శ్రీ లలితా విద్య

(శ్రీ లలితా సహస్రనామ స్తోత్రభాష్యం)

(ప్రవచన సారం)



సామవేదం షణ్ముఖ శర్మ



ఋషిపీఠం ప్రచురణలు

శ్రీలలితావిద్య

శ్రీలలితా సహస్రనామ భాష్యము

(ప్రవచన పాఠం)

సామవేదం షణ్ముఖశర్మ



ఋషిపీఠం ప్రచురణ

శ్రీలలితావిద్య

SRI LALITHA VIDYA

శ్రీలలితా సహస్రనామ భాష్యము

(ప్రవచన పాఠం)

సామవేదం షణ్ముఖశర్మ

Samavedam Shanmukha Sarma


€Sì¿ ముద్రణ:
శ్రీ XÉభకృత్ yÍKaK+, yÏ, 2023

వెల : రూ. **1500/-**

ప్రచురణ:
ఋషిపీఠం చారిటబుల్ ట్రస్ట్(రి)
Rushipeetham Charitable Trust(Regd)

ప్రతులకు:
ఫ్లాట్ నెం-37-93/138/2,
eÌ<ÎS·q>sÙ HÎs&ÙÎ{Ü
హైదరాబాద్-500 056, తెలంగాణ.
ఫోన్: 040-79658274
E-mail: info@rushipeetham.org | Website: www.rushipeetham.org





బ్రహ్మశ్రీ సామవేదం రామమూర్తిశర్మ దంపతులు

గ్రంథకర్త తల్లిదండ్రులు


వన్దే గురుపరంపరామ్



శ్రీ చిదానందనాథులు



శ్రీ అనంతానందనాథులు



శ్రీ మహాదేవానందనాథులు



మహాదేవం గురుం భజే



మహాదేవః శివస్సాక్షాత్ మద్గురుః శ్రీకళానిధిః
ఇతి సంభావ్య మనసా మహాదేవం గురుం భజే.

బ్రహ్మవిద్యైవ శ్రీవిద్యా భావనాయోగనిష్ఠితా
తత్తత్త్వం రూపితం యేన తం మహాదేవమాశ్రయే.

విక్రియారహితో 'వీరః' వీరారాధ్యా మహేశ్వరీ
'భద్ర'భావం మహావీరం మహాదేవం గురుం భజే.

ఆత్మానాత్మవివేకజ్ఞం ఆత్మవిద్యా మహోదధిమ్
రసాత్మకహృదంభోజం మహాదేవం గురుం భజే.

నిర్హేతుకదయాసింధుం ప్రసాదగుణభాసురమ్
శ్రీవిద్యాత్మతపస్సిద్ధం మహాదేవం గురుం భజే.

సుముఖం సుప్రసన్నాస్యం సుధావాఙ్మయ శోభితం
బహుశాస్త్రవిదం 'ధీరం' మహాదేవం గురుం భజే.

యోగారూఢం క్షమాశీలం చోదకం శిష్యవత్సలం
దేవ్యభిన్నం మహోత్సాహం మహాదేవం గురుం భజే.

సారాసారవివేకజ్ఞం హంసతత్త్వావబోధకం
మహాపద్మస్థమధుపం మహాదేవం గురుం భజే.

మహాదేవానందనాథం మదాచార్యం కృపానిధిం
మహావిద్యా మహోల్లాసం మన్మహే మహితాత్మకం.

మద్గురువులు 'శ్రీవిద్యానిధి' శ్రీ మహాదేవానందనాథులకు ప్రణామాంజలులు...

- సామవేదం షణ్ముఖశర్మ

వినతి

శ్రీలలితాసహస్రనామ స్తోత్రంపై అనేక భాష్యాలున్నాయి. వాటికి తేటయైన తెలుగు అనువాదాలున్నాయి. మరి ఈ పుస్తకం దేనికి? అనే ప్రశ్నకు సమాధానం ఈ పుస్తకమే.

'నా భక్తి రచనలు నావి గాన' అన్న విశ్వనాథవారి పలుకే తలపునకొస్తోంది.

ఈ నామసాహస్రితో ఈ జీవునకు - ఏ పురాసుకృతఫలమో - గాఢమైన అనుబంధం ఉన్నది. నిరంతరం మనన - స్మరణ - స్ఫురణలుగా ఈ నామ మంజరులు ఆత్మీయాలయ్యాయి.

దేవీకృపతో సత్సంప్రదాయసిద్ధమైన సద్గురువులు లభించి 'శ్రీవిద్యా'నుగ్రహం సిద్ధించడం ఈ జన్మకు మహాప్రసాదం. ఆ వెలుగులో ప్రామాణిక భాష్యాలను అధ్యయనం చేస్తూ, నామార్థ విచారణగావిస్తూ, తద్వారా పరాంబికను ఆరాధించుకోవడమే అలవాటయింది.

మంత్రంతో పాటు-తత్సంబంధ శాస్త్రాలను శ్రద్ధగా గురుశిక్షణలో చదువుకొని, అనుష్ఠించడం వలన - భాష్య సహాయంతో గ్రహించిన లలితాంబా నామాలు మరింత అర్థవంతమైన తేజస్సుతో భాసించాయి.

అటుపై ప్రవచనరూపంగా చెప్పుకొనే వ్యాజంతో మరొక సాధన మొదలయింది. సంప్రదాయజ్ఞుల అనుమతితో, శాస్త్రం విధించిన పరిమితులను, నియమాలను అతిక్రమించకుండా - కేవలం ధర్మ భక్తిజ్ఞాన సంస్కారాలతో అమ్మవారి వైభవాన్ని ప్రవచించడమే ప్రసంగాల విధానంగా ఏర్పరచుకున్నాను.

ఈ క్రమంలో దృశ్యమాధ్యమంలో 2002 నుండి అనేక నెలలపాటు వీక్షించిన సహృదయులెందరో - ఆనాటి నుండి ఆ ప్రవచనం గ్రంథరూపంగా వెలువడాలని ఆశించారు. దేవీ సంకల్పం ఇన్నాళ్ళకి ఆ అభీష్టాన్ని సిద్ధం చేసింది.

లలితాసహస్రనామభాష్యాలలో ప్రసిద్ధిచెందినవి-

1. శ్రీభాస్కరరాయలవారి 'సౌభాగ్యభాస్కర' భాష్యం. వేదవేదాంత పురాణాగమ స్మృత్యాది విషయాలను ఉట్టంకిస్తూ వారిచ్చిన మహాభాష్యం సంపూర్ణదేవీ

సాక్షాత్కారమే. ఆ విజ్ఞానం అమోఘం.

సంప్రదాయజ్ఞులు, శిష్టులు కూడా ఆ దీధితిని ప్రమాణంగా స్వీకరించారు. అయితే కొన్ని సంప్రదాయాలవారు ఆ భాష్యంలోని కొన్ని అభిప్రాయాలతో విభేదించినప్పటికీ - దాని వైశిష్ట్యాన్ని ఆమోదించారు కూడా. వారు వ్రాసిన భాష్యాలలో కూడా భాస్కరరాయలు ప్రస్తావించిన శాస్త్రాంశాలను, అర్థాలను యథాతథంగా స్వీకరించడమే దానికి తార్కాణం.

2. తత్పూర్వమే వచ్చిన మరొక అద్భుత భాష్యం - శ్రీ భట్టనారాయణుల 'జయమంగళ' వ్యాఖ్య. ఎన్నో విశేషాంశాలతో ప్రామాణికంగా రచించిన ఉజ్జ్వల భాష్యం ఇది.

3. శ్రీ కల్యాణానంద భారతి వారి 'శ్రీ కల్యాణీ శ్రీకళా'-భాష్యం. వీరు వేయికి పైగా నామ విభజన చేశారు. గంభీర భావాలతో కూడిన ఉత్తమ భాష్యమిది. ఆ భాష్యానుసారంగా, ఇతర భాష్యాలను కూడా కలుపుతూ 'శ్రీలలితాసహస్రనామ గూఢార్థదీపిక' పేరుతో శ్రీ రాచకొండ కోటేశ్వరరావుగారు తెలుగులో చక్కని ప్రామాణిక భాష్యాన్ని రచించారు. వివిధ మంత్ర విద్యలను నామాలలో నిక్షిప్తమైనవిగా చూపించిన అద్భుతమైన పద్ధతి వీరిదే. ఇది నాన్యతో దర్శనీయం.

4. 'శ్రీ లలితా నామార్థ మంజూష' పేరుతో శ్రీ వడ్లమూడి వేంకటేశ్వరరావుగారు చక్కని గ్రంథాన్ని రచించారు. ఆయా నామాలలో బీజాక్షరాలను, దేవతామూర్తులను దర్శించి వ్రాసిన ఈ భాష్యం ఎన్నో ఉపనిషద్వాక్యాలను కూడా ప్రస్తావించింది.

ఈ భాష్యాలను అధ్యయనం చేయడంతో పాటు, ఇటువంటి వాటిలో ముఖ్యాంశాలను గ్రహిస్తూ, గురువుల కృప వలన దేవీప్రేరణ వలన స్ఫురించిన భావాలను మేళవించి ప్రవచించడం జరిగింది. నా సాధన కోసం చేసుకున్న మథనం, భావన ప్రవచన రూప సాధనగా కూడా పరిణమించడం అమ్మ అనుగ్రహమే. ప్రవచనాలను విన్న గురువుల దీవెనలు, ఆమోదము లభించడం మరొక మహాభాగ్యం.

2013 సంవత్సరంలో గుంటూరులోని సంపత్‌నగర్‌లో శ్రీ శృంగేరీ శారదాపీఠ పరిపాలిత శంకరమఠంలో, 42 రోజుల పాటు దీక్షగా మరల సుదీర్ఘ ప్రవచన యజ్ఞాన్ని నిర్వహించే సౌభాగ్యం శ్రీశారదామాత కారుణ్యం వలన, జగద్గురు కటాక్షం చేత ప్రాప్తించింది. అది ఒక దివ్యానుభూతి.

ఆ శారదా మందిర విశాల ప్రాంగణంలోనే కేటాయించిన వసతిగృహంలో బస చేసి - బ్రాహ్మీముహూర్తం మొదలు జపానుష్ఠానం, అర్చన, అధ్యయనం, ఆలోచన... అనే నాలుగింటితోనే సాయంకాలం వరకు తపించి, అటుపై ప్రవచించడం చిత్తాన్ని శ్రీమాతృమయం చేసింది.

భాష్యగ్రంథాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూనే, ఇతర శాస్త్రాలలోని అంశాలను కూడా అన్వయిస్తూ, స్ఫురించిన భావాలను శాస్త్రసమ్మతమైతేనే స్వీకరిస్తూ, తపస్సుగా సాగిన ఆ కార్యక్రమంలో - దేవీభావానుభవం వాగ్రూపంగా వ్యక్తమయింది. సౌందర్యలహరి, మూకపంచశతి, ఆర్యాద్విశతి, సుభగోదయస్తవం, పంచస్తవి... వంటి సద్గ్రంథాలలోని విషయాలను కూడా వచసా వహించాను.

ఆ సభలకు స్థానికులే కాక పలు ప్రాంతాల నుండి ఎందరో ఉపాసకులు, పండితులు, వేదజ్ఞులు విచ్చేసి అనుగ్రహించారు.

ఆ ప్రవచన పాఠానికి పుస్తకరూపమే ఈ 'శ్రీలలితావిద్య'. గురుముఖైక వేద్యాలైన శాస్త్రసంకేతగహన విషయాలను తగిన మర్యాదలతో గోప్య పరచి - కేవల భక్తి జ్ఞాన ప్రధానంగా శ్రీలలితాంబా నామరూపలీలా మహిమా తత్త్వాలను వ్యక్తీకరించడమే ఈ ప్రవచన (పుస్తక) ప్రధాన ఉద్దేశం.

ముఖ్యంగా ఈ గ్రంథశైలి గురించి:

ప్రవచనాలను పుస్తకంగా రూపుదిద్దేటప్పుడు కొన్ని దృష్టాంతాలను, ఉపమానాలను, లోకరీతులను పరిహరించడం జరిగింది - ఉపన్యాసాలకు తగినవైనా, గ్రంథానికి సముచితాలు కావనే భావంతో.

కానీ - కొన్నిటిని మాత్రం విషయాంతరాలనిపించినా గ్రంథంలో చేర్చడం జరిగింది. తద్వారా సనాతనధర్మాంశాలను పరామర్శించడం, వాటి ఔన్నత్యాన్ని

నేటి తరానికి అందించడం జరుగుతుందనే సదుద్దేశమే దీనికి కారణం.

అందుకే ఈ గ్రంథంలో సందర్భశుద్ధితో ఆర్షవిజ్ఞాన వైభవాలను కూడా దర్శించవచ్చు.

అయితే పుస్తకమంతా 'ప్రవచనశైలి'లోనే సమకూర్చడం జరిగిందని విజ్ఞులకు విన్నపం. సూటిగా, స్పష్టంగా, సులభంగా సహృదయులకు చేరువ కావాలంటే, ప్రవచనధోరణియే ప్రయోజనకారి అనిపించింది. అవే మాటలు కొలది మార్పులతో సమకూర్చబడ్డాయి.

'శ్రీ లలితాసహస్రనామ స్తోత్రం ఒక శాస్త్రం' అనే మాట ప్రవచనాల (పుస్తకం)లో బహు పర్యాయాలు విన్నవించుకున్నాను. ఉపాసనా శాస్త్రాలు - ఉపనిషద్విజ్ఞానం... ఈ రెండింటి ప్రకాశమే ఈ స్తోత్రమంతా. ప్రతి నామం ఒక విద్యా సూత్రం. ఉపాసనకు 'విద్య' అని పేరు. బ్రహ్మ'విద్య' వేదాంతజ్ఞానం. రెండింటి సారమే ఈ మాలామంత్రరూప స్తోత్ర శాస్త్రం. ఈ కారణం చేతనే 'శ్రీ లలితా విద్య' అనే నామాన్ని ధరించింది.

సగుణ-నిర్గుణ బ్రహ్మతత్త్వ ప్రతిపాదన ఈ వాఙ్మయం - అనే భావంతో, ఆ పరమసత్యాన్నే ప్రధానంగా ఈ ప్రవచనం (గ్రంథం)లో ఘోషించుకున్నాను.

ప్రాచీన భాష్యాలు కొన్ని నామాల అర్థ వివరణలో ఉపనిషద్వాక్యాలను ప్రస్తావించాయి. వాటిని పరిశీలించాక - నా పితృపాదుల (బ్రహ్మశ్రీ సామవేదం రామమూర్తి శర్మగారి) వద్ద అధ్యయనం చేసిన వేదాంతవిద్యాపరిమళం ప్రేరేపించి - లలితాంబను బ్రహ్మవిద్యారూపిణిగా, బ్రహ్మముగా సంభావించుకొనే దృష్టి చేకూరింది. ఆ దర్శనమే ఇందులో సమయాచారబద్ధంగా, వేదవేదాంతనిబద్ధంగా గ్రథనమయింది. ఒకొక్క నామార్థాన్ని విచారణ చేస్తే వేదాంతశాస్త్ర మననమేనని నా భావన.

ఇది భావనాప్రధాన భాష్య గ్రంథం. భావనాగమ్య అయిన శ్రీమాత యొక్క మహిమాతిశయాన్ని కేవలం ప్రపన్న భక్తి స్రవంతిగా కీర్తించడమే ఈ పుస్తక (ప్రవచన) స్వరూపం. ఇది నేను చేసుకున్న వాగ్రూపార్చన. సహృదయులకు దీని పఠనం

కూడా భావార్చనగానే ఉపకరిస్తుందని ఆశిస్తున్నాను.

ఈ రోజుల్లో ఉద్గ్రంథాలను చదివే శ్రద్ధాళువుల సంఖ్య విరళమే. కానీ ఈ గ్రంథంలోని నామాల అర్థ వివరణలను దినానికి కొన్ని చొప్పున పారాయణవలె మనసుపెట్టి చదువుకున్నా పరమేశ్వరీ భావానుభూతి భాసిస్తుందని చెప్పడానికి సందేహించడం లేదు. కారణం – ఆ అనుభూతినే ఈ వాక్యాలలో నింపుకున్నాననే విశ్వాసం.

నా గురువు, తండ్రి బ్రహ్మశ్రీ సామవేదం రామమూర్తి శర్మగారు, అమ్మ శ్రీమతి రమణమ్మల ఆశీర్బలంతో, అస్మద్గురుదేవులు శ్రీ మహాదేవానన్దనాథుల సత్కటాక్షంతో, శ్రీలలితా పరదేవతానుగ్రహంతో ఈ 'శ్రీ లలితా విద్య'ను 'సంపూర్ణం' చేయగలిగాను. గ్రంథ రచనలో ప్రోత్సహించిన ధర్మపత్ని పుష్పలతకు దేవీకృపాసిద్ధిరస్తు.

ఇది సమగ్ర భాష్యం అని చెప్పే సాహసం నేను చేయడం లేదు. యథా శక్త్యుపచారంగా పూర్తి చేసిన 'సంపూర్ణ భావన' మాత్రమే.

ఎందరో ఉపాసనాసిద్ధులు, పండితులు, మహాత్ములు ఉన్నారు. వారికి సదావినమ్రుడను. పాండితీప్రకర్షతో వ్యాఖ్యానించే సమర్థత లేని అల్పజ్ఞుడనైన నా మతిమితికి అందినంత అక్షరార్చనను వారి సహృదయం మన్నించుగాక!

చిన్న పిల్లల చేత వంటి ఈ పనిని, మాతృవాత్సల్యంతో లలితాంబ స్వీకరించి అనుగ్రహించుగాక!

"యత్పూజితం మయా దేవి పరిపూర్ణం తదస్తుతే॥
బాలభావానుసారేణ మమేదం హి విచేష్టితం।
మాతృవాత్సల్య సదృశం త్వయా దేవి విధీయతామ్"

.....



ఋషిపీఠానికి ఎంతో ఆప్తులు, సహృదయులు కావడమే కాక

గతంలో ఎన్నో ప్రచురణలకు సహకారమందించిన

డా॥ వ్యాకరణం ఆంజనేయశాస్త్రి – శ్రీమతి శారద దంపతులు

ఈ పుస్తక ఆరవ ముద్రణకు శ్రీలలితాప్రీతిగా కైంకర్యం చేశారు.

వారికి పరమేశ్వరీ కృప లభించుగాక.

సామవేదం షణ్ముఖ శర్మ..

శ్రీమాత్రే నమః



శ్రీ వల్లభాసమాశ్లిష్టం దశహస్తం గజాననం
గణనాథమహం వందే సర్వసిద్ధిప్రదాయకమ్

భజే శ్రీచక్రమధ్యస్థాం దక్షిణోత్తరయోస్సదా
శ్యామావార్తాళిసంసేవ్యాం భవానీం లలితాంబికామ్

సర్వచైతన్యరూపాం తాం
ఆద్యాం విద్యాం చ ధీమహి
బుద్ధిం యా నః ప్రచోదయాత్

అవతారిక - ఫలశ్రుతి

సహస్రనామస్తోత్రం అనేది ఒక గొప్ప ప్రక్రియ. బాగా అలవాటయిపోవడం వలన ఆ అద్భుతం సామాన్యంగా అనిపిస్తోంది. ఈ సహస్రనామ విద్య ప్రతి ఉపాసనా సంప్రదాయంలో ఉంది. విష్ణువును ఉపాసిస్తే విష్ణుసహస్రం. శివోపాసన చేస్తే శివసహస్రం. అందులో మళ్ళీ రకరకాల భేదాలు ఉన్నాయి. కృష్ణ సహస్రం, రామ సహస్రం, నృసింహ సహస్రం ఉన్నాయి. అలాగే శివునికి సంబంధించి దక్షిణామూర్తి సహస్రనామస్తోత్రం, దీనితో పాటు శివసహస్రనామాలు శివపురాణం, మహాభారతం, స్కాందపురాణం ఇంకా ఇతర పురాణాలలో లభిస్తున్నాయి. లక్ష్మీ, గౌరీ, దుర్గా, సరస్వతి... ఇలా ప్రతి అమ్మవారికి కూడా అనేక సహస్రనామాలు ఉన్నాయి. ఒక దేవతంటూ ఉంటే, ఆ దేవతకి సంబంధించిన మూలమంత్రం ఉంటుంది. దానికి సంబంధించిన సహస్రనామస్తోత్రం ఉంటుంది.

ఉపాసనలో ముఖ్యంగా పంచ అంగాలు ఉంటాయి. ఒకటి సహస్రనామ స్తోత్రం. రెండవది హృదయం, మూడవది కవచం, నాలుగవది కీలకం. ఇవి ప్రధానంగా చెప్తూ ఇంకా బీజం ఇత్యాది విషయాలు చెప్తారు. మంత్రం బలపడడానికి ప్రధాన అంగాలలో సహస్రనామస్తోత్రం ఒకటి. సాధారణంగా ఏ దేవతా ఉపాసనలోనైనా మంత్రం, సహస్రనామస్తోత్రం ఉంటాయి. ఆ మంత్రాధిదేవతని అర్థం చేసుకోవడానికి పనికొచ్చే విజ్ఞానం సహస్రనామాలలో ఉంటుంది. ఏ దేవతా ఉపాసన చేసినా ఆ దేవతా సహస్రనామస్తోత్రం చెయ్యడం వల్ల ఆ మంత్రం పరిపూర్ణతని పొందుతుంది.

అన్ని సహస్రనామస్తోత్రాలు దేనికవే విశిష్టమైనవి. ఏ సహస్రనామస్తోత్రం చెప్పినా దీనిని మించి మరొకటిలేదని ప్రతిచోట చెప్తూ ఉంటారు. అంటే అది ఉపాసించే వారికి దాని యందు పరమబుద్ధి, అదే సర్వోత్కృష్టమని భావన కలిగితేగాని సంపూర్ణసిద్ధి రాదు కనుక అలా చెప్తారు. అయితే అన్ని సహస్రనామాలు పరిశీలించి లలితాసహస్రనామస్తోత్రం చదివితే మాత్రం ఇది ఒక ప్రత్యేకమైనది, విశిష్టమైనది

అని అంగీకరించి నమస్కరిస్తాం.

అసలు సహస్రనామమనే ప్రక్రియ ఎందుకొచ్చిందనేది తెలుసుకుంటే ఈ గ్రంథంపై ఒక అవగాహన కలుగుతుంది. సహస్రనామస్తోత్రమనేది ఒక శాస్త్రం. దేవత గురించి చెప్పాలంటే అది అనంతతత్త్వం. **'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ'** అని వేదమే నమస్కరించింది. అనంతమైన భగవత్తత్త్వాన్ని అనంతంగా కీర్తిస్తేనే సరిగ్గా సరిపోతుంది. కానీ అనంతాన్ని అనంతంగా కీర్తించడానికి కీర్తించే మానవులు అనంతులు కారు. వారికి అంతం ఉంది. మానవులు పరిమితులు, దేవత అపరిమితం. ఫలితం మాత్రం అపరిమితంగానే కావాలి. అందుకు పెద్దలు ఆలోచించి అనంతంగా పఠించిన ఫలితం లభించడానికి అనంతవాచకమైన శబ్దాన్ని తీసుకున్నారు. సహస్రం అనే శబ్దం అనంతవాచి. **'విశ్వం శతం సహస్రం సర్వమక్షయవాచకం'** అని మహాభారతంలోని వాక్యం. విశ్వం, శతం, సహస్రం, సర్వం - ఈ నాలుగు శబ్దాలు అక్షయత్వాన్ని, అనంత తత్త్వాన్ని తెలియజేస్తాయి. అనంతమైన భగవత్తత్త్వాన్ని అనంతంగా కీర్తించడానికి మనకు పెద్దలు ఇచ్చిన అవకాశం సహస్రసంఖ్య. సహస్రనామాలు కీర్తిస్తే అనంతభగవత్తత్త్వాన్ని అనుసంధానం చేసిన ఫలితం లభిస్తుంది. ఇది ఒక ఉద్దేశం.

మరొకటి- సహస్రనామాలు కేవలం పేర్లు కావు. **'జ్ఞాత్వా కుర్వీత కర్మాణి'** అని నిర్దేశించారు. ఏ కర్మ చేస్తున్నామో అది తెలుసుకుని చెయ్యాలి. అలాగే మనం ఏ దేవతని ఆరాధన చేస్తున్నామో ఆ దేవత గురించి బాగా తెలుసుకోవాలి. అప్పుడు సంపూర్ణమైన పుష్టి వస్తుంది. ఒకొక్క దేవత గురించి అనేక సంపుటాలు రాయవచ్చు. అన్ని సంపుటాలు జ్ఞానం పొంది మన మనస్సులో పొందుపరుచుకోవాలంటే మనకంత శక్తి ఉంటుందా? అందుకని అంత సంపుటాల జ్ఞానాన్ని ఒకొక్క నామంలో నిక్షిప్తం చేస్తారు. ఏ దేవతా ఉపాసనలోనైనా వెయ్యినామాలకు సరిగ్గా అర్థం తెలుసుకుంటే, ఆ దేవతంటే ఏమిటో పరిపూర్ణంగా అర్థమవుతుంది.

సాధారణంగా శాస్త్రాల్లో రెండు రకాల గ్రంథాలుంటాయి. మొదటిది సూత్రగ్రంథం. రెండవది భాష్యగ్రంథం. సూత్రగ్రంథమంటే ఆ శాస్త్రజ్ఞానాన్ని సంక్షిప్తంగా

ఒక చిన్న వాక్యంలో పెడతారు. అది మేధావులైన వారికి బాగా అర్థమౌతుంది. మిగిలిన వారికి అందులో ఉన్న దాన్ని వ్యాఖ్యానించితే స్పష్టమవుతుంది.

సూత్రం అర్థం అవడానికి భాష్యం కావాలి. సూత్రం, భాష్యం – రెండింటి ద్వారా శాస్త్రం బాగా తెలుస్తుంది. ఈ విధంగా అన్ని శాస్త్రాలకు సూత్ర, భాష్యాలు – రెండూ ఉన్నాయి. వేదాంతశాస్త్రంలో బ్రహ్మసూత్రాలుంటే దానికి శంకరభాష్యం ఉంది. **అమ్మవారి ఉపాసనకు సంబంధించిన సూత్ర గ్రంథం 'లలితాసహస్రనామ స్తోత్రం'.** ఇందులో ఒకొక్క నామం ఒకొక్క సూత్రం. ఆ సూత్రాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అమ్మవారి విద్య అంతా సంపూర్ణంగా తెలుస్తుంది.

బ్రహ్మవిద్య తెలియాలంటే బ్రహ్మసూత్రాలు, శ్రీవిద్య తెలియాలంటే లలితా సహస్రనామస్తోత్రం.

ఇలా మహర్షులు వెయ్యినామాలతో భగవత్ జ్ఞానాన్ని అందించారు. ఆ జ్ఞానం సంపుటాలతో ఉంటే గుర్తుపెట్టుకోవడం కష్టంగాని, నామాలతో ఉంటే గుర్తుపెట్టుకోవచ్చు.

ఒకచోట ఏకాంతంగా కూర్చొని ఏ ఒక్క నామాన్నో మననం చేస్తే అందులో ఉన్న భావమంతా పొంగులు వారి అమ్మవారు అర్థమవుతారు. అది ఎలా మననం చేసుకోవాలో ఇందులో వివరించడం జరిగింది.

ఈ సహస్రనామస్తోత్రాలకి అనేక భాష్యాలు ఉన్నాయి. పెద్దలు అనేక ఉపాసనా రహస్యాల్ని, వేదాంతశాస్త్ర విజ్ఞానాన్ని కూడా ఈ భాష్యాలలో తెలియజేశారు. దొరికినంత మేరకు ప్రామాణిక భాష్యగ్రంథాలన్నీ మథనం చేసుకుని, వాటి నవనీతాన్ని ఇందులో ఆస్వాదించే ప్రయత్నం జరిగింది. ముఖ్యంగా సహస్రనామస్తోత్రానికి అవతారిక చాలా విశిష్టమైనది.

ఈ సహస్రనామ స్తోత్రం ఎలా వచ్చింది?
ఇది ఎవరు ఎవరికి ఉపదేశించారు?

ఇది హయగ్రీవస్వామివారు అగస్త్యమహర్షికి ఉపదేశించిన బ్రహ్మవిద్య. వ్యాసదేవుడు బ్రహ్మాండపురాణం ఉత్తరభాగంలో ఈ విషయం ప్రస్తావన చేశారు. అయితే అక్కడ సహస్రనామస్తోత్రం మాత్రమే కాకుండా లలితాదేవికి సంబంధించిన అనేక విషయాలు హయగ్రీవస్వామివారి చేత చెప్పబడ్డాయి. అలా చెప్తూ మధ్యలో ఈ సహస్రనామాలను చెప్పారు.

ప్రారంభం పూర్వపీఠిక. దీనిని అవతారిక అని చెప్పుకోవచ్చు. ముఖ్యంగా ఒక విద్యను ముట్టుకునే ముందు దాని విలువ తెలిస్తే మరింత ఏకాగ్రత, శ్రద్ధ ఏర్పడతాయి. శ్రద్ధ అంటే ఏమిటో కాదు, దాని మహిమను శాస్త్రప్రమాణంతో తెలుసుకోవడమే. దానిపై విశ్వాసం కలగడమే. ఆ శ్రద్ధ కలిగించడానికి అవతారిక చాలా పనికొస్తుంది. ఒక విద్యలో ప్రవేశించే ముందు సంసిద్ధత అంత తేలికగా రాదు.

అగస్త్యులవారు అమ్మవారి చరిత్ర అంతా విని హయగ్రీవస్వామివారితో - **'అశ్వానన ! మహాబుద్ధే! సర్వశాస్త్రవిశారద!'** - "ఓ హయగ్రీవా! (గుర్రపు ముఖం కలవాడా!) గొప్ప జ్ఞానం కలవాడా! సర్వశాస్త్రవిశారదా!" ఒక గురువుకు ఉండవలసిన లక్షణాలు ఇందులో తెలియజేశారు. హయగ్రీవుడు చెప్పాడని చెప్పడంలో ఒక ఆంతర్యం ఉంది. అమ్మవారి విద్య - బ్రహ్మవిద్య. బ్రహ్మవిద్య అంటే వేదాంతవిద్యే. బ్రహ్మవిద్యాగురువులు దక్షిణామూర్తి, హయగ్రీవస్వామివారు.

జ్ఞానానందమయం దేవం నిర్మలస్ఫటికాకృతిం
ఆధారంసర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే

మూలవిద్య(శ్రీవిద్య)ను ఇచ్చినవాడు దక్షిణామూర్తి అయితే దానిని వ్యాఖ్యానించి అందించినవాడు హయగ్రీవస్వామి. మొదటివాడు శివుడు. రెండవవాడు విష్ణువు. శివుడు, విష్ణువు కలిసి మనకి అమ్మ గురించి చెప్పారు.

అగస్త్యులవారు అప్పటివరకు హయగ్రీవస్వామి ద్వారా లలితాదేవి గురించి

అనేక విషయాలు విని అడుగుతున్నారు, "స్వామీ! ఇప్పటివరకూ నువ్వు చాలా చెప్పావు... సంతోషంగా ఉంది" అని, ఆ చెప్పినవన్నీ అగస్త్యులవారు ఆయనకి తిరిగి చెప్తున్నాడు. అలాంటి శిష్యులు గురువులకి దొరకడం చాలా కష్టం. చెప్పింది విని నిలబెట్టుకుని తిరిగి గురువుగారితో అంటే గురువుగారు ఎంతో సంతోషిస్తారు. గురువుకి మరికొన్ని చెప్పాలని ఉత్సాహం కూడా పుడుతుంది. అందుకేనేమో ఇలాంటి ఉపోద్ఘాతం ఇచ్చారు. 'ఇప్పటివరకు నువ్వు చాలా విషయాలు చెప్పావు'. దీనిని బట్టి లలితా సహస్రనామ స్తోత్రం చెప్పడానికి ముందు ఎన్ని చెప్పాడో వివరిస్తున్నారు.

పూర్వం ప్రాదుర్భవో మాతుః తతః పట్టాభిషేచనం
భండాసురవధశ్చైవ విస్తరేణ త్వయోదితః

ఇప్పటివరకు నువ్వు '**కథితం లలితాదేవ్యాః చరితం పరమాద్భుతం**'- అమ్మవారి అద్భుతచరిత్రను చెప్పావు. ఆ చరిత్రలో అమ్మవారు ఎలా ప్రాదుర్భవించారు? ఆ తల్లికి ఎలా పట్టాభిషేకం జరిగింది? ఆ జగదంబ ఎలా భండాసుర వధ చేసింది? అవన్నీ వివరించావు.

"వర్ణితం శ్రీపురం చాపి మహావిభవ విస్తరం" – అమ్మవారి శ్రీమన్నగరవైభవం కూడా చెప్పావు. లలితా సహస్రనామ స్తోత్రానికి పూర్వరంగంగా లలితోపాఖ్యానంలో ఇవన్నీ వస్తాయి.

షోఢాన్యాసాదయోన్యాసా న్యాసఖండే సమీరితాః
అంతర్యాగక్రమశ్చైవ బహిర్యాగ క్రమస్తథా
శ్రీమత్పంచదశాక్షర్యాః మహిమా వర్ణితస్తథా
మహాయాగ క్రమశ్చైవ పూజాఖండే ప్రకీర్తితః

ఇందులో ఒకటి – అమ్మవారి చరిత్ర. రెండు – ఉపాసనా సంబంధమైన విషయాలు. ఇవి నిజానికి గురుశిష్యుల మధ్య మాత్రమే చెప్పే అంశాలు అని అగస్త్యులవారికి హయగ్రీవస్వామివారు చెప్పారు. అవి న్యాసఖండం, పురశ్చరణ ఖండం, పూజాఖండం, హోమఖండం, రహస్యఖండం, స్తోత్రఖండమని భాగాలు. ఇంతవరకు చరిత్ర – లలితోపాఖ్యానం. న్యాసఖండంలో అమ్మవారి ఆరాధన చేసేవారు

ఏ మంత్రాలు ఎలా న్యాసం చేసుకోవాలో కూడా హయగ్రీవస్వామివారు చెప్పారు. ఆరు విధాల న్యాసాలను బోధించారు. ఉపాసనలకి సంబంధించిన అంతర్యాగం, బహిర్యాగం, మహాయాగం ఇవన్నీ పూజాఖండంలో చెప్పారు. పురశ్చరణఖండంలో– జపమంటే ఏమిటి? వాటి లక్షణాలు ఏమిటో బోధించారు. ఇక హోమఖండంలో అమ్మవారి హోమం ఎలా చెయ్యాలి? ఆ హోమద్రవ్యాలు ఏమిటి? చక్రరాజం విశేషాలు ఏమిటి? ఇవన్నీ చెప్పారు.

హోమఖండే త్వయాప్రోక్తో హోమద్రవ్యవిధి క్రమః
చక్రరాజస్య విద్యాయాః శ్రీదేవ్యాః దేశికాత్మనోః
రహస్యఖండే తాదాత్మ్యం పరస్పరముదీరితమ్
స్తోత్రఖండే బహువిధాస్తుతయః పరికీర్తితాః

స్తోత్రఖండంలో అమ్మవారి రకరకాల స్తోత్రాలు చెప్పారు. అంటే లలితావిద్య ఎంత ఉందో ఇక్కడ తెలుస్తోంది. లలితోపాఖ్యానమే కాక ఇన్ని ఖండాలతో అమ్మవారి విద్య అంతా చెప్పబడింది.

ఈ స్తోత్రఖండం తరువాత **"మంత్రిణీ దండినీదేవ్యోః ప్రోక్తే నామ సహస్రకే"** – మంత్రిణీ(శ్యామలా)దేవి, దండినీ(వారాహీ)దేవి వీరిద్దరి సహస్రనామాలు చెప్పావు.

అన్నీ చెప్పినట్లే అనిపించింది కానీ ఒక్కటి చెప్పలేదయ్యా! అది **'న తు శ్రీలలితాదేవ్యాః ప్రోక్తం నామసహస్రకమ్'** – లలితాదేవి సహస్రనామాలు చెప్పలేదు. ఎందువల్ల చెప్పలేదని అగస్త్యులవారు అడుగుతున్నారు. అడగడం శ్రద్ధకి సంకేతం.

న తు శ్రీ లలితాదేవ్యాః ప్రోక్తం నామ సహస్రకం
తత్ర మే సంశయో జాతో హయగ్రీవ దయానిధే

'ఓ హయగ్రీవా! దయానిధే!' సంబోధనలు ఎంత గొప్పగా ఉన్నాయో! ముందు సర్వశాస్త్రవిశారదా! ఇప్పుడు దయానిధే! గురువుగారికి జ్ఞానం ఎంత ఉంటుందో దయ అంత ఉంటుంది. కేవలం జ్ఞానం ఉన్నంత మాత్రాన లాభమేముంది. ఆయనకి దయ అంటూ ఉంటే జ్ఞానం మనకి లభిస్తుంది. ఆచార్యునికి కారుణ్యం చాలా ప్రధానం. అందుకు 'దయానిధే! ఎందుకయ్యా నాకు చెప్పలేదు'. 'కిం వా

త్వయా విస్మృతం? తత్ జ్ఞాత్వా వా సముపేక్షితం' – నువ్వు చెప్పడం మర్చిపోయావా! ఎందుకంటే అనేక విషయాలు చెప్తున్నప్పుడు మర్చిపోవచ్చు. గుర్తు చేస్తే తప్పేంలేదు.

లేక **'మమవా యోగ్యతా నాస్తి శ్రోతుం నామ సహస్రకం'** – సహస్రనామాలు వినడానికి నాకు యోగ్యత లేదా? అని అడిగారు. అగస్త్యులవారే ఇలా అడిగారంటే ఇంక సాధారణ మానవులకు ఎంత ఉండాలో ఆలోచించాలి. శిష్యునికి వినయం ఎంతో అవసరం.

"కిమర్థం భవతా నోక్తం తత్ర మే కారణం వద" – ఎందువల్ల చెప్పలేదో కారణం చెప్పవయ్యా! అంటే ఒక్కసారి ఆలోచన చేసి ఆనందంతో చెప్తున్నాడు. ఎప్పుడైనా గురువులు కూడా ప్రశ్న విని శిష్యులకింత శ్రద్ధ కలిగిందని సంతోషిస్తారు.

'ప్రహృష్టో వచనం ప్రాహ తాపసం కుంభసంభవమ్' – ప్రహృష్టః – బాగా ఆనందించి హయగ్రీవస్వామివారు **'లోపాముద్రాపతే అగస్త్య"** అన్నారు – ఇదేం సంబోధన! వాళ్ళ ఆవిడ పేరుతో కలిపి పిలవడం! అంటే ఆవిడ గొప్పతనం అంతటిది. లోపాముద్ర సామాన్యురాలు కాదు. ఈవిడ అమ్మవారికి మహాభక్తురాలు. సహస్రనామాల్లో చోటు సంపాదించుకుందంటే ఎంతో గొప్పతల్లి. అమ్మవారి విద్యకి సంబంధించిన గురుపరంపరలో ఈ తల్లి కూడా ఒకరు. లోపాముద్రాదేవిని, అగస్త్యులవారిని కూడా గురుపరంపరలో చెప్పుకుంటారు.

ఖడ్గమాల చదివే అలవాటు ఉంటే **'లోపాముద్రామయ్యై నమః', 'అగస్త్యమయ్యై నమః'** అంటారు. వారిద్దరూ మనకు గురువులు. అందులో ఒక గురువు ఇప్పుడు అడుగుతున్నారు. ఇంకొక గురువు లోపాముద్ర. ఆవిడ పేరుతో కలిపి సంబోధిస్తూ 'లోపాముద్రాపతే అగస్త్య' – లోపాముద్రకు పతియైన ఓ అగస్త్యుడా! నీకు సహస్రనామాలు వినడానికి అర్హత ఏమిటంటే ఆవిడకి భర్త కావడమే.

సాక్షాత్తు జగదంబయే లోపాముద్రాదేవికి మంత్రం ఇచ్చింది. అది లోపాముద్రాదేవి గొప్పదనం. ఎవరో గురువుల ద్వారా మంత్రం పొంది, తర్వాత అమ్మవారిని మెప్పించడం కాదు. అమ్మవారే గురువై మంత్రమిచ్చారు. ఆ మంత్రంతో అమ్మవారిని ఉపాసన చేసింది. అమ్మవారు లోపాముద్రకి ఇచ్చిన మంత్రమేమిటో

మనకెలా తెలుస్తుంది? ఎందుకంటే శ్రీవిద్యలో ఇదే మంత్రమని నిర్దేశించడానికి లేదు. పన్నెండురకాల భేదాలతో శ్రీవిద్యామంత్రం ఉన్నది.

ఇప్పుడు ప్రసిద్ధంగా సంప్రదాయం **'కాదివిద్య'.** ఇది మన్మథుడు ఉపాసించిన విద్య. ఇది 'క' అనే అక్షరంతో మొదలయ్యే పదిహేను అక్షరాలు. ఇదికాక 'హాదివిద్య' అని మరొకటి ఉన్నది. దీనినే 'లోపాముద్రావిద్య' అని అంటారు. వేటి పరంపర వాటికి ఉన్నది. ఇలా 12 పరంపరలు శ్రీవిద్యలో ఉన్నాయి. మనువు, చంద్రుడు, కుబేరుడు, అగస్త్యుడు, అగ్ని, ఇంద్రుడు, సూర్యుడు, దూర్వాసుడు, స్కందుడు, శివుడు ఉపాసించిన అనేక రకాలైన శ్రీవిద్యా సంప్రదాయాలు ఉన్నాయి. సంప్రదాయాలు ఎన్నైనా అమ్మ మాత్రం ఒక్కరే. వారి యోగ్యతను అనుసరించి సంప్రదాయ పరంపరలలో సాధన చేసుకోవల్సిందే. లోపాముద్రాదేవి పేరున ఉన్న సంప్రదాయంలో అసలు ముద్రాదులు అవసరం లేదని కొందరు వ్యాఖ్యానిస్తారు.

ఆ తల్లి సాక్షాత్తు అమ్మవారిచేత మంత్రం పొందింది కనుకనే ఆవిడకి అంత స్థానం ఉన్నది. మంత్రసిద్ధి పొంది, అగస్త్యుని పతిగా పొందింది. ఇప్పుడు అగస్త్యులవారు హయగ్రీవుని ద్వారా శ్రీవిద్యను పొందుతున్నారు.

అందుకే **'లోపాముద్రాపతే అగస్త్య! సావధానమనాః శృణు'** – ఈ మాట ఎంత విశేషంగా ప్రయోగించారో! "సావధానంగా విను" అంటుంటారు. విషయంలో ఒక గొప్ప మలుపు వచ్చినప్పుడు ఆ గొప్పతనం గురువులు నొక్కి చెప్తుంటారు. అలా అగస్త్యులవారితో కూడా "ఏకాగ్రచిత్తంతో వినవయ్యా!" అన్నారు.

ఎప్పుడైనా ఒక విషయం వినడానికి అర్హత – ఏకాగ్రత తప్ప మరేం లేదు.

"నామ్నాం సహస్రం యన్నోక్తం కారణం తద్వదామి తే" – నేను ఎందుకు చెప్పలేదో వివరిస్తున్నాను. **"రహస్యమితి మత్వాహం నోక్తవాంస్తే న చాన్యథా"** – ఇవి రహస్య నామాలు. అందుకే చెప్పలేదు అన్నారు. రహస్యనామాలు అంటే 'చెవిలో చెప్పాల్సినవి బయటకు చెప్పకూడనివ'ని కాదు. రహస్యనామాలు అంటే ఇందులో బాహ్యానికి అర్థం కాని అనేక విషయాలు ఉన్నాయి. **"పునశ్చ పృచ్ఛసే భక్త్యా తస్మాత్ తత్తే వదామ్యహం"** – "రహస్యనామాలైనప్పటికీ భక్తితో అడిగావు కనుక చెప్తున్నాను"

అన్నారు. రహస్యవిద్య పొందడానికి రెండవ అర్హత - భక్తి. భక్తి లేనివానికి ఏ శాస్త్రం చెప్పకూడదు. భగవద్గీత అంతా చెప్పి **"ఇదం తే న అతపస్కాయ న అభక్తాయ కదాచన"** అంటారు కృష్ణపరమాత్మ. 'తపస్వి కానివానికి, భక్తుడు కానివానికి గీత చెప్పకు' అన్నారు. భక్తి అనేది చాలా ప్రధానం. చాలా సావధానంగా అడిగావు కనుక చెప్తున్నాను.

"బ్రూయాచ్ఛిష్యాయ భక్తాయ రహస్యమపి దేశికః" - రహస్యవిద్య అయినప్పటికీ - శిష్యుడు భక్తుడైతే మాత్రం గురువు (దేశిక అంటే గురువు) తప్పకుండా చెప్పాలి కనుక నీకు నేను తప్పకుండా చెప్తాను. **"భవతా న ప్రదేయం స్యాదభక్తాయ కదాచన"** - నీకు చెప్తున్నా, ఇక పై నువ్వు కూడా భక్తుడు కానివానికి చెప్పకు. ఇక్కడ ముందే ఈ ఉపోద్ఘాతం ఎందుకంటే రహస్యనామం వినడానికి, పఠించడానికి అర్హత ఉందా అనేది ఎవరికి వారే ప్రశ్నించుకోవాలి. ఇలాంటి లక్షణాలున్నవారు ఒక్కరున్నా సంతోషించవల్సిందే. ఎందుకంటే లలితా సహస్ర నామాలు ఎక్కడ చెప్పబడతాయో, మననం చేయబడతాయో అక్కడ అనేకమంది దేవతలు, ఋషులు అదృశ్యరూపాలతో సంచరిస్తూ వింటూ ఉంటారు. అమ్మవారిని నమస్కరించుకుని సహస్రనామాలు చెప్పేవాని చుట్టూ దేవతలు, ఋషులు ఉండి దీవిస్తూ ఉంటారు.

'న శఠాయ న దుష్టాయ నావిశ్వాసాయ కర్హిచిత్' - ఒకడు శఠుడు. రెండవవాడు దుష్టుడు. మూడవవాడు అవిశ్వాసి. ఈ లక్షణాలు ఉన్నవారికి చెప్పకూడదు. శఠుడు అంటే మొండివాడు. ఎంత చెప్పినా వాడు ఒకంతట మారడు. వాడు ఇదివరకు ఏ నిర్ణయంలో ఉన్నాడో అదే నిర్ణయంలో ఉంటాడు.

- శఠుడు అంటే కొంటెవాడు అని కూడా అర్థం. అసలైన అర్థాలు తీయకుండా విపరీత అర్థాలు తీసేవారిని శఠులు అంటారు.

- రెండవవాడు దుష్టుడు. అతని ప్రవృత్తే దుష్టప్రవృత్తి. సహస్రనామాల్లో అమ్మవారు 'దుష్టదూరా' అని చెప్పబడుతోంది.

- మూడవవాడు అవిశ్వాసి - అంటే విశ్వాసం లేనివాడు.

అతీంద్రియమైన విషయం గురించి చెప్పేటప్పుడు శాస్త్రమే ప్రమాణం.

శాస్త్ర ప్రమాణాన్ని విశ్వాసంతోనే తెలుసుకోవాలి కానీ సందేహాలతో, శంకలతో తెలుసుకోలేరు. కాబట్టి విశ్వాసం లేనివారికి చెప్పరాదు.

ఇక్కడ హయగ్రీవుడు అగస్త్యునికి చెప్పడమే కాకుండా "నీ తరువాత ఇంకెవరికైనా నువ్వు దీనిని చెప్పేటప్పుడు జాగ్రత్తగా ఉండు" అని చెప్తున్నాడు. ఎందుకంటే విద్య పరంపరగా వస్తుంది. అగస్త్యునితో చెప్తే అక్కడితో ఆగుతుందా? అక్కడి నుండి మనదాకా వస్తుంది. అందుకు అగస్త్యులవారికి చెప్పేటప్పుడే హెచ్చరిక.

ఇంత ఉపోద్ఘాతం అవసరమా! ఏకంగా 'శ్రీమాతా' అని చెప్పుకోవచ్చు కదా! అంటే అలా అయితే వ్యాసులవారు బ్రహ్మాండపురాణంలో ముందు మొదటినామం శ్రీమాత గురించే చెప్పేవారు. ఇంత ఉపోద్ఘాతం అవసరం ఎందుకంటే అంత యోగ్యత మనం సంతరించుకోవాలి. ఒకొక్క విద్యలో ప్రవేశించడానికి ఒకొక్క రకమైన సంస్కారం కావాలి. సూదిలో దారం పెట్టేటప్పుడే మనం దారాన్ని ముందు పదును చేసి దానిలో ప్రవేశింపజేస్తాం. అలాగే మన అంతఃకరణాన్ని కూడా అంత పదునెక్కించి ఈ సూక్ష్మవిద్యలో ప్రవేశింపజేయాలి.

"ఉపాసకాయ శుద్ధాయ" - ఎవరికి చెప్పాలంటే ఉపాసకునికి చెప్పాలి. **"శ్రీమాతృభక్తియుక్తాయ"**- శ్రీమాతపై భక్తి ఉన్నవారికి చెప్పాలి. **"శ్రీవిద్యారాజవేదినే"** - శ్రీవిద్యామంత్రం ఉన్నవారికి చెప్పాలన్నారు. శ్రీవిద్యామంత్రం ఉన్నవాడు లలితాసహస్రనామం వింటే విషయం తెలిసి మరింత ఆనందిస్తాడు.

'ఉపాసకాయ శుద్ధాయ దేయం నామసహస్రకం" - శుద్ధుడైన ఉపాసకునికే ఈ సహస్రనామ విద్య ఇవ్వాలి. ఇవి కేవలం అర్థాలు తెలుసుకునే అక్షరాలు కావు. శుద్ధోపాసకులు అంటే నిష్కపటమైన భక్తి కలవారు. వీరు కేవలం అమ్మవారు, అమ్మవారి అనుగ్రహం తప్ప మరే చింతన లేనివారు. ఇలాంటి వారు వేళ్ళమీద లెక్కించదగినవారే. అంత తేలికగా శుద్ధోపాసకులు దొరకరు.

ఈ విద్య ఒక దేవత. ఎప్పుడైనా మంత్రాలుగాని, స్తోత్రాలుగాని అక్షరాలనే దృష్టితో చూడకూడదు. అవి సాక్షాత్తు దేవతాస్వరూపాలే. మంత్రాన్ని, స్తోత్రాన్ని పుచ్చుకున్నారంటే దేవతను పుచ్చుకున్నారనే భావనతో పుచ్చుకోవాలి. **'నామసాహస్రకం**

దేయం' – ఈ వెయ్యినామాల విద్యని శుద్ధుడైన ఉపాసకునికి మాత్రమే ఇవ్వాలి.

"యాని నామ సహస్రాణి సద్యః సిద్ధిప్రదాని వై" – ఈ సహస్రనామాలకి ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, ఈ సహస్రనామ విద్య వెంటనే ఫలితం ఇస్తుంది. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. అనేకమందికి ఇవి అనుభవాలే. **"తంత్రేషు లలితా దేవ్యాస్తేషు ముఖ్యమిదం మునే"** – 'ఈ లలితాసహస్రనామస్తోత్రం గురించి అన్ని తంత్రాలయందు, పురాణాలయందు చెప్పబడింది' అన్నారు.

అమ్మవారి తంత్రవిద్యలు మొత్తం అరవైనాలుగు ఉన్నాయి. ఈ అరవైనాలుగు తంత్రాలలోనూ, పురాణాది శాస్త్రాల యందు చెప్పబడ్డ విషయాలన్నీ లలితా సహస్రనామ స్తోత్రంలో ఉన్నాయి. ఈ సహస్రనామాలను జాగ్రత్తగా తెలుసుకుంటే తంత్రవిద్యలు, పురాణాలంటే ఏమిటో కూడా తెలుస్తాయి. **"శ్రీవిద్యైవతు మంత్రాణాం తత్రకాదిర్యథా పరా"** – అరవైనాలుగు తంత్రాల్లోనూ ఇది గొప్పతంత్రం. విభిన్నమైన తంత్రాల గురించి శంకరులవారు సౌందర్యలహరిలో చెప్తూ, "అరవైనాలుగు తంత్రాలలో విశిష్టమైన తంత్రం శ్రీవిద్య" అన్నారు. అందుకే తంత్రాలన్నీ ఒక ఎత్తు, శ్రీవిద్య ఒక్కటీ ఒక ఎత్తు. తంత్రాల యందు శ్రీవిద్య ఎంత గొప్పదో, స్తోత్రాల యందు సహస్రనామస్తోత్రం అంత గొప్పది. తంత్రాలలో శ్రీవిద్య ఎంత ఉత్కృష్టమైనదో, పురాలలో శ్రీపురం అనగా శ్రీమన్నగరం(మణిద్వీపం), సహస్రనామాల్లో లలితా సహస్రనామాలు అంతటి గొప్పదనాన్ని సంతరించుకున్నాయి.

ఇతర తంత్రాలు కేవలం లౌకిక, పారలౌకిక సుఖాలను మాత్రమే ఇస్తాయి. కానీ శ్రీవిద్యాతంత్రం ఇహలోక, పరలోక సుఖాలు మాత్రమే కాకుండా ఏ తంత్రం ఇవ్వలేని మోక్షాన్ని ఇచ్చే బ్రహ్మవిద్య. అందుకే **'స్వతంత్రా సర్వతంత్రేశీ'** – సర్వతంత్రాలకు ప్రభువుగా, స్వతంత్రంగా ఉంది. **'యథాస్య పఠనాద్దేవీ ప్రీయతే లలితాంబికా'** – దీనిని పఠిస్తే అమ్మవారు సంతోషిస్తుంది. అమ్మ సంతోషించడం కన్నా ఇంకేం కావాలి?

సంకల్పాలలో చాలామంది ఎన్నో సంకల్పాలు చదువుతుంటారు కానీ ఒక్క సంకల్పం చాలు అది–'శ్రీ **లలితాదేవతా ప్రీత్యర్థం'**. ఇంకేమీ అవసరం లేదు. ఆవిడ ప్రీతి చెందాలనే ఒక లక్ష్యం పెట్టుకొంటే అన్నీ లభిస్తాయి. లక్ష్యాలు ఎక్కువైపోతే

ప్రీతి లభించదు. దీనికంటే అమ్మ సంతోషించే విషయం మరొకటి లేదని చెప్తూ, **'అన్య నామ సహస్రస్య పాఠాన్న ప్రీయతే తథా, శ్రీమాతుః ప్రీతయే తస్మాత్ అనిశం కీర్తయేదిదం'.** అమ్మవారి ప్రీతి కోసం నిరంతరం దీన్ని పఠించవచ్చు. సహస్రనామస్తోత్రంలో కేవలం పఠనానికి మాత్రమే కాకుండా రకరకాల ప్రయోగాలు ఉన్నాయి. ప్రయోగం అంటే ఒకొక్క సిద్ధి కోసం ఒకొక్కరకంగా వాడడం. ఇది ఉత్తర పీఠికలో ఇంకా వివరంగా తెలియజేస్తారు.

అమ్మవారి నామాలతో పూజ చేయవచ్చు. ఒక నామాన్ని తీసుకొని జపం చేయవచ్చు. కొన్ని నామాలు చేస్తే అనేక దోషాలు పోతాయి. ఒక్కనామాన్ని తీసుకొని దాన్ని కొన్ని వేలమార్లు పఠిస్తే లేదా జపం చేస్తే ఒక సిద్ధి వస్తుంది. అలా మొత్తం వెయ్యినామాలు వెయ్యిమంత్రాలు. ఒకొక్క నామాన్ని ఒక మంత్రంగా తీసుకొని పఠనం చేస్తే గొప్ప ఫలితం ఉన్నది.

దానికి సంబంధించి ఉపాసనా రహస్యాలు తెలిసినవారు దానితో అనేక ప్రయోగాలు కూడా చేశారు. ఒకొక్క నామంతో హోమం చేస్తే వారికి ఆ అగ్నియందు అమ్మవారు ఒకొక్క రూపంతో దర్శనమిచ్చారు. అంటే ఆ నామాధిదేవత ఒకరున్నారు. అందుకే అమ్మవారికి వెయ్యినామాలు వెయ్యిమంత్రాలు. మళ్ళీ వెయ్యిమంత్రాలు వెయ్యిరూపాలు. ఈ వెయ్యిమంత్రాల వెయ్యి రూపాల ఏకరూపం **'లలితాంబ'.** శ్రీచక్రాన్ని బిల్వపత్రాలతో పూజించి సహస్రనామం పఠిస్తే చాలా విశేషం. శ్రీచక్రార్చన చేసి, శ్రీవిద్యామంత్రాన్ని జపం చేసుకుని, తరువాత సహస్రనామ జపం చేస్తే అది అద్భుతమైన ఫలితం ఇస్తుంది.

'జపాంతే కీర్తయేత్ నిత్యం ఇదం నామ సహస్రకం' – జపం చేసిన తరువాత దీన్ని పఠించితే విశేషం. అందుకిది పఠనానికి, అర్చనకి, జపానికి రకరకాలుగా వినియోగించవచ్చు. **'ఇదం నామ సహస్రంతు కీర్తయేన్నిత్యకర్మవత్'** – ఒక నిత్యకర్మగా ఈ సహస్రనామ స్తోత్రాన్ని అనుష్ఠానం చేసుకోవాలి. చక్రరాజార్చనం, జపం ఎలా నిత్యకర్మో అలా సహస్రనామస్తోత్రం నిత్యం చేయాలి.

'భక్తస్య కృత్యమేతావత్' – నా భక్తుడైనవాడు ఈ కృత్యం చేయాలని అమ్మవారే

చెప్పారు. అమ్మవారి భక్తులకు ఇదొక నిత్యకృత్యం.

'అన్యదభ్యుదయం విదుః భక్తస్య అవశ్యకమిదం నామ సాహస్రకీర్తనం' – అలా ఇంత వరకూ వివరించి, ఇంత గొప్పగా చెప్పడానికి కారణం, ఈ సహస్రనామాలు మానవనిర్మితాలు కావు.

సాధారణంగా ఋషులు కూడా వారి తపస్సుతో దర్శించి కొన్ని ఇస్తూ ఉంటారు. కానీ ఈ సహస్రనామాలు ఇచ్చినవారు వశిన్యాది వాగ్దేవతలు. ఇలాంటి విశిష్టత ఉండే సహస్రనామస్తోత్రాలు చాలా అరుదు. **"తత్ర హేతుం ప్రవక్ష్యామి"** – "ఇంత గొప్పది ఎందుకయ్యిందో చెప్తున్నాను విను" అని దీనికి సంబంధించిన ఒక ఇతివృత్తాన్ని చెప్తున్నారు.

వాగ్దేవతల వివరణ

ఒకప్పుడు అమ్మవారు తన ఎనిమిది మంది దేవతల్ని పిలిచి, "మీకు నేనొక పని చెప్తున్నాను. నా గురించి బాగా చెప్పాలంటే వాగ్దేవతలు అయిన మీరే చెప్పగలరు" అన్నారు. ఎందుకంటే మాటంటే జ్ఞానమే. జ్ఞానం బయటకి చెప్తే మాట అంటారు. జ్ఞానము, వాక్కు– ఈ రెండింటి వల్లనే విషయము తెలుస్తుంది. ఈ ఎనిమిది మంది అమ్మవారినుండే ఎనిమిది తెల్లని కిరణాలుగా వచ్చారు. ఆ ఎనిమిది మంది దేవతలనే **'వశిన్యాది వాగ్దేవతలు'** అంటారు. వీరు మనకిచ్చిన ఒక మహా ఉపకృతి ఈ లలితాసహస్రనామ స్తోత్రం. **'వాగ్దేవీర్వశినీ ముఖ్యాః సమాహూయేదమబ్రవీత్'** – ఏ చదువు చదువుకున్నా ఈ ఎనిమిది మందిని స్మరించుకోవడం చాలా ప్రధానం. వశినీ, కామేశ్వరీ, మోదినీ, విమలా, అరుణా, జయినీ, సర్వేశ్వరీ, కౌలినీ.

ఈ ఎనిమిదిమంది గురించి పరిశీలన చెయ్యాలి. వాక్కులు ఎన్ని మాట్లాడినా, వ్రాసినా అవి ప్రధానంగా ఏభై అక్షరాలే. ఈ ఏభై అక్షరాలే పదాలౌతాయి, వాక్యాలౌతాయి, కావ్యాలౌతాయి, శాస్త్రాలౌతాయి.

ఈ ఏభై అక్షరాలని ఎనిమిది భాగాలుగా చేస్తారు. ఆ ఎనిమిది భాగాలు 'అ' వర్గ, 'క' వర్గ, 'చ' వర్గ, 'ట' వర్గ, 'త' వర్గ, 'ప' వర్గ, 'య' వర్గ మరియు 'శ' వర్గం.

'అ' వర్గమంటే – అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ, ఏ, ఐ, ఓ, ఔ, అం, అః

అ నుంచి అః వరకూ పదహారు స్వరాలు. ఇవి ఒక వర్గం.

'క' వర్గం–కఖగఘఙ

'చ' వర్గం –చఛజఝఞ

'ట' వర్గం –టఠడఢణ

'త' వర్గం–తథదధన

'ప' వర్గం –పఫబభమ

'య' వర్గం–యరలవ

'శ' వర్గం –శషసహ

ఇలా ఎనిమిది వర్గాలుగా విభజన చేశారు. ఎనిమిది మంది వాగ్దేవతలు పైన చెప్పిన ఎనిమిది వర్గాలకి అధిదేవతలు. ఈ ఏభై అక్షరాలే ఎనిమిది వర్గాలై 'అ' వర్గం నుంచి 'శ' వర్గం వరకు చెప్పబడుతున్నాయి. అంతే కాదు – మాట లోపల పలికేటప్పుడు మూడు సూక్ష్మదశలు – 'పరా', 'పశ్యంతీ', 'మధ్యమా'. బయటకి పలికేటప్పుడు 'వైఖరీ'.

ఈ వైఖరికే అక్షరాలు. మిగిలిన మూడు దశలు లోపలే కనుక అక్షరాలు బయటికి రావు. ఎనిమిది వర్గాలలో గల ఎనిమిది మంది అధిదేవతలు వైఖరిలోనే కనబడతారు. ఈ వైఖరి రూపంగా ఉన్న దేవతలు సరిగ్గా కంఠం నుంచి పెదవుల వరకు పలికే స్థానాల్లో ఉంటారు. శరీరంలో ఒకొక్క ఇంద్రియానికి ఒకొక్క అధిష్ఠానదేవత ఉంటారు. లేకపోతే ఆ ఇంద్రియం పనిచేయదు. భారతీయ ఋషులు ఎంత గొప్పవారంటే, ఆ దేవతల అనుగ్రహం పొంది ఆ ఇంద్రియశక్తిని ఎలా పుష్టిచేసుకోవచ్చో మనకి చెప్పారు. వాగ్దేవతలు శరీరంలో ఎక్కడెక్కడ ఉంటారో గ్రహిస్తే అదొక ఆశ్చర్యకరమైన విజ్ఞానం.

మొత్తం పలుకులు బయటికి రావడానికి కంఠం నుంచి శిరస్సు వరకు ఉండే చోట్లు మొత్తం ఎనిమిది. 1. కంఠం. 2. తాళువు అంటే దౌడలు. 3. ఓష్ఠములు

అనగా పెదవులు. 4. దంతాలు. దంతాలు వరుసలు రెండైనా దంతాలన్నీ కలిపి ఒకటిగానే చెప్పుకోవాలి. 5. మూర్ధము అంటే పైన అంగిలి భాగం. దాని తరువాత మాట్లాడడానికి ప్రయత్నాలు రెండురకాలుగా జరుగుతాయి. అవి 6. అభ్యంతర ప్రయత్నం, 7. బాహ్యాప్రయత్నం. (లోపల నుండి మాట్లాడడానికి చేసేది – అభ్యంతర ప్రయత్నం, రెండవది బాహ్యాప్రయత్నం). ఇప్పటికి ఏడు స్థానాలు అయ్యాయి. 8. నాలుక–ప్రధానంగా చెప్పబడేది. మిగిలిన అన్నింటికంటె దీనికి ప్రత్యేక స్థానం. దీనికే 'కరణము' అని పేరు. ఇందులో మొదటి ఐదింటికి 'స్థానాల'ని, తరువాత రెండింటికి 'ప్రయత్నాలు' అని, చివరిగా నాలుకకి 'కరణము' అని పేర్లు. శబ్దం బయటికి రావడానికి ఈ ఎనిమిదే ప్రధానం. మనలో శబ్దం పలికే ఎనిమిది చోట్లు – 5 స్థానాలు, 2 ప్రయత్నాలు, 1 కరణము. వీటి యందు అధిష్ఠించి యున్న శక్తులు వీరు. వీరి అనుగ్రహం ఉంటేనే వాక్కు వెలికి వస్తుంది. వెలికి వచ్చిన వాక్కు అర్థమవుతుంది. ఎన్ని అద్భుతమైన కవిత్వాలు చెప్పినా, సంగీతాలు పాడినా, శాస్త్రాలు వల్లించినా ఈ స్థానాలు సహకరించకపోతే ఏదీ లేదు. ఈ వశిన్యాది వాగ్దేవతలందరూ అమ్మవారి రూపాలే. మనలోపల ఉన్న చైతన్యమే ఈ ఎనిమిది పద్ధతులుగా వాక్కుగా వస్తున్నది. ఆ చైతన్యమే అమ్మవారు. ఆవిడ స్వరూపాలే వాగ్దేవతలు.

ఈ ఎనిమిది మంది దేవతలు ఎనిమిది రకాల మంత్రాలకి సంబంధించిన విశేషాలు

వశినీ వాగ్దేవత: కొన్ని మంత్రాలు వశినీ మంత్రాలు. అంటే ఏవైనా మనకి లొంగుబాటుకి రావాలంటే చేసే మంత్రాలకు వశ్యకర(వశీకర) మంత్రాలని పేరు. వశీకరణమంత్రాలంటే క్షుద్రమైన అర్థం తీయరాదు. సృష్టిలో ఏదో ఒకటి వశం కాకపోతే పని జరుగదు. మంచికి కూడా వశీకరణ శక్తి కావాలి. ప్రకృతి కూడా అనుకూలం కావాలంటే అదీ వశీకరణమే. **వశీకరణమంటే ప్రతికూలతలు తొలగి అనుకూలమవడం.** ఆ శక్తి గల మంత్రాలన్నింటికి అధిదేవత 'వశినీ'.

కామేశ్వరీ వాగ్దేవత : కామం అంటే కోరిక. ఒకొక్క కోరిక తీరడానికి ఒకొక్క రకమైన మంత్రం ఉంది. ఆ మంత్రాలకు అధిదేవత కామేశ్వరి. ఒక దేవత

పేరు ఊరికే పెట్టరు. అందులో అర్థం తెలుసుకోవాలి.

మోదినీ వాగ్దేవత : మోదిని అంటే అంగీకారం, ఆనందం అని అర్థం. సృష్టిలో ఏది జరిగినా ఆనందం, తృప్తి కావాలి. ఆనందానికి, తృప్తికి సంబంధించిన మంత్రాధిదేవత మోదిని.

విమలా వాగ్దేవత : విమల అంటే నిర్మలమైన జ్ఞానం కలిగించే విద్యలు, మంత్రాలు.

అరుణా వాగ్దేవత : అరుణ అంటే ఎర్రని కాంతులతో ప్రకాశిస్తుంది. అరుణ వర్ణం ప్రేమకి, కరుణకి సంబంధించినది. దేవత కరుణ పొందడానికి పనికొచ్చే మంత్రవిశేషాలు అరుణా అని చెప్పబడతాయి.

జయినీ వాగ్దేవత : జయిని అంటే జయం కలిగించే మంత్రాలు.

కౌలినీ వాగ్దేవత : ఇది కుండలినీ యోగానికి సంబంధించిన మంత్రవిశేషం.

సర్వేశ్వరీ వాగ్దేవత : సర్వేశ్వరీ అంటే అన్నింటిమీద ఈశిత్వం. ఈశిత్వం అంటే అధికారం. అది కలిగించే మంత్రాలు.

ఇలా మంత్ర విశేషాలు, వాటి ప్రయోజనాలను బట్టి ఎనిమిది భాగాలు. ఎనిమిది భాగాల మంత్రశక్తులకు అధిదేవతలు ఎనిమిదిమంది. ఏ మంత్రం చెప్పినా ఇందులో దేనికో ఒక దానికి సంబంధించినదే. కనుక ఈ వాగ్దేవతలను ఒక్కసారి తలచుకుంటే అన్ని మంత్రాలు చేయలేకపోయినా అన్ని మంత్రశక్తులను వారు అనుగ్రహించగలరు.

లలితాసహస్రనామ స్తోత్ర మహామంత్రస్య వశిన్యాదివాగ్దేవతా ఋషయః. ఒక మంత్రాన్ని చెప్పే ముందు ఆ మంత్రద్రష్టలైన ఋషులకి ముందు నమస్కారం చేసుకోవాలి.

లలితాసహస్రనామానికి హయగ్రీవస్వామివారు, బ్రహ్మాండపురాణం వ్రాసినందుకు వ్యాసులవారు ఋషులు (మంత్రద్రష్టలు). అంతే కాక, వశిన్యాది వాగ్దేవతలు అమ్మవారిని దర్శించి మనకి అందించారు కనుక వారు మొదటి ఋషులు. వశిన్యాది వాగ్దేవతలు అమ్మవారి స్వరూపాలు కనుకనే అమ్మవారి గురించి బాగా

చెప్పగలిగారు. వీరంతా విద్యాధిదేవతలు, మంత్రాధిదేవతలు.

వశిన్యాది వాగ్దేవతలను పిలిచి సాక్షాత్తు అమ్మవారు చెప్తున్నారు, **"భవత్యో మత్ప్రసాదేన ప్రోల్లసత్ వాగ్విభూతయః"** – 'మీరు నా అనుగ్రహంచేత వాగ్వైభవం కలవారు'. **"మద్భక్తానాం వాగ్విభూతి ప్రదానే వినియోజితాః"** – 'నా భక్తులకు వాగ్వైభవం ఇవ్వడానికే మీరు ఉన్నారు'. అమ్మవారిని మనం ఆశ్రయిస్తే, అమ్మవారికి సంబంధించిన కొన్ని విభాగాల నుండి కొందరు మనల్ని అనుగ్రహించడానికి వస్తారు. ఉదాహరణకు లలితాసహస్రనామస్తోత్రం చదివేవాని మీద ఎవరైనా దుష్ప్రయోగంచేస్తే 'ప్రత్యంగిరా' అనే దేవి వచ్చి అడ్డుకుంటుంది. సూర్యుని నుండి వచ్చిన కిరణాలు ఎలా మనల్ని రక్షిస్తున్నాయో, అమ్మనుండి వచ్చిన దేవతలు మనల్ని అలా కాపాడుతారు.

శ్రీచక్రం : వాగ్దేవతలు

వాగ్దేవతలు శ్రీచక్రంలో ఉంటారు. శ్రీచక్రం అమ్మవారి రూపమే. ప్రధానంగా బిందువు దగ్గర అమ్మ ఉంటుంది. అక్కడ మొదట విచ్చుకోగానే త్రికోణంగా వస్తుంది, తర్వాత అష్టత్రికోణంగా వస్తుంది. దాని తర్వాత దశత్రికోణం, మరో దశత్రికోణం, పధ్నాలుగు త్రికోణాలు, ఎనిమిది త్రికోణాలు, పదహారు త్రికోణాలు... అలా చతురస్రం వరకూ బిందువు విచ్చుకుంటుంది.

అష్టత్రికోణ చక్రం – బిందువు నుండి లెక్క పెడితే మూడవది. త్రైలోక్యమోహన చక్రమనే చతురస్రం నుండి లెక్కపెడితే ఏడవది ఈ ఆవరణ. ఆ ఆవరణకి సర్వరోగహర చక్రం అని పేరు. ఈ సర్వరోగహరచక్రంలో ఎనిమిది త్రికోణాలు ఉంటాయి. అదే అష్టత్రికోణం. ఆ ఎనిమిది త్రికోణాల దగ్గర ఉండే దేవతలే వశినీ, కామేశ్వరీ, మోదినీ మొదలైనవారు. వారు శ్రీచక్రంలో ప్రధానంగా కూర్చున్నవారు. ఆ ఆవరణ పేరు **'సర్వరోగహర చక్రం'.**

ఎనిమిది మంది దేవతలు ఒక్కసారి కృప చూపిస్తే దేహంలో, మనస్సులో ఉన్న అన్ని రకాల రోగాలు పోతాయి. రోగాలు రెండు రకాలు. మనస్సుకు వస్తే ఆధి, దేహానికి వస్తే వ్యాధి. ఈ ఆధివ్యాధుల్ని తొలగించగలిగే శక్తి ఎనిమిది మంది

దేవతలకి ఉంది. సర్వరోగహర చక్రంలో ఉన్న ఆ ఎనిమిది మంది దేవతలను ఒక్కసారి స్మరణ చేసుకుంటే, అది సర్వరోగహరము. అది దీనికున్న ప్రత్యేకత.

వీరు సర్వమంత్రాలకు మూలదేవతలు. ఏ మంత్రంలో అయినా అక్షరాలు, శబ్దాలే ఉంటాయి. అన్ని అక్షరాలకి, అన్ని శబ్దాలకి వీరే దేవతలైనపుడు, వీరే సర్వమంత్రాధిదేవతలు. అందుకే వారిని అమ్మవారు ప్రత్యేకించి కీర్తిస్తున్నారు.

"మచ్చక్రస్య రహస్యజ్ఞా మమ నామ పరాయణాః
మమ స్తోత్ర విధానాయ తస్మాదాజ్ఞాపయామి వః"

"మీరు వాగ్విభూతులు. నాయొక్క చక్ర విజ్ఞాన రహస్యాలు తెలిసినవారు. **మమ నామ పరాయణాః** ఎప్పుడూ నా నామాలే పారాయణ చేస్తూ ఉంటారు కాబట్టి నా స్తోత్రాన్ని రచించడానికి మీకు నేను ఆజ్ఞాపన చేస్తున్నాను" అని అమ్మ ఆజ్ఞాపించింది. అప్పుడు వారు "సరే" అని సమ్మతించారు. **'కురుధ్వమంకితం స్తోత్రం మమ నామ సహస్రకైః'**– నాకు అంకితంగా సహస్రనామ స్తోత్రం చెయ్యండి. సాధారణంగా అంకిత శబ్దం ఈ రోజుల్లో ఒక అలవాటుగా వాడుతున్నారు. అంకితం అంటే తెలియజేసేది, గుర్తుచేసేది. నాకు అంకితమైనది అంటే అమ్మవారిని తెలియజేసే స్తోత్రాన్ని తయారుచేయమనగానే వాగ్దేవతలందరూ భావన చేసి ఈ స్తోత్రం సిద్ధం చేశారు.

శ్రీ లలితాసహస్రనామస్తోత్ర ప్రథమావిష్కరణ

"అమ్మా! స్తోత్రం సిద్ధమైంద"ని చెప్పగానే, "ఇదెక్కడ పఠించాలో నేను చెప్తాన"ని అమ్మవారు ఒక గొప్పసభ ఏర్పాటు చేశారు. మొదటిసారి లలితాసహస్రనామ ఆవిష్కరణ సభ మణిద్వీపంలో జరిగింది. అక్కడ **'తతః కదాచిత్ సదసి స్థిత్వా సింహాసనే అంబికా'** – ఆ మణిద్వీపంలో చింతామణి గృహం, అక్కడొక పెద్దసభ, ఆ సభలో అమ్మవారు పంచబ్రహ్మాసనం మీద కూర్చున్నారు. 'అంబిక' – అమ్మవారికి ఎన్నిపేర్లున్నా ఈ పేరు చాలా బాగుంటుంది. ఎన్నిపేర్లున్నా 'అమ్మవారే'. అంబిక సింహాసనం మీద కూర్చున్నారు. అమ్మవారు ఎప్పుడైతే సభ ఏర్పాటు చేశారో వెంటనే ఆ సభకు అనేకమంది వచ్చారు. ఎందుకంటే ప్రపంచాన్ని నిర్వహించే

ప్రపంచనాయకురాలి సభ.

కనుక ప్రపంచాన్ని నిర్వహించేవారందరూ వచ్చారు. కోట్ల కొలది సరస్వతీ బ్రహ్మదేవులు, కోట్ల కొలది లక్ష్మీనారాయణులు, కోట్ల కొలది ఉమామహేశ్వరులు వచ్చారు. ఇదేమిటి ఆశ్చర్యము! అయోమయమేమీ అక్కర్లేదు. ఎన్నికోట్ల బ్రహ్మాండాలు ఉన్నాయో, అన్ని కోట్ల బ్రహ్మాండాలలోను సృష్టి, స్థితి, లయలు జరుగుతున్నాయి. కనుక ఈశ్వరశక్తి ప్రతి బ్రహ్మాండంలో బ్రహ్మ, విష్ణు, రుద్ర రూపాలతో ఉంటుంది. అలా అనేక కోట్ల బ్రహ్మాండాలు ఉన్నాయి. అన్ని కోట్ల బ్రహ్మాండాల నుండి ఆ సృష్టి, స్థితి, లయకారకులు అమ్మవారి సభకి వచ్చారు. అమ్మవారి పరివారదేవతలైన **'మన్త్రిణీ దణ్డినీ ముఖ్యాః సేవార్థం యాః సమాగతాః'** – శ్యామలాదేవి, వారాహీదేవి, **'శక్తయో వివిధాకారాః'** – అనేకరకాలైన అమ్మవారి శక్తులు, పరివారదేవతలు, ఉపదేవతలు, అంగదేవతలు – అందరూ వచ్చి ఆ సభలో కూర్చున్నారు.

గురువులు కూడా వచ్చారు. గురువులు మూడు రకాలుగా ఉంటారు. దివ్యౌఘ, సిద్ధౌఘ, మానవౌఘ. 'ఓఘము' అనగా సమూహం అని అర్థం. అమ్మవారి విద్యలో దేవతలు ఉన్నారు. సిద్ధపురుషులు ఉన్నారు. మానవులుగా వచ్చి ఉపాసనవల్ల, తపస్సువల్ల గొప్పవారైన ఋషులు ఉన్నారు.

దివ్యౌఘ– అంటే దేవకోటికి సంబంధించిన గురువులు 'మిత్రేశమయి' మొదలైనవారు. అగస్త్య, లోపాముద్ర వీరందరూ సిద్ధ గురువులు. శంకరభగవత్పాదులు మొదలైనవారు మానవరూపంలో అవతరించి గురువులైనవారు 'మానవౌఘం' అని చెప్పబడుతున్నారు. ఇలా దివ్యౌఘ, సిద్ధౌఘ, మానవౌఘ వీరందరూ వచ్చారు.

దివ్యౌఘా మానవౌఘాశ్చ సిద్ధౌఘాశ్చ సమాగతాః
తత్రశ్రీ లలితాదేవీ సర్వేషాం దర్శనం దదౌ

భవ్యమైన సింహాసనంలో కూర్చొని అమ్మవారు వీరందరికి దర్శనమిచ్చారు. అప్పుడు అమ్మవారు సైగ చెయ్యగానే, ముందు వరుసలో కూర్చున్న వశినీ మొదలైన ఎనిమిది మంది వాగ్దేవతలు లేచారు. సభ అంతా మౌనం వహించింది. అమ్మవారి సైగని స్వీకరించి, వశిన్యాదివాగ్దేవతలు సహస్రనామాలతో 'కీర్తన' చెయ్యడం మొదలు

పెట్టారు. అది మొదట సహస్రనామస్తోత్రం పఠించిన సన్నివేశం. మణిద్వీపంలో చింతామణి గృహసభలో అంతమంది సమూహంలో వశిన్యాదివాగ్దేవతలు **'బద్ధాంజలి పుటాస్తదా'** రెండుచేతులూ శిరస్సుమీద పెట్టుకొని తలవంచి ఒళ్ళు పులకించిపోతూ ఉండగా అమ్మవారిని **'అస్తువన్నామసాహస్రైః స్వకృతైః లలితామ్బికామ్'** – వెయ్యినామాలు పఠనం చేశారు. **'సర్వే విస్మయం జగ్ముః యే తత్ర సదసి స్థితాః'** ఆ నామాలు విని సదస్సులో ఉన్న మేధావులంతా ఆశ్చర్యచకితులైయ్యారు.

'తతః ప్రోవాచ లలితా' – అప్పుడు అమ్మవారు చెప్తున్నారు, "మీరంతా విన్న ఈ స్తోత్రం నాకు చాలా ప్రీతికరమైనది. మీరందరూ నా ఆజ్ఞగా స్వీకరించి ఈ సహస్రనామ స్తోత్రాన్ని ఇకపై పఠనం చేస్తూ, మీ మీ లోకాలలో వ్యాప్తి చేయించండి". సర్వజీవులు తరించాలనే కారుణ్యంతో అమ్మవారు ఈ ప్రణాళిక వేశారు.

"నా గురించి తెలుసుకుని కీర్తించి సృష్టిలో అందరూ తరించాలి. నా గురించి తెలియజేసే శాస్త్రం లలితాసహస్రనామ స్తోత్రమ"ని అమ్మవారు వశిన్యాదివాగ్దేవతల ద్వారా దివ్యసభలో ఆవిష్కరించి –

'అంకితం నామభిర్దివ్యైః మమ ప్రీతివిధాయకైః
మమాజ్ఞయైవ వాగ్దేవ్యః చక్రుః స్తోత్రమనుత్తమమ్'

"ఇది నాకు అత్యంత ప్రీతిపాత్రమైన స్తోత్రం సుమా! నా ఆజ్ఞను అనుసరించి వాగ్దేవతలు ఈ స్తోత్రం చేశారు. మీరందరూ కూడా శ్రద్ధతో విన్నారు కదా! **'ప్రవర్తయధ్వం భక్తేషు'** – నా భక్తులలో దీన్ని ప్రవర్తిల్లజేయండి. నేను ప్రీతి చెందాలనే తపన నా భక్తులకు ఉంది. వారి తపన తీర్చడం కోసం నేను ఈ విద్యను ఆవిష్కరించాను. మీరు మీ మీ బ్రహ్మాండాలలో నా భక్తులకు అందజేయండి".

'స మే ప్రియతమో జ్ఞేయః తస్మై కామాన్ దదామ్యహమ్
ఇదం నామ సహస్రం మే యో భక్తః పఠతే సకృత్'

"నా భక్తులైనవారు ఈ స్తోత్రాన్ని భక్తితో ఒక్కసారి పఠించినా నేను సంతోషిస్తాను. దీనిని శ్రీచక్రమునందు ఆరాధించి, జపం చేసి పఠించవచ్చును. శ్రీచక్ర ఆరాధన చెయ్యకపోయినా, నా మంత్రం జపం చెయ్యకపోయినా ఈ

సహస్రనామస్తోత్రం చెయ్యవచ్చు" అని అమ్మవారు చెప్పారు.

'మామర్చయతు వా మా వా విద్యాం జపతు వా న వా
కీర్తయేన్నామసహస్రమిదం మత్ప్రీతయే సదా'

"నన్ను అర్చించినా అర్చించకపోయినా, నా మంత్రం జపించినా జపించకపోయినా భక్తితో ఈ నామసహస్రం చదివితే **'మత్ప్రీత్యా సకలాన్ కామాన్ లభతే నాత్ర సంశయః'**- నేను ప్రీతి చెందుతాను. చదివినవారి కోరికలు అన్నీ తీరతాయి. ఇందులో సందేహం లేద"ని అమ్మవారు చెప్పారు. తగిన నియమాలతో ఈ సహస్రనామస్తోత్రం అందరూ తప్పులు లేకుండా కీర్తించవచ్చును.

'తస్మాత్ నామ సహస్రం మే కీర్తయధ్వం సదా ఆదరాత్' – వీటిని నియమాలు అంటారు. ఆదరాత్, భక్త్యా అంటే ఆదరంగా, భక్తిగా చదవాలి అని అర్థం. ఉత్తరాదిలో 'ప్రేమ్ సే బోలో జై మాతాజీ' అన్నట్టు ప్రేమగా పలకాలి.

'తదాజ్ఞయా తదారభ్య బ్రహ్మవిష్ణుమహేశ్వరాః
శక్తయో మంత్రిణీ ముఖ్యా ఇదం నామ సహస్రకం
పఠన్తి భక్త్యా సతతం లలితా పరితుష్టయే'

అమ్మవారు సభలో ఆజ్ఞాపించిన తరువాత బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఇతర శక్తులు, శ్యామల, వారాహీ దేవతలు – వీరందరూ ఆనాటి నుండి లలితా సహస్రనామ స్తోత్రం పారాయణ చేస్తూ ఉన్నారు.

సహస్రనామ స్తోత్రం అపౌరుషేయం. అపౌరుషేయమని వేదాలకి పేరు. వేదాలు మానవులు సృష్టించినవి కావు. **'యస్య నిశ్వసితం వేదాః'** అని ఉపనిషత్ చెప్తోంది. ఊపిరుల వలె వేదాలు పరమాత్మ నుండి సహజంగా వచ్చాయి. వేదాలు పరమాత్మ యొక్క శబ్దరూపములు. అవి పురుష సృష్టి కాదు, జీవ సృష్టి కాదు.

అలాగే సహస్రనామాలు కూడా సాక్షాత్తు అమ్మవారి వాగ్రూపాలే వెలికి వచ్చి అందించాయి కనుక లలితాసహస్రనామస్తోత్రం సాక్షాత్తు వేదమే. వేదపారాయణానికి ఎంత శక్తి ఉందో, సహస్రనామ పారాయణకి అంత శక్తి ఉన్నది.

వేదానికి ప్రత్యేకమైన సంస్కారాలు, అధికారాలు చెప్పారు. అన్ని నియమాలు

లేకుండానే సహస్రనామస్తోత్రం పఠించి అంతటి ఫలితాలు పొందవచ్చును. ఇంత విశేషంగా దీనిని వివరించి, "అందుకే దీనికి రహస్యనామ స్తోత్రమని పేరు వచ్చింది" అని చెప్పారు హయగ్రీవస్వామి.

రహస్యనామాలని ఎందుకన్నారు?

బయటికి పేర్లలా కనబడుతున్నా ఇందులో శ్రీచక్రానికి సంబంధించిన విశేషాలు, శ్రీవిద్యకి సంబంధించిన మర్మాలు ఉన్నాయి. అంతేకాక యోగశాస్త్ర రహస్యాలు, మంత్రశాస్త్ర సంకేతాలు ఉన్నాయి.

రహస్యమని దేనినంటారు? **'ఇదం గుహ్యతమం శాస్త్రం'** అని భగవద్గీత పదిహేనవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ చెప్పారు. గుహ్యతమం అనగా రహస్యాల్లోకెల్లా రహస్యమైనది. యుద్ధభూమిలో చెప్తూ ఇది రహస్యవిద్య అంటారా? ఇది ఒక శాస్త్రీయ సాంకేతిక పదం. లౌకికమైన పదం కాదు.

శాస్త్రాలు రెండు రకాలు. ఒకటి ప్రకటశాస్త్రాలు. రెండు గుహ్యశాస్త్రాలు. భౌతికశాస్త్రాలన్నీ ప్రకటశాస్త్రాలే. అణువిజ్ఞానం మొదలుకొని అన్నీ కూడా భౌతికశాస్త్రాలే.

గుహ్యశాస్త్రాలు మూడు రకాలు – అవి గుహ్య, గుహ్యతర, గుహ్యతమ. అతీంద్రియమైన విజ్ఞానాన్ని గురించి చెప్పే శాస్త్రాలకు రహస్యశాస్త్రాలని పేరు.

ధర్మంగా ఉంటే స్వర్గానికి, అధర్మంగా ఉంటే నరకానికి వెళ్తారు. ఇది ఇంద్రియాలతో ఋజువు చేయలేరు కాబట్టి ఇలాంటివి రహస్య శాస్త్రాలు.

మంత్రశాస్త్రాలు గుహ్యతర శాస్త్రాలు. బ్రహ్మవిద్య, తత్త్వశాస్త్రాలు గుహ్యతమ శాస్త్రాలు. ఈ మూడురకాల శాస్త్రాలను రహస్యశాస్త్రాలు అంటారు.

సహస్రనామస్తోత్రం ఒక స్తోత్రగ్రంథమే కాక మహాశాస్త్రగ్రంథం. ఈ స్తోత్రంలో ధర్మశాస్త్రం, మంత్రశాస్త్రం, యోగశాస్త్రం, వేదాంతశాస్త్రం మొదలైన అన్ని శాస్త్రాలు ఉన్నాయి. వ్యాఖ్యానాలతో అన్నీ ఋజువు చేసినవారు ఉన్నారు.

వ్యవహారం కోసం 'ధర్మశాస్త్రం'. ఉపాసన కోసం 'మంత్రశాస్త్రం'. సత్యం తెలుసుకోవడం కోసం 'తత్త్వశాస్త్రం' – ఈ మూడు మనిషికి కావాలి. వ్యవహారజీవితానికే

'ధర్మం' కావాలి. పరమార్థజీవితానికి 'వేదాంతం' కావాలి. ఈశ్వరుని అనుగ్రహం కోసం 'మంత్రం', 'ఉపాసన' కావాలి. ఈ మూడు శాస్త్రాలు భగవదనుగ్రహం వలనే లభిస్తాయి. అమ్మవారు ధర్మ, మంత్ర, తత్త్వాల మూడింటి రూపం.

ఏది గ్రహిస్తే మరేదీ తెలుసుకోనక్కర్లేదో అలాంటి శాస్త్రం మనకి వశిన్యాదివాగ్దేవతలు అందించారు. నిరంతరం మననం చేసుకోవలసిన గ్రంథమిది. సహస్రనామాలలో కొన్ని నామాలని ఒక కూర్పుగా తీసుకొంటే కొన్ని ఉపనిషత్తులు తయారవుతాయి. కొన్ని నామాలు దగ్గరకు తీసుకొస్తే ఒక మంత్రశాస్త్రం బయటపడుతుంది. కొన్ని నామాలు కూర్చితే ధర్మశాస్త్రం బయటకు వస్తుంది.

మన జీవితంలో ప్రతి క్లిష్టపరిస్థితులలో ఏదో ఒక నామం బయటకు వచ్చి, "నేనున్నా"నని మనల్ని రక్షిస్తుంది. బయటకు చదువుతారు కానీ దానిలో మహిమలు తెలియవు కనుక రహస్యనామాలు. ఆ మహిమలు ప్రకటంగా తెలుసుకోలేరు. మన బుద్ధికి అందని శక్తి వాటిలో ఉంది.

శక్తి ఎప్పుడూ రహస్యమే. ప్రకటమైన పరికరాలు పనిచేయాలంటే రహస్యమైన శక్తి వాటిలో దాగి ఉంటుంది కదా!

లలితాసహస్రనామాల్ని ఒక ద్రాక్షతోటలా వర్ణిస్తే ద్రాక్షతోటలో గుత్తులు గుత్తులుగా ద్రాక్షపళ్ళు ఎలా ఉంటాయో అలా ఈ సహస్రనామాల్లో ఒకొక్క నామాల గుంపు ఒకొక్క గుత్తిగా ఉంటుంది. దుర్గా మంత్రాలన్నీ కొన్ని నామాల గుత్తిలో ఉంటాయి. వనదుర్గా విశేషమంతా ఇంకోచోట చూపిస్తారు. ఇలా ఒకొక్క మంత్రవిశేషాలు కొన్ని గుత్తుల నామాల్లో పెట్టారు. ఆ నామాలగుత్తి తీసుకొని పారాయణ చేయాలి. ఉదాహరణకి

భవదావ సుధావృష్టిః – పాపారణ్య దవానలా
దౌర్భాగ్యతూల వాతూలా – జరాధ్వాంత రవిప్రభా
భాగ్యాబ్ధిచంద్రికా – భక్తచిత్తకేకిఘనాఘనా
రోగపర్వతదంభోళిః – మృత్యుదారుకుఠారికా

ఇది ఒక గుత్తి. జాతకాలలో ఎన్ని రకాలదోషాలున్నాయో, వాటన్నిటినీ

పోగొట్టేశక్తి ఈ గుత్తిలో పెట్టారు.

'దుర్లభా దుర్గమా దుర్గా'...... నుంచి దుర్గావిద్య కనిపిస్తుంది. ఇలా రకరకాల ప్రయోజనాలకోసం రకరకాల గుత్తులు ఉన్నాయి.

'విశుద్ధిచక్రనిలయా'..... నుండి ఒకొక్క చక్రంలో పనిచేసే అమ్మవారి శక్తులన్నీ ఒక గుత్తిగా పెట్టారు.

ద్రాక్షతోటలో ఉన్న పళ్ళగుత్తులకి, సహస్రనామాల్లో ఉన్న నామాల గుత్తులకి తేడా ఏమిటంటే – ద్రాక్షతోటలో పళ్ళగుత్తులలో ఏ పండు తిన్నా రుచి, ఫలితం ఒక్కటే. కానీ సహస్రనామాల్లో ఒకొక్క గుత్తిలో ఒకొక్క రకమైన ఫలం. అంత అత్యద్భుతమైనది లలితాసహస్రనామస్తోత్రం.

లలితాసహస్రనామాల్లో ఒక్కో నామం నుంచి ఏ మంత్రశక్తులు వస్తాయో దర్శించలేరు. కానీ వాటి ఫలితాలను మాత్రం అనుభవిస్తారు. సూక్ష్మదృష్టితో చూస్తేగాని తెలియని అద్భుతాలు ఉన్న నామాలు కాబట్టి ఇవి 'రహస్యనామాలు'.

లలితాసహస్రనామస్తోత్ర భాష్యకారులు:

చాలా మంది మహాత్ములు లలితా సహస్రనామస్తోత్రానికి భాష్యం వ్రాశారు. వీరిలో 18వ శతాబ్దానికి చెందిన భాస్కరరాయలవారు 'సౌభాగ్యభాస్కరం' అనే పేరుతో భాష్యాన్ని రచించారు. ఈయన అమ్మవారి మంత్రసిద్ధి పొందినవారిలో ఒకరు. వీరి పూర్వతరాలు అందరూ శ్రీవిద్యా ఉపాసకులే. అంతేకాకుండా అగ్నిహోత్రీకులు. అగ్నిహోత్రం, వేదవిద్య కలిగిన పరంపరలో పుట్టినవారు భాస్కరరాయలవారు. ఈయన కర్ణాటక దేశానికి చెందినవారు. భాగ్యనగరంలో జన్మించారు. ఆయన గురువుగారు సూరత్ నగరానికి చెందిన పరశివానందనాథశుక్ల. విష్ణుదత్త అనేవారు శ్రీవిద్యలో గురువుగారు.

ఈయన శిష్యపరంపర మహారాష్ట్ర మొదలైన ప్రాంతాలలో నేటికీ చాలా ఉంది. ఈయన శిష్యులు ఒకొక్కరూ ఘటికులై గొప్ప ఉపాసనా గ్రంథాలను రచించారు. ఆయన స్వయంగా వేదవిజ్ఞానం కలిగినవారు. వైదికమైన శ్రౌతయాగాలు ఎన్నో చేశారు. సోమయాగాలెన్నో చేసి సోమయాజిగా వెలుగొందారు.

మహాగ్నిచయన విద్య చేసినవారు. అందుకే 'మహాగ్నిచిద్యజ్ఞా' అనే బిరుదును పొందారు. భాష్యగ్రంథాలలో ఈ విషయాలు ఆయనే వ్యక్తపరచుకున్నారు. శ్రీవిద్యకి సంబంధించిన అద్భుతమైన ప్రస్థానత్రయం ఆయన రచించారు.

1. లలితా రహస్యనామస్తోత్ర భాష్యం, 2.యోగినీ హృదయం, 3. వరివస్యా రహస్యం.

వీరు కాశీక్షేత్రంలో అమ్మవారి సాధన చేస్తూ, లలితాసహస్రనామాలని దర్శనం చేస్తూ, భాష్యం రచించారు. ఆయన దీక్షానామం 'భాసురానందనాథ'. ఆయన అసలు పేరు భాస్కరరాయలవారు. వారి నాన్నగారైన గంభీరరాయలవారు పార్శీభాషలో భారతాన్ని రచించారు. పరంపరగా భారతీ అనే కీర్తినామం కూడా వీరికి ఉంది.

ఇప్పటికీ కాశీ అన్నపూర్ణ ఆలయంలోకి వెళ్ళినపుడు, సరిగ్గా కోణస్థానంలో భాస్కరరాయలవారు స్వయంగా ప్రతిష్ఠ చేసిన యంత్రేశ్వరుడు అనే శివలింగం ఉంటుంది. అక్కడ లింగంపై శ్రీచక్రం ఉంటుంది.

అక్కడ ఆయన భాష్యరచన చేస్తూ పండితులకు భాష్యాన్ని వినిపించేవారు. ఆ విన్న పండితులు ఆశ్చర్యచకితులయ్యేవారు. ఏ సంప్రదాయానికి చెందినవారైనా ఈయన భాష్యం పట్టుకోనిదే భాష్యరచన చెయ్యలేకపోయేవారు.

ఈయనకు పూర్వం కూడా చాలా భాష్యాలు ఉన్నాయి. కానీ అమ్మవారి అనుగ్రహం చేత ఈ భాష్యం చాలా ప్రసిద్ధి చెందింది. కాశీలో త్రిపురాఘాట్ వద్ద ఈయన అమ్మవారి ఆరాధన చేశారు. చౌషష్టిఘాట్ వద్ద చతుష్షష్టియోగినీ దేవతల ఆలయం ఉంది.

ఈయన లలితాభాష్యం చెప్తూ **'చతుష్షష్టికోటియోగినీ గణసేవితా'** అనే మంత్రానికి అర్థం చెప్తే, కొంతమంది పండితులు నిజానికి అరవైనాలుగు కోట్ల యోగినీగణాలు అమ్మవారి దగ్గర ఉన్నారా? అని ప్రశ్నిస్తే, రేపు మీకు వీలైతే చూపిస్తాను అని చెప్పి మరుసటి రోజు శ్రీచక్రానికి అభిషేకంచేసి ఆ వచ్చిన పండితుల కళ్ళకి ఆ తీర్థం వ్రాశారు.

అమ్మవారి శ్రీచక్రం పైనుండి పడిన తీర్థం శక్తి చాలా గొప్పది. అందుకే శివలింగంపై, సాలగ్రామంపై, శ్రీచక్రంపై వచ్చే తీర్థాన్ని జలం అనే దృష్టితో చూస్తే వానిని పాపాత్ముడంటారు. మనకి సూక్ష్మదృష్టి లేదు కానీ ఒక్కసారి చూస్తే అదంతా కాంతిమయంగా గోచరిస్తుంది. అంతకంటే అమృతం మరొకటి దొరకదు.

ఆ శ్రీచక్రం పైనుండి వచ్చిన తీర్థాన్ని ఆ పండితుల కళ్ళకి రాయగా, వెంటనే మణిద్వీపంలో ఉన్న యోగినీ దేవతలందరూ ప్రత్యక్షమయ్యారు. ప్రత్యక్షమై ఎవరిపేరు వారు చెప్పుకుంటుంటే పండితులకి కళ్ళు తిరిగి, 'మేం ఇంక చూడలేకపోతున్నాం' అన్నారు.

దివ్యత్వాన్ని ప్రశ్నించగానే సరిపోదు... అది దర్శనమిస్తే తట్టుకోగలరా! అని చూసుకోవాలి. ఎంత పండితులైనా ఉపాసకుల అనుభవం ముందు నిలువలేరు. వారందరూ కూడా, "అమ్మవారి మంత్రాలు కేవలం నామాలు కావని గ్రహించగలిగా"మని శరణాగతులయ్యారు. ఆయన శిష్యపరంపర కూడా అనేకమైన గ్రంథాలను రచించారు.

ఈయనకు పూర్వం భాష్యం వ్రాసిన వారి పేర్లని కూడా ఒక్కసారి స్మరిస్తే అమ్మవారు సంతోషిస్తారు. ప్రధానంగా ఏడు భాష్యాలు ఉన్నాయి. విమర్శానందనాథులు అనే వారు శ్లోకరూపంలో భాష్యం రచించారు. ఈయన రెండువేల శ్లోకాలలో అమ్మవారి సహస్రనామాలకి భాష్యం రచించారు.

విద్యారణ్యమునీశ్వరులు అని శ్రీవిద్యా సంప్రదాయానికి చెందిన ఒకానొక యోగి. ఈయన గురువుగారు అనంతారణ్యులవారు. ఈయన పదిహేను వందల శ్లోకాలతో లలితాసహస్రనామాలకి భాష్యం వ్రాశారు(వీరికి, శృంగేరీ పీఠానికి పన్నెండవ పీఠాధిపతులుగా ఉన్న విద్యారణ్యులువారికి సంబంధం లేదు). భట్టనారాయణులు – ఈయనకే నారాయణ భట్టు అని కూడా పేరు ఉంది. ఈయన శంకరాద్వైతానికి సంబంధించిన గొప్పజ్ఞాని. ఈయన రెండువేల ఐదువందల శ్లోకాలతో లలితాసహస్రనామాలకి భాష్యం వ్రాశారు. దీనికి 'జయమంగళ వ్యాఖ్య' అని పేరు. ఇది ప్రస్తుతం లభ్యమవుతున్నది. శంకరపండితులు అనేవారు కూడా

లలితాభాష్యం రచించారు. శ్రీశ్రీశ్రీ కళ్యాణానంద భారతివారు 'కళ్యాణి వ్యాఖ్య (శ్రీకలా)' అనే పేరుతో లలితాసహస్రనామాలకి అద్భుతమైన భాష్యం వ్రాశారు. సమయాచారపరంగా ఇదొక ప్రామాణికమైన గ్రంథం.

విమలానందనాథుడు అనేవారూ రచించారు. ఇది కేవలం వ్రాతప్రతిగానే శృంగేరీపీఠంలో ఉన్నదని భాష్యం రచిస్తూ శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావుగారు ప్రస్తావన చెయ్యడం జరిగింది. ఇలా ఇందులో రెండు భాష్యాలను మథనం చేస్తూ, గురువుల దయవలన, ఇతర పురాణాలు పఠించడం వలన, అమ్మవారి కృప వలన లభించిన విజ్ఞానాన్ని మేళవించుకుంటూ ఈ లలితా నామ భావనావిష్కారాన్ని మీ ముందుకు తేవడం జరుగుతోంది.

శ్రీవిద్యాసంబంధమైన ఈ సహస్రనామవిద్యలో భాస్కరరాయల నామవిద్య ఎంత ప్రమాణంగా తీసుకుంటున్నామో అదేవిధంగా భట్టనారాయణులు రచించిన జయమంగళవ్యాఖ్యను కూడా ప్రమాణంగా తీసుకోవడం జరుగుతోంది.

భాస్కరరాయలవారు ఏ పాఠాన్ని స్వీకరించి భాష్యం రచించారో, ఆ పాఠమే ఇప్పుడు అందరికి దొరుకుతోంది. అదే పఠిస్తున్నారు.

భట్టనారాయణులు రచించిన పాఠానికి, భాస్కరరాయలు రచించిన పాఠానికి కొన్ని చోట్ల మార్పులున్నాయి. ఏది గొప్ప అనే చర్చ కంటే కొన్ని అందులోవి, ఇందులోవి తీసుకోవల్సిన అవసరముంది.

అగస్త్యులవారు హయగ్రీవులతో మాట్లాడుతూ 'నువ్వు ఇంతవరకూ ఇవి చెప్పావు కదా' అని కొన్ని చెప్పారు. అందులో లలితోపాఖ్యానం – ఇత్యాది విషయాలు ఉన్నాయి. ఆ విషయాలు కూడా తెలుసుకుని లలితాసహస్రనామాలు చదివితే, ప్రస్తుతం మనకి బాగా అలవాటైన పాఠంలో కొన్ని తప్పనిసరిగా సవరించుకోవాలి. ఉదాహరణకి 'కాలకంఠీ కాంతిమతీ' – ఈ కాలకంఠీ అనేది భాస్కరరాయలవారి పాఠం. తప్పు అని కాదు గాని జయమంగళవ్యాఖ్యలో 'కలకంఠీ' అని ఉంది. ఇద్దరిది పాఠభేదం కనిపించినప్పటికి కూడా అర్థంలో ఇద్దరిది ఉచితంగా ఉన్నప్పుడు భాస్కరరాయలవారిదే స్వీకరించాలి. 'కాలకంఠీ' – అనేది ఒక క్షేత్రంలో ఉన్న

అమ్మరూపంగా పేర్కొన్నారు భాస్కరరాయలవారు.

కానీ కొంతమంది పండితులు దీన్ని ప్రశ్నించవచ్చు. కొంతమంది భాస్కరరాయలవారిది కౌళాచారం, వామాచారం అని, భట్టనారాయణులది అంతా దక్షిణాచారం అంటారు. భాస్కరరాయలవారు అనేక చోట్ల వామాచారాన్ని ఖండించారు. ఎవరి ప్రమాణాలు వారు చూపిస్తారు. భక్తి మాత్రమే ప్రధానం. భాస్కరరాయల వారిదే ప్రమాణంగా ఎందుకు తీసుకున్నామంటే లోకంలో బాగా ప్రసిద్ధిచెంది, దానిలో దోషము లేనప్పుడు దానినే స్వీకరించవచ్చును. బ్రహ్మవేత్తలు, పరాదేవతను సాక్షాత్కరింపజేసుకున్న బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారు ప్రభృతులు ఈ భాష్యాన్ని ప్రామాణికంగా ప్రవచించేవారు కూడా.

ఉదాహరణకి భాస్కరరాయలవారిది 'మాణిక్యమకుటాకారజానుద్వయ విరాజితా' అని ఉంది. జయమంగళ వ్యాఖ్యలో 'మాణిక్యముకురాకారజానుద్వయ విరాజితా' అని ఉంది. ఇందులో ప్రమాణంగా చక్కగా ఉన్నది 'మాణిక్యముకురాకారా' కానీ, మకుటాకార అన్నంతమాత్రాన భేదమేమీ లేదు. చక్కగా స్వీకరించవచ్చు. ఇప్పుడన్ని మార్పులు చేస్తే ప్రసిద్ధంగా చదివేటప్పుడు ఇబ్బంది వస్తుంది.

అలాంటివి కొన్ని ఇందులో వచ్చినపుడు శాస్త్రవిషయం తెలుసుకోవడానికి అక్కడవి, ఇక్కడవి పాఠభేదం చెప్పినప్పటికీ ప్రసిద్ధంగా ఏం చదువుకోవచ్చో తెలియజేయడం జరుగుతుంది. ఇందులో సాధకుడు, భక్తుడు – వీరిని దృష్టిలో పెట్టుకొని తెలియజేయడమవుతోంది.

అదే విధంగా జయమంగళ వ్యాఖ్యలోనే, లలితోపాఖ్యానం ప్రకారం 'మంత్రిణ్యంబావిరచిత విశుక్రవధతోషితా' అని ఉంది. భాస్కరరాయలవారి పాఠంలో 'మంత్రిణ్యంబావిరచిత విషంగవధతోషితా' అని ఉంది. కానీ లలితోపాఖ్యానం ప్రకారమే మనం చదువుకోవాలి.

'విషంగప్రాణహరణవారహీవీర్యనందితా' అనే పాఠమే జయమంగళవ్యాఖ్యలో ఉంది. కానీ భాస్కరరాయలవారు మాత్రం 'విశుక్రప్రాణహరణవారహీవీర్యనందితా' అని చెప్పారు. అప్పుడు మనం ప్రమాణంగా తీసుకోవలసినది జయమంగళవ్యాఖ్య.

దీనికి లలితోపాఖ్యానమే ప్రమాణం.

ఇలా **లభ్యమైన అనేక గ్రంథాలు పఠనం చేస్తూ, జాగ్రత్తగా అధ్యయనం చేస్తూ, శ్రీవిద్యాసంప్రదాయాన్ని సాధనలోకి తెచ్చుకుంటూ ఉండడం వలన సరియైన పాఠం జాగ్రత్తగా అమర్చుకుని వ్యక్తిగతంగా సాధన కోసం ఎంచుకున్న శాస్త్రమే ఇందులో తెలియజేయబడుతుంది.**

నిత్యపారాయణ చేసేటప్పుడు మంత్రబలం మనకి లభించేటట్లుగా ఉండే పాఠాన్ని తయారుచేయడం జరిగింది. 'శ్రీమాతా' నుండి అదే పరంపర సాగుతుంది. అదే విధంగా మంత్రాల గుత్తులు చెప్పడం జరుగుతుంది. వాటి ప్రయోజనం చెప్పుకుంటాం. లలితాసహస్రనామం చదువుతుంటేనే ఆ గమనంలో ఒక అద్భుతమైన దివ్యస్త్రీ గమనం కనబడుతుంది.

విష్ణుసహస్రం, శివసహస్రం చదువుతున్నప్పుడు అర్థాలు తెలియకపోయినా ఆ శబ్ద ఉచ్చారణలోనే మనకి ఆ దేవతాశక్తి స్ఫురిస్తూ ఉంటుంది. విష్ణుసహస్రం చదువుతుంటే ఒక మహాపురుషుని గమనంలా ఉంటుంది. శివసహస్రం చదువుతుంటే ఒక మహాతేజోవంతుడైన మహాపురుషుని స్వరూపం శబ్ద ఉచ్చారణలో కనిపిస్తుంది.

లలితాసహస్రంలో 'శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ' అన్నప్పుడు ఆ సౌకుమార్యం, ఆ లాలిత్యం, ఆ ఠీవి అంతా కనబడుతుంది. అర్థం దాకా వెళ్ళక్కర్లేదు... శబ్ద ఉచ్చారణలోనే ఆ దేవతా లక్షణం కనబడుతుంది.

సహస్రనామస్తోత్ర అర్థంలో ఒక ప్రత్యేకత ఉండవచ్చును. కానీ ఉచ్చారణలోనే ఒక అద్భుతశక్తి ఉంటుంది. ఆ దేవత కనబడుతుంది. **లలితా సహస్రనామములు పఠించేటప్పుడు మాత్రం తప్పులు లేకుండా పఠించాలి. అర్థం తెలుసుకోకపోయినా ఫరవాలేదు గానీ తప్పులు చదివితే సత్ఫలితం రాదు. దుష్ఫలితం వస్తుంది. ఒకొక్క శబ్ద ప్రకంపనలో ఒక చైతన్యం ఉంటుంది.**

కెనడా దేశంలో జరిగిన ఒక పరిశోధనలో సహస్రనామస్తోత్రం పఠిస్తూ ఉంటే ఆ ప్రకంపనల నుండి కాంతి రేఖలు ఉత్పన్నమయ్యాయి. అక్కడున్న భారతీయ వైజ్ఞానిక శాస్త్రవేత్తలు దానికి సంబంధించిన ఒకానొక యంత్రాన్ని(టోనోస్కోపీ)

కంప్యూటరుకి జతపర్చి సహస్రనామస్తోత్రాన్ని పఠించారు. ఆ శబ్దప్రకంపనలు కాంతిరేఖలుగా తీసుకున్న ఆ యంత్రం ద్వారా మొత్తం లలితాసహస్రనామాన్ని పఠించగా కాంతిరేఖారూపం 'శ్రీచక్రం'గా రూపొందింది. సహస్రనామస్తోత్రం పఠిస్తూ ఉంటే మనకు తెలియకుండా శ్రీచక్రం తయారవుతుంది. శబ్దప్రకంపనలో తేడా వస్తే కాంతిరేఖ సరిగ్గా రాదు. రాను రాను విజ్ఞానశాస్త్రం పెరుగుతున్నకొద్దీ భారతీయ ఋషులు ఇచ్చిన ఆధ్యాత్మిక విజ్ఞానమే గొప్ప విజ్ఞానం అని ఋజువు అవుతోంది. ఇది మనం ఆనందించవలసిన, గర్వించవలసిన ప్రధానమైన అంశం. లలితాసహస్రనామస్తోత్రం ఉచ్చారణలో వచ్చే ప్రకంపనాలలో అద్భుతమైన దేవతామూర్తులు, దేవతాచైతన్యాలు, యంత్రవిజ్ఞానాలు అన్నీ ఉన్నాయి. ఉచ్చారణ చాలా అవసరం. అర్థస్ఫురణతో చదివినపుడే నిజమైన పారాయణ అవుతుంది.

సుమారు ఎనిమిది సంవత్సరాల క్రితం తూర్పుగోదావరి జిల్లా, రాజోలులో దేవీవైభవం ప్రవచనం చెప్పడం జరిగింది. అక్కడ అనేక ఆశ్చర్యకరమైన అనుభవాలు. అది వర్షాకాలం. వచ్చిన ప్రతివారిచేత నిర్వాహకులు కోటి కుంకుమార్చన చేయించారు. అది రేపు జరుగుతుందని ముందురోజు ఈ ప్రకటన చేసినపుడు తర్వాత రోజు ఉదయం నుండి చుట్టుప్రక్కల విపరీతమైన వర్షాలు పడుతున్నాయి. ప్రవచనం జరిగే ప్రదేశంలో వర్షం పడితే అనేక మందికి అక్కడ గుడారాలు వేసే అవకాశం లేదు. కుంకుమ పూజ కోసం కొన్ని వందలమంది వచ్చి కూర్చున్నారు. చిత్రమేమిటంటే మొత్తమంతటా వర్షాలు పడుతున్నా ప్రవచనం జరుగుతున్న ఊరిలో వర్షం లేదు. దేవీకథా వైభవ ప్రభావమది.

ప్రవచనం మొదటి రోజు 'శ్రీమాత్రే నమః' అనే నామం చాలా గొప్పది అని చెప్పి, అది రాసుకుంటే మంచిది అని చెప్పడం జరిగింది. ఆ ప్రవచనయజ్ఞం చక్కగా పూర్తయ్యాక ఒక సంవత్సరం తరువాత అక్కడ ఒక వేదపాఠశాల వారు వార్షికోత్సవం చేస్తూ ముఖ్యఅతిథిగా పిలిచారు. మొత్తం వేద సభ అయ్యాక వృద్ధుడైన ఒక రైతు వచ్చి ఒక గొప్ప ఆశ్చర్యకరమైన విషయాన్ని చెప్పాడు. "నాకు చాలా ఆస్తి ఉండేది. కానీ మొత్తం కోల్పోయాను. అది రాదని కూడా మనస్సులో

నిర్ణయించుకున్నాను. కానీ మీరు దేవీవైభవం ప్రవచనం మొదటిరోజున "శ్రీమాత్రే నమః" అని రాసుకుంటే మంచిదని చెప్పారు. నేను తొమ్మిదిరోజులు విడవకుండా రోజూ రాసుకున్నాను. ఆశ్చర్యకరంగా పోయిన నా ఆస్తి అంతా నాకు లభించింది. నేను బాగున్నాను స్వామీ!" అన్నాడు.

అమ్మవారి ఒక్కనామంలో ఎంతశక్తి ఉంది? అలాంటివి వెయ్యినామాలు. ప్రథమనామం 'శ్రీమాత్రే నమః'లో ఇంత శక్తి ఉంది. శ్రీమాతా అనే నామాన్ని మంత్రం చెయ్యాలంటే 'నమః' కలవాలి. నమః కలిస్తే మంత్రం అవుతుంది. మంత్రం కావాలంటే నామానికి చతుర్థీ విభక్తి రావాలి. శ్రీమాతా అనే పదానికి చతుర్థీవిభక్తి కలిసింది– శ్రీమాత్రే నమః. ఇందులో ఒక బీజాక్షర రహస్యం దాగియుంది. దాన్ని మనం భాష్యంలో వివరించుకుందాం.

లలితాసహస్రనామం పఠనమైన తరువాత శిష్టులైన వారు చెప్పే ప్రధానమైన విషయం ముఖ్యంగా **'ఉమా'** నామాన్ని **ఉమాయై నమః** అని పదిమార్లు పఠించ-మన్నారు. మనకి తెలిసీ తెలియక ఏవైనా దోషాలు ఉంటే ఆ దోషాలన్నీ ఉమా నామస్మరణ వల్ల తొలగుతాయి. లలితాసహస్రనామ భాష్యం చెప్పేటప్పుడు మనం శాస్త్రగ్రంథాలు ప్రమాణంగా తీసుకోవడం ఒకటి. శాస్త్రాన్ని అనుసరించి దక్షిణాచార అనగా సమయాచార సంప్రదాయంలో ఉన్న శిష్టులు ఏం చెప్పారో వారి మాటలు కూడా ఇందులో ప్రస్తావించడం జరుగుతూ ఉంటుంది. **ఒకటి శాస్త్రం. మరొకటి శిష్టాచారము. ఈ రెండిటితోనే భాష్యానికి వివరణ ఇవ్వడం జరుగుతుంది. పెద్దలు చెప్పిన భాష్యాన్ని వివరించుకోవడమే ఇందులో జరగబోతోంది.**

ఇలాంటి భవ్యమైన లలితాసహస్రనామస్తోత్రాన్నంతటిని చెప్పి హయగ్రీవస్వామి అంటున్నారు.

ఇత్యేవం నామ సాహస్రం కథితం తే ఘటోద్భవ
రహస్యానాం రహస్యం చ లలితాప్రీతిదాయకం
అనేన సదృశం స్తోత్రం న భూతం న భవిష్యతి

రహస్యం కనుకనే దీన్ని ప్రక్కన పెట్టానన్నాడు. ధర్మశాస్త్ర, మంత్రశాస్త్ర,

తత్త్వశాస్త్రాలను రహస్యశాస్త్రాలు అంటారు. ఆ మూడు శాస్త్రాంశాలు ఇందులో ఉన్నాయి. అనేక నామాలు కేవలం ఉపాసకులైన వారికి మాత్రమే అర్థమౌతాయి. సంస్కృత భాష తెలిసినంత మాత్రాన లలితాసహస్రనామాలకి అర్థం చెప్పలేరు.

ఆ మధ్య సంస్కృత భాష తెలిసిన పండితుని దగ్గరకి కొంతమంది వెళ్ళి సహస్రనామాలకి అర్థం చెప్తారా? అని అడిగితే భాష తెలిసినంత మాత్రాన దీనికి అర్థం చెప్పలేరని చెప్పారు. ఆయన చాలా సంస్కారవంతుడు. మెడిసిన్ పుస్తకం కూడా ఇంగ్లీషులోనే ఉంటుంది కదా! అని ఆంగ్లసాహిత్యకారుని అర్థం చెప్పమంటే కుదురుతుందా! శాస్త్ర గ్రంథం వేరు. భాష వేరు.

ఒకొక్కప్పుడు భాష కూడా తెలియకపోవచ్చు. కానీ దీనికంటూ అర్థాన్ని తెలుసుకోవాలంటే ఉపాసనా సంప్రదాయం ఉంటేగాని కొన్నిటికి అర్థాలు చెప్పలేరు. ఉపాసన సంప్రదాయంలో చక్రసంకేత, మంత్రసంకేత, దేవతా సంకేతములు మూడూ ఉంటాయి. సంకేతము అంటే సూచిస్తున్నది. మంత్రసంకేతాలు బీజాక్షరాలలో నిక్షిప్తం చేస్తారు. అలాంటివి ఆశ్చర్యకరంగా ఎన్నో వెలికివస్తాయి. సభల్లో ఎంత మేరకు చెప్పుకోగలమో అంతే చెప్పుకోగలం.

కొన్ని ఉపాసనతో సంబంధంలేనివారికి పైపైన కనిపిస్తాయి. ఉపాసనకి పనికొచ్చే విషయాలు కూడా ఇందులో ప్రస్తావించడం జరుగుతుంది.

అమ్మవారి ఆరాధన చేసుకునేవారు లలితాసహస్రనామం చదివేటప్పుడు అనుభూతి పొందడం కోసం వారికి అవసరమైనవి కూడా చెప్పడం జరుగుతుంది. ఏవేవైతే బహిరంగంగా ప్రకటించకూడదని నియమం పెట్టారో అవి చెప్పడం జరుగదు. ఉపాసకులకి, ఉపాసకులుకాని భక్తులకి ఇక్కడ పనికొచ్చే అంశాలన్నీ వివరణగా చెప్పాలని అమ్మవారి యొక్క సంకల్పాన్ని అనుసరించి భావించడం జరుగుతోంది. **'భావనాగమ్యా'** పలికిస్తుంది.

ఈ నామాలు 'రహస్యానాం రహస్యం' అని మాటిమాటికి చెప్పడంలో ఇన్ని భావాలు ఉన్నాయి. ఆ పూజా సంకేత, చక్ర సంకేత, మంత్ర సంకేత, దేవతా సంకేతములు ఉన్నాయి కనుకనే ఇవి రహస్యనామాలు. సంకేతాలు తెలిస్తేగాని ఆ

నామాలకి అర్థం తెలీదు.

'ఇలాంటి స్తోత్రం ఇది వరకు లేదు. ఇక పై రాదు' అన్నారు. ఇలా చెప్పగానే కొంతమందికి సందేహం కలుగుతుంది. ఏ వ్రతం చేస్తే ఆ వ్రతాన్ని మించింది లేదంటారు. ఏ స్తోత్రం చదివితే దాన్ని మించింది లేదంటారు. చాలా పెద్ద చిక్కే! ఈ ప్రశ్న సంప్రదాయం తెలిస్తే అనరు. ఏ వ్రతం చేసినా 'వ్రతానాం ఉత్తమ వ్రతం' అంటుంటారు. ఆ వ్రతం చేసినప్పుడు మాత్రం ఆ వ్రతాన్ని మించింది లేదనే చెయ్యాలి. అప్పుడు దాని ఫలితం వస్తుంది. ఒక వ్రతం చేస్తూ ఇది ఉందిగాని, దీని కంటె గొప్పది మరొకటి ఉందన్నప్పుడు, అక్కడ ఆరాధిస్తున్న దేవతపై శ్రద్ధ కొరవడుతుంది.

శ్రద్ధ అంటే ఏది పట్టుకుంటారో అదే పరమం అనిపించాలి. అప్పుడు పురాణాలు, స్తోత్రాలు అన్నిటికీ సమన్వయ సూత్రం దొరుకుతుంది. భౌతికశాస్త్రాలులా ఉండవు ఆధ్యాత్మిక శాస్త్రాలు. శివపురాణం చదివితే శివుడు గొప్ప అని, విష్ణుపురాణం చదివితే విష్ణువు గొప్ప అని, శక్తిపురాణం చదివితే శక్తి గొప్ప అని చెప్తారు. మనం ఏ దేవతని ఆరాధిస్తున్నామో ఆ దేవత అందరికంటే గొప్ప అని అనుకోవాలి. అంతేగాని మిగిలినవారు తక్కువ అని అనుకోరాదు. ఇది తెలిసి ఆ దేవతోపాసన ఎవరైతే చేస్తారో, ఆ దేవత వారిని పరబ్రహ్మముగా అనుగ్రహిస్తుంది. అదే విధంగా ఇక్కడ కూడా ఈ స్తోత్రం పఠించేటప్పుడు దీన్ని మించింది లేదనే భావంతో చెయ్యాలి. పెద్దలు కూడా ఏది తీసుకొంటే అదే పరిపూర్ణమన్నట్టుగా సమకూర్చారు.

ఒక పెద్ద అగ్నిజ్వాల లోంచి కాసింత నిప్పు తీసుకొన్నా దానికదే పరిపూర్ణం. అంత జ్వాలా లక్షణం దానిలో ఉంది. దేనికదే పరిపూర్ణంగా తీసుకొచ్చారు కనుక ఈ వాక్యాలు ఋషి సంప్రదాయాన్ని అనుసరించి చెప్పాలే తప్ప అర్థవాదాలని ప్రక్కకి పెట్టరాదు. కొందరు అతిశయోక్తి అంటారే ఆ అర్థం ఇక్కడ వర్తించదు.

లలితాసహస్రానికి ఉన్న శక్తులు చెప్తూ –

సర్వరోగప్రశమనం సర్వసంపత్ప్రవర్ధనమ్

సర్వాపమృత్యుశమనం కాలమృత్యునివారణమ్

సర్వజ్వరార్తిశమనం దీర్ఘాయుష్యప్రదాయకమ్
పుత్రప్రదమపుత్రాణాం పురుషార్థప్రదాయకమ్

వీటికి తెలుగులో అర్థాలు వివరించక్కర్లేదు. తాత్పర్యం సులభంగానే తెలుస్తోంది. చాలా మందికి స్తోత్రం కంటె ఫలశ్రుతి మీదే మహాప్రీతి ఉంటుంది.

లలితాసహస్రనామాలలో గొప్ప విశేషం... భౌతికఫలాలను ప్రసాదిస్తాయి. ముక్తిని కూడా ఇస్తాయి.

ఈ సహస్రనామాల్లోనే అమ్మవారి అనుగ్రహం ఎలా ఉంటుందో చెప్పే నామాలు కొన్ని ఉన్నాయి. అనుగ్రహానికి సంబంధించిన నామాలు, బ్రహ్మవిద్యకి సంబంధించిన నామాలు, ఏ ఏ అవతారాలు ఎక్కడ చెప్పబడ్డాయి? ఇవన్నీ ఎక్కడికక్కడ వివరణతో చెప్పుకుంటే, ఆ నామాలు వచ్చినప్పుడు మరింత ఆనందంగా అనుభూతితో పఠించవచ్చు. అలా అనేకములైన అనుగ్రహాలు అమ్మవారివి ఉన్నాయి. అందులో ఐహికము, పారమార్థికము – రెండూ ఉంటాయి. అసలు లలితావిద్య యొక్క గొప్పతనమే అది.

కొన్ని విద్యలు 'మేం మోక్షం ఇస్తాం తప్ప ఐహిక ఫలాలను ఇవ్వం. అవి కావాలంటే మరొక చోటికి వెళ్ళమ'ంటాయి. మరికొన్ని మంత్రాలు 'మేం ఐహికఫలాల్ని మాత్రం ఇస్తాం తప్ప మోక్షాన్ని ఇవ్వం' అని చెప్తాయి. కానీ ఒక్క లలితావిద్య అనగా శ్రీవిద్య మాత్రం రెండూ ఇస్తానని చెప్తోంది. అమ్మవారు 'భుక్తిముక్తిప్రదాయినీ'. ఇహలోక–పరలోక సుఖాలకి భుక్తి అని పేరు. భుక్తి అంటే 'అనుభవం' అని అర్థం. ముక్తి అనేది మరొకటి ఉంది. భుక్తి, ముక్తి – రెండూ ఇవ్వగలిగిన విద్యయే శ్రీవిద్య అని పరంపర చెప్తున్నది. ఆ మంత్రంలో ఆ రహస్యం ఉంది. ఈ స్తోత్రంలో ఆ విశేషం ఉంది. ఇందులో ఐహికఫలాల్ని కూడా చూపించారు. 'సర్వరోగప్రశమనం', 'సర్వసంపత్ప్రవర్ధనమ్' ఇవీ కావాలి. నా సాధనకి ఆటంకము లేని విధంగా ఇవి లభించుగాక! అని కోరుకోవాలి.

ఇదం విశేషాత్ శ్రీదేవ్యాః స్తోత్రం ప్రీతి విధాయకమ్
జపేన్నిత్యం ప్రయత్నేన లలితోపాస్తి తత్పరః

'సర్వరోగప్రశమనం', 'సర్వసంపత్ప్రవర్ధనమ్' అన్నీ ఒక ఎత్తు. అది కాక దీనిలో చివరకి చెప్పిన గొప్ప ప్రయోజనం ఒక ఎత్తు. సాధారణంగా అందరూ దీని మీద దృష్టి పెట్టరు. ముందు చెప్పిన వాటి మీదే దృష్టి పెడతారు. కానీ నిజమైన ఉపాసకులు, శిష్టాచారంలో దీక్ష తీసుకున్నవారు ఈ పైవేవీ అనరు. వారు చెప్పేది ఒకటే అది **లలితాప్రీతివిధాయకం** అంటారు. ఈ స్తోత్రం పఠిస్తే అమ్మవారు ప్రీతి పొందుతారు. ఇంక అంతకన్నా మనకి కావలసినదేది! అమ్మవారు సంతోషిస్తారు. శిష్టాచారం ప్రకారంగా శ్రీవిద్య తీసుకోవడమంటే సామాన్యం కాదు. సన్యాసదీక్ష ఎంతో శ్రీవిద్యా దీక్ష అంత. గృహస్థుగా ఉంటూ మనం శ్రీవిద్యతో తరించవచ్చు. శిష్టాచారప్రకారంగా ఆ దీక్షని స్వీకరించేటప్పుడు అక్కడ నామం, గోత్రము సంకల్పంలో చెప్పడానికి వీల్లేదని శాసిస్తారు. లలితామహాత్రిపురసుందరీ ప్రీత్యర్థం అంతే. మరేవీ ప్రక్కన కలుపుకోవడానికి లేదు. నీ నామ, రూపాల్ని విస్మరించడం ఇప్పుడే అలవాటు చేసుకో. అప్పుడు అస్తి, భాతి, ప్రియం మాత్రమే మిగులుతుంది. నామరూపాలు వెళ్ళిపోతాయి. అంటే ఏ విధంగా శ్రీవిద్య బ్రహ్మవిద్య అయిందో చూడాలి.

లలితాసహస్రనామం ఐహికమైన ఫలాలు ఇస్తుంది అని ఎంత చెప్తామో, అలాగే **ఇది బ్రహ్మవిద్యే అనే ప్రతిపాదన చెయ్యడం ఇందులో ప్రధానం.** ఆ నామాలలోంచి కొట్టొచ్చినట్టు ఆ కాంతి కనబడుతూ ఉంటే, లోకంలో వారు ఎక్కడ అందుకోలేరో అని భయంతో దాచడం ఎందుకు! తప్పకుండా గ్రహించగలిగే సహృదయులు ఉంటారు కనుక నిష్కర్షగా, కపటం లేకుండా ఇందులో ఉన్న విద్యని ప్రస్తావించుకుందాం. అది కావాలంటే కేవలం పరమేశ్వర ప్రీత్యర్థం. ఆ పరమేశ్వరుడే ఇందులో పరమేశ్వరీ.

"శ్రీదేవ్యాః ప్రీతివిధాయకం ఇదం విశేషాత్" అని ఇంతవరకూ చెప్పిన ఫలాలని చెప్పారు. విశేషాత్ అనేది స్తోత్రానికి సంబంధించిన విషయం కాదు. ఇది ఫలశ్రుతికి సంబంధించినది. ఇంతవరకూ చెప్పిన ఫలాలే కాకుండా విశేషముగా అని అర్థం. ఇంతవరకూ చెప్పిన ఫలాలన్నీ సామాన్య ఫలాలు. ఇప్పుడు చెప్పబోతోంది విశేషఫలము. 'శ్రీదేవ్యాః ప్రీతివిధాయకమ్' – ఆ శ్రీమాతకి ప్రీతిని కలిగించే స్తోత్రమిది.

లలితోపాసనాతత్పరులు అంటే ఉపాసకులలో తత్పరులు కూడా ఉంటారు. **"సాత్త్వికోపాసకుని ఉపాసన అంతా తెరమరుగునే జరిగిపోతుంద"**న్నారు రామకృష్ణపరమహంస. ఆడంబరం, ప్రకటన అంటే మళ్ళీ రాజస, తామసాలు అయిపోతాయి. నిజమైన ఉపాసన ఎవరికైతే ఉంటుందో వారిది నిష్కల్మషమైన సాత్త్వికమార్గంలో ఉంటుంది. సాధన ఎప్పుడూ సాత్త్వికంగా ఉండాలి. చింతన ఎప్పుడూ తాత్త్వికంగా ఉండాలి. అమ్మవారికి ప్రీతికలిగించే నిజమైన ఉపాసకుడు ఎలా ఉంటాడంటే సాత్త్విక సాధన చేస్తాడు. తాత్త్విక చింతన చేస్తాడు. 'సాధనలో సాత్త్వికత, చింతనలో తాత్త్వికత' – ఈ రెండూ ఉంటేనే వారికి ఇహమూ, పరమూ రెండూ లభిస్తాయి. **సాత్త్విక సాధన, తాత్త్విక చింతన.** ఈ వాక్యం సూత్రప్రాయం.

"లలితోపాస్తితత్పరః" లలితా ఉపాసనా తత్పరుడైనవాడు ప్రయత్నపూర్వకంగా దీన్ని జపించాలి. **జపేత్** అన్నారు. కేవలం స్తోత్రమే అయితే **పఠేత్** అనేవారు. జపమని మంత్రాన్నే అంటారు. ఇది స్తోత్రంలా కనబడుతున్న మంత్రమని దీని భావం. దీని పఠనమే జపము. ఇది స్తోత్రమే కాదు మంత్రమని చెప్పడం. దీని విధానాలు ఎలా చెయ్యాలో చెప్పారు.

ప్రాతఃకాలంలో స్నానం చేసి విధి విధానంగా చెయ్యాల్సిన నిత్యనైమిత్తికాలు పూర్తి చేసుకొని **"ప్రాతఃస్నాత్వా విధానేన సంధ్యాకర్మ సమాప్య చ"** – "ఉపనయన సంస్కారం కలిగినవారు సంధ్యావందనం చెయ్యకుండా లలితాసహస్రం చదివితే ఫలించదు" అని హయగ్రీవస్వామివారు చెప్తున్నారు.

సంధ్యావందనాదుల తరువాత **'పూజాగృహం తతో గత్వా చక్రరాజం సమర్చయేత్'** – పూజాగృహానికి వెళ్ళి చక్రరాజాన్ని అర్చన చేసి, **'విద్యాం జపేత్ సహస్రంవా త్రిశతం శతమేవవా'** – తరువాత విద్యని జపించాలి అన్నారు. శాస్త్రంలో విద్యకి అర్థం మంత్రం. ఆ మంత్రాన్ని వెయ్యిగాని, మూడు వందలుగాని, వందగాని జపం చేసిన తరువాత ఈ స్తోత్రాన్ని పఠించమన్నారు. ఇదొక ప్రక్రియ. ఈ విధంగా చేసి ఎవరైతే నిత్యానుష్ఠానంగా పెట్టుకుంటారో వారు ధన్యులు. జన్మమధ్యంలో ఒక్కసారి చేసినా ఇది గొప్పదని చెప్పారు. దీని ఉద్దేశం – గొప్పదంటే వెంటనే

మణిద్వీపం వరకూ నిచ్చెన పడుతుందని అర్థం కాదు. ముందు పాపాలు పోతాయి. అది దాని ఫలితం. ఈ పాపాలు పోతే ఒకసారి చేస్తే మరొకసారి చెయ్యాలనే మంచి బుద్ధి పుడుతుంది. ఆవిడ క్రమంగా పుట్టిస్తుంది. అందుకే సాధన ఎలాగోలా మొదలు పెట్టాలి. ఒక్కసారి అమ్మ చేయి పట్టుకుంటే, ఆ తల్లి మనల్ని ఇంక వదలదు. నడిపించుకొని తీసుకెళ్తుంది.

"ఇది పఠిస్తే వచ్చే ఫలితం చెప్తున్నాను వినవయ్యా" అని హయగ్రీవస్వామివారు అగస్త్యునికి చెప్తున్నారు.

తస్య పుణ్యఫలం వక్ష్యే శృణు త్వం కుంభసంభవ

"ఓ అగస్త్యా! విను. అనేక జన్మలలో గంగాది సర్వతీర్థాలలో స్నానం చేస్తే ఏ ఫలితం వస్తుందో ఒక్కసారి లలితాసహస్రనామ స్తోత్రాన్ని ముందు చెప్పుకున్న పద్ధతిలో పఠిస్తే ఆ ఫలితం కలుగుతుంది. 'అవిముక్తకే' కాశీక్షేత్రంలో కోటి లింగాలని ప్రతిష్ఠించిన ఫలితం వస్తుంది. కురుక్షేత్రంలో సూర్యగ్రహణ సమయంలో కోటి గోవులని దానం చేసిన ఫలితం, అలాగే శ్రోత్రియుడైన విప్రునకు కోటి బారువుల బంగారాన్ని దానం చేసిన ఫలితం. కోటి అశ్వమేధయాగాలు చేసిన ఫలితం. ఎడారిలో కోటి బావులు త్రవ్విన ఫలితం. దుర్భిక్షకాలంలో కోటి బ్రాహ్మణులకు భోజనం పెట్టడం". (అన్నీ ఉన్నప్పుడు పెడితే అదొక ఫలితం. ఏం లేనప్పుడు పెడితే గొప్ప ఫలితం).

దుర్భిక్షే యః ప్రతిదినం కోటిబ్రాహ్మణభోజనం
శ్రద్ధయా పరయా కుర్యాత్ సహస్ర పరివత్సరాన్

దుర్భిక్షకాలంలో కోటి బ్రాహ్మణులకి భోజనం పెట్టడం. అలా అనేక కాలాలు చేసిన వారికి ఎన్ని ఫలితాలు లభిస్తాయో, ఇవన్నీ కలిపి చేసిన ఫలితం, ఒక్కసారి లలితాసహస్రనామ స్తోత్రాన్ని భక్తిగా హృదయం పెట్టి పద్ధతిగా పఠిస్తే లభిస్తుంది.

రహస్యనామ సాహస్రే నామైకమపి యః పఠేత్
తస్య పాపాని నశ్యన్తి మహాన్త్యపి న సంశయః

ఇందులో ఒక్క నామం పఠించినప్పటికి అనేక పాపాలు పోగొట్టబడతాయి.

వెయ్యి నామాలు కలిపి గుత్తిగా ఉండే ఫలితం చెప్పుకున్నాం. ఒకొక్క నామానికి కూడా అనేక కోట్ల పాపాలను పోగొట్టగలిగే శక్తి ఉంది. ఎప్పుడైనా శాస్త్రవాక్యాల యందు అనుమానం పడితే ఫలితం రాదు సరికదా! శంకించిన దోషం ఒకటి వస్తుంది.

శాస్త్రవాక్యాల యందు "ఋషి చెప్పాడు కనుక సత్యం అని చేయడమే" అనే దృష్టి ఉండాలి. అలా చేస్తే దానికి శ్రద్ధ అని పేరు.

ఆయుర్వేదంలో అనుపానమనేది చాలా ప్రధానం. మందుని పాలతో తీసుకోమన్నారంటే పాలతోనే తీసుకోవాలి. పొరపాటున అదే మందు నీటితో పుచ్చుకుంటే కొత్త రోగం వస్తుంది. మందు మాత్రం అదే. అనుపానం అంత ప్రధానంగా చెప్తున్నారు. అదే విధంగా పారాయణకి, సాధనకి శ్రద్ధ అనుపానం. ఈ శ్రద్ధని ఇమ్మని అమ్మవారిని ప్రార్థించాలి. అమ్మవారు శ్రద్ధాదేవి. శ్రద్ధాసూక్తమని వేదంలో ఒక సూక్తం ఉంది. **"యా దేవీ సర్వభూతేషు శ్రద్ధారూపేణ సంస్థితా, నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః".**

నిత్యకర్మాననుష్ఠానాన్నిషిద్ధకరణాదపి
యత్పాపం జాయతే పుంసాం తత్సర్వం నశ్యతి ద్రుతమ్

ఒకొక్కప్పుడు నిత్యకర్మలు మొదలైనవి మానివేయడం ఒక పాపం. చెయ్యకూడని పని చెయ్యడం రెండవ పాపం. పాపాలు రెండు రకాలు. విధిని వదిలేయడం. నిషేధాన్ని చెయ్యడం. కలియుగంలో ఈ రెండు పాపాలు వద్దన్నా జరుగుతూ ఉంటాయి. అలాంటి దోషాలు పోగొట్టాలంటే లలితాసహస్రనామాన్ని ఒక్కమారుగాని పఠనం చేస్తే చాలు.

అత్రైక నామ్నో యా శక్తిః పాతకానాం నివర్తనే
తన్నివర్త్యమఘం కర్తుం నాలం లోకాశ్చతుర్దశ

ఇందులో ఒక్క నామం పోగొట్టగలిగే పాపాలను పద్నాలుగు భువనాల్లోనూ ఎవరూ చెయ్యలేరు. మనం ఎంత కష్టపడి జన్మంతా ఎన్ని పాపాలు చేసినా ఒక్క నామం మొత్తం దగ్ధం చేసి, ఇంకేమైనా దగ్ధం చెయ్యడానికి ఉన్నాయా అని

అడుగుతుంది. 'అయ్యో! నా లాంటి పాపాత్ముడు తరించగలడా!' అనే ప్రశ్న వస్తే, లలితాసహస్రనామస్తోత్రం 'నేనున్నాన'ని అభయమిస్తోంది.

యస్త్యక్త్వా నామసాహస్రం పాపహానిమభీప్సతి
స హి శీతనివృత్త్యర్థం హిమశైలం నిషేవతే

సహస్రనామాన్ని విడిచిపెట్టి పాపాలు పోగొట్టుకోవడానికి ఇంకేదైనా ప్రాయశ్చిత్తం చేసుకోవడం ఎలాంటిదంటే – 'చలి తగ్గించుకోవడానికి నిప్పుని విడిచిపెట్టి, హిమాలయాలకి వెళ్ళడం లాంటిద'ని చెప్పారు.

లలితాసహస్ర నామాలు స్తోత్రం మాత్రమే కాదు శాస్త్రము, కావ్యము కూడా. స్తోత్రం కాదు అన్నారంటే, స్తోత్రం మాత్రమే కాదు అని అర్థం. ఒక కవిత్వములో శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు ఎన్ని ఉండాలో అన్నీ ఈ స్తోత్రంలో ఉన్నాయి. దీనిని కావ్యధోరణిలో పరిశీలిస్తే ఇది ఒక అత్యద్భుతమైన కావ్యం. సంగీతం కూడా ఇందులో కావల్సినంత ఉంది. అలాగని స్వరపరచి పాటలు పాడమని చెప్పడం కాదు. దీనిలో అనుష్టుప్ అనే ఛందస్సు ఉంది.

భక్తో యః కీర్తయన్నిత్యం ఇదం నామసహస్రకమ్
తస్మై శ్రీలలితాదేవీ ప్రీతాభీష్టం ప్రయచ్ఛతి

నిత్యానుష్ఠానంగా ఎవరైతే లలితాసహస్రనామస్తోత్రాన్ని పఠిస్తారో, వారిపట్ల లలితాదేవి ప్రీతి చెంది వారి అభీష్టాల్ని నెరవేర్చుతుంది.

నిత్యం సంకీర్తనాశక్తః కీర్తయేత్పుణ్యవాసరే
సంక్రాన్తౌ విషువై చైవ స్వజన్మత్రితయేఽ యనే

రోజూ పఠించలేకపోతే పుణ్యవాసరముల యందు దీన్ని పఠించాలి. నిత్యానుష్ఠానం లేకపోయినా పర్వకాలాల్లో అనుష్ఠానం చెయ్యాలి. **సంక్రాంతౌ** – అనగా సంక్రాంతి యందు, **విషువే** – ఇది సంవత్సరానికి రెండు మారులు వస్తుంది.

స్వజన్మత్రితయేఽ యనే – అంటే తన పుట్టినరోజు నుండి మూడవరోజు అని చెప్పారు. పుట్టినరోజున చేసుకోవల్సిన అనుష్ఠానాలు చాలా ఉన్నాయి. ప్రత్యేకించి పుట్టినరోజు నుండి మూడవరోజుకి ఒక శక్తి వస్తుంది. ఆ రోజున దీనిని పఠిస్తే చాలా

విశేషం.

నవమ్యాం వా చతుర్దశ్యాం సితాయాం శుక్రవాసరే
కీర్తయేన్నామసాహస్రం పౌర్ణమాస్యాం విశేషతః

నవమి, చతుర్దశి తిథుల యందు అంటే ఇవి రెండు పక్షాలలోను గొప్పవే కానీ సితాయాం అని ప్రత్యేకించి చెప్తున్నారు.

కనుక శుక్లపక్ష నవమి, శుక్లపక్ష చతుర్దశి ఆ రెండు తిథులలో చంద్రకళలలో చాలా విశేషమైన అంశం ఉంటుంది. శుక్రవాసరే - శుక్రవారం దీన్ని పఠిస్తే చాలా విశేషం. పూర్ణిమ వచ్చినపుడు మరింత విశేషంగా దీన్ని పఠించాలి.

పౌర్ణమాస్యాం చన్ద్రబిమ్బే ధ్యాత్వా శ్రీలలితామ్బికామ్
పంచోపచారై స్సంపూజ్యపఠేన్నామసహస్రకమ్
సర్వేరోగాః ప్రణశ్యన్తి దీర్ఘమాయుశ్చ విన్దతి
అయమాయుష్కరోనామ ప్రయోగః కల్పనోదితః

ముఖ్యంగా పూర్ణిమనాడు చంద్రబింబంలో అమ్మవారిని ధ్యానం చేస్తూ కేవలం పంచోపచారాలు చేసి సహస్రనామాన్ని పఠిస్తే అన్ని రోగాల నుండి బయటపడవచ్చు. ఇవన్నీ ప్రయోగాలు. ఇంతవరకు ఫలశ్రుతులు చెప్పి, ఇప్పుడు ఒకొక్క ప్రక్రియ కోసం దీనిని ఎలా వినియోగించుకోవాలో చెప్పారు.

కొన్ని ప్రయోగాలు మాత్రమే ఇక్కడ చెప్పారు కానీ తంత్రశాస్త్రంలో చాలా విశేషంగా లలితాసహస్రనామ ప్రయోగాలు ఉన్నాయి. ఆ విధంగా చేసి ప్రయోజనాన్ని పొందిన శిష్టులైనవారు చాలామంది ఉన్నారు. లలితాసహస్రంలో కొన్ని గుత్తులు తీసుకొని వాటికి ముందు వెనుక 'శ్రీమాత్రే నమః' అని సంపుటితం చేస్తూ జపం చేస్తే కొన్ని ఫలితాలు ఉంటాయి. ఇప్పటివరకూ సామాన్య ఫలాలు చెప్పారు. ఇంకా ఎన్నో ప్రయోజనాలని హయగ్రీవస్వామి అగస్త్యులవారికి చెప్తూ, "నామదృష్టితో లలితాసహస్రనామాలను పఠించరాదు" అన్నారు. ఇందులో ప్రతిదీ కూడా మంత్రమే అనే భావనతో లలితాసహస్రనామస్తోత్రాన్ని అనుసంధానం చేసుకోవాలి.

మంత్రపరంగా లలితాసహస్రనామస్తోత్రం అంతా కలుపుకుని

మాలామంత్రం. మాల అంటే వరుస. మాల అని దేనిని అంటారో కూడా మంత్రశాస్త్రంలో నిర్వచనం ఉంది.

మంత్రాః ఏకాక్షరా పిండాః కర్తర్యోద్వ్యక్షరామతాః
వర్ణత్రయం సమారభ్య నవర్ణావధిబీజకాః

ఒకే అక్షరం కలిగిన మంత్రాన్ని పిండమంత్రం, రెండు అక్షరాలు కలిగిన వాటిని కర్తరి మంత్రం, మూడు నుంచి తొమ్మిది వరకూ అక్షరాలు ఉండేవాటిని బీజమంత్రాలు, పది నుంచి ఇరవై ఉండే అక్షరాలు మహామంత్రాలు, దానిపైన ఉండేవన్నీ మాలామంత్రాలు అని వ్యవహారం. ఏకాక్షర మంత్రాలు చాలా ఉన్నాయి. అవన్నీ పిండ మంత్రాలు. గణపతి మంత్రం, అలాగే కొన్ని శక్తి మంత్రాలు కూడా ఏకాక్షరమంత్రాలు ఉన్నాయి. నవార్ణ మంత్రాలు అంటే బాలామంత్రం, చండీమంత్రం. వీటికి బీజమంత్రాలని పేరు. పంచదశీ మొదలైనవి మహామంత్రాలు.

పై ప్రకారంగా చూస్తే లలితాసహస్రనామ స్తోత్రం 'మాలామంత్రం'. లలితాసహస్రనామ స్తోత్రమంతా అనుష్టుప్ అనే వైదిక ఛందస్సులో రచింపబడింది. మొదట కావ్యాల్లో వాల్మీకి అనుష్టుప్ ఛందస్సులోనే రామాయణమంతా రచించారు. తరువాత వ్యాసాదులు కూడా పురాణాలను ఆ పద్ధతిలోనే అనుసరించారు. కొన్ని ప్రత్యేక ఛందస్సులలో రచించినా అనుష్టుప్‌కి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అనుష్టుప్ ఛందస్సులో ఒక పరిపూర్ణమైన శక్తి దాగి ఉంది. సంపూర్ణంగా పరిశీలిస్తే గాయత్రి కూడా నాలుగు పాదాలే. అనుష్టుప్ కూడా నాలుగుపాదాలుగానే కనిపిస్తుంది. మొత్తం నాలుగు పాదాలు కలుపుకుంటే ముప్పై రెండు అక్షరాలు. ఇదీ ముప్పై రెండు అక్షరాలే. అలా పరిశీస్తే ఒకొక్క శ్లోకంలో ముప్పై రెండు అక్షరాలు. ఒకొక్క పాదంలో గమనిస్తే పదహారు అక్షరాలు ఉంటాయి.

అమ్మవారి మంత్రాన్ని ప్రధానంగా 'షోడశీ' అని వ్యవహరిస్తూ ఉంటారు. అలా పరిశీలిస్తే ఇందులో ప్రతిపాదం షోడశీయే (పదహారు అక్షరాలే ఉంటాయి). అసలు ఏ సహస్రనామస్తోత్రమైనా అనుష్టుప్‌లోనే రచింపబడుతుంది. అనుష్టుప్‌లో ఒక దైవత్వమున్నది. దేనికైనా పదహారు అక్షరాలే ఉన్నప్పటికీ అమ్మవారి విద్యలో

పదహారు అక్షరాలకి ప్రాధాన్యం ఉంది కనుక లలితాసహస్రంలో ప్రతిపాదం పదహారు అక్షరాలు మాత్రమే.

మరో ప్రత్యేకత– ఇందులో శ్లోక సంఖ్య పరిశీలిస్తే **'ఏవం శ్రీలలితాదేవ్యాః నామ్నాం సాహస్రకం జగుః'** – అని పూర్తవుతుంది. వశిన్యాదివాగ్దేవతలు ఈ విధంగా గానం చేశారు అన్నది చివరి వాక్యం. ఇది నామం కాదు. ముక్తాయింపు. నామం **'లలితాంబికా'**తో పూర్తయిపోతోంది.

'శ్రీమాతా' నుండి **'లలితాంబికా'** వరకు గమనిస్తే 182 1/2 శ్లోకాలు అవుతాయి. **'ఏవం శ్రీ లలితాదేవ్యాః...'** కలుపుకుంటే 183 శ్లోకాలు అవుతాయి. ఈ నామం తీసివేస్తే 182 శ్లోకాలపైన ఒక్క పాదం వస్తుంది. పాదసంఖ్యలో విభజన చేస్తే 365 అవుతాయి. 365 అయ్యాయంటే ఒక సంవత్సరకాలం క్రింద లెక్క. సంవత్సరంలో **'రుద్రో దివో ఉమా రాత్రిః తస్మై తస్యై నమో నమః'** అని చెప్పినట్లుగా పగలు శివ స్వరూపం, రాత్రి అమ్మ స్వరూపంగా భావన చేస్తారు. అలా సంవత్సరంలో ఉత్తరాయణం, దక్షిణాయనం తీసుకుని (శివ, శక్తి) ఈ భేదంగా పరిశీలిస్తే రెండు అయనాలు కలుపుకుంటే 365.

ప్రతి శ్లోకాన్ని రెండు భాగాలు చేసుకుని శివభాగం, శక్తి భాగంగా పరిశీలనం చేస్తే మొత్తంగా 365 రావడం ఒక సంవత్సర సంఖ్యకి సంకేతం. సంవత్సర సంఖ్యాత్మకమైన యజ్ఞాలు వేదంలో చెప్పబడ్డాయి. కనుక ఆ సంఖ్యతో సమకూర్చడం కూడా ఒక సంపూర్ణతకు ప్రతీక. అంతేకాకుండా ఒక వృత్తాన్ని తీసుకుంటే 360 డిగ్రీలు ఉంటుంది. అలా పరిశీలించినా పూర్ణత్వమనేది కనబడుతుంది. సాధారణంగా ఏ సహస్రనామాల్లో స్పష్టంగా కనబడనిది, లలితాసహస్రనామాల్లోనే కనబడేది పూర్వాపర సంబంధం. మొదటి వాక్యానికి తరువాతి వాక్యానికి అనుబంధం ఉంటుంది. అలా గమనిస్తే ఎక్కడికక్కడ ఒక గొలుసు బంధంగా ఏర్పడింది.

నామరూపలీలాది వైభవం

నామవైభవం:

నామాలతో కథ చెప్పడం ఒక ఆశ్చర్యకరమైన అంశం. అది కూడా ఇందులో

గోచరిస్తుంది. అమ్మవారి చరిత్రను అంతవరకు హయగ్రీవస్వామి చెప్పారు. ఆ చరిత్రనంతటిని నామాల్లో ఇక్కడ అందిస్తారు. ఇంతవరకు తాను చెప్పినది జ్ఞప్తిలో ఉండాలంటే ఈ నామాలు గుర్తుపెట్టుకుంటే చాలు.

ఆ చరిత్రను తెలుసుకుని ఈ నామాలను కంఠోపాఠం చేసుకుంటే ఎప్పుడు ఏ నామాన్ని తలచుకున్నా చరిత్ర గుర్తుకు వస్తుంది. లలితాసహస్రనామాలలో విశేషం- ఒక వైపు నామాలన్నీ గొప్పవి- అది నామవైభవం.

రూపవైభవం:

రూపవైభవం వరుసగా **'ఉద్యద్భానుసహస్రాభా'** నుండి **'సర్వాభరణభూషితా'** వరకు వర్ణింపబడింది. ఇక్కడితో వదలకుండా- చదువుతూ ఉంటే మధ్యలో అమ్మవారి ధ్యానం చెదరకుండా అక్కడక్కడ అమ్మవారి రూపాన్ని గుర్తుచేస్తూ ఉంటారు. అవి- **'దరస్మేరముఖాంబుజా', 'దరాందోళితదీర్ఘాక్షీ', 'దాడిమీకుసుమప్రభా', 'తనుమధ్యా'** మొదలైనవి. ఇది రూపవైభవం.

లీలా వైభవం :

అమ్మవారు చేసిన లీలలు వరుసగా నామాల్లో చూపిస్తారు. మొత్తం అమ్మవారి చరిత్ర సహస్రనామాలలో ఉంది. లలితాదేవి ఆవిర్భవించడం, భండాసుర సంహారం, అమ్మవారికి పట్టాభిషేకం ఇదంతా లీలావైభవం.

తత్త్వ వైభవం :

వేదాంతపరంగా అమ్మవారిని ఎలా అర్థం చేసుకోవాలి? ఇవి కూడా చాలా నామాలు ఉన్నాయి. ఉదాహరణకు **'నిరాకారా, నిరంజనా, సర్వోపనిషదుద్ఘుష్టా, దేశకాలాపరిచ్ఛిన్నా, మిథ్యాజగదధిష్ఠానా'** ఈ వాక్యాలన్నీ పరిశీలిస్తే, ఉపనిషత్తులు దొంతరలు దొంతరలుగా కనబడతాయి.

ఉపనిషత్తులు చదివి లలితాసహస్రనామస్తోత్రం చదివితే, ఇదొక్కటీ పట్టుకొని అవన్నీ మననం చేసుకోవచ్చని అర్థమవుతుంది. ఒకవేళ ఉపనిషత్తులు చదవకపోయినా అవి ఇందులో ఉన్నాయనే జ్ఞానంతో ఈ నామాలకి అర్థం తెలుసుకున్నా ఉపనిషత్ తత్త్వవివేచనం జరుగుతుంది.

మంత్ర వైభవం:

లలితాసహస్రనామస్తోత్రంలో మంత్రశాస్త్ర విశేషాలు అనేకం ఉన్నాయి. ఇందులో బీజాక్షరాలు కొన్ని చోట్ల దాచి పెట్టారు. బీజాక్షరాలు బయటకి చెప్పరాదు కనుక కొన్ని చోట్ల మాత్రమే బీజాక్షరాల ప్రశస్తి ప్రస్తావించడం జరుగుతుంది. కానీ అవి ఉన్నాయని తెలుసుకోవచ్చును.

యోగ వైభవం:

యోగశాస్త్రపరంగా, సాధనాపరంగా కావలసినవి ప్రధానంగా ఉన్నాయి. **'విశుద్ధిచక్రనిలయా'** మొదలైన షట్చక్రనామాలే కాక, యోగశాస్త్రానికే సంబంధించినవి చాలా ఉన్నాయి. **'అభ్యాసాతిశయజ్ఞాతా' 'మైత్ర్యాదివాసనాలభ్యా'** – వంటి నామాలు పతంజలి యోగసూత్రాలు తెలిసినవారికి అవగతమవుతాయి.

ఇలా నామవైభవ, రూపవైభవ, లీలావైభవ, తత్త్వవైభవ, మంత్రవైభవ, యోగవైభవాలు ఇందులో పరిశీలించవచ్చు. ఈ కోణాలతో లలితాసహస్రం పరిశీలిస్తే అదే పెద్ద సాధన. సాధనకి మననం చాలా ప్రధానం. జపం, పూజ కూడా చాలా అవసరమే కానీ ఇవన్నీ బాహ్యమే. బాహ్యంలో జడత్వం ఎక్కువ ఉంటుంది. భావంలో చైతన్యం ఎక్కువ ఉంటుంది. మననం చేసుకుంటున్న కొద్దీ చైతన్యం మరింత ఎక్కువ ఉత్పన్నమవుతుంది. బాహ్యం వద్దనడం కాదు. మననశీలత పెంచుకోవాలి. అప్పుడే నిజమైన అభ్యాసం. దానికి కావలసినది ప్రత్యేకమైన శ్రద్ధ, ప్రేమ. వాటితో పరిశీలిస్తే, అమ్మ అనేకమైన రహస్యాలు తెలియజేస్తుంది.

లలితాసహస్రనామ స్తోత్రం కూర్పు పరిశీలించినట్లయితే, మొదటి నామం **'శ్రీమాతా'**, చివరి నామం **'శివా శివశక్త్యైక్యరూపిణీ శ్రీలలితాంబికా'** ఇదొక పాఠాంతరం. ప్రసిద్ధ పాఠం **'శ్రీశివాశివశక్త్యైక్యరూపిణీ లలితాంబికా'.** రెండు పాఠాంతరాలు ఔచిత్యములే. ఈ 'శివా శివశక్త్యైక్యరూపిణీ శ్రీలలితాంబికా'లో చివరి నామం **'లలితా'**. లలితా సహస్రనామస్తోత్రంలో కొన్ని నామాలకు పునరుక్తి ఉంది. శాస్త్రంలో పునరుక్తి దోషమే. కానీ లలితాసహస్రనామస్తోత్రం శాస్త్రమని చెప్పి పునరుక్తిదోషం అవుతుందనుకున్నప్పుడు వీటికి అర్థభేదం ఉన్నదని గ్రహించాలి. ఒకచోట చెప్పినప్పుడు ఒక అర్థం స్వీకరిస్తే, మరొక చోట చెప్పినప్పుడు మరొక

అర్థం స్వీకరించాలి కాబట్టి పునరుక్తి అనడానికి లేదు.

పోనీ అర్థభేదంతో అయినా మళ్ళీ చెప్పారంటే ఆ విధంగా కూడా చెప్పని నామం 'లలితాంబికా'. లలితాసహస్రనామంలో ఒక్కసారి తప్ప ఇంక ఎక్కడా ఈ నామం ఉండదు.

శివసహస్రనామస్తోత్రంలో 'శివ' అనే నామం మొత్తంగా ఒక్కచోట మాత్రమే వస్తుంది. విష్ణుసహస్రనామ స్తోత్రంలో 'విష్ణుః' అనే నామం చాలా మార్లు వస్తుంది. శివ, లలితా సహస్రనామ స్తోత్రాల్లో ఈ రెండు నామాలు వాటిలో ఒక్కోసారి మాత్రమే వస్తాయి. శీర్షిక మాత్రం లలితా సహస్రనామ స్తోత్రమ్.

ఇందులో ప్రత్యేకత– ఇప్పటివరకు చెప్పిన 999 నామాలు శ్రీలలితాంబికవి అని ఆఖరున చెప్పారు. **'శ్రీలలితాంబికా'లో** **'లలితా'** అనే మాట ప్రక్కకు తీస్తే **'శ్రీఅంబికా'** మిగిలింది. మొదట అన్నది **'శ్రీమాతా'** – చివరకి **'శ్రీఅంబికా'**. ప్రారంభంలో అమ్మ, అంబిక అన్నా అమ్మే కనుక చివరికి కూడా అమ్మ. అమ్మతో మొదలై అమ్మతో పూర్తి అవుతున్నాయి ఈ లలితాసహస్రనామాలు. ఇదొక అందమైన కూర్పు. అమ్మకి వెయ్యి పేర్లు ఉన్నప్పటికీ, బిడ్డ దృష్టిలో మాత్రం ఆ తల్లికి ఒకటే పేరు – **'అమ్మ'**. మనమందరం బిడ్డలం కాబట్టి ఆవిడని పిలవాల్సింది **'అమ్మా!'** అనే. ఎంత ఆపదలో ఉన్నా, ఆఖరికి నూరేళ్ళ వృద్ధుడైనా మంచం మీద ఉండి మూలిగినప్పుడు మాత్రం **అమ్మా!** అనే అంటాడు. ఈ అమ్మ అని ఎవరిని ఉద్దేశించి అన్నది? చిన్నప్పుడెప్పుడో అతడి తల్లి కన్నది, పెంచింది, పోషించింది, వెళ్ళిపోయింది. ఆ జీవుడు 'అమ్మా!' అని అరుస్తున్నాడంటే ఆ పరమాత్మనే **'అమ్మా'** అని ఉద్దేశించి పిలుస్తున్నాడు. కనుక **అమ్మా అని పిలవబడ్డ పరమాత్మయే శ్రీలలితాంబిక.** శ్రీమాతాతో ప్రారంభమై అంబికాతో ముగియడంలో అమ్మతో మొదలై అమ్మతో పూర్తయ్యింది. అచ్చంగా జపమాల పట్టుకొని జపం చేసినప్పుడు మేరుపూసతో మొదలుపెట్టి మళ్ళీ మేరుపూసతో పూర్తిచేస్తారు. కనుక దేనితో మొదలుపెట్టామో దానితోనే పూర్తిచెయ్యడమంటే, జపమాలకి మేరుపూస ఎలాంటిదో లలితాసహస్రనామాలకి **అమ్మ** అనే భావం అలాంటిది.

స్తోత్రమధ్యంలో కూడా అమ్మ నామాలు వస్తాయి. 'మాతా' 'మలయాచల వాసినీ', 'అంబికా అనాదినిధనా'. ఇలా 'మాతా', 'అంబికా' రెండుమార్లు మధ్యలో వచ్చాయి. ఆది, మధ్యం, అంతం కూడా 'అమ్మా' అనే తీసుకువచ్చారు. ఇది కూర్పులోనే ఉన్న గొప్ప అందం.

'శ్రీమాతా – శ్రీఅంబికా' భావనాత్మకంగా చూస్తే రెండూ ఒక్కటే. పంచాయతనపూజలో ఐదింటికి పేర్లు చెప్పేటప్పుడు శివునకు శివుడని, గణపతిని గణేశ అని, ఆదిత్యుని సూర్యుడని, నారాయణుని విష్ణువని చెప్తూ అమ్మవారిని మాత్రం **అంబిక** అంటారు.

అంబిక అనేది వైదికమైన శబ్దం. అంబిక, అంబా అనే శబ్దంలో ఉండే శక్తి సామాన్యమైనది కాదు. మన భాషలో మంత్రశక్తి ఉంది. మంత్రశక్తి ఉన్న భాషలో పుట్టడం మన భాగ్యం. ఆ భాషని మరచి బ్రతకడం దౌర్భాగ్యం. 'అమ్మా' అనే మాట సంస్కృతంలో 'అంబా' అనే మాటనుండి జన్యమైనదే. 'మాతా' నుండి 'మా' శబ్దం వచ్చింది. మాతృశబ్దమే ప్రథమావిభక్తిలో మాతా అయ్యింది.

ఇలా చెప్పుకుంటూ మాలామంత్రంలోకి ప్రవేశిస్తున్నాం. **'తత ఊర్ధ్వగతా మాలా తాసు భేదో న విద్యతే'** – మొత్తం ఇరవై అక్షరాల తరువాత ఎన్ని అక్షరాల నామాలు వచ్చినా వాటిని మాలా మంత్రాలు అని ప్రస్తావన చేసుకోవాలి.

ఒకొక్క పాదంలో ప్రత్యేకించి ఇన్నే నామాలు ఉండాలి అనే నియమం లేదు. ఒక పాదంలో మూడు నామాలు, వేరొక పాదంలో ఏడు నామాలు, మరొక పాదంలో ఒకే నామం ఉండవచ్చు. ఒకపాదంలో రెండు ఉండవచ్చు. పాదం మాత్రం పదహారు అక్షరాలు. లలితా సహస్రనామ స్తోత్ర వ్యాఖ్యానం అనేక కోణాలలోంచి పరిశీలిస్తూ ఆస్వాదిస్తే చాలా దివ్యంగా ఉంటుంది. అయితే లలితాసహస్రనామాలకి పూర్వాపర సంబంధమైన క్రమం ఉంది.

అసలు 'లలితా' అనబడేది ఒక ప్రత్యేకమైన దేవతా? అని ప్రశ్నించుకుంటే – వేదం ప్రకారం ఉన్నది ఒకడే పరమేశ్వరుడు. ఆయన తన యొక్క శక్తితో ఈ ప్రపంచాన్ని అంతటినీ నిర్వహిస్తున్నాడు. ఉపాసకుల కోసం, లోకనిర్వహణ కోసం

ఒకే పరమేశ్వరుడు అనేక రూపాలతో ఉపాసింపబడుతూ ఉంటాడు. ఈ మూడు వాక్యాలే మొత్తం హిందూమతాన్ని అర్థం చేసుకోవడానికి పనికివస్తాయి. ఒకడే ఈశ్వరుడు **'ఏకో దేవః సర్వభూతేషు గూఢః'** అని ఉపనిషత్తు ప్రతిపాదన చేసింది. ఒక్కడైన పరమేశ్వరుడు సర్వభూతాల యందు **'గూఢః'**– అత్యంత రహస్యంగా ఉన్నాడు. ఆయన సర్వశక్తిమంతుడై ఉన్నాడు కాబట్టి నమస్కరిస్తున్నారు. ఈ శక్తి ఆయనకి సహజంగా ఉంది. **'పరాస్య శక్తిః వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బలక్రియాచ'** అని ఉపనిషత్ వాక్యం. పరమాత్మ యొక్క శక్తి స్వాభావికీ. అగ్నికి వెలుగు, వేడి ఎంత స్వభావమో ఆ పరమేశ్వరునికి శక్తి అంత స్వభావం. కనుక శక్తిని గురించి చెప్తున్నామంటే శక్తిమంతుని గురించి చెప్తున్నామని అర్థం. ఈశ్వరుడు అంటే శక్తితో కలిసినవాడు. శక్తి అంటేనే ఈశ్వరుడు. రెండిటికీ అభేదం. ఆ ఈశ్వరుని **అమ్మా!** అని పిలిస్తే లలితాంబ అయింది.

అందుకే ఒక వ్యాఖ్యాత లలితాసహస్రమే శివసహస్రం అన్నారు. ఎలాగంటే స్త్రీలింగశబ్దాలతో చెప్పబడిన శివస్వరూపం అన్నారు. లలితాసహస్రనామ ఉపోద్ఘాతం హయగ్రీవస్వామివారు చెప్తూ శ్రీవిద్యా ఉపాసకులకి శివుడు ఎంత ముఖ్యమైనవాడో సహస్రనామస్తోత్రం అంత ముఖ్యమైనదని చెప్పారు. శ్రీవిద్యా ఉపాసకులకి ముఖ్యమైనవాడు శివుడు. శివుడు ఒక్కడే. **'శివశ్శక్త్యాయుక్తో'** ఆయన మొదటి శబ్దం ఇదే.

శివ శబ్దానికి అర్థం బ్రహ్మవిష్ణురుద్రాత్మకమైన పరమాత్మ. పరమేశ్వరుడు, ఆయన యొక్క శక్తి. రెండూ కలిపి ఉభయ ఐక్యమే లలితాసహస్రంలో మొదటి నుండి చివరి వరకూ చెప్పబడింది.

పరమేశ్వరుని యొక్క శక్తి అంటే శక్తితో కూడిన పరమేశ్వరుడు. అమ్మా అని పిలవాలనిపిస్తే పరమేశ్వరి. ఆ తల్లిని ఇక్కడ వివరిస్తున్నారు. లలితాసహస్రనామం ప్రత్యేకత ఏమిటంటే ఇందులో లేని అమ్మ నామం బయట కనబడదు. మనకి ఏ దేవతానామం అయినా ఇందులో గోచరిస్తుంది.

మహాలక్ష్మి కావాలంటే **'రమా రాకేన్దువదనా'** నామం ఉంది. **'రామా రమణలంపటా'** అనే దానికి 'రమా రమణలంపటా' అనే పాఠం ఉంది. **'మహాలక్ష్మీః**

మృడప్రియా' ఉంది, సరస్వతికి **'శాస్త్రమయీ'** ఉంది. ఒకరే అమ్మ, ఒకరే జగదంబ. 'ఉపాసకానాం కార్యార్థమ్' – అమ్మ అనేక రూపాలు వస్తూ ఉన్నాయి.

ఇక్కడ స్తుతిస్తున్న అమ్మవారు సర్వదేవతాత్మిక అయిన పరదేవత. ఆవిడే పరాశక్తి. ఆవిడే పరబ్రహ్మస్వరూపిణి. ఆ తల్లి పేరే **'శ్రీమాతా'.**



ధ్యాన శ్లోకములు

ఏ సహస్రనామాలకైనా ధ్యాన శ్లోకం ఉంటుంది. ఒక స్తోత్రము ద్వారా ఏ దేవతామూర్తి ఆవిర్భవిస్తుందో ఆ కాంతిమయమైన రూపం ఈ ధ్యానశ్లోకంలో చెప్పబడుతుంది. లలితాసహస్రనామానికి నాలుగు విధాలైన ధ్యాన శ్లోకాలు చెప్పారు. ఈ నాలుగు రూపాలలో ఏ రూపాన్నైనా ధ్యానించవచ్చు లేదా నాలుగు రూపాలను కూడా ధ్యానించవచ్చు. ఇవన్నీ కూడా ఆ శ్రీవిద్య యొక్క స్వరూపములే.

సిందూరారుణవిగ్రహాం త్రిణయనాం మాణిక్యమౌళిస్ఫురత్
తారానాయకశేఖరాం స్మితముఖీమాపీనవక్షోరుహాం
పాణిభ్యామళిపూర్ణరత్నచషకం రక్తోత్పలం బిభ్రతీం
సౌమ్యాం రత్నఘటస్థ రక్తచరణాం ధ్యాయేత్పరామంబికామ్

సిందూరారుణ విగ్రహాం – సిందూరమువలె ఎర్రని కాంతులతో ఉన్న రూపము, **త్రిణయనాం** – మూడు నేత్రములతో ప్రకాశిస్తున్నది, **మాణిక్యమౌళిస్ఫురత్** – మాణిక్యములు పొదిగిన కిరీటాన్ని ధరించి, **తారానాయక శేఖరాం** – తారా నాయకుడు అంటే చంద్రుడు. ఆ కిరీటము పైన చంద్రలేఖ ప్రకాశిస్తోంది, **స్మితముఖీం** – అమ్మవారు ఆనందస్వరూపిణి. ఆ ఆనందాన్ని తెలియజేస్తూ చిరునవ్వుతో ప్రకాశిస్తోంది, **ఆపీనవక్షోరుహాం** – మాతృత్వ, వాత్సల్య, అమృత తత్త్వాలనే పోషణ శక్తిని నింపుకున్న వక్షఃస్థల సౌందర్యముతో భాసిస్తున్న తల్లి, **పాణిభ్యామళిపూర్ణ రత్నచషకం** – చేతుల యందు రత్నాలు పొదిగిన అమృతపాత్రను ధరించి, **రక్తోత్పలం బిభ్రతీం** – ఎర్రని పద్మమును ధరించి, **సౌమ్యాం** – స్వాంతస్థితి అయిన సౌమ్యముతో, **రత్నఘటస్థ రక్తచరణాం** – ఎర్రని పీఠంపైన ఉంచిన ఎరుపురంగుతో ప్రకాశించే పాదాలుగల తల్లిని, **ధ్యాయేత్పరాం అంబికాం** – అన్నిటికీ పరమతత్త్వమైన అంబికను ధ్యానిస్తున్నాను.

ఎర్రని కాంతులతో ప్రకాశిస్తూ, మూడు నేత్రములతో, చంద్రలేఖ అలంకరించిన కిరీటాన్ని ధరించి, చిరునవ్వుతో, అమృతమయమైన హృదయంతో, చేతులలో రత్నపాత్రను, రక్తోత్పలమును ధరించి, ఎర్రని పీఠముపై తన లేత ఎరుపు

కాంతులతో ప్రకాశిస్తున్న చరణాలను ఉంచి దీపిస్తున్న జగదంబికను ధ్యానం చేస్తున్నాను. ఇక్కడంతా కూడా అమ్మవారి ఎర్రదనం వర్ణించబడుతోంది. తరువాత ధ్యానశ్లోకంలో ఇదే తల్లి మరో రూపంతో కనబడుతోంది.

అరుణాం కరుణాతరంగితాక్షీం
ధృతపాశాంకుశపుష్పబాణచాపాం
అణిమాదిభిరావృతాం మయూఖైః
అహమిత్యేవ విభావయే భవానీమ్

ఈ శ్లోకం మొత్తం నాలుగు శ్లోకాలలోకి అత్యంత ప్రధానమైనది. అంటే నాలుగు ధ్యాన శ్లోకాలు చదువుకోకపోయినా, ఈ ఒక్క శ్లోకాన్ని ధ్యానశ్లోకంగా చదివి లలితా సహస్రనామములు చదువుకోవచ్చు. ఈ నాలుగింటి సారం ఇందులో ఉంది.

అరుణాం – అమ్మవారు ఎవరంటే 'అరుణ'. లేత ఎర్రని కాంతులతో ప్రకాశిస్తున్నది అని కాకుండా ఆ కాంతే అమ్మ. ఈ అరుణ అనే దానికి సంబంధించి వైదికమైన విషయం చాలా ఉంది. 'అరుణోపనిషత్' అని ఉన్నది. అందులో ఈ అరుణ తత్త్వం వివరంగా చెప్పబడింది. అటువంటి అరుణ అయిన తల్లి.

కరుణాతరంగితాక్షీం – ముఖ్యంగా ఒక మూర్తిలో కన్నులు చాలా ప్రధానం. ఆ కన్నులే కదా అసలు హృదయం ఏమిటో పట్టి చూపిస్తాయి. అమ్మ హృదయం ఏమిటో తెలియజేసేవి ఆ కన్నులు. తరంగాలుగా వెదజల్లబడుతున్న కరుణ. ఈ విశ్వంపై ప్రసరిస్తున్నది అమ్మ కన్నుల నుంచి కరుణ.

ధృతపాశాంకుశపుష్పబాణచాపాం – ఆ తల్లి నాలుగు చేతులలో నాలుగు ఆయుధాలు ధరించి ఉంది. ఒక చేతిలో పాశము, మరొక చేతిలో అంకుశం, మిగిలిన రెండు చేతులలో పుష్పబాణములు, ధనుస్సు (చెరకువిల్లు).

అణిమాదిభిరావృతాం మయూఖైః – అణిమాదులు అంటే 'అణిమ' మొదలైన కాంతులు. ఇవన్నీ గొప్ప సిద్ధులు. ఈ సిద్ధులే అమ్మ నుండి వస్తున్న కాంతులు. అమ్మను ఉపాసించే వారికి ఆ సిద్ధులు వస్తాయి. ఆ వెలుగులన్నీ లభిస్తాయి. శ్రీచక్ర

నవావరణలలోని శక్తులే ఈ మయూఖములు.

అహమిత్యేవ విభావయే భవానీం – 'అహమిత్యేవ విభావయే' అనేది కూడా గొప్ప మాట. ఎక్కడ లోతు ఎక్కువగా ఉంటుందో, ఎక్కడ రహస్యము ఉంటుందో అదే అత్యంత దివ్యంగా ఉంటుంది. లలితా సహస్రం ఆత్మవిద్య, వేదాంతవిద్య. అందుకే రహస్యం అని ముందు చెప్పడమయింది. వేదాంతము ఎప్పుడూ అత్యంత రహస్యంగా ఉంటుంది. ఇది వేదాంతవిద్య అని గ్రహించాలి. అంతేగాని మహిమలుగల నామాల సంపుటి మాత్రమే కాదు. ఆ వేదాంతవిద్య అనేది **'అహమిత్యేవవిభావయే భవానీం'** అని ఒక్క శ్లోకపాదం తెలియజేస్తోంది. దీని స్థూల అర్థం ఏమిటంటే **ఇటువంటి భవానిని నేను ధ్యానిస్తున్నాను. ఏవ** – అంటే **మాత్రమే** అని అర్థం. ఇటువంటి **భవానిని మాత్రమే** అంటే **ఏకాగ్రంగా ఈ మూర్తిని మాత్రమే ధ్యానిస్తున్నాను.**

వేదాంతపరంగా– అహం అంటే నేను. ఆ భావాన్ని/స్వరూపాన్నే ధ్యానిస్తున్నాను అంటే ఉపాసకుడు–ఉపాస్యము ఈ రెండింటి మధ్య భేదము లేని స్థితికి వెళ్ళిపోయాడన్న మాట. ఇది ఉపాసన చెయ్యవలసిన విధానం. **నా రుద్రోరుద్రమర్చయేత్, నా విష్ణుర్విష్ణుమర్చయేత్** – 'నువ్వు ఆ దేవత కానిదే ఆ దేవతను ఉపాసించరాదు' అని శాస్త్రం. జడులుగా ఉన్న మానవులు ఏ దేవతని ఆరాధిస్తున్నారో ఆ దేవతాచైతన్యాన్ని పొంది ఆ స్వరూపం అయిపోవాలి అని చెప్తుంది భారతీయ ఉపాసనాశాస్త్రం.

భౌతిక దృష్టి ఉండకుండా మనస్సు పూర్ణంగా ఆ దేవతతో తన్మయం పొందిన తరువాతనే ఉపాసించాలి. ఆ విధంగా ఆ భవానీదేవితో తన్మయస్థితి పొందడాన్నే **'అహమిత్యేవ విభావయే భవానీం'** అనేది సూచిస్తోంది.

ఇక్కడ 'మయూఖములు' అని చెప్పబడ్డాయి. అణిమ మొదలైన మయూఖముల చేత చుట్టబడి ఉంది. ఒక జ్యోతి వెలుగు చేత చుట్టబడుతుంది. ఆ వెలుగు ఆ జ్యోతి నుండి వచ్చినదే. అంటే జ్యోతి తన నుండి ప్రసరిస్తున్న కాంతుల మధ్య ప్రకాశించినట్లుగా అమ్మ తన నుండి వెలువడుతున్న అణిమాది వెలుగుల

మధ్య ప్రకాశిస్తోంది. అణిమాది వెలుగులంటే శ్రీచక్ర స్వరూపం గురించి తెలుసుకోవాలి.

ఇది ధ్యానానికి అవసరం గనుక అమ్మవారి రూప వర్ణన ఎంత చేసుకుంటున్నామో, ఇక్కడ శ్రీచక్రం గురించి కూడా కొన్ని విషయాలు తెలుసుకోవాలి. చక్రము యొక్క లోతైన విషయాలకి వెళ్ళడం లేదు. నిత్యం శ్రీచక్రార్చన చేసేవారు గురువుల నుండి వాటిని గ్రహిస్తారు. మంత్ర రహస్యముల వైపు వెళ్ళకుండా కేవలం మన ధ్యానానికి, భావనకు ఎంతవరకు అవసరమో అంతవరకే శ్రీచక్రానికి సంబంధించి ఒక అవగాహన కల్పించడమే ఉద్దేశం. **అణిమాదిభిరావృతాం మయూఖైః** అర్థం అవ్వాలన్నా, అలాగే లలితా నామములలో కొన్ని విషయములు బాగా అర్థం అవ్వాలన్నా శ్రీచక్రం గురించి ఒక అవగాహన కావాలి. ఎందుకంటే శ్రీవిద్యలో అంతర్భాగమే అమ్మవారి యొక్క నామములు. పైగా **'శ్రీమాతా', 'చక్రరాజనికేతనా', 'శ్రీమత్ సింహాసనేశ్వరీ'** – ఇవన్నీ కూడా శ్రీచక్రాన్ని తెలియజేసేవి. అందువల్ల ఇప్పుడు శ్రీచక్రం గురించి తెలుసుకున్నామని వెంటనే శ్రీచక్రం తెచ్చుకుని పెట్టుకోవలసిన అవసరం లేదు. దీన్ని ధ్యానం చేస్తే చాలు.

ఈ విశ్వచక్రమే శ్రీచక్రము. అలాగే మన శరీరమే ఒక శ్రీచక్రం. అమ్మవారు శ్రీచక్రంలో ఉంటుంది అంటే యోగ భూమికలో దర్శిస్తే మనలోనే శ్రీచక్రం సాక్షాత్కరిస్తుంది. ఆ శ్రీచక్ర అధిష్ఠాన దేవత అయిన అమ్మవారు సాక్షాత్కరిస్తుంది. భారతీయ విజ్ఞానపు గొప్పతనం ఇందులో తెలుస్తుంది. శ్రీచక్రాన్ని యంత్రం అంటారు. ఒక మంత్రము, దేవత – ఈ రెండు దేనియందు ప్రతిష్ఠింపబడతాయో దాన్ని యంత్రం అంటారు. ఈ యంత్ర విజ్ఞానాన్ని పరిశీలించి విదేశీ మేధావులు, విజ్ఞానశాస్త్రవేత్తలు కూడా ఆశ్చర్యపోయారు.

విశ్వచైతన్యశక్తినంతటినీ కూడా నిబద్ధీకరించి ప్రతిష్ఠ చేసే శక్తి యంత్రానికి ఉంది. అందువల్ల ఒక దేవతారూపం ఉన్నదన్నా, దేవతానామం ఉన్నదన్నా దానికి, ఈ యంత్రానికి సంబంధం ఉంది. అందుకే భారతీయ విగ్రహారాధన కేవలం విగ్రహారాధన కాదు.

'అరుణాం కరుణాతరంగితాక్షీం' అంటూ వర్ణించుకున్న అమ్మవారి రూపం అంతా కూడా శ్రీచక్రార్చనే. అందువల్లనే ఈ శ్లోకం ధ్యానశ్లోకంలో గొప్పది. **'అరుణాం కరుణాతరంగితాక్షీం'** అన్నదానిలో అమ్మవారి స్థూలరూపాన్ని చెప్తూనే **'అణిమాదిభిరావృతాం మయూఖైః'** అనే మాటలో శ్రీచక్రం గురించి చెప్పారు. ఇదంతా కూడా శ్రీచక్రానికి సంబంధించిన వాక్యం.

మూడవ ధ్యానశ్లోకంలో కూడా పై రెండింటిలో చెప్పబడ్డ అమ్మస్వరూపమే.

ధ్యాయేత్ పద్మాసనస్థాం వికసిత వదనాం పద్మపత్రాయతాక్షీం
హేమాభాం పీతవస్త్రాం కరకలిత లసద్ధేమ పద్మాం వరాంగీమ్
సర్వాలంకారయుక్తాం సతతమభయదాం భక్తనమ్రాం భవానీం
శ్రీవిద్యాం శాన్తమూర్తిం సకల సురనుతాం సర్వసమ్పత్ప్రదాత్రీమ్

ఈ శ్లోకం కూడా శ్రీ చక్రతత్త్వాన్ని, అమ్మ స్వరూపాన్ని తెలియజేస్తున్న శ్లోకం. అమ్మవారు పద్మాసనముపై కూర్చున్నది. అంటే పద్మము ఆసనముగా చేసుకొని కూర్చున్నది అనేదేకాక యోగములో పద్మాసనము దివ్యమైనది. ఆ పద్మాసనంలో కూర్చున్నది అమ్మ.

వికసిత వదనాం – వికసించినట్టి వదనంతో ఉన్నది. వదనం వికసించి ఉందంటే అర్థం సర్వభావాలను పరిపూర్ణంగా ప్రకటించుతున్నది అని అర్థం. కరుణ, వాత్సల్యము, సౌజన్యం ఇలాంటి దివ్యభావాలను అమ్మవదనం వికసింపజేసి లోకముపై ప్రకటించుతున్నది. **పద్మపత్రాయతాక్షీం** – పద్మపత్రమువలె(తామరపువ్వు రేకులవలె) విశాలముగా ఉన్న కన్నులుగల తల్లి.

హేమాభాం – సువర్ణకాంతులతో ప్రకాశిస్తున్నది. హిరణ్యవర్ణము అంటే ఇదే. **పీతవస్త్రాం** – పట్టు వస్త్రాలను కట్టుకొని, **కరకలిత లసద్ధేమ పద్మాం వరాంగీమ్** – చేతులలో కూడా బంగారు కాంతులను వెదజల్లుతున్న పద్మాన్ని ధరించి, అత్యంత శ్రేష్ఠమైన దివ్యదేహముతో ప్రకాశిస్తోంది. లౌకికమైన, పాంచభౌతికమైన దేహం కాదది. తేజోమయమైన, లోకాతీతమైన స్వరూపం అది.

సర్వాలంకారయుక్తాం – పరిపూర్ణురాలు గనుక ప్రతి అవయవము దానికి

అనువైన అలంకారముతో ప్రకాశిస్తోంది. ఆ విధంగా కూర్చుని ఉన్న తల్లిని **సకల సురనుతాం** – సకల దేవతలు స్తుతిస్తున్నారు. ఈ దేవతలందరి దేవత్వము కూడా అమ్మవారి కరుణా కటాక్ష వీక్షణ ప్రసారం వల్ల లభించినది కనుక నమ్రులై అమ్మవారిని కొలుచుకుంటున్నారు. భక్తులపట్ల ఎల్లవేళలా లొంగి ఉంటున్నది అనే భావాన్ని చూపిస్తున్నారు. భక్తి చూపిస్తే అమ్మ వెంటనే అనుగ్రహిస్తుంది. భక్తులకు లభ్యమైన కరుణామయ స్వరూపురాలు. **భక్తనమ్రాం భవానీం** – అట్టి భవాని 'శ్రీవిద్యా' అన్నారు. ఉపాసించే మంత్రము, దేవత ఎప్పుడూ వేరు కాదు. ఆ మంత్రమే దేవత అని తెలియాలి. అలాగే ఉపాసనా విధానం కూడా దేవతే.

మంత్రము, ఉపాసన, యంత్రము – ఈ మూడు కలిపి శ్రీవిద్య. ఈ మూడూ అమ్మవారి రూపమే. అమ్మవారి రూపాన్ని మనం ధ్యానించామంటే ఈ మూడూ అందులోనే ఉన్నాయని తెలియాలి. అందుకని అమ్మ పేరే శ్రీవిద్య. ఆమె 'శాన్తమూర్తి'. ఈ శాన్తమూర్తి సర్వరసములకు మూలమైనది. సర్వరసములకు అతీతమైనది. బిందుస్థానంలో ప్రకాశిస్తోంది.

ఆ శాంతమూర్తి అయిన తల్లి **సతతమభయదాం** – ఎల్లవేళలా అభయాన్ని ఇస్తూ ఉంటుంది. అమ్మ రూపంగానీ, మంత్రంగానీ అభయం కోసం ఏర్పడ్డాయి. చాలామంది 'శక్తి ఉపాసన చాలా భయంకరమైనది జాగ్రత్తగా ఉండాలి' అని అనుకుంటారు. తామస విధానాలలో వెళితే భయంగానీ అదే సాత్త్వికమైన ఉపాసనలో 'అభయమే' శక్తి ఉపాసన.

అమ్మ స్వరూపం ఎల్లవేళలా అభయం, వాత్సల్యం, కారుణ్యం. అందువల్ల 'సతతమభయదాం' ఎల్లవేళలా అభయమివ్వడమే స్వభావముగా గలిగి, **సర్వసంపత్ప్రదాత్రీం** – అన్ని సంపదలు ఇచ్చే తల్లి.

అలాగే మన శరీరంలో ఒకొక్క ఇంద్రియానికి ఉన్న లక్షణము ఆ అమ్మ ఇచ్చిన సంపద. ఇలా జగత్తు అంతా అమ్మ సంపదలతో నిండిపోయి ఉన్నది. ఎవరికి ఏ సంపద కావాలో ఇచ్చే తల్లి అని అర్థం. ఆ విధంగా అమ్మ సర్వ సంపన్మయి అయిన శ్రీవిద్యాస్వరూపిణి. ఇంకొక ధ్యాన శ్లోకాన్ని కూడా చెప్తున్నారు.

సకుంకుమవిలేపనామళికచుమ్బికస్తూరికాం
సమన్దహసితేక్షణాం సశరచాపపాశాంకుశామ్
అశేషజనమోహినీ మరుణమాల్యభూషోజ్జ్వలాం
జపాకుసుమభాసురాం జపవిధౌ స్మరేదమ్బికామ్

అమ్మవారి నామాన్ని, మంత్రాన్ని జపం చేసేటప్పుడు ఎలాంటి అంబికను స్మరించాలి అంటే **జపాకుసుమభాసురాం** – జపాకుసుమాలు అంటే దాసాని పువ్వులు. అలాంటి ఎర్రని పువ్వుల వలె ప్రకాశిస్తున్న తల్లిని ధ్యానించాలి .

ఇక్కడ కుసుమంతో పోల్చడంలో అంతరార్థం ఏమంటే కుసుమంలో లావణ్యము, సౌకుమార్యము, కాంతి ఉంటాయి. అలాగ అమ్మవారు కుసుమం వంటి లావణ్యంతో, మృదుస్వభావంతో, ఎర్రని కాంతులతో ప్రకాశిస్తున్నారు. దానికి తోడు **సకుంకుమవిలేపనాం** – కుంకుమని పూసుకొని ఉన్నది తల్లి. ఈ కుంకుమ అనేది కూడా దివ్యపదార్థం.

భారతీయసంస్కృతిలో పసుపు, కుంకుమ ఈ రెండూ దేవతా శక్తి కలిగి ఉన్న పదార్థములుగా భావిస్తాము. ఇవి మానవులు తయారు చేసుకొని వాటి యందు దైవత్వాన్ని ఆరోపించుకున్న వస్తువులు కావు. మహర్షులు దర్శించి వాటిలో దేవతాశక్తి ఆవిష్కరింపబడుతుందని తెలియజేసి వాటిని మన ఆచారంలో భాగంగా పెట్టారు.

కుంకుమ అలంకరించుకోవడం మన సంప్రదాయం. పసుపు మిళితమైనదే కుంకుమ అవుతుంది. దీనిని సంప్రదాయబద్ధమైన పదార్థముగా చేయాలి. కాని ఇక్కడ కేవలం వర్ణం ప్రధానం కాదు. అంటే రంగు ప్రధానం చేసుకుని ఎర్రగా కనిపించిన ఏదో ఒకటి కుంకుమ అని సరిపెట్టుకోవడం పనికి రాదు. కుంకుమ అంటే కుంకుమే. ఈ కుంకుమలో పసుపు ఉంటుంది.

కుంకుమ తయారు చేసేటప్పుడు దానికి సూర్యరశ్మి సోకి ఒక ధ్వని వినబడుతుంది అని చెప్తారు. సూక్ష్మమైన ధ్వని అది. ఆ ధ్వని 'కుం' అనే శబ్దంతో వస్తుంది అని చెప్పారు. అంటే 'కుం ఇతి కూజతీతి కుంకుమ' అని పేరు పెట్టారని వ్యాఖ్యాతలు చెప్పారు. భారతీయ సంస్కృతిలో ఇంత సూక్ష్మమైన ధ్వనిని కూడా

వినగలిగిన సూక్ష్మ శ్రవణశక్తి ఉన్న మహర్షులు ఉండేవారు.

ఈ పద్ధతిలో తయారైన దానిలో ఆ దేవతాశక్తిని జాగృతం చేసే మహిమ ఉంటుంది. సృష్టి అంతా కూడా భగవచ్ఛక్తితో నిండి కూడా కొన్ని మాత్రం ఆ శక్తిని ప్రకటిస్తాయి, ప్రసరింపజేస్తాయి. అన్నీ ఆ పని చేయలేవు. ఎలాగంటే సూర్యకాంతి విశ్వమంతా వ్యాపించి పరుచుకొని ఉంటుంది. కాని ఒక అద్దం ఆ కాంతిని ప్రతిఫలింపజేయగలుగుతుంది. ఆ విధంగా కొన్ని వస్తువులు భగవచ్ఛక్తిని ప్రకటీకరించగలుగుతాయి. అలాంటి వస్తువులలో కుంకుమ ఒకటి.



1. శ్రీమాతా – శ్రీమాత్రే నమః

అమ్మవారిని ఉద్దేశించి మొదట వశిన్యాదివాగ్దేవతలు పలికినది '**శ్రీమాతా**'. ఒక వృక్షానికి విత్తనం మొదటి దశ. సహస్రనామస్తోత్రమనే వృక్షానికి విత్తనం లాంటిది '**శ్రీమాతా**'. విత్తనం దగ్గర పెట్టుకుంటే చెట్టంతా దగ్గర ఉన్నట్లే. విత్తనానికి సంస్కృతంలో పేరు బీజం.

శ్రీమాతా అనే బీజం తెచ్చుకుని ఎవరైతే నిత్యం మననరూపంలో వ్యవసాయం చేస్తారో, అది భూజమై సహస్రనామంలో ఫలాన్ని అంతటిని ఇస్తుంది అనడంలో సందేహం లేదు. ప్రారంభమవుతున్న ఈ నామం సామాన్యమైనది కాదు. చాలా దివ్యమైన నామం '**శ్రీమాతా**'.

తైత్తిరీయ ఉపనిషత్తు పరమాత్మ అంటే ఏమిటో నిర్వచనం చెప్తూ '**యతోవా ఇమాని భూతాని జాయంతే – యేన జాతాని జీవంతి – యత్ప్రయంత్యభిసంవిశంతి – తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి**' అంటుంది. ఇది పరబ్రహ్మ అనే ప్రశ్నకి సూటి సమాధానం. ఇదే అన్నింటికి సరిపోతుంది. ఎవరు భగవంతుడు గురించి చెప్పినా ముందు ఇది చెప్పి తరువాత విషయంలోకి ప్రవేశించాలి. ఏ రూపంలో పరమాత్మను ఆరాధించినా పరమాత్మ అంటే ఏమిటో తెలుసుకుని ఆరాధించాలి. '**తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి**' – పరబ్రహ్మమనగా ఇది అని తెలుసుకోమని వరుణుడు అనే మహర్షి, భృగువనే శిష్యునికి చెప్తున్నాడు. అది తైత్తిరీయ భృగువల్లీలో వస్తుంది.

లలితాసహస్రనామ ప్రారంభమే ఉపనిషత్. ఆవిడే '**సర్వోపనిషదుద్ఘుష్టా**'. లలితాసహస్రనామం ఒక ఉపనిషత్ అని భావిస్తే ఉపనిషత్తులోని ప్రధానమంత్రం ఇక్కడ చెప్పబడుతోంది. "**బ్రహ్మమంటే మూడు మాటల్లో చెప్తున్నాను విను**" అన్నారు.

'**యతో వా ఇమాని భూతాని జాయంతే**' –ఈ సర్వభూతములు అంటే ఈ ప్రపంచం, జీవులు, ప్రపంచమనగా భూప్రపంచమే కాదు సర్వలోకాలు, సర్వజీవులు. జీవులు అనగా దేవతలు, బ్రహ్మదేవుడు మొదలుకొని పిపీలికం వరకూ వీరందరూ ఎవరి వలన కలుగుతున్నారో.....

రెండవది '**యేన జాతాని జీవంతి**' – ఎవరి వలన పెరుగుతూ ఉనికి కలిగి ఉన్నారో...

మూడవది **'యత్ప్రయంత్యభిసంవిశంతి'** – చివరకి ఎవరిలో లయమై పోతున్నారో అదే బ్రహ్మము. ఇదే బ్రహ్మసూత్రాలలో అధికారి గురించి చెప్పిన **'అథాతో బ్రహ్మజిజ్ఞాస'** తరువాత చెప్పిన **'జన్మాద్యస్య యతః'** సూత్రం. జన్మాదులన్నీ ఎవరివలన కలుగుతున్నాయో ఆయనే బ్రహ్మము.

ఇదే మొదటి మాటగా గజేంద్రుడు అన్నాడు. "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై ఎవ్వనియందు డిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణంబెవ్వడు అనాది మధ్య లయుడెవ్వడు..." పరమాత్మకు ఇదొక్కటే నిర్వచనం. సృష్టి, స్థితి, లయలన్నీ ఎవరి వల్ల కలుగుతున్నాయో అతడే పరమేశ్వరుడు.

బ్రహ్మసూత్రాలు ఎలా మొదలయ్యాయో, లలితాసహస్రనామస్తోత్రం అలాగే మొదలయింది. అందుకే ఇది బ్రహ్మవిద్య, శ్రీవిద్య.

మనం అమ్మవల్ల కలిగాం. అమ్మ సృష్టికి హేతువు కనుక మొదటి నామం శ్రీమాతా అనేది **'యతోవా ఇమాని భూతాని జాయంతే'**లో ఉంది.

శ్రీమహారాజ్ఞీ – రాణీ అంటే పాలకురాలు. మొత్తం వ్యవస్థ అంతా సరిగ్గా ఉండేటట్లు చూసుకోవలసిన బాధ్యత మహారాణిది. రాణి అని చెప్పవచ్చుగా 'మహారాణీ' అని చెప్పడంలో ఉద్దేశం ఈవిడకి పైన మరొక పాలకురాలు లేరు. మహాశబ్దం సర్వోత్కృష్టతను తెలియజేస్తుంది. ఈవిడే అన్నింటికీ పైన ఉన్నది. శ్రీమహారాజ్ఞీ అనగా రెండవదైన **'యేన జాతాని జీవంతి'** – ఎవరు ఈ సృష్టి అంతా పెరగడానికి, ఉండడానికి కారణమో అనగా స్థితికారిణి. లోకవ్యవస్థ నిర్మాణ, నిర్వహణలు ఈ మహారాణి కృత్యములే.

సింహాసనేశ్వరీ – దీనికి చాలా అర్థం ఉంది కాని ఇక్కడ ప్రథమార్థం తీసుకుంటే 'ఎవ్వని యందు లయం అవుతున్నదో' అని అర్థం. సింహ అనే శబ్దానికి 'వశకాంతౌ శివ స్మృతః' అని చెప్పినట్లుగా వర్ణవిపర్యయన్యాయం ప్రకారంగా హింస అనే శబ్దమే సింహ అయ్యింది. హింసించునది అనగా లయం చేయునది. హింస అనగా ధ్వంసమే అని కాదు. పూర్తి చేయడం అని అర్థం. ఈ జగత్తునంతటిని లయం చేసుకునేది హింస. అలా చెయ్యగలిగన అధికారం ఎవరికుందో ఆవిడ

ఈశ్వరి. సర్వాన్ని లయం చేయగల తల్లి కాబట్టి సింహాసనేశ్వరీ అనగా లయకారిణి. **'యత్ప్రయంత్యభిసంవిశంతి'** – ఇది ఉపనిషత్ చెప్పిన మూడో వాక్యం.

శ్రీమాతా – సృష్టికారిణి. శ్రీమహారాజ్ఞీ – స్థితికారిణి. శ్రీమత్సింహాసనేశ్వరీ – లయకారిణి. పరమేశ్వరీ అంటే సృష్టి, స్థితి, లయకారిణి అని మొదటి వాక్యంలోనే ప్రతిపాదన చేశారు.

సృష్టి, స్థితి, లయకారిణి ఎవరో ఆవిడే బ్రహ్మము, పరమాత్మ. మనం ఏ విశ్వంలో ఉన్నామో, దేనివల్ల ఉన్నామో, అన్నిటి మీద ఆవిడే అధికారిణి. అందుకే పరబ్రహ్మస్వరూపిణి అని ప్రతిపాదన మొదటి మూడు వాక్యాల్లోనే చేసేశారు.

సృష్టి–స్థితి–లయ అనేవి మూడు పరిణామదశలు. ఇవి నిరంతరం జరుగుతూ ఉంటాయి.

ప్రతి అణువులోనూ, బ్రహ్మాండంలోనూ సృష్టి, స్థితి, లయలు ఎప్పటికప్పుడు ఉంటాయి. అతి సూక్ష్మసమయం లెక్కకట్టలేరు కనుక పెద్ద సమయం చూసుకొని సృష్టి, స్థితి, లయలు అంటున్నారు కానీ ప్రతి కణంలో, ప్రతిక్షణంలో సృష్టి, స్థితి, లయలు జరుగుతూ ఉంటాయి.

'శ్రీ' వైభవం

ప్రతి అణువులోనూ, ప్రతి బ్రహ్మాండంలోనూ సృష్టి స్థితి లయలు చెయ్యగలిగే శక్తి మాత్రం ఒక్కరే. ఆవిడే శ్రీమాతా, శ్రీమహారాజ్ఞీ, శ్రీమత్సింహాసనేశ్వరీ. అయితే సృష్టి–స్థితి–లయలు మారాయి గాని ఆ మూడు చేస్తున్న ఆవిడ మాత్రం మారలేదు. ఆవిడ ఒక్కరే.

పరిశీలిస్తే మాతా–మహారాజ్ఞీ–సింహాసనేశ్వరీ ఈ మూడు శబ్దాలు మారాయి గాని మారకుండా 'శ్రీ' అనే శబ్దం మూడింటిలోనూ ఉంది. అమ్మవారిపేరు శ్రీ. ఆ శ్రీయే సృష్టి చేసేటప్పుడు **మాతా,** స్థితిగా **మహారాజ్ఞీ,** లయం చేసేటప్పుడు **సింహాసనేశ్వరీ.**

ఒక వేదమంత్రం ఓంకారంతో ప్రారంభించాలి. ఇది వేదం అన్నప్పుడు పరబ్రహ్మన్ని చెప్పే ప్రణవం ఓంకారం. ఆయన శక్తిని చెప్పే ప్రణవం శ్రీంకారం.

శ్రీతో ప్రారంభించడం ఓంకారమే. శక్తి సహితంగా పరమాత్మని చూడాలి కనుక శక్తికి సంబంధించిన పేరు '**శ్రీ**'. ఇదే అమ్మవారి బీజం. **బీజాక్షరాలు గురుముఖతః మాత్రమే పొందాలి. చెప్పుకోవడం వరకూ మాత్రమే ఇక్కడ జరుగుతోంది. ఎక్కడెక్కడ ఇలాంటివి వస్తుంటాయో అక్కడక్కడ వాటిని గురుముఖతః మాత్రమే పొందాలనేది తప్పనిసరిగా ప్రతివారు గ్రహించాలి.**

"మ్" అనేదే నాదం. శ్రీకి నాదం కలిస్తే శ్రీం అయ్యింది. ఇది మహాబీజం. అమ్మవారి విద్యకి ఇది ప్రధానబీజం. అమ్మవారి విద్యపేరు శ్రీవిద్య. యంత్రం పేరు శ్రీచక్రం.

శ్రీచక్రం, శ్రీవిద్య అని చెప్పబడుతున్న తల్లి పేరు శ్రీయే కావాలి. శ్రీయొక్క విద్య కనుక శ్రీవిద్య. శ్రీయొక్క చక్రం కనుక శ్రీచక్రం. కనుక ఆ తల్లి పేరే శ్రీ. ప్రారంభమే శ్రీ. శ్రీ అంటే లక్ష్మా? సరస్వతా? పార్వతా? ఆ మూడు ఈవిడే. శ్రీ అనగా శక్తి అని అర్థం. శ్రీ శబ్దం అనేకచోట్ల వాడవచ్చు అని **'లక్ష్మీ సరస్వతి ధీ త్రివర్గ సంపద్విభూతి శోభాసు'** – నిఘంటువు చెప్తున్న అర్థం.

లక్ష్మీదేవి, సరస్వతీ, ధీ అనగా బుద్ధి పరంగా, త్రివర్గాలు అంటే ధర్మార్థకామాలు ఈ మూడింటితో కూడిన సంపద. అలాగే మంచి శోభగాని, కాంతిగాని కనబడితే అది శ్రీ అని చెప్పాలి.

సూర్యుడు చక్కగా కాంతిమంతంగా కనబడితేనే శోభ. నదికి నీరు అందం. నీటికి దాహం పోగొట్టే గుణం అందం. సృష్టికి ప్రకృతిసిద్ధమైన దాని లక్షణం అందం. అదే శోభ. దానినే శ్రీ అంటారు. విభూతికి కూడా శ్రీ అనే పేరు.

గీతలో కృష్ణపరమాత్మ చెప్తూ **"యద్యద్విభూతి మత్సత్వం శ్రీమదూర్జితమేవ వా"** అంటారు. విభూతులను ఉపాసించాలి. విభూతి అంటే గొప్పతనం. సూర్యునికి కాంతి విభూతి. నీటికి దాహం పోగొట్టే గుణం విభూతి. కంటికి చూడగలిగే శక్తి విభూతి. చెవికి వినగలిగే శక్తి విభూతి.

శ్రీ అంటే శోభ, విభూతి, సరస్వతి, లక్ష్మీ, బుద్ధిశక్తి, త్రివర్గాలు. ఇవన్నీ ఎవరో ఆవిడే '**శ్రీమాతా**' లేదా 'శ్రీలకు మాత'. ఈ శోభలకు, విభూతులకు అన్నింటికి

కారణమైనది. మాతా అంటే కారణమైనది అని ఒక అర్థం.

'శ్రీ' అనగా శక్తివాచకం. ఇది అమ్మవారి ప్రణవం. ప్రణవానికి అకార, ఉకార, మకారాలు ఉంటాయి. శ్రీకారంలో కూడా శకార, రకార, ఈకారాలు మూడు ఉన్నాయి. ఇక్కడ శకారం ఆనందవాచి. శం–శాంతి, శుభం. రకారం తేజోవాచి. తేజస్సు అనగా జ్ఞానం. ఈంకారం శక్తిబీజం. **'తాం పద్మినీం ఈం శరణమహం ప్రపద్యే'** – అని శ్రీసూక్తం. శక్తికి సంబంధించిన బీజం కనుక ఈం కారం చివరకు రావాలి. ఈంకారానికే తురీయాక్షరం అని పేరు. అక్షరాలలో మొదటి మూడక్షరాలు అ, ఆ, ఇ – తరువాత ఈ తురీయం (నాల్గవది). తురీయం అంటే ఉపనిషత్ పరంగా పైదే. కనుక 'ఈ' అంటే ఆ తురీయశక్తి, పరాశక్తి. దీనికి మకారం (నాదం) పెడితే 'ఈం' బీజమైంది. శకార, రకార, ఈంకారాలు కలిపితే 'శ్రీం' అయ్యింది. వేదం ప్రకారం శ్రీంకారాన్ని 'గుప్తప్రణవం', ఓంకారాన్ని 'ప్రకటప్రణవం' అంటారు.

'శ' అంటే ఆనందం, 'ర' అంటే జ్ఞానం, 'ఈం' అంటే పరబ్రహ్మ యొక్క శక్తి. జ్ఞానము, ఆనందము, శక్తి కలిగిన పరమాత్మే శ్రీపదవాచ్యుడు.

మరొక అర్థం– శ్రీ అనే శబ్దానికి **'శ్రీయతే ఆశ్రీయతే ఇతి శ్రీః'** అని అర్థం. శ్రయం అనే శబ్దానికి 'ఆ' అనేది ఉపసర్గ చేరితే ఆశ్రయం అయ్యింది. నిజానికి శబ్దం మాత్రం శ్రయమే. శ్రీ అనగా ఆశ్రయశక్తి అని అర్థం. ఆశ్రయం అనగా ఆధారం, పోషకమైన శక్తి.

దేవీమాహాత్మ్యంలో –

త్వామాశ్రితానాం న విపన్నరాణాం

త్వామాశ్రితా హ్యాశ్రయతాం ప్రయాంతి

అంటారు. అమ్మా! నిన్ను ఎవరు ఆశ్రయించారో వారు తెలివైనవారు. వారు ఎవరిని ఆశ్రయించాలో వారినే ఆశ్రయించినవారు. సర్వజీవులకి ఆధారశక్తి.

శ్రీ అంటే ఆశ్రయించే శక్తి అని కూడా అర్థం. కాంతికి దీపం ఎలా కావాలో శక్తికి శివుడు అలా కావాలి. శివుడు జ్యోతి లాంటివాడు. కాంతి జ్యోతిని

ఆశ్రయించుకున్నట్లే శక్తి ఈశ్వరుని ఆశ్రయించుకుంది. **'ఈశ్వరుని ఆశ్రయించుకొని ఉన్న శక్తి కనుక శ్రీ'** అని అర్థం. బయటనుండి వచ్చి ఆశ్రయించినది కాదు. ఆయన వెలుగే అది కనుక ఇద్దరికీ అభేదం. ఆ శక్తిని మనందరం ఆశ్రయించుకొని ఉన్నాం కనుక మనకి ఆశ్రయమైన శక్తికి, ఈశ్వరుని ఆశ్రయించుకొని ఉన్న శక్తికి శ్రీ అని పేరు.

మరొక అర్థం – శ్రీ అనే మాట వేదంలోంచి వచ్చింది. **'ఋచస్సామాని యజూగ్ంషి సా హి శ్రీరమృతాం సతాం'** ఇది వేదవాక్యం. అమ్మవారి విద్య వేదవిద్య. అందువల్ల అన్నీ ఆ పరంగానే అర్థం చెప్పాలి.

శ్రీ అనగా వేదము. వేదం కూడా ఈ విషయాన్నే చెప్పింది. "అమ్మా! నీ పేరేమిటి" అని వేదం అడిగితే, "నా పేరు శ్రీ" అని అమ్మవారు చెప్పారు. అందుకు **ఋచః సామాని యజూగ్ంషి** – ఋక్కులు, సామములు, యజుస్సులుగా చెప్పబడ్డ వేదాన్నంతటినీ కలుపుకొని 'శ్రీ'.

'అమృతా – శ్రీ' అని రెండు పేర్లు. అంటే 'శ్రీ'కి అమృతమని పేరు. అమృతం అనగా ఆనందమైనది, శాశ్వతమైనది అని అర్థం. వేదమనే అమృతం. వేదమంతా కలుపుకుంటే శ్రీ. 'శ్రీమాతా' అంటే 'వేదమాత' అని అర్థం.

ఏ దేవత గురించి మాట్లాడాలన్నా, జీవితంలో బాగుపడడానికి కావలసిన జ్ఞానం తెలుసుకోవాలన్నా, ఇహానికి, పరానికి కావలసిన యజ్ఞం, తత్త్వం ఏది కావాలన్నా వేదమే ఇవ్వాలి. సర్వానికి వేదమే ఆధారం.

మనకి ఆశ్రయశక్తి వేదమే కనుక వేదాన్ని 'శ్రీ' అన్నారు. **'యస్య నిశ్వసితం వేదాః'** – వేదం ఈశ్వరుని నుండే వచ్చింది కాబట్టి శ్రీ అంటే వేదమే. కనుక శ్రీమాతా అనగా వేదమాత గాయత్రీ. **గాయత్రీ 'త్రిపద'. ఈవిడ 'త్రిపుర'.** సంపూర్ణముగా గాయత్రీ స్వరూపమే.

శ్రీనాథ మహాకవి 'కడుపు చల్లంగ వేదాల కన్న తల్లి' అంటారు. వేదాలను కన్న తల్లి. మాతా అంటే కారణమైనది అని అర్థం. కడుపులో పెట్టుకునేది అని అర్థం. ఆవిడ కడుపులోంచే మనందరం వచ్చాం. తల్లిలోంచే వచ్చి తల్లిలోనే ఉన్నాం.

మనల్ని కన్నతల్లి నుంచి మనం వేరయ్యాం గాని ఈ కన్నతల్లిలోనే పుడుతున్నాం, పెరుగుతున్నాం. ఈ కన్నతల్లిలోనే ఈ శరీరం విడిచి పెట్టినా ఉంటున్నాం. కనుక ఎప్పుడూ ఈ తల్లి కడుపులోనే ఉన్నాం. సర్వజగత్తు ఈమెనే ఆశ్రయించుకుని ఉంది. ఆ తల్లి గర్భంలోనే అన్నీ ఉన్నాయి. అమ్మవారికి **'వేదగర్భా'** అని నామం కూడా ఉంది. ఈ నామాన్ని అర్థం చేసుకుంటే ఆ తల్లి **శ్రీమాతా** అని అర్థమౌతుంది.

జగతిని అంతటిని తన నుంచి ప్రసవించింది. ప్ర-సవంలో సవమే 'సవితుః'. సృష్టికారిణి అయింది. మనందరం ఎవరివల్ల కలిగామో, మనకి ఏది కారణమైనదో, మనకేది పోషణమైనదో, మనల్ని రక్షించేది ఎవరో, మనపై నెపం లేని ప్రేమ ఎవరికుందో ఆవిడే అమ్మ. తల్లికి బిడ్డపై ఉండేది అవ్యాజమైన ప్రేమ.

పరమాత్మని అమ్మా! అని ఉపాసించాలా? అయ్యా! అని ఉపాసించాలా? అంటే ఎలాగైనా ఉపాసించవచ్చు అని శాస్త్రం చెప్పింది.

పుం రూపం వా స్మరేద్దేవీం స్త్రీ రూపంవా విచింతయేత్
అథవా నిష్కలాం ధ్యాయేత్ సచ్చిదానంద లక్షణామ్

ఆవిడను అమ్మా! అని పిలవడం గొప్పది. అమ్మా! అని పిలిచినపుడు తల్లి 'ఈ పిల్లవాడు యోగ్యుడా కాదా! అన్ని అర్హతలు ఉన్నాయా లేదా!' ఇవన్నీ పరిశీలించి దయ చూపించదు. పిల్లవానిపై అమ్మప్రేమ ఏదో కారణాన్ని చూసి రాదు. ఇది అమ్మ **అవ్యాజమైన కరుణామూర్తి** అన్నదానికి సరిపోతుంది.

తల్లి ఎలాగైతే పిల్లవానిని లాలించేటప్పుడు అర్హతలు చూడదో ఈశ్వర చైతన్యం కూడా అమ్మా! అని పిలిచేవారిని వెంటనే కరుణిస్తుంది. అమ్మ దగ్గర ఉన్న గొప్ప లక్షణం అవ్యాజమైన ప్రేమ. మనం అమ్మా! అని పిలిచామంటే మనకి కారణమైన తల్లి, నన్ను పోషించే తల్లి, నన్ను రక్షించే తల్లి, నేను యోగ్యుడనైనా, కాకున్నా నన్ను కాపాడే తల్లి అని అర్థం. 'శ్రీమాతా' అనగానే ఆశ్రయమైన తల్లినే ఆశ్రయించామనే భావన కలగాలి.

అర్థం తెలిసి అనడం ఒకటి. భావనతో అనడం ఒకటి. భావనతో అంటే

అమ్మ దొరుకుతుందని లలితాష్టోత్తరశతనామాలలో **'భావనామాత్రసంతుష్టాయై నమః'** అని చెప్పబడింది.

02. శ్రీమహారాజ్ఞీ - శ్రీమహారాజ్ఞ్యై నమః

'శ్రీమహారాజ్ఞీ' అనగా పాలకురాలు. ఒక రాణిగారి వలె అమ్మవారు సంపూర్ణమైన అధికారం కలిగి ఉంటారు. లోకంలో 'తల్లి పిల్లలను కంటుంది కానీ వారి రాతలను కనగలదా!' అని ఒక సామెత ఉంది. కేవలం మాత అయితే ఆ మాట అంటుంది కానీ అమ్మవారు కన్నతల్లి మాత్రమే కాదు, సర్వసమర్థత కల మహారాణీ కూడా.

పిల్లవాడు ఏడుస్తూ ఉంటే లోకంలో కన్నతల్లి కొంతవరకు తాను చెయ్యగలిగింది చేస్తుంది. తరువాత పిల్లవానికి ఏమవుతుందో అని భయపడుతుంది. అమ్మవారు అలాంటి తల్లి కాదు. ఏమైనా చెయ్యగలిగే తల్లి. సంపూర్ణమైన అధికారం ఆవిడకు ఉంది. అధికారం చేతనే పాలన చేస్తున్నది. ఆ తల్లిని మించిన రాణి లేరు. అమ్మవారు సర్వానికి పాలకురాలు. 'మహారాజ్ఞీ'. ఇందులో ఉన్న బీజాక్షరాలు పరిశీలిస్తే ఈ నామం 'ఈ'కారంతో పూర్తవుతుంది. శ్రీ-మాతా, శ్రీ-మహారాజ్ఞీ, శ్రీ-మత్సింహాసనేశ్వరీ. 'శ్రీ'కి నాదం కలిపితే 'శ్రీం' అనే బీజాక్షరం అవుతుంది. మనకు తెలియకుండానే ఇందులో బీజశక్తి నిక్షిప్తమై ఉంది.

శ్రీమాతా అన్నప్పుడు శ్రీం కలిసింది. 'శ్రీమహారాజ్ఞీ', 'శ్రీమత్సింహాసనేశ్వరీ' అన్నప్పుడు కూడా 'శ్రీం' ఉంది. 'మ'లో 'మ్' ఉంది. మొదటి శ్లోకపాదం అన్నప్పుడు మనకు తెలియకుండానే మూడుమార్లు 'శ్రీం' బీజం పలుకుతున్నాం. ఆ తల్లే ముగురమ్మల మూలపుటమ్మ. అందుకే 'శ్రీం' లో మూడూ ఉన్నాయి. శ్రీతో వచ్చే నామాలు మూడున్నాయి. శ్రీకారం లక్ష్మి, సరస్వతి, దుర్గలు ముగ్గురికి సరిపోతుంది. శ్రీమహారాజ్ఞీలో ఎక్కువ బీజశక్తి నిక్షిప్తమై ఉన్నది. 'శ్రీం-అ-హ' మూడు ఉన్నాయి. ఇక్కడ మాతృకావర్ణ శక్తి పెట్టారు. అక్షరాలలో మొదటిది అ. చివరది హ. ఇది అమ్మవారి అద్భుతమైన విద్య.

అహమిత్యేవ విభావయే భవానీం– ఇక్కడ 'అహం' అంటే నేను అనే అర్థం కాదు. అ–హం అనే ఒక మహామంత్రశక్తి. అ–హ– నాదం ఇస్తే హం అయ్యింది 'అహం'. శ్రీం–అ–హ–రాజ్ఞీ – శ్రీమహారాజ్ఞీ.

అ–సృష్టి ఆది. హ–దాని స్పందన శక్తి. 'అ'కార 'హ'కారాలకు చాలా విశేషాలున్నాయి. 'అ'కారం ఈశ్వరుడు, దాని శక్తే 'హ' కారం. ఎవరైతే శ్రీయో, 'అ' కార, 'హ' కార రూపిణియై సమస్త మాతృకావర్ణరూపిణియై ఉన్నదో అటువంటి రాణి.

3. శ్రీమత్సింహాసనేశ్వరీ – శ్రీమత్సింహాసనేశ్వర్యై నమః

అమ్మవారు ఉండే సింహాసనం పేరు శ్రీమత్సింహాసనం. శ్రీమంతమైన సింహాసనపు ఈశ్వరి. సింహాసనమంటే అధికార ఆసనం. సాధారణంగా రాణి సింహాసనంపై కూర్చుని ఆజ్ఞలు జారీచేస్తే ప్రతివారు పాటించాల్సిందే. రాజుగారు రాజధాని నగరంలో సభాభవనంలో గల సింహాసనంపై కూర్చొని పాలన చెయ్యాలి, అమ్మవారు సర్వానికి పాలకురాలు కాబట్టి ప్రతివారి హృదయంలో తిష్ఠవేసుకుని ప్రతివారిని పరిపాలిస్తుంది. ఠీవిగా కూర్చునే ఆసనాన్నే సింహాసనం అంటారు.

సింహం అంటే శ్రేష్ఠత్వమని మరొక అర్థం. పురుషసింహమని అంటూ ఉంటారు. దానికి అందరి కన్నా గొప్పవాడని అర్థం. సింహానికి మృగరాజు అని పేరు. జంతువులన్నింటిలో గొప్పది. **'మృగాణాం చ మృగేంద్రోహం'** – అని పరమాత్మ గీతలో చెప్పారు. సింహం అంటేనే శ్రేష్ఠవాచకం.

అమ్మవారు శ్రేష్ఠమైన ఆసనం మీద కూర్చుని అధికారం చేస్తున్నారు. మన శరీరమంతా పాలిస్తూ అమ్మవారు మన హృదయమనే శ్రేష్ఠమైన ఆసనంలో కూర్చుని ఉన్నారు. శ్రీమంతమైన ఆసనం.

శ్రీ అనగా శక్తి అని అర్థం చెప్పుకున్నాం. శ్రీ అనగా చైతన్యమని మరొక అర్థం. శక్తి అనగా చైతన్యమే. ఆవిడ చిచ్ఛక్తి కాబట్టి ఆ చైతన్యమే శ్రీ. శ్రీ అంటే పూజ్యులు, గొప్పవారని కూడా అర్థం ఉంది. శ్రీమాతా అనగా పూజ్యురాలైన తల్లి

అని అర్థం. అందరిచేత పూజింపబడే తల్లి. **'శరణ్యే లోకానాం'** అని శంకర భగవత్పాదులు అన్నారు. సర్వలోకానికి శరణ్యం. అదే మహామంత్రంలోకి వెళితే...

సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధకే

శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోస్తుతే

ఇక్కడ 'శరణ్యే' - అందరికీ దిక్కైన తల్లి. నాకు కాదు అని ఎవరైనా అనుకుంటే అది వారి అజ్ఞానం.

ఒకాయన అందరూ ఎక్కడ కూర్చున్నారని అడిగితే, నేలమీద కూర్చున్నాం అని ఒక వ్యక్తి చెప్తే, మరొకాయన లేచి నేను నేలమీద కూర్చోలేదు కుర్చీలో కూర్చున్నాను అన్నాడు. ఆయన కూడా నేలమీదే ఉన్నాడు. ఎలాగైతే నేను కుర్చీలో కూర్చున్నా, నేను నేలమీద కూర్చున్నానని చెప్పినా - వారందరూ నేల మీదే ఉన్నారో, అలా ఎవరు మర్చిపోయినా అందరూ అమ్మని ఆశ్రయించే ఉన్నారు.

అమ్మవారే అందరికి ఆధారశక్తి. అందుకే ఋషులచేత, దేవతలచేత, అందరిచేత పూజింపబడుతోంది. 'శ్రీమాతా' అంటే గొప్ప తల్లి. ఈ లోకంలో ఒకొక్క జన్మకి ఒకొక్క తల్లి. కానీ ఈ తల్లి మాత్రం మనం ఎన్ని జన్మలు ఎత్తినా మారకుండా ఉంది. అసలు మనం ఏ జన్మ ఎత్తాలో చూసుకుంటుంది. చివరకి మనకి జన్మ లేకపోయినా ఆవిడే తల్లి. జన్మించినా, జన్మించకపోయినా మనం ఉంటాం. మనం ఉన్నప్పుడు ఆవిడ ఉంది. ఆవిడ లేకపోతే మనం లేము. లోకంలో తల్లులు ఈ శరీరానికి కర్తలు. అది కొంతమేరకు మాత్రమే. జగన్మాత ఎప్పుడూ అధికారిణి "అమ్మా! ఎందరు తల్లుల కడుపులో పడి ఎన్ని జఠరవేదనలు పడ్డానోగాని అసలైన తల్లివి నిన్ను మర్చిపోయానమ్మా! ఇప్పటికి నువ్వు తల్లివని తెలుసుకున్నాను". ఎప్పుడైతే అసలు అమ్మని తెలుసుకుంటామో మరి జఠరవేదన ఉండదు. అసలు అమ్మని తెలుసుకోలేనంత వరకూ అమ్మలు మారుతూ ఉంటారు. **'అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాలపెద్దమ్మ'** అని పోతనగారు చెప్పారు.

'సింహాసనేశ్వరీమంత్ర'మనే విద్య ఉంది. శ్రీచక్రరాజ - సింహాసనేశ్వరి. శ్రీచక్రమనే సింహాసనం మీద కూర్చుని లోకాలని పాలిస్తోంది. శ్రీమత్సింహాసనము

అనగా శ్రీచక్రం. ఆసనము అంటే కూర్చునే చోటు, ఉండే చోటు. ఆవిడ ఉండే చోట్లన్నీ గొప్పవే లేదా ఆవిడ కూర్చుంటే అది గొప్పది అవుతుంది. సింహాసనం అంటే గొప్పదైన ఆసనం. ఆవిడ మన హృదయమనే సింహాసనంలో కూర్చోకపోతే మన బ్రతుకు నడవదు. ఆవిడ గురించి వివేచన చెయ్యడం మొదలుపెట్టాలి. వివేచన చెయ్యడమే లలితాసహస్రనామాలు తెలుసుకోవడం. అలా వివేచన చేస్తే ఆవిడ తప్ప మరొకటి లేదనే జ్ఞానం కలుగుతుంది.

సింహాసనేశ్వరీలో విశేషం చూస్తే అమ్మవారి ఆసనాలు మొత్తం ఐదు ఉన్నాయి. ఐదులో మళ్ళీ ఒకొక్కటి ఐదు చొప్పున ఉన్నాయి.

పంచప్రణవాసన – ఐదు ప్రణవాలు – అమ్మవారి ఆసనం. ఐంకారం, హ్రీంకారం, శ్రీంకారం, క్లీంకారం, సౌః. ఈ ఐదింటిని అమ్మవారి ప్రణవాలంటారు. అర్థం కావడంకోసం చెప్పడం జరుగుతోంది కానీ ఇవి గురుముఖతః తెలుసుకోవలసినవే. **'యా పంచ ప్రణవద్విరేఫనళినీ'** అని రాజరాజేశ్వరీస్తోత్రంలో వస్తుంది. ఈ పంచప్రణవాలలో వ్యాపించింది ఆవిడే.

పంచదిగాసనా – ఐదు దిక్కులలో ఆవిడ ఉంది. నాలుగు దిక్కులు, ఊర్ధ్వదిశ. పంచబ్రహ్మాసనం అంటే ఇదే. అమ్మవారు బల్లమీద కూర్చుంటారు. నాలుగు కొయ్యలు, మధ్యలో బల్ల. ఇదే పంచదిగాసనా.

పంచభూతాలు – ఇవి కూడా ఆవిడ ఆసనాలే. ఆవిడ లేకపోతే పంచభూతాల్లో ఏవీ పని చెయ్యలేవు. అగ్నిలో శక్తి వేడిగా, వెలుగుగా వస్తోంది. వాయువులో శక్తి వీచడంగా, ప్రాణంగా వస్తోంది. అలా ఒకొక్కదాంట్లో శక్తి ఒకొక్క రకంగా ప్రకటింపబడుతున్నా శక్తి మాత్రం ఒక్కటే.

పంచబ్రహ్మాసనా – పంచబ్రహ్మలు –బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివ. వీరు ఏ పని చెయ్యకుండా ఉన్నప్పుడు పంచప్రేతాసనా. ఈ శక్తి ప్రవేశిస్తే వాళ్ళు పంచబ్రహ్మలు అవుతారు.

పంచకళాసనా – నివృత్తి, ప్రతిష్ఠ, విద్య, శాంతి, శాంత్యతీత అనే కళలు. ఇవి లలితాసహస్రంలో 'షడధ్వాతీతరూపిణీ' దగ్గర వస్తాయి. అక్కడ మరింతగా

వివరింపబడుతుంది. పంచప్రణవాసనా, పంచకళాసనా, పంచదిగాసనా, పంచ భూతాసనా, పంచబ్రహ్మాసనా..... ఇవన్నీ అమ్మవారి (పంచ) సింహాసనాలు. అమ్మవారు కూర్చోగానే ఇవన్నీ శ్రీమంతములు అనగా చైతన్యవంతాలు అవుతున్నాయి. ఈ ఐదింటితో కూడిన శ్రీమత్సింహాసనమునందు కూర్చొని ప్రపంచాన్ని పాలిస్తోంది కనుక **'శ్రీమత్సింహాసనేశ్వరీ'.** ఇప్పటివరకూ చెప్పబడింది అమ్మవారి నిత్యస్వరూపం. ఎప్పుడూ ఉండేది ఈవిడే. సృష్టి, స్థితి, లయకారిణి అనేది మూడు నామాలకు సమష్టి అర్థం. అలాంటి అమ్మవారి వల్లే ప్రపంచం నడుస్తోంది. **సింహమారుహ్య కన్యాత్వే నిహతో మహిషోఽనయా, మహిషఘ్నీ తతో దేవీ తథా సింహాసనేశ్వరీ** (దేవీపురాణం). సింహాన్ని ఎక్కి మహిషాసురుని సంహరించినది 'సింహాసనేశ్వరి'.

04. చిదగ్నికుండసమ్భూతా – శ్రీ చిదగ్నికుండసమ్భూతాయై నమః

కొందరు ప్రపంచం ఎవరి వల్ల నడుస్తోందో ఆ శక్తిని తెలుసుకోలేక తమ మానాన తాము నడుస్తూ అజ్ఞానంలో పడిపోతూ ఉంటే, కొంతమంది యోగ్యులు మాత్రం అజ్ఞానంలో పడిపోతున్నామని తెలుసుకుని బయటపడే ప్రయత్నంలో మంచిపనులు చేస్తూ ఉంటారు. వీరి వల్ల వారికి, లోకానికి కూడా మంచిది. వీరిని మంచివారు అంటారు.

కొందరు అజ్ఞానంలో ఉంటూ జ్ఞానం తెలుసుకుందామని ప్రయత్నం కూడా చెయ్యకుండా మంచితనాలు, ధర్మాలు ఇవేం లేవని అధర్మంగా ప్రవర్తిస్తారు. కొందరు అలా ప్రవర్తించడం వారికి ప్రమాదం. కొందరు అధర్మంగా ప్రవర్తిస్తే ప్రక్కవానికి నష్టం. కొంతమంది అధర్మంగా ప్రవర్తిస్తే ప్రపంచానికి నష్టం. అలా ప్రపంచానికి నష్టంగా, అధర్మంగా ప్రవర్తించే జాతిని రాక్షసజాతి అంటారు. అలాంటివారు ఎక్కువైతే మంచిగా ఉన్నవారికి బలం చాలదు. అప్పుడు ప్రపంచం నడవదు.

లోకంలో ధర్మప్రవర్తనతో ఉండేవారు అమ్మని ప్రార్థిస్తూ, "తల్లీ! నువ్విచ్చిన శక్తితో పని చేస్తూ నిన్ను తెలుసుకోకుండా అధర్మంగా ప్రవర్తించే వారి వల్ల మేము బాధ పడుతున్నాం. నువ్విచ్చిన శక్తితో మేం వారిని ఎదుర్కొంటున్నా, మా శక్తి చాలక

వారి ముందు ఓడిపోతున్నాం. మా మంచితనం దెబ్బతింటోందమ్మా! నువ్వు రా!" అని అడుగుతారు.

మనం మంచి చేద్దామన్నా ఏదో ఒక చెడు బయట నుండో, లోపల నుండో వస్తూ ఉంటుంది. అది పోగొట్టుకోవాలంటే ఎవరైతే 'శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ'గా ఉన్నారో, ఆ తల్లినే ఆశ్రయించాలి. ఎవరు పిలిచినా వారికోసం అమ్మ వస్తుంది. కానీ పిలవాలనే బుద్ధి అందరికీ పుట్టదు.

అమ్మవారిని పిలవాలని, ఆశ్రయించాలని, అమ్మ గురించి తెలుసుకోవాలనే బుద్ధి, అర్థం చేసుకోవాలనే బుద్ధి కలగాలంటే దైవీయసంస్కారం, దైవీగుణాలు ఉండాలి. వాటితో అమ్మని ఆశ్రయిస్తే, ఆ పనులను చక్కబెట్టడం కోసం, వారిని కాపాడడం కోసం అమ్మవారు వస్తుంది. నిత్యగా ఉన్న తల్లి ఇప్పుడు వస్తుంది. ఉందంటే శక్తిగా ఉంది. ఉన్నశక్తి కనబడట్లేదు కానీ మనల్ని అనుగ్రహించడం కోసం, కనిపించి మరీ వస్తుంది. దైవీగుణం ఉన్నవారు... వారు బాగుపడుతూ, ఎదుటివారిని కూడా బాగుచేస్తారు. అది ఉంటే వారికోసం ఆవిడ వస్తుంది. ఏదో కొద్ది కొద్దిగా రావడం కాదు. సూర్యుడు సగం వచ్చి, సగం రాకుండా ఉంటే ఎలా ఉంటుంది? బాగా రావాలి. **'సమ్-ఉద్యతా'** సంపూర్ణంగా... ఎవరికోసం వస్తుంది? 'దేవకార్యసముద్యతా'.

అమ్మ ఎలా వస్తుంది? దాని కోసం ఒక కుండం రగల్చాలి. సాధన చెయ్యాలి. నేను చాలా మంచివాడిని అన్నంత మాత్రాన అమ్మవారు రారు. మంచివారైతే సాధన చెయ్యాలి. సాధన ఎంత చెయ్యాలని కొందరు అడుగుతూ ఉంటారు. లలితాసహస్రం చదవమని చెప్తే ఎన్నిరోజులు చదవాలని వెంటనే అడుగుతారు. ఎన్ని రోజులు అని అడిగారంటే ఎప్పుడాపేయాలా అని అడగడమే. సాధన ఎంతవరకు చెయ్యాలని అడగకూడదు. ఫలితం లభించే వరకు చెయ్యాలి. ఈ జన్మలో వస్తుందంటారా! రాకపోతే మరొకజన్మ ఎత్తి సాధన చెయ్యాలి. అంతవరకు చేస్తూ ఉండాలి. యజ్ఞానికి ముందు రెండు కర్రలు మథనం చెయ్యి అన్నారు. రెండిటిని కలిపినంత మాత్రాన అగ్ని పుట్టదు. యజ్ఞంలో అగ్ని పుట్టేవరకు అరణి మథనం చెయ్యాలి. మథనం చేస్తే అగ్ని పుడుతుంది. ఆ అగ్నినుండి శక్తి పుడుతుంది. అలా మథనం చెయ్యగలిగితే, ఆ

మథనం చిదగ్నికుండం అవుతుంది. అందునుండి అమ్మవారు ఆవిర్భవిస్తారు. **'చిదగ్నికుండసంభూతా'... 'దేవకార్యసముద్యతా'.**

'శ్రీమాతా, శ్రీమహారాజ్ఞీ, శ్రీమత్సింహాసనేశ్వరీ' రూపంలో అమ్మవారు ఎప్పుడూ ఉన్నారు. మాతా, మహారాజ్ఞీ, సింహాసనేశ్వరీగా ఉన్న ఆవిడ ఎప్పుడూ శ్రీ. ఆ శ్రీని ఆవిష్కరింపజేసుకోవాలంటే మథనం చెయ్యాలి. అప్పుడు పుట్టే అగ్ని పేరే చిదగ్ని. ఆ అగ్ని పంచభూతాలలో ఒకటి కాదు. పంచభూతాలకి మించినది. పంచభూతాలలోదైతే సాధారణ అగ్ని. దానికి అతీతమైనది కనుక **'చిదగ్నికుండ సంభూతా'.**

ఆవిడ ఉద్భవిస్తే.... దేవకార్యసముద్యతా. దేవకార్యమంతా చక్కబెడతారు. ఇందులో అమ్మవారి యొక్క లీలావైభవం ముందుగా తెలుసుకోవాలి.

లీలా వైభవం : భండాసురుడు అనే రాక్షసుడు తన ఇద్దరి తమ్ముళ్ళు విశుక్రవిషంగులతో కలసి ముల్లోకాలు ఆక్రమించి అందరిని నీరసుల్ని చేశాడు. త్రిలోకవాసులకీ ఇంద్రియాలు ఉన్నా, పనిచెయ్యడం మానేశాయి. మొత్తం నీరసం. లోపల ఉన్న శక్తంతా వాడు లాగివేశాడు. అదొక చిత్రమైన దాడి.

మిగిలిన రాక్షసులు అయితే కొట్టారు, బాదారు. వీడు మొత్తం రసం లాగేశాడు. దాంతో వారికి ఏం చేయాలో తెలియలేదు. అందరూ ఎండిపోయారు. దేవతలంతా వెళ్ళి బ్రహ్మని ఆశ్రయిస్తే, ఇంచుమించు నా పరిస్థితి కూడా అలాగే ఉంది అన్నాడు. వారందరూ వెళ్ళి పరమేశ్వరుని ఆశ్రయించారు. అప్పుడు పరమేశ్వరుడు, 'నేనొక యజ్ఞం చేస్తాను. దానిలో మీరంతా దేహత్యాగం చెయ్యాల'న్నాడు. కాపాడండి బాబూ! అంటే యజ్ఞం చేస్తాను హోమగుండంలో దూకమంటే ఎవరు ఒప్పుకుంటారు! కాని దేవతలు దూకారు. గురువుగారు దూకమంటే దూకాల్సిందే. ప్రశ్న వెయ్యకూడదు. 'శివాయ గురవే నమః'.

ఆయనను ఆశ్రయించారు. ఆ పరమేశ్వరుడే ఆచార్యుడు. ఆయన ఒక సముద్రం మొత్తం ఎండగట్టాడు. హోమగుండం ఒక యోజనం తయారుచేశాడు. ఆ హోమగుండంలో అంతవరకూ ఎండిపోయిన చెట్లన్నీ పడవేశాడు. పరమేశ్వరుడు

ఒక్కసారి ధ్యానం చేసి తన మూలాధారం నుండి అగ్ని రగిల్చాడు. తన శక్తిని తానే జాగృతం చేసి, ఆ శక్తిని ఒకొక్క చక్రం దాటించి, రగిల్చిన అగ్నిని ఆజ్ఞాచక్రం(ఫాలనేత్రం) నుండి తీసి హోమగుండంలో వేశాడు. ఆ అగ్ని లౌకిక అగ్ని కాదు కనుక 'చిదగ్ని' అని దానికొక పేరు పెట్టారు. ఈ చిదగ్నికుండం రగిల్చి అందులో ముందు వెయ్యాల్సిన ఆహుతులన్నీ వేసి పూర్ణాహుతి సమయంలో పూర్ణం ఆహుతి అవ్వాలి కనుక, 'మమ్మలి ఏం చేయమంటార'ని దేవతలు అడిగితే, ఒకొక్కర్ని 'అందులో దూకండి. దానికి తప్ప ఇప్పుడు ఎండిపోయిన మీ శరీరాలు మరి దేనికి పనికిరావు' అన్నాడు.

మొత్తం దేవతలందరూ దూకారు. దూకగానే 'సంతోషం! పూర్ణాహుతి అయిపోయింద'ని పరమేశ్వరుడు లేచి జగదంబని ప్రార్థన చేశాడు. ప్రార్థన చెయ్యగానే అందులోనుండి 'చిదగ్నికుండసంభూత'గా ఆవిడ ఆవిర్భవించింది. ఆ తల్లి కొత్తగా రాలేదు. అదే ప్రారంభమైతే మొదటినామం 'చిదగ్నికుండసంభూతా' కావాలి. ఎప్పుడూ 'శ్రీమాతా', 'శ్రీమహారాజ్ఞీ', 'శ్రీమత్సింహాసనేశ్వరీ' గా ఉన్న దేవి అనుగ్రహించడానికి ఇప్పుడు చిదగ్నికుండం నుండి వచ్చింది. పోనీ వీరందరూ మంటపెట్టుకుని దూకేస్తే రాదు. గురువుగారు మంట పెట్టాలి. దూకమని చెప్పాలి.

తాత్త్వికార్థం

గురువు జ్ఞానాగ్ని రగల్చాలి. ఆయన ఇచ్చేదే జ్ఞానాగ్ని. అది రగలాలి. అలా రగలగానే ఇంతకాలం ఇంద్రియాలతో నేను చేస్తున్నాననే అజ్ఞానం తొలగిపోతుంది. నేను అనే అహంకారం – 'నేను చూశాను, నేను విన్నాను, నేను నడిచా...' ఈ నేను, ఒకొక్క ఇంద్రియంలో అహంకారంగా ఉంది. ఇంద్రియశక్తులే దేవతలు. ఇంతకాలం అవి నావి అని విర్రవీగాయి. ఇప్పుడు గురువుగారు వచ్చి జ్ఞానాగ్ని రగిల్చితే తెలిసొచ్చింది. "మీ అహంకారమంతా దీనిలో తగలబెట్టండి", అన్నారంటే అర్థం – జ్ఞానాగ్నిలో అనగా విచారణవల్ల రగిలిన అగ్నిలో నేను అనే అజ్ఞానాన్ని దహనం చెయ్యాలి.

దేవతలు తమని తాము సమర్పించుకున్నారంటే, ఈ ఇంద్రియాలు ఏవీ

తమంత తాము పని చెయ్యడం లేదు. అఖండమైన ఆ చిచ్ఛక్తివల్లే పని చేస్తున్నాయని ఎరుక కలగాలి. **గురుకృప వల్ల రగిలిన జ్ఞానమనబడే అగ్నియందు అహంకారములన్నీ వ్రేల్చబడితే, అప్పుడు మనలో ఉన్న అమ్మవారు మనకి సాక్షాత్కరిస్తుంది.** ఇది దీని యొక్క అసలైన అర్థం. ఇది మనకి అర్థం కావడం కోసం కథగా తెలియజేశారు.

దేవతలు వెళ్ళారు! ఇది చేశారు, అది చేశారు అని చెప్పడం అర్థం చేసుకోలేని వారి కోసం. కానీ ఎప్పటికైనా అర్థం చేసుకోవలసింది ఇదే. లేకపోతే "ఎప్పుడో భండాసుర సంహారం కోసం యజ్ఞం చేస్తే మేమిప్పుడు ఎందుకు చదవాలండి" అంటారు. ఎందుకంటే భండాసురుడు ఇంకా చావలేదు. లోపల సిద్ధంగా ఉన్నాడు కనుక మళ్ళీ చెయ్యాలి. అగ్ని ఎలా రగులుతుందంటే, శ్రీవిద్యాశాస్త్రం చెప్తూ **'అంతర్నిరంతరమనింధన మేధమానే మోహాంధకార పరిపంథిని సంవిదగ్నౌ'** అన్నది. చిదగ్నిని **సంవిత్ అగ్ని** అంటారు. చిదగ్ని ప్రతివారిలో లోపల కుండలినీ రూపంలో రగులుతూ ఉంటుంది. యోగపరంగా దీనిని కుండలినీ అంటారు. వేదాంతపరంగా దీనినే జ్ఞానం అంటారు. అలాంటి అగ్ని రగిలితే **'మోహాంధకార పరిపంథిని'** – అజ్ఞానమనే అంధకారం పోగొడుతుంది.

అగ్ని వల్ల రెండు ఉపయోగాలు ఉన్నాయి. వెలుగు, వేడిమి. వేడిమి తగలబెడుతుంది. వెలుగు వెలగబడుతుంది. మనకి ఇష్టమైతే వెలగబెట్టడం. ఇష్టం లేకపోతే తగలబెట్టడం. వద్దన్నా రెండూ చేస్తుంది. మనకున్న అజ్ఞానాన్ని తగులబెట్టి, జ్ఞానాన్ని వెలగబెట్టాలి. వెలగబెట్టడం, తగులబెట్టడం రెండూ చేయగలదు 'శ్రీమాత'.

'అంతర్నిరంతరమనింధన మేధమానే' లోపల నిరంతరం సాధన ద్వారా మథనం చెయ్యగా, అగ్ని రగులుతుంది. అది ఇంధనం లేని అగ్ని. ఈ సాధనకి ఒక జీవితం చాలదు. అంత సాధన చేస్తే లోపల ఒకసారి రగులుతుంది. ఎప్పుడు రగులుతుందో తెలియదు.

బృందావనంలో దేవహరాబాబా అని ఒక యోగీశ్వరుడు ఉండేవారు. ఆయన తన దగ్గరకి వచ్చేవారితో, "నీ దగ్గర మనస్సు అనే కర్ర ఉంది. దాన్ని 'రామ' నామమనే మరొక కర్రతో బాగా మథనం చెయ్యి. అలా మథనం చేస్తే అగ్ని పుడుతుంది.

అది ఆ రెండుకర్రల్ని తగలబెట్టేస్తుంది. నామాన్ని తీసేస్తుంది. మనస్సుని తీసేస్తుంది. రామమనే బ్రహ్మాన్ని మాత్రం మిగుల్చుతుంది. విచారణతో సాధన చెయ్య"మని చెప్పేవారు.

పతంజలి యోగసూత్రాలలో "**సతు దీర్ఘకాల నైరంతర్య సత్కారాసేవితా దృఢభూమిః**" అని చెప్పాడు. అంతగా సాధన చెయ్యాలి. నిరంతర మథనం చేస్తేనే అది రగులుతుంది. ఆ రగిలిన అగ్నిలో ఆవిడ ఉంటారు. అగ్నినుండి పుట్టడం కాదు. అగ్నినుండి పుట్టే వేడి, వెలుగు ఆవిడే. '**జ్ఞానాగ్నిస్సర్వకర్మాణి భస్మసాత్కురుతేఽర్జున**' (గీత). సర్వకర్మలను దగ్ధం చేసే జ్ఞానాగ్నియే చిదగ్ని. జ్ఞానాగ్ని నుండి ఉత్పన్నమయ్యే బ్రహ్మవిద్యయే చిదగ్నికుండసంభూత.

చిత్- అనగా పరమాత్మ. అగ్ని అనగా ముందు ఉన్నది అని అర్థం. జ్ఞానరూపంలో సృష్టికి మొదలే ఉంది చిదగ్ని. ఆ చిదగ్ని అనబడే కుండంలో ఆవిడ ఉద్భవిస్తుంది. పరబ్రహ్మ యందు వ్యక్తమైన శక్తి 'చిదగ్నికుండసంభూతా'. ఆ శక్తే దేవతలందరిలో ప్రసరించింది. ఇప్పుడు అమ్మవారు చేసిన పని- తాను ఆవిర్భవించి, తన యందు ముందు పడిపోయిన దేవతలందరిని తన నుండి సృజించింది. అదే '**దేవకార్యసముద్యతా**'.

5. దేవకార్యసముద్యతా - శ్రీ దేవకార్యసముద్యతాయై నమః

చిదగ్నిలో దుమికిన బ్రహ్మ, ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు మొదలుగా గల సర్వదేవతలను మరల '**చిదగ్నికుండసంభూతా**' అయిన అమ్మవారే సృజించారు. చిదగ్నిలో పడకముందు వాళ్ళ శరీరాలను భండాసురుడు పీల్చిపిప్పి చేసేశాడు. అందరూ ఎండిపోయి ఉన్నారు. ఇప్పుడు వచ్చిన శరీరాలు చాలా దివ్యంగా, గొప్పగా, పుష్టిగా ఉన్నాయి. ఆవిడలోంచి వచ్చాయి కనుక ఒకొక్కటి అంత శక్తిమంతమయ్యాయి. అసలు శక్తి ఆవిడే అని తెలుసుకున్నారు. వారి అహంకారం వదిలింది. అమ్మవారు దేవతలతో, 'మీ పని నేను చూస్తాను. మీరు హాయిగా ఉండండ'ని చెప్పి '**దేవకార్యసముద్యతా**' అయ్యింది. దేవకార్యం కోసం ఆవిర్భవించిన తల్లి.

దేవకార్యమనగా లోకరక్షణే. లోకరక్షణ కోసం మహాశంభువు చేసిన మహాయాగంలో చిదగ్నికుండంలోంచి ఆవిర్భవించింది కనుక **'చిదగ్నికుండసంభూతా' - 'దేవకార్యసముద్యతా'**. సముద్యతా అన్నప్పుడు 'సంపూర్ణంగా ఉదయించింది' అని అర్థం - అనగా అన్ని కళలతో పరిపూర్ణంగా ఉద్భవించింది.

'చిచ్ఛక్తిః పరమేశ్వరస్య విమలా చైతన్యమేవోచ్యతే' అని శాస్త్రం. చిదగ్ని అంటే చిచ్ఛక్తి. **'అగ్రే నియతి ఇతి అగ్నిః'** ముందు ఉండేది కనుక అగ్ని. పరమేశ్వరునికి అగ్ని అని పేరు. ఆ పేరు పంచభూతాల్లో అగ్నికి కూడా పెట్టబడింది. **'అగ్ని మీళే పురోహితం'** అనే మొదటి మంత్రమే పరమేశ్వరునిది. అగ్ని అనగా ఆయనే. చిదగ్ని అనగా పరబ్రహ్మ. పరబ్రహ్మ నుండి వ్యక్తమైన శక్తి **'చిదగ్నికుండసంభూతా'.** దేవకార్యం అనగా లోకనిర్వహణ కోసం వ్యక్తమయ్యింది కాబట్టి **'దేవకార్యసముద్యతా'.**

భాష్యకారులు ఇంకో అద్భుతమైన మాట చెప్పారు. దేవః అంటే ఈశ్వరుడు. దేవాః అంటే దేవతలు. బహువచనంలో దేవతలు. ఏకవచనంలో ఈశ్వరుడు. **'ఏకో దేవః సర్వభూతేషు గూఢః'** అని శ్వేతాశ్వతరోపనిషత్తు. కనుక దేవః అంటే పరమేశ్వరః. **'పరమేశ్వరస్య కార్య సిద్ధ్యర్థం సముద్యతా - దేవకార్యసముద్యతా'.** పరమేశ్వరుని కార్యం కోసం పరబ్రహ్మ నుండి వచ్చిన శక్తి. సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అనుగ్రహాలు ఈ ఐదు పరమేశ్వరుని పనులు. ఆయన అయిదూ చేయాలంటే ఆయనలోంచి అయిదురకాలుగా శక్తి రావాలి. సృష్ట్యాదియందు చిచ్ఛక్తి అయిన తల్లి చిదగ్ని స్వరూపుడైన పరమేశ్వరుని నుండే వ్యక్తమై ఈ దేవకార్యం అనగా ఈశ్వరకార్యమైన సృష్టి, స్థితి, లయలు చేయడం కోసం వచ్చింది - ఇదొక అర్థం.

ఒకవైపు కథ, మరొక వైపు పరమార్థం కనబడుతుంది. పరిశీలిస్తే అమ్మవారు **'దేవకార్యసముద్యత'**గా ఉద్భవించి బయటకి వచ్చినప్పుడు ఎలా కనబడుతోందో తరువాత నామంలో చెప్తున్నారు.

6. ఉద్యద్భానుసహస్రాభా - శ్రీఉద్యద్భానుసహస్రాభాయై నమః

ఆ చిద్రూప అగ్నిహోత్రంలో ముందుగా ఒక వెలుగుపుంజం కనబడింది.

భగవంతుడు సాక్షాత్కరించినపుడు ఎలా ఉంటుందో యోగులు మాత్రమే వర్ణించగలరు. పురాణాలన్నీ ఏమని వర్ణిస్తున్నాయంటే-ఏ రూపం లేని పరమాత్మ ముందు కాంతిపుంజంగా గోచరిస్తాడు. అది నిరాకారతత్త్వానికి సంకేతం. తరువాత ఒక సాకారరూపం తీసుకుంటుంది.

'ద్వే బ్రహ్మణి వేదితవ్యే మూర్తం చ అమూర్తం చ' – మూర్తం, అమూర్తం అని బ్రహ్మమునకు రెండు విధాలైన తత్త్వాలు ఉన్నాయని శాస్త్రం. అంతవరకూ అమూర్తమైన పరమాత్మశక్తి, ఇప్పుడు మూర్తమంతం అవ్వడం కోసం ముందు జ్యోతిః పుంజంగా కనబడింది. ఆ జ్యోతిఃపుంజం క్రమంగా రూపం ధరిస్తోంది. ఆ జ్యోతి ఎలా ఉందో వర్ణిస్తూ 'ఉద్యద్భానుసహస్రాభా' – ఉదయిస్తున్న వేలకొలది సూర్యులు ఒక దగ్గర ఉంటే ఎలా ఉంటారో అలా ఉంది.

అమ్మవారు ఉదయించినప్పుడు వచ్చిన ఎర్రదనం పోల్చిచూసి చెప్పాలంటే ఒక సూర్యుడు చాలడు వేలకొలది సూర్యులు కావాలి. ఇక్కడ సహస్రం అనంతవాచి.

ఉదయిస్తున్న అనంతసూర్యులు ఒకచోట ఉంటే ఎలా ఉంటుందో అలా ఉంది అమ్మవారు. ఉదయిస్తున్న సూర్యుడని చెప్పడంలో ఎర్రగా ఉందని చెప్పడం. వేలకొలది సూర్యులు అని చెప్పడంలో అర్థం విజ్ఞానశాస్త్రం ప్రకారం చూసినా లెక్కలేనన్ని సూర్యులు ప్రపంచంలో ఉన్నారు. అందరి సూర్యులకు వెలుగుని, శక్తిని ఇచ్చే అమ్మవారు మాత్రం ఒక్కరే.

అవిద్యానామంతస్తిమిర మిహిర ద్వీపనగరీ
జడానాం చైతన్యస్తబక మకరందస్రుతిఝరీ

వేలకొలది సూర్యులకు కూడా వెలుగును ఇచ్చిన తల్లి. అంత కాంతితో వచ్చింది. దీనిలో ఉద్దేశం మన కంటికి ఒక సూర్యుడు కనబడుతున్నాడు. వేలకొలది సూర్యుల కాంతి మన కంటితో చూడలేము. అమ్మవారు మన కంటితో చూడలేని అలౌకిక తేజస్సు అని చెప్పడం కోసం ఇలాంటి వర్ణన చేశారు. అలౌకిక తేజస్స్వరూపంగా ఎర్రగా వచ్చింది.

ఎప్పుడైనా చీకటిలో ఉన్నప్పుడు ఒక్కసారి కాంతి రాగానే, ఆ వెలుగుకి

కళ్ళు చెదిరిపోతాయి. కొంత సమయం గడిచాక ఆ వెలుగుకి కళ్ళు అలవాటుపడి రూప పరిమాణం కనిపిస్తుంది. అలా దేవతలకి కూడా అమ్మవారు రాగానే రూపం కనబడలేదు. ఆ వెలుగు ముందు కనబడింది. ఆ వెలుగు **'ఉద్యద్భానుసహస్రాభా'**. నెమ్మదిగా దేవతలు అలా అమ్మవారిని చూశారు. అప్పుడు అమ్మరూపం కనబడుతోంది.

7. చతుర్బాహుసమన్వితా – శ్రీ చతుర్బాహుసమన్వితాయై నమః

అలా ఆ ఎర్రని కాంతుల వెలుగు క్రమంగా రూపస్వీకారం చేసింది. అలా అమూర్తం మూర్తం అయ్యింది. నిర్గుణం సగుణం అయ్యింది. నిరాకారం సాకారం అయ్యింది. ఆవిడకి దయపుట్టి అనుగ్రహించాలనుకుంది కనుక సాకారరూపంగా ప్రత్యక్షమవుతోంది. ఎదురుగా అలా చతుర్బాహువులతో మొత్తం దేవతలకి, పరశంభువుకి కూడా కనిపిస్తోంది. తరువాత అమ్మవారి కిరీటవర్ణనకి కొన్ని నామాలు ఉన్నాయి. ముందే చతుర్బాహుసమన్వితా అని ఎందుకు చెప్పారంటే చతుర్బాహు అంటే నాలుగు చేతులే కాదు, చతురస్రం అని అర్థం. లలితోపాఖ్యానం ప్రకారం చూస్తే ముందు కాంతిపుంజం కనబడింది. ఆ కాంతిపుంజంలో ఒక చతురస్రం కనిపించింది.

చతురస్రం అనగా త్రైలోక్యమోహన చక్రం. ముందు శ్రీచక్రంలో మనకు కనబడే ప్రథమావరణ చతురస్రం. దానిలోపల మిగిలిన ఆవరణలన్నీ ఉంటూ మధ్యలో బిందువు ఉంటుంది. చతురస్రంతో కూడిన శ్రీచక్రం అందులో గోచరించింది – అని భావం. **'చతుర్బాహుసమన్వితా'** అంటే శ్రీచక్రస్వరూపిణి. నవావరణలో బిందువు నుండి లెక్కపెడితే చివరది త్రైలోక్యమోహనచక్రం. మొదటి నుండి లెక్కపెడితే తొలుత త్రైలోక్యమోహనచక్రం. ఆరాధన క్రమంలో ముందుగా త్రైలోక్యమోహన చక్రానికే ఆరాధన చేస్తారు. అది చతురస్రం. త్రైలోక్యమోహనచక్రంతో కూడినదంటే మొత్తం శ్రీచక్రం వచ్చింది. 'చతుర్బాహు' అంటే 'త్రైలోక్యమోహనచక్రం'. **'సమన్వితా'** అంటే దానితో కూడిన మిగిలిన ఎనిమిది ఆవరణలు అని అర్థం. నవావరణ శ్రీచక్రం అగ్నికుండంలో గోచరించింది. అంతేకాని నాలుగుచేతుల తల్లి అని మాత్రమే అర్థం

కాదు.

దేవతారూపం ఎలా ఆవిష్కరింపబడిందో జాగ్రత్తగా గమనించాలి. ముందుగా కాంతిపుంజం. ఆ కాంతిపుంజం శ్రీచక్రమయ్యింది. శ్రీచక్రం నుండి అమ్మవారి రూపం వెలికిరాబోతోంది. విగ్రహానికి, ఆ జ్యోతిఃపుంజానికి మధ్యలో యంత్రం ఉంది. విగ్రహం కన్నా యంత్రం సూక్ష్మం. యంత్రం కన్నా సూక్ష్మం జ్యోతిస్సు. విగ్రహంలో యంత్రం, జ్యోతిస్సు రెండూ ఉంటాయి. ఇదో పెద్ద రహస్యం. అమ్మవారి రూపస్వీకారానికి ముందు జ్యోతిఃపుంజం–**'ఉద్యద్భానుసహస్రాభా'.** యంత్రరూపం– **'చతుర్బాహుసమన్వితా'.** చతుర్బాహుసమన్వితా అయిన ఆ తల్లి నాలుగు చేతులలో ఏం ధరించిందో తరువాత నామాల్లో వర్ణిస్తున్నారు.

8. రాగస్వరూపపాశాఢ్యా – శ్రీ రాగస్వరూపపాశాఢ్యాయై నమః,
9. క్రోధాకారాంకుశోజ్జ్వలా – శ్రీ క్రోధాకారాంకుశోజ్జ్వలాయై నమః,
10. మనోరూపేక్షుకోదండా – శ్రీ మనోరూపేక్షుకోదండాయై నమః
11. పంచతన్మాత్రసాయకా – శ్రీ పంచతన్మాత్రసాయకాయై నమః

ఈ నాలుగునామాలు కలిపి అమ్మవారి నాలుగు చేతులలో ఏం ఉన్నాయో చెప్పారు.

1. పాశము. 2.అంకుశం. 3. చెఱకువిల్లు. 4. పువ్వుల బాణాలు. **'మనోరూపేక్షుకోదండా'**– ఇక్షుకోదండం అంటే చెఱకువిల్లు. మనోరూపం అంటే మనస్సు. మనస్సు అనే చెఱకువిల్లుని పట్టుకుంది. **'పంచతన్మాత్రసాయకా'** అంటే ఐదు పువ్వుల బాణాలు పట్టుకుంది. పైన రెండు చేతుల్లో **'రాగస్వరూపపాశాఢ్యా'** – రాగం అనే దానిని పాశముగా పట్టుకున్నారు. **'క్రోధాకారాంకుశోజ్జ్వలా'** – క్రోధాన్ని అంకుశంగా పట్టుకున్నారు.

ఇచ్ఛాశక్తిమయం పాశమంకుశం జ్ఞానరూపిణం. క్రియాశక్తిమయే బాణధనుషీ దధదుజ్జ్వలమ్. పాశం – ఇచ్ఛాశక్తి, అంకుశం – జ్ఞానశక్తి, బాణధనుస్సులు – క్రియాశక్తి అని మరో శాస్త్ర నిర్వచనం.

అమ్మవారి స్వరూపం ప్రకాశ విమర్శరూపం. ప్రకాశం అంటే శివస్వరూపం. విమర్శ శక్తిరూపం. జ్యోతిని ప్రకాశమని, వెలుగుని విమర్శమని అనాలి. విమృశమ్ అంటే వ్యాపించేది. వ్యాపించేదే వెలుగు. జ్యోతి వ్యాపించదు. జ్యోతే వెలుగుగా వ్యాపించింది. జ్యోతి కదలకుండా ఉంది. వెలుగు కదులుతూ ఉంది.

జ్యోతిని 'స్థాణుః స్థిరః' అన్నారు. వెలుగును 'చలన చైతన్య'మంటారు. ప్రకాశ, విమర్శ అనేవి శ్రీవిద్యా ఉపాసనలో వినియోగించే పదాలు. ప్రకాశ, విమర్శ – శివ, శక్తి. ప్రకాశ – శివ. శక్తి–విమర్శ. విమర్శరూపిణీవిద్యా అన్నారు. ఇదే శివశక్తి రూపం. వీరిద్దరిది ఏకరూపమని చెప్పడం జ్యోతికి వెలుగుకి ఎంత ఏకత్వముందో, ప్రకాశానికి విమర్శకి అంత ఏకత్వముందని చెప్పడం. దేవ అనే దానిలో **'ప్రకాశం'** చూపించారు. 'ఉద్యద్భానుసహస్రాభా' అన్నప్పుడు **'విమర్శరూపం'** చూపిస్తున్నారు.

ఇంకా పరిశీలిస్తే మన లోపల ఆత్మచైతన్యం ప్రకాశరూపం. అది మన శరీరమంతా వ్యాపిస్తే విమర్శరూపం. మనలో అమ్మవారిని చూడడం చివరకు రావాలి. మనలో అమ్మవారిని చూస్తే మనమనే అహంకారం ఉండదు. 'అహమిత్యేవ విభావయే భవానీం' అంటే ఇదే. మనలో వ్యాపించిన చైతన్యం నాలుగు చేతులలో పట్టుకుని పనిచేస్తుంది. చేతులతో పట్టుకోవడం అనగా నియంత్రించడం అని అర్థం. ఈ నాలుగు నడిపేది ఆవిడే.

శాస్త్రం వైపు మాత్రమే కాకుండా అనుభవం వైపు వెళ్ళినట్లైతే దీని అర్థం బాగా తెలుస్తుంది. మన జీవితంలో ఉండేవి ఇప్పుడు చెప్పే నాలుగే. పంచతన్మాత్రలు అంటే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు. శబ్దం వినడం, రూపం చూడడం, స్పర్శ తాకడం, రుచి ఆస్వాదించడం, వాసన చూడడం. ఈ ఐదు పొందడానికి ఐదు ఇంద్రియాలు దేవుడిచ్చాడు. ఈ ఐదు అనుభవించాలంటే మరొకటి కలవాలి.. అది మనస్సు. నచ్చే శబ్దం వింటుంటే రాగం ఏర్పడుతుంది. నచ్చని శబ్దం వింటే ద్వేషం ఏర్పడుతుంది. ఒక దాని మీద ప్రీతి–అనుకూల భావం. ఇంకొకదాని మీద అయిష్టత–ప్రతికూలభావం. ఈ ఐదింటిని మనస్సుతో కలుపుకుని అనుభవిస్తూ ఉంటారు. ఈ

అనుభవించినప్పుడు ఇష్టమైనవి పొందితే రాగం. అవి పోకుండా తాడుతో కట్టుకుంటారు. అనుబంధం పెట్టుకుంటారు. రాగం-పాశం అయ్యింది. ఇష్టం లేనిది ఉంటే దాన్ని పొడిచి దూరం చేస్తారు. అదే అంకుశం అయ్యింది.

పంచతన్మాత్రలు, మనస్సు, రాగం, ద్వేషం. ఈ నాలుగే శరీరంలోంచి పనిచేస్తున్నాయి. కానీ ఈ నాలుగు మన లోపల ఒకానొక చైతన్యం ఉంటేనే పనిచేస్తున్నాయి. కాబట్టి మనస్సు, పంచతన్మాత్రలు, రాగం, ద్వేషం... ఇవన్నీ పని చెయ్యడానికి మూలమైన చైతన్యం ఒకటుంది. ఈ చైతన్యం నియంత్రణలో ఇవన్నీ ఉన్నాయి. ఆ నాలుగింటినీ నియంత్రించేందుకు నాలుగుచేతులు ఉండాలి. అదే **'చతుర్బాహుసమన్వితా'.**

మనలోపల ఉన్న 'అహం' రూప చైతన్యమే ఈ నాలుగింటినీ నిర్వహిస్తోంది. మనలోనే కాదు అందరిలోనూ నిర్వహిస్తోంది. ఈ నాలుగు తాను కాక, విలక్షణంగా ఉండే చిద్రూపిణి లలిత. భగవత్పాదులవారు **'త్వయి మయి చాన్యత్రైకో విష్ణుః'** అన్నారు. మీలో నాలో అందరిలో ఉంటూ ఆ తల్లి నిర్వహించే పని ఇది. ఈ నాలుగూ ఆవిడ చేతిలో ఉన్నాయని ఎవరైతే తెలుసుకుంటారో వారికి ఇంక ఏ బాధ లేదు. ముందు అమ్మవారి చేతులనే వర్ణించారు. ఇప్పుడు మళ్ళీ వెలుగును వర్ణిస్తున్నారు.

12. నిజారుణప్రభాపూరమజ్జద్బ్రహ్మాండమండలా

– శ్రీ నిజారుణప్రభాపూరమజ్జద్బ్రహ్మాండమండలాయై నమః

ఇదంతా ఒకే నామం. ఆ తల్లి శరీరం నుండి ఎఱ్ఱని వెలుగులు ఈ ప్రపంచంలోకి ప్రసరిస్తున్నాయి. ప్రతి బ్రహ్మాండం ఆ వెలుగులోనే మునకలు వేస్తున్నది. అనేకమైన బంతులు ఒకచోట పెట్టి దానిపై ఒక కాంతిని ప్రసరింపజేస్తే, ఆ కాంతి అన్నింటిపై ప్రకాశింపబడుతుంది. అలా బ్రహ్మాండాలన్నింటా అమ్మ వెలుగే ఉంది. ఇంతవరకూ దేవతలు అది తెలుసుకోలేదు. ఇప్పుడు తెలుసుకున్నారు. **'నిజ అరుణ ప్రభాపూరమజ్జత్ బ్రహ్మాండ మండలా'** అమ్మ ఎఱ్ఱని వెలుగులనే ప్రవాహంలో బ్రహ్మాండాలు మునకలు వేస్తున్నాయి.

'మజ్జత్' అంటే మునిగిపోవడం. 'పూరము' అనగా ప్రవాహం. 'నిజ అరుణప్రభాపూరము' – వెలుగుల ప్రవాహంలో బ్రహ్మాండాలు మునకలు వేస్తున్నాయి. పంచదారపాకంలో గులాబ్జాములు ఎలా మునకలు వేస్తున్నాయో అమ్మ యొక్క చైతన్యం అనే ప్రవాహంలో బ్రహ్మాండాలు అలా మునకలు వేస్తున్నాయి. ప్రతి బ్రహ్మాండంలోనూ, వెలుపలా అమ్మ చైతన్యమనే రసం నిండి ఉంటుంది.

ఇది ఒక ధ్యానప్రక్రియ. భావన చెయ్యాలి. ఇప్పుడు చెప్పింది అంతా ధ్యానం చెయ్యవచ్చు. ఎదురుగా శివుడు అగ్నికుండం రగిల్చాడు. అమ్మవారు వచ్చారు. నాలుగు చేతులతో కూర్చొని ఉన్నారు. ఆవిడ నుండి ఎఱ్ఱని వెలుగులు వస్తున్నాయి. ఆ వెలుగుల్లో లోకాలన్నీ వెలిగిపోతున్నాయని తెలుసుకుంటున్నారు దేవతలు. **అమ్మ వెలుగే లోకమంతా** అనే జ్ఞానం కలగాలి. లోకాల లోపల, వెలుపల అమ్మవారే వ్యాపించి ఉన్నారు. **'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః'** ఆవిడ లేకపోతే ఏ బ్రహ్మాండానికీ విలువ లేదు.

ఎన్ని బ్రహ్మాండాలు ధ్యానం చెయ్యాలి? మనకి మనమే పెద్ద బ్రహ్మాండం. మన శరీరంలో ఎన్నో అణువులు ఉన్నాయి. ప్రతి అణువు ఒక బ్రహ్మాండాకారమే. ఈ అణువులన్నింటిలో ఆత్మచైతన్యం ప్రసరిస్తోందని ఎవరైతే ధ్యానం చేస్తారో, వారి శరీరానికి ఆయురారోగ్యాలు ఉంటాయి. ఆ చైతన్యమంతా అమ్మవారే. శరీరంలో ఉన్న అణుమండలమే బ్రహ్మాండ మండలం. వాటి అన్నింటిలో ప్రసరిస్తున్న చైతన్యం అమ్మవారే. ఇలా ప్రతివారిలో, ప్రతివారు ఉన్న బ్రహ్మాండాలు అన్నింటిలో ఆవిడే. ఇలా ధ్యానం చేస్తే ఏం ప్రయోజనమో శంకరభగవత్పాదులవారు చెప్తూ –

"తనుచ్ఛాయాభిస్తే తరుణ తరణిః శ్రీసరణిభిః
దివం సర్వాముర్వీమరుణిమ నిమగ్నాం స్మరతి యః
భవన్త్యస్య త్రస్యద్వన హరిణశాలీన నయనాః
సహోర్వశ్యాః వశ్యాః కతి కతి న గీర్వాణగణికాః"

అన్నారు. అమ్మవారి ఉపాసనలో జపప్రక్రియ ఒకటి. ధ్యానప్రక్రియ ఒకటి. కొన్ని రూపాలను వర్ణిస్తారు. అది వర్ణన కాదు. ఒకచోట కూర్చుని, ఆ వర్ణిస్తున్నది

ధ్యానం చేస్తూ ఉంటే ఆ ధ్యానానికి ఒక ఫలం ఉంది. ఇది రూపధ్యానఫలమని ఒక శాస్త్రం. వీలైనంత వరకు పురాణాలు చెప్తున్నప్పుడు వింటూ ఉంటే, రూపవర్ణన చేసినప్పుడు అది మనస్సులో బొమ్మ కడుతుంది. అప్పుడు ధ్యానఫలితం వస్తుంది. శంకరుల శ్లోకానికి అర్థం చూస్తే 'తనుచ్ఛాయాభిస్తే తరుణ తరణి శ్రీసరణిభిః'- అమ్మా! నీ శరీరం నుండి వస్తున్న ఎఱ్ఱని వెలుగుల ప్రవాహంలో 'దివం సర్వాముర్వీమరుణిమ నిమగ్నాం స్మరతి యః' పైన-క్రింద-అంతటా ఆ వెలుగుతోనే నిండిపోయి ఉన్నాయని ధ్యానం చేస్తూ ఉంటే క్రమంగా వారికి సృష్టిలో దేవలోకం మొదలుకొని ఇతరలోకాల వరకూ ఉన్న శక్తులు వశ్యం అవుతాయి. వశ్యం చేసుకొనే శక్తికి ఈ విధమైన ధ్యానప్రక్రియ చెప్పారు. ఈ మాట శంకరులు చెప్పక ముందే

రుద్రాణి! విద్రుమమయీం ప్రతిమామివ త్వాం
యే చింతయన్త్యరుణకాంతిమనన్యరూపాం
తాం నిత్య పక్ష్మలదృశం ప్రసభం భజంతే

అని శ్రీవిద్యాతంత్రంలో చెప్పారు. ఓ రుద్రాణీ! నీ ఎఱ్ఱని ఆకారాన్ని ధ్యానిస్తూ ఆ వెలుగులో ప్రపంచమంతా ప్రకాశిస్తున్నట్లు ఎవరు భావన చేస్తారో వారికి విశ్వంలో ప్రతిదీ వశ్యం అయిపోతుంది. శ్లోకంలో దేవకాంతలైన అప్సరసలు కూడా వారికి వశ్యం అవుతారని ఉంది.

విశ్వంలో ఉన్న సర్వశక్తులు వారికి అధీనమౌతాయి అనే భావాన్ని గ్రహించాలి. ప్రారంభంలోనే ఎఱ్ఱని తల్లి యొక్క ధ్యానాన్ని చూపిస్తున్నారు. ఇక్కడ క్రమం గమనిస్తే- ముందు వెలుగుపుంజం, చతురస్రం అనగా యంత్రం, ఆ శ్రీచక్రయంత్ర విగ్రహరూపమే అమ్మవారు. ఆ వెలుగుల్లోనే ప్రపంచాలన్నీ వెలుగుతున్నాయి. ప్రపంచంలోని అన్ని శక్తులు అమ్మతోనే వచ్చాయి.

13. చమ్పకాశోకపున్నాగసౌగన్ధికలసత్కచా

- శ్రీ చమ్పకాశోకపున్నాగసౌగన్ధికలసత్కచాయై నమః

ఇదంతా ఒకటే నామం. ఈ శ్లోకం అమ్మ కేశాలను వర్ణిస్తోంది. శిరస్సు

నుండి పాదాల వరకు వర్ణన చేస్తున్నారు. సాధారణంగా దేవతలను పాదముల నుండి క్రమంగా శిరస్సు వరకు పూజించాలి. **"దేవతానాం రూపం పాదాంగుష్ఠ ప్రభృతి వర్ణ్యతే"** అన్నారు. అంగపూజ కూడా ఇలాగే ఉంటుంది. వర్ణించేటప్పుడు మాత్రం పురుషదేవతలకైతే పాదాల నుండి శిరస్సు, స్త్రీ దేవతలకైతే శిరస్సు నుండి పాదాల వరకు వర్ణించాలని శాస్త్రనియమం. స్త్రీదేవతా ధ్యానం చేసేటప్పుడు సాధకుని హృదయం చివరకు పాదాలవద్ద నిలిచిపోవాలి. ఇది ఒక ఔచిత్యం.

రెండవ ఔచిత్యం– అగ్నికుండం నుండి అమ్మవారు వస్తున్నప్పుడు ఆ క్రమం శిరస్సు నుండి మొదలుకొని వచ్చిన రూపాన్నే వశిన్యాది వాగ్దేవతలు వర్ణన చేశారు. ముందు అమ్మవారి యొక్క జుట్టుని వర్ణిస్తున్నారు. చంపకము అంటే సంపెంగ. అశోక కుసుమాలు – ఇవి ప్రత్యేకమైన కుసుమాలు. పున్నాగ, సౌగంధిక కుసుమాలు అని నాలుగు చెప్పారంటే నాలుగే అని కాదు. చంపక, అశోక, పున్నాగ, సౌగంధిక మొదలైనవి అని అర్థం. దీనిని ఉపలక్షకన్యాయమంటారు.

రకరకాల కుసుమాలతో అలంకరింపబడిన అమ్మవారి జుట్టు అద్భుతంగా ఉంది. 'కచ' అనగా కేశపాశాలు. అవి ఒత్తుగా ఉన్నాయి. వాటి కొప్పులో చక్కని పూలు అమ్మవారు అలంకరించుకున్నారు. అమ్మవారికి ఇష్టమని మనకు దొరికే కుసుమాలు మనం తెస్తాం కానీ, అమ్మ కొప్పులో ఉన్న పుష్పాలు మాత్రం దేవలోకంలో ఉన్న కుసుమాలు.

శంకరభగవత్పాదులవారు **'యదీయం సౌరభ్యం సహజముపలబ్ధుం సుమనసః'** అని వర్ణించారు. ఎవరైనా జుట్టుకి సుగంధం రావడం కోసం పువ్వులు పెట్టుకుంటారు. అమ్మవారి కురులకి సుగంధం కావాలని పువ్వులే అక్కడికి వచ్చి చేరాయి. అమ్మవారి కేశాలకు సుగంధం సహజం. ఇలా చెప్పారంటే అమ్మవారిది దివ్యశరీరమనే స్పృహ కలగాలి.

ఎప్పుడైనా భగవన్మూర్తిని తలచుకున్నప్పుడు అది మన వలె పాంచభౌతికమై, మాంసమయమైన శరీరమనే భావన ఉండరాదు. చాలామంది ఆ భావనతోనే దేవతలను చూస్తూ దేవతల శరీరవర్ణన చేశారని అనుకుంటుంటారు. దేవతా

శరీరమంటేనే దివ్యం, అలౌకికం అని గ్రహించగలగాలి. అలౌకికమైన భావంలోనే – దేవతాకుసుమాలు అక్కడ ఉన్నాయి. భవ్యమై సహజసుందరమైన, సహజ సౌరభం కలిగిన ఆ కేశపాశాలకు **'వసన్త్యస్మిన్మన్యే బలమథన వాటీ విటపినామ్'** – బలమథనుడు అంటే ఇంద్రుడు. ఇంద్రుని తోటలో పువ్వులు అమ్మవారి కేశపాశాల యందు పెట్టుకుంది. అవి దివ్యకుసుమాలు. ఇంద్రుని తోటలో పువ్వులు కొయ్యడానికి దేవకాంతలు వెళ్ళారు. పరిచారకులు వెళ్ళలేదు. భక్తులైన వారు వెళ్ళి తెచ్చుకుని వచ్చి పూజ చేస్తారు. అమర్చిన పూజ చేస్తే రాజసం. అమర్చుకొని చేస్తే సాత్త్వికం. అమరికతోనే ఆ భక్తి కనబడాలి. సాక్షాత్తుగా శచీదేవి మొదలైనవారు వెళ్ళి కోశారు. ఆ కోసి తెస్తున్నప్పుడు వీరు తోటలోకి అడుగుపెడుతూ ఉండగానే చెట్లు మమ్మల్ని కొయ్యి, మా పువ్వుల్ని కొయ్యి అని మనస్సులో అరుస్తున్నాయి. భారతదేశంలో పూలతోటల్లో మాత్రం 'పుష్పవిలాపాలు' ఉండవు. 'పుష్పవిలాసా'లే ఉంటాయి. పుట్టిన పువ్వులు భగవంతుని చేరడమే వాటికి సార్థకత. ఉదయాన్నే పుట్టి సాయంకాలం రాలిపోయే పువ్వులకి పరమాత్మ సన్నిధి లభించిందంటే ఎంతో ధన్యత.

ఏ చెట్టు పువ్వు కోసి భగవంతునికి అర్పిస్తామో, ఆ చెట్టుయొక్క జీవునికి ఉత్తమగతులు వస్తాయని శాస్త్రం. ఈశ్వరార్చన లేని మానవజన్మ కంటె భగవంతుని కోసం పూసే పువ్వుల్ని పూజించే చెట్టుగా పుట్టినా చాలు ఎంతో ధన్యత. నందనవనంలోని దేవతావృక్షాలు తమ కుసుమాలు అమ్మ సుగంధమైన సహజమైన కేశాలకి అలంకారాలుగా ఉండాలని అనుకుంటూ ఉంటాయి. అమ్మవారి శిరస్సులో ఆ కుసుమాలు పెడితే అమ్మవారి కురుల సహజ సుందరమైన గంధం ఆ కుసుమాలకి అంటుతోంది.

ఇక్కడ చంపక, అశోక, పున్నాగ, సౌగంధిక అనేవి కూడా నాలుగు బీజాక్షర శక్తులు. అయితే ఇక్కడ ఒకొక్కటి వర్ణించేటప్పుడు అవి ధ్యానంలోకి వస్తాయి. అమ్మవారి కేశపాశాలు ధ్యానంలోకి వస్తే, యముని బారినుండి బయటపడతారు. స్వర్గాలు, మోక్షం ప్రక్కన పెడితే ముందు నరకంలో పడకుండా ఉంటే చాలు. మొదట వర్ణించినదే నరకం నుండి బయటపెట్టేసే వర్ణన. అమ్మవారి ఒకొక్క

అవయవంలో ఒకొక్క దేవతాశక్తి ఉంది. అమ్మవారు చిదగ్నికుండం నుంచి దేవతలను తిరిగి సృష్టించినప్పుడు జుట్టు నుండి యముని సృష్టించారు. ఆ నల్లని జుట్టులో యముని శక్తి ఉంది. ఒకొక్క ఇంద్రియంలో ఒకొక్క శక్తి ఉంది. అలాగే అమ్మ కళ్ళని వర్ణించారంటే సూర్యుని వర్ణించారని అర్థం. ఇది మామూలు రూపం కాదు. విరాట్స్వరూపం. అమ్మవారు తిరిగి తన దేహం నుండి దేవతలను సృజించినపుడు జుట్టు నుండి వచ్చినవాడే యముడు. అక్కడి నుండి యముడు వచ్చాడంటే అక్కడ లేడని అర్థం కాదు. దీపం నుండి దీపం వెలిగించారు అంటే అర్థం మొదటి దీపం అలాగే ఉంది. ఆ వెలుగు ఇందులోకి వచ్చిందని అర్థం. అలాగ అమ్మ కేశాలను ధ్యానించేటప్పుడు ఆ యమశక్తి, కాలశక్తి చెప్పబడుతున్నాయి. విరాడ్రూపవర్ణనలో **'కేశాః వనస్పతయః'** అని వర్ణన ఉంది. వనస్పతుల శక్తే కేశాలు. వనస్పతులు అనగా వృక్షజాతులు. అమ్మవారు విరాడ్విగ్రహా కనుక సర్వవృక్షజాతులకి అమ్మవారి కేశములు ఆధారం.

దేవతారూపం ముందు నిలబడ్డప్పుడు ఎప్పుడూ కూడా చీరకట్టుకున్న ఒకానొక స్వరూపమనే భావం రానివ్వకూడదు. మొదట 'విశ్వవిగ్రహా', 'విరాడ్విగ్రహా' అని భావన, రెండవది 'మంత్రవిగ్రహా', మూడవది 'సర్వదేవతా విగ్రహా' అనే భావన కలగాలి. శిరస్సు నుండి పాదాల వరకు అమ్మవారి స్వరూపమంతా 'సర్వదేవతాత్మకం'... 'మంత్రాత్మకం'... 'విశ్వశక్త్యాత్మకం'. మన శరీరాలు మాంస మయాలు. దేవతా శరీరం మంత్రమయం. ఇలా భవ్యమైన అమ్మవారి కచసీమని వర్ణించుకుని కిరీటాన్ని వర్ణిస్తున్నారు.

14. కురువిందమణిశ్రేణీకనత్కోటీరమండితా

– శ్రీ కురువిందమణిశ్రేణీకనత్కోటీరమండితాయై నమః

ఇదంతా ఒకటే నామం. అమ్మవారి యొక్క కిరీటంలో రత్నాలు పొదగబడ్డాయి. ఇంచుమించు అన్నీ ఎఱ్ఱగా మెరిసిపోతున్నాయి. ఆవిడ ఎఱ్ఱని తల్లి. ఆవిడకి ఎఱ్ఱని రత్నాలే ఎక్కువ ప్రీతి. ఎన్ని రత్నాలు పెట్టినా బాగా స్ఫుటంగా

కనబడుతున్నవి మాత్రం ఎఱ్ఱని రత్నాలు. అవి పద్మరాగమణులు. పద్మరాగమణులు సింహళం, కురంజం ఇలా రకరకాల జాతుల్లోంచి పుడతాయి. సింహళదేశం నుండి వచ్చే పద్మరాగమణులని కురువిందమణులని అంటారు. వీటికి శ్రేష్ఠత్వం ఎక్కువ.

కనత్ – అనగా ప్రకాశం. మణుల గుంపులన్నీ పెట్టి ప్రకాశిస్తున్న కిరీటం పెట్టారు. పైగా ఎఱ్ఱని రంగు ఆదిత్యుని వర్ణం. సూర్యుని యొక్క ద్వాదశాదిత్యుల కాంతులు అమ్మవారి కిరీటంలో ఉన్నాయి. అమ్మవారి కిరీటం ధ్యానం చేసేటప్పుడు ఆదిత్యశక్తులన్నీ ధ్యానింపబడుతున్నాయి. జ్యోతిర్మండల శక్తులవి. అమ్మవారికి కిరీటం తయారుచేస్తున్నప్పుడు విశ్వకర్మని జ్యోతిర్గణాలన్నీ, "మమ్మల్ని అందులో పెట్టవా" అని అడిగాయి. ఆ జ్యోతిశ్శక్తులన్నీ విశ్వకర్మ పెట్టాడు. పరిశీలిస్తే అమ్మవారి కిరీటంలో సమస్త జ్యోతిర్మండలాలు భాసిస్తున్నాయి.

అమ్మవారి కిరీట ధ్యానం అనే ఉపాసన ఒకటుంది. ధ్యానోపాసన అనగా కలిపి మొత్తం మూర్తిని చూడడం మాత్రమే కాదు. ప్రత్యవయవ భావన చెయ్యాలి. ఆ చేసినపుడు విశ్వవిగ్రహా, మంత్రశక్తిస్వరూపిణీ, దేవతావిగ్రహా అయిన ఆ తల్లి యొక్క దేవతాశక్తి, మంత్రశక్తి, విశ్వశక్తి కూడా సాధకుని అనుగ్రహిస్తాయి. ఇది ఒక రూపధ్యాన శాస్త్రం.

ఇక్కడ వరకు నామాల సారాంశాన్ని పరిశీలిస్తే అమ్మవారు సృష్టిస్థితి లయకారిణి అయిన 'శ్రీ'. ఆ 'శ్రీ'నే దేవతలు భండాసురుని బాధలు తాళలేక కాపాడమని ఆశ్రయిస్తే, శివుడే గురువుగా వచ్చాడు. శివుని పత్నే అమ్మవారు కనుక శివుడే అమ్మవారిని పిలిచి, "రాక్షస సంహారం చెయ్యి" అని చెప్పలేదు. గురువైనా తెచ్చి ఇవ్వడు. శివుడు కూడా తెచ్చి అమ్మవారిని ఇవ్వడు. ఎవరి సాధన వారు చెయ్యాలి. **'ఊరకే దొరకునా ఉన్నతోన్నతసుఖమ'**ని అన్నమాచార్యులవారంటారు. **'అంతర్నిరంతర మనింధన మేధమానే'** అని చిదగ్ని రగల్చడం గురించి వివరించుకున్నాం. అది గురువు సహాయంతో కావాలి. మన సాధనతో ప్రయత్నిస్తే, గురువే అమ్మవారిని రప్పిస్తాడు. **'శివాయ గురవే నమః'.** ఆయన రప్పిస్తే అమ్మవారు వచ్చారు. ఆ వచ్చిన ఎఱ్ఱనికాంతి క్రమంగా శ్రీచక్రరూపం ధరించింది. అది దేవీ

రూపంగా వ్యక్తమయ్యింది. ఆ రూపాన్నే వర్ణిస్తున్నారు వశిన్యాదివాగ్దేవతలు. పద్మరాగమణులతో ఉన్న కిరీటం ధ్యానిస్తే **'మాంగల్యయుక్తాః వృద్ధి ప్రదాస్తే స్మరణాద్భవంతి'.** ఒకొక్కనామం ఒకొక్క ధ్యాన విశేషం. ఆ కురువిందమణుల కిరీటాన్ని ధ్యానిస్తే అవి మంగళకరమై వృద్ధిని కలిగించే ఫలితాన్ని ఇస్తాయి. తరువాత అమ్మవారి భవ్యమైన లలాటము(ఫాలభాగం)ను వివరిస్తున్నారు.

15. అష్టమీచంద్రవిభ్రాజదళికస్థలశోభితా
– శ్రీ అష్టమీచంద్రవిభ్రాజదళికస్థలశోభితాయై నమః

అష్టమినాటి చంద్రునివలె ప్రకాశిస్తున్న అందమైన నుదురు అమ్మవారిది. అమ్మవారి ప్రతినామంలో కవిత్వం, మంత్ర సంకేత, ఉపాసనాపరమైన రహస్యాలు ఉంటాయి.

అష్టమినాటి చంద్రునివలె అమ్మవారి నుదురు ఎంతో విశాలంగా ఉంది. అష్టమినాడు చంద్రుని గమనిస్తే సరిగ్గా సగం ఉంటాడు. అమ్మవారి నుదురు ఆ సగం చంద్రునిలా ఉంది. ఇందులో ఉన్న అద్భుతాలని పరిశీలిస్తే అష్టమినాడు చంద్రునితో పోల్చడంలో విశేషం. అష్టమి-శుక్లపక్ష అష్టమా? కృష్ణపక్ష అష్టమా? పేర్కొనలేదు. అష్టమి అన్నారు. అలా శుక్లపక్ష, కృష్ణపక్ష పేర్కొనకుండా చెప్పగలిగే తిథి 'అష్టమి ఒక్కటే'. మిగిలిన ఏ తిథి చెప్పినప్పటికి రెండింటికి తేడా ఉంటుంది. అర్ధచంద్రస్వరూపం శుక్లపక్ష అష్టమినాడు ఎలా కనబడుతుందో, కృష్ణపక్ష అష్టమినాడు కూడా అలాగే కనబడుతుంది. అంతేకాని శుక్లపక్ష పాద్యమినాటి కళ, కృష్ణపక్ష పాద్యమినాటి కళ ఒకటి కాదు. ఇతర తిథుల కళలు, ఉభయపక్షాల కళలు ఒక్కలా ఉండవు. కేవలం అష్టమీకళ మాత్రం ఒక్కలా ఉంటుంది. అమ్మవారి స్వరూపం నిర్వికారమైన స్వరూపం. ఆ నిర్వికారస్వరూపం అని చెప్పడం ముందు నుదుటితోనే పేర్కొన్నారు.

సాధారణంగా నుదురులు అందరివి ఎప్పుడూ ఒకేలా ఉండవు. నుదురు చిట్లించడం, వికసించడం ఇవన్నీ కూడా రకరకాల భావాలకి సంకేతాలు. ప్రతికూల

భావాలు వచ్చినప్పుడు నుదురు చిట్లించుకుంటారు. అనుకూల భావాలు వచ్చినప్పుడు నుదురు విస్తారమవుతుంది. ముఖంలో వచ్చిన మార్పులు మొదట నుదుటి దగ్గర వ్యక్తమవుతాయి.

అమ్మవారి నుదురు శుక్లపక్ష, కృష్ణపక్షాలలో ఒకేలా ఉన్నది అని చెప్పడం... అమ్మవారికి అటువంటి వికారాలు లేవని చెప్పడం. ఎప్పుడూ ఒక పూర్ణత్వమే ఆ ముఖంలో ఉంది. ప్రతికూల, అనుకూలమనే రాగద్వేషభావాలు అందులో లేవు. మార్పులేని కళ కలిగినది, నిత్యస్వరూపం అని చెప్పడమే ఇందులో ఉన్న అంతరార్థం.

రెండవ భావం పరిశీలిస్తే – ఒకొక్క తిథినాడు అమ్మవారికి ఒకొక్క పేరు ఉన్నది. వీరిని తిథినిత్యాదేవతలు అంటారు. శుక్లపక్షపాడ్యమి నుండి పూర్ణిమ వరకు ఒక వరుస. మరల కృష్ణపక్ష పాడ్యమి నుండి అమావాస్య వరకు మరో వరుస. ఈ పదిహేను కళలే అక్కడ విలోమ మార్గంలో వస్తూ ఉంటాయి. శుక్లపక్షంలో చతుర్దశి, బహుళ పక్షంలో విదియ అవుతుంది. అష్టమి తిథినాడు మాత్రం రెండుపక్షాలలోనూ పేరు మారదు. ఆవిడ పేరు **'త్వరితా దేవి'.**

అష్టమినాడు అమ్మవారు **'త్వరిత'** అనే పేరుతో ఉంటుంది. మంత్రశాస్త్రం త్వరితాదేవి అనుగ్రహం చెప్తోంది. త్వరితా అంటే త్వరితఫలదాయిని. త్వరితాదేవిని ధ్యానిస్తే వెంటనే ఫలం ఇస్తుంది. ఇందులో మరో రహస్యం ఉంది. ఏదైనా గమ్యానికి వెళ్ళేటప్పుడు సగం దూరం వచ్చేశామంటే ఇంక సిద్ధికి దగ్గరగా ఉన్నామని అర్థం. ఆ సగం దూరం వచ్చామనేది అమ్మవారి యొక్క ఫాలభాగం ధ్యానం చేస్తే, సాధనలో సగం దూరం వెళ్ళిపోతారు. అష్టమి ఫాలభాగం. దాని పైనున్నది సహస్రారమే. అక్కడిదాకా వెళ్తే దగ్గరికి వెళ్ళినట్లే. అంత త్వరితంగా ముందుకు నెడుతుంది ఈ త్వరితా శక్తి.

శుక్లపక్ష అష్టమినాటి తిథిని వేదం **'ఆప్యాయ'** అనే పేరుతో పేర్కొన్నది. ఆప్యాయనము అనగా చల్లబరచడం, ఆనందపరచడం. అమ్మ యొక్క ఆ విశాలమైన ఫాలభాగాన్ని ధ్యానిస్తే ఆ ఆప్యాయని రూప అమ్మవారి అనుగ్రహము లభిస్తుంది. అమ్మవారి యొక్క ఫాలభాగంపై చక్కని కస్తూరీ తిలకం ప్రకాశిస్తోంది.

16. ముఖచంద్రకళంకాభమృగనాభివిశేషకా

– శ్రీ ముఖచంద్రకళంకాభమృగనాభివిశేషకాయై నమః

ఇదంతా ఒక నామమే. అమ్మవారి ముఖం చంద్రుని వంటిది. ఆవిడ చంద్రకళాస్వరూపిణి. ఆవిడ పేరే చంద్ర. అమ్మవారి ధ్యానం చంద్రకళా ధ్యానమే. సహస్రారంలో ఉన్న చంద్రకళే అమ్మవారు. చంద్రశబ్దమే ఎక్కువ కనబడుతూ ఉంటుంది. చంద్రునికి మచ్చ అందమే. ఆ విధంగా చక్కని మిసిమికాంతులు వెదజల్లుతున్న అమ్మవారి ముఖంలో కస్తూరీతిలకం చంద్రునిలోని మచ్చవలె ప్రకాశిస్తోంది.

కస్తూరి మృగం యొక్క నాభి నుండి కస్తూరి వస్తుంది కనుక మృగనాభి అన్నారు. అలాంటి విశేషము కలిగిన ఆ కస్తూరితో అమ్మవారి ముఖం ప్రకాశిస్తోంది. అమ్మవారి కచంలో యముని తేజస్సు చెప్పుకున్నాం. ముఖం శంభుని తేజస్సుతో ఆవిర్భవించింది అని అమ్మవారికి సంబంధించిన విరాట్ స్వరూప వర్ణన, 'దేవీమాహాత్మ్యం'లో అమ్మవారి ఆవిర్భావ సమయంలో ఏ ఏ దేవతాస్వరూపం ఎక్కడుందో వివరిస్తున్నారు.

అమ్మవారి వదనమంతా శంభు తేజస్సు. తిలకస్థానమైన ఆజ్ఞాచక్రస్థానం చెప్పేటప్పుడు అక్కడి నుండి సహస్రారం వరకు ఫాలభాగం ప్రకాశిస్తోంది. ఈ స్థానంలో తిలకధారణ చెయ్యడం ఒక ప్రత్యేకత ఉంది. ఎవరికైనా సరే అదే బిందుస్థానం. అక్కడి నుండి పై వరకు ఉన్న ప్రధానమైన స్థానాన్ని భావన చెయ్యాలి. ఎప్పుడైనా అమ్మవారిని భావన చేసేటప్పుడు ఆజ్ఞాచక్రస్థానం నుండి భావన చేస్తారు. అక్కడి నుండి పైదంతా చంద్రమండలం అని చెప్పబడుతుంది. ఆ భాగమంతా పరమపదస్థానం కనుకనే ఈశ్వరారాధనకి సంకేతంగానే ఫాలభాగంలో భస్మధారణో, కుంకుమధారణో చేస్తారు. ఆది సువాసిని అయిన అమ్మవారికి కస్తూరీతిలకం ప్రకాశిస్తూ ఉంది.

ఇది లలాటమునందు విస్తరించిన అమ్మవారి యొక్క ఆజ్ఞాచక్ర చైతన్యాన్ని

తెలియజేస్తోంది. **'బిందుపరిధో అవినాభావః'** అని అమ్మవారి న్యాసముల యందు చెప్పబడుతుంది. ఒకొక్క అవయవధ్యానము ఒకొక్క న్యాసవిద్య. ఇది ఉపాసన లేదా భక్తి కలవారికి పనికొస్తుంది. న్యాసం అనగా ఉంచుట అని అర్థం. దైవశక్తిని ఉంచుట. అమ్మవారి స్వరూపాన్ని ధ్యానం చెయ్యగానే ఆ దైవశక్తి మనలో జాగృతి జరుగుతుంది.

17. వదనస్మరమాంగళ్యగృహతోరణచిల్లికా

– శ్రీ వదనస్మరమాంగళ్యగృహతోరణచిల్లికాయై నమః

ఇది అమ్మవారి యొక్క కనుబొమలను వివరించే నామం. ఇటు నుండి అటు, మధ్యలో వంగి పైకి వచ్చిన ఆ కనుబొమలు, ముఖమనే ఇంటికి తోరణంలా ఉన్నాయి. కవిత్వమంటే వశిన్యాదివాగ్దేవతలదే, లేదా వారి దయ ఎవరికుంటే వారిది. వారు అనుగ్రహిస్తేనే కవిత్వం వస్తుంది. 'తోరణచిల్లికా' – తోరణంగా పెట్టబడిన అందమైన అలంకారంగా ఉన్నవి అమ్మవారి కనుబొమలు. అమ్మవారి ముఖం ఇల్లులా ఉంది. ఆ ఇంటికి తోరణంలా ఉన్నవి ఆ కనుబొమలు. **'వదనస్మరమాంగళ్య'**– వదనము అనగా ముఖము. **'స్మర'** అంటే సౌందర్యం. **'మాంగళ్య'** అంటే శోభ, శుభం. సౌందర్యం, శుభము రెండూ అమ్మవారి ముఖంలో ప్రకాశిస్తున్నాయి. ఎక్కడైనా మన్మథ శబ్దం ప్రయోగింపబడితే అది సౌందర్య సంకేతం. మన్మథుడు సౌందర్యాధిదేవత.

అమ్మ ముఖంలో సౌందర్యం, శుభం ఇల్లు కట్టుకుని కూర్చున్నాయి. అంత స్థిరంగా ముఖంలో ఉంటున్నాయి అని చెప్పడం ఇక్కడ అర్థం. స్మరశబ్దంలో కామరాజవిద్యను బోధిస్తున్నారు. సౌందర్య శుభాలకు ఆటపట్టై ప్రకాశిస్తున్న అమ్మవారి ముఖానికి చక్కగా తోరణంలా రమ్యమైన కనుబొమలు కనిపిస్తున్నాయి.

బీజాక్షరాలు ఎలా పెట్టారనేది కొన్ని గురుముఖతః మాత్రమే తెలుసుకోవాలి. కొన్ని సభలలో చెప్పినా ఆ చెప్పినవాటిని గురూపదేశం లేకుండా చెయ్యరాదు. ఇప్పటికే గురూపదేశం ఉంటే, ఈ భావనచే కొనసాగించుకోవచ్చును.

కేవలం నామంలో వర్ణన మాత్రమే చూస్తూ ఉంటారు. లోపల బీజాక్షరశక్తి ఉంటుంది. శ్రద్ధగా పఠిస్తే ఆ శక్తి వస్తుంది. అర్థాన్ని తెలుసుకుంటూ స్తోత్రాదులు

పఠిస్తే, దాని ఫలితం అత్యధికంగా ఉంటుంది.

జపం చేస్తున్నప్పుడు మనస్సు నిలవడం లేదని అంటూ ఉంటారు. మనస్సు నిలవాలనే ప్రయత్నం పెట్టుకోవద్దు. జపానికి ఫలం జపఫలమే. మనస్సు నిలవడం అనేది ధ్యానంలో పని. ధ్యానంలో మనస్సు నిలవకపోతే అప్పుడు ప్రశ్నించుకోవాలి. జపంలో మనస్సు నిలవకపోతే ప్రశ్నించుకోనక్కర్లేదు. ప్రయత్నించాలి. జపం ధ్యానంతో కలిపి చేస్తే మంచిదే గాని అది ఎప్పటికో సిద్ధిస్తుంది. జపం చేసిన ఫలితం మాత్రం వ్యర్థం కాదు. ప్రయత్న లోపం లేకుండా మాత్రం చెయ్యగలగాలి. ఈ నామాలు గ్రహించేటప్పుడు మనస్సుకి ధ్యానం అవుతుంది.

మంత్రోద్ధారం అని ఒక శాస్త్రం ఉంది. వేదాల యందు అమ్మవారి మంత్రాలు చెప్పబడ్డాయి. వాటిని సూచనగా చెప్తూ వాటిలోనుండి బీజాన్ని బయటికి తీశారు ఋషులు. వాటిని రహస్యంగా వేదం దాచిపెట్టింది. దాన్ని ఉద్ధరించారు ఋషులు. లలితాసహస్రనామం మొదట బీజాక్షరాలు వివరించుకున్నాం. షోడశీమంత్రానికి ఆదియైన బీజమే లలితాసహస్రానికి మొత్తానికి 'ఆదిబీజం'. సహస్రనామానికి ఏది ఆదిబీజంగా చేశారో తన్మంత్రశక్తినే లలితాసహస్రమంతా ప్రసరించి వ్యాపింప జేశారనడానికి అదే ఆధారం.

వదనం అంటే వాక్కు స్థానం. వదనబీజమంటే వాగ్బీజం. వాగ్బీజం = '**ఐం**'కారం. స్మరబీజం అంటే మన్మథబీజం = '**క్లీం**'కారం. మాంగళ్యబీజం అనగా '**సౌః**' అనే బీజాక్షరం. గృహబీజము అంటే లక్ష్మీస్థానం. అదే '**శ్రీం**'కారం. తోరణబీజం '**హ్రీం**'కారం. ఇవి అమ్మవారి కనుబొమలలో దాగియున్న బీజాక్షరాలు.

'వదన-స్మర-మాంగళ్య-గృహ-తోరణ' క్రమంగా 'ఐంకార-క్లీంకార-సౌః కార-శ్రీంకార-హ్రీంకారా'లనే బీజాలు. 'చిల్లికా' అంటే ఇవి వ్యాపించి ఉన్నాయి. నామంలో ఎన్ని బీజాక్షరాలు నిహితం చేశారో పరిశీలించాలి. ప్రతినామంలోనూ దాగి ఉన్నాయి. ఇవన్నీ సంప్రదాయం ఎంతవరకు సభల్లో చెప్పుకోవచ్చని చెప్పిందో, అంతమేరకే చెప్పుకుంటున్నాం. దాని హద్దులు కూడా వివరించుకుంటున్నాం. ఇప్పుడు చెప్పుకున్న ఐదు బీజాక్షరాలలో విశ్వవిజ్ఞానరహస్యాలు ఉన్నాయి. లలిత అంటే

విశ్వమంతా వ్యాపించి నడిపించే శక్తి, విశ్వాన్ని నడిపే శక్తులే ఈ బీజాక్షరాలు. ఇది వేదప్రమాణాలతో తీసుకోవచ్చు.

'హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ....' ఇత్యాది మంత్రాలలో చూస్తే హ్రీం బీజంలో ఉష్ణత అనే శక్తి ఉంటుంది. ఈ వేడిమి లేకపోతే ప్రపంచంలో ఎవ్వరూ ఉండలేరు. ఇది ప్రాణశక్తి. పరిశీలిస్తే ప్రపంచంలో చూసే శక్తులు కూడా ఇలాగే ఉంటాయి.

'శ్రీం'బీజంలో వెలుగు అనబడే శక్తి కాంతిరూపంగా ఉంటుంది.

'క్లీం' అంటే ఆకర్షణ. ఆకర్షణ అంటే అవతలి వారిని వశం చేసుకోవడం కాదు. ప్రపంచమంతా ఆ శక్తితోనే ఉంది. ప్రతివాని శరీరంలో ఆకర్షణశక్తి ఉంది. భూమిలో ఆకర్షణ శక్తి ఉంది.

'ఐం'బీజంలో శబ్ద శక్తి ఉంది.

'సౌః' బీజం అమ్మవారి మంత్రాలలో చాలా విశేషమైనది. ఇందులో అపూర్వమైన విద్యుచ్ఛక్తి దాగి ఉంది. వరుసగా బీజాలలో దాగి యున్న శక్తి చూస్తే ఉష్ణతాశక్తి, కాంతిశక్తి, ఆకర్షణశక్తి, శబ్దశక్తి, విద్యుచ్ఛక్తి – ఇన్ని శక్తులకి మూలమైన పరాశక్తి అమ్మవారు. ఆ బీజాలు అక్కడ నిక్షిప్తం చేశారు. అవి కనుబొమల కదలికలనుండే ప్రపంచానికి ఆవిడ అందిస్తోంది. కనుబొమలు అంటే ఆజ్ఞాచక్రస్థానం. కనుబొమలు నడిమి స్థానం. అమ్మవారి ఆజ్ఞతోనే ప్రపంచమంతా నడుస్తోంది. ఆజ్ఞాస్వరూపమైన బీజాక్షరాలు ఆ కనుబొమలలో పరిశీలిస్తూ, తద్వారా ఐదు శక్తులతో ప్రపంచాన్ని అమ్మవారు ఎలా నడుపుతున్నారో తెలుసుకోవాలి. ఈ శక్తులన్నీ భగవంతునివే అని తెలిసి బ్రతికేవాడు ఆస్తికుడు. ఆ తెలివి లేకుండా బ్రతికేవాడు నాస్తికుడు.

18. వక్త్రలక్ష్మీపరీవాహచలన్మీనాభలోచనా
– శ్రీ వక్త్రలక్ష్మీపరీవాహచలన్మీనాభలోచనాయై నమః

నిజానికి అమ్మవారి కనులని ఒక్కనామంతో చెప్పడం సరిపోదు. అమ్మవారి కన్నులు అంత గొప్పవి. అమ్మవారి పేరే **'ఈక్షత్యాత్మికా శక్తిః'** అనగా కనులు

తెరుచుకోవడం. ఎవరికి చైతన్యం ఉందో వాడే కళ్ళు తెరుస్తాడు. కళ్ళు తెరుచుకోవడమే శ్రీచక్రం. ఒక చక్కని మొగ్గ పువ్వులా విచ్చుకుంది. అంతవరకు మొగ్గగా ఉన్నది పువ్వులా విచ్చుకుంటే, అందులో ఉన్న కర్ణిక, కేసరాలు, చుట్టూ ఉన్న రేకులు అన్నీ కలిపి పువ్వు. అదేవిధంగా అంతా కలిపి శ్రీచక్రం. ఆ మధ్యలో ఉన్న బిందువే విచ్చుకొని శ్రీచక్రం అయింది. ఒక కదలిక లేని కొలనులో రాయి వేస్తే ముందు వచ్చేది బిందువు. ఆ తరువాత వచ్చేది దాని వల్ల ఏర్పడిన తరంగాలు. అలా శ్రీచక్రాన్ని చూస్తే మధ్యలో బిందువు తరువాత ఆవరణల తరంగాలు ఏర్పడ్డాయి. బిందువులో ఉన్న శక్తే తరువాత ఆవరణలుగా వస్తోంది.

ఈ విశ్వమంతా ఈశ్వరస్వరూపమే. ఈశ్వరుని శక్తి యొక్క స్పందన మొదట బిందువు రూపంలో వచ్చింది. ఆ స్పందనగా వచ్చిన శక్తి సంకల్పం అని చెప్పబడుతుంది. ఈశ్వరసంకల్పంతోనే ప్రపంచం తయారయ్యింది. ఎవరికైనా సాధారణంగా ఏదైనా పని చెయ్యాలంటే ముందు స్పందన– సంకల్పం. చైతన్యం ఉంటేనే సంకల్పం ఉంటుంది. "నేను చేస్తాను" అంటారు. చైతన్యం ఉండడం వల్లే 'నేను' అనగలిగారు. మనకి నేను అనే స్పందన వచ్చినట్లుగా, పరమాత్మ కూడా "నేను సృష్టిని చేస్తాను" అనుకున్నాడు. అలా ఆయన శక్తి మొదట స్పందనరూపంలో వ్యక్తమయ్యింది. ఆ స్పందనలోనే సంకల్పం, ఇచ్ఛ, జ్ఞాన, క్రియ అనే శక్తులన్నీ ఉన్నాయి. **'సత్యకామః సత్యసంకల్పః'** అని ఉపనిషత్ ఈ మాటనే చెప్తోంది. ఆ స్పందనశక్తే ఆదిశంకరులు సౌందర్యలహరి మొదటి శ్లోకంలో చెప్పిన **'న ఖలు కుశలః స్పందితుమపి'.** ఆ స్పందనశక్తిలో ఉన్నదంతా ఈశ్వరస్వరూపమే. అదే తరంగాలుగా వ్యాపించింది. ఏకంగా వచ్చిన ఈశ్వరస్పందనే, సృష్టిరూపంగా అనేకంగా విచ్చుకుంది. సృష్టినంతటిని కమలంగా భావిస్తే, సృష్టి పెద్ద శ్రీచక్రం. అందులో చూసే సర్వశక్తులు ఆవరణలే. వీటినన్నింటికి కేంద్రమై ఉన్నదే శివశక్తి. బిందువు దాకా వెళ్ళాలి. ఆ బిందువు శక్తే ఇన్ని ఆవరణలలో ఉందని తెలుసుకోవాలి. ఈ విశ్వమే శ్రీచక్రం. విశ్వంలో ఉన్న శరీరమూ శ్రీచక్రమే.

"శ్రీచక్రం కొని ఇంట్లో పెట్టుకోవచ్చా" అని అడుగుతూ ఉంటారు. సరియైన

ఉపాసనా పద్ధతి లేకుండా శ్రీచక్రం ఇంట్లో ఉండకూడదు. కానీ మన శరీరమే శ్రీచక్రం. అనేక జన్మాల పుణ్యాలు పెట్టి శరీరమనే శ్రీచక్రాన్ని కొనుక్కున్నాం. శరీరంలోనే శ్రీచక్రాన్ని చూడవచ్చు. మనలో చైతన్యం విచ్చుకుని శరీరమంతా పద్మంలా వ్యాపించిపోయి ప్రసరిస్తోంది. బిందుశక్తి విచ్చుకుని ఆవరణల రూపంలో విస్తరించింది. క్లుప్తంగా చెప్పాలంటే ఇదే శ్రీచక్రం. విచ్చుకోవడమే కళ్ళు తెరవడం. ముడుచుకుంటే లయం. ఈ మధ్యలో ఉండేది స్థితి. **'ఉన్మేషనిమిషోత్పన్నవిపన్నభువనావళిః'** అంటే కంటి గురించి ఒక్క నామమే చెప్పారని కాదు. చాలా నామాలున్నాయి. 'దరాందోళితదీర్ఘాక్షీ', 'లోలాక్షీ' 'కామరూపిణీ', 'కామాక్షీ'.

కన్ను తెరచుకోవడం, మూసుకోవడంలోనే సృష్టి స్థితి లయలన్నీ ఉన్నాయి. ఇవే సంకోచ వ్యాకోచాలు ప్రతి అణువులో, బ్రహ్మాండములో జరుగుతున్నాయి. అదే విశ్వంలో జరుగుతున్న మహావిన్యాసం. ఆ విశ్వవిన్యాసమే అమ్మవారి శక్తి. అది మొదట కన్నుల్లో చూడాలి. కన్నుల నుండే మొత్తం చేస్తోంది ఆ తల్లి. వదనంలో ఉన్న నేత్రాలకి అంత ప్రాధాన్యం ఉంది. ఆ కన్నులని ఇక్కడ వర్ణిస్తున్నారు. ఆ కన్నులు చేపలు ఈదుతున్నట్లు ఉన్నాయి. కంటిని చేపతో పోల్చడం సాధారణంగా కవితా లక్షణం. అమ్మవారి నేత్రాలు విశాలంగా ఉన్నాయి. అటూ ఇటూ కదులుతూ అన్నీ చూస్తూ ఉన్నాయి. ఆవిడ మొత్తాన్ని పరిశీలిస్తోంది.

అమ్మవారు కళ్ళు కదులుతూ ఉన్నప్పుడు చేపల్లా ఉన్నాయి. ఏదైనా నీరు ఉంటేనే చేపలు కదులుతాయి. అమ్మవారి వదనంలో ఉన్న శోభ ఒక ప్రవాహంలా ఉంది. ఆ ప్రవాహంలో ఈదుతున్న చేపల్లా రెండు కళ్ళూ ఉన్నాయి. లక్ష్మీ అంటే శోభ, ప్రకాశము అని అర్థం. సౌందర్య ప్రవాహాన్నే సౌందర్యలహరి అన్నారు. **'తవ వదన సౌన్దర్యలహరీ...'** అక్కడ 'లహరీ' శబ్దమే ఇక్కడ 'పరీవాహ' శబ్దంలో ఉంది.

వక్త్రలక్ష్మీపరీవాహ – అమ్మవారి వదనంలో సౌందర్యం ప్రవహిస్తోంది. ప్రవాహం అంటే నిత్యం ఉండేదని అర్థం. అంతేకాదు ప్రవాహంలో నూతనత్వం ఉంటుంది. అమ్మవారి ముఖంలో సౌందర్యం ప్రవాహరూపంగా ఎప్పటికప్పుడు స్వచ్ఛంగా నూతనంగా ఉన్నది. నిత్యనూతనమైనప్పుడు ప్రవాహం అని చెప్తారు.

సత్–చిత్–ఆనందమే నిత్యసౌందర్యం. ఆ సచ్చిదానంద సౌందర్యం అమ్మవారి ముఖంలో నిత్యనూతనంగా ప్రకాశిస్తోంది. **'వక్త్రలక్ష్మీపరీవాహ'** అన్నప్పుడు బీజాక్షరాలు **'ఐం'**కారం, **'శ్రీం'**కారం. పరీవాహరూపంలో ఉన్న శక్తికి సంబంధించిన **'హ్రీం'**కారం ఉన్నాయి. కుండలినీ మంత్రమంటే ఈ మూడు బీజాలే.

'శ్రీమాత్రే నమః'కి ఈ మూడు బీజాక్షరాలు కలిపితే అది కుండలినీ మంత్రము. ఇది గురువు ద్వారా పొందవలసినదే అని గ్రహించాలి. **'వక్త్రలక్ష్మీపరీవాహ చలన్'** – ఆ పరీవాహంలో కదులుచున్న **'మీనాభలోచనా'** – చేపల వంటి కన్నులు కలది. అమ్మవారి కనులు ధ్యానం చేసినప్పుడు ఆ వదనం కూడా అంత చక్కగా కనబడుతుంది. ఇప్పుడు రెండుకళ్ళా! మూడు కళ్ళా! ఏదైనా ఫరవాలేదు. ఏమైనా

ఏతత్తే వదనం సౌమ్యం లోచనత్రయభూషితమ్

పాతు నః సర్వభూతే(భీతి)భ్యః కాత్యాయని నమోస్తుతే

అని సప్తశతి చెప్తోంది. అమ్మా! నీ సౌమ్యమైన వదనంలో ప్రకాశిస్తున్న మూడు కళ్ళు మమ్మల్ని కాపాడుగాక! అలా అమ్మవారి వదనంలో నేత్రాలకు చాలా ప్రాధాన్యం ఉంది. **అరుణాం కరుణాతరంగితాక్షీం** – అందులోంచే కరుణ తరంగితం అవుతోంది. తరంగితము అంటే ప్రవాహమే. తరంగము అంటే పౌనఃపున్యం. కరుణ తరంగంవలె నిరంతరం వస్తోంది. ఆ కరుణాప్రవాహానికి ఆపు లేదు. అది ఆగితే ప్రపంచం నడక ఆగిపోతుంది. ఆ కన్నుల్లోంచి నిరంతరం శక్తి ప్రవాహాలు వస్తూ ప్రపంచాన్ని నడుపుతున్నాయని అమ్మవారి దివ్య నయన సౌందర్యాన్ని ఇందులో భావన చేస్తున్నారు.. 'మీనాక్షీ' అనే నామమే ఇది.

19. నవచంపకపుష్పాభనాసాదండవిరాజితా

– శ్రీ నవచంపకపుష్పాభనాసాదండవిరాజితాయై నమః

అమ్మవారి 'నాసాదండం' అనగా ముక్కుదూలం నవచంపక అన్నారు. నవ–నిత్యనూతన స్ఫురణ ఎక్కడా పోనివ్వట్లేదు. చక్కగా విచ్చుకున్న పసిమి రంగు కల సంపంగి ఎలా ఉంటుందో దాని వలె ప్రకాశిస్తున్న 'నాసాదండం'. ఇందులో

అజపామంత్ర స్వరూపం చెప్పబడుతోంది. దేవతాస్వరూపం అర్థం చేసుకోవాలంటే మంత్రస్వరూపం తెలియాలి. అజపా స్వరూపాన్ని ఎలా చూడాలో చెప్పారు.

'నాసాదండం నవచంపకం' అని చెప్పడంలో ఆకృతి మాత్రమే కాదు. చక్కని పరిమళం వాయు లక్షణం. అమ్మవారి నాసిక పరిమళము ప్రాణశక్తి. రేకులుగా విచ్చుకోవడం ఉచ్ఛ్వాస, నిశ్వాసలుగా వికసించిన శక్తి. **'హ'**కార, **'స'**కారాలనే అజపామంత్రాక్షరాలు ఇందులో చెప్పబడుతున్నాయి. 'స'కార, 'హ'కారాలే రేకులు. ఆ రేకులతో విచ్చుకుంటూ ప్రసరిస్తున్న ప్రాణశక్తి రూపమైన అజపా స్వరూపమే **'నవచంపకపుష్పాభనాసాదండవిరాజితా'.**

20. తారాకాంతితిరస్కారినాసాభరణభాసురా
– శ్రీ తారాకాంతితిరస్కారినాసాభరణభాసురాయై నమః

నక్షత్రాల కాంతులను తిరస్కరిస్తున్న నాసాభరణంతో ప్రకాశిస్తున్నది. నాసాభరణము అంటే ముక్కుకి ధరించిన ఆభరణం. ఒకటా! రెండా! మూడు చెప్పుకోవాలి. అమ్మవారి నాసికకు మూడువైపులా రమ్యమైన ఆభరణాలు ఉన్నాయి. అవి కుడి, ఎడమ, మధ్యలో అమ్మ అలంకరించుకున్నారు. ఈ అలంకారంలో కూడా విశేషం ఉంది.

భారతీయ అలంకారాలు కూడా యోగశాస్త్రాన్ని అనుసరించే ఉంటాయి. కేవలం అలవాటై దాని విలువ తెలియకపోవడం వల్ల దానిని విడిచిపెడుతున్నారు. మన కట్టు, బొట్టు, ఆభరణాలు, అలంకారాలు మార్చేయడానికి కారణం– కొత్తగా కనబడాలని తప్ప మరేం లేదు. కానీ ఇవి వర్ణించేటప్పుడు ఒక విషయం పరిశీలించాలి. అమ్మవారి అలంకారాలన్నీ గమనిస్తే పూర్తి సంప్రదాయబద్ధంగా అలంకృతమైన ఒక భారతీయ ముత్తైదువలా కనబడుతోంది. అమ్మవారి రూపం ఋషులు తపస్సులతో దర్శించారు. అమ్మవారి చుట్టూ పరిచర్యలు చేసుకునేవారు కూడా అమ్మవారి వలె మంగళకరములైన అలంకారాలతో ఉంటారు. దేవకాంత లందరూ ఇలా ఉంటారని మానవులు దేవతలంత గొప్పవారవ్వాలని దేవతల కట్టూ,

బొట్టూ మానవులకు ఋషులు అలవాటు చేసిన జాతి భారతజాతి. దీనివల్ల మనం దేవతలకి దగ్గర కావాలి.

అమ్మవారి ఆభరణాలన్నీ దేవతాస్వరూపాలు. 'ఆభరణస్తుతి' అని ఒక స్తోత్రం ఉంది. శ్రీవిద్యారహస్యం, మంత్రసంకేతాలు ఈ స్తుతిలో ఉన్నాయి. ఒక ఆభరణాన్ని ధ్యానించారంటే మనకు తెలియకుండానే ఆ మంత్రం అనుసంధానమైపోతుంది. మంత్రశక్తులు సామాన్యులకి అందవు కనుక పెద్దవాళ్ళు నామాలుగా ఇచ్చేశారు. అందులో తెలియకుండానే అన్నీ నిక్షిప్తం చేశారు. అమ్మవారు ఏం ధరించిందో కూడా శాస్త్రం వర్ణిస్తుంది. అమ్మవారి నాసాభరణాలు ఎలా ఉంటాయో ఇతర శాస్త్ర సహాయంతో తెలుసుకోవాలి. అమ్మవారు కుడిముక్కుకి పగడపు ముక్కెర ధరించింది. ఎడమముక్కుకి వజ్రపు ముక్కెర ధరించింది. పగడం, వజ్రం, శుక్ర–కుజ గ్రహాలకి చిహ్నాలు. మధ్యలో బులాకీగా ముత్యం వ్రేలాడుతోంది. **'నాసాగ్రే నవమౌక్తికం'** కృష్ణునికా! అమ్మవారికా!... కృష్ణుడే అమ్మవారు... ఇదో పెద్ద రహస్యం. ఆ బులాకీని ఎన్నో రకాలుగా వర్ణించారు. **'అమ్మవారి చిరునవ్వనే పిల్లవాడు ఆ బులాకీ పట్టుకుని ఆడుకుంటున్నాడు'** అని వర్ణించారు మూకకవి. ఆ బులాకీ వ్రేలాడుతూ అందంగా ప్రకాశిస్తోంది. కుడివైపు ఎరుపుపగడం, ఎడమవైపు తెలుపువజ్రం ప్రకాశిస్తున్నాయి. రత్నప్రకారంగా శుక్రుడు, కుజుడు. మధ్యలోది చంద్రుడు.

మరొక భావన – పగడపు ఎరుపు రంగు సూర్యసంబంధమైన తేజస్సు. వజ్రపు తెలుపు రంగు చంద్రసంబంధమైన తేజస్సు. నాడీమండల వ్యవస్థలో ప్రాణరూపంలో నిత్యం మనలో సంచరిస్తున్నది అమ్మవారే. కుడివైపు ఉన్న పింగళానాడి–సూర్యనాడి. సూర్యసంబంధమైన ఎరుపు ప్రకాశిస్తోంది. ఎడమవైపు ఉన్న ఇడానాడి–చంద్రనాడి. చంద్ర సంబంధమైన వర్ణము తెలుపు. ఆ మధ్యలో సుషుమ్నకి సంకేతంగా ఆ చల్లగా ప్రకాశిస్తూ భాసిస్తున్న ఆ భవ్యమైన ముత్యం. మూడు నాడీ స్వరూపాలు చెప్పడానికై మూడు రకాలైన ఆభరణాలు చూపిస్తున్నారు. ఇది ఆ నాసాభరణాలను ధ్యానించవలసిన విశేషం.

21. కదంబమంజరీక్లుప్తకర్ణపూరమనోహరా

- శ్రీ కదంబమంజరీక్లుప్తకర్ణపూరమనోహరాయై నమః

అమ్మవారు కడిమిపూల గుత్తి అలంకరించుకున్నారు. అది జుట్టు నుండి చెవులలోంచి వ్రేలాడి బయటకి వస్తోంది. క్లుప్త అనగా కూర్చిన అని అర్థం. ఆ కదంబపువ్వుల గుత్తితో కూర్చిన అందమైన చెవులు కలది. కడిమిపూలు రకరకాలు ఉన్నాయి. అక్కడ చెవుల దగ్గర అలంకృతమయ్యేవి ఎలాంటివో అలాంటివే ధ్యానించుకోవాలి.

22. తాటంకయుగళీభూతతపనోడుపమండలా

- శ్రీ తాటంకయుగళీభూతతపనోడుపమండలాయై నమః

అమ్మవారి చెవులు వాయుతేజస్సుతో ఏర్పడ్డాయి. వాయుసంబంధమైన దేవత ఇక్కడ ప్రకాశిస్తున్నది. దిగ్దేవతల యొక్క స్వరూపమిది. ఇది విరాడ్భావనతో తెలుసుకోవాలి. చెవులు నిరంతరం దేవతలు, ఋషులు చేసే స్తుతులన్నీ వింటూ ఉంటాయి. అమ్మవారి తాటంకాలను ధ్యానిస్తే మాంగళ్యాలు స్థిరంగా ఉంటాయి. **'తాటంక ధారణం స్త్రీణాం భర్తురాయుష్య వర్ధనం'** అని శాస్త్రం. తాటంకాలు ధరిస్తే భర్త యొక్క ఆయుష్షు పెరుగుతుంది. ఒకొక్క ఆభరణానికి ఎంతో ప్రభావం ఉంది. భర్త ఆయుష్షుని కోరుకునేవారు వాటిని ధరించాలి. ఋషులు ఇచ్చిన సంకేతాలను పరిశీలించాలి. **'తాటంకయుగళీభూత-తపన-ఉడుప-మండలా'** అంటే తపన మండలం, ఉడుప మండలం. తపన మండలం అంటే సూర్యమండలం. ఉడు అంటే నక్షత్రం. ఉడుప అనగా నక్షత్రాలకు ప్రభువు 'చంద్రుడు'. 'ఉడుప మండలం' అంటే 'చంద్రమండలం'. అమ్మవారి చెవులకి తపనమండల, ఉడుపమండలాలు రెండు తాటంకములు. ఈ రెండు అమ్మవారి చెవులకి తాటంకాలంటే అమ్మ శరీరం 'విశ్వవిగ్రహా'గా భావన చెయ్యాలి. ఇది ఒక వైదికమైన సంప్రదాయం ప్రకారం వర్ణిస్తున్నారు. ఎలా చూడాలో శాస్త్రమే మనకి చెప్తోంది - ఎక్కడినుండో తెచ్చుకోనక్కర్లేదు. అందుకు ఈ శ్లోకం ప్రమాణం:

సూర్యచంద్రౌ స్తనౌ దేవ్యాః తావేవ నయనే స్మృతే
ఉభౌ తాటంకయుగళం ఇత్యేషా వైదికీశ్రుతిః

అని ప్రమాణం. తాటంకయుగళం–సూర్యచంద్రులే. నేత్రములు–సూర్యచంద్రులే. వక్షఃస్థలం–సూర్యచంద్రులే. ఒకే సమయంలో నేత్రాలను, చెవులని, వక్షఃస్థలాన్ని కూడా భావించవచ్చు. ఎప్పుడైనా దేవతారూపం చూసినపుడు అది విశ్వశక్తి రూపమని, సర్వదేవతాత్మకమని, సర్వమంత్రాత్మకమనే భావన కలగాలి. ఈ మాట అమ్మవారి రూపవర్ణన అయ్యేవరకూ గుర్తుపెట్టుకోవాలి. వికారభావాలు కలగకూడదు. తామస ప్రవృత్తి ఉన్నంతకాలం ఆరాధన ప్రారంభంలో సాధనలో దుర్భావాలే కలుగుతూ ఉంటాయి. సాధన పెరుగుతున్న కొద్దీ ఈ దుర్భావాలు తొలగుతూ ఆ జగన్మాత దివ్యస్వరూపం అవగాహనకి వస్తుంది. ఏ మాత్రం సాధన లేనివారే ఈ వర్ణనల గురించి నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ కొత్తపాపాలు తెచ్చుకుంటూ ఉంటారు.

సూర్యచంద్రులు అమ్మవారు పెట్టిన గొప్పవ్యవస్థ. వీరి ద్వారానే మొత్తం జరుగుతోంది. వీరు లేకపోతే చూపు లేదు. నేత్రాల యందు కూడా ఆ సూర్యుడే భాసిస్తున్నాడు. అలాగే మనస్సు. మనస్సు మరొక దృష్టి. కొంతమంది కళ్ళు మూసుకుని కూడా కనబడుతోంది అంటారు. అప్పుడు చూస్తున్నది మనస్సే. దానికి అధిపతి చంద్రుడు. మన దృష్టికి సూర్యుడు, చంద్రుడు ఇద్దరూ ప్రధానమే. సూర్యచంద్రులు లేకపోతే బయటా చూడలేం. ఇంద్రియాలు కూడా పనిచెయ్యవు. చూపు బయట, లోపల కూడా ఉండాలి.

విశ్వంలో ఉన్న సర్వదేవతలు మనలో ఉన్నారు. అమ్మ 'దేవకార్యసముద్యతా'. వారి కార్యం చేయించడం ఆవిడ పని. ఆవిడ హృదయంలో కూర్చుని శరీరంలో ఉన్న ఇంద్రియ చైతన్యాలని పని చేయిస్తోంది. అదే 'దేవకార్యసముద్యతా'. ఆవిడ హృదయంలో కూర్చుంటేనే ఈ దేవకార్యాలు జరుగుతుంటాయి. హృదయంలో ఉన్న అమ్మను ధ్యానం చేస్తే మన దేవకార్యాలన్నీ బాగా జరుగుతాయి. అమ్మవారి ఆరాధన చేసేవారి ఇంద్రియాలకు తప్పకుండా పటుత్వం ఇస్తుంది తల్లి. దేవకార్యములన్నీ

ఆవిడవే. ఇంద్రియకార్యాలన్నీ ఆవిడవే. ఇంద్రియాల యందు ఆ దేవతలుండాలి. బయటా ఆ దేవతలు ఉండాలి. కనుక సూర్యచంద్రులు బయటా ఉన్నారు. మనలోనూ ఉన్నారు. మన శరీరంలో ఉన్న స్థానం, బయట ఉన్న విరాట్ స్థానము రెండూ ఇక్కడ భావన చెయ్యాలి. విశ్వంలో ఉన్న సూర్యచంద్రులు ఎల్లవేళలా అమ్మవారికి సాక్షిరూపంగా ఉండి వారు చూసినవన్నీ అమ్మవారి చెవులలో చెప్తుంటారు. మనం చేసే పనులను చూసేటప్పుడు నేత్రస్థానంలో ఉన్నారు. అమ్మవారికి వినిపించేటప్పుడు అమ్మవారి చెవుల దగ్గరికి వెళ్ళి కూర్చున్నారు. ఇదీ తాటంకయుగళమంటే. ఎవ్వరూ అమ్మవారి కన్ను కప్పలేరు.

శబ్దాలన్నింటికి మూలం సూర్యుడే. **'త్రయీమయాయ త్రిగుణాత్మధారిణే'.** శబ్దరూపంగాను, దర్శనరూపంగాను రెండు చూశాం.

స్తనాలు పోషణశక్తులు. సూర్యుడు లేకపోతే అన్నం ఉందా? చంద్రుని వల్లనే ఓషధులన్నీ పండుతున్నాయని భగవద్గీతలో కూడా స్వామి చెప్పారు. **'పుష్ణామిచౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః'** – చంద్రుడనై నేను ఓషధులను పండిస్తున్నాను. అలాగే సూర్యుడు ప్రాణశక్తిని ఇస్తున్నాడు. వృక్షములన్నీ సూర్యుని నుండి ఆహారాన్ని పొందితే వాటినుండి మనం ఆహారం పొందుతున్నాం. ఆదిత్యహృదయమంతా అదే చెప్తోంది. అన్నములు ఇస్తున్నవారు సూర్యచంద్రులు. పిల్లవానికి తల్లి ఆహారం తన వక్షఃస్థలం నుండే ఇస్తుంది. అదేవిధంగా ప్రపంచంలో అందరం అమ్మవారి పిల్లలం. మనకి ఆహారం సూర్యచంద్రుల ద్వారానే వస్తోంది కనుక సూర్యచంద్రులనే అమ్మవారికి వక్షఃస్థలంగా భావన చేశారు. సాక్షిగా గమనించేటప్పుడు 'నేత్రస్థానం'. ఎప్పటి విషయాలు అప్పుడు అమ్మవారి చెవులో చెప్తున్నప్పుడు, నివేదించేటప్పుడు అవి 'తాటంకస్థానం'. మనల్ని పోషించేటప్పుడు అవే 'వక్షఃస్థలస్థానం'.

ఇదే సూర్యచంద్రులని దర్శించాల్సిన విధానం.

'తారాకాంతితిరస్కారి'కి – **'తాటంకయుగళీభూత'**కి సంబంధం చూస్తే అమ్మవారి శరీరం జ్యోతిర్మయం. తారాకాంతితిరస్కారికి నక్షత్రకాంతినే ధిక్కరిస్తోందని

అర్థం. గ్రహాలు, నక్షత్రాలని రెండున్నాయి. గ్రహాల్లా ఉంటూ మెరిసిపోతూ ఉండేవి రెండున్నాయి. అవి శుక్రుడు, కుజుడు. వీటికి తారలు అని పేరు. తారాకాంతితిరస్కారి అంటే వారిని మించిపోయి ప్రకాశిస్తున్నది అని చెప్పడం ఒక అర్థం. నక్షత్రం యొక్క వెలుగుని చూస్తున్నాం. నిజానికి అది ఆకాశంలో కొన్ని కాంతి సంవత్సరాలు దూరంలో ఉంది. ఎన్నో కాంతి సంవత్సరాల దూరం ఉన్న తార యొక్క కాంతి మనదాకా ప్రసరిస్తోంది. దానిని మించిపోయి అమ్మ నాసాభరణ ప్రకాశం ప్రసరిస్తోందంటే అమ్మవారి శరీరం నుండి ప్రసరించే ఆభరణకాంతి ముందు ఎంత దూరమైనా ప్రసరించగలిగే నక్షత్రకాంతులు కూడా దిగదుడుపే.

అమ్మ శరీరకాంతులు విశ్వంలో ఎంతదూరమైనా ప్రసరించగలవు. ఒక్కసారి కన్యాకుమారి ముక్కెరని ధ్యానం చేసుకుంటే చాలు. 'తాటంకయుగళీభూత' అన్నప్పుడు జ్యోతిర్మండలాల విశేషాలు చెప్పారు. ఈ జ్యోతిర్మండలాలన్నీ విశ్వశరీరంలో ఉన్నాయి. విశ్వమే అమ్మ యొక్క రూపము.

23. పద్మరాగశిలాదర్శపరిభావికపోలభూః

– శ్రీ పద్మరాగశిలాదర్శపరిభావికపోలభువే నమః

అమ్మవారి కపోలాల్లో ఎక్కువగా శంభుని తేజస్సే ఉంది. ముఖంలో ఎక్కువభాగం ఆక్రమించేవి బుగ్గలే. కపోలాలు నునుపుగా నిగ్గుతేలి ఉంటే అద్దాలతో పోలుస్తారు. అద్దాలలాంటి చెక్కిళ్ళని లోకంలో కూడా వ్యవహారం ఉంది. అమ్మవారి ముఖంలో ఎరుపుదనం కూడా ఉంది. అద్దం అంటే తెల్లని అద్దం అని ఊహిస్తామని 'పద్మరాగశిల ఆదర్శ' అన్నారు. బాగా పదును తేలిన పద్మరాగమణులలో చూస్తే ముఖం కనబడుతుంది. పద్మరాగమణులు పెద్దవి తీసుకొచ్చి వాటిని సానబట్టి అద్దంలా చేస్తే ఎలా ఉంటాయో అలా అమ్మవారి బుగ్గలు ఉన్నాయని వర్ణించారు. అందులో ఎఱ్ఱదనమూ ఉంది. అద్దంలా పారదర్శకత కూడా ఉంది. ఆదర్శము అనగా అద్దం అని అర్థం. పద్మరాగములతో చేసిన అద్దాల యొక్క సౌందర్యాన్ని మించిపోయి ప్రకాశిస్తున్న చెక్కిళ్ళు కలది.

24. నవవిద్రుమబింబశ్రీన్యక్కారిరదనచ్ఛదా

– శ్రీ నవవిద్రుమబింబశ్రీన్యక్కారిరదనచ్ఛదాయై నమః

అమ్మవారి అద్భుతమైన పెదాలు వర్ణిస్తున్నారు. ఓష్ఠం, అధరం అని రెండు ఉంటాయి. వ్యవహారంలో రెండింటిని అధరాలు అంటారు లేదా రెండింటిని ఓష్ఠాలు అనేస్తారు. 'ఓష్ఠము' అంటే పై పెదవి. 'అధరము' అంటే క్రింది పెదవి. రెండు కలిపి **'రదనచ్ఛదా'** అన్నారు. 'ఛ్ఛదా' అంటే తెర. 'రదనచ్ఛదా' అనే దానికి తెలుగుమాట **'వాతెర'**. వాక్కు–వా, దానికి **తెర–వాతెర**. ఇది మూసేస్తే తెర, తెరిస్తే పలుకు. వాతెర అని చెప్పారంటే రెండు పెదవులని కలిపి చెప్పారు. రెండు పెదవులకి కలిపి చెప్పేటప్పుడు **'రదనచ్ఛదా'**. పెదవుల తెర. **'న్యక్కారి'** అంటే తిరస్కరించిన, ఓడించిన అని అర్థం. అమ్మవారి పెదవుల ఎరుపుదనం పగడము, దొండపండుల యొక్క ఎరుపుదనాన్ని ఓడిస్తోంది.

'నవవిద్రుమ' అంటే కొత్తదయిన పగడం. 'బింబం' అంటే దొండపండు. పైన ఉన్న పెదవి ఓష్ఠం పగడం కంటె అందంగా ప్రకాశిస్తోంది. క్రింద పెదవి దొండపండు కంటె ఎర్రగా అందంగా ప్రకాశిస్తోంది. **'ఏ'**కార, **'ఐ'**కార మంత్రశక్తులు దీనిలో దాగి ఉన్నాయి. న్యక్కారి, పరిభావి, తిరస్కారి శబ్దాలు గుర్తుపెట్టుకోవాలి.

25. శుద్ధవిద్యాంకురాకారద్విజపంక్తిద్వయోజ్జ్వలా

– శ్రీ శుద్ధవిద్యాంకురాకారద్విజపంక్తిద్వయోజ్జ్వలాయై నమః

అమ్మవారి పెదవుల నడుమ నవ్వుని వర్ణించారు. నవ్వు అంటే పలువరుస కనబడుతోంది. ఇది మామూలు మంత్రం కాదు. అన్ని నామాలలోనూ బీజాక్షరాలు దాగి ఉన్నాయి గాని కొన్ని నామాలు చెప్పకుండా ఉండలేం. అందులో ఉన్న ఆ రహస్యాలు బయటకు తీయాల్సిందే. **'శుద్ధవిద్య అంకురాకార ద్విజపంక్తి ద్వయోజ్జ్వలా'.** ఈ నామాల్లో సంకేతాలు దాగి ఉన్నాయి కనుక రహస్యనామాలు అన్నారు. 'ద్విజపంక్తి' అంటే పలువరుస. సాధారణంగా దంతాలు మొదట వచ్చి, మళ్ళీ వయస్సుపెరిగాక ముందువి పోయి మళ్ళీ వస్తాయి. ద్విజ అని దంతాలకు పేరు. ఉపనయన సంస్కారం కలిగిన వారికి ద్విజులని పేరు. దీక్ష పొందక పూర్వం ఒక జన్మ. దీక్ష పొందిన

తరువాత మరొక జన్మ.

దీక్షితులైన వారికి కూడా ద్విజశబ్దం చెప్పుకోవచ్చు. సర్వవర్ణస్థులకి అమ్మవారి దీక్ష వారి వారి పద్ధతులను అనుసరించి ఉంది. ద్విజ అంటే దీక్షపూర్వం, దీక్ష తరువాత జన్మ అని చెప్పవచ్చు.

ద్విజసంఖ్య సాధారణంగా వేదవేత్తలకే వ్యవహారం కనుక ఇక్కడ వేదవేత్తల అర్థం కూడా స్వీకరించవచ్చు. వేదవేత్తల వలె ప్రకాశిస్తున్నదని చెప్పవచ్చు.

ద్విజ శబ్దంలో రెండు అర్థాలు. ఒకటి దంతములు. రెండు వేదవేత్తలు. ఉపాసకులని మరొక అర్థం ఉంది. ఈ అర్థాలు అన్వయం చూస్తే అమ్మవారి పలువరుస శుద్ధంగా అనగా ధవళకాంతులతో తేటగా, నిర్మలంగా ప్రకాశిస్తూ ఉంది.

శుద్ధవిద్య మొలకలవలె ఉన్న పలువరుస కలది.

మిగిలిన వాటిని చెప్పేటప్పుడు దొండపండులా ఉంది, పగడంలా ఉందని చెప్తే వస్తువులు అర్థమవుతాయి. ఇక్కడ వస్తువులేవీ చెప్పలేదు. మల్లెమొగ్గలా ఉంది అని చెప్పడం లేదు. ఇక్కడ పోల్చి చెప్తున్నది శుద్ధవిద్య యొక్క మొలకలవలె ఉందన్నారు. ఇది చాలా రహస్యనామం. 'ఉజ్జ్వలా' అంటే ప్రకాశం. అమ్మపెదవుల నడుమ ఉన్న పలువరుస అంత అందంగా ఉంది.

శుద్ధవిద్య యొక్క అంకురములు అన్నారు. విద్యలలో బ్రహ్మవిద్య మాత్రమే శుద్ధవిద్య. మిగిలిన విద్యలన్నీ లౌకిక విద్యలే. అదే పరావిద్య. శుద్ధవిద్య అంటే **'సా భవతి శుద్ధవిద్యా యే దంతాహంత యోరభేదమితి'** 'ఇదంతా', 'అహంతా' భేదాలు లేనిది ఏదో అది శుద్ధవిద్య. తెలుగులో 'ఇదంతా' కాదు. సంస్కృతంలో 'ఇదంతా' శబ్దానికి... 'ఇదం' అని చెప్పేదే 'ఇదంతా'. సృష్టిలో ఏ వస్తువునైనా చూపించి 'ఇదం' అంటున్నారు. 'ఇదం' అనగా జగత్తు(ప్రపంచం) అని అర్థం. మనకి తెలిసింది 'ఇదం' ఒక్కటే తప్ప మరొకటి లేదు. ఎక్కడో ఉందంటే తెలియదు కనుకనే అది అంటున్నాం కానీ అది అనేది ఏదీ లేదు. మనల్ని అక్కడకు తీసుకువెళ్తే అది కూడా 'ఇదం' అనే అంటాం. 'ఇదం' అంటే ప్రపంచం. కనుక సృష్టిలో ఇదం-ప్రపంచం, అహం-పరమాత్మ. అహం పరమాత్మ కనుక అహం అంటే అర్థం 'నేను'. నేను

పరమాత్మని. నేను అని మనం ఈ శరీరాన్ని చూపిస్తున్నాం. కానీ 'ఇదం' అని జగత్తుని చెప్పాం. 'ఇదం' జగత్తు అయినప్పుడు, అహం పరమాత్మ అయినప్పుడు 'ఇదం' అని మనం ఏ శరీరాన్ని చూపిస్తున్నామో ఆ శరీరం అహం కాదు అని అర్థం చేసుకోవాలి. అలా 'ఇదం' అని మనం ఏం చూపిస్తున్నామో అది ఏదీ అహం కాదు. **'యుష్మత్ ప్రత్యయః, అహం ప్రత్యయః'** – ఈ రెండింటి గురించి తెలుసుకోవడమే బ్రహ్మసూత్రభాష్యంలో మొదట శంకరులు చెప్పారు. అదే ఇక్కడ శుద్ధవిద్య. 'ఇదం' అని ఏం చూపిస్తున్నామో అదేదీ మనం కాదు. ఇంతవరకూ మన శరీరమే నేను అనుకుంటున్నాం. కానీ అది మనం కాదు – 'ఇదం' అయిపోయింది. 'ఇదం' అనుకున్న ఉపాధులన్నీ తీసేస్తే, ఆ 'ఇదం' దేనివల్ల ప్రకాశిస్తోందో ఆ 'అహంతా' అనగా అహం రూప చైతన్యమే ప్రపంచంలో అంతటా ఉంది. 'ఇదం' అనేది ఉపాధి లక్షణం. 'అహం' అనేది పరమాత్మ లక్షణం. ఉపాధులన్నీ ఇదమే(ప్రపంచమే). ప్రపంచమంటే మనం చుట్టూ చూసేది మాత్రమే కాదు. మన శరీరం మొదలుకొని అంతా ప్రపంచమే. మరి అహం ఎవరు? మన శరీరంతో మొదలుకొని ప్రపంచం అంతటిని ఎవరు సాక్షిగా చూస్తున్నాడో ఆయన అసలు 'అహం'. ఆయనే 'బ్రహ్మము'.

శుద్ధవిద్య అంత తేలికగా అర్థం కాదు. ఇప్పుడు 'ఇదంతా–అహంతా'లో 'ఇదం' అంటే ప్రపంచమని, అహం అంటే పరమాత్మ అని అనుకుంటున్నాం. పరమాత్మ వేరు, ప్రపంచం వేరు అనుకుంటున్నాం. 'ఇదంతా' అని మనం చెప్పే ప్రపంచమంతా పరమాత్మ కాదు. అహమే పరమాత్మ, అహమే పరమాత్మ అని తెలుసుకున్నాక అప్పుడు ప్రపంచమంతా పరమాత్మయే అని తెలుస్తుంది. ఇందాక మనం ప్రపంచమంతా పరమాత్మ కాదనుకున్నాం. ఇప్పుడు ప్రపంచమంతా పరమాత్మ అంటున్నాం. **'సర్వం బ్రహ్మమయం జగత్'**, **'సర్వమున్నతని దివ్యకళామయమంచు విష్ణునందుల్లము చేర్చి.....'** అని చెప్పినట్టుగా ఉపాధి దృష్టితో చూస్తే ఈ శరీరం **'ఇదం'**. ఉపాధులన్నింటిలో చైతన్యంగా ఎవరు వ్యాపించి ఉన్నారో అది **'అహం'**. మీలో, నాలో అందరిలో వ్యాపించింది.

చైతన్యం దృష్టితో పరిశీలిస్తే ఇదంతా అహంతాయే అని తెలుస్తుంది. భేదం

లేదు. ఉన్నది ఒక్కటే. రెండు లేవని తెలుస్తుంది. ఉన్నది ఒక్కటే అని చెప్పడాన్ని **'అద్వైతం'** అంటారు. **ఈ అద్వైతవిద్యనే శుద్ధవిద్య అంటారు.** ఆ శుద్ధవిద్యే అమ్మవారి నవ్వు. అమ్మవారి నవ్వు చూస్తే మనకి జ్ఞానం రావాలి. ఆ పళ్ళు శుద్ధవిద్య యొక్క అంకురం వలె ఉన్నాయి అంటే శుద్ధవిద్య యొక్క ఉదయంగా ప్రకాశిస్తున్నది. శుద్ధమైన బ్రహ్మవిద్యయే అమ్మవారి వదనంలో ప్రకాశిస్తున్నది. అమ్మవారిముఖం **'వాగ్భవకూటం'.**

వాగ్భవకూటం అంటే జ్ఞానకూటం. ఇదంతా జ్ఞానం. మన శరీరంలో కూడా జ్ఞానస్థానం వదనమే. ఆవిడ ఇస్తేనే మనకి వచ్చింది. అమ్మవారి ముఖమంతా జ్ఞానస్వరూపం. జ్ఞానంలో ఉన్న అసలు జ్ఞానం శుద్ధవిద్య. అది అమ్మవారి నవ్వులో ప్రకాశిస్తున్నది.

మరొక అర్థంలో షోడశీవిద్యనే శుద్ధవిద్య అంటారు. అది బ్రహ్మవిద్యే. పదహారు అక్షరాల మహామంత్రం. బీజాక్షరాలు సభలలో చెప్పరాదు. గురుముఖతః తెలుసుకోవల్సిందే. ప్రసిద్ధిచెందిన పంచదశీ విద్యకి ఒక బీజాక్షరం కలిపి షోడశీ అంటారు. ఇదొక పద్ధతి. అలా కాకుండా పంచదశీ అని ఏదైతే పదిహేను అక్షరాలు ఉన్నాయో దానిని మూడు కూటాలు చేస్తే, ఒకొక్క కూటం ఒకొక్క అక్షరం. పదిహేను అక్షరములు కలిపి మూడు అక్షరములు అయ్యాయి. ఈ మూడు బీజాక్షరాలకు మరొక పదమూడు బీజాక్షరాలు కలిపితే దానికి మహాషోడశీవిద్య అని పేరుంది. ఇది పరావిద్య, 'శ్రీ షోడశాక్షరీవిద్య' ఇదే. ఈ పదహారు అక్షరాలే అమ్మవారి యొక్క మంత్రరూపం.

ముఖం నుండే శబ్దాలు రావాలి. నోటి నుండి వచ్చే ఆ మంత్రవిద్యయే అమ్మవారి దంతాలుగా కనబడుతున్నది. పదహారు అక్షరాలే అమ్మవారి దంతాల వరుస. ఈ పదహారు అక్షరాలు ప్రతిదానిలో రెండు. ఒక దాంట్లో దళాలులా ఉంటాయి. ఒక దళంలో రెండేసి ఉంటాయి. పదహారు అక్షరాలలో ఒక దాంట్లో శివభాగం, శక్తిభాగం ఉంటాయి. ఈ శివభాగం, శక్తిభాగాలుగా విభజిస్తే మొత్తం ముప్పైరెండు దళాలు. పదహారు అక్షరాలలో ఆ ముప్పైరెండు దళాలే ముప్పైరెండు

దంతాలుగా అమ్మ యందు ప్రకాశిస్తున్నాయి.

శుద్ధవిద్యలుగా చెప్పబడే విద్యలు కొన్ని ఉన్నాయి. దత్తాత్రేయసంహితలో ముప్పయిరెండు శుద్ధవిద్యలు చెప్పారు. అవన్నీ భాస్కరరాయలవారు ఉదాహరణలుగా తెలియజేశారు. దత్తాత్రేయులవారు దత్తాత్రేయసంహిత అని అమ్మవారి విద్య గురించి అద్భుతమైన గ్రంథాన్ని రచించారు. దత్తాత్రేయులు అంటేనే బ్రహ్మవిద్యారూపుడు. బ్రహ్మవిద్యారూపులు బ్రహ్మవిద్యయే చెప్తారు. దత్తాత్రేయులవారు అమ్మవారి విద్యనంతటికి కల్పం రచించారు. మొత్తానికి దత్తాత్రేయులు, దక్షిణామూర్తి, హయగ్రీవస్వామి కలిపి చెప్పిన విద్యయే 'శ్రీవిద్య'. శ్రీవిద్యలో దత్తాత్రేయుడు ఉన్నాడు.

ఆయన పద్దెనిమిదివేల శ్లోకాలతో దత్తాత్రేయసంహిత రచించారు. ఆయనను గురువుగా స్వీకరించి ఉపదేశం పొంది మొత్తం అమ్మవారి అనుగ్రహాన్ని ఉపాసనాఖండం నుంచి జ్ఞానఖండం వరకూ ఇచ్చారు పరశురాముడు. ఉపాసనాఖండం అంటే ముందు జరిగిన సాధన. దాని జ్ఞానంతో అనుభవంలోకి వెళ్ళిపోయాడు పరశురాముడు. దత్తాత్రేయునికి గొప్పశిష్యుడు. పరశురాముడు దత్తాత్రేయుల వద్ద శ్రీవిద్యారహస్యాలు తెలుసుకున్నారు. అదే 'త్రిపురారహస్యం' అనే గ్రంథం. 'శ్రీవిద్య'కి సంబంధించిన గ్రంథాలు దగ్గర పెట్టుకుంటే తెలుసుకోవడానికి జీవితం చాలదు. అందులో కొన్ని గ్రంథాలు చదువుకున్నా చాలు మరి పుట్టే అవసరం రాదు. దత్తాత్రేయసంహితను పరశురాములవారు ఉపదేశంగా పొంది, అనుష్ఠానం చేసి, ఆరువేల శ్లోకాలలో రచించారు. దానికి పరశురామ కల్పసూత్రములని పేరు. సుమేధ అనే మహర్షి ఈ పరశురాముని ద్వారా ఈ విద్యని గ్రహించారు.

ఇదిగాక వశిష్ఠుని శ్రీవిద్యా ఆగమం ఒకటుంది. దీన్ని దక్షిణాచార సంప్రదాయంలో స్వీకరిస్తారు. వశిష్ఠాగమంలో పదహారు విద్యలు చెప్పారు. అవి 1.శుద్ధవిద్య 2.బాలావిద్య 3.మాతంగీవిద్య 4.గురుపాదుకావిద్య 5.గణపతిమంత్రం 6. సౌభాగ్యవిద్య 7.వారాహీవిద్య 8.తిరస్కరిణీవిద్య 9.లోపాముద్రావిద్య 10.తురీయవిద్య 11.ప్రాసాదవిద్య 12.పరాప్రాసాదవిద్య 13.షోడశీవిద్య 14.పరావిద్య 15.పరాషోడశీవిద్య 16.మహాపాదుకావిద్య. శుద్ధవిద్యతో మొదలై

అనుత్తారమంత్రదీక్ష వరకు 32 దీక్షలు తంత్రాలలో ప్రసిద్ధాలు.

ఈ విద్యలలో మళ్ళీ శివశక్తి భాగాలున్నాయి. అవి అమ్మవారి యొక్క ముప్ఫైరెండు దంతాలని వశిష్ఠాగమం చెప్తోంది. ఇందులో ఏది ప్రమాణం అంటే అన్నీ స్వీకరించవచ్చు. ఉపాసకునికి, శాస్త్రానికి మధ్య ఉండేవారే గురువు. అన్నివిద్యల్లాగే కలి ప్రభావంచేత కలికల్మషాలనుండి బయటపడడానికి పనికొచ్చే శ్రీవిద్యలో కూడా వాదవివాదాలు ఎక్కువైపోయాయి. ఎవరైనా భక్తిగా వారి గురువు చెప్పిన పద్ధతి ప్రకారంగా అనుష్ఠానం చేస్తుంటే ఎవరో మధ్యలో వచ్చి మీ సంప్రదాయం మంచిది కాదు అది వామాచారం అంటారు. ఇంకొకరు వచ్చి అది దక్షిణాచారం అంటారు. ఒకరిని వేరొకరు నిందించడం కూడదు. ఎవరి సంప్రదాయం వారికి శిరోధార్యం. ఎవరి సంప్రదాయాన్ని వారు అనుసరిస్తూ ఇతర సంప్రదాయాలని గౌరవించడమే అసలైన సంప్రదాయం. ఎంతవరకైతే సాధనలో బాహ్యం ఉంటుందో అంతవరకు రాజసమే. అయితే సాత్త్వికానికి వెళ్ళడానికి ఏదో ముందు బాహ్యం చేస్తున్నారు. అలా చేస్తున్నప్పుడు మరింత రాజసం పెంచుకుని తామసంలోకి దిగిపోయి వాదవివాదాల్లోకి వెళ్తే సాధకుడు అయోమయం అయిపోతాడు. శాస్త్రబాహుళ్యం పెరిగే కొద్ది అయోమయం పెరిగిపోతుంది. శాస్త్రానికి, సాధకునికి మధ్య ఉండాల్సినవారు గురువు.

శాస్త్రాలు అనేకం కనుక గురువు అవసరం వచ్చింది. గురువుగారు శాస్త్రపద్ధతిలో ఉన్న ఒక పరంపరని అనుసరించి చెప్తారు. ఆ ఉపాసనా బలం చేత అమ్మవారు అతనికి స్ఫురింపజేస్తారు. ఆయన చెప్పింది శిష్యుడు పాటించడమే.

మన గురువుగారి సాంప్రదాయాన్నే మనం అనుసరించాలి. మన గురువే మనకి దక్షిణామూర్తి. అమ్మవారి అనుగ్రహం కావాలంటే సాధకులైనవారి దృష్టి ఇలా మారాలని చెప్పడం జరుగుతోంది. దత్తాత్రేయసంహితలో మొత్తం ముప్ఫైరెండు శ్రీవిద్యా విశేషాలు చెప్పబడ్డాయి. అదేవిధంగా వశిష్ఠాగమంలో చెప్పబడ్డ పదహారు శ్రీవిద్యావిశేషాలు వాటి యొక్క శివశక్తిభాగాలు. అలాగే మహాషోడశీ అని చెప్పబడుతున్న దాని యొక్క పదహారు అక్షరాలు, వాటి యొక్క శివశక్తి భాగాలు.

ఇవి ముప్పదిరెండు దంతాల యందు భావించవలసినది.

ఎన్ని పలుకులు పలికినా నోటినుండే వస్తాయి. అన్ని పలుకులకి మూలం మాతృకావర్ణాలు. మాతృకావర్ణాలు అంటే ఏభై. అందులో కొన్ని ఒకే వర్ణపు విస్తారాలే. అ-ఆ, ఇ-ఈ. ఇ విస్తారమే ఈ. అలా కొన్ని అక్షరాలు మినహాయిస్తే ఆ ఏభై అక్షరాలలోంచి పద్దెనిమిది అక్షరాలు తొలగిపోతాయి. అప్పుడు ముప్పైరెండు అక్షరాలు మిగులుతాయి. ఈ ముప్పైరెండు అక్షరాలే అమ్మవారి పలువరుస అన్నారు. (అ, ఇ, ఉ, ఋ, ఌ, క, ఖ, గ, ఘ ఙ, చ, ఛ, జ, ఝ, ఞ, ట, ఠ, డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ, బ, భ, మ, స, హ).

ప్రధాన మూల మాతృకావర్ణాలు ముప్పైరెండు. మన శరీరంలో దంతాలు-ఎముకలు. అమ్మవారి శరీరంలో దంతాలు-అక్షర తేజస్సులు, మంత్ర తేజస్సులు, విద్యా తేజస్సులు. బ్రహ్మవిద్యాస్వరూపం, షోడశీవిద్య, ముప్పైరెండు విద్యలు, పదహారు విద్యలు, మాతృకావర్ణములలో ప్రధానమైన ముప్పైరెండు అక్షరాలు. వాగ్భవకూట స్వరూపమైన ముఖంలోని పలువరుసకు ఈ మంత్రవిద్యా సమన్వయం సమంజసం.

మనలను బాగుచెయ్యడానికి వచ్చిన విద్యే శుద్ధవిద్య. అదే వేదం. ఆ వేదవిద్యను అనుష్ఠానం చేస్తూ అర్హత పొంది, సంస్కారం పొందిన మహాత్ములు వేదవేత్తలు. వేదం వేదవేత్తలైన విప్రులను ఆశ్రయించుకుంటుంది. **"విద్యాః వై బ్రాహ్మణమాజగామ"** అని వేదం. వేదవేత్తలైన బ్రాహ్మణులు ద్విజపంక్తి. వేద పఠనం చేసేటప్పుడు వేదవేత్తలు భస్మధారణ చేసుకొని, ధవళ వస్త్రాలు ధరించి ఎదురెదురు వరుసగా కూర్చొని వేదం చదువుతూ ఉంటారు. అలా తెల్లని వస్త్రాలు ధరించి వేదాలు చదువుతున్న బ్రాహ్మణులు ఇటో పదహారుమంది, అటో పదహారుమంది ఎదురెదురుగా కూర్చొంటే ఎంత అందంగా ఉంటారో అంత అందంగా అమ్మవారి పలువరుస ఉందని వర్ణించారు. బ్రాహ్మణుల వరుస వేదాలు వల్లె వేస్తున్నాయి. అమ్మవారి దంతాల వరుస సమస్త వేదవాఙ్మయాన్ని మనకి అందిస్తున్నది. ఇక్కడ సమస్త వేదాలు వెలువడిన వాగ్భవకూటాన్ని చెప్తున్నారు. **'ద్విజపంక్తిద్వయోజ్జ్వలా'** అని వైదిక సంప్రదాయం ఉట్టిపడేలా వశిన్యాది వాగ్దేవతలు చూపిస్తున్నారు.

అమ్మవారి నోటిధ్యానం ఎంతో సేపు ఉండాలి. ఆ దంతాలు, ఆ చిరునవ్వు చుట్టూ ఉన్న పెదవులు చెప్పి తరువాత అమ్మ వేసుకొన్న తాంబూలం పరిమళాన్ని వర్ణిస్తున్నారు. పలుకులు మాత్రమే కాకుండా అమ్మవారి నోటిలో కూడా పరిమళం ఉంది. అసలు వాక్కులకి పరిమళం ఉండాలి. పరిమళం అంటే ఇక్కడ సువాసన అని మాత్రమే అర్థం కాదు. సంస్కారం, కీర్తి. అమ్మవారి శరీరంలోకి ప్రజాపతులు దంతాలుగా వచ్చారు. దంతాలను భావం చేశామంటే ప్రజాపతుల శక్తులన్నింటికి నమస్కారం చేసినట్లే. ఇది విరాట్ విగ్రహంగా చెప్పడం.

26. కర్పూరవీటికామోదసమాకర్షద్దిగంతరా

– శ్రీ కర్పూరవీటికామోదసమాకర్షద్దిగంతరాయై నమః

అమ్మవారు తాంబూలం వేసుకున్నారు. ఆ తాంబూలం పేరు కర్పూరవీటిక. ఊరకే తమలపాకులు చుట్టేసినంత మాత్రాన తాంబూలం కాదు. దానికో పద్ధతి ఉంది. పూజ చేసేటప్పుడు అమ్మవారికి సమర్పిస్తున్నామనే భావనతో చెయ్యాలి. అప్పుడే నిజమైన భక్తి. కర్పూరవీటిక ఎలా ఉండాలో లక్షణం ఉంది.

ఏలా లవంగ కర్పూర కస్తూరీ కేసరాదిభిః
జాజీఫలదళైః పూగైః లాంగల్యూషణ నాగరైః
చూర్ణైః ఖధిరసారైశ్చ యుక్తా కర్పూరవీటికా

ఇలా ఉంటేనే కర్పూరవీటిక. తమలపాకులు శుద్ధంగా, లేతగా ఉండాలి. తమలపాకుల కొనలు తీసి తాంబూలం కట్టాలి. అమ్మవారికి పెట్టేటప్పుడు ఇది పద్ధతి. అందులో వెయ్యాల్సిన పదార్థాలు– ఏలకులు, లవంగాలు, పచ్చకర్పూరం, కస్తూరి, కుంకుమపువ్వు, జాజికాయ, జాపత్రి, పోక అంటే వక్కలు, చలువ మిరియాలు. తమలపాకులకి కాచు, సున్నం ఇవన్నీ పెట్టి కడితే కర్పూరవీటిక అని పేరు. దాని నుండి వచ్చే పరిమళం పేరు ఆమోదం. ఆమోదం అంటే ఆనందమని ఒక అర్థం. పరిమళమని మరొక అర్థం. రెండిటికి అదే చెప్పారంటే ఆనందంతో అందరూ ఆహా! అని తృప్తిపడే దాని పేరు 'ఆమోదం'. అందరికి తృప్తికలిగించే

ఆనందం ఆమోదం. మణిద్వీపంలో దిక్కులంతటా కూడా అమ్మవారి తాంబులపు పరిమళమే వ్యాపించింది.

'కర్పూరవీటిక ఆమోద సమాకర్షద్దిగంతరా' – దిగంతములు– దిక్కుల అంచుల్ని ఆ పరిమళం ఆకర్షిస్తోంది. దానితో ఆ నవ్వుకి, ఆ పలుకుకి కూడా అందం వస్తోంది. ఏదైనా అంతటా వ్యాపించడమే కాకుండా అందరూ బాగుందని ఒప్పుకుంటే దానికి ఆమోదమనాలి. అమ్మవారు ఇచ్చిన పలుకుల వల్ల వచ్చిన జ్ఞానం, మనం ఏ దిక్కుకి వెళ్ళినా అందరూ ఆమోదించే మంచి కీర్తిని ఇస్తుంది. మన గురించి పదిమంది మంచి అనుకుంటే అంతకంటే కావలసినది ఏముంది? అలాంటి కీర్తి అమ్మవారి కృప ఉంటే వస్తుంది. అన్నివైపులా ఆకర్షించగలిగి అంగీకరించగలిగే కీర్తి భక్తులకు లభింపజేస్తున్నది. ఇది తెలిస్తే, "అమ్మా! నిన్ను ఆశ్రయించిన భక్తులకి వాగ్దేవి నోటి యొక్క తాంబూల పరిమళం వంటి కవిత్వాన్ని ఇస్తావమ్మా!" అని శంకరులు సౌందర్యలహరిలో ఎందుకన్నారో అర్థమవుతుంది. ఇది వాగ్భవకూటంలోంచి వచ్చిన గొప్ప వర్ణన. **'వాణీముఖకమల తాంబూలరసతాం'**. (సౌందర్యలహరి)

అమ్మవారి ముఖ సౌందర్యం వర్ణించడంలో వశిన్యాదివాగ్దేవతలకు తనివి తీరలేదు. పెదవులు వర్ణించారు. పలువరుస వర్ణించారు. శుద్ధవిద్య అన్నారు. ఆమోదం అన్నారు. ఇంతవరకు వాసన, నవ్వు మాత్రమే చెప్పారు. ఆ వాసన, నవ్వులోనే విద్యలు ఉన్నాయి. ఆ పలువరుస తళుకులలో విద్యలున్నాయి. ఆ వాసనలో విద్యవల్ల వచ్చే కీర్తి ఉంది. ఇంకొకటి అమ్మవారి పలుకులు ఎంత తియ్యగా ఉన్నాయో తరువాత నామంలో చెప్తున్నారు.

27. నిజసల్లాపమాధుర్యవినిర్భర్త్సితకచ్ఛపీ

– శ్రీ నిజసల్లాపమాధుర్యవినిర్భర్త్సితకచ్ఛప్యై నమః

సల్లాపం అంటే మధురమైన వాక్కులు. తియ్యని పలుకులు ఉంటే ఆ స్వరం అత్యంత మధురంగా ఉండి వింటున్నకొద్దీ వినాలనిపిస్తున్నది.

సరస్వతీదేవి వీణ పేరు 'కచ్ఛపీ'. అమ్మ పలుకులు సరస్వతీదేవి వీణానాదం

కంటె మధురంగా ఉన్నాయి. సృష్టిలో ఇంతకంటె గొప్పవర్ణన ఇంకేం చెయ్యగలరు! మామూలుగా వీణానాదమంటే ఏదో సామాన్యమైనదని అనుకోవచ్చు. కానీ సరస్వతీదేవి వీణానాదానికి మించిన వీణానాదం ఎక్కడా ఉండదు. అమ్మవారి వీణలో ఉన్న గొప్పదనం ఏమిటంటే అది కేవలం స్వరాన్ని మాత్రమే కాకుండా అక్షరాలను కూడా పలికించగలదు. ఆ స్వరశక్తి, అక్షరశక్తి కలిసిన నాదం ఆ కచ్ఛపీలోంచి వెలువడుతోంది. అలా రెండింటిని పలికించగల వీణ అది. ఆ కచ్ఛపీ వీణా మాధుర్యాన్ని మించిపోయి అమ్మవారి వాక్కులు ఉన్నాయి.

ఇలా చెప్పడంలో ఉద్దేశం అమ్మవారి సౌందర్యవిశేషాలన్నీ అలౌకికం. 'వినిర్భర్త్సిత', 'న్యక్కారి', ఇంకో చోట 'పరిభావి', 'తిరస్కారి' ఇవి చెప్పడంలో అర్థం – ఒక ఉపమానం చెప్తూ ఆ ఉపమానాన్ని మించిపోయింది అంటున్నారు.

దానిని మించి ఉన్నప్పుడు ఉపమానం ఎందుకు చెప్పడమంటే, అది చెప్పి, ఇది చెప్తే అదే అనుకుంటారు కనుక దాని కంటె గొప్పగా ఉంటుందని చూపిస్తున్నారు. ఎప్పుడూ నయాగరా జలపాతం చూడని వారికి ఆ జలపాతం ఎలా ఉంటుందో వర్ణించాలంటే, "నువ్వెప్పుడైనా ఎత్తిపోతలు చూశావా?" అని అడుగుతారు. వాడు చూశానంటే దానికి పదిరెట్లు ఉంటుందని చెప్తారు. తెలిసినదానిని చెప్పి, దానికంటె గొప్పదని చెప్పడం కోసం ఉపమానం.

ఈ విషయాన్ని శంకరులు సౌందర్యలహరిలో ఎంతో అందంగా చెప్పారు. లలితాసహస్రనామాలు చెప్తే సౌందర్యలహరి వస్తుంది. సౌందర్యలహరి చెప్తే లలితాసహస్రం వస్తుంది. లలితాసహస్రానికి భాష్యం వ్రాసిన వారందరూ ఈ శ్లోకాన్ని ఉట్టంకించారు.

విపంచ్యా గాయన్తీ వివిధమపదానం పశుపతే
స్త్వయాఽఽరబ్ధే వక్తుం చలితశిరసా సాధువచనే
త్వదీయైర్మాధుర్యైరపలపిత తంత్రీకలరవాం
నిజాం వీణాం వాణీ నిచుళయతి చోళేన నిభృతమ్

శారదాంబ అమ్మవారి కొలువులో కూర్చొని వీణ మీటుతోంది. అమ్మవారి

స్వరూపమే ఆవిడ. వీణ మీటుతూ వాళ్ళాయన గురించి చెప్తేనే అమ్మవారికి ఇష్టం కనుక శివుని లీలలు అందులో వినిపిస్తోంది. ఏ పాట పడితే ఆ పాట పనికిరాదు. భగవత్ కీర్తనే కావాలి. ఆవిడకి భగవంతుడు పరమేశ్వరుడు. ఆ పరమేశ్వరుని కీర్తనలు శారదాంబ పాడుతుంటే, అమ్మవారు ఆనందం తట్టుకోలేక, "సాధు..సాధు.." అంటే బాగు..బాగు.. చాలా బాగుంది అన్నారు. చాలా బాగుంది అనగానే శారదాంబ ఆశ్చర్యపోయింది. 'ఇంత చక్కని నీ పలుకు విన్నాక, నా వీణానాదం బాగుందనడం ఏంటమ్మా! అంతకంటే బాగుంది నీ పలుకు' అని శారదాంబ వెంటనే వీణపై వస్త్రం కప్పేసింది. ఎవరైనా ఓడిపోతే వస్త్రం కప్పేసుకుంటారు. అలాగే వీణ ఓడిపోయిందని శారదాంబ తన పైటని దాని మీద కప్పేసింది అని చక్కని భావన చేశారు శంకరభగవత్పాదులవారు. సహస్రనామాలు చదవడం మాత్రమే కాదు. భావించాలి. అలాగైతే మొత్తం చదవలేమని అనుకోనక్కర్లేదు. పరిపూర్ణంగా ఆస్వాదిస్తే ఒక్క నామం చాలదా! శంకరాచార్యులవారు సౌందర్యలహరి ద్వారా వశిన్యాదివాగ్దేవతలు చెప్పిన ఈ నామాలను ఎలా భావించాలో నేర్పారు.

సృష్టిలో ఏ విద్యలైనప్పటికీ సరస్వతీ దేవి వీణ వల్లే వచ్చాయి. కానీ సరస్వతీదేవి వీణ కంటె మించిన మాధుర్యం అమ్మగొంతులో ఉంది అంటే అర్థం ఈ విద్యలన్నింటికీ మూలం, విద్యలన్నిటిపై తత్త్వం అమ్మయే అని చెప్పడం.

28. మందస్మితప్రభాపూరమజ్జత్కామేశమానసా

– శ్రీ మందస్మితప్రభాపూరమజ్జత్కామేశమానసాయై నమః

అమ్మవారి చిరునవ్వు. దీనిని భావిస్తే మూకకవిగారికే 'మందస్మిత శతకమ'ని వంద శ్లోకాలు వెలికివచ్చాయి. ఇక ఉమాసహస్రం రచించిన గణపతిమునిగారికి కూడా కొన్ని వందల శ్లోకాలు వెలికి వచ్చాయి. ఆ నవ్వు అంత గొప్పది. కానీ లలితాసహస్రంలో ఒక్కనామంతో చెప్పినా చాలా గట్టిగా చెప్పారు. 'ప్రభాపూర' అనే మాట ముందు నామాల్లో కూడా వచ్చింది. 'నిజారుణప్రభాపూర' – అమ్మవెలుగులో ప్రపంచమంతా మునిగిపోతోందని చెప్పారు.

మందస్మిత అంటేనే చిరునవ్వు. ప్రసన్నంగా, నిండైన ఆనందం ఉన్నప్పుడు చిరునవ్వు వస్తుంది. ఉద్రేకంతో కూడిన ఆనందాలు వస్తే అట్టహాసాలు, వికటాట్టహాసాలు, వికృతహాసాలు వస్తాయి. ఇవి లోకంలో సాధారణంగా అలవాటైనవి.

అమ్మ నవ్వు కేవలం మందస్మిత. ఎప్పుడూ చెదరని, నిండైన, ప్రసన్నమైన సచ్చిదానందస్వరూపిణే ఆవిడ. ఆ సచ్చిదానంద లక్షణమైన జ్ఞాన–ఆనందాలను తెలియజేసేది ఆవిడ నవ్వు. అమ్మవారి నవ్వుని తలంచుకొంటే మనకి జ్ఞానం, ఆనందం రెండూ కలుగుతాయి. ఆ నవ్వు ఒక ప్రవాహంలా వస్తోంది. **'మజ్జత్కామేశమానసా'**– కామేశ్వరుని మనస్సు ఆ నవ్వు అనే ప్రవాహంలో మునిగిపోయిందని చెప్తున్నారు వశిన్యాది వాగ్దేవతలు. నిజంగా మనస్సు లయమవడమే కావలసినది. మన్మథుడు శివుని ఓడించడానికి 'అరవిందమశోకం చ చూతం చ నవమల్లికా నీలోత్పలమ'నే ఐదు పువ్వుల బాణాలు సిద్ధం చేసుకుని, చివరకి విఫలమయ్యి అమ్మ దగ్గర ఏడ్చాడు. 'నీ ఐదు పువ్వుల బాణాలు ఆయన దగ్గర పనిచెయ్యవురా! నా దగ్గర ఒక్క బాణం ఉంది' అన్నది అమ్మవారు. కేవలం 'నా నవ్వు చాలు ఆయనకి'. మన్మథుని ఐదు పువ్వుల బాణాలు చెయ్యలేని పని, అమ్మవారి యొక్క చిరునవ్వు అనే బాణం చేసింది. దానితో శివుడు సంపూర్ణంగా వశమైపోయాడు. బింకంగా కూర్చుని మనస్సుని నిగ్రహించుకున్న శివుని మనస్సు అమ్మవారి చిరునవ్వులో మునకలు వేస్తోంది. అమ్మ నవ్వు చూస్తే, అందులో మునకలు వేస్తున్న శివుని మనస్సు కూడా దొరుకుతుంది. రెండూ లభిస్తున్నాయి. 'శివశక్త్యైక్యప్రవాహం' అందులోంచి మనం పొందవచ్చు.

'మజ్జత్కామేశమానసా' అనే దానిలో సమయాచారం చూపిస్తున్నారు. ఈ సమయాచారాన్ని శంకరులు సౌందర్యలహరిలో కూడా చూపించారు. సమత్వమే సమయం. సమత్వం అనగా శివశక్తులని సమముగా భావించుట. అమ్మవారిని ఆరాధన చేసేటప్పుడు అయ్యవారి స్ఫురణ ఉండాలి. అదే సమయాచారం. సమయాచారమంటే సంప్రదాయాన్ని అనుసరించి ఉండే పాతివ్రత్యం. దంపతీభావం గుర్తు వచ్చినప్పుడు మహాపతివ్రత అయిన అమ్మతో పరమేశ్వరుడు ఉంటాడు. కేవలం అమ్మవారిని స్తుతిస్తే ఆవిడకు సంతోషం ఉండదు. అయ్యవారిని కూడా కలిపి

స్తుతించాలి. ఇక్కడ ఆ రమ్యమైన భావాన్ని చూపిస్తున్నారు. అమ్మవారి సౌందర్యాన్ని చూపిస్తూ మధ్య మధ్యలో శివుని గుర్తుకు తెస్తున్నారు వశిన్యాది వాగ్దేవతలు. శివుడు గుర్తు రాగానే శివశక్త్యైక్యరూపం గుర్తు వస్తుంది. లలితాసహస్రనామాల్లో చివరికి వచ్చేది శివశక్త్యైక్యరూపమే. అదే వశిన్యాదివాగ్దేవతల లక్ష్యం. శివశక్తులిద్దరిని కలిసి చేసే ఉపాసనే సమయాచారం. సృష్టిలో అందరికి శక్తి కావాలి. ప్రపంచమంతా శక్తే. మనకి ప్రపంచంలో ఉన్న ఐశ్వర్యశక్తి, వాక్శక్తి, జ్ఞానశక్తి మొదలైనవన్నీ కావాలి. ఆ శక్తులన్ని అమ్మే కాబట్టి అమ్మ అందరికి కావాలి. కానీ ఆ శక్తులు ఈశ్వరునివి.

వెలుగుందని తెలుసుకున్నవారు దాని మూలమైన దీపం ఉందని ఎలా తెలుసుకోవాలో, శక్తి ఉందని తెలుసుకున్నవారు శక్తి ఎవరిదో ఆ ఈశ్వరుని మర్చిపోకూడదు. ప్రపంచంలో కనిపిస్తున్న శక్తిని, ప్రపంచానికి మూలమైన పరమాత్మని కలిపి ఒక్కటిగా చూడగలిగితే పరమాత్మశక్తియే ప్రపంచమంతా అనే ఎరుక కలిగి అహంకారాలు తొలగుతాయి. అదే అసలైన సమయాచారం. అలాగే పాతివ్రత్యంగా భావించేటప్పుడు అమ్మవారిని తలచుకుంటున్న ప్రతిసారి అయ్యవారు స్ఫురించాలి. ఆవిడలో-ఆయన స్ఫురించడమే అద్భుతమైన పాతివ్రత్యం. పాతివ్రత్యధర్మానికి అమ్మ ఆది. ఆది ముత్తైదువ. ఆవిడ చిరునవ్వులో అయ్యవారి మనస్సు మునిగిపోయిందని చెప్పడంలో అద్భుతమైన శివశక్త్యైక్యభావాన్ని చూపిస్తున్నారు.

అమ్మని చెప్తూ అయ్యని గుర్తుచెయ్యడం వశిన్యాదివాగ్దేవతలు చూపించిన సమయాచార సంప్రదాయం. ఇలా గొప్ప కవిత్వం మనకి ఈ లలితాసహస్రనామాల్లో కనబడుతోంది. అమ్మవారి చిరునవ్వును ధ్యానిస్తే మన ముఖంలో ఆ నవ్వు చెదరకుండా ఉంటుంది.

మనమూ నవ్వుతూ ఉంటాం అప్పుడప్పుడు. మనవి అప్పుడప్పుడు నవ్వులు. అమ్మవారివి ఎప్పుడూ నవ్వులే.

జ్ఞానం కలిగినప్పుడు మనకి తెలియకుండా ఆనందం వస్తుంది కనుక జ్ఞానం, ఆనందం రెండూ కలిసి ఉంటాయి. ఆ జ్ఞానానందస్వరూపమే అమ్మ నవ్వు. అదే బ్రహ్మావిద్య.

29. అనాకలితసాదృశ్యచుబుకశ్రీవిరాజితా

– శ్రీ అనాకలితసాదృశ్యచుబుకశ్రీవిరాజితాయై నమః

ప్రతినామాల్లో ఒక పోలికని చూపిస్తూ దానిని మించిపోయిందని చెప్తున్నారు. "అమ్మా! ఈ నామానికి పోలిక కూడా దొరకట్లేదు" అంటున్నారు. సాదృశ్యం అంటే పోలిక. అనాకలితసాదృశ్య అంటే పోల్చుకోవడానికి వీలులేని గెడ్డపు శోభ కల తల్లి అన్నారు. 'చుబుకం' అంటే గెడ్డం. 'శ్రీ' అంటే శోభ. 'విరాజితా' అంటే ప్రకాశం. పోల్చుటకు వీలు కాని గెడ్డపు శోభతో ప్రకాశిస్తున్న అమ్మ. ఇంచుమించు వాగ్భవకూటం చివరిలోకి వస్తున్నాం. ఆ అందమైన అమ్మ 'చుబుకం' యొక్క శోభకి సాటి ప్రపంచంలో మరొకటి లేదు.

ఈ మాటకి శంకరభగవత్పాదులవారి మనస్సు ఒప్పలేదు. ముఖమంతా అద్దంలా ఉంటే, ఆ అద్దానికి పెట్టే పిడిలా ఉంది అమ్మవారి గెడ్డం అన్నారు. ఆ పిడి చిన్నప్పుడు హిమవంతుడు పట్టుకున్నాడు. పెద్దయ్యాక శివుడు పట్టుకుని ఆ ముఖాన్ని చూశాడని చక్కని వర్ణన చేస్తూ **'తవ చుబుకమౌపమ్య రహితం'** – పోలికలేని ఆ అందమైన అమ్మ గెడ్డానికి నమస్కారం అన్నారు.

30. కామేశబద్ధమాంగళ్యసూత్రశోభితకంధరా

– శ్రీ కామేశబద్ధమాంగళ్యసూత్రశోభితకంధరాయై నమః

మళ్ళీ సమయాచారం చూపిస్తున్నారు. శివుడు కట్టిన మంగళసూత్రం అమ్మ కంఠాన ప్రకాశిస్తోంది. ఇది గొప్ప భావం! స్వామి అమ్మకి మంగళసూత్రం కట్టడం, అది అమ్మ మెడలో మెరిసిపోవడం. ఈ నామంలో మనం శివపార్వతుల కల్యాణాన్నంతటినీ భావన చేసుకోవచ్చు. ఆ మంగళసూత్రపు శోభ, దానిలో ముప్పేటలు. ఒకొక్క దానిలో తొమ్మిది సూత్రాలు చొప్పున కట్టి ఉంచారు. 27 నక్షత్ర సంఖ్యగా 27 సూత్రాలు. ఎవరి ఆయువైనా 27 నక్షత్రాల లోపలే ఉంటుంది. ఆ సంఖ్యగా ఆ మంగళసూత్రాలు పెట్టి ఉంచారు. 27 నక్షత్రాలు అంటే సంపూర్ణమైన కాల సంఖ్య. ఈ కాలమంతా కూడా ఐదవతనమైన మాంగళ్యం ఉండడం కోసం

సంకేతంగా చూపిస్తున్నారు.

శివుడు కట్టిన అందమైన మంగళసూత్రం అమ్మవారి మెడలో ఉంది. శివుడు కట్టాడు కనుకనే గట్టిగా ఉంది, లేదా అమ్మ మెడలో మంగళసూత్రం ఉంది కనుకనే ఆయన గట్టిగా ఉన్నాడు. ఏదైనా ఫరవాలేదు. **'మ్రింగెడువాడు విభుండని మ్రింగెడిడియు గరళమనియు మేలని ప్రజకున్, మ్రింగుమనె సర్వమంగళ మంగళసూత్రంబునెంత మది నమ్మినదో'** అని భాగవతంలో పోతనగారు చెప్పారు. మృత్యుంజయునికి పత్ని అయ్యింది కనుకనే మంగళసూత్రం గట్టిగా ఉందంటే, కాదు మా అమ్మ మంగళసూత్రం గట్టిగా ఉంది కనుకనే ఆయన మృత్యుంజయుడయ్యాడు. అయ్యవారి వైపు వారి మాట మొదటిదైతే, అమ్మవారి వైపు వారి మాట రెండవది. మనం ఇద్దరి వాళ్ళం కనుక మనకి రెండూ నిజమే.

మృత్యుంజయుని పత్ని. ఆది సువాసిని అయిన ఆవిడ మంగళసూత్రాన్ని ధ్యానిస్తే అందరికీ మంగళమే. ఈ నామాల్లో 'సౌమంగళ్య మంత్ర బీజాక్షరాలు' కూడా దాగి ఉన్నాయి. ఇది రహస్యమైన విశేషం. ఆ బీజాక్షరాలు తెలుసుకున్నా, తెలియకున్నా ఈ మంత్రాన్ని మననం చేసుకుంటే, పెళ్ళికాని వారికి కూడా చక్కని మంగళసూత్రం లభించి ఆ వధూవరులు కలకాలం జీవిస్తారని చెప్పి దీన్ని సంపుటీకరణచేసి పారాయణ చెయ్యమని చెప్తారు కొందరు శాస్త్రవేత్తలు. సువాసినీత్వాన్ని పెంచగలిగిన ఈ అద్భుతమైన మంత్రానికి నమస్కారం. ఇక్కడితో వాగ్భవకూటం పూర్తయ్యింది. సంపూర్ణజ్ఞానకూటం పూర్తి అయింది.

31 కనకాంగదకేయూరకమనీయభుజాన్వితా
– శ్రీ కనకాంగదకేయూరకమనీయభుజాన్వితాయై నమః

ఇప్పుడు కామరాజకూటంలోకి ప్రవేశిస్తున్నాం. అంగదములు అంటే చేతులకి పెట్టుకొనే ఆభరణాలు. కేయూరాలు అంటే భుజానికి పెట్టుకునేవి. అంగదముల నుంచి కేయూరముల వరకూ వర్ణించారంటే మొత్తం చేతికి ఉన్న ఆభరణాలన్నిటినీ చూపిస్తున్నారు. దీనికి ఇంకా వివరణ కావాలంటే 'చతుర్బాహుసమన్వితా' నుండి

వచ్చిన నామాలన్నీ సరిపోతాయి. ఇక్కడ అలంకారాలు భావన చేసుకుని, మరల చేతులన్నింటి గురించి విశేషంగా చెప్పారు. రమ్యమైన భుజములు మొత్తం నాలుగింటితో ప్రకాశిస్తున్నది. 'కనకాంగదకేయూర' అన్నప్పుడు అలంకారాలన్నీ మంత్రసంకేతాలు అని చెప్పుకుంటున్నాం కనుక ఇవన్నీ మంత్రమయాలుగా భావించవలసినది.

32. రత్నగ్రైవేయచింతాకలోలముక్తాఫలాన్వితా
– శ్రీ రత్నగ్రైవేయచింతాకలోలముక్తాఫలాన్వితాయై నమః

గ్రీవము అంటే కంఠం. గ్రీవము నుండి వ్రేలాడుతూ వచ్చిన ఆభరణములు గ్రైవేయములు. అవే కంఠాభరణాలు. కొన్ని రత్నాలతో కూడినవి, కొన్ని ముత్యాలతో కూడిన ఆభరణాలు ఉన్నాయి. చింతాకము. లోలముక్త. ఇలా ఎన్నో సువర్ణమయమైన కంఠాభరణాలు అమ్మవారి మెడలో ప్రకాశిస్తున్నాయి. వీటన్నిటిని ఉపాసకులు వారివారి దర్శనభాగ్యాన్ని బట్టి భావించవచ్చు. 'చింతాకము' అంటే సువర్ణంతో చేసిన ఒకానొక ఆభరణం. రామదాసుగారు 'సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము' అంటారు. బంగారపు చింతాకుల్లా చేసిన హారం ధరించింది.

'చింతాకం', 'లోలముక్త' అనే మాటలలో రహస్యం ఉంది. జపం చేసేటప్పుడు కంఠం నుండే పలుకులు వస్తాయి. గ్రీవసంబంధమైనది గ్రైవేయం. మంత్రమే అన్నిటికంటె గొప్ప రత్నం. జపం చేసే వారికి కంఠంలోనే ఆ మంత్రరత్నం ఉంటుంది కనుక రత్నమే గ్రైవేయం. మంత్రమే రత్నమై అది గ్రైవేయమయ్యింది. మంత్రరత్నాన్ని ప్రతివారు కంఠంలో జపం చేస్తూ ఉంటారు. జపం చెయ్యగానే సరిపోదు. చింతన కూడా చేస్తూ ఉండాలి. కంఠంలో పలుకుతూ చింతన చెయ్యాలి. ఆ చింతన లోలురై చెయ్యాలి. 'రత్నగ్రైవేయచింతాకలోల' – మంత్రాన్ని కంఠము నందు జపిస్తూ, చింతన చేస్తూ దాని యందు లోలురై ఉండాలి. ఆసక్తితో చెయ్యాలి. లోలత అంటే ఆసక్తి. అలా కంఠమునందు మంత్రాన్ని జపిస్తూ చింతన చేస్తూ ఉంటే వారికి అమ్మవారు 'ముక్తాఫలం' ఇస్తుంది. ముక్తాఫలం అంటే మోక్షమనే ఫలం ఇస్తున్న తల్లి అని

జపపరాయణులకు పనికొచ్చే భావం. మంత్రాన్ని చింతన చేస్తే ఫలితం ఎక్కువ.

చింతాకమంటే ఏది చింతిస్తే అది ఇవ్వగలిగే మంత్రరాశి. అమ్మవారి ఆభరణాలన్నీ మంత్రాలే. ఎక్కడ ఆభరణ వర్ణన వచ్చినా అవి మంత్రవర్ణనయే అని గ్రహించాలి.

33. కామేశ్వరప్రేమరత్నమణిప్రతిపణస్తనీ

– శ్రీ కామేశ్వరప్రేమరత్నమణిప్రతిపణస్తన్యై నమః

అమ్మవారి వక్షఃస్థల భావన వచ్చేటప్పటికి వెంటనే పరమేశ్వరుని 'కామేశ్వర' అని గుర్తు చేస్తున్నారు. ఆహారాన్ని ఇచ్చే అమ్మ వక్షఃస్థలం మనకి మాతృస్థానీయం. పిల్లల్ని పోషించేది. స్త్రీకి పిల్లల్ని పోషించే లక్షణం తల్లి అయ్యాక వస్తుంది. ఆ తల్లి భావనలోనే తండ్రి ఉన్నాడు. ఆ వక్షఃస్థలం పోషించి స్తన్యమిచ్చే స్థానం అయ్యిందంటేనే, పతి యొక్క ప్రేమని తెచ్చుకుని, తన ప్రేమని కలబోసి ఈ రెండిటిని కలిపి పోషణ పదార్థంగా మార్చి పిల్లల్ని తల్లి పోషిస్తున్నది.

పిల్లవానికి తల్లి తిండి పెడుతోందంటే కేవలం తన నుంచి మాత్రమే కాదు. తన భర్త యొక్క ప్రేమ తనలోనికి పొదివి తెచ్చుకుని, తనలోని ప్రేమని కూడా కలిపి, క్షీరముగా మార్చి పిల్లలకు పెడుతోంది. తల్లి స్తన్యం పిల్లవాడు పానం చేస్తున్నాడంటే, తల్లిదండ్రుల ప్రేమని పానం చేస్తున్నాడని అర్థం. తండ్రి కామేశ్వర. ఆయన ప్రేమ రత్నం తీసుకొని దాన్ని రెండింతలు చేసింది. ఇక్కడ 'ప్రతిపణ' అనే దానికి ప్రతిగా ఆవిడ ఇస్తున్నది. 'ప్రతిపణ' – రెండింతలు చేసింది. అమ్మవారి స్తన్యపానం చేసిన భాగ్యశీలురైన గణపతి, కుమారస్వామి మనకి గుర్తు రావాలి. వారిద్దరిని అమ్మవారు స్తన్యమిచ్చి పోషించింది.

అంతేకాదు.. ప్రపంచంలో అందరికీ అన్నం పెడుతున్నది ఆ వక్షఃస్థలమే. దీనినే **'సూర్యచన్ద్రౌ స్తనౌ దేవ్యాః'** అని చెప్పారు. మానవులకే కాదు, సృష్టిలో సర్వులకి, దేవతలకి కూడా స్వాహా, స్వధా రూపంలో అమృతం అమ్మ ఇస్తోంది. సూర్యకిరణాల నుండి మధువుని దేవతలు స్వీకరిస్తారు. అలాగే చంద్రుడు ఆ అమృతాన్ని తాను

స్వీకరించి శుక్లపక్షంలో దేవతలకి, కృష్ణపక్షంలో పితృదేవతలకి ఇస్తాడు. దేవతలు, పితృదేవతలు సూర్యచంద్రుల ద్వారా వచ్చే అమృతం పుచ్చుకుంటున్నారు. దేవతలు మొదలుకొని సర్వజీవులకూ అనగా ఆబ్రహ్మపిపీలికాది మొత్తం అందరికీ అన్నం పెడుతున్నది సూర్యచంద్రరూపాలతో ఆ అమ్మయే. అందుకే జగత్తుకి తండ్రి ఒక్కడే. అతడే **'కామేశ్వరుడు'**. తల్లి ఒక్కరే.. ఆవిడ **'కామేశ్వరి'**.

మరొక అందమైన భావం– శివుని ప్రేమని తాను తీసుకొని దాన్ని రెండింతలుగా ఆయనకి ఇచ్చింది. ప్రేమస్థానం హృదయం. శివుని హృదయంలో ప్రేమరత్నాన్ని ఆవిడ తీసుకొని, మీరు నాకు ప్రేమని ఇచ్చారు, దాన్ని రెండింతలు చేసి ఇస్తానంది అమ్మవారు. అలాంటి పతివ్రత అమ్మవారు. ఆయన ఇచ్చిన ప్రేమరత్నాన్ని రెండింతలు చేసి ఇస్తున్నానని అమ్మ తన వక్షఃస్థలం ద్వారా చాటుతున్నదా! అన్నట్లున్నది. ఈ భావనలో ఎన్నెన్ని రమ్యతలు ఉన్నాయో భావించుకోవచ్చు.

ఇందులో బీజాక్షరాలు పరిశీలిస్తే కామేశ్వరప్రేమరత్నం – కామేశ్వరుడంటే పరబ్రహ్మ. పరబ్రహ్మ యొక్క రత్నం. ప్రకాశించేదే రత్నం – అనగా మంత్రం. పరబ్రహ్మను సూచించే ప్రేమరత్నం(మంత్రం) ఓం కారం. దానికి ప్రతిపణ అంటే రెండింతలు చేసిన ప్రణవములు. 'పణ' అనే శబ్దం ద్వారా ప్రణవమే ధ్వనింప జేస్తున్నారు. పరమేశ్వర మంత్రం ఓంకారము అయితే దాన్ని రెండింతలుగా దానినుండి వచ్చిన రెండు రకాల బీజాక్షరాలు 'హ్రీం', 'శ్రీం'.

ఉత్తరనారాయణంలో **'హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ'** అని చెప్పారు. హ్రీశ్చతే అంటే హ్రీంకారం. లక్ష్మీశ్చ అంటే శ్రీంకారం. 'ఓం' అనేది ఈశ్వర ప్రణవమైతే దానినుండి వచ్చిన శక్తి ప్రణవాలు హ్రీం, శ్రీం అని రెండయ్యాయి. 'ఓం' అనేది కామేశ్వర ప్రేమరత్నం. రెండింతలైన ప్రేమరత్నాలు అమ్మవారివి 'హ్రీం', 'శ్రీం'. ఇది 'ప్రేమరత్నమణిప్రతిపణస్తనీ' అంటే అర్థం. ఇది ఈ నామంలో దాగి యున్న అద్భుత మంత్ర విశేషము.

34. నాభ్యాలవాలరోమాళిలతాఫలకుచద్వయీ

- శ్రీ నాభ్యాలవాలరోమాళిలతాఫలకుచద్వయ్యై నమః

దేవతను ఎలా అర్థం చేసుకోవాలో సంప్రదాయం తెలియాలి. అమ్మవారు 'విశ్వవిగ్రహా'. **'స్వాత్మైవ దేవతాప్రోక్తా లలితా విశ్వవిగ్రహా'** అని హయగ్రీవుని శాస్త్రవాక్యం. 'విశ్వవిగ్రహా' అన్నప్పుడు నాభి స్థానం అంతరిక్షం. **'నాభ్యా ఆసీదంతరిక్షమ్'** అని పురుషసూక్తం. **'నాభ్యాలవాలరోమాళి'** అన్నప్పుడు వైదికభాషనే తీసుకోవాలి. రోమాలు అంటే వైదికభాషలో **'రశ్మయః'** అని అర్థం. కిరణపుంజాలను రోమరాజి అంటారు. విరాడ్రూపిణి రోమరాజి అంటే కిరణపుంజాలు. నాభి అంటే అంతరిక్షం. 'నాభి ఆలవాలం' (ఆలవాలం అంటే పాదు). ఒక పాదు నుండి తీగ ఎలా వస్తుందో, అమ్మవారి నాభి నుంచి రోమరాజి పైకి వెళ్తోంది. అంతరిక్షం నుండి వచ్చిన అనేక రకాలైన రశ్మలు అనగా జ్యోతిర్మయ కిరణపుంజాలు. ఆకాశంలో కిరణపుంజాలు లెక్కలేవు కానీ మనకి పనికొస్తున్న ప్రధాన కిరణాలు రెండే- సూర్యుడు, చంద్రుడు. ఆ నాభి నుండి కిరణపుంజాలనే నూగారు పైకి బయలుదేరితే, ఆ తీగకి సూర్య చంద్రులనే రెండు పళ్ళు వచ్చాయన్నారు. అవి ప్రపంచాన్ని పోషించేటప్పుడు వక్షః స్థలం. అంతరిక్షస్వరూపమైన అమ్మవారి నాభి నుండి సమస్త జ్యోతిర్మండలాలకి పనికొచ్చే కాంతిపుంజాలు బయలుదేరితే, ఆ కాంతిపుంజాల తీగకి పండిన రెండు పళ్ళుగా సూర్యచంద్రులనబడే వక్షఃస్థలం ప్రకాశిస్తూ ఉన్నదని చెప్పారు.

35. లక్ష్యరోమలతాధారతాసమున్నేయమధ్యమా

- శ్రీ లక్ష్యరోమలతాధారతాసమున్నేయమధ్యమాయై నమః

తీగ కనిపించింది కనుక పాదు ఉందని ఊహించుకోవాలి. కానీ పాదు కనిపించడం లేదు. ఆ నాభి ఉన్నచోటు అయిన నడుము కనిపించట్లేదు. నడుము కనిపించట్లేదంటే అర్థం- అంత సన్నని నడుము కల తల్లి. సర్వసాముద్రికా లక్షణాలు ఉన్న తల్లి అమ్మవారు. వశిన్యాదివాగ్దేవతల కంటె కవిత్వం ఎవరు చెప్పగలరు? ఆ రోమలతను బట్టి ఆ నడుముని ఊహించవలసినదే. **'సమున్నేయ'** అంటే

ఊహించవలసినదే అని అర్థం. **'అస్తి నాస్తి విచికిత్సాహేతు శాతోదరిన్'** అంటారు శ్రీనాథమహాకవి. ఉందా! లేదా! అనిపించే శూన్యం వంటి నడుము. మరి శూన్యమేగా అంతరిక్షం అని చెప్పడానికి చోటు. శూన్యమైన నడుము. అంతరిక్షమైన నాభి. జ్యోతిఃపుంజాలైన రశ్మికిరణాలు. ఫలస్వరూపమైన సూర్యచంద్రులు. ఈ భావనంతా కూడా విశ్వవిగ్రహాకృతికి సరిపోతుంది.

36. స్తనభారదళన్మధ్యపట్టబంధవళిత్రయా

– శ్రీ స్తనభారదళన్మధ్యపట్టబంధవళిత్రయాయై నమః

అమ్మవారి వక్షఃస్థలం బరువుకి సన్నని నడుము నిలవలేక, అక్కడ మూడు కట్లు కట్టారా అన్నట్లు మూడు మడతలు ఉన్నాయని వర్ణిస్తున్నారు. శంకరభగవత్పాదుల వారు కూడా ఈ విధంగానే వర్ణించారు. ఇది అమ్మవారి యొక్క కటి వద్ద ఉన్న మూడు గీతలు. ఈ మూడు గీతల్ని చెప్పడం కూడా సాముద్రిక శాస్త్రం ప్రకారంగా సులక్షణాలను పేర్కొనడం.

పూర్ణ ఉత్తమ సాముద్రికా లక్షణం ఉన్నవారికి **'లలాటేచ గళేచైవ మధ్యేవాపి వళిత్రయం స్త్రీపుంసయోరిదం జ్ఞేయం మహాసౌభాగ్యలక్షణం'** అని శాస్త్రం. మహాసౌభాగ్యలక్షణం కలిగితే లలాటం, కంఠం, నడుము దగ్గర మూడు గీతలుంటాయి.

అమ్మవారిని ప్రధానంగా 'హ్రీంకారకుండాగ్నిశిఖా' అని చెప్పారు. అదే చిదగ్ని. పంచదశిలో పన్నెండు అక్షరాలు అన్నీ ఒకొక్క అక్షరమే. ఒక అక్షరంతో మరొక అక్షరం కలవదు. మూడు కూటాలలో ఉన్న సమానాక్షరాలు 'లహ్రీం'. మరొకటి 'క'. 'హ్రీం' మూడు మార్లు వస్తుంది. వాగ్భవబీజం అవగానే 'హ్రీం'కారం వస్తుంది. కామరాజకూటం అవగానే 'హ్రీం' వస్తుంది. శక్తి కూటంలో చివరకు మళ్ళీ 'హ్రీం' వస్తుంది. ఆ 'హ్రీం' ని సహస్రారంతో అనుసంధానం చేసుకోవాలి. 'హ్రీం'లో 'హ', 'ర', 'ఈం' అని మూడు ఉంటాయి. వాగ్భవకూటం అవగానే 'హ్రీం'కారం లోని హ-ర-ఈం చూపించడం కోసమే కంఠం వద్ద మూడు గీతలు. మరల మధ్యకూటం కామరాజ కూటం అవగానే, 'హ్రీం'కారం వస్తుంది. ఆ మూడు

హ-ర-ఈం చూపించడానికే నడుము దగ్గర గీతలు. సంధి అలా చూపిస్తున్నాడు. ఆ అక్షర మంత్ర శక్తులన్నింటిని నమస్కరించుకుంటూ మొత్తంగా అమ్మవారికి పాదాల నుండి పై వరకూ కట్టిన వస్త్రం ధ్యానం చేసుకోవాలి.

37. అరుణారుణకౌసుంభవస్త్రభాస్వత్కటీతటీ

- శ్రీ అరుణారుణకౌసుంభవస్త్రభాస్వత్కటీతట్యై నమః

అమ్మ కటిసీమ ఎఱ్ఱని వస్త్రంతో కూడి ఉంది. అమ్మవారి నితంబస్థానం పృథ్వీస్థానం. 'మహారజనం' అనే అద్దకపు వన్నె చేత అద్దకం చేయబడినది - కౌసుంభం.

38. రత్నకింకిణికారమ్యరశనాదామభూషితా

- శ్రీ రత్నకింకిణికారమ్యరశనాదామభూషితాయై నమః

అమ్మవారు మొలనూలు కట్టుకుంది. రత్నకింకిణి- ఎక్కడ రత్నం, ఆభరణాలు...పదాలు వచ్చినా మంత్రములే. పదహారు తీగలతో చేసిన మేఖలను 'రశనాదామం' అంటారు. పదహారు తీగలు అనగా మరల మంత్రరహస్యం. రత్నకింకిణికా- మొలనూలుకి చిన్న మువ్వలు వ్రేలాడి ఉన్నాయి. అలాంటి మొలనూలు కట్టుకున్న అమ్మవారు. 'రత్నకింకిణికా' అంటే ఈ మువ్వలు మ్రోగుతూ ఉంటాయి. లలితాసహస్రంలోనే 'రణత్కింకిణిమేఖలా' అని మరొక నామం వస్తుంది.

రణత్కింకిణి-రణత్ అంటే ధ్వనిస్తున్న, చప్పుడు చేస్తున్న మువ్వలతో ఉన్న మొలనూలుతో ఉంది. సాధారణంగా లేచి నడిస్తే చప్పుడు వస్తుంది. అమ్మవారు కూర్చున్నప్పుడు కూడా మేఖల చప్పుడు చేస్తున్నది. **'క్వణత్కాంచీదామా కరికలభకుంభస్తననతా, పరిక్షీణా మధ్యే పరిణత శరచ్చంద్రవదనా'** - కాంచీదామం తలచుకుంటే మహాకాంచీ క్షేత్రం గుర్తు రావాలి. అక్కడ అమ్మ కామాక్షీదేవి ప్రకాశిస్తూ ఉంది. మహాబిలస్థానం. మహాబిలస్థానమంటే మూలాధారం నుండి మణిపూరం వరకు ఉన్న స్థానం. ధ్వనులు వ్యక్తమయ్యే చోటు మణిపూరం. ఇక్కడ ధ్వనిస్తున్న

మువ్వలు అంటే మణిపూరం దగ్గర వ్యక్తమవుతున్న సూక్ష్మనాదాలు. అమ్మవారి ఆభరణాలన్నీ మంత్రాలే కనుక ధ్వనులు. 'రణత్కింకిణిమేఖలా' అన్నారు వశిన్యాది వాగ్దేవతలు. 'క్వణత్కాంచీదామ' అన్నారు శంకరులు. ధ్వనిస్తున్న మువ్వల మొలనూలు ధరించిన తల్లి.

39. కామేశజ్ఞాతసౌభాగ్యమార్దవోరుద్వయాన్వితా

– శ్రీ కామేశజ్ఞాతసౌభాగ్యమార్దవోరుద్వయాన్వితాయై నమః

అమ్మవారి ఊరువులు ఎంత మెత్తగా ఉంటాయో అది కేవలం కామేశ్వరునికి మాత్రమే తెలుసు. అదీ ప్రాతివ్రత్యమంటే. పిల్లవానికి తల్లి వాత్సల్యం మాత్రమే తెలుస్తుంది. అమ్మ యొక్క అందం అయ్యకే తెలుస్తుంది. ఇది దాంపత్య ధర్మం. ఈ నామంలోని సున్నితమైన అంశాన్ని తీసుకుని శంకరభగవత్పాదులవారు ఆనందలహరిలో పరవశించి గానం చేశారు. **'తథా తే సౌందర్యం పరమశివ దృఙ్మాత్రవిషయం'** – "అమ్మా! నీ సౌందర్యం పరమశివుని చూపులకి మాత్రమే తెలిసేదమ్మా!" అన్నారు. పరమశివ దృఙ్మాత్రవిషయం అనగానే సమయాచారం.

మార్దవం అంటే మృదుత్వం. ఆ లావణ్య కోమలత్వ భావమే మార్దవం. "అవి నీ ఊరువులకు ఉన్నాయమ్మా!" ఆ మార్దవం 'కామేశజ్ఞాత' –కామేశ్వరునికి మాత్రమే తెలుసు.

కామేశ్వరునికి మాత్రమే తెలుసు అంటే అర్థం, అమ్మవారు శివుని ఒడిలో కూర్చున్నారని చెప్పడం.

ఒకటి పాతివ్రత్యం చెప్పారు. రెండు శివుని ఒడిలో అమ్మవారు ఉన్నదని చెప్పారు. ఇక్కడ సౌభాగ్యశబ్దం ఉంది. అమ్మవారి మంత్రమే సౌభాగ్యవిద్య. ఇక్కడినుండి గురుపాదుకా మంత్ర రహస్యాలు వరుసగా వస్తాయి. శ్రీవిద్యలో కూడా ఒకస్థాయికి వెళ్ళాకే గురుపాదుకలు చెప్తారు. అది కేవలం గురువు ద్వారా మాత్రమే తెలియాలి.

గురువు ఎవరు? గురువు ఎప్పుడూ శివస్వరూపమే. 'శివాయ గురవే నమః'. ఆ శివుని అనుగ్రహమే గురువు ద్వారా మనకి వస్తూ ఉంటుంది. గురువంటే

ఉపాధి కాదు. గురువులు ద్వారా వస్తున్న జ్ఞానం గురువు.

గంగను ఒక పాత్రలో తెచ్చుకుని పూజ చేస్తారు. గంగకి ఆలంబనం పాత్ర. పాత్రకి పువ్వు పెడుతున్న ప్రతిసారి అందులో గంగకే అని ఎలా స్పృహ ఉందో, గురువుకి దండం పెడుతున్న ప్రతిసారి అందులో శివరూపమైన జ్ఞానానికేనన్న స్పృహ ఉండాలి. కొన్ని గురుముఖతః మాత్రమే తెలుసుకోవాలి. దీనినే గురుముఖైక వేద్యమని అంటారు.

పాదుకావిద్యనే పాదుకాదీక్ష అంటారు. ఆ విద్య ఉన్నవారిని పాదుకాంత దీక్షాపరులు అంటారు. అది పూర్ణమైన దీక్ష. ఆ పాదుకాంతదీక్షా రహస్యాలు కేవలం గురువు ద్వారా మాత్రమే తెలుసుకోవాలి కనుక 'కామేశజ్ఞాతసౌభాగ్య మార్దవోరుద్వయాన్వితా' అంటే గురువుకు మాత్రమే తెలిసిన మహాపాదుకాస్వరూపిణి అని అర్థం.

40. మాణిక్యమకుటాకారజానుద్వయవిరాజితా

– శ్రీ మాణిక్యమకుటాకారజానుద్వయవిరాజితాయై నమః

అమ్మవారి మోకాళ్ళు మాణిక్యమకుటాలవలె ఉన్నాయి. జానుద్వయ, ఊరుద్వయ – ఇవన్నీ కూడా గురుపాదుకా రహస్యాలే. రహస్యవిద్య కనుకనే వస్త్రాలలో కప్పుకొని కూర్చోవడం. దీనికి భాస్కరరాయలువారు చెప్తూ అమ్మవారి మోకాళ్ళు పైన పొదుపులా వచ్చిన కిరీటాలు కాకుండా టోపీల్లా ఉన్న కిరీటాలు ఎలా ఉంటాయో అలా ఉన్నాయన్నారు. మాణిక్యాలతో చేసిన కిరీటాల వలె ఉన్నాయని చూపించారు.

భట్టనారాయణులైతే **'మాణిక్యముకురాకార'** అన్నాడు. మాణిక్యపు అద్దాల్లా ఉన్నాయన్నారు. ఇది కూడా సమంజసంగానే ఉంది. మాణిక్య అద్దాలులా నిర్మలంగా ఉన్న అమ్మవారి మోకాళ్ళని ఇక్కడ స్మరణ చెయ్యడం జరిగింది. ఇవన్నీ గురుపాదుకామంత్ర విశేషభాగాలే. అవి గురుముఖతః తెలుసుకోవాలి కనుక ప్రకటంగా చెప్పడం జరగదు. ఉన్నాయని చెప్పడం వల్ల ఎప్పుడైనా చదివేటప్పుడు ఇక్కడ అవే ఉన్నాయని భావిస్తే అదే గురుపాదుక.

41. ఇంద్రగోపపరిక్షిప్తస్మరతూణాభజంఘికా

– శ్రీ ఇంద్రగోపపరిక్షిప్తస్మరతూణాభజంఘికాయై నమః

జంఘిక అంటే కాలిపిక్కలు. ఈ కాలి పిక్కలు మన్మథుడు పెట్టిన అమ్ములపొదుల్లా ఉన్నాయి. మన్మథుడు, "అమ్మా! నా అమ్ములపొదులు పనికిరాలేకపోతున్నాయి. ఇక్కడ పెట్టేస్తున్నాను" అని దండం పెట్టాడు. అలా అమ్ములపొదులు ఎలా ఉన్నాయో కాలిపిక్కలు అలా ఉన్నాయి... అన్నారు ఆదిశంకరులు (సౌందర్యలహరి). పైగా 'ఇంద్రగోపపరిక్షిప్త'. 'ఇంద్రగోప' అంటే ఆరుద్ర పురుగులు ఎలా ఎఱ్ఱగా ఉంటాయో అలా ఎఱ్ఱగా ఉన్నవి. సర్వారుణంగా ఉన్న కాలిపిక్కలు.

42. గూఢగుల్ఫా – శ్రీ గూఢగుల్ఫాయై నమః

'గుల్ఫ' అంటే చీలమండలు. అవి గూఢములుగా ఉండి కనిపించడం లేదు. అంటే చీర అక్కడ వరకు కట్టుకుంది. అంతేకాదు అమ్మవారిని 'ధ్యాయేత్ పద్మాసనస్థాం' అంటాం కదా..అంటే పద్మాసనం వేసుకున్నప్పుడు గుల్ఫములు (చీలమండలు) కనబడవు. అందుకు పద్మాసనస్థగా ఉన్నది. ఇది కూడా గురుపాదుకామంత్రసంకేతమే. అందుకే గూఢ.

43. కూర్మపృష్ఠజయిష్ణుప్రపదాన్వితా

– శ్రీ కూర్మపృష్ఠజయిష్ణుప్రపదాన్వితాయై నమః

అమ్మ మీగాళ్ళు తాబేటి వీపుడిప్పకంటే గొప్పగా ఉన్నాయి అంటే కాస్త ఉబ్బినట్లు ఉంది. మెత్తదనం మాత్రం తాబేటి వీపుకు లేదు. అందుకే జయిష్ణు– దానిని మించిపోయింది. ఆకారమే క్రిందకి వ్రేళ్ళు కనబడుతూ కాస్త ఉబ్బి ఉన్నాయి అని వర్ణిస్తున్నారు. ఇది కూడా ఉత్తమ సాముద్రికా లక్షణం.

ప్రపద – పాదుకామంత్రదీక్ష క్రమంగా పూర్ణదీక్షలోకి వెళ్ళేటప్పుడు మహావాక్యాలు ఇస్తారు. ఇది ఉపాసనాపరమైన విషయం. ఇందులో ఇంత ఉందా

అని చేసేవారికి తెలుస్తుంది. చెయ్యనివారికి ఏదో అర్థంకానిది ఉందని తెలుస్తుంది. **ప్రపద**-పదమంటే అక్షరాలు, ప్రపదములు అంటే గొప్పపదములు. గొప్పపదములు అంటే మహావాక్యములు. మహావాక్యాలు పూర్ణదీక్షలో ఇస్తారు. అందుకే వేదాంతవిద్యకు, శ్రీవిద్యకు భేదం లేదు. శ్రీవిద్యాదీక్ష అంటే అదొక రకమైన సన్న్యాసదీక్షే. సామాన్యం కాదు.

'ప్రపదాన్వితా' అంటే మహావాక్యాలతో ఉంది. గూఢములు అయిన వేదాలయందు ప్రతిపాదింపబడుతున్న మహావాక్యాల స్వరూపమే ఆ పాదుకామంత్ర రహస్యాలు. అంతేకాక అమ్మ మీగాళ్ళు తాబేటి వీపుడిప్పకంటే గొప్పగా ఉన్నాయి కదా! అంటే సాధారణ తాబేలును తీసుకోకుండా గొప్పతాబేలును తీసుకోవాలి. గొప్పతాబేలు అంటే ఆదికూర్మమైన నారాయణస్వామి.

కూర్మపృష్ఠజయిష్ణుప్రపదాన్వితా - కూర్మపృష్ఠము నుండి పదములు (స్థానములు) అనగా లోకములు. ఈ కూర్మపృష్ఠం అంటే క్రిందిభాగము నుండి పైభాగం వరకు అన్నిలోకాలను ధరించగలిగే/రక్షించగలిగే సమర్థత కలిగిన పాదాలు. ఆదికూర్మం కేవలం ఒక మందరపర్వతం మోసింది. ఆ తల్లి పాదాలు సమస్తలోకాలకి రక్షణ స్థానాలు. ప్రపదం-పదము అనగా రక్షణ స్థానమని అర్థం. ఎలాగైతే తాబేటి వీపుడిప్ప మునిగిపోతున్న పర్వతాన్ని పైకి ఎత్తిందో, సంసారంలో మునిగిపోతున్న జీవులను ఎత్తి ఉద్ధరించగలిగిన శక్తి కలిగిన పాదాలు అవి. అందుకే 'కూర్మపృష్ఠజయిష్ణుప్రపదాన్వితా'. శంకరభగవత్పాదులవారు ఈ భావాన్నే మనకు అందిస్తూ వచ్చారు - **'ప్రపదమపదం దేవి విపదాం'** (సౌందర్యలహరి).

44. నఖదీధితిసంఛన్ననమజ్జనతమోగుణా
- శ్రీ నఖదీధితిసంఛన్ననమజ్జనతమోగుణాయై నమః

ఎవరు పాదాలకు ప్రణతి చేస్తారో వారి తలలో ఉన్న అజ్ఞానమనే చీకటంతటిని అమ్మవారి యొక్క కాలిగోళ్లు తీసేస్తాయి. తలనిండా ఉన్నది అజ్ఞానమనే చీకటి. ఈ చీకటి పోవాలంటే తల వంచాలి. తల వంచని వారికి చీకటి పోదు.

నమ్రలక్షణం, వినయలక్షణంతో ఆ పాదాల దగ్గర తల వంచాలి. ఆ ఎఱ్ఱనిపాదాలకి ఆ గోళ్లు తెల్లగా మెరిసిపోతూ చందమామను కత్తిరించి పదిముక్కలు చేసి పెట్టారా అన్నట్లు అంత తెల్లగా ఉన్నాయి. ఆ క్రింద వ్రేలి కొసలు ఎర్రగా ఉన్నాయి.

ఎక్కడైనా చందమామ కనబడితే అరుణకాంతి కనబడదు, అరుణకాంతి కనబడితే చందమామ కనబడదు. రెండూ కలిపి అమ్మవారి పాదాల్లో కనబడుతున్నాయి. ఎంత ఆశ్చర్యం! **'నీ కాలి కొనగోటి రాకాసుధాంశువులు నీ వేలికొనలలో నిండైన అరుణిమలు ప్రసరింపజేయుమమ్మా ఆ ప్రభలె జీవనములమ్మా'**(శివపదం) – కోట్లకాంతులతో నమస్కరించిన భక్తుల తమోగుణాన్ని పోగొడుతున్నది. అటువంటివి అమ్మవారి పాదాలు.

45. పదద్వయప్రభాజాలపరాకృతసరోరుహా
– శ్రీ పదద్వయప్రభాజాలపరాకృతసరోరుహాయై నమః

ఆ రెండు పాదాలలో ఉన్న ఎఱ్ఱని కాంతులు పద్మాలకంటె గొప్పగా ఉన్నాయి. సరోరుహం అంటే పద్మం. పద్మాలని ఓడిస్తున్న కాంతులు కలిగిన పాదాలు. "ఏదో మాకు తెలియదు కనుక పద్మాలతో పోల్చాం కానీ పద్మాలకంటే గొప్పవమ్మా! నీ పాదాలు". దీనికి శంకరులు ఎన్నెన్నో అందమైన భావాలు చేశారు. అవి–"పద్మాలు మంచులో వికసించవు–నీ పాదాలు మంచు కొండలో తిరుగుతాయి. పద్మాలు రాత్రిపూట ఉండవు–నీ పాదాలు పగలు, రాత్రి కూడా చక్కగా ఉంటాయి. అందుకే పద్మాలకంటే గొప్పవమ్మా" అన్నారు. ఇదంతా పద్మాల కంటె గొప్పగా అమ్మపాదాలు ఉన్నాయని చెప్పడం.

హిమానీ హంతవ్యం హిమగిరినివాసైకచతురౌ
నిశాయాం నిద్రాణం నిశి చరమభాగే చ విశదౌ ।
వరం లక్ష్మీపాత్రం శ్రియమతిసృజన్తౌ సమయినాం
సరోజం త్వత్పాదౌ జనని! జయత శ్చిత్రమిహ కిమ్ ॥ (సౌందర్యలహరి)

'పరాకృత సరోరుహా' – ఇందులో ఉంది రహస్యం. సరస్సు నుండి పుట్టింది

కనుక సరోరుహం. సరస్సు అంటే నిరంతరం ప్రవహించేది. సమ్-సారమే సరస్సు. అందునుండి పుట్టింది అనగా సంసారం నుండి పుట్టింది అజ్ఞానం. ఈ అజ్ఞానమంతా 'పరాకృత' పోగొట్టగలిగే శక్తి కలిగిన పాదాలు కలది. పాదాలు అనగా పాదుకా మంత్రాలు. ఇదే ప్రధానం. పాదుకా మంత్రదీక్ష సమస్తమైన అజ్ఞానాన్ని పోగొట్టడానికే వచ్చింది. అమ్మవారు పాదుకామంత్రస్వరూపిణి. కనుక ప్రతిదీ రూపవర్ణనే కాదు. మంత్రవిశేషము కూడా.

ఈ నామాలతో చిదగ్నికుండంలో అమ్మ సంపూర్ణరూపం కనబడుతుంది. చిదగ్నికుండ-హృదయంలో జ్ఞానాగ్నికుండం నుండి కనబడింది. భండాసుర సంహారం కోసం పరశంభువు రగిల్చిన చిదగ్నికుండం నుండి ఉద్భవించిన అమ్మవారి స్వరూప వర్ణన అంతా పూర్తయింది.

ఇప్పుడు మొత్తం చుట్టూ చూసిందా తల్లి. అక్కడ నిలబడి ఉన్న పరమశివుని చూసింది. ఆయన సంతోషిస్తున్నారు. అప్పుడు అమ్మవారు కాళ్ళు కొంచెం కదిపింది. కాళ్ళు కదపగానే మువ్వలు మ్రోగాయి. ఆ మువ్వలు ఎంత అద్భుతంగా మ్రోగుతున్నాయో! మువ్వలు మ్రోగిస్తూ ముందుకొచ్చిన తల్లికి నమస్కరిస్తూ తరువాత నామంలోకి ప్రవేశిద్దాం. **'చంపకాశోకపున్నాగసౌగంధికలసత్కచా'** మొదలుకొని **'శింజానమణిమంజీరమండితశ్రీపదాంబుజా'** వరకు అమ్మవారి **'దివ్యమంగళ విగ్రహ వర్ణన'** చెప్పబడింది.

46. శింజానమణిమంజీరమండితశ్రీపదాంబుజా

- శ్రీ శింజానమణిమంజీరమండితశ్రీపదాంబుజాయై నమః

ఈ నామంలో పాదాల విశేషమే మళ్ళీ చెప్తూ ఉన్నారు. 'శింజాన'-అంటే మ్రోగుతున్న అని అర్థం. 'మణిమంజీర'-మణులతో కూడిన అందెలు. 'మండిత' అంటే అలంకృతమైన, 'శ్రీ' అంటే సౌభాగ్యవంతమైన, 'పదాంబుజా' అంటే పాదపద్మాలు కలది. శ్రీ శబ్దం వచ్చినది. ఆ శ్రీవిద్యను స్ఫురింపజేస్తూ, పాదపద్మాలవద్ద శ్రీ పెట్టడంలో ఒక విశేషముంది.

ప్రధానంగా దివ్యమైన మహాపాదుకా మంత్రంలో చెప్పబడే రెండు రకాల విద్యలు అమ్మవారి యొక్క రెండు చరణాలలో దర్శిస్తూ ఉన్నారు వశిన్యాది వాగ్దేవతలు. కాదివిద్య, హాదివిద్య అని చెప్పబడే రెండు ప్రధానవిద్యలే ఆ చరణంలో ఉన్నాయని భాష్యకారులు అందించిన అద్భుతమైన వ్యాఖ్యానం. సహస్రారకమలంలో యోగులకు భాసించే అమ్మ పాదపద్మాలను ఇక్కడ వర్ణించారు. శింజానమణి– మ్రోగుతున్న మువ్వలు అంటే మంత్రధ్వని అని అర్థం. మంత్రధ్వనులతో కూడిన పాదాలు అనగానే అమ్మవారి ప్రధాన విద్యాస్వరూపాలు కాదివిద్య, హాదివిద్య రెండూ స్ఫురింపజేస్తూ ఉన్నారు.

ఈ అమ్మవారి యొక్క పాదాలను వర్ణిస్తూ మహాకవి కూచిమంచి తిమ్మకవి తెలుగులో– **'తొలిపల్కు గిల్కుటందెలు కల ఎలనాగ'** అన్నారు. అమ్మవారి అందెలలో తొలిపలుకులు రవళిస్తున్నాయి అంటే వేదనాదములు ఆ మువ్వల నుండి రవళిస్తున్నాయి. సమస్త వేదస్వరూపిణి కదా అమ్మవారు అందుకు ఆ శింజానములు అంటే మంత్రధ్వనులు, వేదధ్వనులు. ఆ చిదగ్నికుండంలో అలాంటి నాదములతో అమ్మవారు ఆ మువ్వలు కట్టుకొని ప్రకాశమానంగా గోచరించారు. ఇప్పుడు ఆవిడ గమనం ఎలా ఉందో చూపిస్తున్నారు. ఇది కూడా పాదాల విశేషమే.

47. మరాళీమందగమనా – శ్రీ మరాళీమందగమనాయై నమః

మరాళీ అనగా ఆడ హంస. ఆడ హంస ఎంత మందంగా నడుస్తుందో అమ్మ అలా నడుస్తోంది. ఇది సులక్షణాలతో కూడిన గంభీర గమనాలలో ఒకటి. హంసగమనం చాలా సౌందర్యమైంది. అలాగే పురుషునకు వృషభము, సింహము, ఇత్యాది చతుర్విధ గమనాలు ఉన్నాయి. స్త్రీ విషయంలో ఆడ హంసలాంటి నడకతో వెళ్తోందన్నారు.

ప్రతివారిలో హంసగమనం ఉంది. హంసగమనం ఆగిపోతే బ్రతుకు ఆగిపోతుంది. ఉచ్ఛ్వాస, నిశ్వాస రూపమైన ప్రాణశక్తి యొక్క గమనమే హంసగమనం. ప్రతివారిలో 'హ'కార, 'స'కారము రెండూ ఉచ్ఛ్వాస నిశ్వాసలను తెలియజేస్తాయి.

అయ్యవారిని, అమ్మవారిని హంస మిథునమని పోల్చడం సంప్రదాయం. 'హ', 'స' అన్నప్పుడు 'హ'కారం శివుని, 'స' కారం శక్తిని తెలియజేస్తాయి. ఆ ప్రాణశక్తి ఒకటే అయినప్పటికి రెండు విధములైన గమనములతో శివశక్త్యాత్మకమై ఉంది. యోగి మాత్రమే ఆ అమ్మవారి గమనాన్ని గమనిస్తాడు. భగవచ్ఛక్తి కొత్తగా వచ్చేది కాదు, అది ఉన్నదే. సాధకుడు ఉన్న శక్తిని గమనించి, ఆరాధించి ఆ శక్తితో తాదాత్మ్యం చెంది ముక్తి పొందుతాడు.

సాధకుడు కానివాడు ఆ శక్తిని గమనించక బంధితుడై జన్మపరంపరలో చిక్కుకుంటున్నాడు. శక్తి కేవలం ఉపాసకుల కోసం కొత్తగా రాదు. ఎప్పుడూ ఉన్న శక్తే, ఉపాసకుడు ఆ శక్తిని పొందుతున్నాడు, గ్రహిస్తున్నాడు. ప్రతివారిలో ఈ ప్రాణశక్తి గమనం మందగమనమా! శీఘ్రగమనమా! ప్రాణశక్తి ఎప్పుడూ ఒకేలా గమనం చెయ్యదు. ప్రాతఃకాలానికి, సాయంకాలానికి మనలో హంసగమనంలో తేడా వస్తుందని యోగశాస్త్రం తెలియజేస్తోంది.

ఒకొక్కప్పుడు నాసిక దగ్గర చేయిపెట్టుకొని గాలి వదిలితే ఒకోసారి కుడినాసికా రంధ్రంనుండి, ఒకోసారి ఎడమనాసికా రంధ్రంనుండి గాలి వస్తుంది. కొన్ని సమయాలలో రెండు నాసికలనుండి సమానంగా గాలి వస్తుంది. మన ఊపిరి నడకను కూడా మనం పరిశీలించడం లేదు. అలాంటి పరిశీలన చేస్తూ ఉంటే మన భవిష్యత్తుని కూడా మనం చెప్పగలం. దీనినే ముఖ్యప్రాణ ఉపాసన అంటారు. ఈ ముఖ్యప్రాణ శక్తియే మన శరీరం అంతటిని నడుపుతోంది. మన శరీరంలో చిచ్ఛక్తి ముఖ్యప్రాణ రూపంలో గమనం చేస్తూ డెబ్బైరెండు వేల నాడులకు ప్రాణశక్తిని ప్రసరింపజేస్తోంది. ప్రధానమైన నాడి – సుషుమ్నానాడి. దానికి ఇరుప్రక్కలా ఉన్న నాడులు – ఇడ, పింగళ. వీటి నుండి గమనం ఉచ్ఛ్వాస, నిశ్శ్వాస రూపములతో వెళ్తూ హ–స అవుతోంది. అది మందగమనం ఎప్పుడవుతోంది? శీఘ్రగమనం ఎప్పుడవుతోంది? అంటే వ్యక్తి యొక్క భావనాస్థితులను బట్టి ప్రాణశక్తి మందగమనం, శీఘ్రగమనం ఉంటుంది.

మనకి అనేక రకాల భావాలు కలుగుతూ ఉంటాయి. ఒకొక్కప్పుడు ఒక

వస్తువుని చూడగానే ప్రేమతో కూడిన మక్కువ కలుగుతుంది. ఆ మక్కువకి శృంగారభావమని పేరు. కొన్నింటిపట్ల జుగుప్సాభావం కలుగుతుంది. దానికి బీభత్సమని పేరు. కొన్నింటిని చూస్తే భయమేస్తుంది. దానికి భయానకమని పేరు. కొన్నింటిని చూస్తే ఆశ్చర్యమనిపిస్తుంది. దీనికి అద్భుతమని పేరు. కొన్ని చూస్తే నవ్వు వస్తుంది. దీనికి హాస్యమని పేరు. కొన్ని చూస్తే దుఃఖం వస్తుంది. దీనికి కరుణ అని పేరు. ఇలా అనేకరకాలైన భావాలు. నవరసాలు నాట్యంలోనే కాదు, బ్రతుకులో కూడా ఉన్నాయి. నవరసాత్మకంగా మనలో భావాలు ఉంటాయి. ఈ ఎనిమిది రకాల భావాల ఊపిరిలో తేడా ఉంటుంది. క్రోధంలో ఉన్నప్పుడు హంసగమనంలో తేడా ఉంటుంది. శృంగారాది భావాలలో ఊపిరి గమనంలో మరికొన్ని తేడాలు ఉంటాయి. ఇవన్నీ పరిశీలిస్తే మన లోపల అమ్మవారి నాట్యాన్ని చూడవచ్చు.

క్రోధం, ఉద్రేకం, భయం ఎక్కువగా కలిగితే ఊపిరి వేగం పెరుగుతూ ఉంటుంది. ఊపిరి వేగం పెరిగిపోతోందంటే బ్రతుకు తగ్గిపోతోంది అని అర్థం. బ్రతుకుకి తెచ్చుకున్న ఊపిరుల సంఖ్యాపరిమితి ఖర్చు అయిపోతూ ఉంటుంది. కనుక ఊపిరి చక్కగా నిలవాలి అంటే మందగమనంతోనే ఊపిరి సాగాలి. అలా సాగితే బ్రతుకు పెరుగుతుంది. ఆ గమనం మన చేతిలో ఉంచుకొనేలా చెయ్యడమే ప్రాణాయామ సాధన.

ఏ సమయంలో ఊపిరి మందగమనంగా ఉంటుందో ఆ సమయంలోనే మనం లోపల ఉన్న అమ్మవారిని గ్రహించగలం. మిగిలిన ఉద్రేకాది భావాలు ఉన్నప్పుడు గమనించలేము. జప, ఉపాసన, ధ్యాన సమయాలలో ఊపిరి మందగమనంలో ఉంటుంది. ఎవరికి ఎక్కువ ఉపాసన, జప, ధ్యానాలు ఉంటాయో వారికి తప్పకుండా ఎక్కువ ఆయువు ఉంటుంది. ఆ సమయంలో మనకి మనం పరిశీలించినప్పటికీ కూడా మన ఊపిరిలో ఒక ప్రశాంతస్థితి ఏర్పడుతుంది. ఇదే తొమ్మిదో రసమైన శాంతరసం. మిగిలిన ఎనిమిది రసాలు లోక భావాన్ని ఆశ్రయించి ఉంటాయి. ఈ తొమ్మిదో రసం రావడానికే అంతర్ముఖం కాగలగాలి. ధ్యానస్థితిలో అయితే ఊపిరి మందగమనంలో ఉంటుంది. కనుక **'మరాళీమందగమనా'** అంటే

జపాదికాలాలలో ఉపాసకుని యందు మందగమనంగా సాగుతున్న ముఖ్యప్రాణ స్వరూపిణి. యోగిలో సరిగ్గా మూలాధారం నుండి సహస్రారానికి చేరి, మరల సహస్రారం నుండి మూలాధారానికి వస్తూ ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది. దానిలో ఏ వికారాలు ఉండవు. ఈ శాంతమైన గమనం యోగులకి ఎప్పుడూ ఉంటుంది. యోగుల స్థితి శాంతం. ఇది అమ్మవారి యొక్క అసలు స్వరూపం.

శ్రీచక్రంలో తొమ్మిది ఆవరణలలో తొమ్మిది రసాలు ఉంటాయి. మిగిలిన ఎనిమిది రసాలు లోకాన్ని ఆశ్రయించుకుని ఉంటాయి. తొమ్మిదో రసం బిందువులో ఉంటుంది. ఇది లోకాలకు అతీతమైన స్థితి. కేవలం అంతర్ముఖస్థితిలోనే ఉంటుంది. అది లోకాతీత, గుణాతీత. అందుకు బిందుస్థానం దగ్గర కేవలం శాంతమే. అక్కడ నుండి వచ్చిన ప్రాణశక్తి యొక్క తరంగాలే మిగిలిన ఎనిమిది ఆవరణలలోనూ ఉంటాయి. అంటే మన లోపల సాగుతున్న ప్రాణశక్తికి, శ్రీచక్రానికి, ప్రపంచానికి, జీవితానికి, మంత్రానికి ఉన్న అవినాభావ అనుబంధాన్ని ఆలోచిస్తే, శ్రీవిద్యలో ఇన్ని మర్మాలున్నాయా! అని ఆశ్చర్యమనిపిస్తుంది.

'మరాళీమందగమనా' అంటే మనలో ముఖ్యప్రాణరూపిణిగా మందగమనం చేస్తూ యోగులకు, ఉపాసకులకు సాధనలో అనుభవానికి వచ్చే స్వరూపమే చెప్పబడుతోంది. అమ్మవారి గమనము అనగా ఆ చిచ్ఛక్తి యొక్క గమనము ప్రధానంగా యోగ గమనమే. ఇది ఈ అర్థంలో ఉన్న ఆంతర్యం. అందమైన స్త్రీ నడిచే నడక అని బాహ్యంగా ఈ నామానికి అర్థం. ఇది కేవలం స్థూలదృష్టి. పై పైన చదివేవారు అమ్మవారు చాలా అందంగా నడుస్తూ ఉంటారు అని నమస్కారం పెడుతూ ఉంటారు.

48. మహాలావణ్యశేవధిః - శ్రీ మహాలావణ్యశేవధయే నమః

'శేవధి' అనే మాటకు నిధి, పరమావధి అని రెండు అర్థాలు. తరగకుండా ఉంటే నిధి. దానిని మించి మరొకటి లేదు అన్నప్పుడు 'శేవధి'. రెండు అర్థములు తీసుకోవాలి. అమ్మవారు మహాలావణ్యానికి నిధి వంటిది. అమ్మవారిని మించిన లావణ్యం మరొకటి లేదు. మామూలు లావణ్యం కాదు మహాలావణ్యం. మహా,

శేవధి అనే శబ్దాలతో అమ్మవారి లావణ్యం ఎంత ఉందో ఊహించుకోవచ్చు. చివర నామమైన **'శ్రీలలితాంబికా'** అంటే ఏమిటో ఇక్కడ చెప్పారు. లలితా అనే మాటకు అర్థం చూపిస్తున్నారు.

'లోకాతీత లావణ్యాత్ లలితా తేన సోచ్యతే' (మత్స్యపురాణం). లోకాతీతమైన లావణ్యాన్ని 'లలిత' అంటారు. ఆ లావణ్యం సముద్రంలా అనంతంగా ఉంది. దానిని మించి మరొకటి లేదు. లావణ్యానికి నిధి. పైగా 'మహా' అత్యంత ఉత్కృష్టమైనది, గొప్పది. ఆవిడ ఒక లావణ్యసముద్రం అయితే మనం లోకంలో చూస్తున్న లావణ్యములన్నీ ఆ సముద్రములో బిందువుల వంటివి. అమ్మ లావణ్యం సింధువు. స్వయంప్రకాశమానమైనది. ఆ లావణ్యమే లోకాలలో ఉంది. లోకాలను మించి ఉంది. లోకాలలో వచ్చే లావణ్యం లోకాలు పోతే కనుమరుగు అవుతుంది. కానీ అమ్మ యొక్క లావణ్యం లోకానికి అతీతం కనుక లోకం ఉన్నప్పుడూ, లేనప్పుడూ కూడా ఉంటుంది.

'మహాలావణ్యశేవధి'– అత్యంత సుందరమైన స్వరూపం కలది. ఆ సౌందర్యానికి పరిమితి చూపించలేరు. ఇది అని నిర్దేశించలేరు. సౌందర్యము అన్నా, లావణ్యం అన్నా ఒకటే భావం కనుక సౌందర్యస్వరూపిణి. దశమహావిద్యలలో 'సుందరి' అని చెప్పబడే విద్య లలితాదేవిదే. అమ్మ పేరే లలితామహాత్రిపురసుందరి. శ్రీవిద్యలో మూడవ విద్య పేరు 'సుందరీ విద్య'. శ్రీవిద్యకే 'సుందరీ విద్య' అని పేరు. దీనికే లలితావిద్య, సౌభాగ్యవిద్య, షోడశీవిద్య అని పేర్లు ఉన్నాయి. దశమహావిద్యలలో శ్రీవిద్యకు ఉన్న లోతు మరెక్కడా లేదు. శంకరభగవత్పాదులవారు దశమహావిద్యలను గమనించి, ఈ మూడవ విద్యను మాత్రమే తీసుకువచ్చారు. ఆయన అసలు ఉద్దేశం, జీవుడు ఎప్పుడూ ఐహికంగా చూసుకుంటూ ఉంటే లాభం లేదు బ్రహ్మవిద్య పొందాలి, తరించాలనేది. కానీ అందరికీ అది అంత తేలికగా రాదు కనుక మానవులు తరించాలంటే ఏం చెయ్యాలా అని ఆలోచించి వీరికి ఐహికం, పరమార్థం–రెండిటికీ పనికొచ్చే విద్య ఏమిటా అని ఆలోచించి మూడవ విద్య అయిన శ్రీవిద్యను చెప్పారు.

సౌందర్యవిద్యను చెప్పే గ్రంథమే 'సౌందర్యలహరీ' అన్నారు శంకరులవారు. అందం అంటే అందరికీ ఆనందమే. అందము ఆనందము కాదు. ఆనందమే అందం. అందుకే అందం, ఆనందము రెండూ ఒకే అర్థం.

అది సత్–చిత్–ఆనందము. ఆ సచ్చిదానంద స్వరూపమైన బ్రహ్మమే అని ఉపనిషత్తు ప్రతిపాదన చేస్తున్నది. **'ఆనందాదేవ ఖల్విమాని భూతాని జాయంతే ఆనందోఽబ్రహ్మేతి వ్యజానాత్'** – ఆనందమే బ్రహ్మమని ఉపనిషత్ చెప్తోంది. ఈ ఆనందమే లోకములో అన్నింటిని మించిన ఆనందము. అది శేవధి. దానిని మించి మరొకటి లేదు. లోకములో చూస్తున్నవన్నీ దాని యొక్క లవలేశములే, ఆభాసలే. అందుకు లావణ్యశేవధి అంటే ఆనందశేవధి.

లావణ్యశబ్దం సౌందర్యానికి, సౌందర్యశబ్దం ఆనందానికి, ఆనంద శబ్దం సచ్చిదానంద శబ్దమునకు అన్వయిస్తే మహాలావణ్యశేవధిః. లలితాదేవి అనగా మహాసౌందర్యరూపిణి, సచ్చిదానందరూపిణి. మహచ్ఛబ్దం బ్రహ్మమును తెలియజేస్తుంది.

చిదగ్నికుండంలో కనబడిన అమ్మ కదిలి బయటకు వచ్చినప్పుడు కాలిమువ్వలు మ్రోగాయి. నెమ్మదిగా నడిచి వచ్చి ఎదురుగానున్న పరశంభువు ముందు ఆ తల్లి ఆగింది. అప్పుడు దేవతలు, ఋషులు 'మహాలావణ్యశేవధిః' అని నమస్కారం చేశారు.

49. సర్వారుణా – శ్రీసర్వారుణాయైనమః
(శ్రీ సర్వారుణానవద్యాంగ్యై నమః, శ్రీ అనవద్యాంగ్యై నమః)

ఇది ఒక చాలా లోతైన మాట. 'సర్వారుణా' అంటే అంతటా అరుణ ఛాయతో ప్రకాశించేది. అమ్మవారు ఎఱ్ఱని కాంతులతో ప్రకాశిస్తున్నారు. ఈ మాట 'నిజారుణప్రభాపూరమజ్జద్బ్రహ్మాండమండలా' దగ్గరే మొదలుపెట్టారు.. ఇక్కడ పూర్తి చేశారు. అక్కడ ప్రారంభమైన అరుణం ఇక్కడ పూర్ణమయింది. ఈ అరుణవర్ణం గురించి ఎక్కువ చింతన చెయ్యాలి. ఎందుకంటే అమ్మవారి శరీరమంతా ఎరుపు. ఆ

పాదాల వద్దకు వచ్చేటప్పటికి ఈ ఎరుపు మరికొంచెం ఎక్కువ కనబడుతోంది. ఎందుకంటే అతిసుకుమారం అయిన చోట్ల ఎరుపుకాంతి ఎక్కువ ఉంటుంది.

ఎఱ్ఱని తల్లి పాదాలు మరింత ఎఱ్ఱగా, ఎఱ్ఱని పద్మాల వలె ప్రకాశిస్తున్నాయి. ఆ ఎఱ్ఱని పద్మాల్లోంచి ప్రపంచం వైపు వెలుగులు వస్తూ ఉంటాయి. ఇదొకటి ధ్యానం చేసుకోవలసింది. ఎందుకంటే సర్వబ్రహ్మాండాలకు అతీతంగా ఉన్న అమ్మవారి పాదముల నుండి వచ్చిన కిరణాలు ఇన్ని బ్రహ్మాండాలకు వెలుగుని ఇస్తున్నాయి. ఆ కిరణాలు మూడు కళలుగా ఉంటాయి. అవి-అగ్ని, సూర్య మరియు చంద్రకళలు. ఈ మూడే ప్రపంచానికి ఆధారం. మనలో కూడా అగ్ని, సూర్యుడు, చంద్రుడే శక్తి కేంద్రాలుగా ఉన్నారు. వాక్కుకి అగ్ని అధిదేవత - **'అగ్నిర్మే వాచి శ్రితః'.** అలాగే మనస్సుకి చంద్రుడు అధిదేవత - **'చంద్రమా మనసో జాతః'.** దృష్టికి సూర్యుడు అధిదేవత - **'చక్షోః సూర్యో అజాయత'.** దృష్టి అనేది శరీరానికి, బుద్ధికి సంబంధించిన అంశం. మన త్రికరణ శక్తులు సూర్యచంద్రాగ్నిమయములే.

అలాగే ప్రపంచమంతా సూర్యచంద్రాగ్నిమయమే. ఈ సూర్యచంద్రాగ్నులకు మూలమైన జ్యోతి అమ్మవారు. ఆమె పాదాల నుండి వస్తున్న కిరణజాలములు మొత్తం అగ్ని, సూర్య, చంద్ర కిరణములుగా విడివడుతూ ప్రపంచము వైపు ప్రసరిస్తున్నాయి.

అగ్ని, సూర్య, చంద్ర కిరణముల వల్లే లోకం, కాలం ఏర్పడుతున్నాయి. ఇది కొంచెం లోతైన అంశమైనా, కొంచెం ఆలోచించాలి. సౌందర్యలహరిలో **'చతుష్షష్ట్యాతంత్రైః....' 'క్షితౌ షట్పంచాశత్....'** అనే శ్లోకాలలో ఈ విషయాన్ని ఆదిశంకరులు వివరించారు. ఆరు ఋతువులు కలిపితే ఒక సంవత్సరం. సంవత్సరానికి నిజానికి ఆరు ఋతువులు చెప్పినా మూడే కాలాలు. వేసవికాలం, శీతాకాలం, వర్షాకాలం - అంటే వేడి, మంచు, వర్షం - ఈ మూడే. ఈ మూడు వచ్చినప్పుడు మనకి మూడింటిలో ఒకదాని ప్రాధాన్యం పెరిగిపోతూ ఉంటుంది. అగ్ని ప్రాధాన్యం ఒక కాలంలో పెరుగుతుంది. అదే విధంగా చంద్ర ప్రాధాన్యం వల్ల హిమము ఏర్పడుతుంది. ఈ మూడింటిని గమనించుకుంటూ వెళ్తూ ఉంటే ఈ మూడింటి

యొక్క అనుపాతాల తేడా బట్టి కాలం ఏర్పడుతుంది. అమ్మవారంటే ఏదో వస్తువు కాదు. నిత్యం మన అనుభవంలో ఉన్నది ఆ శక్తి అని తెలుసుకోవడానికి ఇదంతా వివరించడం జరిగింది. ఇలా సంవత్సరకాలమంతా సూర్యచంద్రాగ్నిమయమైన శక్తులే.

అగ్ని కిరణములు (108) నూట ఎనిమిది, సూర్యకిరణాలు (116) నూట పదహారు, చంద్రకిరణాలు (136) నూట ముప్పై ఆరు. మొత్తం మూడువందల అరవై (360). అంటే ఒక సంవత్సరకాలం సంపూర్ణం. మూడువందల అరవై (360) అంటే ఒక వృత్తం. ఇది సంపూర్ణత్వాన్ని సూచిస్తుంది. విశ్వచక్రం – కాలచక్రం ఈ రెండూ... ఒకటి కాలం, ఇంకొకటి దేశం.

ఈ దేశకాల చక్రమంతా కూడా సూర్యచంద్రాగ్నిమయం. చూశారా! ఎంత విజ్ఞానపరంగా అమ్మవారి తత్త్వం ఉన్నదో! అందుకే ఈ మధ్య విజ్ఞానవేత్తలు కూడా అంగీకరించిన గొప్పవిద్య– 'శ్రీవిద్య'. వారికి శ్రీచక్రం, శ్రీవిద్యలే చాలా ఆశ్చర్యంగా ఉన్నాయి. దేశకాలములందు అంతటా ఆవరించిన మూడు తత్త్వములు, మూడువందల అరవై కిరణములు. మూడు వందల అరవై కిరణములు కూడా ఆ తల్లి పాదముల నుండే లోకమంతా వ్యాపిస్తున్నాయి. అమ్మపాదముల వెలుగులే సర్వమూ అయినప్పుడు, అరుణకాంతులతో ఉన్న అమ్మ వెలుగులు సర్వ అరుణం. ఇదే 'సర్వారుణా' అంటే అర్థం. సర్వమునూ ప్రకాశింపజేసే అరుణపు కాంతులు కలది. మొత్తం ఆవిడ వెలుగే ప్రపంచమంతా.

ఇప్పుడు ముందు చెప్పుకున్న నామం 'నిజారుణప్రభాపూరమజ్జద్బ్రహ్మాండ మండలా' చూస్తే బాగా అర్థమవుతుంది. సర్వజగత్తు ఆమె అరుణకాంతులతోనే వెలిగిపోతోంది. ఈ అరుణమనే మాట అంత తేలికైన మాట కాదు. అరుణోపనిషత్ అని ఒక ఉపనిషత్తు ఉంది. ఇందులో శ్రీవిద్యారహస్యాలన్నీ దాగి ఉన్నాయి. సౌర, అరుణ మంత్రాలు వేదాలలో ఉన్నాయి. ఈ అరుణ వర్ణంతో అమ్మవారు ప్రకాశించడాన్ని ధ్యానిస్తే ఒక విశేషం ఉంది. ఈ అరుణవర్ణం దేనికి సంకేతమో భావనోపనిషత్తులో చెప్తూ, **'లౌహిత్యం తద్విమర్శస్యాత్ ఉపాస్తిరితి భావనా'** – ఈ వాక్యం ముందు రాబోయే భావనాగమ్యా నామానికి కూడా పనికొస్తుంది.

లౌహిత్యము అంటే ఎరుపు అని అర్థం. లౌహిత్యం అమ్మవారి యొక్క విమర్శశక్తికి సంకేతం. తెలుపు, ఎరుపు అని రెండు రంగులు... ఇది తెలిస్తే గురుపాదుకలు గుర్తురావాలి.

వందే గురుపదద్వంద్వం అవాఙ్మానసగోచరం

రక్తశుక్లప్రభామిశ్రం అతర్క్యం త్రైపురం మహః

రక్తశుక్లప్రభామిశ్రం–ఎరుపు, తెలుపు ఈ రెండు అన్నారు. తెలుపు శివస్వరూపం, ఎరుపు శక్తి స్వరూపం. తెలుపు ప్రకాశం, ఎరుపు విమర్శ. విమర్శ అనగా వ్యాపించునది అని అర్థం.

దీనికి ముందు ఉదాహరణ చెప్పుకున్నాం... జ్యోతి ప్రకాశం అయితే వెలుగు విమర్శ. జ్యోతి శివుడు, వెలుగు అమ్మవారు. ఈ రెండిటి అభేదమే శివశక్తి అభేదమని భావన చెయ్యాలి. ఇంకా భావన చేస్తే జ్యోతి కదలకుండా ఉంది..అంటే అది అచలం, దాని నుండి వచ్చిన వెలుగు అమ్మవారు. వెలుగుకి మరొక పేరు అరుణం, అచలంగా ఉన్నది శివుడు, అరుణంగా ఉన్నది అమ్మవారు. రెండూ కలిపితే అరుణాచలం. అందుకే అరుణాచలం ఒక పెద్ద మేరువు, శ్రీచక్రం. అలా అనుగ్రహం ఉన్నవారు కొందరికి దర్శనం ఇచ్చింది అరుణాచల పర్వతం.

జ్యోతికి, కాంతికి భేదము లేదు కనుక జ్యోతి అచలం, కాంతి అరుణం. ఎరుపు కాంతి. విమర్శ సంకేతం. అందుకు విమర్శ యొక్క వర్ణమే ఎరుపు, ప్రకాశము యొక్క వర్ణమే తెలుపు. ప్రకాశ–విమర్శ తత్త్వముల మీదే మొత్తం శ్రీవిద్య ఉంది. ప్రకాశ–విమర్శ, శివ–శక్తి, శ్వేత–అరుణ, శుక్ల–రక్త వర్ణములు. ఆమె మొత్తం ఎరుపు కాంతులతో ప్రకాశిస్తూ ఉన్నది. శివుడు శుద్ధస్ఫటిక సంకాశం–తెల్లగా ఉంటాడు, నిర్వికారుడు. ఆయన శక్తి–ప్రపంచమంతా ఎరుపెక్కించి నడిపిస్తోంది. రంగులన్నీ ఆవిడవి, ఏ రంగు లేకుండా ఉండడం ఆయన. ఇది తెలిస్తే ఉపనిషత్తత్త్వంలో కూడా లీనమైపోగలం.

'వల్లభేశ ఉపనిషత్'లో ఎరుపు వర్ణం గురించి చెప్తూ, **'వర్ణానాం ఆద్యం లోహితం'** అన్నారు. తెలుపు నిజానికి రంగు కాదు, ఏ వర్ణము లేనిది. మొదటి

రంగు ఎరుపు. అమ్మవారు సృష్టికి ఆది–శక్తి కదా. ఆది...శక్తి అని చెప్పడానికి సంకేతమే ఎఱ్ఱని రంగు తల్లి. ఆది వర్ణము ఎరుపు ఎలా అవుతుంది అని ఆలోచిస్తే, మన అనుభవంలో ఒక రోజులో ఆది ఏది? ఎరుపే. రుద్రంలో **'అసౌ యస్తామ్రో అరుణ ఉతబభ్రుః సుమంగళః'** అని అక్కడ కూడా అరుణమే చెప్పబడింది. ఈ అరుణవర్ణంతో ఉన్న అమ్మవారిని సూర్యమండలంలో ధ్యానం చేస్తే అది ఒక పెద్ద ఉపాసన. కొందరు శ్రీచక్రం, శ్రీవిద్య లేవని బాధపడుతుంటారు. వారు కూడా తెలుసుకోవలసినది...... ఉదయాన్నే ఆకాశంలో సూర్యరూప శ్రీచక్రం వస్తోంది. అదే శివలింగం. అందులో ఎర్రని కాంతులతో ఉన్న అమ్మవారిని భావించాలి.

పాశాంకుశధనుర్బాణధరాం అరుణవిగ్రహాం

సూర్యమండలమధ్యస్థాం ధ్యాయేత్ త్రిపురసుందరీమ్ – అని భావించాలి. ఆ ప్రాతఃకాల కాంతులలో సూర్యమండలంలో ఎఱ్ఱని కాంతులతో అమ్మవారు మనకి గోచరిస్తున్నారు. ఆది – ఎరుపు వర్ణం – అమ్మవారు. ఈ రెండు అన్వయించుకోవచ్చు. ఆది వర్ణం, విమర్శవర్ణం అరుణం. అది సర్వారుణా. అరుణం శక్తి సంకేతం, సర్వశక్తిస్వరూపిణి. ఆ శక్తులతోనే ఈ జగత్తు అంతా ప్రకాశిస్తోంది కనుక సర్వారుణా.

50. అనవద్యాంగీ – శ్రీ అనవద్యాంగ్యై నమః

అవద్యం అంటే లోపము, దోషం అని అర్థం. అనవద్యం అంటే ఏ దోషం లేని స్వరూపము. సృష్టిలో దోషము లేని రూపమంటూ ఉండదు. రూపానికో దోషం ఉంటుంది. ఏ దోషము లేని రూపము ఏదైనా ఉంది అంటే అది జగదంబారూపమే. అమ్మవారి ఏ రూపమైనా అనవద్యాంగీ. దోషములు లేవు.

అసలు దోషములంటే ఏంటో ముందు తెలుసుకోవాలి. దోషాల్ని రెండు భాగాలు చేస్తే మొదటిభాగంలో దోషాలు: 'జాతా'–అంటే పుట్టుట ఒక దోషం. 'అస్తి'–పుట్టి కొంత కాలం ఉండడం – ఇది రెండవ దోషం. మూడు 'వర్ధతే'– పెరుగుట, నాలుగవది 'విపరిణమతే'–మార్పు చెందుట. పెరగడమంటే అర్థం తరగడమే కనుక ఐదవ దోషం 'క్షీయతే'–తరుగుట, ఆరవది 'నశ్యతే'–నశించుట.

సమయంలో తేడాలే తప్ప ఈ ఆరు దోషాలు సృష్టిలో ప్రతి ఉపాధికి ఉంటాయి. ఈ దోషాలు ఏవీ లేని స్వరూపం అమ్మవారు. ఆవిడ ఎప్పుడూ సద్వస్తువు. ఒకప్పుడు పుట్టి మరొకప్పుడు పోయి, పెరిగి, తరిగి మార్పు చెందేది కాదు. ఈ లక్షణములు నిజానికి పరమాత్మతత్త్వాన్ని తెలియజేస్తాయి. అమ్మవారు ధరించిన రూపానికి, పరమాత్మతత్త్వానికి ఏ భేదము లేదు కనుక అనవద్యాంగీ. ఈ ఆరు దోషములు లేనిది అమ్మవారి దివ్యమంగళ విగ్రహం.

ఇంకొక రకమైన దోషాలు అసత్యతా, అనిత్యతా, జడతా, పరాధీనత, పౌరుషేయతా, సాధ్యతా, పరిచ్ఛిన్నతా అని ఏడు దోషాలు సృష్టిలో కనబడే ఏ వస్తువుకైనా ఉంటాయి.

అసత్యతా – అంటే శాశ్వతం కాదు. **అనిత్యతా** – నిత్యంకాదు. శాశ్వతం అంటే ఎప్పుడూ ఉండేది. నిత్యం అంటే ఎప్పుడూ ఒకేలా ఉండేది. సృష్టిలో శాశ్వతమేమీ కాదు, నిత్యం ఒకేలా ఉండదు. కానీ అమ్మవారు శాశ్వతం, నిత్యము కూడా.

జడతా – లోకంలో ప్రతి ఉపాధికి జడత్వం ఉంటుంది. మన శరీరం చైతన్యం కాదు..జడమే. కానీ అమ్మవారి శరీరం చైతన్యవిగ్రహం. అమ్మవారి రూప భావన అన్నప్పుడు ఈ విషయం తెలియాలి. అందుకే లోకంలో ఉండే అసత్యతా, అనిత్యతా, జడతా అనేవి కూడా అమ్మవారి రూపంలో లేవు.

పరాధీనత – మన శరీరాలు ఎప్పుడు పరాధీనమే (ఇంకొకరి అధీనంలోనే ఉంటాయి). అమ్మవారి రూపానికి పరాధీనమనేది లేదు. అది పూర్తిగా 'స్వతంత్రం'.

పౌరుషేయతా – అంటే ఏ రూపాన్నైనా మానవులలో, జీవులలో సృజించాలి. మానవుల ఉపాధుల సహాయంతోనే మరో ఉపాధి వస్తుంది. ఏ ఉపాధులైనా కొన్ని ఉపాధుల నుండే వస్తాయి. కానీ అమ్మవారి రూపం ఇతరులు ఎవరూ తయారు చెయ్యలేదు. అందుకే దానికి పౌరుషేయతా అనేది లేదు, అది 'అపౌరుషేయం'.

సాధ్యతా – ఆ రూపాన్ని ఎవరూ సాధించలేరు. ఎక్కడో ఉన్న ఏదైనా రూపాన్ని ఇక్కడకు పట్టుకురాగలరు. కానీ అమ్మవారి రూపాన్ని అలా పట్టుకురాలేరు. అమ్మవారి దగ్గర సాధ్యతా అనేది లేదు. ఆవిడ 'అసాధ్యా'.

పరిచ్ఛిన్నతా - అంటే పరిమితి. ప్రతిదానికి ఎంతో కొంత పరిమితి ఉంటుంది. ఈ దోషాలు సృష్టిలో ప్రతిదానికి ఉంటాయి. అమ్మవారు మాత్రమే దోషాలు లేని వస్తువు.

అమ్మవారి రూపం అనవద్యాంగీ. ఏ దోషం లేని స్వరూపం కలది. ఇంతవరకు తెలుసుకున్న నామాలననుసరించి అమ్మవారు ఏమిటో వివేచన చెయ్యాలి.

51. సర్వాభరణభూషితా - శ్రీ సర్వాభరణభూషితాయై నమః

అమ్మవారు సర్వాభరణములు అలంకరించుకుంది. పాపిటబిళ్ళ నుండి కాలిమట్టెల వరకు ఒకొక్క అవయవానికి, ఉపాంగానికి ఒకొక్క ఆభరణమును శాస్త్రములు చెప్పాయి. అవన్నీ అందరూ ధరించగలరా! ధరించినా కొందరికి శోభిల్లదు. శోభిల్లాలి అంటే దానికి తగ్గ తనువు ఉండాలి.

రామచంద్రమూర్తి గురించి హనుమంతుడు చెప్తూ, "అన్ని అలంకారములు ధరించదానికి యోగ్యమైన శరీరము కలిగి కూడా మీరెందుకు ధరించలేదు" అంటారు వనవాస సమయంలో. ఆభరణాలు ఉంటే చాలదు, దానిని ధరించదానికి యోగ్యమైన శరీరం కూడా ఉండాలి. అమ్మవారికి ఆ రెండు చక్కగా సరిపోయాయి. ఆభరణాలకే ఆభరణం అమ్మవారి యొక్క శరీరం. అలాంటి అలంకారములు మొత్తం అమ్మవారి దగ్గర ఉన్నాయి. ఆవిడకి లోటేమిటి? 'సర్వాభరణభూషితా'.

'సర్వాభరణభూషితా' అన్నప్పుడు ఆలోచించవలసింది అమ్మవారు చిదగ్ని కుండం నుండి వచ్చేటప్పటికే ఆభరణాలతో వచ్చారు అంటే ఆవిడ ఎంత సహజమో, ఆభరణాలు అంత సహజమనే కదా అర్థం. అంటే ఆవిడ శరీరం ఎలాంటి చైతన్యమో, ఆభరణాలలో అదే చైతన్యం ఉంది. అవి ఎక్కడినుండో రాలేదు. కనుక ఆభరణములు కూడ అమ్మవారి శరీరమునకు భిన్నములు కావు, అవికూడా అమ్మయొక్క శక్తులే.

అందుకు 'సర్వాభరణభూషితా' అంటే సర్వమంత్రములతో అలంకృతమైనది. ప్రతి మంత్రము అమ్మవారికి అలంకారమే. అందులో ప్రతి ఆభరణాలు అలంకారాలే. అన్ని మంత్రములతో అలంకరింపబడ్డ మహామంత్రరూపిణి అమ్మవారు.

52. శివకామేశ్వరాంకస్థా - శ్రీ శివకామేశ్వరాంకస్థాయై నమః

'శివకామేశ్వరాంకస్థా'–'శివా'–'స్వాధీనవల్లభా' - ఈ మూడు నామాలు మరొక ప్రత్యేక నామాలు. 'శ్రీమాతా' 'శ్రీమహారాజ్ఞీ' 'శ్రీమత్సింహాసనేశ్వరీ' ఎంతో ఇది అంత.

'సర్వాభరణభూషితా'తో అమ్మవారి రూపవర్ణన అయిపోయింది.

భండాసుర సంహారం కోసం చిదగ్నికుండం రగిల్చితే ఆ కుండం నుండి అమ్మవారు వచ్చారు. ఇక్కడ జరిగిన కథంతా లలితోపాఖ్యానంలో ఇదివరలో హయగ్రీవస్వామి చెప్పారు. అక్కడ చెప్పినవి ఇక్కడ నామాలలో వచ్చాయి. ఇప్పుడు ఈ నామాలు అర్థం కావడానికి కథ కూడా తెలియాలి. అమ్మవారు చిదగ్నికుండంలో ఉద్భవించగానే బ్రహ్మాది దేవతలు నమస్కరించారు.

సర్వదేవతలు అమ్మవారి శరీరం నుండి తిరిగి సృజింపబడ్డారు. సృజింపబడిన దేవతలందరూ అమ్మవారికి నమస్కరించి, "తల్లీ! నువ్వు మమ్మల్ని అనుగ్రహించాలి" అంటే బ్రహ్మ ఆలోచించాడు. శత్రువు భండాసురుడు. వానికి శూన్యకపట్టణమని ఒక పట్టణము ఉంది. ఇప్పుడు వానిని కొట్టాడానికి అమ్మవారు వచ్చారు కనుక అమ్మవారిని మేము రాణిగా చెయ్యాలి. ఎందుకంటే వాడు రాక్షసరాజు. ఈమె మా అందరికి రాణి. రాణి కావాలంటే మంచి పట్టణం, రాజధాని ఉండాలి. అమ్మవారి పట్టణం అంటే అక్కడెక్కడో మణిద్వీపంలో ఉంది. ఇప్పుడు ఈవిడకో పట్టణం తయారు చెయ్యాలి అని నిర్ణయించుకుని బ్రహ్మ విశ్వకర్మని పిలిచాడు. అద్భుతమైన పట్టణం తయారైంది. అమ్మవారు అక్కడికి వెళ్ళాక ఆ పట్టణాన్ని వర్ణన చేస్తారు.

కథ అర్థం కావడం కోసం మనం ఇది ముందుగా చెప్పుకుంటున్నాం. ఈ క్రమం చాలా ఔచితీమంతంగా వశిన్యాదివాగ్దేవతలు చెప్పారు. శ్రీమన్నగరం నిర్మాణమయింది. అక్కడన్ని ఆవరణల మధ్య చింతామణిగృహంలో సింహాసనం కూడా సిద్ధం చేశారు.

రాణిగారు సింహాసనంపై కూర్చుందామని సిద్ధపడుతుండగా, బ్రహ్మ ఆగమన్నారు. ఎందుకంటే ఆయనకి చాదస్తం ఎక్కువ. చాదస్తం అంటేనే వేదవిద్య

అని అర్థం–ఛాందసం. ఆయనకి అన్నీ పద్ధతిగా జరగాలి లేకపోతే ఒప్పుకోడు. రాణిగారు కావాలి కానీ రాజులేని రాణికి పట్టాభిషేకం చెయ్యకూడదు. ఎంత రాణిగారైనా రాజుగారు ఉండాలి. కనుక "అమ్మా! నువ్వు ఏమీ అనుకోకపోతే సంప్రదాయం ప్రకారంగా నువ్వు రాజుగారితోపాటు కూర్చోవాలి".

రాజుగారు ఎవరు? శివుడు. అయితే ఆవిడ ఏ కొత్తరూపం ధరించినా మళ్ళీ శివుడు కొత్తగా పెళ్ళిచేసుకోవాలి. ఇదో నియమం. అలాగే ఆయన ఎప్పుడు కొత్తగా వచ్చినా, ఆవిడ మళ్ళీ కొత్తగా వస్తుంది. ఇద్దరూ కలసి ఎన్ని పెళ్ళిళ్ళు చేసుకొన్నారో! కాంచీపురంలో కామాక్షీ–ఏకామ్రేశ్వరుల కళ్యాణం జరిగింది. మళ్ళీ ఆయన, ఈవిడ రూపం ధరిస్తే మళ్ళీ మనకోసం పెళ్ళి చేసుకుంటారు. ఎందుకంటే మళ్ళీ ఆ కాలంనాటి ఋషులు, దేవతలు చూడడానికి.

అగస్త్యమహర్షి వారి పెళ్ళి చూడాలని ముచ్చట పడ్డాడు కాబట్టి కాంచీపురంలో జరిపించుకున్నాడు. భక్తుల కోసం మళ్ళీ మళ్ళీ చేసుకుంటారు. కానీ దంపతులు వాళ్ళే. ఇప్పుడు అమ్మవారు రాణిగా కూర్చోవాలి అంటే రాజుగారు ఎవరు? పరమశివుడే. ఆయన వారందరితో పాటు నిలుచుని ఉన్నాడు. కానీ ఎప్పుడూ లేనిది బ్రహ్మకి ఒక భావం కలిగింది. ఇంత అందగత్తెకు ఇతన్ని ఇవ్వాలా? అనిపించింది. ఎప్పుడూ లేనిది అంటే అర్థం ఏంటంటే అమ్మవారు కూడా ఎప్పుడూ లేనంత అందంగా ఉన్నారు. లలితాదేవిరూపం అన్ని రూపాల కంటె మహాసౌందర్యం.

ఇది తెలియాలంటే రామకృష్ణపరమహంసగారు గొప్పమాట చెప్పారు. ఆ మహానుభావుడు అమ్మవారి మంత్రములన్నీ సిద్ధిపొందాడు. ఏ మంత్రములైనా మాల త్రిప్పడం ఆలస్యం...ఆ తల్లి కనబడేది. సాధారణంగా మంత్రం అక్షరలక్షలు చేసి పురశ్చరణ చేస్తే మంత్రసిద్ధి వస్తుంది కానీ దేవత కనబడదు. దేవత కనబడాలంటే దానికి ఎంతో తపస్సు కావాలి. కానీ రామకృష్ణపరమహంసకి మాత్రం ఒక్క మాల తిప్పగానే దేవత వచ్చి కనబడేది. "నేను అమ్మవారి అన్ని రూపాలు చూశాను. చూశాను కాదు... అమ్మ చూపించింది ప్రతిరూపమూ దివ్యమే కానీ ఒక రూపముంది అలాంటి రూపం ఇంతవరకూ ఎక్కడా లేదు. అది అన్నిటికీ గొప్పరూపం. ఆవిడే

లలితారాజరాజేశ్వరి" అని చెప్పారు. అందుకే **మహాలావణ్యశేవధిః.** "అంత లావణ్యశేవధి ఎదురుగా నిలబడితే చితాభస్మం పూసుకొని, జడలు కట్టుకుని ఉన్న ఈయనకు ఇవ్వాలా" అని బ్రహ్మ మనస్సుకి అనిపించింది.

బ్రహ్మకి తెలుసు ఈయనకే ఇవ్వాలని. అందుకే మనస్సుకి అనిపించి కొంచెం నసిగాడు. ఈ లోపల పరమశివుడు అర్థం చేసుకుని సంకల్పమాత్రం చేత వెంటనే రూపం మార్చేసుకుని ఆవిడకి తగ్గట్లు అందంగా సిద్ధమై ప్రక్కకి వచ్చి నిలబడ్డాడు, "బాగున్నానా?" అని బ్రహ్మని అడిగాడు.

బ్రహ్మ, "ఎంతో బాగున్నావయ్యా! ఇంత సౌందర్యం నీలో నేనెప్పుడూ చూడలేదు" అన్నారు. "ఎంతో కమనీయంగా ఉన్నావు. 'కమనీయత్వాత్ కామః' నువ్వు కమనీయంగా ఉన్నావు కనుక నీకు నేను 'కామేశ్వరుడ'ని పేరు పెడుతున్నాను". ఇప్పుడు ఆయన్ని అమ్మవారికి చూపించి, "సరేనా?" అన్నారు బ్రహ్మ. ఆవిడ కూడా 'సరే' అన్నారు. వెంటనే అమ్మవారు శివునికి వరమాల వేశారు. ఇప్పుడు కళ్యాణం చేయాలంటే చుట్టూ చూశాడు. అమ్మవారి సోదరుడైన నారాయణుడు అక్కడే ఉన్నాడు. నారాయణుని పిలిచి కన్యాదానం చెయ్యమన్నారు. వెంటనే ఆయన వచ్చాడు. ఈ ఇద్దరి చేతులు రెండు కలిపి కన్యాదాన ధార పోశాడు నారాయణుడు. ఇప్పుడు కామేశ్వరీకామేశ్వర కల్యాణం జరిగింది.

పిదప అమ్మవారికి పట్టాభిషేకం చేశారు. పట్టాభిషేకం చేసి పంచబ్రహ్మాసనం మీద కూర్చోబెట్టారు. సంప్రదాయం ప్రకారంగా ఆయన వెళ్ళి కూర్చున్నాడు. **'కామేశజ్ఞాతసౌభాగ్యమార్దవోరుద్వయాన్వితా'** కదా! అప్పుడు వెళ్ళి ఆయన ఒళ్ళో ఆవిడ కూర్చుంది. అందుకు **'శివకామేశ్వరాంకస్థా'.** పట్టాభిషేకదృశ్యాన్ని ఇక్కడ చూపిస్తున్నారు.

ఈ 'శివకామేశ్వరా' అని చెప్పడం విశేషమేంటి? కామేశ్వర అంటే సరిపోతుంది కదా! అందుకు ఒక పాఠాంతరం కూడా ఉంది. జయమంగళవ్యాఖ్య రాసేటప్పుడు భట్టనారాయణులు **'శివా కామేశ్వరాంకస్థా శివస్వాధీనవల్లభా'** అని నామాలు పేర్కొన్నారు. ఆ పాఠంలో **'శివస్వాధీన వల్లభా'** అని ఉంది.

భాస్కరరాయలవారు 'శివకామేశ్వరాంకస్థా' ఒక నామం చేశారు. 'శివా' నామం ముందుకు తెచ్చి, 'కామేశ్వరాంకస్థా' నామమే విడిగా తీశారు. దాని ఔచిత్యం దానిది, దీని ఔచిత్యం దీనిది. 'శివకామేశ్వరాంకస్థా'లో ఉన్న అందం పరిశీలించాలి.

శివుడు అంటే **'ప్రమహసిపదే నిస్త్రైగుణ్యే శివాయ నమో నమః'**. ఈ ప్రపంచానికి, త్రిగుణాలకి అతీతమైన తేజస్సుని శివ అనాలి. త్రిగుణాతీత స్థితిలో సృష్టి ఏం లేదు. నిర్వికారం. శుద్ధం. స్ఫటికం. అలా కేవల శుద్ధస్ఫటిక సంకాశంగా ఉన్న స్వరూపం శివం. ఆయనకి ఇదివరకు కల్పాలలో జీవులయొక్క కర్మవాసనలను అనుసరించి ఉపాధులని ఇవ్వాలి కనుక సృష్టి చెయ్యాలని కోరిక పుట్టింది. ఆ కోరిక పుట్టగానే అంత శివుడు ఈశ్వరుడు అయ్యాడు. శివుడు ఎప్పుడు ఈశ్వరుడయ్యాడు అనేది చూడాలి. శివుడే పరమాత్మ. ఆయనకి సృష్టిచెయ్యాలనే కోరిక పుట్టినప్పుడు ఆయన పరమేశ్వరుడయ్యాడు.

పరమేశ్వర, పరమాత్ముడు అంటే ఏమిటో శివ, ఈశ్వర అన్నా ఇదే అర్థం. అంటే ఇప్పుడు ఈశ్వరునికి కొత్తగా ఒక అర్హత వచ్చింది. అది-సృష్టి, స్థితులు చెయ్యాలని కోరిక కలిగింది. ఆ కోరిక రాగానే సృష్టి ఏర్పాటయింది. పరమాత్మకు ఇచ్ఛ పుట్టిందంటే అందులోనే మిగిలినవన్నీ ఉంటాయి. అందులోంచే మిగిలినవన్నీ బయటకి వస్తాయి. బయట వస్తువులంటూ ఆయనకు ఉంటేగా. జ్ఞానం కూడా ఎవరో నేర్పితే ఆయనకు వస్తుందా! ప్రపంచం చెయ్యాలనే జ్ఞానమూ ఆయనలోంచే వచ్చిందిగా! అందుకు ప్రపంచం చెయ్యగలిగే పరికరాలు ఆయన నుండే వచ్చాయి. కనుకనే చెయ్యాలనే కోరిక 'ఇచ్ఛ'. ఎలా చెయ్యాలనే తెలివి 'జ్ఞానము'. చెయ్యడమనే పని 'క్రియ'. ఇచ్ఛ, జ్ఞాన, క్రియ- ఈ మూడు ఒక దాంట్లోనే ఆయనకున్నాయి. ఆ మూడింటిని కలిపితే 'శక్తి' అంటారు.

ఈ శక్తి మొదట ఆయన నుండి సంకల్పరూపంతో, కామరూపంతో వచ్చింది. ఈ సంకల్ప కామ శక్తే ఇచ్ఛాశక్తి. ఈ ఇచ్ఛాశక్తే జ్ఞాన క్రియాశక్తులుగా వచ్చింది. ఇచ్ఛలోనే జ్ఞానక్రియలు ఉన్నాయి. మనం శివసంకల్పాన్ని మొదట చూసుకోవాలి. సంకల్పము, కామం. కామం అంటే కోరిక.

ఉపనిషత్తే పరమేశ్వరుని గురించి చెప్తూ ప్రజ్ఞానం, కామం - ఇవన్నీ పరబ్రహ్మ యొక్క నామాలు అని చెప్పింది. ఇది ఉపనిషత్తుల్లో పరిశీలిస్తే గమనించవచ్చు.

శ్రుతి ప్రమాణంగా **'యదేతత్హృదయం మనశ్చైతత్ సంజ్ఞానమాజ్ఞానం విజ్ఞానం ప్రజ్ఞానం మేధా దృష్టి ధృతి ర్మతి మనీషా జూతిః స్మృతిః సంకల్పః క్రతురసుః కామో వశః ఇతి సర్వాణ్యే వైతాని ప్రజ్ఞానస్య నామధేయాని భవంతి ప్రజ్ఞానం బ్రహ్మ'** - ఆ ప్రజ్ఞానమునకే కామమని పేరు. కామం అనగా సృష్టి చెయ్యాలనే ఈశ్వరుని సంకల్పశక్తి. కనుక శివుడు అంటే సృష్టికి అతీతుడు. సంకల్పం కలగగానే కామంతో కలిసిన ఈశ్వరుడు అయ్యాడు కనుక 'కామేశ్వరుడు'.

'జగతిః సిసృక్షావాన్ ఈశ్వరః కామ పదవాచ్యః' - జగతిని సృష్టించదలచుకున్న ఈశ్వరుడు 'కామ' పదవాచ్యుడు.

సృష్టి చెయ్యాలనే కోరికలోనే ఇచ్ఛ, జ్ఞాన, క్రియా శక్తులతో కూడిన ఈశ్వరుడే కామేశ్వరుడు.

కామేశ్వరుడు అంటే **'సత్యకామః సత్యసంకల్పః'**. పైగా పరమేశ్వరుడు అనుకున్నాడంటే అది విఫలం కాదు. సత్యం అంటే వ్యర్థం కానిది. ఆయన చెయ్యాలనుకుంటే చేస్తాడు, ఎవరూ ఆపలేరు. ఈశ్వర శాసనాన్ని ఎవరు ఆపగలరు? అది వ్యర్థం కాకుండా ఉన్నది ఉన్నట్టు జరుగుతుంది. కామేశ్వరీ అంటే ఆయన సంకల్పశక్తే.

ఎవరైతే ఈశ్వర సంకల్పాన్ని ఉపాసన చేస్తారో వారి సంకల్పానికి శక్తి వస్తుంది. ఈశ్వరసంకల్పాన్ని ఉపాసించడమే లలితా ఉపాసన. లలితా అంటే పరమేశ్వరుని సంకల్పశక్తి. అదే **'తన్మే మనశ్శివసంకల్పమస్తు'**. అది శివసంకల్పం. ఆ శివసంకల్పశక్తియే కామేశ్వరి. ఆ సంకల్పశక్తి కలిగిన ఈశ్వరుడే కామేశ్వరుడు. ఈ సంకల్పం రాక పూర్వం ఆయన శివుడు. సంకల్పము వచ్చిన తరువాత ఆయన శివకామేశ్వరుడు.

ఆ సంకల్పశక్తి ఆయన నుండే వచ్చింది కనుక ఆయనలోనే ఉంది. ఆ

సంకల్పశక్తిలోనే ఇచ్ఛ, జ్ఞాన, క్రియ అన్నీ దాగి ఉన్నాయి. అందుకే సంకల్పశక్తే ఆదిశక్తి. సర్వశక్తి. శివునిలోనే సంకల్పం ఉంది, శివునికి బయట లేదు. కామేశ్వరి కామేశ్వరుని ఒళ్ళోనే కూర్చుంది. పక్కన కూడా కూర్చోలేదు. ఒళ్ళోనే కూర్చుంది అంటే అర్థం 'ఆయన నుండి వేరుకానిది' అని చెప్పడం.

మరి ఆవిడ పేరు......'శివా'.

53. శివా – శ్రీ శివాయై నమః

అమ్మవారి రహస్యనామములలో శివా అనేది విశేషమైన నామం. శివా, భవానీ, ఉమా – ఈ మూడు నామాలు లలితాసహస్రనామాలలో మూడు ముత్యాలు.

ఇప్పటివరకు అమ్మవారి పేరేమీ చెప్పలేదు. వచ్చిన తల్లిపేరు 'శివా'. 'శివా' అని చెప్పడంలో అర్థం సృష్టికంతటికి మూలమైనవాడు, సృష్టికి అతీతమైన వాడు శివ. ఆ శివునికి, ఈవిడకు వేరేమీ లేదు అని చెప్పడం కోసం 'శివా' అన్నారు. శివః అంటే పుం లింగం, శివా అంటే స్త్రీ లింగం. పేరొక్కటే..... పుంలింగ, స్త్రీలింగ భేదములు. ఆయనకి ఈవిడ భిన్నురాలు కాదు. **'సదాకారా సదానందా సంసార విచ్ఛేదకారిణీ సా శివా పరమాదేవీ శివాభిన్నా శివంకరీ'.** ఈ పరమాదేవి 'శివాభిన్నా' శివునికి అభిన్నురాలు 'శివంకరీ'. త్రిగుణములకు అతీతమైనది శివం.

ఇంకొక అర్థం.. శివమంటే మంగళం, శుభం. ఆయన శుభస్వరూపుడు, ఈవిడ శుభస్వరూపిణి. 'సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధకే' – శివే అని సంబోధన చేశారు. 'శివే' అంటే సర్వమంగళస్వరూపిణి. ఆవిడ ప్రపంచంలోకి శక్తిగా వచ్చినప్పుడు సర్వమంగళస్వరూపిణి. ప్రపంచానికి అతీతంగా ఉన్నప్పుడు శుద్ధస్వరూపిణి. శుద్ధస్వరూపిణి అనే అర్థం శివాకి సృష్టికి అతీతంలో చెప్పాలి. సృష్టి తరువాత ప్రపంచానికి మంగళం కలిగిస్తోంది. సృష్టికి పూర్వంలో ఉన్నప్పుడు కూడా మంగళమే.

'బ్రహ్మాతన్మంగళం పరమ్' – ఉపనిషత్తే చెప్తోంది ఈ మాట. పరబ్రహ్మమే మంగళం. పరబ్రహ్మ అనగా శివుడు. పరబ్రహ్మ స్వరూపిణియే 'శివా'. పరబ్రహ్మ

స్వరూపిణి, మంగళస్వరూపిణి.

'ఉమాశంకరయోర్భేదో నాస్త్యేవ పరమార్థతః' – నిజానికి ఉమాశంకరుల మధ్య భేదం లేదు.

'ద్విధా స్వరూపమాస్థాయ స్థిత ఏకో న సంశయః' అని శాస్త్రం. రెండు రూపములుగా ఉన్నది ఒక్కటే. ఉమా విజ్ఞానం చెప్తూ సూతసంహితలో, 'ఉమాశంకరుల మధ్య భేదం చూపిస్తే వాడు తలక్రిందులుగా నరకములో పడతాడు' అన్నారు. ఆ భేదంలేని స్థితి చెప్పడం కోసమే 'శివా' అనే పేరుని చూపించారు. అందుకే పరమాత్మస్వరూపిణి, మంగళస్వరూపిణి.

ఇప్పటివరకూ అమ్మవారికి కల్యాణం, పట్టాభిషేకం, ఆవిడ పేరూ వచ్చాయి.

54. స్వాధీనవల్లభా – శ్రీ స్వాధీనవల్లభాయై నమః

వల్లభుడు అంటే ప్రియమైన భర్త అని అర్థం. భర్తని తన అధీనములో ఉంచుకున్నది. ఇందులో రెండర్థాలు ఉన్నాయి. అది చమత్కారం. ఇలాంటి మాటని వాడారు వశిన్యాదివాగ్దేవతలు. ఎటునుంచైనా తీసుకోవచ్చు. వల్లభుడు ఆమెకు స్వాధీనం, ఇంకో అర్థం ఆయనకి స్వాధీనముగా ఉండే వల్లభా. ఆయనకు స్వాధీనమైన ప్రియురాలు.

'శివస్వాధీనవల్లభా' అని భట్టనారాయణులు గ్రహించిన ప్రాచీన పాఠం. శివునకు స్వాధీనమైన వల్లభురాలు అంటే ఎప్పుడూ పరమాత్మని అనుసరించి, అనుకూలంగా ఉంటుంది. అమ్మవారు మహాపతివ్రత. అందుకు 'శివస్వాధీనవల్లభా' కూడా నిజమే. శివుని స్వాధీనం చేసుకుంది అన్నా నిజమే. ఇది గొప్ప వివేచన. ఆయన్ని ఈవిడ అధీనంలో పెట్టుకుందంటే అది ఒక సంతోషం. ఆవిడ ఆయన అధీనంలో ఉంటుంది – అదో సంతోషం.

'స్వాధీనవల్లభా'లో చాలా విశేషముంది. అమ్మవారికి పెళ్ళి జరిగినప్పుడు బ్రహ్మ చూపించారు, "ఇదిగో చక్కగా తయారు అయ్యాడు కామేశ్వరుడు" అని పేరు పెట్టి "సరేనా, ఇప్పుడు వివాహం చేసుకుంటావా" అని అమ్మవారితో అంటే,

"చేసుకుంటాను కానీ ఒక నిబంధన. నేను ఏం చెప్తే అది ఆయన వినాలి, నేను చేస్తాను అన్నదానికి ఆయన విరుద్ధంగా చెప్పకూడదు. దీనికి ఆయన ఒప్పుకుంటారంటే నేను పెళ్ళి చేసుకుంటాను" అన్నది. ఇది లలితోపాఖ్యానంలో ఉంది. "ఎందుకంటే నా పేరు ఏకా. ఏకా అంటే నేనొక్కదాన్నే. నా ఆధీనంలో నేను ఉంటా. నేను ఎవరి ఆధీనంలో ఉండను. మీరు ఏదో సంప్రదాయం కోసం పెళ్ళి చేసుకోమన్నారు కనుక చేసుకుంటాను. అంతే కాని నేను ఏది చేసినా ఆయన అడ్డు చెప్పకూడదు, పైగా నేను ఇది చెయ్యాలి అంటే ఆయన సరే అనాలి. ఇన్ని నిబంధనలకి ఒప్పుకుంటారా!" అంటే, "ఒప్పుకుంటావా?" అని శివుని బ్రహ్మ అడిగితే, శివుడు, "సరే" అన్నాడు. అప్పుడు అమ్మవారు పెళ్ళికి ఒప్పుకుంది. పెళ్ళి జరిగింది. అందుకు 'స్వాధీనవల్లభా' అంటే లలితోపాఖ్యానంలో ఉన్న అంశం గుర్తు తెచ్చుకోవాలి. ఈవిడ ఏం చెప్పినా ఆయన కాదనడు. కానీ ఆయన కాదనేదేదీ ఈవిడ చెప్పదు. ఆయన మనస్సుకి విరుద్ధంగా ఏమీ చెయ్యదు. అందుకు **'శివస్వాధీనవల్లభా'** అనడంలోగానీ **'స్వాధీన వల్లభా'** అనడంలో గానీ అంత అందమైన భావం ఉంది.

జ్యోతి, కాంతి.... ఎప్పుడు శివశక్తుల గురించి చెప్పేటప్పుడు ఇదే ఉదాహరణ గుర్తు పెట్టుకోవాలి. జ్యోతి ప్రకాశం, కాంతి విమర్శ. జ్యోతి శివుడు, కాంతి శక్తి. ఇలా చూస్తూ ఉంటే కాంతికి లోకవ్యవహారం ఎక్కువ. ఈ కాంతి గోడల మీద, కిటికీల మీద... అన్నింటి మీద పడుతూ ఉంటుంది. కాంతే అన్నింటిని పట్టించుకునేది. జ్యోతి ఎక్కడ పెట్టారో అక్కడ అలా చూస్తూ ఉంటుంది. సాక్షిగా **'సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ'** స్థిరంగా శివుడు ఉంటాడు. ఈవిడ లోకవ్యవహారాలు అన్నీ పెట్టుకుంటుంది. కనుకనే ఆయన చూస్తూ ఉంటాడు. ఏమీ అనడు. అందుకే ఆయన శివ, ఈవిడ స్వాధీనవల్లభా. అలా వ్యాపించుకుని అంతా పని చేస్తుంది. దీనిలో ఒక చమత్కారం ఉంది. ఇంత కాంతి మళ్ళీ జ్యోతిరూపుడైన ఆయన ఆధీనంలో ఉంది.

ఆయన లోకాలమీద పడలేదు కానీ ఆయన లోకం పనంతా ఆవిడ పెట్టుకుంది. లేకపోతే లోకం బ్రతకదు. ఆ అరుణకాంతి పడుతూ ఉంటేనే ప్రపంచం పని చేస్తోంది. అదే 'సర్వారుణ'.

ఇంత పని చెయ్యడానికి శక్తి ఆయన దగ్గర ఉంది. నిర్వికారుడే కావచ్చు. కానీ శక్తితో ప్రపంచమంతా చేస్తున్నాడు. చేస్తూ సాక్షిగా ఉన్నాడు కనుక "మీరేమనకుండా అలా కూర్చోండి అంతా నేనే చేస్తాను" అంది. **'శివస్వాధీనవల్లభా'** అంటే ఇంత అందమైన భావం ఉంది. ఇప్పుడు వారిద్దరూ కూర్చున్న చోటు చూపిస్తున్నారు.

55. సుమేరుమధ్యశృంగస్థా - శ్రీ సుమేరుమధ్యశృంగస్థాయై నమః

'సుమేరు శృంగమధ్యస్థా' అనే పాఠం కూడా ఉంది. ఏదన్నా ఫరవాలేదు, అటూ ఇటూ ఉన్నా భావం ఒక్కటే. సుమేరువు యొక్క మధ్యశృంగములో ఉన్నది. ఇదొక అర్థం. శృంగము అంటే శిఖరము. సుమేరువు యొక్క శృంగముల మధ్యములో ఉన్నది. సుమేరువులో అనేక శృంగములు ఉన్నాయి. ఆ మధ్యలో ఒక శృంగము ఉంది. దానిపై అమ్మవారు ఉన్నారు. అంటే అమ్మవారి నగరం సుమేరు పర్వతము యొక్క మధ్య శృంగముపై కట్టారు. సుమేరు పర్వతం ఎక్కడుందీ చెప్పడం అంత తేలిక కాదు. సుమేరు శృంగము అంటే ఊహతో తెలుసుకోవలసిందే. సమస్త జ్యోతిర్గణములు ఏ కేంద్రాన్ని ఆధారం చేసుకొని తిరుగుతున్నాయో, ఆ కేంద్రము 'సుమేరు'. అంతే కానీ బంగారుకొండ అని పర్వతంలా ఊహించడానికి లేదు. ఈ సమస్త జ్యోతిర్గణములు తిరుగుతున్నాయి అంటే దేన్నో కేంద్రంగా చేసుకునే తిరుగుతున్నాయి కదా! ఆ కేంద్రం మామూలు కంటికి కనబడదు. ఆ మాటకొస్తే జ్యోతిర్గణాలే అన్నీ మనకు కనబడవు. కానీ వాటి యొక్క గమనంలో ఒక విధానం, పద్ధతి ఉన్నాయి. ఒక చక్రంలా చక్కగా తిరుగుతున్నాయి అంటే దానికొక కేంద్రం ఉండాలి. మేరు అంటే **'మినోతి జ్యోతీంషి ఇతి మేరుః'** – జ్యోతిస్సులను వెదజల్లునది – అనేక రకములైన జ్యోతిస్సులకి ఆధారమై ఉన్నది 'మేరువు'.

మనకి తెలిసిన సమస్త భువనాలలో ఉన్న జ్యోతిర్మండలాలకి ఆధారంగా ఎక్కడో పైన కొన ఉంది. ఆ కొన విశ్వానికి కొన. దానిని ఆధారం చేసుకొని ఇవన్నీ తిరుగుతున్నాయి. అది సుమేరువు. దాని యొక్క కొన యందు మధ్య కేంద్రంలో అమ్మవారు ఉన్నారు. అంటే విశ్వానికి అంతటికి ఆధారస్థానానికి కేంద్రంగా ఉన్నది.

ఇంత చక్రం తిరగడానికి కేంద్రం ఎలాగో ఈ సమస్త జ్యోతిశ్చక్రం, ప్రపంచచక్రం తిరగడానికి కేంద్రబిందువు నందు ఆవిడ ఉంది.

కథాపరంగా చూస్తే శ్రీమన్నగరం సుమేరు శృంగము మీద నిర్మాణం చేశారు. ఆ పర్వతము ఒకటుంది. అయితే ఈ లోకంలో సుమేరువు అంటే ఈ చెప్పిన సుమేరువు యొక్క శక్తి ఒకచోట మనం పట్టుకోవచ్చు. అది మానస సరోవరం దగ్గర ఉన్న కైలాసం. ఇదీ శాస్త్రం చెప్తున్నది. ఇదే 'మహాకైలాసనిలయా'. ఇలా భావిస్తే తప్పేం లేదు. ఎందుకంటే భూమి యందు దాని విభూతి ఉంది. ఇదే నిజమైన సుమేరు అని కాదు కానీ అక్కడికి వెళ్తే ఆ శక్తిని పొందవచ్చు. ఇదొక రహస్యం.

అదే శ్రీచక్రరూపమని పెద్ద వర్ణన. సుమేరువు అనగా శ్రీచక్రము. శ్రీచక్రానికి మేరుప్రస్తారమని పేరు. మేరుప్రస్తారము అంటే క్రిందికి వస్తున్న కొద్ది స్థూలమైపోతుంది. పైకి వెళ్తున్న కొద్ది సూక్ష్మమైపోతుంది.

ఆలోచిస్తే ఇందులోనే పెద్ద భావన ఉంది. క్రిందకు రావడం అంటే లోకం వైపు పడడం. లోకం వైపు వస్తున్న కొద్దీ స్థూలం. పైకి వెళ్ళడం అంటే పరమాత్మ వైపునకు వెళ్ళడం. వెళుతున్న కొద్ది సూక్ష్మం అది. ఆ పరమాత్మ నుండే ప్రపంచమంతా విస్తరించింది. బిందువు నుండే చక్రం అంతా విస్తరించినట్లు, ఆ సుమేరువు యొక్క కొన యందు ఆవిడ ఉంది. బిందుస్థానమే సుమేరుశృంగం. ఆ సుమేరు శృంగంలో ఉంది. అది త్రికోణం మధ్యలో ఉంటుంది. సుమేరు మధ్య అంటే శ్రీచక్రం యొక్క త్రికోణమందు (శృంగ–కొన) అని అర్థం. ఈ మధ్యలో మూడు శృంగములు ఉంటాయి. మూడు శృంగాలకి మధ్యలో ఉంటుంది.

శ్రీచక్రపరంగా ఆ మూడు శృంగాలు: త్రికోణంలో – తూర్పుకోణంలో ఇచ్ఛాశక్తి, నిరుతికోణంలో క్రియాశక్తి, వాయవ్యకోణంలో జ్ఞానశక్తి ఉంటాయి. ఈ మూడింటికి మధ్యలో అమ్మ ఉంటుంది. ఇచ్ఛ, జ్ఞాన, క్రియా శక్తులు త్రికోణంలో మూడుకోణాలలో ఉంటాయి. వాటికి కేంద్రమే మధ్య – బిందుస్థానం.

విశ్వకర్మ నిర్మించిన శ్రీమన్నగరం సుమేరు పర్వతం యొక్క మధ్య కొనలో పెట్టాడు. మిగిలిన చుట్టూ ఉన్న కొనల్లో – తూర్పువైపు బ్రహ్మ శిఖరం, నిరుతి వైపు

విష్ణు శిఖరం, వాయవ్యంలో రుద్రశిఖరం ఉన్నాయి. ఆ మూడు శిఖరాల మధ్యలో శ్రీమన్నగరంలో అమ్మవారు ఉంది కనుక 'సుమేరుశృంగమధ్యస్థా' .

స జయతి సువర్ణశైలః సకలజగచ్చక్రసంఘటిత మూర్తిః

కాంచన నికుంజవాటీ కందలదమరీప్రపంచ సంగీతః

హరిహయనైరృతమారుత హరితామంతేష్వవస్థితం తస్య

వినుమః సానుత్రితయం విధిహరిగౌరీశవిష్టపాధారమ్

మధ్యేపునః మనోహరరత్న రుచిస్తబక రంజితదిగంతమ్

ఉపరి చతుశ్శతయోజనముత్తుంగం శృంగపుంగవముపాసే – అని దూర్వాసుని 'ఆర్యాద్విశతి' (లలితాస్తవరాజ) వర్ణన.

సుమేరు – మరొక పరిశీలనలో 'మేరు' అంటే మన శరీరంలో వెన్నుదండం. వెన్నుదండానికి 'మేరు' అని పేరు. ఈ సమస్త జ్యోతిశ్చక్రం మేరువుని ఆధారం చేసుకొని తిరిగితే, సమస్త శరీరచక్రం వెన్నుదండాన్ని ఆధారం చేసుకుని వెళుతుంది. ఇది మూలంగా ఉంటుంది. ఇదే మేరు. దీన్ని పర్వతం ఎందుకన్నారంటే క్రింద నుండి పైకి వెళ్ళేది పర్వతం కదా! దాని కొన అయిన సహస్రార స్థానానికి వెళితే దాని మధ్యలో **'సుమేరు శృంగమధ్యస్థా'** –సహస్రారస్థానంలో బిందురూపంగా శివశక్తి రూపంగా ఉంది.

మన ఈ అన్వయాలన్నీ కూడా సరియైనవే.

56. శ్రీమన్నగరనాయికా – శ్రీ శ్రీమన్నగరనాయికాయై నమః

సుమేరుశృంగమధ్యస్థా అయిన అమ్మవారి నగరం పేరు శ్రీమన్నగరం. ఆ నగరానికి నాయకురాలు ముఖ్యం. శ్రీమన్నగరానికి నాయకురాలు అని వివరిస్తున్నారు.

శ్రీమన్నగరం...... ఇది గొప్పమాట.

అనేక కోటి బ్రహ్మాండకోటీనాం బహిరూర్ధ్వతః

సహస్రకోటి విస్తీర్ణే సుధాసింధోస్తు మధ్యమే

రత్నద్వీపే జగద్ద్వీపే శతకోటిప్రవిస్తరే

పంచవింశతి తత్త్వాత్మ పంచవింశతి వప్రకైః

త్రిలక్ష యోజనోత్తుంగైః శ్రీవిద్యాయాః పురం శుభమ్ (రుద్రయామళం)

'అనేక కోటి బ్రహ్మాండాలను దాటి ఊర్ధ్వభాగమందు సహస్రకోటి విస్తారమైన రత్నద్వీపమున్నది. దీనికి జగద్ద్వీపమని మరో పేరు. ఒకొక్కటి మూడు లక్షల యోజనాల ఎత్తైన గోడలతో ఉన్నాయి. 25 గోడలు 25 తత్త్వస్వరూపాలు. వాటి మధ్య శ్రీవిద్యానగరమున్నది.

తత్రచతుశ్శత యోజన పరిణాహం దేవశిల్పినా రచితం

నానాసాల మనోజ్ఞం నమామ్యహం నగరమాదివిద్యాయాః

దేవశిల్పి విశ్వకర్మచే మేరుపర్వత మధ్యన, నాలుగు వందల యోజనాల వైశాల్యంతో, అనేక ప్రాకారాలతో మనోహరమై ఉన్న ఆదివిద్యానగరానికి నమస్కరిస్తున్నాను - అని దూర్వాసుని 'ఆర్యాద్విశతి'.

అమ్మవారి పేరు 'శ్రీమాత', ఆవిడ యంత్రం పేరు 'శ్రీయంత్రం', ఆవిడ విద్యపేరు 'శ్రీవిద్య', ఆవిడ నగరం పేరు 'శ్రీమన్నగరం'. మొదట 'శ్రీ'కి ఎన్ని అర్థాలు చెప్పుకున్నామో ఆ అర్థాలు ఇక్కడకు తెచ్చుకోవాలి. శ్రీ అనగా చైతన్యమే. చైతన్యము ఉన్న నగరం శ్రీమన్నగరం. ఇప్పుడు మనం ఆలోచిస్తే ఏ నగరంలో చైతన్యం ఉంది? శ్రీమన్నగరంలోనేనా? మన శరీరంలో లేదా? ఈ శరీరమంతా శ్రీమన్నగరం. మరి ఈ చైతన్యమంతా ఆవిడదే కదా! నాయకురాలు అక్కడ ఉండి పాలిస్తుంటే, అక్కడి నుండి చైతన్యం మన శరీరమంతా ప్రసరిస్తోంది. ఇలా చూస్తే శరీరమనే శ్రీచక్రంలో ఎలా అమ్మవారిని చూడవచ్చో గమనించుకోవచ్చు. శ్రీమన్నగరం అనగా ఇంత భావన చెయ్యాలి. ఈ రహస్యమంతా వేదంలోనే **'దేవానాం పూరయోధ్యా... అమృతేనావృతాం పురీమ్'** అనే మంత్రంలో ఉంది.

57. చింతామణిగృహాంతస్థా - శ్రీ చింతామణిగృహాంతస్థాయై నమః

శ్రీమన్నగరం మధ్యలో అమ్మవారి యొక్క గృహం. ఈ లోపల అనేక ఆవరణలు దాటాక చింతామణి గృహం ఉంది. అమ్మవారి యొక్క గృహంలో గోడలన్నీ

చింతామణులు. చింతామణులు అంటే ఏది చింతన చేస్తే దాన్ని తీర్చే మణులు. అమ్మవారి చింతామణి గృహం యొక్క గోడలలో ఒకొక్క ఇటుక ఒక చింతామణి. మనకి ఒక్క చింతామణి ఉంటే చాలు బ్రతుకంతా హాయిగా ఉండిపోతుంది. దేవతలు ఇంతా మథనం చేస్తే క్షీరసాగరంలో వారికి ఒక చింతామణి దొరికింది. అలాంటి చింతామణులు ఎన్నో అమ్మ ఇంటి గోడలు.

"సకలవిబుధ సంసేవ్యం చిన్తామణి గణరచితం చిన్తాం దూరీకరోతు మే సదనం" – అని లలితా స్తవరాజం.

అంటే అమ్మదాకా వెళ్ళకర్లేదు... అమ్మ ఇంటి గోడలను తలచుకుంటే చాలు.

చింతామణులంటే మంత్రములు. అమ్మవారి చింతామణిగృహానికి నాలుగు ద్వారాలు ఉంటాయి. పూర్వామ్నాయ, పశ్చిమామ్నాయ, దక్షిణామ్నాయ, ఉత్తరామ్నాయ అని. పైన ఉన్నది ఊర్ధ్వ ఆమ్నాయ. చుట్టూ నాలుగువైపుల ద్వారాలు. ద్వారాలు అంటే ఆమ్నాయ మంత్రములని అర్థం. ఒకొక్క ఆమ్నాయంలో ఎన్నో మంత్రములు ఉంటాయి. అన్ని మంత్రములు అమ్మవారికి ద్వారములు అంటే అర్థం ఆ మంత్రములన్నీ చింతామణులే.

అన్ని మంత్రములు కలిసిపోయి చింతామణుల మందిరం అయిపోయింది. ఆ మందిరం లోపల ఆవిడ కూర్చున్నారు. అంటే ఇన్ని మంత్రములకు మూలమైన మహామంత్రస్వరూపిణి ఆ లోపల కూర్చుంది. ఇది భావన చెయ్యవలసిన **'చింతామణిగృహాంతస్థా'.**

చిత్తప్రకాశకత్వాత్ చింతామణిః – అని నిర్వచనం. చిత్తాన్ని ప్రకాశింపజేసే 'చిత్' తత్త్వమే చింతామణి. ఆ చింతామణి గృహంలో అమ్మవారు కూర్చున్న ఆసనం 'పంచబ్రహ్మాసనం'.

58. పంచబ్రహ్మాసనస్థితా – శ్రీ పంచబ్రహ్మాసనస్థితాయై నమః

పంచబ్రహ్మాసనంపై అమ్మవారు కూర్చున్నది. పంచబ్రహ్మాసనం అంటే 'శ్రీమత్సింహాసనేశ్వరీ' నామం దగ్గర వివరించడమయింది. పంచ బ్రహ్మల ఆసనం.

అది- బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వర, సదాశివ- నలుగురు కోళ్ళుగా ఉన్నారు. సదాశివుడు పరచిన బల్లగా ఉన్నాడు. అది అంతా కలిపి ఒకటే, కానీ పనులబట్టి పేర్లు వచ్చాయి. సృష్టి, స్థితి, సంహార, తిరోధాన, అనుగ్రహ అని ఐదు కృత్యములు. ఈ ఐదు కృత్యములకి బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వర, సదాశివ. ఈ పంచ కృత్యాల్లోంచే పంచభూతాలు వచ్చాయి. సృష్టి, స్థితి, సంహార, తిరోధాన, అనుగ్రహాలలో అనుగ్రహ కృత్యం నుంచి ఆకాశం, తిరోధాన కృత్యం నుంచి వాయువు, సంహార కృత్యం నుంచి అగ్ని, స్థితి కృత్యం నుంచి జలం, సృష్టి కృత్యం నుండి భూమి వచ్చాయి.

అలా పంచ కృత్యములు, పంచబ్రహ్మలు, తన్మాత్రలు... దాని నుండి వచ్చిన పంచభూతములు – శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు. అవి పొందడానికి పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు. ఇవన్నీ పని చేయడానికి పంచప్రాణాలు. అంటే ప్రపంచమంతా కలిపితే పంచబ్రహ్మాసనం.

ఇదంతా ఎవరి వల్ల పనిచేస్తోందో ఆవిడ దాని మీద కూర్చుంది. అది 'పంచబ్రహ్మాసనస్థితా'. ఆ పంచబ్రహ్మాసనంపై కూర్చుని భాసిస్తున్న తల్లి. ఈ పంచబ్రహ్మాసనంపై కూర్చున్న చింతామణి గృహం చుట్టూ ఒక వనం ఉంటుంది. ఆ వనం చాలా ప్రధానమైనది.

59. మహాపద్మాటవీసంస్థా - శ్రీ మహాపద్మాటవీసంస్థాయై నమః

ఆ వనం పేరు 'మహాపద్మాటవీ'. దీని గురించి వర్ణిస్తూ చాలా అందమైన విషయములు లలితోపాఖ్యానంలో, దూర్వాసుడు రచించిన ఆర్యాద్విశతిలో చెప్పబడ్డాయి.

తత్ర చతుఃశతయోజన పరిణాహం దేవశిల్పినా రచితం
నానాసాల మనోజ్ఞం నమామ్యహం నగరమాదివిద్యాయాః

అమ్మవారి యొక్క శ్రీమన్నగరానికి నమస్కారం అంటూ చింతామణిగృహంలో పంచబ్రహ్మాసనంలో మహాపద్మాటవి గురించి చెప్తూ అద్భుతమైన విషయం చెప్పబడింది.

మణిసదన సాలయోరధిమధ్యం దశతాలభూమిరుహదీర్ఘై
పర్ణైః సువర్ణవర్ణైర్యుక్తాం కాండైశ్చ యోజనోత్తుంగైః
పద్మాటవీం భజామః పరిమళ కల్లోల పక్ష్మలోపాంతామ్

ఇక్కడ చింతన చేస్తున్నప్పుడు ధ్యానం చేస్తే ఉత్తమ ప్రయోజనం ఉంటుంది. శ్రీమన్నగరం, అందులో చింతామణిగృహం, అందులో పంచబ్రహ్మాసనం. చింతామణి గృహం చుట్టూ మహాపద్మాటవీ. అక్కడ పెద్ద కాడలున్న పద్మములు ఉంటాయి. అవి స్థలపద్మములు... జలపద్మములు కావు. మెట్టతామర అంటారు.

ఆ స్థలపద్మముల ఆకులు అతి విస్తారమైన పొడవుతో ఉంటూ దాని పైన ఈ పద్మములు వికసిస్తాయి. ఒకొక్క దానికి వెయ్యిరేకులు ఉంటాయి. అందులో చక్కటి కేసరములు. వీటి దగ్గర తుమ్మెదలు ఝంకారం చేస్తూ ఉంటాయి. అలాంటి అద్భుతమైన పద్మాటవీ మధ్యలో చింతామణి గృహం. ఇలా ధ్యానం చేయాలి.

నిజానికి 'మహాపద్మాటవీ' అంటే సహస్రారస్థానం. దానిలో ఉన్న బిందుస్థానం అమ్మవారి చోటు.

'మహాపద్మాటవ్యాం మృదితమలమాయేన మనసా' అంటారు శంకర భగవత్పాదులవారు. ఆ మహాపద్మాటవిని మాయా, మాలిన్యంలేని మనస్సులే తెలుసుకుంటాయి. చిత్త మాలిన్యం ఎంత ఎక్కువవుతుంటే, అమ్మవారికి అంత దూరం అవుతుంటారు.

60. కదంబవనవాసినీ - శ్రీ కదంబవనవాసిన్యై నమః

కదంబవనంలో అమ్మవారు ఉంటారు. శ్రీమన్నగరంలో ఒకొక్క ఆవరణ దాటుతూ ఉంటే– మొదట నానావృక్షమహోద్యానవనము అని ఒక ఆవరణ ఉంది. అది దాటిన తరువాత ఐదు కల్పవృక్షవనాల ఆవరణలు వస్తాయి. అవి సంతాన, హరిచందన, పారిజాత, కల్పక, మందారములు. ఇవి దాటిన తరువాత ఆవరణ– కదంబవనం. ఇది చాలా ముఖ్యం. ఇక్కడితో వృక్షావరణలు పూర్తి అయిపోతాయి. అంటే ఏడవ ఆవరణ. ఈ ఏడవ ఆవరణ నిండా కదంబ వృక్షాలు ఉంటాయి.

కదంబవనంలో శ్యామలాదేవి అనేక రూపములతో ఉంటుంది. రాజశ్యామల అనే ప్రధానమైన తల్లిగా ఇక్కడ ఉంటుంది.

కదంబవనవాసినీ - అంటే ఇక్కడ శ్యామలాదేవిని చెప్పినట్లుగా భావించవచ్చు, లేదా మొత్తం శ్రీమన్నగరంలో కదంబవనం, ఆ లోపల చింతామణి గృహం. ఆ గృహ పరిసరాలన్నీ వర్ణిస్తున్నారు కనుక కదంబవనం వర్ణించారు. కదంబవనంలో ఉన్న తల్లి అంటే లలితాదేవి అని కూడా భావించవచ్చు. ఎందుకంటే కదంబవనం లోపలే చింతామణి గృహం ఉన్నది. కదంబవనవాసినీ అన్నా ఇద్దరికీ అన్వయిస్తుంది. శ్రీచక్రంలో బిందువు, త్రికోణం, అష్టత్రికోణములు వస్తాయి. అందులో క్రిందికి ఐదు త్రికోణాలు ఉంటాయి. శ్రీచక్రంలో ఈ ఐదు త్రికోణములను కదంబవనం అంటారు. దాని మధ్యలో ఈవిడ ఉంది కనుక కదంబవనవాసినీ. అలాగే మన సహస్రారస్థానం సమీపంలో ఉన్న రకరకాల చక్రముల యొక్క సమూహములనే సూక్ష్మయోగ భూమికలను కూడా కదంబవనం అంటారు.

'కం' అంటే జలం, 'కం దమయతి ఇతి కదంబః' అని అర్థం. దీనికే నీపా అని మరొకపేరు 'నీరం పాతి ఇతి నీపా' – రెండింటికి అర్థాలు ఒకటే. కం అన్నా...నీరం అన్నా జలమే. ఆ నీటిని నియంత్రించునది అని అర్థం.

అంటే కదంబవృక్షముల యొక్క లక్షణం వాయుమండలంలో జలశక్తులని ఉత్పత్తిని చెయ్యగలవు. మంచి వర్షం కావాలంటే కదంబవనాలు ఉండాలి. అలాగే వర్షాన్ని నియమించగలిగే శక్తి కూడా ఉన్నది. అలాగే ఎక్కడో ఉన్న జలశక్తులని ఆకర్షించి క్రిందికి దింపగలిగే శక్తి కదంబములకు ఉంది.

ఇక్కడ తెలుసుకోవలసిందేంటంటే, అందకుండా ఎక్కడో ఉన్నవాటిని లాగి మనకి అందిస్తున్నాయి కదంబములు. అలాగే మనకందని, కావలసిన అభీష్టములు ఏవైతే ఉన్నాయో వాటిని ఆకర్షించి ఇవ్వగలిగే శక్తులే కదంబవనములు. అమ్మవారి కదంబవన ధ్యానంతోనే అభీష్టసిద్ధులు ఇస్తుంది. అలాంటి కదంబవనవాసినీ.

ఇంతవరకు ఆ వరుస ఎలా చెప్తున్నారో గమనిస్తే – శ్రీమన్నగరం, చింతామణి గృహం, మళ్ళీ ఆ చుట్టూ ఉన్న వనములలో ప్రధానమైనవి–మహాపద్మాటవీ,

కదంబవనం. అన్నీ చెప్పకుండా కొన్నే ఎందుకు చెప్తున్నారు అంటే దీన్నే శాస్త్రంలో ఉపలక్షకన్యాయం అంటారు. ఒక ప్రాంతంలో కొన్ని చెప్పారు అంటే అన్నీ చెప్పినట్టే లెక్క అని దీని యొక్క అర్థం. అలా ఇక్కడ అమ్మవారి అసలు చోటు చెప్పారు. చింతామణి గృహం, దాని చుట్టూ ఉన్న పద్మాటవీ చెప్పారు. వనములలో ప్రధానంగా ఉన్న కదంబవనం చూపిస్తున్నారు. ఇప్పుడు మొత్తం మణిద్వీపం ఎందులో ఉందో దానిని చెబుతున్నారు.

61. సుధాసాగరమధ్యస్థా - శ్రీ సుధాసాగరమధ్యస్థాయై నమః

అమృతసాగరమధ్యంలో మణిద్వీపం ఉంది. ఇప్పుడు ఆ మణిద్వీపాన్ని అలాగే రూపొందించాడు కనుక శ్రీమన్నగరం అలాంటి పద్ధతులలో ఉంది కానీ అమ్మవారి అసలు నివాసమైన మణిద్వీపం అమృతసాగర మధ్యంలో ఉంది. అమృతసాగరం అనేది అన్ని బ్రహ్మాండాలకు ఆవల ఉంది. అమృతసాగరం అంటే మరేమిటో కాదు. సాగరమంటేనే అనంతం అని అర్థం. అపారమైనది, అనంతమైనది, లోతైనది అని అర్థం. పరమాత్మ ధ్యానం వల్ల మనకి కలిగే ఆనందం ఎంత? అది అనంతం, అపారం. పరమాత్మ అంటే ఆనందస్వరూపం. అమ్మ లోకమంతా అమ్మ లక్షణాన్ని చూపిస్తుంది. అమృతసాగరం అనగానే శాశ్వతమైన ఆనందస్వరూపం. అమ్మని ధ్యానం చేస్తూ ఆ తాదాత్మ్యస్థితికి వెళ్ళిపోతే ఆ యోగి, సిద్ధస్థితిలో పొందే ఆనందం అనంతం, అపారం అదే సచ్చిదానందం. ఆ ఆనందానుభూతియే సుధాసముద్రం. ఈ ఆనందానుభూతికి కేంద్రమై ఉన్నది అమ్మ. అదే మణిద్వీపం.

మణి అంటే అర్థం స్వయంప్రకాశం. మనది మట్టిద్వీపం, అమ్మవారిది మణిద్వీపం. మనకి కనిపించాలంటే పగలు సూర్యుడు, రాత్రి చంద్రుడు ఉండాలి, ఇద్దరూ లేకపోతే దీపాలు ఉండాలి. కానీ అమ్మవారి లోకానికి ఏ వెలుగులు అక్కర్లేదు. తనంత తానే ప్రకాశిస్తుంది. తనంత తానే ప్రకాశించే లక్షణం ఉన్నది కనుకనే మణిద్వీపం.

పూర్వం కోటల్లో ప్రకాశం కోసం మణులు పెట్టేవారు. వాటిని మణిదీపాలు

అంటారు. రాత్రి అయ్యేటప్పటికి వాటి వెలుగే మొత్తం వ్యాపిస్తుంది. మణి అంటే స్వయంప్రకాశక లక్షణం కలిగినది అని అర్థం. భగవద్గీతలో స్వామి **'న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః యద్గత్వానివర్తంతే తద్ధామ పరమం మమ'** అని వర్ణించారు కదా! అలాగే **'న తత్ర సూర్యోభాతి న చంద్రతారకం నేమా విద్యుతో భాంతి కుతోఽయమగ్నిః। తమేవ భాంతమనుభాతి సర్వం తస్య భాసా సర్వమిదం విభాతి'** అని చెప్పినట్లుగా సూర్యచంద్రాదులు అవసరం లేకుండా స్వయంగా ప్రకాశించే మణిద్వీపం. కనుక అమృతసముద్రమంటే ఆనందలక్షణం, మణిద్వీపమంటే స్వయంప్రకాశక జ్ఞానలక్షణం.

ఈ జ్ఞానానందములకు కేంద్రమై ఉన్న తల్లి అమ్మవారు. జ్ఞానపరంగా మణిద్వీపమనగా ఇలా అర్థం చేసుకోవాలి. పైగా సుధా అంటే **'సుష్టు ధారయతే ఇతి సుధా'** – ఈ సృష్టినంతటిని ధరించే శక్తి కలది సుధ. మొత్తం ప్రపంచానికి అది కేంద్రం కనుక సుధాసాగర మధ్యంలో ఉన్న తల్లి.

ఇంతవరకు శ్రీమన్నగర వర్ణన పూర్తయింది.

ఈ నామం వరకు – అమ్మవారి ఆవిర్భావం, పట్టాభిషేకం, ఆవిడ ఉన్న నగరమంతా వర్ణించారు. ఇప్పుడు ఈ నగరంలోకి వచ్చి కూర్చుంది కానీ ఆవిడ అసలు చోటు మాత్రం అమృతసాగర మధ్యంలోది కదా అనుకొని దేవతలందరూ దండం పెట్టారు. ఇప్పుడు ఆ తల్లి పేరు చెప్తున్నారు.

62. కామాక్షీ – శ్రీ కామాక్ష్యై నమః

ముందు నామాలలో 'శివా' అని అంటే, "అది ఆవిడకు ఎప్పుడూ ఉండే పేరు. ఇప్పుడు వేము సింహాసనము మీద కూర్చోబెట్టాక ఒక పేరు పెడుతున్నా"మన్నారు బ్రహ్మ. ఏమని పేరు పెట్టాలా అని ఆలోచించారు బ్రహ్మ. ఆ దేవతలని "మీకేమన్నా కోరికలున్నాయా" అని అడిగారు. "అబ్బే కోరికలు లేవ"న్నారు. "మర్చిపోయారా! భండాసురుని నాశనం, లోక క్షేమం... ఇవన్నీ కదా మన లక్ష్యం" అంటే "అవన్నీ మర్చిపోయాం. ఎలాగూ అమ్మ చూపులు మా మీద సోకగానే

అసలు కోరికలు అన్నీ తీరిపోయాయి" అన్నారు.

అసలు కోరికలు ఎవరికీ తీరవు. ఒకప్పుడు ఇది తీరిపోతే చాలు అంటారు. అది తీరాక మరొకటి వస్తూనే ఉంటుంది. అన్ని కోరికలు తీరిపోవడమంటే సామాన్యం కాదు. పరిపూర్ణమైన ఆనందం. ఆ స్థితి దేవతలకి అమ్మ చూపుతో ఇచ్చింది. వారు సర్వమూ మరచి అఖండానందంలో ఉండిపోయారు. అందుకే మాకు ఏ కోరిక లేదన్నారు. "ఓహో! ఇలాంటి స్థితి మీకెప్పుడొచ్చింద"న్నారు బ్రహ్మ. "అదిగో ఆవిడ చూశాక వచ్చిం"దన్నారు."అమ్మా! నీ చూపు ఒక్కసారి సోకితే అసలు అన్ని కోరికలు తీరిపోతాయి. కనుక నీకిప్పుడు 'కామాక్షీ' పేరు పెడుతున్నాను" అని పేరు పెట్టారు బ్రహ్మ.

అమ్మచూపులు పడితే అన్ని కోరికలు తీరిపోతున్నాయి. అసలు కోరికే పుట్టని పరిపూర్ణస్థితి ఇస్తుంది. పరిపూర్ణునికి కోరిక ఏం ఉంటుంది? ఆ పరిపూర్ణ అఖండానందం అమ్మచూపుతో ఇస్తున్నది కాబట్టి కామాక్షీ అని పేరు పెట్టారు. కామాక్షీ అంటే అర్థం 'కామదాయినీ' అని తరువాత నామంలోనే తెలియజేశారు. అన్ని కోర్కెలను తీర్చే తల్లి 'కామాక్షీ, కామదాయినీ'.

ఆ కూర్చున్న కామాక్షీదేవికి ఉన్న విశేషం, ఆవిడ మూడు కన్నుల తల్లి. మూడు కన్నులతో ప్రపంచం నడుపుతోంది. అంటే ప్రపంచంలో మూడు పనులు ఉంటాయి – సృష్టి, స్థితి, లయ. ఆమె మూడు కన్నుల్లో ఒక కంటి నుండి 'బ్రహ్మ–సరస్వతి', ఇంకో కంటి నుండి 'విష్ణువు–లక్ష్మి', ఆ ఫాలనేత్రం నుండి 'ఉమా–మహేశ్వర' – ఈ మూడు వెలికి వచ్చాయి. అంటే సృష్టి, స్థితి, లయలు మూడూ మూడు కన్నులనుండి వెలికి వచ్చాయి. సృష్టి, స్థితి, లయలు చేసే బ్రహ్మ, విష్ణు, రుద్రశక్తులకి మూలం ఆమె నేత్రములు. బ్రహ్మ, విష్ణు, రుద్ర – సృష్టి, స్థితి, లయ ఈ మూడింటికి మూడు అక్షరాలు ఉన్నాయి. అవి క–అ–మ. క–అంటే బ్రహ్మవాచి. ఇది సృష్టిని తెలియజేస్తుంది. అ–అంటే విష్ణువాచి. ఇది స్థితిని తెలియజేస్తుంది. మ–అంటే రుద్రవాచి. ఇది లయను తెలియజేస్తుంది. క–అ–మ. ఈ మూడు ఎవరి అక్షి లోంచి వచ్చాయో ఆవిడ కామాక్షీ. సృష్టి, స్థితి, లయలు మూడింటికి మూలమైన

నేత్రములతో కూర్చున్న తల్లి – కామాక్షి.

63. కామదాయినీ – శ్రీ కామదాయిన్యై నమః

అన్ని కోర్కెలను తీర్చేతల్లి. ఆప్తకామ, పూర్ణకామ... అనబడే బ్రాహ్మీస్థితిని ప్రసాదించునది.

ఇప్పటివరకు కథనంతటినీ పరామర్శ చేసుకుంటే, దివ్యమైన చిదగ్ని కుండంలోంచి వచ్చిన తల్లి, ఆ దివ్యమంగళ విగ్రహంతో కామేశ్వరుని వివాహం చేసుకుంది, శ్రీమన్నగరంలో కొలువుతీరి ఉంది. ఆ శ్రీమన్నగరం రమ్యంగా ప్రకాశిస్తూ ఉన్నది. ఆ కొలువు తీరిన తల్లి దేవతలని అనుగ్రహించి 'కామాక్షీ' 'కామదాయినీ'గా ప్రకాశిస్తూ ఉన్నది. అప్పుడు ఆ తల్లిని అందరూ స్తోత్రం చేశారు. లలితాసహస్రంలో ఇక్కడికి ఒక భాగం పూర్తయ్యింది. అప్పుడు అందరూ స్తోత్రాలు చేస్తున్నారు.

64. దేవర్షిగణసంఘాతస్తూయమానాత్మవైభవా
– శ్రీ దేవర్షిగణసంఘాతస్తూయమానాత్మవైభవాయై నమః

అమ్మవారి యొక్క ఆత్మవైభవాన్ని దేవర్షిగణ సమూహములు స్తోత్రం చేస్తూ ఉన్నారు. ఇక్కడ 'ఆత్మవైభవా' అనే మాటే చాలా అద్భుతం. ఆత్మ యొక్క వైభవమే ప్రపంచము. ఆ ఆత్మ అమ్మవారు అని చూపించడం మరొక అర్థం. ఆత్మస్వరూపమైన అమ్మవారిని స్తుతిస్తున్నది – దేవ–ఋషిగణములు. ఎప్పుడైనా స్తోత్రం చెయ్యాలంటే వీరు మాత్రమే చెయ్యగలరు. వారు చేసినవి ఏవైనా పుస్తకంగా దొరికితే మనం చేస్తాము కానీ మనంతట మనం చెయ్యలేము.

కొంచెం ఆలోచిస్తే అమ్మవారు శ్రీమన్నగరంలో పట్టాభిషేకం జరిగిన వెంటనే అందరూ కలిసి స్తోత్రం చేశారు. అమ్మవారికి పట్టాభిషేకం చేసి స్తోత్రం చెయ్యడమే మన పని. మిగిలిన పనంతా ఆవిడ చేసుకుంటుంది. ఆ స్తోత్రం చేస్తున్నవారు ప్రధానంగా రెండు గణములు. దేవ, ఋషి గణములు. వీరే అమ్మవారిని తెలుసుకోగలరు. ఇంకెవరూ తెలుసుకోలేరు. దైవీ గుణము, ఋష్యత్వం ఉండాలి.

ఈ రెండు ఉన్నవారే భగవంతుని తెలుసుకోగలరు. అతీంద్రియ దర్శన శక్తి ఉన్నవాడు ఋషి. అలాగే దైవీ గుణములు భగవద్గీతలో దైవాసుర సంపద్విభాగయోగంలో చెప్పబడ్డాయి. దేవ ఋషి గణ సంఘాత - సంఘాతం అంటే సమూహం. వారందరూ కలిసి స్తోత్రం చేశారు. ఇక్కడ గణ అంటే సమూహం కదా. మరి సంఘాతమంటే - దేవగణము, ఋషిగణము కలిసి అమ్మవారిని శ్రీమన్నగరంలో స్తుతిస్తున్నారు.

మరొక అర్థం - మనలో అమ్మవారు 'ఆత్మవైభవా' - ఆత్మస్వరూపంగా ఉన్నారు. ఆ ఆత్మస్వరూపంగా ఉన్న అమ్మవారిని స్తోత్రం చెయ్యాలి అంటే దృష్టి అంతర్ముఖం కావాలి. అంతర్ముఖం కావాలంటే దేవగణం, ఋషిగణం లోపలికి తిరగాలి. దేవగణము అంటే ఇంద్రియశక్తులు. ఋషి అనగా జ్ఞానము, ఆలోచనలు, దర్శనశక్తి.

ఆలోచనలు ఋషిగణములు. ఇంద్రియాలు దేవగణములు. మనకున్నవి ఈ రెండే. ఇంద్రియాలన్నీ క్రియ. ఆలోచనలు అన్నీ జ్ఞానము. మన బ్రతుకంతా జ్ఞానము, క్రియలే. మనయొక్క ఈ ఇంద్రియశక్తులు, ఆలోచనా శక్తులు కలిసి మన లోపల ఆత్మగా ఉన్న అమ్మవారిని స్తోత్రం చెయ్యాలి.

అమ్మవారిని స్తుతించాలి అంటే కావలసినవి వాక్కులు. వాక్కులన్నీ కలిపితే ఏభై. ఈ ఏభై దేవగణములు అంటే 'అ' నుంచి 'అం అః' అక్షరములకు దేవగణములని పేరు. 'క' కారం నుండి 'హ' కారం వరకు ఉన్న అక్షరములన్నింటికి ఋషిగణములని పేరు. దేవ-ఋషి ఈ రెండు గణములు. సంఘాత అనగా సంయుక్త అక్షరములని పేరు. అంటే 'క్ష' వంటివి సంయుక్తాక్షరములు. కనుక అక్షరాలు మూడే రకాలు. దేవ, ఋషి, సంయుక్తాక్షరములు. ఈ అక్షరములన్నీ కలిసి అమ్మవారిని స్తోత్రం చేస్తున్నాయి. ఇప్పుడు అమ్మవారు ఎందుకు వచ్చారో ఆ పనికి బయలుదేరారు.

ఇంతవరకు అమ్మవారి రూపం, పట్టాభిషేకం అయింది. దేవతలందరూ ఆనందించి స్తోత్రం చేశారు. దేవతలందరూ ఆనందంగా 'మాకేం కోరికా లేదు' అన్నారు. నారదులవారు వచ్చారు. దేవతలకి అమ్మవారి నుండి వచ్చిన శరీరాలు పుష్టిగా ఉన్నాయి. చక్కగా శ్రీమన్నగరంలో ఉన్నారు కాబట్టి దేవతలు బాగానే

ఉన్నారు. కానీ లోకాలన్నీ భండాసురుని బాధతో పీడింపబడుతున్నాయి. ఇదంతా మరచిపోతే ఎలాగా అని నారదులవారు వెళ్ళి అమ్మవారిని ప్రార్థన చేశారు.

"అమ్మా! కామాక్షీ! చాలా సంతోషం. కానీ ఇదేమైనా బాగుందా" అంటే "ఏమిటి నాయనా!" అని కామాక్షీదేవి అన్నప్పుడు, "ఈ దేవతలందరూ ఇక్కడకు వచ్చి కూర్చున్నారు. నువ్వు వారిని అనుగ్రహిస్తూ కూర్చున్నావు. కానీ అటు ఆ భండాసురుని బాధలకి తాళలేక ముల్లోకాలు బాధపడుతున్నాయి. వారిని కాపాడవలసిన బాధ్యత దేవతలది. వీరికి శక్తి రాగానే సర్వశక్తి స్వరూపిణివైన నీ ధ్యాసలో పడి అదంతా మర్చిపోయారు". అప్పుడు అమ్మవారు చెప్పింది, "కాసేపు ఆనందంగా ఉంటారని వీరందరిని ఇక్కడ ఉంచాను, కానీ భండాసుర సంహారం చెయ్యడం నా యొక్క ఉద్దేశం. నాకు అన్నీ గుర్తు ఉన్నాయి. నువ్వు కూడా లోకం గురించి ఆలోచించావు గనుక నీకు ఆశీర్వచనం ఇస్తున్నాను. నేను యుద్ధానికి బయలుదేరుతున్నాను" అంది. అమ్మవారు లేచి బయలుదేరారు.

అటు ఆ భండాసురునికి పెద్ద రాజధాని శూన్యక పట్టణం. వానికి ఇద్దరు అన్నదమ్ములు విశుక్రుడు, విషంగుడు ఉన్నారు. దానికి తోడు చెల్లెలు పేరు ధూమిక. మేనల్లుళ్ళు మొత్తం పదిమంది. ఎంత పరివారమో! వారందరూ అక్కడ ఉన్నారు. భండాసురుని సైన్యాధ్యక్షుని పేరు కుటిలాక్షుడు. సేనాధ్యక్షుడు సేనలను ఎలా నడుపుతాడో వాడి పేరే చెప్తోంది. కుటిలాక్షుడు అంటే వంకర చూపు కలవాడు. కనుక రాక్షససేనలన్నీ వంకర బుద్ధులతోనే నడుస్తూ ఉంటాయి.

ఇప్పుడు అంత సేనలు అమ్మవారికి కూడా ఉండాలి. కానీ ఒక్క ఆమె ఎలా వెళ్తారా అని దేవతలు ఆలోచిస్తున్నారు. ఒక్కసారి అమ్మవారు మందహాసం చేశారు. ఆ చిరునవ్వు నవ్వగానే అమ్మవారి శరీరం నుండి సూర్యుని నుండి కిరణాలు వచ్చినట్లుగా కోట్లకొలది కిరణాలు బయటకు వచ్చాయి. ఆ కోట్లకొలది శక్తులు బయటకు వస్తుంటే అమ్మవారు చూస్తూ ఉన్నారు. ఇప్పుడు అమ్మవారు ఒక్కరిగా కనబడుతున్నా కోట్లశక్తుల సమాహారరూపిణి అన్న భావం కలగాలి. ఆ కోట్లశక్తులు ఆయుధాలు పట్టుకొని, 'అమ్మా! భండాసురుని సైన్యాన్ని దెబ్బతీయడానికి మేమందరం

సిద్ధంగా ఉన్నామమ్మా' అన్నారు. ఈ సేనలన్నీ మహోత్సాహంతో బయటకు వచ్చాయి. ఇక తల్లి యుద్ధభూమికి తరలివస్తోంది. ఆ సేనలన్నీ చుట్టూ ఉన్నాయి.

65. భండాసురవధోద్యుక్తశక్తిసేనాసమన్వితా

– శ్రీ భండాసురవధోద్యుక్తశక్తిసేనాసమన్వితాయై నమః

భండాసురుని వధించడానికి 'ఉద్యుక్తా'–సిద్ధపడిన శక్తి సేనలతో కూడిన తల్లి. ఇక్కడ నామాలతో కథ చెప్తున్నారు. అలా బయలుదేరిన అమ్మవారికి ప్రధానంగా ఇటు అటు రెండు శక్తులు సిద్ధమయ్యాయి.

అమ్మవారి యొక్క అంకుశం నుండి ఒక దేవత ఆవిర్భవించింది. ఆవిడ అమ్మవారి యొక్క గజబలానికంతటికి అధ్యక్షురాలుగా ఉండి నడుపుతూ ఉంది. అంకుశం అంటేనే ఏనుగుని పొడిచేది. ఏనుగుని అదుపులో పెట్టడానికి శక్తి అంకుశం నుండే వచ్చింది. ఆవిడ పేరు– సంపత్కరీ.

66. సంపత్కరీసమారూఢసింధురవ్రజసేవితా

– శ్రీ సంపత్కరీసమారూఢసింధురవ్రజసేవితాయై నమః

'సింధురం' అంటే ఏనుగు. వ్రజ అంటే సమూహం. సంపత్కరీదేవిచే నడిపింపబడుతున్న ఏనుగుల గుంపుతో సేవింపబడుతున్న తల్లి. 'సంపత్కరీ' అంటే ఐశ్వర్యములను ఇచ్చే తల్లి. సంపత్కరీ అయిన లక్ష్మీదేవికి కూడా అటు ఇటు ఏనుగులు ఉంటాయి. ఏనుగులు ఐశ్వర్యస్వరూపాలే. ఐశ్వర్యాలు ఉంటే సరిపోదు. వాటిని నియంత్రించే శక్తి ఉండాలి. ఐశ్వర్యాలను నియంత్రిస్తూ సంపత్కరీదేవత ఉంది. నియంత్రణలో రెండు రకాలు. ఒకటి కావలసినది ఇవ్వడానికి నియంత్రణ, రెండు అక్కర్లేనిది ప్రక్కకు తీయడానికి నియంత్రణ ఉండాలి. సద్వినియోగానికీ, దుర్వినియోగం కాకుండా చేయడానికీ నియంత్రణ కావాలి కదా!

నియంత్రణ అనేది లేకపోతే సృష్టిలో ఏదైనా ప్రమాదమే. ఐశ్వర్యాలను నియంత్రణ చేసే తల్లి సంపత్కరీ. అంకుశం చేత్తో పట్టుకుంది. ఈ సంపత్కరీదేవి

భండాసురుడు పంపిన దుర్మదుడు అనే రాక్షసుని సంహరించింది. దుర్మదం - మదం ఐశ్వర్యం వలన వస్తుంది. అహంకారమే క్రమంగా మదం అయిపోతుంది.

ఈ మదమును నియంత్రణ చేస్తే గాని ఆధ్యాత్మికంగా ఎదుగుదల ఉండదు. ఈ యుద్ధమంతా కూడా ఆధ్యాత్మిక సాధనే. ఐశ్వర్యాల వల్ల ఏర్పడే మదము వల్ల పరమాత్మ తెలియబడదు. ముందు మదమును నియంత్రించగలిగే ఆత్మశక్తి రావాలి. ఆ ఆత్మశక్తే సంపత్కరీదేవిగా వచ్చింది. నిగ్రహశక్తి అనేది ఇక్కడ చూపిస్తున్నారు. **'లలితా పరమేశాన్యాః అంకుశాస్త్రాత్ సముద్గతా । సంపత్కరీ నామ సా దేవీ'** అని బ్రహ్మాండపురాణం. అమ్మవారి అంకుశం నుండి ఉద్భవించిన శక్తి. ఇప్పుడు మరోతల్లిని చూపిస్తున్నారు.

67. అశ్వారూఢాధిష్ఠితాశ్వకోటికోటిభిరావృతా
- శ్రీ అశ్వారూఢాధిష్ఠితాశ్వకోటికోటిభిరావృతాయై నమః

కోట్లకొలది గుర్రాలను నియంత్రించే శక్తి వచ్చింది. ఆవిడ పేరు 'అశ్వారూఢా'. ఈవిడ అమ్మవారి యొక్క పాశాయుధం నుండి వచ్చింది. **'లలితా పరమేశాన్యాః పాశాయుధ సముద్భవా'** - పాశంతో గుర్రాలను కట్టాలి. ఏనుగులను నొక్కాలి. నొక్కడానికి అంకుశం. కట్టడానికి పాశం. పాశము నుండి వచ్చిన అశ్వారూఢ గుర్రాలను నిగ్రహిస్తోంది.

గుర్రాలు అంటే ఇంద్రియాలు. మొదటిది ఐశ్వర్యం. రెండవది ఇంద్రియాలు. వీటిని నియంత్రించాలి అంటే కట్టిపడేయాలి కానీ పూర్తిగా తీసేయకూడదు. నిగ్రహశక్తే మరో రూపంలో వచ్చింది. మదమును నిగ్రహించడానికి 'సంపత్కరీ'. ఇంద్రియాలను నిగ్రహించడానికి 'అశ్వారూఢా'.

ముందు ఈ రెండూ జరిగితే కానీ దుష్టశక్తుల నాశనం జరగదు. పరాశక్తి అనుగ్రహం లభించదు. ఆ రెండూ జరగాలి అంటే అమ్మవారి కృప కావాలి. అమ్మ కృప వలనే ఆ రెండింటి నుండి ఇవి వచ్చాయి. పాశము, అంకుశములను ధ్యానిస్తే నిగ్రహశక్తి కలిగి, తద్వారానే ఆధ్యాతిక సాధనలో మొదటిమెట్టుకు చేరగలరు.

అశ్వారూఢాని 'ఏహి' అని ధ్యానిస్తారు. అంటే తొందరగా రావమ్మా అని అర్థం. అశ్వారూఢాని ధ్యానిస్తే మంత్రసిద్ధి, సాధన ద్వారా పొందవలసినది చాలా తొందరగా ఇస్తుంది. అలాగే సంపత్కరీ కూడా మనకు సాధనకు కావలసినవి ఇస్తుంది. ఆ సంపద వల్ల మనకి మదం ఎక్కకుండా కాపాడుతుంది. అశ్వారూఢా అమ్మవారు కురుండుడు అనే రాక్షసుని సంహరించింది. వీరిద్దరూ అమ్మవారికి ప్రక్క ప్రక్కల ఉన్నారు. ఇప్పుడు అమ్మవారి రథమును వర్ణిస్తున్నారు.

68. చక్రరాజరథారూఢసర్వాయుధపరిష్కృతా

– శ్రీ చక్రరాజరథారూఢసర్వాయుధపరిష్కృతాయై నమః

అమ్మవారి యొక్క చక్రరాజము సిద్ధమై ఉంది. అమ్మవారి రథం శ్రీచక్రం. యుద్ధానికి వెళ్ళేటప్పుడు శ్రీచక్రమే రథం అయింది. శ్రీచక్రంలో ఉన్న మంత్రశక్తులే ఆయుధములు, దేవతలుగా ఉన్నాయి. మొత్తం దేవతలు, వారి చేతులలో ఆయుధాలు– ఇవే ఇక్కడ 'సర్వాయుధ'. సర్వమంత్రశక్తులతో ఉన్న శ్రీచక్రం సిద్ధమయ్యింది. ఆ శ్రీచక్రం ముందు మనం కూర్చున్నాం అంటే ఆ శ్రీచక్రరూపంలో అమ్మవారు వచ్చి మనలోనున్న భండాసురుని నశింపజేస్తారు అని అర్థం. భండాసురుడు పోతేనే మోక్షం. శ్రీచక్రానికి చక్రరాజమని పేరు.

చక్రమంటే యంత్రం. యంత్రాలు ఎన్ని ఉన్నా యంత్రాలకి రాజులాంటిది శ్రీయంత్రం. దానిని మించి మరొకటి లేదు. ఆ రథంలో అమ్మవారు ఉన్నారు అంటే ఆ రథంలో ఆయుధాలు అన్నీ ఉన్నాయి. అలా సర్వాయుధములతో కూడిన చక్రరాజరథం సిద్ధంగా ఉన్నది. ఇరువైపులా అశ్వారూఢా, సంపత్కరీ ఉన్నారు. ఇప్పుడు అమ్మవారి రథం నుండి రెండు రథములు బయటికి వచ్చాయి. యుద్ధానికి అమ్మవారు ఒక్కరే బయలుదేరారు. ఏది కావాలన్నా దీపం నుండి దీపాలు వచ్చినట్లు అమ్మ నుండే వెలికి వస్తున్నాయి. అమ్మవారికి ఇటు అటు వచ్చిన రథాలలో, అమ్మవారి కుడివైపు రథం పేరు 'గేయచక్రం'.

69. గేయచక్రరథారూఢమంత్రిణీపరిసేవితా

– శ్రీ గేయచక్రరథారూఢమంత్రిణీపరిసేవితాయై నమః

గేయం అంటే గానం. నాద చక్రం. ఆ నాదచక్రంలో అమ్మవారి యొక్క ప్రధానశక్తి మంత్రిణీదేవి ఉంటారు. ఈవిడే రాజశ్యామల. ఈ అమ్మయొక్క యంత్రాన్ని ధ్యానిస్తే చాలు ధన్యులమవుతాం. ఈ తల్లి యొక్క అనుగ్రహం పొందితే సర్వవిద్యలు లభిస్తాయి, బుద్ధులు బాగుపడతాయి. ఈ తల్లి అనుగ్రహమును పొందినవాడే కాళిదాస మహాకవి.

మాణిక్యవీణాముపలాలయంతీం
మదాలసాం మంజులవాగ్విలాసాం
మాహేంద్రనీలద్యుతి కోమలాంగీం
మాతంగకన్యాం మనసా స్మరామి

ఆ తల్లి అక్కడ సిద్ధమయ్యింది. ఆ తల్లే మంత్రిణీ. రాజుగారు ఉన్నప్పుడు మంత్రి ఉన్నట్టే, రాణిగారు ఉన్నప్పుడు మంత్రిణీ. మంత్రాంగము అనగా ఆలోచన. వ్యూహరచన చేయాలంటే ఆలోచన ఉండాలి. అవతలి వానితో యుద్ధం చేయాలంటే ప్రణాళిక, పథకము ఉండాలి. అంటే అర్థం శ్యామలాదేవి బుద్ధికి తల్లి. బుద్ధి ఉంటేగాని దుర్మార్గాలను నశింపజేయలేరు.

శ్యామలాదేవి సర్వవిద్యల తల్లి. ఈ తల్లి అనుగ్రహం వల్ల అన్ని విద్యలు లభిస్తాయి. సంగీతమైనా, సాహిత్యమైనా శ్యామలాదేవి అనుగ్రహమే. ఏ విద్యలైనా నాదము, శబ్దం, అక్షరము, స్వరముతోనే చెప్పబడతాయి. నాద, అక్షర, శబ్దస్వరం – అదే గేయచక్రం. శ్రీచక్రానికి తొమ్మిది ఆవరణలు ఉంటాయి. మంత్రిణీదేవి అయిన శ్యామలా(గేయ)చక్రానికి ఏడు ఆవరణలు ఉంటాయి. ఇందులో కూడా అనేక మంది దేవతలు ఉంటారు. ఈ వివరాలు లలితోపాఖ్యానంలో చెప్పబడ్డాయి. ఇందులో ప్రతి ఆవరణలో అనేకమంది శక్తులు ఉంటారు. వారు రకరకాల శ్యామలాదేవతలు. వారందరికి నమస్కారం చేసుకుంటూ ఇప్పుడు అమ్మవారి యొక్క ఎడమవైపు ఉన్న రథాన్ని చూద్దాం.

70. కిరిచక్రరథారూఢదండనాథాపురస్కృతా

– శ్రీ కిరిచక్రరథారూఢదండనాథాపురస్కృతాయై నమః

'కిరి' అన్నా, 'కిటి' అన్నా 'వరాహము' అని అర్థం. ఇది వరాహచక్రం. దీనికి ఐదు ఆవరణలు ఉంటాయి. ఈ ఐదు ఆవరణలలో వారాహీ దేవతలు అనేకమంది ఉన్నారు. ఈ వారాహీ దేవతలందరికి మూలదేవతగా 'మహావారాహీ' అనే ఆవిడ ఆ చక్రంలో బిందుస్థానంలో ఉంటారు.

వారాహీ అమ్మవారి చేతిలో ముసలము, హలము ఉంటాయి. అంటే రోకలి, నాగలి. పంట పండించడానికి నాగలి, వచ్చిన పంటని మనము తినడానికి అనువుగా చేసేది రోకలి. వారాహీ అంటే భూమిని ధరించే శక్తి, అన్నప్రదాయిని. అన్నమును, పుష్టిని ఇచ్చే శక్తి. అన్నపూర్ణ యొక్క ఒక రూపమే వారాహీ. వారాహీ అమ్మవారి ధ్యానం వలన అన్నం లభిస్తుంది. అన్నం శరీరశక్తినిస్తుంది. ఇదంతా రక్షణ శక్తి.

ఆలోచనల శక్తి శ్యామలాదేవి. శారీరకమైన శక్తి, క్రియాశక్తి వారాహీదేవి. కనుక క్రియాశక్తి వారాహీదేవి. జ్ఞానశక్తి శ్యామలాదేవి. ఈ రెండింటికి మూలమైన ఇచ్ఛాశక్తి, సంకల్పశక్తి లలితాదేవి. ఒక్కసారి భావన చేస్తే కుడివైపు జ్ఞానశక్తియైన శ్యామలాదేవి, ఎడమవైపు క్రియాశక్తి అయిన వారాహీదేవి. మధ్యలో ఇచ్ఛాశక్తి అయిన లలితాదేవి. అంటే ఇచ్ఛ, జ్ఞాన, క్రియ అనే మూడు రూపాలతో ఉన్న పరమేశ్వర సంకల్పశక్తి మహాకామేశ్వరి. అదే –

భజే శ్రీచక్రమధ్యస్థాం దక్షిణోత్తరయోస్సదా

శ్యామావార్తాళిసంసేవ్యాం భవానీం లలితాంబికామ్

ఇప్పుడు అమ్మవారి యుద్ధానికి రథాలు సిద్ధం. ప్రధానమైన నాయికలు సిద్ధం. చుట్టూ శక్తి సేనలు సిద్ధం. ఇక యుద్ధం ప్రారంభమవుతోంది.

ఆ యుద్ధం ఎలా జరిగింది, భండాసురుడు ఎలా సంహరింపబడ్డాడు అనేది అమ్మవారు చేసిన లీల. లలితానామాలలో రూప, లీలా వైభవాల్లోనే మంత్రవైభవ, తత్త్వవైభవ, యోగవైభవములు కూడా చెప్పబడుతున్నాయి. అయిదు

వైభవాలతో లలితా సహస్రనామ భాష్యం చెప్పబడుతోంది. ఈ కథని ఆస్వాదించడం ఒక ఉపాసన.

భండాసుర సంహారగాథలో ఒకొక్క రాక్షసుని సంహరించడంలో ఉద్దేశం – 'ఆధ్యాత్మిక' సాధన చేస్తూ ఉంటే ఆ శ్రీ శక్తి మనలో జాగృతం అవుతూ మనలో ఒకొక్క దుష్టశక్తిని తొలగించి, చివరకు పరాశక్తిగా సాక్షాత్కరించి అనుగ్రహించడమే పరమార్థం. యుద్ధగాథ చాలా దివ్యమైనది. అమ్మవారి పట్టాభిషేకంలో ఉన్న పరమార్థం అమ్మవారు దేవతలకి తిరిగి శక్తిని ఇచ్చింది. శక్తిని ఇచ్చి మనలో ఉన్న అజ్ఞానాలు తొలగించి మనకి మోక్షం ఇస్తుంది.

సృష్టి అంతా ఆవరించిన భండాసురుని, మన నిండా ఆవరించిన భండాసురుని సంహరింపజేయడానికై అమ్మవారికి పట్టాభిషేకం చేయాలి. భండాసుర సంహారానికి రమ్మనమని మనలో ప్రజ్ఞ నారదునిలా బ్రతిమలాడాలి. అప్పుడు అమ్మవారు బయలుదేరాలి. ఆవిడ బయలుదేరితే ఎన్ని శక్తులు వచ్చారో చూస్తే వచ్చినవారంతా ఆవిడ నుండే వచ్చారు.

యుద్ధానికి సిద్ధంగా అటు ఇటు శ్యామలా, వారాహీ. మరొకవైపు సంపత్కరీ, అశ్వారూఢా. మొత్తం శక్తిసేనలు. వీటన్నింటి మధ్య శ్రీచక్రపు బిందువు మీద చిరునవ్వులు చిందిస్తూ ఆ మహాకామేశ్వరుని యొక్క అంకమునందు కూర్చున్న... ఆ లలితా పరమేశ్వరీ శ్రీమద్రాజరాజేశ్వరీ పరాభట్టారికా మహాకామేశ్వరీ త్రిపురసుందరికి... శ్రీమహాత్రిపురసుందరికి జయ జయ... అని జయజయధ్వానాలు శక్తి సేనలు చేస్తున్నాయి.

లలితాసహస్రనామాల్లో మొదటి మూడు నామాలు అమ్మవారంటే ఏమిటి అనే పరతత్త్వనిర్వచనం చెప్తున్నాయి. అటు తరువాత అమ్మవారు ఏ విధంగా ఆవిర్భవించారు అనే దాన్ని 'చిదగ్నికుండసంభూతా, దేవకార్యసముద్యతా'లలో ప్రకటించుతూ, ఆవిర్భవించిన స్వరూపం ఎలా ఉన్నది అనే దాన్ని 'ఉద్యద్భాను సహస్రాభా' 'చతుర్బాహుసమన్వితా' నామం నుండి క్రమంగా 'సర్వారుణా' 'అనవద్యాంగీ' 'సర్వాభరణభూషితా' వరకు రూపవర్ణన చేశారు.

అటు తర్వాత అమ్మవారు కామేశ్వరుని వివాహమాడడం, పట్టాభిషేకం జరగడం, శ్రీమన్నగరాన్ని ఆ తల్లి పాలించడం, అమ్మవారి యొక్క స్థానవర్ణన- 'సుధాసాగరమధ్యస్థా, కామాక్షీ, కామదాయినీ' వరకు చెప్పుకుని, తరువాత దేవతలు, ఋషులు కలిసి అమ్మవారిని స్తుతించడం 'దేవర్షిగణసంఘాత స్తూయమానాత్మవైభవా' - ఇప్పటివరకు చెప్పబడ్డ నామాలను గమనించినట్లయితే ఒక క్రమం కనిపిస్తోంది. ఈ క్రమంలోనే ఇప్పటివరకు రూపవర్ణన చేసుకొని లీలావైభవంలో ప్రవేశించాం. 'భండసైన్యవధోద్యుక్తశక్తివిక్రమహర్షితా' అనే నామంతో మొదలుకొని 'హరనేత్రాగ్ని సందగ్ధకామసంజీవనౌషధిః' నామం వరకూ అమ్మవారి యొక్క లీలావైభవం వర్ణించబడింది.

ఒక కథనంతటినీ నామాల్లో కూర్చారు. అందుకే ఇలాంటి సహస్రనామస్తోత్రం ఇంకెక్కడా దొరకదు. ఆ నామాలు మననం చేసుకుంటే ఆ కథంతా మన లోపల మననమవుతుంది. అంటే అమ్మవారి కథ ఒకప్పుడు విని, ఒకప్పుడు చదివి వదిలేయవలసినది కాదు. చివరి వరకు మననం చేసుకోవలసినదే.

అమ్మవారి చుట్టూ సైన్యాన్ని రక్షిస్తూ ఒక ప్రాకారం ఉన్నది. ఈ ప్రాకారం వారాహీదేవి వ్యూహంతో రచింపబడింది. ఈ ప్రాకారం యొక్క గొప్పతనం వర్ణిస్తూ తరువాతి నామం...

71. జ్వాలామాలినికాక్షిప్తవహ్నిప్రాకారమధ్యగా
- శ్రీ జ్వాలామాలినికాక్షిప్తవహ్నిప్రాకారమధ్యగాయై నమః

జ్వాలామాలిని అనే దేవిచే ఏర్పాటు చేయబడిన వహ్ని ప్రాకార మధ్యంలో ఉన్న తల్లి. ఇక్కడ 'జ్వాలామాలిని' అనే తల్లి తిథి నిత్యాదేవతలలో ఒకరు. పాడ్యమి నుండి పూర్ణిమ వరకు ఒకొక్క తిథి నిత్యాదేవతలు చెప్పబడ్డారు. శుక్లపక్షచతుర్దశినాటి తిథి దేవత 'జ్వాలామాలిని'. బహుళపక్షంలో విదియనాటి దేవత కూడా ఈ తల్లే. ఆ జ్వాలామాలిని దేవి చేత అమ్మ వారాహి వహ్నిప్రాకారం ఏర్పాటు చేయించింది. భండాసురసైన్యం చేసే మాయాయుద్ధముల నుండి శక్తిసేనలన్నింటిని రక్షించడానికి

ఒక ప్రాకార నిర్మాణం జరిగినది. భండాసురుడు ఎలాగూ వాడి కోటలో వాడున్నాడు. వాడికి దుర్గమున్నది. ఇక్కడ అమ్మవారు తాను యుద్ధానికి బయలుదేరి వచ్చారు కనుక ఆ తల్లి చుట్టూ దుర్గము వంటి ఒక ప్రాకారం కావాలి. ఆ ప్రాకారం అగ్నిస్వరూపిణి అయిన జ్వాలామాలిని చేత చేయించింది వారాహీదేవి. ఆ ప్రాకారం ఎంత ఉన్నదంటే

శతయోజన విస్తారం పరివృత మహీతలం
త్రింశద్యోజనమున్నమ్రం జ్వాలాప్రాకారతాం వ్రజేత్

నూరు యోజనాల వైశాల్యం కలిగి, మూడు వందల యోజనాల పొడవు ఉన్న అగ్ని ప్రాకారమది. ఆ అగ్నిప్రాకార మధ్యంలో అమ్మవారు ఉన్నారు.

దీనికి అంతరావరణ, బహిరావరణ అని రెండు ఉంటాయి. ఆ చుట్టూ బయటవైపు కొంతమంది, లోపలిభాగంలో కొంతమంది... వీరందరిని ఆవరించుకొంటూ ఆ ప్రాకారం ఉంటుంది. ఆ లోపల ఉండే సైన్యాలు ప్రధానంగా అమ్మవారు, ఇటు శ్యామలా, వారాహీ, ఆ తరువాత శక్తిసేనలు. వీరందరిని కలుపుకొని ఆ ప్రాకారం ఉంది. ఈ విధంగా ధ్యానం చేయడం ఒక పద్ధతి. సహస్రనామాలు చదవడం, వినడం అనేది ఒక ధ్యానప్రక్రియ. ఈ వర్ణన చేసేటప్పుడు వహ్నిప్రాకారాన్ని భావన చెయ్యడం, మధ్యలో అమ్మవారిని ధ్యానించడం, ఇటు అటు శ్యామలా, వారాహీదేవతలు, ముందు వెనకల సంపత్కరీ, అశ్వారూఢా ఇలా – ధ్యానం చేస్తూ సహస్రనామం చదువుతున్నప్పుడే మన మనస్సులో మెదలాలి. అప్పుడు స్తోత్రం కాస్త ధ్యానంగా మారుతుంది.

72. భండసైన్యవధోద్యుక్తశక్తివిక్రమహర్షితా

– శ్రీ భండసైన్యవధోద్యుక్తశక్తివిక్రమహర్షితాయై నమః

భండసైన్యాన్ని సంహరించడానికి 'ఉద్యుక్త'–సిద్ధంగా ఉన్న శక్తుల విక్రమాన్ని చూసి అమ్మవారు ఆనందించారు. అంటే చుట్టూ ఉన్న శక్తి సేనలు భండసైన్యాన్ని ఎంత వేగంగా సంహరిస్తామా అని చాలా ఉత్సాహం చూపుతున్నారు.

ఇక్కడనుండి 'హర్షిత' లాంటి నామాలు పరిశీలించాలి. వీరు చేసే ప్రతి పని అమ్మవారి ప్రీతికోసమే. ఇది అంతా ఉపాసనా క్రమం. ప్రతి శక్తి సేన చేస్తున్న పనికి అమ్మవారు సంతోషిస్తున్నారు. ఆ శక్తి సేన ప్రయోజనం ఏమిటి? అమ్మవారు సంతోషించడం. ఏం చేసినా **'శ్రీజగదంబాప్రీత్యర్థం'...** అదే గొప్ప ప్రయోజనం. ఇదంతా ఉపాసనా దృష్టితో పరిశీలించాలి. కథాదృష్టితో మాత్రమే సరిపోదు. ఎందుకంటే ఆ మాటలు అంత చక్కగా చూపిస్తున్నారు. ఉపాఖ్యానానికి సమన్వయం ఉపాసన.

ఇలాంటిదే ముందు ఒక నామం వచ్చింది. 'భండాసురవధోద్యుక్త శక్తిసేనాసమన్వితా'. అక్కడ 'సమన్వితా' ఇక్కడ 'హర్షితా'. అక్కడ ముందు సిద్ధమయ్యింది. ఇప్పుడు వారందరూ ముందుకు దూకుతుంటే చూసి సంతోషించింది. అయితే ఆ నామంలో, ఈ నామంలో చిన్న తేడా ఉంది. అది భండాసురవధోద్యుక్త, ఇది భండసైన్యవధోద్యుక్త. అక్కడేమో భండాసురుని చంపడానికి చాలా ఉత్సాహంగా ఉన్నవాళ్ళు. ఇక్కడ భండసైన్యాన్ని చంపడానికి ఉత్సాహంగా ఉన్నారు. అంటే వారు వేరు, వీళ్ళు వేరా అంటే వేరే. ఇక్కడ అమ్మవారిలో రెండు రకాల సైన్యములు ఉంటాయి. అవి అంతరావరణ, బహిరావరణ అనే సైన్యములు. అంతరావరణలో ఉన్నవారు - శ్యామలా, వారాహీ ఇత్యాది ప్రధాన శక్తులు. వారి పరివార దేవతలు, అంగదేవతలు తిరస్కరిణీ, వాగ్వాదిని ఇత్యాదులు. వీరందరూ కలుసుకుంటే అంతరావరణ. ఇది కాకుండా అమ్మవారి శక్తిసేనలు చాలా ఉన్నాయి. అవి అరవైనాలుగు కోట్ల శక్తిసేనలు. వీరందరూ కూడా భండాసురసైన్యాన్ని సంహరించడానికి సిద్ధంగా ఉన్నవారు. వీరు భండసైన్యవధోద్యుక్త. బహిరావరణ దేవతలు.

73. నిత్యాపరాక్రమాటోపనిరీక్షణసముత్సుకా

- శ్రీ నిత్యాపరాక్రమాటోపనిరీక్షణసముత్సుకాయై నమః

ఇప్పుడు నిత్యాదేవతల యొక్క పరాక్రమాన్ని వర్ణిస్తున్నారు. అమ్మవారి

చుట్టూ నిత్యాదేవతలు ఉంటారు. శ్రీచక్రంలో బిందుస్థానంలో అమ్మవారు ప్రధానంగా ఉంటే, అటు తరువాత ఆవరణ త్రికోణం. ఆ బిందువు నుండి, త్రికోణం లోపల మధ్యభాగంలో అమ్మవారిని పరివేష్ఠించి చుట్టూ పదిహేనుమంది తిథినిత్యాదేవతలు ఉంటారు. వీరు కాలస్వరూపులు. వీరియొక్క అనుగ్రహం ఉంటే అన్ని కాలములు అనుకూలిస్తాయి. నెలరోజులు... రెండు పక్షములు. ఆ తిథినిత్యాదేవతలు వీరు. ఇవేవో పురాణములో కథలు మాత్రమే కాదు. మనకు నిత్యం ఉన్నవే.

నిత్యాదేవతలు అమ్మవారి రూపాలు అని ఉపాసన చెయ్యడం వల్ల ధన్యులవుతాము. వారు క్రమంగా-కామేశ్వరీ, భగమాలినీ, నిత్యక్లిన్నా, భేరుండా, వహ్నివాసిని, మహావజ్రేశ్వరి, శివదూతి, త్వరిత, కులసుందరి, నిత్యా, నీలపతాక, విజయ, సర్వమంగళా, జ్వాలామాలిని, చిత్ర.

కథలో మనం పరిశీలించినట్లయితే- భండాసురసైన్యంలో విశుక్రుడు, విషంగుడు అని ఇద్దరు ఉన్నారు. విషంగుడు ఒక మాయా యుద్ధం చేస్తూ వెనుక నుండి అమ్మవారి సైన్యాన్ని దెబ్బతీద్దాం అని ప్రయత్నించాడు. దానిని కొనసాగనివ్వకుండా అడ్డుకొని అతనితో వచ్చిన పదిహేనుమంది దుష్టసేనలని సంహరించడానికి అమ్మవారి చుట్టూ ఉన్న ఈ పదిహేనుమంది వారి పరాక్రమం ప్రదర్శించారు. దమనక, దీర్ఘజిహ్వ, హబక, హాలుమల్ల, కక్లశ, కల్గివాహన, ధుక్లస, పుత్రకేతు, చంద్రబాహు, కుక్కుర, జంబుకాక్ష, కుంభగ, తీక్ష్ణశృంగ, త్రికంటక, చంద్రగుప్త – వీరు కూడా పదిహేను చీకటి శక్తులు. తిథినిత్యాదేవతలు పదిహేనుమంది కాంతి శక్తులు. వారికున్న నల్లదనం చాలు. దానికి తోడు నల్ల ముసుగులు వేసుకొని, ఊపిరి సవ్వడి కూడా వినబడకుండా రాత్రిపూట దాడికి వచ్చారు. యుద్ధం రాత్రి చెయ్యరాదు, పైగా వెనుక నుండి చెయ్యకూడదు. ఇలా వెనుక నుండి కొట్టే వారిని పార్ష్ణిగ్రాహులు అంటారు. అలాంటి వ్యూహం పన్నుకొని వారు వచ్చారు. ఆ సమయం అమ్మవారి సేనలన్నీ ముందుకి వెళ్తున్నాయి. యుద్ధానికి వెనుక నుండి వచ్చిన వారి గురించి తెలియదు. అది కూడా తెలుసుకుని క్రిందకి దిగినవారు ఈ పదిహేనుమంది నిత్యాదేవతలు. వారు క్రిందకి వచ్చి ఈ పదిహేనుమంది అసురశక్తులని కొట్టారు.

అంటే కాలంలో ఉన్న ప్రతికూలతలే ఈ అసుర శక్తులు. వాటిని దునుమాడి అనుకూలం చెయ్యడం ఇందులో విశేషం.

నిత్యాదేవతలు చూపిస్తున్న పరాక్రమం యొక్క గొప్పతనాన్ని చూస్తూ అమ్మవారు మాటిమాటికి సంతోషిస్తోంది. 'సముత్సుకా', 'హర్షితా' ఇవి గమనించు కోవాలి. ఇవి లేకపోతే కేవలం వారు, వారి యుద్ధాలు గుర్తు వస్తాయి. అమ్మని మర్చిపోతారు. లలితాసహస్రనామం మాటిమాటికి అమ్మని గుర్తుచేస్తోంది. ఇవి అమ్మ నామాలు కదా! ఆ పదిహేనుమంది పరాక్రమం చూపించగానే అమ్మ సంతోషించింది. అంటే ఈ పరాక్రమం **అమ్మవారి ప్రీత్యర్థం.**

మనం సాధించిన ప్రతి విజయం అమ్మవారి ప్రీత్యర్థం. ఏ విజయం సాధించినప్పటికి అమ్మవారి శక్తుల సహాయం లేనిదే మనమేం చెయ్యలేం. ఈ నామానికి అనేక వ్యాఖ్యానాలు చాలా అద్భుతంగా చూపించారు. అమ్మవారిని ఎదురుగా పెట్టి పూజిస్తున్నామంటే, ఎదురుగా శత్రువు ఎవరు ఉన్నారు? పూజించేవాడా? పూజించేవాడు భక్తుడు – శత్రువు ఎలా అవుతాడు? కాదు. మన లోపల ఉన్న భండాసురుడు మనల్ని రకరకాల బాధలు పెడుతూ ఉంటాడు. ఒకసారి అజ్ఞానమే జ్ఞానమనిపించేలా భ్రాంతి పెడుతూ ఉంటాడు. అందుకు అమ్మవారి ఆరాధన చేస్తూ ఉంటే మన స్థాయి బట్టి అందులో శక్తులు జాగృతమై మన అంతః కరణంలో ప్రవేశించి, మనలో ఒకొక్క దుష్టశక్తిని కొడుతూ ఉంటాయి. ఆ ఒకొక్క దుష్టశక్తిని కొట్టడమే భండాసుర సంహారం వరకు ఒకొక్కరిని దునుమాడడం.

ఆ కథని అనుసంధానం చేస్తూ మనం భావన చెయ్యవలసినదేమిటంటే మనలో అనేక రకాల అజ్ఞాన జనిత దుష్ప్రవృత్తులు నశిస్తాయి. ఆ సాధనగా దీనిని పారాయణ చేయగలిగితే, ఆ పరాశక్తితో తాదాత్మ్యం చెంది తరించగలరు.

ఆధ్యాత్మిక సాధన అంటే ఎక్కడో పరలోకాల నుండి శక్తిని దింపుకోవడం కాదు. మనలోపల ఉన్న అఖండమైన ఆత్మశక్తిని జాగృతపరుచుకోవడమే. యోగవాసిష్ఠంలో గొప్పమాట – అది ఇక్కడ అన్వయించుకుంటే ఇంకా బాగా తెలుస్తుంది.

'సర్వా యేవ కలా జంతోః అనభ్యాసేన నశ్యతి। ఇయం జ్ఞానకలాత్వస్తః సకృత్ జ్ఞాతాపి వర్ధతే'. మనం యోగశాస్త్రాన్ని, దీనిని కలిపి చూడాలి. లేకపోతే ఈ సహస్రనామాలతో కలిపి చూడాలి. ఈ సహస్రనామాలు, పురాణాలు వేరు, వేదాంతమంతా వేరు అని కొందరు అనుకుంటారు. కానీ 'సర్వోపనిషదుద్ఘుష్టా' అయిన అమ్మవారు ఈవిడే అని తెలియాలంటే ఈ పరంగా అన్వయించుకోవాలి. యోగవాసిష్ఠంలో ఏం చెప్తున్నాడంటే, 'మనలో అద్భుతమైన జ్ఞానకళలు ఉంటాయి. కానీ అనాభ్యాసం చేత అంటే వాటిని సాధన చెయ్యకపోవడం వల్ల ఆ కళలు క్రమంగా క్షీణించి పశుత్వం అభివృద్ధి చెంది ఈ మానవత్వస్థాయి నుండి ఇంకా పశుత్వస్థాయికి దిగి, తరువాత జన్మలు పశుజన్మలు పొందుతారు. ఈ జ్ఞానకళలను కాసింత సాధన చేసినా అవి అభివృద్ధి చెందుతాయి. ఆ జ్ఞానకళలు వృద్ధి చెందుతూ ఉంటే లోపల పరమాత్మగా ఉన్న అమ్మవారు సంతోషించి అనుగ్రహిస్తూ ఉంటారు. సాధన, అభ్యాసం ఎంతగా చేస్తూ ఉంటే, దానికి సంతోషించి ఆవిడ ఇంకా పైపైకి తీసుకువెళ్తూ ఉంటారు. ఈ జ్ఞానకళల యొక్క పరాక్రమం అంటే అభ్యాసం యొక్క తీవ్రత పెరుగుతూ ఉంటే లోపల ఉన్న తల్లి సంతోషించి మరింత అభ్యుదయం కలిగిస్తుంది'. అదే 'సముత్సుకా' అనే మాటలో ఉన్న ఆంతర్యం.

74. భండపుత్రవధోద్యుక్తబాలావిక్రమనందితా

– శ్రీ భండపుత్రవధోద్యుక్తబాలావిక్రమనందితాయై నమః

ఇప్పుడు భండాసురుని కొడుకులు వచ్చారు. వీరు మొత్తం ముప్పైమంది. వీరంతా అవిద్యావృత్తులు. జీవులలో అవిద్యావృత్తులు ముప్పై రకాలుగా ఉంటాయి. వీటికి జీవుని అజ్ఞానం చేత వచ్చిన మాలిన్యాలు అని పేరు. ఈ మాలిన్యాలు చాలా భయంకరం. ఇవి జీవునికి అనేక జన్మల నుండి అలవాటైపోయి ఇవి కూడా సహజమనుకుంటారు. బురద ఒంటికి అంటుకున్నాక కడుక్కోకుండా కొన్ని రోజులు ఉంటే అది కూడా శరీరంలో భాగం అన్నవిధంగా అజ్ఞానమాలిన్యాలు జన్మలజన్మల నుండి జీవుని చుట్టూ ఆవరించుకుని ఉన్నాయి. అవి రకరకాల వృత్తులతో

బయటపడుతూ ఉంటాయి. వృత్తులు అంటే ఆలోచనలు, ప్రవర్తనలు. ఈ రకరకాల ప్రవర్తనలను, మాలిన్యాలను విడదీసి చూపిస్తే మొత్తం ముప్ఫై అజ్ఞానమాలిన్యాలు. ఇవన్నీ తొలగించడం మహాకష్టం.

అజ్ఞానమాలిన్యాలు పోతే ఆ తరువాత కొంత పురోగతి సాధించవచ్చు. జ్ఞానకళలను ప్రబోధించడం 'నిత్యాపరాక్రమాటోప'. అజ్ఞానజనిత అవిద్యా వృత్తులను, ద్వైతభావాలను తొలగిస్తూ సాధన చెయ్యాలంటే ఆ సాధనకు సహకరించే మహాశక్తి బాలామహాత్రిపురసుందరి. వచ్చినవారు ముప్ఫైమంది భండాసురుని కొడుకులు. వీళ్ళూ సామాన్యులు కారు. భండాసురుడు దేవతలతో యుద్ధం చేస్తున్నప్పుడు ఇంద్రాది దేవతలు కూడా వీరి ముందు భయపడినవారే. ఒకొక్కరు దెబ్బతింటుంటే భండపుత్రులు తండ్రికి ధైర్యం చెప్పారు. "నువ్వేం భయపడకు... మేం వెళ్తున్నాం" అని. ఆ వెళ్తున్నప్పుడు అమ్మవారి యొక్క హృదయం నుండి ఒక శక్తి వెలికి వచ్చింది. ఆవిడే బాలామహాత్రిపురసుందరి. నవవర్షప్రాయ. ఎప్పుడూ తొమ్మిదేళ్ళ వయస్సులో ఉంటుంది. లలితాంబ ఎప్పుడూ పదహారేళ్ళ వయస్సే.

నవవర్షానికి చాలా సంకేతాలు ఉన్నాయి. ఇది నిజానికి బాల యొక్క ప్రధానమైన అక్షరవిద్య. బాలావిద్య షడక్షరీ, నవాక్షరీ అని రెండు రూపాలుగా ఉంటుంది. అటువంటి బాలామహాత్రిపురసుందరి నవవర్షప్రాయంగా అమ్మవారి హృదయం నుండి వెలికివచ్చి, "నేను వెళతాను.. వారితో యుద్ధంచేస్తా" అన్నది. అప్పుడు అమ్మవారు, "నిన్ను యుద్ధానికని నేను తెచ్చుకోలేదు. ముచ్చటగా నా ప్రక్కన ఉంటావని తెచ్చుకున్నాను. నువ్వేమీ యుద్ధం చెయ్యవద్దులే. ఈ శ్యామలా, వారాహీ, సంపత్కరీ, అశ్వారూఢా – వీరంతా ఉన్నారు. నీకెందుకు శ్రమ" అంటే "లేదు.. నేను ఎలాగైనా యుద్ధానికి వెళ్తాను" అన్నది. "ఎప్పుడైనా పిల్లలు ఆడుకుంటా నంటే తల్లులు పంపరా?" అన్నది. "అలాగ నేను యుద్ధకేళి చేస్తాను. ఆ యుద్ధకేళికి నన్ను పంపు" అన్నది బాలామహాత్రిపురసుందరి.

మరి అంత ముచ్చట పడుతోంది కదా అని చెప్పి తల్లి సంతోషించి తన యొక్క అద్భుతమైన శ్రీచక్రరథం నుండి ఒక రథాన్ని బయటకి తీసింది. అందరికి

రథాలు ఇందులోంచే సృజించి అందిస్తున్నది.

శ్యామల, వారాహీ రథాలు ఇక్కడి నుండే ఇచ్చింది. ఇప్పుడు ఈమె కోసం ఒక రథం ఇచ్చింది. ఎవరి రథాలు వారివే. అన్నీ ఒక్కలా ఉండవు. అమ్మవారిది మాత్రం నవావరణ. బాలాంబకి ఇచ్చిన రథం పేరు కర్ణీరథం. ఇదొక విశేషమైన రథం. నిజంగా మనం గమనించినట్లయితే ఇది ఎక్కడో లేదు. శ్రీచక్ర ఆరాధకులకు పనికొస్తుందని చెప్పడం జరుగుతోంది.. బిందువు, త్రికోణం, అష్టత్రికోణం వరకు ఉన్న భాగం – బాలాదేవి స్థానం. సరిగ్గా అటు, ఇటు శ్యామల, వారాహీలు కూడా ఉంటారు. ఆ భాగం చాలా ముఖ్యం. 'జ్వాలామాలినికాక్షిప్త' అంటే ఈ అష్టత్రికోణం వరకు వెళ్తే అది అంతరావరణం. దానిని దాటిన తరువాత ఆవరణలన్నీ బహిరావరణలు. వీరు భండసైన్యవధోద్యుక్త. ఇదంతా కలిపి మొత్తం శ్రీచక్రం నుండి వస్తున్న కాంతివలయాల మంత్రశక్తుల తేజస్సే జ్వాలామాలిని. శ్రీచక్రస్వరూపాన్ని భావన చేస్తే ఇంత విషయంలోకి వెళ్ళగలం.

లలితాసహస్రం ఒక వైపు శ్రీచక్రోపాసన, మరొకవైపు కుండలినీ ఉపాసన, మరొకవైపు వేదాంత తత్త్వవిచారణ – ఇలా ఇందులో మూడు ఉన్నాయి. ఇందులో ఒకటి చెప్తూంటే ఇంకోదాంట్లోకి వెళుతూ ఉంటే అయోమయం కాకుండా సమన్వయం కావాలి. ఒకదానితో ఒకటి సమన్వయించాలి. అందుకే సాధనలో ముందుగా అమ్మవారి రూపాన్ని భావన చెయ్యమంటారు. ఆ రూపాన్ని శ్రీచక్రంతో సమన్వయించాలి. ఈ శ్రీచక్రాన్ని విశ్వచక్రంతో సమన్వయించాలి. ఈ విశ్వచక్రాన్ని మన శరీరచక్రంతో సమన్వయించాలి. తరువాత క్రమంగా ఈ శరీరచైతన్యంలో అంతర్యామిగా ఉన్న ఆ పరమ చైతన్యంతో సమన్వయించాలి. అప్పుడు సిద్ధి. ఇందులో మనం ఎక్కడ ఆగి ఉన్నామో చూస్తే, దాని పైభాగానికి వెళ్ళాలి. విగ్రహం దగ్గర ఆగితే శ్రీచక్రభావం దగ్గరకి వెళ్ళాలి. అక్కడి నుండి విశ్వచక్రభావన, అటుపై శరీరచక్రభావన. అది బ్రహ్మాండం. ఇది పిండాండం. తరువాత మనలో ప్రాణశక్తి ఉపాసన కుండలినీ రూపంగా, అంతర్యామి అయిన పరమచైతన్యంలోకి ప్రవేశించాలి. ఇది క్రమం. ఇదంతా కలిపితే సంపూర్ణ లలితా ఉపాసన. వారి స్థాయిని బట్టి కొందరు ఒక దగ్గర

ఆగిపోతారు. అప్పుడు వారు దానినే గట్టిగా ఉపాసిస్తే, తరువాత స్థితికి అమ్మవారే తీసుకెళ్తారు.

'చక్రరాజరథారూఢసర్వాయుధపరిష్కృతా'. ఎవరికిచ్చినా ఇందులో నుండే రథాన్ని అందిస్తున్నది. అంటే ఇది ఖాళీ అయిపోతోందా? కాదు. ముందు ఒక ఉపమానం చెప్పుకున్నాం. దీపం నుండి దీపం వెలిగించినట్లు. అక్కడ మూడు వత్తులు పెడితే మూడు జ్యోతులు. కానీ వెలిగించింది మాత్రం ఈ జ్యోతేగా. అలా శ్రీచక్రమనేది ప్రధానజ్యోతి అయితే ఇందులో నుండే అక్కడకి, ఇక్కడకి, ముగ్గురుకి వెళ్ళాయి. శ్యామలా, వారాహీ ఎంత ప్రధానమో, బాలామహాత్రిపురసుందరి అంత ప్రధానమైన శక్తి. ఈవిడ అమ్మవారి స్వరూపమే. నిజంగా చెప్పాలంటే శ్రీవిద్యకి బీజవిద్య 'బాలావిద్య'. బీజం అంటే అర్థం... మొత్తం చెట్టు యొక్క శక్తి అంతా బీజంలోనే ఉంటుంది కదా!

బాల ఒక పూర్ణవిద్య. దీనినే ఉపాసన చేసి సిద్ధి పొందిన మహాత్ములు ఎందరో! బాల అంటే సామాన్యం కాదు. కృష్ణతత్త్వంలో బాలకృష్ణతత్త్వం, శివతత్త్వంలో సుబ్రహ్మణ్యతత్త్వం వలెనే, శక్తితత్త్వంలో బాలాత్రిపురసుందరీతత్త్వం చెప్పబడుతున్నది.

బాలకృష్ణుని ఉపాసించినా కృష్ణోపాసనే, బాలాత్రిపురసుందరిని ఉపాసించినా శ్రీవిద్యోపాసనే. బాలాత్రిపురసుందరి ప్రధానంగా ప్రాణశక్తిరూపిణి. లలితాదేవి హృదయం నుండి వచ్చిన ప్రాణశక్తి. ఆ తల్లి రథాన్ని వెయ్యి హంసలు నడుపుతున్నాయి. వెయ్యిహంసలు అనగానే శ్వాసలు. బాలాత్రిపురసుందరీ మంత్రాన్ని శ్వాసతో జపించితే చాలా విశేషమని తదుపాసకులు చెప్పారు. ముఖ్యప్రాణవిద్యగా బాలావిద్యని చెప్తారు. ఆ తల్లి ఒకవైపు జ్ఞానాధిదేవత, ఇంకోవైపు ప్రాణాధిదేవత. రెండూ ప్రధానమైనవే. బాలా ఉపాసన వల్ల జ్ఞానశక్తి పెరుగుతుంది. ఇందులో ప్రధానబీజములు మూడున్నాయి. ఈ మూడు బీజములే తరువాత ఆవృతి జరుగుతాయి. మూడు బీజాల నుండే మూడు కూటములతో కూడిన శ్రీవిద్య అంతా ఆవిష్కరించబడింది.

బాలామహాత్రిపురసుందరి రథం ఎక్కగానే శ్యామలా, వారాహీ పరిగెత్తుకు వచ్చి, "నువ్వేమిటమ్మా! యుద్ధానికి బయలుదేరడం... నువ్వు అమ్మవారితో

ముచ్చటలాడడానికి ప్రక్కన కూర్చోవాలి. మేము యుద్ధం చేస్తాం" అన్నారు. ఆవిడ సమాధానం చెప్పలేదు. తిన్నగా తన యొక్క రథంలో యుద్ధానికి వెళ్ళిపోతోంది. 'ఎందుకైనా మంచిది, చిన్నపిల్ల ఉత్సాహంతో బయలుదేరింది ఏం యుద్ధం చేస్తుందిలే, మనం ప్రక్క నుండి సాయం చేద్దాం'... అనుకున్నారు శ్యామలా, వారాహీ. ఎదురుగా ముప్పైమంది రాక్షసులు భండాసురుని కొడుకులు. వారి యొక్క అక్షౌహిణీల సేనలు అంతా వ్యాపించి ఉన్నాయి. అది చూసి ఆశ్చర్యపోతున్నారు శ్యామలా, వారాహీ అమ్మవార్లు. 'ఇంతమంది ఎదురుగా ఉన్నారు మనందరమూ బలం చూపించవలసిందే' అనుకున్నారు.

కానీ ఈ తల్లి మందహాసం చేసి నారాయణాస్త్రాన్ని ప్రయోగించింది. నారాయణాస్త్రం ప్రయోగించగానే మొత్తం ముప్పైమంది తెచ్చుకున్న సైన్యమంతా దహనమైపోయింది. ఆ తరువాత ఒక అర్ధచంద్రబాణాన్ని తీసింది. ఇంతకు ముందు నారాయణాస్త్రం తీసినప్పుడే ఈ శ్యామలా, వారాహీలు సహాయం చేద్దామని ధనుస్సులు పట్టుకున్నవారు ఆమె చూపిస్తున్న ప్రతాపాన్ని చూసి ధనుస్సులు మరి ఎక్కుపెట్టలేదు. చిన్నపిల్ల ఏం యుద్ధం చేస్తుందిలే అనుకున్నాంగాని ఈవిడ పరాక్రమం అద్భుతం. అమ్మకి ఏ మాత్రం తీసిపోదు అనుకుని దండం పెడుతున్నారు. ఈ లోపల ఆ తల్లి ఒకే అర్ధచంద్రబాణం తీసి పట్టుకోగానే ముప్పైమందికి ముప్పై బాలాత్రిపురసుందరులు కనబడ్డారు. 'ఒక సూర్యుండు సమస్తజీవులకు తానొకొక్కడై తోచు పోలిక...' – అలా కనబడగానే ఆశ్చర్యపోయారు. తల్లి ఒక్కరే. ప్రయోగించిన బాణం ఒక్కటే. ఏకకాలంలో బాలాత్రిపురసుందరి చేత ముప్పైమంది సంహరింపబడ్డారు.

ఈ విధంగా ఎప్పుడైతే బాలాత్రిపురసుందరి తన యొక్క పరాక్రమాన్ని చూపించిందో అది చూసి మురిసిపోయింది తల్లి. లలితాంబకి బాలాత్రిపురసుందరి బయలుదేరిన దగ్గర నుండి ముచ్చటే.

అరుణకిరణజాలైరంచితాశావకాశా
విధృతజపటీకా పుస్తకాభీతిహస్తా

ఇతరకరవరాఢ్యా పుల్లకల్హారసంస్థా
నివసతు హృది బాలా నిత్యకల్యాణశీలా

ఆ బాలాత్రిపురసుందరి నవవర్షప్రాయంతో ఉంటూ నాలుగు చేతులతో... రెండు చేతుల్లో పుస్తకము, జపమాల పట్టుకొని; మిగిలిన రెండు చేతులతో వరదహస్తం, అభయహస్తాలతో ఉండి, కల్హారం అనే ఒకానొక కమలంపై కూర్చొని ఎర్రనికాంతులతో మెరసిపోతోంది. 'అరుణకిరణజాలైః అంచిత ఆశావకాశా' – ఆశ అంటే దిక్కులు, ఆ దిక్కుల హద్దులన్నీ కూడా ఆ బాలాత్రిపురసుందరి అరుణకాంతులతో వ్యాపించిపోయి ఉన్నాయి.

అలాంటి ఆ జగజ్జనని తన సర్వవ్యాపక పరమాత్మ చైతన్యాన్ని ఋజువు చేస్తూ ఒక్క రూపమే ఎన్నో రూపములుగా గోచరింపజేస్తూ సంహరించింది. ఆ బయలుదేరడం ఒక ముచ్చట. యుద్ధం చేయడం మరొక ముచ్చట. రాక్షసులను సంహరించడం అద్భుతమైన ముచ్చట. మూడు ముచ్చటలు చూసి మురిసిపోయింది అమ్మ లలితామహాత్రిపుర సుందరి. 'భండపుత్రవధోద్యుక్తబాలావిక్రమనందితా' – భండపుత్రులని వధించడానికి ఉద్యుక్తమైన బాలాదేవి విక్రమానికి 'నందిత'– ఆనందించిన తల్లి.

75. మంత్రిణ్యంబావిరచితవిశుక్రవధతోషితా

– శ్రీ మంత్రిణ్యంబావిరచితవిశుక్రవధతోషితాయై నమః

దీని గురించి ఉపోద్ఘాతంలో చెప్పడం జరిగింది. సాధారణంగా దొరికే పాఠాలలో మార్చుకోవాలి. 'మంత్రిణ్యంబావిరచిత విశుక్రవధతోషితా', 'విషంగప్రాణ హరణ వారాహీవీర్యనందితా'. భాస్కరరాయలకి పూర్వం ఉన్న పాఠములన్నీ ఇవే. అలాగే బ్రహ్మాండపురాణంలోనున్న లలితోపాఖ్యానంలో అసలు పాఠమిది. దానిని అనుసరించే పారాయణ చేసుకోవాలి. మంత్రిణీదేవి అనగా అమ్మ శ్యామలాదేవి. ఈవిడ అద్భుతమైన జ్ఞానశక్తి. విజృంభించి యుద్ధం చేయడానికి వచ్చినపుడు విషంగ, విశుక్రులు ఇద్దరు కూడా భండాసురుని యొక్క కుడి ఎడమ భుజాల నుండి వచ్చారు.

అంటే అసలు అజ్ఞానమంతా భండాసురుడు, వాడి సోదరులైన వీరిద్దరు అహంకార, మమకారాలు. విశుక్ర–శుక్రం అంటే తేజస్సు. ఆ తేజస్సునంతా విగతం చేస్తాడు(తీసేస్తాడు). ఎంత ప్రాపంచిక విషయలాలస పెరుగుతూ ఉంటే మనలో ఉన్న శక్తి అంత తగ్గిపోతుంది. నిగ్రహం ఎంత పెరుగుతూ ఉంటే మనలో తేజస్సు అంత పెరుగుతూ ఉంటుంది. నిగ్రహం తగ్గడం అంటే అర్థం ప్రాపంచిక విషయలాలస. ప్రాపంచిక విషయలాలసే విశుక్రుడు. ఇది అజ్ఞానం యొక్క ప్రథమావస్థ. ఆ విషయలాలసకి కారణం నేను అనే అహం. ఇది ప్రధానమైన ప్రమాదకారి. విషయ సంఘాభిలాష అంతా కలిపితే విశుక్రుడు. అది కొట్టాలి అంటే జ్ఞానస్వరూపము కావాలి. జ్ఞానశక్తి అయిన తల్లి మంత్రిణీదేవి వచ్చింది.

'మంత్రిణ్యంబావిరచితవిశుక్రవధతోషితా' – 'విరచిత' అనగా ఆవిడ రచించినది అంటే చేసినది. విశేషముగా చేసింది కనుక విరచిత. అద్భుత రచన ఇది. ఎందుకనగా విశుక్రుని కొట్టడం సామాన్యం కాదు. విశుక్రుడు మాయావి, కపటుడు. భయంకరమైన వ్యూహాన్ని పన్నుతూ ఉంటాడు. అటువంటి రాక్షసుని అమ్మ శ్యామలాదేవి బ్రహ్మాస్త్రం ప్రయోగించి సంహరించింది. మంత్రిణీదేవి విశుక్రవధ చేయగానే 'తోషితా' – సంతోషించింది ఆ లలితాంబిక.

రాజశ్యామల ఉపాసన వలన క్రమంగా విషయలాలస తగ్గుతూ, విజ్ఞానదృష్టి వికసించడమే దీనిలో పరమార్థం

76. విషంగప్రాణహరణవారాహీవీర్యనందితా

– శ్రీ విషంగప్రాణహరణవారాహీవీర్యనందితాయై నమః

విషంగుడు రెండవవాడు. వీడో ప్రమాదకారి. వీరిలో ఎవరు పెద్దా, ఎవరు చిన్నా అని లేదు. అందరూ సమానస్థాయి దుర్మార్గులే. విషయాభిలాష విశుక్రుడు అయితే, దుష్టవిషయసాంగత్యం విషంగుడు. విషంగ–కూడని సంగం. ఇది 'మమ'.

వారాహీ అమ్మవారు భయంకరుడైన విషంగుని కొట్టడానికి వచ్చింది. ఈ తల్లి చేసిన యుద్ధం చాలా విశేషం. ఈవిడ అనేక రకాలైన అస్త్ర, శస్త్రములు

ప్రయోగించి విషంగుని చుట్టూ ఉన్న అసురసేనలను సంహరించింది. విషంగుని కొట్టేటప్పుడు వారాహీ అమ్మవారు నాగలిని విషంగుని మెడకు వేసి లాగింది. చేతిలో ఉన్న రోకలితో మొత్తింది. మూకకవి మూకపంచశతిలో అమ్మవారిని స్తుతిస్తూ –

'తాడితరిపు పరిపీడన భయహరణనిపుణ హలముసలా

క్రోడపతి భీషణముఖీ క్రీడసి జగతి త్వమేవ కామాక్షి'

అన్నారు. 'హల ముసల చాప హస్తా' – హలము, ముసలము పట్టుకొని వారాహీ అమ్మవారు వచ్చి విజృంభించి విషంగుని సంహరించింది.

77. కామేశ్వరముఖాలోకకల్పితశ్రీగణేశ్వరా

– శ్రీ కామేశ్వరముఖాలోకకల్పితశ్రీగణేశ్వరాయై నమః

లలితోపాఖ్యానం క్రమానికి, లలితాసహస్రనామ క్రమానికి కించిత్ భేదాలున్నాయి. ఆ భేదాలు క్రమభేదములో తప్ప వేరే కాదు. ఇలాంటి క్రమాలు ఉపాసనలో చూడరాదు. ఇక్కడొక ప్రత్యేకమైన శక్తిని చూపిస్తున్నారు. ఇది ఒక సంపూర్ణమైన శక్తి. ఇక్కడ గణపతి యొక్క ఉత్పత్తిని చూపిస్తున్నారు. గణపతి ఎప్పుడు వచ్చినా శివశక్తుల ఏకరూపమే. ఇప్పుడు కూడా ఏకరూపంగా రావాలి. వారు నిజానికి ఆయన్ని పట్టుకు రాలేదు. ఎవరు యుద్ధానికి వెళ్ళినా గణపతి యొక్క సహాయం లేనిదే జరుగదు. త్రిపురాసురసంహారంలో శివునికి కూడా గణేశుని సహాయం కావలసి వచ్చింది. భండాసుర సంహార సమయంలో అమ్మవారికి కావలసి వచ్చింది. కావలసి వచ్చినప్పుడు వీరు వెళ్ళనక్కర్లేదు. అనుకుంటే వీరి నుండే వస్తాడు. ఎలా వచ్చాడంటే.. **'కామేశ్వరముఖాలోకకల్పితశ్రీగణేశ్వరా – మహాగణేశనిర్భిన్నవిఘ్న యంత్రప్రహర్షితా'** ఈ రెండు నామాలు ఒక చక్కటి గుంపు. ఇందులో గణపతి ఉపాసన, ఉపాసనాఫలం రెండూ చెప్తున్నారు.

కల్పించుట అంటే సృష్టించుట అని అర్థం. కల్పన అంటే లేనిది చెయ్యడం కాదు. కలిగించే సమర్థతకి కల్పన అని పేరు. ఆవిడ సమర్థవంతముగా కల్పించింది. 'శ్రీగణేశ్వరా' అన్నప్పుడే 'శ్రీవిద్యాగణపతి'. ఈ 'శ్రీ' అయిన అమ్మవారి తేజస్సే

ఆయన. కామేశ్వరుని ముఖాన్ని అమ్మవారు చూడగానే గణపతి వచ్చాడు.

ఈ ఘట్టం అర్థం కావాలంటే లలితోపాఖ్యానంలోనికి ప్రవేశించాలి. ఈ కథ ప్రకారం అయితే విశుక్రుడు వెళ్ళిపోయాడు. కానీ వెళ్ళక ముందు ఈ సంఘటన జరిగింది. విశుక్రుడు, 'పరాక్రమం, ప్రతాపం చూపిస్తూ వీళ్ళని కొట్టడం మహాకష్టం, ఏదైనా క్షుద్ర ప్రయోగం చేస్తే బాగుంటుంది' అనుకుని 'జయవిఘ్నశిల' అని ఒక యంత్రాన్ని తయారుచేశాడు.

ఆ జయవిఘ్నశిలా యంత్రంలో ఎనిమిది భయంకరమైన శక్తులని ఆవాహన చేశాడు. అవి– అలస, కృపణ, దీన, నిద్ర, తంద్ర, ప్రమీలిక, క్లీబ, నిరహంకార. ఇవి నిజానికి మనలోనే ఉన్నాయి. జయానికి విఘ్నం కలిగించే అసురశక్తులు మొత్తం ఎనిమిది మంది ఉన్నారు.

వీరు ఆధ్యాత్మిక జయానికైనా, భౌతిక జయానికైనా విఘ్నాలే. వీరిని జయిస్తేనే పిల్లలైనా, పెద్దలైనా బాగుపడతారు. గణపతి ఆరాధన పిల్లలకి చిన్ననాటి నుండి నేర్పితే అన్ని విఘ్నాల నుండి బయటపడతారు. ఇప్పుడు విశుక్రుడు జయవిఘ్నశిల యంత్రంలో పెట్టిన ఎనిమిది శక్తులను చూస్తే –

అలస – అంటే సోమరితనం

కృపణ – ఇలాంటి భావాలు వస్తే ఎంత మహావీరుడైనా చతికిలపడిపోతాడు. అర్జునుడు గీతలో **'కార్పణ్యదోషోపహతస్వభావః'** అన్నాడు. ఈ కార్పణ్యదోషం అంటే ఏమిటో కృపణ అన్నా అదే. కృపణ అనగా ఒకానొక బేలతనం.

దీన – దిగులు. అసహాయస్థితి. ప్రతిదానికి దిగులుపడిపోతూ, భయపడుతూ ఉన్నవాడు ఏదీ సాధించలేడు. ఇదొక విఘ్నం.

నిద్రా – ఏ సాధనకైనా ఇది ప్రమాదకారే. ఇవన్నీ కూడా రాజస, తామస శక్తులు.

తంద్ర – అనగా కునికిపాటు.

ప్రమీలిక – ముడుచుకుపోవడం. ప్రతిదానికి కుంచించుకుపోవడం. పదిమంది ముందు మాట్లాడలేకపోవడం. వెనక్కు తగ్గడం ప్రయోజనకారి కాదు.

క్లీబ – క్లీబ అనగా కర్తవ్య విమూఢత. ఇది అర్థం కావాలంటే భగవద్గీతలోని **'క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే'** పరిశీలించాలి. అసలు కర్తవ్యం నుండి వెనక్కి లాగేసే శక్తులలో క్లీబత్వం ఒకటి. తన సమర్థతే తనకు తెలియకుండా వెనకడుగు వేసే లక్షణం ఏదైతే ఉందో దానినే కర్తవ్యవిమూఢత అంటారు. తన సమర్థతనే తాను విస్మరించుట అనేది క్లీబత్వం.

నిరహంకార – అంటే నేనేం చెయ్యగలను? నావల్ల ఏమవుతుంది? అనే ఆత్మవిశ్వాసరాహిత్యం. ఇలా మొత్తం అష్ట దుష్టశక్తులు కేవలం విశుక్రుడు ప్రయోగించిన యంత్రంలో మాత్రమే లేరు.. మనలో కూడా ఉన్నారు. ఒకొక్కప్పుడు మన చేతుల్లో ఉండవు. ఎక్కడి నుండో వస్తాయి.

మన లోపలే ఎంత లోతైన అసురత్వం ఉందో తెలియదు. సృష్టిలో మహాసముద్రాలు కన్నా లోతు మన హృదయం. ఇందులో వీరంతా దాగి ఉన్నారు. ఈ అష్టవిధ దుష్టశక్తులను ఆవాహన చేశాడు విశుక్రుడు. మంచి శక్తులని ఉపాసన చేస్తే మహోపాసన. దుష్టశక్తులని ఉపాసన చేస్తే క్షుద్రోపాసన. ఈ క్షుద్రోపాసకులు వీటిని పట్టుకొని ఇంకొకరిపై ప్రయోగిస్తారు. ఈ దుష్టశక్తులని ఆవాహన చేసి ఆ యంత్రంలో ఎనిమిది దిక్కుల్లో ఎనిమిది త్రిశూలాలు పెట్టాడు. ఎనిమిది త్రిశూలాలలో ఎనిమిది శక్తులను ఆవాహన చేసి, బలులు ఇచ్చి జయవిఘ్నశిలా యంత్రాన్ని సిద్ధంచేసి వేద్దామని వెళ్ళాడు. వెళ్ళేటప్పటికి జ్వాలామాలినికాక్షిప్త వహ్నిప్రాకారంలో జ్వాలలు వెదజల్లుతూ ఉంటే లోపలికి వెళ్ళలేకపోయాడు. ఎలా అని ఆలోచించి ఆకాశమార్గంలోకి ఎగిరి అక్కడి నుండి విసరి వేశాడు. ఎక్కడ పడిందో ఎవరికీ తెలియదు కానీ దాని యొక్క ప్రభావం చేత ఒక్కసారిగా శక్తిసేనలన్నీ నిర్వీర్యం అయిపోయాయి. అంతవరకు ఉత్సాహంగా ఉన్నవారు వెనకబడిపోయారు. దాని ప్రభావం అందరిపై పడిందిగాని ఎవరికి కూడా ఎందువల్ల అలా జరిగిందో తెలియలేదు.

కొన్ని దుష్టయంత్రాలు, మంచి యంత్రాలు ఇళ్ళల్లో పెట్టుకుంటే ఇంట్లో తెలియకుండానే మార్పులు వస్తాయి. దుష్టయంత్రాలకి దుష్ప్రభావాలు, మంచి

యంత్రాలకి మంచి ప్రభావాలు. ఎందువల్ల వచ్చాయో వారికి తెలియకపోవచ్చు. యంత్రం చూస్తే చాలా చిన్నదిగా ఉంటుంది. కానీ దాని శక్తి చాలా ఉంటుంది. పడేసినవాడు ఎక్కడ పడేశాడో తెలియదు కానీ దుష్టశక్తి మాత్రం అందరి మీద పడింది. ప్రతివారు వేదాంతం మాట్లాడడం మొదలుపెట్టారు. చేతకానప్పుడు వచ్చే కబుర్లలో అది ఒకటి. "మనం ఎందుకు యుద్ధం చేస్తున్నాము? వారు, మనం కలిసి కొట్టుకుంటున్నాము. ఈ కొట్టుకోవడం వల్ల ఎవరికి ప్రయోజనం? వారికే కాదు మనకి కూడా దెబ్బలు తగులుతాయి. దేవతలు హాయిగా అక్కడ కూర్చున్నారు. యుద్ధం మనది. విజయం దేవతలది. ఇంత యుద్ధం చేస్తే లలితాదేవి విజయం సాధించింది అంటారు కానీ మనం విజయం సాధించాం అంటారా? కనుక ప్రతాపం అంతా మనది. ఫలితం ఆవిడదా?"

ఇలాంటి ఆలోచనలు వస్తే ఇది ఏదో విఘ్నశిలాయంత్రం, రాక్షసశక్తులు ప్రవేశించాయి అని అనుకోవాలి. నిజానికి ఇదంతా వీరి శక్తా! ఇది అమ్మవారి శక్తి. అమ్మవారి శక్తితో పనిచేస్తూ ఇది తమ శక్తి అనే అజ్ఞానం వచ్చింది. వీరేదో అమ్మవారికి ఉపకారం చేస్తున్నట్లు భావిస్తున్నారు. ఆ అజ్ఞానము ఈ యంత్రము వల్ల వచ్చింది. ఆఖరుకి "ఇవన్నీ అనవసరం, మనకి సుఖమైనది సృష్టిలో ఒకటే 'నిద్రా ఏకా సుఖావహః' నిద్ర అనేది చాలా బాగుంటుంది. నిద్రపోవడమే చాలా మంచిది" అని వీరు అనుకుంటున్నారు.

యంత్రం యొక్క ప్రభావం బహిరావరణ సైన్యంపై తప్ప అంతరావరణంలో ఉన్న శ్యామల, వారాహీ, బాలా వీరెవరిపై ఇది పనిచేయలేదు. వారు కూడా ఈ యంత్రం ఎక్కడుందో కనుక్కోలేదు. ఈ లోపల కుటిలాక్షుడు అనే రాక్షసుడు సైన్యాన్ని అంతటిని వీరి వైపు పంపడంతో శ్యామలా, వారాహీ వారి హఠాత్తు దాడిని చూసి సైన్యమును లేపుతున్నారు. "లెండి, లెండి యుద్ధం చెయ్యాలి" అంటే వారు, "ఎందుకు యుద్ధం చెయ్యా"లని అడిగారు. "ఇదేమిటి ఇంతవరకు ఉత్సాహంగా ఉన్నవారు ఇప్పుడేంటి ఈ ప్రశ్న? చెప్తున్నది ఎవరనుకుంటున్నారు? శ్యామలా, వారాహీ, లలితాదేవి" అనగానే, విఘ్నశిలాయంత్ర ప్రభావితులైన సైనికులు, "ఎవరు శ్యామలా?

ఎవరు వారాహీ? ఎవరు లలితా? ఎవరికి ఎవరు?" అని వేదాంతము మాట్లాడారు. బద్ధకస్తులు, దుర్మార్గులు వేదాంతము మాట్లాడతారు. యోగులు కూడా మాట్లాడతారు. ఇద్దరికి తేడా చాలా ఉంటుంది. మూగవాడు మౌనంగా ఉంటాడు. బ్రహ్మజ్ఞాని మౌనంగానే ఉంటారు. ఇద్దరిది ఒకటే అనుకోవడం ఎలాంటిదో ఇదీ అలాంటిదే.

ఆధ్యాత్మికవాదం అంటే పలాయన వాదమో, నీరస వాదమో కాదు. చైతన్యవాదం అని స్వామి వివేకానంద అంటారు. ఉత్తేజం, ఉత్సాహం, చైతన్యం – ఇవే అమ్మవారి శక్తులు. ఇవే మనలో శక్తిసేనలు. వాటిని మనం విజృంభింపజేసి అజ్ఞానశక్తులను సంహరింపజేయడానికి వాడాలి. సాధకుడు ఎప్పుడూ చతికిలపడకూడదు. ఉత్సాహంతో పురోగమించాలి. జీవన సమరంలో కొన్ని సంఘటనలు మనకి కొంత నిరుత్సాహం, నీరసం తెప్పిస్తాయి. అప్పుడు ఈ గణపతిని తలచుకోవాలి.

మొత్తానికి శ్యామలా, వారాహీ దేవతలకి ఇది పెద్ద సమస్యగా మారింది. ఏ విధంగా వీరందరికి ఉత్తేజం కలిగించడం? ఇటు వస్తున్న అసురసేనల్ని ఎలా నియంత్రించడం? అనుకొని తిన్నగా వెళ్ళి తమవల్ల కావడం లేదని లలితాంబకు విన్నపం చేసుకున్నారు. "అమ్మా! ఏం జరిగిందో తెలియదుగాని ఇంతవరకు ఉత్సాహంగా ఉన్న మన సేనలన్నీ ఒక్కసారి నిరుత్సాహపడిపోయారు. నిద్ర ఆవహించింది" అనగానే అమ్మ లలితాంబ "ఏం జరిగిందో నాకు తెలుసు. మీరు నిశ్చింతగా వెళ్ళండి" అని చెప్పి వాళ్ళాయన వైపు చూసింది 'ఏం చేద్దామని?' చూడగానే ఆయన నవ్వారు. అది గొప్ప స్పందన. లలితాదేవి అంటేనే స్పందన శక్తి. స్పందన అనగా మృదుత్వం, లాలిత్యం, సుకుమారం. చురుకుదనం అమ్మవారు. చైతన్యం యొక్క లక్షణమే చురుకుదనం. జడత్వం యొక్క లక్షణమే బండతనం. వాడే భండాసురుడు. అమ్మవారు శివుని చూశారు. చూడగానే ఆయన నవ్వారు. ఆయన నవ్వగానే మళ్ళీ ఈవిడ నవ్వింది. అంటే స్పందన, ప్రతిస్పందన కలిశాయి. ఆవిడ మందహాసంలో అయ్యవారి ప్రేమకి తిరిగి ప్రతిస్పందించిన హాసం కూడా కలిసింది కనుక ఇప్పుడు అమ్మ చిరునవ్వులో అయ్య ప్రేమ, అమ్మ ప్రేమ రెండూ కలిసిపోయాయి.

ఆ నవ్వులోంచి పుట్టుకొచ్చాడు 'మహాగణపతి'. నవ్వు నుండి వచ్చాడు కనుకనే గణపతి ఆనందస్వరూపుడు. **'ఆనందాత్మాగణేశోఽయం'** అని శాస్త్రవాక్యం. ఈయనకి నైవేద్యాలు మోదకాలు. మోదమంటే ఆనందమే. ఆయన ఆహారమే ఆనందం. ఆయన ప్రసాదం ఆనందం. ఆయనకు పెట్టిన మోదకాలు తిరిగి మనకేగా. ఆయనను తలచుకుంటే బాధలన్నీ తొలగిపోతాయి. ఎందుకంటే ఆయన అమ్మవారి నవ్వు నుండి పుట్టిన మహాతేజస్సు. ఆ వచ్చిన బలుపు తేజస్సు ('తుందిలమ్ మహః') ఎంత గొప్పగా ఉన్నదంటే –

బీజాపూర గదేక్షు కార్ముక ఋజా చక్రాబ్జ పాశోత్పల
వ్రీహ్యగ్ర స్వవిషాణ రత్న కలశప్రోద్యత్కరాంభోరుహః
ధ్యేయో వల్లభయా సపద్మకరయా శ్లిష్టోజ్వలద్భూషయా
విశ్వోత్పత్తి విపత్తి సంస్థితికరో విఘ్నేశ ఇష్టార్థదః.

వారి ఉభయుల తేజస్సు కలబోసుకొని వచ్చాడు కనుక ప్రపంచాన్ని నడిపే ఐదు మిథునదేవతలు ఆయనలోనే ఉన్నారు. లక్ష్మీనారాయణులు, శివపార్వతులు, రతీకందర్పులు, మహీవరాహం, పుష్టి–పుష్టిపతి మొత్తం పదిమంది ప్రపంచాన్ని నడిపే దేవతలు. ఇందులోనే మొత్తం జగన్నిర్వహణ శక్తులన్నీ ఉన్నాయి. కనుకనే పది చేతుల్లో పది రకాల ఆయుధాలు పట్టుకొని ఉన్నాడు. కుడివైపంతా పురుషదేవతలు, ఎడమవైపంతా స్త్రీదేవతల సమాహార రూపంతో ఉంటూ మధ్యలో తొండంతో రత్నకలశం పట్టుకున్నాడు. అది కేవలం మోక్షప్రదాయకమైన శక్తిని చూపిస్తున్న అద్భుతరూపం. చంద్రలలాటంతో ప్రకాశిస్తున్నాడు.

వందే గజేంద్రవదనం వామాంకారూఢవల్లభాశ్లిష్టం
కుంకుమపరాగశోణం కువలయనీజారకోరకాపీడమ్

అంటారు ఆర్యాద్విశతిలో దూర్వాసమహర్షి. అలా ఉన్న ఆ గణపతికి నమస్కారం. ఆయన తిన్నగా వచ్చి, "అమ్మా ఏం చేయాలమ్మా" అంటే "ఏం చెయ్యాలో నేను చెప్పాలా? చూసుకో ఏదో జరిగిందిట" అన్నది లలితాంబ. "సరే" అని ఆయన బయలుదేరాడు. ఎక్కడికి వెళ్తున్నాడో అని శ్యామలా, వారాహీ అందరూ చూస్తున్నారు.

విశుక్రుడు ఆ యంత్రం ఎక్కడ పెట్టాడో ఈయన ఒక్కడే తెలుసుకోగలిగాడు. ఇన్ని విఘ్నాలకి మూలమేంటో మనకి కూడా తెలియదు. ఆయనను ఒక్కడ్ని పట్టుకుంటే ఆయన తెలుసుకుని, అన్ని అవరోధాలు తీసిపారేస్తాడు. ఆయన అవరోధాలు తీస్తే మనకి ఇంకేం కావాలి? అమ్మ యొక్క అసలు విజయానికి గణపతి ప్రధానం కనుకనే అసలు విజయానికి ముందే ఈ నామాలు పెట్టారు. దీనికి అత్యంత ప్రధాన స్థానం ఉంది. మహాగణపతి ఉపాసన పరిపూర్ణ ఉపాసన. దేనికదే పరిపూర్ణం. గణపతి ఉపాసన, బాలా ఉపాసన రెండూ పూర్ణోపాసనలే.

అలాంటి మహాగణపతి తిన్నగా వెళ్ళి ఆ యంత్రాన్ని తన తొండంతో తీసి తన దంతంతో ఒక్కటి కొట్టగానే, అంత శిల కూడా పిండి అయిపోయింది. ఎప్పుడైతే శిల అంతా చూర్ణమైపోయిందో, ఈ శక్తి సేనలకి ఉత్సాహం వచ్చి లేచారు. "ఏంటి ఇంతసేపు ఏదో అనిపించింది. ఎందుకనిపించిందో తెలీదు. ఇప్పుడు ఉత్సాహంగా ఉందిలే" అనుకున్నారు. వీరందరూ ఎప్పుడైతే లేచారో ఇంక విశుక్రునికి భయం పట్టుకుంది. ఇంక లాభం లేదని, "ఏనుగుముఖం కదా ఈయనది. నా దగ్గర ఏనుగు ముఖం రాక్షసులు చాలా ఉన్నారులే" అనుకున్నాడు. గణేశుని గజవదనం ఓంకారవదనం. రాక్షస గజవదనం, మదగజవదనం. మొత్తం సేనలన్నింటితోనూ వస్తున్నాడు గజాసురుడు. వీరందరిని చూశాడు గణపతి. శక్తిసేనలు బయలుదేరుతున్నాయి. అప్పుడు గణపతి "మీరు ఉండండి. మీతో కాదిది. వీరి పని నేను చూస్తా"నని వెళ్ళాడు.

గజాసురుడు భయంకరమైన రాక్షసుడు. వాని చుట్టూ అనేకమంది అసురసేనలు. ఇదంతా ఒక్కడిగా ఉన్న గణపతి ఎదురుగా చూసి, ఒక్కసారి సంకల్పం చేసుకొని నవ్వుకున్నాడు. ఆయన రోమకూపాల నుండి ఏనుగు వదనంతో సప్తకోటి హేరంబులు (ఏడు కోట్ల గణపతులు) రకరకాల రూపాలతో వచ్చారు. ఒకొక్కరు ఒకొక్క రకమైన వాహనాలు. దీని అర్థం '**సప్తకోటిమహామంత్రమంత్రితావయవద్యుతిః**' (గణేశ సహస్రం) - గణపతి ఓంకార రూపుడు, వేదస్వరూపుడు. వేదమంత్రముల సంఖ్య ఏడుకోట్లు. ఏడుకోట్లు వేదమంత్రములు రూపుకడితే గణపతి.

ఆ వచ్చిన మొత్తం ఏడుకోట్ల మంత్ర రూపాలు గణపతి రూపాలే. గణపతి అంటే మూర్తీభవించిన వేదం. ఎప్పుడైతే ఇన్ని రూపాలు వచ్చాయో మొత్తం గజాసురుని సేనలన్నీ సంహరింపబడ్డాయి. గణపతి అవలీలగా గజాసురుని సంహరించాడు. తిన్నగా అమ్మవారి దగ్గరకు వెళ్ళాడు "అమ్మా ఇంకేం చెయ్యాలి" అని. "చేసింది చాలు నాయనా. చాలా అద్భుతమైన పనిచేశావు" అని అమ్మవారు సంతోషించింది.

పుర్యష్టకమే 'గణం' (జ్ఞానేంద్రియ పంచకం, కర్మేంద్రియ పంచకం, ప్రాణ పంచకం, అంతఃకరణ చతుష్టయం, భూత పంచకం, కామం, కర్మం, అజ్ఞానం). వీటితో 'అహంతాభిమానం' (తాదాత్మ్యం) కలిగినవాడు జీవుడు.

కామేశ్వరుడు అనగా నిర్గుణుడైన శివుడు. అతని ముఖాలోకనమనగా -నిర్గుణబ్రహ్మానుభవం. అది లభించగానే, పుర్యష్టక (గణం) తాదాత్మ్యం తొలగిపోతుంది. పుర్యష్టకం తాను కాననీ, దానికి అధీశ్వరుడననే జ్ఞానం లభిస్తుంది. అనగా జీవభావనాశనం.

'సదాశివా(బ్రహ్మా)నుభవం వల్ల పుర్యష్టకధీశ్వరత్వము కలిగించునది' - అనే అర్థాన్ని భాస్కరరాయలు వివరించారు.

78. మహాగణేశనిర్భిన్నవిఘ్నయంత్రప్రహర్షితా

- శ్రీ మహాగణేశనిర్భిన్నవిఘ్నయంత్రప్రహర్షితాయై నమః

ఈయన్నే మహాగణపతి అంటారు. గణపతికి ఏ పేరు వాడితే దానికి తగ్గ అర్థాన్ని తీసుకోవాలి. వల్లభతో కలిసిన శ్రీవిద్యాగణపతి మహాగణపతి అని చెప్పబడతాడు. మహాగణేశ్వరుడు విఘ్నయంత్రమును 'నిర్భిన్న' అంటే భేదించిన తర్వాత 'ప్రహర్షిత'- అంటే సంతోషించింది.

ఇంతవరకూ 'ప్రహర్షితా' అనే శబ్దం రాలేదు. నందిత, తోషితా, హర్షితా వచ్చాయి. కానీ 'ప్ర' అనే ఉపసర్గ ఇక్కడే వచ్చింది. ప్ర-అనగా ప్రకృష్టం. గొప్పగా సంతోషించింది. మిగిలినవి హర్షితా, నందితా మాత్రమే. తనయుడు చేసిన ఘనకార్యము తల్లికి చాలా ఆనందం కలిగించింది. గణపతిని ప్రక్కన పెట్టుకుంటే

అమ్మవారు సంతోషిస్తారు. గణపతి ఉపాసనకి రెండు నామాలు ఇచ్చారు. కథ ప్రకారం ఎలా ఉన్నా ఉపాసనాపరంగా మాత్రం గణపతి ఉపాసనతో శ్రీవిద్య పరిపూర్ణమైన స్థితికి వెళ్తుంది. అందుకే ముందుగా దీనికి సంబంధించిన ఉపాసనే ఇస్తారు. గణపతి అంటే ఏదో మొదట పూజించి ప్రక్కన పెట్టవలసినవాడు కాదు. మొదట ఈయన్ని పూజిస్తే చివర వరకూ తోడు ఉండి నడిపిస్తాడు. గణపతే ఆది, గణపతే అంతం. ఆద్యంతములన్నీ గణపతే. ఎంత చెట్టు మనం నాటినా, ఆ చెట్టుకొన వరకు శక్తి ఇవ్వాలంటే ఆ మూలంలో ఉన్న కుదురు(ఆలవాలము) ప్రధానం. అదేవిధంగా ఎంత సాధన చేసినా అది ఫలదశ వరకు రావాలి అంటే ఆలవాలమూ, కుదురు అయిన దేవుడు గణపతి. గణపతి అంటే కుదురుదేవుడు. ఆయనే అన్నీ కుదుర్చుతాడు. కుదురు కుదరకపోతే గణపతిని పట్టుకుంటే కుదురుగా ఉంటారు. జీవుని అజ్ఞాన నాశనమే విఘ్నయంత్ర నాశనం. పుర్యష్టక తాదాత్మ్యం తొలగిన జ్ఞానమే (గణేశుడు) అవిద్య అనబడే విఘ్నయంత్రాన్ని నాశనం చేయగలదు – అని తాత్త్వికార్థం గ్రహించవచ్చు.

79. భండాసురేంద్రనిర్ముక్తశస్త్రప్రత్యస్త్రవర్షిణీ

– శ్రీ భండాసురేంద్రనిర్ముక్తశస్త్రప్రత్యస్త్రవర్షిణ్యై నమః

యుద్ధంలో ప్రధానమైన వారు విశుక్రుడు, విషంగుడు. అందరూ దెబ్బతిన్నారు. గణపతి వచ్చి మొత్తం మార్గం సుగమం చేశాడు. ఇప్పుడు అమ్మవారు యుద్ధానికి బయలుదేరారు. ఇక్కడ మహారాణి ఉన్నది. అక్కడ రాక్షసుల రాజు ఉన్నాడు. ఇప్పుడు యుద్ధం ప్రారంభమవుతోంది. భండాసురుడు రకరకాల శస్త్రములు వేస్తూ ఉంటే అమ్మవారు వాటికి ప్రత్యస్త్రములు వేస్తున్నారు.

ఇక్కడ కథాపరంగా మాత్రమే కాకుండా ఇందులో ఉన్న అద్భుతాలని పరిశీలించినట్లైతే....'భండాసురేంద్ర'–భండాసురుడు రాక్షసులలో గొప్పవాడు. భండ అంటే మొద్దుబారుడుతనం. బ్రహ్మ సృష్టిలో ఇంత మొద్దుబారుడుతనం ఎక్కడా చూడలేదని 'భండితి'. 'భండితి' అంటే ఛీ ఛీ అని అన్నాడు. ఇలాంటి చీదరించుకునే

గుణాలన్నీ ఒక దగ్గర కూడబెడితే అతడి పేరు 'భండాసురుడు'.

ఏవైతే జుగుప్సాకరమైన దుర్గుణాలు ఉంటాయో అటువంటి దుర్గుణాలరాశి భండాసురుడు. వానిలో లేని దుర్గుణం లేదు. అవే రకరకాల సేనలుగా బయటకు వాని నుండి వచ్చాయి.

ఇక అమ్మవారు లలిత–మూర్తీభవించిన లాలిత్యం. 'నిర్ముక్త శస్త్ర' – భండాసురుడు శస్త్రాలు ప్రయోగించాడు. దానికి సమాధానంగా అమ్మవారు అస్త్రాలు వేశారు. అవి ప్రత్యస్త్రములు – ప్రతిగా వేసిన అస్త్రములు. వర్షముగా వేశారు అమ్మవారు. శస్త్ర, అస్త్ర అని రెండు శబ్దములు వేయడంలో **'ధృత్వా ప్రహరణం శస్త్రం ముక్త్వాత్ అస్త్రమితీరితం'** అని నిర్వచనం. చేత్తో పట్టుకొని కొట్టేది శస్త్రం. అది మంత్రరహితం. మంత్రముతో ప్రయోగించేది అస్త్రం. నిజానికి శస్త్రములో పశుబలం ఉంటుంది. అస్త్రంలో మంత్రబలం ఉంటుంది. భండాసురుడు వేసిన వన్నీ శస్త్రములే. వాటిలో దైవశక్తి, మంత్రశక్తి లేవు. శస్త్రమనగా భౌతికం. అస్త్రం అనగా దివ్యం. భౌతికమైనవే భండాసురుడు వేస్తాడు. దివ్యమైన అస్త్రములు అమ్మవారు వేశారు.

మనం అనుభవించే కష్టాలు అన్నీ భౌతికమే. కానీ సమాధానం మాత్రం దైవికమే కావాలి.

భండాసురుడు ప్రయోగించిన శస్త్రాలు – అమ్మవారి ప్రత్యస్త్రాలు

మొదట భండాసురుడు **'అంధతామిస్రము'** అనే శస్త్రం (ఒక విధమైన చీకటి) వేస్తే అమ్మవారు **'మహాతరణి'** అస్త్రం ప్రయోగించింది. అనగా సూర్యమంత్రాన్ని అమ్మవారు ప్రయోగించారు. ఇక్కడ గమనించవలసినది లలితా మంత్రమంటే ఏదో ఒక్క మంత్రమని కాదు. అనేక మంత్రాల సమాహారమూర్తి అమ్మవారు.

శ్రీవిద్యలో సూర్య, శివ, శక్తి మొదలైన మంత్రాలు ఉంటాయి. అన్నీ అమ్మరూపాలే.

అంధతామిస్రం అంటే గుడ్డితనము. **'తామసాస్త్రము'** అంటే చీకటి. చీకటి అనగా బయట వ్యాపించేది. గుడ్డితనం అంటే మన లోపల ఉన్న లక్షణం. రెండూ ప్రమాదాలే. అమ్మవారు సూర్యునికి సంబంధించిన రెండు అస్త్రములను వేశారు అవి తరణీ అస్త్రం, చక్షుష్మతి అస్త్రం. సూర్యాస్త్రం 'తరణి' వల్ల బయట అంధకారం పోతుంది. 'చక్షుష్మతి' అస్త్రం వల్ల గుడ్డితనం పోతుంది. భౌతికంగా చూసినప్పటికీ సూర్యోపాసన వల్ల మనకి దృష్టి పెరుగుతుంది. సూర్యమంత్ర ప్రస్తావన వివరిస్తున్నారు.

తరువాత భండాసురుడు ప్రయోగించినది **'పాషండ శస్త్రం'** అనగా వేద విరుద్ధమైనది (అధర్మం). వేద విరుద్ధమైన పద్ధతులన్నీ అధర్మములని చెప్పబడతాయి. దీనికి ప్రతిగా అమ్మవారు వేదమాత అయిన **'గాయత్రీ అస్త్రం'** వేశారు. ఇక్కడ అస్త్రం అనగా మంత్రమే. భండాసురుడు **'శక్తినాశన శస్త్రం'** వేశాడు. ప్రతిగా అమ్మవారు **'విశ్వావసు'** అనే అస్త్రాన్ని ప్రయోగించారు. భండాసురుడు **'అంతక శస్త్రం'** వేశాడు. అమ్మవారు ప్రతిగా **'మృత్యుంజయాస్త్రం'** '(మృత్యుంజయ మంత్రం)' వేసింది. భండాసురుడు **'సర్వస్మృతినాశ శస్త్రం'** వేశాడు. అమ్మవారు దానికి ప్రతిగా **'ధారణాస్త్రం'** వేసింది. సర్వస్మృతినాశ శస్త్రము అనగా జ్ఞాపకశక్తి నశింపజేసేది.

'భయశస్త్రం' అనేది భండాసురుడు ప్రయోగించాడు. అప్పుడు అమ్మవారు **'ఇంద్రాస్త్రం'** అనేది ప్రయోగించారు. ఇది **అభయంకర ఇంద్రమంత్రం**. మంత్రాలు ఇక్కడ చెప్పేవి కాదు కనుక పేర్లు స్మరిస్తే చాలు ఈ మంత్రములు తప్పకుండా అనుగ్రహిస్తాయి.

భండాసురుడు **'మహారోగ శస్త్రం'** అనే దాన్ని ప్రయోగించాడు. అనేక రోగాలు రూపాలు ధరించి వచ్చాయి. ఇన్ని రోగాలు పోగొట్టడానికి అమ్మవారు **'నామత్రయాస్త్రం'** ప్రయోగించారు. ఈ నామత్రయాస్త్రం **'అచ్యుత అనంత గోవింద'** నిరంతరం స్మరిస్తే తప్పకుండా ఫలితం వస్తుంది. అటు తరువాత భండాసురుడు **'ఆయుర్నాశ శస్త్రం'** వేస్తే, అమ్మవారు **'కాలసంకర్షణి'** మహాస్త్రం వేసింది. భండాసురుడు **'సర్వాసుర శస్త్రం'** (అన్ని అసుర శక్తులను) ప్రయోగించాడు.

అందులోంచి శుంభ, నిశుంభ, చండ, ముండ, రక్తబీజ, మహిషాసుర,

మధుకైటభ సేనలు అన్నీ కలిసి వచ్చాయి. వీటన్నింటిపై అమ్మవారు **'దుర్గాస్త్రము'** అనే అద్భుతమైన అస్త్రమును ప్రయోగించారు. నవార్ణమంత్రం అంతా ఇక్కడ చూపిస్తున్నారు. దుర్గాది విద్యలు లలితలోనే ఉన్నాయని దీని భావం. భండాసురుడు **'మూక శస్త్రము'**ను ప్రయోగించాడు. అప్పుడు అమ్మవారు **'వాగ్వాదినీ అస్త్రం'** వేశారు. వాగ్వాదినీ దేవత శ్యామలా మంత్రదేవతలలో ఒకరు. ఈ విధంగా అమ్మవారు భండాసురుడు ప్రయోగించిన శస్త్రములకు ప్రతిగా అస్త్రములు వేశారు.

అటుపై భండాసురుడు ఇదివరకు రాక్షసులైన సోమకాసురుడు మొదలైన వారందరిని మొత్తం పదిమందిని ప్రయోగించాడు. అప్పుడు అమ్మవారు వీరికి ఏ శస్త్రములుతో పనిలేదు అని ఆవిడ చేతులు చూపించగానే ఆ వేళ్ళ గోళ్ళ నుండి పది అవతారాలు వచ్చాయి.

80. కరాంగులినఖోత్పన్ననారాయణదశాకృతిః

– శ్రీ కరాంగులినఖోత్పన్ననారాయణదశాకృత్యై నమః

ఈ నామంలో అన్వయలోపం వల్ల చాలా ప్రమాదాలు వస్తున్నాయి. ఒకాయన ఏమన్నారంటే దశావతారాలు పుట్టడానికి భాగవతానికి చాలా కథలు చెప్పారు. లలితాసహస్రంలో అయితే అన్నీ ఒకేసారి వచ్చాయి అని చెప్పారు. ఏమిటో ఈ పురాణాలు నమ్మలేం అన్నారు. ఆయనకు అన్వయం తెలియలేదు. ఇదంతా ఉపాసనా కథ. సాధారణ చారిత్రక కథ కాదు. దశావతారములు అంటే వరుసక్రమంలో చూడడం కాదు. దశావతార ఉపాసనావిద్య. దశావతారరూపుడైన నారాయణుడు ఇక్కడ చెప్పబడుతున్నాడు. నారాయణుని యొక్క శక్తి ప్రయోగింపబడుతున్నది. అన్ని మంత్రములు చెప్పుకున్నాం. ఇది నారాయణుని మంత్రం. నారాయణ మంత్రాలు అమ్మ చేతివేళ్ళ నుండి వచ్చాయి. నారాయణుడు అనగా స్థితి కారకుడు. స్థితి అంటే రక్షణ. ఎవరైనా కొట్టడానికి వచ్చినప్పుడు చేతిని ముందుగా అడ్డుపెడతారు. స్థితికారకత్వం, రక్షణ అనేది హస్తం ద్వారానే జరుగుతుంది. అమ్మవారి చేతుల్లోంచి వచ్చారంటే స్థితికారకుడైన నారాయణుడు అని ఇక్కడ అర్థం.

'కరాంగుళినఖోత్పన్న' – అనేది సామాన్యమైన విషయం కాదు. అద్భుతమైన ఉపాసనా విషయం. శాస్త్రంలో దశావతార ముద్రలు ఉన్నాయి. వాటితో దేవతలని ఆరాధన చేస్తారు. మనలో ఉన్న రాక్షసశక్తులను కొట్టాలంటే ఒక్కడు సరిపోడు. పది అవతారాలు కావాలి. దశావతార మంత్రశక్తులు నారాయణీ స్వరూపాలే.

మత్స్యావతారం :

అజ్ఞానం భయంకరంగా ముంచుకుపోయి మన లోపల జ్ఞానమనే దానిని (స్వాత్మస్మృతిని) తీసుకుపోయి, రజోగుణ తమోగుణ వికారాలతో కూడిన సోమకాసురుడు ఎక్కడ దాచి పెట్టాడో కూడా మనకి తెలియదు.

జ్ఞానాన్ని వెలికి తీయడానికి అజ్ఞానసంద్రాన అణగిపోయిన విద్యని "స్వామీ! నువ్వు ఒకసారి మత్స్యమవై వచ్చి వెలికి తీయవయ్యా" అని ప్రార్థన చెయ్యాలి.

కూర్మావతారం:

సాధన చేస్తూ ఉంటే ప్రధానంగా మనస్సనే మందరపర్వతం క్రుంగిపోతుంది, నిబ్బరం కోల్పోతుంది. తిరిగి దానిని నిలబెట్టడానికి కూర్మావతారం.

వరాహావతారం:

గతి తప్పిపోతున్న బుద్ధిని తిరిగి దాని కక్ష్యలో పెట్టాలి... అంటే వరాహస్వామి కావాలి.

నరసింహావతారం:

ఎంత సాధన చేస్తున్నా సద్వస్తువు ఉందా, లేదా, లేదేమో.. అనిపించే హిరణ్యకశిపుడనే వాడు మన లోపల ఉన్నాడు. సంశయం, సందేహం. వానిని చీల్చాలంటే నరసింహస్వామి రావాల్సిందే.

వామనావతారం:

ఎంత చెప్పినా అన్నీ నావే అని అహంకరించే వానికి 'నీదేం కాదురా అన్ని లోకాలు నావే' అని చెప్పి, ఆ తలలో ఉన్న అహంకారాన్ని అణచడానికి రావాల్సింది ఆ వామన త్రివిక్రమ అవతారం.

పరశురామావతారం:

రాజసమనేది అనేకమార్లు బయటకు వస్తూ ఉంటుంది. నన్ను మించిన వాడు లేడని... 'త్రిసప్తస్సమిధకృతాః' 'మూడు ఏడులు అంటే ఇరవైఒక్క మార్లు మొత్తం నీలో ఉన్న రాజసాన్ని నరికి పారేస్తా' అని పరశువు పట్టుకొని బయలుదేరిన బ్రహ్మతేజం రావాల్సిందే. ఆయనే పరశురామావతారం.

రామావతారం:

ఎంత కాదన్నా పది తలకాయలు... పది ఇంద్రియాలతో తగని కామంతో తహతహలాడిపోతున్న దశకంఠుని కొట్టాలి అంటే మూర్తీభవించిన ధర్మం రామచంద్రమూర్తియై రావాలి.

కృష్ణావతారం:

మన లోపల అనాహతనాదాన్ని పలికిస్తూ, గీతోపదేశం చేస్తూ, జ్ఞానాన్ని ప్రబోధిస్తూ తీసుకువెళ్ళడానికి ఆచార్యుడైన శ్రీకృష్ణపరమాత్మ రావాల్సిందే.

బలరామావతారం:

మనలో మోడై, బీడై మిగిలిపోయిన బ్రతుకు నేలలో జ్ఞానసస్యం పండించడానికి, హలధారియైన బలరామమూర్తి రావాల్సిందే. ఇక్కడ దశావతారాలలో బలరాముడినే చెప్పారు.

కల్క్యవతారం:

ఎంత చెప్పినా కలి ప్రభావం వల్ల అనేక రకాల మ్లేచ్ఛ భావాలు ఆక్రమించుకుంటూ ఉంటాయి. మనం బాగున్నా కలి ప్రభావం అలా ఉంటుంది. అప్పుడు ఆ నారాయణుని తేజస్సే కల్కియై రావాలి.

కనుక దశావతారములు మనకి కావలసినవి – మన కోసం రావలసినవి. దశావతారములు అమ్మకి భిన్నం కావు. అమ్మే నారాయణుడు, అమ్మే శివుడు. పది ఆకృతులైనా అవన్నీ నారాయణునివే. ఆ అవతారాలు మన కోసమే.

జాగ్రత్ స్వప్న సుషుప్తి తురీయ తురీయాతీతములనబడే అయిదు పురుష (జీవ) కృత్యములు; సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అనుగ్రహాలనే పరమేశ్వర కృత్యములను వేలికొనలతో (అవలీలగా) నిర్వహించే పరాశక్తి – అని మరో భావం.

81. మహాపాశుపతాస్త్రాగ్నినిర్దగ్ధాసురసైనికా
- శ్రీ మహాపాశుపతాస్త్రాగ్నినిర్దగ్ధాసురసైనికాయై నమః

భండాసురుని సైన్యాన్ని ఒక్కసారి పరిశీలించి "వీరందరిని ఒక్కసారి సంహరిస్తే సరిపోతుంద"ని అమ్మవారు అనుకుంది. ఇంతవరకు వాడు ప్రయోగిస్తున్న అసురలనందరిని సంహరించింది. ప్రత్యేకంగా తెచ్చుకొచ్చిన సైన్యం ఉన్నారు. చాలామంది బలమైన వారు. చివరి యుద్ధంలో బలమైన వారిని ఉంచుకుంటారు. రావణాసురునికి యుద్ధకాండలో మూలసైన్యం ఎలా ఉన్నారో, భండాసురునికి చుట్టూ అలా ఉన్నారు. మహాపాశుపతాస్త్రం యొక్క అగ్ని చేత అమ్మవారు అసురసేనలన్నింటిని దగ్ధం చేసింది. ఇంక భండాసురుడు ఒక్కడే మిగిలాడు. ఈ నామంలో పాశుపతమంత్రం ఉన్నది.

ఎప్పుడైనా ఒక సాధన చేసే ప్రయత్నం చెయ్యాలి. లలితాసహస్రనామాలు చదివితే ఒకసారి చదవవచ్చు. ఒక నామం తీసుకొని దానిని అష్టోత్తరశత (108) జపం కొంతకాలం చేసి, అది అయ్యాక మరొక నామం తీసుకొని అష్టోత్తరశత జపం చెయ్యాలి. ఎప్పటికి పూర్తవుతుందనేది వద్దు. ఇలా చేస్తే మనకు తెలియకుండానే అందులో ఉన్న మంత్రశక్తి అంతా లభిస్తుంది.

ఈ నామంలో మహాపాశుపతాస్త్రాగ్ని అనే శబ్దం వరకు ఒక బీజాక్షర సంపుటంలోనిది. అది బాహ్యంగా చెప్పరాదు. ఈ నామాన్ని భక్తిగా చేస్తే అది మనల్ని రక్షిస్తుంది. ఈ బీజాక్షరములను గురుముఖతః మహాపాశుపత మంత్రం చేసేవారు చేస్తారు. మొత్తం అసురసేనల్ని కొట్టిందంటే పాశుపతమంత్రం యొక్క గొప్పతనం అర్థమవుతుంది. పశుత్వాన్ని పోగొట్టేదే పాశుపతమంత్రం. పాశబద్ధులు పశువులు. పిపీలికాది బ్రహ్మపర్యంతం కాలానికి బద్ధులే. కాలబద్ధులైన వారందరూ కూడా గుణబద్ధులు, కర్మబద్ధులు, వాసనా బద్ధులు. ఇన్ని పాశాలతో చుట్టబడే పాశబద్ధుడు జీవుడు.

ఈ 'కాలం' మొదలుకొని పశువులు మొదలైనవారు అందరూ ఎవరి చేతిలో ఉన్నారో ఆయనే పశుపతి. పశువులు-పాశము-పతి ఈ జ్ఞానం బాగా రావాలి. ఈ

జ్ఞానము వచ్చి శరణు వేడితే పాశమును తొలగిస్తాడు. పశువు అంటేనే పాశము చేత బంధింపబడేవాడు కాబట్టి ఆ పాశమోచనం చేస్తే పశుశబ్దం పోతుంది.

జీవునికి–శివునికి తేడా ఏమిటంటే పాశము. పాశబద్ధుడు జీవుడు, పాశరహితుడు ఈశ్వరుడు. పాశము తీసినప్పుడే జీవునికి, శివునికి ఏకత్వము చెప్పవచ్చు. పతిని శరణు వేడితే పాశము తీస్తాడు. ఈ శరణు వేడడం ఉపాసన, భక్తి, విచారణ అనేవి అనేక రకాలు. వేదాంతపరంగా 'మహాపాశుపతాస్త్రాగ్ని' అంటే ఆత్మానాత్మ విచారణ. **జ్ఞానయోగంలో విచారణ ఉంటుంది. కర్మయోగంలో ధర్మము ఉంటుంది. ఉపాసనలో భావము ఉంటుంది.** కర్మ చేస్తున్నంత సేపు ధర్మం ఉండాలి. ఉపాసన చేస్తున్నంతసేపు భావన ఉండాలి. జ్ఞానమార్గంలో విచారణ ఉండాలి. విచారణ శీలమైన ప్రవృత్తిని జ్ఞానపరంగా పాశుపతము అంటారు. ప్రతి నామంలో జ్ఞాన, ధర్మ, ఉపాసనాపరంగా అర్థాన్ని గ్రహించాలి. జ్ఞానపరంగా ఆత్మానాత్మ విచారణ, ఉపాసనాపరంగా పాశుపత మంత్రము. అసుర సేనలన్నీ అమ్మవారిచే సంహరింప బడ్డాయి. ఇక భండాసురుడు ఒక్కడే మిగిలాడు. శూన్యక పట్టణం మిగిలింది.

82. కామేశ్వరాస్త్రనిర్దగ్ధసభండాసురశూన్యకా

– శ్రీ కామేశ్వరాస్త్రనిర్దగ్ధసభండాసురశూన్యకాయై నమః

అమ్మవారు కామేశ్వరాస్త్రము ప్రయోగించారు.

శూన్యక పట్టణములో ఉన్న స్త్రీలు ఎవరూ యుద్ధానికి రాలేదు. మగవారు ఎవరూ ఇంట్లో లేరు. వారందరిని పాశుపతాస్త్రముతో అమ్మవారు సంహరించారు. అమ్మ ప్రయోగించిన కామేశ్వరాస్త్రముతో భండాసురునితో పాటు అదే సమయంలో మొత్తం శూన్యక పట్టణములో ఉన్న స్త్రీలు, శిశువులు కూడా సంహరింపబడ్డారు. స్త్రీలని, పిల్లలని సంహరించవచ్చా అంటే వీరంతా రాక్షసులని మర్చిపోరాదు.

ఇక్కడ శిశువులు అంటే ఇంకా ఎదగకుండా బీజదశలో ఉన్న రాక్షసత్వం. స్త్రీలు అంటే తిరిగి ఉత్పత్తి చేయగలిగేవారు. ఈ జన్మలో ఉన్న అజ్ఞానాన్ని సంహరిస్తే లాభం లేదు. ఇంకా తరువాతి జన్మలకి కారణంగా ఉన్న కర్మ బీజములు, అజ్ఞాన

బీజములను కూడా సమూలంగా నశింపజేయాలి. సమూల కర్మక్షయం జరగాలి. అదే ఇక్కడ 'సభండాసురశూన్యకా'. శూన్యక పట్టణముతో సహా భండాసురుని నశింపజేసింది.

శూన్యము అంటే ఏమీ లేదు. మరి ఇంతసేపు ఉంది. పేరు పెట్టడంలోనే సంకేతవాదము. ఏమీ లేదు – అన్నీ ఉన్నట్లు కనిపిస్తాయి. అదే అవిద్య. అదే అజ్ఞానం. ఏమీ లేని దానిని ఉంది అనుకుని, ఆ ఉందనుకున్న దాని కోసం తాపత్రయపడుతూ, చాలా పెంచుకుపోయి, అసలు ఉన్న సత్యాన్ని మర్చిపోయాం. ఉన్న అమ్మని లేదనుకుంటున్నాం. లేని ప్రపంచాన్ని ఉందనుకుని పట్టుకున్నాం. ఇదే మిథ్య, ఇదే శూన్యకము. చెప్పినా అర్థం కాదు. ఎందుకంటే శూన్యం ఉంది అనే అలవాటు అయిపోయింది. అమ్మవారు కామేశ్వరాస్త్రము వేస్తే గాని తొలగదిది.

ఇదే అవిద్య యొక్క సమూల నాశనము. ఇంక మిగిలింది ఒక్కరే. శత్రువులందరూ పోయాక ఎవరు గెలుస్తారో వారే మిగులుతారు. మొత్తం భండాసురునితో శూన్యక పట్టణము పోయాక మిగిలిన అమ్మ 'ఏకా'. **'ఏకం అద్వితీయం బ్రహ్మ'**. ఇంతవరకు ఉన్న అనేకానేక భండాసురుని భావములన్నీ పోయాక మిగిలినది ఒక్కటే పరతత్త్వము.

ఇప్పుడు కామేశ్వరాస్త్రము గురించి చూస్తే, ఈ కామేశ్వరాస్త్రములోనే ఇంతవరకు చెప్పుకున్న గణపతి మంత్రములు, దశావతార మంత్రములు, బాలా మంత్రము, శ్యామలా మంత్రము, వారాహీమంత్రము వచ్చాయి. మనం చదివే ఈ నామములే మంత్ర స్వరూపాలు. శ్యామలా మంత్రము చెయ్యాలంటే 'మంత్రిణ్యంబా విరచిత విశుక్రవధతోషితా'. మహాషోడశీ మంత్రమే 'కామేశ్వరాస్త్రము'. కామేశ్వరాస్త్రమే బ్రహ్మవిద్య. కామేశ్వరుడు అనగా సాక్షాత్తు పరమాత్మ. పరమాత్మ విద్య/ఆత్మ తత్త్వము లభిస్తే మొత్తం అనాత్మలన్నీ నశించిపోతాయి. కనుక అనాత్మభావాల మూటయే 'సభండాసుర శూన్యకా'. ఆత్మవిద్య యొక్క ఘటన వల్ల జరిగిన విషయమిది. అమ్మవారే బ్రహ్మవిద్యాస్వరూపిణి.

ఎప్పుడైతే అసుర సంహారము జరిగిందో, దేవతల ఆనందము పట్టరానిది

అయ్యింది. అమ్మవారిని స్తోత్రిస్తూ కుసుమవృష్టి కురిపిస్తున్నారు.

83. బ్రహ్మోపేంద్రమహేంద్రాదిదేవసంస్తుతవైభవా
– శ్రీ బ్రహ్మోపేంద్రమహేంద్రాదిదేవసంస్తుతవైభవాయై నమః

'బ్రహ్మ–ఉపేంద్ర–మహేంద్ర–ఆది'–బ్రహ్మదేవుడు, విష్ణువు, మహేంద్రుడు మొదలైన వారందరూ అమ్మవారిని స్తుతించారు. ఇక్కడ పరిశీలిస్తే అమ్మవారు బయలుదేరడానికి ముందు 'దేవర్షిగణసంఘాతస్తూయమానాత్మవైభవా..'. మొత్తం యుద్ధానంతరం, విజయం సాధించాక 'బ్రహ్మోపేంద్రమహేంద్రాది దేవసంస్తుత వైభవా..' సాధకుడు ఎప్పుడైనా అమ్మ అనుగ్రహం కోసం ముందు స్తోత్రం చేస్తాడు. అనుగ్రహం లభించాక ఆనందంతో ఎలుగెత్తి స్తోత్రం చేస్తాడు. మొదటి స్తోత్రంలో ఆర్తి, చివరి స్తోత్రంలో ఆనందం ఉంటాయి. మొదటి స్తోత్రంలో, "అమ్మా! అసురసంహారం చేసి మమ్మల్ని కాపాడమ్మా" అన్నారు. ఇప్పుడు ఆనందంలో ఎలుగెత్తి స్తుతిస్తున్నారు. ఇప్పుడు ఆనందోత్సవం.

ఇక్కడితో అమ్మవారి యొక్క లీలావైభవము పూర్తి అయ్యింది. ఇక మంత్రవైభవ రహస్యాలలోకి ప్రవేశిస్తున్నాం.

84. హరనేత్రాగ్నిసందగ్ధకామసంజీవనౌషధిః
– శ్రీ హరనేత్రాగ్నిసందగ్ధకామసంజీవనౌషధ్యై నమః

ఇందులో రెండు మంత్రముల విశేషాలున్నాయి. మొదటిది 'హరనేత్రాగ్ని విద్య'. రెండవది 'కామసంజీవనౌషధీ విద్య'. హరనేత్రాగ్ని – బీజాక్షరములతో సహా ఇందులో చాలా ఉన్నాయి. నేత్ర అంటే 'ఇ' – అగ్నిలో 'ర' ఇవన్నీ రహస్యములు – ఇంతకు మించి చెప్పరాదు. 'హ', 'ర' మొదలైనవి. మొదటిది కామదహన విద్య, రెండవది కామసంజీవనీవిద్య. కామదహనం కావాలి. కామసంజీవము కావాలి అంటే అధర్మబద్ధమైన కామములు తొలగాలి. ధర్మబద్ధమైన కామం లోకనిర్వహణ కోసం ఉండాలి. అసలైన బ్రహ్మమును తెలుసుకోవాలనే తపన సిద్ధించాలి. అమ్మవారు

శివుడు కంటిమంటల్లో కాలిపోయిన మన్మథుని తిరిగి బ్రతికించారు. సంజీవనౌషధి మరణించిన వారిని తిరిగి బ్రతికిస్తుంది.

అమ్మవారి చూపు ఎంతగొప్ప సంజీవని అంటే చాలా కాలం క్రితం దగ్ధమై బూడిదైన వానిని కూడా బ్రతికించగల శక్తి అమ్మవారి వద్ద ఉంది. ఆమె అమృతేశ్వరి. ఎంత మృతుడినైనా తిరిగి జీవింపజేయగలిగే శక్తి అమ్మవారి వద్ద ఉంది. ఈ నామం దేవీ కారుణ్యానికి పరాకాష్ఠ. రతీదేవి వచ్చి ప్రార్థిస్తూ, "అమ్మా! నువ్వు సువాసినివి. నిన్ను నమస్కరించేవారికి ఆ సువాసినత్వం ఉంచాలి కదమ్మా.. తల్లీ! నేను దుఃఖిస్తున్నాను. రాక్షససంహారం జరిగాక దేవతలందరూ బాగున్నారు. మళ్ళీ నువ్వు, మీ ఆయన కలిసే ఉన్నారు. ఇది చేద్దామనే మా ఆయన బయలుదేరాడు, తగలబడ్డాడు. ఆఖరికి దుఃఖం నాకే మిగిలిందమ్మా" అంది. అప్పుడు అమ్మవారు చెప్తున్నారు, "అంతా ఆనందంగా ఉన్నా నువ్వు ఆయన లేరని బాధపడుతున్నావు కదా. ఆయన్నే చింతనచేస్తూ ఉన్న నీ పాతివ్రత్యానికి సంతోషిస్తున్నాను. మీ ఆయన్ని బ్రతికిస్తున్నాను" అని బ్రతికించింది. కేవలం రతీదేవికి మాత్రమే కనబడేవిధంగా బ్రతికించింది. అమ్మవారు గొప్ప పతివ్రత కనుక శివుడు ఏ దేహాన్ని తగలబెట్టాడో ఆ దేహాన్ని బ్రతికించలేదు. ఆయన యొక్క అనుమతి తీసుకొనే రతీదేవికి మాత్రమే గోచరిస్తూ, ఇతరులకు కనబడని దేహాన్ని ప్రసాదించి 'అనంగుని'గా బ్రతికించింది.

ప్రతి పురాణకథ ఒక ఉపాసనా రహస్యమే. ఒక తాత్త్విక సంకేతమే. పైపైన చదివితే పురాణకథలన్నీ ఒకదానికొకటి సంబంధం లేకుండా అసంగతంగా అనిపిస్తాయి. పురాణాలు చరిత్రకథలే కాదు - ఉపాసనా సంకేతాలు. మన్మథుడు బయలుదేరాడంటే అది కామోపాసన విద్య అయిన కాదివిద్య. మన్మథుడు శివశక్త్యైక్యముగా చూడాలనే తపనతో అమ్మవారిని ఉపాసించాడు. దేవతలందరూ కలిపి మన్మథుని పంపారు. దేవతలంటే ఇంద్రియశక్తులు. ఇవన్నీ కలిసి ఆ కామకామేశ్వరులను కలిపి చూడాలనే సాధనగా బయలుదేరాయి. దానిలో మొత్తం పంచప్రజ్ఞలు ప్రయోగించాడు. అప్పుడు శివుడు కంటిమంటతో దగ్ధం చేశాడు. అలా వెళ్తే అలానే చేస్తాడు. ఆయన కన్ను ఫాలనేత్రం - జ్ఞానాగ్ని. ఆ జ్ఞానాన్ని

ఎప్పుడైతే ఆయన ప్రవేశింపజేశాడో, అతడి యొక్క దేహాభిమానం మొత్తం దగ్ధం అయిపోయింది. ఇంకా కాస్త మిగిలిన ఆ ధూళీ, దుమ్ము ఉన్న చితాభస్మంలోంచి భండాసురుడు తయారు అయ్యాడు. వానిని అమ్మవారు సంహరించారు. శివుని పనిని అమ్మవారు సంపూర్ణం చేశారు. అలా మన్మథుని యొక్క దేహం సంపూర్ణనాశనం అయ్యింది. అప్పుడు అమ్మవారు మన్మథుని తిరిగి బ్రతికించారు.

ఇది శ్రీవిద్యలో నిత్యం భూతశుద్ధి చేసుకొనే వారికి తెలుస్తుంది. స్థూల, సూక్ష్మ, కారణ దేహాత్మకమైన అజ్ఞానమాలిన్యాన్ని దగ్ధం చేసి శాంభవ దేహమనేది ఒకటి వస్తోంది. అది వస్తేగాని పార్వతీపరమేశ్వరులను దర్శించలేము. అది ఇక్కడ రహస్యం. ఆ శాంభవదేహం ఇవ్వగలిగిన వారు అమ్మవారు. ఇదే 'హరనేత్రాగ్ని సందగ్ధకామసంజీవనౌషధిః'. దేహమే నేను అనే అజ్ఞానాన్ని జ్ఞానాగ్నిలో దగ్ధం చేశాడు పరమాత్మ. **'జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః'** అని గీతలో పరమాత్మ చెప్పాడు.

శివుని నేత్రం అంటే జ్ఞానాగ్ని. ఆయన గురువు. ఆయన్ని ఆశ్రయించగానే మనలో ఉన్న వాసనలను మొత్తం దగ్ధం చేశాక, అమ్మవారి కృపవల్ల శాంభవదేహమనేది వస్తుంది. శాంభవదేహం అంటే ఆ శివశక్తులను గ్రహించగలిగే సంస్కారంతో కూడిన ప్రజ్ఞ. ఆ ప్రజ్ఞ అమ్మవారు ఇవ్వాలి. అమ్మ అనుగ్రహం ఉంటేగాని ఆ పరబ్రహ్మం తెలియబడదు. ఆ ప్రజ్ఞే 'సంజీవనౌషధిః'. ఆ ముందు దగ్ధమైన వాసనామయమైన దేహాత్మభ్రాంతి దహనం చెయ్యడమే 'హరనేత్రాగ్ని సందగ్ధ'. కనుకనే ప్రార్థన చేస్తూ ముందు గురువును ఆశ్రయించగానే, మనం ప్రోగుచేసుకున్న అజ్ఞానమాలిన్యపు దేహాలను తగులబెడితే, అప్పుడు అమ్మవారు అమృతస్థితిని ఇస్తున్నది.

అనంగత్వం అంటే ఇక శరీరం అవసరంలేని స్థితి. అనగా మోక్షం. 'కామసంజీవనౌషధిః' అనగా దేహాత్మభ్రాంతిని పోగొట్టి బ్రహ్మైక్యస్థితిని ఇవ్వడమే. మోక్షప్రదాయిని. భండాసురసంహార ప్రయోజనం దేహాత్మభ్రాంతి తొలగడం, పరమాత్మలో ఐక్యం చెందడమే కామసంజీవనౌషధిః. ఇందులో అమ్మవారి లీలమాత్రమే కాక శ్రీవిద్యాప్రయోజనం కూడా చెప్పబడింది.

ఇప్పటివరకు చెప్పిన ఈ నామాలను సమీక్షించుకుంటే అమ్మవారు శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీగా ఎప్పుడూ ఉండే తల్లే. అలాంటి అమ్మవారు, చిదగ్నికుండం నుండి తనను తాను వ్యక్తం చేసుకుంది. ఆ వ్యక్తమైన రూపం ధ్యానం చేతే ఊహకి స్థూలంగా అందుతోంది. దీనిని స్థూలరూపం అంటారు. ఇక్కడితో ఆగకూడదు. స్థూలరూపం వెనకాల సూక్ష్మరూపం ఒకటి ఉంటుంది. 'ఉద్యద్భాను సహస్రాభా' నుండి 'సర్వారుణానవద్యాంగీ', 'సర్వాభరణభూషితా' వరకు స్థూలరూపవర్ణన. ఆ స్థూలరూపంతో అమ్మవారు ఇప్పటివరకు చేసిన పని అంతా లీలా వర్ణన.

ఇప్పుడు సూక్ష్మరూప వర్ణన. సూక్ష్మరూపము అంటే మంత్రం. మన శరీరమంతా మాంసమయం అయితే దేవతాశరీరం మంత్రమయము. అందుకే విగ్రహమంతా మంత్రమయం. విగ్రహప్రతిష్ఠకు ముందు మంత్రముతో కూడిన యంత్రాన్ని పెడతారు. ఆ మంత్రశక్తి విగ్రహంలోకి వెళ్తుంది కనుక విగ్రహం అణువణువు మంత్రమే. మంత్రం సూక్ష్మరూపమని అంటారు. ఎందుకంటే స్థూలరూపమైతే కనబడుతుంది, లేదా చెప్తూ ఉంటే వర్ణనకైనా అందుతుంది.

కానీ శబ్దమున్నదే దానికి ఆకారం లేదు. దానికంటె ఇది సూక్ష్మం. సూక్ష్మం అంటే... దానిని పొందడం మొదటిదాని కంటె కొంచెం కష్టం. ఎప్పుడైనా గుర్తుంచుకోవలసింది శక్తి సూక్ష్మంగానే ఉంటుంది. ఎంత సూక్ష్మంలోకి వెళ్తే అంత శక్తిమంతులవుతారు. కనుక ఇప్పుడు రెండవ సూక్ష్మంలోకి వెళ్తున్నాం. అమ్మవారి యొక్క సూక్ష్మస్వరూపం సరిగా 85వ నామం నుండి 89వ నామం (శ్రీమద్వాగ్భవ కూటైకస్వరూపముఖపంకజా-85, కంఠాధఃకటిపర్యంతమధ్యకూట స్వరూపిణీ-86, శక్తికూటైకతాపన్నకట్యధోభాగధారిణీ-87, మూలమంత్రాత్మికా-88, మూలకూట త్రయకళేబరా-89) వరకు చెప్పబడుతున్నది. మొత్తం ఈ ఐదునామాలు అమ్మవారి యొక్క సూక్ష్మస్వరూపం. ఈ నామాలలో మంత్రరహస్యం దాగి ఉంది.

85. శ్రీమద్వాగ్భవకూటైకస్వరూపముఖపంకజా

- శ్రీ శ్రీమద్వాగ్భవకూటైకస్వరూపముఖపంకజాయై నమః

లలితాంబ మంత్రం ప్రధానంగా పంచదశి అంటే పదిహేను అక్షరముల మంత్రం. దానిని మూడు భాగాలు చేస్తారు. మూడు భాగాలు అంటే ముక్కలు కాదు, మూడు భాగాలకు ఒకదానితో ఒకటి అనుబంధం ఉంది. అర్థం కావడం కోసం మూడు భాగాలంటున్నాం. మొదటి భాగం పేరు 'వాగ్భవకూటం'. రెండవ భాగం 'మధ్యకూటం'. దీనికి శాస్త్రనామం కామరాజకూటం. మూడవభాగం 'శక్తికూటం'.

వాగ్భవకూటంలో ఉన్న ప్రయోజనం – ధర్మము, మోక్షము – ఈ రెండింటి కోసం పనికివచ్చే జ్ఞానం ఇస్తుంది వాగ్భవకూటం. వ్యవహార జీవితానికి ధర్మం కావాలి. పరమార్థానికి జ్ఞానము కావాలి. ధర్మం లేని వ్యవహార జీవితం మొదటే దెబ్బతీసేస్తుంది. అందుకే **వ్యవహార జీవితం ధర్మబద్ధంగా ఉండాలి. పరమార్థ సాధన జ్ఞానబద్ధంగా ఉండాలి. ఈ రెండూ రావాలంటే దానికి తగ్గ ధర్మమయమైన, పరమార్థానికి కావలసిన జ్ఞానం ఉండాలి.**

ధర్మ, జ్ఞానములంటే ఏమిటో తెలుసుకోవాలి. రెండూ తెలుసుకోవాలంటే శాస్త్రం కావాలి. శాస్త్రం అంటే వాక్కులు, తెలివితేటలేగా. కనుక వాక్కులు, తెలివితేటలు వాగ్భవకూటం నుండి వస్తాయి. అమ్మవారి మంత్రంలో మొదటి భాగాన్ని శ్రద్ధగా అనుష్ఠానం చెయ్యగలిగితే, ధర్మానికి, జ్ఞానానికి కావలసిన శాస్త్రజ్ఞానం కలుగుతుంది.

ముందు ధర్మం తరువాతే అర్థ–కామ. ఈ అర్థకామాలు 'కామరాజకూటం'లో చెప్పబడుతున్నాయి. కామరాజ కూటం వల్ల జీవితానికి కావలసిన అర్థము, కామము రెండూ లభిస్తాయి. ప్రతివారికి కావలసినవి అర్థము, కామము. అర్థంతో ధర్మం సాధించాలి. ధర్మంతో మోక్షం సాధించాలి. లోకయాత్రకి కామం సాధించాలి అని భాగవతంలో చెప్పబడింది. ఇంత చక్కగా సమన్వయం చేశారు. జీవితానికి కావలసిన పురుషార్థాలు ధర్మ–అర్థ–కామ–మోక్షములు. మధ్యలో రెండే చాలా మందికి కావాలి. కానీ నిజంగా పురుషుడు సార్థకత పొందాలంటే నాలుగూ కావాలి. కనుక ధర్మ–

అర్థ–కామ–మోక్షాలు నాలుగు ఇవ్వగలిగిన విద్య 'శ్రీవిద్య'. అందులో మోక్షం వైపు నడిపే ధర్మం వాగ్భవకూటం వల్ల వస్తుంది. కామరాజ కూటం వల్ల జీవితానికి కావలసిన అర్థకామములు లభిస్తాయి. శక్తికూటం వల్ల లభించేది మోక్షం అని వివరిస్తున్నారు.

మూడు కూటములతో చతుర్విధపురుషార్థాలు ఇవ్వగలిగిన మంత్రమే శ్రీవిద్యామంత్రం. అందుకు త్రివర్గఫలదా – త్రివర్గాలు అంటే అర్థకామాలు కలిపి ఒక వర్గం. చాలామంది త్రివర్గాలు అంటే ధర్మార్థకామాలు అని ఆగిపోతారు. ధర్మం ఒక వర్గం. అర్థకామాలు కలిపి ఒక వర్గం. మోక్షం మూడో వర్గం. అవి త్రివర్గాలు అని లెక్కకట్టాలి. చతుర్వర్గమంటే మధ్యదాన్నే రెండు చేశారు. త్రివర్గాలకు త్రికూటాలు. ఇదే త్రికూట విద్య.

త్రికూటాలు అమ్మవారి శరీరంలోనే ఉన్నాయి. ఆ శరీరాన్ని చూసి ధ్యానం చేసి నమస్కరిస్తే మొత్తం నాలుగూ ఇస్తున్నది అని చెప్తూ **'శ్రీమద్వాగ్భవ కూటైకస్వరూపముఖపంకజా'** అని ప్రారంభించారు. ఇక్కడే శ్రీమత్ అని అవతారికలో చెప్పిన శ్రీం బీజం పెట్టారు. దానితో ప్రారంభించి మళ్ళీ మంత్రవిద్యను ప్రత్యేకించి ఇస్తున్నారు. ఇవి ఒక గుంపు నామాలు అని చెప్పడం కోసం ఆరంభం అంత అందంగా చేస్తున్నారు. శ్రీమద్వాగ్భవకూటైస్వరూపముఖపంకజా– ఈ మంత్రంలో మొదటిభాగం వాగ్భవకూటం అమ్మ ముఖంగా ఉంది.

86. కంఠాధఃకటిపర్యంతమధ్యకూటస్వరూపిణీ

– శ్రీ కంఠాధఃకటిపర్యంతమధ్యకూటస్వరూపిణ్యై నమః

శిరస్సు నుండి కంఠం వరకు వాగ్భవకూటం. కంఠం క్రింది భాగం నుండి నడుము వరకు మధ్యకూట స్వరూపం– కామరాజకూటం. కామరాజకూటమనే మంత్రం అక్కడ దాగి ఉంది. దానిలో ఉన్న బీజాక్షరాలు, వాటి శక్తులు ఈ అవయవాలు. అలాగే కళ్ళు, చెవులు మొదలైనవన్నీ వాగ్భవకూటం.

87. శక్తికూటైకతాపన్నకట్యధోభాగధారిణీ
– శ్రీ శక్తికూటైకతాపన్నకట్యధోభాగధారిణ్యై నమః

కటి నుండి పాదం వరకు అమ్మవారు కట్టుకొన్న అరుణారుణ కౌసుంభ వస్త్రం, ఆ పాదములకు ఉన్న మట్టెలు. పాదం వరకు కూడా శక్తి కూటంతో పొందుపరచబడింది. **'శక్తికూటైకతాపన్న'** అనగా పొందుపరచబడిన ఏకత్వం పొందిన స్థితి. ఈ విధంగా అమ్మవారి స్వరూపంగా అమ్మవారి మూలవిద్య అయిన పంచదశీ విద్య యొక్క మూడు కూటములే మూడు భాగములుగా శరీరంలో ఉన్నాయి.

88. మూలమంత్రాత్మికా – శ్రీ మూలమంత్రాత్మికాయై నమః

అమ్మవారి మంత్రమే మూలమంత్రం. ఏ దేవతనైనా ఉపాసించేటప్పుడు ప్రధానంగా ఒక మంత్రం ఉంటుంది. ఆ మంత్రానికి అంగములుగా పూజ, పునస్కారం, సహస్రనామస్తోత్రం, హృదయం – ఇలాంటివి చాలా ఉంటాయి. మంత్రం మాత్రం మూలమంత్రం. అలాగే శ్రీవిద్య అంతటికి మూలమంత్రమేదో అది అమ్మవారు. ఇప్పటివరకు చేసిన వర్ణన ప్రకారం మూలమంత్రాన్ని మూడు భాగాలుగా చూస్తే, ఆ మూడు భాగాల రూపమే అమ్మవారి స్వరూపం. అందుకు మూలమంత్రమే ఆమె రూపం. ఇంతవరకు విడిగా చెప్పారు. ఇప్పుడు కలిపి ఇందులో చూపిస్తున్నారు.

89. మూలకూటత్రయకలేబరా – శ్రీ మూలకూటత్రయకలేబరాయై నమః

అమ్మ యొక్క కలేబరం (స్వరూపం) మూలకూటత్రయం. మూడు కూటములతో కూడిన కలేబరం అనగా విగ్రహం. మూలమంత్రాత్మిక అంటేనే మూలమంత్రాలతో కూడిన శరీరం. మళ్ళీ 'మూలకూటత్రయకలేబరా' అని ఎందుకు చెప్పారు అంటే మూలమంత్రమే అమ్మ యొక్క రూపం అని సమష్టిగా మునుపటి నామానికి అర్థం. విడివిడిగా క్రమంగా ధ్యానించడం ఈ నామ వైభవం.

మంత్రమే దేవత. దేవతలు ఎక్కడో ఉన్నవారు, ఎక్కడా లేనివారు కారు. రామ మంత్రం చేసిన వారికి రాముడు దేవత. విశ్వవ్యాపకమైన ఈశ్వరచైతన్యాన్ని

రామ మంత్రంతో ఉపాసన చేస్తుంటే ఆ మంత్రం నుండి ఉద్భవించే శబ్దచైతన్యం ఆ ఈశ్వర చైతన్యాన్ని రామరూపంలో ఇచ్చింది.

మరో అర్థం- మొదటి మూడు **'కంఠాధః కటిపర్యంత'** వరకూ చెప్పినదంతా సౌభాగ్యవిద్య. **'మూలమంత్రాత్మికా, మూలకూటత్రయకలేబరా'** అనే వాటిలో షోడశీవిద్యను చూపించారు.

ఇప్పటి వరకు అమ్మవారి యొక్క సూక్ష్మరూపమైన మంత్రాన్ని తెలియజేశారు. ఇప్పుడు కుండలినీ రూపం తెలియజేస్తున్నారు. అమ్మవారిని ఆరాధించే రూపాలు- ఒకటి విగ్రహరూపం, రెండవది మంత్రరూపం, మూడవది కుండలినీ రూపం.

కుండలినీ అందరిలో ప్రాణరూపంగా ఉంది. సరిగ్గా 90వ నామం నుండి 111వ నామం (కులామృతైకరసికా-90, కులసంకేతపాలినీ-91, కులాంగనా-92, కులాంతస్థా-93, కౌలినీ-94, కులయోగినీ-95, అకులా-96, సమయాంతస్థా-97, సమయాచారతత్పరా-98, మూలాధారైకనిలయా-99, బ్రహ్మగ్రంథివిభేదినీ-100, మణిపూరాంతరుదితా-101, విష్ణుగ్రంథివిభేదినీ-102, ఆజ్ఞాచక్రాంతరాలస్థా-103, రుద్రగంథివిభేదినీ-104, సహస్రారాంబుజారూఢా-105, సుధాసారాభివర్షిణీ-106, తటిల్లతాసమరుచిః-107, షట్చక్రోపరిసంస్థితా- 108, మహాసక్తిః-109, కుండలినీ-110, బిసతంతుతనీయసీ- 111) వరకు కుండలినీ ఉపాసనాక్రమం చెప్పబడుతోంది.

ముందు స్థూల రూప వర్ణన, లీలా వర్ణన, దాని తరువాత మంత్రరూపం, తరువాత కుండలినీ రూపం కూర్చుతున్న విధానానికి వశిన్యాది వాగ్దేవతలకు నమస్కారం చేసుకోవాలి.

90. కులామృతైకరసికా - శ్రీ కులామృతైకరసికాయై నమః

కులామృతైకరసికా-90, కులసంకేతపాలినీ-91, కులాంగనా-92, కులాంతస్థా-93, కౌలినీ-94, కులయోగినీ-95, అకులా-96...ఇక్కడ వరకు ఒక నామాల గుంపు. ఇవి 'కుల' అంటూ వచ్చాయి. కులం అంటే ఏమిటి?

'కులామృతైకరసికా' - మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు ఉన్న చక్రములన్నిటిని కలుపుకుని కులము అని పేరు. ఈ కులంలో సాగే సాధన అంతా కులసాధన అని వివరిస్తున్నారు.

సాధకునికి మూలాధారం నుండి కుండలినీ కదలి పైకి వెళ్తూ ఉంటుంది. మిగిలిన వారందరికి క్రిందకి నిత్యం ప్రవహిస్తూ ఉంటుంది. ఒక రాగి తీగలోకి విద్యుచ్ఛక్తి ఎలా వస్తుందో అలా వస్తుంది. కుండలినీ అంటే మరేమిటో కాదు. ఇంటికంతటికి తీగల వ్యవస్థ అంతా పెట్టి ఒక ప్రధాన విద్యుత్ తీగ పెడతారు. ఆ ప్రధాన విద్యుత్‌తీగకే విద్యుచ్ఛక్తిని అనుసంధిస్తారు. అప్పుడు ఇంట్లో ఉన్న విద్యుత్పరికరాలు అన్నిటిలోకి విద్యుచ్ఛక్తి ప్రసరించి పని చేస్తాయి. అయితే ఇన్ని పనిచేయడానికి కారణం ఒకే విద్యుచ్ఛక్తి. అది ఈ ఇంటి మేరకు ఒకే తీగ వల్ల అందుతోంది.

అది ఇల్లయితే, ఇది ఒళ్ళు. దీనికి నాడీ వ్యవస్థ. మొత్తం నాడీమండలం తీగల రూపం. మనం మాతృగర్భంలో ఉన్నప్పుడు సప్తమ మాసానికి ఈ శరీర నిర్మాణం మొత్తం పూర్తయిపోతుంది. శరీరమనే ఇంటిలో అసలు ఇది ఎలా తయారైందో కూడా మనకి తెలియదు. ఈ ఇంట్లోనే అమ్మవారు ఉన్నారు. ఎక్కడున్నారంటే, **'తత్సృష్ట్వా తదేవ అనుప్రావిశత్'** వేదం చెప్తోంది. ఆ శక్తిని సృష్టించి అందులో ప్రవేశించింది. శరీరమనే ఇల్లు తయారైపోగానే బ్రహ్మరంధ్ర స్థానంలో ఈశ్వర శక్తి ప్రవేశిస్తుంది. అది అసలు గృహప్రవేశం. అది సింహద్వారం. అక్కడే ప్రవేశిస్తుంది. అక్కడ ప్రవేశించి ఒక్కసారి అనుసంధించగానే, ఆ సహస్రారం నుండి ప్రధానంగా ఒక్కసారి సుషుమ్నానాడి అందుకుంటుంది. ఇది ప్రధాన నాడి. ఆ ఈశ్వర శక్తి పేరే చిచ్ఛక్తి. ఆ చిచ్ఛక్తి ప్రధాన తీగ నుండి వచ్చి సరిగ్గా హృదయస్థానం నుండి 72,000 నాడులకి అందిస్తుంది. ఇది మొత్తం మనలో ఉన్న విద్యుచ్ఛక్తి. దేహంలోనే మాట్లాడే యంత్రం, వినే యంత్రం, చూసే యంత్రం, కదిలే యంత్రం, గాలి యంత్రం - ఇన్ని పనిచేస్తున్నాయి అంటే మనలో విద్యుచ్ఛక్తి ఉన్నట్లే.

ఇప్పుడు పరిశీలిస్తే ప్రధాన తీగ సుషుమ్నా నాడి. అది వెన్నుదండం లోపల

మధ్యలో ఉంటుంది. దాని నుండి మనలోకి ఈ శక్తి నిత్యం ప్రసరిస్తూ ఉంటుంది. ఇది అందరికి ఉంటుంది. అయితే సాధారణంగా ప్రతీవారిలో ఇది క్రిందికే ప్రవహిస్తూ ఉంటుంది.

ఒక రాగి తీగలోకి విద్యుచ్ఛక్తిలా ఈ ప్రసరణ ఎప్పుడూ బ్రహ్మరంధ్రం నుండి క్రిందకి వెళ్తూ ఉంటుంది. అయితే మిగిలిన జంతునిర్మాణంలో పైకి తీసుకువెళ్ళగలిగే శక్తి వాటి శరీరాలకి లేదు. ఒక్క మానవ శరీరానికి మాత్రమే ఈ శక్తి ఉంది. ఈ శరీరం వచ్చి కూడా తెచ్చుకోలేకపోతే మళ్ళీ ఈ శరీరం వస్తుందని, ముక్తి పొందగలమని నిర్ణయించలేం. ఇది ఈ శరీరం ఉన్నప్పుడే అర్థం చేసుకోవాలి. ఇప్పుడు అర్థం కాలేదంటే, మరెన్ని జన్మలు ఎత్తినా అర్థం కాదు. ఎందుకంటే మనిషి మాత్రమే వెన్నుని నిటారుగా ఉంచగలిగిన ప్రాణి. కాబట్టి మనిషి మాత్రమే ఈ శక్తిని పైకి తీసుకు వెళ్ళగలడు. ఎక్కడ ప్రధాన ధార వస్తోందో అది పట్టుకొనే ప్రయత్నం చేయాలి. ఈ శక్తి క్రిందకి ప్రవహిస్తూ ఉన్నంతకాలం ఈ ప్రపంచమే సత్యమనుకుంటాడు. ఈ దేహమే నేను అనుకుంటాడు. నువ్వు దేహం కాదురా, నువ్వు ఆత్మవురా అంటే అర్థం చేసుకోలేడు. అందుకు వానిని పశువు అంటారు. ఆ ప్రజ్ఞ పైకి ఉత్థానమవుతుంది. ఆ పద్ధతి ఇక్కడ చూపిస్తున్నారు.

యోగి క్రమక్రమంగా సాధన వల్ల ఆ సుషుమ్నానాడీగతమైన చైతన్యం వైపు దృష్టి సారించి మూలాధారం నుండి ఆ చైతన్యాన్ని కదిలించడం వల్ల కుండలినీ కదిలి పైకి వెళ్తుంది. కులం అంటే సమూహము. మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు కులం. ఆ చైతన్యం ఇందులో ప్రసరిస్తూ ఉంటుంది. అదే మన శరీరం మొత్తానికిచ్చే అమృతం. అమృతం అంటే ప్రాణశక్తి. అదే ఈ నాడుల కాలువల్లోంచి వెళ్తోంది కనుక అసలు అమృతం అక్కడ ఉంది. ఆ కులామృతాన్ని పట్టుకునే ప్రయత్నాన్ని చేయాలి. మూలాధారంలో కుండలినీ రూపంతో మన ప్రాణశక్తి చుట్టలు చుట్టుకుని ఉంటుంది. అది సాధన చెయ్యగా పైకి ఉత్థానమవుతుంది. పైకి లేచి అమృతాన్ని తెలుసుకుంటూ వస్తూ ఉంటుంది – అదే 'కుల + అమృత + ఏక + రసికా'.

ఆ సుషుమ్నానాడి నుండి క్రమంగా వెళ్తూ, ఆ సుషుమ్నా నాడిలో ప్రసరిస్తున్న

ఆ చిదేకరసాన్ని తెలుసుకుంటూ పయనిస్తుంది. ఈ నామాలను భావనాత్మకంగా చేస్తే ఎవరికైనా, ఎప్పటికైనా జాగృతి జరుగుతుంది. అలా వెళ్తున్నప్పుడు కలిగే ఆనందాన్ని ఆ జీవుడే అనుభవిస్తాడు. **'ప్రతి ప్రయాణే అమృతాయమానా'** అని శాస్త్రం వర్ణిస్తోంది. ఆ అనుభవిస్తున్న ఆనందం అమ్మవారి రూపమే. కులామృతాన్ని ఆస్వాదిస్తూ ఉన్న ఆనందమే **'కులామృతైకరసికా'**. రసానుభూతి, ఆనందం. ఇది యోగి ప్రాణాయామపటిమతో పొందుతాడు. ఉపాసకుడు తదేక నిష్ఠతో పొందుతాడు. ఇద్దరికీ అదే జరుగుతుంది.

త్యాగరాజస్వామి వారు 'రామా' అని ఉపాసన చేశారు. ఆయనకి కుండలినీ జాగరణ జరిగింది. ఆయన తన కీర్తనలలో **'మూలాధారజ నాదమెరుగుటే ముదమగు మోక్షమురా'** అని అన్నారు. భక్తుడైనవాడు నిరంతరం ఆ పరమాత్మనే ధ్యానం చేస్తూ శరీరాన్ని మర్చిపోతాడు. యోగి ఎలాగైతే ప్రాణాయామ సాధన ద్వారా పైకి వెళ్తూ మూలశక్తిని అందుకుంటాడో, ఇతడూ ఆ మూలశక్తినే రామా అని పేరుతోనో, శివ అనే పేరుతోనో ఉపాసన చేస్తున్నాడు. అలా చేస్తున్నప్పుడు ప్రపంచాన్ని మర్చిపోయి దాన్నే పట్టుకున్నాడు. వాడు పొందే ఆనందమూ, ప్రాణాయామంలో యోగి సహస్రారంతో తాదాత్మ్యం పొందినప్పుడు పొందే అమృతపానం రెండూ ఒక్కటే. అదేవిధంగా వేదాంత మార్గంలో జ్ఞానవిచారణ చేస్తూ బ్రహ్మము గురించి ఆలోచిస్తూ, బ్రహ్మము కాని దానిని ప్రక్కనపెట్టి జ్ఞానులు బ్రహ్మమును పొందుతారు. అభేదాన్ని అందుకుంటారు.

భక్తులైనవారు ప్రపంచాన్ని విడిచిపెట్టి తాను కొలుచుకుంటున్న ఈశ్వర రూపాన్ని ఉపాసన చేస్తారు. యోగి అయిన వాడు ఈ శరీరంలో మిగిలిన భాగాలను పట్టించుకోకుండా, శరీరానికి ప్రాణమిస్తున్న ప్రధానమైన అమృతశక్తిని ఉపాసన చేస్తూ వెళ్తాడు. ముగ్గురు చేసేదీ, చివరకు చేరేది ఒకే చోటు. కుండలినీ అనేది తెలియకపోయినా తదేకనిష్ఠ కలిగితే ఉపాసనలో కూడా ఇదే జరుగుతుంది.

ఇది తెలుసుకోవడానికే బాహ్య ఉపాసనలో అమ్మవారి శ్రీచక్రం ముందు అమృతం పెట్టుకోమని చెప్తారు. ఇది అనేకమందికి తెలుసు. శ్రీవిద్యా ఉపాసకులు

తీర్థం ఇస్తే పుచ్చుకోవడానికి వెళ్ళేవారు ఉంటారు. వారు తీర్థం అనరు. అమృతం అంటారు. అదే కులామృతం. ఈ కులామృతాన్ని ముందు ఆవాహన చేసి, మంత్రితం చేసి శ్రీచక్రంలో దాన్ని బిందువులుగా 'బిందుతర్పణసంతుష్టా' సమర్పణ చేస్తారు.

ఆ సమర్పణ చేయగా మిగిలినది అమృతం. అది వీరు పుచ్చుకుంటారు. ఇంతకు ముందు ఈ అమృతాన్ని శ్రీచక్రంపై వేశారు. శ్రీచక్రంలో అమ్మవారు పుచ్చుకున్నది. అదే కులామృతం. ఈ కులామృతాన్ని శ్రీచక్రంలో ఉన్న తల్లి పుచ్చుకుంటోంది కదా.. అది 'కులామృతైకరసికా'. ఆవరణ పూజలో కూడా అర్ఘ్యపాత్ర పెట్టుకొని చేసినపుడు అది అమృతమే. దేనిలో అయినా ఇదే ఉంటుంది. అక్కడ బాహ్యంగా ఇస్తున్నారు. తిరిగి పుచ్చుకున్నప్పుడు మన లోపల ఉన్న అమ్మవారే పుచ్చుకుంటోందని తెలుసుకోవాలి. కనుక 'కులామృతైకరసికా'.

ఇక్కడ కులామృతం అన్నప్పుడు ప్రధానంగా కులము అంటే ఆరు చక్రాలని చెప్పుకున్నాం. కులము అంటే మరొక అర్థం–జాతులు, వంశాలు. పితృవంశం, గురువంశం అని రెండు రకాలు. పితృవంశం అంటే తండ్రి, తాత, ముత్తాత అని చెప్తారు. గురువంశం అంటే నా గురువు, పరమగురువు, పరమేష్ఠిగురువు అంటారు. మనం చేసే ఉపాసనా శరీరం తండ్రివల్ల వచ్చినది కాక గురువిచ్చిన దీక్షవల్ల వచ్చిన మరో శరీరం. అప్పుడు ఈ తండ్రి ఎవరు? **'శ్రీ గురుః సర్వకారణభూతా శక్తిః'** అని భావనోపనిషత్‌లో మొదటివాక్యం. ఈ గురుపరంపర అంతా దీక్షాశరీరం ఇచ్చిన తండ్రి స్వరూపం.

ఆ గురుపరంపర అంతా కులం. గురుకులం అంటే పరంపర. ఈ గురు పరంపరలో ఎలా చెప్పారో దాని ప్రకారం ఈ అమృతం తయారు చేసుకున్నారు. అది కులామృతం. దానితో అమ్మవారి ఆరాధన చేస్తున్నారు. ఏ కులం ప్రకారం అమృతాన్ని ఇస్తున్నారో ఆ అమృతాన్ని ఆనందంగా అమ్మవారు పుచ్చుకుంటూ రసికురాలిగా ఉంది. అది **'కులామృతైకరసికా'**.

కులం అనే మాటకు అనేక రకాల అర్థాలు ఉన్నాయి. **'న కులం కులమిత్యాహుః ఆచారః కులముచ్యతే'** (భవిష్యోత్తర పురాణం). కులమంటే ఏంటో

కాదయ్యా ఆచారమే కులం అన్నారు. అంతేకాని ఏదో ఒక కులంలో పుట్టినంత మాత్రాన ఆ కులంవాడైపోడు. ఆ కులం యొక్క ఆచారం పాటించాలి. అందుకే **'దర్శనానితు సర్వాణి కులమేవ విశంతి చేత్యాగమేచ'** అన్నారు. సర్వశాస్త్రములు కులాన్ని ఆశ్రయించి ఉంటాయి, అంటే ఆచారాన్ని ఆశ్రయించి ఉంటాయి. అందుకే ఆచారమే కులం. ప్రతి కులమూ గొప్పదే. ప్రతి కులానికి ఒక ఆచారముంది. ఎవరి కులాచారం ప్రకారంగా వారు అమ్మవారిని ఆరాధన చేసినప్పుడు, వారు వారి కులాచారంగా ఇచ్చే నైవేద్యాలు మొదలైన అమృతాన్ని అమ్మవారు తృప్తిగా పుచ్చుకుంటారు. అది కులామృతైకరసిక. ఇది మరొక అర్థం. అందుకే **'విప్రాః క్షోణీభుజో విశస్తదితరే క్షీరాజ్యమధ్వాసవైః'**. అని వర్ణించారు. విప్రులు క్షీరంతోనూ, రాజులు మధువుతోనూ, ఆసవమనే పదార్థముతో ఇతరులు అమ్మవారికి అమృతమిస్తారు అని వర్ణించారు. ఇలా ఇవన్నీ కులాచారాలు. విశేష అర్ఘ్యపాత్ర, సామాన్య అర్ఘ్యపాత్ర అని చెప్పబడుతున్నవాటిని కూడా గ్రహించవచ్చును.

అసలు కులం అంటే – 'కు' అంటే భూమి. భూమి యందు 'లమ్' అంటే లయం. భూమి యందు లయమయ్యేది. భూమి అనగా మూలాధారస్థానం. అక్కడ లయమయ్యేది అని అర్థం. అంటే మూలాధారం నుండి బయలుదేరిన కుండలినీ యోగికి సహస్రారం వరకూ వెళ్తుంది. ఆ వెళ్ళడం మహాకష్టం, చెప్పినంత తేలిక కాదు. ఇది కూడా గురు శిక్షణలోనే చేయాలి. ఆ చేసేటప్పుడు ఎలా చెయ్యాలో ప్రాతఃకాలంలో చేయాల్సిన క్రియని దేవీభాగవతం వివరించింది.

ప్రకాశమానే ప్రథమే ప్రయాణే ప్రతిప్రయాణేప్యమృతాయమానాం
అంతః పదవ్యామనుసంచరంతీం ఆనందరూపాం లలితాం(అబలాం)
ప్రపద్యే

ప్రకాశమానే ప్రథమే ప్రయాణే – మూలాధారం నుండి మహాచైతన్యంతో కుండలినీ ఉత్థానమౌతుంది. ఆ లేచి వెళ్తున్నప్పుడు ఒకొక్క మజిలీ దాటుతుంది. (ఆ మజిలీ ఎలా దాటుతుందో అనేది 'మూలాధారైకనిలయా' అనే నామం దగ్గర వివరించుకుందాం. ఇక్కడ కులామృతం చెప్పడం కోసం ఇది.) ఆ వెళ్తున్నప్పుడు

ఒకొక్క చక్రం దాటుతూ ఉంటే యోగికి కలిగే ఆనందము అద్భుతం. ఏ చక్రమైనా కొంతైనా జాగృతి జరిగితేనే భగవంతుడు అర్థమవుతాడు. ఎందుకంటే పైకి వెళ్ళడం ప్రారంభమైంది. పైకి వెళ్ళడం అంటే పరమాత్మ వైపు తిరుగుతోందది. పరమాత్మస్థానం సహస్రారం. అక్కడి నుండి అనుసంధానం అయింది, తిరిగి అక్కడికే వెళ్తోంది. వెళ్తున్నప్పుడు 'ప్రతి ప్రయాణేపి అమృతాయమానం' – అది కులామృతైక రసిక.

ఒకొక్క చక్రం దాటుతూంటే కలిగే ఆనందం పేరు అమృతం. ఆ అమృతాన్ని ఆనందముగా అనుభవిస్తూ వెళ్తూ ఉంటుంది 'కుండలినీ'. ఆ వెళ్తున్న కుండలినీ ఒకొక్క చక్రం దాటుతూ ఈ కులమార్గములో అమృతాన్ని, ఆనందాన్ని అనుభవిస్తోంది కనుక 'కులామృతైకరసికా'. సహస్రారం వద్ద చంద్రబింబంలా చిచ్ఛక్తి ఉంటుంది. అమ్మవారిని మొదటి నుండి చంద్రకళాస్వరూపిణీగా చెప్పడం జరిగింది. అది పూర్ణ చంద్రకళ.... శివశక్త్యైక్యమైన చంద్రకళ. కుండలినీ నుండి అగ్ని రూపంతో బయలుదేరుతుంది. శరీరంలో మూలాధార, స్వాధిష్ఠానములు **'అగ్నిమండలం'.** మణిపూర, అనాహతములు **'సూర్యమండలం'.** విశుద్ధి, ఆజ్ఞాచక్ర పైభాగం **'చంద్రమండలం'.** 'అగ్నిమండలం' నుండి బయలుదేరిన కుండలినీ, ఒక అగ్నిలా పైకి వెళ్తూ ఒకొక్క చక్రం దగ్గర ఉన్న రసాన్ని పానం చేస్తూ సాగుతుంది. ఇది యోగానికి, యాగానికి ఉన్న అనుబంధం. ఇది లోపల చేస్తే అంతర్యాగం, బయట చేస్తే బహిర్యాగం. అంతర్యాగ క్రమాన్ని ఇక్కడ చూపిస్తున్నారు. క్రమంగా ఆ ఆనందం అనుభవిస్తూ ఒకొక్కటి దాటుతూ వెళ్తుంటే, సహస్రారం దగ్గరకి ఈ అగ్నిరూప కుండలినీ వెళ్ళగానే అక్కడ ఉన్న చంద్రబింబం కరిగి ఒక్కసారి ఒక ధారగా డెబ్బైరెండువేల నాడుల్లోంచి ప్రవహిస్తుంది. అలా ప్రవహించగానే యోగి పొందే ఆనందం దివ్యమైనది. అది పొందాక మళ్ళీ జీవితంలో పడతాడా? ఒకవేళ ప్రారబ్ధవశాత్తు శరీరంలో ఉన్నా వానికి అక్కడికి చేరిపోయిన కుండలినీ ఇంక స్వేచ్ఛగా క్రిందకి–పైకి తిరుగుతూ ఉంటుంది. అటువంటి వానికి పైనుండి మూలాధారంకి వస్తుంది, మూలాధారం నుండి పైకి వెళ్తుంది. అలా వెళ్తున్నప్పుడు ఉండే ఆనందమనేది ఒక్క యోగికే తెలుస్తుంది. ఆదిశంకరభగవత్పాదులవారికి తెలిసింది. వారు ఆ స్థితిని

పొందినవారు. అందుకే వర్ణించారు. ఆ పైన కదా అమ్మవారి అసలు స్థానం. అక్కడున్నాయి ఆవిడ పాదాలు. అక్కడున్న పాదాల నుండి మొత్తం విద్యుచ్ఛక్తి వలె ప్రవహిస్తోంది. దానిని తిరిగి తీసుకువెళ్ళి అక్కడకి చేరుకోగానే ఆ పాదాలను పట్టుకోవాలి. అప్పుడు ఆ పాదాల నుండి స్రవిస్తున్న అమృతధారలు మొత్తంగా డెబ్బైరెండువేల నాడులలో అనుభూతి లభిస్తుంది. ఆదిశంకరులు దీన్నే సౌందర్యలహరిలో వర్ణిస్తూ

సుధాధారాసారైః చరణయుగళాన్తర్విగళితైః
ప్రపంచం సించంతీ పునరపి రసామ్నాయ మహసః
అవాప్యస్వాం భూమిం భుజగనిభమధ్యుష్టవలయం
స్వమాత్మానం కృత్వా స్వపిషి కులకుండే కుహరిణి

ఈ కుండలినీ శక్తి పైకి వెళ్ళి అలా స్రవించి 'ప్రపంచం సించన్తీ' – డెబ్బైరెండువేల నాడులను తడుపుతూ, తిరిగి మళ్ళీ మూలాధారం వద్దకు చేరుతుంది. అటువంటివారిది జాగరిత కుండలినీ.

ఒకప్పుడు మహానుభావులు బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారితో ఒక పెద్ద యోగి మాట్లాడుతూ, "ప్రతివారు కూడా శ్రీచక్రంలో కొన్ని ఆవరణలే దాటారు కానీ బిందువు దాకా ఎంతమంది వెళ్ళారు" అని అడిగారు.

బిందువు అనగా సహస్రారం. మిగిలిన ఆవరణలు దాటడం కూడా మహాకష్టం. ఒకవేళ ఈ ఆవరణలలో ఏది దాటినా ప్రజ్ఞ పైకి వెళ్తూ ఉంటుంది. ఒక చక్రం వద్దకు వచ్చేటప్పటికి ఇతర లోకాల జ్ఞానం, భవిష్యత్ జ్ఞానం వస్తుంది. వారిని చూస్తే అందరూ కాళ్ళమీద పడతారు. అలాంటి దేవతాప్రజ్ఞలు ఒక్క చక్రం దాటితే వస్తాయి. మణిపూరం దాటితే వారి స్థితి ఒక విధంగా ఉంటుంది. అనాహతం దాటితే మరొకలా ఉంటుంది. అయితే కొందరి యోగులకి చక్రాల పేర్లు తెలియకపోవచ్చు. వారు చేసే అఖండమైన మంత్రజపం వలన కాని, అఖండమైన భక్తి వలన కాని, అఖండమైన వేదాంతవిచారణ వలన కాని ఈ ప్రజ్ఞలు జాగృతం అవుతాయి. అలా జరుగుతూ "సహస్రారం వరకూ వెళ్ళి అక్కడ 'ప్రపంచం సించన్తీ'

అనే స్థితి పొంది, ఈ శరీరంలో ఉంటూనే ఆ దివ్యానుభూతిని పొందుతూ ఈ ప్రపంచంలో తిరిగిన వాళ్ళు నేటికాలంలో ఎవరైనా ఉన్నారా?" అని అడిగారు ఆ యోగీశ్వరులు. "ఎప్పుడో చరిత్రలో ఉండవచ్చు గాని, సమకాలంలో ఉన్నారా, ఇప్పుడు భూమిపై(ఆనాటికాలంలో) బ్రతికి బిందువు దాకా వెళ్ళినవారు ఉన్నారా?" అని అడిగితే, "ఉన్నారు" అని చెప్తూ, "ఒక్కరున్నారు బాగా ప్రసిద్ధిచెందినవారు. శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతీ స్వామివారు". ఈ విశాలప్రపంచంలో చాలామంది ఉండవచ్చు. కొందరు గుహల్లో ఉంటారు. కొందరు మహాజ్ఞానులు ఏమీ తెలియకుండా ఇళ్ళలో ఉంటారు.

అప్పుడు ఆ సిద్ధపురుషుడు తన స్థితి చెప్పమని అడిగినప్పుడు రాఘవ నారాయణ శాస్త్రిగారు, "మీరు మహా అయితే బహిర్దశారం, అంతర్దశారం దాటి ఉంటారు" అని చెప్పారు. అంటే కొన్ని చక్రాలే దాటారు. ఈ స్థితి వారు కూడా చాలా అరుదుగా ఉంటారు. అది చెప్పగలగాలంటే మళ్ళీ అంత స్థితి ఉన్నవారే చెప్పాలి. ఇలాంటిది రాఘవనారాయణశాస్త్రిగారే చెప్పగలరు. మహానుభావులు రోజుకి ఇరవైఏడు సార్లు లలితాసహస్రనామస్తోత్రం చదివి, దుర్భరదారిద్ర్యంలో ఉన్నప్పుడు కేవలం నీరు మాత్రమే అమ్మవారికి నైవేద్యం పెడుతూ ఉంటే కొద్ది రోజులకి అమ్మవారు కనికరించి సాక్షాత్కరించి జోళి పట్టుకురా అని చెప్పి స్వయంగా వడ్డించింది. అక్కడి నుండి ఆయనకు ఆకలి అనేది, దరిద్రం అనేది లేదు. అంతగా అనుగ్రహించింది లలితా అమ్మవారు. ఇలా లలితాసహస్రాన్ని సిద్ధింప చేసుకున్న యోగులైన రాఘవనారాయణశాస్త్రిగారు పూర్ణస్థితిని పొందినవారు. వారే ఇలాంటి భావాలు చెప్పగలరు.

91. కులసంకేతపాలిని - శ్రీ కులసంకేతపాలిన్యై నమః

కులసంకేతాలు తెలియాలి. సంకేతాలు అనగా ఏ చక్రానికి ఎవరు అధిదేవత? వాటియొక్క దళములు ఎన్ని? అక్కడ ఏ అక్షరాలు న్యాసము చేయాలి? ఎలా భావన చేయాలి? ఇవన్నీ కులసంకేతాలు. ఈ వ్యవస్థ అంతా ఒక పద్ధతిగా పెడుతూ

ఆయా చక్రాలలో కాపాడుతున్నది కనుక కులసంకేతపాలినీ. పైగా ఈ సాధన గురువు కృప లేకుండా చేస్తే అడ్డదిడ్డమై పోతుంది.

కుండలినీ అంటే దానిని జాగ్రత్తగా జాగృతపరచే పద్ధతి తెలియాలి. కేవలం గురుశిక్షణలో జరగాలి. అలా వెళ్తున్నప్పుడు ఆ సంకేతాలు ఉంటాయి. ఆ సంకేతాలు తెలుసుకుంటూ జాగ్రత్తగా అంచలంచెలుగా వెళ్తూ ఉండాలి. ఆ అంచలంచెల్లో ఉండే సంకేతాలు తెలుసుకోవాలి. ఏ చక్రం ఏ రంగులో ఉంటుంది? దానికి ఎన్ని దళాలు? ఎన్ని అక్షరాలు? ఎలా భావన చేయాలి? ఇవన్నీ గురుశిక్షణలో తెలుసుకుంటూ వెళ్తే కులసంకేతములు. దీనిని అంతటినీ పాలన చేస్తూ నడుపుతూ ఉంటుంది కనుక 'కులసంకేతపాలినీ'.

92. కులాంగనా - శ్రీ కులాంగనాయై నమః

ఈ కులమునందు తిరిగే అంగన ఎవరో ఆవిడే 'కులాంగనా'. ఈ కులమునందు ఒక కులస్త్రీలా నడయాడే కుండలినీ. 'కులామృతైకరసికా' అన్నప్పుడు సంప్రదాయమే కులం, ఆచారమే కులం అని ఒక అర్థం చెప్పుకున్నాం. అలాగే వారి వారి సంప్రదాయాల ప్రకారంగా అమ్మవారికి నివేదించేవి కులామృతములు. అవి పుచ్చుకుంటున్నది 'కులామృతైకరసికా'. ఆయా ఆచారాల్లో యే యే పద్ధతులున్నాయో అవి కులసంకేతములు. అవి జాగ్రత్తగా పాటించేలా గురురూపంలో అమ్మవారే చూసుకుంటూ అనుగ్రహిస్తోంది కనుక 'కులసంకేతపాలినీ'. కులము అనగా కుండలినీ పరంగా కూడా చెప్పుకోవాలి.

'కులాంగనా'- లోకంలో కులాంగనా అంటే కులస్త్రీ. కులస్త్రీ అంటే సంప్రదాయబద్ధురాలైన పతివ్రత. దూర్వాసమహర్షి కులాంగనా అంటే చెప్తూ ఇతర విద్యలు ఎవరికైనా బహిరంగంగా చెప్పవచ్చు కానీ శ్రీవిద్యమాత్రం యోగ్యులు కాని వారికి చెప్పరాదు. ఎందుకంటే ఇది కులాంగన వంటిది. కులాంగన వీధిలోకి రాదుగా. ఈవిడ కూడా రహస్యవిద్య అని చెప్తూ కులాంగనా నామానికి అద్భుతమైన అర్థం చెప్తున్నారు.

అన్యాస్తు సకలావిద్యాః ప్రకటాగణికా ఇవ

ఇయంతు శాంభవీవిద్యా గుప్తా కులవధూరివ

ఈ కులాంగన ఒక రాజవీధిలో హంస నడకతో చాలా హొయలుగా తిరుగుతోంది.

"కులాంగనైషాప్యథ రాజవీధిః ప్రవిశ్య సంకేతగృహాంతరేషు"

కొన్ని గృహాలలోకి వెళ్ళి వారు ఇచ్చే పండు, ఫలం పుచ్చుకొని బొట్టు పెట్టించుకొని వస్తూ ఉంటుంది. ఆ గృహాల సంకేతాలు అవిడకే తెలుసు. కులాంగన ఒక రాజవీధిలోకి వచ్చి 'ప్రవిశ్య సంకేతగృహాంతరేషు'. ఆ సంకేత గృహాల్లోకి వెళ్ళి **'విశ్రమ్య విశ్రమ్య పరేణ పుంసా సంగమ్య సంగమ్య రసం ప్రసూత'** (చింతామణి స్తవం). ఒకొక్క సంకేత గృహంలోకి వెళ్ళి కాస్సేపు విశ్రాంతి తీసుకుంటుంది. అక్కడినుండి అలా బయలుదేరుతూ ఆఖరికి వాళ్ళాయన ఉన్న ఇంటికి వెళ్ళి అక్కడ స్థిరపడుతుంది. వాళ్ళాయన ఉన్న గృహం అనగా బ్రహ్మరంధ్రం. ఆవిడ బయలుదేరిన వీధి అంటే సుషుమ్న. ఒకో ఇంట్లో విశ్రాంతి అనగా ఒకొక్క చక్రం వద్దకు వెళ్ళి విశ్రమిస్తూ ఉంటుంది. అక్కడ కొంతకాలం ఉంటుంది. అక్కడొక స్థితి వస్తుంది. అక్కడ నుండి పైకి అలా అలా వెళ్తుంది. ఈవిడ 'కులాంగనా'.

'కులాంగనా' అంటే మళ్ళీ రెండు అర్థాలు చెప్పుకోవాలి. సంప్రదాయం, సదాచారం పాటిస్తూ, బిడియం, లజ్జ కలిగి రహస్యంగా ఉండే విద్య కనుక అమ్మవారి విద్య కులాంగనా.

రెండవది కులమునందు సంచరిస్తూ అంగనలా ప్రయాణము చేస్తూ నడుస్తోంది కనుక కులాంగన. మంత్రజపం చేసేటప్పుడు ఊపిరితో కలిపి చెయ్యమంటారు. స్థూలరూపాన్ని ధ్యానించి, మంత్రాన్ని ఉపాసిస్తూ, కుండలినితో సమన్వయం చెయ్యాలి. అలా క్రమంగా మరొకస్థితికి వెళ్ళాలి.

కుండలినీ స్వరూపాన్ని వివరిస్తూ పరబ్రహ్మమును జీవుడు రెండు విధములుగా చేరతాడు అని చెప్పారు. పరబ్రహ్మము గురించి ఉపాస్యబ్రహ్మం, జ్ఞేయబ్రహ్మం అని రెండు వ్యవహారాలు ఉన్నాయి. దీనినే సగుణ బ్రహ్మ, నిర్గుణ బ్రహ్మ అని వ్యవహారం.

సగుణబ్రహ్మమునే ఉపాసించగలరు. నిర్గుణబ్రహ్మను ఉపాసించడం సాధ్యం కాదు. అది పొందవలసిందే. అక్కడ ఉపాసన, మంత్రం, తంత్రం ఏమీ ఉండవు. కనుక నిర్గుణ బ్రహ్మమును జ్ఞేయబ్రహ్మము అంటారు. అది కేవలం వేదాంత విచారణ ద్వారా తెలుసుకోవలసిందే. ఉపాసన అంతా సగుణబ్రహ్మమును గురించే.

ఆ సగుణబ్రహ్మ ఉపాసన మూడు రకాలుగా ఉంటుంది. ఆ సగుణబ్రహ్మ ఉపాసన మొదట దివ్యమంగళ విగ్రహం. ఇది ధ్యానం చేసి ఉపాసించవలసిందే. రెండవది మంత్రస్వరూపం. ఇది జపం చేసి ఉపాసించవలసినది. మూడవది కుండలినీ స్వరూపం. దీనిని గమనించడమే పెద్ద ఉపాసన. ఈ విధంగా సగుణబ్రహ్మ ఉపాసన మూడు విధాలుగా ఉంటుంది. రూపధ్యానం, మంత్రజపం, కుండలినీ ఉపాసన. ఇది ఉపాస్యబ్రహ్మం. ఇది ఏ సంప్రదాయాలలోకి వెళ్ళినా పెద్దగా మార్పు ఉండదు. మార్పు ఎక్కడ ఉంటుందంటే శివోపాసన చేస్తే శివ రూపం, శివ మంత్రం మారింది. విష్ణు ఉపాసన చేస్తే విష్ణు రూపం, విష్ణు మంత్రం మారింది. కానీ కుండలినీ అనేది మాత్రం రెండింటికి ఒక్కటే. పరబ్రహ్మం ఒక్కడే. ఉపాస్యబ్రహ్మము, సగుణబ్రహ్మము అన్నప్పుడు మారుతున్నాయి. నిర్గుణబ్రహ్మలో ఇన్ని వైవిధ్యాలు లేవు. ఉన్నది ఒక్కటే. అది **'ఏకం అద్వితీయం బ్రహ్మ'.**

అమ్మవారు ఎవరు? సగుణబ్రహ్మమా? నిర్గుణబ్రహ్మమా? రెండూనూ ఆవిడయే. ఇప్పుడు మనం చెప్తున్న నామములన్నీ ఉపాస్యబ్రహ్మ నామాలు. ఉపాస్యబ్రహ్మమును ఎలా పొందాలో ఆ క్రమాన్ని తెలియజేస్తున్నారు. ఉపాస్యబ్రహ్మములో ముందు అమ్మ రూపధ్యానం చేసుకున్నాం. తరువాత మంత్రస్వరూపాన్ని 'శ్రీమద్వాగ్భవకూటైకస్వరూపముఖపంకజా' దగ్గర నుండి రెండు రూపములు అయ్యాయి. మూడవది కుండలిని. ఈ కుండలినీ రూపాన్ని ఇప్పుడు తెలియజేస్తున్నారు. ఇక్కడితో సగుణబ్రహ్మము గురించిన విషయం స్పష్టమవుతోంది.

దీని తరువాత కూడా ఇంకా ఉపాస్యబ్రహ్మమునకు సంబంధించిన నామాలు ఉంటాయి. నిర్గుణబ్రహ్మమే అమ్మవారు అని ప్రతిపాదించే నామాలు కొన్నిచోట్ల లభిస్తాయి. సగుణబ్రహ్మ ఉపాసనలో బాగా పండినట్లయితే, ఆ ఉపాస్యబ్రహ్మతత్త్వమే

నిర్గుణబ్రహ్మంలోకి చేర్చుతుంది. దాని కోసం ఆయాస పడక్కర్లేదు. ఆ నిర్గుణస్థితిని పొందడమే అద్వైతసిద్ధి, జీవన్ముక్తి. అది కలిగించేది ఉపాస్యబ్రహ్మాయొక్క అనుగ్రహం. ఇది మొత్తం మన హైందవ లేదా వైదిక సంస్కృతిలో సనాతనధర్మంలో ఉన్న క్రమం.

ఉపాసన పరిపూర్ణం కావాలంటే మూడురకాలుగాను కావాలి. ఒక వైపు రూపాన్ని ధ్యానించాలి. మంత్రాన్ని జపించాలి. కుండలినీ రూపంగా ఉపాసన చేయాలి. అందుకే మంత్రాన్ని శ్వాసతో చేయమంటారు. ఏ ఉపాసనలోకి దిగినప్పటికి కూడా షట్చక్ర విద్య, షట్చక్రములందు ఆరాధన ఉంది. అక్కడ మంత్రం, తంత్రం మారినా పద్ధతి మాత్రం ఇదే. భాగవతంలో కూడా 'ఉదరముపాసతే'వంటి మాటలలో మణిపూర చక్రములు మొదలైన వాటిగురించి తెలియజేశారు. ఇవేవో కేవలం లలితకి మాత్రం పరిమితం అని కాదు. అమ్మవారి అనుగ్రహం కావాలనుకునే వారందరికి కావాలి. ఇటువంటి వివరణతో ఇప్పుడు **'కులాంగనా'** మొదలైన నామాలని వివరించుకుంటున్నాం.

కులం అంటే ముందు అనేక అర్థాలు చెప్పుకున్నాం. ప్రధానంగా కుండలినీ స్వరూపంగా చెప్తున్నాం కనుక కులము అనగా షట్చక్రములే. ఈ షట్చక్ర పద్మాలను కలుపుకొని కులం అనాలి. ఈ కులమునందు ప్రకాశించే కుండలినీ మనలో చిచ్ఛక్తిగా ఉంది. ఆ శక్తి చేతనే ఈ శరీరం అంతా పోషింపబడుతోంది. కుండలినీరూపిణి అయిన అమ్మవారే మన శరీరానికి అమృతం. ఆ ప్రసరిస్తున్న చిచ్ఛక్తిని మనలో గమనించుకుంటూ వెళ్ళడమే చేయవలసిన ఉపాసన.

'కులామృతైకరసికా, కులసంకేతపాలినీ' – ఈ రెండు నామాలను ముందు వివరించుకున్నాం. 'కులాంగనా'– కులము నందు సంచరించు అంగనా అంటే షట్చక్రాల్లో సంచరించేది అని ఒకటి. కులాంగనా అనగా కులస్త్రీ. మర్యాదలు, పద్ధతి, సంప్రదాయం కలిగిన స్త్రీని కులస్త్రీ అని అంటారు. ఒక చక్కటి వంశపరంపర, ఆచార పరంపర, మర్యాద ఉన్నది కనుక అమ్మవారు కులస్త్రీ, కనుక అమ్మవారి విద్యయే కులాంగనా విద్య. ఇది యోగ్యులు కాని వారికి చెప్పరాదు. దీనికో పరంపర,

పద్ధతి, మర్యాదలు ఉన్నాయి. ఒక కులాంగనకి ఎన్ని మర్యాదలు ఉన్నాయో, శ్రీవిద్యకి అన్ని మర్యాదలు ఉన్నాయి కనుక ఇది కులాంగనావిద్య అని చెప్పబడుతోంది.

93. కులాంతస్థా - శ్రీ కులాంతస్థాయై నమః

కుల-అంతస్థా- ముందు చెప్పిన భావం ప్రకారంగా చూస్తే ఈ కులం నడుమ ఉంది. 'అంతః' అంటే లోపల భాగంలో, 'స్థా' అంటే ఉన్నది. ఈ కులం లోపల ఉన్నది అనగా ఈ షట్చక్రములలో ప్రతి దానియందు అమ్మయే ప్రకాశిస్తూ ఉన్నది. ఒకొక్క చక్రస్థానానికి వెళ్తున్నప్పుడు, ఒకొక్క దేవతాస్వరూపాన్ని, ఒకొక్క రకమైన సిద్ధిని చెప్పారు. కానీ అమ్మవారే ఆ దేవతాస్వరూపం. మూలాధారం దగ్గర గణపతి, స్వాధిష్ఠానం దగ్గర బ్రహ్మ, మణిపూరం దగ్గర విష్ణువు. ఇలా ఒకొక్కటి చెప్పుకుంటూ ఒక్కో చక్రం దగ్గరికి వెళ్ళేటప్పుడు తత్తత్ దేవతారూపములతో ఆ తల్లే ఉంది. అందుకే 'కులాంతస్థా' - ఇది మరొక అర్థం.

కులం గురించి పైన చెప్పుకున్న దానికి ఒక వైపు 'ఆచారః కులం' అని ఒక మాట. కులం అనగా షట్చక్రములు. గురువంశ పరంపరనే కులం అంటారు. మూలాధారమును కులస్థానమని అంటారని

'కుః పృథ్వీతత్త్వం యత్రలీయతే తత్కులం'
'మూలాధారాంతర స్థితా కులాంగనా సజాతీయానాం
మూలాధారాది ఆజ్ఞాంతానాం కమలానాం సమూహోవాక్కులం'
తత్రస్థితా వా కుండలినీ స్వరూపా పరాశక్తిః

నిర్వచనం చెప్తూ 'మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు ఉన్న కమలము (షట్చక్రము)లకి మరో పేరు షట్ కమలములు. అవి మొగ్గల్లా ఉన్నాయి. ఈ కుండలినీ జాగృతి జరుగుతుంటే అవి విచ్చుకుంటూ ఉంటాయి. అలా విచ్చుకుంటూ ఉంటున్న కొద్ది దివ్యజ్ఞానములు కలుగుతూ ఉంటాయి. అవి గాని విచ్చుకోకపోతే దివ్యత్వం చెప్పినా అర్థం కాదు. ఆ విచ్చుకోవడం లక్షణం చేత వాటికి కమలములు అని పేరు. అందుకే షట్కమలములు. **"మూలాధారా షట్కమలమ్ముల నెమ్మదిగా నే**

దాటి వచ్చితిని ధన్యోస్మి" అని ఒక సంప్రదాయమైన రాజరాజేశ్వరి గీతం ఉంది. ఈ గీతాన్ని అమ్మవారి దర్శనం సహస్రారంలో చూసిన అనుభూతితో ఒక యోగి చేశాడు. మూలాధారము మొదలు ఆరు చక్రాలను షట్కమలములు అంటారు. ఇవన్నీ కలిపితే కులం. సరిగ్గా ఈ మంత్రం శ్రీసూక్తంలో వస్తుంది.

'శ్రియం వాసయ మే కులే మాతరం పద్మమాలినీమ్'

శ్రియం వాసయ మే కులే – 'మే కులే' అంటే నా షట్చక్రములందు 'శ్రియం' – శ్రీ అనగా శ్రీమాత ప్రకాశించుగాక అని అర్థం. ఈ షట్చక్రములు 'పద్మమాలినీమ్' – పద్మములు వరుస పెట్టినట్లుగా ఆరు పద్మములు ఒకదాని క్రింద ఒకటి ఉన్నాయి. కనుక పద్మమాలినీం. మొత్తం శ్రీసూక్తం అంతా శ్రీవిద్యయే. అందుకే ఆ తల్లి –

'అశ్వపూర్వాం రథమధ్యాం హస్తినాదప్రబోధినీమ్'

అశ్వపూర్వాం (అశ్వారూఢా) రథమధ్యాం (చక్రరజరథారూఢసర్వాయుధ పరిష్కృతా– కిరిచక్ర, గేయచక్రముల నడుమనున్నది) హస్తినాదప్రబోధినీమ్ (సంపత్కరీ) – మొత్తం శ్రీసూక్తం అంతా కనబడుతున్నది. శ్రీసూక్తం, శ్రీవిద్య, శ్రీమంత్రం, శ్రీయంత్రం, లలితాసహస్రం – ఇవి ఒకదానితో ఒకదానికున్న అనుబంధములు. 'శ్రియం వాసయ మే కులే' అనేది కూడా ఆ కులశబ్దంతోనే చెప్పబడుతోంది. ఆ తల్లి **'కులం తత్ర స్థితా వా కుండలినీ స్వరూపా పరాశక్తిః'**. కనుక కులాంతస్థా అంటే కుండలినీ అని వివరించారు.

ధ్యానం చేసేటప్పుడు ప్రతివారు కుండలినీ ప్రక్రియలు గురువుల ద్వారా తెలుసుకోవలసినవి ఉంటాయి. అలా కుదరకపోయినా ఇవి చదివేటప్పుడు, లేదా ఏకాంతంలో ఉన్నప్పుడు, ఈ నామాలనుకున్నప్పుడు ఒకానొక ధ్యానం చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ కూడా సత్ఫలితం ఇస్తుంది. ఇది ఇబ్బంది లేని ప్రక్రియ.

మూలాది బిల పర్యంతం మహాత్రిపురసుందరీం,
యా తనుస్తే తటి ప్రఖ్యా తాం భజే భవనాశినీమ్.

ఈ శ్లోకంతో అమ్మవారిని ధ్యానం చేస్తారు. 'మూలాది బిల పర్యంతం' –

ఇక్కడ బిలం అంటే బ్రహ్మరంధ్రమే. మూలాధార స్థానాన్ని కూడా బిలం అంటారు. ఇక్కడ నుండి అక్కడ వరకు ఉన్న బిలమార్గం పద్మనాలం వలె ఉంటుంది. ఇక్కడ నుండి అక్కడ వరకు ఆ మహాత్రిపురసుందరి మెరుపుతీగలా ప్రకాశిస్తోంది. అటువంటి తల్లిని ధ్యానిస్తే, ఆవిడ 'భవనాశినీ'.

94. కౌలినీ - శ్రీ కౌలిన్యై నమః

ఇవన్నీ ఒకే భావసంబంధమైన నామాలు. కులసంబంధమైనది 'కౌలినీ'. అనగా అమ్మవారు ఇంతవరకు చెప్పిన ఈ కులములు అన్నింటి యొక్క సమూహ స్వరూపం.

కౌలినీ అనే దానికి మరొక అర్థం ఉంది. తరువాత నామంతో కూడా దీనికి అనుబంధం ఉంది. కులం, అకులం రెండింటి మధ్య ఉన్న అనుబంధమే కౌలము.

కులము, అకులమని రెండు చెప్పారు. షట్చక్రములను కలుపుకుంటే కులం. అకులం అంటే సహస్రార స్థానం. ఈ ఆరింటికి అది అతీతం. ఈ ఆరింటిలో లెక్కకాదది. అది పరమగమ్యం. ఇవన్నీ మజిలీలు. అది గమ్యం. మజిలీ ముఖ్యమా? గమ్యం ముఖ్యమా? గమ్యమే ముఖ్యం. కానీ మజిలీలు లేనిదే గమ్యం లేదు. కులము ద్వారా అకులాన్ని తెలుసుకోవాలి. ముందు కుల నామాలని చెప్పారు, తరువాత అకులాన్ని చెప్పారు. కులము ద్వారా అకులానికి వెళ్ళాలి అంటే షట్చక్రములనే కులము ద్వారా అకులమైన సహస్రారానికి చేరుకోవాలి. ఈ కులము నుండి అకులానికి ఉండే గమనం, పద్ధతి, మార్గం అంతా కలిపితే దానికి **'కౌలినీ'** అని వివరణ.

'కులం శక్తిరితి ప్రోక్తం అకులం శివ ఉచ్యతే'

కనుక సహస్రార స్థానాన్ని శివం, శివస్థానం అంటారు. ఈ కులంలో సంచరించే కుండలినిని శక్తిస్థానం అంటారు. దీనికి ముందు చెప్పుకున్న దీపం, వెలుగు ఉదాహరణ తీసుకుంటే, దీపం సహస్రారం లాంటిది. వెలుగు కులం లాంటిది. మొత్తం వెలుగే అంతా ప్రసరించినట్లుగా, ఆ దీపం నుండి వచ్చే చిచ్ఛక్తి ఈ కులం అనబడే ఇళ్ళల్లో తిరుగుతోంది. కానీ ఎన్ని ఇళ్ళల్లో తిరిగినా, జ్యోతిదేగా

ఆ వెలుగు . కనుక శివునిదేగా ఈ శక్తి. యోగికి మూలాధారం నుండి బయలుదేరిన కుండలినీ రూపశక్తి, క్రమక్రమంగా అక్కడ ఉన్న శివుని కలుస్తోంది. అకులం శివస్థానం. కులం శక్తి స్థానం. కులంలో ఉన్న శక్తి, అకులంలోని శివునిదేగా. కనుక ఇక్కడ దాకా వచ్చిన వెలుగు అక్కడ దీపానిదే కనుక ఆ దీపస్థానం సహస్రారం అనుకుంటే వెలుగుస్థానం కుండలినీ. ఆ వెలుగు మళ్ళీ తన స్వరూపాన్ని తాను తెలుసుకుంటూ వెళ్ళడమే. ఇది కుండలినీ ఉపాసన.

కులం శక్తిరితి ప్రోక్తం అకులం శివ ఉచ్యతే
కులే అకులశ్చ సంబంధః కౌలమిత్యభిధీయతే

అని వివరించారు. ఈ కులమునకు, అకులమునకు ఉన్న సంబంధాన్ని **'కౌలము'** అని అంటారు. ఆ కౌల సంబంధ శక్తి కనుక కౌలినీ అని వివరిస్తున్నారు. అంటే ఇప్పుడు కులం నుండి తల్లి కౌలం అవుతోంది. అంటే అకులం వైపు ప్రయాణిస్తున్నది కనుక కుల–అకుల సంబంధం.

నిజానికి కులకుండం అంటే మూలాధారం. ఇది కులస్థానం. అకులం సహస్రారం. ఇదొక కొన, అదొక కొన. ఇక్కడ నుండి అక్కడకు సాగే గమనమే కౌలమార్గం. ఆ కౌల మార్గంలో సంచరించే కుండలినియే కౌలినీ అని అర్థం. అంతేకాదు కులసంబంధమైన సర్వవిజ్ఞానములు కలిపితే కౌలినీ అన్నారు. కులసంబంధమైన అంటే మునుపు చెప్పిన సంప్రదాయములు, పద్ధతులు, ఆచారములు ఇవన్నీ కలిపితే కుల సంబంధమైనవి కనుక వాటికి **'కౌలినీ'** అని అర్థాన్ని చూపిస్తున్నారు.

కులదేవతల రూపంలో ఉన్నదని 'కౌలినీ'కి మరొక అర్థం.

ఒకొక్క వంశానికి, ఒకొక్క కులానికి కొందరు దేవతలుంటారు. అవి కూడా అమ్మవారి రూపములే. సమస్త కులదేవతలు అమ్మవారి రూపములు, పరాశక్తి రూపములే. గ్రామదేవతలు, కులదేవతల రూపాలతో అనుగ్రహిస్తున్నది జగన్మాత. కులదేవతారాధనలు మానేయరాదు. అవి ఉండవలసిందే. ఇక్కడ కౌలినీ అంటే కులదేవతల రూపంలో ఉన్నది అని అర్థం.

95. కులయోగినీ - శ్రీ కులయోగిన్యై నమః

కులయోగినీ అంటే కుండలినీ రూపమైన యోగదేవత అని అర్థం. కులముగా ఉన్న యోగినీదేవి. యోగము అంటేనే కలయిక. ఇక్కడ క్రమంగా ఆ కుండలినీరూప చైతన్యం శివునితో యోగం పొందుతోంది. ఆ యోగం పొందిన శక్తి 'కులయోగినీ'.

యోగం అంటే కలయిక, సాధన అని అర్థం. సాధనారూపంగా ఉన్న తల్లి కులయోగిని. ఇంతే కాకుండా కులము అంటే సమూహం అని అర్థం తీసుకోవాలి. ఇది సాధారణంగా ఉన్నదే. సజాతీయ సమూహమును కులమంటారు. సజాతీయ అంటే ఒకే లక్షణం కలిగిన ఒక గుంపుని కులము అనాలి. నిజానికి లక్షణం ఒక్కటే. కానీ వారందరూ విడివిడిగా ఉండి కలిశారు కనుక కులం అన్నప్పుడు ఏకత్వం, అనేకత్వం రెండూ కనబడతాయి. లక్షణం చేత ఏకత్వం. అనేకమంది ఉన్నారు కనుక కులం.

అమ్మవారి శ్రీచక్రంలో త్రైలోక్యమోహనచక్రం నుండి బిందువు వరకు ఉన్న శక్తులు అన్నింటిని కలిపితే యోగినులు. ప్రకట, గుప్త, గుప్తతర, సంప్రదాయ, కులోత్తీర్ణ, నిగర్భ, రహస్య, అతిరహస్య, పరాపరాతి రహస్య అనేవారు యోగినులు. ఈ యోగినులు ఒకొక్కరికి మళ్ళీ పరివారములు చాలా ఉంటాయి. ఇవన్నీ కలుపుకుంటే ప్రధానంగా అరవైనాలుగు కోట్లు. ఒకొక్క ఆవరణ చొప్పున ఇంకా చాలా సంఖ్య ఉంది. ఇలా యోగినీ సమూహం అంతా అక్కడ ఉన్నారు. ఇవన్నీ శ్రీచక్రంలో ఏకజాతితో ఉన్న కులం కనుక మొత్తం ఈ తొమ్మిది ఆవరణలు లేదా ఎనిమిది ఆవరణలలో ఉన్న వారందరిని కలిపి యోగినులు అంటే, ఈ కులంతో కూడి ఉన్నతల్లి కులయోగిని అవుతున్నది. కులయోగిని అంటే శ్రీచక్రంలో ఉన్న సమస్తశక్తులతో కూడుకున్న తల్లి.

ఇప్పటి వరకు మొత్తం శ్రీచక్రంలో ఆ బిందుస్థానం వరకు ఉన్న ఆవరణ దేవతలు అందరూ చెప్పబడ్డారు. అదేవిధంగా సహస్రారానికి క్రింద ఉన్న మొత్తం ఆరుచక్రాలలో ఉన్న దేవతలు చెప్పబడుతున్నారు. అంటే దీనికీ, దానికీ సమన్వయం ఉంది. ఒకానొక సందర్భంలో చెప్పబడే శ్రీచక్రాన్ని మన శరీరంలో ఎలా

అన్వయించుకోవాలనే దానికి ఇదంతా సహకరిస్తుంది.

మనం అందరం శ్రీచక్రం ఉన్నవాళ్లమే. అందులో ఉన్న 'శ్రీ'ని తెలుసుకుంటే ప్రతివారు శ్రీచక్రోపాసకులే. నా కులంలో శ్రీ ఉండాలని కోరుకోవాలి. మొత్తం నా కుటుంబంలో, నా తరువాత రాబోయే వారసులలో శ్రీ ఉండాలని దాని అర్థం కాదు. కాదని కూడా కాదు. నా ఇంట్లో, నా వంశంలో కులం ఉండాలని కోరుకుంటే తప్పేం లేదు కానీ పరమార్థం ఒకటి ఉంది కదా. కులం అనగా 'శ్రియం వాసయ మే కులే'. ఇక్కడితో కులనామాలు పూర్తి అయిపోయాయి.

96. అకులా – శ్రీ అకులాయై నమః

అకులా అంటే సహస్రార స్థానం. కులం ద్వారా అకులం చేరుకోవాలి. అంతేకాని కులం అక్కర్లేదు అని దాటిపోతే అకులానికి చేరలేరు. కులాచారాన్ని పాటిస్తేనే, ఎప్పటికైనా కులాతీత స్థితికి వెళ్తారు.

కౌలినీ, కులయోగినీ నామాలకు కాళీతంత్రం అనే తంత్రశాస్త్రంలో అద్భుతమైన వేదాంత సమన్వయం చేయబడింది. కులము అంటే అనేకం యొక్క సమూహం. అకులం అంటే ఏకం. ఏకతత్త్వం అంటే పరమాత్మ, అనేకతత్త్వం అంటే ప్రపంచం. అనేక రకాల ఉపాధులు. ఈ అనేకం అంతా ప్రపంచానిదే. పరమాత్మ మాత్రం 'ఏకం అద్వితీయం బ్రహ్మ'. కనుక ఇప్పుడు రెండే ఉన్నాయి. కులం, అకులం. పరమాత్మ అకులం.

మనం కులంలో ఉన్నాం. అకులంలో లేమని ఒప్పుకోవలసినదే. మన శరీరం కూడా కులమే. ఇంద్రియాలన్నీ కలిసి ఉంటే ఇదీ కులమే. నా శరీరం కులం, ఈ ప్రపంచం కులం.

కులంలో ఉన్న మనం ఈ కుల–అంగనని తెలుసుకోవాలి. అంటే ఈ ప్రపంచంలో, ఈ శరీరంలో అనేకం అయిన దానిలో చైతన్యరూపంగా అమ్మవారు ఉన్నారు. ఆ అమ్మవారిని తెలుసుకుంటూ వెళ్తే కులం నుండి అకులానికి వెళ్ళగలరు. **శరీరమే కులం. ఆత్మయే అకులం** అన్నది కాళికా తంత్రం. ఎంత అద్భుతమైన

సమన్వయం. ఇదొక్కటి ఆలోచించుకుంటే చాలు. ఇప్పుడు మనం పొందవలసినది ఆత్మని. అకులం–ఆత్మ ఒక్కటే. సృష్టిలో ఆత్మరూపంతో అందరూ ఒక్కటే. అందరూ 'నేను' అని ఆత్మనే చెప్తారు. కానీ తేడా కులంలోనే వచ్చింది.

శరీర కులం. ప్రపంచ కులం. ఈ కులం ద్వారానే అకులాన్ని పొందగలగాలి. శరీరమనే కులంలో ఆత్మ అనే అకులం పొందడానికి కులమే సాధనం అవుతోంది.

శరీర కులం నుండి ఆత్మ అనే అకులాన్ని చేరాలని కాళీతంత్రం చాలా అద్భుతంగా చెప్పింది. మొత్తానికి కుండలినీ యోగం అని పేరు పెట్టినా, మంత్రోపాసన అని పేరు పెట్టినా, దేవతా పూజ అని పేరు పెట్టినా, ప్రాథమిక దశలో ఇవన్నీ ఉపాసనలు అని చెప్పబడతాయి. పరమార్థదశలో ఇవన్నీ ఉపనిషత్తులుగా పర్యవసిస్తాయి.

'అకులా' అనే నామం వచ్చేటప్పటికల్లా ఈ కులములకి చైతన్యం ఇస్తూ కులానికి అతీతంగా ఉన్న ఏకస్వరూపిణి అని ఒక అర్థం. సహస్రారస్థానంలో ఉన్నది 'అకులా'. 'అకులా' అయినది ఎలా ఉంటుంది? 'అకులా'–'సమయాంతస్థా'–'సమయాచారతత్పరా'. ఈ మూడు నామాలకు ఒక సంబంధం ఉంది.

97. సమయాంతస్థా - శ్రీ సమయాంతస్థాయై నమః

అకులంలో అమ్మవారు 'సమయ' అనే రూపంగా ఉంటోంది. కనుక 'సమయాంతస్థా' అని చెప్పారు. సమత్వం యొక్క స్థితిని సమయము అంటారు.

'కులం శక్తిరితి ప్రోక్తం అకులం శివ ఉచ్యతే' – అకులం శివస్థానం, కులం శక్తిస్థానం. ఇంతవరకు 'కులాంగనా' వెళ్ళి అకులంలో శివునితో కలిసింది. శక్తి శివునితో కలిసింది. ఆ రెండూ కలిస్తే సమం. సమం అంటే రెండింటి యొక్క సామరస్యం. ఈ రెండు సమస్థానంలో కలిసిపోయాయి. ఇప్పుడు శివశక్తులు ఏకం అయిపోయాయి. ఈ శివశక్తులు ఏకమైన స్థితిని సమయం అంటారు. ఆ స్థితిలో సహస్రారంలో భాసిస్తోంది కనుక సమయాంతస్థా. ఆ సమయాంతస్థా అయిన చైతన్యాన్ని పొందవలసిన విధానం 'సమయాచారం'. సమయాచారం అంటే శివశక్తుల

ఏకత్వాన్ని మర్చిపోకుండా ఉపాసన చేస్తుండాలి. ఇది అనేక రకాలుగా మొదటి నుండి తెలుసుకుంటున్నాం. శక్తి అంటే ప్రపంచమంతా వ్యాపించిన చైతన్యం. ఇది అందరికీ అనుభవం ఉంది. ఈ చైతన్యానికి మూలమైనవాడు పరమాత్మ. అతడు శివుడు. ఈ రెండింటికి అనుబంధం ఉందని ఎరుక ఎప్పటికీ ఉండాలి. మనం ప్రపంచాన్ని చూస్తున్నాం, ప్రపంచంలోని శక్తిని చూసి మురిసిపోతున్నాం. ఇది కావాలని అడుగుతున్నాం కానీ ఈ శక్తి ఎవరిదో ఆ పరమేశ్వరుని గుర్తు తెచ్చుకుంటే, ఎల్లవేళలా ఆ స్పృహలో ఉంటే... శక్తి, శివుడూ కలిసే ఉన్నారు.

ఈశ్వరుని విస్మరించకుండా, ప్రపంచాన్ని చూడగలిగితే అదే పెద్ద సమయాచారం. అదే 'సర్వం బ్రహ్మమయం జగత్' అనే మాట. విశ్వమంతా ఆయన శక్తితోనే ఉంది అంటే ఇంక నేను ఎవరు? నాలో ఉన్న శక్తి వేరా? ఇది కూడా ఈశ్వరచైతన్యమేగా. ఇప్పుడు నేను ఎవరయ్యాను? నేను అని వేరే లేదు. అంతా ఒక్కటే అనే స్థితికి వెళ్ళగలం. ఇది క్రమంగా అద్వైతస్థితికి చేర్చుతుంది.

సమయాచారమన్నా, అద్వైతమన్నా రెండూ ఒక్కటే... వేదాంత మార్గమే. శివశక్తి ఏకత్వాన్ని తెలుసుకుని చేసే ఉపాసన సమయాచారం. శ్రీవిద్యోపాసన చేసేటప్పుడు ఎప్పుడూ శివశక్తుల ఏకస్వరూపం ఎరుకలో ఉండాలి. ఇది చేస్తేనే తల్లిదండ్రులను ఉపాసించినట్లు అవుతున్నది. ఈ తల్లిదండ్రులను ఉపాసించడం అయినప్పుడు మనం పిల్లలమవుతున్నాం. తల్లిదండ్రులు–పిల్లలు అనే భావన చాలా చక్కనిది. అలా కాకుండా కేవలం శివుని విస్మరించి, శక్తిని మాత్రం ఉపాసిస్తే అది సమయాచారం అనిపించుకోదు. దాన్ని క్షుద్రాచారం అంటారు. శివశక్తుల ఏకత్వం ఎప్పుడూ మర్చిపోరాదు. వారి సామ్యములు శాస్త్రంలో ఎక్కడెక్కడ ఉన్నాయో పరిశీలించాలి. సమయాచారం అనే దానికి వ్యాఖ్యానం చెప్తున్నారు భాష్యకారులు. 'సమయము' అంటే 'సామ్యము'. ఈ సామ్యములు ఎన్ని రకాలుగా ఉన్నాయో చూడాలి.

ఒకటి **అనుష్ఠానసామ్యం.** రెండవది **అధిష్ఠానసామ్యం.** మూడవది **రూపసామ్యం.** నాలుగవది **నామసామ్యం.** ఐదవది **అవస్థాసామ్యం.** ఇవి సమయాలు.

మొత్తం ఈ పంచవిధసామ్యాలు తెలిసి ఉపాసన చెస్తే అది సమయాచారం. మంత్రం చేస్తున్నప్పుడు కూడా ఈ స్పృహ ఉండాలి. ఊరికనే అక్షరాలు వల్లెవేస్తే లాభంలేదు. ఎప్పటికీ జడంగా మిగిలిపోకూడదు. ఆ చైతన్యాన్ని తెచ్చుకోవాలి. ఆ చైతన్యానికి లలితాసహస్రం సహకరించాలి. మంత్రం చేసినా, యంత్రం చేసినా, పూజ చేసినా వారిద్దరినీ మరచిపోరాదు. హయగ్రీవస్వామివారు లలితా త్రిశతి అంతా చెప్పి, శ్రీచక్రం గురించి చెప్తూ '**త్రికోణరూపిణీ శక్తిః బిందురూపః శివస్మృతః**' అన్నారు. శ్రీచక్రంలో త్రికోణాలన్నీ శక్తిస్వరూపాలు, బిందువులన్నీ శివస్వరూపాలు. ఆ రెండు కలిస్తే శ్రీచక్రమయ్యింది. శ్రీచక్రమంటేనే శివశక్తుల రూపం. అమ్మవారి విగ్రహం అంటే శ్రీచక్రం యొక్క రూపమే. ఆ విగ్రహం కూడా శివశక్తుల రూపమే.

సౌందర్యలహరిలో శంకరులు చెప్పిన భావనని మననం చేసుకుంటే చాలు. ఎదురుగా కామాక్షీదేవిని చూస్తుంటే శివుడు ఎక్కడున్నాడని వెతకక్కర్లేదు. ఆవిడలోనే ఉన్నాడు. "అమ్మా! నీలోనే శివుడున్నాడు. లేకపోతే ఆ చంద్రలేఖ, మూడు కళ్ళు... ఇవి మా అయ్యగారి లక్షణాలు నీలో కనిపిస్తున్నాయి. పోనీ అయ్యవారే అందామా అంటే ఆ ఎర్రదనం, ఆ వక్షఃస్థలం ఇదంతా స్త్రీత్వం. ఇది అమ్మవారు. ఈ రెండు కలిసి నువ్వే". ఇది శివశక్తులకు రూపసామ్యం.

అంతేకాదు వారు విడివిడిగా ప్రక్కప్రక్కన ఉన్నా, ఇద్దరి రూపాలు ఒకేలా ఉంటాయి. ఆయన ఆదికిరాతుడు వేషం వేసుకుని వెళ్తే, ఈవిడ శబరిగానే వెళ్తుంది. ఆయన యోగిగా కూర్చుంటే, ఈవిడ యోగినిగా ప్రక్కన ఉంటుంది. ఆయన భోగిగా ఉంటే, ఈవిడ భోగరూపిణిగా ఉంటుంది. ఇది రూపసామ్యం.

నామసామ్యం - పరిశీలిస్తే ఇద్దరి పేర్లు ఒక్కటే. శివ-శివా. శంకర-శాంకరీ. రుద్ర-రుద్రాణీ. భవ-భవానీ. మృడ-మృడానీ.

అధిష్ఠానసామ్యం - అధిష్ఠానం అంటే వారు దేనియందు ఆరాధింపబడు తున్నారో దానికి అధిష్ఠానమని అంటారు. శివుని ఆరాధించాలంటే లింగము. శక్తిని ఆరాధించాలంటే శ్రీచక్రం. ఈ రెండూ అధిష్ఠానాలు. మనం శివలింగాన్ని ఆరాధన చేస్తే లింగం శివశక్తుల ఏకత్వం. '**శివశక్త్యోశ్చ మేళనం లింగముచ్యతే**' శివలింగం

అంటేనే వారి ఉభయుల రూపం. పానవట్టం అమ్మవారు, లింగం శివుడు అని ఒక భావన ఉన్నది. బాణలింగాల వంటి వాటికి పానవట్టం ఉండదు. అది అంతా కలుపుకుని శివశక్తులరూపమే. అది ఒక ప్రత్యేక అంశం. కనుక లింగమంటేనే శివశక్తుల ఏకత్వం. శ్రీచక్రమంటే బిందువులన్నీ శివుడైతే, త్రికోణములన్నీ అమ్మవారు. ఆ అధిష్ఠానం కూడా శివశక్తులరూపమే కనుక అధిష్ఠానసామ్యం.

అనుష్ఠాన సామ్యం – వారు చేసే పనులు. వారివి అయిదే అనుష్ఠానములు. పంచకృత్యములైన సృష్టి, స్థితి, సంహార, తిరోధాన, అనుగ్రహ. ఈ పనులు శక్తే చేస్తోంది. కానీ శక్తి, ఆయన కలిస్తే గాని ఏదీ జరగదు. వారిద్దరూ కలిసే ఉంటారు. శివుడు లేనిదే శక్తి వ్యక్తం కాదు. శక్తి లేనిదే శివుడూ వ్యక్తం కాడు. ఇరువురు కలియవలసిందే. అదే అర్ధనారీశ్వరస్వరూపం. అర్ధనారీశ్వరస్వరూపమే శ్రీచక్ర స్వరూపం. శివశక్తుల ఏకత్వాన్ని మనం కృత్యసామ్యంలో చూడాలి. సృష్టి, స్థితి – ఈ రెండూ కూడా అమ్మవారి పనులు.

'ప్రపంచసృష్ట్యున్ముఖలాస్యకాయై సమస్తసంహారకతాండవాయ నమశ్శివాయైచ నమశ్శివాయ' అన్నారు శంకరభగవత్పాదులవారు. 'సృష్ట్యున్ముఖలాస్యకాయై'–ఆవిడ ఈ సృష్టి అంతా జాగ్రత్తగా జరిగేటట్లు చూస్తుంది. సృష్టి స్థితులు ఆవిడ పనులు. ఈయన పనులు రెండు – సంహారం, తిరోధానం. అయితే ఆవిడ ఈ రెండు పనులు చేస్తున్నప్పుడు ఆయన సహకరించకపోతే చేయలేదు. ఆయన ప్రక్కనుండి సహకారం అందిస్తాడు. ఆయన తన రెండు పనులు చేస్తున్నప్పుడు ఆవిడ సహకరిస్తూ ఉంటుంది. అలాగ రెండింటికి ఆయనకు, రెండింటికి ఆవిడకి పరస్పర సహకారం ఉంటుంది. దీనిని కృత్యసామ్యం లేదా అనుష్ఠాన సామ్యం అని అంటారు. సంహార, తిరోధానాలు ఆయన కృత్యాలు. అనుగ్రహం వీరిద్దరి ఉమ్మడి కృత్యం. కలిసి చేసే ఏకకృత్యం.

అవస్థాసామ్యం – అవస్థాసామ్యం అంటే వారు ఏ ఏ స్థితులలో ఉంటారో అంటే వివిధాలైన రూపాలతో గాని, వివిధ అవతారాలతో గాని వచ్చినప్పుడు ఇద్దరూ ఒకరికి ఒకరు తగినట్లుగా ఉంటారు. ఆవిడ కామేశ్వరిగా రాగానే కామేశ్వరుడై అదే అవతారంగా కనిపిస్తున్నాడు. ఇదంతా అవస్థాసామ్యం. ఈ విధంగా పంచవిధ

సామ్యములు శివశక్తులకున్నాయి. ఇవి తెలుసుకొని ఎవరు ఆరాధన చేస్తారో వారిని సమయాచారపరాయణులు అంటారు.

98. సమయాచారతత్పరా – శ్రీ సమయాచారతత్పరాయై నమః

సమయాచారపరులు ఎవరో వారి పట్ల అమ్మ ప్రీతి కలిగి ఉంటుంది. అమ్మ అనుగ్రహం కావాలంటే సమయాచారులు కావాలి. శ్రీవిద్య ఉపాసకులకి 'సమయినులు' అని పేరు ఉంది. 'సామయికులు' అని కూడా వ్యవహారం. 'సమయినాం' అని శంకరులు సౌందర్యలహరిలో కూడా వివరిస్తారు. సమయం అంటే శివశక్తుల ఏకత్వం. ఆ ఏకత్వస్థితిగా సహస్రారంలో ఉంది కనుక 'సమయాంతస్థా'. అది తెలిసి చేసే ఉపాసన సమయాచారం.

కొందరు సమయాచారాన్నే దక్షిణాచారంగా వ్యవహరిస్తారు. వేదపద్ధతిలో సాగితే దక్షిణాచారం. వేదానికి విరుద్ధంగా సాగితే వామాచారం. వామాచారం గొప్పదా? దక్షిణాచారం గొప్పదా? దేని సంప్రదాయం దానికుంది. దేని గొప్పదనం దానికి ఉంది. మిశ్రమ సంప్రదాయం అని మరొకటి ఉంది. అంటే అటు దక్షిణ, వామాలకి రెండింటికి ఎలా కలపాలో తెలిసిన మహాత్ములు కలిపారు. ఎవరో అడ్డదిడ్డంగా కలపడానికి లేదు. ఏది ఎక్కడ, ఎలా కలపాలో అనేది ఋషులవంటి ఉపాసకులకి తెలుస్తుంది. వారికో నమస్కారం.

ఆపస్తంబసూత్రాలు రచించేటప్పుడు ఆపస్తంబుడు వైదిక సంప్రదాయాన్ని చెప్తున్నానంటూ అక్కడ సమయాచారమనే మాటని వాడారు. **'అథాఽతః సామయాచారికానస్మాన్ ధర్మాన్ వ్యాఖ్యాస్యామః'** అంటారు. వేదమార్గముతో వచ్చేవి అన్నీ సమయాచారాలే. సమయాచారతత్పరా అంటే వైదిక మార్గాల ద్వారా ఆరాధన చేసే సాత్త్వికులపట్ల 'తత్పరా'–ఆసక్తి కలది. వాత్సల్యంతో వారిని అనుగ్రహిస్తున్నది. వశిన్యాదివాగ్దేవతలు అమ్మ మన పట్ల తత్పరురాలై ప్రీతి కలిగి అనుగ్రహించాలంటే సమయాచారాన్ని అనుసరించమని చెప్తున్నారు. అందరూ అమ్మ అనుగ్రహం కోసం చూస్తున్నవారమే. కనుక మనం చేయవలసింది సమయాచారం.

సమయాచారం రెండు పద్ధతులతో ఉంటుంది. ఒకటి బాహ్యం. ఇంకొకటి అభ్యంతరం. రెండు రకాల ఆరాధనలు సాగాలి. సాధన బహిర్యాగ, అంతర్యాగాలు అనే రెండు రకాలుగా సాగాలి. బహిర్యాగం అంటే బాహ్యంగా చేసే ఆరాధన. అంతర్యాగమంటే లోలోపల చేసే ఆరాధన. రెండూ సమన్వయించుకుంటూ వెళ్ళాలి. లోపల చేసే ఆరాధనని 'పరారాధన' అంటారు. బయట చేసే దానిని 'అపరా' అంటారు. పరా, అపరా – ఈ రెండూ కలిపిచేస్తే 'పరాపరా' అంటారు. **'పరయా అపరయా పరాపరయా సపర్యయా'** అని అమ్మవారి ఆరాధన చేసేటప్పుడు వాడే పదాలు. ఎదురుగా శ్రీచక్రం ఆరాధన చెయ్యడం–అపరమా! పరమా! అపరమేగా అంటే బాహ్యమేగా. అయితే మరి పరిపూర్ణత లేదు. మరి ఎందుకు శ్రీచక్రం ఆరాధించాలి? అది చేస్తూనే అంతర్ముఖంగా కూడా చేయాలి. 'అంతర్ముఖసమారాధ్యా బహిర్ముఖసుదుర్లభా' రెండూ కలవాలి. బాహ్యం మానేయమని చెప్పడం కాదు. 'భావములోన బాహ్యము నందును గోవింద గోవింద అని కొలువవో మనసా' (అన్నమయ్య) అనే విధంగా రెండూ జరగాలి. ఇది శ్రీవిద్యాసంప్రదాయంలోనే కాదు. ఏ ఉపాసనా సంప్రదాయంలోనైనా ఇదే పద్ధతి.

నిరంతరం భగవత్సన్నిధిని భావన చేస్తూ, ఒక దీక్ష స్వీకరించి, ఆ పరమాత్మని ఆ దేవతారూపంగా సాధన చేసేవారిని ఉపాసకులు అంటారు. ఏ దేవతా ఉపాసకులు అయినా ఇదే పద్ధతి.

ఏ సంప్రదాయంలో ఉపాసించినా హిందూమతంలో ప్రాథమిక పద్ధతులు ఒకటే. ఇవన్నీ కలిపి ఒకే హిందూమతంగా వ్యవహారం. విష్ణు ఉపాసనైనా, శివోపాసననైనా, శక్త్యుపాసనైనా, సూర్యోపాసనైనా అన్నీ కలిపి ఒకే మతంగా, ఏ దేవతా భక్తులు వారికి తగ్గట్టు రెండూ వాడుకోవచ్చు. బహిర్యాగ, అంతర్యాగాలు రెండూ కావాలి. అంతర్యాగం మళ్ళీ మూడు విధాలుగా ఉంటుంది. ఇక్కడ నుండి ఈ మూడూ మొదలవుతాయి. సమయాంతస్థా నుండి క్రమంగా వెళ్తే అంతర్యాగం వస్తుంది. అంతర, అంతర–తర, అంతర–తమ.

ఒకరింట్లోకి మనం వెళ్ళామంటే కొందరికి మొదటి ప్రాంగణం వరకే

ప్రవేశం. ఇంకొందరికి మధ్యలో వరకు. కొందరికి లోపలి గదుల వరకు ప్రవేశం. అలాగ అంతర, అంతరతర, అంతరతమ. ఇంకా లోపలికి వెళ్ళగలగాలి. ఇప్పటి నుండి చెప్పబడుతున్నది అంతర్యాగ క్రమమే. ఇప్పుడు సమయాంతస్థా అన్నప్పుడు అంతర అనే పద్ధతిని చూపిస్తున్నారు. హృదయము నందు శ్రీచక్రభావన చేయగలిగి, అక్కడ ఆరాధన చేయగలిగితే దానిని సమయాచారం అంటారు. దహరచక్రమునందు శ్రీయంత్రాన్ని భావన చేస్తూ అంటే అమ్మవారి స్వరూపాన్ని భావన చేస్తూ ఆరాధన చేస్తే అది సమయాచారం. ఇది అంతర. తరవాతది అంతరతర.

'మూలాధారైకనిలయా బ్రహ్మగ్రంథివిభేదినీ
మణిపూరాంతరుదితా విష్ణుగ్రంథివిభేదినీ
ఆజ్ఞాచక్రాంతరాళస్థా రుద్రగ్రంథివిభేదినీ'

ఇది అంతరతర ఉపాసన.

99. మూలాధారైకనిలయా – శ్రీ మూలాధారైకనిలయాయై నమః

కుండలినీ శక్తికి ప్రధానస్థానం మూలాధారం. కుండలినీ అనే గృహప్రవేశం అమ్మవారు ఎలా చేసి ప్రవేశిస్తుందో ముందు నామాలలో చెప్పుకున్నాం. 'తత్సృష్ట్వా తదేవ అనుప్రావిశత్' – బ్రహ్మరంధ్రం నుండి ఒక్కసారి మూలాధారం దాకా ప్రసరించి అక్కడ గూడుకట్టుకున్న శక్తి క్రమంగా ప్రాణరూపంలోంచి హృదయనాడికి వస్తుంది. ప్రతివారిలో ఆ హృదయనాడి నుండి క్రమంగా అన్ని నాడులకు ప్రసరింపబడుతూ వెళ్తూ ఉంటుంది. అయితే సాధారణంగా ఈ కుండలినీ రూపశక్తి శరీరమంతా చైతన్యంగా ప్రసరిస్తున్నా, ప్రధానంగా క్రిందిభాగానికే వెళ్ళి చుట్టచుట్టుకుని ఉంటుంది. ఈ ప్రసరణ అన్నప్పుడు జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఒక రాగితీగలో విద్యుచ్ఛక్తి ప్రవహించినట్టు అని ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

మూలాధారైకనిలయా – కుండలినీ మూలాధారంలో ఉన్నప్పుడు క్రిందికే ప్రవహిస్తూ ఉంటుంది. 'మూలాధారైకనిలయా బ్రహ్మగ్రంథివిభేదినీ'– ఆ క్రింద ఉన్న కుండలినీ బయలుదేరుతున్నప్పుడు ఎలా పైకి వెళుతుందో వివరిస్తున్నారు.

ఇది సాధన. ఇది 'అంతరతర' సాధన. 'లలితాత్రిపురసుందరీం కుండలినీమ్' అని అంటున్నాం కనుక ఆ తల్లియొక్క ఒక రూపమిది. ఆ రూపాన్ని ధ్యానించాలి. **'మూలాధార-ఏక-నిలయా..'** 'ఏక' అంటే ప్రధానం. మూలాధారాన్ని ప్రధానంగా చేసుకుని ఉన్న తల్లి కదలి ఒకొక్క గ్రంథి భేదనం చేస్తోంది. గ్రంథి అంటే ముడి. ఆ ముడి విప్పితే గాని మనకు ఆ పైన ఉన్న స్థితి తెలియదు. తాళం తీస్తేగాని పెట్టెలో ఉన్నది తెలీదు, ముడి విడితే గాని ఆ పైకి మనం వెళ్ళలేం. యోగశాస్త్రం 'గ్రంథిభేదన విద్య' అని చెప్తోంది. వేదాంత శాస్త్రం కూడా ఈ మాట చెప్తోంది.

'భిద్యతే హృదయగ్రంథిః ఛిద్యంతే సర్వసంశయాః
క్షీయంతే చ అస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే'

అని ముండకోపనిషత్ చెప్తున్న మంత్రం. అక్కడ 'భిద్యతే హృదయ గ్రంథిః ' లోపల ముడులు విడిపోవాలి. ఆ పరమాత్మ అనుగ్రహం కలిగితే అప్పుడు ముడులు విడుతాయి. దానికి మన దృష్టి పరమాత్మ వైపు సాగాలి... పరమాత్మ దృష్టి మన వైపు పడాలి. పిల్లవాడు "అమ్మా!" అని తల్లి వైపు నడుస్తూ ఉంటే, అప్పుడు తల్లి పిల్లవానిని చూస్తుంది. వీడు నా వైపు వస్తున్నాడని అప్పుడు ఎత్తుకుంటుంది. మన నడక అటు వెళ్ళకుండా మన తిరుగుడు మనం తిరిగితే, మన మానాన మనల్ని వదిలి ఆవిడ పని ఆవిడ చూసుకుంటుంది. మన ప్రయత్నం మనం చేయాలి అంటే అమ్మ వైపు తిరగాలి. అలా తిరిగితే తప్పకుండా అనుగ్రహిస్తుంది. కుండలినీ తిరగడం అంటే పరమాత్మ వైపు అభిముఖం అవ్వడం.

కుండలినీ అంటే చిన్న ఉదాహరణతో చూద్దాం. ఇంతవరకు ప్రపంచం వైపు తిరుగుతూ ఉన్నాం. ప్రపంచపు వస్తువులు సేకరించుకోవడం, ఇక్కడ ఎలా సుఖపడడమో ఎదురు చూడడం, ఎన్ని చెప్పినా, ఎన్ని విన్నా ఇంకా ఎన్ని ప్రోగుచేసుకోవాలో ఆలోచించడం, ఇదంతా ప్రపంచం వైపు తిరగడం. ఇన్నాళ్ళూ తిరిగాం. ఇప్పుడు ఒక్కసారి పరమాత్మ వైపు తిరుగుదాం. ఇటునుండి అటు తిరిగాం. అలాగ క్రిందికి తిరుగుతున్న కుండలినీ వెనక్కి తిరిగింది. తాను ఎక్కడి నుండి వచ్చిందో చూడడం మొదలుపెట్టింది. ఈ విధంగా ఎవరి ప్రజ్ఞ భగవంతుని వైపు

తిరగడం మొదలు పెట్టిందో, వారికి తప్పకుండా కుండలినీ జాగరణ జరుగుతుంది. వారికి కుండలిని అనే పేరు కూడా తెలియకపోవచ్చు. ఆ పరతత్త్వాన్నే జపరూపంలోనో, భక్తిరూపంలోనో, జ్ఞానరూపంలోనో నిరంతరం చింతన చేస్తూ ఉంటే క్రమక్రమంగా ప్రాపంచిక బంధాల నుండి పైకి వెళ్తూ ఉంటుందది. క్రింద దాన్ని వదిలి పైకి వెళ్తూ ఉంటుంది సరిగ్గా అంతరిక్ష నౌక వలె వెళ్తుంది. ఆ నౌక క్రిందనంతా మంచి వ్యవస్థ పెట్టి ఉంచుతారు. మొత్తం యోగమంతా అక్కడే కనబడుతుంది. పునాదులన్నీ పటిష్ఠంగా పెడతారు. అసలు ప్రయోగం మొదలు పెట్టాక అది ముందు క్రింద దాన్ని వదిలి పైకి వెళ్తుంది. పైకి వెళ్ళాక మరొక క్రిందదాన్ని క్రింద వదిలేస్తుంది. అలా వదిలి వెళ్ళిపోతూ ఉంటుంది. అలాగే కుండలిని కూడా ఒకొక్కటి వదులుకుంటూ వెళ్తూ ఉంటుంది. వేదాంతమార్గంలో అయితే ప్రాపంచిక విషయవాసనలు విడిచి పెట్టడం. యోగమార్గంలో అయితే ఒకొక్క గ్రంథిని భేదించుతూ వెళ్ళడం. కుండలిని అనబడే అంతరిక్ష నౌక మొదట విడిచి వెళ్తున్న గ్రంథి 'బ్రహ్మగ్రంథి విభేదినీ'.

100. బ్రహ్మగ్రంథివిభేదినీ – శ్రీ బ్రహ్మగ్రంథివిభేదిన్యై నమః

మూలాధారైకనిలయా బ్రహ్మగంథివిభేదినీ
మణిపూరాంతరుదితా విష్ణుగ్రంథివిభేదినీ
ఆజ్ఞాచక్రాంతరాళస్థా రుద్రగ్రంథివిభేదినీ

యోగపరంగా ఆరు చక్రాలు ఉన్నాయి. స్వాధిష్ఠానం, అనాహతం, విశుద్ధి విడిచిపెట్టి మూడే ఎందుకు చెప్పారు? మూలాధారం పునాదిగా చేసుకుని ఈ కుండలినీ ఉత్థానమై బ్రహ్మగ్రంథిని భేదించింది.

'బ్రహ్మగ్రంథివిభేదినీ' అంటేనే స్వాధిష్ఠానచక్రం పై భాగం. బ్రహ్మగ్రంథి అక్కడే ఉంటుంది. ఈ మధ్య కొందరు వీటిని గ్లాండ్స్ అని రాస్తున్నారు. ముడి అంటే అధునిక పరిభాషలో చెప్పే గ్లాండ్స్ కాదు. ఈ గ్లాండ్స్ కి, ఈ గ్రంథికి సంబంధం లేదు. ఒక డాక్టరు, "నేను వెన్నుని చాలామార్లు శస్త్రచికిత్స చేశాను. నాకు ఇంతవరకూ కుండలినీ కనబడలేదు" అన్నారు. ఇది ఎలాంటిదంటే, "రాగి తీగ కోశానండి..

విద్యుత్తు కనబడలేదు" అన్నట్లు. రాగి తీగ కోస్తే విద్యుత్ కనబడదు, వెన్ను కోస్తే కుండలినీ కనబడదు. శక్తి మనకి కనబడుతుందా? ఒకాయన, "ఆ వెన్నులోంచి ఓ ద్రవం వస్తుందండి. అదే కుండలినీ" అన్నాడు. అసలు తెలియకపోతే దేనికి పడితే దానికి ఆ పేరు పెట్టేయడమే అవుతుంది. ఇది ఆ ద్రావకం కాదు. అది అసలు భౌతిక వస్తువు కాదు. భౌతికంగా నిరూపించలేనిది.

భౌతికశాస్త్రంతో నిరూపించగలిగేదైతే ఇది కూడా భౌతికమే అవుతుంది. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని భౌతిక జ్ఞానంతో నిరూపించాలనుకోవడమే తప్పు.

'బ్రహ్మగ్రంథివిభేదినీ' – అక్కడున్న ముడి పేరు బ్రహ్మగ్రంథి. యోగికి అది భేదనం జరుగుతుంది. ఇప్పుడు చదువుతున్నప్పుడు జరిగిపోతున్నట్లే అనిపించవచ్చు కానీ అది అంత తేలిక కాదు.

ఆధ్యాత్మికసాధన ఏది చేసినప్పటికి కూడా ఏదో ఒక చక్రాన్ని దాటగలిగితే ఒక ఉన్నతస్థితి వస్తుంది. ఎప్పుడూ ఎక్కడ వేసిన గొంగళి అక్కడ లాగా పుట్టిన దగ్గర నుండి ఇదే ప్రపంచంలో, ఇదే ఉపాధితో, ఇదే ప్రజ్ఞతో ఉండిపోవడమే అయితే లాభం లేదు. పైకి వచ్చి బ్రహ్మగ్రంథి విభేదనం జరిగితే ఒక స్థితి పైకి వస్తాం. మన ప్రజ్ఞ/బుద్ధి యొక్క స్థాయి ఏ స్థితిలో ఉన్నదో దాన్ని బట్టి మన చక్రం ఏ స్థితికి ఎదిగిందో మనమే చెప్పుకోవచ్చు.

బ్రహ్మగ్రంథి విభేదనం జరిగితే ఏమవుతుంది?

మానవునికి స్థూల, సూక్ష్మ, కారణాలనే మూడు శరీరాలు ఉంటాయి. స్థూలశరీరం మాత్రమే మరణించినప్పుడు పోతుంది. లోపల సూక్ష్మశరీరం కారణశరీరంతో పాటు ఉంటుంది. ఈ రెండే తరువాతి జన్మలలోకి వెళ్తూ ఉంటాయి. శరీరం పోవడం మోక్షం కాదు. స్థూలశరీరం పోతే మరణం. సరిగ్గా కర్మ జరిగితే సూక్ష్మశరీరంతో ఇతర గతులకి వెళ్తారు. సూక్ష్మ, కారణ శరీరాలు కూడా పోతే అప్పుడు మోక్షం. మూడు శరీరాలలో ఉన్నవాడు జీవుడు. మూడు శరీరాల పాశం తీసేస్తే వాడే ఈశ్వరుడు. కనుక స్థూలశరీరం ఒకటి పోతే సరిపోదు. సూక్ష్మ, కారణ శరీరాలు అసలు వస్తువు. స్థూలశరీరం పోవడం పెద్ద విషయం కాదు. ఉంచుదామన్నా

ఉండదది. ఆ సూక్ష్మ, కారణ శరీరాలు ఉన్నాయి. కానీ బ్రహ్మగ్రంథి భేదనం జరిగాక వాని ప్రజ్ఞ ఏ స్థాయికి వెళ్తుందంటే, ఈ స్థూలదేహము నేను కాను అనే ఎరుక కలుగుతుంది. ఈ కనిపించే ప్రాపంచిక విషయములన్ని సత్యాలు కావు. ఇవి మిథ్యలు అనే భావం అప్పుడు కలుగుతుంది. ఎంత చెప్పినా ఆ భావం కలగలేదంటే బ్రహ్మగ్రంథిభేదనం జరగలేదని అర్థం.

కుండలినీ సర్పం(సార్ధత్రివలయాకార) మూడున్నర చుట్లు చుట్టుకొని తల క్రిందకి పెట్టి ఉంటుంది. యోగికి మాత్రమే పైకి లేస్తుంది. పైకి కూడా లేవలేదంటే, వానికి అసలు భగవంతుని వైపు ఆలోచనే వెళ్ళలేదని అర్థం. కనీసం పడగెత్తి అయినా చూడాలి. ఇప్పుడు దాని తరువాతి స్థితికి వెళ్తున్నాం. 'మణిపూరాంతరుదితా విష్ణుగ్రంథివిభేదినీ'.

101. మణిపూరాంతరుదితా - శ్రీ మణిపూరాంతరుదితాయై నమః

ఇవి విశ్రామస్థానాలు. విశ్రామస్థానాలలో మూలాధారం ప్రధానం. మణిపూరాంతరుదితా-మణిపూరస్థానం-విశ్రామస్థానం. గ్రంథిస్థానం-స్వాధిష్ఠానస్థానం. మణిపూరానికి వెళ్ళి ఉదయిస్తోంది అనగా మణిపూరం వద్ద కుండలినీ కాంతులు వెదజల్లుతూ దశదళాల పద్మంగా మెరసిపోతూ ఉంటుంది. కులాంగనా అయిన అమ్మవారు ఒకొక్క ఇంట్లో ఆగుతుంది. యోగికి మణిపూరం వద్ద కాస్సేపు ఆగి, విశ్రాంతి తీసుకుని మరల అక్కడనుండి పైకి వెళ్ళి 'విష్ణుగ్రంథివిభేదినీ' అక్కడికి భేదనం చేసుకొని వెళ్తుంది.

102. విష్ణుగ్రంథివిభేదినీ - శ్రీ విష్ణుగ్రంథివిభేదిన్యై నమః

అనాహతానికి పైన ఉండేది విష్ణుగ్రంథి. దీనిని భేదిస్తుంది. విష్ణుగ్రంథి భేదనం జరిగితే సూక్ష్మశరీరం నేను కాననే ఎరుక కలుగుతుంది. మనస్సు, ఇంద్రియ చైతన్యాలు ఇవన్నీ కలుపుకుంటే సూక్ష్మశరీరం. 'నేను' అనుకునే కన్ను కాకుండా మన లోపల సూక్ష్మశరీరంలో కన్ను అని ఒకటి ఉంది. అది దర్శనశక్తి. సూక్ష్మశరీరంలో

ఇవన్నీ కలిసి ఉంటాయి. ఈ దేహం పోతే మరల ఈ సూక్ష్మశరీరం పట్టుకుని పోయి ఇంకో దేహంలో దూరుతుంది. అక్కడ ఉన్న దర్శన శక్తిని అక్కడ కన్నుతో అనుసంధానం చేసుకుంటుంది. అలాగ ఈ సూక్ష్మశరీరంలో ఇవన్నీ దాగి ఉంటాయి. కానీ కొందరికి స్థూలశరీరం నేను కాదంటే మనస్సు నేను అనుకుంటారు. ప్రాణం నేను అనుకుంటారు. కానీ అవి కూడా నేను కాదు. విష్ణుగ్రంథి భేదనం జరిగితే 'సూక్ష్మశరీరం నేను కాను' అనే స్థితి అర్థమౌతుంది.

103. ఆజ్ఞాచక్రాంతరాలస్థా – శ్రీ ఆజ్ఞాచక్రాంతరాలస్థాయై నమః

అక్కడ నుండి బయలుదేరి అనాహతం దాటి ఆజ్ఞాచక్రానికి వెళ్ళాక మరొక మజిలీ తీసుకుంటుంది. మజిలీ వచ్చింది కనుక ఆజ్ఞాచక్రం. మజిలీ దగ్గర 'ఉదిత' అన్నారు. ఇక్కడ 'స్థా' అన్నారు. ఆజ్ఞాచక్రం లోపల కూర్చుంటుంది. అక్కడ సాధన చేయాలి. అందుకే పెద్దలు ఆజ్ఞాచక్ర సాధన చాలా విశేషంగా చెప్తారు. అటు తరువాత కొంతకాలానికి 'రుద్రగ్రంథివిభేదినీ'.

104. రుద్రగ్రంథివిభేదినీ – శ్రీ రుద్రగ్రంథివిభేదిన్యై నమః

'ఆజ్ఞాచక్రాంతరాలస్థా' దగ్గర రుద్రగ్రంథిని భేదించుకొని పైకి వెళ్తుంది. ఇంకా పైకి వెళ్తే సహస్రారమే. రుద్రగ్రంథిభేదనం జరగగానే 'కారణ శరీరం కూడా నేను కాను' అనే స్థితి జరుగుతుంది. ఇదివరకు చేసిన కర్మల యొక్క వాసనలన్నీ గూడుకట్టుకున్న చోటు కారణశరీరం. జీవానుభవస్థానం. దీనిని బట్టి సూక్ష్మశరీరం పనిచేస్తుంది. ఇవి రెండూ కలిసి తిరుగుతూ ఉంటాయి. రుద్రగంథి విభేదనం వల్ల కారణశరీరం కూడా నేను కాను అనే ప్రజ్ఞ వస్తుంది.

ఎప్పుడైతే స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం కూడా నేను కాను అని తెలిసిందో పాశములు మూడు ఛేదింపబడతాయి. ఆ మూడింటిలో ఏది నేను అనుకొన్నా జీవుడే. పాశం ఛేదిస్తే ఇంక పశువు కాదు. పాశం పోతే పశువు శివుడైపోతాడు. 'పాశచ్ఛేత్త్రా – పశుపాశవిమోచనీ'.

ఈ మూడు శరీరాలు కూడా నేను కాను అనుకొన్నప్పుడు, ఆ మూడు శరీరాలతో అనుభవించే జాగ్రత్, స్వప్న, సుషుప్తులు కూడా నేను కాను. మరి ఇంతకాలం దానిలో సాక్షిగా, చైతన్యంగా ఉండి దానితో కలిసిపోయి అదే నేను అనుకునే భ్రాంతి చెందాను. ఈ మూడింటికి అతీతమైన వాడను నేను అని ఇప్పుడు నాకు ఎరుక కలిగింది. అప్పుడు జీవుడు ముక్తుడవుతున్నాడు. రుద్రగ్రంథి భేదనం జరిగితేనే కారణశరీరం కూడా నేను కాను అనే స్ఫృహ కలిగి చైతన్యంగా ఈ ఎరుకతో మిగిలిపోతాడు. వాడే సహస్రార స్థానంలో ఉన్న పరమాత్మతో ఐక్యం కాగలడు. ఇదీ క్రమం. మూడు గ్రంథుల భేదనాలలో మూడు శరీరాలైన స్థూల, సూక్ష్మ, కారణశరీరాలు నేను కాననే ఎరుక కలిగింది. దీనినే–

'భిద్యతే హృదయగ్రంథిః ఛిద్యంతే సర్వసంశయాః
క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే'

అని చక్కని క్రమం చూపించారు. ఎవరికైతే రుద్రగ్రంథి భేదనం జరుగుతుందో వారికి కారణ శరీరం కూడా నేను కానని ఎరుక కలుగుతుంది. ఎరుక కలిగితే మరి వాడు బ్రతకడా? హిందూసంస్కృతిలో చచ్చిన తరువాత వచ్చేది ముక్తి కాదు. ఇక్కడ పొందకపోతే తరువాత కూడా పొందలేడని చెప్తోంది. ముక్తి ఇక్కడే పొందాలి.

శంకరభగవత్పాదులవారు **'న మోక్షో నభసః పృష్ఠే న పాతాళే న భూతలే'** – మోక్షం అనేది ఎక్కడో ఆకాశపు కొనలోనో, పాతాళంలోనో, భూమిలోనో లేదు. **ఇహైవ**–ఇక్కడే, ఇక్కడ కాకపోతే మరి ఎక్కడా లేదు అన్నారు. **'మోక్షము కలదా భువిలో జీవన్ముక్తులు కాని వారలకు'** అన్నారు త్యాగరాజస్వామివారు. బ్రతికుండగా మోక్షం పొందకపోతే తరువాత కూడా పొందలేరు.

ఇతర మత సిద్ధాంతాలకి, మన సిద్ధాంతాలకి సహస్రాంతం తేడా ఉంది. అన్ని మతాలు పాపం చేస్తే నరకానికి పోతావు, పుణ్యం చేస్తే స్వర్గానికి పోతావు – ఇంతవరకే చెప్పాయి. కానీ పాపపుణ్యాలకి, స్వర్గనరకాలకి మించి ముక్తి అనేది ఒకటుందని చెప్పగలిగిన ఒకే ఒక్క మతం హిందూమతం మాత్రమే. అందుకే ఇది సమగ్రమైనది. సంపూర్ణమైనది.

రుద్రగ్రంథిభేదనం కూడా జరిగినప్పుడు జీవభావం పోయింది. అయితే ప్రారబ్ధవశాత్తు శరీరం ఉంటుంది. కానీ ఆ స్థితికి వెళ్ళిపోయినవాడు ఈ శరీరంలో ఉన్నా, ఈ శరీరం నేను అనే భ్రాంతిలో ఉండడు. వాడు తన శరీరాన్ని, మిగిలిన శరీరాల్ని ఒకేలా చూస్తూ ఉంటాడు. వాడు చైతన్యస్వరూపుడు. ఇలా చూడగలిగిన వారే జీవన్ముక్తులు. జీవన్ముక్తులైన వారికి దేహాలు కనబడవు. అటువంటి వారే 'అహం బ్రహ్మాస్మి' అని ఉద్గానం చేస్తారు. వేదం 'అహమన్నమహమన్న మహమన్నాదో' అనే మంత్రం చెప్పింది. 'సామగాయన్నాస్తే' అని ఉపనిషత్తుల్లో చెప్తున్నారు. ఆ సామగానం చేస్తారంటోంది ఉపనిషత్. అది బ్రహ్మ, విష్ణు, రుద్రగ్రంథుల భేదనం జరిగిన తరువాత వచ్చే స్థితి. ఆ స్థితి వచ్చే సరికి 'ఆజ్ఞాచక్రాంతరాళస్థా రుద్రగ్రంథి విభేదినీ'. ఈ ఉపాసనని అంతరతర ఉపాసన అంటారు. ఇప్పుడు అంతరతమని చూపించబోతున్నారు.

105. సహస్రారాంబుజారూఢా – శ్రీ సహస్రారాంబుజారూఢాయై నమః

అంబుజము – పద్మము. దానిలో ఆరూఢ – చక్కగా కూర్చున్న తల్లి. సహస్రార అంబుజము నందు ఆరూఢ అయిన తల్లి.

మనలో ఉన్న కుండలినీ సహస్రారంలోకి వెళ్ళాక ఇంత వరకూ ఏ శక్తి ప్రసరణ చేత నేను అనుకున్నాడో, ఆ శక్తి దేహానిది కాదు శివునిదని తెలుస్తుంది. సహస్రారంలో శివశక్తులు ఏకం అయిపోయారు. ఆ స్థితే శివశక్త్యైక్యం. అదే జీవబ్రహ్మైక్యం. ఆ స్థితి ఏర్పడినప్పుడు కలిగే ఆనందం ఒక అమృతధారలా కురుస్తుంది. ఆ అమృతధారే 'సుధాసారాభివర్షిణీ' అని తరువాత నామంలో చెప్తున్నారు.

106. సుధాసారాభివర్షిణీ – శ్రీ సుధాసారాభివర్షిణ్యై నమః

సుధాసార–అభివర్షిణి. 'అభి' అంటే మొత్తంగా తడుపుట. దీనికి ఉపోద్ఘాతం **'సుధాధారాసారైశ్చరణ యుగళాన్తర్విగళితైః ప్రపంచం సించన్తీ పునరపి రసామ్నాయ మహసః'** అని చెప్పుకున్నాం. పైన ఉన్నాయి శివశక్తుల చరణములు.

'రక్తశుక్లప్రభామిశ్రం అతర్క్యం త్రైపురం మహః' అని గురుపాదుకలకి దండం పెడతారు. అందుకని తలమీద పాదుకలు(శఠగోపం) పెడతారు. అక్కడున్నాయి శివశక్తుల పాదుకలు. వారు అసలు గురువులు. ఆ జ్ఞానం మనకి గురువుల ద్వారా వస్తుంది కనుక ఆ గురువులో దీనిని భావన చేయాలి. గురువు అంటే శివశక్తులే. 'శ్రీగురుః సర్వకారణభూతాశక్తిః' అని భావనోపనిషత్ తెలియజేస్తోంది. అమ్మవారే గురుమండలరూపిణి.. సహస్రారంలో వారి పాదుకలు ఉంటాయి. అక్కడ నుండి ఆ శక్తి అంతా మనలో ప్రసరిస్తున్నది. తిరిగి అక్కడికి చేరుకుంటోంది. చేరుకోగానే 'సుధాసారాభివర్షిణీ'. అప్పుడు జీవన్ముక్తుడు అవుతున్నాడు. అక్కడ నుండి అమృతధార మనలో ఉన్న మొత్తం 72 వేల నాడులని తడుపుతోంది. దానిని వివరించారు.

అయితే ఇదంతా యోగం. ఇదంతా వేదానికి సంబంధం లేదంటే అది పొరపాటే. వేదంలో దీనికి సంబంధించిన మంత్రాన్ని ఒకసారి చూద్దాం.

'లోకస్య ద్వార మర్చిమత్పవిత్రం జ్యోతిష్మద్భ్రాజమానమ్ మహస్వత్
అమృతస్య ధారా బహుధా దోహమానం చరణం నోలోకే సుధితాం దధాతు'

అని వివరిస్తున్నారు. ఇది ఈ లోకానికి ద్వారం అని చెప్పారు. అది 'అర్చిమత్' – తేజోమయంగా ఉంది. అది 'పవిత్రం'. 'జ్యోతిష్మత్ భ్రాజమానమ్ మహస్వత్' – అది అత్యంత ప్రకాశవంతమైనది. అక్కడ 'అమృతస్య ధార' – అమృతధార ఉంది. దానిని పిండుకోవాలి. ఒక పొదుగు నుండి పాలు పిండినట్లుగా ఇక్కడనుండి అమృతధారని యోగి మాత్రమే పిండగలడు. 'అమృతస్య ధారా బహుధా దోహమానం' – యోగి అనేక విధాలుగా పిండుతాడు అన్నారు. దీనినే 'సుఖయతి సుధాధార సిరయా' అని సౌందర్యలహరిలో 20వ శ్లోకంలో శంకరులవారు చెప్తూ –

కిరన్తీమఙ్గేభ్యః కిరణనికురుంబామృతరసం
హృదిత్వామాధత్తే హిమకరశిలామూర్తిమివ యః
స సర్పాణాం దర్పం శమయతి శకున్తాధిప ఇవ
జ్వరప్లుష్టాన్ దృష్ట్యా సుఖయతి సుధాధారసిరయా

అన్నారు. సిర అంటే ఆ పొదుగు నుండి వ్రేలాడుతున్న భాగం. అక్కడ

నుండి వచ్చే అమృతధారని యోగి ఆస్వాదిస్తాడు. అది ఎలా ఉంటుందో అక్కడికి వెళ్తే తెలుస్తుంది. అది ఉందని మాత్రమే ఇక్కడ చెప్పగలం. అటువంటి స్థితి 'సుధాసారభివర్షిణీ'. ఇక్కడితో సంపూర్ణంగా కుండలినీ అంతర ఉపాసనని తెలియజేస్తున్నారు. అది హృదయచక్రంలో భావించేటప్పుడు సమయం, కుండలినీ రూపంగా చేసేటప్పుడు అది అంతరతర, మూలాధారైకనిలయా నుండి చెప్పబడుతున్నది. అంతరతమ అన్నప్పుడు 'సహస్రారాంబుజారూఢా సుధాసారాభివర్షిణీ'.

107. తటిల్లతాసమరుచిః – శ్రీ తటిల్లతాసమరుచ్యై నమః,

అమ్మవారి వెలుగును వర్ణిస్తూ 'తటిల్లతాసమరుచిః' అన్నారు. తటిత్ అంటే మెరుపు. లత అంటే తీగ. సమ అంటే పోలిన, వలె అని అర్థం. రుచిః అంటే కాంతి. తటిల్లతాసమరుచిః – మెరుపుతీగ వంటి కాంతిగల తల్లి. అనిర్వచనీయమైన కాంతి అమ్మది.

మనలో ఉన్న సుషుమ్నానాడి అంతటా కూడా ఆ తల్లే ఒక మెరుపుతీగవలె ప్రకాశిస్తూ ఉన్నది. **'నీలతోయదమధ్యస్థా విద్యుల్లేఖేవభాస్వరా'** అని మంత్రపుష్పంలో చెప్తారు. 'నీల–తోయద–మధ్యస్థా' – తోయదము అంటే మబ్బు. నల్లని మబ్బు మధ్యలో మెరిసిన మెరుపులా ఉంది.

'విద్యుల్లేఖేవభాస్వరా' అనే వేదనామమే 'తటిల్లతాసమరుచిః' అని రెండూ ఒకే విషయాన్ని తెలియజేస్తున్నాయి. దీనినే ఆదిశంకరులు సౌందర్యలహరిలో **'తటిల్లేఖాతన్వీం తపనశశివైశ్వానరమయీం'** అనే శ్లోకంలో మెరుపుతీగవంటి తనువు కల తల్లి అని చెప్పారు. అన్ని కాంతులకు మూలమైన కాంతిస్వరూపిణియే అమ్మవారు. తపనశశివైశ్వానరమయీం – సూర్య, చంద్ర, అగ్నులకు కూడా మూలమైన కాంతి స్వరూపం. దీనినే మూకకవి మూకపంచశతిలో చెప్తూ

శంపాలతాసవర్ణం సంపాదయితుం భవజ్వరచికిత్సామ్
లింపామి మనసి కించన కంపాతటరోహి సిద్ధభైషజ్యమ్

శంపాలతా అంటే మెరుపుతీగ. అటువంటి కాంతిగల తల్లీ! నువ్వు ఒక ఔషధలతికవు. సమస్త రోగములను, వ్యాధులను పోగొట్టే ఓషధీలతిక ఆ జగదంబిక. అది శంపాలతాసవర్ణం.

కంపాతటరోహిసిద్ధభైషజ్యమ్ – ఆ తీగ కంపాతటంలో ఉంది అని చెప్పారు. కంపా అనే ఒక నది ప్రవహిస్తున్నది. ఆ నదీతీరమునందు ఉన్నది అంటే కాంచీపుర కామాక్షీదేవిని వర్ణించడం. ఆ కంపా అనేది మనలో సహస్రారసుధాసాగరాన్ని తెలియజేసేది. అక్కడ ప్రకాశిస్తున్న కామాక్షే సహస్రాంబుజారూఢా. ఆవిడే తటిల్లతాసమరుచిః. ఆ మెరుపుతీగను మనస్సులో ధ్యానించాలి.

లింపామి మనసి కించన – ఒక ఓషధిని స్వీకరించేటప్పుడు దానిని రసములా చేసి స్వీకరిస్తాం. అదేవిధంగా ఆ శంపాలతాసవర్ణాన్ని, ఆ తటిల్లతాసమరుచిని హృదయమారా ధ్యానించాలి. మనస్సు అంతా ఆ తల్లి వెలుగే నిండిపోవాలి. భవజ్వరచికిత్సామ్ – సంసారం అనే జబ్బుకు ఆ మెరుపుతీగను ధ్యానించడమే మందు అని మూకకవి చెప్పారు. ఆ సమరుచి అయిన తల్లి ఎక్కడ ప్రకాశిస్తున్నదో చెప్తూ షట్చక్రోపరిసంస్థితా అని తరువాత నామంలో చెప్తున్నారు.

108. షట్చక్రోపరిసంస్థితా – శ్రీ షట్చక్రోపరిసంస్థితాయై నమః
109. మహాసక్తిః – శ్రీ మహాసక్త్యై నమః

అంతరతమలో 'షట్చక్రోపరిసంస్థితా' షట్చక్రములకు పైన అది తెలియబడుతుంది కనుక **'నిషణ్ణాం షణ్ణామప్యుపరి కమలానాం తవ కలామ్'** అని సౌందర్యలహరిలో చెప్పినమాట. షట్ చక్ర ఉపరి సంస్థితా– షట్ చక్ర ఉపరి ఉన్నది. మొత్తానికి ఇదంతా కలుపుకునే కుండలినీ విద్య. మూలాధారం నుండి బయలుదేరి క్రమంగా అకులానికి చేరి స్థిరపడింది. ఆ కుండలినీ స్వరూపాన్ని భావన చేసుకోవడానికి పనికొచ్చేలా చెప్తున్నారు.

మహా ఆసక్తి 'మహాసక్తిః', అంటే గొప్ప ఆసక్తి. ఒక్కసారి కుండలినీ జాగరణ జరిగిందా! అమ్మవారు సహస్రారంలో ఉన్న పరమేశ్వరుని క్రింద నుండి చూసి ఎంత

తొందరగా పైకి చేరతానా అని పైకి బయలుదేరుతూ ఉంటుంది. అది మహా ఆసక్తి. ఒకొక్క చక్రం దాటి పైకి వెళుతూ ఉంటుంది. ఆ గొప్ప ఆసక్తితో సహస్రారంలో ఉన్న శివుని వైపు బయలుదేరుతున్న తల్లి.

ఇది సరిగ్గా సౌందర్యలహరిలో ఒక శ్లోకంలో తెలియజేశారు. అమ్మవారు మణిద్వీపంలో ఉండగా వాళ్ళాయన పరమేశ్వరుడు అప్పుడే ఎక్కడినుంచో వచ్చారు. మహారాణి అందరితో మాట్లాడుతున్నారు. అప్పుడు, "అమ్మా! మీ ఆయన వచ్చారు" అనే వార్త వచ్చింది. ఆయన వచ్చారు అనగానే ఇంతమందిని వదిలి అమ్మవారు వెంటనే బయలుదేరింది. ఆ బయలుదేరుతూ ఆవిడ వస్తూ ఉంటే, అమ్మవారిని దండం పెట్టుకోవడానికి వచ్చి ఆయా ఆసనాలలో కూర్చున్నవారు ఒకొక్కరు లేచి, దండం పెట్టడానికి తలలు క్రిందకి వంచేశారు. ఆవిడ వాళ్ళాయననే చూస్తోంది గాని వచ్చినవారెవరినీ చూడడం లేదు. ఆ ప్రక్కన చెలికత్తెలు వచ్చి, "అమ్మా! జాగ్రత్తమ్మా... ఇది బ్రహ్మ గారి కిరీటం, జాగ్రత్త అది విష్ణువు గారి కిరీటం... ఆ కిరీటం తాకి నీ పాదం కందిపోతుందేమో తల్లీ! అందుకు జాగ్రత్తగా రామ్మా రా!" అని చెప్తే అలా తిన్నగా వాళ్ళాయన దగ్గరికి వెళ్ళింది.

ఇది అచ్చంగా చెప్పాలంటే మూలాధారంలో కూర్చుంది అమ్మవారు. పైన ఉన్న శివుని వద్దకు బయలుదేరుతోంది. అక్కడ అర్చిమద్వారం గుండా బయలుదేరుతున్నప్పుడు లోపల కిరీటాలు పెట్టినవారు ఒకొక్కరు అంటే ఒకొక్క చక్రం దగ్గర ఒకొక్క దేవతా శక్తి. వాటిని ఆవిడ గమనించుకోవట్లేదు అని చెప్పడం ఏమిటంటే కుండలినీ సాధనలో ఒకొక్క చక్రం దాటితే ఒకొక్క సిద్ధి వస్తుంది. కానీ ఆ సిద్ధిని గమనించకూడదు. పరమాత్మనే గమనించుకోవాలి. అందుకే వీటన్నింటిని ఆవిడ గమనించకుండా వెళ్ళిపోతోంది. వెళ్ళిపోతున్నప్పుడు ఆవిడని పరివారశక్తులు జాగ్రత్తగా తీసుకువెళ్తున్నాయి. ఇదంతా చూస్తే కుండలినీ గమనాన్నే అంత అందంగా ఒక పతివ్రతాధర్మంగా శంకరభగవత్పాదులవారు సౌందర్యలహరిలో మనకు అందించారు. ఆ మహానుభావునికి ఒక్కసారి నమస్కారం చేసుకుందాం. 'కులాంగనా' అంటే ఇదే.

షట్చక్రోపరి సంస్థితా, మహాసక్తిః– శివుడు వచ్చాడని చెప్పి అమ్మవారు ఎంత ఆసక్తిగా వెళ్ళారో, ఈ కుండలినీ ఒకొక్క చక్రాన్ని దాటి సహస్రారం వైపు అంత ఆసక్తిగా వెళ్తుంది. అందుకు మహా–ఆసక్తిః 'మహాసక్తిః', ఆవిడ పేరే 'కుండలినీ'.

110. కుండలినీ – శ్రీ కుండలిన్యై నమః

'కులామృతైకరసికా' నుండి ఈ నామం వరకు చెప్పుకున్న తల్లి పేరు 'కుండలినీ'. అందుకే ఆ తల్లిని కుండలినీ అని నమస్కారం చేసుకొని –

మూలధారస్థ వహ్న్యాత్మా తేజోమధ్యే వ్యవస్థితా
జీవశక్తిః కుండలాఖ్యా ప్రాణాకారాథ తైజసీ
ప్రసుప్త భుజగాకారా త్రిరావర్తా మహాద్యుతిః
మాయాశీర్షాం నదంతీం తాం ఉచ్చరంత్యనిశం ఖగే
సుషుమ్నా మధ్యదేశే సా యదాకర్ణద్వయస్యతు
పిధాయ న శృణోత్యేనం ధ్వనిం తస్య తదా మృతిః (తంత్రరాజం)

"ఆత్మతేజస్సు మూలాధారంలో అగ్నిరూపంగా ఉంటుంది. ఆ తేజో మధ్యంలో కుండలమనే పేరున్న జీవశక్తి ఉన్నది. అది తైజసరూపం, ప్రాణాకా(ధా)రం. దాని మాయయే శీర్షము. ఎల్లవేళలా ధ్వనిస్తుంటుంది. కుండలినీ శక్తి సుషుమ్నానాడీ మధ్యంలో ఉంటుంది. చెవులు మూసి విన్నప్పుడు లోపలి ధ్వని వినబడకపోతే మరణాసన్నమైనదని సూచన."

పుర్యష్టకాపరాఖ్యస్య మనసో జీవనాత్మికాం
విద్ధి కుండలినీమంతరా మోదస్యేవ మంజరీ (యోగవాసిష్ఠం)

"పరిమళానికి పూలగుత్తివలె పుర్యష్టకం అనే పేరున్న మనస్సునకు జీవనమైనది కుండలినీ శక్తి".

"యతశ్శృంగాటకాకారా కుండలిన్యుచ్యతే తతః"

కూడలి (శృంగాటకం) ఆకారంగా ఉన్నది కుండలిని – అని దేవీపురాణం.

కుండలి కుమారి కుటిలే చండి చరాచరసవిత్రి చాముండే

గుణిని గుహారిణి గుహ్యే గురుమూర్తే త్వాం నమామి కామాక్షి

అంటారు మూకపంచశతిలో మూకకవి. కుండలి అంటే చుట్ట. అచ్చంగా కుండలీ మూలాధారంలో చుట్టలు చుట్టుకొని ఉంది. పైదాకా వెళ్ళి ఆ అమృతరసం పొందిన తరువాత జీవన్ముక్తునిలో అటు ఇటు హాయిగా తిరుగుతూ మళ్ళీ క్రిందకి వచ్చి కూర్చుంటుంది. కానీ జాగృతం చెంది కూర్చుంటుంది. **'స్వపిషి కులకుండే కుహరిణి'** అన్నారు శంకరులు. ఆ కుండలినీ లేచేటప్పుడు ధ్వని చేసుకుంటూ వెళ్తుంది. ఆ ధ్వని చేసుకుంటూ వెళ్ళడమే **'కుమారీ మంద్రయతే'** అని వేదం చెప్తోంది. ఒక కుమారిలా నడిచి వెళ్తోంది కనుక 'కుండలి', ఆ కుమారీ పాములా నడిచి వెళ్తోంది కనుక 'కుటిలే'. క్రమంగా తీవ్రంగా పైకి వెళ్తుంటే 'చండీ'. ఆ పైకి ఆజ్ఞాచక్రస్థానం దాటిపోయేటప్పటికల్లా 'చరాచరసవిత్రి చాముండే'. 'చాముండే' అంటే ఈ మూడు గ్రంథులు భేదనం చేసిన స్థితి. చాముండ సామన్యమైన విషయం కాదు. రాక్షస సంహారం చేసిందనే కాదు. చాముండా అంటే మూడు గ్రంథుల భేదనం చేసిన తరువాత స్థితి. అదే చండీమంత్రానికి ప్రాధాన్యం. 'గుణిని గుహారిణి' – నీవు రహస్యంగా లోపల గుహ యందు అరణిలా ఉన్నావమ్మా. అగ్నివి. అరణిలో అగ్ని అంటే ఏమిటి? మథనం చేస్తే గాని దొరకదు. కనుక లోపల కుండలినీరూప అగ్ని సాధన చేస్తేకానీ దొరకదు. కనుక గుహ యందు అరణి వలె ఉన్నది. 'గుణిని గుహారిణి గుహ్యే గురుమూర్తే త్వాం నమామి కామాక్షి' అని కీర్తించాడు. అది కుండలినీ విద్య. ఇక్కడ అమ్మవారి ఉపాసన గురించి కావ్యకంఠ వాసిష్ఠగణపతి ముని ఉమాసహస్రం అనే అత్యద్భుతమైన గ్రంథంలో...

సా తత్త్వతస్సమన్తాత్ సత్యస్య విభోస్తతా తపశ్శక్తిః

లీలా మహిళా వపుషా హైమవతీ తనుషు కుణ్డలినీ

అని అమ్మవారి గురించి మూడే విషయములు తెలియజేస్తున్నారు. అమ్మా! నువ్వు పరమేశ్వరుని యొక్క తపశ్శక్తివి. తపశ్శక్తి అంటే ఏదైనా చేయగలిగిన జ్ఞానస్వరూపము. పరమేశ్వర శక్తికే తపశ్శక్తి అనిపేరు. **'యస్య జ్ఞానమయం తపః'**

వేదవాక్యమిది. పరమేశ్వరుని యొక్క జ్ఞానశక్తే ప్రపంచం అంతా వ్యాపించిపోయింది.

అందుకే **'తాం అగ్నివర్ణాం తపసా జ్వలంతీం వైరోచనీం కర్మఫలేషు జుష్టాం దుర్గాం దేవీం శరణమహం ప్రపద్యే'**. ఆ తపసా జ్వలంతీం అంటే ఇది అర్థం. తపః స్వరూపిణియై, జ్ఞానరూపిణియై, శక్తిరూపిణియై ప్రపంచమంతా వ్యాపించిపోయింది. కానీ మనకి ఇది కనబడదు. దీనిని **అత్యంత రూపం** అంటారు. ఈ తల్లిని ఉపాసన చేసేటప్పుడు హైమవతిగా ఉపాసించాలి. చక్కటి స్త్రీరూపం ధరించి హిమవత్పర్వత రాజపుత్రిగా, గౌరిగా, భవానిగా, లలితగా, ఉమగా ఆరాధింపబడుతున్నది. 'లీలామహిళా వపుషా'. దీనిని **ఆధిదైవిక రూపము** అంటారు. అంటే అమ్మవారిని ఆరాధించేటప్పుడు తెలుసుకోవలసింది– ప్రపంచం అంతా వ్యాపించి ఉన్న ఈశ్వర తపశ్శక్తియే అమ్మవారు. కానీ అది మామూలు ఇంద్రియాలకు గోచరించదు. మనస్సుకు, భావనకు అందదు. కనుక మనం భావించడం కోసం అమ్మవారు ఆధిదైవిక రూపంగా – గౌరిగా వ్యక్తమాయ్యారు. ఇక రెండవది – అధిదేవతారూపం. మూడవది **'తనుషు కుండలినీ'.** శరీరమునందు కుండలినీ రూపం. అమ్మా! ఈ విధంగా మూడు విధములుగా నువ్వు ఆరాధింపబడతావు అని గణపతిముని ఉమాసహస్రంలో చెప్పిన అంశం. ఈ మూడింటిని ఇప్పటివరకూ చెప్పుకున్నాం. 'మహాసక్తిః కుండలినీ' – ఈవిడ ఎలా ఉంటుంది అనేదానికి సమాధానం– 'బిసతంతుతనీయసీ'.

111. బిసతంతుతనీయసీ – శ్రీ బిసతంతుతనీయస్యై నమః

'బిస' అంటే తామరతూడు. 'తంతు' అంటే దారం. 'తనీయసీ' అంటే అంత సూక్ష్మంగా ఉన్నది. ఆ తల్లి తామరతూడులోని దారం అంత సూక్ష్మంగా ఉంది. ఇప్పుడు మనం భావించవలసినది ఎలా ఉన్నది అంటే మూలాధారం నుండి క్రమంగా పైవరకూ ఉన్న సుషుమ్నని మనం వెన్నులో భావన చేస్తున్నాం. ఈ సుషుమ్నలో అమ్మవారిని ఒక మెరుపుతీగలా ధ్యానించుకోవాలి. ఆ మెరుపు తీగ అతి సన్నిగా ఉంది. పరమ సుకుమారం. తామరతూడులోని దారం అంటే సుకుమారమే కదా. అత్యంత సుకుమారం కనుకనే **'లలిత'** అన్నారు. కుండలినీ కూడా లలితే.

ముఖ్యప్రాణరూపంగా అంత సుకుమారంగా ఉంది. తామరతూడులోని దారం ఎంత సన్నగా ఉంటుందో అంత సన్నగా ఉంటుంది. ఇలాంటి ఒకానొక కాంతితీగను మూలాధారం నుండి సహస్రారం వరకు ధ్యానించాలి. దీనినే శ్రీవిద్యలో 'పరచితిం భావయేత్' అంటారు. **'మూలాధారాదాబ్రహ్మబిలమ్ విలసంతీమ్'**– మూలాధారం నుండి బ్రహ్మబిలం వరకు ప్రకాశిస్తున్న ఆ వెలుగు ఎంతో గొప్పది.

ఇంత శరీరంలో ఇలా ఉంది కదా అనుకోవచ్చు..కానీ కాదు. **'వివస్వదయుతభాస్వత్ ప్రకాశామ్ పరశ్శత సుధామయూఖ శీతలతేజోదండ రూపామ్ పరచితిమ్'**. అది కోట్లకొలది సూర్యులను, చంద్రులను, అగ్నులను ప్రకాశింపజేసే మహాతేజస్సు. అలాంటి ఆ తల్లి జగదంబ అంత సుకుమారంగా మనలో భాసిస్తూ ఉంది. ఆవిడే అన్ని చక్రముల యందు ప్రకాశిస్తూ ఉన్న స్వరూపమని భావించాలి. ఎలా భావించాలో చెప్పడం కోసం 'బిసతంతు తనీయసీ' నామం చెప్పబడింది. మన వెన్ను మొత్తం కలిపితే తామరతూడు. అందులో సుషుమ్నా నాడి లోపల ఆ తల్లి తామరతూడులోని దారంలా సుకుమారంగా ఉంది. అది బిసతంతుతనీయసి. ఇది ధ్యానం చేయవలసిన పద్ధతి. అందుకు –

భుజంగాకార రూపేణ మూలాధారం సమాశ్రితా
శక్తిః కుండలినీ నామ బిసతంతు నిభా శుభా

మూలాధారంలో సర్పాకారంలో ఉన్నదే జాగృతి చెంది ప్రసరించేటప్పుడు ఆ తల్లి తామరతూడులోని దారంలా సుకుమారంగా సంచరిస్తుంది. మంత్రపుష్పంలో ఇదే చెప్పబడుతోంది.

'నీవారశూకవత్తన్వీ పీతాభాస్వత్యణూపమా'– అణూపమా అంటే అత్యంత సూక్ష్మం. అది పసిమి రంగుతో మెరిసిపోతోంది. ఇది 'విద్యుల్లేఖేవభాస్వరా' విద్యుల్లేఖ అంటే **మెరుపుతీగ**. 'తటిల్లతాసమరుచిః' 'షట్చక్రోపరిసంస్థితా' అని ఇక్కడ వివరిస్తున్నారు. ఆరు చక్రాలకు పైన సహస్రారంలో చక్కగా ఉన్న పరమతత్త్వం కనుక ఈ తల్లి 'తటిల్లతాసమరుచిః'. 'సుధాసారాభివర్షిణీ'–'తటిల్లతా సమరుచిః' 'షట్చక్రోపరి సంస్థితా'–'మహాసక్తిః' 'కుండలినీ'–'బిసతంతు' 'తనీయసీ'. ఎందుకు

తటిల్లతా అన్నారు? మెరుపుతీగ అనేది అచ్చం వేదంలో చెప్పబడిన **'విద్యుల్లేఖేవభాస్వరా'** అనే మాట రూపమే ఇది. విద్యుల్లేఖ. 'తటిల్లేఖా' అన్నా ఇదే. అది సామాన్యం కాదు. మన శరీరంలో ఉన్న మెరుపుతీగ. మన శరీరంలో సృష్టి, స్థితి, లయలన్నీ చేయగలిగే పరమేశ్వర శక్తి.

కానీ ఎప్పుడైనా అనిపించిందా? 'నా శరీరంలో తినడానికి, పడుకోవడానికి పనికొచ్చే ఒక అద్భుతమైన శక్తి ఉంది' అనే సామాన్యులు అనుకుంటారు. కానీ దీనిలో సమస్త సృష్టి, స్థితి, సంహారాదులు చెయ్యగల ఈశ్వర శక్తి ఉంది. అది తెలుసుకునే ప్రయత్నం చేస్తే ఆ ఈశ్వరశక్తితో తాదాత్మ్యం చెంది ముక్తిని పొందుతాం.

హిందూమతం గొప్పతనం తెలుసుకుంటే ఇది ఎంతో భరోసా ఇస్తుంది. నీ లోపల అఖండ ఆత్మశక్తి ఉందయ్యా! "నేనే లోపల అహంగా ఉన్నాను" అన్నాడు పరమాత్మ,

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః
అహమాదిశ్చ మధ్యంచ భూతానామన్త ఏవచ

భగవద్గీతలో ఇది చదివాక ధైర్యం, తృప్తి కలగాలి. ఉన్నాడని తెలిసిందిగా! ఇప్పుడు చేయాల్సిన పని– వెతకడం, అన్వేషణ. అదే సాధన. ఇంకేం కావాలి! ఇంత సులభం. ఆ అన్వేషణకు 'మహాసక్తిః' 'కుండలినీ' 'బిసతంతుతనీయసీ'.

ఇక్కడితో 111 నామాలు పూర్తి అయ్యాయి. దీనిని మూలగ్రంథం అంటారు. లలితాసహస్రనామంలో 111 నామాలే అసలు గ్రంథం. ఇది చదివితే పరిపూర్ణం. లలితాసహస్రనామస్తోత్ర పారాయణ చేయడానికి సమయం చిక్కకపోతే ఈ 111 నామాలను చెప్పి "తత్సత్ బ్రహ్మార్పణమస్తు" అని చెప్పవచ్చు. ఈ 111 నామాలకి 'ప్రకరణగ్రంథమ'ని పేరు. దాని తరువాత చెప్పబడే నామములన్నిటికీ కలిపి 'వివరణగ్రంథమ'ని పేరు. కనుక ఇది 'మూలగ్రంథం', తరువాతది 'భాష్యగ్రంథం'. ఇందులోనే మొత్తం అమ్మవారి స్వరూపాన్ని ప్రతిష్ఠ చేశారు. మొత్తం చరిత్ర, ఉపాసన, విషయములు అన్నీ చెప్పేశారు.

ఇందులో ఒకొక్క నామంలో కథ ఉంది. మిగిలిన వాటిలో ఇంత కథ

లేదు. ఇందులో అమ్మవారి యొక్క బాహ్యమైన శ్రీచక్రస్వరూపం, అమ్మయొక్క రూపవర్ణన, పరివార దేవతలందరూ చెప్పబడ్డారు. 'మంత్రిణ్యంబావిరచిత విశుక్రవధతోషితా', వారాహీ, బాలా వీరంతా పరివార దేవతలు. దాని తరువాత కుండలినీ రూప ఉపాసనని చూపించారు. ఉపాసనా ఫలాన్ని చూపించారు. ఇంకేం కావాలి! ఉపాసనా ఫలం భండాసుర సంహారం. 'కామేశ్వరాస్త్రనిర్దగ్ధస భండాసుర శూన్యకా'.

లలితాదేవి అంటే ఎవరు? ఆవిడ లీల ఏమిటి? తత్త్వం ఏమిటి? రూపం ఏమిటి? నామమేమిటి? ఉపాసన ఏమిటి? పద్ధతులేమిటి? ఎలా చేయాలి? చేస్తే ఫలితం ఏమిటి? మొత్తం చెప్పారు కనుక బహిర్యాగ, అంతర్యాగములతో కూడిన శ్రీచక్ర, శ్రీవిద్యా విషయమంతా కూడా 111 నామాలతో పూర్తయింది.

ఇవి బాగా అర్థం అయితే తరువాత నామాలు సులభంగా తెలుస్తాయి. తరువాత తెలుస్తూ ఉంటే ముందు తెలుసుకున్నది నిలబడుతుంది. లలితాసహస్ర నామాలను మరింత పుష్టి చేస్తున్నవి తరువాత నామాలు.

ఇక్కడ నుండి కూడా అనేక ఉపాసనా విషయాలు వస్తాయి. మొదట్లోనే ద్రాక్షగుత్తులు ఉపమానం అనుకున్నాం. లలితాసహస్రంలో కొన్ని నామాల గుంపు ఒక ఫలం కోసం చూపించిన ఒక మంత్రవిద్య. ఆ మంత్రవిద్యకు సంబంధించిన అంగములు, ఉపాంగములు, ఫలములు, ప్రయోజనాలు అన్నీ అందులోనే చెప్తారు.

112. భవానీ – శ్రీ భవాన్యై నమః

'భవానీ, భావనాగమ్యా, భవారణ్యకుఠారికా' – ఇక్కడ నుండి మొదలవుతున్న నామాలు అత్యంత మధురమైన దివ్యనామాలు. ఇవి మొత్తం 20 నామాలు. ఇవి 'శాంభవీ విద్య' అని చెప్పబడుతున్నాయి. 112వ నామం నుండి 131వ నామం వరకు అంటే 'భవానీ' నామం నుంచి 'శాంతిమతీ' నామం వరకు 'శాంభవీ విద్య' చెప్పబడుతోంది. శాంభవీవిద్యలో ప్రధానమైన తల్లి శాంభవీ విద్యారూపిణి–భవాని. వీటిని ఉపాస్యనామములు అంటారు.

ఇప్పటివరకు చెప్పుకున్న 111 నామాలలో ఉపాస్యదేవత 'శివా'. శివా అనేది ఉపాస్యనామం. ఇది అత్యంత రహస్యనామం. ఇప్పుడు చెప్పబోతున్న విద్యలో ఉపాస్యనామం 'భవానీ'. అక్కడ శివా నామానికి, ఇక్కడ భవానీ అనే నామానికి అత్యంత శక్తి ఉంది.

ఇంకో రహస్యం– అమ్మవారిది తొమ్మిది సంఖ్య. తొమ్మిది నవత్వం. నవ అనే దానికి రెండు అర్థాలు ఉన్నాయి. ఒకటి తొమ్మిది, రెండవది కొత్త, ఎప్పుడూ అది నిత్యనూతనమే. అందుకు నవ సరిపోయింది. తొమ్మిది సంఖ్య పూర్ణ సంఖ్య. ప్రపంచం అంతా తొమ్మిది తోనే కూడి ఉంది.

సంఖ్యాశాస్త్రపరంగా చూస్తే బ్రహ్మ అనేది తొమ్మిది సంఖ్యను తెలియజేస్తుంది. కటపయాది సంఖ్యా ఇత్యాదులుతో అక్షరాలకి సంఖ్య చెప్తారు. ఆ సంఖ్య కలిగిన అక్షరాన్ని ఉపాసిస్తే దానికి కొన్ని ఫలితాలు ఉంటాయి. బ్రహ్మ అంటే పరిపూర్ణుడు కదా. అందుకు పరబ్రహ్మయే చెప్పబడుతున్నాడు. కనుక నవావరణ చక్రంలో చెప్పబడుతున్నది ఎవరు? బ్రహ్మతత్త్వం. పరబ్రహ్మ అని కూడా అర్థం. 'నవ' బ్రహ్మ సంఖ్య కనుకే నవ సంఖ్యతో చేసే ఉత్సవాలకే బ్రహ్మోత్సవాలు అని పేరు. అందుకే పూర్ణత్వం కోసం, బ్రహ్మత్వం కోసం చేసేవే నవరాత్రుల ఉత్సవాలు. నవ సంఖ్య అమ్మవారికి ప్రీతి. ఆవరణలు నవ.

అలాగే తొమ్మిది సంఖ్యను తెలియజేసే రెండు నామాలు ఉన్నాయి. అవి శివా, భవానీ. లలితలో చెప్పబడుతున్న తల్లికి ప్రధానమైన నామాలు శివా, భవానీ.

అరుణాం కరుణాతరంగితాక్షీం
ధృతపాశాంకుశ పుష్పబాణచాపామ్
అణిమాదిభిరావృతాం మయూఖైః
అహమిత్యేవ విభావయే 'భవానీమ్'

లలితాసహస్రనామం ద్వారా ప్రతిపాదింపబడే అమ్మవారి పేరే 'భవానీ'. అందుకే మరొక ధ్యాన శ్లోకంలో 'భక్తనమ్రాం భవానీమ్' అన్నారు. ఇక్కడ నుంచి 'భ' కార నామాలు పరిశీలించాలి.

భవానీ భావనాగమ్యా భవారణ్యకుఠారికా

భద్రప్రియా భద్రమూర్తిర్భక్తసౌభాగ్యదాయినీ

భకార బాహుళ్యానికి ఒక ప్రాధాన్యం ఉంది. శ్రీనాథమహాకవి హరవిలాసంలో 'భ' కారంతో ఒక పద్యం వ్రాశారు. దానికి అక్షరతత్త్వవేత్తలు వ్యాఖ్యానం చేశారు. భకారంతో కూడిన పద్యంగాని, శ్లోకాలనుగాని చదివితే మనకి లోపల ప్రాణశక్తి సంచారం చాలా చక్కగా జరుగుతుంది. గర్భిణీ స్త్రీ భకార బాహుళ్యంగాని చదివితే ఆమెకు సుఖప్రసవం జరుగుతుందని చెప్పారు. అందుకే లలితాసహస్ర నామాలు ఏ లయతో కూర్చబడ్డాయో, ఆ లయని అలాగే పాటిస్తూ చదవగలిగితే మన శరీరంలో అద్భుతాలు జరుగుతాయి. లలితాసహస్రనామాలు ఎక్కడికక్కడ మంత్రరాశులు.

ముందుగా భవానీ అంటే ఇందాక చెప్పినట్లుగా నవసంఖ్యాత్మకమైన పరిపూర్ణత్వాన్ని తెలియజేస్తోంది. భవుని శక్తి భవానీ. ఇది పూర్తిగా శివశక్త్యైక్యరూపిణీ నామం లాగానే ఇద్దరిని కలిపి చెప్తోంది. భవుడు అంటే ఏమిటో తెలిస్తే ఆయన శక్తి తెలుస్తుంది. భవ అంటే '**యస్మాత్ భవంతి భూతాని తాభ్యస్తా భావయంతి చ । భవనాత్ భావనాచ్చైవ భూతానాం స భవః స్మృతః**' అని భవ శబ్దానికి అర్థం. '**భవనాత్-భావనాత్-భవః**' అంటే ఉన్నవాడు, కలుగువాడు. భావన అంటే కలిగించువాడు, ఉంచువాడు. పరమాత్మకి రెండు అర్థాలూ తీసుకోవాలి. అన్నింటిని ఉంచేవాడు, కలిగించేవాడు. ఇంతకంటే భగవంతుని గురించి ఏం చెప్పాలి. కనుక **భవ** అంటే ఆయనే ఉన్నవాడు. శాశ్వతమైనవాడు. దానిని ఆధారం చేసుకొని మనం ఉన్నాం. కనుక ఆయన అందరికీ ఉనికిగా ఉన్నవాడు. లోకాన్ని ఎప్పుడు ఎలా అనుగ్రహించాలో దానికి తగ్గట్టుగా తనకు తనను ఆవిష్కరించుకుంటూ కలుగుతూ ఉంటాడు. అందుకే ఉండువాడు, కలుగువాడు. ప్రపంచాన్ని ఉంచువాడు, కలిగించువాడు. ఆ భవుని యొక్క శక్తి భవానీ. అంటే అర్థం ఏమిటి? ఈ ప్రపంచాన్నంతటినీ ఆవిడే కలిగిస్తున్నది, ఉన్నది, ఉంచుతున్నది. కనుక భవానీ అంటే ఉన్న శక్తి, ఉన్నది అమ్మే. కనుక భవానీ అంటే చాలు అమ్మ ఉన్నది. ఇంతకంటే ఏం కావాలి?

'ఉన్నది' అనే మాటకి వేదాంతం 'సత్' అనే పదాన్ని చెప్పింది కనుక సత్–చిత్–ఆనందం కదా. కనుక **సత్** ఏదో **సతీ** అదే. సత్ అనే శబ్దానికి స్త్రీ లింగం సతీ. 'సర్వాంతర్యామినీ', 'సతీ' అక్కడ వస్తోంది నామం. సత్–సతీ అయినట్లే భవ–భవానీ అయ్యింది. ఏ తల్లి ఈ ప్రపంచమంతా వ్యాపించి ఉన్నదో, ఈ ప్రపంచాన్ని కలిగిస్తూ ఉన్నదో, ఏ తల్లి వల్ల ఈ ప్రపంచమంతా ఉంటూ, కలుగుతూ, వెళ్తూ ఉన్నదో ఆ శక్తినే భవానీ అన్నారు. భవానీ పూర్ణనామంగా చెప్పబడుతోంది.

అష్టమూర్తులలో శివునికి ఒకొక్క మూర్తికి ఒకొక్క పేరు చెప్పారు. భవా అనేది జలమూర్తి. జలం ఎప్పుడూ కూడా స్థితిని ఇస్తూ ఉంటుంది. ఆప్యాయనం. అందుకే జల భూతానికి చాలా ప్రాధాన్యం ఇచ్చారు. తదధిదేవత భవుడు. **'భవ ఇత్యుచ్యతే దేవైః భగవాన్ వేదవాదిభిః సంజీవనేన లోకానాం భవస్య పరమాత్మనః'.** నీటికి జీవనం అని పేరు. అంటే నిలుపుతోంది, బ్రతికిస్తోంది. నీరు లేకపోతే ప్రపంచంలో ఏదీ లేదు. ఆ నీటికి అధిదేవతగా ఉన్నవాడు భవుడు–శివుడు. అందుకు ప్రపంచాన్ని సంజీవనం చేయిస్తున్న జలం శివుడు. ఆయన యొక్క శక్తి ఈవిడ. అష్టమూర్తి అయిన భవునికి శక్తి కనుక ఈ తల్లి భవానీ. ఈ భవానీకే 'ఉషా' అని మరొక పేరు.

'ఉషా సంకీర్తితా భార్యా' – ఇది లింగపురాణం చెప్తున్నది. భవుడైన శివునికి శక్తిగా అమ్మవారు ఉషా అనే పేరుతో ప్రక్కనుంటారు. ఎండిపోయినప్పుడు నీళ్ళతో తడిపితే (ఆప్యాయనం) ఎలా ఉంటుందో, అలాగే ఎండిపోయిన 72 వేల నాడుల్ని సహస్రారం నుండి ప్రసరిస్తూ ఏ అమృతధార తడుపుతోందో ఆ తడిపే శక్తి 'భవానీ'. ఆ పరమాత్మని, పరమాత్మ యొక్క శక్తిని భవానీ శబ్దం ద్వారా తెలుసుకుంటున్నాం.

'చర్చాస్తవం' అని ఒకటి ఉంది. ఇందులో వత్సరాజు అనే మహానుభావుడు భవానీ గురించి చెప్తూ –

సూతే జగంతి భవతీ భవతీ బిభర్తి
జాగర్తి తత్ క్షయ కృతే భవతీ భవానీ

మోహం భినత్తి భవతీ భవతీ రుణద్ధి

లీలాయితం జగతి చిత్రమిదం భవత్యాః

ఎన్నో భవతీలు వచ్చాయి. సరిగ్గా భవతీ, భవానీ అని స్ఫురింపజేసింది. మళ్ళీ శంకరులు –

అవిద్యానామన్తస్తిమిర మిహిరద్వీపనగరీ

జడానాం చైతన్యస్తబక మకరన్ద స్రుతిఝరీ

దరిద్రాణాం చిన్తామణిగుణనికా జన్మజలధౌ

నిమగ్నానాం దంష్ట్రా మురరిపు వరాహస్య భవతీ

సరిగ్గా అక్కడ చూపించారు. భవతీ అంటే ఉన్నదానవు, కలిగినదానవు, కలిగించుదానవు. ఆ భవతీ ఎవరో భవానీ ఆవిడే. అందుకే 'సూతే జగంతి భవతీ' – "నువ్వు ఉంటూ ఈ ప్రపంచాన్ని సృష్టిస్తున్నావు. నువ్వే దీనిని నిలుపుతున్నావు. నువ్వే దీనిని లయం చేస్తున్నావు. ఈ మూడు అవస్థల్లోనూ నువ్వు ఉన్నావు. నువ్వు ఎప్పుడూ ఉన్నదానవమ్మా భవానీ" అని కీర్తించారు. అందుకు సత్ పదార్థమైన పరబ్రహ్మమే భవానీ శబ్దం ద్వారా చెప్పబడుతోంది. ఈ భవానీ నామానికి అర్థం కొంతమేరకు చెప్పగలం గాని, శక్తిని అనుభవించవలసిందే. శ్రద్ధగా వింటే చెప్తున్నప్పుడే అనుభవానికి వస్తుంది. అందుకు భవానీ నామం గురించి విశేషంగా చెప్తున్నారు శంకరులు. ఆ తల్లి యొక్క భవానీ నామాన్ని చెప్తూ –

భవానీ భవానీ భవానీ త్రివారం

ఉదారం ముదా సంతతం యే జపంతి

న శోకం న మోహం న పాపం న భీతిః

కదాచిత్ కథంచిత్ కుతశ్చిత్ జనానామ్

అన్నారు శంకరులు. అమ్మా! భవానీ, భవానీ, భవానీ అని ఎవరు మూడు మార్లు అంటారో, అనడం ఎలాగంటే 'ఉదారం ముదా సంతతం యే జపంతి' అనేటప్పుడు ఉదారంగా అనాలి. అంటే మనస్సు బాగా తెరచుకొని హాయిగా, నిదానంగా అనాలి, ఆనందంగా అనాలి. జై భవానీ.

నామమే అమ్మ కదా? అందుకే ఆనందంగా అంటూ, 'సంతతం' – ఎప్పుడూ జపించాలి. మూడు మార్లు అంటే త్రికరణాలతో అని అర్థం. త్రికరణాలతో తాదాత్మ్యంగా ఎవరు జపిస్తారో వారికి 'న శోకం న మోహం న పాపం న భీతిః' – శోకం లేదు, మోహం లేదు, పాపం లేదు, భయం లేదు. ఇంకేం కావాలి?

ఎవరికి? ఎవరికైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలాగైనా 'కదాచిత్ కథంచిత్ కుతశ్చిత్ జనానామ్' అంత గొప్పది భవానీ నామం. అందుకు శంకరభగవత్పాదులవారు అమ్మా! 'న జానామి మంత్రం న జానామి యోగం న జానామి తంత్రం' – ఏమీ తెలీదమ్మా!, నాకు అలా ఏమీ తెలీదని ఒప్పుకుంటే అంతకంటే గొప్ప యోగం మరొకటి లేదు. 'గతిస్త్వం గతిస్త్వం త్వమేకా భవానీమ్' అన్నారు. నువ్వు నాకు గతివి, గతివి అది ఒక్కటే నాకు చాలు తల్లి. ఇంకేమీ అక్కర్లేదు. భవానీ అంటే చాలు. అమ్మా! నువ్వు ఉన్నావు నాకు. **నువ్వే ఉన్నావు. నేను ఉన్నాననేది భ్రాంతి. నువ్వు ఉన్నావనేది సత్యం. అందుకు భవానీలోనే 'అహం బ్రహ్మాస్మి' పలుకుతోంది.** కనుకే

భవాని త్వం దాసే మయి వితర దృష్టిం సకరుణాం
ఇతి స్తోతుం వాంఛన్ కథయతి భవాని త్వమితి యః
తదైవ త్వం తస్మై దిశసి నిజసాయుజ్యపదవీం
ముకుంద బ్రహ్మేంద్ర స్ఫుట మకుట నీరాజిత పదామ్

అంటున్నారు శంకరులు. 'భవాని త్వం' – 'భవానీ! నువ్వు' అంటే చాలు ఇంకేమీ అడగక్కర్లేకుండానే ముక్తినిస్తుంది. కనుక భవాని అన్నదానిలోనే 'అహం బ్రహ్మాస్మి' అనే మహావాక్యములు ఉన్నాయి. **ముందు ఎలుగెత్తి పిలిచే ఒక నామం, భక్తితో పిలిస్తే మంత్రం, గట్టిగా ఆలోచిస్తే మహావాక్యం. వేదాంత వాక్యం.** అంత శక్తిమంతమైనది భవాని.

113. భావనాగమ్యా – శ్రీ భావనాగమ్యాయై నమః

ఆ భవానీ కృప ఎలా లభిస్తుంది? ఆ అమ్మని ఎలా చూడగలం? ఆ పాదాలు ఎలా చేరగలం? అనే దానికి సమాధానం–'**భావనాగమ్యా**'. భావనతో

పొందవచ్చు. భగవంతుని పొందాలి అంటే భావనయే. భావించేవారికే భగవంతుడు. భావన చేతకాకపోతే భగవంతుడు లేడు. **కర్మలో ధర్మం ఉండాలి, ఉపాసనలో భావన ఉండాలి, జ్ఞానంలో విచారణ ఉండాలి.** భావనయే ఉపాసనకి ప్రాణం. ఉపాసనలన్నీ భావనాశ్రితములు. లేకపోతే ఎదురుగా ఒక లింగం అనే రాయిని పెట్టి శివుడని తాదాత్మ్యంగా పూజ చేస్తున్నాం. దేనివల్ల? అది భావన. అయితే ఏది పడితే అది అయిపోతుందా? శాస్త్రం చెప్పినదానిని భావించితే ఆ భావన సత్యం అవుతుంది. మన ఇష్టం వచ్చినది భావిస్తే అది కేవలం ఒక విశ్వాసం అవుతుంది. శాస్త్రం చెప్పిన ప్రకారం భావించాలి. ఆ లింగం అది స్ఫటికలింగమో, బాణలింగమో, ఎలా ప్రతిష్ఠ చేయాలో... అలా చేసి దాని యందు శివుని భావిస్తే శివుని పొందుతాడని శాస్త్రం చెప్పింది, కనుక నువ్వు శాస్త్రాన్ని అనుసరించి భావించాలి.

ఎవరు దేనిలో భావిస్తే దానిలో భగవంతుడు ఉంటాడా? అంటే ఉండడు. శాస్త్రసమ్మతమైన భావన చేయాలి. 'భావనాగమ్యా' అంటే చిన్న విషయం కాదు. అమ్మని భావనతో పొందగలం. బ్రహ్మప్రాప్తి భావనతోనే సాధ్యం. భావనకు దొరికే తల్లి. అయితే భావన అంత తేలిక కాదు. అది చెప్పాలంటే ఉపనిషత్తుల్లోకి దిగాలి. దాని పేరు **భావనోపనిషత్**. ఈ భావనోపనిషత్ ఒక రమ్యమైన రసగుళిక. అందులో ఎన్నో మాధుర్యాలున్నాయి. శ్రీచక్రాన్ని ఎలా భావించాలో, ఎలా ఆరాధించాలో చాలా సులభంగా, చక్కగా చెప్పారు. ఆ భావన ద్వారా అమ్మవారిని ఆరాధన చేయాలి, బాహ్యం చేయవచ్చుగాక, కానీ భావంలోకి బాహ్యం తీసుకు వెళ్ళాలి. తరువాత భావనతో బాహ్యం చెయ్యాలి. ఇవన్నీ కూడా సాధకులకి పనికివచ్చే అంశాలు. భావన అనేది ఎలా వెళ్ళాలంటే జపం చేసేటప్పుడు రెండు రకాల భావాలు ఉండాలి. అవి **శబ్దభావన, అర్థభావన**. ఆ శబ్ద స్పందనని పరిశీలించాలి. మనస్సుని పెట్టడమే భావన. అదే మహా కష్టం.

ఇక్కడ చేయవలసిన భావన ఎంత బలంగా సాగాలో పరిశీలించాలి. ముందు మంత్రం చేసేటప్పుడు శబ్దాన్ని భావించాలి. దాని తరువాత అర్థాన్ని భావించాలి. దానితో పాటు ఉపాసన సాగాలి. ఇక్కడికి వచ్చేటప్పుడు అర్థభావన

మళ్ళీ మూడు రకాలుగా వెళ్తుంది. మొదట '**బ్రాహ్మీభావన**', రెండవది '**అక్షరభావన**', మూడవది '**మహేశ్వరభావన**'. ఇది భావనాగమ్యా. బ్రాహ్మీ భావన అంటే పూజ చేస్తున్నప్పుడు గాని, జపం చేస్తున్నప్పుడు గాని, స్తోత్రం చేస్తున్నప్పుడు గాని అమ్మవారి దివ్యమంగళ విగ్రహం ధ్యానించుకుంటూ వెళ్తే అది బ్రాహ్మీ భావన. లలితాసహస్రం చదువుతున్నాం... 'అరుణాం కరుణాతరంగితాక్షీం' ధ్యానించుకోవాలి. 'చంపకా శోకపున్నాగసౌగంధికలసత్కచా' – ఆ రూపం అంతా భావన చేస్తూ గాని జపం చేసినా, పూజ చేసినా అది బ్రాహ్మీ భావన. ఇది మొదట ఉంటుంది.

రెండవదానిలోకి వెళ్ళాలి. అదేమిటంటే ఈ మంత్రవర్ణాలకి ఇందాక చెప్పిన శబ్ద భావన, అర్థభావనలతో కలుపుకుంటూ ఆ మంత్రాక్షరములతో తాదాత్మ్యం చెందాలి. దానిలో ఆనందిస్తూ ఉండాలి. అది వచ్చేటప్పటికి దానికి అక్షరభావన అని పేరు.

ఇక మూడవది ఈ రూపం, మంత్రం(నామం) ద్వారా వర్ణించబడే దేవతాతత్త్వం. ఈ రెండిటికి మూలమైనది తత్త్వం. అది అవ్యక్తమైనది. ఆ సర్వవ్యాపకమైన చిత్కళా. సచ్చిత్కళా. ఆ సచ్చిదానందరూపిణిని భావన చేయాలి. ఈ భావన మూడో భావన. ఇది మహేశ్వర భావన.

ఈ మూడు భావనలు బలపడితే అప్పుడు 'భావనాగమ్యా'. ఆ భావనతో దొరుకుతుంది. రూపధ్యానము, మంత్రాక్షరములతో తాదాత్మ్యం, మూడవది పరబ్రహ్మతత్త్వ స్ఫురణ. ఈ మూడు భావనలతోనే అమ్మవారిని తెలుసుకోగలరు. అందుకే భావన ఎలా బలపడుతుందో జగద్గురువులు శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో వివరించాడు. ఆయనకు మించిన గురువు ఎవరూ లేరు కదా.

జ్ఞానేంద్రియాణి సర్వాణి నిగృహ్య మనసా సహ
ఏకత్వభావనాయోగః క్షేత్రజ్ఞ పరమాత్మనోః

కర్మేంద్రియాల బాధేం లేదు. జ్ఞానేంద్రియాలే బయటికి లాగుతూ ఉంటాయి. మనస్సుతో సహా జ్ఞానేంద్రియాలని నిగ్రహించి, 'ఏకత్వ భావనాయోగః' – ఏకాగ్రంగా పరమాత్మ యందు మనస్సు నిలబెడితే దాని పేరు 'భావనాయోగం'. ఈ భావన

వల్ల యోగం వస్తుంది. ఎవరికి? 'క్షేత్రజ్ఞ పరమాత్మనో'. క్షేత్రజ్ఞునికి అంటే జీవునికి, పరమాత్మతో ఈ ఏకత్వమనేది ఇటువంటి భావనల వల్ల వస్తున్నది. అలాంటి భావనాయోగంతోనే అమ్మవారు లభిస్తున్నారు. అమ్మవారు అనగా జీవబ్రహ్మైక్య స్థితియే. పరబ్రహ్మ స్థితియే. అది పొందడానికి భావన. ఇలా భావిస్తే ప్రయోజనం- 'భవారణ్యకుఠారికా'.

114. భవారణ్యకుఠారికా - శ్రీ భవారణ్యకుఠారికాయై నమః

కుఠారం అనగా గండ్రగొడ్డలి. ఎవరిని భావించాలో ముందు చెప్పారు. ఎలా భావించాలో రెండవది. అంటే లక్ష్యమేంటో చెప్పారు, సాధనేంటో చెప్పారు. ప్రయోజనమేంటో చెప్పారు. దేనిని సాధన చేయాలి? భవానీని. ఎలా సాధన చేయాలి? భావనతో. చేస్తే ఏమొస్తుంది? 'భవారణ్యకుఠారికా'. ఒక్క వాక్యంలోనే సంపూర్ణం చూపించారు.

భవ-అరణ్య-కుఠారికా- ఆవిడ గండ్రగొడ్డలిలా పనిచేస్తుంది. అంత లలితమ్మ గండ్రగొడ్డలే. ఎవరికి ఎక్కడ ఎలాగ కావాలో ఆవిడ అలా అవుతుంది. మామూలు గండ్రగొడ్డలి కాదు ఇది. అది ఒక అరణ్యాన్నే దుంపతో సహా నరికేయగలదు. మూలంతో సహా తీసేస్తుంది. ఏమిటి ఆ అరణ్యం అంటే భవారణ్యం. భవం అంటే సంసారం. ఇది పెద్ద అరణ్యం. ఆ తల్లి ఈ సంసారమనే అరణ్యాన్ని సమూలంగా పెకలించేస్తుంది. దీనిని పెకలిస్తే అదే మోక్షం.

దేనిలోకి వెళ్ళి ఏడిస్తే ఆ మొర ఇంకొకడు వినడో దాని పేరు అరణ్యము. మన ఘోష ఇంకొకడు పట్టించుకోని చోటు. అందుకే అరణ్యఘోష, అరణ్య రోదన అని అంటారు. ఏడ్చినా ఎవ్వడూ ఏం పట్టించుకోడు, కాపాడడు. ఇక్కడ ఏడుస్తూ ఉంటే ఫలానావాడు ఓదార్చాడు అంటే వాని వల్ల కూడా లాభం లేదు. వానికి నీ ప్రయోజనం ఏదో ఉంది కనుక ప్రస్తుతం ఓదారుస్తున్నాడు. అంతే...ఈ ప్రపంచమంతా అరణ్యమే. ఈ అరణ్యమంతా పెకలించాలి అంటే ఆ తల్లిని ఆశ్రయించాల్సిందే. సంసారబంధములు, జన్మపరంపరలు ఏవైతే ఉన్నాయో ఆ భవారణ్యము అంతటిని

కూకటివేళ్ళతో పెకలించివేసే బ్రహ్మవిద్యారూపిణి.

శాస్త్రములు ఈ 'కుఠారికా' అనేది మంత్రవిద్య అని చెప్తున్నాయి. ఇందులో ప్రకట, గుప్త గాయత్రీ అని రెండు గాయత్రీ మంత్రరహస్యములు దాగి ఉన్నాయి అంటారు మంత్రతత్త్వవేత్తలు. అవి సభలో ప్రకటించడానికి లేదు. గ్రహించవలసిందే. అందుకే మొత్తం మూడు నామములు కలిపితే అదొక మంత్రరాశి. భవానీ-భావనాగమ్యా-భవారణ్యకుఠారికా. ఇదంతా కూడా సాధనకి తీసుకువెళ్ళాలి.

115. భద్రప్రియా – శ్రీ భద్రప్రియాయై నమః

అమ్మవారికి భద్రములు అంటే చాలా ఇష్టం. అందువలన భద్రములే చేయాలి. భద్రము అంటే శుభము, మంగళము. మంగళకరమైన ఆలోచనలు చేయాలి. సంకల్పాలు, ఆచరణలు మంగళకరంగా ఉంటే తప్పకుండా అమ్మవారు అనుగ్రహిస్తారు. 'భద్రప్రియా'. అలాగే అమ్మవారికి సమర్పించేవన్నీ మంగళకరమైనవి సమర్పించాలి. వాక్కులు సమర్పిస్తున్నావా.. ఎప్పుడూ మంగళకరంగా మాట్లాడు. ఆలోచనలు అన్నీ అమ్మకే అయినప్పుడు ప్రతిదీ మంగళకరంగా ఆలోచించాలి. **'భద్రం కర్ణేభిః శ్రుణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః'** – అక్కడ చెప్తున్నారు. భద్రమునే విందుము గాక! భద్రములే అందుము గాక! అని సంకల్పము చేసుకుని ఎప్పుడూ భద్రం పలకాలి, భద్రం వినాలి. భద్రము ఆలోచించాలి. భద్రములే ఆచరించాలి. అప్పుడు అమ్మవారు తప్పకుండా అనుగ్రహిస్తుంది.

కనుక ఎవరు మంగళకరమైన జీవన విధానము కలిగి ఉంటారో వారి పట్ల అమ్మ ప్రీతిభావంతో అనుగ్రహిస్తుంది. ఆవిడ స్వరూపమే భద్రం కనుక భద్రప్రియా. భద్రములే ఇష్టము ఆవిడకి.

116. భద్రమూర్తిః – శ్రీ భద్రమూర్త్యై నమః

భద్రమూర్తి అంటే మంగళకరమైన రూపము కలది. సర్వతోభద్రమనే పదం చాలా మందికి తెలిసే ఉంటుంది. దేవతా మండలము అంతా ఒక చోట ఉంటే

దాన్ని 'భద్ర మండలం' అంటారు. మండలం అంటే సమూహం. దేవతలంటేనే మంగళస్వరూపులు. మొత్తం దేవతలు మన దగ్గర కూర్చుంటే మనకి ఎంతో భద్రం. ఆ భద్రమండలం ఉంటే 'సర్వతో'-అన్ని విధములా- అన్ని వైపులా భద్రమే. సర్వదేవతాత్మకముగా ప్రతిష్ఠాకల్పములలో గాని, యాగాలలోగాని ఇప్పటికీ సర్వతోభద్రమండలమని వేస్తారు. సర్వదేవతల యొక్క మండలమే భద్రం. అమ్మవారు అలాంటి దేవతల పట్ల ప్రీతి కలిగి అనుగ్రహిస్తున్నది. అంతేకాదు సర్వదేవతామయమైన ఆకృతి కనుక భద్రమూర్తి అని అర్థం. ఆవిడ స్వభావం భద్రం కలిగించడం. భద్రం ఆమె స్వభావం. భద్రం ఆమె ప్రభావం. ఆవిడ వల్ల మనకు భద్రము కలుగుతున్నది. ఆవిడే ఈ భద్రములన్నింటి రూపం. ఆవిడ అనుగ్రహం కావాలంటే భావన చేయాలి. భద్రముగా జీవించాలి. ఇలా భద్రమైన పద్ధతులతో అమ్మవారిని ఆరాధన చేస్తూ ఉంటే ఆ భద్రమూర్తి వల్ల మనకు లభించేది 'భక్తసౌభాగ్యదాయినీ'. ఇవి ప్రయోజనాలు. 'భవారణ్యకుఠారికా' ఒక ప్రయోజనము. 'భక్తసౌభాగ్యదాయినీ' రెండవ ప్రయోజనము. ఇవన్నీ కూడా భవానీ ఉపాసనాఫలములు.

117. భక్తసౌభాగ్యదాయినీ - శ్రీ భక్తసౌభాగ్యదాయిన్యై నమః

భక్తులకు సౌభాగ్యము ఇస్తున్నది. భక్తులు అనగా ఆశ్రయించినవారు. జ్యోతిని ఆశ్రయిస్తే వెలుగు వస్తుంది. అగ్ని ముందు నిలబడితే వేడి వస్తుంది. అమ్మని ఆశ్రయిస్తే చాలు శుభాలు వస్తున్నాయి. అందుకు ఆశ్రయించిన వారందరికి సౌభాగ్యాలు ఇస్తోంది. అమ్మ విద్య పేరే 'సౌభాగ్యవిద్య'. ఆవిడ సౌభాగ్యానికి అధిదేవత. ఎప్పుడూ కూడా మేలు కలిగించే భాగ్యములన్నీ ఆ తల్లే అనుగ్రహిస్తోంది కనుక భక్తసౌభాగ్యదాయినీ. అమ్మవారి భక్తులకి ఎప్పుడూ ఆపద లేదు. భక్తులు కాకపోతే దౌర్భాగ్యం, భక్తులైతే మాత్రం సౌభాగ్యం. అందుకే భక్తసౌభాగ్యదాయినీ. అయితే ఇప్పుడు అమ్మవారు సౌభాగ్యం ఇవ్వాలంటే అమ్మవారి భక్తులుగా మారాలి. ఆ భక్తులుగా మారితే ఇంకేం కావాలి?

'భక్తిప్రియా, భక్తిగమ్యా, భక్తివశ్యా, భయాపహా, శాంభవీ, శారదారాధ్యా,

శర్వాణీ, శర్మదాయినీ'.

118. భక్తిప్రియా - శ్రీ భక్తిప్రియాయై నమః

119. భక్తిగమ్యా - శ్రీ భక్తిగమ్యాయై నమః

120. భక్తివశ్యా - శ్రీ భక్తివశ్యాయై నమః

భక్తి ఇష్టముగా గలది. భక్తిచే చేరదగినది. భక్తికి లొంగునది (అధీనురాలు).

ఇది ఇంకా గట్టిమాట. అమ్మని ఎవరూ వశము చేసుకోలేరు. ప్రపంచాన్ని ఆవిడ వశము చేసుకుంటుంది. ఆవిడ వశము కావాలంటే భక్తులకు లొంగిపోతుంది. పిల్లవాని ఏడుపుకి తల్లి ఎలా లొంగుతుందో, భక్తుని భక్తికి అమ్మవారు అలా లొంగిపోతున్నారు. అలా లొంగిపోతుంది కనుక 'భక్తివశ్యా'. ఆ మాట శివుడు అంతటివాడు అన్నాడు, "మీరు తపస్సులు చెయ్యండి, యజ్ఞాలు చెయ్యండి, యాగాలు చెయ్యండి, జపాలు చెయ్యండి, కర్మలు చెయ్యండి - నేను లొంగను. నువ్వు ఎంత హఠం బిగిస్తావో నేను అంత హఠమైపోతాను, లొంగను. నువ్వు నాపై అమాయకంగా నమ్మకమనే శ్రద్ధ పెట్టుకున్నావనుకో వెంటనే లొంగిపోతాను'' అన్నాడు (శివమహాపురాణం).

న కర్మణా న తపసా న జపైః న సమాధిభిః
శ్రద్ధామయ్యస్తి చేత్పుంసాం యేన కేనాపి హేతునా
వశ్యః స్పృశ్యశ్చ దృశ్యశ్చ పూజ్యః సంభాష్య ఏవచ

శ్రద్ధ అంటే నమ్మకం. ఒక్కసారి ఆ నమ్మకంతో ప్రేమగా భగవంతుని పట్టుకున్నామంటే దానికి లొంగిపోతాడు. వారితో కబుర్లు చెప్తాడు. భక్తి కలిగితే వశ్యమై ఏది చెప్పినా అది చేస్తాడు. అందుకే 'భక్తపరుడైన శ్రీరామ భద్రమూర్తి త్యాగరాజు ఎట్టులాడించె అట్టులాడె' అన్నారు విశ్వనాథవారు. రామచంద్రమూర్తి ప్రపంచాన్ని ఆడిస్తాడు. అలాంటి రామచంద్రమూర్తిని త్యాగరాజు ఆడించాడు. లేకపోతే ప్రపంచాన్ని త్రిప్పే కృష్ణపరమాత్మని గోపికలు చప్పట్లు కొట్టి ఆడించారు. భక్తికి లొంగిపోతారు. భక్తికి ఏం కావాలంటే అది చేస్తారు.

అమ్మవారికి నామ రూపాలు ఉండవు కదా! భక్తుల కోసం ధరిస్తారు.

అమ్మవారు ఈ నైవేద్యాలు అన్నీ తింటారా! భక్తులకోసం తింటారు.

బృందావనం వెళ్ళినప్పుడు ఒకానొక యోగి అక్కడ కనబడ్డాడు. ఆయన గురువుగారి గురించి చెప్తున్నాడు. ఆయన కాళీదేవికి నైవేద్యాలు అన్నీ పెట్టి మాట్లాడుతూ ఉంటాడు. మంత్రం లేదు, తంత్రం లేదు. నవ్వుతూ మాట్లాడుతూ ఉంటాడు. మరి ఆయన రామకృష్ణపరమహంస పుట్టిన నేల నుంచి వచ్చిన యోగి. అంతా అయిన తరువాత పెట్టిన నైవేద్యాలు ఒక్కటి కూడా ఉండదు. మొత్తం కూర్చొని ఆయనతో కబుర్లు చెప్తూ అమ్మవారు ఆయనతో ఆరగిస్తారు. ఇప్పటికీ జరుగుతున్న కథ. మనకెందుకయ్యా అమ్మ కనబడట్లేదు అంటే లోపం – భక్తి లేకపోవడమే. భక్తి–అది ఉంటే ఎంతగానో లొంగిపోతుందన్న మాటని ఎంత చక్కగా వశిన్యాది వాగ్దేవతలు నొక్కి చెప్తున్నారు. 'భక్తిప్రియా, భక్తివశ్యా, భక్తిగమ్యా, భక్తసౌభాగ్యదాయినీ'. అమ్మవారిని నమ్మినవారికి సౌభాగ్యానికి లోటు లేదు, తప్పకుండా ఆ తల్లి అనుగ్రహిస్తుంది. ఆ లోటు లేని సౌభాగ్యం కావాలి అంటే మనలో లోటు లేని భక్తి అభివృద్ధి చెందాలి. ఎంత భక్తి చూపిస్తే అంత.

సూర్యకాంతి ఉంది. తలుపుకి మనం పెట్టిన రంధ్రం బట్టి మనం ఎంత చూడగలిగితే అంత. కొందరు రంధ్రంలోంచి సూర్యకాంతిని చూస్తూ ఉంటారు. వారికి అంతే ప్రాప్తం. కొందరు కిటికీ లోంచి చూస్తారు. అంతే ప్రాప్తం. కొందరు తలుపు తెరచుకొని బయటకి వస్తారు. వారికి అంతా ప్రాప్తం. అలాగ హృదయాలు తెరిచిన భక్తికి భగవంతుడు సంపూర్ణంగా ప్రాప్తమవుతాడు. అందుకు 'భక్తిప్రియా, భక్తివశ్యా, భక్తిగమ్యా'.

అయితే భక్తి అంటే ఏమిటి? భక్తి అనగా ఒక మాట చెప్పుకున్నాం– 'ఆశ్రయించుట'. 'భజ్ సేవాయాం' అనే ధాతువు నుండి భక్తి అనేది వచ్చింది. కానీ భక్తి అంటే ఒక్కమాటలో చూడండి

ద్రుతస్య భగవద్ధర్మాద్ధారావాహికతాం గతా
సర్వేశే మనసోవృత్తిః భక్తిరిత్యభిధీయతే

'సాత్వస్మిన్ పరమప్రేమరూపా' – పరమాత్మ యందు ప్రేమయే భక్తి అన్నాడు నారద మహర్షి. పరమాత్మ యందు అనురాగమే భక్తి అన్నాడు శాండిల్యుడు. **'సా పరానురక్తి రీశ్వరే'**– రెండూ అర్థం ఒకటే. "అనురాగము లేని మనసున సుజ్ఞానము రాదు" అంటారు త్యాగరాజస్వామివారు. పరమాత్మపై అనురాగము ఉండాలి. 'అను' అనగా ఎడతెగని, 'రాగము' అంటే ప్రేమ–ఎడతెగని ప్రేమ. ఎలా వెళ్ళాలయ్యా అంటే భగవద్ధర్మాత్– భగవద్ధర్మముల వలన మనస్సు అతివేగముగా, ఆగకుండా ప్రవహిస్తే దాని పేరు భక్తి.

భగవద్ధర్మములు అనగా భగవత్కథలు వినడము, భగవన్నామం పలకడం, భగవత్పూజ చెయ్యడం. భగవద్విషయాలు ఏ విధంగా మన తలంపుకి వచ్చినప్పటికి కూడా మనస్సు వెంటనే స్పందించిపోయి ఆనందముగా పరిగెత్తుతుంది. ఒకొక్కరికి ఒక్కో విషయం మీద ఉత్సాహం. భాగవతులకి భగవంతుడే ఉత్సాహం. అందుకే నరసింహస్వామి అడుగుతాడు ప్రహ్లాదుడిని "నీకేం కావాలయ్యా" అని, అప్పుడు ప్రహ్లాదుడు, "ఏం లేదయ్యా 'యాప్రీతిరవివేకానాం విషయేష్వనపాయినీ' – అవివేకులకి విషయాల మీద ఎంత ప్రీతి ఉంటుందో, నాకు నీపై అంత ప్రీతి ఉంటే చాలయ్యా" అన్నాడు. ఇటుదటు తిరిగితే చాలు. కానీ అంత తేలిగ్గా తిరగదు. ప్రపంచం వైపు తిరిగే మనస్సుని పరమాత్మ వైపు తిప్పడం మహాకష్టం. అందుకే –ఎన్నో నిర్వచనాలు ఉన్నా ఇది చాలా సమంజసమని ఈ శ్లోకాన్ని ఎంచుకోవడం జరిగింది. అటువంటి భక్తి కలిగితే అమ్మ 'వశ్యా'. ఇక్కడ చెప్పేటప్పుడు మనకు అమ్మవారు అంటే ఏమిటో చెప్పారు, ఆవిడ ఉపాస్యరూపాలే చెప్పి, దానికి ప్రధానంగా భావన కావాలన్నారు. ఆ భావన భక్తితో చెయ్యాలని చెప్పారు. ఇంత చక్కగా సాధన చూపిస్తున్నారు. అలాంటి భక్తి కలిగితే ఏమొస్తుందండి? భయాపహా. వెంటనే భయాల్ని పోగొడుతుంది. భయమంటే దానికి ఎన్ని చెప్పగలం! ఒకొక్క సందర్భంలో ఒకొక్కటి భయం.

121. భయాపహా – శ్రీ భయాపహాయై నమః

మూడే రకాల భయాలు తప్ప మరొకటి లేదు. మన శరీరానికి వచ్చే

రోగాలు, రొష్టులు వల్ల భయం ఒకటి. దీనికి ఆధ్యాత్మిక భయం అంటారు. అలాగే ప్రక్కవాని వల్ల, పురుగు పుట్రా వల్ల, జీవుల వల్ల వచ్చే భయమంతా కూడా ఆధిభౌతిక భయం. ఇది కాకుండా హఠాత్తుగా భూకంపమో, తుఫానో, వరదలో, కుంభవృష్టో – ఇలాంటివి కలిగితే ఆధిదైవిక భయం.

ఈ మూడు రకాల భయాలు పోగొట్టగలిగే శక్తి అమ్మవారికి ఉంది. అందుకే 'భయాపహా'.

భయం అంటే ఏమిటో వేదం చెప్తూ 'ద్వితీయాద్వై భయం భవతి' – రెండవదాని వల్లే భయం కలుగుతుంది అని చెప్పింది. ఒకాయన నేనున్నాను ఏం భయపడకని అనంటే, 'నా భయం అదేనయ్యా' అన్నాడుట ఇవతలివాడు. ప్రక్కన వాడుంటేనే భయం, అసలు ఎవడూ లేకపోయినా భయం. అది ఎందుకు – ఎవడో వస్తాడని. అప్పుడు కూడా రెండవదాని వల్లే భయం. సృష్టిలో రెండవది ఉందంటేనే భయం. రెండవది లేదు, ఉన్నది ఒక్క పరమాత్మే అని అన్నప్పుడు ఎంతో ధైర్యంగా ఉంటుంది. నీరు, నిప్పు–అంతా కూడా పరమాత్మే కనుక ఉన్నది ఒకే పరమాత్మ అనుకుంటే వాడు ప్రహ్లాదునిలా ధైర్యంగా ఉంటాడు. అందుకే ఆయనను నీటిలో తోసినా, నిప్పులో తోసినా ఏమీ బాధపడలేదు. **'నిర్భీకుండు ప్రశస్త భాగవతుడున్ నిర్వైరి'**– ఆయనకి భయమనేది లేదు.

దైవీ గుణములలో మొదటిది **'అభయం సత్త్వసంశుద్ధిః'** అని భగవద్గీతలో మొదలుపెట్టాడు. అభయం ఎంతో గొప్ప విషయం. అభయం అంటే **'అద్వైతమేవాభయం'**–ద్వైతభ్రాంతి ఉన్నంత కాలం భయం ఉంటూనే ఉంటుంది. ద్వైతభ్రాంతి తొలగాలి, ఉన్నది ఒకటే పరతత్త్వం 'అమ్మ' అని తెలియాలి. ఆ స్థితి మనకి కలగాలి అంటే అమ్మ దయ ఉండాలి. అమ్మదయ ఉంటేనే ఈ ద్వైతభ్రాంతిని తొలగించి అద్వైతసిద్ధియైన మోక్షజ్ఞానాన్ని అనుగ్రహిస్తున్నది. ఇది 'భయాపహా' అనే దానిలో పరమార్థం.

ప్రతిదానికి మూడర్థాలు–వ్యవహారార్థం, ఉపాసనా అర్థం, పరమార్థం ఉన్నాయి. అమ్మను **'భయాపహా'** అన్నారు. అందుకే 'అరణ్యే రణే దారుణే శత్రుమధ్యే౽

నలే సాగరే' – ఎక్కడున్నప్పటికి అమ్మని ఒక్కసారి తలంచుకొంటే చాలు. నిజంగా కూడా అదే. భౌతికంగా కూడా అడవుల్లో వెళ్ళిపోతూ ఉంటే ఒక్కసారి 'అమ్మా!' అన్నామనుకోండి వెంటనే కాపాడుతుంది తల్లి. ఆవిడ పనే అది.

నమస్తే శరణ్యే శివే సానుకంపే నమస్తే జగద్వ్యాపికే విశ్వరూపే
నమస్తే జగద్వంద్య పాదారవిన్దే నమస్తే జగత్తారిణి త్రాహి దుర్గే

ఆ తల్లిని అలా ఆశ్రయిస్తే అన్ని భయాలు పోగొడుతుంది.

"...**భయస్థానే విశేషతః. ఆధిష్వపి చ సర్వేషు దేవీ నామాని కీర్తయేత్**" (వాయుపురాణం) – సర్వభయస్థానాలలో దేవీనామాలను కీర్తించాలి.

ఆపద కిం కరణీయం స్మరణీయం చరణకమలమంబాయాః
తత్ స్మరణం కిం కురుతే బ్రహ్మాదీనామపి కింకరీ కురుతే

122. శాంభవీ – శ్రీ శాంభవ్యై నమః

శాంభవీ అన్నా భవానీ లాంటిదే. శంభుని శక్తి శాంభవి. శాంభవీ– ఇది చాలా గొప్ప విషయమైన 'శాంభవీ స్థితి'. సహస్రారస్థానంలోని అమృతప్రవాహమే భవానీ అని జలస్వరూపంగా అన్నాము. శాంభవి అంటే శంభుని శక్తి. శంభు శబ్దానికి అర్థమే శాంభవి అని చెప్పుకోవాలి. శంభు అంటే శుభములు కలిగించువాడు, శుభములకు, శాంతికి మూలమైన వాడు 'శం–భు'. '**నమశ్శంభవేచ మయోభవేచ**' – ఆ శంభుని యొక్క శక్తి అంటే అందరికీ సుఖాన్నీ, శాంతిని, శుభాన్ని ఇచ్చేది అని అర్థం. శాంభవీ అంటే చాలు మనకు ఇవి కలిగిస్తున్నది. ఇప్పుడు చెప్తున్న నామములు అన్నింటికి కలిపి 'శాంభవీ విద్య' అని పేరు.

"**అంతర్లక్ష్యం బహిర్దృష్టిః నిమేషోన్మేషవర్జితా। ఏషా సా శాంభవీ ముద్రా సర్వతంత్రేషు గోపితా**"॥. శాంభవీ స్థితి అంటే పరమాత్మతో తాదాత్మ్యం చెందిన యోగికి తెలుస్తుంది. వాని మనఃస్థితిని శాంభవీ ముద్ర అంటారు. శాంభవి అంటే **అంతర్లక్ష్యం బహిర్దృష్టి**– వాడు లోకంలో అందరినీ చూస్తున్నట్లు కనబడుతూ ఉంటాడు. కానీ అతని అసలు దృష్టి మాత్రం లోపల ఉంటుంది. లోపల ఉన్న పరమాత్మ వైపే

దృష్టిని ఉంచుతాడు. ప్రపంచాన్ని సాక్షీభూతంగా చూస్తూ ఉంటాడు. ఆ స్థితిని 'శాంభవీ స్థితి' అని అంటారు. ఆ స్థితిలో ఏ బ్రహ్మానుభవం వానిలో ఉన్నదో ఆ బ్రహ్మానుభవ రూపమైన ఆనందానికి శాంభవి అని పేరు. అనగా యోగి సమాధిలో పొందే పరబ్రహ్మానందమే శాంభవి. ఆ స్థితిలో ఉంటాడు కనుక జగత్తుని సాక్ష్యముగా చూస్తాడు. అది ఇక్కడ 'అంతర్లక్ష్యం బహిర్దృష్టిః శాంభవీ ముద్రా'.

123. శారదారాధ్యా - శ్రీ శారదారాధ్యాయై నమః

ఇది కూడా సాధనలో ప్రధానమైనది. 'భక్తిప్రియా', 'భక్తిగమ్యా' దగ్గర 'శారదారాధ్యా' నామం కూడా చేర్చాలి. 'శారదారాధ్యా' అనగా శారదాదేవి చేత ఆరాధింపబడుతున్నది - ఇది ఒక అర్థం.

శారద అంటే పలుకులు, జ్ఞానములు. ఇక్కడ ఒకానొక మూర్తి అని మాత్రమే కాదు. అన్ని పలుకులు చేత, అన్ని జ్ఞానముల చేత ఆరాధింపబడుతున్నది ఆ తల్లి. ఇప్పుడు స్తోత్రం చేయాలంటే వేదమంత్రాలు వాడతాం. మంత్రములు, స్తోత్రములు ఇవన్నీ శారదలు....జ్ఞానములు. అలాంటి అన్ని జ్ఞానముల చేత, అన్ని పలుకుల చేత ఆరాధింపబడుతోంది కనుక 'శారదారాధ్యా'.

అంతేకాదు... వశిన్యాదివాగ్దేవతలందరు శారదాశక్తులు. వారి చేత పూజింపబడుతోంది కనుక 'శారదారాధ్యా'.

శరత్కాలంలో ఆరాధింపబడేది 'శారదారాధ్యా'. అమ్మవారిని ఎల్లవేళలా ఆరాధించాలి కానీ శరత్కాల ఆరాధన ప్రధానం. సంవత్సరమంతా ఆరాధించిన ఫలం శరత్కాల ఆరాధనలో వస్తుంది కనుక అది ముఖ్యం. అందుకే సంవత్సర ఆరంభంలో అమ్మవారిని ఆరాధన చేయాలి. వసంత నవరాత్రులు, శారదా నవరాత్రులు. నక్షత్రరీత్యా లెక్క వేస్తే శారదా నవరాత్రులు.

ఎందుకంటే మొదటి నక్షత్రం అశ్విని కదా. అశ్విని నక్షత్రంతో మొదలయ్యేది ఆశ్వయుజమాసం. అందుకు అప్పటి నవరాత్రులు చాలా ప్రధానం. వేదము కూడా ఈ లెక్కని తీసుకుంది. శరత్తుతో సంవత్సరమును లెక్కపెట్టడం వేదసంప్రదాయం.

అందుకే **'జీవేమ శరదశ్శతమ్, నందామ శరదశ్శతమ్, మోదామ శరదశ్శతమ్'** అని చెప్పినప్పుడు వసంతములు అని చెప్పలేదు... శరత్తులనే చెప్పారు. వసంత లక్షణములు, శరత్ లక్షణములు ఇంచుమించు ఒకేలా ఉంటాయి. వాతావరణంలో సమశీతోష్ణస్థితి ఇత్యాదులు. అందుకు శరత్కాలంలో ఆరాధింపబడే దేవత 'శారదారాధ్యా'. అయితే ఎప్పుడైనా కాలం అంటే బయట ఉన్న సమయం అని మాత్రమే కాదు, ఎవరి మనస్సుకు శారదా అనబడే స్థితి ఏర్పడుతుందో వారి పూజ అమ్మవారు స్వీకరిస్తారు. అదే 'శారదారాధ్యా'. మనం సాధనలో ఏ స్థితిలో ఉన్నామో దానిని అనుసరించి మన ఋతువు ఏంటో చెప్పవచ్చు. మనం ఎప్పుడూ శరదృతువులో ఉంటేనే అమ్మవారి పూజ చేయాలి. చైతన్యము శరదృతువుకు ఉన్న విశేషము.

శరత్కాలపు ప్రత్యేకతను పరిశీలిద్దాం. అప్పటి వరకు జలములందు అంతటా వర్షాలవల్ల బురద ఏర్పడుతుంది. నేల, నీరు, నింగి జలమయం, బురదమయం అయిపోతాయి. అందుకే ఆ సమయంలో చాతుర్మాస్యం అని ఎక్కడా కదలకుండా ఉంటారు. శరదృతువు వచ్చిన తరువాత ఈ బురదంతా అడుగంటిపోయి నింగిలో, నేలలో, నీటిలో కూడా తేటదనము ఏర్పడుతుంది. అందుకు శరదృతువు అంటే తేట ఋతువు. బురదని, కాలుష్యాన్నంతటిని నివారింపజేసే ఋతువు. **'శృణాతి హినస్తి ఇతి శరత్'** అన్నారు. ఇటువంటి మాలిన్యాలను, కాలుష్యాలను పోగొట్టేది శరత్. రజోగుణ, తమోగుణాలు కలిసిపోతే బురద. ఆ రెండూ దిగిపోవాలి. అప్పుడు తేటదనం వస్తుంది. ఆ తేటదనం అంటే శుద్ధసత్త్వగుణం. అలాంటి శుద్ధసత్త్వగుణాన్నే ప్రసన్నభావం అంటారు. కనుక శారదా అంటే ప్రసన్నభావం. ప్రసన్నభావం ఎవరికుంటుందో వారి ఆరాధనే సత్యమైన ఆరాధన. వారి ఆరాధన అమ్మవారు అందుకుంటున్నారు. అందుకే అప్రసన్నుడు ఆరాధన చెయ్యరాదు. ప్రసన్నగుణమునే ప్రసాదగుణము అంటారు.

మనఃప్రసాదః సౌమ్యత్వం- భగవద్గీతలో మానసిక తపస్సు అంటే చెప్తూ కృష్ణపరమాత్మ అంటారు - మనస్సులో ప్రసన్నతా భావాలు ఉండాలి, వికారాలు ఉండకూడదు. ప్రసన్నతాభావమే శరత్. ఆ స్థితి శారద. అలాంటి స్థితిలో ఉన్న

వారిచేత ఆరాధింపబడుతుంది కనుక 'శారదారాధ్యా'.

124. శర్వాణీ – శ్రీ శర్వాణ్యై నమః

శర్వుని భార్య కనుక 'శర్వాణీ'. శర్వుడు అంటే శివుడు. **'శృణాతి సంహార సమయే సంహరతి సంహారయతి సకలాః ప్రజాః ఇతి శర్వః'** – సకల జగత్తుని తనలో లీనము చేసుకునేవాడు శర్వుడు. భవ అంటే జలము, అది అన్నింటిని పోషిస్తున్నది. శర్వ అంటే అన్నింటిని లయం చేస్తున్నది. శర్వుడు అన్నప్పుడు సర్వమును తనలో లయం చేసుకునేవాడు. భూమి యందే పుట్టి, భూమి యందే పెరిగి, అన్నీ భూమి యందే లయం అయిపోతాయి.

శర్వుడు అంటే భూమిరూపంలో ఉన్న శివుడు. జలరూపంలో ఉన్న శివుని భవుడు అంటారు. **'శర్వాయ క్షితిమూర్తయే నమః'**– ఆ భూరూపంలో ఉన్న శర్వుని శక్తి 'శర్వాణీ'. భవుని భార్య అయిన భవానీ పేరు 'ఉషా' అని చెప్పుకున్నాం. ఇక్కడ ఈవిడ పేరు 'సుకేశీ'. అష్టమూర్తులలో శర్వుని భార్య పేరు 'సుకేశీ'. 'సుకేశీ కథ్యతే పత్నీ' అని వివరణ. శర్వుని అభిన్నశక్తి. ఇప్పుడు శాంభవి, శర్వాణీ, భవానీ మూడూ బాగా గుర్తుపెట్టుకోవాలి. ఈ తల్లి 'శర్మదాయినీ'.

125. శర్మదాయినీ – శ్రీ శర్మదాయిన్యై నమః

శర్మము అనగా సుఖము. 'శర్మదాయినీ' అంటే సుఖమును ఇచ్చునది. ఇంద్రియసుఖములు కాకుండా, ఇంద్రియాతీతమైన జ్ఞానానందమును శర్మము అంటారు. శర్మము అనగా పరబ్రహ్మానందం. ఆ జ్ఞానానందము ఇచ్చే తల్లి 'శర్మదాయినీ'. ఎవరు భక్తులై ఆరాధిస్తారో వారందరికీ 'శర్మదాయినీ'. ఆవిడే 'శాంకరీ'.

126. శాంకరీ – శ్రీ శాంకర్యై నమః

శంభుని భార్య 'శాంభవి', శర్వుని భార్య 'శర్వాణీ', భవుని భార్య 'భవానీ', శంకరుని భార్య 'శాంకరీ'. శంకర ఎంతో మధురమైన నామం. 'శమ్' అంటే శాంతం,

సుఖము, శుభము. దానికి మూలమైనవాడు శంభుడు. దానిని కలిగించేవాడు శంకరుడు. ఆ శంకరుని శక్తి శాంకరి. శుభాన్ని, సుఖాన్ని కలిగించునది.

ప్రతిసర్గాది మధ్యాంతమహం శంభుం నిరాకులం
స్త్రీరూపేణానుయాస్యామి ప్రాప్య దక్షాదహం తనుం
తతస్తు విష్ణుమాయాం మాం యోగనిద్రాం జగన్మయీం
శాంకరీతి స్తువిష్యంతి రుద్రాణీతి దివౌకసః

"నేను దక్షునకు కూతురిగా జన్మించి, ప్రతి సృష్టియొక్క ఆదిమధ్యాంతాలలో నిర్వికారంగా ఉన్న శంకరుని వనితారూపంగా అనుసరిస్తాను. ఆ నన్ను దేవతలు విష్ణుమాయ, యోగనిద్ర, జగన్మయి, **శాంకరి**, రుద్రాణి – అనే నామాలతో స్తుతిస్తారు" (కాళికాపురాణం).

127. శ్రీకరీ – శ్రీ శ్రీకర్యై నమః

శ్రీ అంటే ఐశ్వర్యం. ఐశ్వర్యములన్నీ కలిగించే శక్తి 'శ్రీకరీ' అని చెప్పబడుతున్నది. శ్రీ అనగా లక్ష్మి. అన్ని రకాల లక్ష్ములను ఇచ్చే శక్తి.

ఇది కూడా అమ్మవారి యొక్క ఒక అనుగ్రహస్వరూపము. ఎవరైతే భక్తులు ఆశ్రయిస్తున్నారో వారికి శ్రీకరీ అవుతున్నది. అమ్మవారి విద్య 'శ్రీవిద్య'. ఎక్కడికక్కడ సమయం దొరికిన ప్రతిసారి 'శ్రీ' శబ్దాన్ని సమయం చూసి ప్రయోగిస్తున్నారు వశిన్యాది వాగ్దేవతలు. 'శ్రీమద్వాగ్భవకూటైక' అన్నప్పుడు మళ్ళీ 'శ్రీ' అనే శబ్దాన్ని ఇచ్చి, ఆ శ్రీవిద్యాధిదేవతని స్ఫురింపజేస్తూ ఇక్కడ కూడా శ్రీకరీ అంటున్నారు. శ్రీ శబ్దానికి మనం ఎన్ని అర్థాలు చెప్పుకున్నామో అవన్నీ గుర్తు పెట్టుకోవాలి. అసలు ఆ శ్రీ అర్థం గుర్తుపెట్టుకొని లలితాసహస్రమంతా పరిశీలించవలసిందే.

శ్రీ అనగా ఐశ్వర్యము, శోభ, జ్ఞానము, మోక్షము ఇన్ని అర్థాలు ఉన్నాయి. 'సా హి శ్రీః అమృతా సతామ్' – ఆ తల్లి అమృతస్వరూపిణి అని చెప్పారు. శ్రీకరీ అంటే అమృతమును ఇచ్చునది అని అర్థం. అమృతమనగా మోక్షం, బ్రహ్మజ్ఞానము, దానిని ప్రసాదిస్తున్నది. ఇక ఐశ్వర్యములు అంటే 'శ్రీ' తో చెప్పబడే సర్వైశ్వర్యములు

'సిద్ధలక్ష్మీర్మోక్షలక్ష్మీః జయలక్ష్మీస్సరస్వతీ శ్రీర్లక్ష్మీః వరలక్ష్మీశ్చ' – ఇవన్నీ శ్రీ రూపములే. శ్రీ అనగా విభూతులు. అలాంటి విభూతులన్నీ ప్రసాదించేది కనుక 'శ్రీకరీ'.

128. సాధ్వీ – శ్రీ సాధ్వ్యై నమః

సాధ్వీ అంటే మహాపతివ్రత. అమ్మవారు మహాపతివ్రత. అంతేకాదు 'సా+అధ్వ – సాధ్వ'. అధ్వము అంటే మార్గము. మార్గములతో కూడి ఉన్నది. దానికి పుం లింగంలో సాధ్వః. స్త్రీ లింగంలో సాధ్వీ. చక్కని మార్గములు కలది సాధ్వీ. చక్కని మార్గములు అంటే సంప్రదాయ పద్ధతులు. బ్రహ్మప్రాప్తికి ఏ ఏ సంప్రదాయ మార్గములు వేదం చెప్పిందో ఆ మార్గములు అన్నీ మంచి మార్గములు. అందుకే సత్–సదా–సాధ్వీ. మంచి మార్గములన్నింటికి గమ్యమైన తల్లి.

మనం తరించడానికి అన్ని మార్గములు వేదమే చెప్పింది కనుక అన్ని శుభ మార్గములతో కూడిన వేదమాతకి 'సాధ్వీ' అని పేరు.

ఈ భవానీదేవిని ఆరాధిస్తే ఫలితాలు–శర్మదాయినీ, భక్తసౌభాగ్యదాయినీ, భయాపహా, భవారణ్యకుఠారికా, శాంకరీ, శ్రీకరీ. ఇక్కడ కూడా భవాని, శాంభవిదేవిని ఆరాధించవలిసిన పద్ధతులు, ఆరాధిస్తే వచ్చే ఫలితాలు చెప్పబడ్డాయి.

ఇవి ప్రధానంగా భవానీ విద్యాస్వరూపానికి సంబంధించిన నామములు. ఉపాస్యదేవత భవానీ. ఆ భవానీదేవి యొక్క వివిధములైన అనుగ్రహాలు ఎలా ఉంటాయో ఈ నామములలో చెప్తున్నారు. శర్మదాయినీ, భక్తసౌభాగ్యదాయినీ, భయాపహా, శ్రీకరీ – ఇవన్నీ భవానీదేవి మనకిచ్చే అనుగ్రహాలు. ఆవిడ యొక్క స్వభావము, స్వరూపము శాంకరీ, శాంభవీ, శర్వాణీ ఇలాంటి నామాలతో ఆ తల్లి యొక్క స్వరూపాన్ని ఆవిష్కరిస్తున్నారు.

సాధ్వీ అంటే అమ్మవారి యొక్క పాతివ్రత్యతత్త్వాన్ని చూపిస్తున్నారు. భవానీ ఒక పతివ్రతా గుణానికి పరమ రూపం. అసలు అమ్మవారిని పతివ్రతగా భావించడం ఒక పెద్ద ఉపాసన. పతివ్రత అనగానే ఆమెతో పాటు ఆయన కూడా స్ఫురింపబడతాడు. అదే పతివ్రతా భావనతో చేసే ఉపాసన. అక్కడ సమయాచారం అవుతున్నది. పతి

ఉంటేనే కదా పతివ్రత. అందుకు అమ్మవారిని పాతివ్రత్యభావనతో ఉపాసించడమే. భవానీ, శాంకరీ, శర్వాణీ, శాంభవీ – ఈ మాటలన్నీ కూడా మనకి సమయాచారాన్ని చెప్తున్నాయి. ఎక్కడికక్కడ ఆ సమయాచారాన్ని ఎలా ప్రతిష్ఠ చేస్తున్నారో చూడండి. సాధ్వీ అనగా పతివ్రతా గుణముల రాశి. అలాగే సాధు మార్గములో ఉన్నది సాధ్వీ. స్త్రీ పాతివ్రత్యమే సాధుమార్గం. పతివ్రతనే సాధ్వీ అంటారు.

పురుషుడు సాధువు కావాలి. స్త్రీ సాధ్వి కావాలి. సాధు అంటే మేలు, బాగు అని కూడా అర్థం ఉన్నది. మేలైనవాడు, మేలైనది అవుతారు. మేలైన గుణములతో ఉన్న తల్లి 'సాధ్వీ'.

129. శరచ్చంద్రనిభాననా - శ్రీ శరచ్చంద్రనిభాననాయై నమః

ఇది కూడా శాంభవీవిద్యకు సంబంధించిన నామమే. శరత్కాలము నాటి చంద్రుని వంటి అందమైన, ప్రకాశవంతమైన ముఖము కలది అని అర్థం. వశిన్యాదివాగ్దేవతలు అమ్మవారి గుణములు, స్వభావము చెబుతూనే తళుక్కున రూపవర్ణన చేస్తుంటారు. ఇంతవరకూ శ్రీకరీ, సాధ్వీ, శర్మదాయినీ అన్నప్పుడు అమ్మరూపం ఎక్కడా చెప్పలేదు. ఒక్కసారి భావిస్తున్న వశిన్యాదివాగ్దేవతలకి ఈ గుణములన్నీ కలిగిన అమ్మరూపం స్ఫురించింది. ఆ రూపం 'శరచ్చంద్రనిభాననా'.

ప్రతి పూర్ణిమ అమ్మవారి నిండు కళలు అయినప్పటికీ శరత్కాల పూర్ణిమకి యోగపరంగా కూడా చాలా ప్రత్యేకత ఉంది. శరత్కాలమే అమ్మ ఆరాధనకు ముఖ్యమైనప్పుడు, శరత్కాల పూర్ణిమ సంవత్సర పూర్ణిమలలోకెల్లా రాజు వంటిది. అత్యంత శ్రేష్ఠమైనది. జ్ఞానానందం యొక్క పరిపూర్ణ దశే 'శరచ్చంద్రనిభాననా'.

'శారదారాధ్యా' చెప్పినపుడు ప్రసన్నతా భావం అని చెప్పుకున్నాం. ఆ ప్రసాదభావము, పరిపూర్ణభావము, జ్ఞానభావము, ఆనందభావము – ఈ నాలుగు అమ్మవారి ముఖంలో భాసిస్తూ ఉన్నాయి కనుక 'శరచ్చంద్రనిభాననా'. అవి పూర్ణంగా ఉన్నాయి కనుక పూర్ణిమనాటి విషయాన్ని ప్రస్తావన చేసుకున్నాం.

ముఖం అనగానే మనస్సుకు దర్పణమే. అంటే అమ్మ యొక్క మనస్సును

వర్ణిస్తున్నారని అర్థం. మనస్సు అంటే స్వభావం. అమ్మవారి మనస్సు ఎప్పుడూ శరచ్చంద్రునివలె పూర్ణంగా జ్ఞానానంద ప్రసన్న భావములతో ఉంటుంది. ఆ మనస్సే ముఖంలో ప్రతిఫలిస్తోంది. – ప్రసన్న పూర్వకమైన హృదయం కలది అని భావించాలి.

130. శాతోదరీ - శ్రీ శాతోదర్యై నమః

ఇప్పుడు రూపవర్ణన కనుక అమ్మవారి 'శరచ్చంద్ర నిభాననా' చెప్పిన వెంటనే ఆ స్వరూపంలో ఉన్న గొప్పతనాన్ని చూపిస్తున్నారు. సన్నని నడుముతో ఉన్నది. 'శాతము' అంటే అత్యంత సూక్ష్మము. శాతముతో కూడిన ఉదరము– అనగా నడిమ ప్రాంతం.

శాతోదరీ – సన్నని నడుముతో ఉన్నది అమ్మవారు. ఒక్కసారి రూపస్ఫురణలో వదనము, నడుము రెండు చూపించారంటే అమ్మ యొక్క మూర్తిని ధ్యానం చేస్తున్నారు.

ఇందులో మంత్రరహస్యం ఒకటి ఉంది. 'శాతోదరీ' నామంలో వనదుర్గా మంత్రసూచన ఉంది. బయటకి చూస్తే రూపధ్యానం. కానీ, వనదుర్గ మంత్ర సూచన. ఈ నామాన్ని అంటున్నప్పుడు మనకు తెలియకుండా ఆ శక్తి తప్పకుండా ప్రవేశిస్తుంది. కానీ ఇది తెలుసుకుని, శాతోదరీ చదివితే వనదుర్గ అమ్మ అని స్ఫురించిందంటే తప్పకుండా మంత్రభావం ఇంకా ఎక్కువ వస్తుంది. సహస్రనామ భాష్యం ఎందుకు చెప్పుకోవడం అంటే అందులో ఉన్న భావం మనస్సు పట్టుకుంటుంది. అలాగ వెయ్యినామాలలో వెయ్యి పట్టుకోక పోయినా, ఒకటి రెండు మన హృదయానికి హత్తుకున్నా అది చేయాల్సిన పని అది చేస్తుంది.

శాతోదరీ అనే మాటలో వనదుర్గా విద్య తెలియజేస్తున్నారు. ఇది దుర్గాదేవికి, గౌరీదేవికి సంబంధించిన నామం.

గౌరీదేవి యొక్క భావన శాతోదరిలో ఉంది. పర్వతరాజు పుత్రిక పార్వతి అయినట్లు శతోదరుని పుత్రిక శాతోదరి. ఉదరం... అంటే గుహ అని అర్థం. శత ఉదర– లెక్కలేనన్ని గుహలు కలిగిన వాడు అంటే హిమవంతుడు. హిమవంతునికి పుత్రిక శాతోదరీ. ఇందులో కేనోపనిషత్‌లో చెప్పిన అమ్మవారి విద్యను

ఆవిష్కరిస్తున్నారు. హైమవతి–హిమవత్పర్వత రాజపుత్రే శాతోదరీ. ఉమా అంటే భవానీ, శర్వాణీ. శాంకరీ, శర్మదాయినీ – ఇదంతా 'బహుశోభమానా'. మొత్తం మూడు వాక్యములే. ఎప్పుడైతే గుహలతో కూడిన మహాపర్వత వనం వచ్చిందో అక్కడ ఆ తల్లి వనదుర్గగా భాసిస్తున్నది అనే రహస్యాన్ని మంత్రశాస్త్రవేత్తలు కనుగొన్నారు.

131. శాంతిమతీ – శ్రీ శాంతిమత్యై నమః

భవానీ విద్యకు ఆఖరి నామం–'శాంతిమతీ'. ఇప్పుడు భవానీ విద్య ఎక్కడెక్కడ ఎలా చెప్పారో చూడాలి. ప్రధాన ఉపాస్య దేవత భవానీ. ఆవిడకి అంగదేవతలు ఇందులో ఇప్పటి వరకూ చెప్పబడ్డారు. మొత్తం ఉపాసనా విద్య ఉంది. 'శాంభవీ, శర్వాణీ, సాధ్వీ, శరచ్చంద్రనిభాననా, శాతోదరీ, శాంతిమతీ' – ఈ ఆరుగురు భవానీ దేవతకు ఉపాసనలో అంగదేవతలు. శాంభవీ విద్యోపాసన ప్రధాన ప్రయోజనం– శర్మదాయినీ, శాంకరీ, శ్రీకరీ – ఇలా మొత్తంగా భవానీ విద్య, శాంభవీ విద్య ఆవిష్కరించబడింది.

శాంతిమతీ మాటలో ఉన్న భావం చాలా ప్రధానమైనది. మతి అంటే మనస్సు, బుద్ధి, అంతఃకరణం. అమ్మవారి బుద్ధి ఎప్పుడూ శాంతంగా ఉంటుంది. శాంతముతో కూడిన మానసము ఉన్నది అని అర్థం. శాంతము అనేది జ్ఞానము యొక్క స్థితి. జ్ఞానముంటే శాంతం ఉంటుంది. త్యాగయ్య **'శాంతము లేక సౌఖ్యము లేదు సారసదళ నయనా'** అన్నారు.

లోకములో ఇంద్రియనిగ్రహాలు రెండు రకాలు ఉంటాయి– శాంతము, దాంతము. దీనినే శమనం, దమనం అని కూడా అంటారు. 'శమనం' అంటే అంతర ఇంద్రియ నిగ్రహం. 'దమనము' అంటే బాహ్యేంద్రియ నిగ్రహం. ఈ రెండిటి వల్ల రావలసినది శాంతి. ఒకవిధంగా శమనము, శాంతము అన్నప్పుడు సాధనలో ఒక విషయం చెప్పినా, సిద్ధిలో శాంతి వేరు. ఇది ఉపనిషత్తు **'ఉపశాంతోఽయమాత్మా'** అని చక్కగా చెప్తోంది. పరమాత్మ స్థితి ఎప్పుడూ శాంతమే. పరమాత్మని ధ్యానించే టప్పుడు 'శాంతాకారం భుజగశయనం' లేదా 'శాంతం పద్మాసనస్థం శశిధర మకుటం' అని ధ్యానిస్తారు.

శాంతం అనేది పరమేశ్వరుని తత్త్వం. తత్త్వం ఎప్పుడూ శాంతమే. ఆ శాంతమైన తత్త్వం మనలను అనుగ్రహించడానికి రూపం ధరించింది. ముందు శాంతం అని చెప్పి, ఆ శాంతమైన పరమాత్మయే మనకోసం ఆకారం ధరించాడు కనుక శాంతాకారం. ఆకారం కొందరికి 'భుజగశయనం పద్మనాభం సురేశం', కొందరికి 'పద్మాసనస్థం శశిధరమకుటం' అంతే. ఉన్న వస్తువు మాత్రం శాంతమే. శాంతం అంటే అది ఏ వికారము లేని స్థితి. పరిపూర్ణమైన జ్ఞానం వచ్చినప్పుడే శాంతం. అంటే ప్రాపంచికమైన వికారములేని స్థితి శాంతము. ఈ శాంతిమతీ అంటే శాంభవీవిద్యలో చివర నామం కదా. చివర నామం వచ్చిందంటే అదే పరమమైనది. శ్రీచక్రంలో అన్ని ఆవరణలు దాటిన తరువాత వచ్చేది బిందువు. ఇదే పరమం. ఆ శాంతం బిందువుకి, మన సహస్రారానికి సమన్వయం.

శ్రీచక్రానికి, మన శరీరానికి ఎక్కడెక్కడ సమన్వయమో చూసుకోవాలి. శరీరము నందు సహస్రారస్థానం, వేదాంత శాస్త్రమునందు పరబ్రహ్మ, శ్రీచక్రంలో బిందుస్థానం - ఈ మూడు అమ్మవారి యొక్క అసలు స్వరూపములు. ఎప్పుడూ కూడా ఆ స్థితిలో ఉన్నది అని అర్థం. అమ్మ వలన ఎనిమిది ఆవరణలు వ్యాపించాయి. కానీ ఎనిమిది ఆవరణలలో ఉన్న లక్షణాలేవీ అమ్మకు లేవు. ఈ ఎనిమిది ఆవరణలు లోకం, తొమ్మిదవ ఆవరణ లోకానికి అతీతం. అతీత స్థితే శాంతం.

ఆ తల్లి వల్ల లోకమంతా పని చేస్తోంది కానీ ఈ లోకంలోని వికారాలేవీ ఆ తల్లికి లేవు. ఇది బాగా తెలుసుకుంటే రాబోయే నామాలని అర్థం చేసుకోవడం సులువౌతుంది. ఉదాహరణకు-జ్యోతి దగ్గర ఉన్న కాంతి శాంతి అనుకుందాం. గోడమీద పడిన కాంతి లోకం అనుకుందాం. గోడ మీద పడిన కాంతికి ఆ గోడ యొక్క విశేషములన్నీ ఉన్నట్లుగా కనబడుతుంది. అంతే కదా... కాంతి పడితేనే గోడకి ఎరుపా, నలుపా, కిటికీ ఉందా అన్నీ తెలుస్తున్నాయి. కనుక వెలుగు వల్లనే అవన్నీ తెలుస్తున్నాయి. కానీ వెలుగుకి అన్నీ లేవు కదా. కానీ ఆ గోడ వ్యవహారంలో వెలుగు లేకపోతే ఇవేమీ తెలుసుకోలేము.

అమ్మ శక్తి లేకపోతే ఈ ప్రపంచంలో ఏమీ తెలియబడటం లేదు. కానీ

వెలుగు గోడలో గదుల నిండా వ్యాపించి ఉన్నా ఆ స్వాభావిక స్థితి జ్యోతితోనే ఉన్నది. అదే విధంగా లోకమంతా అమ్మ శక్తి ఉన్నా లోకానికి అతీతమైన పరమాత్మతోనే ఆవిడ తాదాత్మ్యం చెంది ఉంది. అదే 'శాంతిమతీ'. అది బిందుస్థానంలో కనబడుతున్నది. అందుకే అక్కడ ఆవరణలు ఏమీ లేవు. అది నిరావరణ స్థితి. అందుకే శ్రీచక్రంలో మొట్టమొదట ఆవరణ నుంచి మనం పరిశీలిస్తే, మొట్టమొదటి ఆవరణ శృంగారరసం. అక్కడి నుండి నవరసాలలో ఎనిమిది రసాలు త్రికోణంతో పూర్తి అయిపోతాయి, తొమ్మిదో రసం 'శాంతరసం'.

భరతుడైతే నాట్యశాస్త్రంలో శాంతాన్ని అసలు రసంగా చెప్పలేదు. అష్టరసములే చెప్పాడు. తరువాత అలంకారికులు మొదలైనవారు శాంతరసమని నవరసాలు తీసుకొచ్చారు. అసలు శాంతము రసమే కాదు. శాంతము అసలు రసము యొక్క స్థితి. అది లోకరసం కాదని అర్థం. **'రసోవై సః రసగ్ం హ్యేవాయం లబ్ధ్వా ఆనన్దీ భవతి** (తైత్తిరీయోపనిషత్తు). **స ఏషా రసానాగ్ం రసతమః పరమః పరార్థ్యః** (చాన్దగ్యోపనిషత్తు) – ప్రణవవాచ్యమైన బ్రహ్మమే రసము అని అక్కడ చెప్పిన రసానికి, శాంతానికి సరిపోతుంది. కానీ కావ్యరస, అలంకార, లోక రసాలు కావవి. శృంగార, భయానక, బీభత్స, అద్భుత, కరుణ, హాస్య, వీర, రౌద్ర– ఇవి అష్టరసములు. ఇవి లోక రసములు. లోకంలో మనం పొందేవి. కానీ ఇవన్నీ అమ్మ వల్లనే వస్తాయి. అమ్మ లేకపోతే ఇవేమీ లేవు. లోపల చైతన్యం లేకపోతే ఏడవలేం, నవ్వలేం. రెండూ చైతన్యం వల్లనే వస్తాయి. కానీ చైతన్యానికి ఈ రెండూ లేవు. క్రోధం, కామం చైతన్యం వల్ల వస్తున్నాయి. కానీ చైతన్యానికి ఆ వికారాలు లేవు.

ఆ చైతన్యమే అమ్మవారు– శాంతిమతీ. ఆవిడ వల్ల ఇవి ఉన్నాయని తెలుసుకోవడం ఎనిమిది ఆవరణలలో ఉన్న తల్లి వీటికి అతీతంగా ఉందని తెలుసుకోవడం తొమ్మిదో ఆవరణ. తొమ్మిదవ ఆవరణలో చెప్పబడిన రసం శాంత రసం. శాంతిమతి అంటే ఆ శాంతరస స్థితిలో ఉన్న తల్లి అనగానే మనల్ని తిన్నగా తీసుకుపోయి శాంభవీ విద్య బిందుస్థానంలో ఉన్న అమ్మవారిని చూపించుతున్నది. 'శాంకరీ, శ్రీకరీ, సాధ్వీ, శరచ్చంద్రనిభాననా, శాతోదరీ, శాంతిమతీ' – అక్కడితో

శాంభవీ విద్య పూర్ణమయింది. ఇక్కడ మనం గమనించుకోవలసిన అందమైన అంశములు– భవానీ, శర్వాణీ, శాంభవి, శాంకరీ – ఇవన్నీ కూడా శివుని యొక్క శక్తి అని ప్రతిపాదన చేస్తూ వచ్చాయి. ఉమా, గౌరీ, భవానీ అని చెప్పబడే అమ్మయే లలితాదేవి.

'భవానీ' నుండి 'శాంతిమతీ' వరకు ఉన్న నామాల తల్లికి నమస్కారం చేసుకొందాం.

++++

ఇప్పుడు చెప్పిన శాంతరసం ఎవరికి అర్థం అవుతోందో, వారికి రాబోయే నామాలు అర్థం అవుతాయి. 132 నుంచి 155వ నామం వరకు ఉన్న 24 నామాలు 'నిరాధారా' నుండి మొదలవుతూ 'నిరీశ్వరా' నామం వరకు ఒక గుత్తుగా ఉంటాయి. ఈ ద్రాక్షగుత్తిని బయటకి తీద్దాం. ఇవి అమ్మవారి యొక్క అసలు స్వరూపాన్ని తెలియజేస్తాయి. అంటే ఇంతవరకూ చెప్పినది అసలుది కాదు అనుకుంటే మహా దోషం. ఉపాస్యబ్రహ్మము ఇంతవరకూ చెప్పుకున్నాం. ఉపాస్యబ్రహ్మం అన్నప్పుడు అది సగుణమే. సగుణబ్రహ్మమే ఉపాసింపబడుతుంది. నిర్గుణబ్రహ్మమునకు ఉపాసన అనరాదు. నిర్గుణబ్రహ్మము జ్ఞేయబ్రహ్మము. అది కేవలం వేదాంత విచారణల ద్వారా తెలియబడుతోందే తప్ప, సగుణంలో తెలియబడదు. **ఇంగ్లీషులో చెప్పాలంటే సగుణబ్రహ్మోపాసనలో మెడిటేషన్ ఉంటుంది, నిర్గుణబ్రహ్మోపాసనలో రియలైజేషన్ ఉంటుంది. మనకు మెడిటేట్ చేస్తే గాని రియలైజేషన్ లేదు కనుక ఏది రియలైజ్ చేసుకోవాలో, అది మన మెడిటేషన్ కోసం రూపం ధరించింది.** ఉపాస్యమైన సగుణబ్రహ్మకి, జ్ఞేయమైన నిర్గుణబ్రహ్మమునకు వస్తుతః భేదం లేదు. **'ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా'.**

ఇది ఒక్కటి అర్థం కానందువల్ల హిందువులకి కూడా హిందూమతం అర్థం కావడం లేదు. హిందూమతం గొప్పతనం ఏమిటంటే 'నిర్గుణబ్రహ్మ ప్రతిపాదన'. ఇంతవరకు ప్రపంచంలో ఎక్కడా నిర్గుణబ్రహ్మ ప్రతిపాదన గురించి ఇంత స్పష్టమైన

విషయములు లేవు. భారతీయసంస్కృతి గొప్పతనం ఇదే. అసలు వస్తువు నిర్గుణబ్రహ్మమే.

పరమాత్మకి వికారాలు ఏవీ లేవు. పరమాత్మ అనేవాడే లేకపోతే ఈ వికారములు ఏవీ లేవు. ఇది ఎలాగు అంటే పరమాత్మ ఉనికి చేత ప్రపంచం అంతా భాసిస్తోంది. వికారాలు అన్ని ప్రపంచానివే కనుక ఆయనకి ఏవీ లేవు. అప్పుడు ప్రపంచంలో ఉన్న పరమాత్మను తెలుసుకుంటూ విచారణ చేస్తే వికారంతో కూడిన ప్రపంచం నుండి నిర్వికారమైన బ్రహ్మంలోకి వెళతాం. కానీ ఒకేసారి నిర్వికారం పట్టుకోవాలి అంటే మహా కష్టం. ఎందుకంటే మనం అనేక వికారాలలో ఉంటూ దేహంతో తాదాత్మ్యం చెంది ఉన్నాం. ఎంత కాదన్నా అది మాత్రం ఒప్పుకోవలసిందే. జగద్గురువైన కృష్ణపరమాత్మ చక్కగా చెప్పాడు.

క్లేశోధికతరస్తేషామవ్యక్తాసక్త చేతసామ్

అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే

అవ్యక్తమైన, నిర్గుణమైన బ్రహ్మమును పట్టుకోవడం 'క్లేశోధికతరః'–అత్యంత క్లిష్టం. **'కశ్చిత్ ధీరః'** అన్నట్టు ఎవడో ఒక్కడు పట్టుకుంటాడు. కానీ పట్టుకోవలసింది మాత్రం అదే. కానీ పట్టుకోవడం చాలా కష్టం. అతి కష్టమైనది సాధించాలంటే ఈ శరీరంతోనే సాధించగలం. "ఇప్పుడు అంత కష్టం మాకు వద్దులెండి" అంటే మళ్ళీ ఈ శరీరం వస్తుందో, లేదో తెలీదు. అప్పుడు ఏం చేయాలి? పరమాత్మ దయ చూడండి! ఆ అవ్యక్తమైన స్వరూపమే దివ్యనామ, దివ్యరూప, దివ్యలీలలతో వ్యక్తమయింది. ఆ నిర్గుణబ్రహ్మమే క్రమంగా తన తత్త్వాన్ని తెలియజేసే సగుణ సాకార రూపాన్ని ధరించి, దానికో నామం పెట్టుకుని, దానితో అనేక లీలలు చేసింది. ఆ దివ్య సగుణసాకార లీలల్ని ఎవరు స్మరణ చేస్తూ, ధ్యానం చేస్తూ, ఉపాసన చేస్తూ ఉంటారో వారికి ఎప్పటికో అప్పుడు ఆ తల్లే క్రమంగా తనలోనికి తీసుకువెళ్ళిపోతుంది. ఎంతవరకు సగుణ సాకారం ధ్యానిస్తున్నామో అంతవరకు కొంచెం దూరం ఉన్నట్లే. మనకి ఏదైనా వస్తువు ముఖం మీదకు తీసుకు వచ్చేశారనుకోండి. అబ్బ కనిపించట్లేదు కొద్దిగా దూరం పెట్టవయ్యా అంటాం. అప్పుడు కనబడుతుంది. ఇంకా దూరం

పెడితే అసలు కనబడదు. కనుక మనకు తగినంత దూరంలో ఉండాలి.

అతి దగ్గరైన వస్తువు మనకు తెలీదు. అలాగే మన హృదయంలోకి వచ్చిన అమ్మ మనకలా కనబడడం లేదు. కొంచెం దూరంగా పెట్టాలి. మరీ దూరం పెడితే అదొక బాధ. కొంచెం దూరం పెట్టు అంటే మన హృదయంలో ఉన్న అమ్మవారిని ఒక రూపం, ఒక యంత్రం, ఒక విగ్రహంలా ఎదురుగా పెట్టుకొని భావన చేస్తూ పూజ చేయాలి. మనం పూజ అంతా చేసిన తరువాత ఉద్వాసన అంటే తీసుకుని ఎక్కడో మరో చోట పడేయడం కాదు. అది అంతా తీసుకుని లోపల దాచుకోవడం. ఉపాసనలో రూపోపాసన, మంత్రోపాసన, కుండలినీ ఉపాసన అనే మూడు ఉపాసనలు ఉన్నాయని ముందే తెలుసుకున్నాం. మొట్టమొదటిది రూపం, రెండవది మంత్రం, మూడవది కుండలినీ – ఈ మూడూ ఉపాస్యబ్రహ్మములు.

ఉపాసనా బ్రహ్మస్వరూపం– భవానీ నుండి శాంతిమతీ వరకు. ఈ ఉపాసించే బ్రహ్మమునకు, నిర్గుణబ్రహ్మమునకు భేదం లేదు. నిర్గుణబ్రహ్మమునకు **'ఔపనిషద బ్రహ్మము'** అనే మరో పేరు ఉంది. ఈ నామం వేదాంతశాస్త్రంలో ఎక్కువ వస్తుంది. ఉపనిషత్తులో చెప్పబడిన బ్రహ్మమును ఔపనిషదబ్రహ్మము అంటారు. ఉపనిషత్తులో చెప్పిన పరమాత్మకి, ఉపాసనలో చెప్పిన పరమాత్మకి భేదం ఉన్నట్లు కనబడుతుంది. ఈ విషయం చాలా జాగ్రత్తగా గమనించాలి. భేదం ఉందని చెప్పలేదు, ఉన్నట్లు కనబడుతోంది. ఉపనిషత్తు మాత్రం ఇంక ఉపాసనలు, కర్మలు వీటి జోలికి వెళ్ళకుండా నేరుగా మనకి ఆత్మవస్తువును చెబుతోంది.

ఆత్మ వస్తువు ఏది? పరబ్రహ్మ. ఆయన ఎవరు? లేదా ఆమె ఎవరు? లేదా – ఉపనిషత్తుల దగ్గర 'డు", "ది" రెండూ లేవు. స్త్రీ, పుం భేదములకు అతీతమైన శుద్ధ పరతత్త్వం ఉపనిషత్ ప్రతిపాదన. అదే మనం పొందవలసినది.

ఇప్పుడు ఈ నామాలు నిజానికి కొద్దిపాటి సంస్కృత జ్ఞానం ఉన్నవాళ్ళకైనా లేదా కొద్దిపాటి పూజా పునస్కారాలు ఉన్న వాళ్ళకైనా అర్థమైపోతాయి. ఇక్కడ ఉన్నవి అంత స్పష్టమైన నామాలు. ఇవి ఒక్కసారి ఎప్పుడైనా అనుకోవడానికి ప్రయత్నించాలి. చాలా చోట్ల గమనిస్తూ ఉంటాం.

నిజానికి ఇవి కీలకనామాలు. ఒక్కసారి ప్రశాంతంగా కూర్చుని ఆ నామస్మరణ చేస్తూ 'నిరాధారా, నిరంజనా నిర్లేపా, నిర్మలా, నిత్యా, నిరాకారా నిరాకులా' అంటూ ఉంటే మనస్సుకి ఎంతో శాంతిగా ఉంటుంది. ఎందుకంటే అది అసలు స్వరూపం. అమ్మవారు అందరిలో ఉన్నారు అన్నాం. అందరిలో ఎలా ఉన్నారు? స్వరూపమేంటి? ఆత్మ యొక్క స్వరూపం ఏంటి? ఆత్మ అన్నా, బ్రహ్మమన్నా, పరమాత్మ అన్నా ఒక్కటే.

రామకృష్ణపరమహంస గొప్పమాట చెప్పారు. "ఉపనిషత్తులు చెప్పే బ్రహ్మము, అలాగే ఉపనిషత్తులు చదివి వేదాంతులు చెప్పే ఆత్మ, భాగవతులు చెప్పే భగవంతుడు, నేను చెప్పే కాళీదేవి.. నాలుగు ఒక్కటే". ఆ సమన్వయం జాగ్రత్తగా తెలుసుకుంటే మనకి ఈ బాధే లేదు. మనం ఏ దేవతను ఉపాసించినా తత్త్వం మాత్రం అదే. "మేము రామభక్తులమ"న్నా, ఈ 'నిరాకారా', 'నిరాకులా' దగ్గర అందరూ ఒక్కటే. కేవలం రూప భావనకి, నామ భావనకి వచ్చేటప్పటికల్లా రాముడా! కృష్ణుడా! శివుడా! అని వచ్చింది. అసలు మాత్రం నిరాధారా, నిరాకులా. ఇది అర్థం అయితేనే విష్ణువుని, శివుని, కృష్ణుని, అమ్మవారిని – అందరినీ నమస్కరించగలం. లేకపోతే ఇందరు దేవుళ్ళెందుకు అంటారు.

నామ రూపాలు ఎన్నో అయ్యాయి కానీ నిరాధారా, నిరాకులా తత్త్వం మాత్రం ఒక్కటే. ఆ తత్వాన్నే కొందరు రాముడన్నారు, కొందరు శివుడన్నారు. కనుక ఇప్పుడు అన్నింటికి మూలమైన పరతత్త్వంలోకి వెళ్ళిపోతున్నాం. అంటే ఇది లలితాసహస్రం ప్రతిపాదించిన అమ్మవారి యొక్క **తాత్త్వికరూపం**. మరొక పేరు **పరమార్థరూపం**. ఇంతవరకు ఉపాస్యరూపము. ఇప్పుడు జ్ఞేయబ్రహ్మము. జ్ఞేయము అనగా తెలుసుకోదగినది, తెలుసుకోవలసినది. ఇది తప్ప మరి తెలుసుకోవలసినది లేదు.

మొదట ఉపాసనలో భావన ఉంటుంది. జ్ఞానంలో విచారణ ఉంటుంది అన్నామే అది ఇక్కడ అన్వయించుకోవాలి. 'నిరాధారా' నుంచి 'నిరీశ్వరా' వరకూ చెప్పబడుతున్న తాత్పర్యం ఏమిటంటే ఇంతవరకు లలితా, భవానీ, శర్వాణీ అని చెప్పిన ఆవిడ సర్వవేదాంతములు ప్రతిపాదించిన పరతత్త్వమే.

'ఓంకార పంజరశుకీం ఉపనిషదుద్యానకేళి కలకంఠీం, ఆగమ విపిన మయూరీం ఆర్యాం అంతర్విభావయే గౌరీం' – ఇందులో ఏం చెప్పారు? ఆ ఓంకారం ద్వారా ప్రతిపాదింపబడుతున్నది ఏది ఉందో, 'ఉపనిషదుద్యానకేళి కలకంఠీం'– ఉపనిషత్తులనే ఉద్యానంలో నెమలిలా ఎవరు విహరిస్తున్నారో ఆ తల్లి అమ్మవారు. ఉపనిషత్తుల్లో ఆడుకునే నెమలి అంటే ఉపనిషత్తులు ప్రతిపాదించిన పరతత్త్వం. ఉపనిషత్తులు ఏం చెప్తున్నాయి? **"ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యః మంతవ్యః నిధిధ్యాసితవ్యః"** – గట్టిగా చెప్పినప్పుడు 'అరే! తెలుసుకోరా!' అంటారు. ఎప్పుడూ ఒక్కటే పని చెయ్యి.. ఆత్మ అంటే – ఏంటో తెలుసుకో. విచారణ చెయ్యి. మననం చెయ్యి. నిలిచిపో. అదే మోక్షం. అది తెలియనంత వరకు మోక్షం లేదు.

మనకందరకు మోక్షం కావాలంటే అమ్మ యొక్క అసలు స్వరూపం ఇది అని తెలియాలి.

నిరాధారా నిరంజనా నిర్లేపా నిర్మలా నిత్యా నిరాకారా నిరాకులా
నిర్గుణా నిష్కలా శాంతా నిష్కామా నిరుపప్లవా
నిత్యముక్తా నిర్వికారా నిష్ప్రపంచా నిరాశ్రయా
నిత్యశుద్ధా నిత్యబుద్ధా నిరవద్యా నిరంతరా
నిష్కారణా నిష్కలంకా నిరుపాధి ర్నిరీశ్వరా

ఇవన్నీ నిశ్శబ్దనామాలు. నిశ్శబ్దం చెప్పడానికి ఎంత శబ్దం చేస్తున్నామో చూశారా! ఎవరో ఒకాయన మౌనం గురించి రెండు గంటలు ఉపన్యాసం ఇచ్చారుట. అంత వాగితే గాని మౌనం అర్థమవ్వదు. అందుకు ఆ మౌన తత్త్వమే ఇక్కడ ఎలా వివరిస్తున్నారో చూడండి. అమ్మవారి యొక్క పరమార్థ రూప, తాత్త్వికరూప చింతనలోకి వెళ్ళబోతున్నాము.

132. నిరాధారా – శ్రీ నిరాధారాయై నమః

ఆత్మతత్త్వం ఎలాంటిది అంటే దానికి ఏ ఆధారం లేదు. దానికి ఏ ఆధారము లేదు కానీ అది అన్నింటికి ఆధారం. ప్రపంచంలో ప్రతిదానికి ఒక ఆధారం

కనబడుతోంది. ఒక వస్తువు బల్ల మీద ఉంది. ఆ బల్ల నేల మీద ఉంది. అక్కడితో అయిపోయింది. కానీ నేల దేని మీద ఉంది? ఎప్పుడైనా ఆలోచించామా! ఎక్కడుంది నేల? ఇది ఆకాశంలో ఉంది. ఆకాశం ఎక్కడుంది! తెలివైన వాడైతే ఆకాశం అంతటా ఉంది అంటాడు. ఆకాశంలో భూమి ఉంది కాదు.. భూమిలో ఆకాశం ఉంది. భూమిలో ఉన్న మనలో ఆకాశం ఉంది. మన చుట్టూ ఆకాశం ఉంది. ఆకాశం ఎలా ఉంది! చెప్పలేం. కానీ అంతటా ఉంది అని మాత్రం ఒప్పుకుంటున్నాం. ఆకాశం వరకు మనం వెళ్ళగలిగాం కాబట్టి మరి కొంచెం పైకి వెళ్ళండి. ఆకాశం కూడా దేని యందు ఉన్నదో అది పరమాత్మ. ఇప్పుడు మళ్ళీ విచారణ చేయాలి. ఆకాశం అంతటా... అందరిలో ఎలా వ్యాపించి ఉందో ఆకాశంతో సహా అన్నిటిలో అంతటా అలా వ్యాపించి పరమాత్మ ఉన్నాడు.

'ఆకాశవత్ సర్వగతః సుసూక్ష్మః' అని ఉపనిషత్ చెప్తోంది. అన్నింటికి ఆధారం ఎవరు? పరమాత్మ. ఒక గ్రహం కొంతకాలానికి పోతుంది. నక్షత్రాలు చస్తాయి అన్నారు. అదే నేడు చెప్తున్న డెడ్ స్టార్, బ్లాక్ హోల్ వంటివి. ఆకాశం ఎక్కడకు పోతుంది? ఆకాశమే పోదంటే ఆకాశం నిండా ఏ చిచ్ఛక్తిని వ్యాపింపజేశాడో ఆ శక్తి ఏమౌతుంది? పరమాత్మ ఎక్కడికి పోతాడు? ఆయన ఎప్పుడూ ఉంటాడు. కనుక ఇప్పుడు అన్నింటికి ఆధారమైంది, అన్నీ పోయినా తానుంటుంది కనుక 'నిరాధారా'.

ఆకాశం కంటె మూలమైన చైతన్యానికి ఆధారమే లేదు. ఆవిడ అన్నింటికి ఆధారం. కనుక నిరాధారా. ఈ ప్రశ్న ఉపనిషత్తుల్లో "**స భగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి స్వే మహిమ్ని**" అని ఉంది. ఆ భగవానుడైన బ్రహ్మము దేనియందు ప్రతిష్ఠింపబడి ఉన్నాడు? అని ప్రశ్నిస్తే, పరమాత్మ తన బలంతో ప్రపంచాన్ని పట్టి ఉన్నాడు అని సమాధానం. కనుక తన మహిమ ప్రపంచానికి ఆధారము. తనకు తానే ఆధారము. అది 'నిరాధారా'.

133. నిరంజనా - శ్రీ నిరంజనాయై నమః

నిరవద్యం-నిరంజనం - ఆత్మ. ఇవన్నీ ఉపనిషద్వాక్యములు. అంజనమంటే

కాటుక. కాటుక అంటే పూసేది అని అర్థం. ఒక విధంగా పూతే. అంటుకునేది. పూతలు రెండు రకాలు. కనుక 'నిరంజనా', 'నిర్లేపా' – రెండూ అంటుకోవడం గురించి చెప్పేవైనా చిన్న విషయములు ఇక్కడ ఉన్నాయి. నిరంజనా అంటే అవిద్య యొక్క సంపర్కం ఏమీ లేనిది అని అర్థం.

సాధారణంగా వేదాంతం అర్థమవడానికి కొన్ని ఉదాహరణలు చెప్పుకుంటూ ఉంటాం. ఒక నీలి అద్దం వెనుక దీపాన్ని పెట్టినట్లయితే దీపకాంతి నీలంగా అద్దంలోంచి మనకు కనిపిస్తుంది. అప్పుడు నీలకాంతి వచ్చిందండి అంటాం. నీలకాంతి అని కలిపేశాం. నీలకాంతి దేనిది... దీపానిదా? అద్దానిదా? అద్దానిది నీలమే, కాంతిది కాదు. కాంతి దేనిది, దీపానిది. ఇప్పుడు నీలకాంతి ఎవరిది? అజ్ఞానం చేత ఏం చేస్తున్నామంటే అద్దానికే నీల–కాంతి కలిపేస్తాం. లేకపోతే దీపానికే నీల–కాంతి కలిపేస్తాం. నీలం అద్దం యొక్క లక్షణము. కాంతి జ్యోతి యొక్క లక్షణము. మనం నీల, అద్దాలవంటి ఉపాధులం. ఇందులో కాంతి అమ్మవారు. ఇప్పుడు ఈ శరీరంలో ఉన్న చైతన్యం శరీరంతో కలిపి చూస్తున్నాం. కానీ నిజానికి కాంతి అద్దానికి అంటిందా? భాసింపజేస్తోంది గాని అంటట్లేదు. కాంతి జ్యోతిని అంటి ఉంది. జ్యోతి ఎవరు? పరమాత్మ. కాంతి ఎవరు? చైతన్యం. అమ్మవారు ఈ చైతన్యం. ఈ చైతన్యం ఎవరిది? పరమాత్మదే. కానీ అద్దమునందు ప్రకాశింపబడుతున్నది. కానీ ఈ కాంతి అద్దానిది మాత్రం కాదు.

ఉపాధి అంటే అద్దము, చైతన్యము అంటే వెలుగు, పరమాత్మ అంటే జ్యోతి. ఈ మూడు ఉదాహరణలు గుర్తు పెట్టుకుంటే ఇప్పుడు చెప్పినవన్నీ మనకు స్పష్టంగా అర్థం అవుతాయి. ప్రపంచంలో మనం చూసే ఉపాధుల అన్నింటియందు ప్రకాశవస్తువు అమ్మవారే. ఈ శరీరం జడం. జడంలో ఆ చైతన్యరూపిణి ఎలా ఉందయ్యా! వికారాలు అంటక ఉంది.

134. నిర్లేపా – శ్రీ నిర్లేపాయై నమః

లేపనం అంటే కూడా పూత అనే అర్థం. కాటుక పూత అంటే అంటుకునేటట్లు

ఉంటుంది. కానీ అమ్మవారికి అలాంటివి ఏమీ లేవు. ఏది పూస్తామో అది కృత్రిమమే. పూయనిది సహజం. అందుకే అమ్మ 'నిర్లేపా'.

'లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా'-అని శ్రీ కృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పాడు. ఒక యోగి ప్రపంచంలో తామరాకు మీద నీటిబొట్టులా ఉంటాడు. ప్రపంచంలోనే ఉన్నా ప్రపంచవికారాలు ఏవీ ఆయనకి అంటడం లేదు.

యోగి ప్రపంచంలో ఉన్నా అంటుకోకుండా ఎలా ఉంటాడో, ఆ యోగి ఏ తల్లిని (ఆత్మతత్త్వాన్ని) ఆశ్రయించడం వల్ల యోగి అయ్యాడో మరి ఆ తల్లి ఎలా ఉంటుందో ఆలోచించాలి. ఆవిడ 'నిర్లేపా'. ఇంత పని చేస్తుంది కానీ ఏ వికారాలకు లోను కాదు. ఇది సరిగ్గా **'అసంగో హ్యయం పురుషః'** అని బృహదారణ్యకంలో చెప్పిన వాక్యము.

ఉపనిషత్ వాక్యాలు దొంతర దొంతర్లుగా లలితాసహస్రంలో వస్తాయి. ఒకే సమయంలో పురాణాలు, ధర్మశాస్త్రాలు, వేదాంతం మూడూ చదివిన విశేషం ఒక్క లలితాసహస్రంలో ఉంది. 'అసంగో హ్యయం పురుషః - లిప్యతే న సపాపేన పద్మపత్రమివాంభసా' - ఈ పురుషుడంటే ఆత్మస్వరూపం. దేనికీ అంటనిది. కఠోపనిషత్తులో చెప్పినట్లుగా **'అన్యత్రధర్మాదన్యత్రాధర్మాదన్యత్రాస్మాత్ కృతాకృతాత్'** - ఈ స్వరూపానికి ఇది కృతం-అకృతం, ధర్మం-అధర్మం అని ఏమీ లేవు. అది 'నిర్లేపా'.

135. నిర్మలా - శ్రీ నిర్మలాయై నమః

ఏ మాలిన్యము లేనిది. మాలిన్యాలు-కర్మ మాలిన్యాలు, సంపర్క మాలిన్యాలు అనేవి ఎన్నో రకాలు ఉంటాయి. ఆణవ మల, మాయిక మల, కార్మిక మల అనేవి ఉంటాయి. ఆణవ మల- అంటే జీవునికి ఇతర జన్మల నుండి వచ్చిన మాలిన్యం. కార్మిక మలం - ఇప్పుడు కొత్తగా చేస్తున్న కర్మల వల్ల వచ్చే మాలిన్యం. మాయిక మలం - నిరంతరం మనస్సు దేనితోనైనా సంగం పెట్టుకుంటే దాని వల్ల మనస్సుకి అంటేది. ఇలా మూడు చూపిస్తున్నారు. మూడవదానికి కాయికమలమని కూడా

పేరు ఉంది. ఈ మూడు మాలిన్యాలు లేనివాడు శివుడు. ఈ మూడు మాలిన్యాలు ఉన్నవాడు జీవుడు. శివుడు అన్నా, శివా అన్నా ఒకటే కదా.. అందుకే నిర్మలా. అత్యంత శుద్ధమైనది.

136. నిత్యా - శ్రీ నిత్యాయై నమః

ఎప్పుడూ ఉండేది కనుక 'నిత్యా'. నిత్యా అనే మాటకి మార్పు లేకుండా ఉండేదని కూడా అర్థం. **'అవినాశీ వారేయమాత్మా'** - ఇది ఉపనిషత్ చెప్తోంది. ఈ ఆత్మ అవినాశి. నాశనం లేనిది. ఆది, మధ్య, అంతములు లేనిది. మూడు కాలాలలో ఉన్నది- అని ఇన్ని అర్థాలున్నాయి. త్రికాలాలలోను ఉన్నదే ఆత్మ, త్రికాలాలలోనూ లేనిది ఆత్మ కాదు. ఇదొక్కటి ఆలోచిస్తే ఆత్మ ఏదో, అనాత్మ ఏదో మనమే నిర్ణయించగలం. త్రికాలాల్లో లేనిది- శరీరం. పరిణామ పేశలమైనదేదీ ఆత్మ కాదు. కనుక ఏది ఆత్మ.... ఏది అనాత్మో నువ్వే చూసుకో. ఈ నామాలని బట్టి పఠనంలోకీ, పారాయణంలోకీ కాదు.... విచారణలోకి దిగాలి. ముందు ధర్మం ప్రచారంగా ఉంటుంది. రెండవ దాంట్లో ఆచారంగా ఉంటుంది. మూడవ దాంట్లో విచారణగా ఉంటుంది. కొందరు ప్రచారంతోనే ఆగిపోతూ ఉంటారు. చెప్పింది ఆచరిస్తే ఆచారం, తరువాత కావలసినది విచారం. మనం ప్రచారం లోంచి ఆచారంలోకి, ఆచారంలోంచి విచారణలోకి వెళ్ళాలి. అదే సమయంలో ప్రచారము, ఆచారము, విచారము కలిపి చేస్తూంటే అది ఇంకా ధన్యం.

137. నిరాకారా - శ్రీ నిరాకారాయై నమః

ఇంతవరకూ అమ్మవారి ఆకారాన్ని అందంగా వర్ణించారు. 'చమ్పకాశోకపున్నాగ సౌగంధికలసత్కచా, సర్వారుణాఽనవద్యాంగీ, సర్వాభరణభూషితా, శివకామేశ్వరాంకస్థా, శాతోదరీ, శరచ్చంద్రనిభాననా' .... ఇంత అందమైన ఆకారం వర్ణిస్తూ, ఈ నామాలలో 'నిరాకారా' అని తేల్చారు. పోనీ ఒక పుస్తకంలో ఆకారం, మరొక పుస్తకంలో నిరాకారం చెప్తే పరస్పర విరుద్ధం లేదనుకుంటాం. ఇక్కడ పరస్పర

విరుద్ధం వలె కనిపిస్తాయి. నిరాకార సాకారాలకి భేదములేమిటి? మనకి ఆకారముంది. అమ్మవారికి ఆకారముంది. కానీ ఆమె నిరాకారా. ఈ భేదం తెలుసుకోవడానికి ఉపనిషత్తే సరియైనది. ఇవన్నీ ఉపనిషత్తుల్లోవే.

ఆమె స్వతహాగా 'నిరాకారా'. నామం లేదు, రూపం లేదు. **'ఆకారస్య సగుణరూపస్య కల్పితత్వాత్ నిరాకారా'**. సగుణ రూపం యొక్క ఆకారం కల్పితం. ఆ కల్పన ఆవిడ కల్పించుకున్నది. ఆవిడకి రూప కల్పన మనం చెయ్యగలమా! ఆవిడ ఎలా కల్పించుకొందో ఋషులకి అలా దర్శనమిచ్చింది. వారు వర్ణించారు. వర్ణించినదాన్ని మనం ఊహిస్తున్నాం. అసత్యాన్ని ఊహించకూడదు. సత్యాన్నే ఊహించాలి. అంటే శాస్త్రమేది వర్ణించిందో దాన్ని మనం ధ్యానించాలి. శాస్త్రం మనకి నమ్మకం, ఋషికి అది అనుభవం కాబట్టి వారు వర్ణించారు. మనం దాన్ని నమ్మితే మనం కూడా ఆ అనుభవంలోనికి వెళ్ళగలం. 'ఋషి అనుభవాన్ని అందుకోవాలంటే విశ్వాసం ప్రధానం'.

ఋషులు అనుభవాన్ని శాస్త్రంతో వర్ణిస్తారు. మనం దాన్ని విశ్వసిస్తాం. అది విశ్వసిస్తే దాని పేరు శ్రద్ధ. కనుక శ్రద్ధతోనే వారి అనుభవానికి వెళ్ళగలం. ఆకారం ఆవిడ కల్పించుకున్నది గాని, ఆవిడ స్వరూపం నిరాకారా. లేకపోతే ప్రపంచమంతా వ్యాపించి ఉన్న శక్తికి ఇది ఆకారమని మనం పరిమితి చెయ్యగలమా? అది ఆవిడే చేసుకుంది. అమ్మవారు రూపం ఎలా స్వీకరిస్తారు అనేది ఉపనిషత్తులో చూపించారు. **'స్వయోగ మాహాత్మ్య నిర్మితేన అత్యద్భుతేన విస్మాపనీయేన రూపేణ దేవానాం ఇంద్రియగోచరే ప్రాదుర్బభూవ'** – ఇది ఉపనిషత్తులో మంత్రం. స్వయోగ మహాత్మ్య–అపరిమితమైన శక్తి... సృష్టిలో దేనికైనా పరిమితం పెట్టగలదు ఆవిడ. పరిమితి పెడితే మాయ. పరిమితి పెట్టగలిగే అపరిమిత శక్తికే మహామాయా అని పేరు. ఆ తల్లి భక్తులను అనుగ్రహించడానికి తనని తాను పరిమితం చేసుకొని వచ్చింది.

మనం మాయ అధీనంలో ఉంటాం. ఆవిడ మాయను తన అధీనంలో పెట్టుకొని ఒక అద్భుతమైన రూపం తీసుకొంది. ఆ రూపం 'స్వయోగ మాహాత్మ్య

నిర్మితేన' – తన యొక్క యోగశక్తితో నిర్మించబడిన రూపం, 'అత్యద్భుతేన' – ఆ రూపం అత్యంత అద్భుతంగా ఉంది, 'విస్మాపనీయేన' – మరపురాని విధంగా ఆశ్చర్యం గొలుపుతూ ఉన్నది ఆ రూపము. అలాంటి రూపంతో– 'దేవానాం ఇంద్రియ గోచరే ప్రాదుర్బభూవ' – అక్కడున్న దేవతలందరి కళ్ళకి కనబడేటట్టుగా కనిపించింది. ఆవిడే తన రూపంతో కనిపించింది. ఈ మంత్రం కేనోపనిషత్తులోనిది. 'స తస్మిన్నేవకాశే స్త్రియమాజగామ' – అక్కడ దేవతలందరూ నన్ను మించిన శక్తిమంతులు లేరు అని వాదించుకొంటూ ఉంటే – ఒక్కసారి పరమేశ్వరుడు జ్యోతి రూపంగా దర్శనమిచ్చాక... మిమ్మల్ని మించిన శక్తిమంతుడిని నేను, అసలు మీ అందరికీ శక్తినిచ్చిన వానిని నేను. మీకు నేను శక్తినిస్తే అది మీరు సొంతం చేసుకొని తిరిగేస్తున్నారు అని చెప్పడం కోసం ఆ స్వామియే అమ్మ రూపంలో ఒక్కసారి వచ్చాడు.

కనుక ఇంద్రియగోచరమైన రూపం ఆ తల్లే కల్పన చేసుకుంది. ఆ తల్లి నిజానికి నిరాకారా. భక్తులను అనుగ్రహించడానికి సాకారా. ఈ మాట పురాణవాక్యాల్లో కూడా ఉంది. 'ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా' – ఉపాసకులను అనుగ్రహించడం కోసమై బ్రహ్మము తన యొక్క రూపము కల్పించుకున్నాడు. 'బ్రహ్మజ్యోతి స్వరూపంచ భక్తానుగ్రహ విగ్రహం'. చైతన్యస్వరూపమైన బ్రహ్మము, భక్తులను అనుగ్రహించడానికి రూపం ధరిస్తుంది కానీ అసలు తత్త్వం 'నిరాకారా'.

138. నిరాకులా – శ్రీ నిరాకులాయై నమః

ఆకులము అంటే కలత, చిత్తవికారము, చిత్తచాంచల్యం. ఇవి అవిద్యా వికారాలు. కొలనులో అలలు కదలడం కూడా కలత, కదలికలో దాని అసలు స్వరూపం మనకు తెలియదు. అటువంటి కదలికలు, వికారాలు ఏవీ అమ్మవారికి లేవు కనుక ఆవిడ 'నిరాకులా'.

139. నిర్గుణా – శ్రీ నిర్గుణాయై నమః

ఉపాధికి గుణములు ఉంటాయి. ప్రపంచంలో ఉన్నవన్నీ ఉపాధులే. ఈ గుణములలో అమ్మవారు వ్యాపించిపోయి ఉన్నారు. ఆవిడ సహజంగా నిర్గుణా. **'సాక్షీ చేతా కేవలో నిర్గుణః'** అనేది ఉపనిషద్వాక్యం. అమ్మవారిని 'నిర్గుణా' అని ఎందుకంటారో చెప్తూ–**'లక్షణం దైవకోట్యంకః శరీరైకాశ్రయోగుణః, ఇయంతు నిర్గుణాదేవీ నైవలక్షయితుం క్షమా'** (మత్స్య, పద్మపురాణాలు) – ఒక శరీరం ఆధారంగా మంచి, చెడు, తెలుపు, నలుపు అని గుణాలు చెప్తున్నారు. ఇవన్నీ ఉపాధివి. కానీ దీనిని వెలిగిస్తున్న 'చిత్' మాత్రం 'నిర్గుణా'. "గుణం శరీరాశ్రయం. లక్షణ వర్జితురాలు దేవి నిర్గుణా. లక్షించుటకు (గుర్తించుటకు, నిర్దేశించుటకు) వీలుకాని సాక్షి చైతన్యము కేవలం నిర్గుణం".

140. నిష్కలా – శ్రీ నిష్కలాయై నమః

సకలా, నిష్కలా అని రెండు విషయములు ఉన్నాయి. కల అంటే భాగం, నిష్కలా అంటే భాగములు లేకపోవడం.

అవయవాదులు, గుణాలు లేనిది నిష్కల.

ప్రపంచమంతా సకలమే. ఆవిడ నిష్కలా. కనుక **అమ్మవారి రూపధ్యానం సకలం. అమ్మవారి తత్త్వధ్యానం లేదా తత్త్వజ్ఞానం నిష్కలం.** సకల, నిష్కలా రెండూ అమ్మవారి యొక్క స్వరూపములే. అందుకే **'ధ్యానం యా నిష్కలాచింతా నిరాధారా నిరాశ్రయా న తు ధ్యానం శరీరస్య ముఖహస్తాది కల్పనా'** (జ్ఞానభైరవ భట్టారకులు) – "ముఖహస్తాది శరీర కల్పనకు ధ్యానించడం కాక, నిష్కలమైన, నిరాధార, నిరాశ్రయ తత్త్వాన్ని ధ్యానించాలి" అని అసలు తత్త్వం తెలియజేశారు.

141. శాంతా – శ్రీ శాంతాయై నమః

ఇక్కడ 'ని'శబ్దము రాలేదు. 'ని'శబ్దముతో ఇంతవరకూ చెప్పుకున్న పరబ్రహ్మ అసలు లక్షణము 'శాంతా'. శాంతము అనేదే అసలు తత్త్వము. శమన స్వభావము

కలిగినది శాంతము. సర్వవికారాలు లయం చెందిన స్థితి శాంతము. అది కూడా 'నిరాకులా'ది నామాల ద్వారా వ్యాఖ్యానించుకున్న తత్త్వమే. శాంతా అన్నప్పుడు 'శ' అనేది అమృతత్త్వాన్ని తెలియజేస్తోంది. 'శ' అమృత సంకేతము. అమృతత్త్వాన్ని చెప్పే తత్త్వమే అమ్మవారు కనుక శాంతా.

నిష్కళం నిశ్చలం శాంతం అని త్రిపురోపనిషత్ అమ్మవారి తత్త్వాన్ని చెప్తూ శాంతా అనే మాటని చెప్పింది. సర్వక్రియానివృత్తి రూపం శాంతం – సర్వక్రియల నుంచి నివృత్తి పొందిన రూపం ఏదో అది శాంతము. 'శ' అంతము శాంతము అంటే శుభాంతము, సుఖాంతము అని అర్థం. ప్రతివారు ఏది చేసినా అది శుభంగా పూర్తి అవ్వాలనే కోరుకుంటారు. శుభముగా పరిణమించాలి. దాని ఫలము మాత్రము శుభము అవ్వాలి అనుకుంటారు. అలా చూస్తే ఫలము శుభము అయి ఉన్నది. ఆ ఫలమే అమ్మవారి తత్త్వము. పరిణామంలో చిట్టచివరిగా లభించే ఫలము ఏదైతే ఉందో ఆ ఫలము 'శ' అంత – శుభముతో అంతమైనది. అంతము నందు లభించే ఆ పరతత్త్వము కేవల శుభస్వరూపమైనది కనుక శాంతా.

నిష్కలా ధ్యానానికి వచ్చేటప్పటికల్లా **'న తు ధ్యానం శరీరస్య ముఖహస్తాది కల్పనా'** – అక్కడ అమ్మవారి యొక్క శరీరము, ముఖము ధ్యానము చెయ్యడమనేది ఉండదు. ఆ స్థితిలో అమ్మవారు కేవలం నిష్కలా. ఆ స్థితి ఊహాతీతం. ఆ స్థితిలో ఉండడమే 'శాంతా'. అమృతబీజాత్మక.

అమ్మవారి ఉపనిషత్తులు–త్రిపురా ఉపనిషత్, అరుణోపనిషత్, బహ్వృచోప నిషత్, భావనోపనిషత్, శ్రీ ఉపనిషత్ (శ్రీ ఉపనిషత్ అంటే – శ్రీసూక్తం). ఇంకా దేవీ అథర్వశీర్షం, దేవ్యుపనిషత్. శ్రీ విద్యోపాసకులకి నిరంతరం ఆరాధనలో ఏదో ఒక ఉపనిషత్ అనుసంధానం చెయ్యమంటారు. లేదా సర్వకాలాల్లో అయినా అనుసంధానం చేయాలి.

'నిష్కలం నిశ్చలం శాంతం' త్రిపురోపనిషత్తులోని మంత్రం. అమ్మ నిష్కలా, నిశ్చలా, శాంతా.

142. నిష్కామా - శ్రీ నిష్కామాయై నమః

ఒక్క కోరిక కూడా అమ్మవారికి లేదు కనుక ఆవిడ 'నిష్కామా'. దీని గురించి చెప్తూ, **'సంపూర్ణకామస్య కిమిచ్ఛేతి' 'అవాప్తాఖిల కామాయాస్తృష్ణా కిం విషయే భవేత్'** అని దేవీభాగవతంలోని వాక్యాలు. సంపూర్ణ కామునికి కోరికేమిటి? అని అర్థం. అన్ని కోరికలు తీరిపోయినవారికి కోరిక ఉంటుందా?

కోరిక ఉందంటే కొరత ఉందని అర్థం. కొరత ఉంటే కోరిక. పాత్రలో ఖాళీ ఉంటేనే నీళ్ళు పోస్తాం. నిండు పాత్ర తెచ్చి నీళ్ళు పొయ్యమంటే, అసలే నిండిపోయింది కదా ఏం పోస్తామని అంటామా లేదా! సత్యము, పరిపూర్ణము అయినప్పుడు ఇంక కొరత ఎక్కడుంటుంది?

143. నిరుపప్లవా - శ్రీ నిరుపప్లవాయై నమః

ఉపప్లవము అంటే నాశనము. నిరుపప్లవ అంటే నాశనము లేనిది. ఉపప్లవ, ఉపద్రవాలు, ఉత్పాతాలు సమానార్థకాలు. అలాంటి నాశనముగాని, నాశన లక్షణాలుగాని, వృద్ధి, క్షయము వంటి లక్షణాలు అమ్మవారి దగ్గర లేవు. కనుక నిరుపప్లవ. **'అశరీరం వా వసంతం'** అనే తత్త్వాన్ని వ్యాఖ్యానిస్తూ ఉపనిషత్తు చెప్పిన విషయం ఇదే.

నిరుపప్లవ – నాశనరహిత. ఈ సృష్టి అంతా భిన్నతత్త్వములతో కూడుకున్నదని సాంఖ్యం చెప్తోంది. వ్యక్తము మొదలుకుని మహందహంకారపృథివ్యాపస్తేజో వాయురాకాశాత్ అని తరువాత పంచేంద్రియాలు - జ్ఞానేంద్రియ పంచకము, కర్మేంద్రియ పంచకము ఇత్యాదులు చెప్పి వాటికి మళ్ళీ శబ్దస్పర్శాది లక్షణాలు, ఆ తరువాత జీవుడు ఇత్యాదులన్నీ తెలియజేశారు. ఇవి సాంఖ్యము చెప్పిన తత్త్వములు. ఇవి నాశనమైపోయే తత్త్వములే. కాని నాశనంకాని తత్త్వము ఒకటి ఉంది. అందువల్ల కేవల సాంఖ్యాన్ని ఈ నామంలో ఖండించడం జరుగుతోంది.

ఈ జగత్తు కేవల సంఖ్యాత్మకంగా ఉంటోంది అంటే నశించిపోయేది జగత్తు. వీటికి అతీతమైన అవ్యక్తమైన ఆ పరతత్త్వమే నిరుపప్లవ.

144. నిత్యముక్తా – శ్రీ నిత్యముక్తాయై నమః

చైతన్యస్వరూపంగా ఉపాధులలో ఉన్నా ఆవిడకు ఏ బంధమూ లేదు. కుండ పగిలినా గాలి ఉంది, కుండ ఉన్నా గాలి ఉంది, కుండకు ముందూ గాలి ఉంది. అలాగే శరీరాది ఉపాధులలో చైతన్యం – 'నిత్యముక్తా' – మోక్షస్వరూపిణి అని భావం.

145. నిర్వికారా – శ్రీ నిర్వికారాయై నమః

ఉపాధి వికారాలేవీ లేనిది. పుట్టుట, ఉండుట, పెరుగుట, మార్పుచెందుట, క్షీణించుట, నశించుట – అనే షడ్భావ వికారాలు లేనిది. మహదాది ప్రకృతి తత్త్వాలకు అతీతురాలు.

146. నిష్ప్రపంచా – శ్రీ నిష్ప్రపంచాయై నమః

పృథివ్యాది పంచభూతాలకు ఆ తల్లే ఆధారము. కానీ ఆ భూతాది ప్రపంచాలకు అధిష్ఠానమైన ఆత్మకు వాటితో సంబంధం లేదు. ప్రపంచంలో ఆమె చైతన్యముగా, అధిష్ఠానముగా ఉన్నా, ఆమెలో ప్రపంచం లేదు. **"ప్రపంచోపశమం శివమద్వైతం చతుర్థం మన్యంతే"** (శ్రుతి) ప్రపంచాదులు ఉపశమించిన (అతీతమైన) తురీయతత్త్వం శివం, అద్వైతం.

147. నిరాశ్రయా – శ్రీ నిరాశ్రయాయై నమః

'నిరాధారా' అంటే ఏంటో 'నిరాశ్రయా' అంటే అదే అర్థం. రెండింటికి చిన్న తేడా ఉంది. అన్నింటికీ ఆధారము, తనకు తానే ఆధారము అని చెప్పడానికి 'నిరాధారా'. నిరాశ్రయా అంటే అన్నింటికి ఆశ్రయమైనా ఆ వికారములేవీ ఈవిడకు లేవు. ఆశ్రయాల అవసరం లేనిది. **'విశ్వం ప్రతిష్ఠితం యస్యాం తస్యాః కుత్ర ప్రతిష్ఠితం'** – ఎవరియందు విశ్వమున్నదో ఆమెకు ఉనికి ఎక్కడ?

148. నిత్యశుద్ధా – శ్రీ నిత్యశుద్ధాయై నమః

అమ్మవారి శుద్ధత ఎలాంటిది అంటే '**అస్పర్శశ్చ మహాన్ శుచిః**' అని ఉపనిషత్ చెప్తోంది. అమ్మవారిని ఏదీ తాకలేదు కనుక 'నిత్యశుద్ధా'. ఎలాగంటే ఆకాశవత్ – ఆకాశాన్ని చూస్తే పరమాత్మ అర్థమయిపోతాడు. అందుకే ఈ ఉపనిషత్తు లో 'ఆకాశోపాసన' అని ఒకటి ప్రత్యేకంగా చెప్పారు. ఏ వస్తువు ముందు పెట్టినా తీసేసి దానికి ఆధారమైన ఆకాశాన్ని చూడాలి. ఆకాశాన్ని చూస్తూ వెళ్తే అదొక ఉపాసనా ప్రక్రియ. ఉపనిషదుపాసన. ఆకాశం శుద్ధం. కాని బుద్ధం కాదు. కనుక ఆకాశమే పరమాత్మ అని చెప్పలేం. కానీ పరమేశ్వరి ఆకాశమువలె శుద్ధమైనా, ఆకాశానికి లేని 'బుద్ధం' అనే తత్త్వం కలిగినది. **"అత్యంత మలినో దేహో, దేహీ చాత్యంత నిర్మలః"** – దేహం మిక్కిలి మలినమైనది. దేహి (ఆత్మ) నిర్మలుడు – అని స్మృతి వాక్యం.

149. నిత్యబుద్ధా – శ్రీ నిత్యబుద్ధాయై నమః

పరమాత్మ నిత్యశుద్ధమే కాదు, నిత్యబుద్ధం కూడా అంటే చిత్ స్వరూపం, జ్ఞాన స్వరూపం. '**నహి విజ్ఞాతుర్విజ్ఞాతేర్విపరిలోపో విద్యతే**' (శ్రుతి) విజ్ఞాత (బ్రహ్మము), విజ్ఞాతి (జ్ఞానం)కి ఏ లోపమూ ఉండదు.

నానాచ్ఛిద్ర ఘటోదరస్థిత మహాదీపప్రభాభాస్వరం
జ్ఞానం యస్యతు చక్షురాదికరణద్వారా బహిఃస్పందతే
జానామీతి తమేవ భాన్తమనుభాత్యేతత్సమస్తం జగత్
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే

రకరకాల రంధ్రాలున్న కుండని దీపం మీద బోర్లిస్తే అన్ని రంధ్రాల్లోంచి ఆ కాంతి ఎలా కనబడుతుందో అదే విధంగా శరీరంలోనున్న రంధ్రాలనుండి చైతన్యం ప్రసరిస్తోంది. కుండకి కన్నాలున్నాయి కానీ దీపానికి కన్నాలు లేవు. అదే నిత్యశుద్ధా. ఆ చైతన్యం వల్లనే ఇది అంతా పనిచేస్తోంది కనుక 'నిత్యబుద్ధా'.

దీనికి ఉపనిషత్ '**ప్రజ్ఞానఘన ఏవాస్య ప్రజ్ఞానం బ్రహ్మ**' అని చెప్తున్నది. ఆ

ప్రజ్ఞానఘనమిది. ప్ర–జ్ఞానం. త్రిపురారహస్యంలో పరశురాములవారు దత్తాత్రేయుల వారిని ఒక ప్రశ్న అడుగుతాడు. "ఆత్మని తెలుసుకోగలమా?" అంటే "తెలుసుకోలేవు" అన్నాడు. "తెలుసుకోలేం అన్నప్పుడు మరి ప్రయత్నం ఎందుకు? సాధన ఎందుకు?" అని అడిగితే, "తెలుసుకోవాలి" అన్నాడు. "ఇదేమిటి తెలుసుకోలేం అంటూనే, తెలుసుకోవాలి అంటున్నా"వంటే చిక్కు విప్పుతానని చెప్పాడు. "ఒక్కటి తెలుసుకో.. దేని ద్వారా అన్నీ తెలుసుకోగలుగుతున్నామో అదే ఆత్మయని తెలుసుకో. ఇది ఒక్కటే నీలోపల ఉన్న చిద్వస్తువు". అదే 'నిత్యబుద్ధా'.

150. నిరవద్యా – శ్రీ నిరవద్యాయై నమః

ఈ భావము అనవద్యాంగీ దగ్గర చెప్పుకున్నాం. అవద్యము అంటే దోషము, లోపము అని అర్థములు. ఏ దోషము, లోపము లేనిది. నిరవద్యం నిరంజనం అని ఉపనిషదుక్తి. నిర్దోషా అని చెప్పబడే తల్లి. అవద్య అంటే నరకము అని కూడా అర్థం ఉంది. ఆశ్రయించిన భక్తులకు ఎటువంటి నరకబాధలు లేకుండా చేస్తుంది కనుక అమ్మవారు నిరవద్యా. నరకం అంటే వేదన, యాతన అనేవి. ఇవి అమ్మవారు తన భక్తులకు ఏ స్థితిలోనూ లేకుండా చేస్తుంది.

తస్మాదహర్నిశం దేవీం సంస్మరేత్పురుషో యది
న యాత్యవద్యం నరకం సంక్షీణాశేషపాతకం

అహర్నిశలు ఆ జగదంబికను ఎవరు సంస్మరిస్తారో వారికి నరకబాధ ఉండదు. పాతకాలు అన్నీ నశిస్తాయి. అమ్మకి ఎప్పుడూ ఏ వేదనా ఉండదు. అంతేకాదు ఆ తల్లిని ఆశ్రయించినవారికి కూడా ఏ వేదనా లేకుండా చేస్తుంది కనుక నిరవద్యా.

151. నిరంతరా – శ్రీ నిరంతరాయై నమః

ఇది కూడా ఆత్మతత్త్వాన్ని చెప్తున్న నామమే. అంతరము లేనిది 'నిరంతరా'. అంతరము అనే శబ్దానికి '**అంతరమవకాశావధి పరిధానాంతర్ధి భేదతాదర్థ్యే ఛిద్రాత్మీయ వినా బహిరవసరమధ్యే అంతరాత్మని చేత్**' అని వివిధ అర్థాలు చెప్పారు.

ఇందులో అంతర శబ్దానికి ప్రధానంగా తీసుకోవలసిన అర్థాలు - అవకాశము, ఛిద్రము, అవధి, భేదము, హద్దు ఇత్యాదులు. ఇవి ఏమీ లేనిది 'నిరంతరా'.

అవకాశము అంటే హద్దు అనే అర్థం. ఇంత ఉన్నది... ఇంత ఉండాలి అంటే అవకాశమది. ఇక్కడ అటువంటి హద్దు ఏమీ లేదు కనుక 'నిరంతరా'.

రెండవది ఛిద్రము. ఛిద్రానికి కూడా అంతరం అంటారు. ఎటువంటి ఛిద్రము లేనిది అంటే ఎటువంటి లోపం లేనిది. పరిపూర్ణమైన తత్త్వమది. ఆ పరిపూర్ణతని చెప్పడానికి ఇరవై నాలుగు నామాలు చెప్పారు. ఒకొక్క నామాన్ని భావన చేయాలి. భావన చేస్తే చాలు ఆత్మతత్త్వం అందుతుంది. ఆ భావనలోకి వెళ్తే ఎంత పరిపూర్ణమైనదో, దేనికి అంటకుండా ఎంత నిష్కళంగా ప్రకాశిస్తుందో తెలుస్తుంది. **'య ఏతస్మిన్నుదరమంతరం కురుతే అథ తస్య భయం భవతి'** అనే ఉపనిషద్వాక్యాను సారం - 'ఎవరు పరమాత్మ(లలిత)యందు భేదదృష్టిని పెడుతున్నాడో వానికి భయము(అజ్ఞానం) కలుగుతుంది'. అభేదస్వరూపిణి.

ఒక్కసారి మనం ధ్యానిస్తున్న అమ్మ పరిపూర్ణురాలు, శుద్ధురాలు, అనుగ్రహ సంపన్నురాలు అని భౌతిక విషయాల నుండి దృష్టి మరల్చి అహంకారము, క్రోధము, రాగము ఇత్యాది దుర్బుద్ధులు క్షణమైనా విడిచిపెడితే అప్పుడు ఈ నామాలన్నీ అర్థం అవుతాయి.

'నిరంతరా' ఎటువంటి లోపాలు లేనిది. అవధి లేనిది. భేదము లేనిది. ఏ భేదము అమ్మవారి దగ్గర లేదు.

అంతేకాక 'నిరంతరా' అంటే ఎడతెరపి లేకుండా ఉన్నదనే అర్థంలో కూడా వాడుతుంటారు. ఈ సృష్టిలో ప్రతిదీ అంతరంతోనే వెళ్ళిపోతోంది. కానీ అమ్మ మాత్రం నిరంతరంగా ఎల్లవేళలా ప్రసరిస్తున్నట్టి మహాచైతన్య స్వరూపం.

152. నిష్కారణా - శ్రీ నిష్కారణాయై నమః

ఆవిడకి కారణం లేదు కానీ ఆవిడ కారణానికి కారణం. సర్వకారణ కారణం.

'స కారణం కరణ కారణాధిపో నచాస్య కశ్చిత్జనితా న చాధిపః' ఉపనిషద్వాక్యం. ఆ తల్లికి పుట్టించిన వాడు, ప్రభువు లేదు. అన్నింటికి అది కారణమైనది. దానికి కారణము లేదు. కరణము అంటే ఉపకరణం. మనకు చూడాలనే కార్యానికి కన్ను అనే కరణం కావాలి. ఆ కరణాలు ఆవిడకి అక్కర్లేదు. అందుకు **'పశ్యత్యచక్షుః'** అన్నారు ఉపనిషత్తులో. కళ్ళు లేకుండానే అన్నీ చూస్తుంది. చెవి లేకుండానే అన్నీ వింటుంది. అందుకే 'చూడడే నా పాటు చూపులు చూడక చూచువారల కృప జూచువాడు' అన్నారు భాగవతంలో.

153. నిష్కళంకా – శ్రీ నిష్కళంకాయై నమః

కళంకం లేనిది. శుద్ధం అపాపవిద్ధం అని ఉపనిషత్ వాక్యం. పరతత్త్వము శుద్ధమైనది. ఏ పాపముల తాకిడి లేనిది.

కళంకము అంటే మచ్చ అని అర్థము. ఒక దోషము. ఎటువంటి దోషము లేనిది అమ్మవారు. సాధారణంగా కళంకం అనేదానిని నిందావాచకముగా వాడతారు. లోకంలో ఎవరైనా నిందవేస్తే ఆ నింద కళంకం అనుకుంటాం. నింద ఎదుటివారు వేశారు గాని నిజానికి ఉందో లేదో మనకు తెలియాలి.

మన హృదయంలో ఎటువంటి మలినం ఉండకూడదు. ఆ కళంకం లేని స్థితికి రావాలి. ఆ స్థితికి వచ్చినప్పుడు నిష్కళంక స్థితి అర్థం అవుతుంది. రాగము, దోషము ఇత్యాదులు అన్నీ కళంకములే. ఒకదాని యందు మోహజనితమైన అనురాగము, మరొక దాని యందు ద్వేషము, పుణ్యము పాపము... ఇన్ని కళంకాలతో కూడుకున్నది జీవభావము. ఇందులో ఏ కళంకము లేనిది పరమాత్మతత్త్వము. ఏ పాపపు దెబ్బ లేనిది కనుక నిష్కళంక. నిర్మలమైన మహాతేజం అది. అందువల్ల నిష్కళంకస్వరూపిణి.

154. నిరుపాధిః – శ్రీ నిరుపాధయే నమః

ఉపాధులలో ఆవిడ వ్యాపించి ఉంది కానీ ఆవిడకి ఉపాధి లేదు. అందుకే

'నిరుపాధిః'. ఆవిడకి ఉపాధి అక్కర్లేదు. కుండలో గాలి ఉంది కానీ కుండ లేకపోయినా కూడా ఉండగలదు. అందుకు ఉపాధులలో అమ్మ ఉందంటే ఉపాధి లేకపోతే అమ్మ లేదా! ఆవిడ ఉండగలదు కనుక 'నిరుపాధిః'. **'ఉప సమీపే ఆదధాతి స్వీయం ధర్మమిత్యుపాధిః'** - తన ధర్మమునకు దగ్గరగానున్న దానిపై సంక్రమింపజేసేది ఉపాధి. స్ఫటికం దగ్గర గులాబి ఉంటే ఆ స్ఫటికం ఎర్రగా కనబడుతుంది. ఆ ఎరుపు గులాబి అనే ఉపాధిది. స్ఫటికానిది కాదు. దేహలక్షణాలు ఆత్మకి అంటగడతాం. ఆ దేహమే ఉపాధి. ఉపాధి జడరూపమైనది. దానికి చేతనత్వాన్నిచ్చే చైతన్యం నిరుపాధికం.

155. నిరీశ్వరా - శ్రీ నిరీశ్వరాయై నమః

'న చాస్యకశ్చిజ్జని తానచాధిపః' ఆవిడకి ఈశ్వరుడు ఎవరూ లేడు. ఈశ్వరుడు(రి) అంటే అంతిమ సత్యం. దానిని మించిన సత్యం మరొకటి లేదు. అది అన్నిటినీ శాసిస్తోంది.

ఈశ్వరుడు అనగా అన్నింటిని నియంత్రించువాడు. అన్నింటిని ఆయన నియంత్రిస్తాడు. ఆయనను ఎవరూ నియంత్రించలేరు. **'ఈశావాస్యమిదం సర్వం'** అనే కదా ప్రారంభం. ఈశ్వరునికి భిన్నంగా ప్రపంచంలో మరొకటి లేదు. అన్నీ ఆయన పట్టులో ఉన్నాయంటే అన్నిచోట్లా ఆయనే(ఆమెయే) నడుపుతున్నాడు(న్నది). తనకంటూ వేరే నియామకులు లేనిది.

'నిరాధారా' 'నిరంజనా' నుంచి 'నిరీశ్వరా' వరకు అమ్మవారి యొక్క పరమార్థరూపం, తత్త్వస్వరూపం, ఆత్మరూపం, బ్రహ్మ రూపం అని చెప్పబడే జ్ఞేయబ్రహ్మము చెప్పబడింది. ఇప్పటితో మనకి అమ్మవారి యొక్క ఉభయరూప వర్ణనలు అయిపోయాయి. సగుణ, నిర్గుణ బ్రహ్మస్వరూపం. సగుణంలో మూడు విధములు రూప, మంత్ర, కుండలినీ. ఇవి సగుణములు.

నీరాగా (156) – నిష్పరిగ్రహా (183)

ఈ నామాలలో ఉపాసనా ఫలం చూపిస్తున్నారు. అమ్మవారి ఉపాసనకు ఫలమేమిటి? అది ఇందులో మనం ఎక్కడికక్కడ విడదీసుకోవాలి. 'నీరాగా' నామం నుండి 'నిష్పరిగ్రహా' నామం వరకు పరిశీలించాలి.

నీరాగా రాగమథనీ నిర్మదా మదనాశినీ
నిశ్చింతా నిరహంకారా నిర్మోహా మోహనాశినీ
నిర్మమా మమతాహంత్రీ నిష్పాపా పాపనాశినీ
నిష్క్రోధా క్రోధశమనీ నిర్లోభా లోభనాశినీ
నిస్సంశయా సంశయఘ్నీ నిర్భవా భవనాశినీ
నిర్వికల్పా నిరాబాధా నిర్భేదా భేదనాశినీ
నిర్నాశా మృత్యుమథనీ నిష్క్రియా నిష్పరిగ్రహా

156. నీరాగా – శ్రీ నీరాగాయై నమః
157. రాగమథనీ – శ్రీ రాగమథన్యై నమః

(ఈ నామాలలో జీవుల దోషాలు అమ్మవారు ఎలా తొలగిస్తుందో చెప్తున్నారు. ఈ దోషాలు అన్ని దోషాలకి మూల దోషాలు. ఈ 17 దోషాలు తొలగితేనే పరమాత్మ ప్రాప్తి. ఈ 17 దోషాలు ఉన్నంతకాలం శుద్ధి లేదు). రాగం మొదటి దోషం. రాగం అంటే ఒక దాని మీద రక్తి భావం, ప్రీతిభావం. అక్కడ నుండి ఒకొక్కటి మొదలవుతాయి. రాగం, మదం, మోహం, చింత, అహంకారం, మమత, పాపం, క్రోధం, లోభం, సంశయం, భవం. 'భవం'కి పాఠాంతరంలో భయం అని కూడా చెప్పారు. భవం, వికల్పం అంటే చెదరుట. ఒక దాని యందు సరిగ్గా ఉండకుండా చెదరిపోవడం.

అలాగే బాధ. బాధ అంటే పరిణామం కలిగించుట అని అర్థం. బాధ, భేదము, నాశము ఒక్కలాంటివే. క్రియ, పరిగ్రహం. పరిగ్రహం అంటే వస్తువును స్వీకరించుట. స్వీకరించుట రెండు విధాలు. అది శరీరంతో కావచ్చు, మనస్సుతో

కావచ్చు. కొందరు పాపం శరీరంతో స్వీకరించరు, మనస్సుతో స్వీకరిస్తారు.

అమ్మవారు ఈ దోషాలన్నీ తొలగించాలి. ఈ 17 దోషాలు ఎలా తీస్తుందో చూడండి. 'రాగమథనీ', 'మదనాశినీ'. పరదేవత మనకు ఇచ్చే ఫలం చెప్పే ముందు దాని ముందు విశేషం పరిశీలించాలి. లలితా సహస్రం కూర్పులో ఔచిత్యం ఉంటుంది. ఔచిత్యమే రసం అన్నారు. రసమేదో కవిత్వం అది. అందుకే లలితాసహస్రనామ స్తోత్రం కవిత్వం.

'రాగమథనీ'– ఆవిడ రాగమును పోగొడుతుంది. ఇది ప్రయోజనం. ఇది అమ్మవారి ఉపాసనా ఫలం. ఇప్పటి వరకు మనం అమ్మవారిని సగుణంగా భావించాం, నిర్గుణంగా తెలుసుకున్నాం. ఈ రెండు చేయడం వల్ల దోషాలు పోతాయి అనేది ఇక్కడ తెలియబడుతోంది. దోషాలు అన్నీ పోయాక అమ్మవారిని తలచుకుంటాననంటే మన వల్ల కాదు. దోషాలు పోగొట్టేది కూడా ఆవిడే. పోగొట్టిన తరువాత మిగిలేదీ ఆవిడే.

'రాగమథనీ' – రాగమును పోగొడుతుంది కానీ ఆ తల్లి 'నీరాగా'. ఆవిడకి రాగం లేదు. అప్పుడు మనకి ధైర్యం. ఏ రాగము లేని తల్లి దగ్గరికి వెళ్తే రాగమును పోగొడుతుంది. అసలు చీకటి లేని వెలుగు దగ్గరికి వెళ్తేనే కదా మనకు వెలుగు. వెలుగు దగ్గరకి వెళ్ళినప్పుడు వెలుగు చీకటిని తరిమి కొట్టదు. వెలుగు వస్తే చీకటి అదే పోతుంది. అమ్మ వస్తే అజ్ఞానం అదే పోతుంది. కనుక ఆవిడ 'నీరాగా–రాగమథనీ'. ఆవిడకి రాగము లేదు కనుక రాగములు తొలగిస్తోంది. రాగము పరమ భయంకరం. జడభరతుడు అంతటివాడు కూడా రాగం చేత జన్మలు ఎత్తాల్సి వచ్చింది. కనుక రాగం జ్ఞానులు అయిన వారిని కూడా లాగేస్తుంది. కనుక 'ఈ దోషాలు పోగొట్టాలంటే ఆమెను ఆశ్రయించు'. ఇది వశిన్యాది వాగ్దేవతలు మనకు చూపిస్తున్న మార్గం. ఎలా ఆశ్రయించాలి? అదే 155 నామాలలో చెప్పాం అంటున్నారు వశిన్యాది వాగ్దేవతలు. ఆ భావంతో ఆశ్రయించు.

158. నిర్మదా - శ్రీ నిర్మదాయై నమః

159. మదనాశినీ - శ్రీ మదనాశిన్యై నమః

నిర్మదా - మదములేని తల్లి. మదము అంటే 'ఇది నాకు ఉంది అనే బలీయమైన భావం'. ఈ భావం చాలా ప్రమాదకరం. 'ఇది నాకు ఉంది' అనుకోగానే దానితో తాదాత్మ్యం చెందడం మొదలుపెడతారు. అక్కడ నుండి శత్రుత్వాలు పెరుగుతాయి. అమ్మ వద్ద ఈ మద వికారము అనేది లేదు.

బలము, భాగ్యము, విద్య, ధనము, అధికారము - ఇందులో ఏది ఉన్నా మదానికి హేతువు అవుతుంది. కనుక నిరంతరం జాగరూకతతో ఉండాలి. అది ఈశ్వరానుగ్రహం వల్లే వచ్చింది అని తెలుసుకుంటే ఫరవాలేదు. అలా కాకుండా వాటిని 'నేను సాధించాను' అనుకుంటే - ఆ మదము రెండు రకాలైన ప్రమాదాలను కలిగిస్తుంది. 1. తనని తాను తెలుసుకోనివ్వదు. 2. అవతలివానిని గుర్తించనివ్వదు. తద్వారా ఆ మదము పతనానికి హేతువు అవుతుంది.

అధికార మదము, ధనమదము, విద్యామదము ఇలా రకరకాలైన మదము కలిగినవారు లోకంలో కనబడుతూ ఉంటారు. అధికారమదము బాగా ఉన్నవారు మహాత్ములు ఎదురుపడినా వారికి నమస్కరించరు. తన వద్ద అధికారం ఉంది కనుక తను ఎదుటివారికి నమస్కరిస్తే తన అధికారం తక్కువైపోతుంది అనుకుంటారు. అదేవిధంగా ధనమదం, విద్యామదము ఉన్నవారు అవతలివారిని తక్కువచూపు చూస్తూ ఉంటారు.

మన యందు భగవద్విభూతి ఏది ఉన్నా అది ఈశ్వరప్రసాదము, అనేక జన్మల తపస్సు వల్ల, ఆయన అనుగ్రహం వల్లే లభించింది అనుకోవాలి తప్ప, అది తాను తెచ్చుకున్నానని అనుకుంటే మదము వస్తుంది.

భగవత్తత్త్వము నిర్మదమైన తత్త్వము. అమ్మవారు శుద్ధురాలు, నిర్మలురాలు అని తెలుసుకుని సాధన చేస్తూ ఉంటే, ఆ తత్త్వము మనలో క్రమంగా అనుసంధానించబడి మనలో ఉన్న మదము, రాగము ఇత్యాదులు తొలుగుతాయి.

నిర్మదా – మదరహితురాలు. మదనాశినీ – ఆశ్రయించినవారి మదమును నశింపజేసే తల్లి.

160. నిశ్చింతా – శ్రీ నిశ్చింతాయై నమః

నిశ్చింతా అనగా చింతానాశిని. అన్నింటికీ నాశిని ప్రక్కన పెట్టారా? అని వెతక వద్దు. అన్వయించుకోవడమే. నిశ్చింతా. దుఃఖాన్ని కలిగించే స్మృతి చింత. విశ్వనిఘంటువులో 'ఛల' అని అర్థం ఉంది. అంటే 'కపటం'. దుఃఖాన్నీ, దుఃఖకారణమైన స్మరణనీ, కపటాన్ని తొలగించునది. అవి లేనిది.

161. నిరహంకారా – శ్రీ నిరహంకారాయై నమః

162. నిర్మోహా – శ్రీ నిర్మోహాయై నమః

163. మోహనాశినీ – శ్రీ మోహనాశిన్యై నమః

164. నిర్మమా – శ్రీ నిర్మమాయై నమః

165. మమతాహంత్రీ – శ్రీ మమతాహంత్ర్యై నమః

చింత చాలా ప్రమాదకారి. ఒకొక్కప్పుడు సంఘటన జరిగిపోతుంది. కానీ చింత లోపల దహించివేస్తుంది. చింత కంటే చితి మేలు అన్నారు. **'చితా దహతి నిర్జీవం చింతా దహతి జీవితమ్'** అన్నారు. నిర్జీవమైన దానిని చితి దహిస్తుంది. సజీవుని చింత దహిస్తుంది. చింత నీలో శక్తిని క్షీణింపజేస్తుంది. మనలో ఉన్న అద్భుతమైన ఆత్మశక్తి ఈ దోషాల వల్ల క్షీణించిపోతుంది. రాగము, మదము, చింత, అహంకారం – ఇవన్నీ దోషములు. ఆ తల్లిని పట్టుకుంటే లోపల స్వాత్మశక్తిగా అమ్మ జాగృతం జరుగుతూ ఒకొక్కటి తొలగిపోతాయి.

ఆత్మశక్తి జాగృతమైతే గానీ దోషాలు పోవు. దోషాలు పోతే గాని ఆత్మశక్తి జాగృతం కాదు. ఆత్మ శక్తే అమ్మ అని ఆశ్రయించగలిగితే ఆవిడే దోషాలు పోగొడుతుంటుంది. నీ అంతట నువ్వు దోషాలు పోగొట్టుకుంటాను అనుకుంటే నీ

అహంకారం. "నా ప్రయత్నం నేను చేస్తాను గాని నా వల్ల కాదమ్మా. నా ప్రయత్నం-చెయ్యి పైకెత్తుతా, నీ అనుగ్రహం-చేయూతనిచ్చి పైకి లాగు. నన్ను నువ్వు అనుగ్రహించాలి తల్లి".

'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'. అప్పుడు **'అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి'** అన్ని పాప(దోష)ల నుండి విడుదల చేస్తానన్నది అభయవాక్యం. అన్నీ కలిపి 17 పాపాలు. అంతేకాని పాపం అనగానే ప్రతిసారి హత్యలు చేయడం, దొంగతనాలు చేయడం మాత్రమే కాదు. పాపము అనగా దోషము. అక్కడ కృష్ణ రూపంలో "ఈ దోషాలన్నీ తీసేస్తాను" అంటున్నది అమ్మ. భగవద్గీతలో చరమ వాక్యమే ఇక్కడ విస్తరించిన ఈ వాక్యాలలో కనబడుతున్నది. ఆ తల్లికి ఆ దోషాలు లేవు. మనకూ అవి లేకుండా చేస్తుంది.

'నీరాగా, రాగమథనీ, నిర్మదా, మదనాశినీ, నిశ్చింతా, నిరహంకారా, నిర్మోహా, మోహనాశినీ, నిర్మమా, మమతాహంత్రీ'- అహం లేదు, మమ లేదు. రెండూ తీసేస్తుంది. **'తత్ర కో మోహః? కశ్శోకః ఏకత్వమనుపశ్యతే'** - ఏకమైన బ్రహ్మమును తెలుసుకుంటే మోహ, శోకాలెక్కడివి? - అని శ్రుతి. ఏకమైన బ్రహ్మజ్ఞానం అజ్ఞాన వికారాలైన రాగ, మద, చింత, అహంకార, మమకార, మోహాలను నశింపజేస్తుంది.

166. నిష్పాపా - శ్రీ నిష్పాపాయై నమః

167. పాపనాశినీ - శ్రీ పాపనాశిన్యై నమః

మునుపటి నామాలలో దోషములే పాపములని మొత్తం పాపసమూహములు చెప్పారు. కానీ పాపానికి ఒకటే అర్థం- శాస్త్రం ఏది విధించిందో అది చెయ్యకపోవడం, ఏది విధించలేదో అది చెయ్యడం. కలియుగంలో వ్యత్యస్తం అవుతుంది. ఏది చెయ్యవద్దన్నారో అది చెయ్యాలనిపిస్తుంది, ఏది చెయ్యమన్నారో అది చెయ్యాలనిపించదు.

విధి నిషేధాల్ని తారుమారు చేసి, విధిని వదిలిపెట్టి నిషేధాన్ని ఆచరిస్తే దానిని పాపం అంటారు. ఈ పాపం వల్ల వచ్చేది దుఃఖం. అమ్మవారు ఆ పాపాన్ని,

దుఃఖాన్ని కూడా తొలగిస్తోంది. లోకంలో మనం చేసే ప్రతిక్రియలన్నీ కూడా దుఃఖనాశనాలే తప్ప, పాప నాశనం కాదు. పాపం పోతేగాని దుఃఖం పూర్తిగా పోదు. దుఃఖమనే చెట్టుకి మూలమైన దుంప 'పాపం'. దానిని కూడా తీసేయాలి. ఆ దుంప తెంచే శక్తి అమ్మవారికే ఉంది. అందుకనే 'నిష్పాపా' 'పాపనాశినీ' అన్నారు.

ఛిత్వా భిత్వా చ భూతాని హత్వా సర్వమిదం జగత్

ప్రణమ్య శిరసా దేవీం న స పాపైర్విలిప్యతే (దేవీభాగవతం)

ఇక్కడ అమ్మవారి కారుణ్యాన్ని చూపిస్తున్నారు. దీనిని కూడా అనుకూల దృక్పథంతో తీసుకోవాలి. ఎవరైనా ఎందరినో చంపేసి, చెయ్యకూడని పనులు ఎన్నో చేసేసి, ఆ తరువాత పశ్చాత్తప్తుడై అమ్మా! అని ఏడుస్తూ ఒక్క దండం పెడితే అన్ని పాపాలు క్షణంలో తీసేస్తుందిట. 'అయితే ఎన్ని పాపాలు చేసినా అమ్మ తీసేస్తుందా?' అంటే 'పశ్చాత్తాపం ఉంటే' అనేది సమాధానం.

అలాగ చెప్తే అందరూ పాపాలు చెయ్యరా? అంటే, నిజంగా అమ్మని శరణువేడితే చెయ్యరు. అమ్మ ఆ బుద్ధి పుట్టనివ్వదు. ఇక్కడ సాధకునికి ధైర్యం ఇవ్వడమే గాని పాపాత్మునికి మరిన్ని పాపాలు చేయడానికి భరోసా ఇవ్వడం కాదు. ఒక్కసారి వెనక్కి చూసి, "నాకెన్నో పాపాలున్నాయమ్మా ఎలా తరిస్తానం"టే, "నీకేం ఫరవాలేదు నాన్నా! నన్ను ఆశ్రయించావు కదా" అంటుంది. అందుకే **'అపరాధశతం కృత్వా జగదంబేతి చోచ్చరేత్'** – వేలకొలదిగా అపరాధాలు చేసినా జగదంబా! అని పిలిస్తే చాలు. అమ్మ అన్నిటినీ తొలగించుతుంది.

తవ ప్రతిజ్ఞా మద్భక్తాః న నశ్యంతీత్యపి క్వచిత్

ఇతి సంచింత్య సంచింత్య ప్రాణాన్ సంధారయామ్యహమ్

"అమ్మా! నీ ప్రతిజ్ఞ ఏమిటంటే నా భక్తులు ఎప్పుడూ నశించరు. 'న మే భక్తః ప్రణశ్యతి'. – నీ ప్రతిజ్ఞ గుర్తుపెట్టుకొని నేను బ్రతుకుతున్నా అమ్మా. నిన్ను పట్టుకున్నాను కనుక నేను నశించను. అందుకే నాకేం ఫరవాలేదు". "ఏమిటయ్యా నువ్వు అంత గొప్పవాడివా!" అంటే, "నేను కాదు. మా అమ్మ అంత గొప్పది. అమ్మకు శరణాగతుడను కనుక నాకేం భయం లేదు". పట్టుకున్న ఆశ్రయం అంత గొప్పది.

"మేరు పర్వత మాత్రోపి రాశిః పాపస్య కర్మణః,
కాత్యాయినీం సమాసాద్య నశ్యతి క్షణమాత్రతః" (పద్మపురాణం)

– పాపములు మేరుపర్వతము వలె ఉన్నా, అమ్మని ఆశ్రయిస్తే ఆ క్షణంలో పాపాలు తీసేస్తుంది. ఇంకేం కావాలి? మనకు పాపాలు చేయడానికి సంవత్సరాలు పట్టినా, పాపాలు పోగొట్టడానికి అమ్మకి అరక్షణం చాలు. ఎందుకంటే గదిలో చీకటి కొన్ని ఏళ్ళ నుండి ఉన్నా, దీపం వెలిగిస్తే ఆ దీపానికి ఆ చీకటిని పోగొట్టడానికి ఏళ్ళు పట్టదు. వెలిగించడమే ఆలస్యం. అటువంటిది అమ్మవారి యొక్క ఆశ్రయం.

168. నిష్క్రోధా - శ్రీ నిష్క్రోధాయై నమః
169. క్రోధశమనీ - శ్రీ క్రోధశమన్యై నమః

ఇక్కడ తెలుసుకోవలసిన గుణాలు కూడా ఉన్నాయి. ఆవిడే క్రోధాలు పోగొడుతుందని కాదు. ఇవి ఎంతో అసహ్యకరమైనవని తెలుసుకుని ప్రయత్నిస్తే, అమ్మవారు చేయూతనిస్తారు. కామము, క్రోధము ఏ పాటి ఉన్నా అమ్మకి దూరం అవుతామని తెలుసుకొని అవి అన్నీ వదిలించుకునే ప్రయత్నం చేయాలి. 'చిత్తశుద్ధి లేని శివపూజలేలయా?' అనే మాట పట్టుకుని చిత్తశుద్ధి లేదు కనుక శివపూజ మానేయకూడదు. చిత్తశుద్ధి కోసం చేస్తున్నానని మనసు పెట్టి చేయాలి. బసవేశ్వరుడు బసవేశ్వర వచనాలలో... 'క్రోధి అభిషేకం చేస్తే రక్తంతో పూజించినట్లు' అని చెప్పాడు. విసుగు, కోపం ఉన్నప్పుడు జపం, తపం ప్రక్కన పెట్టండి. వానిని జయించడానికి ప్రాణాయామాది సాధనలు చేయండి. ప్రాణాయామం మొదలైనవి చేస్తే ముందు మనస్సు కుదుట పడుతుంది. అవి జయించాకే ఇవి. జయించడం కోసం చేయవచ్చును. అందుకే 'నిష్క్రోధా' 'క్రోధశమనీ'.

170. నిర్లోభా - శ్రీ నిర్లోభాయై నమః

171. లోభనాశినీ - శ్రీ లోభనాశిన్యై నమః

ఒక వస్తువుపై వ్యామోహం పెంచుకుని, అది తనది చేసుకుని, అది తనకే ఉండాలని, తన దగ్గరే దాచుకోవాలనే స్వభావానికి లోభం అని పేరు. అజ్ఞానం యొక్క వికారమే లోభం కూడా. ఒక వస్తువు పట్ల మమత్వం అనే దానిని పెంచే లక్షణం లోభంలో ఉంది. దాని వల్ల మనలో ఉదారత అనేది కొరవడుతుంది. ఉదారత అంటే దాపరికం లేకుండా పంచగలిగే లక్షణం. ఆ ఉదారత కొరవడితే మానవత్వానికే దెబ్బ. ఇంక దైవత్వం దాక ఎందుకు?

నిర్లోభా అంటే పరమ ఉదారస్వభావురాలు అని అర్థం. ఉదారత అమ్మ దగ్గర ఉంది కనుకనే ఈ జగత్తు అంతా ఇంత క్షేమంగా ఉంది. అమ్మ తన శక్తిని మొత్తాన్ని ప్రకటిస్తోంది. దాచుకోలేదు. దాని మీద మమకారముగానీ, లోభముగానీ లేదు. సర్వశక్తిమయి అయిన పరిపూర్ణురాలు కనుక పరిపూర్ణతతో తన శక్తిని విశ్వమంతా పరచి చూపిస్తున్నది. తన కృపని పరమ ఉదారంగా అందిస్తోంది. సూర్యుని నుండి వచ్చే వెలుతురు, నీటి నుండి వచ్చే చల్లదనం, వాయువు ఇచ్చే సాంత్వన ఇలా పంచభూతాలలో వచ్చే శక్తి అంతా కూడా ఆ తల్లి ఉదారతనే తెలియజేస్తోంది.

ఏ కారణం చేత ప్రకృతి అంతా కూడా ఉదారంగా ఈ విశ్వాన్ని కరుణిస్తోంది ఆ కరుణ, ఉదారత్వం అమ్మది కనుక. ఔదార్యము, ఉదారత అనే సద్గుణాల స్వరూపము అమ్మవారు. పరమ ఉదారురాలు కనుక లోభము లేనిది అన్నారు. అమ్మని ఆశ్రయించినవారికి కూడా లోభము అనేది లేకుండా చేస్తుంది. లోభం దుర్గుణం అని తెలుసుకున్నాం. లోభం వల్లే పాపం వస్తుంది. పాపానికి మూడు ప్రధాన ద్వారాలు అని వివరించారు. అది కామము, క్రోధము, లోభము.

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః
కామఃక్రోధస్తథాలోభః తస్మాదేతత్త్రయం త్యజేత్

ఆత్మని నాశనము చేసే నరకద్వారములు మూడు. అవి కామక్రోధలోభాలు

– అని కృష్ణపరమాత్మ చెప్పాడు. వాటి వరుసే ఈ నామాలలో చెప్తున్నారు. నిష్క్రోధా, క్రోధశమనీ, నిర్లోభా, లోభనాశినీ.

లోభత్వము వల్ల తనదైన ఆ దివ్యత్వ విభూతి తానే అనుభవించలేదు, ఇతరులకు పంచలేదు. తాను అనుభవించక, ఇతరులకు పంచక ఉండిపోయే ఆ దివ్యానుభూతి ఏదైతే ఉందో అది దేనికి పనికొస్తుంది! ఉదారత అనే దైవీగుణము తన భక్తులకు కలిగేలా చేస్తుంది అమ్మ. అందువల్లే లోభనాశిని అన్నారు.

లోభాదిదుర్గుణాలు పోయిన చిత్తానికే నిర్లోభా అయిన ఆ దేవి తత్త్వం అర్థం అవుతుంది. అమ్మ అనుగ్రహం లభిస్తుంది. ఆ స్థితి వస్తే అన్ని సందేహాలు పోతాయి. సందేహాలు పోగొట్టే శక్తి అమ్మకే ఉంది కనుక నిస్సంశయా.

172. నిస్సంశయా – శ్రీ నిస్సంశయాయై నమః

173. సంశయఘ్నీ – శ్రీ సంశయఘ్న్యై నమః

అన్నింటికి మూలం సందేహం. రాగ, మద మొదలైనవి ఉపాధి దోషాలు. ఉపాధి దోషాలు పోగొట్టడానికి నిరుపాధి అయిన తల్లి అనుగ్రహిస్తోంది. 'సంశయము' అన్నింటికన్నా భయంకరమైనది. ఆ సందేహాన్ని అమ్మయే పోగొట్టగలదు. సందేహం పోయిందంటే మోక్షం–జ్ఞానమే. అజ్ఞానమే సందేహం. అవిద్య యొక్క లక్షణమే సందేహం. అమ్మవారు దానిని పోగొడుతుంది. ఆ తల్లి దయా దృష్టి పెడితే, అమ్మపై నువ్వు దృష్టిపెడితే నీ సందేహం తొలగుతుంది. లేకపోతే తొలగదు అని శాస్త్రం చెప్పింది.

ఆవిడ యందు నువ్వు దృష్టి పెట్టు. అంటే ఏకాగ్రంగా ఉపాసించు. అప్పుడు ఆవిడ నీపై దృష్టి పెడుతుంది. 'చూచువారల కృప జూచువాడు'. నువ్వు భక్తితో చూడు... ఆవిడ దయతో చూస్తుంది. ఈ రెండూ కలిస్తే సంశయాలన్నీ ఛేదింపబడతాయి. **'తస్మిన్ దృష్టే పరావరే'** ఇది కఠోపనిషత్ మంత్రం. '**భిద్యతే హృదయగ్రంథిః ఛిద్యంతే సర్వసంశయాః**'. ఇక్కడ 'నిస్సంశయా సంశయఘ్నీ' – ఉపనిషత్తులో **'క్షీయంతేచాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే'**.

174.నిర్భవా - శ్రీ నిర్భవాయై నమః

175.భవనాశినీ - శ్రీ భవనాశిన్యై నమః

భవ అంటే పుట్టుక, సంసారం. పరదేవతకి సంసారం, పుట్టుక లేవు. అంతే కాక ఆశ్రయించిన వారి సంసారాన్ని, పుట్టుకలని తీసేస్తుంది కనుక ఆమె పేరే 'భవనాశినీ'. అమ్మవారి పేర్లలో 'భవతారిణీ' అనే ఒక పేరు ఉంది. ఈ అమ్మవారు శక్తిపీఠాలలో ఓడ్యాణపీఠం (ఒరిస్సా) లో ఉంది. అమ్మవారిని అక్కడ తారిణీదేవి అని పిలుస్తారు. ఈ తారిణీ విద్య మళ్ళీ లలితాసహస్రంలో కూడా ఒకచోట వస్తుంది. తారిణీ అంటే సంసారసాగరం నుంచి దాటిస్తుంది. కుండలినీ శక్తిని ప్రార్థన చేస్తూ, **'యా తనుస్తే తటిత్ ప్రఖ్యా తాం భజే భవనాశినీమ్'** అన్నారు. ఆ మాట ఇక్కడ తెలుస్తుంది.

కేవలం ఆత్మజ్ఞానం మాత్రమే పుట్టుక లేకుండా చేస్తుంది. ఆ స్వరూపం అమ్మవారిది. ప్రసిద్ధిగా శాస్త్రంలో ఉన్న విషయం–'ఎవరైతే శుక్లపక్షంలో నవరాత్రులు విధిబద్ధంగా ఆరాధిస్తారో వారి యొక్క పూర్వీకులు అటు పదితరాలవారు, ఇటు పదితరాలవారు తరించిపోయి, వారు **'భవార్ణవాత్ సముద్ధృత్య దుర్గాలోకే మహీయతే'** అన్నారు. వారు సంసార సాగరం నుండి బయటపడతారు.

176. నిర్వికల్పా - శ్రీ నిర్వికల్పాయై నమః

వికల్పం అంటే చెదరుట. సంకల్పం, వికల్పం – ఈ రెండు మనస్సు యొక్క లక్షణములు. ఆవిడ మనస్సుకు అతీతురాలు కనుక నిర్వికల్పా.

నిర్వికల్పా అనేది చాలా బలీయమైన మాట. ఇది యోగపరమైన భాష. వికల్ప, నిర్వికల్ప అనేవి సమాధి స్థితికి సంబంధించిన పదాలు. సవికల్ప సమాధి, నిర్వికల్ప సమాధి. ఒక విషయంతో బుద్ధి ఏకాగ్రంగా కలసి ఉంటే అది సవికల్ప సమాధి. అది సిద్ధించడం కూడా సామాన్యం కాదు.

ఒక విషయం మీద ఏకాగ్రంగా ఉన్నప్పుడు క్రమంగా బుద్ధి అనేదే ఉండదు. బుద్ధి ఆ వస్తువులో లీనమైపోయి అదే మిగిలిపోతుంది. అది నిర్వికల్పసమాధి. అది

ఊహకి కూడా అందని దివ్యస్థితి. ఆ స్థితిలోనే పూర్ణత్వము భాసిస్తుంది. అది నిధిధ్యాసనము అని చెప్పబడే అంతిమ సమాధి స్థితి. ఆ స్థితిలో భాసించే పరతత్త్వము కనుక అమ్మ స్థితి నిర్వికల్ప.

వికల్పాదులు లేనిది. వికల్పము అంటే చెదిరిపోవడం. ఒకటి అనుకుని అది చెదిరిపోతే వికల్పం అవుతుంది. భ్రాంతి కూడా వికల్పమే. వికల్పాత్మకమైన స్థితిలేనిది నిర్వికల్పము. ఎటువంటి భ్రాంతి కూడా లేనిది.

వికల్పము గురించి యోగసూత్రాలలో చెప్తూ "శబ్దమాత్రానుపాతీ వస్తుశూన్యో వికల్పః" అన్నారు. ఒక శబ్దము వింటాం. ఆ శబ్దము వినగానే ఒక విషయం స్ఫురిస్తుంది. కానీ ఆ విషయం లేనిదే. దానిని వికల్పము అంటారు.

ఉదాహరణకు ఆవు అనే మాట విన్నాము. ఆవు అనే మాట వినగానే ఆవు స్ఫురిస్తోందిగాని ఆవు రావడంలేదు. ఇలా శబ్దమాత్రం ద్వారా విషయం స్ఫురిస్తోంది – అంటే ఒకానొక వస్తు విషయమైన జ్ఞానము కలుగుతోందిగాని ఆ వస్తువు యొక్క సాక్షాత్కారం అనేది లేదు. అదే విధంగా ఈ జగత్తులో ఈ వికల్పాత్మకమైన బుద్ధికి అసలైన జ్ఞానము లభించకుండా ఉంటుంది. ఇటువంటి వికల్పస్థితి లేనిది కనుక నిర్వికల్ప అని చెప్పారు. ఇది చాలా లోతైన అర్థం. సమాధి స్థితిలో మాత్రమే అన్వయించే అర్థం.

వికల్పము అంటే విరుద్ధమైన కల్పము అని అర్థం. విరుద్ధమైన పక్షము. 'ఇది నాకు విరుద్ధం, ఇది నాకు పడదు' అంటే అది వికల్పము అవుతుంది. అలా అమ్మకి పడనవి అంటూ ఏమీ లేవు. ఈ జగత్తులో ఆమెకి వికల్పము ఏమీ లేదు. సర్వజగత్తు పట్ల అనుగ్రహస్వరూపము కలిగినది. ఆమె కంటే వేరుగా జగత్తులో ఏదీ లేదు. అంతా తానే అయి ఉంది. నిజానికి అమ్మకి విరోధము లేదు. విరోధులు లేరు. విరోధము, విరుద్ధము అనేవి భ్రాంతి ద్వారా కల్పింపబడినవే. అంతా ఉన్నది అమ్మే. అందుకు నిర్వికల్పా. సర్వవ్యాపకమైన తత్త్వమే నిర్వికల్పా.

177. నిరాబాధా - శ్రీ నిరాబాధాయై నమః

ఏ బాధ కూడా లేనిది. నిర-ఆబాధ అని కూడా చెప్తారు. ఆబాధ అంటే లేదనుట, కాదనుట ఇత్యాది అర్థాలు ఉన్నాయి. ఇది కాదు, ఇది లేదు అనే స్థితి అమ్మకు లేదు. అంతా ఉన్నది, అంతా అయినది అమ్మ. లేనిది, కానిది కాదు. అది నిరాబాధ.

ఆ తత్వాన్ని దేశమూ బాధించలేదు, కాలమూ బాధించలేదు అన్నారు. అవస్థ, కాలము, దేశము ఈ మూడు ప్రాపంచికమైన విషయాలను బాధిస్తూ ఉంటాయి. ఉన్నస్థితిలో ఉండనివ్వకపోవడమే బాధ.

ఆ పరతత్వాన్ని మాత్రం ఈ మూడు బాధించలేవు. దేశకాలావస్థలకు అతీతమైనది కనుక నిరాబాధ. అలా ఉన్న పరిపూర్ణజ్ఞానస్వరూపం. తనను ఆశ్రయించినవారికి కూడా అటువంటి బాధలు లేని స్థితిని ఇస్తుంది. దేశముచేత, కాలము చేత, అవస్థ చేత బాధింపబడేది శరీరముకాని 'నేను' కాదు అనేదే ఆత్మజ్ఞానం. ఆ ఆత్మజ్ఞానం ఎప్పుడు కలుగుతుందో అప్పుడు వారు నిరాబాధ స్థితికే చేరతారు. అలా భక్తులకు నిరాబాధా స్థితిని కలిగించే ఆత్మస్వరూపిణి అమ్మ.

178. నిర్భేదా - శ్రీ నిర్భేదాయై నమః

ఆవిడకి భేదం లేదు. ఏకవస్తువు. భేదాలు మూడు అని వేదాంతం తెలియజేస్తోంది. సజాతీయ, విజాతీయ, స్వగత భేదములు. విజాతీయ భేదములు అంటే మానవులు, ఆవులు ఈ రెండూ విజాతీయములు.

సజాతీయ భేదములు - మానవులలో మళ్ళీ స్త్రీలు, పురుషులు. ఇవన్నీ సజాతీయ భేదాలు.

స్వగత భేదం అంటే వారి శరీరాలు చూసుకుంటే కన్ను ఉన్నట్లు కాళ్ళు లేవు. కాళ్ళు ఉన్నట్లు కన్నులు లేవు. ఇది స్వగత భేదం. కనుక స్వగత భేద, విజాతీయ భేద, సజాతీయ భేదాలు ప్రపంచంలో ప్రతి వస్తువుకి ఉంటాయి కానీ చైతన్యమైన ఆత్మకి ఈ మూడు భేదములు లేవు. ఆ ఆత్మయే నేను అని విషయం

తెలుసుకున్నవానికి భేదము లేదు. భేదములేని తల్లి. జ్ఞానదాయినిగా భేదనాశిని.

179. భేదనాశినీ – శ్రీ భేదనాశిన్యై నమః

భేదం లేని స్వరూపం కనుక మన భేద దృష్టిని తొలగిస్తున్నది. అయితే కొందరు ఏం చెప్పారంటే శక్తికి, శక్తిమంతునికి భేదం లేదు. శక్తి అంటే ప్రపంచంలో వ్యాపించినది. శక్తిమంతుడు ప్రపంచాతీతమైన ఈశ్వరుడు. ఈ రెండింటికి భేదం లేదు. ఈ అభేద ఉపాసనే మోక్షం. భేద దృష్టి పోనంతవరకూ కూడా మోక్షం రాదు.

ఎంత దేవుని భక్తుడు అయినా భేద దృష్టి పోవాలి. ప్రయత్నం చేసి అమ్మని ఆశ్రయిస్తే తత్త్వజ్ఞానం చేత భేదాన్ని ఆవిడే తొలగిస్తుంది. ఆవిడ అనుగ్రహం లేకపోతే ఇవేమి తొలగవు. 'ఈశ్వరానుగ్రహాదేవ పుంసామద్వైతవాసనా'. కనీసం వాసనా(సంస్కార)రూపంగానైనా అద్వైతం ఉంటేనే అద్వైతం అర్థమవుతుంది. వాసన కావాలన్నా ఈశ్వరానుగ్రహం కావాలి. అమ్మ దయ లేకపోతే ఆ వాసనా కలుగదు, ఆ ఫలమూ రాదు. 'నిర్భేదా' 'భేదనాశినీ'.

180. నిర్నాశా – శ్రీ నిర్నాశాయై నమః

నిర్నాశా అంటే నాశనములేని తల్లి. ఆ తల్లిని ఆశ్రయిస్తే నాశనము లేకుండా చేస్తుంది. పరిపూర్ణురాలు, పరబ్రహ్మస్వరూపిణి కనుక **సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ** అని వేదమే చెప్పింది. సత్యమై, జ్ఞానమై, అనంతమై ఉన్న తల్లి కనుక నిర్నాశా అని చెప్పారు. 'నశించిపోయే వాటి యందు నశించనిది ఒకటి ఉంది దానిని గ్రహించు' అని గీతలో పరమాత్మ చెప్పారు. నాశనమే లక్షణముగా కలిగిన ఈ జగత్తులో నశించకుండా ఉండే ఒక ఆధారశక్తి ఉంది. ఆ ఆధారశక్తే అమ్మస్వరూపం. అదే అమ్మతత్త్వము. అదే నిర్నాశా.

181. మృత్యుమథనీ – శ్రీ మృత్యుమథన్యై నమః

నిర్నాశా నామం అర్థం కావడానికి 'మృత్యుమథనీ' నామం. ఆవిడ మృత్యువుని

తొలగిస్తుంది. ఇది చాలా గొప్ప మాట. చావుని తీసేస్తుంది అంతే కదా! అంటే అమ్మని ఆశ్రయిస్తే మరి చావడు. మనం ఏ ఏ గురువుల దగ్గర మంత్రవిద్య నేర్చుకున్నామో వారందరూ ఎప్పుడెప్పుడో పరమపదించారు కదా! మరి వారు ఉన్నారా! అంటే, సమాధానం–వారే ఉన్నారు. నిత్యమూ ఉండే తల్లితో ఉన్నవారు. లేని–పోని, ఉండి–లేని వస్తువులతో తిరుగుతూ ఉన్నంతకాలం మనం మృత్యువుతో ఉన్నట్లే. **'ప్రమాదం వై మృత్యుమహం బ్రవీమి'** అని ఉపనిషత్ చెప్తోంది. ఏది అమృతమో తెలుసుకోనంత వరకు మృత్యువే. 'ఏది మృతమో అది నువ్వు' అనుకుంటున్నంత కాలం మృత్యువే. చచ్చే లక్షణం కలిగింది శరీరం. అదే నువ్వు అనుకున్నంత కాలం నువ్వు చచ్చేవాడివే. **మర్త్యః** అర్థమే అది. దీనికి అతీతమైన ఆత్మతో నువ్వు తాదాత్మ్యం చెందు. అమృతడవౌతావు.

అందుకే వేదాంతం బోధిస్తోంది: మృత లక్షణాన్ని నేను, నేను అని అఘోరిస్తున్నావు. బయటికి రా! అమృతమే నువ్వు అని చెప్తోంది. ఎప్పుడూ 'నువ్వు అమృతానివి.... నువ్వు శరీరం కాదు...' అని చెప్తూ ఉంటే అప్పుడు మన మనస్సుకే అనిపిస్తుంది నేను మృత్యువును కానట, అమృతమట అనుకుంటే కనీసం ఏదో తగిలిందిగా మనస్సుకి. ఇది వాసనలా లోపలికి వెళ్ళిపోతుంది. ఇది తరువాత జన్మలలో వచ్చి సాధనగా కొనసాగుతుంది. కనుకనే వేదాంత శాస్త్రం శ్రద్ధగా విను. వేదాంతశాస్త్రమే పాపనాశనం. ఎందుకంటే సహజంగా నువ్వు పాపం, దోషం లేనివాడివి. నువ్వు మృతి లేనివాడివి అని చెబుతూ ఉంటే వినడానికి ఎంతో బాగుంటుంది కదా.

మృత్యుమథనీ – అజ్ఞానమే మృత్యువు. ఏమరపాటే మృత్యువు. తెలుగులో చెప్పాలంటే ప్రమాదం అంటే ఏమరపాటు, అజాగ్రత్త. అజ్ఞానంతో ఉండడమే అజాగ్రత్త. కనుక ఆ శాశ్వత నిద్ర నుండి బయటకి తీయగలిగే శక్తే మృత్యుమథనీ. అమృతత్త్వ స్థితి ఇస్తున్నది. ఇదే 'మృత్యోర్ముక్షీయమామృతాత్' – ఇక్కడ చెప్పబడుతున్నది మృత్యుంజయ మంత్రం.

"మామృతాదిత్యమృతత్వం ప్రాప్నోతి – అక్షయత్వం ప్రాప్నోతి నిత్యత్వం

ప్రోప్నోతి స్వయం రుద్రో భవతి" (త్రిపురోపనిషత్) "అమృతం నుండి జారిపడకుండా – అమృతత్వాన్నీ, అనంతత్వానీ, నిత్యతనీ అమ్మ భక్తుడు పొందుతున్నాడు. సాక్షాత్తుగా రుద్రుడౌతున్నాడు.

182. నిష్క్రియా – శ్రీ నిష్క్రియాయై నమః

ఆవిడకి ఏ క్రియా లేదు. సృష్టి, స్థితి, లయలన్నీ ఆవిడే చేస్తుంది కదా మరి నిష్క్రియా అంటారేమిటి! దీనికి ఉదాహరణ శంకరులు బాగా చెప్పారు. "సూర్యుడు ఉదయించాడు. అందరూ లేచి పనులు చేసుకుంటున్నారు. నిన్న రాత్రి వరకు మొగ్గలుగా ఉన్నవి ప్రొద్దున్న సూర్యుడు ఉదయించగానే పువ్వులుగా చక్కగా విచ్చుకున్నాయి. కిలకిలారావాలు చేసే పక్షులు, తమ నిత్యకత్యాలలో మానవులు బయలు దేరారు. ఇంతమంది సాయంత్రం వరకు ఏవో చేస్తూనే ఉన్నారు. మళ్ళీ ఆయన వెళ్ళిపోయాడు. అందరూ వెళ్ళిపోయారు. ఇన్ని పనులు ఎవరు చేశారు? సూర్యుడే కదా! సూర్యుడే చేశాడా? అంటే..సూర్యుడు లేకపోతే ఇవన్నీ జరుగుతాయా? సూర్యుని ఉనికి చేత ఇవన్నీ జరుగుతున్నాయి కానీ సూర్యునికి ఏమీ లేవు. అమ్మవారు ఉనికి చైతన్యంగా ఉండడం చేత ఉపాధులన్నీ చైతన్యాన్ని పొంది పని చేస్తున్నాయి. ఈ ఉపాధుల పనులేవీ ఆవిడకి అంటడం లేదు. అందుకు 'నిష్క్రియా'.

'అశరీరం వా వసంతం న ప్రియాప్రియే స్పృశతే' (ఉపనిషద్వాక్యం) "శరీరత్రయ ప్రవిలాపం (జ్ఞానం చేత లయం) జరిగినవానికి విధి నిషేధాలు ఉండవు" జ్ఞానస్థితి ఇది. ఆ జ్ఞానమే శ్రీమాత. **"యథా సన్నిధిమాత్రేణ గంధః క్షోభాయ జాయతే. మనసో నోపకర్తృత్వాత్ తథాసౌ పరమేశ్వరః".** 'పరిమళ సన్నిధి చేతనే మనస్సు సంచరిస్తుంది. అలాగే భగవంతుని సన్నిధి చేత సృష్ట్యాదులు నడుస్తున్నాయి. ఆయన కర్తకాకున్నా" అని విష్ణుపురాణం.

183. నిష్పరిగ్రహా – శ్రీ నిష్పరిగ్రహాయై నమః

ఆవిడ ఏదీ స్వీకరించదు కనుక నిష్పరిగ్రహా. స్వీకరణ అనేది మనస్సుతో

పని. ఆలయంలో ఒక బంగారం కిరీటం ఉంటే వచ్చిన భక్తులలో ఎవడో ఒక దొంగ ఉంటాడు. వానికి అది చూస్తే తీసుకో బుద్ధి వేస్తుంది. అయితే తీసుకుంటే కొడతారనే భయంతో తీసుకోడు. కొంతమంది భయంతో దొంగలు కాకుండా ఉండిపోతారు. కొందరు భయం వదిలేస్తే దొంగలు అయిపోతారు. రెండూ ప్రమాదాలే కానీ మనస్సుతో అది కాని నా దగ్గరికి వస్తే బావుండునని అనుకునేవాడు కూడా దొంగే.

'మనసాభి గృహ్యాతే' – మనస్సుతో స్వీకరించినా దొంగయే అని చెప్పారు. 'అపరిగ్రహం' అంటే ఇది. 'నిష్పరిగ్రహా' అనే విషయంలో ఇప్పుడు పరిశీలించాలంటే ప్రపంచంలో తిరుగుతూ, అన్ని విషయాలు చూస్తున్నా, దేనినీ నాది అని లాక్కోకూడదు. అది సాధన చేయాలి. అలా లోపలకి లాగకుండా ఉండడం ఆత్మవస్తువు. లోపలికి లాక్కుంటే శరీర వస్తువు. నువ్వు శరీరానికి ప్రీతి కలిగించే వస్తువులను లాక్కుంటున్నావు. అవి ఆత్మకి సహకరించేవి కావు. లోక విషయములేవీ లోపలకి రానివ్వకపోవడమే 'నిష్పరిగ్రహా'. ఇది పరమార్థం.

17 దోషాలు పోగొట్టే అమ్మవారి నామాలు పూర్తి అయ్యాయి. ఇక్కడ నుండి మరో మంత్రవిద్య మొదలవుతోంది. ఇంతవరకు చెప్పుకున్న సారాంశాన్ని పరిశీలిస్తే అమ్మవారి యొక్క నిర్గుణబ్రహ్మ స్వరూపాన్ని చెప్పారు. దానికి మొదట్లో చెప్పిన సగుణబ్రహ్మానికి సంబంధం తెంచుకోకూడదు. లలితాసహస్రంలో ఒకదానికి మరియొక దానికి సంబంధం ఉంది. ఈ రెండూ ఆవిడే. ఇలాంటి అమ్మను ఉపాసన చెయ్యడం వల్ల వచ్చే ఫలం ఇక్కడ చెప్పారు. ఆ ఫలస్వరూపమైన రూపాన్నే మళ్ళీ అమ్మరూపంలో ఆవిష్కరిస్తున్నారు.

నీరాగా నుండి నిష్పరిగ్రహా వరకు 28 నామాలు. 17 నామాలు ముఖ్య ప్రాణ విద్య. 11 నామాలు దక్షిణామూర్తి మంత్రం. ఏకాదశ రుద్రమంత్రం ఇవన్నీ ఇప్పటి వరకు చెప్పుకున్న వాటిలో దాగి ఉన్న మంత్రాలు. 'నీరాగా రాగమథనీ' నుండి 'నిష్పరిగ్రహా' వరకు వేదాంతం అనిపించే వాటిలో ఈ మంత్ర సంకేతాలు పెట్టారు.

ముఖ్యప్రాణవిద్యకి 17 అక్షరాలు ఉంటాయి. ఈ 17 అక్షరాలు చెప్పడం కోసమే ఈ 17 నామాలు చెప్పారు. పదిహేడు దోషాలను పోగొట్టే శక్తి–రాగమథనీ, మదనాశినీ, మోహనాశినీ, మమతాహంత్రీ, పాపనాశినీ, క్రోధశమనీ, లోభనాశినీ, సంశయఘ్నీ, భవనాశినీ, భేదనాశినీ, మృత్యుమథనీ–ఈ నామాలకు ఉంది. ఈ పదకొండు నామాలు ఏకాదశ రుద్రవిద్య. ఏకాదశరుద్రుల ఏక స్వరూపం. అది జ్ఞానానికి పనికొచ్చినప్పుడు దక్షిణామూర్తి విద్య అవుతుంది. ఇప్పుడు దుర్గా విద్యలో ప్రవేశిస్తున్నాం.

184 – నిస్తులా నుండి 198 – సమానాధికవర్జితా

(నిస్తులా184 నీలచికురా185 నిరపాయా186 నిరత్యయా187 దుర్లభా188 దుర్గమా189 దుర్గా190 దుఃఖహన్త్రీ191 సుఖప్రదా192 దుష్టదూరా193 దురాచారశమనీ 194 దోషవర్జితా195 సర్వజ్ఞా196 సాన్ద్రకరుణా197 సమానాధికవర్జితా 198).

ఈ నామాలు భవానీవిద్యలో మరొక ఉపాసనావిధానం.

184. నిస్తులా – శ్రీ నిస్తులాయై నమః

సాటిలేనిది. తులా అంటే సాటి. ఒక దానికొకటి పోల్చి చూడడం. అమ్మవారితో పోల్చదగిన వస్తువు మరొకటి లేదు కనుక 'నిస్తులా'. అది వశిన్యాది వాగ్దేవతలకు బాగా తెలుసు. అందుకే పద్మాలులా పాదాలు ఉన్నాయి అనకుండా పద్మాలకంటే గొప్పగా ఉన్నాయి అన్నారు. అమ్మ సగుణము నిస్తులమే. నిర్గుణమూ నిస్తులమే. బ్రహ్మము వంటిది మరొక బ్రహ్మము లేదు కదా. అది ఏకం.

185. నీలచికురా – శ్రీ నీలచికురాయై నమః

మళ్ళీ ఆకారం దగ్గరికి వచ్చారు. ఆ దుర్గాంబా రూపం ఎలా ఉందీ అంటే 'నీలచికురా'. చికురా అంటే ముంగురులు. ఆ ముంగురులతో పాటు ఒత్తైన జుట్టు.

అది నీలం(నల్ల)గా ఉంది. నల్లని జుట్టు యౌవనానికి సంకేతం. అందుకు **'హరికేశాయ పుష్టాయ ఉపవీతినే'** అన్నారు. పుష్టిగా కలిగిన యౌవనానికి చెప్పినది 'హరికేశం'. అంటే పచ్చని జుట్టు. యౌవనంలో ఉన్న జుట్టును పచ్చని చెట్టులా పోల్చారు. శివుని యొక్క యౌవనరూపాన్ని 'హరికేశాయ' అని వర్ణించినట్లుగా ఇక్కడ అమ్మవారిని 'నీలచికురా' అని వర్ణించారు. అమ్మవారు ఎప్పుడూ పదహారేళ్ళ వయస్సులో ఉంటుంది కనుక 'నీలచికురా'. **'సదా షోడశవర్షం చ నవయౌవన దర్పితాం'** – మంచి యౌవనంతో ఉంటుంది. పదహారేళ్ళ వయస్సుతో ఉంటుంది కనుక ఎప్పుడూ ఆ నీలచికురాని ధ్యానం చేసుకోవాలి.

186. నిరపాయా – శ్రీ నిరపాయాయై నమః

ఏ అపాయము లేనిది. మనల్ని తొలగించే ఇబ్బంది పెట్టేదే అపాయం. అపాయాలు ఉపాధులకు వస్తాయి కానీ చైతన్యానికి కాదు. 1.విద్యాపాయం, 2.ధనాపాయం, 3.ఆరోగ్యాపాయం, 4.ప్రాణాపాయం అనేవి.

విద్యాపాయం – ఈవేళ మనకి విద్య ఉందని ఆనందించడానికి లేదు. ఇది తెలుసుకుంటే అహం పోతుంది. ఈవాళ గొప్పగా అర్థం చేసుకుని గుర్తు పెట్టుకోవచ్చు. ఒక స్థితిలో ఏం గుర్తుకు రావు. ఏమైపోతుంది అదంతా! గుర్తు చేసింది ఎవరు? గుర్తు తీసింది ఎవరు? మహాత్ములకి కూడా ఒక దశకి వచ్చేటప్పటికి ఏమీ గుర్తు లేకుండా ఉండిపోవచ్చు. మరి ఇది అంతా వ్యర్థమేనా! వాసనా రూపంలో మిగులుంటుందంతే.... ఏవీ మనవి కావు. పూర్ణంగా లేకపోతే ఒక అపాయం, రేపో–మాపో పోతుందనే మరొక అపాయం. ఇవి ప్రతిదానికి ఉంటాయి. ధనం ఉన్నా సరిగా లేదనే బాధ. లేనప్పుడు ఒక అపాయం, ఉన్నప్పుడు మరొక అపాయం. ఆ అపాయాలు ఆవిడకు లేవు.

ధనాపాయ, విద్యాపాయ, ఆరోగ్యాపాయ, ప్రాణాపాయములు ఆవిడకు లేవు. ఇక్కడ మరొక అర్థం ఏమిటంటే– ఈ అపాయాలు లలితాంబకు లేకపోవడమే కాక– ఆవిడని ఆశ్రయించిన వారికి కూడా అపాయాలు లేకుండా చేస్తుంది.

నన్ను చూసి ఎవడు ఏది గొప్ప అంటున్నాడో అది అంతా నువ్వే. నేను ఏం కాదు- ఇదీ ఆశ్రయం. ఇలా ఎప్పుడైతే నీకు అనిపించిన ప్రతి గొప్పతనం ఆమెయే అని పట్టుకున్నావో అదే ఆశ్రయం. నాది అంటేనే తరుగుదల, ఆవిడదంటే తరగని గని.

నదిని ఆశ్రయించిన కుండకి ఎప్పుడూ నిండుతనమే. అమ్మవారిని ఆశ్రయించిన వారికి ఎప్పుడూ నిండుతనమే. వారికి ధనమూ పోదు, విద్యా పోదు. అన్నీ ఆవిడే చూసుకుంటుంది. ఒకవేళ తీసిందా – నీకు అవసరం లేదని తీసేస్తుంది... అంతే. కొన్ని లేకపోతే భక్తుడు-'నాకు ఇంక అక్కర్లేదని తీసేసింది' 'ఇంతవరకూ కావాలని ఉంచింది' అనుకుంటాడు. అందుకే మాత అనే శబ్దానికి పుంలింగంలో 'కొలుచునది' అని అర్థం.

187. నిరత్యయా – శ్రీ నిరత్యయాయై నమః

అత్యయ శబ్దానికి ఎన్నో అర్థాలున్నాయి. అవి-'**అతిక్రమే దండే వినాశే దోషకృచ్ఛ్రయోః**'- ఇవి నానార్థాలు. అతిక్రమే-దాటుట. దండే-శిక్షించుట, వినాశే-నశించుట, దోషము, కష్టం. కృచ్ఛ్రః-అతి కష్టం. ఇవి అన్నీ కలుపుకుని అత్యయము అని పేరు. అతిక్రమించుట, దండించబడుట, శిక్షింపబడుట, నాశనము, దోషము, కష్టము-ఇవేవీ లేని తల్లి-నిరత్యయా. ఆ తల్లి అధీనంలోనే అందరూ ఉంటారు. ఆవిడ కన్ను నుండి ఎవరూ దాటలేరు. ఆ చూపులో అంత జాగ్రత్త ఉంటుంది.

సృష్టిలో ఎన్ని తత్త్వములైనా అమ్మ క్రిందే. అమ్మను దాటి మరో తత్త్వం లేదు కనుక 'నిరత్యయా'. అంతే కాదు ఆవిడని ఎవరూ దండించలేరు, నాశనం కలిగించలేరు.

188. దుర్లభా – శ్రీ దుర్లభాయై నమః

దుర్లభా అంటే 'దొరకనిది' అనకూడదు. కష్టపడితే కానీ దొరకనిది. తేలికగా సాధ్యం కానిది. 'అలభా' అనలేదు 'దుర్లభా' అన్నారు. అమ్మవారు అత్యంత దుర్లభం.

అంత తేలిక కాదు. ఆత్మతత్త్వం పొందడం అత్యంత కష్టం. కష్టపడితే దానిని పొందవచ్చును. అదే సాధన. ఆ సాధన చెయ్యకపోతే అమ్మవారు దొరకదు. కేవలం ఆ సాధకుల పూజయే స్పష్టమైన పూజ. అలాంటి స్థితిలేనివారి పూజ అస్పష్టపూజ. సాధనలోకి వెళ్ళాలి. జ్ఞానంతో పూజించాలి. అదే 'జ్ఞాత్వా కుర్వీత కర్మాణి' తెలుసుకొని చేయాలి. కష్టం కావచ్చు. కష్టం కనుకనే సాధన చెయ్యి. ఉదాహరణకు హిమవత్పర్వతం ఎక్కడం కష్టం. అందుకే సాధన.

'ఊరకే దొరకునా ఉన్నతోన్నత సుఖము?' – అన్నమయ్య మాట. గొప్ప వస్తువు తేలికగా దొరుకుతుందనుకున్నారా? గొప్ప వస్తువుకు కష్టపడాల్సిందే. అంతర ఇంద్రియాలు, బాహ్యేంద్రియాలు నియంత్రించాలి. మాట మాటకి శ్రవణం, నిధి ధ్యాసనము చేయాలి. అందుకే 'తపసా' అని ఉపనిషత్తు చెప్తోంది. తపస్సుతో, జ్ఞానముతో నిగ్రహింపబడిన మనస్సుతో దొరకునది. **'అసంశయం మహాబాహో మనోదుర్నిగ్రహం చలం'**–మహా కష్టమయ్యా అని అర్జునుడు చేతులెత్తేశాడు. **'అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేన చ గృహ్యతే'**. ఆ అభ్యాస, వైరాగ్యాలు చెయ్యమన్నాడు జగద్గురువు. ఆ రెండింటికి మాత్రమే దొరుకుతుంది. అది విడిచిపెట్టి కబుర్లు చెప్తే అమ్మవారు దొరకదు. **'నాయమాత్మా ప్రవచనేన లభ్యః' 'నాయమాత్మా బలహీనేన లభ్యః'** – అని ఉపనిషత్తు చెప్తోంది.

189. దుర్గమా – శ్రీ దుర్గమాయై నమః

పొందడమే కాదు – అందడం, తెలియడం కూడా కష్టమే. చెప్తూ ఉన్నా అవగాహన మహాకష్టం. పరతత్త్వం అందినట్లే ఉంటూ జారిపోతూ ఉంటుంది. దుర్గమా– ఎంత దుర్గమమంటే మనకి ఏది చెప్పినా గ్రహించడానికి భగవంతుడు రెండు పరికరాలు ఇచ్చాడు. ఒకటి– మాట, రెండు– మనస్సు. చెప్పేవాడు మాటతో చెప్తాడు. వినేవారు మనస్సుతో ఊహిస్తారు. ఇలా ఏదైనా తెలిసిన రూపాన్ని చెబుతూ ఉంటే పట్టేసుకోవచ్చు. కానీ ఆకారం లేనిది, ఉపాధి లేనిది, సర్వవ్యాపకమైనది, పాపం లేనిది అని చెప్తూ ఉంటే అది మనస్సుతోనే అందదు. ఎందుకంటే మనస్సుకు

ఏది ఉపాధో అదే అలవాటు అయిపోయింది కనుక ఏది చెప్పినా ఉపాధితో చెప్పాలి. ఆ అతీతతత్త్వం మనస్సుకు, మాటకి దొరకదు. కనుకనే 'దుర్గమా' అనే మాట. సరిగ్గా ఈ మాటకి ఉపనిషద్వాక్యం–**'యన్మనసా న మనుతే', 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ'** – మనస్సుకి, మాటకి అందనిదే పరమాత్మ. 'దుర్లభా, దుర్గమా' – అంత తేలికగా దొరకదు. అంత తేలికగా అంతుపట్టదు.

ఈ రెండు నామాలకి అర్థాలను కలిపి ఒక నామం చెప్పబడుతున్నది. దుర్లభా, దుర్గమా అన్నది నిర్వచనం అయితే, వాటికి ప్రధాన నామం–'దుర్గా'.

190. దుర్గా – శ్రీ దుర్గాయై నమః

దుర్గా నామానికి అనేక అర్థాలు ఉన్నాయి.

ముందుగా పరమార్థదృష్టితో చూస్తే– ఏది దుర్లభమో, ఏది దుర్గమమో ఆ పరతత్త్వమే దుర్గ. పరతత్త్వస్వరూపం, పరబ్రహ్మస్వరూపం

అంతే కాక దుర్గతులను తొలగించునది. దుర్గతులు అంటే చాలా ఉన్నాయి. దాని ముందు అందరికీ తేలికైన ఒక అర్థం తెలుసుకోవాలి. 'దుః' అనే శబ్దంతో చెప్పబడేవి ఏమున్నాయో వాటన్నిటిని తీసిపారేస్తుంది. దుఃఖం, దుష్టత్వం, దుర్మార్గం, దురాచారం, దురితం, దుస్సాధ్యం – ఇలా చాలా ఉన్నాయి.

మార్గం అంతా ఎప్పుడైనా దుర్గమము, దుర్లభముగా ఉంటే 'దుర్గా' అనుకోవాలి. అప్పుడు ఆ దుర్గమ్మ చక్కగా మార్గం వేస్తుంది.

ఆలోచనలు మొదలు పెట్టినపుడు ఏ ఆలోచనా అందనప్పుడు, 'దుర్గా' అని పలికితే చిక్కుముడి విప్పేస్తుంది. దుః అని చెప్పబడే వాటి అన్నింటిని అనగా దుర్లభమైన, దుర్గమమైన, దుస్సాధ్యమైన వాటిని, సులభం, సుగమం, సుసాధ్యం చేసి దుఃఖాన్ని, దుష్టత్వాన్ని, దురితాన్ని, దుర్మార్గాన్ని, దురాచారాన్ని తొలగించే తల్లి కనుక 'దుర్గా'.

అందుకే సప్తశతిలో–

దుర్గే స్మృతా హరసి భీతిమశేషజంతోః
స్వస్థైః స్మృతామతిమతీవ శుభాం దదాసి
దారిద్ర్యదుఃఖభయహారిణి కా త్వదన్యా
సర్వోపకారకరణాయ సదార్ద్రచిత్తా

దుర్గా నామానికి ఉన్న శక్తి ఎంతటిదో 'దేవీమాహాత్మ్యం'లో చెప్పారు. **'అరణ్యే రణే దారుణే శత్రుమధ్యే.'** ఎలాంటి దుర్గమమైన అరణ్యంలో చిక్కుకుపోయినా, చుట్టూ శత్రువులు ఆక్రమించి ఒక్కడివైపోయినప్పుడు ఒక్కసారి 'దుర్గమ్మా!' అని శరణు వేడితే వెంటనే ఆ తల్లి వస్తుంది. మనలను రక్షిస్తుంది. దీనికి దేవీభాగవతంలో ఆ తల్లి ఒక భక్తుని యుద్ధంలో రక్షించిన అద్భుతమైన కథ చెప్పారు. ఆ యుద్ధంలోనే కాదు. బ్రతుకే ఒక యుద్ధం. ఏ యుద్ధంలోనైనా చుట్టూ ప్రతికూల శక్తులను ఎదుర్కొనే శక్తి నీకు ఇస్తుంది. మనలో ఉన్న దుష్టత్వాన్ని, బయట ఉన్న దుష్టత్వాన్ని, దురాచారాన్ని తొలగించగలిగే దుర్గా అనే నామం ఒక్కటి చాలదా మనకి, అందుకే-

సర్వస్వరూపే సర్వేశే సర్వశక్తి సమన్వితే
భయేభ్యః త్రాహినో దేవి! దుర్గే! దేవి! నమోస్తుతే

ఇప్పుడు దుర్గా తత్త్వానికి, 'నిరత్యయా'కి ఉన్న సంబంధం గ్రహించగలం. ఆ తల్లిని ఎవ్వరూ దాటలేరు. దేని నుంచైనా ఆ తల్లి దాటించగలదు. అందుకే **'నమస్తే జగత్తారిణి త్రాహి దుర్గే'**.

దుర్గా విద్య, దుర్గా మంత్ర విశేషాలన్నీ ఇక్కడ చూపిస్తున్నారు. 'దుర్లభా దుర్గమా దుర్గా' - ఈ అర్థాన్ని అలాగే గుర్తు పెట్టుకోవాలి. **'దైత్యే మహావిఘ్నే భవబంధే కుకర్మణి శోకే దుఃఖేచ నరకే యమదండేచ జన్మని మహాభయేచ రోగే'** - ఇవి దుర్గతులు. రాక్షసులు, విఘ్నములు, సంసార బంధము, కుకర్మ-చెడ్డ పనుల వల్ల కలిగే ఫలితాలు, శోకము, దుఃఖము, నరకము, యమదండన, జన్మ పరంపర, భయములు, రోగములు - ఈ పదకొండు 'దుః'. వీటి అన్నింటిని తొలగించేది దుర్గ.

'దుర్గాం దేవీం శరణమహం ప్రపద్యే' అని వేదంలో అమ్మవారిని ఈ పేర్లతో సూచించారు.

మరొక్క అర్థం **'ఆశ్రయశక్తి'**. ఆశ్రయించవలసిన శక్తి. ఆశ్రయమై ఉన్న శక్తి.

అంతే కాక దుర్గా అంటే ఏమిటో మొదటి రెండు నామాలైన 'దుర్లభా', 'దుర్గమా'లలో చూపించారు.

నిజానికి ఈ వాక్యంలో పరిశీలించినట్లయితే 'దుర్లభా, దుర్గమా, దుర్గా, దుఃఖహన్త్రీ, సుఖప్రదా, దుష్టదూరా, దురాచారశమనీ, దోషవర్జితా' అన్నప్పుడు దుర్గామంత్రంలో ప్రధానంగా చెప్పబడే "దుం" బీజం వరుసగా వస్తుంది. ఈ నామాలని మనం ఆవృతి చేసుకొంటే దుర్గామంత్రం జపం చేసినట్లే అవుతుంది. వీటిలో దుర్గ అంటే ఏమిటో నిర్వచనం చూపించారు. ఆ దుర్గాదేవిని ఉపాసిస్తే ఏం జరుగుతుందో తరువాత రెండు నామాలలో చెప్తున్నారు. దుర్గా అనే మధ్యనామం తీసుకొని అటు రెండు, ఇటు రెండు మనం పరిశీలిస్తే మొదటి రెండూ నిర్వచనం, మిగిలిన రెండూ ఉపాసనాఫలం. నిర్వచనం–'దుర్లభా', 'దుర్గమా'.

ముందు పరబ్రహ్మగానే నిర్వచనం చెప్పుకోవాలి కనుక 'దుర్లభము', 'దుర్గమము' అయిన పరతత్త్వమే దుర్గ. అటువంటి దుర్గాదేవి ఉపాసన వల్ల ఫలమేమిటి అంటే–'దుఃఖహన్త్రీ', 'సుఖప్రదా'.

ఇలా ఆవిష్కరిస్తూ ఇంకా దుర్గాతత్త్వాన్ని తరువాత నామాల్లో కూడా చెప్పబోతున్నారు. దుర్గా అనే నామానికి చెప్పుకున్న అర్థాలు మననం చేసుకుంటే ఏది ఉపనిషత్తుల్లో చెప్పబడుతూ, యోగులకు అతిప్రయాసతో తెలియబడేది ఉందో ఆ తత్త్వమే దుర్గ అని అర్థమవుతుంది. వేదాంతమునందు ఈ తల్లి బ్రహ్మజ్ఞానం. వేదముల యందు ఈ తల్లి యజ్ఞఫలప్రదాయినీ. వేదం రెండు భాగాలు. కర్మకాండ, జ్ఞానకాండ. కర్మకాండలో యజ్ఞఫలప్రదాయినిగా, యజ్ఞస్వరూపిణిగా ఉంది. జ్ఞానకాండలో ఈ తల్లి బ్రహ్మవిద్యారూపిణిగా ఉన్నది. కర్మకాండలో ఎక్కడ కనబడుతున్నదంటే దుర్గాసూక్తంలో చెప్పబడిందే ప్రమాణం. 'కర్మఫలేషుజుష్టాం'–

కర్మఫలముల యందు ఆరాధింపబడుతున్నది. యజ్ఞం అగ్నిహోత్రునియందు చేస్తారు. **'అగ్ని ముఖావై దేవాః'** ఏ దేవత రావాలన్నా అగ్నిముఖం నుంచే రావాలి. 'జాతవేదసేసునవా' అన్నా, 'జాతవేదో మమావహ' అన్నా, శ్రీసూక్తంలో చెప్పినా, దుర్గాసూక్తంలో చెప్పినా జాతవేదుడే. జాతవేదుడంటే అగ్నిహోత్రుడు(యజ్ఞాగ్ని). అంతే కాక వేదముల నుండి కలిగినవాడని ఒక అర్థం కూడా ఉంది. నిజానికి వేదములు పరమేశ్వరుని నుండి కలిగాయి. పరమేశ్వరుడే జాతవేదుడు. వేదము వలన కలిగినవాడు (లభ్యమైనవాడు) కూడా అతనే.

మనం అగ్నిహోత్రంలో ఆరాధన చేస్తున్నాం అంటే మనం రగిల్చిన నిప్పు కాదు అక్కడ చెప్పబడుతున్నది. అంతవరకు అది నిప్పే కావచ్చు. కానీ మంత్రసంస్కారం చేత పరమేశ్వర స్వరూపాన్ని పొందింది. **'రుద్రో యేషయదగ్నిః'** అని మళ్ళీ శాస్త్రమే చెప్తున్నది. రుద్రస్వరూపమే అగ్ని. హవిస్సులను ఆహరిస్తుంది కనుక ఆ అగ్నికే హరి అని పేరు. హరి అన్నా, హరుడన్నా అగ్నిహోత్రమే. అందుకే భారతీయ సంస్కృతిలో పరమేశ్వరుని ఏ దేవతా రూపంగా ఆరాధించాలన్నా మాధ్యమం మాత్రం అగ్నే. దేవతలు కూడా పరమేశ్వరినిగాని, పరమేశ్వరునిగాని ఆరాధించాలంటే 'వహ్ని పురోగమాస్తే' – అగ్నిదేవుని ముందు పెట్టుకుని వెళ్తూ ఉంటారు. అగ్ని వారికి నాయకుడు.

'అగ్రే నియతి ఇతి అగ్నిః' కనుక అగ్ని శబ్దం పరమేశ్వరునికి వర్తిస్తున్నది. 'అగ్ని ముఖావై దేవాః' అని సర్వదేవతలను అగ్ని ద్వారానే సంతృప్తి పరుస్తున్నాం. ఈ తల్లి ఉద్భవించినదే మహాయాగం యొక్క అగ్నిలోంచే కదా! కనుక జాతవేదసే.. ఏ దేవతా స్వరూపమైనా దాని నుండి ఆవిష్కరించుకోవాలి. ఆ అగ్నినే స్త్రీ రూపమైన లక్ష్మీగా రమ్మని శ్రీసూక్తంతో పిలుస్తారు. దుర్గా రూపంగా అనుగ్రహించాలని దుర్గాసూక్తంతో పిలుస్తారు. కనుక ఈ అగ్ని పరమేశ్వర స్వరూపమే. ఆ పరమేశ్వర స్వరూపమే దుర్గగా అనుగ్రహిస్తుంది. ఆయన శక్తినే మనం ఇక్కడ దుర్గగా అనుగ్రహించమని ప్రార్థిస్తున్నాం. 'జాతవేదసేసునవా' అన్నప్పుడు ఆ పరమేశ్వరుని మనం ప్రార్థిస్తూ, 'నీ శక్తి దుర్గగా మమ్మల్ని అనుగ్రహించాలి' అని ఆ మంత్రం

నుండి ప్రారంభించి అగ్నిస్వరూపాన్ని దుర్గగా పిలుచుకొని వెళ్తున్నాం. నిజానికి అసలైన అగ్ని–**'అంతర్నిరంతరమనింధన మేధమానే' 'మోహాంధకార పరిపంథిని సంవిదగ్నౌ'** ముందు నామాలలో తెలియజేసిన అర్థం. ఆ లోపల జ్వలించే జ్ఞాన రూపమైన చిదగ్నియే మనకు దుర్గగా అనుగ్రహించాలి. మనలో ప్రకాశించే చిదగ్నినే ప్రార్థన చేస్తున్నాం. దుర్గ యొక్క తత్త్వం చాలా విశిష్టమైనది. ఎంత విస్తారంగా ఉందంటే ఆ తల్లి వేదభాగముల యందు దుర్గగా చెప్పబడుతూ **'దుర్గాం దేవీగ్ం శరణమహం ప్రపద్యే సుతరసితరసే నమః'** అని కీర్తింపబడుతున్నది. **'తాం అగ్నివర్ణాం తపసా జ్వలంతీమ్'** – ఆ అగ్ని యందే ఆ తల్లి జ్ఞానస్వరూపిణిగా ప్రకాశిస్తూ గోచరిస్తున్నది అని అక్కడ మనం నమస్కారం చేసుకొని అటువంటి దుర్గని శరణు వేడుతున్నాం.

చిత్రమేమిటంటే వేదంగాని, ఉపనిషత్తు గాని 'శరణు వేడుతున్నాం' అనే మాట అమ్మవారి దగ్గరే ఎక్కువగా చెప్పింది. శరణ్యే–దుర్గాదేవంటేనే శరణ్యశక్తి. ఆశ్రయశక్తి. దుర్గము అంటే మనకి లోకంలో కోట అని వ్యవహారం ఉంది. కోటలోకి చేరిపోయాక చాలా భద్రత ఉంటుంది. శత్రువులకు 'దుర్భేద్యం'. ఆ తల్లి ఎవరినైనా ఎదుర్కొనగలదు కానీ ఆ తల్లిని ఏ ఒక్కరు ఎదుర్కొనలేరు. కోటని చేరితే ఎంత క్షేమం లభిస్తున్నదో, దుర్గమ్మని ఆశ్రయిస్తే అంత క్షేమం లభిస్తున్నది. అందుకు దుర్గ అంటే పైన మనం చెప్పుకున్న చివర అర్థం 'ఆశ్రయశక్తి'.

బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే
వాసుదేవః సర్వమితి స మహాత్మా 'సుదుర్లభః'

ఆ సర్వవ్యాపకమైన బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోవడం అత్యంత కష్టం. 'సుదుర్లభః' అని గీతలో చెప్పిన వాక్యమే ఇక్కడ 'దుర్లభా'. అటువంటి దుర్లభమైన, దుర్గమమైన పరతత్త్వం దుర్గ.

దుర్గముడు అనే రాక్షసుని ఈవిడ సంహరించింది. ఆ సంహరించినప్పుడే అమ్మవారు శతాక్షీ, శాకంభరిగా వచ్చిందని దేవీభాగవతం వివరించింది. ఆ దుర్గముడు అనే రాక్షసుని సంహరించడంచేతే దుర్గాదేవి అయ్యిందని దేవీభాగవతం, దేవీమాహాత్మ్యం తెలియజేస్తున్నాయి.

తదైవ చ వధిష్యామి దుర్గమాఖ్యం మహాసురం
దుర్గాదేవీతి విఖ్యాతం తన్మే నామ భవిష్యతి
తాం దుర్గాం దుర్గమాం దేవీం దురాచార విఘాతినీం
నమామి భవభీతోహం సంసారార్ణవతారిణీం

అని మనకి ఉపనిషత్తుల్లో చెప్తున్న మంత్రం. 'తాం దుర్గాం దుర్గమాం దేవీం దురాచార విఘాతినీమ్' - ఇది వేదంలో భాగం. ఆ భాగం యధాతథంగా ఇక్కడికి తీసుకురాబడినది. లలితాసహస్రం చదువుతుంటే వేదాలు, ఉపనిషత్తులు అన్నీ కలిసిపోయి వస్తుంటాయి. 'నమామి భవభీతోహం సంసారార్ణవ తారిణీం' - ఆ తల్లి సంసార సముద్రం నుండి దాటిస్తుంది. భవభీతుడను అయిన నేను అమ్మని శరణు వేడుతున్నాను. సంసార సముద్రం నుండి అంత గొప్పగా ఎవరూ దాటించలేరు. కొంతమంది, "సగం వరకూ నేను దాటిస్తాను, అక్కడ నుండి ఇంకెవరైనా వస్తారు, అక్కడ నుండి తీసుకువెళ్తారు" అనవచ్చు. కానీ ఈవిడ దాటిస్తే 'సుతరసి తరసే నమః' సంపూర్ణముగా దాటించేస్తుంది. **'నమః ప్రతరణాయచ ఉత్తరణాయచ'**- ఆ దాటించడం ఒక ఉత్తమ స్థితి నుండి మరొక ఉత్తమస్థితికి తీసుకువెళ్ళడం (ప్రతరణ). 'ఉత్తరణం' అంటే మరల వెనక్కి రావలసిన అవసరం లేకుండా మోక్షాన్ని ఇవ్వడం. దుర్గమ్మ యొక్క అనుగ్రహం ఆ తారిణీశక్తి ద్వారా మనం తెలుసుకుంటున్నాం. **'యస్యాః పరతరం నాస్తి సైషా దుర్గా ప్రకీర్తితా'** - ఇది కూడా అమ్మవారి అథర్వశీర్ష వాక్యంలో మనకు కనబడుతున్నది. ఎవరికి మించిన పరతత్త్వం మరొకటి లేదో ఆవిడ 'దుర్గ'.

ధీ బలాది భయే దుర్గే తారితా రిపుసంకటే
దేవాః శక్రాదయో యేన తేన దుర్గా ప్రకీర్తితా

బుద్ధిబలం, దేహబలం, ఆయుధబలం, సైన్యబలం వంటి బలాలతో శత్రువులు దేవతలకు భయం కలిగించినప్పుడు - ఆ భయాలను తొలగించి కాచినది దుర్గ అని కూడా వివరిస్తున్నారు. నిజానికి ఈ బాధలనుండి మనలనే కాక దేవతలను కూడా బయటపెట్టగలదు. ఆపదలను తొలగించే శక్తి.

191. దుఃఖహన్త్రీ - శ్రీ దుఃఖహన్త్ర్యై నమః,

192. సుఖప్రదా - శ్రీ సుఖప్రదాయై నమః

అమ్మవారి ఆరాధన మనకు ఇచ్చే ఫలితం– దుఃఖహన్త్రీ, సుఖప్రదా. దుఃఖం, సుఖం అంటే ఏమిటో తెలుసుకోవాలి. 'ఖం' అనే శబ్దానికి అనేక అర్థాలు: ఇంద్రియాలు, ఆకాశం, అనుభవం. భరించలేని అనుభవం అయితే దుఃఖం. హాయి అయిన అనుభవం అయితే సుఖం.

ఏ దుఃఖం తొలగితే మరి దుఃఖం రాదో దానిని తొలగించగలిగే శక్తి. 'అత్యంతిక దుఃఖం' అని ఒకటి ఉంది. ఈ అత్యంతిక దుఃఖ నాశనం చెయ్యగలిగేది 'దుఃఖహన్త్రీ' అన్నారు. అత్యంతిక దుఃఖం గురించి ఉపనిషత్తులు ప్రతిపాదిస్తున్నాయి. **'తదత్యంత విమోకోஉ పవర్గః'** అని గౌతమ మహర్షి అపవర్గం(మోక్షం) అంటే ఏమిటో చక్కగా చెప్తూ 'అత్యంతిక విమోకః' అన్నాడు. విమోకః అంటే విడుదల. అత్యంత విమోకః – ఏ విముక్తి దొరికితే మరి ఏ విముక్తి అక్కర్లేదో అదే మోక్షం.

అత్యంతిక దుఃఖనాశనం అంటే మోక్షం అని అర్థం. అది దొరికే వరకు ఏవో ఒక దుఃఖాలు ఉంటూనే ఉంటాయి. సంసారం ఒక పెద్ద దుఃఖం. దాంట్లో ఇవన్నీ చిన్న చిన్న దుఃఖాలు. మనకి 'గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏరుకోవడం' అనే సామెత ఉంది. అలాగే మనం ఉన్నదే దుఃఖసంసారం. ఒక దుఃఖం తీస్తాం, ఇంకొక దుఃఖం తీస్తాం – ఎన్నని తీస్తాం? అయితే మనకు దుఃఖోపశమనం కలిగినప్పుడు ఒక ఆనందం కలుగుతుంది. కానీ ఈ దుఃఖోపశమనం ఎలాంటిది అంటే రెండు కొరడా దెబ్బల మధ్య ఉన్న విరామం వంటిది. 'ఈ ఉపాధి తాదాత్మ్యం అనే అజ్ఞానం పోతే అసలైన మోక్షం' అనేదే అసలైన దుఃఖనాశనం.

ఆ మోక్షమే అసలైన సుఖం. ఆ సుఖం కలిగిస్తోంది కనుక 'సుఖప్రదా'. 'దుఃఖహన్త్రీ' 'సుఖప్రదా'. ప్రాథమిక స్థాయిలో చెప్పినప్పుడు దుఃఖం తొలగిస్తుంది, సుఖం కలిగిస్తుంది అంటే చాలు. అప్పటికి అదే అర్థం. అది కాదని కాదు. దాని పైన కూడా ఉన్నదని చెప్పడం. మోక్షరూపమైన **'భూమా'** అనబడే బ్రహ్మానంద సుఖమును ఇస్తున్నది. ఆత్మజ్ఞానమనే సుఖమును ఇస్తున్నది.

సుఖము రెండు విధాలు: విషయసుఖము, పరమ సుఖము. లోకాల్లో ఉన్న విషయాలతో మనం పొందే సుఖాలన్నీ విషయ సుఖాలు. లోకయాత్రకి ఇవన్నీ అవసరమే కనుక ఇవీ ఇస్తున్నది ఆ తల్లి, పరమ సుఖమైన మోక్షాన్ని కూడా ఇస్తున్నది. అందుకే 'దుఃఖహన్త్రీ సుఖప్రదా' అనేది అత్యంత అద్భుతమైనది. ఉపనిషత్ చెప్తోంది **'దుఃఖే నాత్యంతశ్చరతి'** అని 'దుఃఖం యొక్క సంపూర్ణ నాశనమే మోక్షం' అది కలిగించే తల్లి. నిజానికి పరతత్త్వం పొందినపుడే సుఖం. విషయాలు ఏవి పొందినా కలిగే సుఖములు భ్రాంతి సుఖాలే. ఇవి అన్నీ భ్రమానందాలే. బ్రహ్మానందం అనేది ఉత్కృష్టమైనది. దాని గురించే చెప్తూ **'రసగ్గ్ హ్యేవాయం లబ్ధ్వా ఆనందీ భవతి'** అని 'ఏ రసమును పొందితే ఆనందము అనుభవిస్తామో ఆ ఆనందము' **'పరమః పరార్ధ్యః'** దానిని మించినది లేదు- అని ఉపనిషత్ ప్రస్తావన. ఆ **'ఆనందీ భవతి'** అనే మాటే 'సుఖప్రదా' అనే మాటలో మనం తెలుసుకోవలసినది.

అయితే ఇలాంటి పరతత్త్వం అందరికీ దొరుకుతుందా?

193. దుష్టదూరా - శ్రీ దుష్టదూరాయై నమః

194. దురాచారశమనీ - శ్రీ దురాచారశమన్యై నమః

'దుష్టదూరా - దురాచారశమనీ-దోషవర్జితా' విభాగం జాగ్రత్తగా చూసుకుని పలకాలి. ఒకొక్కసారి ఒకొక్క పాదంలో ఐదు నామాలు ఉంటాయి. మొదటిపాదంలో ఐదు నామాలు ఉన్నాయి. 'దుర్లభా దుర్గమా దుర్గా దుఃఖహన్త్రీ సుఖప్రదా' ఈ పాదంలో మూడు నామాలు 'దుష్టదూరా-దురాచారశమనీ-దోషవర్జితా'. ఇది కూడా దుర్గా తత్త్వమే. దుర్గమ్మను అర్థం చేసుకోవాలి.

దుష్టులకు దూరంగా ఉంటుంది. అమ్మవారు నిజానికి దూరంగా ఉంటారా! సర్వవ్యాపకమైన తత్త్వం అలా దూరంగా ఉండడమేమిటి? ఎంత దగ్గరగా ఉందంటే మన దేహం కంటే దగ్గరగా ఉందిట పరతత్త్వం. ఆత్మవస్తువై యున్నది. నేను అనబడే చైతన్యమే ఆవిడ. అంత దగ్గరగా ఉన్న తత్త్వం దూరమని ఎలా అంటే, ఎవరైతే అంతర్ముఖులు అవుతారో వారికి అత్యంత సన్నిహితం, ఎవరైతే బహిర్ముఖులు

అవుతారో వారికి మరీ దూరం.

'బహిర్ముఖత్వమే దుష్టత్వం'. ఎంతవరకు బహిర్ముఖ ప్రాపంచిక విషయములే సత్యమని తిరుగుతుంటారో అంతవరకు దుష్టత్వమే. పరమాత్మ తత్త్వం **'దూరస్థః'.** ఎవరికంటే... **'కర్మవిక్షిప్త చేతసాం'** అన్నారు భాగవతంలో. కర్మలంపటాలలో మునిగిన వారికి ఆ తత్త్వం అత్యంతదూరం. కానీ అది **'హృదిస్థః'** – హృదయంలోనే ఉంది. ఈ మాటే **'తద్దూరే తద్వంతికే తదేజతి తన్నైజతి'** అనే మంత్రంలో ఈశావాస్యోపనిషత్ తెలియజేస్తోంది. 'అతి దగ్గరగా ఉన్నది అదే.. అతి దూరంగా ఉన్నది అదే'. ఆ విషయం ఇక్కడ వివరిస్తున్నారు.

దుష్టదూరా – దుష్టులకు దూరముగా ఉండునది. ఇదే విషయం దేవీభాగవతంలో చక్కగా ఇది అర్థం అయ్యేవిధంగా తెలియజేశారు. **"న భజంతి కుతర్కజ్ఞాః దేవీం విశ్వేశ్వరీం శివామ్"** అన్నారు. కుతర్కజ్ఞులు విశ్వేశ్వరి అయిన దేవిని భజించరు, ఆశ్రయించరు. తర్కం కుతర్కం అయితే ప్రమాదం. పక్వం కాని బుద్ధికి తర్కం చేయడం మాత్రం తెలుస్తుందా! కనుక తర్కబుద్ధి చాలా అవసరం. కుతర్కం మాత్రం పనికిరాదు.

శంకరభగవత్పాదులవారు శాస్త్రవ్యాఖ్యానం చేస్తూ, "యుక్తితో తెలుసుకో" అన్నారు. యుక్తి అంటే ఏమిటో కూడా తెలుసుకోవాలి. శాస్త్రప్రమాణంతో తర్కం చెయ్యమని "శ్రుతిమతః తర్కోను సంధీయతాం" అని సాధనాపంచకంలో చెప్పారు కదా జగద్గురువులు. అలాంటి శ్రుతిమతమైన తర్కం చాలా అవసరం. కేవల తర్కానికి పరమాత్మ దొరకదు. 'వాదో నావలంబ్యః' అని భక్తి సూత్రాలలో నారదులవారే చెప్పారు. వాదాలకి, తర్కాలకి పరమాత్మ దొరకదు.

కుతర్కం చేస్తున్నంతకాలం పరమేశ్వరుని గ్రహించలేము. అందుకు కుతర్కజ్ఞులకు దూరంగా ఉండునది. వాళ్ళు ఆశ్రయించలేరు. అత్యంత సమీపంగా ఉన్నదానిని కుతర్కం వల్ల పట్టుకోలేకపోతున్నాం. ఈ మాటల్లోనే మనకి అర్థం చెప్తూనే సాధకుడు ఎలా ఉండాలో చెప్తున్నారు.

'శాస్త్రవిరుద్ధ ఆచారం శమయతీతి దురాచారశమనీ' అన్నారు. ఏది మంచో,

ఏది చెడో నువ్వు నిర్ణయించగలవా! శాస్త్రం చెప్పాలి. శాస్త్రవిరుద్ధమైన ఆచారం దురాచారం. దాని యొక్క ప్రభావాన్ని తొలగించేది కనుక దురాచారశమనీ. ఇది కూడా దుర్గా ఉపాసన ఫలమే. 'దుఃఖహన్త్రీ–సుఖప్రదా–దురాచారశమనీ'.

195. దోషవర్జితా - శ్రీ దోషవర్జితాయై నమః

దుష్టత్వములన్నీ తొలగించే ఆ తల్లికి దోషం లేదు. దోషాలు ఎన్ని రకాలో ముందు నామాలలో చెప్పుకోవడమయింది. అవి రాగము మొదలుకొని సంశయం ఇత్యాది మొత్తం 17 దోషాలు. ఆవిడ 17 దోషాలు లేని తల్లి కనుక 'దోషవర్జితా'. అంతేకాదు ప్రతి ఉపాధికి దోషాలు ఉన్నాయి. 'అనవద్యాంగీ' దగ్గర చెప్పుకున్నవి ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. 'అస్తి, జాయతే, వర్థతే, విపరిణమతే, అపక్షీయతే, నశ్యతే' అని ఆరు దోషాలు. ఈ షడ్దోషాలు లేని తల్లి కనుక 'దోషవర్జితా'. దోషాలు పోవాలంటే 'దోషవర్జితనే పట్టుకోవాలి. ఇంతవరకు 'దుష్టదూరా దురాచారశమనీ' చెప్పి 'దోషవర్జితా' అని చెప్పడంలో 'ఉపాధిగతమైన దోషములేవీ లేనిది' అనగానే 'నిరుపాధిః' అనే తత్త్వమే ప్రతిపాదన చేస్తున్నారు. దోషవర్జితా తత్త్వం పరమాత్మ మాత్రమే.

196. సర్వజ్ఞా - శ్రీ సర్వజ్ఞాయై నమః

ఆ పరమాత్మనే 'సర్వజ్ఞా' అని చెప్తున్నారు. అమ్మవారు సర్వజ్ఞా అంటే సర్వమూ తెలిసిన తల్లి. ఉపనిషత్ ఈ మాటని చాలా నిండుగా అన్నది– **'యః సర్వజ్ఞః సర్వవిత్'.** అలాగే **'సర్వజ్ఞా సర్వవేతృత్వాత్'** అని దేవీభాగవతంలో చెప్పిన వాక్యం. అన్నీ తెలిసిన ఆవిడ.

మన బుద్ధికి పరిమితి ఉంది. ఆవిడ దేశ కాల వస్తు భేదములు లేకుండా సర్వత్రా వ్యాపించిన జ్ఞానస్వరూపిణి. అంతేకాదు అమ్మవారికున్న ప్రధానమైన లక్షణములు – సర్వజ్ఞత, అనాదిబోధ, స్వతంత్రత, నిత్యత, సంపూర్ణత, అనంతత అని ఆరు లక్షణాలు. ఈ ఆరు లక్షణాలు ఎవరికుంటాయో వారిని భగవతీ, భగవాన్ అని అంటారు.

సర్వజ్ఞత, అనాదిబోధ – ఆ జ్ఞానమనేదానికి అనాది ఉన్నది. ఆమె ఉండడమే జ్ఞానం. జ్యోతికి కాంతి ఎంత సహజమో, జ్ఞానం ఆ తల్లికి అంత సహజం. అందుకు అనాదిబోధ.

స్వతంత్రత అన్నది కేవలం పరమాత్మకి తప్ప ప్రపంచంలో ఇంకెవ్వరికీ లేదు. అన్నీ తన ఆధీనంలో కలిగి, తాను దేని అధీనంలోనూ లేని తత్త్వమే ఇది.

నిత్యత – నిత్యతకి ఎన్నో అర్థాలు ఇదివరకు నామాలలో తెలియజేయడమయింది.

సంపూర్ణత, అనంతత – ఈ ఆరు లక్షణాలు ఉన్నవి కేవలం పరమాత్మకే. పరమాత్మస్వరూపిణి కనుక సర్వజ్ఞ.

197. సాన్ద్రకరుణా – శ్రీ సాన్ద్రకరుణాయై నమః

సర్వజ్ఞతా, అనాదిబోధ, స్వతంత్రత ఇత్యాది శక్తులతో ఉన్నప్పటికీ, అన్నింటిని మించిన ఒక అద్భుతమైన లక్షణం ఉంది. అది 'సాన్ద్రకరుణా'. ఈ మాట చాలా విశేషమైనది. అమ్మవారు కరుణా స్వరూపిణి. ఆ కరుణ సాంద్రమైనది. సాంద్ర అంటే ఘనము, పుష్కలము అని అర్థం. పలచదనం లేదక్కడ.

కారుణ్యం తప్ప మరొకటి లేదు. ఆ రూపం నిలువెల్లా కారుణ్యం. రూపం లేని తల్లి రూపం ధరించిందంటేనే 'కారుణ్యం'. నామం లేని తల్లి నామంలోకి వచ్చిందంటేనే 'కారుణ్యం'. అమ్మ అంటే కారుణ్యమే. కారుణ్యం కాకపోతే ఈ ప్రపంచం ఇలా ఉంటుందా! ఆ కరుణని గుర్తించకపోతే వారిని దౌర్భాగ్యులు అనాలి. అమ్మ కారుణ్యం విశ్వమంతా వ్యాపించి నడిపిస్తున్నది.

'సర్వజ్ఞతా', 'సాన్ద్రకరుణా' – రెండూ చాలా గొప్పవిషయాలు. ఎందుకంటే దయగలిగిన వానికి జ్ఞానం లేకపోతే ప్రమాదం. జ్ఞానం ఉన్నవానికి దయ లేకపోతే ప్రమాదం. రెండూ ఒకచోట ఉంటే అది మనకి ప్రమోదం. అమ్మ దగ్గర రెండూ ఉన్నాయి.

అసలు ఆ అమ్మవారి పేరే 'కరుణా' అంటారు వేత్తలు.

కారణపరచిద్రూపా కాంచీపురసీమ్ని కామపీఠగతా

కాచన విహరతి కరుణా కాశ్మీరస్తబక కోమలాంగలతా

కాంచీపురంలో ఒకానొక దయ తిరుగుతోంది అన్నారు మూకకవి. **'జగత్త్రాతుం శమ్భోర్జయతి కరుణా కాచిదరుణా'** అన్నారు శంకరులు. అమ్మ అరుణం అంటే కరుణయే. అరుణా, కరుణా అనే పదాలు ఎంతో దగ్గరగా ఉన్నాయి. అందుకు అమ్మ అంటేనే 'సాన్ద్రకరుణా'. ఆ తల్లికి నిలువెల్లా కరుణే.

198. సమానాధికవర్జితా - శ్రీ సమానాధికవర్జితాయై నమః

ఆమెతో సమానము లేదు, ఆమెకి అధికము లేదు. ఆవిడకి ఆవిడే సాటి. ఏది చెప్పినా ఆవిడ కంటె తక్కువే.

'నిస్తులా' అంటే అర్థం ఏమిటో 'సమానాధికవర్జితా' అన్నా అదే అర్థం. అక్కడికే తీసుకువచ్చారు. ఇది సరిగ్గా ఉపనిషద్వాక్యం-**'న తత్ సమశ్చాభ్యధి కశ్చ దృశ్యతే'** ఇదొక మాట. **'న తత్సమశ్చాభ్యధికః కుతోన్యః'** మరొకమాట. దానితో సమానమే లేదు కదా. ఇంక దానికంటె అధికం ఉందని ఎలా చెప్పగలమనేది పరతత్త్వం గురించి ప్రతిపాదన చేస్తూ ఉపనిషత్తులు చెప్పే భావం. ఈ వాక్యములన్నీ కూడా అమ్మవారు పరతత్త్వమే, పరబ్రహ్మమే అని ప్రతిపాదన చేస్తున్నాయి. **'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ'** - అద్వితీయం. మొత్తం అమ్మ యొక్క నవార్ణ విద్య అయిన దుర్గావిద్య. 'నిస్తులా' నుండి ఇప్పటివరకూ చెప్పబడిన నామములలో రహస్యం. దీనిని సరిగ్గా అర్థం చేసుకుంటే అదే దుర్గావిద్య పారాయణం. ఇందులో మొత్తం నామాలు చూస్తే నవార్ణ మంత్ర సంకేతంగా తొమ్మిది నామాలు. అవి-

1.నిస్తులా, 2.నీలచికురా, 3.నిరపాయా, 4.నిరత్యయా, 5.దుర్లభా, 6.దుర్గమా, 7.సర్వజ్ఞా, 8.సాన్ద్రకరుణా, 9.సమానాధికవర్జితా.

ఈ తొమ్మిది నామాలు దుర్గాదేవి యొక్క స్వరూపాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఫలాన్ని చూపించే నామాలు - 1.దుఃఖహన్త్రీ, 2.సుఖప్రదా, 3.దురాచారశమనీ. దుర్గాదేవి ఉపాసన వల్ల ఈ మూడు లభిస్తున్నాయి. ఫలములు మూడు, స్వరూపం

తొమ్మిది. మొత్తం 12 నామాలు. ఇంత వరకూ దుర్గా తత్త్వాన్ని తెలుసుకున్నాం కదా.

ఇప్పుడు మొదలవుతున్నాయి:- సర్వశక్తిమయీ (199) నుండి మృడప్రియా (211) వరకు. సర్వశక్తిమయీ, సర్వమంగళా, సద్గతిప్రదా, సర్వేశ్వరీ, సర్వమయీ, సర్వమన్త్రస్వరూపిణీ, సర్వయంత్రాత్మికా, సర్వతంత్రరూపా, మనోన్మనీ, మాహేశ్వరీ, మహాదేవీ, మహాలక్ష్మీ, మృడప్రియా నామం వరకు అంతా **వనదుర్గా మాలామంత్రం**.

అలా పరిశీలన చేసుకుంటూ పారాయణ చేసుకోవచ్చు. వనదుర్గా మంత్రవిశేషం చాలా ఉన్నది. సర్వభయ సంహారం. దుర్గయొక్క మరొక స్వరూపమే ఇది.

199. సర్వశక్తిమయీ - శ్రీ సర్వశక్తిమయ్యై నమః

'సర్వశక్తిమయీ, సర్వమంగళా, సద్గతిప్రదా'....ఈ మూడు నామములు 'స' కార నామాలు. 'స' కారములోనే ఒక అద్భుతమైన సౌందర్యం ఉంది. 'స' కారం సౌమ్య శబ్దం. 'సర్వశక్తిమయీ' అంటే ఈవిడని మించిన మరొక శక్తి ఎక్కడా లేదు. ప్రపంచంలో ఏ శక్తులు మనం చూస్తున్నామో ఆ శక్తులన్నీ ఈవిడలో ఉన్నాయి. ఒకొక్క దేవతలో ఒకొక్క శక్తి ఉన్నది. ఆ శక్తి ఆ దేవతకి పరిమితం. ఇంద్రునికి ఉన్న శక్తి అగ్నికి లేదు, అగ్నికి ఉన్న శక్తి వరుణునకు లేదు, వరుణునికి ఉన్న శక్తి యమునికి లేదు. ఎవరి శక్తి వారిదే. ఇలా ఒకొక్కరి శక్తి ఒకొక్కటిగా ఉన్నది. కానీ మహిషాసురుని బాధ తట్టుకోలేక వీరందరూ త్రిమూర్తులను ప్రార్థన చేసినప్పుడు, ఆ త్రిమూర్తుల శక్తి ఒక అగ్నిపుంజంగా కలిసినప్పుడు ఈ దేవతల నుంచి కూడా తేజస్సు బయటికి వచ్చి అదంతా ఏకజ్యోతిగా నిలిచింది. అంటే అగ్ని, ఇంద్ర, వరుణ, యమ, అశ్వనీదేవతలు-ఇలా 33 కోట్ల దేవతల యొక్క శక్తులు రాశీభూతమై అమ్మవారు ఆవిర్భవించారని దేవీమాహాత్మ్యంలో చెప్పబడింది. అమ్మవారు సర్వదేవతల యొక్క శక్తిరూపం. అంటే ఇదివరకు విడివిడిగా ఉన్న దేవతలు అమ్మవారి నుండి వచ్చిన కిరణాల వంటివారు. ఈ కిరణాలన్నీ కలుపుకొని ఉన్న మహాజ్యోతి అమ్మవారు.

సర్వశక్తిమయీ అంటేనే సర్వమంత్రశక్తిమయి, సర్వదేవతా శక్తిమయి, సర్వపదార్థ శక్తిమయి. ప్రతి పదార్థంలో ఒక శక్తి ఉంది.

అగ్నిలో దాహకశక్తి, ప్రకాశక శక్తి. జలంలో దాహనాశక శక్తి, తాపనాశక శక్తి, శుభ్రతాశక్తి ఉన్నాయి. ఇందులో ఒకొక్క దానిలో ఒకొక్క శక్తి, ఇన్ని శక్తులు అమ్మలో ఉన్నాయి. ఉన్నాయి కనుకనే అమ్మ నుండి ఈ శక్తులన్నీ పంచబడ్డాయి. ఇవి అన్నీ కూడా అక్కడ నుండి దేవతలకు పంచబడిన పరిమిత శక్తులు. వీటన్నింటికి మూలమైన అపరిమిత శక్తి ఆవిడ.

అందుకు **'యస్య యస్య పదార్థస్య యా యా శక్తిరుదాహృతా'** 'ఏ ఏ పదార్థములకి ఏ ఏ శక్తి ఉందని చెప్తున్నారో ఆ శక్తులన్నీ అమ్మయే' అని చెప్తున్నారు. **'పదార్థశక్తయో యా యాస్తాస్తా గౌరీం విదుర్బుధాః'**– 'ప్రతి పదార్థశక్తిని గౌరీదేవి' అని తెలుసుకోవాలి.

అంతేకాక ముఖ్యంగా శ్రీచక్రాధిదేవత అయిన తల్లి కనుక శ్రీచక్రంలో బిందుస్వరూపంలో ఉంటూ మిగిలిన ఎనిమిది ఆవరణలుగా విచ్చుకుని వికసించింది. ఎనిమిది ఆవరణలలో అక్షోభ్యాది అనేక శక్తులున్నాయి. ఈ సర్వశక్తులతో కలిసి శ్రీచక్రంలో కూర్చుంది కనుక 'సర్వశక్తిమయీ' అని శ్రీచక్రాధిదేవతగా అమ్మవారిని పూజిస్తున్నాం.

చంద్రముని యందు జ్యోత్స్నవు చంద్రవదన
ప్రభవు వాసరకరుణందు పద్మనయన
దాహశక్తివి పూబోడి దహనునందు
మ్రొక్కెదను నీకు కళ్యాణమూర్తి లక్ష్మి

అని అగస్త్యమహర్షి కొల్హాపురి లక్ష్మిని స్తుతిచేస్తూ అంటారు. చంద్రునిలో వెన్నెల, అగ్నిలో దాహకత్వం, సూర్యునిలో కాంతి – ఇవన్నీ నువ్వే కదా తల్లి. 'సర్వశక్తిమయీ' అంటే ఏంటో ఇప్పుడు అర్థం అవుతున్నది. ఈ 'సాన్ద్రకరుణా' నుండి ఈ విశ్వమంతా అమ్మ శక్తిగా, కరుణగా ఎలా వ్యాపించి ఉందో దర్శించవచ్చు.

200. సర్వమంగళా - శ్రీ సర్వమంగళాయై నమః

అన్ని మంగళములు కలది. శక్తి ఒక్కటుంటే సరిపోతుందా! మంగళకరంగా ఉండాలి.

సృష్టిలో ఏ శక్తిని చూసినా అది అమ్మయే అనే ఎరుక ఈ నామాల వల్ల కలగాలి. నామానికి భాష్యం చెప్పుకోవడం అంటే అది విచారణ చెయ్యడమే. నామాలు చదువుకోవడమంటే ప్రాథమిక దశ, నామాలు విచారణ చేయడం పారాయణ దశ, అసలు విచారణయే పారాయణ. విచారణ చేస్తుంటే మనం అమ్మవారితో తాదాత్మ్యం చెందుతూ ఉంటాం. సృష్టిలో దేని నుండి మంగళం పొందుతున్నామన్నా అది అమ్మరూపం అని చెప్పి నమస్కారం చేసుకోవాలి. ఏది నీకు మేలు చేసిందో అదే దైవం. ఇది మనకు స్వభావంగా అలవాటు చేశారు. ఇది తెలియక చాలా మంది మీ హిందువులు అన్నింటిని దేవుళ్ళని దండం పెడతారని అంటారు. అదే మా గొప్పతనమని మనం చెప్పాలి.

గొప్ప గుణమేమిటంటే కృతజ్ఞత. సృష్టిలో ఏది మేలు చేస్తోందో అదే భగవచ్ఛక్తి అని పరిశీలించగలిగాడు హిందువు. మనకు గొప్ప మేలు చేసేవాడు సూర్యభగవానుడు.

ఎక్కడ తేజస్సు కనబడితే అక్కడ దండం పెట్టమని గీతలో స్వామి చెప్పారు. **'యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా'**. తేజస్సు అంటే గొప్పతనం. ఆ గొప్పతనం భగవంతుడే. ఆ గొప్పతనానికి దండం పెట్టాలి. ఎక్కడెక్కడ ఒక శక్తి ఉందో, ఎక్కడెక్కడ ఒక మంగళం ఉందో... ఆ మంగళం భగవంతుడే. ఎందుకంటే అమ్మవారు దయతో ఆ రూపంతో నీకు మంగళం కలిగిస్తున్నారు. ఉదయం సూర్యుడు రాగానే, "అమ్మా! వచ్చావా తల్లీ!" అని దండం పెడతాడు. రాత్రి చీకటి రాగానే, "అమ్మా! వచ్చావా తల్లీ!" అని మళ్ళీ దండం పెడతాడు. ఎందుకంటే "నన్ను నిద్రపుచ్చి విశ్రాంతిని ఇవ్వడానికి రాత్రి రూపంలో వచ్చావు, నన్ను మేల్కొలిపి తిండి పెట్టడానికి వెలుగు రూపంతో వచ్చావు తల్లీ!" అని అడుగడుగునా అమ్మ అనుభవం భక్తునికి ఉంటుంది. అది అసలైన స్థితి. గాలి వీచినా "అమ్మా వచ్చావా! మమ్మల్ని తాకి అనుగ్రహిస్తున్నావు తల్లీ!" అనుకోగలగాలి.

అలా అనుకుంటే వాడు ప్రహ్లాదుడు. **'కలండంబోధి గలండు గాలి గలదాకాశంబునం గుంభినిం గలదగ్నిన్ దిశలన్ బగళ్ళ నిశలన్'**. ఎక్కడెక్కడ మంగళం ఉందో ఆ మంగళములన్నీ అమ్మవారి స్వరూపమే అని తెలుసుకోవాలి. **'అసౌ యస్తామ్రో అరుణ ఉతబభ్రుస్సుమంగళః'** – ఆయన పేరు శివుడు, మంగళుడు. అంతేకాదు **'సుమంగళీ'** అనేమాట వేదంలో కూడా మనకి కనబడుతుంది. సూర్యుడు ఉదయించినప్పుడు ఉషఃకాల కాంతికి (ఉషాదేవి) పేరే **'సుమంగళీ'**. ఆ ఉషా చిహ్నమే ఆ మంగళకరమైన కుంకుమ ఎర్రదనం. ఉషఃకాలస్వరూపం కూడా మంగళమే. పసుపు, కుంకుమ – ఈ రెండూ సూర్యకిరణ కాంతి స్వరూపాలు. అమ్మవారు **'హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణరజతస్రజామ్'**– ఆ ప్రాతఃకాల సూర్యకాంతితోటే అమ్మ చూస్తున్నారు. ఆవిడ పేరే అరుణ. అరుణోపనిషత్ అంతా ఇదే చూపిస్తున్నది. సౌరారుణమంత్రములయందు విశేషమే ఇది.

'సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే, శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోస్తుతే'. సర్వమంగళములకు ఆవిడ మాంగళ్యము. 'మంగళ మాంగళ్యే' అంటే మంగళం అనుకొన్న వస్తువులో మంగళం కలిగించే శక్తి అమ్మవారు. వెలుగనే మంగళం అమ్మవారు. నీటిలో దాహం పోగొట్టే శక్తి అమ్మవారు. **'రసోఽహమప్సు కౌన్తేయ ప్రభాఽస్మి శశి సూర్యయోః'** – "నీటిలో దాహాన్ని పోగొట్టే శక్తిని నేను, సూర్యునిలో, చంద్రునిలో వెలుగును నేను" భగవద్గీతలో స్వామి అన్నాడు.

అంతేకాదు – అమ్మని ఎవరు ఆశ్రయిస్తారో వారికి అమంగళాలు ఉండవు. ఎందుకంటే **'అశుభాని నిరాచష్టే, తనోతి శుభసంతతిమ్, స్మృతి మాత్రేణ యత్పుంసాం బ్రహ్మ తన్మంగళం విదుః'** లేదా **"బ్రహ్మతన్మంగళం పరం"**.

పరబ్రహ్మమును ఎవరైతే ఒకసారి తలచుకుంటారో వారికి 'అశుభాని నిరాచష్టే' –అశుభాలు తొలగుతాయి. 'తనోతి శుభసంతతిమ్' – (సంతతి అంటే పరంపర) శుభములు వరుస పెట్టి వస్తూ ఉంటాయి. ఎవరికి? 'స్మృతిమాత్రేణ యత్పుంసాం' – స్మరణ మాత్రం చేతనే అశుభాలు 'నిరాచష్టే' తొలగుతాయి.

'యశ్శివో నామ రూపాభ్యాం యా దేవీ సర్వమంగళా' అని పరబ్రహ్మ

గురించి ప్రతిపాదన చేశారు. కనుక 'సర్వమంగళా' అంటే 'పరబ్రహ్మస్వరూపిణి'. అంతా బ్రహ్మపరమైన నామములే. **'సర్వాణి హృదయస్థాని మంగళాని శుభానిచ దదాతి చేప్సితాన్ లోకే తేన సా సర్వమంగళా'** (దేవీపురాణం). ఈ శ్లోకాన్ని అర్థం చేసుకుంటే 'సర్వమంగళా'లో మరింత అందం తెలుస్తుంది. అమ్మవారిని ఆశ్రయించిన వెంటనే ఆవిడ మన హృదయంలో ఉన్న మంగళకరమైన సంకల్పాలను నెరవేర్చుతుంది. మంగళం అంటే ఒక్కటే. ధర్మబద్ధమైన ఆలోచనయే మంగళం. 'దదాతి చ ఈప్సితాన్ లోకే' – ఆశ్రితుల కోరిన కోరికలన్నీ నెరవేర్చే తల్లి కనుక 'సర్వమంగళా'.

మంగళకరమైన వస్తువులకి మర్యాదలు ఇవ్వమని చెప్పారు. గోవు, అగ్ని, సువర్ణం, నెయ్యి, సూర్యుడు, పుణ్యస్త్రీ, రాజు, తులసి, బిల్వం, పుష్పం, అద్దం, శివలింగం, సాలగ్రామం మొదలైనవి మంగళస్వరూపములు అన్నారు.

ఈ మాటలు ధర్మరాజుకి అంత వేదాంతం చెప్పిన తరువాత భీష్ముడు కూడా చెప్పాడు. ఇవి కూడా అవసరం. వీటినే ప్రాతఃకాలం లేచి చూస్తే వారికి మంగళములు కలుగుతాయి. వీటి అన్నింటిలో అమ్మ ఉంది. పూర్వం పెద్దవారు ఇవన్నీ చూసుకునేవారు. ఇంటి గుమ్మం, స్త్రీ యొక్క పాపిట ఇవన్నీ కూడా మహాలక్ష్మీ స్థానములు. ఇవన్నీ అమ్మ రూపములే. ముందు పరబ్రహ్మపరమైన అర్థం చెప్పుకున్నాం. ఇప్పుడు వ్యవహారపరమైన అర్థం కూడా తెలియజేయడమయింది. కావలసినది పరమార్థం, ఉన్నది వ్యవహారం– రెండింటిలోనూ అమ్మనే మనం చూడాలనే ఉద్దేశంతో రెండు అర్థములు.

201. సద్గతిప్రదా – శ్రీ సద్గతిప్రదాయై నమః

సద్గతిని ఇచ్చునది.

సద్గతులు అనేక రకాలు. ఎప్పుడైనా ఉన్నదాని కంటె ఉన్నతస్థితి సద్గతి. పెద్దదైన మోక్షం వచ్చిందా లేదా ప్రక్కన పెట్టి, ఇంతకంటె క్రిందకి పడకుండా ఉంటే అంతే చాలు. అమ్మనిగాని ఒక్కసారి ఆశ్రయిస్తే ఇంతకంటె క్రిందకి పడం అనడంలో సందేహం లేదు. నీ సాధనాబలాన్ని అనుసరించి ఇంతకంటె ఉన్నత స్థితి ఇస్తుంది.

అన్నిటి కంటె ఉన్నతమైన స్థితి అయిన మోక్షాన్ని కూడా ప్రసాదిస్తుంది. చాలా మందికి మోక్షం అంటే బాగా తెలుసు. మోక్షం అంటే జీవబ్రహ్మైక్యం. అంతే కదా!

సృష్టిలో ఒక రాజుగారిని బాగా ఆశ్రయిస్తే, మహా ఇష్టపడితే బహుధనాన్ని ఇస్తాడు. ఇంకా ఇష్టపడితే మంత్రిగానో, సేనాధ్యక్షుడిగానో, ధనాధ్యక్షుడిగానో చేస్తాడు. కానీ రాజుని చేస్తాడా? చెయ్యడు. కానీ పరమాత్మని శివా! అని ఆశ్రయిస్తే, ఆయన ఒక్కడే 'శివోహం' అని శివుని చేసేస్తాడు. తనలో ఐక్యం చేసుకుని, అభిన్నం చేస్తాడు. అది జరిగితే అది సద్గతి. అమ్మతో ఐక్యం అయిపోవాలి. ఇంక అమ్మకి, నీకు భేదం లేదనే స్థితికి తీసుకువెళ్తుంది ఆ తల్లి.

స్వర్గాది మోక్షాంతం సద్గతులు. వాటిని ప్రసాదించునది.

సద్గతులు రెండు రకాలు. సాపేక్ష సద్గతి, నిరపేక్ష సద్గతి. ఇంద్రలోకం చాలా బాగుంది కానీ అక్కడికి వెళ్ళాక అంతకంటె పైన మరొకటి ఉంటూ ఉంటుంది కనుక సాపేక్షం. అంటే అక్కడికి పరిపూర్ణం కాదు. ఇదీ సద్గతే.

ఈ సాపేక్ష సద్గతులు కూడా అమ్మవారే ఇస్తుంది.

నిరపేక్ష సద్గతి అంటే మోక్షం. అదీ అమ్మవారే ప్రసాదిస్తుంది. సాపేక్ష అంటే స్వర్గాది లోకముల యందు, ఊర్ధ్వలోకముల యందు లభించే సద్గతులు. ఇవి అన్ని పుణ్యవిశేషం వల్ల వస్తాయి. అమ్మని ఆశ్రయించడమే ఒక పుణ్యం. ఆ పుణ్యం చేత ఉత్తమ లోకాలు వస్తాయి. ఆ ఉత్తమ లోకసుఖాలు అయిపోయిన తరువాత ఉత్తమ జన్మలు వస్తాయి. ఆ ఉత్తమ జన్మలలోనైనా క్రమక్రమంగా భక్తి, విచారణ చేయగా మోక్షం వస్తుంది. కనుక సాపేక్ష సద్గతీ గొప్పదే, నిరపేక్ష సద్గతీ గొప్పదే. గతులంటే తెలిస్తే సద్గతి అంటే తెలుస్తుంది.

ఒక నామం ఆధారంగా చేసుకొని ఎన్నో తెలుసుకోవాలి కదా! గతులు అంటే మన తరువాత పరిస్థితి. తరువాత మన పరిస్థితి ఏమిటి? ఎవరు నిర్ణయిస్తారు? మన పనులే నిర్ణయిస్తాయి. నీ గతి ఏమిటి అనేది నీ పనిని అనుసరించి నిర్ణయించే ఒక వ్యవస్థ. ఇప్పుడు ఈ భూలోకంలో మనమున్నది కూడా ఒక సద్గతే. ఇదివరకు మనం ఎన్నో దాటి వచ్చి ఈ దుర్లభ మానవజన్మను పొందాం కదా!.

మొదటిది శిలా జన్మ, దాని తరువాత లతాగుల్మములు- పొదలజన్మ, తరువాత ఓషధులు, వనస్పతులు అయిన వృక్ష జన్మలు. తరువాత క్రిమికీటకాలు, జలచరాలు, మృగాలు, పశువులు, పక్షులు తరువాత మానవులు. వీటి అన్నిటితో పోలిస్తే ఇది సద్గతి. ఇప్పుడు మనం ఇక్కడి నుండి పైకి వెళ్ళాలి. కనుక దీని కంటె సద్గతులు అంటే దేవజన్మలు ఇత్యాదులన్నీ కూడా సద్గతులు. ఇప్పటికంటె ఇంకా పైకి వెళ్ళడం శాస్త్రంలో చెప్పారు. ఎందుకంటే ముందు వృక్షజన్మలు, శిలా జన్మలు వచ్చిన తరువాత శిలాజన్మలో ఉత్కృష్ట జన్మ ఏది అంటే సాలగ్రామం. వృక్షాలలో ఉత్కృష్టం మారేడు, అశ్వత్థం ఇత్యాది దేవతా వృక్షములు. పశువులలో ఉత్కృష్టం గో జన్మ అన్నారు. మానవులలో ఉత్కృష్ట జన్మ ఏమిటంటే బ్రహ్మజ్ఞానిగా పుట్టడం. పరమేశ్వర జ్ఞానం పొందగలిగే జన్మ వచ్చాక కూడా సద్వినియోగం చేసుకోకపోతే మళ్ళీ వెనక్కి వెళ్ళిపోతారు. మళ్ళీ వెనక్కి వెళ్ళామా చాలా కష్టపడాల్సి వస్తుంది. సద్గతులు ఇన్ని రకాలు ఉంటాయని వివరిస్తున్నారు. అమ్మని ఆశ్రయిస్తే సద్గతిని ఇస్తున్నది.

పైగా పాపం చేస్తే వచ్చేవి పాపగతులు- నరకాదులు. తరువాత క్షుద్రజన్మలు. ఇది ఒక గతి. పుణ్యం చేస్తే వచ్చేవి ఉత్తమ లోకములు. మిశ్రమజన్మ వచ్చినప్పుడు మానవలోకం. మూడు గతులు ఇక్కడే చెప్పేసుకున్నాం. మానవ జన్మ చెప్పుకున్నాక, పుణ్యకర్మలు చేసేవారు ధూమాది మార్గముల ద్వారా ఉత్తమలోకాలకి వెళ్తారు. ఇది గీతలో స్వామి చెప్పినది. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు కూడా ఇదే ప్రతిపాదన చేస్తున్నాయి. ఇవే మనం తెలుసుకోవలసిన గతులు.

ఇప్పుడు మానవ జన్మ ఫరవాలేదు. ఇంక తరువాత ఎవరు ఎక్కడికి వెళ్తారు? ఎలా చేస్తే ఎక్కడికి వెళ్తారో తెలుసుకుంటే ఏం చెయ్యాలో మనకే తెలుస్తుంది. ఇష్టాపుర్తాది కర్మలు సకామంగా ఆచరించువారు (ఇష్టాపుర్తాది కర్మలంటే యజ్ఞయాగాదులు, పదిమందికి పనికి వచ్చే మంచి పనులు, చెట్లు నాటించుట, సత్రములు కట్టించుట, అన్నములు పెట్టించుట ఇవన్నీ పూర్తకర్మలు). ధూమ మార్గము ద్వారా వారు పుణ్యలోకాలకి వెళ్తారు. అయితే పుణ్యలోకాల తరువాత, **'క్షీణే పుణ్యే**

మర్త్యలోకే విశంతి' – మళ్ళీ క్రిందకి వస్తారు. ఇది ధూమ మార్గం.

రెండవది అర్చిరాది మార్గం. అర్చిరాది మార్గం అంటే ఉపాసకులు, భక్తులు అయిన వారు వెళ్ళేది. వీరు జ్యోతిర్మయమైన మార్గం ద్వారా క్రమక్రమంగా ఆ దేవతాలోకములని చేరతారు. అక్కడ నుండి క్రమంగా పరమాత్మతో ఐక్యం చెందుతారు. దీన్ని క్రమముక్తి అంటారు. ఇది శ్రేష్ఠం. దీని కంటె గొప్పది పరామార్గం. అది జీవన్ముక్తి. అది ఇక్కడే లభిస్తుంది. కనుక క్రమముక్తి, జీవన్ముక్తి– ఈ రెండు ఉత్తమమైనవి. క్రమముక్తి అంటే ఆయాదేవతల లోకాలకి చేరతారు (ఇంద్రాది లోకములు కాదు, అది సగుణ బ్రహ్మలోకమని చెప్తారు). **'మహ్యం దత్వా ప్రయాతుం బ్రహ్మలోకమ్'** – ఈ బ్రహ్మలోకమే శివభక్తులకి కైలాసం, విష్ణు భక్తులకి వైకుంఠం, అమ్మభక్తులకి మణిద్వీపం. అక్కడికి చేరతారు. కొంతకాలానికి అక్కడ దివ్యలోకంలో ఆనందం అనుభవించి తరువాత ఆ పరతత్త్వంతో ఐక్యం చెందుతారు. ఇది క్రమముక్తి. వారు వెనక్కి రారు.

ధూమమార్గంలో వెళ్ళినవారు వెనక్కి వస్తారు. జీవన్ముక్తులు ఇక్కడే పరతత్త్వం(సర్వవ్యాపకమైన బ్రహ్మము)లో ఐక్యం అయిపోతున్నారు. ఇక్కడ మూడు ఉత్తమగతులు చెప్పుకున్నాం. ఒకటి ధూమ మార్గం, రెండవది అర్చిరాది మార్గం, మూడవది జీవన్ముక్తుల మార్గం. ఈ మూడు ఉత్తమ గతులు. అమ్మని ఆశ్రయించి సకామంగా అనుష్ఠానాలు చేస్తున్నట్లైతే, ధూమాది మార్గాలలో వెళ్ళి ఉత్తమ లోకాలలో సుఖాలు అనుభవించి మళ్ళీ క్రిందకి వస్తారు. అదే ప్రేమగా, భక్తిగా, నిరపేక్షంగా అమ్మ పేరు తలచుకుంటేనే ఒళ్ళు పులకించి, అమ్మనే స్మరణ చేస్తూ ఆనందపారవశ్యం అనుభవిస్తూ "అమ్మా! నువ్వు చాలమ్మా. నాకు ఇంకేమీ అక్కర్లేదు" అనే నిష్కామ భక్తి కలిగి ఉంటే అది క్రమముక్తిని ఇస్తుంది. అంతేకాక ఈ జన్మలోనే జీవన్ముక్తులను చేయవచ్చు. జీవన్ముక్తి రాకుండా మరణిస్తే అప్పుడు వాడు మణిద్వీప లోకానికి వెళ్ళి క్రమంగా బ్రహ్మైక్యం చెందుతాడు. అమ్మ ఉపాసన, భక్తి ఎంత గొప్పదో చూశారా! కనుక అమ్మని ఆశ్రయిస్తే క్రమశః 'సద్గతిప్రదా'. అమ్మ అనుగ్రహం లేకపోతే సద్గతికి కావలసిన మార్గాలే దొరకవు.

దుర్లభం త్రయ మే వైతత్ 'దైవానుగ్రహహేతుకమ్'

మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః

అమ్మ అనుగ్రహం ఉంటేనే ముందు మానవత్వం వస్తుంది. ఆ మానవునికి కూడా ముముక్షత్వం కావాలనే కోరిక పుడుతుంది. ఆ తరువాత మహాపురుషుల ఆశ్రయం దొరుకుతుంది. దాని తరువాత మరి చెప్పలేదు. మహాపురుష సంశ్రయం దొరికితే ఆ తరువాత అన్నీ అవే వస్తాయి. అందుకు ఈ మూడింటిని విశేషంగా చూపించారు. **'గతిస్త్వం గతిస్త్వం త్వమేకా భవానీ'.**

202. సర్వేశ్వరీ – శ్రీ సర్వేశ్వర్యై నమః

ఇది నిజానికి పెద్దగా వివరించక్కర్లేదు. 'నిరీశ్వరా' నామార్థంలోనే తెలియజేయడమయింది. లలితాంబను మించిన ఈశ్వరి మరొకరు లేరు. అన్నింటికి ఆవిడ ఈశ్వరి. ఈశ్వరి అనగా నియామకురాలు. **'పరా పరాణాం పరమా త్వమేవ పరమేశ్వరీ'.** ఆవిడ పేరే పరమేశ్వరి. **'సై వ సర్వేశ్వరేశ్వరీ'**(దేవీమాహాత్మ్యం).

203. సర్వమయీ – శ్రీ సర్వమయ్యై నమః

ఇంతవరకు 'సర్వేశ్వరి', 'సర్వశక్తిమయీ', 'సర్వమంగళా' అని చూడడం మొదలు పెట్టాక, 'సర్వమయీ' అర్థం అవుతుంది. **మొదట 'సర్వమంగళా', 'సర్వశక్తిమయీ' అనేవి విభూతియోగం. 'సర్వేశ్వరీ' 'సర్వమయీ' అనేటప్పుడు విశ్వరూపసందర్శన యోగం.** ముందు అమ్మవారి విభూతులను, శక్తులను చూశాం. క్రమంగా చూస్తూ ఉంటే సర్వమూ అమ్మమయం అని అవగతమౌతుంది. అందుకు 'సర్వమయీ'.

'మత్' ప్రత్యయమ్ నుండి 'మయం' అనే మాట వచ్చింది. ఉపాధి కనబడుతూ ఉండగా పరతత్త్వాన్ని చెప్పాల్సి వచ్చినప్పుడు సర్వమయం అనాలి. అదే కానీ ఉపాధిని విడిచి పెడితే 'మయం' లేదు.

ఉదాహరణకు ఉంగరం బంగారుమయం. ఇందులో ఉంగరం ఆకారాన్ని

దృష్టిలో పెట్టుకొన్నాం, బంగారాన్ని కూడా దృష్టిలో పెట్టుకున్నాం కానీ బంగారం మాత్రమే చూసేవాడు ఉంగరం ఉపాధి ఎలా ఉన్నా లెక్కపెట్టడు. వాడు ఉంగరంలో నగిషీ ఏమిటి? ఎంత గుండ్రంగా ఉంది? ఇవేమీ చూడడు. అందులో ఎంత బంగారం ఉందో చూస్తాడు. వానికి బంగారమయం కాదు, బంగారమే కావాలి. ఉపాధితో కలిపి చూపినప్పుడు బంగారమయం.

బంగారు మయం అంటే అమ్మ ఈ ప్రపంచమంతా వ్యాపించి ఉంది. అందుకు 'సర్వమయీ'. ఉంగరం ఎలా బంగారుమయమో, కుండ ఎలా మట్టిమయమో, అలాగే ప్రపంచం అమ్మమయం అని తెలుసుకోవాలి.

కుండలో మట్టి తప్ప ఇంకేమైనా ఉందా? ఉంగరంలో బంగారం తప్ప మరేదైనా ఉందా? కనుక ఆకార విశేషాలు పెట్టుకున్న పేర్లు. **'వాచారంభణం వికారో నామధేయం'** అని ఉపనిషత్ చెప్తోంది ఈ విషయమే. నామరూపాలు వ్యవహార కల్పితమే. సత్యం ఏంటి? **అస్తి, భాతి, ప్రియం** – నేను ఉన్నాను అనే చైతన్యం సాధారణం. కనుక అది కుండ అని పేరు పెట్టావు కాని ఉన్నదేమిటి మట్టేగా. కుండ తయారుకాక ముందు మట్టే. కుండ పగిలింది... ఉన్నది మట్టే. కనుక కుండ మట్టి మయం. ఉపాధితో కూడిన ప్రపంచం అమ్మమయం, బ్రహ్మమయం. అప్పుడు అమ్మ 'సర్వమయీ' అయ్యిందా, లేదా! అందుకే సర్వమయీ అనే మాట అంత విశేషం.

ఆగమ ప్రకారంగా – పృథివీ తత్త్వం మొదలుకొని శివతత్త్వం వరకు 36 తత్త్వాల స్వరూపము అమ్మయే.

ప్రపంచమంతా అమ్మమయం. అదే **'సర్వం ఖల్విదం బ్రహ్మ నేహనానాస్తి కించన'.**

సూర్యునిలో కాంతి, నీటిలో దాహనాశక శక్తి అమ్మవారు. కంటిలో చూసే శక్తి అమ్మవారు. ఇవన్నీ అమ్మవారు అయినప్పుడు ఇంక 'సర్వమయీ' కాక ఇంకేమిటి! ఈ సర్వమయం అన్న తత్త్వాన్ని ఉపాసనలోకి తెచ్చుకోవడానికి ఒక మంత్రమో, యంత్రమో కావాలి కదా! ఏ మంత్రం అని పట్టుకుంటాం?

204. సర్వమన్త్రస్వరూపిణీ - శ్రీ సర్వమన్త్రస్వరూపిణ్యై నమః

దీనికి రెండు అర్థాలు ఉన్నాయి. శ్రీవిద్యకే సర్వమంత్రమని పేరు. అన్ని మంత్రములు శ్రీవిద్యలోనే ఉన్నాయి కనుక అదే సర్వమంత్రం. ఇది ఒక అర్థం.

రెండు- ఏ మంత్రమైనా అమ్మరూపమే. ఇది ఎలాగంటే - అమ్మ నాదరూపిణి, శబ్దరూపిణి. అమ్మ నుండే 50 అక్షరాలు వచ్చి, ప్రతి అక్షరమూ అమ్మరూపమే అయినప్పుడు, మంత్రాలలో ఉండేవి అక్షరాలేగా! నాదమేగా! కనుక, నాదమూ, శబ్దమూ అమ్మయే. అక్షరములన్నీ అమ్మయే అన్నప్పుడు సర్వమంత్రములు అమ్మవారే.

'పరా' రూపంగా, 'నాద' రూపంగా ఉన్న తల్లే 'వైఖరీ' రూపమైన అక్షరములుగా వ్యాపించింది. ఆ అక్షరములన్నీ మంత్రములయ్యాయి. కనుక మంత్రములన్నీ అక్షరమయములు అయినప్పుడు, అక్షరములన్నీ అమ్మ స్వరూపాలైనప్పుడు.. 'సర్వమంత్రస్వరూపిణి'.

సర్వ మంత్రములంటే అనేక మంత్రాలు. మంత్రవిజ్ఞానం అనేది ఎక్కడ ఉంటుందో అక్కడే దేవతలు, ఉపాసనలు, ఇవన్నీ ఉంటాయి. దేవతలంటే భూమిలో ఉంటారా? ఆకాశంలో ఉంటారా? గాలిలో ఉంటారా? నీటిలో ఉంటారా? అంటే సమాధానం-మంత్రంలో ఉంటారు.

లలితాదేవి, రాముడు, కృష్ణుడు - ఎవరు ఏ మంత్రాన్ని జపిస్తారో ఆ మంత్రాధిదేవత వారికి ఉంటుంది.

'మంత్రవాచ్యార్థాః దేవతాః" ఇదీ నిర్వచనం. మంత్రచైతన్యం దేవత. మంత్రం జడపదార్థం కాదు. మంత్రంలో శక్తి ఉంటుంది. ఆ శక్తే దేవత. అలాగే ఎన్ని మంత్రాలు ఉన్నాయో అన్ని శక్తులు ఉన్నాయి, అందరు దేవతలున్నారు. కానీ ప్రధానంగా ఒకే చైతన్యం ఇన్ని చైతన్యములుగా కనబడుతోంది. ఒకే నాదశక్తి ఇన్ని మంత్రములుగా గోచరిస్తోంది.

శ్రీవిద్యలో షడామ్నాయాలలో వివిధ మంత్రాలు ఉన్నాయి. వాటన్నిటి స్వరూపం లలితామహాత్రిపురసుందరియే - సర్వమంత్రస్వరూపిణి.

మంత్రాలు మొత్తం మూడు రకాలు ఉంటాయి. వేదమంత్రములే మూడు రకాలు.

1.తారక మంత్రములు

2.అభీష్టకారక మంత్రములు

3.అభిచారిక మంత్రములు

తారక మంత్రములు అంటే మోక్షాన్ని ఇచ్చే మంత్రములు. ఆ జపం వల్ల బ్రహ్మజ్ఞానం, మోక్షం లభిస్తాయి. మంత్రం నేరుగా మోక్షాన్ని ఇవ్వదు. మంత్రం చేయగా చేయగా చిత్తశుద్ధి ఏర్పడి, జ్ఞానాగ్ని రగిలి మోక్షం లభిస్తుంది. అందుకు అవి మోక్షకారక మంత్రములు, తారక మంత్రములు,

అభీష్టకారక మంత్రములు – ఒకొక్క కోరికకి ఒకొక్క మంత్రం ఉంటుంది. ఇవన్నీ అభీష్టకారకములు.

అభిచారికము అంటే మనల్ని బాధించే దుష్టత్వాన్ని పోగొట్టడానికి చేసే ప్రయోగాలు. ఒక అనారోగ్యం పోగొట్టుకోవడానికో లేదా శత్రుబాధలు పోగొట్టుకోవడానికో చేసుకునేవి అభిచారిక మంత్రములు. ధర్మరక్షణ కోసం వినియోగించినపుడు ఇవి కూడా శ్రేష్ఠములే. ఆ రోజుల్లో ధర్మబద్ధంగా పాలించే రాజుకి అధర్మపరుల నుండి ప్రమాదం రాకుండా యజ్ఞము ద్వారా అభిచారిక మంత్రములని ప్రయోగించి బాగు చేసేవారు. ధర్మరక్షణకు చేసే అభిచారికములు. ఇవి వేదమంత్రములు.

తాంత్రిక మంత్రములు: తాంత్రిక మంత్రములలో కూడా మూడు రకములు ఉన్నాయి. తాంత్రికాన్నే ఆగమము అంటారు. వేదాన్ని నిగమము అంటారు. మనకి ఇవి కూడా ప్రమాణములే. శైవాగమం, వైష్ణవాగమం, శాక్తేయాగమాలు – ఇవన్నీ మంత్రములే. వీటిలో కూడా తారక, అభీష్టకారక, అభిచారక అనే మంత్రములు ఉంటాయి.

ఇవికాక – శాబర మంత్రములు. వీటికి ఉత్తమ ప్రయోజనాలు ఏమీ లేవు. పరిమితి గల చిన్న చిన్న ప్రయోజనాలే. శబర అంటే ఆటవికులు మొదలైనవారు వీటిని వాడుతుంటారు. పాముని కట్టేసే మంత్రం, అలాగే దిష్టి తీసే మంత్రాలు. ఇవన్నీ శాబర మంత్రములు. వాటి ప్రభావం వాటిది. వాటి ప్రయోజనం వాటిది.

ఇలా మూడు రకాల మంత్రాలు ఉంటాయి.

ఏ మంత్రమైనా అమ్మ రూపమే. ఈ వైదిక, తాంత్రిక, శాబర అనబడే మూడు విధములైన మంత్రరూపిణి అయిన తల్లికి నమస్కారం. అమ్మవారిని గట్టిగా ఆశ్రయిస్తే అన్ని మంత్రాలను పట్టుకున్నట్లే.

అన్ని మంత్రాలు భూమి మీద ఎవ్వడూ చెయ్యలేడు. ఆయుష్షు చాలదు. పైగా అవన్నీ చేస్తే మాత్రం మోక్షం వస్తుందా! జీవుడు తరించడానికి చిత్తశుద్ధి కోసం అవసరమైనవి ఏవో ఒకటో రెండో పెట్టుకుని తరించిపోవచ్చు. అన్నీ ఎవరు చెయ్యగలరు? ఆ చేస్తున్న మంత్రమే 'సర్వమన్త్రస్వరూపిణీ' అయిన అమ్మవారనే భావనతో చేయగలిగితే మన జీవితానికి కావలసినవి అన్ని అదే ఇస్తుంది.

జీవితం ఎంతో అనుకుంటాం గాని ఇలా చూస్తూ ఉంటే అలా అయిపోతుంది. ఇంత జీవితానికి ఇన్ని ఆశలా! కనుక "స్వామీ! ఇంత అల్పమైన జీవితంలో '**కలలంచున్ శకునంబులంచు గ్రహయోగంబంచు సాముద్రికంబు నిమిషార్ధజీవనములం లటంచు... బ్రీతి బుట్టించి ఈ సిలుగుల్ ప్రాణుల కెన్ని చేసితివయా శ్రీకాళహస్తీశ్వరా...**' ఎంత మోహం పెట్టావయ్యా స్వామీ?" అన్నారు ధూర్జటి. ఎన్నెన్నో ఆశలు.. జీవితం అల్పం. కనుక జీవితానికి ఎక్కువ ప్రోగు చేసుకోనక్కర్లేదు. 'సర్వమన్త్రస్వరూపిణీ' అయిన అమ్మవారిని ఒక్కరిని పట్టుకున్నా మనం తరించిపోవచ్చును.

205. సర్వయంత్రాత్మికా – శ్రీ సర్వయంత్రాత్మికాయై నమః

'సర్వమన్త్రస్వరూపిణీ, సర్వయంత్రాత్మికా, సర్వతంత్రరూపా' – ఈ మూడు ఒక దగ్గర కూర్చడంలోనున్న అందాన్ని పరిశీలించాలి. అమ్మా! నువ్వు మంత్రరూపిణివి, నువ్వే యంత్రరూపిణివి. మంత్రం, యంత్రం, తంత్రం అనే మూడింటి గురించి మూడు నామాలు చెప్తున్నాయి. సర్వమంత్రం అంటే 'శ్రీవిద్యా మంత్రం', సర్వయంత్రం అంటే 'శ్రీచక్రం', సర్వతంత్రం అంటే 'శ్రీవిద్య'. '**సర్వ**' అనేమాట బ్రహ్మమునకు చెందిన మాట. బ్రహ్మమునకు సంబంధించిన మంత్రమే శ్రీవిద్య. బ్రహ్మమునకు సంబంధించిన యంత్రమే శ్రీచక్రం, బ్రహ్మవిద్యయే శ్రీవిద్య.

అంతేకాదు ఆ శ్రీవిద్యాస్వరూపిణి అయిన అమ్మవారే అన్ని మంత్రములు. ఆ తల్లే అన్ని యంత్రాలు. మంత్రం, యంత్రం, తంత్రం మూడింటికున్న అనుబంధం పరిశీలించాలి. మంత్రము అంటూ ఉంటే యంత్రమంటూ ఉంటుంది. ఈ రెండూ ఉంటే తంత్రమంటూ ఉంటుంది. ఈ మూడు కలిపితేనే ఉపాసన అని చెప్పబడుతోంది.

206. సర్వతంత్రరూపా – శ్రీ సర్వతంత్రరూపాయై నమః

ఈ నామాలు ఎంతో ఔచిత్యంగా కూర్చారు... సాక్షాత్తు వశిన్యాది వాగ్దేవతలు కనుక ఈ విధంగా కూర్చగలిగారు.

సర్వమన్త్రస్వరూపిణీ అన్నప్పుడు మంత్రములోనే చైతన్యం స్ఫురిస్తూ ఉంటుంది కనుక మంత్రస్వరూపం.

సర్వయంత్రాత్మికా – ఆత్మిక అన్నా స్వరూపమేగాని, ఇక్కడ ఆత్మిక అన్నప్పుడు వ్యాపకమై ఉండే లక్షణం తెలియజేశారు. 'రూపా' అంటే రూపించబడునది. రూపించుట అంటే తెలియజేయుట. సర్వ తంత్రముల ద్వారా తెలియజేయబడినది.

అమ్మ గురించి తంత్రముల ద్వారానే తెలుసుకోగలరు. తంత్రం అంటే అర్థం తెలుసుకోవాలి. కొంతమంది 'వానిది తాంత్రికమండి, వైదికం కాదండి' – ఇలా కబుర్లు చెప్తారు. వైదికమూ తాంత్రికమే. వైదికంగా యజ్ఞం చేయాలంటే యజ్ఞం ఎలా చెయ్యాలో తెలియాలి కదా! అదే తంత్రం. **'తన్యతే విస్తార్యతే జ్ఞానం అనేన ఇతి తంత్రం'** – తంత్రశబ్దానికి ఇదే అర్థం. దేని ద్వారా జ్ఞానం విస్తరించి చెప్పబడుతూ ఉన్నదో దాని పేరు తంత్రం. తంత్రమంటే అర్థం ఇది.

ఈ తంత్రములు వేదసమ్మతమైన తంత్రములు, వేద విరుద్ధ తంత్రములు అని రెండు రకాలు ఉన్నాయి. వేద సమ్మతమైన తంత్రమే మనకు ముక్తినిస్తుంది. ఇహపరాలను ఇస్తోంది కనుక దానిని మనం స్వీకరిస్తాం.

యంత్రం అంటే? కొన్ని గీతలు, గుండ్రాలు చుట్టడమేనా యంత్రం. అంతే కాదు. యంత్రం అంటే శక్తికేంద్రం. ఇది తెలుసుకుంటే చాలు. శక్తి ఎక్కడ ఉంటుందో దాని పేరు యంత్రం.

సృష్టిలో ఎన్ని మంత్రాలు, ఎన్ని యంత్రాలు, ఎన్ని తంత్రాలు ఉన్నాయో అన్నీ అమ్మవారి యొక్క స్వరూపములే అని చెప్పడమే 'సర్వతంత్రరూపా'.

207. మనోన్మనీ – శ్రీ మనోన్మన్యై నమః

ఈ నామంతో అద్భుతమైన స్థితిని అనుభవానికి తేబోతున్నారు. ఈ నామాలన్నీ వనదుర్గామాలామంత్ర విశేషములు అని చెప్పుకున్నాం. వనదుర్గకి సంబంధించిన 'మహావిద్య' పారాయణ చేస్తారు. మహావిద్యలో లెక్కలేనన్ని మంత్రాలు ఉంటాయి. అవి ప్రధానమైన మంత్రములు. దానికి సంబంధించినవి సర్వమంత్రాత్మిక, సర్వయంత్రాత్మిక. అందులో ఒకొక్క విద్యను బయటికి తీసి యంత్రం చేసుకోవడం చాలా కష్టం. మహావిద్య అంటే బ్రహ్మవిద్యగా చేయాలి. అంతేగాని ప్రయోగాలకి పనికి వచ్చే ఒక విద్యగా భావించవద్దు. అది రక్షణశక్తిగా పని చేస్తోంది గాని, దాని నుండి పొందవలసింది బ్రహ్మవిద్య అనేది భావన చేయాలి. బ్రహ్మవిద్యా భావనతో చేసే ఉపాసన చాలా గొప్పది. అలా కాకుండా కేవలం అభీష్ట, అభిచారిక బుద్ధితో చేసే ఉపాసన స్వల్పమే అవుతుంది. బ్రహ్మవిద్యా భావనతో చేస్తే దక్షిణాచారం. ఇంతే తేడా. అభీష్టం కోసం చేయవచ్చు. కానీ ధర్మబద్ధమైన అభీష్టం కోసం చేస్తే అది బ్రహ్మవిద్యకు సహకరిస్తుంది. ఉపాసకులకు తెలియవలసిన వనదుర్గామాలా విశేషం అంతా ఈ నామాలలో తెలియజేశారు.

మనోన్మనీ– ఇది పరాకోటికి సంబంధించిన నామం. ఇది అమ్మవారి నామం. శ్రీచక్రంలో అణువణువునా ఎన్ని దేవతాశక్తులు ఉన్నాయో లలితాసహస్రంలో ప్రతి అక్షరంలో అన్ని శక్తులు ఉన్నాయి. మనోన్మనీ అనే శబ్దం స్త్రీలింగంలో మనోన్మనీ, పుంలింగంలో మనోన్మనః. స్త్రీ లింగ, పుంలింగాలు కేవలం ఉపాధిగా చూస్తున్నాం గాని శక్తిమాత్రం ఆ పరతత్త్వమే. మనోన్మనీ అర్థం చేసుకోవాలంటే పరమేశ్వరుని యొక్క పదిశక్తులు తెలియాలి.

'వామదేవాయ నమో జ్యేష్ఠాయ నమః శ్రేష్ఠాయ నమో రుద్రాయ నమః కాలాయ నమః కలవికరణాయ నమో బలవికరణాయ నమో బలాయ నమో

బలప్రమథనాయ నమస్సర్వభూతదమనాయ నమో మనోన్మనాయ నమః' ఇందులో పదవదిగా అత్యంతికశక్తిగా ఉంది. దానిని మించి మరొకటి లేదు.

'వామదేవాయ నమః' అంటే వామదేవ అనే శక్తి ఇది. వామాశక్తి అని కూడా అంటారు. శివశక్తే కదా అమ్మవారు. శక్తిని చేర్చగానే స్త్రీలింగం అవుతుంది. వామా, జ్యేష్ఠా, రౌద్రీ వంటి అమ్మవారి నామాలు– 'వామదేవాయ నమో జ్యేష్ఠాయ నమశ్శ్రేష్ఠాయ నమో రుద్రాయ నమః కాలాయ'. ఇదే 'కాళీ'. అలాగే **'బలా, బలప్రమథనీ, సర్వభూతదమనీ, మనోన్మనీ** శక్తిని తెలియజేశారు.

ముందు వామదేవ అని ఎందుకు చెప్పారంటే వమనత్వం చేత వామం. వమనత్వం అంటే వెలిగక్కుట అని అర్థం. ఈ సృష్టినంతటిని తనలో వ్యక్తం చేయగలిగే శక్తి – వామ. 'ఒకపరి జగముల వెలినిడి ఒకపరి లోపలికి గొనుచు' – ఆ వెలినిడి అనేది వామ.

ఈ సృష్టి అంతటికి తాను అధికుడై ప్రకాశిస్తున్నాడు కనుక 'జ్యేష్ఠః'.

అధికుడు మాత్రమే కాదు, గొప్పవాడు కనుక శ్రేష్ఠః.

తరువాత ఈ జగత్తుని అంతటిని కూడా ఆయన 'రౌద్రీశక్తి'తో నియంత్రణ చేస్తున్నాడు.

అలాగే కాలస్వరూపంగా గమనించుకుంటున్నాడు. కాలమే కదా ఏది ఎప్పుడు ఎక్కడ ఎలాగ ఉండాలో నిర్ణయించేది. ఈ కాలం వికరణం అవుతోంది. వికరణం అంటే వెదజల్లుట. ఈ కాలం ఒకొక్కరికి ఒక్కోరకంగా పంచుతున్నాడు. అంతేకాక బలవికరణం చేశాడు. ఒకొక్క ఉపాధిలో ఒకొక్క రకం బలం పెట్టాడు. ఇది బలవికరణం. ఇన్ని బలాలు పెట్టినవాడు అసలు బలం వాడు. అంతేకాక ఎవరైనా ఆయన ఇచ్చిన బలం చూసి విర్రవీగితే, ఆ బలాన్ని మథనం చేసేస్తాడు. అదే బలప్రమథనం.

మొత్తానికి మొదట వామదేవ అన్నప్పుడు సృష్టిని చూపించారు, తరువాతవన్నీ స్థితి. సర్వభూతదమనాయ– అన్నీ లోపలకి లాగేశాడు. సృష్టి స్థితి, లయలన్నీ ఇందులో చూపిస్తున్నారు. ఇంత చేసినవాడు ఎవరో ఆయన – మనోన్మనః. అతని

అసలు స్వరూపం 'మనోన్మనః'. మనోన్మనః అంటే ఏమిటో చూద్దాం–

ధ్యాన ధ్యాతృ ధ్యేయ భావో యదా పశ్యతి నిర్భరం
తదోన్మనీత్వం భవతి జ్ఞానామృత నిషేవణాత్

ఇది చాలా గొప్ప విషయం. ఇది అసలు త్రిపురావిద్యను చెబుతోంది. 'మనోన్మనీ' అనేది పరావిద్య. నిజానికి శ్రీవిద్య అసలు స్వరూపం ఇక్కడ కనబడుతోంది.

సృష్టిలో ఎప్పుడూ కూడా త్రిపుటి ఉంటుంది. త్రిపుటి అంటే– ధ్యాన–ధ్యాతృ–ధ్యేయ, జ్ఞాన–జ్ఞాతృ–జ్ఞేయ. ఇలా సృష్టిలో అన్నీ మూడే. ఒక వస్తువు ఉంటే దానిని తెలుసుకునేవాడు, తెలియబడేది, తెలుసుకొనుట అనే మూడు ఉన్నాయి. ప్రపంచమంతా త్రిపుటి. ఈ త్రిపుటి ఉన్నంతకాలం ఉపాధి. ఈ త్రిపుటి యందు ఒకటే ఉందనే జ్ఞానము మాత్రము ఉండి దానిలో జ్ఞాత–జ్ఞేయం లీనమైపోవాలి. ఈ త్రిపుటి ఏకత్వం కలిగితేనే ఏకత్వానందం. అలా త్రిపుటి ఏకమైనప్పుడు కలిగే ఆనందమే **త్రిపురసుందరి**. ఆ ఏకం కావాలంటే త్రిపుటి నశించాలి కదా! అదే త్రిపురాసుర సంహారం. అది తెలియాలంటే త్రిపుటిలో వ్యాపించినది ఒక్కటే అనేది తెలుసుకోవాలి. అదే త్రివిక్రమ. త్రివిక్రమ, త్రిపురాసురసంహారం, త్రిపురసుందరి అంటే ఇంత అర్థం ఉన్నది.

ఏ స్థితికి చేరిపోయాక ధ్యానము, ధ్యాత, ధ్యేయము మూడు ఒక్కటై పోతాయో అది ఏకత్వం. అదే జీవబ్రహ్మైక్యం. ఆ స్థితికి **'మనోన్మనీ'** అని పేరు. ఆ స్థితిలో ఏకమై ఉంటున్న త్రిపురసుందరియే 'మనోన్మనీ'.

ఈ మనోన్మనీ స్థితికి చేరుకున్నాక, యోగి యొక్క స్థితి –

నేత్ర యయోన్మేష నిమేషముక్తే వాయుర్యయావర్జిత రేచపూరః
మనశ్చ సంకల్ప వికల్పశూన్యం మనోన్మనీ సా మయి సన్నిధత్తామ్

మనోన్మనీగా అమ్మవారిని ధ్యానం చేయాలి. ఆ స్థితిలో కన్నుకి రెప్పపాటు ఉండదు. దృష్టి నిశ్చలంగా నిలిచిపోతుంది. ప్రపంచాన్ని చూస్తున్నట్లు కనిపిస్తున్నా ప్రపంచాన్ని చూడదు. **అంతర్లక్ష్యం బహిర్దృష్టిః**. మునుపటి శాంభవీవిద్యలో చెప్పుకున్న స్థితియే.

'వాయుర్యయా వర్జిత రేచపూరః' – వాయువుకి రేచ పూరములు రెండూ ఉండవు అంటే కుంభక స్థితిలో ఉండిపోతుంది. ఆ స్థితి సాధకునికి ఊహ మాత్రమే, సిద్ధునికి అనుభవం. ఇది క్షణం దొరికినా ఆ స్థితి వేరు. అంతిమలక్ష్యం అదేనని చెప్పడం మాత్రం ఇక్కడ జరుగుతోంది తప్ప మరొకటి కాదు.

'వామదేవాయ నమో జ్యేష్ఠాయ నమః' అనేది సాధారణం కాదు. అందులో సృష్టి, స్థితి లయకారకుడైన పరమాత్మ సృష్టి, స్థితి లయలకి అతీతమైన త్రిపుటి ఏకత్వంలో భాసిస్తున్నాడు అని చెప్తున్నది ఆ మంత్రం.

ఆ సమయంలో మనస్సు **'మనశ్చ సంకల్ప వికల్ప శూన్యం'** – మనస్సుకు సంకల్పం లేదు, వికల్పం ఉండదు. **అచలోయం సనాతనః** – అది అచలస్థితి. అది మనోలయ స్థితి.

సరిగ్గా ఇది ఎక్కడ ఉంటుందంటే, మూలాధారాది ఆరు చక్రాలలో, ఆజ్ఞాచక్రానికి–సహస్రారానికి నడుమ కొన్ని భూమికలున్నాయి. అక్కడ దాకా వెళ్ళాక ఆ పైన స్థితి మధురమైనది. అక్కడ ఉండే శక్తులు – వామా, జ్యేష్ఠా, రౌద్రీ శక్తులు. ఇది చక్రన్యాసం చేసేటప్పుడు శ్రీవిద్యలో చేసుకుంటారు. ఆజ్ఞ వరకూ వచ్చేశాక, అక్కడ నుండి అత్యంత సూక్ష్మంగా ప్రతిచోట అంగుళం ప్రమాణంలో పైకి వెళ్తూ ఒకొక్క శక్తిని దాటుతూ సహస్రారంలో బిందువు దగ్గరికి వచ్చేటప్పటికి అక్కడ చెప్పే పేరు మనోన్మనీ. ఆ స్థితిలో భూమిక పరమాత్మలో లయం అయినది.

ఈ నామాన్ని భావన చేస్తుంటేనే భావించే మనస్సు అమ్మతో తాదాత్మ్యం చెందుతుంది. సారంగా – ప్రాపంచికమైన తాదాత్మ్యాన్ని వదలి పరమాత్మలో తాదాత్మ్యం పొందేస్థితిని మనోన్మనీ అని అంటారు.

సంకల్ప వికల్ప శూన్యమే శివశక్తి సమ్మేళనమై అహోరాత్ర భేదరహితమై ఆ చంద్రమండల సమీపానికి చేరినప్పటి స్థితి – మనోన్మనీ.

భ్రూమధ్యం నుండి లెక్కగడితే ఇది ఎనిమిదవ స్థానం. ఆ పై స్థానం బిందువు. శ్రీచక్రంలో త్రికోణం దాటి వెళ్ళిపోయిన తరువాత ఆ బిందువు యొక్క కొనకి చేరడానికి మధ్యలో ఇన్ని ఉంటాయి. ఇది యోగంతోనైనా తెలుసుకోవాలి

లేదా ఉపాసనతోనైనా తెలుసుకోవాలి, శ్రీచక్ర మననంతోనైనా తెలుసుకోవాలి. అది పరమమైన స్థితి. అది ఉందని చెప్పుకుని, భావనతో గ్రహించడమే ఈ స్థితిలో చెయ్యగలిగేది. ఆ స్థితిలో ఉన్న తల్లి. అదే మహేశ్వరుని యొక్క తత్త్వం కనుక 'మాహేశ్వరీ'. కనుకనే తరువాత నామములు–'మాహేశ్వరీ', 'మహాదేవీ'.

208. మాహేశ్వరీ - శ్రీ మాహేశ్వర్యై నమః

'మాయాంతు ప్రకృతిం విద్యాం మాయినంతు మహేశ్వరమ్'. ప్రకృతికి మాయ అని పేరు. ఈ మాయ ఎవరి అధీనంలో ఉందో అతడు మహేశ్వరుడు. ఆ మహేశ్వరునికి, మాహేశ్వరికి భేదం లేదు. ఆ తల్లే ప్రకృతి రూపంగా ఉన్నప్పుడు మాయ. ఆ తల్లి ప్రకృతికి అతీతంగా ఉన్నప్పుడు, ప్రకృతిని నియంత్రించేటప్పుడు మాహేశ్వరీ. ఎవరైతే మనోన్మనీ స్థితికి చేరుతారో వారి అధీనంలో ప్రకృతి అంతా ఉంటుంది. ఇదీ గమనించుకోవలసినది. కనుక మహేశ్వర శబ్దం ఇక్కడ ఈ విధంగా వివరించబడుతోంది.

గుణాతీతుడైన ఈశ్వరుడు సృష్టి, స్థితి కారకుడై నియంత్రించేటప్పుడు మహేశ్వరునిగా చెప్పబడుతున్నాడు. ఈ మహేశ్వరుడే ఓంకార స్వరూపమని, ఆ ఓంకార స్వరూపమే వేదమునకు ఆది యందు, చివర కూడా చెప్పబడుతున్నది.

"యో వేదాదౌ స్వరః ప్రోక్తో వేదాంతేచ ప్రతిష్ఠితః। తస్య ప్రకృతి లీనస్య యః పరః స మహేశ్వరః"

ఆ స్థితికి చేరినప్పుడు అదే ప్రకృతిలీన స్థితి. మనోన్మనీ నామంలో అదే వివరించారు.

209. మహాదేవీ – శ్రీ మహాదేవ్యై నమః

మహేశ్వరుని శక్తి మాహేశ్వరి. మహాదేవుని శక్తి మహాదేవి. శివనామాలు ఎన్నో వస్తున్నాయి. అందుకే లలితాసహస్రం పుంలింగంలో చెబితే శివసహస్రం. కామేశ్వరీ సహస్రం, కామేశ్వర సహస్రం కూడా లలితాసహస్రమే. దాని యందు

పుంలింగాలు కామేశ్వరః, స్త్రీ లింగాలు కామేశ్వరీ. కామకామేశ్వరీ సహస్రమే లలితాసహస్రనామ స్తోత్రం.

'మహా' అనే పదంతోనే ఆవిడ గొప్పతనం తెలియజేస్తున్నారు. మహచ్ఛబ్దం, సర్వశబ్దం బ్రహ్మమునకు వాడతారు. శాస్త్రమునందు పరబ్రహ్మమునే 'మహా' అని, 'సర్వ' అని పేర్కొన్నారు. ఇంతవరకు సర్వశబ్దం చెప్పుకున్నాం. సర్వశబ్దం మనోన్మనీ దగ్గర ఆగిపోయింది. ఇప్పుడు 'మాహేశ్వరీ' మొదలవుతోంది. ఇక్కడ నుండి 'మహా' అనే నామాలు ఇరవైఆరు వస్తాయి.

'మాహేశ్వరీ, మహాదేవీ, మహాలక్ష్మీర్మృడప్రియా' – ఇక్కడి వరకు వనదుర్గా మాలా విద్య.

భవానీ, శర్వాణీ నామాల గురించి చెప్పినప్పుడు ఆయా అష్టమూర్తి నామాలు తెలియజేయడమయింది. అందులో మహదేవ అనేది అష్టమూర్తులలో చంద్రుని తెలిపే నామం. **మహతే దేవాయ నమః, మహాదేవాయ చంద్రమూర్తయే నమః.** ఆయన చంద్రమూర్తి అయినప్పుడు, ఆవిడ రోహిణి అవుతున్నది. మహాదేవీ అంటే చంద్రరూపుడైన పరమేశ్వరునకు పత్ని. అది సాధారణ చంద్ర కాదు, మనోన్మనీ దాకా వచ్చాం కనుక అక్కడ ఉన్న సహస్రాంతర్గతమైన చంద్రస్వరూపం. అన్నింటిని దాటిపోయి ఉన్న శక్తి కనుక మహాదేవః–మహాదేవీ.

అంతేకాదు.. అమ్మవారు 'దేవి'. ఆ తల్లిని దేవీభాగవతం, దేవీపురాణం, దేవీసూక్తం, **'యా దేవీ సర్వభూతేషు' 'ప్రణోదేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ', 'దుర్గాం దేవీగ్ం శరణమహం ప్రపద్యే'.** ఎక్కడ చూసినా 'దేవీ'. అమ్మవారికి అసలు పేరు దేవీ. అయితే దేవి అంటే ఒక చిక్కు ఉంది. ఎంతమందో దేవతలున్నారు. అందరి దేవతల్లో ఆవిడ కూడా ఒకరు అనడానికి లేదు. దేవతలకే దేవి కనుక 'మహాదేవి' అంటూ –

నమో దేవ్యై మహాదేవ్యై శివాయై సతతం నమః
నమః ప్రకృత్యై భద్రాయై నియతాః ప్రణతాస్స్మ తామ్

'నమో దేవ్యై' అని అక్కడికి ఊరుకోకుండా 'మహాదేవ్యై' అనడంలో దేవతలకి

కూడా దేవతవి అని అర్థం.

అంతే కాక లలితాసహస్రంలో మొత్తం అన్ని శక్తిపీఠాల దేవతలు ఉన్నారు. గండకీ నదీ తీరంలో చక్రతీర్థం దగ్గర ఉన్న అమ్మవారి శక్తిపీఠం పేరు 'మహాదేవి'. 'సాలగ్రామే మహాదేవీ' అని వివరించబడుతోంది.

210.మహాలక్ష్మీః - శ్రీ మహాలక్ష్మ్యై నమః

లక్షించేది (చూచేది), లక్షింపబడేది (చూడబడేది) అని రెండు అర్థములు. ఆవిడ కన్నులతో ప్రపంచాన్ని శాసిస్తోంది. కనుకనే 'కామాక్షీ', 'మీనాక్షీ'.

అంతేకాక దేనియందు లక్ష్యం ఉందో అది లక్ష్మి. ప్రతివాడు ఏదో గొప్పదాని యందే లక్ష్యం పెట్టుకుంటాడు. దృష్టి దేనియందు పెడతారో అదే 'లక్ష్మి'. ఎప్పుడైతే ఒకటి కావాలనుకుంటున్నారో.. ఆ కావాలి అనిపించే ఆనందం, గొప్పతనం 'లక్ష్మి'.

ఆ ఆనందం మనం దృష్టి పెట్టినంతమాత్రాన లభించదు. ఆవిడ మనయందు కృపాదృష్టి పెడితే గాని లభించదు. మనం లక్షించేది మనలను లక్షిస్తే గాని మనకు దొరకదు. ఆవిడ మనలను చూడాలి అంటే అనుగ్రహించాలి అని అర్థం. అది లక్ష్మి. శంకరభగవత్పాదులవారు ఐశ్వర్యం కావాలి, ఇంకేదో కావాలి అని ఏమీ అడగకుండా "ఒక్కసారి చూస్తే చాలు" అన్నారు. చూస్తే కనకధార - అదే కురుస్తుంది అన్నారు.

అఙ్గం హరేః పులకభూషణమాశ్రయన్తీ
భృఙ్గాఙ్గనేవ ముకుళాభరణం తమాలమ్
అఙ్గీకృతాఖిల విభూతిరపాఙ్గలీలా
మాఙ్గల్యదాఽస్తు మమ మఙ్గళ దేవతాయాః

'అపాఙ్గలీల' - ఆవిడ లక్షిస్తే చాలు. ఆవిడ లక్ష్మి.

మహాలక్ష్మి నామానికి దేవీభాగవతంలో నిర్వచనం -

లక్ష్యతే దృశ్యతే విశ్వం స్నిగ్ధదృష్ట్యా యయాఽనిశం
దేవీ భూతాశ్చ మహతీ మహాలక్ష్మీస్తథోచ్యతే.. (దేవీభాగవతం).

ఈ ప్రపంచాన్ని అంతటిని ఏ తల్లి కరుణామయమైన చూపులతో చూస్తోందో

ఆ తల్లి లక్ష్మి. ఆవిడ చూడకపోతే ప్రపంచము ఉండదు.

శంకరభగవత్పాదులవారు ఒక మాట అంటారు– "అమ్మా! నీ ముందు నిలబడి నేను గంటలకొలది పరిశీలిస్తున్నాను. నువ్వు కనురెప్ప వేయలేదేమమ్మా?" అని అడిగారు. ఆయనకి సమాధానం దొరికిపోయింది గాని లేకపోతే ఆవిడ చెప్తుంది ''నేను మూస్తే నువ్వు ఉండవురా'' అని. ఎందుకంటే 'ఉన్మేషనిమిషోత్పన్నవిపన్నభువనావళిః' – మరో నామం.

ఆవిడ కనురెప్ప మూస్తే ప్రపంచం శూన్యం. కనురెప్ప తెరిస్తే ఉంది. మూయకుండా ఉంది కనుక అలా చూస్తోంది మొత్తం. మనం కనురెప్ప మూసేలోపల అనేక క్రిమికీటకాలకి ఆయువు అయిపోతుంది. దేవతలు కనురెప్పలు మూసే లోపల మన ఆయువులు అయిపోతాయి. దేవతల ఆయువులు బ్రహ్మగారు రెప్పవేసే లోపల అయిపోతాయి. అలాంటి బ్రహ్మల ఆయువులు అమ్మ ఒక్కరెప్ప వేసే లోపల అయిపోతాయి.

అందుకు ఆ తల్లి కంటికి రెప్పవేయకుండా అలా చూస్తూ ఉంది. ఊరికినే చూడటం కాదు. 'స్నిగ్ధ దృష్ట్యా' – వాత్సల్యంతో చూస్తోంది. ఆవిడ చూస్తూ ఉంటే ఆ చూపుల్లోంచి శక్తి వచ్చి ప్రపంచమంతా శక్తిమంతమై నడుస్తోంది. 'స్నిగ్ధదృష్ట్యా లక్ష్యతే విశ్వం' తన యొక్క కరుణామయమైన చూపులతో ఈ ప్రపంచాన్ని ఎవరు చూస్తున్నారో ఆవిడ 'లక్ష్మి'. 'దేవీ భూతాశ్చ మహతీ' – దేవతలలోకెల్లా గొప్ప ఆవిడ కనుక 'మహా'. కనుక 'మహాలక్ష్మి' అని దేవీ భాగవతం వివరించింది.

అయితే మహాలక్ష్మి అంటే విష్ణుపత్ని అయిన మహాలక్ష్మియేనా? ఇందులో సందేహం లేదు. ఆ తల్లికి నమస్కారం చేస్తాం. విష్ణుపత్ని అయిన మహాలక్ష్మి, బ్రహ్మపత్ని అయిన సరస్వతి అన్నీ అమ్మవారే. అన్ని నామాలు ఇక్కడ ఉన్నాయి. ఆ మాటకొస్తే బ్రహ్మ, విష్ణువు, శివుడు కూడా ఒక్కరేగా. ఒకే ఈశ్వరుడు మూడు అయ్యాడు. ఒకే ఈశ్వరశక్తి మూడు అయ్యింది. ఆ ఎరుక ఎప్పుడూ ఉండాలి. కానీ లక్ష్మి పరమేశ్వరుని శక్తి అని అర్థం తీసుకోవాలి.

శాస్త్రాలలో గణపతిలో లక్ష్మీగణపతి అనేది ఉంది. అందులో గణపతి

పరమేశ్వరుడు, లక్ష్మి ఆయన శక్తి. ఆ మాటకొస్తే 'యాదేవీ సర్వభూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా' ప్రతీవానిలోనూ లక్ష్మి ఉంది. వాని శక్తి వానికి లక్ష్మి. అది లేకపోతే వానిని ఎవ్వరూ చూడరు కదా. మనం సృష్టిలో దేనివల్ల పోషింపబడుతున్నామో, దేని వల్ల గుర్తింపబడుతున్నామో ఆ శక్తికే లక్ష్మి అని పేరు. ప్రతివానికి వాని లక్ష్మి వానికి ఉండాలి. ఆ లక్ష్మి ఉన్నంత కాలమే ఉనికి. కనుక సృష్టి అంతా వ్యాపించి ఉంది లక్ష్మి, అలాగే పరమేశ్వరుని శక్తి ఏ రూపమైనా ఆవిడ పేరు లక్ష్మే.

211. మృడప్రియా – శ్రీ మృడప్రియాయై నమః

మృడప్రియా అంటే శివప్రియా. శివప్రియా మహాలక్ష్మి ఎలా అవుతుంది అంటే సాధారణ పురాణకథలతో చూస్తే అర్థం కాదు. ఈ నామానికి పరమార్థ దృష్టితో చూస్తే తెలుస్తుంది. **'తస్యాంకమండలారూఢాం శక్తిర్మాహేశ్వరీ పరా, మహాలక్ష్మీరితిఖ్యాతా శ్యామా సర్వమనోహరా'**(శివపురాణం) – కైలాసంలో పరమేశ్వరుని యొక్క ఎడమతొడపై కూర్చున్న శ్యామా అయిన తల్లిని మహాలక్ష్మి అంటారు అని శాస్త్రం చెప్తున్నది. అంటే శివుని ఒళ్ళో కూర్చున్న లక్ష్మి.

శ్యామా అంటే చామనచాయ కలిగిన తల్లి మాత్రమే కాదు. **'శ్యామా షోడశవార్షికీ'** –పదహారు ఏళ్ళ వయస్సులో ఉన్న స్త్రీని **'శ్యామా'** అనాలి. శివుని ఒళ్ళో కూర్చున్న తల్లి 'షోడశీ' అయిన శక్తియే. ఆవిడే మహాలక్ష్మి అని చెప్పబడుతోంది. ఈవిడకి పేరు సరిగ్గా తెలియాలంటే సప్తశతీ పారాయణ చేశాక మూర్తిరహస్యం అని చదువుతారు. అందులో మొదట ఉన్నది ఒక మహాలక్ష్మి, ఆవిడ నుండి మూడు శక్తులు వచ్చాయి అని వివరిస్తారు. ఆ ఆద్యాలక్ష్మియే సర్వశక్తులకు మూలమైన శక్తి. ఆవిడ నుండే సర్వవిశ్వము వచ్చిందని... ఆదిశక్తినే మహాలక్ష్మి అని అన్నారు. మార్కండేయ పురాణంలో **'సర్వాసాద్యా మహాలక్ష్మీః త్రిగుణా సా వ్యవస్థితా'** అని వర్ణిస్తున్నారు. ఆవిడ ఆద్యాలక్ష్మి అయిన దేవత.

ఆద్యాలక్ష్మిని తెలియజేసే లక్ష్మీహృదయమని ఒక అద్భుతమైన శాస్త్రం ఉంది. ఆ ఆద్యాలక్ష్మిని విష్ణుపత్ని అంటే తప్పేం లేదు. ఎందుకంటే విష్ణువే

నారాయణుడు, పరమేశ్వరుడు. ఆ భావంతో అది సమంజసమే. కానీ ఆద్యాలక్ష్మి అంటే సరస్వతి, లక్ష్మి, గౌరి మూడు శక్తులూ ఆవిడే. ఈ ఆద్యాలక్ష్మిని ఉద్దేశించే లక్ష్మీసహస్రనామస్తోత్రం కూడా ఉంది. అది పట్టుకుంటే మళ్ళీ లలితాసహస్రం అంత అవుతుంది. అందులో 'రుద్రైకాదశనీ' అనే ఒక నామం కూడా ఉంది. మహాలక్ష్మి అంటే పరాశక్తి అని ఇక్కడ అర్థం.

మృడేశ్వరుడు అనే నామంతో శివుడు గోకర్ణం దగ్గర నెలకొని ఉన్నాడు. మృడ అనే నామం రుద్రంలో చాలా మార్లు వస్తూ ఉంటుంది. మృడ అంటే ఆనంద స్వరూపం. 'మృడయ' అంటే ఆనందింపజేయు అని అర్థం. ఆనందస్వరూపుడు శివుడు.

మాహేశ్వరీ, మహాదేవీ, శర్వాణీ, శాంభవీ, భవానీ... అలా శివునికి పూర్తిగా అభిన్నమైన తత్త్వాన్ని సమయాచారంగా ప్రవహింపజేస్తున్నారు. ఇది నామసామ్య దృష్టి.

మృడా అనగా ఆనందస్వరూపుడు. లోకంలో మనం మనుష్యానందం నుంచి బ్రహ్మానందం వరకూ చెప్పబడే అన్ని ఆనందాలు ఆయన రూపమే. ఆయన సర్వానందరూపుడు. ఆయన యొక్క ప్రియమైన శక్తి ఈవిడ. ప్రియమన్నా ఆనందమనే అర్థం. అస్తి-భాతి-ప్రియం-సత్-చిత్-ఆనందం. 'మృడప్రియా' అంటే ఆనందస్వరూపుడైన పరమేశ్వరునికే ఆనందం కలిగించేది అమ్మవారు. ఆనందస్వరూపుని యొక్క ఆనందస్వరూపం అనే భావాన్ని శ్రీనాథమహాకవి ఇలా తెలియజేశారు.

అర్ధశశిభూషణుడు స్వయం ప్రబుద్ధుడు ఉన్నతుడు నిత్యోన్నత జ్యోతి
అతని సంతతానందశక్తి ఆ సరసిజాక్షి విశ్వజనయిత్రి వారికి వేరు లేదు

విశ్వజనయిత్రి, అతని సంతత ఆనందశక్తి. ఇప్పటివరకు సామాన్య అంశములు కాకుండా దివ్యమైన విశేషములతో నామములయందు మనం ఆ తల్లి యొక్క భవ్యమైన వనదుర్గా మాలా విశేషములను పరిశీలిస్తూనే, శ్రీవిద్యాపరదేవతా మనోన్మనీ దేవతని ఇందులో ఆవిష్కరించుకున్నాం.

ఇక్కడ నుండి వరుసగా 14 నామాలు వస్తాయి. ఈ 14 నామాలు దుర్గాసప్తశతీ అని చెప్పబడుతున్న దాంట్లో ఉన్న మాలామంత్ర విశేషములు. అందుకే

13 అధ్యాయాలలో ఉండే శక్తులు 13 చెప్పి, సమష్టిగా మరొకటి చెప్పి 14 నామములు(212–225 వరకు) అయ్యాయి. వరుసగా 'మహారూపా' నుండి 'మహాయోగేశ్వరేశ్వరీ' వరకు. ఇదొక రహస్యం.

దేవీమాహాత్మ్యం(దుర్గాసప్తశతీ)లో 13 అధ్యాయాలు. పదమూడు అధ్యాయాలలో బీజాక్షరములు ఎన్ని శ్లోకాలో అన్ని బీజాక్షరములు ఉన్నాయి. ఇది కాకుండా సమష్టిగా అధ్యాయానికో బీజాక్షరం ఉన్నది. ఆ బీజాక్షర శక్తులన్నీ 'మహారూపా' నుంచి 'మహాయోగీశ్వరేశ్వరీ' వరకూ ఉన్నాయి. మహా శబ్దమంతా అమ్మవారిని వివరిస్తున్నది. అందుకని దుర్గానామం నుండి క్రమంగా మనకి సర్వనామంలోకి తీసుకు వెళ్ళి సర్వ నుంచి మహానామంలోకి, మహానామం నుంచి వరుసగా వనదుర్గా స్వరూపాన్ని చూపించి, ఇప్పుడు దుర్గా సప్తశతీ మంత్రవిశేషంలోకి తీసుకువెళుతున్నారు. సప్తశతిలో ఉన్న అనేక భావాలు గోచరిస్తూ ఉంటాయి. అది మహారూపా నుంచి మహాయోగేశ్వరేశ్వరీ వరకూ 14 నామాలు ఇక్కడ చెప్పబడుతూ ఉంటాయి.

వనదుర్గా మాలా మంత్రవిశేషాలు. ఇలా మంత్రవిద్య ఫలానా నామాలతో ఉంది అనడానికి ప్రమాణం ఏమిటి? అక్కడ స్పష్టంగా చెప్పారా? కొన్ని చోట్ల అయితే బీజాక్షరాలు ద్యోతకమౌతాయి. కొన్ని చోట్ల బీజాక్షరాలు కనబడవు. మరి ఎలా చెప్పగలం? ఏదో తోచినట్లు చెప్పామా అంటే పరంపరలో ఉపాసకులు అయినవారు సిద్ధిపొంది ఫలానా నామాలలో ఫలానా మంత్రములు ఉన్నాయని ఏవి ప్రమాణంగా చూపించారో వాటినే ఇక్కడ చెప్పడం జరుగుతోంది. కొన్ని చోట్ల బీజాక్షరరూపములలో ఉంటే, కొన్ని చోట్ల అర్థభావనతో ఉంటాయి.

ఒకొక్క మంత్రానికి ఒకొక్క భావం ఉంటుంది. ఆ భావం ఏ నామాలలో కనబడుతుందో, ఆ నామాలలో ఆ మంత్రం నిక్షిప్తం చేయబడింది అని మంత్రసిద్ధులు అయినవారు చూపించిందే మనం ఇక్కడ ప్రస్తావన చేసుకుంటున్నాం. కనుకనే ప్రతిచోటా ఎలా బీజాక్షరములు ఉన్నాయి అని వెతకనవసరం లేదు. అర్థస్ఫురణగా గ్రహించవలసినదే.

212. మహారూపా – శ్రీ మహారూపాయై నమః

అమ్మరూపం మహారూపం అన్నారు. నిజానికి అమ్మకి రూపమున్నదా అంటే తత్త్వస్వరూపం అనుగ్రహించడం కోసం దివ్యనామ, దివ్యరూపములు స్వీకరించింది. అమ్మకున్న రూపములన్నీ కూడా ప్రకృతితో కూడిన రూపములు కావు. ప్రకృతికి అతీతమైనవి అని చెప్పడం కోసం మహా అనే శబ్దాన్ని ప్రయోగించారు. దేవత యొక్క రూపం తేజోమయమైనది. తాను తన ఇచ్ఛతో భక్తులను అనుగ్రహించడానికి స్వీకరించిన కరుణామయమైన విగ్రహం. ఆ స్వరూపానికి తన యొక్క బ్రహ్మతత్త్వానికి ఏమీ భేదం లేదు. మహా శబ్దం ఎక్కడ వచ్చినా గొప్ప, పెద్ద అనే అర్థంలోనూ, పరబ్రహ్మ అనే అర్థంలోనూ వాడతారు.

మహా అన్నా, బ్రహ్మమన్నా పెద్దదనే అర్థం. **'బృహత్వాత్ బృంహణత్వాత్ బ్రహ్మ'**. అమ్మ ధరించిన రూపం ఆ పరబ్రహ్మ తత్త్వమే. అది గొప్ప రూపం. గొప్పది అంటే ఇతర రూపములకు ఉన్న దోషములు లేవు కనుక గొప్పది, పరిమితిలో పెట్టి చూడలేము కనుక పెద్దది.

పైగా మహాశబ్దం ఎప్పుడు వాడాలి అనేదానికి శాస్త్రంలో ఒక ప్రమాణం ఉన్నది. పురుషుడు, ప్రధానము, వ్యక్తము, కాలము – ఈ నాలుగింటికి అతీతంగా ఏది ఉన్నదో దానికి 'మహా' అని అనాలి. 'పురుషుడు' అన్నప్పుడు ఇక్కడ జీవుడని ఒక అర్థం. అదే విధంగా సృష్టి చేయాలని సంకల్పించుకున్న పరమపురుషుడు. దాని తరువాత వచ్చినది– 'ప్రధానము'. ప్రధానమంటే అవ్యక్తమైన ప్రకృతి, దాని నుండి వచ్చినది వ్యక్తమైన ప్రకృతి. తరువాత 'కాలం'. అన్నీ దీనికి లోబడి ఉంటాయి.

పురుష, ప్రధాన, వ్యక్త, కాలములు ప్రకృతికి సంబంధించినవి. ఇవి అన్నీ అమ్మ రూపములే. కానీ అమ్మ యొక్క అసలు రూపము వీటికి అతీతంగా ఉన్నది కనుక మహా.

విరాడ్విగ్రహా అన్నప్పుడు ఎంతని ఊహించగలరు? మన లెక్కకు అందదు. దేవతలందరి ప్రార్థన విని మహిషాసుర సంహారం కోసం అమ్మవారు ఒకసారి ఉద్భవించింది. కాంతిపుంజంగా ఉద్భవించినప్పుడు ఎలా ఉన్నది అంటే –

స దదర్శ తతో దేవీం వ్యాప్తలోకత్రయాం త్విషా
పాదాక్రాంత్యా నతభువం కిరీటోల్లిఖితామ్బరామ్
క్షోభితాశేషపాతాళాం ధనుర్జ్యానిఃస్వనేన తామ్
దిశోభుజ సహస్రేణ సమన్తాద్వ్యాప్య సంస్థితామ్

అని 'దేవీమాహాత్మ్యం' వర్ణించింది. అమ్మ నుండి వచ్చే తేజస్సుతో మూడు లోకాలు వెలిగిపోతున్నాయి. కిరీటం ఆకాశాన్ని రాసుకుంటోంది.

ఇక 'క్షోభితాశేషపాతాళాం' – ఆ పాదముల యొక్క బరువుకి పాతాళ లోకములు క్షోభ పడుతున్నాయి. 'దిశోభుజ సహస్రేణ' వేలకొలది చేతులతో దిక్కులంతా వ్యాపించి ఉన్నది. 'సమంతాత్ వ్యాప్య సంస్థితామ్' అన్నప్పుడు మహారూపమే కదా.

213. మహాపూజ్యా – శ్రీ మహాపూజ్యాయై నమః

గొప్పగా పూజింపబడే తల్లి. గొప్పవారి చేత పూజింపబడే తల్లి. మనందరికి దేవతలు, ఋషులు వందనీయులు. ఆ దేవతలు, ఋషులు కూడా అమ్మవారిని ఆరాధన చేస్తారు. వారందరి చేత పూజింపబడుతోంది కనుక 'మహాపూజ్యా'. పైగా వారు గొప్పగా పూజిస్తారు. గొప్పగా పూజించదానికి తగిన స్వరూపం. బ్రహ్మ విష్ణు రుద్ర ఇంద్ర అగ్ని సూర్యాదులు మంత్రరూపిణిగా వివిధ ప్రతిమాదులలో ఆరాధిస్తారని శాస్త్రప్రమాణం.

214. మహాపాతకనాశినీ – శ్రీ మహాపాతకనాశిన్యై నమః

ఆ పూజించే వారు పాతకాలు లేని మహాత్ములు. అలాంటి తల్లిని ఎవరు స్మరణ చేస్తారో, ఎవరు ఆరాధన చేస్తారో వారి పాతకాలు పోతాయి. పాతకాలు అంటే మహాపాతకాలు, ఉపపాతకాలు, సంకలీకరణ పాతకాలు, మలినీకరణ పాతకాలు, అపాత్రీకరణములు, జాతిభ్రంశకరములు – ఇలాంటివి చాలా ఉంటాయి. ఎప్పుడైనా కాశీ వెళ్ళి మణికర్ణికలో స్నానం చేస్తూంటే అక్కడ సంకల్పంలో ఈ చిట్టా

చెప్తారు. ముందు పాపాల చిట్టా అంతా ఉంటుంది. ఇన్ని ఉన్నాయా అని భయం వేసి మరోసారి గంగలో మునిగిపోతాం.

వీటన్నింటికి రకరకాల ప్రాయశ్చిత్తాలు ఉన్నాయి. తెలిసినంత మేరకు చేసుకోవాలి. భాగవతంలో చెప్పిన విషయం: ప్రాయశ్చిత్త కర్మలు ఎన్ని చేసినప్పటికి అవి పాపాలను పైపైన తీస్తాయిగాని పాపాలకు మూలమైన సంస్కారాలను తీయవు. పాపసంస్కారాలతో సహా పాపాలను తీయగలిగే శక్తి అమ్మవారికి ఉంది.

మహాపాతకాలను కూడా నశింపజేస్తుంది. ఈ మాట తెలుసుకుని అమ్మవారిని ఆరాధిస్తే ఇంకేం పాతకాలు మిగులుతాయి? '**బ్రహ్మహత్యాశతంవాపి శివపూజా వినాశయేత్**' (బ్రహ్మోత్తరఖండం)- బ్రహ్మహత్యాది వందలకొలది పాపములు చేసినా శివపూజ వలన తొలగుతున్నాయి. శివ పూజ, శివా పూజ రెండూ ఒకటే.

'**కృతస్య అఖిల పాపస్య జ్ఞానతోఽజ్ఞానతోఽపివా। ప్రాయశ్చిత్తం పరం ప్రోక్తం పరాశక్తేః పదస్మృతిః**' అని బ్రహ్మాండపురాణ వాక్యం. తెలిసీ, తెలియక చేసిన పాపాలు ఉంటాయి. ఒక్కసారి అమ్మ పాదాలను స్మరిస్తే చాలు ఇన్ని రకాలుగా చేసిన పాపాలను అన్నిటినీ, మొత్తం దహనం చేస్తున్నది. 'మహాపాతకనాశినీ'.

ఇందులో ఉన్న ఆంతర్యం మరొకటి పరిశీలించాలి. ప్రాయశ్చిత్త విధుల్లో చెప్పబడుతున్న మంత్రములన్నీ కూడా రకరకాల పాపములు పోగొట్టే రకరకాల దేవతాస్మరణములు. ప్రాయశ్చిత్త మంత్రాలలో చెప్పబడ్డ ఆ దేవతలందరి యొక్క సమష్టిరూపం అమ్మవారు. అందుకు సమష్టిరూపిణి అయిన అమ్మవారిని ఆరాధన చేస్తే ప్రాయశ్చిత్తరూపంలో మనల్ని అనుగ్రహించే దేవతలందరి కృప లభించినట్లే.

215. మహామాయా – శ్రీ మహామాయాయై నమః

'**నమస్తేస్తు మహామాయే శ్రీపీఠే సురపూజితే**' – శ్రీపీఠే అన్నప్పుడే శ్రీచక్రమునందు ఉన్న తల్లి మహామాయే. మాయ అనేది పరమేశ్వరుని యొక్క శక్తి విశేషం. ఆయన శక్తి చేతనే ఆయనను మనం తెలుసుకోలేకపోతున్నాం.

తెలుసుకోవాలంటే మళ్ళీ ఆయన శక్తి చేతనే తెలుసుకోవాలి.

తెలియనీయకుండా చేస్తున్నది ఆయన మాయే. తెలుసుకోవాలన్నా ఆయన మాయే అనుగ్రహించాలి. తెలియనీయకుండా చేస్తున్నప్పుడు అవిద్య. తెలుసుకునేటట్లు చేస్తున్నప్పుడు విద్య. రెండూ అదే. ఇది ఎలాగంటే మనం సూర్యుని చూద్దామని ఒక్కసారి తల ఎత్తితే ఆయన్ని పరిశీలనగా చూడగలమా! ఎందుకు చూడలేం! ఆయన నుంచి వచ్చిన కాంతి వల్లే ఆయనను చూడలేకపోతున్నాం.

అలాగే పరమేశ్వరుని యొక్క శక్తి విశ్వరూపంగా ఇంత వ్యాపించగానే అనేకమైన ఈ విశ్వాన్ని చూస్తూ దీని మూలమైన ఏకాన్ని పట్టుకోలేకపోతున్నాం. దానికి మళ్ళీ ఆయన అనుగ్రహమే కావాలి.

మాయ గురించి వేదాంతుల మాయ, శాక్తేయుల మాయ... ఇలా రకరకాలుగా నిర్వచనములున్నాయి. ఇవన్నీ తెలుసుకుని అయోమయంలో పడేకంటె భక్తికి ఎంత అవసరమో అంత తెలుసుకుంటే చాలు.

మాయ అంటే '**విచిత్రకార్యకరీ శక్తిః**'. అంటే ఈ సృష్టి, స్థితి లయలు అనేవి పరమాత్మ ఎలా చేస్తున్నాడో ఆలోచిస్తే ఆశ్చర్యం అనిపిస్తుంది. అలాంటి ఆశ్చర్యకరమైన శక్తి ఆయనది. ఆ శక్తే మాయ.

'నానావిధ చిత్ర జగన్నిర్మాణ సామర్థ్య బుద్ధిరూపా సమనియతగుణా బ్రహ్మశక్తిః' – ఇది 'మాయ'కి నిర్వచనం. నానా విధములైన చిత్రజగత్తుని నిర్మించగలిగిన పరమేశ్వరుని యొక్క ఆ మాయ, లోకాలను 'సమనియతగుణ' – ఏది ఎక్కడ ఎలా నడపాలో చూసుకుంటున్న శక్తి. అది 'బ్రహ్మశక్తిః' – పరమాత్మ యొక్క శక్తే. ఇది 'మహామాయా'.

అంతేకాదు– ఈ మాయ ఎంత గొప్పదంటే, 'జయించాను' అని గట్టిగా అంటే వెంటనే కిందకి లాగేస్తుంది. జయించాను అన్నవానికి ఇంకా మాయ ఉందని అర్థం. లేని దానిని జయించడం ఏమిటి? 'అది ఉందా, లేదా' అని నిర్వచించలేం కనుక అది మాయ.

జ్ఞానినామపి చేతాంసి దేవీ భగవతీ హి సా

బలాదాకృష్య మోహాయ మహామాయా ప్రయచ్ఛతి (దేవీమాహాత్మ్యం)

జ్ఞానుల యొక్క చిత్తాన్ని కూడా లాగగలదు. ఇక్కడ కొంచెం వ్యాఖ్యాతలు చాలా జాగ్రత్తగా చెప్పారు. శాస్త్రం సుష్ఠుగా అధ్యయనం చేసేవానికి ఇలాంటి సందేహాలు వస్తాయి.

"జ్ఞానస్థితికి వెళ్ళిపోయిన వారికి మళ్ళీ మాయ ఉంటుందా" - అంటే, ఇక్కడ వ్యాఖ్యాతలు, "అపరోక్షజ్ఞానం పొందిన వారికి మాయ లేదు. కానీ పరోక్షజ్ఞానం ఉన్నవారికి మాత్రం మాయ ఉంటుంది" అన్నారు.

పరోక్షజ్ఞానం అంటే- శాస్త్రములన్నీ చదివి, పరబ్రహ్మ అనగా ఏమిటి? లోకమంటే ఏమిటి? మిథ్య అంటే ఏమిటి? సత్యం అంటే ఏమిటో తెలుసుకోవడాన్ని పరోక్షజ్ఞానం అంటారు. ఇది శాస్త్రజన్య జ్ఞానము. అది కూడా అంత తేలిగ్గా రాదు. ఎందుకంటే శాస్త్రములు చదివినా, విన్నా స్పష్టంగా బ్రహ్మ సత్యం, జగన్మిథ్య అనేది అర్థం అవ్వదు. ఒకవేళ అర్థం అయితే దానిని పరోక్షజ్ఞానం అంటారు.

ఈ పరోక్షజ్ఞానం వచ్చినప్పటికి కూడా మాయ ప్రక్కన పొంచి ఉంటుంది. ఎందుకంటే మాయ అనేక కర్మల రూపంలో ఉంటుంది. పరోక్షజ్ఞానుల విషయంలోనే ఈ మాట తెలుసుకోవాలి. "జ్ఞానినామపి చేతాంసి దేవీ భగవతీ హి సా" - అంటే పరోక్షజ్ఞానం పొంది మహాతపస్వులై, మహా యోగులై, తపస్వులై ఉన్న వారందరిని కలిపి జ్ఞానులు అంటారు. అలాంటి వారిని కూడా ఈ మాయ లాగేస్తుంది.

మహామాయ చేసే పనేమిటో పురాణాల్లో అత్యద్భుతంగా చూపిస్తున్నాడు. కాళీపురాణంలో "**గర్భాంతజ్ఞాన సంపన్నం ప్రేరితం సూతి మారుతైః ఉత్పన్న జ్ఞానరహితం కురుతే యా నిరంతరం**" - ఆ తల్లి దయయే ఎంత గొప్పదంటే గర్భంలో ఉన్నప్పుడు శిశువుకి ఒక్కసారి ఈ దేహాదులు నేను కాను అని ఒక జ్ఞానం ఏడవ నెలలో కలుగుతుంది. "అనేక శరీరాలు పొంది, ఇప్పుడు ఈ జఠరంలో పడ్డాను. ఈ జన్మలోనైనా సార్థకంగా ఉంటాను" అని బాధపడతాడు. గర్భోపనిషత్‌లో ఈ విషయం ఉంది. దీనిని గురించి ఎక్కువ రమణమహర్షులవారు ఉట్టంకించేవారు. అందరం

ఆ స్థితిలో ఒకప్పుడు ఉన్న వారమే. కానీ ఆ స్థితిలో ఉన్నామని కించిత్ కూడా మనకి జ్ఞాపకం లేదు. కానీ ఆ స్థితిలో ఉన్నప్పుడు మనకి ఇతర జన్మల స్మృతి కలుగుతుంది. కలిగి, ఇకనైనా మాయలో పడకుండా ఈ జన్మని సార్థకం చేసుకుని మోక్షం కోసం ప్రయత్నిస్తానని అప్పుడు ఒట్లు పెడతాడు. ఇదంతా పిండోత్పత్తి ప్రకరణం అనే పేరుతో అనేక గ్రంథాలలో కనబడుతుంది.

భాగవతాది పురాణాలలో కూడా గర్భోపనిషత్ విషయం తెలియజేశారు. ఇంత జ్ఞానం కలిగినవాడు ఆఖరికి తొమ్మిదవ నెల పూర్తికాగానే బయటకి వచ్చేస్తాడు. 'సూతి మారుతైః' అంటే ఆ గర్భంలో ఆ ప్రసవ సమయంలో వచ్చే గాలుల చేత బయటపడగానే జ్ఞానం మొత్తం పోయి మళ్ళీ "ఈ దేహమే నేను" అనుకుంటాడు, ఇక్కడ తిరుగుతాడు, ఆ ఒట్లు, అప్పుడు వచ్చిన ఎరుక అంతా మర్చిపోతాడు. ఈ జ్ఞానం అంతా మరిపింపజేసింది ఎవరు? అమ్మవారే. ఆవిడే 'మహామాయా'.

ఈ మాటేగా 'దేవీమాహాత్మ్యంలో' ఉపోద్ఘాతంలో సుమేధ – సురథునికి, సమాధికి చెప్పాడు. ఈ మాయను అతిక్రమించలేము. తెలిసినట్టే అనిపిస్తుంది గాని, అంత తేలికగా తెలీదు. లాగుతూ ఉంటుంది. ఎందుకయ్యా అంటే మళ్ళీ **"సర్గస్య రక్షణార్థాయ తస్మై మోహాత్మనే నమః"**(మహాభారతం) – ప్రపంచం నడవాలంటే మాయ ఉండాల్సిందే.

'సర్గస్య రక్షణార్థం'–ఎంతవరకూ అవసరమో అంతవరకు ఉండాలి. ఆ అవసరం ఎవరు నిర్ణయిస్తారు? అది కూడా మన చేతులలో లేదు. "నీకు ఎప్పుడు అక్కర్లేదో, ఎప్పుడు కావాలో ఆవిడకి తెలుసు" అని నీకు తెలిస్తే మాయని తొలగించుకోవాలని ప్రయత్నం లేదు, ఉంచుకోవాలని ప్రయత్నం లేదు. ఉందో, లేదో తెలియని దానిని ఉంచాలా, లేదా అనే సమస్య ఇంకెందుకు?

ఆవిడని ఆశ్రయించు. ఆవిడే మహామాయ అని పట్టుకో. ఆవిడ చూసుకుంటుంది. అదే దేవీసప్తశతిలో ఉపదేశించాడు సురథునికి, సమాధికి. "నేను లక్ష ఉపదేశాలు చెప్పినా అర్థం కాదు మీకు. ఆ తల్లిని ఆశ్రయించండి" అని చెప్పాడు. ఆవిడ ఉంచితే ఉంచుతుంది, తీసేస్తే తీసేస్తుంది. ఆవిడని ఆశ్రయిస్తే,

ఉంచినప్పుడు ప్రమాదం కలిగించదు, ప్రమాదం లేకుండా తీసేస్తుంది. అదే కదా సప్తశతి (దేవీమాహాత్మ్యం) యొక్క సారాంశం. అది అర్థం చేసుకోవడానికి 'మహామాయా' నామం.

ఈవిడ ఎంత మాయ అంటే, **'మాయావినామపి మాయాకారిత్వాత్ మహామాయా'** – మాయావులు అనుకున్నవారిని కూడా మాయ చేయగలదు. బ్రహ్మదేవుడు కృష్ణపరమాత్మని మాయ చెయ్యాలనుకొని గోవులను, గోపకులను అందరిని దాచి పెట్టాడు. అది బ్రహ్మ మాయ. ఆ పైన ఉంది విష్ణుమాయ. అది ఆవిడ. 'మహామాయా'. ఈ తల్లికి నమస్కారం చేసుకోవాలి.

భగవద్గీతలో చెప్పినట్లుగా **'దైవీహ్యేషాగుణమయీ మమ మాయా దురత్యయా'** – గుణమయమైనది నా మాయ. ఆయన మాయ అంటే పరమాత్మ యొక్క శక్తిగా. దానితోనే ప్రపంచమంతా నడుపుతున్నాడు. మొదటి వాక్యంలో, ఇది దాటడం మహాకష్టం అన్నాడు. వెంటనే క్రింది వాక్యంలో, **'మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే'** – దాటలేని నా మాయ నన్ను ఆశ్రయించిన వాడు దాటుతాడు– అన్నాడు. కనుక మనం చేయాల్సిన పని 'ప్రపద్యంతే' – ఆశ్రయించడం. అది ఒక్కటి తప్ప మరొకటి లేదు.

216. మహాసత్త్వా – శ్రీ మహాసత్త్వాయై నమః

ఈ నామం నుండి "మహాసత్త్వా, మహాశక్తి, మహారతి, మహాభోగా, మహైశ్వర్యా, మహావీర్యా, మహాబలా, మహాబుద్ధిః మహాసిద్ధిః" ఒక గుంపుగా వస్తాయి. ఇందులో సత్త్వం, శక్తి, రతి, భోగం, బుద్ధి, బలం, ఐశ్వర్యం, వీర్యం – ఇవన్నీ లోకంలో అందరికీ కనబడుతూనే ఉన్నాయి. శక్తి లేనిదెవరికి? ఉంది. అలాగే బుద్ధిమంతులు చాలామంది కనబడుతున్నారు. బుద్ధిమంతులంటే తెలివైనవారు.

మరి అమ్మవారిని మహాబుద్ధి, మహాశక్తి అని చెప్పడం ఏమిటి?

ఇక్కడ చూపిస్తున్నది ఒక సామూహిక శక్తి అని అర్థం చేసుకోవాలి. అమ్మవారిని ఏం వర్ణిస్తున్నామో అవన్నీ ప్రపంచంలో ఉన్నాయి. కానీ ఇవన్నీ విడివిడిగా మనకు

కనబడుతూ ఉన్నాయి.

ప్రపంచంలో ఇన్ని రకాల జ్ఞానాలకి ఒకటే జ్ఞానము మూలము. అదే ఆ తల్లి. విడివిడిగా చూడకుండా సమష్టిగా చూడడం. ఆ జ్ఞానమే ప్రపంచమంతా పరచబడి, పంచబడి కనబడుతోంది.

యా దేవీ సర్వభూతేషు బుద్ధి రూపేణ సంస్థితా
యా దేవీ సర్వభూతేషు లజ్జా రూపేణ సంస్థితా
యా దేవీ సర్వభూతేషు క్షుధా రూపేణ సంస్థితా
యా దేవీ సర్వభూతేషు దృష్టి రూపేణ సంస్థితా
యా దేవీ సర్వభూతేషు శక్తి రూపేణ సంస్థితా
యా దేవీ సర్వభూతేషు మాతృ రూపేణ సంస్థితా
యా దేవీ సర్వభూతేషు నిద్రా రూపేణ సంస్థితా

అన్నీ మనకున్నవే అక్కడ చెప్తున్నారు. కానీ అవి అమ్మవారని ఎందుకు చెప్తున్నారు అంటే ఆవిడ మహాశక్తిగా లోకములో అలా వ్యాపించింది. సర్వభూతములందు ఉన్న ఏకశక్తిని పరిశీలిస్తున్నాం. సప్తశతీ (దేవీమాహాత్మ్యం) రహస్యములు ఇందులో ఉన్నాయంటే ఏమిటో అర్థమౌతోంది కదా. గమనించుకుంటూ వెళ్తూ ఉండాలి.

మహాసత్త్వా–ఇక్కడ చెప్పడమేమిటంటే మనకి కడవలో తీసుకున్న నీరు ఖాళీ అయిపోతే మళ్ళీ నది దగ్గరకి పరిగెడతాం. అలాగా మనకి కావలసిన సత్త్వం, శక్తి, బుద్ధి ఏవైనా లుప్తమయితే 'మహాశక్తి, మహాసత్త్వ'మని ఒకసారి పట్టుకుంటే అప్పుడు ఆవిడ మన లోపలికి నింపుతుంది.

అమ్మవారే మూలము అని తెలుసుకున్నవారికి కావలసినంత దొరుకుతునే ఉంటుంది. అది గ్రహించుకోవాలి. ఈ నామములతో మనం ప్రపంచంలో పరిమితంగా చూసేది ప్రతిదీ అమ్మవారి వెలుగే అని తెలుసుకుంటూ ఆ మూలమైన వెలుగునే పరిశీలించగలగాలి.

సత్త్వం అనే మాటకి సత్–త్వం. సత్ అంటే ఉనికి. అలాగే సత్ అంటే

ప్రాణం. సత్ అంటే బలం. మన ఉనికికి ఆధారమైనవన్నీ సత్ లే. అలాంటి సత్ తో కూడింది సత్త్వం. ప్రాణం, బలం, ఉనికి, స్వభావం - ఇవి అర్థములు. మనముండాలంటే మనకొక ఉనికి కావాలి. కానీ అమ్మవారు మహాసత్త్వా- గొప్ప ఉనికి కలిగినది, గొప్ప ప్రాణశక్తిగా ఉన్నది. గొప్ప బలముగా ఉన్నది. **'బలం బలవతాం చాహం'** ఇవే మాటలు కృష్ణపరమాత్మ గీతలో చెప్పాడు. "బలవంతులలో బలమును నేనని తెలుసుకో". ఎక్కడో భగవంతుడున్నాడని వెతకడం కాదు. ఒకాయన, "భగవంతుడు కనిపించట్లేదం"దని అన్నాడు. వెంటనే గురువు, "కనిపించేదంతా భగవంతుడేనని తెలుసుకో" అన్నాడు.

కానీ మనం భగవంతుని తెలుసుకోలేకపోతున్నాం. ఇందులో ఏ ఒక్కటి కూడా మనం తెచ్చుకోలేదు. సృష్టిలో చూస్తుంటే అందరికీ ఒకే శరీరం, ఒకే కళ్ళు, ఒకే ఇంద్రియములు...కానీ ఒకడు అద్భుతంగా పాడతాడు, ఇంకొకడికి అది ఉండదు. అంటే వారి యొక్క యోగ్యతను బట్టి అమ్మ ఆ శక్తిని వారికి పంపించింది. ఈ శక్తి అమ్మవారు. ఇలా మనం సృష్టిలో ప్రతిదీ గమనించుకుంటూ వెళ్తూ ఉంటే ఆవిడ 'మహా'గా కనబడుతుంది.

217. మహాశక్తిః - శ్రీ మహాశక్త్యై నమః

'మహతీ శక్తిః సామర్థ్యం అస్య ఇతి మహాశక్తిః'. శక్తి అనే పదానికి సమర్థత అని అర్థము. బలముండడం ఒకటి, చెయ్యగలగడం ఒకటి. ఆ చెయ్యగలిగే సమర్థతకి శక్తి అని పేరు. అమ్మవారి దగ్గర ఉన్న శక్తి మహా..శక్తిః, **'దేవాత్మశక్తిః స్వగుణైర్నిగూఢమ్'** అని శ్వేతాశ్వతరోపనిషత్‌లో మంత్రముంది. సర్వదేవతల యందు ఉన్న శక్తి ఆవిడ. మనలో కూడా శక్తిగా ఉంది. కానీ మనలో గూఢంగా ఉంది. ఆవిడని తెలుసుకోలేకపోతున్నామంటే గూఢమేగా. గూఢంగా ఉన్న శక్తిగా అంతటా ఉన్నది కనుక మహాశక్తి. సృష్టిలో ఎవరైనా ఏదైనా చెయ్యగలుగుతున్నారంటే ఆ తల్లి దయే కనుక మహాశక్తిః.

ఆ శక్తితో పోల్చడానికి మరొక శక్తి లేదు. **'న తత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే'**

(శ్వేతాశ్వతర ఉపనిషత్తు) – అమ్మ శక్తితో సమానముగాని, అధికముగాని లేదంటే అది మరి మహాశక్తి కాదూ! గొప్ప శక్తి, సమూహశక్తి, పెద్దశక్తి, పరబ్రహ్మశక్తి. మహా అన్నప్పుడు అన్నింటి నిర్వచనం చెప్పుకుంటూ వెళ్ళాలి.

సృష్టిలో ఏది చూసినా అలా పరిశీలించాలి. ఒక ఔషధం పుచ్చుకున్నాం. ఔషధంలో రోగహర శక్తి అమ్మవారు. సూర్యునిలో వెలుగుశక్తి అమ్మవారు. అగ్నియందు దాహక శక్తి, చంద్రికలో ఆహ్లాదశక్తి, ఒక విద్వాంసునిలో విద్య అమ్మవారు. ఇలా సృష్టిలో ప్రతిదానిలో ఉన్న ఆ శక్తి అంతా అమ్మవారే.

218. మహారతిః – శ్రీ మహారత్యై నమః

రతి అంటే ఆసక్తి, ప్రీతి అని అర్థం. సృష్టిలో రతి అనేది లేనిదెవరికి? ఒక మహానుభావుడు శివతాండవ స్తోత్రం రచిస్తూ 'రతిః ప్రతిక్షణం మమ' అంటాడు. అక్కడ రతి అంటే ఏమిటి అర్థం? ఆనందించే లక్షణమే రతి. ఒకొక్కరు ఒక్కోదానిలో ఆనందిస్తూ ఉంటారు.

కొందరికి ఉత్తమమైన కావ్యములు, శాస్త్రములు చెప్తూ ఉంటే రతి, కొందరికది నచ్చదు. వారికి కావలసినవి లౌకిక కథలు. వాటియందు వారికి రతి. రతి అనేది అక్కడా ఉంది, ఇక్కడా ఉంది. సంస్కారముల చేత అది స్థానములు మారుతోంది.

రతి అనే గుణముగా చూస్తే గొప్పదే. ఆనందించే లక్షణం గొప్పది. అసలు దేనికీ ఆనందించలేకపోతే అదొక జబ్బు. ఆనందించే లక్షణము అనేది వారి యొక్క కర్మవాసనలను బట్టి ఉత్తమమైనదా, అనుత్తమమైనదా అనేది తరువాత విషయం. ఈ లక్షణం అమ్మవారి అనుగ్రహం.

ఈ రతులన్నీ మనం చూస్తున్నాం. కానీ గొప్ప రతి అమ్మవారి యొక్క స్వరూపం. గొప్పరతి అంటే మళ్ళీ ఇందాక చెప్పినట్లుగా గొప్పవిషయముల యందు రతి, గొప్పవాటి యందు రతి. అలాగే గొప్పది అంటే పరబ్రహ్మము కదా! పరబ్రహ్మము యందు రతి అంటే పరబ్రహ్మము నందు ప్రీతి. బ్రహ్మము గురించి చెప్పినా, విన్నా,

అనుకున్నా ఆనందం కలిగిందనుకోండి ఆ రతి పేరు మహారతి.

పైగా అమ్మవారికో మహారతి ఉంది. ఏమిటా రతి అంటే తనవాడైన శివుని యందు పరమ రతి. **శివుని యందు అత్యంత ఆసక్తి కలది** అని అర్థం. ఎంత ప్రీతి లేకపోతే అన్నీ వదిలిపెట్టి అంత తపస్సు చేస్తుంది? శివుని యందు ఆనందించడం ఆవిడకి స్వభావం. '**నిజభర్తృముఖాంభోజచింతనాయై నమో నమః**' అమ్మ నామమే.

ఇంకో అర్థం – మహాత్ముల ఆసక్తిని కేంద్రీకరించుకునే తల్లి. అంటే మహాత్ములైన వారందరూ అమ్మ యందే ఆసక్తి కలిగి ఉంటారు. వారికి అమ్మవారి గురించి విన్నా, అమ్మవారి గురించి అన్నా, చెప్పుకున్నా పరమానందం.

'మానస సంచరరే బ్రహ్మణి మానస సంచరరే' అని సదాశివబ్రహ్మేంద్రస్వామి అన్నారు. అలాంటివారు బ్రహ్మము నందే ఆనందిస్తూ ఉంటారు. **'మమ రతిః సాంబే పరబ్రహ్మణి'** అని అప్పయ్యదీక్షితులు అన్నారు.

219. మహాభోగా – శ్రీ మహాభోగాయై నమః

గొప్పభోగము కలది. అనుభవించే దేన్నైనా భోగము అనవచ్చుకాని, సుఖాన్ని భోగించేటప్పుడు మనం భోగమనే వ్యవహారాన్ని చూపిస్తున్నాం. భోగశబ్దం సుఖానికి, ధనానికి రెండింటికి వర్తిస్తుంది. మహాభోగా అంటే గొప్ప సుఖం, గొప్ప ధనం కలిగినది. నిజానికి ఆవిడ దగ్గర లేకపోతే అన్ని భోగములు ఎక్కడున్నాయి? ఒక్కసారి ఆవిడ భోగము చూడాలి.

మణిద్వీపంలో ఒక ఆవరణ అంతా అమ్మవారి సేవకులు ఉంటారు. అమ్మవారికి అలంకారాలు చేసేవారికంటూ ఒక నివాస ప్రాంతం ఉంది. వారు అనంగకుసుమా, అనంగమేఖలా మొదలైనవారు. వీరి పనేమిటంటే అమ్మవారిని అలంకరించడం. ఈ అలంకరించేందుకు వారిలో ఒకొక్కరికి కొన్ని లక్షలమంది సేవకులు ఉంటారు. వారి పని ప్రొద్దుట లేచిన దగ్గర నుండి అమ్మవారికి కావలసినవి అమర్చుకోవడమే. ఆ మణిద్వీపంలో ఉన్న దివ్యమైన ఉద్యానవనాల్లోకి వెళ్ళి కావలసిన పువ్వులేరుకోవడం, దళాలు ఏరుకోవడం, అలాగే సుగంధములు సమకూర్చుకోవడం,

ఆవిడకి కావలసినవన్నీ ఏర్పాటు చెయ్యడం. లేపనాలు మొదలైనవన్నీ సిద్ధం చేసుకొని ఆభూషణ మండపానికి వీరందరూ బయలుదేరతారు. ఎక్కడా ఒక్క అలంకారం కూడా తగ్గకూడదు. శిరస్సు నుంచి పాదం వరకూ ప్రతి అలంకారం అమ్మవారికి ఉండాలి. ఆ ప్రక్కన వింజామరలు వీచేవారు, చామరములు పట్టేవారు, ఛత్రం పట్టేవారు... ఇలా ఏ ఒక్క భోగానికి కొదవ లేదు. ఇంతమంది చేత గొప్ప గొప్ప భోగములుతో సేవించబడుతోంది గనుక 'మహాభోగా' అని అర్థం.

ఆ భోగాలు ఎంతో దివ్యమైనవి. అంతేకాదు సృష్టిలో అన్ని భోగముల యొక్క సమష్టి స్వరూపిణి. అమ్మవారి అనుగ్రహం లేకపోతే భోగము దొరకదు. ఈ వేళ మనం భోగాన్ని అనుభవిస్తున్నాం అంటే అమ్మవారి అనుగ్రహమే. భోగాలు తప్పేం కాదు. ధర్మబద్ధమైన భోగం అనుభవించవచ్చు. అది నీవు అమ్మవారి అనుగ్రహంగా అనుభవించు అంతే. అది అనుభవిస్తున్నంతసేపు అమ్మవారి ప్రసాదం అనుకో. ఇలాగ ఆ తల్లి దయ ఉంటేనే ఈ భోగములన్నీ లభిస్తాయి. ఒక మంచి శయ్య దొరికిందన్నా, ఒక మంచి ఇల్లు దొరికిందన్నా, ఒక వస్త్రం దొరికిందన్నా అది అమ్మదయ. ఆ దయవల్ల ఇవన్నీ లభిస్తున్నాయి. అందుకే సృష్టిలో కొందరికి అవి లేవు, కొందరికి ఇవి ఉన్నాయి. ఎందుకు? వారు చేసుకున్న పవిత్రమైన పుణ్యకర్మల ఫలంగా అమ్మవారు ఆ భోగాన్ని ఇస్తున్నారు. **'ఆభోగం'** అంటే శరీరం అని ఒక అర్థం. దివ్యమైన, విరాట్ శరీరం కలిగినది కనుక 'మహాభోగా' అని చెప్పవచ్చు.

220. మహైశ్వర్యా – శ్రీ మహైశ్వర్యాయై నమః

గొప్ప ఐశ్వర్యములు కలది. మణిద్వీపంలో ఆవిడ ఇల్లే చింతామణి గృహము. ఇంక ద్వీపమే మణిద్వీపం. అందులో ఒక రేణువు ముందు ఇంద్రాది ఐశ్వర్యములు దిగదుడుపే. అంటే అంత మణుల ద్వీపమది. అలాంటి మణిద్వీపవాసిని. ఆవిడ ఐశ్వర్యాలకు కొదవేమిటి! ప్రపంచంలో సర్వ ఐశ్వర్యములు ఆవిడవే.

ఐశ్వర్య శబ్దానికి రెండు అర్థములు ఉన్నాయి. ఒకటి విభూతులు, ఇంకొకటి ఈశ్వరత్వం. విభూతులు అంటే సంపదలు మొదలైనవి. అలాగే ఈశ్వరత్వము అంటే

అధికారము. మహా ఐశ్వర్యము అంటే గొప్ప అధికారము కలది. **ఈశ్వరస్య భావం ఐశ్వర్యం-** ఆమె ఈశ్వరులకు కూడా ఈశ్వరి. గొప్ప ఈశ్వరి.

అలాగే ఆవిడకున్న ఐశ్వర్యములకూ కొదవలేదు. ఆవిడ అనుగ్రహమున్న వారికే అష్టైశ్వర్యాలు వస్తున్నాయి. అష్టైశ్వర్యములు అంటే దాసులు, భృత్యులు, సుతులు, బంధువులు, వస్తువులు, వాహనాలు, ధనము, ధాన్యాలు ఇవి అష్టైశ్వర్యాలు. ఇవి ఆవిడ దయ ఉంటే అందరికీ లభిస్తున్నాయి. వాటి అన్నింటి యందు కూడా ఆ తల్లి విభూతి రూపంలో ఉన్నది.

ఈ నామాలు అనుసంధానిస్తూ ఉంటే మన చుట్టూ ఉన్న ఐశ్వర్యాలు అమ్మ ప్రసాదాలుగా కనబడతాయి.

మహైశ్వర్యం అంటే మరొక అర్థం-ఐశ్వర్యములలో మహైశ్వర్యం అని దేనిని అనాలి. మహా శబ్దం వాడబడింది కాబట్టి పరిశీలించాలి.

సాధారణ ఐశ్వర్యములు అంటే **'కర్మపరిమిత కాలభోజ్యాని'.** ఇదివరకు చేసుకున్న కర్మలను బట్టి ఇప్పుడు ఐశ్వర్యము వచ్చింది. ఇది ఆ కర్మ వేగం ఎంత వరకు ఉంటుందో అంత వరకు ఉంటుంది. అంతే కదా! ఓడలు బళ్ళు అవుతాయి, బళ్ళు ఓడలు అవుతాయి అనే సామెతని మనం చూస్తూ ఉంటాం.

మహాత్ములు అయిన వారు దేనికి లొంగిపోరు. ఇది ఒకప్పుడు చేసుకున్న పుణ్యకర్మ వల్ల వచ్చింది, అది ఎంతవరకు ఉందో అంతవరకూ ఉంటుంది. తరువాత పోతుంది. అది వారికి తెలుసు. ఇవి అన్నీ కర్మపరిమిత భోజ్యములు. ఈ విషయాలు తెలిస్తే ఇంక ఏ ఐశ్వర్యానికైనా అహంకారం ఉంటుందా?

ఆధ్యాత్మిక భావన ఉన్నవాడు సరిగ్గా బ్రతకగలడు అంటే ఇదే అర్థం. భూలోక ఐశ్వర్యములే కాదు ఏ లోక ఐశ్వర్యములైనా అంతే. ఇంద్రాదిలోక ఐశ్వర్యములు కూడా 'క్షీణే పుణ్యే మర్త్యలోకే విశంతి' - ఇవి కర్మపరిమిత కాలభోజ్యములే. ఇవి మహైశ్వర్యములు అనడానికి లేదు.

మహైశ్వర్యం అంటే కేవలం మోక్షం, పరబ్రహ్మ ప్రాప్తి. అమ్మ పాదములు లభించితే అదే గొప్ప ఐశ్వర్యము. ఎందుకంటే ఆ ఐశ్వర్యానికే కర్మ పరిమితి లేదు.

అది కర్మవల్ల వచ్చేది కాదు. అది **'జ్ఞానాదేవహి'** - జ్ఞానము వల్ల లభిస్తున్నది. అపరిమితమైన ఆ మోక్షసుఖమే మహైశ్వర్యము. ఆ మోక్షసుఖము అమ్మవారి రూపము కనుక 'మహైశ్వర్యా'. కాంతి స్వరూపమైన దీపమే మనకి కాంతిని ఇవ్వగలదు. మోక్షస్వరూపమైన అమ్మవారే మనకి మోక్షం ఇవ్వగలదు.

ఇది తెలుసుకొని 'మహైశ్వర్యా' నామం అర్థాన్ని భావన చేయాలి. ముక్తిని ప్రసాదించునది, ముక్తి రూపమైనది.

221. మహావీర్యా - శ్రీ మహావీర్యాయై నమః

'వీర్యం శుక్రే ప్రభావేచ తేజస్సామర్థ్యయోరపి'. వీర్య శబ్దానికి 'ఉత్పత్తి కారణమైన శక్తి - ఉత్పత్తి కారణం' అని అర్థం. దేనినైనా ఉత్పత్తి చెయ్యగలిగే శక్తిని వీర్యము అని అంటారు. ఆవిడ మహావీర్యా. ఈ అనంత ప్రపంచాన్ని త్రిలోకాలను సృష్టిస్తున్నది. చతుర్దశ భువనాలను ఉత్పత్తి చేయగల శక్తి ఆవిడకు ఉంది.

పరబ్రహ్మ స్వరూపము ఈ మాయ ద్వారా, ప్రకృతి ద్వారా అనంతమైన విశ్వాన్ని సృజిస్తున్నది. **'తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజప్రదః పితా'** అని పరమాత్మ గీతలో చెప్పాడు. మహద్యోని అనగా ప్రకృతి. మహత్ - ఈ మహత్ యందు ఈశ్వరశక్తి ప్రవేశించి ఈ జగత్తంతా నిర్మాణం అవుతుంది. కనుక జగన్నిర్మాణము చెయ్యగలిగిన ఉత్పత్తి, సమర్థత ఉంది కనుకనే మహదుత్పత్తి కారణము **'అవిద్యాలక్షణం వీర్యమస్యాహం ఇతి మహావీర్యా'** అని కూడా 'మహావీర్యా' శబ్దానికి అర్థం.

222. మహాబలా - శ్రీ మహాబలాయై నమః

ముందు నామాలలో బలం గురించి చాలా చెప్పుకున్నాం. మళ్ళీ ఇక్కడ తెలియజేశారంటే బలమనే మాటకి అనేక అర్థాలు ఉన్నాయి. బలము అంటే సైన్యము అని కూడా అర్థం. **'మహాంతి సైన్యాని బలాని యస్యాః'** - అమ్మవారి దగ్గర గొప్పబలములు ఉన్నాయి. ఆ బలములు ఏమిటి? 'భండాసురవధోద్యుక్త శక్తిసేనా

సమన్వితా', 'భండసైన్య వధోద్యుక్త శక్తి విక్రమ హర్షితా' అని చెప్పినప్పుడు లెక్కలేనన్ని సైన్యములు మొత్తం శ్రీచక్రం నిండా ఉన్నాయి. ఇన్ని సైన్యములు పెట్టుకొని బిందువులో ఆవిడ కూర్చుని ఉంటుంది. అందుకు ఆవిడ మహాబలము కలది. ఈ బలము నుండే 'బలగం' అనే శబ్దం వచ్చింది. ఆవిడకి అంత బలగముంది.

223. మహాబుద్ధిః – శ్రీ మహాబుద్ధయే నమః

'యా దేవీ సర్వభూతేషు బుద్ధిరూపేణ సంస్థితా' – సృష్టిలో ప్రతివాని బుద్ధిశక్తి ఆవిడే. ఏ బుద్ధి కావాలన్నా ఆ తల్లికి దండం పెట్టాల్సిందే.

లోకంలో ఒక అద్భుతమైన శిల్పం చూస్తే 'ఎవరు చెక్కారు?' అని వెంటనే అడుగుతామా, లేదా! ఒక అద్భుతమైన చిన్న శిల్పం చూస్తేనే కర్త ఎవరని వెతుకుతున్నామే, విశ్వమనే అద్భుతమైన ఈ శిల్పాన్ని చూసి కూడా కర్త ఎవరని ఎందుకు వెతకడం లేదో! ఎవరూ లేకపోతే ఈ సూర్యోదయమేంటి, ఈ చంద్రోదయమేంటి? ఎంత అద్భుతం! అడుగడుగునా అద్భుతమే.

అద్భుతాన్ని అనుభవించడం చేతకాని పరిస్థితిలో మనమున్నాం. లేకపోతే ఒక విత్తనం అలా విచ్చుకొని అంకురమై ఒక మహావృక్షం అవ్వడం అద్భుతం కాదా! ప్రొద్దున వరకూ కనబడని ఒక మొగ్గ సూర్యకాంతి తగలగానే విచ్చుకొని పువ్వైపోవడం, పువ్వులో ఎప్పుడూ కనివినీ ఎరుగని వర్ణాలు కనబడడం అద్భుతం కాదా! చెట్టంతా చేదై పండు తియ్యగా ఉంటుంది – అది అద్భుతం కాదా! ఇంత అద్భుతమైన జ్ఞానం లోకంలో ఎవరు పెట్టారు? అది 'మహాబుద్ధిః'. ఇది జ్ఞానం. మన జ్ఞానం ఈ ప్రపంచాన్ని తయారుచెయ్యలేదు. ఈశ్వర జ్ఞానం తయారుచేసింది. సృష్టిలో అన్నింటి యందు అమ్మవారే జ్ఞానరూపంగా వ్యాపించింది. ఆ ఈశ్వర జ్ఞానమే మహాబుద్ధి.

'యస్మిన్ విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి' – దేనిని తెలుసుకుంటే అంతా తెలిసినట్లవుతుందో అదే బ్రహ్మము. ఏ బుద్ధి (జ్ఞానం) కలిగితే మరి తెలుసుకోవలసినదేదీ మిగులదో అదే మహాబుద్ధి. ఆ గొప్ప బుద్ధియే తానై, ఆ బుద్ధిని ప్రసాదించునది తానే అనే జ్ఞానమే మహాబుద్ధి.

224. మహాసిద్ధిః – శ్రీ మహాసిద్ధయే నమః

సిద్ధులన్నీ ఈవిడ స్వరూపాలే. సృష్టిలో ఒకొక్కరికి ఒకొక్క సిద్ధి. సమూహంగా అన్నీ కలిపిన సిద్ధులు ఆవిడే. అందుకు గొప్ప సిద్ధులన్నీ ఆవిడ రూపములే. మంచి విద్య చదివి విద్యంతా బాగా వంటబడితే విద్యాసిద్ధి. మంత్రం చేస్తే చివరికి –

గుహ్యాతిగుహ్యగోప్త్రీ త్వం గృహాణ అస్మత్కృతం జపం

సిద్ధిర్భవతు మే దేవి త్వత్ప్రసాదాన్మహేశ్వరి....

అనాల్సిందే. అంటే మంత్రం చేసినంత మాత్రాన లేదు. ఆవిడకి ధారపోస్తూ – సిద్ధిర్భవతు మే దేవి త్వత్ప్రసాదాన్మహేశ్వరీ' – అమ్మా నాకు ఈ మంత్రం సిద్ధించుగాక! – అంటే నువ్వు మాల త్రిప్పితే ఇవ్వదు. ఆవిడకి ఇది చెప్తూ అర్పించడం. సిద్ధి ఆవిడ చేతులో ఉంది అని తెలుసుకుంటే చాలు. కనుక మంత్రసిద్ధి, కార్యసిద్ధి, విద్యాసిద్ధి – ఏ సిద్ధి అయినా ఆవిడే.

అణిమా సిద్ధి, మహిమా సిద్ధి, లఘిమా సిద్ధి, గరిమా సిద్ధి, ప్రాప్తి సిద్ధి, ఈశిత్వ సిద్ధి, వశిత్వ సిద్ధి, సర్వకామ సిద్ధి... అష్టసిద్ధులను ప్రథమావరణమైన త్రైలోక్యమోహన చక్రంలో నమస్కారం చేసుకుంటున్నాం. సిద్ధులన్నీ గుమ్మం దగ్గరే ఉన్నాయి. త్రైలోక్యమోహన చక్రం గుమ్మం. అంతర్గృహం (అంతఃపురం) – బిందువు. **'పురారాతేరంతఃపురం'** అంటారు సౌందర్యలహరిలో శంకరభగవత్పాదులవారు. ద్వారం త్రైలోక్యమోహన చక్రం. ద్వారంలోనే అమ్మవారు అన్నీ ప్రసాదిస్తుంది. కొందరు ద్వారంలో ఇచ్చింది పుచ్చుకొని బయటికి వచ్చేస్తుంటారు. ద్వారంలో ఇచ్చినది పుచ్చుకొని బయటకి వచ్చేవానిని బిచ్చగాడు అంటారు. లోపలకు వెళ్ళి అమ్మ దగ్గర ఉంటే పిల్లవాడంటారు. మనం బిడ్డలా అమ్మని ఆశ్రయించాలి... బిచ్చగాళ్ళలా కాదు. అందుకే మహాత్ములు ద్వారం దగ్గర వచ్చిన వాటితో తృప్తి చెందరు. కానీ మహాసిద్ధులన్నీ అక్కడే ఉన్నాయి.

అమ్మవారి ఉపాసన చేస్తే అణిమ, మహిమ వస్తాయి. అణిమ అంటే చూస్తూ చూస్తూ ఉండగానే పరిమాణం తగ్గించుకోవచ్చు, మహిమ అంటే పరిమాణం పెంచవచ్చు. ఇవన్నీ ఆంజనేయస్వామివారికి ఉన్నాయి. 'అష్టసిద్ధి నవనిధికే దాతా

అనవరదీక్షా జానకీమాతా'. ఒక్కసారి పరిమాణాన్ని తగ్గించుకోగలదు లేదా పెంచుకోగలదు.

పరిమాణంలో పెద్దగా ఉన్నా శరీరాన్ని అతి తేలిక చేసుకుని వెళ్ళగలదు. అది 'లఘిమ'. పరిమాణంలో చిన్నగా కనబడుతున్నా అతి బరువుగా ఉండగలదు అది 'గరిమ'. ఇక్కడుంటూనే ఎక్కడదైనా పొందగలదు అది 'ప్రాప్తి'. ఏదనుకుంటే దాన్ని పొందగలదు 'ప్రాకామ్యం'.

ఎవరిని కావాలంటే వారిని అధీనంలో పెట్టుకోగలదు 'వశ్యం', 'వశిత్వం'. దేనిమీదైనా అధికారం చెలాయించగలదు 'ఈశిత్వం'. ఇవే అష్టసిద్ధులంటే. అమ్మవారి ఆరాధన చేస్తే ఇవి ఇచ్చేస్తుంది. అంటే ఒక్కసారి చూస్తూ చూస్తూ మన పరిమాణం పెంచుకోవచ్చన్నమాట – అది కాదు ఇక్కడ అర్థం. ఎక్కడ గొప్పగా కనబడాలో అక్కడ గొప్పగా కనబడేలా చేస్తుంది. అది ఇక్కడ అసలు అర్థం. ఎక్కడ తగ్గి ఉండాలో అక్కడ తగ్గించేలా చేస్తుంది. అవన్నీ కూడా ఆవిడకి తెలుసు. అంత ఆంజనేయస్వామి వారు లంకలోకి వెళ్ళినప్పుడు మాత్రము తనను తాను తగ్గించుకొని వెళ్ళాడు. 'అనువుగాని చోట అధికులమనరాదు'. ఎక్కడ ఏ శక్తి బయటపెట్టాలో ఆయనకి తెలుసు.

అమ్మవారి అనుగ్రహము కలిగినవారు ఎంత సంపదలున్నా అణకువగానే 'అణిమ'తోనే ఉంటారు. వారి దగ్గరున్న తపస్సు మొదలైనవన్నీ 'మహిమ'గా బయటకి కనబడతాయి. ఎక్కడ ఎంత చూపించాలో అంత చూపించగలరు. అమ్మవారి ఆరాధన చేస్తూ ఉంటే మనకొచ్చే సిద్ధులవి. వారికి ఎప్పుడు ఏం కావాలో అది వస్తుంది – 'ప్రాకామ్యం'. ఎక్కడ అందనిదైనా అమ్మ భక్తులకి అందుతుంది. అదే 'ప్రాప్తి'. వారికి ఎక్కడైనా చెల్లుబాటు జరుగుతుంది. అదే 'ఈశిత్వము'. ఎవరైనా లొంగుబాటు అవుతారు. అదే 'వశిత్వము'. అష్టసిద్ధులంటే ఇవే. ఇవన్నీ ఆవిడ స్వరూపములే. అష్టసిద్ధుల సమాహార రూపమే 'మహాసిద్ధిః'.

మహాసిద్ధిః అన్నప్పుడు మరొక అర్థము చూడాలి. మహైశ్వర్యమే మహాసిద్ధి. మహా అంటే మోక్షము. మోక్షసిద్ధి అమ్మవారి యొక్క రూపము. 'సిద్ధలక్ష్మీర్మోక్షలక్ష్మీః

జయలక్ష్మీః సరస్వతీ' – ఇవన్నీ సిద్ధులే.

అంతేకాదు, స్కందపురాణములో భగవత్సాధన వల్ల, భగవధారాధన వల్ల సిద్ధులు ఎలా వస్తాయో చెప్పారు. ఈ సిద్ధులు గాని వచ్చాయి అంటే అమ్మవారి మంత్రమో, పూజో సిద్ధించిందని అర్థము. ఏదైనా సాధన కొంత చేస్తేగాని సిద్ధి లేదు.

అసలు సాధనలోకి అడుగు పెట్టకుండానే సిద్ధి గురించి కొందరు కబుర్లు ఆడుతూ ఉంటారు. 'చేస్తే ఏమొస్తుందండీ? అదుందా, లేదా?' ఉందో, లేదో ముందు దిగితే కనబడుతుంది. అన్వేషించేవానికి ఉందో, లేదో తెలుస్తుంది. నువ్వు ప్రయత్నించు. ప్రారంభము చెయ్యి. సాధన చెయ్యి... నీకు తప్పకుండా లభిస్తుంది. అసలు సాధన చెయ్యనివానికి సిద్ధే లేదు. సాధన చేస్తూ ఉన్నా సిద్ధి అనేది ఏ దశలో, ఎక్కడున్నదో తెలిసిపోతూ ఉంటుంది. కనుక మన సాధనలో మన స్థితి ఏమిటి అనేది ఎవరైనా చూసుకోవచ్చు.

ఆ సిద్ధులు:

మొట్టమొదటి సిద్ధి **'రసోల్లాసః'**– రసోల్లాసం మొదటి సిద్ధి. మనం ఏ జపం చేస్తున్నామో లేదా ఏ స్తోత్రం చేస్తున్నామో, ఏ సాధన చేస్తున్నామో దానిలో ఉన్న భావాన్ని, ఆంతర్యాన్ని ఆస్వాదించడం కావాలి. లేకపోతే జడమే.

దీనికి పాండిత్యము అక్కర్లేదు. నిష్కపటమైన, నిర్మలమైన మనస్సు ఉండాలి. సాధనలో ముందు రసోల్లాసమైన సిద్ధి.

తరువాత **'ద్వంద్వైరనభిభూతమ్'**– రెండవస్థితి అది. అంటే సుఖదుఃఖాలు, లాభనష్టాలు కలుగుతూ ఉన్నా చలించకుండా ఉండగలిగే లక్షణము.

మూడవది **'అధమోత్తమతాభావః'**– వీడు అధముడు, వీడు ఉత్తముడు, ఇది తక్కువది, ఇది ఎక్కువది – అనే భావాలు పోతాయి. ఇది మూడవ స్థితి. దాని తరువాత శరీరములో ఒక తెలియని **కాంతి** వస్తుంది. ఒక చక్కటి **బలం** వస్తుంది. శోకము లేని పరిస్థితి కలిగి ఉల్లాసము, **ఆనందము** ఉంటాయి. తపస్సుకి గాని, ధ్యానానికి గాని కూర్చుంటే **చెక్కు చెదరకుండా** ఉండగలడు.

తరువాత స్థితి **'కామచారిత్వము'**– ఎక్కడికైనా తిరగగలదు. అడ్డుకొనేది లేదు. ఈ స్థితి చెప్పాలంటే **'అనికేతః స్థిరమతిః భక్తిమాన్ యః స మే ప్రియః'** – వీటన్నిటికి పారమార్థిక దృష్టితోనే చెప్తున్నాం. కామచారిత్వమంటే ఏ శరీరం అంటే అది ధరించగలదు, ఎక్కడికైనా వెళ్ళగలడని కాదు ఇక్కడ అర్థము. కామచారిత్వము అంటే 'అనికేతః స్థిరమతిః' ఇక్కడా, అక్కడా అని కాదు – ఎక్కడైనా ఇమడగలిగి చక్కగా తన సాధన తాను చేసుకోగలిగిన లక్షణము. 'ఇది నాది' అనే లంపటంతో ఒకచోట ఈషణం లేకుండా, బంధరహితుడై విహరించడమే కామచారిత్వము.

తరువాత **'యత్ర క్వచన శాయితే'**– ఇదీ ఇంచు మించు కామచారిత్వమే. కామచారిత్వంలో ఎక్కడికి వెళ్ళాలన్నా అభ్యంతరం ఉండదు. ఎక్కడైనా ఉండడానికి కూడా అభ్యంతరము ఉండదు. ఎందుకంటే ఇక్కడ ఉండలేను, అక్కడ ఉండగలను అంటే అమ్మవారు ఇక్కడ లేరు, అక్కడ ఉన్నారు అని అర్థం వస్తుంది కదా! 'సర్వవ్యాపినీ'– అనే భావన వచ్చాక ఇంకెక్కడున్నా అమ్మవారే. ఈ స్థితి ప్రహ్లాదునికి తేలికగా వచ్చింది.

మొదటి సిద్ధి 'రసోల్లాసము', రెండవది 'ద్వంద్వైః అనభిభూతము', మూడవది 'అధమోత్తమతా అభావః', నాలుగవది 'తుల్యతాతేషాం ఆయుషః సుఖదుఃఖయోః' అయిదవది 'కాంతేర్బల బాహుల్యం విశోకః'. ఆరవది 'పరమాత్మ పరత్వేన తపోధ్యానాది నిష్ఠతా'. ఏడవది 'కామచారిత్వం'. ఎనిమిదవది 'యత్రక్వచన శాయితే' – ఇవన్నీ కలిస్తే 'మహాసిద్ధి' అనిపించుకుంటుంది. ఇది అమ్మ అనుగ్రహము వల్ల లభిస్తుంది. మహాసిద్ధి స్వరూపమంటే ఇది.

225. మహాయోగేశ్వరేశ్వరీ – శ్రీ మహాయోగేశ్వరేశ్వర్యై నమః

యోగుల్లో కూడా చాలా మంది ఉంటారు. రకరకాల యోగులు. కొందరు పన్నెండు ఏళ్ళు, పదిహేను ఏళ్ళు సాధన చేసి గాలిలో ఎగరడం నేర్చుకోగలరు. మనలో చాలామందికి తెలిసిన కథే. రామకృష్ణపరమహంస కథలో చెప్తూ ఉండేవారు.

దక్షిణేశ్వరములో ఒకాయన "నేను మీ దగ్గర విద్య చూపిస్తానండి" అన్నాడు. అదేమిటంటే నడుచుకుంటూ గంగ మీద వెళ్ళడం. మళ్ళీ గంగపై నుండి నడుచుకుంటూ

రావడం. యోగము అంటే జ్ఞానము. ఏదో ఒక సిద్ధి. "దీనికెన్నాళ్ళు పట్టింది"? అని అడిగారు పరమహంస. "పధ్నాలుగు ఏళ్ళు పట్టింద"న్నాడు. "భగవంతుడిచ్చిన ఆయువులో పధ్నాలుగేళ్ళు వృథా చేశావయ్యా" అన్నారు. యాభైపైసలు ఇస్తే పడవవాడు ఇటునించి తీసుకుపోయేదానికి నువ్వు పధ్నాలుగేళ్ళు వృథా చేశావన్నాడు. అంటే ఇవన్నీ యోగములా? వస్తుంటాయి, పోతుంటాయి. వీటిని పట్టించుకోకూడదు. కనుక కాలాన్ని మహాయోగానికి వినియోగించు. ఆ తల్లి పాదములు లభించడమే 'మహాయోగము'. అది పొందినవారు యోగీశ్వరులు. ఆ మహాయోగములో గొప్పవారు.

అంతేకాదు **'యత్ర యోగేశ్వరః కృష్ణో'** కూడా మనం అన్వయించుకోవచ్చు. అన్ని యోగములకు ఈవిడ ఈశ్వరి. యోగములన్నింటిలో గొప్పవి ఏవో (యోగీశ్వరములు) వాటన్నింటికి కూడా ఈవిడే ఈశ్వరి.

ఇంకో అర్థమున్నది. మహాయోగేశ్వరులు అంటే బ్రహ్మవిష్ణురుద్రులు. యోగము అంటే ఏదైనా చెయ్యగలిగే సమర్థత. అది కూడా యోగమే. 'యోగమాయాముపాశ్రితః' అని కృష్ణపరమాత్మని వర్ణిస్తూ చెప్పారు. యోగశక్తితోనే భగవంతుడు ఏదైనా చేస్తాడు. ఒకొక్కరికి ఒకొక్క యోగశక్తి. అలాగే దేవతలందరికీ కూడా యోగములున్నాయి. ఇంద్రాది దేవతలకి కూడా వారి యోగములు వారికున్నాయి. వాటితో ఏమైనా చెయ్యగలరు. ఏదైనా చెయ్యగలిగే సర్వసమర్థులు బ్రహ్మ, విష్ణు, రుద్రులు. ఆ మహాయోగీశ్వరులకు కూడా ఈశ్వరి గనుక 'మహాయోగేశ్వరేశ్వరీ'.

ఇది ఒకసారి భావన చేస్తే, మనం 'బ్రహ్మోపేంద్ర మహేంద్రాది దేవ సంస్తుత వైభవా' – అని నమస్కరిస్తున్నాం కదా. 'యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిః దేవైస్సదా పూజితా'. ఇంత మాత్రానికి వారు ముగ్గురూ తగ్గిపోయారనుకోవద్దు. ఆ ముగ్గురి రూపంతో ఉన్న శక్తి ఆవిడే అనేది తెలుసుకోవాలి. ఆ ఏకత్వాన్ని చెప్పడానికే 'మహాయోగేశ్వరేశ్వరీ' అని తెలియజేస్తున్నారు.

అడుగడుగునా మనం దేవీమాహాత్మ్యములోని వాక్యములతో అనుసంధానము చేసుకుంటూ వెళ్తున్నాము. అలా ఇక్కడ మొత్తము పధ్నాలుగు నామములని మనం

నమస్కారం చేసుకుంటున్నాము. నామాలకి పధ్నాలుగు రకాల బీజాలు ఉన్నాయి. బీజాక్షరాలు కనుక సభలో చెప్పడం లేదు. అవి గురుముఖైక వేద్యాలు. కానీ బీజ అధిదేవతలను ఒకసారి చెప్పుకుందాం.

వారు– వాయువు, ఆత్మ, సత్యదేవుడు, సర్వము, పురః, అంతః, యజ్ఞః, వషట్కారః, ఇంద్రః, రుద్ర, విష్ణు, బ్రహ్మ, నమః, ప్రజాపతి అనబడే మొత్తం పధ్నాలుగు మంది దేవతలు ఈ పధ్నాలుగు నామాలకి అధిదేవతలు. వీరి బీజాక్షరములే అక్కడ ఉంటాయి. ఆ శక్తి అంతా ఇక్కడుంది.

మొత్తానికి సహస్రనామ స్తోత్రంలో ఎన్నెన్ని విద్యలు దాగి ఉన్నాయో తెలుసుకుని– 'మహాపూజ్యా' నుండి మనం ఇంతవరకు చెప్పుకున్న నామముల తరువాత, 'మహాతంత్రా' నుండి 'యోగినీగణసేవితా' వరకు ఉన్న నామాలలో 'మహాయాగక్రమం' అనే ఒక విద్యను తెలియజేస్తున్నారు.

మహాయాగము, రహోయాగము, అంతర్యాగము, బహిర్యాగము – ఈ శబ్దములన్నీ శ్రీవిద్యలో వచ్చే పదజాలము. అక్కడుండే సాంకేతిక పదాలు, పారిభాషిక పదాలు గురించి చెప్పిన విశేషాలు చూద్దాం.

ఈ మహాయాగ ప్రస్తావన లలితోపాఖ్యానంలో వస్తుంది. మహాయాగము చేసినవాడు మహాశంభువు. అమ్మవారి యొక్క శక్తి ఆవిష్కృతము కావాలంటే ఈ యాగము చేయాలి. అప్పుడే 'జాతవేదసే సునవా' కనబడుతుంది. అలాంటి జాతవేదం రగల్చగలిగి ఆరాధన చేసే యాగం శివుడొక్కడే చెయ్యగలిగాడు.

భండాసురుని బాధ తట్టుకోలేక దేవతలందరూ కలిసి పరమేశ్వరుని ప్రార్థన చేస్తే, ఆయన గురువై వచ్చి ఒక మహాయాగం చేశాడు. ఆ మహాయాగములో ఒక సముద్రాన్ని ఎండగట్టి మిగిలిన సముద్రాలన్నింటిని ఆహుతి చేసి దేవతలందరినీ పడమన్నాడు. ఆ మహాయాగక్రమం విశేషంగా వర్ణిస్తారు. ఈ హయగ్రీవస్వామివారే ఈ అగస్త్యులవారికే సహస్రనామం చెప్పకముందు, చెప్తూ అంటారు, "ఈ మహాయాగము కానీ వింటే అనేక అశ్వమేధ యాగాలు చేసిన ఫలితం లభిస్తుంది"అని. అలాంటి మహాయాగక్రమం ఇక్కడ్నుంచి చెప్పబడుతున్నది. ఈ మహాయాగమే నిజానికి

మనం చేస్తున్న బాహ్య శ్రీచక్ర ఉపాసన. అక్కడ ఆయన చేసిన పద్ధతినంతటిని గమనిస్తే అదే విషయం అవగతమౌతుంది. బహిర్యాగ, అంతర్యాగములు కలిపిగాని చెయ్యగలిగితే 'మహాయాగమే'. ఇది ఉపాసకులైన వారికి బాగా తెలుస్తుంది.

మన లోపల చిత్‌శక్తిని తెలుసుకుంటూ మన అహాన్ని ఆహుతి చేసుకుంటూ ఉంటే అది అంతర్యాగము. ఎదురుగా శ్రీచక్రమునందు ఆరాధన చేస్తూ ఉంటే అది బహిర్యాగము. ఇది కాకుండా శ్రీవిద్యా యాగమని మరొక యాగమున్నది. ఈ విషయాలన్ని మరొక నామం దగ్గర తెలుసుకుందాం.

226. మహాతంత్రా - శ్రీ మహాతంత్రాయై నమః

గొప్పతంత్రము అమ్మయొక్క రూపం. మునుపటి నామాలలో 'సర్వతంత్రరూపా' చెప్పుకున్నాం కనుక ఇక్కడ తంత్రము గురించి ఎక్కువ చెప్పనక్కర్లేదు. మహాతంత్రము అంటే గొప్ప తంత్రము. గొప్ప తంత్రము అనగా 'శ్రీవిద్య'. అన్ని తంత్రాలు ఒక ఎత్తు, శ్రీవిద్య ఒక్కటి ఒక ఎత్తు. దీని ప్రత్యేకత ఏమిటంటే, ఇతర తంత్రములు కేవలం భుక్తికి మాత్రమే లేదా ముక్తికి మాత్రమే పనికివస్తాయి. ఈ తంత్రము మాత్రం భుక్తి, ముక్తులు రెండింటికి పనికొస్తుంది. మోక్షకారకమైన తంత్రము కనుక దీని పేరు 'మహాతంత్రా'.

చతుష్షష్ట్యా తంత్రైః సకలమతిసన్ధాయ భువనం
స్థితస్తత్తత్ సిద్ధి ప్రసవ పరతంత్రైః పశుపతిః
పునస్త్వన్నిర్బన్ధాదఖిల పురుషార్థైకఘటనా
స్వతంత్రం తే తంత్రం క్షితితలమవాతీతరదిదమ్

'వివిధ సిద్ధులను ఇచ్చే అరవైనాలుగు తంత్రాలను నిర్మించిన పశుపతి, అమ్మా! నీ నిర్బంధం వలన అన్ని పురుషార్థాలను ప్రసాదించే, స్వతంత్రమైన నీ తంత్రాన్ని (శ్రీవిద్యను) భూమిపై అవతరింపజేశాడు' - అని సౌందర్యలహరిలో ఆదిశంకర వచనం.

మహా అంటే మోక్షము. పరబ్రహ్మ ప్రాప్తికి పనికొచ్చే తంత్రము కనుక

శ్రీవిద్యయే మహాతంత్రము. ఆ శ్రీవిద్యకు సంబంధించిన తంత్రములో ఉండేవి మంత్రమూ, యంత్రమూ కదా. అందుకే శ్రీవిద్యా మంత్రము 'మహామంత్రా'.

227. మహామంత్రా - శ్రీ మహామంత్రాయై నమః

228. మహాయంత్రా - శ్రీ మహాయంత్రాయై నమః

శ్రీ చక్రమే మహాయంత్రము. శ్రీచక్రానికి ఉన్న విశేషమేమిటంటే భూప్రస్తార, మేరుప్రస్తార, కైలాసప్రస్తారమని ప్రధానంగా మూడు ప్రస్తారములు ఉన్నాయి.

పొడవు, వెడల్పు కలిగినది భూప్రస్తారం. మేరు ప్రస్తారమంటే ఎత్తు కూడా కలుస్తుంది. వాటియందు ప్రధానమైన బీజాక్షరములతో లిఖించి చూస్తే కైలాస ప్రస్తారం. కైలాస ప్రస్తారాన్ని గృహాల్లో పూజించరాదు అని చెప్తారు. భూప్రస్తార, మేరుప్రస్తార, కైలాసప్రస్తారములని మూడు ప్రస్తారములుగా ఉన్నది మహాయంత్రము. ఇది అమ్మవారి యొక్క స్వరూపం.

ఇవి కాకుండా మహాయంత్ర శబ్దముతో చెప్పబడేవి - శ్రీచక్రము, రుద్రయంత్రము, వనదుర్గాయంత్రము, దుర్గాయంత్రము..ఇలా కొన్ని మహాయంత్రము లని చెప్పబడతాయి. అంటే ఏ మంత్రవిద్య అయితే ఇహాన్ని ఇస్తూనే పరాన్ని కూడా ఇవ్వగలదో అలాంటి విద్యలకే మహామంత్రం, మహాయంత్రం అనాలి. అది శ్రీవిద్యే కావచ్చు, పంచాక్షరీ, దక్షిణామూర్తి, అష్టాక్షరీ, ద్వాదశాక్షరీ - ఇవన్నీ కూడా మనకి ఇహము, పరమూ కూడా ప్రసాదించగలిగేవి.

ఇక్కడ మోక్ష కారకమైన విద్యలన్నీ తీసుకోవాలి. అయితే అన్ని విద్యల స్వరూపం శ్రీవిద్య. ఎందుకంటే శ్రీవిద్యలో లేని మంత్రం లేదు. సమష్టిగా షడామ్నాయ విద్యలలో మనం చూస్తే ఆరు ఆమ్నాయ విద్యలూ శ్రీవిద్యలో ఉన్నాయి. పంచాక్షరీ, అష్టాక్షరీ అన్నీ ఆమ్నాయంలోంచి వచ్చినవే. **'షడామ్నాయ సమష్టి విద్యే శ్రీవిద్య'.** సాధారణంగా పంచామ్నాయాలు మనం చెప్పుకుంటూ ఉంటాం కాని అనుత్తరామ్నా యం కూడా కలుపుకుని షడామ్నాయ విద్యనే భావన చేసుకోవాలి. 'మహామంత్రా మహాయంత్రా' అని చెప్పబడుతోంది.

శ్రీవిద్యకి యంత్రరాజమని, సిద్ధవజ్రము అని పేరు ఉంది. దానికి కావలసిన శ్రద్ధ, సంస్కారం ఇవి అన్నీ అవసరమే. శ్రద్ధ, సంస్కారములు గురుముఖతః తెలుసుకోవలసినవే.

యంత్రం అంటేనే శక్తికేంద్రం. మంత్ర శక్తి, దేవతా శక్తి కేంద్రీకృతమైన చోటు యంత్రం. అంతేకాదు యంత్రము అనే మాటకి మరొక అర్థం- **'యమించునది'**. మన యొక్క బుద్ధులని, ఇంద్రియాలని (ని)యమించగలిగితే అదే పెద్ద యంత్రం. కనుక అమ్మవారి ఆరాధన నెమ్మదిగా మనలను నియంత్రిస్తుంది. ఆ నియంత్రణా శక్తే అమ్మవారి యంత్రం. **'యంత్రణాత్ యంత్రమిత్యాహుః'**

అంతే కాదు. **'యాతనాత్ త్రాయతే ఇతి'** యాతన నుంచి రక్షించేది 'యంత్రము' అని కూడా అర్థం. యంత్రారాధన చేసిన వారికి నరక యాతనలు ఉండవు.

229. మహాసనా - శ్రీ మహాసనాయై నమః

అమ్మవారు గొప్ప ఆసనం కలది. ఆవిడ చోటు చాలా గొప్పది. అంతా కలుపుకున్న ప్రపంచమే ఆవిడ అసనం. ఆవిడ కూర్చుంటేనే ఇది చైతన్యవంతం అవుతోంది. పంచభూతాలు, పంచతన్మాత్రలు, పంచప్రాణాలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు. ఈ పంచతో కూడిన ప్రపంచం అంతా అమ్మ కూర్చున్నది కనుక ఆవిడ 'పంచబ్రహ్మాసనస్థితా'. అంతేకాదు మన హృదయమే దేవి ఆసనం. అక్కడ కూర్చున్నది పరదేవత. మనం చేయాల్సినది కూర్చున్న ఆమెను తెలుసుకోవడమే. కొత్తగా కూర్చోపెట్టక్కర్లేదు. అక్కడ ఆవిడ కూర్చుంటేనే ఈ పంచ(శరీరం) తిరుగుతోంది.

పంచభూతాత్మకమై, పంచతన్మాత్రలతో, పంచజ్ఞానేంద్రియాలతో, పంచకర్మేంద్రియాలతో, పంచప్రాణాలతో తిరిగే ఈ శరీరమే అమ్మవారికి మహాసనం. ఇక్కడ కూర్చుని ఆవిడ ప్రకాశిస్తేనే మనం నడువగలుగుతున్నాం. 'మహాసనా' అంటే ఇంత భావన చేయాలి.

'శ్రీచక్రరాజ సింహాసనేశ్వరీ' అన్నారు కదా! శ్రీచక్రరాజమే అమ్మవారి సింహాసనము. ఇంతవరకు చెప్పిన మహాయంత్రమే మహాసనముగా కలిగినది.

230. మహాయాగక్రమారాధ్యా - శ్రీ మహాయాగక్రమారాధ్యాయై నమః

అమ్మవారిని ఆరాధన చేయాలంటే మహాయాగక్రమముతో ఆరాధించాలి. క్రమము అంటే పద్ధతి. దేని తరువాత ఏం చేయాలి అనేది పద్ధతి. ఆ మహాయాగక్రమం మహాశంభువునకు తెలుసు. అందుకే మొత్తం దేవతలు కలసి 'శివాయ గురవే నమః' అని ఆశ్రయించారు. వెంటనే ఆయన వచ్చి, "నేను చేస్తాను మహాయాగం... మీవల్ల కాద"న్నాడు. ఇది అంతా 'చిదగ్నికుండసంభూతా' నామం దగ్గర వివరంగా చెప్పుకున్నాం.

వేదంలో అగ్నిష్టోమ, జ్యోతిష్టోమ, పాకయజ్ఞము, హవిర్యజ్ఞము మొదలైనవి కూడా మహాయాగములని చెప్పబడుతున్నాయి. ఆ వైదిక యజ్ఞముల చేత ఆరాధించబడేదీ ఆ తల్లే. 'కర్మఫలేషు జుష్టాం' కదా. అలాగే శ్రీయాగ, అంబాయాగము లను మహాయాగములని అంటారు. శ్రీవిద్యాయాగము అంటే అగ్నిహోత్రమందు నవావరణ స్వరూపాలను, అక్కడ ఉన్న దేవతలను ఉద్దేశించి చేసేది.

ఏ మంత్రం చేసినా సరే ఆ మంత్రాన్ని అనుష్ఠానం చేయడం, హోమం చేయడం రెండూ ఉంటాయి. ఇవన్నీ క్రమముగా తెలుసుకుని అందులో అమ్మవారి మంత్రములను ఆరాధన చేయడం మహాయాగం. శ్రీయాగం అంతర్యాగమనీ, బహిర్యాగమనీ రెండు విధములు. భావనోపనిషత్‌ని అనుసరించి చేసే అంతర్యాగక్రమం గొప్పది కనుక మహాయాగమే. ఈ మహాయాగక్రమం ద్వారా ఆరాధింపబడుతోంది కనుక 'మహాయాగక్రమారాధ్యా'. ఈ మహాయాగక్రమంతో మొట్టమొదటి పూజ చేసినవాడు - పరమేశ్వరుడు. **'మహాశంభునాథో మహాయాగేన చిదగ్నికుండాత్ లలితాం ప్రాదుర్భావయామాస'** - అని లలితోపాఖ్యాన వృత్తాంతం.

231. మహాభైరవపూజితా – శ్రీ మహాభైరవపూజితాయై నమః

మహాయాగక్రమం ద్వారా మహాభైరవుని చేత పూజింపబడినది. మహాభైరవుడు అంటే శివుడు. ప్రధానంగా ఎనిమిది(అష్ట) భైరవులు ఉన్నారు. వీరి పేర్లు తలచుకుంటే చాలు మనం ధన్యులమవుతాం. ఎప్పుడూ భైరవ, భైరవి అనగానే అవి ఏవో ఉగ్రశక్తులు, క్షుద్రశక్తులు అని అనుకోరాదు.

'భైరవ' అనేది బ్రహ్మశబ్దమే. సామాన్యము కాదు. 'కాశికాపురాధినాథ కాలభైరవం భజే'. 'భైరవ' అంటే భయంకరమైన శక్తి. భయంకరమైన శక్తి అంటే ఉగ్రత్వము.

ఎవరైతే పరిశీలిస్తూ రక్షిస్తూ ఉంటారో వారికి ఎక్కువ శక్తి ఉండాలి. అటువంటివారు తోడుంటే ధైర్యం. భైరవుడు అంటే ప్రపంచాన్ని గమనించే స్వామి. కాలరూపంలో అందరినీ గమనిస్తూ ఉంటాడు. ఎవరైనా తేడా చేస్తే శిక్షిస్తాడు. ఆయన శిక్షిస్తే ఎవరూ ఆపలేరు. ఆయన రక్షించినా అడ్డుకోలేరు. రక్ష, శిక్ష ఆయనకే చెల్లు. కాలరూపంలో అందరినీ గమనించుకుంటాడు కనుక 'కాలభైరవం భజే'. ఆయనే కాలభైరవుడు. ఎనిమిది రకాల భైరవ రూపాలు ఉంటాయి. ఈ ఎనిమిది రకాల భైరవుల్లో మనకి కాలభైరవుడు కనబడడు. ఆయన ప్రధాన భైరవుడు అనుకోవాలి. అంటే ఆయన యొక్క స్వరూపాలు ఈ ఎనిమిది.

వీరిని అష్టమి మొదలైన తిథులు వచ్చినప్పుడు మరింత విశేషంగా ఆరాధన చేస్తారు. అంతేకాదు భైరవ స్మరణతో అనేక దుష్టశక్తుల నుండి బయటపడవచ్చు. భైరవ ఉపాసన చాలా విశిష్టమైనది. కేవల క్షుద్రప్రయోజనాల కోసం చేసే భైరవోపాసనలని వదిలేద్దాం. కానీ ఉత్తమ ప్రయోజనంతో చేసే భైరవోపాసన పరబ్రహ్మవాచకము.

'అసితాంగ భైరవ, రురుభైరవ, చండభైరవ, క్రోధభైరవ, ఉన్మత్తభైరవ, కపాలభైరవ, భీషణభైరవ, సంహారభైరవ' – వీరిని మొత్తం అష్టభైరవులు అంటారు. కాశీ క్షేత్రములో అష్టభైరవ క్షేత్రాలు ఉన్నాయి. అష్టభైరవ యాత్ర అని చేస్తారు. అదొక ప్రత్యేకం. ఆదివారం వచ్చినా, అష్టమి వచ్చినా ఈ భైరవునికి చాలా విశేషము.

మార్గశీర్ష శుద్ధ అష్టమికి కాలభైరవాష్టమి అని విశేషమైన పేరు. సూర్యుని కూడా భైరవుడు అంటారు. ఆయన పేరు 'మార్తాండభైరవుడు'.

అంతేకాదు భైరవ శబ్దానికి మరొక అర్థము చూస్తే **'భరత్వ రమణత్వ వమన్వాతాత్ భైరవః'**. భరత్వము అంటే పోషించుట. సృష్టిలో అందరిని పోషించే శక్తి అనగా స్థితి కారకుడు పరమాత్మ. 'రమణత్వ' అంటే ఆనందింపజేసేవాడు. పోషణ, ఆనందము ఈ రెండూ ఇచ్చేవాడు ఆయన. అలాగే 'వమనత్వ' అంటే వెళ్ళగక్కుట. ఈ సృష్టిని అంతటిని తననుంచి వెలికి తీసుకువస్తాడు. వామదేవ నామం చెప్పుకున్నప్పుడు చెప్పుకున్నాం. భరత్వ, రమణత్వ, వమనత్వాలు – ఈ మూడు చెయ్యగలిగినవాడు ఎవడో అతడు భైరవుడు.

సమష్టిగా ఇన్ని భైరవులకు మూలమైన పరమేశ్వరుని 'మహాభైరవ' అని అంటారు. ఆ మహాభైరవుని చేత పూజింపబడింది.

శంభుః పూజయతే దేవీం మంత్రశక్తిమయీం శుభాం

అక్షమాలాం కరే ధృత్వా న్యాసేనైవ భవోద్భవః

ఇది పద్మపురాణంలోని వాక్యం. శివుడు అక్షమాల పట్టుకొని అమ్మవారి జపం చేస్తూ ఉంటాడు. తత్త్వదృష్టితో చూస్తే ఇవేమి ఎక్కువ తక్కువలు కావు. 'మహాభైరవపూజితా'– పరమేశ్వరుని చేత ఆరాధించబడుతున్నది.

232. మహేశ్వరమహాకల్పమహాతాణ్డవసాక్షిణీ

– శ్రీ మహేశ్వరమహాకల్పమహాతాణ్డవసాక్షిణ్యై నమః

'మహేశ్వరుడు మహాకల్పకాలంలో చేసే తాండవములో ఈవిడ సాక్షి'. కల్పతాండవము కాదు. మహాకల్ప తాండవము. కల్పము, మహాకల్పము రెండింటికి తేడా ఉంది.

నాలుగు యుగాలు కలిపితే ఒక మహాయుగము. అలాంటివి 71 అయితే ఒక మన్వంతరము. అలాంటివి 14 అయితే ఒక కల్పము. ఇది సృష్టికాలము. ఈ కల్పాంతములో మొత్తం పోతుంది. మరల అంత సమయం బ్రహ్మకి రాత్రి. ఈ

పగలు, ఆ రాత్రి కలిపితే బ్రహ్మకు ఒక రోజు అయింది. ఇలాంటివి నూరైతే బ్రహ్మకి ఆయువు పూర్తవుతుంది. ఆ బ్రహ్మకి ఆయువు పూర్తయ్యే సమయానికి 'మహాకల్పాంతము' అని పేరు. అప్పుడు ఆ మహాకల్పాంత కాలంలో బ్రహ్మ కూడా లేడు. ఎవరున్నారు? మొత్తం లాగేసుకున్నవాడు ఉన్నాడు. కనుక అన్నీ లయం చేసి కూడా తాను లయం కానివాడే లయకారకుడు పరమాత్మ. ఆ లయం చేసింది దేనితో? తన శక్తితోనే కదా! కనుక లయం చేసుకున్నప్పుడు ఆయనతో పాటు ఆయన యొక్క శక్తి ఉంది.

సాధారణంగా ఒక గమనములో చిన్న లయ ఉంటుంది. లాగేసుకున్నప్పుడు పెద్ద లయ ఉంటుంది. ఆయన తాండవమే ప్రపంచము. ఆ లయ చక్కగా ఆనంద తాండవము చేస్తూ ఉంటే ప్రపంచము హాయిగా సాగుతుంది. ఆయన అలా కాదని చెప్పి గొప్పగా లోపలికి లాగితే అది ప్రళయ తాండవము అవుతుంది. ప్రళయ తాండవము అంటే లయ పెరిగింది అంతే.

సాధారణంగా ఆయన కైలాసంలో ప్రదోష తాండవం చేస్తున్నప్పుడు అందరూ వెళ్ళి చూస్తూ కూర్చుంటారు. అలాగ చిదంబరంలో నాట్యం చేసినా చూసేవారు ఉన్నారు. దేవసభ, చిత్సభ అన్నీ ఉన్నాయి. ప్రళయ కాలంలో మొత్తం అందర్నీ లాగేస్తున్నాడు. మరి చూసేవారు ఎవరూ లేరు. మరి చూసేవారు ఎవరూ లేనప్పుడు మరి తాండవము చెయ్యాలంటే ఆయనకి మాత్రము ఉత్సాహం ఉండాలి కదా. అప్పుడు ఆవిడ అంటుంది – "నేను చూస్తున్నాను.. తాళం వేస్తున్నాను. తాండవం చెయ్యి" అని ఆవిడ చూస్తూ ఉంటుంది. ఈయన చేస్తూ ఉంటాడు. అసలు ఆవిడ చూస్తేనే ఈయనకి సంతోషం.

అఖర్వసర్వమంగలా కళాకదంబమంజరీ
రసప్రవాహమాధురీ విజృంభణామధువ్రతం
స్మరాంతకం పురాంతకం భవాంతకం మఖాంతకం
గజాంతకాంధకాంతకం తమంతకాంతకం భజే

ఆవిడ చూస్తూ శభాష్ అంటే గాని మామూలు నాట్యమే చెయ్యడే. "ఈ

దేవతలెవ్వరూ లేకపోయినా ఫరవాలేదు. నువ్వు చూడు, చప్పట్లు కొట్టు – నాకు చాలు" అన్నాడాయన. ఆవిడ ఉత్సాహశక్తి. ఆయన మహాతాండవం చేస్తూ ఉంటే సాక్షిగా చూస్తూ ఉంటుంది. ఈ మాట చెప్పడంలో అర్థము వారిద్దరే మిగిలారు. మొత్తం పోయింది. అంతేకాదు – శివుని కృత్యమైన ప్రళయానికి తల్లి సాక్షి మాత్రమే.

ఇక్కడ మహాకల్ప మహాతాండవము అంటే ఏమిటో కాదు. జీవుడు తన సర్వకర్మలను లయం చేసుకుని జీవభావం పోయి సంపూర్ణ మోక్షం పొందడమే మహాకల్పం. అప్పుడు కలిగే ఆనందము యొక్క పారవశ్యమే మహా తాండవము. ఆ మహాతాండవ స్థితిలో జీవుడు లేడు, ప్రకృతి లేదు.. శివశక్తులు మాత్రమే ఉన్నారు. ఆ శివశక్తుల యొక్క ఆనంద విజృంభణమే 'మహేశ్వరమహాకల్పమహాతాండవసాక్షిణీ'. ఇది ప్రళయావస్థ. మహాయాగక్రమం యొక్క ఫలమది. అది కావాలి.

కల్పాంతకాలంలో ఆ స్వామి చేసే నాట్యం:

కల్పోపసంహరణ కల్పిత తాండవస్య
దేవస్య ఖండపరశోః పరభైరవస్య
పాశాంకుశైక్షవశరాసన పుష్పబాణైః
సా సాక్షిణీ విజయతే తవ మూర్తిరేకా

అని సంప్రదాయ స్తోత్రం. "కల్పోప సంహరణ కాలంలో ఖండపరశువు, పరభైరవుడు అంటే మహాభైరవుడు నాట్యం చేస్తూ ఉంటే పాశాంకుశములన్నీ ధరించి నువ్వొక్కదానివే సాక్షిణిగా చూస్తూ ఉంటావమ్మా" అన్నారు.

233. మహాకామేశమహిషీ – శ్రీ మహాకామేశమహిష్యై నమః

'మహిషి' అంటే పట్టపురాణి. ఈవిడ మహాకామేశ్వరునికి పట్టపురాణి. మహాకామేశుడంటే ఎవరు? 'కామేశబద్ధమాంగళ్యసూత్రశోభితకందరా' నామం నుండి వివరిస్తూనే ఉన్నాము. ఆయన మహాకామేశ్వరుడు. ఆయనను మించి మరొకటి లేదు కనుక మహాశబ్దాన్ని చూపిస్తున్నారు.

సృష్టి చెయ్యాలనుకొన్న పరమేశ్వరుని సంకల్పం చేతనే ఈ ప్రపంచం అంతా

నడుస్తోంది. ఇచ్ఛాశక్తి కలవాడు కామేశ్వరుడు.

అలాగే 'కమనీయత్వాత్ కామః' – కమనీయమైన వాడు. కమనీయం అనే మాటకి కోరుకోదగినది అని అర్థం. ఎవరికి అది కోరుకోవాలనిపిస్తుందో దాని పేరు కమనీయం. సృష్టిలో కమనీయములు చాలా ఉంటాయి. ఆకలేస్తే అన్నం కమనీయం. దాహం వేస్తే నీరు కమనీయం. కానీ అసలు కమనీయం ఏది? అంటే యోగులను అడగాలి. **'బ్రహ్మేష్టం శరణముపగమ్య'** అని శ్రుతి – ఇష్టమైనది ఆ బ్రహ్మమే! యోగులకు కమనీయమైనది పరబ్రహ్మమే. లోకాన్నంతటినీ కాదని లోకేశ్వరునే కోరుకున్నారు. ఆనందమే కమనీయం. సచ్చిదానందమే మహాకామేశ్వరుడు.

ఎప్పుడైనా పెద్దవారి ఇష్టానికి విలువ ఎక్కువ. శుకమహర్షికి ఏది ఇష్టం? పరమహంసకి ఏది ఇష్టము? వారిని అడిగితే పరమాత్మే ఇష్టమని చెప్తారు. మహాత్ములందరికీ కమనీయమైనవాడు 'మహాకామేశ్వరుడు'. అలాంటి మహాకామేశ్వరుని పట్టపురాణి కనుక 'మహాకామేశమహిషీ'. అక్కడ హాయిగా ఆయన ఒళ్ళో కూర్చుంది. మహాకామేశమహిషీ. ఆ కూర్చున్న ఆమెను ఇప్పుడు చూడాలి.

234. మహాత్రిపురసుందరీ – శ్రీ మహాత్రిపురసుందర్యై నమః

ఇప్పుడొచ్చింది ఆవిడ పేరు. మహాత్రిపురసుందరీ. మహా అంటే అంతకు మించిన గొప్పది లేదు. కనుక మహా – పరబ్రహ్మ స్వరూపిణి. త్రిపుర అనే దానికి మరో నామంలో చాలా వివరంగా చెప్పుకున్నాం. ఇక్కడ మరొక అర్థం చెప్పుకుందాం.

ఒకే నామానికి ఒక దగ్గర వివరిస్తే ఇంకో దగ్గర అంత వివరణ అవసరం లేదు. ఇక్కడ మనం శ్రీచక్ర స్వరూపంగా తెలియజేసుకుంటున్నాం. బిందుమండలంలో అమ్మవారు ఉంటారు. బిందుమండలం వెంటనే ఉండేది త్రికోణము. త్రికోణము అంటే మూడు బిందువులు. ఇచ్ఛ, జ్ఞాన, క్రియ అనే మూడు బిందువుల నడుమ ఉన్న ప్రధాన బిందువు. అసలు ఈ బిందువు నుంచే ఆ మూడు ఏర్పడ్డాయి. ఇచ్ఛ–జ్ఞాన–క్రియలకు మూలమై ఉన్నది ఆవిడ కనుక త్రిపుర అంటే త్రికోణ మధ్యంలో ఉన్న బిందు స్వరూపిణి. మాతృ–మాన–మేయ, జ్ఞాతృ–జ్ఞాన–జ్ఞేయ – ఈ త్రిపుటుల

ఏకత్వమే సిద్ధావస్థ. అదే త్రిపురసుందరీ తత్త్వం. ఇది ప్రధానంగా చెప్పుకోవలసిన భావము.

235. చతుష్షష్ట్యుపచారాఢ్యా - శ్రీ చతుష్షష్ట్యుపచారాఢ్యాయై నమః

అరువదినాలుగు ఉపచారములు పొందినది. శంకరభగవత్పాదుల వారు భవ్యమైన విజయాన్ని సాధించి తిరిగి వస్తూ కాశ్మీర క్షేత్రంలో సరస్వతీదేవిని దర్శించారు. తరువాత మూకాంబికా క్షేత్రానికి వచ్చేటప్పటికి అక్కడ ఆయనకి ఆ తల్లి సంపూర్ణమైన కళలతో సాక్షాత్కరించింది.

అప్పటికప్పుడు ఆయన ఆనందపారవశ్యంతో చతుష్షష్ట్యుపచార పూజా స్తోత్రం రచించారు. అదొక్కటి పట్టుకుంటే చాలు 64 ఉపచారాలు హాయిగా చేసుకోవచ్చు. బాహ్య పూజలకైతే నియమము, పద్ధతి, ఉపాసనలు.

మానసిక పూజలు హాయిగా చేసుకోవచ్చు. సిద్ధి కూడా ఎక్కువ. అది అంతర్యాగములోకి తీసుకువెళుతుంది.

ప్రధానంగా ఉపచారములు పంచోపచార, షోడశోపచార, చతుష్షష్ట్యుపచార ములు. ఈ చతుష్షష్ట్యుపచారములకి అధికారం అమ్మవారికే ఉంటుంది. వశిన్యాది వాగ్దేవతలు అమ్మవారికి చేస్తున్న 64 ఉపచారముల పేర్లు చెప్పుకుని మానసికంగా చేసుకొన్న తృప్తిని పొందుదాం.

01. అర్ఘ్యం
02. పాద్యం
03. ఆచమనీయం
04. భూషావరోపణం అంటే మునుపు వేసిన ఆభరణాలను తీసివేయడం
05. సుగంధతైలాభ్యంజనం
06. మజ్జనశాలా ప్రవేశం - స్నానాల గదికి తీసుకు వెళ్ళడం.
07. మణిపీఠోపవేశనం - దేవాకాంతలందరూ అమ్మవారిని మణిపీఠం మీద కూర్చోబెట్టారు.

08. దివ్యస్నానీయ ఉద్వర్తనం – దేవకాంతలందరూ అమ్మవారికి నలుగు పెట్టారు.

09. ఉష్ణోదకస్నానం – వేడినీటితో అమ్మవారికి దేవకాంతలందరూ స్నానం చేయించారు.

10. కనక కలశచ్యుత సకల తీర్థాభిషేచనం – అంటే బంగారు కలశం తీసుకొచ్చి అమ్మవారికి సకల తీర్థములతో దేవకాంతలందరూ అభిషేకం చేశారు.

11. ధౌతవస్త్రపరిమార్జనం – దేవకాంతలు అమ్మవారిని పొడివస్త్రంతో శుభ్రంగా తుడిచారు.

12. అరుణదుకూల పరిధానం – అమ్మవారు ఎర్రని వస్త్రం కట్టుకొన్నారు.

13. అరుణకుచోత్తరీయం–అమ్మవారు ఎర్రని రవిక ధరించారు. అటు తరువాత

14. ఆలేపన మంటపప్రవేశనం – ఆలేపనాలు పూసే గృహానికి తీసుకు వెళ్ళారు.

15. మణిపీఠోపవేశనం – మళ్ళీ అక్కడ మణిపీఠంపై కూర్చోబెట్టారు.

16. చందనాగరుకుంకుమ సంకుల మృగమద కర్పూర కస్తూరీ గోరోచనాది దివ్యగంధేన సర్వాంగ పరిలేపనం – అమ్మవారికి అన్ని ఆలేపనాలు చేశారు.

17. కేశభరస్య కాలాగరు ధూపం – దేవకాంతలు అమ్మవారి యొక్క ఒత్తైన కేశములను విస్తారపరచి కాలాగరుధూపం వేశారు.

18. మల్లికా మాలతీ చంపకాశోక శతపత్ర పూగక్రముక మంజరీ పున్నాగ కల్హార ముఖ్య సర్వర్తుకుసుమమాలా అలంకరణం – అమ్మవారికి జడవేసి, జడకి సర్వఋతు కుసుమమాలలు అలంకరించారు. ఇక్కడ అమ్మవారు 'చంపకాశోకపున్నాగ సౌగంధికలసత్కచా' అయ్యింది. ఇప్పటివరకు ఒక మండపంలో అమ్మవారు భూషణములు ధరించింది, ధూపం పెట్టించుకొంది. జడ వేయించుకొని మాలలు వేయించుకున్నారు. ఇప్పుడు మరో మండపంలోకి తీసుకువెళ్ళారు.

19. భూషణ మండప ప్రవేశనం – అనంగకుసుమాది దేవతలు అమ్మవారికి అలంకారాలు చెయ్యడానికి ఈ మండపానికి తీసుకువచ్చారు. ఇక్కడ పెట్టెల్లో నిండా ఆభరణాలు ఉన్నాయి. అనంగకుసుమాది దేవతలు ఒకొక్కరు అమ్మవారికి అలంకరణ చేస్తున్నారు. ఇక్కడ మళ్ళీ

20. మణిపీఠోపవేశనం– అమ్మవారిని మణిపీఠంపై కూర్చోబెట్టారు.

21. నవ మణిమకుటం – అమ్మవారికి తొమ్మిదిరకాల మణులతో కూర్చిన అద్భుతమైన కిరీటాన్ని అలంకరింపజేశారు. దానిపై

22. చంద్రశకలం – చంద్రశకలాన్ని అలంకరించారు. తరువాత

23. సీమంతే సిందూర తిలకం – సీమంతంలో సిందూరాన్ని దిద్దారు.

24. తిలక రత్నం – దానికి చక్కగా అద్దుతూ తిలకరత్నం తీర్చారు.

25. కాలాంజనం – అమ్మవారి కళ్ళకి కాటుక దిద్దారు.

26. పాళీయుగళం – తరువాత 'పాళీయుగళం' అమ్మవారి చెంపల దగ్గర అలంకారం చేశారు.

27. మణికుండల యుగళం – చెవులకు మణికుండలాలు పెట్టారు

28. నాసాభరణం – ముక్కు పుడక, బులాకీ

29. అధరయావకం – అంటే పెదవులకు పూసే లత్తుక

30. ఆర్యభూషణం – ఇది ప్రధాన భూషణం. మంగళ సూత్రం.

31. హేమచింతాకము – అంటే బంగారంతో కూడిన చింతాకం అనే చింతామణుల మాల

32. పతకం– అదొక ఆభరణం

33. మహాపతకం – ఇదొక ఆభరణం

34. ముక్తావళి – ముత్యాల దండ

35. ఏకావళి – భుజములకి పైన పెట్టే ఆభరణములు

36. ఛన్నవీరం – ఇదొక ఆభరణ విశేషం

37. కేయూర యుగములు – నాలుగు చేతుల భుజములకి నాలుగు రకాలు కేయూరయుగళ భూషణాలు

38. వలయావళి– చేతులకి కంకణాలు పెట్టారు

39. ఊర్మికావళి – మొత్తం నాలుగు చేతులకి ఇరవై ఉంగరాలు పెట్టారు

40. కాంచీదామం – మొలనూలు

41. కటిసూత్రం– దానికి మళ్ళీ ఒక సూత్రం
42. సౌభాగ్య ఆభరణం – ఒకానొక ఆభరణ విశేషం
43. పాదకటకం – పాదాలకు పెట్టిన ఆభరణములు
44. రత్ననూపురం – రత్నములు తాపిన మువ్వల అందెలు
45. పాదాంగుళీయకం – కాలి మట్టెలు
46. ఏక కరే పాశం – ఒక చేతిలో పాశము
47. ఇతర కరే అంకుశం – మరొక చేతిలో అంకుశం
48. అన్య కరే పుండ్రేక్షుకోదండం – ఇంకొక చేతిలో చెరకు విల్లు
49. అపరకరే పుష్పబాణాని – మిగిలిన చేతిలో పువ్వుల బాణాలు

ఇవి అన్నీ చేసి ఆ దేవతలందరూ అమ్మవారిని ఆహ్వానం పలుకుతుంటే, పరివార దేవతలు స్తోత్రములు చేస్తుంటే కదిలి వైభవంగా మణిద్వీపంలోనున్న రమ్యమైన సింహాసనం వద్దకు వెళ్లింది. అక్కడ మహాకామేశ్వరుడు కూర్చుని ఉన్నాడు.

50. మహాకామేశ్వర పర్యంకోపవేశనం – వెళ్లి ఆయన ఒడిలో కూర్చుంది. ఇంతవరకు ఆవిడ వచ్చి వెళ్ళేవరకు ఎనిమిది ఆవరణల దేవతలు నిల్చుని స్తోత్రములు చేస్తున్నారు. ఆవిడ వెళ్లి ఆ పర్యంకాసనంలో కూర్చున్నాక వీరందరూ మళ్ళీ వారివారి ఆసనాలలో కూర్చుని అమ్మవారికి నమస్కారం చేసుకుంటున్నారు.

51. అమృత చషకం – అమ్మవారి దగ్గర ఒక బంగారు పాత్రలో అమృతం నింపి "అమ్మా! తీసుకోవమ్మా పానీయం" అని **అమృత చషకం** ఇచ్చారు. అమృతం పానం చేసింది.

52. ఆచమనీయం – అమృత చషకం స్వీకరించగానే ఆచమనీయం చేసింది.

53. కర్పూర వీటిక – ఆ తరువాత అమ్మవారి యొక్క పరిచారికులలో ప్రధానమైన వారు వచ్చి బంగారు పళ్లరంలో చక్కగా ఏలా లవంగ కస్తూరి వేసిన కర్పూర వీటిక పెట్టి "తీసుకో అమ్మా!" అని ఇచ్చారు. అప్పుడు ఆ కర్పూర వీటిక అందరూ చూస్తున్నారు. దేనికోసం అంటే ఆ తరువాత అమ్మ నవ్వు కోసం ఎదురు చూస్తున్నారు. అప్పుడొక చిన్ననవ్వు నవ్వింది.

54.ఆనందోల్లాస విలాసహాసం. వీటిని గ్రహించాక, ఆనందపరవశులై అందరూ నమస్కరిస్తున్నారు.

55.మంగళ ఆరార్తికము – ఆ తరువాత మొత్తం అమ్మవారి దగ్గర ఆ మణిద్వీపంలో ఉన్న దేవకాంతలు, ముత్తైదువులు, ఋషికాంతలు, అష్టావరణ దేవతలు లేచారు. అమ్మవారికి అనేక రత్నాలు పెట్టిన పాత్రలో దివ్యమైన జ్యోతులు పెట్టి మంగళనాదములు మ్రోగుతుండగా అమ్మవారికి హారతులు ఇస్తున్నారు. దివ్యనాదములు మ్రోగుతున్నాయి. దాని తరువాత –

56. నిఖిలలోకైక సూచిక ముక్తాతపత్రము – అక్కడ పరివారదేవతలు అందరూ ముత్యాలు వ్రేలాడుతున్న ఒక విశాలమైన తెల్లని గొడుగుని పట్టుకున్నారు. నువ్వు సర్వలోకములకు సామ్రాజ్ఞివి అని చెప్తూ 'ఏకాతపత్ర సామ్రాజ్యదాయికాయై నమో నమః' – అని అమ్మకు ముక్తాతపత్రం పట్టారు.

57. చామరయుగళం – పరిచారికలు ఇరుప్రక్కల నిలబడి చామర యుగళం పట్టుకుని ఆ తల్లికి వీస్తూ ఉన్నారు

58. దర్పణం – మణులు పొదిగిన బంగారపు అంచుతో కూడిన అద్దాన్ని అమ్మవారికి ఇచ్చారు. అమ్మవారు అద్దం చూసుకుంది.

59. తాళవృంతము – తాటికమ్మల వీవెన పట్టుకొని విసురుతూ ఉన్నారు.

60. గంధము – అమ్మవారికి గంధము అలంకరించారు

61. పుష్పం – రకరకాల పువ్వులతో, సహస్రనామాలతో, త్రిశతి నామాలతో అమ్మవారికి దేవతలు అందరూ అర్చన చేశారు.

62. ధూపం – ధూపాన్ని సమర్పించారు.

63. దీపమాలికలు – అటు తరువాత రకరకాల దీపమాలికలు ప్రకాశింపజేశారు.

64. నైవేద్యం – తాంబూలము – నీరాజనము

అమ్మవారికి చక్కగా నైవేద్యం ఇస్తూ ఉంటే, "అందరికీ ఆహారం అందిందా?" అని అమ్మవారు అడిగింది. అందరూ తింటున్నారని తెలిసి అమ్మవారు కూడా ఆరగింపు చేశారు. మహానైవేద్యాన్ని పుచ్చుకున్నారు. ఆ తరువాత తాంబూలము, నీరాజనము

సమర్పించి అందరూ సాష్టాంగ నమస్కారములు చేశారు.

ఇవి అరవై నాలుగు ఉపచారములు. ఈ అరవై నాలుగు ఉపచారములతో శోభిల్లుతున్న తల్లి 'చతుష్షష్ట్యుపచారాఢ్యా' అని కీర్తించబడుతున్నది. అరవై నాలుగు సంపూర్ణతకు సంకేతం.

236. చతుష్షష్టికలామయీ - శ్రీ చతుష్షష్టికలామయ్యై నమః

అరవై నాలుగు కళల తల్లి. అరవై నాలుగు కళలూ అమ్మవారే. ఇందులో ఏ కళ ప్రకాశించినా అమ్మవారి యొక్క స్వరూపమే.

అందుకే అమ్మ ఆరాధకులకి ఏ కళలకి తక్కువ ఉండదు. కళలు అంటే విద్యలు. ఇదొక అర్థం.

'కలాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం నిజతపః ఫలాభ్యాం భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం' - శివానందలహరిలో ప్రారంభమే శంకరభగవత్పాదులవారు 'కలా' అని మొదలు పెట్టారు. పంచదశి మహామంత్రంలో ప్రథమ అక్షరం ఎత్తుకున్నారు.

'కలాభ్యాం' అక్కడ వచ్చింది. వారు విద్యా స్వరూపులు. మొత్తం అరవై నాలుగు కళలు. అరవై నాలుగు కళలంటే సామాన్యమా! అరవై నాలుగు కళలు మళ్ళీ రెండు చేయాలి. మొత్తం నూట ఇరవై ఎనిమిది కళలు. ఇందులో ఒక అరవై నాలుగు విద్యా కళలు. మరి ఒక అరవై నాలుగు వృత్తి కళలు.

అదీ కళే, ఇదీ కళే. మన దేశంలో అరవై నాలుగు విద్యలుండేవి. అరవై నాలుగు రకాల వృత్తులుండేవి. ఎన్నో పోగొట్టుకున్నాం. పేర్లు అయినా చూస్తే క్రమంగా -

చతుర్విద్యలు - (1) అన్వీక్షకి (2) త్రయీ (3) వార్తా (4) దండనీతి, **షడ్విద్యలు** - (5) ఆకర్షణము (6) స్తంభనము (7) మారణము (8) విద్వేషనము (9) ఉచ్చాటనము (10) మోహనము, **వేదములు** - (11) ఋగ్వేదము (12) యజుర్వేదము (13) సామవేదము (14) అథర్వణ వేదము, **వేదాంగములు** - (15) శిక్ష (16) వ్యాకరణము (17) ఛందము (18) నిరుక్తి (19) జ్యోతిషము (20) కల్పము, **శాస్త్రములు** -

(21) మీమాంస (22) న్యాయశాస్త్రము (23) పురాణము (24) ధర్మశాస్త్రము (25) ఆయుర్వేదము (26) ధనుర్వేదము (27) నీతిశాస్త్రము (28) అర్థశాస్త్రము, **పురాణములు –** (29) బ్రాహ్మము (30) పాద్మము (31) వైష్ణవము (32) శైవము (33) భాగవతము (34) భవిష్యోత్తరము (35) నారదీయము (36) మార్కండేయము (37) ఆగ్నేయము (38) బ్రహ్మవైవర్తము (39) లైంగము (40) వారాహము (41) స్కాందము (42) గారుడము (43) వామనము (44) కూర్మము (45) మత్స్యము (46) బ్రహ్మాండము, **ఉపపురాణములు –** (47) సనత్కుమారము (48) నారసింహము (49) స్కాందము – శివధర్మము (51) దౌర్వాసము (52) నారదీయము (53) కాపిలము (54) మానవము (55) ఔశనము (56) బ్రహ్మాండము (57) వారుణము (58) కౌశికము (59) లైంగము (60) సాంబము (61) సౌరము (62) పారాశరము (63) మారీచము (64) భార్గవము.

ఇవి కాక గీత, వాద్య, నృత్య, నాట్య, ఆలేఖ్య, విశేషక, పుష్పతండులవల్యాది, కుసుమాస్తరణ, దంతవస్త్రాంగరాగ, మణికుట్టి కర్మ, శయ్యావిధి, వారి వాద్య, చిత్రయోగ, పుష్పలావిక, మాల్యగ్రంథనం, నేపథ్య రచన, కర్ణపత్రభంగ, సుగంధ రచన, భూషాయోగ, ఇంద్రజాల, కౌచుమార, చిత్రశాకాపూపభక్ష్యక్రియ, హస్తలాఘవ, పానకాస వరాగాది నిర్మాణ, సూచీవాయ ప్రక్రియ, వీణాడమరు వాద్య, సూత్రక్రీడ, ప్రహేళిక, ప్రతిమాల, దుర్వాచక యోగ, పుస్తక వాచక, నాటికాఖ్యాయికా, సమస్యాపూరణ, పట్టికా వేత్రవాత్ర, తక్షకర్మ, తక్షణ, వాస్తువిద్య, రత్నరూప పరీక్ష, ధాతువాద, మణిరాగ జ్ఞాన, ఆకర వేదన, వృక్షాయుర్వేద, మేషకుక్కుట లావాది యుద్ధము, శారికా శుకాలాపన, కేశప్రసాదన, అక్షరోత్పాదన, ముష్టికా కథనము, మ్లేచ్ఛతర్క వికల్ప, దేశభాషాదివేదన, ప్రసూనశకల జ్ఞాన, నిమిత్త జ్ఞాన, యంత్రమాతృక జ్ఞాన, ధారణ యంత్ర, సంవాచ్య, మానసీకావ్యక్రియ, ఛందోధీ, నానాకోశధీ, నానాక్రియాది కల్ప, చల ఆశయ యోగ, వస్త్ర సంగోపన, ద్యూత, బాలక్రీడ, ఆకర్షణ క్రీడ, వైతాళికీ విద్య. ఇవి మొత్తం విద్యల యొక్క స్వరూపం. ఆ స్వరూపమే అమ్మవారు. ఇది చతుష్షష్టి కళామయీ.

237. మహాచతుష్షష్టికోటియోగినీగణసేవితా

– శ్రీ మహాచతుష్షష్టికోటియోగినీగణసేవితాయై నమః

అమ్మవారిని కొలుచుకుంటున్న యోగినీ గణాలు 'మహా చతుష్షష్టి కోటి'– అరవై నాలుగు కోట్ల యోగినీ గణములు. వీరు అతి గొప్పవారు కనుక 'మహా' అనే విశేష పదప్రయోగం. శ్రీచక్రంలో ఉన్న దేవతలని ప్రధానంగా చెప్పుకున్నప్పటికీ కూడా అసలు శ్రీ చక్రంలోని భూపురంలో(త్రైలోక్యమోహన చక్రంలో)నే మధ్యరేఖ అయిన చతురస్రరేఖలోనే ఎనిమిదిమంది మాతృకాదేవతలు ఉంటారు. వారు బ్రాహ్మీ, మాహేశ్వరీ, కౌమారి, వైష్ణవి, వారాహీ, మాహేంద్రి, చాముండ, మహాలక్ష్మి. వీరిలో ఒకొక్కరికి ఎనిమిది చొప్పున మళ్ళీ శక్తులుంటాయి. అవి అక్షోభ్య మొదలైన శక్తులు. వాటిని కలుపుకుంటే అరవై నాలుగు అయ్యాయి.

వీరిలో ఒకొక్కరికి ఒకొక్క కోటి చొప్పున సహాయక శక్తులుంటాయి. వీరే అరవై నాలుగు కోట్లు. **'లలితా చక్ర నవకే ప్రత్యేకం శక్తయః ప్రియే చతుష్షష్టిమితాః కోట్యః'** – నవచక్రరూపమైన శ్రీలలితాచక్రంలో ప్రతి చక్రంలో అరవైనాలుగు కోట్ల శక్తులు ఉంటారు అని 'తంత్రరాజం'లోని విషయం. ఇలా మొత్తం కలుపుకుంటే అమ్మవారి శ్రీచక్రంలో 5 పద్మాల 7 అర్బుదాల 6 కోట్లమంది యోగినులు ఉంటారు. ఇంత పెద్ద సంఖ్య కనుక 'మహా' అన్నారు. చూడగలిగే శక్తి మనకి లేదుగాని, ఉండగలిగే శక్తి అమ్మవారికి ఉంది. అలాంటి అన్ని శక్తులు అమ్మవారిని నిరంతరం సేవించుతూ ఉంటాయి.

ఈ నామాల వల్ల ఇంతవరకు మనకి శ్రీచక్ర విద్య అంతా ఆరాధన చేసుకున్నట్లే అనిపించింది కదా. ఇదే 'మహాయాగక్రమారాధ్యా' అని చెప్పబడుతున్న అమ్మవారి యొక్క దివ్య స్వరూపం.

ఇక 'మనువిద్యా' నుంచి 'పంచకృత్యపరాయణా' వరకు మంత్రవిద్యా రహస్య విశేషములు తెలియజేస్తున్నారు.

మనువిద్యా చన్ద్రవిద్యా చన్ద్రమండలమధ్యగా
చారురూపా చారుహాసా చారుచన్ద్రకళాధరా

238. మనువిద్యా – శ్రీ మనువిద్యాయై నమః

అమ్మవారి విద్య – మనువిద్య. మను అంటే మంత్రమని ఒక అర్థం ఉన్నది. మంత్రవిద్యలన్నీ అమ్మ రూపములు. ఇది సాధారణంగా చెప్పుకునే అర్థం. అమ్మవారికి ప్రధానమైన విద్య ఏదైతే ఉందో ఆ శ్రీవిద్య మనకి ఇప్పుడు లోకంలో ఒక పద్ధతిగా తెలుసు కాబట్టి విద్య అంటాం. ఇంకా ఎన్ని పద్ధతులు ఉన్నాయో! ఒకొక్కరు అమ్మవారిని ఒకొక్క రకంగా ఉపాసన చేశారు.

ఒకొక్కరు ఒకొక్క విద్యను పట్టుకుని తరించిపోయారు. ఇక్కడ ఈ నామాలు తెలుసుకునేటప్పుడు విశేషం ఏమిటంటే సృష్టిలో అనేకమంది పని చేస్తేగాని ప్రపంచం నడవట్లేదు. ఇంద్రాది దేవతలు, మనువులు, ప్రజాపతులు పని చేయాలి. ఇంతమంది దేవతలు పనిచేస్తేనే ప్రపంచం నడుస్తోంది.

ఈ దేవతలు అందరూ వారి సమర్థత కోసం ఏం చెయ్యాలని బ్రహ్మని అడిగారు. సమర్థత అంటే శక్తి కదా – "మీ శక్తి మీకు కావాలంటే శక్తిని ఉపాసించండి" అన్నారు. ఎవరికైనా ఇదే పెద్ద ఉపదేశము. మనం మన శక్తిని బాగా పొందాలన్నా, కనబరచాలన్నా శక్తిని ఉపాసించాలి.

అందుకే నవరాత్రులు వస్తే ప్రతి వృత్తి పనివారు వారి వృత్తి కుల సంబంధమైనవాటికి పూజ చేసుకుంటూ ఉంటారు. అన్నీ బాగా పని చెయ్యాలని చేస్తారు.

మనువుకైనా తనదైన ఒక శక్తి ఉన్నది. ఆ మనుశక్తి లేకపోతే ఆయన పని ఆయన చెయ్యలేడు. ఆ శక్తి కోసం ఆయన అమ్మవారిని ధ్యానం చేశాడు. అప్పుడు బ్రహ్మ ఆయనకంటూ ఒక అమ్మవారి విద్యను చెప్పాడు. ఆయన ఆ విద్యతో అమ్మవారిని ఉపాసన చేసుకున్నాడు. అలాగే ఇంద్రుడు అమ్మవారిని ఉపాసన చేశాడు. అలా ఎవరెవరు ఏ పద్ధతిలో వారి శక్తి కోసం అమ్మవారిని ఉపాసన చేశారో, ఆ పద్ధతిలో ఉన్న విద్యకి వారి పేరు వచ్చింది.

దీనిని బట్టి చూస్తూ ఉంటే దేవతలందరూ అమ్మవారి ఉపాసకులే. ఆవిడ అనుగ్రహం చేతనే వారికి ఆ దేవత్వం అనేది వచ్చింది. అదే మనకి దేవీమాహాత్మ్యం

గాని, ఇటు వైపు బ్రహ్మాండపురాణం గాని చెప్తున్న విషయం.

అలా పన్నెండు మంది శ్రీవిద్యా ఉపాసకులు ఉన్నారు. వీరి వలన శ్రీవిద్య వ్యాప్తి చెందింది. వారు– 1. మనువు 2. చంద్రుడు 3. కుబేరుడు 4. అగస్త్యులవారు 5. లోపాముద్ర 6. మన్మథుడు 7. అగ్ని 8. ఇంద్రుడు 9. సూర్యుడు. 10. దూర్వాసుడు – ఈ మహానుభావుడు ఇచ్చిందే 'ఆర్యాద్విశతి', 'త్రిపురామహిమ్నః స్తుతి', 'పరశంభు మహిమ్నః స్తుతి.'

ముఖ్యంగా కాంచీపురంలో ఆ క్షామాక్షీదేవి రాగానే ఎలా ఆరాధన చెయ్యాలని దేవతలందరూ ఆలోచించారు. "వస్తాదులే శివాంశతో పుట్టినవాడు. ఎందుకంటే శివుడు కానివాడు నా గురించి చెప్పలేదు, నన్ను పూజించలేదు" అని అమ్మవారు చెప్పింది. శివాంశతో ఉన్న దూర్వాసుడు వచ్చి తన శిష్యులను అక్కడ పెట్టి నిత్యం పూజలు జరగాలని ఏర్పాటు చేశాడు. ఆ దూర్వాసుడు విధించిన పూజయే అలా క్రమక్రమంగా వచ్చింది. ఈ దూర్వాసుడే తరువాతి కాలంలో అనేక రూపములతో అక్కడ పూజా విధానం ఏర్పాటు చేశాడు. ఈ దూర్వాసుల వారే మూకకవిగా పుట్టి మూకపంచశతి అందించారని కామాక్షీ విలాసం అనే గ్రంథం తెలియజేస్తోంది. అమ్మవారి ఆరాధన ఆ శివాంశ ఉంటే గాని చేయలేరు. ఈయన వలన అనేకములైన శ్రీవిద్యా విషయములు వ్యాప్తి చెందాయి. 11. స్కందుడు 12. శివుడు. ఈ పన్నెండు మంది కూటత్రయ విద్యను వృద్ధి చేసినవారు. కూటత్రయ విద్య అంటే వాగ్భవకూట, కామరాజ కూట, శక్తికూటాలు అని చెప్పబడే విద్యలని వారి వారి పద్ధతులలో వారు ఉపాసన చేశారు. ఇలా వచ్చినది అమ్మవారి విద్య గనుక – మానవులకి ప్రధానంగా మొదటి వాడు మనువు. స్వాయంభువ మనువు. మన దృష్టిలో ఇతడు సృష్టికి ప్రారంభం. 'మనువిద్యా' అని ప్రారంభించారంటే శాస్త్రాలలో ఉపలక్షక న్యాయము అని అంటారు. మనువు చెప్పాడంటే మొత్తం పన్నెండు మంది చెప్పారని అర్థం. మనువిద్య అంటే మొత్తం అయ్యింది.

239. చన్ద్రవిద్యా – శ్రీ చన్ద్రవిద్యాయై నమః

చంద్రుడు ఉపాసించిన విద్య. నిజానికి అమ్మవారి విద్యే చన్ద్రవిద్య. చంద్రత్వము అంటే చల్లదనము. రసత్వము, ఆర్ద్రత అమ్మవారి యొక్క స్వరూపము. అగ్ని, వేడి ఇదంతా అయ్యవారి స్వరూపం. అమ్మవారి విద్య అది, అయ్యవారి విద్య ఇది. మనకు రెండూ కావాలి. అగ్నీషోమాత్మకం జగత్. సోమం అంటే అమ్మవారే. సోమపానం అంటే సోమలత నుంచి పానం చేస్తారు. అది యజ్ఞంలో ప్రక్రియ. అది బహిర్యాగం. ఆ సోమపాన విద్యయే శ్రీవిద్యలో అమృతాన్ని ఇచ్చి పానం చేయడంగా వచ్చింది. ఆ సోమలతయే యోగంలో కుండలిని. ఆ లతలో ప్రసరించే చిదేకసరూపిణిని సహస్రార కమలంలో గ్రహించి ఆస్వాదించేవారు అసలైన సోమపీథులు. యోగవిద్యలో అది సోమపానం. అక్కడ ఆ చంద్రబింబస్వరూపిణి అయినది.

సహస్రార కమలంలో చంద్రమండలంలో అమ్మవారు ఉంటారు. అది అక్కడ స్రవిస్తేనే 'ప్రపంచం సించంతీ పునరపి రసామ్నాయ మహసః'. దీని గురించి వేదంలో 'ఇయం వావసరఘా' అనే మంత్రమున్నది. ఈ సరఘా అనే దానిని తీసుకుని శంకరభగవత్పాదులవారి యొక్క పరమ గురువులు గౌడ భగవత్పాదులవారు (గోవిందభగవత్పాదులవారు శంకరులకు గురువుగారు) 'సుభగోదయ స్తవం' అని రచించారు. ఇది సౌందర్యలహరికి మాతృకాగ్రంథం. 'సుభగోదయ స్తవం'లో చెబుతున్నారు.

'సహస్రారే పద్మే శశిరమహసాం బింబమపరం, తదేవ శ్రీచక్రం సరఘమితి తద్బైందవమితి'– సహస్రారపద్మంలో 'శశిరమహసాం' అంటే చంద్రుడు. చంద్రబింబం అక్కడ ఉన్నది. ఈ చంద్రబింబమే సూక్ష్మ శ్రీచక్రము. అదే బైందవ చక్రము అని చెప్పబడుతున్నది. అక్కడ శ్రీచక్రానికి 'సరఘమితి' అనేమాట ప్రయోగించారు. అది యోగి అందుకుంటాడు. దానికి సంబంధించిన విద్య 'చన్ద్రవిద్య'. అంటే 'శ్రీవిద్య'.

శ్రీవిద్య–చన్ద్రవిద్య అంటే శ్రీవిద్య ద్వారా మనం అక్కడకి చేరగలుగుతున్నాం

కనుక 'చన్ద్రవిద్య'. నేను చెప్పిన చన్ద్రవిద్య అనేది అదే అని ఋషి హయగ్రీవస్వామివారు ఇక్కడ తెలియజేస్తున్నారు.

240. చన్ద్రమండలమధ్యగా - శ్రీ చన్ద్రమండలమధ్యగాయై నమః

చన్ద్రమండలం మధ్యంలో అమ్మవారు ప్రకాశిస్తున్నారు. అనగా సహస్రార కమలంలో ఉన్న శివశక్త్యైక్య రూపంలో ఉన్న చన్ద్రమండలం. శివపురాణంలో శివుడు పార్వతీదేవితో చెప్తూ **'అహమగ్నిశిరో నిష్ఠస్త్వం సోమశిరసి స్థితా'** అని అంటాడు. "నేను అగ్ని శిరస్సుపై ఉంటాను. నువ్వు సోమశిరస్సుపై ఉంటావు" అన్నాడు. **'అగ్నీషోమాత్మకం విశ్వం ఆవాభ్యాం సమధిష్ఠితమ్'** – ఈ జగమంతా అగ్నీషోమాత్మకం కావున మన ఇద్దరిచేత చక్కగా అధిష్ఠింపబడినది.

అగ్ని శిరస్సు అంటే మూలాధారంలో మూడు చుట్లు చుట్టుకొని ఉన్న కుండలినీ తేజస్సు. ఇదే మహాలింగం. ఇదే అగ్ని. ఇది జ్వలిస్తేనే ఆ పైకి వెళ్ళి చంద్రమండలాన్ని అందుకుంటేనే ధార. 'అగ్నీషోమాత్మకం జగత్' అని ఇక్కడ చూపిస్తున్నారు. ఈ రెండింటి యోగం వివరిస్తున్నాడు. ఇది పెద్ద రహస్యం. కనుకనే చన్ద్రవిద్య అంటే చంద్రుడు ఉపాసించిన విద్య అని మాత్రమే కాకుండా ఈ అర్థం కూడా తీసుకోవాలి. అమ్మవారికి చంద్ర అనే పేరు అనేక చోట్ల ఉంది. 'చంద్రాం' 'చంద్రసహోదరీం' (లక్ష్మీ అష్టోత్తరశతనామస్తోత్రం)

చంద్ర అంటేనే ఆహ్లాదరూపుడు, అమృతరూపుడు. అమ్మవారు ఆహ్లాదస్వరూపిణి, అమృతస్వరూపిణి, ప్రసన్నతారూపిణి, రసస్వరూపిణి కనుకనే **ఆర్ద్రాం పుష్కరిణీం పుష్టిమ్** – శ్రీసూక్తం. ఆ ఆర్ద్ర శక్తే చంద్రశక్తి. అందుకే 'చన్ద్రవిద్యా' 'చన్ద్రమండలమధ్యగా'.

చన్ద్రమండలం అనగా శ్రీచక్రానికి మరొక పేరు. ఇది ఎలాగు అంటే శ్రీచక్రం తొమ్మిది ఆవరణలు. క్రింది నుంచి మూడు ఆవరణలని ఒక మండలంగా తీసుకోవాలి. త్రైలోక్యమోహన చక్రం నుంచి మూడు ఆవరణలు వెళితే అగ్ని మండలం. దాని తరువాత మూడు ఆవరణలు సూర్యమండలం. దాని తరువాత మూడు ఆవరణలు

చన్ద్రమండలం. ఈ చన్ద్రమండలానికి మధ్యలో బిందురూపంలో ఉంది కనుక 'చన్ద్రమండలమధ్యగా'.

మన లోపల కూడా శ్రీచక్రాన్ని భావన చేస్తే అలాగే ఉంటుంది. మూలాధారం నుంచి లెక్కకడితే మొత్తం మనలో ఉన్న ఆరు చక్రాలలో రెండు చక్రాలకు ఒక మండలం చేస్తే – మొదటిది అగ్ని మండలం. రెండవది సూర్యమండలం, మూడవది చన్ద్రమండలం. అంటే ఆజ్ఞాచక్రం నుంచి సహస్రారం వరకు చన్ద్రమండలం ఉంది. దానిలో ఉన్నది 'చంద్రమండలమధ్యగా'. ఆ స్వరూపం ఎలా ఉన్నది అంటే తరువాతి నామంలో చెప్తున్నారు 'చారురూపా'.

241. చారురూపా – శ్రీ చారురూపాయై నమః

'చారు' అంటే మనోహరమైన అని అర్థం. మనస్సుని హరించే అత్యంత సుందరమైన రూపం కనుక 'చారురూపా'. చంద్రుడు ఎవరికైనా ఆనందంగా గోచరిస్తాడు. అలాగే అమ్మవారి తత్త్వం కూడా అందరికి ఆనందాన్ని కలిగిస్తుంది. రసగ్రహణ లక్షణం ఉంటే ఎవరికైనా ఆహ్లాదాన్నే కలిగిస్తుంది. అలాంటి ఆహ్లాదకరరూపం అమ్మవారిది. అంతే కాదు... అత్యంతమనోహరమైనది.

ఇలాంటి సౌందర్యరూపాన్ని గురించి శంకరభగవత్పాదులవారు త్రిశతినామావళికి భాష్యం రాస్తూ 'చారురూపా' **"దుఃఖాస్పర్శ పరమానందరూపతయా"** అని చెప్పారు. దుఃఖం యొక్క స్పర్శ ఏమీ లేని ఆనందం అన్నారు. సృష్టిలో మనం ఏ ఆనందాన్ని తీసుకొన్నా దానికి దుఃఖస్పర్శ ఉంది. అవునో కాదో ఎవరికి వారే ఆలోచిస్తే తెలుస్తుంది.

ఒక ధనం వస్తే దానికి కావలిసినన్ని దుఃఖస్పర్శలు ఉన్నాయి. అందుకే ఆర్జన నుండి వినియోగం వరకు వివిధ దుఃఖాలు. కనుక సృష్టిలో ఏ ఆనందం అనుభవిస్తున్నామన్నా ప్రక్కన నేనున్నానని దుఃఖం పొంచి చూస్తూ ఉంటుంది. అందుకే లోకసుఖాలు అన్నీ దుఃఖస్పర్శలు ఉన్నవే. కేవలం అమ్మవారు ఆ దుఃఖస్పర్శలు ఏమీ లేని శుద్ధ ఆనందరూపిణి సచ్చిదానందతత్త్వం కనుక 'చారురూపా'.

242. చారుహాసా – శ్రీ చారుహాసాయై నమః

చారురూపం యొక్క ఆనందాన్ని అంతా అమ్మవారు నవ్వులో చూపిస్తున్నారు కనుక చారుహాసా. అమ్మవారి నవ్వు ఒక విద్య. ఆ నవ్వులో చారుత్వం కనబడుతోంది అంటే ఏమాత్రం దుఃఖపు ఛాయ లేదు. భయం, శోకం, శంక, మోహం, లోభం – ఇవన్నీ దుఃఖం యొక్క అవతారాలు. ఇవేమీ లేని ప్రసన్నమైన, గంభీరమైన, పరిపూర్ణమైన ఆనందం అమ్మవారు. ఆ ఆనందప్రకాశమే చారుహాసం.

243. చారుచన్ద్రకలాధరా – శ్రీ చారుచన్ద్రకలాధరాయై నమః

అమ్మవారి రూపము, నవ్వు వర్ణించారు. ఇక్కడ అమ్మవారు ధరించిన చంద్రకళను వర్ణిస్తున్నారు. ఇది ఎలా భావించాలంటే 'శ్రీచక్రమధ్యంలో బిందువులో కూర్చున్న తల్లి చారురూపంతో ప్రకాశిస్తూ, చారుహాసం చేస్తూ, చారుచన్ద్రకళను ధరించింది'. అసలు చంద్రకళని ధరించిన అమ్మవారిని తలచుకుంటే ఏమి వస్తుందో శాస్త్రం వర్ణిస్తోంది.

చంద్రశేఖరా! అన్నా ఇదే అర్థం.

విశుద్ధజ్ఞానదేహాయ త్రివేదీ దివ్యచక్షుషే

శ్రేయః ప్రాప్తి నిమిత్తాయ నమః సోమార్ధధారిణే

విశుద్ధమైన జ్ఞానదేహం కలిగినవాడు, 'త్రివేది' –మూడు కాలాల్ని, మూడు లోకాల్ని తెలిసినవాడు, దివ్యదృష్టి కలిగినవాడు, చంద్రశేఖరుడు అయిన స్వామిని 'శ్రేయఃప్రాప్తి నిమిత్తాయ' – శ్రేయప్రాప్తికై ఇలాంటి స్వరూపాన్ని ధ్యానించాలి. అందుకే యముడు తరుముకొస్తుంటే మహానుభావుడు మార్కండేయునికి ఈ పేరే గుర్తు వచ్చింది. **'చంద్రశేఖరమాశ్రయే మమ కిం కరిష్యతివై యమః', 'చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర పాహిమాం, చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర రక్షమాం'**. మహిమంతా ఆ పేరుకున్నది. ఆ నామం అనుకుంటే చాలు అమృతత్వం, సౌమ్యం, విశుద్ధమైన జ్ఞానస్వరూపం, ఆనందస్వరూపం కనబడుతోంది. ఆ జ్ఞానం, ఆనందం రెండూ కలిసిన లక్షణమే చంద్రకళ.

పరమేశ్వరుడు లేదా పరమేశ్వరి ధరించిన చంద్రకళ పేరు సదాకళ, సాదాఖ్యకళ, ధ్రువాకళ అంటారు. అంటే మనం చూసే చంద్రుని యొక్క పదిహేనుకళలు మార్పులు చెందుతూ ఉంటాయి. మారని పదహారో కళ **'అమృతః ఆత్మనః కళాం'** – ఆ మారని కళ శుద్ధమైనది. అమృతం అంటూ ఉంటేనే ఇన్ని మార్పులు కలుగుతున్నాయి. మనస్సుని చంద్రునితో పోలిస్తే ఒకొక్కసారి మనస్సులో ఒక్కో కళ ఉంటుంది. ఒక వ్యక్తి ఇవాళ ఆనందంగా ఉన్నాడంటే రేపు ఉంటాడని నమ్మకం లేదు. సుఖదుఃఖభావాలతో మనస్సు యొక్క కళలు మారిపోతూ ఉంటాయి. మారుతున్న మనస్సు యొక్క కళలు మనకి తెలుసు గాని మనస్సులో ఇన్ని కళలు కనబడడానికి వెనకాల మారని ఒక కళ ఉంది. అది ఆత్మస్వరూపమైన పరమాత్మ. ఆయన ఒకడు ఉంటేనే మనస్సు రకరకాలుగా ఉంటోంది. కనుక మార్పులన్నీ మనస్సు అనే చంద్రునికే గాని, దీనికి మూలమైన ఆత్మ అనే చంద్రునికి మార్పు లేదు. మారుతున్న మనస్సు అనే కళలను చూస్తున్నాం గాని మారని ఆ కళని చూడాలి. అది చూస్తే మన మనస్సులో ఇన్ని మార్పులు ఉండవు. ఎప్పుడూ ఒకేలాగ ఉంటాము. ఆ స్థితిని తెలుసుకోవాలి.

మారని ఆ కళయే పదహారవది. అదే షోడశీ. అదే ఆత్మ. ఆ సాదాఖ్య అనే కళే అమ్మవారి యొక్క శిరస్సు మీద ఉంటుంది. ఆ చంద్రశేఖరులు మాత్రమే మనకి ముక్తిని ఇవ్వగలరు. అమృతస్వరూపమైన ఆ రూపమే శాశ్వతత్వాన్ని, ఆనందాన్ని, జ్ఞానాన్ని మూడింటిని చెప్పే కళ. చంద్రశేఖరుడు అంటే శాశ్వతమైనవాడు, జ్ఞానస్వరూపుడు, ఆనందస్వరూపుడు. ఇవే నామాల్లో 'డు'లు తీసేసి స్త్రీగా చెప్తే ఆవిడ చంద్రశేఖరి. 'చారుచన్ద్రకలాధరా'.

244. చరాచరజగన్నాథా - శ్రీ చరాచరజగన్నాథాయై నమః

'గతిశీలత్వాత్ జగత్' – జగత్ అంటే పరిణామశీలమైనది. నిన్న ఉన్నట్టు ఈవేళ లేదు, ఈవేళ ఉన్నట్టు రేపు ఉండదు. ఈ జగత్తులో రెండురకాల జీవులనే మనం చూడగలం అవి చర–కదిలేవి, అచర–కదలనవి.

వృక్షశిలాదులు అన్నీ అచరములు, మానవ పశు పక్ష్యాదులన్నీ చరములు. ఈ రెండు రూపములైన ఈ చరాచరజగత్ అంతటికి కూడా 'నాథా' అనగా నాయకురాలు - చరాచరజగన్నాథా. చరాచరరూపమైన జగతికి నాయకురాలు.

245. చక్రరాజనికేతనా - శ్రీ చక్రరాజనికేతనాయై నమః

నికేతనము అనగా ఇల్లు. చక్రరాజమే తన ఇల్లుగా చేసుకొని ఉంది. అంటే ప్రపంచం అంతా కలిపి ఒకటే శ్రీచక్రం. మనలో కూడా శ్రీచక్రం ఉంది. ఈ విషయం చాలా ప్రధానమైనది. గతం నుంచి శ్రీచక్రం గురించి సూచన ఇస్తూ వస్తున్నాం. సూక్ష్మం నుంచి క్రిందకి వస్తూ ఉంటే స్థూలం. స్థూలం నుంచి పైకి వెళ్తూ ఉంటే సూక్ష్మం. క్రిందకి వస్తున్న కొద్దీ ప్రపంచము, పైకి వెళ్తున్నకొద్దీ పరమాత్మ. అందుకే ఈ ఎనిమిది ఆవరణలు లోకం. పైన బిందువు లోకాతీతం. ఈ మొత్తం కలిపిన ఆ తల్లే ఇందులో ఉందని తెలుసుకుంటే అదే 'శ్రీచక్రం'. కనుక విశ్వమే 'శ్రీచక్రం', శరీరమే 'శ్రీచక్రం'.

ఈ పిండాండ, బ్రహ్మాండసమన్వయమే శ్రీచక్రోపాసన. మనందరిలో శ్రీచక్రాన్ని భావించవచ్చు. శ్రీచక్రములో తొమ్మిది ఆవరణలు ఉంటాయి. ఈ తొమ్మిది ఆవరణలలో మొట్టమొదటిది బిందువు. దాని తరువాత త్రికోణం. దాని తరువాత అష్టత్రికోణం. దాని తరువాత దశత్రికోణం. దాని తరువాత బహిర్దశారం. దాని తరువాత పధ్నాలుగు త్రికోణాలు. దాని తరువాత అష్టదళపద్మం. దాని తరువాత షోడశదళపద్మం. దాని తరువాత భూపురం. కాని మనం పరిశీలిస్తే అష్టదళానికి చుట్టూ ఒక వృత్తం గీసి ఉంటుంది. అలాగే షోడశదళానికి మూడు వృత్తాలు గీసి ఉంటాయి. తరువాత వచ్చేది భూపురం. భూపురం వచ్చేటప్పటికి చతురస్రమని ఒకటి చెప్పినా మూడు గీతలు ఉంటాయి.

మనమందరం తిన్నగా కూర్చుంటే మేరుప్రస్తారాలమే.

శ్రీచక్రం బ్రహ్మరంధ్రం చ సువృత్తం చ తిక్రోణకం
లలాటే అష్టారకం చ భ్రూవోర్మధ్యే దశారకం
బహిర్దశారం కంఠేతు మన్వస్రం హృదయే భవేత్
కుక్షౌతు ప్రథమం వృత్తం నాభ్యాం అష్టదళాంబుజం
కట్యాం ద్వితీయవలయం స్వాధిష్ఠానే కళాశ్రకం
తస్యాదధస్తాత్ తృతీయం మూలాధారే చతురశ్రకం
ద్వితీయం భూపురం జంఘే తృతీయం వామజంఘకే
త్రిపురేశీ మహాయంత్రం సృష్టిన్యాసవిధిక్రమాత్

బిందువు సహస్రారమధ్యంలో ఉంది. అది సర్వానందమయచక్రం. దాని చుట్టూ ఉన్న శిరస్సు త్రికోణం. ఇది సర్వసిద్ధిప్రదచక్రం.
అష్టత్రికోణచక్రం సర్వరోగహరచక్రం అనే పేరుతో లలాటస్థానంలో ఉంది. వశిన్యాది వాగ్దేవతలు అక్కడే ఉంటారు.

కనుబొమల నడిమి ప్రాంతంలోనే అంతర్దశారచక్రం ఉంది.

కంఠంలో బహిర్దశారచక్రస్థానం ఉంది. మనువులు పధ్నాలుగు మంది కనుక మన్వస్రం అంటే పధ్నాలుగు త్రికోణముల చక్రము. దీనికే 'సౌభాగ్యదాయక చక్రం' అని పేరు. అది హృదయంలో ఉంది.

మన్వస్ర చక్రం తరువాత అష్టదళచక్రానికి వెళ్ళాలి. ఈ అష్టదళచక్రం వద్దకి వెళ్ళేటప్పుడు ఒక వృత్తం ప్రారంభమై దళాలు వచ్చి, మళ్ళీ వృత్తంతో పూర్తి అవుతుంది. కనుక కుక్షి యందు మొదటి వృత్తం వచ్చి నాభి యందు అష్టదళాలు వస్తాయి. నాభి తరువాత కటి యందు రెండవ వృత్తం వచ్చింది. ఈ చక్రానికి 'సర్వసంక్షోభణచక్రం' అని పేరు. స్వాధిష్ఠానచక్రం వద్దకు వచ్చేటప్పటికల్లా షోడశదళపద్మం పూర్తయిపోతుంది.

కళలు ఎన్ని? పదహారు. అందుకే కళాశ్రకం అన్నారు. దాని క్రింద మూలాధారం ఉంది. ఇది త్రైలోక్యమోహనచక్రం. మూలధారం దగ్గర మూడుగీతలు ఉంటాయి. ప్రధానంగా మూలాధారం వద్ద ఒక చతురస్రం గీసుకొని (ఊహా రూపంగా), తరువాత వామజంఘ, దక్షిణజంఘ (ఎడమ, కుడి కాలిపిక్కలు)

మూలాధారంతో కలుపుకుంటే మూడుగీతల చతురస్రం త్రైలోక్యమోహనచక్రం. మనం కూర్చున్నప్పుడు పాదములు, కాలిపిక్కలు, మూలాధారం కలుపుకుంటే త్రైలోక్యమోహన చక్రం.

స్వాధిష్ఠానం వద్ద షోడశదళపద్మం, మణిపూరం దగ్గర అష్టదళపద్మం, హృదయం వద్ద మన్వస్రం, కంఠం దగ్గర బహిర్దశారచక్రం, భ్రూమధ్యంలో అంతర్దశారచక్రం, లలాటప్రాంతమంతా అష్టత్రికోణచక్రం, తలపై భాగమంతా త్రికోణచక్రం, సహస్రారమధ్యంలో బిందుచక్రం. ఇదే మొత్తం మన శరీరంలో ఉన్న శ్రీచక్రస్వరూపం. ఇందులో మొత్తం ప్రసరిస్తూ అమ్మవారు ఉన్నారు కనుక 'చక్రరాజనికేతనా'. ఇలా భావన చేసుకుని మనం తెలుసుకోవాలి. ప్రధానం – క్రింద నుంచి పైకి, పై నుంచి క్రిందకి మనం చూశాం. సంహారచక్రం అంటే లోకం నుంచి క్రమంగా అమ్మలో లీనమవడం. సృష్టిక్రమం అంటే పై నుండి క్రిందకి చెప్పడం. కనుక మూలాధారం నుంచి సహస్రారం వరకూ మనలో ఉన్న శ్రీచక్రంలో భాసించే ఆత్మరూపచైతన్యమే 'చక్రరాజనికేతనా' అని చెప్పబడుతున్నది.

'మనువిద్యా, చన్ద్రవిద్యా' నామాల నుండి 'చన్ద్రవిద్య' గా చెప్పబడుతున్నాయి. చన్ద్రమండలమధ్యగా అంటే బిందుమధ్యంలో ప్రకాశించే అమ్మవారి యొక్క స్వరూపం. ఆ తల్లి చక్రరాజంలో భాసిస్తోంది కనుక 'చక్రరాజనికేతనా'. చక్రరాజము అన్నప్పుడు బాహ్యంగా మనం ఆరాధించే యంత్రమే కాకుండా యంత్రము అనగానే శక్తి కేంద్రీకృతమైనచోటు అని భావించాలి. అలా మనం పరిశీలిస్తే మన శరీరమంతా శక్తిమయం. మన శరీరమే శ్రీచక్రం. ఈ శ్రీచక్రాన్ని మన శరీరంలో ఎలా భావించాలో భావనోపనిషత్తులో చెప్పారు. అలాంటి భావన చేసినప్పుడే అమ్మవారి అనుగ్రహం పూర్ణంగా లభిస్తుంది. అది కేవలం బాహ్యం వల్ల లభించదు. అదే 'భావనాగమ్యా'. కేవలం భావనకి భగవంతుడు దొరుకుతాడనే తేలికపాటి అర్థం అందులో లేదు. 'భావనోపనిషత్' యొక్క భావన అంతా ఆ భావనలో ఉన్నది. ముందు వివరంగా చెప్పుకున్న శ్లోకమే సాధకుల ఉపయోగం కోసం మరొక శాస్త్రంలో అతిక్లుప్తంగా కూడా చెప్పారు. అది మనం ఎక్కడ ధ్యానం చేసుకున్నా సరిపోతుంది.

బైందవం బ్రహ్మరంధ్రం చ మస్తకం చ త్రికోణకం
లలాటే అష్టారచక్రం చ భ్రువోర్మధ్యే దశారకం
బహిర్దశారం కంఠేతు మన్వస్రం హృదిసంస్థితం
నాభౌతు వసుపత్రం చ కట్యాం షోడశపత్రకం
వృత్తత్రయం చ ఊరూభ్యాం పాదయోః చతురస్రకం

బ్రహ్మరంధ్రం దగ్గర 'సర్వానందమయచక్రం' అని చెప్పబడుతున్న బిందుచక్రం.

అటు తరువాత వస్తున్నది 'త్రికోణము'. ఇది 'సర్వసిద్ధిప్రదచక్రమ'ని చెప్పబడుతున్న త్రికోణం. అది మస్తకం. లలాటం వద్ద ఉన్న చక్రం 'అష్టత్రికోణచక్రం'. ఇది 'సర్వరోగహరచక్రం'. భ్రూమధ్యం వద్ద ఉన్నది 'అంతర్దశారచక్రం'. ఇదే 'సర్వారక్షాకరచక్రము'. ఇది పది త్రికోణాలతో ఉన్న 'అంతర్దశారచక్రం'.

కంఠం వద్ద మరో పది త్రికోణాల చక్రం–'బహిర్దశారచక్రం'. దీనికి 'సర్వార్థసాధకచక్రం' అని పేరు ఉంది. హృదయం వద్ద పధ్నాలుగు త్రికోణాల 'సర్వసౌభాగ్యదాయక చక్రం'.

నాభి దగ్గర అష్టదళములతో ఉన్న 'సర్వసంక్షోభణచక్రము'. అటుతరువాత కటి–స్వాధిష్ఠానం ప్రాంతమంతా షోడశదళములతో కూడిన సర్వాశాపరిపూరక చక్రం. మూలాధారం నుంచి పాదముల వరకు విస్తరించబడినది 'త్రైలోక్యమోహన చక్రం'(చతురస్రం). మొత్తం శరీరాన్ని శ్రీచక్రస్వరూపంగా ఆవిష్కరించుకొని అలాంటి చక్రరాజంలో అమ్మ ఉన్నది అని భావన చేస్తే మన తనువు అంతా అమ్మమయం. ఇదే మణిద్వీపంగా భాసిస్తున్నది.

మూలాధారం క్రిందుగా అకులసహస్రారంలో భూపురం (చతురస్రం), దానిపైననే 'విషువ' పేరు కలిగిన ఎర్రని ఆరు దళాల పద్మంలో షోడశదళ చక్రం, మూలాధారమునందు అష్టదళ చక్రం, మణిపూరకంలో దశదళంలో బహిర్దశార చక్రం, అనాహతంలో ద్వాదశదళమునందు అంతర్దశార చక్రం, విశుద్ధమునందు పదహారు దళాలలో అష్టా (అష్టత్రికోణ) చక్రం, లంబికాగ్రం(కొండనాలిక)లో

త్రికోణావరణ దేవతలు, ఆయుధ దేవతలు; ఆజ్ఞాచక్రంలో ద్విదళపద్మంలో బిందుచక్రం – తద్దేవతను ధ్యానించాలి.(ఆధారం: శ్రీకరపాత్రస్వామివారిచే సంకలితమైన 'శ్రీవిద్యారత్నాకరః') 'శ్రీచక్రం'లో చెప్పిన మరో పద్ధతిలో అంతర్యాగం చెప్పబడింది.

246. పార్వతీ – శ్రీ పార్వత్యై నమః

అమ్మవారికున్న పేర్లలో ఎంతో దివ్యమైన, మధురమైన నామములలో 'పార్వతీ' ఒకటి. అమ్మవారి నామవైభవ, రూపవైభవ, లీలావైభవ, మంత్రవైభవ, తత్త్వవైభవ, యోగవైభవ – మొత్తం ఆరు వైభవాలు ఇందులో ఉన్నాయి. కొన్ని చోట్ల ఉపాసనాపరమైన నామాలు కనబడుతూ ఉంటాయి. కొన్ని చోట్ల ఉపనిషత్ పరమైన నామాలు. ఎప్పుడైనా ఉపనిషత్తు విద్యలు నేర్చుకోవాలంటే కనీసపు అర్హతలు కొన్ని ఉన్నాయి. అంతేకాని మనం ఎలా ఉన్నామో అలాగే ఉంటూ ఉపనిషత్తులు అర్థం కావాలంటే కావు. దానికంటూ ముందు కొంత సాధన ఉండాలి. **'అథాతో బ్రహ్మజిజ్ఞాస'**– అటువంటి సంస్కారం, అధికారం ఉంటేగాని అర్థం కాదు.

వశిన్యాదివాగ్దేవతలు లలితాసహస్రనామాల్ని అలా కూర్చారు. మామూలుగా ఉపాసనలో బాహ్యమైన మంత్రములు, న్యాసములు ఇవే కొందరికి ఎక్కువ ఆసక్తి. ఇవి కాదని కాదుగాని ఎంతకాదన్నా ఇవి బాహ్యామే. శ్రీవిద్య యొక్క అసలు ప్రయోజనం బ్రహ్మవిద్య. లేకపోతే 'అహం బ్రహ్మాస్మి' ప్రతిపాదన చేసి, మహావాక్యాలు అందించి, ప్రస్థానత్రయం భాష్యం అందించిన ఆ బ్రహ్మజ్ఞుడు, జీవన్ముక్తుడు శంకరులు– ఒక తంత్రశాస్త్రాన్ని పట్టుకున్నాడు అంటే ఆలోచించాలి. ఆయన ప్రస్థానత్రయంలో ఏది ప్రతిపాదించారో అది అంతా ఈ శ్రీవిద్యలో ఉంది కనుకే దీనిని శంకరులవారు పట్టుకున్నారు. అందుకే శ్రీవిద్య బ్రహ్మవిద్య. ఈ ప్రస్తావన సహస్రనామాల్లో చేస్తూనే ఉన్నారు. దీనిపేరు మహావిద్య. మహా అనే మాట ఎక్కడ వచ్చినా అది బ్రహ్మమనే అర్థం. అందుకు దీన్ని బ్రహ్మవిద్యగానే గ్రహించాలి. మొట్టమొదట సాధకులకి మాత్రం ఇది మహిమాన్వితమే.

పార్వతీ అంటే సాధారణ అర్థంలో పర్వతరాజపుత్రి. పర్వతరాజు పుత్రికగా

పుట్టక ముందూ ఆవిడ పేరు పార్వతియే. పార్వతీ అంటే కేనోపనిషత్తులో చెప్పిన 'ఉమా హైమవతీ బహుశోభమానా'. శ్రీవిద్య అంతా కూడా ఈ స్వరూపమే. హైమవతీ అంటే హిమవత్పర్వతరాజపుత్రీ హైమవతీ. ఆ స్వరూపమే పార్వతి. అనగా బ్రహ్మవిద్యాస్వరూపిణీ. శివపురాణంలో పార్వతి గురించి చెప్తూ '**పార్వతీ పరమాదేవీ బ్రహ్మవిద్యాస్వరూపిణీ**' అన్నారు. పార్వతి అంటేనే బ్రహ్మవిద్యాస్వరూపం.

ఆవిడ బ్రహ్మవిద్య అయితే బ్రహ్మము పరమేశ్వరుడు. అంటే బ్రహ్మవిద్యకి, బ్రహ్మకి భేదం లేదు కనుక ఉభయులకి భేదం లేదు. ఈ పార్వతీదేవియే ఉపనిషత్తుల్లో దేవతలకి బ్రహ్మవిద్యని ఉపదేశించింది. ఉపనిషత్ ప్రతిపాద్యమైన దేవత – అమ్మ పార్వతీదేవి.

బ్రహ్మవిద్యాధిదేవత ఈ తల్లి. బ్రహ్మవిద్యాస్వరూపిణీ నామాన్నే మరొకచోట బ్రహ్మవిద్యా ప్రదాయిని నామంగా చెప్పారు. బ్రహ్మవిద్యని ఇస్తుంది కనుక ఈ తల్లినే ఆశ్రయించాలి. ఎందుకు బ్రహ్మవిద్య అంటే అది పొందేవరకూ జీవునికి మోక్షం లేదు.

ఈ శరీరాన్ని పొంది కూడా బ్రహ్మవిద్యకి ఎవరు ప్రయత్నించరో వారికి ఉపనిషత్తు 'ఆత్మద్రోహి' అని పేరు పెట్టింది. తనకు తాను ద్రోహం చేసుకుంటున్నాడు. ఎందువల్ల అంటే ఇంత శరీరాన్ని, ప్రజ్ఞకి ఆలంబన అయిన బుద్ధిని మనకి ఇచ్చాడు. ఆ బుద్ధి పొంది కూడ వినియోగించుకోలేదంటే వానికి ఆత్మఘ్నుడు అని పేరు. ఈ విషయాన్ని శంకరభగవత్పాదులవారు వివేకచూడామణిలో మొట్టమొదటి శ్లోకాల్లోనే హెచ్చరించారు.

పార్వతీ అనే నామానికి విశేషములైన అర్థములు:

పర్వతరాజపుత్రి పార్వతి. ఇది అమ్మవారి యొక్క లీలారూపం. కాని సత్యస్వరూపాన్ని మనం ఇప్పుడు చూడాలి. పార్వతి అనే నామానికి చాలా అర్థాలు ఉన్నాయి. పర్వతము అంటే కదలకుండా ఉండేది. కదలకుండా ఉండేదానికి ఉపనిషత్ ఒక మాట చెప్పింది – 'కూటస్థమచలం ధ్రువం'. ఈ శరీరం అనబడే కూటములో కదలకుండా ఉండేది ఏదో అది కూటస్థము అనగా ఆత్మస్వరూపమే. అచలం –

కదలకుండా ఉంటుంది. కనుక సుస్థిరమైన ఆత్మచైతన్యమే పర్వతం. ఆ ఆత్మజ్ఞానమే పార్వతి.

పర్వత సంబంధి పార్వతి కనుక పార్వతి అనగా బ్రహ్మజ్ఞానమే. ఇవన్నీ శాస్త్రము చెప్తున్న అర్థములే.

పర్వము అంటే కణుపు అని అర్థం. పర్వతానికి కూడా ఆ పేరు ఎందుకు వచ్చిందంటే అది ఒకటే అలా పైదాకా ఉండకుండా శిఖరములు బోలెడు ఉంటాయి. ఒకదానితో ఒకటి అనుబంధం ఉంటూ వెళ్తూ ఉంటాయి కాబట్టి దానికి పేరు పర్వతము.

పర్వము అంటే భాగము అని అర్థం. ఒకదానితో ఒకటి సంబంధం లేకపోతే పర్వములు అనకూడదు. మహాభారతంలో ఒకదానికొకదానికి అనుబంధం ఉంది కనుక వ్యాసులవారు 'పర్వము' అని పేరు పెట్టారు. దేనికదే అయిపోతే దాని పేరు 'ఖండము' అని అనాలి. ఖండం కాదది పర్వం.

పర్వము అని దేనినవాలంటే భాగము కనబడుతుంది కాని వేరు ఉండదు. దీనికి ఉదాహరణ – చెఱకు, వెదురులో కూడా పర్వములు ఉంటాయి. వెదురుకి, చెరకుకి కూడా కణుపు బట్టి భాగము తెలిసిపోతోంది. భాగము ఉందిగాని అందులో భాగం లేదు అంటే అర్థం ఒక భాగానికి, ఒక భాగానికి అనుబంధం ఉన్నది. కనుక భాగముగా కనబడుతున్నా ఏకముగా ఉన్నది ఏదో అది పర్వము. పర్వముగా ఉంటూ విస్తరించినది. 'తనోతి ఇతి' – తనోతి అంటే విస్తరించినది కనుక 'పర్వరూపేణ తనోతి' – పర్వములుగా విస్తరించినది పార్వతి. పార్వతి అంటే శక్తి. శక్తి ప్రధానంగా ప్రపంచములో మూడు రూపములతో వ్యాపించి ఉంటుంది. అవి ఇచ్ఛ, జ్ఞాన, క్రియ. ఇవి మూడు మూడు ముక్కలు కావు – కలిపి ఒకే శక్తి. ఇచ్ఛ, జ్ఞాన, క్రియ... ఈ మూడు పర్వములుగా కలిగిన ఒక శక్తిని పార్వతి అన్నారు.

మరొక అర్థంలో చూద్దాం. మన దగ్గర ఒక చెరకు విల్లు ఉంది. మూలాధారం నుంచి సహస్రారం వరకు ఉన్నదాన్ని చెరకు విల్లు అనుకుందాం. ఇందులో ప్రధానంగా ఆరు పర్వాలు ఉన్నాయి. మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ,

ఆజ్ఞ. ఇవన్నీ విడి ముక్కలు కావు. ఒకొక్కటి ఒక కణుపు. ఇలాగ మొత్తం వ్యాపిస్తున్న కుండలినీశక్తి, మూలాధారం నుంచి సహస్రారం వరకు ఈ కణుపులలోంచి (పర్వములలో) వ్యాపించుతూ వెళ్తున్న పార్వతీ.

పార్వతీ అంటే మరొక అర్థంలో చూస్తే శ్రీచక్రంలో నవ ఆవరణలు ఉన్నాయి. నవ ఆవరణలు ఏ చక్రానికి ఆ చక్రం విడిగా ఉన్నాయా? ఇదంతా శ్రీచక్రమే కనుక 'చక్రరాజనికేతనా'. శ్రీచక్రంలో తొమ్మిది ఆవరణలు. ఈ తొమ్మిది ఆవరణలు విడివిడి చక్రాలు తెచ్చి ఒక దగ్గర పెట్టినవి కాదు. బిందువే తొమ్మిది ఆవరణలుగా విస్తరించింది. కనుక తొమ్మిది ఆవరణలలోను వ్యాపించిన శక్తి అమ్మవారే. నవ ఆవరణలే నవ పర్వములు. ఈ నవ ఆవరణలు అనే నవ పర్వములలో వ్యాపించి ఉన్న చక్రరాజనికేతనయే 'పార్వతీ'. అనగా తొమ్మిది ఆవరణలలో వ్యాపించిపోయి ఉన్నది ఒక్క చైతన్యమే. 'చక్రరాజనికేతనా' వెంటనే 'పార్వతీ' నామం ఉండడంలో ఔచిత్యం.

247. పద్మనయనా – శ్రీ పద్మనయనాయై నమః

పద్మములవంటి నేత్రములు కలది. ముందు లీలారూపవర్ణన తెలుసుకోవాలి. అందుకే పద్మాక్షీ 'పుండరీకాక్షీ', పుండరీకాక్ష అనే శబ్దములు కూడా ఉన్నాయి. పుండరీకముల వంటి నేత్రములు కలది లేదా పుండరీకముల వంటి నేత్రములు కలవాడు. **'తస్య యథా కప్యాసం పుండరీకమేవ అక్షిణీ'** అని ఉపనిషత్తులో మంత్రం ఉంది. పుండరీక నేత్రములతో ప్రకాశించేవాడు అని పరమాత్మని వర్ణించారు. సూర్యమండలాంతరవర్తియైన పరమాత్మని పుండరీకాక్షునిగా వర్ణించి చెప్పారు. మనం ఏ పని ప్రారంభించినా పుండరీకాక్ష నామస్మరణ చేస్తాం కదా!

పుండరీకాక్ష అంటే ఏమిటో 'పద్మనయనా' అన్నా అదే అర్థం. అక్కడ పుంలింగం, ఇక్కడ స్త్రీలింగం. అంతే భేదం. సూర్యచంద్రులే అమ్మవారి నేత్రములు. సూర్యునికి, చంద్రునికి పద్మ సంజ్ఞ వేదములలోనే కనబడుతుంది. **'పద్ల్ గతౌ'** అనే ధాతువు నుంచి పద్మము వచ్చింది. వికసన లక్షణము, గమన లక్షణము కలిగిన దానిని పద్మము అని అంటారు. ఈ రెండు లక్షణాలు ఉన్నవాడు సూర్యభగవానుడు.

ఆయన చక్కగా వికసిస్తాడు, ఆయన వల్ల ప్రపంచం వికసిస్తోంది. అలాగే చంద్రునికి కూడా ఉంది. వారి కాంతులు ఎక్కడికైనా గమనం చేస్తాయి, వ్యాపిస్తాయి. వికసన గమన లక్షణములతో వ్యాపించేవి ఏవో అవి పద్మములు. ఆ సూర్యచంద్రులే నేత్రములుగా కలిగినది కనుక 'పద్మనయనా'.

248. పద్మరాగసమప్రభా - శ్రీ పద్మరాగసమప్రభాయై నమః

అమ్మవారి శరీరవర్ణమంతా పద్మరాగకాంతులవలె ప్రకాశిస్తున్నది. పద్మరాగము అంటే కెంపులలో ఒకరకమైన తెగ. సింహళదేశములో దొరికే మాణిక్యాలను పద్మరాగాలు అంటారు. అలాంటి పద్మరాగమణులు ఎర్రని కాంతులతో ఉంటాయి. అటువంటి ఎర్రని కాంతులతో ప్రకాశిస్తున్నది కనుక 'పద్మరాగసమప్రభా'. అమ్మకాంతులంటే జ్ఞానకాంతులే. అందుకే పద్మనయన తరువాత 'పద్మరాగసమప్రభా' చెప్పడంలో ఆ తల్లి నుంచి వ్యాపించి వచ్చిన జ్ఞానానంద అరుణ ప్రసారమే 'పద్మరాగసమప్రభా'.

249. పంచప్రేతాసనాసీనా - శ్రీ పంచప్రేతాసనాసీనాయై నమః
250. పంచబ్రహ్మస్వరూపిణీ - శ్రీ పంచబ్రహ్మస్వరూపిణ్యై నమః

ఇక్కడ ప్రేతశబ్దానికి అర్థం చలనరహితం. చలనము లేకుండా ఉండేవి ఐదు ఉన్నాయి. పరదేవత ఆసీనయైతే వాటికి చైతన్యం వచ్చింది. అప్పుడు 'పంచబ్రహ్మస్వరూపిణీ'. ఆ చైతన్యంతో ఆ ఐదు కూడా ప్రకాశించిపోతున్నాయి.

నారాయణభట్టు పాఠంలో 'పంచబ్రహ్మస్వరూపిణీ'కి బదులుగా 'పరబ్రహ్మ స్వరూపిణీ' అని ఉన్నది. పంచబ్రహ్మస్వరూపిణిగానే ఎక్కువమంది తీసుకుంటున్నారు కనుక మనం కూడా దానినే స్వీకరిద్దాం. పంచప్రేతలు అనగా బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివ. వీరు ఐదుగురు కలిపితే ఒకరే ఈశ్వరుడు.

ఈశ్వరుని పని కదలకుండా ఉండడం. ఆయన శక్తి పని కదలడం. కదలకుండా స్థిరంగా కూర్చున్నవాడు ఆయన. ఆయన శక్తి కదులుతోంది. జ్యోతి

కదలకుండా ఉంది, కాంతి కదులుతోంది. అదొక్కటి అర్థం చేసుకుంటే చాలు. కాంతి జ్యోతిని ఆసనముగా తీసుకుంది. అలాగ ఆయన నిశ్చలంగా సాక్షీభూతంగా చూస్తూ ఉంటే పంచరూపములతో ఉన్న ఆ ఈశ్వరుని ఆధారం చేసుకొని ఈవిడ శక్తిగా వ్యాపించి ఉంది. 'పంచప్రేతసనాసీనా' – వీరి యొక్క పనులు ఐదు. అవి సృష్టి, స్థితి, సంహార, తిరోధాన, అనుగ్రహ. ఈ నామాల వివరణ ముందు ముందు వివరించుకుంటాం. ఈ ఐదు పనులు చేసినపుడు వారికి చైతన్యం ఉంది అంటారు. ఐదు పనులు చేయనప్పుడు కదలకుండా ఉన్నవారిలో ఈ ఐదు పనుల రూపంలో కదలిక ఈ తల్లి తెచ్చింది. కానీ వారు మాత్రం కదలకుండా ఉన్నారు.

వేదాంతశాస్త్రం ప్రకారం అయితే పరబ్రహ్మ అలాగే ఉన్నాడు. ఆయన యొక్క మాయాశక్తి మొత్తం చేస్తుంది. కదలకుండా ఉన్న పరబ్రహ్మస్వరూపం ఆయన. కనుక ఐదు రూపాలతో కనబడ్డా ఆయన పంచప్రేత అనగా చలనరహితంగా ఉన్నవాడు. ఆయనలో చలనం ఈవిడ తీసుకొచ్చింది. ఇదే స్పందశక్తి. అదే సౌందర్యలహరిలో శంకరులు చెప్పినమాట '**న చే దేవం దేవో న ఖలు కుశలః స్పందితుమపి**'. కదలిక లేకుండా ఉన్నవారు పంచప్రేతలు.

మనందరికి బాగా అలవాటైన ఒక చిత్రం గుర్తొస్తుంది. అమ్మవారు ఒక ఆసనం మీద కూర్చుని ఉంటారు. ఆ ఆసనానికి నాలుగుకోళ్ళల్లో నలుగురు, మధ్యలో బల్ల. ఈ విషయమంతా మళ్ళీ, 'సృష్టికర్త్రీ – బ్రహ్మరూపా' దగ్గర వస్తుంది. కనుక ఆ అర్థాన్ని ఇక్కడ భావించినా, ఈ అర్థాన్ని అక్కడ భావించినా ఒకదానికొకటి సహకరిస్తుంది.

సదాశివో మహాప్రేతః కేవలోనిశ్చలః ప్రియే
శక్త్యా వినా కృతో దేవి కథంచిదపి న క్షమః

"ఆ సదాశివునకు మహాప్రేత అని పేరు. అతడు కేవలుడు(అద్వితీయుడు), నిశ్చలుడు. అతడు కూడా శక్తితో కలయిక లేనప్పుడు ఏది చేయడానికి గానీ సమర్థుడు కాదు" అని వివరించారు.

ఇప్పుడు మరొక అర్థం– ఎందుకు ఈ అర్థం చెప్పుకుంటున్నామంటే తరువాత

నామాలు చాలా గట్టివి. మిగిలిన వాటికైతే లీలార్థం, మరొక అర్థం చెప్పుకున్నాం కాని తరువాతి వాటికి ఉపనిషదర్థం తప్ప మరొకటి లేదు. అది అర్థం కావాలంటే దానికి, దీనికి ఒక సంబంధం చెప్పాలి.

పంచబ్రహ్మస్వరూపిణీ అనగానే – 'చిన్మయీ పరమానందా విజ్ఞానఘన రూపిణి' 'ధ్యానధ్యాతృధ్యేయరూపా' వద్దకు తీసుకుపోయారు. ఇవి పూర్తిగా ఉపనిషద్విషయాలు. ఇందులో తైత్తిరీయ ఉపనిషత్తు అంతా చెప్తున్నారు.

ఇది పరిశీలిస్తే – ఈ పంచప్రేతలు ఎక్కడ ఉన్నాయి? పంచబ్రహ్మలు ఎక్కడ ఉన్నారు? దీనికి ఉపనిషత్ ప్రమాణంగా చూద్దాం. పంచప్రేతలు మనలో ఉన్నాయి. పంచకోశములే పంచప్రేతలు. అన్నమయ, ప్రాణమయ, విజ్ఞానమయ, మనోమయ, ఆనందమయ – ఈ ఐదుకోశములు నిజానికి జడములు. కనిపించేది స్థూలశరీరమే(అన్నమయకోశమే) కావచ్చు. కనుక అన్నమయకోశమే కాదు మిగిలిన నాలుగు కోశములు జడములే. ఈ కోశములన్నీ ఎక్కడ ఉన్నాయి? ఉపనిషత్తుల్లో కాదు – మనలోనే ఉన్నాయి.

ఈ పంచకోశవివేచనమే వేదాంతము. ఈ ఐదుకోశములు జడములా, చైతన్యములా అనేది తెలుసుకోవాలి. చైతన్యాలు అని అనుభవంలో అనుకుంటున్నాం. విచారణలో చైతన్యం ఇందులో ఉంది తప్ప ఇది చైతన్యం కాదు అనేది తెలుసుకోవాలి. అందుకే ఇవి పంచప్రేతలే. ఈ పంచప్రేతల్లో ఈవిడ 'ఆసీనా' – ఆ చైతన్యం ప్రవేశించింది. ఆత్మరూపిణియైన అమ్మవారి యొక్క చైతన్యము పంచప్రేతస్వరూపమైన శరీరంలో వ్యాపించిపోయింది. వ్యాపించినపుడు మొత్తం పంచప్రేతల్లో (కోశాలలో) అధిష్ఠించి ఆవిడే కూర్చుంది. చైతన్యం అంటేనే బ్రహ్మము.

కాశ్మీర శైవ సిద్ధాంతములో 'శివసూత్రము'లని ఒక అద్భుతమైన గ్రంథం ఉంది. అది సాక్షాత్తు శివుడే చెప్పారు. ఆ శివసూత్రమనే గ్రంథంలో మొట్టమొదట బ్రహ్మము, ఆత్మ అంటే 'చైతన్యమాత్మా' అని నిర్వచనం. బ్రహ్మము అంటే చైతన్యం. కేవలం చిత్ – చైతన్యం. పంచబ్రహ్మస్వరూణీ అంటే ఆవిడ కూర్చోగానే పంచప్రేతలు పంచబ్రహ్మలులా కనబడుతున్నారు అంటే ఇవే చైతన్యమని అనిపిస్తున్నాయి.

వివేకంతో చూస్తే పంచప్రేతలే. వీటిలో ఆవిడ ఆసీనమవడం వల్ల ఇవే పంచబ్రహ్మలుగా కనబడుతున్నాయి. ముందు అది తెలుసుకుని అసలు బ్రహ్మము ఏమిటో అన్వేషించుకుంటూ వెళ్ళాలి.

ఇదేమిటి అంటే మనం ఒక గదిలోకి అడుగు పెట్టాం. గదిలోకి అడుగు పెట్టగానే ముందు మనకి గుమ్మం వద్ద ఒక కాంతి పడుతోంది. ఈ కాంతి ఎక్కడి నుంచి వచ్చిందా అని గదిలోకి వచ్చాం. వచ్చి గోడలన్నీ చూశాం, గోడల మీద కూడా కాంతి ఉంది. అలా క్రమక్రమంగా చూస్తే గోడలకి, గుమ్మాలకి కూడా వెలుగు ఇచ్చే దీపం కనిపిస్తుంది. అలా మనకి ఈ పంచకోశాల గది ఇది.

పంచకోశాల శరీరంలో ఒకొక్క కోశం ఒకొక్క గదిగా అనుకుంటే ఈ గదులలో వెలుగుగా అమ్మవారు వ్యాపించిపోయారు. అన్నమయకోశం, ప్రాణమయకోశం అలా ప్రతి గదిలో వెలుగు చూస్తూ 'ఆహా! ఇది కూడా వెలుగుతోంది' అనుకుంటే తప్పులేదు. కనుక గది, వెలుగు. ఇది ప్రేత, అది బ్రహ్మ. కనుక ఈ కోశము చూస్తూ ఇందులోని చైతన్యాన్ని చూస్తూ దీనిదా చైతన్యం – కాదే! ఇక్కడికి ఈ చైతన్యం ఎలా వచ్చిందో వెనక్కి వెళ్తే అలా అన్నమయకోశం నుంచి ప్రాణమయ కోశం, ప్రాణమయకోశం నుంచి విజ్ఞానమయకోశం. అలా ఆనందమయ కోశానికి ఆవల ఉన్నది – చైతన్యం.

ఒక గురువుగారిని శిష్యుడు బ్రహ్మము అంటే ఏమిటో చెప్పమని అడిగారు. ముందు నువ్వు ఆలోచన చేసి చెప్పు అని పంపించివేశారు. కొంతకాలం తపస్సు చేసి మళ్ళీ గురువుగారి దగ్గరకి వచ్చి బ్రహ్మమంటే "అన్నం బ్రహ్మేతి వ్యజానాత్" అన్నాడు. గురువుగారు చాలా బాగుంది అని మరికొంత కాలం వెళ్ళి సాధన చెయ్యమని పంపించివేశాడు. అంతేకాని వెంటనే అన్నం బ్రహ్మము కాదు అని చెప్పలేదు. ఎందుకంటే కేవలం గురువుగారు చెప్తే తెలిసేది కాదు. మన విచారణ ఉండాలి.

మనకి ఈ రోజుల్లో అన్నీ గురువుగారే చెప్పాలి. మన విచారణ లేదు. ఇలాంటి సిద్ధాంతాలు వచ్చే ఆధ్యాత్మిక సంస్కృతి పాడైపోయింది. గురువులు కూడా ఏవో అద్భుతాలు (మిరాకిల్స్) చేసేస్తారు అనుకోవద్దు.

గురువులు అద్భుతాలు (మిరాకిల్స్) చెయ్యరు. మనలను ఆలోచింపజేస్తారు. సరిగ్గా ఆలోచించడం నేర్పుతారు. ఆలోచించడం నేర్పనివాడు గురువే కాదు. అందుకే గురువుగారు శిష్యునితో 'అన్నం బ్రహ్మేతి వ్యజానాత్' అన్నది సరైనది కాదనను కాని, పూర్తి సత్యం కాదు అని చెప్పారు. ఇప్పుడు గదిలో వెలుగు ఉంది. ఆ గదియే వెలుగా! మరికొంచెం ఆలోచించాలి అని శిష్యుని పంపించివేశారు.

మరికొంత కాలానికి శిష్యుడు వచ్చి 'ప్రాణో బ్రహ్మేతి వ్యజానాత్' అన్నాడు. గురువుగారు చాలా బాగుంది కొంతదాకా వచ్చావు, రెండవగదిలోకి వచ్చావు. మళ్ళీ వెళ్ళి ఆలోచించు అన్నారు. మరికొంత కాలం తరువాత వచ్చి 'మనోబ్రహ్మేతి వ్యజానాత్' అన్నాడు. గురువుగారు ఒప్పుకోలేదు. ఆధ్యాత్మికసాధన అంటే అంత తేలిక కాదు. బాగా ఆలోచించాలి. ఆలోచించడానికి కావలసిన స్థిరత్వం యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యానాదుల ద్వారా తెచ్చుకోవాలి.

ఈ శిష్యుడు మరికొంతకాలం తరువాత 'విజ్ఞానం బ్రహ్మేతి వ్యజానాత్' అన్నాడు. మరికొంతకాలానికి 'ఆనందం బ్రహ్మేతి వ్యజానాత్' అని తెలుసుకున్నాడు. ఇక్కడ మొట్టమొదట 'అన్నం బ్రహ్మేతి వ్యజానాత్' అంటే అన్నమయకోశమే బ్రహ్మము. తరువాత 'ప్రాణోబ్రహ్మేతి వ్యజానాత్' – ప్రాణమే బ్రహ్మము. ఆ శిష్యుడు ఊరకనే ఆలోచించలేదు. ఉపాసన చేశాడు. 'అన్నం బ్రహ్మేతి ఉపాసీత' – అదే బ్రహ్మము అని తెలుసుకున్నాడు.

ఇక్కడ గురువుగారు శిష్యునికి చిన్న సూచన ఇచ్చారు – ఊరికినే వెళ్ళిపోమనలేదు. "బ్రహ్మమంటే ఏంటో చెప్తాను. దాని బట్టి నువ్వు ఆలోచించు" అన్నారు. "దేని నుంచి ఈ ప్రపంచం పుడుతుందో, దేనివల్ల ఈ ప్రపంచం పెరుగుతుందో, దేనిలో లయం అవుతుందో అదే బ్రహ్మము". ఈ మంత్రం మొదటి నామం 'శ్రీమాతా' గురించి చెప్పిన దగ్గర వచ్చింది. **'యతో వా ఇమాని భూతాని జాయన్తే యేన జాతాని జీవన్తి, యత్ప్రయన్త్యభిసంవిశంతి, తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి'** – ఇది బ్రహ్మము. అది నువ్వు తెలుసుకో అని శిష్యుని గురువుగారు పంపించారు. ఇప్పుడు గురువుగారు చెప్పినది గుర్తుపెట్టుకొని ఈ జగత్తు దేని నుంచి పుట్టింది,

దేని నుంచి పెరిగింది, దేనిలో లయమౌతోందో ఆలోచించాడు.

మొదటి ఆలోచన - అన్నం వల్ల పుట్టింది, అన్నం వల్ల పెరుగుతోంది కనుక అన్నమే మూలం, అలా వస్తూ 'అన్నాద్ధ్యేవంతి భూతాని' - ఇది సత్యము. ఇక్కడ అన్నమే బ్రహ్మమని ఎవరు ఉపాసన చేస్తారో వారికి అన్నం బాగా లభిస్తుంది. 'అన్నం బహుకుర్వీత', 'అన్నం న నింద్యాత్' - అన్నమే బ్రహ్మమని ఉపాసిస్తే ఎన్ని అద్భుతాలు దొరుకుతాయో. ఎందుకంటే బ్రహ్మం అన్నంలో కూడా ఉంది. గదియే వెలుగు అనుకుంటే తప్పు లేదు. గదిలో కూడ వెలుగు ఉంది. అందుకని అన్నమే బ్రహ్మము. తరువాత మరి కొంచెం ఆలోచించాడు. గురువుగారికి చాలా సంతోషం కలిగింది. ఇంకా ముందుకి వెళ్లమని చెప్పారు. అన్నింటికి సూత్రం మాత్రం 'యతో వా ఇమాని భూతాని జాయన్తే'. అలా ఇక్కడ వరకు అన్నం బ్రహ్మ, ప్రాణం బ్రహ్మ, మనోబ్రహ్మ, విజ్ఞానం బ్రహ్మ అంటే ఆనందకోశం వరకూ ఐదు బ్రహ్మలు వచ్చాయి. ఇప్పుడు చూస్తే 'పంచబ్రహ్మస్వరూపిణీ' అయ్యింది.

ఇక్కడ నామం ఎంత గొప్పగా ఉందో 'పంచప్రేత ఆసీనా', 'పంచబ్రహ్మ స్వరూపిణీ'. పంచప్రేతల్లో కూర్చుంది అంటే జడమునందు చైతన్యం ఉంది. అందులో ఉన్న చైతన్యం ఆవిడ రూపం. పంచకోశాలలోనున్న చైతన్యం ఆవిడ స్వరూపమే. అలా చూస్తూ వెళ్తే ఆనందమయకోశంలో 'ఆనందం బ్రహ్మేతి వ్యజానాత్'. ఇది విచారణ. ఇది ఎలా అన్వయించుకోవాలంటే తరువాత నామాలు 'చిన్మయీ' 'పరమానందా'. ఇప్పుడు ఐదు బ్రహ్మము కాదు. ఈ ఐదింటి యందు బ్రహ్మము 'చైతన్యం' వ్యాపించి ఉంటూ, ఈ ఐదింటికి అతీతంగా కూడా ఉంది.

ఇక్కడ - 'పంచకోశాంతరస్థితా' అనే నామం కూడా విచారణ చేయాలి. అంతా పంచకోశవిచారమే. 'వివేకచూడామణి'లో శంకరభగవత్పాదులవారు బ్రహ్మజ్ఞానం తెలియజేస్తూ మొత్తం పంచకోశవిచారణ చెప్పారు. శివగీతలో శివుడు కూడా పంచకోశ విచారణే చెప్పారు. కనుక పంచకోశములు జడములే. అందులో చిత్స్వరూపిణిగా వ్యాపించిన అమ్మవారిని వేరుగా చూస్తే- కోశములలో వ్యాపించిన 'చిత్' మాత్రమే అమ్మవారు. కోశముల యందు ఆవిడ వ్యాపించిపోయి కోశమంతా

ఆవిడే అనిపించింది. కానీ కోశము అంతా ఉన్న చైతన్యమే ఆవిడ అని వెతికితే **'చిత్' మాత్రమే**. ఆ కోశాల్లో ఆవిడ చైతన్యంగా వ్యాపించిపోయింది కనుక వ్యాపించిపోయి ఉన్న 'చిత్'... చిన్మయీ.

251. చిన్మయీ – శ్రీ చిన్మయ్యై నమః

మన లోపల ఉన్న ఐదు కోశాలలోను, వాటికి ఆవల చైతన్యరూపంలో కూడా అమ్మవారు వ్యాపించి ఉన్నారు. అన్నమయకోశానికి పుచ్ఛం ప్రాణమయకోశం. ప్రాణమయకోశానికి పుచ్ఛం మనోమయకోశం. మనోమయకోశానికి పుచ్ఛం విజ్ఞానమయకోశం. విజ్ఞానమయకోశానికి పుచ్ఛం ఆనందమయకోశం. ఆనందమయకోశానికి పుచ్ఛం బ్రహ్మము. **'బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా'** అనేది ఉపనిషత్ వాక్యం. పుచ్ఛము అనగా ఆధారం.

ఒకదానికొకటి ఆధారంగా వెళ్తూ ఉన్నా పంచకోశాలకి అతీతంగా ఉన్నది బ్రహ్మపుచ్ఛం. ఆ బ్రహ్మ స్వరూపం ఆనందమయకోశంలో ఉన్నా ఆనందం కాదు. ఆనందమయకోశంలో ఉండే ఆనందం ప్రపంచంలో ఉండే విషయసుఖాలవల్ల వచ్చే ఆనందాన్ని అనుభవిస్తున్నాను అనే భావన మాత్రమే. అది నిజమైన ఆనందం కాదు. ఆనందమయకోశానికి కూడా ఆవల ఉన్నది బ్రహ్మము. ఇంతవరకు మనం పంచకోశాలలో కలిసి ఉన్న బ్రహ్మమును గురించి తెలుసుకున్నాము. ఇప్పుడు పంచకోశాలకి అతీతంగా ఉన్న బ్రహ్మమును చూపిస్తున్నారు. అది ఎలాగంటే గదిలో ఉన్న కాంతిని తెలుసుకోవాలంటే గోడ, కాంతి ఒకటి కాదు అనే తెలివి ఉంటే చాలు. అలా పంచకోశాలలో... వ్యాపించిన చైతన్యాన్ని 'చిన్మయీ'ని మాత్రమే గ్రహించాలి. అప్పుడు ఆవిడ మాత్రమే 'పరమానన్దా' అని తెలుస్తుంది.

252. పరమానన్దా – శ్రీ పరమానన్దాయై నమః

బ్రహ్మము అనగా కేవలం ఆనందరూపం. జగత్తంతటికి విజ్ఞానమనే చైతన్యం పరమానందరూపిణి వలనే వచ్చింది. మనలో ఐదుకోశాలకు వెలుగుగాని,

చైతన్యంగాని, వాటిమీద మనకి మక్కువ కలిగించడానికి గానీ కావలసిన చైత్యనం అమ్మవారే.

సృష్టిలో ఏ ఒక్కరైనా తమని తాము భావించుకొనేటపుడు 'నేను' అనగా ఎముకలగూడు, రక్తపుధార, మాంసపుముద్ద అని అనుకోరు కదా. దీనిలో ఉన్నది ఏదో 'నేను' అనుకుంటాం... అది మనకి సాధారణంగానే తెలుస్తుంది. కానీ విచారణ చేయాలి. కనుక వీటన్నిటిలో చిత్ ఒకటున్నది. ఆ చిత్స్వరూపమే 'పరమానందా'. అదే అసలు జ్ఞానం. దానివల్ల ఇవన్నీ జ్ఞానము ఉన్నట్లుగా, చైతన్యమైనట్లుగా కనబడుతున్నాయి. అసలు నిర్దిష్టమైన జ్ఞానం – 'చిత్'.

ఆ వెలుగు – పరమానందా. అది విజ్ఞానం యొక్క ఘనస్వరూపం. ఆవిడే 'విజ్ఞానఘనరూపిణీ'.

253. విజ్ఞానఘనరూపిణీ – శ్రీ విజ్ఞానఘనరూపిణ్యై నమః

ప్రజ్ఞానఘనం, విజ్ఞానఘనం అనే మాటలు ఉపనిషత్తులలో ఎక్కువగా ఉన్నాయి. విష్ణుసహస్రం, శివస్తోత్రాలలో కూడా ఈ మాటలు కనబడతాయి. పరమానంద అంటే ఆనందం. జ్ఞానం, ఆనందం రెండూ కలిపితే అదే పరమాత్మ స్వరూపం. 'జ్ఞానానందమయం దేవం' అన్నా ఇదే అర్థం. ఈ విజ్ఞానఘనరూపిణిని తెలుసుకున్నాక ఇంక తెలియవలసిందేమీ లేదు. విషయాన్ని అర్థం చేసేకుంటే జ్ఞానం. అనుభవానికి తెచ్చుకుంటే విజ్ఞానం. ఆ దశలో శుద్ధమైన జ్ఞానం మాత్రమే ఉంది. అదే 'విజ్ఞానఘనరూపిణి'.

ఇప్పటివరకు వచ్చిన నామాలలో బ్రహ్మము అంటే విచారణ చేశాం. ఈ విచారణ చేసినపుడు మన బుద్ధి దేనియందు నిలిపి అన్వేషిస్తామో అదే దొరకుతుంది. ఉదాహరణకి నేలమీద రూపాయికాసు పడిపోయింది. వెతుకుతున్నప్పుడు మన ఊహలో ఆ రూపాయికాసునే ధ్యానం చేస్తూ వెతుకుతూ ఉంటాం. మన ధ్యాసలో ఉన్న రూపాయికాసు క్రింద కనబడితే అప్పుడు పట్టుకొంటాం. ఆ కాసు ఎలా ఉంటుందో మర్చిపోతే మనం వెతకలేం. అది దొరికే వరకూ మన ఊహలో ఉంది.

అలా పంచకోశాలలో ఉన్న బ్రహ్మమును గురించి విచారణ చేయాలి. ఈ విచారణ బుద్ధితో చేయాలి. మనస్సనేది సంకల్ప వికల్పాలతో ఉంటుంది. విచారణకి బుద్ధి. మనలో ఏది చైతన్యంగా ఉందో దాని మీద దృష్టి నిలిపితే దాని పేరు ధ్యానం.

ధ్యానాన్ని బుద్ధితో చేస్తాం కనుక బుద్ధే జ్ఞానం. జ్ఞానంతోనే విచారణ చేశాం. బుద్ధి దేనిని విచారణ చేసింది? జ్ఞానం. చివరకి తెలుసుకున్నది జ్ఞానం. వెలుగు ద్వారానే వెలుగుని తెలుసుకుంటున్నట్లు విచారణ, జ్ఞానం రెండూ ఒకటే.

254. ధ్యానధ్యాతృధ్యేయరూపా - శ్రీ ధ్యానధ్యాతృధ్యేయరూపాయై నమః

ధ్యానము, ధ్యాతృ, ధ్యేయము - మూడు ఒకటే అని తెలిసినపుడే అమ్మవారు అర్థం అవుతారు. విడి విడిగా ఉన్నంతకాలం అర్థం అవదు. ఒక్కటయ్యాక ఏదైతే ఉన్నదో ఆవిడే అమ్మవారు. సాధన ప్రారంభంలో మూడు ఉంటాయి. కొనసాగింపులోను మూడు ఉంటాయి. సిద్ధికి వచ్చేటప్పటకి ఒకటే ఉంటుంది.

మనం పరమాత్మని ధ్యానం చేశాం. ధ్యానం బుద్ధితోనే చేయాలి. అమ్మవారిని తెలుసుకోవడానికి ధ్యానం తప్ప మరో మార్గం లేదు. అమ్మవారికి 'ధ్యానగమ్యా' అని నామం కూడా ఉన్నది.

ప్రారంభదశలో ధ్యాన-ధ్యాతృ-ధ్యేయ మూడు ఉండాలి. బుద్ధిని బ్రహ్మము వైపు మరల్చుట, నిలుపుట **ధ్యానం.**

ధ్యానం చేసేవాని పేరు - **ధ్యాత**. దేన్ని ధ్యానం చేస్తున్నాడో అది - **ధ్యేయం**. మధ్యలో ఉన్న ప్రక్రియ పేరు **ధ్యానం**. సృష్టిలో ఏది చేసినా ఈ మూడూ ఉంటాయి. భోజనం చేసినపుడు కూడా ఎదురుగా భోజ్యము(తినే పదార్థము) - భోక్త(తినేవాడు) - భోజనము(తినబడేది). సృష్టి అంటేనే త్రిపుటి. సాధన కూడా త్రిపుటే. ఎక్కడ త్రిపుటి ఉందో అక్కడ ప్రపంచం ఉంటుంది. సాధన దశలో ధ్యాత, ధ్యేయం, ధ్యానము మూడూ ఉన్నా సాధన లక్ష్యం మాత్రం మూడుగా ఉండిపోవడం కాదు.

ధ్యాత ధ్యానము ద్వారా ఆ ధ్యేయంలో లయమై, ఆ ధ్యేయమే ఈ ధ్యాన

స్వరూపమైన జ్ఞానమని అవగాహన చేసుకొని అందులో లీనమైపోతాడు. మూడు కలసి ఒకటైపోతాయి.

దీనికి రామకృష్ణపరమహంస ఒక మంచి ఉదాహరణ ద్వారా చెప్పారు. ఉదాహరణలు గహనమైన విషయాలు చెప్పేటప్పుడు ఆధారానికి పనికివస్తాయి. అంతేకాని ఉదాహరణలే జ్ఞానం కాదు. కానీ ఆలంబన లేకపోతే మనకి అర్థం కాదు కాబట్టి ఉదాహరణ అర్థం చేసుకోవడానికి చెప్పుకోవాలి కానీ అది ప్రమాణం మాత్రం కాదు.

ఒక ఉప్పుబొమ్మ సముద్రం లోతు తెలుసుకోవాలని బయలుదేరి ఆనందంతో క్రమక్రమంగా సముద్రంలోకి దిగింది. చివరకి సముద్రంలోకి లీనమైపోయింది. ఇక్కడ ఉప్పుబొమ్మ సముద్రాన్ని చేరేవరకూ మూడు విషయాలు ఉన్నాయి. ఉప్పుబొమ్మ ఉన్నది, సముద్రం ఉన్నది, సముద్రం దగ్గరకి ఉప్పు బొమ్మ వెళ్ళడం ఉన్నది. తరువాత మూడు కలసి ఒకటైపోయాయి. ఒకటైనప్పుడు ఆ ఉప్పుబొమ్మ సముద్రంలో కలసి అనంతమైపోయింది. అలా పరిమితి గల జీవుడు ధ్యానమనే ప్రక్రియ ద్వారా ధ్యాతగా మారి బ్రహ్మమనే దాన్ని ధ్యేయంగా పెట్టుకొని విచారణ చెయ్యగా క్రమక్రమంగా 'దాసోహం' అనే స్థితి నుంచి 'సోహం' అనే స్థితిలోకి లయమైపోతాడు. అదే 'ధ్యానధ్యాతృధ్యేయరూపా'. ఆ ఒక్కటైపోయిన అహం బ్రహ్మముతో తాదాత్మ్యమైపోయిన ఏకత్వస్థితిలో ఉన్న అఖండ, అపరిమిత, జ్ఞానానందరూపమే 'పరమానందా' 'విజ్ఞానఘనరూపిణీ'.

పంచకోశాలు దాటిపోయి పట్టుకోగలిగితే ఆ తురీయభూమికకి వెళ్ళేటప్పటకి ఈ పరమానంద విజ్ఞానఘనరూపిణీ స్థితి అవగాహనకు వస్తుంది. ఆ అవగాహన రాగానే అప్పటివరకు మూడుగా ఉన్న త్రిపుటి ఏకమైపోతుంది. ఆ ఏకమైనస్థితిలో ఉన్న అఖండజ్ఞాన పరమానంద రూపమే అమ్మవారు అని చెప్పడమే 'ధ్యానధ్యాతృధ్యేయ రూపా'. దీనినే **'త్రయమేకత్ర సంయమం'** అని యోగంలో మరొకచోట తెలియజేశారు.

ఇదే మాటని దక్షిణామూర్తి స్తోత్ర భాష్యం రాస్తూ సురేశ్వరాచార్యులు మానసోల్లాసి వ్యాఖ్యలో **'ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేదవిభాగినే, వ్యోమవత్**

వ్యాప్తదేహాయ దక్షిణామూర్తయే నమః' అని ప్రారంభశ్లోకంలో చెప్పారు.

గురువుగారి దగ్గరికి వెళ్ళి ఉపదేశం పొందినపుడు ఆయన ఏం ఉపదేశించారో అదే మనం ఉపాసిస్తాం. ఇప్పుడు మనం చెప్పుకుంటున్న ధ్యాత, ధ్యానము, ధ్యేయం అనే మాటలలో ఉపాసకుడు, ఉపాసన, ఉపాస్యం అనుకోవచ్చు. ఇదీ త్రిపుటే. మనం గురువుగారు ఇచ్చిన ఉపాసనని తీసుకొన్నాం. మనకి ఉపాసన రూపంగా గురువుగారే ఉన్నారు. అదే 'గురుః'. 'ఆత్మ' – అంటే సాధన చేసేవాడు. దేన్ని సాధన చేస్తున్నాడో అది 'ఈశ్వరుడు'.

ఈశ్వరో గురురాత్మేతి – ఈ భేదమంతా సాధన దశలోనే ఉంటుంది. ఇది తెలుసుకున్నాక ఏకత్వస్థితిలో 'వ్యోమవద్వ్యాప్తదేహాయ' – ఆకాశం వలె ఏకమై వ్యాపించిన తత్త్వమే. ఆ ఏకత్వమూర్తి తత్త్వమైన దక్షిణామూర్తికి నమస్కారం అన్నారు. 'ఈశ్వరో గురురాత్మేతి' ఏమిటో 'ధ్యానధ్యాతృధ్యేయరూపా' అదే. 'పరమానంద విజ్ఞానఘనరూపిణీ' స్థితి 'ధ్యానధ్యాతృధ్యేయరూపా'గా ఉన్నది. ఆ స్థితికి చేరుకున్నాక 'ధర్మాధర్మవివర్జితా'.

255. ధర్మాధర్మవివర్జితా – శ్రీ ధర్మాధర్మవివర్జితాయై నమః

సాధకుడు ఆ ఏకస్థితికి చేరాక ధర్మంగాని, అధర్మంగాని, త్రిగుణాలు మొదలైనవి ఉండవు. ఇవన్నీ పంచకోశాలకి సంబంధించిన విషయాలే. పంచకోశాలు 'నేను' అనుకుంటున్నంత కాలమే ధర్మాధర్మాలు ఉంటాయి. ధర్మం విధి. అధర్మం నిషేధం. ఇదంతా పంచకోశాలతో ఉన్న జీవునికి, ప్రపంచానికి తప్ప ఈశ్వరునికి ఉండదు. పంచకోశవ్యతిరిక్తమైన పరమాత్మ చైతన్యం దగ్గరికి వచ్చేటప్పటికి ధర్మము లేదు, అధర్మము లేదు.

ధర్మాధర్మాలు త్రిగుణములతో ఉన్నప్పుడు ఉంటాయి. త్రిగుణాలకి అతీతమైన స్థితే 'ధ్యానధ్యాతృధ్యేయరూపా'.

ఈ నామాలలో తైత్తిరీయోపనిషత్ వర్ణించారు.

తరువాత వచ్చే నామాల్లో మాండుక్యోపనిషత్తును చెప్తున్నారు. అవి –

విశ్వరూపా జాగరిణీ స్వపన్తీ తైజసాత్మికా

సుప్తా ప్రాజ్ఞాత్మికా తుర్యా సర్వావస్థావివర్జితా

ఈ నామాలను నాలుగు భాగాలుగా విభజించుకుంటే ఇందులో ఒకొక్క అవస్థకి రెండేసి పేర్లుగా చెప్పబడుతున్నది.

256 నుండి 263 వరకు ఉన్న నామాలను ఒక గుత్తిగా తీసుకోవచ్చు. ఈ నామాల గుత్తిలో అమ్మవారి ఎనిమిది స్థితులను వర్ణిస్తున్నారు. మనం మెలకువగా ఉన్నప్పుడు మనలోని చైతన్యం మెలకువగా ఉంది. ఓంకారంలో ఉన్న అకార, మకార, తురీయం(బిందు, నాదాలు) అనే నాలుగు భాగాలను ఈ నామాలలో చూపిస్తున్నారు. ఈ నాలుగు భాగాలకు మనలో ఉన్న నాలుగు ప్రజ్ఞలకు సంబంధం చెప్తున్నారు.

1. విశ్వరూపా, జాగరిణీ-జాగ్రదవస్థకు, 2. స్వపన్తీ, తైజసాత్మికా - స్వప్నావస్థకు, 3. సుప్తా, ప్రాజ్ఞాత్మికా - సుషుప్తి అవస్థకు, 4. తుర్యా, సర్వవస్థావివర్జితా - తురీయా అవస్థకు సంబంధించిన నామాలు. ఈ నాలుగింటికి సంబంధించి ఎనిమిది నామాలు చెప్పారు.

256. విశ్వరూపా - శ్రీ విశ్వరూపాయై నమః,

257. జాగరిణీ - శ్రీ జాగరిణ్యై నమః

సకల విశ్వము అమ్మవారి రూపము. ఎంత విశ్వం అంటే మన ఊహకు కూడా అందనిది. గోచరాగోచరాత్మకమై, లక్ష్యాలక్ష్యాత్మికమై ఉన్న ఈ అనంత విశ్వము అంతా అమ్మవారి రూపమే. కనుక విశ్వరూపా.

మరలా ఈ విశ్వం స్థూలము, సూక్ష్మము అని రెండు విధాలుగా ఉంటోంది. బాహ్యంగా విస్తరిల్లిన విశ్వమే స్థూలము. అదే బ్రహ్మాండము. మనలో ఉన్న విశ్వమే సూక్ష్మము. దానిని పిండాండము అంటారు. అనగా వ్యక్తిలో ఉన్న విశ్వము. ఈ వ్యక్తిలో ఉన్న విశ్వమే సూక్ష్మరూపంతో ఉన్నది. అది స్థూల, సూక్ష్మ, కారణ శరీరములతో వ్యాపించి ఉన్నది. అనగా మనల్ని మనం పరిశీలించుకోవడం ఇక్కడ మొదలౌతున్నది. శ్రీవిద్య ఆత్మవిద్య. అమ్మవారు ఆత్మస్వరూపం. ఆత్మవిద్య ఆవిష్కరణ

కోసం ఈ విశ్లేషణ చాలా అవసరం.

జీవునిలో ఒక చైతన్యం ఉంది. ఆ చైతన్యం మెలకువలోనూ, నిద్రలోనూ, ఈ రెండు లేని స్వప్నంలో కూడా ఉంటుంది. ఇలా మూడు అవస్థలు అనుభవిస్తూ ఉంటుంది ఈ చైతన్యం. మొదట జాగరిణీ అనగా జాగ్రదవస్థ రూపంగా ఉన్న చైతన్యం విశ్వమంతా ఏ చైతన్యం వ్యాపించి ఉందో అదే వ్యక్తిలోనూ జీవచైతన్యంగా ఉన్నది కనుకనే మనకు ఉనికి, మనికి ఉంటున్నది.

సర్వచైతన్య స్వరూపిణి అయిన జగదంబిక మనలో కూడా వ్యాపించి ఉంది కనుకనే మనకు ఈ మూడు అవస్థలు అనుభవానికి వస్తున్నాయి. జాగ్రదవస్థాస్వరూపంగా అనుభవానికి వచ్చే చైతన్యమే జాగరిణీ.

జాగ్రదవస్థలో ఉన్న జీవచైతన్యానికి పేరే విశ్వుడు. విశ్వునిరూపంతో ఉన్న ఆ చైతన్యానికి నమస్కారం. విశ్వరూపా అనడంలో విశ్వుని రూపంతో ఉన్న తల్లి.

విశ్వరూపా అంటే విశ్వమే రూపమై ఉన్నది అని ఒక అర్థం. జాగ్రదవ స్థాభిమాని అయిన జీవచైతన్యానికి పేరు 'విశ్వరూపా'. విశ్వుడు అనే జీవ అభిధ సంజ్ఞతో ప్రకాశిస్తున్న తల్లి కనుక 'విశ్వరూపా'. జాగ్రత్ అవస్థలో మనం విశ్వాన్ని అనుభవిస్తూ ఉంటాం. ఆ తల్లి విశ్వరూపా అనే చైతన్యంగా లేకపోతే మనకు జాగ్రదవస్థయే లేదు, దాని రూపమైన చైతన్యమూ లేదు.

258. స్వపన్తీ - శ్రీ స్వపన్త్యై నమః,

259. తైజసాత్మికా - శ్రీ తైజసాత్మికాయై నమః

నిద్రలో మనలో చైతన్యరూపంగా ఉన్న అమ్మవారికి (ఆత్మచైతన్యానికి) పేరు 'తైజసాత్మికా'. స్వప్నము అంటే కలలు కంటున్న స్థితి. స్వప్నంలో అనుభవించే దంతా ఏ వెలుగు వల్ల చూస్తున్నామో ఆ చైతన్యమే తైజసాత్మికా. ఉదాహరణకి ఎర్రగోడ మీద కాంతి ఎర్రగా ఉంది. నల్లగోడ మీద కాంతి నల్లగా ఉంది. కానీ నల్లదనం గోడదే – కాంతిది కాదు. అలా మెలకువదశలో ఉన్న చైతన్యం 'జాగరిణీ'. స్వప్నావస్థలో 'తైజసాత్మికా'.

260. సుప్తా - శ్రీ సుప్తాయై నమః,

261. ప్రాజ్ఞాత్మికా - శ్రీ ప్రాజ్ఞాత్మికాయై నమః

గాఢనిద్రకి పేరు సుషుప్తి. మనలో సుషుప్తిలో కూడా చైతన్యం ఉంది. కాబట్టే నిద్రలేచిన తరువాత హాయిగా పడుకున్నాను అని చెప్తాం. నిద్రలో కూడా చైతన్యం ఉంటుంది కానీ మనస్సు పనిచేయదు. జాగ్రదవస్థలో శరీరం, మనస్సు రెండు పనిచేస్తాయి. స్వప్నావస్థలో మనస్సు మాత్రమే పని చేస్తుంది. సుషుప్త్యవస్థలో మనస్సు కూడా పనిచేయదు. ప్రాణం పనిచేస్తుంది. కానీ ప్రాణం గుర్తు తెచ్చుకొని చెప్పే మనస్సు కాదు, బుద్ధి కాదు. మాండుక్యంలో సుషుప్తి గురించి చాలా విస్తారంగా చెప్పారు.

సుషుప్తిని బాగా అర్థం చేసుకుంటే సరిపోతుంది. సుషుప్తిలో ఏదో ఒకహాయి ఉంది. సృష్టిలో ఎవరైనా పనులు చేస్తూ ప్రపంచంలో తిరుగుతూ ఉన్నా నిద్ర లేకపోతే కాసేపు పడుకొని వచ్చేస్తాను అంటారు. మనం సుఖం అనుకొనే ప్రపంచమంతా బయటే ఉన్నట్లయితే, కాసేపు పడుకొని వస్తాను అని ఎందుకు అంటున్నాం? అంటే ప్రపంచాన్ని విడిచిపెట్టిన ఒకానొక స్థితిలో ఏదో ఒక ఆనందం ఉంది. ఆ ఆనందంతో కలిస్తేగాని మనకి తృప్తిలేదు. అలా కలవాలనే రోజు కొంత సేపు నిద్ర ద్వారా ప్రయత్నిస్తూ ఉంటాం. ఆ ఆనందంతో కలిసి మనం కొంత శక్తిని పుంజుకొని మళ్ళీ లేస్తున్నాం. అన్ని శక్తులను ఇవ్వగల మహాశక్తి అక్కడ ఉంది. కేవలం సుషుప్త్యవస్థలోనే జీవుడు పరమాత్మతో కలుస్తాడు. అక్కడ కేవలం ప్రజ్ఞారూప చైతన్యం మాత్రమే ఉంటుంది. ప్రజ్ఞ అనగా చైతన్యం యొక్క లక్షణం. తెలుసుకొనే బుద్ధి కాదు. ఆలోచన చేసే సంకల్పం కాదు. కాబట్టి సుషుప్త్యవస్థలో జీవచైతన్యానికి పేరు ప్రాజ్ఞుడు. మనలో ఉన్న మూడు అవస్థలకి విశ్వుడు, తైజసుడు, ప్రాజ్ఞుడు అని పేర్లు. ఇవి ఉపనిషత్తులో బాగా ప్రస్తావించబడ్డాయి.

మనం మెలకువలో ఉన్నప్పుడు మనలో ఉన్న చైతన్యాన్ని జాగ్రదవస్థతో కలిపాం. స్వప్నావస్థలో మన చైతన్యం మరొక లోకంలో ఉంటుంది. ఇలా మనం చూస్తే మనలో ఉన్న చైతన్యం శరీరానిదా? మనస్సుదా? ఆలోచించాలి.

262. తుర్యా - శ్రీ తుర్యాయై నమః,

263. సర్వావస్థావివర్జితా - శ్రీ సర్వావస్థావివర్జితాయై నమః

స్వప్నావస్థ వరకు మనస్సుది కానీ సుషుప్తిలోకి వెళ్తే అదీ కాదు. మరి దేనిది అనేది సుషుప్తిలో తెలుసుకోలేం. దానికి మరొక అవస్థ ఉన్నది. ఇది అంత తేలికగా రాదు. దాని పేరు తుర్యా. ఇది మూడవస్థలలోను, వాటికి అతీతంగాను ఉంది.

ఉదాహరణకి ఒక గదిలో వెలిగే లైటు రకరకాల వస్తువులపై పడి వాటి యొక్క రంగులను తెలియజేస్తుంది. కాంతి ఆ వస్తువులపై పడుతున్నా వాటికి అంటకుండా అతీతంగా ఉన్నట్టే పంచకోశాలు అనే ఇంటిని ప్రకాశింపజేస్తూ దానికీ అంటకుండా ప్రజ్ఞానఘనరూపిణి అయిన తల్లి ఉన్నది. ఆవిడని తెలుసుకోవాలంటే మూడవస్థలు దాటి వెళ్ళాలి. ఆ అవస్థ పేరు 'తురీయం'. అది సమాధిలో మాత్రమే తెలియబడుతుంది. సమాధి అనగా బుద్ధి సమస్థితిలోకి వెళ్ళడం. సమం అంటే కృష్ణపరమాత్మ చెప్పినట్టుగా -

సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్

వినశ్యంతవినశ్యన్తం యః పశ్యతి స పశ్యతి (భగవద్గీత)

ఆత్మతత్త్వాన్ని పట్టుకోవాలి. ఆ స్థితి పేరే తురీయం. తురీయం అంటే నాలుగవది అని అర్థం. జాగ్రత్తు కాదు, స్వప్నము కాదు, సుషుప్తి కాదు. తురీయావస్థలో చైతన్యానికి పేరేమీ లేదు. జాగ్రదవస్థలో జాగరిణితో కలిపాం కనుక విశ్వ. విశ్వ అంటే సమస్తం కలిపి దర్శిస్తున్నాం కనుక **విశ్వుడు** అంటున్నారు. లోపల ఆత్మతో మొత్తం కాంతిని చూడగలుగుతున్నాం కనుక **తైజసుడు** అంటున్నాం. సుషుప్తిలో ప్రజ్ఞారూపం మాత్రమే ఉంది కనుక **ప్రాజ్ఞుడు** అని అంటున్నారు.

సమాధిలో యోగులు మాత్రమే తురీయం పొందగలరు. బ్రహ్మజ్ఞులకి మాత్రమే ఇది సాధ్యం అవుతుంది. ఎక్కడ జ్యోతి ఉందో అక్కడ కాంతి ఉందని తెలిసి పట్టుకోవడం తురీయం. అప్పుడు ఈ వెలుగే ప్రపంచమంతా ఉందని చూస్తూ ఉన్నాం. తురీయావస్థలో ఉన్న యోగికి మాత్రం మనలో ఉన్న పంచకోశాల వెలుగు,

ప్రపంచంలో ఉన్న వెలుగు అమ్మవారే అని అర్థం అవుతుంది. తురీయాన్ని అవస్థ అని అనకూడదు. అవస్థలన్నీ మూడింటిలోనే ఉంటాయి. 'సర్వావస్థావివర్జితా'.

ఏ అవస్థలు లేని స్థితి తురీయం. ఓంకారంలో అకార, ఉకార, మకారాలు – ఈ మూడు అవస్థలని తెలియజేస్తాయి. ఆ పైన ఉన్నది అర్ధమాత్ర. అ – ఉ – మ అనగలంగాని 'మ్' అనేది స్పష్టంగా పలకలేం. స్పష్టంగా మూడు అవస్థలు అర్థమవుతాయి కాని ఆ పైన బిందునాదాత్మకమై ఉన్నది అర్థం కాదు, విడిగా ఉచ్చరించలేం. ఈ బిందునాదాత్మకమైన స్థితినే తురీయం అన్నారు.

కానీ వీటన్నింటిని కలిపే 'ఓం' అంటున్నాం. ఓంకారమే బ్రహ్మము అంటున్నాం. మూడు అవస్థలలోను ఉంటూనే మూడవస్థలకి అతీతంగా ఉన్న చైతన్యమే బ్రహ్మమైన అమ్మవారు. ఇందులో మెలకువలో, స్వప్నంలో, సుషుప్తిలో అనేది తీసేసి 'ఉన్నది' అనే మాటని తీసుకొంటే అది మూడింటిలో ఉన్నది, మూడింటికి అతీతముగా ఉన్నది. అది తెలుసుకుంటే మూడింటిని తీసివేయనక్కర్లేదు. మూడింటిలోను అదే ఉందని తెలుసుకోవాలి. అదే '**సర్వమున్ అతని దివ్యకళామయమంచు విష్ణునందుల్లము జేర్చి**' అని ప్రహ్లాదుడు చెప్పినది.

ప్రహ్లాదుడు కూడా ఇలాంటి జ్ఞానియే. ఆ స్థితికి వెళ్ళినవారికి అంతా అదే కనబడుతుంది. 'త్వయి మయి చాన్యత్రైకో విష్ణుః' – ఐదు గదులలో ఒకే వెలుగు కాని గదికో వెలుగు కాదని తెలుసుకున్నాడు. విచారణ ద్వారానే దీన్ని తెలుసుకోగలరు.

వ్యష్టిలో అంటే ప్రతివారిలో ఉన్న అమ్మవారి చైతన్యాన్ని చెప్పేటప్పుడు విశ్వరూపా, తైజసా, ప్రాజ్ఞః; విరాట్‌గా అంటే సమష్టిగా చెప్పినపుడు అమ్మవారి చైతన్యానికి వైశ్వానరుడు, హిరణ్యగర్భుడు, ఈశ్వరుడు అని వ్యవహారం. ప్రపంచపరంగా సృష్టిస్థితిలయలు గురించి చెప్పినపుడు లయ అనేది సుషుప్తి అవస్థ లాంటిది అన్నారు. సుషుప్తిలో ఎలాగైతే మన జ్ఞాపకాలు, కర్మవాసనలు అన్నీ లీనమై మళ్ళీ నిద్ర నుండి లేవగానే బయటకి వచ్చాయో, అదేవిధంగా ప్రళయావస్థలో పరమాత్మ యందు లీనమై మళ్ళీ బయటకి వస్తాయి. కనుక వ్యష్టిలో సుషుప్తి గాఢనిద్ర అయితే ప్రపంచంలో అదే ప్రళయంగా చెప్పుకోవచ్చు. లయం అంటే లీనం అని అర్థం. వైశ్వానర, హిరణ్యగర్భ,

ఈశ్వర అని చెప్పినప్పటికి అతీతస్థితిలో ఆయనే పరబ్రహ్మ.

ఇదంతా విచారణే. ఉపనిషత్తులు బాగా చదివాక, అవి ప్రక్కన పెట్టి లలితాసహస్రం చదువుకొంటే ఇదే మననం అవుతుంది. సర్వావస్థావివర్జిత అయిన అమ్మవారే మూడు అవస్థలలోనూ ప్రకాశిస్తున్నది. మెలకువగా ఉన్నప్పుడు మనలో ఆ తల్లే ఉంది. స్వప్నావస్థలో ఉన్నప్పుడు అమ్మయే ఉంది. మనం అవస్థలతో అమ్మవారిని కలిపేయడంవల్ల ఆవిడని తెలుసుకోలేకపోతున్నాం. అవస్థాతీతంగా చూసే ప్రయత్నంచేస్తే 'తుర్యా సర్వావస్థావివర్జితా' అయిన తల్లి తెలియబడుతుంది. దీనినే శంకరులు సౌందర్యలహరిలో **'తురీయా కాపి త్వం దురధిగమనిస్సీమ మహిమా, మహామాయా విశ్వం భ్రమయసి పరబ్రహ్మమహిషీ'** (సౌందర్యలహరి) - అన్నారు.

ఈ మూడు అవస్థలు మనకి స్థూల, సూక్ష్మ, కారణ శరీరాల వల్ల వస్తున్నాయి. స్థూల-సూక్ష్మ-కారణ, జాగృత్-స్వప్న-సుషుప్తి ఇవన్నీ మూడు. ఈ మూడింటిలో ఉంటూనే మూడింటికి అతీతంగా ఉన్నదానిని, మూడింటిలో ఉండగానే మనం పట్టుకోగలగాలి. ఈ మూడింటిలో ఉంది కాబట్టి 'త్రిపుర'. మూడింటికి అతీతంగా ఉంది కాబట్టి 'మహా'. మూడింటికి ఈవిడే వెలుగుని ఇచ్చి అందంగా (చైతన్యంగా) ఉంది కనుక 'మహాత్రిపురసుందరీ'. ఇదే మహాత్రిపురసుందరీ తత్త్వం. ఈ వివేచనే మొత్తం శ్రీవిద్యలో గోచరిస్తున్నది. బ్రహ్మతత్త్వమే అమ్మవారని తెలుస్తుంది. అమ్మవారు శుద్ధబ్రహ్మస్వరూపిణీ. త్రిగుణాలకి, త్రిలోకాలకి, త్రిఅవస్థలకి, త్రిశరీరాలకీ అతీతమై వీటన్నిటికి చైతన్యం ఇస్తోంది కనుక ఆ త్రిపురసుందరీయే 'సర్వావస్థావివర్జితా'. తరువాతి నామాలలో ఈ మూడింటితో కూడిన ప్రపంచాన్ని ఎలా నడుపుతున్నదో చూపిస్తున్నారు.

సృష్టికర్త్రీ బ్రహ్మరూపా గోప్త్రీ గోవిందరూపిణీ
సంహారిణీ రుద్రరూపా తిరోధానకరీశ్వరీ
సదాశివానుగ్రహదా పంచకృత్యపరాయణా

ఇక్కడి వరకూ ఒక గుత్తి.

264. సృష్టికర్త్రీ - శ్రీ సృష్టికర్త్ర్యై నమః,

265. బ్రహ్మరూపా - శ్రీ బ్రహ్మరూపాయై నమః

ప్రపంచంలో అమ్మవారు అయిదు పనులు చేస్తూ ఉంటారు. ఆ పనులు చేస్తున్నప్పుడు అమ్మవారు ఎలా ఉన్నారో చూపిస్తున్నారు. మొదటిది కృత్యం. రెండవది ఆ కృత్యం చేస్తున్న దేవత పేరు. ఈ అనంతమైన సృష్టి చేస్తున్నది ఆ పరబ్రహ్మ శక్తే. ఈ సృష్టి అంతా ఆ శక్తి విలసనమే. త్రిగుణాలలో రజోగుణ ప్రధానంగా ఉన్న పరమేశ్వరుడు అనగా బ్రహ్మదేవుడు సృష్టి చేస్తూ ఉంటాడు. అలా సృష్టిని చేయించే శక్తి పరమేశ్వరి. కనుక జగదంబికయే సృష్టికర్త్రీ అయినది.

ఈ సృష్టి అనంతము. ఇందులో ఏక గుణ, ద్విగుణ, త్రిగుణ అనే మూడు రకాల సృష్టుల గురించి శాస్త్రములు వర్ణిస్తున్నాయి. సత్త్వ, రజస్తమోగుణాలను వివిధ పాళ్ళల్లో మేళవించి సృష్టిలో జరాయుజ, స్వేదజ, అండజ, ఉద్భిజ మొదలైన జీవకోటిని సృష్టించినది అమ్మ. ఆ జీవకోటిలో స్థావరము, జంగమము అయిన ఈ అనంత విశ్వమును సృష్టిస్తున్న శక్తి సృష్టికర్త్రీ.

ఈ సృష్టిని ఎలా చేస్తున్నది అనేది బ్రహ్మరూపా. బ్రహ్మరూపంలో అనగా చతుర్ముఖ బ్రహ్మరూపంగా ఉండి సృష్టిని చేస్తున్నది. ఇక్కడ పంచకృత్యాలలో మొదటిదైన కృత్యము సృష్టిని, తరువాత కృత్యము స్థితిని తెలియజేస్తున్నది. స్థితి అంటే రక్షణ. సృష్టించబడిన జగత్తు ఒక స్థితిలో ఉండి రక్షింపబడుతూ, వృద్ధి చెందుతూ ఉంటే దానిని స్థితి అంటున్నాం. ఆ స్థితికారిణి అయిన అమ్మవారు కనుక గోప్త్రీ.

266. గోప్త్రీ - శ్రీ గోప్త్ర్యై నమః,

267. గోవిందరూపిణీ - శ్రీ గోవిందరూపిణ్యై నమః

గోపనము అంటే రక్షణ, స్థితి అని అర్థం. 'గోప్త్రీ' అంటే రక్షణస్వరూపిణి, స్థితికారిణి. ఈ స్థితిలో అమ్మవారు గోవిందరూపంతో ఉంది. గోపాలకుడు అన్నా రక్షకుడు అనే అర్థం. ప్రపంచాన్ని రక్షించి స్థితికారణుడై ఉన్న గోవిందుడు. స్థితికారిణీ శక్తి(గోప్త్రీ)గా ఉన్నప్పుడు అమ్మవారి పేరు 'గోవిందరూపిణీ'.

268. సంహారిణీ - శ్రీ సంహారిణ్యై నమః,

269. రుద్రరూపా - శ్రీ రుద్రరూపాయై నమః

సంహారసమయంలో అమ్మవారు 'రుద్రరూపా'. సంహారం అంటే చక్కగా కూర్చుట అని అర్థం. సమ్యక్ హారం = సంహారం. ఆ- హారం, వి-హారం, సం-హారం. ప్రపంచం అంతా ఉపశమించినా మొత్తం లేకుండా పోదు. ఇదివరకటి మన కర్మలు, వాసనలు అవి తరువాత ఎలా అనుభవించాలి అనేవి సమకూర్చడం పరమేశ్వరి పని. మళ్ళీ మనం ఏ శరీరంతో లేవాలి? ఏ వాసనలకి ఏ కర్మలు ఇవ్వాలి? ఏ ఫలాలు ఇవ్వాలి? ఇదంతా నిర్ణయించే ఈశ్వరవ్యవస్థే సంహారం. ఆడుకున్న పిల్లవాడు అలసిపోయి, "అమ్మా అలసిపోయాను" అని అమ్మ ఒడిలో పడుకుంటాడు. అలా అలసిపోయిన ప్రపంచం ఈశ్వరుని ఒడిలో శయనిస్తుంది. అదే 'సంహారిణీ' 'రుద్రరూపా'.

270. తిరోధానకరీ - శ్రీ తిరోధానకర్యై నమః,

271. ఈశ్వరీ - శ్రీ ఈశ్వర్యై నమః

'తిరోధానకరీ' అంటే మరుగుపరచునది అని అర్థం. నాలుగవ కృత్యమైన తిరోధానం చేసేటప్పుడు అమ్మవారి పేరు 'ఈశ్వరీ'. పుంలింగంలో చెప్తే 'ఈశ్వరః', 'మహేశ్వరః'.

272. సదాశివా - శ్రీ సదాశివాయై నమః,

273. అనుగ్రహదా - శ్రీ అనుగ్రహదాయై నమః

274. పంచకృత్యపరాయణా - శ్రీ పంచకృత్యపరాయణాయై నమః

ఐదవకృత్యంగా 'సదాశివా' రూపంలో అనుగ్రహాన్ని ఇస్తుంది. ఈ ఐదు కృత్యాలు చేస్తున్నది అమ్మవారే కనుక 'పంచకృత్యపరాయణా'. లలితాసహస్రనామ స్తోత్రం ఒక విద్య. ఏ నామానికి ఆ నామం మహిమనిచ్చే మంత్రం మాత్రమే కాదు.

సృష్టికర్త్రీ, స్థితికర్త్రీ, సంహారకర్త్రీ, తిరోధానకర్త్రీ, అనుగ్రహకర్త్రీ అమ్మవారే - అనే జ్ఞానం ఇది.

సృష్టి, స్థితి, సంహారం అనేది అందరికి తెలిసిన విషయమే. సంహారం అయినపుడు మొత్తం పోతోందా? మళ్ళీ సృష్టి వచ్చినపుడు వస్తోంది కదా!

సృష్టి అంటే పని ప్రారంభించడం. స్థితి అంటే కొనసాగించడం. సంహారము అంటే పూర్తిచేయడం. ఈ మూడు పనులు నిద్రావస్థలో మరుగుపడిపోయాయి. మళ్ళీ పొద్దున్నే లేవగానే ఇవన్నీ ఎక్కడ ఆపామో అక్కడ గుర్తుకువచ్చాయి. అలా గుర్తురాకపోతే ఆ పరిస్థితి వేరుగా ఉంటుంది. సుషుప్తిలో ఉన్నప్పుడు ఇవన్నీ గుర్తుకు రానపుడు నిద్రలేచిన వెంటనే ఎలా గుర్తుకు వస్తున్నాయి? చైతన్యం మన బుద్ధిలో ప్రసరించగానే అన్నీ పనిచేయడం మొదలుపెడతాయి. కనుకనే నిద్రపోయినపుడు సుషుప్తిలో 'తిరోధానకరీ'. పొద్దున్న లేవగానే నిన్న ఎక్కడ ఆపామో దాన్ని అనుసరించి గ్రహించినది కనుక 'అనుగ్రహం'.

అనుగ్రహ అనేమాటకి 'అనుసరించి గ్రహించడం' అని అర్థం. మనం ఏ కర్మ చేశామో దాన్ని అనుసరించి దయ చూపిస్తుంది కనుక 'అనుగ్రహదా' అయినది. ఇలా మన వ్యవహారంలో మనకే ఐదు కృత్యాలు కనబడుతున్నాయి. ఈ పంచకృత్యాలు చేసేది అమ్మవారే.

ప్రపంచపరంగా అన్వయించుకుంటే ఒకప్పుడు సృష్టి వచ్చింది, స్థితిగా సాగుతోంది, సంహారం అవుతోంది. ప్రళయావస్థలో ఇదంతా మరుగున పడుతోంది. మళ్ళీ సృష్టి ప్రారంభమౌతోంది. కల్పం అంతా అయిపోయాక బ్రహ్మ కూడా నిద్ర లేచి మళ్ళీ సృష్టి ప్రారంభిస్తాడు. ఇదే వేదంలో చెప్తూ **'సూర్యాచంద్రమసౌ ధాతా యథాపూర్వమకల్పయత్'** అంటారు.

మళ్ళీ ఈ కల్పం ప్రారంభమవగానే ఇదివరకు కల్పాలలో ఉన్న సూర్యుడు, చంద్రుడు, పంచభూతాలు అవే మళ్ళీ తీసుకొస్తాడు పరమాత్మ. అంటే ఇదివరకటి సృష్టిని అనుసరించి గ్రహించాడు బ్రహ్మదేవుడు. అప్పటివరకు ఈ సృష్టినంతటినీ 'తిరోధానకరీ' అయిన ఈశ్వరశక్తి దాచి పెట్టింది. మళ్ళీ సృష్ట్యారంభంలో 'అనుగ్రహించి'

బయటకి తీసుకువచ్చింది. ఈ సృష్టిని బయటకి తెచ్చినప్పుడు తల్లి ఏవి అవసరం లేవో తీసేసి అవసరమైనవే ఉంచుతుంది.

మనకి కూడా రాత్రి నిద్రపోయినపుడు కొన్ని కణాలు నశించిపోయి మళ్ళీ కొత్తవి పుడతాయి....ఇదంతా విజ్ఞానమే. ఈ కణాలు అలాగే ఉంటే జీవితాంతం చిన్నపిల్లల్లాగే ఉండేవారం. ఇలా ఎప్పటికప్పుడు మన శరీరంలో నశించిపోయిన కణాలు ఇందులోనే లయం అయిపోతాయి. పుట్టినవి ఇందులోనే పుడతాయి, నశించేవి ఇందులోనే నశించిపోతున్నాయి కనుక ఈ శరీరాన్నే మహాశ్మశానం అన్నారు. ఇందులో ఉన్న ఈశ్వరుని శ్మశానవాసి అన్నారు. ఈ శరీరంలో బాల్యం లీనమయిపోయింది. ఈ శరీరంలోనే కౌమారం లీనమైపోయింది. అప్పుడు చేసిన కర్మలను అనుసరించి మళ్ళీ ఒక బాల్యం, కౌమారం – మళ్ళీ అనుగ్రహం అవుతుంది. ఈ వ్యవస్థ అంతా నడిపించేది ఈశ్వరశక్తి. ఆవిడే 'సదాశివానుగ్రహదా'. మనలో ఆత్మశక్తిగా ఐదుపనులు అమ్మవారే చేస్తున్నారు. ప్రపంచంలోనూ ఆ తల్లే ఈ ఐదు పనులు చేస్తోంది.

ఈ పంచకృత్యాలు చేసేవారు బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వర, సదాశివ – ఇవే నాలుగు మంచం కోళ్ళు, ఐదవది బల్ల. ఈ ఐదింటిని మనం ధ్యానించేటపుడు పంచకోశమే పంచబ్రహ్మాసనం. అక్కడ పనిచేసేవి ఈ శక్తులే.

మునుపు వచ్చిన 'పార్వతీ' నామానికి కూడా ఇది అన్వయించుకుంటే, మూడవస్థలలో చైతన్యానికి పేర్లు వేరైనా చైతన్యం ఒక్కటే. జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్తి వీటిని పర్వములుగా తీసుకుంటే ఈ పర్వములలో విడవకుండా ఉండే చైతన్యం పార్వతీ అని తెలుసుకోవాలి. ఈ పార్వతి పంచబ్రహ్మలైన జడములకి చైతన్యమిస్తూ కూర్చున్నది కనుక శ్రీచక్రం, మధ్య బిందువు, ఆ బిందువు పైన సింహాసనం, ఆ సింహాసనం పైన అమ్మవారు 'కామేశ్వరాంకనిలయా'గా భాసిస్తున్నది.

'మనువిద్య' నామంతో ప్రారంభమైన చన్ద్రమండలవిద్య **'పంచకృత్య పరాయణా'** నామంతో పూర్తి అవుతోంది. చన్ద్రమండలవిద్య అనగా శ్రీచక్రంలో అమ్మవారిని ఆరాధించవలసిన విధానం. అమ్మవారిని బిందువునందు ధ్యానించవలసిన పద్ధతి. 'ధ్యానధ్యాతృధ్యేయరూపా' స్థితే బిందుస్థితి. బిందువు ఏకమే. త్రికోణాలే

అనేకం. త్రికోణాలే సృష్టిస్థితిలయలు. త్రికోణాలే సత్త్వరజస్తమోగుణాలు, త్రికోణాలే జాగ్రత్స్వప్నసుషుప్తులు, త్రికోణాలే స్థూలసూక్ష్మకారణ శరీరాలు. ప్రపంచమంతా ఈ మూడింటితోనే ముడిపడి ఉంది. ఈ త్రికోణాలతో వ్యాపించిపోయిన శక్తే త్రికోణాలకి అతీతంగా కేంద్రంలో ఉన్న బిందువు. అది తురీయభూమిక.

తరువాత నామాలలో భానువిద్యని చూపిస్తున్నారు. వెనుకటి నామాలలో చన్ద్రవిద్య అంటే సహస్రార స్థానంలో 'చన్ద్రమండలమధ్యగా'లో అమ్మవారిని ధ్యానించాలి. అది తురీయభూమిక కాబట్టి తురీయభూమికి సంబంధించినవి అన్నీ అక్కడ వివరించారు.

'పంచకృత్యపరాయణా' అనే దానికి రెండవ అర్థం చూస్తే సృష్టిస్థితిలయలు మూడు అందరికి తెలుసు. తిరోధానం అంటే ప్రపంచం అంతటా బ్రహ్మమే ఉన్నప్పటికి మనకి అనిపించడం లేదు, కనిపించడం లేదు. ఎందువల్ల? అంతా తానే అయి అది తెలియనివ్వకుండా చేసే మాయాశక్తి మరుగుపరుస్తోంది కనుక 'తిరోధానకరీ'. మరుగు పరచకపోతే మనం భరించలేం. ఇంద్రియాలలో కూరుకుపోయున్న జీవునికి సరియైన చిత్త పక్వత లేనప్పుడు పరతత్త్వం తెలియదు. అప్పుడు మరుగుపరచే ఉంచాలి లేకపోతే ప్రపంచం తెలియదు. మాయ లేకపోతే ప్రపంచం నడవదు. ఆవిడే 'తిరోధానకరీ'.

ఎంత వేదాంతం చెప్పినవారిలోనైనా అమ్మవారు 'తిరోధానకరీ'గానే ఉంటుంది. అందుకే అమ్మవారికి 'మహామాయా' నామం కూడా ఉంది. **'జ్ఞానినామపి చేతాంసి దేవీ భగవతీ హి సా। బలాదాకృష్య మోహాయ మహామాయా ప్రయచ్ఛతి'** అని 'దేవీమాహాత్మ్యం'లో తెలియజేశారు. జీవులనందరిని అమ్మవారు పక్వత రానంతవరకూ ప్రపంచంలోనే త్రిప్పుతూ ఉంటుంది. అలా త్రిప్పేటప్పుడు 'తిరోధానకరీ' అయ్యింది. ఏ ఒక్కరో పక్వత కలిగి ఉంటారు. వానిని మాత్రమే ఆ తల్లి బయటకు తీసుకొస్తుంది. అప్పుడు అమ్మవారు 'అనుగ్రహదా' అయి మోక్షాన్ని ఇస్తుంది. ఈ ఐదింటిని కలిపి శాస్త్రం ఒక మంచి శ్లోకంలో చెప్పింది.

సా విశ్వం కురుతే కామం సా పాలయతి పాలితం
కల్పాంతే సంహరత్యేవ త్రిరూపా విశ్వమోహినీ
తయాయుక్తస్సృజేద్బ్రహ్మా విష్ణుః పాతి తయాన్వితః
రుద్రస్సంహరతే కామం తయా సమ్మిళితో జగత్
సా బధ్నాతి జగత్ కృత్స్నం మాయాపాశేన మోహితామ్
అహం మమేతి పాశేన సుదృఢేన నరాధిప
యోగినో ముక్తసంగాశ్చ ముక్తికామా ముముక్షవః
తామేవ సముపాసంతే దేవీం విశ్వేశ్వరీం శివామ్ (దేవీభాగవతం)

సా విశ్వం కురుతే - మొత్తం విశ్వాన్ని సృష్టిస్తోంది. **సా పాలయతి పాలితం** - సృష్టించిన విశ్వాన్ని పాలిస్తోంది. పాలించిన విశ్వాన్ని సంహరిస్తోంది. ఆ శక్తితో కలిసినపుడే బ్రహ్మ సృష్టి చేస్తున్నారు. విష్ణువు పాలిస్తున్నాడు. రుద్రుడు సంహరిస్తున్నాడు. సూక్ష్మవివేచనకి వెళ్తేనే పంచకృత్యాలు తెలుస్తాయి.

ఆ తల్లియే జీవులందరిని 'అహం' - 'మమ' అనే పాశాలతో త్రిప్పుతోంది. పాశాలతో త్రిప్పుతున్నప్పుడు అమ్మవారికి పేరు 'తిరోధానకరీ'.

యోగులు మాత్రమే అహం-మమ పట్టించుకోకుండా ఇవన్నీ చేస్తున్న చిచ్ఛక్తిని ఆశ్రయిస్తారు. అలాంటి ముముక్షువులైన వారికి, యోగులకి ముక్తినిచ్చేటప్పుడు అనుగ్రహదా.

మొదటి మూడు సృష్టి, స్థితి, లయలు; మిగిలిన రెండు బంధం, మోక్షం. ఈ ఐదు పనులు తప్ప ప్రపంచంలో ఇంకేమీ జరగవు. మనకి తెలిసినవి నాలుగే. ఐదవది అమ్మవారు ఎవరికి ఇస్తుందో వారికే తెలుస్తుంది. కానీ ఐదూ అమ్మవారే చేస్తుందని మనం గ్రహించాలి.

275. భానుమండలమధ్యస్థా - శ్రీ భానుమండలమధ్యస్థాయై నమః

'భానుమండలమధ్యస్థా' నుండి 'పుణ్యాపుణ్యఫలప్రదా' నామం వరకు 'భానువిద్య'గా చెప్పబడుతున్నది. వెనుకటి నామాల్లో అమ్మవారిని చంద్రమండల

మధ్యంలో చెప్పారు. పురాణాలలో వర్ణించిన చంద్రమండలం, మనం చూసే మండలరూప చంద్రుడు ఒకటి కాదు. మనం చూస్తున్న సూర్యాదిమండలములకు పైన అంతరిక్షంలో ఒకానొక తేమ కలిగిన తెల్లని ఆర్ద్రభూమిక ఏదో ఉందని భావించాలి. దీనినే పోతనగారు భాగవతంలో వామనావతారాన్ని వర్ణిస్తూ చెప్పారు.

ఇంతింతై వటుండింతయై మరియు దానింతై నభోవీథిపై
నంతై తోయదమండలాభ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రునికంతయై ధ్రువునిపైనంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంతసంవర్ధియై

సూర్యమండలం పైన చంద్రమండలం ఉందని మన శాస్త్రం చెప్తోంది. యోగశాస్త్రంలో కూడా సూర్యమండలస్థానమైన అనాహతచక్రం పైన చంద్రమండలం ఉంది. అదేవిధంగా మనం చూస్తున్న సూర్యమండలానికి పైన చంద్రమండలం ఉంది. అంతదాకా ఇప్పుడున్న మన విజ్ఞానం ఎదగలేదు. కానీ దీనిని మన ఋషులు దర్శించి చూపించారు. ఆ చంద్రుడు మనకి తెలియదు కానీ ఆ ఆర్ద్రలక్షణం మనం ప్రస్తుతం చూస్తున్న చంద్రుని యందు దొరుకుతోంది కాబట్టి మనం దాని యందు అమ్మవారిని భావించడం చెయ్యవచ్చు.

చంద్రమండలంలో అమ్మవారిని భావిస్తూ లలితాసహస్రం చదివితే చాలా శ్రేష్ఠం. పూర్ణచంద్రబింబం వచ్చినపుడు ఆ రోజు అమ్మవారిని ప్రత్యేకించి పూజచేయాలి. చంద్రమండలంలో వచ్చే కళల ప్రకారంగానే మనకి వచ్చే నిత్యతిథుల ప్రకారంగా అమ్మవారిని ఆరాధన చేయాలి. చంద్రుడు మనస్సుకి కారకుడు కనుక మనస్సు బాగుపడుతుంది. చంద్రమండలంలోని అమ్మవారిని ధ్యానిస్తూ ఆవుపాలను నైవేద్యం పెట్టి వెన్నెల పడుతూ ఉండగా లలితాసహస్రం చదివితే చాలా విశేషం. కొంతకాలం ఇవన్నీ చెయ్యగా ఎప్పటికైనా అమ్మవారి అనుగ్రహం కలిగి ఈ నామాలలో ఉన్న అంతరార్థాన్ని తెలుసుకునే జ్ఞానం వస్తుంది.

త్రేతాయుగంలో శ్రీరామచంద్రునికి పరశురాముడు ధనుర్బాణాలని ఇచ్చేశాక ఆయనలోని విష్ణ్వంశ శ్రీరామచంద్రమూర్తిలోకి వెళ్ళిపోయింది. అప్పటి నుండి

పరశురాముడు కేవల తపస్వి. ఆయన సాధన కోసం దత్తాత్రేయుని ఆశ్రయించాడు. దత్తాత్రేయులవారు మంత్రాన్ని ఇచ్చి దాన్ని సాధన చెయ్యమన్నారు. తరువాత కొంతకాలానికి శ్రీవిద్య, శ్రీచక్రం, ఉపాసనా విధానం అంతా చెప్పి దాన్ని చెయ్యమన్నారు. చాలాకాలం చేసి మళ్ళీ దత్తాత్రేయులవారి వద్దకు వచ్చాడు. ఇంత సాధన అయ్యాక అప్పుడు జ్ఞానాన్ని బోధించాడు. ఈ పద్ధతినే ఇక్కడ వివరిస్తున్నారు.

అందుకే అమ్మవారి పూజ అయ్యాక,

బాలభావానుసారేణ మమేదం హి విచేష్టితం

మాతృవాత్సల్య సదృశం త్వయా దేవి! విధీయతాం

"అమ్మా! నేను బొమ్మలు పేర్చుకున్నట్టుగా చక్రం పెట్టి, అటువైపు అమృతం పెట్టుకొని సర్వప్రపంచాన్ని ఆహరించే నీకు, బిందువు వేసి ఇస్తున్నాను అంటే చిన్నపిల్లల పనిలానే ఉంది కదా, తల్లీ! నిజంలే. నాది పిల్లల పని, నీది అమ్మ పని" అన్నాడు భక్తుడు.

తల్లి ఒక విద్యాలయ వసతిగృహంలో పిల్లవానిని వదిలిపెట్టి వెళ్ళింది. పిల్లవాడు తల్లిపై బెంగపెట్టుకొన్నాడు. చదువు అయిపోయాక రోజూ అమ్మని తలుచుకొంటు ఏడుస్తూ పడుకొనేవాడు. అమ్మ మాత్రం వారి ఊర్లో తన పనిలో తాను ఉండేది. ఒకసారి అమ్మ వచ్చేటప్పటికి పిల్లవాడు గదిలో ఒక్కడే అమ్మ బొమ్మని చూసి తలచుకొంటూ ఉంటే కిటికిలోంచి అమ్మ చూడగానే, నన్నే తలచుకుంటున్నాడని ఒక్కసారి తలుపుతీసి, "నాన్నా!" అని చేరదీసింది. కిటికిలోంచి చూసిన తల్లే, కొడుకు తనని తలచుకుంటున్నాడని తెలిసి పిల్లవానిని చూసి అంత చలించిపోయిందే! ప్రపంచంలోంచి గమనిస్తున్న తల్లి, ఆమె బొమ్మని ఆరాధించే మనల్ని చూసి ఆనందంతో అనుగ్రహించదా! ఆలోచించాలి. ఇలా మనం అమ్మని మర్చిపోరాదని వశిన్యాదివాగ్దేవతలు చెప్తున్నారు.

విద్యుచ్ఛక్తి పొందడానికి రాగితీగ ఎలాంటి ఆలంబనమో, అలా అమ్మవారి ఉపాసనకి కొన్ని ప్రత్యేకమైన ఆలంబనలు ఉన్నాయి.

గురువు ద్వారా సుశిక్షితంగా పొందిన శ్రీచక్రం ఒక ఆలంబన. ప్రతిమ

ఒక ఆలంబన. కలశం ఒక ఆలంబన. మనం ఏమీ అమర్చుకోకుండా ఉన్నా శ్రీచక్రం పొద్దున్నే ఆకాశంలో దర్శనమిస్తుంది. అందులో అమ్మని భావన చేయాలి. ఇది అన్నింటికంటె శ్రేష్ఠమైన ఆలంబన. అదే 'భానుమండలమధ్యస్థా'.

'చన్ద్రమండలమధ్యగా', 'భానుమండలమధ్యస్థా'– రాత్రి, పగలు కూడా అమ్మవారే. 'భానుమండలమధ్యస్థా' అయిన అమ్మవారిని ఆరాధన చేయాలి. సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు ఆ 'భానుమండల' మధ్యంలో ఉన్న అమ్మవారిని ఉద్దేశించి అర్ఘ్యప్రదానం, అర్చన, సంధ్యావందనం చేయాలి. ఏ వర్ణం వారైనా ప్రాతఃకాలంలో సూర్యభగవానునికి ఎదురుగా నిల్చుని–

సూర్యమండలమధ్యస్థాం దేవీం త్రిపురసుందరీం
పాశాంకుశధనుర్బాణహస్తాం ధ్యాయేత్ సుసాధకః

ఇది అమ్మవారి ఉపాసకులకి శాస్త్రం చెప్పిన ఒక విధి.

మరొక శ్లోకంలో –

పాశాంకుశధనుర్బాణధరాం అరుణవిగ్రహాం
భానుమండలమధ్యస్థాం ధ్యాయేత్ త్రిపురసుందరీం

ఈ శ్లోకాలతో సూర్యమండలమధ్యంలో అమ్మవారిని భావన చేయాలి. ఆ సూర్యుని నుండి వచ్చే 'నిజారుణప్రభాపూర' కాంతులు అన్నీ అమ్మవారివే.

దీనినే ఉపనిషత్, **య యేషోంతరాదిత్యే హిరణ్మయఃపురుషో దృశ్యతే** – అంటుంది. 'సూర్యమండలమధ్యగా' అని అమ్మవారిని ఉపాసించాలి.

'హిరణ్యవర్ణాం హరిణీం – హిరణ్మయీం – అరుణాం' – ఇవన్నీ సూర్యమండలమధ్యంలో ఉన్న అమ్మవారిని వర్ణిస్తున్నాయి. ప్రపంచమంతా అమ్మవారి చైతన్యమే అయినా మనకి మాత్రం సూర్యమండలంలోంచే ఆ మహావిభూతి వస్తోంది కనుక సూర్యుడే పెద్ద శ్రీచక్రం.

ఆయన విష్ణుభక్తులకి విష్ణుస్వరూపం. శివభక్తులకి శివలింగం. శ్రీచక్ర ఉపాసకులకి – శ్రీచక్రం.

ఉద్యన్తమస్తం యన్తమాదిత్యమభిధ్యాయన్

కుర్వన్ బ్రాహ్మణో విద్వాన్ సకలం భద్రమశ్నుతే

అసావాదిత్యోబ్రహ్మేతి

అని శ్రుతిమార్గంలో నమస్కరించుకుంటున్నారు.

ఆ ఆదిత్యునే బ్రహ్మమని ఉపాసించమని వేదం చెప్తున్న విజ్ఞానం.

పన్నెండు మంది శ్రీవిద్యా ఉపాసకులలో ఒకడు సూర్యభగవానుడు. ఆ ఉపాసనావిద్యని ఇక్కడ ఆవిష్కరిస్తున్నారు. వియత్ చక్రము ఏది ఉందో అదే శ్రీచక్రం(వియత్ చక్రము అంటే ఆకాశ చక్రం). ఆకాశచక్రము అంటే బయట కనబడే మహాకాశం, దీనికి కూడా మూలమైన చిదాకాశం – మన హృదయంలో ఉండే దహరాకాశం.

ఈ మూడు ఆకాశములు శ్రీచక్ర స్వరూపంగానే భావన చేయాలి. అలా అక్కడ ఆకాశంలో గోచరించే మహాస్వరూపం ఆదిత్యభగవానుడు.

'భానుమండలమధ్యస్థా' అంటే దహరవిద్య చెప్తున్నారు. అనాహతపద్మంలో పన్నెండు దళాలు ఉంటాయి. పన్నెండు దళాలు ద్వాదశాదిత్యులకి సంకేతం. ఇది హృత్పుండరీకంలో అమ్మవారిని ధ్యానించే పద్ధతి. దీనినే సమయాచారం అంటారు.

ఏ దేవత ఉపాసనకైనా మూడు ప్రధానమైన కేంద్రాలు ఉంటాయి. మన హృదయంలో దహరచక్రమని చెప్పబడుతున్నదే భానుమండలం. హృదయమధ్యంలో అమ్మవారు ఉన్నట్లుగా ధ్యానించాలి. భ్రూమధ్యంలో, సహస్రారంలో ధ్యానించాలి. హృదయాకాశం, చిత్తాకాశం, చిదాకాశం. ఈ పద్ధతిలో అమ్మవారిని ధ్యానించడం చాలా విశేషంగా చెప్తారు. ఇక్కడ ధ్యానించే తల్లికి పేరు 'భైరవీ'.

276. భైరవీ – శ్రీ భైరవ్యై నమః

సూర్యభగవానునికి మార్తాండభైరవుడని ఒక పేరు. భైరవుని శక్తి భైరవి. హృదయంలో అమ్మవారు మార్తాండభైరవీ రూపంలో ఉంది. భైరవుడు అనగా పరమేశ్వరుడు. భరత్వ, రమణత్వ, వమనత్వాలు చేసే భైరవుని శక్తి కనుక భైరవీ అయ్యింది.

అమ్మవారిని కుమారీరూపంలో పూజ చేసేటప్పుడు పన్నెండు సంవత్సరాల వయసుగల బాలికకు 'భైరవీ' అని పేరు. సాధారణంగా నవకన్యలు, నవకుమారీలు వరకే చెప్తారు. భైరవిరూపంలో అమ్మవారు ద్వాదశవర్షప్రాయంలో ఉన్న బాలికరూపంలో ఆరాధించబడుతున్నది.

మార్తాండభైరవ స్వరూపంగా సూర్యమండలమునందు ఉన్నవాడు రుద్రుడే. ఆయన శక్తి భైరవి.

277. భగమాలినీ – శ్రీ భగమాలిన్యై నమః

తిథిదేవతలలో ఒక దేవత. ద్వితీయా తిథికి అధిదేవత భగమాలిని. భగము అనే మాటకి ఐశ్వర్యం, వెలుగు అని అర్థం.

ఐశ్వర్యాలు అమ్మవారి దగ్గర 'మాల'గా అనగా ఒక దాని తరువాత ఒకటి వరుసగా పరంపరగా ఉన్నాయి కనుక భగమాలినీ. ఐశ్వర్యముల వరుసలు కలది.

మరొక అర్థంలో భగమాలినీ అంటే కాంతివరుసలు కలది. సూర్యుని చుట్టూ కిరణాలు ఉంటాయి. సూర్యునికి కిరణమాలి అని పేరు. కిరణములన్నీ మాలాకారంలో ఉంటాయి.

అలా కాంతిమాలికలతో ఉన్న ఆదిత్యమండలాంతర్వర్తిని – 'భగమాలినీ'.

ఆదిత్యులు పన్నెండుమంది. వారు ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూష, అర్యముడు, భగుడు, వివస్వతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు. కొన్ని పేర్లకి వేరే పాఠాంతరాలు కనబడతాయి. ఇందులో భగుడు ఉన్నాడు.

మాల అంటే వరుస. సంవత్సరకాలంలో పన్నెండు నెలలకి ద్వాదశాదిత్యులు. మాల అయినపుడు ఒకరిని ప్రధానంగా పెట్టుకొని వారిని అనుసరిస్తున్న వారిని చెప్పాలి. ద్వాదశాదిత్యులలో ఉన్న భగునితో ప్రారంభమైన ఆదిత్యుల వరుసకు భగమాల అని పేరు. ఈ పన్నెండుమంది ఆదిత్యులు ఎవరి రూపమో ఆ తల్లి 'భగమాలినీ'.

278. పద్మాసనా – శ్రీ పద్మాసనాయై నమః

అమ్మవారిని హృదయంలో భావించినపుడు పద్మాసనంలో ఉన్నట్లు భావించాలి. కాంచీపురంలో కామాక్షీ అమ్మవారు ఈ ఆసనంలో దర్శనమిస్తారు. ఇది త్రిపురసుందరి స్వరూపం. ఈ ఆసనంలో అమ్మవారి రెండుపాదాలు దర్శనమిస్తాయి.

పద్మాసనాలలో అనేక భేదాలు ఉన్నాయి. అమ్మవారు వేసే పద్మాసనం మాత్రం సాధారణంగా అందరూ వేసే పద్మాసనంలా ఉండదు. అది గురువు యొక్క శిక్షణ లేనిదే ప్రయత్నించినా రాదు. అమ్మవారు యోగిని కాబట్టి అలా కూర్చోగలదు.

అలా కూర్చున్నప్పుడు మూలాధారం దగ్గర శక్తి జాగృతం అవుతుంది. అక్కడ జాగరణి అయిన శక్తిని 'కలిక' అంటారు. 'చిత్కళానందకలికా' – ఈ కలికా శక్తి జాగృతం కావడానికి ఎలా కూర్చోవాలో ఆసనం చెప్పారు. ఇది పద్మాసనంలో ఒక భేదం. కామాక్షీ అమ్మవారు ఆ ఆసనంలో కూర్చుంటారు కనుక 'పద్మాసనా'. ధ్యానం చేస్తున్నప్పుడు హృదయపద్మంలో పద్మాసనంలో కూర్చుంది కనుక 'పద్మాసనా'. సుషుమ్నానాడి నుండి వచ్చే చైతన్యాన్ని ప్రధానంగా హృదయం తీసుకొని మనలో ఉన్న డెబ్భైరెండువేల నాడులకి ప్రసరిస్తుంది కనుక హృదయం ప్రధానస్థానం. హృదయపద్మంలో ఉంది కాబట్టి 'పద్మాసనా'.

279. భగవతీ – శ్రీ భగవత్యై నమః

భగమాలినీకి – భగవతీకి సంబంధం పరిశీలించాలి. పుంలింగంలో భగవాన్, స్త్రీలింగంలో భగవతి. **'బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి శబ్ద్యతే'** – (భాగవతం). బ్రహ్మము, పరమాత్మ, భగవాన్ – ఈ మూడు పర్యాయపదాలు. ఈ సమస్త విశ్వం నడపడానికి కావలసిన ఐశ్వర్యం, జ్ఞానం, బలం మొదలైన వాటికి భగము అని పేరు. భగము కలది భగవతి. భగము అనగా –

ఐశ్వర్యస్య సమగ్రస్య ధర్మస్య యశసః శ్రియః
జ్ఞానవైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీరిణా

సంపూర్ణమగు ఐశ్వర్యం, ధర్మం, యశస్సు, శ్రీ, జ్ఞానం, వైరాగ్యం - ఈ ఆరింటికి భగమని పేరు.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానాం గతిమాగతిమ్
అవిద్యా విద్యయోస్తత్త్వం వేత్తీతి భగవత్యసా

ప్రపంచం యొక్క ఉత్పత్తి ప్రళయాలు, సృష్టిలో ఉన్న జీవుల రాకపోకలు, ఏ జీవులని బంధించాలి, ఏ జీవులకి మోక్షం ఇవ్వాలి మొదలైన ఆరు తెలిసినవాడు భగవాన్ అని విష్ణుపురాణం, భగవతీ - అని దేవీభాగవతం మొదలైనవి తెలియజేస్తున్నాయి.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానాం గతిమాగతిమ్
వేత్తి విద్యామవిద్యాంచ స వాచ్యో భగవానితి (సా దేవీ భగవతీ సతీ)

కనుక అమ్మవారిని భగవతీగా భావిస్తున్నాము.

280. పద్మనాభసహోదరీ - శ్రీ పద్మనాభసహోదర్యై నమః

అమ్మవారు పద్మనాభుడైన విష్ణువునకు సహోదరి. సమాన లక్షణం కలిగిన శక్తి ఇద్దరికి ఉంటే సోదరీ స్థానంలో చెప్తారు. దీనికి సంబంధించిన కథ పురాణాలలో ఉన్నది.

కాంచీక్షేత్రంలో లోకరక్షణకోసం పెద్దయజ్ఞం తలపెట్టారు. తపస్సు చేసి తరువాత యజ్ఞం చేస్తే చాలా మంచిదని ఆ యజ్ఞానికి ముందు తపస్సు చేశారు.

కాంచీక్షేత్రే పురా ధాతా సర్వలోక పితామహః
శ్రీదేవీదర్శనార్థాయ తపస్తేపే సుదారుణం

అలా తపస్సు చేస్తూ ధ్యానంలోకి వెళ్ళిపోయారు బ్రహ్మ. అప్పుడు-

ఆత్మైక్యధ్యానయుక్తస్య తస్య ప్రతపతో మునేః
ప్రాదుర్బభూవ త్రిపురా పద్మహస్తా స సోదరా
పద్మాసనే చ తిష్ఠంతీం విష్ణునా జిష్ణునా సహ

ఎదురుగా ఒక కాంతిపుంజం కనబడి దానిలో క్రమంగా పద్మంలో కూర్చుని

అమ్మవారు తన అన్నగారైన విష్ణువుతో దర్శనమిచ్చింది. అలా బ్రహ్మకి పద్మాసనంలో భగవతి అయిన అమ్మవారు దర్శనమిచ్చింది కనుక 'పద్మనాభసహోదరీ'.

అమ్మవారు అన్నగారితో ఉన్న క్షేత్రం పురీ జగన్నాథక్షేత్రం. అక్కడ సుభద్రా రూపంతో ఉన్నది ఈ తల్లే. ఒకసారి రాధాదేవి ద్వారకకి వచ్చినపుడు కృష్ణుని అష్టమహిషులు ఆమెని గోకులంలో కృష్ణ లీలలు గురించి చెప్పమని అడిగినపుడు రాధాదేవి వివరిస్తూ ఉంటుంది. రాధాదేవి కృష్ణుని గురించి చెప్తున్నప్పుడు అష్టమహిషులకి పారవశ్యం కలిగింది. ఆ సమయంలో కృష్ణుడు, బలరాముడు, సుభద్ర కలిసి వస్తున్నారు. వారికి గుమ్మం దగ్గరకి రాగానే రాధాదేవి గొంతు వినబడింది. అక్కడే ఆగి రాధాదేవి చెప్తున్న కృష్ణలీలలు వింటూ ఈ ముగ్గురు ఆనందంగా కదలకుండా నిలబడిపోయారు. ఆ సమయంలోనే నారదులవారు వచ్చి ముగ్గురిని చూస్తూ దండం పెట్టాడు. రాధాదేవి కథ పూర్తి చెయ్యగానే కృష్ణునికి బాహ్యదృష్టి వచ్చి, నారదుని చూసి, "ఎంతసేపు అయ్యింది వచ్చి" అని అడిగితే నారదుడు, "చాలా సేపు అయ్యింది. మీ ముగ్గురు అలా నిలబడి ఉంటే చూడడానికి చాలా బాగుంది. మీ ముగ్గురు ఒక క్షేత్రంలో ఉంటే చూడాలని ఉంది" అంటే "కలియుగంలో పురీ క్షేత్రంలో ఇలాగే ఉంటాం. నీ కోరిక తీరుతుందిలే" అని కృష్ణపరమాత్మ చెప్పాడు.

యా మేనా కుక్షి సంభూతా సుభద్రా పూర్వజన్మని

కృష్ణేన సహ దేవక్యాస్సాస్మిన్ జన్మని కుక్షిగా అని 'బ్రహ్మాండపురాణోక్తి

పూర్వజన్మలో మేనాహిమవంతుల పుత్రిక అయిన పార్వతిగా జన్మించిన ఆమెయే కృష్ణుని సోదరిగా జన్మించినది – అని పై పురాణవాక్య తాత్పర్యం.

కాంచీపురంలో కూడా అమ్మవారు కామాక్షిగా ఉంటే, సోదరుడైన విష్ణువు వరదరాజస్వామిగా ఉన్నాడు. శివుడు కూడా అక్కడే ఏకామ్రేశ్వరునిగా ఉన్నాడు.

మరొక క్షేత్రంలో అమ్మవారు పాండ్యపుత్రికగా వచ్చినపుడు సుందరేశ్వరుని వివాహం చేసుకున్నది. ఆ వివాహంలో అన్నగారైన విష్ణువు కన్యాదానం చేశారు. అప్పుడు అమ్మవారు అన్నగారికి ఉంగరం ఒకటి ఇచ్చి "పెట్టుకో అన్నయ్యా!" అంది. ఆ క్షేత్రంలో వెలసిన వారు అందరూ అందగాళ్ళే. శివుని పేరు సుందరేశ్వరుడు.

అక్కడ విష్ణువు పేరు అళగళ్ విష్ణువు. ఈ క్షేత్రం మధురైలో ఉంది. అక్కడ విష్ణువు చేతికి అమ్మవారు ఇచ్చిన ఉంగరం కనబడుతుంది. ఇలా శివుని, శక్తిని, విష్ణువుని ముగ్గురుని కలిపి ధ్యానించడం ఒక ఉపాసనా పద్ధతి.

శివుడే వ్యాపించిపోతే విష్ణువు అవుతాడు. 'వ్యాపకత్వాత్ విష్ణుః'. వ్యాపించినది శక్తి. ఆ శక్తి యొక్క పురుషరూపమే విష్ణువు. అమ్మవారు ఎవరో విష్ణువూ ఆయనే. ఇద్దరూ ఒకటే కనుక అన్నా చెల్లెలు.

దీనినే 'మూర్తిత్రయ రహస్యం'లో వివరిస్తూ - సృష్టి ఆది యందు ఒక పరంజ్యోతి ప్రకాశించింది. అది క్రమంగా మూడు భాగాలై కాంతివలయాలుగా బయటకి వచ్చింది. వాటిలో ఒక భాగం నుండి బ్రహ్మ-లక్ష్మి, మరొక భాగం నుండి శివుడు-సరస్వతి, వేరొక భాగం నుండి ఉమా-విష్ణువు వచ్చారు. వీరు కవలలు అనుకోవచ్చు.

కాబట్టి బ్రహ్మ, లక్ష్మి సోదరీసోదరులు. శివుడు, సరస్వతీ సోదరీసోదరులు. సరస్వతీ నామాలలో 'శివానుజాయై నమః' అని ఉంది. అదేవిధంగా ఉమా, విష్ణువు సోదరీసోదరులుగా వచ్చారు. సోదరీసోదరులు అనగా ఏకలక్షణం కలవారు. అప్పుడు బ్రహ్మ తన సోదరిని విష్ణువుకి, విష్ణువు తన సోదరిని శివునికి, శివుడు తన సోదరిని బ్రహ్మకి ఇచ్చారు.

ఇందులో అర్థం చూస్తే సృష్టితో పాటు వచ్చిన సంపదని ఎవరైతే బాగా స్థితిని చేస్తారో వారికి ఇస్తే దానిని చక్కగా వినియోగం చేస్తారు. లక్ష్మిని స్థితికారకుడైన విష్ణువుకి ఇచ్చాడు. స్థితికారకుని నుండి వచ్చిన శక్తి అయిన అమ్మవారు లయకారకునికి ప్రక్కన ఉండి, స్థితిని పరిశీలించుకుంటూ జాగ్రత్తగా వెళ్తుంది కనుక అమ్మవారైన వైష్ణవిని శివునికి ఇచ్చారు. లయం చేయడానికి జ్ఞానం చాలా ప్రధానం. జ్ఞానం, లయ రెండూ ఒక్కటే. సృష్టి చేసినపుడు లయం అయిపోతుందేమో అనే అజ్ఞానం ఉండకూడదు. జ్ఞానం ప్రక్కన ఉండాలి. కాబట్టి లయకారకుని జ్ఞానము సృష్టికర్తకి భార్య అయ్యింది. ఇలా ఒకదానికొకటి అన్వయం చేసుకోవచ్చు. ఈ విధంగా కూడ అమ్మవారు 'పద్మనాభసహోదరీ' అయ్యింది.

కాంచీపురంలో అమ్మవారు సోదరుడైన విష్ణువుతో బ్రహ్మదేవునకు దర్శనమిచ్చినది. ఇది వరదరాజ సమేత కామాక్షీ అనే భావన చేసుకుంటున్నాం.

శివ-విష్ణు-శక్తి - ఈ మూడు తత్త్వములు అనుసంధానం గొప్ప యోగం. అవి అనేక చోట్ల లలితా సహస్రనామ స్తోత్రాలలో కనబడుతూ ఉంటాయి. ఈ రహస్యాన్ని పట్టుకున్న వారిలో శంకరుని తరువాత శంకరులంతటి వారు అప్పయ్యదీక్షితులవారు. ఆ మహానుభావుడు రత్నత్రయ పరీక్ష అనే ఒక గ్రంథం రచించారు. ఆ రత్నత్రయం అని చెప్పినప్పుడు మూడు రత్నాలు శివ రత్న, శక్తి రత్న, విష్ణు రత్నములు అని చెప్పారు. మంత్రపరంగా కాదివిద్యలో వాగ్భవకూటోద్ధారం ఈ నామాలలో ఉందని శ్రీ భాస్కరాయల దర్శనం. దీనికి మునుపు నామాలలో 'పద్మాసన' అనేది 'కకారం' (పద్మాసనుడైన బ్రహ్మదేవుని సూచించే అక్షరం - క). 'భగ' 'ఏ'కారం, వతీ - ఈకారం. పద్మనాభసహోదర (వామనునికి సోదరుడైన) ఇంద్రుడు. ఆతని సూచించే శబ్దం 'ల'. 'సహోదరీ' నామంలో - హ+ఉ - తదుపరి 'రీ' - కలిపి 'హ్రీం'కారాన్ని సూచిస్తోంది. 'పద్మాసనా, భగ, వతీ, పద్మనాభసహోదరీ' - ఈ శ్లోకపాదం వాగ్భవకూటాన్ని (క ఏ ఈ ల హ్రీం) సూచిస్తోందని చక్కని అన్వయాన్ని చెప్పారు.

నామాలలో మంత్రశక్తులు ఇలా గూఢంగా దాగి ఉంటాయి.

281. ఉన్మేషనిమిషోత్పన్నవిపన్నభువనావళిః
- శ్రీ ఉన్మేషనిమిషోత్పన్నవిపన్నభువనావళ్యై నమః

'ఉన్మేషం' అంటే తెరచుట. 'నిమేషం' అంటే మూయుట. ఈ రెండిటిలోనే మొత్తం సృష్టి నిర్వహణ చేస్తున్నది. తెరచుటలో ఉత్పన్నం. మూయడంలో విపన్నం. మధ్యలో స్థితి. కళ్ళు తెరిచి కళ్ళు మూయడంలోనే సృష్టిస్థితిలయలు చేస్తోంది. కళ్ళుమూసి తెరవడం మనకి ఎంత సులభమో, సృష్టి స్థితిలయలు చేయడం అమ్మవారికి అంత సులభం. అదీ ఈ నామంలో వివరిస్తున్నారు. దీనినే శంకరులు సౌందర్యలహరిలో వివరిస్తూ- "అమ్మవారు కనురెప్ప వేయకుండా జగత్తుని రక్షిస్తోంది"

అని చెప్పారు. అప్పుడే స్థితి చక్కగా ఉంటుంది. 'కంటి మీద రెప్ప పడకుండా కాపలా కాస్తున్నాడు' అని లోకవ్యవహారంలో అంటారు.

మునుపు నామంలో పద్మనాభసహోదరికి జగన్నాథక్షేత్రం గురించి చెప్పుకున్నాం. ఆ క్షేత్రంలో జగన్నాథుడు కూడా రెప్పవెయ్యకుండా చూస్తూ ఉంటాడు. అందుకే ఆ క్షేత్రంలో స్వామికి రెప్పలు ఉండవు. అక్కడి భక్తులు ఈయన్ని, "స్వామీ! రెప్పలు కూడా లేకుండా ప్రపంచాన్ని చూస్తున్నావా!" అంటారు. నిజంగా ఆయన రెప్ప వేస్తే స్థితి ఉండదు. మరొక ప్రత్యేకత ఆయన నేత్రాలు గుండ్రంగా ఉంటాయి. అందుకే ఒడిశా వారు 'చక్కోఅఖి' అంటారు. ఆయన చక్రనేత్రుడు. గుండ్రని కళ్ళు అంటే అనంతదృష్టికి సంకేతం. గుండ్రటి సూర్యుడు, గుండ్రటి చంద్రుడు – రెండూ నయనములుగా పెట్టుకొని కూర్చున్నాడు.

విరాట్పురుషరూపంలో ఉన్న ఆ తల్లినే ఎన్నో రూపాలుగా దర్శిస్తున్నాం. ఉపనిషత్తు ప్రతిపాదించిన విధంగా – మూడు అవస్థలలోనూ (జాగ్రత్, స్వప్న, సుషుప్తులలో) విశ్వరూప, తైజస, ప్రాజ్ఞులుగా ఉన్న ఆ తల్లే సమాధ్యవస్థలో తురీయభూమికలో 'సర్వావస్థావివర్జిత'గా ఉన్నది. అకార, ఉకార, మకార, తురీయరూపంలో భాసిస్తున్నది. ఆ తల్లి సృష్టి, స్థితి, సంహార, తిరోధాన, అనుగ్రహ ములనే పంచకృత్యాలతో ప్రపంచంలో ప్రతి అణువులో వ్యాపించింది. ఆ తల్లే పద్మనాభసహోదరిగా సూర్యమండలంలో ఉంటూ ప్రపంచాన్ని నడుపుతూ ఉన్నది.

కళ్ళు మూసి కళ్ళు తెరవడంలోనే సృష్టి స్థితి లయలు చేస్తున్న తల్లి అని చెప్పడంలో 'స్పందనశక్తి' అని అర్థం. అదే చైతన్యం. చైతన్యం చేతనే సంకోచ, వ్యాకోచములు రెండూ జరుగుతూ ఉంటాయి. ఈ సంకోచ వ్యాకోచాత్మకమైన పద్ధతి ప్రతి కణంలో, ప్రతి క్షణంలో జరుగుతూనే ఉన్నది.

సృష్టి, స్థితి, లయలు అంటే ఎప్పుడో కల్పాంతంలో ప్రళయం అని మాత్రమే కాదు. ప్రతి అణువులో నిత్యం జరుగుతూ ఉన్న నిరంతర ప్రక్రియ. ఆ స్పందనాత్మక శక్తినే ఇక్కడ కనులు తెరిచి, కనులు మూయడం అనే భావనలో తెలుసుకోవాలి.

282. సహస్రశీర్షవదనా - శ్రీ సహస్రశీర్షవదనాయై నమః

283. సహస్రాక్షీ - శ్రీ సహస్రాక్ష్యై నమః

284. సహస్రపాత్ - శ్రీ సహస్రపదే నమః

ఈ నామాలు భానువిద్యలో చెప్తున్నారు కనుక సూర్యపరంగా భావన చేస్తే సూర్యునికి ఈ పేర్లు వర్తిస్తున్నాయి. ఎందుకంటే సహస్రకిరణుడు ఆయన. అంటే తన చేతులు ఎక్కడికైనా చాస్తున్నాడు. అనంతకిరణాలవాడు... పైగా ఆ కిరణాలే ఎక్కడికైనా ప్రసరిస్తున్నాయి కనుక 'సహస్ర పాదములు'. ఆ కిరణాలు ప్రపంచాన్ని అంతటికి దృష్టిని ఇస్తున్నాయి కనుక 'సహస్రాక్షీ'. అలాగే జ్ఞానేంద్రియ స్థానములలో సూర్యభగవానుని భావిస్తున్నాం కనుక అవే 'సహస్రశీర్షములు'. ఈ విధంగా సహస్రశీర్షవదనా, సహస్రాక్షీ, సహస్రపాత్ అనేవి సూర్యశక్తి యొక్క ఉపాసనా విశేషాలే.

భారతీయసంస్కృతి ఏ దేవతోపాసన అయినా సూర్యునితోనే చూపిస్తున్నది. ఎందుకంటే ఏ దేవతారాధన చేసినా అగ్నిహోత్రంలో హోమం చేస్తేనే ఏ దేవతకైనా అందుతుంది. అది మనం రగిల్చిన అగ్ని. మనం రగల్చకుండానే తనంతట తాను రగులుతున్న అగ్ని సూర్యభగవానుడు. ఆయనే అసలైన అగ్నిహోత్రం. **'ఏష చైవాగ్నిహోత్రంచ ఫలం చైవాగ్నిహోత్రిణాం వేదాశ్చక్రతవశ్చైవ క్రతూనాం ఫలమేవ చ'** (ఆదిత్యహృదయం). **'హగ్ం సశ్శుచిషత్ వసురంతరిక్షసద్ధోతావేదిషత్'** - అని వైదికమంత్రం. వేదిషత్ అంటే వేదియందు ఉండువాడు. ఇప్పటికీ ఆ వేదిక అనే పదం వాడుకలో ఉంది. కానీ అగ్నిహోత్రం రగిల్చిన చోటుకు వేదిక అని పేరు. కనుక తూర్పు దిక్కుకి వేదిక అని పేరు.

సూర్యభగవానునికి వేదిషత్ అని పేరు. అంటే వేది యందు ఉండువాడు. అగ్నిహోత్రానికి, సూర్యునికి ఉన్న అనుబంధం తెలుసుకోగలగాలి. అమ్మవారు ఆ సూర్యభగవానునిలో ప్రకాశిస్తున్న తేజస్వరూపిణిగా అంతటా దర్శిస్తూ, అంతటా వ్యాపిస్తూ, అందరికీ జ్ఞానమిస్తోంది. జ్ఞానప్రదాయిని అన్నప్పుడు 'సహస్రశీర్షవదనా', దర్శనశక్తి 'సహస్రాక్షీ', గమనశక్తి 'సహస్రపాత్'. ఈ మూడు సూర్యపరంగా

చెప్పుకున్నాం. రెండవది ముందు నామాలలో విరాట్‌పురుష వర్ణనలో చెప్పుకున్నాం. ఇక మూడవ భావం - విశ్వరూప దర్శనం. పరమాత్మకి లెక్కలేనన్ని నేత్రములు ఉన్నాయి. సహస్రాక్ష, సహస్రపాత్ అని విష్ణుసహస్రంలో కూడా ఉంది. పురుషసూక్తంలో కూడా ఉంది. ఇక్కడా ఉంది అంటే విష్ణుసహస్రము, శ్రీలలితా అన్నీ ఒక్కటే భావాన్ని తెలియజేస్తున్నాయి.

'సహస్రం' అంటే అనంతం అని అర్థం. అనంతమైన నేత్రములు, అనంతమైన శిరస్సులు, అనంతమైన పాదములు కలది అని చెప్పినప్పుడు అనంత ఇంద్రియశక్తి అని అర్థం. మూడు చెప్పారంటే ఉపలక్షక న్యాయం చేత మిగిలిన ఇంద్రియాలు కూడా గ్రహించవలసిందే.

అమ్మవారి చైతన్యం అందరిలో ఉందని కదా ముందు నామాల వరకు ప్రస్తావన చేసుకున్నాం. పరిశీలిస్తే ప్రతివాని దర్శన శక్తి, శ్రవణ శక్తి, వాక్ శక్తి అమ్మవారు. మంచి మాట్లాడుతున్నాడా? చెడు మాట్లాడుతున్నాడా అని ప్రక్కన పెట్టండి. ఇది మనం గమనిస్తే వాక్ అనే శక్తి, దర్శన శక్తి - ఇలా ప్రతి ఇంద్రియానికి శక్తి ఆవిడ ఇచ్చిందే కానీ మనం తయారు చేసుకున్నది కాదు కదా! ఉన్నది వాడుకుంటున్నాం. ఇప్పుడు పరిశీలిస్తే అందరి తలలలో, అందరి కన్నులలో, అందరి పాదాలలో ఆవిడ శక్తే ఉంది. ఇలా గమనిస్తే ప్రతి శిరస్సులో, ప్రతి పాదంలో, ప్రతి నేత్రంలో ఆ చిత్ శక్తే ప్రసరిస్తున్నప్పుడు ఎన్ని శిరస్సులు ఉన్నాయి? ఎన్ని పాదాలు ఉన్నాయి?. సహస్ర... అనంత...

సృష్టిలో అందరి కన్నులలోంచి చూస్తున్న దర్శనశక్తి. అందరి శిరస్సులలోను కనబడుతున్న జ్ఞానశక్తి, అందరి పాదాలలోను గమనశక్తి. అదే 'సహస్రశీర్షవదనా' 'సహస్రాక్షీ' 'సహస్రపాత్'. ఇలా చూడగలిగితే- "అఖిలరూపులు తన రూపమైన వాడు, ఆదిమధ్యాంతములు లేక అలరువాడు" అన్న గజేంద్రుని మాట అర్థం అవుతుంది.

285. ఆబ్రహ్మకీటజననీ - శ్రీ ఆబ్రహ్మకీటజనన్యై నమః

ఆబ్రహ్మకీటజననీ వర్ణాశ్రమవిధాయినీ

నిజాజ్ఞారూపనిగమా పుణ్యాపుణ్యఫలప్రదా

ఇదొక పదాల సమూహం. సహస్రవ్యాపిని అయిన జగదంబ సృష్టిలో అందరికీ తల్లి. ఎవరికి? అంటే ఆబ్రహ్మకీటజననీ. బ్రహ్మదేవుడు మొదలుకొని కీటకము వరకు అందరికీ ఆవిడే తల్లి. అందుకే **"త్వం దేవజననీ పరా"** "నువ్వు దేవతలకే తల్లివి" అని అమ్మవారి సూక్తములలో వేదములే వివరించాయి.

దేవతలలోకెల్లా పరమమైన జన్మ ఎవరిది అంటే బ్రహ్మదేవునిది. అందుకే ఆయనకి సురశ్రేష్ఠుడు, పితామహుడు అని పేర్లు. దేవతలలోకెల్లా పెద్దవాడు. అలాగే తక్కువ జన్మలలో అతి తక్కువది కీటకం. ఇదొక అవధి, అదొక అవధి. పాపజన్మలలో కెల్లా పరమ పాప జన్మ కీటకం. పుణ్యమైన వాటిల్లో కెల్లా పరమ పుణ్యమైనది బ్రహ్మ. అక్కడ మొదలుకుని ఇక్కడవరకు అంటే పుణ్యపాపములు సర్వజీవులకు ఉన్నాయి. ఈ సర్వజీవులలో చైతన్యం అమ్మయే.

కేవలం మానవులకు మాత్రమే కాదు. బ్రహ్మదేవుడు మొదలుకుని కీటకం వరకు అందరికీ తల్లి. అయితే మానవునికి ఉన్న బుద్ధిశక్తి వల్ల శక్తిని గుర్తించగలిగే ఒకానొక అవకాశం ఉంది. ఆవిడ సర్వజగజ్జననీ. జగజ్జననీ అనే మాట చాలు. తల్లి అన్నప్పుడు మనం శ్రీమాతా అన్న మాటనే భావన చేసుకోవాలి. కారణమై, పోషకమై, రక్షకమై భరిస్తూ ఉన్నది ఎవరో ఆవిడే తల్లి. అందరికీ ఆవిడే కారణం, పోషకం, రక్షకం.

286. వర్ణాశ్రమవిధాయినీ - శ్రీ వర్ణాశ్రమవిధాయిన్యై నమః

వర్ణము, ఆశ్రమము అనే పద్ధతి ఏర్పాటు చేసిన తల్లి. కొన్ని వర్ణాల వారికి, కొన్ని ఆశ్రమాల వారికేనా తల్లి? అందరికీ ఆవిడ తల్లే. 'ఆబ్రహ్మకీటజననీ' - సర్వులకు ఆవిడే జనని అని చెప్పి 'వర్ణాశ్రమవిధాయినీ' అన్నారు.

వర్ణాశ్రమాలు మానవులకు ఉంటాయి. అది కూడా ఏ మానవులైతే కర్మ

చేసి బాగుపడదాం అనుకుంటారో వారికుంటాయి. కొందరు అంటూ ఉంటారు– "భారతదేశంలోనే వర్ణాశ్రమాలు ఉన్నాయి. ప్రపంచంలో ఇంక దేనికీ లేవా?" అంటే నిజమే. భారతదేశానికే ఎందుకు ఉన్నాయంటే ఇది కర్మభూమి, యజ్ఞభూమి కనుక కర్మ అంటూ ఎక్కడ ఉంటుందో అక్కడ వర్ణాశ్రమాలు తప్పకుండా ఉంటాయి. ఈ వర్ణాశ్రమ పద్ధతి అమ్మవారే ఏర్పాటు చేశారు. దీనికి ప్రమాణం భగవద్గీతలో వాక్యమే

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్

"వారివారి గుణకర్మలను అనుసరించి నేను చాతుర్వర్ణ్యములను సృష్టించాను" అన్నారు శ్రీ కృష్ణపరమాత్మ.

"మానవులు పుట్టడం ఒకేలా పుడతారు కానీ వారి గుణకర్మలను బట్టి నాలుగు వర్ణాలవారని నిర్ణయించాలని భగవద్గీతలో చెప్పారని కొందరు అంటారు. కానీ అలా చెప్పలేదు. అలా చెప్తే 'సృష్టం' అనే మాట రాదు. నేను సృష్టించాను అన్నాడు. పుట్టుకతోనే ఈ వర్ణములంటూ ఉంటాయి. "చాతుర్వర్ణ్యం మయా **సృష్టం**" "వారి పూర్వజన్మల యొక్క వాసనలను, ఆ కర్మలని, గుణాలని అనుసరించి నాలుగు వర్ణములు నేను ఏర్పాటు చేశాను" అన్నారు. అలాగే **చతురాశ్రమములు.** ఇది వ్యవస్థ.

మానవుడు బాగుపడడానికి భగవానుడు ఏర్పాటు చేసిన వ్యవస్థ పేరు వర్ణాశ్రమ వ్యవస్థ. ఇది నేనే చేశాను, నేను చేయలేదన్నాడు. వాటికి కర్తను నేను. అకర్తను కూడా నేనే అన్నాడు. ఏ మాట ఎందుకు చెప్పాడు? అదే అక్కడ ఉన్న అందం. అంటే భగవంతుడు ఎవరికో కొందరి మీద ప్రేమ పుట్టి ఒకరిని ఒకరి వర్ణంలో, ఒకరిని ఇంకో వర్ణంలో పడేయడు.

'వర్ణాశ్రమవిధాయినీ' నామం చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. దీనికి శాస్త్రీయమైన అర్థమే చెప్పుకోవాలి.

'వర్ణాశ్రమవిధాయినీ' అనేది ఎందుకు చెప్పింది? అంటే ఇది లేనిదే

తరించలేరు. వేదాంతంలో ఇవన్నీ లేవు అనుకోవచ్చు కానీ అక్కడవరకు వెళ్ళడానికి ఇవన్నీ కావాలి. అందుకే మహానుభావుడు శంకరభగవత్పాదులవారు అపరోక్షానుభూతిలో మొదటి వాక్యంలో **'స్వవర్ణాశ్రమ ధర్మేణ తపసా హరితోషణాత్'** అన్నారు. ఈ వాక్యం భాగవతంలోనూ, విష్ణుపురాణంలోను కనబడుతోంది. ప్రతి వ్యక్తి కూడా వేదాంతంలోకి వెళ్ళే ముందు వారి వారి వర్ణానికి, వారి వారి ఆశ్రమానికి అనుగుణమైన ధర్మాన్ని ఆచరించి, అవి కూడా, 'విష్ణుప్రీతికి చేస్తున్నాను' అని చేయాలి. అలా చేస్తే వాని చిత్తానికి ఏకాగ్రత, శుద్ధత ఏర్పడతాయి. అవి లేకపోతే సంస్కారం ఉండదు. అందుకు కర్మ సంస్కారం ఇవ్వడానికి పనికి వస్తుంది. అందుకు వర్ణాశ్రమములు అనేది శాస్త్రం చెప్పింది.

సనాతనధర్మం వర్ణాశ్రమాల మీద ఆధారపడి ఉంది. ఈ వర్ణాశ్రమములలో ఏది ఎక్కువ, ఏది తక్కువ అని ప్రశ్న వేస్తే... ఎవరి వర్ణం వారికి ఎక్కువ. ఎక్కువ, తక్కువలు ఏవీ లేవు. లోకవ్యవస్థ నడపడం కోసం పరమాత్మ వర్ణాశ్రమ వ్యవస్థను ఏర్పాటు చేశాడు.

భారతీయసంస్కృతిలో ఋషులు ఉన్నారు కనుక దీనిని వ్యవస్థ చేశారు కానీ వర్ణధర్మం మాత్రం ప్రపంచమంతా ఉంది. ఆ మాటకివస్తే జ్యోతిష శాస్త్రంలో గ్రహాలకు కూడా వర్ణాలు ఉన్నాయి. వృక్షాలలో, శిలల్లో కూడా బ్రాహ్మణ శిల, క్షత్రియ శిల మొదలైనవి ఉన్నాయి. అంతే కాక పుంశిల, నపుంసక శిల, స్త్రీ శిల అని శిలాభేదాలు ఉన్నాయి. స్త్రీ దేవతా విగ్రహాలు చెక్కాలంటే స్త్రీశిలే వాడాలి. పురుష దేవతా విగ్రహాలు చెక్కాలంటే పుంశిల వాడాలి. పీఠములు మొదలైనవి చెక్కేటప్పుడు నపుంసక శిల వాడాలి. దేనికి ఏ శిల వాడాలో చెప్పేది ఆగమశాస్త్రం. శిల్పశాస్త్రం అంత విశేషం. అయితే భారతీయ ఋషుల విశేషమేమిటంటే పైన కనబడుతున్న ఉపాధులు కాకుండా లోపల ఉన్న లక్షణాన్ని తపస్సుతో దర్శించి మనకి ఇచ్చారు.

దేవతలలో కూడా వర్ణాలు ఉన్నాయి. ప్రపంచమంతా కూడా మూడు గుణాల యొక్క కలయికే. మూడు గుణాలలో సత్త్వగుణం పాళ్ళు ఎక్కువ ఉంటూ

రజోగుణం, తమోగుణములు కాస్త తక్కువ ఉంటే అది విప్ర అని చెప్పబడుతున్నది.

అదే రజోగుణం పాళ్ళు ఎక్కువ ఉంటూ మిగిలినవి రెండూ తక్కువ ఉంటే అది క్షత్రియం. రజోగుణం, తమోగుణం పాళ్ళు సమానంగా ఉంటూ సత్త్వగుణం పాళ్ళు కొద్దిగా తగ్గితే అది వైశ్య. తమోగుణం పాళ్ళు ఎక్కువ ఉంటే అది శూద్ర అని చెప్పబడుతున్నది. అన్ని గుణములు అమ్మవారి స్వరూపములే అయినపుడు ఏది తక్కువ, ఏది ఎక్కువ?

ఒకే మానవునిలో కూడా మళ్ళీ నాలుగు వర్ణాలు ఉంటాయి. ఒకే వ్యక్తి ఆలోచనకి మేధస్సు ఉపయోగించేటప్పుడు వాడే బ్రాహ్మణుడు అవుతాడు. తనను తాను రక్షించుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటూ, నిర్వహణ సాగిస్తే వాడే క్షత్రియుడు. తనకు వచ్చింది తాను చక్కగా వినియోగించుకుంటూ, ఎలా పంపకం చేసుకోవాలో అని ఆదాయాన్ని చూసుకుని, వస్తు వినిమయం చేస్తే వాడే వైశ్యుడు. తాను ఏదైనా ఒక వృత్తి, ఉత్పత్తి చేసుకుంటున్నప్పుడు తానే శూద్రుడు.

ఇది ఒక వైజ్ఞానిక వ్యవస్థ. అది ప్రపంచంలో ఉంది. అయితే దీనిని మన వాళ్ళు ఏం చేశారంటే ఒక పరంపర, ఒక రక్తము, ఒక కుటుంబవ్యవస్థగా గుర్తించారు. ఇలా ఒకప్పుడు భారతదేశంలో ప్రతిష్ఠంగా ఉంది. ఇప్పుడు ప్రశ్నార్థకం అయిపోయింది. కుటుంబవ్యవస్థ చాలా గట్టిగా ఉండేది కనుక ఇది ఆ వ్యవస్థలో చక్కగా ఇమడబడి క్షేమంగా వెళ్ళింది. తరువాత వ్యక్తుల స్వార్థాలు ప్రబలిపోయి, ఎవరి పనులు వాళ్ళు చేయడం మానేసి నువ్వు ఎక్కువ, నేను తక్కువ అని కొట్టుకోవడం మొదలు పెట్టాక వ్యవస్థ అంతా అస్తవ్యస్తం అయిపోయింది. పూర్తిగా వదిలేశామా? అంటే అదీ లేదు. ఒకప్పుడు వర్ణాశ్రమాలు బాగా ఉన్నప్పుడు లేనన్ని కులసంఘాలు ఇప్పుడు వ్యవస్థ సరిగ్గా లేనప్పుడు ఎక్కువగా ఉన్నాయి.

పాలనలో జాతులు చూడకూడదన్న కాలంలోనే జాతిని ఆధారం చేసుకునే పాలనలు ఉన్నాయి. ఆఖరికి కళ్ళు మూసుకు బ్రతికేస్తూ అదే జ్ఞానం అనుకుంటున్నాం. చుట్టూ ఉన్నది ఒక్కసారి ఆలోచించాలి. కాబట్టి వర్ణాశ్రమ వ్యవస్థ గురించి మరింత ఎక్కువగా తెలుసుకోవలసిన కాలం ఇదే. ప్రతి వర్ణము గొప్పదే. ప్రతి వర్ణం వారికి

శాస్త్రం విధించిన కర్మ వారు చేసుకుంటూ వారు సత్త్వగుణాన్ని పెంచుకుంటూ ఈశ్వర భక్తి కలిగి ఉంటే అది వారిలో సత్త్వగుణాన్ని క్రమంగా పెంచి తత్త్వము, మోక్షము ఇస్తుంది. మోక్షం ఏ వర్ణం వాడైనా పొందుతాడు. కృష్ణపరమాత్మ ఒక్క మాట చెప్పాడు– **"స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః"** "తన వర్ణాశ్రమాలకు ఉచితమైన కర్మలతో నన్ను అర్చించినవాడు సిద్ధి పొందుతాడు". అంతేగాని ఫలానా జాతి వారికే మోక్షమిస్తానని ఎక్కడైనా ఉందా?

సృష్టిలో ప్రతి వర్ణం వాడు గొప్పవాడే. ప్రతి ఆశ్రమం గొప్పదే. వర్ణ – ఆశ్రమ ప్రక్కనే ఉన్నాయి. నాలుగు ఆశ్రమాలలో నీది ఏదో అది గొప్పది. గృహస్థాశ్రమం చాలా గొప్పది అని గృహస్థు అనుకుంటే చాలా మంచిది. సన్న్యాసి – గృహస్థాశ్రమం చాలా గొప్పది, అనవసరంగా పొరపాటు చేశాను అనుకుని మళ్ళీ వెనక్కి వెళ్తే మహా ప్రమాదం. ప్రతి ఆశ్రమానికి కొన్ని ధర్మాలు ఉంటాయి. వారు అది పాటించినప్పుడు అది గొప్పదే. ప్రతి వర్ణం వల్ల, ప్రతి ఆశ్రమం వల్ల ప్రపంచానికి ఒక ఉపయోగం ఉంది. వారు ఆ ధర్మం పాటించినప్పుడు ప్రపంచానికి అది ఉపయుక్తం అవుతుంది.

వృత్తులు ఒకప్పుడు వర్ణాన్ని ఆశ్రయించుకుని ఉండేవి. వృత్తుల తీరులు మారిపోయాయి. కాబట్టి పద్ధతులు మారుతున్నాయి. **వృత్తి వేరు – ధర్మం వేరు. నీ కుటుంబం ఏదైతే పరంపరగా చేసుకుందో అదే ధర్మం. ఇప్పుడు వృత్తి మారింది కనుక ధర్మాలు మారడానికి లేదు. వారి యొక్క పరంపరను వారు అనుసరించవలసిందే.**

ఇదే సమయంలో అమ్మవారు చెప్తున్న వ్యవస్థ ఏమిటంటే ఎవరి వర్ణ ధర్మాన్ని వారు కాపాడుకోవాలి. ఒక జీవుడంటే కనబడే ఒక అన్నమయ కోశమే కాదు. లోపల సూక్ష్మమైన ఎన్నో అంశాలు ఉంటాయి. అవి పరిశోధించే దశకి ఇంకా ఈ భౌతిక విజ్ఞానం ఎదగలేదు. ఎప్పటికో ఎదుగుతుంది. ఆ ఎదిగేలోపల మనం భ్రష్టం అయిపోకూడదు.

వర్ణాశ్రమ ధర్మములు సాంకర్యములు కారాదు. బ్రహ్మచారి బ్రహ్మచారిగానే ఉండాలి. కొంచెం గృహస్థాశ్రమం కూడా కలుపుకుంటాను అంటే మరింకేం బ్రహ్మచారి

అవుతాడు? ఎవరిది వారు పాటించాల్సిందే.

ఇవన్నీ కలిపి ఒక పరమపురుషుని శరీరంలో వేదం భావన చేసింది. అదే పురుషసూక్తం. పురుషసూక్తంలో- **'బ్రాహ్మణోస్య ముఖమాసీత్'** అనే మంత్రం ఉంది. 'సహస్రాక్షీ సహస్రపాత్' అన్నప్పుడు పురుషసూక్తం అంతా ఇక్కడ ఆవిష్కరింపబడింది. పురుషసూక్తం ఆవిష్కరిస్తున్నారు కనుకనే 'పద్మనాభసహోదరీ' తీసుకువచ్చారు. అదీ ఔచిత్యం.

ప్రతి వర్ణము భగవంతుడు మనం తరించడానికి ఇచ్చిన ఒకానొక మార్గము. దానితోనే మనం తరించవచ్చు. ఈ విధానం దేని ద్వారా ఆవిడ ఏర్పాటు చేసింది? వేదముల ద్వారా ఎవరు, ఎలా జీవించాలో చూపించింది ఆ తల్లి.

విధానం ఏర్పాటు చేసి విధానములను తెలియజేసింది ఆవిడే. తానే శాస్త్రరూపంతో చూపించింది. శాస్త్రములు పరమాత్మ వలన వచ్చినవి. బ్రహ్మసూత్రాల్లో 'శాస్త్రయోనిత్వాత్' అని సూత్రం చెప్పారు. దీని అర్థం ఏమిటంటే శాస్త్రాలకు అమ్మ కారణము. అమ్మకు శాస్త్రములు కారణము. ఇది ఎలా తెలుసుకోవాలంటే మనం అమ్మ గురించి తెలుసుకోవాలన్నా, అమ్మ గురించి ఉపాసన చేయాలన్నా మనకి శాస్త్రాలే దిక్కు. శాస్త్రాల ద్వారానే మనం అమ్మను తెలుసుకున్నాం కనుక అమ్మకు శాస్త్రములు కారణము. శాస్త్రములు అమ్మవారి నుండి వచ్చాయి. ఇది ఉపనిషత్ చెపుతోంది - **'యస్య నిశ్శ్వసితం వేదాః'** అని. వేదములన్నీ పరమాత్మ యొక్క నిట్టూర్పులే. మన నుండి ఊపిరి ఎంత సహజంగా వస్తోందో అమ్మవారి నుండి అలా ఆ వేదవిజ్ఞానమంతా వచ్చింది. ఆ వచ్చిందంతా మొదట పుచ్చుకున్నవాడు బ్రహ్మదేవుడు. ఆయనను మొదలుకుని అందరికీ ఆవిడే తల్లి. అందుకే **'ఆబ్రహ్మకీటజననీ'.**

ఆ శాస్త్రములన్నీ అమ్మవారి స్వరూపములే. ఆవిడ ఒక పాలకురాలు. పాలించే రాజ్యానికి ఒక రాజ్యాంగం ఉంటుంది. దాని ప్రకారం రాజ్యంలోని వారందరూ నడిస్తేనే, దాని పేరు ప్రభుత్వం. ఆ రాజ్యాంగం లేకుండా ఉంటే అది అరాచకం. పాలన అన్నప్పుడు ఒక పద్ధతి ఉండాలి. మరి అమ్మవారు జగజ్జనని కదా! పైగా

శ్రీమహారాజ్ఞిగా ప్రపంచాన్ని పాలిస్తోంది కదా! పాలిస్తున్నప్పుడు ఆవిడకి ఒకానొక రాజ్యాంగాన్ని తయారు చేయవలసిన బాధ్యత పడింది. ఆ రాజ్యాంగమే ఆ దేశం వారందరికీ ఆజ్ఞ.

అలాగే అమ్మవారు ఈ వేదములు అనే రాజ్యాంగం తయారు చేసి మనకు ఆజ్ఞాపించింది. రాజు చెప్పినది పాటించాల్సిన బాధ్యత పౌరులది. రాజు అనగా ప్రభుత్వం. ప్రభుత్వం నిర్ణయించింది పాటించకపోతే శిక్షిస్తారు. అక్కడ నువ్వు తర్కాలు చేస్తాను అంటే కుదురుతుందా? న్యాయాన్ని పాటించాల్సిందే.

ఒక దేశం కోసం ఏర్పాటు చేసుకున్నదే మనం మార్చలేకపోతున్నామే ప్రపంచ నిర్వహణ కోసం అమ్మవారు ఇచ్చిన ఒక రాజ్యాంగం ఉంది. దాని పేరే వేదము. ఈ వేదము అమ్మవారి యొక్క ఆజ్ఞారూపము. 'వర్ణాశ్రమవిధాయినీ' అయిన తల్లి ఆ విధానమును తయారు చేసి మనకు ఇచ్చింది. దాని పేరు 'నిజాజ్ఞారూపనిగమా' అని చక్కని మాట.

287. నిజాజ్ఞారూపనిగమా - శ్రీ నిజాజ్ఞారూపనిగమాయై నమః

నిజ అంటే తన యొక్క ఆజ్ఞారూపమైన నిగమమును కలది. నిగమము అనగా వేదాది శాస్త్రములు. వేదాది శాస్త్రములు అంటే అమ్మవారి యొక్క ఆజ్ఞలు. **'శ్రుతిః స్మృతిః మమైవాజ్ఞా'** అని శివపురాణంలో పరమాత్మ శివుడు చెప్పాడు. "స్మృతి, శ్రుతి ఇత్యాదులు నా యొక్క ఆజ్ఞలు. ఎవడు దానిని ఉల్లంఘిస్తాడో వాడు శిక్షకు అర్హుడు. ఎవడు దానిని పాటిస్తాడో వాడు రక్షణకు అర్హుడు". ఇది స్వామి వారు పెట్టిన విధానం.

ఈ మాటనే కూర్మపురాణంలో **'మమైవాజ్ఞా పరాశక్తిర్వేదసంజ్ఞా పురాతనీ, ఋగ్యజుస్సామరూపేణ సర్గాదౌ సంప్రవర్తతే'** - 'సృష్టికి ఆది యందు ఋగ్యజుస్సామాత్మకమైన వేదమంతా కూడా 'మమైవ ఆజ్ఞా'- 'నా యొక్క ఆజ్ఞయే' అని అమ్మవారే చెప్పారు. ఇదే మాట 'శ్రుతిః స్మృతిః మమైవాజ్ఞా' విష్ణువాక్యము, శివవాక్యము కనబడతాయి. అంటే ఈశ్వరుడు ఒక్కడే. ఏ ముఖంతో చెప్పినా విషయం

అదే. మొత్తానికి ఇవి అన్నీ పరమాత్మ యొక్క ఆజ్ఞా వాక్యములు.

'వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః వేదాంత కృత్ వేదవిదేవ చాహం' అన్నాడు గీతలో పరమాత్మ. వేదములన్నింటి చేత తెలియబడుతున్న వానిని నేను కనుక నన్ను తెలుసుకోవాలంటే ప్రమాణం వేదమే. మనం ఇప్పుడు ఇన్ని చెప్పుకుంటున్నాం అంటే శాస్త్రం లేకపోతే అమ్మవారు తెలుస్తారా? శివుడు తెలుస్తారా? విష్ణువు తెలుస్తాడా? వారిని పొందాల్సిన విధానం తెలుస్తుందా? ఇవన్నీ ఎవరు ఏర్పాటు చేశారు? అమ్మవారే అలా ఏర్పాటు చేసింది.

ప్రాచీనుల దృష్టిలో శాస్త్రము అనగా వేదమే. దానిని అనుసరించి ఏవైనా చెప్తే అవి కూడా శాస్త్రములే. అందుకు శ్రుతి, స్మృతి, పురాణములు – ఈ మూడిటికీ ఒకే గౌరవాన్ని ఎందుకు ఇచ్చామంటే శ్రుతి అనగా వేదం. వేదం ఏం చెప్పిందో అవే చెప్తున్నాయి స్మృతులు, పురాణాలు కనుక వాటికి కూడా ఆ స్థానం ఇచ్చారు.

'తస్మాత్ శాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ' అని పరమాత్మ చెప్పాడు. శాస్త్రాన్నే ప్రమాణంగా తీసుకోవాలి అని చెప్పడంలో ఆ వేదమే ఆయన ఏర్పాటు చేసిన శాస్త్రం. ప్రమాణంగా తీసుకుంటే బాగుపడతాం అని చెప్పాడు. ప్రమాణంగా తీసుకోకపోతే నశించిపోతాం అని మళ్ళీ ఆయనే చెప్పాడు మరొకచోట. **'యత్ శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః, న చ సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాంగతిమ్'** – శాస్త్రవిధిని అతిక్రమించరాదు. అమ్మవారు అలాంటి శాసనం చేసినది. నిగమములు అమ్మవారి ఆజ్ఞారూపాలు.

288. పుణ్యాపుణ్యఫలప్రదా – శ్రీ పుణ్యాపుణ్యఫలప్రదాయై నమః

మనమందరం బాగుపడడానికి అమ్మవారు ఒక పద్ధతి పెట్టింది. అదే 'నిజాజ్ఞారూపనిగమా'. ఎవరైతే ఆ పద్ధతిని పాటిస్తారో వారు పవిత్రులు. గతజన్మల పాపాలు, పుణ్యాలు కలిసి ఈ జన్మ వచ్చింది. ఇప్పుడు ఈ పాపాలన్నీ పోగొట్టుకుంటేనే మళ్ళీ తరించగలరు. ఈ పాపాల నాశనానికి కావలసిన పద్ధతులు వేదం చెప్పింది. ఆ పద్ధతులు పాటిస్తే పాపాలు పోయి పవిత్రులౌతారు. అలా పవిత్రమయ్యే స్థితిని

పుణ్యం అంటారు. పుణ్యం అంటే **'పునాతి అనేన ఇతి పుణ్యం'.** ఏది చెయ్యడం వలన మనం పవిత్రులమౌతామో దాని పేరు పుణ్యం.

వేదాలు, 'నిగమాలు' అమ్మ ఆజ్ఞారూపాలు అయ్యాయి. వానిని అనుసరించి నడిచేవారు పుణ్యాత్ములు. వాటిని అతిక్రమించేవారు పాపాత్ములు. కానీ శాస్త్రం చాలా మృదువుగా మాట్లాడుతుంది. పాపం అనే పదం వాడదు. అపుణ్యం అని చాలా పవిత్రంగా చెప్పారు. పుణ్య–అపుణ్య. 'రౌరవే అపుణ్యనిలయే' అంటాం. 'అపుణ్యనిలయే' అంటే నరకాలలో ఉన్నవారు అని అర్థం.

శాస్త్ర ప్రకారం ప్రవర్తిస్తే పుణ్యం. దాన్ని అతిక్రమిస్తే అపుణ్యం. అమ్మవారు పుణ్యం చేసినందుకు ఫలంగా సుఖం ఇస్తున్నది. అపుణ్యానికి ఫలంగా దుఃఖం ఇస్తోంది. మొత్తం ఈశ్వరుని కృత్యం అంతా ఇందులో చూపించారు. ధర్మం అంటే శాస్త్రం చెప్పేదే ధర్మం. మనకి తోచింది ధర్మం కాదు. తోచినట్లు నడిచేవారు వానరులు. శాస్త్రం చెప్పినట్లు నడిచేవారు నరులు. శాస్త్రవిహితకర్మాచరణయే ధర్మము. అది నిర్ణయించేది వేదము. అది అమ్మవారి ఆజ్ఞ. ఇదే 'నిజాజ్ఞారూపనిగమా'.

పాటించితే పుణ్యఫలంగా సుఖం ఇస్తున్నది. పాటించకపోతే అపుణ్యఫలంగా దుఃఖం ఇస్తున్నది. కాబట్టి సుఖదుఃఖ అనుభవాలు అమ్మవారే ఇస్తున్నారు. కానీ ఒక పద్ధతి ప్రకారం ఇస్తోంది.

ఈశ్వరుడు కర్మఫలప్రదాత అని చెప్పడం ఇది. సరిగ్గా బ్రహ్మసూత్రాలలో చెప్పిన **'ఫలమత ఉపపత్తేః'** అనే సూత్రమంతా ఇక్కడ చెప్పారు. లలితాసహస్రంలో ఉపనిషత్ వివేచన ఎలా వస్తున్నదో పరిశీలించాలి. ఈశ్వరుడు కర్మఫలప్రదాత. ఇక్కడే పూర్వమీమాంసని కొట్టి ఉత్తరమీమాంసా ప్రతిష్ఠాపన జరుగుతోంది.

పూర్వమీమాంస ఏంటంటే – ఈశ్వరుడు ఎవరు? ఆయన గురించి వదిలేసెయ్. నీ కర్మ నువ్వు చేస్తున్నావు. దాని ఫలం నువ్వు అనుభవిస్తున్నావు. అంతే.. ఇది పూర్వమీమాంస.

ఉత్తరమీమాంస అలా అనదు. కర్మ చేస్తుంది అని కర్మని మాత్రమే ఒప్పుకోకూడదు. ఉపదేశసారంలో **'కర్మ కిం పరం కర్మ తజ్జడం' 'కర్తురాజ్ఞయా**

ప్రాప్యతే ఫలం' అన్నారు రమణమహర్షి. కర్మ ఏం చేస్తుంది? అది జడమైనది. కర్మఫలప్రదాత ఒకడున్నాడు అని ఈశ్వర అస్తిత్వాన్ని ఉత్తరమీమాంసలో మనం తెలుసుకుంటున్నాం. కర్మఫలప్రదా(యిని)త అనే మాటనే 'పుణ్యాపుణ్యఫలప్రదా' అని చూపించారు.

లలితాసహస్రనామస్తోత్రం పరమమైన వేదాంతదర్శనాన్ని ప్రతిష్ఠ చేస్తోంది. వేదాంతం ఉత్తరమీమాంస. ఇది – మునుపు ఉన్న అన్ని మీమాంసాలని పూర్వపక్షం చేసి ఉత్తరపక్షం (సిద్ధాంతం) నిర్ణయిస్తోంది.

వేదం ద్వారా శాస్త్రం చెప్పిన కర్మలు అన్నీ చిత్తశుద్ధి కోసమే. చిత్తశుద్ధి తరువాత బ్రహ్మజ్ఞానం పొందాలి. ధర్మం చేస్తున్నప్పుడు బ్రహ్మజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొనే ధర్మం చేయాలి. ధర్మాచరణ వలన చిత్తశుద్ధి ఏర్పడుతుంది. చిత్తశుద్ధి ఏర్పడితే వేదాంతం అర్థమౌతుంది. చిత్తశుద్ధిలేనివారికి వేదాంతం చెప్తే మహాదోషం. ముందు మనం పుణ్యమైన కర్మలు చేస్తేనే పాపం పోతుంది. ఆ పాపదోషాలు పోతేనే వేదాంతం అర్థమౌతుంది. ఇలా చూస్తే 'వర్ణాశ్రమవిధాయినీ', 'పుణ్యాపుణ్యఫలప్రదా' – ఇదంతా వేదంలో పూర్వభాగం – అంటే కర్మకాండ. దాని తరువాత జ్ఞానకాండ – అంటే వేదాంతం.

కర్మకాండలో అమ్మవారు 'నిజాజ్ఞారూపనిగమా'గా ఉంటూ మనం చేసిన పుణ్యాపుణ్యాలకి ఫలాలు ఇస్తూ కనబడ్డారు. వేదాంతం అనగా వేదం చివరిభాగమైన ఉపనిషత్ భాగంలోకి వెళ్తే అక్కడ 'పరతత్త్వం'గా ఆ తల్లియే ప్రతిపాదింపబడుతోంది.

మనం పుణ్యకర్మలు చేసినట్లైతే అనుగ్రహించి చిత్తశుద్ధిని ఇస్తున్నది. ఆ చిత్తశుద్ధి ద్వారా వేదాంతవిద్యని తెలుసుకుంటే జ్ఞానరూపిణిగా అనుగ్రహిస్తున్నది. తరువాత నామం 'శ్రుతిసీమన్తసిందూరీకృతపాదాబ్జధూళికా'.

289. శ్రుతిసీమన్తసిందూరీకృతపాదాబ్జధూళికా

– శ్రీ శ్రుతిసీమన్తసిందూరీకృతపాదాబ్జధూళికాయై నమః

ఇదంతా కలిపి ఒకటే నామంగా చదవాలి. వేదాలన్నింటిని ముత్తైదువులైన

స్త్రీ రూపాలుగా చూపించారు. అమ్మవారినుండి వచ్చిన వేదాలు అమ్మవారి పుత్రికలైన వేదకాంతలు అని భావించాలి. ముత్తైదువులు అందరూ అమ్మవారి పాదాలకి నమస్కారాలు చేశారు అంటే వేదాలు అమ్మవారిని స్తుతిస్తున్నాయి అని చెప్పడం. ముత్తైదువుకి పాపిట ఉండాలి. వారు అమ్మవారికి నమస్కారం చెయ్యగానే వారి పాపిట అమ్మవారి పాదాలకు తగిలింది. అమ్మవారి పాదాలకు పారాణి ఉంటుంది. అది కాస్తా నమస్కరించిన వేదకాంతల పాపిట(సీమంతాని)కి అంటింది. అమ్మవారి పాదాబ్జధూళి అనగా పాదపద్మాలకు ఉన్న ధూళి.

అది కుంకుమ వల్ల వచ్చింది కావచ్చు, లోకసంచారం వల్ల వచ్చింది కావచ్చు, పూజాదుల వల్ల వచ్చింది కావచ్చు. ఏదైనా అమ్మపాదాలకి ఉన్న ఆ ఎర్రనిధూళి నమస్కరించిన వేదకాంతల పాపిటకి సిందూరంలా అంటింది.

వేదాలు అంటే మనందరం గౌరవించేవి. అవి అమ్మవారి ఆజ్ఞని పాటిస్తాయి. ఆజ్ఞ పాటించేవారే వెళ్ళి అమ్మ పాదాలపై పడి దండం పెడతారు. అమ్మవారు ఆజ్ఞారూపాలుగా వచ్చిన వేదాలు మనల్ని శాసిస్తున్నాయి. వేదకాంతలందరూ నిత్యం అమ్మవారికి నమస్కారం చేస్తున్నారు అంటే అర్థం - వేదాలు ఎప్పుడూ అమ్మవారిని 'శ్రుతిసంస్తుతవైభవా' అన్నట్లుగా స్తుతిస్తున్నాయి. అమ్మవారిని ప్రతిపాదిస్తున్నాయి.

స్త్రీకి ఐదవతనమే అందం. ఆ ఐదవతనం ఉన్న సౌందర్యం కనబడుతుంటే గౌరవం.

వేదకాంతలకి ఐదవతనపు సౌందర్యం పాపిట సిందూరం పెట్టుకోవడం వల్ల వచ్చింది. దానితో వారికి నిండుతనం వచ్చింది. వేదకాంతలకి సిందూర రూపమైన నిండుతనం అమ్మవారి పాదాలవల్లే వచ్చింది.

మరొక అద్భుతభావాన్ని పరిశీలిస్తే పాపిట అంటే శిరస్సుకే ఉంటుంది. వేదాలన్నీ కలిపి ఒక స్త్రీగా భావన చేస్తే, శిరస్సు చివరి భాగం. చెట్టుకి చివరి భాగం కొమ్మలని చెప్తాంగాని వేళ్ళని చెప్తామా! చెట్టుకి పాదపం అని పేరు కూడా ఉంది. అంటే పాదాలే మూలభాగం. చివరి భాగం కొమ్మలు. అలా వేదాలకి అంతభాగమే శిరస్సు - అదే వేదాంతం అని అర్థం. శ్రుతికాంతల తలలు అంటే

ఉపనిషత్ జ్ఞానం అని అర్థం. ఉపనిషత్తులన్నీ ఆత్మజ్ఞానాన్నే అనగా - బ్రహ్మపదార్థాన్నే పరమార్థంగా చెప్తున్నాయి.

నిగమ మహార్థముల్ జగము నిండెను తన్నిగమాంతవైఖరుల్

నిగమచయమ్ము కన్న హవణించెను - తన్నిగమాంతచూడమై...

అన్నారు విశ్వనాథవారు. వేదజ్ఞానమే ప్రపంచమంతా నిండిపోయింది. మన శరీరంలో అన్నిటి కంటె గొప్పది ముఖమే. అలా ఉపనిషత్తే వేదంలో గొప్పది అంటున్నారు.

'తన్నిగమాంతచూడమై తగిలెను బ్రహ్మనాబడు పదార్థము' - ఆ వేదాంతమనెడు పాపిట యందు తగిలెను బ్రహ్మ అనే పదార్థం. ఆ పదార్థం అమ్మ **'కాలికొనగోటి రుచిచే రుచిమంతమిదేమి చిత్రమో'** - ఆ బ్రహ్మపదార్థం అమ్మకాలి కొనగోటి కాంతివల్ల ప్రకాశిస్తోంది. అంటే అమ్మపాదాలని ఆశ్రయించకపోతే బ్రహ్మజ్ఞానం ప్రకాశించదు అని చెప్పడం దీనిలో భావం.

వేదాంతం పరతత్త్వాన్ని చెప్తోంది కనుక గొప్పది అయ్యింది. పాదాలని ఆశ్రయించిన వేదాంతకాంతల పాపిటలో కనబడింది అమ్మ పాదధూళి. అంటే పాదాలు ఎక్కడ ఉన్నాయో ఆలోచించాలి.

ఉపనిషత్తులు కూడా బ్రహ్మపదార్థాన్ని తెచ్చి చేతిలో పెట్టవు. మనకి బ్రహ్మపదార్థాన్ని గురించిన ప్రకాశాన్ని ఇస్తాయి. అంటే విచారణ చేసుకునే జ్ఞానాన్ని ఇస్తాయి. వాటిని అధారం చేసుకొని మనం సాధన చేసి బ్రహ్మపదార్థాన్ని పట్టుకోవాలి. అందుకే వేదాంతములందు బ్రహ్మపదార్థ విచారణ జరుగుతుంది. ఆ విచారణ అనేది కూడా అమ్మపాదాల నుండి వచ్చిన ధూళే.

'పాదాబ్జధూళికా' అన్నారు. పాదపద్మముల యొక్క ధూళికా అంటే బయటనుండి వచ్చి పడేది కాదు. పద్మానికి సహజంగా కేసరాలని ఉంటాయి. దాని ధూళి. ఇది ఒక అర్థం. అమ్మపాదాల యొక్క ధూళి మట్టి ధూళి, ఇసుక ధూళి కాదు. అది కాంతిధూళి. ఎప్పుడైనా కాంతి కిరణాలు ప్రసరిస్తున్నప్పుడు చిన్నచిన్న కాంతికిరణజాలములు మనకి కనిపిస్తూ ఉంటాయి. అమ్మ పాదాబ్జధూళి అంటే

అమ్మపాదాలు బ్రహ్మపదార్థం అయితే బ్రహ్మపదార్థం యొక్క జ్ఞానకాంతిపుంజమే పాదాబ్జధూళి. ఆ కాంతి పుంజములు వేదాంతమునందు చెప్పబడుతున్నాయి.

ఈ నామంలో మరొక అర్థం - వేదాలు కూడా పరమాత్మని చెప్పడానికే ప్రయత్నిస్తున్నాయి గాని పరమాత్మని అవి కూడా సంపూర్ణంగా చెప్పలేవు. అమ్మవారిని చూడడమే కష్టం. పాదాలని పట్టుకోవడం మరీ కష్టం. తల తాకించడం ఇంకా కష్టం, ఆ భాగ్యం వేదాలకి దొరికింది. అమ్మపాదాల దగ్గరకి వెళ్ళగలిగే శక్తి వేదవిజ్ఞానానికి మాత్రమే ఉందని తెలుసుకోవాలి. అక్కడదాకా వెళ్ళినా ధూళి లభించింది అంటే వాటికి పాదం లభించింది. మనకి చూపిస్తున్నది ఆ ధూళే. మనకి వేదాంతమునందు కనబడుతున్నదంతా ఆ పరబ్రహ్మపదం యొక్క కాంతిప్రసారమే. పాపిటసిందూరమే ముత్తైదువ తలకి అందం. వేదాంతానికి అందం బ్రహ్మతత్త్వ ప్రతిపాదనమే. ఆ బ్రహ్మతత్త్వమే అమ్మ పాదధూళి. ఇన్ని విషయాలు ఒక్క వాక్యంలో చూపించారు.

వేదాలు కూడ **'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ'** అన్నాయి. **'నేతి నేతి ఇతి నిగమకహో'** అంటారు తులసీదాస్. వేదాలు కూడ పరమాత్మని గురించి "ఇదికాదు, ఇదికాదు" అని చెప్తాయి కాని "ఇది" అని చెప్పలేదు. ఇదికాదు, ఇదికాదు అని తీసెయ్యగా ఏది మిగిలిందో అదే బ్రహ్మమని వేదాంతం చెప్పింది. ఇక్కడ శ్రుతులకు కూడా అందదు అని భావం.

సాధారణంగా భావిస్తే వేదాలన్నీ స్త్రీలుగా వెళ్ళి నమస్కారం చెయ్యడం. వారందరికి తలలు ఉన్నాయి. అవి వేదశాఖలు. ఎన్ని ఉపనిషత్తులు ఉన్నాయో అన్ని తలకాయలు. వెయ్యి ఎనిమిది ఉపనిషత్తులు ఉన్నాయి. ఆ వెయ్యి ఎనిమిది తలలపై ప్రకాశిస్తున్న ధూళి అంతా ఈ పాదధూళియే.

ఉపనిషత్తులు వెదికితే అమ్మ పాదధూళి దొరుకుతుంది. అది మన శిరస్సున బొట్టుగా పెట్టుకోవాలి అంటే ఆ జ్ఞానాన్నే మన తలకి ఎక్కించుకోవాలి. అది ఇందులో ప్రతిపాదించిన విషయం.

అమ్మవారు వ్యవహారంలో ధర్మము, పరమార్థంలో జ్ఞానం. మనకి

ఎంతవరకు వ్యవహారజీవితం ఉన్నదో అంతవరకు ధర్మాన్ని పాటించాలి. పరమార్థం తెలియాలంటే జ్ఞానమే కావాలి. ధర్మం జ్ఞానానికి సహకారి.

మెట్టమొదట 'నిజాజ్ఞారూపనిగమా'. తరువాత – 'శ్రుతిసీమన్తసింధూరీకృత పాదాబ్జధూళికా'.

పాదం నుండి వచ్చిన కాంతులు శిరస్సుపై పెట్టుకోవడం అనగా ఉపాసకులు అమ్మవారి ఉపాసనలో ప్రవేశించగానే గురుపాదుకలు పట్టుకుంటారు. ఆ గురుపాదుకా మంత్రాలు ఉపనిషత్ ప్రతిపాద్యమైన పరతత్త్వమే. ఆ గురుపాదుకామంత్రరూపం అనేది ఆ పాదాల యందు ఉన్న ప్రకాశమే. ఆ పాదాలే ప్రతివారి సహస్రారకమలంలో ప్రకాశిస్తున్నాయి. వేదకాంతల తలపై సిందూరం అనగా ప్రతివారి శిరస్సుపై సహస్రారకమలంలో ప్రకాశిస్తున్న

వందే గురుపదద్వంద్వం అవాఙ్మానసగోచరం
రక్తశుక్లప్రభామిశ్రం అతర్క్యం త్రైపురం మహః

ఇందులో ఆ 'మహః' అనేదే ధూళిక. ఈ నామంలో గురుపాదుకామంత్ర రహస్యం దాగి ఉంది. పాదుకాంతదీక్షాపరులని మాట ఉంది. ఆ మంత్ర విశేషం ఈ నామంలో దాగి ఉంది. ఇది మంత్రపరంగా తెలుసుకోవలసినది.

ఉపనిషత్తులన్నీ అమ్మనే ప్రతిపాదన చేస్తున్నాయని చెప్పుకున్నాం. ఉదాహరణకు దశోపనిషత్తుల్లో కేనోపనిషత్ అంతా అమ్మవారి తత్త్వాన్నే చెప్తోంది.

'సైషా దేవీ జగదండమసృజత', 'అహం రుద్రేభిర్వసుభిశ్చరామి' అని దేవీఉపనిషత్తులలోని వాక్యాలు.

దేవీ ఉపనిషత్తులో **'నమస్తేస్తు భగవతి మాతరస్మాన్ పాహి సర్వతః సైషాష్టౌవసవః సైషా ఏకాదశరుద్రాః సైషా ద్వాదశాదిత్యాః సైషా విశ్వేదేవాః సోమపాఽసోమపాశ్చ సైషా యాతుధానాఽసురారక్షాగ్ంసిపిశాచా యక్షా సిద్ధాః సైషా సత్త్వరజస్తమాంసి.........శరణ్యాం శివదాం శుభాం'**

అమ్మవారి గురించి ఇలా ఉపనిషత్ చెప్పింది. ఇంకా అరుణోపనిషత్, త్రిపురోపనిషత్, భావనోపనిషత్, బహ్వృచోపనిషత్ – వీటిల్లో చాలా నేరుగా అమ్మవారి

గురించి చెప్పారు. అందులో అమ్మవారి మంత్రాలు దాచి పెట్టారు. ఉపనిషత్ ప్రతిపాద్యమే శ్రీవిద్య అని చెప్పడానికి అమ్మవారి మంత్రాలు **'కామో యోనిః కమలా వజ్రపాణిర్గుహాహసా'** ఇది ఉపనిషత్తులో మంత్రం. ఇందులో ఒకొక్కటి విస్తరించి చెప్పుకుంటే మంత్రోద్ధారణ అవుతుంది. 'కామోయోనిః' – దానిలో కామః అంటే 'క' కారం – అలా మంత్రోద్ధారం జరుగుతుంది. ఇది సరిగ్గా అర్థం చేసుకుంటే 'సర్వోపనిషదుద్ఘుష్టా' మరింత తేలిక అవుతుంది.

'నిజాజ్ఞారూపనిగమా' అంటే వేదాలు చూపించారు. ఈ నామంలో ఉపనిషత్తులు చూపించారు. రెండిటిచే ప్రతిపాదింపబడిన వేదతాత్పర్యమే శ్రీలలిత.

290. సకలాగమసన్దోహశుక్తిసంపుటమౌక్తికా

– శ్రీ సకలాగమసన్దోహశుక్తిసంపుటమౌక్తికాయై నమః

అమ్మవారు ముత్యంలా మెరిసిపోతున్నారు. నిగనిగలాడుతూ నునుపుదనంతో కూడిన అందాన్ని లావణ్యం అనాలి. అమ్మవారు లావణ్యం... ముత్యపు సౌందర్యమే ఆవిడ దగ్గర ఉంది. లోకంలో ఎవరైనా స్వచ్ఛంగా ఉంటే ముత్యంలాంటి వాడండి... రత్నం లాంటి వాడండి... అంటుంటారు. రత్నానికే రత్నం అమ్మవారు. ముత్యం ముత్యపుచిప్పలో దొరుకుతుంది. ఆ ముత్యపుచిప్పలో ముత్యం తయారవడానికి చాలా సమయం పడుతుంది.

అమ్మవారు ఒక ముత్యం అయితే ఆ ముత్యాన్ని మనం ముత్యపుచిప్పలోనే పట్టుకోవాలి. అలా అమ్మ అనే ముత్యము శాస్త్రమనే ముత్యపుచిప్పలో దొరుతుంది. ఏ శాస్త్రం? అన్ని శాస్త్రాలు కలిసిపోయి ఒక ముత్యపుచిప్ప అయితే అందులో ఒక ముత్యం పుట్టింది. ముత్యం పుట్టడం అంటే ముత్యపుచిప్ప చేసుకున్న తపస్సు. ముత్యపుచిప్ప సారం ముత్యం. మనం ముత్యాన్ని తీసుకొని చిప్పని పారేస్తాం. కాబట్టి దీనిలో ప్రధానం ముత్యమే. కానీ చిప్ప లేకపోతే ముత్యం లేదే? శాస్త్రం ఎంతవరకు అంటే మనకి పరతత్త్వం లభించే వరకే. పరతత్త్వం తెలిశాక ఇంక శాస్త్రం గొడవ పట్టించుకోము.

కృష్ణపరమాత్మ గీతలో **'త్రైగుణ్యవిషయా వేదాః నిస్త్రైగుణ్యో భవార్జున'** అంటూ **'యేన త్యజసి తత్ త్యజ'** – "దేనితో దీన్ని విడిచిపెట్టావో దాన్నికూడా విడిచి పెట్టు" అన్నాడు. సకలశాస్త్రాల సారమూ, పరతత్త్వం అమ్మవారే అని చెప్పడం దీని భావం.

ముక్తా, ముక్తి, మౌక్తికా – మూడు ఒకటే అర్థాన్ని ఇస్తాయి. మౌక్తికా అంటే మోక్షావస్థ. ముక్తికి సంబంధించినది మౌక్తికం. ఈ మోక్షం సర్వశాస్త్రములకు సారమైనది. అమ్మవారు మోక్షస్వరూపంగా ఉన్న తురీయభూమికకి చెందిన పరతత్త్వం అని చెప్పడం కోసం 'మౌక్తికా' అనే శబ్దాన్ని చూపించారు.

నిగమం అంటే వేదం. మంత్రశాస్త్రాలకు ఆగమాలు అని పేరు. శైవాగమం, శాక్తేయాగమం, సౌరాగమం – ఇవన్నీ ఆగమాలు. ఉపాసనా పద్ధతులను తెలియజేసే శాస్త్రాలవి. ఆగమము అంటే శాస్త్రము అని అర్థం. ఇందులో ఒక వైపు నిగమం చూపించారు, ఉపనిషత్ చూపించారు. ఆగమం చూపించారు. మన బ్రతుకు బాగుచేయడానికి రెండే గ్రంథాలు. అవి– నిగమం, ఆగమం. ఈ రెండిటిలో ఉండేవి ఏమిటో స్మరించి చెప్పేవి స్మృతులు. వీటిలో ఉన్నవి సామాన్యులకి అందించడం కోసం వచ్చినవి పురాణాలు.

వేదం అంగీకరించిన ఆగమాలు మనకి కావాలి. వేదసమ్మతమైన ఆగమాలు దక్షిణాచారం, వేదవిరుద్ధమైన ఆగమాలు వామాచారం. ముందు వేదాన్ని ప్రతిపాదన చేశారు. వేదాంతాన్ని ప్రతిపాదన చేశారు. ఈ రెండిటిని ఇచ్చే ఆగమం శ్రీవిద్యాగమం. ఇలా సకలాగమం అంటే శాక్తేయ, సౌర ఇత్యాదిగా ఉన్నాయి. అన్ని ఆగమాల సారం ఒకటే పరతత్త్వం. ఆ పరతత్త్వమే అమ్మవారు.

నిగమం అంటే నిర్గమించింది నిగమం. నిర్గమించుట అంటే బయటకి వచ్చుట. సూర్యుని నుండి వెలుగు వచ్చినట్లు పరమాత్మనుండి వేదం వచ్చింది కనుక అది నిగమం.

ఆగమం అంటే ఆగమించినది. అనగా బయటకి వచ్చినది అని అర్థం. 'నితరాం' అన్నప్పుడు నిగమం, 'ఆసమంతాత్' అన్నప్పుడు ఆగమం. నిజానికి రెండూ ఒకటే అర్థం. భావం ఒకటే అయినా తేడా కోసం పదాలు చెప్పారు. ఆగమాలు కూడ ఈశ్వరప్రోక్తాలే.

ఇదే 'చతుష్షష్ట్యా తంత్రైః' అనే సౌందర్యలహరి శ్లోకంలో శంకరభగవత్పాదుల వారు చెప్పారు.

మొత్తం అన్ని ఆగమాలు చెప్పమని అమ్మవారు శివుని ప్రేరేపించారు. పిల్లల బాగుకోసం ఏదైనా చెయ్యండి అని తండ్రిని తల్లి ఏవిధంగా నిరంతరం పోరి, పోరి పిల్లల కోసం మంచి పనులు చేయిస్తుందో అలా, శివుని పోరి పోరి అమ్మవారు ఆయన చేత ఆగమాలు చెప్పించారు. "అయితే చెబుతాను విను" అని ఆవిడకే చెప్పాడు.

మనకి అడగడం కూడా చేతకాదని మన తరపున అమ్మవారు అడిగారు. ఆవిడ పుచ్చుకొని మనకి ఇచ్చింది. మనం తరించడానికి పనికి వచ్చేవి నిగమాలు, ఆగమాలు. ఈ రెండు అమ్మరూపాలే. నిగమాలు అమ్మ ఆజ్ఞారూపాలు. వేదాంతమునందు పరదేవతాతత్త్వమే చెప్పబడింది. అమ్మవారే సమస్త ఆగమాల సారం. ఇలా వేదం - వేదాంతం - ఆగమం... ఈ మూడు శాస్త్రాల సారం పరతత్త్వమైన లలితయేనని మూడునామాలు.

'సకలాగమసందోహశుక్తిసంపుటమౌక్తికా'. ఈ నామం నారాయణభట్టు పాఠంలో అయితే, **'సత్కులాగమసందోహశుక్తిసంపుటమౌక్తికా'** అని వేరే పాఠంగా ఉంది. సకలాగమ కాకుండా 'సత్కులాగమసందోహ'. మనం ఇదివరకు కొన్ని నామాలవలె దీనిని సవరించుకోవచ్చు. సవరించుకోకపోయినా తప్పు లేదు. భావమేమి చెడదు. 'సత్కులాగమ' అన్నప్పుడు ఉత్తమమైన కులం. సంప్రదాయపరంపర, గురుపరంపరకి కులమని పేరు. 'కులామృతైకరసికా' నామం దగ్గర మనం చెప్పుకున్నాం. 'సత్కులా' - చక్కని గురుపరంపరతో వచ్చిన ఆగమాలన్నింటి యందు ప్రతిపాదింపబడిన సారవస్తువు ఈవిడే. ఈ సారవస్తువుని పట్టుకుంటేనే మోక్షం వస్తుంది.

'మౌక్తికా' అనే మాటలో ముక్తిని ధ్వనింపజేశారు. ముక్తిని ఇవ్వడానికి పనికి వస్తోంది. అమ్మతత్త్వం తెలిస్తేనే ముక్తి. సారవస్తువు దొరికేవరకు సాధన చేయమని తెలియజేస్తున్నారు. మనకి చతుర్విధపురుషార్థాలను ఇవ్వడానికి అమ్మవారు

వేదాలు, వేదాంతములు, ఆగమాలు ఏర్పాటు చేసింది. తరువాతి నామం 'పురుషార్థప్రదా'.

291. పురుషార్థప్రదా - శ్రీ పురుషార్థప్రదాయై నమః

పురుషార్థాలను ఇచ్చునది. పురుషార్థాలు నాలుగు. అవి-ధర్మ, అర్థ, కామ, మోక్షములు. ఆశ నాలుగింటి మీద ఉండదు. కేవలం రెండిటి మీదే ఉంటుంది. ధర్మ, మోక్షాల మీద ఉండదు. కొందరు నాకు మోక్షం మీదే ఉందండి అంటారు కానీ అది అంత తేలికగా రాదు. మనకి అర్థకామాలు కూడా కావాలి. కోరికలు లేకపోయినా అవసరాలు ఉంటాయి. బ్రతికి ఉన్నంతకాలం అవసరాలు తీరాలి కదా!

శివుని అమ్మవారు ఒక గొప్పకోరిక కోరుకున్నారు. పిల్లలు బాగుపడడం కోసం ఏదైనా శాస్త్రం ఇమ్మని అడిగితే శివుడు ఆలోచించి ఆరోగ్యానికి ఈ మంత్రం, ఐశ్వరానికి ఈ మంత్రం అని ఇలా బోలెడు మంత్రాలు తయారుచేసి ఇచ్చి, "ఎలా ఉన్నాయ"ని అడిగాడు. "వీటన్నిటి వల్ల పిల్లలకి లౌకికమైన కోరికలు తీరాలి, మోక్షం రావాలి" అంటే "రెండు కుదరదు. ఏదో ఒకటే కుదురుతుంది. భోగం కావాలంటే మోక్షం ఉండదు. మోక్షం ఉంటే భోగం ఉండదు. రెండూ కష్టం" అన్నాడు శివుడు. "కష్టం కనుకే మిమ్మల్ని అడిగాను" అన్నది అమ్మవారు.

"భోగం కావాలంటే వేదం దగ్గరకి వెళ్ళాలి. మోక్షం కావాలంటే వేదాంతం దగ్గిరికి వెళ్ళాలి. రెండూ ఒక్కచోట ఇవ్వడానికి ఏదైనా తయారుచేయమని మిమ్మల్నే అడుగుతున్నాను" అని అమ్మవారంటే "ఏం నువ్వు చేయ్యలేవా!" అన్నాడు శివుడు. "నేను మీతో చేయిస్తాను" అంది అమ్మవారు **'పునస్త్వన్నిర్బంధాత్'** గట్టిగా నిర్బంధించింది. ప్రొద్దున్న లేచిన దగ్గర్నించి చేశారా, చేశారా అని అమ్మవారు ఒకటే గొడవ. అంత నిర్బంధిస్తే ఆఖరికి విసిగిపోయి, "సరే! తయారుచేస్తున్నా"నని వేషం మార్చుకున్నాడు. పూజ చేసేటప్పుడు ఒక వేషం, వంట వండేటప్పుడు ఒక వేషం - అలా భోగం, మోక్షం రెండూ రావడం కోసం శాస్త్రం తయారుచేయడానికి వేషం మార్చుకున్నాడు. అదే దక్షిణామూర్తి స్వరూపం. ఆ రూపంలో శాస్త్రం తయారుచేశాడు.

"ఇదిగో తయారుచేశాను. దీనివల్ల ఇహలోకానికి కావలసిన భుక్తి వస్తుంది. పరమార్థానికి కావలసిన ముక్తి వస్తుంది. అలాంటి శాస్త్రం తయారుచేశాను" అన్నాడు. అమ్మవారు, "అదే నాకు కావలసింది" అంటే, "ఇదంతా నీ గురించే" అన్నాడు. "అవును మనద్దరి గురించే" అన్నది అమ్మవారు. "అఖిలపురుషార్థైక ఘటనా" అంటారు శంకరులు. అదే శ్రీవిద్య.

పురుషార్థప్రదా - ధర్మ, అర్థ, కామ, మోక్షములు. ముందు మూడు లౌకికములు. మోక్షం అనేది పరమార్థం. ఆ నాలుగు ఇవ్వగలిగే విద్యపేరే శ్రీవిద్య. అదే అమ్మరూపం. దానిని తయారు చేయించింది. ఆ రూపంగా మనకి అమ్మవారు 'పురుషార్థప్రదా'. ఆవిడ పురుషార్థాలన్నీ ఇస్తుంది.

ఆరోగ్యార్థేఽ ర్చయేత్ సూర్యం - ధర్మమోక్షాయ మాధవమ్

శివం ధర్మార్థమోక్షాయ చతుర్వర్గాయ చండికామ్

ఆరోగ్యం కోసం సూర్యుని ఆరాధన చేయాలి. ఎన్ని సంపదలున్నా అనుభవించడానికి ఆరోగ్యం ఉండాలి. ధర్మం కోసం, మోక్షం కోసం విష్ణువుని ఆరాధించాలి. ధర్మార్థమోక్షాలకి శివుని ఆరాధించాలి. నాలుగూ కావాలంటే అమ్మవారిని ఆరాధించాలి. ఇలా చెప్పారని శివ, విష్ణువులను తగ్గించారని అనుకోరాదు. అందరూ అమ్మవారి రూపాలే. దీనిని పారమ్యం అంటారు. ఏ శాస్త్రం చదివినప్పుడు ఆ శాస్త్రం మీద నిష్ఠ కలిగించడం కోసం ఇలా తెలియజేస్తారు. నాలుగూ కావాలంటే చండిక అయిన అమ్మవారిని ఆరాధించాలి.

యేఽ ర్చయంతి పరాంశక్తిం విధినావిధినాపి వా

న తే సంసారిణో నూనం ముక్తా ఏవ న సంశయః (బ్రహ్మాండపురాణం)

తెలిసిగాని, తెలియకగాని ఎలాగైనా అమ్మవారిని ఆరాధించడమంటూ మొదలుపెడితే వానిని మరి సంసారి అనకూడదు. ముక్తుడనే అనాలి. వాడు మరి సంసారంలో పడడు. మోక్షాన్ని తప్పకుండా పొందుతాడని అభయం ఇస్తోంది. అందుకే పురుషార్థప్రదా. దానితో జీవుడు పరిపూర్ణుడు అవుతాడు.

292. పూర్ణా – శ్రీ పూర్ణాయై నమః

నిండైనది. ఎక్కడా కొరత లేదు, కొలత లేదు. లోటు లేదు. పరిమితి లేదు. అటువంటి శక్తి అమ్మవారు. పరబ్రహ్మ స్వరూపానికి 'పూర్ణా' అని పేరు.

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదుచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఉపనిషత్తుల్లో ప్రతిపాదింపబడిన గొప్పమంత్రమిది. ఈ మంత్రాన్ని చూసి పాశ్చాత్యమేధావులు కూడా భారతీయ తత్త్వచింతన ముందు మోకరిల్లారు. అక్కడున్నది, ఇక్కడున్నది, ముందున్నది, వెనుక ఉన్నది అంతా కూడా పూర్ణమే. పూర్ణం నుంచి పూర్ణాన్ని తీస్తే పూర్ణమే మిగులుతుంది. కనుక చిట్టచివరికి మిగిలేది కూడా పూర్ణత్వమే.

ముందున్నది పూర్ణత్వమే. నిండుగా నిండి ఉన్నది పూర్ణమైన పరబ్రహ్మతత్త్వమే. ఈ జగత్తంతా పూర్ణంలోని భాగమే. పూర్ణత్వాన్ని ఎవరైతే అర్థం చేసుకుంటారో వారికి కూడా కొరత ఉండదు. వారికి లోటనేదే లేదు. కొందరు జీవితంలో ఎప్పుడూ ఏదో ఒక లోటును భావిస్తూనే ఉంటారు. ఎన్ని ఉన్నా, ఏదో లేదు అనుకుంటూ ఉంటారు. అలాంటివారికి ఏదో లేదని పరుగుపెట్టడంతోనే జీవితమంతా అయిపోతుంది. **'ఉన్నసుఖమ్ములు చూడకనే లేకున్నవాటికి ఉరకలు వేతుము'** – అదే మన జీవితవైఖరి అంతా. అన్ని ఉంటాయి కానీ ఏదో లేదు అనుకుంటారు.

అమ్మవారి దీక్ష నిష్ఠగా చేస్తే పూర్ణదీక్షాపరులు అని వ్యవహారంలో అంటారు. పూర్ణదీక్ష అంటే బ్రహ్మవిద్యపరంగా అన్వయించడమే. శ్రీవిద్య పూర్ణవిద్య. పూర్ణవిద్య అనగా బ్రహ్మవిద్య.

293. భోగినీ – శ్రీ భోగిన్యై నమః

ఇహలోక పరలోక సుఖాలు భోగములు. ఆ భోగాలన్నీ ఆవిడ స్వరూపాలే. తినే అన్నంలో ఆవిడ శక్తిగా ఉంటే కానీ మనకు శక్తి లేదు. భోగాలన్నీ ఆవిడ రూపాలే అని తెలిసి ఏవైనా భోగించాలి. భోగము అనగా పదార్థాలు కావు –

ఆనందం అని అర్థం. ఆనందమే భోగం. ఆనందానుభవం. భోగిని అంటే ఆనంద అనుభవస్వరూపిణి.

'పూర్ణా' 'భోగినీ' – మోక్షం, లోక సుఖం రెండూ ఇస్తున్నది. రెండు రూపాలైనది అని అర్థం చెప్పుకోవచ్చు. మోక్షమూ, భోగమూ కూడా పరాశక్తి ప్రసాదమే. తరువాత నామం 'భువనేశ్వరీ'.

294. భువనేశ్వరీ – శ్రీ భువనేశ్వర్యై నమః

దశమహావిద్యలలో పదియవ విద్య 'భువనేశ్వరీ విద్య'. ఈ నామం నుండి భువనేశ్వరీవిద్యా విషయాలు చెప్తున్నారు. భువనేశ్వరీవిద్య ఒక పెద్ద మంత్రశాస్త్రం. దీనిని గురుముఖతః గ్రహించవలసినదే. భువనేశ్వరి – నిజానికి ఒకే బీజాక్షరం. ఇది పరమవిద్య. మోక్షవిద్య. దేవీభాగవతంలో భువనేశ్వరినే ప్రథమశక్తిగా తెలియజేశారు. మణిద్వీపవాసిని భువనేశ్వరి. అవిడనే లలితా అన్నప్పుడు శ్రీమన్నగరనాయికా. లలితావిద్యలో భువనేశ్వరీ బీజం మూడుసార్లు వస్తుంది. చేసేవారికి తెలుస్తుంది. ప్రతి కూటమిలో చివర వచ్చేది భువనేశ్వరీ బీజమే. మూడు కూటాల్లో మూడు భువనేశ్వరీ బీజాలు పెట్టారు. భువనేశ్వరీ బీజమే త్రిపుర అయ్యింది. భువనేశ్వరీయే రాజరాజేశ్వరీ. శ్రీవిద్యకి, భువనేశ్వరీవిద్యకి భేదం లేదు.

భువనాలకు ఈశ్వరి. భువనం– భవనము రెండు ఒకటే భావం.

'భవనాత్ భావనాత్ చైవ' – భవః భవనం భువనం – ఉండుట, కలుగుట, కలిగించుట, ఉంచుట. ఈ ప్రపంచములన్నీ వ్యవహారములో ఉన్నాయి. ఇవన్నీ భువనములు. మొత్తం చతుర్దశ భువనాలు ఉన్నాయి. అట్టడుగు లోకం నుండి పైలోకం వరకు వెళ్తే బ్రహ్మలోకం వరకు వెళ్ళాలి. అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళ వరకు వచ్చాము. అవి క్రిందవి. పైన – భూలోక, భువర్లోక, సువర్లోక, మహాలోక, జనోలోక, తపోలోక, సత్యలోకములు మొత్తం చతుర్దశ భువనములు. ఇన్ని భువనాలకు ఒక్కరే నాయకురాలు – భువనేశ్వరి.

శివేన సహితాం దేవీం భావయేత్ భువనేశ్వరీం

ఈ తల్లిని కూడా శివ సహితంగా భావించవలసినదే. భువనేశ్వరీ రూపం ఒకసారి ధ్యానించుకుందాం. వరద అభయ హస్తములు, పాశము, అంకుశము ధరించి ఉంటుంది. ప్రధానంగా ఇది స్వరూపం. పైన పాశాంకుశం. ఈ పాశాంకుశాలే లలితమ్మకు కూడా ఉన్నాయి. చెరుకు విల్లు, పువ్వుల బాణాలు అధికంగా ఉన్నాయి. దానితో అక్షరాలు ఎక్కువ పెరిగాయి.

చెరుకువిల్లు, పువ్వుల బాణాలు చేతిలో పట్టుకుంది కనుక లలితాదేవికి వరద, అభయ హస్తాలకి అవకాశం లేదు. మరి వరద, అభయ హస్తాలు ఏమయిపోయాయి? "నీ పాదాలే వరద అభయ హస్తాలమ్మా!" అన్నారు శంకరభగవత్పాదులవారు.

శరణ్యే లోకానాం తవహి చరణావేవ నిపుణౌ

చరణం అంటే క్రింది భాగము. చరణావేవ - ఒకొక్క కూటమిలో చివరి భాగం. అదే భువనేశ్వరీ శక్తిని ఇస్తున్నది అని శంకరభగవత్పాదులవారు సౌందర్యలహరిలో తెలియజేశారు.

మనలో భీరుత్వాన్ని పోగొట్టేది శక్తి ఒకటే. భీరుత్వము - పిరికితనము. అజ్ఞానం వలన కలిగేదంతా భీరుత్వము. దానిని పోగొట్టే తల్లి పేరు భైరవి. అజ్ఞాననాశిని భైరవి. జ్ఞానస్వరూపిణి పార్వతి. భైరవి, పార్వతి రెండు శక్తులు భువనేశ్వరీ బీజం యొక్క స్వరూపాలు.

'పార్వతీ, పద్మనయనా' దగ్గర మొదలై 'భానుమండలమధ్యస్థా, భైరవీ, భగమాలినీ' - ఆ రెండిటి సమన్వయం భువనేశ్వరీ నామం వద్ద తెలియజేస్తున్నారు. ఆ భువనేశ్వరిని ప్రాతఃకాలములో భైరవి అనే నామంతో ఆరాధన చేయాలి. సాయంకాలంలో పార్వతీ నామంతో ఆరాధన చేయాలి.

ప్రొద్దున లేచామంటే బోలెడు పనులు పెట్టుకున్నామని అర్థం. ఆ పనులు భయం లేకుండా ఉండాలి గనుక భైరవి. సాయంత్రం అయ్యేటప్పటికల్లా శాంతి. అది పార్వతి. ప్రాతఃకాల భైరవి, సాయంకాల పార్వతి రెండూ భువనేశ్వరి యొక్క స్వరూపములు అని శాస్త్రం చెప్తున్న రహస్య విషయము.

భువనేశ్వరి ఎందుకు అయింది?

భువనానందనాథస్య ప్రసన్నత్వాత్ మహేశ్వరీ

భువనేశత్వ విఖ్యాతా శాంభవీ భువనేశ్వరీ

శివుని పేరు భువనానందనాథుడు. శ్రీవిద్యా సంప్రదాయంలో గురువులని 'ఆనందనాథ' అనే సంప్రదాయంతో సంబోధించడం కనబడుతుంది. శ్రీవిద్యలో రెండు రకాల సంప్రదాయాలు. ఒక సంప్రదాయానికి దక్షిణామూర్తి గురువు. ఇంకొక సంప్రదాయానికి ఆనందభైరవుడు గురువు. అమ్మవారి ఆరాధన చేసేటపుడు

శ్రీగురో దక్షిణామూర్తే భక్తానుగ్రహకారక,

అనుజ్ఞాం దేహి భగవన్ శ్రీ చక్రార్చనాయ మే.

అతిక్రూర మహాకాయ కల్పాంతదహనోపమ,

భైరవాయ నమస్తుభ్యం అనుజ్ఞాం దాతుమర్హసి.

అది ఆనంద భైరవ విద్య. భైరవ, దక్షిణామూర్తుల ప్రతిపాదన మనకి కనబడుతోంది. **మహాభైరవపూజితా** – సాక్షాత్ శివుడే గురువు. ఆనందనాథ గురు సంప్రదాయమైనప్పుడు శివుడు మనకి ఆదిగురువు. కనుక ఆయన పేరు 'భువనానందనాథ'. అదే 'శివాయ గురవే నమః' లేదా 'సదాశివ సమారంభాం' అంటాం. భువనానందనాథుని శక్తి గనుక 'భువనేశ్వరీ' అయ్యింది.

భువనములయందు ఆనందముగా ఆయనే ఉన్నాడు. నాథుడుగా కూడా ఆయనే ఉన్నాడు. ఆనందము ఆయనే, నాయకుడు ఆయనే. ఇంకొక రహస్యం – ఒక్కటే బీజాక్షరము ఉంది. అందులోనే మూడు అక్షరాలు ఉన్నాయి. ఆ బీజాక్షరంలో ఉన్న అక్షరాలు మూడు. చివరికి నాదం.

మొట్టమొదటిది 'ఏకాక్షరేపి'. చూడడానికి ఒక్క అక్షరముగా ఉన్నా మొత్తం నాలుగు శక్తులు అందులో కలసిపోయాయి. నాలుగు శక్తులు సామాన్యం కాదు. దక్షిణామూర్తి సంహిత అనే గ్రంథంలో భువనేశ్వరీ బీజంలో ఉన్న రహస్యాన్ని చూపించారు.

'ఏకాక్షరేఽపి దేవేశి సంత్యత్ర భువనానితి'. ఒక్క అక్షరంగా ఆ బీజాక్షరం మనకి కనబడుతున్నది. కానీ సమస్త భువనములు అందులో ఉన్నాయి. అందుకని

ఆ బీజాక్షరం అంటున్నప్పుడు ఆనందంగా అనాలి. 'హ్రీంకారీ – హ్రీమతీ' అక్కడే చెప్పారు బీజాక్షరం. ఆ బీజాక్షరంలో సర్వభువనములు ఉన్నాయి. గురోపదేశరహితంగా చెయ్యరాదు ఆ బీజాక్షరం. అందులో సమస్త భువనములు ఉన్నాయి. కనుకనే భువనేశ్వరీ బీజము.

బీజాక్షరాలు ఎక్కువగా ప్రకటించకూడదు. కొన్నేమో ఆ మంత్రం చూపించాలి, కొన్ని మేలి ముసుగులాగ చూపించాలి, కొన్ని సంకేతంగా చూపించాలి. ఇవన్నీ ప్రవచనా నియమావళి. శాస్త్రాన్ని ప్రవచనం చేసేటప్పుడు అనేక నియమాలు ఉంటాయి. అది గురు సంప్రదాయబద్ధములు. సంప్రదాయబద్ధంగా కూర్చుని చెప్తున్న వచనములివి.

వ్యోమబీజే మహేశాని కైలాసాది ప్రతిష్ఠితం

మొట్టమొదటి బీజం 'హ'కారం. అది ఆకాశబీజం, ఇంకా సూక్ష్మ భూమికలలోకి పరిశీలిస్తే, ఆ ఆకాశ బీజంలో 'ఓం' చెప్పబడింది. **పరమే వ్యోమన్** – 'హ' ఆకాశబీజం. అక్కడ ఉన్నది మహాకైలాసము. బ్రహ్మలోకానికి పైన ఉన్న మహాకైలాసంతో సంబంధం పెట్టారు. మహాకైలాసం అంటే మణిద్వీపం అని అనుకున్నా తప్పు లేదు. అక్కడ మహా కైలాసం. ఇంకా క్రిందకి వెళ్తుంటే 'ఈ' కారం వాయులోకం. ఇలా అన్ని లోకములు చెప్పి చిట్టచివరి వరకు సమస్త భువనములు దాని లోపలే చూపెట్టారు. సమస్త భువనములలో వ్యాపించిన ఒక మహాశక్తిని ఒక్క బీజాక్షరంలో పెడితే అది భువనేశ్వరీ బీజం.

భువనేశ్వరీ అనే మాటలో సమస్త భువనాలకి తల్లి అన్న నామము అన్నప్పుడే భక్తులకి అది చాలు. బీజాక్షరం లేదు అని బాధ పడనక్కరలేదు. భక్తి లేని వానికి బీజాక్షరమిచ్చినా మంత్రసిద్ధి వస్తుంది కానీ అమ్మ అనుగ్రహం రాదు. మనకి కావలసినది మంత్రసిద్ధికంటే గొప్పది అమ్మ అనుగ్రహం. అమ్మ అనుగ్రహం కావాలి అంటే అమ్మ నామం ప్రేమగా అనుకుంటే చాలు. మంత్రాలు ఎక్కడ దొరుకుతాయా అని వెతకనక్కరలేదు. ఇదే మంత్రరాశిగా జాగ్రత్తగా చేసుకుంటే అమ్మయే అనుగ్రహిస్తుంది. ఈ నామమే మహామంత్రం.

295. అంబికా - శ్రీ అంబికాయై నమః

అంబ - కారణము, పోషకము. కారణాలకి కూడా కారణం కాబట్టి అంబిక.

అమ్మల గన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ
చాల పెద్దమ్మ సురారులమ్మ కడుపారడి పుచ్చెడి యమ్మ
తన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ
దుర్గ మాయమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్

అంబిక - అమ్మలగన్న యమ్మ. అంబలు అంటే ముగ్గురే ప్రధానంగా. వారు- దుర్గ, లక్ష్మీ, సరస్వతి. మూడు రూపములతో ఉన్న అమ్మ. అమ్మవారికి **'క్లుప్త ప్రీతికర నామము'** అని ఈ నామానికి పేరు.

అంబిక నామానికి ఉన్న శక్తి అంతా ఇంతా కాదు. ఏది తెలిసినా, తెలియకపోయినా 'అమ్మా!' అని అనడం చాలు. అమ్మా అన్నా, అంబా అన్నా భేదమేమి లేదు. తెలుగువాడు అమ్మ అన్నాడు. దీనికి అంబ అన్నమాట సంస్కృత మూలం. ఏదయినా అమ్మకి అర్థం అయిపోతుంది. అమ్మ, అంబ అన్నప్పుడు మనలోపల విచ్చుకునే శక్తులు ఏవో ఉన్నాయి.

అంబికా కైతవే సిద్ధే నిద్రాయాం నిశి కీర్త్యతే

సిద్ధిని, నిద్రని, రాత్రిని అంబికా అంటారు. దీనినే నానార్థాలు అంటారు. విశ్వకోశంలో చెప్పిన మాట. ఇందులో ఏ అర్థం తీసుకోవాలి అంటే నాలుగూ తీసుకోవచ్చు... తీసుకోవాలి.

ఆవిడే నిద్రారూపిణి

యాదేవీ సర్వభూతేషు నిద్రారూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః

...ఈ నిద్ర సామాన్యము కాదు.

స్తౌమి నిద్రాం భగవతీం విష్ణోరతులతేజసాం
విశ్వేశ్వరీం జగద్ధాత్రీం స్థితిసంహారకారిణీం

పరమాత్మ యందు యోగనిద్రగా ఉన్న తల్లి పేరు అంబిక. సృష్టికి పూర్వం ఉన్న తల్లిని అంబిక అంటారు. అంబిక అంటే ఆ అర్థం తీసుకోవాలి. రాత్రి అంబిక. **"రాత్రీం ప్రపద్యే"**. సప్తశతిలో రాత్రిసూక్తం ఉంది. వేదాలలోని రాత్రిసూక్తం పారాయణ చేస్తే కొంతకాలానికి అమ్మవారు కనబడి, "నీకేం కావాలి" అని అడుగుతుంది. లోకాలన్నీ చూపిస్తుంది. ఆ లోక సుఖాలలో ఏది కావాలంటే అది ఎంచుకోమంటుంది. **'రాత్రిరూపా మహాదేవీ దివారూపో మహేశ్వరః'** (స్కాన్దపురాణం) – రాత్రి రూపిణి మహాదేవి – దివారూపుడు మహేశ్వరుడు.

తెలివైనవాడైతే "ఈ లోకాలు ఏవీ అక్కరలేదు, అమ్మా, లోకాతీతమైన నీ పరమపదం కావాలి" అంటాడు. అది రాత్రిదేవి అనుగ్రహం. రాత్రిసూక్తం సామవేదంలో, ఋగ్వేదంలో చెప్పబడుతున్నది. భవ్యమయినది. ఇదే సప్తశతిలో ప్రథమ చరిత్రం. ఆ రాత్రిసూక్తమునందు ప్రతిపాదింపబడుతున్న తల్లియే అంబిక.

అలాగే – సిద్ధియే అంబిక. ఏ పని కావాలన్నా కావలసినది సిద్ధియే కదా! అంబిక అంటే సిద్ధి తప్పకుండా లభిస్తుంది.

'ఆబ్రహ్మకీటజననీ' అని మొదలు పెట్టి **'భువనేశ్వరీ, అంబికా'** అని రెండు నామాలలో ఆ నామాన్ని అందంగా సర్ది పెట్టారు. అక్కడ 'జననీ'కి – అంబిక అని, 'ఆబ్రహ్మకీట' అనేది భువనేశ్వరిలో చూపించారు.

తతోఽమ్బికాం పరంరూపం బిభ్రాణాం సుమనోహరామ్ (దేవీమాహాత్మ్యం)

అమ్మవారి అంబికా నామములు అనేక చోట్ల పురాణాలలో వివరించారు. అందమైన సర్వోత్కృష్ట స్త్రీరూపంలో ఉన్న తల్లి అంబిక.

296. అనాదినిధనా – శ్రీ అనాదినిధనాయై నమః

ప్రపంచానికి ఆది ఆవిడ. మరి ఆవిడకి ఏది ఆది? భువనాలకైతే ఆది-నిధనం ఉన్నాయి గాని భువనేశ్వరికి లేవు. అంటే భువనాలతోపాటు వచ్చి, భువనాలతోపాటు పోయేది కాదు. భువనాలకి ముందు ఉంది. భువనాలు ఉన్నప్పుడు ఉంది. భువనాలు పోయినా ఆవిడ ఉంటుంది. **ఆది**–మొదలు, **నిధనం**–అంతం

ఆవిడకి లేవు. అన్ని భువనాలకి అధీశ్వరీ. ప్రతి భువనంలో సృష్టి, స్థితి, లయలు జరిగేటప్పుడు వాటికి సంబంధించిన దేవతలందరు అమ్మవారిని ఆరాధన చేస్తారు.

ప్రతి భువనానికి బ్రహ్మవిష్ణురుద్రులున్నారు. వారందరూ వచ్చి భువనేశ్వరిని కొలుచుకోవలసిందే. తరువాతి నామం 'హరిబ్రహ్మేంద్రసేవితా'.

297. హరిబ్రహ్మేంద్రసేవితా - శ్రీ హరిబ్రహ్మేంద్రసేవితాయై నమః

హరిచేత, బ్రహ్మచేత, ఇంద్రునిచేత సేవింపబడుతున్న తల్లి. ఇక్కడ భువనేశ్వరీ ఉన్న మణిద్వీపంలోకి మనం ప్రవేశించవచ్చు. ఆ భవ్యమైన శ్రీమన్నగరంలో 18, 17 ప్రాకారాల మధ్యలో విష్ణువు, విష్ణుపరివారాలన్నీ ఉంటాయి. 16, 17 ప్రాకారాలలో బ్రహ్మదేవుడు ఉంటాడు. 14, 15 ప్రాకారాల మధ్యలో ఇంద్రుడు, ఇంద్రశక్తులన్నీ ఉంటాయి. ఆ ప్రాకారాలలో ఉండి, వారు అమ్మవారిని ఆరాధన చేస్తూ ఉంటారు. హరి, బ్రహ్మ, ఇంద్ర సేవితా అని ఆయా ప్రాకారాలను మనం భావన చేసుకోవచ్చు.

బ్రహ్మావిష్ణుస్తథా శంభుర్వాసవో వరుణో యమః
వాయురగ్నిః కుబేరశ్చ త్వష్టా పూషాశ్వినౌ భగః
ఆదిత్యో వసవో రుద్రాః విశ్వేదేవా మరుద్గణాః
సర్వే ధ్యాయంతి తాం దేవీం సృష్టిస్థిత్యంతకారిణీమ్

బ్రహ్మ, విష్ణువు, శంభుడు, ఇంద్రుడు, వరుణుడు, యముడు, వాయువు, అగ్ని, కుబేరుడు, త్వష్టా, పూషా, అశ్వినులు, భగుడు, ఆదిత్యుడు, వసువులు, రుద్రులు, విశ్వేదేవులు, మరుద్గణములు... వీరంతా సృష్టిస్థితిలయకారిణియైన దేవిని ధ్యానిస్తున్నారు (దేవీభాగవతం).

298. నారాయణీ - శ్రీ నారాయణ్యై నమః

'నారాయణీ' నామం చాలా దివ్యమహామంత్రం. కనుకనే దేవీసూక్తం 'నారాయణి నమోస్తుతే' అని పలుమార్లు చెప్పింది. పుంలింగంలో 'నారాయణః'. స్త్రీలింగంలో నారాయణీ. శివా, శర్వాణీ, శాంకరీ, 'నారాయణీ', వైష్ణవీ, బ్రాహ్మీ,

ఐంద్రీ, కౌమారీ - ఇలా సర్వదేవతల శక్తి అమ్మవారే. కనుక సర్వదేవతాత్మిక. 'నారాయణీ' పరబ్రహ్మ పేరు. నారాయణః అంటే ఏమిటో నారాయణీ అన్నా అదే అర్థం. విష్ణువే వైష్ణవి. లలితమ్మ అయినా, విష్ణువైనా ఒకటే తత్త్వం అనే తెలివి ఉండాలి. 'నారాయణీ' అనేది మహామంత్రం.

ఆర్తాః విషణ్ణాః శిథిలాశ్చ భీతాః ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః
సంకీర్త్య నారాయణ శబ్దమాత్రం విముక్తదుఃఖాః సుఖినో భవంతు

శుంభ, నిశుంభల సంహారం తరువాత అమ్మవారిని స్తుతిస్తూ దేవతలు చేసినది.

సర్వమంగళమాంగళ్యే శివేసర్వార్థసాధికే
శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోస్తుతే

నారాయణ శబ్దానికి ఉన్న అర్థాలన్నీ గొప్ప అర్థములే.

నరః ఆత్మా తతో జాతాన్యాకాశాదీని నారాణి కార్యాణి - తాని కార్యాణి
అయం కారణాత్మనా వ్యాప్నోతి - అతశ్చ తా న్యయన మస్యేతి నారాయణః

ఇది వైదిక అర్థం. నరుడు అంటే పరమాత్మ, నరః నామం విష్ణుసహస్రంలో వస్తుంది. నరుడు– సాగువాడు, వ్యాపించువాడు అని అర్థం. పరమాత్మకే 'నర' అని నామం. అలాంటి పరమాత్మ పనులన్నీ నారములు. నర సంబంధమైనవి నారములు. పరమాత్మ పనులు అంటే కార్యములు. సృష్టి, స్థితి, లయలు ఇవన్నీ నారములు. వీటి యందు కారణంగా వ్యాపించిన పరబ్రహ్మ నారాయణుడు. నారమైన పరమాత్మ యొక్క కార్యముల యందు కారణమున్నది. కారణమైన మట్టి కార్యమైన కుండలో వ్యాపించినట్లుగా కారణమైన పరమాత్మ శక్తి కార్యమైన ప్రపంచంలో వ్యాపించిపోయింది.

'నరాజ్జాతాని తత్త్వాని నారాణీతి విదుర్బుధాః, తాన్యేవ చాయనం తస్య తేన నారాయణః స్మృతః' (మహాభారతం). **'నయతీతి నరః'** – నరుడైన (నడిపించువాడు) పరమాత్మ నుండి జనించిన కార్యములు (జగత్తులు) నారములు. వాటియందు వ్యాపించి, ఆశ్రయమైనవాడు నారాయణుడు లేదా నారాయణి.

ముందు ప్రపంచాన్ని చూస్తున్నాం కనుక ప్రపంచంలో వ్యాపించిపోయినవాడు ఆయనే అనేది తెలుసుకోవడానికి 'నారాయణ'. యతి అయినవారు ఆశీర్వాదాలు చేయకూడదని యతి సంప్రదాయంలో ఒక నిర్దేశం చేశారు. మనం వెళ్ళి ఆయనకి దండం పెట్టినా ఆయన దృష్టిలో అది దండం కాదు. వారి పని ఒక్కటే - నారాయణస్మృతి. గృహస్థు 'ఆయుష్మాన్ భవ', 'కల్యాణమస్తు' అని ఆశీర్వదించవచ్చు. సన్యాసిగాని కల్యాణమస్తు అని అంటే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. గౌడపాదాచార్యులవారు మాండుక్యకారికలో 'నిరాశీః నిర్నమస్కారః'. వారు ఆశీర్వదించరు. నమస్కరించరు అని తెలియజేశారు.

బ్రాహ్మీస్థితిలో సర్వం బ్రహ్మమయం అయినప్పుడు ఆశీర్వచనం, నమస్కారం ఉండవు. పరమాత్మ సర్వకార్యాల్లో నాలో, నీలో అంతటా ఒక్కటే. ఆ ఒక్కటైన బ్రహ్మమే ఏకమని చెప్తున్నారు. నారాయణీ అని అన్నా ఇదే అర్థం. కార్యరూపమైన జగత్తు యందు కారణమైన చైతన్యమే నారాయణీ. ఇది మొదటి భావన.

రెండవ అర్థం- నరుడు అంటే మానవుడు, సాగువాడు. **'నృణాతి గచ్ఛతీతి నరః'** - జీవులందరూ నరులే. వీరు సాగిపోతూనే ఉన్నారు. ప్రపంచంలో జీవులందరి పేరు నరులు. జీవుల సమూహం పేరు నారం. జీవులందరికి అయనంగా, ఆధారంగా ఉన్నది నారాయణీ. సర్వజీవులకి ఆశ్రయశక్తి.

సృష్టికి పూర్వస్థితిలో జగమంతా జలమయం. ఈ జలమయస్థితికి నారం అని పేరు. అంతా నశించిపోయినా నశించకుండా ఆవిడ ఉంది. నారము-నీరము రెండూ ఒక్కటే. అలాంటి ప్రళయకాల జలస్థితి యందు ఉన్నవారు నారాయణీ, నారాయణ. ప్రళయకాల జలములందు వటపత్రం మీద తేలియాడుతూ కనబడే స్వామివారిని నారాయణ అంటారు. ఆవిడే అమ్మవారు.

'ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపోవై నరసూనవః అయనం తస్యతా యస్మాత్ తేన నారాయణః స్మృతః' - ఇదంతా ఒక్క మంత్రంతో వేదం చెప్పింది.

యచ్చకించిత్ జగత్సర్వం దృశ్యతే శ్రూయతేపివా

అంతర్బహిశ్చతత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః

ఈ మాటే ఇక్కడ నారాయణీ. ప్రపంచ పాలనశక్తి.

శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణే

సర్వస్యార్తి హరే దేవి నారాయణి నమోస్తుతే

ఆశ్రయశక్తి కనుకనే నారాయణి అనగానే విష్ణువు, అమ్మవారు. కూర్మపురాణంలో **"అహం నారాయణో గౌరీ జగన్మాతా సనాతనీ విభజ్య సంస్థితో దేవస్స్వాత్మానం పరమేశ్వరః। న మే విదుః పరం తత్త్వం దేవాద్యా న మహర్షయః, ఏకోஉహం వేద విశ్వాత్మా భవానీ విష్ణురేవ చ"** శివుడు చెప్పాడు. "అహం నారాయణః – నేను నారాయణుడను, నేనే గౌరి, జగన్మాత, సనాతనీ. నా శక్తిని రెండు రూపాలు చేశాను. పురుషరూపం విష్ణువు, స్త్రీరూపం అమ్మవారు" అని చెప్పాడు. ఇదే లలితోపాఖ్యానంలో ఉన్న విషయం.

'ఆద్యాశక్తిర్మహేశస్య చతుర్ధా భిన్న విగ్రహా..... పుంరూపాచ మదాత్మికా' – అని విష్ణువు చెప్తున్నాడు. శివుని స్వరూపమే నారాయణ, నారాయణీ. లలితోపాసన అంటే విష్ణూపాసనే.

నారాయణీ అనే నామంలో నారాయణ, నారాయణీ ఇద్దరూ స్ఫురింపబడుతున్నారు. ఇద్దరూ శివుని యొక్క స్వరూపమేనని తెలియబడుతున్నారు. ఆ శివజ్యోతికి, నారాయణికి నమస్కరించుకుందాం.

సారాంశంగా –

సమస్త భువనములకు ఈశ్వరీ అయిన అమ్మవారి స్వరూపమే (భువనేశ్వరియే) నారాయణీ. నారము అనగా జీవకోటి అంతటికి ఆధారముగా, ఆశ్రయముగా ఉన్న శక్తి. నరుడు అనగా పరమాత్మ, ఆయన కార్యములు నారములు. ఈ సృష్టి అంతా నారము. దీనియందు అంతర్యామిగా వ్యాపించిన శక్తి నారాయణి. సృష్టి పూర్వము జలమయమైనస్థితిలో ఉన్న తల్లి, శాశ్వతీమాత అయిన జగదంబ – నారాయణీ.

299. నాదరూపా - శ్రీ నాదరూపాయై నమః

అమ్మవారు నాదస్వరూపిణి. పరమాత్మ తన శక్తితో వ్యక్తమవుతున్నప్పుడు ప్రథమ వ్యక్తీకరణ నాదము. సృష్టికి ఆది అయిన ఆ నాద స్వరూపమును ప్రకాశ, విమర్శ అని రెండుగా చెప్పవచ్చు.

శివ స్వరూపము ప్రకాశము, అమ్మ స్వరూపము విమర్శ. శక్తి విమర్శ, ఈశ్వరుడు ప్రకాశము. ఈ శక్తులనే 'రక్తశుక్లప్రభామిశ్రం' అని భావన చేస్తున్నాము. విమర్శరూపిణిగా ఈశ్వరుని శక్తి ప్రకాశించినప్పుడు ముందుగా ప్రకాశ వస్తువైన పరమాత్మ బిందువుగా వ్యక్తమై, తరువాత నాదముగా అభివ్యక్తి అవుతున్నాడు.

నాదమే సమస్త సృష్టికి మూలముగా ఉండి ఈ సృష్టి అంతా వ్యాపించి ఉన్నది. నారాయణీకి, నాదరూపాకీ రెండిటికి అనుబంధం చూస్తే సృష్టి అంతా పరమాత్మ నాదరూపంగా వ్యాపించి ఉన్నాడు. చైతన్యము ఎక్కడ ఉంటుందో అక్కడ నాదము ఉంటుంది కనుకనే చైతన్యముతోనే నాదమును పట్టుకోవాలి. ఉపాసన అనగానే మొట్టమొదట గురువులు మంత్రమే ఇస్తారు. ఎందుకంటే నాదముతోనే ఆ చైతన్యమును పట్టుకోగలము.

చైతన్యమైన పరమాత్మను పట్టుకోవడానికి ఆలంబన నాదము. మంత్రము ఇచ్చారంటే నాదము ఇచ్చినట్లే. వేదాంత విచారణలో కూడా మహావాక్యములు ఉపదేశిస్తారు. అవి కూడా నాదములే. ప్రధానంగా నాదమే చైతన్యము యొక్క ప్రథమ అభివ్యక్తి గనుక నాదంతోనే మనం మళ్ళీ చైతన్యంలోకి వెళ్ళగలం.

శంకరభగవత్పాదులవారు బ్రహ్మవిద్యకు సంబంధించిన యోగాలు గురించి మాట్లాడుతూ 'హఠయోగ' ఇత్యాది యోగములు బ్రహ్మవిద్యకు సరిపోవని ఆయన అంగీకరించలేదు. నాదయోగాన్ని మాత్రమే అంగీకరించి, 'ప్రబోధసుధాకరము'లో నాదయోగము, నాదానుసంధానము చాలా విశేషముగా సాధకునికి చాలా ప్రధానమైనవి అని వివరించారు.

అమ్మవారు ముందు నాదరూపముగా వ్యక్తమై తరువాత జగద్రూపంగా వ్యక్తమయ్యారు. ఏ దేవతైనా మంత్ర చైతన్యమే. మంత్రములనగా అక్షరములే.

అక్షరములన్నీ నాదాత్మకములే. నాదము అక్షరములుగా, స్వరరూపములుగా వచ్చింది. నాదరూపంగా చూస్తే చెవికి వినబడేదానిని శబ్దము అంటాం. ఇది నాదము యొక్క స్వరూపమే.

చెవికి కొన్ని పరిమితులు ఉన్నాయి. చెవికి వినబడేదే నాదము కాదు. వినబడనివి కూడా కొన్ని నాదములున్నాయి. వినబడే శబ్దాన్ని దాటిపోయాక కూడా సూక్ష్మమైన నాద దశలు ఉన్నాయి. సూక్ష్మనాద దశలే ప్రథమనాదం. అక్కడ నుండే వ్యక్తనాదం వచ్చింది.

అక్షరములకు, స్వరములకు మొదటి నాదము 'ఓంకారం'. 'ఓంకారం' కూడా శ్రవణానికి వినబడుతున్నది కనుక దీనికంటె పైన ఇంకొకటి ఉన్నది. వ్యక్తమైన నాదం 'ఓంకారం'. అది వ్యక్తం కాని దశ ఇంకొకటి ఉన్నది. బీజదశలో వృక్షం వ్యక్తం కాదు. మొలకదశ, వృక్షదశ వ్యక్తమవుతున్నవి. ఓంకారం కూడా వ్యక్తమే. దీని వెనకాల చాలా సూక్ష్మమైన నాదములు చాలా ఉన్నాయి.

'న'కారం ప్రాణనామేనం 'ద'కారం అనలం విదుః

ఈ మాటనే తీసుకుని త్యాగరాజస్వామివారు, **"ప్రాణానల సంయోగముచే ప్రణవ నాదము సప్తస్వరములైఁ బరగె"** అన్నారు.

'న'కారం ప్రాణవాయువును, 'ద'కారం అగ్నిని తెలియజేస్తుంది. మనలోపల ఈ వాయువు, అగ్ని – ఈ రెండిటియొక్క కలయికచేత నాదం ఉత్పన్నం జరిగి అది క్రమక్రమంగా శబ్దంగా వినబడుతుంది.

ప్రతివారిలోనూ ప్రాణము, తేజస్సు – ఈ రెండిటి యొక్క స్వరూపం నాదరూపంలో ఉంటుంది. చైతన్యం లేకుండా నాదము ఉండదు. అందుకే చైతన్యం ఉందా, లేదా అని చెప్పడానికి నాడి పట్టుకుంటారు. కనుక జీవి యొక్క చైతన్యము, ప్రాణము నాదమయమే.

నాదము యొక్క వ్యక్తీకరణ అక్షరము, స్వరము అనుకుంటే దాని కూర్పు పదము, దాని కూర్పు వాక్యము, దాని కూర్పు శాస్త్రము, కావ్యము. అక్షరం, స్వరం – అనే రెండు రకాలుగా నాదము ప్రపంచమంతా ఉంటుంది. మానవునికి మాత్రం

స్వర–అక్షరాత్మకం, మిగిలిన జగత్తు అంతా స్వరాత్మకం.

నాదం లేని చోటు లేదు. నాదంబట్టే మనం కనబడే వస్తువులను పోల్చుకోగలం. నీరు ప్రవహిస్తున్నది, గాలి వీచుతున్నది అంటే నాదము ఉంది. ఇలా ప్రతీ అంశములోనూ నాదము ఉంది. మనం చెవి వినగలిగే శక్తితో వింటున్నాం గానీ, ఇంకా సూక్ష్మమైన శక్తిగలిగిన యంత్రములు గానీ దగ్గర పెట్టుకుంటే మనం చెవితో వినలేని నాదములు కూడా వినగలం.

యంత్ర సహాయం లేకుండా లోపల మన యొక్క ప్రజ్ఞను సాధనతో పెంచగలిగితే ఇంకా సూక్ష్మనాదములు వినగలం. ఈ సూక్ష్మనాదం గానీ వినగలిగితే ఆ సిద్ధులు చాలా విశేషంగా చెప్పారు - త్యాగరాజస్వామి వారు **'మూలాధారజనాదమెరుగుటె ముదమగు మోక్షమురా'** అన్నారు. లోపల మూలాధారగత నాదం వినగలిగితే అదే మోక్షం.

ప్రాణ ప్రయాణ సమయం వచ్చినప్పుడు నాదం వినబడదు. ప్రాణనాదం వినబడలేదంటే ఇంకొంత కాలమునకు మరణించినట్లే అని కంసునికి అవసాన దశ వచ్చినపుడు వర్ణిస్తారు. చెవి మూసుకున్నప్పుడు శంఖం లోపల నాదం ఎలా ఉంటుందో అలా మన లోపల ఒక నాదం ఉంటుంది. అది ప్రాణశక్తిని తెలియజేస్తుంది.

నాదవిద్య లేనిదే మోక్షవిద్య, పరమాత్మ దొరకదని **'శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరబ్రహ్మాధి గచ్ఛతి'** అన్నారు. శబ్దబ్రహ్మములో నిష్ణాతుడు పరబ్రహ్మను పొందుతాడు. శబ్దబ్రహ్మమంటే నాదము - వేదము.

నిశ్శబ్దమైన ప్రాంతములో ఉండగలిగితే లోపల నాదం వినగలం. ఇలా వినగలిగితే ఎన్ని రకాల సిద్ధులు వస్తాయో 'శివపురాణం'లో విశేషంగా శబ్దవిద్య ఉపాసనగా వివరించారు. ప్రాతఃకాలం బ్రాహ్మీముహూర్తకాలంలో మౌనంగా కూర్చుని చెవులని మూసి లోపల నాదమును వినడానికి ప్రయత్నం కొంతకాలం చెయ్యగా, దివ్యశబ్దములు ఒక స్థాయిలో వినబడతాయి. ఇవి ఎలా ఉంటాయో అంటే బయటకు చెప్పకూడదు. గురుశిక్షణలో తెలుసుకోవలసినదే. ఇలా వినబడితే ఒకొక్క దశ వచ్చేటప్పటికి జీవునికి కొన్ని సిద్ధులు వస్తాయి. కేవలం నాదంతో చెయ్యవలసిన

సాధనలు ఉన్నాయి. ఆ సిద్ధులలో ఒక నాదం వినబడేటప్పటికి - ఖేచర సిద్ధి - గగనమార్గంలో సంచరించగలరు. ఒక నాదం వినగలిగినప్పుడు సూక్ష్మలోక దర్శనం అవుతుంది. ఇక్కడ ఈ శరీరంతో ఉంటూనే ఇతర లోకాలలో సంచరించగలిగే శక్తి కూడా శబ్ద బ్రహ్మోపాసన వలన వస్తుంది. ఆ శబ్దములు చిమచిమారావ, కిణికిణిరావ - ఇలాంటివి చాలా చెప్పారు. మనం లోపల ఉన్న నాదం యొక్క విన్యాసాలు చూడగలిగితే చాలా అద్భుతమైన స్థితి. త్యాగరాజస్వామివారు నాదోపాసకులు. విశేషమేమిటంటే ఎంత నాదమైనా సృష్టిలో స్వరాలతోనే ఉంటుంది. సృష్టిలో ఏ శబ్దం వినబడినా దానికొక స్వరం ఉన్నది. దానినొక పద్ధతిలో కూర్చితే సంగీతం అవుతుంది. స్వరం ప్రతీచోటా ఉంది. అక్షరాలు వేరు. ఇవి మానవులే పలుకగలరు. మిగిలిన చోట్ల స్వరాలున్నాయి.

ప్రకృతిలో ఒకొక్కదాని నుండి ఒకొక్క స్వరాన్ని తీసుకున్నారు. ఎన్ని స్వరములైనా ప్రధానంగా 'ఏడే'. సప్తస్వరములే. ఈ సప్తస్వరములకి, మన లోపల ఉన్న ఆరు చక్రములు, పైన ఉన్న సహస్రారమునకు సంబంధం ఉంది. ఆదివారం నుండి శనివారం వరకు గల ఏడు రోజులకు కూడా సంబంధం ఉన్నది. అదే విధంగా దీనికి సప్తవర్ణములకు సంబంధం ఉంది. ఇలా చూస్తే సప్తస్వరములకు ఏదో విశేషం ఉంది. ఈ సప్తస్వరవిద్య వేదములోంచి వచ్చింది. నాదం-వేదం-స్వరం. స్వరములు సంగీతము పాడుకోవడానికి మాత్రమే కాదు. మంత్రస్వరూపములు అని భావించి సంగీతం సాధన చేస్తే ఆ సంగీతం మోక్షాన్ని ఇస్తుంది. పాటలు పాడి రజింపచేసుకుంటే వినోదవిద్య అవుతుంది. దానిని నాదవిద్యగా చేయగలిగితే మోక్షం పొందవచ్చు. దానిని ఆ భావంతో చూడగలిగితే అది భక్తి అవుతుంది. అప్పుడు వాడు ముక్తిని పొందగలడని **"సంగీతజ్ఞానము భక్తి వినా సన్మార్గము కలదే మనసా"** అన్నారు. నాదప్రస్తార విషయంలో భావన చేస్తూ ఉంటే ఆ పరమాత్మ అనుభూతిని పొందగలరు.

ఒకొక్క స్వరమునకు ఒకొక్క అధిదేవత ఉంటారు. వీరికి వారములకు సంబంధం ఉన్నది. ఒక వారంనాడు ఒక అధిదేవతను ఉపాసన చేసి, ఆ స్వరమును ఉపాసిస్తే ఆ స్వరదేవత అనుగ్రహిస్తుంది. స్వరదేవత అనుగ్రహిస్తే సంగీతముతో

నాదోపాసన చేసి పరతత్త్వాన్ని పొందగలడు. ఇలా ఆయా రోజులకు ఏఏ స్వరాధిదేవతలు ఉంటారో, వారికి ఉపాసన పద్ధతి ఉంది. దీనిని నాదోపాసన అంటారు. ఇది చేసినవారు త్యాగరాజస్వామివారు. సంగీత ప్రపంచంలో తాన్‌సేన్, ముత్తుస్వామి దీక్షితులవారు ఇలా గొప్ప సిద్ధపురుషులు, మహాత్ములు ఉన్నారు. త్యాగరాజస్వామివారు సాధనను చూపించారు. **"నాభి, హృత్, కంఠ, రసన, నాసాదులయందు శోభిల్లు సప్తస్వర సుందరుల భజించవే మనసా"**. ఇది సామాన్యం కాదు. అందుకే **"సదాశివమయమగు నాదోంకార స్వర విదులు"** అంటారాయన. నాదం అనగానే వీరికి శివస్వరూపం గోచరించింది.

దూర్వాసమహాముని నాదోపాస విద్యను 'పరశంభుమహిమ్నః స్తుతి'లో చాలా విస్తారంగా వివరించారు. నాదోపాసనకు, శ్రీవిద్యకి సంబంధం ఉంది. ప్రతి మంత్రంలోను ఒక నాదం ఉంది. మంత్రంతో క్రమంగా అందులో ఉన్న అక్షరాలకి కూడా ఆధారమైన నాదాన్ని పట్టుకుంటే మన లోపల నినదిస్తున్న అనాహత ప్రాణనాదాన్ని వినగలం. బయట శంఖ, మృదంగ, వీణా నాదాలలో వినబడేది ఆహతనాదం.

వేదశిరోమాతృజ సప్తస్వర
నాదాచలదీప! స్వీకృత
యాదవకుల మురళీవాదన
వినోద మోహనకర
త్యాగరాజ వందనీయ! సామజవరగమన!

మాతృకావర్ణ ప్రధానమైన యాభై అక్షరములు అమ్మవారి రూపములే. సృష్టిలో ఏ భాష మాట్లాడినా ఈ యాభై అక్షరములే. హంఫట్ అని హలంతం మాట్లాడినా, రామ, కృష్ణా అని అజంతం మాట్లాడినా యాభై అక్షరములే. ఈ అక్షరములు, సప్తస్వరములు 'ప్రణవం' నుండి విచ్చుకున్నాయి.

సప్తస్వరములకు, మనలోని సప్తచక్రములకి అన్నింటికి ఆధారమైన నాదమునకు సంబంధం ఉంది. ఇది తెలుసుకుంటూ సప్తధామములకి పై చోటికి



వెళ్తే నాదాంతమైన అమృతమైన పరతత్త్వాన్ని పొందుతాం. నాదములో ఇన్ని రహస్యములున్నాయి.

నాదతనుమనిశం శంకరం నమామి మే మనసా శిరసా

మోదకర నిగమోత్తమ సామ వేదసారం వారంవారం

సద్యోజాతాది పంచవక్త్రజ సరిగమపదనీ వరసప్తస్వర

విద్యాలోలం, విదళితకాలం విమలహృదయ త్యాగరాజపాలం

ఇది ఎవరికి తెలుసునంటే త్యాగరాజునకు ఎరుకే. **"న్యాయాన్యాయము తెలుసును జగములు మాయామయమని తెలుసును"**, అని చెప్పి **"దుర్గుణ కాయజాది షడ్రిపుల జయించే కార్యము తెలుసును త్యాగరాజునకే సంగీతజ్ఞానము భక్తి వినా".**

ఈ నాదస్థానం మన శరీరంలో ఎక్కడ పట్టుకోగలం?

పైన స్వరాదుల ద్వారా క్రమక్రమంగా మాతృకావర్ణముల ద్వారా ఒకొక్క చక్రములో మాతృకావర్ణములు న్యాసం చేసుకుంటాం. మూలాధారం దగ్గర నాలుగు అక్షరములు, స్వాధిష్ఠానం దగ్గర ఆరు అక్షరములు, మణిపూరం దగ్గర పది అక్షరములు, అనాహతం దగ్గర పన్నెండు, విశుద్ధిస్థానం దగ్గర పదహారు, సహస్రారం దగ్గర రెండు అక్షరములు మొత్తం కలిపి యాభై అక్షరములు. వీటిని సాధన చేస్తే వ్యక్తనాదం వినబడుతుంది. దానికి పైన ఉన్న సూక్ష్మనాదములు వినబడవు. స్థూలం కన్నా సూక్ష్మంలోని శక్తి ఎక్కువ ఉంటుంది.

స్థూలంలోంచి సూక్ష్మంలోకి వెళ్ళాలి. అనగా విగ్రహం నుంచి యంత్రంలోనికి, యంత్రం నుంచి మంత్రంలోంచి తత్త్వంలోకి వెళ్ళాలి. అక్షరములు స్థూలములు. వీటి నుండి సూక్ష్మమైన నాదంలోకి వెళ్ళాలి. హ్రీంకారాదులకు బిందువుపైన ఎనిమిది స్థానములున్నాయి.

రోధిన్యాఖ్యాం యదుక్తం తే నాదః తస్యోర్ధ్వ సంయుతః

పద్మకింజల్కసంకాశః సూర్యకోటి సమప్రభః

పురైః పరివృతో సంఖ్యైః

ఆజ్ఞాచక్రం దాటాక ప్రతిచోటా ఒక ప్రమాణంలో లెక్కపెట్టుకుంటూ వెళ్తే

ఎనిమిది స్థానములకు సహస్రారం వస్తుంది. దానిలో మొట్టమొదట అర్ధచంద్ర, తరువాత రోధిని, దాని తరువాత నాద, నాదాంత, శక్తి, వ్యాపిక, సమని, ఉన్మని (ఉన్మని అంటే మనోన్మనీ) నాద అంటే మూడవస్థానం ఫాలభాగంలో. అక్కడ సూర్యకోటి కాంతులతో అమ్మ ప్రకాశిస్తూ ఉంటుంది.

ఏ విధంగా పద్మముల యొక్క కేసరములు రకరకాల వర్ణములుగా, కిరణాలుగా భాసిస్తూ ఉంటాయో అలాంటి కిరణములతో శివునితో సహా అక్కడ ప్రకాశిస్తుంది. నాదం అందరిలో ప్రణవరూపంలో సూక్ష్మంగా ధ్వనిస్తూ వ్యాపించి ఉంది. కాబట్టి ఆ భాగంలో ధ్యానం చేయాలి.

'నారాయణ సమామ్నాయ విద్య' అని ఉంది. అనగా 'అకారాది 'క్ష'కారాంత అక్షరములు'.

నారాయణీ అంటే మాతృకావర్ణరూపిణీ. దానికి మూలమైనది నాదరూపా.

నాదాఖ్యా సర్వభూతేషు జీవరూపేణ సంస్థితా
అనాదినిధనా ఏవ సూక్ష్మావాగనపాయినీ

– చైతన్యరూపంగా, జీవరూపంగా ఉన్నది. అది అనాధినిధనా. వీదని సూక్ష్మవాక్కు. అది ఈ ధ్వనులుగా వినలేము. గ్రంథిభేదన విద్యలో ఆజ్ఞాచక్రం వరకు బ్రహ్మగ్రంథి, విష్ణుగ్రంథి, రుద్రగ్రంథి (అ–ఉ–మ). వీని నుండి సహస్రారం వరకు ఎనిమిది (రోధిన్యాదులు). మొత్తం పదకొండు. వీరినే నాదస్వరూపమైన ఏకాదశ రుద్రులు అంటారు. వీటిని సూక్ష్మచక్రములు అంటారు.

నాదాంతమునకు వెళ్ళే సరికి సహస్రారకమలం నుండి అమృతస్రావం లభిస్తుంది. నాదాంతమునందు అమృతరూప అనుభవంలోకి వస్తారు కనుక **రుతం** అంటే నాదం. **రుదంతే** – నాదాంతమునందు, 'ద్రవతి ద్రావయతి' – అనగా ద్రవరూపంలో ఆనందానుభవ రూపంగా ఉన్నవాడు రుద్రుడు. **'నాదాంతే (రుదంతే) అమృతరూపేణ ద్రవతి ద్రావయతి ఇతి రుద్రః'**– ఈ రహస్యం తెలిసిన త్యాగరాజస్వామి వారు "నాదతనుమనిశం శంకరం" అన్నారు.

నాదానుసన్ధాన! నమోస్తు తుభ్యం
త్వాం సాధనం తత్త్వపదస్య జానే
భవత్ ప్రసాదాత్ పవనేన సాకం
విలీయతే విష్ణుపదే మనో మే (ఆదిశంకర – యోగతారావళి)

'నాదానుసంధానమా! నీకు నమస్కారం. ఏలనంటే, నిన్ను తత్త్వపదానికి సాధనంగా గ్రహించాను. నీ అనుగ్రహాన నా మనస్సు ప్రాణంతో కలిసి విష్ణుపదం(బ్రహ్మమునందు) లో విలీనమవుతుంది.'

300. నామరూపవివర్జితా – శ్రీ నామరూపవివర్జితాయై నమః

నామం లేదని అమ్మవారికి ఒక నామం. నామం, రూపం లోకంలో వ్యవహారమే. వ్యవహార ప్రపంచం నామరూపం, పరమార్థం నామరూప వివర్జితా. ఏ నామం నామరూప రహిత స్థితికి తీసుకువెళ్తుందో ఆ నామాన్ని ఉపాసించాలి. మనమందరం నామరూప ఉపాసకులమే.

నామరూప ప్రపంచం వల్ల మనకు మోహం, రాగం, ద్వేషం, జన్మ పరంపరలు ఉన్నాయి. దీని వల్ల మోక్షం రాదు. మరి ఎలాగంటే ఏ నామం, ఏ రూపం పట్టుకుంటే నామరూప రహిత స్థితికి వెళ్తామో ఆ నామాన్ని, ఆ రూపాన్ని పట్టుకోమని శాస్త్రం చెప్పింది. మన నామరూపములు గౌణములు (వ్యవహార కల్పితములు), పరమాత్మ రూపములు తత్త్వసంకేతములు. దివ్యములు.

వ్యవహార ప్రపంచంలో ఉన్న నామరూపములు అమ్మవారికి లేవు. ఉదాహరణకి పాలు అనే వస్తువుకు పేరు, రూపం వినియోగ దశలోనికి వెళ్ళే సరికి శక్తిగా మారింది. దీనికి నామం లేదు, రూపం లేదు. నామరూపములలో శక్తి ఉండవచ్చుగానీ, శక్తికి నామరూపాలు లేవు. కాబట్టి నామరూప ప్రపంచంలో వ్యాపించి ఉన్న అమ్మవారికి నామరూపములు లేవు.

"ఆకాశో"హ"వై నామరూపయోర్నిర్వహితా తే యదంతరా తద్బ్రహ్మ" అని ఛాందోగ్యం. 'ఆకాశమే నామరూపాలను నిర్వహించుచున్నదని, ఆ రెండునూ లేని

స్వరూపమే బ్రహ్మము' అధిష్ఠానమైన బ్రహ్మము నామరూపవివర్జితము.

వేదాంతం బ్రహ్మం గురించి చెప్పాలంటే –

అస్తి భాతి ప్రియం నామం రూపంచేత్యంశ పంచకం

ఆద్యత్రయం బ్రహ్మరూపం జగద్రూపం తతోద్వయం

అస్తి, భాతి, ప్రియం, నామం, రూపం. ఇందులో చివరి రెండు (నామరూపాలు) ప్రపంచ విషయాలు; మిగిలినవి పరమాత్మ విషయం. ఈ ఐదు కలసి ఉన్నా నామం, రూపం కనిపించినట్లు మిగిలిన మూడు కనిపించవు. నామరూపమైన ప్రపంచమునందు పరమాత్మ అస్తి, భాతి, ప్రియంగా వ్యాపించి ఉన్నాడు. ఇది తెలియాలంటే నామరూపాలు విడిచి సాధన చేయాలి.

అస్తి అంటే(ఉండునది) శాశ్వతమైన ఉనికి. దీనికే సత్ అని పేరు. చైతన్య వస్తువు. ప్రకాశిస్తూ ఉన్నది. అందుకే భాతి. దీనికే చిత్ అని పేరు. ఇక ప్రియం – ఆనందం. సత్, చిత్, ఆనందం అంటే ఏమిటో అస్తి, భాతి, ప్రియం అంటే అదే. నామరూపాలతో అస్తి–భాతి–ప్రియములను పట్టుకోవాలి. అదే 'నామరూపవివర్జితా'. అస్తి, భాతి, ప్రియం, నామం, రూపం – ఈ ఐదు కలిపి ప్రపంచం, వీనిని చిటికెన వేలు నుండి లెక్కపెట్టి నామం, రూపములను తీసేస్తే అదే చిన్ముద్ర.

స్వాత్మానం ప్రకటీ కరోతి భజతాం

యో ముద్రయా భద్రయా తస్మై

శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే

మన లోపల ఆత్మ అనబడే వస్తువు నామము, రూపము కాదు. ఈ రెండూ పరిహరిస్తే దాని స్వరూపమే అస్తి, భాతి, ప్రియం అని కేవలం చిన్ముద్రతో చూపించాడు పరమేశ్వరుడు. సచ్చిదానంద వస్తువు ఆత్మ. నామరూపాలు ఉపాధి. ఉపాధిలోనున్న ఆత్మ నామరూపవివర్జిత. అదే స్వస్వరూపం.

హ్రీంకారీ హ్రీమతీ హృద్యా హేయోపాదేయవర్జితా

301. హ్రీంకారీ – శ్రీ హ్రీంకార్యై నమః

నామరూపాలు కలిగినది సృష్టి అని చెప్పుకున్నాం. నామరూప వివర్జిత సృష్టికి అతీతం. ఆ అమ్మవారి నుండి నామరూపాత్మకమైన జగత్తు వచ్చింది. ఏది రావాలన్నా ఆకాశం నుండి రావాలి. నామరూప రహితమైన స్థితి ఆకాశం. ఆకాశం కంటె సూక్ష్మమైన స్థితి ఒకటి ఉన్నది.

ఆత్మనః ఆకాశః సంభూతః–ఆకాశాత్ వాయుః

నామరూపవివర్జితా దగ్గర నుండి నామరూపాత్మకమైన ప్రపంచం వరకు అమ్మవారే వ్యాపించి ఉన్నారు. 'భువనేశ్వరీ' నామం దగ్గర నుండి భువనాలన్ని చూపిస్తూ భువనాలన్నింటిలో ఈశ్వరిగా ఉన్నది మాత్రము 'సత్ చిత్ ఆనందమే' – అని నిరూపించారు. మనం భువనాలను చూస్తున్నాం గానీ ఈశ్వరిని చూడడం లేదు. ఈశ్వర స్వరూపమైన సచ్చిదానందమును పట్టుకోవాలి. 'ఈశ్వరీ' నామరూపవివర్జిత అని ప్రతిపాదింపబడింది. ఆమెతో సహా భువనాలన్నీ కలిపి ఆవిడ స్వరూపంగా చూడాలి.

కుండతో సహా మట్టిని ఎలా చూస్తామో అలాగే భువనాలతో సహా భువనేశ్వరీని చూడాలి. భక్తునికి భువనాలు భువనేశ్వరీమయంగా అనిపిస్తే, సామాన్యులకు మాత్రం భువనాలుగానే అనిపిస్తాయి. భువనేశ్వరీ అంటే భువనాలలో ఉన్న ఈశ్వరిని పట్టుకోవడానికి ప్రయత్నం చేయడం. పధ్నాలుగు భువనాలలో ఎక్కడెక్కడ ఈశ్వరీ ఉందో పరిశీలించాలి.

పాదంలో 'అతలం' మొదలై అతల, వితల, సుతల, రసాతల నుండి 'భూః' వద్ద ఆధారస్థానం వచ్చింది. అక్కడ నుండి భువః, మహః, జనః, తపః అని మొత్తం ఏడు లోకాలు వచ్చాయి. ఇవి సప్తభూమికలే. క్రింది సప్త, పై సప్తభూమికలు కలిపి చతుర్దశ భువనములు.

ఈ చతుర్దశ భువనములలో వ్యాపించి ఉన్న ఈశ్వరిని గ్రహించాలి. ఆ భువనములను మన శరీరమే అనుకుంటే కేంద్రస్థానమైన హృదయంలో అమ్మవారిని ధ్యానించాలి.

ఆ తల్లిని పట్టుకోవాలంటే పనికొచ్చే బీజం 'హ్రీంకారీ'. 'హ్రీం' కారమే అమ్మ బీజము. 'శ్రీమాతా, శ్రీ మహారాజ్ఞీ, శ్రీమద్వాగ్భవకూటైకా' నామాలలో 'శ్రీం' బీజం కలిపారు. ఇక్కడ భువనేశ్వరీదేవి బీజమైన 'హ్రీం' కారమును చెప్పారు. మొత్తం ఈ లలితా సహస్రంలో మూడు బీజములు నేరుగా చెప్పారు. మొదట 'శ్రీ', ఇక్కడ 'హ్రీం' చెప్పారు, తరువాత 'క్లీం' వస్తోంది. ఈ మూడు ప్రధాన బీజములే కాకుండా లలితాసహస్రంలో రహస్య బీజములు చాలా ఉన్నాయి.

'హ్రీం'కారీ– 'హ్రీం'కారము అమ్మ యొక్క రూపం. శబ్దాలను అక్షరాలు చేసి, అక్షరాలను పదాలు చేస్తేగానీ మనకు అర్థంకాదు. శబ్ద ప్రకంపనలో అర్థాలున్నాయి. ఆ అర్థం మనకి అర్థం కాకపోయినా కావల్సిన అర్థం ఇస్తుంది (అర్థం అంటే ప్రయోజనం అనే మరొక అర్థం ఉంది).

'హ్రీం', 'ఓం', అని రెండు ఉన్నాయి. ఓం బ్రహ్మమును తెలియజేస్తుంది. హ్రీం శక్తిని తెలియజేస్తుంది. కనుక దీనిని భువనేశ్వరీ బీజం అన్నారు. బ్రహ్మము ఓంకారం. ఓంకారమైన బ్రహ్మం ఎప్పుడు చెప్పారో అప్పుడు బ్రహ్మశక్తిని చెప్తారు. ఉదాహరణకి జ్యోతిని చెప్తే వెలుగును చెప్పినట్లే కదా! బ్రహ్మమును చెప్తే శక్తిని కూడా చెప్పినట్లే.

ఓంకారంలో బ్రహ్మమును శక్తితో కలిపి తెలుసుకుంటాం. 'హ్రీం'కారంలో శక్తిని బ్రహ్మముతో కలిపి తెలుసుకుంటాం. అంతే తేడా.

ఓంకారంలో అకార, ఉకార, మకారములు ఉన్నాయి. 'హ్రీం' కారంలో హకార, రకార, ఈం కారములు ఉన్నాయి. పంచదశిలో ఒకొక్క అక్షరానికి ఇరవై చొప్పున మొత్తం మూడువందల అమ్మవారి నామాలు త్రిశతిలో వస్తాయి. అందులో 'హ్రీం'కార బీజమునకు ప్రధానంగా నామాలు వస్తాయి.

త్రిశతిలో ఒకొక్క అక్షరమునకు కొన్ని నామాలు శివుడు, కొన్ని నామాలు శక్తి చెప్పారు. కానీ 'హ్రీం'కారంతో వచ్చే నామాలని ఇద్దరూ కలిపి చెప్పారు. ఎందుకంటే హ్రీంకారం ఉభయాత్మకం. **'శక్త్యక్షరాణి సర్వాణి హ్రీంకారం ఉభయాత్మకం'** అన్నారు. హ్రీంకారం శివశక్తులరూపం. అందుకే **'హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ'** అన్నప్పుడు

వేదంలో హ్రీంకార, శ్రీంకారములు రెండూ చెప్పారు. ఈ రెండూ ఓంకారస్వరూపుడైన బ్రహ్మమునకు పత్నీస్థానములలో ఉన్నాయి. ఆయన శక్తులే హ్రీంకార, శ్రీంకారాలుగా వచ్చాయని వేదమే చెప్పింది.

'నాదరూపా' నామానికి, ఈ నామానికి కూడా సంబంధం ఉన్నది. నాదానికి ప్రధానమైన సామవేదంలో 'హ్రీం'కారమే గొప్పశక్తి అన్నారు. 'హిం'కు రకారం కలిస్తే గొప్పశక్తి. **'పృథ్వీ హింకారం, ఆదిత్యుడు హింకారం, ద్యౌః హింకారం, ప్రజాపతి హింకారం, ఉద్యత్ హింకారం, మనో హింకారం, సర్వం హింకారం'** అని సామవేదంలో ఒక భాగం కనబడుతుంది.

పరమాత్మశక్తి చిచ్ఛక్తిగా వ్యాపించింది. దీనికి ఏ రూపం చూపించలేరు. కేవలం శక్తిగా వ్యాపించిపోయింది. శక్తిగా వ్యాపించిపోతే పరమాత్మను ఆకాశం అంటారు. **'ఆత్మనః ఆకాశః సంభూతః'** అన్నట్లుగా వ్యాపించిన ఆకాశంలో సమస్త సృష్టి జరిగింది.

ఆకాశంలో ఏ చిచ్ఛక్తి వ్యాపించిందో, ఆ శక్తే గ్రహాలు, నక్షత్రాలు, లోకాలు అన్ని రూపాలుగా వ్యక్తమయింది. పురాణాలు చెప్పే చతుర్దశ భువనాలు, విజ్ఞానశాస్త్రంలోని జ్యోతిర్మండలాలు మొదలైనవి కూడా ఆకాశంలోనివే కదా. అందులోంచి అన్నీ వ్యక్తం అవుతున్నాయి. మొట్టమొదటిది 'హ' అనే ఆకాశ బీజం. దాని తరువాత 'ఈ' అనే వాయు బీజం వచ్చింది. మూడోది 'ర'కారం తేజోబీజం. ఆకాశంలో దాగిన చిచ్ఛక్తి తత్త్వమంతా 'హ్రీం' అనే బీజంలో ఉన్నది. ఆకాశంలో దాగిన తేజస్సు, వాయువు – ఈ రెండూ వ్యాపించి మిగతా భూత సృష్టి జరిగిందని తెలుసుకోవాలి. ప్రధానంగా ఈ మూడూ భూతపరంగా కనబడుతున్నాయి. ఈశ్వరశక్తిని ఈ మూడిటి ద్వారా తెలుసుకుంటున్నాం.

మనలో ఆకాశం హృదయస్థానం, వాయువు ప్రాణస్థానం, తేజస్సు (అగ్ని) చిచ్ఛక్తి యొక్క ప్రధాన స్థానం. వీటిని పట్టుకుంటూ వెళ్ళడమే సాధన. కుండలినీ స్థానం కూడా అగ్నియే. అందుకే **'ప్రాణానల సంయోగముచే...'** అని త్యాగయ్య అన్నారు.

హ్రీంకారాన్ని సాధన చేసే విషయములు దేవీభాగవతములో కూడా చాలా వివరించారు. స్థూల, సూక్ష్మ, కారణములనే మూడు శరీరములున్నాయి. పైన తురీయం అనే చైతన్యం ఉన్నది. ఈ నాలుగు కలిపి చూస్తే భువనాలయందు ఉన్న ఈశ్వరీ తేజం తెలుస్తుంది.

హకారో స్థూలదేహస్యాత్ రకారో సూక్ష్మదేహకః
ఈకారః కారణాత్మాసౌ హ్రీంకారోఽహం తురీయకమ్

హకారం స్థూలదేహాన్ని, రకారం సూక్ష్మదేహాన్ని, ఈకారం కారణదేహాన్ని తెలియజేస్తాయి. హ్రీం ఆ మూడింటిని తెలియజేస్తూ మూడింటి పైన ఉన్న తురీయాన్ని అందిస్తుంది.

హ్రీంకారం అనేది మన శరీరంలో ఉన్న స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలలో ఉన్న ఈశ్వర తేజాన్ని తెలియజేయడానికి పనిచేస్తూనే క్రమక్రమంగా దీనికి అతీతమైన శక్తిని కూడా అందిస్తున్నది. భువనాధ్యక్షురాలైన అమ్మవారిని ఈ బీజం ద్వారా ఉపాసన చేస్తే భువనములలో ప్రతిది మనకు అనుకూలమవుతుంది. అందుకే హ్రీంకారోపాసన చాలా విశేషంగా చెప్తున్నారు.

ఇంకోచోట హ్రీంకార అర్థాన్ని చెప్తూ సత్, చిత్, ఆనందస్వరూపాలే దీనిలో ఉన్నాయని చెప్పారు.

సత్ స్వరూపస్సదాకారో హకారో ధర్మతత్పరః
చిదాకారశ్శివాకారో రేఫస్సర్వార్థ సిద్ధిదః
ఆనంద రూపయోరైక్యాత్ ఈకారః సర్వకామదః
బిందురూపో తదంత స్థో భవేతాం మోక్షదాయినౌ
సచ్చిదానందరూపం తత్ ప్రోక్తం బీజం మనీషిభిః
సచ్చిదానందరూపం యత్పరం బ్రహ్మ తదేవహి

సత్‌ని తెలియజేసేది హకారము. దీని ఉపాసన వల్ల ధర్మ పురుషార్థం సిద్ధిస్తుంది. చిత్‌ని (అగ్నిని) తెలియజేస్తున్నది రేఫః (రకారం). దీని ఉపాసన వల్ల సంపద వస్తుంది, అన్ని అర్థాలు సిద్ధిస్తాయి. ఈంకారం కామము(కోరికలు)లను తీరుస్తుంది.

హకారం ధర్మపురుషార్థాన్ని, రకారం అర్థపురుషార్థాన్ని, ఈకారం కామపురుషార్థాన్ని ఇస్తోంది. హకారం సత్‌ని, రకారం చిత్‌ని, ఈకారం ఆనందాన్ని తెలియజేస్తుంది. కోరిక తీరితేనే కదా ఆనందం. భౌతికంగా ధర్మ, అర్థ, కామాలని చూస్తున్నాం. భౌతిక ప్రయోజనములు, పారమార్థిక ప్రయోజనములు రెండూ ఉన్నాయి. భౌతికంగా ధర్మ, అర్థ, కామాలు, పారమార్థికంగా సత్, చిత్, ఆనందాలు.

మరి మోక్షం? **బిందురూపో తదంతస్థో భవేతాం మోక్షదాయినౌ**

హ, ర, ఈ చెప్పాక 'మ్' అనేది మోక్షదాయిని అన్నారు. చతుర్విధ పురుషార్థాలు ఇవ్వగలిగే శక్తి 'హ్రీం'లో ఉన్నది. ఈ బీజాక్షరం ఉంటే అమ్మవారి విద్య వచ్చినట్లే. అది పరిపూర్ణమయిన బీజం అవుతున్నది. ఇది భువనేశ్వరీ బీజం. 'హ్రీంకారీ' – అని ఈ బీజాక్షర స్వరూపంగా అమ్మవారిని చూపిస్తున్నారు. హకారం ఆకాశంతో మొదలయి అక్కడనుంచి వచ్చిన ఈ స్వరూపాన్నంతటిని చెబుతుంది.

ఆకాశమే నామరూపములను నిర్వహిస్తున్నది. అలాగే మన రూపాన్ని, మన నామాన్ని నిర్వహిస్తున్నది కూడా మన లోపల ఆకాశమే. మన లోపలైతే దహరాకాశము, బయటైతే మహాకాశము, రెండిటికి ఆధారమయితే చిదాకాశము. ఆకాశాన్ని పట్టుకోవాలి. అమ్మవారు ఆకాశ విద్య. అప్పయ్యదీక్షితులవారు **'ఆకాశమాదిజననీం శరణం ప్రపద్యే'** అన్నారు. ఆదిజనని అయిన ఆకాశానికి నమస్కారము. అన్ని భూతములను ఆకాశంలోనే చూస్తున్నాము. ఆకాశం అన్ని భూతాలను సృష్టిస్తోంది.

ఆకాశమంటే శూన్యము కాదు. చిచ్ఛక్తితో వ్యాపించింది ఆకాశము. ఆకాశమంటేనే శక్తి సంభరితం. అమ్మవారి ఉపాసన అంటేనే ఆకాశోపాసన పంచభూతాల్లో ఒకొక్కటి లయం చేసుకుంటూ వెళితే ఆకాశం పైన ఉన్నది ఆత్మవస్తువేగా.

ఆకాశం దాకా వెళ్ళామంటే ఆత్మవస్తువుకి దగ్గరగా వెళ్ళినట్లే. ఆకాశం యొక్క గుణం శబ్దము. శబ్దం అంటే నాదమేగా. నాదరూప – హ్రీంకారీ కలపండి. నామరూపవివర్జిత అయిన చిదాకాశంలో నాదరూపంగా అమ్మవారు వ్యక్తమై తరువాత

జగద్రూపమయిన నామరూపాలను సృష్టించింది. నామరూపమైన ప్రపంచంలో నామరూపవివర్జిత అయిన తల్లి నాదరూపంగా వ్యాపించి హ్రీంకారీగా ధ్వనిస్తున్నది. ఎంత అందమైన అన్వయం. 'హ్రీంకారీ' అనగా ఇంత విషయం ఉంది.

ఆకాశోహవై నామరూపయోర్ నిర్వహితా
తే యదన్తరా తద్బ్రహ్మ తదమృతం సా ఆత్మా
చిచ్ఛక్తిరూప ఆకాశ ఏవ
నామరూపయోర్ నిర్వాహక తదుభయం వినా
యదధిష్ఠానమాత్రం అవశిష్యతే తదేవ బ్రహ్మేతి (భాష్యం)

నామ రూపములను నిర్వహించునది ఆకాశం. నామ రూపాలు తీసేస్తే మిగిలినది చిదాకాశం. అదే చిదంబరం. అక్కడ చిచ్ఛక్తి వ్యాపించి ఉన్నది. ఈ విషయం అంతా ఛాందోగ్యంలో చెప్పబడుతున్నది. ఛాందోగ్యం సామవేదంలోనిది. అందులోనే 'తత్త్వమసి' మహావాక్యం వస్తుంది. అలాంటి ఛాందోగ్యపనిషత్తులో చెప్పబడ్డ రహస్యమంతా ఇక్కడ వివరించి చూపిస్తున్నారు. బీజాక్షరాలని ఊరికే జదుల్లా చేసెయ్యకుండా ఇప్పుడు ఇంత విషయం అమ్మవారు మనకి తెలియజేశారు. ఇకపై అన్నప్పుడు కొంచెం అనుభూతితో హ-ర-ఈం కారములను మననం చేసుకుంటే మంచిది.

'వియదీకార సంయుక్తం వీతిహోత్రసమన్వితం, అర్ధేందులసితం దేవ్యాః బీజం సర్వార్థసాధకం, ఏవమేకాక్షరం మంత్రం యతయః శుద్ధచేతసః, ధ్యాయంతి పరమానందమయా జ్ఞానాంబురాశయః' - ఇది దేవీఅథర్వశీర్షంలో ఉంది. వియత్- ఆకాశం, ఆకాశబీజం హకారం. ఈ కార సంయుక్తం. ఈ కలుపుకోవాలి. వీతిహోత్రసమన్వితం- అగ్ని బీజమైన రకారాన్ని కలిపి, దానికి అర్ధేందులసితం (ఇదే అర్ధచంద్రాకారం అనుకోవచ్చు)

ఓం అన్నప్పుడు చివరన అర్ధచంద్రం వచ్చింది. శివుడు ఓంకార రూపుడైనప్పుడు చివరికి అర్ధచంద్రుడు వచ్చాడు. శివుని తలపై చంద్రశేఖరుడు

ఉన్నాడు. ఇప్పుడు చంద్రశేఖరుడు అంటే ఏమిటో తెలిసింది కదా. శివుడు ఓంకార రూపుడు కనుక అర్ధచంద్రునితో కూడి చంద్రశేఖరుడు అయ్యాడు. అదే అమ్మరూపం. హ్రీంకారం అమ్మవారైనపుడు ఆవిడకి 'మ్' అనే నాదమే చంద్రబిందువు.

'అర్ధేందులసితం దేవ్యాః బీజం' – ఈ బీజం చేస్తే సర్వార్థ సాధకం. అన్నీ సిద్ధిస్తాయి. ఈ ఒక్క అక్షరాన్ని పట్టుకుంటే 'ఏవం ఏకాక్షరం మంత్రం యతయః శుద్ధ చేతసః' – యతయః అంటే ఇంద్రియములను నిగ్రహించువారు. శుద్ధ చేతస్కులైన వారు హ్రీంకారం సాయంతో ఆ స్థితికి వెళ్ళి, 'ధ్యాయంతి పరమానందమయా జ్ఞానాంబురాశయః' – వారు జ్ఞానసముద్రముతో తాదాత్మ్యులై ఆనందపారవశ్యాన్ని అనుభవిస్తారు.

అమ్మవారు అనగా హ్రీంకారరూపిణీ

నమస్తే భువనేశాని, నమస్తే ప్రణవాత్మికే
సర్వ వేదాంత సంసిద్ధే నమో హ్రీంకారమూర్తయే

అమ్మవారి లోకాన్ని వర్ణించినప్పుడు 'దేవీభాగవతం'లో ఒక బ్రహ్మాండానికి చెందిన బ్రహ్మ, విష్ణు, రుద్రులు ముగ్గురిని ఒకానొక విమానంలో అలా అమ్మవారు పైకి పంపించారు. విమానం తనంత తాను వెళ్తోంది. అన్ని భువనాలు దాటిపోతోంది. అది ఎక్కడ ఆగితే అక్కడ వీరు దిగాలే తప్ప వారంతట వారు ఆపుకుని దిగడానికి లేదు. వారు అలా క్రమంగా మణిద్వీపానికి వెళ్ళారు. ఆ మణిద్వీపంలో రమ్యమైన కల్పవృక్షవనములు ఉన్నాయి. అక్కడ పక్షులు రెక్కలార్చుతూ తిరుగుతూ హ్రీంకారాన్ని జపిస్తున్నాయి. అమ్మవారి లోకమంతా హ్రీం అనే నాదంతో నిండి ఉంది.

ఇవన్నీ మంత్రవిశేషములు.

ఓంకారానికి ప్రణవం, తారం, ధ్రువం అనే పేర్లు ఉన్నాయి. దీన్ని మాయాబీజం అంటారు. హ్రీం కారానికి–శక్తిబీజం, హృల్లేఖ, మాలిని, శివవల్లరీ (శివతీగ) అనే పేర్లు ఉన్నాయి. మంత్రసాధన చేస్తూ ఉండగా మనలోపల కుండలినీ జాగృతమవుతుంది. ఈ మూడు అక్షరములు మూడు గ్రంథులు. **'కళ, వాణి(ఈ తల్లికే వాణి అనిపేరు) మూర్తి, బీజశక్తి, కుండలినీ, హ్రీం బ్రహ్మేతి'** అని శాస్త్రం

కూడా బహు నామాలను వివరిస్తోంది.

'హ్రీ' అనే దానిని నాదంతో కలపాలి అంటే ఉపాసన కావాలి. నాదం తీసేస్తే నామం అయిపోతుంది. హాయిగా చేసుకోవచ్చు. శక్తి మాత్రం ఏం తగ్గదు. హ్రీం అంటే హ, ర, ఈం(ఇం) నాదం(మ్) తీస్తే హరి అయింది. హరి అనే నామంలో కూడా ఇంత విశేషముంది. ఊరికనే చెప్పినమాట కాదు ఇది.

తదా తాం తారమిత్యాహుః

ఓం ఆత్మేతి బహు శ్రుతాః కామేశశక్తిం బ్రువతే హరిమాత్మేతి చాపరే

ఓంకారం యొక్క శక్తినే హరి అని అంటారు. ఓంకారం శివుడు, శక్తిగా వ్యాపించిపోయాడు అంటే హరి. అది తెలుసుకోవడమే శివ, కేశవ అభేదము. హరి అనే దాంట్లో ఇంత విషయం ఉంది.

ఓం– తార –శక్తి – హరి ఇవన్నీ కూడా ఒకే విషయాన్ని తెలియజేస్తున్నాయి. హరి అంటే పరబ్రహ్మమే. **హరి అను రెండక్షరములు హరియించును పాతకములు.**

'భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానందలహరీం'– మనకు తెలియకుండానే ఇందులో బీజాక్షరం అంటున్నాము. శంకర భగవత్పాదులవారు ఆ విధంగా కూరుస్తారు. నాదానికి, ఈమ్‌కి ఉన్న అనుబంధం ఒకసారి చూస్తే

వేదమయీం నాదమయీం బిందుమయీం పరపదోద్యదిందుమయీం

మంత్రమయీం తంత్రమయీం ప్రకృతిమయీం నౌమి విశ్వవికృతిమయీం

పంచశతిలో మూకకవి రచన ఇది. ఆ వేదమయమే నాదమయీం – అదే నాదరూపా. ఇదంతా భువనాలన్నిటా నిండి ఉంది. భువనాలు పధ్నాలుగు. వాటిలో ఉండే అంశాలు మాత్రం ఎనిమిదే. అవే అష్టమూర్తులు.

ధరణీమయీం – తరణిమయీం

పవనమయీం – గగన దహనహోతృమయీం

అంబుమయీం – ఇందుమయీం

అంబామనుకంపమాదిమామీక్షే

ఇందులో అష్టమూర్త్యాత్మకమైన, భువనములంతా వ్యాపించి పోయిన 'ఈం'

కార స్వరూపిణిని ఆవిష్కరించారు. ఆ రహస్యములే ఇక్కడ హ్రీం నాదరూపం ద్వారా తెలుసుకున్నాం.

302. హ్రీమతీ – శ్రీ హ్రీమత్యై నమః

మతి అంటే బుద్ధి, స్వభావము, స్వరూపము. అమ్మవారు హ్రీంమతి. హ్రీం స్వరూపము. హ్రీమతి అన్నప్పుడు హ్రీం కలిసిపోయింది (హ్రీం + అతి). అమ్మవారి యొక్క స్వరూపము, స్వభావము – హ్రీం.

'హ్రీమతీ' అంటే లజ్జ కలది. అమ్మవారి స్వభావము లజ్జ. హ్రీ అంటే సంస్కృతంలో సిగ్గు అని ఒక అర్థం ఉంది. 'శ్రద్ధయా దేయం భియా దేయం హ్రియా దేయం' – 'లజ్జతో దానం చేయాలి' అని వేదవాక్యం.

'హ్రీ' తృతీయా విభక్తి చేస్తే 'హ్రియా' అయింది. 'హ్రీం' అనే బీజాక్షరాన్ని పట్టుకుని 'హ్రీ' అని సిగ్గుకి తెచ్చేశాము. సిగ్గు అమ్మవారి రూపం. **'కులజన ప్రభవస్య లజ్జా'**– సప్తశతిలో ప్రత్యేకంగా లజ్జ అమ్మవారి రూపంగా చెప్పారు.

యా శ్రీః స్వయం సుకృతినాం భవనేష్వలక్ష్మీః
పాపాత్మనాం కృతధియాం హృదయేషు బుద్ధిః
శ్రద్ధా సతాం కులజన ప్రభవస్య లజ్జా

ఉత్తమమైన జన్మకలిగిన స్త్రీలలో, పురుషులలో లజ్జా రూపంగా ఆవిడ ఉంటుంది. లజ్జ అంటే బిడియం. చాలా గొప్పలక్షణం. అమ్మవారు మహాపతివ్రత. 'లలితా మహాత్రిపురసుందరి', 'పార్వతి' అనగానే ఆవిడ లజ్జా రూపంగా గొప్ప స్వభావాన్ని చూపిస్తోంది. లజ్జ, మతి, తుష్టి, పుష్టి – అనే అర్థాలు 'హ్రీ' అనే పదానికి ఉన్నాయి. అవి కలది హ్రీమతి.

కులస్త్రీ లక్షణం గనుక లజ్జతో, బిడియంతో ఉంది. **యా దేవీ సర్వభూతేషు లజ్జారూపేణ సంస్థితా, నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః –** ఆ లజ్జారూపమే 'హ్రీమతీ'. అధర్మం చెయ్యడానికి వెనుకాడడమే లజ్జ అన్నారు. ఎవడో చెప్పాడని అధర్మం మానేయ్యడమే కాదు. ఎవడో చూస్తాడని కొందరు అధర్మం చెయ్యరు.

తరువాత ఎవడయినా పట్టుకుంటాడేమోనని అబద్ధాలు ఆడకుండా ఉంటారు.

పరాశక్తి అనుగ్రహం ఎవరికి ఉంటుందో వారు సహజంగా ధర్మం ఆచరిస్తారు. అమ్మవారి అనుగ్రహం ఉంటేనే దివ్యగుణాలు వస్తాయి. ఉత్తమమయిన గుణాలలో ఒకటి హ్రీ. అధర్మం చెయ్యడానికి వెనుకంజ వేస్తే అదే బోలెడు ధర్మాలు చేసినంత. అది గొప్పగుణం. వారికి శాస్త్రం చెప్పనక్కర్లేదు. ఆ బుద్ధి సహజంగా వస్తుంది. "సత్యమునే పలుకవలెను" అని పదిమార్లు చెప్తే జాలిపడి పదకొండవమారు కొంతమంది చేస్తారు.

రామచంద్రమూర్తి **'సత్యం వద'** వాక్యం చదివి సత్యం చెప్పాడా? సీతమ్మ పాతివ్రత్య ధర్మాలు చదివి పతివ్రతగా ఉందా? రామచంద్రమూర్తికి, సీతమ్మకి ఉత్తమ గుణాలు సహజంగా ఉన్నాయి. స్వభావంగా ఉన్నాయి. స్వభావంగా లేక, ప్రభావంగా లేకపోతే అభావం అంటారు. అభావమంటే లేకపోవడం. చాలామందికి ధర్మం అభావం. కొంతమందికి పదిమార్లు చెప్పారు కదా అని చేస్తారు. అది ప్రభావం. పుస్తకాలు చదవకుండానే కొందరు ధర్మం స్వభావసిద్ధంగా ఆచరిస్తారు. అమ్మవారి దగ్గర హ్రీలాంటి గుణములు స్వభావసిద్ధంగా ఉన్నాయి. అనంత కళ్యాణరూపిణిగా ఉంది కనుక 'హ్రీమతీ'. ఇది ఒక భావం.

లజ్జ అంటే ముడుచుకుపోవడం. రావణాసురుడు వచ్చినప్పుడు సీతమ్మ ఎలా ముడుచుకుంది. అక్కడ అర్థం చేసుకోవాలి. దివ్య స్వరూపమంతా అక్కడ దర్శనమిస్తోంది. సీతమ్మ ఉపాసన అమ్మవారి ఉపాసనే. ఈ గుణాలన్నీ అక్కడ కనబడతాయి. ఆవిడ 'హ్రీమతీ'.

అసలే ఆవిడ బిడియంగా లజ్జగానే ఉన్నది. రావణాసురుడు రాగానే ఒక్కసారి ఎంత ముడుచుకుపోయింది? నిజానికి అయోధ్యలో మహారాణిగా ఉండవలసిన తల్లి, ఎంతో బిడియంగా రాచమర్యాదలతో ఉండవలసిన తల్లి, రాక్షసుని చేత బంధింపబడి వనంలో ఉంది. మరుగు లేదు. దుర్మార్గుడైన రావణాసురుడు వస్తే ఎలా ముడుచుకుపోయిందో వర్ణిస్తాడు వాల్మీకి.

ఊరువులు చుట్టూ చేతులు చుట్టుకుని మరింత వెనక్కి వెళ్ళిపోయింది.

'సోమకాసురుడు వచ్చినప్పుడు వేదకాంత ఎలా భయపడి వెనక్కివెళ్ళిందో అలా వెళ్ళింది' అన్నారు విశ్వనాథ సత్యనారాయణగారు. అదే 'హ్రీమతీ' అంటే అర్థం.

ఇంతవరకు ఉత్తమమైన గుణములుగా చెప్పుకున్నాం. హ్రీం అంతా ఆవిడ స్వభావము. ఇందులోనే సృష్టిస్థితిలయలన్నీ ఉన్నాయి కనుక అది ఆవిడ స్వభావం అనేది పరమార్థం.

హ్రీం అంటే ముడుచుకొనుట. లోపలికి లాగుకొనుట. బయటపెడితే ప్రపంచం. లోపలికి లాగితే లయం. లీనం చేసుకొనుట. లోపలికి లాగేయడం అంటే అంతర్ముఖులను చేసి పరతత్త్వంలో లయం చేస్తుంది. ఎక్కడికి చేరితే మళ్ళీ బయటకి రామో ఆ చోటుకు లాగెయ్యడమే. అది హ్రీం బీజంలో ఉన్న అసలు అర్థం. అందుకే అమ్మవారి పదిహేను అక్షరాల మంత్రంలో ప్రతి కూటమికి ఆఖరి అక్షరం అదే. పరమాత్మలో లీనం చేసుకొనే శక్తే 'హ్రీం'. లయకారిణి. ఇది అర్థం. అందుకే ఇది మోక్షకారిణీ విద్య అని చెప్పబడుతున్నది. అలా మోక్షమివ్వడమే స్వభావముగా కలది కనుక 'హ్రీమతీ'

303. హృద్యా - శ్రీ హృద్యాయై నమః

మనోహరం, ఆకర్షణ, ఆహ్లాదము కలిగిస్తే అది హృద్యము. లోకవ్యవహారంలో కూడా ఏదైనా బాగుంటే, 'ఆహా! హృద్యంగా ఉంద'ని అంటారు. అమ్మవారి స్వభావం 'హ్రీమతీ'. అమ్మవారి స్వరూపం 'హృద్యా'. మనోహరమైన రూపము, స్వభావము కలది. ఈ నామం నుండి అంతా అందం, ఆనందమే వస్తుంటాయి.

లలితాదేవి అంటేనే ఆనందం, అందం. ఆ స్వరూపమంతా హ్రీం బీజం విచ్చుకోగానే విజృంభిస్తుంది.

నాహం తీర్థే న కైలాసే వైకుంఠే వా న కర్హిచిత్
వసామి కింతు మత్ జ్ఞాని హృదయాంభోజమధ్యమే (దేవీభాగవతం)

"నేను తీర్థంలో లేను. కైలాసంలో ఉండను. వైకుంఠంలో కూడా ఉండను.

నా జ్ఞానుల హృదయపద్మంలో ఉంటాను". ఇదే యోగి 'హృద్ధ్యాన గమ్యం'. అందరి హృదయాలలో ఉన్నప్పటికీ యోగులకి మాత్రమే అనుభవానికి వస్తుంది. వారే ఆ స్థితిని అనుభవించగలరు. వారు హ్రీమతులై లోపలికి ముడిచేసుకున్నారు కనుక అనుభవించగలరు. అదే అంతర్ముఖత్వం. అంతర్ముఖులయ్యారు గనుక హృదయంలో చూడగలిగారు. అది అమ్మవారి అసలు చిరునామా.

ఇలా చెప్పగానే - అమ్మవారు కైలాసంలో, వైకుంఠంలో, క్షేత్రంలో, తీర్థంలో ఉండరని అర్థం కాదు. అమ్మవారుండే అసలు చోటు హృదయం. కానీ అక్కడ (హృదయంలో) చూడటానికి అడ్డుకునే పాపం పోవడానికి తీర్థాలు, క్షేత్రాలు తిరగాలి.

'హ్రీం' బీజం వలన ముడుచుకున్న హృదయకోశం విచ్చుకుంటుంది. విచ్చుకున్న చోట ఆ జ్ఞానస్వరూపిణిగా అమ్మ భాసిస్తోంది. ప్రపంచాన్ని ముడిచేస్తోంది, పరమాత్మని విప్పుతుంది.

304. హేయోపాదేయవర్జితా - శ్రీ హేయోపాదేయవర్జితాయై నమః

'నామరూపవివర్జితా' ఎలాంటి గట్టిపదమో 'హేయోపాదేయవర్జితా' అలాంటిదే. ఈ పదం ఉపనిషద్వచనం. అమ్మవారికి హేయము లేదు. ఉపాదేయము లేదు. హేయము అంటే విడువదగినది, వదిలేయవలసినది. ఉపాదేయము అంటే తీసుకోవలసినది. ఏది స్వీకరించాలో అది ఉపాదేయము, ఏది విడిచిపెట్టాలో అది హేయము. లోకంలో జీవులందరికి హేయోపాదేయాలు ఉంటాయి. సుఖం ఉపాదేయం, దుఃఖం హేయం. లాభం ఉపాదేయం, నష్టం హేయం. ఇలాగ ద్వంద్వాలు. ఆవిడకి ద్వంద్వాలు అనేవి లేవు. ఇది కావాలి, ఇది అక్కర్లేదు అని రెండూ లేనిది. ఏదైనా వస్తువు మన దగ్గర లేకపోతే కావాలి అనిపిస్తుంది. ఒక వస్తువు తనది కానప్పుడు వదిలేయాలనిపిస్తుంది. మనల్ని మనం వదులుకోగలమా? ఆత్మని వదులుకోగలమా? ఆత్మని తీసుకోగలమా? అదే మనమై ఉన్నప్పుడు ఈ రెండూ మనం చెయ్యలేం. అదే నేనై ఉన్న ఆత్మవస్తువే అమ్మవారు. అదే 'హేయోపాదేయవర్జితా'.

ఆత్మవస్తువు అందరిలోను ఉంది. ప్రతివాడు కావాలంటే నా శరీరాన్ని ఇచ్చేస్తాను అంటాడు కానీ నేనును ఇవ్వగలడా? అప్పుడే అర్థమౌతుంది శరీరము కూడా హేయమా, ఉపాదేయమా అనేది. శరీరమునకు కూడా ఆవల ఆత్మవస్తువు ఉంది. అమ్మవారే ఆ ఆత్మ వస్తువు. అదే నామరూప వివర్జితం, అదే హేయోపాదేయ వర్జితం.

మరొక అర్థం - చెయ్యవలసిన కర్మలు ఉపాదేయములు. చెయ్యకూడని కర్మలు హేయములు. ఇదే విధి, నిషేధము. ధర్మాధర్మములు. ఈ రెండూ అమ్మవారికి లేవు గనుక 'ధర్మాధర్మవివర్జితా' అంటే ఏమిటో 'హేయోపాదేయవర్జితా' అంటే అదే. నిప్పు నోట్లో వేసుకోవడానికి హేయము. నీరు ఉపాదేయము. అమ్మకి రెండిటి అవసరము, స్పర్శ లేదు కనుక 'హేయోపాదేయవర్జితా'.

జీవులకు కావలసినవి ప్రకృతి, ప్రపంచము. అమ్మవారు ప్రకృతికి అతీతురాలు. హేయోపాదేయము గురించి ఆలోచిస్తూ ఉంటే స్వస్వరూపముగా ఉన్నదే అమ్మ అని స్పష్టమౌతుంది. అన్నీ వేదాంత వాక్యములే. **'కర్మణ్యకర్మ యః పశ్యేదకర్మణి చ కర్మ యః'** - అనే గీతావాక్యం, **'న కర్మణా న ప్రజయా ధనేన'** - అనే శ్రుతి వాక్యం ఈ భావాన్నే చెబుతున్నాయి.

'హ్రీంకారీ' అనేది వట్టి బీజాక్షరముగా చెప్పలేదు. అది మనలను అంతర్ముఖులను చేసి మన స్వస్వరూపమయిన హేయోపాదేయవర్జితని చెప్పడమే పరమార్థం. అంతర్ముఖం చేసే విద్యయే హ్రీంకారము. అది ఎక్కడో లేదు, భువనములంతా వ్యాపించి ఉన్నది.

ఈ మాటలో మరొక అర్థం చూద్దాం- "నేను ఒకరిని భక్తునిగా స్వీకరిస్తాను, మరొకరిని విడిచిపెడతాను" అని లేదుట. 'అమ్మవారి దగ్గరికి వెళ్ళడానికి నేను తగుదునా?' అని ప్రశ్నించుకోకూడదు. ఎందుకంటే హేయోపాదేయాలు ఏమి లేవుగా. అందుకే వీడు తగనివాడని ఎవరినీ వదిలేయదు. వీడు తగినవాడని కొందరినే తీసుకోదు. అందరి పట్ల సమంగానే అమ్మ ఉంటుంది.

సూర్యుడు మురికి కాలువ మీద, గంగ మీద కూడా ప్రకాశిస్తున్నాడు.

మురికి కాలువ హేయమనిగాని, గంగ ఉపాదేయమని గాని ఏమీ లేదు. "అమ్మా! నేను నీచుడినే. ప్రపంచానికి నేను హేయమే కానీ నీవు నన్ను అలా చూడవు తల్లీ. అనుగ్రహిస్తావు. నీది సమదృష్టి". ఈ మాటలనే శంకరులు ఇలా అంటున్నారు - **వనేవా హర్మ్యేవా సమకర నిపాతో హిమకరః** - తల్లీ! ఒక ఉత్తముడు ఉపాదేయమని గానీ, అధముడనైన నేను హేయమని గానీ లేవు. నీ కారుణ్యం అందరి ఎడల సమముగా నున్నది. అమ్మ కారుణ్యానికి హేయము, ఉపాదేయము రెండూ లేవు. అందరిని సమంగానే అనుగ్రహిస్తావు.

'సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్'
అపిచేత్సుదురాచారో భజతే మామనన్యభాక్
సాధురేవ స మంతవ్యః సమ్యగ్వ్యవసితో హి సః

అంటారు గీతలో కృష్ణపరమాత్మ. "ఎంత దురాచారపరుడైనా నిరంతరం నన్ను భజించినవాడు సాధువే." పరమాత్మ యందు విచ్చుకున్న ప్రేమ మనకి ఉండాలి. అమ్మవారిని ప్రేమగా ఆశ్రయించ గలిగితే చాలు.

తరువాతి నామాలు- 'రాజరాజార్చితా రాజ్ఞీ, రమ్యా, రాజీవలోచనా'. 'ర'కారము అగ్ని. దోషాలు ఏవైనా మిగిలి ఉంటే దహనం చెయ్యడానికి వస్తోంది ఈ బీజాక్షరం. 'రాజరాజార్చితా' నుండి 'రామా రమణలంపటా' వరకు అంతా 'ర'కారం. ఇది కలిపిగాని ఒకసారి అనుకుంటే అప్పటివరకు ఉన్న నిరుత్సాహం పోయి ఉత్సాహం వస్తుంది. 'ర' అనే దాంట్లో ఉన్న అగ్ని అలాంటిది.

305. రాజరాజార్చితా - శ్రీ రాజరాజార్చితాయై నమః

అమ్మవారు రాజరాజుల చేత అర్చింపబడుచున్నది. ఇప్పుడు మరొక విద్యని ఇస్తున్నారు. రాజరాజు అంటే కుబేరుడు. **'రాజాధిరాజాయ ప్రసహ్యసాహినే నమో వయం వైశ్రవణాయ కుర్మహే'** - వైశ్రవణుడు అంటే కుబేరుడు. కుబేరుని చేత అర్చింపబడే తల్లి. కుబేరుడు ఉపాసించిన విద్య శ్రీవిద్య కనుక 'రాజరాజార్చితా'. అతను కూడా శ్రీవిద్యోపాసకుడే. మనువిద్య, చన్ద్రవిద్యలా ఇది కుబేరవిద్య. కుబేరుడు

అమ్మవారి ఉపాసన చేతనే ఐశ్వర్యాలన్నింటికి అధిపతి అయ్యాడు.

ఎవరి దగ్గరైనా ఏదైనా గొప్పదనం ఉందంటే అది వారికి అమ్మవారి దయవల్లే వచ్చింది. అది తెచ్చుకోవడం కోసం నానా తపస్సు చేశాడు. ఎవడు ధనాధ్యక్షుడో వాడే రాజరాజు. లలితాంబ యొక్క శ్రీమన్నగరంలో పదునాలుగు, పదునైదు ప్రాకారాల మధ్య కుబేరుడు మొదలైన యక్షుల లోకం ఉంది. కుబేరుడు, మణిభద్రుడు మొదలైన యక్షులు ఆ చోట అమ్మవారిని ధ్యానపూర్వకంగా ఆరాధిస్తున్నారని – 'ఆర్యాద్విశతి' దూర్వాస కృత వర్ణన.

తల్లోక పూర్వభాగే ధనదం ధ్యాయామి శేవధి కులేశం

అపి మాణిభద్రముఖ్యాన్ అంబా చరణావలంబినో యక్షాన్

కుబేరునిచేత ఉపాసింపబడిన విద్య రాజరాజవిద్య. రాజ అనే మాటకి తరువాత వచ్చే నామానికి సంబంధం ఉన్నది. రాజ అంటే రెండు అర్థాలు ఉన్నాయి. రంజకత్వాత్ – రంజింప చేయువాడు రాజు. అంటే మనలను ఆనందింప జేయువాడు; ప్రకాశించువాడు రాజు – రాజతే ప్రకాశతే – ప్రకాశము, ఆనందము. ప్రకాశమే జ్ఞానము, ఆనందము. జ్ఞానాన్ని, ఆనందాన్ని కలిగించే తల్లి అమ్మవారు.

లోకంలో ఎవడో ఒకడు ఆనందం ఇస్తూ ఉంటాడు. ప్రకాశిస్తూ ఉంటాడు. ప్రకాశించువాడంటే వాని పేరు బాగా వ్యాప్తి చెందింది అని అర్థం. వాడు రాజు. ఒకని పేరు ఒకనికి తెలియకపోయినా రాజుగారి పేరు అందరికీ తెలుస్తుంది.

అధికారానికి రాజత్వం ఉంది. అధికారంలో ఉన్నవాడు అందరికి తెలుస్తాడు. ప్రకాశిస్తున్నాడని అర్థం. రాజులు అంటే ప్రకాశించువారు, పేరు గలవారు, వ్యాపించువారు, అధికారము గలవారు. రాజు ప్రసిద్ధుడై మన మీద అధికారం కలిగి కావలసినవన్నీ ఇస్తూ తన పాలనతో మనల్ని ఆనందింపజేస్తాడు. ఆనందింప చేసేవాడే రాజు. మను, చంద్ర, కుబేరులకు కూడా రాజరాజులని పేరుంది. వారిచే అర్చింపబడుతున్నది – రాజరాజార్చిత.

రాజు తన చేత పాలింపబడుతున్న ప్రజలందరిని పోషణ చేత ఆనందింప జెయ్యాలి. అలా రాజుల మీద రాజులు కనబడుతూనే ఉంటారు.

తాడిని తన్నేవాడు ఉంటే తలదన్నే వాడు మరొకడు ఉంటాడు - అని సామెత. ఇవాళ ఒకరికి వెలుగు, రేపు ఇంకొకరికి వెలుగు. ఇది తెలుసుకుంటే అహాలన్నీ పోతూ ఉంటాయి. ఏం చూసుకుని మురిసిపోతూ ఉంటారు! వీరందరు రాజులు. తత్కాలానికి, తద్దేశానికి. వారందరికీ దేశకాల పరిమితులున్నాయి. భూలోకానికి అధిపతి ఒకరు, స్వర్గలోకానికి మరొకరు... ఇలా ఆయన లోకంలో ఆయనకే ఆధిపత్యం. వాడు వెళ్ళి మరో లోకం దగ్గర అధికారం చెలాయిస్తే లాభం లేదు.

రాజుల, రాజుల, రాజుల పైన ఉన్న రాజులందరూ కూడి అర్చిస్తూ ఉంటారు అమ్మవారిని.

బ్రహ్మ, విష్ణు, రుద్రులకి రాజరాజులని పేర్లు. వీరు లోకపాలకులందరికి లోకపాలకులు. వారి ముగ్గురి చేత అర్చింపబడుతోంది కనుక 'రాజరాజార్చితా'.

వారిలో కూడా ఆవిడ ఈశ్వరిగా ఉంది. బ్రహ్మ సృష్టిశక్తి, విష్ణువు స్థితి శక్తి, శివుని లయశక్తి - మూడూ ఆవిడే. అందుకు 'రాజరాజార్చితా'. ఆవిడ కంటె ఆనంద స్వరూపం ఎవరు ఉన్నారు? ఇక్కడ నుండి ఆనంద స్వరూపాన్ని వివరిస్తూ ఉన్నారు. 'రాజరాజార్చితా' తరువాతి నామం 'రాజ్ఞీ'.

306. రాజ్ఞీ - శ్రీ రాజ్ఞ్యై నమః

'రాజరాజార్చితా' అనగానే తెలిసిపోయింది ఈవిడని మించిన రాణీగారు ఎవరూ లేరు. అన్నింటికి రాణి ఈవిడ. భువనేశ్వరీ అని చెప్తున్న ఈ మంత్రము రాజరాజులు కూడా ఉపాసించినది. వారు ఉపాసించిన మంత్రము అన్నింటికి రాణి వంటిది. అంటే శ్రేష్ఠమైన మంత్రము.

సకల భువనాలకి ఈశ్వరుడు కామేశ్వరుడు. ఆయన ప్రక్కన ఈవిడ కూర్చుంది. అందుకు మహాకామేశ్వరియే మహారాణి. రాజరాజులందరి చేత అర్చించబడుతున్న రాణి. అమ్మవారి మంత్రానికే రాణి అని పేరు. అన్ని మంత్రములకు రాణి - షోడశీ. ఆ షోడశీ విద్యాస్వరూపమునే ఇక్కడ ఆవిష్కరిస్తున్నారు.

307. రమ్యా – శ్రీ రమ్యాయై నమః

లోకంలో అత్యంత సుందరమైన దానిని రమ్యము అంటారు. అమ్మవారు మహా సుందర స్వరూపము. సుందరీ విద్య. త్రిపురసుందరి. ఆ సౌందర్యతత్త్వాన్ని ఇక్కడ నుంచి ఆవిష్కరిస్తున్నారు. 'రమ్యా'... చిన్న చిన్న పద భేదాలతో అందాన్ని అనేక రకాలుగా చూపిస్తున్నారు. అత్యంత రమ్యమైన స్వరూపము.

ఉమా హైమవతీ బహుశోభమానా – అన్ని శోభలు ఆవిడ దగ్గరనే ఉన్నాయి. 'బహుశోభమానా' కనుక రమ్యా. 'రమ్యా, రాజీవలోచనా, రంజనీ, రమణీ' వరకు హ్రీం బీజంలో ఒకొక్క బీజాన్ని నిక్షిప్తం చేశారు. ఇది అతి పెద్ద రహస్యం. ఇందులో బీజాక్షరాలను వెతుకవద్దు. మంత్రశాస్త్రంలో 'హ' కారము ఇందులో చెప్పబడుతున్నది అనే విషయాన్ని చూపిస్తున్నారు.

308. రాజీవలోచనా – శ్రీ రాజీవలోచనాయై నమః

'రాజీవలోచనా' అన్నప్పుడు 'ఈ' కారం చెప్పారు. మాతృకాన్యాసం చేసినప్పుడు 'లోచనా' దగ్గర వస్తుంది 'ఈ'. అలా కూడా తెలియాలి.

'పరోక్ష ప్రియా ఇవహి దేవాః' అన్నారు. అలాగ ఇక్కడ దాచి చెప్తున్నారు. దేవత సంతోషిస్తున్నది.

'రమ్యా' అన్నప్పుడు ధ్వనించేది 'హ' కారము. అలాగే రాజీవలోచనాలో 'ఈ'కార ధ్వని, 'హ్రీం'కారం విచ్చుకుని అలా నామాలుగా వ్యాపించింది. హ్రీం బీజాధిదేవత అయిన భువనేశ్వరీ స్వరూపాన్ని ఈ నామాల్లో తెలియజేస్తున్నారు. అది తెలియకుండా నామం చేసినా 'హ్రీం' బీజంలో ఎన్నెన్ని శక్తులు ఉన్నాయో అవన్నీ నామాలు శ్రద్ధగా చదివిన వారికి వస్తాయి. ఒకొక్క నామంతో ఆ మంత్రవిద్యను పొందవచ్చు.

రాజీవలోచనా – రాజీవము వంటి లోచనములు కలది. పద్మము వంటి నేత్రములు కలది. ఇక్కడ విశేషంగా చెప్పనక్కరలేదు. 'పార్వతీ, పద్మనయనా' దగ్గర చెప్పుకున్నాం. అక్కడ పద్మనయనా అని చెప్పారు, ఇక్కడ రాజీవ అని 'ర' తో

చెప్పారు. ఒకే భావం చెప్పడం కాదు. శక్తిని ఇక్కడ నిబద్ధం చేస్తున్నారు.

309. రంజనీ – శ్రీ రంజన్యై నమః

రంజనీ, రమణీ... ఒకటి రేఫాన్ని, ఒకటి బిందువుని సూచిస్తుంది. **వియదీకార సంయుక్తం వీతిహోత్రసమన్వితం.** 'వియత్' (ఆకాశం) – రమ్యలో చూపించారు. 'రాజీవలోచనా'లో 'ఈ'కారం చూపించారు. **రంజనీ** – బిందువుని, **రమణీ**– రకారాన్ని చూపిస్తున్నారు. ఇదేదో తెచ్చి అన్వయించింది కాదు – ఇది మంత్ర శాస్త్రవేత్తలు ఇచ్చిన వ్యాఖ్యానమే. ఆశ్చర్యం ఎక్కడ కలగాలి అంటే ఇలాంటి రహస్యాలని ఇందులో పెట్టారా అని ఆనందించాలి. ఆనందము యొక్క రకరకాల అవస్థలు 'రమ్యా', 'రంజనీ'. జ్ఞానము, ఆనందము ఉంటేనే కళ్ళు విచ్చుకుంటాయి. కళ్ళు విచ్చుకుంటే వెలిగిపోతున్నాడండీ అంటారు. రాజీవలోచనా అన్నా కూడా ఆనంద స్వరూపమే. అమ్మవారు అంటే ఆనందం, అందం. రమ్యా – ఆనంద స్వరూపం, రంజనీ ఆనందరూపిణి, రంజింపచేసేది రంజని. ఆనందదాయిని. సచ్చిదానంద రూపిణియై వివిధానందాలుగా ప్రకాశించునది.

'రంజనీ' అంటే ఉత్సాహకారిణీ అయిన శక్తి అని కొందరు వ్యాఖ్యానించారు. ఉత్సాహం అంటే ఒక పని చెయ్యడానికి కావలసిన ప్రేరణ. ఆ ఉత్సాహం ఆనందం పొందుతున్న కొద్దీ పెరుగుతుంది. ఉత్సాహాన్ని పెంపొందింప జేసే తల్లి.

310. రమణీ – శ్రీ రమణ్యై నమః

రమింప జేయునది, ఆనందింప జేయునది అని అర్థం. **'ఆనందోబ్రహ్మేతి వ్యజానాత్'.**

అమ్మని ఉపాసించడం వలన ఏదో ఆనందం లభిస్తుంది అని కాదు; ఉపాసించడమే ఆనందం. ఆవిడ పేరు తలచుకుంటే ఆనందం. ఆ రూపాన్ని ధ్యానిస్తే ఆనందం. ఆవిడ గురించి వింటే ఆనందం. అలా ఆనందింపజేయగల స్వభావం ఆవిడది. అది రమణీ. దేనిని రమణీ అనాలో శాస్త్రం చెప్తోంది. **"క్షణం క్షణం**

యన్నవతాముపైతి తదైవ రూపం రమణీయతాయాః" - క్షణ, క్షణానికి కొత్తగా అనిపిస్తూ ఉండాలి. ఎప్పటికప్పుడు కొత్తగా అనిపించేది ఏదయినా ఉందా లోకంలో. నూతనంగా అన్నీ బాగుంటాయి. 'క్షణం క్షణం యన్నవతాముపైతి' అనేది సృష్టిలో దేనికి లేదు. నిత్యనూతనత్వం అమ్మవారి స్వరూపం. నిత్యనూతనమైన ఆనందం దేనికి ఉందో దానిని రమణీ అనాలి. ఇప్పుడు రమణీ అని ఎవరినీ అనలేం అని తెలిసిపోయింది. ఆ పదం అమ్మవారికే సరిపోతుంది. నిత్యనూతన ఆనందరూపిణి అనగా - సచ్చిదానంద స్వరూపమే.

దానిని ఆస్వాదించాలి అంటే అది మనది అయి ఉండాలి. మనది కాకపోతే మనం ఆస్వాదించలేం. పరతత్త్వాన్ని ఎందుకు ఆస్వాదించగలం అంటే మన అసలు స్వభావము అదే. రసము అంటే ఆనందము. ఆస్వాదించగలిగే శక్తి కూడా అమ్మవారే. ఆస్వాదించగలిగే శక్తిని 'రస్యా' అంటారు.

311. రస్యా - శ్రీ రస్యాయై నమః

రమణీయమైన స్వరూపాన్ని ఆస్వాదించగల స్వభావం అమ్మవారు. ఆవిడ సర్వ జగత్తులో అంతటా ఉంది. అందరికీ అవే శరీరాలే అయినా ఒక మహాత్ముడైన యోగి ఎప్పుడూ ఆనందంలోనే ఉంటాడు. అదే శరీరం, అదే ఆనందతత్త్వం మనలోనూ ఉంది. కానీ మనం ఆనందించలేకపోతున్నాం. కారణం 'రస్యా' లోపించింది. కనుక 'రస్య' గా అమ్మ మనలను అనుగ్రహిస్తే, అప్పుడు ఆ ఆనందాన్ని ఆస్వాదించగలం. రసము అనగా ఆనందము. ఆనందాన్ని గ్రహించగలిగే శక్తి కూడ అమ్మవారే. ఆస్వాదయోగ్యమైన ఆనందమే పరమేశ్వరి. **'రసో వై సః'** - అని ఉపనిషద్వాక్యం.

వెలుగే వెలుగుని గుర్తించగలదు. ఎలాగంటే మనం సూర్యుని ఆయన వెలుగు ద్వారానే తెలుసుకోగలుగుతున్నాం. ఆనందస్వరూపిణి అయిన ఆ తల్లిని ఆనందము ద్వారానే తెలుసుకోగలం. మనం సృష్టిలో ఏ ఆనందాన్ని అనుభవిస్తున్నా అది అమ్మ స్వరూపమే అని తెలుసుకోగలిగితే క్రమంగా 'రస్యా' స్థితిని పొందగలం. వెలుగు ద్వారానే వెలుగును - తెలుసుకోగలం అని చెప్పారు. ఇక్కడ సూర్యుని

వెలుగు అన్నాం. వెలుగు ద్వారా సూర్యుని తెలుసుకోగలం. కానీ తెలుసుకునేది మాత్రం కళ్ళ ద్వారానే. కంటికి అధిదేవత అయిన సూర్యుని ద్వారానే సూర్యుని ఎలా తెలుసుకోగలుగుతున్నామో, మన లోపల ఆ తల్లి ఆనందరూపిణిగా ఉంటేనే గానీ తెలుసుకోలేము.

'రంస్యా' అని కూడా 'రసగ్రహణశక్తి'గా పాఠాంతరం ఉంది.

'రంజనీ, రమణీ, రస్యా' - ఇదంతా ఆ భువనేశ్వరీ స్వరూపం. 'రమ్యా' నుండి 'రమణీ' వరకు హ, ర, ఈం వరకు చెప్పారు. దానిని గ్రహించగలిగే ఆ ఉపదేశశక్తే అమ్మవారు. అది రస్యా. ఉపదేశ శక్తి అంటే గురుస్వరూపం. ఉపదేశ శక్తి మంత్రముతో వచ్చింది. మంత్రములో శబ్దము రవళిస్తోంది. ఆ శబ్దం నాదంతో మ్రోగిపోతోంది. ఆ మ్రోగిపోతున్న శబ్దమే 'రణత్కింకిణిమేఖలా'.

312. రణత్కింకిణిమేఖలా - శ్రీ రణత్కింకిణిమేఖలాయై నమః

కింకిణి అంటే మువ్వలు. రణత్ - మ్రోగుతున్న అని అర్థం. మేఖలా అంటే వడ్డాణము. మ్రోగుతున్న మువ్వలతో సమకూర్చిన వడ్డాణమును అలకరించుకున్న అమ్మవారు. ఇదంతా అందమైన రూపం కనుక 'రమ్యా, రాజీవలోచనా, రంజనీ, రస్యా, రణత్కింకిణిమేఖలా' అని భావిస్తూ రూపాన్ని ధ్యానించినా సరిపోతుంది.

కింకిణి- అమ్మవారి మంత్రంలో ఎన్ని శబ్దాలు వినబడుతున్నాయో అన్ని శబ్దములు కింకిణులే. ఈ కింకిణులన్నీ కలిపిన మేఖల అమ్మవారి యొక్క మంత్రరూపము. అమ్మవారి యొక్క సంపూర్ణ మంత్రము షోడశి కావచ్చు, పంచదశి కావచ్చు, లేదా ఏకాక్షరమంత్రం కావచ్చు. అందులో వినబడుతున్న రకరకాల శబ్ద నాదములే కింకిణులు. ఈ కింకిణులు ఎప్పుడూ మారు మ్రోగిపోతూ ఉంటాయి. అందుకే 'రణత్కింకిణిమేఖలా'.

ఆ మంత్ర స్వరూపములో ఉన్న సమస్తమైన నాదశక్తులని చూపించారు. **'క్వణత్కాంచీదామా'** అమ్మవారు ఆ కాంచీ(వడ్డాణం) కట్టుకుని కూర్చున్నారు. మనకి శబ్దము యొక్క వ్యక్తీకరణల స్థానము గురించి శాస్త్రంలో చెప్పారు.

మూలాధారం వద్ద శబ్దం మన చెవికి వినబడదు. అది క్రమంగా వికసించుకొని స్వాధిష్ఠానం దగ్గర నుండి మణిపూరప్రదేశమైన నాభి దగ్గరికి వచ్చేటప్పటికి వ్యక్తీకరణ దశకి వెళ్తుంది. అంటే బీజం మొలకెత్తిన దశ అనుకోవచ్చు. సమస్త శబ్దములకి అక్షరములుగా విచ్చుకోవడానికి ప్రధాన స్థానం నాభి ప్రదేశం.

చిన్న ఉదాహరణ– చెట్టుని చూశాం. మూలమంతా క్రింద ఉంది. క్రింద ఉన్నదంతా స్వాధిష్ఠానం, మూలాధారం అనుకుందాం. పాదు నుండి మొదలు దగ్గరే చెట్టు కనబడుతున్నది. మనకి చెట్టు పాదు నుండి కనబడుతున్నట్లుగా సర్వ శబ్దాలకి, అక్షరాలకి, నాదాలకి, పాదువంటి చోటు నాభి. నాభి దగ్గర అలంకరించిన ఆభరణం వడ్డాణం. అక్కడ మాత్రమే మంత్రశక్తులన్నీ ఉంటాయి.

అదే మణిపూర. మణులు..అదే కింకిణి.. అక్కడే ధ్వనిస్తుంది. అది 'మణిపూరాంతరుదితా'. ఇదీ రహస్యం. అలాంటి ఆ సీమలో ప్రత్యక్షమైన మంత్రస్వరూపం గనుకనే ఆ నాభి నుంచి వ్యక్తమయ్యే మహా స్వరూపమే కాంచీపురంలో మనకు కనబడుతున్నది. తిరువారూరు మూలధారమైతే, కాంచీపురం వడ్డాణ స్థానము. అక్కడ నుండే మంత్ర స్వరూపము యొక్క ఆవిష్కరణ. 'రణత్కింకిణిమేఖలా' అన్నప్పుడు ఈ స్వరూపాన్ని ధ్యానించి, భావించాలి. తరువాతి నామాలు. 'రమా, రాకేందువదనా, రతిరూపా, రతిప్రియా'.

313. రమా – శ్రీ రమాయై నమః

314. రాకేందువదనా – శ్రీ రాకేందువదనాయై నమః

రమా అనగా లక్ష్మీ స్వరూపము. అంటే ఈ నామాల్లో 'శ్రీం' బీజం ధ్వనిస్తోంది. ఈ లక్ష్మీస్వరూపంలో బీజాక్షరాన్ని ఎలా ఇస్తున్నారో పరిశీలించాలి. రమా – శ్రీ. నాదం లేదు. రాకేందువదనా: రాకా – నిండుపున్నమి. ఇందు – చంద్రుడు. వదనా – నిండు పున్నమినాటి చంద్రుని వంటి వదనము కలది. అమ్మవారి ముఖం నిండుగా ఉన్నది. పదహారు కళలతో ప్రకాశిస్తోంది. సంపూర్ణం అంటే **షోడశి.**

రమా రాకేందువదనా - షోడశీ ప్రధాన బీజాన్ని ఆవిష్కరిస్తున్నారు. శ్రీ అనేది రమ. పూర్ణవదనం అంటే పూర్ణానుస్వారం. పూర్ణానుస్వారం అనగా వృత్తం. వృత్తమంటే బిందువేగా. బిందువు పెరిగితే వృత్తం. వృత్తం క్లుప్తం అయితే బిందువు. బిందువు, వృత్తం ఒక్కటే. రాకేందువదనా బిందుస్వరూపం. బిందువు అనేదాన్ని అక్షరాల్లో చెప్పాలంటే 'మ్' అనే శబ్దంతో చెప్పాలి. రమా అంటే 'శ్రీ', రాకేందువదన అంటే 'మ్'. ఈ రెండూ కలిపితే 'శ్రీం' బీజం. ఇందులో లక్ష్మీ స్వరూపాన్ని ఆవిష్కరిస్తున్నారు.

లక్ష్మీదేవి అనుగ్రహం ఉంటేనే ఉత్సాహము, ఆసక్తి పుడతాయి. లక్ష్మీ కళలంటే ఇవి. అమ్మవారి భక్తులకు ఎప్పుడూ ఉత్సాహం ఉంటుంది. 'మహోత్సాహో, మహాబలః' - విష్ణుసహస్రనామాలలో చెప్పారు. ఉత్సాహం, బలం లేకపోతే ఇమ్మని అమ్మవారిని దండం పెట్టుకోవాలి.

"మా విజయున్ చేరెదు వన్నెకాడు మదినావేశించు ఎల్లప్పుడున్" - అతనే రథాన్ని తోలుతున్నాడు(కృష్ణపరమాత్మ). రథాన్ని తోలుతున్న 'పరమోత్సాహున్ ప్రశంసించెదన్' అంటాడు భీష్మపితామహుడు. ఆయన ఉత్సాహంగా కూర్చోకపోతే పాండవులకి విజయం ఉందా? ఆనందం యొక్క సంపూర్ణ వైభవ స్వరూపమే 'రమా'.

'రమా' అంటే మరో అర్థం-క్రీడించుట. **'రము క్రీడాయాం'-** అనే ధాత్వర్థం. ఆడుకోవడం, ఆనందించడం. ఆడుకోవడం అంటేనే ఆనందించడం. అమ్మవారు ఎప్పుడూ ఆనందస్వరూపిణి. ఆనందం ఉన్నవారే ఆడుకుంటారు. ఆనందంగా ఆడుకుంటారు. ఆడుకుంటూ ఆనందిస్తారు. అమ్మవారు ఆనందస్వరూపిణి. ప్రపంచమనే ఆట ఆడుకుంటోంది. అందుకే ముఖం ఎప్పుడూ ఆనందంతో విచ్చుకుని ఉండడమే 'రాకేందువదనా'. 'పరిణత శరశ్చంద్రవదనా' అని సౌందర్యలహరిలో ఆదిశంకరులు చెప్పారు.

315. రతిరూపా - శ్రీ రతిరూపాయై నమః

316. రతిప్రియా - శ్రీ రతిప్రియాయై నమః

ఆసక్తి రూపిణి. ఆసక్తి అమ్మవారి రూపం. 'మహాసక్తిః' దగ్గర తెలుసుకున్నాం.

'రమతే యమునా పులినవనే' 'రాధామాధవ రతి చరితం ఇతి బోధావహం శ్రుతిభూషణం'(అన్నమయ్య). ఆ పరమాత్మ యందు నిరంతరం రతి. ఆ పరమాత్మ కృష్ణుడైతే, ఆవిడ రాధారూపిణిగా రతి. ఆ పరమాత్మ శివుడైతే, ఆవిడ పార్వతీరూపంగా రతి.

ఎంత రతి లేకపోతే, "అమ్మా! ఇంక తపస్సు చాలు. కృశించిపోయావు వచ్చేయ్", అని అంటే, "మీరు పొండి... నేను తపస్సు చేస్తాను" అంది. ఆయనే ఆఖరికి ముసలి వేషం వేసుకుని వచ్చి, "వాని కోసమా నీ రతి" అంటే "ఆ రతి నీకు తెలియదులే పో!" అని చెప్పి తన ఆసక్తిని చూపించింది అమ్మ పార్వతి. పరమేశ్వరునిపై ప్రేమంతా రూపం కట్టి కనబడింది.

పరమేశ్వరుని యందున్న ఆసక్తికి రతి అని పేరు. దానికే మరొక పేరు భక్తి, "సా పరానురక్తిరీశ్వరే" అని శాండిల్యుడు భక్తి సూత్రాలకి అర్థం చెప్తూ పరమాత్మ మీద పరమమైన రతి ఉంటే దానికి పేరు భక్తి. 'రతిరూపా' అంటే 'భక్తిరూపా'.

భక్తిప్రియా, భక్తివశ్యా అదే రతిప్రియా. పరమాత్మ యందు రతి అమ్మవారి రూపము. అమ్మవారి అనుగ్రహం ఉంటే కానీ పరమాత్మ యందు ప్రీతి కలుగదు.

'రతిరూపా' 'రతిప్రియా'కి ఇంకో అర్థం కాముని భార్య రతి. కాముడు అంటే కామేశ్వరుడు. కామేశ్వరుని ఆస్వాదిస్తున్న మహాకామేశ్వరియే 'రతిరూపా'. ఈ తల్లికి మహాభక్తులు అంటే చాలా ఇష్టం. రతీదేవి అమ్మవారిని కొలుచుకుంది. భర్త భస్మమైన తర్వాత రతీదేవి పార్వతీదేవినే ఉపాసించింది. అమ్మవారికి రతీదేవి పట్ల ప్రీతి కలిగి, రతీదేవికి మరణించిన మన్మథుని తిరిగి తెచ్చి ఇచ్చింది. ఆ విధంగా తన భక్తురాలైన రతీదేవి పట్ల ప్రీతి కలిగినది కనుక 'రతిప్రియా'. ఇది మరొక అర్థం.

రాధమ్మ దయ లేనిదే కృష్ణుడు దొరకడు అంటూ ఉంటారు. వెంటనే మనవారు

తిరిగి పురాణాల్లో రాధమ్మ ఎక్కడ ఉంది భాగవతంలో కనపడలేదు అంటారు. సరిగ్గా అర్థం చేసుకోగలిగితే భాగవతమంతా రాధే. భగవంతుని మీద రతి అయిన రాధమ్మ. రాధమ్మే 'రతిరూపా'.

ఈ నామాల్లో కామకళాబీజస్వరూపం ఉన్నది – అని కూడా భావించవచ్చు.

317. రక్షాకరీ – శ్రీ రక్షాకర్యై నమః

318. రాక్షసఘ్నీ – శ్రీ రాక్షసఘ్న్యై నమః

ఏదో గత జన్మల పుణ్యాలవల్ల గురువు మంత్రం ఇస్తాడు. లేదా మనకి అమ్మవారిపై భక్తి కలిగింది. కానీ ఈ ప్రపంచంపై ఆసక్తి మనలను వదలడం లేదంటే, "ఏం ఫర్వాలేదు. నీకు నేనే యోగం ఇచ్చాను కనుక నన్నే ఉపాసించు. అప్పుడు నీకు నేను ఇచ్చిన యోగం నన్ను పొందే వరకు చెడకుండా నేనే కాపాడతాను" అని భగవంతుడు కాపాడతాడు. అదే 'యోగక్షేమం వహామ్యహం'. ఆ యోగాన్ని కాపాడుతుంది కనుక 'రక్షాకరీ'. నువ్వు కాపాడతానంటావు అమ్మా! నాకేం తెలుసు? కానీ నాకు అడుగడుగునా రాక్షసుల్లా ఒకొక్క విఘ్నం వచ్చిపడుతున్నాయి అంటే, "అవి నేనే తొలగిస్తానుగా నీకెందుకు బాధ" అనేదే తరువాతి నామం 'రాక్షసఘ్నీ'.

ఆ ఇచ్చిన భక్తి యోగాన్ని కాపాడుతుంది. అడ్డుకునే అజ్ఞానాన్ని తొలగిస్తుంది. కనుక 'రక్షాకరీ', 'రాక్షసఘ్నీ'. ఉపాసకునికి కావలసిన అర్థం.

ఇప్పుడు లోకంలో అమ్మ చేస్తున్న పనిని చూద్దాం. లోకాన్ని అమ్మ ఎప్పుడూ కాపాడుతూ ఉంటుంది. అమ్మ ప్రేమ లోకంలో వ్యాపించిపోయింది. లోకం మీద ప్రేమ ఉండడం మూలంగానే లోకాన్ని రక్షిస్తోంది. లోకరక్షణకి ప్రమాదం కలిగించడానికి రాక్షసులు తయారయి వస్తే వారందరిని మట్టు పెడుతోంది. కనుక రాక్షసఘ్నీ. ఎందరిని మట్టు పెట్టిందో చెప్తే 'దేవీమాహాత్మ్యం' అవుతుంది. బ్రహ్మాండపురాణం అవుతుంది. ఎందరెందరు రాక్షసులు ఈ లోకానికి దెబ్బతీశారో వారందరిని తొలగించింది.

మొత్తానికి ఆ తల్లి ప్రేమరూపిణి, ఆనందరూపిణి కనుక 'రామా' అని

వివరించబడుతూ ఉన్నది. హ్రీంకార ఉపాసన చెయ్యాలన్న ప్రీతి అమ్మ దయ ఉంటేనే వస్తుంది - రతిరూపా, రతిప్రియా. ఆ ప్రీతి కలిగిన భక్తులని అమ్మ అడుగడుగునా కాపాడుతూ ఉంటుంది - రక్షాకరీ. వారి సాధనకి ఏమైనా విఘ్నాలు వస్తే తొలగించి అనుగ్రహిస్తుంది - రాక్షసఘ్నీ. ఇందులో భువనేశ్వరీమంత్ర ఆవిష్కరణ చేస్తూ మంత్ర స్వరూపాన్ని, స్వభావాన్ని మంత్ర ఉపాసకులకు అమ్మ ప్రభావాన్ని చూపిస్తున్నారు.

అమ్మ మంత్రాన్ని అనుష్ఠిస్తే వచ్చే ఫలమది. రక్షాకరీ, రాక్షసఘ్నీ. రక్షిస్తున్నది- ఈ రక్షణ అనేక రకాలుగా ఉంటుంది. మొదటిది సాధారణంగా లోకంలో భయం ఏర్పడినప్పుడు వాటినుంచి కాపాడడం ఒక రక్ష. ఆ భయాలు అనేక రకాలు. ఇన్ని భయాల నుండి కాపాడుతుంది. అన్నింటి కంటె పెద్ద భయం అజ్ఞానం. దాని నుండి కూడా కాపాడుతోంది కనుక 'రక్షాకరీ' అంటే ఐహిక ఫలప్రదాయిని మాత్రమే కాక పారమార్థికమైన జ్ఞానం ఇస్తున్నది.

319. రామా - శ్రీ రామాయై నమః

ఇది చాలా విశిష్టమైన నామం. 'సుందరీ రమణీ రామా' అని అమరకోశం చెప్తున్నది. సుందరమైన స్త్రీకి మరో పేరు 'రామా'. జగత్తులో స్త్రీ అనే స్వరూపమే అమ్మవారి రూపం. విశ్వంలో ఉన్న స్త్రీ విభూతులన్నీ కలిపి ఈ నామంలో చెప్పబడుతున్నాయి. దీని గురించి దేవీభాగవతం మొదలైనవాటిని చూస్తే **'త్వత్కళా సర్వయోషితః'** అనే మాట కనబడుతుంది. అమ్మవారి కళయే ప్రతి స్త్రీలో ఉంది. ప్రధానంగా అది పరిపూర్ణస్వరూపాలుగా ఉపాసించబడుతున్న దుర్గ, లక్ష్మి, సరస్వతి, గాయత్రి, రాధ ఇత్యాది రూపాలతో మొదలుకుని అమ్మవారి అంశావతారాలైన ఉత్తమ రూపములు గంగా, తులసి ఇత్యాదులు. ఇవన్నీ స్త్రీ స్వరూపములే.

పరాశక్తి మొదలుకుని స్త్రీ స్వరూపం వరకు అన్నీ అమ్మ యొక్క రూపములే అనే భావన చేయాలి. ఆ భావనలో భాగంగానే మనకి అమ్మవారి ఆరాధన అనగానే బాలా ఉపాసన మొదలుకుని సువాసినీ పూజ వరకు చేస్తున్నాం.

స్త్రీ ఏ రూపంలో ఉన్నా గౌరవింపదగినదే అనే భావం. స్త్రీలను ఆరాధించినప్పుడు అమ్మవారి భావనతో ఆరాధించడమనేది మనకి కనబడుతున్నది. ఈ భావనలో విశేషం ఏమిటి? అంటే -

శంకరః పురుషాస్సర్వే స్త్రియస్సర్వా మహేశ్వరీ
పుంలింగ శబ్దవాచ్యా యే తే చ రుద్రాః ప్రకీర్తితాః
స్త్రీలింగ శబ్దవాచా యాస్సర్వా గౌర్యా విభూతయః

అని శాస్త్రం చెప్తున్న వాక్యం. సృష్టిలో ఉన్న శక్తులన్నీ రెండే. పురుష - స్త్రీ అనే రూపములతోనే ఉంటాయి. ఈ రెండిటిలో 'పురుష' అంతా శివ స్వరూపము. స్త్రీ అంతా శక్తిస్వరూపంగా భావించి ఆరాధించేవాడే పరతత్త్వాన్ని తెలుసుకోగలడు అని శాస్త్రం చెప్తున్న వాక్యం. ఇదే మాట రుద్ర హృదయోపనిషత్తులో కూడా చెప్తూ-

రుద్రో నర ఉమానారీ తస్మై తస్యై నమో నమః

నరుడు అంటే మగరూపంలో ఉన్న జీవుడు. అది రుద్ర స్వరూపము. ఆయన యొక్క విభూతి ఉంటే గాని పుంస్త్వం రాదు. ఈ శరీరానిది ఏముంది? జీవుడు తాను చేసుకున్న కర్మలకొద్దీ ఈ శరీరం వస్తుంది. ఈ శరీరంలో తచ్ఛక్తి విశేషము ఈశ్వర స్వరూపమే. పుంస్త్వం అనేది శివ రూపము. స్త్రీత్వం అనేది అమ్మవారి యొక్క రూపము.

ఇలాంటి మాటే విష్ణుపురాణంలో **'దేవతిర్యఙ్మనుష్యాదౌ పున్నామా భగవాన్ హరిః। స్త్రీ నామ్నీ లక్ష్మీర్మైత్రేయ నాఽనయోర్విద్యతే పరం'** - 'దేవతలలో, జంతువులలో, మనుష్యులలో - అందరిలో పుంరూపాలన్నీ హరియే. స్త్రీలందరూ లక్ష్మియే'.

స్త్రియః తుష్టా స్త్రియో రుష్టాస్తుష్టారుష్టాశ్చ దేవతాః
వర్ధయంతి కులం తుష్టా నాశయంత్యవమానితాః

అని ధర్మశాస్త్రం చెప్తున్న వాక్యం. స్త్రీ సంతోషించినా, స్త్రీ కోపగించినా అమ్మవారు సంతోషించినట్లే, అమ్మవారు కోపగించినట్లే. స్త్రీ సంతోషిస్తే దేవతలు సంతోషించి వారి వంశాలని కాపాడుతారు. స్త్రీ దుఃఖపడినా, కోపగించుకున్నా దేవతలకి కోపం కలిగి వారి వంశాలని దెబ్బతీస్తారని ధర్మశాస్త్రం చెప్తున్నది. దీనిని

బట్టి స్త్రీకి మన శాస్త్రం ఎంత మర్యాదని, గౌరవాన్ని ఇచ్చిందో తెలుస్తుంది.

ఏ రూపంలో ఉన్నా స్త్రీ పూజ్యురాలే. పురుషునికి సంస్కారాలు చేస్తేకాని శరీరానికి శుద్ధత్వం రాదు. స్త్రీ జన్మతః శుద్ధురాలే. రెండవ సంవత్సరం వచ్చిన దగ్గర్నుంచి స్త్రీని పూజ్యురాలుగా మనం భావన చేస్తాం. స్త్రీ మంగళ స్వరూపమే. ఏ స్త్రీని ఏనాడు అవమానించరాదు, తక్కువగా చూడరాదు అని ధర్మశాస్త్రములు చెప్తున్నాయి. ఎందువల్లంటే అమ్మవారి యొక్క విభూతి స్త్రీలలో ఉంది. ఇది దర్శించవలసిన విధానం. స్త్రీలను అవమాన దృష్టితో చూసేవాడు, కాముక దృష్టితో చూసేవాడు శక్తి ఉపాసనలో పండలేడు అని శాక్తేయం పెద్ద హెచ్చరిక చేస్తోంది.

కాముక వికారాలన్నీ కూడా జయించి, అధర్మాన్ని వదలి పెట్టినవాడే అమ్మవారి పూజకు అర్హుడు అవుతాడు. అటువంటి వారికి అమ్మవారి అనుగ్రహం లభిస్తున్నది. రామా అనే మాటలోనే మనకి స్త్రీ స్వరూపాన్ని చూపిస్తున్నారు.

మరొక భావాన్ని మనం పరిశీలిస్తే – దీనిని పుంలింగం చేస్తే 'రామః' అవుతుంది. అంటే ఉన్న తత్త్వం ఒక్కటే. దానిని పుంలింగంలో చెప్తే రామః, స్త్రీలింగంలో చెప్తే రామా అయ్యింది. అంతే తేడా. రామః అంటే ఏమి పరమార్థమో, రామా అన్నా అదే పరమార్థం అని తెలుసుకోవాలి.

రమంతే యోగినోనంతే సత్యానందే చిదాత్మని
ఇతి రామ పదేనాసౌ పరబ్రహ్మాభిధీయతే

యోగులు (సిద్ధులు) అంతమునందు, వారి సాధనలన్నీ ఫలించిన తరువాత సిద్ధిగా ఏ పరతత్త్వమునందు చేరి పరమానందం అనుభవిస్తారో అదే రామః. రామః అంటేనే ఆనంద స్వరూపుడు, ఆనందింపజేయువాడు. యోగులకు కూడా గమ్యమైన సచ్చిదానంద పరబ్రహ్మము అని అర్థం.

'శ్రీరామో లలితాంబికా'. ఈ విషయాన్ని బ్రహ్మాండపురాణంలో నేరుగానే చెప్పారు. 'శ్రీకృష్ణః' శ్యామలాదేవీ శ్రీరామో 'లలితాంబికా' ఇది దేవతా తత్త్వం తెలిసినవారు పలికిన మాటలు. రూపములు ఏమైనప్పటికి దేవతాతత్త్వములో సామ్యముంటుంది. ఆ దేవతా సామ్యములను గ్రహించగలగాలి. అప్పుడు తత్త్వం

మరింత చక్కగా అర్థం అవుతుంది.

'యా ఉమా సా స్వయం విష్ణుః' **'శ్రీరామో లలితాంబికా'**, **'పుంరూపాచ మదాత్మికా'** - ఇలాంటి మాటలన్నీ ఉన్నాయి. చెరకువిల్లు పట్టుకున్న లలితాదేవి, కోదండం పట్టుకున్న శ్రీరామచంద్రమూర్తి - ఇద్దరూ ఒకే లాగ కనిపిస్తారు. 'మనోరూపేక్షుకోదండా' అనే మాటలోనే కోదండరామ ధ్వని మనకి మొదటిలోనే చూపిస్తున్నారు కదా, సంగీతరూపిణి శ్యామలాదేవి నాదస్వరూపం- వేణునాద వినోదుడైన కృష్ణపరమాత్మలో దర్శిస్తున్నాం. ఇవన్నీ రహస్య విషయములు. **'యోగమాయాముపాశ్రితః'** అని భాగవతం రాసపంచాధ్యాయిలో కనబడుతుంది. యోగమాయ అంటే అమ్మవారేగా! ఆ విషయాన్ని ప్రస్తావన చేస్తూ బ్రహ్మాండపురాణంలో కృష్ణపరమాత్మ అమ్మవారి ఉపాసనతో తాదాత్మ్యం చెంది వేణువు ద్వారా గోపికలను మోహింపగలిగాడు.

'అశేషజన మోహినీం' అయిన తత్త్వం అమ్మవారే. ఆ తత్త్వంతో తాదాత్మ్యం చెందగలిగే అభిన్నరూపుడు విష్ణువు. అందుకే **'హరిస్త్వాం ఆరాధ్యాం ప్రణత జన సౌభాగ్య జననీం పురా నారీ భూత్వా పురరిపుమపి క్షోభమనయత్'** అని శంకర భగవత్పాదుల వారు సౌందర్యలహరిలో చెప్పిన విషయం. జగన్నాథుడే జగన్మోహిని అవగలిగాడు.

పరబ్రహ్మ స్వరూపము, ఆనంద స్వరూపము అనే విషయాన్ని ఈ నామంలో అర్థం చేసుకోవాలి. ఈవిధంగా నిత్యానందలక్షణ స్వరూపమైన రామా నామం గురించి చెప్పారు. తరువాత నామం 'రమణలంపటా'.

320. రమణలంపటా - శ్రీ రమణలంపటాయై నమః

రమణత్వం అన్నా ఆనందమే. తీవ్రమైన ఆసక్తికి లంపటము అని పేరు. అత్యాసక్తి. 'రమణలంపటా' అంటే ఆనందస్వరూపమునందు ఆసక్తి కలిగినది. సచ్చిదానందరూపమైన పరమాత్మయందు ఆసక్తి కలిగిన స్వరూపమనగా బ్రహ్మవిద్యా స్వరూపిణి.

మరొక అర్థంలో రమణుడు అంటే రంజింపజేయువాడు. అమ్మవారికి రమణుడు ఎవరు? శివుడు. ఎవరి పతి వారికి రమణుడు. ఎవరి సతి వారికి రమణి. అమ్మవారికి రమణుడు పరమేశ్వరుడు. ఆయన యందే ఎప్పుడూ ఆసక్తి కలిగినది. 'రమణలంపటా' - ఎంత ఆసక్తి అంటే అది లంపటంగా మారింది. అది ఒక అంతట వదలదు. అంత ఆసక్తి. ఎల్లవేళలా శివుడంటే అత్యంతమైన మక్కువ కలది. ఎంత మక్కువ అంటే ఆమె చరిత్ర అంతా అదే చెప్తున్నది. ఆ తల్లి ఆయన కోసం ఎంతో తపస్సు చేసింది. పైగా **'నిజభర్తృముఖాంభోజచింతనాయై నమో నమః'** మొదలైన అష్టోత్తరశతనామాల్లోని వాక్యాలను తలచుకున్నా- ఆవిడకి ఎప్పుడూ ఒకటే పని - ఎల్లవేళలా తన భర్తగారి ముఖాన్ని చింతన చేస్తూ ఉంటుంది. ముచ్చటలు చెప్పుకున్నా ఆయనవే. ఆవిడకి అంత శివప్రీతి. భువనేశ్వరుడైన పరమేశ్వరుని యందు అత్యంత ఆసక్తి కలిగిన భువనేశ్వరి.

ఇంతవరకు రకార నామాలు అయ్యాయి. భువనేశ్వరీ మంత్రంలో ఉన్న ఒకానొక రహస్యాన్ని, మొత్తం శక్తి మంత్రాల్లో ఉన్న ఒక రహస్యాన్ని ఆవిష్కరిస్తున్న ఒక అద్భుత నామాల వరుసలోకి మనం ప్రవేశిస్తున్నాం.

ఇక్కడ లలితా సహస్రనామాల గురించి చెప్పిన ఉపోద్ఘాత వాక్యాలను మరొక్కమారు స్మరించుకోవలసినదే. లలితా సహస్రనామాలు కాలక్షేప నామాలు కాదు. ఏ నామాలకు లేనిది దీనికి మాత్రమే విశిష్టంగా చెప్పిన మాట- 'ఇవి రహస్యనామములు'. రహస్యము అంటే ఎంత సంస్కృతం తెలిసినవారికైనా నిఘంటువుపరంగా దానికి ఒక అర్థాన్ని చెప్పుకుంటాం. ఒక అర్థం వ్యవహార అర్థం. ఇవి మాత్రమే కాకుండా ఇంకా తత్త్వ, మంత్ర, యోగ సంకేతములు ఏవైతే దాగి ఉంటాయో అవి కూడా ఈ నామాల్లో ఉన్నాయి గనుక రహస్య నామములు.

ఆ రహస్యాన్ని విప్పి చెప్పుకోవడమే భాష్యం. ఇప్పటికే శ్రీవిద్యా సంప్రదాయంలో ఉంటూ ఆ మంత్రములతో పరిచయము, అనుభవము ఉన్న వారికి కూడా ప్రయోజనకారి. అందునా - కేవల భక్తితో వినేవారికి పనికొచ్చే అంశాలు చెప్పబడుతూ ఉంటాయి.

ఉపాసన చేసే వారికి మరింత దాని యందు నిష్ఠ కలిగి తద్రహస్యములు తెలిస్తే మరింత పురోగతి ఉంటుంది కనుక దానికి సంబంధించినవి సభల్లో ఎంత మేరకు చెప్పుకోవాలో అంత మేరకు చెప్తూనే వాటి నియమాలని మళ్ళీ చెప్పడం జరుగుతోంది. సంప్రదాయాన్ని అతిక్రమించకుండా ఉండాలనే జాగ్రత్తతో కూర్చొని చెప్పుకుంటున్నాం. ఇక్కడ నుండి చెప్పేవన్నీ మరో అద్భుతమైన మంత్ర విశేషములు.

కామ్యా కామకళారూపా కదంబకుసుమప్రియా
కల్యాణీ జగతీకందా కరుణారససాగరా
కళావతీ కళాలాపా కాంతా

ఇంతవరకు 'ర'కార నామాలు అయ్యాయి. ఇప్పుడు 'క'కార నామములు.

321. కామ్యా – శ్రీ కామ్యాయై నమః

'కామ్యా' అంటే కోరబడునది అని అర్థం. కోరబడునది అనే మాటలో కోరదగినది అని కూడా అర్థం. సృష్టిలో అందరూ కోరుకునేది ఆనందం. కానీ చిన్న తేడా ఉంది. మనం ఆనందాన్ని వస్తువు యందు ఆరోపించుకుని ఆ వస్తువు ఆనందం ఇస్తుందని భావించి వస్తువును కోరుకుంటున్నాం. ఆనందాన్ని ఎప్పుడైనా కోరుకున్నామా?

భ్రమానందం, బ్రహ్మానందం, జడానందం, చిదానందం. కోరుకోదగిన ఆనందం ఏది? ఏది అసలు ఆనందమో అదే కావాలి గాని ఆభాసలు మనకి ఎందుకు? విషయ సుఖాలకి ఆభాసానందాలు, భ్రమానందాలు అని పేరు. పరమాత్మ సుఖము మాత్రమే సత్యానందం, చిదానందం. కనుక ఆనందము అనగానే శాస్త్రంలో సత్యానందమే తీసుకోవాలిగాని ఆభాసానందాలని స్వీకరించరాదు. కామ్యా అంటే గొప్ప వ్యాఖ్యానాన్ని చెప్పారు. **జ్ఞానేన ప్రాప్తవ్యా.** జ్ఞానముతో మాత్రమే దొరికే తల్లి, **'ముముక్షుభిః కామ్య మానత్వాత్ కామ్యా'** – ముముక్షువులు దేనిని కోరుకుంటారో అది పరతత్త్వం. కోరుకోవడం అందరికి సహజమే. మనం ఏవేవి కావాలని కోరుకుంటున్నామో అవన్నీ అక్కర్లేదని తోసిపారేసినవారు దేన్ని కోరుకుంటారో అదే ఆనందం.

మనం పనికిరానివన్ని కోరుకుంటున్నాం. కొందరు చెత్త పారేస్తే ఏరుకుంటూ ఉంటారు. అచ్చంగా మన పని అంతే. జ్ఞానులు **'విషయాన్ విష ఇవ త్యాజ్యాన్'** అని చెప్పినట్టుగా విషయాలు విషం వంటివని పారేశారు వారు. అవి మనం ఏరుకుంటున్నాం. విషయాలన్నీ అక్కర్లేదని పారేసి వారు ఏది పట్టుకున్నారో దానిని కావాలని కోరుకోవడం బాగుంటుంది కదా.

పరమార్థంగా చెప్పాంగాని మనం ఏ స్థాయిలో ఉంటే దాని పరంగా అర్థం చెప్పుకోవచ్చు.

ఆకలి వేసేవానికి అన్నం కావాలి. అప్పుడు కూర్చోబెట్టి వేదాంతం చెప్తానంటే ఒక్కడు వినడు. అప్పుడు అన్నరూపంలో వచ్చేది అమ్మవారే. మనకి ఎప్పుడు ఏది కావాలంటే ఆ రూపంలో వచ్చి అనుగ్రహిస్తున్నది అమ్మ.

ముందు పరమార్థం చెప్పుకున్నా తరువాత పనికొచ్చే ఇతర అర్థాలు కూడా చెప్పుకోవాలి. **'ఇష్టాపూర్తస్య కామ్యానాం త్రివర్గస్య యో నిధిః'** అని అమ్మవారి గురించి చెప్పిన మాట. ఇష్టాపూర్తకర్మలు చేసి మనం ఏది కోరుకుంటామో అది అమ్మవారే అన్నారు.

ఇష్టాపూర్తకర్మలు - ఇష్టములు అంటే యజ్ఞములు. పూర్తములు అంటే మంచిపనులు. చెట్లు నాటించుట, నూతులు త్రవ్వించుట, చలివేంద్రాలు పెట్టడం, సత్రాలు కట్టించడం, దానం చెయ్యడం... ఇలా ప్రజోపకరమైన పనులు చేయించడం. ఇవన్నీ పూర్తకర్మములు. ఇవన్ని చేసి కోరుకునేది ఏమిటి? ఉత్తమలోక సుఖాలు, స్వర్గాది సౌఖ్యాలు. అవి కూడా అమ్మరూపమే. ఆ రూపంలో కూడా అక్కడ ఆవిడ ఉన్నది. యజ్ఞాల ద్వారా వచ్చే ఫలాలు, జ్ఞానం ద్వారా దొరికే మోక్షఫలం కూడా అమ్మరూపాలే. ఈ రెండు కామ్యాలు అమ్మవారు అని చెప్పడం కోసం 'కామ్యా'.

అనారోగ్యంగా ఉన్నప్పుడు ఆరోగ్యమే కామ్యం. అపుడు ఆరోగ్యరూపిణి అమ్మ. అలా సృష్టిలో మనం కోరుకునే ప్రతిది అందులో మనకొక ప్రయోజనం, ఒక ఆనందం ఉందని కోరుకుంటున్నాం. అందులో ఆ ఆనందంగా, ప్రయోజనంగా ఉన్న శక్తి అమ్మవారు. ఇదే మనకి **'సర్వమంగళమాంగళ్యే'** - భావంలో చెప్పారు.

అమ్మవారినే లౌకిక కోరికలు కోరుకుంటే ప్రయోజనం ఏంటంటే అవి మనల్ని మోహంలో బంధించవు, బాధించవు. కొందరు భగవంతుని ఏం కోరుకోకూడదని అంటూంటారు. అది చాలా తప్పు మాట. కోరికంటూ ఉంటే కోరుకోవచ్చు. కోరికే లేకపోతే వేరే విషయం. అంతేగాని కోరికల కోసం అమ్మవారి దగ్గరకి వెళ్ళను, వాటి కోసం వేరే దగ్గరకి వెళ్తానంటే అదీ తప్పే. అమ్మవారిని అడిగి కోరికలు తీర్చుకుంటే ఆ కోరిక తీర్చుకున్న ప్రతిసారి అది అమ్మ దయ వల్ల వచ్చింది అనే స్పృహ ఉంటుంది. ఏదో భగవంతుని దయండీ... అని ఈ మాట మనకి పెద్దవారు అలవాటు చేశారు. ఇది నానుడిగానైనా మనలోంచి వచ్చేస్తుంది.

ఎప్పుడూ రామకృష్ణ పరమహంస ఒక మాట అనేవారు. 'అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లే.' ఈ మాట ఎంత గొప్పమాట. అంటే అర్థం ఏంటి? ఏది ఉన్నా అది అమ్మ దయే. అలా అన్నప్పుడు మనం అనుభవించే ప్రతిదానిలోను అమ్మనే మనం ధ్యానం చేస్తున్నాం.

కామ్యా చెప్పినప్పుడు అమ్మవారికి కామ సంబంధమైన నామాలు ఎన్ని ఉన్నాయో కాళీపురాణంలో చెప్తున్నారు.

కామార్థమాగతా యస్మాన్మయా సార్థం మహాగిరౌ
కామాఖ్యా ప్రోచ్యతే దేవీ నీలకూటే రహోగతా
కామదా కామినీ కామ్యా
కాంతా కామాంగదాయినీ
కామాంగనాశినీ యస్మాత్
కామాఖ్యా తేన కథ్యతే

ఇది కాళీపురాణంలో శివుడు చెప్పిన మాట. అమ్మవారికి కామాఖ్యా అని పేరుంది. (కామా అనే పేరున్నది - కామాఖ్యా) 'కామాఖ్యా' అని క్షేత్రం కూడా ఉంది. ఇది అస్సాం రాష్ట్రంలోని కామరూప జిల్లాలో ఉన్నది. ఇది అత్యంత శ్రేష్ఠమైన క్షేత్రం. శక్తిపీఠాలన్నింటిలోకి దీనికొక ప్రత్యేక స్థానం ఉన్నది. అమ్మవారి యొక్క యోనిపీఠ స్థానం అది. అమ్మవారి ఏ విద్య అయినా అక్కడ పండుతుంది. 'కామగిరి'

అని చెప్పబడే నీలకూట పర్వతంలో ఆనందంగా శివునితో సంచరించే తల్లి.

దక్షిణాచార, వామాచార సంప్రదాయములలో ఎవరైనా అక్కడ సాధకులే. మనం ఆ క్షేత్రానికి వెళ్ళినపుడు కొన్ని వామాచార పద్ధతులు కనిపిస్తాయి. అవి మనం పట్టించుకోకూడదు. అక్కడ ఎవరి పద్ధతిలో వారు సాధన చేసుకొని తరించిపోవచ్చు. దశమహావిద్యలు అక్కడ ఉన్నాయి. మొత్తం శక్తి పీఠాలు ఆవిర్భవించిన తరువాత పరమేశ్వరుడు చుట్టూ చూస్తే ఈ ఒక్క క్షేత్రం మాత్రం కుంగిపోతోంది. మిగిలినవన్నీ నిలబడ్డాయి. ఈ క్షేత్రం కుంగిపోతుంటే శివుడు వెళ్ళి త్రిశూలంతో పట్టి నిలిపాడు. ఆ క్షేత్రశక్తి అంత బలమైనది. దాన్ని నిలబెట్టగలగాలంటే శివుడు ఉండాలి. కాళీదేవి క్రింద శివుడు శయనించిన మూర్తి ఏమిటి? శక్తి నిలబడగలగాలంటే శివుడు అవసరమని భావం. ఆయన అధిష్ఠానంగా మాయ విజృంభిస్తోంది. అందుకే అమ్మవారి ఉపాసకులు శివభక్తులై ఉండాలి.

శివుని కొలుచుకొని, అమ్మవారిని కొలుచుకోవాలి. అదే సమయాచారం.

లలితాసహస్రనామం చదివే ముందు 'శివాయ గురవే నమః' అనే దాన్ని కనీసం ఒక 24 మార్లైనా అనుకొని అప్పుడు చదవడం మొదలుపెట్టాలి. ఎందుకంటే ఆయన గురువు. గురువే కదా శక్తిని తట్టుకోగల శక్తిని మనకి ఇస్తాడు. నిజంగా మనకి ఒకవిధంగా శివుడు గురువు.

ఆయన మీద కాళీ నిలబడింది, లలిత కూర్చుంది అంతే. రెండిటికి అర్థం ఏమిటి? కొంతమంది అడగొచ్చు– 'ఆవిడ మరీ కాళ్ళు పెట్టి నిలబడింది, ఈవిడ ఏకంగా మఠం వేసుకొని కూర్చొంది. ఇవేమైనా బాగున్నాయా?' ఇలాంటివి అసలు ఏ మాత్రం సంప్రదాయం తెలియనివారికి కొత్తగా, వింతగా అనిపిస్తాయి.

మనకంటే ఈ దేశంలో పుట్టాం కనుక దేవతలంటే ఒకానొక గౌరవభావం రక్తంలో ఉంది కనుక పరంపరలో ఉన్నాం కాబట్టి శివుడు మీద నిలబడిన కాళిదేవిని చూస్తే దండం పెట్టి వచ్చేస్తాం. కానీ ఎవడో ఒక విదేశీయుడు ఏం తెలియనివాడు వచ్చి ఈ రూపాలు చూసి "ఆవిడేంటండీ నాలిక అలా వేలాడేసుకొని, మెడలో పుర్రెలు వేసుకొని శివుని మీద కాలు పెట్టిందేంటండీ" అంటాడు. మరొకడొచ్చి,

"ఆయన మీద కూర్చొందేం"టండీ అంటాడు. "నేనెప్పుడు ఆలోచించలేదండి. ఏదో మూఢనమ్మకంలో పడిపోయాం ఇంతకాలమ"ని మనం అనుకుంటాం. మన అజ్ఞానాన్ని, వారి అజ్ఞానాన్ని పోగొట్టడం కోసం ఈ ప్రస్తావన తీసుకొస్తున్నాం. దీని అర్థం ఈశ్వరుడు శక్తికి ఆధారము అని చెప్పడం. కాళీరూపమైనా, లలితారూపమైనా జ్యోతిని ఆధారం చేసుకొని కాంతి ఉన్నట్టుగా శివుని ఆధారం చేసుకొని శక్తి ఉన్నదనే తత్త్వాన్ని మనం భావించాలి. శివ-శక్తి తత్త్వ అన్వయమే మనకి ఇందులో కనబడుతోంది. దశమహావిద్యలన్నీ కూడా చాలా లోతైనవి. పైపైన చూస్తే రక్తం, పుర్రెలు కనబడుతూ ఉంటాయి. అది చాలా అసహ్యమండి అంటాం. అలా అన్నది కూడా ఒక పుర్రెతోనే అని తెలుసుకోవాలి. అన్నీ మనలో ఉన్నవే. మనలో ఉన్న వాటికి శక్తిని ఇచ్చేది అవిడ.

మనలో ఆ శక్తి ఉండబట్టే ఇవన్నీ అలంకారాలుగా కనబడుతున్నాయి. లేకపోతే ఈ శరీరాన్ని రోజుకి ఎన్నిమార్లు శుభ్రపరచుకొని లేపనాలు పూసుకోవడం లేదు? ఎందువల్ల? మన శరీరం ఇంత అందంగా కనబడడానికి కారణమైన ఆ వస్తువు ఏమిటి? ఎముకలు, రక్తము, మాంసము ఇవన్నీ కలిపి ప్యాక్ చేసిన ఒకానొక వస్తువు మనకి అందంగా అనిపిస్తోందా, లేదా? లోపల ఒక శక్తి అనేది ఉండడం వల్ల అందంగా అనిపిస్తోంది. వీటన్నిటికి అందం ఎవరిచ్చారు? శక్తి. ఆ శక్తే అందం. అదే సౌందర్యం.

అందుకే ఆవిడ ఇవన్నీ అలంకారాలుగా వేసుకొని తిరుగుతోంది. ఆవిడకి ఏదైనా అందమే. ఆవిడ ఉంటే అన్నీ అందమే. ఆ మాటే 'కామ్యా' నామం దగ్గర నుంచి గ్రహించాలి. చాలా కాలం కామాఖ్యపీఠంలో శివుడు తపస్సు చేశాడు. అలాంటి భవ్యమైన చోటు కామాఖ్యక్షేత్రం. అక్కడికి శివుని కోసం అమ్మవారు వచ్చింది. **'కామార్థమాగతాయస్మాన్ మయా సార్థం'** – నాతో పాటు ఇక్కడకు వచ్చి, అమ్మవారు నాతో పాటు ఈ పర్వతం మీద విహరిస్తున్నది అని చెప్తున్నాడు శివుడు. ఆ పర్వతం పేరు నీలపర్వతం. నీలపర్వతం అనే పేరుతో రెండు మూడు పర్వతాలు భారతదేశంలో ఉన్నాయి.

ఒకటి నీలాచలమని పురీ జగన్నాథక్షేత్రంలో ఉంది. మరో నీలాచలం కామాఖ్యలో ఉన్న 'కామరూపగిరి'. దానికీ నీలగిరి అని పేరు. అక్కడ శివునితో పాటు శక్తి విహరిస్తున్నది. ఎన్ని రకాలుగా విహరించాలో అన్ని రకాలుగా విహరిస్తోంది అన్నాడు.

శివుడు ఎన్ని రూపాలు ధరిస్తే అమ్మవారు అన్ని రూపాలు ధరిస్తుంది. ఆమె ఎన్ని రూపాలు ధరిస్తే శివుడు అన్ని రూపాలు ధరిస్తాడు... అంటే దశమహావిద్యాది సమస్తరూపాలు. ఆ రూపాలు ఎన్ని ఉన్నాయంటే కొన్ని కోట్ల శక్తులు ఉన్నాయి. కోట్ల అమ్మరూపాలు ఉంటే కోట్ల శివరూపాలు ఉంటాయి. కనుకనే శివశక్తులు రూపాలు ఎన్ని అంటే చూడడానికి ఈ కళ్ళు చాలవు.

ఈ విషయాన్ని అప్పయ్యదీక్షితులవారు చెప్తూ, "శివుని శక్తులు కొన్ని కోట్లు ఉన్నాయి" అన్నారు(దుర్గాచన్ద్రకళాస్తుతిలో). అన్ని శక్తుల కేంద్రం అది. అక్కడున్న తల్లికి కామాఖ్యా అని పేరు ఎందుకొచ్చిందంటే 'ఆఖ్య' అంటే పేరు అని అర్థం. ఆమె పేరే కామ–ఆఖ్య. 'కామ' అనే పేరు ఎందుకొచ్చిందంటే కామదా, కామిని, కామ్యా, కాంతా, కామాంగదాయినీ, కామాంగనాశినీ. ఇవి తెలిస్తే మనకి 'కామ్యా' అర్థం అవుతుంది.

అమ్మవారు 'కామదా'. అంటే భక్తుల కోర్కెలు అన్నిటిని తీర్చుతుంది. కోరిక రూపంగా ఆవిడే ఉంది. అంటే ఆనందస్వరూపంగా ఉన్నది. ఎప్పుడైనా 'కామ' శబ్దం ఆనందవాచి. ఆవిడే ఆనందరూపిణి. కామ్యా – కోరుకోదగినది అని కాళీపురాణంలో కామ్య శబ్దం చెప్పారు. **కాంతా కామాంగదాయినీ–** కాంతా శబ్దానికి ముందు వచ్చే నామాలలో అర్థం చెప్పుకుంటాం.

'కామాంగదాయిని', 'కామాంగనాశిని' – కామునికి శరీరాన్ని ఇచ్చింది అమ్మవారే. కాముని శరీరాన్ని దహనం చేసింది అమ్మవారే. దహనం చేసింది శివుడా? అమ్మవారా? శివుడు కదా! శివుని పని, అమ్మవారి పని అని రెండు ఉండవు. ఆవిడ చేస్తే ఈయన చేసినట్లే, ఈయన చేస్తే ఆవిడ చేసినట్లే. మన్మథుని బ్రతికించింది అమ్మ అంటే శివుడే బ్రతికించాడు. మన్మథుని దహనం చేశాడు శివుడు అంటే

అమ్మవారే తగలబెట్టింది. రెండు అమ్మవారే చేసింది.

జ్ఞానాగ్నితో దగ్ధం చేసింది. ఆనందస్వరూపంగా అతడిని ఉజ్జీవింపజేసింది. ఈ విషయాన్ని 'హరనేత్రాగ్నిసందగ్ధకామసంజీవనౌషధిః' దగ్గర వివరించుకున్నాం. **'కామదా కామినీ కామా కాంతా కామాంగదాయినీ కామాంగనాశినీ యస్మాత్ కామాఖ్యా తేన కథ్యతే'** – ఆ తల్లి కామ–ఆఖ్య. మొత్తానికి 'కామ' శబ్దంతో చెప్పబడ్డ విద్య అంతా అమ్మవారే. కామ్యా అనగానే కాళికాపురాణంలోని వాక్యాలతో ఈ నామాన్ని అన్వయించుకున్నాం. తరువాత ప్రధానమైన నామంలోకి ప్రవేశిస్తున్నాం.

మనం ఒక పాత్రలో నీరు పట్టుకొంటే అందులో దాహం తీర్చే శక్తిగా అమ్మ ఉంటుంది. లేకపోతే మన దాహం ఎలా తీరుతుంది? ఇలా ప్రతి పదార్థంలోను మనకు ప్రయోజనకారిగా అమ్మే ఉందనే భావం ఈ 'కామ్యా' నామ విచారణ వల్ల కావాలి. తరువాత నామం 'కామకలారూపా'.

322. కామకలారూపా – శ్రీ కామకలారూపాయై నమః

ఇది విశిష్టమైన ఒక నామం. అమ్మవారికి సంబంధించిన ఉపాసనా శాస్త్రాలలో 'కామకలావిలాసం' అని ఒక ప్రత్యేకమైన గ్రంథం ఉంది. ఇది మనమనుకొనే తృతీయ పురుషార్థం కాదు. చతుర్విధ పురుషార్థాలలో చెప్పబడిన కామానికి సంబంధించిన శాస్త్రం కాదు ఇది. ఉపాసనా సంబంధమైన శాస్త్రం. ఇంకా లోతుగా పరిశీలిస్తే తత్త్వసంబంధమైన శాస్త్రం. లలితాసహస్రనామాలు రహస్యనామాలు అని చెప్పడంలోని ఉద్దేశం మరొక్కసారి స్మరించుకోవాలి. నిఘంటువు అర్థం తీయరాదు. బయటకి కనబడే నిఘంటువు అర్థం కాకుండా అందులో నిక్షిప్తమైన సంకేతార్థాలు గ్రహించాలి. అలా అన్వయించుకొని పారాయణ చేయాలి. రహస్యనామాలని పేరు లలితానామాలకి మాత్రమే ఉంది. వీటిని తీసుకొని భౌతికార్థం వ్రాసేవారు దీనిని ముట్టుకోవద్దు. ఇది నాకు తెలియని విషయమని దండం పెడితే చాలు. లేదా తెలుసుకునే ఓపికైనా ఉండాలి.

కామ శబ్దానికి ముందు నుంచి చెప్తున్న అర్థాలన్నీ ఇక్కడ అన్వయించుకోవాలి.

కామః అంటే ఆనందస్వరూపం. ప్రతివాడు ఒకటి కోరుకుంటున్నాడంటే వస్తువుని కాదు, ఆనందాన్ని అని ముందే చెప్పుకున్నాం. కోరిక అంటేనే ఆనందం. మనం కోరుకుంటున్నామంటేనే ఆనందం కోసం కదా! **కామకలారూపా** – ఆనంద కలారూపిణి. ఇదొక ప్రధానమైన అర్థం.

ఈ నామానికి చాలా విస్తారమైన అర్థాలు ఉన్నాయి. ఈ నామం భక్తులకి, భావుకులకి, ఉపాసకులకి అవసరమే. అందరికీ పనికొచ్చే అర్థాలు పరిశీలిద్దాం. ఎవరికి కావలసినవి వారు గ్రహించవచ్చు.

'కామకలా' అనేది ఒక మంత్రశక్తి, బీజశక్తి విశేషం. కామకోటిపీఠమని అష్టాదశ పీఠాలలో ఒకటి కాంచీపురం. శంకరభగవత్పాదులవారికి పూర్వమే దాని పేరు కామకోటి. శంకరులకు పూర్వమే లలితాసహస్రం ఉంది. అందులోనే 'త్రికూటా' 'కామకోటికా' అని ఉన్నది.

కాంచీపురంలో కామకోటి, కామరూప క్షేత్రంలో కామాఖ్యా. రెండిటిలో ఉన్న విశేషం చూస్తే అమ్మవారి పేరు కామేశ్వరి. కామేశ్వరి అనే నామం ఉపాసకులకే కాకుండా చాలామందికి ఎరుకే. కొందరికి కులదేవతగా కూడ కామేశ్వరి ఉన్నది. ఏ కులదేవతైనా మహాకామేశ్వరి యొక్క ఒకానొక విభూతి రూపం. ఆ తత్త్వం తెలుసుకోగలగాలి. దీనికి వేదాంతతత్త్వంతో సమన్వయం ఉంది. పైగా కామ, కామ్య అన్నప్పుడు లౌకికమైన ప్రయోజనాలు మొదలుకొని పారమార్థిక ప్రయోజనం వరకు అన్ని అమ్మరూపములే అని చెప్పుకున్నాం కాబట్టి ఈ కామకలారూపిణి అయిన అమ్మవారిని ఎవరు ఉపాసన చేస్తారో వారి కోరికలు తీరుతున్నాయి, చిట్టచివరకి ఏ కోరికాలేని మోక్షమనేది కూడా లభిస్తోంది.

కోరికలు తీరుతున్నాయి అంటే ఎప్పుడైనా ఉపాసకులు గుర్తు పెట్టుకోవలసింది ధర్మబద్ధమైన కోరిక. ధర్మాన్ని ప్రక్కన పెట్టి అధర్మ పద్ధతులలో ఉపాసన చేసేవారు అధములు. ధర్మంతో నియంత్రణ చేసుకుంటూ వెళ్ళాలి.

ఈ నామానికి ఉపనిషత్ సంబంధమైన వివేచనం కూడా ఉన్నది కాబట్టి ఈ నామం ఇప్పుడు వచ్చిన నామాలగుత్తిలో చాలా ప్రధానం. లలితాసహస్రనామంలో

ఒక కీలకమైన నామం **కామకలారూపా.** అమ్మవారి భక్తులందరికీ ప్రధానమైన నామం.

కామపరిపంథి కామిని కామేశ్వరి కామపీఠమధ్యగతే
కామదుఘా భవకమలే కామకలే కామకోటి కామాక్షి

అన్నారు మూకపంచశతిలో మూకకవి. ఈ శ్లోకంలోనే రహస్యాన్ని పెట్టాడు మహానుభావుడు. 321 నామాలు నేర్చుకున్న సంస్కారం ఉంటే ఈ నామం అర్థమౌతుంది. హఠాత్తుగా ఈ నామం పట్టుకుంటే అర్థమవడం కష్టం. ముందు నుంచి చెప్తున్న ఉపోద్ఘాతం శ్రద్ధగా గ్రహిస్తే ఈ నామం మరింత స్పష్టంగా అర్థమౌతుంది. ఈ నామాన్ని భక్తిభావంతో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. కామ-కల-రూప మూడు శబ్దాలు ఉన్నాయి. అమ్మవారి రూపం కామరూపం, కలా రూపం రెండూ తీసుకోవాలి. కామ - అనగా ఆనందస్వరూపం. కళ అనగా విద్యలు. అమ్మవారు విద్యల రూపంలో ఉన్నది.

'కలాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం' అని చెప్పినట్లుగా కళలు అనగా విద్యలు. కామస్వరూపమైన ఆనందతత్త్వం నుంచి వచ్చిన కళ కామకళ. ఆనందస్వరూపుడెవరు? పరమాత్మ. కామ అంటే కామయోః - అని ఇద్దరిని కలపాలి. కామేశ్వరీ-కామేశ్వరుల యొక్క అంటే పరబ్రహ్మశక్తి యొక్క కళయే 'కామకలా'. పరబ్రహ్మ యొక్క కళ అంటే ఆయన నుండి మొదటగా వెలువడింది. పరమేశ్వరుని ఇచ్ఛాస్వరూపం, సంకల్పశక్తి దాని ద్వారానే ఆయనని గుర్తించాం.

పరమాత్మ సృష్టికి పూర్వం తన శక్తిని బయట పెట్టాడు. **'సః అకామయత', 'స ఐక్షత'** - అని ఉపనిషత్తు చెప్తోంది. ఆయన కామించాడు అన్నారు. ఏమని? **'ఏకోఽహం బహుస్యాం ప్రజాయేయ'** - 'ఒక్క నేనే ఎన్నో అవుతాను' అనుకున్నాడు. అనుకున్నాడు అంటేనే కామించాడు అని అర్థం. సృష్టి చెయ్యాలని పరమాత్మ అనుకుంటేనే సృష్టి వచ్చింది. ఈ అనుకునే శక్తే సంకల్పం, కామము అని చెప్పబడుతున్నది. ఆ సంకల్పానికి ఉన్న శక్తి ఎప్పుడూ వ్యర్థం కాదు.

పరమాత్మది వ్యర్థంకాని సంకల్పశక్తి కనుకనే **'సత్యకామః, సత్య సంకల్పః'**

అని చెప్పబడుతున్నాడు. ఆ సత్యకామస్వరూపుడు సృష్టి చెయ్యాలన్న కోరిక ఉన్న పరమేశ్వరుడు. అసలు అది వస్తేనే ఆయనను ఈశ్వరుడు అన్నారు. లేకపోతే పరమాత్మ అన్నారు.

సృష్ట్యాదులకు అతీతంగా భావిస్తే పరమాత్మ. సృష్టిస్థితిలయలు చేస్తున్నాడు అంటే ఈశ్వరుడు. ఆ చేస్తున్నాడు అంటే చెయ్యాలనుకున్నాడు కదా! ఒకడు ఒక పని చేశాడంటే ముందు చెయ్యాలనుకుంటేనే చేస్తాడు. ఈ అనుకోవడంలోనే శక్తి అంతా ఉంది. ఆ శక్తిస్వరూపుడు. అదే ప్రథమం. ఇదే బిందుస్వరూపం అంటే అర్థం.

కామకళా అంటే కామేశ్వరీ-కామేశ్వరుల యొక్క కళారూపం. ఎన్ని కళలు వారివి? అంటే ఇచ్ఛారూపం ఒకటి. అక్కడి నుండి మొదలైన అన్ని కళలు వారివే. కలాభ్యాం - వారి నుంచి వెలువడిన కళలు.

పరమేశ్వరీ-పరమేశ్వరుల యొక్క రకరకాల శక్తి విలాసములే కామకళలు. వాటన్నిటి రూపం కామకళారూపం. కామకళా అనే మాటకి నిర్వచనం 'త్రిపురా సిద్ధాంతం' అనే గ్రంథంలో చెప్తూ-

తస్య కామేశ్వరాఖ్యస్య కామేశ్వర్యాశ్చ పార్వతి
కలాభ్యాం స విలాసా చ ఖ్యాతా కామకలేతి చ

కామేశ్వరుడనబడే ఆయన, ఆయన శక్తి అయిన కామేశ్వరి, వీరి ఉభయుల యొక్క విలాసమే 'కామకలా'. అందుకే పార్వతీ పరమేశ్వరులు లేదా పరమేశ్వరీ పరమేశ్వరుల యొక్క రకరకాల ప్రకటనలు, వారు ధరించే రూపములు, వారు చేసే లీలలు, వారి అనుగ్రహములు, వారి నుండి వచ్చిన శక్తులు - వీటన్నిటిని కలుపుకొంటే కామకళలు. మనం ఉపాసించేది వాటినే. అమ్మ రూపాన్ని ఉపాసిస్తున్నాం. అమ్మ లీలలను, అమ్మ నామాలను... ఇవన్నీ అమ్మ ప్రకటించింది. ఆ ప్రకటించడమే కళ. అలా ప్రకటితమైన వాటన్నిటి రూపములు 'కామకలారూపా'.

'కామకలావిలాసం' అనే గ్రంథంలో **'కామః కమనీయతయా కలా చ దహనేందు విగ్రహౌ బిందూ'** - కమనీయత్వం చేత కామము అన్నారు. కమనీయత అంటే ముందు చెప్పిన అర్థమే **కోరుకునేది, కోరుకోదగినది.** అది ఎవరు? పరమాత్మ.

కళ అంటే ఆ పరమాత్మ ప్రపంచరూపంలో వచ్చినపుడు ముందు కొన్ని బిందువులుగా వచ్చాడు. బిందువులు అంటే మొదటి రూపం. ముగ్గులు గీయాలంటే ముందు చుక్కలు పెట్టి కలుపుకుంటూ వెళ్తారు. అలా శ్రీచక్రం ఆవిర్భవించాలంటే ముందు బిందువే వచ్చింది. బిందువు అలా విస్తరిస్తేనే విచ్చుకొంది. ప్రథమస్పందన బిందువు విస్తరిస్తుంది.. దీనికి ఒక ఉదాహరణ చెప్పుకున్నాం.

ఒక కదలని కొలనులో ఒక రాయి వేస్తే ఏర్పడే బిందువు అనేక తరంగాలని ఏర్పాటు చేసింది. కానీ అనేకమైన తరంగాలు రావడానికి ప్రథమమైన బిందువే ఆధారం. అలాంటి బిందువులు ఎన్ని వచ్చాయో చెప్తూ 'దహన ఇందు విగ్రహా బిందూ' అన్నారు. దహన అంటే అగ్ని. ఇందు అంటే చంద్రుడు. ఇవి రెండు బిందువులు. ఈ రెండు బిందువులుగా వ్యక్తమైంది. ఈ రెండిటి నుంచే ప్రపంచమంతా వచ్చింది. ఇది జాగత్తగా పరిశీలిస్తే -

వందే గురుపదద్వంద్వం
అవాఙ్మానసగోచరం
రక్తశుక్లప్రభామిశ్రం
అతర్క్యం త్రైపురం మహః

రక్తం అంటే ఎర్ర రంగు, శుక్లం అంటే తెల్లరంగు మాత్రమే కాదు. రక్తము అంటే ఎరుపు అగ్నిని తెలియజేస్తుంది. తెలుపు చంద్రవర్ణం. అగ్ని వేడికి, వెలుగుకి సంకేతం. చంద్రుడు చల్లదనానికి, జలానికి సంకేతం. 'దహన-ఇందు' అంటే అగ్నీషోమాత్మకం. అగ్నీషోమాత్మకమనే బిందువులుగా పరమాత్మ ముందు ప్రకటింపబడ్డాడు. ఆ స్వరూపంతోనే ప్రపంచమంతా సాగుతోంది. కాబట్టి ముందు పరమాత్మ, ఆయన యొక్క రెండు బిందువులు తీసుకోవాలి. ఈ రెండు బిందువులకి చాలా విశేష రహస్యం ఉంది. ఈ రెండు బిందువులు కలిసిన ఒక బిందువు ఉంది. అక్కడకి వెళ్ళేటప్పటికి రెండు బిందువుల లక్షణాలు ఆ బిందువుకి ఉన్నాయి అన్నారు. ఆ రెండు బిందువులు కలుపుకున్నవాడే సూర్యభగవానుడు.

సూర్యభగవానుడు ఇటు అగ్నిస్వరూపుడు, అటు జలస్వరూపుడు. వేదం

ఒక రహస్యాన్ని చెప్పింది. రాత్రి అయ్యేటప్పటికి సూర్యుడు తన వెలుగును అగ్నికి, చంద్రునికి ఇస్తాడు అంటే జలానికి ఇస్తాడు. సూర్యోదయాత్పూర్వమే బ్రాహ్మీముహూర్తంలో స్నానం చేస్తే వారి శరీరం లోకి ఒక తేజస్సు వస్తుందని చెప్తారు. జలం అంటే చంద్రలక్షణమే.

పగలు వారిద్దరి నుండి వెలుగును తను తీసేసుకొని ప్రకాశిస్తూ ఉంటాడు. సూర్యుడు వచ్చేటప్పటికల్లా ఆయనలో అగ్ని, చంద్రుడు రెండూ కలిసి ఉన్నాయి. అగ్నీషోమాత్మకం ఏకబిందువు సూర్యభగవానుడు. ఆయనను మళ్ళీ రెండుగా రెండు బిందువులు. పైన ఒక బిందువు గీసి సరిగ్గా క్రింద సమాంతరంగా రెండు బిందువులు వేస్తే (గణితంలో 'దేర్‌ఫోర్') ఉన్నట్లు పైన ఒక బిందువు క్రింద రెండు బిందువులు. ఇది కామకళాధ్యానం. ఆ మూడు బిందువులను ధ్యానించాలి. మూడింటి క్రింద మళ్ళీ ఏకస్వరూప సంకేతంగా మరో బిందువు మొత్తం నాలుగు....

'ముఖం బిందుం కృత్వా కుచయుగమధస్తస్య తదధో
హరార్ధం ధ్యాయేద్యో హరమహిషి తే మన్మథకలామ్
స సద్యస్సంక్షోభం నయతి వనితా ఇత్యతి లఘు
త్రిలోకీమప్యాశు భ్రమయతి రవీన్దుస్తనయుగామ్

'హరుని పట్టపురాణీ! ఏ ఉపాసకుడు ఒక బిందువును ముఖముగా, దానికి దిగువ రెండు బిందువులను కుచయుగముగా, దాని క్రిందుగా శక్తి సంకేతాక్షరమగు 'హరార్ధము' (శివునిలో సగము-శక్తి)గా భావించి నీ 'కామరాజబీజము'ను ధ్యానించునో, అతడు వెంటనే వనితలను అనురాగముతో కలత చెందించుచున్నాడనుట చాలా అల్పమైనది. ఎందుకంటే, సూర్యచంద్రులే చనుగవగా గలిగిన ముల్లోకాలనే అతడు భ్రమింపజేయుచున్నాడు.

సర్వలోకాలనే అధీనం చేసుకునే శక్తిని పొందినవానికి, అల్పవిషయాలు లెక్కలోకి రావు, విషయసుఖాలను జయించడమే లోకవశ్యం అని గ్రహించాలి అని సౌందర్యలహరిలో శంకరులు దీనినే చెప్పారు. ఇది ధ్యాన విధానం. ఎవరైతే ఈ ధ్యానం చేస్తారో వారికి ఎంత గొప్ప ప్రయోజనం అంటే **'పునర్గర్భరంధ్రం న పశ్యంతి**

ధీరాః' – ఇలా ధ్యానం చేసేవాడు మళ్ళీ తల్లి కడుపులో పుట్టడమ్మా! అన్నారు. ఇది అత్యంత ప్రధానం. ఎంతో యోగ్యుడైన శిష్యునికి గురువులు ఇలాంటివి ఇస్తారు.

ఒక బిందువు కామస్వరూపం. రెండు బిందువులు కళాస్వరూపం.

ప్రథమబిందువుగా సూర్యుని తీసుకోమన్నారు. క్రింద రెండు బిందువులు చంద్ర, అగ్ని. ఈ మూడింటి నుంచి వచ్చినవే సమస్తమైన అక్షరాలు, నాదాలు. పరమాత్మ సృష్టిగా వికసించడానికి స్వీకరించినది ఇదే..... సూర్య–చంద్ర–అగ్ని. ఇదే **'తపనశశివైశ్వానరమయీం'** అని చెప్పినది.

సృష్టిలో అన్నీ మూడే. కృష్ణపరమాత్మ గీతలో ఈ రహస్యాన్నే చెప్తూ –

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽ ఖిలం

యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధిమామకం

ముందు ఆదిత్యునిలో ఏ తేజస్సు ఉందో అదే చంద్రునిలోను, అగ్నిలోను ఉంది అన్నారు.

ఆదిత్యునిలో ఏ తేజస్సు ఉందో, అదే 'యచ్చంద్రమసి యశ్చాగ్నౌ' ఆ మూడు తేజస్సులు నేనే అని తెలుసుకో అని పరమాత్మ వచనం. ఆ మూడింటిని చెప్పే బీజం ఒకటి ఉంది. **'కామః కమనీయతా కళా చ దహన ఇందు విగ్రహౌ బిందూ'** – కనుక ఆ రెండు బిందువులే (అగ్ని, చంద్ర) ప్రధానం అని వివరించి చూపిస్తున్నారు.

అగ్రబిందు పరికల్పితాననాం

అన్యబిందుయుగళ స్తనద్వయీం

నాదబిందురశనాగుణాస్పదాం

నౌమి తే పరశివే పరాం కళాం

పరమశివకళకి నమస్కారం. పరమశివకళ అంటే కామకళ. ఈ కామకళ నుండే శక్తి మంత్రాలు అన్నీ ఉత్పన్నమయ్యాయి. ఇది భువనేశ్వరీ బీజం అని చెప్పబడుతున్న దానిలోనున్న ప్రధానశక్తి. ఇది లేకపోతే బీజం సరిగ్గా పలకలేం. 'కామ' అన్నదానిలో కామరాజ బీజాన్ని తీసుకోవచ్చు. కామరాజ బీజం అంటే 'క్లీం'

కారం. ఈ బీజాక్షరాన్ని ఉపదేశరహితంగా జపించరాదు. ఉపాసకుల సౌలభ్యం కోసం, శ్రద్ధగా వినేవారి సౌలభ్యం కోసం చెప్పుకునే బీజాక్షరాలు వెంటనే రాసేసుకొని జపం చేయడానికి లేదు. ఇప్పుడు మననం చేస్తున్నాం కదా, అది ప్రమాదం లేకుండా సత్ ఫలం మాత్రం భక్తిగా చదివిన(విన్న)వారందరికీ ఇస్తుంది.

ఈ విషయాన్నే ఉపనిషత్తు చెప్తూ '**యదీగ్ం శ్రుణోతి అలకగ్ం శ్రుణోతి నహి ప్రవేద సుకృతస్య పంథాం**' – 'ఎవరైతే ఈ కామకళను తెలుసుకోరో వారికి తరించే మార్గం కనబడదు' అన్నారు. క్లీం అనే మాటలో క–ల–ఈం అని మూడు ఉన్నాయి. అక్కడ కళ ఉంది.అందులో క–ల తీసివేస్తే మిగిలింది 'ఈం'. అది అక్కడ బీజాక్షరంగా ఉంది. 'ఈం' లేకపోతే క–లకి శక్తి లేదు. 'ఈం' శక్తి వాచకం. క–లకి శక్తివాచకం కలవగానే 'క్లీం' అయ్యింది. ఈం అనే దానిని కామరాజబీజంలో ఉన్న కామకళ అని అంటారు. ఈ కామకళ అమ్మవారి సర్వశక్తుల స్వరూపం.

హకార రకార ఈంకారాలు 'హ్రీం' అయ్యింది.

'హ' 'ర' అక్షరాలకు 'ఈం' కలిస్తే 'హ్రీం' అయ్యింది. హ్రీం అనే బీజాక్షరాన్ని హాయిగా ఈం వల్లనే కలిపి పలుకగలిగాము. ఆ 'ఈం'నే కామకళ అంటారు.'కామకళారూపా' అంటే 'ఈంకారరూపిణీ' అని ప్రధానమైన అర్థం. దీనికే 'తురీయస్వరం' అని పేరు. తురీయం అంటే చతుర్థభూమిక.(అకారం తరువాత నాలుగవది – అ, ఆ, ఇ, ఈ) అది ఈం. ఇదే కామకళా. కామకళ అని దేనిని అనాలో వివరణ ఉంది. '**కామకళా విద్యా స్థూలసూక్ష్మపరాభేదేన అహమితి శ్రీమితి ఈం ఇతి త్రిధా వ్యవహార్యతే**' – ఇవన్నీ శోధనతో పట్టుకోవలసిన విషయాలు. కామకళావిద్యని స్థూలసూక్ష్మపరా భేదాలతో చెప్పాలి.

స్థూలంగా కామకళ అంటే 'అహం'. సూక్ష్మంగా చెప్పాలంటే 'శ్రీం'. పరారూపంగా చెప్పాలంటే 'ఈం'. ఈం కలవగానే శక్తి వస్తోంది. శ–రలో ఈం కలవగానే 'శ్రీం' అయ్యింది. 'ఈం' శక్తి ప్రణవం. 'ఈం' అమ్మవారి స్వరూపం. ఇంచుమించు అమ్మవారి బీజాక్షరాలన్నింటిలో 'ఈం' ఉంటుంది. అదే కామకళ. ఆ కళ లేకపోతే మంత్రానికి శక్తి రాదు. అది కాముని యొక్క కళ. ఏ కాముడు?

కామేశ్వరీ-కామేశ్వరుల యొక్క మిథునం. వారి శక్తి 'ఈం' రూపంలో వచ్చి అక్షరాలతో కలుస్తోంది. అప్పుడు మంత్రం ఏర్పడుతుంది. ఇది స్థూలంలో అహం. అహం అనేది కామకళే. **'స అకామయత ఏకోహం బహుస్యాం ప్రజాయేయేతి'** అని చెప్పినప్పుడు ఒక్క నేనే ఎన్నో అవుతాను. ఎన్నో అంటే అనేకం. ఇదే ప్రపంచం. ఒక్కడు ఎవరు? పరమాత్మ. ఆయన తెలియడం లేదు. ఎందుకంటే ఆయనే ఎన్నో అయిపోయాడు. ఆయనను మనం చూడలేకపోతున్నాం. **ఏకః - బహు** మధ్యలో ఉన్నది **'అహం'**. ఒక్క నేను ఎన్నో అవుతాను అనే కంటె ముందు 'నేను' అనుకున్నాడు. నేను అనుకుంటేగాని సృష్టిలో ఎవరూ ఏమి చెయ్యలేరు. చెయ్యడమనే 'క్రియ' వెనుక 'నేను' అనే ఒక స్పందన ఉంది. ఆ నేను అనే స్పందన అమ్మవారు. ఆ 'నేను' అనే స్పందనే 'ఎన్నో' అనే 'క్రియ'గా వచ్చింది. క్రియారూపంగా రావడానికి ముందు నేను అనే స్పందనగా పరమాత్మ వ్యక్తమయ్యాడు. ఆయన నేను అనుకోకపోతే ప్రపంచమే లేదు. 'బహుస్యాం' అనుకోవాలంటే నేను అనుకోవాలి కనుక ఆయనలో నేను అనే శక్తే అమ్మవారని తెలియడం కోసమే శంకరులు సౌందర్యలహరిలో **'పురమథితురాహో పురుషికా'** అన్నారు. 'ఆహో పురుషికా' - అహంకారరూపమైన పురుషకారం. పురుషకారం అంటే ప్రయత్నశక్తి. అహం అని బయటకి వచ్చింది. పరమేశ్వరుని యొక్క అహం.

భారతీయసంస్కృతిలో మామూలు అక్షరాలలో కూడా మహామంత్రాలు ఉన్నాయి. మాకు మామూలు అక్షరాలు చాలనుకుంటారు కొందరు, మంత్రం పట్టుకుంటారు కొందరు. అక్షరాలు అ కారంతో మొదలై హ కారంతో పూర్తవుతాయి. క్ష కారం సంయుక్తాక్షరం కనుక లెక్కలోకి రాదు. అ తో మొదలై -హ తో పూర్తవుతాయి. అ-హ రెండు తీసుకొంటే అన్ని అక్షరాలు దానిలో ఉన్నట్టే. దానికి నాదం 'మ్' కలిపితే అహం అయింది. అహం అంటే పెద్ద మంత్రం. ఈ అహమే అమ్మవారు. ఈశ్వరుని యొక్క అహం అమ్మవారు. మనలో కూడా అహం 'నేను' అంటున్నామంటే చైతన్యం లేకపోతే అనగలమా! కనుక మనలో అహంరూపమైన చైతన్యమే అమ్మవారు. రమణమహర్షి 'నేను'ని తెలుసుకోమని ఎందుకు అన్నారో ఇది తెలిస్తే అర్థమౌతుంది.

పరమేశ్వరుని యొక్క నేను ఆవిడ. ఆ నేనుని ఉపాసించాలి. అదే **'అహమిత్యేవ విభావయే భవానీం'**. ఈ అహంని కామకళా అంటారు. పరమాత్మ సృష్టి చేయాలి అనుకున్నప్పుడు 'కామం' కదా! అప్పుడొచ్చిన 'కళ' కదా అహం. కనుక కామకళ. ఇది స్థూలప్రణవం.

మరొక అర్థం చూస్తే 'అహ' అన్నప్పుడు 'అ' అక్షరాన్ని చాలా తేలికగా పలుకుతాం. 'హ' అన్నప్పుడు విశేషస్పందనతో అంటాం. పరిశీలన చేయాలి. ప్రపంచాన్ని పరిశీలన చేస్తే రహస్యాలు తెలుస్తాయి. పరిశీలించాలంటే ఏకాగ్రత ఉండాలి. శ్రద్ధ ఉండాలి. శ్రద్ధ లేనివానికి సాధన కుదరదు. మఠం వెయ్యలేనివానికి యోగం ఎక్కడ? ఆలోచించలేనివారికి తపస్సు ఎక్కడ? తపస్సు చెయ్యలేనివారికి సిద్ధి ఎక్కడ?

లోకంలో మనం ఏదైనా అద్భుతం చూడగానే ఆహా! అని అంటామా, లేదా? ఆ అద్భుతమే వ్యక్తీకరణ, ఆహా అనే రూపంలో ఉంటుంది. హకారమనేది ఆకాశంలో స్పందన శక్తి. దానికి మ్ అనేది నాదం కలిసింది. అప్పుడు అహం. ఈ అహమే బ్రహ్మము. 'అహం బ్రహ్మాస్మి'.

అహం అనేది ప్రధానమైన కామకళ. ఇది స్థూలం. ప్రతివాడు అ-హం అంటాడు కనుక ఇది స్థూలం. సూక్ష్మంలోకి వెళ్తే బీజాక్షరాలు వచ్చాయి. శ్రీం, క్లీం, హ్రీం, ఐం – అన్నింటిలో ఈం ఉంది. అ-ఈ కలిస్తే ఐ అవుతుంది. ఈం శక్తిబీజమని చెప్పుకున్నాం. ఇదే **"తాం పద్మినీం ఈం శరణమహం ప్రపద్యే"** అని శ్రీసూక్తం చెప్తోంది. ఈ రహస్యాన్నే మూకశంకరుల మూకపంచశతిలో ప్రస్తావించుకున్నాం. అది – వేదమయీం నాదమయీం బిందుమయీం. దానినే శంకరులు 'చిదానందలహరీం' అని (ఈం) ధ్వనింపచేశారు.

మూడవది పరా– 'ఈం'. వీటి (శ్రీం, హ్రీం... ఇత్యాది) నుండి తీసిన గుప్తప్రణవం అని చెప్పబడే 'ఈం'కార ప్రణవం. ఈ మూడింటిని కామకళలే అంటారు. కామకళారూపా అంటే అహంరూపిణి. శ్రీం, క్లీం మొదలైన బీజరూపిణి. ఈం అనబడే పరాబీజరూపిణి. శ్రీవిద్యలో కూడ బిందువు గీసేటపుడు బిందుస్థానంలో

'ఈం' గీస్తారు. అమ్మవారి యంత్రాలు వేసే వారికి ఇవి తెలుస్తాయి. ఉపాసనామర్మాలు తెలిసిన పాదుకాంతదీక్షాపరులు, పూర్ణదీక్షాపరులైన అమ్మ ఉపాసకులకి మధ్యలో 'ఈం' ఎందుకు పెడతారో తెలుస్తుంది. అదే ప్రథమం కనుక అక్కడ నుండి విస్తరిస్తోంది.

తాం ఈకారాక్షరోద్ధారాం
సారాత్సారాం పరాత్పరాం
ప్రణమామి మహాదేవీం
పరమానందరూపిణీమ్

అని దేవీ అథర్వశీర్షంలో వస్తుంది. ఈకారాక్షరంగా ఉద్ధరింపబడుతున్నది, సారాలలో కెల్లా సారమైనది, పరాత్పరమైనది, పరమానందరూపిణీ మహాదేవియైన తల్లికి నమస్కారము. పరమానందరూపిణి సారాత్సారం 'ఈం'. ఈం అమ్మవారి యొక్క పరారూపమని చెప్పబడుతుంది. ఈ మంత్రాన్ని శాస్త్రం అనేకరకాలుగా ఆవిష్కరిస్తున్నది. 'విరూపాక్ష పంచాశిక' అనే మంత్రశాస్త్రంలో గొప్ప విషయం చెప్పారు. ప్రథమంగా బిందువు సూర్యుడు. అందులోంచి రెండు తియ్యాలి అన్నారు. అవి అగ్ని, చంద్రుడు అనే రెండు బిందువులు. ముఖం బిందుం కృత్వా – ముఖం నుండి రెండు బిందువులు. తరువాత క్రింద ఒక రసనలాగ ఒక తాడు వెయ్యమన్నాడు. ఆ రసన ఏమిటంటే **'నాదబిందు రశనాగుణాస్పదాం'**. ఇది ఒక బిందువు అనుకుంటే ముందు ప్రథమ బిందువు మధ్యలో రెండు బిందువులు క్రింద ఒక బిందువు. దీనిని సంవిత్ బిందువు లేదా నాదబిందురూపిణీ అంటారు. ఇక్కడినుండే మంత్రవిషయం వస్తుంది. ఆ నాదబిందురసనా.

ముఖాన్ని ఒక బిందువుగా చెప్పి, వక్షఃస్థలాన్ని రెండు బిందువులుగా చెప్పి, కటిస్థానాన్ని మరొక బిందువుగా చూపిస్తున్నారు.

కటిస్థానం మేఖలా. అదే రణత్కింకిణిమేఖలా. అమ్మవారి రూపం ఒక స్త్రీ రూపంగా భావించరాదు. అది శక్తి. మనకి అర్థం కావడం కోసం వివరిస్తున్నారు. అలా చెప్తే కానీ అర్థం కాదు గనుక ముఖమనగానే పైస్థానం తీసుకోవాలి. క్రింద రెండు స్థానాలు ప్రక్కప్రక్కనే సమాంతరంగా తీసుకోవడం కోసం ఆ రెండిటిని వక్షః

స్థలంగా చూపించారు. క్రింద ఉన్న కటి ఒక వృత్తంగా భావించడం కోసం 'నాదబిందురసనాస్పదాం గుణాం' అన్నారు.

రసనా అనగా మొలనూలు. నాదబిందువులే మొలనూలు. నాదబిందువులు మణిపూరచక్రం దగ్గర విచ్చుకునేవి. అదే 'నాదరూపా' నామం నుండి 'రణత్కింకిణిమేఖలా' వరకు చెప్పినది. అవే అమ్మవారి మంత్రాలు. "ఇలా ఎవరైతే భావన చేస్తారో వారు మరి జన్మించరమ్మా!" అని చెప్పారు. అమ్మవారి ఉపాసనలో ఇది చాలా విశేషం.

ఈకారోర్ధ్వగతో బిందుర్ముఖం భానురధోముఖౌ
స్తనౌ దహనశీతాంశూ యోని ర్హార్ధా కలా భవేత్

సూర్యమండల స్వరూపమైన మిశ్రబిందువు ముఖంగాను, (చంద్ర, అగ్ని) శుక్ల రక్త బిందువులు రెండునూ స్తనయుగళముగాను, సంవిద్బిందువు కటిప్రదేశంగాను – ఈ నాలుగు కలిగిన స్వరూపం.

శంకరులు సౌందర్యలహరిలో **'ముఖం బిందుం కృత్వా'** అనే శ్లోకాన్ని చక్కగా నిక్షిప్తం చేసి ఇచ్చారు. దీని ప్రకారం చూస్తే ముందు సూర్యుడు, తరువాత రెండు అగ్ని, చంద్రుడు. సూర్యుడే ఈ అగ్ని, చంద్రుల రెండిటి మేళనమని చెప్పుకున్నాం. సూర్యుని ఇచ్ఛాశక్తి అనుకుంటే, తరువాత అగ్ని, చంద్రుడు. చంద్రుని యొక్క శాంతమైన జ్ఞానస్థితిని తెలియజేసేది మంత్రిణీదేవియైన శ్యామలాదేవి. అగ్ని క్రియాశక్తి వారాహీదేవి. పైన ఉన్న సూర్యశక్తి లలితాదేవి.

చంద్రలక్షణం, అగ్నిలక్షణం సూర్యునిలో ఉండి సూర్యునిలోంచి బయటకి వచ్చాయి. అలా లలితాదేవిలో ఉన్న శ్యామలాశక్తి, వారాహీశక్తి బయటకి వచ్చాయి. ఇదే –

భజే శ్రీచక్రమధ్యస్థాం
దక్షిణోత్తరయోస్సదా
శ్యామావార్తాళి సంసేవ్యాం
భవానీం లలితాంబికాం

ఆ తరువాత వచ్చిన మంత్రరాశి సమస్తమూ కూడా ఆ క్రింద సంవిత్ బిందువులో కనబడుతున్నాయి. మంత్రాక్షరములుగా స్పష్టంగా వినేటప్పటికి నాద-బిందువు అనే స్థానం వచ్చింది. ఈ నాలుగు బిందువులని కలిపి 'కామకళా' అంటారు. **పరానందసింధౌ నిమగ్నాః పునర్గర్భరంధ్రం న పశ్యంతి ధీరాః** – దీనికి పైన చాలా శ్లోకాలు ఉంటాయి కానీ అవి కేవలం ఉపాసకులకు మాత్రమే చెప్పాలి. కనుక చివర వాక్యం మాత్రమే చెప్పుకుంటున్నాం. అమ్మవారు ఏదో కొత్తశక్తి కాదు. ఎప్పుడూ ఉన్నదే. సూర్యచంద్రాగ్నులుగా ఉంటూ అనేక అక్షరాలుగా, మంత్రాలుగా వ్యాపించిన తల్లిని ఇందులో భావన చేయాలి. ఈ కామకళ అనే నామం ఒక మంత్రం.

'కామ'–'కళా' అనే దానిని విభజన చేసి అద్భుతమైన విషయాన్ని విమర్శనాశాస్త్రం తెలియజేస్తోంది. 'కామ'–'కళా' రెండు భాగాలు చెయ్యగా, కామ ఒకటి, కళా ఒకటి. ఈ రెండు అమ్మ రూపములే. కామ అన్నప్పుడు కాలో క–ఆ అని రెండు అక్షరాలు వచ్చాయి. **'క'–మాయ, 'అ'–తదవచ్ఛిన్న చైతన్యం ఈశ్వరః, 'అ'–శుద్ధచైతన్యం, 'మ'–అవిద్య, 'అ'–తదవచ్ఛిన్న చైతన్యం జీవః** అని వివరిస్తున్నారు.

కామ అన్నప్పుడు క–అ అన్నాం. కాని ఇందులో క్–అ–అ అని మూడు ఉన్నాయి. క అనేది మాయని, అ అనేది ఆ మాయతో ఉన్న ఈశ్వరుని తెలియజేస్తుంది. మనం ఎప్పుడు ఉపాసించాలన్నా మాయతో ఉన్న ఈశ్వరుని ఉపాసించగలం గాని మాయకి అతీతమైన ఈశ్వరుని ఉపాసించలేం.

మాయతో ఉన్న ఈశ్వరుడంటే సగుణబ్రహ్మ. మాయాశబలితం. నిర్గుణాన్ని ఉపాసించలేం. కేవలం తెలుసుకోవడమే. క–అ అంటే సగుణబ్రహ్మం. ముందు 'అ'ని చైతన్యం అన్నాం. రెండవ 'అ' శుద్ధచైతన్యం అయ్యింది. క–అ అంటే మాయతో ఉన్న ఈశ్వరుడు. కేవల అకారం అంటే శుద్ధచైతన్యం.

పరమాత్మకున్న రెండు స్వరూపాలను తీసుకున్నాం. సగుణం, నిర్గుణం. సృష్టిస్థితిలయలు చేసేటపుడు మాయాశక్తితో ఉంటాడు కనుక 'క' అనేది సగుణబ్రహ్మాన్ని తెలియజేస్తోంది. 'అ' అనేది నిర్గుణబ్రహ్మాన్ని తెలియజేస్తున్నది. ఇది 'కా' అనే మాటకి

అర్థం (సగుణ నిర్గుణ బ్రహ్మము).

ఇప్పుడు మ అనేదానిలో **మ్+అ** అని రెండు ఉన్నాయి. మ్ అన్నది అవిద్యని తెలియచేస్తుంది. అ అనేది **'తదవచ్ఛిన్నం జీవః'**. 'క'తో ఉన్న 'అ' మాయతో ఉన్న ఈశ్వరుడు. 'మ'తో ఉన్న 'అ' అవిద్యతో ఉన్న జీవుడు. జీవునికి, ఈశ్వరునికి భేదం– ఈశ్వరుడు మాయతో ఉంటాడు. జీవుడు అవిద్యతో ఉంటాడు.

క – సగుణబ్రహ్మం, అ – నిర్గుణబ్రహ్మం. ఈ రెండు కలిపి పరమేశ్వరుడు. మ అనేది జీవుని తెలియజేస్తుంది. జీవునిలో కూడా అకారం ఉంది అంటే చైతన్యం ఉంది. కాని జీవునిది అవిద్యతో ఉన్న చైతన్యం. అవిద్యకి, మాయకి తేడా ఏమిటి?

ఈశ్వరుని దగ్గర ఉంటే దానికి మాయ అని పేరు. మన దగ్గర ఉంటే అవిద్య అని పేరు. అవిద్య అంటే 'నేను' కాని దానిని 'నేను' అనుకోవడమే. ఏది నేను కాదు? దేహాది ఉపాధులు. కానీ ఎంత చెప్పినా ఇదే 'నేను' అని అనుకోవడం మనకి అలవాటే. ఇప్పుడు నేను కాదు అనుకుంటున్నవారంతా అనుకుంటున్నది అదే. కనుక అది అవిద్య. అది ఎప్పుడూ ఉంటుంది. అది అంత తేలిగ్గా పోదు.

పరమేశ్వరుడు విద్యతో ఉన్న చైతన్యం అంటే మాయ ఆయన అధీనంలో ఉంది. దానితోనే ప్రపంచం నడుపుతున్నాడు. మనం అవిద్య ఆధీనంలో ఉన్నాం. ఇప్పుడు అవిద్యని, మాయని తీసేస్తే మిగిలినది చైతన్యం ఒకటే.

జీవునికి, ఈశ్వరునికి తేడాని వివేకచూడామణిలో శంకరులు చెప్తూ, **'ఈశ్వరుడు సర్వజ్ఞుడు, జీవుడు కించిజ్ఞుడు'** అంటారు. ఈశ్వరునికి సర్వం తెలుసు. జీవునికి కొంతే తెలుసు. ఈశ్వరునిలో **సర్వ**, జీవునిలో **కించిత్** తీసేస్తే 'జ్ఞ' మిగిలిందన్నారు. జ్ఞ అంటే తెలుసుకొనుట అనేది ఉంది. సర్వం తెలిసినవాడు ఆయన. కొంచెం తెలినవాడు జీవుడు. కొంచెం, సర్వము తీసేస్తే 'తెలిసివాడు' అని ఉంటుంది. ఈ తెలివి మాత్రం ఒకటే. ఇదే అద్వైతం. దీనికి ఉదాహరణ: కిటికీలోంచి సూర్యుడు, ఆకాశంలోని సూర్యుడు. బయట అంతా వ్యాపించిన సూర్యుడు, కిటికిలోంచి ఉన్న సూర్యుడు ఇద్దరూ ఒకటే. కిటికి అనే దానిలోంచి చూస్తున్నాం కనుక పరిమితంగా కనబడ్డాడు. అలాగే ఉపాధి అనే దానిలో పరిమితంగా చూస్తున్నాం కనుక జీవుడు అనబడుతున్నాడు.

ఉపాధిని వదిలి చూస్తే ఆయనే ఈశ్వరుడు. ఉపాధి తాదాత్మ్యం ద్వైతం. ఉపాధి తీసేస్తే అద్వైతం అయ్యింది. కామకళా అద్వైతంలోకి తీసుకువెళ్తోంది. అందుకే శంకరులు దీనిని గ్రహించారు. ఇది తెలియక ఇటీవల కాలంలో శివకేశవుల భేదం చూపే కొంతమంది శంకరద్వేషులు వచ్చి 'అంత శంకరులు కూడా చివరకి కామకళా ఉపాసన అంటూ క్షుద్రపూజలోకి వచ్చారే'ని రాశారు. దానికిది ఖండన.

నిజానికి పరమేశ్వరుడు శుద్ధ చైతన్యమే, అకారమే. సృష్టి చెయ్యాలని మాయాశక్తిని తీసుకున్నప్పుడు 'కా' అయ్యాడు. అంటే క+అ సగుణబ్రహ్మం అయిన్నప్పటికీ – శక్తితో ఉన్న ఈశ్వరుడు.

అవిద్యతో కూడుకున్న జీవుడనే చైతన్యం, మాయతో కూడుకున్న ఈశ్వరుడనే చైతన్యం 'శుద్ధచైతన్యమేవ' – రెండు శుద్ధచైతన్యాలే... ఎలా అంటే – **'ఉపాధి నిరసనేన జీవేశ్వరౌ శుద్ధబ్రహ్మణోభిన్నౌ'** ఈశ్వరునికి మాయ ఉపాధి, జీవునికి అవిద్య ఉపాధి. రెండిటిలో ఉపాధిని తీసేస్తే 'జీవేశ్వరౌ అభిన్నౌ' – వారిద్దరూ అభిన్నులే.

'ఇతి సామాన్యేన అధికరణ్యేన జీవ యేవ ఈశ్వరః' – జీవుడే ఈశ్వరుడని తెలిసింది. **'భాగత్యాగ లక్షణయా అయమర్థః పర్యవసన్నః'** – ఇదే జహదజహల్లక్షణ మని వేదాంతవిచారణ – వివేకచూడామణిలో చాలా విస్తారంగా ఉంది. భాగత్యాగం చెయ్యమన్నారు. భాగమంటే ఏది పరిమితిగా ఉందో దానిని తీసేయ్యమన్నారు. అపుడు 'అహం సః, హంసః'. 'సః అహం సోహం' – ఇదే తుదిగా మిగిలేది.

ఇప్పుడు **'కళా'** అనేది చూస్తే 'క' కి బ్రహ్మము అని అర్థం, మాయ అని ఒక అర్థం, ఆకాశం అని ఒక అర్థం ఉంది. సందర్భం బట్టి అర్థం తీసుకోవాలి.

'క' అంటే ఆకాశము. 'కలా' లోని కలో 'క్'–'అ' అని రెండు ఉన్నాయి. **క్**– అనేది కకారం అది ఆకాశాన్ని తెలియజేస్తుంది. **అ** అనేది **తదుపహితచైతన్యం** అంటే ఆకాశంలో ఉన్న చైతన్యాన్ని చెప్తుంది.

'లా' అనే దానిలో ల్–అ–ఆ. ల **పృథ్వీబీజం.** అ–**పృథ్వీలో ఉన్న చైతన్యం.** ఇంకొక అ–**శుద్ధచైతన్యం. పృథివ్యాద్యాకాశాంతం** – పృథ్వీ మొదలుకొని ఆకాశం వరకు క–ల. అక్కడ ఇక్కడ ఉన్న చైతన్యం ఒక్కటే. అది ఆకాశంలోని చైతన్యం, ఇది

భూమిలోని చైతన్యం. ఆకాశం, భూమి తీసేస్తే మిగిలినది చైతన్యం ఒక్కటే. భూమినుంచి ఆకాశం వరకు చైతన్యం మాత్రం ఒక్కటే.

భూమి నుంచి ఆకాశం వరకు ఒకటే ఉన్నది.**'పృథివ్యాద్యాకాశాంతం పరిదృశ్యమానః సర్వః ప్రపంచో బ్రహ్మైవ'**. అ-అనే చైతన్యం క-తో కలిసింది, ల-తో కలిసింది. క-ల తీసేస్తే, అ-ఒక్కటే. అదే శుద్ధచైతన్యం. భూమి నుండి ఆకాశం వరకూ ఉన్నది ఒకటే చైతన్యం. ఇదే **'సర్వం ఖల్విదం బ్రహ్మ ఇతి స్మృతిః'** - సర్వం ఖల్విదం బ్రహ్మ అని స్పష్టమౌతుంది.

కామకళావిమర్శ- విమర్శ అంటే పర్యాలోచన. విస్తరించి చెప్తే విమర్శ. **'శివాద్యవనిపర్యంతం పరిదృశ్యమాన సర్వప్రపంచ అధిష్ఠాన నిర్విశేష బ్రహ్మైవాహం ఇత్యఖండ అర్థానుసంధానం కామకలా విమర్శః'**. కామకలా విమర్శ అంటే అర్థం- 'ఈ సమస్త బ్రహ్మాండాల యందు జీవుడు మొదలుకొని ఈశ్వరుని వరకు ఏ బ్రహ్మచైతన్యం వ్యాపించి ఉందో అదే అహం' అనే విచారణయే కామకలా. ఇది మొత్తం బ్రహ్మవిద్య.

ఇది పరిశీలిస్తే - ఆకాశము అంటే మన శిరస్సు, భూమి అంటే మూలాధారం. మూలాధారం నుండి శిరస్సు వరకూ వ్యాపించిన కుండలినీ రూప చైతన్యమే కలా. ఆ కలయే మనలో ఈశ్వరచైతన్యం చేత వచ్చింది కనుక 'కామకలా'. కుండలినీ రూపిణి.

శ్రీవిద్య ఉపనిషత్తులయందు పర్యవసిస్తోంది అంటే ఇదే. ఇదే కామకళారూపంలో ఉన్న ఆంతర్యం. తరువాతి నామం 'కదంబకుసుమప్రియా'.

323. కదంబకుసుమప్రియా - శ్రీ కదంబకుసుమప్రియాయై నమః

కదంబకుసుమాలంటే ప్రీతికలిగినది. కడిమిపూల పట్ల ప్రీతి కలిగినది, కదంబ వనవాసినిగా ఆ వనకుసుమాల పట్ల ప్రీతి కలది. కదంబము అనే మాటకి సమూహము అని అర్థం. కదంబకుసుమము అంటే సమూహరూపమైన జగత్తులో కనిపించేవి అన్నీ అమ్మకి పూజా కుసుమాలే. మనం సమకూర్చుకున్న విషయ

సమూహములన్నీ కుసుమములుగా చేసి అర్పించాలి. ఆ అర్పణకు ప్రీతిచెందే తల్లి.

324. కల్యాణీ –శ్రీ కల్యాణ్యై నమః

కల్యాణీ అంటే మంగళస్వరూపిణి. 'కల్యా' అంటే మంగళకరమైన వాక్కు దానిని శబ్దించునది – 'ణీ', మంగళకరమైన వాక్కుని పలుకునది, ఇచ్చునది అని అర్థం. **'శుభాత్మికా వాణీ కల్యా తామేవ అణతి శబ్దాయతే సా కల్యాణీ'** – శుభంకరమైన వాక్కురూపంలో ఉండేది. ఆ వాక్కులను పలికించేది.

'శబ్ద సంతతిం ఉత్పాదయంతి' – శబ్దసంతతిని ఉత్పాదన చేయునది. ఇన్ని పలుకులు పలుకుతున్నామంటే ఏ చైతన్యం మనలో ఉండడం వలన పలుకుతున్నామో అదే కల్యాణీ. మలయ పర్వతమున ఈ నామంతో పూజలందుకుంటోదని 'దేవీపురాణ' వచనం.

325. జగతీకందా – శ్రీ జగతీకందాయై నమః

కందా అంటే మూలం. అమ్మవారు సర్వజగత్తుకి మూలమైనది. 'కామకలా' విద్యకి సంబంధించిన నామాలివి. ఈ నామాలను అనుసంధానం చేసుకుంటూ, క్రమక్రమంగా ఈశ్వరశక్తి స్వరూపమే కామకల అని, అది ప్రతివారిలో అహం రూపంతో ఉన్నది అని గ్రహించాలి. మంత్రంలో శ్రీం మొదలైన బీజాక్షరాలతో ఉన్నది. పరారూపంగా గుప్తశక్తి ప్రణవం(ఈం)గా ఉన్నదని చెప్పుకుంటూ, అదే ఈ బ్రహ్మాండమంతా వ్యాపించిన ఈశ్వర చైతన్యమని విమర్శ చేసుకుని, ఆ స్వరూపాన్ని కదంబకుసుమాలతో అర్చించాలి. మనం పోగు చేసుకున్న సమస్తం అర్పణ చెయ్యడమే కదంబకుసుమము.

అలా చేస్తే మనలో పలికే ప్రతి వ్యక్తీకరణ ఆ చైతన్యంవల్లే కలుగుతోందని 'కల్యాణీ'ని తెలుసుకుంటాం. సర్వ జగత్తుకి మూలచైతన్యము అదే అని 'జగతీకందా' అంటాం. అలాంటి ఆ స్వరూపాన్ని ఇలా మనం తెలుసుకోగలుగుతున్నామంటే అది ఆ తల్లి దయ. ఆ తల్లి మంత్రరూపంగా, విగ్రహరూపంగా, కుండలినీరూపంగా,

శ్రీచక్రరూపంగా మన చేత ఆరాధింపబడుతోంది.

'కందా' అంటే 'పూరణం' అనే అర్థం కూడా ఉంది. 'జగమంతా నిండినది' **'ఈశావాస్యమిదం సర్వం'** అని అర్థం.

326. కరుణారససాగరా - శ్రీ కరుణారససాగరాయై నమః

కరుణాసముద్రురాలు.

అంతు పట్టనిది, అనంతమైనది. ఎప్పటికీ తరగనిది అని చెప్పేటప్పుడు సాగరశబ్దం వాడతారు. అమ్మ దయ తరగదు. అది అనంతం, అపారము. దాని లోతు మనకి అవగాహన కాదు. అందుకే అది సాగరం. కరుణారస - కరుణ అంటే దయ. రస అంటే ఆనందం. దయ, ఆనందం ఈ రెండిటికి ఆవిడ సముద్రం వంటిది. అమ్మ దగ్గర దయగాని, ఆనందము గాని అపారమై ఉంది. అనంతమై ఉంది. ఇది కామకలా ఉపాసనా ఫలము. ఆ తల్లి దయారూపిణిగా, ఆనందరూపిణిగా అనుగ్రహిస్తూ ఉంది. అందులోనే సర్వకళలూ ఉన్నాయి. కామకలా నామం మరింతగా అర్థం చేసుకోవడానికి తరువాతి నామాలు 'కలావతీ, కలాలాపా, కాంతా, కాదంబరీప్రియా'.

327. కలావతీ - శ్రీ కలావత్యై నమః

కలావతీ అంటే కళలు కలిగినది. కళలు అంటే పేరుకు ఒక కళ ఇచ్ఛారూపంలో వచ్చింది కానీ దాని నుండి ఎన్నో కళలు వచ్చాయి. అన్ని కళలరూపము.

328. కలాలాపా - శ్రీ కలాలాపాయై నమః

కలలే ఆలాపముగా కలిగినది. ఆలాపము అంటే మృదుభాషణం. కల అంటే మధురభాషణం. కళ- ఆలాప అంటే అమ్మవారు మధురంగా, మృదువుగా మాట్లాడుతుంది.

కల - అనేమాటకి అవ్యక్తమధురం అని అర్థం.

అమ్మ వాక్కులు ఏమిటి? కళలు అంటే విద్యలు. విద్యలన్నీ అమ్మ ఆలాపాలే. వేదాది సర్వవిద్యలు అమ్మ రూపాలే. అవి ఎంత మధురమైనవి? ఎంత దివ్యమైనవి? అవి ఇలా ఉంటాయి? దాని మహిమలు ఇలా ఉంటాయని ఎవరైనా వర్ణించగలరా! కలావతీ, కలాలాపా -విద్యలు కలిగినది. విద్యలను పలుకునది. ఈ రెండిటికి ఇది అర్థం.

కళలు అంటే అమ్మవారి రకరకాల శక్తులు. అలాంటి కళలు చాలా ఉంటాయి. మనకి తెలిసిన కళలు అగ్నికళలు, సూర్యకళలు. చంద్రకళలు, బ్రహ్మకళలు , విష్ణుకళలు, రుద్రకళలు, ఈశ్వరకళలు, సదాశివకళలు. మొత్తం ఎనిమిది. ఒకొక్కటీ బహుసంఖ్యలలో ఉంటాయి. ఇన్ని కళలు అమ్మరూపాలుగా ప్రపంచమంతా వ్యాపించిపోయి ఉన్నాయి.

అలాగే - నివృత్తి, ప్రతిష్ఠ, విద్య, శాంతి, శాంత్యతీత కళలుగా ఉన్నది కలావతి.

సృష్టి, స్థితి, సంహార, తిరోధాన, అనుగ్రహమనే కృత్యాలు. సూర్య, చంద్ర, అగ్ని అనబడే శక్తులు. వీటితో ప్రపంచం అంతా వ్యాపించింది. ఇన్ని కళలు కల తల్లి కలావతి. నవావరణ అర్చనలో విశేషార్ఘ్యం లో ఈ కళలన్నింటిని అందులో ఆవాహన చేస్తారు. ఈ ప్రపంచం అంతా ఆ అమృతమే. అదే కలావతీ.

329. కాంతా - శ్రీ కాంతాయై నమః

అమ్మవారు 'కాంతా'. **'అభిరూపతమం దేహం వహన్ కాంతః'**-అత్యంత సుందరమైన శరీరాన్ని కాంతం అంటారు. అమ్మవారిది అత్యంత సుందరమైన రూపం.

'క+అంత' = కాంత. కం = బ్రహ్మము. బ్రహ్మము యొక్క అంతము. అంతము అంటే సిద్ధాంతము. బ్రహ్మమే పరమార్థమని చెప్పే శాస్త్రం పేరు 'కాంతా'. బ్రహ్మవిద్యాస్వరూపిణి. సిద్ధాంతమంటే అంతంలో సిద్ధించినది సిద్ధాంతము. ఇదివరకు మాట్లాడిన మాటలన్నీ తీసిపడేసి (పూర్వపక్షం చేసి) ఇదే సరైనది అని చెప్తే దాని పేరే సిద్ధాంతం.

సిద్ధించిన అంతము సిద్ధాంతము. పరబ్రహ్మనే పరమార్థంగా చెప్పిన బ్రహ్మవిద్యయే 'కాంతా'.

ఇంకొక అర్థం 'క' అంటే బ్రహ్మ(పరబ్రహ్మ)మని, 'క' అంటే చతుర్ముఖ బ్రహ్మ అని కూడా అర్థం. బ్రహ్మ అంతం బ్రహ్మకు తెలియదు. బ్రహ్మ అంతం అమ్మవారికి తెలుసు. బ్రహ్మకి కూడా ప్రళయమిచ్చే శక్తి కనుక 'కాంతా' అని మరొక అర్థం.

కాంతా శబ్దానికి అర్థం చెప్తూ '**ద్విపరార్థాంతే కస్య బ్రహ్మణోఽప్యంతః అస్మాదితి వా కాంతః**' – ద్వితీయ పరార్థే శ్వేతవరాహకల్పే అంటాం. అంటే బ్రహ్మ యొక్క రెండవభాగం అంటే ఆయన యాభయ్యవ పడిలో పడ్డాడు. ఆయనకి అది ఎప్పుడు పూర్తి అవుతుందో ఈవిడకి తెలుసు. ఆయనకి అంతమిచ్చేది ఈవిడ. అందుకే కాంతా. తరువాతి నామం 'కాదంబరీప్రియా'.

330. కాదంబరీప్రియా – శ్రీ కాదంబరీప్రియాయై నమః

అమ్మవారికి ఏ అమృతాన్ని సమర్పణము చేస్తారో దాని పేరు 'కాదంబరీ'. ఆ అమృతమునందు ప్రీతి కలది. '**సంవిన్మయే పరేదేవి పరామృత రుచిప్రియే**'– క్షీరము మొదలైన వాటితో ఒక విశేష అర్ఘ్య అమృతాన్ని చేసి అమ్మవారికి 'బిందుతర్పణ సంతుష్టా' అని అర్పిస్తారు.

'కాదంబరీప్రియా' అనేది పూజా సంకేతం. పూజా సంకేతంగా ఏదైతే అమ్మవారికి సమర్పణ చేస్తున్నామో అది సంవిదమృతము. అంటే జ్ఞానము, అమృతమే అమ్మకి సమర్పణ చేయాలి.

అది సంవిదమృతం, పరామృతం. కదంబకుసుమాలనుండి వచ్చే మకరందానికి కాదంబరీ అని పేరు. దీనికి కల్లు అని అర్థం ఉంటే దానిని పక్కన పెడదాం. కదంబకుసుమాల గురించి ఇందాక చెప్పుకున్నాం. అది ఇప్పుడు గ్రహించాలి. ఈ ప్రపంచంలో ఉన్న సర్వసమూహాలు కదంబకుసుమాలే. దానిలో మకరందమంటే సారవస్తువు. ఆ సార వస్తువైన జ్ఞానమేదైతే ఉందో అదే అమ్మవారికి

అర్పణము. ఇది కాదంబరీప్రియా.

కదంబకుసుమ జన్యం కనుక మొగ్గల్లా ఉన్నవి పువ్వుల్లా విచ్చుకోవాలి. అవి గుంపుగా మొగ్గలాగ ఉన్నాయి, పువ్వులు అవ్వాలి. అది మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు ఉన్న ఆరుచక్రాలు విచ్చుకోవడమే కదంబకుసుమాలు. దానిలో ఒకొక్క చక్రంలో ఉన్న అమృతాన్ని ఆస్వాదిస్తూ వెళ్ళడమే 'కాదంబరీ'.

అది క్రమక్రమంగా సుషుమ్నా నాడి ద్వారా పైకి వెళ్ళి ఆ పైన ఉన్న సహస్రార కమలంలో ఉన్న అమ్మవారి యందు తాదాత్మ్యం చెందితే లభించే అఖండానందమే 'కాదంబరీప్రియా'.

కాదంబరీదేవి అంటే శాస్త్రంలో సరస్వతీదేవి అని అర్థం. కాదంబరీప్రియా అంటే అమ్మవారికి సరస్వతీదేవి అంటే చాలా ఇష్టం. సరస్వతి అంటే విద్యలు. విద్యలు అంటే అమ్మవారికి ప్రీతి.

'కాదంబినీప్రియా' అనే పాఠాంతరం కూడా ఉంది. కదంబవనముల యందు ప్రీతి కలది.

331. వరదా – శ్రీ వరదాయై నమః

వరాలు ఇచ్చునది. వరము అంటే కోరిక. అన్ని కోరికలు తీరుస్తోంది. 'వరదా, వామనయనా, వారుణీమదవిహ్వలా' అని మూడు నామాలు కలిపి ఒక గుంపు. అన్నీ వకారంతో మొదలు అవుతున్నాయి. 'వ' అమృత బీజం. కోరినవి ఇచ్చు తల్లి అని దీనికొక అర్థం. వరము అంటే శ్రేష్ఠము అని కూడా అర్థం.

నిజమైన వరం అంటే మోక్షం, జ్ఞానం. అవి ఇచ్చే తల్లి 'వరదా'. నచికేతుడు యముని దగ్గరికి వెళ్ళినప్పుడు ముందు కొన్ని అగ్నివిద్యలు అడిగాడు. నచికేతాగ్ని ఇత్యాది అగ్నివిద్యలు ఇచ్చాడు. తరువాత బ్రహ్మజ్ఞానాన్ని అడిగాడు. అది తప్ప ఇంక ఏదైనా ఇస్తానన్నాడు. ఏ లోకాన్నైనా ఇస్తాను గాని బ్రహ్మజ్ఞానం మాత్రం ఇవ్వను అన్నాడు యముడు. ఇంక ఏదైనా కోరుకో! అన్నాడు.

గురువు శిష్యునికి పరీక్ష పెడుతున్నాడు. నిజంగా వీడు బ్రహ్మవిద్య కోసం

వచ్చాడా, కాలక్షేపం కోసం వచ్చాడా? అది పరీక్ష. నీకేం కావాలి? స్వర్గలోక సుఖాలు కావాలా? ఏం కావాలి? అని అడిగాడు.

'నా వృణీత' – నేను అది తప్ప ఇంకేమీ వరించను. దేన్ని వరించాడు? బ్రహ్మవిద్యను వరించాడు. వరము అంటే బ్రహ్మవిద్య. దానిని ఇచ్చేది వరదా. ఉపనిషత్తుల తోటలోకి వెళ్ళి పువ్వులు ఏరుకుని రావాలి.

నవమ్యాంచ సదా పూజ్యేయం దేవీ సమాధినా
వరదా సర్వలోకానాం భవిష్యతి నసంశయః

అని దేవీపురాణం చెప్తున్న వాక్యం. నవమి నాడు అమ్మవారిని సమాధితో ఎవరు పూజించినా వరమిస్తుంది. 'సమాధినా' అనే నిబంధన పెట్టారు. సమాధినా అంటే ఏకాగ్రబుద్ధితో. నవమినాడు ఏకాగ్రతతో ఎవరు పూజిస్తారో ఏ లోకంలో వారైనా సరే వారికి వరదా–వరములిస్తాను. అభిమతాలను ఇచ్చే తల్లి 'వరదా'. వరద అభయ హస్తాలు ప్రదర్శించకుండానే వరములివ్వడం ఆవిడ పని అని చెప్తూ

త్వదన్యః పాణిభ్యాం అభయ వరదో దైవత గణైః
త్వమేకా నైవాసి ప్రకటిత వరాభీత్యభినయా
భయాత్త్రాతుం దాతుం ఫలమపిచ వాంఛా సమధికం
శరణ్యే లోకానాం తవహి చరణావేవనిపుణౌ

అంటారు సౌందర్యలహరిలో శంకరులు. అమ్మ పాదాలే వరాలిచ్చేవి గనుక 'వరదా'.

యజ్ఞపరమైన నామాలుగా కూడా లలితాసహస్రం చెప్పుకుంటున్నాం. ఈ నామంలో మరొక రహస్యమున్నది. '**వరం దక్షిణా దదాతి యజమాన రూపేణ ఇతి వరదః**'– 'వరమనగా దక్షిణ. యజమానరూపముగా దక్షిణనిచ్చునది వరదా.' దక్షిణ అంటే సమర్థత అని అర్థం. సమర్థత అంటే ఫలం. దక్షిణ ఇస్తేనే యజ్ఞం చేసిన దానికి ఫలం పూర్తి అవుతుంది. లేకపోతే పూర్తి కాదు.

దక్షిణ అనేది అమ్మవారి రూపం. దేవీభాగవతంలో 'దక్షిణాదేవి' అని ఒక దేవి చెప్పబడుతుంది. యజ్ఞానికి సార్థకతనిచ్చే తల్లి. పదిమంది సాయంతో మనం

యజ్ఞం చేసుకుంటాం. దాని ఫలితం వారికి దక్షిణరూపంలో ఇస్తేనే మనకు సంపూర్ణంగా దక్కుతుంది. 'రక్షాకరీ'కి కూడా యజ్ఞ భస్మానికి 'రక్ష' అని పేరు. ఆ యజ్ఞభస్మంగా ఉన్నది 'రక్షాకరీ' నామానికి అర్థం చెప్పారు. యజ్ఞపరమైన ఎన్నో అర్థాలు ఇందులో కనబడతాయి. అన్ని యజ్ఞాలు చేసిన ఫలం లలితాసహస్రంలో ఉంది.

332. వామనయనా – శ్రీ వామనయనాయై నమః

వామము అంటే అందం అని ఒక అర్థం. వామనయనా – అందమైన కనులు కలది. 'వామాక్షి' అని స్త్రీకే పేరు. అమ్మ కళ్ళకి అందం దయ. అమ్మవారు 'కరుణా తరంగితాక్షీ'. ఆ కళ్ళ నుండి దయ వర్షిస్తోంది. అందమైన మూడు నేత్రాలతో దయని వర్షిస్తోంది కనుక 'వామనయనా'.

ఇంకొక అర్థంలో **'ఏష ఉ ఏవ వామనీః'** అని శ్రుతి. వామ అనే మాటకి అర్థం చెప్తూ 'కర్మ వల్ల వచ్చే ఫలము వామము' అన్నారు. కర్మఫలం అందంగా ఉంటుంది. నయతి అంటే పొందించునది. వామనయన అంటే కర్మ ఫలాన్ని పొందించునది. చేసిన కర్మకు ఫలమిచ్చేది.

'వామం కర్మ జన్యఫలం తన్నయతి ప్రాపయతీతి వామనయనా' – అందమయిన కన్నులు కలది, కర్మఫలములను ఇచ్చునది. రూపపరమైన అర్థం, తత్త్వపరమైన అర్థం.

333. వారుణీమదవిహ్వలా – శ్రీ వారుణీమదవిహ్వలాయై నమః

ఇది కూడా కాదంబరీప్రియా లాగ కాస్త తిరకాసైన మాటే. వారుణీ అంటే లోకంలో కల్లు, సారాయి మొదలైన మత్తుపదార్థాలు. వాటివల్ల వచ్చే మదం ఒకటి. మదమంటే పారవశ్యం. విహ్వల అంటే తూగుతున్నది. 'వారుణీమదవిహ్వలా' అంటే మద్యపాన పారవశ్యంతో తూగుతున్న తల్లి.

అందుకే ఇది వామాచారమని కొందరు అంటారు. అది మూర్ఖత్వం. ముందు చెప్పుకున్న కాదంబరీ అర్థమే దీనికి చెప్పినా అక్కడ కాదంబరికి, ఇక్కడ వారుణీమదకి

ఇప్పుడు అన్వయం. ఇందాక కాదంబరీ దగ్గర చెప్పని మరో భావం ఇక్కడ శాస్త్రాధారంగా గ్రహించాలి.

బ్రహ్మానందం లభించిన వారికి ప్రపంచం పట్టదు. ఎందుకంటే వారికి నామరూప దృష్టే లేదు.

ఆ బ్రహ్మానంద పారవశ్యమే మదం. ఆ బ్రహ్మానందం అనే మదంతో తూగుతున్నది ఏమిటి? ఆనందం యొక్క ప్రకటన.

అధశ్చోర్ధ్వం స్థితా నాడీ వారుణీ సర్వగామినీ
పూషాదిగ్దేవతా ప్రోక్తా వారుణీ వాయుదేవతా

శరీరంలో క్రిందకి, పైకి సంచరించే ప్రధాన నాడి ఉంది. దానిని వారుణీ నాడి అంటారు. యోగంతో కూడా ఈ నాడిని ప్రచోదనం కలిగిస్తారు. ఈ నాడి మామూలు వారిలో నిద్రావస్థలో ఉంటుంది. యోగి యోగాభ్యాస పాటవంతో దానిని అదుపులో పెడతాడు. ఈ అదుపులో పెట్టినవాడు ఊపిరిని అదుపులో పెట్టగలుగుతాడు. ప్రాణశక్తిని అదుపులో పెట్టగలుగుతాడు. అప్పుడు వానికి ఆయువు పెరుగుతుంది. ఆహార నియమం, సాధన, జపం, తపం చేసే వారికి ప్రాణశక్తి నియంత్రింపబడుతుంది. దాంతో వారి ఆయుష్షు పెరుగుతుంది.

వారుణీ నాడి ప్రధానంగా వాయుదేవతగా ఉంటుంది. ఇది దిగ్దేవత. అది **'అధశ్చ ఊర్ధ్వస్థితా నాడీ'**– పైకి, క్రిందకి ప్రసరిస్తున్న ప్రాణనాడి. ఆ నాడిని నిగ్రహించి క్రమంగా సాధన చెయ్యడం వలన అందులోంచి సహస్రార కమలంలోకి ప్రసరించడం జరుగుతుంది. అప్పుడు లభించే ఆనంద పారవశ్యం వారుణీమదం. వారుణి అనేది నాడి పేరు.

వేదాంతంలో వారుణీవిద్య చెప్పబడింది. **'సైషా భార్గవీ వారుణీ విద్యా'** అని తైత్తిరీయంలో వస్తుంది. 'పంచబ్రహ్మాసనస్థితా' దగ్గర కూడా దీనిని వివరించుకున్నాం. **'భృగుర్వై వారుణిః'**– భృగువుకు బ్రహ్మవిద్యనంతటిని వరుణుడనే ఋషి ఉపదేశిస్తాడు. ఇక్కడ దిగ్దేవతలలో వరుణదేవుడు కాదు. ఆ ఋషి ఇచ్చిన విద్య పేరు వారుణీ విద్య. అది భృగువంశ సంజాతమైనది కనుక భార్గవీ విద్య.

శుక్రవారం భృగువారం. భార్గవీ అంటే శ్రీ, లక్ష్మీ. భృగు అంటే తేజఃస్వరూపం. ఇది శ్రీవిద్య. తైత్తిరీయంలో బ్రహ్మవిద్యగా చెప్పబడుతున్నది. కేనోపనిషత్తులో అమ్మ చెప్పింది. ఉపనిషత్ ప్రతిపాద్యమైన బ్రహ్మవిద్యే శ్రీవిద్య. దాని పేరే వారుణీ విద్య. అదే **'సైషా భార్గవీ వారుణీవిద్యా'**.

ముందు **'అన్నం బ్రహ్మేతి వ్యజానాత్, ప్రాణం బ్రహ్మేతి వ్యజానాత్, ఆనందోऽబ్రహ్మేతి వ్యజానాత్'** చెప్పిన తరువాత ఒక మాట అంటారు. **'ఏషా సామగాయన్నాస్తే హా ఊ హాహాఉహా'** అని ముగుస్తుంది. సామగానం అంటే ఆనందపారవశ్యంతో చేసే గానం. అంతేకాని శ్రుతి, లయబద్ధంగా ప్రక్కవాడు మెచ్చుకున్నాడా, లేదా అని చేసే పాట కాదు. ఆనందం పెల్లుబికిపోగానే గీతం వస్తుంది. అదే భ్రమరగీతం, గోపికాగీతం అని చెప్పినట్టుగా ఆ సామగానం చేస్తారు.

వారుణీవిద్య రాగానే అనగా బ్రహ్మానందపారవశ్యం కలుగగానే ఆనందంతో తూగిపోతూ **'సామగాయన్నాస్తే'** – చివరి మంత్రాలు తైత్తిరీయంలో చెప్తారు. ఆ వారుణీ విద్య, బ్రహ్మానందవిద్యతో కలిగిన పారవశ్యంతో చేసే సామగానం ఏదో అది అమ్మరూపము. అది వారుణీమదవిహ్వలలో చెప్పబడుతున్న పరమార్థం. కల్లు, సారాయి అనే సామాన్య అర్థాలను దాటి ఉపనిషత్ ప్రతిపాద్యమైన సిద్ధాంతంగా తెలుసుకోవలసిన రహస్య నామం ఇది.

మరొక అర్థం 'విహ్వలా' అంటే తూగిపోవడం. 'అవిహ్వలా' అంటే స్థిరంగా ఉండడం. అమ్మవారు చాలా స్థిరంగా ఉంటారు. 'వారుణీమత్ అవిహ్వలా' – వారుణీమాన్ అని ఆదిశేషునికి పేరు. మనలో ఉన్న కుండలినీ రూప ఆదిశేషువు వారుణీమాన్. వారుణీ మత్ అవిహ్వలా – ఆదిశేషునిలా స్థిరంగా ఉండేది అని ఒక అర్థం.

ఆదిశేషుడు భువనములన్నీ మోస్తూ ఉన్నా కదలడు. సమస్త భువనాలకు ఆధారశక్తి ఆదిశేషువు. ఆదిశేషువు అంటే అన్ని వైపులనుండి ఆక్రమించిన ఆకర్షణశక్తి. అనంత ఫణాలతో పట్టుకున్నాడు. ఈ ఆదిశేషువు ఏ విధంగా అయితే ఇన్ని భువనాలని భరిస్తూ నిశ్చలంగా ఉన్నాడో ఆ విధంగా సమస్త భువనాలని ఆధారశక్తిగా భరిస్తూ

ఆధారశక్తిగా ఉన్నది కనుక 'వారుణీమత్ అవిహ్వలా' అనే అర్థాన్ని కొంతమంది వ్యాఖ్యానించారు. ఇది కూడా ఔచిత్యమేగాని 'సైషా భార్గవీ వారుణీ విద్యా' అనే అర్థాన్నే ప్రమాణంగా తీసుకోవాలి. తరువాతి నామాలు 'విశ్వాధికా, వేదవేద్యా, వింధ్యాచలనివాసినీ'. ఈ నామాల గుంపులో వింధ్యాచలనివాసినీ మంత్రం చెప్పారు. వింధ్యవాసినీ మంత్రమని ఒక మంత్రం ఉంది. అది బీజాక్షరాలతో సహా ఉంటుంది. ఆ బీజాక్షరాలతో సహా మంత్రం చెప్పక్కర్లేదుగాని ఈ నామాల గుంపుని స్మరిస్తే చాలు.

334. విశ్వాధికా – శ్రీ విశ్వాధికాయై నమః

విశ్వాన్ని మించి ఈవిడ ఉంది. ఈవిడని మించి మరొకటి లేదు. **'విశ్వాధికో రుద్రో మహర్షిః'** అని ఉపనిషత్ చెప్తున్న వాక్యం. విశ్వాధికుడైన రుద్రస్వరూపమే అమ్మవారు. **'స భూమిం విశ్వతో వృత్వా అత్యతిష్ఠద్దశాంగులం'** అంటున్నాం. అంటే ఈ సమస్తమైన విశ్వాన్ని అతిక్రమించి దీనికి పైన ఉంది అన్నారు. ఎంత పైన అంటే మనం చూస్తున్న దాని కంటె చాలా పైన ఉంది. అందుకే '**త్రిపాదూర్ధ్వ ఉదైత్పురుషః పాదోఽస్యేహా భవాత్పునః**' – పరమాత్మయందు పావుభాగమే మనం ప్రపంచంలో చూస్తున్నది. ముప్పాతిక భాగం పైన ఉంది అన్నారు. **'పాదోఽస్య విశ్వా భూతాని త్రిపాదస్యామృతం దివి'**. విశ్వంలో అమ్మని మించిన అధికమైన వస్తువు లేదు. ఆ వస్తువు తెలియాలంటే ప్రమాణం వేదమే. మరొకటి లేదు.

335. వేదవేద్యా – శ్రీ వేదవేద్యాయై నమః

వేదము ద్వారా తెలియబడేది. **'వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః'** – మణిద్వీపంలో అమ్మవారి చింతామణి గృహానికి ప్రధానంగా నాలుగు ద్వారాలు ఉంటాయి. ఈ నాలుగు ద్వారాలకి పూజ చేస్తారు. ద్వారశ్రియై నమః, పూర్వామ్నాయ, పశ్చిమామ్నాయ, దక్షిణామ్నాయ, ఉత్తరామ్నాయములు. యజ్ఞశాలల్లో పూర్వద్వార, ఉత్తర ద్వార, దక్షిణ ద్వార, పశ్చిమద్వారాల్లో ఏం పేరులు పెడతారు?

ఋచాం ప్రాచీ మహతీదిగుచ్యతే దక్షిణామాహుర్యజుషామపారాం
అథర్వణామ్ అంగిరసాం ప్రతీచీ సామ్నాముదీచీ మహతీ దిగుచ్యతే

తూర్పు ద్వారంలో ఋగ్వేదం. దక్షిణ ద్వారంలో యజుర్వేదం. పశ్చిమ ద్వారంలో అథర్వణవేదం. ఉత్తరద్వారంలో సామవేదం ఉంటాయి. ఈ నాలుగు ద్వారాల నుండి చింతామణిగృహంలోకి వెళ్ళాలి. చింతామణిగృహంలో ఉన్నదెవరు? ద్వారమని పేరెందుకొచ్చింది? దేనిద్వారా వెళ్తామో దాని పేరు ద్వారం. లోపల ఉన్న అమ్మ అనే పరతత్త్వం దగ్గరికి వెళ్ళాలంటే వీటి ద్వారా వెళ్ళాలి. వేదాది మంత్రాల జ్ఞానం చేతనే పరతత్త్వాన్ని తెలుసుకోగలం. ఇంకొక మార్గం ద్వారా తెలుసుకోలేం. బ్రహ్మతత్త్వం గురించి చెప్పడానికి ఉన్నవి వేదం, వేదాది ఆధారమైన శాస్త్రాలు తప్ప మరి ఏ ఇతర వస్తువు లేదు. ఆ సూక్ష్మమైన విశ్వాధికమైన వస్తువుని వేదం ద్వారా తెలుసుకోవాలి.

336. వింధ్యాచలనివాసినీ – శ్రీ వింధ్యాచలనివాసిన్యై నమః

వింధ్యపర్వతంపై ఉన్న తల్లి వింధ్యవాసినీదేవి. అమ్మవారికి రకరకాల పేర్లు ఉన్నాయి. త్రికూటాద్రి మీద ఉన్న జగదంబ పేరు సీత.

'వింధ్యే యా వింధ్యవాసినీ'– వింధ్యపర్వతంపై వింధ్యవాసిని. **'నందగోపకులే జాతా యశోదా గర్భసంభవా'** – ఈవిడ నందగోపకులంలో యశోదానందులకు కుమార్తెగా పుట్టింది. కృష్ణునికి సోదరి. కంసునికి బుద్ధి చెప్పినది. పసిపిల్ల అనుకుని నేలమీద కొడితే గగనానికి ఎగిరి తన స్వరూపాన్ని చూపించి, "నిన్ను చంపేవాడు ఒకచోట పెరుగుతున్నా"డని చెప్పి వింధ్యపర్వతానికి వెళ్ళి నివసించింది. కొంతకాలం తరువాత ఆ పర్వతం ప్రాంతంలో తిరుగుతున్న శుంభ, నిశుంభులను సంహరించింది.

వైవస్వతేఽంతరే ప్రాప్తే ఉభౌ శుంభనిశుంభకౌ
ఉత్పత్స్యేతే వరాన్మత్తౌ లోకోపద్రవకారిణౌ
నందగోపకులే జాతా యశోదా గర్భసంభవా
తావహం నాశయిష్యామి నందాఖ్యా వింధ్యవాసినీ

ఆ శక్తికి నందాదేవి అని మరొక పేరు. ఈమెను కూడా దుర్గ అనే అంటారు. ఈ నామానికి ఇంకొక అర్థం చూడాలి. **'వింధ్యవీథీ ప్లవంగమః ఆతపీ మండలీ మృత్యుః పింగళః సర్వతాపనః'** అని ఆదిత్యహృదయంలో వస్తుంది. వింధ్యవీథి అంటే ఆకాశవీథి. ఆకాశాన్నంటేంత స్థితిలో ఉంది కనుక వింధ్యపర్వతమని దానికి పేరు పెట్టారు.

ఆకాశ మధ్యంలో ప్రవహించే చైతన్యధార. అదే వింధ్యవీథి. ఆ వింధ్యవీథిలో ఎగురుతూ వెళ్తున్నాడు కనుక 'వింధ్యవీథీ ప్లవంగమః' అని సూర్యుని స్తుతించారు. దీని నుండే తెలుగువారు వినువీథి అన్నారు. ఆ వింధ్యవీథిలో ఉండేది వింధ్యవాసిని. ఆకాశంలో వ్యాపించిన శక్తి. ఆకాశం ఉన్నతమైన స్థానం.

మరొక అర్థంలో మన యొక్క సుషుమ్నా నాడిని వింధ్యవీథి అంటారు. ఇది పైకి వెళ్ళిన ఆకాశసీమ సహస్రారమే వింధ్యవీథి. అక్కడ కూర్చున్న తల్లి 'వింధ్యాచలనివాసినీ'. అచలం అంటే పైన ఉండేది కనుక వింధ్యాచలనివాసినీ. సహస్రారమునందు ఉన్న తల్లి.

ఆజ్ఞాచక్రం వరకు విశ్వం. పైన ఉన్నది 'విశ్వాధికా'. దానిని తెలుసుకోవాలంటే వేదాది శాస్త్ర సహాయంతోనే తెలుసుకోవాలి (వేదవేద్యా). ఆ శాస్త్ర సహాయంతో సాధన చేస్తే అత్యున్నతమైన స్థితిలో ఆవిడ గోచరిస్తోంది. అది 'వింధ్యాచలనివాసినీ'. అమ్మవారి భక్తులైనవారు అత్యంత ప్రధానమైన ఈ విషయాలను గుర్తుంచుకుంటారు.

337. విధాత్రీ – శ్రీ విధాత్ర్యై నమః

వేదాలన్నీ ఇచ్చినవాడు విధాత బ్రహ్మదేవుడు. ఆ బ్రహ్మరూపిణి ఈమెయే. బ్రహ్మ నుండి వచ్చిన వేదాలు ఈ తల్లే. విధాత్రీ అన్నప్పుడు బ్రహ్మస్వరూపిణి అని ఒక అర్థం. బ్రహ్మకు విధాత అని పేరు ఎందుకు వచ్చింది? ధాత–విధాత. విధానం ఏర్పరుచువాడు విధాత. ఈ ప్రపంచానికి ఒక విధానముంది. సూర్యోదయం, చంద్రోదయం ఒక పద్ధతి. ఈ పద్ధతులు ఎవరు ఏర్పరిచారు? మనం ఏర్పరచలేదు.

ఉన్న పద్ధతులను అనుసరించి వెళ్ళిపోవడమే మనం చేసేది.

కాలరూపంలో, దేశరూపంలో, విశ్వరూపంలో ఒక విధానమున్నది. ఈ జగద్రూప విధానాన్ని ఏర్పరచిన తల్లి విధాత్రీ. **'విదధాతి ధారయతి పోషయతి వా జగత్ ఇతి విధాత్రీ'**-ఈ జగత్తును పోషించునది, ధరించునది అని అర్థం.

అలా సర్వజగత్తు పోషణ ఏ తల్లి బాధ్యతయో ఆ తల్లి 'విధాత్రీ'. **'ధాత్రీ మాతా సమాఖ్యాతా ధారణాచ్ఛోపగీయత'** – విధాత శక్తి 'విధాత్రీ'. అదే విధంగా జగత్తునంతటిని పోషించునది 'విధాత్రీ'.

ఈ ప్రపంచాన్ని ధర్మమే పట్టి నిలుపుతోంది. ఆ ధర్మరూపం అమ్మవారు. 'విధాత్రీ' అంటే ధర్మరూపిణి. లోకాన్ని భరించేవారు అనేకమంది ఉన్నారు. **'విశేషేణ శేష దిగ్గజ భూధరాన్ సర్వభూతానాం ధాతౄన్ దధాతీతి విధాతా'** – ఈ భూమిని భరించే ఆదిశేషువు, దిగ్గజాలు ఇవన్నీ భూమిని భరించేవి. వాటన్నిటిని భరిస్తున్న శక్తి ఈవిడ. వారందరికి శక్తి ఈ తల్లి. ఇంకో అర్థం విధాత అంటే **'కర్మణాం తత్ఫలానాంచ కర్తా విధాతా'** – జీవుల కర్మలేమిటి? వారికి ఏ ఫలమివ్వాలనే ఫలప్రదాయక శక్తిని 'విధాతా' అంటారు. లోకంలో ఏదైనా జరిగితే విధి విలాసమండీ అంటారు. విధి అన్నా, విధాత అన్నా ఒక్కటే. విధి అంటే వారి కర్మకి తగ్గ ఫలం ఇవ్వడం ఎవరి బాధ్యతో వారు విధాత. ఆ రూపంగా సర్వజీవులకి వారివారి ఫలాలను ప్రసాదించే తల్లి 'విధాత్రీ'.

338. వేదజననీ – శ్రీ వేదజనన్యై నమః

వేదాల తల్లి. 'కడుపు చల్లంగ వేదాళి కన్నతల్లి' అంటాడు శ్రీనాథ మహాకవి. సృష్టిలో ఏ జ్ఞానమైనా, ధర్మమైనా వేదం ద్వారానే రావాలి. **'వేదోఽఖిలధర్మమూలం'**. విద్ అనే ధాతువు నుంచే వేదమనే శబ్దం వచ్చింది. సర్వ జ్ఞానాలకు ఆధారం వేదం. దానిని అనుసరించి ఇతిహాస, పురాణ, ఇత్యాది శాస్త్రాలన్నీ వచ్చాయి. వేదాలు అపౌరుషేయాలు. మానవ సృష్టి కాదు. మరి ఎక్కడి నుండి వచ్చాయంటే అమ్మ నుండి వచ్చాయి. వేదాలే తల్లి. వేదమాత సాక్షాత్తుగా గాయత్రీస్వరూపంగా

చెప్పబడుతుంది. ఆ తల్లి లలితాదేవి. లలితాదేవిని ఆరాధిస్తే అదే గాయత్రీ ఉపాసన.

శబ్దాత్మికా సువిమలర్గ్యజుషాం నిధానం
ఉద్గీథరమ్య పదపాఠవతాం చ సామ్నాం
వేదత్రయీ భగవతీ భవభావనాయ
వార్తాచ సర్వజగతాం పరమార్తిహంత్రీ

'దేవీమాహాత్మ్యం'లో దేవతలందరూ అమ్మవారి గురించి ఈ విధంగా స్తోత్రం చేశారు. **శబ్దాత్మికా** –నువ్వు శబ్ద బ్రహ్మస్వరూపిణివి (వేదస్వరూపం అని భావం) అమ్మా! నువ్వే **'సువిమలర్గ్యజుషాం నిధానం'** – ఋగ్యజుస్సులుగా ఉన్న దానవు. **ఉద్గీథరమ్య పదపాఠవతాం చ సామ్నాం**– ఎలుగెత్తి గానం చేసే సామం నీ స్వరూపం. ఈ విధంగా **వేదత్రయీ** –ఋగ్యజుస్సామాత్మకంగా వచ్చిన దానవు. **ఋచః సామాని యజూగ్ంషి** అని శ్రుతి.

అస్య మహతో భూతస్య నిశ్వసితమేతద్ ఋగ్వేదో
యజుర్వేదస్సామవేద అథర్వాంగి రసః

అని ఉపనిషత్ చెపుతున్న మాట. ఆ పరతత్త్వము యొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసాలే వేదాలుగా వచ్చాయి. వేదాలన్నిటికి కారణం గనుక ఈ తల్లిని వేదజననీ అన్నారు. ఇదే హయగ్రీవస్వామివారు బ్రహ్మాండపురాణంలో అమ్మవారి విరాట్ వర్ణన చేస్తారు.

వేదాః నిశ్వసితం యస్యాః వీక్షితం భూతపంచకమ్
స్మితం చరాచరం యస్యాః తస్యై దేవ్యై నమో నమః

ఏ తల్లి నిట్టూర్పులు వేదాలై వచ్చాయో, ఏ తల్లి చూపులతోనే పంచభూతాలు ప్రకటింపబడ్డాయో, ఏ తల్లి చిరునవ్వు ఈ చరాచరముగా సృజింపబడినదో ఆ తల్లికి నమస్కారం.**'యతః శృంగాటకాకార కుండలిన్యాస్సముద్గతాః, స్వరాశ్చ వ్యంజనానీతి వేదమాతా తతః స్మృతా** (దేవీపురాణం) – నాలుగు వీధుల కూడలి (శృంగాటకం) వంటి ఆకృతి కలిగిన కుండలినీ శక్తి వల్లనే అచ్చులు, హల్లులు వ్యక్తమయ్యాయి. కనుక ఆ శక్తినే 'వేదమాత' అన్నారు.

339. విష్ణుమాయా – శ్రీ విష్ణుమాయాయై నమః

ఇదంతా కామకలారూపమనే నామాన్ని ఆధారం చేసుకుని వస్తున్న నామ పరంపర. 'ఈ' అనబడే కామకలా బీజం యొక్క విస్తారము వేదాది స్వరూపాలు. వేదాది విద్యలన్నీ ఆ కామస్వరూపమైన పరమేశ్వరీ పరమేశ్వరులనుండే వచ్చాయి. దాని యొక్క విస్తారమే 'విష్ణుమాయావిలాసినీ'. రెండు నామాలివి. విష్ణుమాయావిలాసినీ అని కలిపి చదువుతారు కానీ రెండు విడివిడి నామాలుగా విజ్ఞులు స్వీకరించారు. అమ్మవారికి మరో పేరు విష్ణుమాయా. విష్ణువు యొక్క మాయ అని మాత్రమే అర్థం కాదు. విష్ణు అంటే వ్యాపించినది అని అర్థం. వ్యాపించి ఉన్న మాయాస్వరూపిణి. జగత్తంతా మాయ చేతనే వ్యాపించబడి ఉంది.

మాయాంతు ప్రకృతిం విద్యాత్ మాయినంతు మహేశ్వరమ్ – 'మాయ అనేది ప్రకృతి, మాయను తన వశంలో ఉంచుకొనువాడు మహేశ్వరుడు.'

ఆ మాయనే 'మమ మాయా దురత్యయా' అంటాడు గీతలో కృష్ణపరమాత్మ. నా మాయ అన్నాడు కనుక విష్ణుమాయా. విష్ణువు వేరు, మాయ వేరు కాదు. ఆయనే పెద్దమాయావి. మాయ అంటే 'అనిర్వచనీయ శక్తిః'. ఉన్నది అని అనలేం, లేదని త్రోసిపుచ్చలేం. **'విచిత్ర కార్యకరీ, అనిర్వచనీయా' 'దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా'** – పరమాత్మ యొక్క త్రిగుణాత్మికమైన మాయాశక్తి అమ్మవారు. అది విశ్వమంతా వ్యాపించి ఉంది కనుక 'విష్ణుమాయా'. **'యా దేవీ సర్వభూతేషు విష్ణుమాయేతి శబ్దితా'** – సర్వభూతముల యందు విష్ణుమాయగా చెప్పబడుతున్న తల్లి.

340. విలాసినీ – శ్రీ విలాసిన్యై నమః

ఆ శక్తి చేసేదే విలాసం. విలాసినీ అనే మాటకు చాలా అర్థాలు ఉన్నాయి. ఇది చాలా లోతైన మాట. విలాసమంటే తాను చేసే ప్రకటనము. ఇది నాట్యశాస్త్ర శబ్దం. భరతుడు నాట్యశాస్త్రంలో విలాసమంటే చెప్తూ **'భావహావోదయః విలాసః'** అన్నాడు. భావహావం– దీనినే మనం హావభావాలు అంటాం.

ఒకదానిని ప్రకటించేటప్పుడు భావం ఉంటుంది. ఆ భావాన్ని రకరకాల భంగిమలతోను, ముద్రలతోను, అభినయంతోనూ ప్రకటిస్తే దాన్ని హావం అనాలి. అలాగే నాట్యశాస్త్రంలో హావ, భావాలు ఉన్నాయి. అమ్మవారు ఈ జగద్రూపంగా హావం, భావం ప్రకటిస్తున్నారు.

నాట్యశాస్త్రంలో ఒక నర్తకి హావభావాలు ప్రకటించినపుడు ఆ నర్తకి అసలు స్వరూపం వేరు. ప్రకటిస్తున్న హావభావాలు అక్కడ ఉన్న వృత్తాంతాన్ని ఆధారం చేసుకుని ఉంటాయి. అవి ఆవిడవి కావు. ఒక భావాన్ని తాను అభినయిస్తోంది. మాయ అంటేనే పరమాత్మ యొక్క అభినయం.

నర్తకుని భంగి పెక్కగు మూర్తులలో నెవ్వడాడు
మునులును దివిజుల్ కీర్తింప నేరరెవ్వరి వర్తనము

అని గజేంద్రుడు చెప్పినట్లుగా ఆ శక్తి విష్ణుమాయగా రకరకాల హావభావాలుగా ఈ జగమంతా ప్రకటింపబడుతున్నది. మనకొక భావము కలిగితే దానిని ప్రకటిస్తాము. అలా సృష్టిలో అన్నీ హావభావాలు ప్రకటిస్తూ ఉంటాయి. ఒక జంతువు కూడా తన ఆనందాన్ని, కోపాన్ని ప్రకటిస్తుంది.

ప్రకృతిలో చెట్లు మొదలైనవి కూడా ఆయా కాలాలలో వాటి యొక్క తత్త్వాన్ని ప్రకటిస్తూ ఉంటాయి. ఈ ప్రకటింపబడే శక్తి అంతా అమ్మవారే. ఇది మనం గమనించినట్లైతే ప్రపంచమంతా విష్ణుమాయ యొక్క విలాసమే. 'విష్ణుమాయా' 'విలాసిని' అంటే ఇదొక ప్రధానమైన అర్థం.

ఇంకొక అర్థం మోహినీ స్వరూపాన్ని 'విలాసినీ' అంటారు. 'అశేషజనమోహినీం' ఆ మోహినీ శక్తి అమ్మవారు. విష్ణుమాయయే మోహినీ కాగలదు. అందుకే విష్ణువు మోహిని అయ్యాడు. విష్ణుమాయా విలాసినే ఈ మోహినీ. ఈ మోహినీ శక్తి ఎక్కడ ఉంది? ఎక్కడ లేదు? ముఖ్యంగా ఆధ్యాత్మిక సాధన చేసే వారి దగ్గరికి చాలా చక్కగా వస్తుంది. మోహపెడుతూ ఉంటుంది. దానిని దాటుకుంటూ వెళ్తూ ఉండాలి.

కొన్నికొన్ని మంత్ర సాధనలు చేసేటప్పుడు రకరకాల సౌందర్యరూపాలు

వ్యక్తమౌతూ ఉంటాయి. అవి ఒకొక్కప్పుడు సూక్ష్మ ప్రపంచంలోనే దర్శనమిస్తూ ఉంటాయి. ఒక మంత్రానికి సరిగ్గా ప్రక్రియ చెప్తారు. ఆ ప్రక్రియ చేసేటప్పటకి కొంతమంది అప్సరఃకాంతలు దర్శనమిస్తారు. ఆ సౌందర్యం దర్శనమిచ్చినపుడు కూడా మాతృభావంతో చూసి నమస్కరించగలిగితే బాగుపడతారు. పైకి వెళ్ళు అని పంపిస్తుంది. లేకపోతే క్రింద పడతారు.

ఇవే పురాణాలలో కూడా తాపసుల వద్దకు మేనక రావడం వంటి వృత్తాంతాలు. మేనక కోసం తపస్సు చేయటం కాదు కదా! తపస్సు చేస్తుంటే వచ్చినది. పురాణ కథలు చెప్తున్న విషయం ఏమిటో గమనించుకోవాలి. సాధకుడైనవానికి రకరకాల వ్యామోహాలు ఎదురవుతూ ఉంటాయి. ఒకొక్కప్పుడు అవి కనబడితే సిద్ధి ఏమో అనే అనుమానం కూడా వస్తూ ఉంటుంది.

అన్వేషణకి వెళ్ళినపుడు హనుమత్స్వామి మందోదరిని చూడగానే సీతయేమో అనుకుంటాడు. మహాయోగి కనుక తరువాత వెంటనే సీత కాదని నిర్ణయించుకున్నాడు. అక్కడ ఒక యోగశాస్త్రవేత్త అద్భుతమైన వ్యాఖ్యానాన్ని అందించారు. ఇది యోగసిద్ధినే చెప్తుందయ్యా అన్నారు. అసలైన సిద్ధి ఆ లలితాపరమేశ్వరీ అయిన సీతమ్మ. ఆవిడ దర్శనానికి వెళ్తూ ఉంటే ఇదే సిద్ధేమో అని భ్రాంతి కలిగింది. కాని యోగైనవాడు దాటి వెళ్ళాడు. అదే విధంగా సాధనలో 'విలాసినీ' అనేది ఆపుతూ ఉంటుంది. ముఖ్యంగా కుండలినీ శక్తి గమనంలో కూడా కొన్ని చక్రాలు దాటి వెళ్ళగలరు. కానీ బ్రహ్మరంధ్రం దగ్గరికి వెళ్ళడం మహాకష్టం.

'ద్వారం సా మోక్షమార్గస్య రోధయిత్వా వ్యవస్థితా'– సరిగ్గా మోక్షద్వారం దగ్గర అడ్డుకునే ఒక శక్తి ఉంటుంది. ఆ శక్తి పేరు విలాసినీ. విలాసినీ శక్తి అంటే సిద్ధికి అవరోధం కలిగించే శక్తి. అది కూడా ఆవిడే. సిద్ధి ఆవిడే, సిద్ధికి అవరోధము ఆవిడే. ఇది జాగ్రత్తగా తెలుసుకోవాలి.

ఒక విద్యాసంస్థ చదివిస్తుంది. చదివిన తరువాత పరీక్షలు పెడుతుంది. పరీక్షలు పెట్టి కొందరిని తీసివేస్తుంది. ఎందుకు పెట్టారు? నిజమైన యోగ్యుడు అవునో, కాదో గమనించుకోవాలి. తీర్చిదిద్దాలి. అందరికి మోక్షమార్గంలో

ప్రవేశముంటుందా? సాధన చేసేవారికే పరీక్షలు. చదువుకునే వారికి పరీక్షలు. కొందరంటూ ఉంటారు, "ఎందుకు స్వామి ఇన్ని పరీక్షలు పెట్టావు" అని. పరీక్షలు పెట్టడానికైనా అర్హత ఉంటే అదృష్టంగానే భావించాలి.

సరిగ్గా బ్రహ్మరంధ్ర స్థానం దగ్గరికి వచ్చేటప్పటికి ఒక పొరలా ఆవిడ సహస్రార ప్రవేశానికి అడ్డుతుంది. ఆ శక్తి విలాసినీ. ముందే ఆ విలాసినీ శక్తికి నమస్కారం చేసుకోగలిగితే అక్కడ వివేకం ఉదయిస్తుంది. వివేకం ఉదయిస్తే అప్పుడు ఆ తల్లి పక్కకి తొలగి, "ఇక వెళ్ళు" అని చెప్తుంది. ఆ తల్లే ఆపేది, ఆ తల్లే లోపలికి పంపేది. రెండూ ఆ శక్తే! ఈ తల్లిని వర్ణిస్తూ– **'విలాసినీ శక్తిః కష్టతరాధిగమ్యా'** అన్నారు. ఎంతో కష్టం చేతనే దాటగలిగిన శక్తి.

జ్ఞానినామపి చేతాంసి దేవీ భగవతీ హి సా
బలాదాకృష్య మోహాయ మహామాయా ప్రయచ్ఛతి

ఆ మహామాయ, ఇక్కడ విలాసిని రెండు ఒకటే. స్వచ్ఛంద తంత్రము అనే గ్రంథానుసారం అమ్మవారు మూడు శక్తులుగా అనుగ్రహిస్తూ ఉంటుంది. **నిత్య, విలాసినీ, దోగ్ధ్రీ** – దుగ్ధ అంటే పితకడం. దోగ్ధ్రీ అంటే పితికి ఇచ్చేది. నిత్య అంటే ఎప్పుడూ ఉండే తల్లి పరాశక్తి. విలాసినీ అంటే ముందు చెప్పుకున్నట్లు అడ్డుకుంటుంది. ఆ సాధకుడు యోగ్యుడైతే దోగ్ధ్రీగా ఆవిడే ఆ పరతత్త్వాన్ని పితికి ఇస్తుంది. పితికి ఇవ్వడం అంటే సహస్రార కమలంలో ఉన్న అమృతాన్ని అందించే శక్తియే. అందుకోకుండా ఆపే శక్తి విలాసినీ. రెండూ ఒక్కరే– నిత్య.

లలితా సహస్రనామాలు జాగ్రత్తగా చదివి, ఈ నామం దగ్గర "అమ్మా! నన్ను మోహంలో పడనీయకు తల్లీ! నాకు అంత శక్తి లేదు" అని పాదాలు పట్టుకోగలిగితే అప్పుడు ఆ పిల్లవానిని ఆవిడ తప్పకుండా అనుగ్రహిస్తుంది.

క్షేత్రస్వరూపా క్షేత్రేశీ క్షేత్రక్షేత్రజ్ఞపాలినీ
క్షయవృద్ధివినిర్ముక్తా క్షేత్రపాలసమర్చితా

ఇవి క్ష కారంతో వస్తున్న నామాలు.

341. క్షేత్రస్వరూపా - శ్రీ క్షేత్రస్వరూపాయై నమః

342. క్షేత్రేశీ - శ్రీ క్షేత్రేశ్యై నమః

అమ్మ క్షేత్రముల రూపంతో ఉన్నది. క్షేత్రాలకు ఈశ్వరిగా ఉన్నది. రెండూ ఆవిడే. సాధారణంగా క్షేత్రం వేరు, నియామకులు వేరుగా ఉంటారు. ఒకొక్కప్పుడు ఒకే క్షేత్రానికి పది, పదిహేనుమంది నియామకులు ఉంటారు. ఇవాళ ఈ క్షేత్రానికి ఒకడు ఈశ్వరుడు అయితే మరికొన్నాళ్ళకు అతను పోయి మరొకడు వస్తూ ఉంటాడు. క్షేత్రం వేరు, క్షేత్రేశ్వరుడు వేరు అయితే ఇలా ఉంటుంది. ఈవిడే క్షేత్రస్వరూపా. ఈవిడే క్షేత్రేశీ. క్షేత్రమూ ఈవిడే. క్షేత్రేశ్వరీ ఈవిడే. సకల జీవ శరీరాలూ ఆ చిచ్ఛక్తికి క్షేత్రాలే. వాటి నియామకురాలు ఆ తల్లియే.

క్షేత్రాలన్నీ తల్లి రూపాలే. లోకంలో పుణ్యక్షేత్రాలు అని చెప్తుంటాం. దేవతాశక్తి ఎక్కడ కేంద్రీకృతమై ఉందో అది క్షేత్రం.

'క్షేత్రరూపీ మహేశ్వరః' అని శివపురాణంలో ఒక మాట ఉంది. క్షేత్రాలన్నీ ఈశ్వర రూపాలు. భగవంతుడు మనల్ని అనుగ్రహించడం కోసం రెండు రూపాలతో వచ్చాడు. అవి క్షేత్రరూప, కాల రూపాలు. క్షేత్రాలలో పుణ్యక్షేత్రాలు, కాలాలలో పుణ్యకాలాలు. ఈ రెండూ మనం తరించడం కోసం పెట్టారు.

పుణ్యకాలాలు అంటే బ్రాహ్మీముహూర్తం, సంధ్యాసమయాలు, పూర్ణిమ, అమావాస్య, శివరాత్రి, ఏకాదశి మొదలైనవి. అన్నీ కాలాలే. రోజూ ఒకేలాగ కనబడుతున్నా కాలాలలో పుణ్యమైనవి, దేశాలలో పుణ్యమైనవి ఉంటాయి.

భగవచ్ఛక్తి ఎక్కడ కేంద్రీకృతమై ఉంటుందో అన్నాం, కానీ ఎక్కడుంటుందో అనలేదు. అంతటా ఉంది కానీ ఒక చోట కేంద్రీకృతమై ఉంది.

అలా కేంద్రీకృతమవడానికి రెండు కారణాలు ఉంటాయి. మహర్షుల తపస్సులు, భగవత్సన్నిధి. తపస్సునాచరించి భగవచ్ఛక్తిని అక్కడ వారి తపస్సుతో కేంద్రీకృతం చేస్తారు. అప్పుడు భగవంతుడు సంతోషించి వారి తపస్సుకు ఫలితంగా అక్కడ ఉండిపోతాడు. మనం దేవతలకంటె ముందు ఋషులకి నమస్కారం చేసుకోవాలి. భక్తులకి నమస్కారం చేసుకోవాలి. భగవంతుని ఒకొక్కచోట వారు దింపారు. అలా

దింపడం చేత ఆయన దిగాడు. వారి తపస్సు కేంద్రీకృతమైంది, వారి తపస్సు వల్ల వచ్చిన భగవంతుడు అక్కడ ఉన్నాడు గనుక క్షేత్రాలకి శక్తి ఎక్కువ ఉంటుంది. క్షేత్రం ఆవిడే. క్షేత్రాన్ని నియమించి పాలించేది కూడా ఆ తల్లే.

"బిభర్తి క్షేత్రతాం దేవీ త్రిపురాంతకవల్లభా। క్షేత్రజ్ఞత్వమతో ధత్తే భగవానంత కాంతకః"(లింగపురాణం) - త్రిపురాంతకుని ప్రియసతి క్షేత్రత్వాన్ని ధరిస్తున్నది. యమాంతకుడైన శివభగవానుడు క్షేత్రజ్ఞత్వాన్ని పొందుతున్నాడు. క్షేత్రజ్ఞ క్షేత్రములు - శివశక్తులు. క్షేత్రమందు వ్యాపించిన చిచ్ఛక్తి దేవి. ఆ శక్తిమంతుడు క్షేత్రజ్ఞుడు శివుడు.

343. క్షేత్రక్షేత్రజ్ఞపాలినీ - శ్రీ క్షేత్రక్షేత్రజ్ఞపాలిన్యై నమః

భగవద్గీతలో క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగం అంతా ఈ నామాలలో ఉంది.

ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః
క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత

అని రెండు మాటలు చెప్తున్నాడు. ఈ శరీరమే క్షేత్రము. క్షేత్రము అంటే పొలం. ఎక్కడ పంటలు పండించుకోగలమో అది క్షేత్రం. మన కర్మ పంటలు పండించుకుని అనుభవించే శరీరమే క్షేత్రం. ఇది వరకు కర్మలు అన్నీ పండించుకుని దీనిలోనే సుఖదుఃఖ రూపాలతో అనుభవిస్తున్నాం. దీనిలో పండించుకుని అనుభవించుకునేవాడు ఒకడు ఉన్నాడు.

పాదం నుండి శిరస్సు వరకు నేను చూశాను, నేను విన్నాను, నేను తిన్నాను అని... చూసింది ఒకటైతే, నడచింది ఒకటైతే నేను చూశా, నేను నడిచా అని 'నేను'తో సంబంధం పెడుతున్నవాడు ఒకడు ఉన్నాడు. ఈ 'తెలుసుకుంటున్నవాడు'. 'ఈ శరీరం నేను అనుకుంటున్నవాడు' '**క్షేత్రజ్ఞః**'.

శరీరము క్షేత్రము, దీనిలో తెలుసుకుంటున్న ప్రజ్ఞారూపంగా ఎవడు ఉంటున్నాడో వాడు క్షేత్రజ్ఞుడు. మన క్షేత్రాలకి మనమే ఈశ్వరులం. ఇది వరకు

కర్మల ఫలంగా మనకి ఇవన్నీ వచ్చాయి. ఇదంతా మన వల్ల మనకే లభించాయి. కర్మఫలదాయిని ఆ పరమేశ్వరి – క్షేత్రక్షేత్రజ్ఞపాలిని.

క్షేత్రజ్ఞుడు, క్షేత్రేశీ, క్షేత్ర – మూడు శబ్దాలు వచ్చాయి. ఈ క్షేత్రంలో ఉన్న 'నేను' అనబడే చైతన్యం క్షేత్రజ్ఞుడు. ఇందులో ఏ ఒక్కటైనా ఈ క్షేత్రంలో నేను తయారు చేసుకున్నానా? ఎవరికి వారు ఆలోచించుకోవచ్చు. పాదాలనుండి శిరస్సు వరకు శక్తి ఎవరు?

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే అర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా

రాజ్యాన్ని పాలించే రాజుగారు కోటలో కూర్చున్నట్లుగా, శరీరాన్ని పాలించే పరమేశి 'క్షేత్రేశీ' హృదయంలో కూర్చొని మొత్తం శరీరాన్ని నియమిస్తోంది. శరీరం నేను అనుకుంటున్న నాకు కూడా శరీరం మీద అధికారం లేదని తెలుస్తూనే ఉంటుంది. ఇందులో ఆరోగ్యం గాని, బాల్యం, యౌవనం, కౌమారం గాని మన స్వాధీనంలో ఉన్నాయా?

క్షేత్రమైన శరీరాన్ని, క్షేత్రజ్ఞుడైన జీవుని...రెండింటిని తన స్వాధీనంలో పెట్టుకుంది కనుక 'క్షేత్రక్షేత్రజ్ఞపాలినీ'.

చతుర్వింశతి తత్త్వాని క్షేత్రశబ్దేన సూరయః
ఆహుః క్షేత్రజ్ఞ శబ్దేన భోక్తారం పురుషం తథా

'ఇరువదినాలుగు తత్త్వములకు క్షేత్రమనియు, దీనిని ఎరిగినవాడు, భోక్తయైన పురుషుడు క్షేత్రజ్ఞుడనియు విజ్ఞులు చెప్తారు' – అని లింగపురాణ వాక్యం

'అవ్యక్తం క్షేత్రముద్దిష్టం బ్రహ్మాక్షేత్రజ్ఞ ఉచ్యతే' – అని వాయుపురాణోక్తి. ఆ అవ్యక్తము(ప్రకృతి) క్షేత్రమని, బ్రహ్మక్షేత్రజ్ఞుడని భావం. ఇలా ఆర్షవాఙ్మయం ఒకే సత్యాన్ని ప్రకటిస్తోంది. **'యోఽస్యాత్మనః కారయితా తం క్షేత్రజ్ఞం ప్రచక్షతే'** – శరీరాలచే కార్యాలను చేయించేవాడు క్షేత్రజ్ఞుడు – అని మనుస్మృతి చెబుతోంది.

క్షేత్రం – క్షేత్రజ్ఞుడు – క్షేత్రేశీ. జగత్ – జీవ – ఈశ్వరులు. తత్త్వతః మూడు లేవు. ఒకే బ్రహ్మము. దానియందే మూడు భాసిస్తున్నాయి.

344. క్షయవృద్ధివినిర్ముక్తా - శ్రీ క్షయవృద్ధివినిర్ముక్తాయై నమః

ఈ క్షేత్రానికి ఒక లక్షణం ఉంది. క్షేత్రమంతా అమ్మవారే. క్షేత్రజ్ఞుడైన జీవుడు కూడా అమ్మవారే. కానీ ఈ క్షేత్రానికి క్షయము, వృద్ధి రెండూ ఉన్నాయి. క్షయం అంటే తరిగిపోవుట, వృద్ధి అంటే పెరిగిపోవుట. ఈ క్షేత్రము, కేత్రజ్ఞుడు, క్షేత్రేశీ అమ్మవారే అయినప్పటికీ ఈ క్షేత్రానికి ఉన్న క్షయవృద్ధి లక్షణాలు ఆ తల్లికి లేవు. ఆవిడ చైతన్యస్వరూపిణి.

క్షయవృద్ధివినిర్ముక్తా - క్షయముగాని, వృద్ధిగాని ఈ రెండూ లేని తల్లి.

ఆవిడ వల్ల ఉపాధులు పని చేస్తున్నాయి. ఉపాధులు పోయినా ఆవిడ అలాగే ఉంది. కెరటాల నిండా సముద్రం ఉంది. కెరటం లయం అయిపోయింది. సముద్రం అలాగే ఉంది. అలాగే ఉపాధులు లయం అయిపోయినా చైతన్యం అలాగే ఉంటుంది. ఈ ఐక్యతని తెలుసుకోవాలి.

నామవిద్య జ్ఞానవిద్యయే. పరమాత్మ జ్ఞానాన్నివ్వడానికి నామాలు వచ్చాయని ముందే చెప్పుకున్నాం.

345. క్షేత్రపాలసమర్చితా - శ్రీ క్షేత్రపాలసమర్చితాయై నమః

క్షేత్రపాలుని చేత పూజింపబడుతోంది. క్షేత్రజ్ఞుడు జీవుడు. ఈ శరీరము నేను, నేను అని అనుకుంటున్నంత కాలం వీడు జీవుడు అని చెప్పబడతాడు. ఈ శరీరం, ఈ శరీర చైతన్యం అమ్మవారే అని అనుకున్నాడో, జీవునికి జీవభావం పోతుంది. జీవభావం పోయిన వానికి మరి పుట్టుక లేదు.

శరీరము నేను అని అనుకుంటున్నంత కాలం వాడు క్షేత్రపాలుడే. ఈ క్షేత్రపాలుడు అయిన జీవుడు అమ్మవారిని అర్చించాలి. ఏ తల్లి నాలో ఈ చైతన్యంగా ఉన్నదో ఆ తల్లినే నేను ఆరాధిస్తున్నాను అని అర్చించాలి. అలా అర్చించే జీవునికి క్షేత్రపాలుడు అని పేరు. ఆ క్షేత్రపాలుని చేత అర్చింపబడుతున్న తల్లి 'క్షేత్రపాలసమర్చితా'.

ఇంత తెలుసుకున్నవారు అమ్మవారిని బాగా అర్థం చేసుకుని ఆరాధిస్తారు.

కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని చూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము

ఈ కరములు, శిరము ఎక్కడున్నాయి? క్షేత్రము లోనివేగా. ఇవి అర్పించేవాడు ఎవడు? క్షేత్రపాలుడేగా. కనుక అర్పిస్తూ ఆరాధిస్తున్నది ఎవరిని? ఆ తల్లినే. ఆమెయే **క్షేత్రపాలసమర్చితా.**

మరొక అర్థం చూస్తే – క్షేత్రాలు అనగా రకరకాల క్షేత్రములు చెప్పుకున్నాం. ప్రతి క్షేత్రంలో క్షేత్రపాలకులు కొందరు ఉంటారు. క్షేత్రపాలకుడు, మూలదేవత ఉంటారు. కాశీక్షేత్రానికి వెళ్తే విశ్వనాథుడు దైవం, క్షేత్రపాలకుడు కాలభైరవుడు. ఇలా ఒకొక్క క్షేత్రంలో ఒకొక్క క్షేత్రపాలకుడు ఉంటారు.

అద్వైతసిద్ధి రానంత వరకు జీవుడు మొట్టమొదట "ఈ శరీరం నేను" అని అనుకుంటాడు. తరువాత "ఈ శరీరాన్నీ, నన్ను కూడా అమ్మే నడుపుతోంది" అనుకుంటాడు. ఇది రెండవ మెట్టు. మూడవ మెట్టుకి వెళ్ళేటప్పటికల్లా, "ఈ శరీరాన్నీ, నన్నూ అమ్మ నడపడం ఏమిటి? అసలు నేను అనేది ఒకటి ఉందా? మొత్తం అమ్మయే" అనుకుంటాడు. ఇది అద్వైత సిద్ధి. గమ్యం. రెండవ మెట్టు చేరితే గానీ గమ్యానికి చేరుకోలేం. చాలా మంది రెండవ మెట్టు కూడా వెళ్ళరు గనుక మూడవది చెప్తే అర్థం కాదు. ఆ స్థితిలో అది సరి అయినదే.

జీవుడు ఈశ్వరుని ఆరాధిస్తున్నంత కాలం 'నీ అంశను నేను, నువ్వు పూర్ణుడవు' అన్న భావనతో ఆరాధించుకుంటూ ఉంటాడు. ఉపాధితో తాదాత్మ్యం ఇంకా ఉంది కనుక. అది ఉన్నంత కాలం క్షేత్రపాలుడు. అప్పుడు ఆమె సమర్చితా. అలా ఆరాధన చేస్తూ ఉంటే ఆ తల్లి 'క్షయవృద్ధివినిర్ముక్తా' దశకి తరువాత తీసుకు వెళ్తుంది. కనుక క్షేత్రం దొరికినా, మనం క్షేత్రాన్ని భగవత్ సేవకి వినియోగించగలిగితే క్షేత్రపాలకులం అవుతాం. మన చేత ఆరాధింపబడే తల్లి 'క్షేత్రపాలసమర్చితా'.

'పంచవర్గ ధర్మీభూత ఆత్మజ్ఞానామృతేన వివశ్యాత్మసన్నిధౌ నిత్యత్వేన

ప్రతీయతే చ తత్ప్రతిఫలితం చైతన్యం యత్ ప్రకాశతే స క్షేత్రజ్ఞః' - అంతఃకరణ చతుష్టయం (4), పంచప్రాణ (5), పంచభూత (5), త్రిగుణ (3), పుణ్యాపాపములు (2) - ఈ పంచవర్గముల ధర్మములను కలిగిన ధర్మి జీవుడు, ఆత్మ (క్షేత్రేశీ) సన్నిధిచేత ప్రకాశిస్తున్నాడు. పందొమ్మిది ధర్మములున్న దేహము క్షేత్రము. ధర్మి జీవుడు క్షేత్రజ్ఞుడు. అతనిలో (జ్ఞ) ప్రకాశము ఈశ్వరి (పరమాత్మ - క్షేత్రేశీ). ఆ ఈశ్వరియే 'క్షేత్ర-క్షేత్రజ్ఞ-పాలినీ'. క్షేత్ర తాదాత్మ్యాన్ని (దేహాత్మభ్రాంతిని) వదలి, క్షేత్రజ్ఞుడు (జీవుడు) దేహాన్నీ, తననీ ప్రకాశింపజేసే క్షేత్రేశిని గ్రహించినప్పుడు క్షయ, వృద్ధి లేని ఆ పరమాత్మతత్త్వమే తాననే జ్ఞానంతో ముక్తుడౌతాడు.

అనిత్యం, పరాధీనం, జడం, పరిచ్ఛిన్నం, అసత్యం, దుఃఖం, కార్యం - ఈ ఏడూ క్షేత్ర(దేహ)లక్షణాలు.

నిత్యం, స్వతంత్రం, జ్ఞానం, అనంతం, సత్యం, ఆనందం, కర్త - ఇవి క్షేత్రజ్ఞుని లక్షణాలు. కానీ తన ఈ స్వస్వరూపాన్ని తెలుసుకోలేక, దేహలక్షణాలతో తాదాత్మ్యం చెందడమే బంధం. స్వరూప లక్షణాలు (నిత్య, స్వతంత్రాదులు) కలిగినది పరమాత్మ లలిత. అది క్షయవృద్ధివినిర్ముక్తా. జీవుడు(క్షేత్రజ్ఞుడు) తత్త్వతః 'తత్' స్వరూపమే. దానిని గ్రహించేందుకు క్షేత్రమైన దేహేంద్రియబుద్ధులను నియంత్రించినప్పుడు 'క్షేత్రపాలకుడు'. తద్వారా ఏకాగ్రబుద్ధితో ఉపాసించి, క్రమంగా విచారణపూర్వక జ్ఞానంతో జీవబ్రహ్మైక్యాన్ని పొంది క్షయవృద్ధివినిర్ముక్త స్థితిని - అనగా కైవల్యాన్ని పొందుతున్నాడు.

అలా ఆయా క్షేత్రాలయందు క్షేత్రపాలకుల చేత ఆరాధింపబడుతున్న తల్లి అని మరొక అర్థం. సర్వజీవుల చేత ఆరాధింపబడే తల్లి 'క్షేత్రపాలసమర్చితా'. ఇక్కడితో క్షేత్ర, క్షేత్రజ్ఞ విభాగయోగం పూర్తి అయింది.

346. విజయా - శ్రీ విజయాయై నమః

అమ్మవారి స్వరూపం విజయం. ఆవిడ చరిత్రలను తిరగేస్తే ఎందరో రాక్షసుల మీద విజయాలు సాధించింది. యుద్ధానికి బయలుదేరడమే ఆలస్యం. గెలుస్తుందా?

లేదా? అనే ప్రశ్నే లేదు. ఆ తల్లి గెలిచి తీరుతుంది. అందుకే ఆవిడకి 'అపరాజితా' అని పేరు. జయ, విజయ, అపరాజిత – మూడూ అమ్మవారి యొక్క స్వరూపాలు. 'విజయా' అంటే జయశాలినీ అని అర్థం.

అమ్మవారికి 'విజయా' అని ఒక నామం పురాణాలలో ఉంది. పద్ముడు అని ఒక రాక్షసుని సంహరించడానికి అమ్మవారు వచ్చినపుడు ఆవిడ పేరు 'విజయ'. అసలు దుర్గమ్మ తత్త్వమే విజయతత్త్వం. విజయదుర్గ, విజయలక్ష్మి.

నవమి నాడు పూజింపబడే తల్లికే 'విజయా' అని పేరు. నవమి పూజే ప్రధానం. అలా ఆరాధించినవారికి విజయం ఇస్తోంది. నవమి పూజ చేసిన తరువాత సంధ్యాకాలంలో దశమి వస్తే –

ఈషత్ సంధ్యామతిక్రాంతః కించిదున్నిద్రతారకః
విజయో నామ కాలోఽయం సర్వకార్యార్థసాధకః

కాస్త సంధ్యదాటి అప్పుడప్పుడే నక్షత్రాలు వస్తున్నప్పుడు శరత్కాలంలో శుద్ధ దశమీ ముహూర్తం వస్తే దాని పేరు 'విజయాముహూర్తం'. ఆ విజయా ముహూర్తంలో అమ్మవారిని 'జయా విజయా సమేత అపరాజితా' అనే పేరుతో ఆరాధన చేస్తారు. ఈ మూడు పేర్లు కలుపుకుంటే సంపూర్ణ విజయతత్త్వం. అపరాజితా అంటే ఓటమిలేని (తత్త్వం) తల్లి, జయ విజయములు కలిగిన తల్లి. ఆ తల్లిని ఆ ముహూర్తంలో ఆరాధన చేయాలి. శమీవృక్షం దగ్గరికి వెళ్ళి ఆరాధన చెయ్యడం శ్రేష్ఠం. అమ్మవారి వ్రతాల్లోకెల్లా శరద్వ్రతం (నవరాత్రివ్రతం) చాలా విశేషం. ఆ శరన్నవరాత్రవ్రతానికి పూర్ణత్వం ఆ విజయా ముహూర్త ఆరాధనతో వస్తోంది కనుక ఆ సమయంలో విజయా. ఆవిడ స్వరూపమే విజయం కనుక తన భక్తులకు గెలుపును ప్రసాదిస్తుంది.

మహాత్ములు అయిన రాజులు కూడా వారి విజయం కోసం ఆరాధన చేస్తారు. సురథుడు మొదలైన వారందరూ అంతవరకు ఓడిపోయి, శత్రువుల చేత దూరంగా తరిమివేయబడ్డా విజయవంతులు అయ్యారు. ఏ రంగంలోనైనా తిరిగి లేవగలిగే శక్తి 'విజయా' నామం ద్వారా వస్తుంది.

347. విమలా - శ్రీ విమలాయై నమః

అసలు విజయం ఏదయ్యా అంటే మళ్ళీ వెనక్కి రావలసిన అవసరం లేని మోక్షప్రాప్తి. అక్కడి తత్త్వం 'విమలా'.

విమల అంటే మాలిన్యము లేనిది. మాలిన్యాలు ఎన్ని రకాలు ఉన్నాయో అన్నీ కలిపి కట్టకట్టి ఒకటే - అజ్ఞానమాలిన్యం, అవిద్యామాలిన్యం. ఆ మాలిన్యం ఉంటే జీవుడు. మాలిన్యం లేనివాడు ఈశ్వరుడు. ఈశ్వరునికి, జీవునికి తేడా ఏమిటంటే శుద్ధత ఉంటే ఈశ్వరుడు, శుద్ధత లేకపోతే జీవుడు. మలత్రయ సంశ్లేషము చేత అంటే మలత్రయాలు కమ్ముకుపోతే జీవుడు. మలత్రయాలు లేనిది ఈశ్వరుడు.

'ఆదితః పరిశుద్ధత్వాత్ మలత్రయ వియోగతః శివ ఇత్యుచ్యతే సద్భిః' - అని శివనామానికి చెప్తున్న నిర్వచనం. శివ/పరమాత్మ అంటే ఎప్పుడూ శుద్ధుడే. **మలత్రయ వియోగతః** - ఆయనకు ఈ మూడు మాలిన్యాలు లేవు. ఆణవమల, కాయికమల, కార్మికమల అనే మూడు మాలిన్యాలు ప్రతి జీవునికి ఉంటాయి. ఈ మూడు రకాల మాలిన్యాలు తొలగించగల తల్లి, ఆ మూడూ లేని తల్లి. శరీర మాలిన్యాలు, మానసిక మాలిన్యాలు చాలా ఉంటాయి. శరీర మాలిన్యాలు ఎన్ని రకాలు ఉంటాయో శాస్త్రం చెప్పింది. రక్త, శుక్ల, మద్య, మూత్ర, విట్, పింజూష, నఖ, శ్లేష్మ, అశ్రు(కన్నీరు కుడా ఒక దోషంగా చెప్పారు), దూషిక, స్వేదమాలిన్యం, జిహ్వామాలిన్యం(దానికి కులక అని శాస్త్రం పేరు చెప్పింది), దంతమాలిన్యం(దీనికి విప్పక అని పేరు) - ఇలాంటివన్నీ ప్రకృతి జీవులైన దేహాలకి ఉంటాయి. అమ్మవారు ధరించిన దివ్యమంగళ విగ్రహానికి కాని, నామానికి కాని, ఆవిడ తత్త్వానికి కాని ఏ దోషము లేదు. అమ్మ రూపాన్ని భావించినప్పుడు దోషరహితంగా భావన చెయ్యవలసినది.

మంత్రస్వరూపంలో విమలా, విజయా అని రెండు లక్షణాలు మంత్రానికి ఉంటాయి. సిద్ధి కలిగించే లక్షణం 'విజయ'. జీవునికి మంత్రం ఇచ్చేటప్పుడు పుచ్చుకునే వానికి సంస్కరించి ఇవ్వాలి. అలా సంస్కరించి శిష్యులకి ఇచ్చేటప్పుడు ఆ మంత్రాన్ని పవిత్రం చేస్తారు. ఆ మంత్రస్వరూపిణి విమల.

జనన, జీవన, తాడన, బోధన, అభిషేక, విమలీకరణ, ఆప్యాయన, తర్పణ, దీపన, గోపన అని దశ సంస్కారములు చేసి ఆ మంత్రం పండిస్తారు. అప్పుడు ఆ మంత్రం 'విమలా' అవుతుంది. అలాగ దశ సంస్కారములు చేత శుద్ధమైన మంత్రముగా ఉపాసకునిలో ప్రకాశించే అమ్మరూపమే 'విమలా'. అటువంటి సంస్కారాదులు అక్కరలేని సహజ నిర్మలమైన శ్రీవిద్యామంత్ర స్వరూపము – విమల...అని కూడా కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం. అది సిద్ధి ప్రదాయిని అవుతుంది కనుక 'విజయా'. ఆ మంత్రాన్ని ఎప్పుడూ మనం సేవిస్తూ ఉంటాము కనుక 'వన్ద్యా' అని తరువాతి నామం.

348. వన్ద్యా – శ్రీ వన్ద్యాయై నమః

వందనము పొందదగినది, వందనము పొందునది. 'హరిబ్రహ్మేంద్రసేవితా' అని చెప్పుకున్నాం. సర్వదేవతల చేత వందనము పొందుతూ ఉంటుంది.

కృష్ణపరమాత్మ యొక్క విశ్వరూప సందర్శనాన్ని చూసిన వెంటనే అర్జునుడు **'కస్మాచ్చ తే న నమేరన్ మహాత్మన్'** అంటాడు. **'సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః'** – అటు దేవతలు, సిద్ధులు అందరూ నీకు నమస్కరిస్తున్నారు. నువ్వు నమస్కారం పొందటానికి అర్హుడవు. నిన్ను తెలుసుకున్నాక నమస్కారం చెయ్యకుండా ఎవరు ఉండగలరు?

మొట్టమొదట పరదేవతను తెలుసుకోవడం కోసం నమస్కారం చేస్తారు. తెలుసుకున్నాక నమస్కరించకుండా ఉండలేరు.

శంకరభగవత్పాదుల వారికి ఒక పేదరాలు ఉసిరిక ఇచ్చిందని అమ్మవారిని ప్రార్థన చేస్తూ ఒక గొప్పమాట అంటారు. "అమ్మా! పేదరాలికి ఐశ్వర్యం ఇవ్వు. నీకు వందనము చెయ్యడమనే ఒక్క ఐశ్వర్యం నాకు చాలునమ్మా!" అన్నారు.

చాలా మంది ఐశ్వర్యాలు అన్నీ అనుభవించిన తరువాత వందనం చేద్దామని అనుకుంటారు. వందనం చేస్తే అన్నీ అవే వస్తాయి. తెలివైనవాడు ముందు ఈ సంపద పెట్టుకుంటాడు. అన్నిటికంటె గొప్ప సంపద **వందన సంపద.**

సంపత్కరాణి సకలేంద్రియ నందనాని
సామ్రాజ్యదాన నిరతాని సరోరుహాక్షి
త్వద్వందనాని దురితోద్ధరణోద్యతాని
మామేవ మాతరనిశం కలయంతు నాన్యే

అంటారు. **సంపత్కరాణి** – నమస్కరిస్తే సంపదలు వస్తాయన్నారు. **సకలేంద్రియనందనాని** – దాని వలన సర్వేంద్రియములకు ఆనందం కలుగుతుంది. నమస్కరించడం వలన ఇంద్రియాలకు పుష్టి వస్తుంది.

'తుష్టువాగ్ం సస్తనూభిః వ్యశేమ దేవహితం యదాయుః' – ఇంద్రియము లన్నిటికి కూడా అటువంటి పుష్టి ఇస్తున్నది కనుక 'సకలేంద్రియనందనాని'. **సౌభాగ్యదాననిరతాని** – సౌభాగ్యములన్నీ ఇస్తూ ఉంటుంది. – **దురితోద్ధరణోద్యతాని** – అన్ని పాపాల నుండి ఉద్ధరిస్తుంది. ఈ నాలుగు ప్రయోజనాలు కలిగించే **త్వద్వందనాని.. మామేవ మాతరనిశం కలయంతు నాన్యే** – తల్లీ! ఈ సంపద ఉంటే చాలు మరేమి అక్కరలేదు. "న – అన్యే" అని నొక్కి చెప్పారు. "ఇదివరకు వందనాలు చెయ్యకపోవడం వల్లే ఈ పేదరాలికి ఈ దారిద్ర్యం వచ్చింది. ఇప్పుడు నాకు ఉసిరిక వేసింది కనుక ఈవిడ తరపున నేను వందనాలు చేస్తున్నానమ్మా!" అన్నారు. 'వందనమంత్ర'మని ఒక మంత్రముంది. సాందీపని భగవానుడు ఋషిగా కలిగిన, గురుముఖైక వేద్యమంత్రం. దాని ద్వారా ఆరాధింపబడునది 'వన్ద్యా!'

వంద్యులు అంటే నమస్కారం పొందేవారు ఎన్ని రకాలుగా ఉన్నారో చెప్తున్నారు. సంతతి వంద్యులు, పరిచార వంద్యులు, పరిజన వంద్యులు, అనుచర వంద్యులు, సహచర వంద్యులు, శిష్యజన వంద్యులు, భక్తజన వంద్యులు, అర్థిజన వంద్యులు, ఆర్తజన వంద్యులు.

కొందరికి సంతానం నమస్కరిస్తూ ఉంటుంది. వాని పిల్లలు వానికి దండం పెడతారు. వీరు సంతతి వంద్యులు. పరిచారవంద్యులు – జీతానికి పనిచేసే పరిచారకులు దండం పెడుతూ ఉంటారు. పరిజనవంద్యులు – వారి చుట్టూ ఉన్న కుటుంబం నమస్కరిస్తూ ఉంటారు. అనుచరవంద్యులు – అనుచరులు

నమస్కరించేవారు. కొందరు సహచరవంద్యులు – పదవిలో ఉన్నంత కాలం వాని వెనుక తిరుగుతూ ఉంటారు. ఆ తరువాత ఒక్కడు వెనకాల ఉండడు. అది చూసి వీడు మురిసిపోయి త్రిభువనాలకి అధిపతైనట్టు భావించుకుంటూ ఉంటాడు. అన్నమయ్య ఇలాంటి వారినే "మనుజ కీటముల మరెవ్వరెరుగు" అన్నాడు. కొందరు శిష్యజనవంద్యులు. కొందరు భక్తజన వంద్యులు. కొందరు అర్థిజనవంద్యులు అవసరమొచ్చినప్పుడల్లా దండం పెడుతూ ఉంటారు. కొందరు ఆర్తజనవంద్యులు. కానీ అమ్మవారు సర్వవన్ద్యా – అందరిచేత వందనం పొందే తల్లి. అలా వందనం చేస్తే ప్రయోజనమేంటో తరువాతి నామంలో చెప్తున్నారు.

349. వన్దారుజనవత్సలా – శ్రీ వన్దారుజనవత్సలాయై నమః

వందనం చేసిన వారిపట్ల వాత్సల్యముగా ఉంటుంది. పరమాత్మ అందరి పట్ల సమంగానే ఉంటాడు కానీ తనని పట్టుకున్నవారిని తాను పట్టుకుంటాడు. వాత్సల్యం అంటే తలిదండ్రులకి పిల్లలపట్ల, గురువుకి శిష్యులపట్ల కలిగే ప్రేమ భావానికి వాత్సల్యమని పేరు. ఆవిడ జగజ్జనని. అటువంటి వాత్సల్యంతో చూస్తుంది. వందారు జనుల పట్ల వాత్సల్యంతో ఉంటుంది. **'ప్రణత జన సౌభాగ్యజనని'** అంటారు శంకరులు. ఆవిడకి నమస్కరించడం ఒక సౌభాగ్యం. **'ప్రణంతుం స్తోతుం వా కథమకృత పుణ్యాః ప్రభవతి'** అని సౌందర్యలహరి. అమ్మవారికి నమస్కారం చెయ్యాలంటే సౌభాగ్యం ఉండాలి.

"తనువుచే వందనమొనరించుచున్నారా" అన్నారు త్యాగరాజస్వామివారు. త్రికరణాలతో అమ్మను శరణు వేడడమే నమస్కారము. అది వందనము. అలాంటి వందనం చేసినవారిని అమ్మ తప్పకుండా అనుగ్రహిస్తున్నది. సులభ ప్రసన్నురాలు. 'దాసుని తప్పులు దండముతో సరి' అంటారు. తెలిసి చేసే ఒక్క నమస్కారానికి అమ్మ అంత అనుగ్రహిస్తున్నది.

నమస్కారం చేసిన వానికి ఏమి వస్తాయో మనువు ధర్మశాస్త్రంలో చెప్తున్నాడు.

అభివాదన శీలస్య నిత్యం వృద్ధోపసేవినః
చత్వారి తస్య వర్ధంతే ఆయుర్విద్యా యశో ధనం

నమస్కరించడమనే సంస్కారం అలవాటు అయిన వారికి ఆయువు, విద్య, కీర్తి, ధనం - ఈ నాలుగు వస్తాయి. పెద్దలకు నమస్కారం చేశామంటే వారిలో జ్ఞానరూపంతో, వృద్ధరూపంతో ఉన్నది అమ్మవారే.

అమ్మవారి పటానికి తప్ప ఇంకెవరికి దండం పెట్టనని కాదు దీని అర్థం. ఎవరెవరికి నమస్కారం పెట్టాలని శాస్త్రం చెప్పిందో వారందరికీ పెట్టిన నమస్కారం అమ్మవారికే చెందుతుంది.

'సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి'

తరువాత మరొక నామాల గుత్తిలోకి ప్రవేశిస్తున్నాం. ఈ నామాలను చిన్నప్పటి నుండి చదివితే విద్యలు బాగా వస్తాయి. 'వాగ్వాదినీ, వామకేశీ, వహ్నిమణ్డలవాసినీ' -ఇది వాఙ్మంత్రం. ఇక్కడ తల్లి సరస్వతీదేవికి సంబంధించిన మంత్ర విశేషాలు ఉన్నాయి. పైగా ఇవన్నీ అమృత మంత్ర విశేషాలు. "విశ్వాధికా వేదవేద్యా.." అంతకు ముందు కూడా వకారంతోనే మొదలు పెట్టుకుని "వరదా, వామనయనా.." అక్కడ నుండి వకారంతోనున్న అమృత నామాలు ప్రారంభమయ్యాయి. ఇవి కూడా అమృత నామాలలో భాగమే.

350. వాగ్వాదినీ - శ్రీ వాగ్వాదిన్యై నమః

అమ్మవారి ప్రధానమైన శ్రీవిద్యా దేవతలలో/ శ్యామలాదేవి అంగ దేవతల్లో వాగ్వాదినీ ఒకరు. శ్యామలాదేవి జ్ఞానాధిదేవత. ఆవిడ దగ్గర అనేకమైన శక్తులుంటాయి. అమ్మ ఉపాసకులకు శ్యామలామంత్రం శిరోధార్యం. ఆ శ్యామలాదేవి ప్రక్కన ఉండే శక్తులలో వాగ్వాదినీ, నకులీసరస్వతీ మొదలైనవారు ఉంటారు. వాగ్వాదినీ ఆ శ్యామలాదేవి యొక్క స్వరూపం. ఈ తల్లి దయ ఉంటే వాక్కులు బాగుంటాయి. వాక్ అంటే జ్ఞానం. వాక్కులు పలికించగలిగే దేవత 'వాగ్వాదినీ'.

శరజ్జ్యోత్స్నా శుద్ధాం శశియుత జటాజూట మకుటాం
వరత్రాసత్రాణ స్ఫటిక ఘటికా (ఘుటికా) పుస్తకకరామ్
సకృన్నత్వా నత్వా కథమివ సతాం సన్నిదధతే
మధుక్షీర ద్రాక్షా మధురిమ ధురీణాః ఫణతయః.

ఆ తల్లి యొక్క అనుగ్రహముంటే తేనె వలె, పాల వలె, ద్రాక్ష వలె అద్భుతమైన, మధురమైన శబ్దములు పలుకుతాయి.

గద్యశ్లోకమయీ వాక్నిస్సరతి వినా ప్రయత్నలేశమపి-అసలు మాట తడుముకోకుండా పలుకులు పలికిస్తుంది ఆ తల్లి. బుద్ధికి అంత జ్ఞానాన్ని ప్రసాదించి ఆ తెలివిని ప్రకటించగలిగే శక్తిని కూడా ఇస్తుంది.

వాగ్వాదినీదేవత రూపం ఎలా ఉంటుందో ఈ నామం ద్వారా భావన చేద్దాం. ఒకసారి రూపాన్ని తలచుకుని నామం అనుకుంటే చాలు

పుస్తకజపపటిహస్తే వరదాఽభయ చిహ్న చారుబాహులతే
కర్పూరామలదేహే వాగీశ్వరి బోధయాశు మమ చేతః

వాగ్వాదినీ రూపం ఇలా ఉంటుంది. ఒక చేతిలో పుస్తకం, ఇంకో చేతిలో జపమాల, మిగిలిన రెండు చేతులలో వరద, అభయ చిహ్నాలు కలిగి, 'కర్పూరామలదేహే' – కర్పూరం వలె తెల్లగా ప్రకాశిస్తున్న **'వాగీశ్వరీ బోధాయాశు మమ చేతః'** – నా బుద్ధికి సరియైన తెలివిని ఇవ్వమ్మా! వాగ్వాదినీ నామంలో వకారం రెండు మార్లు వచ్చింది. ఆ నామంలోనే అంత శక్తి ఉంది. ఈ తల్లే నాదబ్రహ్మ స్వరూపిణి.

సర్వేషాం చ స్వభక్తానాం వాదరూపేణ సర్వదా
స్థిరతా వాచి విఖ్యాతా లోకే వాగ్వాదినీహి సా

ఈ తల్లి అనుగ్రహముంటే ఎటువంటి దుష్టుడినైనా వాదనలో జయించగలరు. వాగ్వాదినీ విద్య బాగా పండిన మహాత్ముడు ఎవరంటే ఎక్కడో కాలడిలో పుట్టి ఆరేళ్ళకే అద్భుతమైన జ్ఞానియై బయలుదేరి ఆసేతుశీతాచలం ముమ్మార్లు పర్యటించి

తలలు పండిన మేధావులైన వారిని కూడా కూర్చోబెట్టి తన వాదనతో బ్రహ్మవిద్యను ప్రతిష్ఠించిన ఆదిశంకర భగవత్పాదుల వారిని గుర్తు చేసుకోవాలి. ఆ తల్లికి నమస్కారం చేసుకుని వెళ్తే చాలు. తన భక్తులకు ఆ శక్తిని ఇస్తుంది. కామాక్షీదేవి తంజావూరులో బంగారు కామాక్షీదేవిగా ఆరాధింపబడుతుంది. ఆ పరంపరకు చెందిన మహాను భావుల్లో శ్యామశాస్త్రిగారు ఒకరు. ఆయన శ్రీవిద్యోపాసకుల్లో దిట్ట.

ఒకసారి తంజావూరు ప్రభువు దగ్గరికి ఉత్తరభారత దేశంనుంచి ఒక పెద్ద సంగీత విద్యాంసుడు వచ్చాడు. ఆయన అందరిని జయించుకుని వెళ్ళిపోతున్నాడు తనని మించినవారు లేడని. తంజావూరులో ఉన్న పండితులందరిని ఓడించాడు. దానితో "మీరాజ్యం విద్యలో నాకు పాదాక్రాంతం అయ్యింది అని చాటింపు వెయ్యండి" అని అన్నాడు. తన రాజ్యంలో పండితులు లేరని ఏ రాజు ఒప్పుకోగలడు? రాజాస్థానం నుండి శ్యామశాస్త్రిగారిని రమ్మని కబురు వచ్చింది. ఏనాడూ రాజాస్థానానికి వెళ్ళని ఆయన అమ్మవారికి నమస్కారం చేసుకుని బయలుదేరారు. శ్యామశాస్త్రిగారు వెళ్ళి కూర్చోగానే అవతలివాడు పూర్తిగా శరణాగతుడై పాదాలని ఆశ్రయించాడు. అమ్మ విద్యని ఇవ్వడమే కాదు, ఆ ఇచ్చిన విద్య నిలబడేటట్లు చేస్తుంది.

ఎన్ని రకాలుగా అమ్మని కీర్తించాడో! – **"కనకశైల విహారిణి కామకోటి బాలే సుశీలే"** అంటారు. ఒకానొకప్పుడు తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు అమ్మని, **"దురుసుగా కృపజూచి సంతతమరోగదృఢశరీరముగా సలుపు నను"** తొందరగా కృప చూపించవమ్మా! అని ప్రార్థించారు.

ఈ తల్లి ఇచ్చిన తాంబూల కబలం చేతనే కదా మూకకవి 500 శ్లోకాలు పలుకగలిగాడు. వాగ్వాదిని అయిన లలితాపరమేశ్వరి యొక్క విద్యా స్వరూపాన్ని భావన చేసుకుంటున్నాం. **శబ్దానాం జననీ త్వమేవ భువనే వాగ్వాదినీత్యుచ్యతే** (లఘుస్తవం) – 'శబ్దములకు జనని అయిన నీవే ఈ భువనంలో వాగ్వాదినిగా చెప్పబడుతున్నావు'.

351. వామకేశీ – శ్రీ వామకేశ్యై నమః

'వామ' అంటే సుందరమైన, 'కేశీ' కేశములు కలిగినది. అమ్మవారి కేశాలను ధ్యానించడం వల్ల కలిగే ఫలితాన్ని శంకరులు సౌందర్యలహరిలో చెప్తూ,

ధునోతు ధ్వాంతం నః తులితదళితేందీవరవనం
ఘనస్నిగ్ధశ్లక్ష్ణం చికురనికురుంబం తవ శివే
యదీయం సౌరభ్యం సహజముపలబ్ధుం సుమనసో
వసంత్యస్మిన్మన్యే బలమథనవాటీ విటపినామ్

అంటారు. ధునోతు ధ్వాంతం నః – అమ్మవారి కేశాలను ధ్యానిస్తే మన లోపల అజ్ఞానమనే చీకటి పోతుందన్నారు. 'ఘనస్నిగ్ధశ్లక్ష్ణం చికురనికురుంబం తవ శివే' – ఆ తల్లిది ఒత్తైన జుట్టు. అలాంటి అందమైన కేశములు కనుక 'వామకేశీ'. ఇది కేవలం రూపపరంగా చెప్పుకున్నా ఈ నామంలో ఉన్న విశేషం చూడాలి.

'కేశాః రశ్మయః' అని హృషీకేశ శబ్దానికి ఉన్న అర్థాన్నే ఇక్కడ కూడా చెప్పుకోవాలి. కేశములు అంటే రశ్మలు. వామ అంటే సుందరమైనవి. అలాగే వమనము అంటే క్రిందికి వెదజల్లబడుతున్నవి అని అర్థం. అలా వస్తున్న కేశములు అంటే సూర్య రశ్మలు, అగ్ని రశ్మలు, చంద్ర రశ్మలు. వీటితోనే అమ్మవారు ప్రపంచాన్ని పుష్టి చేస్తోంది. ప్రపంచాన్ని పోషించే సూర్య, చంద్ర, అగ్నిరూప కిరణాలు కలది. ఇది రెండవ అర్థం.

ఇంకో అర్థంలో వామకుడు అంటే శివుడు. ఆయన పేరే వామదేవుడు. ఆయన యొక్క రాణి/శక్తి 'వామకేశీ', శంకర – శాంకరీ అయినట్లుగా వామదేవుడైన శివుని శక్తి 'వామకేశీ'.

వామకేశుడనే పేరుతో ఒక క్షేత్రం ఉంది. **జటే వామేశ్వరం విద్యాత్** – జటి అనే తీర్థంలో శివుడు వామకేశ్వరుడు అనే పేరుతో ఉన్నాడు. అక్కడ ఆయన శక్తి పేరు 'వామకేశి'.

ఏకాదశరుద్రులను కలుపుకుని వామకేశులని పేరు కూడా ఉంది. ఏకాదశ రుద్రరూపాలతో ఉన్నది వామకేశీ. సూర్యచంద్రాదులందరిని కలుపుకుని నవగ్రహాలకు

వామకులని పేరు. ఆ జ్యోతిర్మండలాల నుండి, గ్రహముల నుండి వెలుగులు, శక్తులు ప్రపంచం వైపు ప్రసరిస్తూ ఉంటాయి. వామకులు అని పేరు సూర్యాది నవగ్రహాలకు, ఏకాదశ రుద్రులకు ఉంది. ఈ రెండు రూపాలతో ఉంటూ లోకాన్ని శాసించే తల్లి 'వామకేశి'. గ్రహశక్తులను తన ఆధీనంలో పెట్టుకున్నతల్లి అనే మాటను కూడా చెప్తున్నది.

ఇక్కడ మరొక విశేషం 'వామకేశీ' తరువాత 'వహ్నిమండలవాసినీ' నామం వస్తోంది. 'వాగ్వాదినీ- వామకేశీ-వహ్నిమండలవాసినీ' ఈ మూడింటిని కలిపితే వాఙ్మయ విద్య చెప్పబడుతున్నది. వాగ్వాదినీ యొక్క స్వరూపము, తత్త్వము వివరిస్తున్నారు. ఈ కిరణాలను ఎలాగైతే వామకేశి వెదజల్లుతుందో, జ్ఞానకిరణాలను వాగ్వాదినీ అలా వెదజల్లుతుంది గనుక 'వామకేశి'.

352. వహ్నిమణ్డలవాసినీ - శ్రీ వహ్నిమణ్డలవాసిన్యై నమః

నారాయణభట్టు తీసుకున్న లలితాపాఠంలో 'వహ్నికుణ్డలవాసినీ' అని కనబడుతున్నది. ఇది కూడా సమంజసమే. వహ్నిమండలం అంటే అగ్నిమండలం. అమ్మవారు అగ్నిమండలంలో ఉందన్నారు.

వహ్ని అంటే అగ్ని. అగ్ని సంఖ్య మూడు. మూడింటితో ఉన్న మండలము. ఆ మండలంగా ఉన్నది త్రికోణం. త్రికోణమండలంలో బిందుస్థానంలో ఉంది కనుక 'వహ్నిమణ్డలవాసినీ'.

ఇంకొక అర్థం వహ్నిమండలం, వహ్నికుండలం అంటే మూలాధారం. **'స్వపిషి కులకుండే కుహరిణీ'** అన్నారు శంకరభగవత్పాదులవారు. మూలాధారంలో కుండలినీ ఉంటుంది. అది జాగృతమైతే అగ్నికుండంలా ప్రకాశిస్తుంది. ఆ కుండలినీ శక్తే పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ రూపాలుగా వ్యాపించి పయనిస్తుంది. అప్పుడు ఆవిడ వాగ్వాదినీ. వాక్‌శక్తి. ఆ వాగ్దేవత అసలు చోటు - వహ్నిమండలవాసినీ. ఆ విధంగా సూక్ష్మ వాక్‌శక్తి అయిన అమ్మవారిని తెలియజేస్తున్నారు.

వహ్నికుండలము అంటే ప్రధానంగా చెప్పబడుతున్నది మూలాధారం.

సహస్రారానికి కూడా వహ్నిమండలమనే పేరు ఉంది. మన లోపల శ్రీచక్రం చెప్పినప్పుడు 'బైందవం బ్రహ్మరంధ్రం చ మస్తకం చ త్రికోణకే' అన్నారు. మస్తకం త్రికోణం – అదే వహ్నిమండలం. అక్కడ అమ్మవారు ఉంది. అది సహస్రారస్థానం. మూలాధారం నుండి సహస్రారం దాకా ఆవిడే కుండలినీగా ఉందని 'వహ్నిమణ్డలవాసినీ'. ఇవన్నీ భావన చెయ్యవలసినదే.

అగ్నిదేవునికి, వాక్కుకి ఉన్న అనుబంధం వేద విజ్ఞానం తెలిసిన వారందరికీ తెలుసు. వాక్కుకి అధిదేవత అగ్నిభట్టారకుడు. **'అగ్నిర్మే వాచి శ్రితః'** – అగ్ని నా వాక్కు నందు ఉన్నాడు. **'అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్'** అని వేదవాక్యం. అగ్నిదేవుడు వాక్కై ముఖంలోకి వచ్చాడు. అందుకే **'ముఖమపి దహనో'** అని విష్ణుసహస్రంలో కూడా చెప్పబడింది. వాక్కు అగ్నినుండే వచ్చింది. వాక్కుకి అగ్ని అధిదేవత కాబట్టి వాగ్వాదినీ నామం వరుసలో 'వహ్నిమణ్డలవాసినీ' ఉండడం విశేషం.

అగ్నిమండలంగా మనకి కనబడేది సూర్యభగవానుడు. ఆ వహ్నిమండలమైన సూర్యమండలంలో ప్రకాశించే గాయత్రీరూపిణియే వాగ్దేవి. సూర్యమండలంలో వాగ్దేవిగా అమ్మవారిని ఎవరైతే ఉపాసన చేస్తారో వారికి విద్యలలో గొప్ప ప్రతిభ ప్రసాదిస్తుంది.

353. భక్తిమత్కల్పలతికా – శ్రీ భక్తిమత్కల్పలతికాయై నమః

కల్పవృక్షంవలె కల్పలత కూడా ఉంది. వీటి లక్షణం భక్తులు ఏం కోరుకుంటే అవి ప్రసాదిస్తాయి. సంకల్పించినవన్నీ నెరవేర్చుతుంది కల్పలత. అమ్మవారు కూడా అటువంటిదే. ఎవరు భక్తులో వారి పాలిట కల్పలత అమ్మవారు.

నేను ఒక తీగ పట్టుకున్నాను అన్నాడు మూకకవి. ఆ తీగ ఎక్కడుందయ్యా అంటే **'కంపాతట సీమ్ని సిద్ధ భైషజ్యం'** అన్నారు. మంచి ఓషధుల తీగలు అడవులలోకి వెళ్ళి తీసుకువస్తారు. అలాగ మేము కంపానది తీరానికి వెళ్తే ఒక తీగ దొరికింది. ఈ తీగ ఎలా ఉందంటే మెరుపుతీగలాగ మెరిసిపోతోంది అన్నాడు. **శంపాలతాసవర్ణం.**

కంపాతటసీమ్ని సిద్ధభైషజ్యం లింపామి మనసి కించన – ఆ మందు తెచ్చి నూరి పూసుకుంటారు. అలా అమ్మ అనే తీగని నా హృదయానికి పూసుకుంటున్నాను అన్నాడు. అమ్మ తత్త్వాన్ని హృదయంలో తాదాత్మ్యం చెందించుకొంటున్నాను. ఆ కల్పలత ఓషధీలత కూడా.

భక్తిమత్కల్పలతికా – భక్తులైన వారికి ఆవిడ కల్పలత. ఏ భక్తుడు ఏ స్థాయిలో ఉన్నాడో ఆ స్థాయికి తగ్గ సంకల్పాలు నెరవేర్చుతూనే ఇంకా పై స్థాయికి తీసుకువెళ్ళి ముక్తిని ఇవ్వగలిగిన తల్లి.

ఈ విశేషాన్ని చాలా చమత్కారంగా శంకరులు ఒక మాటలో చెప్పారు– దేవకాంతలు అమ్మవారి దగ్గరికి వెళ్ళి అమ్మ పాదాల దగ్గర వారి చేతులు ముకుళించారు. ఆ పాదాలు నవ్వుతున్నాయా అన్నట్లు గోళ్ళు తళతళ లాడుతున్నాయి. తెల్లగా ఉన్నాయి కాలి వేళ్ళ గోళ్ళు. నవ్వితే ముఖంలో తెల్లని పలువరుస ఎలా కనబడుతుందో అలా అమ్మ గోళ్ళకాంతులు అలా నవ్వుతున్నాయి. ఎందుకంటే ఎవరి చేతులు వచ్చి ముడుచుకొన్నాయి అమ్మవారి పాదాల దగ్గర? దేవకాంతలు. సామాన్యమైన చేతులు కావు అవి. స్వర్గలోకంలో కల్పవృక్షపు కుసుమాలు కోసే చేతులు. జీవులందరికి ఏ కోరిక పడితే ఆ కోరిక తీర్చేవి కల్పవృక్షాలు. ఆ కల్పవృక్షాలు దేవకాంతలకి అందుబాటులో ఉన్నాయి. వాటిని కాదని ఆ చేతులు అమ్మ దగ్గరకి వచ్చి దండం పెడుతున్నాయి.

వెన్నెల తగిలితే పద్మాలు ముడుచుకున్నట్లుగా అమ్మ పాదాల గోళ్ళ కాంతి అనే వెన్నెల తగలగానే ఈ చేతులనే పద్మాలు ముడుచుకుపోయాయి అన్నారు. అంటే నమస్కరిస్తున్నాయి. ఎందుకు ముడుచుకుపోయాయంటే కల్పవృక్ష కుసుమాల కంటె అమ్మ పాదాలు గొప్పవని చూపిస్తున్నారు. కల్పవృక్షాలు ఇవ్వలేనివి కూడా అమ్మపాదాలు ఇస్తాయి.

ఎంతో పుణ్యం చేసుకుంటే స్వర్గలోకానికి వెళ్తే అక్కడ కల్పవృక్షాలు కోరికలు తీరుస్తాయి. కానీ అమ్మ అనే కల్పలతిక స్వర్గందాక వెళ్ళనక్కరలేకుండానే ఈ భూమి యందు మనం ఆశ్రయించినా కావలసినవన్నీ ఇస్తుంది. పైగా అక్కడిదాకా వెళ్ళినా

ఆ కల్పవృక్షం మోక్షం ఇవ్వలేదు. ఈ కల్పలత మోక్షం కూడా ఇవ్వగలదు. మోక్షదాయిని గనుకనే తరువాతి నామం 'పశుపాశవిమోచనీ'.

354. పశుపాశవిమోచనీ – శ్రీ పశుపాశవిమోచన్యై నమః

ఇది అత్యద్భుతమైన నామం. భక్తులైన వారికి ఈ నామం చాలు. ఇందులో అత్యంత రహస్యమున్నది. ఇది శ్రీవిద్యా ఉపాసనాఫలం. తాను ఉపాసించే దైవమే తన లోపలి చైతన్యం అని తెలియకుండా ఆరాధించేవాడు పశువు అని వేదాంతం ఇచ్చిన నిర్వచనం.

"యోఽన్యాం దేవతాముపాస్తే అన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద యథా పశుః" – బృహదారణ్యకంలోని మంత్రమిది. తాను ఆరాధిస్తున్న దైవం వేరు, తాను వేరు అని అనుకున్నంతకాలం పశుత్వమే. మరి ఏం చేస్తాం? ఇది ఎలా పోతుంది? అమ్మ వేరు, నేను వేరు అని కదా మనం ఆరాధన చేస్తున్నాం... అంటే మెట్టమొదట ఆరాధన అలాగే జరుగుతుంది. అలా ఆరాధన చేస్తూ ఉంటే ఆ పరమేశ్వరియే దానిని పోగొడుతుంది.

అమ్మవారి ఆరాధనకు కూర్చున్నప్పుడు 'అమ్మ ఈశ్వరి, నేను జీవుడ'ని కూర్చోవడం తప్పు లేదు. కానీ అమ్మ ఆరాధన చెయ్యగా, చెయ్యగా ఏం చేస్తుంది అంటే, 'నువ్వు పాశం చేత బంధింపబడ్డావు కనుక జీవుడనిపించుకుంటున్నావు. అది తొలగిస్తాను' అని పాశం తీసేస్తుంది. అప్పుడు పశుభావం పోతుంది. అదే **'అహమిత్యేవ విభావయే భవానీం'** అనే దానిలో ఉన్నది. అహం ఇతి విభావయే భవానీం–నా లోపల అహంరూప చైతన్యం భవానీయే. ఇది తెలుసుకొని అమ్మ పూజ చేయాలి,

నారుద్రో రుద్రమర్చయేత్ – రుద్రుడు కానివాడు రుద్రుని పూజించరాదు. నువ్వు మంత్రస్వరూపం కాకపోతే నువ్వు మంత్రాన్ని జపం చెయ్యకు అని చెప్పారు. అందుకే మంత్రాన్ని న్యాసం చేసుకుంటారు. న్యాసం చేసుకుంటే మంత్రం మన స్వరూపమవుతుంది కనుక అప్పుడు జపం చెయ్యమని చెప్పారు.

అలాగే మహాన్యాసం – రుద్రుని న్యాసం ద్వారా మన శరీరంలో నింపుకున్నాక అప్పుడు రుద్రార్చన చేయాలి.

పశుత్వం అనగా అజ్ఞానం. **'పశు పాశ పతిర్జ్ఞానం జ్ఞానమిత్యభిధీయతే'** అని శివపురాణంలోని వాక్యం. పశువు, పాశం, పతి – ఈ మూడిటి గురించి తెలుసుకోవడమే జ్ఞానం.

దేశము, కాలము ఈ పరిమితులకు లోబడిన వారందరూ పశువులు. 'నేను' అనుకుంటున్న మన దేహం దేశ, కాల పరిమితులకి లోబడి ఉంది. అవిద్యా పాశం కట్టి నడిపిస్తున్నది.

పశుత్వం అంటే అస్వతంత్రత. **'అభేదజ్ఞాన రూపవిద్య'** (జీవేశ్వరులకు అభేదజ్ఞానం) లేనివారు పశువులు. ఆ అవిద్య పాశం. ఆ పశువులకు అజ్ఞాన(అవిద్యా)పాశాన్ని తొలగించునది. అజ్ఞానవికారాలైన తత్త్వాలు పాశాలు. వాటినుండి విమోచనం కలిగించే ఈశ్వరి.

దేశము, కాలము, జీవులు ఎవరి ఆధీనంలో ఉన్నారో ఆ శక్తి పరమేశ్వరి. తప్పకుండా ఆశ్రయించిన వారికి విమోచనం కలిగిస్తుంది. కనుక 'పశుపాశవిమోచనీ'.

ఈశ్వరునికి, జీవునికి భేదం పాశమొక్కటే. అది తీసేస్తే రెండూ ఒక్కటే. పరిమితి చేసేది పాశము. మనకి మనం ఉపాధిని పరిమితం చేసుకున్నాం. ఇదే పాశం. ఆ పాశం తీసే అనుగ్రహశక్తి 'పశుపాశవిమోచనీ'.

తరువాతి నామాలు 'సంహృతాశేషపాషండా' 'సదాచారప్రవర్తికా'. ఈ రెండు నామాలు కలికాలంలో గట్టిగా అనుకోవాలి.

355. సంహృతాశేషపాషండా – శ్రీ సంహృతాశేషపాషండాయై నమః

అశేష – అంటే మొత్తంగా పాషండత్వాన్ని, సంహృత – సంహరించునది. పాషండత్వం పోవాలి. పాషండత్వం అంటే **'పా శబ్దేనతు వేదార్థః పాఖండాః తస్య ఖండకాః'** అని నిరుక్తంలో నిర్వచనం చెప్పారు. 'పా' అంటే వేదార్థం. పాలించునది, రక్షించునది కనుక వేదం యొక్క అర్థాన్ని 'పా' అన్నారు. దానిని ఖండించువారు

అంటే వేదధర్మాన్ని నిందించువాడు, వేదధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించేవాడు పాఖండుడు. వారే పాషండులు.

పాషండ ప్రాచుర్యము కలియుగంలో ఎక్కువ. అది అధర్మమని తెలిస్తే కొంత సంతోషం. కానీ ధర్మంలా కనబడే అధర్మం చాలా ప్రమాదం. అటువంటి పాషండత్వాన్ని సంపూర్ణంగా సంహరించునది. పాషండులను లేకుండా చేయునది.

356. సదాచారప్రవర్తికా - శ్రీ సదాచారప్రవర్తికాయై నమః

ముందు నామానికి, ఈ నామానికి అనుబంధం పట్టుకోవాలి. శాస్త్రము చెప్పిన ఆచారము సదాచారము. సత్ ఆచారము మంచి ఆచారము. మనల్ని బాగు చేసే ఆచారము. అదే - శాస్త్ర విహిత కర్మను ఆచరించడమే ధర్మము. పాషండత్వానికి వ్యతిరేకం సదాచారం. **'ఆచారప్రభవో ధర్మః ధర్మస్య ప్రభురచ్యుతః'.** కనుక సదాచారము చాలా ముఖ్యము.

అగస్త్యమహర్షి కలియుగంలో తిరుగుతూ, ఇంత కలి వ్యాపించి పోయిందే... ఇంత దురాచారమైన కలిలో జీవులు ఎలా తరిస్తారని దుఃఖపడుతూ చివరకు కాంచీపురంలో అమ్మవారిని దర్శించి తపస్సు చేసుకుంటూ ఉంటే హయగ్రీవస్వామి దర్శనమిచ్చి "దోషాలు ఎన్ని రకాలుంటాయో చెప్తాను విను" అని ముందుగా వివరిస్తాడు.

ఆహార విహార వ్యవహారాలలో శాస్త్రవిరుద్ధమైన దురాచారాలే దోషాలు. వాటిని తొలగించి, సదాచారాలను ప్రవర్తింపజేసే ప్రభావం శ్రీదేవీ సమర్చనకి ఉన్నది - అని బ్రహ్మాండపురాణంలోని లలితోపాఖ్యానం వివరిస్తున్నది.

శ్రుతి-స్మృతి-పురాణేతిహాసాదులను ఋషులకు దర్శింపజేసి, వారి ద్వారా ఆ శాస్త్రాలను, ధర్మాలను ప్రవర్తింపజేసిన పరమేశ్వరి.

ఆచారాలు రెండు రకాలు. శాస్త్రాల వల్ల, శిష్టజనుల వల్ల గ్రహించేవి.

సత్పురుషులు పరంపరగా ఆచరిస్తూ వస్తున్నది శాస్త్ర విహితమైన ఆచారము. దాన్ని ఆచరించడమే ధర్మము. ఆ ధర్మం ఎవరికి ఉంటుందో వారికి భగవంతుడు అండగా ఉంటాడు.

కర్మకాండోక్తమైన ఆచారాలను, బ్రహ్మకాండలో చెప్పబడిన సాధనలను ప్రవర్తింపజేసేది జగదంబ.

ఇవన్నీ అమ్మవారి కృప తెలిపే నామాలు. 'పశుపాశవిమోచనీ' నుండి అమ్మవారి కామకళా ఉపాసనా యొక్క ఫలములు. ఇవన్నీ ఈ నామాల్లో వివరిస్తున్నారు. 'పశుపాశవిమోచనీ', 'సంహృతాశేషపాషణ్డా', 'సదాచారప్రవర్తికా' ఈ వరుసలోనే తరువాత నామం 'తాపత్రయాగ్నిసంతప్తసమాహ్లాదనచంద్రికా'.

357. తాపత్రయాగ్నిసంతప్తసమాహ్లాదనచన్ద్రికా
– శ్రీ తాపత్రయాగ్నిసంతప్తసమాహ్లాదనచన్ద్రికాయై నమః

తాపత్రయాలతో తపించిన వారిని చల్లబరిచే వెన్నెలగా అమ్మవారు ఉన్నారు. ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక తాపములు. మొత్తానికి ఉన్నవే ఈ మూడు తాపాలు. ఈ మూడు తాపాలు పోతేనే శాంతి. ఓం శాంతిః శాంతిః శాంతిః అని మూడు సార్లు అంటారు కదా!

ఈ తాపాలు తొలగిన స్థితి శాంతం. ఆ తాపాలతో తపించే వారికి శాంతినిచ్చే తల్లి. ఆ శాంతియే **'అజరః అమృతః'** – అని శ్రుతి. ఆ అమృతకలయే చంద్రిక. చంద్రిక అంటే శాంతి. అమ్మవారు చంద్రకళ. చంద్రకళ అంటే సహస్రారకమలంలో ఉన్న సుధామయ బిందువు. అదే ధ్రువాకళ. సదాకళ. దీన్ని 'చంద్రమణ్డలమధ్యగా' నామం దగ్గర వివరంగా చెప్పుకున్నాం. చంద్రిక అంటే ఆ చంద్రస్వరూపము యొక్క అనుగ్రహం, అమృతభావం. ఆ చంద్రిక మనకు అందాలంటే తాపత్రయాలలో (ఇక్కడ మరొక అర్థం) మనం సంతప్తులమవ్వాలి. అప్పుడు ఆ అగ్నిని దాటించి ఆ వెన్నెల వస్తుంది.

మూలాధారం దగ్గర కుండలినీ జాగృతి చెందినప్పుడు అగ్నిగా ఉత్థానమవుతుంది. అదే అగ్ని. మూలాధారము అగ్నిమండలము. సహస్రారం చంద్రమండలం. ఈ మధ్యలో సూర్యమండలము. ఈ అగ్ని మండలం నుండి సూర్యమండలం ద్వారా చంద్రమండలం లోకి వెళ్ళగలిగితే మోక్షం లభించినట్లే. ఇదే

ప్రక్రియ. ముందు అగ్నిమండలం నుండి వెళ్ళాలి. తపించితే గాని ఏదీ దొరకదు. తపించడాన్నే తపస్సు అంటారు.

మూలాధారం నుండి కదలివెళ్ళి బ్రహ్మగ్రంథి, విష్ణుగ్రంథి, రుద్రగ్రంథి... మూడిటి నుండి కుండలినీ వెళ్ళేటప్పుడు అదే తాపత్రయాగ్ని. దానితో బాగా సాధించి మూడిటిని దాటిపోతే 'సంతప్త' – సమగ్ర తపస్సుచే సంపూర్ణంగా సిద్ధి పొందుతాడు. అలా సిద్ధి పొందిన జీవునికి సహస్రారంలో చంద్రిక – వెన్నెలలా చల్లని శాంతినిచ్చి, ఆనందాన్ని ఇస్తుంది. ఇది దీనిలో దాగిన యోగపరమైన అర్థం.

'తరుణీ' 'తాపసారాధ్యా' 'తనుమధ్యా' 'తమోపహా'. ఈ నామాలనుండి తరుణీ విద్య అని మంత్రశాస్త్ర విశేషం చెప్తున్నారు.

358. తరుణీ – శ్రీ తరుణ్యై నమః

తరుణం అంటే యౌవనమని అర్థం. అమ్మవారికి వృద్ధాప్యం లేదు. బాల్యం లేదు. యౌవనమే. యౌవనమంటే అన్ని ఇంద్రియములు సంపూర్ణ వికసనము పొందిన దశ. బాల్యం ఎదగని దశ, వృద్ధాప్యం జీర్ణించిన దశ. ఆవిడ స్వరూపమంతా పూర్ణంగా ఉందని చెప్పడమే యౌవనము యొక్క విశేషం. **'సదా షోడశవర్షాంచ నవయౌవనదర్పితాం'** అని వర్ణిస్తారు. ఎప్పుడూ నవయౌవనంతో పదహారు సంవత్సరాల వయసుతో ఉంటుంది కనుక 'తరుణీ'. ఇది సాధారణ అర్థం.

తరుణీ అని ఎప్పుడు అనాలి? మంచి తరుణం అనే మాట వాడుకలో వింటుంటాం. మనం బాగుపడే విషయం ప్రారంభమవ్వడమే తరుణం. ఊర్ధ్వముఖ ప్రయాణానికి సిద్ధమైన కుండలినిని 'తరుణి' అంటారు. మూలాధారం నుండి కదిలిన కుండలినీ విద్యయే తరుణీ విద్య. షోడశవర్షం అంటే 16. పదహారు యొక్క పూర్ణత్వం అమ్మవారు. 16 అక్షరాల షోడశీ విద్య 'తరుణీ విద్య'.

359. తాపసారాధ్యా – శ్రీ తాపసారాధ్యాయై నమః

తరుణిని తాపసులే ఆరాధించగలరు. తాపసా అంటే తపించే స్వభావం

చేతనైనవారు. అందుకే తాపత్రయానికి అర్థం చెప్పుకున్నాం. తపస్వులు అనగా తపస్సు చేసేవారు, సాధకులు, నియమపాలన చేసేవారు.

'భక్తిప్రియా', 'భక్తివశ్యా' 'ధ్యానగమ్యా', 'తాపసారాధ్యా', ముందు రాబోయే 'అంతర్ముఖసమారాధ్యా', 'ధీరసమర్చితా', 'వీరారాధ్యా' – ఇవన్నీ ఒక దగ్గరికి తెస్తే అమ్మవారు ఎవరి ఆరాధన పొందుతారో తెలుస్తుంది. ఇప్పుడు మనం ఆ జాబితాలో ఉన్నామా? వీరులమా? ధీరులమా? తాపసులమా? గ్రహించుకోవాలి.

నియమబద్ధమైన జీవితమే తపస్సు. ఉపాసన అంటేనే తపస్సు. తపః – అంటే ఎన్నిటికి చెప్పుకోవచ్చో చెప్తూ మితభోజనాన్ని, ఉపవాసాన్ని, కృచ్ఛ్ర చాంద్రాయణాదులని చెప్పారు. తపస్సు అనగా శాస్త్రవిధానాలతో శరీరాన్ని శుష్కింప చేయుట. అలా తపింపజెయ్యాలి. లోహాన్ని కూడా నిప్పులతో కాల్చి కొడితేగాని అది అనుకున్న ఆకారంలోనికి రాదు. అలాగే జీవుడు కూడా కొన్ని జన్మల నుండి మొద్దుబారిపోయి ఉన్నాడు.

నియమ పాలన చేసి ఎవరైతే ఆరాధన చేస్తున్నారో వారి ఆరాధన అమ్మ పొందుతోంది. సాధన ప్రారంభదశ 'తరుణీ', ఆ ప్రారంభదశ కొనసాగుతున్న దశ 'తాపస'. అలాంటి తాపసుల యొక్క ఆరాధన పొందేది 'తాపసారాధ్యా'. తపస్సు గురించి కృష్ణపరమాత్మ గొప్ప నిర్వచనం చెప్తూ **"మనసశ్చేంద్రియాణాంచ ఏకాగ్ర్యం తప ఉచ్యతే"** – "మనస్సు, ఇంద్రియములు... ఈ రెండిటిని ఏకాగ్రం చేస్తే దాని పేరు తపస్సు" అన్నాడు.

దీనినే త్రిశతిలో చెప్తూ **'ఏకభక్తిమదర్చితా'** అన్నారు. కృష్ణపరమాత్మ గీతలో **"ఏకభక్తిర్విశిష్యతే"** అని చెప్పాడు. గొప్ప భక్తి ఏంటంటే ఏకభక్తే. అది ఇంద్రియములు, మనస్సు ఏకాగ్ర పరచిన భక్తి. తపస్సు అనే దానికి ఎన్నెన్ని అర్థాలు ఉన్నాయో తెలుసుకుంటే అవన్నీ ఇక్కడ అన్వయించుకోవచ్చు. యక్షుడు ధర్మరాజుని తపస్సు అంటే ఏమిటని అడుగుతాడు. **"తపస్స్వధర్మవర్తిత్వం"** అని సమాధానమిచ్చాడు. స్వధర్మ పాలనే తపస్సు. అది చెయ్యడమే మహాకష్టం. అది చేస్తే అదే తపస్సు. స్వధర్మ పాలన, ఏకాగ్రత, నియమపాలన... ఇలా అన్ని తపస్సులతోనూ అమ్మవారిని

ఆరాధించాలి. అందుకే 'తాపసారాధ్యా'.

360. తనుమధ్యా – శ్రీ తనుమధ్యాయై నమః

తరుణి అంటే కుండలినీ, పూర్ణ యౌవనంలో ఉన్నదని అర్థంలో చెప్పుకున్నాం. తరుణీ అంటే అమ్మవారి దివ్యమంగళ విగ్రహాన్ని ధ్యానించవచ్చు. ఆ స్వరూపం ఎంత అందంగా ఉందో వివరిస్తూ 'తనుమధ్యా' అన్నారు. 'తను' అంటే సూక్ష్మము అని అర్థం. అదే తనీయసీ – సూక్ష్మము. నడుమ ప్రాంతం సన్నగా ఉంటే 'తనుమధ్యా' అనాలి. అమ్మవారు సన్నని నడుముతో ఉన్నారు కనుక 'తనుమధ్యా'. ఇది రూపపరమైన అర్థం. రూపవైభవం అయ్యింది. తరువాత మంత్రవైభవ, తత్త్వవైభవాలలో ఈ నామార్థాన్ని చూద్దాం.

తను అంటే శరీరము, మధ్య అంటే మధ్యలో ఉన్నది. అమ్మ శరీరమేది? 'శ్రీచక్రం శివయోర్వపుః' – శివశక్తుల శరీరం శ్రీచక్రం. శ్రీచక్రమనే దాని మధ్యలో బిందురూపంగా ఉన్నది కనుక **తనుమధ్యా**. ఇదొక అర్థం.

మన శరీరంలో సరిగ్గా మధ్యలో మూలాధారం నుండి వెన్ను మధ్యలో సుషుమ్నానాడి యందు సంచరిస్తున్నది. బిసతంతుతనీయసీ. అదే తను. తనీయసీ – **తనుమధ్యా.**

సుషుమ్నా నుండి కుండలినీగా బయలుదేరిన అమ్మవారు సుకుమారంగా ఉంది. ప్రాణశక్తి చరించే సుషుమ్నా నాడినే 'తనుమధ్యా' అంటారు. ఆ సాగుతున్న దశ అంతా తపస్సు. ఆ తపస్సు ద్వారా ఉపాసింపబడే దేవి 'తాపసారాధ్యా'. ఇది తరుణీ విద్య ఆవిష్కరణ.

'తనుమధ్యా' అనే దేవత ఒకరు ఉన్నారు. కాంచీక్షేత్రంలో ఆ దేవత ఉంది. **"మాం పాతు నీవాయాస్తీరే నివసంతీ బిల్వేశ్వర కాంతా దేవీ తనుమధ్యా"** – అని అమ్మవారి శక్తి పీఠాల్లో ఒక పీఠాన్ని చెప్పారు. నీవా నదీతీరంలో బిల్వేశ్వరుడు అనే శివుడు ఉన్నాడు. అతని కాంతగా అమ్మవారు అక్కడ 'తనుమధ్యా' అనే పేరుతో ఉంది.

కుండలినీదేవి, సన్నని నడుముగల తల్లి, శ్రీచక్రమధ్యంలో ఉన్న దేవి, మన శరీరంలో హృదయంలో ఉండే తల్లి... ఇన్ని అర్థాలు తీసుకోవాలి

361. తమోపహా – శ్రీ తమోపహాయై నమః

తమస్సును పోగొట్టే తల్లి గనుక 'తమోపహా'. తమస్సు అంటే అజ్ఞానము, అవిద్య. ఒకొక్క మాట మనలో ఎంతో ధైర్యాన్ని ఇస్తోంది. ఈ పాశాలు ఎలా పోతాయి? నేను చూసుకుంటానంటుంది అమ్మవారు. 'పశుపాశవిమోచనీ'. మరి అది జరిగే వరకూ నా బ్రతుకో? 'భక్తిమత్కల్పలతికా'. అయ్యో! ఈ దురాచార జీవితంలో ఎలా? 'సదాచారప్రవర్తికా'. నేను సరిగ్గానే ఉంటాను గానీ నా చుట్టూ పాషండులు ఉన్నారు ఎలాగంటే 'సంహృతాశేషపాషణ్డా'. ఏది కావాలంటే అది ఇస్తానని తడుముకోకుండా అమ్మవారు ఈ నామాలలో చెప్తోంది. ఇన్ని ప్రయోజనాలు కలిగిస్తున్న తరుణీ, తాపసుల చేత ఆరాధింపడే తల్లి. తనుమధ్యగా ఉన్న ఆ జగదంబిక 'తమోపహా'.

362. చితిః – శ్రీ చిత్యై నమః

చైతన్యము అని అర్థం. **'స్వతంత్రా విశ్వసిద్ధి హేతురితి'** అని శక్తి సూత్రాలలో ఇచ్చిన నిర్వచనం. 'స్వతంత్రమైన ఈశ్వరుని శక్తి'ని చితిః అంటారు. ఇది విశ్వసిద్ధి హేతువు. ఈ విశ్వమంతా ఉండడానికి హేతువైన ఏ శక్తి ఉందో అది చితిః.

ఇది ఎక్కడున్నదంటే సృష్టిలో. ఇది లేకపోతే చైతన్యమే లేదు. జగత్తులో ప్రతి వారిలో ఇది ఉన్నది. **'సైషా చితిరితి ప్రోక్తా జీవనాజ్జీవికైషిణాం'** (మహావాసిష్ఠం) – బ్రతుకుతున్న వారందరిలో బ్రతుకు అనే రూపంలో ఉంది ఈ తల్లి. మనం బ్రతుకుతున్నామంటే శక్తి వలన...**'భూతానామస్మి చేతనా'** అని స్వామి ఇదే వాక్యాన్ని గీతలో చెప్పాడు.

ప్రతివారిలో చితి అనేది ఉండడం వలననే ఉనికి అనేది ఉంటుంది. ప్రపంచం నడవడానికి కారణమైన ఈశ్వర శక్తి 'చితిః'. ఆ చితినే మనం ఆరాధన

చేస్తున్నాం. **పరచితిః** అనే మాటని శంకరులు సౌందర్యలహరిలో చెప్పారు. శ్రీవిద్యలో శ్రీచక్రాన్ని ఆరాధన చేసేటప్పుడు **'పరచితిం భావయేత్'** అంటారు. పర అంటే సర్వోత్కృష్టమైన, చితిః అంటే చైతన్య స్వరూపిణి.

'తమోపహా' చెప్పిన వెంటనే 'చితిః' అని పెట్టడంలో విశేషం చూడాలి. చీకట్లను పోగొడుతున్నది అంటే అజ్ఞానాన్ని పోగొడుతున్నది. చితిః అన్నదానికి చైతన్యరూపిణి అని ఒక అర్థం. జ్ఞానరూపిణి అని మరొక అర్థం. **'అవిద్యా పరిపంథి జ్ఞాన స్వరూపా చితిః'** అని కూడా నిర్వచనం ఉంది.

పరిపంథి అంటే శత్రువు. అవిద్యకు శత్రువైన జ్ఞానరూపాన్ని చితిః అంటారు. ఆ జ్ఞానరూపంగా అమ్మవారు ఉన్నారు. ప్రతివారిలో ఈ చైతన్యం ఉంటేనే తెలుసుకోవడమనేది ఉంటుంది.

363. తత్పదలక్ష్యార్థా - శ్రీ తత్పదలక్ష్యార్థాయై నమః

'తత్' అనే పదమునకు లక్ష్యార్థము. తత్ అనే పదం దేన్ని తెలియజేస్తుందో అదే పరమేశ్వరి. 'తత్త్వమసి' మహావాక్యములో తత్ అనే పదం దేనిని చెప్తుందో అదే అమ్మవారు. తత్ - త్వమ్- అసి -మనం శోధన, సాధన చెయ్యవలసినదంతా ఈ మూడు పదాలు కలిగిన మహావాక్యాన్నే. దీనికి మరొక పేరు ఉపదేశ వాక్యము.

గురువు 'తత్ త్వమ్ అసి' అని శిష్యునకు చెప్తాడు. తత్ అనగా బ్రహ్మపదార్థం, త్వమ్ అనగా జీవుడు, అసి(అయి ఉన్నావు) అంటే ఐక్యమై ఉన్నది. 'అది నువ్వై ఉన్నావు'. ఇది తెలుగులో అర్థం. అది అంటే బ్రహ్మపదార్థం. బ్రహ్మపదార్థాన్ని అది అని ఎందుకు చెప్తున్నాం? ఏది మనకు పరోక్ష వస్తువో దానిని అది అంటాం. బ్రహ్మము పరోక్షమా? ప్రత్యక్షమా? ప్రత్యక్షం అని శాస్త్రం విన్నప్పుడు అనిపిస్తుంది కానీ మనకి ఎప్పుడూ అది పరోక్షమే.

బ్రహ్మానుభవం లేదు కనుక అనుభవానికి తెలియడం లేదు. 'తద్దూరే' కనుక అది దూరంగానే ఉంది. దూరంగా ఉన్నంత కాలం అది పరోక్ష వస్తువే. పరోక్ష వస్తువేంటో చెప్తూ- "అది పరోక్షం కాదయ్యా! అదే నువ్వై ఉన్నావ"ని దానిని అత్యంత

అపరోక్షం చేశారు. పరోక్ష వస్తువని భ్రమించేదానిని అపరోక్షం చేసుకోగలగాలని శంకరభగవత్పాదులవారు 'అపరోక్షానుభూతి' అనే గ్రంథం కూడా రచించిపెట్టారు.

తత్త్వమసి అని గురువు చెప్తారు. శిష్యుడు **త్వమ్** అనగా జీవ పదార్థం, **తత్** అనగా బ్రహ్మపదార్థమని రెండిటి గురించి విచారణ చేస్తాడు. **అసి** ఎలా అయిందో తెలుసుకుంటాడు. త్వమ్ అనే ఉపాధిగతమైన చైతన్యం ఉపాధికి అతీతమైన చైతన్యము తత్ పదార్థమే. ఉపాధులు చెప్పుకున్నంత కాలము పదార్థం అహం (త్వ) పదార్థము. విచారణ ద్వారా అది తత్ పదార్థమే అని తెలుసుకుంటాడు. అప్పుడు తత్త్వమసి అనే ఉపదేశ వాక్యం శిష్యునికి అనుభవానికి వచ్చేటప్పటికి 'అహం బ్రహ్మాస్మి' అవుతోంది.

'తత్త్వమసి' అనే దాన్ని ఉపదేశవాక్యం అంటారు. 'అహం బ్రహ్మాస్మి' అనే దాన్ని అనుభవవాక్యం అంటారు. అహం బ్రహ్మ అన్నప్పుడు అహం – జీవ వాచకం, బ్రహ్మ – పరమాత్మ వాచకము. త్వం – జీవవాచకం. తత్–బ్రహ్మవాచకం. ఇప్పుడు అమ్మవారు త్వమ్ పద వాచియా? తత్పద వాచియా! తత్పదలక్ష్యార్థా అంటే ఉపాధిగతమైన జీవభావం కాదు, ఉపాధిని నిరసించి పట్టుకోవలసిన పరమచైతన్యం.

తత్త్వమసి అనే మహావాక్యంలో తత్ అనేది ఏ బ్రహ్మమును చెప్తున్నదో ఆ బ్రహ్మమే అమ్మ. తత్ పదమునకు లక్ష్యమై, అర్థమై ఉన్నది. గాయత్రీ మహామంత్రములో మొదటి అక్షరం 'తత్' అనేది బ్రహ్మమే.

'అది' అనే మాట చాలా విశేషం. ఇందాక పరోక్ష వస్తువు కనుక 'అది' అన్నాం. అది అనడంలో ఇంకొక భావం కూడా ఉన్నది. ఏదైనా మాటకి అందనప్పుడు, మనం 'అదండీ, ఇదండీ' అని చెప్తాం. అందనప్పుడల్లా అలా చెప్పడమే. వేదం దేన్నైనా స్పష్టంగా చెప్తుంది కానీ బ్రహ్మ పదార్థం దగ్గరికి వచ్చేటప్పటికి వేదం కూడ 'అది' (తత్) అని చెప్పి ఊరుకుంది. అది ఇది అని చెప్పలేం కనుక. ప్రపంచంలోని ఒక ప్రకృతి పదార్థాన్ని నిర్దేశించవచ్చు. అమ్మ పదార్థము కాదు, ప్రకృతి కాదు. ప్రకృతికే చైతన్యాన్ని ఇచ్చే **చితిః** ఆ తల్లి. ఆ **చితిః** అనే దాన్ని 'ఇది' (ఇదం) అని వస్తువుగా నిర్దేశించలేం గనుక 'అది'(తత్) అని అంటే – మనసుకి, మాటకి అందనిది.

"యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" అనే తత్త్వమే తత్, ఆ తత్

ఏదంటే **సవితుర్వరేణ్యం** – సృష్టికర్త అయిన పరమేశ్వరుని తేజస్సే తత్. ఆ తేజస్సే చితిః. అదే తత్పదలక్ష్యార్థ. గాయత్రీ మంత్రార్థమని ఒక భావం. మహావాక్యములో చెప్పబడే **తత్** అనబడే పరబ్రహ్మస్వరూపము. ఇది ఈ వాక్యము యొక్క అర్థము. ఆ స్వరూపం ఎలా ఉంటుంది? రూపమంటే మనం తెలుసుకునేది రూపం. అమ్మరూపం ఎలాంటిదంటే –

364. చిదేకరసరూపిణీ – శ్రీ చిదేకరసరూపిణ్యై నమః

ఏకమనే మాటకి ఖండము కానిది, అఖండము అని అర్థం. ముక్కలు చెయ్యలేని విధంగా అఖండమై, సంపూర్ణమై ఉన్నదానిని "ఏక" అన్న శబ్దంతో చెప్పాలి. రసమనగా ఆనందమని అర్థం. **ఏకరసం** అంటే అఖండానందరూపిణి. ఆ అఖండానందానికి మరొక లక్షణముంది – అది చిత్. ఆ **'చితిః'** నామం కొనసాగుతోంది. **చిత్ ఏక రస.** చిత్ అంటే చైతన్యము, జ్ఞానము అని చెప్పుకున్నాం. ఏకరసము అంటే అఖండ ఆనందం. రెండూ కలిపి చూస్తే **అఖండ జ్ఞానానందమే** అమ్మరూపం. కేవల జ్ఞానానందరూపిణి.

'కేవల' అన్నమాట చెప్పడం కోసమే ఏక శబ్దం ప్రయోగించారు. శరీరం జడము మాత్రమే. ఈ జడం 'ఆహా' అనిపిస్తోందంటే దీనిలో 'చితిః' అని ఒక ఆవిడ 'చిదేకరసరూపిణి'గా తిరుగుతోంది. అది ఆవిడ అసలు స్వరూపం. అదే తత్పదలక్ష్యార్థం. ఈ జడంతో తాదాత్మ్యం చెంది 'నేను' అని ఏది అనుకుంటున్నామో అది త్వం-పదం. అది జీవుడు. అది పరిహరించవలసినదే. తత్ మాత్రమే మిగలవలసింది. ఛాందోగ్యోపనిషత్తులో వస్తున్న 'తత్త్వమసి' మహావాక్యం ఇక్కడ ప్రతిపాదన చేయబడుతున్నది.

365. స్వాత్మానన్దలవీభూతబ్రహ్మాద్యానన్దసంతతిః
– శ్రీ స్వాత్మానన్దలవీభూతబ్రహ్మాద్యానన్దసంతత్యై నమః

అగస్త్యుడు అడిగినప్పుడు హయగ్రీవస్వామి బోధిస్తూ త్రిశతి అంతా చెప్పాడు.

అమ్మవారు అంటే ఏమిటో ఒక్క మాటలో చెప్తాను విను అని, **'స్వాత్మైవ దేవతా ప్రోక్తా లలితా విశ్వవిగ్రహా'** అని చెప్పాడు. లలిత అంటే 'స్వాత్మ ఏవ'. నేను అని అనడానికి ఏ చైతన్యం ఆధారమో అది ఆత్మ. ఆ ఆత్మయే లలిత. ఆవిడే విశ్వవిగ్రహా. నీ యొక్క ఆత్మ ఎలా ఉందో ప్రతివారికి ఆత్మయై ఉన్నప్పుడు విశ్వమంతా ఆవిడ విగ్రహమేగా.

ఆత్మస్వరూపిణి అయిన అమ్మని మనం తెలుసుకున్నాక జనన, మరణ, సుఖ, దుఃఖ, లాభ, నష్ట ఇత్యాది ద్వంద్వవికారాలని దాటిపోతాం. ఉపాధులన్నీ దాటిపోయిన తరువాత అఖండమైన స్వాత్మానందాన్ని మనం పొందగలగాలి.

మనకు అసలైన ఆనందం కావాలని కోరిక ఉందా, లేదా? ఇది ముందు ప్రశ్నించుకోవాలి. కావాలి అనుకుంటే అసలైన ఆనందం ఇది అని చెప్పారు. లవీభూత అంటే అల్పమైన అని అర్థం. అమ్మ అఖండ ఆనంద స్వరూపిణి. అదే చిదేకరసరూపిణి. ఆ ఆనందం ఎంతటిదయ్యా అంటే సమస్త లోకాల ఆనందాలు కలిపినా ఆ ఆనందం ముందు అత్యంత అల్పములే.

'లవీభూత బ్రహ్మాద్యానంద సంతతిః' అనే మాట జాగ్రత్తగా తెలుసుకోవాలి. రహస్య నామాలు కనుక ఇందులో ఒక రహస్యముంది. బ్రహ్మాది – ఆనంద – సంతతిః అన్నారు. సంతతిః అంటే సమూహమని ఇక్కడ అర్థం. బ్రహ్మానందం మొదలుకుని అన్ని ఆనందముల సమూహములు కూడా అమ్మ ఆనందం ముందు (ఆనందరూపిణి అయిన అమ్మ ముందు) అత్యంత అల్పములు.

అమ్మ ఆనంద సముద్రము. మనం చెప్పే లోకసుఖములన్నీ బిందువులు. సముద్రం ముందు నీటిబొట్టు ప్రమాణం ఎంత? ఇక్కడ బ్రహ్మానందం అంటే పరబ్రహ్మానందం కాదు. బ్రహ్మలోకానందం. పరబ్రహ్మ అమ్మయే.

చతుర్ముఖబ్రహ్మ లోకానందం మొదలుకుని అన్నీ అంటే మనం అనుకునే భూలోకసుఖాల వరకు... అని అర్థం.

మానుషానందం మొదలుకుని బ్రహ్మానందం వరకూ ఎన్నో ఆనందాలు ఉన్నాయి. మనిషి కూడా మానుషానందం పొందడం లేదు. మనుష్యుడు

మానుషానందం పొందాలంటే అనేక జన్మల సుకృతాలు ఉంటే పొందుతాడు.

మనుష్యానందం గురించి పరిపూర్ణంగా శాస్త్రంలో ఉంది. అందులో లవలేశమే మనం ఈ శరీరంతో పొందగలుగుతున్నాం. ముందు వాడు యువకుడై ఉండాలి. ఏ రోగము లేని దృఢ శరీరుడై ఉండాలి. పైగా జ్ఞానియై ఉండాలి. సమస్త శాస్త్రవేత్త అయి ఉండాలి. సాధువై ఉండాలి. అధ్యయనసంపన్నుడై ఉండాలి. భోగవస్తువులకి కొదువ లేకుండా ఉండాలి. ప్రయత్నించక్కర్లేకుండానే సంపద ఉండాలి. తన పరిజనమంతా తనకి అనుకూలంగా ఉండాలి. సమస్తమైన భూమండలాన్ని ఏకఛత్రంగా పాలించగలగాలి. విశేషించి 'అకామహతుడై' (కోరిక దెబ్బ తగలనివాడై – కోరిక లేనివాడై) ఉండాలి. అలాంటివాడు పొందే ఆనందాన్ని మానుషానంద మంటారు. ఇది ఒక మనిషికే సాధ్యం. కానీ మనుష్యులందరికీ ఇది పొందడం సాధ్యమేనా? ఒక వేళ ఇవన్నీ సమకూరితే దాని పేరు **మానుషానందము.**

మనుష్యానందానికి వందరెట్లు ఎక్కువ 'మనుష్యగంధర్వానందము'. దీనికి వందరెట్లు ఎక్కువ 'దేవగంధర్వానందము'. దీనికంటె వందరెట్లు 'పితృదేవానందము'. ఇప్పుడు చేసుకొన్న పుణ్యాలని బట్టి ఇతరలోకాలకి వెళ్తే అక్కడ ఆనందాలు దొరుకుతూ ఉంటాయి. పితృదేవానందము కంటె వందరెట్లు ఎక్కువ 'అజానజదేవానందము'. దానికంటె వంద రెట్లు ఎక్కువ 'కర్మదేవానందము'. దానికంటె వంద రెట్లు ఎక్కువ 'దేవానందము'.

దేవానందం కంటె వందరెట్లు ఎక్కువ 'ఇంద్రానందం'. ఇది ఇంద్రత్వంలో పొందే ఆనందం. దానికంటె వంద రెట్లు 'బృహస్పత్యానందం'. దాని కంటె వందరెట్లు 'ప్రజాపత్యానందం'. దానికంటె వందరెట్లు ఎక్కువ 'బ్రహ్మలోకానందం'. బ్రహ్మానందం అంటే ఇది. ఎక్కడ మనుష్యానందం? ఎక్కడ బ్రహ్మలోకానందం? పరిశీలించాలి...

భూమిలో ఉన్న ఆనందాలన్నింటిలోనూ మనుష్యానందం గొప్పది. ఈ మనుష్యానందం మొదలుకుని అక్కడ బ్రహ్మలోకానందం వరకూ ఇన్ని లోకానందములన్నీ కూడా ఆ అఖండానందరూపిణి అయిన అమ్మవారి ముందు లవలేశములే.

అటువంటి అఖండానంద స్వరూపము. అదే చిదేకరసం. అదే "తత్పద లక్ష్యార్థము". అదే సర్వజీవుల యందు ప్రవహిస్తున్న 'చితిః'.

ఇందులో గొప్ప ఆనందకరమైన అంశం ఏమిటంటే మనం బ్రహ్మలోకానందం వరకు వెళ్ళగలమో, లేదో కానీ మన లోపల ఆ బ్రహ్మమే అఖండ ఆనందరూపమైన ఆత్మగా ఉన్నది. మనకి ఎంత అందుబాటులో ఉందో పరిశీలించారా! కనుక సాధన చేసి మనం దానిని పొందగలిగితే బ్రహ్మదేవుడు కూడా పొందనంత ఆనందాన్ని పొందవచ్చు. స్వస్వరూపమే (ఆత్మ) ఆనందఘనము.

ఆ ఆనందాన్ని లోకంలో దేనితోనూ పోల్చడానికి వీలులేదు. అది మన ఊహకి కూడా అందనిది. ఏపాటి ఊహకి అందినా అది ఆ ఆనందం కాదు.

అఖండానందస్వరూపమనే మాటకి చిదేకరసము అన్నప్పుడు అఖండము ఉన్నదే దానినే ఇక్కడ 'స్వాత్మానన్దలవీభూతబ్రహ్మాద్యానన్దసంతతి' అన్నారు.

ఇప్పుడు చెప్పిన ఈ ఆనందాలన్నీ సృష్టిలో అమ్మ యొక్క వెలుగులే. మనం చెప్పుకున్న నీటిబొట్లన్నీ సముద్రంలోంచి వచ్చినవేగా. అలా ఈ ఆనందాలన్నీ అమ్మ యొక్క అఖండానందము నుండి వచ్చిన బొట్లు. ఈ బొట్లు కోసం మనం తాపత్రయ పడుతున్నాం. అది వదిలిపెట్టి అమృత సముద్రం కోసం తపస్సు చేయవయ్యా అని ఇక్కడ మనకి చేస్తున్న ఒక బోధ.

"ఏతస్యైవానందస్య ఇమాని భూతాని మాత్రాముపజీవంతి" – పరమాత్మానందంలోని లేశాన్ని మాత్రమే ఇతర భూతాలు పొందుతున్నాయి అని తైత్తిరీయంలో చెప్పబడిన మాట అంతా ఇక్కడ చెప్పారు.

ఎప్పుడూ సాధన చేసుకుంటూ ఉంటే మన లోపల అమ్మని పట్టుకోవడం చాలా సులభం. ఎక్కడెక్కడో తిరిగి తిరిగి వచ్చాం. అక్కడ కాదయ్యా లోపల వెతకండి. నీ ఇంటి పెట్టెలోనే అమ్మవారు ఉన్నారంటే ఎంత ఆనందం. ఇంటి పెట్టెలో ఉందంటేనే అంత ఆనంద పడతామే మరి ఒంటి పెట్టెలో ఉందంటే ఎంత ఆనంద పడాలి? అపరిచ్ఛిన్నమైన నిర్గుణ బ్రహ్మానందమే తత్త్వతః లలితాస్వరూపం. అది మోక్షానందం.

366. పరా – శ్రీ పరాయై నమః

పరాప్రత్యక్చితీరూపా పశ్యన్తీ పరదేవతా
మధ్యమా వైఖరీరూపా భక్తమానసహంసికా

ఈ శ్లోకములో రెండు పాదాలు ఉన్నాయి. ఈ రెండు పాదాలలో అనేక నామాలు ఉన్నాయి. ఈ రెండు పాదాలు ఒక గుత్తి. పరా, పశ్యన్తీ, మధ్యమా, వైఖరీ. ఈ నాలుగు నామములే ఈ మొత్తం శ్లోకంలో ప్రధానమైనవి. మిగిలినవి అప్రధానం అని కాదు. మనం ఈ నాలుగింటిని విమర్శన చేసుకోవాలి. శబ్దబ్రహ్మస్వరూపిణిగా పరమేశ్వరిని ప్రతిపాదిస్తున్న నామాలివి.

బయటకి వినబడే మాటలన్నిటికి వైఖరి అని పేరు. ప్రతి శబ్దం మనకి బయటకి వినబడుతోంది. అక్షరాత్మకంగా మానవుడు ఒక్కడే పలుకగలడు. మిగిలిన జీవులెవరూ ఆ విధంగా పలుకలేరు. వాక్స్వరూపాన్ని వేదమే చెప్తూ –

చత్వారి వాక్పరిమితా పదాని తాని విదుః బ్రాహ్మణా యే మనీషిణః
గుహాత్రీణి నిహితా నేంగయంతి తురీయం వాచో మనుష్యా వదంతి

ఇది చాలా ముఖ్యమైన ఘట్టం. ఇందులోనే శ్రీచక్రముంది. ఇందులోనే కుండలినీ ఉంది. ఈ నాలుగింటిని విచారణ చేస్తే శ్రీచక్రోపాసనే. అలాగే శ్రీచక్రంలో ఈ నాలుగు ఎక్కడ ఉన్నాయో చెప్పడం జరుగుతుంది. శ్రీచక్రాన్ని చూశాక ఏ ఏ కోణాలలో ఇవి ఉన్నాయో పట్టుకొని ఉపాసన చేస్తే, అక్కడ కోణాలలో ఉన్నదే ఇక్కడుందని తెలుసుకుని రెండిటికి ఐక్యమనేది ఘటించి అమ్మ యొక్క సాయుజ్యాన్ని, అఖండ చిదేకరసరూపిణి స్థితిని పొందగలం. అందుకే ఇది చాలా ముఖ్యమైన వివేచన.

పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అనబడే నాలుగు వాక్స్వరూపాలని చెప్తున్నారు.

గలగలా మాట్లాడే మాట స్థూలంగా చెవులున్న ప్రతివారికి వినబడుతుంది. దాని వెనకాల మూడు సూక్ష్మ దశలు ఉంటాయి. ఆ మూడు చెవులకి వినబడవు. కానీ అవి లేకపోతే ఇది రాదు. ఇది ఎలాంటిదంటే చెట్టు, కొమ్మలు, కాండము

కనబడుతోంది కానీ వేరు కనబడదు. కానీ కనబడే చెట్టుబట్టి, కనబడని వేరు ఉందని ఎలా తెలుసుకుంటున్నామో, వినబడే వాక్కులను బట్టి లోపల వేరులాగ వినబడని సూక్ష్మశక్తులు లోపల ఉన్నాయని తెలుసుకోవాలి.

ఎప్పుడైనా స్థూలానికి మూలం సూక్ష్మం. స్థూలం కంటె సూక్ష్మానికి శక్తి ఎక్కువ. మానవుడు సాధనలో ఎంత స్థూలం నుంచి సూక్ష్మానికి వెళ్తే అంత సద్గతిని పొందగలడు.

పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అనబడే నాలుగు వాక్స్వరూపాలుగా చెప్తారు గానీ ప్రపంచానికి కూడా ఇదే వర్తిస్తుంది. ప్రపంచంలో మనం ఏ వస్తువు గురించి మాట్లాడుకోవాలన్నా వైఖరియే ప్రధానం. ఏ వస్తువుని వర్ణించాలన్నా ప్రతిదానికి నామాలు, పదాలు ఉన్నాయి. వాటిని చెప్తున్నామంటే వైఖరీయే కదా! నామం, రూపం – ఇవన్నీ వైఖరియే! ఈ వైఖరి వెనకాల ఉన్న పరా, పశ్యంతి, మధ్యమాలను తెలుసుకుందాం.

ఇది అర్థం అవడానికి చిన్న ఉదాహరణతో చెప్పుకోవాలి. ఒక గింజ చెట్టుగా కావాలంటే ఎన్నో దశలు దాటుతుంది. విత్తనం యొక్క ముందు దశ ఉబ్బడం. ఈ ఉబ్బినదశ వంటిది **పరా దశ** అంటారు. తరువాత దాని నుండి మొలక వస్తుంది. ఈ మొలకని **పశ్యన్తీ దశ** అంటారు. ఆ మొలక తరువాత ఒక రెండు దళాల చిన్ని మొక్కగా ఉంటుంది. మొత్తం వృక్షం అని చెప్పలేం. అసలు వృక్షం కాదని చెప్పలేం. కాబోయే వృక్షము యొక్క ఒకానొక వ్యక్తదశ అందులో కనబడుతోంది. కనుకనే ఉబ్బుదశ నుండి మొలకదశ. మొలక దశ నుండి రెండు దళాలుగా విచ్చుకొని పైకి లేచే దశ. దీనిని దళదశ అనుకుంటే ఇది **మధ్యమ.** దాని తరువాత వృక్షం. వృక్షమనగానే కొమ్మలు, రెమ్మలు, పువ్వులు, పళ్ళు... ఇలా రకరకాలు ఉంటుంది. ఈ వృక్షమంతా **వైఖరి.** ఈ వైఖరికి ఇప్పుడు వెనక్కి వెళ్తే దళదశ, మొలకదశ, విత్తనదశ వచ్చింది. ఎలాగైతే విత్తనానికి ఈ మూడు దశలు ఉన్నవో అలా వైఖరికి వెనకాల మధ్యమ, పశ్యంతి, పరా వచ్చాయి.

ఇది రోజూ మనలో జరిగే ఒకానొక నిరంతర క్రియ. మన మాటలన్నీ

ఎక్కడ్నుంచి వస్తున్నాయని ఎప్పుడైనా ఆలోచించామా? మన శరీరంలో ప్రాణశక్తి వాగ్రూపంగా ప్రధానంగా ఉంది. దానినే పట్టుకోవాలి. మంత్రోపదేశం ప్రధానంగా ఎందుకు చేస్తారంటే మనలో ప్రాణచైతన్యం యొక్క ప్రథమ స్వరూపం నాదం. వాక్కు ద్వారా నాదానికి వెళ్ళి ఆ నాదానికి మూలమైన అమ్మని పట్టుకోవాలని ప్రయత్నం. ఈ విషయాన్నంతటిని 'నాదరూపా' నామం దగ్గర వివరంగా చెప్పుకున్నాం.

ముందు మాట్లాడాలనే సంకల్పం రాగానే మన మెదడు దగ్గర ప్రధానంగా ఆ సంకల్పరూపమైన చైతన్యం అందుకుని ఒక విద్యుత్ తీగలోంచి విద్యుత్ ఎలా ఎంత వేగంగా ప్రసారం అవుతుందో అంత వేగంగా మూలాధారానికి వెళ్తుంది. ఇది జరిగే ప్రక్రియ. పాణిని మొదలైన వారు శబ్దం యొక్క ఉత్పత్తి గురించి చాలా విశేషాలు చెప్తూ వారు కూడా ఇదే అభిప్రాయం చెప్పారు.

మాట్లాడాలి అని మనకి అనగానే హఠాత్తుగా చైతన్యం ఒక్కసారి విద్యుత్‌లా పనిచేస్తుంది. నీరులాగా అని అనలేదు. నీరు గొట్టం నుండి పడడానికి కొంత సమయం పడుతుంది. కానీ విద్యుత్ ప్రసారం కావడానికి ఎంతో సమయం పట్టదు. విద్యుత్ సంయోగం కాగానే చివరివరకు ఎలా ప్రవహిస్తుందో అలా సహస్రారస్థానం దగ్గర ఉన్న చైతన్యము అంత వేగంగా వెళ్ళి మూలాధారానికి అంటుకుంటుంది. అక్కడ మూలాధారం నుండి ఆ చైతన్యం బయలుదేరుతుంది. ఆ బయలుదేరిన దశని 'పరా' అంటారు. అర్థం చేసుకోవడానికి నెమ్మదిగా చెప్పుకుంటున్నాం కానీ వైఖరికి రావడానికి అంత సమయం పట్టదు. అలా మూలాధారం దగ్గర ఉద్యుక్తమైన దశనే 'పరాదశ' అని అంటారు. అక్కడ అది భావదశని పొందుతుంది.

భావదశ అంటే మనం మాట్లాడదలచుకున్న భావం అంతా నిర్మాణం జరుగుతుంది. ఆ విషయం మనస్సుకు గోచరమవుతుంది. ఆ మనస్సు అందుకునే దశ 'పశ్యన్తీ' (చూస్తోంది) అంటారు. అక్కడ నుండి పైకి వెళ్ళిన తరువాత దశ – వైఖరికి, పశ్యన్తీకి నడుమ ఉన్న దశ. ఆ నడుమదశనే 'మధ్యమ' అంటారు. ఆ మధ్యమదశలో మనం ఏ భాషలో మాట్లాడదలచుకున్నామో దానికి సంబంధించినదంతా మనలో చైతన్యము(జ్ఞానం) తయారుచేసుకుంటుంది.

ఏ భాష మాట్లాడుతున్నప్పటికీ దాని భావమంతా తయారు అవుతుంది. పూర్తిగా వాక్కులుగా వినబడదు గాని లోపలే తయారవుతుంది. అలా తయారైనది కంఠం దగ్గర నుండి బయటకి వచ్చేటప్పటికి వినబడుతుంది. పరా దశ సంకల్పరూపంగా చైతన్యం రావడం. భావరూపంగా అందేది పశ్యన్తీ దశ. ఆ లోపల వాక్య నిర్మాణం సూక్ష్మంగా చేసుకునే దశ మధ్యమ దశ. బైటకి వినపడగానే వైఖరీ దశ. మాట ఇలా తయారవుతుంది. మన లోపల ప్రాణశక్తి వల్ల ఇదంతా జరుగుతోంది.

వాక్కు అనేది ప్రాణశక్తి యొక్క ప్రకటనమే. ప్రాణము, వేడిమి - ఈ రెండూ కలిస్తే నాదం బయలుదేరుతుంది. నారాయణీ, నాదరూపా దగ్గర చదువుకున్న విషయం ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి.

ఆ వాక్కు యొక్క సంచారాన్ని మనం గమనిస్తూ ఉంటే మన లోపల చితిః అయిన అమ్మవారు ఎలా కదులుతున్నారో గమనించుకోవచ్చు. మంత్రమునకు అది సహాయం. మంత్రం స్థూలంగా కాకుండా, సూక్ష్మంగా చేయడం మొదలు పెడితే అంత ఎక్కువగా ఈ వాక్కుని ఉపాసిస్తాం. మంత్రోపాసకులు అందరూ చేసేది ఈ వాగ్రూప ఉపాసనే.

మూలాధారాత్ సముత్పన్నః పరాఖ్యోనాదసంభవః
స ఏవోర్ధ్వతయానీతః స్వాధిష్ఠానే విజృంభితః
పశ్యంత్యాఖ్యామవాప్నోతి తయైవోర్ధ్వం శనైశ్శనైః
అనాహతే బుద్ధితత్త్వసమేతో మధ్యమాభిధః
తథా తయోర్ధ్వం నున్నస్సన్ విశుద్ధౌకంఠదేశతః
వైఖర్యాఖ్యా... అని 'నిత్యాతంత్రం' చెబుతున్నది.

"మూలాధారంలో నాదం పుడుతుంది. దానినే 'పరా' అంటారు. అది క్రమంగా పైకి తీసుకురాబడి స్వాధిష్ఠానాన్ని పొందుతుంది. అప్పుడు దానికి 'పశ్యంతి' అని పేరు. ఆ నాదమే మెల్లమెల్లగా పైకి వచ్చి అనాహత చక్రాన్ని పొందుతుంది. అక్కడ బుద్ధితో కలుస్తుంది. దానికి 'మధ్యమ' అంటారు. అలా పైకి తీసుకురాబడిన ఆ నాదం విశుద్ధిచక్రంలో ప్రవేశించి, కంఠము మొదలైన స్థానాలను పొంది 'వైఖరి' అని చెప్పబడుతుంది".

అపదం పదమాపన్నం పదం చాప్యపదం భవేత్

పదాపద విభాగంచ యః పశ్యతి స పశ్యతి.(సూతసంహిత - యజ్ఞవైభవ ఖండం)

నిష్పంద (నిశ్చల) శబ్దబ్రహ్మమే పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ - అనే నాలుగు స్థానాలను పొందింది. ఇది సృష్టిక్రమంలోనిది. ఈ నాలుగింటిని క్రమంగా తెలుసుకున్నవాడే జ్ఞాని.

'ప్రసాదరూపిణీ చేతి పరా సా శాంభవీ పరే' - అని 'త్రిపురాసిద్ధాంతం' - ప్రసాదరూపిణి అయిన శాంభవి (శంభుని శక్తి) కనుక 'పర' అయినది.

సృష్టి నిర్మాణం కూడా పరా, పశ్యన్తీ, మధ్యమా, వైఖరీరూపంగా జరిగింది. పరమాత్మ సృష్టి చేయాలనుకోగానే తన శక్తితో కలిశాడు. తన శక్తితో పరమాత్మ కలవగానే ఆ దశని 'పరా' అంటారు. ఆ తరువాత ఈ జగత్తుని ఎలా నిర్మాణం చేయాలనే జ్ఞానంలో ముందు సంకల్ప దశ, భావ దశ. ఆ భావ దశకి వచ్చేటప్పటకి 'పశ్యన్తీ'. ఏ విధంగా నిర్మాణం చేయాలని లోపల సమకూర్చుకున్నారో అది ఆయన యొక్క 'మధ్యమ'. తరువాత జగద్రూపంగా వ్యక్తం చేశాడే అది ఆయన యొక్క 'వైఖరీ'.

పరమేశ్వరశక్తి పరా, పశ్యన్తీ, మధ్యమ, వైఖరులుగా అలా విస్తరించింది. మనలోపల వాక్‌శక్తి అలా వచ్చింది. ఇది పరిశీలన చేస్తూ ఉంటే అది తెలుస్తుంది. అక్కడ ఉన్నదే ఇక్కడుంది అని చెప్పడంలో అదే అర్థం. వాక్కు గమనం ఎలా సాగుతుందో తెలుస్తుంది. దీనికి పైన చెప్పిన శాస్త్ర వాక్యాల్లో ఒక మాట చెప్తూ **"మూలాధారాత్ సముత్పన్నః పరాఖ్యో నాదసంభవః"** -మూలాధారం నుండి కలిగినది 'పరా' అని చెప్పబడుతున్నది.

'స ఏవోర్ధ్వతయా నీతః' - అది పైకి రాగానే, **'స్వాధిష్ఠానే విజృంభితః'** - స్వాధిష్ఠానం దగ్గరికి వచ్చేటప్పటికి పైకిరావడంలో వాక్కుకి వేగం పెరుగుతుంది. అక్కడ నుండి పైకి వచ్చేటప్పుడు **'పశ్యంత్యాఖ్యామవాప్నోతి'** - పశ్యంతి అని చెప్పబడుతున్నది. **'తథైవోర్ధ్వం శనైః శనైః'** - అది నెమ్మది నెమ్మదిగా వెళ్ళి, **'అనాహతే**

బుద్ధితత్త్వసమేతో మధ్యమాభిధః' – అనాహతం దగ్గరకి వచ్చేటప్పటికి బుద్ధితత్త్వంతో కలిసి మధ్యమా అనిపించుకుంటోంది. అది– **'తథా తయోర్ధ్వం నున్నస్సన్ విశుద్ధౌ కంఠదేశతః వైఖర్యాఖ్యా'** – పైకి తీసుకురాబడి విశుద్ధిచక్రంలో ప్రవేశించి, కంఠాది స్థానాల ద్వారా 'వైఖరిగా' వినబడుతుంది. ఇంతవరకు వచ్చింది. ఇక్కడ నుండి బయటకు రావడానికి మానవునికి ఒక్కనికే భగవంతుడు అవకాశమిచ్చాడు. ఇలాంటి శరీరం, ఇలాంటి తలకాయ ప్రపంచంలో దేనికీ లేదు.

వాగ్దేవి ప్రపంచమంతా ఉంటుంది. రాళ్ళ యందు వాక్కు పరారూపంగా ఉంటుంది. వృక్షాదుల యందు పశ్యన్తీ, పశువుల యందు మధ్యమా రూపంతో, మానవుని యందు వైఖరి రూపంగా వ్యక్తమవుతుంది. మానవుని దగ్గరే నాలుగు ఉన్నాయి. మిగిలిన వాటియందు ఒకొక్క దశ ఉంటుంది. పరా రాతితో మొదలుకొని అన్నింటిలోను ఉంటుంది. **'చత్వారి వాక్పరిమితా పదాని తాని విదుర్బ్రాహ్మణా యే మనీషిణః'** – ఎవరైతే జ్ఞానులో వారు ఈ వాక్తత్త్వాన్ని తెలుసుకోగలరు.

'గుహా త్రీణి నిహితా నేంగయంతి' – ఆ మూడు లోపల దాగి ఉంటాయి. ఎవరికి తెలియబడవు. **'తురీయం వాచో మనుష్యా వదంతి'** – ఆ నాలుగవదైన వాక్కుని మానవులే పలుకగలరు. అది పలుకగలిగే జన్మ మానవునికే వచ్చింది. ఇది వచ్చినప్పుడు దాని మూలదశను తెలుసుకునే ప్రయత్నం చేయలేకపోతే మరి ఏ జన్మలోనూ పొందలేం. వాక్కు యొక్క పూర్ణదశ మానవునిలో ఉంటుంది. పూర్ణత్వం ఈ శరీరంలో ఉంటుంది కనుక మానవునికి 'పురుషుడు' అని పేరు. మనుష్యునికి పురుషుడు అనే పేరు ఎందుకు వచ్చిందంటే ఇతర జంతు జన్మల కంటె పూర్ణుడు గనుక. మనలో ఉన్న వాగ్వ్యాపార వైఖరిని మనం చూశాం.

పరదేవత అని ఎందుకన్నారో తెలుసుకుంటే ఇంకా ఆశ్చర్యం వేస్తుంది. 'పరా' – ఇది స్వాధిష్ఠానం దగ్గరకి వచ్చి తరువాత అనాహతం దగ్గర నుండి ఎలా ప్రయాణిస్తోందో గమనించాం. షట్చక్రాల గురించి తెలియని వారికి కూడా ఇవి ఉంటాయి. గుండెకాయ గురించి పూర్తి అవగాహన లేనివారికి కూడా గుండెకాయ ఉంటుంది. కానీ దానిగురించి వైద్యునికి మాత్రమే తెలుస్తుంది. అలాగే కుండలినీ

అందరికి ఉంటుంది. కానీ దాని గురించి యోగులకి మాత్రమే తెలుస్తుంది. తెలుసుకుంటే మనం కూడా యోగంతో బాగుపడతాం. విమర్శరూపిణీ అంటే ఇదే. విమర్శగా వ్యాపించి మనలో సంచరిస్తున్న శక్తిని తెలుసుకుంటున్నాం.

శక్తితో కూడిన పరమాత్మని 'పరా' అనాలి. ఇది శ్రీచక్రంలో ఎక్కడ ఉందో పరిశీలిస్తే, శ్రీచక్రంలో మేరువులో పైన బిందుస్థానం – పరా, త్రికోణం – పశ్యంతి, అష్టత్రికోణం – మధ్యమా అని చెప్పబడుతూ మిగిలిన అన్ని ఆవరణలు కలుపుకొని అంటే తరువాత వచ్చే రెండు 'దశ త్రికోణ' చక్రాలు, చతుర్దశ త్రికోణం, అష్టదళము, షోడశదళం, చతురస్రం ఇదంతా వైఖరీగా వ్యక్తమౌతున్న ప్రపంచమే. అక్కడ నుండి మొత్తం లోకమంతా వస్తోంది. పరా సహస్రారంలోంచి మూలాధారంలోకి వచ్చింది. అది పొందగలిగితే అప్పుడు మోక్షము.

ఈ మాటనే త్యాగరాజ స్వామివారు 'మూలాధారజ నాదమెరుగుటే ముదమగు మోక్షమురా' అన్నారు. అంటే ఆయన స్థితి ఎంతటిదో గ్రహించాలి. ఆయన నాదయోగి. సంకీర్తన యోగి. అందుకే ఆ మాటని అనగలిగారు.

"పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే" – పరాశక్తి అంటే ఇదే అర్థం. సృష్టికి ప్రారంభదశలో ఉన్న శక్తి పరాశక్తి. అదే ఆదిశక్తి. ఆ ఆదిశక్తే పరావాక్కుగా మనలో ఉన్నది.

దీనిని రకరకాలుగా సాధకులు చేస్తారు.

యేయం విమర్శరూపైవ పరమార్థ చమత్కృతిః
సైవసారం పదార్థానాం పరా వాగభిధీయతే
నాదాఖ్యా సర్వభూతేషు జీవరూపేణ సంస్థితా
అనాదినిధనా సైవ సూక్ష్మా వాగనపాయినీ
అనాదినిధనం బ్రహ్మశబ్దతత్త్వం యదక్షరమ్

సర్వపదార్థాల సారం 'పరా'. మాయాశబలితబ్రహ్మమే పరా. ఆద్యంతాలు లేనిదీ, సూక్ష్మమై, నాశరహితమై, శబ్దతత్త్వమైన అక్షరబ్రహ్మమే 'నాద'మనే పేరుతో సర్వభూతములలో జీవరూపంలో ఉన్నది.

సహస్రకమలే శక్తిశ్శివేన సహ మోదతే। సచావస్థా పరా జ్ఞేయా సైవ నిర్వృతి కారణమ్. కుండలినీ శక్తి ఉత్థానమై, బ్రహ్మ, విష్ణు, రుద్ర గ్రంథులను భేదించుకొని సహస్రారంలో శివునితో ఐక్యాన్ని పొందే, నివృత్తి కారణమైన స్థితియే 'పరా'.

ఆధిభౌతికంగా పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరులే – కామరూపపీఠం, పూర్ణగిరిపీఠం, జాలంధరపీఠం, ఓడ్యాణపీఠం – అని 'నిత్యాహృదయం' చెబుతోంది

367. ప్రత్యక్చితీరూపా – శ్రీ ప్రత్యక్చితీరూపాయై నమః

'చితి' అన్నదానికి అర్థం వెనుకటి నామాలలో తెలుసుకున్నాం. ప్రత్యక్ అంటే అంతర్ముఖము అని అర్థం. ముందుకు సాగిపోతూ ఉంటే బహిర్ముఖం. దానిని వెనక్కి త్రిప్పితే ప్రత్యక్. భగవంతుడు ఇచ్చిన ప్రజ్ఞ అందరికి కూడా బయటకే పరిగెడుతుంది. నీరు పల్లమెరుగు అని అంటాం. అలా నీటికి ఎలా క్రిందపడటం లక్షణమో, మనలోపల జ్ఞానానికి ఎప్పుడు బైట ప్రపంచం వైపు ప్రసారం స్వభావం. ఇంత లోపల విషయాన్ని చెప్పగానే చిరాకు, విసుగు వస్తుంది. అదే బయట విషయాలు, సంగతులు చెప్తే హుషారుగా వింటారు. ఎందుకంటే బహిర్ముఖ విషయాలు చెప్తే సంతోషం. లోకం తీరు అంతే. మానవుని ఇంద్రియాలకి సహజ లక్షణం బహిర్ముఖం.

అది సహజమని **"పరాంచిఖాని వ్యతృణత్స్వయంభూః"** అని ఉపనిషత్ చెప్తోంది. పరాఙ్ముఖం – అందరికీ కూడా పరాఙ్ముఖమే అంటే మనం లోపలవి తప్ప బయటవి వెతుకుతూ ఉంటాం. ఎవడో ఒక్కడు వెనక్కి తిరిగి చూస్తాడు. **'కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షత్'** – ఎవరో ఒకానొక ధీరుడు వెనక్కి తిరుగుతాడు అనేది ఉపనిషద్వచనం. వెనక్కి తిరుగుతున్నాడంటే ఇంత చూస్తున్నానే ప్రపంచం, దీనికి మూలమైనదేది అని ఒక్కసారి మఠం వేసుకుని కూర్చుని ఆలోచిస్తాడు.

స్థిమితంగా ఒక్క నిమిషమైనా మనం కూర్చోగలమా! చాలా పనులున్నాయండీ అంటారు. పూజ చేయాలి, జపం చేయాలి కాని స్థిమితంగా కూర్చోలేరు. కోటికి

ఒక్కడు వెనక్కి తిరుగుతాడు అంటాడు కృష్ణపరమాత్మ **"మనుష్యాణాం సహస్రేషు కశ్చిత్ యతతి సిద్ధయే"** అంటాడు.

'కశ్చిద్ధీరః' – వాడొక్కడు తిరుగుతాడు.

చెట్టుకు మూలానికి ఎలా వెళ్తున్నామో, మనం మూలానికి అలా వెళ్ళాలి. అలా మూలానికి వెళ్తే అక్కడ ప్రత్యక్ – అంతర్ముఖదృష్టితో చూస్తే కనబడే జ్ఞానమే అమ్మరూపము.

ప్రత్యక్చితీరూపా – అంతర్ముఖ దృష్టిని 'ప్రత్యక్' అంటారు. ఆ దృష్టికి గోచరించే జ్ఞానరూపాన్ని 'చితీరూపా' అంటారు. కానీ బైటకి చూసేది? అదీ అమ్మరూపమే. ఆవిడ చైతన్యం లేకపోతే బయటవి కూడా చూడలేం. అక్కడ అమ్మరూపం కనబడదు, ప్రపంచరూపం కనబడుతుంది. ప్రత్యక్ అయితేనే చితీరూపం గోచరిస్తుంది. బైట తిరుగుతున్నంతసేపు అది కూడా అమ్మ చైతన్యమైనా తెలియబడడం లేదు.

'పరా' తరువాత 'ప్రత్యక్చితీరూపా' పెట్టడంలో ఉద్దేశం– పరా అనబడే అమ్మవారి స్వరూపము అంతర్ముఖ దృష్టి కలవారికి మాత్రమే జ్ఞానముగా లభిస్తుంది. ఇది ఈ వాక్యము యొక్క అర్థం.

'పరా' ప్రక్కనే ప్రత్యక్చితీరూపా ఎందుకు పెట్టాలి? పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి అంటే అయిపోతుందిగా. వశిన్యాదివాగ్దేవతలు ఒక చక్కని విజ్ఞానాన్ని మనకి అందిస్తున్నారు. పరాని తెలుసుకోవాలంటే పద్ధతి ఇది. 'ప్రత్యక్' అయితేనే 'పరా'ను మనం 'చితీ'(చైతన్య)రూపంగా తెలుసుకోగలం. చైతన్యరూపంగా అనుభవానికి వస్తున్నది. ఇది 'పరచితి' అని చెప్పబడుతున్నది.

368. పశ్యన్తీ – శ్రీ పశ్యన్త్యై నమః

369. పరదేవతా – శ్రీ పరదేవతాయై నమః

పశ్యంతీ దశలో మనం చూస్తే ఆ పరదేవత లలితాంబ. మూలాధారం మొదలు షట్చక్ర దళాలలోని మాతృకా వర్ణాలన్నీ పశ్యంతీ వాగ్రూపాలు.

అవిభాగాతు పశ్యంతీ సర్వతః సంహృతక్రమా

స్వరూపజ్యోతిరేవాంతః సూక్ష్మావాగనపాయినీ

"అక్షరోచ్చారణకు ఆధారమై కంఠం, దౌడలు వంటి ప్రత్యేక స్థానాలు లేనిది. ఇంద్రియాలతో గ్రహించలేని సూక్ష్మవాక్కు – పశ్యంతి.

వేదశాస్త్రమయీ వాణీ యస్యాః సా పరదేవతా' – వేదశాస్త్రమయమైన వాక్కులు ఎవరివో ఆమెయే పరదేవత. పశ్యంతీదశలో భావరూపంతో గ్రహించగలిగే ఉపాస్యదేవతగా పరదేవత ఉంటుంది.

సాధారణంగా ప్రజ్ఞ వైఖరీ దశలోనే ఉంది. సాధనతో పశ్యంతీ దశకి వెళ్తే భావరూపంగా అమ్మవారిని ఉపాసించగలం, అందుకే 'పశ్యన్తీ – పరదేవతా'.

'మధ్యమా' 'వైఖరీ' కలిపే చెప్పారు. మధ్యమా, వైఖరికి పెద్ద తేడా ఏమీ లేదు. బయటకి వినబడే అక్షరాలు, వెలుపలకి వచ్చేలోపల తయారు అవుతాయి.

370. మధ్యమా – శ్రీ మధ్యమాయై నమః

'పరా'దశని ప్రత్యక్ దృష్టితో అనుభవించగలుగుతున్నాం. 'పరదేవతా' స్వరూపాన్ని పశ్యంతీ దశలో భావనాత్మకంగా తెలుసుకోగలుగుతున్నాం. 'మధ్యమా' దశలో మనం అనుభవించేది ఏది? మంత్రం. మంత్రజపం బయటకి చెయ్యరుగా! అక్షరాలు లోపల తిరుగుతున్నాయా? లేదా? అక్షరాలు బయటకి వినబడకుండా లోపల తయారయ్యే దశ మధ్యమ. ఆ మధ్యమ దశలో మనం చేస్తూ ఉండగా ఆ మంత్రమంతా దేవతాంశగా మారుతుంది. అది ఆవిడ చైతన్యం కదా! మధ్యమస్థితిలో జపం చేస్తున్నది, వైఖరి స్థితిలో ఉన్న మంత్రాలేగా! "శ్రీమాత్రే నమః" అనేది మంత్రం అనుకుందాం. శ్రీమాత్రే నమః వైఖరీయేగా!

అంతస్సంకల్పరూపా యా క్రమరూపాఽనుపాతినీ

ప్రాణవృత్తిమతిక్రమ్య మధ్యమా వాక్ ప్రవర్తతే

అంతస్సంకల్పరూపమైనది, క్రమరూపంగా అనుపాతమైనదీ, ప్రాణవృత్తిని అతిక్రమించి ప్రవర్తించే వాక్కు మధ్యమా.

మనం జపంగా చేసినప్పుడు దానిని మధ్యమగా చేస్తున్నాం. బయటకు అనేటప్పటికి అది వైఖరి. జపానికి వెళ్ళేటప్పటికి వైఖరి నుండి మధ్యమలోకి వెళ్ళింది. వెనక్కి వెళ్ళిందంటే మధ్యమకి వెళ్ళింది. మధ్యమకి వెళ్ళినప్పుడు మననం చేశాం కదా! వైఖరిలో ఉండే అక్షరాలనే మధ్యమలో జపం చేస్తున్నాం కనుక రెండూ ప్రక్కప్రక్కనే పెట్టారు 'మధ్యమా' – 'వైఖరీరూపా'.

మధ్యమా, వైఖరీలను ప్రక్కప్రక్కన పెట్టడంతో అంత అద్భుతం చూపించాడు. రెండిటికి పెద్ద భేదం లేదు. మొత్తానికి మనం మధ్యమగా చేస్తున్నప్పుడు ఆ దేవత ఆ మంత్రచైతన్యంలోంచి తయారవుతోంది. ఎక్కడ ఉంది ఆవిడ? మధ్యమలో తయారై జపం చేస్తున్న భక్తుని మనస్సులో అది విహరిస్తూ ఉంటుంది.

371. వైఖరీరూపా – శ్రీ వైఖరీరూపాయై నమః

372. భక్తమానసహంసికా – శ్రీ భక్తమానసహంసికాయై నమః

'మధ్యమ'లో జపం చేసునప్పుడు భక్తుని మనస్సులో హంసలా ఓలలాడుతూంటుంది. ఇది పూర్తిగా సాధనకు సంబంధించిన అంశమే. జగన్మాత ప్రతివారిలో 'పరా'గా ఉన్నారు. పరా తెలియాలంటే మనం ప్రత్యక్ దృష్టితో వెళ్తే అక్కడ చితిరూపంగా కనబడుతుంది. లేదండీ భావన చేస్తూంటాను అంటే అప్పుడు పశ్యన్తీ దశలోంచి పట్టుకోవాలి. లేదా జపం చేస్తాను అప్పుడు మధ్యమా దశలోకి వెళ్ళు. అప్పుడు మూడిటిలో ఏది చేసినా ఆ సాధకుని యొక్క మనస్సులో అమ్మవారు మానససరోవరంలో హంసలాగ విహరిస్తూ ఉంటుంది.

ఒక్క రెండు వాక్యాలలో మొత్తం సాధన దశ అంతా చెప్పారు... భక్తుడు అనగా అమ్మవారిని ఆశ్రయించిన సాధకుడు. మంత్రం పట్టుకున్నాడో, చక్రం పట్టుకున్నాడో, స్తోత్రం పట్టుకున్నాడో... లోపల తిరుగుతోందా, లేదా? ఒక్కసారి మనస్సులో అనుకున్నాడు అంటే, భావించాడు అంటే పశ్యంతీ, మౌనంగా ఉన్నాడు అంటే పరా. ఎలాగైనా ఆ తల్లే ఇన్ని రూపాలతో వస్తోంది కనుక సాధనలో ఉన్న స్థాయిలన్నీ చూపిస్తున్నారు. ఈ విధంగా 'భక్తమానసహంసికా'.

మానస- హంసిక. మనస్సు ఎక్కడుంది? చిరునామ ఎవరూ చెప్పలేరు. దానికో రూపం ఉందా? గుండె ఎక్కడుందంటే చూపించవచ్చు లేదా యంత్ర పరీక్ష ద్వారా అయినా చూడవచ్చు. మనస్సు ఎక్కడ ఉందో చెప్పలేము. మరి బుద్ధికి, మనస్సుకి చైతన్యం ఇచ్చే అమ్మ ఎక్కడ కనబడుతుంది. కనబడలేదని బుద్ధి లేదని ఎలా అనలేమో, కనబడలేదని అమ్మ లేదని అలాగే అనలేం. అది మనం భావించవలసిందే.

కానీ మనస్సు అని ఒకటుంది. మనం ఏ జపం చేసినా, తపం చేసినా మనస్సూ పని చేస్తుంది. రెండవ వైపు మరొకటి పనిచేస్తోంది – ప్రాణం, ఊపిరి. అదే కదా! వాక్కు అంతా. ఊపిరిని, యోగశాస్త్రంలో 'హంస' అంటారు. అమ్మవారిని జపం చేస్తున్నాం, సాధన చేస్తున్నామంటే మనస్సుతో కొంత, శబ్దంతో కొంత చేస్తున్నాం కదా! శబ్దంతో అంటే ప్రాణం. అదీ హంస. మానస-హంస ఈ రెండు రూపాలతో అమ్మ సాధకునిలో తిరుగుతోంది. భక్తుని లోపల మనోరూపంగా భావనతోనూ, హంసరూపంగా మంత్రంగానూ తిరుగుతూ ఉన్నది కనుక "భక్తమానసహంసికా".

వైఖరీ అనే మాటకి అర్థం చెప్తూ **'ప్రాణేన విఖరాఖ్యేన ప్రేరితా వైఖరీ మనః'** అన్నారు యోగశాస్త్రవేత్తలు. విఖరం అంటే ప్రాణవాయువు. ఖం అంటే రంధ్రం. విశేషముగా కర్ణరంధ్రమున ప్రవేశిస్తోంది కనుక వైఖరీ అన్నారు. చెవిలోకి వినబడుతోంది కనుక వైఖరీ.

"పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ" అనలేదు వశిన్యాదివాగ్దేవతలు. 'పరా', 'ప్రత్యక్చితీరూపా', 'పశ్యన్తీ', 'పరదేవతా', 'మధ్యమా', 'వైఖరీరూపా', 'భక్తమానసహంసికా'. ఈ భావాన్ని అందించిన అమ్మవారికి, వశిన్యాదివాగ్దేవతలకు నమస్కారం చేసుకుందాం. వైఖరీకి వచ్చేటప్పటికల్లా స్ఫుటమైన వాక్కు ఉంది. అందుకు మానవ జన్మ గొప్పది. అక్కడికి వచ్చిన అమ్మవారు మాతృకావర్ణరూపిణియై స్ఫుటరూపంలో బయటకి వస్తున్నారు. ఆ తల్లి పేరే 'రాజరాజేశ్వరి'.

పశ్యన్తీ దశకి వచ్చినప్పటికి ఆమె 'బాల', మధ్యమా దశ – 'పంచదశీవిద్య'. వైఖరీదశలో పూర్ణంగా బయటకి వచ్చింది శక్తి కనుక అది 'షోడశీవిద్య' ఆలోచించే

వారికి ఇది ఒక రహస్యం. ఉపాసకునికి పనికి వచ్చే అంశమిది. తరువాత నామం 'కామేశ్వరప్రాణనాడీ'.

373. కామేశ్వరప్రాణనాడీ - శ్రీ కామేశ్వరప్రాణనాడ్యై నమః

ప్రాణనాడీ అంటే ప్రాణం ప్రసరించేనాడి. నాడులన్నిటిలో ప్రాణం ప్రసరిస్తోంది కదా! మళ్ళీ ప్రాణనాడీ అని వేరే ఎందుకు చెప్పాలి? 72,000 నాడులు. కానీ అందులో మళ్ళీ ప్రధానం 101 నాడులు. కొందరు 108 నాడులంటారు. 108 నాడులకి చైతన్యం ఇవ్వడం కోసమే మంత్రాన్ని 108 మార్లు చెయ్యాలని చెప్తారు. అలంబుషా, కుహూ - ఇలా 108 నాడులకి పేర్లు ఉన్నాయి. ఊరికినే పేర్లు పెట్టలేదు. ఆ నాడి యొక్క లక్షణాన్నిబట్టి పేరు పెట్టారు.

అన్ని నాడులలోకెల్లా ముఖ్యమైన నాడి 'సుషుమ్నానాడి'. సుషుమ్నకి ప్రాణనాడి అని పేరు. ఈ సుషుమ్నలో అమ్మవారు ముఖ్యప్రాణరూపంగా సంచరిస్తోంది. అదే 'చిదేకరసరూపిణీ'. ఇది ఎలాంటిదంటే రాగితీగలో విద్యుత్ ప్రసరిస్తుంటుంది. అలా ప్రసరిస్తున్నప్పుడు రాగి తీగ ఏ ఆకారంలో ఉందో అదే ఆకారంలో విద్యుత్ ప్రసరిస్తున్నట్లు మనం భావన చేస్తాం. అలాగే ఈ వెన్నుపూస అనే గొట్టంలో సుషుమ్న అనే నాడిలో అమ్మవారు అనే శక్తి "చిదేకరసరూపిణి"గా ప్రవహిస్తోంది.

అమ్మవారి యొక్క చిదేకరసరూపిణి అన్నప్పుడు జ్ఞానము, ఆనందము రెండు చెప్పాం. జ్ఞానం ఈశ్వరస్వరూపం, ఆనందం అమ్మస్వరూపం. ఈ రెండిటికి భేదం లేదు. **'అతని సంతతానంద శక్తి యా సరసిజాక్షి'** అన్నారు. జ్ఞానము, ఆనందము అంటే అమ్మ, అయ్య - అంటే కామేశ్వరీ, కామేశ్వరులు. కామేశ్వరీ కామేశ్వరులు సంచరించే ముఖ్యప్రాణనాడి – సుషుమ్న. సుషుమ్నానాడి యందు ప్రసరిస్తున్న ప్రధానశక్తి 'కామేశ్వరప్రాణనాడీ'. ఇది ఒక అర్థం.

ఇంకొక అర్థం కామేశ్వరునికి ఈవిడ ప్రాణనాడి. కామేశ్వరుని కదలికకి అమ్మవారు ప్రధానం. అమ్మవారు శివుని కదలించే శక్తి.

స్థాణువును కదలించే శివచైతన్యరూపిణివమ్మా
మదనారి మది కరగించిన మధురానురాగిణివమ్మా (శివపదం)

అని చెప్పుకున్నాం. ఆవిడ శివుని కదిలిస్తోంది. ఆమె కదలించకపోతే శివుడు కదలడు. స్థాణువైన ఆయనలో కదలిక తెచ్చింది. ఆ కదలిక తెస్తేనే కదా ఇంత ప్రపంచం ఏర్పడింది. ఆ కదలికే – స్పందన. కామేశ్వరుని కదలించే స్పందనశక్తి అని అర్థం. ఉపనిషత్పరంగా చూసినా పరమాత్మ నిశ్చలుడు, నిర్వికారుడు.

సీతమ్మ అధ్యాత్మరామాయణంలో ఒక మాట చెప్తుంది. "రాముడా! ఆయన ఏం చేయడు" అంటుంది. "మరి ఇంత రామాయణం ఉంది కదా" అంటే "అదంతా నేను చేయించాను" అంటుంది. **'రామో న గచ్ఛతి న తిష్ఠతి నానుశోచతి'** – రామాయణం ఎలా అర్థం చేసుకోవాలో పనికొచ్చే జ్ఞానం అధ్యాత్మరామాయణం మనకి ఇస్తోంది. ఆవిడ కదలకపోతే రావణుడు చస్తాడా? అందుకనే కదలి కూర్చున్నది. ఈవిడ కదలకపోతే ఆయన కదలడు. అందుకే ఆయన్ని కదిలించింది తల్లి. "ఆయన కూర్చోడు, నడవడు, ఏమి చెయ్యడు. ఆయన యందు కదలించే శక్తిని నేనే" అని చెప్తోంది. ఎప్పుడూ పరమాత్మ జ్యోతిలా అలాగే కూర్చుంటాడు. ఆయన శక్తి కాంతిలా ప్రసరించి వ్యాపిస్తుంది.

శివశ్శక్త్యాయుక్తో యదిభవతి శక్తఃప్రభవితుం
నచేదేవం దేవో నఖలు కుశలః స్పందితుమపి

ఆ మాటే ఇక్కడ మనం చెప్పుకున్నాం. అమ్మా! ఆయన ఉన్నాడంటే నీ వల్లే. నువ్వు లేకపోతే ఆయన లేడని కాదు కానీ తెలియబడడు అని అర్థం. అమ్మా! అమృతం తాగిన దేవతలు కూడా వెళ్ళిపోతారు. కానీ **'కరాళం యత్క్ష్వేళం కబలితవతః కాలకలనా, న శంభోస్తన్మూలం తవ జనని తాటంక మహిమా'** – అంటున్నారు శంకరభగవత్పాదులవారు. అమృతం తాగిన దేవతలకి దిక్కు లేదు. వారు మన్వంతరాలకో, కల్పాంతాలకో పోవలసినదే. కానీ ఈయనెప్పుడు అమృతం తాగలేదు... విషమే మ్రింగాడు అయినా సంతోషంగా సర్వకాల సర్వావస్థలలోనూ ఉంటున్నాడు. మృత్యుంజయుడు. ఎందువల్ల? అంటే నాకు తెలిసింది అన్నాడు.

"తన్మూలం తవ జనని తాటంక మహిమా" – అంతా నీ చెవికమ్మల గొప్పతనమమ్మా! అన్నారు.

374. కృతజ్ఞా – శ్రీ కృతజ్ఞాయై నమః

ఈ నామానికి అనేక అర్థాలున్నాయి. కృతజ్ఞా అంటే చేసినది తెలుసుకునేది. కృతం అంటే చేసినది, చెయ్యబడినది. జ్ఞ – తెలుసుకున్నది. చేసినది ప్రతిదీ అమ్మకి తెలుసు. చేసిన మేలు మరచిపోకుండా ఉండడాన్ని కృతజ్ఞత అంటారు. అమ్మవారికి కూడా అలాగే వ్యవహారమంటే తప్పేం లేదు.

మనం ఏం చేశామో అమ్మ గుర్తు పెట్టుకుంటుంది. మనం అనుకుంటాం "ఇన్ని పూజలు చేశాం అమ్మకి ఏమీ పట్టలేదు" అని కానీ మనకంటే ఎక్కువ గుర్తు పెట్టుకుంటుందా తల్లి. మన చుట్టూ ఉన్నవారి కంటె భగవతియే ఎక్కువ గుర్తు పెట్టుకుంటుంది. మన ప్రతి మొర వింటుంది.

ఎక్కడో తలుపులు వేసుకుని అరిస్తే మన మొర చుట్టు ప్రక్కల వారు వినకపోవచ్చు కానీ పరమాత్మ వింటాడు. లేకపోతే తనవారు అనుకున్న ఐదుగురు భర్తలు, పెద్దవారు అనుకున్న వారందరూ ఉన్న సభలో అవమానం జరుగుతుంటే కనిపిస్తున్న ఒక్కరూ ఆదుకోలేదే.... 'కృష్ణా!' అని అరిస్తే కనబడనివాడు ఆదుకున్నాడు. అది 'కృతజ్ఞా'.

'పత్రపుష్పాద్యల్పమపి ప్రయచ్ఛతాం మోక్షం దదాతీతి కృతజ్ఞా' అని అర్థం చెప్పారు. ప్రేమతో అమ్మని ఉద్దేశించి ఒక దీపం వెలిగించినా, ఒక పండు పెట్టినా, పువ్వు పెట్టినా – ఇలా ఇచ్చాడని గుర్తుపెట్టుకుంటుంది ఆ తల్లి. ఉత్తముల గుణమేంటంటే ఎవడైనా ఒక చిన్న ఉపకారం చేస్తే తిరిగి ఎప్పుడు ప్రత్యుపకారం చేద్దామా అని ఎదురుచూస్తూ ఉంటారు. సుందరకాండలో అదే **'కృతేచ ప్రతికర్తవ్యం ఏష ధర్మః సనాతనః'** – అని సాగరుడు/మైనాకుడు చెప్పాడు. ఎదురు చూశారు వారు. ఉత్తమపురుషునికే అంత కృతజ్ఞత ఉంటుందే! మరి అమ్మవారు ఇంకా జాగ్రత్తగా గమనిస్తారు.

ఇంకొక అర్థం – కృతం అంటే చెయ్యబడినది. ఆమె చేత కృతమైనది ఏమిటి? ప్రపంచం. ఈ ప్రపంచాన్ని మనం తయారు చెయ్యలేదు. ఆవిడ చేసిన ఈ ప్రపంచంలో ప్రత్యణువులో ఏం జరుగుతోందో ఆవిడకి తెలుసు. ఈ విశ్వం కృతం. ఈ విశ్వంలో ప్రతిదీ తెలుసుకునే తల్లి. ఆవిడ సాక్షిరూపంలో గమనిస్తూ ఉంటుంది కనుక కృతజ్ఞా. ఆ గమనింపుకై ఎక్కడికక్కడ చూసే తన శక్తులను నియమించింది. ఆవిడ పెట్టిన శక్తులు చూడండి.

సూర్యస్సోమో యమః కాలో మహాభూతాని పంచ చ
ఏతే శుభాశుభస్యేహ కర్మణో నవ సాక్షిణః

తొమ్మిది మంది సాక్షులు. సూర్యుడు, చంద్రుడు, యముడు, కాలుడు, పంచభూతాలు. వీరు ప్రతివారిని గమనించుతూ ఉంటారు. వీరి కన్ను కప్పి ఎవరైనా పని చెయ్యగలరా? ఇవన్నీ అమ్మవారి రూపాలే. వీటి రూపంలో ప్రతిదీ తెలుసుకుంటూ ఉంటుంది కనుక కృతజ్ఞా. కృతం అంటే కార్యం. తెలుసుకునే తల్లి కారణం. కార్యరూపమైన జగత్తును తెలుసుకునే కారణరూపమైన జగదంబ.

375. కామపూజితా – శ్రీ కామపూజితాయై నమః

ఇక్కడ నుండి మరొక ఒక గుత్తి తయారవుతున్నది. శక్తిపీఠాల విషయం చెప్పబడుతున్నది. శక్తిపీఠాలు ఎన్నో ఉన్నాయి. 64 కోట్ల శక్తిపీఠాలు ఉన్నాయని పురాణం చెప్తోంది. అందులో 64 గొప్పవి. ఆ 64లో 50 గొప్పవి. ఆ 50 లో 18 గొప్పవి. 18 లో నాలుగు గొప్పవి అని తెలియజేసింది. అవి 1. కామగిరి పీఠం, 2. జాలంధర పీఠం, 3. ఓడ్యాణ పీఠం, 4. పూర్ణగిరి పీఠం. ఇది ఉపాసనాపరమైనది.

"కామపూర్ణ జకారాఖ్యా శ్రీపీఠాంతర్నివాసినీ' అని ధ్యానం చేస్తారు. కామగిరిపీఠం, జాలంధరపీఠం, ఓడ్యాణపీఠం, పూర్ణగిరిపీఠం – ఈ నాలుగు పీఠాలలో అమ్మవారిని సేవించాలి. 'కామపూజితా' అంటే కామగిరిపీఠంలో పూజింపబడే తల్లి. 'కామపూజితా, శృంగారరససంపూర్ణా, జయా, జాలంధరస్థితా, ఓడ్యాణపీఠనిలయా, బిందుమండలవాసినీ' ఈ వరుస అలా గుర్తుపెట్టుకోవాలి. కామగిరి పీఠము నుండి

బిందుమండలవాసినీ వరకూ ఒక రేఖ. శృంగారరససంపూర్ణా అని పూర్ణగిరిపీఠం. 'నామైకదేశ న్యాయేన' **'కామ'**పూజితా, శృంగారరస**'సంపూర్ణా'** – ఇవి కామగిరి, పూర్ణగిరి పీఠాలను తెలియజేస్తున్నాయి. ధ్వని ఎలా ఇస్తున్నారో పరిశీలించాలి. జాలంధర స్థితా– ఓడ్యాణపీఠనిలయా అని నాలుగు పీఠాలు అయ్యాయి. 'బిందుమండలవాసినీ' గుర్తుంచుకోవాలి. మధ్యలో 'జయా' నామం వచ్చింది. ఈ జయా రూపమైన తల్లి ఈ ఐదు చోట్లా ఉంది.

'జయా' అంటే మనలోపల ముఖ్యప్రాణస్వరూపంగా ఉన్న తల్లి. ముందు చెప్పుకున్న పరా, పశ్యంతి, మధ్యమా, వైఖరికి కొనసాగింపు ఈ నామములు. అదే జయా. ఆవిడ ఇంత శరీరాన్ని జయింపజేస్తోంది. జయించడమంటే నెగ్గడం. ఈ శరీరాన్ని నెట్టుకొస్తున్నామంటే/ నెగ్గుకొస్తున్నామంటే దేని వల్ల? అది జయ. మనలో ఉన్న చితిరూపిణి. ఆ చితిరూపమే 'జయా'. ఈ జయం మనం తెలుసుకోవడానికి అవి పీఠాలు. ఆ పీఠాలు మన శరీరంలోనే ఉన్నాయి.

బాహ్యంగా చూస్తే కామగిరిపీఠం – కాంచీపురం. జాలంధరపీఠం – జలంధర్ అని చెప్పబడుతూ పంజాబులో ఉంది. కొందరు హిమాచలప్రదేశ్‌లో ఉందని, కొందరు ఆంధ్రదేశంలోనే ఉందని చెప్తారు. ఉపపీఠాలు కూడా ఉంటాయి. ఏమీ తికమక పడనక్కర్లేదు. పర్లీ వైద్యనాథుడు బీహారులో ఉన్నదా, మహారాష్ట్రలో ఉన్నదా – రెండిటికి పర్లీ అనే పేరు. రెండు అనుకోవచ్చు. జ్యోతిర్లింగాలు 12 మాత్రమే కాదు. ఉపలింగాలు చాలా ఉంటాయి. ఒకే నామంతో రెండు మూడు ఉన్నప్పుడు అన్నీ తీసుకోవలసిందే. ఇంత చరిత్ర మనకి తెలియనపుడు రెండిటిలో ఏది చూసినా సంతోషించాలి. రెండూ చూసినా సంతోషించాలి. శక్తిపీఠాలు ఇన్నని లెక్క కట్టలేం. జాలంధర్ – జలంధర్ అనే పట్టణం ఉంది.

కొంచెం ఆలోచిస్తే **భారతదేశం శక్తిమయం.**

అన్యుల దాడులలో మార్పులు చెయ్యడం మొదలుపెడితే మన దేశ ప్రధాన స్రవంతి దెబ్బతిని దేశభద్రతకి ఎంత ప్రమాదం ఏర్పడుతుందో ఆలోచించాలి.

త్రిపుర అని ఒక రాష్ట్రం ఉంది. అక్కడ అమ్మవారి త్రిపురసుందరీపీఠం

ఉంది. ఇప్పటికీ ఈ క్షేత్రం ఉంది. కాశ్మీరం అనేది అమ్మవారి పేరు. చండీఘర్ చండీదేవి పేరు. అరుణాచలప్రదేశ్, కాంచీపురం, కామరూప(ఇది అస్సాంలోదే). పరిశీలిస్తే భారతదేశం ఆసేతు శీతాచలం అమ్మమయం. అందుకే భారతీయుడు 'వందేమాతరం' అని అమ్మవారికి నమస్కారం చేసుకుంటాడు. హిమాచల పర్వతాలు పైన ఉన్నాయి. మన అమ్మ హిమాచలపర్వత రాజపుత్రి. 'హిమాచలమహావంశ పావనాయై నమో నమః'. మధ్యలో మధ్యప్రదేశ్. అక్కడ వింధ్యపర్వతాలు. వింధ్యపర్వతంలో వింధ్యవాసిని ఉంది. వింధ్యాచలనివాసినీ అంటున్నాం కదా. క్రిందకి వస్తే కేరళ. కేరళ అంటే మలయాలదేశం. మలయపర్వతాలలో అమ్మవారి పేరు భగవతి. మలయాచలవాసినీ నామం వస్తుంది. పైన **హిమాచలవాసిని**, మధ్యలో **వింధ్యాచలవాసిని,** చివరికి **మలయాచలవాసిని.** భారతదేశం ఆది, మధ్యం, అంతం కూడా అమ్మ మయం. అందుకే వందేమాతరం. వందే శ్రీమాతరం. ఈ దేశమే అమ్మమయం. అడుగడుగునా శక్తిపీఠాలే. భారతదేశం శక్తిమయం, శివమయం. శివశక్తిమయం. ఇలా నమస్కరించుకుందాం.

పూర్ణగిరి పీఠం హిమవత్ పర్వత ప్రాంతంలో బదరీ – కేదార్‌కి సమీపంలో ఉంది. ఇప్పటికీ పూర్ణగిరిపీఠంలో అమ్మవారికి ఆరాధన చేస్తున్న ఆదిశంకర సంప్రదాయానికి చెందిన ఒకానొక పరంపర ఉంది. పూర్ణగిరిపీఠంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా ఉంటారు.

'కామపూజితా' కామగిరి పీఠమునందు పూజింపబడుతున్నది.

'కామపూజితా' అంటే మన్మథుని చేత పూజింపబడునది. అంటే కామవిద్య, కాదివిద్య.

కాదివిద్య, హాదివిద్య అని శ్రీవిద్య రెండురకాలుగా ఉంటుంది. ఈ కాదివిద్య మన్మథుడు ఉపాసించిన విద్య. దీనిని ఇచ్చినవాడు శివుడు. శివుడు అమ్మవారి ఉపాసకుడే. ఎప్పుడూ ఆవిడ దగ్గరే ఉంటాడు. ఉప–ఆసన(సమీపే). శివుని పేరు అక్కడ కాముడు – కామేశ్వరుడు. కామేశ్వరుడు పూజించాడు అమ్మవారిని కనుక 'కామపూజితా' అని కూడా అర్థం తీసుకోవచ్చు.

376. శృంగారరససంపూర్ణా - శ్రీ శృంగారరససంపూర్ణాయై నమః

అమ్మవారికి శృంగారనాయికా అని ఒక పేరు ఉన్నది.

శృంగారం నవరసాలలో మొదటిది. శృంగారం అంటే ఒక గొప్ప సౌందర్యము, ఆసక్తి. శృంగారం నుంచే తెలుగులో సింగారమనే మాట వచ్చింది. సింగారించుకోవడం అంటే ప్రతిదీ చక్కగా తీర్చిదిద్దుకోవడం.

అనంగకుసుమాది దేవతలందరూ కూడా అమ్మవారి కాలి మట్టెల దగ్గర నుండి ఆ శిరస్సునున్న 'చంపకాశోకపున్నాగసౌగంధికలసత్కచా' వరకూ చక్కగా సింగారించారు. అన్ని అలంకారములు అమ్మ దగ్గరే శోభిల్లుతున్నాయి. ఈ సర్వాలంకారములే శృంగారము. ఆ శృంగారాలతో శోభిల్లుతున్న ఆనంద రస స్వరూపిణీ. ఈ ఆనందము, శృంగారం అమ్మ దగ్గర సంపూర్ణంగా ఉన్నాయి కనుక శృంగారరససంపూర్ణా.

మరొక అర్థంలో - శృంగములు అంటే కొమ్ములు. కొమ్ములు అంటే త్రికోణములు. అరలు అంటే దళాలు, వృత్తాలు. రస - అనేది నవసంఖ్య. తొమ్మిది ఆవరణలతో కూడుకొన్న శ్రీచక్రాన్ని ఇందులో ఆవిష్కరిస్తున్నారు. శృంగము అనగా త్రికోణ చక్రములు. అరలు అనగా వృత్త చక్రములు. అమ్మవారి త్రికోణ చక్రములు ఐదు. వృత్త చక్రాలు నాలుగు కలిపితే తొమ్మిది. ఈ తొమ్మిదిటిలో ఒకొక్క ఆవరణలో ఒకొక్క రసముంది. **త్రైలోక్యమోహన చక్రంలో శృంగారరసం.** దాని తరువాత పదహారు దళాలు సర్వాశాపరిపూరకచక్రం. దీనిలో వీరరసం ఉంది. దాని తరువాత అష్టదళ చక్రము. దీనినే సర్వసంక్షోభణ చక్రం అంటారు. అక్కడ కరుణరసం ఉంటుంది. దాని తరువాత చతుర్దశ త్రికోణం - సర్వసౌభాగ్యచక్రం. అందులో భయానక రసం ఉంటుంది. దాని తరువాత సర్వార్థసాధక చక్రం. దీనినే బహిర్దశారం అంటారు. దీనిలో బీభత్సరసం. దాని తరువాత సర్వరక్షాకరచక్రం - అక్కడ రౌద్రరసం. దాని తరువాత అష్టకోణం - సర్వరోగహర చక్రం. అక్కడ హాస్యరసం. తరువాత త్రికోణం సర్వసిద్ధిప్రద చక్రం - అక్కడ అద్భుతరసం.

ఎనిమిది రసాలు అయ్యాయి. ఈ ఎనిమిది రసాలు శ్రీచక్రంలోనే కాదు

మన బ్రతుకులో కూడా ఉన్నాయి. ఇవన్నీ మనం పొందే అనుభూతులు. మనకి భయముంది, ఆశ్చర్యం ఉంది. క్రోధం ఉంది. వీరం ఉంది. దానితో ఒకానొక తాదాత్మ్యం ఉంది. ఈ ఎనిమిది రసాలు లోకంలో అందరికీ ఉంటాయి. మన బ్రతుకు అంతా లోకం. ఈ ఎనిమిది రసాలకి మూలమైన చైతన్యం అతీతంగా లోపల ఉంది. ఆ చైతన్యం అసలు స్వరూపం శాంతం. అది తొమ్మిదవ రసం. త్రైలోక్యమోహన చక్రం నుండి సర్వసిద్ధిప్రద చక్రం వరకూ–అంటే శృంగారరసం నుండి అద్భుతరసం వరకూ 8 రసాలు చెప్పారు. తొమ్మిదవది బిందువు–శాంతరసం.

ఈ తొమ్మిది రసాలు శ్రీచక్రంలో ఉన్నాయి. శృంగములున్నాయి, అరలున్నాయి, రసములున్నాయి. శృంగారరసంతో కూడిన శ్రీచక్రం అమ్మరూపం గనుక 'శృంగారరససంపూర్ణా'. శృంగారం త్రైలోక్యమోహన చక్రం నుండి మొదలుకుని అన్ని రసములు ఉన్నాయని చెప్పడం శృంగారరససంపూర్ణా మాటలో ఉన్న ఔచిత్యం.

హృదయంలో శ్రీచక్రభావాన్ని ఆరాధన చెయ్యడం చాలా విశేషం. ఇదే భావనోపనిషత్ తెలియజేస్తోంది. హృదయం అని చెప్పినపుడు హృదయంలో దళాలు 12. అవే అనాహత పద్మదళాలు. శృంగ అనేది సంఖ్యాశాస్త్రపరంగా రెండును తెలియచేస్తుంది. అదేవిధంగా రసములు అంటే రుచులు. షడ్రసాలు – 6. కనుక రససంఖ్య ఆరుని తెలియజేస్తుంది.

అర అంటే రెండిటి యొక్క యోజనం. కనుక శృంగ అంటే 2. రస అంటే 6. రెండిటి యొక్క యోజనం 2 × 6 =12. పన్నెండుదళాల చక్రమేదైతే ఉందో అది పూర్ణగిరిపీఠం. అక్కడ అమ్మవారిని ఆరాధిస్తారు. 'శృంగారరససంపూర్ణా' అనే దానికి పూర్ణగిరిపీఠం అనే అర్థం యోగశాస్త్రపరంగా చెప్పవచ్చు.

377. జయా – శ్రీ జయాయై నమః

జయమే అమ్మవారి యొక్క స్వరూపము, స్వభావము. ఈ లోకానికంతటికి కూడా అతీతమైన శక్తిస్వరూపిణి. 'అనేకములైన దుష్ట రాక్షసులను జయించిన తల్లి అని జయ శబ్దానికి అర్థం.

జయ అంటే ఓంకార స్వరూపము అని అర్థం కూడా ఉంది. సర్వ శబ్దాలు, నాదాలు కూడా ఓంకారములోనే లీనమవుతాయి. ఆ విధంగా ఓంకారము సర్వమునూ జయించి తానే మిగిలి ఉంటుంది. అందువల్లనే ఓంకార స్వరూపిణి.

అదే విధముగా పరబ్రహ్మ కూడా. పరబ్రహ్మను చేరుకున్న జీవుడు అన్నిటిని విడిచి దానిలో లీనమవుతాడు. ఇలా సర్వమును కూడా దాటిన తరువాత ప్రకాశించే పరతత్త్వమేదో అది జయా అని చెప్పబడుతున్నది. ఈ జయా అనే శబ్దానికి వేద వాఙ్మయంలోను, ప్రాచీన ఆర్ష వాఙ్మయంలోను చాలా ప్రాధాన్యముంది. అష్టాదశ పురాణవిద్య కూడా **'తతో జయ ముదీరయేత్'** అని జయ శబ్దంతోనే ప్రారంభ మవుతుంది.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో 'జయ'ముదీరయేత్

నరనారాయణాదులకు నమస్కరించి మేము జయం చెప్తున్నాం అంటారు పురాణవేత్తలు. జయము అనే దానికి ధర్మ, అర్థ, కామ, మోక్షములనే నాలుగు పురుషార్థాలను ప్రసాదించే పురుషార్థ సాధనమని అర్థం.

జయ అనే శబ్దానికి ఇంకొక అర్థంలో సంఖ్యావాచకంగా చూస్తే పద్దెనిమిది అని అర్థం వస్తుంది. కటపయాది సంఖ్యా శాస్త్రమని ఒక సంఖ్యాశాస్త్రం ఉంది. దాని ప్రకారం వ్యాఖ్యానిస్తూ 18 పురాణములు కనుక 'జయముదీరయేత్' అనగా 18 పురాణాలను తెలియజేస్తోంది కనుక జయం అని చెప్పారని పురాణం చెప్తోంది.

'శృంగారరససంపూర్ణా' తరువాత జయ చెప్పడంలో విశేషం. 'శృంగారరససంపూర్ణా' అనే నామం తొమ్మిది రసములతో కూడిన శ్రీచక్రాన్ని తెలియజేస్తుంది. జయ అనేది పద్దెనిమిదిని తెలియచేస్తుంది. సంఖ్యాశాస్త్ర ప్రకారం 18లో 1ని, 8ని కలిపితే మళ్ళీ తొమ్మిది అయ్యింది. ఈ తొమ్మిదితో కూడిన శ్రీచక్రవ్యాపిని అయిన విద్యయే ఇక్కడ చెప్పబడుతున్నది. శ్రీచక్రం మొత్తంగా వ్యాపించిన అమ్మవారి చైతన్యానికి 'జయం' అని పేరు. 9 కూడా పూర్ణ సంఖ్యనే తెలియజేస్తున్నది.

సంపూర్ణ అంటేనే తొమ్మిది అని అర్థం. తొమ్మిది పూర్ణసంఖ్య. తొమ్మిది

తరువాత చెప్పే అంకెలన్నీ తొమ్మిది లోపల అంకెలని కలిపి చెప్పుకోవలసినదే. నవరసాలు మొదటి నామంలో చెప్పినట్లే జయా నామంలో కూడా నవరసాత్మిక, పరిపూర్ణస్వరూపిణి అని కూడా చెప్తున్నారు. ఈ విధంగా జయా అని చెప్పడంలో చాలా విశేషం కనిపిస్తోంది.

మరొక అర్థంలో 'జయా' అంటే మృత్యుంజయస్వరూపిణి. మృత్యువుని జయించడమే అసలైన జయం. మృత్యువు అంటే అజ్ఞానం, అవిద్య అని అర్థం. దానిని జయిస్తేనే మోక్షం. తనని ఆశ్రయించిన భక్తులకి ఆత్మజ్ఞానం కలిగించి దాని ద్వారా అవిద్యని, అజ్ఞానాన్ని జయించే శక్తిని ప్రసాదించే జయశీల అయిన అమ్మవారు 'జయా' అని చెప్పబడుతున్నారు.

మరొక అర్థంలో – ముఖ్య ప్రాణస్వరూపిణి. కామపూజితా, శృంగార రససంపూర్ణా, జయా, జాలంధరస్థితా, ఓడ్యాణపీఠనిలయా, బిందుమండల వాసినీ అనే ఈ నామాల మధ్యలో 'జయా' అనే నామం చెప్పడంలో చాలా రహస్యం ఉంది. ఇది కూడా శ్రీచక్ర ఉపాసనకి సంబంధించినది.

మన లోపల ఏ యోగ చక్రములు ఉన్నాయో ఆ యోగ చక్రాల ద్వారా ప్రయాణిస్తున్న ముఖ్యప్రాణ ఉపాసన ఇక్కడ చెప్పబడుతున్నది. ఈ యోగ చక్రాలే కామపూజితా, శృంగారరససంపూర్ణా, జాలంధర, ఓడ్యాణం, బిందుమండలం అనే నామముల ద్వారా చెప్పబడుతున్నాయి. ఆ యోగ చక్రాల ద్వారా ఉపాసింపబడుతున్న లేదా ఆ యోగ చక్రాల యందు వ్యాప్తి చెంది ఊర్ధ్వగమనం చేస్తున్న ముఖ్యప్రాణమే 'జయా'. ఈ విధంగా అటు శ్రీచక్రము, ఇటు మనలోపలి యోగ చక్రాలు వీటి మధ్యన జయా అని చెప్పడంలో విశేషం. ముఖ్యప్రాణస్వరూపిణి, మృత్యుంజయ స్వరూపిణి, పరిపూర్ణస్వరూపిణీ, నవరసాత్మికా అని ఇన్ని అర్థాలతో ఉన్న ఈ 'జయా' అనే దేవి వరాహపర్వతము మీద ప్రకాశిస్తున్నది అని పురాణాలు చెప్తున్నాయి. అనేక నామాలతో అనేక క్షేత్రాలలో అమ్మవారు ఉన్నారు.

378. జాలంధరస్థితా – శ్రీ జాలంధరస్థితాయై నమః

జలమును ధరించే స్వరూపము. ప్రధానంగా ప్రాణనాడి సంచరించే చోటు కంఠం. ఇది జాలంధరస్థితా. జాలంధరపీఠంలో ఉన్న తల్లి.

379. ఓడ్యాణపీఠనిలయా – శ్రీ ఓడ్యాణపీఠనిలయాయై నమః

ఓడ్యాణపీఠమంటే అస్సాంలో ఉన్న కామాఖ్యపీఠం. ఇది వివరంగా శాస్త్రం చెప్తున్న మాట. అత్యంత ఉత్కృష్టమైనపీఠం. ఇది బాహ్యంగా చెప్పుకునేది. మనలో జాలంధరపీఠం కంఠం దగ్గర ఉంది. పూర్ణగిరిపీఠం హృదయం (అనాహతం). కామగిరిపీఠం మూలాధారం. జాలంధరం విశుద్ధిచక్రస్థానం, ఓడ్యాణపీఠస్థానం ఆజ్ఞాచక్రం. దానికి పైన సహస్రారం. అదే తరువాతి నామం బిన్దుమండలవాసినీ.

380. బిన్దుమండలవాసినీ – శ్రీ బిన్దుమండలవాసిన్యై నమః

ఒకదాని నుండి ఒకదానికి దాటుకుంటూ వెళ్ళడమే జయం. 'కామపూజితా' నుండి 'బిన్దుమండలవాసినీ' వరకు వెళ్తున్నాం. వీటన్నిటికి యోగశాస్త్రంలో ప్రమాణాలు ఉన్నాయి. కామగిరి పీఠం గురించి చెప్తూ **"గుదమేఢ్రాంతరాళస్థం మూలాధారం త్రికోణకం। తదేతత్ కామరూపాఖ్యం పీఠం కామఫలప్రదం'** అని కామగిరిపీఠం ఎక్కడ ఉందో చెప్పారు.

తరువాత పూర్ణగిరిపీఠం గురించి చెప్తూ **'ద్వాదశారం మహాచక్రం హృదయే అనాహతాహ్వాయం। తదేతత్ పూర్ణగిర్యాఖ్యం పీఠం తవ వరాననే'.**

"కంఠ కూపే విశుద్ధాఖ్యం యచ్చక్రం షోడశారకం। పీఠం జాలంధరం నామ తిష్ఠత్యత్ర మహేశ్వరీ" – కంఠం దగ్గర ఉన్న 16 దళాల చక్రం జాలంధరపీఠంగా చెప్పబడుతుంది.

జాలంధరబంధమని యోగశాస్త్రంలో ఉంది.

ఓడ్యాణపీఠం గురించి చెప్తూ, **'ఆజ్ఞా భ్రువోర్మధ్యే ద్విదళం చక్రముత్తమమ్। ఓడ్యాణాఖ్యం మహాపీఠం ఉపరిష్టాత్ ప్రతిష్ఠితం'** – రెండు దళాల చక్రం ఆజ్ఞాచక్రంలో

ఉంటుంది. అది ఓడ్యాణపీఠమని వివరించారు. ఈ విధంగా మనలో అమ్మవారి స్థానములు చెప్పబడుతున్నాయి.

శ్రీచక్రంలో ఇవి ఎక్కడ ఉంటాయో చెప్తున్నారు. పరా, పశ్యన్తీ, మధ్యమ, వైఖరులు శ్రీచక్రంలో ఎక్కడ ఉంటాయో చెప్పుకున్నాం. **బిన్దుమండలవాసినీ** అన్నప్పుడే తెలుస్తుంది. శ్రీచక్రంలో బిందువు ఉంది. **ఓడ్యాణపీఠం** అంటే బిందువు. వెంటనే వచ్చే త్రికోణం.

శ్రీకరపాత్రస్వామి వారిచే సమకూర్చబడిన 'శ్రీవిద్యారత్నాకరః' గ్రంథం ప్రకారం – **నవయోనిచక్రాత్మక కామగిరిపీఠే** – బిందువు తరువాత వచ్చే త్రికోణం, ఆపై అష్టత్రికోణావరణ... కలిపితే నవయోని చక్రం. అది కామగిరిపీఠం.

దశారద్వయ చతుర్దశార చక్రాత్మక జాలంధరపీఠే – రెండు దశత్రికోణ ఆవరణలు (బహిర్దశార, అంతర్దశార), పదునాలుగు త్రికోణ ఆవరణలు కలిపి జాలంధరపీఠం.

అష్టదళ షోడశదళ చతురస్ర చక్రాత్మకే పూర్ణగిరిపీఠే – అష్టదళ, షోడశ(16) దళ, చతురస్ర ఆవరణలు కలిపి పూర్ణగిరిపీఠం.

బిందు – ఓడ్యాణపీఠం. ఇది మరొక విధమైన సాధనదృష్టి.

ముందు చెప్పుకున్న పరా, వైఖరీ శ్రీచక్రంలోనే కనబడుతున్నాయి. బిన్దుమండలవాసినీ నుండి వరుసగా పూర్ణగిరిపీఠం, ఓడ్యాణపీఠము, జాలంధరపీఠము, కామగిరిపీఠం అందులోనే కనబడుతున్నాయి. శరీరచక్ర– శ్రీచక్ర–విశ్వచక్ర సమన్వయం ఎలా జరుగుతోందో చూడండి. ఇవే ప్రధానంగా తెలుసుకోవలసినవి.

381. రహోయాగక్రమారాధ్యా – శ్రీ రహోయాగక్రమారాధ్యాయై నమః
382. రహస్తర్పణతర్పితా – శ్రీ రహస్తర్పణతర్పితాయై నమః

బహిర్యాగం, అంతర్యాగం అని రెండు ఉన్నాయి. ఇది శ్రీవిద్యోపాసనలో కూడా ఉంటాయి గాని యాంత్రికంగా చేస్తే తెలియదు. బయట శ్రీచక్రము నందు ఆరాధన చేస్తే బహిర్యాగం. మన లోపలే చక్రభావన చేస్తూ ఉంటే అంతర్యాగం.

అలా చేస్తూ ఒకొక్క దళంలో ఏ ఏ దేవతలని ఆరాధించాలి? అమ్మవారి ఏ నవావరణ చక్రంలోని భాగము శరీరంలో ఏ చక్రంలో అన్వయించాలి? ఏ దేవతని అక్కడ భావించాలి? అని ఒకొక్కటి భావించుకుంటూ వెళ్తుంటే అప్పుడు అది అంతర్యాగం. రహః అంటే రహస్యము. రహస్యముగా చేసిన యాగము యొక్క క్రమము. క్రమమంటే పద్ధతి. పద్ధతి అనేది గురువు, శిష్యుడు సంప్రదాయంతో కూడినది. ఇవి తెలియకుండా చేస్తే లాభం లేదు.

ఉత్తమమైన గురువుని ఆశ్రయించి తద్వారా ఈ పద్ధతిని తెలుసుకుని ఆరాధన చేస్తే అప్పుడు పూర్ణగిరి, కామగిరి, ఓడ్యాణ, జాలంధర, బిందుమండలముల యందు ఉన్న అమ్మవారిని మనం ఆరాధించగలం. ఆ పద్ధతిలో ఆరాధించినప్పుడు మన యొక్క జీవభావాన్ని అంటే నేను అనే అహాన్ని అమ్మకు ఆయా పీఠములయందు అర్పించాలి. అది తర్పణం. **రహస్తర్పణం**. శ్రీచక్రంలో చేసే బిందుతర్పణం బాహ్యం. ఇది ఆంతర్యం. ప్రాణాయామ ప్రక్రియలో భావనామాత్రంగా శరీరచక్రంలో శ్రీచక్రాన్ని సమన్వయించి సర్వం బ్రహ్మమయంగా చేసే అంతర్యాగమే రహోయాగం.

ఆయా ఆవరణదేవతలకు పూజాంగతర్పణాన్ని సమర్పించడమే రహస్తర్పణం. 'హంస'లు(ఉచ్ఛ్వాస – నిశ్వాసాత్మకమైన ప్రాణశక్తి) భావనతో ఆయా చక్రాలదేవతలకు తర్పణంగా చేసే ప్రక్రియ గురుముఖైకవేద్యం.

ప్రకాశమానమైన కుండలిని యందు అధిష్ఠించిన చిదగ్నియందు పుణ్య, పాప, ధర్మ, అధర్మ, సంకల్ప, వికల్ప, కృత్యాకృత్యములను హుతం చేసి కేవల సచ్చిన్మాత్రంగా మిగలడమే రహోయాగక్రమం.

...న లోక చిత్తగ్రహణే రతస్య
ఏకాంతశీలస్య దృఢవ్రతస్య
మోక్షోభవేత్ప్రీతి నివర్తకస్య
ఆధ్యాత్మయోగే నిరతస్య సమ్యక్
మోక్షో భవేన్నిత్యమహింసకస్య (ఆపస్తంబః)

లోకమునందు ఇతరుల చిత్తవృత్తులను గ్రహించుటయందు ఆసక్తి కలవానికి

ముక్తి లేదు. ఏకాంతవాసియై (అంతర్ముఖుడై) దృఢమైన నియమం కలవాడై, ఎన్నడూ ఏ ప్రాణినీ హింసించక (జీవేశ్వరయాగమునందు) బ్రహ్మమునందు ఆసక్తి కలవానికి ముక్తి. ఈ ఏకాంతయోగమే రహోయాగం.

'సహస్రారే పద్మే సహ రహసి పత్యా విహరసి' – అని ఆదిశంకరులు 'ఓ మాతా! సహస్రార కమలంలో నీ పతితో కలసి రహస్యముగా విహరిస్తున్నావు' అన్నారు. ఇంద్రియాలకు అగోచరమైన పరతత్త్వమే 'రహస్యం'. దానిని అంతర్ముఖ సాధనతో గ్రహించడమే రహోయాగం.

అంతర్నిరంతరమనింధన మేధమానే
మోహాంధకార పరిపంథిని సంవిదగ్నౌ
కస్మింశ్చిదద్భుత మరీచి వికాసభూమౌ
విశ్వం జుహోమి వసుధాది శివావసానం.

'నిరంతర అంతర్ముఖ సాధన వల్ల జ్వలించిన చిదగ్నియందు (మహాంధకారాన్ని పోగొట్టేది) అద్భుత కాంతుల వికాసమునందు – భూమి మొదలు శివతత్త్వము వరకు 36 తత్త్వాల విశ్వమును హుతం చేయుటే ఈ యాగం. మిథ్యారూపమైన జగద్భావన సత్యమైన బ్రహ్మమునందు లయం చేయుటయే ఈ ప్రక్రియ. ఒక్కమాటలో – మంత్రార్థభావనయే రహోయాగం – అని కూడా చెప్పవచ్చు.

'రహోయాగక్రమారాధ్యా' 'రహస్తర్పణతర్పితా'. ఆ రహస్తర్పణానికి సంతోషించే అమ్మ రహోయాగంతో ఆరాధన పొందే తల్లి. మన లోపల కుండలినీ రూపము, చైతన్యరూపముగా అమ్మవారే ఉన్నారు. బాహ్యం అంతర్యాగంగా వెళ్ళాలి. అలా సాధన చేస్తే అనుగ్రహం ఎలా ఉంటుందో తరువాత నామం 'సద్యఃప్రసాదినీ'లో చెప్తున్నారు.

383. సద్యఃప్రసాదినీ – శ్రీ సద్యఃప్రసాదిన్యై నమః

సద్యః అంటే వెంటనే. వెంటనే అనుగ్రహం చూపిస్తుంది. ఎవరైతే అమ్మవారిని అంతరంగంలో ఆరాధన చేస్తారో వారిని అనుగ్రహిస్తుంది. ఇలా చెప్తే బాహ్యపూజలు

మానేయమని అర్థం కాదు. ఉపాసకులకి మానేశామనే భావం కూడా ఉండదు. అది ఉన్నదా అతడు అపరిపూర్ణుడే. ఆ స్థితికి వెళ్ళిపోయినవాడు బాహ్యం మానుతాడు, మానడు అని కాదు... వారికి అవసరం లేదు. లోకసంగ్రహార్థం చేసినా తప్పేమీ లేదు.

అంతర్ముఖులమయ్యామా అనేది సాధకునికి కొలబద్ద. ఇది చాలా ముఖ్యం. అమ్మ అనుగ్రహం (ప్రసాదం) లేనిదే అంతర్యాగం సాధ్యం కాదు – అని కూడా ఈ నామ భావం. ఒక్క శ్రీవిద్యలోనే కాదు. ఏ భక్తిలోనైనా ఇంతే. ఎంతకాలం వెలి? **లోనమ్మిన వేల్పుటమ్మల మనంబుల ఉండెడి అమ్మ** – ఆ 'లోనమ్మిన' కావాలి. లోలో చెయ్యడమే రహస్తర్పణతర్పితా. ఆ ఆరాధనకి అమ్మవారు తొందరగా అనుగ్రహిస్తారు. లోపల ఉందని తెలుసుకున్నాం కదా! లోపల అంటే దగ్గరే ఉంది. దూరం ఉందంటే ఎప్పుడైనా వస్తుందని మనకే అనిపిస్తుంది. లోపల ఉందంటే వెంటనే రావాలి. కనుక 'సద్యఃప్రసాదినీ'. వెంటనే అనుగ్రహించేది.

పరా నుండి ఇప్పటి వరకు చెప్తున్నదంతా కూడా రహోయాగక్రమమే. ఈ క్రమంలో ఎవరైతే ఆరాధిస్తున్నారో వారిని వెంటనే అమ్మ అనుగ్రహిస్తుంది. అమ్మవారి ఏ ఆరాధనైనప్పటికి వ్యర్థము కాదు. మన ఆరాధనాస్థాయికి తగ్గట్లుగా వెంటనే ఫలం ఇస్తుంది. అందులో సందేహము లేదు. **'ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే'** అన్నారు. అమ్మవారి అనుగ్రహం లభించిందా సర్వ దుఃఖాలు నశిస్తాయి. అది అమ్మ యొక్క ప్రసాద లక్షణము. ఆ ప్రసాదము సద్యఃప్రసాదినీ. **'సద్యఃపూరయసే కరాబ్జ చషకం వాంఛాఫలైః'** అన్నారు. కరాబ్జచషకం – మనం అమ్మ ముందు రెండు చేతులు దోయిలించి నిలబడతాం. ఈ రెండు చేతులు అనే పాత్ర పట్టుకుని నిలబడితే అమ్మ వాటిని ఖాళీగా ఉంచదు. సద్యఃపూరయసే – వెంటనే నింపేస్తుంది. అడిగిన వారి కోరికలు తీర్చే తల్లి. అందుకు సద్యఃప్రసాదినీ.

384. విశ్వసాక్షిణీ – శ్రీ విశ్వసాక్షిణ్యై నమః

విశ్వమునంతటికి ఆవిడ సాక్షిణి. 'కృతజ్ఞా' నామం గుర్తు పెట్టుకుంటే

ఇక్కడ స్పష్టంగా అర్థమవుతుంది. సాక్షిణీ అని చెప్పడంలో రెండు అర్థాలున్నాయి. అంటకుండా చూసే వారు సాక్షులు. ఏదైనా వ్యాజంలో సాక్షులు ఉంటే వారికి ఏ శిక్షా ఉండదు. వారికి అన్నీ తెలుసు కానీ ఏమీ అంటదు. అలాగే ప్రపంచంలో ప్రతిది అమ్మకి తెలుసు. ఆవిడకి ఏ దోషం ఉండదు కనుక సాక్షిణీ.

దీనికి మరొక అర్థం కూడా ఉంది. **'సమ్యక్ ఈక్షణత్వాత్ సాక్షిణీ'**. ఆ తల్లిది సమగ్రమైన ఈక్షణం అంటే దృష్టి. సృష్టిలో సర్వ కాలజ్ఞానం, సర్వదేశజ్ఞానం, సర్వ వస్తుజ్ఞానం, అణువు మొదలు బ్రహ్మాండం వరకు ప్రతి క్షణం, ప్రతి కణంలో ఏం జరుగుతోందో ఆ తల్లికి తెలుసు. సమగ్రమైన దృష్టి అమ్మవారిది. ఆవిడకి వర్తమానం, భూత, భవిష్యత్ అని కాల విభజన లేదు. అన్నీ కలిపి ఒకటే. అఖండ కాలజ్ఞానం, అఖండ దేశజ్ఞానం, అఖండ వస్తుజ్ఞానం, కలిగిన విశ్వసాక్షిణీ. సమస్తమును సమగ్రముగా పరిశీలించునది.

385. సాక్షివర్జితా – శ్రీ సాక్షివర్జితాయై నమః

ఆవిడకి సాక్షి ఎవరూ లేరు. అన్నింటికి ఆవిడ సాక్షి. మనం పదిమందిని చూస్తుంటే మనల్ని చూసేవాడు మరొకడు ఉంటాడు. కానీ అమ్మకి సాక్షులు లేరు. విశ్వమంతా లయమైపోయినప్పుడు కూడా అమ్మ చూస్తూనే ఉంది. అమ్మని చూసేవారు ఎవరు? ఆవిడ సృష్టించిన విశ్వంలోనే అందరూ ఉన్నారు. బ్రహ్మాదేవుడు మొదలుకుని అందరూ అక్కడి వారే. అందరినీ ఆవిడే గమనించుకుంటోంది. ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి, ఏది, ఎలా ఇవ్వాలో తెలిసిన తల్లి. ఆవిడకి ఇచ్చేవారు ఎవరు? ఆవిడని నియమించేది ఎవరు? అందుకే అమ్మవారు 'విశ్వసాక్షిణీ', 'సాక్షివర్జితా'.

తరువాత నామాలు 'షడంగదేవతాయుక్తా', 'షాడ్గుణ్యపరిపూరితా' (పూజా సంకేతాలు)

సహస్రనామాలను రహస్యనామాలు అనడంలో పూజా సంకేతాలు, మంత్రసంకేతాలు, యోగసంకేతాలు, షట్చక్రసంకేతాలు అన్నీ ఉంటాయి అని అర్థం. ఇప్పుడు పూజాసంకేతాలు చూపిస్తున్నారు.

386. షడంగదేవతాయుక్తా – శ్రీ షడంగదేవతాయుక్తాయై నమః

షడంగదేవతలతో కూడినది. అమ్మ మంత్రరూపిణి. మంత్రానికి ఆరు అంగములుంటాయి. ఈ ఆరు అంగములతో మంత్రానికి శక్తి వస్తుంది. ఎలాగైతే అవయవాలతో మనకి శక్తి ఉన్నదో మంత్రాలకి కూడా అవయవాలుంటాయి. అంగముతో విద్య నేర్చుకోవాలి. షడంగములు అంటే హృదయము, శిరస్సు, శిఖ, కవచము, నేత్రము, అస్త్రము.

ఏ మంత్రానికైనా 'హృదయాయ నమః, శిరసే స్వాహా, శిఖాయై వషట్, కవచాయ హుం, నేత్రత్రయాయ వౌషట్, అస్త్రాయ ఫట్' అని చెప్తారు. బిందుస్థానంలో అమ్మవారుంటే ఆవిడ చుట్టూ వీరుంటారు. ఆ షడంగదేవతలని మనం ఆరాధన చేయాలి.

అమ్మవారి చుట్టూ పరివేష్టించి అమ్మవారిని వారు ఆరాధన చేస్తూంటారు. ఖడ్గమాల అని ప్రసిద్ధమైన శుద్ధశక్తిమాలామంత్రంలో మొట్టమొదటిగా మనం ఆరాధించేది వీరినే. ఆ తరువాతే మిగిలిన నామాలు. ముందు ఆ షడంగాలు ఉంటేనే మిగిలిన అంగములుండేవి.

హృదయదేవి, శిరోదేవి, శిఖాదేవి, కవచదేవి, నేత్రదేవి, అస్త్రదేవి. వీరే షడంగ దేవతలు. ఈ షడంగ దేవతలతో కూర్చుని బిన్దుమండలంలో పూజింప బడుతోంది కనుక 'షడంగదేవతాయుక్తా'.

387. షాడ్గుణ్యపరిపూరితా – శ్రీ షాడ్గుణ్యపరిపూరితాయై నమః

అమ్మవారి దగ్గర ఆరు గుణములు పరిపూర్ణముగా, సహజంగా ఉన్నాయి. షడ్గుణములు అంటే మనం 'భగవతీ' నామం దగ్గర చెప్పుకున్నది గుర్తు తెచ్చుకోవాలి. **'ఐశ్వర్యస్య సమగ్రస్య, ధర్మస్య యశసః శ్రియః। జ్ఞానవైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీరిణా'** – ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, శ్రీ, జ్ఞానము, వైరాగ్యము – ఇవి పరిపూర్ణముగా అమ్మ దగ్గర ఉన్నాయి. సూర్యుని దగ్గర వెలుగు ఎలా పరిపూర్ణంగా ఉందో ఆ విధంగా ఉన్నాయి. ఆ పరమేశ్వరి ప్రసాదిస్తేనే మిగిలిన వాటికీ వెలుగు

వస్తుంది. అలాగ అమ్మవారి దగ్గర ఆరు గుణములు పరిపూర్ణంగా ఉన్నాయి.

ఆరు శక్తులు కలిగి ఉంటేనే ఈశ్వరుడు లేదా ఈశ్వరి అనాలి. ఆ ఆరు శక్తులు ఏమిటో చెప్తూ– **"సర్వజ్ఞతా తృప్తిరనాదిబోధః। స్వతంత్రతా నిత్యమలుప్తశక్తిః అనంతతా చేతి విభోర్విధిజ్ఞాః। షడాహురంగాని పరమేశ్వరస్య"** అన్నారు.

సర్వజ్ఞత, నిత్యతృప్తి, అనాదిబోధ, స్వతంత్రత, అలుప్తత (లుప్తం అంటే లోటు. అలుప్తత అంటే లోటనేది లేదు), అనంతత... ఇవి ఆరు శక్తులు, లేదా షడంగాలు షడ్గుణాలు.

'షడంగ దేవతాయుక్తా', 'షాడ్గుణ్యపరిపూరితా' రెండూ ప్రక్కప్రక్కన ఎందుకు పెట్టారు? మంత్రంలో షడంగ దేవతలు. ఆమె స్వరూపంలో ఆరు శక్తులు. రెండిటికి సమన్వయం ఉన్నది. అది పరిశీలిస్తే సర్వజ్ఞశక్తికి – హృదయదేవికి సమన్వయం. నిత్యతృప్తాశక్తికి – శిరోదేవి, శిఖాదేవికి – అనాదిబోధశక్తి, స్వతంత్రాశక్తికి – కవచదేవికి, అలుప్తతా శక్తికి – నేత్రదేవి, అనంతతాశక్తికి – అస్త్రదేవి. షాడ్గుణ్యములకి, షడంగ దేవతలకి ఇది సమన్వయం.

షడంగదేవతలని ఆరాధించామంటే, షాడ్గుణ్యములని ఆరాధించాము.

388. నిత్యక్లిన్నా – శ్రీ నిత్యక్లిన్నాయై నమః

అమ్మవారి తిథి దేవతల్లో శుక్లపక్ష తృతీయ నాటి దేవత పేరు నిత్యక్లిన్నా. కామేశ్వరీ, భగమాలినీ, నిత్యక్లిన్నా అని చెప్తారు. కామేశ్వరీ పాడ్యమి నాటి దేవత. భగమాలినీ విదియనాటి దేవత. నిత్యక్లిన్నా తృతీయ నాటి దేవత. బహుళ త్రయోదశి తిథిదేవత.

క్లిన్నత అంటే అర్థం–తడి. నిత్యక్లిన్నా అంటే ఎప్పుడూ ఆర్ద్రముగా ఉండే తల్లి. **కరుణారసార్ద్రా**. కరుణచేత నిత్యమూ ఆర్ద్రముగా ఉంటుంది కనుక నిత్యక్లిన్నా. **ఆర్ద్రాం పుష్కరిణీం పుష్టిం** – అక్కడ ఆర్ద్రాం అనే శక్తి ఏదో ఇక్కడ ఆ శక్తే.

నిత్యక్లిన్నా అని చెప్పడంలో మరో విశేషం... ఎప్పుడూ తడిగా ఉండడమనేది తాజాదనం. ఎండిపోవడమనేది వాడిపోవడం. అమ్మవారు ఈ ఆరు గుణములతో

ఎప్పుడూ నిత్యనూతనంగా ఉంటారు. ఇవి ఎప్పుడూ ఆవిడ దగ్గర వాడవు. ఆ శక్తిలాంటిది మరొకటి ఏదైనా ఉందా? లేదు. పోనీ ఎలా ఉంటుందో చెప్పగలమా? ఎలా ఉంటుందంటే పోల్చి చెప్తేగాని అర్థం కాదుకదా. పోలిక చెప్పడానికి కూడ అలాంటి వస్తువు మరొకటి లేదు అని తరువాత నామంలో 'నిరుపమా' అని చెప్తున్నారు.

389. నిరుపమా – శ్రీ నిరుపమాయై నమః

ఉపమా అంటే పోలిక. పోలిక లేనిది... నిరుపమా. పరబ్రహ్మము లాంటి వస్తువు మరొకటి లేదు. **'ఏకమేవ అద్వితీయం'** – రెండవది లేదు. **'న తస్య ప్రతిమా అస్తి'** ఉపనిషత్ వాక్యం. అమ్మకి ప్రతిమ లేదు. అంటే అమ్మవారికి సాటి లేదు. అలాంటి తల్లిని ఆరాధిస్తే ఏమి లభిస్తుందో తరువాత నామంలో చెప్తున్నారు.

390. నిర్వాణసుఖదాయినీ – శ్రీ నిర్వాణసుఖదాయిన్యై నమః

నిర్వాణము అంటే మోక్షమని అర్థం. నిర్వాణము అంటే **'సర్వక్రియా నివృత్తిః నిర్వాణం'** – నివృత్తియే నిర్వాణం. నివృత్తి అంటే అన్నీ ఆపేయడం. ఈ లోక వ్యవహారాలు, సుఖదుఃఖాలు ఇంక లేవు. అవి లేని స్థితి నిర్వాణము. ఆ నిర్వాణమనబడే మోక్ష సుఖము ఇచ్చే తల్లి. ఇది ఉపసనా ఫలం.

391. నిత్యాషోడశికారూపా – శ్రీ నిత్యాషోడశికారూపాయై నమః

ఇదంతా ఒకటే నామం. నిత్యాది పదహారు రూపములతో ఉన్నది. నిత్యలు అంటే తిథి నిత్యా దేవతలు. ఉపోద్ఘాతంగా ఒక్కరిని గుర్తు చేశారు. మిగిలిన పదిహేను తిథి నిత్యా దేవతలు ఇక్కడ స్మరింపబడ్డారు. కామేశ్వరి, భగమాలిని, నిత్యక్లిన్నా, భేరుండ, వహ్నివాసిని, మహావజ్రేశ్వరీ, శివదూతి, త్వరిత, కులసుందరి, నిత్యా, నీలపతాక, విజయా, సర్వమంగళ, జ్వాలామాలిని, చిత్ర. వీరు ప్రధానంగా పదిహేను తిథి నిత్యా దేవతలు. చంద్రకళలని ఆధారం చేసుకుని చెప్పారు. పాడ్యమి నుండి పూర్ణిమ వరకు, తిరిగి వెనుకకి వస్తూ అమావాస్య వరకు మొత్తం తిథి నిత్యాదేవతలే.

మొత్తంగా ఒక మాసం. తిథులు అంటే ఏమిటి? చంద్రకళలు చెప్పడంలో ఉద్దేశమేమిటి? చంద్రుడే ముఖ్యమా? సూర్యుడు కాదా? చంద్రుడు శుక్లపక్షంలో సూర్యుని నుండి శక్తి తీసుకుంటూ పెరుగుతాడు. కృష్ణపక్షంలో సూర్యునికి ఇస్తూ తగ్గుతాడు.

(దీనినే 'యస్య సహస్రాభీశోరభీశులేశో హిమాంశు బింబగతః, భాసయతి నక్తమఖిలం భేదయతు విపద్గణానరుణః' అని అప్పయ్య దీక్షితులవారి ఆదిత్యస్తోత్రం. దీనిని బట్టి మనవారికున్న సౌరశక్తి విజ్ఞానం తెలుస్తుంది. ఇతరదేశాలు ఇంకా భూమి బల్లపరుపుగా ఉంటుందనుకుంటున్న దశలో భూమి గుండ్రంగా ఉన్నది. ఖగోళం అనే మాట చెప్పిన దేశం భారతదేశం.

ఇతర దేశాలు రాజుల పేర్లు మీద నెలలు పెట్టుకుంటే - వచ్చేపోయే రాజులు మాకెందుకయ్యా! ఉండే నక్షత్రాలను, గ్రహాలను ఆధారంగా పెడతామని గ్రహాలను ఆధారంగా చేసుకుని రోజుల పేర్లు, నక్షత్రాలను ఆధారంగా చేసుకుని మాసాల పేర్లు చెప్పి మొత్తం 'భ'చక్రాన్ని ఆధారం చేసుకుని కాలచక్రాన్ని ఏర్పాటు చేసిన పరమ వైజ్ఞానికులైన భారతీయ మహర్షుల పాదాలకు నమస్కారం చేసుకుందాం.)

'నిత్యాషోడశికారూపా' అనే దానికి కాలస్వరూపిణి అని అసలైన అర్థం. కాలం అనుకూలించాలని ప్రతివాడు అనుకుంటాడు. కాలం ఈ పదిహేను రూపాలతోనే ఉంది. 'నిత్యాషోడశికా' ఉపాసన. 'కాలశక్తి' ఉపాసనే. శ్రీవిద్యలో మిగిలిన తొమ్మిది విద్యలకి సమన్వయం ఉంది.

బగళాముఖీ-వారాహీతత్త్వంలో చెప్పబడుతుంది. మాతంగి శ్యామలగా ఆరాధింపబడుతుంది. కాళీ (కాలస్వరూపిణి) - షోడశికా రూపంలో ఆరాధింప బడుతుంది. ఇలా అన్ని విద్యలకి సమన్వయం శ్రీవిద్యలో ఉంది గనుకనే శ్రీవిద్యని శంకరభగవత్పాదులవారు ప్రధానంగా చెప్పారు.

కాలస్వరూపమే 'నిత్యాషోడశికారూపా'. అహోరాత్ర రూపాలతో ఉండే తల్లి. పగలు, రాత్రి ఆవిడే. పదిహేను అని చెప్పి షోడశికా ఎందుకన్నారు? ఈ పదిహేను మారుతున్న కళలు. మారని కళ పదహారవది 'లలితాదేవి'. అమ్మవారు బిందువులో

ఆసీన. త్రికోణం లోపల ఆవిడ చుట్టూ 15 మంది కూర్చుంటారు.

ఆద్యాయాః లలితాయాః సురన్యాస్యుః పంచదశాంగగాః

లలితాంగిత్వరూపేణ సర్వాసామాత్మ విగ్రహో

అని చెప్పారు. మొత్తం ఈ పదిహేను మంది అమ్మవారి అంగములే. అమ్మవారి స్వరూపములే. కనుక అమ్మవారికి, వారికి ఏమీ భేదము లేదు. వీరితో కలిపి అమ్మవారిని ఆరాధించడం విశేషం. మారని కళ – షోడశి. మారే కళలు పదిహేను.

చంద్రుడు మన మనస్సుకి అధిదేవత. మన మనస్సుకి శుక్ల, కృష్ణపక్షాలు ఉంటూ ఉంటాయి. కాలచక్రంలో కృష్ణపక్షం, శుక్లపక్షం ఉన్నట్లుగానే మనస్సుకి కూడా రకరకాల ఎదుగులు, బొదుగులు ఉంటూ ఉంటాయి. ఈ ఎదుగులు, బొదుగులూ ఉంటూ ఉన్నా ఏ పరిణామములు లేక పరిపూర్ణంగా ఉన్న శక్తి లోపల ఉంది. అది ఆత్మ స్వరూపం. అదే షోడశి.

మనస్సుకి మార్పుగాని, ఆత్మకి మార్పు ఏముంటుంది? ఆత్మ అంటూ ఒకటి ఉంటేనే మనసు పని చేస్తూంటుంది. చంద్రకళలు మారుతూ ఉన్నా, మారని కళగా అమ్మవారు ఉన్నారు. మనలో ఆత్మయే షోడశీ.

అలాగే సుఖాలు, దుఃఖాలు ఎన్ని వస్తున్నా నిండుగా కదలకుండా పరిపూర్ణస్థితి రావాలంటే షోడశీతత్త్వాన్ని గ్రహించగలగాలి. ఇది భావనాత్మకంగా చేయవలసిన ఉపాసన.

392. శ్రీకంఠార్ధశరీరిణీ – శ్రీ శ్రీకంఠార్ధశరీరిణ్యై నమః

శ్రీకంఠుడు అంటే శివుడు. శివునిలో ఆవిడ అర్ధశరీరం. కనుకనే అర్ధనారీశ్వరీ. ఇప్పటివరకు చెప్పిన దానికి ఒక చక్కటి కొనసాగింపు వాక్యంలా ఇక్కడ ఈ నామం పెట్టారు. మనలో మహాచైతన్య స్వరూపం సంచరిస్తోంది. ఈ మహా చైతన్యానికి మనలోను, శ్రీచక్రంలోనూ సమన్వయం చేసుకోవాలి. మొదటిది పరా, పశ్యంతీ మొదలైన రూపములుగా; రెండవది పూర్ణగిరి, జాలంధర, కామగిరి పీఠాలుగా

తెలుసుకోవాలి. ఈ రెండిటినీ శ్రీచక్రంలోనూ, మన శరీరంలోనూ భావన చేశాం. శ్రీకంఠ నామం చాలా గొప్పశబ్దం. శ్రీకంఠుడు అంటే విషాన్ని కంఠము నందు ఉంచుకున్నవాడు. శ్రీకంఠుని యొక్క అర్ధశరీరము ఈవిడ. దీని గురించి శంకరభగవత్పాదులవారు, **'చతుర్భిః శ్రీకంఠైః శివయువతిభిః పంచభిరపి'** అని ఎందుకన్నారో తెలుస్తుంది. ఆ శ్లోకాలలో జగద్గురువులు 'శ్రీకంఠ' శబ్దాన్నే ఉపయోగించారు.

అమ్మ పరమేశ్వరునిలో సగభాగం. అయ్యవారు అమ్మవారిలో సగభాగం. ఇది అర్ధనారీశ్వరీతత్త్వం. ఈ అర్ధనారీశ్వర స్వరూపం అనే అద్భుతమైన భావన మన హైందవ ఆరాధనా విధానంలో కనబడుతున్నది. ఇది విజ్ఞానశాస్త్రం కూడా అంగీకరిస్తున్న గొప్ప ఆశ్చర్యకరమైన అంశం. అర్ధనారీశ్వరతత్త్వం శ్రీచక్రంతో సమన్వయం.

జగత్తంతా శివశక్త్యాత్మకం. శివుడు లేనిదే శక్తి, శక్తి లేనిదే శివుడు లేడు. తీపి అనే గుణాన్ని తీయని వస్తువు లేనిదే ఎలా పొందలేమో, అగ్ని అనే దానిని కట్టె మొదలైన వాటి సాయం లేనిదే ఎలా పొందలేమో – శక్తిని శివుడు లేకుండా తెలుసుకోలేం. శివుని శక్తి లేకుండా తెలుసుకోలేము. వారిరువురి ఐక్యం తెలుసుకుని చేసే ఆరాధనే సమయాచారం. ఆ సమయాచార సంప్రదాయంలోనే వశిన్యాదివాగ్దేవతలు అందిస్తున్నారు. ఎక్కడికక్కడ శివుని గుర్తు చేస్తున్నారు. గుర్తు చేస్తూ సాధన చేస్తూంటే ఆ సాధన ఒక బలంగా పని చేస్తుంది. అలా గుర్తుచేస్తున్న నామాలలో ఇది ఒకటి.

సృష్టి ఆది యందు ఆ పరమాత్మ ఒక్కడే ఉన్నాడని 'ఏకం సత్' అని ఉపనిషత్ తెలియజేస్తోంది. ఆయన ఈ జగన్నిర్మాణం చెయ్యాలనుకున్నాడు. అలా అనుకున్నప్పుడు 'ఏకాకీ న రమతే'. ఇదే మాట మనుస్మృతిలో కూడా కనబడుతున్నది. ఒక్కనికి ఏమి తోచటం లేదు. కానీ ఇంకొకరు బయటనుండి రావాలంటే ఆయనకి బయట ఇంకొక వస్తువు లేదు. అంతా తానైన వానికి బయట ఇంకొకటి ఏం వస్తుంది. అప్పుడు జగత్తే లేదు.

'సః ద్వేధా విభజ్య' – తనని తాను రెండుగా చేసుకున్నాడు. ఆ రెండుగా చేసుకున్నప్పుడు రెండు రూపాలు వచ్చాయి. అవే నర – నారీ రూపం. అంతవరకు పురుషుడు కాదు, స్త్రీ కాదు. ఒకానొక పరంజ్యోతి. ఆయన నుండి ఆ రెండు రూపాలు వ్యక్తమయ్యాయి. ఇదే భావం బృహదారణ్యకంలో చెప్పబడింది. **"స ఇమమేవాత్మానం ద్వేధా అపాయత్తతః పతిశ్చపత్నీ చాభవతాం"** – ఒక్క పరమాత్మయే తనను రెండు భాగములుగా చేసుకున్నాడు. వానిలో ఒకటి పతిగా, రెండవది పత్నిగా అయినది. ఇకపై వచ్చే నామములన్నింటికి ఈ అనుబంధం ఉంది.

తరువాత సృష్టి జరిగినది. బ్రహ్మదేవునికి పరమాత్మ సృష్టి చేసే శక్తిని ఇచ్చాడు. ఆ తరువాత బ్రహ్మ మానస సృష్టి చేశాడు (మనస్సు నుండి సృజించాడు). ఆయన నుండి వచ్చిన ప్రజాపతులు, ఋషులు మొదలైన వారందరూ మానస సృష్టి మాత్రమే. మైథున సృష్టి కాదది. లోక వ్యవస్థ ఏర్పాటు చేశాడు. అటు తరువాత ఈ సృష్టించిన సృష్టిని ఎలా విస్తరింపజేయాలి అనే ఆలోచన చేశాడు. ఆలోచనలో బ్రహ్మదేవుడు ఏకాగ్రంగా ప్రణవాన్ని ధ్యానం చేస్తున్నాడు.

అప్పుడు ప్రణవం మూర్తిమంతమై ఒక జ్యోతిరూపం ధరించి బ్రహ్మ ఎదురుగా కనబడింది. ఆ జ్యోతి స్వరూపాన్ని చూసి బ్రహ్మ నమస్కరిస్తూ ఉండగా ఆ జ్యోతిస్వరూపంలో ఒక మూర్తి గోచరించింది. ఆ జ్యోతియే మూర్తి అయ్యింది. ఎలా గోచరించిందంటే –

చాంపేయ గౌరార్ధ శరీరకాయై కర్పూరగౌరార్ధ శరీరకాయ
ధమ్మిల్లకాయైచ జటాధరాయ నమశ్శివాయైచ నమశ్శివాయ (ఆదిశంకరులు)

ఒకే జ్యోతిలో రెండు భాగములు – ఎడమ వైపు అమ్మవారు, కుడివైపు అయ్యవారు. ఇది మొట్టమొదట బ్రహ్మకు కనబడిన స్వరూపం. అప్పుడు నమస్కరించి, "స్వామీ! ఈ రూపం యొక్క ఆంతర్యమేమిట"ని అడిగాడు బ్రహ్మదేవుడు. "నాకే రూపం లేదయ్యా! భక్తుని యొక్క ప్రయోజనాన్ని అనుసరించి రూపాన్ని ధరిస్తాను" అన్నాడు పరమాత్మ. "ఇప్పుడు నీ ప్రయోజనం ఏమిటి? ఈ జగత్తు ఎలా వ్యాపిస్తుందా అని నువ్వు ఆలోచిస్తున్నావు. ఇది స్త్రీ, పుంసాత్మక శక్తితో వ్యాపించాలి. ఆ

స్త్రీపుంసాత్మకమైన శక్తి నువ్వు సృజించలేవు. అది నా యొక్క శక్తి. అది నీకు చూపించడానికే ఈ జ్యోతిస్వరూపంతో గోచరించాను" అన్నాడు పరమాత్మ.

"ఇప్పటివరకు నేను ఒకానొక పురుష సృష్టిని చేశాను. ప్రజాపతులు, మహర్షులు వచ్చారు. వీరంతా పురుషులు మాత్రమే. ఒక్క స్త్రీ కూడా తయారు కాలేదు. మరి స్త్రీ సృష్టి ఎలా చెయ్యాల"న్నాడు బ్రహ్మ. అప్పుడు శివుడు స్త్రీ సృష్టి చేయడం నీవల్ల కాదులే.. అది ఈవిడ చూసుకుంటుంది" అన్నాడు శివుడు. అప్పుడు అమ్మవారి నుండి స్త్రీ శక్తి వెలికి వచ్చింది. ఆ వచ్చిన స్త్రీ శక్తి జగత్తులో వ్యాపించింది. శివుని నుండి పుంస్త్వ శక్తి వచ్చింది. ఇలా జగత్తంతా కూడా శివశక్త్యాత్మకంగా గోచరించింది. ఇదే "రమణీ" అనే నామం దగ్గర వివరింపబడింది. రామా నామం దగ్గర కూడా వివరించుకున్నాం. స్త్రీ అమ్మ రూపం. పుంరూపమంతా అయ్యవారి రూపం.

ఈ సృష్టిలో ఏది చూసినా స్త్రీ, పుంసాత్మకంగానే గోచరిస్తోంది. మహాకవి నన్నయ భారతం రచిస్తూ ఇదే భావన చేశారు.

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే
లోకానాం స్థితిమావహన్త్యవిహితాం స్త్రీపుంస యోగోద్భవాం
తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమామ్బుజభవశ్రీకన్ధరాః శ్రేయసే

ముగ్గురు అయ్యలు, ముగురమ్మలతోనే జగత్తంతా నడుస్తున్నదని, స్త్రీ, పుంసయోగోద్భవమని గొప్పమాట ప్రయోగించారు. ఆది మిథునం. ఎవరయ్యా అంటే "ఆదిశక్తి, పరమాత్మ". అదే అర్ధనారీశ్వరతత్త్వంగా చెప్పబడుతోంది. ఈ రెండు విడివిడిగా కనిపించవచ్చుగా... ఒకేలా ఎందుకు కనబడాలి? అయన ఒకచోట, ఆవిడ ఒక చోట కనిపించవచ్చుగా అంటే అందులోనే గొప్ప అందముందని చెప్పారు. ఇద్దరూ కలిసి ఒకరూపంగా కనబడడంలో ఉద్దేశం- అది రెండు కాదు ఒక్కటే. జగద్రచన కోసం రెండుగా కనబడుతోంది అని చెప్పడం దీనిలో ఉన్న అద్భుతమైన ఆంతర్యం.

శ్రీకంఠుడు అని ఎందుకు మళ్ళీ విశేషంగా చెప్పారు? పరమేశ్వరుడు నీలకంఠుడు. ఆ నీలకంఠుడే జగతిని రక్షించాడు. అర్ధనారీశ్వరరూపంలో కూడా కుడివైపు ఆ నీలకంఠం కనిపిస్తుంది. నీలకంఠునిగా మారడానికి కొంత అమ్మవారే కారణం అన్నారు. విషపానం చెయ్యడానికి సిద్ధపడినపుడు అమ్మవారిని, "మ్రింగమంటావా ?"అని అడిగితే "ఫరవాలేదు మ్రింగండి" అన్నది.

మ్రింగెడువాడు విభుండని
మ్రింగెడిదియు గరళమనియు మేలని ప్రజకున్
మ్రింగుమనె సర్వమంగళ
మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో!

అన్నారు పోతనగారు.

ఆ భవ్యమైన స్వరూపాన్ని మనం చూస్తూ ఉంటే అమ్మవారు, అయ్యవారు కలిసే ఈ జగత్తునంతటిని రక్షించారు. విషం మ్రింగేవాడు భర్త కదా అంటే 'ఏం ఫరవాలేదు నా మంగళసూత్రం గట్టిది' అందిట అమ్మవారు. ఆవిడ ముత్తైదువతనం ఎంత గొప్పదంటే విషం మ్రింగిన పరమాత్మ కూడా అలా ఉన్నాడుట. కాదయ్యా! ఆయన మృత్యుంజయుడు కనుకనే ఆవిడ శాశ్వతమైన పెద్దముత్తైదువ అయిందంటారు మరి కొంతమంది. మనం రెండూ సత్యమనే భావించాలి. మనకి ఇద్దరూ కావలసినవారే.

శ్రీకంఠుడని చెప్పగానే జగత్తును రక్షించిన ఈశ్వరి, ఈశ్వర స్వరూపం రెండూ ఒక్కటే. 'శ్రీకంఠార్ధశరీరిణీ' అనే నామంలో మనం జగత్తుని రక్షించే జగజ్జననీ జనక ఐక్యభావాన్ని ఒక్క చోట చూడగలుగుతున్నాం.

ఇప్పుడు మరొక భావంలోకి ప్రవేశిద్దాం. రూపంగా ధ్యానిస్తే పార్వతీ, పరమేశ్వరులు. నిజానికి వారికి రూపం ఉందా! పరబ్రహ్మకు రూపం లేదు. ఆయన శక్తికి అంతకన్నా రూపం లేదు. రూపం లేదు అంటే రూపం ధరించలేరని అర్థం కాదు. రూపం ధరించగలరు. అర్ధనారీశ్వర రూపంలో కనబడినవారు రూపం దాల్చక ముందు కూడా ఉన్నారు. కేవలం విగ్రహాకారమే కాకుండ శ్రీచక్రం కూడ వారిద్దరి

శరీరమే. **శ్రీచక్రం శివయోర్వపుః-** శివయోః అనేది ద్వివచనం. శివుల యొక్క శరీరము శ్రీచక్రము. శివుల అంటే శివాశివులు. శివా అంటే అమ్మవారు, శివః అంటే అయ్యవారు. వారిద్దరి యొక్క శరీరం శ్రీచక్రం.

ఒక విగ్రహాకారమే కాకుండా శ్రీచక్రము కూడా అర్ధనారీశ్వర స్వరూపమని చెప్పడం కోసం 'శ్రీ'తో ప్రారంభించారు. ఇది ఒక సంప్రదాయము. శ్రీచక్రాన్ని వర్ణించేటప్పుడు సరిగ్గా శంకరభగవత్పాదులవారు ఈ భావాన్ని తీసుకున్నారు. శంకరుల సౌందర్యలహరికి స్ఫూర్తి లలితా సహస్రనామ స్తోత్రం. అడుగడుగునా ఈ సంకేతాలు కనబడుతూనే ఉంటాయి. ఇది 'చంపకాశోగపున్నాగసౌగంధికలసత్కచా' నామాల నుండి గోచరిస్తూనే ఉంటాయి. మధ్యమధ్యలో వశిన్యాది వాగ్దేవతలు పరమేశ్వరుని స్మరిస్తూంటారు. 'శ్రీకంఠార్ధశరీరిణీ' అని చెప్పడంలో ఇదొక భావం. శ్రీచక్రస్వరూపమని చెప్పడానికి శంకరుల శ్లోకమే మనకు ప్రమాణం.

చతుర్భిః శ్రీకణ్ఠైః శివయువతిభిః పంచభిరపి
ప్రభిన్నాభిః శంభోర్నవభిరపి మూలప్రకృతిభిః
త్రయశ్చత్వారింశద్వసుదలకలాశ్రత్రివలయ
త్రిరేఖాభిః సార్ధం తవ చరణకోణాః పరిణతాః

అమ్మా! నీ శ్రీచక్రం ఎలా తయారయిందంటే నవ ఆవరణల్లో త్రికోణాలన్నీ నీ స్వరూపం. బిందువులన్నీ అయ్యవారి స్వరూపం, **'త్రికోణరూపిణీ శక్తిః బిందురూపః శివః స్మృతః'** - బిందువు- వృత్తం నిజానికి ఒకటే. శ్రీచక్రంలో ఉన్న బిందువు, వృత్తములు శివ చక్రములు. బిందువు మధ్యలో ఉంది. వృత్తములు చివరిలో వస్తాయి. అష్టదళం, షోడశదళం చివరికి చతురస్రం. ఇవన్నీ వృత్త చక్రములు. ఈ నాలుగు శివస్వరూపాలు. ఇక త్రికోణములు బిందువు చుట్టూ, త్రికోణావరణ ఒకటి. తరువాత అష్టత్రికోణ ఆవరణ. ఇది వశిన్యాది వాగ్దేవతలు ఉన్నది. తరువాత అంతర్దశారం, బహిర్దశారం, చతుర్దశారం, చతురస్రం. ఇవన్నీ త్రికోణ చక్రములు. 5 త్రికోణ చక్రాలు, 4 శివ చక్రాలు. రెండూ కలిసి నిర్మాణమైనది శ్రీచక్రం. విశేషమైన భావం - ఇద్దరూ కలిసే ఉన్నారు. శ్రీకంఠార్ధశరిరిణీ అనగా శ్రీచక్ర స్వరూపము.

శ్రీకంఠార్ధశరీరిణీ అనే మాటని సౌందర్యలహరిలో, "చతుర్భిః శ్రీకణ్ఠైః శివయువతిభిః పంచభిరపి" అని చెప్తే, దీనినే స్కాందపురాణములో చెప్తూ-

వాగుద్భూతా పరాశక్తిః యా చిద్రూపా పరాభిధా
వన్దే తామనిశం భక్త్యా శ్రీకంఠార్ధశరీరిణీమ్
ఇచ్ఛా సంజ్ఞా చ యా శక్తిః పరిపూర్ణాశివోదరా
వన్దే తామాదరేణైవ మమేష్టఫలదాయినీమ్

వాక్కుగా వచ్చిన పరాశక్తి ఎవరో ఆవిడే చిద్రూపా. చైతన్యరూపిణిగా ఉన్నది. ఆవిడే శ్రీకంఠార్ధశరీరిణి. ఆ మాట స్కాందపురాణంలో సరిగ్గా వాక్కు చిద్రుపా దగ్గర చెప్పబడింది. పరా, పశ్యంతీ వాక్కుల కొనసాగింపులో శ్రీకంఠార్ధశరీరిణీ అని చెప్పారు. ఇది ఒక సంప్రదాయం.

పరాది చతుర్విధములైన వాక్కులు శ్రీచక్రంలో సమన్వయింపబడుతున్నాయి. ఆ శ్రీచక్రంలో ఉన్న ఆ వాగ్రూపము, దాని ద్వారా ప్రకటింపబడుతున్న చైతన్యం. మనం మాట్లాడుతున్నాం, శబ్దం చేస్తున్నామంటే చైతన్యమే. నాదము చైతన్యానికి స్వరూపము. చైతన్యము పరమేశ్వరుడే. వ్యక్తమవుతున్న ప్రతి వాక్కులో చైతన్యము ఉంది. వాక్కుకి అర్థం చైతన్యమే.

వాక్కు తప్పకుండా ఒక భావాన్ని చెప్తుంది. భావం మళ్ళీ చైతన్య స్వరూపమే. వాక్కు- అర్థం. ప్రకటింపబడే ఒక స్వరూపం వాక్కు. ప్రకటనకి మూలమైన చైతన్యం అర్థం. వాక్కు-అర్థం... ఈ రెండూ తీసుకుంటే -

వాగర్థావివ సంపృక్తౌ వాగర్థః ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ

అని రఘువంశకావ్యం ప్రారంభంలో కాళిదాసు మహాకవి అన్నారు.

'వాగ్రూపా పార్వతీదేవీ అర్థరూపో మహేశ్వరః' (శివపురాణం) – ఈ సృష్టి అంతా రెండే కళలు అని చెప్పారు. వాక్కు కళలు కొన్ని ఉంటాయి, అర్థకళలు కొన్ని ఉంటాయి. అర్థము యొక్క స్వరూపాలన్నీ శివునివి. వాక్కుయొక్క స్వరూపాలన్నీ అమ్మవారివి. ఈ వాక్కు, అర్థం ఎలా విడదీయలేమో శివశక్తులని అలా విడదీయలేరు.

లోకంలో కేవలం సాహిత్యార్థమే చాలా మందికి తెలుసు. శక్తిలోనే శివుడు ఉన్నాడని మామూలుగా చెప్పేస్తారు. కాళిదాసు మాత్రం మాములుగా వ్రాయలేదు. వాగర్థములు అంటే అది సంపూర్ణమైన ఒక అద్భుతమైన తత్త్వం. సృష్టి అంతా వాగర్థములుగా ఉన్నది. **అగ్నీషోమాత్మకం జగత్ వాగర్థాత్మకం జగత్** అని 'రెండు వాక్యాలు ముందు చెప్పి ఒకొక్క దానికి ఒకొక్క అధ్యాయ వివరణ ఇచ్చింది శివపురాణం. ఆ స్ఫురణ ఇక్కడ తీసుకోవాలి.

శ్రీకంఠార్ధశరీరిణీ అనేది పరాది వాక్కుల వివరణ చెప్పి, తరువాత కుండలినీ గమనములో నాలుగు పీఠములు చెప్పిన తరువాత చెప్పడంలో ఉద్దేశం – ఆ వాగ్రూపమైన స్వరూపాన్ని, శ్రీచక్రస్వరూపాన్ని, ఉపాస్యమైన అర్ధనారీశ్వర స్వరూపాన్ని తెలుసుకోవాలి.

మనం నమస్కరిస్తున్న కామాక్షీదేవి అర్ధనారీశ్వరరూపమే అని శంకరాచార్యులు అన్నారు. శంకరులు అమ్మని 'పెద్ద దొంగ' అన్నారు. శివుని దొంగిలించిందిట. నువ్వు సగం ఇయ్యి. మిగిలిన సగం నేను తీసుకోగలను అందిట. శివుడు సగం ఇస్తే అక్కడితో తృప్తిపడకుండా

త్వయా హృత్వా వామం వపురపరితృప్తేన మనసా
శరీరార్ధం శంభోరపరమపి శంకే హృత మభూత్
యదేతత్త్వద్రూపం సకలమరుణాభం త్రిణయనం
కుచాభ్యామానమ్రం కుటిల శశి చూడాల మకుటమ్

అసంతృప్తితో మిగిలిన సగం కూడా తీసేసుకుని కలసిపోయి కనిపిస్తోంది అని అమ్మవారిని అంటారు శంకరులు. "ఇదేమిటయ్యా నా మీద లేనిపోని నింద వేస్తున్నావు" అని అమ్మవారంటే "లేదమ్మా! నీలో ఆయన ఉన్నాడు. ఆ చంద్రలేఖ, మూడు కళ్ళు శివునివేగా! " అన్నారు.

"పోనీ ఆయనే అనుకో.. నేను అని ఎందుకు అనుకుంటున్నావు?" అంటే, "ఆ ఎరుపు, ఆ ఉన్నత వక్షఃస్థలం ఎవరివి? నీవి కదా!" అన్నారు. లలితారూపంలో ఎర్రదనం, ఆ వక్షఃస్థలం చూస్తుంటే జగన్మాతృత్వం కనిపిస్తోంది. మూడు కళ్ళు,

నెలవంక చూస్తూంటే శివుడు కనిపిస్తున్నాడు. కామాక్షీ లలితమ్మ కూడా శివశక్త్యైక్యరూపిణే. ఆవిడ కూడా శ్రీకంఠార్ధశరీరిణి. విగ్రహము శ్రీకంఠార్ధశరీరిణియే. శ్రీచక్రము శ్రీకంఠార్ధశరీరిణియే. వాగర్థములు శ్రీకంఠార్ధమే, ప్రపంచమంతా శ్రీ కంఠార్ధశరీరిణియే.

393. ప్రభావతీ – శ్రీ ప్రభావత్యై నమః

394. ప్రభారూపా – శ్రీ ప్రభారూపాయై నమః

"ప్రభావతీ, ప్రభారూపా, ప్రసిద్ధా, పరమేశ్వరీ" మొత్తం ఈ వాక్యాన్నిగాని జపం చేస్తే అదొక సిద్ధి. దాని ప్రయోజనమేంటో చూద్దాం. ప్రతిదాంట్లో రెండు మూడు భావాలు తీస్తున్నాం. ఒకొక్క దానికి ఏదో తోచింది చెప్పడం కాదు. 'కాళిదాసు కవిత్వం కొంత... తన పైత్యం కొంత' అని సామెత ఉంది. ఆ ధోరణిలో కాకుండా శాస్త్రోద్దిష్ట యథార్థాలనే గ్రహిద్దాం.

రహస్యనామమన్నప్పుడు రెండు అర్థాలుంటాయి. అవి తంత్రార్థం, తత్త్వార్థం. తంత్రమనగానే దానిలో మంత్రము, యోగము, రూపము, యంత్రము, పూజాప్రక్రియ అనగా అందులో పూజింపబడే దేవతా విశేషాలు... ఇలా తంత్రంలో 5 భాగాలు ఉంటాయి.

రెండవది తత్త్వార్థం. ఇది ఉపనిషత్పరమైనది. తత్త్వార్థం ఎప్పుడూ ఒక్కటే. తంత్రార్థమే ఎక్కువ. తంత్రం అనేది బాహ్యం కనుక, బాహ్యం అంటే ప్రపంచం కనుక ప్రపంచం ఎప్పుడూ అనేకమే. పూజాదికాలన్నీ ప్రపంచపు సంగతే. తత్త్వం మాత్రం ఎప్పుడూ ఒక్కటే. అందుకు తత్త్వార్థం ఒక్కటే.

ఈ నామాల్లో ముందు లౌకికార్థం చెప్పుకుంటే నిఘంటువు అర్థాలు ఒకలాగ ఉంటాయి. అవి లేవని కాదు. కానీ అది కేవలం స్థూలం. సంస్కృతం బాగా తెలుసుకుని, నిఘంటువుల సహాయంతో పదాలకి అర్థం తెలుసుకుంటే కేవలం ఇంటి గుమ్మం చూసినట్టే. గుమ్మం చూస్తే ఇంటి గురించి పూర్తిగా తెలీదు. ఆ ఇంట్లో మనం స్వంతదారులా తిరగాలి. ఈ ఇల్లు మా అమ్మ, అయ్యలది. అమ్మా, అయ్యా

ఇంట్లో సొంతదారుగా తిరిగేది పిల్లవాడు మాత్రమే. మనం లలితాపరమేశ్వరికి బిడ్డలమనుకుంటే లలితాసహస్రనామ సౌధంలో పిల్లవానిగా విహరిస్తే ప్రతి గది చూపిస్తుంది అమ్మవారు. ఆ భావాలే మనం ఇందులో చెప్పుకుంటున్నాం. లోతు లోతుల్లోకి వెళ్ళడం అంటే గదిగదిలోకి వెళ్ళడం. మొత్తం ఇల్లు స్వరూపమిదని చూపిస్తుంది. గుమ్మం దగ్గరే తృప్తి పడిపోతే ఎలా! అసలు అందాలు చూడాలి కదా! అందుకు ప్రయత్నం చేద్దాం.

ప్రభావతీ, ప్రభారూపా, ప్రసిద్ధా, పరమేశ్వరీ- లలితాసహస్రనామాల్లో కవిత్వం ఎంత బాగుంటుందో చెప్పుకున్నాం.

ప్రభా-వతీ. వతి అంటే కలిగినది అని అర్థం. అమ్మ ప్రభలు కలిగి ఉంది. ప్రభా అంటే కాంతి. కాంతి కలిగి ఉన్న తల్లి అని అర్థం. అమ్మవారు కాంతిరూపం. ఎప్పుడైనా దేవతల శరీరం తేజోమయం. మన శరీరాలు పాంచభౌతిక వికారమయాలు. ఏ దేవతల శరీరమైనా తేజోమయమే. అన్ని దేవతలకీ మూలమైన దేవదేవి పరంజ్యోతిర్మయం. అమ్మవారి రూపాన్ని ధ్యానం చేసేటపుడు **"జ్యోతిర్మయం వపుః"** - జ్యోతిస్వరూపంగా భావన చేయాలి.

అమ్మవారు ప్రభావతి. అమ్మ ఎర్రని కాంతులతో మెరిసిపోతోంది. వెలుగులు అమ్మవారి నుండి వస్తున్నాయి. ఇన్ని వెలుగులు కలిగిన తల్లి,

ఆ చెప్పే తీరు కూడా - అమ్మవారు దర్శనం ఇచ్చినపుడు ముందు వెలుగులు కన్పిస్తున్నాయి. ఆపై ఈ వెలుగులన్ని కలిగిన అమ్మ కనిపించింది. ఆ అమ్మయే వెలుగు రూపంగా కనిపించింది. ఆ క్రమం చూడాలి. ప్రభావతి -ప్రభారూప. వెలుగులు కలిగినది, వెలుగే రూపమైనది అని ఈ రెండు నామాలకి అర్థాలు.

వెలుగులు ఎన్ని? ఒకటేగా అంటే కాదు. ప్రభలు ఎన్ని ఉన్నాయో చెప్తున్నారు. ఇన్ని ప్రభలుంటే గాని మన బ్రతుకు లేదు.

సూర్యుని కిరణాలన్నీ కలిపి ఒకటే కాంతి ముద్ద అని అనుకుంటాం. కానీ అందులో ఎన్ని కిరణాలున్నాయో! దానిలో ఒకొక్క కిరణానికి ఒకొక్క ప్రత్యేకత ఉంది. ఒకొక్క ప్రభని మనం తలచుకుంటే ఒకొక్క శక్తి వస్తుంది. అలాగ అమ్మవారి

నుండి అనేక ప్రభలు వస్తున్నాయి. ఈ ప్రభలు మనకి కావలసిన అనేక శక్తులను ప్రసరిస్తున్నాయి.

అణిమాదిభిః మయూఖైః - అణిమా మొదలైన కిరణములు కలిగినది. ఇవన్నీ కిరణములు. శ్రీకంఠార్ధశరీరిణీ, శ్రీచక్రంలో పరమేశ్వరి బిందువులో కూర్చుంది. బిందువు జ్యోతిలాంటిది. అది ప్రభావతి. ఆ బిందువు నుండి వచ్చిన కాంతిపుంజములే ఎనిమిది ఆవరణలలో వ్యాపించాయి. ఆ కిరణపుంజాలన్నింటికి మధ్యలో ఆవిడ ఉంది.

దీపం వెలిగించినపుడు గమనిస్తే చుట్టూ ఒక కాంతి పుంజం ఉంటుంది. సూర్యుని చుట్టూ ఒక కాంతివలయం ఉంటుంది. అక్కడి కిరణాలు మన దాకా వస్తున్నాయి. ఆ సూర్యుని బిందువుగా భావించి, అక్కడి నుండి మన దాకా వచ్చే కాంతి కిరణాలన్ని ఆవరణలుగా భావిద్దాం.

అమ్మవారు బిందువులో కూర్చున్నారు. ఆవిడ నుండి వచ్చే కాంతికిరణాలన్నీ ఎనిమిది ఆవరణలుగా వ్యాపించాయి. ఎనిమిదావరణలలో ఎన్నో శక్తులున్నాయి. త్రైలోక్యమోహనచక్రంలో మొదటి రేఖలో అణిమ, మహిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్య, ఈశిత్వ, వశిత్వ ఇవి సిద్ధులు. దేనితో మొదలైంది? అణిమ. అందుకే అణిమాదిభిః.- అణిమా మొదలైన అని అర్థం. మొదలైన అంటే త్రికోణంలో మొట్టమొదట వచ్చే మొదటి రేఖలో పదిమంది సిద్ధి దేవతలు.

దాని తరువాత బ్రాహ్మ్యాది అష్టమాతృకలు వస్తారు. తరువాత వచ్చే రేఖలో దశముద్రాదేవతలుంటారు. సర్వసంక్షోభిణీ, సర్వవిద్రావిణీ మొదలైనవి. ఇలా చతురస్రంలోనే 28మంది దేవతలు వచ్చేశారు. ఈ 28 మంది దేవతలు అమ్మ వెలుగులు. వీరు ప్రభలు. మొదటి ఆవరణలో ఉన్న 28. దాని తరువాత ఆవరణలో కామాకర్షిణి, చిత్తాకర్షిణి, బుద్ధ్యాకర్షిణి మొదలైన 16 మంది వస్తారు. తరువాత అనంగకుసుమ, అనంగమేఖలా మొదలైన 8 మంది. అటు తరువాత చతుర్దశభువనాలు దగ్గరికొచ్చేటప్పటికి సర్వసౌభాగ్యదాయకచక్రంలో ఉన్న వారు 14 మంది. దాని తరువాత బహిర్దశావరణం. అక్కడున్న దేవతలు పది మంది.

వారు కూడా ప్రభలే. ఆ తరువాత అంతర్దశావరణం. అక్కడ మళ్ళీ 10 మంది.

తరువాత వసుకోణం. అక్కడ 8 మంది వశిన్యాదివాగ్దేవతలు. వారు 8 కిరణాలు. దాని తరువాత త్రికోణం. అక్కడ ముగ్గురు - మహాకామేశ్వరీ, మహాభగమాలిని, మహావజ్రేశ్వరి. వీరితోపాటు ఆయుధదేవతలు బాణిని, చాపిణి, పాశిని, అంకుశిని మొదలైనవారు ఉంటారు. వీరితోపాటుగా షోడశనిత్యాదేవతలు కూడా అక్కడే ఉంటారు. ఇందరు దేవతలు. కానీ వీరందంరూ వేరువేరు కాదు. వీరందరూ ప్రభలు. ఈ ప్రభలు అన్నీ కలిగిన ఆవిడ ప్రభావతి.

'అణిమాదిభిరావృతాంమయూఖైః' అంటే భావమిది. అంటే అణిమా మొదలుకుని మహాభగమాలిని, మహావజ్రేశ్వరి అక్కడి వరకూ చెప్పబడ్డవారందరూ మయూఖములు(కిరణములు) అనగా ప్రభలు. ఇన్ని ప్రభలు కలిగినది ఎవరో ఆ లలితాంబ.

ఆ లలితాంబ బిందువులో కూర్చుని ఉంది. ఆవిడ ప్రభారూప. ఈ వెలుగులు ఎక్కడున్నాయి? విశ్వమంతా ఈ వెలుగులే ఉన్నాయి. అన్నీ పరిశీలిస్తే మొత్తం ప్రపంచం అంతా శ్రీచక్రంగా దర్శించవచ్చు.

గంధాకర్షిణి, చిత్తాకర్షిణి, ధైర్యాకర్షిణి, రూపాకర్షిణి, రసాకర్షిణి - ఇవి కేవలం దేవతల పేర్లు మాత్రమే కాదు. ఒకసారి పరిశీలిద్దాం. ఎదురుగా ఒక రూపం ఉంది. ఆ రూపాన్ని వెంటనే కన్ను అనే ఇంద్రియం ఆకర్షించింది.. అదే రూపాకర్షిణి. గంధాకర్షిణి - ఎక్కడో వాసన వస్తుంటే ఆ వాసన నాసిక యొక్క చైతన్యం ఆకర్షించింది. అలాగే రసాకర్షిణి, రుచి అంటే రసాకర్షిణి నాలుకలో ఉంది. ఇలా ప్రపంచంలో ఉన్నవాటన్నిటిని మన లోపలకి ఆకర్షించే శక్తి ఒకటి ఉందా? లేదా? ఈ శక్తులు ఎవరు?

ఇది ఏదీ మనం తయారు చేసుకోలేదు కదా! అణిమాది మొదలుకుని చిట్టచివర వరకూ ఉన్న సర్వశక్తులు ఈ శరీరంలోనే ఉన్నాయి. ఆ ప్రభలు ఈ శరీరం అంతా ప్రసరిస్తేగాని శరీరం కదలదు. ఇన్ని ప్రభలతో శరీరాన్ని కదుపుతున్న ఆ తల్లి యొక్క వెలుగులే ఈ శరీరమంతా వ్యాపించి ఉన్నాయని తెలుసుకోవాలి. ఈ

వెలుగులన్నిటికి మూలమైన 'ప్రభారూపా' అంటే ఇన్ని వెలుగులని మనలో ప్రసరిస్తూ అఖండ ఆత్మశక్తిగా మనలో ఉన్న పరతత్త్వమే 'ప్రభారూపా'.

ఇప్పుడు అందరికి తెలిసినది ఈ ఈశ్వరియే - నేను చూశాను అంటే రూపాకర్షిణి. నేను వాసన చూశాను అంటే గంధాకర్షిణి. ఒకొక్కదాన్ని చెప్తున్నప్పుడు అన్నిటిలో 'నేను' వస్తోంది కదా! ఆ 'నేను' ఎవరు? ఈ 'నేను'గా అందరిలో ప్రసిద్ధగా ఉంది కనుక ప్రభావతీ, ప్రభారూపా, ప్రసిద్ధా అన్నారు.

395. ప్రసిద్ధా - శ్రీ ప్రసిద్ధాయై నమః

జగన్మాత గురించి తెలియనివారు లేరు. వేదవేదాంత పురాణాదుల యందు ప్రసిద్ధిగా చెప్పబడినది. నేను అనేది అందరికి తెలిసిన వస్తువే. 'ఆబాలగోపవిదితా' దగ్గర దీనిని గుర్తుపెట్టుకోవాలి. **'స్తుహి శ్రుతం గర్త సదం యువానం'** అని వేదమంత్రం. శ్రుతం అంటేనే 'ప్రసిద్ధం'. **సర్వచైతన్యరూపాం తాం ఆద్యాం విద్యాంచ** - సర్వచైతన్య రూపిణి అయినప్పుడు అంతకన్నా ప్రసిద్ధురాలు ఎవరుంటారు? **'తామహం ప్రత్యయవ్యాజాత్ సర్వే జానన్తి జన్తవః'** - అని దేవీభాగవతం. "లోపల ఉన్న ఆ చైతన్య రూపిణిని 'నేను' అనే మిషతో అందరూ తెలుసుకుంటున్నారు."

396. పరమేశ్వరీ - శ్రీ పరమేశ్వర్యై నమః

ఆమెను మించి ఈశ్వరి మరొకరు లేరు. త్రైలోక్యమోహన చక్రంలో ఒక ఈశ్వరి ఉంది. ఆవిడ త్రిపుర అన్నాం. షోడశదళానికి వచ్చేటప్పటికి మరో ఈశ్వరి వచ్చింది. ఆవిడ 'త్రిపురేశీ'. ఇలా త్రిపురసుందరి, త్రిపురవాసినీ అని ఇలా ఒకొక్క చక్రానికి ఒకొక్క ఈశ్వరి ఉంది. ఈ ఈశ్వరులందరూ ఆయా ఆవరణ చక్రాలకు ఈశ్వరులు. ఈ ఈశ్వరులందరిని దాటి బిందువులో ఉన్నది పరమేశ్వరి. ఆ తల్లికి ఎవరూ నియామకురాలు గాని, నియామకుడుగాని లేరు. తానే అందరినీ నియమిస్తూ ఉంటుంది.

త్వమీశ్వరాణాం పరమం మహేశ్వరమ్
త్వం దేవతానాం పరమం చ దైవతమ్

అని ఉపనిషత్ చెప్పినమాట. ఈశ్వరులకి ఈశ్వరుడవు నువ్వు, దేవతలకి దేవుడవు నువ్వు. దేవుడు, ఈశ్వరుడు అన్నదానిని స్త్రీలింగం చేస్తే దేవీ, ఈశ్వరీ. అందుకే పరమేశ్వరీ.

మరొక భావంలో ప్రభావతీ, ప్రభారూపా, ప్రసిద్ధా, పరమేశ్వరీ... ఇవి ఉపాసకునికి వచ్చే సిద్ధి యొక్క లక్షణాలని దీనిలో ఆంతర్యం. అమ్మవారి మంత్రాన్ని నిరంతరం జపం చేస్తూ ఉంటే వాని శరీరంలో ఆ మంత్రచైతన్యం జాగృతమై ఉంటుంది. మంత్రం జడం కాదు, అక్షరం కాదు. స్ఫోట సిద్ధాంతమని దాని వెనకాల పెద్ద సిద్ధాంతం ఉంది.

మంత్రం అంటే కేవలం ఉపదేశం పొందిన షోడశీ, పంచదశీ అని మాత్రమే కాదు. శ్రద్ధగా రోజు లలితాసహస్రం పారాయణ చేస్తే ఆ శబ్దమూ మంత్రమే. అదంతా వదలి 'శ్రీమాత్రే నమః' అని అనుకున్నా అదీ మంత్రమే. మొత్తానికి భక్తిశ్రద్ధలతో పద్ధతిగా గురువు చెప్పిన క్రమంలో గాని ఉపాసన చేస్తే ఆ మంత్ర చైతన్యం మనలో జాగృతి జరుగుతుంది. జపపరాయణులైన వారి శరీరంలో ఒక తేజస్సు వస్తుంది.

ఒక దీపాన్ని లోహపు పెట్టెలో పెడితే పెట్టె అంతా వేడెక్కినట్లే, మంత్రదీపాన్ని శరీరంలో పెడితే శరీరం అంతా వేడెక్కదా? ఆ తేజస్సు మామూలు కంటితో స్థూలంగా నిర్ణయించలేం. మంత్రతేజస్సుని నిర్ణయించడానికి అవతలివారికి అంత శక్తి లేకపోవచ్చు. కానీ ఏదో తెలియని ఒకానొక తేజస్సు కనిపిస్తుంటుంది.

స్వామీ వివేకానంద ఎన్నో ప్రశ్నలు వేద్దామని రామకృష్ణపరమహంస దగ్గరకి వెళ్ళి కూర్చున్నారు. బయటకి వచ్చాక ఏం అడిగారంటే– "ఎన్నెన్ని ప్రశ్నలతో వచ్చానో అన్నీ ఆయన ముందు కూర్చుంటే తీరిపోయాయి" అన్నారు. అదే ప్రభ. ఆ మహోపాసకుని నుండి వస్తున్న ప్రభలో జ్ఞానము, తేజస్సు అన్నీ ఉంటాయి.

సామాన్యుల శరీరాలు మాంసమయాలు. సిద్ధుల శరీరాలు మంత్ర మయాలు. మంత్రం నిరంతరం సాధన చెయ్యడంచేత మహోపాసకుల శరీరంలో

ప్రసరిస్తున్న ప్రాణ (మంత్ర) తేజస్సు చేత వారి ఇంద్రియాలన్నీ నిండిపోతాయి. పాపాలు చేస్తే అవి కూడా "త్వగస్థిగతైః సర్వపాపైః ప్రముచ్యతే" అని మహన్యాసంలో చెప్తారు. పాపాలు చేస్తే చర్మంలో, ఎముకల్లో, రక్తంలో, మాంసంలో పాపాలు పేరుకుపోతాయి. పుణ్యాలు చేసినా అదే జరుగుతుంది. ఒక స్పాంజిని తీసుకొని మనం గంగలో ముంచితే గంగనీరు పీల్చుకుంటుంది. మురికి నీటిలో ముంచితే మురికి నీరు పీల్చుకుంటుంది. అలాంటిదే ఈ శరీరం.

యోగి అయినవాడు బహుకాలం సాధన చెయ్యడం వలన శరీరం లోపల సూక్ష్మరూపంలో మంత్రచైతన్యం ఉండిపోతుంది. ప్ర-భ ప్రకృష్టమైన తేజస్సు. భ అంటే కాంతి. దీనినే వర్చస్సు అని లోకంలో అంటుంటారు.

యోగి దేహంలో ఉన్న ఆ ప్రభలన్నీ అమ్మవే. ఉపాసకునిలో ప్రకటింపబడే అద్భుతాలన్ని అతనివి కావు. ఆ ప్రభలన్నీ ఆవిడవి. ఆ ప్రభలరూపంగా ఆవిడ లోపల కూర్చుంది. ఇంతకాలం చేసిన మంత్రం ప్రకృష్టంగా సిద్ధించి గోచరించింది కనుక ప్రసిద్ధా. ఆవిడ సిద్ధరూపంగా, మంత్రసిద్ధిగా లోపల ఉంది. కనుక 'ప్రభావతి, ప్రభారూపా, ప్రసిద్ధా'. ఆ తల్లి మహామంత్రరూపిణిగా "పరమేశ్వరి". సర్వైశ్వర్యం, సర్వవశం (స్వతంత్రత) మొదలైన శక్తులను ప్రసాదించే తల్లి.

ఈ నామ భావన చేసి అమ్మవారిని ఆరాధన చేయాలి.

ఔచిత్యం తెలిసినవారికి ఈ సందర్భంలో చిన్న ప్రస్తావన. లలితాసహస్రానికి భాష్యాలు ఎంతమందో రచించారు. ఒకొక్కరు ఒకొక్క సిద్ధపురుషులు. అలాంటి సిద్ధపురుషులలో మనం సుమారుగా ఏడుగురి పేర్లు చెప్పుకున్నాం. కానీ తెలుగులో ఒకాయన లలితాసహస్రనామం రచించారు. ఇది సంస్కృతానికి అనువాదం కాదు. ఆయన సరస్వతీ అవతారం. ఆయన గురించి చాలా మందికి అసలు తెలియదు.

ఆయన చాలా తేజఃస్వరూపుడు, మంత్రసిద్ధి స్వరూపుడు, సాహిత్యము, వేదవిజ్ఞానము, సంస్కృత విజ్ఞానము, ఆంగ్లభాషా విజ్ఞానము, సంగీత విజ్ఞానము, నాట్య శాస్త్రము, మంత్ర శాస్త్రము, జ్యోతిషశాస్త్రము అన్నింటి సిద్ధపురుషుడైన ఒక్క వ్యక్తి ఉండడం ఆశ్చర్యం. అలాంటివారు ఒకాయన తెలుగులో పుట్టారు. ఆయనే

హరికథాపితామహుడు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు గారు.

ఆ సిద్ధపురుషుడు తన జీవితపు చివరిదశల్లో అమ్మవారి ఆజ్ఞతో తెలుగులో లలితాసహస్రానామాలకి వ్యాఖ్య వ్రాశారు. అమ్మ దర్శనమిచ్చి వ్రాయమని చెప్పింది. మనం మాట్లాడుకునే తెలుగు కాదది. అసలైన తెలుగు.

అచ్చ తెనుగులో అంటే అచ్చతెలుగులో కూడా సంస్కృత వికారాలు కొన్ని ఉంటాయి. రథము – అరదము. అది సంస్కృతం నుండే పుట్టింది కాని తెలుగు అనడానికి లేదు. దీనిని అచ్చతెనుగు అనవచ్చు. అచ్చతెనుగు అని కూడా ఈయన అనలేదు. ఎందుకంటే 'అచ్చ' అనేది కూడా సంస్కృతంలోంచే వచ్చింది. "అసలు తెలుగు నేను చెప్తాను" అన్నాడు. నిజానికి ఇది సాహితీవేత్తలు, విశ్వవిద్యాలయాలు పట్టుకోవలసిన విషయం. భాగవతుల గురించి చెప్తే భగవతి సంతోషిస్తుంది. ఆ మహానుభావుడు దీని సంతటిని **నాటు తెలుగు** అని పేరు పెట్టి వ్రాశాడు. నాటు అంటే మోటు కాదు. నాటు అంటే దేశీయమైన. నాటు తెలుగులో పద్యరూపంలో లలితా నామాలకి అర్థం వ్రాశారు. ఇందులో ప్రసిద్ధమైన వ్యాఖ్యానాలు ఉంటూ ఉండగా, వాటిలో అసలైనవి వదలకుండా, అనవసరపు వివరణ ఇవ్వకుండా సూటిగా పట్టుకు వచ్చారు. ఇప్పుడు అది చెప్పాలన్నా, సంస్కృతంలో ఉన్నదైనా చెప్పొచ్చుగాని నాటు తెలుగులోది చెప్తే అర్థం చేసుకోవడం కూడా మహాకష్టం.

ఈయన విష్ణుసహస్రానికి కూడా నాటు తెలుగులో అర్థం వ్రాశారు. సంస్కృతంలో, ఇంగ్లీషులో చాలా పుస్తకాలు రచించారు. షేక్స్పియరు, కాళిదాసులని పోలిక చేస్తూ అద్భుతమైన గ్రంథం వ్రాశారు. **"వెన్నుని వేయిపేర్ల వినకరి"** అని విష్ణు సహస్రనామానికి పేరు పెట్టారు. లలితా సహస్రానికి **"తల్లి విన్కి"** అని పేరు పెట్టారు. ఏదో ఇక్కడ ప్రస్తావిద్దామని గ్రంథం పరిశీలిస్తే అందులో ఉన్న వెలుగు అంతా ఇంతా కాదు. ఆ తెలుగు మాటల్లో అమ్మ కనబడింది.

ఆ తేట తెలుగులో ఎందుకు చెప్తున్నాను అన్న దానికి వ్రాశారు.

తొలిబలుకుల నోట –దొర్లించినంత

గోరికలీడేర్చు –గుబ్బలిపట్టి

తెఱగంట్ల నుడిగాని- తెలుగునన్గాని

తను గొల్చువారి న-త్తలిగాపాడు

వెలితిప్పటెంకి వే-పేర్ల వినకరి

పొగడు డింగరులకె-ప్పుడు లోటు రాదు

ఈ పదాలు అంటూ ఉంటే వచ్చే అనుభూతి వేరు. తొలిపలుకులు అంటే వేదాలు. వాటిని నోటితో పలికితే "కోరికలీడేర్చు గుబ్బలిపట్టి" - అంటే కొండకూతురు. కొండకూతురంటే అమ్మవారు. అయితే కేవలం వేదాలు చెప్తేనే ఇస్తుందా? అంటే "తెఱగంట్ల నుడిగాని- తెలుగునన్గాని" - తెరగంట్లు అంటే దేవతలు. నుడి అంటే పలుకు. దేవతల భాష అయిన సంస్కృతంలోగాని, తెలుగునన్గాని- తెలుగులో గాని ఏ భాషలో కొల్చినా - తను గొల్చువారి న-త్తలి గాపాడు - సంస్కృతంలోనైనా, తెలుగులో నైనా ఏ భాషలో కొలచినా ఆ తల్లి కాపాడుతుంది. సర్వదేవతలకి తల్లి గనుక "వెలితిప్పటెంకి వే పేర్ల-వినకరి, పొగడుడింగరులకె-ప్పుడు లోటు రాదు." 'వినకరి' అంటే స్తోత్రము. ఆ తల్లి యొక్క వే పేర్లనీ పలికేవారికి ఎప్పుడు లోటురాదు. 'డింగరులు' అంటే భక్తులు.

'చితిః' అనేమాటకి నారాయణదాసుగారు నిర్వచనం చెప్తూ

ఎలమాఱకెన్నడు-న్జెలగెడుతెల్వి

నింగినేలలకుఁదా-నే పట్టుఁగొమ్మ

అనయమెదిరిఁగాన-కలరెడి పదుచు

ఎల్ల యొడళ్ళఁ గ్రి-క్కిరిసిన యుసురు

అడియరి కెఱుకువ - నలరించు వేల్పు

అన్నారు. **ఎలమాఱకెన్నడు-న్జెలగెడుతెల్వి** - ఏ మార్పు లేకుండా ఎప్పుడూ ఉండే తెలివి. **నింగినేలలకుఁదా-నే పట్టుఁగొమ్మ అనయమెదిరిఁగాన-కలరెడి పదుచు**- అంటే సాటి లేకుండా ఉన్న శక్తి, **ఎల్ల యొడళ్ళ కిక్కిరిసిన యుసురు**- ప్రతి వాని శరీరములో క్రిక్కిరిసిన ఉసురు. శరీరం అంటే సంస్కృతం. ప్రతివారి శరీరంలో క్రిక్కిరిసిన ఉసురు అంటే అడుగడుగునా వ్యాపించిపోయిన ప్రాణశక్తి. అడయరికి -

భక్తునికి, ఎరకువ– జ్ఞానం కలిగించు వేల్పు. చితిః అంటే ఇది ఆయనిచ్చిన నిర్వచనం. అలాగే 'చిదేకరసరూపిణి'కి ఇచ్చిన మాట చూడండి.

నిండారు వేడుక – నిలువైన పడుచు

తన యడియరి నెప్పు – తనియించు తల్లి

నిండారు వేడుక నిలువైన పడుచు– పరిపూర్ణమైన ఆనందం రూపంగా ఉన్న తల్లి. **తనయడియరి నెప్పు తనియించు తల్లి** – తన భక్తుని ఎప్పుడూ తృప్తి పరచే తల్లి, **'ప్రభావతీ'** నుండి నామాలకు నిర్వచనాలు చూస్తే

ఎనిమిది కల్మల – నెలరించు మినుకు

వెలుగున నన్నిటి – న్వెలిగించు తెల్వి

మిలమిలలాడెడు – మెట్టాడు పడుచు

అడియరి న్తళతళ – నలరించు వేల్పు

మినుకు అంటే వెలుగు. ఈ ఎనిమిది కల్మలు ఉంటేనే మనకి ప్రభ ఉంటుంది. లోకంలో కూడా వెలిగిపోతున్నాడండి అంటుంటారు. ఈ మధ్య వాని ప్రభ తగ్గిందిలెండి అని వాడుకలో అంటుంటారు. ప్రభ అంటే ప్రకటింపబడుతున్న కీర్తి. ప్రభలు ఎన్ని విధాలుగా వస్తాయో శాస్త్రం చెప్తూ ఎనిమిది కల్మల వల్ల వస్తాయంది. అంటే అష్టైశ్వర్యాల వల్ల వస్తాయని అర్థం. ఏ రకమైన ఐశ్వర్యమున్నా వానికి ప్రభ ఉంటుంది. ఎనిమిది కల్మలు అమ్మ రూపాలు. అష్టైశ్వర్యాలు ఇచ్చే తల్లి అనే అర్థాన్ని తీసుకొచ్చారు.

వెలుగున నన్నిటి న్వెలిగించు తెల్వి – ఇది గొప్ప నిర్వచనం. **మిలమిలలాడెడు మెట్టాడు పడుచు, అడియరి న్తళతళ నలరించు వేల్పు** అన్నారు. అడయరి అంటే భక్తుడు. తన భక్తుని ఎప్పుడూ తళతళ లాడిస్తుందిట అమ్మ. అంటే వానిని ప్రసిద్ధుని చేసి కీర్తిని కలిగిస్తుంది.

ఆ తల్లికి ఎవరు నమస్కారం చేస్తారో వారికి "సోపి లక్ష్మీసహస్రైః పరిక్రీడతే" – సహస్ర లక్ష్ములు వారిని సేవించుకుంటాయి. "తస్య వక్త్రాంతరాత్ గద్యపద్యాత్మికా వాఙ్మయీ నిస్సరేత్" అని కాళిదాసు మహాకవి అన్నారు. అమ్మ అనుగ్రహం ఉంటే

వాని నోటినుంచి పలుకులు దొంతరలు వస్తాయి. అమ్మ అనుగ్రహం ఉంటే అష్టైశ్వర్యములు వానికి సిద్ధిస్తాయి. ఇవే ప్రభలు. తన భక్తులని "తళతళనలరించు వేల్పు". అలా ప్రకాశింపజేస్తుందన్నారు. అమ్మ తెలుగు తల్లి అయిపోయింది.

ఎవరు తెలుగు చదివినా ఒకే అక్షరం చదువుతారు. ఒకే భాష మాట్లాడు తున్నారు. తెలుగు మాట్లాడే అందరికి తల్లి తెలుగు తల్లి.

నారాయణదాసుగారు బాలాత్రిపురసుందరి ఉపాసకులు. దాని వల్ల అంత సిద్ధిని పొందారు. శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసుగారు అమ్మ భక్తుల్లో, అమ్మ డింగరీలలో, అమ్మ అడయరులలో మేలిమివాడు గనుక ఆయనకి ఐదు పది సేతలు, జోతలు. జోత అనే తెలుగు మాటకి నమస్కారమని అర్థం.

శ్రీకంఠార్ధశరీరిణి అన్నదానికి ఆయన చెప్పిన నిర్వచనం చూస్తే-

చీకటి వెల్తురు-ల్చెటీనంత సల్పి

హెచ్చు తగ్గులనెన్న-కేలెదు జేజె

జేజె అంటే దేవత. సగం చీకటి, సగం వెలుతురు చేసి ఆవిడ లోకాన్ని నడుపుతోంది. సగం చీకటి, సగం వెలుతురు అంటే పగలు, రాత్రి. పగలు శివ స్వరూపం, రాత్రి అమ్మ స్వరూపం. దీనికి ప్రమాణం "రుద్రో దివా ఉమా రాత్రిః తస్మై తస్యై నమో నమః"- రుద్రహృదయ ఉపనిషత్తులోని మంత్రమిది. రుద్రుడు పగలు, రాత్రి అమ్మ. ఈ రెండూ కలిపితే అహోరాత్రులు. ఈ అహోరాత్రులు ఒక రోజు. అమ్మ అయ్యా కలిపితే ఒకరోజు. ఉత్తరాయణం శివరూపం, దక్షిణాయనం అమ్మరూపం. రెండూ కలిపితే ఒక సంవత్సరము. అలా రెండుగా ఉన్నది ఒక్కటే. అదే శ్రీకంఠారార్ధశరీరిణి అని అంత అందమైన అర్థం ఇచ్చారు.

తరువాత నామములు- "మూలప్రకృతిః, అవ్యక్తా, వ్యక్తావ్యక్తస్వరూపిణీ, వ్యాపినీ, వివిధాకారా, విద్యావిద్యాస్వరూపిణీ". ఈ శ్లోకం ఒక అద్భుతమైన విజ్ఞానం. ఇందులో విశ్వనిర్మాణ విజ్ఞానం చెప్పబడింది. ముందు మనకి ప్రపంచం కనిపిస్తోంది. దీనిని మనం వివేచన చేస్తే పరమాత్మ దొరుకుతాడు. ముందు వాహనాన్ని చూస్తే తరువాత లోపల చోదకుడు తెలుస్తాడు.

అదేవిధంగా ప్రపంచాన్ని నడిపిస్తున్న ఆవిడని తెలుసుకోవాలంటే ముందు ప్రపంచాన్ని తెలుసుకోవాలి. కదులుతున్నది, కదిలిస్తున్నది ఇక్కడ నుండే.

397. మూలప్రకృతిః – శ్రీ మూలప్రకృత్యై నమః

మూలమైన ప్రకృతి. ప్రకృతి అంటే ముడిసరుకు. ఉదాహరణకి కుండ వికృతి, మట్టి ప్రకృతి. ఇదే లక్ష్మీఅష్టోత్తరశతనామాల మొదటి రెండు నామాలుగా ప్రకృతి, వికృతి అని చెప్పారు.

ప్రకృతి, మూలప్రకృతి – రెండిటికి తేడా ఏమిటి? మూలప్రకృతి అని ఎప్పుడనాలంటే పరమాత్మకి సృష్టి చేయాలని సంకల్పించుకోగానే శక్తితో వ్యక్తమవుతాడు. ఆ ప్రథమ అభివ్యక్తిని మూలప్రకృతి అనాలి. అదే కదా అసలు మూలం. వెనక్కి వెళ్తూ ఉంటే మూలం తెలుస్తుంది. మనకి బాగా తెలిసింది భూమి. భూమికి వెనక్కి వెళ్తే నీరు, దానికి వెనక్కి అగ్ని, దానికి వెనక్కి వెళ్తే వాయువు. ఇంకా వెనక్కి వెళితే ఆకాశం. వెనక్కి వెళ్తున్న కొద్దీ పట్టు చిక్కడం కష్టం. భూమి చిక్కినంతగా నీరు చిక్కదు, నీరు చిక్కినంతగా నిప్పు చిక్కదు, నిప్పు చిక్కినంతగా గాలి చిక్కదు, గాలి చిక్కినంతగా ఆకాశం చిక్కదు. ఒక దానికొకటి ప్రకృతి.

భూమి నీటి నుండి వచ్చింది. నీరు అగ్ని నుండి వచ్చింది. **అగ్నేరాపః. వాయోరగ్నిః.** అగ్నికి మూలప్రకృతి వాయువు. ఆకాశాద్వాయుః– ఆకాశం నుండి వాయువు వచ్చింది. ఆకాశం ఎక్కడ్నించి వచ్చింది? – ఆత్మనః ఆకాశ స్సంభూతః – ఆకాశానికి పైన ఉన్నది అసలు మూలప్రకృతి అవుతుంది. అదెవరు? ఆత్మశక్తి.

హేతుస్సమస్త జగతాం త్రిగుణాపి దోషైః
న జ్ఞాయసే హరిహరాదిభిరప్యపారా
సర్వాశ్రయాఽఖిలమిదం జగదంశభూతం
అవ్యాకృతాహి పరమా ప్రకృతిస్త్వమాద్యా (దేవీమాహాత్మ్యం)

జగద్రూపంగా వ్యక్తం కాని పూర్వస్థితి సృష్టికి ఆద్యా అయిన ప్రకృతి. ప్రకృతి అంటే ప్రధాన వస్తువు, ఆధారవస్తువు అని అర్థం. కృతి అంటే చెయ్యబడినది.

కృతం అంటే ప్రపంచం. ఈ కృతానికి ఏది "ప్ర"గా ఉందో అది ప్రకృతి అన్నారు. "ప్ర" అంటే ప్రథమం. కృతికి **ప్రథమంగా** ఎవరున్నారో అది ప్రకృతి. కృతి **ప్రధానంగా** ఎవరున్నారో అది ప్రకృతి. కృతికి **ప్రకృష్టంగా** ఎవరున్నారో అది ప్రకృతి. మూడు "ప్ర" లు వచ్చాయి.

కృతికి ప్రథమంగా ఉన్నది అమ్మవారు. ఇది నిమిత్త కారణం, ఉపాదాన కారణం. కుండకి నిమిత్త కారణం కుమ్మరి, ఉపాదాన కారణం మట్టి. ప్రపంచానికి మాత్రం నిమిత్త, ఉపాదాన కారణాలు రెండూ అమ్మవారే. ప్రకృష్ణ అంటే గొప్పది. ఇంత కృతిలో గొప్పది అదే. అది లేకపోతే గొప్ప లేదు. మనం ఒక బత్తాయి పండు కొన్నప్పుడు రసముందా అని అడుగుతాం. బత్తాయి పండుకి ప్రకృష్టం రసం. ప్రపంచం అనే పండులో చిదేకరసరూపిణియే రసం. రసం-సారం రెండూ ఒకటే. ఆ ప్రకృష్టము ఆవిడే. కృతికి ప్రధానమై, ప్రథమమై, ప్రకృష్టమై ఉంది కనుక ప్రకృతి. మూలమై ఉంది కనుక మూలప్రకృతి. పరమాత్మ మొట్టమొదట వ్యక్తం చేసిన స్థితి మూలప్రకృతి. అది ఎలా ఉంటుంది! మనకి తయారు అయ్యాక తెలుస్తోంది కానీ తయారు కాకముందు ఈ ప్రపంచం అందులో ఉండవచ్చు కాని కనబడుట లేదు కదా! ఆ స్థితి ఏది?

398. అవ్యక్తా - శ్రీ అవ్యక్తాయై నమః

చెట్టు పూర్తిగా కనబడుతుంది. చెట్టు కనబడక ముందు దాని స్వరూపం విత్తనం. విత్తనంలో చెట్టు ఎలా ఉంది? అవ్యక్తా. జగత్తుకి మూలప్రకృతిగా ఉన్న ఆమె యందు జగత్తు అవ్యక్తంగా ఉంది - కొమ్మా, రెమ్మా, పువ్వు, కాయ లక్షణాలన్ని విత్తనంలో ఉన్నట్లుగా, ఈ ప్రపంచంలో మనం చూసే నామరూపాత్మకమైన జగత్తంతా బీజరూపంలో ఉన్న స్థితి అది. మూలప్రకృతి, అవ్యక్తా అంటే మాయ. మాయగా ఉన్న ఈశ్వర శక్తి. ఈశ్వరుడు లేకపోతే మాయ అసలు తెలియబడదు.

పరబ్రహ్మమును కూడా 'అవ్యక్త'మని చెప్పవచ్చు - **"న చక్షుషా గృహ్యతేనాపి వాచా నాన్యైః దేవైస్తపసా కర్మణా వా"** "అది నేత్రాలచే చూడబడదు. మాటచే

చెప్పబడదు, తపస్సు చేతగానీ, కర్మల చేతగానీ, దేవతలచే గానీ తెలియబడదు" అని ఉపనిషద్వాక్యం. ప్రభవ(సృష్టి) ధర్మం కల విష్ణువునకు 'అవ్యక్తం' అని అంటారని లింగపురాణోక్తి.

399. వ్యక్తావ్యక్తస్వరూపిణీ - శ్రీ వ్యక్తావ్యక్తస్వరూపిణ్యై నమః

చతుర్వింశతి తత్త్వాలు - పంచభూతాలు, పంచతన్మాత్రలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం - ఈ ఇరవై నాలుగు తత్త్వాలు వ్యక్తములు. పరమేశ్వరుని యొక్క సంకల్పశక్తి మూలప్రకృతి. అది అవ్యక్తమైన మాయ. అది జగద్రూపంలో వచ్చినప్పుడు మొదట మహత్తుగా, తరువాత అహంకారంగా వచ్చింది. తరువాత విశ్వంగా వ్యాప్తి అవుతోంది. తరువాత 'వివిధాకారా'గా అవుతుంది.

వ్యక్తావ్యక్తము అంటే మహత్తు, అహంకారము అని అర్థం.

ఇంకొక అర్థం - కనబడేది, వినబడేది అంతా వ్యక్తం. వ్యక్తం గోచర ప్రపంచం. దీనికి ఆధారం అవ్యక్తం. వ్యక్తము, అవ్యక్తము రెండూ అమ్మవారే. విత్తనము, చెట్టు అని మనం అనుకుంటే చెట్టురూపంగా కనబడుతున్నది విత్తనమే. వ్యక్తావ్యక్తాలు రెండూ ఒక్కటే. కార్యమైన జగత్తులో కారణం వ్యాపించి ఉంటుంది.

అవ్యక్తం అంటే కారణం, వ్యక్తం అంటే కార్యం. కార్యకారణ రూపముతో ఉన్నది. అందులో సందేహం లేదు. వ్యక్తావ్యక్తస్వరూపిణి అయిన తల్లి ప్రపంచరూపంగా 'వ్యాపినీ' అయ్యింది.

త్రయోవింశతి తత్త్వాని వ్యక్త శబ్దేన సూరయః
వదంత్యవ్యక్త శబ్దేన ప్రకృతించ పరాం తథా (బ్రహ్మాండపురాణం)
ఇరవై మూడు తత్త్వాలను వ్యక్తమని, ప్రకృతిని అవ్యక్తమని జ్ఞానులు చెప్తున్నారు.
ఉక్తమక్షరమవ్యక్తం వ్యక్తం క్షరముదాహృతం (మత్స్యపురాణం)
అక్షరం అవ్యక్తం, క్షరమే వ్యక్తం, ఈ రెండూ కూడా దేవీ రూపములే.

సమష్టిం విదురవ్యక్తం వ్యక్తం వ్యష్టిం మునీశ్వరాః (నృసింహపురాణం)
సమష్టిని అవ్యక్తం గాను, వ్యష్టిని వ్యక్తంగాను వివరించారు.

400. వ్యాపినీ – శ్రీ వ్యాపిన్యై నమః

సర్వజగత్తుగా, జగమునందంతటా వ్యాపించునది. మూడు విధాలుగా వ్యాపిస్తుంది. ద్రవ్య, జ్ఞాన, క్రియ. ద్రవ్యం అంటే ఒక వస్తువు. దానిలో స్వభావికంగా ఒక జ్ఞానం ఉంటుంది. ఒక చెట్టులోనే అది రెమ్మగా, కొమ్మగా ఎదగడమనే ఒక స్వాభావిక జ్ఞానం ఉంది. అప్పుడే పుట్టిన పిల్లవాడు నాలుక మీద తేనె వేస్తే చప్పరించాలనే జ్ఞానం ఏ పుస్తకం చదివి నేర్చుకున్నాడు? ఇది 'చితిః'. ప్రతి దానిలో స్వాభావికంగా ఉన్న జ్ఞానం. అదీ ద్రవ్యంలో ఉన్న జ్ఞానం. ఆ జ్ఞానంతో క్రియ జరుగుతోంది. నాలుకతో రుచి తెలుసుకోవడమనే జ్ఞానం చేత తినడమనే క్రియ జరుగుతోందే. ఇలా ప్రతిపదార్థానికి ద్రవ్య, జ్ఞాన, క్రియ అనేవి మూడు ఉంటాయి. ఈ ద్రవ్య, జ్ఞాన, క్రియలుగా వ్యాపించిన చైతన్యమే వ్యాపినీ. ఇలా వ్యాపించి రకరకాల ఆకారాలలో భేదం తప్ప అందులో ఉన్న చైతన్యం మాత్రం ఒకటేనని తెలుసుకోవాలి.

'ఆకాశవత్ సర్వగతత్వాత్ వ్యాపీ' – ఆకాశము వలె సర్వగతము కనుక వ్యాపినీ. తరంగాలలో జలము వలె కారణముగా సర్వకార్యాలలో వ్యాపించినది.

401. వివిధాకారా – శ్రీ వివిధాకారాయై నమః

సృష్టిరూపముగా అనేక విధముల ఆకారములు కలది. అనేక వర్ణ, స్వరభేదాలతో నామవ్యాపినీ – పిపీలికాది బ్రహ్మపర్యంతం మూర్తి భేదాలలో రూపవ్యాపిని. ఇలా వివిధ ఆకారాలు అమ్మవారే అయినప్పుడు అందరికీ ఎందుకు తెలియడం లేదు? ఆవిడ వల్లే అంతా ఉన్నప్పటికీ, ఆవిడే అంతా అనే తెలివి కొందరికే ఉంటుంది. అది యోగ్యులైనవారికి అమ్మ కలిగిస్తుంది. యోగ్యులు కానివారికి అమ్మ కలిగించదు. అది కలిగించేటపుడు ఆవిడ విద్య, కలిగించనపుడు అవిద్య.

402. విద్యావిద్యాస్వరూపిణీ - శ్రీ విద్యావిద్యాస్వరూపిణ్యై నమః

అవిద్య అంటే ఆత్మని మరచి బ్రతకడం. విద్య అంటే అంతా ఆత్మయేనని తెలుసుకోవడం. కుండంతా మట్టియే అని ఎరుక కలిగి గ్రహించినట్లుగా, అంతా అమ్మయే అని తెలుసుకోవడం విద్య. ఇది అందరికి తెలియదు. తెలిస్తే వాడు కూడా **'సోహం' 'శివోహం' 'అహం బ్రహ్మాస్మి'** అని ఎరుకతో ఉంటాడు. అది విద్య. అది అందరికి తెలియనివ్వదు. తెలిస్తే మోక్షమే. యోగ్యత ఉన్నవారికి తప్పకుండా తెలియజేస్తుంది.

ప్రపంచం అనే మూకుడిలో అమ్మవారు జీవులనే గారెలను వేయిస్తోంది. వేగిపోయిన గారెలకు ముక్తినిచ్చి బయటకు తీస్తుంది. వేగని గారెలను మరికొంచెం వేయిస్తోంది. వేయించడం అవిద్య. బయటకి తీయడం విద్య. జీవులలో కర్మ అనే పచ్చిదనం ఒకటుంది. అది క్షయమయ్యే వరకు ఆ తల్లి వేయిస్తూ ఉంటుంది. నూటికి తొంభైతొమ్మిది మందికి అవిద్యే ఉంటుంది. ఇక్కడ చెప్పే అవిద్య లోకంలో చెప్పే నిరక్షరాస్యత, అమాయకత్వం కాదు. అవిద్య అనేదానికి శాస్త్రీయమైన అర్థం- **'తాను కాని దానిని తాను అనుకోవడం'**. తానేమిటో తెలుసుకుంటే విద్య.

కర్మల వలన తాను కానిది తాననుకోవడమే అలవాటైపోయింది. ఇలా ఎప్పుడు మొదలయ్యిందో అని వెతకవద్దని గురువుల బోధ. చెట్టు ముందా, విత్తనం ముందా అని వెతికితే ఎలా దొరకదో అలా ఇది కూడా దొరకదు. ఎప్పుడు మొదలయ్యిందో వెతకడం కాదు... ఎలా వదిలించుకోవాలో చూసుకోవాలి. తాను అనుకున్న ఈ శరీరానికి సుఖం కావాలని కర్మలు చేస్తూ ఉంటారు. ఈ కర్మలకి సంబంధించిన జ్ఞానవిశేషాలు, విద్యలు కావు. శాస్త్రీయ పరిభాషలో ప్రపంచానికి పనికి వచ్చే విద్యలు కూడా అవిద్యలే. ఇవన్నీ అవసరమే. యజ్ఞం, యాగం వల్ల స్వర్గం వస్తుందని, పాపం పోతుందని చేసే కర్మలు-వీటన్నిటికి కూడా అవిద్యలు అని పేరు.

కానీ ఈ తెలివి లేకపోతే ఎప్పుడూ పాపం నుండి బయట పడలేం. పుణ్యకార్యాలు చెయ్యలేం. యజ్ఞయాగాలు తెలియవు. కనుక వీటన్నిటిలో కూడా అమ్మవారు అవిద్యారూపంతో ఉన్నారు. దీనికే **అపరావిద్య** అని పేరు పెట్టారు.

ఈ కర్మలు కూడా చెయ్యాలి. ఎందుకంటే ఈ కర్మలు చెయ్యడం వలన కృతఘ్నుతా దోషం పోతుంది. ఈ జ్ఞానం కూడా అమ్మవారు ఇచ్చినదే. ఈ ఉపాధిలో ఉన్నంతకాలం ఈ జ్ఞానం ఉండాలి. 'అవిద్య అంటే అజ్ఞానం' అనుకొని వీటిని దోషంగా చూడకూడదు. దీనినుండి ఎలా బయటపడాలో చూడాలి. పుండు వచ్చిందంటే వెంటనే పెకలించి పారేయడం కాదు. దానిని గమనించి మందు రాసి, కట్టు కట్టి, ఏది పంపిస్తే అది పెరిగిపోతుందో దానిని పంపకుండా జాగ్రత్త పడాలి. ఆ పుండుని తొలగించడానికి ఏ వైద్యపద్ధతి అవసరమో దానిని చేయాలి. ఈ శరీరమే నేను అనే భ్రాంతి తొలగించుకోవడానికి అంత ప్రణాళిక ఉంది.

ఆ విధానం అనేది మనకి కర్మలనేవి చెప్తూ ఉంటాయి. కర్మలు అనేవి బయట పూసిన లేపనాలవంటివి. ఇవి మొత్తం పుండుని తీయవు. బయట లేపనం పూసి, లోపలకి మందు పంపించాలి. లోపలకి పంపించేది అంతర్ముఖమైన జ్ఞానం. అదే వేదాంతం. పుండుకి బయట పూసే పూతలు ఈ యజ్ఞయాగాది కర్మలవంటివి. రెండూ అవసరమే. రెండూ కలసి చేసుకోవాలి. **అవిద్య అనగా యజ్ఞయాగాది కర్మలు. లౌకికానికి పనికి వచ్చే విద్యలు. విద్య అనగా మోక్షానికి పనికి వచ్చే బ్రహ్మవిద్య. ఈ రెండూ అమ్మరూపాలే.**

విద్య అంటే మరొక అర్థం ఉపాసన. అవిద్య అంటే కర్మలు. ఉపాసన, ఉపనిషత్ జ్ఞానం – ఈ రెండే మనకి మోక్షాన్ని ఇవ్వగలవు. కర్మలన్నీ కూడా ఇహలోక, పరలోక సుఖాలు ఇస్తాయి. ఉపాసన మళ్ళీ కర్మలా చేయకుండా భక్తిగా, ప్రేమగా, నిష్కామంగా చేస్తూ ఉంటే ఈ జన్మలోనే అమ్మ బ్రహ్మజ్ఞానాన్ని ఇచ్చి తనలో ఐక్యం చేసుకుంటుంది.

ఈ ఉపాసన చేస్తూ ఉండగా జ్ఞానం పొందకుండా శరీరం పోతే అప్పుడు మణిద్వీపంలో కూర్చోబెట్టి, తరువాత కొంతకాలానికి తనలో ఐక్యం చేసుకొని జీవబ్రహ్మైక్యాన్ని ఇస్తుంది. రెండూ గొప్పవే. ఉపాసనలకి విద్యలని పేరు. ఇంకొకదానికి జ్ఞానం అని పేరు. మిగిలినవన్ని అవిద్యలే. లోకంలో ఇహలోకానికి, పరలోకాలకు కావలసిన అవిద్యలు కూడా అమ్మరూపాలే. మోక్షానికి పనికి వచ్చే ఉపాసన,

బ్రహ్మజ్ఞానం కూడా అమ్మరూపాలే. ఇదే 'విద్యావిద్యాస్వరూపిణీ'. ఇది రెండవ అర్థం.

మొదటి అర్థం బంధించేది అవిద్య. ముక్తినిచ్చేది విద్య. ఇది ఒక అర్థం. రెండవ అర్థం యజ్ఞయాగాది విద్యలన్ని అవిద్యలు-అపరావిద్యలు. మోక్షకారకమైన ఉపాసన, బ్రహ్మజ్ఞానం (విద్య).

విద్యావిద్య, వ్యక్తావ్యక్త పరిశీలిస్తే అమ్మవారు ప్రపంచమంతా ఉన్నారు కాని తెలియబడడం లేదు. ఎలా ఉన్నారంటే తెరమరుగులో ఉన్నారు. తెర వెనకాల వస్తువు ఉంది. అది ఏమిటో తెలియబడదు కానీ లేదని అనలేం. ఉండి-ఉండనట్టు అలా కనబడుతూ ఉంటుంది. అలాగే లోకంలో మనకి వ్యవహారంలో కూడా ఆలోచిస్తూ ఉంటే భగవంతుడు ఉన్నాడేమో, పరమాత్మ ఉన్నాడేమో అనిపిస్తూ ఉంటుంది. ఉన్నాడు అని కూడా అనిపిస్తుంది. లేడేమో అని మళ్ళీ అనిపిస్తుంది. కలడో, లేడో? ఏమిటి.... ఇదంతా ఆవిడ ఆడించే ఆట.

ఇదంతా అందరికి అనుభవైక వేద్యమే. పోతనగారి భాగవతంలో గజేంద్రునికి కూడా, "కలడు కలండనెడి వాడు కలడో! లేడో!" అనిపించింది కదా. ఇలా కలడో, లేడో అనిపించడానికి ఆవిడే కారణం. 'వ్యక్తావ్యక్తా' - కనీ కనిపించక దోబూచులాడుతున్న తల్లి. ఎలా అమ్మ పిల్లలతో ఆడుతుందో అలా ఈ ప్రపంచంలో మాయ అనే తెర వెనకాల ఆవిడ ఉండి దోబూచులాడుతోంది. ఇదో రకమైన తిరోధానం. అంటే మరుగుపరచడం. చివరకు ఆ దోబూచులాటలో, "అమ్మా!" అని గట్టిగా పట్టుకుంటే ఆ తెరదీసి అనుగ్రహం తప్పకుండా ఇస్తుంది.

'అరతెరమరుగున ఆడినదే అలకల కులుకుల అలమేల్మంగ.. అలరులు కురియగ ఆడినదే' అంటాడు అన్నమయ్య. అరతెరమరుగంటే అదే. 'తెరతీయమ్మా!' అని ప్రార్థించాలి. 'తెరతీయగరాదా! లోని తెరతీయగరాదా!' అని త్యాగరాజుస్వామిలా అంటే ఆ తెర ఆవిడే తీస్తుంది. ఎందుకమ్మా మరుగు. 'మరుగేలరా! ఓ రాఘవా! మరుగేల చరాచరరూప' అని అడిగారు. ఆ అరతెర మరుగు ఆటయే **వ్యక్తావ్యక్తాస్వరూపిణీ.** అదే **విద్యావిద్యాస్వరూపిణీ.**

ఈ అరతెరమరుగు గురించి ఆదిభట్ల నారాయణదాసుగారు చెప్తూ **'అగపడీ అగపడ దాగట్టు పట్టి'** అన్నారు. అగపడీ అగపడదు – వ్యక్తావ్యక్తాస్వరూపిణీ. ఈ అనుభూతి దగ్గర ఏ వ్యాఖ్యానం సరిపోదు. గట్టుపట్టి – పర్వతపుత్రి. **అడయరితో దొంగాటలాడెడి వేల్పు** – అడయరితో అంటే తన భక్తునితో దొంగాటలాడుతూ ఉంటుంది.

భక్తితో ఉపాసన చేస్తున్నపుడు ఒక్కోసారి ఏదో తెలియని తాదాత్మ్యం 'అందిపోయింది' అనిపిస్తుంది. మళ్ళీ అంతలోనే ఉందా, లేదా అనిపిస్తుంది. అంతా అమ్మయే అనిపించి, మళ్ళీ లోకం కోసం పరిగెడుతున్నాం. అదే వ్యక్తావ్యక్తాస్వరూపిణి. ఆ సాధకునిలో ఎన్ని అవస్థలు పెట్టి ఆడుకుంటుందో అమ్మవారు. ఎప్పుడు తెరతీసి తన ఒడిలో కూర్చోబెట్టుకుంటుందో! ఆ ఆటలో మనం పాల్గొనవలసిందే.

ఆ 'మూలప్రకృతిః' అనే మాటకు ఆదిభట్ల నారాయణదాసుగారు చెప్తూ **'నింగికి నేలలకుఁ దానే తల్లి వేరు'** అన్నారు. ఒకప్పుడు ఈ తెలుగు పదాలన్ని అందరికి తెలిసేవి. నింగి నేలలకు అంటే సమస్త ప్రపంచానికి **'తానే తల్లి వేరు'** అంటే మూలప్రకృతి.

ఇప్పుడు చెప్పిన వ్యాఖ్యానానికంతటికి ప్రమాణ వ్యాఖ్యానాలు చూస్తే **'కర్మణా బధ్యతే జంతుర్విద్యయా తు ప్రముచ్యతే'** ఉపనిషద్వాక్యం చూస్తే **'అవిద్యయా మృత్యుం తీర్త్వా'** – సత్కర్మలను ఆచరించడం ద్వారా కర్మబంధాల నుండి, **అవిద్యయా** అంటే వేదం చెప్పిన యజ్ఞాదికర్మలు. వాటి ద్వారా **మృత్యుం తీర్త్వా** – మృత్యువుని దాటితే, **విద్యయా అమృతమశ్నుతే** – విద్య ద్వారా అమృతత్త్వాన్ని పొందుతావు. ఇప్పటివరకు చెప్పుకున్న నామాలు విశ్వమంతా వ్యాపించిన అమ్మ, విశ్వంలో ఎలా దోబూచులాడుతుందో చూపించారు వశిన్యాదివాగ్దేవతలు.

బ్రహ్మైవ సాతి దుష్ప్రాపా విద్యావిద్యా స్వరూపిణీ...
...విద్యాఽవిద్యేతి దేవ్యా ద్వే రూపా జానీహి పార్థివ
ఏకయా ముచ్యతే జన్తుః అన్యయా బధ్యతే పునః. (దేవీభాగవతం)

ఆ శక్తి పొందశక్యం కాదు. విద్యావిద్యా స్వరూపురాలు. అదే బ్రహ్మము...

పరదేవతకు విద్య, అవిద్య అని రెండు స్వరూపాలున్నాయి. వాటిలో విద్యా స్వరూపాన్ని తెలుసుకున్నవాడు ముక్తుడవుతున్నాడు. అవిద్య వలన సంసారబంధాన్ని పొందుతున్నాడు.

భ్రాంతిర్విద్యాపరం చేతి శివరూపమిదం త్రయం
అర్థేషు భిన్నరూపేషు విజ్ఞానం భ్రాంతిరుచ్యతే
ఆత్మాకారేణ సంవిత్తిః బుధైఃవిద్యేతి కథ్యతే.

భ్రాంతి, విద్య, పరం – అని శివుని మూడు రూపాలు. పదార్థాలను వేరువేరుగా తెలుసుకొనుట భ్రాంతి (అవిద్య). అంతా ఆత్మస్వరూపంగా గ్రహించుట 'విద్య'. వికల్పాలు లేని కేవల పరతత్త్వంగా ఉండుట పరము (లింగపురాణము).

'మూలప్రకృతిరవ్యక్తా, వ్యక్తావ్యక్తస్వరూపిణీ, వ్యాపినీ, వివిధాకారా, విద్యావిద్యాస్వరూపిణీ' – ఈ నామాలన్ని ఒక గుత్తి.

403. మహాకామేశనయనకుముదాహ్లాదకౌముదీ

– శ్రీ మహాకామేశనయనకుముదాహ్లాదకౌముద్యై నమః

మహాకామేశ్వరుడు అంటే పరమేశ్వరుడు. పరబ్రహ్మస్వరూపాన్ని చెప్పడం కోసం 'మహా' శబ్దం వాడారు. ఆయన నయనాలు కుముదాలవలె ఉన్నాయి. కుముదం అంటే తెల్లకలువ – ఆయన కళ్ళు తెల్లకలువల్లాగా ఉన్నాయి. మహాకామేశుని ఆ నయనాలకి అమ్మవారు ఆహ్లాదం కలిగిస్తోంది. కలువలకి ఆహ్లాదం కలిగించేది వెన్నెల. అయ్యవారి మూడు కళ్ళు అనే కలువలకి హాయిని కలిగించే వెన్నెల అమ్మవారు. ఈ నామంలో ఎన్నో అందాలు ఉన్నాయి.

అమ్మవారిని చంద్రునిలా ఉన్నారని చెప్పలేదు. వెన్నెలకుప్ప అన్నారు. అమ్మవారిని చూస్తుంటే అయ్యవారి కళ్ళు చల్లబడుతున్నాయి, విచ్చుకుంటున్నాయి. లోకంలో కూడా మనకి ఇష్టమైన వస్తువు కనబడగానే కళ్ళు విచ్చుకుంటాయి. అలా పరమేశ్వరునికి అమ్మవారిని చూస్తుంటే కళ్ళు వికసిస్తున్నాయి. పతి కళ్ళకి చల్లదనం కలిగించడం కంటే భార్యకి కావలసిన భాగ్యం ఇంకేముంటుంది. భార్యని చూడగానే

భర్త ఆనందంగా, ప్రీతిగా ఉండాలి. ఇందులో పరస్పర ప్రేమని చూపిస్తున్నారు.

కుముదం కైరవే రక్తపంకజే– ఎర్రకలువ, తెల్లకలువ రెండిటిని కుముదం అనవచ్చు. ఆయనకి పైన ఎర్రకలువ, క్రింద రెండు తెల్లకలువలు ఉన్నాయి. ఒక దాంట్లో కొంత ఎరుపు కూడా కలిసిందన్నారు. ఆ మూడు కళ్ళకి ఆవిడ వెన్నెలే. ఆ కళ్ళని చక్కగా విచ్చుకునేలా చేస్తోంది.

ప్రతివాడు శివుడు అనుగ్రహించాలి అంటాడు. అయ్యవారు మనవైపు ప్రసన్నంగా చూడాలి. ఎర్రకన్నుతో చూస్తే మహాకష్టం. అలా చూస్తేనే మన్మథుడు తగలబడిపోయాడు. పరమేశ్వరుడు ఎర్రని కళ్ళతో కాకుండా చల్లని కళ్ళతో చక్కగా చూడాలంటే అమ్మవారు ప్రక్కన ఉండాలి.

అమ్మవారు రాక ముందు తగలబడ్డాడుగాని ఆవిడ రాగానే మన్మథుని స్వామి బ్రతికించేశాడు. అందుకే అమ్మతో కూడిన అయ్యని గాని ఆరాధన చేస్తే మనకి 'అమ్మయ్య' అనిపిస్తుంది. వెన్నెలతో పోల్చడంలో ఇంత విశేషం ఉంది.

కళ్ళు విచ్చుకొనుట అంటే జ్ఞానం. మహాకామేశనయన వికసనం. అంటే బ్రహ్మజ్ఞాన ప్రకాశ ప్రసరణ. ఈ బ్రహ్మజ్ఞానమనేది విచ్చుకోవాలంటే అమ్మ అనే వెన్నెల మనపై ప్రసరించాలి. అమ్మ అనుగ్రహం, కటాక్షం ఎవరికి లభిస్తుందో వారి హృదయంలో బ్రహ్మజ్ఞానం వికసిస్తుంది అని దీని అసలైన అర్థం.

బ్రహ్మవిద్య లభిస్తేనే బ్రహ్మజ్ఞాన వికసనం. బ్రహ్మవిద్యారూపిణి అమ్మ. బ్రహ్మజ్ఞానాన్ని వెన్నెలతో పోల్చారంటే శాంతం, ఆనందం, వెలుగు అన్నీ వెన్నెలకి ఉన్నాయి. వెలుగు జ్ఞానానికి, వెన్నెల శాంత్యానందాలకు సంకేతాలు. అమ్మవారిని వెన్నెలతో పోల్చుతున్నారంటే జ్ఞానానందాలు రెండూ ఇవ్వగలదు. వెన్నెల వస్తే భూమికంతటికి ముదమే కనుక కౌముది అన్నారు. ఏ వెన్నెలని, ఏ పేరుతో పిలవాలో శాస్త్రాలలో ఉంది.

'కౌముదః కార్తికే మాసి చంద్రికాయాం చ కౌముదీ' అన్నారు. కార్తికమాసపు వెన్నెలకి 'కౌముదీ' అని పేరు. ఇది శరత్పూర్ణిమలలో చివరిది. ఈ కార్తికపూర్ణిమే అమ్మవారికి చాలా ప్రీతి. ముఖ్యరాకా – అదే శరద్రాత్రి. కార్తికపూర్ణిమనాటి

వెన్నెల నిండైన వెన్నెల.

దీనినే **"చల్లనితల్లి ఆ చలిమల పిల్ల"** అన్నారు ఆదిభట్ల నారాయణదాసుగారు. వెన్నెల అంటే చల్లని తల్లి. సూర్యుడు కూడా ఆ పరమేశ్వరియే అని తరువాతి నామంలో చెప్తున్నారు.

404. భక్తహార్దతమోభేదభానుమద్భానుసన్తతిః
– శ్రీ భక్తహార్దతమోభేదభానుమద్భానుసన్తత్యై నమః

హార్దం అంటే హృదయం. ఆ హార్దంలో ఆవిడ ఉంది. తమస్సు అంటే చీకటి. ఎంత చీకటి ఉందో భర్తృహరి చెప్తూ **'అంతః స్ఫూర్జదపార మోహతిమిర ప్రాగ్భారముచ్చాటయన్'**– అనేక జన్మలనుండి మోసుకొస్తున్న మోహాంధకారం ఉందన్నారు. మామూలు చీకటి కాదు కటికచీకటి. దాని పైన ఒక వెలుగు ఉందని కూడా తెలియదు.

అందరి హృదయాల్లో, భక్తుల గుండెల్లో కూడా తమస్సు ఉంది. భక్తుని గొప్పదనం అమ్మని పట్టుకున్నాడు. అమ్మని పట్టుకోగానే భక్తుడు అనే బిరుదు వచ్చేసింది. భక్తుడు అంటే ఆశ్రయించినవాడు. అమ్మని ప్రేమగా ఆశ్రయించాడు. చీకటిని పోగొట్టుకునే ప్రయత్నం అక్కర్లేదు. అమ్మని శరణు వేడే ప్రయత్నం చేయాలి.

నిరంతర చింతన, భావన, కీర్తన చేస్తూ అమ్మని ఆరాధిస్తే వాడు భక్తుడు. అలాంటి భక్తుల గుండెల్లో అనేక జన్మల నుండి వస్తున్న మోహాంధకారాన్ని పటాపంచలు చేయడానికి ఆవిడ ఒక్కసారి ఉదయిస్తుంది. రాత్రంతా ఉన్న చీకటి పొద్దున్న సూర్యభగవానుడు రాగానే పటాపంచలు అయిపోతుంది. అలా అనేక జన్మల చీకటి గుండెలో ఉంటే అమ్మని ఆరాధన చేస్తూ ఉంటే ఆవిడ ఒక్కసారి కారుణ్యంతో, ఆరుణ్యంతో ఉదయిస్తుంది. ఆవిడ ఉదయించగానే 'భానుమద్భానుసంతతిః'. భానుమత్ అంటే సూర్యుడు. సంతతి అంటే సమూహం. సూర్యునిలా రకరకాల కాంతి కిరణాల సమూహాన్ని వెదజల్లుతుంది.

భక్తుల హృదయాలలో ఉన్న అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేసే

కాంతికిరణాలను వెదజల్లే సూర్యస్వరూపం అమ్మవారు. భక్తహార్ద – భక్తుల గుండెలలో ఉదయిస్తుంది.

భానుసంతతి అంటే కిరణాల పరంపర.

అణిమ ఒక కిరణం, మహిమ ఒక కిరణం. అలా అన్ని కిరణాలతో భానుసంతతులను వెదజల్లుతూ హృదయంలో ప్రకాశించే తల్లి. నిజానికి ఇక్కడ 'నయన' అన్నప్పుడు ఆజ్ఞాచక్ర స్థానాన్ని బోధింపజేస్తున్నారు. 'హార్ద' అన్నప్పుడు అనాహత చక్రస్థానాన్ని చూపిస్తున్నారు. హృదయంలో ఆ రెండు స్థానాలు ధ్యానం చెయ్యవలసిన చోట్లు. ఈ విధంగా అనుగ్రహించే తల్లిని ఈ కిరణాల సంతతి అని చెప్పడం కోసమే **'తస్య మధ్యే మహానగ్నిర్విశ్వార్చిః విశ్వతోముఖః'** – హృదయగుహ లోపల ప్రకాశిస్తున్న ఆ పరంజ్యోతి అయిన అమ్మ అన్నారు. ఆ కిరణాలు ఎలా ప్రసరిస్తున్నాయంటే **భానుసంతతిః**. అది లేకపోతే బ్రతుకు లేదు.

భక్తుని హృదయంలో అమ్మవారు వస్తున్నారు అంటే కొత్తగా వస్తున్నారా? సూర్యుడు ప్రొద్దున్నే వచ్చాడంటే కొత్తగా ఆయన వస్తున్నాడా! భూమి అట్నుంచి ఇటు తిరిగితే సూర్యుడు వచ్చాడనిపించింది. అలాగే మన దృష్టి అమ్మవారు వైపు తిరిగితే అమ్మవారు వచ్చినట్లు అనిపిస్తుంది. సాక్షాత్కారమంటే ఇంతే. దృష్టి తిరగడమే.

తిరుగుతున్న భూమి తిరగనట్టు అనిపిస్తోంది. తిరగని సూర్యుడు తిరిగినట్టు కనిపిస్తున్నాడు. అలాగే చలించని ఆత్మ చలించినట్టు కనిపిస్తోంది. చలించడమే లక్షణం కలిగిన దేహం స్థిరమని భ్రాంతి కలుగుతోంది. ఆ లోపల సత్యాన్ని ఒక్కసారి చూడాలి. ఆ చూడడమే హార్ద. ఆ హృదయాన్ని అంతర్ముఖులమై చూడాలి. చూడగానే ఆ లోపల అసలు జ్యోతి దర్శనమిస్తుంది. భక్తుడు అనగా మోముని పరమాత్మ వైపు తిప్పినవాడు. **కశ్చిత్ ధీరః ప్రత్యగాత్మానమైక్షత్** – అలా తిరగ్గానే జ్యోతి దర్శనమిచ్చింది. నిజానికి అప్పుడు తెలిసింది కొత్తగా వచ్చింది కాదు. ఆవిడ వెలుగే శరీరమంతా భానుసంతతిగా తిరుగుతోంది.

సూర్యకిరణాల లోంచి ప్రాణశక్తి ప్రపంచానికి, శరీరానికి వస్తుంది. అమ్మ ప్రసరింపజేస్తున్న ఆత్మ చైతన్య కిరణాలలోంచి ప్రతి నాడీమండలంలోకి వెలుగులు

వెళ్తున్నాయి కనుక భానుసంతతిః. ఈ మాట గురించి వేదంలో చెప్తూ -

తిర్యగూర్ధ్వమధశ్చాయీ రశ్మయస్తస్యసంతతా

సంతాపయతి స్వందేహమాపాదతల మస్తకః

అని చదువుతున్నాం కదా! అక్కడ **సంతతా**, ఇక్కడా అదే **భానుసంతతిః**. ఇదే వేదానికి, లలితా సహస్రానికి ఉన్న అనుబంధం.

405. శివదూతీ - శ్రీ శివదూత్యై నమః

ఇక్కడ నుండి మరొక విద్యలోకి ప్రవేశిస్తున్నాం. ఈ విద్యలో ఉపాసించే దేవత పేరు **'శివదూతి'**. ఈ మంత్రాలు కొన్ని గుత్తులు ఉన్నాయి. **'శివదూతీ'** నుండి **'సూక్ష్మరూపిణీ'** వరకు 64 నామాలు ఒక విద్య. దీనికి 'శివదూతీ విద్య' అని పేరు. శివదూతి విద్య ప్రయోజనం చాలా విశేషంగా ఉంటుంది.

శివదూతీ అమ్మవారు షోడశతిథి నిత్యలలో శుక్లపక్ష సప్తమినాటి దేవత. ఈవిడ తరువాతే **త్వరిత** వస్తున్నది. తిథులలో సప్తమి చాలా విశేషమైనది. సూర్యునికి సప్తమీ తిథి చాలా ప్రధానం.

శివదూతి ఎవరు? సప్తశతిలో వచ్చే కథ- శుంభనిశుంభులతో యుద్ధం జరగడానికి ముందు అమ్మవారు వారికి "మీరుగా బుద్ధి తెచ్చుకుని శరణు వేడారా అభయమిస్తాను లేదా తలతీస్తాను" అని సందేశం పంపదలచుకుంది. ఆ సందేశం ఎవరి ద్వారా పంపుదామా అని చూసింది.

అప్పటికే ధూమ్రాక్షుని, చండముండులను, రక్తబీజుని అమ్మవారు సంహరించాక చివరిగా శుంభనిశుంభులకు బుద్ధి తెచ్చుకోమని సందేశం పంపదలచి తన భర్తయైన పరమేశ్వరుని దూతగా పంపించింది. ఆవిడ స్వాధీనవల్లభా కనుక అమ్మ ఎలా చెప్తే అలా వింటాడు పరమేశ్వరుడు. పైగా దౌత్యానికి ఈయననే వినియోగించుకుంటారు. **'నమో దూతాయచ ప్రహితాయ చ'** అంటుంది రుద్రనమకం.

అమ్మవారు మాతృస్వరూపిణి కనుక ఏదో బుద్ధి చెప్పమని పంపించింది. వారు వినరు. వారు నాశనమవ్వాలని వెళ్ళాడు శివుడు. అలా పరమేశ్వరుని దూతగా

పంపడానికి అమ్మ నుండి ఒక శక్తి బయటకి వచ్చింది. ఆ శక్తిని అష్టమాతృకల తరువాత నవమమాతృకగా చెప్తారు. ఆ రూపంతో వచ్చి పంపింది. శివుని దూతగా చేసిన తల్లి కనుక 'శివదూతీ' అని పేరు.

శివదూతీ అంటే పరమేశ్వరుని చేత ఏదైనా చేయించగలిగే తల్లి. మనకి ఆ తల్లే కావాలి.

"నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ" అని అంటేనే ఆయన అనుగ్రహించ గలడు. అమ్మవారే ఆయన చేత అనుగ్రహం ఇప్పించగలదు. ఆవిడ సాయపడడమే కాకుండా ఆయన చేత కూడా మనకి సాయపడేలా చేస్తుంది. మన యొక్క అవిద్యను పూర్తిగా నాశనం చేసేది 'శివదూతీ'.

శివదూతీ అనగా గురురూపంగా వచ్చిన అమ్మవారు. మనలో అవిద్యా నాశనం కోసం ముందు అమ్మవారు గురువు ద్వారా అనుగ్రహం పంపిస్తారు. అమ్మ అనుగ్రహం పొందడానికి పనికొచ్చే జ్ఞానం, భక్తి – ఈ రెండిటికి శివదూతీ అని పేరు. శివదూతీ అంటే శివభక్తి.

ఎన్నో జన్మలు గడిచిపోయాయి. భక్తి మాత్రం రాలేదు. గతజన్మలలో భక్తి లేదని ఎలా చెప్పగలమంటే, భక్తి ఉంటే ఈ జన్మ వచ్చేది కాదు. అప్పుడు భక్తి లేదు, జ్ఞానం లేదు. ఇప్పుడు ఇన్నాళ్ళ తరువాత శివభక్తి వచ్చింది. శివదూతి వచ్చింది. దూత వచ్చాడంటే సహకరిస్తాడు. మనకి, పరమాత్మకి సంబంధం పెట్టేవాడే దూత. శివభక్తియే శివదూతి. శివజ్ఞానమే శివదూతీ.

ఆదిభట్ల నారాయణదాసుగారు దీనిని తెలుగు చేస్తూ –

మగని గెల్చిన చలిమల దొరపిల్ల

దొడ్డవారలకు పెన్డ్రోవ తారుపుది

– మగని గెల్చిన అంటే శివుని దూతగా పంపగలిగినది అంటే అమ్మ ఎంత గొప్పదో తెలుస్తుంది.

'తారుపు' అంటే ఇటు నుండి అటు తీసుకెళ్ళడం, మార్చుట అని అర్థం. **పెన్డ్రోవ** అంటే గొప్పమార్గం. గొప్పమార్గమంటే సన్మార్గం. సన్మార్గం అంటే జ్ఞానమార్గం,

భగవన్మార్గం. ఆ జ్ఞానమార్గంలోకి తీసుకువెళ్ళేది. దొడ్డవారలకు అనగా సత్పురుషులకు, పుణ్యాత్ములకు, యోగులకు, సాధకులకు, భక్తులకు గొప్పమార్గానికి తీసుకువెళ్ళే తల్లి శివదూతీ.

శివదూతీ అంటే కథలో ఉన్న శివదూతీని తెలుసుకోవాలి. తిథి నిత్యాదేవతల్లో శివదూతిని తెలుసుకోవాలి. శివ జ్ఞానరూపిణి అనే జ్ఞానం కూడా తెలుసుకోవాలి. పుష్కరక్షేత్రంలో శివదూతీ తీర్థమని ఉంది. "**పుష్కరే యా వ్యవస్థితా శివదూతీ తథా వేదీ క్షేమా క్షేమంకరీ సదా**" అన్నారు. ఈ శివదూతి క్షేమంకరీ. ఎప్పుడైనా శివదూతిని తలచుకుంటే మన మార్గాల్లో కాపాడుతుంది. "పెనుద్రోవ తారుపుది" అని నారాయణదాసుగారు చెప్పడంలో అర్థం శివదూతి మార్గరక్షక శక్తి. క్షేమంకరీ అంటే మార్గరక్షకశక్తి.

406. శివారాధ్యా - శ్రీ శివారాధ్యాయై నమః

శివుని చేత ఆరాధింపబడినది. ఆరాధింపబడినది అంటే ఆరాధన అనే ప్రక్రియ ఒకటి ఉంది. ఈ ప్రక్రియ ఆరాధించేవానికి తెలుస్తుంది. అది తెలిసినవాడు శివుడు. ఆ ఆరాధన ప్రక్రియ పేరు శ్రీవిద్య. ఈ శ్రీవిద్యకి గురువు శివుడు. ఆయనే శ్రీవిద్యని మనకి అనుగ్రహించినవాడు. 'శివాయ గురవే నమః'.

శివారాధ్యా అంటే శ్రీవిద్య. శివుడు తయారుచేసిన విద్య మాత్రమే కాదు. ఆయన ఆరాధించి మనకి ఇచ్చాడు. ఆయన సహజంగా చేసి చూపించి మనకి ఇచ్చాడు. మహాయాగక్రమం చేసింది ఆయనేగా. తరువాతేగా అమ్మవారు చిదగ్నికుండసంభూతగా వచ్చారు. శ్రీవిద్యకి గురువు శివుడు.

దక్షిణామూర్తిని ఆశ్రయిస్తేనే శ్రీవిద్య. '**శ్రీగురో! దక్షిణామూర్తే! భక్తానుగ్రహ కారక! అనుజ్ఞాం దేహి భగవన్! శ్రీచక్రార్చనాయ మే**' - అంటారు సాధకులు. శ్రీచక్రార్చన చెయ్యాలంటే ముందు శివుని అనుగ్రహం కావాలి. దాని విజ్ఞానమంతా శివునిది. దక్షిణామూర్తిని ఆశ్రయిస్తే ఆయనే గురువై శ్రీవిద్యలో మనకి మెలకువలన్ని నేర్పుతూ ఉంటాడు. బ్రహ్మాండపురాణంలో దీని గురించి చెప్తూ -

శివోఽపి యాం సమారాధ్య ధ్యానయోగబలేనచ
ఈశ్వరః సర్వసిద్ధీనాం అర్ధనారీశ్వరోఽభవత్

శివుడు ఏ తల్లిని ధ్యానయోగబలంతో ఉపాసించి సర్వసిద్ధులకు ఈశ్వరుడై, అర్ధనారీశ్వరుడయ్యాడో, ఆ తల్లి శివారాధ్యా అన్నారు. శివదూతీ తత్త్వమే తరువాతి నామాల్లో వివరిస్తున్నారు.

శివుడు అమ్మవారిని ఆరాధించి, ఆ ఆరాధన క్రమాన్ని మనకి అనుగ్రహించాడు. శివుడు దర్శించి అనుగ్రహించిన విద్యకి 'చతుష్కూట విద్య' అంటారని శాస్త్రం చెప్తున్నది. అది శివుడు ఉపాసించిన విద్య. మనకి శ్రీవిద్యలో కామసేవితవిద్య, కుబేరవిద్య, మనువిద్య – ఇలా రకరకాల విద్యలు ఎలా ఉన్నాయో అలా శివుడు దర్శించిన విద్య పేరు **"చతుష్కూట విద్య"**.

407. శివమూర్తిః – శ్రీ శివమూర్త్యై నమః

శివము అంటే మంగళం, క్షేమము అని అర్థం. మంగళాలన్నీ మూర్తి ధరిస్తే అవి అమ్మస్వరూపం. **'యా దేవీ సర్వమంగళా'** అని శాస్త్ర వాక్యం.

శివ శబ్దానికి **'క్షేమే మోక్షే చ'** అని నిఘంటువు చెప్పే అర్థం. ఈ మోక్షస్వరూపిణి అమ్మవారే. శివుని మూర్తియే అమ్మవారు. నిజానికి ఏ రూపము లేనివాడు ఆయన. ఆయన తనదైన శక్తితో రూపం ధరిస్తున్నాడు. అప్పుడా మూర్తి నిండా శక్తే ఉంది. శక్తి లేనిదే శివుడు మూర్తి ధరించలేడు. ఈ మాట శివపురాణంలో చెప్తూ **"కిం కిం నయద్భవసి బాల శశాంకమౌళేః"** – "అమ్మా! నువ్వు శివునికి ఏం కావడం లేదు?" అన్నారు.

'శక్తిః శరీరమధిదైవతమంతరాత్మా ఐశ్వర్యమాయతనమాసనజాలమిచ్ఛా' – అమ్మా! నువ్వు శివునికి శక్తివి. శరీరానివి. ఆయతనానివి. ఆయతనం అంటే ఉండే చోటు. ఇన్ని రకాలుగా ఆ శివునికి అమ్మవారు ఉన్నారు కనుక "శక్తిః శరీరం అధిదైవతం" – శివునికి శక్తి అమ్మవారు. శరీరం అమ్మవారు. అందుకు శివుడు మూర్తి ధరించాడంటే శక్తి లేనిదే మూర్తి ధరించగలడా? అవ్యక్తమైన స్వామి

వ్యక్తమవ్వాలంటే అమ్మవారు ఉండాలి. వ్యక్తమంతా అమ్మరూపం. అవ్యక్తమంతా అయ్య రూపమని శాస్త్రం చెప్తోంది.

వ్యక్తావ్యక్తస్వరూపిణి నామాన్ని ఇక్కడ మరోమారు గుర్తు తెచ్చుకోవచ్చు. ఈ విషయాన్ని వేదాంతశాస్త్రంలో చెప్తూ **"మాయాంతు ప్రకృతిం విద్యాత్ మాయినంతు మహేశ్వరం"** అని చెప్తూనే **"వ్యక్తమంబామయం సర్వం అవ్యక్తంతు మహేశ్వరం"** అన్నారు (సూతసంహిత). వ్యక్తమైతే అది అమ్మరూపం. అవ్యక్తమైతే అయ్యరూపం. అవ్యక్తమైన శివుడు వ్యక్తమయ్యాడంటే అమ్మవారే. శివమూర్తిః - శివుని యొక్క మూర్తి.

శివమూర్తికి, అమ్మవారికి భేదం లేదని చెప్పడం ఇందులో ఉద్దేశం. సమయాచారమైన ఆ అభేదమే మొదటి నుండి చెప్పుకుంటున్నాం. దీనికి సంబంధించి ఆగమంలో చెప్తూ-

"ఏకో రుద్రః సర్వభూతేషు గూఢః,
మాయా రుద్రః సకలో నిష్కళశ్చ
స యేవ దేవీ న చ తద్విభిన్నా
హ్యేతత్ జ్ఞాత్వైవామృతత్వం వ్రజంతీ" అన్నారు.

ఏకో రుద్రః సర్వభూతేషు గూఢః - సర్వజీవకోటిలో గూఢంగా ఉన్న ఆత్మస్వరూపుడు శివుడే. స ఏవ దేవీ - ఆయనే దేవి. వారిద్దరికి భేదం లేదు. ఇది ఎవరు తెలుసుకుంటున్నారో వారు అమృతత్వాన్ని పొందుతున్నారు. శివశక్తుల ఏకత్వాన్ని గ్రహించినవారే అమృతత్వాన్ని పొందుతున్నారు.

408. శివంకరీ - శ్రీ శివంకర్యై నమః

శివంకరీ అంటే మంగళములను కలిగిస్తున్నది. మంగళము, క్షేమము, మోక్షము. వీటిని ఇచ్చే తల్లి 'శివంకరీ'. **'బ్రహ్మ తన్మంగళం పరం'** - పరమ మంగళమైన బ్రహ్మమే శివం. భక్తుల అవిద్యా పాశాలను తొలగించి, బ్రహ్మస్వరూపులుగా చేయునది. దీని గురించి ఆదిభట్ల నారాయణదాసుగారు చెప్తూ -

ముక్కంటిపై వలపున్ గొన్న పడుచు

గట్టువిల్తునకు వేర్కాదు మలప్ప

అన్నారు. మలప్ప అంటే కొండకూతురు అని అమ్మవారిని చెప్తున్నారు. గట్టువిల్తుడంటే శివుడు. పర్వతాన్నే ధనువుగా చేసుకున్నాడు కనుక గట్టువిల్తుడు. **ఎల్లవారలకు మేలే కోరు వేల్పు** - అమ్మవారు ఎప్పుడూ మేలే కోరుతుంది. ఈ మాట సరిగ్గా మహాభారతంలో కృష్ణుడు శివశబ్దానికి అర్థం చెప్తూ-

"శివమిచ్ఛేన్మనుష్యాణాం తస్మాత్ శివ ఇతి స్మృతః" అన్నారు. అందరికి శివం కలిగించడం శివుని స్వభావం. మంచుకి చల్లదనం ఎలా స్వభావమో, సూర్యునికి వెలుగు ఎలా స్వభావమో శివునికి శుభమివ్వడం అలా స్వభావం. శివుశక్తుల ఏకత్వమంతా ఈ నామాల దొంతరలో కనబడుతుంది.

409. శివప్రియా - శ్రీ శివప్రియాయై నమః

శివప్రియా అనే నామానికి రెండు అర్థాలు ఉన్నాయి. శివునకు ప్రియమైనది. శివుడే ప్రియముగా కలది. శివుడు ఎవతెకు ప్రియుడో ఆమె శివప్రియా. **"శివః ప్రియో యస్యాః సా".**

410. శివపరా - శ్రీ శివపరాయై నమః

పరా అనే మాటకి రెండర్థాలు ఉన్నాయి. అదే బుద్ధి పెట్టుకుంటే దానిని పరత్వం అంటారు. తత్ పరత్వం అనే మాట ఉంది. అమ్మవారు ఎప్పుడూ శివపరా. ఆవిడ శివపరాయణురాలు. ఆయననే ఆశ్రయించుకుని ఉంటుంది. ఆయన గురించే చింతన చేస్తూ ఉంటుంది. ఆయన భావనలోనే ఉంటుంది.

పరత్వం అంటే ఉత్కృష్టతా అనే భావం కూడా ఉంది. శివుడే ఉత్కృష్టుడు అని భావించే ఆవిడ 'శివపరా'. సృష్టిలో గొప్పవస్తువేదని అడిగితే 'శివుడే' అని అమ్మవారు చెప్తుంది. ఆయన గురించి అంత తపస్సు చేసింది. శివుడు తప్ప అన్యము పట్టని తల్లి కనుక 'శివపరా'.

పరత్వానికి మరొక అర్థం – బోధించునది. శివుని బోధించే తల్లి. సృష్టిలో అమ్మవారే అయ్యవారి గురించి చెప్తారు. లోకంలో కూడా తల్లే తండ్రిని చూపిస్తుంది. తొలిపరిచయం తల్లి. తరువాతి పరిచయం తండ్రి. అమ్మ మనకి తెలిస్తే ఆ అమ్మే మనకి అయ్య ఏమిటో చెప్తుంది. శివజ్ఞానం ఇచ్చేది ఆ తల్లే. కొందరు ఈ నామానికి అర్థం చెప్తూ శివుని కంటె ఉత్కృష్టురాలు అని అర్థంలో చెప్పారు. ఇది కూడా తీసుకోవచ్చు. **శివాత్ పరా – శివపరా** అని కొందరు చెప్పారు. శివుడే పరంగా కలది కనుక శివపరా. ఈ మూడు భావాలను కూడా తీసుకోవచ్చు.

411. శిష్టేష్టా – శ్రీ శిష్టేష్టాయై నమః

శిష్టులంటే అమ్మవారికి ఇష్టం. **శిష్టాని శిష్టాః** – శిష్టములు, శిష్టులు అని రెండు అర్థాలు నిఘంటువులో చెప్పారు. శిష్టములంటే శాసించునవి. అనగా శాస్త్రములు. శిష్టేష్టా అంటే శాస్త్రములంటే అమ్మవారికి చాలా ఇష్టం.

శాస్త్రములే కదా మనలను తరింపజేయడానికి అమ్మ దగ్గర నుండి వచ్చాయి. 'నిజాజ్ఞారూపనిగమా' దగ్గర ఈ నామానికి అర్థం విస్తారంగా చెప్పుకున్నాం. వేదాలు, స్మృతులు, ఉపాసనలు, ఆగమాలు – ఇవన్నీ అమ్మవారి నుండి వచ్చాయి. శాస్త్రాలు ఇష్టమంటే పుస్తకాలన్ని పెట్టి పూజ చేస్తే అమ్మవారికి ఇష్టమని అర్థం కాదు. శాస్త్రాలలో ఉన్న ధర్మాలను అనుసరిస్తే అమ్మవారికి చాలా ఇష్టం. .

శిష్టాః–శిష్టులు. అంటే శాస్త్రం ప్రకారం నడుచుకొనువారు. సత్యం వద – ధర్మం చర. ఇవన్నీ శాస్త్రనియమాలు. వాటిని అనుసరిస్తూ నియమబద్ధంగా జీవించేవారు శిష్టులు. ఆ శిష్టులకి అమ్మవారు ఇష్టము. ఆ శిష్టులంటే అమ్మవారికి ఇష్టము. రెండూ తీసుకోవచ్చు.

సత్సంస్కారాలు ఉన్నవారికి భగవంతునిపై ప్రీతి కలుగుతుంది. అవి కలగాలంటే ముందు వారికి శిష్టాచారం ఒకటుండాలి.

ఇష్టమనే శబ్దం వేదంలో కనబడుతున్నది. **"బ్రహ్మేష్టం శరణముపగమ్య"** అనే మంత్రమున్నది. ఇష్టమైన బ్రహ్మమును శరణు వేడి... శరణు వేడడం అనే

మాటలో రెండర్థాలు ఉన్నాయి. ఒకటి తప్పనిసరియై శరణు వేడడం. రెండు ఇష్టంతో శరణు వేడడం. ఏ దిక్కు లేదు కనుక దిక్కుగా పట్టుకుంటే అది తప్పని స్థైరి పట్టుకోవడం. ప్రీతిగా శరణు వేడడం ఇష్టం.

ఇష్టం అనేది వైదిక శబ్దం. మనం వాడే అనేక మాటలు వేదం నుండి వచ్చినవే. మనము ఆహుతి వేసినపుడు ఇజ్యం అంటారు. దేనిని ఉద్దేశించి ఇజ్యం వేస్తామో దానిని ఇష్టం అంటారు. ఒక దేవతకి ఆహుతి వేసినపుడు ఏది కోరుకొని మనం ఇజ్యం వేస్తామో అది ఇష్టం. ఇష్టం అనేది కోరికకి పర్యాయ పదం. శిష్టేష్టా అంటే శిష్టులు యజ్ఞముల ద్వారా ఎవరిని ఆరాధిస్తున్నారో ఆ తల్లి. ఫలరూపిణి – ఫలప్రదాయిని.

412. శిష్టపూజితా – శ్రీ శిష్టపూజితాయై నమః

శిష్టులచేత పూజింపబడునది. దుష్టులు పూజిస్తే ఆ పూజని అమ్మవారు అందుకోదు. అమ్మవారు దుష్టపూజిత కాదు. 'దుష్టదూరా'. శిష్టులు చేసే పని అమ్మవారి పూజ. శిష్టాచారం అంతా అమ్మ పూజయే. శిష్టులపూజని అమ్మ గ్రహిస్తుంది.

శిష్టుల పూజ శాస్త్రసమ్మతంగా ఉంటుంది. అశాస్త్రమైన పూజ అమ్మవారు అందుకోదు.

'అశాస్త్ర విహితం ఘోరం' అన్నారు. శాస్త్రసమ్మతమైన ఆరాధన అమ్మవారికి చాలా ఇష్టం.

ధర్మానికి ప్రమాణాలు రెండు. ఒకటి శాస్త్రాలు. రెండవది శిష్టులు. అనగా మహాత్ములు. శాస్త్రంలో ఏం చెప్పారో చూడాలి. అన్ని శాస్త్రాలు మనకు తెలియవు కనుక మహాత్ముల యొక్క జీవితవిధానమే మనకి ప్రమాణం. వారు శిష్టులు. శిష్టాచారమే ప్రమాణమని మహాభారతంలో భీష్ములవారు చెప్పారు.

413. అప్రమేయా – శ్రీ అప్రమేయాయై నమః

కొలతకి అందనిది. పరిమితి ఉంటేనే కొలత వస్తుంది. అమ్మవారు కొలతకి

అందని తల్లి అంటే పరిమితి లేని తల్లి. '**సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ**' అని ఉపనిషత్ చెప్తున్నది. అనంతస్వరూపం ఎప్పుడూ కొలతకి అందదు.

అప్రమేయ శబ్దానికి మరొక అందమైన అర్థం కూడా వివరించారు. ఇది 'దేశకాలాపరిచ్ఛిన్నా' నామం దగ్గర ఇంకా వివరంగా వస్తుంది కనుక ఆ పరమార్థ అర్థంలో కాకుండా మరొక అర్థంలో చూద్దాం.

అప్రమేయా – అనే దానికి భాష్యకారులు, ఉపాసకులైనవారు ఒక అద్భుతమైన విషయం చెప్పారు. '**అ**' చేత '**ప్రమేయం**' అవుతున్నది **అప్రమేయం**. ప్రమేయం అంటే కొలుచుట. ఎప్పుడైనా కొలుచుకోవడం అనే మాట వింటూ ఉంటాం. దేవుని కొలుచుకున్నాం అంటారు. ఈ 'కొలుచుకున్నాం' అనే మాట తెలుగువారు పలుకుతూ ఉంటారు. కొలుచుకుంటున్నాం అంటేనే కొలత పెడుతున్నామని అర్థం. అంటే అమ్మ కొలతకి అందదు, కానీ మన బ్రతుకు తరించడం కోసం కొలత పెడుతున్నామని అర్థం.

ముందుగా నామరూపాలు లేని తల్లిని ఒక రూపం పెట్టుకుని ఎదురుగా పెట్టుకున్నాం. అప్పుడే కొలిచేశాం. అపరిమితమైన తల్లిని పరిమిత భావానికి తెచ్చుకోవడమే **కొలుచుకొనుట.**

అది తప్పు కాదా అంటే – ఏమీ కాదు. ఎందుకు కాదంటే మనం పరిమితులం కనుక మనం అపరిమితాన్ని పరిమితంగానే తెలుసుకోగలం. ఇది ఎలాగంటే దాహం తీరడానికి నదికి కుండ పట్టుకెళ్ళాం. కొలుచుకుని నీళ్ళని కుండతో తెచ్చుకుంటున్నాం. నదినంతా తెచ్చుకోలేమని నీళ్ళు తెచ్చుకోవడం మానేస్తామా? అంతా తెచ్చుకోవడం మనకు అవసరం లేదు. మన బ్రతుకు బాగుపడడానికి మన శక్తిమేరకు ఎంత తెచ్చుకోగలమో అంతే.

మనం పూజ చేసినప్పుడే కొలుచుకోవడమనేది సంకల్పంలో చెప్తూ 'యథాశక్తి ధ్యానావాహనాది షోడశోపచార పూజాం కరిష్యే' అంటాం. 'యథాశక్తి – శారీరక, మానసిక, వాచిక' – "ఈ మూడు శక్తులతో ఎంత చెయ్యగలమో అంత చేస్తున్నాం అమ్మా!" అన్నప్పుడే నువ్వు పరిమితికి అందని దానవు, నేను పరిమితుడను. నిన్ను

నేను పొందడానికై నా పరిమితి భావనలో నిన్ను ఆరాధిస్తున్నాను. అదే సమయంలో అపరిమిత తత్త్వ స్పృహ ఉన్నది, పరిమితమైన భావనతో కూడిన ఆరాధనా ఉన్నది.

అప్రమేయా అన్నప్పుడు ఈ భావం ఒక్కసారి వస్తే – కొలతకి అందని తల్లి కొలవబడుతుంది. ఎవరి చేత కొలవబడుతుంది? 'అ' చేత కొలవబడుతోంది. 'అ' కారం బ్రహ్మవిష్ణురుద్రులను తెలియజేస్తుంది.

అకారం బ్రహ్మ వాచి అని కొందరు, అకారం విష్ణువాచి అని కొందరు చెప్తారు. అంటే అకారాది దేవతలచే కొలవబడుతున్నారు. బ్రహ్మ, విష్ణు, ఇంద్రాదుల చేత కొలవబడుతున్నదని అర్థం.

అకారం విష్ణువాచి అని చెప్పినట్లు, విష్ణ్వాది దేవతలచేత కొలవబడుతున్నది కనుక అ–ప్రమేయ. దీని ప్రమాణం 'హరిబ్రహ్మేంద్రసేవితా'.

'హరిహరబ్రహ్మేంద్రసేవితా' అనే మాట ఉంది. 'యా బ్రహ్మాచ్యుత శంకరప్రభృతిర్దేవైస్సదాపూజితా' అని చెప్తున్నారు. అమ్మవారు ఏ రూపం ధరించినా వీరు కొలవడానికి సిద్ధమే.

అమ్మవారిని లక్ష్మీదేవి రూపంలో చెప్తూ –

వందే పద్మకరాం ప్రసన్నవదనాం సౌభాగ్యదాం భాగ్యదాం
హస్తాభ్యాం అభయప్రదాం మణిగణైర్నానావిధైర్భూషితాం
భక్తాభీష్టఫలప్రదాం హరిహరబ్రహ్మాదిభిస్సేవితాం
పార్శ్వేపంకజ శంఖపద్మనిధిభిర్యుక్తాం సదాశక్తిభిః

అన్నారు. ఈ హరిహరబ్రహ్మాదిసేవితా అన్నప్పుడు కూడా 'అప్రమేయా' అనే అర్థంలోనే చెప్పారు.

ఇంకొక అద్భుతమైన అర్థం చెప్పారు. అ–ప్రమేయ అంటే అకారాది వర్ణాలచే కొలవబడే తల్లి. అనగా మాతృకావర్ణాల చేత ఆరాధింపబడుతున్న తల్లి. ఇది శ్రీవిద్యాపరమైన అద్భుతమైన విషయం. అమ్మవారిని మనం చెప్పాలన్నా, మాట్లాడాలన్నా అక్షరాలే కదా ఆధారం.

414. స్వప్రకాశా - శ్రీ స్వప్రకాశాయై నమః

తనంత తాను ప్రకాశించునది. సృష్టిలో అన్నీ కూడా ఇంకో దాని వల్ల ప్రకాశిస్తాయి. వాటిని పరప్రకాశం అంటారు. తనంత తాను ప్రకాశిస్తే స్వయంప్రకాశం. మనకు కనబడుతున్న వాటి అన్నింటిలోకి మనం సూర్యుని స్వయంప్రకాశకుడు అంటాం.

కానీ, వేదం సూర్యుడు కూడా స్వయంప్రకాశ స్వరూపుడు కాదని చెప్తోంది. సూర్యాదులను కూడా ఎవరు ప్రకాశింప చేస్తున్నారో - గీతలో కృష్ణపరమాత్మ చెప్తూ

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలం

యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకం

సూర్యాదుల యందు ఏ వెలుగు ఉందో అది నేనే అన్నాడు. ఆ వెలుగే **'జ్యోతిషామపి యజ్జ్యోతిః'.**

శాస్త్రం స్వప్రకాశ శబ్దానికి అమ్మవారిపరంగా అర్థం చెప్తూ-

యద్భాసా భాస్యతే సూర్యో యద్భాసా భాస్యతే జగత్

స్వాంతఃస్థజ్యోతి రూపా సా స్వప్రకాశా తదుచ్యతే

ఎవరి వెలుగు సూర్యుని వెలిగిస్తోందో, ఎవరి వెలుగు ప్రపంచాన్ని వెలిగిస్తోందో, ఆ వెలుగు మన లోపల జ్యోతి స్వరూపంగా ఉంది. ఆ జ్యోతిస్వరూపిణియే స్వప్రకాశ అయిన అమ్మవారు.

ఇంత స్వప్రకాశ వస్తువు ఎక్కడ ఉంది? మనలో ఉంది. మన శరీరం అనే కొలతలో పెట్టి చూస్తున్నాం కనుక ప్రమేయం. శరీరానికి కొలత ఉంది కానీ శరీరంలో ఉన్న చైతన్యానికి కొలత లేదు. అది అప్రమేయం... అదే స్వప్రకాశం. లోపల స్వాంతఃస్వరూపిణి అయిన అమ్మవారిని చూపిస్తున్నారు.

న తత్ర సూర్యో భాతి న చంద్ర తారకం

నేమా విద్యుతో భాంతి కుతోయమగ్నిః

తమేవభాంతమనుభాతి సర్వం

తస్య భాసా సర్వమిదం విభాతి

ఆ వెలుగే అన్నింటిలో వెలుగుతోంది. దానిని అనుసరిస్తూ అన్నీ వెలుగుతున్నాయి. మనలోపల ఆత్మ అనే ప్రకాశం ఉంటే దానిని అనుసరించి కన్ను వెలుగుతోంది, కాలు కదులుతోంది, చెయ్యి కదులుతోంది.. ఇలా అన్నీ చైతన్యవంతమవుతున్నాయి. అది స్వాంతస్థమైన చైతన్యం. ఆ స్వప్రకాశరూపాన్ని భావన చెయ్యాలి. ఇది అమ్మవారి పరమార్థ స్వరూపం. ఆత్మప్రకాశాన్ని అనుసరించే అన్నీ ప్రకాశిస్తున్నాయి.

దేవీభాగవతంలో కూడా -

సర్వచైతన్యరూపాం తాం
ఆద్యాం విద్యాం చ ధీమహి
బుద్ధిం యా నః ప్రచోదయాత్

అని ప్రథమ శ్లోకంతో ప్రారంభించారు. ఈ శ్లోకవ్యాఖ్యానమే దేవీభాగవతం అని వ్యాసులవారే చెప్పారు.

చైతన్యస్య న దృశ్యత్వం దృశ్యతే జడమేవ తత్
స్వప్రకాశం చ చైతన్యం న పరేణ ప్రకాశితమ్

చైతన్యానికి, జడానికి తేడా ఒక్కమాటలో చెప్తున్నారు. చూడబడేది జడం. చూస్తున్నది చైతన్యం. దృశ్యమంతా జడం. దృక్ - చైతన్యం. దృక్ దృశ్య వివేచనమని వేదాంతంలో చెప్తారు.

ప్రపంచాన్ని దేనితో చూస్తున్నామో దానిని మనం చూడగలుగుతున్నామా! కంటితో అన్నీ చూస్తున్నాం కానీ కన్నుని ఎప్పుడైనా చూడగలుగుతున్నామా! మన వల్ల కాదు. కానీ లేదు అనగలిగామా! చూడలేకపోతున్నా అది ఉందని ఒప్పుకొంటున్నాం.

కంటికి కూడా అమ్మవారే చైతన్యమై కూర్చొంది. 'జ్యోతిషామపి యజ్జ్యోతిః' అంటే బయట కనిపిస్తున్న సూర్యునికి, చంద్రునికి అని మాత్రమే కాదు. మనలో ప్రకాశాన్ని ఇస్తున్న చైతన్యం 'స్వప్రకాశా'.

"అత్రాయం పురుషః స్వయం జ్యోతిః" అని శ్రుతి. 'ఈ పురుషుడు (పూర్ణచైతన్యం) స్వయంజ్యోతి'.

415. మనోవాచామగోచరా - శ్రీ మనోవాచామగోచరాయై నమః

స్వప్రకాశమైన అప్రమేయ చైతన్యం మనస్సుకి, మాటకి దొరకదు. దొరికిందంటే 'చూడబడేది'(దృశ్యం) అయిపోయింది. చూడబడేదంటే ఇంద్రియములతో తెలియ బడేది. ఇంద్రియాలతో తెలియబడేది ఏదైనా జడమే.

చైతన్యం వల్లనే ఇంద్రియాలు పనిచేస్తున్నాయి. కానీ ఇంద్రియాలు చైత్యన్నాన్ని తెలుసుకోలేవు. ఈ మాట ఉపనిషత్ చెప్తూ - భూమి చైతన్యం వల్ల ఉంది, కాని భూమి దానిని తెలుసుకోలేదు. ఇలా పంచభూతములు ఆ చైతన్యాన్ని తెలుసుకోలేవు. అది ఆధారచైతన్యమై ఉంది. ప్రతివాడు తనకి ఆధారమైన దానిని తెలుసుకోలేడు. ఒక వేళ తెలుసుకుంటే, 'నేను' అని, దాని వల్లే అంటున్నానని తెలుసుకొని, దానిలోనే నిలబడిపోతాడు.

'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అని ప్రసిద్ధ వేదాంత వాక్యం. 'వాక్కులు పరమాత్మను పొందలేక (బోధింపలేక) వెనుదిరిగాయి. అలాగే మనస్సు కూడా వెనుదిరిగింది.'

జ్ఞానమార్గంలో విచారణ ఉంటుంది. విచారణ అంటే ఆలోచన. జ్ఞానమార్గం ఆలోచించగలిగే వారికి కావాలి. సూదిలోకి దారం పంపాలంటే ఆ దారాన్ని కొంచెం పదును చేసి పంపిస్తాం. అలాగ అత్యంత సూక్ష్మమైన జ్ఞానమార్గంలోకి వెళ్ళాలంటే ఈ మనస్సనే దారాన్ని పదును చేయాలి. ఆ పదును చెయ్యడానికి పనికి వస్తుంది ఉపాసన. చిత్తశుద్ధికి కర్మ. చిత్త ఏకాగ్రతకి ఉపాసన. ఈ రెండు కలిగితే జ్ఞానం. ఈ మూడు కలిపి చెప్తే లలితాసహస్రనామ స్తోత్రం. ఈ నామాలన్నిటిని ఏకాంతంగా విచారణ చేసుకోవాలి. "విచారణైక గమ్యం" అని పరమాత్మను అన్నారు. విచారణకి తప్ప మరి దేనికీ దొరకదు.

416. చిచ్ఛక్తిః - శ్రీ చిచ్ఛక్త్యై నమః

417. చేతనారూపా - శ్రీ చేతనారూపాయై నమః

418. జడశక్తిః - శ్రీ జడశక్త్యై నమః

సృష్టిలో మనం చూస్తున్నవి రెండు రకాల పదార్థాలు - చేతన పదార్థాలు, అచేతన పదార్థాలు. అనగా కదిలే పదార్థాలు, కదలని పదార్థాలు. ఉదాహరణకి రాయి, కొండ, చెట్లు మొదలైనవి కదలనవి. కదిలేవి పశువులు, పక్షులు, మనుష్యులు ఇత్యాదులు.

కదిలే వాటిలోనూ అమ్మయే ఉన్నది. అమ్మ అనగా చైతన్యం. ఆత్మరూపమైన చైతన్యం ఉన్నది. కదిలేవాటిలో ఉన్నదంటే మరి కదలని వాటిలో లేదా? అంటే అక్కడా ఉన్నది. అయితే కదిలే వాటిలో ఎలా ఉన్నదంటే '**చిచ్ఛక్తిః చేతనారూపా**'గా ఉందన్నారు. చిచ్ఛక్తికి అనేక అర్థాలు ఉన్నాయి.

ఒకటే చిచ్ఛక్తి - చేతన జగత్తులో చేతనారూపంలో ఉంది. చేతన వేరు - చైతన్యం వేరు.

చేతన అంటే కదలిక. కదలిక అనేదే అమ్మరూపం. అమ్మ కదిలే పదార్థంలో కదలికగా ఉంది. దీనినే శ్రీకృష్ణపరమాత్మ గీతలో చెప్తూ-"భూతానామస్మి చేతనా" - "సమస్త ప్రాణులయందు నేను చేతనారూపంగా ఉన్నాను" అన్నారు. ఇది ఈశ్వర విభూతి. మనలో చైతన్యం చేతనగా పనిచేస్తోంది.

చైతన్యం-చేతన రెండిటికి భేదం తెలుసుకోవాలి. చైతన్యమంటే మనలో ఉన్న కేవల జ్ఞానరూపం. అది కదలికగా కనబడితే చేతన అంటారు. కదలిక అంటే ఊరికినే నడవడం కాదు. కదలికలు అనేకం ఉన్నాయి. కూర్చున్నవారిలో కూడా కదలిక ఉంటుంది.

లోపల ఒక కదిలిక ఉంది. అదే ఆలోచన. ప్రతి దానికి ఒక కదలిక ఉంది. ఈ కదలిక ఎవరు? దేని వల్ల వచ్చింది? ఆ చైతన్యమే మనలో చేతనగా వ్యక్తమవు తుంది.

వ్యక్తాన్ని బట్టే అవ్యక్తాన్ని తెలుసుకోవాలి. వెలుగుని బట్టి సూర్యుని

తెలుసుకున్నట్లుగా చేతన బట్టి చైతన్యాన్ని తెలుసుకోవాలి. మనలో కదలికలు అన్నింటికి మూలమైనది చైతన్యం. ఆ చైతన్యం పేరు చిచ్ఛక్తి. ఆ చిచ్ఛక్తి మనలో చేతనగా కదులుతోంది.

లలితా సహస్రం బాగా అర్థం చేసుకుంటే భగవద్గీత అర్థం అవుతుంది. అన్ని శాస్త్రాలు ఒకటే చెప్తాయి. అంతా కలిపి హిందూమతం. హిందూమతం ఒకొక్క గ్రంథంలో ఒకొక్కటి చెప్పదు. అన్ని గ్రంథాలలోను ఒకటే చెప్తుంది.

చిచ్ఛక్తి కదిలేవాటి యందు చేతనగా ఉన్నది. కదలని వాటి యందు జడశక్తిగా ఉంది. రెండు రకాలుగానూ ఉండాలి. ఉదాహరణకి కొండా ఉండాలి, నదీ ఉండాలి. నది కదులుతోంది కనుక పనికొచ్చింది, కొండ కదలడం లేదు కనుక పనికొచ్చింది. అటుది ఇటు తిరిగితే మనం తట్టుకోలేం. నది కదలకుండా ఉంటే ప్రమాదం. కొండ కదిలితే ప్రమాదం.

ప్రపంచంలో ఎప్పుడూ రెండే శక్తులు– మొదటిది జడశక్తి, రెండవది చేతనాశక్తి. ఇవి రెండూ ఒకే చిచ్ఛక్తి యొక్క స్వరూపములు.

చిచ్ఛక్తిః చేతనారూపా, జడశక్తిర్జడాత్మికా – కదిలే వస్తువుల యందు కదలికగా ఉన్న చిచ్ఛక్తి, జడవస్తువుల యందు జడశక్తిగా ఉంటూ జడస్వరూపంగా ఉంది.

రెండవ అర్థం – ఈ జగత్తులో మనకు చిత్, జడం – రెండూ కలిసి కనిపిస్తాయి. అది వేరు, ఇది వేరు కాకుండా రెండూ కలిసే ప్రపంచం ఉంది.

జడములు అంటే ఉపాధులు. ఉపాధులు దేనివల్ల కదులుతున్నాయో అది చిత్. చిచ్ఛక్తి, జడశక్తి రెండిటిని చూస్తే శరీరం జడం. శరీరేంద్రియ శక్తి జడ శక్తి.

మన లోపల ఉన్న చిచ్ఛక్తి యొక్క స్వరూపం గురించి శాస్త్రం నిర్వచనం చెప్తూ –

వర్తతే సర్వభూతేషు శక్తిస్సర్వాత్మనా నృప
శవవచ్ఛక్తిహీనస్తు ప్రాణీ భవతి సర్వథా
చిచ్ఛక్తిస్సర్వభూతేషు రూపం తస్యాస్తదేవ హి (దేవీభాగవతం)

“సర్వభూతాలందంతటా నిండి శక్తి ఉన్నది. శక్తిలేని ప్రాణి అన్ని విధాలా

శవంతో సమానం. సర్వప్రాణులందున్న చిచ్ఛక్తికి సామర్థ్యమే స్వరూపం."

దేనియందు ఏది పోవడం వల్ల దేహం శవంగా మిగిలిపోతుందో అది చిచ్ఛక్తి. చిచ్ఛక్తి అంటే మనలో కదలిక. చైతన్యం చేతనగా మన శరీరంలో తిరుగుతోంది. ఈ చేతనగా తిరిగేది ప్రాణం. ఈ ప్రాణశక్తి మనల్ని పోషిస్తోంది. చిచ్ఛక్తి మనల్ని పోషించే శక్తి. చిచ్ఛక్తి ప్రాణశక్తి. ఇది సర్వభూతాలను పోషిస్తోంది.

మనం అన్నాదులవల్ల కూడా తెచ్చుకొనేది ప్రాణశక్తినే. ప్రాణశక్తి చేత మనం పోషింపబడుతున్నాం. కనుక ఆత్మరూపిణియై ఉన్న తల్లి మనలో ప్రాణముగా కదులుతోంది. ముందుగా ప్రాణమే మనం ఆత్మ అనుకుంటాం. తప్పేం లేదు. దేహమే ఆత్మ, మనస్సే ఆత్మ అనుకునేకంటె ప్రాణం ఆత్మ అనేదాకా వెళ్ళవచ్చు. ఫరవాలేదుకాని ప్రాణమే ఆత్మ అని ఆగిపోతే సరిపోదు.

దేహం ప్రాణమపీంద్రియాణ్యపి చలాం బుద్ధించ శూన్యం విదుః
స్త్రీబాలాంధజడోపమస్త్వహమితి భ్రాంతా భృశం వాదినః

అని శంకరులు దక్షిణామూర్తి స్తోత్రంలో అంటారు.

ప్రాణం మనలో ఉన్న చేతన. చేతన బట్టే చైతన్యాన్ని గుర్తించాలని చెప్పారు. ప్రాణం వల్ల అన్ని కదులుతున్నాయి. ప్రాణం అనే శబ్దానికి– **'ప్రాణీతి చేష్టాం కరోతీతి ప్రాణః'** – ప్రాణం అంటే చేష్ట కలిగించునది. ప్రాణానికి కూడా ప్రాణమైన పరమాత్మను **'ఈశానః ప్రాణదః ప్రాణః'** అన్నారు. **'ప్రాణస్స ప్రాణః'** – అన్నది శాస్త్రం.

ఆ చిచ్ఛక్తి లేకపోతే శరీరమే లేదు. అదే ఈ శరీరాదులకి కదలిక ఇస్తున్నది. రాళ్ళకి, రప్పలకి కూడా కదలికలు ఉన్నాయనే విషయాన్ని కొన్నాళ్ళ క్రితం ఒక అణుశాస్త్రవేత్త పరిశోధన చేసి చెప్పాడు. సృష్టిలో కదలిక లేని వస్తువు లేదన్నాడు.

ఒక బండరాయిని స్థూలదృష్టితో చూస్తే స్థావరము, జడము అంటున్నాం. బండరాయిని జడం అనుకోరాదు. సృష్టిలో ఎక్కడా కూడా నిర్జీవ జగత్తు, జీవ జగత్తు అనలేదు మన శాస్త్రాలు. స్థావరజంగమాలు, చరాచరాలు అన్నాయి. మనలోనే కాదు... రాళ్ళలో కూడా కదలిక ఉంది. మనలో కదలికని మనం

గుర్తించగలం. దానిలో కదలిక స్ఫుటంగా గుర్తించలేం. దానిలో అణువుల పరిణామం ఉంది. "ఈ విషయం నేను కనుగొనగలిగాను" అని ఫ్రిజ్జాఫ్ కాప్రా అనే అణుశాస్త్రవేత్త చెప్పాడు."సృష్టిలో ఈ కదలికలన్నీ ఒక లయాత్మకంగా ఉన్నాయి. ఈ లయాత్మకమైన కదలిక ప్రపంచమంతా ఉంది. ఈ లయతోనే జగత్తు కదిలిపోతోంది. ఈ కదిలిస్తున్న లయే లయకారకుడైన శివుని నాట్యం" అని ప్రతిపాదన చేశాడు.

మనలో చిచ్ఛక్తి అంటే ఆత్మ యొక్క శక్తి. ఈ శక్తే మనలో చేతనగా, జడశక్తిగా రెండు రకాలుగా పనిచేస్తోంది. ఒక్క ఎముక ఎలా నిర్మాణం చేయాలో ఆ వస్తువుగాని, ఆ తయారుచెయ్యడమనే ప్రక్రియగాని మనకి తెలీదు. నేను అని తిరుగుతున్న మనకి ఇంద్రియాదులను తయారుచెయ్యడం తెలుసా! ఇవన్నీ ఆలోచిస్తే ప్రపంచాన్ని మనం పరిశీలించక్కర్లేదు. మనల్ని మనం పరిశీలించుకుంటే చాలు.

జగత్ స్వరూపాన్ని సృష్టించడానికి ఏర్పడిన మాయా 'పరిణామ'శక్తికే 'జడశక్తి' అని పేరు. లేదా బ్రహ్మమునందు 'వివర్తం'గా జగత్తు భాసించడానికి కారణమైన మాయ యందు వ్యక్తమయ్యే సకల ప్రకృతి శక్తులు దానిలో గ్రహింపబడతాయి.

శక్తయస్సర్వభావానాం అచింత్య జ్ఞానగోచరాః
శతశో బ్రహ్మణస్తాస్తు సర్గాద్యా భావశక్తయః
భవంతి తపసాం శ్రేష్ఠ! పావకస్య యథోష్ణతా
నిమిత్తమాత్రమేవాసౌ సృజ్యానాం సర్గకర్మణి
ప్రధానకారణీభూతా యతోవై సృజ్య శక్తయః
నిమిత్తమాత్రముక్త్వైకం నాన్యత్కించిదపేక్షతే
నీయతే తపసాం శ్రేష్ఠ స్వశక్త్యా వస్తువస్తుతాం.

"సకల భావాలకు శక్తులుంటాయి. ఆ శక్తులన్నీ పరమాత్మ జ్ఞానమందు గోచరిస్తున్నాయి. అనగా పరమాత్మ యొక్క చిచ్ఛక్తి యందే అన్ని శక్తులు ఉన్నాయని అర్థం. ఆ శక్తులే బ్రహ్మదేవునందు వందలకొలది సృష్టి శక్తులుగా అవుతున్నాయి. ఆ శక్తియే అగ్ని యందు వేడిమిగా అవుతుంది. సృష్టి చేయడంలో బ్రహ్మ నిమిత్తమాత్రుడే కానీ ప్రధాన కారణం కాదు. మాయలోని సృజన శక్తులే ప్రధానకారణాలౌతున్నాయి.

ఇంద్రియాల చేత గ్రహింపశక్యం కాని పరమాత్మ తన శక్తి చేతనే ఇంద్రియగ్రాహ్య (ఇంద్రియాలచే తెలియబడే) జగద్రూపుడుగా అయ్యాడని అర్థం.

419. జడాత్మికా - శ్రీ జడాత్మికాయై నమః

జడశక్తి, జడస్వరూపం కూడా అమ్మవారే. ఉపాధులు జడములు అన్నాము. మరి ఉపాధుల స్వరూపం ఎవరు? అది అమ్మవారే తయారుచేసినప్పుడు, శక్తిగా ఆవిడే లోపల వ్యాపించి ఉన్నప్పుడు- ఇది కంటికి కనబడుతున్నది అన్నా ఆవిడ వల్లనే కనుక మనకి కనబడుతున్న జడమైన స్వరూపం కూడా అమ్మవారే.

పంచభూతాలకు జడములని పేరు. పంచభూతాలతో తయారైన ఇంద్రియాలకి కూడా జడములని పేరు. కానీ పంచభూతాలు జడములు అయినప్పుడు ఆ పంచభూతాలు ఎవరు తయారుచేశారు? అమ్మవారే. '**తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్**' – జడాత్మకమైన సృష్టిని చేసి అందులో ప్రవేశించింది. ఆ రూపం ఎవరు నిర్దేశించారు? చెట్టు అంటే అలా కొమ్మలు సాగి ఉండాలి, నీరు అంటే ఆ రూపంతో ఉండాలి, రాయంటే అలా ఒక రూపంతో ఉండాలని నిర్ధారణ ఎవరు చేశారు? కనుక వాటన్నింటిలో నిండి ఉన్నది అమ్మ స్వరూపమే. 'త్రిభువనవపుషం విష్ణుమీశం నమామి' – కనబడిన జగత్తంతా అమ్మ రూపమే. కానీ జడం మాత్రమే కాదు. జడం అమ్మ వల్ల ఏర్పడి అమ్మవలనే కనబడుతోంది కనుక ఆమెను జడస్వరూపం అన్నా, ఆ జడము యొక్క శక్తి ఆవిడే. ఈ కదలికకి, జడానికి మూలమైన చిచ్ఛక్తి కూడా ఆవిడయే.

ఇది మొత్తం మనం పరిశీలిస్తే ఉపాధుల రూపంతో ఉన్నది, ఉపాధుల యందు ఉన్నది, ఉపాధులలో కదలకుండా ఉండవలసిన వాటిని కదలకుండా ఉంచుతున్నది, కదిలేవాటిని కదిలిస్తున్నది అమ్మవారే అని తెలుస్తుంది.

ఈ దృష్టితో పరిశీలిస్తే కొన్ని గ్రహాలలో కదలిక ఉంది. వాటిలో జడత్వమూ ఉంది. భూమి యందు జడత్వం 'కదలని తనం' ఉన్నది. భూమి యందు ఉన్న మట్టి, రాయి ఇత్యాదులు కదలకుండా ఉన్నాయి. కానీ అందులో మళ్ళీ కదలిక

ఉంది. సృష్టిలో ఈ రెండు కలబోసే ఉంటాయి. కనుక జడం అని చెప్పలేము, కదలిక అని చెప్పలేము. "ఈ మాట ఆశ్చర్యం" అని ఓపెన్ హేమర్ అనే విదేశీయ అణుశాస్త్రవేత్త చెప్పాడు. ఈయన అణుశాస్త్రం గురించి చెప్తూ, "అణువులలో కదలిక గురించి అవునని చెప్పలేం, లేదని చెప్పలేం" అన్నారు. ఈ మాట ఒక విజ్ఞానశాస్త్రవేత్త చెప్తే దాన్ని విజ్ఞానశాస్త్రం చెప్పిందని ఒప్పుకొంటాం.

కానీ ఇదే మాటని కొన్ని లక్షల సంవత్సరాల క్రితం ఉపనిషత్ **'తదేతతి తన్నైజతి తద్దూరే తద్వంతికే'** అది కదలదు, కదులుతుంది అని చెప్పింది. ఇలా ఆలోచిస్తూ ఉంటే ఈ జగత్తులో కదలడం, కదలకపోవడం అన్నీ మనకి కనబడుతూనే ఉన్నాయి. ఇదంతా చిచ్ఛక్తి ఉంటేనే ఉంది. లేకపోతే ఏదీ లేదు. 'చిచ్ఛక్తిః' అనేదే 'చేతనారూపా' 'జడశక్తిః' 'జడాత్మికా'గా గోచరిస్తున్నది.

అందుకే 'చిచ్ఛక్తిశ్చేతనారూపా జడశక్తిర్జడాత్మికా' అని విభజించడానికి లేదు. చిచ్ఛక్తియే చేతనారూపా, జడశక్తి, జడాత్మికా – ఇదే అన్వయం. దీనిని ఆదిభట్ల నారాయణదాసుగారు తెలుగులో చెప్తూ– **"అలవున ఉసురులు చెలగించు చేవ"** అన్నారు. ఉసురులు అంటే ప్రాణాలు అనగా చేతనలు. ఆ చేతనలని చెలగించే చేవ. చేవ అనేది తెలుగుపదం. అలవున అంటే ఒక క్రమపద్ధతిలో.. ప్రాణాలని నడుపుతున్న తల్లి అన్నారు. 'చేవ' అంటే చిచ్ఛక్తి.

మందల నిలవయి మయినద్పు తెల్వి – మందల అంటే సమూహం. మన శరీరం ఒక సమూహం, కూటం. ఈ కూటము నందు ఉన్నది – కూటస్థం. ఈ శరీరంలో ఆవిడ కదలకుండా ఉంది. శరీరాన్ని నడిపే తెలివి ఆవిడ. కన్నుతో ఎలా చూడాలి? నాలుకతో ఎలా రుచి చూడాలి? అనే తెలివే అమ్మవారు. తెలివి అంటే పుస్తకం చదివి అర్థం చేసుకొనే తెలివితేటలు వేరు. ఏ ఇంద్రియానికి ఏ చైతన్యమో అదే తెలివి. **'నింగినేలల నెల్ల నిండారు వేల్పు'** అన్నారు.

ఇంతవరకు చెప్పుకున్నది ఒక క్రమం. అప్రమేయా స్వప్రకాశా మనోవాచామగోచరా, చిచ్ఛక్తిశ్చేతనారూపా జడశక్తిర్జడాత్మికా – ఈ శ్లోకం బయటకు తీసుకుని మనం వివేచన చేసుకున్నాం. ఆ స్వరూపమే శివదూతీ, శివమూర్తీ, శివంకరీ

అయిన శివశక్తులరూపంలో అన్వయం అయ్యింది. తరువాత నామాల నుండి మరొక విద్యను ఆవిష్కరిస్తున్నారు.

అయితే ఇక్కడ జడాత్మికా అన్నప్పుడు మనం తెలుసుకోవలసినది '**సత్యం చానృతం చ సత్యమభవత్**' అనే ఉపనిషత్ వ్యాఖ్యతో అన్వయం. జడం కూడా చైతన్యం ఎలా అవుతుంది అనే ప్రశ్నకి కూడా ఇది సమాధానం.

సత్యం, అసత్యం కూడా సత్యమే అన్నారు. అయ్యా నువ్వు రెండో మాట అసత్యం అని అంటున్నావు కదా, మరి సత్యం ఎలా అవుతుంది? అంటే సత్యమంటూ ఒకటి ఉంటేనే అసత్యం తెలియబడుతోంది. లోపల చిచ్ఛక్తి ఉంటేనే జడమైన శరీరం ఒకటున్నది అని తెలుస్తోంది. కనుక శరీరరూపంలో చైతన్యాన్నే కదా మనం తెలుసుకుంటున్నాం. శరీరం జడమైనా దానిని జడంగా తీసిపారేయకుండా దానిలో చైతన్యంతో కలిపి చూపిస్తున్నాం.

సృష్టంతా రెండూ కలిసిపోయి ఉంటుందని ముందే చెప్పుకున్నాం. దీనినే శంకరభగవత్పాదులవారు **చిజ్జడగ్రంథి** అని పేరు పెట్టారు. జడం, చిత్ రెండూ కలసి ఉన్నాయి కదా! ఎలాగ? ఇది జడమా, చేతనమా? ఏదో ఒకటి చెప్పండి. ఇందాకే జడం అన్నారు ఉపాధిలో ఒప్పుకుంటాం. జడం అమ్మరూపమే. అమ్మ చైతన్యమన్నారే? అంటే అవును... ఆ చైతన్యం లేకపోతే ఈ జడం తయారు కాదు కదా! అంటే జడంగా కనబడుతున్నది ఆ చైతన్యమే కాని చైతన్యానికి జడం లేదు. జడస్వరూపాన్ని చైతన్యం యొక్క ఉపాధిగా తెలుసుకోవాలి గాని అది చైతన్యమే అని అనరాదు. 'సత్యం చానృతం చ సత్యమభవత్' – సత్యం, అనృతం కూడా సత్యమే.

ఆ సత్యాన్ని ఉపాసించవలసిన నామాల్లోకి ప్రవేశిస్తున్నాం. 'గాయత్రీ, వ్యాహృతిః, సంధ్యా, ద్విజబృందనిషేవితా, తత్త్వాసనా, తత్త్వమయీ, పంచకోశాంతరస్థితా' – ఈ శ్లోకమంతా గాయత్రీవిద్య ప్రతిపాదిస్తోంది. కొన్ని శ్లోకాలలో ఒకే విద్యను తెలియజేస్తారు, దానికి తరువాత ఇంకొక విద్యతో సంబంధం పెడుతూ అక్కడ నుంచి మరొక విద్య చెప్తారు. ఇది ఎలా ఉంటుంది అంటే మనం ఒక బంగారు గొలుసు చేసేటప్పుడు మధ్యలో ఒక పూసలా చేస్తాం. అది బంగారమే. తరువాత పూసకు

సంబంధం కలుపుతూ మరొక పూసలోకి వెళతాం. అలా లలితాసహస్రంలో ఆ పూసల గుంపులా ఒకొక్క నామం ఉంటూ మరొక దానికి అనుసంధానం చేస్తుంది.

420. గాయత్రీ - శ్రీ గాయత్ర్యై నమః

గాయత్రీ శబ్దానికి శాస్త్రం చెప్పిన అర్థం **'గాతారం త్రాయతే ఇతి గాయత్రీ'** - పాడే వారిని కాపాడుతుంది.

మంత్రాలు పాడేవి కాదు. దాని పేరే మననం చేసేదే మంత్రం. మరి 'గాతారం త్రాయతే' అని ఎందుకన్నారు? అసలు గానం అంటే ఏమిటి? స్వరాలు, కల్పనలు చేసి పాడేది అని కాదు ఇక్కడ అర్థం. ఒక ఆనంద అనుభూతితో పలికే వ్యక్తీకరణకు గానం అని పేరు. మనలో గానం ఏదో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. మనలో గానం ఊపిరి. ఈ మాట శాస్త్రం చెప్తోంది. మన ఆలోచనలు ఋక్కులు, మన ఆచరణలు యజుస్సులు, మన ప్రాణాలు సామములు అని చెప్పింది. గానం లక్షణం అక్కడ ఉంది. గాతారం త్రాయతే ఇతి గాయత్రీ - ప్రాణశక్తితో కలిపి మంత్రం చేస్తే మనకి ప్రాణరక్షణ ఉంటుంది.

అలాగే **'గయాన్ త్రాయతే ఇతి గాయత్రీ'** - గయాన్ అంటే ప్రాణాలను రక్షించునది గాయత్రి. గాయత్రి అంటే ప్రాణరక్షణ శక్తి. ప్రాణశక్తిని కాపాడేది గాయత్రి. అందరిలో గాయత్రి సాగుతోంది. దానినే అజపాగాయత్రి అంటారు. అజపా అంటే శ్వాసరూపం.

పరమ చైతన్య శక్తి గాయత్రీ. **"గాయత్రీ వా ఇదం సర్వం"** - సర్వవ్యాపకమైన ఈ శక్తియే గాయత్రీ.

మంత్రం ఎంత సూక్ష్మమైతే అంత శక్తి. బయటకి జప మంత్రం పలికితే అది అధమం అన్నప్పుడు మరి గాయత్రి మంత్రాన్ని పాట కట్టవచ్చా అంటే అది ఇంకెంత పాపమో తెలుసుకోవాలి. మంత్రం వేరు - పాట వేరు. మననం చేసుకోవల్సిందే మంత్రం. బయటకి అంటే అధమం, పెదవి కదుపుతూ బయటకు వినబడకుండా అంటే ఉపాంశువు, ఇది బయటకు అనే దానికన్నా శ్రేష్ఠం. మనస్సుతో చెయ్యగలిగితే

మంచిది. కానీ ఇది వెంటనే రాదు. ఉపాంశువుతో ఉన్నప్పుడు మనస్సు కూడా పనిచేస్తుంది కనుక ఉపాంశువు చేసేవాడు నిరుత్సాహ పడకూడదు. ఇది వృథా కాదు.

ఈ గాయత్రీ అర్థం చేసుకుంటే అందరి సాధకులకి పనికి వస్తుంది. ప్రతివారు సాధకులే. వారు శ్రీవిద్యాసాధకులు, గాయత్రీసాధకులు కావచ్చు. ఏదో ఒక రామ నామమో, కృష్ణనామమో చేసుకునేవారు కావచ్చు. ఎవరైనా సాధకులే కదా. అన్నీ మంత్రాలే. రామ, కృష్ణ కూడా వేదం నుంచే వచ్చాయి.

జపం, మంత్రం, దేవత అని పేరు పెట్టాలంటే వేదంలోంచి వచ్చిన వాటికే ఈ పేరు చెల్లుతుంది.

వేదం చేత ప్రతిపాదింపబడినవాడే దేవుడు. హిందువులు జపించే రామ, కృష్ణ, శివ, దుర్గ, లక్ష్మీ, సరస్వతి ఇవన్నీ మంత్రాలే. ఇవి అందరూ చేసుకోవచ్చు. ఉపనయనం అయినప్పుడు తండ్రి ఏ మంత్రాన్ని ఉపదేశిస్తాడో వారికి అది గాయత్రీ. వారు అది చేసి ఏదైనా చేస్తేనే వారికి ఏదైనా ఫలిస్తుంది. అది మానేసి వేరేది చేస్తే అసలు ఫలించదు.

సంధ్యావందనం చెయ్యనివాడు ఏడాది కొకమారు సత్యనారాయణ వ్రతం చేసినా ఫలించదు. ఉపనయనం అయిన వాడు సంధ్యావందనం చేసి తీరాలి. ఇది వాడి కర్తవ్యం. మిగిలినవారు చెయ్యకపోయినా తప్పేం లేదు. కానీ వారు ఏదైనా అనుష్ఠానం చేసుకుంటే వారికి మంచిది. తరించుతారు. వారికి వారి గురువులు ఇచ్చిన మంత్రాలు చేసుకోవచ్చు. అష్టాక్షరీ, పంచాక్షరీ, రామ, కృష్ణాది అనేక మంత్రాలకు తగిన సంస్కారాలతో అందరికీ అధికారం ఉంది.

శ్రీవిద్యాదులకు కూడా సర్వవర్ణాలవారికి అధికారం ఉంది. కానీ ఎవరికైనా సంస్కారం చెయ్యాలి. సంస్కారం చెయ్యక పూర్వం అది ఒక జన్మ. సంస్కారం చేసిన తరువాత, గురువు దగ్గర మంత్రం పుచ్చుకున్నాక అది రెండవ జన్మ. ద్విజసంస్కారం పొందినవారు ఆ మంత్రాన్ని సాధన చేస్తూ ఉంటే ఆ మంత్రం వారికి గాయత్రి.

ప్రతివారికి ఉపదేశింపబడ్డ మంత్రాన్ని సంధ్యాకాలంలో ప్రాణశక్తితో కలిపి

చేస్తే వారికి అది గాయత్రియై వారిని రక్షిస్తుంది. ఉపనయన సంస్కారం పొందినవారు మాత్రం త్రిపదా గాయత్రిగా ఏ మంత్రాన్ని పొందారో దానిని యావజ్జీవం జపించవలసిందే. **"అహరహస్సంధ్యాముపాసీత"** అని వేదమాత చెప్తోంది.

నిత్యనైమిత్తిక కర్మలను ఎప్పుడూ మానరాదు. నిత్య కర్మ గాయత్రి. సంధ్య అనగా సంధ్య యందు ఉపాసించవలసింది కనుక సంధ్య. **'ప్రాణావై గయా స్త త్ప్రాణాగ్ స్తత్రె । తద్యద్దయాగ్ స్తత్రే తస్మాద్గాయత్రీ నామ'** అని బృహదారణ్యకోపనిషత్తు చెప్పింది. **'గాయంతం త్రాయతే యస్మాత్ గాయత్రీ తేన కథ్యతే'** – గాయత్రీ కల్పం – భారద్వాజస్మృతి.

ప్రకట గాయత్రి, గుప్త గాయత్రి అని రెండు రకాల గాయత్రి ఉంటుంది. ప్రకటగాయత్రి అంటే తండ్రి వద్ద ఉపదేశం పొంది చేసే మంత్రం. గుప్తగాయత్రి అంటే మూడు రకాలు. అవి – బాలా, పంచదశి, షోడశి మంత్రాలు. ఈ మూడూ ఉపదేశం పొందితే గాయత్రి మంత్రోపదేశం వంటిదే.

(మహా మంత్రాలను పుస్తకాలలోను, సీ.డీ.లలోను వినిపిస్తే వాతావరణం క్షోభిస్తుంది. ఆఖరికి కారు రివర్సు చేసేటప్పుడు, కాలింగ్ బెల్‌కి, ఫోను రింగ్టోన్లుగా మహా మంత్రాలను పెట్టడం మహాపాపం. ఇవి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ప్రాణశక్తిని హరిస్తాయి. మందు సరదాగా కొనుక్కొని చూడ్డానికి బాగుందని పుచ్చుకొంటే ప్రాణాపాయమే కదా!)

నామాన్ని మంత్రంలా జపించవచ్చు గాని, మంత్రాన్ని నామంలా పలుకకూడదు. రామరామ అని పాడుకోవచ్చు. ఆ రామనామాన్నే సంధ్యాకాలంలో కూర్చుని మౌనంగా, లేదా ఊపిరితో కలిపి జపం చేస్తే రామగాయత్రి అవుతుంది. సందేహం లేదు.

421. వ్యాహృతిః – శ్రీ వ్యాహృత్యై నమః

'వ్యాహృతిః' అంటే ఉచ్చారణ. **'వ్యాహరణం ఉచ్చారణం తద్రూపా వ్యాహృతిః'.** మంత్రాన్ని ఉచ్చరించినపుడు ఆ ఉచ్చారణ రూపంలో ఉన్న శక్తి అమ్మవారు.

వాయుపురాణంలో శివుడు అమ్మవారితో చెప్తూ, **"మయాభిర్వ్యాహృతం యస్మాత్ త్వంచైవ సముపస్థితం తేన వ్యాహృతిరిత్యేవం నామ తే సిద్ధిమేష్యతి"** అంటాడు. "పార్వతీ! నీకు వ్యాహృతి అనే పేరు ఎందుకు వచ్చిందో తెలుసా! నేను మొట్టమొదట నిన్ను ఉచ్చరించాను. అది విని బ్రహ్మదేవుడు నా దగ్గర నుండి స్వీకరించి నిన్ను ఉచ్చరించాడు. నేను, బ్రహ్మదేవుడు కలిపి నిన్ను ఉచ్చరించాం కనుక నీ పేరు వ్యాహృతి" అన్నాడు. వ్యాహృతి అనగా ఉచ్చరింపబడినది.

పరమేశ్వరుడు ఉచ్చరించినదే వ్యాహృతి. పరమేశ్వరుడు ఉచ్చరించినది వేదం. అది ఆయన పలుకు. పరమేశ్వరుని నుండి వేదరూపంగా వచ్చిన ఉచ్చారణ గాయత్రి. వ్యాహృతి అంటే వేదమాత. గాయత్రికి వేదమాత అని పేరు. వేదరూపాలతో వచ్చినదే గాయత్రీ. ఆ వేదం మన ప్రాణాలను రక్షిస్తుంది. సశాస్త్రీయంగా అధ్యయనం చేసిన వేదపండితుడు వేదం చదువుతున్నప్పుడు శ్రద్ధగా వింటున్నప్పుడు అవి మన చెవిలో పడితే మనకు తెలియకుండానే ఆ వాయుతరంగాలలో శక్తి మనలో ప్రసరించి మన ప్రాణం రక్షింపబడుతుంది.

గాయత్రి-వ్యాహృతిః-సంధ్యా. అజపారూపమైన గాయత్రి మనలో ఉచ్చారణరూపంలో సంచరిస్తోంది. మన లోపల ప్రాణాలను రక్షించే శక్తిగా అమ్మ సంచరిస్తోంది. అదే చిచ్ఛక్తిః - చేతనారూపా జడశక్తిః - జడాత్మికా. ప్రాణాలను రక్షిస్తూ తిరుగుతోంది కనుక గాయత్రి. ఈ ప్రాణరక్షణ శక్తి మనలో ఉచ్చారణరూపంలో బయటపడుతోంది కనుక 'వ్యాహృతిః'.

422. సంధ్యా - శ్రీ సంధ్యాయై నమః

మనలో ఉచ్చరింపబడిన ఆ తల్లిని సంధ్యలోనే తెలుసుకోగలం. సంధ్యాకాలాలు మూడు. అవి ప్రాతః, మధ్యాహ్న, సాయంకాలాలు. ఇవి మనందరికి తెలిసిన సంధ్యలు. గూఢసంధ్య... తురీయ సంధ్య. అర్ధరాత్రి కాలాన్ని తురీయసంధ్య అంటారు. అదే లింగోద్భవకాలం.

ఈ సంధ్యాకాలాల్లో పరమాత్మని ధ్యానించాలి. అందుకే సంధ్యాకాలాల్లో

భగవదారాధన చెయ్యాలన్నారు. మరో కోణంలో – యోగపరమైన సంధ్యలో నిలవడం గొప్ప సాధన. కాలం అంటే స్థితి అని అర్థం. బైట ఉన్న కాలం కాదు. బయట చల్లగా ఉన్నా మనస్సు తెగ వెడెక్కిపోతే చెమటలు పడతాయి.

కాలం అంటే మనం ఉన్న స్థితి. సంధ్య అంటే సమ్యక్ ధ్యానం. సమగ్రమైన ధ్యానమే సంధ్య. సమగ్ర ధ్యానంలోకి మనం వెళ్తే అప్పుడు పరమాత్మానుభవం ప్రాప్తిస్తుంది. సంధ్యాదేవి అంటే సమగ్ర ధ్యానంలో అనుభవానికి వచ్చే పరబ్రహ్మశక్తి అని అర్థం.

ధ్యానం వేరు, సమ్యక్ ధ్యానం వేరు. ధ్యానంలో కూడా పండిపోవాలి. ఆ స్థితిలోకి వెళ్తే అప్పుడు అనుభూతిలోకి వచ్చేది సంధ్య.

సూర్యుని యందలి చైతన్యానికి, తనలోని చైతన్యానికి అభేదభావన చేయడమే సంధ్య – అని చక్కని నిర్వచనం. **'ఆదిత్యావచ్ఛిన్న చైతన్యస్య స్వస్యచ అభేద భావనం సంధ్యా పదార్థః** (భాస్కరరాయ).

సంధ్యయోరఖిలవృత్తిషు – రెండు ఆలోచనలకి నడుమ ఒక సూక్ష్మ విరామం ఉంటుంది. ఈ సూక్ష్మ విరామం పట్టుకోవడం మహాకష్టం. ఆ సూక్ష్మ విరామమే సంధ్య. అది ఆలోచిస్తే దొరకదు. ఆలోచనలు లేకుండా మనస్సుని నిలపడం వల్లకాదు. నిలుపుదామని ప్రయత్నిస్తే కదిలిపోతూ ఉంటుంది. వెంట్రుకవాసి కంటే సూక్ష్మమది. అక్కడికి గాని వెళ్ళగలిగితే పట్టుకోగలమన్నారు. దీనికి ఒక చిన్న ఉదాహరణ చెప్పవచ్చు.

ఒక పూసలహారంలో దారం ఉంటుంది. ఆ దారం కనబడదు. కాని లేదనం. ఆ హారంలో దారం చూడాలి అంటే రెండు పూసలని చెరో ప్రక్కకి జరిపితే మధ్యలో దారం కనబడుతుంది. మధ్యలో ఉన్న దారమే మొత్తం అంతా వ్యాపించి ఉంది. పూసకి పరిమితి ఉంది కాని, మధ్యలో ఉన్న దారానికి అటువంటి పరిమితి లేదు. రెండు ఆలోచనలు రెండు పూసలు అనుకుంటే ఆ రెండు ఆలోచనల మధ్యలో చిన్న విరామం ఉంటుంది. ఆ విరామాన్ని పట్టుకోవడం మహాకష్టం.

ఆ ఆలోచనారహిత స్థితిలో పరమాత్మ చైతన్యం ఉంటుంది. ఆ ఖాళీలోనే

కాకుండా ప్రతి ఆలోచనలోను అదే సూత్రంగా ఉంది. చైతన్యం అనే దారంలో ఆలోచనలు అనే పూసలు వస్తున్నాయి. ఆ అసలు చైతన్యాన్ని మనం పట్టుకోవాలంటే ఏ ఆలోచనా లేని స్థితిలో నిలవగలగాలి. ఆ రెండు ఆలోచనల మధ్య సూక్ష్మకాలంలో నిలపగలగాలి. ఇది మహాకష్టం కనుకనే సమ్యక్ ధ్యానం. అది సాధనలోకి తేలికగా రాదు కనుక ముందు స్థూల సంధ్యని ఆశ్రయించాలి. ప్రాతఃకాల, మధ్యాహ్నకాల, సాయంకాల సంధ్యలలో క్రమంగా మన మనస్సుని ఏకాగ్రపరచి సాధన చేస్తే ఎప్పటికైనా ఆ స్థితిలోకి అమ్మ కృపచే చేరుకుంటాం.

ఆ సూక్ష్మ విరామకాల సమయంలో అనుభవానికి వచ్చే తల్లి. ఆలోచనలకు అతీతమైన స్థితిలో అది 'భావవర్జితా' అయిన స్థితి. 'నామరూప వివర్జితా' అయిన స్థితి. అదే 'అప్రమేయా స్వప్రకాశా' స్థితి. అదే 'చిచ్ఛక్తిశ్చేతనారూపా జడశక్తిర్జడాత్మికా' అయిన స్థితి. ఆవిడే మన ప్రాణాలను రక్షిస్తూ మన ఊపిరులనే హారంలో తిరుగుతున్న శక్తి. ఆవిడని మనం అసలు తెలుసుకోగలిగేది సంధ్యలోనే. కనుక సంధ్యావందనం ప్రతివారు వారివారి పద్ధతులను అనుసరించి తప్పనిసరిగా చేయాలి.

ఈ సంధ్యను తెలుసుకునే విధానం మరొకటి ఉంది. ఇది కూడా చెయ్యవచ్చు. ధ్యానస్థితికి పనికి వచ్చేది. **'భ్రూవోర్ఘ్రాణస్య యస్సంధిః తత్ర సంధ్యాముపాసతే'**. కనుబొమలకి, నాసికకి నడుమ కలయికకి సంధి అని పేరు. అక్కడ ప్రకాశించే చైతన్యమే సంధ్య. అమ్మవారి అసలు తేజస్సు అక్కడ ఉంటుంది.

సహస్రారం నుంచి ప్రకాశిస్తున్న చైతన్యం ఈ మనశ్చక్రం దగ్గర్నించి పంచభూతాలలోకి ప్రవేశించి మన శరీరాన్ని నడుపుతోంది. మహాచైతన్యం మనస్సులోకి ప్రవేశించే సంధిస్థానంలో పట్టుకోవాలి. ఆజ్ఞాచక్రమే మనశ్చక్రం. అక్కడ ధ్యానం చెయ్యడం మొదలుపెడితే క్రమక్రమంగా సిద్ధిస్తుంది. ఇది ధ్యానప్రక్రియ. దానికే వారణాసి అని పేరు.

"శ్రీపర్వతం శిరః స్థానే వైద్యనాథం లలాటకే వారాణసీ భ్రువోర్మధ్యే" అన్నారు. శ్రీశైలం శిరస్సు. లలాటమందు వైద్యనాథం. వారణాసి కనుబొమల నడిమి ప్రాంతం.

కనుబొమల నడుమ ప్రాంతం వారణాసి. వరణ – అసి రెండు నదుల

నడుమ గంగ ఉంది. అలాగే ఇడ-పింగళ నాడులు వరణ- అసి. సుషుమ్ననాడి గంగ. ఈ మూడు కలిసే చోటు సంధ్య. జ్యోతిర్లింగం అక్కడ ఉంటుంది. ఆ జ్యోతే పరంజ్యోతి. అది మన శరీరానికి అంతటికి చిచ్ఛక్తి. అదే మన ప్రాణాలను రక్షిస్తోంది. అక్కడ ధ్యానం చేస్తే మనకు ప్రాణరక్షణ లభిస్తున్నది. ఇదంతా ధ్యాన - యోగ ప్రక్రియ.

వ్యాహృతి నామానికి మరొక అర్థం చూద్దాం. **'భూః భువః సువః'** వీటిని వ్యాహృతులంటారని చెప్పుకున్నాం. అవే బ్రహ్మగ్రంథివిభేదినీ, విష్ణుగ్రంథివిభేదినీ, రుద్రగ్రంథివిభేదినీ. మూడు వ్యాహృతులు.

బ్రహ్మదేవుడు పరమాత్మని ధ్యానిస్తూ ఉన్నప్పుడు పరమాత్మ జ్యోతిస్వరూపంగా దర్శనమిచ్చి మూడు రూపాలుగా వ్యక్తమయ్యాడు. అదే అకార-ఉకార-మకారాలు. అందులోంచి ఋక్కులు, యజుస్సులు, సామములు వచ్చాయి. వాటినుంచి సూర్యుడు, అగ్ని, వాయువులు వచ్చాయి. అక్కడ నుండి క్రమంగా భూమి, అంతరిక్షం, దివి వచ్చాయి. అంతరిక్షం అంటే ఆకాశం. దివి అంటే దేవలోకం.

ఈ మూడింటి సారమే ఋక్కు, యజస్సు, సామము. వీరే అగ్ని, వాయు, సూర్యులు. ఈ మూడింటి సారము అకార, ఉకార, మకారాలు. ఈ మూడింటి సారం ఓంకారం. ఓంకారం యొక్క సారం పరమాత్మ. పరమాత్మ మూడు రూపాలుగా వ్యాహృతి అయితే అవే "భూః భువః సువః". ఈ భావనతో చేస్తే సిద్ధి లభిస్తుంది.

ఋగ్వేదం-అగ్నిసారం. యజుర్వేదం-వాయుసారం. సామవేదం-సూర్యసారం. ఈ మూడు స్వరూపాలే ప్రపంచం. ఆ వ్యాహృతే విస్తరించి ఉచ్చారణ రూపంలో వచ్చింది. అగ్ని, వాయు, సూర్య మండలాలు - వాటిద్వారా భూమ్యాదులు క్షేమంగా ఉండాలంటే ఋగ్యజుస్సామాత్మక వేదవిద్యయే కాపాడుతుంది.

ఏ మంత్రమైనా సంస్కారం పొంది ప్రాణశక్తితో సంధ్యాకాలంలో ఉపాసన చేస్తే ఆ ఉచ్చారణ వ్యాహృతిగా ఉంటూ వారిని అది కాపాడుతుంది. గాయత్రి అనగా మనలో తిరిగే ప్రాణశక్తియే. అది ఉచ్చారణరూపంలో వచ్చింది గనుక వ్యాహృతి. దానిని సంధ్యలోనే (సమ్యక్ధ్యానంలో) మనం తెలుసుకోగలం. అది పొందాలంటే దానికి తగిన సంస్కారం పొంది ఉపాసించాలి.

423. ద్విజబృన్దనిషేవితా – శ్రీ ద్విజబృన్దనిషేవితాయై నమః

సంస్కారం పొందినవారిచే సేవింపబడుతున్నది. సంస్కారానంతరం మరొక జన్మయే. అదే ద్విజత్వం. వారిచే సేవించబడుతున్నది.

424. తత్త్వాసనా – శ్రీ తత్త్వాసనాయై నమః

తత్త్వాలను ఆసనములుగా కలది. ఆసనం ప్రధానం కాదు. ఆసనం మీద కూర్చున్నావిడ ప్రధానం. తత్త్వములే అమ్మవారికి ఆసనాలు. తత్త్వములు అంటే ప్రపంచంలో మనం చూస్తున్నవన్నీ ఇరవై నాలుగు తత్త్వాలు. అవి అవ్యక్తం, వ్యక్తము, మహత్, అహంకారం, పంచతన్మాత్రలు, పంచభూతాలు, పంచేంద్రియాలు. ఇవి అమ్మవారికి ఆసనము. రాజుగారు కూర్చుంటేనే సింహాసనానికి శక్తి. అలా అమ్మవారు కూర్చుంటేనే ఆ 24 తత్త్వాలకి చైతన్యం వస్తోంది.

24 తత్త్వాలను అధిష్ఠించిన శక్తియే 'తత్త్వాసనా'. తత్త్వసంఖ్య అంటే 24. ఈ 24 తత్త్వాలు ప్రపంచమంతా నిండి ఉన్నాయి. అమ్మవారు వాటిని అధిష్ఠించడం వల్లే ఆ 24 తత్త్వాలకు చైతన్యం, గౌరవం, చలామణి ఉంటాయి. ఆసనంపై కూర్చుంది అంటే ఆసనము కంటే పైన ఉన్నదని అర్థం. ఆ 24 తత్త్వాలకు ఆవల ఉన్న తత్త్వమే అమ్మవారు అని అర్థం. అధిష్ఠాన చైతన్యం.

ఈ నామానికి గాయత్రితో సంబంధం ఉంది. తత్త్వసంఖ్య అయిన 24 అక్షరాల గాయత్రి. అందరూ చదువుకోదగ్గ గాయత్రి ఉంది. ఆ గాయత్రికి కూడా 24 అక్షరాలే. అది –

సర్వచైతన్యరూపాం తాం
ఆద్యాం విద్యాం చ ధీమహి
బుద్ధిం యా నః ప్రచోదయాత్ (దేవీభాగవతం)

మనలోను, ప్రపంచంలోను 24 తత్త్వాలు ఉన్నాయి. మనలో ఉన్న 24 తత్త్వాలలో అధిష్ఠించి, వాటిని నడుపుతూ, వాటికి అతీతంగా ఉన్నది కనుక తత్త్వాసనా.

425. తత్ - శ్రీతస్మై నమః

426. త్వమ్ - శ్రీ తుభ్యం నమః

427. అయి - శ్రీ అయ్యై నమః

తత్త్వమయీ - శ్రీ తత్త్వమయ్యై నమః

తత్త్వాసనా తత్త్వమయిగా కనబడుతోంది. అనేకమంది వ్యాఖ్యాతలు ఈ 'తత్త్వమయీ' నామాన్ని తత్-త్వమ్-అయి అని మూడు నామాలుగా చూపించారు. 'తత్త్వమయీ'ని ఒక నామంగానే తీసుకోవచ్చని భాస్కరరాయలకు పూర్వం భాష్యం రచించిన నారాయణభట్టు, వైద్యనాథ్ దీక్షితులు మొదలైనవారు చెప్పారు. నారాయణభట్టు 'తత్త్వమయీ' ఒక నామంగానే తీసుకున్నారు. ఇదీ సమంజసమే

భాస్కరరాయలవారు తత్ ఒక నామం, త్వమ్ ఒక నామం, అయి - ఒక నామంగా చూపించారు. అది దోషం కాదు కానీ, ఇక్కడ నారాయణభట్టుది సముచితం. ఆయన ప్రమాణం చాలా చక్కగా అన్వయింపబడుతోంది. భాస్కరరాయలవారు చెప్పింది కూడా ఒక మంచి వివేచన కలిగింది కనుక ఆయనదీ స్వీకరించవచ్చు.

తత్త్వాసనా అన్నప్పుడు ఆసనం వేరు, ఆసనం మీద కూర్చున్నవారు వేరు అవుతారు. కానీ అమ్మ అలా లేదు. ఆసనంలో కూర్చొంటూ ఆసనమే ఆవిడలా కనబడుతోంది. ఇది ఎలాగంటే ఉంగరం-బంగారం. ఉంగరం బంగారమయం. బంగారానికి నిజానికి ఉంగరం ఆకారం లేదు. కానీ ఉంగరంలో బంగారం ఇమిడింది. అదే విధంగా ఈ తత్త్వాలన్నిటిలో అమ్మ చైతన్యం వ్యాపించి ఉందని చెప్పడం కోసం తత్త్వమయీ అని చూపించారు. 24 తత్త్వాలలో అమ్మ తప్ప మరేం లేదు కనుక తత్త్వాసనా, తత్త్వమయీ.

24 తత్త్వాలలో ఉన్న పరమాత్మని తెలుసుకోకుండా నిప్పుమీద నివురులా అజ్ఞానంతో పరమాత్మని కప్పేశాం. ముందు దానిని ఊదాలి. ఆ 24 తత్త్వాల పైనున్న అవిద్యా మాలిన్యాన్ని తీసివేస్తే లోపల ఉన్న ఆ 'తత్త్వాసనా' 'తత్త్వమయీ' కనబడుతుంది. దానికోసం ఒకొక్క తత్త్వంలో ఈశ్వరుడు ఏ పేరుతో ఉన్నాడో తెలుసుకోమని చెప్పి కేశవ, నారాయణ, మాధవ అని 24 పేర్లు చెప్పారు.

24 తత్త్వాలతోనే మనం పాపాలు చేస్తున్నాం కనుక, ఈ 24 నామాలతో ఆచమనం చేస్తే, ఆ పాపమాలిన్యం పోయి, ఆ 24 తత్త్వాలలో చిచ్ఛక్తి అయిన గాయత్రీరూపంలో ఉన్న అమ్మ దర్శనమిస్తుంది.

మరొక అర్థం పరిశీలిస్తే 'ద్విజబృన్దనిషేవితా' వరకు ఉన్న నామాలలో ప్రాణశక్తే తల్లి అని చెప్పుకున్నాం. ఈ ప్రాణశక్తి అయిన తల్లి 24 తత్త్వాలను ప్రసరింపజేస్తూ ఉంది. ఈవిడ మనలో సరిగ్గా వెన్నుపూస మధ్యలో తిరుగుతోంది. మన వెన్నులో ఇరవై నాలుగు పూసలు ఉంటాయి. వీణలో కూడా ఇరవై నాలుగు మెట్లు ఉంటాయి. మనలో 24 తత్త్వాలని ఆసనంగా తీసుకొని ప్రాణస్వరూపంగా తిరుగుతూ ఉన్న కుండలినీ రూప ప్రాణస్వరూపం. ఆ తల్లి ఈ పూసలలో ప్రకాశిస్తూ తత్త్వమయిగా ఉన్నది. తత్త్వాలని ఆసనంగా తీసుకొని 24 పైన కూర్చొంది. ఇలా క్రమంగా వెళ్తూ ఉంటే పైన సహస్రారంలో కూర్చుని ఉన్న తల్లి 24(తత్త్వ సంఖ్య)కి పైన ఉన్నది.

తత్త్వశుద్ధి అయితే తత్త్వంలో ఉన్న చైతన్యం సిద్ధంగా కనిపిస్తుంది.

428. పంచకోశాంతరస్థితా – శ్రీ పంచకోశాంతరస్థితాయై నమః

ఈ నామానికి 'పంచప్రేతాసనా' 'పంచబ్రహ్మస్వరూపిణీ' నామాల దగ్గర విస్తారంగా చెప్పుకున్నాం. 'పంచకోశాంతరస్థితా'లో ఒక అద్భుతం ఉంది. మన శరీరం మొత్తం పంచకోశాలతో తయారైంది. ఈ పంచకోశాల లోపల ఎవరున్నారు? పంచకోశ–అంతరం అన్నారు. అదే అంతర్దృష్టి. అంతర అంటే లోపల ఉన్న తల్లిని చూడమన్నారు. గదులు కట్టినట్టు అన్నమయకోశం, ప్రాణమయకోశం అని విడివిడిగా లేవు. అన్నమయకోశం అంటే కనబడే ఈ స్థూల శరీరం. అన్నం వల్ల పుట్టి, అన్నం వల్ల పెరుగుతోంది మన శరీరం. దీనిలో తిరుగుతున్న ప్రాణశక్తి **ప్రాణమయకోశం.** దీనిలోపల సంకల్పవికల్పాలు చేస్తూ అనుభూతి ప్రధానంగా ఉన్న మనస్సు **మనోమయకోశం.** విచారణ చేస్తున్న బుద్ధి **విజ్ఞానమయ కోశం.** సుఖం, దుఃఖం అనుభవిస్తున్నాననుకుంటూ లోపల ఉండేది **ఆనందమయకోశం.** ఈ ఐదింటిని ప్రకాశింపజేస్తూ వెనకాల (లోలోపల) ఉన్నది **పరమాత్మ.** అది **పంచకోశ–అంతరస్థితా.**

అన్నమయకోశం లోపల ప్రాణమయకోశం ఉంది. ఏది ఆధారమో అది లోపల ఉంటోంది. కొండపల్లి బొమ్మలు అమ్ముతూ ఉంటారు. పైది ఉన్న బొమ్మ తీస్తే లోపల మరొక బొమ్మ ఉంటుంది. అయితే అవి ఏ బొమ్మకాబొమ్మే. కానీ మన శరీరంలో ఈ పంచకోశాలు లోపల ఉన్న బొమ్మ వల్ల పై బొమ్మ ఉంటుంది. పై బొమ్మైన అన్నమయకోశం ఉండడానికి పనికొచ్చే బొమ్మ ప్రాణమయకోశం. అది ఉండడానికి పనికొచ్చే బొమ్మ మనోమయకోశం. దాని తరువాత విజ్ఞానమయకోశం. దానిలోపల ఆనందమయకోశం. ఆనందమయకోశం లోపల **'బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా'** అని చెప్పి ఆ చివర అమ్మవారు ప్రకాశిస్తోంది. ఆవిడే 'పంచకోశాంతరస్థితా'. పంచకోశ అంతరం అంటే లోపల ఉంది. అదే అంతఃపురం. అంతఃపురంలో ఆ తల్లిని మనం దర్శించాలి.

మరొక అర్థంలో పరిశీలిస్తే – పంచకోశాలలో అంతరం అంటే మధ్యలోదని అర్థం. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయకోశాలు. వీటిలో మధ్యన ఉండే మనోమయకోశం. మధ్యకోశమైన మనస్సుతోనే సాధన చెయ్యాలి. 'మనోవాచామగోచరా' అని ముందు నామాలలో చెప్పి, ఇప్పుడు మనస్సుతో సాధన చెయ్యాలని చెప్తున్నారు. ఈ మాటని వేదం చెప్తూ **'యన్మనసా న మనుతే'** – మనస్సుకి దొరకదు అంటూనే **'మనసా ఏవ అనుద్రష్టవ్యా'** – మనస్సుతోనే తెలుసుకో అంటోంది.

మనస్సుకు దొరకదు అని చెప్పడంలో రహస్యం – సంస్కారం లేని మనస్సుకు దొరకదని అర్థం. సంస్కారం పొందిన మనస్సు అంటే 'తపసా శ్రద్ధయా మనీషయా' అని ఉపనిషత్ చెప్తోంది. తపస్సుతో అనగా సాధనతో, విశ్వాసంతో, ఆలోచనతో సాధన చేస్తే మనస్సుకు సంస్కారం వస్తుంది. ఆ సంస్కారం పొందిన మనస్సుకి అమ్మ దొరుకుతుంది.

అంతర్ముఖ ప్రజ్ఞ కలిగిన మనస్సుకి దొరుకుతుంది. ఆ ప్రజ్ఞకు వెళ్ళడమే ద్విజత్వం. ఆ ప్రజ్ఞ లేకపోవడం పశుత్వం. అక్కడికి మనం చేరగలిగితే అది పంచకోశ అంతర – ఆ మనోమయకోశంలోంచే దానిని పట్టుకోగలం గనుక 'పంచకోశాంతరస్థితా'. ఇది మరొక అర్థం.

పంచకోశాంతరస్థితా - ఐదింటికి ఆధారంగా ఉందని చెప్పడం ఒకటి. మధ్యలో ఉన్న మనస్సుతోనే అమ్మని సాధన చెయ్యాలి అని మరొక అర్థం. మొదటిది సిద్ధమైన అర్థం. రెండవది సాధనకి పనికి వచ్చే అర్థం.

429. నిస్సీమమహిమా - శ్రీ నిస్సీమమహిమ్నే నమః

పంచకోశాలకి పరిమితి ఉంది కానీ ఆ ఐదింటిలోపల ఉన్న అమ్మకి పరిమితి లేదు. 'నిః' అంటే లేదు అని అర్థం. 'సీమ' అంటే హద్దు, మహిమ. అమ్మకి, ఆమె మహిమకు - ఈ రెండిటికి పరిమితి లేదు. మహిమ అంటే శక్తి యొక్క ప్రకటన.

శరీరంలో ప్రకాశించే చిత్ జ్యోతి సమస్త భువనాలను, గ్రహాలను, నక్షత్రాలను ప్రకాశింపజేస్తున్నది. మనం చూడగలిగే లోకాలన్నీ ప్రకాశింపజేస్తున్నది. వాటి హద్దు దాటిన లోకాలను కూడా ప్రకాశింపజేస్తున్నది. లోకాలకి హద్దు ఉంది కానీ లోకేశ్వరికి హద్దు లేదు.

మనం కిటికీ లోంచి సూర్యకాంతి చూస్తే సూర్యకాంతికి హద్దు కాదది... కిటికీకి హద్దు. అదే 'నిస్సీమమహిమా'.

430. నిత్యయౌవనా - శ్రీ నిత్యయౌవనాయై నమః

తత్త్వచింతన చేయిస్తూ వెంటనే అమ్మవారి సగుణసాకార రూపంలోకి తీసుకెళ్తున్నారు. అమ్మవారు ఎల్లప్పుడు నిత్యయౌవనగా ఉంటుంది. నిత్యయౌవనం అంటే కాలం యొక్క దోషం లేనిది అని అర్థం. యౌవనం పోయిందంటే కాలదోషం పట్టిందని అర్థం.

అమ్మవారి దివ్యచైతన్యానికి కాలదోషం లేదు. కాలానికి లొంగేవారికి సీమ ఉంటుంది. కాలానికి అతీతురాలు అమ్మవారు.

431. మదశాలినీ - శ్రీ మదశాలిన్యై నమః

'మద'మనగా పారవశ్యం. బ్రహ్మానందముతో శోభించునది. ఇతర విషయాలు

లేని కేవలానందమే మదం. వృత్తిరహిత నిర్విషయానందమే బ్రహ్మానందం. ఆ ఆనందంతో ప్రకాశించునది.

432. మదఘూర్ణితరక్తాక్షీ - శ్రీ మదఘూర్ణితరక్తాక్ష్యై నమః

433. మదపాటలగణ్డభూః - శ్రీ మదపాటలగణ్డభువే నమః

మదముతో తిరుగుతున్న ఎర్రని కళ్ళు కలిగిన అమ్మవారు. ఆ కళ్ళని అటూ ఇటూ త్రిప్పి చూస్తోంది. అంతే కాదు - యౌవనం వల్ల అమ్మవారి చెక్కిళ్ళు నిగనిగలాడుతూ నిగారింపుగా ఉన్నాయి. **మదపాటలగణ్డభూః** - ఆ నిగారింపు కలిగిన పాటలత్వం అంటే ఆ ఎర్రని ఎరుపు కల తల్లి. అసలే ఎర్రని పిల్ల అయిన ఆ తల్లికి బుగ్గల దగ్గర, అరచేతుల దగ్గర, అరికాళ్ళు దగ్గర మరింత ఎరుపు కనిపిస్తోంది.

మదపాటలం అంటే ఆ యౌవనం వల్ల వచ్చిన పారవశ్యపు గొప్పదనం. ఇది మద శబ్దానికి వాడిన సరైన పదం. ఇది మనం అనుకునే గర్వం, పొగరు కాదు. పారవశ్యం. ఆనంద లక్షణం. మదం అనగా ఆనంద లక్షణం. ఆ ఆనందం అమ్మ తనువంతా భాసిస్తోంది. అదే 'నిత్యయౌవనా' 'మదశాలినీ'.

'శాలినీ' అంటే స్వభావం, స్వరూపం అని రెండర్థాలు. అమ్మ ఆనంద స్వరూపం - ఆనందతత్త్వం. ఆ ఆనందం ఆ కళ్ళలో త్రుళ్ళింతలాడుతోంది కాబట్టి 'మదఘూర్ణితరక్తాక్షీ'.

'మదపాటలగణ్డభూః' – అది ఆ చెక్కిళ్ళలో ప్రతిఫలిస్తోంది. నవ్వుతూ ఉన్నప్పుడు ఆ కళ్ళు, చెక్కిళ్లు మరింత మెరిసిపోతాయి. ఆనందాన్ని ప్రకటిస్తూ అమ్మ నవ్వుతోంది. ఆ ఎర్రని పెదవుల మీద ఆ తెల్లని నవ్వుకి ఆ బుగ్గలు కాస్తా విచ్చుకున్నాయి. అలా విచ్చుకున్నప్పుడు అందులో లేత ఎర్రదనం మరింత కనిపిస్తోంది. ఆ లేత ఎర్రదనమే 'పాటలం'.

'భూః' అంటే భూమి, చోటు. గండ అంటే బుగ్గలు, పాటల అంటే ఎరుపు. మద అంటే ఆనందం. ఆనందపారవశ్యపు ఎర్రదనం చేత మెరిసిపోతున్న కపోలాలతో ఆ తల్లి ఉంది. దానికి తోడు ఆ కళ్ళు అటూ, ఇటూ త్రిప్పి చూస్తోంది. అలా త్రిప్పి

చూడకపోతే ప్రపంచం నడవదు. ఆవిడకి సూర్య, చంద్రులు కళ్ళు. అందుకు అటూ, ఇటూ త్రిప్పుతోంది. అందులోంచి ప్రపంచానికి ఆనందాన్ని వర్షింపజేస్తోంది. ఘూర్ణితరక్తాక్షి. ఘూర్ణిత అంటే తిరగడం. 'రక్తం' అంటే ఎరుపు. విశ్వకారణ శక్తికి సంకేతమే అరుణ వర్ణం.

'మదో రేతసి కస్తూర్యాం గర్వే హర్షే ఇభదానయోః మద్యేఽపి మద ఆఖ్యాతః' అని మద శబ్దానికి నానార్థాలు చెప్పారు. హర్షము (ఆనందం), కస్తూరి. ఈ రెండిటిని మదం అంటారు. ఆనందానికి మదం అనే పేరుంది. గర్వానికి కూడా మదమనే పేరు ఉంది. మద్యపానం వల్ల వచ్చే పారవశ్యానికి మదం ఉంది. కొంతమంది ఈ ఆఖరి అర్థాన్ని తీసుకొంటారుగాని అది తప్పు. ఇక్కడ అన్వయించరాదు.

అమ్మవారు మదం పానం చేసిన ఘట్టం ఒకటి ఉంది. ఆవిడ అద్భుతమైన రూపం ధరించి మహిషాసుర సంహారానికి బయలుదేరినపుడు మదిరాపాత్రను కుబేరుడు ఇస్తాడు. మదిరాపాత్ర అంటే ఒకానొక ఆనందమైన మధుపాత్ర.

మహిషాసురుడు డెక్కలు విసురుతూ, మట్టిని చిమ్ముతూ తెగ విజృభిస్తుంటే అన్ని రూపాలతో వాడిని కొట్టింది. ఇంకా అరుస్తున్నాడు. **"గర్జ గర్జ క్షణం మూఢ మధుయావత్ పిబామ్యహం"** అంది తల్లి. "గర్జించు, గర్జించు నేనిది తాగేవరకే నీ గర్జన. ఇది తాగడం పూర్తయ్యాక దేవతలు ఆనందంతో గర్జిస్తారు. అప్పుడు నీ గర్జన ఆగిపోతుంది" అంది. మధుపానం చేసి కాలితో ఒకటి కొట్టింది. దానితో మహిషాసురుడు మరణించాడు. ఆ మధువు త్రాగే వరకే రాక్షసుల విజృంభణ. మధువు త్రాగాక రాక్షసత్వం పోయింది. ఏమిటా మధువు? ఆ మధువే సచ్చిన్మయ బ్రహ్మానందం.

బ్రహ్మానందమనే మాధుర్యం దొరికితే అజ్ఞానమనే అసురత్వం నశిస్తుంది. అదే సహస్రారకమలం అనే మధువును పానం చేస్తూ ఉంటే అంత వరకు మూడు దేహాలు నేను అనుకునే అజ్ఞానం (మహిషాసురుడు) నశిస్తుంది. ఆ బ్రహ్మానంద పారవశ్యం అమ్మ మూర్తిలో కనబడుతున్నది.

అమ్మవారు ఆ నవయౌవనంతో కూర్చున్నప్పుడు ఆవిడ బ్రహ్మానందరూపిణి

అని ఆవిడ రూపం అంతా చెప్తోంది కనుక 'మదశాలినీ'. ఆ ఆనందం ఆవిడ కళ్ళల్లో తిరుగుతోంది. ప్రాపంచిక వికారాలను మరచిపోయిన ఆనంద పారవశ్యం ఆ కళ్ళల్లో మెదులాడుతోంది.

'మదపాటలగణ్డభూః' – ఆ తల్లికి బుగ్గలలో, చెక్కిళ్ళలో ఆ ఆనందం మిలమిల మెరుస్తోంది.

అమ్మవారి ఆకృతి ధ్యానయోగ్యమైన దివ్యమంగళ విగ్రహం. ఆ భావనలో పరిపూర్ణమైన ఆనందస్ఫూర్తి కలిగి రాక్షసభావాలు నశిస్తాయి. ఈ నామాలను ఉచ్చరిస్తున్నప్పుడు అమ్మవారిని పరిపూర్ణంగా ధ్యానం చేస్తే మన హృదయమంతా బ్రహ్మానందంతో నిండిపోతుంది.

434. చందనద్రవదిగ్ధాంగీ – శ్రీ చందనద్రవదిగ్ధాంగ్యై నమః

అమ్మవారి ఆరాధనలో ప్రధానంగా ఉపయోగించేది చందనద్రవం. అనంగకుసుమ, అనంగమేఖల మొదలైన దేవతలు ఆ మణిద్వీపంలో అమ్మవారి ఆరాధన చేస్తూ అమ్మవారికి చందనం పూశారు.

'చందనద్రవదిగ్ధాంగీ' – ఆహ్లాదకర ఆనంద సుధతో డబ్భైరెండు వేల నాడులలో ప్రకాశిస్తున్న చైతన్యరూపమే ఇక్కడ బావించాలి. అమ్మవారికి 'అమృతచైతన్యవిగ్రహా' అని పేరు ఉంది.

అమృతం – చైతన్యం అని రెండు ఉన్నాయి. చైతన్యం అంటే జ్ఞానం. అమృతం అంటే ఆనందం. జ్ఞానానందస్వరూపిణి. ఆ జ్ఞానానందం పెల్లుబుకుతోంది. చందనంలాంటి సుగంధం ఉంటే అది దిక్కులంతటా వ్యాపిస్తుంది. అలా అమ్మవారి యొక్క దివ్య గుణములు కరుణ, వాత్సల్యము, సౌజన్యము, శక్తి, ప్రతాపము, ప్రకాశము – ఇవన్నీ దివ్యగుణములు. ఆ దివ్యగుణముల కీర్తి అంతటా వ్యాపిస్తోంది. ఇదే 'సుగంధిం పుష్టివర్ధనం'. అమ్మ యొక్క దివ్యగుణాల కీర్తియే చందనద్రవం. వాటితో ఆర్ద్రయై కనిపిస్తోంది కనుక 'చందనద్రవదిగ్ధాంగీ'.

మొత్తం చిచ్ఛక్తి అయిన తల్లిని ఉపాసన చేస్తూ ఆ శక్తి మూర్తిని ప్రతిష్ఠ

చేసుకున్నాం. ఆ మూర్తియే 'నిత్యయౌవనా' 'మదశాలినీ' 'మదఘూర్ణితరక్తాక్షీ'. 'మదపాటలగణ్డభూః' 'చందనద్రవదిగ్ధాంగీ'.

అమ్మవారి దివ్యమంగళ విగ్రహానికి ఉండవలసిన సమస్త సాముద్రికా లక్షణాలు వరుసగా ఇక్కడ చెప్పబడ్డాయి. ముందుగా నిత్య యౌవనం. అమ్మ స్వరూపంలో ఎప్పుడూ ఎదగని పసితనం గాని, జీర్ణించిన వృద్ధాప్య వికారాలు గానీ లేకుండా ఒక పరిపూర్ణత ఉంది. ఆ పరిపూర్ణతను తెలియజేసేదే 'నిత్యయౌవనా'. యౌవనం యొక్క స్వభావమైన ఆ చైతన్యం, ఆనందపారవశ్యం అమ్మ మూర్తి యందు శాశ్వతంగా కనిపిస్తుంది కనుక మదశాలినీ అని చెప్పి, అటు తరువాత 'మదఘూర్ణితరక్తాక్షీ' అన్నారు. అమ్మ నేత్రాలయందు ఆనంద పారవశ్య అనుభూతి వ్యక్తమవుతున్నది. ఘూర్ణిత అనగా తిరుగుతున్నదని అర్థం. మదఘూర్ణిత అంటే ఆనంద పారవశ్యంతో చలిస్తున్న రక్తాక్షి అనగా ఎర్రని నేత్రాలు కలిగిన తల్లి అని చెప్పారు.

మంత్రహృదయం తెలిసిన మహాత్ములు ఒక అద్భుతవిషయాన్ని ఆవిష్కరించారు. 'నిత్యయౌవనా' నుండి 'చాంపేయకుసుమప్రియా' వరకు చదువుకుంటే రక్తాక్షి దేవత యొక్క అనుగ్రహం కలుగుతుంది.

రక్తాక్షి అనేది అరవై సంవత్సరాలలో ఒక సంవత్సరం పేరు. అరవై సంవత్సరాలు సూర్యభగవానునికి సంబంధించినవే. రక్తాక్షుడు అంటే సూర్యభగవానుడు. ఆయన యందు ఉన్న శక్తియే రక్తాక్షి. రక్త అంటే ఎరుపు అని అర్థం. 'రక్తః' అనే పేరు ఆదిత్యహృదయంలో సూర్యభగవానుని నామంగా కనబడుతున్నది.

'అసౌ యస్తామ్రో అరుణ ఉత బభ్రుః సుమంగళః' అని చెప్పినట్లుగా ఎర్రని కాంతులతో ప్రకాశిస్తూ ఉంటాడు. పైగా ఆయనే జగచ్చక్షువు. సూర్యుడు అమ్మవారి కన్నే. అగ్ని కూడా అమ్మవారి కన్నే. చంద్రునికి కూడా ఎర్రదనం ఉందని వర్ణిస్తోంది భాగవతం. ఒకానొక పూర్ణిమనాటి మొదటస్థితిలో చంద్రుడు కూడా ఎర్రగా కనబడతాడు. కాంతి యొక్క ప్రథమ వికసనం ఎరుపే. తరువాత బంగారము, తెలుపు మొదలైనవి వస్తాయి. 'వర్ణానాం ఆద్యం లోహితం' అని ఉపనిషత్ చెప్తోంది.

'రక్తాక్షీ' అంటే సూర్యచంద్రాగ్నుల రూపంతో ఉన్న నేత్రములు. అవి ఎప్పుడూ

ఆనందస్వరూపమే. యుగాలనుండి ఆ తేజస్సు పరిపూర్ణంగానే ప్రకాశిస్తూ జగతికి ఆనందం కలిగిస్తోంది. సంచరణ లక్షణం కలిగినవి కనుక ఘూర్ణితాలు. మదఘూర్ణితరక్తాక్షీ... అంటే సూర్య-చంద్ర-అగ్ని నేత్రములు కలది అనే భావం కూడ స్పష్టంగా సరిపోతుంది.

ఘూర్ణితమునకు శాస్త్రీయమైన వ్యాఖ్యానం చెప్తూ- **'బాహ్య విషయ వైముఖ్యం ఘూర్ణనమ్'** అన్నారు. బాహ్యవిషయాల పట్ల విముఖత అమ్మనేత్రాలలో ఉంది. బాహ్యవిషయాల పట్ల సుముఖత అంటే అజ్ఞానం. బాహ్యవిషయాల పట్ల విముఖత్వం అంటే జ్ఞానం. ఆ జ్ఞానమే ఇక్కడ ఘూర్ణనం. మద అంటే పారవశ్యం. బ్రహ్మానందపారవశ్యంతో ఉన్న నేత్రాలు.

ప్రపంచాన్ని మనం చూసిన దానికి, ఒక యోగి చూసిన దానికి చాలా తేడా ఉంటుంది. 'అంతర్లక్ష్యం బహిర్దృష్టిః' అని శాంభవీముద్ర గురించి చెప్పినపుడు వివరించుకున్నాం. బహిర్దృష్టి స్థితిలో ప్రపంచాన్ని చూస్తున్నప్పుడు మన దృష్టికి వికారాలు వస్తాయి. ఇష్టమైన వస్తువుని చూస్తే ఒక రకంగా, కొంచెం తేడా వస్తే ద్వేషపూరితంగా, సందేహం వస్తే ఒకరకంగా నేత్రములలో ఇన్ని వికారాలు ఉంటాయి.

కానీ అమ్మ నేత్రాలలో ఒకే అవస్థ ఉంది. అదే ఆనందపారవశ్యం. అంతర్ముఖమైన ఆనందపారవశ్య అనుభూతిలో ఓలలాడుతూ ఉంది. తరంగితమవుతోంది. అలాంటి ఆనందపారవశ్యంతో కూడి బాహ్యవిషయవైముఖ్యాన్ని కలబోసిన జ్ఞాన ఆనందస్వరూపాలే అమ్మవారి నేత్రాలు. అలాంటి అమ్మనేత్రాలని ఎందుకు ధ్యానించాలంటే ఆ చూపు మనపై ప్రసరిస్తే మనకి అటువంటి జ్ఞానానందాలు లభిస్తాయి.

మదపాటలగణ్డభూః - అమ్మవారి చెక్కిళ్ళు గురించి చెప్పే నామం. మద శబ్దానికి ఆనందపారవశ్యమని ఒక అర్థం. మరొక అర్థంలో కస్తూరి అని చెప్పుకున్నాం. అమ్మవారి దగ్గర అనంగకుసుమ, అనంగమేఖల మొదలైనవారు ఈ కస్తూరి లేపనం తీసికొని, చెక్కిళ్ళకి మకరికాపత్రాలను లిఖిస్తారు. మకరికాపత్రమని ఒక అలంకారం గురించి మన ప్రాచీన అలంకారశాస్త్రాలలో వర్ణించారు. ఈ వర్ణనలు ఇప్పటికి

ఉత్తరాది విగ్రహాలలో కనిపిస్తాయి. దక్షిణాదివారు ఎలాగైతే గోరింటాకు చేతులకు పెట్టుకుంటారో అలా అమ్మవారి చెక్కిళ్ళకి కస్తూరితో లిఖించిన ఒకానొక లేపనం చేస్తారు. దాని వల్ల అమ్మవారి చెక్కిళ్ళు మరింత ప్రకాశవంతంగా ఉన్నాయి. కస్తూరితో లిఖించబడిన వర్ణంతో ప్రకాశిస్తున్న కపోలములు గలది.

'చందనద్రవదిగ్ధాంగీ' అంటే అమ్మవారికి జరుగుతున్న కైంకర్యాల గురించి చెప్పే నామం. చందనము అంటే ఆహ్లాదము. చందనద్రవ - చందనమనేది ఒక ద్రవ్యమే కాకుండా చందనమనేది ఒకానొక గుణం పేరు. 'చది–ఆహ్లాదే' అనే ధాతువు నుంచి చందన శబ్దం ఉత్పన్నమైంది. ఆహ్లాదకర లక్షణం కలిగింది కనుకనే చందనం అని పేరు పెట్టారు.

అలాంటి శాంతికరమైన, ఆనందకరమైన 'ద్రవము' అంటే వ్యక్తీకరణ. అమ్మవారి స్వరూపం అంతా అటువంటి ఆర్ద్రమైన, ఆహ్లాదకరమైన, ప్రసన్నమయమైన శోభతో ఉంది కనుక 'చందనద్రవదిగ్ధాంగీ'.

435. చాంపేయకుసుమప్రియా - శ్రీ చాంపేయకుసుమప్రియాయై నమః

కుసుమప్రియా నామాలు చాలా వస్తున్నాయి. 'కదంబకుసుమప్రియా' అనే నామం ముందు వచ్చింది. ఇప్పుడు 'చాంపేయకుసుమప్రియా'.

చాంపేయకుసుమాలు అంటే సంపెంగపూలు. అదేవిధంగా నాగకేసర కుసుమములు అని మరొక అర్థం కూడా ఉన్నది. నాగకేసరము, సంపెంగ పూలతో అమ్మవారి ఆరాధన చాలా విశేషం.

నిజానికి చాంపేయము అంటే 'బంగారు రంగు పువ్వులు' అని అసలైన అర్థం. సింహాచలం సంపెంగ బంగారు రంగుతో ఉంటుంది. చాంపేయ కుసుమాలు అనగానే ఆ అర్థాన్నే చెప్తారు.

ముందు కదంబకుసుమం చెప్పుకున్నాం. కదంబకుసుమం అంటే కడిమిపువ్వులు అనే అర్థం కాకుండా సమూహభావమే కదంబం అని అర్థం చెప్పి మనలో వికసిస్తున్న రకరకాల షట్చక్రాలస్థానాలే కుసుమాలని ఒక భావం చెప్పుకున్నాం. భౌతికార్థం,

తత్త్వార్థం రెండు అర్థాలు తీసుకోవాలి.

చాంపేయం అంటే సువర్ణకాంతులు. కాంతిని వెదజల్లే లక్షణం. కాంతి అంటే జ్ఞానమనే అర్థం ఇక్కడ తీసుకోవాలి. చాంపేయ కుసుమములు అంటే జ్ఞానము, వికసనము. కుసుమం ఎప్పుడు వచ్చినా వికసన లక్షణమనే అర్థం తీసుకోవాలి. జ్ఞానంతో వికసించిన భావాలే అమ్మవారికి ఇష్టమైన పువ్వులు. భక్తితో, జ్ఞానముతో వికసించిన సు-వర్ణములు అంటే ఇవి. సువర్ణం అనేది కాంతిని ఎంత తెలియజేస్తుందో, అక్షరాలని అంత తెలియజేస్తుంది. మంత్రాలు, స్తోత్రాలు ఇవన్నీ సువర్ణకుసుమాలే. జ్ఞానంతో వికసించిన భావాలు, వాక్యాలు. ఈ రెండు కూడా చాంపేయకుసుమాలు. వీటన్నింటికి సమన్వయం 'చైతన్యకుసుమప్రియా' నామం దగ్గర వస్తుంది.

త్యాగరాజస్వామివారు 'నామ కుసుమములతో పూజింతు' అన్నారు. మనం పువ్వులతో పూజిస్తూ నామాలు అంటాం. అక్కడ పువ్వులు వేయడమే కాకుండా నామాలే కుసుమాలని భావించాలి. ఒకొక్క నామం విచ్చుకొంది. అలా అందులో ఉన్న జ్ఞానార్థం, ఆనందార్థం గమనిస్తూ అలాంటి నామకుసుమాలతో అమ్మవారిని ఆరాధించాలి. జ్ఞానంతో కూడిన భావాలని ఒక అర్థమైతే, జ్ఞానంతో కూడిన వాక్యాలు అని మరొక అర్థం. ఈ రెండు రకాల కుసుమాలు అమ్మవారికి ఇష్టం. తరువాత నామాలు -

కుశలా కోమలాకారా కురుకుల్లా కులేశ్వరీ
కులకుణ్డాలయా కౌలమార్గతత్పరసేవితా

ఈ నామాలన్నీ 'కులేశ్వరీ' విద్యని చెప్తున్నాయి. ప్రతి నామాల గుత్తి ఒక విద్య. విద్య అంటేనే ఉపాసన అని అర్థం. శ్రీవిద్య అంటే అమ్మవారి ఉపాసన అని అర్థం. ఇక్కడ కుశలావిద్య, కులేశ్వరీవిద్య - రెండూ ఒక్కటే. కుశలా, కురుకుల్లా - రెండూ ఒక్కటే.

436. కుశలా - శ్రీ కుశలాయై నమః

అమ్మవారి పేరు కుశలా. మనం వ్యవహారంలో కూడా "కుశలంగా ఉన్నారా?"

అని అంటుంటాం. కుశలము అనే మాటకి అనేకార్థాలు ఉన్నాయి. కుశలము అంటే గొప్పయోగం అని అర్థం. యోగం నిండుగా ఉంటే దాని పేరు 'కుశల' అనాలని కృష్ణపరమాత్మ గీతలో చెప్తాడు. **'యోగః కర్మసు కౌశలం'** అన్నారు. కుశలస్య భావం కౌశలం. కుశలత్వం అంటే– 'కర్మసు కౌశలం యోగః' – కర్మలయందు నైపుణ్యాన్ని యోగం అంటారు. కర్మలని చాలా నిపుణత్వంతో చేయాలి. అమ్మవారు అటువంటి నిపుణురాలు. మనం కుశలమనే మాటని క్షేమమనే అర్థంలో వాడతాం. క్షేమం ఒక్కటే కాదు దాని అర్థం. అసలైన అర్థాలు– నైపుణ్యం, నేర్పరితనం. అమ్మవారు పరమ నేర్పరురాలు. నేర్పరితనమే ఆవిడ.

'నేరములన్నియు నావి నేరుపులన్నియు నీవి' అంటారు అన్నమయ్య. అజ్ఞానంతో కూడినవాడు జీవుడు. జ్ఞానమే స్వరూపంగా కలవాడు పరమాత్మ. కుశలా అంటే జ్ఞానరూపిణి, నిపుణురాలు అని ప్రధాన అర్థం.

జగన్నిర్మాణ కౌశలత్వం కలిగిన తల్లి కనుక 'కుశలా'.

మరొక అర్థం 'కుశలా' అంటే క్షేమం. పరదేవత క్షేమస్వరూపిణి.

ఆధివ్యాధి మరణాది వికారాలు లేని దివ్యమంగళ విగ్రహం కలది. ఈ నామాన్ని 'నిత్యయౌవనా' నామంతో కూడా అనుబంధం స్వీకరించవచ్చు.

కర్మయందు నైపుణ్యం అంటే చాలా అద్భుతంగా చెయ్యడం అని మాత్రమే కాదు.

కర్మ వల్ల బంధం పొంది మోక్షానికి దూరమైపోతాం. జన్మలు ఎందువల్ల వస్తున్నాయంటే కర్మలవల్ల వస్తున్నాయి. అయితే కర్మ మానివేస్తే నరకంలో పడతారు. ఇదే పెద్ద చిక్కు. బ్రహ్మవిద్యాస్వరూపిణి అయిన అమ్మవారి కుశలా నామం గ్రహిస్తే యోగార్థం స్ఫురిస్తుంది.

గీతలో కృష్ణపరమాత్మ అర్జునునితో చెప్తూ 'కుర్వన్ కర్మాణి' – కర్మ ఎప్పుడూ చెయ్యాలి అని చెప్పారు. బ్రతికినంతకాలం కర్మలు చెయ్యవలసిందే. మరి, కర్మ బంధమైనపుడు ఏం చేయాలి? మన శరీరం కర్మ శరీరం. కర్మ శరీరం కర్మకే ప్రేరేపిస్తుంది. స్వర్గాలలో అనుభవించే శరీరాలు భోగ శరీరాలు. నరకాదులలో

శరీరాలు యాతనా శరీరాలు. అవి యాతనల కోసం వచ్చాయి. భూమి యందు ఉన్న శరీరాలు కర్మ కోసం వచ్చాయి. కర్మ చెయ్యడం దీని స్వభావమైనపుడు కర్మని మానేయమని చెప్పడం ఎలా? అంటే కర్మని కుశలతతో చెయ్యమని కృష్ణపరమాత్మ చెప్పాడు.

కర్మ మానక్కర్లేదు. కుశలతతో కర్మ చేయగలిగితే మనం మళ్ళీ జన్మపరంపరలో పడం. 'యోగః కర్మసు కౌశలం' అనే దానికి ఇది సరైన అర్థం.

కుశలత అంటే ఏమిటి? ఈ కర్మ నేను చేస్తున్నాను – అనే అహంకారాన్ని విడిచిపెట్టాలి. ఆ కర్మ ఫలాకాంక్షను వదలాలి. ఫలం రాదని కాదు. మనం ఆశించిందే ఫలం కాదు. ఇంకేదో ఉంటుంది. అది మనకు తెలీదు.

మనకి శాస్త్రం విధించిన కర్మని సరిగ్గా చేస్తున్నామా, లేదా అనేది ఆలోచించాలి. అంతేకాని నేను చేస్తున్నాననే అహంకారం గాని, ఎవడైనా గుర్తిస్తాడో లేదో అనే బాధ, ఫలితం వస్తుందా లేదా అనే అనుమానం ఇవన్నీ వదిలేయాలి. మనకు కర్మ చెయ్యడానికి పరికరాలు అన్నీ పరమేశ్వరియే ఇచ్చింది. మెలకువ, ఎరుక అమ్మ ప్రసాదాలే. కనుక ఫలం ఇదే అని మనం ఎలా నిర్ణయించగలం?

'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అన్నారు. ఫలం మీద 'వద్దు' అన్నారు గాని, 'లేదు' అనలేదు. 'మా' కి 'న' కి తేడా ఉంది. మన అధికారం కర్మ చెయ్యడం వరకే. ఫలం గురించి ఆలోచించనక్కర్లేదు.

నేను చేస్తున్నాననే అహాన్ని, దాని ఫలం మీద దృష్టిని విడిచిపెట్టి చెయ్యడం అంత తేలిక కాదు. కనుకనే దానికి నైపుణ్యం అన్నారు. దానిని యోగం అన్నారు. దానిని సాధన చెయ్యాలి. క్రమంగా అలా చెయ్యగలిగితే అది కౌశలం అని చెప్పారు. ఇలా చేస్తే మనల్ని ఆ కర్మ బంధించదు.

అటువంటి కౌశలం అమ్మ యొక్క స్వరూపం. ఆవిడ అనుగ్రహం ఉంటేనే కుశలత వస్తుంది. ఇది పరమార్థం. 'కుశలా' అంటే క్షేమరూపిణి, భద్రరూపిణి, మంగళరూపిణి, యోగరూపిణి.

437. కోమలాకారా – శ్రీ కోమలాకారాయై నమః

కోమలా అనే శబ్దానికి మృదుమధురమైన స్వభావము అని శాస్త్రీయమైన అర్థం. మృదువైన, మధురమైన స్వరూపము – కోమలము. అమ్మవారి స్వరూపంలో, స్వభావంలో మృదుత్వం, మధురత్వం రెండు లక్షణాలు ఉన్నాయి.

మృదుత్వం అంటే సౌమ్యం, వాత్సల్యము, సాత్త్వికత మొదలైనవి. పరమాత్మ అసలు స్వరూపం గుణాతీతా అయినప్పటికీ అనుగ్రహించడం కోసం రూపం స్వీకరిస్తే ఎప్పుడైనా శుద్ధసత్త్వగుణంతో ఉంటుంది. శుద్ధసత్త్వగుణమంటే రజోగుణ, తమోగుణ వికారాలు లేనిది. ఆ శుద్ధసత్త్వగుణమే మృదుత్వం.

లోకంలో కూడా ఒక సాత్త్వికుని చూస్తే వారిలోని సౌమ్యం, సౌజన్యంలాంటి ప్రసన్నభావాల వలన ఆనందం కలుగుతుంది. సత్త్వాత్ సంజాయతే జ్ఞానం – సత్త్వగుణం యొక్క లక్షణమే జ్ఞానము, ఆనందం. మరి శుద్ధసత్త్వగుణం ఉంటే శుద్ధమైన జ్ఞానం, శుద్ధమైన ఆనందం ఉంటాయి. ఆ శుద్ధమైన జ్ఞానానంద లక్షణమే మృదుత్వం. ఆ మధురము ఆనందం యొక్క లక్షణము.

శంకరభగవత్పాదులవారు – శివుడు అమ్మవారికి మెట్టెలు తొడిగేటపుడు అమ్మవారు పాదాల్ని ఎలా పట్టుకొన్నాడో వర్ణిస్తూ **"దృషది దయమానేన మనసా యదాదాయన్యస్తం"** అంటారు. మెట్టెలు పెట్టేటప్పుడు పాదాన్ని శాస్త్ర ప్రకారంగా సన్నెకల్లు మీద పెట్టాలి. ఇంత మెత్తని పాదాలని అంత కఠినమైన రాయి మీద పెట్టాలా! అని శివునికి జాలివేసిందిట. అందుకు **'దయమానేన మనసా'** – చాలా జాలిగా, జాగ్రత్తగా ఆ మెత్తని పాదాలను పట్టుకుని రాయి మీద పెట్టి మెట్టెలు తొడిగాడుట.

438. కురుకుల్లా –శ్రీ కురుకుల్లాయై నమః

'కుశలా' నుండి 'కౌలమార్గతత్పరసేవితా' వరకు అధిష్ఠాన దేవత 'కురుకుల్లా'. ఇది ఒక మంత్రం. 'కురుకుల్లాయై నమః' అనుకున్నా అదొక మంత్రం అవుతుంది. ఈవిడ ఒక తల్లి. శ్రీమన్నగర వర్ణనలో కురుకుల్లా దేవి ఉంది.

'చింతామణిగృహాంతస్థా' దగ్గర చెప్పుకున్నాం. చింతామణి గృహం శ్రీమన్నగరంలో ఉంది. శ్రీమన్నగరం ఇరవైఐదు ఆవరణలతో ఉన్నది. మొదటిది నానా వృక్షమహోద్యానవనం. తరువాత ఆరు కల్పవృక్షవనాలు. తరువాత భవ్యమైన కదంబవనం. ఆ తరువాత రత్నమయ ప్రాకారములు, తరువాత అద్భుతమైన కందకాలు కనిపిస్తాయి. అందులో కొన్ని ప్రాకారాలు ఉన్నాయి. ఆ ప్రాకారాలలో బుద్ధిశాల, అహంకారశాల అని రెండు శాలలు ఉన్నాయి.

ఈ పదాలను అర్థం చేసుకుంటే ఒకొక్క తత్త్వాన్ని మనం అధిగమిస్తూ బుద్ధి, అహంకార తత్త్వాలను దాటితే చింతామణి గృహం. అలా భావించితే మనలోనే మొత్తం మణిద్వీపం ఉంది. దానినే ఆర్యాద్విశతి అనే పేరుతో రెండు వందల శ్లోకాలుగా శ్రీమన్నగర వర్ణన చేసి పెట్టారు దూర్వాసమహర్షి. ఇదంతా బ్రహ్మాండపురాణంలో చేసిన వర్ణనకు ధ్యానరూపం.

శ్రీమన్నగరం, మణిద్వీపం – రెండూ ఒక్కటే. మన పెద్దవాళ్ళు దీనిని నిరంతరం భావన చెయ్యమని చెప్పారు. మణిద్వీప వర్ణన గాని, శ్రీమన్నగర వర్ణన గాని రోజూ చదువుకున్నా, గృహప్రవేశాల్లో చదివినా ఇంటికి మంచిది, ఒంటికి మంచిది. అది చదివి ఊరుకోవడం కాదు. అసలు ఎందుకిలా చెప్పారు. ఇలాంటి లోకం ఒకటి ఉందా? బ్రహ్మాండాలకి ఆవల ఏం ఉందో మనకి ఏం తెలుసు? తప్పకుండా ఉంది. సాలోక్యముక్తి పొందినవారు ఆ లోకానికి వెళ్తారు. అందులో ఏమీ సందేహం లేదు.

జీవన్ముక్తి కావాలంటే ఈ లోకాన్ని మన శరీరంలో భావించాలి. మన శరీరమే మణిద్వీపం. బుద్ధి, అహంకారమనే మాటలు చెప్తున్నారంటే ఈ బుద్ధి, అహంకారం ఎక్కడ ఉన్నాయి? మనలోనే ఉన్నాయి. కనబడుతున్న ఇంద్రియాలు మొదలైనవి దాటి లోపలికి ఇంకా వెళ్తూ ఉంటే బుద్ధి, అహంకారం అనే సూక్ష్మభూమికలు. ఇవి కూడా దాటి వెళ్ళ గలిగితే ఆ తరువాత మహాపద్మాటవీ, ఆ వెనకాల అమ్మవారి స్వరూపం అనగానే ఈ శరీరతత్త్వాలన్ని దాటిన తరువాత పంచకోశాంతరస్థితగా చెప్పడమే అందులో ఉన్న విషయం.

శ్రీమన్నగరంలో బుద్ధిశాల, అహంకారశాల అని రెండు శాలల మధ్య ఒక

బావి ఉంది. అలా మూడు బావులు ఉంటాయి. **'అమృతాది వాపికా త్రయాయ నమః'** అని మూడు బావులను భావించాలి. ఈ మూడు బావులలో అమృతవాపి ఒకటి. బుద్ధిశాల, అహంకారశాల మధ్యలో ఒక బావి ఉంది. ఆ బావిలో అమృతం ఉంటుంది.

ఆ భూమికకి చేరగలిగినవారు, సాలోక్య ముక్తిని పొందినవారు ఆ బావిలో అమృతాన్ని తాగగలరు. లోకంలో దాహం కలిగితే నీరు తాగితేనే ఆహా అనిపిస్తుందే. జన్మజన్మల జీవుల దాహాన్ని, తాపత్రయాలను పోగొట్టగలిగే శక్తి అమృతవాపిలో ఉంది. ఆ వాపి జలాన్ని పానం చేస్తే ఆ తాపత్రయమంతా పోతుంది.

ఆ జలం పేరు 'సౌషుమ్నామృతము'. సుషుమ్న అనే నాడి లోపల ప్రసరిస్తున్న 'చిదేకరసరూపిణి'. ఆ రసం అందుకోగలిగితే ఇంచుమించు చిట్టచివర చింతామణి గృహం దగ్గరికి వెళ్ళిపోయినట్లే. ఇంత యోగపరమైన భావనని లోకపరంగా బావిగా అభివర్ణించారు.

ఈ ఆనందం ఎక్కడ తెలుస్తుందంటే బుద్ధిశాలను కూడా దాటాలి. **"యో బుద్ధేః పరతస్తు సః"** అని భగవద్గీతలో పరమాత్ముడు చెప్తూ, "బుద్ధిని కూడా దాటిన తరువాత ఏది ఉందో అదే పరమాత్మ" అని చెప్పాడు.

ఆ వాపి దగ్గర ఒక శక్తి నాయకురాలుగా ఉంటుంది.. ఆవిడ పేరు కురుకుల్లా. సౌషుమ్నామృతానికి ఎవరు యోగ్యులో చూసి వారికి ఆ అమృతాన్ని ఇస్తుంది. ఆవిడ అనుజ్ఞ లేనిదే ఆ నూతిలో నీళ్ళు తీయడానికి లేదు. అక్కడి దాకా వెళ్ళడానికే ఒక అధికారం ఉండాలి. వెళ్ళాం కదా అని చేద పట్టుకుని తోడేస్తామంటే ఆవిడ ఒప్పుకోదు. అలా ఒకొక్క చోట ఒకొక్క దేవత ఉంటుంది. సుషుమ్నామృతం ఉన్న నూతి దగ్గర ఈ నాయకురాలు ఉంటుంది. ఆవిడే రసం ఇస్తుంది. ఆ రసాన్ని ఇచ్చి, ఆ స్థితిని కూడా దాటించి పరదేవత సన్నిధికి చేర్చుతుంది.

'కురుకుల్లా, కులేశ్వరి, కులకుండాలయా, కౌలమార్గతత్పరసేవితా' అని నామాల అనుబంధాన్ని చక్కగా చూపిస్తున్నారు. కులము అంటే షట్ చక్రకులం. అందులో ఉన్న సుషుమ్నామృతం. దానికి నాయకురాలు కురుకుల్లా.

ఈ నామంలో గుప్తంగా కొన్ని బీజాక్షరాలు ఉన్నాయి. అవి సభల్లో చెప్పరాదు కనుక "శ్రీ కురుకుల్లాయై నమః" అని స్మరణ చేసుకొంటే యోగ్యంగా ఉంటుంది.

నారాయణభట్టు పాఠంలో **'కురుకుల్యా'** అనే నామాంతరం కనబడింది. తప్పేమీ లేదు. అది కూడా గ్రాహ్యమే. కుల్యా అంటే కాలువ. మనం యోగసాధన చేసేటప్పుడు ఏ కుల్యా ఉందో అది సుషమ్నానాడి. దానిని ఆయన 'కురుకుల్యా' అని వర్ణించారు. కురుకుల్లా అనే వర్ణన మనకి శ్రీమన్నగర వర్ణనలో బ్రహ్మాండపురాణంలో కనబడుతోంది. ఈ కురుకుల్లా దేవికి నమస్కరిస్తూ ఆర్యాద్విశతిలో దూర్వాసుడు ఒక మాట అన్నారు-

కురువింద తరణి నిలయాం కులాచల స్పర్థి కుచనమనమధ్యాం

కుంకుమ విలిప్త గాత్రీం కురుకుల్లాం మనసి కుర్మహే సతతం

కురుకుల్లాదేవి -ఎర్రని కాంతులతో ప్రకాశిస్తూ కుంకుమ పూసిన మేనితో అక్కడ ఉంది. అద్భుతమైన రూపంతో ప్రకాశిస్తున్న కురుకుల్లా దేవికి నమస్కారం.

439. కులేశ్వరీ - శ్రీ కులేశ్వర్యై నమః

కులమునకు ఈశ్వరి. కులము అనగా **'మూలాధారాదికం చక్రషట్కం కులమితి స్మృతం'** అని శాస్త్రం. మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు కులము. సహస్రారాన్ని అకులము అంటారని ముందు నామాలలో వివరంగా చెప్పుకున్నాం. ఈ కులమునకు ఈశ్వరి. ఈ ఆరు చక్రాలు సుషమ్నా నాడి యొక్క మజిలీలు. ఆరు చక్రములు కలుపుకుని సుషమ్నా నాడి యొక్క స్వరూపం. ఆరు చక్రములకు కులమని పేరు. కురుకుల్లయే 'కులేశ్వరీ'.

440. కులకుణ్డాలయా - శ్రీ కులకుణ్డాలయా నమః

ప్రధానమైన తీగకి ఆధారం పాదులాగ ఈ మొత్తం కులమునకు ఆధారం మూలాధారం. ఆ మూలాధారం దగ్గర ఈ కుండలినీ **'సార్ధ త్రివలయాకారైః'** అన్నట్లుగా మూడున్నర చుట్లతో తల క్రిందకి దించిన పాములా ఉంటుంది. ఆ కుండలిని సర్పము పైకి లేచినప్పుడు సుషమ్నా మార్గం ద్వారా సంచరిస్తూ వెళ్తుంది. అలా

వెళ్ళినప్పుడు ఈ సుషుమ్నారసం అనుభవానికి వస్తుంది.

కులకుణ్డమంటే మూలాధారం. కులకుణ్డ - ఆలయా = మూలాధారమే ఆలయముగా చేసుకున్నది. అమ్మవారి గురించి శంకరులు చెప్తూ -

అవాప్య స్వాం భూమిం భుజగ నిభమధ్యుష్టవలయాం

స్వమాత్మానం కృత్వా స్వపిషి కులకుణ్డే కుహరిణీ

అన్నారు. మొట్టమొదటిగా డెబ్భైరెండు వేల నాడులను తడిపిన స్థితికి వెళ్ళాక మళ్ళీ క్రిందకి వచ్చి మూలాధారంలో తిరుగుతూ అక్కడ నుండి క్రిందకి, మీదకి స్వేచ్ఛగా సంచరిస్తుంది. అటు ఇటూ తిరుగుతున్నదానిని ఎవరైతే గమనించి ఆరాధన చేస్తారో వారు ఈ కులాన్నే సాధనగా తీసుకుని యోగ మార్గంలో వెళ్తున్నారు. అమ్మవారిని కుండలినీ/కుల రూపంలో ఉపాసించే వారు కౌలమార్గులు. వారి ప్రయాణం మూలాధారం, సహస్రారం.

'కుల అకులయోః సంబంధః కౌలం' అని అర్థం వెనుకటి నామాలైన 'కౌలినీ' దగ్గర విస్తారంగా చెప్పుకున్నాం. షట్చక్రాలకు, సహస్రారమునకు ఉన్న సంబంధమే కౌలము. ఈ సంబంధాన్ని తెలుసుకుంటూ మూలాధారం నుండి జాగృతి చెంది ఆ యోగ మార్గంలో ఎవరైతే అమ్మవారిని సాధన చేస్తూ ఉంటారో వారు కౌలమార్గులు.

441. కౌలమార్గతత్పరసేవితా - శ్రీ కౌలమార్గతత్పరసేవితాయై నమః

ఏ సాధన అయినా తత్పర బుద్ధితో చెయ్యాలి. 'తత్పర' అనేది గొప్పమాట. సమయాచారతత్పరా. శివశక్తుల ఏకత్వాన్నే ఎప్పుడూ భావిస్తూ ఉంటే సమయాచార తత్పరులు. కౌలమార్గతత్పరులు కొంతమంది ఉన్నారు. కౌలమార్గమంటే యోగ మార్గమందే తత్పరత కలిగి ఉన్నవారు. 'ఇదే నాకు ఉత్కృష్ట'మని దాని మీదే ఏకాగ్ర బుద్ధితో ఉంటే అదే తత్పరత్వం.

'కౌలమార్గతత్పరసేవితా' అంటే ఆ కౌలమార్గతత్పరులచే సేవించబడుతోంది.

శ్రీవిద్యలో ఒకదానికి ఒకటి అంగముగా పనికి వస్తాయి. ఒక వైపు శ్రీచక్ర ఆరాధన చేస్తూ, మరొక వైపు మంత్ర జపం చేస్తూ, మరొక వైపు ప్రాతఃకాలంలో

ఒకొక్క చక్రంలో ఉన్న అక్షరాలను, వర్ణాలను, ఆయా దేవతలను భావన చేస్తూ పైకి వెళ్ళడం అనేది ఒక క్రియ. అది అంతర్యాగ క్రమము. ఈ మూడు కలిపి గురుశిక్షణలో చేసుకోవచ్చు.

ఒక వైపు బాహ్య చక్రార్చన, లోపల అంతశ్చక్రార్చన, మూడవది జపం. మూడూ కలిపి చేసుకోవచ్చు. ఇవి మూడు ఒకే ఉపాసనకి సంబంధించినవి కనుక ఇక్కడ విక్షేపం లేదు. దీనికి మరొకటి కలిపితే విక్షేపం వస్తున్నది. కౌలమార్గతత్పరసేవితా ఇది సాధన చేసుకోవడం చాలా మంచిదే. హృదయ చక్రం, ఆజ్ఞాచక్రం దగ్గర అమ్మవారిని ధ్యానిస్తూ వెళ్తూ ఉంటే అది కూడా కౌలమార్గ తత్పరతయే.

కులేశ్వరీ, కులకుణ్డలయా అయిన ఆ తల్లిని కౌలమార్గ తత్పరులు సేవిస్తూ ఉంటారు.

రెండవ అర్థం- కుల మార్గము అంటే షట్ చక్రమార్గం ఒకటి. కులము అనగా వంశము. ఒక పరంపర. కులములు అంటే పితృవంశం, గురువంశమని రెండు ఉంటాయి. పితృవంశమంటే మన తండ్రి, తాతలు అక్కడ నుండి వచ్చిన కులము ఒకటి. రెండవది గురు వంశము. మన గురువులు పరంపరంతా ఒకటి. ఈ రెండూ కులములే.

మనం చేసే ఆచార వ్యవహారములు పితృపరంపరకి సంబంధించినవి ఉంటాయి. ఆ మార్గంలో మనం సేవించుకుంటూ ఉంటే మనం ఏ కులంలో(ఏ పరంపరలో)పుట్టామో **'కురు కర్మైవ తస్మాత్ త్వం పూర్వైః పూర్వతరం కృతం'** అని కృష్ణపరమాత్మ చెప్పినట్లుగా మన తాతతండ్రులు నడచిన ఏ సనాతన మార్గం ఉన్నదో ఆ మార్గంలో మనం వెళ్తూ ఉంటే అది కౌలమార్గం. అలాంటి సనాతన ధర్మ మార్గంలో పరంపరననుసరించి వెళ్తూ చేసిన పూజ అమ్మ తప్పకుండా పుచ్చుకుంటుంది.

ఎవరి కులపద్ధతిలో వారు అమ్మవారిని ఆరాధన చేసుకోవచ్చు. అదే కౌలమార్గమంటే. కొందరు గ్రామదేవతల రూపంతో ఆరాధించుకుంటూ ఉంటారు. అది వారి పరంపర. వారివారి కులాచారాల ప్రకారంగా చేసే పూజలకి అమ్మ సంతోషిస్తుంది కనుక కౌలమార్గతత్పరసేవితా.

మూడవ అర్థం- వారి గురుపరంపరని అనుసరించిన పద్ధతిలో ఆరాధిస్తే అది కౌలమార్గమే. గురువు-పరమగురువు-పరమేష్టి గురువు. ఇలా వచ్చిన పరంపర ఏదైతే ఉందో దాని ప్రకారం ఆరాధిస్తే అది కౌలమార్గం.

అది తత్పర బుద్ధితో ఆరాధించాలి. **'యస్య దేవే పరాభక్తిః యథా దేవే తథా గురౌ'** అని కఠోపనిషత్ చెప్తోంది. భగవంతుని యందు ఎంత భక్తి ఉందో అంత భక్తి గురువు యందు కూడా ఉండాలి. అలా ఉంటూ గురుపరంపరకి సంబంధించిన మార్గంలో ఆరాధిస్తూ ఉంటే, వారు కౌలమార్గతత్పరులు. అమ్మవారు వారి పూజ అందుకుంటుంది.

కౌలమార్గము అనగా ఒక అర్థం షట్చక్రమార్గముతో చేసే సాధన. రెండవది మన యొక్క వంశ పరంపరననుసరించి చేసేది. మూడవది గురుపరంపరని అనుసరించి చేసేది. ఈ విధంగా వివిధములైన కులమార్గాల ద్వారా ఆరాధింపబడే తల్లికి నమస్కారం చేసుకుంటూ, కురుకుల్లా అయిన తల్లి లలితాంబను నమస్కరించుకుందాం.

442. కుమారగణనాథాంబా - శ్రీ కుమారగణనాథాంబాయై నమః

'కుమారగణనాథాంబా' అన్నప్పుడు ఉపాసనారూపంగా, యోగరూపంగా రెండు రకాలుగా పరిశీలించాలి. గణనాథుడు అంటే గణపతి. కుమార అంటే సుబ్రహ్మణ్యస్వామి. వారిద్దరికి అంబ.

భాగవతంలో రుక్మిణీదేవి తన పెళ్ళికి ముందు అమ్మవారిని పూజ చేశారు. **"నమ్మితి నా మనంబున"** అని పోతనగారు చెప్తే, మూలంలో **"భవపత్నీం భవాన్వితాం స్వసంతానయుతాం శివాం"** - తన పిల్లలతో ఉన్న అమ్మవారిని పూజించింది అని వ్యాసులవారు చెప్పారు. పిల్లలతో పాటు పరమేశ్వరుడు కూడా ఉన్నాడు. భవునితో ఉన్న భవానీ, సంతానంతో ఉన్న శివా అన్నారు. ఇది ధ్యానిస్తే చాలా విశేషం.

పిల్లలతో ఉందంటేనే తల్లి అని తెలుస్తోంది. ఆ రూపాన్ని ధ్యానిస్తే వాత్సల్యభావం మరింత లభిస్తుంది.

జంబుకేశ్వరంలో ఉన్న అఖిలాండేశ్వరీ ఆలయంలో అమ్మవారికి ఎదురుగా గణపతిని పెట్టారు శంకరులవారు. ఆనాటి నుండి ఆవిడ సౌమ్యకళలతో తేజరిల్లుతోంది. ఆ పిల్లలనిద్దరిని తలచుకుని ఒక్కసారి అమ్మని తలచుకుంటే, వెంటనే అమ్మ ఆనందించి మనల్ని అనుగ్రహిస్తుంది.

కుమారగణనాథాంబా - అని తలచుకుంటే, సగం పని పిల్లలే చేసి పెట్టేస్తారు.

కురుకుల్లా, కులేశ్వరి తరువాత కుమారగణనాథాంబా ఎందుకు పెట్టారో పరిశీలించాలి. యోగపరంగా గణపతి మూలాధారానికి అధిపతి అని వేదం చెప్తోంది. **'త్వం మూలాధారే స్థితోఽసి నిత్యం'** అని వేదం, **"మూలాధార క్షేత్రస్థితం పరాది చత్వారి వాగాత్మకం ప్రణవ స్వరూపవక్రతుండమ"**ని ముత్తుస్వామి దీక్షితులవారు చెప్పారు.

మూలాధారక్షేత్రంలో కుదురుగా కూర్చుంటాడు గణపతి. గణపతి అంటే కుదురుదేవుడు. కుదురు అన్న మాటే అందమైన తెలుగుమాట. తీగకి ఉన్న పాదు కుదురు. అది జాగ్రత్తగా ఉంటే చెట్టుకి, పాదుకి ప్రమాదం లేదు. కుండలిని అనే తీగకి మూలాధారం కుదురు. ఆ కుదురు దగ్గర కూర్చున్న దేవత గణపతి. కుదురు, కుదిరితే అంతా కుదురుతుంది. పాదులో నీరు పోస్తే చెట్టంతా పండినట్లు గణపతిని పట్టుకుంటే మిగిలినవన్ని పండిస్తాడు.

కుమారస్వామి, గణపతి - ఇద్దరూ శివశక్తుల రూపమే. ఇద్దరూ వేరు కాదు. సుబ్రహ్మణ్యునికి ఐదు ముఖాలు అయ్యవి అయితే, ఒక ముఖం అమ్మది. గణపతికి క్రింద శరీరమంతా అమ్మ ఇచ్చింది. ముఖం ఆయన పెట్టాడు. రెండూ కలిపితే శివ-శక్తి రెండూ కలిశాయి. సుబ్రహ్మణ్యుడు, గణనాథుడు - ఉభయులూ శివశక్త్యైక్యరూపులే.

గణపతి మూలాధారంలో స్థిరంగా కూర్చున్నాడు. అక్కడ సాధన వల్ల కుండలినీ ఉత్థానమయ్యింది. రెండూ శివశక్తుల రూపాలే. అందుకే పుత్రుల స్థానం. శివశక్తి మూలాధారం వద్దకు ఎలా వెళ్ళింది? సహస్రారం దగ్గర ఉన్న తేజస్సే మూలాధారానికి ప్రసరిస్తుంది. కైలాసంలో తేజస్సు అంటే శివపార్వతులు. ఆ తేజస్సే మూలాధారానికి

దిగింది. దిగిన తరువాత అక్కడ నుండి కుండలినీ సర్పరూపంగా లేచింది. లేచినప్పుడు ఆరు చక్రాల మీద పాకింది. సుబ్రహ్మణ్యుని సర్పరూపంగా పూజించడంలో ఇదో ఆంతర్యం.

ఆరు చక్రాల మీద నుండి వెళ్ళి ఆరు ముఖాల వాడయ్యాడు. ఆరు చక్రాల లోంచి వెళ్ళిన తేజస్సు మూలాధారంలో ఉన్న తేజస్సేగా.

కురుకుల్లా, కులేశ్వరీ దగ్గర 'కుమార గణనాథాంబా' నామం ఉండడం అర్థం చేసుకోవలసిన గొప్ప విషయం. దేవగణాలన్ని కదుపుతాడు... అంటే... మొత్తం దేవగణాలు ఒక్క స్తంభంలో ఉన్నారు. మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు ఆరు చక్రాలు అంటారుగాని ఒక చక్రానికి ఇంకొక చక్రానికి క్రింద కొన్ని భూమికలు ఉంటూ ఉంటాయి. ఒకొక్క దానికి ఒకొక్కరు అధిపతి. అన్ని దేవతల సమష్టిరూపం గణనాథుడు.

అలా 33 కోట్ల దేవతలు కూడా మూలాధారం నుండి సహస్రారం లోపల ఉంటారు. ఇందరు దేవతలను కలిపి ఒక దాని లోంచి తీసుకువెళ్తోంది కుండలినీ కనుక అదే దేవసేనాపతి. కైలాసంలో పార్వతీపరమేశ్వరులు పిల్లలతో కూర్చుంటారు అంటే బయటకి చూస్తే అది పరివారమూర్తి, గట్టిగా ఆలోచిస్తే అది యోగం. ఇంకా గట్టిగా ఆలోచిస్తే అది తత్త్వం. అంత గట్టిగా ఆలోచించవలసిన మతం పేరే హిందూమతం.

ఇలాంటి తల్లిని మనం ఉపాసిస్తే వచ్చే ఫలితాలు వరుసగా నవశక్తుల నామాలుగా ఉన్నాయి. ఈ నవశక్తులు అందరికి కావలసినవే. ఇవి విభూతులు అని చెప్పబడుతున్నాయి.

ఇవన్నీ అమ్మరూపాలు. సృష్టిలో అందరూ మేలే కోరుకుంటారు. మేలు అంటే మనం సంతోషంగా ఉండాలి. జ్ఞానంతో ఉండాలి. ధైర్యంతో ఉండాలి. శాంతితో ఉండాలి. ఎప్పుడూ శుభాలు కలుగుతూ ఉండాలి. మంచి వర్చస్సుతో ఉండాలి. ఆనందంగా ఉండాలి. మనకు అడ్డు వచ్చిన ఏ అడ్డంకులైనా తొలగిపోవాలి. ఒకొక్కటి ఇవ్వడానికి ఒకొక్క రూపం "తుష్టిః, పుష్టిః, మతిః, ధృతిః, శాంతి, స్వస్తిమతీ,

కాంతిః, నందినీ, విఘ్ననాశినీ" - ఇవన్నీ అందరికీ కావలసినవే. సృష్టిలో మనకి కావలసిన గొప్ప శక్తులన్నీ దేవతలే. అవి తెచ్చుకోవడం కోసం చేసే సాధనే దేవతా పూజ.

443. తుష్టిః - శ్రీ తుష్ట్యై నమః

తుష్టి. పుష్టి ఇవన్నీ అమ్మవారి దివ్యగుణములు, లక్ష్మి గుణాలు. లక్ష్మీ స్వరూపాలు.

ఇవన్నీ అమ్మవారి ఆరాధనా ఫలాలు. వీటిని అమ్మవారి విభూతులు అంటారు. ఇవి ప్రతివారిలో ఉంటాయి. ఉండాలి. లేకపోతే అమ్మవారి ఆరాధన ప్రారంభిస్తే ఇస్తుంది. **"యా దేవీ సర్వభూతేషు తుష్టి రూపేణ సంస్థితా"** అని అమ్మవారిని 'దేవీమాహాత్మ్యం'లో దేవతలు ప్రార్థించారు. మొట్టమొదటిది తుష్టి.

తుష్టి అంటే సంతోషము. సంతృప్తి. ఇష్టమైనవి లభించడం వలన, అనిష్టమైనవి తొలగడం వలన కలిగే తృప్తి - తుష్టి. ఆశ్రయించిన వారికి ఈ రెండిటినీ సమకూర్చే తల్లి.

సంతోషి ఈ మూడు జగముల పూజ్యుండు
సంతోషి కెన్నడు జరుగు సుఖము (భాగవతం)

444. పుష్టిః - శ్రీ పుష్ట్యై నమః

'యా దేవీ సర్వభూతేషు పుష్టిరూపేణ సంస్థితా' అని అమ్మవారిని ప్రార్థించు కుంటాం. లక్ష్మి అష్టోత్తరశత నామాలలో కూడా -

ఆహ్లాదజననీం పుష్టిం శివాం శివకరీం సతీం
విమలాం విశ్వజననీం తుష్టిం దారిద్ర్యనాశనీం

అని వస్తుంది. ఇవన్నీ అమ్మవారి దివ్యగుణములు.

పుష్టిః అంటే నిండుదనం. సమృద్ధి. పోషణశక్తిని పుష్టి అంటారు. తొమ్మిది రకాల పుష్టులను వేదం చెప్పింది. వాక్-పుష్టి- మాటలు అందరూ మాట్లాడతారు

గాని, కొందరు పుష్టిగా మాట్లాడతారు. చాలా రసవత్తరంగా మాట్లాడితే ఆ వాక్కుకి సాహిత్యమని, సంగీతమని పేరు. కూనిరాగాలు అందరూ తీస్తారు. కాని, సంగీతవిద్వాంసుని దగ్గర సంగీతం పుష్టిగా ఉంది. సృష్టిలో అందరి దగ్గరా అన్నీ ఉంటాయి గాని పుష్టిగా ఎక్కడ ఉంటుందో అక్కడ గౌరవం పెరుగుతుంది. ఇది అమ్మవారి స్వరూపం.

వాక్-పుష్టి, జ్ఞానపుష్టి, శరీరపుష్టి, ఇంద్రియపుష్టి , ధనధాన్యపుష్టి, ప్రజాపుష్టి. ప్రజా అంటే సంతానము, పరివారము. మనం ఒక పని చెయ్యాలంటే దానికి సహకరించడానికి పదిమంది ఉండాలి. ఈ పదిమంది ఉండాలన్నా అమ్మవారి అనుగ్రహం ఉండాలి.

ఈ నామాలతో అలా క్రమక్రమంగా చూస్తే ప్రపంచంలో మనం అనుభవించే ప్రతి సంపదని పదార్థ దృష్టితో కాకుండా, ప్రసాద దృష్టితో చూడడం అలవాటు చేసుకుంటాం. అది మనకు క్రమక్రమంగా ఉత్తమ స్థితిని ఇస్తుంది. అందుకే ప్రజా అనేది ఒక పుష్టిగా చెప్పారు.

పశుపుష్టి. ఇది కూడా ప్రస్తుత పరిస్థితులలో చాలా అవసరం. పూర్వం ఇంటికో గోవు ఉండేది. గో సంపదతో కళకళలాడుతూ భారతదేశం ఉండేది. పారిశ్రామికమనే నెపంతో ఎన్ని దూరం చేసుకొంటున్నామనేది ఆలోచిస్తే అందరికి తెలుస్తుంది.

తరువాత **గ్రామపుష్టి**. **'విశ్వం పుష్టం గ్రామే అస్మిన్ అనాతురం'** – మనం ఉన్న గ్రామంలో అంతా పుష్టిగా ఉండాలి. **ధర్మపుష్టి**– అన్నిటికంటె ఇది ప్రధానం. మన దగ్గర ధర్మం పుష్టిగా ఉంటేనే పైన వివరించుకున్న పుష్టులన్నీ వస్తాయి. కనుక ఇది చివరిది కాదు. ప్రధానమైనది. ఈ తొమ్మిది రకాల పుష్టులను వేదం చెప్పి, పుష్టులన్నింటికి ప్రభువు పరమేశ్వరుడు అని **'పుష్టానాం పతయే నమః'** అన్నది.

దేవీభాగవతంలో తుష్టి, పుష్టి మొదలైన వాటిని అమ్మవారి అంశరూపాలుగా, దేవతలుగా చెప్పారు. హిమాలయాల్లో దేవదారువనమనే క్షేత్రంలో పుష్టీదేవి ఉంది.

445. మతిః – శ్రీ మత్యై నమః

మతి అంటే బుద్ధి. బుద్ధి ఎపుడైనా అమ్మవారే. బుద్ధిని అమ్మవారే మనకి ఇచ్చిందని తెలుసుకుని ముందు ఆ తల్లికి నమస్కరించుకోవాలి.

'స దేవో దండమాదాయ రక్షంతి పశుపాలవత్। యం తు రక్షతుమిచ్ఛన్తి బుద్ధ్యా సంవిభజన్తి తమ్' – మనలను భగవంతుడు ఎలా రక్షిస్తాడో చెప్తూ ఆయన మన ప్రక్కన కఱ్ఱ పట్టుకొని అంగరక్షకునిలా రక్షించడు. ఎవరిని బాగు చెయ్యాలనుకుంటాడో వారికి మంచి బుద్ధిని ఇచ్చి వారిని రక్షిస్తూ ఉంటాడు.

'స నో బుద్ధ్యా శుభయా సంయునక్తు' అని ఉపనిషన్మంత్రం చెప్తున్నది. భగవంతుడు మనకి శుభ బుద్ధిని ఇచ్చుగాక. భారతీయ ఋషులు **'బుద్ధిం యా నః ప్రచోదయాత్'** అని ఒక్కటే ప్రార్థన చేశారు. బుద్ధిని బాగుచెయ్యమ్మా అని అడిగితే అన్నీ బాగుంటాయి.

'సర్వస్య చాహం హృదిసన్నివిష్టో మత్తః స్మృతిర్జ్ఞాన మపోహనం చ' – "ప్రతివారి హృదయంలో నేనే ఉంటూ వారికి మరపు, ఎరుక నేనే కలిగిస్తాను" అన్నాడు కృష్ణ పరమాత్మ. అది గ్రహించగలిగితే మనకి అవసరమైన బుద్ధి ఆయనే ఇస్తాడు. ఆ బుద్ధి శక్తి అమ్మవారు. ఇప్పుడు మనం అడగవలసిన మతి ఏమిటి? సూతసంహితలో అమ్మవారిని స్తుతిస్తూ ఒక గొప్పమాట ఉన్నది

యాఽనుభూతిరుదితా మతిః పరా వేదమాన నిరతా శుభావహా
తామతీవ సుఖదాం వయం శివాం కేశవాది జనసేవితాం నుమః

"వేదప్రమాణమందు ఆసక్తి కలదీ, మంగళప్రదమైనది, శ్రేష్ఠానుభూతి రూపమైన ఏ మతి ఉందో అది 'శివా'(దేవీ) స్వరూపము. కేశవుడు మొదలగు జనులందరు సేవించే సుఖదాయిని అయిన ఆ 'మతి'కి నమస్సు."

మతిని అమ్మవారి రూపంగా మనం ఉపాసన చెయ్యాలి. అప్పుడు ఆ మతి మనకి వస్తుంది. ప్రతి నామాన్ని ఏ భావంతో చూడాలో వశిన్యాదివాగ్దేవతలు చెప్తున్నారు. ఏ మతిని మనం కోరుకోవాలో వేదమాత చెప్తూ 'వేదమాన నిరతా శుభావహా' అన్నది. ముందు శుభంకరమైన మతి. అది వేద ధర్మములతో కూడిన

బుద్ధి అయి ఉండాలి. అధర్మపు ఆలోచన బుద్ధికి రాకూడదు. వేదం చెప్పిన ధర్మము నందు ఆసక్తి కలిగి, ఆ ధర్మము చెయ్యాలనే బుద్ధి 'శుభావహా'. అదే శుభంకరమైన బుద్ధి. ఆ బుద్ధే అమ్మవారు.

'వేదమాన నిరతా శుభావహా యా అనుభూతిరుదితా మతిః పరా' అన్నారు.

తాను చేస్తున్న ధర్మము, ఉపాసనల అనుభూతిని అందుకునేది మతి. అనుభూతిని అందించేది, ధర్మబద్ధమైనది, శుభంకరమైనది ఏదో ఆ మతిని కేశవాది జనులు కూడా ఆరాధిస్తున్నారంటే దేవతలకు కూడా ఆ మతి కావాలి. ఆ మతితోనే వారు ఉండాలి. ఈ మతి కావాలనే అమ్మవారు సమస్త దేవతల చేత సేవింపబడుతోంది. అలాంటి మతినే 'సుఖదా' అన్నారు. ఆ మతి ఒక్కటే సుఖాన్ని ఇస్తుంది. 'సుఖదాం శివాం నుమః'– అటువంటి మతిస్వరూపిణి అయిన 'శివా'కు నమస్కారము.

'నిశ్చయాత్మక చిత్తవృత్తిః బుద్ధిః'. బుద్ధి వల్లనే వస్తువు యొక్క స్వరూపాన్ని తెలుసుకోగలం.

ఇక సాధన యందు నిశ్చయాత్మకమై బుద్ధి ఉంటే అది **'వ్యవసాయాత్మికా బుద్ధిః'**. అది ఇంకా ఉత్కృష్టం.

అది బ్రహ్మమునందు నిలిచిపోతే దానిని అఖండాకార వృత్తి అంటారు. పరమాత్మ తప్ప అన్యం ఆ బుద్ధికి తెలియదు. అంతటిని పరమాత్మగానే చూస్తుంది. ఉదాహరణకు బంగారం పైన దృష్టి ఉన్నవానికి నానారకాల నగలన్నీ పెట్టినా దానినంతటిని బంగారమనే ఎలా చూస్తాడో, అదే విధంగా వ్యవసాయాత్మిక బుద్ధి ఉన్నవాడు ఈ ప్రపంచాన్నంతటిని బ్రహ్మముగా చూస్తాడు.

యోగి బుద్ధి– అఖండాకార వృత్తి. సాధనామార్గంలో నేను తరిస్తానని దాని యందు శ్రద్ధ కలిగి సాధన చేసే వాని బుద్ధిని నిశ్చయాత్మక బుద్ధి అంటారు. ఈ రెండు రూపాలుగా ఉన్న మతినే 'విభూతి రూపం'గా తెలుసుకుంటూ అటువంటి మతిని ఇవ్వమని అమ్మవారిని ప్రార్థించాలి. క్షణానికో బుద్ధి ఉంటే అది 'విక్షేపాత్మక బుద్ధిః'. ఇది సామాన్యం. సిద్ధికి ప్రతికూలం.

446. ధృతిః – శ్రీ ధృత్యై నమః

ధృతిః అంటే ధైర్యం. ధైర్యము అంటే తెగింపు కాదు. నిలుకడ. ఇది చాలా ముఖ్యమైన గుణం. మనస్సు యొక్క స్థిరభావం 'ధృతి'. ధృతి కుదిరితే అన్నీ కుదురుతాయి.

'ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాస సంత్రస్తులై' అని భర్తృహరి చెప్పాడు. విఘ్నం వస్తుందేమోనని కొంతమంది ఆరంభించరు. కొందరు ఆరంభించి వదిలేస్తారు. ఆరంభించిన తరువాత ఫలం దొరికే వరకు నిలుకడ కలిగి ఉండాలి. ఆ నిలుకడ కలిగి ఉండే గుణం కూడా అమ్మవారి అనుగ్రహం ఉంటే కానీ రాదు. ఇవన్నీ అమ్మ అనుగ్రహిస్తే మనం సాధనలో పండిపోతాం. సిద్ధిలో దొరికేది అమ్మపాదాలే – సందేహం లేదు. సాధనలో కూడా అమ్మవారి దయ లేకపోతే వెళ్లలేమని ఈ నామాలు తెలియజేస్తున్నాయి.

ధృతి అమ్మవారి యొక్క స్వరూపం. ఈ ధృతి మూలకంగానే స్వస్వరూప జ్ఞానం దాకా వెళ్లగలం. సామాన్యులకి – యోగులకి ఒకే విధమైన శరీరాలే అయినా మతి, ధృతిల దగ్గరే తేడా ఉంది. వారి మతిలో ఒక నిశ్చయముంది. ఆ సాధన చేస్తున్నంత సేపు ధృతిలో ఉన్నారు కనుక వెళ్ళగలిగారు.

ఇవన్నీ ఐహికమైన ప్రగతి మొదలుకుని పరమార్థమైన మోక్షం వరకూ పనికి వచ్చే గుణాలు.

'యా దేవీ సర్వభూతేషు ధృతి రూపేణ సంస్థితా' అని అమ్మవారికి నమస్కారం చేసుకోవాలి. పిండారకం అని ఒక క్షేత్రం ఉంది. అక్కడ అమ్మవారి పేరు ధృతి. మొత్తం అన్ని శక్తులకి క్షేత్రాలు ఉన్నాయి. క్షేత్రాధిదేవతలకి ఒక లక్షణం ఉంది. క్షేత్రాలకి వెళ్ళలేకపోయినా ఉన్నచోట నుండి భక్తిగా తలచుకున్నా అనుగ్రహిస్తారు. **బుద్ధిః కీర్తిః ధృతిర్లక్ష్మీః శక్తిః శ్రద్ధా మతిః స్మృతిః॥ సర్వేషాం ప్రాణినాం సాऽంబా ప్రత్యక్షం తన్నిదర్శనమ్** (దేవీభాగవతం). 'ఆ దేవియే ప్రాణులందరిలో – బుద్ధి, కీర్తి, ధైర్యము. లక్ష్మి, శక్తి, శ్రద్ధ, మతి, స్మృతి – రూపాలతో ప్రత్యక్షంగా ఉన్నది.'

447. శాంతిః - శ్రీ శాంత్యై నమః

'యా దేవీ సర్వభూతేషు శాంతిరూపేణ సంస్థితా'.

సత్త్వగుణం యొక్క ప్రధాన లక్షణం శాంతి. సత్త్వగుణం ఉన్నవారు ఎప్పుడూ శాంతంగా ఉంటారు. శాంతం అంటే అలజడి లేని స్థితి. శమనం, శాంతం రెండూ ఒక్కటే. మనకి తలనొప్పి వచ్చి అది పోతే శాంతి. మరి తలనొప్పి రానపుడు శాంతి ఉందా! దుఃఖం వచ్చిపోతేనే శాంతి కాదు. ఎండలోంచి నీడలోకి వెళ్తే హాయి అనిపించింది కాని నీడలోనే ఉన్నవాడు హాయిగా ఉన్నాడా? నీడలో ఉన్నవానికి ఎండ కాకపోతే మరోబాధ లోపల ఉంటుంది. మామూలుగా ఒక బాధనుంచి వచ్చే ఉపశమనాన్ని శాంతి అనుకుంటే అమ్మవారు ఆ శాంతినీ ఇస్తారు. అక్కడితో తృప్తి పడకూడదు. అసలైన అర్థం గ్రహించాలి.

తుష్టి, పుష్టి, ధృతి, మతి వల్ల మనస్సు పొందే ప్రసన్నతాగుణం. దీనికే ప్రసాదగుణం అని పేరు.

మల మాయా వికారేషు శాంతిః పుంసః పునర్యయా

సా కళా శాంతిరిత్యుక్తా సాధికారాస్పదం పదం (శైవాగమం)

మల మాయా వికారాలు తొలగిన తరువాత ఉన్న స్థితి శాంతి. మలమాయా - ఆణవ మలం, కార్మిక మలం, మాయా మలం. ఇవి జీవ మాలిన్యములు. ఇవి పోతే కలిగే స్థితి పేరు శాంతి. ఆ శాంతం వస్తే మోక్షం. అదే 'శాంతము లేక సౌఖ్యము లేదు దాంతునికైన వేదాంతునికైనా' అని చెప్పిన త్యాగరాజస్వామి కీర్తన హృదయం.

దాంతుడు అంటే ఇంద్రియ నిగ్రహసంపన్నుడు. వేదాంతి అంటే తత్త్వజ్ఞానం అంతా తెలిసినవాడు. ఇంద్రియాలని స్వాధీనంలో ఉంచుకున్నప్పటికీ ఈ మలమాయా వికారాలు పోయినవాడు మాత్రమే బ్రహ్మానందసుఖాన్ని పొందగలడని త్యాగరాజమహర్షి మనకి అందించిన అద్భుతమైన తెలుగు వేదాంతం.

అయితే ఈ శాంతి ఎవరికి దొరుకుతుంది? కావాలనుకునే వారందరికీ దొరకదు. అర్హులైనవారికి మాత్రమే దొరుకుతుంది.

సాధికారాస్పదం పదం – 'దానికి పొందదగిన అర్హత ఉండాలి' అన్నారు. శాంతి అనే స్థితి యోగంలో ఎక్కడ కలుగుతుందో చెప్తూ– 'సాధకుడు విశుద్ధి చక్రం దాకా వెళ్ళగలిగితే అక్కడ లభించేది శాంతి'. విశుద్ధిచక్రం దగ్గర జీవుని ప్రాణశక్తి ఉంటుంది. జీవశక్తిస్థానం విశుద్ధిచక్రం.

బృహత్పరాశరస్మృతి గ్రంథంలో చెప్తూ –

దశపంచాంగులం వ్యాప్తం నాసికాయా బహిః స్థితం

జీవో యత్ర విశుద్ధ్యేత సా కళా షోడశీ స్మృతా

జీవభావం శుద్ధం కావాలంటే వారి ప్రజ్ఞ విశుద్ధి చక్రం దాకా ఎదగాలి. విశుద్ధిచక్రం నాసిక నుండి పదంగుళాల క్రిందికి వస్తే అక్కడ జీవభావం ఉంటుంది. యోగంతో అక్కడికి చేరి విశుద్ధిచక్రాన్ని చైతన్యవంతం చేయగలిగితే అప్పుడు ఏర్పడే స్థితిలో జీవుడు శుద్ధుడవుతాడు. ఆ స్థితి పేరే శాంతము.

శాంతికి ఇంకో గుణం ఏమిటంటే **'అపరాధ సహిష్ణుత్వం శాంతిః'**. ఇది సాధనాపరమైన అర్థం. ఎవరైనా అపరాధాలు చేస్తే వారిని క్షమించగలిగే గుణమే శాంతి. ధర్మానికి అపరాధంచేసే దుర్మార్గులని పాలకులైనవారు క్షమించకూడదు. వ్యక్తిగతంగా ఎవరైనా అపరాధం చేస్తే సహించగలిగితే ఆధ్యాత్మిక సాధనలో పైకి వెళ్తాం. ఆత్మగుణాలని కొన్ని ఉంటాయి. **ఆత్మగుణాలు లేనివారికి ఆత్మజ్ఞానం రాదు.**

కరుణ, శాంతి – ఈ రెండు ఆత్మగుణాలు. కరుణ అంటే **పరదుఃఖ అసహిష్ణుత** – ఇతరులకి దుఃఖం కలిగితే తట్టుకోలేకపోతే దాని పేరు కరుణ. అది ఉంటే ఎప్పటికైనా బాగుపడవచ్చు. రెండో గుణం **అపరాధసహిష్ణుత** – అవతలివారి అపరాధాలని సహించగలిగితే దానికి శాంతమని పేరు. యోగంలో క్రమంగా ప్రాణాన్ని నియంత్రిస్తూ –

కుంభితా రేచితా వాపి పూరితోవా యథా భవేత్

తదంతే శాంతి నామాసౌ శాంత్యా శాంతఃప్రకాశితః

రేచక, పూరక, కుంభకాలను సక్రమంగా చేసినపుడు పరిశీలించవచ్చు. ప్రాణాయామస్థితిలో అది చేస్తున్నప్పుడు రేచక, కుంభకాలు సరిగ్గా చేస్తే ఒకానొక

స్థితి సాధకునికి లభిస్తుంది. ఆ స్థితిని కూడా శాంతం అంటారు. ఈ రేచక, కుంభకాల నియంత్రణ గురువుల వద్ద సశాస్త్రీయ శిక్షణ పొంది మాత్రమే చెయ్యవలసినది. ఇలా శిక్షణ పొంది చేస్తూ ఉంటే అప్పుడు శాంతి నిలబడుతుంది. ఇది యోగపరమైన అర్థం.

448. స్వస్తిమతీ – శ్రీ స్వస్తిమత్యై నమః

చక్కని ఉనికి కలది. సు + అస్తి = స్వస్తి. అస్తి అంటే ఉన్నది. సు అంటే మేలు, మంచి, శుభం మొదలైనవి. మంచి కలుగుగాక! అనలేదు. మంచి ఉంది అన్నారు. ఉన్నది అనుకుంటే ఎప్పటికైనా ఉంటుంది. స్వస్తి అంటేనే అనుకూల భావన. ఆ స్వస్తి మన స్వభావం కావాలి. మేలును చూడగలిగే స్వభావం. మేలైన స్థితి స్వస్తిమతీ. స్వస్తి అనే దేవత ఉన్నారు. పైన చెప్పిన విభూతులన్నీ దేవతలు.

కర్ణాటకలో గోవా అనే ప్రాంతంలో శాంతాదేవి అనే పేరుతో అమ్మవారు ఉన్నారు. శాంత, తుష్టి, పుష్టి – వీరంతా దేవతలు. స్వస్తి అనేది ఒక తల్లి. వేదంలో **'స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః'** అని చెప్తారు. స్వస్తిక్ అని చక్రం కూడా లిఖించడం సంప్రదాయం. దేవతలందరూ మనకి స్వస్తిని ఇవ్వాలనే మాట వేదంలో ఉంది.

'స్వస్తి నః పూషా విశ్వవేదాః స్వస్తినః తార్క్ష్యో అరిష్టనేమిః' – అందరు దేవతలు శుభాన్ని కలిగించుగాక! మేలైనది అంటే ఆనందం, జ్ఞానం, సత్యం మొదలైన దివ్య గుణాలు.

అసలు మేలైనది బ్రహ్మము. బ్రహ్మము మాత్రమే ఉంది. **'అస్తి బ్రహ్మ'** అనే భావమే స్వస్తి. **'అస్తి బ్రహ్మేతి వ్యజానాత్'** – ఉన్నదే బ్రహ్మము. ఆ భావం అమ్మవారి అనుగ్రహం వలన రావాలి.

దీనికి ఇంకో భావాన్ని చెప్తూ **'ఆశీఃక్షేమ నిష్పాప పుణ్య మంగళ వాచక స్వస్తీత్యవినాశి నామః'** అని స్వస్తి శబ్దానికి శాస్త్రీయమైన అర్థం. ఆశీః అంటే మంచిని కోరుకొనుట. ఇదే ఆశీర్వచనం.

'స్వస్తిపుణ్యాహ వచనం' అని కూడా ఉంది. స్వస్తి అంటే రెండవ అర్థం –

క్షేమం. మూడవ అర్థం - నిష్పాపం- ఏ పాపం లేని స్థితి. తరువాతది - పుణ్యము. తరువాతది - మంగళం. తరువాతది అసలు అర్థం... స్వస్తి అనగా **'అవినాశి నామ'** - నాశనం లేనిది స్వస్తి. అది బ్రహ్మము.

ఈ ఆశీఃక్షేమనిష్పాప పుణ్యమంగళ వాచకాలకి స్వస్తి శబ్దం చెప్తే అవి నశించకుండా ఎప్పటికీ ఉంటాయి. వినాశనము లేని క్షేమము, పుణ్యము, మంగళము - ఇవన్నీ కలిపితే స్వస్తి. ఆ స్వస్తి స్వభావముగా కల తల్లి 'స్వస్తిమతీ'.

దీపానికి 'స్వస్తిమతీ' అని పేరు ఉంది. దీపం వెలిగించాక 'స్వస్తిమతీ' అని తలచుకుంటే పైన చెప్పినవన్నీ ఇస్తుంది. స్వస్తిలక్షణం దీపంలో ఉంది. దీపం పెట్టి ఏదైనా సాధించవచ్చు. 'దీపేన సాధ్యతే సర్వం'. ఒక్క దీపం పెట్టినా స్వస్తిమతియే. స్వస్తిక్ ఆకారంలో దీపం పెట్టే విధానం శాస్త్ర వర్ణితం.

దయాస్వభావానికి, శుద్ధత్వానికి కూడా స్వస్తిమతి అని పేరు. అలాగే దైవత్వం, శుభత్వం ఇవి నిఘంటువు చెప్పే స్వస్తిమతి యొక్క అర్థాలు. ఇవన్నీ కలుపుకుని అవినాశినీ అయినదే స్వస్తి అనేది ప్రధాన అర్థం. ఆవిడే అమ్మవారు.

సత్యానికి ఏది సత్యమో అది స్వస్తి. సత్యము అంటే ఎప్పుడూ ఉండేది. ఎప్పుడూ ఉండేదని ఏది అనిపిస్తోందో, అది దేనివల్ల ఉందో అది సత్యం. అవి ప్రాణాలు. కనుక ప్రాణాలకు సత్యములని పేరు. ఈ ప్రాణానికి కూడా సత్యమైనది ఆత్మవస్తువు. సత్యమైన ప్రాణానికి కూడా సత్యమైన పరబ్రహ్మమే 'అవినాశీ వస్తు'. ఆ స్వరూపమే 'స్వస్తిమతీ'.

449. కాంతిః - శ్రీ కాంత్యై నమః

దీనినే జీవకళ అని లోకంలో వ్యవహరిస్తారు.

ముఖకాంతిని బట్టి వారి జీవితకాలం చెప్పేవారు ఉన్నారు. ఇది ఒక శాస్త్రం.

చిచ్ఛక్తి, పుష్టి, తుష్టి, మతి, ధృతి, స్వస్తిమతిగా ఉంటూ వెలుగులీనుతూ ఉంటుంది. ఈ పైన చెప్పిన ఆరూ పుష్టిగా ఉంటే కాంతి. వర్చస్సు అన్నా ఇదే.

మనం ముందు చెప్పుకున్న 'చిచ్ఛక్తిశ్చేతనారూపా' స్వరూపం గాయత్రిది. ఆ

గాయత్రి మంత్ర ఫలాలు ఈ తొమ్మిది - అని వ్యాఖ్యాతలు చెప్పారు.

సూర్యమండలాంతర్వర్తియైన ఈశ్వరతేజస్సే గాయత్రీ. ఇదొక ప్రధాన అర్థం. ప్రతిజీవునిలో ఉండే జీవకళ అనబడే తేజస్సే కాంతి. ఇచ్ఛాశక్తియే కాంతి శబ్దానికి అర్థమని విజ్ఞుల మాట.

450. నందినీ - శ్రీ నందిన్యై నమః

'నందినీ' అంటే ఆనంద స్వభావం. కామధేనువు పేరు నందినీ. కామధేనువు ఉపాసన ఒకటి ఉన్నది. నంది-నందినీ. నంది పుంలింగం, నందినీ స్త్రీలింగం. 'నందినో నందివర్ధనః', 'ఈశ్వరో భగహా నందీ' అని శివ, విష్ణుసహస్రాలలో కూడా కనబడుతున్నాయి. నంది అనేది కూడా భగవన్నామమే. గంగానదికి ఉన్న నామాలలో నందినీ ఒకటి. ఆ పావన నదీ రూపంగా ఉన్నది జగన్మాతయేనని పురాణాలు ప్రకటిస్తున్నాయి.

ఆనందాన్ని గుర్తించి, అనుభవించగలిగే శక్తి నందినీ. ఆనందింపజేయునది, ఆనందస్వరూపిణి.

ఇప్పటివరకు మనకి కావలసినవి అన్నీ వచ్చాయి. ఇవి పొందాలని అందరికీ ఉంది కానీ ఏవో అడ్డంకులు వస్తున్నాయి. అడ్డంకులు అనేక రకాలు. అవి సాధనలో అడ్డంకులు. దుఃఖం ఒక అడ్డంకి. ఈ అడ్డంకులే విఘ్నాలు. ఇవన్నీ ప్రక్కకి తీసేస్తే అప్పుడు ఆనందాన్ని అనుభవించవచ్చు అనుకుంటే అవి తీసే పని కూడా పరమేశ్వరి కృపయే అని - ఆ తరువాత నామంలో చెప్తున్నారు.

451. విఘ్ననాశినీ - శ్రీ విఘ్ననాశిన్యై నమః

విఘ్నములను తొలగించునది. **'విశేషేణ ఘ్నంతీతి విఘ్నః. విద్యాంతరాయాః తన్నాశయితుం శీలమితి విఘ్ననాశినీ'** (సౌభాగ్యభాస్కరం). మనలను బాగా దెబ్బతీసేవి ఏవి ఉన్నాయో అవి విఘ్నాలు. మనం సాధన చేస్తున్నప్పుడు వచ్చే అంతరాయములు, ప్రతికూలాలు మొదలైనవి. ఆ బాధించే విఘ్నాలు ఇసుమంత కూడా లేకుండా చేసి

వాటిని నశింపజేయునది ఈ తల్లి. విఘ్ననాశినీశక్తి ఇక్కడ చెప్పబడుతున్నది. ఈ తల్లి అనుగ్రహం ఉంటే వెనకటి నామాలలో చెప్పినవన్నీ పొందగలం.

మనం యోగసాధన చేసినా, మంత్రసాధన చేసినా, ఆధ్యాత్మికసాధన చేసినా, లేదా భౌతికమైన చదువుకైనా, ఏది చెయ్యాలన్నా ఉండవలసిన శక్తి ఇదే.

'విశ్వాని దేవ సవితుర్దురితాని పరాసువ' అని వేదం. సృష్టికర్త తేజస్సు అయిన అమ్మవారు అన్ని దురితాలను తొలగించుగాక! అసలు విఘ్నాలంటే అజ్ఞానము, పాపాలు, విద్యకు (జ్ఞానానికి) అంతరాయాలు. జ్ఞానప్రతిబంధకాలు. వీటిని పోగొట్టే తల్లి గనుక 'విఘ్ననాశినీ'.

452. తేజోవతీ – శ్రీ తేజోవత్యై నమః

ముందు నామాలలో అమ్మవారి నవవిధ విభూతులైన తుష్టిః, పుష్టిః, మతిః, ధృతిః, శాంతిః, స్వస్తిమతీ, కాంతిః, నందినీ, విఘ్ననాశినీ అని చెప్పి వాటన్నిటి అనుసంధానంగా పదవనామం 'తేజోవతీ' అని చెప్పారు. తుష్టి మొదలైన సంపుటి ఇక్కడితో పరిపూర్ణమౌతోంది. పైన చెప్పిన తొమ్మిదింటిని అనుసంధానిస్తూ చెప్తున్న అత్యంత దివ్యమైన నామం 'తేజోవతీ'.

విఘ్ననాశినీ తరువాత తేజోవతీ చెప్పడంలో విశేషం – మొత్తం ఈ 9 శక్తులను సంపాదించినవాడే ఏ కార్యాన్నైనా పరిపూర్ణంగా చెయ్యగలడు. కార్యాన్ని పరిపూర్ణం చెయ్యగలిగిన శక్తిని తేజస్సు అంటారు. ఈ తేజస్సుకి అనేక రకాల అర్థాలున్నాయి. అన్నీ ఇక్కడ తీసుకోవచ్చు.

తేజస్సు అనేదానికి శాస్త్రార్థం **'కార్య సంపాదనా సామర్థ్యం'.** ఏ పనినైనా చెయ్యగలిగిన సత్తువ, సంకల్పబలం – ఇత్యాదులన్ని కలుపుకుంటే దానిని తేజస్సు అంటారు. దీనికే పరాక్రమమని కూడా అర్థం. వెలుగు, పరాక్రమము, బలము – ఇలాంటి వాటికి తేజస్సు శబ్దం వాడుతూ ఉంటాం. ఇక్కడ పరాక్రమమంటే కార్యసంపాదనా సామర్థ్యం. విఘ్ననాశనం చెయ్యగలిగితే ఆ తరువాత కావలసింది ఇదే.

తేజస్సుకు మరొక శాస్త్రీయమైన అర్థం–**'పరకృత అధిక్షేప అసహత్వం'** తేజస్సు. ఎవరైనా మనల్ని నిందించినా, దెబ్బతీసినా తిరిగి వారికి సమాధానం చెప్పగలిగిన శక్తి తేజస్సు. ఇది మనకి ప్రతాపపరంగా వాడబడుతుంది.

మన సాధనకి, ధర్మానికి దెబ్బతీసే ఆసురీగుణాలను ఎదుర్కోగలిగే పటుత్వం తేజస్సు. అది అమ్మవారి అనుగ్రహం వల్లనే మనకి రావాలి. దాని వల్లనే కార్యసంపాదనా సామర్థ్యం వస్తుంది.

లోకంలో ఎవరైనా ఏ కార్యంలోనైనా విజయం సాధించాలంటే పైన చెప్పుకున్న తొమ్మిదింటితోపాటు ప్రధానంగా ఈ పదవది కావాలి.

మరొక అర్థంలో తేజస్సు కల తల్లి అంటే ప్రకాశకులకి కూడా ప్రకాశమైన తల్లి. **'ఏతస్మిన్ ఖల్వక్షరే గార్గి సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠత'** అని బృహదారణ్యక ఉపనిషత్ లో చెప్పారు. అక్షర స్వరూపుడైన పరమాత్మ తేజస్సు చేతనే సూర్యచంద్రాదులందరూ నిలచియున్నారు. వారియందు కూడా ప్రకాశిస్తున్న తేజస్సు. అది పరబ్రహ్మ యొక్క తేజస్సు. ఆ తేజఃస్వరూపిణి అమ్మవారు కనుక తేజోవతీ. సృష్టిలో సమస్త జ్యోతిర్మండలాలకి వెలుగునిస్తున్న తల్లి. **'జ్యోతిషామపి యః జ్యోతిః'** అని ఇదే విషయాన్ని ఉపనిషత్ చెప్తోంది.

'తేజోవతీ' నామం మొత్తం లలితాసహస్రనామాలంతటికి పరచుకుని ఎలా కనబడుతోందంటే లలితాసహస్రంలో 365 కిరణాలున్నాయి. ఈ 365 కిరణాల నుండి వస్తున్న తేజస్సంతా అమ్మవారి స్వరూపం. 365 శ్లోకపాదాలున్నాయి. 182 1/2 శ్లోకాలు. ఒక సంవత్సర కాలానికి సంబంధించిన అమ్మవారి కిరణములు. వీటి గురించి శ్రీవిద్యలో చాలా విశేషంగా చెప్పారు.

ఈ 365 కిరణాలంటే అహోరాత్రులుగా ప్రకాశిస్తున్న అమ్మవారి తేజస్సు. అహోరాత్రి అంటే పగలు, రాత్రి. ఈ రెండిటికి ప్రకాశమున్నది. ఈ అహోరాత్రాత్మకమైనది ఒక దినం. అది ఒక రోజుకి సంబంధించిన తేజస్సు. సంవత్సరకాలంలో కలిగే అహోరాత్రములు మొత్తం 365 అవుతున్నాయి. ఈ 365 రకాలైన కిరణాలు అమ్మవారి నుండి ప్రసరిస్తూంటాయి. ఇదే సౌందర్యలహరిలో

ఆదిశంకరులు **'క్షితౌ షట్పంచాశత్'** అనే శ్లోకంలో దానికి, ఋతువులకి, సంవత్సరాలకి ఎలా సంబంధం ఉందో వివరించారు.

శ్రీవిద్యలో చెప్పబడిన నాదప్రకృతితో వచ్చే 15 కిరణాలు, అష్టమూర్త్యాత్మక కిరణాలు 8. అలా శ్రీచక్రానికి అనుసంధానం చేస్తూ మొత్తం కిరణాలు చెప్తారు. అవి తేజస్సులు. ఆ తేజస్సులతో ప్రకాశించే తల్లి తేజోవతీ. ఈ పది నామాలు ఒక గుంపుగా తీసుకుని నిత్యం అనుసంధానం చేసుకోగలిగితే ఈ తుష్టి, పుష్టి, ధృతి, శాంతి మొదలైన శక్తులు లభించి సాధనని సాఫల్యం చేసే తేజోవతీ శక్తి లభిస్తున్నది.

453. త్రినయనా - శ్రీ త్రినయనాయై నమః

'మూడు కన్నుల తల్లి' అని ఈ నామార్థం స్పష్టంగా చెప్తోంది. ఎక్కడ నేత్రశక్తిని వర్ణించినా జ్ఞానమనే అర్థం. **'జ్ఞానాత్మనే నేత్రత్రయాయ వౌషట్'** అని అంగన్యాసంలో చెప్తారు. జ్ఞానం నేత్రత్రయం చెప్పడం విశేషం. సాధారణంగా మంత్రన్యాసం చేసుకునే వారు కూడా 'నేత్ర త్రయాయ' అనే అంటారు. మంత్రం చేస్తున్న వారికి మూడు కళ్ళు ఉన్నాయా? ఉన్నవి రెండే కళ్ళేగా? ఇక్కడ మూడు కళ్ళు అంటే సూర్య, చంద్ర, అగ్ని గురించి చెప్పడం.

దేని వలన ప్రతి వస్తువుని గ్రహించగలుగుతున్నామో ఆ చైతన్యాన్ని తీసుకుంటే అదే మూడు రకాలుగా మనలో ఉన్నది. అది మనస్సు, మాట, క్రియ అనే మూడు తేజస్సులు.

మనస్సుకి 'చంద్రమా మనసో జాతః' అని చంద్రుడు, 'అగ్నిర్మే వాచి శ్రితః' అని వాక్కుకి ఉన్న తేజస్సు అగ్ని, కంటి యందు ఉన్న తేజస్సు (చక్షోః సూర్యోఽ జాయత)సూర్యభగవానుడు. శరీరానికి కన్ను, మాటకి అగ్ని, మనస్సుకి చంద్రుడు. ఈ మూడురకాల తేజస్సులలో మంత్రాన్ని న్యాసం చేసుకోవడమే 'నేత్రత్రయాయ వౌషట్'.

అమ్మవారు ఈ సూర్య, చంద్ర, అగ్ని నేత్రములుగా సృష్టిలో అందరి త్రికరణాలను నడుపుతోంది. ఈ త్రికరణాల నుండి వచ్చే వెలుగే త్రినయనా.

ఏతత్తే వదనం సౌమ్యం లోచన త్రయ భూషితం

పాతు నః సర్వభూతే(భీతి)భ్యః కాత్యాయని నమోస్తుతే (దేవీమాహాత్మ్యం)

అమ్మా! నీ మూడు కన్నుల సౌమ్య వదనంతో మమ్మల్ని కాపాడమని ప్రార్థించారు దేవతలు, ఋషులు. ఆ మూడు కళ్ళ శక్తే శ్రీచక్రంలో మూడు మండలాలుగా చెప్పబడుతున్నది. అదే మన శరీరమందు కూడా అగ్ని, సూర్య, చంద్ర మండలాలుగా ఉన్నది. ఈ మూడు కళ్ళతో, మూడు లోకాలని, మూడు కాలాలని పరిశీలించే తల్లి.

అమ్మవారి యొక్క సూర్యచంద్ర అగ్ని తత్త్వములని పైన చెప్పిన తేజోవతీ నామంతో అనుసంధానం చేసుకుని చూస్తే తేజోవతీ అంటే మొత్తం 365 కిరణాలు. ఒకొక్క రోజులో ప్రసరించే అహోరాత్ర రూపమైన అమ్మవారి తేజస్సు. కాలమంతా అమ్మ రూపమే. అహోరాత్ర తేజస్సు కూడా త్రినయన. ఒక దినంలో త్రిసంధ్యలుగా ఉన్నది ఈ తల్లి. త్రినయనా భావాన్ని శంకరభగవత్పాదులవారు సౌందర్యలహరిలో అత్యద్భుతంగా –

అహస్సూతే సవ్యం తవ నయనమర్కాత్మకతయా

త్రియామాం వామంతే సృజతి రజనీ నాయకతయా

తృతీయా తే దృష్టిర్దరదలిత హేమాంబుజ రుచిః

సమాధత్తే సంధ్యాం దివసనిశయోరంతర చరీమ్ అని వర్ణించారు.

తేజోవతీ నామం ప్రక్కన త్రినయనా నామం వచ్చినప్పుడు ఈ ఉద్దేశంతో తెలుసుకోవాలి.

అమ్మా! నీ ఒక నేత్రము సూర్యనేత్రమై పగటిని సృష్టిస్తున్నది. మరొక నేత్రము చంద్రనేత్రమై రాత్రిని సృజిస్తున్నది. మధ్యలో అరవిరిసిన బంగారు కమలంలా ఉన్న మూడవ నేత్రం 'సమాధత్తే సంధ్యాం–దివసనిశయోరంతరచరీమ్'– నీ యొక్క ఫాలనేత్రము పగటికి, రాత్రికి నడుమ ఉన్న సంధ్యని తెలియచేస్తున్నది. ఇది కూడా సాధారణ వర్ణన కాదు.

సరిగ్గా సంధ్యా స్థానం కనుబొమల నడిమి ప్రాంతం. అక్కడ అమ్మ యొక్క ఫాలనేత్రం సంధ్యాస్థితిని తెలియజేస్తుందని ఒక అద్భుతమైన భావాన్ని చూపించారు.

కనుక త్రి–నయన. పగలు, రాత్రి, సంధ్యా అనే తేజస్సులని చెప్తూ ఉన్నది.

'ప్రత్యక్ష, అనుమాన, ఆగమ' అనే మూడు ప్రమాణాల స్వరూపిణి – అని కూడా భావించవచ్చు.

454. లోలాక్షీకామరూపిణీ – శ్రీ లోలాక్షీకామరూపిణ్యై నమః

లోలాక్షీ – శ్రీ లోలాక్ష్యై నమః

కొన్ని పుస్తకాలలో భాష్యకారులే 'లోలాక్షీ కామరూపిణీ'ని ఒక నామంగా చూపించారు. కానీ పూర్వ గ్రంథాలలో లోలాక్షీ ఒక నామం, కామరూపిణి ఇంకొక నామం.

లోల అనే మాటకి ఒకటి ఆసక్తి, మరొకటి చలనము అని రెండు అర్థాలు. అటూ ఇటూ కదులుతూ ఉన్న దానిని లోల అంటారు.

అమ్మ వారి కన్నులు లోల–అక్షులు అంటే కదులుతున్న నేత్రములు. అవి కదలకపోతే రోజులు కదలవు. ఆ సూర్యచంద్రాత్మకమైన గమనముతో లోకం నడుస్తోంది. గమనశీలమైన సూర్య, చంద్ర తేజస్సులే అక్షులుగా కలది కనుక త్రినయనా వెంటనే లోలాక్షీ చెప్పారు. రెండూ నేత్రాలకి సంబంధించినవే. లోలాక్షీ అని చెప్పినప్పుడు గమనశీలమైన తేజోమయ నేత్రాలు కలది. ఇది 'విశ్వవిగ్రహా' అయిన అమ్మవారి స్వరూపం.

అమ్మవారి అపారమైన కారుణ్యభావాన్ని పరిశీలిస్తే 'లోలత కలిగిన అక్షి'. లోలత అంటే ఆసక్తి. అమ్మవారి నేత్రాలలో రెండు రకాలైన ఆసక్తి కనబడుతుందని చెప్పారు. ఆసక్తి అంటే ప్రేమకు చిహ్నం. ఎవరి మీద ప్రేమ ఉంటే వారిని అలా చూస్తూంటాం. పైగా అమ్మవారు ఎప్పుడూ కూడా శివునినే చూస్తుంటుంది. పరమేశ్వరునిపై లోలత కలిగిన నేత్రములు కనుక అమ్మవారని లోలాక్షీ అన్నారు.

'నిజభర్తృముఖాంభోజచింతనాయై నమో నమః'– ఆ స్వామిని అలా చూస్తూ ఉండడమే అమ్మవారికి ఆనందం. ఈ ఆసక్తి పరమాత్మ పట్ల ప్రేమరూపంతో ఉంది.

భక్తుల పట్ల అమ్మ వాత్సల్యరూపమైన లోలతతో చూస్తూ ఉంటుంది. ఎప్పుడూ

భక్తులను చూస్తూ ఉంటుంది. భక్తులపై లాలిత్యం, వాత్సల్య భావం అమ్మవారికి ఉంది. వాత్సల్యరూపమైన ప్రేమశక్తి ఆ కళ్ళల్లో కనబడుతోంది. ఈ విధంగా మూడు రకాల భావాలు ఈ నామానికి తీసుకోవచ్చు.

కామరూపిణీ– శ్రీ కామరూపిణ్యై నమః

'కామకలారూపా' దగ్గర చెప్పిన మాట యొక్క మరొక స్వరూపమే ఇక్కడ చూపించారు. 'కామ' 'రూపా' శబ్దాలు రెండూ ఇక్కడ ఉన్నాయి. కామ అంటే 'కమనీయత్వాత్ కామః' ఇది ప్రథమమైన అర్థం. అందరూ కోరుకునేది కామం. అది – ఆనందం. కామరూపిణీ అనగా ఆనందరూపిణీ. అమ్మవారు సచ్చిదానంద ఘనరూపిణి కదా!

మరొకటి కామరూపిణీ అంటే ఇచ్ఛతో రూపాలు స్వీకరించునది. వారు ఏ రూపాన్ని కావాలంటే ఆ రూపాన్ని స్వీకరిస్తే కామరూపధారులు అని అంటారు.

'స్వేచ్ఛయోపాత్తవిగ్రహా' అని శాస్త్రంలో వర్ణించారు. 'స్వ–ఇచ్ఛయా' – తన యొక్క ఇచ్ఛతో స్వీకరించే సచ్చిదానందమయ విగ్రహమది. పూర్తి వశీకృతమైన ఇచ్ఛతో అమ్మ ప్రకాశిస్తోంది కనుక కామరూపిణి. ఎందుకు ఆకారాన్ని స్వీకరిస్తోంది? **'భక్తహేతోర్ధృతాకృతిః'** – భక్తులను అనుగ్రహించడం కోసం స్వేచ్ఛగా రూప స్వీకారం చేస్తుంది. **'ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా'** అని శాస్త్రం.

ఉపాసకులను అనుగ్రహించడం కోసం ఏ రూపం లేని పరబ్రహ్మ రూపస్వీకారం చేశాడు. అలాగ ఋషులకి కనిపించి అనుగ్రహించిన ఆ రూపాలను ధ్యానించమని ఉపాసకులకు బోధించారు. ఉపాసకుల యొక్క కోరికలు తీర్చడానికై తన యొక్క ఇచ్ఛతో రూపము ధరించింది కనుక కామరూపిణీ.

కామమనగా పరమేశ్వరుని యొక్క ఇచ్ఛాశక్తి. ఆయన ఇచ్ఛాశక్తే రూపం ధరించి అమ్మవారు అయ్యారు. లలితోపాసన అంటే శివ సంకల్పాన్ని ఉపాసించడమే. సంకల్పశక్తి ఉపాసనయే లలిత. ఈ నామం మంత్రపరంగా చూస్తే 'ఈం'బీజ స్వరూపిణి. అమ్మవారి గుప్త ప్రణవాన్ని మళ్ళీ ఇక్కడ ధ్వనింపజేస్తున్నారు. కామరూపిణి

అయిన తల్లికి యోగీశ్వరి అని పేరుంది. ఈ కామరూపిణీ దేవి క్షేత్రం కామాఖ్యా.

కామేశ్వరీం చ కామాఖ్యాం కామరూప నివాసినీం
తప్తకాంచనసంకాశాం తాం నమామి సురేశ్వరీమ్

అని దేవీపురాణంలో కామాఖ్యలో ఉన్న దశవిధ విద్యాస్వరూపిణి అయిన జగదంబ యొక్క పూర్ణరూపానికి సంబంధిన మంత్రాన్ని శివుడు నారదునికి ఉపదేశించాడు. ఇది అత్యద్భుతమైన మంత్రం. ఈ మంత్రాన్ని ప్రతివారు పఠించుకోవచ్చు. దీనిలో కామేశ్వరీ, కామాఖ్యా, కామరూపిణీ అని మూడు శబ్దాలు మంత్రాలుగా ఉన్నాయి.

455. మాలినీ – శ్రీ మాలిన్యై నమః

మాలినీ అంటే మాల ధరించినది అని సాధారణమైన అర్థం. చక్కటి మాలలు ఎన్నో ధరించింది. **'హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణరజతస్రజాం'** అని శ్రీసూక్తం. అమ్మవారు సువర్ణరజతాది దివ్యధాతువులతో కూడిన మాలికలు, దివ్య రత్నమాలికలు, అనేక రకాల కల్పవృక్ష కుసుమాలతో అల్లిన మాలికలు ధరించి ఉన్నారు. కనుకనే సుమమాలలు, రత్నమాలలు, సువర్ణ రజతాది ధాతుమాలికలు ధరించిన తల్లి గనుక 'మాలినీ'.

గంగాదేవియైన జగదంబకు 'మాలిని' అని నామం.

మాలినీ మంత్రమని ఒకటున్నది.

శ్రీమన్మాలిని మంత్రరాజ సహితం వందే గురోర్మండలమ్

గురుమండల స్తోత్రం చేస్తూ 'శ్రీమన్మాలినీ' అంటాం. ఈ మాలినీ అర్థమైతే తరువాత నామం హంసినీ అర్థమౌవుతుంది. అప్పుడు వెంటనే మాతా, మలయాచలవాసినీ అర్థం అవుతాయి. ఈ నామాల కూర్పులో అంత ఔచిత్యం ఉంది. శ్రీవిద్యోపాసనలో గురుమండలము చేసుకుని, గణపతి మంత్రం చేసుకుని ఆ తరువాత మాలినీ మంత్రం చేస్తే శ్రీవిద్యారాధనకి యోగ్యుడవుతాడు.

'అ' కారం నుండి 'క్ష' కారం వరకు ఉన్న అక్షరమాలయే మాలినీ మంత్రం.

దీనికి ముందు కొన్ని బీజాక్షారాలు, మళ్ళీ చిట్టచివర కొన్ని బీజాక్షరాలు పెట్టడం ఉంది. ఈ అక్షరశక్తులు సామాన్యం కావు. అ తరువాత క్రమంగా అం అః వరకూ వచ్చి మళ్ళీ క,ఖ,గ,ఘ అని హల్లులు చెప్పాలి. ఆ పద్ధతిని ఎవరు నిర్ణయించారు? ఋషులు. వేదమునందే నిర్ణయించారు.

ఆ పద్ధతిని అనుసరించి భారతదేశంలో ఏ భాషవారైనా అక్షరాభ్యాసం చేస్తారు. ప్రపంచంలో ఎక్కడా ఈ పద్ధతి లేదు. పరమేశ్వరుని డమరుకం మ్రోగించినప్పుడు వచ్చిన క్రమమది. ఆ డమరుకం నుండి 14 శబ్దాలు వచ్చాయి. అవే మహేశ్వర సూత్రాలు.

అ, ఇ, ఉ – అలా మొత్తం 14 సూత్రముల నుండి పంచాశద్వర్ణాలు వచ్చాయి. ఈ 50 అక్షరాల క్రమం మంత్రశాస్త్రం. చిన్నప్పుడు అక్షరాభ్యాసము అనే పేరుతో పిల్లలకి ఆ మంత్రాలని అభ్యసింపజేస్తారు. అక్షరాభ్యాసం కాదు అది మంత్రాభ్యాసం. ఆ మంత్రశక్తులైన అక్షరాలు అనుగ్రహిస్తేనే తరువాత అక్షరాత్మకాలైన విద్యలన్నీ అనుగ్రహిస్తాయనే ఉద్దేశంతో మన పెద్దవారు అక్షరాభ్యాసం అని పెట్టారు.

లౌకిక విద్యలకి కాని, పారమార్థిక విద్యలకి గాని ప్రధానం అక్షరశక్తి. అదే నాదశక్తి. అక్షరాలు అమ్మరూపం అని మొదటి నుండి చూపించడం మన పెద్దవారు చేసిన గొప్ప అలవాటు. వాటిని క్రమబద్ధంగా పెట్టుకుని గురూపదేశంతో మాతృకావర్ణాలు గ్రహించి ఉపాసించడం విశేషమైన అంశం. అక్షరాలని ప్రతిరోజు మంత్రంలా భావం చేస్తూ పలుకుతూ సాధన చేస్తే అది ఒక పెద్ద సాధన.

ఆదిక్షన్మమ గురురాట్ ఆదిక్షాంతాక్షరాత్మికాం విద్యామ్
స్వాదిష్ట చాపదండాం నేదిష్ఠామేవ కామపీఠగతామ్

అంటారు మూకకవి. “నా గురువుకి నా పై ఎంత దయ ఉందంటే నాకు ఎంతో కారుణ్యంతో అ కారాది, క్ష కారాంతకమైన విద్యను అనుగ్రహించాడ”ని పులకించిపోయి అంటున్నాడు. మా గురురాజు నాకు ఆదిక్షన్ – ఆదేశించాడు.

ఆదిక్షాంతాక్షరాత్మికామ్ విద్యాం– అ కారం నుంచి క్ష కారం వరకూ ఉన్న విద్య పరావిద్య. ఆ పరావిద్య స్వరూపం స్వాదిష్ట చాపదండాం – తీపి విల్లు అంటే

చెఱకువిల్లు పట్టుకున్న తల్లి. ఆవిడే అ కారాది క్ష కారాంతక మాతృకాస్వరూపిణి. నేదిష్టామేవ కాంచీ నిలయామే – కంచిలో నాకళ్ళ ఎదురుగా కనిపిస్తోంది ఆ తల్లి– అని ఆనందపరవశంతో మూకకవి అంటున్నారు.

అక్షరమాల అమ్మ యొక్క స్వరూపం. దీనికి 'మాలినీ మంత్రం' అని పేరు. రాజాశ్యామలకి సంబంధించిన బీజాక్షరములు అటూ, ఇటూ సంపుటితం చేసి మధ్యలో అక్షరాలకి నాదాన్ని మేళవించినది – మాలినీ మంత్రం. అది గురుముఖతః మాత్రమే తెలుసుకోవలసిన ఒకానొక విద్య.

ఏం చేతకాకపోయినా అకారం నుంచి క్షకారం వరకు ఉన్న అక్షరశక్తులని రోజూ ఒకసారి అనుకుని 'శ్రీమాత్రే నమః' అని అనుకున్నా చాలు. అది ఒక పెద్ద ఉపాసన. పిల్లలకి అలవాటు చెయ్యవచ్చు. మనం కూడా చేసుకోవచ్చు. అమ్మ అంటేనే వాగ్దేవి. పరా వాగ్దేవి. ఆ వాగ్దేవత ఉపాసనయే శ్రీవిద్యోపాసన. మాలినీ అంటే అక్షరమాలా స్వరూపిణి.

'మాతరం పద్మమాలినీం' అని, అదేవిధంగా **'హేమమాలినీం'** అని శ్రీ సూక్తంలో మాలినీ శబ్దాలు కనబడుతున్నాయి. **'శ్రియం వాసయ మే కులే మాతరం పద్మమాలినీం'** అని కులే అన్నప్పుడు షట్చక్రాల యందు పద్మముల వరుస అంటే సహస్రారం నుండి మూలాధారం వరకూ అన్నీ పద్మములే. ఈ పద్మాలు ఒక వరుసగా ఉంటాయి కనుక 'పద్మమాలినీ'. అది కులం. "నా కులమునందు ఆ శ్రీ భాసించు గాక!" అంటే షట్చక్రములందు ఆ కుండలినీ శక్తి ప్రకాశిస్తూ ఈ షట్చక్రరూపమైన పద్మాలు విచ్చుకొనుగాక... అని అర్థంలో పద్మమాలినీ అనే భావాన్ని చూపించారు.

దానికి, ఈ మాలినీకి సంబంధమున్నది. 50 అక్షరాలు మాల అనుకున్నాం. జపమాలకి అక్షమాల అని పేరు. అకారాది క్షకారాంత అక్షరములే అక్షమాల.

కొందరు, "జపమాల పట్టుకోవాలా?" అని అడుగుతారు. దాని శక్తి దానిదే. ఊపిరితో మంత్రం చేస్తే అదొక జపమాల అన్నారు. ఉచ్ఛ్వాస, నిశ్వాస ఒక ఆవృతి. అజపామంత్రస్వరూపం ఈ 'మాలినీ', 'హంసినీ' అనే నామాలలో ఆవిష్కరణ అవుతుంది. హంసమంత్రం అంటే అజపా గాయత్రీ.

అజపాగాయత్రీ అంటే శ్వాసకి సంబంధించిన మంత్రరాజం. దీనినే హంసమంత్రం అంటారు. తదుపరి నామం – హంసినీ. అజపా అంటే శ్వాస. ఈ శ్వాస సంచరిస్తున్న తీరు మొత్తం షట్చక్రాలలోంచి ప్రసరిస్తూ ఉంటుంది. షట్చక్రాలలో మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు ఒకొక్క చక్రానికి కొన్ని అక్షరాలు చొప్పున విభజన జరుగుతోంది. మూలాధారంలో వ, శ, ష, స అనే నాలుగు అక్షరాలు, తరువాత స్వాధిష్ఠానం దగ్గర 6 అక్షరాలు, మణిపూరం దగ్గర 10 అక్షరాలు, అనాహతం దగ్గర 12 అక్షరాలు, విశుద్ధిచక్రం దగ్గర 16 అక్షరాలు, ఆజ్ఞాచక్రం దగ్గర భ్రూమధ్యం వద్ద 2 అక్షరాలు. మొత్తం 50 అక్షరాలు అయ్యాయి. 50 అక్షరాలు కలుపుకుని సహస్రారం దగ్గర భాసిస్తాయి.

మూలాధారం దగ్గర నుండి ఆజ్ఞాచక్రం వరకూ కులం అంటారు. ఆ కులం లోపల ఉన్న 50 అక్షరాలు కలిపి ఒక మాల. మూలాధారం దగ్గర నుండి ఆజ్ఞాచక్రం వరకు తిరిగే ఆ శ్వాస గమనమే **మాలినీ.** ఇది పెద్ద అక్షమాల.

మాలినీని అక్షరశక్తులుగా భావించి అక్షరాలు మన షట్చక్రాలయందున్న శక్తులే అని గ్రహించాక అది శ్వాసమంత్రమైన హంస మంత్రంగా పరిణమిస్తుంది.

మాలినీ అంటే భవ్యమైన అక్షరస్వరూపం. అదే విధంగా మనలో మూలాధారాధి ఆరుచక్రాలలో సంచరించే ప్రాణశక్తి రూపం. ఈ ప్రాణశక్తినే హంస అంటారు. హం–స ఉచ్ఛ్వాస నిశ్శ్వాసాత్మకమైనది. ఉచ్ఛ్వాసకు హ కారం, నిశ్శ్వాసకు స కారం. హకారం శివరూపం, సకారం శక్తి రూపం. ఉచ్ఛ్వాస నిశ్శ్వాసము లేనిదే బ్రతుకు లేదు.

ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలు కలిపి ఒక ప్రాణం ఎలా అయ్యిందో అలా శివశక్తులు కలిపి ఒకే పరతత్త్వంగా కనబడుతుంది. హంసతత్త్వ ఉపాసన అంటే ఇదే. ఏ మంత్రం చేసినా ఇంతే. ప్రాణాయామం చెయ్యండని అంటుంటారు. మనం చెయ్యబోయే మంత్రవిద్యని శ్వాసతో మేళనం చేసుకుంటే క్రమంగా చైతన్యతత్త్వంలోకి ప్రవేశించడానికి పెద్దవారు ఏర్పాటు చేసిన పద్ధతి ఇది.

మంత్రానికి, ప్రాణశక్తికి సంబంధం ఉంది. ప్రాణశక్తికి, ఆత్మశక్తికి అతిదగ్గర

సంబంధం ఉంది. ఆత్మ యొక్క చైతన్యం తెలుసుకోవాలంటే ప్రాణశక్తితో మేళనం జరగాలి. ప్రాణశక్తిని గ్రహించాలంటే మంత్రశక్తి కావాలి. మంత్రం అత్యంత ప్రధానంగా చెప్పడం జరుగుతోంది. మాలినీ అన్నప్పుడు అక్షరరూపమై మంత్రాన్ని చెప్తూ, ఆ మంత్రాన్ని అనుసంధానం చెయ్యవలసిన శ్వాసవిద్యని 'హంసినీ' అనే నామంతో వెంటనే చూపిస్తున్నారు.

456. హంసినీ – శ్రీ హంసిన్యై నమః

హంస శబ్దానికి అనేక రకాలైన అర్థాలు ఉన్నాయి. మొట్టమొదట ప్రధానార్థం అజపారూపిణి. అజపా మంత్రం అంటే మనలో ఎప్పుడూ తిరుగుతున్న శ్వాస. జీవుడు ఎప్పుడూ త్రిప్పుకుంటున్న అక్షమాల. ఆ జపమాల ఆగిపోతే మన బ్రతుకు జపం ఆగిపోతుంది. ఆ జపమాల నిరంతరం తిరుగుతోంది. జపాన్ని ఆ మాలతో కలిపి చేస్తే అది గొప్ప ఉపాసన అవుతుంది.

గమాగమస్థం గమనాది శూన్యం
చిద్రూపదీపం తిమిరాపహారం
పశ్యామి తే సర్వ జనాంతరస్థం
నమామి హంసం పరమాత్మరూపం

అంటారు. హంస అంటే పరమాత్మ రూపం. ఆయన సర్వజనులలోను అంతరస్థంగా ఉన్నాడు. హంస శబ్దం సూర్యునికి కూడ చెప్పారు. శరీరానికి ఆత్మ ఎలాగో ప్రపంచానికి సూర్యుడు అలాగ ఉన్నాడు.

'సూర్య ఆత్మాజగతస్తస్థుషశ్చ' – స్థావరజంగమాత్మకమైన ప్రపంచానికి ఆత్మ సూర్యుడు. మన శరీరం ఎలాగ ఆత్మ వల్ల చైతన్యాన్ని పొందుతుందో, ప్రపంచం అనే శరీరం సూర్యునివల్ల అలా చైతన్యాన్ని పొందుతోంది. గాయత్రీనామం నుండి మొదలై ఒకే గొలుసులా ఈ నామాల వరుస కొనసాగుతోంది.

గాయత్రీ సూర్యమండలాంతర్వర్తి విద్య. గాయత్రిలో గుప్త, ప్రకట, అజప మూడు భేదాలున్నాయి. ప్రకట గాయత్రీ, గుప్త గాయత్రీ ముందు వివరించుకున్నాం.

ఇప్పుడు అజపా గాయత్రీ చూపిస్తున్నారు. మనందరి ప్రాణశక్తికి అసలైన ఆధారం సూర్యభగవానుడు. అందుకే ఆ స్వామినే 'ప్రజా ప్రాణాః ఋతుకర్తా ప్రభాకరః' అని ఆదిత్యహృదయం తెలియజేస్తోంది.

ఆయన సర్వులకు ప్రాణరూపుడు. సూర్యుడే ప్రాణమనే విషయాన్నే ప్రశ్నోపనిషత్ చాలా వివరించింది. సూర్యమండలంలో ఉన్న తేజస్సే అమ్మవారు. సూర్యునికి హంస అని పేరుంది. హంసః అనే శబ్దమే స్త్రీలింగం చేసి హంసినీ అన్నారు.

హంస మంత్రస్వరూపాన్ని అమ్మరూపంగా దర్శించడం హంసినీలో ఉన్న గొప్ప ప్రత్యేకత. సోహం హంసః అని రెండిటి అనుబంధాన్ని చెప్తూ **'అహం – సః ఇతి తాదాత్మ్య భావినః సంసారభయం హంతీతి హంసః'** అన్నారు. 'అతడే(బ్రహ్మమే) నేనని తాదాత్మ్యంగా భావించే వాని సంసార భయాన్ని పోగొట్టునది – హంస.

అహం సః – ఇందులో అకారం లుప్తమైంది. హంసలో అ సహాయం లేనిదే హ అనలేం మనం. 'అహం సః హంసః' ఇంతే అర్థం.

రసో వై సః – తత్. తత్పదార్థమే సః. త్వమ్ పదార్థమే అహం.

ఉపాసన తాదాత్మ్య భావనతో చెయ్యాలి.

మనలో ఉన్న నేను అనే చైతన్యం సః అనబడే అమ్మతో తాదాత్మ్యం చెందుతుంది.

అలాంటి తాదాత్మ్య భావం మనకు కలిగిందంటే సంసార భయం తప్పకుండా ఆ తల్లి పోగొడుతుంది.

హంసః అనే శబ్దానికి మరొక అర్థం 'హంతి గచ్ఛతి' – సంచరించునది. ఆయన కాంతి గమనం వలనే ఉదయం, సాయంత్రం ఏర్పడుతోంది. అంత గమన శక్తి వేరెవరికీ లేదు.

నిమిషార్ధేనైకేన ద్వేచ శతే ద్వే సహస్రే ద్వే
క్రమమాణ యోజనానాం నమోస్తు తే నళిననాథాయ

కనురెప్పపాటుకి సగం కాలంలోనే 2,200 యోజనాలు ప్రయాణిస్తాడు. అంత తీవ్రమైన గమనం ఉంది గనుకనే సూర్యభగవానునికి హంస అని పేరు వచ్చింది.

గమన శక్తి కలిగినవాడని హంస శబ్దానికి అర్థం. అమ్మవారికి హంస అని పేరెలా వచ్చిందో వివరిస్తూ **'హంతి గచ్ఛతి సర్వ శరీరేషు ఇతి హంసః'** అన్నారు. ప్రతివారి శరీరంలో ఆవిడ గమనం చేస్తోంది.

అలా గమనం చేయకపోతే బ్రతుకు గమనం ఆగిపోతుంది. ఆవిడ హాయిగా చేస్తున్న గమనం చూడాలంటే ధ్యానంలోకి వెళ్ళాలి. ధ్యానంలో మన శ్వాస హాయిగా ఆడుతుంది. 'మరాళీ' 'మందగమనా' నామాల దగ్గర దీని గురించి విస్తారంగా వివరించుకున్నాం.

చైతన్యరూపంలో, ప్రాణరూపంలో ప్రతి వారిలో సంచరిస్తోంది కనుక అమ్మకి హంస అని పేరు. ఆ హంసస్వరూపిణి హంసినీ.

మరొక అర్థంలో **'వస్తువివేక సమర్థా హంసా'.** వివేకజ్ఞానమే హంస. హంసకు ఒక లక్షణముంది పాలు, నీరు కలిపేస్తే పాలు తీసుకుని నీరు విడిచి పెడుతుంది. దానికి వివేకము అని పేరు. సృష్టిలో జడం, చైతన్యం రెండూ కలిసే ఉంటాయి. అందువల్లే పరమ భ్రాంతికి లోనై చైతన్యాన్ని జడమనుకుంటాం. జడాన్ని చైతన్యమనుకుంటాం. రెండింటినీ వేరు చెయ్యగల సమర్థత ఆ తల్లి అనుగ్రహం ఉంటే వస్తుంది. ఆ సమర్థత వివేక సమర్థత.

వివేకం అనే మాటకి అసలైన అర్థం వేరు చేసి చూడగలగడం. ఏది నిత్యం, ఏది అనిత్యం. ఏది సత్యం, ఏది అసత్యం అని వేరు చేసి చూడగలగడం వివేకం. జ్ఞానం రావాలంటే మొదటి అడుగు వివేకం. జ్ఞానము వివేకము మీద ఆధారపడి ఉంటుంది. కనుకనే హంస పైనే సరస్వతి ఉంది. వివేకమే హంస. జ్ఞానమే సరస్వతి.

హంసలు – అనగా యతులలో శ్రేష్ఠులు. ఆత్మజ్ఞానసంపన్నులైన వారిలో తత్‌జ్ఞానరూపిణి.

457. మాతా – శ్రీ మాత్రే నమః

సందర్భాన్ని బట్టి నామార్థాన్ని, దాని ఔచిత్యాన్ని గ్రహించే ప్రయత్నం చేయాలి.

మాతా అంటే సాధారణంగా అయితే తల్లి అని అర్థం. ఈ వివరణంతా శ్రీమాతా దగ్గర చెప్పుకున్నాం. అయితే ఇక్కడ మాతాకి మరొక అర్థం చెప్పుకోవాలి. మాతా అంటే మాతృకావర్ణరూపిణి. 50 అక్షరాలకు తల్లులు అని పేర్లు. ఈ తల్లులు ఉంటేనే తరువాత వాక్యాలు, పదాలు, కావ్యాలు అనే సంతానం.

50 అక్షరాలకి మాతృకావర్ణాలని పేరు. ఈ మాలినీ హంసినీగా మనలో సంచరిస్తున్న 50 అక్షరాల రూపంతో ఉన్న తల్లి 'మాతా'.

'మంత్రాణాం మాతృభూతా చ మాతృకా పరమేశ్వరీ' (స్కాన్దపురాణం) అమ్మవారికి మాతృకా పరమేశ్వరీ, మాతా అని కూడా పేరుంది.

అక్షరాలను అటూ ఇటూ అమర్చడంలోనే మంత్రాలు వస్తున్నాయి. ఓషధులని ఎలా సంకలనం చేస్తే ఔషధం వస్తుందో వైద్యునికి తెలుసు. అక్షరాలను ఎలా కలిపితే మంత్రం అవుతుందో ఋషికి తెలుసు. ఓషధులన్నీ గొప్పవే కదా అని మనమే నాలుగు తీసుకుని మ్రింగేస్తే ఉంటామో, లేదో సందేహమే. అలాగే ఏ అక్షరాలను ఎలా కలపాలో తెలియకుండా మంత్రానుష్ఠానం చెయ్యరాదు. పుస్తకాలు చూసి చేసేవారికి ఇవే ప్రమాదాలు.

మంత్రాలన్నిటికి తల్లి వంటివి అక్షరాలైతే, ఆ అక్షరస్వరూపిణి అమ్మవారు కాబట్టి అమ్మవారు మంత్రమాతృకామూర్తి.

లోకంలో మనల్ని కన్న తల్లి కూడా అమ్మవారి స్వరూపమే.

'త్వత్కళా సర్వ యోషితః' అని. ఇది 'రామా' నామం దగ్గర చాలా విశేషంగా చెప్పుకున్నాం.

జగన్మాతృ భావన బాల్యం నుండి అవగాహన చేసుకున్నట్లైతే ప్రతిది అమ్మగానే చూస్తారు. భారతదేశంలో చదువు నేర్పేటప్పుడే సరస్వతీ అమ్మ అని నేర్పుతారు. డబ్బు పుచ్చుకునేటప్పుడు లక్ష్మమ్మా అంటాం. బలం కనపడితే దుర్గమ్మా అంటాం. మన భారతీయసంస్కృతి ఇలా ప్రతిదాన్ని అమ్మగా చూడడం నేర్పింది. సర్వం జగన్మాతృమయమనే భావన మనకి 'మాతా' అనే నామంలో కనబడుతున్నది.

తుష్టి, పుష్టి నామాల నుండి అమ్మవారు ఆయా పేర్లతో ఏ ఏ క్షేత్రాలలో

ఉన్నారో సందర్భాన్నిబట్టి చెప్పుకుంటున్నాం. కాయావరోహణము అని ద్రవిడ దేశంలో ఒక క్షేత్రముంది. ముత్తుస్వామి దీక్షితులు కాయావరోహణేశ్వరునిపై కీర్తనలు కూడా రచించారు. అక్కడ అమ్మవారి పేరు 'మాతా'.

458. మలయాచలవాసినీ - శ్రీ మలయాచలవాసిన్యై నమః

మలయపర్వతం పైన ఉన్న తల్లి.

వింధ్యాచలం అన్న పదానికి కూడా రెండు అర్థాలు చెప్పుకున్నాం. 'సహస్రార స్థానమే వింధ్యాచలం'.

మలయాచలం అనేదానికి కూడా ఇంకొక అర్థం ఉండాలి. ముందుగా భౌతిక అర్థం చెప్పుకోవాలి. క్షేత్రరూపంలో ఉన్న తల్లికి ముందుగా నమస్కారం చేసుకోవాలి. మలయాచలము అనగా మలయాళ దేశము. అదే ఇప్పుడు కేరళగా పిలవబడుతోంది. అక్కడ పర్వత శ్రేణికి మలయపర్వతాలని పేరు. అక్కడ ఉన్న తల్లికి భగవతి అని పేరు.

ఇప్పటికి కేరళలో ఏ ప్రాంతానికి వెళ్ళినా అమ్మవారిని వారు 'భగవతీ' అనే పిలుస్తారు. ఒకొక్క మండలంలో ఒకొక్క పేరు. కాంచీపురం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏ అమ్మవారినైనా 'కామాక్షీ తాయి' అంటారు. అఖండ కాంచీమండలంలో ఏ రూపంలో అమ్మ ఉన్నా ఆవిడ కామాక్షే.

అలాగే మలయపర్వతముల యందు ఎక్కడ కేరళలో చూసినా అమ్మవారు భగవతిగానే పిలవబడతారు. పరుశురామ క్షేత్రాలుగా ఆరు భగవతీ క్షేత్రాలున్నాయి. మూకాంబిక మొదలుకొని 6 క్షేత్రాలు. మూకాంబికా క్షేత్రం ఒకటి కర్ణాటకలో ఉంది. మిగిలిన ఐదు క్షేత్రాలు మలయాళంలో ఉన్నాయి. కర్ణాటక, మలయాళం అని మనం తరువాత చేసుకున్న రాష్ట్ర విభజన. అంతా భరతవర్షమే. 6 భగవతీ క్షేత్రాలు ఒకేలా ఉంటాయి. భగవతీరూపంలో మలయాచలంలో ఉన్న అమ్మవారు.

మరొక అర్థంలో 'మాలినీ, హంసినీ, మాతా' నుండి 'మలయాచలాని'కి అనుబంధం ఉంది. పూర్వాపర సంబంధం తెలియాలి. శ్వాస, అక్షరాలు

చెప్పుకుంటున్నాం. మూడు అక్షరాలలోనే 50 అక్షరాలు ఉన్నాయి. అది పెద్ద రహస్యం.

మాతా అంటే ఓంకార రూపిణి. ఓంకారం అన్ని అక్షరాలకి మూలం. ఆ ఓంకారంలో ఉన్నవి మూడే అక్షరాలు అవి అ–ఉ–మ. ఇవి కలిపే ఓం అయ్యింది. అ అని పలికేటపుడు కూడా నోరు పూర్తిగా తెరుచుకుంటుంది. ఉ అన్నప్పుడు సగం మూసుకుంది. మ్ అన్నప్పుడు పూర్తిగా మూసుకుంది.

పూర్తిగా తెరచుకొనుట సృష్టి, మధ్యలో ఉండుట స్థితి(ఉ). మ్– లయ. సృష్టి, స్థితి, లయలు అ–ఉ–మ లో ఉన్నాయి.

ఓంకారం అన్నప్పుడు స్థూలంగా వినబడేది మకారంతో ఆగిపోతుంది. అ–ఉ–మ కారాలు స్థూల నాదాలు. దాని తరువాత సూక్ష్మనాదం మనకు వినబడదు. మ్ అనే ఆ సూక్ష్మనాదం – ఓంకారం దేని నుంచి ప్రారంభించామో దానిలోకి తిరిగి వెళుతుంది.

వినపడే స్థూలనాదాలు అ–ఉ–మ కారములైతే, వినపడని సూక్ష్మనాదాలు ఎనిమిది.

అ–ఉ–మ కారాలు సరిగ్గా మనకి భ్రూమధ్యస్థానంతో పూర్తవుతాయి. భ్రూమధ్యం దాటిన తరువాత సహస్రారం వరకు కలుపుకుంటే ఆ సూక్ష్మనాదానికి తురీయం అని ఉపనిషత్ ఒకే పేరు పెట్టింది. ఇవి మూడు అయితే సహస్రారం దాకా ఉన్నది నాలుగవది. అ–ఉ–మ కారాలు జాగ్రత్స్వప్నసుషుప్తులను, బ్రహ్మవిష్ణురుద్రులను, సృష్టి, స్థితి, లయలను చెప్తుంటాయి.

ఈ మూడింటిలో ఉంటూనే ఈ మూడింటిని దాటినదేదో అది తురీయంలో తెలుసుకోవాలి. ఆ తురీయానికి చేరిపోతే అదే లయం, మోక్షం. తురీయస్థితిని పొందినవాడే సమాధి స్థితిని పొందినవాడు. ఆ తురీయము మకారానికి పైన ఉంది. అక్కడ సూక్ష్మభూమికల క్రింద రోధిని–నాద–నాదాంత–ఉన్మనీ అని 'మనోన్మనీ' నామం దగ్గర చాలా విశేషంగా చెప్పుకున్నాం.

తురీయం కేవలం త్రిగుణాతీతమైన బ్రహ్మము. అ–ఉ–మ కారములు

త్రిగుణముతో కూడిన బ్రహ్మము. సగుణ బ్రహ్మము. తురీయము నిర్గుణ బ్రహ్మము. ఆ రెండూ కలిపి గ్రహించడమే ప్రణవ తత్త్వం.

'మాలినీ' 'హంసినీ'గా మనలో నడయాడుతున్న తల్లిని ఆజ్ఞాచక్రం వరకు తీసుకు వెళ్ళగలిగితే 'మ్' అక్కడికి వచ్చింది. ఆ తర్వాత తురీయంలోకి ఆ మకారం లయించి పోవాలి. మకారం లయించి పోయిన ఆ తురీయస్థితినే అచలం, స్థాణుస్థితి అన్నారు. కనుక **మకారం లయించిన స్థితే మ-లయ-అచలము.** మకారము లయించే అచలమైన తురీయ భూమిక అనగా సహస్రార స్థానము. మలయాచలవాసినీ అంటే సహస్రారము నందు ఉన్న తల్లి.

459. సుముఖీ - శ్రీ సుముఖ్యై నమః

సుముఖీ, నళినీ, సుభ్రూః, శోభనా, సురనాయికా - ఈ నాలుగు నామాలు కలిపి 'సుముఖీ' అనబడే అమ్మవారి మంత్రవిద్యా విశేషాలు. శోభనమైన ముఖం. **'శోభతేऽస్యముఖం య ఏవం వేద"** అని శ్రుతి.

'బ్రహ్మజ్ఞానం కలవాని ముఖం ప్రకాశిస్తున్నది'.

అన్ని మేలైన లక్షణాలను 'సు' అంటారు. ఆ లక్షణాలతో శోభిల్లే చక్కని ముఖం కలది 'సుముఖీ'.

ఇందులో ప్రధాన దేవత సుముఖీ దేవత. నళినీ, సుభ్రూః, శోభనా, సురనాయికలలో నాలుగు బీజాక్షరాలు నిక్షిప్తం చేశారు.

మొదటి దానికి సూచన 'శ్రీం'కారం. మొత్తం 4 బీజాక్షరాలతో 'సుముఖీ' అనే దేవత మంత్రం. 'శ్రీ సుముఖ్యై నమః' అనే మంత్రం ఇందులో కనబడుతుంది.

ఛాందగ్యోపనిషత్తులో ఇది కనబడుతుంది. గురువు శిష్యుని బ్రహ్మసాధనకి పంపిస్తాడు. ఆ సాధన చేసి బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకొనివచ్చిన శిష్యుని చూస్తూ **'బ్రహ్మవిద ఇవ సౌమ్య తే ముఖమాభాతి'** - ఓ సౌమ్యుడా! నీ ముఖం బ్రహ్మవేత్త ముఖంలా ప్రకాశిస్తోందయ్యా అన్నాడు. బ్రహ్మవేత్త ముఖం ఎప్పుడూ ఆనందంగా వికసిస్తూ కనబడుతుంది.

బ్రహ్మవేత్త ముఖంలోనే అలా ఉన్నప్పుడు బ్రహ్మమే రూపం ధరించినప్పుడు ఆ ముఖం ఎలా ఉంటుంది? అమ్మ ముఖం నుండి బ్రహ్మజ్ఞానసంపద ప్రసరింపబడుతోంది గనుక అది 'సుముఖీ'. దానితో వికసించి ఉంది కనుక 'నళినీ'.

460. నళినీ – శ్రీ నళిన్యై నమః

నళినీ అంటే పద్మస్వరూపిణి. నళినీ అన్నా, పద్మినీ అన్నా ఒక్కటే. అమ్మ పద్మినీదేవి. పద్మినీ ఒక విధంగా మహాలక్ష్మీ స్వరూపమే.

అమ్మవారిని వర్ణించినప్పుడు పాదపద్మం, ముఖపద్మం, నయనపద్మం, హస్తపద్మం అంటే ఆ వికసన లక్షణము, ఆ పూర్ణతా లక్షణమే. పద్మము యొక్క శక్తి వికసించుట నిండుతనము. ఈ రెండూ ఎక్కడ ఉంటాయో అది పద్మ లక్షణం. అమ్మవారి దగ్గర ఆ లక్షణం సంపూర్ణంగా ఉంది కనుక నళినీ. ఒకటి నందినీ, ఇంకొకటి నళినీ అని చెప్పడంలో అమ్మవారు గంగారూపిణీ అని చెప్పడం ప్రధానమైన అర్థం.

నందినీ, నళినీ, సీతా, మాలినీ చ మహాపగా
విష్ణుపాదాబ్జసంభూతా, గంగా, త్రిపథగామినీ
భాగీరథీ, భోగవతీ, జాహ్నవీ, త్రిదశేశ్వరీ

నందినీ, నళినీ, మాలినీ అని 3 నామాలు క్రమంలో ఇక్కడ గోచరించాయి. గంగానదిగా ఉండి తరింపచేసేది కూడా అమ్మయే. దేవీభాగవతం గంగ అమ్మవారి రూపమే అని చెప్తోంది. ఆ తల్లే శివ జటాజూటం నుండి కదలివచ్చి తరింపజేస్తున్నది. సాక్షాత్తూ విష్ణురూపిణి.

నళినీ అంటే పరమ పవిత్రరూపిణి అని అర్థం. ఇప్పటివరకూ వికసన రూపం చెప్పుకున్నాం.

ప్రాతఃస్మరామి లలితా వదనారవిందం
బింబాధరం పృథులమౌక్తికశోభినాసం
ఆకర్ణదీర్ఘనయనం మణికుండలాఢ్యం
మందస్మితం మృగమదోజ్జ్వల ఫాలదేశం

అలా సుముఖీని ధ్యానించడమే మనకి గంగాస్నాన ఫలాన్ని ఇస్తుంది. ఇది మానసిక స్నానం.

461. సుభ్రూః – శ్రీ సుభ్రువే నమః

చక్కని కనుబొమలు కలది అని వర్ణించారు. కనుబొమల ధ్యానం ఒక విశేషం. ధ్యానదృష్టి ఎప్పుడూ ఉండవలసింది కనుబొమల నడిమి స్థానంలోనే. **'భ్రువౌ చ సంధ్యయోస్తేజః'** అని అమ్మవారి రూపవర్ణనని బ్రహ్మాండపురాణం చెప్తున్నది. కనుబొమలు సంధ్య యొక్క తేజస్సు. ఈ మాటనే శంకరభగవత్పాదులవారు సౌందర్యలహరిలో 'దరదళితనీలోత్పలరుచిః దర్శించి చూపించారు.

462. శోభనా – శ్రీ శోభనాయై నమః

సౌందర్యం, మంగళం, ఆనందం – ఈ భావాల కలయికని శోభనము అంటారు. అమ్మవారు శోభనారూపిణి. నిర్వికారస్థితియే శోభనత్వం. భయము, అజ్ఞానము, ఈర్ష్య, అసూయ, దుఃఖము – ఇవన్నీ వికారాలు. ఇవేవి లేని కేవల జ్ఞానానందస్వరూపమే నిర్వికారం. ఇలా మొత్తం 'సుముఖీ, నళినీ, సుభ్రూః, శోభనా' పరిశీలిస్తే బ్రహ్మవిద్యాస్వరూపిణియే అమ్మ అని తెలుస్తుంది.

463. సురనాయికా – శ్రీ సురనాయికాయై నమః

దేవతలకు నాయకురాలు. దేవతలు అందరూ అమ్మవారిని **'నమో దేవ్యై మహాదేవ్యై శివాయై సతతం నమః'** – దేవీ, మహాదేవీ అని నమస్కరిస్తారు. ముందు దేవీ అని ఎందుకన్నారంటే అందరిలో ప్రకాశించే తల్లి అని అర్థం. దేవీ అంటే మిగిలిన దేవతలతో ఒకరిగా అనుకోరాదని 'మహాదేవీ' అన్నారు. దేవి, మహాదేవి కనుక అమ్మవారు 'సురనాయికా'.

'మహత్తరా మహిమా దేవతానాం' అని శాస్త్రం చెప్తున్నది. దేవతలందరికి కూడా శక్తినిచ్చిన తల్లి కనుక మహత్తరా. ఆ తల్లే సురనాయికా.

464. (క)కాలకంఠీ - శ్రీ (క)కాలకంఠ్యై నమః

నారాయణభట్టు, మరికొన్ని పూర్వపాఠాలన్నీ కూడా కలకంఠీ అనే నామాన్ని చెప్పాయి. వైద్యనాథ దీక్షితుడు అనే మహానుభావుడు భాస్కరరాయలు తరువాత వారే కానీ ఆయన నారాయణభట్టు పాఠాన్నే అనుసరించి 'కలకంఠీ' అని తీసుకున్నారు.

కలము అంటే అవ్యక్తమధుర ధ్వని. 'కామకలారూపా' దగ్గర విస్తారంగా చెప్పుకున్నాం. అవ్యక్తమైన, మధురమైన ధ్వని అమ్మవారి కంఠం లోంచి వస్తోంది. ప్రాణశక్తికి కేంద్రస్థానం విశుద్ధి. జీవుని స్థానమది.

మూలాధారం-గణపతి, స్వాధిష్ఠానం-బ్రహ్మ, మణిపూరం-విష్ణువు, అనాహతం-రుద్రుడు, విశుద్ధి-జీవునిస్థానం అంటే ప్రాణస్థానం. జీవహంస చోటు విశుద్ధిచక్రస్థానం.

'శాంతిః' నామం వివరించుకున్నప్పుడు నాసిక నుండి 10 అంగుళాలు క్రిందకి దిగివస్తే కనబడుతుంది అని చెప్పుకున్నాం. అది కంఠస్థానం.

జ్ఞానేంద్రియాలన్ని తయారై ఉన్న శిరస్సుకి, కర్మేంద్రియాలకు నడిమి స్థానం విశుద్ధిచక్రం. ఇది కర్మ, జ్ఞానాల కేంద్రస్థానం.

అందుకే ఆ స్థానం చాలా ప్రధానం.

శ్రీహర్షుడు అమ్మవారిని ధ్యానం చేసి స్తుతిస్తున్నప్పుడు ఆ కంఠాన్ని వర్ణిస్తూ చాలా గొప్ప భావన చేశాడు. ఆ భావాన్ని శ్రీనాథమహాకవి కూడా ఏం తక్కువ లేకుండానే వర్ణించాడు.

జయజయ జనయిత్రి కళ్యాణసంధాత్రి
గాంధర్వవిద్యా కళాకంఠనాళాం త్రివేదీవళీం
సారసాహిత్య నిర్వర్తిత ప్రోల్ల సదృక్తరంగామ్
అనేకాభిచారక్రియాహోమధూమావళీమ్...

అని శారదాదేవి రూపాన్ని వర్ణించారు. అమ్మా! గాంధర్వ విద్యాకళ నీ '**కంఠ**'మమ్మా అన్నారు. 'కలకంఠీం' అనేమాటని కాళిదాస మహాకవి స్తుతిస్తూ-

'ఓంకార పంజరశుకీం ఉపనిషదుద్యాన కేళికలకంఠీమ్' అన్నారు.

అవ్యక్త మధురనాదం పలికే ఆ కంఠసీమలో మూడు గీతలు కనబడుతున్నాయి. శంకరులు, "నీ కంఠమంతా సంగీత విద్య చెప్పడం కోసం సంగీతంలో ఉన్న షడ్జ, మధ్యమ, గాంధార గ్రామములను సంకేతిస్తున్నాయి" అని వర్ణించారు.

పరమేశ్వరుడు కట్టిన మంగళసూత్రం కంఠం నుండి క్రిందకి వ్రేలాడుతోంది. ఆ కట్టిన మంగళసూత్రంలో తొమ్మిది చొప్పున మూడు పేటలు చేసి కట్టారని ఆ మూడు సంఖ్య చెప్పడం కోసం అక్కడ మూడు గీతలు కనబడుతున్నాయా! అని కూడా వర్ణించారు. ఇది శంకరులు చేసిన రమ్యమైన భావన. కలకంఠీ అన్నప్పుడు ఇవన్నీ భావన చేసుకోవలసిందే. అలాంటి భవ్యమైన అమ్మ కలకంఠీ.

'కలకంఠీ' అనే నామానికి 'కాలకంఠీ' అనే పాఠం కూడా ఉంది. 'కాలకంఠీ' అనే నామానికి భాస్కరులు చెప్పిన అర్థం – మొదటి నుండి శివా, భవానీ అన్నప్పుడు శివుని యొక్క శక్తిగా అమ్మవారిని చూపిస్తున్నప్పుడు అమ్మవారు కూడా 'కాలకంఠీ'. శివుడు నల్లని కంఠంతో ఉన్నాడు కనుక ఆయనకి నీలకంఠుడు, కాలకంఠుడు అని పేరు వచ్చింది. అమ్మవారు కూడా 'కాలకంఠీ' అయ్యింది. శివునికి అభిన్నురాలు అమ్మవారు అని దీని భావం.

అంతేకాదు కాలకంఠీ అనే నామంతో పురాణాల్లో అమ్మవారికి ఒక రూపముంది. **'ససర్జ కాళీం కామారిః కాలకంఠీం కపర్దినీం'** అని ఆగమాల్లో ఉంది. ఒకప్పుడు దారుకాసురుడు అనే రాక్షసుడు దేవతలందరిని పీడిస్తూ విహరిస్తూ ఉన్నప్పుడు దేవతలందరూ శివుని వద్ద శరణు వేడితే ఆయన ఒక్కసారి కాళీదేవిని తలచుకున్నాడు. కాళీ ఆయన నుండి వచ్చింది. ఆయన నుండి వచ్చిన ఆ కాళీదేవిని 'కాలకంఠీ' 'కపర్దినీ' అన్నారు. ఆ రూపంతో వచ్చింది కనుక 'కాలకంఠీ'.

కాలంజరమనే క్షేత్రంలో అమ్మవారు కాలకంఠీ అనే పేరుతో ఉన్నారు. శక్తి పీఠాల్లో ఎక్కడ కాలకంఠీ ఉన్నదో చూపించి, పురాణంలో ఎక్కడ ఉందో చూపించారంటే ఆ మహానుభావుని అధ్యయనం, ఉపాసనా బలం ఎంతటిదో తెలుస్తుంది.

465. కాంతిమతీ- శ్రీ కాంతిమత్యై నమః

అన్ని కాంతుల సమాహార రూపమని అర్థం చేసుకోవాలి. అంతేకాదు... ఇక్కడ 'కాంతి' అనే శబ్దానికి ఇచ్ఛాశక్తిస్వరూపిణి అనే అర్థం స్వీకరించాలి.

466. క్షోభిణీ - శ్రీ క్షోభిణ్యై నమః

పరమాత్మ యొక్క సంకల్పశక్తి చేత ప్రకృతిలో పరిణామం ఏర్పడింది. ఆ మొదటి పరిణామాన్ని క్షోభ అంటారు. ఒక కొలనులో రాయి విసిరితే మొట్టమొదటి స్పందన తరువాత తరంగాలరూపంలో బహురూపాలు వ్యక్తమవుతాయి. పరమాత్మ యందు ముందుగా ఆయన యొక్క శక్తి చేతనే 'అహం' అనే స్పందన వచ్చింది. ఈ అహం అనే స్పందనతో ముందు ప్రథమ క్షోభ ఏర్పడింది. ఈ క్షోభే స్పందన శక్తి. ఆ ప్రథమ క్షోభ నుండి ప్రపంచమనే క్షోభ ఏర్పడింది. కనుక ప్రథమ స్పందనశక్తి అయిన ఇచ్ఛాశక్తినే 'క్షోభిణీ' అంటారు. కాంతిమతీ, క్షోభిణీ - రెండూ అమ్మవారి యొక్క ఇచ్ఛాశక్తి స్వరూపాన్ని తెలియజేస్తున్నాయి.

ప్రకృతిం పురుషం చైవ ప్రవిశ్యాత్మేచ్ఛయా హరిః
క్షోభయామాస భగవాన్ సర్గకాలే వ్యపాశ్రితః

అని విష్ణుపురాణం చెప్తోంది. విష్ణువు ఈ జగత్తుని నిర్మాణం చెయ్యదలచి తన శక్తిని ప్రకృతి యందు ప్రవేశింపజేసినపుడు ప్రకృతిలో కలవరపాటు ఏర్పడింది. ఆ విధంగా **'క్షోభయామాస భగవాన్'**. దీనినే క్షుభితా, క్షోభ అని చెప్తారు.

467. సూక్ష్మరూపిణీ - శ్రీ సూక్ష్మరూపిణ్యై నమః

సూక్ష్మమంటే ఇంద్రియాలతో గ్రహించలేనిది. శక్తి ఎప్పుడూ అత్యంత సూక్ష్మమే.

అన్నిటిలోనూ ప్రవేశించి, అంతటా వ్యాపించి ఉన్న సర్వవ్యాపక ఈశ్వరశక్తినే సూక్ష్మరూపిణి అంటారు. స్థూలదృష్టికి గోచరించని ఆత్మ అత్యంత సూక్ష్మము. అదే పరబ్రహ్మ స్వరూపం. తద్రూపిణి సూక్ష్మరూపిణి.

తెలియశక్యంకాని పరతత్త్వం గురించి ఉపనిషత్తులు **"సూక్ష్మాత్ సూక్ష్మతరం**

నిత్యం అణోరణీయాన్' – అన్నిటి కంటె సూక్ష్మమైనది, నిత్యమైనది, అణువు కంటె అణువైనది – అని వర్ణించాయి. ఉపాస్య అయిన పరమేశ్వరి కూడా స్థూల, సూక్ష్మ, పరా – రూపాలతో అలరారుతోంది. అందులో రెండవదైన సూక్ష్మరూపము కలది – అని మరొక అర్థం. 'తంత్రరాజం' ప్రకారం మూలాధారమందున్న అగ్నికుండంలో శాస్త్రోక్త విధిగా మంత్రాక్షరాలతో పదకొండు విధాలుగా చేసే హోమానికి 'సూక్ష్మము' అని పేరు. ఆ హోమరూపిణి – అని ఇంకొక అన్వయం.

ధాతుదేవతల విజ్ఞానం

తరువాత వచ్చే నామాలు 'వజ్రేశ్వరీ, వామదేవీ, వయోఽవస్థావివర్జితా, సిద్ధేశ్వరీ, సిద్ధవిద్యా, సిద్ధమాతా, యశస్వినీ' మొత్తం – 7 నామాలు. తరువాత మొదలవుతున్నాయి– 'విశుద్ధిచక్రనిలయా', 'రక్తవర్ణా', 'త్రిలోచనా'. ఇది 38 వ శ్లోకం. నామాల వరుసలో 476 వ నామం – విశుద్ధిచక్రనిలయా. అక్కడ నుండి క్రమంగా 535 నామం 'యాకిన్యంబా స్వరూపిణీ' వరకు సుమారు 71 నామాలు ఒక గుచ్ఛం. అత్యంత ముఖ్యమైనవి. ఇవి గ్రహించగలిగితే మన శరీరాన్ని అమ్మ ఎలా నడిపిస్తోందో అర్థం అవుతుంది.

అంతే కాదు... ఎక్కడెక్కడ కూర్చుని అమ్మవారు ఏం చేస్తున్నారో ఈ శ్లోకాలతో ధ్యానం చేసుకోవచ్చు. అర్థం తెలుస్తోంది కనుక ఆ భావన చేస్తూ కంఠంలో అమ్మవారు ఎలా కూర్చున్నారో, హృదయంలో ఏ రూపంతో ఉన్నారో, ఏ ఏ ఆయుధాలు పట్టుకున్నారో – ఆ రూపం పేరు, ఆవిడ చుట్టూ ఉన్నవారు ఎవరో తెలుసుకుని ధ్యానం చేయవచ్చు.

మన శరీరంలోని సప్త ధాతువులు మనం తయారు చేసుకోలేదు. ఇది ఒక్కటి ఆలోచిస్తే చాలు. లోపల ఒక చైతన్యం ఉన్నది. సప్తధాతువులు నిర్మాణం జరగడానికి మన శరీరంలో ఏడు స్థానాలందు ఆ చైతన్యరూపిణియే ఉండి నిర్మిస్తున్నది. ధాతువు అంటే మూల వస్తువు. అవి చర్మము, మాంసం, ఎముక, రక్తము, మజ్జ, మేదస్సు, శుక్రము.

ఈ ధాతువుల్లో తేడాలు వస్తేనే రోగాలు వస్తాయి. ఈ సప్త ధాతువులు బాగుంటే మనకి ఏ రోగం రాదు. శ్రీచక్రంలో వారాహీదేవి ఆవరణలో కిరిచక్రము నందు ఈ ధాతు దేవతలు ఉంటారు. వారు లలితాదేవి రూపాలే. మన శరీరంలో ఉండి శరీరాన్ని నియంత్రిస్తూ ఉంటారు. ధాతు వైషమ్యం రాకుంటే ఆరోగ్యం బాగుంటుంది.

ఈ 'వజ్రేశ్వరీ' నామానికి 'విశుద్ధిచక్రనిలయా'కి అనుబంధం ఉంది. అక్కడ చెప్పబడే ఏడింటికి మూలస్థానాలు 'వజ్రేశ్వరీ, వామదేవి, వయోఽవస్థావివర్జితా' మొదలైనవి. అక్కడ చెప్పబోయే ఏడు నామాలకి విశుద్ధిచక్ర నిలయా నుండి చెప్పబోయే ఏడు నామాలకి అనుబంధం ఉంది. అక్కడ ఒకొక్క చక్రం దగ్గర ఉన్న ఒకొక్క తల్లికి, ఇక్కడ ఈ నామాలకి సంబంధం ఉంది.

ఉదాహరణకి 'విశుద్ధిచక్రనిలయా' దగ్గర ఉన్న శక్తి 'డాకినీశ్వరీ'. ఆ డాకినీశ్వరీకి మరొక పేరు 'వజ్రేశ్వరీ'. అనాహతా దగ్గరికి వచ్చేటప్పటికి 'వామదేవీ'. అక్కడికక్కడ ఆ అనుబంధం. ఇవి పఠించేటప్పుడు 'విశుద్ధి చక్రాని'కి ముందు 'వజ్రేశ్వరీ'తో ప్రారంభించాలి. 'యాకిన్యాంబా స్వరూపిణీ'తో పూర్తి చెయ్యకూడదు. 'యాకిన్యంబాస్వరూపిణీ' తరువాత 'స్వాహా, స్వధా, మతిర్మేధా, శ్రుతిః, స్మృతిః, అనుత్తమా' నామాల దగ్గర మళ్ళీ ఇంకొక సంబంధం ఉంది కనుక అక్కడితో పూర్తి చెయ్యాలి. అంటే 98వ శ్లోకం నుండి 110వ శ్లోకం వరకు చదువుకోవాలి. దానికి ముందున్న వజ్రేశ్వరీ 'వామదేవీ' కూడా కలిపి చదువుకోవాలి.

97వ శ్లోకం నుండి పఠించి ఇది పారాయణం చేస్తే దీనికి ఒక ఫలితం. అంతే కాదు. మనకి ఏదైనా ఒక రోగం వస్తే ఆ రోగం ఏ ధాతు లోపం వల్ల వచ్చిందో తెలుసుకుని, ఆ నామాల గుత్తి బయటకు తేవాలి. ఒకొక్క నామాల గుత్తిలో ఒకొక్క ధాతు దేవత ఉంటుంది. అలా 71 నామాల్లో ఏడుగురు దేవతలు వస్తున్నారు. ఇంచుమించు ఒకొక్క దేవతకి పది నామాల చొప్పున చూసుకున్నా, పది నామాల గుత్తితో ఒక ధాతు దేవత ఉంటుంది. అలా మొత్తం ఏడు ధాతు దేవతలని తీసుకోవచ్చు.

ఆయా దేవతలకి నైవేద్యం ఏం పెట్టాలో, ఎలా ధ్యానించాలో, అక్కడ పరివార దేవతలు ఎవరో ఆ నామాలలో ఉన్నాయి. మొత్తం ప్రక్రియ అంతా చెప్పారు.

ఆ దేవత 'పాయసాన్నప్రియా' అన్నప్పుడు ఆ దేవతకి పాయసం పెట్టాలి. 'గుడాన్నప్రీతమానసా' అన్నప్పుడు ఆ దేవతకి గుడాన్నం పెట్టాలి. అలా ఏ దేవతకి ఏ నైవేద్యం పెట్టాలో వివరించారు.

'విశుద్ధిచక్రనిలయా' నుండి 'డాకినీశ్వరీ' వరకు ఉన్న నామాలు చర్మమనే ధాతుదేవతని చెప్తున్నాయి. ఆ దేవతకి పాయసాన్నం ప్రియం. కనుక 'శ్రీమాత్రే నమః' మంత్రం ఉచ్చరించి 'విశుద్ధిచక్రనిలయా రక్తవర్ణా త్రిలోచనా....డాకినీశ్వరీ' అని పూర్తి చేసి, మరల 'శ్రీమాత్రే నమః' అని జపం చేసి, పాయసాన్నం నైవేద్యం పెట్టి దానిని ప్రసాదంగా తీసుకుంటే ఆ ధాతు వైషమ్యం పోతుంది. ఇదొక పద్ధతి.

అలాగే ఒక స్త్రీ గర్భవతి అయ్యింది అని తెలిశాక, ధాతు దేవతలకి ఒకొక్కరికి వారికి సంబంధించిన నైవేద్యం తయారు చేసి, నెలల క్రమాన్ని అనుసరించి ఈ చెప్పిన క్రియ ప్రకారం అమ్మవారికి నివేదించి, గర్భవతి చేత తినిపిస్తే లోపల తయారయ్యే శిశువుకి ఆ ఇంద్రియాలు చక్కగా నిర్మాణమై ఉత్తమమైన శిశువు కలుగుతాడు. దీనికంతటికి శాస్త్రముంది. ఈ సాధన సులభంగా చేసుకోవచ్చు. ప్రయోజనాలు అద్భుతంగా ఉంటాయి.

(సరిగ్గా చాలా కాలం క్రిందట టి.వి.లో చెప్పినప్పుడు ఈ నామాలకి వచ్చిన ప్రతి స్పందన చాలా ఆశ్చర్యం. ప్రవచనం అయిన సంవత్సరానికి ఎక్కడికో ప్రవచనానికి వెళ్ళినప్పుడు, ఒకావిడ వచ్చి ఇవాళ నేను నడవగలుగుతున్నాను అంటే లలితాసహస్రనామాల వల్లనే జరిగింది. అది చెప్పడానికి మీ దగ్గరికి నడిచి వచ్చాను అని చెప్పింది. ఎందుకంటే నా కీళ్ళు పనిచెయ్యడం మానేశాయి. ఆ సమయంలో టి.వి.లో లలితాసహస్రం చెప్తూ ఉంటే విన్నాను. అక్కడ ఏది నైవేద్యం పెట్టాలి, ఏ నామం ఏలా చెయ్యాలో చెప్పారు. ఆ నైవేద్యం పెట్టి ఆ నామం చేసి నలభై రోజులు అనుష్ఠానం చెయ్యగానే ఆనాటి నుండి నా శరీరం బాగుపడి నేను తిరగ గలుగుతున్నాను. ఇది ఒక విషయము.

అదేవిధంగా ఎప్పటికప్పుడు సంతానం నిలబడకపోతే ఏం చెయ్యాలనే సందేహంలో ఉన్నప్పుడు మళ్ళీ గర్భం ధరించినప్పుడు భయపడుతున్న స్థితిలో ఈ నామాలు విని, ఎప్పటి కప్పుడు ఏ ఏ మాసంలో ఏవేవి పెట్టాలో పద్ధతి ప్రకారం పెడితే, పండంటి శిశువు కలిగాడని ఒక తల్లి చెప్పింది. లలితాసహస్రనామాల శక్తి అంతా ఇంతా కాదు.

ఇంకా ఎముకలు విరిగి ఆసుపత్రిలో ఉన్న ఒక వ్యక్తికి శస్త్రచికిత్స చేస్తే ఎన్నో నెలలు పడుతుందన్నదానికి అతని భార్య ప్రక్కన కూర్చుని 'అస్థి సంస్థితా' నామాలు పఠించి, అక్కడ చెప్పిన పదార్థం నివేదన చేసి ఆ జపం చేసిన నీరుని, అతని చేత తీర్థంగా సేవింపజేస్తే వైద్యులు ఆశ్చర్యపోయేలా కొన్ని వారాలలో ఆయన కోలుకుని బయటకి వచ్చాడు. ఇవన్నీ ప్రత్యక్షానుభవాలు. ఇన్ని శక్తులు లలితాసహస్రనామాల్లో ఉన్నాయి.

ఆ ధాతు శక్తుల తల్లులని ఉపాసన చేసుకుని అన్ని రకాల పుష్టులను సంపాదించుకుందాం. ఒక్కటి మాత్రం బాగా తెలుస్తుంది. నా శరీరంలో ఏడు చోట్ల తల్లి ఏడు రూపాలతో కూర్చుని ఈ శరీరంలో ఎముకని, రక్తాన్ని మొదలైన ధాతువులను ఏర్పాటు చేసి నడిపిస్తోందంటే ఆ తల్లి ఎంత దయామయి! కనుక ఇవి పఠిస్తూ, మన శరీరంలో ప్రసరిస్తున్న అమ్మ దయని గుర్తించి ఆనంద పారవశ్యంతో అమ్మకి అంకితమై సేవించుకోవాలి.)

97వ శ్లోకం నించి 110వ శ్లోకం వరకు కలిపి ఒక విద్య. ఈ నామాలని మనం భావనాత్మకంగా కనుక సాధన చేసినట్లైతే, శరీరానికి కావలసినంత పుష్టిని సంపాదించడమే కాకుండా ఆధ్యాత్మికంగా, యోగపరంగా అమ్మవారి అనుగ్రహం పొందడానికి పనికి వచ్చే శ్లోకముల వరుస. ఇది ఒక్కటి లలితా సహస్రనామ స్తోత్రంలో ఒక ప్రత్యేక గ్రంథంగా కూడా చెప్తారు.

వజ్రేశ్వరీ వామదేవీ వయోఽవస్థావివర్జితా
సిద్ధేశ్వరీ సిద్ధవిద్యా సిద్ధమాతా యశస్వినీ

ఈ 7 నామాలు ప్రారంభమై చివరికి ఒక శ్లోక పాదం 'స్వాహా, స్వధా,

మతిః, మేధా, శ్రుతిః, స్మృతిః, అనుత్తమా' ఈ మూడు పాదాల నడుమ కూర్చబడినవి, ఇదంతా కలుపుకుని ఒక విద్య ఎలా అవుతున్నదో గమనించుకుందాం.

ముందుగా 'వజ్రేశ్వరీ' నామం నుండి ఏడు నామాలకి అర్థం చెప్పుకున్న తరువాత 'విశుద్ధిచక్రనిలయా'లో ప్రవేశించి తరువాత మిగిలిన విషయాలు గ్రహించవచ్చు.

468. వజ్రేశ్వరీ – శ్రీ వజ్రేశ్వర్యై నమః

శ్రీచక్రంలో బిందువు తరువాత త్రికోణం ఉంటుంది. ఇది రెండవ ఆవరణ. ఈ త్రికోణంలో మొత్తం ముగ్గురు దేవతలు ఉంటారు. మహాకామేశ్వరి, మహావజ్రేశ్వరి, మహాభగమాలిని. అక్కడ చెప్తున్న మహావజ్రేశ్వరియే ఈ వజ్రేశ్వరి.

ఇది కాకుండా తిథి దేవతలలో కూడా శుక్లపక్ష షష్ఠీ తిథిదేవతకి 'వజ్రేశ్వరీ' అని పేరు. ప్రధానంగా త్రిశక్తుల్లో కూడా వజ్రేశ్వరి అని చెప్పబడుతున్నది. ఈ తల్లి వాక్ శక్తికి అధిష్ఠాన దేవత. ఈ దేవత మన యొక్క విశుద్ధిచక్రం దగ్గర ఉంటుంది.

ఇక్కడ నుండి ఏఏ చక్రముల దగ్గర ఏఏ శక్తులని ఎలా ధ్యానించాలో విశేషంగా చెప్తున్నారు. శాస్త్రముల యందు చక్రముల ధ్యానం రకరకములుగా ఉన్నది. కొన్ని రకాల చక్ర ధ్యానాలలో ఒకొక్క దళాన్ని భావించడం, అందులో ఉన్న అధిష్ఠాన దేవతలు అనగా మూలాధారంలో గణపతి, స్వాధిష్ఠానంలో బ్రహ్మదేవుడు, మణిపూరంలో విష్ణువు, అనాహతంలో పరమేశ్వరుడు రుద్రుడు, విశుద్ధం దగ్గర జీవేశ్వరుడు... ఇలా ఒకొక్క చక్రం దగ్గర ధ్యానిస్తారు. ఇదొక ధ్యాన ప్రక్రియ.

ఇప్పుడు చెప్పబోతున్నవి ధాతు దేవతలు. వీరు ధాతువులకి పుష్టిని కలిగించే దేవతలు. ఈ రెండిటికి కూడా అనుబంధం ఉన్నది. శరీరమంతా ఈ ధాతు వ్యవస్థని నిర్మిస్తున్నది పరాశక్తే. ప్రపంచంలో ప్రతి నిర్వహణ – అమ్మవారి చేతిపనే.

మన శరీరం అనే విశ్వం యొక్క నిర్మాణం కూడా ఆ పరదేవతానుగ్రహమే. ఆ తల్లి ఒకొక్క శక్తితో ఒకొక్క విధంగా నియంత్రణ చేస్తున్నది. ఆ శక్తుల పేర్లే

డాకినీశ్వరీ, హాకినీశ్వరీ... ఇత్యాది పేర్లుగా మనకి క్రమంగా ఇందులో రాబోతున్నాయి. అవి ఆయా చక్రములయందు ఎలా ఉంటాయి, ఏ రంగుతో ఉంటాయి, ఏ ముఖంతో ఉంటాయి, ఏ ఆయుధాలు ధరిస్తాయి, ఆ దేవతల పేర్లు, ఆయా దేవతల చుట్టూ ఉన్న పరివార దేవతల విశేషాలన్నీ మనకి అందించారు.

ఇవి నిజానికి మంత్ర – యోగశాస్త్రాలలో పెద్ద శ్లోకాలు, పెద్ద ప్రక్రియలు. వాటిని వశిన్యాది దేవతలు మనపై దయతో ఒకొక్క గుచ్ఛంగా అందించారు. ఒక గుత్తిలో పది నామాలు ఉండవచ్చు, మరొక చోట తొమ్మిది నామాలు, ఏడు నామాలు, ఆరు నామాలు అలా మొత్తానికి సప్త చక్రాలలో ఉండే ఈ దేవతలు, వారి ఆయుధాలు, వాటి విశేషణములు, వాటికి పెట్టవలసిన నైవేద్యాలు అన్నీ కలిపి, అంత తంత్రప్రక్రియని ఒక శ్లోకంలో అందించారంటే వశిన్యాది దేవతలకు ఎంత మనపై దయో గ్రహించాలి. అంతకంటే లలితాంబకి మనపై దయ. వీటిని సులభంగా సాధన చేసుకోవచ్చు. పెద్దపెద్ద యోగములు, కుండలిని తెలియనివారు కూడా దీనిని సాధన చేసుకొని తరించవచ్చు అని లలితా సహస్ర నామాల్లో పెట్టారు.

లలితా సహస్రనామం కల్పవృక్షం. ఎవరు ఏది కోరితే అది ఇవ్వగలిగిన శక్తి దీనికి ఉన్నది. తాంత్రిక ప్రయోజనాలు అంటే ఐహిక, పరలోక సుఖాలను ఇవ్వగలిగిన శక్తి, తాత్త్విక ప్రయోజనమైన పరమార్థజ్ఞానం, మోక్షాన్ని ఇవ్వగలిగే శక్తి కూడా ఉన్న గ్రంథం అని అనేకమార్లు చెప్పుకుంటున్నాం.

ఇప్పుడు వజ్రేశ్వరీదేవిని రెండు రకాలుగా చెప్పుకున్నాం. తిథి నిత్యాదేవతలలో వజ్రేశ్వరి. త్రికోణ చక్రంలో ఉన్న వజ్రేశ్వరి. ఈ వజ్రేశ్వరి ప్రధానంగా వాక్‌శక్తి. వేదము నందు కూడా **'వాగ్వై వజ్రః'** అనే మాట ఉంది. వాక్కే వజ్రము.

ఈ వాక్కు వినిర్గమించే ప్రధానమైన చోటు కంఠం. అది విశుద్ధి చక్రం. అక్కడ ఉండే దేవత వజ్రేశ్వరీ. ఈ నామం ఒక జపంగా కూడా చేసుకోవచ్చు.

శ్రీచక్రంలో, తిథినిత్యాదేవతలలో ఉన్న తల్లిని చెప్పుకున్నాం. వీరు కాక శ్రీమన్నగరంలో 12వ ప్రాకారంలో వజ్రమయ ప్రాకారం ఉంటుంది. దానిముందు వచ్చే 11 వ ప్రాకారానికి 12 వ ప్రాకారానికీ రెండిటికి మధ్యలో వజ్రమయి అనే

భూమి ఉంటుంది. ఆ భూమిలో ఒక అద్భుతమైన జలాశయం ఉంటుంది. అందులోని జలం పుచ్చుకుంటే శరీరం వజ్రాకాయమౌతుంది. వజ్రేశ్వరి అనేది శారీరదారుఢ్యాన్ని ఇచ్చేశక్తి అని మరొక అర్థం.

హనుమత్ స్వామికి వజ్రకాయుడు, వజ్రాంగబలి అని పేర్లు ఉన్నాయి. వివిధ సిద్ధులలో శరీరాన్ని వజ్రకాయంలా చేసే సిద్ధి ఒకటి ఉంది. అలాంటి వజ్రకాయసిద్ధి దేవత కూడా వజ్రేశ్వరియే.

ఈ నామాన్ని గాని స్మరించితే శరీరధారుఢ్యం లభిస్తున్నది. ఈ వజ్రేశ్వరీ దేవి ఇంద్రుని అనుగ్రహించింది.

భండాసురునికి – ఇంద్రునికి జరిగిన యుద్ధంలో ఇంద్రాదులు బాగా దెబ్బలు తిన్నారు. ఇంద్రుని దగ్గర ఉన్న వజ్రాయుధాన్ని భండాసురుడు మింగేశాడు. శ్రీమన్నగర నిర్మాణం జరిగాక, అక్కడ వజ్రమయప్రాకారంలో ఉన్న తీర్థంలో ఇంద్రుడు చాలా కాలం తపస్సు చేశాడు. అప్పుడు అమ్మవారు అనుగ్రహించి తిరిగి వజ్రాయుధాన్ని ప్రసాదించింది. ఇదంతా లలితోపాఖ్యానంలో కథ. అప్పటి నుండి ఇంద్రుని చేతిలో ఉన్న వజ్రాయుధం అది. ఆ వజ్రాయుధంతోనే అతను మళ్ళీ బలోపేతుడు అయ్యాడు.

తజ్జలాదుత్థితా దేవీ వజ్రం దత్వా బలద్విషే
పునరంతర్దధే సోఽపి కృతార్థః స్వర్గమేయివాన్

– అని లలితోపాఖ్యానంలోని శ్లోకం ఈ విషయాన్ని చెబుతున్నది.

అటువంటి వాక్శక్తి, శరీరదారుఢ్యశక్తి అయిన వజ్రేశ్వరీ దేవిని దూర్వాసమహర్షి ఆర్యాద్విశతిలో వర్ణిస్తూ–

తత్ర సదా ప్రవహంతీ తటినీ వజ్రాభిధా చిరం జీయాత్
చటులోర్మిజాలనృత్యత్ కలహంసీ కుల కలక్వణిత పుష్టా(44)
రోధసి తస్యా రుచిరే వజ్రేశీ జయతి వజ్రభూషాఢ్యా
వజ్రప్రదాన తోషిత వజ్రిముఖ త్రిదశ వినుత చారిత్రా(45)

అని కీర్తిస్తారు. ఈ తల్లి అక్కడ వజ్ర రత్నాలన్నీ అలంకరించుకుని ఉంటుంది. అక్కడ ఉన్న వజ్రమనే తటిని అనగా జలాశయం దగ్గర విహరిస్తూ ఉంటుంది. ఆ

తల్లి అందరి దేవతల చేత పూజింపబడుతోంది. ఎందుకంటే దేవతలకి ప్రభువైన ఇంద్రుడే పూజించాడంటే మిగిలిన వారందరూ కూడ పూజించారని వేరే చెప్పనక్కరలేదు. వజ్రి అంటే ఇంద్రుడు మొదలైన దేవతలచే ఆరాధింపబడే తల్లి.

ఈ తల్లి గురించి నారాయణదాసుగారు చెప్తూ తల్లివిన్కిలో **'ముమ్మూల ముగురు వేల్పుల నేలు జేజ'** – ముమ్మూల అంటే త్రికోణం. అక్కడ ముగురు వేల్పులలో ఒకరుగా ఉంటూ ఏలుకుంటోంది. **'పొలుపారు ముచ్చదువులకు బుట్టిల్లు'** అన్నారు. ముచ్చదువులు అంటే ఋగ్యజుస్సామాత్మకమైన వేదము. దానికి పుట్టిల్లు అంటే వాగ్దేవత అని విశేషంగా చూపించారు. తెలుగు మాటల్లో కూడా వజ్రేశ్వరికి నమస్కారం చేసుకుందాం. ఈ వజ్రేశ్వరీ క్షేత్రం మహారాష్ట్ర ప్రాంతంలో ఉంది.

469. వామదేవీ – శ్రీ వామదేవ్యై నమః

విశుద్ధిచక్రం తరువాత వచ్చే అనాహతచక్రం దగ్గర వామదేవిని ధ్యానించాలి. 'వామదేవ్యై నమః' ఇది ఈ తల్లికి మంత్రం.

శివునకు వామదేవుడు అని పేరు ఉంది. ఆయనకు 'శంకరః' అని పేరు ఉంటే అమ్మవారు 'శాంకరీ' అయింది. శంభుడు అయితే శాంభవీ. ఆయన రుద్రుడు ఐతే రుద్రాణీ. ఆయనకి వామదేవ అని పేరుంటే అమ్మవారు వామదేవీ అయింది. శివునకు అభిన్నురాలు అని నామసామ్యం చెప్పే నామాలలో ఇది ఒకటి.

శివునికి వామదేవుడని పేరు. దాని వివరణ– **'వామో వందనీయో దేవః'.** వామ అంటే అందమైనవాడని, వందనీయుడని అర్థం. **'మిగుల అందగాడు'** అని నారాయణదాసుగారు కూడా వామదేవుడైన శివుని గురించి వర్ణించారు.

అందరిచేత వందనీయుడు, పరమపూజ్యుడు గనుక వామదేవ. వేదంలో ఐతరేయ బ్రాహ్మణంలో– **'తం దేవా అబ్రువన్ అయం వై నః సర్వేషాం వామ ఇతి తస్మాత్ వామదేవః'** అని ఉంది. మా అందరి కంటె కూడా ఇతడు అందగాడు, ఆశ్రయుడైన వాడని దేవతలు పరమేశ్వరునికి నమస్కారం చేశారు. అందుకే ఆయన పేరు వామదేవుడు. ఇది వైదికమైన నామం. ఆయన యొక్క శక్తి **వామదేవీ.** అమ్మవారు

సుందరి, పరమేశ్వరుడు సుందరుడు.

వామదేవ – పరమేశ్వరుని పంచముఖాలలో ఒకటైన ఉత్తర ముఖం. దీనిని శివపురాణం వర్ణిస్తూ–

కుంకుమక్షోద సంకాశం వామాఖ్యం నవవేషధృత్
వక్త్రముత్తరమీశస్య ప్రతిష్ఠాయాం ప్రతిష్ఠితం

అన్నది. స్వామి యొక్క ఉత్తర ముఖం కుంకుమవర్ణంలా పసిమి కలిసిన ఎరుపురంగుతో ప్రకాశిస్తూ ఉంటుంది. అది అత్యంత సుందరమైనది, మహాశక్తి మంతమైనది ఉత్తరవదనం. అది వామదేవ వదనం. 'వమనం' అంటే వెలిగ్రక్కుట. సర్వజగతిని తన నుండి ప్రకటించువాడు వామదేవుడు.

ఆ వామదేవ వదనంతో ఉన్న పరమేశ్వరుడు వామదేవుడు. ఆయన శక్తి వామదేవి. పిండాండంలో అనాహత చక్రాధిష్ఠాన దేవత.

470. వయోఽవస్థావివర్జితా – శ్రీ వయోఽవస్థావివర్జితాయై నమః

వయస్సు, అవస్థ – ఇవి రెండూ జీవుల శరీరాలకి ఉంటాయి. వయస్సు క్రమక్రమంగా పెరుగుతూ ఉంటుంది. అలాగే అవస్థలు అంటే బాల్య, కౌమార, యౌవన, వార్ధక్య ఇవి ప్రధానాలు. బాల్య, కౌమారాల మధ్యలో పౌంగడ, కైశోర ఇలా ఎన్నో అవస్థలు ఉన్నాయి.

పసితనం నుండి పండు ముసలితనం వరకు శరీరానికి ఎన్నో అవస్థలు. లోకవ్యవహారంలో కష్టాలకి కూడా అవస్థలు అని పేరు. ఈ అవస్థలేమీ తక్కువ కావు. ఇవన్నీ మన శరీరానికి ఉన్నాయి. చిట్టచివర అవస్థ మరణం. జీవులందరికి అలాంటి అవస్థలు ఉంటాయి. ఈ వయస్సూ, అవస్థా రెండూ లేనిది పరమేశ్వరి 'వయోఽవస్థా వివర్జితా'.

కాలము యొక్క దోషం లేని తల్లి. కాల స్పర్శ లేదు. ఆవిడ కాలాతీత. కాలబద్ధులమైన మనం కాలాతీత తత్త్వాన్ని ఉపాసిస్తేనే ముక్తిని పొందగలం. మోక్షమనేది కాలాతీత అవస్థ. ఆ కాలాతీత శక్తే 'వయోఽవస్థావివర్జితా'. ఈ తల్లి

మన పిండాండంలో మణిపూరానికి అధిష్ఠానదేవత.

సరిగ్గా విశుద్ధిచక్రం నుండి ఏ వరుసలో వచ్చిందో ఆ వరుసలోనే చెప్పుకుంటున్నాం. విశుద్ధము, అనాహతము, మణిపూరము, స్వాధిష్ఠానము, మూలాధారము... మరల ఆజ్ఞాచక్రానికి వస్తుంది. అటు తరువాత సహస్రారం. ఈ క్రమం ఎందుకు చెప్పారనేది అక్కడ వివరించినప్పుడు గమనించుకుందాం.

ప్రస్తుతం ఈ ఏడు నామాలకి ఉన్న విశేషం తెలుసుకుంటూ మణిపూరానికి అధిష్ఠాన దేవి అయిన తల్లి 'కాలవ్యవస్థకి అతీతురాలు' అని ఈ భావనలో ధ్యానం చేసుకోవాలి.

471. సిద్ధేశ్వరీ – శ్రీ సిద్ధేశ్వర్యై నమః

అమ్మవారి సిద్ధనామాలు వరుసగా మూడు కనిపిస్తున్నాయి. సిద్ధేశ్వరీ, సిద్ధవిద్యా, సిద్ధమాతా. అన్ని సిద్ధులకి ఆవిడే తల్లి. సిద్ధ సంబంధమైన నామం ఇదివరలో కూడా చెప్పుకుంటూ అణిమాద్యష్ట సిద్ధులు కూడా అమ్మవారి స్వరూపమని చెప్పుకున్నాం.

అదే విధంగా ప్రతి కార్యము, ప్రతి మంత్రము – ఏది సిద్ధించాలన్నా అమ్మవారి అనుగ్రహం కావలసిందే. మనం మంత్రం జపించినంత మాత్రాన సిద్ధించదు. అమ్మ దయ ఉంటేనే సిద్ధి వస్తుంది. అందుకనే మంత్రం అంతా చేసిన తరువాత **'గుహ్యాతి గుహ్య గోప్త్రీ త్వం.... సిద్ధిర్భవతు మే దేవి'** అని చెప్పి 'నీ అనుగ్రహం వల్లనే సిద్ధి రావాలమ్మా' అనాలి.

ఆ సిద్ధి ఎవరికి, ఎంతకి వస్తుందో మనం చెప్పలేం. కొందరికి అక్షర లక్షలు చేస్తేగాని రాదు, కొందరికి ఎన్ని కోట్లు చేసినా రాదు. ఊరికనే జపం చెయ్యడం కాదు. అది వారి అవస్థని బట్టి ఉంటుంది. రామకృష్ణపరమహంసకి ఒక మాల త్రిప్పితే సిద్ధి వచ్చేది. ఈ విషయం గతంలో మనం చెప్పుకున్నాం. ఒక్క మాలకే సిద్ధి వస్తుందా అంటే అలా చెయ్యగలిగితే వస్తుంది. అదంతా కూడా ఒక పద్ధతి.

కొందరు ఉపదేశం పొందుతూనే సిద్ధి పొందినవారు ఉన్నారు. కొందరు

ఉపదేశం పొందిన తరువాత కూడా జడమే. చైతన్యమహాప్రభు గయ వెళ్ళినప్పుడు మంత్రం చెవిలో పడుతూంటేనే మూర్ఛితుడయ్యాడు. ఇక్కడ మూర్ఛ అంటే భావసమాధి. మంత్రం ఎన్ని కోట్లు చేస్తే ఆ భావ సమాధి వస్తుంది? కేవలం శ్రవణమాత్రం చేతనే ఆ మహాత్ముడు భావ సమాధి పొందాడు. కొందరు అలా ఉంటారు.

సిద్ధేశ్వరిని ఆశ్రయిస్తే ఆ తల్లి తప్పకుండా అనుగ్రహిస్తుంది. **'కాశ్యాం ప్రసిద్ధా'** – కాశీలో 'సిద్ధేశ్వరీ' దేవి నెలకొని ఉంది.

సిద్ధేశ్వరీ, సిద్ధవిద్యా, సిద్ధమాతా – ఇక్కడ ఈ మూడు మాటలకి ఒక విశేషముంది. సిద్ధశక్తి – సిద్ధులకి ఈశ్వరి. సిద్ధులన్నింటికి నియామకురాలు. సర్వ సిద్ధులు ఎవరి ఆధీనంలో ఉన్నాయో ఆవిడే 'సిద్ధేశ్వరీ'.

472. సిద్ధవిద్యా – శ్రీ సిద్ధవిద్యాయై నమః

విద్య అంటే ఉపాసన, మంత్రం అని రెండు అర్థాలు ఉన్నాయి. దశ మహావిద్యలు అని పేరు ఉంది. స్త్రీ రూపాలైన మంత్రశాస్త్రాలకు విద్యలని పేరు అని ఒక నిర్వచనం ఉంది.

శక్తికి సంబంధించిన మంత్ర శాస్త్రాలన్నింటికి విద్యలని పేర్లు. ఈ విద్యలు ఎన్ని ఉన్నాయో లెక్క లేదు. కానీ సిద్ధ విద్యలు అని చెప్పబడుతూ మొత్తం పది ఉన్నాయి. ఈ పది సిద్ధవిద్యల రూపమూ లలితాంబయే. పది విద్యలు ఎవరూ చెయ్యలేరు. ఏదో ఒక్క విద్యే చెయ్యగలరు. అయితే ఏ ఒక్క విద్య చేసినప్పటికి మిగిలిన తొమ్మిది అందులో సమన్వయింపబడి ఉంటాయి. ఆ ఒక్క విద్యని గూఢంగా, గాఢంగా చేస్తే చాలు. లలితా విద్య శ్రీవిద్య. ఇది దశ మహావిద్యలలో మూడవది. అక్కడ కూడా మూడవ సంఖ్యే. అమ్మవారు త్రిపురా విద్య. ఆ విద్యకి షోడశీ విద్య, త్రిపురా విద్య, సుందరీ విద్య అని మూడు పేర్లు ఉన్నాయి.

మొదటి విద్య కాళి. రెండవ విద్య తార. మూడవ విద్య సుందరీ విద్య.

కాళీ తారా మహావిద్యా షోడశీ భువనేశ్వరీ
భైరవీ ఛిన్నమస్తా చ విద్యా ధూమావతీ తథా

బగళా సిద్ధవిద్యా చ మాతంగీ కమలాత్మికా
ఏతా దశమహావిద్యాః సిద్ధవిద్యాః ప్రకీర్తితాః

కాళీ, తార, షోడశీ, ఛిన్నమస్తా, బగళాముఖీ, ధూమావతీ, మాతంగీ, భైరవి, కమలాత్మికా, భువనేశ్వరీ – మొత్తం దశ మహావిద్యలు. ఈ దశ మహావిద్యలకి సిద్ధవిద్యలని పేర్లు. సిద్ధవిద్యా అంటే దశ మహావిద్యల యొక్క రూపమని ఒక అర్థం. దశ మహావిద్యలలో ఒక సిద్ధవిద్య అయిన శ్రీవిద్యయే లలితాంబ అని మరొక అర్థం. రెండు అర్థాలు తీసుకోవలసినవే.

శ్రీవిద్యలో మిగిలిన తొమ్మిది విద్యలు సమన్వయింపబడతాయని అనేక మార్లు చెప్పుకున్నాం. బగళాముఖీ స్వరూపమే శ్రీవిద్యలో వారాహీదేవి. అక్కడ మాతంగీవిద్యయే శ్రీవిద్యలో శ్యామలాదేవి. కాళీవిద్యయే తిథి నిత్యాదేవి ఉపాసన. తిథి నిత్యలు కూడా కాలస్వరూపమే. ప్రతి దానికి మిగిలిన తొమ్మిది విద్యలు శ్రీవిద్యలో ఉంటాయి. దశమహావిద్యలు ఉత్కృష్టాలే. ప్రతిదీ గొప్పదే.

ఆద్యావిద్యే కాళీవిద్య. కొందరు కాళీ ఉపాసన అంటే చాలా భయంకరమైన ఉపాసన అని అనుకుంటారు. ఆ కాళీని ఉపాసించే రామకృష్ణ పరమహంస బ్రహ్మవేత్త అయ్యారని మరచిపోరాదు.

ఏ విద్య అయినప్పటికి ఉపాసించే పద్ధతి, ఉపాసించే సంస్కారం బట్టి అది తేల్చబడుతుంటుంది.

ఈ మహావిద్యలని ఉత్తమమైన సంస్కారముతో, వైరాగ్యముతో, వివేకముతో సాత్త్విక పద్ధతులలో ఉపాసన చేస్తే దశమహావిద్యలు మోక్ష విద్యలే. అలా కాకుండా కేవలం క్షుద్ర ప్రయోజనాల కోసం చేస్తూ ఉంటే అవి కేవల తాంత్రిక విద్యలు అవుతాయి. ఇప్పుడు ఈ భావం తాత్త్విక, తాంత్రిక సమన్వయంతో సాగుతున్నది.

ఐహిక ప్రయోజనాలు, ధర్మబద్ధమైన కోరికల కోసం దశమహావిద్యలు చెయ్యవచ్చు. అది క్రమంగా చిత్తశుద్ధిని ఇస్తుంది. శ్రీవిద్యనే సిద్ధవిద్య అన్నారు. శ్రీవిద్య గురించి చెప్పినపుడే విశేషంగా నొక్కి 'మహావిద్యా షోడశీ' అని ఒక మాట అన్నారు. 'మహావిద్యా' అని ప్రత్యేకించి శ్రీవిద్యని చెప్పారు.

శంకరులు కూడా పది మహావిద్యలను పరిశీలించి ఈ మూడవ విద్య ఒక్కటే తీసుకున్నారు. తాను ప్రతిపాదించిన ఉపనిషత్ ప్రతిపాద్యమైన ఔపనిషద బ్రహ్మము అనగా శుద్ధమైన వేదాంత ప్రతిపాద్యమైన బ్రహ్మమును చేర్చగలిగేది, ఆ లక్షణములు కలిగిన విద్య శ్రీవిద్యయే అని ఆయన గమనించారు. శంకరభగవత్పాదులవారు దీనిని మాత్రమే స్వీకరించి తాను స్థాపించిన పీఠాలన్నిటిలో కూడా శ్రీవిద్య జరిగేలా చూశారు. అది కేవలం ఔపనిషదమే. 'సర్వోపనిషదుద్ఘుష్టా'. ఈ విద్యకి సిద్ధవిద్య అని పేరు ఎందుకు వచ్చిందో చూపిస్తున్నారు. ముందు ఈ విద్య ఉపాసనతో ప్రారంభమవుతుంది. ఉపాసన చేస్తున్నప్పుడు మన యొక్క వాక్కు, శరీరము కూడా దాంట్లో ప్రవేశిస్తాయి. పూజాదికాలు చేస్తున్నప్పుడు శరీరం పనిచేస్తూ ఉంటుంది. మంత్రము శ్లోకాలు చదివినప్పుడు వాక్కు పని చేస్తూ ఉంటుంది. క్రమంగా మనసు కూడా పని చేస్తుంది.

అర్థ స్ఫురణతో చేసే ఉపాసన ఉపాసనతో ఆగిపోకుండా ఉపనిషత్తుగా పర్యవసిస్తుంది. ఉపాసన ద్వారా చిత్తశుద్ధిని, ఈశ్వరకృపను ఇచ్చి, ఆ చిత్తశుద్ధి ద్వారా జ్ఞానాన్ని, మోక్షాన్ని ఇవ్వగలిగే విద్యని సిద్ధవిద్య అంటారు. దశమహావిద్యలు సిద్ధవిద్యాస్వరూపాలే. ప్రత్యేకించి మనం శ్రీవిద్య గురించి చెప్పుకుంటున్నాం గనుక ఇదే సిద్ధవిద్య.

శ్రీవిద్యలోనున్న బాలా, పంచదశీ, షోడశాక్షరీ మొదలైన వాటన్నింటిని సిద్ధవిద్యలుగా ఎందుకన్నారో పరిశీలించాలి. సిద్ధవిద్యా అంటే సిద్ధినిచ్చు విద్య అని చెప్పినప్పటికి శాస్త్రం అన్నప్పుడు మాత్రము కొంచెం గట్టిగానే పరిశీలించాలి. మంత్ర శాస్త్రములో **'సిద్ధారి చక్ర శోధన'**మనే ఒక ప్రక్రియ ఉంది. కొన్ని మంత్రాలు ఇచ్చేటప్పుడు దానిని అనేక విధాల శోధన చెయ్యాలి. పుచ్చుకునే వారిని శోధించాలి. మంత్రాన్ని కూడా రకరకాల సంస్కారాలతో ప్రవేశింపజెయ్యాలి. ఇది గురువులు చెప్తారు. మంత్రం అంటే శబ్దం ఇవ్వడం కాదు. సంస్కారం చూసి దేవతాశక్తిని ఇవ్వడం. పుచ్చుకోవాలనే కుతూహలం అందరికీ ఉంటుంది కానీ, అందుకునే అర్హత కొందరికే ఉంటుంది. సరైన గురువైతే అన్ని రకాలు పరిశోధిస్తాడు.

భౌతిక ప్రయోజనం ఎక్కువ కలిగిన మంత్రాలకి సిద్ధారి చక్ర శోధనం చేసి ఇస్తారు. అలాంటి సిద్ధారి చక్ర శోధనం అవసరం లేని విద్య శ్రీవిద్య. దీని పేరు సిద్ధవిద్య. శోధనం ఏం చెయ్యకుండానే ఇవ్వవచ్చు. మోక్షకారిణియైన విద్యలకి ఇటువంటి మినహాయింపులు ఉంటాయని శాస్త్రం చెప్తున్నది. బ్రహ్మవిద్య అయిన ఈ శ్రీవిద్యకి మాత్రమే సిద్ధవిద్య అన్న పేరు సిద్ధిస్తున్నది. మహావిద్య, సిద్ధవిద్య, ఈ రెండు పేర్లకి అర్థం బ్రహ్మవిద్య.

473. సిద్ధమాతా – శ్రీ సిద్ధమాత్రే నమః

474. యశస్వినీ – శ్రీ యశస్విన్యై నమః

సిద్ధులను రక్షించునది సిద్ధమాతా. **'రక్షకత్వాత్ మాతా'.** ఆ తల్లే ఎవరికి సిద్ధి ఇవ్వాలా అని ఆలోచించి వారిని ఎంచుకుంటుంది. అలా ఎంచుకుంటేనే సరియైన గురువు వచ్చి విద్య ఇస్తారు. 'దైవం మానుషరూపేణ' అంటే అర్థం ఇది. ఆ విధంగా వచ్చిన గురువు మనల్ని సంస్కరిస్తారు.

సిద్ధులకు నియామకురాలైన తల్లి సిద్ధావిద్యా రూపంగా వచ్చింది. వచ్చిన తరువాత దానిని సాధన చేసిన సిద్ధునికి అమ్మవారే తల్లిగా అనుగ్రహిస్తోంది కనుక సిద్ధమాతా. అమ్మవారి ఉపాసకుడు అమ్మవారికి బిడ్డే.

బాలభావానుసారేణ మమేదం హి విచేష్టితం
మాతృవాత్సల్య సదృశం త్వయా దేవి విదీయతామ్

అని మొత్తం పూజంతా చేశాక ఉపాసకుడు అంటాడు– "నేను ఏదో చిన్న పిల్లవానిలా పూజ చేశానమ్మా. తల్లిలా అనుగ్రహించు".

పిల్లలు ఆడుకుంటున్నప్పుడు రకరకాల లక్కపిడతలు పెట్టుకొని అమ్మా వంట చేశాను అంటారు. ఉత్తుత్తి కూరల్ని, అన్నాన్ని చేతుల్లో పెట్టి బాగుందా చెప్పమ్మా అంటే ఆ తల్లి ఎంతో సంతోషంతో, "చాలా బాగుందిరా నాన్నా" అంటుంది. అలా అమ్మ ముందు మనం పిల్లలమే. ఆ అజ్ఞాన దశను ఒప్పుకోవాలి.

మనం అజ్ఞానంతో చేస్తూ ఉంటే ఆ తల్లికి ప్రేమ పుట్టి అనుగ్రహిస్తుంది.

సిద్ధవిద్యలను ఉపాసించే వారికి ఎవరయ్యా దిక్కు అంటే నేను తల్లిలా దిక్కుగా ఉంటానని చెప్తోంది లలితాంబ. ఏ సిద్ధి ఎవరికి ఇవ్వాలన్నా ఆవిడ ఆధీనంలో ఉన్నాయి కనుక ఆవిడ సిద్ధేశ్వరి.

మాత అంటే కారణమైనది. సిద్ధులు ఆవిడ నుండే వస్తాయి కనుక సిద్ధులకి తల్లి. సిద్ధి వల్ల మనకి వచ్చేది ఒక శాశ్వతమైన స్థితి. ఆ శాశ్వతమైన ధర్మము, దానివలన కలిగిన యశస్సు ఆ సిద్ధి యొక్క లక్షణాలు. కనుక ఈ నామాల వరుసలో 'యశస్వినీ' నామం పెట్టారు. **'అస్మా యే మేధా స్రజో వినిః తస్య నామ మహ ద్యశః'** అనే శ్రుతివాక్యాన్ననుసరించి ఆ పరమేశ్వరుని నామము అందరునూ గొప్ప కీర్తి అని చెప్పుకుంటారు. ఆ భగవన్నామమే గొప్ప యశస్సు! సహజ మహిమాదికాల వలన దేవ, ఋషి, శ్రుతులచే కీర్తింపబడినది.

సాధకుడు అంటే సాధన చేసేవాడు. సాధనతో సాధ్యం చేసుకుంటాడు. అయితే అమ్మవారు సాధ్యమా? సిద్ధమా?

ఒక లేని వస్తువుని కష్టపడి తయారు చేస్తే దానిని సాధ్యము అంటారు. సిద్ధము అంటే మనం నిర్మించలేదు. అది అక్కడ ఉంది. ఉదాహరణకి దీపం వెలిగించాం, దీపం సాధ్యం. అది మనం వెలిగిస్తే కనిపించింది. కానీ సూర్యుడు సిద్ధం. కుండ సాధ్యం. మట్టి సిద్ధం. తనంత తానుగా కలిగి ఉన్నది సిద్ధ వస్తువు. బ్రహ్మమే సిద్ధ వస్తువు. మోక్షము సిద్ధ వస్తువు. సాధ్య వస్తువు కాదని శాస్త్రం చెప్తోంది. మోక్షాన్ని ఎవ్వరూ పుట్టించలేరు. ఒకప్పుడు లేనిది ఇప్పుడు పుట్టిందంటే... అది మరొకప్పుడు పోతుంది. ఇది సూత్రం. మరి మోక్షము సాధ్యమా? సిద్ధమా? ఇది వేదాంత చర్చ.

పరమేశ్వరి 'ఉన్న' తత్త్వం, ఆవిడ వల్ల అన్నీ సాధ్యమవుతాయి. ఆవిడ దేనివల్లా సాధ్యం కాదు. తయారు చేయవలసిన అవసరం లేకుండా సిద్ధంగా ఉంది. మనం సాధన చేస్తూ ఉంటే అది సిద్ధవస్తువే కనుక మనలో ఏవైనా లోపాలు ఉంటే సవరించి ఆ తల్లి అనుగ్రహించి దగ్గరికి తీసుకుంటుంది. సిద్ధము అనగా పరబ్రహ్మము అని అర్థం. బ్రహ్మవిద్యయే సిద్ధవిద్యా. సిద్ధేశ్వరీ, సిద్ధమాతా అంటే పరబ్రహ్మయే ఈశ్వరిగా,

మాతగా, విద్యగా మనల్ని అనుగ్రహిస్తున్నారు.

అంత బలీయమైన గొప్ప నామాలివి. 'వజ్రేశ్వరీ' నుండి 'యశస్వినీ' వరకు క్రమంగా వీరు ఏడు చక్రాలకు నియామక శక్తులు.

మణిపూరం వరకూ 'వయోఽవస్థావివర్జితా' అని చెప్పుకున్నాం. స్వాధిష్ఠానచక్రంలో 'సిద్ధేశ్వరీ' అని చెప్పబడుతున్నది. ఇక 'సిద్ధవిద్యా' అయిన తల్లి మూలాధారచక్రానికి అధిష్ఠాన దేవత. 'సిద్ధమాతా' ఆజ్ఞాచక్రానికి అధిష్ఠానదేవత. 'యశస్వినీ' సహస్రారానికి అధిష్ఠాన శక్తులుగా చెప్పబడుతున్నారు. ఈ ఏడు శక్తులు కూడా విశుద్ధిచక్రం నుండి ఆజ్ఞాచక్రం వరకు ఉన్నారు. తరువాత వచ్చే నామాలు కూడా అదే వరుసలో ఉంటాయి.

475 నామం నుంచి 484 నామం వరకు పది నామాలు కలిపి ఒక గుత్తి. ఇదంతా కలిపి ఒకే విద్య.

475. విశుద్ధిచక్రనిలయా – శ్రీ విశుద్ధిచక్రనిలయాయై నమః

ఈ నామాన్ని కొందరు 'విశుద్ధచక్రనిలయా' అని చదువుతారు. ఎలా చదివినా తప్పులేదు. కంఠస్థానం దగ్గర ఉన్న చక్రానికి విశుద్ధిచక్రమని పేరు. ఇవన్నీ సిద్ధములే. కాబట్టి కాసింత సాధన చేస్తే తప్పకుండా వస్తాయి.

'విశుద్ధిచక్రనిలయా' దగ్గర అమ్మవారు ఎలా ఉంటుందో చెప్తూ– **'సర్వ శ్వేతా నతియుతా' –** అక్కడ కమలం తెల్లని రంగుతో మొత్తం పదహారు దళాలతో ఉంటుంది... ఈ పదహారు దళాలు, ఆవిడ చుట్టూ ఉన్న పరివార దేవతలు. ఆ దేవత స్వరూపము, ఆ దేవత ధరించిన ఆయుధాలు, ఆ దేవతకి నివేదించవలసిన పదార్థాలు – అవన్నీ ఇక్కడ చెప్పబడుతున్నాయి.

విశుద్ధిచక్రనిలయా రక్తవర్ణా త్రిలోచనా
ఖట్వాంగాదిప్రహరణా వదనైకసమన్వితా
పాయసాన్నప్రియా త్వక్స్థా పశులోకభయంకరీ
అమృతాదిమహాశక్తిసంవృతా డాకినీశ్వరీ

ఇది ఒక సంపుటి. ఇది త్వక్స్థా – త్వక్ అంటే చర్మం. చర్మము నందు ఉన్నదని అర్థం. సప్తధాతువుల్లో ఈవిడ చర్మధాతువు యొక్క నిర్మాణ శక్తి.

మన చర్మవ్యవస్థని నియంత్రించే శక్తి విశుద్ధిచక్రం వద్ద ఉంది.

ఈ చర్మ వ్యవస్థకి తల్లి విశుద్ధిచక్ర నిలయా అయిన డాకినీశ్వరి. ఆ రూపం ఎలా ఉంటుందో మంత్ర శాస్త్రం మరో చోట చాలా విశేషంగా వర్ణించారు. దాన్ని సారంగా అందిస్తున్నారు వశిన్యాది వాగ్దేవతలు.

476. రక్తవర్ణా – శ్రీ రక్తవర్ణాయై నమః

ఈ అమ్మవారు ఎర్రగా ఉంటుంది. కమలం తెల్లదే, అమ్మరూపం మాత్రం ఎర్రగా ఉంటుంది. ఈ నామం పాఠాంతరాలలో 'రక్తవర్ణా' అని ఉన్నది. భాస్కరరాయలవారు 'ఆరక్తవర్ణా' అని వ్రాశారు. అందరూ రక్తవర్ణా అనే చెప్పారు. 'ఆరక్తవర్ణా' అంటే తప్పేమీ లేదు. 'రక్తవర్ణా' అంటే అంతకన్నా తప్పులేదు. 'ఆ' అంటే మొత్తము అని అర్థం. 'ఆరక్తవర్ణా' అంటే 'మొత్తం రక్తవర్ణమే' అని అర్థం.

భాస్కరరాయలవారి తపన లలితాసహస్రంలో పునరుక్తి లేదని చెప్పాలనుకున్నారు. ఒకే శబ్దం రెండు సార్లు కనబడితే దాన్ని ఆయన మరొకలా సాధించారు. 'స్వాహా, స్వధా, మతిర్మేధా' దగ్గర 'మతిః' అనే నామం వస్తుంది. పూర్వపాఠాలలో మతిః అని మాత్రమే ఉంది. శాంతిః, పుష్టిః దగ్గర మతిః వచ్చింది. మళ్ళీ అక్కడ వచ్చింది. పునరుక్తి అవుతుందనే ఉద్దేశంతో భాస్కరరాయలవారు సంధి విడదీసి అక్కడ 'అమతిః' అని చూపించారు. అందరూ 'అమత్యైనమః' అని పూజ కూడ చేస్తున్నారు. కానీ నారాయణభట్టు పాఠంలో మాత్రం 'మతిర్మేధా' దగ్గర ఆయన 'మతిః' అనే చెప్పారు కానీ అమతి అని చెప్పలేదు. తప్పని ఎవరిని అనకూడదు. స్తోత్రాల్లో పునరుక్తి దోషం కాదు. కావ్యాదుల్లో వేరు. కావ్యానికే నియమమిది.

శాస్త్రంలో ఒక శబ్దం రెండు మార్లు వచ్చిందంటే ఒకొక్కప్పుడు అర్థ భేదం వస్తుంది. ఒకే అర్థంతో చెప్పినా సందర్భాన్ని బట్టి అన్వయంలో భేదం ఉంటుంది తప్ప దాన్ని పునరుక్తి అని అనరాదు. ఆమాటకి వస్తే విష్ణుసహస్రంలో ఎన్నో పునరుక్తులు

ఉన్నాయి. 'వసుప్రదా' నామం ప్రక్క ప్రక్కనే వస్తూ ఉంటుంది. పునరుక్తులన్ని తీసివేస్తే వెయ్యి నామాలు కావు.

నారాయణభట్టు మొదలగు వారు కూడా సామాన్యులు కారు – సిద్ధపురుషులే. అక్కడ 'మతిః' అని చెప్పుకోవచ్చు. అలాగ ఇక్కడ 'రక్తవర్ణా' అన్నా కూడా తప్పు లేదు. 'విశుద్ధిచక్రనిలయా' – 'రక్తవర్ణా'.

విశుద్ధిచక్రములో ఉన్నది డాకినీశ్వరీ. ఆవిడ ఎవరు? ఇవి లలిత యొక్క నామాలు. కనుక లలితాదేవియే ఆ రూపంతో ఉంది. ఒకొక్క చక్రంలో ఒకొక్క తల్లి. ఆ తల్లే ఇక్కడ ఆ పేరుతో వ్యవహరింపబడుతోందని గ్రహించాలి.

విశుద్ధిచక్రం నుండి మూలాధారం వరకు ఐదు చక్రాలు. ఆజ్ఞాచక్రం ఆరవ చక్రం. ఏడవ స్థితి సహస్రారం. మొత్తం ఏడు భూమికలలో ఏడుగురు దేవతలను చెప్పారు. ఏడు చెప్పడంలో విశుద్ధితో ఎందుకు మొదలు పెట్టారు? మనకి ప్రారంభం సహస్రారం నుండి క్రిందకి వచ్చే పద్ధతి లేదా మూలాధారం నుండి పైకి వెళ్ళే పద్ధతిలోనైనా ఉండాలి. ఇలా వెళ్ళడం అనౌచిత్యమా అంటే కాదు. ఇందులో ఏం ఔచిత్యం ఉందో పరిశీలించాలి.

విశుద్ధిచక్రం ఆకాశ తత్త్వానికి ప్రతీక. అలా క్రిందకి వెళ్తే 'ఆకాశా ద్వాయుః'. వాయుతత్త్వం అనాహతం. 'వాయోరగ్నిః' అగ్నితత్త్వం మణిపూరం. 'జలతత్త్వం' స్వాధిష్ఠానం. 'భూతత్త్వం' మూలాధారం. ఈ పంచభూతాలతో తన్మయమై తిరిగే మనస్తత్త్వం ఒకటి ఉంది. మనస్సు అంతఃకరణ తత్త్వం. దాని స్థానం ఆజ్ఞాచక్ర స్థానం. మన బ్రతుకంతా ఈ ఆరే. మరి ఒకటి లేదు. పంచభూతాలు మరియు అంతఃకరణం.

ఈ అంతఃకరణం జ్ఞానస్థానం. పంచభూతాలు శరీర నిర్మాణానికి పనికొచ్చే ఇంద్రియాలకు ప్రధానాలు. పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచ ప్రాణాలు – ఇలా ఎన్ని చెప్పినా ఆరే. మన శరీరంలో కూడా పృథ్వీ వ్యవస్థ ఉంది. జల వ్యవస్థ ఉన్నది. వ్యవస్థ అంటూ ఉన్నప్పుడు వాటిని నిర్వహించేది ఉండాలి. మన ఊరిలో నీళ్ళు వస్తున్నాయంటే దానికి ఒక కార్యాలయం ఉంటుంది. అలా

పృథ్వీ వ్యవస్థను నిర్వహింపజేసేది మూలాధారం. జలవ్యవస్థని స్వాధిష్ఠానం, అగ్నిని మణిపూరం, వాయువుని అనాహతం, ఆకాశాన్ని విశుద్ధి. మనసుని ఆజ్ఞాచక్రం. అసలు సమస్య అంతా మనసుతోనే కనుక దృష్టి అంతా ఆజ్ఞాచక్రం దగ్గర పెట్టి సాధన చెయ్యాలి అంటారు కొందరు యోగులు.

ముందు ఆ ప్రధాన కార్యాలయం ఏదో తెలుసుకుని అక్కడ వారిని మంచి చేసుకుంటే మిగతా వ్యవస్థ అంతా చక్కగా పనిచేస్తూ ఉంటుంది. అదే యోగసాధన. కష్టం కాదు. ఇప్పుడు చెప్పే ప్రకియల ద్వారా చాలా సులభంగానే చేసుకోవచ్చు. సభల్లో ఎంతవరకు చెప్పుకోవచ్చో, భావనతో ఎలా చేసుకోవచ్చో వశిన్యాది వాగ్దేవతలు ఇక్కడ చెప్తున్న మాటల ద్వారా గ్రహిద్దాం.

ఈ ప్రక్రియలో మరో విశేషం ఉంది. ఒక శిశువు తల్లి గర్భంలో ప్రవేశించిన దగ్గర నుండి సప్తమ మాసం వరకు పరిణామాలుంటాయి. సప్తమ మాసం వచ్చేటప్పటికల్లా వారిలో జీవ చైతన్యం ఉద్బుద్ధమవుతుంది. నేను అనే స్పృహ సప్తమ మాసంలో వస్తుంది. ఆ తరువాత రెండు మాసములు మిగిలిన అవయవములు రావడం, పుష్టి చెందడం ప్రక్రియ. కనుక సప్తమాసములే ప్రధానము. ఈ సప్తమాస వ్యవస్థలో గర్భంలో పడిన దగ్గర నుండి ఆ శరీరంలో ఆయా మార్పులు చేసే చక్రములు విశుద్ధితోనే మొదలు అవుతాయి.

గర్భస్థ శిశువు ఏడవ మాసం వరకు ఏ ఏ దేవత ప్రభావంతో, ఏ ఏ అవయవ నిర్మాణం జరుగుతూ ఉంటే, ఏ దశకి వెళ్తారో తెలుసుకోవాలి. ఇప్పుడు చెప్పబోయే దేవతలు గర్భస్థ శిశువుని సప్తమ మాసం వరకు ఎదిగేటట్లు చేసే దేవతలు. ఈ ధ్యానం గాని తల్లి చేసుకున్నట్లయితే ఆ పిల్లవానికి క్షేమం.

ఇందులో చెప్పిన పదార్థములు గర్భవతి ఆరగించితే అది సూక్ష్మశక్తిగా మారి పిల్లవాని అవయవ నిర్మాణంలో పనికి వస్తుంది. ఈ దేవతలు పుట్టిన తరువాత ఉన్న లోపాలని కూడా సవరించగలరు.

విశుద్ధి చక్రంలో ఉన్న తల్లి రక్తవర్ణా. మాతృగర్భంలో ప్రథమంలో ఏర్పడే శుక్లశోణిత మిశ్ర బిందు రూపం జీవునిది. ఈవిడ ఆ దశకి నియామకురాలు. ఈ దశని పోల్చడం కూడా కష్టం. ఈ తల్లి అనుగ్రహంతోనే అది జరుగుతూ ఉంటుంది.

477. త్రిలోచనా – శ్రీ త్రిలోచనాయై నమః

'రక్తవర్ణా' అయిన తల్లి మూడు కళ్ళు కలదని రూప వర్ణన చేస్తున్నారు. 'విశుద్ధిచక్రనిలయా' అయిన తల్లి డాకినీశ్వరినీ ఎలా ధ్యానించాలో చెప్తున్నారు. తరువాత నామంలో డాకినీశ్వరీ దేవి ధరించిన ఆయుధాలు చెప్పబడ్డాయి.

478. ఖట్వాంగాదిప్రహరణా – శ్రీ ఖట్వాంగాదిప్రహరణాయై నమః

ఖట్వాంగ – ఆది అని చెప్పారు. ఆది (మొదలైనవి) అని చెప్పినపుడు మిగిలినవేంటో తెలుసుకోవాలి. దీనికి సంబంధించిన శాస్త్రంలోకి వెళ్ళాలి. డాకినీశ్వరీ ఏమేమి దాల్చినదో ఆ శాస్త్రంలో వర్ణించారు. ఇది మనం ధ్యానంలోకి తెచ్చుకోవచ్చు.

ఖట్వాంగము, ఖడ్గము, త్రిశూలము, చర్మము. చర్మము అంటే డాలు. ఈ నాలుగింటిని నాలుగు చేతులలో ధరించింది. ఖట్వాంగము అంటే చూడడానికి క్రింద ఒక కర్రలా ఉండి పైన ఒక కపాలం ఉంటుంది. గట్టిగా ఆలోచిస్తే మన వెన్నుముక పైన కపాలం. దానికి ప్రతీకే ఇది.

479. వదనైకసమన్వితా – శ్రీ వదనైకసమన్వితాయై నమః

ఈ తల్లి ఒకే ముఖంతో ఉంటుంది.

480. పాయసాన్నప్రియా – శ్రీ పాయసాన్నప్రియాయై నమః

ఈ తల్లికి నివేదన పాయసాన్నము. దేవత, స్వరూపము, నివేదన అన్నీ చెప్పారు. డాకినీశ్వరీ నామం తలచుకుని లలితాదేవికి పాయసాన్నం పెట్టగలిగితే ఆ పాయసాన్నం ఔషధం అవుతుంది.

ఆ పాయసాన్ని ఎలా తయారు చెయ్యాలో మంత్రశాస్త్రం చెప్తోంది.

తండులే నిక్షిపేత్ క్షీరం ద్విగుణంవా తదర్థకం
అలాభే విన్యసేత్తోయం తస్యార్థం గోఘృతం పరం
తండులార్ధాన్ భిన్నముద్గాన్ గుడం విన్యస్య పాచయేత్
నివేదయేత్తతోమంత్రీ పాయసాన్నం శివాయచ

ఈ విధంగా తయారుచేసిన దాన్ని పాయసమని అనాలి. ఇలా తయారుచేసిన పాయసాన్నం శివునికి నివేదన చేస్తే చాలా మంచిదని చెప్పారు. ఇదే నివేదన శివునికి, శక్తికి కూడా చేసుకోవచ్చు. శివారాధనకే కాకుండా విష్ణ్వారాధనకు కూడా చేసుకోవచ్చు.

పరిమాణం ప్రకారంగా బియ్యంలో పాలు వేసి, బెల్లము, పెసరపప్పు వేసి, ఆవునెయ్యి వేసి వండితే దాన్ని పాయసం అంటారు.

481. త్వక్స్థా – శ్రీ త్వక్స్థాయై నమః

త్వక్స్థా అంటే చర్మమునందు అధిష్ఠించినది. అనగా చర్మధాతువుని నియంత్రిస్తున్న తల్లి.

482. పశులోకభయంకరీ – శ్రీ పశులోకభయంకర్యై నమః

ఈ తల్లి ధ్యానం యొక్క ప్రయోజనం 'పశులోకభయంకరీ' అన్నారు. ఇక్కడ పశుపతి తత్త్వమంతా తెలుసుకోవాలి. పశువు అంటే అజ్ఞానం. ఆ అజ్ఞానం కలిగినవారి పట్ల భయంకరి. అజ్ఞానాన్ని, పశుత్వాన్ని తొలగించే తల్లి కాబట్టి పశులోకభయంకరీ. **'అథ యోఽన్యాం దేవతాముపాస్తే అన్యోఽసావన్యోహమస్మీతి న స వేద యథా పశుః'** – నేను వేరు, నేను ఉపాసించే దేవత వేరు – అని భేదభావంతో ఎవరు దేవతను ఉపాసిస్తున్నారో వారు పశువు వలె తెలియనివారు – అని ఉపనిషన్మతం. **"ద్వితీయస్మాత్ భయం భవతి య ఏతస్మిన్నుదరమంతరం కురుతే అథ తస్య భయం భవతి"** – 'రెండవ వాని వలన (ఆత్మకు ఇతరమైన దాని వలన) భయం కలుగుతుంది. ఎవరు భేదంతో బ్రహ్మమును పొందుతున్నారో (గ్రహిస్తున్నారో) వారికి భయం కలుగుతుంది'. – అని ఉపనిషద్వచనం. బ్రహ్మముతో భేదదృష్టి పశుత్వం. ఆ పశుభావం కలవారికి భయం కలుగుతుంది. అది అజ్ఞాన జనితం. దానిని తొలగించేది జ్ఞానస్వరూపిణియే. ఆవిడ చుట్టూ పదహారు మంది దేవతలుంటారు. ఆ దేవతల పేర్లు తరువాతి నామంలో ప్రస్తావిస్తున్నారు.

483. అమృతాదిమహాశక్తిసంవృతా

– శ్రీ అమృతాదిమహాశక్తిసంవృతాయై నమః

అమృత మొదలైన దేవతలు. అమృత–ఆది అన్నారు. ఆది అంటే మిగిలిన పదహారు శక్తుల పేర్లు తలచుకోవాలి. ఆ శక్తుల పేర్లు– అమృత, ఆకర్షిణి, ఇంద్రాణి, ఈశాని, ఉషఃకేశి, ఊర్ధ్వా, ఋద్ధిదా, ౠకారా, ఌకార, ౡష, ఏకపద, ఐశ్వర్య, ఓంకారి, ఔషధి, అంబిక, అక్షర – మొత్తం పదహారు.

ఇప్పుడు పదహారు నామాలలో మొదటి అక్షరాలు చూస్తే అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ, ౠ, ఌ, ౡ, ఏ, ఐ, ఓ, ఔ, అం, అః". మొత్తం 16 అక్షరాలు. వీటిని ప్రాణాక్షరాలైన స్వరాలు అంటారు. ఈ 16 అక్షరాలు 16 దళాలలో ఉంటాయి. ఈ పదహారు దళాల పద్మం విశుద్ధిచక్రంలో ఉంది. అక్కడ ఉన్న 16 అక్షరాలు ఒట్టి అక్షరాలు కాదు. దేవతలు. అక్షరాలు అమ్మలు. అప్పుడు మాతృకావర్ణరూపిణీ అంటే అర్థమౌతుంది.

అక్షరాల దేవతల తేజోమయస్వరూపాలు. ఇలా మొత్తం మనలో ఆరు చక్రాలలో ఉన్న అక్షరదేవతలను లెక్కపెడితే 50 అక్షరాలు వస్తాయి. 16 స్వరశక్తులున్నాయి. ఆ అక్షరాలు మనం పలుకుతున్నప్పుడు ఈ చక్రం సహకరిస్తుంది. ఈ రహస్య విజ్ఞానాన్ని గ్రహించినవాడే యోగి. విశుద్ధిచక్రం దగ్గర చుట్టూ ఉన్న పదహారు మంది దేవతలు వీరు. తరువాత నామంలో విశుద్ధచక్ర దేవత పేరు చెప్తున్నారు.

484. డాకినీశ్వరీ – శ్రీ డాకినీశ్వర్యై నమః

విశుద్ధిచక్ర అధిష్ఠానదేవత డాకినీశ్వరీ అని చివరిగా పేరు చెప్తున్నారు. ముందు చోటు చెప్పి, తరువాత రూపం చెప్పి, ఆ దేవతను ఎలా అనుగ్రహింప చేసుకోవాలో తెలియజేసి, ఆ దేవత ప్రయోజనం ఏంటో వివరించి, ఆ దేవత చుట్టూ ఉన్న పరివార దేవతలు ఎవరెవరో చెప్తున్నారు. అమృతా మొదలైన పదహారు శక్తులతో కూడిన డాకినీశ్వరీ.

విశుద్ధిచక్రనిలయా 475వ నామం నుండి డాకినీశ్వరీ 484వ నామం వరకు ఉన్న ఈ గుత్తిని శ్లోకరూపంగా మంత్రశాస్త్రం వర్ణించింది. ఈ శ్లోకాన్ని పరిశీలిస్తే వశిన్యాది వాగ్దేవతలు చేసిన కూర్పులో ఉన్న అందం మనం గ్రహించగలం.

గ్రీవాకూపే విశుద్ధే నృపదళ కమలే శ్వేతరక్తాం త్రినేత్రాం
హస్తైః ఖట్వాంగ ఖడ్గౌ త్రిశిఖమపి మహాచర్మ సంధారయంతీం
వక్త్రేణైకేన యుక్తాం పశుజనభయదాం పాయసాన్నైకసక్తాం
త్వక్ స్థాం వందేఽమృతాద్యైః పరివృత వపుషం డాకినీం వీరవంద్యామ్

ఈ తల్లికి 'వీరవంద్యాం' అని మరొక పేరు కూడా ఉంది. ఈ తల్లికి నమస్కారం చేసుకుంటూ తరువాత నామాల వరుసలోకి ప్రవేశిస్తున్నాం.

అనాహతాబ్జనిలయా శ్యామాభా వదనద్వయా
దంష్ట్రోజ్జ్వలాక్షమాలాదిధరా రుధిరసంస్థితా
కాళరాత్ర్యాదిశక్త్యౌఘవృతా స్నిగ్ధౌదనప్రియా
మహావీరేంద్రవరదా రాకిన్యంబాస్వరూపిణీ

ఈ పదినామాలు ఒక గుత్తి. వీటికి ముందు 'శ్రీమాత్రే నమః' కలుపుకుని 'అనాహతాబ్జనిలయా' నుండి 'రాకిన్యంబా స్వరూపిణీ' వరకు పఠించి, మరల 'శ్రీమాత్రేనమః' అనాలి. ఇది ఒక సంపుటి. ఇలా జపం చెయ్యడం మొదలు పెట్టి చెయ్యగలిగినంత ఓపికగా చేసుకుంటే రక్తానికి సంబంధించిన దోషాలు పోతాయి. ఇది శ్రద్ధగా సాధన చెయ్యవలసినది. పైగా ఈ నామాలు పఠించేటప్పుడు దృష్టి అనాహతం మీద పెట్టుకోవాలి.

485. అనాహతాబ్జనిలయా – శ్రీ అనాహతాబ్జనిలయాయై నమః

అనాహతం అంటే హృదయస్థానం. అబ్జం అనగా పద్మం. హృదయపద్మంలో ఉన్న తల్లి. ఇక్కడున్న తల్లి పేరు రాకినీశ్వరీదేవి. అనాహతం దగ్గర నాదశక్తి బయటకు వినబడని రూపంలో ఉంటుంది. గర్భస్థపిండ విషయంలో రెండవ మాసం.

ముందు విశుద్ధిచక్రం దగ్గర చెప్పిన అమ్మవారికి పాయసాన్నం నివేదించి

తీసుకుంటే గర్భస్థశిశువు ప్రథమ మాస దశకి రక్షణ.

ఇక్కడ రెండవ మాస దశకి రక్షగా చెప్తున్నారు. ఇవన్నీ కూడా ఆయుర్వేదశాస్త్రం చెప్తున్నదానికి కూడా సరిగ్గా సరిపోతున్నాయి. శౌనక, కృతవీర్యా, సుభూతి, గౌతమ, ధన్వంతరుడు మొదలైనవారు గర్భస్థ శిశువు ఎదుగుదలకి చెప్పిన అంశాలకి, ఇక్కడ చెప్తున్న యోగ విషయాలకి సరిపోతుంది. భారతదేశంలో మతం వేరు, విజ్ఞానం వేరు కాదు. మతం, విజ్ఞానం కలిపి ఒక్కటే.

భారతీయ హైందవధర్మమంటే అనేక విజ్ఞానాలు కలబోసుకున్న ఒక అద్భుత శాస్త్రీయ జీవన విధానం అని తెలుసుకోవాలి. భౌతిక విజ్ఞానానికి ఈశ్వర శక్తి కలిపితే అది తొందరగా ఫలిస్తుంది. ఆ పద్ధతి ఇక్కడ చూపిస్తున్నారు.

486. శ్యామాభా – శ్రీ శ్యామాభాయై నమః

శ్యామలవర్ణంతో ప్రకాశిస్తున్న తల్లి. **'శ్యామా షోడశవార్షికీ'** – పదహారు సంవత్సరముల వయస్సు ఉంటే 'శ్యామా' అంటారు. ఆ వయస్సులో ఉన్న తల్లిగా భావన చేయాలి.

487. వదనద్వయా – శ్రీ వదనద్వయాయై నమః

ఈ తల్లికి రెండు శిరస్సులు. దీనిని బట్టి చూస్తే గర్భస్థ పిండములో ఏర్పడే ఇంద్రియములకి, ఇక్కడ ఈ వదనములకి సంబంధం ఉన్నది. ఈ నామాల అంతరార్థాలు చాలా విశేషంగా ఉంటాయి. గర్భస్థ పిండంలో రెండవ నెల స్థితికి, ఇప్పుడు ఉన్న ఈ దేవతకి ఉన్న అనుబంధం చెప్తున్నారు

488. దంష్ట్రోజ్జ్వలా – శ్రీ దంష్ట్రోజ్జ్వలాయై నమః

ఈ తల్లికి గల రెండు వదనాలకి ఉజ్జ్వలమైన కోరలు అటు, ఇటు ప్రకాశిస్తూ ఉన్నాయి

489. అక్షమాలాదిధరా – శ్రీ అక్షమాలాదిధరాయై నమః

'అక్షమాల–ఆది ధరా' – అక్షమాల మొదలైన నాలుగు రకాల ఆయుధాలు ధరించినది. అక్షము, శూలము, కపాలము, డమరుకము. ఈ నాలుగు ఆయుధాలతో ఉన్న రూపాన్ని ధ్యానించాలి.

490. రుధిరసంస్థితా – శ్రీ రుధిరసంస్థితాయై నమః

మన శరీరంలో ఉన్న నెత్తురనబడే ధాతువుకి ఈవిడ అధిష్ఠాన దేవత. రక్తసంబంధమైన ఏ దోషం పోవాలన్నా ఈ తల్లిని ధ్యానించుకోవాలి. ఈ తల్లి చుట్టూ మొత్తం పన్నెండు మంది దేవతలుంటారు.

491. కాళరాత్ర్యాదిశక్త్యౌఘవృతా – శ్రీ కాళరాత్ర్యాదిశక్త్యౌఘవృతాయై నమః

ఓఘము అంటే సమూహము. కాళరాత్రి–ఆది అంటే కాళరాత్రి మొదలైన శక్తులతో కూడి ఉన్నది. కాళరాత్రిలో మొదటి అక్షరం – 'క' .

కాళరాత్రి, ఖాతీత, గాయత్రీ, ఘంటాధారిణి, ఙామిని, చంద్రా, ఛాయ, జయ, ఝుంకారి, ఞ్ఞానరూప, టంకహస్తా, ఠంకారిణీ. ఇప్పుడు మొదటి అక్షరాలు చూస్తే క నించి ఠ వరకు ఉన్న అక్షరాలు వచ్చాయి. క,ఖ,గ,ఘ,ఙ చ,ఛ,జ,ఝ,ఞ,ట,ఠ వరకు. అనాహత పద్మం పన్నెండు దళాలు. ఈ పన్నెండు దళాలలో 12 మంది శక్తులు ఉన్నారు. ఒకొక్క దళంలో ఈ అక్షరాలు. ఒకొక్క అక్షరం ఒకొక్క దేవత.

492. స్నిగ్ధౌదనప్రియా – శ్రీ స్నిగ్ధౌదనప్రియాయై నమః

స్నిగ్ధౌదనం ఈ తల్లికి ఇష్టమైనది. స్నిగ్ధ అంటే నేతితో తడిసిన అని, ఓదనము అనగా ఆహారం అని అర్థం. నేతితో తడిసిన ఆహారం ఈవిడకి ప్రీతి.

దీనికి చాలా అర్థాలు చెప్పారు. మనం కేసరీబాత్ అంటుంటాం. అది ఆవునేతితో కలిసి ఉంటే సరిపోతుంది. అంతేకాని కొంత ఆవు నెయ్యి, కొంత గేదె నెయ్యి కూడదు. దేశీయ గోఘృతం మాత్రమే శ్రేష్ఠం.

ఈ దేశానికి, ఈ మట్టికి, ఈ దేశవాళీ గోవుకి, ఈ సంస్కృతికి ఏదో అనుబంధం ఉంది. మన ప్రాణాలు నిలపగలిగే గోమాతకు మరొక్కసారి నమస్కారం చేసుకుందాం. కొంతమంది ఆవు నెయ్యి బాగా కలిపిన పప్పు అన్నం కూడా స్నిగ్ధౌదనమే అని చెప్పారు. తప్పేం కాదు.

493. మహావీరేంద్రవరదా - శ్రీ మహావీరేంద్రవరదాయై నమః

ఈ తల్లి మహావీరేంద్రులకి వరము ఇస్తుంది. ఎవరైతే నిగ్రహంతో సాధన చేస్తారో వారే వీరులు. వీరత్వమంటే సాధనలో బలం. ఇంద్రియాలను నిగ్రహించడం కంటె వీరత్వము మరొకటి ఉంటుందా? ఇంద్రియ నిగ్రహం ఉంటే గాని మంత్రం సిద్ధించదు, దేవతా సిద్ధించదు. దేవతని ధ్యానిస్తేనే ప్రయోజనం కాని ఆ ధ్యానానికి అడ్డంకి చపలత్వము. అది నిగ్రహించడమే పెద్ద వీరత్వము. దీనినే హిరణ్యకశిపునితో ప్రహ్లాదుడు చెప్తూ -

లోకములన్నియున్ గడియలోన జయించిన వాడ వింద్రియా
నీకము చిత్తమున్ గెలువనేరవు నిన్ను నిబద్ధు జేయు నీ
భీకర శత్రులార్వుర బ్రభిన్నుల జేసిన బ్రాణికోటిలో
నీకు విరోధి లేడొకడు నేర్పున జూడుము దానవేశ్వరా

అంటాడు. శాస్త్ర పరిభాషలో, ఉపాసనలో పరిణతి పొందినవారు మహావీరులు. దీనికి పురాణంలో ఒక కథని కూడా ఉట్టంకిస్తారు భాస్కరరాయల వారు.

ఒకసారి ఇంద్రుడు, ప్రహ్లాదుడు కలిసి అమ్మవారిని ఉపాసన చేశారు. వారిద్దరినీ ఆ తల్లి అనుగ్రహించింది. ఇంద్ర అన్నప్పుడు ఇంద్రుడు, మహావీర అంటే ప్రహ్లాదుడు. ఇద్దరిని అనుగ్రహించింది అని చెప్పి ఒక కథను మనకు గుర్తుచేశారు. తురీయావస్థను అనుసంధానించువారు వీరులు - అని మరో అర్థం ఉంది. బ్రహ్మసాక్షాత్కారమును పొందినవారు, (సాక్షీరూప చైతన్యస్థితిలో ఉన్నవారు ఇంద్రులు. వారు మహావీరులు). అటువంటి వారిని అనుగ్రహించే పరమేశ్వరి. అనాహతంలో ధ్యానించే భక్తయోగులే

మహావీరులు. వారికి వరదాయిని ఈ తల్లి.

'మహావీరేంద్రవరదా'లో మరొక అద్భుతమైన విశేషముంది. సోమయాగంలో ఉపయోగించే పాత్రకి 'మహావీరా' అనే పేరు ఉంది. 'మహావీరేంద్రవరదా' అంటే ఆ పాత్ర ద్వారా చెయ్యబడే యజ్ఞానికి సంతోషించి వరాలిచ్చే తల్లి అని అర్థం. అమ్మవారు యజ్ఞస్వరూపిణి కనుక దాని పరంగా కూడా అన్వయం ఉంది. యజ్ఞములో చెప్పబడే సోమయాగం, సోమపానమే శ్రీ చక్రార్చనలో విశేషార్ఘ్యమని చెప్పబడుతుంది. అదే అంతర్యాగంలో సుషుమ్నలో చెప్పబడే అమృతముగా ప్రస్తావన చెయ్యబడుతున్నది.

494. రాకిన్యంబాస్వరూపిణీ - శ్రీ రాకిన్యంబాస్వరూపిణ్యై నమః

అనాహతచక్రానికి అధిష్ఠాన దేవత పేరు రాకినీదేవి. లలితాదేవియే ఆ రూపంతో ఉంది. రాకినీ అంబా స్వరూపంతో ఉన్న లలిత అని హృత్పద్మంలో ధ్యానించాలి. ఆవిడ ధరించిన ఆయుధాలు, పేరు, వర్ణము, అనుగ్రహము - ఇత్యాదులన్నీ ఇక్కడ చెప్పబడుతున్నాయి. ఈ తల్లి మనలని అనుగ్రహించుగాక. దీనికి సంబంధించి మంత్రశాస్త్రంలో -

హృత్పద్మే భానుపత్రే ద్వివదన లసితాం దంష్ట్రిణీం శ్యామవర్ణాం
అక్షం శూలం కపాలం డమరుమపి భుజైర్ధారయంతీం త్రినేత్రాం
రక్తస్థాం కాళరాత్రి ప్రభృతి పరివృతాం స్నిగ్ధ భక్తైక సక్తాం
శ్రీమద్వీరేంద్రవంద్యాం అభిమత ఫలదాం రాకిణీం భావయామః

భానుపత్రే అంటే సూర్యపత్రం. 12 మంది సూర్యులు. అనాహతచక్రంలో ఉండే పద్మానికి 12 దళాలు. ఈ 12 దళాలని 12 సూర్యులతో పోల్చారు. మంత్రభాష అంటే ఇలా ఉంటుంది. రక్తస్థాం అంటే రక్త ధాతువును అధిష్ఠించిన తల్లి.

495 నుంచి 503 వరకు తొమ్మిది నామాలలో మరొక తల్లిని చూపిస్తున్నారు. లాకినీదేవి. అయితే డాకినీ, రాకిణీ ఎందుకు వచ్చాయో చెప్పుకోవాలి కదా.

ఈ తల్లిని ఉపాసన చేసినప్పుడు కొన్ని మంత్ర విశేషములు ఉన్నాయి. అందులో వాడే బీజములు, న్యాసము, వాటికి వాడే అక్షరములు డ కారముతో కూడి ఉంటుంది

కనుక డాకినీ. **ర** కారంతో కూడిన బీజం న్యాసము చేస్తారు గనుక రాకిణీ. లాకినీ అంటే **ల** కారంతో కూడిన బీజన్యాసం. ఈ శబ్దాలన్నీ అలా వచ్చాయి. అంతేకాని అతితెలివిగా లాకినీ, శాకినీ అంటే ఆంజనేయ దండకంలో చదివినవి ఇక్కడకి అన్వయించి రెండూ ఒకటేనా అని అనుకోకూడదు. ఇక్కడ ఆ బీజాక్షర మంత్రశక్తుల విశేషాలు చెప్పబడుతున్నాయి.

495. మణిపూరాబ్జనిలయా – శ్రీ మణిపూరాబ్జనిలయాయై నమః

మణిపూరము అంటే నాభీచక్రం. అక్కడ ఉన్న తల్లి లాకినీదేవి. అక్కడ ప్రకాశమానమైన నాదశక్తి ఉంటుంది కనుకనే దానికి మణిపూరమని పేరు. ఇది 'మాసత్రయేణ' అన్నారు అంటే – గర్భస్థపిండ విషయంలో మూడవ మాసానికి సంబంధించిన ఎదుగుదలనిచ్చే తల్లి.

496. వదనత్రయసంయుతా – శ్రీ వదనత్రయసంయుతాయై నమః

ఈ తల్లికి మూడు శిరస్సులు ఉన్నాయి. 'వయోవస్థావివర్జితా' అనే నామంలో చెప్పిన దేవత ఇక్కడ చెప్పబడుతోంది.

వదనాల గురించి చెప్తూ వదనైక, వదనద్వయ, వదనత్రయ అనడంలో అర్థం గర్భస్థశిశువుకి కూడా ఒక అవయవం పెరుగుతూ ఉంటుంది. తరువాతి నామం 'వజ్రాదికాయుధోపేతా'.

497. వజ్రాదికాయుధోపేతా – శ్రీ వజ్రాదికాయుధోపేతాయై నమః

వజ్రం మొదలైన ఆయుధములు ధరించినది. మొత్తం నాలుగు ఆయుధాలు చెప్పుకోవాలి. వజ్రము, శక్తి, దండము, అభయముద్ర. నాలుగు చేతులతో ఈ ఆయుధములు ధరించి ఉన్న తల్లి గనుక 'వజ్రాదికాయుధోపేతా'.

498. డామర్యాదిభిరావృతా –శ్రీ డామర్యాదిభిరావృతాయై నమః

ఈ తల్లి చుట్టూ డామరి మొదలైన దేవతలు ఉన్నారు. మణిపూరం దగ్గర ఉన్నది పది దళముల చక్రం. అందులో ఒకొక్క దళానికి ఒకొక్కరు చొప్పున పదిమంది ప్రకాశిస్తున్నారు. డామరీ, ఢంకారిణీ, ణామిని, తామసీ, స్థాణ్వీ, దాక్షాయణీ, ధాత్రీ, నందా, పార్వతీ, ఫట్కారి. డ కారం నుంచి ఫ కారం వరకు చెప్పబడిన అక్షర శక్తులు. వీరంతా లాకినీదేవికి ఆవరణదేవతలు.

499. రక్తవర్ణా – శ్రీ రక్తవర్ణాయై నమః

ఎర్రని రంగు కలది కనుక 'రక్తవర్ణా'.

500. మాంసనిష్ఠా – శ్రీ మాంసనిష్ఠాయై నమః

మాంసధాతువునందు అధిష్ఠానదేవతగా ఉండునది. మన శరీరంలోని మాంసధాతువుకి బలం కలగాలంటే ఈ తల్లి అనుగ్రహం కావాలి. తరువాత నామంలో 'గుడాన్నప్రీతమానసా' అని ఈ తల్లికి ఇష్టమైన పదార్థాన్ని చెప్తున్నారు.

501. గుడాన్నప్రీతమానసా – శ్రీ గుడాన్నప్రీతమానసాయై నమః

గుడము అంటే బెల్లం. గుడాన్నము ఎలా తయారుచెయ్యాలో చెప్తున్నారు.

తండులేషు చతుర్భాగం గుడం విక్షిప్యసాధకః
ద్విభాగం విన్యసేత్ దుగ్ధం తస్యార్థం ప్రక్షిపేత్ ఘృతం
నారికేళంచ కదలీఫలమేలాం చ విక్షిపేత్
కృత్వా గుడాన్నమేవంతు శంభవే నివేదయేత్

బియ్యంలో బెల్లము, ఆవుపాలు, ఆవునెయ్యి, కొబ్బరి ముక్కలు లేదా కొబ్బరి కోరు, అరటి పళ్ళు, ఏలకులు మొదలైన వాటితో కలిపి తయారు చెయ్యాలి. వీటిని పార్వతీపరమేశ్వరులకు నివేదన చెయ్యాలి. ఇది గర్భస్థపిండ విషయంలో ఆ తల్లి ఆహారంగా తీసుకుంటే త్రిమాసస్థితిలో లోపల శిశువుకు ఉన్నతమైన ఎదుగుదల ఉంటుంది.

502. సమస్తభక్తసుఖదా - శ్రీ సమస్తభక్తసుఖదాయై నమః

అన్ని రకాల సుఖాలను, అన్ని రకాల భక్తులకి ఇచ్చునది. అన్ని రకాల భక్తులు అంటే **'ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ'** అని చెప్పినట్లుగా ఒకొక్క స్థాయికి చెందిన భక్తులుంటారు. మనకేం కావాలో ఆ తల్లికి తెలుసు. అమ్మవారి ఉపాసన చేస్తున్నప్పుడు ధాతు దేవతలని ధ్యానం చేసుకుంటూ ఉంటే ఆ ధాతు దేవతలు ఆ జీవునికి ఆయువు ఉన్నంత కాలం దృఢమైన శరీరాన్ని ఇస్తారు. శ్యామశాస్త్రిగారు ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు అమ్మవారి ముందు కూర్చుని **"దురుసుగా కృపజూచి సంతతమరోగ దృఢ శరీరముగా సలుపు నను"** అని కీర్తించారు. ఆవిడ శరీర దారుఢ్యము ఇవ్వగల తల్లి. సప్తధాతువులు ఆవిడ చేతిలో ఉన్నాయి.

అంతేకాదు. ఎవరైతే అమ్మవారికి ఉపచారం చేస్తూ ఉంటారో వారిపట్ల ఎవరైనా అపచారం తలబెడితే ఆ శత్రువుల ధాతువులు వీరు లాగేస్తారు. భండాసుర సంహార సమయంలో వారాహీదేవి యొక్క చక్రంలో ఉన్న ఈ సప్త ధాతుదేవతలు భండాసురసేనలందరిలో ప్రవేశించి వారి ధాతువులు బయటకి లాగగానే వారు క్రింద పడిపోయారు.

వీరంతా ధాతు వైషమ్యం లేకుండా కాపాడే దేవతలు. ధాతుపుష్టి చెయ్యగల శక్తి ఆ అన్నానికి ఉంది.

503. లాకిన్యంబాస్వరూపిణీ - శ్రీ లాకిన్యంబాస్వరూపిణ్యై నమః

మణిపూరచక్రం వద్ద ఉన్న ఈ తల్లి పేరు 'లాకినీ అంబ'.

దిక్పత్రే నాభిపద్మే త్రివదన విలసద్దంష్ట్రిణీం రక్తవర్ణాం
శక్తిం దంభోళిదండావ భయమపి భుజైర్ధారయంతీం మహోగ్రాం
డామర్యాద్యైః పరీతాం పశుజనభయదాం మాంసధాత్వేకనిష్ఠాం
గౌడాన్నాసక్తచిత్తాం సకల సుఖకరీం లాకినీం భావయామః

ఇవి మంత్రశాస్త్రం చెప్పిన మాటలు. ఈ శ్లోకములు చాలా దివ్యమైనవి. లలితాసహస్రంలో 'సమస్త భక్తసుఖదాం' మంత్రశాస్త్రం 'సకల సుఖకరీం' అని

చూపించారు. ఆ శ్లోకసారం అంతా ఇక్కడ గోచరించింది. నామాలు చెప్తూ మన కోసం ఎంతో విజ్ఞానాన్ని ఇస్తున్నారు. ఆ లలితాదేవి కృపకి మరొక్కసారి నమస్కారం చేసుకుంటూ 504వ నామం నుంచి 513వ నామం వరకు పది నామాలు 'స్వాధిష్ఠానచక్రం'లో ఉన్న అమ్మవారిని వర్ణిస్తున్నారు.

504. స్వాధిష్ఠానాంబుజగతా – శ్రీ స్వాధిష్ఠానాంబుజగతాయై నమః

స్వాధిష్ఠాన పద్మం దగ్గర ఉన్న శక్తిని వివరిస్తున్నారు. ఇది సరిగ్గా గర్భస్థపిండ విషయంలో **'చతుర్థమాసే జఠరకటిప్రదో భవతి'** – నాలుగవ నెలలో ఎదగాల్సిన అవయవాలకు సహకరించే తల్లి. స్వాధిష్ఠాన పద్మంలో ఉన్న కాకినీదేవి. ఈ దేవి న్యాసము బీజము **'క'**కార ప్రధానంగా ఉంటుంది కనుకనే కాకినీ అని చెప్పారు.

505. చతుర్వక్త్రమనోహరా – శ్రీ చతుర్వక్త్రమనోహరాయై నమః

నాలుగు శిరస్సులతో ప్రకాశిస్తున్న తల్లి.

506. శూలాద్యాయుధసంపన్నా – శ్రీ శూలాద్యాయుధసంపన్నాయై నమః

శూలము మొదలైన ఆయుధాలు ధరించిన తల్లి. మొదలైన అనే దాని కోసమే మనం ఇతర శాస్త్రాలలో ప్రవేశించి తెచ్చుకోవాలి. మన ధ్యానానికి తెలియడం కోసం అమ్మవారు ఏ ఏ ఆయుధాలని ధరించారో చెప్తున్నారు. శూలము, పాశము, కపాలము, అభయము. ఈ తల్లి ఈ నాలుగు ఆయుధాలు పట్టుకుని ఉంటుంది.

507. పీతవర్ణా – శ్రీ పీతవర్ణాయై నమః

ఈ తల్లి యొక్క రంగు పీతవర్ణం. **'పీతాభాస్వత్యణూపమా'** అని చెప్పినట్లుగా ఈ తల్లి పసుపు రంగు, బంగారువన్నెతో ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ తల్లి 'సిద్ధేశ్వరీ'. ఆ నామాల వరుసలో అక్కడితో దీనికి అనుబంధం ఉంది అని చెప్పుకున్నాం.

508. అతిగర్వితా – శ్రీ అతిగర్వితాయై నమః

గర్వం ఎప్పుడు వస్తుంది అంటే సంపదలు అన్నీ సమృద్ధిగా ఉన్నప్పుడు, ఆ నిండైన భావం చూపిస్తున్నప్పుడు 'నాకేం' అని ఉంటుంది. ఇదొక దర్పం. ఇది కూడా ఉండవలసిన వారి దగ్గర ఉంటే ఒక సౌందర్యం.

విశ్వనాథ సత్యనారాయణగారు 'ధిషణాహంకార సంభార దోహల బ్రాహ్మీ మయమూర్తి' అన్నారు. ఒకొక్కప్పుడు అలాంటి అహంకారం అందం. అది ప్రమాదకారి కాదు. అమ్మవారి దగ్గర అతిశయించిన భావం, సౌందర్యము, సంపద, ఐశ్వర్యము పుష్టిగా ఉన్నాయి. ఆ పుష్టిగా ఉన్న భావంతో ఆవిడ నిండుగా చూస్తున్నారు. అందుకే అతిగర్వితా. లాకినీదేవి – ఉగ్ర, కాకినీదేవి – అతిగర్వితా. భావానికో ప్రాధాన్యం ఉంది.

509. మేదోనిష్ఠా – శ్రీ మేదోనిష్ఠాయై నమః

మన మెదడు లోపల ఉండే మృదువైన మాంసవిశేషాన్ని మేదస్సు అంటారు. ఇది చాలా ప్రధానం. మెదడుకి అత్యంత ముఖ్యమైన ధాతువు ఇది. బుద్ధి కళారూపంతో ఇది అనుగ్రహిస్తుంది. ఆ ధాతువుని వృద్ధి చెందించే పదార్థం గురించి తరువాత నామంలో చెప్తున్నారు.

510. మధుప్రీతా – శ్రీ మధుప్రీతాయై నమః

తేనె అంటే చాలా ఇష్టం. తేనె నివేదన చెయ్యాలి. **'యన్మధునాజుహోతి మహతీమేవ తద్దేవతాం ప్రీణాతి'** – మధువుతో హోమం చేసినవారు గొప్పగా దేవతను సంతోషింపజేస్తున్నారు అని శ్రుతి. **'మధువాతా ఋతాయతే'. 'అసౌవా ఆదిత్యో దేవమధు'** (శ్రుతి) – సూర్యకిరణాల ద్వారా ప్రాణశక్తి రూపమైన మధువు వ్యాపిస్తున్నది. కనుక సూర్యబింబము దేవమధువు.

511. బందిన్యాదిసమన్వితా - శ్రీ బందిన్యాదిసమన్వితాయై నమః

బందినీ మొదలైన దేవతలతో ఉన్నది. ఇక్కడ బందినీ నుండి చెప్పబడే దేవతలు ఆరుగురు వస్తారు. వీరు స్వాధిష్ఠాన చక్రంలో ఉన్నవారు. **'బందినీం భద్రకాళీం చ మహామాయాం యశస్వినీం, రక్తాం లంబోష్ఠికాం చైవ పూజయేత్ క్రమశః'.** బందినీ, భద్రకాళీ, మహామాయా, యశస్వినీ, రమ, లంబోష్ఠి. ముందు మనం నామాలలో చెప్పుకున్న యశస్వినీ వేరు, ఇక్కడ యశస్వినీ వేరు. బ నుంచి ల వరకు అక్షరాలు స్వాధిష్ఠానం దగ్గరకి వచ్చాయి. ఈవిడకి ఇష్టమైన పదార్థం తరువాత నామంలో చెప్తున్నారు.

512. దధ్యన్నాసక్తహృదయా - శ్రీ దధ్యన్నాసక్తహృదయాయై నమః

దధి(పెరుగు)తో చేసిన ఓదనముపై ఆసక్తి కలిగిన హృదయమున్నది. ఇది ఎలా చెయ్యాలో చెప్తున్నారు.

దధ్నాచాన్విత శుద్ధాన్నం లవణేన సమన్వితం
ఆర్ద్రమరీచి సంయుక్తం ధానక పత్ర సంగతం
తథా నాగరఖండాఢ్యం దధ్యన్నం చేత్ప్రకీర్తితమ్

శుద్ధమైన అన్నంలో లవణము అంటే సైంధవ లేదా సముద్ర లవణము అని పూర్వులు చెప్పినది కలిపి, మరీచి అనగా మిరియాలు, ధానక సంయుతం అంటే కొత్తిమీర ఆకులు, నాగరఖండం అంటే అల్లం ముక్కలు. ఇవి కలిపి తయారు చెయ్యవలసినది దధ్యోజనము. ఇది గర్భస్థ శిశువుకి నాలుగవ మాసంలో ఎదగవలసిన అవయవాలకి పనికి వస్తాయి. 'మధుప్రీతా', 'దధ్యన్నాసక్తహృదయా' - రెండూ కనబడుతున్నాయి అంటే రెండు రకాల పదార్థాలు స్వీకరించవచ్చు.

513. కాకినీరూపధారిణీ - శ్రీ కాకినీరూపధారిణ్యై నమః

స్వాధిష్ఠానంలో కాకినీదేవి చెప్పబడుతోంది

స్వాధిష్ఠానాఖ్యపద్మే రసదళ సహితే వేదవక్త్రాం త్రినేత్రాం
హస్తాభ్యాం ధారయంతీం త్రిశిఖ గుణ కపాలాభయాన్యాత్తగర్వాం

మేదో ధాతు ప్రవిష్టామలిమద ముదితాం బందినీ ముఖ్య యుక్తాం
పీతాం దధ్యోదనేష్టాం అభిమత ఫలదాం కాకినీం భావయామః

కేవలం ధాతుపుష్టమైనవే కాకుండా ఈ నివేదనల వల్ల ఇతర అనుషంగిక ప్రయోజనాలలో ఒకటి 'అభిమత ఫలదాం' – దధ్యోజనము వలన కోరికలు తీరుతాయి.

514 నుంచి 520 నామం వరకు గల ఏడు నామాలు మూలాధారంలో ఉన్న తల్లివి. మూలాధారం అత్యంత ప్రధానమైనది.

514. మూలాధారాంబుజారూఢా – శ్రీ మూలాధారాంబుజారూఢాయై నమః

మూలధారపద్మముపై అధిష్ఠించినది. ఇక్కడ 'సిద్ధవిద్యా' అయిన తల్లి. ఇది గర్భస్థపిండ విషయంలో ఐదవ నెలకి సంబంధించిన అవయవాల ఎదుగుదలకి ముఖ్యమైనది.

515. పంచవక్త్రా – శ్రీ పంచవక్త్రాయై నమః

గర్భస్థపిండ విషయంలో **'పంచమే మాసే పృష్ఠవంశో భవతి'** – ఐదవమాసంలో వెన్నెముక ఏర్పడుతుంది. మూలాధారాంబుజారూఢా అయిన దేవిని పంచవక్త్రా అని చెప్పారు. పంచవక్త్రా అంటే అయిదు ముఖాలతో ఉంటుంది. ఇక్కడ సిద్ధవిద్య అనే దేవి ఐదు ముఖాలతో ప్రకాశిస్తున్నది. దీనిని సద్యోజాతాది ఐదు ముఖాలుగా భావించవచ్చు. గర్భస్థ పిండ విషయంలో ఐదవ మాసంలో చర్మధాతువును తెచ్చుకుంటుంది. అంతకు ముందు మాసములలో నాలుగు ఇంద్రియాల యొక్క ద్వారములు ఏర్పడి, ఐదవమాసంలో చర్మధాతువు ఏర్పడుతుంది, అంటే స్పర్శేంద్రియం ఏర్పడింది. దీనితో పంచేంద్రియములు పూర్తి అయినవి. త్వక్, చక్షు, శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణము అని చెప్పబడే పంచేంద్రియములు ఇక్కడకు పూర్తవుతున్నాయి. పంచేంద్రియ స్ఫురణ జీవునికి ఈ స్థితిలో కలుగుతున్నది.

516. అస్థిసంస్థితా - శ్రీ అస్థిసంస్థితాయై నమః

ఎముకల యందున్నది. ఎముకలకి బలం ఇచ్చే తల్లి.

517. అంకుశాదిప్రహరణా - శ్రీ అంకుశాదిప్రహరణాయై నమః

ప్రహరణ అంటే ఆయుధము. అంకుశము మొదలైన ఆయుధములు ధరించి ఉన్నది. ప్రతి దేవతకి నాలుగు చేతులు చెప్తూ ఉన్నారు. అంకుశము, కమలము, పుస్తకము, జ్ఞానముద్ర ధరించి ఉంది. ఈవిడ వాగ్దేవత. 'మూలాధారజ నాదమెరుగుటే ముదమగు మోక్షమురా' అని త్యాగరాజుల వారు చెప్పిన విషయం కూడా ఇక్కడ భావన చేసుకోవచ్చు.

518. వరదాదినిషేవితా - శ్రీ వరదాదినిషేవితాయై నమః

మూలాధారంలో ఈ తల్లి నాలుగు దళాల పద్మాన ఉన్నది. ఈ నాలుగు దళాలలో నలుగురు దేవతలున్నారు. వారు–వరద, శ్రీ, షండా, సరస్వతి. వ,శ,ష,స. వారిచే సేవించబడుతున్నది.

519. ముద్గౌదనాసక్తచిత్తా - శ్రీ ముద్గౌదనాసక్తచిత్తాయై నమః

ముద్గౌదనం ఈ తల్లికి ప్రీతి. అంటే పెసరపప్పుతో వండిన అన్నం.

సుశాలి తండులం ప్రస్థం తదర్ధముద్గభిన్నకం
చతుఃపలం గుడం ప్రోక్తం తన్మానం నారికేళకం
ముష్టిమాత్రం మరీచం స్యాత్ తదర్ధం సైంధవం రజః
తదర్ధం జీరకం విద్యాత్ కుడపం గోఘృతం విదుః
గోక్షీరేణ స్వమాత్రేణ సంయోజ్య కమలాననే
మందాగ్ని పచనాదేవ సిద్ధాన్నమిదముత్తమం

దీనికి సిద్ధాన్నం అని పేరు. చాలా విశిష్టమైన అన్నం. ఇది ఎలా చెయ్యాలో చెప్తూ–బియ్యంతో పెసరపప్పును కలిపి ఉడికిస్తూ ఇందులో కొంత భాగం మళ్ళీ

బెల్లం వేసి, కొబ్బరి కోరుగాని, ముక్కలు గానీ వేసి, మిరియాలు బాగా వేసుకుని, సైంధవ లవణం, జీలకర్ర, ఆవు నెయ్యి కూడా వెయ్యాలి. ఇది ఉడికించేటప్పుడు ఆవుపాలు కలపాలి. మందాగ్ని పచనాత్ – మంట సెగ చిన్నదిగా ఉంచి చెయ్యాలి. అలా చేస్తే **'సిద్ధాన్నమిదముత్తమమ్'** – అది ఉత్తమమైనది.

520. సాకిన్యంబాస్వరూపిణీ – శ్రీ సాకిన్యంబాస్వరూపిణ్యై నమః

సాకినీదేవి ఇక్కడ చెప్పబడుతున్నది.

మూలాధారస్థ పద్మే శ్రుతిదళ లసితే పంచవక్త్రాం త్రినేత్రాం
ధూమ్రాభాం అస్థి సంస్థాం సృణిమపి కమలం పుస్తకం జ్ఞానముద్రాం
బిభ్రాణాం బాహుదండైః సులలిత వరదా పూర్వశక్త్యన్వితాం తాం
ముద్గౌదనాసక్తచిత్తాం మధుమదముదితాం సాకినీం భావయామః

ఇందులో కూడా 'ముద్గన్నాసక్తచిత్తా' మొదలైన నామాలు కనబడుతున్నాయి.

521. ఆజ్ఞాచక్రాబ్జనిలయా నుంచి 527. హాకినీరూపధారిణీ వరకు ఏడు నామములు ఆజ్ఞాచక్ర స్థానం యొక్క విశేషం. ఆజ్ఞాచక్రంలో హాకినీ దేవి ఉంటుంది.

521. ఆజ్ఞాచక్రాబ్జనిలయా – శ్రీ ఆజ్ఞాచక్రాబ్జనిలయాయై నమః

ఆజ్ఞాచక్రము అనే పద్మమునందు ఉన్న తల్లి. ఈవిడ 'సిద్ధమాత'. ఈ ఆజ్ఞాచక్రస్థానం చాలా విశేషమైనది. దీనికి త్రిపురాస్థానము అని కూడా పేరు. ఇక్కడ నుండి పైన ఇంక కాలవ్యవస్థ ఉండదు. ప్రపంచమంతా కూడా కాల వ్యవస్థకు బద్ధమైనదే. ఆజ్ఞాచక్రం క్రిందనంతా కాలవ్యవస్థ. ఆజ్ఞాచక్రానికి పైన కాలాతీత వ్యవస్థ. ఆ కాలాతీత వ్యవస్థే శివశక్త్యైక్యరూపిణీ తత్త్వం. నిజానికి ఆజ్ఞాచక్ర స్థానం కూడలి స్థానం. ఈ కూడలి స్థానం ఖండత్రయ, మండలత్రయ, కూటత్రయముల యొక్క కూడలి. కూటత్రయ మంత్రములో మూడు కూటములు. అదే ఖండత్రయము అంటే సూర్య, చంద్ర, అగ్ని ఖండములు. వీటి అన్నింటి యొక్క కూడిక. ఇడ, పింగళ, సుషుమ్నల యొక్క సంగమస్థానం కూడా అదే. అందుకే దీని పేరే 'త్రిపురా

స్థానం' అని చెప్పబడుతుంది.

ఇక్కడ నుండి అంతా చంద్రమండల విషయంగా చెప్పబడుతున్నది కనుక సాధనలో ఒక క్రమంలో బిందువుని ధ్యానించడం ఇక్కడ కూడా కనబడుతున్నది. అటువంటి భవ్యమైన ఆజ్ఞాచక్రాబ్జ నిలయా. దీని పేరే ఆజ్ఞ అనగా సమస్త ఇంద్రియాలను శాసించేది. అంతఃకరణ యొక్క ప్రేరణ వలన ఇంద్రియాలు పని చేస్తున్నాయి. అంతఃకరణ శక్తికి కేంద్రం ఆజ్ఞాచక్రస్థానం. ఇది కూడలి స్థానం గనుక అటు పరమాత్మకి, ఇటు ప్రపంచానికి ఉన్న అనుబంధం ఇక్కడ తెలుస్తోంది. అందుకు ఈ స్థానం వద్దనే ధ్యానం చెయ్యాలి. మన పెద్దలు ఈ స్థానం వద్దనే బొట్టు పెట్టుకోమంటారు. అక్కడ బిందు రూపంగా ఉంటుంది కనుకనే దాని సంకేతంగా బిందురూపంగా కూడా బొట్టు పెట్టుకోవడం కనిపిస్తుంది. బిందువే ఇక్కడ ప్రధానంగా చెప్పబడుతున్నది. ఇక్కడ నుండి ఆ పై భాగమంతా ఆ చంద్రమండల వ్యాపకత్వానికి సంకేతంగా భస్మధారణ, ఊర్ధ్వ పుండ్రధారణ వచ్చాయి. మొత్తానికి భారతీయ సంస్కృతిలో ఇప్పుడు ఏవైతే చిహ్నాధారణలు అని చెప్పబడుతున్నాయో అవి అన్నీ యోగశాస్త్రాన్ని, మంత్రశాస్త్రాన్ని ఆధారం చేసుకుని ఉన్నాయి. చెరిపేసుకుని తిరగడానికి శాస్త్రం అక్కర్లేదు. పెట్టుకుని ఉండడానికే శాస్త్రం కావాలి.

(కొందరు – ఇవన్నీ ఎందుకండీ పుట్టుకతో లేవు కదా అని అంటూ ఉంటారు. పుట్టుకతో లేనివి మనం చాలా ధరించాము. పుట్టుకతో వచ్చిన దానిని సంస్కరించుకుంటేనే వాడు దివ్యుడు అవుతాడు. పుట్టుకతో ఉన్నట్లుగానే చచ్చేదాకా అలాగే ఉంటే వాడు దివ్యుడు కాడు. సంస్కరణ వలన దేహం శుద్ధమవుతుంది. సంస్కరణ వలన మానవత్వానికి దైవత్వం వస్తుంది. ఆ సంస్కారంలో భాగాలే తిలకధారణ, కుంకుమధారణ, భస్మధారణ, ఊర్ధ్వపుండ్రధారణ... ఇవన్నీ గొప్పవే. దేని ప్రాధాన్యం దానికి ఉంది. మన పెద్దవారు ప్రధానంగా భస్మధారణం, గోపీచందనం, కుంకుమ– ఈ మూడింటికి ప్రాధాన్యం ఇచ్చారు. గోపీచందనం ఊర్ధ్వముగా ధరించుట, భస్మధారణ తిర్యక్ అనగా అడ్డంగా ధరించుట, కుంకుమధారణ బిందురూపంగా ధరించుట వైదికమైన సంప్రదాయ ప్రకారంగా వస్తున్నాయి. ఎవరి

పద్ధతులలో వారు ఆ భ్రూమధ్య స్థానంలో ఉన్న ఆ దివ్యశక్తిని ఆరాధించాలి. ఆజ్ఞాచక్రం అంత విశేషంగా చెప్పబడుతున్నది.)

ఇక్కడికి వచ్చేటప్పటికి గర్భస్థ పిండ విషయంలో ఆరవమాసంలో కావలసిన ఎదుగుదల జరుగుతూ ఉంటుంది.

522. శుక్లవర్ణా - శ్రీ శుక్లవర్ణాయై నమః

ఇక్కడున్న తల్లి 'శుక్లవర్ణా'. తెల్లని కాంతులతో ప్రకాశిస్తూ ఉంటుంది. ఆవిడకి ఆరు ముఖాలు ఉంటాయనేది తరువాతి నామం -

523. షడాననా - శ్రీ షడాననాయై నమః

ఇక్కడికి వచ్చేటప్పటికి, ఆరు చక్రములు ఆరు ముఖములు అవుతున్నాయి. షడాననా అన్నప్పుడు ఐదు శివ తత్త్వాలు, ఒకటి అమ్మవారి శక్తి యొక్క స్వరూపము - కలిపితే ఆరు. వాటి యొక్క సంగమ స్థానం. షట్ చక్రము. షట్ కోణము యొక్క స్థానంగా కూడా భావన చెయ్యవచ్చు. ఆరు మోములతో ప్రకాశిస్తున్నది.

అంతే కాదు... మనస్సుకి ఆరవ ఇంద్రియము అని పేరు. మనకి ప్రధానంగా కర్మేంద్రియాలతో గొడవ లేదు. గొడవ అంతా జ్ఞానేంద్రియాలతోనే. త్వక్, చక్షు, శ్రోత్రు, జిహ్వా, ఆఘ్రాణములు. ఇవే జ్ఞానేంద్రియములు. ప్రపంచంలో దేనినైనా తెలుసుకునేది, తెలియజేసేది వీటితోనే.

చర్మము, కన్ను, చెవి, నాలుక, ముక్కు - జ్ఞానేంద్రియములు. మిగిలినవి కర్మేంద్రియములు. ఇవన్నీ కూడా జ్ఞానేంద్రియాల ప్రేరణతో పని చేస్తూ ఉంటాయి. పంచ తన్మాత్రలను గ్రహించడానికి పంచ జ్ఞానేంద్రియములున్నాయి. ఈ పంచ జ్ఞానేంద్రియములను నియమించేది మళ్ళీ మనస్సు. అది గాని కలవకపోతే వీటి గురించి తెలియదు. అందుకు మనస్సు అనేది 'మనషష్టానీంద్రియాణి' అని చెప్పినట్లుగా ఐదు+ఒకటి కలిపితే ఆరు. ఈ ఆరు పరమేశ్వరునికి అర్పణ చెయ్యగలగడమే గొప్ప యోగం. శంకరభగవత్పాదులవారు "నీ పాద పద్మములయందు నా జీవుడు ఆరు

పాదములతో ఆశ్రయిస్తున్నాడు" అన్నారు. షట్ పదములు అనగా తుమ్మెద అని ఒక అర్థం. తుమ్మెద పద్మాన్ని ఆశ్రయించినట్లుగా మన జీవుడు కూడా ఆరు పాదములతో అమ్మవారిని ఆశ్రయిస్తున్నాడు. ఆరు పాదములు అంటే పంచ జ్ఞానేంద్రియములతోను, ఒక మనసుతోనూ కలిసి అమ్మవారిని ఆశ్రయించడం.

'కమలాక్షునర్చించు కరములు కరములు' అన్నా ఇదే. భక్తి, యోగం, జ్ఞానం–ఏ పేరు చెప్పినా ఆ పరమేశ్వర తత్త్వంతో తాదాత్మ్యం చెందాలనే తహతహే వీటన్నింటిలో కనబడుతున్నది. అందుకు ఈ ప్రధానమైన ఆజ్ఞాచక్రం గురించే ఎక్కువ విస్తారం. దీనికే జ్యోతిర్లింగ స్థానమని కూడా పేరు. పరమేశ్వరుని యొక్క జ్యోతి స్వరూపాన్ని ధ్యానించవలసిన స్థానం ఇది. భగవద్గీతలో స్వామి వారు జ్ఞానయోగం చెప్పేటప్పుడు నాసాగ్రమునందు దృష్టి ఉంచాలి అన్నది ఇదే చోటు.

524. మజ్జాసంస్థా – శ్రీ మజ్జాసంస్థాయై నమః

ఇది ఎముకల లోపల ఉండే ఒకానొక గుజ్జు పదార్థం. దీని వలన ఎముకలకి గట్టితనం, కీళ్ళ సంధులయందు ఉన్న స్థితి ఏర్పడతాయి. ఈ మజ్జాధాతువు శరీరంలో ఒక ప్రధానమైన ధాతువుగా చెప్పబడుతున్నది. అటువంటి మజ్జాధాతువుకి నియామకురాలుగా, దాని యందు అధిష్ఠించి ఉన్న ఈ హాకినీ తల్లి 'ఆజ్ఞాచక్రాబ్జ నిలయా'.

525. హంసవతీముఖ్యశక్తిసమన్వితా
– శ్రీ హంసవతీముఖ్యశక్తిసమన్వితాయై నమః

ముఖ్య అంటే మొదలైన. హంసవతి మొదలైన శక్తులతో ఉన్నది. ఆజ్ఞాచక్రంలో రెండు దళాలే ఉంటాయి. ప్రధానంగా ఇద్దరే ఉన్నారు....వారు హంసవతీ, క్షమావతీ. మొదటి అక్షరాలు తీస్తే హ–క్ష. ఈ రెండు అక్షరాలే రెండు దళాలుగా ఉంటాయి. వాటి నడుమ ప్రకాశిస్తున్న తల్లి. ఈ తల్లికి నివేదన – 'హరిద్రాన్నైకరసికా'.

526. హరిద్రాన్నైకరసికా – శ్రీ హరిద్రాన్నైకరసికాయై నమః

ఏక శబ్దానికి ప్రధానము అని అర్థం. రసిక అంటే రసజ్ఞత, ప్రీతి కలిగినది అని అర్థం. హరిద్రాన్నమునందు ప్రీతి కలిగిన తల్లి. ఈ 'సిద్ధమాతా' అనే దేవతకి హరిద్రాన్నం అంటే ప్రీతి.

హరిద్రా అంటే పసుపు.

మరీచీ రజనీ చూర్ణైః జీరకాద్యైశ్చ సంయుతం
ఆజ్యేన సంప్లుతం దేవీ హరిద్రాన్నమితీరితం

మిరియాలు, జీలకర్ర, పసుపు, ఆవునెయ్యి కలిపి ఉన్నది హరిద్రాన్నం. ఇది గర్భిణి గాని ఆరవ మాసంలో తీసుకుంటే అది ఆవిడకి పథ్యమై ఆ లోపల సంతానం ఎదుగుదలకి పనికి వస్తుంది.

527. హాకినీరూపధారిణీ – శ్రీ హాకినీరూపధారిణ్యై నమః

ఇక్కడ ఈ తల్లి పేరు హాకినీ. ఈ తల్లి యొక్క బీజము, శక్తి, కీలకము, న్యాసము అన్నీ హకారంతో కూడి ఉంటాయి కనుక హాకినీ. ఈ పేర్లు కూడా చాలా జాగ్రత్తగా గుర్తుపెట్టుకుని చేసుకుంటే చాలా విశేషము. ఈ హాకినీ రూపంతో ఆజ్ఞాచక్రంలో ఉన్న తల్లిని మంత్రశాస్త్రం ఎలా కీర్తిస్తుందో వాటిని ఈ నామాలు ఎలా స్వీకరించాయో గ్రహించుతూ –

భ్రూమధ్యే బిందుపద్మే దళయుగ కలితే శుక్లవర్ణాం కరాబ్జైః
బిభ్రాణాం జ్ఞానముద్రాం డమరుకమమలామక్షమాలాం కపాలాం
షట్చక్రాధారమధ్యాం త్రిణయనలసితాం హంసవత్యాదియుక్తాం
హారిద్రాన్నైకసక్తాం సకల శుభకరీం హాకినీం భావయామః

ఈ తల్లి చేతుల్లో జ్ఞానముద్ర, డమరుకము, అక్షమాల, కపాలము ధరించి ప్రకాశిస్తుంది. ఇక్కడ నామ వర్ణనలో అమ్మవారి ఆయుధాల గురించి వర్ణించి చెప్పలేదు. మంత్ర శాస్త్రంలో ఉన్న దానిని ఇక్కడ తీసుకుని ధ్యానం చేసుకోవచ్చు. ఇక్కడ జ్ఞానముద్ర, డమరుకము, అక్షమాల, కపాలము ధరించి తెల్లని కాంతులతో వెలిగిపోతూ ఆరు ముఖాలతో ఉన్న అమ్మవారిని ధ్యానించాలి.

షట్చక్రాధారమధ్యాం - షట్చక్రంలో నడుమనున్నది. త్రిణయనలసితాం - మూడు కళ్ళ తల్లి. హంసవత్యాది యుక్తాం-హంసవతీ, క్షమావతీ అనే శక్తులతో ఉన్నది. 'హరిద్రాన్నైకసక్తాం సకల శుభకరీం హాకినీం భావయామః'. అటువంటి 'హాకినీ'ని భావిస్తున్నాము.

528. సహస్రదళపద్మస్థా - శ్రీ సహస్రదళపద్మస్థాయై నమః

వెయ్యి దళాలు అంటే అనంత దళములు. బ్రహ్మరంధ్రమందు సహస్రదళపద్మం. అక్కడున్న యోగిని లెక్కకందని దళాలతో విచ్చుకొని ఉంది. నిజానికి ఇది పూర్తిగా పరాశక్తి స్థానం. పరంధామము అనేది ఈ స్థితిలో ఉన్నది. ఇదే విష్ణుభక్తులకి వైకుంఠము, శివ భక్తులకి కైలాసం, అమ్మ భక్తులకి మణిద్వీపం అని 'లోక' సంజ్ఞతో చెప్పబడుతున్నది. ఇదే బ్రహ్మజ్ఞానులకి బ్రాహ్మీస్థితి. అటువంటి భవ్యమైన పరంధామమిది. ఇక్కడ ఆ వెయ్యిదళములలో 'యశస్వినీ' అని చెప్పబడుతున్న ఆ జగదంబిక సరిగ్గా ఏడవ మాసంలో గర్భస్థ శిశువు యొక్క సంపూర్ణమైన ఎదుగుదలకి సహకరించే దేవత.

సప్తమే మాసే జీవ సంయుక్తో భవతి, అష్టమే మాసే సర్వసంపూర్ణో భవతి, నవమే జీవతి - అని శాస్త్రం చెప్తున్నది. సప్తమమాసంలో జీవ చైతన్యం పని చేస్తూ ఉంటుంది. నేను అనే స్ఫురణ కలిగేది సప్తమ మాసంలో. అష్టమ మాసంలో అవయవాలకు ఒక పూర్ణత్వం వస్తుంది. నవమ మాసంలో ప్రాణశక్తి స్థిరపడుతుంది. అప్పుడు వెలికి వస్తాడు. ఏడవ మాసమే అత్యంత ప్రధానంగా చెప్పబడుతోంది కనుక అక్కడ వరకే చక్ర స్థానములన్ని వివరింపబడుతున్నాయి.

ఇక్కడ ఏడవ మాసం వివరించిన దానికి సహస్రార భూమిక దగ్గర సూక్ష్మ చక్రములు కూడా కలుపుకుంటే తొమ్మిది అవుతాయి మొత్తం. నవ మాసములు పూర్ణమైన ఎదుగుదలకి, నవగ్రహ శక్తులకి సంబంధం ఉంది. సంఖ్యాశాస్త్రములో 'నవమ' ఒక పూర్ణత్వము గనుక చిట్టచివరికి అమ్మవారి చక్రంలో నవ ఆవరణలకి ఒక శాస్త్రీయమైన అనుబంధం ఉన్నది.

529. సర్వవర్ణోపశోభితా – శ్రీ సర్వవర్ణోపశోభితాయై నమః

ఇంతవరకు ఒకొక్క చక్రంలో దేవతలలో ఒకరు రక్తవర్ణా, ఒకరు శుక్లవర్ణా, ఒకరు పీతవర్ణా. ఇక్కడ తల్లి 'సర్వవర్ణోపశోభితా'. అన్ని రంగులతో ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ తల్లినే మనం ఉపాసిస్తూ సంధ్యాకాలంలో **'సర్వవర్ణే మహాదేవి సంధ్యావిద్యే సరస్వతి'** అని నమస్కరిస్తాం.

క్రింద ఉన్న ఆరు చక్రములకు మూలము ఇదే. ఇదే విభజింపబడి ఒకొక్క చక్రములో ఒకొక్క శక్తిగా కేంద్రీకృతమైనది. కనుక మొత్తం ఆరు చక్రములకు ప్రధానము ఇదే. నిరంతరం బ్రహ్మరంధ్రం స్థానం నుండి వచ్చిన ఈశ్వర చైతన్యమే ఆరు చక్రములయందు ప్రసరిస్తూ ఉంటుంది. దాని యొక్క ప్రసరణ అధోదిశలో వెళ్తూ ఉంటే సాధకుడు దానిని చేరుకోవడానికి ఊర్ధ్వదిశలో ప్రయాణిస్తున్నాడు.

కానీ మొత్తం ఆ శక్తే విభజింపబడి ఆరు చక్రములకు ఉంది గనుక ఆరు చక్రములలో విభజింపబడిన యాభై అక్షరములు అక్కడే ఉంటాయి.

సర్వవర్ణ–ఉపశోభితా అంటే అన్ని అక్షరములతో ప్రకాశిస్తున్నది. విశుద్ధి దగ్గర పదహారు అక్షరములు – 'అ'కారం నుండి 'అం అః' వరకు, అనాహతం దగ్గర పన్నెండు అక్షరములు 'క' కారం నుండి 'ఠ' కారం వరకు, మణిపూరం దగ్గర 'డ' కారం నుంచి 'ఫ'కారం, స్వాధిష్ఠానం దగ్గర 'బ' కారం నుంచి 'ల' కారం వరకు, మూలాధారం దగ్గర 'వ, శ, ష, స' వరకూ, ఆజ్ఞాచక్రం దగ్గర 'హ'–'క్ష'. ఇలా యాభై అక్షరములు విభజింపబడ్డాయి కదా! ఇలా విభజింపబడిన యాభై అక్షరములు కలిసి ఎక్కడ ఉన్నాయో అదే సర్వవర్ణోపశోభితా. అందుకే అక్షరాల్లో మొదటి క్రమం అ, ఆ, ఇ, ఈ లతోనే ప్రారంభిస్తాము కనుక అదే క్రమంలో అ, ఆ లు ఎక్కడ ఉన్నాయో ఆ స్థానం నుండే ప్రారంభించారు. విశుద్ధిచక్ర నిలయా నుండి మొదలు పెట్టి క్రమంగా హ–క్ష తో పూర్తి అవుతాయి కనుక ఆజ్ఞాచక్రంతో పూర్తి చేశారు. ఇది ఒక క్రమం.

అదే విధంగా సృష్ట్యారంభం. **'ఆకాశాద్వాయుః', 'వాయోరగ్నిః'.** ఈ పంచభూత క్రమం తరువాత మనశ్చక్రం చూపించి వీటన్నింటికి మూలమైన పరమాత్మ తత్త్వాన్ని సహస్రారస్థానంలో అనుసంధానం చేస్తున్నారు.

శ్రీవిద్యలో ప్రధానంగా ఆయా చక్రములందు అక్షరములను న్యాసం చేసుకుంటూ చేసేది మాతృకా న్యాసము అని అంతర్మాతృకాన్యాసమని చెప్తారు. అయితే కేవలం అక్కడితో ఆగకుండా, అక్కడ ఉన్న యోగినీ దేవతలు అంటే డాకినీ, హాకినీ మొదలైనవారిని చెప్పడం జరిగింది.

యోగినీ దేవతలు ఆయా స్థానాలలో ఉంటూ వాని కర్మ కొద్దీ ఏ ఏ ధాతువులను ఇవ్వాలో ఆ ధాతువులను అన్నిటినీ శరీరానికి ఇస్తూ జీవుని గమనించుకుంటూ ఉంటారు. ఆయా స్థానములలో ఉన్నవారు ఆ జీవునికి ఏ ధాతు వైషమ్యం కలిగించాలి, ఏ ధాతువుకు పోషణ ఇవ్వాలో చూసుకుంటూ ఉంటారు. అమ్మ భక్తులైన వారికి మాత్రం ఈ ధాతు దేవతలు అనుకూలంగా ఉంటూ అనుగ్రహిస్తూ ఉంటారు.

ఇక్కడ కేవలం మాతృకాన్యాసంతో ఊరుకోకుండా యోగినీ దేవతల స్వరూపములు, ధాతువులు, ఆ యోగినీ దేవతల ధ్యాన విశేషములు, పెట్టవలసిన నైవేద్యములు – అన్నీ చూపిస్తూ ఒక అద్భుతమైన శాస్త్రాన్ని మనకి ఇస్తూ ఉన్నారు.

'సర్వవర్ణోపశోభితా' అంటే అన్ని రంగులతో ఉన్న తల్లి అని ఒకటి, అన్ని అక్షరములతో ప్రకాశించే తల్లి అని కూడా అర్థం. ఒకొక్క అక్షరం (వర్ణం) ఒకొక్క రంగు (వన్నె) కలిగి ఉంటుంది. అన్ని అక్షరాల రంగుల సర్వవర్ణములు. ఇందులో యాభై అక్షరాలు కలిసి ఉంటాయి. అలాంటపుడు యాభై దళాలే ఉండాలి కదా అంటే కాదు. సహస్రదళశోభితా. అక్షరములనుండి వచ్చిన వేదాది సమస్త శాస్త్రములకు మూలవిద్యలు కూడ అక్కడే ప్రకాశిస్తున్నాయి.

530. సర్వాయుధధరా – శ్రీ సర్వాయుధధరాయై నమః

మిగిలిన దేవతలు నాలుగు చేతుల్లో నాలుగేసి ఆయుధాలు పట్టుకున్నారు. ఇక్కడ ఆయుధాల సంఖ్య కూడా లెక్కించడానికి వీలుకానంతగా ఉంది. అనంతాలైన శక్తులు అనంతాలైన ఆయుధాలుగా చెప్పబడుతున్నాయి. శక్తులని ప్రకటించడానికి సాధనలే ఆయుధాలు. అనంతశక్తులని ప్రసరించే జగదంబిక యొక్క స్థానం సహస్రారం గనుక 'సర్వాయుధధరా' అన్నారు.

'సహస్రాణి సహస్రధా బాహవో తవ హేతయః' – రుద్రమంత్రాలలో చెప్పబడింది. అనంతములైన బాహువులను, అనంతములైన ఆయుధాలు ధరించిన ఆ పరమేశ్వర తేజస్సుని వర్ణించారు. ఆ తేజస్సే ఇక్కడ ప్రకాశిస్తున్నది కనుక 'సర్వాయుధధరా'. ఈ షట్చక్ర దేవతలకు ఏ ఏ ఆయుధాలు ఉన్నాయో ఆ ఆయుధాలన్నిటి మూలశక్తులు ఈ తల్లి వద్ద ఉన్నాయి. ఈ సహస్రారము పరమగమ్యమైనది. ఇక్కడ ఉండే దేవత మూలధాతువైన శుక్లధాతువునందు నిష్ఠితయై ఉంటుంది. అనగా శుక్లధాతువుకి అధిష్ఠానదేవత. అందుకే తరువాతి నామం 'శుక్లసంస్థితా'.

531. శుక్లసంస్థితా – శ్రీ శుక్లసంస్థితాయై నమః

జీవోత్పత్తికి మూలమైన బీజానికి అధిష్ఠానమైన దేవత. ఆ బీజమే శుక్లమని చెప్పబడుతుంది. ఈ శుక్లము ద్వారానే జీవుడు మాతృగర్భంలో ప్రవేశిస్తాడు. ఏ జీవుడు, ఏ విధంగా, ఎక్కడ ప్రవేశించాలని చూసేది ఈ తల్లే. శుక్ల ధాతువుకి నియామకురాలు. ప్రధాన బీజస్వరూపిణి. శరీరాన ప్రధానమైన ఓజస్సు అనే ధాతువును అధిష్ఠానంగా కలిగి ఉన్నది.

532. సర్వతోముఖీ – శ్రీ సర్వతోముఖ్యై నమః

ఇంతవరకు ఆరు చక్రాల వద్ద ఒకటి, రెండు, మూడు అని చెప్పుకున్నాం కాని ఈ తల్లి సర్వతోముఖి. అన్ని వైపులా ముఖాలే. అన్ని వైపులా ముఖాలంటే **'సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్'**. మొత్తానికి ఒక అనంత శక్తి ఉంది. అనంతశక్తి అంటే సర్వవిశ్వాన్ని నడిపే సర్వవ్యాపకమైన ఏ మహా చైతన్యముందో ఆ మహా చైతన్యము 'అమృతా'దేవితో మొదలు 'క్షమావతి' వరకు ఏభై వర్ణాధిదేవతల రూపాలు తానే అయి ఉన్న దేవి.

"సర్వతోక్షిశిరోముఖీ'. అమ్మవారికి ఈ మాట మరొక చోట కూడా కనబడుతోంది. అన్ని వైపులా పాదములు కలదంటే సర్వవ్యాపిని అని అర్థం. అన్ని

వైపులా ముఖాలు కలదంటే సర్వతోముఖీ. సప్తమ మాసములో సర్వేంద్రియములకు పుష్టి ఏర్పడుతున్నది కనుక ఆ మాట సరిపోతున్నది.

533. సర్వౌదనప్రీతచిత్తా - శ్రీ సర్వౌదనప్రీతచిత్తాయై నమః

ఓదనము అంటే ఆహారము. అన్ని ఆహారములు ఈవిడకి ఇష్టమే. వెనుక విడివిడిగా ఏ ఆహార పదార్థములు చెప్పారో అవి అన్నీ కలిపి ఈ అమ్మవారికి నివేదన చేసుకోవచ్చు. ఎవరికి? లలితాపరాభట్టారికా అని చెప్పబడుతూ ఏ తల్లి సహస్రారంలో భాసిస్తున్నదో ఆ తల్లికి మునుపు చెప్పిన ఆరు రకాల పదార్థములు విడివిడిగా వండి నివేదన చేయవచ్చు. దీనివల్ల సర్వ ధాతుపుష్టి ఏర్పడుతున్నది.

అలాగే శాస్త్రం చెప్పిన సర్వవిధ నివేదన పదార్థములు పెట్టవచ్చు. 'సర్వౌదన' అనగా శాస్త్రము చెప్పిన సర్వసాత్త్విక పదార్థములు అన్నీ కూడ అమ్మవారికి నివేదన చేయవచ్చు. పైన చెప్పిన ఈ ఆరు నివేదనలు గాని స్వీకరిస్తే గర్భస్థ శిశువు విషయంలో సర్వేంద్రియములకు పుష్టి ఏర్పడుతుంది. సర్వజగతిని ఆహరించునది **'యస్య బ్రహ్మ చ క్షత్రంచోభే భవత ఓదనః'** అని శ్రుతివాక్యం.

అన్న పదార్థముల యొక్క వైశిష్ట్యాన్ని చెప్పారు. పుట్టుక వచ్చింది అన్నం వలన, శరీరం పెరుగుతున్నది అన్నం వలన. **'అన్నాదేవ భవంతి భూతాని'** - భూతములు అన్నం వల్లనే కలుగుతాయి. **'అన్నం న నింద్యాత్', 'అన్నం న పరిచక్షీత'** - అని వేదవచనాలు.

'సర్వౌదనప్రీతచిత్తా' అంటే మరొక విషయం- ఆహారము అనగా విషయములు. సర్వ విషయములందు సమబుద్ధి కలిగే బ్రాహ్మీస్థితి. సుఖము-దుఃఖము, లాభము-నష్టములు ద్వంద్వములేని సమస్థితి ఏర్పడుతున్నదని తాత్త్వికమైన అర్థం.

534. యాకిన్యంబాస్వరూపిణీ - శ్రీ యాకిన్యంబాస్వరూపిణ్యై నమః

ఇక్కడ ఉన్న తల్లి యాకినీదేవి. ఈ తల్లి బీజములు, సంకేతములు అన్నీ యకారంతో ఉంటాయి కనుక యాకినీ. సరిగ్గా 'విశుద్ధిచక్రా' నుండి చూస్తే

'యాకిన్యంబా స్వరూపిణీ' వరకు మొత్తము ఏడు స్థానములలో ఉన్న యోగినీ దేవతలు, వారి స్వరూపాలు, వారి వర్ణనలు, వారి యొక్క ఆయుధములు, వారికి ప్రీతములైన పదార్థములు, వారి అనుగ్రహ వైఖరులు....ఇవన్నీ మొత్తం ఈ అరవై నామాల్లో చూపించారు.

దానికి పూర్వరంగంగా **'వజ్రేశ్వరీ' 'వామదేవీ'** అవి ఏడు నామములు. దాని చివరికి అనుసంధానం చేస్తూ **'స్వాహా, స్వధా, మతిః, మేధా, శ్రుతిః, స్మృతిః, అనుత్తమా'** అని ఏడు నామములు ఉన్నాయి. మొత్తం లలితా సహస్రనామంలో ఒక్క పాదంలో ఏడు నామములున్న పాదము ఇది ఒక్కటే. కొన్ని చోట్ల మూడు నామాలు, కొన్ని చోట్ల రెండు నుంచి ఐదు నామాలు వచ్చిన సందర్భములు ఉన్నాయి. ఇది ఇంతవరకు చెప్పినదానికి ముగింపు.

ముండ వ్యోమస్థ పద్మే దశశత దళకే కర్ణికా చంద్ర సంస్థాం
రేతో నిష్ఠాం సమస్తాయుధ కలితకరాం సర్వతో వక్త్రపద్మాం
ఆదిక్షాంతార్ణశక్తి ప్రకట పరివృతాం సర్వవర్ణాం భవానీం
సర్వాన్నాసక్త చిత్తాం పరశివరసికాం యాకినీం భావయామః

ఇప్పటివరకు చెప్పుకున్న 'యాకిన్యాంబా' స్వరూపాన్ని చూపిస్తూ మంత్రశాస్త్రం ఇచ్చిన ధ్యానశ్లోకాన్ని చూద్దాం –

శిరోభాగంలో ఉన్న ఆకాశంలోని పద్మమందు వెయ్యి దళముల కర్ణిక మధ్యలో ఈ తల్లి ఉంటుంది. శుక్లధాతువునందు నిష్ఠిత అయినది. ఆ అనంత హస్తములలో అనంత ఆయుధములు ధరించి ఉంది.

డాకినీ దేవి అని ఎవరైతే విశుద్ధిచక్రంలో ఉన్నారో ఆ తల్లి వజ్రేశ్వరీ సంకేతం ద్వారా చెప్పబడుతున్నది. ఆ మంత్రాధిదేవత 'స్వాహా'. మంత్రంగా చేసేటప్పుడు "డ" కారానికి బీజం కలిపి, నాదం చేసి 'డం డాకిన్యై స్వాహా', 'రం రాకిన్యై స్వాహా', అని అనుసంధానం చేస్తూ ఉంటారు. ఇది కూడా ఒక పద్ధతి. డాకినీ అంటే 'వజ్రేశ్వరీ', 'స్వాహా' రెండూ గుర్తుకు రావాలి.

'డాకినీ, రాకినీ, లాకినీ, కాకినీ, సాకినీ, హాకినీ, యాకినీ' అనబడే యోగ

దేవతలకు, 'డం, రం, లం, కం, సం, హాం, యాం' అనే బీజదేవతలకు నమస్కారం చేసుకుంటాం. బీజములు గురూపదేశంతో చేసుకోవాలి. ఉపదేశం లేనప్పుడు ఆ దేవత పేర్లు అనుకున్నా చాలు. మొత్తం వీటిని అనుసంధానం చేసుకుంటూ – లలితా పరమేశ్వరి యొక్క అనుగ్రహ స్వరూపములే శరీరాన్ని రక్షిస్తున్నాయి అని భావన చేసుకోవాలి. యోగినీ దేవతలు లలితాదేవికి అభిన్నులు. లలితాదేవే నా శరీరాన్ని కాపాడుతున్న అమ్మ.

ఇప్పుడు అమ్మ అనే మాట ఎంత గొప్పగా సరిపోతుందో మరొక్కమారు ఆలోచిద్దాం. లోకంలో మనల్ని కన్నతల్లిని అమ్మా అని అంటాం. నిజమే. ఎందుకంటే ఈ శరీరం ఏర్పడడానికి ఆ తల్లి దేహాన్ని పంచుకుని వచ్చాం కనుక ఆ తల్లిని తల్లి అంటున్నాము. రూపకల్పన చేసేటప్పుడు ఆ తల్లి కూడా రూపం ఇవ్వడం లేదు. కడుపులో ఉన్నవారిని పోషిస్తూ ఉంటే తాను ఒక పాత్రగా కేవలం భరిస్తూ ఉన్నది. ప్రమాదం కలుగకుండా జాగ్రత్త పడుతూ ఉన్నది. కాని రూపం తాను మలచలేదు. ఎవరు మలచారు? జీవుడు మలచుకున్నాడా? మన ముఖం, కాళ్ళు మనం చెక్కుకో లేదు. మన కర్మలకి అనుగుణంగా గుర్తుపెట్టుకుని దానిని అనుసరించి దేహాదులు కల్పన చేస్తున్న ఒక మహాశక్తి ఈ ప్రకృతిలో/విశ్వంలో వ్యాపించి ఉంది.

ఆ మహాశక్తే మన యొక్క కర్మలకి అనుగుణంగా రూపకల్పన చేసింది. ఆ తల్లి ఆ రూప నిర్మాణానికి సహకరించింది. గర్భం నుండి వెలికి వచ్చిన తరువాత ఈ తల్లి విడిచి పెట్టేసింది. కొంతకాలం పోషిస్తోంది. అమ్మవారు మాత్రం ఏడు ధాతు శక్తుల రూపంలో ఉంటూ శరీరంలో ఎప్పుడూ అంటి పెట్టుకుని కాపాడుతోంది. ఇప్పుడు నిజమైన తల్లి ఎవరు? 'శ్రీమాతా' అన్నప్పుడు మరొక్కసారి ఆ భావన తెచ్చుకోవాలి. 'శ్రీమాత్రే నమః' అన్న మంత్రానికి ఎంత శక్తి ఉందో మరొక్కసారి తెలుసుకోవాలి. ఆ మాతృలక్షణం ఎంత గొప్పగా కనిపిస్తోందో చూడండి. అంతేకాదు ఈ జీవునికి కర్మ కొద్దీ దేహం ఉంది. చిట్టచివరికి దేహం పతనం అయిపోయింది.

తరువాత ఏ ఏ కర్మవాసనలున్నాయో అవన్నీ లాగి వాని యొక్క సూక్ష్మశరీరంలో నిక్షిప్తం చేసి, ఆ సూక్ష్మ శరీరాన్ని కూడ పట్టుకుని వీనికి తగిన దేహం ఏమిటో

ఏర్పాటు చేసి మళ్ళీ అందులో పెడుతూ ఉంటుంది. ఒక జన్మలో ఒక తల్లి, ఇంకో జన్మలో ఇంకో తల్లి గాని అమ్మవారి అనుబంధం మాత్రం జీవునికి ఎప్పుడూ ఉంటుంది. నిజమైన అనుబంధం ఈ తల్లితోనే ఉంది. చిట్టచివరికి దేహాదులు లేని స్థితిలో ఈ తల్లిలోనే లయం అవ్వాలి. ఉన్నది ఒక్కటే తల్లి. ఈ తల్లి తప్ప మరొకరు లేరు. భువనైక మాత అయిన ఈ తల్లి పట్ల కృతజ్ఞత, భక్తి ఉండాలి.

ఇక్కడ లలితా పరాభట్టారిక యొక్క సంపూర్ణస్వరూపం చూపబడుతున్నది. ఇక తరువాతి నామములు 'స్వాహా, స్వధా, మతిర్మేధా' – ఈ తల్లుల పేర్లు చాలా విశేషం.

535. స్వాహా – శ్రీ స్వాహాయై నమః

దేవతలకి ఆహుతులు వేసేటప్పుడు స్వాహాకారం, పితృదేవతకు స్వధాకారం. దేవతలకు ఇచ్చిన పదార్థం హవ్యము అంటారు. పితృదేవతలకు ఇచ్చేదాన్ని కవ్యము అంటారు. ఈ హవ్య, కవ్యములను స్వీకరించడానికి అమ్మవారు రెండు రూపాలు అయ్యారు. పితృదేవతా వ్యవస్థ అంతా స్వధా రూపంతో అమ్మవారే చూసుకుంటుంది.

యస్యాః సమస్తసురతా సముదీరణేన
తృప్తిం ప్రయాతి సకలేషు మఖేషు దేవి!
స్వాహాసివై పితృగణస్య చ తృప్తిహేతుః
ఉచ్చార్యసే త్వమత ఏవ జనైః స్వధాచ (దేవీమాహాత్మ్యం)

దేవతలందరికి స్వాహా రూపంతో అమ్మవారే అన్నం పెడుతుంది. ఒక్క మానవులకే కాదు... సర్వజీవులకు అన్నం ప్రదానం చేస్తున్నది. అన్నం అన్నప్పుడు ప్రధానంగా స్వాహా.

ప్రాణాయ స్వాహా, అపానాయ స్వాహా అన్నప్పుడు మన లోపల ఉన్న జఠరాగ్నికి కూడా అదే ఇస్తున్నాం. అందుకు 'సర్వౌదన ప్రీతచిత్తా' అన్నప్పుడు ఓదనములు చెప్పి తరువాత స్వాహా చెప్పడం చాలా విశేషం. అయితే ఎన్ని రకాల యజ్ఞములు చేసినా–

సోమ సంస్థా హవిః సంస్థా పాకసంస్థాశ్చ సప్త యాః

తాస్త్వదుచ్చారణాద్దేవి క్రియంతే బ్రహ్మవాదిభిః

వేదవేత్తలైనవారు సోమ సంస్థలు, హవిః సంస్థలు, పాక సంస్థలు అని ఏడు రకాల యజ్ఞాలు చేస్తూ ఉంటారు. యజ్ఞముల యందు స్వాహాకార ఉచ్చారణ చేతనే దేవతలకి అందుతూ ఉంది.

స్వాహాదేవి, స్వధాదేవి అగ్నిదేవుని యొక్క భార్యలు అంటారు. ఆ అగ్ని ఎవరు?

స్వాహావహ్న్యాత్మనస్తస్య ప్రోక్తా పశుపతేః ప్రియా

షణ్ముఖో భగవాన్ దేవో బుధైః పుత్రః ఉదాహృతః (లింగపురాణం)

అగ్నిదేవుడు శివుని యొక్క రూపము. అందుకే శివుడు అగ్ని లింగం అని మనం ప్రస్తావన చేస్తూ ఉంటాం. **'రుద్రో ఏష యదగ్నిః'** అని శాస్త్రం చెప్తున్నది. ఆ యజ్ఞాగ్ని సాక్షాత్తు పరమేశ్వరుడే. పశుపతే అగ్ని. యజ్ఞములో పశువు అని శబ్దం కూడా వాడతారు. అప్పుడు పశుపతే యజ్ఞేశ్వరుడు. పశుపతి అయిన యజ్ఞేశ్వరుడు అగ్నిగా వ్యవహరింపబడుతున్నప్పుడు ఆయన శక్తి అయిన అమ్మవారు స్వాహాదేవిగా చెప్పబడుతూ ఉంటారు. ఆ యజ్ఞేశ్వరుడు అయిన పశుపతికి ఆ తల్లి అయిన స్వాహాదేవికి తనయుడే షణ్ముఖుడు. అనగా యజ్ఞస్వరూప శక్తి విషయము.

నామ్నా పశుపతేర్యాతు తనురగ్నిర్ద్విజైః స్మృతా

తస్య పత్నీ స్మృతా స్వాహా స్కందశ్చాపి సుతః స్మృతః – ఇదే భావాన్ని వాయుపురాణం చెబుతోంది.

'స్వాహాం తు దక్షిణే పార్శ్వే దేవీం వామే స్వధాం తథా' అని అగ్నిహోత్ర ప్రార్థన చేసేటప్పుడు అగ్నిభట్టారకునికి కుడివైపు స్వాహాదేవి, ఎడమ వైపు స్వధాదేవి ఉన్నట్లుగా ధ్యానించాలి. నిజానికి ఎడమ, కుడి అన్నప్పుడు కృష్ణపక్షమంతా పితృదేవతలది, శుక్లపక్షమంతా దేవతలది. అలాగే ఉత్తరాయణ, దక్షిణాయనములలో కూడా ఉత్తరాయణం దేవతలది, దక్షిణాయనం పితృదేవతలది. ఆ విషయంగానే ఇక్కడ స్వాహా, స్వధా చోట్లు చెప్పబడుతున్నాయి. పితృయానం అంతా వామం వైపు

చెప్తూ ఉంటే, దేవయానం అంతా దక్షిణం వైపు చెప్తూ ఉంటుంది. ఆ దేవయానానికి స్వాహా, పితృయానానికి స్వధా. ఇవన్నీ చాలా విశేషమైన అంశములు. స్వాహా అనే ఆ తల్లి విశుద్ధి చక్రదేవత అయిన వజ్రేశ్వరి యొక్క మంత్ర విశేషము.

'స్వాహా మాహేశ్వరీ పురే' అని చెప్పబడుతున్నది. క్షేత్రముల పరంగా మాహేశ్వరీపురం అనే పీఠంలో స్వాహాదేవి అనే తల్లి ఉన్నది.

'వాచం పద్మాలయాం పద్మాం శుచిం **స్వాహాం స్వధాం** సుధాం' అని లక్ష్మీ అష్టోత్తర శతనామాలలో కూడా చెప్పబడింది.

ఇక్కడ స్వాహాకి, స్వధాకి మరొక విశేషం చూడాలి. సు + ఆహా – స్వాహా అని. స్వాహాకు వేదశాస్త్రం ఎన్నో నిర్వచనాలు చెప్పింది. ఇది దేవతాహ్వాన వాచకం. స్వాహా, స్వధా, వషట్, ఓంకారం, నమస్కారం – ఈ ఐదింటిని దేవతాహ్వాన వాచకములు అంటారు. ఈ పదం తగిలితే గాని దేవత స్వీకరించదు. స్వాహాకారం యజ్ఞాలలో వినియోగిస్తారు. నిత్యం వాడుకునే ప్రణవం 'నమః'.

స్వాహా, స్వధా, ఓంకారాలలో ఎంత శక్తి ఉందో 'నమః' అనే దానిలో అంత శక్తి ఉంది. నమస్కారానికి ప్రణవము అని పేరు. ప్రణవము అంటే దేవతని ఆహ్వానింప చేయునది. దేవతను స్పందింప చేస్తుంది. యజ్ఞము నందు వినియోగించేవి స్వాహా, వషట్. పితృదేవతల విషయంలో స్వధాకారం. ఇక జపాదుల్లోనూ, యజ్ఞాదుల్లోనూ ఓంకారం వాడుతూ ఉంటారు. నమః సర్వకాలములలోనూ హాయిగా ప్రయోగించవచ్చు. నామావళి చేసేటప్పుడు నమః అని ఎందుకు పెడతారంటే దాని వల్ల నామం మంత్రమౌతుంది. అప్పుడు ఆ నామంతో చెప్పబడ్డ దేవత ఆహ్వానింపబడుతుంది. నమస్కారానికి అంతశక్తి ఉంది. అందుకే నమస్కారాన్ని ఎక్కడ పడితే అక్కడ పారేసుకోకూడదు. జాగ్రత్తగా వినియోగించుకోవాలి. నమః అంత గొప్పది కనుకనే నమకం వచ్చింది.

'సుష్టు ఆహూయతే ఇతి స్వాహా'. స్వాహా గురించి నిరుక్తం చాలా విశేషాలు చెప్తుంది. ఆ అర్థ వివేచనమే చాలా ఆనందంగా ఉంటుంది. స్వాహా, స్వధా ఇత్యాది నామాలు చాలా శక్తిమంతంగా జీవునిపై ప్రభావం చూపిస్తాయి. సుష్టు ఆహూయతే–

సంపూర్ణముగా ఆహ్వానించుట అని స్వాహా శబ్దానికి అర్థం. దేవత సంపూర్ణంగా వచ్చి అక్కడ స్థిరపడి మనం ఇచ్చింది ప్రీతిగా పొందడానికి పనికి వచ్చే శబ్దం స్వాహా.

స్వం+ఆహ-స్వాహా. స్వ అనే దానికి రెండు అర్థాలు. ఒకటి స్వర్గము, ఆహా అంటే పొందించునది. స్వర్గాన్ని పొందించునది. దేవతల స్థానం స్వర్గం. మనం వెయ్యవలసిన ఆహుతులు దేవతలకి చేరాలి. ఆ పదం ఉచ్చరించడంవల్ల దేవతాస్థానమైన స్వర్గానికి చేరి ఆ దేవతలకి అందుతుంది. ఎక్కడైతే దుఃఖ స్పర్శ ఇసుమంత కూడా ఉండదో దాని పేరు స్వర్గం. నిజానికి ఈ లోకంలో స్వర్గం లేదు. దుఃఖ, సుఖ మిశ్రమలోకమిది. దీనికి రుద్రనమకము 'సోభము' అని పేరు పెట్టింది. 'నమః సోభ్యాయ చ'. స ఉభ - సోభ. అంటే దుఃఖ-సుఖ మిశ్రమం.

'సైవ తే వాగిత్యబ్రవీత్' (తైత్తిరీయ శ్రుతి, - స్వీయవాగ్రూపమే (తనదైనవాక్కు) స్వాహా.

స్వ అంటే స్వాత్మ స్థితి. స్వ ఆహా అంటే స్వాత్మను పొందించే తల్లి అనే అర్థం.

కేవలం స్వర్గాది సుఖములే కాకుండా స్వాత్మజ్ఞానాన్ని కలిగించే దేవతా స్వరూపము స్వాహా. ఇవన్నీ కూడా వైదిక అర్థములు.

536. స్వధా - శ్రీ స్వధాయై నమః

స్వ- తన యొక్క శక్తితో, ధ-ధరించునది తల్లి. ఏ జీవుడు ఎక్కడ ఉన్నాడన్నది ఏ జీవునికీ తెలియదు. ఆ జీవిని పట్టుకుని తీసుకువెళ్తున్న శక్తి ఒకటి ఉన్నది. అది అమ్మవారి శక్తి. దేహం ఉన్నప్పుడల్లా దేహం పట్టుకుని ఉంది. దేహంలో సప్త ధాతువులు ఆవిడే అయి ఉన్నప్పుడు పట్టుకున్నది ఎవరో తెలిసిపోయింది కదా. ఆధారశక్తి ఆవిడే. దేహపతనానంతరం కూడా ఆ జీవుడు మరో లోకానికి, మరో గతికి, మరో ఉపాధికి వెళ్ళేవరకు కూడా వాడు ఎక్కడ ఉన్నాడో చూసుకోవలసిన శక్తి స్వధా. పితృదేవతల యొక్క పత్నిగా ఈమెని చెప్తున్నారు.

జీవుడు శరీరం వదలిన తరువాత వాడు ఏ ఉపాధిలోకి వెళ్ళాలి? ఎక్కడ

ఎంత కాలం ఉండాలి? అనేవి నిర్ణయించే విభాగమే పితృదేవతా వ్యవస్థ.

ముప్ఫైమూడు రకాల పితృ దేవతా గణాలు ఉన్నాయి. వాటికి ఉప గణాలు కూడా ఉన్నాయి. ప్రధానంగా మనం వసురుద్రాదిత్యులు అంటాం. సోమప, అగ్నిప, బర్హిషత్, అగ్నిష్వాత్ - ఇత్యాది పేర్లతో పితృదేవత గణములు ఉన్నాయి. వారిని ఆరాధించేదే ఆబ్దిక కర్మ. ఏ జీవుడు ఎక్కడ ఉన్నాడో వారికి తెలుస్తుంది. మనం ఏ జీవుని ఉద్దేశించి ఇచ్చినా పితృదేవతలు అనబడేవారు చూసుకుంటూ ఉంటారు. ఈ విషయములన్నీ హరివంశంలో, మహాభారతంలో, కొన్ని పురాణాల్లో చాలా విస్తారంగా చెప్పారు. అది వింటే చాలు అనేక అరిష్టాలు పోతాయని వివరించారు.

'స్వధా' అనే శక్తితో ఆ తల్లి ధరిస్తోంది. పోషిస్తున్నది. **'సుష్టు దదాతి పోషయతి వా'** అని ఒక వ్యుత్పత్తి. లేకపోతే ఈ ప్రపంచమంతా ఎవరు ధరిస్తున్నారు? పిల్లవాడు నడవలేనప్పుడు తల్లి తన పొత్తిళ్ళల్లోంచి దింపకుండా వాడు నడవగలిగే వరకు ఎంతో జాగ్రత్తగా పట్టుకుని ఎలా అయితే ఎత్తుకు తిరుగుతుందో, అలాగే ఈ దేహాదులు లేని జీవుని ఈ తల్లి అలా ఎత్తుకుని, తగిన దేహం ఇచ్చేవరకు ఉంటుంది. **జగదంబ అంత గొప్ప తల్లి.**

స్వాహా, స్వధాకి వైదికమైన అర్థములు ఇంకా చాలా ఉన్నాయి. ఇవన్నీ కుడా ఒట్టి పదములు కావు. నిజానికి ఈ రెండూ మన బ్రతుకు బాగు చెయ్యడానికి అమ్మ ధరించిన గొప్ప రూపములు. పితృయానంలోంచి వెళ్ళేవారికి, దేవయానంలోంచి వెళ్ళేవారికి కూడా ఈ తల్లే ప్రధానమైన విషయం. అయితే స్వాహా, స్వధా దేవతల గురించి ప్రత్యేకించి ఆరాధనలు దేవీభాగవతంలో చాలా విస్తృతంగా చెప్పారు. అన్నీ చెయ్యలేకపోయినా స్వాహా దేవికి కొన్ని నామాలు, స్వధా దేవికి కొన్ని నామాలు చెప్పారు. అవి అనుకుంటే చాలు వారిద్దరి అనుగ్రహం లభిస్తుంది. ఎందుకంటే ఈ రోజుల్లో యజ్ఞాలు, యాగాలు కష్టసాధ్యాలు. లలితా సహస్రం చదువుకుంటే అక్కడ వచ్చే పేర్లతో యజ్ఞం చేస్తున్న భావన చెయ్యవచ్చు.

స్వాహాదేవికి చెప్తూ-

స్వాహా, వహ్నిప్రియా, వహ్నిజాయా, సంతోషకారిణీ, క్రియా, శక్తిః, కాలరాత్రి, పరిపాకకరీ, ధృవా, గతీ, దాహికా, దహనక్షమా, సంసారసార రూపా, దేవపోషణ కారిణీ, ఘోరసంసారతారిణీ, దేవజీవనరూపా – ఇవి పదహారు నామాలు. ఇది స్వాహా షోడశ నామస్తుతి. ఈ తల్లి అనుగ్రహం ఉంటే వివాహసిద్ధి, సంతానసిద్ధి కలుగుతాయి. చిట్టచివరికి సర్వదేవతల అనుగ్రహం రావడానికి పనికి వచ్చే తల్లి స్వాహాదేవి.

స్వధా దేవికి కూడా కొన్ని ప్రత్యేకమైన నామాలు చెప్పారు. అవి– పితృప్రాణతుల్యా, ద్విజప్రీతికరా, ద్విజజీవనరూపిణీ, శ్రాద్ధాధిష్ఠాతృదేవీ, శ్రాద్ధ ఫలప్రదా, బ్రహ్మమానసకన్యా, పితృతుష్టిప్రదా. ఈ స్వధా దేవి గోలోకంలో రాధాదేవి సఖి అని చెప్పబడుతున్నది. ఈ తల్లికి సుశీల అని మరొక పేరు కూడా వివరించబడుతున్నది. ఈ తల్లి వామదేవి అని భావన చెయ్యాలి. వజ్రేశ్వరి–వామదేవి వరుసలలోకి వీటిని తీసుకువెళ్తూ ఉండాలి. స్వాహా, స్వధా ఉభయ రూపములలో ఉన్న అమ్మవారికి నమస్కారం చేసుకుని 'మతిః' అనే నామం పరిశీలిద్దాం.

దీని గురించి తుష్టిః పుష్టిర్మతిర్ధృతిః నామాల దగ్గర వివరంగా చెప్పుకున్నాం.

537. మతిః – శ్రీ మత్యై నమః

బుద్ధి స్వరూపిణి.

స్వాహా, స్వధా తరువాత మతి ఎందుకు పెట్టారనే దానికి అద్భుతమైన అన్వయం ఉంది. స్వాహా, స్వధా అంటే దేవ, పితృ కార్యములు. మానవుడై పుట్టినవాడు దేవ–పితృ కార్యాలు తప్పకుండా చెయ్యాలి. మన బ్రతుకుకి సుఖం ఇచ్చేది అదే.

స్వాహా, స్వధా రూపమైన దేవ, పితృ కర్మల ద్వారా శుద్ధమైన బుద్ధి ఏదో అది 'మతిః'. మతి అంటే ఒట్టి బుద్ధి కాదు. అటువంటి బుద్ధిని ఇక్కడ అమ్మవారి స్వరూపంగా భావన చేస్తున్నారు. **'యజ్ఞశిష్టాశినః'** అన్నారు. యజ్ఞము చెయ్యగా మిగిలిన దానిని ఆరగించగా ఏర్పడే పవిత్రమైన బుద్ధి. తిండి బట్టే బుద్ధి ఏర్పడుతుంది.

లలితాసహస్రంలో అన్నాలన్ని చెప్పి నివేదన చెయ్యమని చెప్పారు. ఆ నివేదన చేస్తే పుచ్చుకునే తల్లి 'స్వాహా', 'స్వధా' రూపిణి. అప్పుడు మనకు ఏర్పడే బుద్ధి 'మతిః'. 'దేవపితృయజ్ఞశిష్టాశనం' వల్ల వచ్చే సూక్ష్మబుద్ధిని 'మతిః' అంటారు. సూక్ష్మమైన జ్ఞానాన్ని గ్రహించగలిగే తెలివి.

ఉపనిషత్ కూడా ఈ ప్రస్తావన చేసింది. **దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యం** – దేవ, పితృ కార్యములందు ఎప్పుడూ కూడా ఏమరపాటు కూడదు. చాలా జాగ్రత్తగా, శ్రద్ధగా చెయ్యాలి. ఇవి భౌతికంగా కనబడే లోకాలు కావు. శాస్త్రం ద్వారానే తెలుసుకోవాలి. కనుక శాస్త్రాన్ని నమ్మి చెయ్యవలసినది కర్మ. శాస్త్రంపై నమ్మకాన్ని శ్రద్ధ అని అంటారు. కనుకనే దానిని శ్రాద్ధకర్మ అంటారు.

భాస్కరరాయల వారు **అమతిః** అని నామాన్ని చెప్పారు. ఆయన మహాత్ములు. సందేహం లేదు. రూపశూన్యతయే 'అమతి' అని 'స్వాత్మజ్ఞానస్వరూపిణి' అంటూ నిరుక్త అన్వయంతో భాస్కరరాయులు చెప్పారు.

ప్రథమ సృష్టికి ముందు పరమాత్మ ఇచ్ఛ మాత్రమే ఉన్నది. బుద్ధ్యాదుల మతి మొదలైన వాటి సృష్టి లేదు కనుక – ఆ ఇచ్ఛాస్వరూపిణి 'అమతి' అని చక్కని అన్వయం. 'అవిద్యా' రూపము(అమతి) మరో అర్థం.

అనేక పూర్వపాఠాలలో 'మతిః' అనే నామం ఉంటుందని ప్రమాణం తెలిసిన ఉపాసకులందరూ నిర్ణయించి చూపించారు.

'మతిః' అనే దానిలో మరో విశేషం– **'ఝడితి అర్థగ్రహణశీలా మతిః'**– ఝడితి అంటే చాలా స్పష్టంగా, శీఘ్రముగా, అర్థ గ్రహణశీలా – చెప్పగానే అర్థమవ్వాలి. ఎంత చెప్పినా అర్థం కాకపోతే 'మత్యై నమః' అని అమ్మవారిని జపం చేస్తే సరి. మతిః అనేది 'బుద్ధ్యధిష్ఠాన దేవత'.

'ధారణ గ్రహణ పాటవాత్ మతిః' – ధరించుట, గ్రహించుట అని రెండు పాటవాలు ఉండాలి. ముందు చెప్పేటప్పుడు పట్టుకోగలగాలి. అది ధారణ. పట్టుకున్నది నిలుపుకోగలగాలి అది గ్రహణ.

మతిః అంటే **'నిస్సంశయ సిద్ధాంతః'**. ఇంక సందేహం లేని జ్ఞానానికి మతిః

అని పేరు. అది రావాలంటే 'నిస్సంశయా', 'సంశయఘ్నీ' అయిన అమ్మవారి పాదాలు పట్టుకోవలసినదే. ఆవిడ మతిరూపంతో ఉంటుంది. **'సర్వస్య బుద్ధి రూపేణ'** అని వర్ణిస్తున్నాం కదా! సిద్ధాంతము అంటే ఇక సందేహానికి, ప్రశ్నలకు ఆస్కారం లేనిది. పూర్వపక్షము, సిద్ధాంతము అని రెండు మాటలు ఉంటాయి. ఒకడు ఏదో మాట చెప్తాడు, అది సత్యమనుకుంటాడు. మేధావి ఒకడు వచ్చి అది తప్పు అని ఖండించి అసలు సిద్ధాంతం ప్రతిపాదిస్తాడు. దేనిని ఖండించాడో అది పూర్వపక్షం. దేనిని నిలిపాడో దానిని సిద్ధాంతం అని అంటారు. ఆ సిద్ధాంతశక్తినే 'మతిః' అని అంటారు.

అమ్మవారిని ఈ నామంతో మనం అనుసంధానం చేసుకోగలిగితే నిర్మలమైన బుద్ధిని ఇవ్వడమే కాకుండా స్పష్టమైన జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. సంశయం పోగొట్టే శక్తి ఈ నామానికి ఉన్నది. లలితాదేవి సహస్ర నామాలు చదువుతూ ఉంటే సంశయాలు పోతాయి.

538. మేధా – శ్రీ మేధాయై నమః

'మతిః' 'మేధా' రెండు వెంటవెంటనే చూపిస్తున్నారు. మేధాశక్తి అంటే బుద్ధి యొక్క సమగ్రశక్తి. మేధాకి, మతికి చిన్న తేడా ఉంది. సంకల్ప వికల్పాదులు చెయ్యడం, విషయాన్ని సరిగ్గా గ్రహించడం – ఇవన్నీ 'మతిః' అయితే, దానిని సరిగ్గా నిలిపి చక్కగా తిరిగి వ్యక్తీకరించే బుద్ధి శక్తి ఏదైతే ఉందో అది 'మేధా'.

మేధాసి దేవి విదితాఖిలశాస్త్రసారా
దుర్గాసి దుర్గ భవసాగర నౌరసంగా
శ్రీః కైటభారి హృదయైక కృతాధివాసా
గౌరీ త్వమేవ శశిమౌళి కృత ప్రతిష్ఠా

అని సప్తశతి చెప్తోంది. మేధా అంటే అఖిల శాస్త్రసారాన్ని తెలుసుకోగలగడం. శాస్త్రములు చాలా ఉన్నాయి. శాస్త్రములను అర్థం చేసుకోగలిగే శక్తి 'మతిః', శాస్త్రసారాన్ని పట్టుకోగలిగే శక్తి 'మేధా'. కావలసినది సారవస్తువే. మొత్తం 'స్వాహా'

నుండి ఇక్కడ వరకు అమ్మ యొక్క వేదస్వరూపమంతా ప్రతిపాదింపబడుతున్నది. కర్మకి సంబంధించి 'స్వాహా', 'స్వధా'. జ్ఞానానికి సంబంధించి 'మతిః', 'మేధా'. కర్మలు యజ్ఞయాగాదులకు సంబంధించినవి. జ్ఞానానికి కావలసినది విచారణాశీలత. బుద్ధిబలం ఉన్నవానికే జ్ఞానమార్గం.

జ్ఞానరూప విచారణా శక్తికి చెప్పబడుతున్నది 'మతిః', 'మేధా'. కర్మరూప యజ్ఞశక్తి– 'స్వాహా', 'స్వధా'. మొత్తం రెండూ కలిపితే వేదస్వరూపము. కర్మకాండ, జ్ఞానకాండ – రెండిటి స్వరూపము కలిపితే వేదము.

539. శ్రుతిః – శ్రీ శ్రుత్యై నమః

వేదస్వరూపిణి. స్వాహా, స్వధారూపమైన కర్మకాండ, మతిర్మేధా అయిన జ్ఞానకాండ... రెండు స్వరూపములుగా ఉన్న వేదమాతయే అమ్మవారు. వేదానికి శ్రుతి అని పేరు రావడానికి కూడా రెండు కారణాలు ఉన్నాయి. 1.వేదం పుస్తకాల ద్వారా వచ్చే విద్య కాదు. కొంతవరకూ దానిని సహాయంగా తీసుకోవచ్చు గానీ, అది కేవలం గురువు ద్వారా, శ్రవణం ద్వారానే స్వరసహితంగా గ్రహించడం, దానిని వల్లెవేయడం. గ్రహించేటప్పుడు దాని పేరు 'శ్రుతి'. వల్లెవేసేటప్పుడు దాని పేరు 'ఆమ్నాయం'. గురువు ఒక శిష్యునికి శ్రవణం ద్వారా బోధిస్తాడు. ఆ శిష్యుడు పరిపూర్ణుడై, తాను గురువై మరి కొందరికి మళ్ళీ శ్రవణం ద్వారానే చెప్తున్నాడు. శ్రవణ పరంపరతో వచ్చింది కనుక దాని పేరు శ్రుతి.

2. మొదటిది వ్యవహారార్థం. ఇప్పుడిది అసలైన ప్రధాన అర్థం. మహర్షులు తపస్సు చేత అతీంద్రియ దృష్టిని పొందుతారు. ఆ అతీంద్రియ శక్తితో వారికి ఈశ్వర వచనం వినబడుతుంది. ఈశ్వరుడు శబ్దరూపముగా ఆ తపస్వులకి వినిపించాడు. మహర్షులు ఆ తపోజనితమైన శక్తిచేత విని మనకు చెప్తున్నారు. అలా విని మనకి అందించారు గనుక దాని పేరు 'శ్రుతిః'.

ఇక్కడివరకు మనకి 'సిద్ధేశ్వరీ', 'సిద్ధవిద్యా' దేవతలు అయ్యారు.

540. స్మృతిః - శ్రీ స్మృత్యై నమః

ఇప్పుడు చెప్పిన కర్మ కలాపములన్నీ పాటించాలి అంటే రెండే ఆధారం. అవి- శ్రుతి, స్మృతి. స్మృతి చాలా గహనమైనది. వేదార్థం అంత తేలికగా చెప్పలేం. ఒకటి చెప్తూ ఉంటే మరొక అర్థం వస్తుంది. అర్థం గ్రహించే శక్తి మానవునిది. వేదం ఈశ్వరుని మేధ. మన బుద్ధికి శరీర పరిమితి ఉంది. ఈశ్వరుని జ్ఞానాన్ని మన బుద్ధితో అందుకోగలమా? అందులో ఏ మేధ ఉందో చెప్పాలంటే మళ్ళీ దాన్ని వినగలిగిన స్థాయికి వెళ్ళిన ఋషి మళ్ళీ చెప్పగలడు. అలా చెప్పిన ఋషులు మనకి అర్థాలను ఇచ్చారు. విద్యారణ్యులవారు తదితరులు కూడా అర్థాలు ఇచ్చారు. విద్యారణ్యులు భాష్యం వ్రాస్తూ "నేను కొంతమేరకే చెప్పగలుగుతున్నాను కానీ వేదం యొక్క సంపూర్ణ అర్థం నేను చెప్పలేన"న్నారు. వేదంలో ప్రతి మంత్రానికి ఆదిభౌతికార్థం, ఆధిదైవికార్థం, ఆధ్యాత్మికార్థమని మూడు అర్థాలు ఉంటాయి. మూడు అర్థాలు ప్రతి మంత్రానికి ఉంటాయి గనుక మొత్తం వేదానికి 'త్రయీ' అని పేరు.

లోకహితం కోసం ఋషులు అందరూ వేదంలో ఉన్న ధర్మాన్ని స్మరణకు తెచ్చుకున్నారు. అందులో శ్రుతమైన దానిని స్మరణలోకి తెచ్చుకుని దాన్ని గ్రంథాల రూపంలో ఇచ్చారు. ధర్మశాస్త్రాలకి, పురాణాలకి స్మృతులని పేరు. పురాణాలకి కూడా స్మృతి స్థానమే ఉంది. శంకరభగవత్పాదుల వారు అక్కడక్కడ పురాణ వాక్యాలు ఉట్టంకించేటప్పుడు స్మృత్యుక్తి అనే వ్రాశారు.

వర్తమానాన్యతీతాని తథైవానాగతాన్యపి, స్మర్యతే సర్వకార్యాణి తేనాసౌ స్మృతిరుచ్యతే (వాయుపురాణం) - 'జరుగుతున్నది, జరిగినవీ, జరుగబోవునవీ అయిన సర్వకర్మలను స్మరించడం చేత ఆమె స్మృతిరూపురాలు'. **'స్మృతిః సంస్మరాణాద్దేవీ'** అని దేవీపురాణం. శ్రుతుల యందు చెప్పినదానిని స్మరించి చెప్పడాన్ని స్మృతి అన్నారు. ధర్మ శాస్త్రముల రూపములో ఉన్న తల్లి. మనకోసమే అమ్మ శ్రుతి రూపంతో, స్మృతిరూపంతో ఉన్నది.

'శ్రుతేరివార్థం స్మృతిరన్వగచ్ఛత్'. దిలీపచక్రవర్తి సాధన చేసేటపుడు శబల కామధేనువు వెళ్తూ ఉంటే వెనకాల దూడ, శ్రుతిని అనుసరించి స్మృతి వెళ్తున్నట్లుగా

వెళ్తోంది అని కాళిదాసు చెప్పారు.

అమ్మ దయ ఉంటేనే మతి, మేధ పనిచేస్తాయి. అప్పుడే ఏదైనా ఒక విషయాన్ని సరిగా శ్రవణం చేయగలము. సరిగ్గా శ్రవణం చెయ్యగలిగే శక్తి అమ్మవారు. అది 'శ్రుతి'. ఆ శ్రవణం చేసినది మనం గుర్తులో మిగుల్చుకోగలగాలి. ఆ శక్తి 'స్మృతి'.

541. అనుత్తమా – శ్రీ అనుత్తమాయై నమః

ఈ గుత్తిలో ఇది ఆఖరి నామం. దానిని మించి మరొక ఉత్తమ వస్తువు లేదు. ఉత్తమ అంటేనే గొప్పది. దాని పైన మరొకటి లేదు కనుక అనుత్తమా. అమ్మవారితో సమానమైనదిగాని, గొప్ప వస్తువు గాని లేదు. అన్నీ దాని క్రిందవే.

'న తత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే' – అని ఉపనిషద్వాక్యం. ఇది శ్రుతి ప్రమాణం. **'న త్వత్సమో౽స్త్యభ్యధికః కుతో౽న్యః'** అని స్మృతి. దీని అర్థం అమ్మవారి కంటె అధికం గాని, సమానం గాని లేదు. దీనిని 'సమానాధికవర్జితా' నామం దగ్గర విస్తారంగా చెప్పుకున్నాం. ఇక్కడితో ఏడు నామాల గుత్తి పూర్ణమయింది. ఏడవది సహస్రార స్థానం. సహస్రారం పైన మరి ఏదీ లేదు. అదే 'అనుత్తమా'.

'వజ్రేశ్వరీ', 'వామదేవీ' నామాల నుండి 'అనుత్తమా' నామం వరకు ఉన్నది ఒకానొక చక్కని గుంపు. ఇందులో చెప్పబడుతున్న విద్య పేరు 'షడాధారవిద్య '.

ఆరు చక్రాలను ఆధారం చేసుకుని ఉన్న ఒకానొక విద్యా పద్ధతి ఇందులో ఉంది. దీనికి ఇంచుమించు దగ్గరగా ఉన్నది 'మూలాధారైకనిలయా', 'బ్రహ్మగ్రంథివిభేదినీ'. అది ముఖ్య ప్రాణవిద్య. దానికి 'వాగధీశ్వరీ విద్య' అని పేరు. శ్రీ విద్యా సంకేతములు ఎక్కడెక్కడ ఉన్నాయో లలితా సహస్రనామములలో తెలియజేస్తున్నారు. ఇప్పటివరకు వచ్చిన ఈ శక్తులకు మనం నమస్కారం చేసుకుంటూ గమనించుకోవలసినది – సర్వాక్షరస్వరూపాలు ఇక్కడ చెప్పబడుతున్నాయి. 'అమృతా' నుండి 'క్షమావతీ' వరకు మొత్తం 50 అక్షరాలు. ఈ యాభై అక్షరాలకి మాతృకా దేవతలు అని పేరు.

పధ్నాలుగు సూత్రముల నుండి మొత్తం అక్షరాలన్నీ వచ్చాయని ముందు

చెప్పుకున్నాం. ఇది ప్రథమ స్పందన. అంటే డమరుకం మొదట మ్రోగించినప్పుడు స్పందన. సరిగ్గా శ్రీచక్రంలో బిందువు స్పందనను తెలియచేస్తుంది. అక్కడ నుండి త్రికోణ చక్రములు మొదలు అవుతాయి. చిట్టచివరికి చతురస్రంతో పూర్తి అయిపోతుంది. డమరుకం ప్రథమ స్పందనయై దాని నుండి వచ్చిన పద్నాలుగు సూత్రాలు, దాని నుండి వచ్చిన అక్షరములు వ్యక్తమవుతాయి. బిందువు తరువాత త్రికోణం. దాని తరువాత ఒక త్రికోణం, తరువాత ఎనిమిది త్రికోణాలు, తరువాత రెండు × పది అంటే 20 త్రికోణాలు. దాని తరువాత పద్నాలుగు త్రికోణాలు. మొత్తం నలభై మూడు త్రికోణాలు. పద్నాలుగు సూత్రాలలో నలభై మూడు అక్షరాలు వస్తాయి. ఈ నలభై మూడు అక్షరాలే కించిత్ భేదం వల్ల ప్రధానంగా యాభై అవుతాయి. మొత్తంగా ఆ డమరుక నాదానికి, శ్రీచక్రానికి, అక్షరాలకి, మన శరీరంలో ఉన్న ఆరు చక్రాలకి, ఏడవ భూమికకి అనుబంధం ఉంది.

ఇప్పుడు మరొక నామాల వరుసలోకి ప్రవేశిస్తున్నాం. ఈ విద్యకి 'విమర్శరూపిణీ విద్య' అని పేరు.

పుణ్యకీర్తిః పుణ్యలభ్యా పుణ్యశ్రవణకీర్తనా
పులోమజార్చితా బంధమోచనీ బంధురాలకా(బర్బరాలకా)

542. పుణ్యకీర్తిః – శ్రీ పుణ్యకీర్త్యై నమః

పవిత్రమైన కీర్తి కలది. అమ్మ లీలలు, మహిమ, వైభవము అన్నీ కలిపితే కీర్తి. అవి పవిత్రమైన చరిత్ర, పవిత్రమైన నామము. పవిత్రమైన రూపం. ఒక్క మాటలో చెప్పాలంటే అమ్మ గురించి ఏది చెప్పినా పవిత్రమే. పవిత్రమైన కీర్తి కలిగినది కనుక 'పుణ్యకీర్తి'. తనను సేవించే భక్తులకి ఆ తల్లి పవిత్రమైన కీర్తిని ప్రసాదిస్తుంది. ఆ భక్తులు కూడా అంత స్థితికి వెళ్ళగలరు. దీనికి ఆదిభట్ల నారాయణదాసుగారు చక్కని తెలుగులో చెప్పారు. అది– **"మంచి పేర్గానె మంచుమల దొరపిల్ల"** అన్నారు. మంచి పేరు పొందినది. **"తన డింగరికి బొగడ్తనలర్చు వేల్పు"** అన్నారు. అమ్మవారిని కొలుచుకునే పుణ్యుని అందరూ పొగిడేటట్లు చేస్తుంది.

అమ్మవారిపై ప్రీతి కలగాలంటే అనేక జన్మల పుణ్యం ఉండాలి. 'కోటి జన్మార్జితైః పుణ్యైః భవే భక్తిః ప్రజాయతే' అని భారతంలో కృష్ణుడు అర్జునునితో చెప్పాడు. అనేక కోట్ల జన్మలలో చేసిన పుణ్యం ఉంటేనే పరమేశ్వరునిపై భక్తి కలుగుతుంది.

543. పుణ్యలభ్యా – శ్రీ పుణ్యలభ్యాయై నమః

ఎన్నో జన్మల పుణ్యాలు కలిస్తే ఈ జన్మలో భగవంతునిపై కాస్త భక్తి ఏర్పడుతుంది. దానిని పెంపొందించుకుని ఈ జన్మలోనే ముక్తిని పొందవచ్చు. అది కాసింతైనా ఉంటే తరువాత జన్మలకైనా పనికి వస్తుంది. మొత్తానికి అనేక జన్మల పుణ్యం ఉంటేనే కాని అమ్మ దొరకదు. పరతత్త్వ విజ్ఞానం దొరకదు. పరాగతీ దొరకదు. ఆ పాదములు లభించవు. పద్ధతీ లభించదు. ఎవరికి చివరి జన్మయో వారికే శ్రీవిద్య లభిస్తుంది. ఆ వచ్చిన శ్రీవిద్యని సద్వినియోగపరచుకోవాలి. భక్తితో, ప్రేమతో అమ్మ అనుగ్రహం కోసం చేసుకోగలిగితే అదే చివరిజన్మ. అందుకే 'పుణ్యలభ్యా'.

పశ్యంతి పుణ్యపుంజాః యే యే వేదాంతాః తపస్వినః

రాగిణో నైవ పశ్యంతి దేవీం భగవతీం శివామ్ (దేవీభాగవతం)

అని శాస్త్రం చెప్పిన గొప్పమాట.

అనేక పుణ్య పుంజములున్నవారు మాత్రమే ఆ తల్లిని తెలుసుకోగలరు. ఆరాధించగలరు. చిట్టచివరికి ఆ పరమపదాన్ని, ముక్తిని పొందగలరు. రాగద్వేషాది వికారాలతో ఉన్నవారు అమ్మవారిని గ్రహించలేరు.

శంకరులు అమ్మవారిని ఆరాధిస్తూ –

అతస్త్వాం ఆరాధ్యాం హరిహర విరించాదిభిరపి

ప్రణంతుం స్తోతుం వా కథమకృత పుణ్యః ప్రభవతి

అంటారు. "ఓ తల్లీ! హరిహర బ్రహ్మాదులచే పూజింపబడుతున్న నిన్ను నమస్కరించాలన్నా, స్తుతించాలన్నా పుణ్యాలు లేనివాడు ఏం చేయగలడు?"

"మంచివారలకే సమకుఱు మలప్ప" – మంచివారికే దొరుకుతుంది – అని

చెప్పారు ఆదిభట్ల నారాయణదాసుగారు. గత జన్మలలో పుణ్యాలు ఉన్నాయో, లేవో మనకి తెలియదు. మనకేదో పుణ్యం ఉండడం వలన అమ్మని పట్టుకోవాలని బుద్ధి పుట్టింది. పవిత్రమైన పనులు చేస్తుంటే దేవీ అనుగ్రహం లభిస్తుంది. ఆ పవిత్రమైన పనేమిటో తరువాతి నామంలో చెప్తున్నారు.

544. పుణ్యశ్రవణకీర్తనా – శ్రీ పుణ్యశ్రవణకీర్తనాయై నమః

కీర్తనమంటే పొగడుట. కీర్తి అంటే పొగడదగిన గుణము. ఎవరి గురించి వింటే, ఎవరిని పొగిడితే పుణ్యులమౌతామో వారిని 'పుణ్యశ్రవణకీర్తనా' అనాలి.

మనం లోకంలో పేరు ప్రఖ్యాతులున్నవారిని పొగడి మన పలుకులను వ్యర్థం చేసుకుంటూ ఉంటాం. అదే పరమేశ్వరుని పొగడితే మనకున్న సమస్త దోషాలు పోతాయి. అది అలవాటు చేసుకోగలగాలి. ఎవరిని పొగడితే పుణ్యులమౌతున్నామో, ఎవరి గురించి వింటే పుణ్యులమౌతున్నామో వారి గురించి వినాలి, వారిని కీర్తించాలి.

శ్రవణ మాత్రము చేతనే సమస్త పాపాలను క్షణంలో అమ్మవారు దగ్ధం చేస్తుంది. పరమేశ్వరి మహిమ గాని, నామం గాని, రూపంగాని, లీలగాని శ్రవణం చేసినా, కీర్తన చేసినా పవిత్రులవుతారు కనుక అమ్మవారికి 'పుణ్యశ్రవణకీర్తనా' అని పేరు.

'పుణ్యకీర్తిః, పుణ్యలభ్యా, పుణ్యశ్రవణకీర్తనా' – ఇవి సాధనాపరమైన నామాలు. ఇదివరకు 'శిష్టపూజితా' మొదలైన అనేక నామాల వద్ద చాలా సూచనలు చెప్పడమయింది. ఆ విధంగా పుణ్యలభ్యా, భక్తిగమ్యా, ధ్యానగమ్యా – ఇలాంటివన్ని ఒక దగ్గరికి తెచ్చుకుంటే అమ్మవారి అనుగ్రహం పొందాలంటే సాధన ఏం చెయ్యాలో తెలుస్తుంది. సాధనాశాస్త్రం కూడా లలితాసహస్రనామ స్తోత్రమే. 'గమ్యా', 'లభ్యా' ఉన్న నామాలు ఒక దగ్గరికి తెచ్చుకుంటే సాధన గురించి మరింత తెలుస్తుంది. ఆరాధ్య నామాలు కూడా తీసుకోవాలి. 'ధీరసమర్చితా, అర్చితా, పూజితా, ఆరాధ్యా, గమ్యా, వశ్యా, లభ్యా' – ఇవన్ని ఒక దగ్గరికి చేర్చి చూస్తే సాధనలు.

545. పులోమజార్చితా – శ్రీ పులోమజార్చితాయై నమః

పులోమజ చేత పూజింపబడిన తల్లి. దీనికి దేవీభాగవతంలో ప్రమాణం చూపిస్తూ –

ఇత్యుక్త్వా సా తదా తేన శక్రపత్నీ సుమానసా
జగ్రాహ మన్త్రం దేవేంద్రగురోర్దేవ్యాః సుసాధనం
విద్యాం ప్రాప్య గురోర్దేవీ దేవీం త్రిపురసుందరీం
సమ్యగారాధయామాస బలిపుష్పార్చనైః శుభైః

అని చెప్పారు. ఈ శ్లోకం ఈ నామానికి ప్రమాణం. ఒకొక్క మన్వంతరంలో ఒకొక్కరు ఇంద్రుడు అవుతూ ఉంటారు. ఒకానొక సమయంలో లోకరక్షణ కోసం ఇంద్రుడు వృత్రాసుర సంహారం చేసి బ్రహ్మహత్యా పాతకానికి లోనయ్యాడు. రాజులందరూ ధర్మరక్షణ కోసమే శత్రునాశనం చేసినప్పటికి ప్రాయశ్చిత్తం చేసుకునేవారు.

ధర్మరక్షణ కోసం చేసిన హింస ఇటువంటి ప్రాయశ్చిత్తంతో పుణ్యమైపోతుంది. అధర్మంగా హింసిస్తే దానికి సామాన్య ప్రాయశ్చిత్తం చాలదు. ఇంద్రుడు వృత్రాసుర సంహారం చేశాక ఇతనికి బ్రహ్మహత్యా పాతకం వచ్చింది. దానిని పోగొట్టుకోవడానికని తపస్సుకి వెళ్ళాడు. ఈ లోపల దేవతలు, ఋషులు ఇంద్రుని పాపం పోవడానికి ఆయన కోసం కొన్ని పుణ్యకార్యాలు చేస్తామన్నారు. లోకక్షేమం కోసం పనికి వచ్చేవాడు ఒకడుంటే వాని కోసం మిగిలిన వారు కొన్ని మంచి పనులు చెయ్యాలి. ఇది లోకం యొక్క ధర్మం. అందుకోసం "మేమందరం నీ కోసం కొన్ని యాగాలు చేస్తాం. మేమెన్ని చేసినా నువ్వు చెయ్యాల్సింది నువ్వు చెయ్యాలి కనుక నువ్వు ఎక్కడైనా తపస్సు చేసుకో"మన్నారు.

దానికి ఇంద్రుడు ఎక్కడ సాధన చెయ్యాలా అని అనుకుంటుంటే బృహస్పతి ఒక చోటు చూపించాడు. దాని ప్రకారం – సూక్ష్మదేహంతో ఒక కమలనాళంలో కూర్చుని ఎవరికీ కనిపించకుండా సాధన చేసుకుంటున్నాడు. ఇంద్రుడు ఎక్కడ ఉన్నాడో శచీదేవికి కూడా తెలియదు. ఇంద్రుడు లేని పరిస్థితి మూలంగా అరాచకం

ఏర్పడింది. ఆ సమయంలో ఇంద్రునిగా ఎవరినైనా పెట్టాలి. నూరు యజ్ఞాలు చేసిన వానినే ఇంద్రునిగా పెట్టాలి. అప్పటిలో నూరు యజ్ఞాలు చేసిన సూర్యవంశ చక్రవర్తిని నహుషుని తీసుకువచ్చి ఇంద్రునిగా పెట్టారు.

అంతకు ముందువరకు బుద్ధిగానే ఉన్నాడు కానీ, పదవి రాగానే పాడైపోయాడు. పదవులు వస్తే బుద్ధులు మారుతుంటాయి. ఇంద్ర పదవి వస్తే సంతోషించకుండా ఇంద్రాణి కావాలి అన్నాడు. శచీదేవి మహాపతివ్రత.

ఆవిడ ఏం చెయ్యాలో తెలియక గురువైన బృహస్పతిని ఆశ్రయించింది. ఆయన మంత్రోపదేశం చేసి సాధన చెయ్యమన్నాడు. గురువు దగ్గర మంత్రం తీసుకుని సాధన చేస్తేనే ఇంద్రుడు ఎక్కడ ఉన్నాడో కనబడ్డాడు.

ఇంద్రుని దగ్గరికి వెళ్ళి సలహా అడిగితే "సప్తఋషులు నడిపే పల్లకీలో నా దగ్గరికి వస్తే చూద్దామని చెప్పు" అని చెప్పాడు. ఇదేమిటి ఇలా చెప్పారంటే, ముందు నువ్వు ఆ పని చెయ్యమని చెప్పాడు. పదవిలో ఉన్నవారు అహంకారం వల్ల, సంపద వల్ల మహాత్ములను తూలనాడతారు. నహుషుడు అంత మత్తెక్కి ఉన్నాడు. బ్రహ్మర్షులచే శాపం పొంది అప్పుడెక్కడ పడాలో అక్కడ పడతాడు అని ఇంద్రుడు శచీదేవికి చెప్పాడు.

మనకి ఒక ఆలోచన వచ్చి అది విజయవంతం కావాలన్నా దానికి అమ్మవారి అనుగ్రహం ఉండాలి. అంతేకాని మన సంకల్పాలు, మన ప్రణాళికలు విజయాలు కావు. ఇది తెలియక కొంతమంది నన్ను నేను నమ్ముకున్నానంటారు. ఇవన్నీ కొత్త సాహిత్యాలు చదివినప్పుడు వచ్చే భ్రాంతులు. కొందరు నాకు భగవద్విశ్వాసం లేదు, ఆత్మవిశ్వాసం ఉందంటారు. ఆత్మయే ఆవిడనే ఎరుక వారికి తెలియదు. ఆ విశ్వాసం కూడా ఆవిడ ఇవ్వాల్సిందే. నేను కృషి చేస్తానంటే, ఆ కృషి చేస్తాను, శక్తి కూడా ఆవిడే కదా!

శచీదేవి మాత్రం తల్లిని నమ్ముకుంది. **'తన్ను లోనమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి అమ్మ'.** వేల్పుటమ్మ శచీదేవి. సర్వదేవతలకి ప్రభువు ఇంద్రుడైతే, సర్వదేవకాంతలకి ప్రభ్వి శచీదేవి. ఆవిడ అమ్మవారిని ఆశ్రయించింది.

'విద్యాం ప్రాప్య గురోర్దేవీ దేవీం త్రిపురసుందరీం' – గురువు ద్వారా త్రిపురసుందరీవిద్యని స్వీకరించి ఆ తల్లిని **'సమ్యగారాధయామాస'** సమగ్రముగా ఆరాధన చేసింది. ఆ తల్లి ఆరాధన చేతనే తాను ప్రమాదం నుండి బయట పడడమే కాకుండా, ఇంద్రుడు కూడా పవిత్రుడై తాను తన స్థానంలో కూర్చున్నాడు. ఒకే ఉపాసనతో మూడు ఫలితాలు వచ్చాయి. దుర్మార్గుడైన నహుషుడు క్రింద పడిపోవడం, శచీదేవి కాపాడబడడం, తిరిగి ఇంద్రుడు తన స్వస్థానానికి వెళ్ళడం... ఇవన్నీ కూడా అమ్మవారిని ఆరాధించడం వలన లభించిన ఫలితాలు.

శచీదేవికి అమ్మ ఆరాధన వలన ఇంత అద్భుతమైన ఫలము లభించింది కనుక 'పులోమజార్చితా'. శచీదేవి పులోముడనే ఒక మహర్షి కుమార్తె. శచీదేవికి మరొక పేరు పులోమజ. పులోమజ–అర్చిత అంటే శచీదేవిచే పూజింపబడినది అని అర్థం. దానికి సంబంధించిన కథ ఇది. ఒక నామం కదిపితే కథ వస్తుంది. ఆ కథ అంతా తెలుసుకుంటే మనకి బుద్ధి వస్తుంది. త్రిపురసుందరిని పూజించడమనేది తెలుసుకోవడమే కాకుండా ప్రవర్తన ఎంత జాగ్రత్తగా ఉండాలో గ్రహించాలి.

546. బంధమోచనీ – శ్రీ బంధమోచన్యై నమః

బంధాలనుండి బయట పెట్టే తల్లి. మొదటి నామానికి, ఈ నామానికి సంబంధం తెలుస్తుంది. శచీదేవి తనకి ఉన్న చిక్కు నుండి బయటపడింది. పాప శాపబంధంలో ఉన్న తన భర్త ఇంద్రుడు కూడా బయట పడ్డాడు.

'బంధమోచనీ' అంటే అజ్ఞానబంధనం నుండి విముక్తి కలిగించునది. **'మృత్యోర్ముక్షీయ మా–మృతాత్'**. 'నన్ను మృత్యు బంధము నుండి విడిపించు, అమృతముతో బంధము తెంపకు'. అమృతముతో బంధము కలిగించు అనకుండా అమృతముతో బంధము తెంపకు అన్నారు. మనకి అమృతముతో బంధము సహజంగా ఉంది. ఆ బంధము తెగకూడదు. మృత్యువుతో బంధము కొత్తగా వచ్చింది కనుక అది తెగాలి. మృత్యువుతో బంధం అంటే అజ్ఞానము. అమృతంతో బంధము పరమాత్మతో అనుబంధము. అదే నిజమైన బంధం. మృత్యువుతో బంధం కల్పితం.

అమృతంతో బంధం సహజం. సహజమైన ఆ బంధం ఉండాలి. అసహజమైన బంధం అనిపించుకునేది పోవాలి. ఆ అజ్ఞానబంధం వదలడం మన వల్ల కాదు. దానికి అమ్మవారి అనుగ్రహం ఉండాలి. 'పశుపాశవిమోచనీ' నామం దగ్గర చెప్పిన వ్యాఖ్యానాన్ని సమన్వయించుకోవాలి.

ఇంకొక అర్థంలో 'బంధమోచనీ' అంటే దుర్గాదేవి విశేషం చెప్పబడుతోంది. ఇది ఒక విశేషమైన శక్తి. ఇది కారాగృహాశృంఖలాల చేత బంధింపబడిన వారిని కూడా విడుదల చేయగలదు. అలాగని నేరగాళ్ళందరినీ విడిపిస్తుందని కాదు. మన మానాన మనం మంచిగా ఉన్నప్పటికి కూడా శత్రువులు మొదలైనవారు ఆక్రమించి బంధించవచ్చు. ఇది పూర్వం రోజుల్లో శత్రురాజులు వచ్చి రాజ్యాన్ని జయించి ఆ రాజులని బంధించేవారు. అప్పుడు వారికి ఏది దిక్కు? రాజులైనవారు చండీదేవిని ఆశ్రయిస్తూ అమ్మవారి మహిమలని మననం చేసుకుంటూ ఉంటే శత్రుబాధ లేకుండా ఉండేది. ఒకవేళ పొరపాటున బంధింపబడ్డా బయటపడేవారు. ప్రస్తుతం ధర్మంపై చాలా శత్రువులు ఉన్నారు. ఈ యుగంలో ధార్మికులకి శత్రుబాధలు ఎక్కువ. వారిలో లేని ఆరోపణలు పెట్టి అయినా బంధించగలరు. అలాంటప్పుడు వారికి ఏది దిక్కు? వారు అంతకాలం కొలుచుకునే అమ్మయే దిక్కు. కనుక 'బంధమోచనీ'.

అనేకరకాలైన చిక్కుముడుల నుండి బయట పడాలంటే ఆ దుర్గాదేవిని ఆశ్రయించాలి. ఒకొక్కప్పుడు ఎంత సాధకుడైనా మానవ సహజమైన పొరపాటు చేస్తాడు. ఆ పొరపాటు వలన ఒక బంధము, ఒక శిక్ష ఏర్పడినప్పుడు అతడు పశ్చాత్తప్తుడై ఇకపై చేయనని నిర్ణయించుకుని, "బంధంనుండి బయట పెట్టు తల్లీ!" అంటే అతనిని క్షేమంగా బయట పెట్టగలదు.

బంధమోచనీ శక్తికి సంబంధించి అనేక వృత్తాంతములు వ్యాఖ్యాతలే ఉదహరించారు. ఒకప్పుడు ఏకావళి అనే రాజకన్యని కాలకేతు అనే అసురుడు బంధించి తీసుకు వెళ్ళిపోయాడు. ఏకావళి చెలికత్తె యశోవతి. కాలకేతుడు ఏకావళిని ఎక్కడ బంధించాడో ఎవరికి తెలియలేదు. యశోవతి అమ్మవారి ఉపాసకురాలు. మా రాణి క్షేమంగా రావాలని ప్రార్థిస్తే అప్పుడు అమ్మవారి అనుగ్రహంతో ఆ కాలకేతువు

సంహరింపబడి క్షేమంగా ఏకావళి రాజ్యానికి చేరింది. ఇది బంధమోచనీ శక్తికి చెప్పిన అద్భుతమైన ఇతివృత్తం (దేవీభాగవతం)

ఉషాపరిణయం అద్భుతమైన చరిత్ర. అందులో ఉషాదేవికి చిత్రలేఖ అనే చెలికత్తె ఉండేది. దేవీభాగవతం చిత్రలేఖ అమ్మవారి యొక్క కళాంశ అని చెప్తోంది. ఇదే విధంగా ఉషాపరిణయంలో అనిరుద్ధుని బాణాసురుడు బంధిస్తే చిత్రలేఖ సాయంతో ఉషాదేవి గృహంలోకి అనిరుద్ధుడు తీసుకువెళ్ళబడతాడు. ఆయన అంతట ఆయన వెళ్ళలేదు. శక్తితో వెళ్ళిపోయాడు. ఉషా–అనిరుద్ధుల సంభాషణ జరుగుతూ ఉంటే బాణాసురుడు వచ్చి అనిరుద్ధుని నాగపాశంతో బంధించాడు.

అలా అనిరుద్ధుడు నాగపాశ మంత్రబద్ధుడై బాధపడుతూ ఉన్నాడు. ఆ సమయంలో సూక్ష్మదేహంతో అక్కడికి నారదులవారు వెళ్ళి, "నన్ను కృష్ణుడు పంపాడు. నిన్ను దుర్గాదేవిని ధ్యానించమన్నాడు" అని చెప్పి దుర్గానామాలు కొన్ని వివరించి, "ఈ దుర్గని ఉపాసిస్తూ ఉండు. ఈ నాగపాశం నుండి విముక్తుడవౌతావు. తరువాత ఆయన వస్తాడులే" అని నాగపాశ విమోచనానికి దుర్గాదేవి మంత్రాన్ని ఉపదేశించారు నారదులవారు. ఆ మంత్రాన్ని చేసుకుంటూ ఉంటాడు అనిరుద్ధుడు. ఆ మంత్రబలం వల్ల కొంతసేపటికే అనిరుద్ధుడు ఆ పాశ బంధనం నుండి ముక్తుడయ్యాడు. ఇది పురాణాల్లో చిన్న కథ. అలా పాశబంధాన్ని పోగొట్టింది కనుక 'బంధమోచనీ'.

ఏవంస్తుతా తదా దేవీ దుర్గా దుర్గపరాక్రమా। బద్ధం బాణపురే వీరమనిరుద్ధం వ్యమోచయత్ (హరివంశం)

అన్ని రకాల బంధాలనుంచి మనల్ని బయట పెట్టే తల్లి కనుక 'బంధమోచనీ'. **"కట్టులన్విడిపించు గట్టాండపడచు"** అన్నారు నారాయణదాసుగారు. గట్టు అంటే పర్వతం. పర్వతపుటాడపడచు. ఈవిడ కట్టులను విడిపించు తల్లి.

547. బంధురాలకా / బర్బరాలకా

– శ్రీ బంధురాలకాయై నమః / శ్రీ బర్బరాలకాయై నమః

బంధురము అంటే దట్టమైన అని అర్థం. అలకలు అంటే ముంగురులు, కేశ సంపద. 'బంధురాలకా' అంటే దట్టమైన కేశ సంపద కలది.

దీనినే శంకరులవారు సౌందర్యలహరిలో **'అరాళైస్స్వాభావ్యా దళికలభసశ్రీభి రలకైః'** అని ఒకచోట చెప్తే, మరో చోట **'ఘనస్నిగ్ధం శ్లక్ష్ణం చికుర నికురుంబం తవ శివే'** అని చెప్తారు. దట్టంగా, మృదువుగా, వంకీలు తిరిగి ఉన్నాయి.

పాఠాంతరంలో **'బర్బరాలకా'** కూడా మనకి కనబడుతుంది. బర్బర అంటే ఎగుడుదిగుడుగా ఉండడం. చిక్కుడుకాయలకి సంస్కృతంలో బర్బరములని పేరు. మరాఠీ ప్రాంతాల్లో బరబట్టీ అని పేరు. ఇవి ఒకచోట ఉబ్బి, క్రిందకి దిగి మళ్ళీ ఉబ్బి ఉంటాయి. అలా ఎత్తుపల్లాలతో, దట్టముగా, అందముగా వంకీలు తిరిగి ఉన్నదాన్ని బర్బరా అంటారు.

రెండు పాఠాలు సరియైనవే.

బంధమోచనీ, పులోమజార్చితా నామాలు వచ్చేటప్పటికి రూపం కాకుండా మహిమని చూపిస్తున్నారు. మరికొన్ని చోట్లకి వచ్చేటప్పటికి తత్త్వం కనబడింది. కొన్ని నామాలు మహిమని, కొన్ని నామాలు తత్త్వాన్ని, కొన్ని నామాలు చరిత్రని చెప్తాయి. పులోమజార్చితా, బంధమోచనీ చరిత్రలు. ఇందులో లీలావైభవం కూడా ఉంది. ఇదే మహిమా వైభవం కూడా చెప్తోంది. రూపవైభవంలోకి **బంధురాలకా** వస్తుంది. తత్త్వాన్ని చెప్పుకుంటున్నా రూపధ్యానాన్ని మర్చిపోరాదు.

ఈ నామానికి అనువాదం చేస్తూ నారాయణదాసుగారు –

'ఉంగ్రాల ముంగురులొప్పు ప్రోయాలు

అందమౌ కొప్పడియకలర్చువేల్పు

విరియఁ బోసిన బిర్సు వేనలి జేజె'

వేనలి అంటే వెంట్రుకలు. విరియబోసిన అంటే జుట్టు విప్పుకుని ఉందని కాదు అర్థం. జడ వేసుకునే ఉంది. అమ్మవారు జడవేసుకునే ఉంటుంది కాని అది విస్తారంగా, ఒత్తుగా ఉంటుంది. జుట్టు విరబోసుకోవడం దేవతల లక్షణం కాదు. జుట్టు కొసలు నేలకి తగలకూడదు. ఆ కొసలనుండి నీరు కారకూడదు. స్త్రీమూర్తికి జుట్టు ముడి చాలా ప్రాధాన్యం.

వాల్మీకి సుందరకాండలో సీతమ్మవారి జడని చాలా చక్కగా వర్ణిస్తాడు. అంత

కష్టంలో ఉన్నా సీతమ్మ జడ వేసుకోవడం మానలేదు. జుట్టు విరబోసుకున్న సీతమ్మ రామాయణంలో లేదు. 'బంధురాలకా' అంటే ముంగురులు మీదపడుతున్నదాని బట్టి అమ్మవారి జుట్టు ఎంత దట్టమో ఆలోచించుకోవాలి. అలకలు అంటే ముంగురులు. ఒత్తైన జుట్టు ఉన్నప్పుడే అలకలు క్రిందికి వస్తాయి. అలకల వర్ణనతో మొత్తం జుట్టుని చూపిస్తున్నారు. అమ్మవారి రూపధ్యానం చేసుకుని, తరువాత నామంలోకి ప్రవేశిద్దాం.

548. విమర్శరూపిణీ - శ్రీ విమర్శరూపిణ్యై నమః

ప్రకాశస్వరూపమైన పరబ్రహ్మము యొక్క స్వాభావిక స్ఫురణ విమర్శ. ప్రకాశ, విమర్శ – ఈ రెండు తత్త్వాలు శ్రీవిద్యలో ప్రధానం. ఇది తెలిస్తే కానీ శ్రీవిద్య అర్థం కాదు. ప్రకాశమంటే స్వయంప్రకాశమైన చైతన్య వస్తువు. ఆయనే పరమాత్మ. ఆయన నుండి వ్యక్తమైన శక్తి విమర్శ. దీనికి మనం ఉదాహరణగా ముందు చెప్పుకున్న జ్యోతి, వెలుగు గుర్తు తెచ్చుకోవాలి.

జ్యోతిని ప్రకాశమని, వెలుగుని విమర్శ అని అనుకోవాలి. విమర్శ అంటే వ్యాపించినది. జ్యోతి నుండి ప్రకటింపబడి అంతా వ్యాపించిపోయింది విమర్శ. జ్యోతి ప్రకాశ. స్వయంప్రకాశమైన శివుడు పరబ్రహ్మమైతే, ఆయన నుండి వచ్చి విస్తరించి విశ్వమంతా వ్యాపించిన శక్తి విమర్శ. ప్రకాశ, విమర్శ వేరుగా ఉన్నాయా? వెలుగు ఏ వస్తువు మీద పడిందో ఆ వస్తువును మనం చూస్తున్నాం. కానీ వస్తువు మీద పడిన వెలుగుని చూడడంలేదు. వస్తువు అంటే ప్రాపంచిక విషయములు. వాటిలో వ్యాపించిన చైతన్యం అమ్మ. అది వెలుగు.

వేదాంతశాస్త్రం దీనినే రెండు శబ్దాలతో చెప్పింది. ఈ రెండూ తెలిస్తే చాలు అదే మోక్షం. సత్, చిత్. సత్ అంటే ఎప్పుడూ ఉన్న వస్తువు. చిత్ దాని చైతన్యం. ఇదే 'స్ఫురత్తా'. మన హృదయకుహరంలో పరమాత్మ చిత్ జ్యోతిగా ఉన్నాడు. ఆయన చైతన్యం విమర్శ అయి శరీరమంతా ప్రసరించింది. అమ్మవారు 'విమర్శరూపిణీ'. పుణ్యకీర్తి నామం నుండి విమర్శరూపిణీ వరకు శ్రీవిద్యా రహస్యం చెప్పబడుతున్నది.

శ్రీచక్రమధ్యంలో ఉన్న బిందువులో ప్రకాశ, విమర్శలు కలసి ఉంటాయి. విశ్వంగా వ్యాపించడానికి సిద్ధమైన శక్తి పరమాత్మ నుండి మొట్టమొదట ప్రకటింపబడుతుంది. మొట్టమొదట ప్రకటింపబడిన శక్తితో ఉన్న పరమాత్మని బిందుస్వరూపుడు అంటారు. లేకపోతే ఆయన కొలను వంటి వాడు.

కొలనులో బిందువు వచ్చిందంటే సృష్టి చేస్తాననే సంకల్పం ఆయనకు కలిగింది. ఈ సంకల్పశక్తి విమర్శ యొక్క ప్రథమ స్వరూపం. అది ప్రకాశంతో కలిసే ఉంది. అది బిందువు. అక్కడ మొదలై లోకమంతా వ్యాపించింది. బిందువుతో మొదలై ఆవరణలన్నిటా వ్యాపించింది 'విమర్శరూపిణీ'.

మరొక భావంలో –

విమర్శరూపిణీ అంటే బ్రహ్మవిద్య అని అర్థం. బ్రహ్మము గురించి ఆలోచించేది బ్రహ్మవిద్య. వివేచనయే విద్య. విమర్శించుట అని లోకవ్యవహారంలో ఒక మాట ఉంది. విమర్శ అంటే ఒకదానిని విడమరచి ఆలోచించుట. దానిని బాగా ఆలోచించాలి. విచారణాశీల – ఇది విమర్శ. బ్రహ్మవిద్య. గురువుగారు తత్త్వమసి అని చెప్తారు. తత్–బ్రహ్మపదార్థం. త్వమ్–జీవపదార్థం. అసి–ఐక్యం చెప్తున్నదని చెప్పేసి గురువుగారు వెళ్ళిపోయారు. మనం ఆలోచించుకోవాలి. జీవ పదార్థం శోధన చేసుకోవాలి. తత్ పదార్థాన్ని అర్థం చేసుకోవాలి. రెండిటికి ఉన్న ఐక్యతను తెలుసుకోవాలి. ఇదంతా విచారణ వల్ల వస్తోంది.

అలా విచారణ చేస్తే కాని ఆ ప్రకాశం దొరకదు. బ్రహ్మ పదార్థం విచారణాశీలమైన విద్య ద్వారా దొరుకుతోంది. **విచారణాశీలమైన బ్రహ్మవిద్యనే విమర్శరూపిణీ** అంటారు. ఈ బ్రహ్మవిద్య ద్వారా ప్రతిపాదింపబడే బ్రహ్మము ప్రకాశము.

కేనోపనిషత్తులో చెప్పబడ్డ కథలో పరమేశ్వరుడు యక్షరూపంలో కనబడడం, దేవతలు ప్రశ్నించడం, తిరిగి ఆయన అంతర్థానం అవ్వగానే అమ్మవారు రావడం మొదలైనవి వస్తాయి.

విశ్వమంతా బ్రహ్మమే అనే ఎరుక కలిగించేది విమర్శ. ఆ విచారణ శక్తి మనలో అమ్మ దయ ఉంటే కాని రాదు. ఇది రెండవ అర్థం. మొదటి అర్థం –

పరమాత్మ నుండి ప్రకటింపబడిన శక్తియే విమర్శ. ఆయన సత్. ఆవిడ చిత్. సత్ అంటే ఉన్నది. నేను ఉన్నాను అని ప్రతివాడు అంటాడు. నేను–ఉన్నాను అని రెండు వచ్చాయి. నేను అంటేనే ఉన్నావని అర్థం అయిపోతోంది. నేను అనే ఉనికిలోనే ఉన్నాను అనే స్ఫురణ ఉంది. దీనినే 'సత్తా స్ఫురత్తా' అంటారు. సత్ లోనే చిత్ ఉంది. స్ఫురత్తా అయిన శక్తి అమ్మవారు. అదే 'విమర్శరూపిణీ'.

స్వాభావికీ స్ఫురత్తా విమర్శరూపాస్య విద్యతే శక్తిః

సైవ చరాచరమఖిలం జనయతి జగదేతదపి చ సంహరతి

(సౌభాగ్య సుధోదయం).

స్వాభావికీ స్ఫురత్తా – ఈ స్ఫురత్తా అనేది సత్ అనేదానికి స్వాభావికి. స్వాభావికి అంటే స్వభావంగా ఉన్నది. 'శివస్య సహజా ధ్రువా' అని ఉపనిషత్ ప్రతిపాదన చేస్తోంది. సూర్యునికి వెలుగు ఎంత సహజమో, సత్ కి చిత్ అంత సహజం. అదే విమర్శరూప. ఆ శక్తియే **'స ఏవ చరాచరమఖిలం జనయతి జగదేతత్ అపిచ సంహరతి'**. ఆ విమర్శరూపిణీ అయిన శక్తియే జగతిని సృష్టిస్తోంది, పాలిస్తోంది, సంహరిస్తోంది. **సృష్టి, స్థితి, లయకారిణి అయిన శక్తి 'విమర్శరూపిణీ'.** అది ఎవరిదో అతడు ప్రకాశము. రెండు విడివిడిగా లేవు. ప్రకాశ, విమర్శ ఏకత్వం తెలుసుకోవాలి. విమర్శ తెలిస్తే కాని ప్రకాశం తెలీదు. సూర్యుని వెలుగు బట్టే సూర్యుని తెలుసుకోగలం. ఉన్నాననే స్ఫురణ బట్టే "నేను"అనేది తెలియబడుతోంది. తెలియబడ్డాక రెండూ ఏకమే అనే జ్ఞానం మిగిలిపోతుంది. ఆ జ్ఞానమే 'సర్వం బ్రహ్మమయం జగత్' అనే బ్రహ్మవిద్య. దీనిని విశ్లేషిస్తూ శాస్త్రం ఎంతో చక్కగా చెప్తోంది.

వాచకేన విమర్శేన వినా కిం వా ప్రకాశ్యతే

వాచ్యేనాపి ప్రకాశేన వినా కిం వా విమృశ్యతే (మాతృకా వివేకం)

– అందులో వాచకము, వాచ్యము అని రెండు ఉంటాయి. వాచ్యము అంటే చెప్పబడేది. వాచకము అంటే చెప్పునది. వాచకము లేనిదే వాచ్యం తెలుస్తుందా? వాచ్యం లేనిదే వాచకముంటుందా? చెప్పబడేది లేనప్పుడు చెప్పడం ఎక్కడ ఉంటుంది. చెప్పడమనేది లేనప్పుడు చెప్పబడేది ఎలా తెలుస్తుంది. ఒకటి లేనిదే ఒకటి లేదు.

వాచ్య, వాచకములు అన్నారు. విమర్శమైన వాచకం లేకపోతే ప్రకాశం ఎలా తెలియబడుతుంది? వాచ్యమైన ప్రకాశము లేకపోతే వాచకమైన విమర్శ ఎక్కడ ఉంది?

తస్మాద్విమర్శో విస్ఫూర్తౌ ప్రకాశం సమపేక్షతే
ప్రకాశశ్చాత్మనో జ్ఞానే విమర్శం సమపేక్షతే

– ఒకదానికొకటి ఆపేక్షిస్తూ ఉంటాయి. దీనిని ఆధార – ఆధేయ తత్త్వములు అంటారు. ఇదే శివశక్తి తత్త్వము. ప్రకాశ, విమర్శలు కలసి ఒక్కచోట బిందువుగా కనబడుతూ, అవి కలిసి విస్తరిస్తూ మిగిలిన ఆవరణల్లో గోచరిస్తాయి. ఈ ప్రకాశ, విమర్శ స్వరూప చక్రమే శ్రీచక్రము. అర్థము వాచ్యము, వాచకము వాక్కు. ఈ రెండిటికి ఉన్నది అభేదస్థితే –

వాగర్థావివసంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే
జగతఃపితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ (రఘువంశం)

ఇంత మహావిషయాన్ని గ్రహించినవాడు కాళిదాసమహాకవి. శివశక్తుల ఏకత్వ జ్ఞానాన్నంతటిని కుమారసంభవమనే గ్రంథంలో మనకి అత్యంత రహస్యంగా ఇచ్చాడు. 'రఘువంశం'లో ఆది శ్లోకంగా పలికాడు. మామూలుగా చదివితే కావ్యం, లోపల చదివితే మంత్రశాస్త్రం. కొంతమంది 'విమర్శరూపిణీవిద్యా' అని చెప్పి బ్రహ్మవిద్య అని ప్రకటిస్తారు. కాని 'విద్యా' అనేది వేరే నామమే.

549. విద్యా – శ్రీ విద్యాయై నమః

'సర్వ చైతన్యరూపాం తాం ఆద్యాం విద్యాం చ ధీమహి'. అమ్మవారు సర్వచైతన్యరూపిణి. ఈవిడ ఎప్పటినుండి ఉందనే ప్రశ్నించేవారందిరి కన్నా అన్నిటికంటే ముందు ఉంది కనుక ఆద్యా. ఎలా ఉందంటే విద్యారూపంగా ఉంది. అమ్మవారి పేరే విద్య. విద్య అంటే జ్ఞానరూపిణి. ప్రతివారిలో తెలుసుకునే, తెలియజేసే శక్తిగా ఆవిడ ఉంది. విమర్శరూపమే ప్రకాశాన్ని తెలియజేస్తోంది. విద్య, వేత్త, వేద్యము ఇది త్రిపుటి. వేత్త అంటే తెలుసుకునేవాడు. విద్య అంటే తెలియజేసేది.

వేద్యము అంటే తెలియబడేది. జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము. ధ్యాత, ధ్యేయము, ధ్యానము. మూడు ఉన్నాయి. జ్ఞాత, జ్ఞేయము కూడా జ్ఞానంలో లయం అయిపోయింది. వేత్త, వేద్యము కూడా విద్యలోనే లయమైపోయింది. విద్య అంటే తెలుసుకునే శక్తి. అదే అమ్మవారు.

తెలిశాక ఇంక తెలియబడేది, తెలుసుకునే వారు ఉంటారా? ఈ మూడు ఒకటి అయిపోయి ఏకత్వం సిద్ధించింది. ఏకత్వస్థితిలో ఒక్కటే ఉన్నది. ఆ ఒక్కటి ఉన్న తత్త్వమే విద్య. త్రిపుటి ఏకత్వమే విద్య. పరమాత్మను తెలియజేయునది విద్య. ఏ శక్తి ఉండడం వలన మనం సృష్టిలో అన్ని తెలుసుకుంటున్నామో ఆ శక్తే విద్య. నాకు తెలియలేదు అన్నా, ఆ తెలియలేదనేది కూడా ఒక చైతన్యమంటూ ఉంటేనే తెలిసింది. సృష్టిలో దేని గురించి తెలుసుకున్నా దానికి కారణం లోపల ఉన్న చిత్ అనగా చైతన్యం. అదే విద్య. అదే విమర్శరూపిణిగా ప్రపంచం అంతా వ్యాపించి ఉంది. విమర్శరూపిణియే విద్య.

విద్య అనగా చైతన్యము అనే అర్థం తీసుకుని పరమాణువు మొదలుకుని పరమాత్మ వరకూ వ్యాపించిన చైతన్యమే ప్రజ్ఞారూపిణిగా ఉన్నది. 'ప్రజ్ఞానం బ్రహ్మ' అనే మహావాక్యాన్ని ఇక్కడ భావన చెయ్యవలసినది. ఆ ప్రజ్ఞాన రూపమైన విద్య అమ్మవారు. ఇది ఒక అర్థం.

విద్య అంటే **'యయా తదక్షరమధిగమ్యతే సా విద్యా'** – పర్మబహ్మమును తెలియజేయునది విద్య. ఆ విద్య అమ్మరూపమే. అదే బ్రహ్మవిద్య. విచారణశీలినీ అయిన శక్తి విమర్శరూపిణీ. ఆ విచారణ శక్తితో తెలియబడే బ్రహ్మవిద్యే విద్య. ఈ రెండు అర్థాలు గ్రహించాలి. విద్య అనగా శ్రీవిద్య.

శ్రీవిద్యలో వాడే మంత్రాలు, యంత్రములు, పరివారదేవతలు, యోగప్రక్రియలు – అన్నీ కలుపుకుంటే దాని పేరు శ్రీవిద్య. ఈ శ్రీవిద్యంతా అమ్మరూపమే. కనుక విద్య వేరు, ఉపాసించబడే తల్లి వేరు కాదు. మనం ఉపాసించే విద్య అంతా అమ్మవారేనని తెలుసుకోవాలి. ఇందులో అంతా అమ్మే విమర్శింపబడుతోంది. అంటే విచారణ చేయబడుతోంది.

'విద్యా హి సా భగవతీ పరమా హి దేవీ' అని 'దేవీమాహాత్మ్యం' చెప్తోంది. ఆ విమర్శరూపిణీ అయిన విద్య చేతనే సృష్టి, స్థితి, లయలన్నీ జరిగాయి. **'సర్వ చైతన్యరూపా ఆద్యా విద్యా'** నుండి ఈ జగత్తు అంతా నిర్మాణమైనది. ఆద్యా అయిన విమర్శరూపిణీ శక్తి స్వామి నుండి మొట్టమొదట వ్యక్తమై దానినుండి జగత్తంతా ఏర్పడింది. ఆత్మ యొక్క శక్తి విమర్శరూపంగా వ్యక్తమవగానే అక్కడ నుండి సృష్టి ఏర్పడింది. సృష్టి యొక్క ప్రథమ భూతం ఆకాశం. 'ఆత్మావా ఇదమగ్రమాసీత్' అని ఉపనిషత్ వచనం. మొట్టమొదట ఆత్మయే ఉండెను. ఆ 'ఉండెను' అన్నప్పుడు స్ఫురణగా ఉంది కనుక విమర్శ. అక్కడ నుండి వచ్చినది ఆకాశం. ఆకాశం నుండి అన్నీ తయారు అయ్యాయి. మొట్టమొదట ఆకాశంతో పాటు సృష్టి అంతా తెలుస్తున్నది. ఆకాశానికి ఆవల ఉన్నది విమర్శరూపిణి అయిన తల్లి. ఆ తల్లి నుండే ఆకాశం మొదలుకుని మొత్తం ప్రపంచం అంతా ఏర్పడింది. 'విమర్శరూపిణీ' అయిన 'విద్య'యే 'వియదాది జగత్ప్రసూః' అని చెప్తున్నారు.

550. వియదాదిజగత్ప్రసూః – శ్రీ వియదాదిజగత్ప్రసవే నమః

వియత్ అంటే ఆకాశం. జగత్ప్రసూః – ఆకాశము మొదలైన జగత్తంతా... ఆ తల్లి నుండే ప్రసవించింది. విమర్శరూపిణి విద్య నుండే వియదాది జగత్తులు కలిగాయి. ఆకాశంతో మొదలుకొని జగములకు కన్నతల్లి విమర్శరూపిణీ విద్య. అందుకే జగన్మాత.

'తస్మాద్వా ఏతస్మాదాత్మనః ఆకాశస్సంభూతః ఆకాశాద్వాయుః వాయోరగ్నిః అగ్నేరాపః అద్భ్యః పృథివీ పృథివ్యా ఓషధయః ఓషధీభ్యో అన్నం అన్నాత్పురుషః' అని శ్రుతి చెప్పిన క్రమం. ఆ క్రమం అంతా ఇక్కడ కనిపిస్తున్నది.

వియత్ అనగా ఆకాశం. ఆకాశం మొదలుకుని సమస్తసృష్టిని చెప్పడం జరుగుతున్నది. వ్యక్తమైన స్థితిలో ప్రథమ సృష్టి ఆకాశం. అక్కడ నుండి మిగిలినవన్నీ వచ్చాయి కనుక 'వియత్–ఆది–జగత్ప్రసూః'.

++++

ఇప్పుడు అత్యంత మహిమాన్వితాలై సర్వరోగాలను హరించగలిగే నామాలు మొదలౌతూ ఉన్నాయి. వాటిని ఏ విధంగా మనం ప్రయోగం చేస్తే రోగనాశనమవుతుందో గ్రహించుకోవచ్చు.

'సర్వవ్యాధిప్రశమనీ', 'సర్వమృత్యునివారిణీ'. ఈ రెండు నామాలు ఒకే శ్లోకపాదంలో కనబడుతున్నాయి. ఈ రెండు నామములకు ఒక మంత్రత్వ విశేషముంది. విమర్శరూపిణీ అయిన తల్లిని ఉపాసించడం వలన వచ్చే ఫలితాలు ఈ నామాల ద్వారా చెప్తున్నారు.

'సర్వవ్యాధిప్రశమనీ', 'సర్వమృత్యునివారిణీ' అన్న నామాలు ఒక మంత్రం వంటివి. దీనితో అనుసంధానం చేసి లలితాసహస్రనామ పారాయణ చెయ్యడమనే ఒక ప్రక్రియ ఉన్నది. కామ్య ప్రయోగములు శాస్త్రాలలో కొన్ని చెప్తూ ఉంటారు. ఒకొక్క కోరిక కోసం ఒకొక్క మంత్రరాశిని సంపుటితం చేయడం అనేది ఉంటుంది. మామూలుగా చదువుతూ ఉంటే ఫలితం తప్పకుండా ఉంటుంది గాని, ఒకానొక కోరిక ఏదైనా ఉన్నప్పుడు దానిలోనే ఒక మంత్రం తీసుకుని మిగిలిన నామాలతో అనుసంధానం చేస్తూ సంపుటితం చెయ్యాలి.

ఉదాహరణకి చాలా ప్రసిద్ధిలోనున్న 'కామేశబద్ధమాంగల్యసూత్రశోభిత కంధరా'. దీనిని సంపుటితం చేస్తే వివాహం కాని వారికి వివాహం జరుగుతుంది. వివాహం అయినవారికి ఐదవతనం గట్టిపడుతుంది. అలా 'సర్వవ్యాధిప్రశమనీ', 'సర్వమృత్యునివారిణీ' అనే నామాలు రోగహరణము, ఆయుష్షుని వృద్ధి చెయ్యగల నామాలు.

ఈ రెండు నామాలు విడిగా మంత్రంగా కూడా జపించుకోవచ్చు. దీన్ని 'శ్రీమాత్రే నమః' అనే దానితో సంపుటితం చెయ్యాలి. లలితాసహస్ర నామాలకి మూలమంత్రంగా శ్రీమాత్రే నమః అనే నామాన్ని చెప్పుకోవచ్చు. "శ్రీమాత్రే నమః సర్వవ్యాధిప్రశమనీ సర్వమృత్యునివారిణీ శ్రీమాత్రే నమః" – ఇలా వాక్యానికి రెండు వైపుల చెప్పుకొని పారాయణ చేస్తే అదొక సిద్ధి. ఇలాగ 'శ్రీమాత్రే నమః' అనే నామంతో చాలా నామాలను సంపుటితం చేసుకొని పారాయణ చేసుకోవచ్చు.

551. సర్వవ్యాధిప్రశమనీ - శ్రీ సర్వవ్యాధిప్రశమన్యై నమః,

552. సర్వమృత్యునివారిణీ - శ్రీ సర్వమృత్యునివారిణ్యై నమః

శమనము అంటే తొలగుట, తొలగించుట. ప్రశమనము అంటే సంపూర్తిగా తొలగించుట. అవశేషంగా మిగల్చకుండా సంపూర్ణంగా సర్వవ్యాధులను అమ్మవారు తొలగిస్తుంది. ఇందులో సందేహం లేదు. లలితాసహస్రనామ ప్రయోగ విధుల్లో కూడా చాలా రకాలైన ప్రయోగాల్ని శాస్త్రం వివరించింది. భస్మాన్ని చేతిలో పట్టుకుని లలితా సహస్రనామస్తోత్రం మొత్తం చదివి ఆ భస్మాన్ని ధారణ చేస్తే ఆధివ్యాధులు నెమ్మదిస్తాయని ప్రయోగవిధిలో వశిన్యాది వాగ్దేవతలు తెలియజేస్తున్నారు.

ఈ నామంతో సంపుటితం చేస్తే శక్తి చాలా విశేషంగా ఉంటుంది. వ్యాధి అంటే శారీరక, మానసిక అని రెండు రకాలు ఉంటాయి. మనస్సులో ఉన్న మానసిక దౌర్బల్యము, భయము - ఇవన్నీ కూడా వ్యాధులు క్రిందనే నిర్ణయించారు. అదేవిధంగా శరీరానికి వచ్చే రకరకాల వ్యాధులు. వాటికి లెక్కలేదు. అమ్మ పాదాలని ఆశ్రయించడం చేత అలాంటి భయంకరమైన వ్యాధులన్నీ తొలగుతాయి.

రోగానశేషాన్ అపహంసి తుష్టాన్
రుష్టాతు కామాన్ సకాలనభీష్టాన్
త్వామాశ్రితానాం నవిపన్నరాణాం
త్వామాశ్రితాహ్యాశ్రయతాం ప్రయాంతి

అని 'దేవీమాహాత్మ్యంలో' అమ్మ ఇచ్చే అభయాన్ని వర్ణిస్తారు. 'రోగానశేషాన్ అపహంసి'. అశేషాన్ అంటే సమస్తములైన రోగాలను పోగొట్టే తల్లి.

'సర్వవ్యాధిప్రశమనీ' అనే నామాన్ని అన్ని రకాల వ్యాధులను నిర్మూలించే తల్లి అని కొంతమేరకు అర్థం చేసుకోవచ్చు. కానీ 'సర్వమృత్యునివారిణీ' కొంచెం చిత్రమైన నామం. అన్నిరకాల మృత్యువులనూ నివారించే తల్లి అని చెప్తున్నారు. కానీ మనకి తెలిసి ఒకటే చావు. ఆ చావు వచ్చే వరకు ఈ బ్రతుకంతా చచ్చేచావు అన్నారు. లోకవ్యవహారంలో కూడా 'చచ్చేచావు అయ్యిందండి' అనే మాటలు వింటూనే ఉంటాం. ఇలా చూస్తే లోకంలో రకరకాలైన చావులు ఉన్నాయి.

మృత్యువు ప్రధానంగా రెండు రకాలు. కాలమృత్యువు, అపమృత్యువు లేదా అకాలమృత్యువు. కాలమృత్యువంటే ప్రారబ్ధవశాత్తు శరీరం పండి రాలిపోయేది. అపమృత్యువు అంటే జీవితం మధ్యలో ప్రమాదవశాత్తు వచ్చే మృత్యువు.

అపమృత్యువులను మాత్రం మణి–మంత్ర–ఔషధాలతో తొలగించుకోవచ్చని శాస్త్రం చెప్తోంది. జాతకం చూసి ఫలనా సమయంలో గండం ఉంటుంది. అది కాని దాటిపోతే ఇంక ఫర్వాలేదని చెప్తారు. అది దాటడానికి కావలసిన ప్రయోగం గురువుల ద్వారా తెలుసుకోవలసిందే. ఒకొక్కప్పుడు అపమృత్యువులకి సూచనలు వస్తూ ఉంటాయి. స్వప్నాదుల ద్వారానో, శకునాల ద్వారానో రాబోయే మృత్యువును గుర్తించడం. అవి శాస్త్రాలలో ఉన్నాయి. ఏ స్వప్నం వస్తే ఎన్ని నెలలలో మరణిస్తారనేది శాస్త్రం ఉంది. ఇవి భయపెట్టడానికి కాదు. జాగ్రత్త పడడానికి.

స్వప్నశాస్త్రం, జ్యోతిష శాస్త్రం... మన జాతకస్థితిని బట్టి ఏం జరగబోతోందో చెప్తూ పరిహారాలు కూడా చెప్తాయి. ఆ పరిహారాలతో పరిహరింపబడితే అపమృత్యువుని తప్పించుకోవచ్చు. ఎన్ని పరిహారాలు చేసినా పరిహరింపబడకపోతే కాలమృత్యువని అర్థం. అమ్మవారి అనుగ్రహం ఉంటే రెండిటిని పరిహరించగలదు. ఆ తల్లి కాలమృత్యువును కూడా తొలగించగలదు. ఇదెలా సాధ్యమనే విషయంపై యోగంలో చాలా విశేషాలు చెప్పబడ్డాయి. ఇది అమ్మ అనుగ్రహం వలన సాధ్యమౌతుంది.

పరమేశ్వరానుగ్రహం పొందిన మార్కండేయుడు అపమృత్యువును దాటడం కాదు, కాలమృత్యువుని కూడా దాటాడు. 'సర్వవ్యాధిప్రశమనీ' 'సర్వమృత్యునివారిణీ'కి పెద్ద ఉదాహరణ సత్యవంతుని చరిత్రే. సత్యవంతునికి సంవత్సరం లోపే మరణమని వివాహానికి ముందే సావిత్రీదేవికి తెలిసినా ఆయన్ని వివాహం చేసుకున్నది. "మనస్సు ఆయన మీద ఉన్నప్పుడు మరొకరిని నేను చేపట్టలేను గనుక ఆయన్నే నేను చేపడతా"నని చెప్పి అప్పట్నించి ఆ తల్లి సంవత్సరకాలం అమ్మవారి ఉపాసనలోనే నిష్ఠురాలు అయ్యింది.

సావిత్రీదేవి గాయత్రీ అంశతో అశ్వపతికి పుట్టిన వనిత. సంవత్సరంపాటు

ఈ భయం తనలోనే పెట్టుకున్నది. ఆ విషయం ఆవిడకి, తండ్రికి, నారదునికి – ఈ ముగ్గురికి తప్ప ఇంకెవరికి తెలియదు. అత్తమామలకి, భర్తకి – ఎవరికీ తెలియదు. అలాంటి చోట ఆవిడ నవ్వుతూ అనుమానం రాకుండా ఉందంటే ఆ తల్లి మనోనిబ్బరానికి నమస్కారం చేసుకోవాలి.

సత్యవంతునికి ఫలానా సమయం మృత్యువని తెలిసినప్పుడు తన దీక్షని మరింత పటుతరం చేసుకుంది. ఒక వ్రతం స్వీకరించింది. ఆ వ్రతమేమిటో ఇతర పురాణాదుల ద్వారా గ్రహించవచ్చు. సావిత్రీదేవి అమ్మవారి ఉపాసన చేసింది. అమ్మ అనుగ్రహంతో చిరాయువుగా భర్తను పొందింది.

సావిత్రి, మార్కండేయుడు – ఇలాంటి మహాభక్తుల చరిత్రలు పరిశీలిస్తే – ప్రారబ్ధాన్ని కూడా తప్పించ గలిగే శక్తి పరమేశ్వరి ఉపాసనకి ఉంది. ముఖ్యంగా త్రిపురారహస్యంలో ఈ విషయం కనబడుతుంది. ప్రారబ్ధం అనుభవించేస్తే మోక్షం వచ్చేస్తుందని కొందరనుకుంటారు. మన ప్రయత్నం చేతనే మోక్షం వస్తుంది తప్ప ప్రారబ్ధం వల్ల కాదు. ఇలాగ మనలో బలీయమైన సాధన ఉంటే అపమృత్యువుల్ని, అకాలమృత్యువుని, సర్వమృత్యువులను తల్లి పోగొట్టగలదు. ఇంకా చాలా మృత్యువుల గురించి శాస్త్రం వివరించింది.

ఇంద్రియ పటుత్వం క్షీణించడం కూడా మృత్యువే. కొంతమంది వంద ఏళ్ళు బ్రతుకుతారు కాని యాభై ఏళ్ళు మంచం మీదే వెళ్ళదీస్తారు. అప్పుడు వారు బ్రతికి ఉన్నట్లా? ఏదో పేరుకు ప్రాణం ఉంది కనుక జీవించి ఉన్నారంటారు. ఇంద్రియ పటుత్వమెప్పుడైతే క్షీణించిందో ఇంద్రియములకు మృత్యువే. ఏ ఇంద్రియం పని చెయ్యడం మానేస్తే ఆ ఇంద్రియానికి అది మృత్యువే.

నిజం చెప్పాలంటే మృత్యువెప్పుడో చివరకి వచ్చే బంధువు కాదు. దగ్గర ఉండే బంధువు. 'నిత్యం సన్నిహితో మృత్యుః, కర్తవ్యో ధర్మ సంగ్రహః' అని శాస్త్రం చెప్తున్నది. తెలివైనవాడు ఎప్పుడు తన ప్రక్కనే మృత్యువు ఉందని భయపడుతూ కూర్చోడు. జాగ్రత్తపడుతూ ఉంటాడు. మృత్యువు అనేక రూపాలుగా హెచ్చరికలు పంపిస్తూ ఉంటుంది.

వార్ధక్యం ఒకానొక మృత్యువు యొక్క వేషమని చెప్పారు. రోగాలు, రొష్టులు – ఇవన్నీ మృత్యువు యొక్క రకరకాల రూపాలు. మన ఇంద్రియాలన్నీ నిరంతరం బాగా పని చెయ్యాలని చెప్తూ **"పశ్యేమ శరదశ్శతం, జీవేమ శరదశ్శతం, నందామ శరదశ్శతం, మోదామ శరదశ్శతం, భవామ శరదశ్శతం, శ్రుణవామ శరదశ్శతం, ప్రబ్రవామ శరదశ్శతమ**"ని శ్రుతి పేర్కొంది.

ఆ మంత్రార్థం పరిశీలిస్తే నూరేళ్ళు నేను ఉండాలని ఊరుకోలేదు. నూరేళ్ళు నేను (భగవానుని – భగవతిని) చూస్తూ, వింటూ, అంటూ, ఆనందిస్తూ ఉండాలి. ఇంద్రియ పటుత్వంతో నూరేళ్ళు ఉండాలి. మనలను వేదం ఎంతో చక్కగా అర్థం చేసుకుంది.

'స్థిరైరంగైః స్తుష్టువాగ్ంసస్తనోభిః'. స్థిరైః అంగైః – శరీర ఇంద్రియాలు పటుత్వం కలిగి ఉంటూ, నేను శరీరంతో ఆరాధన చేసుకోవాలని వేదమాతని ప్రార్థించాలి. అమ్మవారిని ఆరాధన చేస్తే ఆయుష్షు తప్పకుండా ఇస్తారు. ఐతే అమ్మవారి ఆరాధకులు ఇప్పటివరకూ అందరూ మిగిలిపోయారా? ఇది ఒక పెద్ద ప్రశ్న. అసలు ఆయువు పరిపూర్ణత ఎప్పుడు? మోక్షం పొందడానికి అనువైన సాధన పూర్ణం అయ్యే వరకు ఆయువు ఉండాలని కోరుకోవాలి.

మహాత్ములు ఆయువు ఉన్నప్పుడే జాగ్రత్త పడతారు. పొందవలసినది పొందేవరకు మనం బ్రతకాలి. పెద్దవాళ్ళు "దీర్ఘాయురస్తు" అని దీవిస్తారు. బ్రతుకు అంటే ఒక సాధన. జీవితం ఒక యోగం. సాధించడానికి వచ్చింది జీవితం. అది పూర్తి కావడానికి ఏం చెయ్యాలో అదంతా చేస్తున్నామా, లేదా అనేది నిరంతరం చింతన చేసుకుంటూ ఉండాలి.

ఎప్పుడూ జీవితాన్ని నిందించుకోకూడదు. ఇంకా గొప్పగా బ్రతకాలని కోరుకోవాలి. అంటే మరణించే వరకు మన ఇంద్రియాలు పటుత్వముగా ఉండాలి. అలా ఉండడానికి అమ్మవారు మనకు ఏ అవకాశాలు ఇచ్చారో అన్నీ వినియోగించుకోవాలి. ఆహారములు, మంత్రములు, సాధనలు – అన్నీ కలిపే మనం బ్రతకడానికి గొప్ప అవకాశములు. అలాంటి అవకాశాలు అమ్మ ఇస్తుంది. అవి పని చేసే లాగ ఇస్తుంది.

అసలైనది పొందేవరకు ఎన్ని రకాల దురవస్థలు ఉంటాయో వాటి అన్నింటిని తొలగించే తల్లి గనుక 'సర్వమృత్యునివారిణీ'. నామంలో లోతు తెలిసి భావన బలంగా పని చేస్తే శీఘ్రంగా ఫలిస్తుంది. దానికోసమే వ్యాఖ్యానం చెప్పుకోవాలి. అర్థం తెలిస్తే భావన పని చేస్తుంది. భావన పని చేస్తే ఫలితం లభిస్తుంది.

ఈ నామానికి పరమార్థం చూస్తే – అసలు మృత్యువు అంటే ఏమిటో ఉపనిషత్ చెప్తూ **'ప్రమాదం వై మృత్యుమహం బ్రవీమి'** – ఏమరపాటే మృత్యువు అని చెప్పింది. తన సహజస్థితిలో తాను ఉండక పోవడమే ఏమరపాటు. జ్ఞానం సచ్చిదానందమైన ఆత్మయే నేనని తెలుసుకోవడం. దానిని విడిచిపెట్టి మరణలక్షణమైన శరీరాన్ని నేను అనుకోవడమే మృత్యువు. ఈ మృత్యుదశ దాటిపోవాలి.

దేహతాదాత్మ్యం వదలి ఈశ్వర తాదాత్మ్యం పొందగలగాలి. అది పొందడమే 'మృత్యోర్ముక్షీయ మామృతాత్' అని చెప్పే మృత్యుంజయ మంత్రస్వరూపం. అదే ఈ నామాలలో వరుసగా వ్యాపించి ఉంది. అజ్ఞానం అసలు మృత్యువు. మోహం, శోకం, భయం, ద్వంద్వ స్థితి – ఇవన్నీ అజ్ఞానం నుండి వచ్చే రకరకాల బాధలు. ఇవన్నీ సర్వమృత్యువులే. ఈ సర్వమృత్యువులతో పాటు అజ్ఞానాన్ని సమూలంగా నాశనం చేసి, అమృతత్త్వ స్థితియైన మోక్షాన్ని ఇచ్చేది అమ్మ కారుణ్యం. శరీరం కలకాలం ఉండడం కాదు. మనం మళ్ళీ పుట్టకుండా ఉండే స్థితి అమృతత్వం. అదే మోక్షం. అది ఇవ్వగలిగేది అమ్మ. 'సర్వమృత్యునివారిణీ' అన్నప్పుడు ఈ అర్థంతో భాష్యం పరిపూర్ణమవుతోంది.

భవరోగమే పెద్ద జబ్బు. మిగిలిన రోగాలన్నీ రోగంలో రోగాలు. ఈ భవరోగమనేది కొన్ని జన్మల నుండి అలవాటు అయిపోయింది. అది రోగమని గుర్తించడానికి ఏదో ఒక యోగం ఉండాలి. అప్పుడు మాత్రమే అది నివారించుకోవడానికి తగిన ప్రయత్నాలు చేస్తారు.

'సర్వవ్యాధి ప్రశమనీ' అంటే సంసార రోగమును పోగొట్టునది. 'సర్వమృత్యు నివారిణీ' అంటే సంసార రోగానికి మూలమైన అవిద్య అనబడే మృత్యువును తొలగించేది. సర్వ అంటే పూర్తిగా అని అర్థం.

553. అగ్రగణ్యా – శ్రీ అగ్రగణ్యాయై నమః

అగ్ర అంటే మొదట అని అర్థం. గణ్య అంటే లెక్కించదగినది అని అర్థం. లోకంలో కూడా మొట్టమొదట లెక్కపెట్టదగినవానిని అగ్రగణ్యుడు అంటాం. పదిమంది ఉన్నప్పుడు అందులో ఎవడు అందరిలో ఉత్తముడో వానిని ముందు లెక్కించాలి. 'వియదాదిజగత్ప్రసూః' నామంలో వియత్–ఆది అన్నప్పుడు లోకంలో ఉన్న అన్ని రకాల జీవులు వచ్చారు. అంతేకాకుండా వియదాది అంటే ఆకాశం మొదలుకొని పంచభూతాలు, పంచతన్మాత్రలు – ఇత్యాది తత్త్వాలన్నీ లెక్కించదగినవే.

'గణ్యంతే సంఖ్యాయంతే'. ఇవన్నీ లెక్కకి అందేవి. ఈ లెక్కకందే ప్రపంచమంతా ఎవరి నుండి పుట్టిందో ఆవిడ లెక్కకి అందనిది. మొట్టమొదట పరమేశ్వరిని చెప్పి తరువాత ఈ ప్రపంచం గురించి చెప్పాలి. కనుకనే 'విమర్శరూపిణీ' విద్యని చెప్పి, తరువాత 'వియదాదిజగత్ప్రసూః' చెప్పారు.

వియదాది అంటే లెక్కకి అందేది. ఆకాశము మొదలు అనగానే వాయువు, అగ్ని, నీరు, భూమి....ఇలా ఎన్నైనా చెప్పవచ్చు. లెక్కకి అందే ప్రపంచానికి ముందు ఉన్న అమ్మవారికి మాత్రం లెక్కలేదు. మొట్టమొదట జగదంబని చెప్పి ప్రపంచాన్ని చెప్పాలి గనుక 'అగ్రగణ్యా'. మొట్టమొదటిగా లెక్కించదగినది. దేశకాల గణనలకు, పరిమితులకు అతీతమైనది.

సర్వస్య జగతః మూలకారణత్వాత్ – సర్వజగత్తుకి మూలకారణశక్తి అని 'అగ్రగణ్యా' నామానికి అర్థం. శ్రుతిలో కూడా 'అహమస్య ప్రథమజా ఋతాస్య పూర్వం దేవేభ్యో అమృతస్య నాభాయీ' అనే మంత్రంలో తెలియజేశారు. అహం–అస్యః, **నేను ఈ జగత్తుకి, ప్రథమజా– మొట్టమొదట ఉన్నదానిని.** ఈ సత్యములన్నింటికి సత్యాన్ని, దేవతలకి కూడా అమృతత్వమైనదానిని, అమృతమునకు మూలమైన దానిని (అమృతము అంటే మోక్షం). ఈ అమృతమైన నేను ఉంటేనే ప్రపంచం నిలచి ఉందని అమ్మవారు చెప్తోంది.

'సర్వమృత్యునివారిణీ' నామం తరువాత 'అగ్రగణ్యా' నామం చెప్పడంలో అమృతత్వ ప్రతిపాదన చేస్తున్నారు. 'ఆత్మావా ఇదమగ్ర ఆసీత్' – ఇలాంటి మంత్రాలు

శ్రుతిలో ఉంటాయి. సృష్టికి పూర్వము ఉన్నది ఆత్మ అంటుంది ఉపనిషత్తు. 'సైషా' అని ఆ తల్లియే మొట్టమొదట ఈ జగత్తుకి ఆరంభంలో ఉందంటుంది – దేవీ సూక్తం. బ్రహ్మమన్నా, ఆత్మ అన్నా, దేవీ అన్నా ఒక్కటే అన్నది నిజం. ఆ తల్లే అగ్రగణ్యగా ఉంది. అగ్ర–ఆసీత్ అనే ఉపనిషత్ వాక్యం లోంచి వచ్చింది ఈ శబ్దం.

554. అచింత్యరూపా – శ్రీ అచింత్యరూపాయై నమః

'వియదాదిజగత్ప్రసూః' నామం నుండి అన్నీ చింతనకి అందుతాయి. ఆకాశాదుల నుండి ప్రపంచమంతా చింత్యయే.

ఆకాశానికి కూడా ఆది అయిన అగ్రస్థితిని చింతన చెయ్యగలమా? ఎలా ఉంటుందో చెప్పగలమా? అత్యంత సూక్ష్మమై సర్వవ్యాపకమైనది కనుక ఆకాశం కొంతమేరకు మన చింతనకు అందడం లేదు. అంతకంటే సూక్ష్మమైన, వ్యాపకమైన తత్త్వం చింతనకి అందుతుందా? అమ్మ ఇలా ఉంటుంది అని రూపించడానికి మన చింతనతో సాధ్యము కాదు కనుక 'అచింత్యరూపా'. **'యతోవాచోనివర్తంతే అప్రాప్యమనసాసహ'.** మనసు మాటలకందని తత్త్వం. గుణ సంపర్కములు లేనిది కనుక చింతలుండడానికి వీలు కాని రూపము కలది.

555. కలికల్మషనాశినీ – శ్రీ కలికల్మషనాశిన్యై నమః

కలిదోషాలు ఎక్కువైపోతున్నాయని భయం కలిగినపుడు ఈ నామాన్ని జపించుకుంటే ఆ భయం నుండి రక్షణ పొందవచ్చు. మనలో ఆ కలి బుద్ధులు ప్రవేశించలేవు.

కలిలో ఉండే గుణాల్ని శాస్త్రాలు వర్ణించాయి. కలిలో ధర్మం ఒంటి కాలి మీద ఉంటుందన్నారు. ధర్మానికి నాలుగు పాదాలు. సత్యము, అహింస, శౌచము, అస్తేయము. కలిలో ఒక్కటే ఉంటుందంటే ఇందులో ఏ ఒకటా అని వెతకడం కాదు. ఒంటి కాలు అంటే ఏంటో అర్థం చేసుకోవాలి. పాదాలుగా విభజించితే ప్రతి యుగానికి నాలుగు పాదములు ఉంటాయి. కలియుగంలో ఒంటికాలితో ధర్మం

ఉంటుందంటే లెక్క వేరు. ఇక్కడ అర్థం ఒక పరిపూర్ణతని చెప్పేటప్పుడు నాలుగు పావులు చెప్తారు. అందులో ముప్పాతిక భాగం అధర్మం ఉంటూ, ఒక పాతిక భాగమే ధర్మం కనిపించే యుగం పేరు కలియుగం. ఇలా అర్థం చేసుకోవాలి.

మొదటి నుండి చివరి వరకు మొత్తం మీద ఇలా ఉంటుంది. అంతేకాని - ప్రథమపాదం ధర్మం, తరువాత అధర్మం అనుకుంటే.... ఆ మాట అనడానికైనా మనకి అవకాశం ఉందా! మనం ఉన్నదే ప్రథమపాదంలో. ప్రథమపాదంలోనే కావలసినంత అధర్మం ఉంది. ఇలాంటి దాంట్లో ధర్మం లేదా అంటే... అక్కడక్కడ కనబడుతోంది. ఇలాంటప్పుడు ఎలా తరిస్తారు? పొందవలసిన వస్తువు చాలా గొప్పది. చెయ్యాల్సిన కృషి చాలా ఎక్కువ. అంత కృషి చెయ్యడానికి శక్తి, అవకాశం తక్కువ.

మనం బజారులో ఏదో వస్తువు కొనడానికి వెళ్ళాం. ఆ వస్తువు ధర పది రూపాయలు ఉంటే మన దగ్గర రెండు రూపాయలే ఉన్నాయి. వెనక్కి వచ్చేస్తాం అంతకన్నా ఏం చెయ్యలేం. అలా ఉంది మన పరిస్థితి. మోక్షమో లేదా సద్గతో అనే మహావస్తువు కొనుక్కోవాలంటే ఈ యుగంలో మన దగ్గర పూర్తి రూపాయి లేదు. పావలానే ఉంది కానీ పావలాకి దొరకదు అది. రూపాయి పెట్టాల్సిందే.

మనం రూపాయి కావాలంటే ఏం చేస్తాం. "అమ్మా! నా దగ్గర పావలాయే ఉంద"ని దండం పెడితే, "నేను చూస్తానులేరా బాబు" అని ముప్పావలా ఇవ్వకుండానే ఆవిడ పూర్ణఫలం ప్రసాదిస్తుంది. అమ్మవారిని ఆశ్రయించకపోతే మన దగ్గరున్న పావలా చెల్లదు.

అమ్మ పాదాలను పట్టుకోవడమే మనం ఈ కలియుగంలో చెయ్యవలసిన పని. ఈ కలి కల్మషాలన్ని పోగొట్టే తల్లే అమ్మవారు. కలికల్మషం మనలో ఇసుమంత ప్రవేశించినా మోక్షం దాకా కాదు - ముందు సద్గతికి దూరం అవుతాం. అధర్మం వల్ల పుట్టగతులే ఉండవు. అమ్మవారి విద్య కలికాలంలో మరింత ప్రధానం. ఇదే మాట విష్ణుపురాణంలో కూడా కనబడుతుంది. విష్ణువును ఆశ్రయిస్తే కలికాలంలో ఏం ఫరవాలేదు. ఇదే మాట శివపురాణంలో, గణపతిపురాణంలో, స్కాందపురాణంలో

ఆయాదేవతల పారమ్యంగా కనబడుతుంది. ఇందులో ఎవరిని గట్టిగా పట్టుకున్నా మనం తరించిపోతాం.

ముఖ్యంగా అగస్త్యులవారు ఈ కలియుగ ఆరంభ దశలో భూమండలమంతా సంచరిస్తూ, కాలం ఎంత పాడైపోయిందో అని చాలా బాధపడ్డాడు. ఆయన ఒకప్పుడు బాగున్నకాలం చూశాడు కనుక అప్పుడు పాడయిందేమిటో అర్థమయింది. అలాంటి కాలాన్ని చూడని వారికి కాలం పాడవడమనేదే అర్థం కాదు.

ప్రతివారికి ఇంద్రియాలని సుఖ పెట్టడం, కడుపు నింపుకోవడమే పరమార్థం అయిపోయింది. వీరు ఎలా తరిస్తారని అగస్త్యులవారికి బాధ కలిగింది. ఎలా తరిస్తామా అనే బాధ ఆ మనుషులకి లేదు. వీరెలా తరిస్తారనే బాధ ఆయనకి ఉంది. పిచ్చివాడు తనెప్పుడు పిచ్చివాడినని అనుకోడు. వాడి ఆనందంలో వాడు ఉంటాడు. నా కొడుకు పిచ్చివాడైపోయాడనే బాధ తలిదండ్రులకి ఉంటుంది. మహాత్ములైన ఋషులకి కూడా లోకంలో మన తీరు చూస్తే అంత బాధ ఉంటుంది.

'వీరు ఎలా తరిస్తారా!' అని అగస్త్యులవారు తిరిగి తిరిగి వచ్చి కాంచీపురం చేరుకుని అక్కడ అమ్మవారిని ఆశ్రయించి సాధన చేస్తూంటే హయగ్రీవస్వామి వారు కనబడి, "ఏం బాధపడకు, నాయనా! కలియుగంలో ఎన్నో ప్రాయశ్చిత్తాలు చేసుకుంటే గాని బయటపడలేని స్థితులు ఉన్నాయి. కానీ అమ్మవారి పాదాలను ధ్యానిస్తూ, అమ్మ విద్యను గురువు ద్వారా పొంది ఎవరైతే కాసింత ఉపాసన చేస్తారో వారు ఈ కలికల్మషాలనుండి సులభంగా దాటగలర''ని చెప్తూ లలితాచరిత్రని, లలితాసహస్రనామాలను, లలితావిద్యని అనుగ్రహించారు. అక్కడ దాని లక్ష్యమే 'కలికల్మషనాశనం'.

ఇదే నామం త్రిశతిలో కూడా అమ్మవారికి కనబడుతోంది. కలి అంటే కాల లక్షణమే కాదు – అది ఒకానొక దోషం. మనలో ధార్మికబుద్ధి బాగా కొరవడితే అది కలి. ఏ యుగంలోనైనా వ్యక్తిలో ధర్మం లోపిస్తే వానికది కలికాలమే!

త్రేతాయుగంలో రావణాసురునిలో కలి ప్రవేశించాడు. ద్వాపరయుగంలో దుర్యోధనాదులలో కలి ప్రవేశించాడు. కలియుగంలో అందరిలో ప్రవేశించాడు.

ఏనాటి కృతయుగంలోనో నలచక్రవర్తిలో ప్రవేశించాడా, లేదా? వ్యక్తికి కూడా కలియుగ, కృతయుగాలుంటాయి. కలియుగంలో కూడా వ్యక్తికి కృతయుగం సాధ్యమే.

మొత్తం లోకం మారకపోయినా వాడు అమ్మవారిని ఆశ్రయించి ధర్మబద్ధంగా జీవిస్తూ ఉంటే కృతయుగం సాధ్యమే. ఇప్పటికీ మనం మహాత్ములని, జీవన్ముక్తులని ఎడనెడ చూస్తూనే ఉన్నాం. వారికది కృతయుగమే. అమ్మని ఆశ్రయిస్తే వారికి కలికల్మషాలన్ని తొలగుతాయి. ఎన్ని కల్మషాలు చేసినా అమ్మ మోక్షం ఇచ్చేస్తుందని కాదు. అసలు కల్మషబుద్ధులే లేకుండా చేస్తుంది. బయట ఉన్న కల్మషాల ప్రభావం మన మీద లేకుండా చేస్తుంది.

కలిలో దోషము ఏమిటో తెలుసుకోవాలి. కృత, త్రేతా, ద్వాపర, కలి. కర్తవ్యానికి, కృతానికి చిన్న తేడా ఉంది. కర్తవ్యం అంటే చెయ్యవలసినది. కృతం అంటే చెయ్యబడింది.

ధర్మమనేది – శాస్త్రంలో చదివి అది గొప్పదని తెలుసుకొని చేస్తున్నామంటే అది చాలా ఇబ్బంది. సహజంగా ధర్మాన్ని చేసేస్తూ ఉండే లక్షణం గల యుగం పేరు కృతయుగం. రామచంద్రమూర్తి 'సత్యం వద', 'ధర్మం చర' అని గురువు దగ్గర నేర్చుకుని చెప్పలేదు. ఆయనకి సత్యం కర్తవ్యం కాదు – కృతం. ఆయన అత్యంత సహజంగా ధర్మం చేస్తున్నాడు. మహాత్ములకి ధర్మం కృతం. ఆ యుగంలో అందరికి ధర్మం కృతమే కాని, కర్తవ్యం కాదు.

త్రేతాయుగంలో ఆ ధర్మము మూడు పాదాలు ఉంటుంది. ద్వాపరంలో సగం ధర్మం, సగం అధర్మం. కలి అంటే **'కల్యంతే కలహం కుర్వంత్యస్మిన్ ఇతి కలిః'**. కల్యంతే అంటే దెబ్బలాడుకునే కాలం పేరు కలికాలము. కలసి ఉండటానికి కారణాలు ఉంటాయి, విడిపోవడానికి కారణాలు ఉంటాయి. విడిపోవడానికి కారణాలు వెతికే కాలం పేరు కలికాలం. కలసి బ్రతకనివ్వని వాడు కలి.

నల, దమయంతులు కలసి బ్రతుకుదామనుకుంటే వారి బుద్ధుల్లో దూరి చెరో దిక్కుకి పంపించేశాడు. ఎంత ప్రేమ ఉన్నప్పటికి వాడు లోపల దూరితే ఎవ్వరిని కలిసి ఉండనివ్వడు. పిల్లలు తల్లిదండ్రులలో లోపాలు వెతుకుతూ ఉంటారు.

తలిదండ్రులు తమకు అనుకూలంగా ఉన్నారా, లేదా అని పిల్లలు చూస్తూ ఉంటారు. అంతా వ్యత్యస్తంగా ఉంటుంది. అలాగే గురువుగారు అనుకూలంగా ఉన్నారా, లేదా అని శిష్యులు చూస్తూ ఉంటారు. పెద్దల నుండి ధర్మాలు పిల్లలు ఆశిస్తూ ఉంటారు. పిల్లలు మాత్రం ధర్మాలని ఆచరించరు. ఇలాంటి కలికల్మష శక్తులు మన లోపల అంతఃశక్తిని నిర్వీర్యం చేస్తాయి. అధర్మం మన లోపల శక్తిని క్షీణింపజేస్తుంది. ధర్మమే శక్తిని పెంచుతుంది. అధర్మం అంత ప్రమాదకారి.

కలియుగంలో కనబడే లక్షణాలు కలహము, అవిధేయత, ద్వేషము, అనాచారము, దురాచారము. అనాచారము అంటే అసలు ఆచారం లేకపోవడం. దురాచారమంటే కూడని ఆచారాలు చెయ్యడం.

కృతస్యాఽఖిలపాపస్య జ్ఞానతోఽజ్ఞానతోపి వా
ప్రాయశ్చిత్తం పరం ప్రోక్తం పరాశక్తేః పదస్మృతిః

అని బ్రహ్మాండపురాణంలో చెప్పారు. తెలిసిగాని, తెలియకగాని చేసిన సమస్త పాపాలకు ప్రాయశ్చిత్తం 'పరాశక్తేః పదస్మృతిః' – పరాశక్తి యొక్క పాదములను స్మరించుట. పదస్మృతి అనే మాట చాలా చమత్కారమైనది. పదములు అనగా పాదములు. పాదాలను స్మరించుట అని ఒక అర్థం. పదము అంటే నామము. నామాలను స్మరించుట అని మరియొక అర్థం.

ఇవి రెండూ గ్రాహ్యములే. నామరూపాలు, చరణరూపాలు అయిన ఆ పదముల యొక్క స్మరణమే చాలు.

'తవ ప్రతిజ్ఞా మద్భక్తా న నశ్యంతీత్యపి క్వచిత్' – నా భక్తుడు ఎప్పుడూ చెడిపోడని అమ్మ ప్రతిజ్ఞ పట్టింది. భక్తుడైనవారికి ఆ మాటొక్కటి చాలు. ఆ కారణం చేతనే ఎన్ని చేసినా చివరికి **'జగదంబేతి చోచ్చరేత్'** – జగదంబా! అని అనగానే మనం చేసిన దానిలో జ్ఞాతాజ్ఞాతాలుగా ఉన్న దోషాలన్నీ అమ్మ తొలగిస్తుంది. ఇది జగదంబ అనే నామానికి ఉన్న మహిమ. ఇలా ప్రతి నామానికి ఉన్న మహిమను వివరిస్తున్నారు. పరాశక్తి యొక్క పదస్మృతి అంత గొప్పది.

అమ్మ మన పాపాలను ఏవిధంగా పోగొడుతుందో కూర్మ పురాణంలో చెప్తూ,

శమం యాతి జలం వహ్నే స్తమసో భాస్కరోదయః

శాన్త్యై కలేరఘౌఘస్య దేవీ నామానుకీర్తనమ్

కలికాలంలో ఉన్న పాపాల దొంతరని పోగొట్టడానికి ఎప్పుడూ అమ్మవారి నామాలను కీర్తన చేస్తూ ఉండాలి. అగ్నిని నీరు ఎలా ఆర్పి వేస్తుందో, చీకటిని సూర్యుడు ఎలా తొలగిస్తాడో పాపాలని అమ్మవారు అలా తొలగిస్తారు.

దీని గురించి నారాయణదాసుగారు చెప్తూ, **'తన యడియని తప్పిదము గాచు వేల్పు'** – తన భక్తునికి అంతవరకూ ఉన్న తప్పిదాలను అన్నింటిని తీసేసి కాపాడే వేల్పు అన్నారు.

'తలచినంత పిదపతరి తప్పుదుల్చు'. దీనినే పెద్దవారు 'పిదపకాలం బుద్ధులు' అనేవారు. మనం తెలుగుకు దూరమౌతున్న కొద్ది ఇలాంటి పదాలకు దూరమైపోతున్నాం. పిదప అంటే చివరిది. అంటే కలి. పిదపకాలమంటే కలికాలం. కలికాలానికి మంచి తెలుగుమాట వేశారు దాసుగారు. తరి అంటే సమయం. పిదపతరి అంటే పిదపకాలం. పిదప కాలం తప్పుదుల్చు. దుల్చు అంటే చీల్చిపారేయడం.

నిబ్బరికము పుట్టి నిడుగట్టుపట్టి

బిళరుల నెన్నని యొప్పులకుప్ప

అన్నారు. ఒప్పులకుప్ప అన్నమాట అమ్మకే సరిపోతుంది. ఒప్పు అంటే మంచి. ఒప్పుల కుప్ప అంటే మంచితనాల రాశి. తప్పుల కుప్ప 'కలికల్మష'మైతే, 'నాశినీ' ఒప్పుల కుప్ప.

కలిదోష నాశనము అనేదే శ్రీవిద్య యొక్క ప్రత్యేకత. ఆ తల్లి ఎటువంటి కలికల్మషాన్నైనా పోగొడుతుంది. దోషాలు అన్నము వల్ల, సంక్రమణం వల్ల – అంటే ఒకరితో ఒకరి సాంగత్యము – ఇత్యాదుల వల్ల ఏర్పడుతాయి. అందుకే వీలైనంత వరకు ఆచారవంతమైన అన్నమే తినాలి. మనం ఎంతో ఆచారంగా తింటున్నప్పటికీ తెలిసో తెలియకో దోషాలు జరుగుతూ ఉంటాయి.

అలాంటప్పుడు అమ్మవారి మంత్రాన్ని అష్టోత్తరశతం చేసి తీసుకుంటే

అన్నదోషాన్ని పోగొడుతుంది. చేయకూడని విషయ దోషాలనన్నింటిని పోగొడుతుందని బ్రహ్మాండపురాణం చెప్తోంది.

అన్నదోషాలే కాకుండా చెయ్యకూడనివి ఎన్నో రకాలు దోషాల గురించి బ్రహ్మాండపురాణంలో బృహస్పతి ఇంద్రునికి చెప్తాడు. అక్కడ ఆచారకాండ అంతా వివరించాడు. మద్యపానాది దోషాలు, ఇత్యాదులు చాలా భయంకరమైనవి. ఇలాంటి ఎంత నిష్కృతిలేని పాపాలో చెప్పాడు. అలాంటి పాపాలను చేసేశానే – తరించేది ఎలా? అంటే అప్పుడు అమ్మవారి విద్యను ఆశ్రయించాలి. అమ్మ విద్యలో ఉన్నాం గనుక ఎన్ని పాపాలైనా చెయ్యవచ్చని గాదు. చేసిన పాపాలను తొలగించగలదు. అలా ఆరాధిస్తూ ఉంటే మళ్ళీ చెయ్యాలనే బుద్ధి కూడా పుట్టకుండా చేస్తుంది ఆ తల్లి.

త్రిశతిలో కూడా ఇదే నామాన్ని 'కలిదోషహరా' కల్మషఘ్నీ – ఇలా విడివిడి నామాలు కనిపిస్తాయి. ఆ రెండు ఇక్కడ కలిసి 'కలికల్మషనాశినీ' అని ఒక్క నామం కనబడుతోంది.

కలికాలంలో మూడు రకాల దోషాలు ఉంటాయి. **'కలౌ కలికృతాన్ దోషాన్ ద్రవ్య దేహాత్మ సంభవాన్'.** ద్రవ్యం, దేహము, ఆత్మ – ఈ మూడింటితో దోషాలు వస్తాయి. ద్రవ్యములంటే బయట వస్తువులు. దేహము అంటే శరీరం, మూడవది ఆత్మ. ఇక్కడ ఆత్మ శబ్దానికి మనస్సని అర్థం. ఈ మూడింటితో వచ్చిన దోషములు తొలగించేది పరమేశ్వరీ చింతన.

556. కాత్యాయనీ – శ్రీ కాత్యాయన్యై నమః

ఇప్పుడు మనం చెప్పుకుంటున్న 'విమర్శరూపిణీవిద్య' అనబడే విశాలమైన నామాల గుంపులో 'కాత్యాయనీ' మంత్రమే ప్రధానమైన మంత్రం. విమర్శరూపిణీ అయిన తల్లి యొక్క ప్రధాన నామం 'కాత్యాయనీ'. కాత్యాయనీ నామమే మహామంత్రం. 'శ్రీ కాత్యాయన్యై నమః' – ఇది ఒక మంత్రం.

గోపికలు కాత్యాయనీ వ్రతం చేశారని భాగవతం చెప్తున్నది.

'కాత్యాయనీ, కాలహంత్రీ, కమలాక్షనిషేవితా' – ఈ శ్లోకపాదం ఒక మంత్రం.

ఇందులో ప్రధానమంత్రం 'కాత్యాయనీ'. కాత్యాయనీ ఉపాసనాఫలం 'కాలహంత్రీ'. వెనుకటి నామాల కొనసాగింపుగా మృత్యుంజయమంత్ర విశేషాలలో ప్రవేశించాం. శ్రీవిద్యలో అమ్మవారి ప్రధాన మంత్రాల్లో "కాలసంకర్షణీమంత్రమ"ని ఉంది.

'భండాసురేంద్రనిర్ముక్తశస్త్రప్రత్యస్త్రవర్షిణీ' దగ్గర భండాసురుడు వేసిన మృత్యు అస్త్రానికి అమ్మవారు సమాధానంగా కాలసంకర్షణాస్త్రం ప్రయోగించారు. భండాసురుడు ఆయుర్నాశనాస్త్రమనేదానిని వేస్తే దానికి అమ్మవారు ఇచ్చిన ప్రత్యస్త్రం 'కాలసంకర్షిణీ'. కాలసంకర్షిణీ మంత్రం వైదికమైన మంత్రము. శ్రీవిద్యోపాసకులకు అది తెలుస్తుంది.

ఈ 'కాత్యాయనీ కాలహంత్రీ కమలాక్షనిషేవితా' నామపంక్తియే మంత్రం. కాలహంత్రీలో కాలసంకర్షిణీ అనేదానిని దాచి పెట్టారు. వశిన్యాది వాగ్దేవతల దయ చాలా ఉంది. నామాల్లో మంత్ర విశేషాలు ఇలా గర్భీకరించారు. కాలహంత్రీ శక్తి కాత్యాయనీ. కాత్యాయనీ నామ వివేచనమే పెద్ద ఉపాసన. ఆ నామానికి ఎన్ని అర్థాలు ఉన్నాయో అన్నీ భావన చేసుకోవాలి.

ఈ నామానికి ప్రధానంగా కథాపరమైన అర్థం ఉంది. కతుడు అనే ముని ఉండేవాడు. ఆయనకి కతముడు అని పేరు కూడా ఉంది. ఈ కతముడు అనే ముని అమ్మవారు తన పుత్రికైతే బాగుండునని అనుకున్నాడు. ఆ అనుగ్రహం ఇవ్వదలచుకున్నాడు పరమేశ్వరుడు. అమ్మవారు కైలాసంలో ఉండగా వెనకనుండి వచ్చి సరదాగా శివుని కనులు మూసింది. అలా చెయ్యగానే మొత్తం లోకాలు చీకట్లైపోయాయి.

వెంటనే అమ్మవారు చేతులు తీసేసింది. పరమేశ్వరుడు కళ్ళు తెరిచాడు. క్షణకాలమే మూసింది. అక్కడి క్షణం ఇక్కడ కొన్ని యుగాలుతో సమానం. మొత్తం ప్రళయావస్థగా మారింది. ఏమిటి ఇలా జరిగిందని అడిగింది అమ్మవారు. నా కళ్ళు ఎప్పుడూ ముయ్యకుండా చూస్తున్నాను. ఇవి సూర్య, చంద్ర, అగ్ని నేత్రాలు. ఆ మూడు మూసివేయగానే జగత్తుకు ప్రళయం ఏర్పడిందన్నాడు పరమేశ్వరుడు.

మొత్తానికి స్థితిలో ఉండవలసిన జగత్తుకు అకాల ప్రళయం ఏర్పడింది

కనుక తత్ దోషపరిహారార్థం నువ్వు ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్నాడు పరమేశ్వరుడు. అమ్మవారికి ప్రాయశ్చిత్తమా అని మనం అనకూడదు. ఒక శాస్త్రం చెప్పినప్పుడు వారికి పాపం లేకపోయినా వారూ దానిని అనుసరిస్తారు. వారు దాని వల్ల లోకానికి ఒక కళ్యాణం చేస్తారని గ్రహించాలి. వారికి ప్రాయశ్చిత్తం అక్కరలేదు. రామచంద్రమూర్తికి తిరిగి శివుని ప్రతిష్ఠ చేసి పాపం పోగొట్టుకోవలసిన అవసరం లేదు. కానీ ఆయన రామేశ్వరం శివుని ప్రతిష్ఠించడం వలన మనం అందరం తరించిపోయాం. వారు చేసే పనులు వారికి అవసరం లేదు – మన కోసం.

అమ్మవారితో పరమేశ్వరుడు చెప్తూ, "హిమాలయాలలో కతముడనే ముని నువ్వు కుమార్తెగా కావాలని తపస్సు చేస్తున్నాడు. అతని ఆశ్రమం ముందు నువ్వు శిశురూపంతో ఉండు" అని చెప్పాడు. గర్భం నుండి అమ్మవారు వచ్చే అవకాశం అక్కడ లేదు. అమ్మవారు తనకు లభించిందని అతడు తన తపశ్శక్తితో పోల్చుకుంటాడు. "ఆ విధంగా అతని ముచ్చట తీర్చు" అని చెప్పాడు. "చిన్నపిల్లల్ని పెంచడం అనే ముచ్చట ఎనిమిదవ యేట వరకే. వారు ఎదుగుతూ ఉంటే ఆ ముచ్చట ఉండదు. కనుక ముచ్చట తీరా ఎనిమిది యేళ్ళు అతని దగ్గర నువ్వు ఉండు. ఎనిమిదవ ఏడు నీకు రాగానే ఆయనకి మోక్షాన్ని ఇచ్చి, అప్పటివరకూ అతడు వినియోగించుకొంటున్న జపమాల, ఆసనము, వ్యాసపీఠము, కమండలము, దీపపుసెమ్మెలు, అతడు నివేదన చేసే వేయించిన మొలకపెసలు పట్టుకుని నువ్వు బయలుదేరే సమయానికి కాశీలో కరువు ఉంటుంది. అక్కడకి నువ్వు చేరి అన్నపూర్ణా భవానీగా ఉండి అక్కడి కరువంతా తీర్చి అక్కడే నువ్వు అన్నపూర్ణా తేజముగా నిలచి, అక్కడ నుండి బయలుదేరి దక్షిణదేశానికి వెళ్ళు. అక్కడ సముద్రప్రాంతం వద్ద ఒక పెద్ద మామిడిచెట్టు ఉంటుంది. అది నా రూపమే. అక్కడ సైకతలింగం ఒకటి ఉంటుంది. అదీ నా రూపమే. దీపం ఒకటి వెలుగుతూ ఉంటుంది. నీకు సహాయపడడానికి ఇద్దరు చెలికత్తెలు అక్కడ సిద్ధమయ్యే ఉంటారు. వేయించిన మొలక పెసర గింజ ఒకటి ఉంటుంది. ఇది, అది కలిపి నైవేద్యం పెట్టు. అక్కడున్న శివుని పూజ చెయ్యి. అప్పుడు అక్కడ నేను నిన్ను అనుగ్రహిస్తాను" అని చెప్పాడు.

ఆ మామిడిచెట్టు కాంచీపురంలోని ఏకామ్రేశ్వర క్షేత్రం. కతమునికి హిమగిరిలో ఆమె కుమార్తెగా కలిగి కాత్యాయని అయి, అతనికి ముక్తిని ప్రసాదించింది. అక్కడ నుండి బయలుదేరి కాశీలో అన్నపూర్ణమ్మగా వెలిగి, అటు నుండి కాంచీపురం వచ్చి కామాక్షిగా శివునికై తపస్సు చేసింది. ఇది 'కామాక్షీ విలాసం'లోని గాథ.

కామాక్షీదేవే లలితాత్రిపురసుందరి కనుక అమ్మవారి కథంతా చెప్పుకున్నాం. కతుడు లేదా కతముడు అనే మహర్షి పుత్రికగా వచ్చింది కనుక 'కాత్యాయనీ'.

మరొక అర్థంలో –

కతులు అంటే బ్రహ్మవేత్తలు. ఆ బ్రహ్మవేత్తలు ఏ బ్రహ్మవిద్యతో, జ్ఞానంతో ఉన్నారో ఆ జ్ఞానం అమ్మవారి యొక్క రూపం. బ్రహ్మవేత్తలలో ప్రకాశించే బ్రహ్మవిద్యాస్వరూపిణి కాత్యాయనీ. ఇది దీనికి అసలైన అర్థం. మొదటిది లీలార్థం. రెండవది పరమార్థం.

లీల జరిగినప్పుడు లీలార్థం మొదలవుతుంది. పరమార్థం ఎప్పుడూ ఉంటుంది. కాత్యాయనీ నామం కతమునికి కూతురు అయ్యాకే వచ్చిందంటే అప్పుడది మంత్రం కాదు. అది ఎప్పుడూ ఉండాలి. ఎప్పుడూ వేదాలలో అమ్మవారు కాత్యాయనీ అని చెప్పబడుతూ ఉంటారు. కాత్యాయనీ అంటే జ్ఞానరూపిణి. కాత్యాయనీ నామం చేస్తే అజ్ఞానం పోతుంది. జ్ఞానం లభిస్తుంది. అది మనకి సర్వమృత్యునివారిణీ.

కాత్యాయనీ నామానికి మరొక ప్రధాన అర్థం వామన పురాణం చెప్తోంది –

తచ్చాపి తేజోవరముత్తమం మహన్నామ్నా పృథివ్యామభవత్ప్రసిద్ధం
కాత్యాయనీత్యేవ తదా బభౌ సా నామ్నాచ తేనైవ జగత్ప్రసిద్ధా

మహిషాసురుడు మొదలైన రాక్షసులు పెచ్చుపెరిగినప్పుడు దేవతలందరూ అమ్మవారిని ప్రార్థిస్తే ఒక్కసారి ఆవిడ ఆవిర్భవించింది. ఎలా వచ్చిందంటే 'వ్యాప్తలోకత్రయస్త్విషా' అని సప్తశతి వర్ణిస్తోంది. 'నిజారుణప్రభాపూరమజ్జద్బ్రహ్మాండ మండలా' అని చెప్పినట్లుగా ముల్లోకాలు అమ్మవారి వెలుగుతో ప్రకాశించి పోతున్నాయి. ఆ కాంతికి ఎక్కడా అడ్డు, ఆపు లేదు. అలా అడ్డు, ఆపు లేకుండా వ్యాపించిన అఖండ కాంతిని 'కాత్యాయనీ' అంటారు.

సర్వవ్యాపకమైన అఖండమైన జ్యోతి స్వరూపమే 'కాత్యాయనీ'.

ముందు చెప్పుకున్న జ్ఞానమనే అర్థానికి, దీనికి సంబంధం ఉందా అని పరిశీలిస్తే జ్ఞానమంటేనే జ్యోతి, బ్రహ్మమంటేనే జ్యోతిస్వరూపిణి అంటే జ్ఞానరూపిణీ. కాత్యాయనీ అనగా జ్యోతిస్వరూపము.

మనలో భ్రూమధ్యస్థానం ఓడ్యాణపీఠమని చెప్పుకున్నాం. **'కాత్యాయనీ చోడ్డియానే'** అని కాళీపురాణం చెప్తోంది. కాత్యాయనీ నామమనగానే అత్యంత ఉత్కృష్టస్థానం భ్రూమధ్యస్థానం స్పందిస్తుంది. అక్కడ దేవత ఆవిడ. ఇంచుమించు బిందువాసినే ఆ తల్లి అని చెప్పబడుతోంది.

ఈ నామానికి ఇన్ని అర్థాలు చెప్పుకోవడమంటే ఉపాసన చేసి కాత్యాయనీ నామాన్ని పండించుకోవడం అని గ్రహించగలగాలి. అర్థవివేచన వల్లనే మంత్రం సిద్ధిస్తుంది. వల్లెవేయడం మాత్రమే కాదు. దేవీపురాణంలో వ్యాసులవారు కాత్యాయనీ నామానికి అర్థం చెప్తూ

కం బ్రహ్మ కం శిరః ప్రోక్తం అశ్మసారంచ కం మతమ్
ధారణాద్వాసనాద్వాపి తేన కాత్యాయనీ మతా

కం అనే మాటకి బ్రహ్మ, శిరస్సు, వజ్రము అని అర్థాలున్నాయి. ఆ బ్రహ్మమును ధరించునది, బ్రహ్మమునందు వసించునది, శిరస్సును ధరించునది, శిరస్సునందు వసించునది, వజ్రమును ధరించునది, వజ్రమునందు వసించునది అని మూడు అర్థాలు చెప్పుకోవాలి. ధరించుట, వసించుట.

ధరించుట అంటే ఆధారశక్తి. బ్రహ్మమునకు ఆధారశక్తి. బ్రహ్మము అనగా వేదము. వేదమునకు ఆధారశక్తి. బ్రహ్మమైనా శక్తి ద్వారానే తెలియబడతాడు గనుక బ్రహ్మమునకు ఆధారమైన శక్తి గనుక ఈవిడ 'కాత్యాయనీ'. కం అనే బ్రహ్మమునకు ఆధారమైన శక్తి.

కం శిరః – శిరస్సునకు కం అనే పేరు కూడా ఉంది. ఆ శిరః స్థానాన్ని ధరిస్తోంది ఈవిడ. ధరించుట అంటే ఆధారం. శిరస్సులోనే జ్ఞానేంద్రియాలన్నీ ఉన్నాయి. జ్ఞానం యొక్క పట్టుకొమ్మ శిరస్సు. ఈ జ్ఞానాన్ని ఇక్కడ ఆధారంగా ధరించేది ఆ తల్లి.

ఆ తల్లే ఈ శిరస్సును పట్టుకుంది. కొందరు "అమ్మ కపాలం పట్టుకుంటుంది, చూస్తే భయమేస్తుందం"టారు. ఆవిడ పట్టుకుంటేనే ఈ కపాలము ఉంటుందని తెలియాలి. శివుని చేతిలో, అమ్మవారి చేతిలో కపాలము ఎందుకు ఉంది? అంటే మన కపాలాలన్నీ వారి చేతులలోనే ఉన్నాయని అర్థం.

వారు చేత్తో పట్టుకోకపోతే దీనికి చైతన్యము లేదు. చైతన్యస్పర్శ ఉంటేనే మన శిరస్సుకి చైతన్యము వచ్చింది. విద్యుచ్ఛక్తి తగిలితేనే రాగి తీగకి విద్యుత్ ప్రసారం అవుతుంది. మన శిరస్సుకి ఆ శివశక్తుల స్పర్శ తగలగానే చైతన్యము వచ్చింది.

బ్రహ్మరంధ్రస్థానంలో శిరస్సుపై ఉన్నది. కాత్యాయనీ అంటే బ్రహ్మరంధ్ర స్థానంలో ప్రకాశించేది. శిరస్సు నందు ఉన్న ప్రధానమైన చక్రాలు రెండు. మొదటిది భ్రూమధ్యం, రెండవది బ్రహ్మరంధ్రం. ఈ రెండిటికీ ఆవిడే ఆధారశక్తి. కాత్యాయనీ అత్యంత ఉత్కృష్టమైన పరానామం.

వజ్రాన్ని ధరించునది అంటే ఇంద్రాణీ శక్తి. వజ్రపాణి అమ్మవారు. వజ్రమనగా 'వాగ్వై వజ్రః'. వాక్కుకి వజ్రమని పేరుందని ముందు నామాలలో చెప్పుకున్నాం. కాత్యాయనీ అంటే వాక్కులని ధరించే తల్లి.

557. కాలహంత్రీ - శ్రీ కాలహంత్ర్యై నమః

కాలాన్ని నశింపజేయునది. సృష్టిలో ఎవరైనా కాలబద్ధులే. బ్రహ్మగారైనా అంతే. ఎవరి కాలం వారికుంటుంది.

'కాలోహి దురతిక్రమః' అనే మాట శ్రీమద్రామాయణంలో ఉంది. కాలాన్ని ఎవడూ దాటలేడు. కాలహంత్రీనామం కూడా వివేచన చెయ్యాలి. సీతమ్మ వారి కష్టం చూడగానే హనుమస్వామి ఆ చెట్టుమీద కూర్చుని **'యది సీతాపి దుఃఖార్తా కాలోహి దురతిక్రమః'** అని అనుకుంటాడు. సీతమ్మకి కూడా దుఃఖం వచ్చిందంటే కాలాన్ని ఎవరూ దాటలేరు సుమా అని అనుకున్నాడు.

సీతమ్మకి దుఃఖం రాకూడదా అంటే రాకూడదు. సర్వ జగద్రక్షకుడైన నారాయణుడు రామచంద్రమూర్తి ప్రక్కన ఉన్నాడు. ఎవరినైనా ఎదిరించే మరిది

మరో ప్రక్కన ఉన్నాడు. ఇద్దరూ ఉంటూ ఉన్నప్పటికి సీతమ్మకి దుఃఖం వచ్చింది అంటే ఎన్ని రక్షణ శక్తులున్నా కాలం దాటడం కష్టం కదా అనుకున్నాడు. అలాంటి కష్టమైన కాలాన్ని కూడా దాటించగలిగే శక్తి 'కాలహంత్రీ'.

ప్రతి వారికి ఒక దుష్కాలం ఉంటుంది. అప్పటి వరకు వెలిగిపోతారు. అంతా తన నిర్వాకం అనుకుంటారు. దెబ్బ తింటారు. అప్పుడు "ఏం చేస్తాం, భగవంతుడు అలా చేశాడు" అంటారు. దుష్కాలాన్ని ఎలా దాటాలి?

లలితాసహస్రంలో జ్యోతిష పరమైన నామాలు చాలా ఉన్నాయి. "కాలదోషం" పట్టిందనే మాటని వ్యవహారంలో వింటూ ఉంటాం. అమ్మవారిని ఆశ్రయిస్తే కాలదోషాలు లేకుండా చేస్తుంది.

దుష్కాలాలను తొలగిస్తుంది. మనపై దుష్కాల ప్రభావం ఎంతవరకూ ఉంటుందంటే అమ్మవారి పాదాలను ఆశ్రయించే వరకే ఉంటుంది. అమ్మ పాదాలని గాని ఆశ్రయించామా జాతకాలు మనల్ని ఏం చెయ్యలేవు. గ్రహాలు తిరిగే కక్ష్యలన్నీ అమ్మ పాదాల దగ్గర ముగ్గులు. ముగ్గుల్లో గొబ్బెమ్మల్లా ఉంటాయి గ్రహాలన్నీ. ఆ పాదాలని ఆశ్రయిస్తే అమ్మ కడగంటి చూపులతో శాసిస్తుంది.

ఒక వేళ బలీయమైన ప్రారబ్ధంతో ఏదైనా వచ్చినా వాని చిత్తానికి అది సోకదు. జ్ఞానస్థితిలోకి వాడు చేరిపోతాడు. ఈ మార్పులు వానికి పట్టవు.

శివశివ పశ్యంతి సమం శ్రీకామాక్షీ కటాక్షితాః పురుషాః
విపినం భవనమమిత్రం మిత్రం లోష్టంచ యువతి బింబోష్ఠం

– అంటాడు మూకకవి.

పవి పుష్పంబగు నగ్ని మంచగు నకూపారంబగు భూమీ స్థలం
బవు శత్రుండతి మిత్రుఁడౌ విషము దివ్యాహారమౌ నెన్నఁగా
నవనీమండలి లోపలన్ శివశివేత్యాభాషణోల్లాసికిన్
శివ నీ నామము సర్వవశ్యకరమౌ శ్రీకాళహస్తీశ్వరా!

గ్రహదోషంబులు దుర్నిమిత్తములు నీ కళ్యాన నామంబుఁ బ్ర
త్యహమున్ బేర్కొను నుత్తమోత్తముల బాధం బెట్టఁగానోపునే

దహనున్ గప్పఁగఁ జాలునే శలభసంతానంబు నీ సేవ చే
సి హతక్లేశులు గారు గాక మనుజుల్ శ్రీకాళహస్తీశ్వరా!

అంటాడు ధూర్జటి. గ్రహదోషాలు, కాని కాలాలు – ఇవన్నీ అమ్మ పాదాలని ఆశ్రయించని వారికే ఉంటాయి. ఆశ్రయించేవారికి 'కాలహంత్రీ'. ఇది ఒక అర్థం.

కాలుడు అంటే మృత్యువు. కాలహంత్రీ అంటే మృత్యునాశినీ. ఇది ప్రధానమైన రెండవ అర్థం. రెండు అర్థాలు తీసుకోవాలి. ఆ తల్లి మృత్యునాశినీ.

'చంద్రశేఖరమాశ్రయే మమ కిం కరిష్యతివై యమః' అని మార్కండేయుడు శివలింగాన్ని గట్టిగా పట్టుకుంటే శివుడు ఆ లింగంలోంచి ఒక్కసారి వచ్చి మొట్టమొదట చేసిన పని మార్కేండేయుని మీద కుడి చెయ్యి వేసి, ఎడం పాదంతో యముని(కాలుని) తన్నాడు.

కుడి చెయ్యి వేసి, 'వీడు నా వాడు' అని తన దగ్గరికి లాక్కున్నాడు. నా వాడు అని పరమేశ్వరుడు అన్న తరువాత ఇంకొకడు వాని వైపు చూడడానికి వీలు లేదు. శివుడు భక్తుని నావాడు అన్న తరువాత అమ్మవారు వానిని బాధించేవానిని కొడుతుంది. అందుకే యముని పరమేశ్వరుడు ఎడమ పాదంతో కొట్టాడంటే ఎడం పాదం అమ్మవారేగా? మనం శివునికి సంబంధించినవారమైతే మనల్ని అమ్మవారు రక్షిస్తారని దీనిలో భావంగా గ్రహించవచ్చు.

'చంద్రశేఖరభక్తార్తిభంజనాయై నమో నమః' అని లలితాష్టోత్తర శతనామావళిలో నామం. చంద్రశేఖర భక్తుల ఆర్తిని అమ్మవారు పోగొడుతుంది. 'చంద్రశేఖరమాశ్రయే మమ కిం కరిష్యతి వైయమః' – చంద్రశేఖరుని భక్తుడు మార్కండేయుడు. ఆర్తిభంజనం చేసిన పరమేశ్వరుని ఎడమ పాదం అమ్మవారుగా అర్ధనారీశ్వర స్వరూపంలో కనబడుతుంది.

పరమేశ్వరుడు నటరాజుగా ఎడమపాదమెత్తి, ఆ పాదాన్ని ఆశ్రయిస్తే నేను అభయం ఇస్తానని కుడి చెయ్యిని అభయంగా చూపిస్తాడు. ఎత్తింది ఎడమ పాదం. చూపిస్తున్నది దానిని. అమ్మ పాదం పట్టుకుంటే అయ్యవారి అభయం లభిస్తుందని దీని అర్థం. ఇద్దరూ ఒక్కటే. కాలహంత్రీ అంటే మృత్యునాశినీ అని ఒక అర్థం.

'కాలహంత్రీ' అంటే మోక్షదాయినీ అని మరొక అర్థం. మనం ఎంతవరకు కాలబద్ధులమో అంత వరకు పాశబద్ధులమే. కాలబద్ధుడు జీవుడైతే కాలానికి అతీతుడు ఈశ్వరుడు. పిపీలికాది బ్రహ్మపర్యంతం అంటే చీమ మొదలుకుని బ్రహ్మగారి వరకూ అన్ని లోకాల వారు కాలబద్ధులే.

జనన, మరణ రూపమైన సంసారమే కాలం. కాలహంత్రీ అంటే సంసారనాశినీ – మోక్షదాయినీ. సంసార బంధనాన్ని తొలగించే తల్లి.

కాత్యాయనీకి మరొక శాస్త్రీయమైన అర్థం – **'కతి అయనాని కేచన మార్గాః** – కతి అయనాని ఇతి కాత్యాయనీ'. కాత్యాయనీ కాల స్వరూపిణి. ఈ కాలరూపంలో ఎవరికి–ఎప్పుడు–ఎక్కడ– ఏది–ఎలా ఇవ్వాలో ఆవిడ నిర్ణయిస్తుంది. ఆ నిర్ణయాన్ని అనుసరించే దేవతలందరూ పని చేస్తూ ఉంటారు. కాలరూపిణిగా జగత్తునంతటిని నియంత్రిస్తోంది. లెక్కపెడితే ఎన్ని అయనాలు. కతి అయనాని. అయనాలు అంటే ఉత్తరాయణ, దక్షిణాయనములతో కూడిన ఒక సంవత్సరము. ఇలాగ ఎన్నెన్ని సంవత్సరములు, ఎన్నెన్ని కాలాలు. ఈ అనంతకాలస్వరూపిణియై అమ్మవారు ఉంటున్నారు. అలాంటి కాలరూపిణి అయిన తల్లి ప్రతివారిని శాసిస్తూ ఆ కాలం నుండి బయట పెడుతుంది.

అలా కాలాతీతురాలు అయిన తల్లి. కాలాన్ని తాను నియంత్రిస్తూనే తనని ఆశ్రయించిన వారిని కాలం నుండి బయట పెట్టేస్తుంది. 'కాత్యాయనీ' తరువాత 'కాలహంత్రీ' చెప్పడంలో అది విశేషం.

ఈ నామములలో జాతకములో దుర్దశలు పోవడమే కాకుండా అపమృత్యువులను, కాలమృత్యువులను కూడా పోగొట్టగలిగే శక్తి ఉన్నది.

ఈ కాత్యాయనీ అమ్మవారిని ఎవరు సేవిస్తారో తరువాతి నామంలో చెప్తున్నారు.

558. కమలాక్షనిషేవితా – శ్రీ కమలాక్షనిషేవితాయై నమః

కమలాక్షుని చేత సేవించబడినది. ఇప్పటి వరకు అమ్మవారి విద్యలో ఘటికులు ఒకొక్కరూ వచ్చారు. మనువిద్యా, చంద్రవిద్యా, రాజరాజార్చితా –

ఇవన్నీ అమ్మవారి విద్యలు. అందులో 'శివారాధ్యా' కూడా వస్తుంది. శివుడు కూడా అమ్మవారిని ఆరాధన చేస్తున్నాడు. ఇప్పుడు కమలాక్షుడు వచ్చాడు. పుండరీకాక్షుడు, కమలాక్షుడు అని విష్ణువుకి పేర్లు. కమలాక్షుడైన నారాయణుని చేత, 'నిషేవిత' అంటే సంపూర్ణంగా ఆరాధింపబడునది. నారాయణుడు అమ్మవారిని ఆరాధించడం అనేదాని గురించి పురాణలలో ఎన్నెన్నో ప్రమాణాలు ఉన్నాయి.

పద్మపురాణం **'ఇంద్రనీలమయీం దేవీం విష్ణురర్చయతే సదా విష్ణుత్వం ప్రాప్తవాంస్తేన'** అని చెప్తున్నది. ఇంద్రనీలమణులతో ఉన్న ఆకారంగా అమ్మవారిని విష్ణువు పూజ చేశాడు. ఒకొక్క దేవత ఒకొక్క రూపంతో ఆరాధిస్తున్నది. వైకుంఠంలో ఇంద్రనీలమణులతో చేసిన అమ్మవారి విగ్రహాన్ని ఆరాధించువాడు.

మూకకవి స్తుతి శతకం మొత్తం ఈ నీలకాంతి తల్లిగానే అమ్మవారిని వర్ణించారు.

తాపింఛ స్తబకత్విషే తనుభృతాం దారిద్ర్యముద్రాద్విషే
సంసారాఖ్య తమోముషే పురరిపోర్వామాంక సీమాజుషే
కంపాతీరముపేయుషే కవయతాం జిహ్వాకుటీం జగ్ముషే
విశ్వత్రాణపుషే నమోఽస్తు సతతం తస్మై పరంజ్యోతిషే

అని ఆ తల్లిని వర్ణించాడు. ఆ నీలకాంతుల తల్లిని ఆరాధించినవాడు నారాయణుడు. ఆయన లక్షణానికి అది చాలా దగ్గరైన జల లక్షణం. కనుక నారాయణుని చేత సేవించబడుతున్నది.

ఆదిశంకరులు సౌందర్యలహరిలో చెప్తూ-

హరిస్త్వామారాధ్య ప్రణతజనసౌభాగ్యజననీం
పురా నారీ భూత్వా పురరిపుమపి క్షోభమనయత్
స్మరోఽపి త్వాం నత్వా రతినయన లేహ్యేన వపుషా
మునీనామప్యంతః ప్రభవతి హి మోహాయ మహతామ్

'హరిబ్రహ్మేంద్రసేవితా' అని నామం కూడా ఉంది. 'అతస్త్వామారాధ్యాం హరిహరవిరించాదిభిరపి' - హరి, హర, విరించి ఆది అన్నారు - పెద్దవారు

ముగ్గురు ఉంటే తరువాత వారిని అనుసరించే అందరూ అక్కడ ఉంటారు. 'హరి హర విరించి' తరువాత దేవతలు, ఋషులు మొదలైన వారందరి చేత ఆరాధింపబడే తల్లి. ఆదిశంకరులు సౌందర్యలహరి మొదటి శ్లోకంలోనే అమ్మవారి పూజ్యతని చూపిస్తున్నారు.

కాత్యాయనీ అయిన తల్లిని కమలాక్షులు మాత్రమే సేవించగలరు. కమల-అక్ష- నిషేవిత - దీనికి మళ్ళీ రెండు రకాల అర్థాలు ఉన్నాయి. కమలాక్ష అంటే సంపూర్ణముగా వికసించిన దృష్టి కలవారిచే చక్కగా సేవించబడుతున్నది. అంటే జ్ఞానదృష్టి కలవారి చేత పూజింపబడునది.

కమల-అక్ష-నిషేవిత-ఇదే నిజానికి పుండరీకాక్ష శబ్దానికి వేదంలో ఉన్న అద్భుతమైన అర్థం. 'అక్షు వ్యాప్తౌ' అనే ధాతువు ప్రకారంగా అక్ష అంటే వ్యాపించుట. పుండరీకము అంటే హృదయం. హృదయంలో వ్యాపించినది.

కమల-అక్ష-నిషేవితా అంటే హృదయమునందు వ్యాపించబడి చక్కగా సేవించబడుచున్నది. ఆ కాత్యాయనీదేవిని హృదయపద్మంలో వ్యాపించిన దానినిగా భావించి సేవించాలి. అలా భావించి సేవించబడే తల్లి కనుక 'కమలాక్షనిషేవితా'.

మొదట అర్థం నారాయణునిచే సేవించబడినది. రెండవ అర్థం జ్ఞానదృష్టితో వికసించినవారు సేవిస్తారు. మూడవది హృదయకమలము నందు వ్యాపించినదిగా సేవించబడుతున్న తల్లి. ఇది కమలాక్షనిషేవితా.

559. తాంబూలపూరితముఖీ - శ్రీ తాంబూలపూరితముఖ్యై నమః

ఇక్కడి నుండి మరల అమ్మవారి దివ్యమంగళవిగ్రహ ధ్యానం జరుగుతోంది. అక్కడ నిర్గుణ, నిరాకారతత్త్వం చెప్పారు. ఇప్పుడు సగుణసాకారం చెప్తారు. రెండిటిని సమన్వయించి ఆరాధించమని చెప్పడం ఇందులో ఉన్న భావం.

ఇప్పుడు అమ్మవారి స్వరూపం చూడాలి. అమ్మవారి ముఖం తాంబూలంతో ఉన్నది. తాంబూలం నములుతూ మందహాసం చేస్తోంది. 'కర్పూరవీటికామోద సమాకర్షద్దిగంతరా' నామం దగ్గర చెప్పుకున్నదంతా ఇక్కడ భావన చెయ్యాలి. ఆ

నవ్వుతున్న వదనాన్ని ఇక్కడ ధ్యానిస్తున్నాం.

560. దాడిమీకుసుమప్రభా – శ్రీ దాడిమీకుసుమప్రభాయై నమః

దానిమ్మపువ్వులాంటి కాంతితో ఉంది. భాస్కరరాయలవారు దానిమ్మలో రెండు రకాల జాతులు ఉంటాయన్నారు. ఒకటి పువ్వు వచ్చి, తరువాత కాయ వస్తుంది. మరోరకం పువ్వులే ఉంటాయి కాని, కాయలు ఉండవు. ఆ దాడిమీకుసుమం ఏ విధంగా పసుపు – ఎరుపుల కలయికతో ఉంటుందో అలాంటి వర్ణంతో అమ్మవారు ప్రకాశిస్తూ ఉంటారు. దానినే హిరణ్యవర్ణం అంటారు. దీనినే భావనోపనిషత్తులో **'లౌహిత్యమేతస్య సర్వస్య విమర్శః'** అని చెప్పారు. ఇవన్నీ 'విమర్శరూపిణీవిద్య' నామాల వరుసలో వస్తున్నాయి.

విమర్శము యొక్క రంగు ఎరుపు, ప్రకాశము యొక్క రంగు తెలుపు అని ముందు నుండి చెప్పుకుంటున్నాం. **'రక్త శుక్ల ప్రభామిశ్రం అతర్క్యంత్రైపురం మహః'** అని గురుపాదుకా ధ్యానం. రక్తశుక్ల ప్రభామిశ్రంలో ముందు విమర్శరూపిణీ అని చెప్పుకున్నాం. 'విమర్శరూపిణీ' అంటే ఎర్రని తల్లి. ఆ ఎర్రని తల్లి ఉపాసనా ప్రయోజనాలే 'కాలహన్త్రీ', 'సర్వవ్యాధిప్రశమనీ', 'సర్వమృత్యునివారిణీ' ఇత్యాదులు. ఆవిడ తత్త్వం 'అగ్రగణ్యా', 'అచింత్యరూపా'. ఆవిడ నామం 'కాత్యాయనీ'. ఆవిడరూపం 'తాంబూలపూరితముఖీ', 'దాడిమీకుసుమప్రభా'.

'అరుణా' అయిన తల్లే 'విమర్శరూపిణీ'. మొట్టమొదట చెప్పుకున్న ఆ తల్లిని ఇక్కడ స్మరించుకుంటున్నాం. శరీరమంతా అరుణవర్ణంగానే ఉంది. అమ్మవారి ఉపచారాల్లో ఏ ఉపచారము దేనికి సంకేతమో వివరిస్తున్న ఒక శాస్త్రముంది. అది దగ్గర పెట్టుకుని పూజ చేస్తే అదే నిజమైన అంతర్యాగం అయిపోతుంది. దానికి వస్తువులు అక్కరలేదు. ఇంట్లో కూర్చుని కూడా చెయ్యవచ్చు.

సాధారణంగా తాంబూల సేవనం నైవేద్యం అయ్యాక వస్తుంది. పదార్థములన్నీ లోపలికి వెళ్ళిపోయాక మిగిలేది. పదార్థాలు లోపలికి వెళ్ళడం అనే దానిని విజ్ఞానంతో

ఆలోచించాలి. నిజానికి తాంబూలం చివరిది. తరువాత వచ్చేది నీరాజనం. నీరాజనం అంటే సంపూర్ణ దర్శనం. ఈ సంపూర్ణదర్శనానికి పూర్వభాగం తాంబూలం. ఆ భావంతో అన్వయిస్తుంది మొత్తం శ్రీవిద్య. శ్రీవిద్య భావనావిద్య. భావన లేకపోతే శ్రీవిద్య ఫలించదు.

'భవానీ', 'భావనాగమ్యా' పరిశీలించాలి. భావన బలపడడం కోసం మనం చేసుకుంటున్న సాధన ఇది. 'తాంబూలపూరితముఖీ'లో ఒక అర్థం ఉంది. 'దాడిమీకుసుమప్రభా'లో మరొక అర్థం ఉంది. దాడిమీకుసుమమంటే అరుణవర్ణంతో ఉన్న తల్లి.

అమ్మ రూపం భావిస్తూ చేసే ధ్యానాన్ని ఈ నామాలలో పెట్టారు. 'తాంబూల పూరితముఖీ', 'దాడిమీకుసుమప్రభా' నామాలలో అమ్మవారి ముఖ వర్ణన, శరీర వర్ణన చెప్పారు. అమ్మవారు ఎరుపు, వేసుకొన్న తాంబూలం మరీ ఎర్రగా ఉంది. మొత్తం ఎరుపు అంతా భావనలోకి వచ్చేటప్పుడు సర్వారుణ కావాలి. ఆ సర్వారుణత్వం కొరకు రెండు ఎర్రదనాలు చూపిస్తున్నారు.

ఎరుపు అగ్ని వర్ణం. **'తామగ్నివర్ణాం తపసా జ్వలంతీం'** అని దుర్గాసూక్తం చెప్తోంది. అక్కడ అగ్నివర్ణమే హిరణ్యవర్ణాం. **'జాతవేదసే సునవామ..'** ఇది వైదికమైన భావం. ఆ యజ్ఞాగ్ని, జ్ఞానాగ్ని యొక్క తేజస్సే అమ్మవారు. యజ్ఞాగ్ని యొక్క తేజస్సు అంటే 'కర్మఫలప్రదాయినీ', జ్ఞానాగ్ని యొక్క తేజస్సు అంటే 'మోక్షప్రదాయినీ'. రెండూ అగ్ని తేజస్సులే. 'అగ్నివర్ణాం' అంటే 'దాడిమీకుసుమప్రభా' చూపించారు.

అంత అరుణవర్ణంతో ప్రకాశిస్తున్న తల్లిని పాదంతో చెప్పవచ్చు, కళ్ళతో చూపించవచ్చు, చెక్కిళ్ళతో వర్ణించవచ్చు కానీ ముఖంతోనే ఎందుకు చెప్పారంటే ముఖానికి, అగ్నికి సంబంధం ఉంది. ముఖాదగ్నిశ్చ - ముఖం అగ్నిస్థానం. **'ముఖమపిదహనో యస్యవాస్తేయమబ్ధిః'** అని విష్ణుసహస్రం.

'అగ్నిముఖావై దేవాః'. నోరు అగ్నికి సంకేతం. అమ్మవారి విరాట్ విగ్రహంలో నోటి స్థానం అగ్ని. నోటి నుండి వచ్చే పలుకులకి అధిదేవత అగ్ని. నోరు అగ్నిస్థానం. అగ్ని యొక్క ఎరుపుదనం చెప్తూ, దాని ప్రధానస్థానాన్ని వర్ణిస్తూ తాంబూలపూరితముఖీ

అని చెప్పడంలో విశేషం ఉంది. ఆ అగ్నివర్ణాన్ని శరీరమంతా చూపిస్తూ 'దాడిమీకుసుమప్రభా' అని వివరించారు.

'తాంబూలపూరితముఖీ' అంటే వాక్కుల యొక్క శక్తిని భావించడం ప్రధానం. అమ్మ వాగ్దేవత కనుక, వాక్కు అగ్నిమయం కాబట్టి రెండు భావనలు చెప్పారు. తాంబూలం గురించి ఉపాసనాశాస్త్రం చెప్తూ– **'అవస్థాత్రయ ఏకత్వాత్ తాంబూలం'** – అవస్థాత్రయాల ఏకత్వం తాంబూలం.

అవస్థాత్రయాల ఏకత్వం ఎప్పుడొస్తుంది? ఒక అవస్థలో ఇంకొక అవస్థ కలవదు. ఈ నామానికి 'విశ్వరూపా జాగరిణీ' నామ విశ్లేషణ అన్వయించవచ్చు.

జాగ్రదవస్థలో స్వప్నావస్థ కలవదు. స్వప్నావస్థలో సుషుప్తి కలవదు. మరి ఈ మూడింటి ఏకస్థితి అంటే అర్థం మూడు ముద్దయిపోవడం కాదు. ఆ మూడింటిలో ఏకంగా ఎవరు ఉన్నారో ఆ చైతన్యానికి జాగ్రత్ స్వప్నసుషుప్తులు లేవు.

చైతన్యం ఉంటేనే అవస్థ ఉంది. మూడింటిలో ఏకంగా ఉన్నది చైతన్యము. ఆ మూడింటిని తీసి చైతన్యాన్ని మాత్రమే చూడాలంటే తురీయ దశకి వెళ్ళాలి. 'తురీయా సర్వావస్థావివర్జితా' అని చెప్పారు. అది సర్వావస్థలు లేని స్థితి. మూడు అవస్థలు ఏకమైన స్థితి అని చెప్పడంలో అర్థం – మూడవస్థలలో ఏది ఏకమై ఉందో దానిని మాత్రమే చూడాలి అంటే మూడవస్థలు దాటి పోవాలి.

ఆ స్థితి సమాధి. ఆ సమాధిస్థితిలో అనుభవానికి వచ్చేది తురీయభూమికలో వచ్చే తల్లి. మూడు అవస్థలలో ఏదీ తురీయభూమికలో ఉండదు.

తాంబూలం లక్షణం పరిశీలిస్తే దాంట్లో తమలపాకు, సున్నము, వక్కలు, ఇంకా అనేక రకాల సుగంధద్రవ్యాలు వేస్తారు. వాటిల్లో వేసేవేవి ఎర్రగా ఉండవు. ఇన్ని విడివిడి పదార్థాలు ఒక్కటిగా ఆ అగ్ని ముఖమైన అమ్మలోకి వెళ్ళి ఏకమైపోయాయి. ఆ ఏకం ఎరుపు రంగు. ఆ ఎరుపు అమ్మవారు. విడివిడిగా ఉన్న భౌతిక పదార్థాలు అమ్మలోకి ప్రవేశించగానే అవన్నీ కూడా అమ్మ అయిపోయి 'సోహం' భావం వచ్చింది. ఆ విమర్శరూపంలో ఐక్యం అయిపోయాయి. ఆ అవస్థాత్రయ ఏకత్వమే తాంబూలం.

అమ్మవారికి తాంబూలం సమర్పించినపుడు మనకి ఈ భావన కలగాలి. కొందరు అమ్మవారి విద్యని రాజసవిద్యగానే ఉపాసన చేస్తారు. డాంబికంగా చూపించడమే ప్రధానమౌతుంది. తాత్త్వికముగా వెళ్తే తాంబూలతత్త్వం ఎంత గొప్పదో తెలుస్తుంది.

'అవస్థాత్రయ ఏకత్వాత్ తాంబూలం' అని శాస్త్రం చెప్పడంలో అసలైన అంతరార్థం ఇది. **'లౌహిత్యమేతస్య సర్వస్య విమర్శః'** అనే భావనోపనిషత్తు వాక్యం కూడా ఇక్కడ అన్వయింపబడుతోంది. దీని కోసం ముందుగానే 'భవానీ, భావనాగమ్యా' అని చెప్పారు.

'తాంబూలపూరితముఖీ' అనగానే ముఖం ధ్యానంలోకి వచ్చింది. శరీరవర్ణమంతా 'దాడిమీకుసుమప్రభా' ద్వారా వర్ణించారు.

561. మృగాక్షీ – శ్రీ మృగాక్ష్యై నమః

అమ్మవారికి లేడి కన్నులు లాంటి కన్నులు ఉన్నాయి. సాధారణంగా అందమైన కళ్ళని హరిణాక్షీ, మృగాక్షీ అంటారు. లేడి కళ్ళకు మూడు లక్షణాలు ఉంటాయని శాస్త్రం చెప్తున్నది. ఒకటి విశాలత్వం, రెండవది చంచలత్వము, మూడవది జాగరితము. మూడు లక్షణాలున్న కళ్ళని హరిణాక్షీ అనాలి. ఇదంతా అమ్మవారి చక్కటి రూపవర్ణన.

విశ్వంలో ఉన్న ప్రత్యణువుని ఈక్షించే కన్నులవి. సృష్టిలో అన్ని కాలాలని, అన్ని దేశాలని, అన్ని వస్తువులని నిరంతరం సాక్షిగా చూస్తోంది కనుక విశాల నేత్రములు.

చంచలంగా చూస్తోంది. అటూ ఇటూ చూసేటపుడు కళ్ళు తిరుగుతుంటాయి. ఆవిడ నేత్రలుగా చెప్పబడే సూర్యచంద్రులు ఎక్కడికైనా కాంతులు ప్రసరిస్తూ ఉంటారు. అహోరాత్రులు తిరుగుతూ ఉంటారు అదే చంచలత్వం. 'లోలాక్షీ' వంటి నామలను ఇక్కడ స్మరించవచ్చు.

జాగరికత్వం అంటే ఆవిడ కళ్ళు తెరచుకొని మనల్ని గమనించుకుంటూ

ఉన్నాయి. ఆ తల్లి కనులు మూస్తే ఇంక లోకాలు లేవు. సూర్యుడు ఎప్పుడైనా మూసుకున్నాడా? తెరచిన కన్ను సూర్యుడు.

దివీవ చక్షురాతతం –

మనం నిద్రపోతామని మరో చోట ఉదయిస్తున్నాడు కాని, ఆయనకి అస్తమయం లేదు. అమ్మ నేత్రం కనుక జాగరిత లక్షణం వచ్చింది. అమ్మ నేత్రమే సూర్యుడు. ఇది తెలుసుకుంటే రోజూ అమ్మ కన్నులను మనం చూస్తున్నట్లే.

విశాలత, చంచలత, జాగృతి అనే మూడు లక్షణాలతో జగత్తుని గమనించుకుంటోంది గనుక మృగాక్షీ.

మహాత్రిపురసుందరి కనుక సాముద్రిక శాస్త్రం ప్రకారం ఉండవలసిన సల్లక్షణం 'మృగాక్షీ'. ఇందులో రూపవర్ణన, తత్త్వభావన – రెండూ మననం చేసుకోవాలి. తరువాతి నామం 'మోహినీ'.

562. మోహినీ – శ్రీ మోహిన్యై నమః

అమ్మవారి స్వరూపమే మోహినీ. మోహినీ అనే మాట రెండు విషయములలో ఉంది. జగత్తుని చూసి మోహితులౌతుంటారు. ఒకటి చూసి మరొకటి మర్చిపోతే మోహం. లోకాన్ని చూస్తూ లోకేశ్వరుని మరచిపోతే అది అజ్ఞానజనిత మోహం. అమ్మ దివ్యసౌందర్య భావనలో లీనమై ప్రపంచాన్ని మరచిపోవడం పనికి వచ్చే మోహం.

కృష్ణపరమాత్మకి జగన్మోహనుడని పేరు. ఆయన అవతారమే మోహనావతారం. ఆయనను చూస్తూ ప్రపంచాన్ని మరచిపోయారు గోపికలు. ఆయనను మోహిస్తే మోహం పోతుంది. లోకాన్ని మోహిస్తే మోహం పెరుగుతుంది.

ఎవరిని మోహిస్తే మోహం క్షయమవుతుందో వారిని మోహిస్తే మోక్షమే. ఎవరిని మోహిస్తే మరింత జన్మపరంపరలలో దిగుతామో వారిని మోహిస్తే ప్రమాదమే. లోకాన్ని మోహిస్తే అది అజ్ఞానం. ఈశ్వరుని మోహిస్తే అది భక్తి. మరి భక్తులందరూ ఈశ్వరుని మోహించినవారే. 'సదా పశ్యంతి సూరయః' – వారు ఎప్పుడూ పరతత్త్వాన్ని

చూసి మోహితులవుతారు. అందుకే జగన్మోహనుడని స్వామివారి పేరు. జగన్మోహిని ఈవిడ పేరు. 'అశేషజనమోహినీం అరుణమాల్యభూషాంబరాం'. ఈ ప్రపంచంలో అందరినీ మోహింపజేస్తున్న శక్తి అమ్మవారే.

జ్ఞానం ఉండి వైరాగ్యం ఉంటే మంచిదే. జ్ఞానం లేని వైరాగ్యం వస్తే చాలా ప్రమాదం. హఠాత్తుగా ఇవి అన్ని నశించిపోయేవే, ఏవీ మిగలవు అని అనిపిస్తే వారు ఎంతో మానసిక ఆందోళనకి గురౌతారు. దాని కంటే ఇవన్నీ సత్యమనే మాయలో బ్రతికితే కనీసం రోగం లేకుండా ఉంటారు. వివేకవైరాగ్యమని చెప్పారు. ఒకదానిని సత్యమని తెలుసుకుని వేరొకదానిని అసత్యమని తెలుసుకుంటే, లేదా ఒకదాన్ని అసత్యమని నిరసిస్తూ సత్యాన్ని తెలుసుకుంటే దానికి ప్రయోజనం ఉంది. ఆధారం ఉంటుంది.

అమ్మ మోహం పెట్టకపోతే ప్రపంచం నడవదు. దీనికి ఉదాహరణలు అనేకమార్లు చెప్పుకున్నాం. ఎవరికెవరు ఏమౌతారనుకొని అప్పుడే పుట్టిన పిల్లవానిని కన్నతల్లి వదిలేస్తే ఆ పిల్లవాని బ్రతుకేమైపోవాలి? మరి అలాంటప్పుడు మోహం ఉండాలా, లేదా?

మోహం గురించి 'దేవీమాహాత్మ్యం'లో అద్భుతమైన వృత్తాంతాన్ని వ్యాసభగవానుడు అందించాడు. రాజ్యం అన్యుల ఆక్రమణకి గురియై శత్రువుల చేతిలో నుండి తప్పించుకు వచ్చిన సురథుడు, పిల్లలచేత గెంటివేయబడిన సమాధి ఇద్దరూ అడవులపాలై సుమేధ మహర్షి ఆశ్రమానికి చేరుకొని ఆయనను అత్యంతవినయంగా అడుగుతున్నారు. "అయ్యా! కూడబెట్టుకున్నది ఏది మాతో రాదని తెలుస్తోంది. శరీరమా ఆయువు అయిపోయింది. కూడబెట్టుకున్నదంతా తీసుకుని మెడపట్టి బయటకి గెంటేసినప్పటికీ పిల్లల మీద మమకారం పోవడం లేదు. అంతా పనికిరానిదని తెలిసి కూడా హాయిగా విడిచి పెట్టి ఉండలేకపోతున్నాం. కారణం చెప్పమ"ని సమాధి ప్రార్థించాడు. "పోయిన రాజ్యంపై మమకారం వదలడంలేద"ని సురథుడు వాపోయాడు. ఇది ఆలోచించవలసిన అంశం. పెద్ద ప్రశ్న ఇది. మనం ఎప్పుడూ వేసుకోని ప్రశ్న, వేసుకోవలసిన ప్రశ్న. వేసుకుంటే సమాధానం దొరికితే,

మోక్షం పొందే ప్రశ్న.

సుమేధ మహర్షి వారికి అక్కడ ఒక చెట్టుపై గూట్లో ఉన్న కొన్ని పక్షి పిల్లలను చూపిస్తుండగా, అంతలో తల్లి పక్షి వచ్చి వాటిని పోషిస్తోంది. "ఇదేగా మీరూ చేసే పని" అన్నాడు. పక్షికి ఆ పిల్లలు పుట్టేవరకు వారెవరో తెలియదు. తన నుండి అండము రాగానే పిల్ల అయ్యింది. పక్షికి నాది అనే భావం కలిగిందంటే ఏదో ఒక శక్తి జగత్తుని నడిపిస్తోందని అర్థమౌతోంది. మనలో, ప్రతి జంతువులో ప్రేమ ఉంది. ఆ ప్రేమని వ్యాపింప చేసిందెవరు? ఆవిడే అశేషజనమోహినీ అయిన అమ్మవారు. ఆవిడ అలా లేకపోతే జగత్తు నడవదు.

మరి మోక్షమెలాగ? అని మనకి నిజంగా సంకల్పము కలిగితే తగిన సాధన చేసి యోగ్యుడనిపించుకుంటే (అమ్మకి అనిపిస్తే) అప్పుడు ఆవిడ మనకి తప్పకుండా మోక్షం ఇస్తుంది. అంతవరకు ఈ ప్రపంచంలో త్రిప్పుతూనే ఉంటుంది. లేకపోతే ప్రపంచం నడవదు.

'సర్గస్య రక్షణార్థాయ తస్మై మోహాత్మనే నమః' (మహాభారతం) – ప్రపంచాన్ని రక్షించడం కోసం ఆ మోహరూపంలో అమ్మయే వ్యాపించి ఉంది. ఎరుక కలిగిన వారిని నువ్వు పండిపోయావురా అని తనలోకి తీసుకొంటుంది. ఈవిధంగా అశేషజనమోహినీ. ఇక్కడ మోహినీ అవతారం విష్ణువు కాదు... అమ్మవారే.

బ్రహ్మాండపురాణంలో అమ్మవారికి మూడు అవతారాలు ఉన్నాయని చెప్పారు.

ఆదౌ ప్రాదురభూచ్ఛక్తిః బ్రహ్మణో ధ్యాన యోగతః

ప్రకృతిర్నామ సా ఖ్యాతా దేవానాం ఇష్టసిద్ధిదా

అమ్మవారి మొదట స్వరూపం ప్రకృతి. రెండవది –

సర్వ సమ్మోహజనకం అవాఙ్మానసగోచరం

ద్వితీయముదభూద్రూపం ప్రవృత్తే అమృతమంథనే

అమృతం కోసం క్షీరసాగర మథనం చేసినప్పుడు సర్వసమ్మోహజనకమై ఇలా ఉంటుందని వర్ణించడానికి వీలులేనంత అందంగా **'యద్దర్శనాదభూదీశః సర్వజ్ఞోపి విమోహితః'** – అందమైన మోహినీరూపం ధరించి వచ్చింది. శివుని సైతం మోహింప

జేసిన రూపం. ఆ అమృతం పంచిన మోహినీరూపం అమ్మవారి రెండవ స్వరూపం. భండాసురుని సంహరించడానికి చిదగ్నికుండము లోంచి వచ్చినది లలితాదేవి మూడవ స్వరూపం. ఈ మూడు స్వరూపాలు అమ్మవారివే.

మొదటిది ప్రకృతి. ప్రకృతి అంటే మూలప్రకృతి. సర్వజగత్తుని నిర్మించడానికి మూలమైన శక్తి ప్రకృతి. ప్రకృతి అని పేరు ఒక్కటి చెప్పారుగాని ప్రకృతిలో ప్రధానంగా ఐదు రూపాలు ఉంటాయి. అవి దుర్గ, లక్ష్మి, సరస్వతి, గాయత్రి, రాధ. ఇవి ఎప్పుడూ ఉంటాయి. అప్పుడప్పుడు జగత్తుకి రాక్షస బాధలు వచ్చినపుడు ధరించి వచ్చే రూపాలే 'మోహినీ', ఆ తరువాత వచ్చిన 'లలిత'.

క్షీరసాగర మథన సమయంలో వచ్చినది మోహిని. జగన్మోహిని అనగానే అందరినీ మాయలో ముంచేసింది అనిపిస్తుంది. ఆవిడేమీ మాయలో ముంచలేదు. ఆ తల్లే అమృతము ఇచ్చింది. దీనిని దేవతలవైపు నుండి ఆలోచించాలి. మనం అసురలవైపు నుంచి చూస్తే మోసం చేసిందని అంటాం. దేవతల వైపు నుండి చూస్తే "అబ్బా! అమృతమిచ్చింది" అంటాం.

జగన్మోహినీ రూపం ధరించిన తల్లిని ధ్యానిస్తే ఒక చేతిలో అమృత కలశం, మరొక చేతిలో గరిట పట్టుకుని వడ్డిస్తున్న జగన్మోహిని మనకు సాక్షాత్తు అన్నపూర్ణమ్మగా కనిపిస్తుంది. దేవతల దృష్టిలో ఆవిడ జగన్మాత. అసురుల దృష్టిలో మోహినీ. ఈ జగత్తు అంతా అమ్మరూపమే. ఇక్కడే యోగులు, భక్తులు తిరుగుతున్నారు. భోగులు, దుర్మార్గులు కూడా ఇందులోనే సంచరిస్తున్నారు. అందరికీ ఇదే ప్రపంచం. వారు ప్రపంచాన్ని ఎలా చూస్తున్నారో, ఇతరులు ఎలా చూస్తున్నారో పరిశీలించాలి. వారికి ఈ ప్రపంచం జగన్మాతగా, జగన్నాథునిగా దర్శనమిస్తోంది. ఇతరులకి ఈ ప్రపంచం జగన్మోహినిగా కనబడుతోంది.

రాక్షసులందరూ అమృతం గురించి మర్చిపోయి ఆ మోహినీ విలాసాన్ని చూస్తూ కూర్చున్నారు.

విషయాకర్షణలకు మోహితులైన అసుర ప్రవృత్తులకు అమృతం వడ్డించదు. జగత్తు సాక్షాత్తు జగన్మాతృరూపమని భావించేవారికి అమృతము వడ్డిస్తుంది.

దైవీగుణములు ఎవరికి ఉన్నాయో వారికి ఈ జగత్తు జగన్మాతగా దర్శనమిచ్చి అమృతమైన మోక్షాన్ని ప్రసాదిస్తుంది. అమృతమైన జ్ఞానాన్ని ఇస్తుంది. ఆసురీ గుణాలు ఉన్నవారికి ఈ జగత్తు మోహినిగా మరింత మోహంలో ముంచి చూపిస్తుంది.

అమ్మవారు మనకి అమృతం వడ్డించాలంటే జ్ఞానంగాని, మోక్షంగాని, అనుగ్రహంగాని ఇవ్వాలంటే ఆవిడని జగన్మాతృ భావనతో చూడాలి. మాయా విలాస నటనల్లో పడరాదు. అది జగన్మోహినీ నామంలో ఉన్న భావం.

ఇది అమ్మవారి రెండవ అవతారంగా చెప్పడంలో ఋషి హృదయాన్ని అర్థం చేసుకోవాలి. విష్ణువుకి, శక్తికి భేదము లేదనే చూపిస్తున్నారు. శక్తిపూజ లేకుండా శివపూజ చేయకూడదు అంటే విష్ణువు లేకుండా శివుడు లేడు, శివుడు లేకుండా విష్ణువు లేడని చెప్పడమే. విష్ణువు యొక్క స్త్రీ రూపాన్ని ఉపాసిస్తే దాని పేరు శ్రీవిద్య. ఇదంతా విష్ణు సహస్రమే.

అమ్మవారికి, శివునికి భేదం లేదు కదా అంటే అందుకే విష్ణువునకు, శివునినకు భేదం లేదు. 'కమలాక్షనిషేవితా' తరువాత 'మోహినీ' రావడంలో ఉన్న ఔచిత్యం పరిశీలిస్తే 'తాంబులపూరితముఖీ', 'దాడిమీకుసుమప్రభా' అయిన తల్లి 'మోహినీ'. అంటే మోహినీరూపం అమ్మవారిది. ఆ రూపాన్ని విష్ణువు ధరించారు. ఇప్పుడు 'హరిస్త్వామారాధ్య' అంటే కమలాక్షనిషేవితా, 'ప్రణతజనసౌభాగ్యజననీం' అంటే మోహినీ నామం వశిన్యాది వాగ్దేవతలు ఎంత ఔచితీమంతంగా కూర్చారో తెలుస్తుంది.

563. ముఖ్యా – శ్రీ ముఖ్యాయై నమః

ముఖ్యస్వరూపిణి. ముఖ్యము అంటే ప్రధానము. ఈ జగత్తంతటికి ఆవిడే ప్రధానం. మూలవస్తువు. తరువాతే ఈ ప్రపంచము. అంతేకాదు. ఈ ప్రపంచం అంతా కలసి ఒక మంద అనుకుంటే దీనిలో లెక్క పెట్టదగ్గ వస్తువు అమ్మవారు ఒక్కరే. మన శరీరంలో ముఖ్యప్రాణము. ముఖ్యమైన ఆత్మ. ముఖ్యమైనది అంతా అమ్మవారు. 'అహమస్మి ప్రథమజా ఋతస్స' – సృష్టిలో మొదట వ్యక్తమైనది తానేనని 'దేవీసూక్తం'.

ముఖము అంటే నోరు. ముఖ్య అంటే నోటి నుండి వెలువడిన వాగ్దేవత అని మరొక అర్థం.

564. మృడానీ - శ్రీ మృడాన్యై నమః

విష్ణువు అనగానే సత్త్వగుణం. సత్త్వగుణంతో కూడిన శివశక్తికి మృడ అని పేరు. **'జన సుఖకృతే సత్త్వోద్రిక్తౌ మృడాయ నమో నమః' –** (శివమహిమ్నః స్తుతి) – జనులకు సుఖం కలిగించడం 'మృడ' లక్షణం. 'కమలాక్షనిషేవితా' విద్యకి మృడస్వరూపం అనుబంధం. మృడ అనే శబ్దానికి అర్థం ఆనందము, అందరికీ ఆనందం ఇచ్చేవాడని అర్థం.

గోకర్ణానికి దగ్గరగా 'మృడేశ్వర' అనే క్షేత్రం ఉంది. శివునికి ఉన్న పేర్లలో మృడనామం ఒకటి. ఇందులో అద్భుతమైన మంత్ర రహస్యం దాగి ఉన్నది.

'యాతే రుద్ర శివా తనూ శివా విశ్వస్య భేషజీ శివా రుద్రస్య భేషజీ తయానో మృడ జీవసే'

ఇది చాలా చమత్కారమైన మంత్రం. హే రుద్రా! నీ యొక్క శివా తనువు... అనగా నీ మంగళకరమైన తనువు ఈ లోకానికి ఔషధం వంటిది. తిరిగి బ్రతికించగలదు, రక్షించగలదు. రక్షించే నీ స్వరూపము 'శివా' తనువు. నీ మంగళకరమైన తనువు. అది అఘోరం. సమస్తమునకు ఔషధం వంటిది.

'తనూ' శబ్దం స్త్రీ లింగం 'శివా' అని వేదమంత్రం దీర్ఘం చెప్తున్నారు. శివా అంటే అమ్మవారు. కానీ మంగళకరమైన శరీరము అనే అర్థంలో కూడా చెప్పుకోవచ్చు. రుద్రుని యొక్క 'శివా తనువు' అంటే స్త్రీ రూపమైన లలితా రూపము ఉన్నదే అది 'విశ్వస్య భేషజీ' – సమస్తమును రక్షించే ఔషధ స్వరూపము – అని కూడా అర్థం చెప్పవచ్చు.

తయానో మృడ జీవసే – ఓ మృడా! దాని వల్లనే మేము జీవిస్తున్నాము. ప్రపంచాన్నంతటిని జీవింపచేసే ఈశ్వరుని యొక్క శివా తనువు ఏదైతే ఉందో అదే మృడా అని చెప్పబడుతున్నది. మృడుని యొక్క శక్తి గనుక మృడానీ. ఆనంద స్వరూపిణి.

565. మిత్రరూపిణీ – శ్రీ మిత్రరూపిణ్యై నమః

అమ్మవారు ఎప్పుడూ మిత్రరూపిణి. ఎవ్వరి పట్ల శత్రుత్వం అనేది ఉండదు. సహజంగా మిత్రురాలు. ఈ మాటని కృష్ణపరమాత్మ గీతలో చెప్పాడు.

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోక మహేశ్వరం
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి

"అందరికీ నేను మిత్రుడనని ఎవరు తెలుసుకుంటున్నారో వారు శాంతిని పొందుతారు." పరమాత్మ అందరికీ స్నేహితుడే. ఆయన మిత్రత్వం తెలుసుకోవాలి.

మిత్రుడు అంటే లోకానికి హితం కలిగించేవాడు. కొందరు మనకి బాధ కలిగించాడు దేవుడు అని అనుకుంటారు. అవి కూడా హితం కోసమే అని అనుకోవాలి. మిత్రుడు ఎప్పుడూ హితం కోసమే చెప్తాడు.

దీనినే సఖ్యాసక్త భక్తి అంటారు. సఖ్యాసక్త భక్తిలో, 'తనకి ఏది జరిగినా అది భగవంతుడు తన మంచి కోసం చేశాడ'ని అనుకుంటారు. అటువంటి వారు భగవంతుని దూషించరు. కష్టం వచ్చినా, 'భగవంతుడు ఎందుకో మంచికే ఇచ్చి ఉంటాడులే, నా గురించి నా కంటే ఆయనకే ఎక్కువ తెలుసు' అనుకుంటారు. అలా అనుకున్న వానిని భగవంతుడు తప్పకుండా ఎప్పుడూ కనిపెట్టుకుని ఉంటాడు. కారణం వారికేదొచ్చినా "నేను ఇచ్చాననే అనుకుంటున్నారు కనుక వారికి మంచే చెయ్యాల"ని భగవంతుడు అనుకుంటాడు.

ప్రపంచంలో అందరికి ఆయన సుహృత్. ఎప్పుడూ మంచే కోరతాడు. మిత్రునికి కొన్ని లక్షణాలు ఉంటాయని భర్తృహరి చెప్తూ –

పాపాన్నివారయతి యోజయతే హితాయ
గుహ్యం నిగూహతి గుణాన్ ప్రకటీ కరోతి
ఆపత్సుచైవ న జహాతి దదాతి కామాన్
సన్మిత్రలక్షణమిదం ప్రవదంతి సంతః

మిత్రునికి ఉండాల్సినవి ఆరు లక్షణాలు. ఇవి ఉంటేనే మిత్రుడు అని చెప్పాలి.

1. **పాపాన్నివారయతి** – మొట్టమొదట మనల్ని పాపం చెయ్యకుండా ఆపాలి.

మన చేత తప్పు చెయ్యకుండా గమనించుకోవాలి.

2. **యోజయతే హితాయ** – మనకేది హితమో, ఏది మేలు చేస్తుందో దానిని మనచేత చేయించాలి.

3. **గుహ్యం నిగూహతి** – మన రహస్యాలను కాపాడాలి. ఎవరి దగ్గరైనా తప్పులుంటాయి కాని, తన మిత్రుని తప్పులు బయట పెట్టకూడదు. అవి బయట పెడితే మిత్రునికి అపకీర్తి వస్తుంది. అందుకే బాహాటపరచకూడదు. మిత్రునికి మంచి గుణముంటే నలుగురిలో చెప్పాలి. అమ్మవారు తన భక్తునిలో ఏదైనా దోషం ఉంటే ఆ భక్తుని అంతరంగంలో ఉంటూ హెచ్చరిస్తూ బాగు చేస్తుంది. అంతేకాని భక్తుని అవగుణాలన్ని బయటపెట్టి అపకీర్తి తీసుకురాదు.

4. **గుణాన్ ప్రకటీ కరోతి** – వారి మంచి గుణాలని బయటకి చూపిస్తుంది. అంత విషాన్ని చిన్నగా చేసి లోపల దాచేశాడు శివుడు. చిన్నగా ఉన్న చంద్రవంకని మాత్రం బయట పెట్టి చూపిస్తున్నాడు. అలాగ తన భక్తుని దగ్గర కొద్దిపాటి గుణం ఉంటే దానిని నెత్తికి ఎక్కించుకుని చూపిస్తాడు, ఎంతో దోషం ఉన్నా లోపల నిగ్రహించేస్తాడు పరమాత్మ. ఎంత దయామయుడో గమనించాలి.

5. **ఆపత్సుచైవ న జహాతి** – ఆపదలు వచ్చినప్పుడు అసలు విడిచిపెట్టదు. గజేంద్రుని మొసలి పట్టినప్పుడు సాటి ఏనుగులన్నీ ఒడ్డుకు వెళ్ళిపోయాయి. అలాంటి వారు బంధువులు కారు. మిత్రులు కారు. అమ్మ మన అసలు చుట్టం.

6. **దదాతి కామాన్** – ఎప్పుడు ఏది అవసరమో అది ఇస్తుంది.

ఆరు లక్షణాలు ఒకసారి చూస్తే – 1. పాపాలు పోగొడుతుంది. 2. ఏది హితమో అది చేయిస్తుంది. 3. గుహ్యములైనవి దాచిపెడుతుంది. 4. మంచి గుణాలని బయట పెడుతుంది. 5. ఆపదలు కలిగినప్పుడు విడిచిపెట్టదు. 6. వారికి కావలసినవి ఇస్తుంది. ఈ ఆరు లక్షణాలు కలవారిని సన్మిత్రులు అనాలి. ఈ ఆరు లక్షణాలు అమ్మవారి దగ్గర పుష్కలంగా ఉన్నాయి. మనలను ఎల్లవేళలా ఆ విధంగా కాపాడుకుంటుంది కనుక 'మిత్రరూపిణీ'.

ద్వాదశాదిత్యులకి ఒక లెక్కలో మిత్ర, రవి, సూర్య, భాను, ఖగ, పూష,

హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య, సవితా, అర్క, భాస్కరులనే నామాలు ఉన్నాయి. మిత్రరూపిణీ అంటే మిత్రుడు మొదలుగా గల ద్వాదశాదిత్య రూపాలతో ఉన్న తల్లి. ఆదిత్య మండలంలో ఉన్న జగదంబ. విమర్శరూపిణి అయిన విద్యయే మిత్రరూపిణి అనగా ఆదిత్యరూపిణి.

ఆరు మిత్ర లక్షణాలు ఆదిత్య భగవానునికి కూడా ఉన్నాయి. అందుకే ఆదిత్యుని శివుడని, విష్ణువని, అమ్మ అని 'భానుమండలమధ్యస్థా'గా ఎవరు ఆశ్రయిస్తారో వారిని ఆ మండలం లోంచే అమ్మవారు కాపాడుతున్నారు.

మిత్రరూపిణికి ఉన్న రెండురకాల భావాలు చెప్పుకున్నాం. 1. సర్వజీవులను మిత్రుని వలె అనుగ్రహించే తల్లి. దీనిని గీతలో చెప్పిన వాక్కుతో సమన్వయించుకున్నాము.

2. మిత్రరూపిణి అంటే మిత్రాది ద్వాదశాదిత్యరూపిణి. మిత్రుడనేవాడు దినాభిమానదేవత. కనుకనే ప్రాతఃకాలంలో మిత్రోపస్థానంతోనే సంధ్యావందనం చేస్తారు. మిత్రరూపిణి అంటే సంధ్యాస్వరూపిణి అయిన అమ్మవారుగా భావన చెయ్యాలి.

తరువాత నామాలు – 'నిత్యతృప్తా, భక్తనిధిః, నియంత్రీ, నిఖిలేశ్వరీ'. ఈ నామాలలో పరతత్త్వస్వరూపిణి అయిన అమ్మవారి వైభవాన్ని వివరిస్తున్నారు.

566. నిత్యతృప్తా – శ్రీ నిత్యతృప్తాయై నమః

ఏ వాంఛా లేని పరిపూర్ణురాలు. ఆనందస్వరూపిణి. అమ్మవారు ఎల్లవేళలా తృప్తిగా ఉంటారు. తృప్తి అనేది బయట వస్తువుల నుండి వచ్చేదే అయితే ఒకప్పుడు ఉంటుంది, ఒకప్పుడు పోతూ ఉంటుంది. ఆ వస్తుసంయోగంలో తృప్తి ఉంటుంది, వస్తువియోగంలో అసంతృప్తి ఉంటుంది. తృప్తి అనేది ఆత్మ విషయం. స్వయంగా సచ్చిదానందస్వరూపిణి అయిన అమ్మవారు కేవలం బ్రహ్మానందరూపిణి గనుక 'నిత్యతృప్తా'. నిత్యతృప్తి అనేది అమ్మవారి ప్రధాన స్వరూపం.

567. భక్తనిధిః - శ్రీ భక్తనిధయే నమః

భక్తులకు నిధి వంటిది. నిధి అంటే అక్షయ సంపద. అన్నీ దేని యందు ఉంటాయో అది నిధి. సర్వభక్తులు ఏ తల్లిని ఆశ్రయించి ఉన్నారో ఆ తల్లి భక్తనిధి. భక్తులకి తరగని సంపద అమ్మవారు. భక్తులైనవారు అమ్మవారి వల్ల సంపదలు ఆశించరు. అమ్మవారే సంపద అనుకుంటారు. ఈ నామం మరింత అర్థం కావాలంటే 'నిధి చాల సుఖమా రాముని సన్నిధి సేవ సుఖమా' అనే త్యాగరాజస్వామివారి కీర్తన స్ఫురణకు తెచ్చుకోవాలి. రామ సన్నిధే నిధి. అమ్మవారే ఒక నిధి అని భక్తులు తెలుసుకుంటారు. అది భక్తనిధి మాటలో ఒక అర్థం.

అంతే కాదు, అమ్మవారిని ఆశ్రయించిన వారికి అన్ని సంపదలు అక్షయంగానే లభిస్తాయి కనుక భక్తనిధి అని మరొక భావం.

భక్తనిధికి మరొక అద్భుతమైన భావన కూడా ఆవిష్కరించవచ్చు. భక్త అనే శబ్దానికి శాస్త్రపరమైన అనేక అర్థాలు ఉన్నాయి. భక్త అంటే భక్తులు. భక్తము అంటే భాగము అని ఇంకొక అర్థం ఉంది. 'భక్తిప్రియా'కి పాఠాంతరంలో 'భక్తప్రియా' కూడా ఉంది. భక్తులు అంటే ప్రీతి కలిగినది అని అర్థం చెప్పుకున్నాం. కొన్ని చోట్ల కొంతమంది మరొక వ్యాఖ్యానం కూడా చెప్పారు. భక్తము అంటే భాగము. సామవేద గానాల్లో కొన్ని పద్ధతులున్నాయి. దీనినే **'ఓమిత్యుద్గీథ భక్తేరవయవపదవీం...'** అని అప్పయదీక్షితులవారు ఆదిత్యస్తోత్రరత్నంలో చెప్పారు. సామగానాలలో రకరకాలైన పద్ధతులకి భక్తములని పేరు. **భక్తప్రియా** అంటే **సామగానప్రియా** అనే అర్థం తీసుకుని వ్యాఖ్యానం చెప్పారు.

భక్తము అంటే భాగమని అర్థం తీసుకుంటే ఈ ప్రపంచమంతా భాగాలుగానే కనిపిస్తోంది. చతుర్వింశతి తత్త్వాలతో కూడిన ప్రకృతి అంతా భాగాలే. భాగాలుగా ఉన్న ఈ ప్రపంచానికి నిధి వంటిది. ఆధారస్వరూపమై ఉన్నదనే అర్థంలో కూడా చెప్పుకోవచ్చు. ఈ నామం తరువాత నామాలకి అనుబంధము.

నిత్యతృప్త స్వరూపురాలు కనుక భక్తుల పాలిట పెన్నిధి అని కూడా చక్కగా ఉన్నది.

568. నియంత్రీ – శ్రీ నియంత్ర్యై నమః

నియంత్రీ అంటే నియమించే శక్తి. ఎవరిని నియమిస్తుందనేది ప్రత్యేకించి చెప్పలేదు కనుక సర్వులను నియమించే తల్లి

'సర్వాన్ స్వేషు స్వేషు కృత్యేషు వ్యవస్థాపయతీతి నియంత్రీ' – సృష్టిలో ప్రతివారిని వారివారి కృత్యములందు నియమిస్తున్నది ఆ తల్లి అని అర్థం. దేవగణాలయందు వసు రుద్ర ఆదిత్యులు, పితృగణాలయందు అగ్నిష్వాత్తులు, బర్హిషదులు మొదలైన సర్వజీవులను వారివారి స్థితులలో నియమించేది ఆ తల్లి. ఆవిడ పెట్టే నియామకాన్ని అనుసరించి పంచభూతాలు కూడా ప్రవర్తిస్తూ ఉంటాయి. సర్వ ప్రకృతిని, విశ్వాన్ని కూడా వాటి వాటి కృత్యాలయందు నియమించే తల్లి.

569. నిఖిలేశ్వరీ – శ్రీ నిఖిలేశ్వర్యై నమః

అన్నింటికి శాసకురాలుగా ఉన్నది. నిఖిలము అంటే సమస్తము. సమస్తమైన భువనాలకు ఈశ్వరీ. నియంత్రీ, నిఖిలేశ్వరీ – రెండు కూడా అమ్మవారు 'పరమేశ్వరి' అనే విషయాన్ని తెలియజేస్తున్నాయి. 'నిత్యతృప్తా' అనే మాట ఆవిడ యొక్క పరతత్త్వస్వరూపాన్ని ప్రతిపాదన చేస్తున్నది. తరువాతి నామం 'మైత్ర్యాదివాసనాలభ్యా'.

ఇవన్నీ సాధకులకి ముఖ్యమైన నామాలు. సిద్ధి ఏదో అది చెప్తూనే సాధన గురించి కూడా ఇక్కడే చెప్తున్నారు. అమ్మవారి సాధన అంటే మంత్రం పుచ్చుకుని జపం చెయ్యడం మాత్రమే కాదు. ఆధ్యాత్మికసాధన అంటే ఒక రోజు మొత్తం మీద ఒక గంటో, రెండు గంటలో, ఐదు, ఆరు గంటలో చేసే అనుష్ఠానం మాత్రమే కాదు. మన యొక్క మొత్తం ప్రవర్తన కూడా ఆధ్యాత్మిక సాధనయే. ప్రొద్దుట లేచిన దగ్గర నుండి తిరిగి నిద్రపోయే వరకు మన యొక్క ప్రవర్తన అంతా ఆధ్యాత్మిక సాధన కావలసినదే. దేవుని మందిరంలో చేసేది మాత్రమే కాకుండా మన నిత్యజీవన సరళిలో మనం ఎలా ఉంటామో అనేది మన సాధనకి ప్రధానమైన అంశం.

ధర్మబద్ధమైన సంపాదనని ధర్మానికి వినియోగించడం, అలాగే మానవ సంబంధాలు ఎలా ఉండాలో ఇత్యాదులన్నీ ఆధ్యాత్మిక ప్రగతితో అనుబంధం కలిగి ఉంటాయి. మానవ సంబంధాలెలా ఉండాలో తరువాత నామంలో చెప్తున్నారు.

570. మైత్ర్యాదివాసనాలభ్యా - శ్రీ మైత్ర్యాదివాసనాలభ్యాయై నమః

ఈ మైత్ర్యాది వాసనలతో ఉంటేనే అమ్మవారు లభిస్తున్నారు. పుణ్యలభ్యా, భక్తిగమ్యా, భక్తిప్రియా - ఇత్యాదులన్ని ఒక దగ్గరికి తెచ్చుకుంటే సాధకునికి ఉండవలసిన లక్షణాలు అన్నీ తెలుస్తాయి.

అలా మనకి లలితా సహస్రనామస్తోత్రమనే శాస్త్రం గొప్ప నియమాలని శాసిస్తున్నది. ఈ ధర్మములు మైత్ర్యాదివాసనలు. ఈ వాసనలు 'ఆది' అని చెప్పారు. ఆది అంటే మొదలైన అని అర్థం. మైత్రి మొదలైన... అంటే ఆ మొదలైనవేవో మనకి ప్రసిద్ధి చెందిన ఋషులిచ్చిన శాస్త్ర సహాయం కావాలి. పతంజలి యోగసూత్రాల్లో మైత్ర్యాదివాసనలు అనే మాట చెప్పాడు. సాధకులైనవారికి ఇది చాలా అవసరం.

వాసనలు అంటే సంస్కారాలు. చిత్తప్రసాదం కోసం ఈ సంస్కారాలను అభివృద్ధి చేసుకోవాలి. చిత్తము ప్రసన్నమైతేనే స్థితి నిలుస్తుంది. జ్ఞానముగాని, భక్తిగాని, ఉపాసనగాని నిలబడాలంటే చిత్తం ప్రసన్నం కావాలి. చిత్తం ప్రసన్నం కావాలంటే ఈ సంస్కారాలు ఉండాలి.

'మైత్రీ కరుణా ముదితోపేక్షాణాం సుఖదుఃఖ పుణ్యాపుణ్య విషయాణాం భావనాతః చిత్తప్రసాదనం' అని పతంజలి యోగసూత్రాల్లో చెప్పారు. ముందుగా ఈ నాలుగు గుణాలు తెచ్చుకోవాలని చెప్పారు. మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష - ఈ నాలుగూ ఉంటే సుఖదుఃఖ, పుణ్యాపుణ్య ద్వంద్వాల యందు సమస్థితి అలవాటు అవుతుంది. ఈ నాలుగు లేకుండా ఎన్ని చేసినా ఆధ్యాత్మిక సాధనలో నిలబడలేం. ఇది అమ్మవారి అనుగ్రహం పొందడానికి ఉపాయం. అమ్మవారి అనుగ్రహం కావాలంటే 'మైత్ర్యాదివాసనాలభ్యా' ఉండాలి. దీనిని శాస్త్రాంతరంలో మరొక చోట చెప్తూ -

మైత్ర్యాది చిత్త పరికర్మ విధాయ విద్యా। క్లేశ ప్రహాణమిహ లబ్ధ సబీజయోగాః
ఖ్యాతించ సత్త్వ పురుషాన్యతయాధిగమ్యా। వాంఛంతి తామపి సమాధిభృతో నిరోద్ధుమ్

అని అత్యద్భుతమైన ఒక సాధనాక్రమాన్ని ఇందులో చెప్తున్నారు. ముందుగా

మైత్ర్యాది సంస్కారాల చేత చిత్తాన్ని ప్రసన్నం చేసుకుంటే క్లేశాలు దాటిపోతాం. ఆ క్లేశాలు దాటగానే అప్పుడు సబీజయోగం సిద్ధిస్తుంది. సబీజయోగమంటే శరీరం నేను కాదు, ఆత్మే నేననే భావనతో కూడిన సాధన సిద్ధిస్తుంది. క్రమక్రమంగా ఆ ఈశ్వరతత్త్వం అవగతమై సమాధిలో నిలబడగలం. మొత్తం ఆధ్యాత్మసాధనకి పునాది లాంటివి మైత్ర్యాదివాసనలు. దీని గురించే విద్యారణ్యులవారు పంచదశిలో చెప్తూ, **"మైత్రి కరుణ ముదితా ఉపేక్షేతి సద్వాసనా పాటవేన దుర్వాసనా క్షయః సమ్యగ్భాయాత్"** అని చెప్పారు. ఈ మైత్రి, ముదిత, కరుణ, ఉపేక్ష అనే గుణాల సద్వాసనల వల్ల దుర్వాసనలు పోతాయని చెప్పారు. దుష్టసంస్కారాలు పోవాలంటే వీటిని అభివృద్ధి చేసుకోవాలి. ఇవి నిజానికి అంతఃకరణ పరిశీలన చేసుకునే వారికి పనికొస్తాయి.

ఇవి కేవలం ఆధ్యాత్మికతకే కాదు. జీవితంలో శాంతంగా బ్రతకాలనుకొనే వారందరికి పనికొచ్చే అద్భుతమైన విషయాలు. వ్యక్తిత్వ వికాసం గురించి చెప్పే వాటిలో ఇలాంటివి బోధించాలి. వ్యక్తులతో ఎలా ప్రవర్తించాలనే దాన్ని నాలుగు భాగాలు చేసి చూపించారు.

సాధారణంగా మనకి లోకంలో సంబంధమున్న వ్యక్తులు నాలుగు రకాలుగా ఉంటారు. 1. ఒకరు మనతో సమాన స్థాయివారు 2. మనకంటే గొప్పవారు, 3. మనకంటే తక్కువవారు, 4. మనపై శత్రుతాభావం కలిగినవారు. ఈ నాలుగు రకాల వారితో ఎలా ప్రవర్తించాలో ఇక్కడ చూపిస్తున్నారు.

• మనతో సమస్థాయి కలిగిన వారితో మైత్రీ భావం కలిగి ఉండాలి. సమమైన వయస్సుగాని, విద్యగాని, సంపదగాని, స్థానంగాని ఉంటే వారితో మైత్రీ భావం కలిగి ఉండాలి.

• మనకంటె ఎవరైనా ఏదో ఒక రంగంలో గొప్ప కీర్తి మొదలైనవి సంపాదించి ఉంటే వారిని చూసి 'ముదితా' భావంతో ఉండాలి. అంటే సంతోషించాలి.

• మనకంటె తక్కువ స్థాయివారు ఎవరైనా కనిపిస్తే వారి పట్ల కరుణ అనే భావాన్ని చూపించాలి. కరుణ అంటే 'పరదుఃఖ అసహిష్ణుతా' అని నిర్వచనం.

అవతలి వారి దైన్యాన్ని చూసి తట్టుకోలేక కరిగిపోయే గుణం కరుణ. ఆ కరుణతో వారికి సాధ్యమైనంతగా సాయపడాలి. ఇది మూడవది.

• నాలుగవది మనమంటే పడనివారిపట్ల ఉపేక్ష వహించాలి. అసలు వారి గురించి మన మనస్సులో ఆలోచన రాకుండా ఉపేక్షించాలి.

ఈ నాలుగు గుణాలు తెచ్చుకుంటే చిత్తానికి ప్రసన్నతా లక్షణమనేది ఏర్పడుతుంది. మనసత్త్వశాస్త్రం గురించి మన ఋషులు ఎంత శోధించి సాధించి పెట్టారో ఇవన్నీ పరిశీలిస్తే చక్కగా అర్థమౌతుంది.

మానసిక రుగ్మతలన్నింటిని పోగట్టగలిగేది ఆధ్యాత్మికమార్గం. ఈ పోటీ ప్రపంచంలో ఇలాంటి సంస్కారాలు మొదటి నుండి పిల్లలకి కనుక నేర్పితే వాళ్ల మనస్సు ముందు శాంతిస్తుంది.

ఎంత సంపాదించినా 'అశాంతస్య కుతః సుఖం' – శాంతి లేనప్పుడు సుఖం ఉండదు. చిత్త ప్రసన్నత అనేది గొప్ప గుణం. యోగ శబ్దాలు చాలా విశేషంగా ఉంటాయి. పతంజలి చెప్పిన యోగసూత్ర అంశాన్ని ఇక్కడ వశిన్యాది వాగ్దేవతలు గుర్తు చేస్తున్నారు. (ప్రాచీన వైదికాంశాన్నే పతంజలి ప్రస్తావించారు). మైత్రి, ముదిత, కరుణ, ఉపేక్ష అనబడే వాసనలు కలిగిన వారికి క్రమంగా పరతత్త్వం లభిస్తున్నది.

అలాంటి సంస్కారాలు కలిగి అప్పుడు జపము, తపము సాధన చేయాలి. లేదా జప, తప సాధనలు చేస్తూ ఈ సంస్కారాలను అభివృద్ధి చేసుకోవచ్చు. అంతేకాని ఇది అయ్యాక అది చూద్దామనుకుంటే మహాకష్టం. రెండూ కలిపి సాగించుకుంటూ సంస్కారములు అభివృద్ధి చేసుకోవాలి.

ఇదే విషయాన్ని స్వామి గీతలో **"అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ"** అన్నారు. ఆధ్యాత్మిక శాస్త్రం ఎక్కడైనా ఒకే గొంతు.

571. మహాప్రళయసాక్షిణీ – శ్రీ మహాప్రళయసాక్షిణ్యై నమః

మహాప్రళయంలో సాక్షిగా ఉండునది. 'మహేశ్వరమహాకల్పమహాతాండవ సాక్షిణీ' అనే నామం దగ్గర కూడా వివరించుకోవడం జరిగింది. మళ్ళీ ఇక్కడ

కూడా స్మరణలోకి వస్తోంది. మహాప్రళయంలో జగత్తు అంతా పరమాత్మ యందు లయమైపోయింది. ఇక మిగిలింది పరమాత్మయే. అన్నీ దేని యందు లయమయ్యాయో ఆ పరతత్త్వమే మహాప్రళయసాక్షిణీ. ఆ స్థితిలో ఆవిడ సాక్షిణిగా చూస్తోంది. శంకరభగవత్పాదులవారు –

కిం బ్రూమస్తవ సాహసం పశుపతే కస్యాస్తి శంభో భవ
ద్ధైర్యం చేదృశ మాత్మనస్స్థితిరియం చాన్యైః కథం లభ్యతే
భ్రశ్యద్దేవగణం త్రసన్మునిగణం నశ్యత్ప్రపంచం లయం
పశ్యన్ నిర్భయ ఏక ఏవ విహరత్యానంద సాంద్రో భవాన్

అని శివానందలహరిలో అంటారు. ఆ ప్రళయకాలంలో ఒక వైపు దేవతలు, మరొకవైపు మునులు గడగడ వణికిపోతూ ఉంటారు. ప్రపంచం అంతా లయం అయిపోతుంది. అలాంటి స్థితిలో అందరూ భయపడుతూ ఉంటే పరమేశ్వరుడు ఒక్కడే ఆనందసాంద్రుడై నిబ్బరంగా నిలుచుని ఉన్నాడు. అన్నింటిని తనలో లయం చేసుకునే ఆయనకి నాశనం లేదు. శంకరులు 'ఆత్మనఃస్థితిరయం' – అటువంటి ఆత్మస్థితి ఎవరికి ఉంటుందయ్యా అని గొప్ప మాట అంటారు. ఆ ఆత్మస్థితి 'మహాప్రళయసాక్షిణీ'.

ప్రళయం ఉపాధులకే తప్ప ఆత్మకు లేదు. ఆత్మస్వరూపిణియై అమ్మవారు ఉన్నారు. నశించే లక్షణమున్నవి నశించి తీరుతాయి. అమ్మవారు వాటన్నింటిని సాక్షిగా చూస్తూ ఉన్న నాశనరహిత సత్యం.

ఇక్కడ ఒక అద్భుతమైన భావం 'గురుకుల' అనే గ్రంథంలో కనబడుతుంది.

సురేంద్ర రుద్ర పద్మజాచ్యుతాదయోఽపి యే మృతే
ర్వశం వదా న తత్ స్త్రియః సువాసినీ పద స్పృశః
మహేశ్వరస్య మృత్యు ఘస్మరస్య సాక్షిణీ తు యా
సుమంగళీరియం వధూరిమాం సమేత పశ్యత

'సుమంగళీరియం వధూరిమాం సమేత పశ్యత' అనే వేదమంత్రం తీసుకుని శ్లోకంలో అద్భుతంగా శాస్త్రం చెప్తోంది. సుమంగళీవధూ అంటే అమ్మవారు. సుమంగళీ

అనగానే అందరికి ముందు గుర్తొచ్చేది గౌరీదేవి. సౌమంగళ్యం అభివృద్ధి చెందడం కోసం ఆ తల్లిని వివాహ సమయంలో కూడా ఆరాధన చేస్తారు. ఆవిడకి సుమంగళీ అని పేరు ఎలా వచ్చిందంటే చెప్తూ సురేంద్రాది దేవతలంతా మహాప్రళయకాలంలో మృత్యువుకు లోనైపోతూ ఉంటారు. అందుకే వారి భార్యలు దీర్ఘసువాసినులేగాని, నిత్యసువాసినులు అనడానికి లేదు. ఒక్క అమ్మవారికి 'సుమంగలీరియం వధూ' అని మంత్రం ఉందంటున్నారు పై శ్లోకం చెప్పిన శాస్త్రవేత్త. ఎందుకలా ఉన్నదంటే ఆ సమయంలో మృత్యువును కూడా సంహరించు పరమేశ్వరుడు ఒక్కడే శాశ్వతుడై ఉంటాడు గనుక అతని పత్ని అయిన అమ్మవారికి ఆ పేరొచ్చింది.

కల్పోపసంహరణకల్పితతాండవస్య దేవస్య ఖండపరశోః పరభైరవస్య
పాశాంకుశైక్షవ శరాసన పుష్పబాణైః సా సాక్షిణీ విజయతే తవ మూర్తిరేకా

అని పంచదశీస్తవంలో చెప్పారు. కల్పాంతకాలంలో సర్వజగత్తుని సంహరించి ఆ పరమేశ్వరుడు ప్రకాశిస్తూ ఉంటే, సాక్షిగా ఆ తల్లి చూస్తూ ఉంటుంది. శాశ్వతురాలు అని చెప్పడమే ఈ మహాప్రళయసాక్షిణీ నామంలో ఉన్న అర్థం. జగతికి ప్రళయాదులు కలుగుతున్నా తనకు ఆ వికారాలేమీ లేని చిద్రూపిణి.

యోగపరంగా చూస్తే ప్రళయాలు మూడు రకాలుగా ఉంటాయి. నిత్య ప్రళయం ఒకటి. కల్పాంతకాలంలో జగత్తుకి కలిగే ప్రళయం మరొకటి. బ్రహ్మకి ఒక ప్రళయం ఉంది. దానిని బ్రహ్మప్రళయం అంటారు. బ్రహ్మకి నూరు కల్పాలు అయిపోతే ఆయనకో ప్రళయం. ఈ బ్రహ్మప్రళయం ఎలా ఉంటుందో బ్రహ్మకి కూడా తెలీదు. ఆయన కల్పాంతకాల ప్రళయాన్ని చూడగలడు. పరమేశ్వరుడు మాత్రమే బ్రహ్మప్రళయాన్ని చూడగలడు.

మనకి రోజూ నిద్ర నిత్యప్రళయం. ఉపాధి చైతన్యమంతా ఎక్కడో లయమైపోతుంది. ఎంతో బాగా లయమైపోతోంది కనుక ప్ర-లయం. ప్రళయం అంటే నాశనమని అర్థం కాదు. బాగా లీనం అగుట అని అర్థం. ఎంత బాగా లీనమవుతుందంటే మళ్ళీ ప్రొద్దున్నే ఎంత అవసరమో అంతే బయటకి వస్తుంది. అంత చక్కగా లీనం చేసుకున్న విశ్రాంతి స్వరూపాన్నే శివ అంటారు.

'శేరతే ప్రాణినో యత్ర స శివః' అని శివ నామానికి ఒక నిర్వచనం. ఆడి ఆడి అలసిపోయిన పిల్లవాడు తల్లి ఒడిలో ఎలా విశ్రాంతి తీసుకుంటాడో... అలాగే ఆడి ఆడి అలసిన జీవుడు ఈశ్వరుని ఒడిలో అలా విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ విశ్రాంతి భావన ఆ నిద్రలో మనం అనుభవిస్తున్నాం. మంచి నిద్ర పట్టాలని అందరూ అనుకుంటూ ఉంటారు. ఆ నిద్రలో ఏదో ఉంది. అది నిత్యప్రళయం.

కల్పాంతకాలంలో బ్రహ్మప్రళయం. ఇది మాములుగా జగత్తుకి, జీవునికి వచ్చే ప్రళయం. అత్యంతిక ప్రళయం అని ఇంకో ప్రళయం ఉంది. ఈ ప్రళయం చాలా ఆశ్చర్యకరంగా ఉంటుంది. మిగిలిన ప్రళయాలలో మళ్ళీ రావడం ఉంది. నిద్రపోయినవారు ప్రొద్దున్న లేచినట్లు ప్రతి ప్రళయానంతరం తిరిగి రావడం ఉంది. కల్పాంతకాలంలో వచ్చే ప్రళయంలో అన్నీ లీనమైపోయినా కర్మవాసనలని బట్టి మళ్ళీ సృష్టిస్తూ ఉంటాడు. ఈ లీనమైన జీవులు కూడా మరొక రూపంలో రావచ్చు.

ఒక మేధావి నిద్రకి నిర్వచనం చెప్తూ 'ఇవాళ రాత్రి నిద్రపోయి తిరిగి రేపు మళ్ళీ ఈ శరీరంలో లేస్తే దానికి నిద్ర అని పేరు. ఈ శరీరంలో నిద్రపోయి మరో శరీరంలో లేస్తే దానికి చావు అని పేరు' అన్నాడు. కానీ యోగి చేసే అవస్థ అంతా కూడా మూడవ ప్రళయం కోసమే సాధన. ఆ ప్రళయం అంటే బాగా లయం అయిపోవాలి. మళ్ళీ తిరిగి వెనక్కి రాకూడదు.

'యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ' అని కృష్ణపరమాత్మ గీతలో చెప్పినట్టుగా దేనిలో లీనమైతే మరి వెనక్కి తిరిగిరామో అదే గొప్ప ప్రళయం. అది అత్యంతిక ప్రళయమని చెప్పబడుతోంది. అలాంటి మహాప్రళయంలో జీవుడు కూడ లయమైపోయి ఇంక జీవ భావం ఉండదు. ఉన్నది ఒక్కటే తత్త్వం. అదే కైవల్యం(మోక్షం). అది సాక్షీభావంగా దేనికీ అంటకుండా చూస్తున్న సమగ్ర జ్ఞానరూపము. సాక్షి అంటే సమగ్ర జ్ఞానం.

మహాప్రళయం అంటే మోక్షం. ఆ మోక్షస్థితిలో ఉండే సమగ్ర జ్ఞానస్వరూపిణే 'మహాప్రళయసాక్షిణీ'. ఇది పరమార్థంలో సత్యం. ముందు చెప్పిన అర్థాలు వ్యవహారాల్లో సత్యాలు.

572. పరాశక్తిః – శ్రీ పరాశక్త్యై నమః

పరా అంటే సర్వోత్కృష్టము. దేనిని మించి మరొకటి లేదో దానికి పరము, పరమము అని పేరు. అటువంటి పరమమైన శక్తి అమ్మవారు.

పరమాత్మకి సహజమైన శక్తి. దీపానికి కాంతి సహజం. సూర్యునికి వెలుగు సహజం. అలాగే పరమాత్మకి ఈ సృష్టినంతటిని చెయ్యగలిగే శక్తి సహజం.

'పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బలక్రియా చ' అని ఉపనిషత్ చెప్తోంది. స్వాభావికీ, జ్ఞాన, బల, క్రియ అని ఆయన యొక్క పరాశక్తే అనేక రకాలుగా చెప్పబడుతోంది.

మన శరీరంలో తొమ్మిది ధాతువులుంటాయని చెప్తూ **నవభిరపి మూల ప్రకృతిభిః** అని సౌందర్యలహరిలో శంకరులు చెప్పారు. శ్రీచక్రంలో నవావరణలకు, మన శరీరంలో నవధాతువులకి సమన్వయం చేశారు శంకరులు. ప్రతివారిలో నవధాతువులు ఉంటాయి. అందులో ఐదు ధాతువులు అమ్మవారి స్వరూపం. నాలుగు ధాతువులు శివస్వరూపం. ఇవన్నీ కలిస్తేనే శ్రీచక్రం, శరీరచక్రం. మనలో ఉన్న తొమ్మిది ధాతువులు చెప్తూ –

త్వగసృఙ్మాంస మేదోస్థి ధాతవశ్శక్తిమూలకాః
మజ్జా శుక్ల ప్రాణ జీవ ధాతవశ్శివమూలకాః

త్వక్ అంటే చర్మము, రక్తము, మాంసము, మేదస్సు, అస్థి – ఈ ఐదు ధాతువులు కాకుండా మరో రెండు మజ్జ, శుక్లం. ఇవి ఏడు ధాతువులు. ఇవికాక ప్రాణ, జీవ అనే మరొక రెండు ధాతువులున్నాయని చెప్పారు. శ్వాసరూపమైనది ప్రాణము, చేతనారూపమైనది జీవము. ఈ రెండూ సూక్ష్మధాతువులు.

సాధారణంగా శరీరంలో ఉన్న ధాతువులు ఏడని చెప్పినప్పటికీ చేతనారూపమైన జీవము, శ్వాసరూపమైన ప్రాణాన్ని కూడా ధాతువుల క్రిందే చెప్తారు. చర్మము, రక్తము, మాంసము, మేదస్సు, అస్థి. ఇవి వ్యక్తమైన ధాతువులు. వీటికి శక్తి మూలకాలని పేరు. మజ్జ, శుక్లము కాక మరో రెండు ప్రాణ, జీవ. మొత్తం నాలుగు శివధాతువులు. మొత్తం తొమ్మిది. ఈ తొమ్మిదితో కూడిన నవావరణ చక్రం మన శరీరమే.

ఈ తొమ్మిదింటికి మూలమైనది ఒకటి ఉంది. **'నవధాతురయం దేహో నవయోని సముద్భవః దశమీధాతురేకైవ పరాశక్తిరితీరితా'** – నవ ధాతుమయమైనది ఈ దేహం. ఈ తొమ్మిది ధాతువులు పని చెయ్యడానికి ఒక ధాతువు కావాలి. ఆ ధాతువుని 'చిచ్ఛక్తిః' అని అంటారు. చిద్ధాతువు అని శాస్త్రంలో మరొక చోట వ్యవహారంలో ఉంది. చిత్ అనబడే పరమేశ్వర చైతన్యం. దానిని 'దశమీ ధాతురేకైవ'. **'పరాశక్తిరితీరితా'** – ఈ పదవ ధాతువునే 'పరాశక్తిః' అంటారు.

మిగిలిన తొమ్మిది మార్పులు చెందుతాయి గాని ఇది ప్రధానం. పరాశక్తి అంటే ఇది. పరాశక్తి వస్తువు కాదు. మనలో ఈశ్వర స్వరూపంగా ఆత్మ ఉన్నది. దాని యొక్క శక్తి చిచ్ఛక్తి. ఆ చిచ్ఛక్తే విస్తరించి తొమ్మిది రూపములుగా నడుపుతున్నది. తొమ్మిది ధాతువులకి మూలధాతువు ఆ తల్లి. ధాతువు అంటేనే మూలపదార్థము. మూలానికి కూడా మూలమై ఉన్న చిద్ధాతువు ఆవిడ.

మిగిలిన ధాతువులు శరీరంతో పాటు పోతాయి కాని, ఈ ధాతువు పోదు. ఈ ధాతువే జీవుని వాసనారూపంగా తీసుకుని మరో శరీరంలో ప్రవేశింపజేస్తుంది. ఈ మూడు శరీరాలు నశించాక ఈ ధాతువు సాయంతోనే జీవుడు పరతత్త్వంలో లీనమవుతున్నాడు. మహాప్రళయసాక్షిణిగా ఉండే ధాతువు ఇది. మహాప్రళయంలో ఇది వరకు చెప్పుకున్న సర్వధాతువులు పోతున్నాయి. ఈ శక్తి మాత్రం ఉంటుంది. ఆ ధాతువు వల్లే మిగిలిన తొమ్మిది ధాతువులు నడుస్తూ ఉన్నాయి. తొమ్మిది ధాతువుల్లో ఉన్నది ఈ ధాతువు యొక్క శక్తే. అందులో సందేహం లేదు.

యస్య యస్య పదార్థస్య యా యా శక్తిరుదాహృతా
సా సా విశ్వేశ్వరీ దేవీ స స సర్వో మహేశ్వరః
శక్తిమంతః పదార్థా యే తే వై శర్వవిభూతయః
పదార్థశక్తయో యా యాః తాస్తా గౌరీం విదుర్బుధాః (లింగపురాణం)

సృష్టిలో ఏ పదార్థం చూసినా దానికో శక్తి ఉంది. అలా ప్రతి పదార్థంలో ఉన్న శక్తే అమ్మవారు. ఆ తల్లినే గౌరీ అంటారు. పరాశక్తి అనే మాటని ఇక్కడ ఈ విధంగా ప్రతిపాదన చేశారు.

573. పరానిష్ఠా - శ్రీ పరానిష్ఠాయై నమః

ఉత్కృష్టమైన సమాప్తి. అనగా విచారణచే జగద్దృష్టి, ఉపాధి దృష్టి పూర్తిగా లయించి కేవల శుద్ధ జ్ఞానముగా మిగులుట. త్యాగరాజస్వామివారు తన కీర్తనలో 'మానసవనచర వర సంచారము నిలిపి మూర్తి బాగుగ పొడగనేవారు ఎందరో మహానుభావులు' అన్నారు. త్యాగరాజస్వామి సాధకుడు కాదు సిద్ధుడు. "మనసు నిల్ప శక్తి లేకపోతే మధుర ఘంటా విరుల పూజ ఏమి సేయురా" అని మరో చోట అంటారు. మనస్సుని నిలపాలి. ఆ మనస్సుని దేని యందు నిలపాలో దాని యందు నిలిపితే 'పరానిష్ఠ'.

పరబ్రహ్మము నందు మనోగత చైతన్యాన్ని నిలపాలి. అలా మనస్సు నిలిచాక ఇంక మనస్సు ఉందా? కేవలం చైతన్యం మాత్రం మిగిలి ఉంది. అది ఎప్పుడు తెలుస్తుంది? నిష్ఠ కుదిరితే తెలుస్తుంది. ఆ నిష్ఠ కుదిరినపుడు ఆ చైతన్యమే పరము అని తెలిసిన స్థితి ఏర్పడుతుంది. ఆ పరానిష్ఠ అంత గొప్ప మాట. ఇవన్నీ శాస్త్రీయ శబ్దాలు కనుక ప్రతి దానికి శాస్త్ర సహాయం తీసుకుంటూ అక్కడ ఏం చెప్పారో ఇందులో చెప్పుకుంటున్నాం.

పరాశక్తి అంటే అందరికి మూలమైన శక్తి అని ఒక మాట చెపితే అయిపోయింది. తొమ్మిది ధాతువులు చెప్పి, తొమ్మిది ధాతువులకి మూలమవుతూ వాటికి అతీతంగా ఉన్న ధాతువు అని చెప్పారు. దీనికి హాని, క్షయము ఇత్యాదులు లేవని చెప్పడం శాస్త్రీయమైన నిర్వచనం.

శాస్త్రాచార్యోపదేశేన తర్కైశ్శాస్త్రానుసారిభిః
సర్వసాక్షితయాత్మానం సమ్యక్ నిశ్చిత్య సుస్థిరః
స్వాత్మనోఽన్యతయా భాంతం సమస్తమవిశేషతః
స్వాత్మమాత్రతయాబుద్ధ్వా పునస్స్వాత్మానమద్వయం
శుద్ధం బ్రహ్మేతి నిశ్చిత్య స్వయం స్వానుభవేన చ
నిశ్చయం చ స్వచిన్మాత్రే విలాప్యావిక్రియేఽద్వయే
విలాపనం చ చిద్రూపం బుద్ధ్వా కేవలరూపతః

స్వయం తిష్ఠేదయం సాక్షాత్ బ్రహ్మవిత్ప్రవరో మునిః

ఈదృశీయం పరానిష్ఠా శ్రౌతీ స్వానుభవాత్మికా (సూతగీత)

'శాస్త్రాచార్యోపదేశైః' – ఆచార్య ఉపదేశము ద్వారా శాస్త్రాన్ని పొంది, 'తర్కై శ్శాస్త్రానుసారిభిః' – శాస్త్రసమ్మతమైన తర్కముతో విచారణ చెయ్యాలి. వేదసమ్మతమైన తర్కాన్ని అనుసంధానం చెయ్యాలని చెప్పారు.

శాస్త్రాన్ని గురువుద్వారా తీసుకుని విచారణ చెయ్యాలి. అలా విచారణ చేస్తూ ఉంటే 'సర్వసాక్షితయాత్మానం సమ్యక్ నిశ్చిత్య సుస్థిరః' – ఈ శరీరతత్త్వం నుండి ఆ 'నేను' వేరు చెయ్యడం చేతనవుతుంది. నేను శరీరాన్ని, నేను ప్రాణాన్ని, నేను బుద్ధిని, నేను మనస్సుని అనుకునే అజ్ఞానపు నిలుకడ నుండి వెనక్కి మరలి **'స్వాత్మనోఽన్యతయా భాంతం సమస్త మవిశేషతః'** – ఆ నేనుకు మూలమైన చైతన్యం విశ్వమంతా వ్యాపకమై ఒక్కటే ఉన్నది అని తెలుసుకుని –

స్వాత్మమాత్రతయా బుద్ధ్వా పునస్స్వాత్మానమద్వయం

శుద్ధం బ్రహ్మేతి నిశ్చిత్య స్వయం స్వానుభవేన చ

మాయావికారము ఏమీ లేని శుద్ధబ్రహ్మమే నేను అనే స్థితికి వచ్చి అందులో నిశ్చయం లభించాలి. శాస్త్రం చెప్తున్నప్పుడు, తర్కం ఉపయోగించినప్పుడు, శ్రద్ధగా వింటున్నప్పుడు, మళ్ళీ గట్టిగా విచారణ చేసినప్పుడు, 'నిజమే నేను శుద్ధబ్రహ్మమే' అని అనిపిస్తుంది. కాని అది నిలబడాలి. **'నిశ్చయం చ స్వచిన్మాత్రే విలాప్యావిక్రియేఽద్వయే విలాపనం చ'** – ఆ అద్వయమైన పరతత్త్వాన్ని తెలుసుకుని, ఇంతవరకు మనం ఏవైతే ఉపాధులు అనుకున్నామో ఆ ఉపాధుల యొక్క చైతన్యాన్ని పరతత్త్వంలో లయం చేసేసి ఆ స్థితిలో 'బుద్ధ్వా కేవలరూపతః' – అదే 'చిదానంద రూపః శివోహం శివోహం' అని ఒక చోట చెప్తే మరో చోట, 'చిదానందరూపః శివః కేవలోహం' – కేవలః అంటే ఇంక ఏమీ లేదు, అదే నేను అని 'స్వయం తిష్ఠేదయం సాక్షాత్ బ్రహ్మవిత్ప్రవరో మునిః' – అప్పుడు బ్రహ్మవేత్త ఆ స్థితిలో నిలచిపోతాడు. అలా నిలచిపోయిన స్థితి– 'ఈదృశీయం పరా నిష్ఠా శ్రౌతీ స్వానుభవాత్మికా' – అది పరానిష్ఠా నామానికి నిర్వచనం.

ఉపాధి తాదాత్మ్యములన్నీ విడిచిపెట్టి స్వచైతన్యము శుద్ధబ్రహ్మమే అని తెలిసిన స్థితిని 'పరానిష్ఠా' అనాలి. అక్కడ తెలిసిన జ్ఞానము, శుద్ధబ్రహ్మము వేరు కాదు. తెలివియే బ్రహ్మము అని తెలుస్తున్నది. ఆ శుద్ధబ్రహ్మస్థితే 'పరానిష్ఠా'. **'సర్వ కర్మ అఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే'** అనే గీతావాక్యం ఇదే భావం.

ఈ 'పరానిష్ఠా' అనే దానికి తేట తెలుగులో ఆదిభట్ల నారాయణదాసుగారు చెప్తూ **'కల, మెలకువ కూర్కు కాని యున్కి'** – జాగ్రత్, స్వప్న, సుషుప్తి – మూడు అవస్థలు కాని తురీయ భూమిక. అక్కడ తురీయమని దేనిని చెప్పుకున్నామో అదే ఇక్కడ 'పరానిష్ఠా'గా చెప్పబడుతోంది. ఆ స్థితిలో ఇసుమంతైన అజ్ఞానావస్థ ఉండదు. కేవలం జ్ఞానం మాత్రమే ఉంటుంది. విచారణ దశలో కొంత ప్రపంచం, కొంత పరమాత్మ. దీనిని వదలించుకునే ప్రయత్నంలో చాలా యాతన పడుతూ ఉంటారు. సిద్ధస్థితి అని చెప్పబడే పరానిష్ఠ అనే స్థితికి వెళ్ళిపోయిన తరువాత మిగిలింది కేవలం బ్రహ్మచైతన్యమే. అదే 'ప్రజ్ఞానఘనరూపిణీ' అని తరువాత నామం.

574. ప్రజ్ఞానఘనరూపిణీ – శ్రీ ప్రజ్ఞానఘనరూపిణ్యై నమః

ప్రజ్ఞానఘనరూపిణీ అనే నామం ఉపనిషత్ ప్రతిపాద్యమైనది. శ్రీవిద్యలో పూర్ణదీక్షకు వెళ్ళిన వారికి మహావాక్యాలు ఉపదేశిస్తారు. అది ఒక సన్న్యాసమే. సామాన్యం కాదు. వారి వేషభాషలు యతీశ్వరులలా లేకపోయినా ఆ దీక్షలో అనుగ్రహించబడినప్పుడే ఇకపై వారు విచారణశీలురై ఉండాలి అని ఉపదేశం. **'స్వాత్మైవ దేవతా ప్రోక్తా లలితా విశ్వవిగ్రహా'** అనే తత్త్వంలోకి వెళ్ళాలి.

లలిత ఎవరు? స్వాత్మ ఏవ. ఆ స్వరూపమే ప్రజ్ఞానఘనం. అవిద్యాలేశసంస్కార స్పర్శ కూడా ఉండదు. పూర్ణజ్ఞానస్వరూపము. అదే 'ప్రజ్ఞానఘనరూపిణీ'. ఈ ప్రజ్ఞాన ఘనతత్త్వమే మనలో జాగ్రత్ స్వప్న సుషుప్తులలో సాక్షిగా ఉంటుంది. 'జాగ్రత్స్వప్నసుషుప్తీనాం సాక్షిభూత్యై నమో నమః' అని అమ్మవారికి లలితా అష్టోత్తరశతనామాలలో నామం. జాగ్రత్ స్వప్న సుషుప్తులు అందరికి తెలుసు. మరి ఆ సాక్షి ఎవరు? అమ్మవారు.

పరానిష్ఠలో ఉన్న స్వరూప స్థితియే ఇది. జాగ్రత్స్వప్న సుషుప్తులకి అతీతమైన స్థితి. దట్టమైన ప్రజ్ఞానమే ఆమె రూపం. **'స యథా సైంధవఘనో అనంతరో అబాహ్యః కృత్స్నో రసఘనః ఏవైవం వా అరేఽయమాత్మా అనంతరో అబాహ్యః కృత్స్నో ప్రజ్ఞానఘన ఏవ'** (కాణ్వశాఖ) 'ఉప్పురాయిలో లోపల వెలుపల మరే రుచి లేక కేవలం ఉప్పు మాత్రమే ఏ విధంగా ఉండునో అదే విధంగా పరమాత్మ కూడా కేవలం జ్ఞానంతో ఘనీభవించి ఉన్నది'. ఆ పరమాత్మయే లలిత.

"కల మెలకువ కూర్కు కనిపెట్టు తెలివి" అన్నారు ఆదిభట్ల నారాయణదాసు గారు. వీటిలో సాక్షీభూతంగా ఉన్న తల్లి అని చెప్పారు. ఆ సాక్షి అర్థమైతేనే మహాప్రళయసాక్షిణీ అర్థం అవుతుంది. తురీయస్థితే మహాప్రళయం. **ఐదవ ఉనికియై అలరారు వేల్పు** అని వివరించారు. ఆ తల్లి 'ప్రజ్ఞానఘనరూపిణీ'.

575. మాధ్వీపానాలసా – శ్రీ మాధ్వీపానాలసాయై నమః

మాధ్వీ అంటే మత్తుని కలిగించే ఒకానొక పానీయం ద్రాక్షాసవము – అని నిఘంటువు అర్థం. ఆ మత్తు పానీయం తాగి దానితో అలసగా ఉంది. మదమెక్కి ఉండడాన్ని అలసత్వమంటారు. ప్రపంచం పట్టకుండా ఒక పారవశ్య భావంతో ఉంది. మాధ్వీపానం వలన ఆ పారవశ్యం వచ్చింది.

కొంతమంది మాధ్వీ అంటే ఇప్పకల్లు అని కూడా చెప్తారు. ఇప్పకల్లు కావచ్చు, ద్రాక్షారసం కావచ్చు. అమ్మవారు దానితో అలసగా ఉన్నారు కనుకనే దానిని నివేదించాలి అనుకుంటే అది మహాదోషమని గ్రహించాలి. ఆ అర్థంలో తీసుకోకూడదు.

ఒక వైపు అమ్మవారిని ప్రజ్ఞానఘనరూపిణీ, పరానిష్ఠా అని అద్భుతమైన ఉపనిషత్ ప్రతిపాద్యములైన శబ్దాలు వాడి, వెంటనే 'ఇప్పసారా తాగి మత్తెక్కినది' అని అనకూడదు. ఒకప్పుడు శ్రీవిద్యని కొంతమంది వామాచారపరాయణులు ఆ విధమైన మార్గములోకి తీసుకెళ్ళారు. మకార పంచకమని – మద్యము, మత్స్యము, మాంసము – ఇత్యాదులు సభల్లో చెప్పుకోలేని విధానాలు ఉన్నాయి. అయితే ఇవన్నీ వామాచారం. వాటివల్ల పరమార్థం లభించదు.

మొట్టమొదట శ్రీవిద్య బ్రహ్మవిద్య అని తెలుసుకుని దానిని తిరిగి ఉద్ధరించినవారు ఆదిశంకరభగవత్పాదులవారు. అవగాహనారాహిత్యం లేని కొందరు అంత ఉపనిషత్ భాష్యం రచించిన ఆదిశంకరులు శ్రీవిద్యోపాసన చేశారా! అనుకుంటూ సౌందర్యలహరి ఆయన వ్రాశారో, లేదో అంటారు. అలా అనే వారిది ఏకదేశ పాండిత్యం.

వారు కొంచెం పూర్వాపరాలు అధ్యయనం చేయాలి. శంకరభగవత్పాదులవారి పరమగురువులైన గౌడపాదులవారు 'సుభగోదయస్తవం' అని అత్యద్భుతమైన రచన చేశారు. అదే శైలిలో సౌందర్యలహరి నడిచింది. ఇది కూడా పరంపరగానే శంకరులు తీసుకున్నారు.

అది సమయాచారమని చెప్పడానికి లలితాసహస్రమే ప్రమాణము. అడుగడుగునా 'సమయాచారతత్పరా' అని చెప్పడమే కాకుండా 'పరానిష్ఠా' వంటి నామాలు ఉన్నాయి.

ఈ పదాలు అర్థం చేసుకునేటప్పుడు వేద, వేదాంత సహాయం తీసుకోవాలి. శంకరభగవత్పాదులవారి తరువాత శ్రీవిద్య అలా కొనసాగుతూ క్రమంగా శంకరపీఠాలద్వారా రక్షింపబడుతూ వస్తున్నది.

'మాధ్వీపానాలసా' అన్నదానికి అర్థం పరిశీలించాలి. ఇవి రెండూ కాదన్నప్పుడు నిఘంటువును ప్రక్కకి పెట్టెయ్యాలి. దీనిని ఛాందసప్రయోగం అంటారు. ఛాందసము అంటే వేదప్రయోగము. '**మధువాతా ఋతాయతే మధుక్షరంతి సింధవః**' అని మంత్రం చెప్తూ '**మాధ్వీర్గావో భవంతు నః**" అని అక్కడ మాధ్వీ శబ్దం వాడారు.

మాధ్వీర్గావో భవంతు నః – గోవులు మాకు మధువులు ఇచ్చుగాక! గోవులు అంటే వేదవాక్యాలు. వేదవాక్యాలు మాకు మధువులు ఇచ్చుగాక! అంటే మనకి ఆనందకరమైన స్థితిని ఇచ్చుగాక! ఇది దాని యొక్క అసలైన అర్థం. గావః అంటే ఇక్కడ వేదాంతవాక్యాలు. వేదాంతవాక్యాల వల్ల కలిగిన జ్ఞానం. ఆ జ్ఞానం వల్ల కలిగిన ఆనందమనే మధువు. మధువు అంటే తియ్యదనం. ఏది ఆనందమో దానిని తీపి అనాలి.

'మాధ్వీ' అంటే జ్ఞానము వల్ల కలిగిన ఆనందం. దీని పేరే బ్రహ్మానందం. సచ్చిదానందం. బ్రహ్మానందపానము అంటే అనుభవము. బ్రహ్మానందానుభవము వలన వచ్చిన పారవశ్యస్థితే 'మాధ్వీపానాలసా'. ఎప్పుడూ ఆవిడ స్థితి బ్రహ్మానందస్థితి.

చిదానంద, బ్రహ్మానంద పారవశ్యస్థితే మాధ్వీపానా–అలసా. దీనికి 'బాహ్య విషయ వైముఖ్యం' అని నిర్వచనం. మత్తులో ఉన్నవారికి బయట ఏం జరుగుతుందో అసలు తెలియదు. అలాగే బ్రహ్మానందపారవశ్యానికి వెళ్ళిన వానికి బహిర్ముఖదృష్టి ఉండదు. అది అలసా మాటలో ఉన్న అర్థం. అలాంటి అలసా స్థితి ఇవాళ ఉండి, రేపు పోయేది కాదు – ఎప్పుడూ ఉంటుంది. అందుకే తరువాత నామం 'మత్తా'.

576. మత్తా – శ్రీ మత్తాయై నమః

మత్తా అంటే మదము. మదమెక్కుట అంటే పారవశ్యము. మత్ ప్రత్యయం అంటే అహంకారం. మత్తా అంటే అహంరూపిణి. అహం రూప బ్రహ్మముగా ఉన్నది.

మత్తా అంటే పారవశ్యమని ఒక అర్థం. 'అహం బ్రహ్మాఽస్మి' అనే స్థితి ఒకటి. నేనే బ్రహ్మము అనే స్థితి చాలా బాగుంటుంది. నేనే రాజుని అంటేనే ఎంతో మదం వస్తుందే! నేనే బ్రహ్మము అనే స్థితి ఇంకెంత మదంగా ఉంటుంది! నేనే రాజుని అనే మదం ప్రమాదకారైతే, నేను బ్రహ్మమును అనే మదం ఆనందకారి. 'అహం' అనే దాని స్థితిని 'మత్తా' అనే దాని నుండి స్వీకరించవచ్చు.

పరాహంతా – ఉత్కృష్టమైన 'అహంతా' స్వరూపిణి.

అహమనే భావన రెండు రకాలు. నేను అనే చైతన్యం అమ్మవారు– అని ఒకటి, సర్వాక్షరములు అమ్మ రూపమే అని భావన చేయడం మరొకటి. తరువాత నామం 'మాతృకావర్ణరూపిణీ'.

577. మాతృకావర్ణరూపిణీ – శ్రీ మాతృకావర్ణరూపిణ్యై నమః

శ్రీవిద్య అనగా మాతృకావర్ణ భావనయే ప్రధానం. అక్షరములే అమ్మవారు.

పరిశీలిస్తే అడుగడుగునా వశిన్యాదివాగ్దేవతలు దీనినే ప్రతిపాదిస్తున్నారు. విశుద్ధిచక్రం నుండి ఆజ్ఞాచక్రం వరకు ఉన్న అక్షరాలు అన్ని అమ్మవారైతే, అక్కడ తిరిగే ప్రాణమంతా యాభై అక్షరాలమీదే ఆధారపడి ఉంది. ఈ యాభై అక్షరాల సమష్టిరూపం సహస్రారంలో అమ్మరూపమై ప్రకాశిస్తున్నది.

యాభై అక్షరాలుగా విచ్చుకుని ఈ శరీరంగా ప్రసరింపజేస్తున్నది. ఆ తల్లిని తెలుసుకోవాలంటే యాభై అక్షరాలను ఉపాసన చెయ్యడమే ప్రధానమైన విద్య. దానికి, కుండలినీకి ముడిపెట్టి మొత్తం వివరణ అంతా కూడా అక్షర ఉపాసనగా చెప్పారు. భారతీయసంస్కృతిలో అక్షరాలకి చాలా ప్రాధాన్యం ఉంది. అక్షరాభ్యాసంలో మాటి మాటికి అక్షరాలు అనిపించి దిద్దించుతారు. అది అభ్యాసం కోసమే అయినప్పటికి ప్రధానంగా అక్షరాది దేవతలు అనుగ్రహించాలి. ఇది తెలుసుకుని అక్షరం అమ్మ అని భావన చెయ్యాలి. ఒక్క అక్షరాన్ని సిద్ధింప చేసుకుంటే దేవతలు కూడా అసూయపడే ఉన్నతస్థితి వస్తుందని మాతృకాస్తోత్రం చెప్తోంది.

'యదక్షరైక మాత్రేపి సంసిద్ధే స్పర్థతే నరః' అని చెప్పబడింది. ఒక్క అక్షరం సిద్ధించుకుంటే గరుడ, యక్ష, గంధర్వాది దేవతలు వారిపై స్పర్థ వహిస్తారన్నారు.

'అ'కారం నుండి 'క్ష' కారం వరకు అక్షర క్రమం. క్ష సంయుక్త అక్షరం కాబట్టి హకారంతోనే మనం పూర్తి చేసుకుంటూ ఉన్నాం. ఈ యాభై అక్షరాలే తల్లులు. ఇది చిన్నప్పుడు దిద్ది వదులుకోవడం కాదు. బ్రతుకంతా దిద్దుకోవలసినదే. ఉపమన్యు మహర్షి యాభై అక్షరాలకు సంబంధించి ఒక అద్భుతమైన శాస్త్రం రచించారు. మహేశ్వర సూత్రాలకు అది భాష్యం.

విశ్వనిర్మాణ విజ్ఞానమంతా అకారం నుండి హకారం లోపల దాగి ఉంది. మన ఋషులు అక్షరాల్లో ప్రపంచ రహస్యాన్ని పెట్టారు.

మొట్టమొదట ఇవి తెలియవు. ముందు దిద్దుకో! తరువాత ఎప్పుడో నెమరు వేసుకో! ఆ స్థితి రావాలి. భారతీయ సంస్కృతిలో చదువు అంటేనే భగవత్ స్వరూపం.

అక్షరాధిదేవత అమ్మవారు. ఏ శాస్త్రం మనం చదువుకున్నా అక్షరాలతోనే పదాలు, వాక్యాలు, శాస్త్రాలు తయారౌతాయి. ఆఖరికి బ్రహ్మవిద్య నామరూపాలకి

అందదని చెప్పాలన్నా నామంతోనే చెప్పాలి. మాటలకు దొరకదు అనేది కూడా ఒక మాటతో చెప్పాల్సిన విషయమే.

మనకి కావలసినది మాటల సాయమే. **శబ్దబ్రహ్మాణి నిష్ణాతః పరబ్రహ్మాధి గచ్ఛతి** – శబ్దబ్రహ్మములో ఆరితేరినవాడే పరబ్రహ్మమును పొందగలడు. పరానికి పనికొచ్చే వేదాదిశాస్త్రాలు, ఇహానికి పనికొచ్చే అపరావిద్యలు ఇవన్నీ కూడా మాతృకావర్ణాల మీదే ఆధారపడి ఉన్నాయి. మాతృక అంటేనే అమ్మ. మాతృకావర్ణరూపిణి. అక్షరాలన్నీ అమ్మలే. అమ్మే అక్షరాలు అన్న భావన కోసమే మాతృకావర్ణరూపిణీ నామం.

వర్ణ అనే మాటకి మరొక అర్థం ఉంది. వర్ణమంటే అక్షరం. వర్ణమంటే రంగు. చూడగలిగే శక్తి ఉండాలే గాని సూక్ష్మదృష్టితో చూస్తే ఒకొక్క అక్షరానికి ఒకొక్క వర్ణముంది. ఆ వర్ణములు ఏమిటో శాస్త్రములు చూపిస్తున్నాయి.

స్ఫటికాభాః స్వరాః ప్రోక్తాః స్పర్శా విద్రుమసన్నిభాః
యాదయో నవ పీతాఃస్యుః క్షకార స్త్వరుణోమతః

తంత్రసారమనే గ్రంథంలో చెప్పబడుతున్న వాక్యం. 'స్వరాః స్ఫటికాభాః' – స్వరాలు అంటే అకారం నుండి అం అః వరకూ చెప్పబడ్డ పదహారు అక్షరాలు స్ఫటికపు రంగుతో ఉంటాయి.

స్పర్శా విద్రుమసన్నిభాః – కకారాదులకి స్పర్శలు అని పేరు. స్వరాలు తగిలితే కాని పలకలేం కనుక వాటికి స్పర్శలు అని పేరొచ్చింది. ఇవి పగడపు కాంతులతో ఉంటాయి. అవి కవర్గ, చవర్గ, టవర్గ, తవర్గ, పవర్గ. క వర్గ మంటే క–ఖ–గ–ఘ.

యాదయో నవపీతాఃస్యుః – య, ర, ల, వ, శ, ష, స, హ, ళ – ఇవి పసుపు రంగుతో ఉంటాయి.

క్షకార స్త్వరుణోమతః – క్షకారం అరుణవర్ణంతో ప్రకాశిస్తూ ఉంటుంది.

కొన్ని గ్రంథాలలో వర్ణ భేదాలున్నాయి. వర్ణాన్ని ఉపాసించిన స్థితి బట్టి ఆ దేవతలు వేరువేరు వర్ణాలలో కూడా కనబడతారు. ఇక్కడ ప్రామాణికంగా ఉన్న ఒకానొక నిర్వచనం మనం తీసుకున్నాం. అక్షరానికి ఒక వర్ణం ఉంటుంది. వర్ణమే

కాక దేవత ఆకారాలు కూడా ఉన్నాయి. మొత్తం యాభై అక్షరాలకి యాభై దేవతలు ఉన్నారు. ఆ దేవతల పేర్లు 'విశుద్ధిచక్రనిలయా' దగ్గరనుండి వచ్చే నామాలలో చెప్పుకున్నాం.

ఇలా ఆరు చక్రాలలో మొత్తం 50 అక్షరాలు చెప్పుకున్నాం. ఆ కేంద్రాలు లెక్కపెట్టుకుంటే 50 అక్షరాలు మన శరీరంలోనే ఉన్నాయి.

శక్తి ఉండే చోటును పీఠం అంటారు. మన శరీరం నిండా శక్తిపీఠాలే ఉన్నాయి. ఇంకా వివరం 'పంచాశత్పీఠరూపిణీ' దగ్గర వివరించుకుందాం.

అక్షరాలన్నీ శివశక్తుల రూపాలని శాస్త్రం చెప్తోంది.

అకారః ప్రథమో దేవీ క్షకారోంత్యః తతః పరం

అక్షమాలేతి విఖ్యాతా మాతృకావర్ణరూపిణీ

శబ్దబ్రహ్మ స్వరూపేయం శబ్దాతీతంతు జప్యతే

అక్షమాలయే అక్షరమాల. శబ్దాతీతతత్త్వమే ఈ శబ్దబ్రహ్మ స్వరూపంగా జపించబడుతున్నది.

యథాపరతరశ్శంభుః ద్విధా శక్తిః శివాత్మనా

తథైవ మాతృకాదేవీ ద్విధా భూతా సతీ స్వయం

ఏకాకారేణ శక్తేస్తు వాచికా చేతరేణ తు

శివస్య వాచికా సాక్షాత్ విద్యేయం పదగామినీ

ఇది శాస్త్రం చెప్తున్న గొప్పమాట. ఒక్క శివుడే శివ, శక్తి అని రెండు రూపాలు అయ్యాడు. నిజానికి అమ్మవారు, అయ్యవారు అంటున్నాం గాని ఒక్కడే ఆయన. **ఏకః శివః.**

'పరతరశ్శంభుః ద్విధా శక్తిః శివాత్మనా' – ఆయన శివ, శక్తిగా రెండు రూపాలయ్యాడు. అదేవిధంగా ఆయన శక్తి అయిన మాతృక కూడా శివ, శక్తి రూపాలుగా రెండు అయినది. ఇందులో అచ్చులు శక్తి రూపాలు, హల్లులు శివ రూపాలు. ఇది శంకరులు సౌందర్యలహరిలో చెప్పిన 'శివశ్శక్త్యాయుక్తో' శ్లోకం చూస్తే మరింత అర్థం తెలుస్తుంది. అమ్మా! శక్తి లేనిదే శివుడు నిలువలేడని అర్థం

చెప్పారు. అలాగే పైన ఉన్న అచ్చులు కలవకపోతే హల్లులు నిలువలేవు అని ఇక్కడ అర్థం.

అచ్చులని కలపకుండా క్, చ్, ట్ అని మాట్లాడలేం. క్ కి అ కలిస్తే 'క', ఇ కలిస్తే 'కి' అవుతోంది. కానీ హల్లులు లేకుండా అచ్చులను అ ఆ ఇ ఈ అని పలుకగలం. పోనీ అ ఆ ఇ ఈ అంటూ ఉన్నా అర్థం లేదు. వాటికి హల్లులు కలిస్తేనే అసలు ప్రయోజనం. అచ్చులు, హల్లులు రెండూ కలిస్తేనే 'వాగర్థావివ సంపృక్తౌ' అవుతోంది. అచ్చులు శక్తిరూపాలు. హల్లులు శివ రూపాలు. ఈ రెండూ కలిస్తేనే 'శివశ్శక్త్యాయుక్తః' అవుతోంది. శ్రీ చక్రమే 'మాతృకావర్ణరూపిణీ'. శ్రీచక్రంలో అక్షరాలు కనబడక పోవచ్చు. కానీ అందులో ఉన్న బిందువులు, త్రికోణములు ఇవన్నీ వాటిని వివరిస్తాయి. శివుడు దమరుకం మ్రోగించగానే నలభై మూడు శబ్దాలు వచ్చాయి. పధ్నాలుగు సూత్రాల్లో ఉన్న శబ్దాలు నలభైమూడు.

1. అ ఇ ఉణ్
2. ఋ లుక్
3. ఏ ఓ
4. ఐ ఔచ్
5. హ య వ రట్
6. లణ్
7. ఞ మ ఙ ణ నమ్
8. ఝ భయ్
9. ఘ ఢ ధష్
10. జ బ గ డ దశ్
11. ఖ ఫ ఛ ఠ థ చ ట తవ్
12. క పయ్
13. శ ష సర్
14. హల్

నలభై మూడు శబ్దాలు అంటే శ్రీచక్రంలో కనపడే నలభైమూడు త్రికోణాలు. మహేశ్వరసూత్రాలకు ఉపమన్యు మహర్షి భాష్యం ఎలా వ్రాశాడో కొంత అర్థం చేసుకోవచ్చు.

ఇలా అక్షరాలను అభ్యాసం చెయ్యాలి. అ-ఆ-ఇ-ఈ-ఉ-ఊ అని రోజూ అంటూ ఉన్నా చాలు. దీనికి మంత్రం తగిలిస్తే అం-ఆం-ఇం-ఈం-కానీ ఇది గురువు దగ్గర నేర్చుకుని మాత్రమే చెయ్యాలి. మాతృకావిద్య సామాన్యం కాదు.

ఆదిక్షన్మమ గురురాట్ ఆదిక్షాంతాక్షరాత్మికాం విద్యాం

స్వాదిష్ఠ చాపదండాం నేదిష్ఠామేవ కాంచీనిలయా మే

అని ముందు చెప్పుకున్న మూకకవి శ్లోకాన్ని గుర్తు తెచ్చుకోవాలి. "ఆదిక్షాంతాక్షర ఆత్మవిద్య"ని నాకు గురువు ఇచ్చారని పరవశించి మూకకవి చెప్తున్నారు. అది మాతృకావర్ణరూపిణి.

మాతృకాన్యాసం చేసి అమ్మవారి ఆరాధన చెయ్యడాన్ని ప్రధానంగా చెప్తారు. ఉపాసకులకి ఇతర న్యాసాలున్నా, లేకున్నా మాతృకాన్యాసం చెయ్యమని చెప్పడంలో విశేషమిది. అక్షరాలు అమ్మరూపాలు అని తెలుసుకోగలిగితే మన సమస్త ప్రాణకేంద్రాలు స్పందిస్తాయి.

578. మహాకైలాసనిలయా - శ్రీ మహాకైలాసనిలయాయై నమః

మహాకైలాసమే నిలయంగా కలది. శివుని లోకం పధ్నాలుగు ఆవరణల మహాకైలాసం. ఆ మహాకైలాసంలో అమ్మవారు పరమేశ్వరునితో ఉంది.

కైలాసమంటే **'కేళీనాం ఆనందానాం సమూహః కైలం'** - కేళుల గుంపు కైలము. ఆనందాల సమూహము. స్వాత్మానందలవీభూత బ్రహ్మాద్యానంద సంతతిః - అన్ని ఆనందాల కంటె గొప్పది. అన్ని ఆనందాలు అందులో కలిసే ఉన్నాయి. బిందువులన్ని సింధువులో ఉన్నట్లు మనమనుకునే ఆనంద బిందువులన్ని ఆ పరమానందంలో ఉన్నాయి.

ఆ కైలము అక్కడ స్థిరముగా ఉన్నది. **'తేనాస్య తే స్థీయత ఇతి కైలాసః'** -

ఈ ఆనంద సమూహము ఎక్కడ స్థిరంగా ఉంటుందో దాని పేరు కైలాసము. అఖండ శాశ్వతానందము అని అర్థము.

ఆనందస్వరూపుడైన శివుని వెలుగే అక్కడ పరమానందధామమై ప్రకాశిస్తున్నది. అదే పరబ్రహ్మస్వరూపము. మహా శబ్దము ఎక్కడవచ్చినా బ్రహ్మావాచీ అని తెలుసుకోవాలి. 'మహాకైలాసనిలయా' అన్నదానికి ఇది ఒక అర్థం.

కైలాసం అనే మాటకి మరొక అర్థం చెప్తూ– 'క' అంటే శిరస్సు, బ్రహ్మ అని రెండర్థాలున్నాయని ముందు చెప్పుకున్నాం. **'కే శిరసి శివయోర్లాసో నృత్యమస్మిన్ ఇతి కైలాసః'** – కే అంటే శిరస్సునందు అనగా సహస్రారమునందు లాస్యం జరుగుతోంది. లాసము నుండే ఉల్లాసము అనే మాట వచ్చింది. ఆనందమయమైన స్థితిని లాసము అంటారు. ఉత్కృష్టమైన రూపం.

ఈ లాసము సహస్రారమునందు జరుగుతూంటుంది. 'శివయోర్లాసో నృత్యః' అన్నారు. దీని నుండే లాస్యము అనే మాట వచ్చింది. లాస్యం అంటే నృత్యము. అక్కడ ఎప్పుడూ ఇద్దరి నృత్యం జరుగుతోంది. నృత్యము అంటేనే ఆనందము యొక్క విజృంభణ.

అమ్మవారు కలవగానే నాట్యం లాస్యం అయిపోయింది. లాస్యం అంటే సుకుమార, కోమల, శాంత నృత్యమని అర్థం. ఆ స్థితే **శివయోః** అంటే పార్వతీపరమేశ్వరుల యొక్క లాస్యము.

ఈ లాస్యం ఎక్కడ జరుగుతోంది? శివశక్తుల ఏకమైన స్థితి ఎక్కడుందో అది కైలాసము. అది సహస్రారస్థానము. ఆ సహస్రారస్థానంలో శివశక్త్యాత్మకంగా ఉండే తల్లి అని 'మహాకైలాసనిలయా' అనే దానికి మరొక అర్థం. దీనికి ప్రమాణం 'త్రిపురాసారోక్తి' అని శాస్త్రంలో చెప్తున్నమాట.

ఏతత్కైలాస సంజ్ఞం పదం అకులపదం
బిందురూపీ స్వరూపీ యత్రాస్తే దేవదేవః

అకుల పదమును కైలాసమంటారు. ఆజ్ఞాచక్రమువరకు ఉన్నది కులము. ఆపై ఉన్నది అకులం. 'అకులా' 'సమయాంతస్థా' –అకులలో సామరస్యముగా

ఉన్నది. సమయ – శివశక్తుల ఏకత్వమే సమయ. **'సహసమయయా లాస్యపరయా'** అని సౌందర్యలహరిలో శంకరులు చెప్పిన ఆ లాస్యమే ఇక్కడ లాసము. అది 'కే'. 'కం' అంటే బ్రహ్మ అని అర్థం తీసుకుంటే అప్పుడు, **కైలాసః...** అంటే బ్రహ్మానందస్వరూపము.

ఈ రహస్యాన్ని తీసుకునే శంకరులు సౌందర్యలహరిలో చెప్తూ **'సహస్రారే పద్మే సహ రహసి పత్యా విహరసి'**– 'సహస్రారపద్మంలో నీ పతితో కలసి రహస్యంగా ఆడుకుంటున్నావమ్మా' అంటున్నారు. ఆ ఆటే లాసము. అదే 'మహాకైలాసనిలయా' మాటలోని అందం.

ఇంకో అద్భుతమైన ఔచిత్యాన్ని చెప్తున్నారు.

'మాతృకావర్ణరూపిణీ' వెంటనే 'మహాకైలాసనిలయా' రావడంలో అర్థం ఏమిటో పరిశీలించాలి. శ్రీచక్రానికి మూడు ప్రస్తారాలు ప్రధానంగా చెప్పబడుతున్నాయి. ఒకటి భూప్రస్తారం. ఇంకొకటి మేరుప్రస్తారం. పైకి వెళ్తున్నకొద్ది సూక్ష్మంగా, క్రిందకి వస్తున్న కొద్ది స్థూలంగా ఉంటుంది. ఇది అందరికి పరిచయం. ఇంకొక ప్రస్తారముంది. దీని పేరు కైలాస ప్రస్తారం. కైలాసప్రస్తారమంటే శ్రీచక్రంలో ఆయా స్థానాల దగ్గర మాతృకా వర్ణాలని నిక్షిప్తం చేస్తారు. ఆ నిక్షిప్తం రెండు విధాలు. (1) వాటి యందు రచించడం ఒక పద్ధతి. (2) వాటి యందు ఆవహింపజేయడం మరొక పద్ధతి. అక్షర శక్తులను ఆవహింపజేస్తూ శ్రీచక్రంలో రచించి పెడితే దానికి కైలాస ప్రస్తారమని పేరు.

మాతృకావర్ణాలు కలిసి శ్రీచక్రాన్ని కైలాసప్రస్తారమంటారు. ఇది 'మాతృకావర్ణరూపిణీ' వెంటనే 'మహాకైలాసనిలయా' చెప్పడంలో ఔచిత్యం.

579. మృణాళమృదుదోర్లతా – శ్రీ మృణాళమృదుదోర్లతాయై నమః

ఈ నామంలో అమ్మ ఎంత మెత్తనిదో చెప్తున్నారు. మృణాళము అంటే తామరతూడు. మృదు అంటే మెత్తదనం. దోర్లతా అంటే చేతులు. చేతులు కల్పలతల వలె ఉన్నాయి. కల్పలతలు ఏవి కోరుకుంటే అవి ఇస్తాయి. అమ్మ చేతులు ఏవి

కావాలంటే అవి ఇస్తాయి. 'భక్తిమత్కల్పలతికా' అని కూడా అమ్మవారి మరొక నామం.

కావలసినవన్నీ ధర్మ, అర్థ, కామ, మోక్షములు అనే నాలుగింటిలో దేనికో ఒకదాని క్రిందకి వస్తాయి. ఆ నాలుగు ఇవ్వాలి కనుక అమ్మవారికి నాలుగు చేతులు. మెత్తని చెయ్యి మెత్తని మనస్సుకు సంకేతం. అమ్మ పేరే లలిత. అంత లాలిత్యమైన తల్లికి చేతులు కూడా లలితంగానే ఉన్నాయి. ఆ చేత్తో ఏ పని చేసినా అంత మెత్తగా, అంత లలితంగానే ఉంటుంది. ఇచ్చేటప్పుడు లాలిత్యంతో ఇవ్వాలి – అంటే ప్రేమగా ఇవ్వాలి.

అమ్మవారివి తామరుతూడులోని దారంవలె మెత్తగా ఉన్న చేతులు. నాలుగు చేతులా, రెండు చేతులా అని చెప్పలేదు. చేతులు అని చెప్తున్నారు. వెయ్యి చేతులు కూడా పెట్టుకోవచ్చు.

అమ్మరూపాలలో రెండు చేతులు, నాలుగుచేతులు, ఎనిమిది చేతులు, పది చేతులు, పద్దెనిమిది చేతులు ఉన్న మూర్తులు కూడా ఉన్నాయి.

ఎన్ని చేతులు ఉన్నా అన్ని చేతులు 'మృణాళమృదుదోర్లతా'. ఆ చేతులతోనే రాక్షసులతో యుద్ధం చేసింది. అప్పుడు ఆ చేతులు వారికి కఠినం. ఆ మెత్తని చేతులతో ఈ జగత్తునంతటిని లాలిస్తోంది కనుక లలిత.

చేతుల మెత్తదనం అమ్మ కారుణ్యాన్ని, సౌజన్యాన్ని, మార్దవ గుణాన్ని తెలియజేస్తోంది. ఇలా ఒకొక్క నామాన్ని భావన చెయ్యాలి.

మరొకభావన చెప్తూ 'మహాకైలాసనిలయా' అంటే సహస్రారస్థానం. అక్కడి దాకా ప్రసరిస్తూ వెళ్తున్న కుండలినీ. బిసతంతుతనీయసీ. మృణాళ, బిసతంతు– రెండూ తామర తూడులే. దాని ద్వారా అమ్మ సుకుమారంగా, సుషుమ్నగా వెళ్తోంది. సుషుమ్నకి రెండు వైపులా రెండు చేతుల్లా ఉన్నవి ఇడ, పింగళ నాడులు.

మృణాళము వలె సుషుమ్నా ద్వారా వెళ్తున్న తల్లికి సుకుమారంగా ఇరువైపులా ఇడ, పింగళ ఉన్నాయి కనుక 'మృణాళమృదుదోర్లతా'. ఇడా, పింగళా సుషుమ్నాత్మకమైన ముఖ్యప్రాణ స్వరూపాన్ని ఇక్కడ భావన చేస్తున్నారు.

580. మహనీయా – శ్రీ మహనీయాయై నమః

గొప్పది కనుకనే మహనీయా. 'మహః పూజాయాం' అనే ధాతువు ప్రకారంగా మహనీయా అంటే పూజింప దగినది, పూజింపబడేది అని అర్థం. ఆ తల్లి పూజకు యోగ్యురాలు. హరిహరబ్రహ్మేదులందరి చేత పూజింపబడే తల్లి గనుక 'మహనీయా'.

581. దయామూర్తిః – శ్రీ దయామూర్త్యై నమః

మూర్తి ప్రకటింపబడిన స్వరూపం. దయ ఒక మూర్తి ధరిస్తే అది అమ్మవారు. అమ్మ అణువణువు దయయే. ఎప్పుడూ కఠినంగా ప్రవర్తించదు. కాఠిన్యం ఉందనుకొంటే అది మన అజ్ఞానం. అమ్మవారు కఠినంగా మనకి అనిపించినా అది కూడా కరుణే. "అమ్మా! రాక్షసులని చెండాడవమ్మా" అన్నా కఠినురాలని అనకూడదని దేవతలు అన్నారు.

చిత్తే కృపా సమర నిష్ఠురతా చ దృష్టా
వైరిష్వపి ప్రకటితైవ దయా త్వయేత్థం

తల్లీ! శత్రువులయందు కూడా దయనే ప్రకటించావు. అమ్మవారు తన చూపుతోనే శత్రువులని తగలబెట్టేయగలదు. అయినా ఆయుధాలు ఎందుకు వాడిందంటే 'మృణాళమృదుదోర్లతా' అయిన తల్లి కనుక ఆ తల్లి చేతిస్పర్శతో తగిలిన ఆయుధాలు వారి ఒంటికి తగిలితే వారి పాపాలు పోతాయి. ఆ తల్లి ఎందుకలా తగిలించిందంటే **'రిపవోఽపి హి శస్త్రపూతా'** – శత్రువులు కూడా శస్త్రముల చేత పవిత్రులైపోవాలి. పవిత్రులు కాకపోతే సద్గతిని ఇవ్వదు. శత్రుసంహారమంతా అయిపోయాక రాక్షసులందరికి అమ్మవారు సద్గతిని ఇచ్చేసిందని దేవతలకి తెలిసింది. "అమ్మా! పాపాత్ములకి సద్గతి ఇవ్వకూడదు కదా!" అంటే, "అందుకే వారిని ఆయుధాలతో కొట్టి పాపాలను తీసేసి అనుగ్రహించా"నని చెప్పింది. కాబట్టి అమ్మవారు 'దయా మూర్తిః'. దయ **హృదయం**లో ఉన్నది.

హృ'దయ'ంలో పూజింపబడిన మూర్తి కనుక దయామూర్తి అని వ్యాఖ్యాతలు చక్కగా వర్ణించారు. ఎవరి హృదయంలో దయ అనే ధాతువు ఉంటుందో అక్కడే ఈ మూర్తి పూజింపబడుతుంది.

582. మహాసామ్రాజ్యశాలినీ – శ్రీ మహాసామ్రాజ్యశాలిన్యై నమః

గొప్ప సామ్రాజ్యము కలిగినది. సర్వవిశ్వము అమ్మవారి సామ్రాజ్యమే. అమ్మవారి పేరే రాజరాజేశ్వరి.

మహాకైలాసమే మహాసామ్రాజ్యము. ప్రపంచాన్నంతటిని ఏలే చోటు కైలాసము. దానిని మించిన సామ్రాజ్యం మరొకటి లేదు. ఆటలు పంచకృత్యాలే. సర్వబ్రహ్మాండాలలో జరిగే పంచకృత్యాల ఆటలకి అది కేంద్రబిందువు. అలాంటి చోట కూర్చుని ఈ ప్రపంచాన్నంతటిని ఐదు ఆటలతో పాలిస్తున్నది గనుక 'మహాసామ్రాజ్యశాలినీ'.

శ్రీచక్రంలో బిందుపీఠంలో ఉన్నది 'మహాసామ్రాజ్యశాలినీ'. లోకాలలో మహాకైలాసంలో ఉన్నది. శరీరంలో సహస్రారమునందు ఉన్నది మహాసామ్రాజ్య శాలినీ. వేదాది శాస్త్రాలన్నీ మహాసామ్రాజ్యములు. వాటిని ఏలే మాతృకావర్ణరూపిణి అనే భావన కూడా తీసుకోవచ్చు.

ఇప్పటివరకు మాతృకావర్ణరూపిణితో అనుబంధము కలిగిన నామములు పూర్తి అయ్యాయి. ఇప్పుడు చెప్పబడుతున్న నామాలు శ్రీవిద్యాస్వరూప ఆవిష్కరణ. ఇందులో కొన్ని కేవలం ఉపాసకులకు మాత్రమే పనికొచ్చేవి ఉంటాయి కనుక గురుముఖతః మాత్రమే తెలుసుకోవాలి. మంత్రంలో అక్షరాలు, వాటి సంకేతాలు చెప్పారు. 'సదసి న ప్రకాశయేత్' అని చెప్పినట్టుగా వాటిని సభలలో ప్రస్తావించరాదు. మరి తెలియనివారికి ఈ నామాల మననమే ఆ ఫలితాన్ని ప్రసాదిస్తుందనడంలో సందేహం లేదు.

ఆత్మవిద్యా మహావిద్యా శ్రీవిద్యా కామసేవితా
శ్రీషోడశాక్షరీవిద్యా త్రికూటా కామకోటికా
కటాక్షకింకరీభూతకమలాకోటిసేవితా
శిరఃస్థితా చంద్రనిభా ఫాలస్థేంద్రధనుఃప్రభా
హృదయస్థా రవిప్రఖ్యా త్రికోణాంతరదీపికా

'ఆత్మవిద్యా' నుండి 'త్రికోణాంతరదీపికా' వరకు శ్రీవిద్యా మూలమంత్ర విశేషం

చెప్పబడింది. 'శ్రీమద్వాగ్భవకూటైకస్వరూపముఖపంకజా' నామం దగ్గర చెప్పింది ఇక్కడ గుర్తు తెచ్చుకుంటే మరింత బాగా అర్థమౌతుంది. శ్రీవిద్యని ఎంత చక్కగా పరిచయం చేస్తున్నారో గమనించాలి. అసలైన మూల మంత్రాన్ని 'శ్రీషోడశాక్షరీవిద్యా' నామం దగ్గర చెప్పారు. ఆ మూలమంత్రము ద్వారా చెప్పబడే విద్యాస్వరూపమేదో ముందు చెప్తున్నారు.

583. ఆత్మవిద్యా – శ్రీ ఆత్మవిద్యాయై నమః

శ్రీవిద్య అనగా ఆత్మవిద్య. లోకంలో సాధారణ ప్రయోజనాల కోసం మాత్రమే వాడేది కాదది. అది ఆత్మజ్ఞానాన్ని ఇచ్చే విద్య. ఇలాంటి వాక్యమే విష్ణుపురాణంలో లక్ష్మీదేవిని స్తోత్రం చేస్తూ ఇంద్రుడు –

ఆత్మవిద్యా చ దేవి త్వం విముక్త ఫలదాయినీ
అన్వీక్షకీ త్రయీ వార్తా దండనీతిస్త్వమేవచ
సౌమ్యా సౌమ్యైః జగద్రూపైః త్వయేతద్దేవి పూరితం

అని చెప్పారు. ఆ లక్ష్మియే ఈ లలిత. అమ్మా! **అన్వీక్షకీత్రయీ వార్తా దండనీతి** అని చెప్తున్న రాజవిద్యవి నువ్వే. ధర్మరక్షణ కోసం 'అన్వీక్షకీ త్రయీ వార్తా' మొదలైన రూపాలతో ఉంటూ ఇహలోక సామ్రాజ్యం నడిపిస్తుంది. మోక్షం కావాలనుకుంటే, "ఆ నువ్వే ఆత్మవిద్యగా వచ్చావు తల్లీ" అని 'ఆత్మవిద్యా చ దేవిత్వం విముక్తిఫలదాయినీ' అని శ్రీదేవిని ఇంద్రుడు స్తుతిస్తాడు. ఆత్మ అంటే ఏంటో తెలియజేసే విద్య. నేను అనడానికి ఏ చైతన్యము ఆధారమో దాని పేరు ఆత్మ.

ముందు ఈ శరీరమే నేను, ఇదే ఆత్మ అనుకుంటారు. అలా అనుకుంటే దాని పేరు దేహాత్మ. కొంత కాలానికి తెలివితేటలు వచ్చి శరీరమే నేను ఎలా అవుతుందని ఆలోచించి, మనస్సు దాకా వస్తాడు. దేహం కాదు మనస్సు అని అనుకుంటారు. మరి కొందరు బుద్ధి దాకా వస్తారు, కొందరు ప్రాణం దాకా వస్తారు. **ఆఖరికి పంచకోశాలు నేను కాదు** అనేది తెలుసుకుంటారు. పంచకోశాలను వెలిగిస్తున్న 'పంచకోశాంతరస్థితా' ఏది ఉందో అదే ఆత్మ అని తెలుసుకుంటారు.

'నేను' అనే చైతన్యానికి ఆధారం బ్రహ్మమే. ఆత్మని తెలుసుకునే ప్రక్రియ ఆత్మవిద్య. దాని ద్వారా ఆత్మయే బ్రహ్మమని తెలియబడుతున్నది.

584. మహావిద్యా – శ్రీ మహావిద్యాయై నమః

బ్రహ్మముకు మరొక పేరు మహా. ఆత్మవిద్య చివరికి బ్రహ్మమునే తెలియజేస్తున్నది కనుక 'మహావిద్యా'. **'అధ్యాత్మవిద్యా విద్యానాం'** – అని భగవద్గీతావాక్యం. విద్యలలో గొప్పది అధ్యాత్మవిద్య. అదే మహావిద్య. కాళీ, తారా, త్రిపురాది దశ విద్యలు, వనదుర్గాది విద్యలు – మహావిద్యలుగా చెప్పబడుతున్నాయి. వాటిలో ప్రధానమైన త్రిపురా(శ్రీ) విద్య కనుక మహావిద్య. బ్రహ్మము అంటే ఎక్కడో వెతకడం కాదు. మనలో ఉన్న 'స్వాత్మైవ బ్రహ్మ', 'అహం బ్రహ్మాఽస్మి'. అదే 'శ్రీవిద్య'. **'యజ్ఞవిద్యా మహావిద్యా గుహ్యవిద్యాచ శోభనే'** (ఇంద్రకృత లక్ష్మీస్తుతి).

585. శ్రీవిద్యా – శ్రీ శ్రీవిద్యాయై నమః

ఆత్మవిద్య, మహావిద్యయే 'శ్రీవిద్య'. శ్రీ అనగా పరబ్రహ్మస్వరూపం. పరబ్రహ్మశక్తి. శక్తి ద్వారా శక్తిమంతుని తెలుసుకోవాలి గనుక ఈ ఆత్మవిద్యా, మహావిద్యా తెలియాలంటే ప్రపంచమంతా వ్యాపించిన శ్రీ ఏదో తెలుసుకోవాలి.

శ్రీ అనగా శోభ, కాంతి. శ్రీ అనే మాటే పెద్ద మంత్రం. అందుకే భారతదేశంలో శ్రీకారం చుట్టడమనే మాట ఉంది. తెలియకుండానే అందరం శ్రీవిద్యోపాసకులమే. శ్రీకారం చుట్టకుండా ఏముంది. లలితా సహస్రనామం కూడా శ్రీకారంతోనే ప్రారంభమైనది. శ్రీ అనగా చైతన్యము.

ఆ చైతన్యాన్ని మనం శోభగా, చైతన్యంగా, కాంతిగా, లక్ష్మిగా వర్ణిస్తాం. అదే ఆత్మవిద్యా, మహావిద్యా, శ్రీవిద్యా. శ అంటే ఆనందము, **ర** అంటే తేజస్సు అనగా జ్ఞానము, **ఈ** అంటే బ్రహ్మశక్తి. **శ, ర, ఈ అంటే జ్ఞానానందాత్మకమైన పరబ్రహ్మశక్తి అని శ్రీ శబ్దానికి అర్థం.**

సర్వైః ఆశ్రయతే ఇతి శ్రీ – అందరికి ఆశ్రయమైన శక్తి. ఇంతవరకు బ్రహ్మము,

ఆత్మ అని చెప్పిన సత్యాన్ని ఆశ్రయించుకున్న స్వాత్మశక్తియే శ్రీ. అది తెలుసుకునే విద్య పేరే 'శ్రీవిద్యా'. ఈ శ్రీవిద్యని మనకి ఇచ్చినవారు గురువు. ఒక మంత్రం మన దాకా వచ్చిందంటే ఆ మంత్రం ముందుగా ఎవరు చేశారో తెలుసుకోవాలి. అదే తరువాత నామంలో చెప్తున్నారు.

586. కామసేవితా – శ్రీ కామసేవితాయై నమః

ఇప్పుడు శ్రీవిద్యగా ప్రసిద్ధి చెందిన ఏ కాదివిద్య ఉందో దానిని మన్మథుడు ఉపాసన చేశాడు. ఆ ఉపాసన వల్లనే అతడు సిద్ధపురుషుడు అయ్యాడు. శ్రీవిద్య కాదివిద్య అని అర్థం. హాదివిద్య, సాదివిద్య కూడా. ఇలా శ్రీవిద్యలో రకాలు ఉన్నాయి.

మరొక అర్థం– 'కామసేవితా' అన్నప్పుడు 'కామకళారూపా' నామం వద్ద చెప్పినది గుర్తు తెచ్చుకోవాలి. కామకళ అంటే ప్రధానంగా చెప్పుకున్నది 'ఈం'. కామసేవితా అంటే ఈం రూపముగా సేవించబడునది. ఇంకొక ప్రధాన అర్థం **కామ** అంటే కామేశ్వరుడు, పరమాత్మ, పరబ్రహ్మ శివుడు అని అర్థం. అమ్మవారి విద్య మనకి ఇచ్చినవాడు శివుడే. మొట్టమొదట ఆయనే అమ్మవారి విద్యను అనుసంధానం చేసుకుని మనకి ఇచ్చాడు కనుక ఆదిగురువు ఆయనే.

శివుడే అందరికి గురువు. మొట్టమొదటివాడు సృష్టి చెయ్యాలని కామించినవాడు.("సః అకామయత'). ఏ శక్తిని ఉపాసించి అనగా అనుసంధానం చేసుకుని ఈ సృష్టిని చేశాడో ఆ శక్తే శ్రీ విద్య. కనుక కామసేవితా అంటే కామేశ్వరసేవితా అని మరొక అర్థం.

మహావిద్యా మంత్రరూపాన్ని తరువాత నామంలో చెప్తున్నారు.

587. శ్రీషోడశాక్షరీవిద్యా – శ్రీ శ్రీషోడశాక్షరీవిద్యాయై నమః

ఏదైనా గొప్పదానికి ముందు శ్రీకారం పెడతాం. కనుక ఈ మంత్రానికి శ్రీకారం అనే కిరీటం పెట్టి సింహాసనం మీద కూర్చోబెట్టినట్లు తెచ్చారు. షోడశాక్షరీవిద్య

ప్రధానంగా చూపిస్తున్నారు. పదహారు అక్షరాల విద్య. పదిహేను అక్షరాల విద్య కూడా పూర్ణవిద్యే. ఇదే షోడశీలో కలుస్తుంది. మూడు అక్షరాలకి మరో మూడైతే ఆరు అక్షరాల బాలామంత్రం అవుతుంది. ఆ బాలా మంత్రం ఒక్కటి పట్టుకుని ముక్తి పొందిన మహాత్ములున్నారు.

ఏ మంత్రాన్ని కూడా తక్కువగా చూడరాదు. శ్రీవిద్య అనేదానికి నిర్వచనం వ్రాస్తూ భాష్యకారులు మూడు చూపించారు. అవి బాల, పంచదశీ, షోడశీ. ఈ మూడింటిని శ్రీవిద్యే అంటారు. ఇందులో ఏ ఒక్కటి సిద్ధించుకున్నా శ్రీవిద్యే. మంత్ర మాత్రంచేతనే శక్తిమంతమౌతుందని అనుకోవడానికి లేదు. సాధన వల్ల శక్తిమంతమౌతుంది. ఆ మూడక్షరాలే తిరిగి మూడక్షరాలుగా వస్తుంది. దాని అర్థమేమిటంటే 'అహం బ్రహ్మాఽస్మి'. 'బ్రహ్మైవాహమస్మి'. అదే విచారణ. అప్పుడే బ్రహ్మవిద్య తెలుస్తుంది. అంతరార్థంలోకి వెళితే బ్రహ్మవిద్య. దానినే పండించుకుని ముక్తి పొందినవారు ఉన్నారు. అదే శ్రీవిద్య. అది పదహారుకళల అమ్మవారిని తెలియజేస్తుంది కనుక 'శ్రీషోడశాక్షరీవిద్య' అని చెప్పుకుంటే అది దేనికైనా అన్వయం అవుతుంది.

షోడశీమంత్రంలో పదిహేను అక్షరాల పంచదశికి మరొక్క బీజాక్షరం ఉంటుంది. శ్రీషోడశాక్షరీ విద్యలోనే ఆ బీజాక్షరాన్ని సూచించారు. ఆ సూచించేదే గొప్ప మంత్రం. అది కలవగానే పదహారు అక్షరాలైపోయింది.

ఇంకో షోడశీవిద్య ఉంది. దానికి ఇరవై ఎనిమిది అక్షరాలు ఉన్నాయి. అందులో బీజాక్షరాలు ఉంటాయి. మొట్టమొదట వచ్చిన బీజాక్షరాలు పంచదశీ మొత్తం చెప్పి, ఆ తరువాత అవి తిరిగి పునరావృతం అవుతాయి అంటే వెనక్కి వస్తాయి. వాటికో మర్యాద ఉంది కనుక బీజాక్షరాలు సభల్లో, లేఖనాలలో చెప్పరాదు.

పంచదశి ప్రధానమంత్రం. షోడశీలో కూడా పంచదశే ఉంటుంది. ఈ పదిహేను అక్షరాలకి అటు, ఇటు ఉన్న బీజాక్షరాలు కలుపుకుంటే పదమూడు అవుతాయి. 15 + 13 = 28 అయ్యాయి. పంచదశీలో ఒకొక్క కూటమి ఒకొక్క అక్షరం క్రింద లెక్కపెట్టాలి. పంచదశిలో మూడు కూటములు ఉంటాయి. మూడు

కూటములు కలిపితే పదిహేను అక్షరాలు. మూడు కూటములలో ఒకొక్క కూటమిని ఒకొక్క అక్షరం క్రింద లెక్కపెట్టాలి. అప్పుడు 15 అక్షరాలు **మూడు** అక్షరాలు అయ్యాయి. ఇది త్రికూటా. అప్పుడు మిగిలిన 13, ఈ మూడింటితో కలిసి 16 అయ్యాయి.

కనుక 28 అక్షరాల విద్య కూడా షోడశాక్షరీవిద్యగానే చెప్పబడుతున్నది. ఇది పూర్ణదీక్షలో లభించే మహావిద్య. అందుకే షోడశాక్షరీవిద్యగా చెప్పబడుతోంది. శ్రీవిద్యలో పరమమైన విద్య కనుక దీనిని ప్రత్యేకించి ప్రస్తావించారు.

మంత్రం చెప్పలేకపోయినా మంత్రం పేరు చెప్పవచ్చు. అది మంత్రోపదేశం లేని వారి విషయంలో పనికొస్తుంది. ఆత్మవిద్యా, మహావిద్యా, శ్రీవిద్యా. దానిని ఇచ్చినవాడు పరమేశ్వరుడు కనుక కామసేవితా. దాని యొక్క పరమమంత్రం 'శ్రీషోడశాక్షరీవిద్యా'.

శ్రీసూక్తం అంతా మొత్తం పదిహేను ఋక్కులు. పదిహేను అక్షరాలకి, పదిహేను ఋక్కులకి సంబంధం ఉంది. ఈ పదిహేను ఋక్కులుగా పల్లవించిన 'శ్రీ' పదహారవ అక్షరం అయింది. శ్రీసూక్తమంతా షోడశీ, పంచదశీకి విస్తారం. దీని *గురించి వివరంగా శ్రీసూక్తపరమార్థమని శ్రీసూక్తంలో రహస్యార్థాలని వ్యాఖ్యానించడం జరిగింది (ఋషిపీఠం ప్రచురణ).*

శ్రీసూక్తంలోని 15 ఋక్కులలో 15 అక్షరాలు దాగి ఉన్నాయి. అదే పంచదశీవిద్య. ఆ పంచదశీవిద్యని ఇచ్చినవాడు **'ఆనందకర్దమశ్చైవ చిక్లీత ఇతి విశ్రుతాః ఋషయస్తే త్రయః పుత్రాః స్వయం శ్రీదేవి దేవతా'** – ఇది శ్రీవిద్యాశాస్త్రంలోని శ్లోకం. ఆనంద, కర్దమ, చిక్లీత అని లక్ష్మీదేవి మానసపుత్రులు ముగ్గురు ఉన్నారు. వీరు ముగ్గురు దర్శించి ఇచ్చిన మంత్రమే శ్రీవిద్యామంత్రం. ఈ ముగ్గురి యొక్క విద్యే త్రికూటవిద్య. లక్ష్మీదేవి మనస్సు నుండి వచ్చిన పుత్రుడే కాముడు. మన్మథశక్తే ఆనంద, కర్దమ, చిక్లీత అనే మూడు రూపాలుగా ఉంది. 'కమలజు కన్నతల్లి కాముని కన్నతల్లి అమరుల గన్నతల్లి ఆదిమలక్ష్మి' అని వర్ణించారు అన్నమయ్య.

మన్మథుడు లక్ష్మీదేవి హృదయంలోంచి కలిగి లోకాన్ని నడిపే దేవత.

కమనీయమైన ఆ శక్తే కామ అని చెప్పబడుతోంది. ఆనంద, కర్దమ, చిక్లీత అనేవి వైదికమైన పేర్లు. అందుకే **'కాదివిద్యా యతోజాతః స చిక్లీతః సదావతు'** – ఈ కాదివిద్య ఏ చిక్లీతుని నుండి కలిగిందో ఆ విద్య నన్ను రక్షించుగాక అని ఒక మంత్రప్రయోగంలో ఉంది.

కాదివిద్యని ఇచ్చినవాడు చిక్లీతుడు. మన్మథునికి ఉన్న మరొక పేరు చిక్లీతుడు. కామసేవితా అంటే చిక్లీతుని ద్వారా మనకి లభించిన శ్రీవిద్య. శ్రీషోడశాక్షరీ ముందు కామసేవితా పెట్టడంలో శ్రీ సూక్తంలో చెప్పబడ్డ చిక్లీతుడు అనే దేవతని తెలియజేయడమయింది.

భవ్యమైన ఆ స్వరూపాన్ని తరువాతి నామంలో చెప్తూ 'త్రికూటా' అన్నారు. శ్రీషోడశాక్షరీవిద్య మూడు కూటములతో ఉంది. దానిని మించిన గొప్ప స్థితి లేదు గనుక కామకోటికా. ఇలా తరువాతి నామాలలో శ్రీవిద్యాస్వరూపం పూర్తిగా చెప్పబడుతుంది. 'ఆత్మవిద్యా' దగ్గర నుండి 'త్రికోణాంతరదీపికా' వరకు విద్యారహస్యాలను తెలియజేశారు.

588. త్రికూటా – శ్రీ త్రికూటాయై నమః

'సాహి శ్రీః అమృతాం సతాం'. వేదము నందు శ్రీ అనేది ఋగ్యజుస్సామాత్మిక యైన అమ్మవారిని తెలియజేస్తున్నది. సాక్షాత్ వేదస్వరూపిణి. వేదవేదాంతప్రతిపాద్య అయిన తల్లే శ్రీవిద్యాధిదేవత. ఆ తల్లికి సంబంధించిన మంత్రం 'శ్రీ షోడశాక్షరీ విద్య'.

శ్రీషోడశాక్షరీవిద్య, శ్రీవిద్య అని చెప్పబడుతున్న ఆ మంత్రం మూడు కూటములతో ఉన్నది కనుక త్రికూటా. ఇది మంత్రస్వరూపాన్ని చెప్తున్న నామం. వాగ్భవకూట, కామరాజకూట, శక్తికూట అని త్రికూటములతో చెప్పబడుతున్న విద్య కనుక త్రికూట. ఇదే కాది, హాది, సాది అని కూడా చెప్పబడుతోంది. మొదటికూటం క తో, రెండవకూటం హ తో, మూడవకూటం స కారంతో ప్రారంభం అవుతుంది కనుక కాది, హాది, సాది.

విద్యాభేదాల్లో హాదివిద్య, సాదివిద్య, కాదివిద్య అని ఇలా పన్నెండు విద్యలకి పన్నెండు భేదాలు ఉన్నాయి. అది గురుముఖతః మాత్రమే తెలుసుకోవలసిన విషయం. 15 అక్షరాల మహామంత్రం మూడు కూటములతో కూడి ఉందని వివరిస్తున్నారు. ఇక్కడ చెప్పేటప్పుడు మంత్రపరంగా సరిపోవాలి. అమ్మ యొక్క ప్రతి స్వరూపానికి ఈ నామం సరిపోవాలి.

త్రికూటాకి మరొక అర్థం చెప్తూ– **'త్రయాణాం బ్రహ్మాదీనాం అవస్థా పీఠ లోక గుణాదీనాం వా కూటం సమూహః యస్యాః సా'**. అమ్మవారు ముగ్గురు అమ్మలరూపం. అది త్రికూటమే. కూటము అంటే సమూహము. దుర్గా లక్ష్మీ సరస్వతీరూపిణి. అంతేకాదు బ్రహ్మాదీనాం – బ్రహ్మవిష్ణురుద్రరూపిణి. అవస్థాత్రయములైన జాగ్రత్, స్వప్న, సుషుప్తుల యందు వ్యాపించి ఉంటుంది కనుక త్రికూటా. అలాగే పీఠత్రయములు అంటే ప్రధానంగా మూడు పీఠాలైన కామగిరి, పూర్ణగిరి, జాలంధర పీఠాలు, త్రిలోకములు, త్రిగుణములు. వీటన్నింటి యొక్క సమూహముల యందు వ్యాపించి ఉన్న తల్లి గనుక 'త్రికూటా'.

589. కామకోటికా – శ్రీ కామకోటికాయై నమః

లలితా సహస్రనామాల్లోనే 'కామకోటికా' కనిపిస్తున్నది. అలాగే బ్రహ్మాండ పురాణంలో, లలితోపాఖ్యానంలో లలితాదేవికి సంబంధించి ఇరవైఐదు విశేషనామాలు చెప్పారు. అందులో **'కామకోటికాయై నమః'** అని ఉన్నది. 'కామకోటి' అన్నది అమ్మవారి నామం. శక్తి పీఠాలలో కాంచీపురం కామకోటి పీఠము అని చెప్పడం ఉంది.

అమ్మవారి మంత్రాన్నే కామకోటి మంత్రము అని చెప్పవచ్చు. ముందు మంత్రపరంగా అర్థం చెప్పుకుని ఇంకా అమ్మవారి అనుగ్రహపరంగా కూడా అర్థం చెప్పుకోవాలి.

ముందు కామకోటికా ఎందుకన్నారో తెలుసుకుందాం. కోటి అనే పదానికి అర్థం చెప్తూ **'ఏకదేశః కోటిః'** అన్నారు. రెండూ కలిసి ఒక చోట ఉంటే దాన్ని

కామకోటి అనాలి. ఇక్కడ అమ్మవారు **'కామః పరశివః ఏవ కోటిః ఏకదేశః'** అమ్మవారు ఆ శివునితో కలిసి ఒకటిగా ఉన్న స్వరూపము కామకోటి అని చెప్పబడుతుంది. ఇది **'శివశక్తి సామరస్యం పరబ్రహ్మరూపత్వాత్'** అని వ్యాఖ్యానం (భాస్కరరాయ). శివశక్తి సామరస్యాన్ని కామకోటి అనాలి.

'కోటి' సంఖ్యావాచకమే కాకుండా సమూహము, గుంపు, కలసి ఉండుట అని కూడా అర్థం ఉంది. ఒక్కటై కలసి ఉన్న స్వరూపం చెప్పినప్పుడు కూడా కోటి శబ్దం వాడబడుతున్నది. కామకోటికా అంటే కామకామేశ్వరుల యొక్క ఏక స్వరూపం. అదే శ్రీవిద్య. అమ్మ విద్య కేవలం శక్తి మంత్రమా? శివమంత్రమా? అంటే ఉభయుల మంత్రం. కామకోటికా అంటే శివశక్తుల ఏకరూపమైన మంత్రస్వరూపము అని సారార్థం.

మరొక శాస్త్రపరమైన అర్థం. కాంచీపురంలో మూడు కోటులు ఉన్నాయి. 1. వరదరాజ పెరుమాళ్ళు ఉన్న ప్రాంతమంతా విష్ణుకోటి. 2. ఏకామ్రేశ్వరుడు ఉన్న ప్రాంతమంతా రుద్రకోటి. 3. అమ్మవారు ఉన్న ప్రాంతమంతా కామకోటి. మూడు కోటులు అక్కడ ఉన్నాయి. త్రికూటా అన్నప్పుడు కొందరు ఆ భావనలో కూడా చెప్తారు. మూడు శక్తుల యొక్క సమూహము. కామకోటి అని అమ్మవారికి ప్రసిద్ధిగా ఉన్నది.

పురమథన పుణ్యకోటీ పుంజిత కవిలోక సూక్తిరసధాటీ
మనసి మమ కామకోటీ విహరతు కరుణావిపాక పరిపాటీ

ఆ కామకోటి నా మనస్సులో విహరించుగాక! అమ్మపేరు కామకోటి. ఆవిడ 'పురమథన పుణ్యకోటి' అంటే శివుని యొక్క పుణ్యాలరాశి. 'పుంజిత కవిలోక సూక్తి రసధాటి'. కవులు అంటే మంత్రములు, ఋషులు అని రెండర్థాలు. వారి యొక్క సూక్తాలన్ని కలసిపోయిన స్వరూపము అంటే వేదప్రతిపాద్యమానమైన తత్త్వము. అలాంటి తల్లి అయిన కామకోటి నా మనసులో విహరించాలి అని అద్భుతమైన భావాన్ని మూకకవి చూపించారు.

కామాక్షీదేవి వెలసిన చోటు కామకోటి. అక్కడ కూర్చుని ఏ మంత్రం జపించినా

ఒకొక్క అక్షరము కోటిగుణితమై ఆ అక్షరము వల్ల ఏవేవి సిద్ధించాలో అవన్నీ సిద్ధిస్తాయి. మంత్రములో ప్రత్యక్షరము కోటిగుణితముగా ఎక్కడ సిద్ధిస్తుందో ఆ చోటు పేరు కామకోటి అని మరొక అర్థం. అక్షరాల వల్ల సిద్ధించే ఆనందానికే కామమని పేరు. కామశబ్దానికి ఆనందమని అర్థాన్ని కూడా చెప్పుకున్నాం. సృష్టిలో అందరూ కోరుకునే కామం ఆనందమే.

కోటి అంటే గుంపు. అన్ని ఆనందాల ఏకరూపిణి అమ్మవారు.

'స్వాత్మానందలవీభూతబ్రహ్మాద్యానందసంతతిః' అని చెప్పినట్లుగా మానుషానందం మొదలుకొని బ్రహ్మానందం వరకు సర్వానందాల సమూహమైన సచ్చిదానందము కనుక కామకోటి అంటే ఆనందస్వరూపిణి. ప్రతివారికి వారి మంత్రము యొక్క సిద్ధే కామము.

ఇంకొక అర్థంలో కోటి అంటే అంచు. శేవధి, అవధి. కామమునకు అంచు అంటే చివరిది అని అర్థం. కామమునకు అంచు అంటే కామము దాటిన తరువాత ఏం ఉంది? మోక్షం. అదే 'కామకోటికా'. ఆమె మోక్షస్వరూపిణి.

మొదటి అర్థం – శివశక్తి సామరస్యం చెప్పబడుతున్నది. రెండవది – మంత్రం యొక్క సర్వానందాలను, సిద్ధులను అందించే తల్లి, మూడవది – మోక్షస్వరూపిణి. త్రికూటా కామకోటికా. మంత్రము పేరే కామకోటి. మంత్రాధిదేవత ఆ కామకోటి తల్లి. తరువాత నామం

590. కటాక్షకింకరీభూతకమలాకోటిసేవితా

– శ్రీ కటాక్షకింకరీభూతకమలాకోటిసేవితాయై నమః

ఈ నామం శ్రీవిద్యాఫలం. ముందు విద్యాస్వరూపం చెప్పారు. తరువాత ఆ విద్యకున్న స్వభావం చెప్పారు. ఇప్పుడు ప్రభావం చెప్తున్నారు. శ్రీవిద్యోపాసకులకు వచ్చే ఫలితం ఏమిటో వివరిస్తున్నారు.

కమలా అంటే లక్ష్ములు అనగా ఐశ్వర్యాలు. అంతేకాని వైకుంఠంలో ఉన్న లక్ష్మీదేవి అని కాదు. ఐశ్వర్యాలు కోటి ఉన్నాయన్నారు. కోటి అంటే లెక్కలేనన్ని

గుంపులు. ఈ లక్ష్ముల గుంపులన్నీ కూడా అమ్మవారు అలా కడగంటితో చూస్తే చాలు కింకరులు అయిపోతాయి. అమ్మవారి కనుసైగలను అనుసరించి సర్వైశ్వర్యాలు సంచరిస్తూ ఉంటాయని అర్థం. కేవలం తన కడగంటి చూపుల మాత్రం చేతనే కోట్లాదిలక్ష్ములను కింకరులుగా చేసుకుంటోంది అమ్మవారు. ఆవిడ ఎక్కడకి వెళ్ళమంటే అక్కడికి వెళ్తూ ఉంటారు.

అమ్మవారి అనుగ్రహం పొందగలిగితే, కోట్లాది లక్ష్ములు లభిస్తాయి. శ్రీలను తన కన్నుల నుండి వర్షింప చేసే తల్లి గనుక ఆవిడ శ్రీమాత. మాత అంటే తల్లి, కారణము అని అర్థం. శ్రీలకి కారణమైన తల్లి శ్రీమాత. శ్రీలు అంటే ఐశ్వర్యాలు మొదలుకుని జ్ఞానము, మోక్షము ఇత్యాది ఎన్నో అర్థాలు చెప్పుకున్నాం.

'సిద్ధలక్ష్మీర్మోక్షలక్ష్మీర్జయలక్ష్మీః సరస్వతీ శ్రీర్లక్ష్మీర్వరలక్ష్మీశ్చ' – ఇవికాక అష్టలక్ష్ములు. ఆరోగ్యలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి ఈ పేర్లు కూడా ఉన్నాయి. తుష్టిలక్ష్మి, పుష్టిలక్ష్మి, ఉద్యోగలక్ష్మి ఎన్నైనా కలుపుకోవచ్చు. లెక్కలేనన్ని లక్ష్ములు ఉన్నాయి. మనం లెక్క పెట్టలేకపోతున్నాం కనుక కోటి అనుకుంటే సరిపోతోంది. కమలాకోటి అంటే లెక్కకందని ఐశ్వర్యాలన్ని కూడా అమ్మవారి కటాక్ష మాత్రం చేతనే లభిస్తూ ఉన్నాయి.

ఏం చెప్తే అది చేస్తే దానికి కింకరీ అని మాటని ఉపయోగిస్తారు. ఆ ఐశ్వర్యాలన్నీ అమ్మవారి ఆజ్ఞలను అనుసరించి ప్రవర్తిస్తూ ఉంటాయి.

ఈ కటాక్ష అనే మాట చెప్పేటప్పుడు అమ్మవారి యొక్క అక్షివిద్యని మరచిపోరాదు. **'ఈక్షత్యాత్మికా శక్తిః' 'స ఐక్షత బహుస్యాం ప్రజాయేయ'.** ఇదే 'ఉన్మేషనిమిషోత్పన్నవిపన్నభువనావళిః' – కన్ను మూసి కన్ను తెరవడం లాంటిది. కటాక్ష అన్నప్పుడు ఆ ఈక్షత్యాత్మికా శక్తి అని చెప్పుకోవాలి అంటే విచ్చుకొనుట అని అర్థం. ఈ 'కటాక్షీ' అన్న శక్తి శ్రీచక్రంలో బిందువు.

బిందువు విచ్చుకుంటే చక్రమయింది. ఒక మొగ్గ విచ్చుకుంటే కమలమై అందులో ఉన్న ప్రతి రేకు కనబడుతూ ఉంటుంది. ప్రతి కేసరము గోచరిస్తాయి. అలాగే బిందుస్వరూపిణి అయిన అమ్మవారు విచ్చుకుని త్రికోణాలుగాను,

అష్టదళపద్మముగాను, షోడశదళపద్మముగాను, చతురస్రముగాను కనబడుతుంది. మొత్తం కలుపుకుంటే శ్రీచక్రం.

చక్రము పద్మము ఒక్కటే. పద్మములో ఎలాగైతే రేకు రేకుకి సంబంధం ఉంటూ, మధ్యలో ఉన్న కర్ణికతో అనుబంధం పెట్టుకున్నాయో, అలా ఒక ఆవరణకు మరొక ఆవరణకు అనుబంధం ఉంటూ అన్నీ కలసి బిందువుతో అనుబంధం పెట్టుకున్నాయి. కనుక బిందువు ప్రధానశక్తి. మొత్తం ఆవరణలలో ఉన్న దేవతలందరూ కూడా ఆ కటాక్షశక్తికి కింకరీభూతులే.

కమలా అంటే వికసన శక్తులు. త్రికోణం మొదలుకుని చతురస్రం వరకు చెప్పబడుతున్న ఆవరణ దేవతలు అణిమ, మహిమ ఇత్యాదులందరూ పరమేశ్వరికి కింకరులు, అంటే ఆవిడకి ఆజ్ఞానువర్తులు.

అష్ట ఆవరణలలోనున్న ప్రతి దేవతా కూడా శ్రీశక్తి స్వరూపమే. ఎనిమిది ఆవరణలలో ఉన్న దేవతలు, వారి పరివార శక్తులను కూడా కలుపుకుంటే అరవైనాలుగు కోట్ల శక్తి దేవతలు ఉన్నారు. బిందువు విచ్చుకోవడం వలన ఏర్పడి మొత్తం నవావరణ దేవతలను కలుపుకుంటే కోట్ల కొలది ఉన్నారు. వారందరూ ఆ బిందుస్వరూపిణి అయిన అమ్మవారిని సేవిస్తూ ఉన్నారని శ్రీచక్రాన్ని మొత్తం ఆవిష్కరించారు. ఇది దీని మరొక భావం.

భగవద్గీతలో స్వామివారు **'యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా'** అని చెప్పారు. ఆ విభూతులకే శ్రీ అని పేరు. **'శ్రద్ధాం విభూతిం సురభిం నమామి పరమాత్మికాం'** అని లక్ష్మీ అష్టోత్తర శతనామాల్లో కూడా 'విభూతి' అని ఉంది.

విభూతి అంటే పరమేశ్వరుని యొక్క ఐశ్వర్యశక్తి. అవి చాలా ఉంటాయి. కృష్ణుడు కొన్ని చెప్పి, నా విభూతులు ఎన్నో నేనే చెప్పలేనన్నాడు. **"హంత తే కథయిష్యామి దివ్యాహ్యాత్మవిభూతయః ప్రాధాన్యతః కురు శ్రేష్ఠ!"** అన్నాడు. "అర్జునా! నేను ఇప్పుడు చెప్పినవి ప్రధానంగా కొన్ని విభూతులు మాత్రమే తప్ప ఇవి మాత్రమే అని నిర్ణయించలేం". **"నాస్త్యంతో విస్తరస్య మే" "నాన్తోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప** – నా యొక్క విభూతులకు అంతు లేదు" అన్నాడు.

ఆ విభూతిశక్తులే అంతులేనివి కనుక కమలాకోటి అయ్యాయి. సమస్త విభూతులు కూడా ఆ పరమేశ్వరి యొక్క ఆజ్ఞానుబద్ధులే.

శ్రీచక్రంలో చెప్పబడ్డ సమస్త శక్తులు శ్రీలు. వాటికి తల్లియై బిందుపీఠవాసిని శ్రీమాత. ఆ శ్రీమాతృ స్వరూపం ఈ నామంలో చెప్పుకున్నాం. తరువాత నామాలు

శిరఃస్థితా చంద్రనిభా ఫాలస్థేంద్రధనుఃప్రభా

హృదయస్థా రవిప్రఖ్యా త్రికోణాంతరదీపికా

ఇది ఒక గుత్తి. ఈ గుత్తికి, మునుపు చెప్పిన శ్రీవిద్యామంత్రానికి అనుబంధం ఉంది.

'శిరఃస్థితా చంద్రనిభా' 'ఫాలస్థేంద్రధనుఃప్రభా' 'హృదయస్థా రవిప్రఖ్యా' ఈ ఆరు నామాలు... రెండేసి కలిసి ఒకటి చొప్పున విభజన చేసుకొంటూ ఈ ప్రక్రియ గురించి పరిశీలిద్దాం.

591. శిరఃస్థితా - శ్రీ శిరఃస్థితాయై నమః

శిరస్సుపై బ్రహ్మరంధ్రస్థానంలో - సహస్రారంలో ఉన్నది.

మేరురూప శ్రీచక్రాన్ని ఒక్కసారి భావన చేస్తే దాని శిరస్సు బిందువు. కాబట్టి బిందువు నందు ఉన్నది.

శిరస్సు నందు ఉపాసకుడు గురుపాదుకలని భావిస్తాడు. ఆ గురుపాదుకామంత్ర రూపిణిగా శిరస్సునందు ప్రకాశిస్తున్నదని మరొక భావం.

సాయంకాలంలో ధ్యానం చేసేటప్పుడు శిరస్సునందు ధ్యానించాలని ఒక పద్ధతి ఉంది. ఆ విధంగా సాయంత్రధ్యానస్థితి అని చెప్పుకోవచ్చు. అక్కడ శిరస్సులో ఎలా ఉందో తరువాత నామంలో చెప్తున్నారు.

592. చంద్రనిభా - శ్రీ చంద్రనిభాయై నమః

శిరస్సు నందు ప్రకాశిస్తున్న తల్లి చంద్ర సమాన కాంతులతో ఉంది. అమృతబింబరూపిణీ. 'చంద్రకళా' అని అమ్మవారి పేరు. 'చది ఆహ్లాదే' అను ధాతువు

ప్రకారంగా ఆహ్లాదకారిణి అయిన అమృతబింబరూపం. ఇది సరిగ్గా బ్రహ్మరంధ్రస్థానం దగ్గర ఉంటుంది. శిరస్సు వద్ద ఆ చంద్రబింబరూపంగా ఉన్న తల్లిగా ధ్యానించాలి. 'శిరఃస్థితా చంద్రనిభా'.

శిరోదేవత, హృదయదేవత, నేత్రదేవత.... వాటికి ఇక్కడ అనుబంధం జాగ్రత్తగా చూసుకోవాలి. వీరంతా మంత్రానికి ఉండే అంగదేవతాశక్తులు. శిరస్సునందు భావించబడే 'చంద్రనిభా' దగ్గర ఉన్న శక్తి శిరోదేవతాశక్తి. ఈ శిరోదేవతా శక్తికి అమ్మవారి నిత్యతృప్తా శక్తితో సమన్వయం. ఆ నిత్యతృప్తాదేవియే మాధ్వీపానాలసా, మత్తా.

అందుకే మంత్రం చేసేటప్పుడు కూడా 'శిరసే స్వాహా' అని అంటారు. అక్కడ స్వాహా రూపిణి అయిన శక్తి. ఇప్పటికి మూడు శక్తులు వచ్చాయి. స్వాహా, శిరోదేవత, నిత్యతృప్తాశక్తి.

నిత్యతృప్తా. నిత్యానందరూపిణి. ఆ అఖండానందరూపమే సహస్రార కమలం దగ్గర భాసిస్తోంది. ఇక్కడ ఉన్న శక్తికి అమృతకిరణ్మయి అని మరొక పేరు. అమృతకిరణుడు అంటేనే చంద్రుడు. నిత్యతృప్తతాశక్తి, శిరోదేవత. అర్చన కాలంలో 'శిరసి' .. అన్నప్పుడు శిరోదేవతకి నమస్కారం చెయ్యడం కనబడుతున్నది.

593. ఫాలస్థా – శ్రీ ఫాలస్థాయై నమః

594. ఇంద్రధనుఃప్రభా – శ్రీఇంద్రధనుఃప్రభాయై నమః

ఫాలస్థా అంటే నుదుటిభాగంలో ధ్యానం చేయాల్సిన తల్లిని తెలియజేస్తున్నారు. ఇది ఉదయకాలధ్యానస్వరూపం. అంటే సాయంకాలం నుదుటిమీద ధ్యానించవద్దని చెప్పడం కాదు. ధ్యానం కుదిరితే ఎక్కడైనా, ఎప్పుడైనా చేసుకోవచ్చు గాని ప్రధానమైన స్థితిని చెప్తున్నారు. శిరస్సు వద్ద చంద్రనిభా, ఫాలస్థా – ఇంద్రధనుఃప్రభా.

దీపాకారోఽర్ధమాత్రశ్చ లలాటే వృత్త ఇష్యతే

అర్ధచంద్రస్తదాకారం పాదమాత్రస్తదూర్ధ్వతః

అని వివరించారు. దీని భావం లలాటమునందు దీపాకారముగా భావించాలి.

ఇంకా మనకి అర్థం కావడం కోసం అర్ధచంద్రః– అర్ధచంద్రాకారంలో – భావించాలన్నారు. ఇక్కడ భువనేశ్వరీదేవి బీజం 'హ్రీంకారం' భావించబడుతున్నది. అకార, ఉకార, మకారముల పైన ఉన్నదానిని అర్ధమాత్ర అంటారు. **'అర్ధమాత్రా స్థితా దేవీ యానుచ్చార్యా విశేషతః'** అని 'దేవీమాహాత్మ్యం'లో బ్రహ్మకృతస్తుతిలో యోగమాయని స్తుతించేటప్పుడు కనిపిస్తుంది. అర్ధమాత్ర బైటకు స్పష్టంగా ఉచ్చరింపబడదు.

అర్ధచంద్రాకారమంటే ధనురాకారం. ఇక్కడ 'ఇంద్రధనుః ప్రభా'. ముందు దీపాకారం చెప్పి ఇక్కడ ఇంద్రధనుఃప్రభా చెప్పడంలో విశేషం బహువర్ణరూపిణిగా ధ్యానించాలని చెప్పడం.

బహువర్ణాలు అంటే సప్తవర్ణాలు. సప్తవర్ణ ప్రకాశము కలవాడు అంటే అగ్ని అని అర్థం.

అగ్ని సప్తవర్ణుడు, సప్తజిహ్వుడు అని చెప్పబడుతున్నవాడు గనుక అగ్నిస్వరూపిణి. 'తామగ్నివర్ణాం' అని చెప్పే స్వరూపం ఇక్కడ కనబడుతున్నది. ఆ అగ్నే బహువర్ణాలతో ప్రకాశిస్తున్నాడు. అమ్మవారి అగ్నిస్వరూపాన్ని అర్ధచంద్రాకారంగా భావించాల్సిన చోటు.

595. హృదయస్థా – శ్రీ హృదయస్థాయై నమః

హృదయమునందు ధ్యేయగా ఉన్న అమ్మవారు 'రవిప్రఖ్యా'. ప్రఖ్యా అన్నా కాంతిగలది అని అర్థం. అంటే సూర్యసమానకాంతితో ప్రకాశిస్తోంది. హృదయం సూర్యమండలం గనుక అక్కడ భావన చేస్తున్నాం. హృదయస్థా అనే మాటకి చాలా విశేషాలు ఉన్నాయి. హృదయమే ప్రధానంగా ఆత్మచైతన్యాన్ని ధ్యానం చేయాల్సిన కేంద్రం.

'దహరం విపాపం పరమేఽశ్వభూతం యత్ పుండరీకం పురమధ్యసగ్గ్స్థం' అని మంత్రం. ఆ తల్లి అక్కడ ప్రకాశిస్తున్నది. ఈ హృదయశక్తి ఎలాంటిది అంటే **'యథా న్యగ్రోధ బీజస్థః శక్తిరూపో మహాద్రుమః। తథా హృదయ బీజస్థం జగదేతత్**

చరాచరం' అన్నారు. మొత్తం మఱ్ఱిచెట్టు యొక్క శక్తి విత్తనంలో ఉన్నట్లుగా సర్వ జగత్తులో వ్యాపించిన శక్తి హృదయంలో ఉంది. 'యోగిహృద్ధ్యాన గమ్యం' అని హృదయస్థానానికి చాలా ప్రధానమైన విషయం చెప్పారు. అమ్మరూపాన్ని కూడా హృదయంలో ధ్యానించినప్పుడు ఒక అద్భుతమైన ప్రభావం ఉంటుంది. హృదయంలో ధ్యానం చేసే ఉపాసన చాలా విశేషం.

అమ్మవారిని ధ్యానించే చోట్లు ప్రధానంగా మూడు చెప్పబడ్డాయి. 1. శిరస్సు 2. ఫాలభాగము, 3. హృదయం. ఈ మూడింటి యందు భావించాలి. ఇక్కడ ప్రత్యేకంగా ఇంద్రధనుఃప్రభా, శిరఃస్థితా అన్నప్పుడు శిరస్సు నుండి భ్రూమధ్యస్థానం వరకు ఒకటిగానే భావించాలి. అది అంతా చంద్రమండలమే. అక్కడ అగ్ని అనే పేరు నేరుగా చెప్పకుండా 'ఇంద్రధనుఃప్రభా' అని మాత్రమే చెప్పడానికి విశేషమది. పైగా అర్ధచంద్రాకారాన్ని ధ్యానించమన్నారని అన్నప్పుడు కూడా ఆజ్ఞాచక్రం నుండి అదంతా చంద్రమండలమే. అక్కడ సూక్ష్మరూపమైన అగ్నిగా భావన చెయ్యమని శాస్త్రం చెప్తోంది.

596. రవిప్రఖ్యా – శ్రీ రవిప్రఖ్యాయై నమః

హృదయంలో సూర్యమండలంగా భావన చెయ్యాలి. సూర్యునితో సమానమైన కాంతులు కల తల్లి. అంతరాదిత్యోపాసన అన్నప్పుడు సూర్యమండలంలో ఉన్న ఆదిత్యుడు, హృదయమండలంలో ఉన్న ఆదిత్యుడు ఇద్దరూ హిరణ్యరూపంతో ఉన్నారు అని భావన చెయ్యాలి. 'రుక్మాభం' – ఇలాంటి పదాలు ఉపనిషత్తుల్లో ప్రస్తావించారు.

'య ఏషోంతరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే' అని ఉపనిషత్ చెప్పినట్లుగా ఆదిత్యమండలమునందున్న హిరణ్మయపురుషుడు అనగా బంగారుకాంతులతో ప్రకాశిస్తున్న స్వరూపం. అక్కడ పురుషుడు అంటే పరమేశ్వరుడు. పరమేశ్వరీ అనుకున్నప్పటికి ఆ హిరణ్మయకాంతులతో ప్రకాశిస్తున్న అమ్మవారు 'రవిప్రఖ్యా' అని తేజస్స్వరూపాన్ని భావించాలి. అదే 'హిరణ్యవర్ణాం హరిణీమ్' అని శ్రీసూక్తంలో వేదం చెప్పింది. ఇది మధ్యాహ్నసమయ ధ్యానమని కొందరు చెప్తుంటారు.

మొత్తానికి హృదయకుహరంలో భావించాల్సిన దివ్యమైన బంగారుకాంతులతో లేదా ఎరుపు, పసుపు కలిసిన కాంతులతో ప్రకాశిస్తున్న హిరణ్యరూపిణిని 'హృదయస్థా', 'రవిప్రఖ్యా' అని చెప్పారు. ఇప్పటికి శిరఃస్థితా, ఫాలస్థా, హృదయస్థా అయ్యాయి. శిరఃస్థితా అన్నప్పుడు చంద్రనిభా, ఫాలస్థా అన్నప్పుడు ఇంద్రధనుఃప్రభా, హృదయస్థా అన్నప్పుడు రవిప్రఖ్యా. ఇవి ప్రధానంగా భావించవలసిన స్వరూపాలు.

597. త్రికోణాంతరదీపికా – శ్రీ త్రికోణాంతరదీపికాయై నమః

త్రికోణము యొక్క అంతరము. మూడు కోణాల అంతరములో ఉందన్నారు. ఇక్కడ అగ్ని, సూర్య, చంద్ర – ఈ మూడు బిందువులు తీసుకోవాలి. ఈ అగ్ని, చంద్రుల సమన్వయం సూర్యుని యందు అవుతున్నది. ఇదంతా విస్తారంగా 'కామకళారూపా' దగ్గర చెప్పకున్నాం.

'కామకళా' అన్నప్పుడు ఈ మూడు బిందువులని కళా అంటారని చెప్పుకున్నాం. ఆ మూడు బిందువులే అగ్ని, చంద్ర, సూర్య. అగ్ని, సోమ రెండిటి సమన్వయం సూర్యుని యందు ఉంది. ఆ సూర్యుని తేజస్సే రాత్రివేళ అగ్ని, చంద్రుల యందు ప్రకాశిస్తున్నది. సూర్యుడు రాగానే వీరిద్దరి తేజస్సు సూర్యునిలో లీనమైపోతుంది.

సూర్యుడు అగ్నిషోమాత్మకశక్తిగా చెప్పబడుతుంటాడు. అగ్ని శివస్వరూపము, సోమము శక్తి స్వరూపమైతే అగ్నిషోమాత్మకమైన శక్తి సూర్యుడైనప్పుడు సూర్యుడే శివశక్త్యాత్మకస్వరూపుడు అవుతున్నాడు. కనుకనే సూర్యభగవానుని అలా భావించాలి. సూర్యుని ఒక బిందువుగా పెట్టి, అగ్ని, చంద్రులని సమాంతరంగా రెండు బిందువులని పెట్టుకొంటే మూడు బిందువులయ్యాయి. ఈ మూడు బిందువులను కలిపి గీతలు గీస్తే ఒక త్రికోణమయింది. ఈ మూడింటి మధ్యలో ఒక బిందువు ఉంటుంది. ఈ మూడింటికి కేంద్రమైనది మూలమైనదని దాని అర్థం. ఈ మూడింటికి ప్రకాశమిచ్చే పరబ్రహ్మస్వరూపిణి. అదే 'త్రికోణ–అంతర–దీపికా'. సూర్యచంద్రాగ్నులకి కూడా మూలమై ప్రకాశిస్తున్నది.

'త్రికోణాంతరదీపికా'కి మరొక భావం చూస్తే త్రికోణాంతరమధ్యంలో దీపంలా

ప్రకాశిస్తోంది. దీపికా అంటే ప్రకాశాన్ని ఇచ్చునది అని అర్థం. ఇలా చెప్పడంలో విశేషం అగ్నికి, సూర్యునికి, చంద్రునికి ప్రకాశాన్ని ఇచ్చునది. **'యదాదిత్యగతంతేజో జగద్భాసయతేఽఖిలమ్, యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకం'** అని భగవద్గీతలో కృష్ణపరమాత్మ చెప్పిన భావంతో అన్వయించవచ్చు.

సూర్యచంద్రాగ్నులు ప్రళయాదులలో అంతరించిపోవచ్చు. కానీ అప్పుడు వారు ఈ తేజస్సులోనే లీనమౌతారు. మళ్ళీ తిరిగి ఈ తేజస్సు నుండే వస్తూ ఉంటారు.

ఈ నామానికి మరొక భావం తీసుకుంటే మొత్తం శ్రీవిద్యామంత్రాన్ని ఎలా ధ్యానించాలో చెప్పారు. త్రికోణం ఎక్కడుందో తెలుసుకోవాలి. **'మూలాధారం వసేద్దివ్యం త్రికోణమతిసుందరం'**–త్రికోణం మూలాధారమందు ఉన్నది. అందుకే **'మూలాధారే త్రికోణాఖ్యే'** – మూలాధారానికి త్రికోణమని పేరు. మన శరీరమందు కూడా అగ్ని సూర్య చంద్రమండలాలు ఉన్నాయని అనేకమార్లు ప్రస్తావించుకున్నాము.

క్రింది భాగమంతా అగ్ని, తరువాత సూర్యుడు, పైన చంద్రమండలం ఉంటుంది. ఈ మూడింటికి ప్రధానంగా మూలమునందు, వీటిని సమన్వయిస్తూ శక్తి ఉంటుంది. అదే మనకి మూలాధారస్థానంలో త్రికోణమని చెప్పబడుతోంది. ఆ మూలాధార మధ్యంలో ప్రకాశిస్తున్న కుండలినీరూప తేజస్సే 'త్రికోణాంతరదీపికా'.

'శిరఃస్థితా' అన్నప్పుడు ప్రధానంగా శిరోభాగం **సహస్రారస్థానం**గా చెప్పారు. 'ఫాలస్థా' అన్నప్పుడు **ఆజ్ఞాచక్రం** ప్రస్తావన చేశారు. 'హృదయస్థా' అన్నప్పుడు **అనాహతచక్రం** ప్రస్తావన చెయ్యబడుతోంది. దాని తరువాత **మూలాధారం** 'త్రికోణాంతరదీపికా' అని చెప్తున్నారు.

వశిన్యాది వాగ్దేవతలు 'ఆత్మవిద్యా మహావిద్యా శ్రీవిద్యా' అని చెప్పి, దానిని మనకి ఇచ్చినవారు 'కామసేవితా' అని చెప్తూ, ఆ విద్య 'శ్రీషోడశాక్షరీవిద్య'గా పండుతోందని వివరిస్తూ, అది 'త్రికూటములు'గా ఉందని భావం చూపిస్తూ, దాని ఫలం 'కటాక్షకింకరీభూతకమలాకోటిసేవితా' అని తెలియజేశారు. ఆ త్రికూటవిద్యలో 'కామకోటికా' ఉన్నారని చూపించారు. దానిని ధ్యానించవలసిన పద్ధతిని 'శిరఃస్థితా చంద్రనిభా, ఫాలస్థేంద్రధనుఃప్రభా, హృదయస్థా రవిప్రఖ్యా, త్రికోణాంతరదీపికా' అని చెప్పారు.

'ఆత్మవిద్యా'తో మొదలుపెట్టి 'త్రికోణాంతరదీపికా'తో మొత్తం శ్రీవిద్యా స్వరూపాన్ని చక్కగా ఆవిష్కరింపజేశారు.

మూలాధారం నుండి సహస్రారం వరకూ ప్రసరిస్తున్న తేజోమయమైన సూర్యచంద్రాగ్ని మయమైన మూడింటికి మూలమైన ఒక మహాతేజస్సు –పరచితి– ఒక స్తంభము వలె ప్రసరిస్తున్నది. దీనినే సన్నగా 'బిసతంతుతనీయసీ' వలె వెళ్తోందని భావన చెయ్యవచ్చు. దానికి ఇప్పుడు చెప్పిన మంత్రానికి ఎలా సమన్వయం ఉందో పరిశీలించుకోవచ్చు.

శిరోదేవత దగ్గర నిత్యతృప్తతా, అమృతకిరణ్మయి అని చెప్పుకున్నాం. మిగిలిన స్థానాల వద్ద ఉన్న దేవతల పేర్లని కూడా తెలుసుకుందాం. ఫాలస్థా – ఇంద్రధనుః ప్రభా దగ్గర 'నేత్రదేవి' చెప్పబడుతోంది. కరన్యాసం చేసేటప్పుడు 'నేత్రత్రయాయ వౌషట్' అన్నప్పుడు ఫాలభాగాన్నే చూపిస్తాం. అది నేత్రశక్తి. నేత్రదేవితో కలిసి ఉండే అమ్మవారి శక్తి 'అలుప్తతా'.

'హృదయస్థా' అన్నప్పుడు 'హృదయదేవి'. అక్కడ ఆవిడ 'సర్వజ్ఞతా' అనే శక్తితో సమన్వయింపబడుతుంది. హృదయమునందు అమ్మవారిని భావనచేస్తే వచ్చే స్థితి సర్వజ్ఞత. ఫాలనేత్రం దగ్గర భావన చేసేటపుడు 'అలుప్తతా' అంటే ఏ లోటు లేని స్థితి అని అర్థం. అనగా 'పరిపూర్ణత'

'త్రికోణాంతరదీపికా' దగ్గర అస్త్రశక్తి ఉందని చెప్పారు. దీనినే అస్త్రదేవి అంటారు. అనంతత అనబడే అమ్మవారి శక్తి అక్కడ సమన్వయింపబడుతోంది.

ప్రథమకూటం త్రికోణాంతరదీపికా ధ్యానించినపుడు అస్త్రదేవి 'అనంతశక్తి'. హృదయం దగ్గర హృదయదేవి 'సర్వజ్ఞతాశక్తి'. ఫాలం దగ్గర నేత్రదేవి 'అలుప్తతాశక్తి'. శిరస్సు దగ్గర శిరోదేవి 'నిత్యతృప్తతా' శక్తి...ఇవి భావన చేసుకోవలసిన అంశాలు.

ఈ విధంగా ఉపాసనాపద్ధతులు చెప్పి తరువాత నామాలైన 'దాక్షాయణీ' 'దైత్యహంత్రీ' 'దక్షయజ్ఞవినాశినీ' – అమ్మవారి లీలావైభవాన్ని కూడా శ్రీవిద్యతో ఎలా అన్వయించవచ్చో వివరిస్తున్నారు.

598. దాక్షాయణీ - శ్రీ దాక్షాయణ్యై నమః

599. దైత్యహంత్రీ - శ్రీ దైత్యహంత్ర్యై నమః

600. దక్షయజ్ఞవినాశనీ - శ్రీ దక్షయజ్ఞవినాశిన్యై నమః

దాక్షాయణీ అంటే దక్షుని పుత్రిక అని అర్థం. దక్షుని పుత్రికగా దక్షయజ్ఞవినాశనం చేసింది. తండ్రికి కూతురిగా పుట్టి తండ్రి చేసే చెడ్డపనిని దెబ్బతీసింది. దీనిలో అమ్మవారి కథంతా కనబడుతోంది.

దక్షప్రజాపతి బ్రహ్మ వద్దకు వెళ్ళి, "ప్రజాపతిగా నా పనిని చక్కగా చేసేటట్లు అనుగ్రహించు" అంటే "శక్తి లేనిదే నువ్వు ఆ పని చేయలేవు కనుక శక్తిని ఉపాసించమ"ని మొట్టమొదట బ్రహ్మ చెప్పాడు. అప్పుడు దక్షుడు శక్తిని ఉపాసించాడు. ప్రజాపతిగా మంచి సంతానం ద్వారా సృష్టిని విస్తరింపజేయవలసిన బాధ్యత దక్షునికి వచ్చింది.

"నాకు సత్సంతానం కలిగి వంశవిస్తారం కలగాలంటే నువ్వే నాకు సంతానంగా కావాలమ్మా" అని అమ్మవారిని దక్షుడు ప్రార్థించాడు. దక్షుని బుద్ధి అమ్మవారికి తెలుసు. దక్షునికి కొద్దిగా శివద్వేషం ఉంది. దానికి కారణం లేదు. సృష్టిని విస్తరింపజేయవలసిన వారిలో దక్షుడు ఒకడు. పరమేశ్వరుడో లయకారకుడు. కనుక దక్షుడు విస్తరింపజేసిన సృష్టంతా పరమేశ్వరుడు లయం చేసేస్తాడనే భావం. అది పూర్తి అజ్ఞానమే. ఆ అజ్ఞానభావంతో దక్షుడు ఉన్నాడు. కాని అదేం బయటపడలేదు. అమ్మవారు ఆయనకి పుత్రికగా వచ్చారు.

కొంతకాలానికి ఆయన అమ్మవారిని ప్రార్థించి పుత్రికగా పొందానన్న సంగతి మర్చిపోయాడు. మనిషికి అలవాటనేది ఒక ప్రమాదం. మహాపురుషులైనా మనకి అలవాటైపోతే వారు మనకి మామూలుగా కనిపిస్తారు. అద్భుతాలు అలవాటైపోతే మామూలైపోతాయి. అది ఒకొక్కప్పుడు మహాప్రమాదం.

సాక్షాత్ పరాశక్తి కూతురిగా వస్తే సామాన్య ధోరణిలో క్రమక్రమంగా 'నా కూతురేగా నేను చెప్పినట్లు వింటుంద'నుకున్నాడు. పరాశక్తి కుమార్తె అవగానే తన అధీనం అనుకున్నాడు. ఆవిడ మహామాయ కనుక ఆయనకి అలాగే కనబడింది.

దక్షుని బుద్ధి తెలిసిన అమ్మవారు దక్షునితో, "నేను నీకు సంతానంగా వస్తే నన్ను శివునికి ఇచ్చి పెళ్ళి చెయ్యమ"ని ముందే చెప్పింది. కానీ నా కూతురనే భావంతో నేను చెప్పినట్లు వింటుందని అనుకున్నాడు. కానీ అమ్మవారు వినలేదు. దక్షుడు శివుడులేని స్వయంవరం ఏర్పాటు చేస్తే ఆ స్వయంవరంలో కూడా శూన్యంలోనే "నమశ్శివాయ" అని దండ వేసింది. పరమేశ్వరుడు ఎక్కడ లేడు? ఆ దండని క్రిందపడనివ్వకుండా పరమేశ్వరుడు దానిని స్వీకరించి వెళ్ళిపోయాడు.

తరువాత దక్షునికి తీవ్రమైన బాధ కలిగింది. ఎలాగైనా శివుని అవమానించాలని రాక్షసబుద్ధితో ఈశ్వరద్రోహం చెయ్యాలని సంకల్పించుకున్నాడు. దక్షుడు పుట్టింది దేవయోనే అయినా, బుద్ధి రాక్షసం. ఎప్పుడైతే ఒక రాక్షసబుద్ధి వచ్చిందో దాని నుండి అనేక ఆసురీబుద్ధులు బయటకి వస్తాయి.

ఈశ్వరద్రోహమే ఆసురీబుద్ధి. ఇది వానికి ప్రమాదం. ప్రపంచానికి ప్రమాదం. వానితో కలిసినవారికి ప్రమాదం. దక్షుడు శాస్త్రవిరుద్ధంగా ఈశ్వరుడులేని యజ్ఞాన్ని తలపెట్టాడు. ఆ యజ్ఞానికి వెళ్ళినవారు దేవతలే అయినా బుద్ధులన్నీ ఆసురీబుద్ధులై అవి లోకానికి ప్రమాదకరం కనుక దాక్షాయణిగా పుట్టినప్పటికి వారిలో పుట్టిన దైత్య బుద్ధులని నశింపజేయడానికి అమ్మవారు బయలుదేరింది. కాబట్టి **'దైత్యహంత్రీ'**. అలా వెళ్ళి అమ్మవారు చేసిన పని **'దక్షయజ్ఞవినాశినీ'.**

కొంచెం జాగ్రత్తగా కథ పరిశీలిస్తే దక్షయజ్ఞం విధ్వంసం చేసింది వీరభద్రుడో, అమ్మవారో తెలుస్తుంది. అమ్మవారు దక్షునికి బుద్ధి చెబుదామని వెళ్ళింది. ఆయన వినలేదు. యోగాగ్నిలో అమ్మవారు శరీరాన్ని త్యజించిందే తప్ప, అమ్మవారిని దక్షయజ్ఞవినాశిని అని అనవచ్చా? అంటే మొత్తం అమ్మవారే చేసిందన్నారు.

దక్షయజ్ఞం జరుగుతుంటే అక్కడ శాంతి లేకుండా అటు ఇటు తిరుగుతున్న నారదుడు యజ్ఞం సజావుగా జరగకూడదని తిన్నగా కైలాసానికి వెళ్ళి పరమేశ్వరునికి ఆ విషయాన్ని చెప్తే ఆయన ఏమీ పట్టనట్లు కూర్చున్నాడు. నిన్ను అవమానించాలనే దక్షుడు యజ్ఞం చేస్తున్నాడని నారదుడు చెప్పాడు. పరమేశ్వరుడు యోగీశ్వరేశ్వరుడు. ఆయనకు నింద లేదు, ప్రశంస లేదు. ఈయనతో లాభం లేదనుకొని వచ్చిన పని

కావడం లేదని తిన్నగా అమ్మవారి దగ్గరకు వెళ్ళి చెప్పాడు.

ఇందులో తెలుసుకోవలసినదేమిటంటే శివుని నిందిస్తే శివుడు ఏమీ చెయ్యడు కానీ ప్రకృతి శిక్షిస్తుంది. ఇది గ్రహించాలి. ప్రకృతి అప్పుడు కదలివచ్చింది. ఆవిడ కదిలితే గాని ఈయన కదలడు. అదో రహస్యం. ఆవిడ కదలి వెళ్ళింది. తాను లేకుండా చేస్తే పరమేశ్వరుడు ఇంకా విజృంభిస్తాడని తెలిసి, పైగా శివనిందాపరుడైన దక్షుని కూతురిగా దాక్షాయణి అనే పేరు ఉండకూడదనుకుని నిర్ణయించుకుని ఆ తనువు చాలించుకుని పార్వతిగా వచ్చింది.

మొత్తం కల్యాణం కథంతా ఈ నామాలలో చూపించారు. పరమేశ్వరునికి ఆయనను అవమానిస్తున్నారని చెప్తే కోపం రాలేదు కాని, అమ్మవారి తనువు ఇంక లేదు అనగానే తట్టుకోలేకపోయాడు.

ఎంతో నిగ్రహంగా తిరుగుతున్న రామచంద్రమూర్తికి కూడా సీతమ్మని రావణాసురుడు తీసుకుపోగానే మహాకోపం వచ్చింది. నేను వెళ్తేగాని రాముడు బాణాన్ని సంధించడని సీతమ్మ వెళ్ళింది. సరిగ్గా పరిశీలిస్తే "సతీ శివుల" కథే "సీతారాముల" కథ. ఇది 'శివశ్శక్త్యాయుక్తః' మాట యొక్క వ్యాఖ్యానమే.

దక్షయజ్ఞంలో ఉన్న అసలైన అర్థం పరిశీలిస్తే – ఆయన పేరు దక్షుడు. దక్షత అంటే సమర్థత. కాని నిజానికి దక్షుడు కాదు; దక్షుడనని అనుకునేవాడు. పరమేశ్వరుడు దక్షిణామూర్తి. దక్షిణామూర్తి అంటే సమర్థతే. దక్షుడు "నేను సమర్థుడన"ని అనుకుని అహంకరించాడు.

ఒకానొక సుకృతం వల్ల అమ్మవారి శక్తి అనగా ప్రకృతి అనుకూలిస్తుంది. ప్రకృతి అనుకూలిస్తే, మనకి ప్రకృతి అధీనమని అనుకుంటాం. అనుకూలానికి, అధీనానికి చాలా తేడా ఉంది. అనుకూలించి అమ్మవారు వస్తే అధీనమనుకుని ప్రకృతిని క్షోభ పెట్టాడు. ప్రకృతి దక్షుని కూతురు కాదు... ఈశ్వరుని శక్తి.

ప్రకృతి ఈశ్వరుని శక్తి అని దక్షుడు మర్చిపోతే అమ్మవారు "నేను ఆయన శక్తినే" అని ఋజువు చేసింది.

ఈశ్వరుని విస్మరించి తానే సమర్థుడనని, ప్రకృతి తనకి లొంగి ఉందని

అనుకుని చేసే ప్రతి పని దక్షయజ్ఞమే. ఈ కోణంలో మనం ఆలోచిస్తే అధునిక నాగరికత అంతా దక్షయజ్ఞమే. ఇంత ప్రకృతిశక్తికి పరమేశ్వరుడు ఒకడున్నాడని మర్చిపోతున్నారు. అదే నాస్తికత్వం. అప్పుడేం జరుగుతుంది? పరమేశ్వరుడేం చెయ్యడు కాని ప్రకృతే క్షోభిస్తుంది. ఆ క్షోభ ఈశ్వర అవజ్ఞతో కూడిన కార్యక్రమాన్ని ధ్వంసం చేసి తీరుతుంది.

అదంతా అమ్మవారే. ఆవిడే దాక్షాయణీ. మనలో ఆసురీభావాలు పుడితే విజృంభిస్తుంది. భగవంతుని అవజ్ఞ చేయడమే ఆసురీభావం. శాస్త్రవిరుద్ధంగా ప్రవర్తించడమే ఆసురీభావం. ఆసురీభావాన్ని అంతం చేయడం అమ్మవారి లక్షణం కనుక 'దైత్యహంత్రీ' అయిన తల్లి 'దక్షయజ్ఞవినాశినీ'గా వచ్చింది.

దాక్షాయణీ అనే మాటకి మరొక అద్భుతమైన భావం **'దర్శపూర్ణమాసయోః ఆవృత్తిః దాక్షాయణ యజ్ఞపదేనోచ్యతే తద్రూపా'**- దాక్షాయణము అని ఒక యజ్ఞానికి పేరు. అది దర్శపూర్ణమాస అని చేసే నిత్యాగ్నికర్మల యొక్క ఆవృత్తి. దర్శపూర్ణమాసలు మొదలుకొని ఒక సంవత్సరం కాలం చెయ్యవలసిన అగ్నిహోత్రకర్మలన్నింటిని కలుపుకుంటే దాక్షాయణమని పేరు. ఆ యజ్ఞరూపిణిగా ఉన్న తల్లి గనుక 'దాక్షాయణీ'. **ఒక సంవత్సరకాలపు యజ్ఞస్వరూపమే 'దాక్షాయణీ'**.

యజ్ఞరూపిణి కనుకనే అశాస్త్రీయమైన యజ్ఞాన్ని దెబ్బతీయడానికి వచ్చినది.

'అశాస్త్రవిహితం ఘోరం' అన్నాడు గీతలో పరమాత్మ. **'యజంతే నామ యజ్ఞాస్తే దంభేనావిధిపూర్వకం'** – కొంతమంది దంభమాన మదంతో యజ్ఞాలనే పేరుతో అశాస్త్రములు ఆచరిస్తారు. అటువంటి వారిని **'క్షిపామ్యజస్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు'.** "వారిని అసురజన్మలలో పడేస్తాను" అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

అలా పడేస్తే ఎప్పటికైనా ఉద్ధరిస్తాడా? అంటే, **'మామప్రాప్యైవ కౌంతేయ తతోయాంత్యధమాం గతిం'** అన్నాడు. "అటువంటివారెప్పటికీ నన్ను పొందలేక ఇంకా అధోగతుల పాలవుతారు". దీనిని బట్టి అశాస్త్రమైన యజ్ఞాలు ఎంత ప్రమాదమో తెలుస్తుంది.

యజ్ఞద్రోహులు దైత్యులు. వారిని శిక్షించే స్వరూపమే దైత్యహంత్రి. యజ్ఞరూపిణి, యజ్ఞరక్షకురాలు.

కథ చెప్పుకున్నాం. తెలుసుకోవలసిన ధర్మభావం గ్రహించుకున్నాం. **"దాక్షాయణీత్వపర్ణాయాం రోహిణ్యాం తారకాసుచ** – విశ్వనిఘంటువు ప్రకారం, పార్వతి అనే అర్థమే కాక, రోహిణి అశ్విన్యాది నక్షత్ర రూపిణి – అనే అర్థం కూడా ఉంది.

తరువాత నామములు 'దరాందోళితదీర్ఘాక్షీ' 'దరహాసోజ్జ్వలన్ముఖీ'.

601. దరాందోళితదీర్ఘాక్షీ – శ్రీ దరాందోళితదీర్ఘాక్ష్యై నమః

దర అంటే అరవిరిసిన, కొంచెము అని అర్థం. ఆందోళిత అంటే కదులుతున్న అని అర్థం. 'కొంచెముగా కదులుతున్న పొడవైన కళ్లుగల తల్లి' అని అర్థం. అలా కదలడంలో విలాసం కనబడుతుంది. అటు–ఇటు కదలడాన్ని ఆందోళిత అంటారు. అమ్మవారి కనులు చాలా పొడవైనవి. అమ్మవారు ప్రపంచమంతటిని ఆ దిక్కు నుండి ఈ దిక్కు వరకూ ఒకసారి గమనించుకుంటోంది. విశాలమైన నేత్రాలతో చూస్తున్నదనే భావన చెయ్యాలి.

ఈ నామంలో మరొక విశేషమైన అర్థం – దీర్ఘ అంటే పొడవైన అని అర్థం. అది విశాలతకే కాదు ఎంత దూరమైనా అమ్మ చూపులు ప్రసరిస్తాయని అర్థం. ఎక్కడో కొన్ని కాంతి సంవత్సరాలదూరంలో సూర్యుడు ఉన్నాడు. అలాంటి సూర్యభగవానుని నుండి మనకి కాంతి వస్తోంది. మనదాకా ఎలా రాగలుగుతోంది అని ఒక్కసారి పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. సూర్యుడు అమ్మవారి నేత్రమే. కనుకనే ఆ చూపులకు ఎంతదూరమైనా ప్రసరించగలిగే శక్తి ఉన్నది.

శంకరభగవత్పాదులవారు అమ్మవారి చూపులని వర్ణిస్తూ–

దృశా ద్రాఘీయస్యా దరదళిత నీలోత్పల రుచా
దవీయాంసం దీనం స్నపయ కృపయా మామపి శివే!
అనేనాయం ధన్యో భవతి న చ తే హానిరియతా
వనే వా హర్మ్యే వా సమకరనిపాతో హిమకరః

ఇందులో పదాలనే శంకరులవారు చెప్పారు. "అమ్మా! నీ చూపులు చాలా

దీర్ఘమైనవి. అవి ఎక్కడికైనా వెళ్ళగలవు. నేను దూరంగా ఉన్న మాట వాస్తవమే". (అమ్మవారు ఉన్నారనే స్పృహ కూడా లేకుండా బ్రతకడమే దూరంగా ఉండడం). "పాపకర్ముడిని కనుక అజ్ఞానదోషంచేత నీకు దూరంగా ఉన్నాను తల్లీ! నేను ఎంతదూరంగా ఉన్నా నీ చూపు ప్రసరించగలదు కనుక నాపై నీ కటాక్షం ప్రసరింపజేయు తల్లీ!" ఎలాంటి చూపంటే 'దరదళితనీలోత్పలరుచా'. "అరవిరిసిన నల్లని కలువ వంటి కన్నులలోంచి నీ చల్లని చూపుని నా పై ప్రసరింపజేయు తల్లీ! తనకి నష్టం లేకుండా ఒకరికి గొప్ప లాభం ఇవ్వడం కంటే పుణ్యం ఏముంటుంది? ఆ చూపు ప్రసరిస్తే నేను ధన్యుడనౌతాను. నీకు ఇసుమంత కూడా హాని లేదమ్మా! – గొప్ప యోగులమీద, సాధకులమీద ప్రసరించవలసిన నా చూపుని ఇంతదూరంగా ఉన్న నీ మీద ఎలా ప్రసరిస్తానంటే – అలా అనకమ్మా! చంద్రకాంతి మేడ మీద, అడవులలో ఒకేలా ప్రసరిస్తుంది కదా తల్లీ! అలాగే యోగుల మీద ప్రసరిస్తున్న నీ చూపు ఈ అయోగ్యుని మీద కూడా ప్రసరింపజేస్తే ధన్యుడనైపోతానమ్మా!" అంటున్నారు. శంకరులు అయోగ్యులనుకుంటే మనకి మహాపాపం. ఆ విధంగా అమ్మవారి ముందు వినయంగా ప్రతివాడు అనుకోవాలి. ఇలా అనుకుంటే వారికి మించిన యోగ్యుడు మరొకడు ఉండడు.

'దరాందోళితదీర్ఘాక్షీ' అన్నప్పుడు ఈ శ్లోకాన్ని ఒక్కసారి భావన చేసుకోవాలి. అక్కడ 'దరదళిత...' ఇక్కడ 'దరాందోళిత'. అమ్మచూపు కదులుతోంది. విశాలనేత్రాలతో పాటు ఎంత దూరమైనా తన చూపుల కాంతులని ప్రసరింపజేస్తున్న తల్లి.

602. దరహాసోజ్జ్వలన్ముఖీ – శ్రీ దరహాసోజ్జ్వలన్ముఖ్యై నమః

దరహాసంతో గొప్పగా ప్రకాశిస్తున్న ముఖము కలది.

దరాందోళితదీర్ఘాక్షీ, దరహాసోజ్జ్వలన్ముఖీ అన్నప్పుడు అందులో దర, అక్షి అనే వాటిల్లో బీజాక్షరాలు దాగి ఉన్నాయి. ఉజ్జ్వలన్ముఖీ అనే దానిలో జ్వాలాముఖీ మంత్రరహస్యం దాగి ఉంది.

ఒక సిద్ధపురుషుడైతే దీనినుండి వచ్చిన బీజమంత్రాలతో జ్వాలాముఖీ మంత్రాన్ని

ఉద్ధరించి చూపించారు. మనకి తెలియకుండానే ఇందులో జ్వాలాముఖీదేవిని స్మరించుకుంటున్నాం. జ్వాల అంటే ప్రకాశిస్తున్న అని అర్థం – అమ్మవారి చూపు, నవ్వు మనకి చాలు. జ్ఞానప్రకాశమే (ఉజ్జ్వల) ఆ నగుమోము.

603. గురుమూర్తిః – శ్రీ గురుమూర్త్యై నమః

పరమేశ్వరియే అసలు గురువు. మన గురువులు కూడా అమ్మ రూపమే. అమ్మ మనలను అనుగ్రహించడం కోసమని గురుమూర్తి ధరించి వచ్చింది. గురువులో కనబడుతున్నదంతా అమ్మ కారుణ్యమే. గురువుకి, అమ్మకి భేదం ఎలా లేదో చెప్తూ–

యథా ఘటశ్చ కలశః కుంభశ్చైకార్థవాచకాః
తథా మంత్రో దేవతాచ గురుశ్చైకార్థ వాచకాః

అన్నారు. కుండకి ఘటము, కలశము, కుంభమని మూడు పేర్లు ఎలాగైతే చెప్పారో అలాగే ఒక్క అమ్మనే మంత్రము, దేవత, గురువు అంటారు. అమ్మవారు గురుస్వరూపం. గురువు అమ్మరూపం.

భావనోపనిషత్తు మొట్టమొదటగా '**శ్రీగురుః సర్వకారణ భూతా శక్తిః**' అన్నది. మూర్తి అంటే ప్రకటించి కనబడేది. ప్రకటింపబడిన అమ్మరూపమే గురువు అని గ్రహించగలగాలి. మొట్టమొదటి అమ్మవారి గురుమూర్తి స్వరూపమే దక్షిణామూర్తి. శ్రీవిద్యకు ఆదిగురువు. ఆయనతో మొదలైన శ్రీవిద్య మన దాకా గురుపరంపర వలన వచ్చింది. గురు పరంపర అంతా అమ్మ రూపమే.

ఈ పరంపర గురుతత్త్వాన్నంతటిని తాను మోసుకు వచ్చి మనకి ఇచ్చిన గురువు ఉంటారే ఆయన అమ్మవారి అసలు రూపముగా భావించి ఆరాధించాలి. అమ్మ విద్య ఎవరి ముఖం నుండి లభించిందో అతడే అమ్మ రూపము. ప్రకటింపబడేదే రూపమైనప్పుడు గురువు ద్వారా మనకి అమ్మ విద్యయే ప్రకటింపబడుతోంది. అప్పుడు అమ్మవారు ఆయన రూపమైపోయింది కనుక గురుమూర్తిః అనే భావం అంత గొప్పగా చూపిస్తున్నారు.

గుకారః సదితిప్రోక్తో

రుకారో జ్ఞానవాచకః

బ్రహ్మజ్ఞానైక రూపత్వాత్

గురురిత్యభిధీయతే

గుకారం - సత్ (బ్రహ్మము). రుకారం - జ్ఞానం. బ్రహ్మజ్ఞానస్వరూపుడే గురువు. ఆ తత్త్వమే లలితాంబ.

గుకారస్త్వంధకారః స్యాత్ రుకారస్తన్నివర్తకః - అంధకారాన్ని (గు) నివర్తింపజేసే వాడు (రు) - గురువు అని శక్తిరహస్యం.

సర్వావస్థలలోనూ ఆ జగదంబా తత్త్వంతో లేదా ఏ విద్యను మనకి ఇస్తున్నారో ఆ విద్యతో తాదాత్మ్యం చెంది ఉన్నవారే గురువులు అవుతారు. వారి లక్ష్యం ఎప్పుడూ అటే ఉంటుంది.

స్వార్థాహంకారరహితులు గురువులు అవుతారు. అలాంటి గురువులు మాత్రమే అమ్మరూపంగా భావింపబడతారని చెప్తూ **"తామిచ్ఛావిగ్రహాం దేవీం గురురూపాం విభావయేత్"** అన్నారు. అమ్మవారు తాను తన ఇచ్ఛతో గురుమూర్తి ధరించి వచ్చిందని భావించాలి. ఎల్లవేళలా గురువుని అమ్మవారికి అభిన్నంగా చూడాలి.

సాక్షాత్తు అమ్మవారే ఒకసారి గురుమూర్తిగా వచ్చారు. ఒకప్పుడు ఇంద్రునికి అమ్మవారు దివ్యాకాశంలో కనబడి శ్రీవిద్యని బోధించారు. ఇది మనకి సామవేదంలో కేనోపనిషత్తులో చెప్పబడుతున్న కథ. శ్రీవిద్య అక్కడ పల్లవించింది. చిదేకరసరూపిణిగా ఛాందోగ్యోపనిషత్తులో దర్శనమిచ్చింది.

తైత్తిరీయంలో **'యతోవా ఇమాని భూతాని జాయంతే'** అని గోచరించింది. ఉపనిషత్తులు అన్నింటిలోంచి గ్రహించినదే శ్రీవిద్య. అందుకే అది ఆత్మవిద్య, మహావిద్య. ఆ తల్లే స్పష్టంగా, స్వచ్ఛంగా ఇంద్రాది దేవతలకు, హిమవంతునకు బ్రహ్మవిద్యని బోధించింది. ఈ కథంతా దేవీభాగవతంలో వస్తుంది.

అమ్మవారు దాక్షాయణిగా తనువు చాలించిన తరువాత తిరిగి మేనా-హిమవంతులకు కుమార్తెగా వచ్చింది. వారితో సహా దేవతలందరూ తపస్సు చేశారు.

అమ్మ తన దివ్యరూపాన్ని చూపించి మేనా-హిమవంతులకు పుత్రికగా వస్తానని చెప్తూ వారికి కొన్ని అధ్యాయాల గీతను బోధించింది. దీనినే దేవీగీత అని అంటారు. ఇది దేవీభాగవతంలో ప్రశస్తమైన బ్రహ్మవిద్యాశాస్త్రం. ఇది స్వయంగా అమ్మవారే హిమవంతుని నిమిత్తంగా చేసుకుని సర్వదేవతలకు బోధించింది.

వేదంలో "అహం రుద్రేభిర్వసుభిశ్చరామి" అని అమ్మ చెప్పిన దేవీసూక్తం మొత్తం గీతనే చెప్తోంది. 'అహం' నేనే ఇది అని చెప్తోందంటే 'మత్తఃపరతరం నాన్యత్' అని కృష్ణపరమాత్మ గీతలో చెప్పిన భావాన్ని వేదములోనే ప్రతిపాదించింది. వేదంలోనే అమ్మవారు గురువుగా కనబడుతోంది. ఇంద్రాది దేవతలకు, హిమవంతుడు మొదలైన వారికి కూడా జ్ఞాన ప్రదానం చేసిన గురుమూర్తి.

604. గుణనిధిః – శ్రీ గుణనిధయే నమః

గురువు ఎప్పుడూ గుణనిధియై ఉండాలి. అమ్మవారు గురుమూర్తిగా వచ్చినప్పుడు గుణనిధిగా ఉంది. గుణము అంటే శిష్యునిపై వాత్సల్యం. గుణమనే శబ్దానికి ఉపనిషత్ చెప్తూ జ్ఞానిని గుణి అనాలి అని చెప్పింది.

ప్రధానంగా జ్ఞానం ఉంటేనే గురువు అంటాం. గురువు అంటే ఒక పదవి కాదు. అది జ్ఞానస్వరూపం. గుణనిధి అంటే జ్ఞానానికి నిధి వంటి వాడు. తరగని జ్ఞానము ఆయన దగ్గర ఉన్నదని అర్థం.

అమ్మవారు ఈ ప్రపంచం తయారు కావడానికి కావలసిన అన్ని గుణాలకు నిధి వంటిది. అనంతకళ్యాణగుణాల నిధే గుణనిధి అని అమ్మవారి పరంగా చెప్పాలి. 'గురుమూర్తిః, గుణనిధిః' అన్నప్పుడు గురువుకి ఉండవలసిన గుణాలు కొన్ని శాస్త్రం చెప్తోంది –

సుందరః సుముఖః స్వచ్ఛః సులభో బహూతంత్రవిత్

అసంశయః సంశయచ్ఛిన్నిరపేక్షో గురుర్మతః

సుందరః – **'సుతరాం ఆద్రియతే ఇతి సుందరః'** – చక్కగా ఆదరించే స్వభావం గురువు దగ్గర ఉండాలి.

సుముఖః – ఒక ప్రసన్నతా భావంతో శిష్యునికి అనుకూలంగా ఉండాలి.

స్వచ్ఛః – నిష్కపటంగా ఉండాలి.

సులభః – గురువు ఆ శిష్యునికి ఎప్పుడు, ఏ సందేహం వచ్చినా తీర్చగలిగేటంత సౌలభ్యంగా ఉండాలి.

బహుతంత్రవిత్ – తంత్రమనగా శాస్త్రమని ఇక్కడ అర్థం. బహు శాస్త్రాలయందు నేర్పరియై ఉండాలి.

అసంశయః – తాను ఉపదేశించే విద్యలో తనకే సందేహం ఉండకూడదు.

సంశయచ్ఛిన్ – సందేహం పోగొట్టగలిగేవానిగా ఉండాలి.

నిరపేక్షః – తానేదీ అపేక్షించకుండా ఉండాలి.

గుణనిధికి మరొక అర్థం చెప్పారు. గుణములు అంటే వ్యూహములు. ప్రపంచాన్ని అమ్మవారు ఏ వ్యూహాలతో ఏర్పాటు చేశారో వాటికి గుణములు అని పేరు. అవన్నీ ఆమెను ఆధారం చేసుకుని ఉన్నాయి కనుక గుణములకు నిధి. ఆ వ్యూహాల పేర్లు కాల, కుల, నామ, జ్ఞాన, చిత్త, నాద, బిందు, కలా, జీవ. ఈ వ్యూహములతో అమ్మవారు ప్రపంచం నడుపుతూ ఉంటారు.

నవవ్యూహాత్మకో దేవః పరానందః పరాత్మకః – నవవ్యూహాత్మకమైన స్వయంప్రకాశరూపుడైన పరానందస్వరూపుడైన పరమాత్మ.

కాలవ్యూహం – నిమిషాలు, క్షణాలు, అహోరాత్రులు – అమ్మవారే పన్నారు. కుల – కులములు అంటే రకరకాల వర్గములు. సృష్టిలోనే కులములు ఉన్నాయి. కులము అనగా సమూహము. ఒకే లక్షణము కలిగిన జాతికి కులము అని పేరు. ఇదొక వ్యూహము.

నామవ్యూహం – ప్రతి పదార్థానికి ఒక నామం. అదొక వ్యూహం. అలాగే ఒకొక్క దానిలో ఒకొక్క రకమైన జ్ఞానం. అదొక వ్యూహం. ప్రతి దానికి ప్రత్యేక చిత్త సంస్కారములు. శబ్దపరంగా నాదవ్యూహం. బిందువ్యూహం. జీవవ్యూహం. ఇన్ని రకాల వ్యూహములతో ప్రపంచాన్ని నడుపుతోంది కనుక 'గుణనిధిః' అని మరొక అర్థం.

గుణము అంటే తాడు అని భాస్కరరాయలవారు మరొక అర్థాన్ని చెప్పారు. గుణనిధిః అనే నామానికి ఆయన మత్స్యపురాణం, కాళీ పురాణాలని ప్రమాణాలుగా చూపించి చెప్పారు. ఈ తాడు విద్యలని కాపాడింది. గుణనిధిః అంటే అలాంటి గట్టి తాడు వంటిది అని చెప్పారు. నారాయణుడు ప్రళయకాలంలో ఏకార్ణవమైన జలంలో ఒక ఓడలో సర్వవిద్యలను భద్రపరచి అందులో సత్యవంతుడనే మనువుని పెట్టాడు. తరువాత సృష్టికి కావలసిన బీజాలన్నీ అందులో ఉన్నాయి. మొత్తం జలం కనుక పడవ ఊగిపోతుంది. ఆ పడవని స్థిరంగా నిలపడానికి నారాయణుడు మత్స్యమై వచ్చాడు. ఆ మత్స్యమునకు ఒక కొమ్ము కూడా ఉంది. ఆ పడవని స్థిరంగా నిలపడానికి ఒక తాడు తీసుకొచ్చి ఆ తాడుని మత్స్యము యొక్క కొమ్ముకి, పడవకి కట్టారు. అప్పుడు అది స్థిరంగా ఉంది.

అందులో ఉన్నవారు సప్తర్షులు, సత్యవ్రతుడనే కాబోయే వైవస్వత మనువు. సృష్టికి కావలసిన బీజాలు, విద్యలు అన్ని దాగి ఉన్నాయి. ఎదురుగా ఒక చేప. అలా మళ్ళీ సృష్టి ఆరంభం వరకు ఉండాలి. వారు ఆ మత్స్యంతో మాటలాడడం మొదలు పెట్టారు. "స్వామీ! మాకు కొన్ని సందేహాలు ఉన్నాయి తీరుస్తావా?" అంటే "అడగండి చెప్తా" అన్నాడు. వారు అడుగుతూ ఉన్నారు.... ఆయన చెప్తూ ఉన్నారు. వారికి సమయమంతా హాయిగా గడిచిపోయింది. మత్స్యంగా ఆయన ఇచ్చిన విజ్ఞానమంతా మత్స్యపురాణంలో చెప్పారు. ఈ తాడుకి 'వటీరికా' అని పేరు ఉంది. కాళీపురాణంలో చూపిస్తున్నారు.

జగద్ధాత్రీ మహామాయా లోకమాతా జగన్మయీ

ద్రధయిష్యతి తాం రజ్జుం న తృట్యతి యథా తథా

జగద్ధాత్రి, మహామాయ, లోకమాత అయిన దేవి ఆ రజ్జువును ముక్కలై పోకుండా దృఢంగా కాపాడింది – కనుక 'గుణనిధి'

'చింతామణి గుణనికా జన్మజలధౌ' అని సౌందర్యలహరిలో చెప్పారు. చింతామణులహారం.

గట్టితాడు అమ్మవారు. అటు పరమాత్మకి, ఇటు పడవపై కూర్చున్న వారికి

మధ్యలో గట్టి అనుబంధం అమ్మవారు. దీనిని ఆధారంగా చేసుకుని విద్యలన్నీ నిలిచాయి. మత్స్యావతారమంటే వేదోద్ధర, జ్ఞానోద్ధర అవతారం విద్యలన్నీ నిలపడానికి శక్తి – తాడు. ఆ తాడే మనకి కావాలి. 'ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః' – ప్రజాతంతువుని ఛేదించకు. సంతానం అనే తాడుని ఛేదించకు. ఈ తాడు కొనసాగాలి. ఇది సంతాన పరంపర. ఇదే గురువు నుండి శిష్యునికి, శిష్యుని నుండి మరో శిష్యునికి వచ్చిన విద్యాపరంపర. ఈ గురు పరంపరే ఒక తాడు. అదే గుణము. ఆ గుణమునందు విద్య అనే నిధిగా వ్యాపించి ఉంది. గురుపరంపర రూపిణిగా ఉన్నదే గుణనిధిః.

'గురుమూర్తిర్గుణనిధిః గోమాతా గుహజన్మభూః' – ఇవన్నీ గకారంతో వచ్చిన నామాలు. గకారం గురువాచకం. ప్రధానంగా ఇక్కడ గురుస్వరూపం ఆవిష్కరణ జరుగుతోంది. అమ్మవారు గురుమూర్తిగా కనబడినప్పుడు గుణాలనిధిగా ఉంది.

శిష్యుల అజ్ఞానాన్ని గురువు ఎంతో సహిస్తాడు కనుక గురువు క్షమా గుణాన్ని కలిగి ఉంటాడు. ప్రేమ, కారుణ్యం, వాత్సల్యం ఇత్యాదులు గురువు శిష్యులపై నిరంతరం చూపిస్తాడు. అమ్మవారి గుణాలన్ని అక్కడ ప్రోగు అయ్యాయి కనుక 'గురుమూర్తిర్గుణనిధిః'. ఈ విద్యలన్నింటికి తల్లి గనుక 'గోమాతా'.

605. గోమాతా – శ్రీ గోమాత్రే నమః

గురువు ఇచ్చిన విద్య మనకి కామధేనువులా ఏదైనా ఇస్తుంది. గోమాత అంటే కామధేనువు. కామధేనువులలో గొప్పది సురభి. లక్ష్మీ అష్టోత్తరశతనామాలలో కూడా 'శ్రద్ధాం విభూతిం సురభిం' అని ప్రార్థిస్తాం. సురభి అమ్మవారి స్వరూపం. అమ్మవారి మొట్టమొదట గోరూపం గోలోకంలో సురభిరూపంతో వచ్చింది. ఆ వచ్చిన సురభీదేవి సంతానాన్ని సమస్త లోకాలవారు అడిగారు.

ఆ తల్లి ఒకొక్క లోకానికి ఒకొక్క రూపంతో వెళ్ళింది. భూలోకమందు భారతదేశానికి మాత్రమే దిగివచ్చాయి కామధేను సంతానం. ఇందులో సందేహమేమీ లేదు. కామధేను సంతానానికి సంబంధించిన గోవులు ఆసేతుశీతాచలం మాత్రమే

ఉన్నాయి. కామధేనువు సంతానమైన యజ్ఞస్వరూపమైన 'యజ్ఞస్య మాతా' అని చెప్పేతల్లి భారతీయ గోవు మాత్రమే.

భారతదేశపు ప్రతి గోవు అమ్మవారి రూపమే. గోమాత సేవ చెయ్యడం అమ్మవారి సేవే. శ్రీచక్రాన్ని ఆరాధించడం ఎంత సేవో, గోవుని ఆరాధించడం కూడా అంతే సేవ.

సర్వాభీష్టప్రదాయిని అయిన కామధేనుస్వరూపిణి అని మరొక అర్థం.

విద్యయే గోమాత. గురువు అంటే విద్యాస్వరూపమే.

గంగ పాత్ర తెచ్చామంటే పాత్ర ప్రాధాన్యం కాదు. అందులో గంగ ప్రాధాన్యం. ఆ పాత్రని తెచ్చుకున్న ప్రతిసారి గంగాజలమనే అంటాం. చెప్తున్నది గంగాజలం గురించి, చూపిస్తున్నది పాత్ర. మనం గంగాజలానికే దండం పెడతాం. బొట్లు చెంబుకి, పూజ గంగా జలానికి చేస్తాం. గురువు పాత్రలాంటివాడు. అమ్మవారి విద్య గంగాజలం లాంటిది. ఆ పాత్రని ఎలా ఆరాధిస్తున్నామో అలా గురువుని ఆరాధించాలి.

గోవు అనగా విద్య. విద్యలు అంటే వేద వాక్యములు. ఆవిడ విద్యల తల్లి కనుకనే గురురూపిణీ. గో అనే శబ్దం దేని దేనికి వాడాలో శాస్త్రం చెప్తోంది.

బాణౌ వాచి పశౌ భూమౌ దిశి రశ్మౌ జలే అక్షిణి
స్వర్గే మాతరి వజ్రే అగ్నౌ ముఖే సత్యేతి గోధ్వనిః

గో అనే దానికి ఇన్ని అర్థాలు ఉన్నాయి.

ఇందులో ఏవేవి అమ్మవారి పరంగా వ్యాఖ్యానించడానికి సరిపోతాయో అన్నీ తీసుకోవాలి. బాణౌ – మంత్రాలన్నీ అస్త్రములే. మంత్రాల తల్లి. వాచి అంటే వాక్కులు. వేదవాక్కులు. పశౌ అంటే ధేనువులు, వృషభములు. భూమౌ – భూమికి గోవు అని వ్యవహారము. దిశి – దిక్కులకి గోవులని పేరు. రశ్మౌ– కిరణాలకు గోవులని పేరు. జలౌ– జలమునకు గోవు అని పేరు. అక్షిణి – నేత్రమునకు గోవు అని పేరు. స్వర్గమునకు గోవు అని పేరు. తల్లికి గోవు అని పేరు. అందుకే భారతీయుడు అమ్మ తరువాత ఆవు అంటాడు.

గోమాత అంటే సమస్త వేదవాక్యాలకి తల్లి. అగ్నికి కూడా గోవు అని పేరున్నది. గో అంటే సత్యము. ఇవన్నీ గోవులు అని చెప్పారు. వీటన్నిటికి మూలకారిణి కనుక 'గోమాతా'.

606. గుహజన్మభూః – శ్రీ గుహజన్మభువే నమః

గుహ అంటే సుబ్రహ్మణ్యస్వామి. ఆయన పుట్టుకకు కారణమైన తల్లి. స్కందమాత అనబడే దేవతని ఇక్కడ చూపిస్తున్నారు. అమ్మవారి నవదుర్గలలో స్కందమాత ఒకరు. స్కందుని ఒడిలో పెట్టుకున్న అమ్మ అంటే పరిపూర్ణమైన జ్ఞానరూపిణి, వాత్సల్యరూపిణి.

గురునామ పరంపరలలో ఈ నామం చెప్పడంలో విశేషమేమిటి? గుహజన్మభూః– గుహ అంటే హృదయం. జన్మ – కలుగుట. హృదయంలో కలుగునది. ఈ విద్య యొక్క పరమార్థం హృదయంలో వెలగాలి. ఆ హృదయంలో వెలిగే జ్ఞానమునకు కారణమైన తల్లి.

శ్రీవిద్యాసంప్రదాయంలో సుబ్రహ్మణ్యస్వామి ఒకరు. 'మనువిద్యా, చంద్రవిద్యా, కమలాక్షనిషేవితా, శివారాధ్యా, కుబేరవిద్య, రాజరాజార్చితా' నామాలు చెప్పుకున్నాం. అదే విధంగా సుబ్రహ్మణ్య ఉపాసన విద్య 'గుహజన్మభూః'. సుబ్రహ్మణ్యుడు శ్రీవిద్యోపాసకులకు గురువు. శ్రీవిద్యకి, శివవిద్యకి కూడా గురువు సుబ్రహ్మణ్యుడే.

"శ్రీనాథాది గురుగుహో జయతి" అన్నారు ముత్తుస్వామిదీక్షితులవారు. ఆయన శ్రీవిద్యలో పరమ సిద్ధపురుషుడు. ముత్తుస్వామిదీక్షితుల వారు నవావరణకీర్తనలలో ఎన్నో శ్రీవిద్యా రహస్యాలు పెట్టారు. ఆయన ప్రతి కీర్తనకి 'గురుగుహ' ముద్ర ఉంటుంది. కాశీలో శ్రీవిద్య సిద్ధింపజేసుకుని వస్తూ తిరుత్తణిలో ముత్తుస్వామిదీక్షితులవారికి ఒక నలభై రోజులు సుబ్రహ్మణ్య మంత్రం జపించుకుందాం అనిపించింది.

అలా నలభై రోజులు అయ్యాక ధ్యానస్థితిలో ఉండగా ఒక ముసలాయన వచ్చి కళ్ళు మూసుకోమని చెప్పి ముత్తుస్వామిదీక్షితులవారి నోటిలో పటిక బెల్లం

పెట్టారు. "ఇప్పుడు కళ్ళు తెరు" అన్నారు. కళ్ళు తెరిచేటప్పటికల్లా ఎదురుగా ఆ జ్యోతిర్మండలంలో సుబ్రహ్మణ్య స్వామి దర్శన మిచ్చారు.

వెంటనే ఆనందపరవశుడై **"శ్రీ గురుగుహ తారయాశు మాం శరవణభవ- శ్రీగురుగుహ తారయాశు మాం"** అని కీర్తన చేశాడు. "స్వామినాథ! పరిపాలయాశు మాం స్వప్రకాశ వల్లీశ గురుగుహ దేవసేనేశ" అని నువ్వే సంపూర్ణమైన గురువువని గురుమండల స్ఫురణంతా తెచ్చుకుని 'శ్రీనాథాది గురుత్రయం గణపతిం పీఠత్రయం' అనగానే 'శ్రీనాథాది గురుగుహో జయతి' అని కీర్తన రచించారు.

నాకు గుహుడే గురువు అన్నారు. దానితో శ్రీవిద్య అంతా కీర్తనల రూపంలో వెలికి వచ్చింది. గుహుడు శ్రీవిద్యాచార్యులలో ప్రధానమైనవాడు గనుక అతని తల్లి 'గుహజన్మభూః'. సుబ్రహ్మణ్యుడే జ్ఞానాధిదేవత. ఆయనకి 'జ్ఞానశక్త్యాత్మా' అని పేరు. జ్ఞానశక్తి అనే ఆయుధాన్ని అమ్మవారు ఇచ్చింది. దానితో అసురశక్తులని చెండాడాడు.

సుబ్రహ్మణ్యుడే కాకుండా గణపతి కూడా గురుస్వరూపుడే. మొత్తం నామాలన్నీ ఆయనే అని చెప్పారు. గణపతి గకారప్రియుడు. 'గురుమూర్తి' 'గుణనిధిః' 'గోమాతా' 'గుహజన్మభూః' నామాలలో పల్లవిస్తున్న గకారం అంతా గణపతి స్వరూపమే. అలా ఇద్దరు గురువులను అమ్మవారు ఇచ్చారు. వీరిద్దరి దయ మనపై ఉంటేనే ఆ తల్లి అనుగ్రహం లభిస్తుంది. సుబ్రహ్మణ్యుని, గణపతిని కూడా మన గురువులుగానే భావన చెయ్యాలి.

శ్రీవిద్యలో ప్రవేశం కావాలంటే మొట్టమొదట వల్లభగణపతి అనుగ్రహం ఉండాలి. లేకపోతే శ్రీవిద్యలోకి ప్రవేశమే లేదు.

దీనిలో ఒక మంత్రద్రష్ట ఒక అద్భుతం కనుగొన్నాడు. గోమాత అనే దగ్గర పట్టుకున్నాడు. గుహకి మాత. గవర్ణమునకు మాత. వర్ణము అంటేనే దేవత. గకారం గణపతి మంత్రం. గోమాత అంటే గణపతి తల్లి అని అర్థం చెప్పారు. గుహజన్మభూః అంటే సుబ్రహ్మణ్యునికి తల్లి అని వివరించారు.

607. దేవేశీ – శ్రీ దేవేశ్యై నమః

దేవతలందరికి ఈశ్వరి. మన బ్రతుకులన్నీ దేవతల చేతుల్లో ఉంటే ఆ దేవతల బ్రతుకులన్నీ అమ్మవారి చేతిలో ఉన్నాయి. దేవతలది మన మీద అధికారం. దేవతల మీద అధికారం అమ్మవారిది. అమ్మ అనుగ్రహాన్ని పొందగలిగితే మిగిలినవారంతా అనుకూలంగా ఉంటారు.

దేవి అనే మాటకి అర్థం చెప్తూ, **'దీవ్యతే క్రీడతే యస్మాత్ ద్యోతతే రోచతే దివి। తస్మాత్ దేవ ఇతి ప్రోక్తః। స్తూయతే సర్వ దైవతైః'** అన్నారు.

దీవ్యతే – ప్రకాశించుట. క్రీడతే – ఆడుకొనుట, ద్యోతతే – గోచరించుట. ఈ పనులన్నీ చేసేది దేవతలు. వారు ప్రకాశస్వరూపులు. ఈ ప్రపంచంలో ఏ పనైనా అలవోకగా, అనాయాసంగా చేస్తారు. అలాంటి ప్రకాశస్వరూపులైన దేవతలకి అమ్మవారు ఈశ్వరియై దేవతలకి దైవత్వాన్ని ఇస్తున్నది. ముందు చెప్పుకున్న 'నమో దేవ్యై మహాదేవ్యై' నామాన్ని ఇక్కడ స్మరించుకుంటే దేవతలకి ఈశ్వరి అని తెలుస్తుంది.

'దేవేశీ', 'దండనీతిస్థా', 'దహరాకాశరూపిణీ' నామాలకి ఒక సంబంధం ఉంది.

దహరాకాశమంటే హృదయం. హృదయంలో ఉన్న ఆకాశం ఆవిడ రూపం. ఆకాశానికి రూపం ఉందా అంటే అది శూన్యం కాదు... పూర్తి శక్తిమయం అని అనేకమార్లు చెప్పుకున్నాం.

ఆకాశం అంటే 'ఆసమంతాత్ కాశం ప్రకాశం ఇతి ఆకాశం'. పూర్తి చైతన్యమయమై ఉంది. అది చిత్ ఆకాశం (చిదాకాశం). హృదయంలో కేవలం శక్తిరూపంగా వ్యాపించిపోయి ఆవిడ ఉంది. ఆ వ్యాపించిన శక్తినే చిచ్ఛక్తి అంటారు. ఈ చిచ్ఛక్తే మన శరీరంలో చేతనారూపంగా నడుస్తూ ఉన్నది. చిచ్ఛక్తి వ్యాపించిన చోటు దహరాకాశం. చిచ్ఛక్తే శ్రీచక్రం. శ్రీచక్రానికే దహరచక్రము, వియత్ చక్రము అని పేర్లు.

'దహరాకాశరూపిణీ' అంటే హృదయాకాశంలో ప్రకాశిస్తున్న తల్లి. ఆ దహరాకాశంలో ఉంటూనే ఇంద్రియాలను నడుపుతోంది. ఇంద్రియాలలో ఒకొక్క

ఇంద్రియానికి ఒకొక్క అధిష్ఠాన దేవత ఉంటారు. ఇంద్రియాలు అంటే దేవతలనే చెప్పుకోవాలి. మనం కళ్ళు అని చెప్పుకొనే ఈ రెండు గోళీకాయలలో సూర్యశక్తి ప్రసరిస్తేనే ఇది దృష్టినిచ్చే కన్ను అయింది. ఈ రెండు చెవులలో దిగ్దేవతలు ప్రసరిస్తే శ్రవణశక్తి అని పేరు. నాలికపై రుచికి వరుణుడు, వాక్కుకి అగ్ని, చేతికి ఇంద్రుడు అధిదేవతలు. పాదాలకు విష్ణువు అధిదేవత. ఒకొక్క ఇంద్రియానికి ఒకొక్క దేవత ఉన్నారు. ఇలా అందరూ గొప్పవారే.

ఈ ఇంద్రియరూప దేవతలందరిని శాసిస్తూ ఉన్న శక్తి ఎక్కడ ఉందో చెప్తూ, **"ఈశ్వరః సర్వభూతేషు హృద్దేశే అర్జున తిష్ఠతి"** (గీత) అన్నారు. దహరాకాశరూపిణి అయిన అమ్మవారు ఇంద్రియరూపమైన దేవతలకి ఈశ్వరిగా ఉంది. దేవేశీ అయిన తల్లి దహరాకాశంలో ఉండి దేవతలనందరిని (ఇంద్రియ శక్తులను) నియంత్రిస్తూ ఉన్నది.

608. దండనీతిస్థా – శ్రీ దండనీతిస్థాయై నమః

దండనీతి యందున్నది – నీతిశాస్త్రజ్ఞురాలు. దండనీతి ఒక శాస్త్రం. **"అన్వీక్షకీ త్రయీ వార్తా దండనీతిస్త్వమేవ చ"** అని అమ్మవారిని విష్ణుపురాణం కీర్తించింది.

ప్రతి దానిని గమనించి తెలుసుకోగలిగిన జ్ఞానము 'అన్వీక్షకీ'. ధర్మమేదో, అధర్మమేదో తెలియచేసే విద్య 'త్రయీ'. ఏది ప్రయోజనకారో, ఏది అనర్థకారో చెప్పే విద్య 'వార్తా'. 'దండనీతి' అంటే 'నయానయబోధక విద్య'.

నయానయగతాన్ లోకాన్ అవికల్పేన యోజనాత్
దండనాత్ దమనాద్వాపి దండనీతిరితి స్మృతా

అని దేవీపురాణం చెప్తోంది. ఏ మార్గంలో వెళ్తే మంచో, ఏ మార్గంలో వెళ్తే చెడో చూపిస్తూ, మంచి మార్గంలో వెళ్ళిన వారిని ఎలా రక్షించాలో, చెడు మార్గంలో వెళ్ళిన వారిని ఎలా శిక్షించాలో చెప్పే శాస్త్రం పేరు దండనీతి. ఆ దండనీతి శాస్త్రం అమ్మవారి రూపం. ఈ దేవి దండనీతిగా ఈ లోకమంతా నిర్వహిస్తున్నది.

రాజదండం రాజరాజేశ్వరి చేతిలో ఉంది. అమ్మ శాసనాన్ని దాటడం దేవతల వల్ల కూడా కాదు.

భీషాస్మాద్వాతః పవతే భీషోదేతి సూర్యః
భీషాస్మాదగ్నిశ్చేంద్రశ్చ మృత్యుర్ధావతి పంచమః

అని ఉపనిషత్తు చెప్పిన మహామంత్రం. ఏ దేవి యొక్క శాసనభయం చేత ఇంద్రుడు, యముడు, వరుణుడు, అగ్ని, వాయువు, సూర్యుడు, చంద్రుడు పని చేస్తూ ఉంటారో, ఏ దేవి శాసనభయం చేత మృత్యువు కూడా భయపడి పరిగెడుతుందో ఆ దేవి 'దేవేశీ'–'దండనీతిస్థా'.

ఆ దండనీతితో దేవేశియే లోకములను నడుపుతున్న తల్లి. ఇంత జగములు ఏలే రాజేశ్వరి మన హృదయంలో ఉండి మన ఇంద్రియాలనే దేవతలని నడుపుతూ మనం చేసిన ధర్మాలకి ఫలితంగా అనుగ్రహిస్తూ, అధర్మానికి ఫలితంగా శిక్షిస్తూ దండనీతిని పాటిస్తున్నది.

609. దహరాకాశరూపిణీ – శ్రీ దహరాకాశరూపిణ్యై నమః

హృదయంలోని సూక్ష్మాకాశస్వరూపురాలు. దహరాకాశరూపంలో ఉంటూ, ఇంద్రియాలనబడే దేవతల్ని శాసిస్తూ, ధర్మబద్ధంగా ఉన్నప్పుడు రక్షిస్తూ, అధర్మబద్ధంగా ఉన్నప్పుడు శిక్షిస్తూ ఉన్న తల్లి. దీనిని ఈ మూడు నామాల వరుసలోను చెప్పారు.

అమ్మవారి విద్యకి 'దహరవిద్య' అని ప్రధానమైన ఒక పేరు ఉంది. వియత్ చక్రము, దహర చక్రం. ఆ హృదయచక్రమే శ్రీచక్రం.

'అథ యదస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకం వేశ్మ దహరోఽస్మిన్నంతరాకాశః తస్మిన్ యదంతః తదన్వేష్టవ్యమ్' అని ఉపనిషత్తు చెప్తున్నమాట. 'దహర అస్మిన్ అంతరాకాశః' – ఈ హృదయాకాశంలో ఆ పరమాత్మ ఉన్నాడు. 'దహరం పుండరీకం వేశ్మ' – ఇది దహరము. ఇదే పుండరీకం. బ్రహ్మపురం. అక్కడ ఉన్నది ఆ పరతత్త్వమే. దానినే అన్వేషించు అన్నారు. ఈ మాట చెప్పినప్పుడు మరొక ప్రశ్న వస్తుంది. సర్వవ్యాపిని అయినప్పుడు దహరాకాశంలో ఉన్నదని ఎలా చెప్తారనే దానికి శంకరభగవత్పాదులవారు చక్కటి అన్వయం చేశారు.

ఆకాశం అంతటా ఉంది. వెదురు గొట్టములోని ఆకాశము, గొట్టం ఎంత

ప్రమాణంలో ఉందో అంత ప్రమాణం ఆకాశానికి కూడా అన్వయిస్తుంది. గంగానదీ జలాన్ని ఒక కలశంలోకి తీసుకున్నప్పుడు కలశజలాన్ని గంగానదిగా చెప్పినట్లుగా సర్వవ్యాపకమైన ఈశ్వరచైతన్యం హృదయంలో వ్యక్తమవుతున్నది గనుక అక్కడ మనం దహరాకాశరూపంగానే భావన చేస్తున్నాము. ఇది ముఖ్యమైన ఉపాసన, ధ్యాన విధి.

దండనీతిస్థా అనే దానికి తేట తెలుగు భాష్యమిచ్చారు నారాయణదాసుగారు.

చెడుగులడంచి మంచి చెలంగించు వేల్పు

కట్టుపాటుల నిల్పు ముక్కంటి వెలంది

కట్టుబాటు అనేది దండనీతి. ధర్మాన్ని నిలపడం. దహరాకాశరూపిణి అనే దానికి – అందరి హృదయాలలో ఉంటుంది కాని భక్తులు మాత్రమే తమ హృదయంలో అమ్మవారిని దర్శిస్తున్నారు. అందుకే దాసుగారు **"అడియని డెందమునందొప్పు వేల్పు"** అని దహరాకాశరూపిణికి అనువాదం చేశారు.

అడియని అంటే భక్తుని యొక్క డెందమునందు ఒప్పు వేల్పు. భక్తుడు మాత్రమే హృదయాంతరవర్తిని అయిన అమ్మవారిని గ్రహించగలుగుతున్నాడు. అలా గ్రహించిన వాడే భక్తుడు అవుతున్నాడు.

610. ప్రతిపన్ముఖ్యరాకాంతతిథిమండలపూజితా

– శ్రీ ప్రతిపన్ముఖ్యరాకాంతతిథిమండలపూజితాయై నమః

ఈ పాదం అంతా ఒక్కటే నామం. 'ప్రతిపత్' అంటే పాడ్యమి, 'ముఖ్య' అంటే మొదలుకొని, 'రాకా' అంటే పూర్ణిమ అని అర్థం. ప్రతిపన్ముఖ్యరాకా అంటే పాడ్యమి మొదలుకుని పూర్ణిమ వరకు చెప్పబడుతున్న తిథులయందు పూజింపబడుతున్నది. ఆ తిథిమండలరూపంగా అర్చించబడుతున్నది అని ఒక అర్థం. ఆ తిథిమండలము చేత పూజింపబడుతున్నదని మరో అర్థం.

పాడ్యమి నుంచి పూర్ణిమ వరకు ఉన్న తిథిమండలదేవతలైన నిత్యాదేవతలు అమ్మవారిని ఆరాధన చేస్తున్నారు.

ఒకొక్క తిథికి ఒకొక్క ప్రత్యేకత ఉన్నది. ఆ ప్రత్యేకతను తెలుసుకుని ఆ తిథినాడు ఆరాధన ఆ రోజు చెయ్యాలి.

ఈ తిథి దేవతలు – కామేశ్వరి, భగమాలిని, నిత్యక్లిన్న, భేరుండ, వహ్నివాసిని, మహావజ్రేశ్వరి, శివదూతీ, త్వరిత, కులసుందరీ, నిత్య, నీలపతాక, విజయ, సర్వమంగళ, జ్వాలామాలిని, చిత్ర. ఇది పూర్ణిమ వరకు చెప్పిన లెక్క.

కృష్ణ పాడ్యమి నుండి వెళ్ళాలంటే వెనక్కి వెళ్ళాలి. చిత్ర అనేది కృష్ణ పాడ్యమి నాటి తిథి నిత్యాదేవత అవుతుంది. కృష్ణ విదియ జ్వాలామాలిని, అలా వెనక్కి వెళ్తూ ఉంటే అమావాస్యకి కామేశ్వరీ వస్తున్నది. మళ్ళీ శుక్ల పాడ్యమికి కామేశ్వరితో మొదలు పెట్టుకుంటాం. ఇది క్రమం. మొత్తం నెలంతా కూడా తిథిమండలమే చెప్పబడుతున్నది. తిథిమండలాలను ఆరాధించడం ఒక విశేషం.

దిన, వార, తిథి, నక్షత్ర ఇత్యాదులన్నీ దేవతా శక్తులు. ప్రతిరోజూ వాటిని స్మరించుకోవాలి. అమ్మ ఆ రూపంతో లోకాన్ని నియమిస్తున్నది. వారానికి, తిథికి, నక్షత్రానికి ఉన్న అధిదేవతల అనుగ్రహం మనకి కావాలి కనుక అనునిత్యం సంకల్పంలో వీటిని చెప్పుకుంటాం.

ఈ తిథి నిత్యాదేవతల ఆరాధన శ్రీవిద్యలోనే కాక వేదంలో కూడా పగటి దేవతలు, రాత్రి దేవతలు అని ఉన్నారు.

'సంజ్ఞానం ప్రజ్ఞానం విజ్ఞానం జానదభిజానతు' అని చెప్తూ పాడ్యమి నాడు తిథి, విదియనాడు తిథి దేవతల గురించి వేదములందు చెప్పబడుతున్నాయి. అవే భావాలు ఇక్కడ ఆవిష్కరింపబడుతున్నాయి. తిథిమండలం ద్వారా పూజింపబడుతున్నది.

తిథులు గురించి తెలుసుకునేటప్పుడు శ్రీవిద్యా పరిచయంతో తిథిదేవతలనందరిని చెప్పుకున్నాం గాని ఒకొక్క తిథికి ఒకొక్క దేవత ఉన్నారు. ఆ రోజు ఆ దేవత యొక్క అనుగ్రహం ఉంటుంది. వారాలలో కూడా ఒకొక్క వారానికి ఒకొక్క గ్రహదేవత ఉంటుంది. తిథి దేవత ఉంటుంది. తిథులను, గ్రహాలను, నక్షత్రాలను అనుసరించి ఆరాధన చెయ్యడం, మాసాలను అనుసరించి అనేక రకాలైన

సాధనలు చెయ్యడం. వాటి ఫలాలు వాటికి ఉన్నాయి.

కామేశ్వరీ మొదలైన తిథినిత్యాదేవతలే కాకుండా తిథులకున్న దేవతలు ఎవరో శాస్త్రం చెప్తున్నది.

వహ్న్యర్కస్రాఉమా విఘ్నో భుజంగః షణ్ముఖో రవిః
మాతరశ్చ తథా దుర్గా దిశో ధనద కేశవౌ
యమో హరశ్శశీ చేతి తిథీశాః పరికీర్తితాః

'తిథీశాః' అంటే తిథికి అధిష్ఠాన దేవతలు. పాడ్యమికి అగ్నిదేవుడు అధిపతి, విదియకి అశ్వినీదేవతలు. తదియకి ఉమాదేవి. చవితికి విఘ్నేశ్వరుడు. పంచమికి నాగదేవతలు. షష్ఠికి షణ్ముఖుడు. సప్తమికి సూర్యుడు. అష్టమికి మాతృదేవతలు అంటే సప్తమాతృకలు మొదలైనవారు. నవమికి దుర్గాదేవి. దశమికి దిగ్దేవతలు అంటే దిక్పాలకులు. ఏకాదశికి ధనదుడు అంటే కుబేరుడు అధిదేవత. కొన్ని చోట్ల యమశక్తిని కూడా ప్రస్తావించడం జరుగుతోంది. ద్వాదశికి కేశవుడు. త్రయోదశకి యముడు. చతుర్దశికి హరుడు అనగా శివుడు, పూర్ణిమకి చంద్రుడు. అమావాస్యకి పితృదేవతలు.

తిథిమండలము అంటే ఈ దేవతలు. వీరందరి చేత పూజింపబడుతోంది కనుక 'తిథిమండలపూజితా' – పాడ్యమి నుండి పూర్ణిమ వరకు, కాలదేవతలందరూ కూడా ఈ మహాకాళినే ఆరాధన చేస్తున్నారు.

611. కళాత్మికా – శ్రీ కళాత్మికాయై నమః

ఈ నామాలన్నీ లోకరచనా వైఖరిని వివరిస్తున్నాయి. కళాత్మికా అంటే కళల స్వరూపమని అర్థం.

శంకరభగవత్పాదులవారు శివానందలహరిని ప్రారంభిస్తూ **'కలాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం'** అన్నారు. ఈ కళల గురించి మునుపు కూడా కొన్ని నామాలలో ప్రస్తావించుకున్నాం.

కళలు అంటే భాగములు అని అర్థం. అదే విధంగా కళలు అంటే విలాసములు

అని మరొక అర్థం. విద్యలు అని ఒక అర్థం. ఇలా మూడు రకాల అర్థాలు. అమ్మవారు ఈ మూడింటి రూపము.

విద్యల రూపం కనుక కళాత్మిక. విలాసము అంటే శోభ యొక్క ప్రకటన. అలాంటి శోభల రూపం కనుక కళాత్మిక. మూడవ అర్థం ఈ లోకములోని రకరకాల భాగములు. మంగళస్వరూపములు.

లోకమంతా ప్రధానంగా సూర్య, చంద్ర, అగ్ని కళలనే మూడు కళలతో ఉంది. చంద్రకళలు 16, అగ్నికళలు 10, సూర్యకళలు 12. అదే విధంగా జాగ్రత్స్వప్నసుషుప్తి తురీయ కళలని ఉన్నాయి. మనకి ఉన్న నాలుగు అవస్థలలో ఒకొక్క అవస్థలో కొన్ని కళలు ఉంటాయి.

ఉత్పత్తి, జాగ్రత, బోధ, మనోవ్యాపారము... ఈ నాలుగు జాగ్రదవస్థలో ఉండే కళలు. అభిలాష, భ్రమ, చింత, విషయవాంఛ... ఈ నాలుగు స్వప్నావస్థలో ఉండే కళలు. పరాకు, మూర్ఛ, నిద్ర, మరణము – ఈ నాలుగు సుషుప్తి అవస్థ కళలు. వైరాగ్యము, మోక్షేచ్ఛ, మనశ్శుద్ధి, సదసద్వస్తు విచక్షణ – ఈ నాలుగు తురీయ స్థితి కళలు.

ఈ కళలు మనం తురీయ స్థితికి వస్తే వస్తాయని కాదు. ఆ కళలు అభివృద్ధి చేసుకోగలిగితే ఎప్పటికైనా ఆ తురీయభూమికకి వెళ్ళగలం. జాగ్రత్స్వప్నసుషుప్తి అవస్థ కళలు తెలుస్తూనే ఉంటాయి. ఆ కళలన్నీ ఎప్పుడూ మనలో ఉంటాయి.

విశ్వరూపా జాగరిణీ నామాల దగ్గర వివరంగా చెప్పుకున్నాం. ఆయా అవస్థలలో ఆ కళల రూపంలో కనబడుతున్నది కనుక 'కళాత్మికా'.

అరుణోపనిషత్ అని ఒక ఉపనిషత్తు అమ్మవారి విద్యలకి సంబంధించి చాలా విశేషమైన అంశాలను చెప్పింది. అరుణోపనిషత్, బహ్వృచోపనిషత్, త్రిపురోపనిషత్... ఇవి చాలా ప్రధానం. ఇవికాక దేవ్యుపనిషత్, దేవీ అథర్వశీర్షము ఉన్నాయి. శ్రీవిద్యకు సంబంధించిన అంశాలు మనకు ఇందులో కనిపిస్తున్నాయి.

అరుణోపనిషత్ ప్రకారంగా కళలు ఏమిటో చూపిస్తున్నారు. అర్చిష్మత్ కళలు, జ్యోతిష్మత్ కళలు, మహస్వత్ కళలు. సూర్య, చంద్ర, అగ్నులకి పన్నెండు, పదహారు, పది అని చెప్పబడింది.

ఒక సంవత్సరరూపంగా లెక్కవేసుకుంటే ఈ మూడు కళలే సంవత్సరంలో వ్యాపిస్తాయి. తేమ, చలువ, నీరు – ఇవన్నీ చంద్రకళలు. అవి విజృంభించేది వర్షాకాలము, చలికాలము. అగ్ని కళలు సూర్యకళలు వేసవిలో విజృంభించేవి. అర్చిష్మత్ అనబడే అగ్నికళలు 108. జ్యోతిష్మత్ అనబడే చంద్రకళలు 136. మహస్వత్ అని చెప్పబడే సూర్యకళలు 116. మొత్తం 360 కళలు. దీనినే శంకరులు –

'క్షితౌ షట్పంచాశద్ద్విసమధిక పంచాశదుదకే

హుతాశే ద్వాషష్టి శ్చతురధికపంచాశదనిలే

దివి ద్విష్షట్త్రింశన్మనసి చ చతుష్షష్టిరితి యే

మయూఖాస్తేషామప్యుపరి తవ పాదాంబుజయుగమ్ అని సౌందర్యలహరిలో వివరించారు.

ఇవే ఆరు ఋతువులలో పరచబడుతూ సంవత్సర రూప కాలచక్రాన్ని ఏర్పరుస్తున్నాయి. ఈ మూడు కళలని అరుణోపనిషత్ చెప్తోంది. ఈ కళలన్నీ అమ్మవారి రూపాలే అని గ్రహించగలగాలి.

అదేవిధంగా 64 కళలు ఉన్నాయి. చతుష్షష్టి కళలు. ఈ కళలు గురించి కూడా విశేషంగా ప్రస్తావించుకున్నాం. 64 కళలు అంటే విద్యాకళలు. వేదాలు మొదలుకుని అన్నీ కళలరూపంలో ఉన్నది.

612. కళానాథా – శ్రీ కళానాథాయై నమః

కళలరూపంలో ఉంటూ ఆ సూర్య–చంద్ర–అగ్నులయందు తన ప్రకాశాన్ని వ్యాపింపజేసి తద్వారా లోకాన్ని నడుపుతోంది. నడపడమే కాకుండా వాటి యందు సంపూర్ణ నాయకత్వం అమ్మవారిది. ఈ కళలు అన్నింటికి ఈవిడే నాథ. నాథ అనే మాటకి దిక్కైనది, పాలకురాలు అని రెండు అర్థాలు. వ్యవస్థ చూస్తోంది కనుక పాలకురాలు. వాటన్నిటికి ఆధారం కనుక దిక్కైనది. కళలన్నింటికి నాథ.

కళానాథ అంటే చంద్రుడు అని కూడా అర్థం ఉంది. అమ్మవారు చంద్రకళాస్వరూపిణి. ఈ చంద్రకళ సూర్యచంద్రఅగ్నులలో ఉన్న కళ కాదు. ఈ

చంద్రకళ సదాకళ, ధ్రువాకళ అని చెప్పబడుతున్న షోడశీ కళ. ఆ చంద్రకళే సహస్రారకమలంలో ప్రకాశించే అమృతబింబము. శ్రీచక్రంలో బిందుచక్రమే కళానాథ అని చెప్పబడుతున్నది

613. కావ్యాలాపవినోదినీ - శ్రీ కావ్యాలాపవినోదిన్యై నమః

ఈ నామానికి మరొక పాఠాంతరంలో 'కావ్యాలాపవిమోదినీ' అని ఉంది. మోదినీ అన్నా, విమోదినీ అన్నా ఆనందించునది అని అర్థం. అమ్మవారికి ఒక వినోదం ఉంది. అది కావ్యాలాపాలు వింటూ ఆనందిస్తూ ఉంటుంది. ఇది రసజ్ఞతకు సంకేతం. రసవంతమైన విషయం వింటే గ్రహించి ఆనందించడానికి ఒక దైవీగుణం ఉండాలి. సాత్త్విక గుణం ఉంటేనే లోతును తెలుసుకుని ఆనందించగలరు.

'కవీనాం సందర్భస్తబక' - ఇత్యాది శ్లోకాలలో శంకరభగవత్పాదులవారు ఈ రసజ్ఞత గురించి చాలా చెప్పారు. అమ్మవారి ముందు కవిత్వం చెప్తూ ఉంటే కళ్ళు ఆనందంతో పెద్దవి చేసిందిట. తల్లి ముందు కవిత్వం చెప్పే భాగ్యం ఎవరికి లభిస్తుంది? మనం గొప్ప కవులని నమస్కరించుకుంటున్న కాళిదాసు ఇత్యాదులందరూ అమ్మవారి ముందు కవిత్వం చెప్పుకున్నవారే. గొప్ప కవులకి కవులు వశిన్యాది వాగ్దేవతలు.

లలితా సహస్రనామం వారు చెప్పిన పెద్ద కవిత్వం. వారే స్వయంగా చెప్పారు. వారి దయ వల్ల అందరూ చెప్తున్నారు. కళ్ళు మూసుకుని ధ్యానిస్తే అమ్మ ముందు కవిత్వం చెప్పే మహాత్ములు చాలా మంది కనబడతారు. ముందు వేదాలు. వేదమాతలందరూ అమ్మ ముందు గానం చేస్తున్నారు.

కావ్యము అనే మాట వేదానికే వ్యవహరింపబడింది. నిరుక్తము ప్రకారంగా కవి, కావ్యము అనే శబ్దం వేదానికే ఉంది. కవి శబ్దాన్ని 'కవిం పురాణమనుశాసితారం' అని పరమాత్మకి, మంత్రాలకి, ఋషులకి చెప్పారు.

కావ్య-ఆలాప-వినోదినీ అంటే వేదాలాపములు వింటూ ఆనందిస్తూ ఉంటుంది. వేదమంత్రాలన్నీ రూపాలు ధరించి అమ్మ ముందు స్తుతి చేస్తున్నాయి.

దీనినే 'శ్రుతిసీమంతసిందూరీకృతపాదాబ్జధూళికా' దగ్గర విస్తారంగా చెప్పుకున్నాం. అమ్మ ముందు నిలబడి ఒకొక్క మంత్రం ఒకొక్క రూపం ధరించింది. అలా ఏడు కోట్ల మంత్రాలు కూడా అమ్మ ముందు చేతులు మోడ్చి అమ్మని స్తుతి చేస్తున్నాయి.

వేదాల యొక్క హృదయం అమ్మ తత్త్వాన్ని ప్రతిపాదించడమే. ఎవరైనా వేదాన్ని గానం చేస్తారు. అమ్మవారి ముందు వేదములే గానం చేస్తున్నాయి. అమ్మవారికి అర్చనలో ఉపచారాలుగా వేదపఠనం, కావ్యపఠనం, సంగీతపఠనం... ఇవన్నీ కావాలి. ఆ తల్లికి కళలు అంటే చాలా ఇష్టం. ఆ కళల యొక్క ఆలాపనలే కావ్యాలాపములు.

అమ్మవారి అర్చన అంతా చేశాక రమ్యమైన ఘట్టం బహుపరాకులు. బహుపరాకులు చదివేటప్పుడు **'ఋగ్వేదమవధారయ'** అనగానే ఋగ్వేద పండితులు ఋగ్వేదం చదువుతారు. అలాగే యజుర్వేద, సామ, అధర్వ వేదాలు, పురాణ, వేదాంత, కావ్య నాటకాదులు కూడా.

నాలుగు వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు అన్నీ అమ్మకి ఉపచారాలు. రామాయణం లాంటి కావ్యం కూడా ఈ తల్లి అనుగ్రహం వల్లనే వచ్చింది. ఇలా అమ్మవారి దగ్గర ఎంతో మంది బారులు తీరి వినిపిస్తున్నారు.

ముందు వేదకాంతలు, ఒక వైపు వ్యాసవాల్మీకాదులు, మరొకవైపు కాళిదాసు, ఇత్యాదులు. అటు తరువాత శంకరభగవత్పాదులవారు, ముత్తుస్వామి దీక్షితులు, త్యాగరాజస్వామివారు... వారందరూ గానాలు చేస్తున్న దృశ్యం మన కంటికి కనిపించాలి. ఆ తల్లి అన్నీ వింటుంది. ఆవిడ లోకం ఒక మణిద్వీపమేనా? ఏ లోకం ఆవిడ లోకం కాదు! సర్వమూ ఆవిడ లోకమే.

ఎక్కడ అమ్మ పూజ జరిగినా అది ఆవిడ దర్బారే. ఎక్కడ కూర్చుని పాట పాడినా ఆవిడ వింటూ ఉంటుంది. ఎక్కడ కూర్చుని కావ్యాలాపం చేసినా వినోదిని కనుక ఆనందిస్తుంది. పిల్లలు ఏదైనా చక్కనిది నేర్చుకొని వచ్చి, "అమ్మా నేనిది చదివా"నని వినిపిస్తుంటే, తల్లి వారి మనస్సు నొచ్చుకోకూడదని ఎంతో సంతోషంగా వింటుంది. అలా మనందరికి తల్లి అయిన జగన్మాత అంత ప్రేమగా వింటుంది.

కవుల యొక్క కవిత్వాన్ని వినేటప్పుడు 'అబ్బా!' అని కళ్ళు పెద్దవి చేసుకుని

మరీ వింటోంది. ఆ వింటున్నప్పుడు ఆ కళ్ళు చెవుల దాకా సాగిపోయాయట. కవుల కవిత్వాన్ని ఆస్వాదించేది చెవులే. చెవులు ఆస్వాదిస్తూ ఉంటే ఆ కళ్ళు కూడా సాగి ఆ చెవులతో పాటు కావ్యాన్ని వింటున్నాయి. ఈ రెండు కళ్ళకి అయితే ఆ భాగ్యం ఉంది చెవుల దాకా సాగి ఆనందిస్తూ. నాకా భాగ్యం లేదు కదా అని ఆ మూడవ కన్ను ఈ రెండు కళ్ళ మీద అసూయ చెంది ఎరుపెక్కిపోయిందని అంటారు శంకరులు. ఇది 'కావ్యాలాపవినోదినీ'.

కవీనాం సన్దర్భస్తబక మకరన్దైకరసికం
కటాక్షవ్యాక్షేప భ్రమరకలభౌ కర్ణయుగళం
అముఞ్చన్తౌ దృష్ట్వా తవ నవరసాస్వాదతరళౌ
అసూయాసంసర్గా దళికనయనం కిఞ్చిదరుణమ్

కావ్యాలాపం చేస్తూ ఉంటే దహరాకాశరూపిణి అయిన తల్లి సంతోషిస్తూ ఆ సంతోషమనే గుణాన్ని వ్యాపింప జేస్తుంది. మంచి కావ్యాలను చదవాలి. ఋషులు ఇంత రచించాక చదవకుండా బ్రతకడం దురదృష్టం. మంచి పుస్తకాలు చదివి ఋషిఋణం తీర్చుకోవాలి.

ఏది చదవడం వలన మనలో ధర్మము, భక్తి వృద్ధి చెందుతాయో అదే మంచి గ్రంథము. అలాంటి వాటిని చదివే సంస్కారాన్ని అలవరచుకోవాలి. ధర్మ, భక్తి, జ్ఞానాలు వృద్ధి చెందే గ్రంథాలే గొప్పవి. అవి కావ్యములు.

అయితే 'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' - కావ్యాలాపములు కూడదు అని వేదం శాసించింది. కాళిదాస మహాకవి యొక్క గ్రంథాలకి భాష్యం వ్రాస్తూ మల్లినాథ సోమసూరిగారు వివరిస్తూ "అసత్కావ్యములను ఆలాపన చెయ్యవద్దని వేదము చెప్పింది. సత్కావ్యముల విషయంలో చెప్పలేదు కనుక సత్కావ్యమైన కాళిదాసు కావ్యానికి నేను భాష్యం వ్రాస్తున్నాన"ని అన్నారు.

'కావ్యామృత రసాస్వాదః సజ్జనైః సంగమేవ చ' - కావ్యామృత రసాన్ని ఆస్వాదించడము. సత్పురుషులతో సాంగత్యము. ఈ రెండే జీవితంలో సారములు. మిగిలినవన్ని నిస్సారములు.

614. సచామరరమావాణీసవ్యదక్షిణసేవితా

– శ్రీ సచామరరమావాణీసవ్యదక్షిణసేవితాయై నమః

అమ్మవారికి ఇరువైపులా ఉన్నవారు రమా, వాణీ. సవ్యము అంటే ఎడమ వైపు, దక్షిణ అంటే కుడివైపు అని అర్థం. రమావాణీ – సవ్యదక్షిణ అని తీసుకుంటే అమ్మవారికి ఎడమ వైపు లక్ష్మీదేవి, కుడివైపు వాణీదేవి. వీరు ఉభయులు సేవిస్తున్నారు. ఈ చిత్రాన్ని మనం భావన చేసుకోవాలి. లలితామహాత్రిపురసుందరిని అటూ, ఇటూ సేవిస్తున్నవారు.

కొంతమందికి ఎలా అన్వయించుకోవాలో తెలియక ఒక దేవతా ప్రాధాన్యం చెప్తే మరొక దేవతని తగ్గించారని అనుకుంటారు గాని అది తగ్గించడం కాదు. వీటినే ఉపాసనా సంప్రదాయాలు అంటారు. సరస్వతీ ఉపాసకులకి సరస్వతీదేవికి ఇటు అటు లక్ష్మి, కాళీ కొలుచుకుంటూ ఉంటారు. లక్ష్మి ఉపాసనలో అటు, ఇటు కొలుచుకున్నవారు మారుతూ ఉంటారు. అంత మాత్రం చేత మిగిలిన దేవతలు తక్కువని కాదు.

ఎవరిని మనము ఉపాసిస్తున్నామో దానిని పరమమని చెప్పి, మిగిలిన వాటిని అంగములుగా భావించాలి.

ఇందులో మరొక శక్తిని కూడా గ్రహించాలి. ఒక బీజాక్షరం ఈ నామంలో దాగి ఉంది.

ఎక్కడైనా చిత్రపటం చూసినపుడు దీనికి భిన్నంగా ఉన్నా ఆ పటంలోని దోషాలు ఎంచకుండా నమస్కారం చేసుకోవడంలో తప్పేం లేదు. ఈ సవ్య దక్షిణ అన్నది కూడా చమత్కారం. సవ్యదక్షిణ అన్నది అమ్మవారికి సవ్యదక్షిణ? లేక నమస్కరిస్తున్న వారికి సవ్యదక్షిణ? అనేది చెప్పలేదు కనుక ఈ నామానికి భిన్నంగా చిత్రపటం ఉంటే అది అమ్మవారికి సవ్యదక్షిణ అనుకోవచ్చు.

తంజావూరు చిత్రలేఖనాలని ప్రమాణంతోనే ఆ రోజుల్లో వేసేవారు. వారి దాంట్లో ఇక్కడ చెప్పినట్లు కాకుండా అటు ఇటుగా ఉంటుంది. తంజావూరు కళను ఏమీ అనకూడదు. మననుంచి లెక్క కట్టామనుకోవాలి. చర్చలు ఎక్కువ చేయకుండా

ప్రధానంగా ఇందులో ఉన్న అందాన్ని అస్వాదించే ప్రయత్నం చెయ్యాలి. కుడి వైపు సరస్వతి, ఎడమ వైపు లక్ష్మీ, మధ్యలో లలితామహాత్రిపురసుందరిపరాభట్టారిక భాసిస్తున్నది.

లక్ష్మి అంటే ఐశ్వర్యము. సరస్వతి అంటే జ్ఞానము, వాక్కులు.

మనకు లభించిన జ్ఞానము, ఐశ్వర్యము – ఈ రెండూ అమ్మవారి కైంకర్యానికే వినియోగించాలి అనేది దీనిలో ఉన్న భావం. మన తెలివితేటలను, మన సంపదని అమ్మకి అర్పించాలి. అర్పించడమంటే అర్థం – అవి అనుభవిస్తున్న ప్రతిసారి అవి అమ్మ ప్రసాదాలని అమ్మకి నివేదించి స్వీకరించాలి. సృష్టిలో ఏది అనుభవించినా అమ్మ ప్రసాదమనే భావనతో అనుభవించాలి. ఇదే అసలైన భక్తి. అలా చూడగలిగితే ప్రపంచాన్ని అంతటిని ప్రసాద దృష్టితో చూస్తాం. పదార్థ దృష్టి విడచి ప్రసాద దృష్టి తెచ్చుకోవాలని రమణమహర్షి చెప్పారు.

ఇందులో బీజాక్షర రహస్యాన్ని కూడా చూపిస్తున్నారు. కుడివైపు సరస్వతి, మధ్యలో అమ్మవారు, ఎడమ వైపు లక్ష్మి. **సరస్వతీ బీజం ఐం. లక్ష్మి బీజం శ్రీం. మధ్యలో హ్రీం ఉంది. ఐం హ్రీం శ్రీం. ఇది 'సచామర రమావాణీ సవ్యదక్షిణ సేవితా'.** దీనికి కుండలినీ మంత్రమని పేరు. ఇది కూడా గురూపదేశంతో చెస్తేనే శ్రేష్ఠం. గురూపదేశం లేకపోయినా ఈ నామం చాలు. అమ్మవారికి ఎడమ వైపు రమా శ్రీం, కుడివైపు ఐం, మధ్యలో హ్రీం. హ్రీం అమ్మవారి యొక్క మంత్రరూపం.

615. ఆదిశక్తిః – శ్రీ ఆదిశక్త్యై నమః

సృష్టి అంతటికి మొదట ఉన్న శక్తి. అంటే మొదట శక్తే ఉంది. మొదట ఉన్నదే సృష్టి స్థితి లయలకు హేతువై విశ్వం అంతా వ్యాపించింది. ఒక చీర నేసే ముందు అది దూది కండెరూపంలో ఉంది. అదే వస్త్రంగా పరచినప్పుడు ఆ పత్తి కండె వస్త్రములో ఏ మూల ఉంది? అంతా పడుగు పేకలై వ్యాపించి ఉంది. దీనిని ఓతప్రోతం అంటారు. ఆదిగా ఉన్న కండెయే వస్త్రంగా వ్యాపించి ఉంది.

అదే విధంగా సృష్టికి మూలమైన పరాశక్తే సృష్టి అంతా పరచుకుని వ్యాపించింది.

ఇలా భావన చేస్తే అప్పుడు 'సర్వం శక్తిమయం'గా కనిపిస్తుంది. **"అహమస్య ప్రథమజా ఋతస్య"** – నేనే జగత్తంతటికీ ప్రథమముగా ఉన్న దానను. ఆదిశక్తి అంటే మూలశక్తి అని ప్రధానమైన అర్థం.

ఈ నామాన్ని 'సచామరరమావాణీసవ్యదక్షిణసేవితా' తరువాత చెప్పడంలో ఉద్దేశం లక్ష్మీసరస్వతులకు కూడా మూలమైన శక్తి– ఆదిశక్తి అని ప్రస్తావన చేశారు. ఈ ఆదిశక్తి ఎంత ఉంటుందో కొలవగలమా? దాని గురించి చెప్తూ తరువాత నామం 'అమేయాత్మా'.

616. అమేయా – శ్రీ అమేయాయై నమః,

ఈ నామాన్ని కొంతమంది రెండు నామాలుగా చెప్పారు. అమేయ ఒక నామం. ఆత్మ ఒక నామం. కొందరు 'అమేయాత్మా'ని ఒక నామంగా చెప్పారు. ముందు విడి విడిగా అర్థం తెలుసుకొని తరువాత కలిపి ఉన్న అర్థాన్ని పరిశీలిద్దాం.

మేయము అంటే కొలతకి అందేది. **'మాతుం పరిచ్ఛేత్తుం నశక్యతే ఇతి అమేయా'**. ఇది ఇంతే ఉంటుందని కొలత పెట్టి చెప్పలేనిది అమేయా. కొలత మూడు రకాలుగా ఉంటుంది. 1.దేశపు కొలత 2. కాలపు కొలత 3. వస్తువు కొలత.

దేశపు కొలత అంటే ఒక వస్తువు ఎంత చోటు ఆక్రమించిందనేది. కాలపు కొలత అంటే ఎంత సేపు ఉందో తెలియజేస్తుంది. వస్తువు కొలత అంటే వస్తువు యొక్క పరిమాణం. సృష్టిలో మీరు ఏది చూసిన దానికి ఈ మూడు కొలతలు ఉంటాయి. ఈ మూడు కొలతలు లేనిది సర్వవ్యాపిని అయిన శక్తి. దానికి కొలత ఎవరూ చెప్పలేరు. దానియందు అన్నీ ఉన్నాయి. కనుక **అమేయ** – కొలతకి అందనిది.

ఏది నిత్యమో, ఏది సత్యమో, ఏది జ్ఞానమో, ఏది అనంతమో, ఏది అపరిచ్ఛిన్నమో అనగా పరిమితి లేనిదో, ఏది ఆనందమో, ఏది అపౌరుషేయమో (అంటే మానవుడు సృష్టించింది కాదో), సిద్ధమైనదో (అంటే అది తయారు చేసే

వస్తువు కాదు), స్వతంత్రము, స్వతఃప్రమాణము, మహోత్తమము, నిష్క్రియము, నిర్గుణము, నిర్మలము, నిష్కలము, నిశ్చలము, శుద్ధము, అనంతము, అచ్యుతము, అజరము, అమరము... ఈ పదాలు మొత్తాన్ని ఒక దగ్గరికి తెచ్చుకుంటే 'పరతత్త్వము' అంటే ఒక అవగాహన వస్తుంది. అలాంటి తత్త్వాన్నే 'అమేయా' అనాలి. అదే 'ఆత్మా'.

617. ఆత్మా - శ్రీ ఆత్మనే నమః

నేను అనబడే దానికి ఏ చైతన్యము ఆధారమో అదే ఆత్మ. అమేయమైనదేదో అదే ఆత్మ. అది ఉండడం వలననే నేను అని అనగలుగుతున్నాం. నేను అనబడే చైతన్యము అమేయమైన వస్తువది. మేయమైన దేహానిది కాదు. అప్పుడు నేను అమేయము అయిపోయింది. దానినే బ్రహ్మము అంటారు.

నేను అమేయమైపోయానంటే 'అహం బ్రహ్మాఽస్మి' స్థితికి వెళ్ళిపోయాం. అమేయం తరువాత ఆత్మ అని చెప్పడంలో విశేషం – అమేయ తత్త్వమే ప్రతివారి హృదయంలో ఆత్మగా భాసిస్తున్నది.

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః

అహమాదించ మధ్యంచ భూతానాం అంత ఏవ చ

అని గీతలో కృష్ణపరమాత్మ చెప్పాడు.

ఆత్మ ఎక్కడ ఉంది? ఎక్కడ లేదు? అన్నిటిలో అదే వ్యాపించి ఉంది. ఉపాధులబట్టే భేదం చెప్తున్నాం. స్త్రీ, పురుష, పొడుగు, పొట్టి, మూర్ఖుడు, పండితుడు – ఇవన్నీ ఉపాధిగతమైనవే. చైతన్యమే అమేయము. ఉపాధులు మేయములు. చైతన్యం అమేయమైనది కనుక ఆత్మగా ఉంది. ఆత్మకి మరొక అర్థం 'ఆతనోతి వ్యాప్నోతి ఇతి ఆత్మా' – వ్యాపించునది.

పరమాత్మయే ప్రతివారిలో జీవునిగా ఉన్నాడని శాస్త్రం. **"ఆత్మా తస్య అష్టమీ మూర్తిః శివస్య పరమా తనుః"**(శివపురాణం). శివుని ఎనిమిదవ మూర్తి 'ఆత్మ'యే".

'ఆత్మా దేహ మనో బ్రహ్మ స్వభావ ధృతి బుద్ధిషు'. ఆత్మా అనే పదానికి

దేహం, మనస్సు, బ్రహ్మ. స్వభావం, ధృతి, బుద్ధి – అని అర్థాలు – విశ్వనిఘంటువులో చెప్పబడుతున్నది.

'యాదేవీ సర్వభూతేషు బుద్ధిరూపేణ సంస్థితా' (దేవీమాహాత్మ్యం). బుద్ధ్యాదుల రూపంగా ఉన్న చిత్ స్వరూపిణి జగన్మాతయే.

మన శరీరంలో ఆత్మ అంతటా ఉంది. దానిని తెలుసుకోవడానికి ప్రధాన కేంద్రం హృదయం. ధ్యానించడానికి కేంద్రాలు చెప్పారే కాని, ఆత్మచైతన్యం శరీరం అంతా వ్యాపించి ఉంది. 'త్వయిమయిచాన్యత్రైకో విష్ణుః' అన్నారు శంకరులు. ఆ ఆత్మవస్తువుకి మించినది మరొకటి లేదు కనుక అదే 'పరమా' అని తరువాత నామంలో చెప్పారు.

618. పరమా – శ్రీ పరమాయై నమః

అన్నింటి కంటె ఉత్కృష్టమైనది. ఉపాధులకి అతీతముగా ఉన్నదే పరమము. **'ఉత్తమ పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః'** అని గీతాచార్యుడు చెప్తున్నాడు. ఉత్తమపురుషుని పరమాత్మ అని అనాలి. ఉత్తమ అంటే అన్నింటి కంటె ఉత్కృష్టమైనది అని అర్థం.

ఈ శరీరాన్ని 'అపరా ప్రకృతి' అంటారు. ఈ శరీరం నేను అని అనుకుంటూ లోపల ఉన్నవానిని జీవుడని వ్యవహారంలో చెప్తారు. శరీరంతో తాదాత్మ్యం చెంది ఉన్నంతకాలం జీవుడు. వీనిని పరాప్రకృతి అంటారు. అపరా ప్రకృతి పోతుంది. పరాప్రకృతి జీవుడు మాత్రం మరో దేహంలోకి మారుతూ ఉంటాడు. ఈ పరా–అపరాల కంటే పైన ఎవరైతే ఉంటాడో వానినే "క్షరాక్షర అతీతుడు" అని చెప్తూ వానిని పరముడు అంటారు. అతడు ఈ ఇద్దరికీ మూలం. ఈ రెండిటికి అతీతుడు.

'తద్విష్ణోః పరమం పదం సదా పశ్యంతి సూరయః' – అదే విష్ణువు యొక్క పరమ పదము. విష్ణువు సర్వవ్యాపకుడైన పరమాత్మ. అదే అమేయాత్మా. ఆయన యొక్క పరమ పదము.

'బ్రహ్మవిదాప్నోతి పరం' అనే మాటని కూడా ఉపనిషత్తుల్లో చెప్పారు. బ్రహ్మవేత్త

మాత్రమే ఆ పరమును పొందగలడు. అదే **'పరమే వ్యోమన్'.** ఈ ఆకాశాదులకు కూడా అతీతంగా భాసిస్తూ ఉన్నది. ఆకాశాదులన్నీ దానిలోనే భాసిస్తున్నాయి. అతీతం అంటే ఎక్కడో పై అంతస్థులో ఉందని అర్థం కాదు. అతీతము అంటే వీటికి అంటకుండా ఉందని అర్థం. ఎలాగైతే అన్నీ ఆకాశంలో ఉన్నా ఆకాశానికి ఏవీ అంటడం లేదో అదే విధంగా ఆకాశంతో సహా అన్నీ అమ్మవారిలో ఉన్నాయి. కానీ అమ్మవారికి ఇవేవీ అంటడం లేదు.

ప్రధాన పురుషావ్యక్త కాలాస్తు ప్రవిభాగశః
రూపాణి స్థితిసర్గాంతవ్యక్తి సద్భావ హేతవః

మనకి లోకంలో కనబడుతున్న మొత్తం విషయాలు నాలుగు రకాలే. ఈ నాలుగింటిని పని చేయిస్తూ, ఈ నాలుగింటికి పైన ఎవరున్నారో దానిని పరమం అనాలి. ఆ నాలుగు – ప్రధాన, పురుష, అవ్యక్త, కాల.

ప్రధానము అంటే ప్రకృతి. పురుష అంటే జీవుడు. జీవుడు ప్రకృతితో తాదాత్మ్యం చెందినవాడు. మనకి కనబడుతున్న ఈ ప్రకృతికి పైన అవ్యక్తమనే తత్త్వముంది. అవ్యక్తం అంటే పరమాత్మ అని చెప్పడానికి వీలులేదు. చెట్టుకు ముందు విత్తనంలాగ చెప్పబడుతూ ఉన్నది. సందర్భాన్ని బట్టి అవ్యక్తశబ్దం అర్థం మారుతూ ఉంటుంది. అవ్యక్తమంటే ఇప్పుడు ఈ జన్మలో మనం వ్యక్తం అయ్యాం. కానీ ఈ జన్మ కాక ముందు దీనికి సంబంధించిన కర్మబీజాలన్నీ ఎక్కడో దాగి ఉన్నాయి. ఆ కర్మబీజాలు పండవలసిన సమయంలో దేహరూపంగా వ్యక్తమయ్యాయి.

కనుక ఈ దేహాదులుగా రావలసిన కర్మబీజాలు, బీజస్థితిలో ఉన్నప్పుడు అవ్యక్తము. ఇది పరమాత్మ అనడానికి వీలు లేదు. బీజస్థితిని అవ్యక్తం అంటారు. కనబడుతున్న ప్రకృతిని ప్రధానమంటారు. వీటితో తాదాత్మ్యం చెంది ఉన్నవానిని జీవుడంటారు.

నాలుగవది కాలము. అవ్యక్త, ప్రధాన, పురుష ఈ మూడు పనిచేయడానికి కాలం ఆధారం. ఉదాహరణకి ఈ శరీరానికి సంబంధించి మనం అనుభవించవలసిన బ్రతుకంతా వ్యక్తం కాకముందు బీజరూపంలో ఉంది. అది ఎప్పుడు వ్యక్తం కావాలో

దానికో కాలం ఉంది. ఆ జీవునికి మళ్ళీ ఎప్పుడు అనుభవం రావాలో కాలంలో నిర్ధారించబడి ఉంది. 'కలయతి నియతీతి కాలః'. దీనినే నియతి అంటారు.

ఈ నాలుగు మనకి కనబడుతున్న ప్రపంచం. ప్రధాన, పురుష, అవ్యక్త, కాలం. ఈ నాలుగింటికి పైన ఏది అతీతంగా ఉంటూ, ఈ నాలుగింటిని ఏది చైతన్యవంతం చేస్తోందో దానిని పరమము అనాలి. ఇది పరమ పంచమ భూమిక. దీనినే 'పరమా' అని వ్యాఖ్యానిస్తారు. ఇది 'పరమా' నామానికి శాస్త్ర రూపమైన వాఖ్యానం. ఆ శబ్దము వేదంలో, ఉపనిషత్తులోనిది.

దీనికి తేటతెలుగులో అద్భుతంగా అందించారు నారాయణదాసుగారు– **"కల తెలంగులు నాల్గు కలవందులోన, నికరమౌ దినుసు తానే యైన వేల్పు"** అన్నారు. మొత్తం నాలుగు ఉన్నాయి. ఈ నాలుగింటిలో వ్యాపించిన వస్తువు... అదే అసలు వస్తువు. 'నికరమౌ దినుసు తానే యైన వేల్పు' – దినుసు అంటే వస్తువు.

ఆ చైతన్య వస్తువు నికరం. అది నాలుగింటిలో ఉంటూ నాలుగింటికి అతీతముగా ఉంది కనుక పరమము.

ఈ పరమమే **"నింగి నేలలకు పై నెగడు మలప్ప"**. మలప్ప అంటే కొండకూతురు అని అర్థం. భూమికి ఆకాశానికి కూడా పైన ఉన్న తత్త్వము.

ఎవరు ఈ నామము తెలుసుకుని అమ్మవారిని పరతత్త్వమని ఆరాధన చేస్తారో వారిని ఈ నాలుగింటి నుండి బయటకు తీసి ఆ పరమముతో తాదాత్మ్యము కలిగిస్తుంది.

అంతేకాకుండా ఆ భక్తుడు పరమంగా ఉండేటట్లు చేస్తుంది. అంటే ఉత్తమస్థితిలో ఉండేటట్లు చేస్తుంది.

"అడియనందటిపయి నాడించు జేజె". అడియను అంటే భక్తుని ఉన్నతికి తీసుకు వెళ్ళి కీర్తిని పొందింపజేసే తల్లి. అందుకే 'పరమా'.

619. పావనాకృతిః – శ్రీ పావనాకృతయే నమః

అమేయము, ఆత్మ, పరమము అన్నప్పుడు సర్వవ్యాపకము, సూక్ష్మమైన ఆ

తత్త్వమే 'పావనాకృతిః'. ఇంతవరకు నిర్గుణంగా, నిరాకారంగా చెప్పబడుతున్న పరతత్త్వము ఒక ఆకారం ధరించింది. ఆ ఆకారం 'పావనాకృతిః'.

పావనాకృతి అంటే పవిత్రమైన ఆకారమని ఒక అర్థం. పవిత్రతను ఇచ్చే ఆకారమని మరొక అర్థం. ఆ ఆకారాన్ని ధ్యానిస్తే మనం పవిత్రులమౌతాము. అమ్మవారు 'మంగళానాం చ మంగళం'.

శాస్త్రార్థంలో ఆకృతి అంటే నామము, రూపము, లీలలు. ఈ మూడు ఆకృతులే. ప్రకటింపబడినవి అని అర్థం. అమ్మ లీలలు, నామాలు, రూపాలు పవిత్రాలు.

అలాంటి పావనమైన అమ్మరూపాన్ని భావన చేస్తే అప్పుడు మన హృదయం పావనమౌతుంది. హృదయం పావనమైతేనే 'అమేయాత్మా' 'పరమా' అర్థమౌతాయి. అమ్మ యొక్క మంత్ర, యంత్ర, తంత్ర, విగ్రహరూపాలన్నీ పావనాలే. యంత్రం అంటే శ్రీచక్రం.

పావనాకృతికి మరొక అర్థం చెప్తున్నారు. మన శరీరాన్నీ, బుద్ధినీ పవిత్రం చేసుకోవడానికి, జీవుని శుద్ధుని చేసుకోవడానికి మూడు పద్ధతులు పెద్దలు చెప్పారు. ఇది యాజ్ఞవల్క్యస్మృతిలో కనబడుతున్న గొప్పమాట.

భూతాత్మనః తపోవిద్యే బుద్ధేః జ్ఞానం విశోధనం

క్షేత్రజ్ఞస్య ఈశ్వర జ్ఞానాత్ విశుద్ధిః పరమా మతా

తపస్సులవల్ల, విద్యలవల్ల శరీరానికి పవిత్రత, శుద్ధి వస్తుంది. తపస్సు అంటే శాస్త్రము చెప్పిన నియమాలను పాటించుట. నియమపాలన తపస్సు. విద్యలు అంటే ఉపాసన అని అర్థం. వాటి వలన ఈ దేహం, ప్రాణం శుద్ధి అవుతాయి.

బుద్ధి దేని వలన శుద్ధి అవుతుందో చెప్తూ 'బుద్ధేః జ్ఞానం విశోధనం' – భగవత్తత్త్వాన్ని ఆలోచన, విచారణ చేయడం వలన బుద్ధి, మనస్సు శుద్ధి అవుతాయి. 'తాను ఈశ్వరునకు వేరు కాను' అనే జ్ఞానం కలిగినప్పుడు జీవుడు శుద్ధుడైపోతున్నాడు. ఇది ఒకదాని పై ఒకటి వస్తుంది. ముందు తపోనియమాలు పాటించాలి. భగవద్విచారణ చెయ్యాలి. అప్పుడు ఈ క్షేత్రజ్ఞుడైన వానికి, ఈశ్వర చైతన్యానికి భేదం లేదని అర్థం అవుతుంది.

మన భౌతికదేహాన్ని శుద్ధి చేసే విద్యలు, తపస్సులు అమ్మ రూపాలు. మన ఆలోచనలు శుద్ధి చేసే అమ్మ యొక్క జ్ఞానము, క్షేత్రజ్ఞ– ఈశ్వర అభేదజ్ఞానము అమ్మ యొక్క పావనాకృతి. ఈ మూడు పావనాకృతులు అని చెప్పబడుతున్నాయి. కేవలం దివ్యమంగళవిగ్రహమనే కాకుండా తపో, విద్య, ఉపాసనా, జ్ఞానరూపాలతో ఉన్నది అమ్మవారే.

620. అనేకకోటిబ్రహ్మాండజననీ – శ్రీ అనేకకోటిబ్రహ్మాండజనన్యై నమః

నారాయణదాసుగారు ఈ నామానికి చక్కని తెలుగు అనువాదం చేస్తూ– **"ఈ నింగి నేలలకెల్ల ముత్తవ్వ" – అమ్మలకి, అమ్మలకి, అమ్మలకి అమ్మ ముత్తవ్వ** అని చెప్పారు. కారణానికి, కారణానికి కారణం. ఈ నింగి నేలలకెల్ల... సమస్త బ్రహ్మాండములకు అవ్వ. చతుర్దశభువనాలు కలిపితే ఒక బ్రహ్మాండము. ఇలాంటి బ్రహ్మాండములు ఎన్నో ఉన్నాయి కనుక 'అనేకకోటిబ్రహ్మాండజననీ'.

అనేక కోట్ల బ్రహ్మాండములకు కారణమైనది.

వైశంపాయనుడు 'సహస్రసూర్యతయా' – వేలకొలది సూర్యమండలములు ఉన్నాయని వేదంలో వర్ణించి తెలియజేశాడు. ఈ బ్రహ్మాండ జ్ఞానం చాలా విశేషం. ఈ విశ్వం యొక్క అంతు తెలియదు.

మేడిచెట్టుకి పళ్ళు మీద నుండి క్రింది వరకు ఉంటాయి. మేడిపండు నిండా పురుగులుంటాయి. అందులో ఉన్న పురుగు అది ఏ పండులో ఉందో అదే దానికి ప్రపంచం అనుకుంటుంది. మొత్తం దాని జ్ఞానం ఆ పండు వరకే. కానీ ఇలాంటివి ఆ చెట్టుకి చాలా ఉంటాయనే విషయం దానికి తెలీదు. ఈ పళ్ళన్నిటిలో రసం ఒక్కటే. ఒకే చెట్టు. అలా బ్రహ్మాండాలన్నీ పళ్ళులాంటివి అనుకుంటే ఈ పళ్ళు అన్నింటిని పోషిస్తూ రసమిస్తూ కాపాడుతున్న చెట్టు అమ్మవారు. ఇదే 'అనేకకోటిబ్రహ్మాండజననీ' అన్నప్పుడు భావించవలసినది. ఎన్ని బ్రహ్మాండములు ఉన్నాయో ఒక్కసారి గ్రహించగలిగితే మన దేహగతమైన అహంకారం పోతుంది.

వృక్షమంతా ఏ రసం ప్రసరిస్తున్నదో ఆ రసమే అందులో ప్రవహిస్తోందనుకుంటే

ఆ ఏకత్వం చాలా గొప్పది. 'అనేకకోటిబ్రహ్మాండజననీ' అనే అద్భుతమైన అంశాన్ని ఆవిష్కరించిన భారతీయ ఋషులకి నమస్కారం చేసుకోవాలి. అంతుపట్టని ప్రపంచమంతా ఒకే అమ్మరూపంగా దర్శించగలిగే కీలకం వల్ల భారతీయ ఋషులు దీనిని పట్టుకోగలిగారు.

బ్రహ్మాండాలకు అభిమాన దేవతలైన విరాట్ - మొదలైన వారికి కూడా కారణమైనది.

స్థూలమైన పంచ మహాభూతాల పంచీకరణం చేత నిర్మింపబడినది బ్రహ్మాండం. ఈ స్థూల బ్రహ్మాండభిమాన దేవతకు 'విరాట్' అని పేరు. ఈ బ్రహ్మాండంలోపల ఉన్న సమష్టి లింగశరీరానికి సూక్ష్మశరీరానికి - అభిమాన దేవత స్వరాట్టు. ఈ రెండిటికీ కారణమైన అవ్యాకృతి శరీరాభిమాని సమ్రాట్.

ప్రాధాన్యేన విరాడాత్మా బ్రహ్మాండమభిమన్యతే
స్వరాట్ స్వరూపముభయం సమ్రాడిత్యబ్రవీత్ శ్రుతిః

ఈ విరాట్ - స్వరాట్ - సమ్రాట్‌లను కూడా కలిగించిన పరమ కారణమైన పరతత్త్వం జగన్మాత.

621. దివ్యవిగ్రహా - శ్రీ దివ్యవిగ్రహాయై నమః

భౌతిక వికారములకు చెందని ప్రకాశ స్వరూపము కలది.

ఏ విగ్రహాన్ని భావిస్తే మరి విగ్ర(దే)హాన్ని ధరించకుండా ఉంటామో అలాంటి విగ్రహాలను భావించాలి. ఆ విగ్రహాలే దేవతా విగ్రహాలు. విగ్రహం అంటే విశేషముగా గ్రహించునది. భగవత్తత్త్వాన్ని విశేషంగా గ్రహిస్తుంది కనుక విగ్రహం. ఆ విగ్రహం దివ్యవిగ్రహం.

గీతలో కృష్ణపరమాత్మ **'జన్మకర్మ చ మే దివ్యం'** అన్నాడు. "అర్జునా! నేనూ నీలాగే పుట్టాను... నీలాగే పెరిగాను.. నీతో పాటు నిరంతరం కలిసి తిరుగుతూ, రథం తోలుతూ ఉన్నాను కనుక నేనూ నీవంటి వాడినే అనుకోకు. నా జన్మ కర్మలు దివ్యాలు." అమ్మవారి యొక్క పావనాకృతులు దివ్యములు. **'పరిత్రాణాయ సాధూనాం**

వినాశాయ చ దుష్కృతాం, ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే' – సాధుత్వాన్ని రక్షించడానికి, దుష్టత్వాన్ని శిక్షించడానికి ధరించిన ఆకారము కనుక 'దివ్యవిగ్రహా'.

కొందరికి అమ్మ అలా దివ్యవిగ్రహం ధరించినా లోకంలో ఇంకా దుష్టత్వము ఎందుకు పోలేదు అనుకుంటారు. ఎవరు ధ్యానిస్తారో వారి దుష్టత్వాన్ని పోగొట్టి, వారి సాధుత్వాన్ని రక్షించి మోక్షమిస్తుంది. మూకుమ్మడి మోక్షాలు ఉండవు. ఏ జీవుని పక్వత వానిదే. వరదలు మొదలైనవి వచ్చినప్పుడు అందరూ పోతారా? కొందరే పోతారు. అలా అందరికి ఒకేసారి అన్నీ రావు. వారి వారి కర్మలని బట్టి వస్తాయి.

ఎవరైతే ఆ దివ్యమైన విగ్రహాన్ని ధ్యానిస్తారో అలా ధ్యానించిన ప్రతిసారి వారి హృదయంలో సంభవించి వారిలో ఉన్న దుష్టత్వాన్ని పోగొట్టి శిష్టత్వాన్ని రక్షించి, ఏది పట్టుకోవడం వలన మోక్షాన్ని పొందగలరో ఆ ధర్మాన్ని నిలబెడుతుంది. అలా ధరించిన అమ్మవారి విగ్రహమే 'దివ్యవిగ్రహా' అని చెప్పబడుతున్నది. 'సంభవామి యుగే యుగే' అంటే... మాటి మాటికి అని అర్థం. మనం ఎన్ని మార్లు అమ్మవారిని ధ్యానిస్తామో అన్నిమార్లు అని అర్థం.

ఇవన్నీ శాస్త్రీయమైన నామాలు కనుక శాస్త్రంతోనే పరిష్కరించుకోవాలి. 'అనేకకోటిబ్రహ్మాండజననీ దివ్యవిగ్రహా' అని ఒకే నామంలో ఎందుకు పెట్టారో పరిశీలిస్తే మరి కొన్ని అద్భుతమైన భావాలు కనబడతాయి. అమ్మవారి విగ్రహం దివ్యం. ఆ దివ్యమైన విగ్రహం నుండి అనేక కోటి బ్రహ్మాండాలు ఉత్పన్నమౌతున్నాయి. అవన్నీ, ఆ పరదేవతను ఆధారం చేసుకునే ఉన్నాయి.

బ్రహ్మాండాలన్నీ ఎవరి యందు ఉన్నాయో తెలుసుకున్నాక అమ్మ యొక్క ఆకారాన్ని ఒక్కసారి భావిస్తే ఆ విరాట్ విగ్రహా అయిన అమ్మవారు ఎంత దివ్యవిగ్రహమో అర్థమౌతుంది. అనేక కోటి బ్రహ్మాండములు అమ్మ నుండే పుట్టి, అమ్మయందే పెరిగి, అమ్మయందే లీనమవుతున్నాయి.

దివ్యము అంటే జ్యోతిర్మయము. దివ్ అనే పదానికే ప్రకాశం అని అర్థము. అమ్మవారు జ్యోతిర్మయమైన స్వరూపము.

మనం చూస్తున్న గ్రహాలు, నక్షత్రాలు, సూర్యచంద్రాగ్నులు – ఇవన్నీ జ్యోతులు. ఈ జ్యోతులన్నీ ఏ విగ్రహం నుండి వచ్చాయో ఆ పరమేశ్వరి జ్యోతులకు జ్యోతి. కనుక దివ్యవిగ్రహా. దాని నుండి ఇవన్నీ వెలికి వస్తున్నాయి. ఇది సరిగ్గా ఉపనిషత్తులో **"యథాగ్నేః క్షుద్రా విస్ఫులింగానివ్యుచ్చరంతి"** అనే మంత్రంలో చెప్పారు. ఒక జ్వలిస్తున్న అగ్ని నుండి నిప్పురవ్వలు వెలికి వచ్చినట్లుగా పరమాత్మ నుండి **'సర్వే లోకాః సర్వే దేవాః సర్వే జీవాః'** – లోకాలు, దేవతలు, జీవులు, ఈ సమస్తము వచ్చాయి.

ఈ బ్రహ్మాండములన్నీ నిప్పురవ్వలు. ఈ నిప్పురవ్వలన్నింటికి మూలమైన జ్యోతిస్వరూపం 'దివ్యవిగ్రహా'. కనిపిస్తున్న రవ్వలలాంటి లోకాలలో, బ్రహ్మాండాలలో, శరీరాలలో అన్నిటా వ్యాపించి ఉన్నది ఆ నిప్పే. ఆ దివ్యవిగ్రహాన్ని నిరంతరం ధ్యానించాలి. **'విగ్రహః సమరే దేహే విస్తార ప్రవిభాగయోః** (మేదినీకోశం)' – విగ్రహ శబ్దానికి దేహమనే కాక, యుద్ధమనే అర్థం కూడా ఉంది. అంతరిక్షమందు దివ్య అసురులతో యుద్ధం చేసిన దేవి. **'తత్రాపి సా నిరాధారా యుయుధే తేన చండికా'** అని దేవీమాహాత్మ్యం. ఆధారమనేది లేకుండా చండిక అసురులతో యుద్ధం చేసినది.

622. క్లీంకారీ – శ్రీ క్లీంకార్యై నమః

'క్లీంకారీ' 'కేవలా' 'గుహ్యా' 'కైవల్యపదదాయినీ' – క్లీంకారం యొక్క శక్తిని ఈ నామాలన్నీ వ్యాఖ్యానిస్తున్నాయి. ఇక్కడ నుండి 'వాగీశ్వరీ' అనే అమ్మవారి విద్య ప్రారంభమౌతోంది.

'క్లీం' అనే బీజాన్ని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ ప్రస్తావించుకున్నామని ఈ బీజాక్షరాలను నేరుగా జపించరాదు. ప్రతి దానికి గురూపదేశం ఉండాలి. శాస్త్రంలో వివేచనగా నామానికి అర్థం చెప్పుకోవచ్చు కనుక చెప్పడం జరుగుతోంది. క్లీంకారం అమ్మవారి స్వరూపం.

ఇది బాలామంత్రంలో నడుమ కనబడుతున్న ప్రధాన బీజం. అమ్మవారి మంత్రాలన్నిటిలో భాసిస్తుంటుంది. ఇది మోక్షకారక బీజము. క్లీం బీజంలో రాధాకృష్ణ,

లక్ష్మీనారాయణ తత్త్వాలు చెప్పబడుతున్నాయి. లక్ష్మీ అష్టోత్తరశతనామాలు పారాయణం చేసే అలవాటు ఉంటే దానికి పూర్వాపరాల్లో ఉపోద్ఘాతం, ఉపసంహార శ్లోకాలలో క్లీంబీజం గురించి వివరిస్తారు. ఈ బీజాక్షరం లక్ష్మీనారాయణ ఉభయతత్త్వాన్ని చూపిస్తుంది.

లక్ష్మీనారాయణ పుత్రుడు మన్మథుడు. క్లీంకారాన్ని మన్మథబీజం అంటారు. దీనికి వశీకరణబీజమని మరొక పేరు. ఎవరినైనా వశం చేసుకోవడం అని దీని అర్థం కాదు. క్లీం అంటే లాగుట. క్లీంకారీ అంటే ఆకర్షణశక్తి స్వరూపిణి అని ప్రధాన అర్థం. కర్షణశక్తి కలవాడే కృష్ణుడు. కృష్ణబీజం కూడా ఇదే.

'అనేకకోటిబ్రహ్మాండజననీ – దివ్యవిగ్రహా – క్లీంకారీ' ఈ నామాల అనుబంధం పరిశీలించాలి. ఈ బ్రహ్మాండాలన్నీ వేటికవి వేరుగా ఉన్నట్లు కనబడుతున్నాయి. కానీ అవి వేరుగా లేవు. వాటన్నిటిని ఒక ఆధారవస్తువు లాగి పట్టుకుని నడిపిస్తోంది. ఇవన్నీ ఆవిడ అధీనంలో ఉన్నాయి. అధీనం తప్పితే చిట్లిపోతాయి.

శంకరభగవత్పాదులవారు భగవద్గీత వ్యాఖ్యానం వ్రాస్తూ **'గామావిశ్యచ భూతాని ధారయామ్యహమోజసా'** అనే శ్లోకానికి – ఈ భూమి మొదలైన సర్వగ్రహాలని ఏ పరమేశ్వరశక్తి (ఓజస్సు) పట్టుకుందో ఆ పట్టుగాని వదలిపెడితే అవన్నీ చిట్లిపోయి చెల్లాచెదురు అయిపోతాయన్నారు. భూమి దాకా ఎందుకు? మన శరీరంలో ఇంద్రియాలన్నీ దేనికది విడిపోకుండా ఏ పట్టుమీద ఉన్నాయో ఆలోచించుకోవాలి.

ఒక చక్రంలో ఆకులు అన్నీ నాభిని పట్టి ఎలా నడుస్తున్నాయో అదేవిధంగా హృదయంలో ఉన్న ఈశ్వరశక్తిని శరీరమంతా లాగి పట్టి నడిపిస్తున్నది. అలా ప్రపంచాన్నంతటిని పట్టి నడిపిస్తున్న అమ్మవారి శక్తియే 'క్లీంకారీ'.

అలా పట్టి నడుపుతున్నప్పుడు ఈ జగత్తు ఎంత ఉంది? ఇందులో ఎన్ని ఉన్నాయి? అంతులేదు. అంతటిని పట్టి నడుపుతుంది క్లీంకారీ.

క్లీం అంటే లాగునది, ఆకర్షించేదని చెప్పుకున్నాం. లోపలికి లాగాలి. క్లీం బీజం వశీకరణ చేస్తుంది. ఏమిటా వశమంటే మన వశం తప్పి పరిగెడుతున్న ఇంద్రియాలను వశం చేసి ఒక దగ్గర కూర్చోబెట్టి, అటూ ఇటూ పరిగెడుతున్న

బుద్ధిని ఏకాగ్రం చేసి అంతర్ముఖ ప్రజ్ఞను ఇస్తుంది. క్లీంకార జపం యొక్క ప్రయోజనమిది.

బహిర్ముఖంలో అనేకం కానీ, అంతర్ముఖంలో ఏకమే. మనం అంతర్ముఖులమైతేనే **'కేవలా'**తత్త్వం అర్థం అవుతుంది. అది ఎక్కడుందో చెప్తూ **'పరం పుమాంసం నిహితం గుహాయాం'.**

అంతర్ముఖమయ్యాక హృదయగుహలో ప్రకాశించే ఆ పరతత్త్వము వైపు మన దృష్టి వెళ్తుంది. అపుడు 'గుహ్యా'గా ఉన్న ఆ పరతత్త్వాన్ని గ్రహించి తరువాత మనం కైవల్య పదాన్ని పొందగలం. క్లీంకార జపమిచ్చే ప్రధాన ప్రయోజనం మనలను అంతర్ముఖులను చేసి, మనలో కేవలంగా గుహ్యంగా ఉన్న ఈశ్వరతత్త్వాన్ని అవగాహన చేయించి, తాదాత్మ్యం చెందించి **కైవల్యపదమును** ఇస్తుంది. ఇది క్లీంకారీ స్వరూప ఆవిష్కరణ.

'క్లీంకారీ, కేవలా, గుహ్యా, కైవల్యపదదాయినీ' – ఇలాంటి బీజాక్షరాన్ని పట్టుకుని "ఎదుటి వారిని వశం చేసుకోవడానికి పని చేస్తుంది. ఇది మన్మథబీజం" అనుకుంటే అది అజ్ఞానం. ఈ నామం చెప్పి వెంటనే కేవలా, గుహ్యా, కైవల్యపదదాయినీ నామాలు చెప్పి ఉపనిషత్ భావనలోకి లాగేశారు. ఇది ఆ బీజం యొక్క స్వరూపం. ఇదే అమ్మవారి యొక్క త్రికూటముల్లో మధ్యకూటం. ఇది ప్రధానమైనది.

మరొక అర్థం– క్లీంకారంలో 'కేవలా'ని పట్టుకోవాలి. 'కేవలా' అర్థం ఉపనిషత్ చెప్తూ **'యదీగ్ం శ్రుణోత్యలకగ్ం శ్రుణోతి నహి ప్రవేద సుకృతస్య పంథాం'** అన్నది.

క్లీం అన్నప్పుడు క–ల–ఈం ఉంది. అమ్మవారు అంటే శక్తి. ఇదంతా మాతృకావర్ణరూపిణి దగ్గర వివరంగా చెప్పుకున్నాం. అకారం నుండి అం, అః వరకూ శక్త్యక్షరములు. క కారం నుండి శివాక్షరములు. రెండూ కలుపుకుంటే శివశక్త్యాత్మకం.

అచ్చులు శక్తి అక్షరములు. క్లీంలో అచ్చు ఈం. క–ల అనేవి హల్లులు. కల అంటే భాగములు అని అర్థం తీసుకుంటే ఈ ప్రపంచమంతా కలలు. క్లీంలో క, ల తీసేస్తే ఈం ఉంటుంది. ఈం ఉండడంవల్లే క, ల కలసి ఉన్నాయి. లేకపోతే క–ల విడిపోతుంది.

ప్రపంచంలో అంతా కలసి ఉండేటట్లుగా 'క్లీం'ను పట్టి ఉంచినది ఏదో దానిని పట్టుకోవాలి. క్లీంలోంచి కల తీసేయగా మిగిలిన 'ఈం' కేవలా. 'క్లీం'లో 'ఈం' రహస్యంగా ఉంది కనుక 'గుహ్యా'. అలా రహస్యంగా ఉన్న 'ఈం' అనే అమ్మవారి శక్తిని గ్రహించగలిగితే అదే 'కైవల్యపదదాయినీ'. 'ఈం' కారాన్నే 'కామకళారూపా' అంటారు. దీనిని గుప్త ప్రణవము అంటారు.

'తాం పద్మినీమీం (పద్మినీం+ఈం) శరణమహం ప్రపద్యే' అని శ్రీసూక్తం చెప్తోంది. కల అంటే ప్రపంచంలో మనం చూసే అనేకములు. అందులో ఉన్న 'ఈం' ఏకత్వశక్తి. ఇది ఉపనిషత్ చెప్పిన మాట.

ఇన్ని, ఇంత అనేవి జగత్తుకు సంబంధించిన అనేకత్వం అయినప్పటికి, వాటన్నిటిని పట్టి నడిపే శక్తి మాత్రం ఏకమే. అదే తరువాత నామంలో చెప్తున్నారు.

623. కేవలా – శ్రీ కేవలాయై నమః

ఆవిడ ఏకాకి. ఏదీ ఆవిడకి పట్టదు. బురదనీటిలో సూర్యబింబం ప్రతిఫలిస్తోంది. సూర్యుని నుండి వేడిని, వెలుగుని నీరు గ్రహించింది. కానీ అందులో ప్రతిఫలించే సూర్యునికి ఆ బురద అంటలేదు. ఆ నీరు అంటలేదు. ఆయన పరమంగానే ఉన్నాడు. అందరిలో అంతర్యామిగా ఉన్నా, 'అనేకకోటిబ్రహ్మాండజననీ దివ్యవిగ్రహా' అయినా 'కేవలా'. ఇంత 'కేవలా'గా ఎలా ఉండగలిగిందంటే గుహ్యంగా ఉందని తరువాత నామంలో చెప్తున్నారు.

624. గుహ్యా – శ్రీ గుహ్యాయై నమః

'ఏకో దేవః సర్వభూతేషు గూఢః' అని ఉపనిషత్తు చెప్పింది. పాలలో వెన్నలా, నువ్వులలో నూనెలా సర్వజీవులలో ఆ చిచ్ఛక్తి ఉంది.

'పరేణ నాకం నిహితం గుహాయామ్' – పరమమైనది. నాకం అంటే దుఃఖం లేని కేవల ఆనందస్వరూపము. అది ఎక్కడ ఉందో చెప్తూ 'నిహితం గుహాయాం' అన్నారు. గుహ అంటే పంచకోశాల లోపల ఉన్నది. లోపలకి వెళ్తేనే 'గుహా' వస్తుంది.

'యదంతః పంచకోశానాం గుహా శబ్దేన గీయతే' అని శ్రుతి. గుహ అంటే పంచకోశ అంతరం. పంచకోశాంతరస్థితా అయినది 'గుహ్యా'.

'రహస్యోపనిషద్వేద్యత్వాద్గుహాయాం హృదయాకాశే నిహితి ఇతి వా గుహ్యాః' – గుహ్యాశాస్త్రమంటే ఉపనిషత్ శాస్త్రము. గుహ్యా అంటే ఉపనిషత్తుల ద్వారా ప్రతిపాదింపబడే పరతత్త్వము.

'కేవలా'గా ఉన్న ఆ తల్లి 'గుహ్యా'గా ఉంది. అది తెలుసుకుంటే 'ఈ నేను అనేది దాని మీదే ఆధారపడి ఉంది గనుక' అనేకము గొడవ వదలి, ఆ 'కేవలా'తో తాదాత్మ్యం చెందుతారని చెప్తూ తరువాత నామం 'కైవల్యపదదాయినీ'.

625. కైవల్యపదదాయినీ – శ్రీ కైవల్యపదదాయిన్యై నమః

ఉపనిషత్తుల ద్వారా ప్రతిపాదింపబడే పరతత్త్వమే కైవల్యపదాన్ని ఇచ్చేది. అమ్మవారిని ఆశ్రయిస్తే ఎలా అనుగ్రహిస్తారో చెప్తూ 'శక్తిరహస్యం'లో ఉన్న విషయాన్ని వివరిస్తున్నారు.

ఆత్మబుద్ధ్యా ప్రతీకేన మాతృబుద్ధ్యాప్యహం ధియా
కర్మణాపి భజన్మర్త్యః కైవల్యపదమశ్నుతే

"అంతా పరమాత్మ అనే బుద్ధితోగానీ, ప్రతీక (విగ్రహాదుల) యందు పరమాత్మభావనచే గానీ, అంతా శక్తి (జగన్మాత) అనే బుద్ధితో గానీ, విహిత కర్మానుష్ఠానంచే గానీ బ్రహ్మోపాసన చేసినవాడు కైవల్యాన్ని పొందుతున్నాడు.

ఈ విధంగా ప్రారబ్ధానుభవంతో స్థూలదేహాన్ని, సత్యపదార్థజ్ఞానంతో సూక్ష్మదేహాన్ని, సర్వవాంఛా విముక్తితో కారణ దేహాన్ని పోగొట్టి శరీరత్రయాన్ని నశింపజేసి కైవల్యాన్ని ఇస్తుంది కనుక కైవల్యపదదాయినీ. మూడు శరీరాలు పోతేనే కైవల్యము. ఒక్క శరీరం పోతే చావు. మూడు శరీరాలు పోవడానికి మార్గం మాత్రం ఇక్కడే ఉంది. ఇక్కడ పొందకపోతే ఎక్కడా పొందలేం.

626. త్రిపురా - శ్రీ త్రిపురాయై నమః

'త్రిపురా, త్రిజగద్వంద్యా, త్రిమూర్తిః, త్రిదశేశ్వరీ, త్ర్యక్షరీ'. అమ్మవారి త్రిపురావిద్యని ఈ నామాల గుత్తిలో వివరిస్తున్నారు. అమ్మవారి పేరే 'త్రిపురా'. ఆవిడ చైతన్యరూపిణిగా ఉంది కనుక 'సుందరీ' అన్నారు. అమ్మవారి అసలు పేరు త్రిపుర. త్రిపురసుందరీ అని కలిపి కూడా చెప్పవచ్చు. త్రిపురభైరవి కూడా అమ్మవారే.

దశమహావిద్యలలో త్రిపురభైరవి ఒకరు. త్రిపురసుందరి మరొకరు కాదు. సుందరం ఆకర్షణీయంగా ఉంది కనుక సుందరమైన దృష్టితో చూస్తాం. ఆవిడే భైరవి కూడా. ఉగ్రం కూడా ఆవిడే. చలికాలంలో సూర్యుడు వస్తే బయటకు వెళ్ళి ఎండలో నిల్చోవాలనిపిస్తుంది. గ్రీష్మంలో ఆ సూర్యుడే మహోగ్రంగా ఉంటాడు. ఈ ప్రపంచమంతా వ్యాపించిన సుందరమైన, మృదువైన వస్తువులన్నీ అమ్మయే. అది త్రిపురసుందరీ తత్త్వం. ఉగ్రత్వం కూడా అమ్మయే- ఆవిడ త్రిపురభైరవి. ఈ రెండూ ఒక్కటే - త్రిపుర. ఈ రెండూ అమ్మయే అని తెలుసుకుంటే బాధ లేదు.

సౌమ్యాని యాని రూపాణి త్రైలోక్యే విచరంతితే
యాని చాత్యంత ఘోరాని తైరక్షాస్మాం తథా భువం

అని చెప్తోంది 'దేవీమాహాత్మ్యం'. "అమ్మా! నన్ను రక్షించడానికి నీ సౌమ్య రూపాలు, నీ ఘోర రూపాలు - రెండూ అవసరమే" అంటున్నారు. ఈ రెండు రూపాలు నన్ను, ఈ లోకాన్ని కాపాడాలి.

తైరక్షాస్మాం తథా భువం - మమ్మల్ని కాపాడు. ఈ లోకాలను కాపాడు అని దేవతలు ప్రార్థించారు కనుకనే వారి కోరిక వెంటనే అమ్మవారు తీర్చారు.

'త్రిపురా' నామ వివేచనమే ఒక పెద్ద యోగము. దత్తాత్రేయస్వామి వారు పరశురామునికి చెప్పిన అమ్మవారి విజ్ఞానమంతటిని కలిపి 'త్రిపురారహస్యం' అని పేరు పెట్టారు.

త్రిపురాసిద్ధాంతమని ఒక శాక్తేయగ్రంథముంది.

ఈ ప్రపంచంలో మనం చూస్తున్నవన్నీ మూడే.

దేవానాం త్రిత్రయం త్రయీ హుతభుజాం శక్తిత్రయం త్రిస్వరాః
త్రైలోక్యం త్రిపుదీ త్రిపుష్కరమథో త్రిబ్రహ్మవర్ణాస్త్రయః
యత్కించిజ్జగతి త్రిధా నియమితం వస్తు త్రివర్గాత్మకం
తత్సర్వం త్రిపురేతి నామ భగవత్యన్వేతి తే తత్త్వతః

సృష్టిలో ఉన్న మూడులు చూపిస్తున్నారు. **దేవానాం త్రిత్రయం** అంటే ముగ్గురు దేవుళ్ళు. బ్రహ్మ, విష్ణు, రుద్రులు. **త్రయీ** అంటే ఋగ్యజుస్సామములు. **హుతభుజా** అంటే అగ్నులు మూడు. గార్హపత్యాగ్ని, ఆహవనీయాగ్ని, దక్షిణాగ్ని. **శక్తిత్రయం** అంటే మూడు శక్తులు. అవి ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు.

త్రిస్వరాః – ఉదాత్త, అనుదాత్త, స్వరిత మూడు స్వరాలు. **త్రైలోక్యం** – భూః, భువః, సువర్లోకములు. **త్రిపదీ** – స్వర్గ, మర్త్య, పాతాళాలు. లేదా మనం ఉన్న చోటు. మనకి క్రింద ఉన్నది, పైన ఉన్నది. **త్రిపుష్కరం** అంటే త్రివేణి అనే గంగ, యమున, సరస్వతులుగా భావన చెయ్యవచ్చు.

త్రిబ్రహ్మవర్ణాః– బ్రహ్మవర్ణాలు మూడు. బ్రహ్మము అంటే ఓంకారం. ఓంకారం యొక్క మూడు వర్ణములు– అకార, ఉకార, మకారములు. మరొక అర్థంలో త్రిబ్రహ్మవర్ణాః అంటే పరబ్రహ్మమును తెలియజేసే పదములు. అవి **తత్, త్వం, అసి. అహం–బ్రహ్మ–అస్మి.** ఇవి మూడు మూడుగా కనబడుతున్నాయి. మూడూ నిజానికి ఒక్కటే అని తెలుసుకుంటే ఆ ఏకత్వస్థితి లభిస్తుంది. మూడు ఎవరి అధీనంలో ఉన్నాయో, మూడు ఎవరో – ఆవిడే 'త్రిపుర'.

అమ్మవారు అంటే బ్రహ్మ, విష్ణు, రుద్రులు. అలాగే ముగురమ్మలూ ఆ తల్లే. వేదములు మూడూ ఆవిడ స్వరూపమే. మూడు అగ్నులు దేవీ రూపములే. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు ఆవిడే. ఉదాత్త, అనుదాత్త, స్వరితములు, ముల్లోకములు, మూడు స్థానములు, మూడు ప్రవాహములు ఆ తల్లి. ఈ మూడు ప్రవాహములు మనలో ఉన్నాయి. **త్రిపుష్కరా** అంటే **'నాడీత్రయంతు త్రిపురా'**. సుషుమ్న, పింగళ, ఇడ. మన లోపల మూడు నాడులే త్రిపురా. మూడు నాడుల్లో ఉన్న ఏకశక్తిని గ్రహించగలిగితే అదే త్రిపురోపాసన.

మనో బుద్ధిస్తథా చిత్తం పురత్రయముదాహృతమ్
తత్ర తత్ర వసత్యేషా తస్మాత్తు త్రిపురా మతా

మన లోపలే మూడు పట్టణాలు ఉన్నాయి. అవి మనస్సు, బుద్ధి, చిత్తం. ఈ మూడింటిని పురత్రయం అంటారు. ఈ మూడింటిలో వ్యాపించి ఉన్న చైతన్యమే త్రిపురా. ఇంత సృష్టికి ప్రధానమైన జ్యోతిర్మండలాలు మూడు. అవి సూర్య, చంద్ర, అగ్నులు. ఈ మూడింటి యందు వ్యాపించిన శక్తి 'త్రిపురా'.

శ్రీచక్రంలో తొమ్మిది ఆవరణలు. మూడు ఆవరణలు ఒక మండలం క్రింద విభాగం చేస్తే మూడు మండలములు. మొత్తంగా శ్రీ చక్రంలో మూడు మండలాలుగా విభజన చేస్తే అవి అగ్నిమండల, సూర్యమండల, చంద్రమండలాలు. దీనినే **'ఏణాంకానలభానుమండల లసత్ శ్రీచక్ర మధ్య స్థితా'** అని శంకరభగవత్పాదులవారు మాతృకావర్ణమాలాస్తుతిలో చెప్పారు. ఏణాంక అంటే చంద్రుడు. భానుమండల అంటే సూర్యుడు. అనల అంటే అగ్ని. త్రిపుర అంటే శ్రీచక్రం. ఈ త్రిపురాల యందు వ్యాపించిన తల్లి త్రిపురసుందరీ. **'త్రికోణం మండలం చాస్యాః భూపురంచ త్రిరేఖకం'** అని మరొక విభజన కనిపిస్తోంది.

కుండలినీ విషయంలో – బ్రహ్మగ్రంథి, విష్ణుగ్రంథి, రుద్రగ్రంథి. ఈ మూడు గ్రంథుల నుండి వ్యాపించి వెళ్ళేది త్రిపురా. ఆ త్రిపురాతత్త్వ వివేచన చేస్తూ ఉంటే వీటిని మూడు మూడుగా కాక మూడింటిలోనూ ఉన్న ఒక్క తత్త్వాన్ని గ్రహించగలము. మొత్తానికి ప్రపంచమంతా త్రి.

త్రిపుటి యొక్క వేరుతనాన్ని తొలగించడమే త్రిపురాసుర సంహారం. అది జరగాలంటే త్రి యందు విక్రమించిన ఆ వ్యాపకతత్త్వాన్ని తెలుసుకుంటే అదే త్రివిక్రమము. ఆ మూడింటిని నడిపించే ఏకమైన త్రిపురసుందరీ తత్త్వము. త్రిపురాసుర సంహారము, త్రివిక్రమ తత్త్వము, త్రిపుర సుందరీ తత్త్వము – ఈ మూడు ఒకే పరతత్త్వాన్ని బోధిస్తున్నాయి..

మన శరీరంలో కూడా మూడు శరీరాలు ఉన్నాయి. అవి స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు. పంచకోశాలకి కూడా మూడింటి విభజన చెప్పారు. అన్నమయ,

ప్రాణమయ కోశాలు స్థూలం. మనోమయ, విజ్ఞానమయ కలిపితే సూక్ష్మం. ఆనందమయ కోశం కారణశరీరం. ఈ మూడు శరీరాలకి మూడు అవస్థలు. అవి జాగ్రత్స్వప్నసుషుప్తులు. ఇది మూడు కాలాలలో ఉంటుంది – అవి నిన్న, నేడు, రేపు. మనం చూసే లోకాలు మూడు. శరీరాలు మూడు. కాలాలు మూడు. అవస్థలు మూడు. ఈ మూడు అవస్థలలోనూ చైతన్యముంది. ఈ మూడు పురాలలో ఉన్న ఏక చైతన్యమే 'త్రిపురా'. ఈ పురములలో ఆవిడ ఉంది గనుకనే పురాలకి అందం. లేకపోతే ఏం లేదు. త్రిపురాలకి సౌందర్యం ఇచ్చే చైతన్యమే త్రిపురసుందరీ. ఈ త్రిపురాలలో ఆ చైతన్యం నిరంతరం ప్రసరిస్తోంది. ఆ శక్తి ప్రసరణకే **'లహరి'** అని పేరు. ఆ సుందరే 'సౌందర్యలహరీ'.

అమ్మవారు గొప్పది కనుక మహాత్రిపురసుందరీ. లావణ్యరూపిణి కనుక లలితామహాత్రిపురసుందరీ.

పురా అనే మాటకి చోటు అని ఒక అర్థం. పురా అంటే మునుపే అని కూడ అర్థం. **'మూర్తి త్రయస్యాపి పురాతనత్వాత్ తదంబికాయాస్త్రిపురేతి నామ'**. **త్రిభిః పురా త్రిపురా** – మూడింటి యందున్నదే అని ఇంతవరకూ అర్థం చెప్పారు. ఈ మూడూ వచ్చాక అమ్మవారు వచ్చారా? వీటికి మునుపే ఆవిడ ఉంది.

ఈ త్రిపురాలు ఏర్పడక ముందు ఉన్న చిద్రూపిణి. త్రిపురాలు ఏర్పడ్డాక త్రిపురాలలోనూ ఉంది. ఈ త్రిపురాలు పోయినా ఉంటుంది.

ఈ మూడూ ప్రపంచ విషయాలైతే ఈ మూడింటి యందు, ఈ మూడు ఏర్పడక ముందు కూడా ఉన్నది త్రిపురా. ఎవరైతే ఎప్పుడూ ఉంటారో ఆ తత్త్వాన్ని ఆశ్రయించినవారు ఎప్పుడూ ఉండే మోక్షాన్ని పొందుతారు. ఆ త్రిపురాతత్త్వాన్నే ముల్లోకాల వారు నమస్కరిస్తున్నారు.

627. త్రిజగద్వంద్యా – శ్రీ త్రిజగద్వంద్యాయై నమః

ముల్లోకాలలో ఉండే యోగులు మూడు చోట్లలో అమ్మవారిని ఆరాధన చేస్తున్నారు. ఆ మూడు చోట్లే 'శిరఃస్థితా చంద్రనిభా, ఫాలస్థేంద్రధనుఃప్రభా, హృదయస్థా

రవిప్రఖ్యా, త్రికోణాంతర దీపికా' అదే 'త్రిజగద్వంద్యా'. అలాంటి ఆరాధన తీసుకుని మూకకవి చెప్తున్నారు –

మధ్యే హృదయం మధ్యే నిటలం మధ్యే శిరోఽపివాస్తవ్యాం
చండకరచక్రకార్ముక చంద్రసమాభాం నమామి కామాక్షీం

చండకర అంటే సూర్యుడు. చక్ర కార్ముక అంటే ఇంద్రధనువు. చంద్రసమాభాం అంటే చంద్రునివంటి కాంతిరూపిణి. రవిప్రఖ్యా, ఇంద్రధనుఃప్రభా, చంద్రనిభా చెప్పి వీటిని ఎక్కడ ధ్యానించాలో చెప్తూ 'మధ్యే హృదయం, మధ్యే నిటలం, మధ్యే శిరోపివాస్తవ్యాం' అన్నారు. అక్కడ మూడింటి యందు ఆరాధిపబడుతోంది కనుక 'త్రిజగద్వంద్యా'. ఆవిడే 'త్రిమూర్తిః' అని తరువాత నామంలో చెప్తున్నారు. స్వర్గ మర్త్య పాతాళ వాసులచే, భూర్భువఃసువర్లోకవాసులచేత వందనము పొందునది.

628. త్రిమూర్తిః – శ్రీ త్రిమూర్త్యై నమః

'ప్రయోజనవశాచ్ఛక్తిః ఏకైవ త్రివిధా భవేత్' అని శాస్త్రం. లోకం యొక్క ప్రయోజనం కోసం ఒకే శక్తి అయిన అమ్మవారు మూడు రూపాలై లోకాన్ని రక్షిస్తున్నారు. బ్రహ్మవిష్ణురుద్రాదులకు మునుపే ఉందంటే బ్రహ్మవిష్ణురుద్రాదులు కూడా అమ్మ యొక్క మూర్తులే కనుక 'త్రిమూర్తిః'.

'త్రిమూర్తిః' అని చెప్పినపుడు ముగ్గురు అయ్యలు, ముగ్గురమ్మలను స్మరించుకోవాలి. బ్రహ్మవిష్ణురుద్రులు, సరస్వతీ, లక్ష్మీ, దుర్గలు. ఈ మూడింటితోనే ప్రపంచం నడుస్తోంది. ముగురమ్మలమూలపుటమ్మయే 'త్రిమూర్తిః'. ఇచ్ఛా జ్ఞాన క్రియాశక్తుల రూపం. వామ, జ్యేష్ఠ, రౌద్రీ అనబడే మూడు శక్తుల రూపం. ఇవన్నీ 'త్రిమూర్తిః' అనే నామం ద్వారా తెలియబడతాయి.

'శాంభవీ శుక్లరూపా చ శ్రీవిద్యా రక్తరూపికా
శ్యామలా శ్యామరూపాస్యాత్ ఇత్యేతా గుణశక్తయః'.

అమ్మవారు శాంభవిగా ఉన్నప్పుడు తెల్లని రూపంతో ఉంటారు. శ్రీవిద్యా రూపిణిగా ఉన్నప్పుడు ఎర్రనిరూపంతో ప్రకాశిస్తూ ఉంటారు. 'శ్యామలా శ్యామరూపా

చ'. శ్యామలాదేవి రూపంలో ఉన్నప్పుడు చామనచాయలో వెలుగులీనుతూ ఉంటుంది. ఈ మూడూ కూడా 'త్రిమూర్తిః' అని చెప్పబడుతున్నాయి.

నవరాత్రుల పూజ చేసేటప్పుడు మూడు సంవత్సరాల బాలికగా ఆరాధన చేస్తే ఆ మూర్తిని 'త్రిమూర్తిః' అంటారని కుమారీ పూజలో చెప్పబడుతోంది.

629. త్రిదశేశ్వరీ - శ్రీ త్రిదశేశ్వర్యై నమః

దేవతలందరికీ నాయకురాలు. త్రిదశలు అంటే దేవతలు. దేవతలు ఎప్పుడూ ముప్పై ఏళ్ళవారుగానే ఉంటారు. ఆ స్థితి మంచి పక్వమైన శరీరం. బాల్య, కౌమార, యౌవనం.

మూడవ దశ అంటే యౌవనం. ఎప్పుడూ ఆ మూడవ దశలోనే వారు ఉంటారు. వారికి నాలుగవ దశ అయిన వార్ధక్యం లేదు. ఐదవ దశ అయిన మరణం లేదు. ఎప్పుడూ ఉండడమే త్రిదశ. ఇలా ఎప్పుడూ యౌవనంలో ఉంటున్న దేవతలకి ఈశ్వరి గనుక 'త్రిదశేశ్వరీ'.

మరొక అర్థంలో త్రిదశ-ఈశ్వరీ మూడు దశలకి ఆవిడ ఈశ్వరీ. మూడు దశలు అంటే జాగ్రత్ దశ, స్వప్న దశ, సుషుప్తి దశ. ఈ మూడు దశలలోనూ జీవులకు ఆవిడే నాయకురాలు. పదముగ్గురు విశ్వదేవులకు, ముప్పదిమూడు దేవగణములకు నియామకురాలు.

630. త్ర్యక్షరీ - శ్రీ త్ర్యక్షర్యై నమః

ఇది అమ్మవారి విద్యాస్వరూపాన్ని చెప్తున్నది. 'త్ర్యక్షరీ' ప్రధానంగా ఓంకారరూపిణి. ఓంకారం మూడు అక్షరాలతో కూడి ఉంటుంది కనుక 'త్ర్యక్ష్యరీ'.

శ్రీవిద్యలో త్ర్యక్షరీ అని చెప్పబడుతున్న విద్యలు రెండు ఉన్నాయి. **త్ర్యక్షరీ శుద్ధవిద్యా కుమారీ చ.** శుద్ధవిద్యా అని మంత్రం ఉంది. అది ప్రకటించరాదు. గురుముఖైక వేద్యం. కుమారీ అంటే బాలామంత్రం. బాలామంత్రాన్ని కూడ త్ర్యక్షరీ అని అంటారు. మంత్రోపాసన చేసినపుడు ఆరు అక్షరాల బాల ఉంది. నవాక్షర బాల

కూడా ఉంది. ఆరు అయినా, తొమ్మిది అయినా అందులో మూడు అక్షరాలే ప్రధానం. ఈ మూడింటి యొక్క ఆవృతి తిరిగి రావడమే షడక్షరీలోనూ, నవాక్షరీలోనూ కనపడుతుంది. బాల త్ర్యక్షరీ రూపిణిగా చెప్పబడుతోంది. పంచదశీ త్ర్యక్షరీయే. పంచదశీ పదిహేను అక్షరాలు చెప్పినా అవి త్రికూటాలుగా ఉన్నాయి. ఒకొక్క కూటమిని ఒకొక్క అక్షరంగా భావిస్తే అది 'త్ర్యక్షరీ' అవుతుంది. ఆ భావన ముఖ్యంగా షోడశీలో కనబడుతుంటుంది. షోడశీలోనున్న 28 అక్షరాలలో పంచదశీ అని చెప్పబడే 15 అక్షరాలను మినహాయిస్తే 13. పంచదశీ మూడు కూటాలు గనుక ఒకొక్క కూటమి ఒకొక్క అక్షరం క్రింద తీసుకుంటే అప్పుడు షోడశీ అవుతుందని షోడశాక్షరీవిద్య దగ్గర వ్యాఖ్యానించుకోవడం జరిగింది.

త్ర్యక్షరీ అంటే మూడు కూటములతో ఉన్న శ్రీవిద్యాధిదేవత.

వాగీశ్వరీ జ్ఞానశక్తిః వాగ్భవా మోక్షరూపిణీ

కామరాజా క్రియాశక్తిః కామేశీ కామరూపిణీ

శక్తిబీజే పరాశక్తిః ఇచ్ఛైవ శివరూపిణీ

ఏవం దేవీ త్ర్యక్షరీ తు మహాత్రిపురసుందరీ (వామకేశ్వర తంత్రం)

'మహాత్రిపురసుందరీ' అంటేనే త్ర్యక్షరీవిద్య. త్రిపురా దగ్గర ప్రారంభమై త్ర్యక్షరీతో త్రినామాలు పూర్తి అవుతాయి. ముందుగా వాగ్భవబీజం. **'వాగీశ్వరీ జ్ఞానశక్తిః వాగ్భవా మోక్షరూపిణీ'** – వాగ్భవబీజానికి వాగీశ్వరి జ్ఞానశక్తి అధిష్ఠానంగా ఉన్నది.

'కామరాజే క్రియాశక్తిః కామేశీ కామరూపిణీ' – ఆ మధ్య కూటంలో క్రియాశక్తి ఉన్నది. **'శక్తిబీజే పరాశక్తిః ఇచ్ఛైవ శివరూపిణీ'** – మూడవది ఇచ్ఛాశక్తి. ఆ ఇచ్ఛాశక్తినే పరాశక్తి అంటారు. అది శక్తి బీజము.

శక్తికూటమే ఇక్కడ శక్తిబీజం అని చెప్పబడ్డది. కామరాజ కూటం అనే దానికి క్రియాశక్తి అని వ్యవహారము. ఇలా కలుపుకుని ఈ మూడు త్ర్యక్షరీవిద్య. త్రిపుర సుందరీ విద్యయే త్ర్యక్షరీ విద్య. ఇలా బాల, శుద్ధవిద్య, పంచదశీ లేదా షోడశీ ఇవన్నీ కూడా 'త్ర్యక్షరీ'గా చెప్పబడుతున్నాయి.

'సచామరరమావాణీసవ్యదక్షిణసేవితా' ఒక్కసారి గుర్తు తెచ్చుకుంటే అక్కడ

కూడా త్ర్యక్షరీ విద్య ఎలా వచ్చిందో వివరించుకున్నాం. వాణి, లక్ష్మి, గౌరి మూడు బీజములు త్ర్యక్షరీ విద్యయే.

631. దివ్యగంధాఢ్యా – శ్రీ దివ్యగంధాఢ్యాయై నమః

'దివ్యగంధాఢ్యా', 'సిందూరతిలకాంచితా' – ఈ రెండు నామాలు అమ్మవారి దివ్యమంగళవిగ్రహాన్ని భావన చేయిస్తున్నాయి. ఇప్పుడు రూప వైభవం కనబడుతున్నది.

దివ్యగంధము ధరించి ఉన్నది. గంధములు మనం అమ్మవారికి అందిస్తూ ఉన్నాం. ఇవి భౌమములు. భౌమములు అంటే మనకి భూమిలో దొరికే ఒక సుగంధం. దానిని అమ్మవారికి ఇవ్వగలం. అమ్మవారికి మణిద్వీపములో ఇచ్చేది మాత్రం దివ్యగంధం. దివ్యగంధం అలౌకికమైనది అని అర్థం. ప్రకాశమానమైన అని మరొక అర్థం. అలాంటి ప్రకాశమానములైన అలౌకిక గంధముల చేత అలంకృత అయి పూజింపబడుతున్నది.

గంధము అంటేనే పరిమళం. పరిమళం యొక్క లక్షణం వ్యాపించడం. ఆ వ్యాపకశక్తిని గంధం తెలియజేస్తోంది. 'సుగంధిం పుష్టివర్ధనం' అనే మంత్రభావాన్నే ఇక్కడ స్వీకరించాలి. పరమేశ్వరుడు అనంత కళ్యాణ గుణాలతో ప్రకాశిస్తూ ఉంటాడు గనుక పరమాత్మకి సుగంధి అనే పేరొచ్చిందని నిరుక్తకారులు చెప్పారు. ఒక పరిమళమును అనుసరించి పుష్పాన్ని ఎలా పోల్చుకుంటామో, భగవంతుని అద్భుతశక్తులను, విభూతులను అనుసరించి ఆయన భగవంతుడని గ్రహించ గలుగుతున్నాము.

ప్రకటింపబడిన భగవానుని అనంత కళ్యాణగుణాలే గంధములు. అవి ఎప్పుడూ జగత్తుకు మేలు కలిగిస్తాయి కనుక సుగంధములు. అవి పాంచభౌతిక వికారాలతో ఉన్నవి కావు.

'జన్మ కర్మ చ మే దివ్యం' అని పరమాత్మ భగవద్గీతలో చెప్పినట్లుగా అవి అలౌకికములు, దివ్యములు గనుక 'దివ్యగంధాఢ్యా'. **'గంధద్వారాం దురాధర్షాం'** అని శ్రీ సూక్తంలో చెప్పబడుతున్నది. గంధగుణము కలిగిన భూదేవీస్వరూపురాలని మరోభావం.

632. సిందూరతిలకాంచితా - శ్రీ సిందూరతిలకాంచితాయై నమః

అమ్మ స్వరూపంలో సిందూరతిలకాన్ని వర్ణిస్తున్నారు. నిజానికి అమ్మ తిలకం సిందూర తిలకమా! కస్తూరి తిలకమా! 'ముఖచంద్రకళంకాభమృగనాభివిశేషకా' నామం దగ్గర కస్తూరి తిలకం గురించి చెప్పుకున్నాం. మృగనాభి అంటేనే కస్తూరీ. మరి ఈ నామంలో 'సిందూరతిలకాంచితా' అని చెప్పారు అంటే... రెండూ సత్యాలే.

ఫాలభాగం మధ్యలో కస్తూరితిలకం ఉంటే, పాపిట వద్ద సిందూరము ఉంది. పాపిట వద్ద ప్రకాశిస్తున్న సిందూరతిలకాన్ని ఇక్కడ భావన చేస్తున్నారు. అమ్మవారిరూపంలో సిందూరతిలకాన్ని గనుక ధ్యానం చేస్తే అది మంగళములను కలిగిస్తుంది. సిందూరధారణ భారతీయసంస్కృతిలో ప్రధానంగా చెప్పారు. పాపిట వద్ద సువాసినీ స్త్రీ సిందూరాన్ని ధరించాలి.

తనోతు క్షేమం నః తవ వదనసౌన్దర్యలహరీ
పరీవాహస్రోతస్సరణిరివ సీమన్తసరణిః
వహన్తీ సిందూరం ప్రబల కబరీ భారతిమిరః
ద్విషాం బృందైః బందీకృతమివ నవీనార్కకిరణమ్

అమ్మా! నీ ముఖసౌన్దర్యమనే ప్రవాహం సాగే కాలువ వలె నీ పాపిటదారి మాకు క్షేమాన్ని విస్తరింపజేయుగాక! దట్టమైన కురులు అనే చీకటి శత్రువులు ఇరువైపుల ఆక్రమించి బంధించిన బాలసూర్య కిరణం వలె ప్రకాశిస్తున్న సిందూరాన్ని, ఆ సీమంతం దాల్చి ఉన్నది అన్నారు సౌందర్యలహరిలో శంకరభగవత్పాదులవారు. అమ్మవారి పాపిట సిందూరం 'నవీన అర్కకిరణం' – అరుణకిరణాలతో ప్రకాశిస్తున్న సూర్యభగవానుని కిరణరాశివలె ప్రకాశిస్తోందన్నారు. అమ్మ ధరించిన ఆ సిందూరతిలకాన్ని ఎవరు భావిస్తారో వారికి లోపల ఉన్న అంధకారం పోయి జ్ఞానం లభిస్తుంది.

'దివ్యగంధాఢ్యా', 'సిందూరతిలకాంచితా' – రెండూ చెప్పడంలో అమ్మవారి భవ్యమైన సువాసినీ లక్షణాన్ని ప్రతిపాదన చేస్తున్నారు. త్ర్యక్షరీరూపంతో ప్రకాశిస్తున్న ఆ తల్లి యొక్క భవ్యమంగళ విగ్రహాన్ని ఇక్కడ వర్ణిస్తున్నారు. గంధము, సిందూరము

అలంకరించుకున్న పెద్దముత్తైదువని భావన చేస్తున్నారు.

అంచిత అన్న శబ్దానికి కూడినది అని ఒక అర్థం. అంచిత అంటే **'అంచు గతి పూజనయోః'** – అంచు అంటే పూజింపబడినది అని కూడా అర్థం. సిందూరతిలకముతో పూజింపబడుతున్న తల్లి అనే భావము కూడా స్వీకరించాలి. అమ్మవారిని అలంకరించడానికి వచ్చిన అనంగకుసుమ, అనంగమేఖల మొదలైనవారు ఆ అలంకారాన్ని అర్చనగా చేసుకుంటున్నారు.

633. ఉమా – శ్రీ ఉమాయై నమః

ఉమా నామము రహస్య నామము. లలితా సహస్ర నామాలలో రహస్యనామాలు – శివా, భవానీ, ఉమా. అమ్మవారి స్వరూపం ఉమా. ఉమా అనే మాటకి ఎన్నో అర్థాలున్నాయి. సర్వదోషహారిణియైన నామం ఉమా నామం.

లలితాసహస్రనామం చదివిన తరువాత దోషనివృత్తికై చివరికి ఉమా నామాన్ని పదిమార్లు చెయ్యాలని కొంతమంది సంప్రదాయజ్ఞులు నిర్దేశించారు. ఏ పూజ చేసినా చివరికి ఉమా నామం పదిసార్లు చేస్తే ఏమైనా దోషాలు ఉంటే పరిహరింపబడతాయి. అలాగని తప్పులు చదివినా సమర్థనీయం కాదు. మనం పెద్దల ద్వారా నేర్చుకుని ఎంత జాగ్రత్తగా చదివినా ఒకొక్కప్పుడు స్ఖాలిత్యం దోషం రావచ్చును. అక్షరస్ఖాలిత్యాలే కాకుండా మనసు కూడా ఒక్కోసారి జారిపోతుంటుంది. ఇవన్నీ దోషములే. ఆ దోష పరిహారార్థం చివరికి 'శ్రీ ఉమాయై నమః' అని నామాన్ని స్మరణ చెయ్యాలి.

ఉమా నామానికి కథాపరంగా లీలార్థం

అమ్మవారు అవతరించినప్పుడు జరిగిన ఒకానొక కథా సందర్భము ఉంది. **"ఉమేతి మాత్రా తపసో నిషిద్ధా, పశ్చాదుమాఖ్యాం సుముఖీ జగామ"** – అంటారు కాళిదాస మహాకవి.

గౌరి తపస్సుకు వెళతానని నిర్ణయించుకున్నాక, తల్లి మేనాదేవి వద్దన్నది. చెప్పి చెప్పి మేనాదేవికి చివరికి మాటలు రాక, "ఉ...మా.." అంది. **ఉ** అంటే ఓయి అని, **మా** అంటే వద్దు అని దీని అర్థం. అదే నా పేరమ్మా అని అందిట అమ్మవారు.

ఉమా అంటే తపోనిషిద్ధా. తపస్సుకు వెళ్తుంటే నిషేధించిన వచనము ద్వారా వచ్చిన పేరు.

యతో నిరస్తా తపసే వనం గంతుం తు మేనయా

ఉమేతి తేన సోమేతి నామ ప్రాప తదా సతీ (కాళికాపురాణం)

'ఉ మా ఇతి నిషేధంతీ ఉమేత్యేవ తథా భవేత్' (బ్రహ్మపురాణం)

ఈ నామాన్ని పరిశీలన చేస్తే అనేక అద్భుతమైన భావాలు కనబడతాయి.

పరమార్థం

"ఉమా అనేదే నా పేరమ్మా" అని చెప్పడంలో అమ్మవారి ఉద్దేశం. అది వేదాలలోనే ఉంది అని మేనాదేవితో చెప్పడం. 'ఇప్పుడంటే నీకు పుత్రికగా వచ్చాను గాని అంతకు ముందు కూడా నేను ఉన్నాను. అంతకు ముందు నేను ఉన్నప్పుడు నా పేరు ఉమా'. వేదాలలో ఉమా నామం ఉంది. **'ఉమాం హైమవతీం బహుశోభమానాం'** ఇదే శ్రీవిద్య. ఇది కేనోపనిషత్తులో చెప్పబడుతోంది.

ఉమా నామానికి భాష్యకారులు అర్థం చెప్తూ **"ప్రణవ వర్ణస్య వ్యత్యాస రూపః"** అన్నారు. ఉమా అనేది ప్రణవ వర్ణము యొక్క వ్యత్యాస రూపము. ప్రణవము అంటే ఓంకారం. ఓంకారం కూడా త్ర్యక్షరీ. అందులో అ-ఉ-మ అని మూడు ఉన్నాయి. దీని వ్యత్యాసరూపము అంటే అకారాన్ని మనం తొలగించితే వినబడేవి ఉమ రెండే. కాని అకారాన్ని తొలగించకూడదు. తీసుకు వెళ్ళి మకారానికి తగిలించాలి. అప్పుడు అది ఉమా అయ్యింది. ఉమా అంటే ఓంకారం యొక్క స్వరూపమే. **(ఉ - మ - అ)**

ఓంకారం యొక్క శక్తి అమ్మవారు. ఓం నేరుగా బ్రహ్మమునే చెప్తుంది. ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ - దాని యొక్క పరమేశ్వర శక్తి ఉమారూపంతో వచ్చింది. ఉమా అన్నా, ఓంకారం అన్నా ఒక్కటే.

ఉమా నామాన్ని ఉపాసన చేస్తుంటే ఐహికమైన ప్రయోజనాలు లభిస్తూనే పారిమార్థికమైన ప్రయోజనం కూడా ఇవ్వగలదు. భుక్తి, ముక్తి ప్రదాయకమైన శబ్దం 'ఉమా'.

శివుని తెలియజేస్తున్న ఓంకారం. శక్తిని తెలియజేస్తున్న ఉమా నామం. రెండిటికి భేదం లేదు. శివశక్త్యైక్యరూపిణి. ఉమా నామానికి **"ఉః ఉత్తమా సా మా చిత్తవృత్తిశ్చేతి వా"** అని అద్భుతమైన నిరుక్తార్థాన్ని చెప్పారు. ఉత్తమమైన చిత్తవృత్తిని ఉమా అంటారు. ఇది అలా గుర్తుపెట్టుకుంటే చాలు.

చిత్తవృత్తి అంటే మనసు చేసే పని. ఈ చిత్తవృత్తులు అనేక రకాలుంటాయి. ఉత్తమ చిత్తవృత్తులు అంటే మంచి ఆలోచనలు.

ఉమా అంటే ఈశ్వరుని ఆరాధనకి సన్నద్ధమైన భావము. పరమాత్మని పొందడం కోసం అమ్మవారు అన్నింటిని విడిచిపెట్టింది. విషయాల్ని పరిత్యజించి విశ్వేశ్వరుని వరించి వెళ్ళిన చిత్తవృత్తే 'ఉమా'. తపస్సుకు వెళ్తున్న ఉమా రూపాన్ని ఎవరు భావన చేస్తారో వారికి ఉత్తమ చిత్తవృత్తి వస్తుంది. సూతసంహితలో ఉమా సంబంధమైన రమ్యమైన శ్లోకాన్ని చెప్పారు.

పరానుభూతిం భవపాశనాశినీం సదాశివస్యాప్యతి శోభనాఢ్యాం

(శోభన ప్రదాం)

ఉమాభిదాం ఉత్తమ చిత్తవృత్తిదాం నమామి నానావిధలోకవైభవామ్

ఉమా అంటే పరానుభూతి. పర అంటే సర్వోత్కృష్టమైన పరమాత్మ. ఉత్కృష్టమైన భగవదనుభవమే ఉమా. ఉమా అనగానే భగవదనుగ్రహస్వరూపము. పరబ్రహ్మాను భవమే ఉమా. అలాంటి ఉమాదేవిని ధ్యానిస్తే భవపాశనాశినీ. ఆ తల్లి భవపాశాలన్నీ తీసివేస్తుంది. ఆ తల్లే **'సదాశివస్యాప్యతి శోభనాఢ్యాం'** – శివునికి కూడా అందమిచ్చే తల్లి.

ఉమాం హైమవతీం బహుశోభమానాం అనేదానికి వ్యాఖ్యానం ఇది.

ఓంకారరూపమైన ఈశ్వరశక్తి ఉమాగా వెలికి వచ్చి ఇన్ని లోక వైభవాలుగా వ్యక్తమవుతున్నది. ఉమా నామానికి మరొక అర్థాన్ని చెప్తూ **'ఓంకార సారశక్తిత్వాత్ ఉమేతి పరికీర్తితా'** – ఓంకారం యొక్క సారశక్తిని ఉమా అంటారు.

తపస్సును నిషేధించడం వలన వచ్చిందని అర్థమే కాకుండా ఇప్పుడు మరొక అర్థం కూడా వచ్చింది. **'సుప్తానామథ బుద్ధీనాం అమాత్రోచ్చారణాత్ హృది। నిత్యం**

త్రైలోక్యభూతానాం ఉమేతీందుకలోచ్యతే' – సుప్తమైన బుద్ధులని జాగృత పరచగలిగే శక్తి 'ఉమా' అన్నారు. సుప్తమైన బుద్ధులంటే అజ్ఞానముతో నిండిపోయిన బుద్ధులను మేలుకొలిపి పరమేశ్వరుని వైపు తిప్పే తల్లి.

"ముల్లోకాలలో సుషుప్తియందున్న వారి, మెలకువ కలవారి హృదయాలను ప్రేరేపించు ఇందుకళ – ఉమ". దహరాకాశం శివుడు. ఆయన శిరమున ఇందుకళ బిందు రూపముగా ఉన్నది. దానిని తెలియజేయునదే ఉమా నామం.

'ఉమేతి ఇందుకలోచ్యతే' – ఉమా అంటే ఇందుకళ. 'ఇందుకళ' అంటే సహస్రారంలో ప్రకాశించే షోడశీకళనే 'ఉమా' అంటారు. ఉమా అంటే షోడశీకళారూపిణీ. శ్రీవిద్యాధిదేవతైన లలితాదేవి యొక్క దివ్య నామం ఉమా.

అకార ఉకార మకారాః మదీయే ప్రణవే స్థితాః ఉకారం చ మకారం చ అకారం చ క్రమేరితం త్వదీయం ప్రణవం విద్ధి త్రిమాత్రం ప్లుతముత్తమమ్॥ (లింగపురాణం) "నా ప్రణవంలో అ, ఉ, మ – ఉన్నాయి. నీ ప్రణవంలో ఉ, మ, అ చెప్పబడ్డాయి. ఇది నీ ప్రణవం (దేవీపురాణం). ఇది త్రి మాత్రలు కలది.

'ఉం పరమశివం మాతి పరిచ్ఛినత్తి' అని ఒక నిర్వచనం. అనంతుడైన పరమశివుని పరిణామము (కొలత) కలవాని వలె చూపించే మాయాశక్తి – ఉమా.

'కాంతి' స్వరూపిణి అని కూడా అర్థం. ఈ కాంతి బ్రహ్మజ్ఞానం.

కన్యాపూజలో ఆరేళ్ళ కన్య 'ఉమా' అని ధౌమ్య వచనం. సింధువనంలో వినాయక పీఠంలో 'ఉమా' నామంతో దేవి ఉన్నది.

ఇచ్ఛాశక్తిః ఉమా కుమారీ – పరమేశ్వరుని యొక్క ఇచ్ఛాశక్తే 'ఉమా' 'కుమారీ'. ఆ ఇచ్ఛాశక్తే లలితా. ఉమా అనేది లలితాంబకు సంబంధించిన గొప్పనామం. అలాంటి ఉమాదేవి ఎలా అవతరించి వచ్చిందో తరువాత నామంలో చెప్తున్నారు.

634. శైలేంద్రతనయా – శ్రీ శైలేంద్రతనయాయై నమః

శైల–ఇంద్ర–తనయా అంటే పర్వతరాజపుత్రిక. ఆవిడే 'గౌరీ'. ఆవిడను గంధర్వులు సేవిస్తున్నారు గనుక 'గంధర్వసేవితా'.

'జాతా శైలేన్ద్ర గేహే సా శైలరాజసుతా తతః' (దేవీపురాణం). శైలేన్ద్రుని ఇంట పుట్టినది శైలరాజసుత.

ఉమా **హైమవతీ** మాటే ఇక్కడ వచ్చింది. అక్కడ హైమవతే ఇక్కడ శైలేంద్రతనయా. హైమవతీ అన్నా హిమవత్పర్వత రాజపుత్రిక అయిన ఆ తల్లే.

మరొక భావంతో – శ్రీవిద్యాసంప్రదాయంలో శైలేంద్రమంటే మేరుప్రస్తార శ్రీచక్రము. అదే పర్వతము. మేరు అన్న పేరే పర్వతానిది. మేరువు అంటే శైలేంద్రమే. శైలేంద్రతనయా అంటే శ్రీచక్ర ఉపాసన వల్ల లభించేది. బిందుస్థిత అయిన ఆ లలితాపరాభట్టారికే 'శైలేంద్రతనయా'.

635. గౌరీ – శ్రీ గౌర్యై నమః

తేటతెల్లని తల్లి. ముత్తుస్వామి దీక్షితులవారు కాళీ, గౌరీ – రెండూ అమ్మవారే అని చెప్తూ 'సితాసితే' అని కీర్తించారు. "తెలుపు నలుపుల తల్లి" అన్నారు. అంటే గౌరీ, కాళీ.

ప్రళయకాలంలో ఈ ప్రపంచమేదీ గోచరించని ఒక మహాంధకారం ఉంటుంది. అమ్మవారే అలా వ్యాపించి ఉన్నారని చెప్పారు. అంతుపట్టనితనమే కాళీ. ఆ నామం దగ్గర మరింత విస్తారమైన అర్థం తెలుసుకుందాం. గౌరీ అంటే ప్రకాశస్వరూపిణి అని అర్థం.

కాళీ, గౌరీ ఒక్కరే అని చెప్తూ చండీసప్తశతిలో ఒక కథ ఉంది. ఒక సూచనగా ఒక్క శ్లోకంలో అక్కడ ధ్వనింపజేస్తారు. ఇక్కడ స్మరించుకోవచ్చు. అమ్మవారు మొట్టమొదట నల్లపిల్లగానే పుట్టింది. ఆమె అన్నగారు అలాంటి ఆయనే. వారిద్దరిది ఒక్కటే రంగు. వారు ఇరువురు ఒకే జ్యోతి నుండి వచ్చిన కవలలు. ఇద్దరూ నల్లగా ఉన్నా చాలా అందంగా ఉన్నారు. నల్లదనంలో సౌందర్యం తెలుసుకోవాలంటే విష్ణువుని చూడాలి. శ్యామా అన్న వర్ణమే చామనచాయ. అటువంటి రంగుతో అమ్మవారు ఉండేది. కాని శివుడు పెళ్ళి చేసుకునేటప్పుడు మాత్రం **'కాళీ ప్రణయలాలసః'** అని శివపురాణంలో చెప్పినట్లుగా కాళీదేవిని పెళ్ళి చేసుకుంటున్నాను అని ఉత్సాహంగా

పెళ్ళిమండపం మీద కూర్చున్నాడు.

కానీ పెళ్ళైన కొంత కాలానికి "నల్లపిల్లా! నువ్వు నల్లగా ఉన్నావు" అంటూ ఉన్నాడు. ఆవిడ ఇదేం బాగోలేదనుకుని వెళ్ళి తపస్సు చేసిన తరువాత తెల్లగా మారింది. అంతవరకూ ఉన్న ఆ నల్లని కోశాన్ని విడిచిపెట్టి గౌరకాంతితో భాసించింది.

ఆ విడిచిపెట్టిన నల్లని కోశమే 'కౌశికీ' అనే శక్తి. ఆ శక్తే బయలుదేరి శంభునిశుంభుల సంహారం చేసింది. అంత కథ నడపడం కోసం ఆయన 'నల్లపిల్లా' అనాల్సి వచ్చింది. వారి పరిహాసాలు, లీలలు లోకానికి కళ్యాణాలు అని గ్రహించాలి.

లోకకళ్యాణం కోసం గౌరిగా వచ్చి అమ్మవారు పరమేశ్వరునితో 'చూడు నేను ఎంత తెల్లగా ఉన్నానో' అంది. **'శంఖకుందేందు వర్ణాచేత్యతో గౌరీతి సా స్మృతా'** – శంఖము, మల్లెపువ్వు వలె తెల్లగా ఉన్న తల్లిని 'గౌరీ' అని అంటారు.

కన్యాకుబ్జమనే పీఠంలో పీఠాధిదేవతగా గౌరీ దేవి ఉంది. గౌరీ మంత్రము వేదాలలో సూర్యునికి వాడారు. గౌః కాంతి కిరణాలు. సూర్యుడు ఆ కాంతి కిరణాల పుంజం. పురుషదేవతగా ఉపాసిస్తే పురుషునిగా ఆయన గోచరిస్తాడు. స్త్రీ దేవతగా ఉపాసిస్తే స్త్రీ దేవతగా అనుగ్రహిస్తాడు.

'భానుమండలమధ్యస్థా' అయినప్పుడు ఆ సూర్యమండలాంతర్వర్తినియైన ప్రకాశస్వరూపమే 'గౌరీ'. గౌరీ శబ్దమునకు వేదమునందు సూర్యపరంగా వాడిన మంత్రాలు చాలా ఉన్నాయి. **'గౌరీమిమాయ సలిలాని తక్షత్యేకపదీ ద్విపదీ సా చతుష్పదీ అష్టాపదీ నవపదీ బభూవుషీ సహస్రాక్షరా పరమే వ్యోమన్'** అని వేదమంత్రం. అగ్నీషోమాత్మకంగా వచ్చే సూర్యప్రకాశాన్ని గౌరీ అనాలని వైదికమైన నిర్వచనం. అగ్ని లక్షణము, జలలక్షణము రెండూ కలసి వస్తాయి. సూర్యుని యొక్క స్వరూపమే అగ్నీషోమాత్మకము.

సూర్యుని యొక్క కిరణములలోంచి వచ్చే అగ్నీషోమాత్మకమైన శక్తి గగనమండలంలో ప్రకాశించి భూమికి వచ్చేటప్పటికి ఎలా క్రమక్రమంగా విస్తరిస్తూ వస్తోందో వివరిస్తూ **'ఏకపదీ ద్విపదీ సా చతుష్పదీ అష్టాపదీ'** అన్నారు. ఎక్కడో ఉన్న ప్రకాశం ఆకాశంలో సాక్షాత్కరించి క్రమంగా భూమి పైకి ప్రసరించేటప్పుడు

'ద్విపదీ' అయ్యింది. దిక్కుల్లో ప్రసరించేటప్పుడు **'చతుష్పదీ'** అయ్యింది. అలా క్రమక్రమంగా సహస్రకిరణాలుగా వ్యాపించిన సూర్యకాంతిని 'అష్టాపదీ నవపదీ బభూవుషీ సహస్రాక్షరా పరమేవ్యోమన్' అని వర్ణించారు. పరమేవ్యోమన్ అన్నప్పుడు మనకి కనబడుతున్న భూతాకాశమే కాకుండా చిదాకాశం కూడా తీసుకోవాలి.

గౌరీ అంటే మరొక అర్థంలో వెలుగుల తల్లి. వెలుగు అంటే జ్ఞానం. గౌరీ అంటే జ్ఞానస్వరూపిణి. బ్రహ్మవిద్యాధిదేవత. ఉమా, గౌరీ కూడా బ్రహ్మవిద్యా స్వరూపమే. **'పార్వతీ పరమాదేవీ బ్రహ్మవిద్యాస్వరూపిణీ'** అని నామాలు చెప్పుకున్నాం.

సంశయాలతో, అజ్ఞానాలతో కొట్టుమిట్టాడేవారికి అవన్నీ తొలగించి తేటతెల్లం చేస్తుంది. తేటతెల్లం అంటే బాగా స్పష్టమవ్వడమని అర్థం. బ్రహ్మవిద్య ఒక్కటే తేటతెల్లని విద్య. శుద్ధవిద్య.

బ్రహ్మవిద్య మనకి వేదాల ద్వారా క్రమంగా లభిస్తున్నది. 'గౌః' అంటే వాక్కులు అని అర్థం కూడా ఉంది. శబ్దబ్రహ్మస్వరూపిణి వల్లనే అజ్ఞానం పోతోంది. శబ్దబ్రహ్మస్వరూపంగా విచ్చుకున్నది. ఈ నామాల్లో వాగధీశ్వరీ విద్య చెప్పబడు తున్నదని ముందు చెప్పుకున్నాం. వాగధీశ్వరీ అంటే శబ్దబ్రహ్మస్వరూపిణి.

రెండే శబ్దబ్రహ్మములు అని చెప్పుకోవాలి. అవి ఓంకారము, వేదము. వేదాంతం కూడా వేదంలోని భాగమే అని గ్రహించాలి. వేదవేదాంతాలు కలుపుకుంటే శబ్దబ్రహ్మము. దానికి మూలమైన ఓంకారము కూడా శబ్దబ్రహ్మమే. 'శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరబ్రహ్మాధిగచ్ఛతి' శబ్దబ్రహ్మములో నిష్ణాతుడైతేనే పరబ్రహ్మ ప్రాప్తి. శబ్దాలన్నీ వేదాది శాస్త్రాల నుండి వచ్చాయి.

ఆకాశం నుండే శబ్దం వస్తుంది. శబ్దబ్రహ్మము ముందు ఏకపదిగా వచ్చింది. ఏకపది అంటే ఓంకారం. ఉమా అంటే ఓంకారం. ఆ ఓంకారం ఎలా విస్తరించి వస్తుందో చూపిస్తున్నారు. 'గౌరీమిమాయ సలిలా' అన్నదిక్కడ అనుసంధానం చేసుకోవాలి. ఆ ఓంకారమే విస్తరించి ఇన్ని విద్యలుగా వచ్చింది. ఉమా అనే ఓంకారం ఎలా వచ్చిందో గౌరీ నామంతో, వేదం సహాయంతో తెలుసుకోవాలి.

ముందు ఓంకారం, తరువాత ద్విపది. రెండుగా అంటే వ్యాహృతి, గాయత్రీ.

ఓంకారమే వ్యాహృతులుగా, గాయత్రీగా అయ్యింది. తరువాత చతుష్పదీ అంటే ఋగ్యజుస్సామాథర్వణ వేదాలుగా వచ్చింది.

దాని తరువాత స్వరూపం అష్టాపదీ అంటే ఎనిమిది స్వరూపాలుగా వచ్చింది. అవి షడంగములు, పురాణములు, ధర్మశాస్త్రం. (షడంగాలు అంటే శిక్షా, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పములు.)

తరువాత నవపదీ అంటే మీమాంస, న్యాయము, సాంఖ్యము, యోగము, పాంచరాత్రము, పాశుపతము, ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వము. ఇవి వేదముల నుండి వచ్చిన విద్యలు. ఆ తరువాత వీటిని ఆధారం చేసుకుని లెక్కలేనన్ని విద్యలన్నీ వచ్చాయి. వాటిని **సహస్రాక్షరా పరమేవ్యోమన్** అక్షర అంటే అక్షరములు. ఈ అక్షరాలన్నీ రావడానికి ముందు గౌరీ ఉంది. ఆ శబ్దమే ఓంకారమై, గాయత్రియై, వేదాలై, పురాణ షడంగ ధర్మశాస్త్రాలై, మీమాంసా, న్యాయ, సాంఖ్య, యోగ, పాంచరాత్ర, పాశుపత, ఆయుర్వేద, ధనుర్వేద, గాంధర్వాదులై– క్రమక్రమంగా విస్తరించి అపారమైన వాఙ్మయమై మనకు లభించింది. ఈ వాఙ్మయమైన ప్రపంచమంతా కలిపితే **'జ్యోతిర్మయీం వాఙ్మయీం'.** ఆ జ్యోతే గౌరీ అనగా ప్రకాశ స్వరూపము. దాని యొక్క ప్రథమ రూపం ఓంకారం. ఈ శ్లోకంలో ప్రథమనామం ఉమా. ఉమా అంటే ఓంకారం.

కన్యాకుబ్జ పీఠాధీశ్వరి. (పద్మపురాణం) **"కన్యాకుబ్జే తథా గౌరీ"** పది ఏళ్ళ కన్యకు గౌరీనామం.

636. గంధర్వసేవితా – శ్రీ గంధర్వసేవితాయై నమః

గౌరీదేవి శబ్దవిద్యగా ఎప్పుడు వచ్చిందో ఆ అక్షరములు తీసుకుని, ఆ స్వరములు స్వీకరించి అక్షరాలతో, స్వరాలతో ఆ తల్లినే గానం చేస్తున్నారు. దానిని చక్కగా గానం చేస్తే అదే గాంధర్వము. అదే గానం. ఆ గానంతో సేవించబడుతూ ఉన్నది ఆ తల్లియే. గంధర్వులనబడే దేవతావిశేషాలచే సేవించబడునది, దివ్యగానంచేత సేవించబడునది – అని అర్థాలు.

637. విశ్వగర్భా - శ్రీ విశ్వగర్భాయై నమః

తనలో సమస్తము కలది. ఆ తల్లి నుండే విశ్వం వ్యక్తమైనది. వ్యక్తమైన విశ్వానికి రెండు రూపాలు ఉంటాయి. రూపము, నామము. నామమంతా అక్షర ప్రపంచం. రూపమంతా దృశ్య ప్రపంచం.

'గర్భా' శబ్దం చాలా చిత్రమైనది. లోపలి భాగము అని సరైన అర్థము. 'విశ్వగర్భా' అంటే విశ్వమునంతటిని తనలో కలిగినదని అర్థం.

అనగా సముద్రాలలో కెరటాలు ప్రకటించబడినట్లుగా అని అర్థం చేసుకోవాలి.

కెరటాలు ప్రకటింపబడగానే అవి సముద్రాన్ని విడిచి ఎక్కడికీ వెళ్ళిపోవు. అవి దాంట్లోనే ప్రకటింపబడుతూ ఆ శక్తితోనే ఉన్నాయో అలా విశ్వమంతా అమ్మ యందే వ్యక్తమైనది, ఉన్నది.

మరొక అర్థం విశ్వము లోపల ఉన్న తల్లి. విశ్వము ఆమెలో ఉన్నది. విశ్వములో ఆమె ఉంది. కెరటాలన్నీ సముద్రంలో ఉన్నాయి. కెరటాల్లో ఉన్నది సముద్రమే. అదే 'విశ్వగర్భా'.

అమ్మ అంటే అఖండాత్మస్వరూపిణి. ఆ తల్లి యందే ఈ లోకమంతా ఉన్నది. ఆ తల్లి ఈ లోకంలో ప్రతి అణువులో ప్రసరించింది.

'సర్వం యస్మిన్ శేతే సర్వస్మిన్ యశ్శేతే' - అన్నీ ఎవరియందు ఉన్నాయో, అన్నింటియందూ ఎవరున్నారో ఆమె అమ్మ.

'యథేయం పృథివీ మహీ భూతానాం గర్భమాదధే' అనే మంత్రం ప్రకారం 'విశ్వగర్భా' అనేది భూదేవికి కూడా పేరు. భూదేవి సమస్తము తన గర్భంలో పెట్టుకుంది. ఈ తల్లే నిజమైన తల్లి. లోకంలో తల్లులు కన్న తరువాత కొన్నాళ్ళకి "నీ బ్రతుకు నీదే" అని వదిలేయవచ్చు కానీ ఈ తల్లి అలాంటిది కాదు. ఇక్కడే పుట్టాం. ఇక్కడే పెరిగాం. మళ్ళీ ఇక్కడే కలుస్తాం. విశ్వము అనే దానికి సమస్తము అని అర్థం. సమస్తమును ధరించేది భూదేవి గనుక 'విశ్వగర్భా'. అంతే కాదు భూమాతకి విశ్వగర్భా, అగ్నిగర్భా, రత్నగర్భా అని ఎన్నో పేర్లు ఉన్నాయి.

638. స్వర్ణగర్భా - శ్రీ స్వర్ణగర్భాయై నమః

స్వర్ణాదిధాతువులను తన గర్భంలో పెట్టుకున్న భూదేవి స్వర్ణగర్భా. మరొక అర్థం- **'స్వర్ణాశ్శోభనార్ణాః మన్త్రాగర్భే యస్యాః'.** స్వర్ణము అంటే శోభనమైన వర్ణములు. శుభాన్ని కలిగించే శక్తి కలిగిన అక్షరాలు స్వర్ణములు. కనకధారాస్తోత్రానికి శంకరులు సువర్ణధారాస్తోత్రమని పేరు పెట్టారు.

అక్షరాలే బంగారం. సు-వర్ణమే స్వర్ణము. శుభము కలిగించే మంత్రములన్నీ ఎవరి కడుపులో ఉన్నాయో ఆవిడ స్వర్ణగర్భా. అన్ని మంత్రాలను కన్నతల్లి.

ఆవిడే 'గౌరీ' అనగా శబ్దబ్రహ్మస్వరూపము. ఆ శబ్దబ్రహ్మలోనే లోకాలన్నీ ఉన్నాయి. ఆ శబ్దబ్రహ్మలోనే మంత్రాలన్నీ ఉన్నాయి. ఆ శబ్దబ్రహ్మరూపిణియే గౌరీ.

లోకంలో కూడా ఎవరైనా చక్కని మాట చెప్తే బంగారంలాంటి మాట చెప్పారంటారు. బంగారంలాంటి మాటలన్నీ వేదవేదాంత విద్యలే. ఆ వేదాంతవిద్య అనే స్వర్ణమును తన లోపల దాచుకుంది గనుక 'స్వర్ణగర్భా'.

మంత్రాల లోపల ఉన్న చైతన్యం కూడా అమ్మవారే. విశ్వమంటే దృశ్యమానమైన సమస్త రూప జగత్తు. స్వర్ణము అంటే అక్షరమైన నామజగత్తు. నామరూపాత్మకమైన సర్వమూ ఆ శబ్దబ్రహ్మస్వరూపిణి అయిన ఓంకారరూపిణి అయిన 'గౌరీ', 'ఉమా'లోనే వ్యాపించి ఉన్నాయి.

శాస్త్రాల ప్రకారం ఎవరైతే అమ్మవారిని ఉపాసన చేస్తారో వారికి లభించనివి అంటూ లేవు. సృష్టిలో ఏది కావాలన్నా పట్టుకోవలసినది అమ్మవారినే. మనం ఏదో పొందాలని ఎవరి దగ్గరకో వెళ్తుంటాం కానీ అమ్మవారిని పట్టుకుంటే చాలు. **"ఆపది కిం కరణీయం స్మరణీయం చరణయుగళమంబాయాః"** - అమ్మవారిని ఆశ్రయించాలి.

వేదాది మంత్రవిద్యలని అనుష్ఠానం చేస్తూ తద్వారా అమ్మవారిని ఆరాధన చేస్తుంటాం. మంత్రం చేసేటప్పుడు, "అమ్మా! దీనిలో నువ్వు ఉన్నావు. ఇది నీ నుండి వచ్చింద"నుకొని చేస్తుంటే ఆ మంత్రం చేస్తున్నంతసేపూ అమ్మ మనతో ఉన్నట్లుగానే అనిపిస్తుంది.

తన విద్యని ఉపాసించేవారికి కోరుకున్నవి, గొప్పవైన వరాలన్నీ ఇస్తుంది కనుక 'వరదా' అని తరువాత నామంలో చెప్తున్నారు.

639. వరదా – శ్రీ వరదాయై నమః / అవరదా – శ్రీ అవరదాయై నమః

ఈ నామాన్ని వరదా అని చెప్పుకోవచ్చు లేదా అవరదా అని చెప్పుకోవచ్చు. విశ్వగర్భా స్వర్ణగర్భా వరదా వాగధీశ్వరీ అని ముందునామాలతో కలిపి చదివినప్పుడు 'అ' అనేది సంధిలో కలసిపోయి వరదా అనేదే వినబడుతోంది. స్వర్ణగర్భాఽ వరదా. కాని 'వరదా వామనయన' అని అంతకు ముందు వచ్చిన నామాలలో వరదా వచ్చింది కనుక ఇక్కడ 'అవరదా' అని భాష్యకారులు విభజించి చూపించారు. భాష్యకారులు అంటే మంత్రరహస్యం తెలిసినవారు. వారు చేసిన విభజనను మనం గౌరవించవచ్చు.

వరదా అనే అర్థాన్నే చెప్పుకుంటే 'వరములను ఇచ్చే తల్లి' అని అర్థం. శబ్దబ్రహ్మము యొక్క ప్రయోజనాన్ని తెలియజేస్తున్నారు. శబ్దబ్రహ్మము వరాలను ఇస్తుంది. వేదములోని కర్మకాండ చేస్తే ఇహలోక, పరలోక సుఖాలు వస్తాయి. వరములు అంటే వరించినవి, కోరుకున్నవి అని అర్థం. కామ్యములైనవి అన్నీ ఇహలోక, పరలోక సుఖాలు కూడా విద్య ద్వారా, మంత్రాల ద్వారా పొందుతున్నాం కనుక వరదా.

వరము అంటే శ్రేష్ఠమైనది. అన్నిటి కంటే శ్రేష్ఠమైనది మోక్షము. దానిని కూడా నేను ఇస్తాను అంది అమ్మవారు. వరదా అంటే మోక్షము ఇచ్చునది. ఒకే శబ్దములో రెండు అర్థాలు ఉన్నాయి.

వరాన్ అభీష్టాన్ ఉపాసకేభ్యః దదాతి – అభీష్టాలను ఉపాసకులకు ఇచ్చునది కనుక వరదా.

వరం ఉత్తమం జ్ఞానం స్వభక్తాయ ఇంద్రాయ దదాతి ఇతి వా వరద – ఇంద్రునికి విద్యని ఇచ్చిన గురుస్వరూపం ఇక్కడ చెప్పబడుతున్నది. ఇంద్రునికి సైతము వరము ఇచ్చినది కనుక వరదా అని చెప్పుకోవచ్చు

'అవరదా' అనేది కూడా చాలా విశిష్టమైన నామమే. విశ్వగర్భా, స్వర్ణగర్భా కనుక అన్నింటికి వరాలు ఇచ్చేది ఆ తల్లే. జగత్తుకు వరాలను ఇవ్వడం ఆ తల్లి లక్షణంగాని, ఆ తల్లికి వరాలను ఇచ్చేవారు సృష్టిలో ఎవరూ లేరు కనుక అవరదా. అవరదా అంటే తనకు వరదాతలు అంటూ లేని తల్లి అని ఒక అర్థం. ఒకొక్క దేవతను ఆరాధిస్తే ఒకొక్క రకమైన వరాలను ఇస్తారు. కాని అందరిలోకి సాటిలేని వరదాత అమ్మవారే. అవరదా అంటే సాటిలేని వరదురాలు అని అర్థం.

అవరదా అంటే చక్కని ప్రకాశమానమైన దంతపంక్తి అని మరొక అర్థం. దంతములు చిరునవ్వు నవ్వితే కనబడతాయి. అమ్మవారు చిరునవ్వు నవ్వుతున్నారు. 32 మాతృకావర్ణాలకు సంకేతాలుగా 32 దివ్యదంతాలు ప్రకాశిస్తున్నాయి. అటువంటి చక్కని దంతపంక్తి విద్యను, మనఃప్రసన్నతను కూడా తెలియజేస్తున్నాయి.

నవ్వు మనస్సులో ప్రసన్నత, ఆనందము ఉన్నప్పుడు వస్తుంది. అమ్మకు మనపట్ల ప్రసన్నత, వాత్సల్యము ఉంది అని ఆ దంతపంక్తి తెలియజేస్తోంది. కనుక అవరదా అని నవ్వుని ప్రకటించే దంతాలను ఇందులో వర్ణించారు.

మరొక అర్థంలో సోదరీసోదరులలో తన కన్నా చిన్నవారిని 'అవర' అని అంటారు. అవర-దా అంటే అటువంటివారిని ఇచ్చేది. ఈ అర్థం ఇక్కడ సముచితమా అంటే సముచితమే. ఒక విద్య అనేది ఒక గొప్పవాని దగ్గర ఉన్నప్పుడు అది వానితోనే అంతరించిపోతే కష్టం. వారి తరువాత దానిని అందుకునేవారు ఉండాలి. ఆ విద్యను అందుకునేవారిని కూడా అమ్మవారే ఇస్తారు.

ఒక గురువుకి అంత విద్య ఉంటే వారు ఆ బరువుని తట్టుకోలేరు. గురువు అంటేనే బరువైనవాడు అని అర్థం. అంత బరువైన ఆ విద్యని ఎవరికైనా ఇవ్వాలి. అది మిగిల్చి వెళ్ళాలి అంటే స్వామి నా దగ్గర మిగల్చండి అని వచ్చేవాడే శిష్యుడు. అలాంటి శిష్యులు అవరులే. కనుక సోదరీసోదరులు, వధూవరులు, వటువులు, కన్యలు, వీరంతా అవర శబ్దవాచ్యులు.

పూర్వము నుంచి వచ్చినదానిని కొనసాగించేవారు అవరులు. అటువంటివారు లేకపోతే విద్య సాగదు. ఇక్కడ బ్రహ్మవిద్యాస్వరూపం గురించి చెప్తున్నారు కనుక ఆ

విద్యని కొనసాగించే రూపంలో ఉన్న అమ్మవారు, వారిని ఇచ్చే అమ్మవారు అని కూడా దీనికి అర్థాన్ని చెప్పారు. ఇందులో కూడా గొప్ప పరమార్థం ఉంది. నమః పూర్వజాయ చ అవరజాయ చ అని అవరస్వరూపంలో ఉన్న రుద్రునికి కూడా రుద్రనమకంలో నమస్కరించారు. ఆ విద్యని కొనసాగించే తరువాతివారు, తన తరువాత పుట్టినవారు అని అర్థం. అటువంటి వారిని ఇచ్చే తల్లి.

శబ్ద బ్రహ్మము యొక్క ప్రయోజనాన్ని తెలియజేస్తున్నారు. శబ్దబ్రహ్మము వరాలను ఇస్తుంది. వేదంలోని కర్మకాండ చేస్తే ఇహలోక, పరలోకసుఖాలు వస్తాయి. వరములు అంటే వరించునవి, కోరుకున్నవి అని అర్థం. కామ్యములైన అన్ని ఇహపరలోక సుఖాలు కూడా విద్య ద్వారా, మంత్రాల ద్వారా పొందుతున్నాం కనుక 'వరదా'.

వరము అంటే శ్రేష్ఠమైనది. అన్నింటి కంటె శ్రేష్ఠమైనది మోక్షం. దానిని కూడా "నేనే ఇస్తానం"ది అమ్మవారు. వరదా అంటే మోక్షమిచ్చునది. ఒకే శబ్దంలో రెండు అర్థాలు ఉన్నాయి. ఈ వరదా అయిన వాగ్దేవతే 'వాగధీశ్వరీ' అని తరువాత నామం.

640. వాగధీశ్వరీ – శ్రీ వాగధీశ్వర్యై నమః

వాక్కులకు అధీశ్వరి. శబ్దబ్రహ్మరూపములే వాక్కులు. అన్నింటికి ఆవిడే అధీశ్వరి. తన నుండి వచ్చిన వాక్కులకు తానే ఈశ్వరిగా కూర్చుని ఉంది. ఆ వాక్కుని ఎవరు ఉపాసిస్తున్నారో వారిని అనుగ్రహిస్తోంది.

ఇక్కడ చెప్పబడుతున్న తల్లి సరస్వతీదేవి. **"ప్రణోదేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ ధీనా మవిత్ర్యవతు".** ఈ మాట చాలా విశేషం.

'ధీనామ్ అవిత్రీ' అంటే బుద్ధులను రక్షించు తల్లి. అవతు– అంటే రక్షించు గాక! వాజేభిర్వాజనీవతీ– అంటే అన్నములతో అనుగ్రహించు గాక! అన్నములు అంటే ఐశ్వర్యములు. ఐశ్వర్యాలన్నీ ఆవిడ దగ్గరే ఉన్నాయి.

అన్ని ఐశ్వర్యాలు కలిగించింది గనుక 'వాజినీవతీ'. 'వాజేభిః' అంటే

అన్నములతో, ఇంద్రియములు అనుభవించే ఐశ్వర్యములతో అనుగ్రహించు గాక! 'ధీనామవిత్రీ' - మా బుద్ధులను కాపాడుతూ ఉన్నది. అలాంటి ఆ తల్లి 'ప్రణోదేవీ సరస్వతీ'- ప్రకృష్టముగా మమ్మల్ని అనుగ్రహించు గాక!

అమ్మవారి విద్య వాగ్విద్య. పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అని నాలుగు రూపాలుగా వచ్చిన వాగ్రూపంగా ఉన్న అధీశ్వరి. మన ప్రాణాలకు అధిష్ఠానంగా ఉంటూ మనలో పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అనబడే వాగ్దేవతగా ఉంది కనుక వాగధీశ్వరీ. ఇటువంటి ఆ తల్లిని ఉపాసించే విధానం తరువాత నామాలలో చెప్తున్నారు.

641. ధ్యానగమ్యా - శ్రీ ధ్యానగమ్యాయై నమః

విశ్వగర్భా, స్వర్ణగర్భా అన్నప్పుడు మంత్రం. తరువాత నామంలో 'ధ్యానగమ్యా'. 'ఉమా', 'గౌరీ' అంటే బ్రహ్మవిద్య అని చెప్పుకున్నాం. ఆ బ్రహ్మవిద్యనే ఆవిష్కరిస్తున్నారు. ఆ బ్రహ్మవిద్య ఊరికనే దొరకదు. 'ధ్యానగమ్యా' అని చెప్పారు.

"కుతో జాతా జీవామః కేనవా వయం?" మనం ఎక్కడ నుంచి పుట్టాం? ఎవరి వల్ల పెరుగుతున్నాం? ఎటు పోతున్నాం? అని ప్రశ్నలు బ్రహ్మవాదులు వేసుకున్నారు.

బ్రహ్మవాదులు అంటే నిరంతరం బ్రహ్మము గురించి ఆలోచించే మహానుభావులు, "మనం దేని వలన పుట్టాం? దేని వలన పెరుగుతున్నామ"నే ఆలోచన చేశారు.

'తే ధ్యాన యోగానుగతా అపశ్యన్ దేవా ఆత్మశక్తిం స్వగుణైర్నిగూఢాం' (కేనోపనిషత్తు) - ధ్యానయోగంలోకి వెళ్ళారు. అలా వెళ్ళినప్పుడు ఈశ్వరశక్తి గోచరించింది. ఆ ఈశ్వరశక్తి "నేను బ్రహ్మమును" అని చెప్పింది. ఇది బ్రహ్మవిద్య. నా యందే సర్వము ఉన్నది. అసలు నేను లేక మరొకటి లేదని తనను తాను ప్రకటించుకుంది. భగవత్ జ్ఞానం తనంత తాను ప్రకటింపబడాలి. అలా ప్రకటింపబడాలంటే ధ్యానము ద్వారానే సాధ్యం.

"తల్లీ! గుణములచే నిగూఢమైన నిన్నే ధ్యానయోగంలోనికి వెళ్ళిన

మహానుభావులు దర్శించారు." ఇది ఉపనిషత్తులోని మాట.

మనం దేని వలన ఉన్నామనేది 'కేన' అన్న ప్రశ్నతో మొదలైంది కనుక దాని పేరు కేనోపనిషత్తు. ఆ ప్రశ్నకు వారు చేసిన పరిష్కారం ధ్యానం. ఆ ధ్యానయోగం ఫలించగానే ఈశ్వరశక్తిని దర్శనం చేశారు. ఆ శక్తే బ్రహ్మవిద్యగా ప్రకటింపబడింది. ధ్యానం వలన బ్రహ్మవిద్య తెలియబడింది.

642. అపరిచ్ఛేద్యా – శ్రీ అపరిచ్ఛేద్యాయై నమః

పరిచ్ఛేదము అంటే తెగగొట్టుట. అనగా ఇది ఇంతే అని నిర్దేశించి చెప్పుట. మనం చూసే ప్రపంచం అంతా పరిచ్ఛేదమే.

ఉపాధులు అన్నీ పరిచ్ఛేద్యములే. ఆ చైతన్య స్వరూపము మాత్రమే అపరిచ్ఛేద్యము – పరిచ్ఛేదించడానికి వీలులేనిది. పరిమితి లేనిది అని దీని అర్థం. అమేయాత్మా దగ్గర చెప్పినదే ఇక్కడ భావిస్తే సులభంగా ఈ నామానికి అర్థం గ్రహించవచ్చు. అమ్మవారు సర్వవ్యాపిని. కొలతకి అందని తల్లి కనుక అపరిచ్ఛేద్యా.

643. జ్ఞానదా – శ్రీ జ్ఞానదాయై నమః

జ్ఞానాన్ని ప్రసాదించే తల్లి. సూర్యుడు కాంతి విగ్రహుడు కనుక కాంతిని ఇవ్వగలిగాడు. జ్ఞానమే అమ్మ కనుక జ్ఞానాన్ని ఇవ్వగలిగింది.

మన సర్వేంద్రియాలకి వివిధ వస్తువులని గ్రహించగలిగిన జ్ఞానమిచ్చిన తల్లే 'జ్ఞానదా'. ఇంద్రియాతీతమైన స్వస్వరూపజ్ఞానాన్ని ప్రసాదించే బ్రహ్మవిద్యారూపిణి – జ్ఞానదా.

644. జ్ఞానవిగ్రహా – శ్రీ జ్ఞానవిగ్రహాయై నమః

జ్ఞానమే అమ్మవారి విగ్రహం. జ్ఞానము యొక్క సాకార రూపిణి. **'జ్ఞానమేవ పరం బ్రహ్మ జ్ఞానం బంధాయ చేష్యతే, జ్ఞానాత్మకమిదం విశ్వం న జ్ఞానాద్విద్యతే పర' విద్యావిద్యేతి మైత్రేయ జ్ఞానమేవోపధారయ** – "జ్ఞానమే పరబ్రహ్మము. జ్ఞానమే

బంధాన్ని కలిగిస్తుంది. ఈ జగమంతా జ్ఞానాత్మకం. జ్ఞానం కంటె రెండవది, గొప్పది లేదు. ఓ మైత్రేయా! విద్య, అవిద్య – రెండూ జ్ఞానమే అని తెలుసుకో" అని 'విష్ణుపురాణం'లో పరాశరోక్తి.

'పరమాత్మ' అనే అర్థంలో 'జ్ఞానం' అనే పదం చెప్పబడింది. విశ్వమంతా జ్ఞానరూపంగా వ్యాపించినది 'జ్ఞానవిగ్రహా.' జ్ఞానం దేని ద్వారా ప్రతిపాదింప బడుతోందో తరువాత నామంలో చెప్తూ 'సర్వవేదాంతసంవేద్యా' అన్నారు.

645. సర్వవేదాంతసంవేద్యా – శ్రీ సర్వవేదాంతసంవేద్యాయై నమః

జ్ఞానం పరమేశ్వరి. అమ్మ దయలేనిదే రాదు.

సూర్యుని విడిచిపెట్టి వెలుగును తెచ్చుకోవడం ఎంత కష్టమో, అమ్మవారిని విడిచిపెట్టి జ్ఞానాన్ని తెచ్చుకోవడం అంతే కష్టం. **'ఈదృశీ పరమా విద్యా శాంకరీ భవనాశినీ, ప్రసాదాదేవ జంతూనాం శక్తిరేవ హి జాయతే'** – అమ్మవారు భవనాశినీ అయిన పరమావిద్యా. ఆవిడే శాంకరీ. **'పరానుభూతిం భవపాశనాశినీం'** అని ఉమాకి భవనాశినీ అనే పేరు చెప్పుకున్నాం. భవనాశినీ అయిన శాంకరీ యొక్క అనుగ్రహము చేతనే జ్ఞానం లభిస్తున్నది.

'విద్యారూపా యా శివా వేదవేద్యా
సత్యానందానంత సంవిత్స్వరూపా
తస్యా వాచః సర్వలోకైకమాతుః
భక్త్యైవస్యాదంబికాయాః ప్రసాదాత్' – ఉపనిషద్వేద్యం, నిత్యం, ఆనందం అయిన జ్ఞానం సర్వలోకమాతయందలి భక్తి చేత, ఆ దేవి అనుగ్రహం చేత లభిస్తుంది.

అంబిక యెడల భక్తి కలిగితే వారిని అనుగ్రహించి అమ్మ జ్ఞానమిస్తుంది. మరొక మార్గము లేదని శాస్త్రం చెప్తోంది. జ్ఞానం ఇచ్చే తల్లి కనుక జ్ఞానదా, జ్ఞానవిగ్రహా. ఉమా అని చెప్పబడుతున్న శ్రీవిద్యను ఉపాసన చేస్తున్నవారికి ఆ శ్రీవిద్యలో సర్వమంత్రాలు గర్భీకృతమై ఉన్నాయి కనుక అది 'స్వర్ణగర్భా'. అలాంటి ఆ శ్రీవిద్యాధిదేవత ఉపాసించిన వారికి అన్ని వరాలు ఇవ్వడమే గాక జీవిత

పరమార్థమైన బ్రహ్మజ్ఞానాన్ని కూడా అనుగ్రహిస్తున్నది (వరదా, జ్ఞానదా) అని శ్రీవిద్యా ప్రయోజనం తెలియజేస్తున్నారు. ఆ శ్రీవిద్యయే జ్ఞానము యొక్క స్వరూపము గనుక 'జ్ఞానవిగ్రహా'.

'ఆత్మవిద్యా మహావిద్యా శ్రీవిద్యా'. మహావిద్య అంటే బ్రహ్మవిద్య. అదే 'సర్వవేదాంతసంవేద్యా'. వేదము అన్నప్పుడు రెండు భాగాలు. కర్మకాండ, జ్ఞానకాండ. జ్ఞానకాండ మాత్రమే చెప్పే భాగం వేదాంతం అది ఉపనిషత్తు. సర్వవేదాంతములలో చక్కగా దొరికేదే 'జ్ఞానదా', 'జ్ఞానవిగ్రహా'. సంవేద్యా అంటే సమగ్రముగా, సంపూర్ణముగా, స్పష్టముగా, తేటతెల్లముగా అని అర్థం.

అమ్మవారు సర్వవేదాంతాలలో తేటతెల్లముగా తెలియబడుతోంది. కొమ్మలు ఎన్నైనా పళ్ళు ఒక్కటే, రుచి ఒక్కటే. అలా రకరకాలుగా ఉపనిషత్ శాఖలు కనబడుతున్నా వాటి అన్నింటిలో లభించే రసస్వరూపిణి ఈ తల్లే. ఆ స్వరూపాన్ని తరువాత నామములో చెప్తున్నారు.

646. సత్యానందస్వరూపిణి – శ్రీ సత్యానందస్వరూపిణ్యై నమః

వేదాంతాన్ని చెప్పే జ్ఞానం ఏది సత్యమో, ఏది అసత్యమో తెలియజేస్తూ స్వస్వరూపాన్ని చెప్తుంది. సత్యము అంటే త్రికాలాలో నశించనిది. అదే ఆనందము.

లోకంలో దొరికేవన్నీ ఆభాసానందాలు. అవి లౌకికానందాలు. అమ్మవారు అటువంటి స్వరూపిణి కాదు. లోకేశ్వరి, నిరతిశయానందస్వరూపిణి. అఖండ సచ్చిదానంద రూపము. ఆ ఆనందమొక్కటే సత్యము. మిగిలినదంతా కూడా కపటము, మిథ్య.

ఏషా త్రిశక్తిరుద్దిష్టా నయసిద్ధాంతగామినీ
ఏషా జ్ఞానాత్మికా శక్తిః సర్వవేదాంతగామినీ

సిద్ధాంతాల చేత శక్తిగా, వేదాంతములచే జ్ఞానాత్మిక శక్తిగా చెప్పబడుతున్నది.

అమ్మవారు మాత్రమే అసలు. ఆ అసలే సత్యం. అదే సత్యానందస్వరూపిణి. స్వ అంటే తన. తన రూపముగా ఉన్నది. సత్యానందస్వరూపిణి అంటే ఆత్మరూపంగా

ప్రకాశిస్తూ ఉన్నది. ఇదంతా ఎలా తెలుస్తుందంటే 'సర్వవేదాంతసంవేద్యా'. మన స్వస్వరూపమైన సత్యానందాన్ని పొందించే శాస్త్రమే వేదాంతము. **'సదితి ప్రాణమస్తీత్యన్నమయం ఇత్యసావాదిత్యః'** అన్న శ్రుతి ప్రకారం ప్రాణ, అన్న, ఆదిత్య స్వరూపిణి. **"సచ్చత్యచ్చాభవతే"** అని చెప్పినట్లుగా కార్యకారణాత్మకమైన ఆనంద స్వరూపిణి పరమేశ్వరి.

బ్రాహ్మీస్థితికి వెళ్ళిన తరువాత పూజలు, ముద్రలు, క్రియలు ఉండవు. ఆ స్థితినే తరువాత నామంలో చెప్తున్నారు.

647. లోపాముద్రార్చితా – శ్రీ లోపాముద్రార్చితాయై నమః

ఉపాసనలన్నీ దాటి వేదాంతస్థితికి వెళ్ళాక అనుభవానికి వచ్చే స్థితే 'లోపాముద్రార్చితా'. ముద్రాదులన్నీ లుప్తమైన స్థితిలో లభిస్తున్నదని తాత్త్వికార్థంగా చెప్పుకోవచ్చు. కేవల విచారణ చేత తాదాత్మ్యస్థితిని పొందిన వారిచే అనుసంధానింపబడే పరబ్రహ్మస్వరూపిణి. అంతర్యాగస్థితిని అన్వయించవచ్చు.

'మనువిద్యా, చంద్రవిద్యా, పులోమజార్చితా' – ఇత్యాది నామాలలో అమ్మవారిని ఉపాసించిన వారిని ఇప్పటి దాకా చాలామందిని తలచుకున్నాం. వీరిలో రెండు రకాలు. అమ్మవారిని పూజించిన భక్తులున్నారు. అమ్మవారి మంత్రాన్ని ద్రష్టలై దర్శించి, ఆ మంత్రాన్ని మనవరకు వ్యాప్తి చేసినవారున్నారు. మనువిద్యా, చంద్రవిద్యా, కామసేవితా – ఇవన్ని అమ్మవారి మంత్రద్రష్టలను తెలియజేసే నామాలు. కమలాక్షనిషేవితా, శివారాధ్యా – ఈ నామాలు కూడా అమ్మ మంత్రాన్ని దర్శించి ఇచ్చినవారిని తెలియజేశాయి.

అలా అమ్మ మంత్రద్రష్టలలో ఒక ద్రష్ట 'లోపాముద్రాదేవి'. మనువిద్యా, చంద్రవిద్యా ఎలాగైతే చెప్పబడ్డాయో శ్రీవిద్యలో 'లోపాముద్రవిద్యా' అని ఒకటి ఉన్నది. అది హకారంతో ప్రారంభమౌతుంది. అది గురుముఖైకవేద్యం. ముందు ఉపోద్ఘాతంలో విస్తారంగా అగస్త్యుని గురించి వివరించుకున్నాం. "లోపాముద్రాపతే! అగస్త్య!" అన్నారు హయగ్రీవస్వామివారు. "ఓ అగస్త్యా! నువ్వు లోపాముద్రాదేవి

పతివి కాబట్టే నీకు లలితాసహస్రనామం వినడానికి అర్హత వచ్చింది" అన్నారు. అగస్త్యులవారిని పెళ్ళి చేసుకోవడానికి ఆవిడ తపస్సు చేసింది. ఆవిడకి ఎవరూ మంత్రం ఇవ్వలేదు. గౌరీదేవినే ఆదర్శంగా తీసుకొని ఆ దేవినే ఆరాధించింది.

అమ్మవారు కనబడి మంత్రం ఉపదేశించారు. తపస్సుకు చేరుకున్నాక తల్లే కనబడి మంత్రం చెప్తే వారినే ద్రష్టలు అంటారు. భగవంతుడే తన శబ్దాన్ని తాను ఉపదేశిస్తే ఆ విన్నవాడు ద్రష్ట అయిపోతాడు. లోపాముద్రా అనే తల్లి ఒక ఋషిక.

అమ్మవారు తన నామాలలో 'లోపాముద్రార్చితా' పేరు పెట్టించింది. లోపాముద్ర చేత ఆరాధింపబడిన తల్లి. లోపాముద్ర పేరుతో ఒక విద్య ఉన్నది. ఒక మంత్రమున్నది. ఆ మంత్రము ఆ తల్లి ద్రష్టగా మనకి ఇచ్చింది. **"పత్న్యస్య లోపాముద్రాఖ్యా మాముపాస్తే అతి భక్తితః"** (బ్రహ్మాండపురాణం) – అగస్త్యుని యొక్క పత్ని నన్ను బాగా ఉపాసన చేసింది కనుక ఆవిడ పేరున నా విద్యకు ఒక నామకరణం చేస్తున్నానని అమ్మవారు అన్నది. భక్తుని పేరు భగవంతుడు చెప్పడం గొప్ప విషయం. ఆ తల్లి పేరు జగజ్జనని చెప్పింది అంటే ఆవిడ ఎంత ధన్యురాలో తెలుసుకోవాలి.

అగస్త్యపత్న్యా లోపాఖ్యముద్రాయాః పరమేశ్వరీ

ప్రసన్నత్వాదియం దేవీ లోపాముద్రేతి గీయతే – "అగస్త్యుని పత్ని 'లోప' అనే ముద్రతో పరమేశ్వరికి ప్రీతి కలిగించింది. అప్పటినుండి ఆమె పేరు లోపాముద్ర" (త్రిపురాసిద్ధాంతం)

అమ్మవారు మెచ్చిన భక్తురాలు 'లోపాముద్రాదేవి'. ప్రతిరోజూ ప్రాతః స్మరణీయులు లోపాముద్రా–అగస్త్యులు. ఏ దివ్యభూమికలలోనో, తపోనిష్ఠలోనో ఉన్న లోపాముద్రాఅగస్త్యులు మనలను అనుగ్రహింతురుగాక!. వారిని శ్రీవిద్యలో ఉన్న ప్రతివారు నమస్కరించుకోవలసినదే. వారికి దివ్యౌఘ, సిద్ధౌఘములలో ఉభయలక్షణాలు ఉన్నాయని భావన చెయ్యవలసినదే. ఆ మహాత్ములకి నమస్కారం చేసుకుంటూ లోపాముద్రా విద్యకు మరొక అర్థం చెప్పుకుందాం.

'విద్యా తృతీయఖండేన కుర్యాత్ సర్వోపచారకాన్' – ఇది శ్రీవిద్యారహస్య

భాష్యం. కేవలం మూడవ ఖండంతో మాత్రమే ఉపాసన చేస్తే దానిని లోపాముద్రా విద్య అంటారు. మొదటి రెండు ఖండాలు ధర్మార్థ కామములు. మూడవది కేవలం మోక్షం కనుక ఆ విద్యని లోపాముద్ర అని అన్నట్లు ఒక నిర్వచనముంది. ఈ వ్యాఖ్యానం తదుపాసకులకి గ్రాహ్యం.

648. లీలాక్లుప్తబ్రహ్మాండమండలా
– శ్రీ లీలాక్లుప్తబ్రహ్మాండమండలాయై నమః

క్లుప్త అంటే సమకూర్చుట, ఒక పద్ధతిలో పెట్టుట. అన్నీ చక్కగా అమర్చుట. అమ్మవారు బ్రహ్మాండ మండలాలన్నీ సొరుగుల్లో పెట్టినట్లు భలే అమర్చిపెట్టింది. ఇంట్లో అమ్మ పాత్రలన్నీ వాడకానికి సర్ది పెట్టినట్లు ఈ తల్లి జగత్తునంతటిని చక్కగా సవరిస్తుంది. **'తస్య శక్తి సముల్లాసమాత్రం జగదితి స్థితం'** – ఆ పరమాత్మ శక్తి సముల్లాసమే జగత్తుగా ఉన్నది అని యోగవాసిష్ఠం.

ఇలా అమ్మవారు బ్రహ్మాండమండలం సవరించడం లీలగా చేసింది. 'లీలయా' అంటే 'అనాయాసేన'. ఏ మాత్రం ఆయాసం లేకుండా హాయిగా అనంతకోటి బ్రహ్మాండాలన్నీ ఒక వరుసలో పెడుతుంది.

సవరించడం అంటే ఒక నియమపద్ధతిలో నడపడం. దీన్నే క్లుప్త అంటారు. ఎప్పుడు దేనిని వ్యక్తం చెయ్యాలి? ఎంత కాలం నడపాలి? కోట్లకొలది ఉన్న జీవులకు ఎప్పుడు, ఎక్కడ, ఏమిటి ఎలా అందించాలి? ఇదంతా చెయ్యడమే అదే క్లుప్తత.

'స్వేచ్ఛయా స్వభిత్తౌ విశ్వం ఉన్మీలయతి' – 'స్వేచ్ఛగా తాననెడు గోడపై ఈ జగత్తును ప్రకటించినది' – అని శక్తి సూత్రంలో చెప్పినట్లుగా తన యొక్క లీలతో తన శక్తి యందు ఈ లోకాన్ని ప్రతిఫలింపజేస్తున్నది. ప్రతిఫలింప అనేది వేదాంత పరిభాష. **'లోకవత్తు లీలా కైవల్యం'** అని బ్రహ్మసూత్రాలు చెప్తున్నాయి. ఈ లోకమంతా ఒక లీల. లీల అంటే అర్థం చెప్పలేనిది. పరమాత్మ ఎందుకు చేశాడనేది మనకు తెలియదు.

చిన్నపిల్లలకి తల్లిదండ్రులు ఎందుకు ఏం చేస్తున్నారో అర్థం కాదు. "నాన్నా! ఎందుకలా చేశావ"ని పిల్లలు అడిగితే "నీ కనవసరమ"ని తల్లితండ్రులు పిల్లల్ని అంటారు. అంటే నీకు ఇంకా దానిని అర్థం చేసుకునే పరిణతి రాలేదు, ఊరుకోమని చెప్పడమే.

తమ కంటె వయస్సులో ఉన్న తల్లిదండ్రులే ఎందుకు అలా చేశారో పిల్లలకి అర్థం కాదే! అలాంటిది అన్ని విధాలా పెద్దవాడైన పరమాత్మ ఎందుకు ఏం చేశాడో మనకి అర్థం అవుతుందా? ఇంత ప్రపంచం పరమాత్మ ఎందుకు చెయ్యాలి వంటి ప్రశ్నలు మాత్రం చిన్నపిల్లల్లా అడుగుతూ ఉంటారు.

ఈశ్వర కృత్యాలు మనకి అర్థం కావు. నమస్కారం చేసుకుని ఊరుకోవడం ఉత్తమము. లీల అంటే మన బుద్ధితో అర్థం చేసుకోలేని ఈశ్వర కృత్యము. అనాయాసంగా ఆవిడ చేసే పనులను తెలుసుకోవడం మనకి మహాయాసం. 'అనిర్వచనీయ శక్తిః' – ఇలా అని నిర్దేశించలేని శక్తి అని అర్థం. ఆ శక్తి యొక్క స్వరూపాన్ని తరువాత నామాలలో ఆవిష్కరిస్తున్నారు. 'అదృశ్యా, దృశ్యరహితా, విజ్ఞాత్రీ, వేద్యవర్జితా'

649. అదృశ్యా – శ్రీ అదృశ్యాయై నమః

ముందు చెప్పుకున్న అపరిచ్ఛేద్యా, అమేయాత్మా అంత లోతైన నామం ఇది. 'అదృశ్యా' ఆవిడ కనబడదు. ఇంత దాకా వర్ణించి ఈ నామం దగ్గర 'కనబడదు' అని చెప్తున్నారు. కనబడితే దృశ్యవస్తువే అవుతుంది. చావు పుట్టుకలు లేని శాశ్వత వస్తువుని పట్టుకోవాలి. శాశ్వతమైనది అశాశ్వతానికి గోచరించదు. కనుక ఆ తల్లి 'అదృశ్యా'. ఇంద్రియాలకు గోచరించనిది.

'నదృష్టేః ద్రష్టారం పశ్యేత్' – 'దృష్టి లోపలనున్న ద్రష్టను చూడలేదు' అని ఉపనిషత్తు.

650. దృశ్యరహితా – శ్రీ దృశ్యరహితాయై నమః

దృశ్యము లేనిది. అస్తి, భాతి, ప్రియం, నామం, రూపం – ఇవి ఐదు అంశాలు. నామం, రూపం ప్రపంచ లక్షణం. పరమాత్మ స్వరూపం అస్తి, భాతి, ప్రియం. మన లోపల ఉన్న చైతన్యం అస్తి, భాతి, ప్రియం. మన శరీరము నామం, రూపం. అలాగే ప్రపంచం అంతా ఉంటుంది.

కనబడుతున్నది అంతా నామరూపాలు. లోపల అస్తి, భాతి, ప్రియం ఉన్నాయి. అవి మాత్రం ఎవరికి కనబడవు. అదృశ్యా అంటే అస్తి, భాతి, ప్రియం. అది తెలియాలంటే దృశ్యాన్ని తీసెయ్యాలి. నామ రూపరహితమే 'దృశ్యరహితా'.

నామరూపాలు తీసేస్తే మిగిలిన అస్తి, భాతి, ప్రియములే – 'అదృశ్యా'. **'నిర్గుణా దుర్గమా శక్తిః'**(దేవీభాగవతం). అమ్మవారి శక్తి – నిర్గుణా, దుర్గమా. నిర్గుణమైనది ఎప్పుడూ దుర్గమమే. అంత తేలికగా దొరకదు. నామరూపాలైతే అర్థమౌతాయి. అమ్మవారి రూపం ఇలా ఉందని చెప్తూ ఉంటే కళ్ళకి కట్టినట్టుంది అంటాం. కానీ నామరూపాలుగా మనకి ఆవిడ కనబడుతున్నా ఆవిడ అసలు స్వరూపం అస్తి, భాతి, ప్రియం.

ఎప్పుడైతే దృశ్యవస్తువు వచ్చిందో అది జడమే. దృక్ దృశ్య వివేచన మొత్తం రెండు నామాలు. దృశ్యం జడం. దృక్ చైతన్యం. దృక్ అంటే చూచేది. దృశ్యం అంటే చూడబడేది. మనం దేనిని చూస్తున్నామో అదంతా జడమే. మరి దృక్ ఏది? దేని వల్ల చూస్తున్నామో అది దృక్. ఈ ప్రపంచాన్ని చైతన్యం వల్ల చూడగలుగుతున్నాం. కన్ను వలన అని అనలేం. అమ్మ 'సర్వచైతన్యరూపా' అది దృశ్యరహితా.

651. విజ్ఞాత్రీ – శ్రీ విజ్ఞాత్ర్యై నమః

విశేషంగా తెలుసుకొనునది. ఆవిడకి తెలియనిది ఏమీ లేదు. అన్నింటిని తెలుసుకుంటోంది. ఆవిడ తెలుసుకోవలసినది ఏదీ లేదు. **'యస్య విజ్ఞాన మాత్రేణ సర్వం విజ్ఞాతం భవతి'** అని ఉపనిషత్ వచనం. అన్నింటిని తెలుసుకునేదాన్ని దేనితో తెలుసుకుంటాము?

'విజ్ఞాతారమరే కేన విజానీయాత్' (ఉపనిషత్తు)

పరమాత్మను తెలుసుకోగలమా! తెలుసుకోలేము. అన్నీ దేనివల్ల తెలుసుకుంటున్నామో అదే పరమాత్మ అని తెలుసుకోవాలి. మనం ఎప్పుడైనా ఒక వస్తువుని తెలుసుకుంటున్నామంటే మనం వేరు, ఆ వస్తువు వేరు కనుక మనం తెలుకుంటున్నాం. అన్నీ ఆవిడే అయినప్పుడు ఆవిడ ఏం తెలుసుకోవాలి. ఆవిడకి అన్యం మరొకటి ఉందా! అద్వైతా. ఆవిడకి ద్వితీయం లేదు.

ధ్యానయోగనిష్ఠులైనవారు మాత్రమే ధ్యానంతో తెలుసుకోగలుగుతున్నారు. ఆ పరమేశ్వరికి తెలుసుకోవలసిన వస్తువే లేదు. తెలియనిది ఏమీ లేదు.

652. వేద్యవర్జితా - శ్రీ వేద్యవర్జితాయై నమః

తెలుసుకోవలసినది లేని తల్లి. ఆమె జ్ఞానరూపిణి. ఇదంతా జ్ఞానదా, జ్ఞానవిగ్రహా అనే నామాల వ్యాఖ్యానం. జ్ఞానమంటే ఏమిటో తెలియజేస్తున్నారు. అదృశ్యా, దృశ్యరహితా, విజ్ఞాత్రీ, వేద్యవర్జితా - మననం చేసుకుంటే సంపూర్ణ ఉపనిషత్ జ్ఞానం వీటిలో ఉంది. నామ రూపాలు దృశ్యాలు, సచ్చిదానందం అదృశ్యం. అదే సర్వజ్ఞ తత్త్వం.

చైతన్యం ఉండడం వల్ల మనం అన్నీ తెలుసుకోగలుగుతున్నాం. అదే 'విజ్ఞాత్రీ'. ఆ చైతన్యం ఏదీ తెలుసుకోనక్కరలేదు. అదే 'వేద్యవర్జితా'.

653. యోగినీ - శ్రీ యోగిన్యై నమః

654. యోగదా - శ్రీ యోగదాయై నమః

655. యోగ్యా - శ్రీ యోగ్యాయై నమః

యోగినీ అంటే పరిపూర్ణురాలు, జ్ఞాని అని అర్థం. జ్ఞానమంటే పరిపూర్ణత. అమ్మవారు 'విజ్ఞాత్రీ' 'వేద్యవర్జితా' కనుక 'యోగినీ'. ఆ పరిపూర్ణమైన జ్ఞానం అమ్మవారే ఎవరికైనా ఇస్తుంది కనుక 'యోగదా'. ఆవిడ ఇచ్చిన జ్ఞానం ఆవిడే కనుక 'యోగ్యా'. 'యోగ్యా' అంటే పొందవలసినది. 'యోగినీ' అంటే జ్ఞానరూపిణి, 'యోగదా' అంటే

యోగమును ఇచ్చునది. మనం పొందవలసినది ఆ పరతత్త్వాన్నే.

యోగరూపంతో ఈ తల్లి ప్రపంచం అంతా నడుపుతోంది. 'ఏకత్వ భావనయే' యోగం. పరమాత్మతో ఐక్యభావాన్ని కలిగినది.

యోగినీ అనేది ప్రపంచంలో వ్యాపించిన అమ్మవారి యొక్క శక్తి. యోగము అంటే కలుపుట. రెండింటినీ కలుపుతూ ఉంటుంది. సృష్టిలో అన్నీ రెండేసి కలసి వెళ్తూ ఉంటాయి. ఉదాహరణకి కన్ను ఉంది. దానికి ఎదురుగా చూడడానికి ఒక వస్తువు ఉంది. చూడడానికి ఉన్న వస్తువుకి, కన్నుకి సంబంధం ఎవరు? కంటితో ఆ వస్తువును చూసి అనుభవిస్తున్న జీవుడు ఆ వస్తువుతో యోగం పొందుతున్నాడు.

ఆ అనుభవించగలిగే శక్తికి అనుభవించాల్సిన పదార్థాన్ని యోగం చేసింది ఎవరో, ఆ కలిపినది ఎవరో – ఆవిడే 'యోగదా'.

'యోగినీ' అంటే జీవుడు. 'యోగదా' అంటే అనుసంధానము. 'యోగ్యము' అంటే అనుభవించవలసిన వస్తువు. యోగమునకు తగినది. ఒక దృశ్యము భోగ్యము. కన్ను దాని భోక్త. ఈ రెండిటి కలయిక భోగము. భోక్త, భోగ్యము, భోగము. భోక్త అంటే అనుభవించువాడు. భోగము అంటే అనుభవించుట. భోగ్యము అంటే అనుభవించబడునది. ఈ విధంగా అన్నింటికి అన్వయించుకోవచ్చు. **'భోక్తా భోగ్యం ప్రేరితారంచ మత్వా, సర్వం ప్రోక్తం త్రివిధం బ్రహ్మ చైతత్'** (శ్వేతాశ్వతరోపనిషత్తు) – మూడు బ్రహ్మమేనని తాత్పర్యం.

అన్నము–భోగ్యము, జీవుడు–భోక్త, అన్నము తినుట–భోగము. అనుభవించేవి ఎన్నైతే ఉన్నాయో అవన్నీ యోగ్యములు. యోగ్యములైనవి అక్కడ ఉన్నప్పటికీ అనుభవించే చైతన్యం మనలో లేకపోతే ఏమౌతాం?

ఇది యోగినీ, యోగదా, యోగ్యా. ఈ మూడు అమ్మవారే అయినప్పుడు ఇది త్రిపుటి ఏకత్వము అయ్యింది. అదే 'త్రిపురా'.

యోగినీ – జ్ఞానస్వరూపిణి, యోగదా – జ్ఞానమును ఇచ్చేది. యోగ్యా – ఆ జ్ఞానమే తానైనది – ఇది మరొక అర్థం. ఆ జ్ఞానం లభించడమే ఆనందం. ఆ ఆనందం 'యోగానందా' అని తరువాత నామంలో చెప్తున్నారు.

656. యోగానందా - శ్రీ యోగానందాయై నమః

శివశక్తి సామరస్యమే యోగం. ఆ యోగరూపమైన ఆనందమే లలిత. బ్రహ్మముతో ఐక్యమే ఆనందం. యోగము అంటే కలయిక - అని అర్థం కదా!

అనుభవించే జీవుడు, అనుభవించవలసిన వస్తువు, అనుభవము. ఈ మూడింటి కలయికే ప్రపంచము. విశ్వమంతా అమ్మవారే అన్నప్పుడు 'యోగినీ, యోగదా, యోగ్యా' అనబడే ఏక జ్ఞానముతో మన మనస్సు ఏకమైతే అదే యోగము. ఆ యోగం లభించితే అదే ఆనందము. ఆ ఆనందరూపిణి 'యోగానందా'.

నేను - ప్రపంచము అనే యోగమే ఈ విశ్వమంతా ఉంది. ఈ రెండిటిని ధరిస్తున్నది ఎవరు? ఈ యుగమును ధరిస్తున్నది ఎవరో చెప్తూ తరువాత నామం.

657. యుగంధరా - శ్రీ యుగంధరాయై నమః

యుగమును ధరించునది 'యుగంధరా'. ఇటు నేను అనబడే చైతన్యాన్ని, అటు నువ్వు అనుభవించే ప్రపంచాన్ని - ఈ రెండింటిని పట్టి నడుపుతున్నది అమ్మవారు. పిండాండ బ్రహ్మాండ సమైక్యం. పిండాండం అంటే నేను అనే చైతన్యం. బ్రహ్మాండం అంటే కనిపించే ప్రపంచం. ఈ రెండిటిలో ఉన్నది ఒక్కటే. అదే యుగంధరా. యోగినీ, యోగదా, యోగ్యా, యోగానందా, యుగంధరా - ఇవి వివేచనగా తెలుసుకోవాలి.

ఏ జీవునికి, ఏ వస్తువు, ఎప్పుడు ఇవ్వాలో ఆవిడకి తెలుసు. రెండిటికి యోగం కలుపుతోంది.

మనకు అనుభవించే సమయం వచ్చినప్పుడు పదార్థం అక్కడికి తెస్తోంది. మనకు అనుభవించే యోగం వచ్చినపుడు ఆ శక్తిని మన లోంచి వ్యక్తపరుస్తోంది. ఒక వేళ మనకు అనుభవించే యోగం లేకపోతే పదార్థం దగ్గర ఉన్నా ఇంద్రియశక్తిని తీసేస్తోంది. ఆ యోగం కలుపుతూ, తీస్తూ... ఇలా 'లీలాక్లుప్తబ్రహ్మాండమండలా' - బ్రహ్మాండమండలాన్ని అమర్చి నడుపుతూ ఉన్నది. జీవుని, జగత్తుని రెండిటిని నడుపుతోంది. జీవ, జగత్తులను నడిపే ఈశ్వరచైతన్యమే 'యుగంధరా'.

నాస్తికుడు కూడా నేను, ప్రపంచం అనే రెండిటిని ఒప్పుకుంటాడు. ఈ రెండిటిని నడుపుతున్నదేదో వాడికి తెలీదు. అది 'యుగంధరా'.

యోగినీ అంటే పరిపూర్ణమైన జ్ఞానరూపిణి అని అర్థం. ఆ జ్ఞానాన్ని తన భక్తులకి ఇస్తోంది కనుక 'యోగదా'. యోగమును ఇచ్చునది అని అర్థము. ఎప్పుడైనా యోగము ఇచ్చేది భగవచ్ఛక్తే. **'దదామి బుద్ధి యోగం'** అని కృష్ణపరమాత్మ గీతలో చెప్పాడు. నేను వారికి బుద్ధియోగం ఇస్తానని వివరించాడు. బుద్ధి యోగం అనగా జ్ఞానాన్ని ఇస్తున్నాడు.

మరో భావంలో – కర్మఫలమే యోగం. దానిని ఏ జీవునికి ఏ రూపంలో ఇవ్వాలో తెలిసిన తల్లి ఆ జగదంబ. 'యోగదా' అంటే కర్మఫలాన్ని ఇచ్చేది. ఫలరూపంలో ఉన్నదంతా అమ్మవారే గనుక 'యోగ్యా'. 'యోగదా' అంటే మరొక అర్థం తరించాడానికి ఎవరికి ఏ యోగం అవసరమో దానిని వారికి ఆ తల్లే ఇస్తుంది. అది భక్తియోగం, రాజయోగం, కర్మయోగం ఇలా ఏ యోగమైనప్పటికి వారి వారి అర్హతలని అనుసరించి అమ్మవారే ఇస్తుంది. అదే **'యోగక్షేమం వహామ్యహం'** అని చెప్పడంలో అర్థం. తరువాత యోగానందా. ఆ యోగం ద్వారా కలిగే ఆనందం.

యోగినీ శబ్దానికి మరొక అర్థాన్ని వివరిస్తున్నారు. అమ్మవారికి **'యోగినీరూపిణి'** అని ప్రసిద్ధమైన పేరు ఉంది. శ్రీవిద్యలో అమ్మవారు యోగినీదేవే. అమ్మవారి ఉపాసన అంటే యోగినీ ఉపాసనే. ఎన్నిరకాల యోగినులు ఉన్నారో చెప్తూ–

నరపతి రవికాష్ఠా షట్సముద్ర ద్విసంఖ్యైః
అకడబవహపూర్వైరక్షరైర్వేష్టితాభిః
డరలకసహ వర్ణవ్యాపినీభిస్తు షడ్భిః
ఘటిత తనురితీయం కథ్యతే యోగినీతి

అని యోగినీ శబ్దానికి అర్థం చెప్పారు. విశుద్ధం దగ్గర అకారాది అచ్చులు 16. అనాహతం దగ్గర కకారం నుంచి ఠకారంవరకు 12. మణిపూరం దగ్గర డకారం నుంచి ఫకారం వరకు 10. స్వాధిష్ఠానం దగ్గర బకారం నుంచి లకారం వరకు 6. మూలాధారం దగ్గర వకారం నుంచి సకారం వరకు 4.ఆజ్ఞాచక్రం దగ్గర హకారం, క్షకారం 2. ఇలా మొత్తం 50 అక్షరాలు.

అక్కడ చెప్పబడ్డ వారి పేర్లు డాకినీ, రాకినీ, లాకినీ, కాకినీ, సాకినీ, హాకినీ, యాకినీ... వీరిని యోగినులు అంటారు. డాకినీ నుంచి యాకినీ వరకూ ఏడు నామాలతో వ్యవహరింపబడుతూ సప్త ధాతు చక్రాలను నడుపుతున్న యోగినీదేవతలు. మన యోగాన్ని బట్టి ఈ ధాతువులు లభిస్తాయి. ధాతురూపంగా యోగ్యముగా ఉన్నది ఆ తల్లే. ఆ యోగినుల రూపముతో ఉన్న లలితాంబ యోగిని. శ్రీవిద్య యోగినీవిద్య. అమ్మవారి పేరే యోగినీ.

శ్రీచక్రం మొత్తం యోగినుల ఉపాసనయే. శ్రీ చక్రంలో మొట్టమొదటిది త్రైలోక్య మోహన చక్రం. అది చతురస్రం. దీనికే భూపురము అని పేరు. అక్కడ మొత్తం 28 మంది దేవతలుంటారు. వీరందరూ అమ్మవారి రూపాలే. 'అణిమాదిభిరావృతాం ముయూఖైః' మొదలైనవారు. వారందరికి కలిపి **ప్రకట యోగినులు** అని పేరు. తరువాత వచ్చే షోడశ ఆవరణలో వచ్చే 16 మంది దేవతలకు **గుప్తయోగినులు** అని పేరు. అటు తరువాత అష్టదళపద్మంలో **గుప్తతరయోగినులు.** ఇక 14 త్రికోణాలచక్రాలలో **సంప్రదాయ యోగినులు.** తరువాత **కులోత్తీర్ణ యోగినులు – 10, నిగర్భ యోగినులు – 10, రహస్య యోగినులు – 8, అతిరహస్య యోగినులు – 3.** వీరంతా త్రికోణచక్రం వరకు ఉంటారు. ఇక బిందువు దగ్గర ఉన్న లలితా మహాత్రిపురసుందరి పేరు **పరాపరరహస్యయోగినీ.** సమస్త ఆవరణ దేవతలు యోగినులు. వీరంతా బిందువులో ఉన్న అమ్మవారి రూపాలే కనుక వారికి యోగినులనే పేరు వచ్చింది. మొత్తం కలుపుకుంటే శ్రీచక్రాధిదేవత లలితామహాత్రిపురసుందరియే **'యోగినీ'.**

'యుగంధరా' నామంలో దాగిన మరొక ఆంతర్యం తెలుసుకుందాం. అనుభవిస్తున్న జీవుడు, అనుభవింపబడే ప్రపంచం – ఈ రెండే యుగం. ఈ రెండిటి యందు ఉన్న శక్తి అమ్మవారు. ఇక్కడ అనుభవించే శక్తి మనకి లేకపోయినా, అనుభవించడానికి సరైన ప్రపంచం లేకపోయినా ఇంక గతి లేదు. ఈ రెండు రూపాలుగా ఉన్నది అమ్మవారే కనుక యుగమును ధరించినది 'యుగంధరా'. దీనిని 'యోగినీ యోగదా యోగ్యా' అని త్రిపుటీ పరంగా చెప్పినప్పుడు చెప్పుకున్నాం.

యుగంధరా నామానికి మరికొన్ని శాస్త్రీయ అర్థాలు చూస్తే **'సహస్రకోటి యుగధారిణే నమః'** అని విష్ణుసహస్రంలో ఉంది. యుగమును ధరించునది యుగంధరా. యుగములు అంటే కాలములు. మన చతుర్యుగములు మొదలుకుని సర్వకాలాలు అమ్మయే నడుపుతున్నది.

అసలు మొత్తం కాలానికే యుగమని పేరు. యుగమంటే జంట. పగలు, రాత్రి కలిపిన జంటతో ఒక రోజు ఉంది. అలాగే సంవత్సరానికి కూడా యుగమని పేరు. ఉత్తరాయణ, దక్షిణాయనాది రెండు జంటలతో కూడినది కనుక సంవత్సరం కూడా యుగమే. పగలు – రాత్రి, ఉత్తరాయణం – దక్షిణాయనం – శివశక్తిరూపము. ఇలా కాలము కూడా శివశక్త్యాత్మకముగా అహోరాత్రముగా ఉంది.

కాలము అమ్మరూపమే గనుక అమ్మవారిని ఆరాధించే వారికి మరొక కాలమానం ఉంది. సాధారణంగా చాంద్రమానం, సౌరమానం మనకి తెలుసు. ఉత్తరాదిన బార్హస్పత్యమానము అని కాశీలాంటి క్షేత్రాల్లో అది కనబడుతుంది. అమ్మవారి ఉపాసకులకు మరొక మానం ఉన్నది. అది శ్రీవిద్యామానం. శ్రీవిద్యోపాసకులకి అష్టాంగమని చెప్పబడుతున్నది. అక్కడ చెప్పబడే కాలం వేరు, యుగం వేరు. లలితామహాత్రిపురసుందరీ యొక్క భ్రుకుటి యొక్క ఆజ్ఞతో ప్రవర్తిస్తున్న... అని ప్రారంభమౌతుంది. అలా ప్రారంభమౌతూ ఆ వారాన తిథి నిత్యా, కాలనిత్య, దివసం... అలా ఆ వ్యవహారాలన్నీ వేరుగా ఉంటాయి. అమ్మవారిని ఉపాసించేవారి కాలం వేరు. కాలం అంటే స్థితి.

అమ్మవారి ఉపాసకుని కాలమంతా అమ్మమయం. పంచాంగం సాధారణ కాలాంగంలో కనబడుతుంది. అమ్మవారి ఉపాసనలో అష్టాంగము. శ్రీవిద్యోపాసకులకు దీని గురించి తెలుస్తుంది. ఈ అష్టాంగంలో ఉపాసించేటప్పుడు తిథి నిత్యాదేవతలు వస్తారు. 'ప్రతిపన్ముఖ్యరాకాంతతిథిమండల పూజితా'కి ఈ సందర్భంగా మరొక కోణాన్ని దర్శించవచ్చు.

పాడ్యమి నుండి పూర్ణిమ వరకు.. తిరిగి ఆవృతిలో అమావాస్య వరకు... పదిహేను చంద్రకళలయ్యాయి. ఈ పదిహేను చంద్రకళల కాలరూపిణి అమ్మవారు

గనుక 'యుగంధరా'. కాలాన్ని ధరించి నిర్వహిస్తోంది. శుక్ల – కృష్ణపక్షాలనే యుగమే ఈ చంద్రకళల రూపం.

'యోగినీ' అంటే శ్రీచక్రాధిదేవత. ఆ చక్రాధిదేవతను ఎవరు ఆరాధన చేస్తున్నారో వారికి అన్ని యోగాలను ఇస్తుంది కనుక 'యోగదా'. ఎన్ని యోగములు వచ్చినా పొందవలసినది ఆ తల్లి తత్త్వమే. ఆ తత్త్వమే 'యోగ్యా'. ఆ తల్లి తత్త్వం పొందినప్పుడు కలిగే ఆనందం 'యోగానందా'. శ్రీచక్రమే 'యుగంధరా'. యుగమంటే శివశక్తియుగం. శివశక్త్యాత్మికా అంటే అర్థం ఏమిటో 'యుగంధరా' అన్నా అదే అర్థం. కామకామేశ్వరీమయమైన తత్త్వము. ఆ బిందువు దగ్గర ఉన్న తల్లియే 'యుగంధరా'. 'శ్రీచక్రం శివయోర్వపుః' అని చెప్పినట్లుగా శ్రీచక్రమంతా శివశక్తులమయం కనుక అది 'యుగంధరా'. అనగా శ్రీచక్రరూపిణి.

'యోగినీ' నుండి 'యుగంధరా' నామాల ఔచితీమంతమైన కూర్పు ఇది.

658. ఇచ్ఛాశక్తిజ్ఞానశక్తిక్రియాశక్తిస్వరూపిణీ
– శ్రీ ఇచ్ఛాశక్తిజ్ఞానశక్తిక్రియాశక్తిస్వరూపిణ్యై నమః

ఇచ్ఛ, జ్ఞాన, క్రియ అనే మూడు శక్తుల రూపాలతో ఉన్నది.

పరమేశ్వరుడు సృష్టి చెయ్యాలని సంకల్పించుకున్నాడు. అది ఇచ్ఛాశక్తి. ఎలా చెయ్యాలనే జ్ఞానం ఆయన యొక్క సహజశక్తి. సృష్టి చేయడమనే క్రియ ఆయన యొక్క శక్తే. నిజానికి ఈ మూడు శక్తులు ఒక శక్తే. మూడు విడివిడి శక్తులు కావు. మూడు శక్తులుగా పని చేస్తున్న పరాశక్తి ఒక్కరే.

శ్రీచక్రంలో అమ్మ స్వరూపాన్ని ఒక్కసారి భావన చేస్తే బిందువు తరువాత వచ్చే త్రికోణములో ఇచ్ఛాజ్ఞానక్రియాత్మకమైన శక్తి వికసిస్తుంది. మొత్తం శ్రీచక్ర విశేషమంతా బిందుత్రికోణములే.

'త్రికోణరూపిణీ శక్తిః బిందురూపః శివస్మృతః' అని అగస్త్యుల వారితో హయగ్రీవస్వామి వారు మొత్తం త్రిశతి చెప్పిన తరువాత చివరికి చెప్పారు. త్రికోణము శక్తిని తెలియజేస్తుంది. బిందువులో శివశక్తులు ఉభయులు కలిసి ఉంటారు. శక్తి

ప్రసరించినప్పుడు త్రికోణంగా ఉంటుంది. బిందురూపము దగ్గర శివునకు ప్రాధాన్యం కనబడుతుంది. శక్తికి ప్రాధాన్యం త్రికోణం దగ్గర కనబడుతుంది.

ముందు కనిపించింది బిందువు. ఆ బిందువు విస్తరించి వెంటనే త్రికోణం అయ్యింది. ఇక్కడే మొత్తం కామకళా విద్య ఉంది. బిందువులో ఉన్న శివశక్త్యాత్మకము – కామ. అది విచ్చుకుని మూడు బిందువులు అయ్యింది. అదే అగ్నిసోమసూర్య బిందువులు. అది కళా. ఆ బిందువు విస్తరించి ఇన్ని త్రికోణాలు, ఇన్ని బిందువులుగా మారి శ్రీచక్రమైంది గాని ప్రధానంగా ఉన్నవి రెండే. ఆ రెండిటిని బయటికి తీసి పరిశీలిస్తే త్రికోణం మధ్యలో బిందువు – అంటే పానవట్టములో ఉన్న శివలింగము దర్శనమౌతుంది.

ఇచ్ఛ, జ్ఞాన, క్రియ – ఈ మూడింటి చేత విశ్వమంతా నడుస్తున్నది. శక్తి యొక్క ప్రథమ స్వరూపము, ప్రధాన స్వరూపము ఇచ్ఛాజ్ఞానక్రియలే. దానికి కేంద్రమై ప్రకాశిస్తుంది శివశక్త్యాత్మక బిందువు.

ఇప్పుడు అమ్మ విగ్రహాన్ని భావన చేస్తే, ఆ భావనలో ఏ శక్తిని ఎక్కడ భావించాలో చెప్తున్నారు.

ఇచ్ఛాశిరః ప్రదేశశ్చ జ్ఞానం చ తదధోగతా

క్రియా పదగతాహ్యస్యాః ఏవం శక్తిత్రయం వపుః (సంకేత పద్ధతి)

అమ్మ శరీరం మొత్తంలో ఇచ్ఛాశక్తి అంతా శిరః ప్రదేశం. కంఠం నుంచి కటి వరకు జ్ఞానశక్తి. క్రియ అనేది ప(పా)దము నందు ఉంటుంది. ఎప్పుడైనా క్రియ అనేది కదలికే. ఇచ్ఛ–జ్ఞాన–క్రియ... ఎప్పుడూ విడివిడి ముక్కలు కావు. ఇదంతా కలిసి అమ్మ స్వరూపము. ఆ తల్లి ముందు నిలబడగానే ఈ నామం గుర్తొస్తే చాలు.

మనం కూడా ఏదైనా పని చేయాలనుకుంటాం. దానికి పని చెయ్యాలనే ఇచ్ఛ ఉండాలి. ఇచ్ఛ లేనపుడు ఏం చెయ్యలేము. ఆ ఇచ్ఛే కామ సంకల్పము. ఇచ్ఛ ఉండగానే సరికాదు. ఎలా చెయ్యాలో తెలివి (జ్ఞానం) ఉండాలి. ఇది రెండవది. రెండూ ఉంటే సరిపోదు. క్రియ కూడా ఉండాలి. ప్రతి చిన్న పనికి ఈ మూడు కావాలి. ఎవరికైనా సృష్టిలో ఈ మూడు జరుగుతున్నాయి. చైతన్యం లక్షణమే

ఇచ్ఛాజ్ఞానక్రియ. చైతన్యమే అమ్మవారు. అది లోపల ఉంది కనుకనే ఈ మూడు పనులు జరుగుతున్నాయి. ఎవరైతే ఈ రూపంగా అమ్మవారిని ధ్యానిస్తారో వారికి శుభేచ్ఛ జరుగుతుంది. మంచి జ్ఞానం లభిస్తుంది. మంచి క్రియలు జరిగి మంచి సాఫల్యం సిద్ధిస్తుంది.

త్రిపురా త్రివిధాదేవీ బ్రహ్మావిష్ణీశరూపిణీ

జ్ఞానశక్తిః క్రియాశక్తిరిచ్ఛాశక్త్యాత్మికా ప్రియా (వామకేశ్వరతంత్రం)

'త్రిపురా' అనేది ఇచ్ఛాశక్తిజ్ఞానశక్తిక్రియాశక్తి స్వరూపము. బ్రహ్మవిష్ణు శివాత్మకము. అది అమ్మ రూపము. ఇది శ్రీచక్రపరంగాను, విగ్రహపరంగాను కూడా అన్వయింపబడుతున్నది. ఆ మూడు శక్తులతో ఉన్న తల్లే ఈ సర్వజగత్తుని పట్టి నడిపిస్తున్నది గనుక 'సర్వాధారా'. ఆ మూడు శక్తుల మీదనే సమస్త ప్రపంచము ఆధారపడి ఉన్నది.

659. సర్వాధారా – శ్రీ సర్వాధారాయై నమః

సర్వమునకు ఆధారమైనది.

యే అర్థానిత్యయే వినశ్యంతి చాన్యే
యే అర్థాః స్థూలాః యే చ సూక్ష్మశ్చ సూక్ష్మాః
యచ్చామూర్తం యచ్చమూర్తం సమస్తం
యద్యద్భూతేషు ఏకమేకంచ కించిత్
యేఽర్థభూమౌ యేఽంతరిక్షేఽన్యతో వా
తేషాం దేవి! త్వత్త ఏవోపలబ్ధిః – అని మార్కండేయ పురాణం.

"నిత్య, అనిత్యాలు, స్థూలాలు, సూక్ష్మాలు, మిగుల సూక్ష్మాలు, రూపాలు లేనిది, రూపాలున్నదీ.. అన్నీ భూతాలలో ఒకొక్కటి, భూమి యందు, ఆకాశమందు, ఇతర ప్రదేశాలలో ఉన్న సకల వస్తువులు దేనివలన కలుగుతున్నాయో... వాటికన్నిటికీ దేవియే ఆధారం" అని భావం. సర్వములలో, సర్వములకు ఆధారంగా ఉన్నది.

అణువు మొదలు బ్రహ్మాండములకు అధిష్ఠానమైనది. జగతి ఏ బ్రహ్మమునందు భాసిస్తున్నదో ఆ బ్రహ్మమే అధిష్ఠానం – సర్వజగతికి ఆధారం.

660. సుప్రతిష్ఠా – శ్రీ సుప్రతిష్ఠాయై నమః

జగతికి చక్కని అధిష్ఠానమైనది. ఈ నామం కూడా మనకి శ్రుతిలో కనిపిస్తుంది. ఇవన్నీ వైదిక నామాలే. **'సుప్రతిష్ఠా జగతో విశ్వస్యహి వరా'** అని వేదవాక్యం. ఈ జగత్తు అంతటికి ఆవిడే సుప్రతిష్ఠా. ప్రతిష్ఠా అన్నది అధిష్ఠానము. ఆధారానికి, అధిష్ఠానానికి కొంచెం భేదం ఉంది. పుస్తకం బల్ల మీద ఉంటే పుస్తకానికి ఆ బల్ల ఆధారము. ఇది 'సర్వాధారా' లాంటిది. ఆ ఆధారాన్ని తీసేస్తే వాటి మానాన అవి ఉంటాయి. కానీ అలాంటి ఆధారం కాదు ఇక్కడ చెప్పేది. ఈ తల్లి లేకపోతే దానికి ఉనికే లేదు. అందుకు 'సుప్రతిష్ఠా' అని నొక్కి చెప్తున్నారు.

కెరటాలకు సముద్రం ఏ విధంగా ఆధారమైందో తల్లి అలా ఆధారంగా ఉంది అని చెప్పడానికి సు-ప్రతిష్ఠా అన్నారు. తిష్ఠా అంటే ఉండుట. ప్ర-తిష్ఠా అంటే బాగా ఉండుట. సు అంటే సుష్టుగా ఉండుట అని అర్థం. సుష్టుగా, ప్రకృష్టముగా ఈ తల్లి యందే ఈ జగత్తు అంతా ఉంది కనుక 'సుప్రతిష్ఠా'.

661. సదసద్రూపధారిణీ – శ్రీ సదసద్రూపధారిణ్యై నమః

సత్తు, అసత్తుల రూపము ధరించినది. సముద్రశక్తి కెరటాల్లో వ్యాపించి ఎలా కెరటాలను నడుపుతోందో అలా అమ్మవారు 'సుప్రతిష్ఠా'గా ఉంటూ ఈ జగత్తుని సదసద్రూపముగా నడుపుతోంది.

ఒక అర్థంలో సత్ అంటే కార్యము. అసత్ అంటే కారణము. కార్యము (సత్) అనగా ఉనికి. ఉనికిగా కనబడుతోంది కనుక కార్యాన్ని సత్ అంటారు. కారణం మనకు కనబడడం లేదు. కార్యములో లీనమైపోయింది కనుక అది అసత్ అని చెప్తారు.

కార్యము, కారణము... ఈ ప్రపంచంలో నిరంతరం నడుస్తున్నాయి. ఈ కార్య కారణాత్మకమైన స్వరూపాన్ని అమ్మయే ధరించి ఉంది. సదసత్ తత్త్వాన్ని ఈ విధంగా తెలియజేశారు.

అరూపా చ సరూపా చ సగుణా నిర్గుణా తథా

నామరూపాఽతిరిక్తా చ సత్తామాత్రా చిదాత్మికా

జగదంబ అరూప–సరూప కూడా.

నామ రూపాల ఉనికిలో కనబడుతున్నది అమ్మయే. అప్పుడు 'నామరూపా' అనుకున్నా తప్పు లేదు. నామరూపాలు అసత్తే. సత్ పరమాత్మ. అసత్ అయిన నామరూపాలుగా కనిపిస్తున్నది ఆవిడే. కేవల సద్రూపిణి, సచ్చిదానందరూపంగా ఉన్నది కూడా ఆ తల్లే. కనుక 'సదసద్రూపధారిణీ'.

'సాకారా' 'నిరాకారా' 'సగుణా' 'నిర్గుణా', 'నామరూపాలు' ఆ మాతయే. 'అతిరిక్తా' కూడా జగన్మాతయే.

నామరూపాత్మకమైన ఉపాధులలో ఉన్నప్పటికి నామరూప వికారాలు అమ్మకి లేవు అని కూడా గ్రహించాలి. రెండూ ఆవిడ యొక్క స్వరూపమని చెప్పడం కోసమే 'సదసద్రూపధారిణీ' అని చెప్పారు.

కారణము, కార్యము అనే విషయాన్ని **'అసద్వా ఇదమగ్ర ఆసీత్ కథమసతః సజ్జాయేత'**. అసత్ నుండి సత్ వచ్చిందని ఉపనిషత్ చెప్తోంది. అంటే కారణము లోంచి కార్యము ఏర్పడుట అని అర్థం. ఇవన్నీ వేదవాక్యముగా ప్రతిష్ఠింప బడుతున్నాయి.

662. అష్టమూర్తిః – శ్రీ అష్టమూర్త్యై నమః

అష్టమూర్తితత్త్వం చాలా ముఖ్యమైనది. శంకరభగవత్పాదులవారు వేదాంతతత్త్వాన్ని మొత్తం తొమ్మిది శ్లోకాలలో రంగరించి, ఇదంతా మనకు పట్టాలంటే ఈశ్వరుని ఉపాసించాలన్నారు. ఎనిమిది మూర్తులు ధరించినవానినే ఈశ్వరుడు అంటారు. ఈ ఎనిమిది మూర్తులు ఈశ్వరియే(రుడే) అని తెలుసుకోవాలి.

ఎప్పుడైతే కనిపించేది అంతా పరమేశ్వరియే అని తెలిసిందో క్రమక్రమంగా కనిపించే దాని కంటె అతీతమైన తత్త్వరూపిణిగా కూడా తెలుస్తుంది. ఈ మాటనే శంకరభగవత్పాదాచార్యులు దక్షిణమూర్తి స్తోత్రంలో చెప్తూ –

భూరంభాంస్యనలోఽనిలోంబరమహర్నాథో హిమాంశుః పుమా

నిత్యాభాతి చరాచరాత్మకమిదం యస్యైవ మూర్త్యష్టకమ్

నాన్యత్కించన విద్యతే విమృశతాం యస్మాత్పరస్మాద్విభోః

తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే

అన్నారు. సర్వవ్యాపకమైన ఈశ్వరతత్త్వాన్ని తెలుసుకోవాలంటే ఎనిమిది మూర్తులుగా వ్యాపించి ఉన్న పరమేశ్వరుని ఆరాధించమన్నారు. ఆ క్రమం– భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, క్షేత్రజ్ఞుడు. ఇది ఒక వరుస.

కొంతమంది క్షేత్రజ్ఞుడు స్థానంలో యజ్ఞము చేసే యజమాని అని చెప్పారు. మొత్తానికి ఎనిమిది మూర్తులుగా పరమాత్మ ఉన్నాడు. పుమాన్ అని చివరికి ఇచ్చారు. పుమాన్ అంటే క్షేత్రజ్ఞుడైన పురుషుడు. ఈ ఎనిమిది ఆయన రూపాలు. ఈ సృష్టిలో ఈ ఎనిమిది తప్ప మరేదీ లేదు. ఎనిమిదీ శివుడే అయినప్పుడు సర్వం శివమయం జగత్. అంతా శివమయమే అయ్యింది. అష్టమూర్తి ఉపాసనే మోక్షహేతువు కనుకనే **'జగత ఈశధీయుక్త సేవనమ్ అష్టమూర్తి భృత్ దేవపూజనమ్'** అని ఉపదేశసారములో రమణులవారు దీనినే బోధించారు.

జగమంతా ఈశ్వరమయమనే కీలకం తెలిసి ఈశ్వరారాధన చేసేవారు జీవేశ్వర అభేదస్థితిని పొందుతారు.

'ఈశావాస్యమిదం సర్వం యత్కించిత్ జగత్యాం జగత్' అని ఉపనిషత్తు చెప్తోంది. అసలు ఆ ఉపనిషత్ పేరే ఈశావాస్యోపనిషత్తు. కారణం ఆ మంత్రంతో ప్రారంభం అవుతోంది. జగమంతా ఈశ్వరునిచేత ఆవాస్యము. ఈశ్వరుడు అష్టమూర్తులుగా వ్యాపించి ఉన్నాడు.

అష్టమూర్తులు బయట కనబడే ప్రపంచంలోనే కాకుండా మన శరీరంలో కూడా ఉన్నారు. దీనిని భావన చేస్తే 'సదసద్రూపధారిణీ' మరింత చక్కగా అర్థం అవుతుంది. ఉపాధులు అని అనుకుంటున్న వాటి యందు కూడా ఉన్నవి అష్టమూర్తులే. జగమంతా ఈశ్వరుడే. కానీ జగత్తుకు కూడా అతీతుడు ఆయన. అది తెలిస్తే

ముందు జగత్తులో భగవంతుని చూస్తాము. క్రమంగా జగత్తుకి అతీతస్థితిని గ్రహిస్తాం. అప్పుడే **'విశ్వకరు విశ్వదూరుని విశ్వాత్మకు విశ్వమయుని విశ్వవిశ్వున్ శాశ్వతునజు బ్రహ్మప్రభు ఈశ్వరుని పరమపురుషు నే భజియింతున్'** అని భాగవతంలో గజేంద్రుడు చేసిన స్తుతి అర్థమౌతుంది.

విశ్వమంతా పరమాత్మే. విశ్వానికి అతీతుడు కూడా ఆయనే. 'సదసద్రూప ధారిణి' అయిన ఆ తల్లి 'అష్టమూర్తిః'. కాళిదాసమహాకవి అమ్మవారిని మొట్టమొదట అష్టమూర్తులుగా ఉపాసించాడు కనుకనే **'యా సృష్టిః సృష్టిరాద్యా వహతి విధిహుతం యా హవిర్యాచ హోత్రీ... ప్రత్యక్షాభి ప్రపన్న స్తనుభిరవతువస్తాభిరష్టాభిరీశః'** అని 'అభిజ్ఞాన శాకుంతలం' నాటకంలో మొట్టమొదటి శ్లోకంగా చెప్పారు.

'యా' అని ముందు స్త్రీలింగ శబ్దాన్ని వాడారు. పరమేశ్వరుని యొక్క తనువులు మొత్తం ఎనిమిది. ఆ తనువులు ప్రత్యాక్షాభిః– ప్రత్యక్షస్వరూపములు. అవి మమ్మల్ని రక్షించుగాక అన్నారు. ఎపుడైతే ఎనిమిది మూర్తులవాడు మనల్ని రక్షించాలనుకున్నామో మనకి సర్వత్రా శివరక్షే. అయితే చెప్పేటప్పుడు ఎనిమిది మూర్తులకి కాళిదాసు చమత్కారంగా స్త్రీలింగ శబ్దాలు వాడాడు.

సాధారణ సాహిత్య దృష్టితో చూస్తే అది కేవలం శివుని అష్టమూర్తులు. కానీ స్త్రీలింగం చెప్పడం విశేషం. శివుడు ఒక మూర్తి ధరించాలంటే అమ్మ సహాయం లేకపోతే ధరించలేడు.

శివుడు మనకి కావాలంటే అమ్మ సహాయంతోనే రావాలి. లేకపోతే ఆయన రాడు. కనుక 'ఎనిమిది రూపాలు అమ్మవే' అని చెప్పారు కాళిదాసమహాకవి. **'వాగర్థావివసంపృక్తౌ'** అని శ్లోకం వ్రాయగలిగిన మహాపురుషుడు. కాళిదాస మహాకవి శ్రీవిద్యలో బాగా సిద్ధి పొందినవాడు. ఆయన రచించిన కుమారసంభవం కాని, రఘువంశం కాని మొత్తం శ్రీవిద్యారహస్యాలని చెప్తాయి.

'ప్రత్యభిజ్ఞా సిద్ధాంతం' తెలియకపోతే అభిజ్ఞానశాకుంతలం వ్రాయగలరా! మూకకవి కూడా అష్టమూర్తులు అమ్మయే అని చెప్పారు.

ధరణిమయీం తరణిమయీం పవనమయీం గగనదహనహోతృమయీం
అంబుమయీం ఇందుమయీం అంబామనుకంపామాదిమామీక్షే

'ధరణిమయీం' అంటే భూమిరూపం. 'తరణిమయీం' అంటే సూర్యరూపం. 'పవనమయీం' అంటే వాయురూపం. 'గగన' అంటే ఆకాశం. 'దహన' అంటే అగ్ని. 'హోతృ' అంటే యజ్ఞము చేయువాడు లేదా క్షేత్రజ్ఞుడు. 'అంబుమయీం' అంటే జలం. 'ఇందుమయీం' – చంద్రుడు. అంబామనుకంపామాదిమామీక్షే – ఎనిమిది మూర్తులుగా ఉన్న అమ్మవారి దయకు నేను నమస్కరిస్తున్నాను అన్నారు.

శివుని యొక్క అష్టమూర్తుల పేర్లు: భవుడు, శర్వుడు, ఈశానుడు, పశుపతి, రుద్రుడు, ఉగ్రుడు, భీముడు, మహాదేవుడు. వీటిని పూజలో వినియోగించుకునేటప్పుడు 'భవాయ దేవాయ నమః', 'శర్వాయ దేవాయ నమః' అని చెప్పుకోవాలి. ఈ అష్టమూర్తులుగా ఉన్న శివులకు పత్నులుగా ఉన్న అమ్మవారి పేర్లను తెలుసుకోవాలి. ఆయన ఏ పేరు ధరిస్తే ఆ రూపానికి తగ్గ పేరుతో ఆవిడ ఉంటుంది. అష్టమూర్తుల పత్నుల పేర్లు: సుకేశీ, సోమా, స్వాహా, పరశివా, అదితి, సువర్చలా, దీక్షా, రోహిణీ.

అదేవిధంగా భగవద్గీతలో **'భూమిరాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధిరేవచ, అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా'** అని సదసద్రూపధారిణీ అయిన ప్రకృతి అంతా కూడా భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం – ఈ ఎనిమిది అష్టమూర్తులు. మనో, బుద్ధి, అహంకారం బయటకి తీస్తే పంచభూతాలు అన్నింటిలోనూ ఉన్నాయి. మనస్సుకి చంద్రుడు, బుద్ధి దృష్టికి సంబంధించినది కనుక సూర్యుడు. అహంకారమే జీవచైతన్యం.

శక్తి రహస్యంలో అమ్మవారి ఎనిమిది మూర్తులు చెప్పారు. ఎనిమిది మూర్తులను ఉపాసన చేసేవారికి పరిపూర్ణమైన అనుగ్రహం లభిస్తుంది. వాటిని వివరిస్తూ –

లక్ష్మీర్మేధా ధరా పుష్టిః గౌరీ తుష్టిః ప్రభా ధృతిః
ఏతాభిః పాహితనుభిరష్టాభిర్మాం సరస్వతీ

అన్నారు. వేదం ప్రకారంగా ప్రాణశక్తి సరస్వతి. సరస్వతి అంటే ప్రవహించునది. ఆ సరస్వతి ఎనిమిది రూపాలతో నన్ను అనుగ్రహించుగాక! అని శ్లోకానికి అర్థం.

దీనిని ప్రతివారు సాధనగా కూడా చేసుకోవచ్చు.

లక్ష్మి, మేధా, ధరా (అంటే భూదేవి. ధరించేశక్తి అని కూడా అర్థం చేసుకోవచ్చు.) పుష్టి, గౌరి, తుష్టి, ప్రభా, ధృతి– ఇవి మొత్తం ఎనిమిది స్వరూపాలు. ఈ ఎనిమిది మనకి కావాలి. గౌరి అంటే తేజస్సు, జ్ఞానం. ధృతి అంటే ధైర్యం, నిలుకడ.

ఇవి కాక అమ్మవారి అష్టమూర్తులుగా మాతృకామూర్తులు ఎనిమిది చెప్తున్నారు. అవి బ్రాహ్మీ, మాహేశ్వరీ, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, ఐంద్రీ, చాముండా, మహాలక్ష్మీ.

శ్రీచక్రంలో కూడా అష్టమూర్తులు ఉన్నారు. వారు–అనంగకుసుమా, అనంగమేఖలా, అనంగమదనా, అనంగమదనాతురా, అనంగరేఖా, అనంగవేగినీ, అనంగాంకుశా, అనంగమాలినీ. వీరే కాకుండా వశినీ, కామేశ్వరీ, మోదినీ, విమలా, అరుణా, జయినీ, సర్వేశ్వరి, కౌళినీ – ఇవి కూడా అష్టమూర్తులే.

663. అజాజైత్రీ – శ్రీ అజాజైత్ర్యై నమః

అజా – శ్రీ అజాయై నమః

కొన్ని గ్రంథాలలో 'అజాజైత్రీ' అని ఒక్క నామంగానే చెప్పారు గాని విడి విడి నామాలుగా తీసుకున్నారు కొందరు.

ఈ కల్పం యొక్క ఆదిని చెప్పగలం గాని సమస్త జగత్తు యొక్క ఆదిని ఎన్ని కల్పాల నుండి జరుగుతోందో ఎవరూ చెప్పలేరు. ఈ జగత్తు ఏ శక్తి చేత నడుస్తోందో ఆ శక్తి యొక్క ఆదిని ఎవరూ నిర్ణయించలేరు గనుక 'అజా'. 'జా' అంటే పుట్టుక. 'అజా' అంటే పుట్టుక లేనిది.

'అజా' అనేమాట వేదంలో రెండిటి పరంగా వాడబడింది. అజా అంటే పరబ్రహ్మము. మాయకి కూడా అజా అని పేరు ఉంది. పరమాత్మ ఎంత అనాదియో, మాయ కూడా అంత అనాది.

'అజామేకాం లోహిత శుక్లకృష్ణాం' అని వర్ణన ఉన్నది. లోహిత, శుక్ల, కృష్ణ అనే శబ్దాలకు ఎరుపు, తెలుపు, నలుపు అని అర్థం. ఎరుపు అంటే రజోగుణం,

నలుపు తమోగుణం, తెలుపు సత్త్వగుణం అని వ్యవహారంతో చెప్తూ మాయాశక్తిని 'అజామేకాం' అని సాంఖ్యులు వ్యాఖ్యానం చేశారు.

ఉపనిషత్ ప్రకారంగా చూస్తే మరొక అర్థం ఉంది. ఈ జగత్తులో ఉన్నవి పంచభూతాలని చెప్తున్నా, కనబడే భూతాలు భూమి, నీరు, అగ్ని మూడే. వాయువు, ఆకాశాలు మనకి కనబడవు. మన బ్రతుకు కూడా ఈ మూడింటి యందే ఆధారపడి ఉంది. దీనినే వేదం 'తేజోబన్నములు' అన్నది. తేజస్సు అంటే అగ్ని. అప్ అంటే జలం. అన్నం అంటే భూతత్త్వం. ఈ మూడింటికి రంగులు చెప్పింది. తేజస్సు యొక్క రంగు ఎరుపు, జలము యొక్క రంగు తెలుపు, భూమి (అన్నం) వర్ణాన్ని నలుపు అన్నారు.

'అజామేకాం లోహిత శుక్ల కృష్ణాం' అని చెప్పినపుడు తేజోబన్నరూపంలో ఉన్న ఈశ్వరుని యొక్క శక్తి అని ఒక వ్యాఖ్యానం చెప్పారు. సత్త్వరజస్తమోగుణాత్మిక అయిన మాయ కనుక అక్కడ 'లోహితశుక్లకృష్ణా'కి అది అర్థం. తేజోబన్నరూపాలతో ప్రపంచాన్ని నడుపుతున్న పరమేశ్వర శక్తి గనుక 'అజా'.

ఆ అజా ఏక. అదే 'అజామేకాం'. అజా –మాయాశక్తి ఆ తల్లే. లోకాన్ని నిర్వహిస్తున్నదంటే మాయాశక్తి అని చెప్పాలి. లోకానికి అతీత అంటే 'పరబ్రహ్మ స్వరూపిణీ' అని చెప్పాలి. ఎలా చెప్పినా అజా అనే చెప్పాలి.

జైత్రీ - శ్రీ జైత్ర్యై నమః

'జైత్రీ' అంటే జయశీల. జయము ఆవిడ స్వభావము అని అర్థం. 'జయా' నామం దగ్గర విషయాన్ని వివరంగా చెప్పుకున్నాం. అమ్మవారికి ఎప్పుడూ ఉత్సవాలే. అవి జైత్రోత్సవం, విజయోత్సవం. ఏడాదికొకసారి విజయదశమినాడు ఉత్సవాలు. ఉత్సవం పేరే విజయోత్సవం. అమ్మవారిది ఎప్పుడూ విజయమే. ఆ తల్లిని తలచుకున్న వారికి కూడా ఎప్పుడూ విజయమే. వారికి ఓటమి లేదు. అమ్మవారు అపరాజిత.

అమ్మవారు జైత్రోత్సవపరాయణి. గొప్పగా జైత్రోత్సవాలు నిరంతరం జరుగుతూనే ఉంటాయి కనుక జయశీల.

అజా, జైత్రీ – ఈ రెండిటిని పరిశీలిస్తే అమ్మవారు తన యొక్క 'అజా'

అయిన శక్తితో ఈ లోకాన్నంతటిని ఆక్రమించుకుని, దీనిని మించే ఉంది కనుక ఆవిడ ఎప్పుడూ 'జైత్రీ'. 'అజా' అయిన 'అవిద్య'ను జయించునది, తొలగించునది, కనుక **'అజాజైత్రీ'** అని ఏక నామం.

తన భక్తులను అజ్ఞానాన్ని జయించేలా చెయ్యగలదు ఆ తల్లి. అజ్ఞానాన్ని జయించి జ్ఞానాన్ని ప్రకాశింపజేసే జ్ఞానస్వరూపిణి అని కూడా భావించవచ్చు.

664. లోకయాత్రావిధాయినీ - శ్రీ లోకయాత్రావిధాయిన్యై నమః

ఒక పద్ధతి కలిగిన ప్రయాణాన్ని యాత్ర అంటారు. ఈ లోకమంతా ఒక యాత్రే. దీనికో విధానము, పద్ధతి ఉన్నాయి. ఆ విధానాన్ని ఏర్పరిస్తేనే విధాయినీ అయ్యింది. ప్రపంచం పిచ్చివాని చేతిలో రాయిలా లేదు. బ్రహ్మాండములు, ఈ కూర్పు - ఇవన్నీ ఒక క్రమంగా సాగుతున్నది.

సర్వజీవుల గమనం యాత్రయే. ఏ యాత్ర అయినా ఈ లోకం లోనే. ఈ యాత్ర సాగుతూనే ఉంటుంది. ఎప్పుడు, ఏ యాత్ర, ఎవరికి, ఎక్కడ ఏర్పాటు చెయ్యాలో అమ్మవారు చూసుకుంటూ ఉంటుంది. ప్రతివానిచేత ఈ లోకంలో యాత్ర సాగిస్తున్న తల్లి.

ఒక్క ఈ భూలోకమే కాదు... ఈ చరాచర జగత్తు, సర్వలోకములు, చతుర్దశ భువనాలు, మన కంటికి కనబడని అనేక బ్రహ్మాండాలు, అనేక లోకాలను వాటి సృష్టి స్థితిలయలన్నీ పరమేశ్వరి నడుపుతున్న విధానమే. ఇదే లోకయాత్రావిధాయినీ.

అమ్మవారి భక్తులకి కొన్ని విధానాలు చెప్పారు. ఇక్కడ చెప్తున్నవన్నీ పాటించవచ్చు. ప్రాతఃకాలంలో నిద్ర లేస్తూనే ధ్యానం చేసుకోమన్నారు.

ముందుగా శిరస్సు యందు గురుస్వరూపంగా అమ్మవారిని భావన చెయ్యాలి. తరువాత ప్రాణ సంచారంలో అమ్మవారే ఉన్నారని గురువు ఇచ్చిన మంత్రాన్ని భావన చెయ్యాలి. తరువాత అమ్మరూపాన్ని భావన చెయ్యాలి. మంత్రం ఉన్నా, లేకపోయినా అమ్మవారిని **'ప్రాతఃస్మరామి లలితా వదనారవిందం' 'ప్రాతఃస్మరామి లలితా చరణారవిందం'** - ఇలా మొత్తం అమ్మవారిని మనసారా అనుకుంటూ ఒక స్తోత్రం

చెప్పారు. ఆ స్తోత్రంలో చివర **'ప్రాతః సముత్థాయ తవ ప్రియార్థం సంసారయాత్రామను వర్తయిష్యే'** – ఇలా అనుకుని నిద్ర నుండి లేవాలి. అప్పుడు లోకయాత్ర అంటే బాగా అర్థమవుతుంది.

"అమ్మా! ప్రొద్దున్న లేచాను. ఇంక లోకంతో గొడవ మొదలవుతోంది. అమ్మా! నీ ప్రియం కోసం నేను లోకయాత్ర చేస్తున్నాను." అలా అనుకుని లేవాలి. అమ్మవారి ప్రియంకోసం నేను బ్రతుకుతున్నాను అని బ్రతకాలి. అది 'లోకయాత్రా విధాయినీ'. అసలు బ్రతుకే అమ్మవారు. మనమేది చేసినా అమ్మ ప్రీతికోసమే అనుకోవాలి.

665. ఏకాకినీ – శ్రీ ఏకాకిన్యై నమః

ఈ ప్రపంచంలో పరమేశ్వరి తప్ప ఇంకొకటి లేదు. రెండవది లేనిది ఏక **'ఏకం అద్వితీయం బ్రహ్మ'**. బృహదారణ్యకోపనిషత్తులో –**'సోఽ బిభేత్తస్మాత్ ఏకాకీ బిభేతి సహాయమీక్షాం చక్రే యన్మదన్యన్నాస్తి కస్మాన్ను బిభేమీతి తత ఏవాస్య భయం వీయాయ'** అని ఒక మంత్రం ఉంది. దీని అర్థం మొట్టమొదట ప్రజాపతి నేను ఒక్కడనే ఉన్నానని భయపడ్డాడు. తరువాత నేను ఒక్కడినే ఉన్నానని నిర్భయంగా ఉన్నాడు. ఉన్నది ఒక్క ఆత్మయే అనే ఎరుకయే అభయం – అని భావం. **'అద్వైతమేవాఽ భయం'** అని మనకి తెలియజేస్తున్నది.

దేవీపురాణంలో 'ఏకాకినీ' అయిన అమ్మవారి గురించి చెప్తూ **'ఏకైవ లోకాన్ గ్రసతి ఏకైవ స్థాపయత్యపి ఏకైవ సృజతే విశ్వం తస్మాదేకాకినీ మతా'** –అమ్మవారు ఒక్కరే ఈ ప్రపంచాన్ని సృష్టి చేస్తోంది. స్థితి చేస్తోంది, ఒక్కరే లయం చేస్తోంది. కనుక ఆవిడ 'ఏకాకినీ'.

ఏకా కామేశ్వరీ శక్తిః అనేకోపాధియోగతః। పరాపరేణ రూపేణ క్రీడతే తస్య సన్నిధౌ – ఒకే కామేశ్వరీ శక్తి అనేకోపాధుల యోగంచేత అతని (పరమాత్మ) సన్నిధిలో అనేక రూపాలతో క్రీడిస్తున్నది – అని కూర్మపురాణ వివరణ.

'ఏకాకినీ' శబ్దానికి మరొక అర్థం: ఏక అంటే ప్రధాన, అసహాయ అని అర్థం. లోకవ్యవహారంలో కూడా ఒక్కడే అంటే వాడొక్కడు చాలని అర్థం. 'ఏకాకినీ' అంటే సర్వ సమర్థురాలని అర్థం. ప్రధానమైనదని మరొక అర్థం.

666. భూమరూపా – శ్రీ భూమరూపాయై నమః

భూమ అంటే విస్తారము. అంతా ఆవిడే విస్తరించి ఉంది. అంతా అనంతతత్త్వం తప్ప మరొకటి లేదు.

మనం ఈ ప్రపంచం ఎంతో ఉందనుకుంటాం కానీ దానికంటె పరమాత్మ ఎంతో ఉన్నాడు. ఒక వస్తువు పెద్దదైతే, దానికి ఆధారమైనది ఇంకా పెద్దగా ఉండాలి. ప్రపంచమే ఎంతో ఉందంటే ఈ ప్రపంచానికి ఆధారమైనది కూడా విస్తారంగానే ఉండాలి. ప్రపంచమంతా వ్యాపించిపోతూ ప్రపంచం కంటె అతీతంగా ఉంది కనుక 'భూమరూపా'.

అత్యంత విస్తారస్వరూపిణి. అనంతమైన సుఖాన్ని కూడా భూమా అంటారు. మనవన్నీ అంత సుఖాలే. అనంత సుఖమంటే ఉపనిషత్తు నిర్వచనం చెప్తూ **'యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యజానాతి స భూమా'**–ఎక్కడ రెండవది కనబడదో, రెండవది వినబడదో, రెండవది తలంపబడదో ఆ స్థితి 'భూమా'. ఏకం అనడంలోనే రెండవది లేదని చెప్పడం. ఆ రెండవది లేని స్థితే అనంతమైనది, ఆనందమైనది. అదే 'భూమరూపా'. **'యో వై భూమా తత్ సుఖం'.**

అనంతానందస్వరూపిణీ. అక్కడ రెండవ తత్త్వం లేదు. తురీయస్థితిలో కలిగే అనుభూతిని 'భూమా' అంటారు.

667. నిర్ద్వైతా – శ్రీ నిర్ద్వైతాయై నమః

ద్వైతభావం లేనిది. ఏకము, అనంతానందము కనుక పరమేశ్వరి తప్ప రెండవది లేదు. మరి ప్రపంచం కనబడుతోందే అంటే అది కూడా అమ్మవారే. ప్రపంచం రెండవదిగా కనబడుతోందంటే అది మిథ్య అన్నారు. బ్రహ్మసత్యం జగన్మిథ్య. రజ్జుసర్పభ్రాంతి ఇక్కడ చెప్తున్నారు. అద్వైతం పట్టుకున్నాక ఆ ఉపమానం చెప్పకపోతే పూర్ణత్వం రాదు. రజ్జుసర్పభ్రాంతి అంటే తాడుని చూసి పాము అనుకున్నాడు. పాము లేదు – ఇది తాడే అని తరువాత తేలిపోయింది. తేలిపోయాక తాడే ఉంది, పాము లేదు. పరిదృశ్యమానమైన ద్వైత ప్రపంచం కంటే విలక్షణమైనది.

భ్రాంతిలో పాము మాత్రమే ఉంది. జ్ఞానంలో తాడు మాత్రమే ఉంది. భ్రాంతిలో ప్రపంచం ఉంది. జ్ఞానంలో బ్రహ్మమే ఉంది. జ్ఞానంలో బ్రహ్మము తప్ప మరొకటి లేదు. మనకి అలా అనిపించడం లేదంటే మనమింకా భ్రాంతిలోనే ఉన్నామని అర్థం. అది తొలగించుకునే సాధన చెయ్యాలి. జ్ఞానస్థితిలో అమ్మవారు తప్ప మరొకటి లేదు కనుక నిర్ద్వైతా. అల్పము, అనిత్యము ద్వైతం. ఆ ద్వైతం లేనిది – నిర్ద్వైతా.

668. ద్వైతవర్జితా – శ్రీ ద్వైతవర్జితాయై నమః

'నిర్ద్వైతా', 'ద్వైతవర్జితా' – రెండూ ఒకేలా కనిపిస్తున్నాయి. ద్వైతవర్జితా అంటే రెండవది లేదు. ఏకాకినీ దగ్గరే అంతా స్పష్టమయ్యింది. మరి ఇదంతా ఎందుకు చెప్పడమంటే మనకి బోధించడం. ద్వైతాన్ని విడిచి పెడితేనే మనకి నిర్ద్వైతమనే స్థితి లభిస్తుంది. పొందాల్సింది ముందు చెప్పి, దానిని ఎలా పొందాలో తరువాత చెప్పారు. 'నిర్ద్వైతా', 'ద్వైతవర్జితా' – ఈ క్రమాన్ని పరిశీలిస్తే ఒక్క వాక్యంలో అద్వైతాన్నంతటిని వశిన్యాది వాగ్దేవతలు చెప్పారు. నిజానికి – **ద్వైతం పోవుట (తొలగుట)** అనకూడదు. ద్వైతభావం తొలగితే తెలియబడే ఏకతత్త్వం – నిర్ద్వైతా. అదియే ద్వైతములేనిది – ద్వైతవర్జితా

ద్వైతం లేనిది – అదే ఈ నామ వైశిష్ట్యం. జీవునికి, ఈశ్వరునికి భేదము లేని స్థితినే అద్వైతమంటారు. ఈ స్థితి ద్వైతాన్ని విడిచిపెడితేనే మనకి అవగతమౌతుంది. నేను ఉపాధిననుకుంటున్నంత కాలం నువ్వు జీవునివి. ఉపాధికి అతీతమై సచ్చిదానందమైన ఈశ్వరి వేరే ఉందని అనుకుంటే ద్వైతం. అసలు ఉపాధిని నేను కాదు, సచ్చిదానంద స్వరూపమే నేనని తెలిశాక ఇంక ఉపాధి తాదాత్మ్యం పోయి చైతన్యంతో ఏకత్వం లభిస్తుంది. అది తెలియాలంటే ద్వైతమైన ఉపాధిని త్యజించాలి. సంకల్ప వికల్పరహితమైన స్థితియే ద్వైతవర్జితా.

త్యజించడమంటే 'అజ్ఞానాన్ని విడిచి పెట్టాలి'. అంతే కానీ, శరీరాన్ని ఎక్కడో పడేయడం కాదు. ఉపాధిగతమైన స్థూల శరీరాన్ని వదిలేసినా, సూక్ష్మకారణ శరీరాలు మాత్రం జీవుని పట్టుకుని జనన పరంపరలను కలిగిస్తాయి. ఈ మూడు శరీరములు నేను కాదనే భావం తెలుసుకోవాలి.

విడిచి పెట్టుట అంటే 'నేను' అనే భావనని విడిచిపెట్టడం. అది అంత తేలిక కాదు. దానికి అమ్మ దయ కావలసిందే. ఉపాధే నేననుకొని అజ్ఞానదశలో జీవ–ఈశ్వరులు ఇద్దరు ఉంటారు. నేను ఉపాధిని కాదు, చైతన్యాన్ని అనే విషయాన్ని జీవుడు సాధన ద్వారా అనుభవంగా సిద్ధి పొందిన తరువాత ఈశ్వరునిలో ఐక్యం అవుతాడు. మొదటి దశలో ఇద్దరు ఉన్నారు.

'సదసద్రూపధారిణీ' నామంలో మనలను అష్టమూర్తిగా పరిశీలన చేయించి, ఈ పరిశీలనవల్ల మాత్రమే అద్వైతసిద్ధిని పొందుతామని 'నిర్ద్వైతా' 'ద్వైతవర్జితా'తో చెప్తున్నారు. లలితా సహస్రనామం ఎక్కడికక్కడ ఒక మహాశాస్త్రం. ఇది మామూలుగా పఠించుకుంటూ వెళ్తే మంత్రశాస్త్రంలా పని చేస్తుంది. అన్ని మంత్రాలసారం ఇందులో నిక్షిప్తం చేశారు. తరువాత వచ్చే నామాల్లో మరొక విద్య చూపిస్తున్నారు. 'అన్నదా, వసుదా, వృద్ధా, బ్రహ్మాత్మైక్యస్వరూపిణీ'.

ద్రష్టలైనవారు దీనికి 'సావిత్రీవిద్య' అని పేరు పెట్టారు. సవితా అంటే సూర్యభగవానుడు. ఆయన యందు ఉన్న అమ్మవారు సావిత్రీ. సూర్యమండలంలో అమ్మవారు ఉన్నారని భావన చేసి ఉపాసన చేస్తే అది ఎలాంటి ఫలితం ఇస్తుందో ఈ నామాల్లో చెప్తున్నారు. వీటిని పఠించడం వల్ల ఇందులో చెప్పినవన్నీ లభిస్తాయి.

669. అన్నదా – శ్రీ అన్నదాయై నమః

అన్నమును ఇచ్చునది. ఆదిత్యవిద్య ప్రధానంగా అన్నాన్ని ప్రసాదిస్తుంది. మహాభారతంలో ధర్మరాజు అరణ్యవాస సమయంలో తన వెనుక వచ్చిన మహాత్ములందరికి అన్నవసతిని ఎలా సమకుర్చాలా? అని ఆలోచిస్తున్నపుడు ఆయన పురోహితుడైన ధౌమ్యుడు సూర్యభగవానుని ఆరాధించమని చెప్పాడు. ధర్మరాజు సూర్యారాధన చేసి ఆయన అనుగ్రహం వల్ల అక్షయపాత్రని పొంది వచ్చినవారందరికి అన్నాన్ని పెట్టగలిగాడు. "ఎలాంటి అన్నం తింటే నా బుద్ధి బాగుపడుతుందో అలాంటి అన్నం ఇవ్వమ్మా" అని అమ్మవారిని అడగాలి. 'అన్నదా' అని లలితమ్మని అడిగితే అలాంటి అన్నమే ఇస్తుంది. తినే అన్నంలో స్థూలభాగం మాలిన్యం అవుతోంది.

సూక్ష్మభాగం ప్రాణశక్తిగా మారుతున్నది. సూక్ష్మతమభాగం మనసుగా మారుతున్నది. అన్నం బట్టే మనసు.

'జ్ఞాన వైరాగ్యసిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతి!' – నాకు మంచి జ్ఞానవైరాగ్యాలు కలిగే అన్నం ఇవ్వమ్మా అని పెద్దవాళ్ళు అడగమని చెప్పేవారు. అన్నదోషం లేకుండా చూసుకోవాలి. ఆదిత్యుని వల్లనే అన్నం వస్తుందని అగ్నిహోత్ర విద్య అంతా తెలియజేస్తోంది. **'అగ్నౌ ప్రాస్తాఽ ఽ హుతిః సమ్యగాదిత్యం ఉపతిష్ఠతే, ఆదిత్యాజ్జాయతే వృష్టిర్వృష్టేరన్నం తతః ప్రజాః'** అని శాస్త్రం చెప్తున్నమాట.

ఆదిత్యుని నుండే వృష్టి, వృష్టి నుండే అన్నం. ఆదిత్యరూపిణియైన అమ్మవారికి మనం సమర్పించేదే మనకు ఇస్తోంది. అన్నానికి ఎన్ని దోషాలుంటాయో శాస్త్రం చెప్తున్నది. ఆ దోషాలు లేని అన్నం ఇమ్మని అమ్మని అడగాలి.

అన్నానికి – జాతిదోష, ఆశ్రయదోష, నిమిత్తదోష అనే మూడు దోషాలు వచ్చే అవకాశం ఉంది. జాతిదోషం అంటే సహజంగా ఆ పదార్థానికి ఉన్న దోషం. ఉల్లి, ముల్లంగి – ఇవన్ని జాతి దోషాలు. తామస పదార్థములు కనుక ఇవి వర్జనీయములు.

రెండవది ఆశ్రయదోషం. ఆశ్రయదోషమంటే ఆ వస్తువు పెట్టిన పాత్రనిబట్టి పాత్ర దోషం వస్తుంది. ఉదాహరణకి పాలు సాత్త్విక ఆహారం. దానికి జాతి దోషం లేదు కాని, పాలని రాగిపాత్రలో పోస్తే అది కల్లుతో సమానం.

మూడవది నిమిత్తదోషం. అన్నీ బాగున్నా, అది పుట్టిన చోటు కూడ సరైనది అయి ఉండాలి. మంచి మారేడు దళాలు, మంచి వంకాయలు బాగున్నా అవి శ్మశానంవంటి ప్రదేశాలలో ఉంటే అలాంటివి ఉపయోగించరాదు, తినరాదు. దుష్టమైన ప్రాంతాల్లో పెరిగినవి కూడా దోషమే.

ఇవన్నీ పెట్టుకొని చూడరానివి చూసినా దోషమే. కాకి, పిల్లి, కుక్క ఇత్యాదులు స్పర్శించినా అవి దోషాలు అవుతాయి. అలాంటి భోజనములు త్యాజ్యములు (విడువదగినవి). "మీరు వంట జాగ్రత్తగా చేస్తారు కానీ వాడు ఎక్కడ పండించాడో మీకేం తెలుస్తుంద"ని కొందరు అంటారు. తెలియని దాని గురించి ఆలోచించనక్కరలేదు. తెలిసినది చూడాలి. అదే శాస్త్రం.

తెలియకవచ్చే దోషనివృత్తికి భగవంతునికి నివేదించి భోజనం చెయ్యాలి. అలా మన దాకా వచ్చాక మనం జాగ్రత్త పడాలి. నివేదించడం వలన మన దాకా రాకముందు దానికున్న దోషాలు పోతాయి. "దోషము లేని అన్నం ప్రతిరోజు నీకు నివేదన చేసి తినే భాగ్యం నాకు కల్పించు తల్లీ!" అని కోరుకోవాలి. శ్రీరామశరణ్ గారు అనే మహానుభావులు రోజూ బియ్యాన్ని రామనామంతో ఏరి వండుకునేవారు. అప్పుడు అన్నం పవిత్రమైపోతుంది.

670. వసుదా – శ్రీ వసుదాయై నమః

వసు అంటే ఐశ్వర్యం అని అర్థం. అనుభవించేవన్నీ అన్నములు. అవి సమకూర్చుకోవడానికి కావలసిన సంపదలని వసువులు అంటారు. ఈ రెండూ అమ్మవారే ఇస్తున్నారు. "**స వా ఏష మహానజ ఆత్మాన్నాదో వసుదానో విందతే వసు య ఏవం వేద**" అని బృహదారణ్యకోపనిషత్తులోని మంత్రం. పరిశీలిస్తే వశిన్యాది వాగ్దేవతలు 'అన్నదా', 'వసుదా' అని బృహదారణ్యకంలోని వరుసనే తీసుకొచ్చారు.

'మహానజ ఆత్మా' అంటే గొప్పది. పుట్టుక లేని ఆత్మస్వరూపిణియైన అమ్మ వల్లనే అన్నము, వసువు రెండు కలుగుతున్నాయి. **'యస్యాం హిరణ్యం విందేయం గామశ్వం పురుషానహం'** అని వేదం చెప్తోంది. హిరణ్యము, సువర్ణము అమ్మవల్లనే వస్తున్నాయి.

ఈ రెండు నామాలు ప్రక్క ప్రక్కనే పెట్టడంలో అంత విశేషముంది. అమ్మవారి ఆరాధకులకి ఎప్పుడూ ఏ లోటూ ఉండదు. ఏది కావాలో అది ఇస్తూనే ఉంటుంది. వారికి రేపేమిటనే భయమే ఉండదు.

'వసు ధనం దదాతీతి వసుదా'. గొప్ప సంపద ఏమిటో చెప్తున్నారు– **'వసు ప్రకృష్టం మోక్షాఖ్యం ఫలం భక్తేభ్యః ప్రదదాతీతి వసుదా'** – అన్నం అంటే ఇహలోకంలో అనుభవించే ఐశ్వర్యాలన్నీ అన్నములు. వసుదా అంటే తరువాత కావలసిన మోక్షం అనే సంపద కూడ అమ్మయే ఇస్తోంది. అన్నదా, వసుదా అనడంలో ఈ అర్థాన్ని కూడా చెప్పారు. అమ్మ భక్తులకి దేనికి లోటు లేదని కాళిదాస మహాకవి చెప్తూ...

హ్రీంహ్రీమితి ప్రతిదినం జపతాం త్వదాఖ్యాం

కిం నామ దుర్లభమిహ త్రిపురాధివాసే

మాలా కిరీట మదవారణ మాననీయా

తాం సేవతే వసుమతీ స్వయమేవ లక్ష్మ్యా

"ఓ తల్లీ! త్రిపురసుందరివైన నీ మంత్రాన్ని ఎవరు నిరంతరం జపం చేస్తారో వారికి దుర్లభమేమిటమ్మా! వారి పాదాలకి సర్వలోకవాసులు నమస్కారం చేస్తున్నారు. భూమి లక్ష్మీసహితంగా వారికి కావలసినవన్నీ సమకూరుస్తుంది". భూమికే వసుంధర అని పేరు. అమ్మవారే వసుదా. తరువాతి నామం 'వృద్ధా'.

671. వృద్ధా – శ్రీ వృద్ధాయై నమః

ముదుసలి. ఒక ముసలి ముత్తయిదువ చక్కగా పసుపు రాసుకుని, బొట్టు పెట్టుకుని కనబడితే పార్వతీదేవిలా ఉందని వెంటనే అంటారు. వృద్ధ సౌందర్యం వృద్ధానిదే. కొంతమంది వృద్ధాప్యం వచ్చిందని భయపడిపోతారు. దాని అందం దానిదే. దాని అందం తెలియాలంటే వృద్ధులైన రమణమహర్షి కళ్లల్లోకి చూడాలి. వృద్ధులైన మహాస్వామివారి నవ్వును పరిశీలించాలి. చంద్రశేఖరభారతీస్వామి వారిని తలంచుకోవాలి. ఆ తేజస్సు వారి యొక్క వదనంలో కనబడుతుంది.

అమ్మవారు పెద్ద ముత్తైదువుగా ఉన్నప్పుడు ఆయనో వృద్ధుడు, ఆవిడో వృద్ధురాలు. ఎవరైనా వృద్ధదంపతులను చూడగానే పార్వతీపరమేశ్వరులులా ఉన్నారు అంటారు. భారతదేశంలో పుట్టినవారికి ఈ మాట సహజంగా వచ్చేస్తుంది. రుద్రనమకంలో పరమేశ్వరునికి కూడా వృద్ధుడని పేరుంది – **'నమో వృద్ధాయచ సంవృధ్వనేచ'**. ఆయనకి కూడా ముసలాయన అని పేరుంది. ఇద్దరూ ముసలివారే.

వేదపురాణశాస్త్ర పదవీనదనీయసియైన పెద్దము

త్తైదువ కాశికానగర హాటక పీఠ శిఖాధిరూఢ య

య్యాదిమశక్తి సంయమివరా! యిటురమ్మని పిల్చె హస్తసం

జ్ఞాదరలీల రత్నకటకాభరణంబులు ఘల్లు ఘల్లనన్

అంటారు శ్రీనాథమహాకవి. అన్నపూర్ణమ్మే అన్నదా, వసుదా, వృద్ధా. అమ్మ జుట్టుని వర్ణిస్తూ **'వేనలి పాట పాటనరవెంట్రుకతోఁ దిలతండులాన్వయ శ్రీనటియింప"–** కొన్ని తెలుపు వెంట్రుకలు, నలుపు వెంట్రుకలు కలిసున్నాయని నల్లనువ్వులు, బియ్యం కలిపినట్టు జుట్టు ఉందన్నారు.

వృద్ధా అంటే పెద్దావిడ. వృద్ధాప్యమంటే జీర్ణించిన శరీరమే అక్కర్లేదు. వృద్ధాప్యం వేరు, జర వేరు. కొందరికి వృద్ధాప్యం ఉంటుంది కాని, జర ఉండదు. వృద్ధాప్యం అంటే పెద్దరికం. అమ్మవారు ఎప్పటినుండి ఉందో మనం చెప్పగలమా! పోతనగారు **'చాలపెద్దమ్మ'** అన్నారు.

'బృహి వృద్ధౌ' అనే ధాతువు ప్రకారంగా 'వృద్ధా' అంటే సృష్టికి పూర్వమే ఉన్న తల్లి అని అర్థం. **'అహమస్మి ప్రథమజా'** (దేవీసూక్తం) **'అహమేవ సా పూర్వంతు నాన్యత్కించిన్నగాధిప'** అని దేవీభాగవతం చెప్తోంది. అంటే ఈ సృష్టికి పూర్వమే నేను ఉన్నాను. మనం ఈ సృష్టికి ఎంత వయసో అని వెతుకుతున్నాం కానీ దానికి పూర్వమే ఉన్నావిడ కనుక 'వృద్ధా'. **'త్వం జీర్ణా దండేన వంచసీతి'** – నీవు ముదసలివై దండముతో నడచుచున్నావని శ్రుతివాక్యం.

'అన్నదా', 'వసుదా' ప్రక్కన 'వృద్ధా' పెట్టడంలో విశేషం– అన్నములను, వసువులను ఇవ్వడమే కాకుండా వృద్ధి పొందించేది అని అర్థం. యుగాల నుండి ఈ భూమి మీదే పడి తింటున్నాం. వాటిని ఎప్పటికప్పుడు ఈ తల్లే ఇస్తోంది. **అన్నపూర్ణా సదాపూర్ణా** – ఆవిడ భాండారం ఎప్పుడూ శూన్యం కాదు. ఆ తల్లి ఇస్తూనే ఉంది. ఇలా ఖాళీ అవగానే అలా పెంచుతూ ఉంటుంది.

భూమిని పరిశీలిస్తే మనకి ఎంత ఇస్తోందో తెలుస్తుంది. ఈ తల్లిని వృద్ధా అన్నప్పుడు వృద్ధి పొందించేదని అర్థం. తన భక్తులకి అన్నములిస్తూ, వసువులు ఇస్తూ వృద్ధి పొందిస్తుంది. ఆ బ్రహ్మమును పొందేవరకు మనలను అమ్మవారు వృద్ధి పొందిస్తుంది. ఆ బ్రహ్మమును పొందాక మిగిలిన స్థితినే తరువాత నామంలో చెప్తున్నారు.

672. బ్రహ్మాత్మైక్యస్వరూపిణీ – శ్రీ బ్రహ్మాత్మైక్యస్వరూపిణ్యై నమః

బ్రహ్మమే తానైన స్వరూపిణి. 'నేను' అనుకుంటున్న జీవుడు ఆ బ్రహ్మముతో ఐక్యమైనప్పుడు అమ్మయొక్క సంపూర్ణస్వరూపం తెలుస్తుంది. ఇదే సావిత్రీ పరమేశ్వరీ విద్య యొక్క స్వరూపం. మహావాక్యముల సారమంతా **బ్రహ్మాత్మైక్య** అని ఒక్క మాటలో చెప్పారు. **'అహం బ్రహ్మాఽస్మి, తత్త్వమసి, అయమాత్మాబ్రహ్మ, ప్రజ్ఞానం బ్రహ్మ'** అనేవి మహావాక్యములు. బ్రహ్మము, ఆత్మ (జీవుడు) ఒకటే అయిన కేవల స్వరూపము. మోక్షస్థితిలో ఉండే కేవల పరబ్రహ్మతత్త్వమే లలితాంబ అసలు స్వరూపము.

'సోహం హంసః శివస్సోహం' – ఇవన్నీ కలుపుకుంటే ఆ సోహం మంత్రస్వరూపమే ఇక్కడ చెప్పబడుతున్నది. ఇదే వివరిస్తూ **'అహం శబ్దశ్చ రూఢత్వాత్ లోకే జీవాత్మ వస్తుని'** (సూతసంహిత) – లోకంలో ప్రతి జీవునికి అహం అనే మాట ఉన్నది. నేను అని ప్రతివాడు అంటూ ఉంటాడు. ఈ నేను అనుకునే జీవాత్మని 'సః' అనే బ్రహ్మంతో కలపగలిగినవాడు ఏ ఒక్కడో ఉంటాడు. అదే సోఽహం. క్రొత్తగా కలపనక్కర్లేదు. అది లోపల కలిసే ఉంది. దానిని అనుభవానికి తెచ్చుకోవడమే సిద్ధి. ప్రతిసారి మనలో ఉచ్ఛ్వాస నిశ్వాసరూపంలో ఊపిరి సోహం, సోహం అని చెప్తోంది. కానీ మనం వినడం లేదు. లోపల శబ్దం తప్ప అన్ని శబ్దాలు వినబడుతుంటాయి. మనం మౌనంగా ఉంటే మనలో శబ్దం వినబడుతుంది. మన లోపల అజపాగా వినబడుతున్న హంస మంత్రమే జీవబ్రహ్మైక్యస్వరూపము. హంసమంత్రంగా ఉన్న అజపాగాయత్రీ అని భావం.

673. బృహతీ – శ్రీ బృహత్యై నమః

బ్రహ్మము యొక్క వ్యాఖ్యానము ఈ నామాలలో తెలియజేస్తున్నారు. జీవుడు బ్రహ్మముతో ఐక్యమైతే సిద్ధిపొందినట్లని చెప్పారు. మనం బ్రహ్మము గురించి, సత్యం గురించి ఆలోచించాలి. ఆలోచిస్తుంటే జీవభావం అదే పోతుంది. మనం వెలుగువైపు నడక సాగిస్తే చీకటి అదే పోతుంది.

'మానస సంచరరే బ్రహ్మణి మానస సంచరరే' అంటారు సదాశివబ్రహ్మేన్ద్ర స్వామి. ఆ బ్రహ్మము గురించి చెప్తూ బృహతీ అన్నారు. అతి పెద్దది అంటే భూమా. దానిని మించిన పెద్ద వస్తువు లేదు.

"బృహత్త్వాత్ బృంహణత్వాచ్చ". బ్రహ్మము అంటే 'బృహత్ బృంహణం'. బృహత్ అంటే అతి పెద్దది. బృంహణము అంటే అంతటా వ్యాపించినది. ఈ రెండిటి వల్ల అది బ్రహ్మము అయ్యింది. బృహత్ శబ్దమే స్త్రీలింగంలో 'బృహతీ'.

అమ్మవారు సావిత్రీ అనగానే వేదస్వరూపిణి అని అర్థం. వేదం అనేక ఛందోరూపాలతో ఉంటుంది. గాయత్రీ ఛందోరూపాన్ని గాయత్రీ నామం దగ్గర వివరించుకున్నాం. ఈ నామంలో 'బృహతీ' అనే ఛందోరూపాన్ని చెప్తున్నారు. బృహతీ అనేది ఒక ఛందస్సు పేరు. ఇది నాలుగు పాదాలు కలిగి, ఒకొక్క పాదానికి తొమ్మిది అక్షరాలు చొప్పున ఉన్న ఒక వైదికఛందస్సు. వైదికఛందస్సులు ప్రధానంగా ఏడు. గాయత్రీ, త్రిష్టుప్, అనుష్టుప్, బృహతీ, పంక్తి, విరాట్, ఉష్ణిక్‌లలో బృహతీ అనేది ఒకటి.

'విశ్వావసోస్తు బృహతీ' అని విశ్వావసువనే దేవత ధరించే వీణపేరు 'బృహతీ'. నారదుడు ధరించిన వీణ పేరు 'మహతీ'. శారదాంబది కచ్ఛపి. వీణ అనే మాట ఎప్పుడొచ్చినా శబ్దస్వరూపమే. మన వెన్నువీణ మీద మీటే నాదం కూడా ఆవిడే. బృహతీ అంటే ఛందోరూపిణి, సంగీతరూపిణి. పరబ్రహ్మస్వరూపిణి. ఇది సావిత్రీవిద్య కనుక సూర్యమంత్రాల్లో **'హంసః శుచిషద్వసురంతరిక్ష'** అని మంత్రం చెప్తూ చిట్టచివరికి **'ఋతం బృహత్'** అని చెప్పారు. అది బృహత్ శక్తి. హంస అంటే సూర్యభగవానుడు. హంస – బ్రహ్మాత్మైక్యస్వరూపిణి. చిట్టచివరికి వచ్చే బృహత్ అని 'బృహతీ' మంత్రాన్ని ఇక్కడ చెప్పారు. **'బృహత్సామ్న తథా సామ్నాం'** అని గీతాచార్యుని మాట. నామాలలో బృహత్సామం ఈశ్వరీ విభూతియే.

674. బ్రాహ్మణీ - శ్రీ బ్రాహ్మణ్యై నమః

బ్రాహ్మణుని భార్య 'బ్రాహ్మణీ'. ఒక్క సరియైన బ్రాహ్మణుడు కనిపిస్తే అతని పాదాలకు దండం పెట్టవచ్చు. **'సర్వే దేవాః వేదవిది బ్రాహ్మణే సంవసంతి'** అని శాస్త్రం. అనుష్ఠానపరులైన వేదవేత్తలలో సర్వదేవతలు ఉంటారు. అసలు బ్రాహ్మణ శబ్దానికి అర్థం జన్మతః అతనికి బ్రాహ్మణత్వం ఉన్నప్పటికీ వారు సంస్కారంతో బ్రాహ్మణత్వం నింపుకుంటారు. బ్రాహ్మణ జన్మ అనేది తపస్సుకి కేటాయింపబడినది. **"ఇహ క్లేశాయ తపసే ప్రేత్యత్వనుపమం సుఖం"** అన్నారు.

తపస్సుకే జీవితం అంకితం చేసుకున్న వారిని బ్రాహ్మణులు అంటారు. బ్రహ్మము అనగా వేదము, ధర్మము, తపస్సు, జ్ఞానము, పరమాత్మ అని ఐదు అర్థాలు. పరమాత్మ అనేది అందరికి తెలిసినదే. మిగిలిన నాలుగు - ధర్మము, వేదము, జ్ఞానము, తపస్సు. ఈ నాలుగు తన జీవితంగా ఎవడు గడుపుతున్నాడో వానిని బ్రాహ్మణుడు అనాలి. శివుని బ్రాహ్మణుడు - అని శ్రుతి, స్మృతులు చెప్పాయి. ఐదు అర్థాలకు తగినవాడు అతడే. **'బ్రాహ్మణో భగవాన్ సాంబో బ్రాహ్మణానాం హి దైవతం విశేషాత్ బ్రాహ్మణో రుద్రం ఈశానం శరణం వ్రజేత్'** అని లింగపురాణం. **'త్వం వై దేవేషు బ్రాహ్మణోసి'**... అని ఛాందోగ్యం. అటువంటి బ్రాహ్మణుడైన శివుని పత్ని ... బ్రాహ్మణి.

అలాంటి బ్రాహ్మణుని తపస్సుకి సహకరించే శక్తి ప్రక్కన ఉండాలి. సోమయాజి ఉంటే సోమిదేవమ్మ ఉంటుంది. అతడు అగ్నిహోత్రం రగల్చాలంటే ప్రక్కన ఆవిడ లేకపోతే రగల్చడానికి లేదు.

బ్రాహ్మణుని కర్మకి బ్రాహ్మణి చాలా అవసరం. వేద, ధర్మ, జ్ఞాన, తపః స్వరూపిణి అని దీనికి ప్రధానమైన అర్థాలు. ఈ రూపంగానే కాశీలో కనబడి వ్యాసులవారికి భోజనం పెట్టింది.

675. బ్రాహ్మీ - శ్రీ బ్రాహ్మ్యై నమః

పరబ్రహ్మస్వరూపిణి. బ్రహ్మ యొక్క శక్తి అయిన సరస్వతీదేవి అని మరొక అర్థం.

సావిత్రి, సరస్వతి, గాయత్రి - మూడు ఒకే తల్లి. ఆ తల్లే సావిత్రి. బ్రాహ్మీ అని మాతృకాదేవతలలో ప్రథమంగా చెప్పుకుంటున్నాం.

676. బ్రహ్మానందా - శ్రీ బ్రహ్మానందాయై నమః

బృహత్, బృంహణము - రెండూ అయిన అతి పెద్దది, సర్వవ్యాపకమైన ఆనందమే బ్రహ్మానందము. బ్రహ్మానందమంటే పరబ్రహ్మానందము. బ్రహ్మలోకానందం మాత్రమే కాదు. భూలోకం మొదలుకొని సర్వలోకాలు ఏ ఆనందం ముందు దిగదుడుపో ఆ ఆనందం 'బ్రహ్మానందా'. నిరతిశయానందరూపిణి. బ్రహ్మము ఆనందం కలది - అనరాదు. బ్రహ్మమే ఆనందం. అది అమ్మవారి యొక్క స్వరూపము. ఇంతవరకు పరబ్రహ్మస్వరూపిణిగా చూపించారు. తరువాత నామం 'బలిప్రియా'.

677. బలిప్రియా - శ్రీ బలిప్రియాయై నమః

పూజోపహారాలు, నివేదనలు - 'బలి'. వాటిపై ప్రీతి కలిగినది. అమ్మవారికి ఇష్టమైనది బలి. ఇది కూడా భక్తిప్రియా, ధ్యానగమ్యా - ఈ నామాల వరుసలోకి తీసుకువెళ్ళాలి. సాధన చెయ్యాలనే తపన ఉన్నవారికి సాధనకి పనికొచ్చే విషయమంతా లలితాసహస్రంలో ఉంది. సాధనకి సంబంధించిన నామాలలో ఒకటి 'బలిప్రియా'.

"సర్వేఽస్మై దేవాః బలిమావహంతి" శాస్త్రోక్తి. దేవతలందరికి బలి ఇవ్వాలి. బలి ఇవ్వకపోతే దేవత సంతృప్తి పడదు. బలి అంటే త్యాగము. త్యాగము అంటే విడిచిపెట్టుట, అర్పించుట. **'త్యాగపూర్వకంగా ఇచ్చే నివేదనకు బలి అని పేరు'.**

భాగవతంలో చక్రవర్తి పేరు బలి. ఆయన నాది అనే భావంతో ఉన్నప్పుడు బలి కాలేదు. తనవనుకున్న రెండు లోకాలు ఇచ్చేశాడు, అప్పటికి బలి కాలేదు. 'మమ' అనుకున్న రెండు లోకాలు ఇచ్చాక, 'అహం' అనుకున్న తనను తాను సమర్పించాక అసలైన బలి అయ్యాడు. అటువంటి సమర్పణకి ప్రీతి చెందునది బలిప్రియా.

అహంకార, మమకార త్యాగమే నిజమైన బలి. అది ఎవరైతే చెయ్యగలరో వారికి పరమాత్మ తన సర్వస్వరూపాన్ని చూపించి ఉత్తమ స్థితిని ఇస్తాడు. అది మనం

బలిచక్రవర్తి కథా విషయంలో గ్రహించవలసినది.

'బలిప్రియా' అన్నప్పుడు నివేదన సమర్పించే పదార్థానికి సంతోషించేదనే చెప్పుకోవచ్చు. అయితే సాధారణంగా నివేదన పదార్థంలో చిట్టచివరికి కొంత భాగాన్ని ప్రక్కకు తీసి బలి భుక్కులకి వేస్తారు. అదొక పద్ధతి చెప్పారు. బలిభుక్కుకి వెయ్యడమనేది చాలా విశేషమైన అంశం. బలిభుక్కులు అంటే కాకులు, కుక్కలు ఇత్యాదులు. దీనిని రాగి పాత్రలో తీసుకువెళ్ళి బయట పెడతారు. అవి తినడం వలన అనేక భూతకోటి శాంతిస్తుంది. మొత్తం పూజా సమాప్తిలో అమ్మవారి ఆరాధకులు ఈ పని చేస్తుంటారు.

దేవతా వ్యవస్థ గురించి చెప్పుకోవడానికి వినే ఓపిక, చెప్పే తీరిక ఉండాలి గానీ చాలా ఉంది. దేవతల్లో కూడా సత్త్వరజస్తమో గుణములతో దేవతలుంటారు. ఆ తమోగుణమైన దేవతలను తామస ప్రవృత్తి గలవారు ఆరాధన చేస్తారు. వారి వారి పద్ధతిలో ఆరాధించేటప్పుడు వారి బలులు వారు ఇస్తారు. వాటి ఔచిత్య, అనౌచిత్యాల గురించి చర్చ అనవసరం. ఎవరైనా పూజ చేసేటప్పుడు బలి ఇవ్వవలసినదే. బలి అన్నప్పుడు పదార్థ నివేదనలు. ఎవరు తినే దానిని వారు నివేదన చేస్తారు.

నివేదన చేసినప్పుడు నైవేద్యంగా ఇచ్చేది బలి. బలిభుక్కులకి పెట్టే బలి ఇవ్వడం ఒక పద్ధతి. ఇంకొక పద్దతిలో బలి అనేది చండీయాగం మొదలైనవి చేసినప్పుడు గుమ్మడికాయలను కోసి ఆయా దేవతలప్రీతికై దానిలో నల్లమినుగులు, పెరుగు కలిపి పెడతారు. బలికి వాడవలసిన పదార్థాలను శాస్త్రం చెప్తూ **'కూష్మాండం ఇక్షుదండం చ శ్రీఫలం నారికేళం, యే తే బలి సమాః ప్రోక్తా తృప్తా భాగసమాస్సదా'** అని చెప్పింది. ఇవి బలులుగా ఇస్తే సర్వ జీవులు సంతోషిస్తాయి. భూతకోటి సంతోషం కోసం బలి.

ఈ ప్రపంచంలో వ్యాపించి ఉండే భూతకోటి తృప్తి కోసం వేరేగా ఒకటి చేసి, ఆ తరువాతే మనలను దేవతానుగ్రహం పొందమని శాస్త్రం నిర్దేశించింది. మనకి కనబడని సూక్ష్మప్రపంచంలో పాపాల వల్ల గతులు లేని వారి పట్ల కూడా ఆలోచన

చేసి బలి విధానాన్ని ఏర్పరిచిన మహర్షుల దయకి కూడా నమస్కారం చేసుకోవాలి.

హిందూమతంలో సాధారణంగా చేసే పనులలో కూడా మహా జ్ఞానం ఉంది. అదే హిందూధర్మం యొక్క ప్రత్యేకత. కూష్మాండం అంటే గుమ్మడికాయ, ఇక్షుదండం అంటే చెఱకు, శ్రీఫలం అంటే మారేడు కాయ, కొబ్బరికాయకి కూడా శ్రీఫలమని పేరు. కానీ శ్లోకంలో నారికేళం అని చెప్పారు కనుక శ్రీఫలం అంటే ఇక్కడ మారేడుకాయ అని తీసుకోవాలి. ఈ నాలుగింటిని కూడా 'బలి సమాః ప్రోక్తా' – ఇవి బలులుగా చెయ్యాల్సిన పదార్థాలుగా విశేషంగా శాస్త్రాలు నిర్దేశించాయి. ఆయా దేవతలకు చేసే బలుల వల్ల దేవదేవి ప్రీతి చెందుతుంది కనుక 'బలిప్రియా!' అవిద్యను నిరసించి, అరిషడ్వర్గాలను జయించిన యోగులు బలులు (బలవంతులు). వారిపై దయ కలిగి, ప్రీతిచెందే తల్లి. వారిని అనుగ్రహించే పరదేవత బలిప్రియ.

678. భాషారూపా – శ్రీ భాషారూపాయై నమః

'భాషారూపా' 'బృహత్సేనా' 'భావాభావవివర్జితా' – ఈ శ్లోకపాదంలో మూడు నామాలు ఉన్నాయి. మొదటిగా భాష యొక్క స్వరూపం అమ్మవారు అని అర్థం. భాష అంటే శాస్త్రీయమైన అర్థం – పలుకు. మనం ఏది భాషిస్తామో అది భాష. పలుకుల రూపమైన తల్లి అని 'భాషారూపా'కి అర్థం. వాగ్రూపిణి అని భావం.

తరువాత 'బృహత్సేనా' వెంటనే చెప్పారు. ఈ రెండిటికి ఉన్న అనుబంధం చూడాలంటే 'భాషారూపా' గురించి కొంచెం పరామర్శ చెయ్యాలి. లోకంలో వ్యవహారంలో అనేక భాషలు ఉన్నాయి. భాషలు అనేకంగా ఉన్నా అవన్నీ అమ్మ రూపమే అనేదొక్కటి తెలుసుకుంటే భాషలలో ఒకటి గొప్పది, వేరొకటి తక్కువదనేది ఏదీ లేదు.

అమ్మవారికి ఏ భాష ఇష్టం? అసలు ఆవిడ స్వరూపమే 'నామరూపాతీతా'. భాష అనేది నామరూపాలకు సంబంధించినది. ఆవిడ దానికి అతీతురాలు. కానీ ఆ నాదస్వరూపిణి అయిన తల్లి వివిధ భాషలుగా వ్యక్తమవుతున్నది. **'యద్భాషా వై మానవాః తద్భాషా వై దేవాః'** అన్నారు. మన భాష ఏమిటో భగవంతుని భాష అదే.

మనం ఏ పలుకులో పిలిచినా ఆయన తప్పకుండా పలుకుతాడు. సర్వభాషలు అమ్మస్వరూపాలే అని చెప్పడం ఇందులోని ఆంతర్యం. దీని గురించి ఒక అద్భుతమైన భావం మనకు శాస్త్రాలలో కనబడుతుంది.

తల్లీ! కొంతమంది నిన్ను సంస్కృతంలో కీర్తిస్తారు. కొంతమంది ప్రాకృతంలో కీర్తిస్తారు. కొందరు సాధారణ భాషలలో కీర్తిస్తారు. కొందరు మ్లేచ్ఛాది భాషలలో కీర్తిస్తారన్నారు. మన దేశంలో మ్లేచ్ఛాది భాషలు ప్రవేశించిన తరువాత వచ్చిన ఒకానొక శ్లోకంలోని భావం. మొత్తానికి చెప్పినవారు ఋషితుల్యులే. అమ్మవారిని ఏ భాషలోనైనా పిలిచి ఆరాధించుకోవచ్చు. పరతత్త్వం ఒక్కటే.

దీని గురించి రామకృష్ణపరమహంస గొప్ప సమన్వయం చేశారు. నీరు అనే దానిని అడిగేటప్పుడు హిందీవాడు పానీ అంటాడు, సంస్కృతంలో జలం ఇవ్వండి అని అడుగుతారు, మన తెలుగువారు నీరు ఇవ్వండి అంటారు. ఎవరెలా అడిగినా ఇవ్వబడే పదార్థం మాత్రం ఒక్కటే. అదే విధంగా ఎవరు, ఏ భాషలో పిలిచినా భగవంతుడు ఒక్కడే. ఈ సమన్వయ సూత్రం చాలా చక్కగా 'భాషారూపా'లో మనకు కనబడుతోంది.

ఎవరు ఏ భాషలో మాట్లాడినా, మాట్లాడడం అంటూ ఒకటి వచ్చినప్పుడు (అంటే భాషించేదే భాష) అది వైఖరికి సంబంధించిన విషయం. వాక్కుకి ఉన్న దశలలో 'పరా' 'పశ్యంతీ' 'మధ్యమా' దాటిన తరువాత 'వైఖరీ'. వైఖరిలో పరా, పశ్యంతీ, మధ్యమా ఉంటాయి. ఇతర జంతుజాలాల్లో పరా కొన్నింటిలో, పశ్యంతీ కొన్నింటిలో, మధ్యమా కొన్నింటిలో ఉంటుంది అని చెప్పుకున్నాం. **"తురీయం వాచో మనుష్యా వదంతి"** అన్నట్లుగా మానవులు మాత్రమే వైఖరీరూపమైన వాక్కులను పలుకగలరు. 'భాషారూపా' అంటే 'వైఖరీరూపా' అని కూడా అర్థం.

ఈ వైఖరీగా పలుకబడుతున్న శబ్దాలు ఎన్నైనప్పటికి అవి ప్రధానంగా 50 అక్షరాలే. భాషారూపా అంటే మాతృకావర్ణరూపిణీ అనే ఇక్కడ కూడా అర్థం. వశిన్యాదివాగ్దేవతలు మొదటి నుండి కూడా ఈ భావాన్ని మనకి అందిస్తూ ఉన్నారు. ఎన్ని భాషలు వచ్చినా, ఎన్ని మాట్లాడినా అవన్నీ ఈ 50 అక్షరాల కూడికలే.

ఎవరు ఏం మాట్లాడినా ఇందులోవే తప్ప ఇంకెక్కడా శబ్దాలు అనేవి లేవు. వైఖరీ అంతా కూడా 50 అక్షరాలుగా ఉంది కనుక 'భాషారూపా' అని చెప్పబడుతోంది. ఈ 'భాషారూపా'లో సర్వమంత్రాలు వచ్చాయి.

భాషణములోంచే మంత్రమనేది ఆవిర్భవిస్తోంది. భాషింపబడే అక్షరములతో ఏర్పడిన మంత్రాలు ఎన్నో ఉన్నాయి. మంత్రము అంటేనే శక్తి. 'భాషారూపా' అంటే 'మంత్ర రూపా'. ఎన్ని రకాల మంత్రాలు ఉన్నాయో అన్నీ అమ్మ రూపాలే.

పరమనాదరూపిణియైన అమ్మవారు బహువిధ మంత్రశక్తులతో భాషిస్తూ, ఈ మంత్రాలన్నీ పెద్ద సేనగా చేసుకున్నది.

679. బృహత్సేనా - శ్రీ బృహత్సేనాయై నమః

'బృహత్సేనా' అంటే పెద్ద సేన కలది అని అర్థం. మంత్రాలే సేనలు.

శ్రీవిద్యలో విశేషంగా అన్ని మంత్రాలు ఉన్నాయి. ఇతర మంత్ర ఉపాసనా శాస్త్రాలలో వారి ప్రధాన దైవం, తదంగదేవతలే తప్ప ఇతరులను స్వీకరించరు. శ్రీవిద్యలో ప్రత్యేకత ఏమిటంటే వైదికమైన సర్వదేవతలని స్వీకరించింది. హయగ్రీవాది విష్ణు మంత్రాలు, శివ మంత్రాలు, దశావతార మంత్రాలు – ఇత్యాదులన్ని శ్రీవిద్యలో ఉన్నాయి.

శ్రీవిద్యలో చెప్పబడే మంత్రాలన్నింటిని కలిపి ఆమ్నాయమంత్రాలని ప్రత్యేకంగా చెప్పారు. ప్రధానంగా షడామ్నాయ మంత్రాలు శ్రీవిద్యలో కనబడతాయి. అవన్నీ కలుపుకుంటే అది బృహత్సేనా. బృహత్సేనా అంటే 'ఆమ్నాయమంత్రరూపిణి' అని ప్రధానమైన అర్థం.

ఈ నామానికి 'ఎంతో సేన కలది' అని సాధారణ అర్థం చెప్పడానికి లేదు. దీనిని వశిన్యాది వాగ్దేవతలు చెప్తూ శ్రీవిద్యాధిదేవత అయిన తల్లిని ఆవిష్కరిస్తున్నారంటే ఇది సంపూర్ణంగా "ఆమ్నాయమంత్ర స్వరూపాల"ని తెలుస్తున్నది.

ఇంకొక అర్థంలో వేదాది మంత్రాలన్నీ కూడా సేనలే. ఒక మంత్రం ఒకొక్క సేన. 'వేదమయీం నాదమయీం' అమ్మవారు వేదస్వరూపిణి. నాదరూపిణి

అయినప్పుడు వేదమంత్రాలన్నీ ఆవిడకి సేనగా ఉన్నాయి. **'సేనాన్యే దిశాం చ పతయే నమః'** అని రుద్రంలో కూడా చెప్పబడింది.

సేన అనే శబ్దానికి శాస్త్రం నిర్వచనం చెప్తూ 'ఇన' అంటే 'రాజు' అని అర్థం. సేన అంటే 'రాజు కలది' అని అర్థం. సేనలు వాటంతట అవి స్వతంత్రించి వెళ్ళడం లేదు. వాటిని నడిపేవాడు, శాసించేవాడు, వాటిని అధీనంలో పెట్టుకున్నవాడు ఒకడు ఉన్నాడని సేన శబ్దమే చెప్తోంది. 'ఇన'ను అనుసరించి వెళ్తున్నది సేన.

అమ్మవారి సేన అంటే తన ఆజ్ఞానుబద్ధులై నడుస్తున్న అనేక మంది శక్తులను కలదని అర్థం. ఆ సేనలన్నీ అమ్మనే తమ యొక్క ప్రభ్విగా అంటే తమ నాయకురాలిగా, తమ పాలకురాలిగా స్వీకరించి పని చేస్తున్నాయి.

బృహత్సేనా – సేన ఎంతుందో లెక్కపెట్టగలమా? వేదాలు ఎన్ని ఉన్నాయంటే 'అనంతా వై వేదాః' అన్నట్లుగా వేదములు అనంతములు. అనంతమంటేనే బృహత్. బృహత్ అనే శబ్దం బ్రహ్మమునకు వాడతారని 'బృహతీ' 'బ్రాహ్మణీ' నుండి మొదలుపెట్టుకు వచ్చారు.

వేదాలకు 'బ్రహ్మ' అని అర్థం. బ్రహ్మమే బృహత్. 'బృహత్సేనా' అంటే అనంతములైన వేదరూపాలైన సేన కలది. అసలు ఆమ్నాయమంటేనే వేదమని మరొక అర్థం ఉంది. ఇక్కడంతా వైదికదేవతలే చెప్పబడుతున్నారు.

మూడవ అర్థం చూస్తే లలితాదేవి సేనలను ఒక్కసారి పరిశీలించాలి. మామూలుగా లెక్కపెడితే 64 కోట్ల అక్షోభ్య శక్తులని వాటికి పేరు. అక్షోభ్యశక్తులంటే వారు ఎవరినైనా కలవరపరచగలరు. వారిని ఎవరూ కలవరపరచలేరు. **'అక్షోభ్యః సర్వప్రహరణాయుధః'** అని విష్ణుసహస్రం చెప్తోంది. అమ్మవారి సేనలన్నీ అటువంటివే. భండాసురవధోద్యుక్త, భండసైన్యవధోద్యుక్త అని రెండు సార్లు చెప్పారు. లెక్కపెట్టలేనన్ని అపారమైన సేనలు ఉన్నాయి. వారి పేర్లు తలచుకుంటేనే పాపాలు పోతాయి.

శ్యామల, వారాహీ, సంపత్కరీ, అశ్వారూఢా, నిత్యాదేవతలు – ఈ సేనలంతటికి నాయకురాలు – అమ్మ లలితమ్మ. వారు ఏం చేసినా అమ్మ ప్రీతికోసమే చేస్తున్నారు. ఈ సేనలన్నీ ఆవిడవి. భండాసుర సంహారానికి బయలుదేరుతున్న అమ్మవారి

సేనలంతా బృహత్ అని భావన చేసుకోవాలి. రాశిలోనూ బృహత్తే, వాసిలోనూ బృహత్తే. బృహత్సేనా అన్నప్పుడు పై మూడు రకాలైన భావాలు స్వీకరించాలి.

భాషారూపా, బృహత్సేనాకి సంబంధం అక్కడున్న శ్యామలా, వారాహీ, సంపత్కరీ, అశ్వారూఢా మంత్రాధిదేవతలే. వారు స్పందించాలన్నా మంత్రమే ఆధారం. వారాహీ, శ్యామలా, సంపత్కరీ, అశ్వారూఢా మంత్రములున్నాయి. వారాహీ అంగదేవతలు తిరస్కరిణీ, స్వప్నవారాహీ ఇత్యాది మంత్రాలు కూడా ఉన్నాయి. శ్యామలామంత్ర దేవతలైన లఘుశ్యామా, వాగ్వాదినీ, నకులీ మొదలైనవన్నీ సేనలు. ఇవన్నీ మంత్రాలే. ఆ మంత్రాలతో వారి అనుగ్రహం మనకి లభిస్తోంది. ఆ మంత్రాలు భాషారూపా. మంత్రము చేత అధిదేవతలుగా చెప్పబడ్డ శ్రీవిద్యలో ఉన్న ఈ అధిదేవతలందరితో ఉన్న పరదేవత 'బృహత్సేనా'.

తరువాత నామం 'భావాభావవివర్జితా'.

680. భావాభావవివర్జితా – శ్రీ భావాభావవివర్జితాయై నమః

అక్షరాలన్నీ అమ్మవారైతే, అక్షరాలతో తయారైన ప్రపంచంలో ఉన్న శాస్త్రాలన్నీ ఒక చోట కూడగడితే, అది నిలవ చెయ్యడానికి మనకి కోటలు చాలవు. అన్ని శాస్త్రాలు ఉన్నాయి. ఈ శాస్త్రాలన్నీ బలమైన జ్ఞానాన్ని మనకి ఇస్తున్నాయి. శాస్త్రాలే బృహత్సేనా. ఈ శాస్త్రాలన్నిటి ద్వారా మనకొక భావం తెలుస్తున్నది. కానీ అమ్మవారు ఏ భావానికి దొరుకుతారు? 'భావాభావవివర్జితా' – ఆవిడ భావము, అభావము రెండిటికి అతీతమే. మరి 'భావనాగమ్యా' అంటే? మనకి భావన కాని, ఆవిడకి భావం కాదు. మనం భావన ద్వారా అక్కడికి వెళ్తాము. ఉదాహరణకు ఒక ఊరికి వెళ్ళడానికి మనం కారులో బయలుదేరాం. ఊరికి కారు అవసరం లేదు. వెళ్ళడానికి కారు మనకి అవసరం.

అమ్మవారే భాషారూపా, బృహత్సేనా అవుతూ భాష ద్వారా, శాస్త్రాల ద్వారా తెలియబడే భావాలకి కూడా అతీతురాలుగా ఉంది. 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' – వాచా అంటే భాష, మనసా అంటే భావం. ఆవిడ భాషకి, భావానికి కూడా అతీతురాలు.

శాస్త్రీయార్థంలో భావము అంటే 'ఉండుట' అని, అభావమంటే 'లేకుండుట'. అమ్మవారు ఉన్నారా? లేరా? ఉన్నారు, లేరు అని లేకుండా ఉన్నారు. ఇలా అనవచ్చా అంటే పరతత్త్వం గురించి అనవచ్చు.

మనం లోకంలో ఎవరైనా ఉన్నారనేది ఇంద్రియాల ద్వారా నిర్దేశిస్తాం. ఆ వస్తువు కూడా నామరూపాలతో దొరికితేనే మనం నిర్దేశించగలం. అమ్మవారు అలా నిర్దేశించబడగలరా? ఉపాధులవలె అమ్మవారిని 'భావా' (ఉన్నది) అని చెప్పలేం. కనుక అభావమని అందామా అంటే అభావమనడానికి కూడా వీలు లేదు.

మనం వస్తువు రూపంగా ఆవిడను నిర్దేశించలేం గాని, చైతన్యంగా ఆవిడ ఉంది.

నామరూపాత్మకమైన వస్తు ప్రపంచం అమ్మవారు కాదు. అది ఉండడానికి ఆవిడ హేతువు. ఇది భావాభావ. ఇది చాలా ముఖ్యమైన భావము.

ఒకొక్కప్పుడు ఆ పరతత్త్వం లీలగా రూపాన్ని, నామాన్ని ధరించవచ్చు. ఆ విధంగా కనబడవచ్చు కానీ దానికి లోబడదు. దానికి పరిమితమై ఉండదు. వస్తువులను నిర్దేశించినట్లుగా బ్రహ్మమును నిర్దేశించలేం. లేదు, ఉన్నది అని కూడా ఏ జ్ఞానం వల్ల చెప్పగలుగుతున్నామో ఆ జ్ఞానమే తానై ఉన్నది కనుక 'భావభావవివర్జితా'.

దీని గురించి చెప్తూ, **"నిక్కము న్గల్లకాని మలతొల్పూచులు"** అన్నారు నారాయణదాసుగారు. మలతొల్పూచులు కొండలరాజుగారి మొదటి కూతురు. నిక్కము న్గల్లకాని అంటే సత్యము కాదు, అసత్యము కాదు. **'సత్యం అసత్యమేవ సత్యం'** అని చెప్పినట్లుగా ఇది వ్యవహారము. **'సత్యము'** అన్నదానికి లోకమువలె సత్యము కాదనే పదాన్ని ముందు పెట్టుకోవాలి. కానీ నిజమైన సత్యం అమ్మవారే కనుక 'సత్యస్వరూపిణీ'.

"ఉన్నదిగాని ఎట్లుండునో వేల్పు"- అని మరో చక్కటి అనువాదం చేశారు నారాయణదాసుగారు. ఇది 'భావాభావవివర్జితా' అంటే. ఉంది కానీ ఎలా ఉంటుందో ఆవిడ? ఎలా ఉంటుందో అంటే 'అనిర్దేశ్య వపుః' అని చెప్పినట్లుగా – నిర్వచించలేమని అర్థం. ఈ మాటని సరిగ్గా పలికినవాడే గజేంద్రుడు. **"కలుగడే నాపాలి కలిమి సందేహింప కలిమి లేములు లేక కలుగువాడు"**- కలిమి అంటే (భావం) కలగడం.

లేమి అంటే (అభావం) లేకపోవడం. కలగడం, లేకపోవడం అనేవి లేకుండా కలిగేవాడు.

జీవప్రపంచానికి ఉన్న ఉనికి, నాశనమనేది తల్లికి లేదు. అది 'భావాభావ వివర్జితా'. శాశ్వతమైన దానికి కలగడం, పోవడమనేది ఉండదు. అది ఎప్పుడూ ఉంటుంది.

అమ్మవారు ఉన్నదే అయితే మరి రావడమున్నది అంటే ఆవిడ మనలా రాలేదు. అనుగ్రహించడానికి అవసరమైతే లీలగా దివ్యమంగళ విగ్రహం ధరించే వస్తుంది. చండిగానో, కాళిగానో, లలితగానో ఏ రూపమో స్వీకరించి రావచ్చు. అలా వచ్చినపుడు అప్పుడే వచ్చిందని చెప్పడానికి లేదు. ముందు నుండి ఉన్నావిడే ఈ రూపం స్వీకరించింది. ఆ భావం కలగడం కోసమే 'భావాభావవివర్జితా'. అంతే కానీ శూన్యం కాదు.

శూన్యము కాదని చెప్పడానికి **'అభావవివర్జితా'**. అది అస్తిత్వం కలది. మనం అనుకునే దేహాదుల వలె ఉన్నది కాదు కనుక **'భావవివర్జితా'**. 'భావవివర్జితా', 'అభావ వివర్జితా' కలుపుకుని 'భావాభావవివర్జితా'.

నామరూపాత్మకంగా గోచరించే వ్యాకృత ప్రపంచం భావం. దానికి కారణమైన అవ్యాకృతమైన అవిద్య – అభావం (కంటికి గోచరించనది). ఈ రెండిటికీ అతీతమైన కేవల సచ్చిత్ స్వరూపిణి 'భావాభావవివర్జిత'.

ద్రవ్య, గుణ, కర్మ, సామాన్య, విశేష, సమవాయ అనబడే భావములు; ప్రాగభావ, ప్రధ్వంసాభావ, అత్యంతాభావ, అన్యోన్యాభావ – అనబడే అభావములు. ఈ భావ – అభావములు జగద్విషయాలు. వీటికి అతీతమైనది – భావాభావవివర్జితా.

681. సుఖారాధ్యా – శ్రీ సుఖారాధ్యాయై నమః

'సుఖారాధ్యా' నామం కూడా 'ధ్యానగమ్యా' నామం వలెనే ఉపాసనకి సంబంధమైన నామం. సుఖముగా ఆరాధింపబడునది. ఆరాధనలో ఒక సుఖం ఉంది.

పూజ వల్ల ఏం వస్తుందని అడగడం కాదు. పూజయే ఆనందం అన్న భావనని గ్రహించగలగాలి. అలా సుఖంగా ఆరాధిస్తే ఆ ఆరాధనని అమ్మ స్వీకరిస్తుంది.

భగవదారాధన ఎప్పుడూ కష్టం కాదు. ఎంతో కష్టపడాలని మనం అనుకుంటాం. సృష్టిలో భగవంతుని ప్రసన్నం చేసుకోవడమే అతి సులభం. మిగిలినవి అన్నీ అతికష్టమే. అతి సులభమైన దాని కోసం కొంచెం కూడా ప్రయత్నం చేయకుండా, అతి కష్టాల కోసం కష్టపడడం వల్ల శరీర శక్తులన్నీ క్షీణించి చతికిలపడిపోతున్నాం.

మనం మొట్టమొదటే సుఖంగా, సులభంగా ఆ తల్లిని పట్టుకుంటే అసలు ఈ బాధలు ఉండేవే కావు. మనం ఏ పద్ధతిలోనైనా అమ్మవారిని **'యథాశక్తి యథా సంభవద్రవ్యైః సపర్యాక్రమ నిర్వర్తయిష్యే'** అని ఉన్న శక్తితో అన్ని సమకూర్చుకోవచ్చు. పూజకి కూర్చున్నప్పుడు ఏం సమకూర్చుకోగలిగామో వాటితోనే తృప్తిగా ఆరాధన చెయ్యవచ్చు.

'భావనామాత్రసంతుష్టహృదయాయై నమో నమః'. భగవంతుడు తప్ప సృష్టిలో ఎవ్వరూ కూడా భావించినంత మాత్రాన సంతుష్టి చెందరు.

దీనికి ఒక అందమైన తెలుగు సేత చేశారు నారాయణదాసుగారు – **"మ్రొక్కినఁ జాలు బుల్పుఁగొనెడి వేల్పు"** – బులుపుకొనెడి అంటే ఆనందించేది అని అర్థం. ఆ మాత్రం మ్రొక్కితే చాలు (నమస్కారం చేతనే) ఆనందించే తల్లి. **"వడి సుళ్వుగాఁ గొలువందగు జేజె"**– వడి అంటే తొందరగా, సులువుగా అని అర్థం. పూజ చేస్తే చాలు తొందరగా అనుగ్రహిస్తుంది. ఆవిడ పూజ చాలా సుఖము. పూజిస్తూ ఉన్నప్పుడే ఆనందము. భావనామాత్రమైన ఉపచారములతోనే, ద్రవ్య కాయక్లేశాలు లేని అంతర్యాగం చేతనే తృప్తి చెందునది అని ఈ నామానికి అర్థం.

682. శుభకరీ – శ్రీ శుభకర్యై నమః

భావన ఏం కష్టం కాదు కనుక అలా పూజ చేస్తే అమ్మ 'సుఖారాధ్యా'యై వెంటనే మనకు శుభాలను ఇస్తుంది. శుభములంటే మేలు కలిగించేవన్నీ ఇస్తుందని అర్థం. శుభ సంకల్పాలు, శుభ ఆచరణలు, శుభఫలాలు – అన్నీ శుభంకరమైనవి

ప్రసాదిస్తుంది. మన బుద్ధిలోనికి అశుభాన్ని రానివ్వదు.

'శుభం' అనగానే 'పవిత్రమైనది'(పుణ్యం) అని అర్థం. పుణ్యాలను మాత్రమే కలిగియున్నది. 'సుఖారాధ్యా' యొక్క ఫలితం 'శుభకరీ'.

683. శోభనాసులభాగతిః – శోభనాసులభాగత్యై నమః

'శ్రీ శోభనాయై నమః', 'శ్రీ సులభాగత్యై నమః' – ఈ నామాన్ని ఈవిధంగా రెండు నామాలుగా చెప్పినవారున్నారు. శోభన స్వరూపురాలు, శుభస్వరూపురాలు. శోభనా నామం మునుపు ఒక్కసారి వచ్చింది. అక్కడ ఆ నామాన్ని చెప్పి, మళ్ళీ ఇక్కడ చెప్తే పునరుక్తి అవుతుందని విజ్ఞులైనవారు 'శోభనా సులభాగతిః' కలిపి ఒకే నామంగా చెప్పారు. అలా అనుకున్నా ఒక అర్థం ఉంది. విడిగా చెప్పినా తప్పులేదు. స్తోత్రంలో ఎప్పుడూ కూడా పునరుక్తి దోషం కాదు కనుక శోభనా మరొకసారి అనుకోవచ్చు.

శుభకరీ తరువాత శోభనా చెప్పడంలో విశేషం శుభాలను ఇచ్చే తల్లికి శుభము స్వభావంగా ఉందని అర్థం. శుభస్వరూపిణి అని దీని భావం.

'శోభనా సులభాగతిః' అన్న దానికి మరొక అర్థం శుభ స్వభావము కలిగిన వారికి సులభంగా లభించే పరమ పదము. శుభస్వభావం కలిగినవారే శోభనులు. అమ్మవారి ఆరాధనకి మనం శోభనులుగా మారాలి. శోభ తెచ్చుకోవాలి. శోభ అంటే చక్కగా ముఖం అంతా అలంకరించుకోవడం మాత్రమే కాదు. అయితే – అమ్మవారి పూజకు అలాగే కూర్చోవాలి. స్వయమలంకృత్య–తనని తాను అలంకరించుకుని, కూర్చుని పూజ చెయ్యాలని చెప్పారు.

మనం ఓ చక్రం ముందో లేదా ఒక బొమ్మ ముందో కూర్చోలేదు. అమ్మ ముందు కూర్చున్నాం. బొమ్మ ముందు కూర్చున్నామని అనుకుంటే అంత సమయం దండగ. అమ్మ ముందే కూర్చున్నాం. అందువల్ల శుభ్రంగా తయారై, మంగళకరమైన చిహ్నములు ధరించి కూర్చోవాలి.

ఎవరి సంప్రదాయాన్ని అనుసరించి వారు విభూతి ధారణో, గోపీచందన

ధారణో, కుంకుమ పెట్టుకుని చక్కగా నవ్వుతూ, చక్కగా తలదువ్వుకునో, ముడి వేసుకునో, స్త్రీలైతే పసుపు, పారాణి రాసుకుని, అలంకారాలు చేసుకుని అమ్మవారి ముందు కూర్చుంటారు. ఇలా మంగళకరంగా తయారైన వారిని శోభనులు అంటారు. ఆ శోభనులుగా పూజ చేసేవారు సులభంగా అమ్మ అనుగ్రహంతో పరమపదాన్ని పొందగలరు.

శోభనులకు సులభముగా లభించే పరతత్త్వము. సాధకులు శోభనులై ఉండాలి. అమ్మవారు శోభనులకు అత్యంత సులభా. శోభనులు అంటే అంతరంగము మొదలుకుని బహిరంగము వరకు అంతా మంగళకరమైన భావాలు, మంగళకరమైన స్వభావం కలవారు. పదిమంది మేలుకోరేవాడు శోభనుడు. లోకం అమ్మవారిది. అమ్మవారి లోకం బాగుండాలి అనుకుంటే అప్పుడు అమ్మవారు సంతోషిస్తారు.

మంచి చేసే ఆలోచన ఉండాలి. చేయాలి. అలాంటి శోభన స్వభావం మనం కలిగి ఉండి సుఖంగా అమ్మవారిని భావనారూపంగా ఆరాధన చేస్తే అప్పుడు సులభంగా అమ్మ తన పరతత్త్వాన్ని ఇస్తున్నది. అదే శోభనులకు సులభమైన గతి. ఇది కూడా సాధనాపరమైన అద్భుతమైన వాక్యం. **శుభమైన సులభమైన ఉపాయస్వరూపిణి** – అని కూడా ఈ నామార్థం.

అమ్మ ఆరాధనకు ఉండవలసిన లక్షణాలు. 1. సుఖముగా 2. శుభముగా ఆరాధించవలసిన లక్షణములు. సుఖారాధ్యా, శుభారాధ్యా. అలాంటి వారికి కష్టం లేకుండా సులభంగా పరతత్త్వం లభిస్తోంది.

ప్రేమపూర్వకమైన భావన, మంగళకరమైన స్వభావము, ఆచరణ – ఇవి కలిగిన వారిని అమ్మ అనుగ్రహిస్తుంది.

'శోభనా – అసులభాగతిః' అని పదచ్ఛేదం చేస్తే, శుభస్వరూపిణియైన ఈ తల్లి, అంత తేలికగా పొందలేని గతి (మోక్షం – సుదుర్లభా) స్వరూపిణి. ఎన్నో పుణ్యవిశేషాలచే, ఇంద్రియనిగ్రహాది సాధనలచే మాత్రమే పొందబడే కైవల్య స్వరూపిణి... అని కూడా చెప్పవచ్చు. దుర్లభమైన మానుషజన్మ దేవీ ఆరాధనచేత శోభనమవుతుంది.

684. రాజరాజేశ్వరీ – శ్రీ రాజరాజేశ్వర్యై నమః

'రాజరాజేశ్వరీ' నుండి 'సాగరమేఖలా' వరకు రాజ్యలక్ష్మీ మంత్రవిశేషాలు చెప్పబడుతున్నాయి. ఎవరైనా ఉన్నతస్థితి కావాలనుకునేవారు వీటిని పారాయణగా చేసుకోవచ్చు. ఏది కావాలంటే అది అమ్మవారే ఇస్తుంది. ఇంత వరకు వేదాంతచర్చ చేశారు. సాధనా పద్ధతి చెప్పారు. ఇప్పుడు ఈ రాజరాజేశ్వరీ అనే శబ్దంతో ప్రారంభమౌతున్న 'రాజరాజేశ్వరీ విద్య'ని ఇస్తున్నారు.

ఇందులో ప్రతిపాదింపబడుతున్న దేవత రాజ్యలక్ష్మీ దేవత. లక్ష్మీబీజమే శ్రీకారం. ఆ శ్రీ ప్రధానంగా కలిగిన మహామంత్రం షోడశీ. సమస్త దేవతాత్మిక అయిన మహాలక్ష్మి. శ్రీసూక్తాధిదేవత.

లక్ష్మీ అష్టోత్తరశతనామాలలో 'నృపవేశ్మగతానందా' అని ఒక నామం ఉంది. ఈ నామానికి రాజుల ఇళ్ళల్లోకి వెళ్ళడానికి ఆనందించే తల్లి అని అర్థం. అంటే ఆ రాజుల ఇళ్ళల్లో ఉండే కళ అమ్మవారే. ఆ కళ ఉంటేనే అతను రాజు అయ్యాడు. అమ్మ అనుగ్రహం ఎవరి మీద పడుతుందో వాడు అంత గొప్పవాడు అవుతాడు.

ఈ నామముల వరుసలో కూడా సాధనాపరమైన అంశాలు చాలా చూపించారు. అమ్మ కృప ఎంత గొప్పదో! మొత్తానికి లలితమ్మ మనం ఏది అడిగామో అది మాత్రమే ఇవ్వడం కాకుండా మనలోనున్న జీవునికి కావలసినవన్నీ సమకూర్చి ఉత్తమగతిని కూడా ఇస్తుంది. శ్రీవిద్యే భోగమోక్షకరీ విద్య.

అమ్మవారు ప్రపంచంలోని సుఖాలు కాకుండా మోక్షం మాత్రమే ఇస్తానని చెప్పదు. ఆవిడ పిల్లలమైన మనకి ముందు అన్నీ సమృద్ధిగా ఇస్తూ, 'ఇవే గొప్పవని మురిసిపోకు. నాయనా! పరతత్త్వమనేది ఒకటి ఉంద'ని దానికి కావలసిన జ్ఞానం, వివేక వైరాగ్యములు ఇచ్చి మోక్షము కూడా ప్రసాదిస్తుంది. ఇహము, పరము రెండూ ఇస్తోంది.

'రాజ్యలక్ష్మీః' అనే నామానికి తత్త్వావిష్కరణ జరుగుతోంది. ఇది సాక్షాత్ షోడశీవిద్యగానే ఆవిష్కరిస్తున్నారు. షోడశీ విద్యాధిదేవతనే రాజరాజేశ్వరీ అంటారు. రాజరాజేశ్వరీ అన్నా, లలితాదేవి అన్నా, కామేశ్వరీ అన్నా, కామాక్షీ అన్నా ఒక్కరే.

ఇవన్నీ ఒకే మంత్రము యొక్క స్వరూపములు.

బ్రహ్మవేత్తలైనవారికి మాత్రమే అసలు రాజ్యము అంటే ఏమిటో తెలుసు.

'స్వారాజ్యం భోజ్యం వైరాజ్యం పారమేష్ఠికం రాజ్యమాధిపత్యం' అని వేద మంత్రం చెప్తోంది. ఇవన్ని ఉన్నతస్థితిని ఇచ్చే నామాలు. ప్రతివాడు ఉన్న స్థితి నుండి ఉన్నతస్థితికి చేరుకోవాలనుకుంటాడు. అలాగే కోరుకోవాలి. ఆధ్యాత్మికసాధనలో ఇంకా ప్రగతి సాధించి ముందుకు వెళ్ళాలనుకుంటే దానికి కూడా ఈ నామాలు సహకరిస్తాయి.

ఎదుగు బొదుగు లేకుండా బ్రతుకు ఉందనుకుంటే ఈ నామాలు కరదీపికలా పనికి వస్తాయి. దీనికి కూడా 'శ్రీమాత్రే నమః' సంపుటితం చేసుకుని చేసుకోవచ్చు. 'శ్రీమాత్రే నమః' అని చదివి 'రాజరాజేశ్వరీ' నామం నుండి 'సాగరమేఖలా' వరకు చదివి, మరల 'శ్రీమాత్రే నమః' అనుకుంటే అదొక సంపుటి. ఇది పారాయణ చేసుకునే వారికి లలితాసహస్రం ఎలా పనికొస్తుందో చెప్తూ ఆనుషంగికంగా చెప్పే మాట.

'రాజరాజేశ్వరీ' - అమ్మవారు రాజరాజులకు ఈశ్వరీ. ఆమెను మించిన తత్త్వం మరొకటి లేదనేదాన్ని ఈ నామం స్పష్టం చేస్తోంది. అమ్మతత్త్వాన్ని నిరంతరం అనుభవించే యోగులు 'రాజరాజేశ్వరీ' అన్న మాటకే సమాధిస్థితిని పొందుతారు. ఆ మాటలో అంత గొప్పతనం ఉంది. 'రాజ-రాజ-ఈశ్వరీ' ఇందులో మూడు ఉన్నాయి. రాజులు అంటేనే గొప్పవారు. పాలించేవానిని రాజు అంటారు. భారతం రాజు అనే మాటకి నిర్వచనం చెప్తూ **'రంజకత్వాత్ రాజా'** రంజింపజేస్తాడు కనుక రాజు అన్నది. పోషింపజేస్తాడు. లోటు లేకుండా చూస్తూ ఉంటాడు.

రాజు అనే దానికి మరొక అర్థం - **'రాజతే ఇతి రాజా'** - ప్రకాశించువాడు. అందరికంటె గొప్పగా, అన్నింటిలోనూ గొప్పగా ఉన్నవానిని రాజు అంటారు. కొందరు సంపదల్లోనే రాజులవుతారు. కొందరు సమర్థతలో రాజులు, కొంతమంది జ్ఞానములో రాజులు. ఇలాగ ఒకొక్కరు ఒకొక్క రాజులు. అన్నింటిలోనూ రాజులు కొందరు ఉంటారు.

మొత్తానికి రాజులు అనగానే గొప్పగా ఉండువారు, అందరిని ఆనందింప చేయువారని అర్థం. ఇలాంటి పని చేసే బాధ్యత కొందరికి అమ్మవారు అప్పగించింది. అలాగ మనకి ప్రపంచంలో కూడా ఒక పెద్ద రాజు ఉంటాడు. ఆయన సామ్రాట్. ఆయన క్రింద సామంతులు చాలా మంది ఉంటారు.

అమ్మవారు సామంతుల్లా ఎందరినో నియమించింది. వారందరూ మనకి రాజులు. దిక్పాలకులు మొదలైన వారందరిని రాజులు అంటారు. బ్రహ్మ, విష్ణు, రుద్రులని రాజరాజులంటారు. దేవతలందరికి వారు దేవుళ్ళు. ఆ ముగ్గురికి మహేశ్వరులు అని పేరు ఉంది. వారికి కూడా ఆమె ఈశ్వరి. నియామకురాలు. **'యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిర్దేవైః సదా పూజితా'** అని చెప్పినట్లుగా.

కుబేరునికి 'రాజరాజు' అని పేరు. సృష్టిలో ఆయన కృప కూడా మనకి ఉండాలి. **'రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే నమో వయం వైశ్రవణాయ కుర్మహే'** అని మంత్రం. వైశ్రవణుడు అంటే కుబేరుడు. ఆయనకి సంబంధించిన మంత్రము. 'రాజాధిరాజ' అంటే కుబేరుడు. రాజరాజఈశ్వరి అంటే మహాలక్ష్మి. రాజరాజైన కుబేరునికి కూడా అమ్మవారే నియామకురాలు. దీనిని 'రాజరాజార్చితా' నామం దగ్గర వివరించుకున్నాం.

శ్రీవిద్య పన్నెండు విద్యలలో ఒకటిగా 'కుబేరవిద్య' అని చెప్పబడుతున్నది. మనువిద్య, చంద్రవిద్యల వలె దీనిని కూడా స్మరించుకోవాలి. కుబేరుడు కూడా శ్రీవిద్యోపాసకుడే. కుబేరసంబంధమైన రహస్యాలు మొత్తం ఈ నామ పరంపరలో వస్తాయి. కుబేరలక్ష్మి ఆరాధన అని ఒకటి ఉంది. దానికి ఒక మంత్రం చెప్తారు. కొంతమంది ఇళ్ళల్లో కుబేరలక్ష్మిపటం కూడా ఉంటుంది.

సమస్త లోకపాలకులకి పాలకురాలు. లోకపాలకులైన దేవతలకి నియామకులైన బ్రహ్మ విష్ణు రుద్రాదులకు కూడా నియామకురాలు అని మూడు అర్థాలు చెప్తూ కుబేరవిద్యయే శ్రీవిద్య అని ప్రస్తావన చేస్తున్నారు.

685. రాజ్యదాయినీ – శ్రీ రాజ్యదాయిన్యై నమః

రాజ్యమునిచ్చునది. ఏది దొరికితే మనం ఆనందంగా, అందరికంటె గొప్పగా ఉంటామో అదే రాజ్యం. రాజ భావమే రాజ్యం. అమ్మవారు రాజ్యం ఇస్తుంది.

ఆనందకరమైన, ఉన్నతస్థితిని రాజ్యము అంటారు. దానిని ఇచ్చునది రాజ్యదాయినీ. రాజరాజేశ్వరీ అంటే భువనేశ్వరీ స్వరూపం. భువనములన్నింటికి ఈశ్వరీ.

ఎన్ని రాజ్యాలు ఉన్నాయో శాస్త్రంలో చెప్పారు. రాజ్యముల పేర్లు తలచుకోవడం కూడా గొప్ప క్షేమం. అష్టదిక్పాలకులకు రాజ్యాలు ఉన్నాయి. ఇంద్రుని రాజ్యం అమరావతి. అగ్నిదేవుని రాజ్యం తేజోవతి. యమధర్మరాజు రాజ్యం పేరు సంయమిని. నిరుతి యొక్క రాజ్యం కృష్ణాంగనా. వరుణుని రాజ్యం శ్రద్ధావతి. వాయువు రాజ్యం గంధవతి. కుబేరునిది అలకావతి లేదా అలకాపురి. ఈశానునకు యశోవతి. బ్రహ్మకి సత్యలోకం, విష్ణువునకు వైకుంఠం, ఈశ్వరునకు కైలాసం. ఇవన్నీ కూడా రాజ్యములే. ఇలా దేవతలు, త్రిమూర్తులు ఆయాలోకాలలో ఉంటూ, ఆ లోకధర్మాన్ని అనుసరిస్తూ రాజ్యదాయినీ కృప వలన ఆయా లోకాలను నడుపుతున్నారు. ఆ లోకాలు, ఆ లోకాల యందు స్థితి ఇచ్చిన తల్లి.

ఇదంతా 'భువనేశ్వరీవిద్య'గా భావన చెయ్యాలి. సమస్త లోకాలను విడివిడిగా చూడడం, సమస్త లోకాలను సమష్టిగా అమ్మ ఎలా పాలన చేస్తోందో గ్రహించడం అనేది 'రాజ్యదాయినీ' నామంలో ఉన్న విశేషము.

686. రాజ్యవల్లభా – శ్రీ రాజ్యవల్లభాయై నమః

వల్లభా అంటే నాయకురాలు అని ప్రధానమైన అర్థం. సమస్త రాజ్యాలకు ఈవిడ వల్లభురాలు.

వల్లభా శబ్దానికి మరొక అర్థం 'ప్రియమైనది'. 'రాజ్యవల్లభా' అంటే సమస్త రాజ్యాలకు ప్రియము చేయునది. అన్ని లోకాలలో ఉండే వారికి కూడా కావలసినవి సమకూర్చుతూ ఆనందం కలిగించే తల్లి కనుక 'రాజ్యవల్లభా'.

లోకంలో మనం ఎవరికైనా ఆనందం కలిగించాలంటే అవతలి వాని వల్ల ఏదైనా ప్రయోజనం ఉంటే కలిగిస్తాం లేదా పుణ్యం వస్తుందంటే కలిగిస్తాం. అమ్మవారికి ఆ రెండూ లేవు. ఆవిడ దగ్గర ఉన్నది గొప్ప దయ. ఆ దయ వల్ల ఈ లోకానికి ప్రీతి కలిగిస్తోంది. అందుకే తరువాత నామం 'రాజత్కృపా'.

687. రాజత్కృపా – శ్రీ రాజత్కృపాయై నమః

ఇన్ని రాజ్యాలు ఏర్పరిచి నడపడానికి కారణం 'రాజత్కృపా'. రాజత్ అంటే ప్రకాశిస్తున్న, గొప్పదైన అని అర్థం. అమ్మది గొప్పదైన దయ.

అమ్మ దయ ప్రకాశిస్తోందంటే అంతటా కనిపిస్తోంది. ప్రహ్లాదునికి భగవంతుని కృప అంతటా కనిపిస్తే, హిరణ్యకశిపునికి అది తప్ప మిగతాది అంతా కనిపిస్తోంది. ప్రపంచమంతా ఎక్కడ చూసినా రాజత్కృప గోచరిస్తోంది. పగలంతా పనిచేసి అలసిపోయిన మనకి రాత్రి అనే చీకటిని తీసుకువచ్చి లోకాన్ని నిద్రపుచ్చుతోంది అమ్మవారు. అమ్మ కృపే ఉదయాన్నే వచ్చి సూర్యుని రూపంలో సర్వజీవకోటి మీద కురుస్తోంది. ఆవిడ పట్టుకుని ఉండడం వల్లే భూమి మీద మనం నిలబడగలుగుతున్నాం. ఒక్కసారి నా వల్లకాదు అని వదిలేస్తే మనం ఏమవ్వాలి?

మనం అమ్మవారి నుండి ఆ దయను ఎలా అనుభవిస్తున్నామో ఈ నామంలో భావన చెయ్యాలి. మనం ఆ కృపని ప్రత్యక్షముగా అనుభవిస్తున్నాం. కానీ మనకి అది అని తెలియడం లేదు. సూర్యుడు, భూమి, గాలి – ఇవన్నీ అమ్మ దయారూపాలుగా కనబడుతున్నాయి కనుక అమ్మదయే అంతటా ఉంది.

ఆవిడ కృప ఎక్కడో దాగి లేదు. ఇన్ని లోకాలు ఏర్పరచడం, ఆ వ్యవస్థని చేయడం. ఇదంతా అమ్మ దయ వల్లనే చేసింది. ఆ దయే లోకాలను ఏలుతోంది. ఆ దయతోనే తనని ఆశ్రయించిన వారిని తీసుకు వచ్చి పైన కూర్చోబెడుతుందని తరువాత నామంలో చెప్తున్నారు.

688. రాజపీఠనివేశితనిజాశ్రితా - శ్రీ రాజపీఠనివేశితనిజాశ్రితాయై నమః

తనని ఆశ్రయించిన భక్తులను రాజపీఠంలో కూర్చోబెడుతున్నది. రాజపీఠం అంటే గొప్పస్థానమని అర్థం.

అమ్మవారు ప్రతిజ్ఞ పట్టారు. వాగ్దేవి చెప్తున్న మంత్రం- **"యం కామయే తం తముగ్రం కృణోమి తం బ్రహ్మాణం తమృషిం తం సుమేధామ్"** (ఋగ్వేదం). నేను ఎవరిపై ప్రీతి కలిగి ఉంటానో వారిని ఉగ్రుణ్ణి చేస్తాను అంది. ఉత్కృష్టస్థితిలో ఉన్నవాడు ఉగ్రుడు. అందరికంటె మించిపోయే వానిని ఉగ్రుడు అంటారు. (అందరికంటె ఎక్కువ బలం చూపిస్తాడు కనుక శివుని ఉగ్రుడు అంటారు.)

తన భక్తుని ఉగ్రుణ్ణి, గొప్పవానిని చేస్తానని వేదంలో అమ్మవారు ప్రతిజ్ఞ పట్టింది. 'తం బ్రహ్మాణం' అంటే, 'వానిని బ్రహ్మను చేస్తాను' అంది. 'బ్రహ్మాణం కరోమి' అంటే జ్ఞానిని చేస్తాను అని అర్థం. వానిని ఋషిని, మేధావిని చేస్తాను.

కొందరు పనికిరాడనుకుంటున్నవారిని కూడా "తీర్చిదిద్దుతాము" అంటుంటారు. అమ్మ తీర్చిదిద్దుతాను అనదు - అలా చేసేస్తానని చెప్తోంది. ఆవిడ తలచుకోవాలే కానీ ఎవరినైనా తీసుకువెళ్ళి ఉన్నతస్థానంలో కూర్చోపెట్టగలదు. ఏమి చేతకానివాడు కూడా అమ్మని ఆశ్రయిస్తే సర్వసమర్థుడు అయిపోగలడు. అమ్మవారికి ఆ శక్తి ఉంది. ఆ శక్తే ఆవిడ.

పండితుఁడాతఁడాతఁడు ప్రభావసమగ్రుఁడతండు శూరుఁడా
తండు వివేకి యాతఁడు వదాన్యుడతండు మహాకులీనుఁడా
తండు కళావిదుండతఁడు ధన్యుడతండు మనోజ్ఞమూర్తి, యె
వ్వండు భవత్కృపాకలన వైభవలక్ష్మికిఁబాత్రుఁడిందిరా!

అంటారు కాశీఖండంలో శ్రీనాథమహాకవి.

ఈ నామానికి పురాణ ప్రమాణం, వేదప్రమాణం... రెండు చూపించాం. వేదంలో తల్లిమాట అది- "నేను ఎవరిని అనుగ్రహిస్తానో వానిని తీసుకువచ్చి ఉన్నత స్థానంలో ఉంచుతాను" అన్నది.

అమ్మవారిని ఆశ్రయించడం చేత ముందు చెప్పుకున్న రాజరాజులు అందరూ

ఆయా స్థానాలయందు ఉన్నారు. 'రాజపీఠనివేశితనిజాశ్రితా' అనే నామానికి ముందు 'రాజత్కృపా' అనే నామం చెప్పడంలో ఉన్న ఔచిత్యం. ఆశ్రయించిన భక్తుని పట్ల అమ్మకి దయపుట్టి ఆ స్థితిని ఇస్తుంది.

689. రాజ్యలక్ష్మీః - శ్రీ రాజ్యలక్ష్మ్యై నమః

ముందు చెప్పిన వివిధములైన రాజ్యములలో వ్యాపించిన లక్ష్మి - రాజ్యలక్ష్మీః. భూమి మొదలుకుని బ్రహ్మలోకం వరకు ఉన్న సర్వలోకములలో ఉన్న సంపదలు ఈ తల్లే. లక్ష్మీదేవిని స్తుతిస్తూ ఇంద్రుడు- **"స్వర్గేచ స్వర్గలక్ష్మీః త్వం మర్త్యలక్ష్మీశ్చ భూతలే, వైకుంఠేచ మహాలక్ష్మీః కైలాసే పార్వతీ త్వం చ క్షీరోదే సింధుకన్యకా"** - కైలాసం మొదలుకుని వైకుంఠం, బ్రహ్మలోకం, చిట్టచివరికి మర్త్యలోకం, మన ఇళ్ళల్లో కూడా "గృహలక్ష్మీ గృహే గృహే". ఇలా సర్వమునందు వ్యాపించి ఉంది కాబట్టి 'రాజ్యలక్ష్మీః'. మంత్రశాస్త్రాలలో రాజ్యలక్ష్మీ మంత్రాధిదేవత.

సమస్తలోకాలలో వ్యాపించి, తనను ఆశ్రయించిన వారిని ఉన్నతస్థితిలో ఉంచుతూ ఆనందం కలిగించే లక్ష్మి రాజ్యలక్ష్మి. ఈ తల్లి అనుగ్రహం ఉన్నవారు తప్పకుండా ఎప్పుడూ ఉన్నతస్థితిలో ఉంటారు. 'రాజత్కృపా, రాజపీఠనివేశితనిజాశ్రితా, రాజ్యలక్ష్మీః' అన్నప్పుడు 'సర్వరాజ్య సంపత్స్వరూపిణీ' అనే భావాన్ని ప్రకటిస్తున్నది.

690. కోశనాథా - శ్రీ కోశనాథాయై నమః

'కోశనాథా', 'చతురంగబలేశ్వరీ'. రాజ్యానికి ఉండవలసినవి ప్రధానంగా రెండే. ఈ రెండూ ఉంటే ఎన్నైనా చెయ్యవచ్చు. ఒకటి - కోశములు అంటే భాండారం. అది బాగా ఉంటేనే రాజు ఏదైనా సాధించగలడు. ఏ దుష్టరాజునైనా క్రిందకి దించాలంటే వానిని సామంతో, దానంతో నియంత్రించాలంటే ముందు ఆ రాజ్యానికి కోశం బాగుండాలి. రాజ్యం క్షేమంగా ఉండాలన్నా కోశం బాగుండాలి.

రాజ్యానికి ఉండవలసిన వనరులన్నీ అమ్మవారు చక్కగా నింపి పెట్టారు. కోశములకు నాథ.

కుబేరుని దగ్గర కొన్ని నిధులు ఉన్నాయి – అవి ఇక్కడ వర్ణిస్తున్నారు. ఈ నిధులని ఆధారం చేసుకుని కుబేరుడు ప్రపంచమంతటికి ఐశ్వర్యాన్ని ఇస్తూ ఉంటాడు.

ఈ ప్రపంచంలో సంపదలు పొందించడానికి ఆయన దగ్గర కొన్ని నిధులు ఉన్నాయి. తొమ్మిది నిధి దేవతలు, అష్టసిద్ధి దేవతలు ఉన్నారు. నిధి దేవతలు కుబేరుని ఆజ్ఞకి లోబడి ఉంటారు. వారి ఆధారంతోనే అన్ని రకాల సంపదలు సమకూర్చగలడు. నిధి అంటేనే తరగని గని. ఆ తరగని నిధులే ఆయన కోశాలు. ఆ నిధులన్నింటికి తల్లి ఈవిడ.

నిధి దేవతల పేర్లు– పద్మనిధి, మహాపద్మనిధి, శంఖనిధి, మకరనిధి, కచ్ఛపనిధి, ముకుందనిధి, కుందనిధి, నీలనిధి, ఖర్వనిధి. ఈ నవ నిధులకు ఆవిడ నాయకురాలు.

రాజ్యశబ్దానికి మరొక అర్థం: ఈ శరీరమే పెద్ద రాజ్యం. మన కోశాలలో మంచి శక్తి ఉండాలి. మనలో ఐదు కోశాలని బాగా నడుపుతూ ఐదు కోశాలకు నాయకురాలుగా ఉన్నది కనుక 'కోశనాథా'. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయములనే కోశములకు నాయకురాలు.

691. చతురంగబలేశ్వరీ – శ్రీ చతురంగబలేశ్వర్యై నమః

కోశాలకి బలం కూడా కావాలి. వశిన్యాది వాగ్దేవతలు తత్త్వాన్ని చక్కగా ఆవిష్కరిస్తున్నారు. ముందు పీఠం చూపించారు. దాని తరువాత రాజ్యానికి కావలసిన బలాలు రెండు. కోశబలం, చతురంగబలం. ఇదే మొత్తం రక్షణ. చతురంగబలాలంటే రథ, గజ, తురగ, పదాతులు. వీటన్నింటికి ప్రమాణాలు పురాణకథల్లో మనకి కనబడుతుంటాయి.

దేవీసప్తశతిలో సురథుడనే రాజుని శత్రువులు ఓడించి తరిమి వేస్తే, అన్నీ పోగొట్టుకొని గురువుల దగ్గర కూర్చుని కొన్ని దినాలు అమ్మవారి పూజ చేశాడు. అమ్మ దయ వల్ల మొత్తం రాజులందరూ భయచకితులు అయ్యారు. అతడు తిరిగి రాజ్యాన్నీ, సంపదలనీ పొందారు.

ఈ నామాన్ని మంత్రపరంగా చూస్తే మంత్రానికి ప్రధానంగా బీజ, పద, సంఖ్య, రేఖ అని నాలుగు బలాలు ఉంటాయి. మంత్రానికి ఇవి చతురంగబలాలు.

మంత్రంలో బీజాక్షరాలు, పదాలు, ఏ సంఖ్యలో కూర్చబడ్డాయో లెక్క- ఉదాహరణకు నవాక్షరి అంటే తొమ్మిది, షడక్షరీ అంటే ఆరు. మంత్రానికి సంఖ్య ఒక ప్రాధాన్యంగా ఉంది.

మంత్రానికి శక్తి అక్షరాలతోను, బీజాక్షరాలతోను, సంఖ్యతోను కూడా ఉంటుంది.

రేఖ అంటే మంత్రము యొక్క యంత్రరూపము. మంత్రానికి యంత్రం ముఖ్యం. అమ్మవారి మంత్రం పంచదశీ. పంచదశీలో బీజాక్షరాలున్నాయి. పదాలున్నాయి. పంచదశీ అని సంఖ్య ఉంది. దాని యొక్క యంత్రం శ్రీచక్రం. సంఖ్య, బీజ, పద, రేఖ – అని ఈ నాలుగు చతురంగబలం. ఈ చతురంగబలం కలిగిన శ్రీవిద్యాధిదేవత 'చతురంగబలేశ్వరీ'.

బహ్వృచోపనిషత్తు ప్రకారం – **"శరీరపురుషః, ఛందోపురుషః, వేదపురుషో మహాపురుషః"** – ఈ నాలుగు పురుషుల స్వరూపాలు.

విశ్వరాజ్యం నడిపేటప్పుడు ఆవిడ నాలుగే బలంగా తీసుకుంది. అవి ఋగ్యజుస్సామాథర్వణ వేదాలు. నాలుగు వేదాలే ప్రపంచానికి బలం. అదే 'చతురంగబలేశ్వరీ'.

692. సామ్రాజ్యదాయినీ – శ్రీ సామ్రాజ్యదాయిన్యై నమః

సామ్రాట్ అంటే అనేక సామంతులని కలుపుకొని పైన ఉన్న స్థితి. అపరిమితమైన ఆధిపత్యమే సామ్రాజ్యం.

శ్రీవిద్య పొంది దీక్షలోకి వెళ్ళినవారు రాజులు. అమ్మ విద్యలో బాగా పండి గురుకృపతో 'ఇంక నువ్వు పూర్ణుడవు అయ్యా'వని అనిపించుకుంటే వాడు సామ్రాట్టు. ఆ స్థితి అమ్మ కృప మాత్రమే ప్రసాదిస్తుంది కనుక 'సామ్రాజ్యదాయినీ'.

బ్రహ్మవిద్యావేత్తలను, శ్రీవిద్యలో పూర్ణత్వాన్ని పొందినవారిని సామ్రాట్ అంటారు. జ్ఞానియే గొప్ప సామ్రాట్. పరమాత్మకి మూడు పదాలు ఉన్నాయి. సామ్రాట్, విరాట్, స్వరాట్. విరాట్ – విశేషేన రాజతే ఇతి విరాట్ – విశ్వరూపంగా వ్యాపించి ఉన్నాడు.

'స్వరాట్' తనంత తాను ప్రకాశిస్తున్నాడు. దానిని మించి మరొక ప్రకాశం లేదు. సంపూర్ణప్రకాశమే సామ్రాట్. ఈ మూడు తత్త్వాలు పరమేశ్వరునికి, పరమేశ్వరికి చెప్పారు.

తన భక్తులను ఆ స్థితికి తీసుకుని వెళ్తుంది. సామ్రాజ్యదాయినీ అంటే అందరూ ఆయనకు లోబడి ఉంటారు కాని, ఏ ఒక్కరూ కూడా ఆయనను లోబరచుకోలేరు. ఇది ఎప్పుడూ ఉండాలి. ఒకనికి మనం లొంగిపోతే మనం బానిసలమే. ఎవరికి లొంగకుండా ఉంటే అదే సామ్రాట్. ఏ ఆశా లేకపోతే వారే సామ్రాట్. పరమవైరాగ్యవంతుడైన మహాయోగిని సామ్రాట్ అనాలి.

వశిష్ఠుడు సామ్రాట్టా! లేక సూర్యవంశపు చక్రవర్తి సామ్రాట్టా! అంటే వశిష్ఠుడే సామ్రాట్. రఘువంశంలో సామ్రాట్టులకు కిరీటం పెట్టాడు వశిష్ఠుడు. వారందరూ వచ్చి, వారి కిరీటాలు తీసి ఈయన పాదాల వద్ద పెట్టి సాష్టాంగ నమస్కారాలు చేసేవారు.

'పాత్రం పూర్ణతరం చ మే' 'అమ్మా! నీ దీక్షలో నన్ను పరిపూర్ణుని చేయి తల్లీ!' దీక్షలో గొప్పవాడైన వానిని సామ్రాట్ అంటారు. ఆ స్థితిని ఇచ్చే తల్లి సామ్రాజ్యదాయినీ. బ్రహ్మవేత్తలు ఆత్మసామ్రాజ్యానికి అధిపతులు.

సంపత్కరాణి సకలేన్ద్రియనన్దనాని
సామ్రాజ్యదానవిభవాని సరోరుహాక్షి
త్వద్వీక్షితాని దురితాహరణోద్యతాని
తామేవమాతరనిశం కలయంతు నాన్యమ్' అని కాళిదాసకృతి. తల్లి వీక్షణాలు సామ్రాజ్యాన్ని ప్రసాదిస్తాయి.

"రామభక్తి సామ్రాజ్యము ఏ మానవులకి అబ్బెనో ఆ మానవుల సందర్శనము అత్యంత బ్రహ్మానందము" అంటారు మరో సామ్రాట్టైన త్యాగరాజస్వామివారు. భక్తిలో పండిపోతే భక్తిసామ్రాజ్యం. అమ్మ దయ లేనిదే భక్తి లేదు కనుక 'భక్తి సామ్రాజ్యదాయినీ' అని భావన చేసుకోవాలి. సాధకుడైనవాడు ఈ కోణంలో ఆలోచించాలి. తరువాత నామం 'సత్యసంధా'.

693. సత్యసంధా - శ్రీ సత్యసంధాయై నమః

ఇంతవరకు చెప్పిన రాజ్యలక్ష్మీతత్త్వానికి ప్రధానమైనది చెప్తున్నారు. 'సంధా' అంటే లోబడి ఉండుట. సత్యానికి కట్టుబడి ఉండుటే సత్యసంధా. రాజైన వానికి ఉండవలసిన లక్షణమిది. ఈ నియమాన్ని అయోధ్యాధిపతులు పాటించారు. ప్రాచీన భారత రాజర్షుల నియమమది. సత్యమైన ప్రతిజ్ఞా మర్యాదలు కల తల్లి.

రఘువంశ రాజులందరూ సత్యసంధులు. అటువంటి రాజర్షులు పాలించిన నేల భారతదేశం. ఆ రాజర్షుల లక్షణమే సత్యసంధత. "నేనొక్కడిని ఇప్పుడు పుత్రవ్యామోహంతో సత్యాన్ని తప్పిపోతే ఈ రాజ్యాన్ని నాదాకా తీసుకువచ్చిన పూర్వీకుల దగ్గర ఉన్న 'సత్యసంధా' అనే గుణం కోల్పోతాన"ని బాధపడ్డాడు దశరథుడు.

ఋషికి అసత్యం సోకితే తపస్తేజమంతా పోతుంది. "నాన్నకి సత్యం తప్పే దోషం నేను రానివ్వకూడదని, నాన్న సత్యాన్ని నేను కాపాడతాన"ని వనవాసానికి సిద్ధమయ్యాడు శ్రీరామచంద్రమూర్తి. 'సత్యసంధా' అనేది పాలకులైనవారికి ఉండవలసిన గొప్పలక్షణం. రాజ్యధర్మం సత్యం. అటువంటి సత్యసంధతయే అమ్మ యొక్క స్వరూపం.

'సత్యస్సంధా సంకల్పో యస్య ఇతి సత్యసంధః'. సంకల్పించినది తప్పక చేసేవాడు 'సత్యసంధా'. సత్యం అంటే వ్యర్థం కానిది అని మరో అర్థం. వ్యర్థం కాకుండా పాలన జరుగుతూ ఉంటుంది. ఈ నామానికి భాష్యకారులు అర్థం చెప్తూ- 'రామచంద్రరూపిణి' అన్నారు. రాముని రూపంతో ఉన్న లలితాంబా.

రాజరాజేశ్వరీ నామం నుండి చెప్పినదంతా రామతత్త్వమే. ఈ నామాలన్నీ రాముని యొక్క స్త్రీలింగ శబ్దాన్నే వర్ణిస్తున్నారు. సావిత్రీ నామం వరకూ రామచంద్రమూర్తినే చెప్తున్నారు. **'శ్రీరామో లలితాంబికా'.** (బ్రహ్మాండపురాణం)

రామచంద్రమూర్తిది కోదండం. అమ్మవారిది ఇక్షుదండం. మనోరూపేక్షు కోదండా. చాలామంది ఈ అన్వయాన్ని చమత్కారంగా చెప్పారని అనుకుంటారు. కానీ ఉపాసనారహస్యం తెలిసిన వారు, దేవతాతత్త్వం గ్రహించినవారు ఒకే తత్త్వం రెండు రూపాలతో కనబడినప్పుడు రెండిటిని అనుసంధానం చేస్తారు. ఇదే రహస్య

విద్య. సుదర్శన, నృసింహతత్త్వాలని సుబ్రహ్మణ్యునిలో కొందరు దర్శిస్తారు. తద్దేవతా లక్షణం అక్కడ ఉంది. ఒక దేవతకి – మరో దేవతకి సమన్వయం ఉంటుంది. తత్త్వం ఒక్కటే రెండు రూపాలు అయింది.

కేవలం వైష్ణవులమనుకునేవారు సుబ్రహ్మణ్యుని శైవుడని అనుకుంటే, సుబ్రహ్మణ్యుని ఉపాసించే శైవులు నరసింహస్వామిని వైష్ణవదైవమనుకుంటారు. రెండు రూపాలలో ఉన్న సమన్వయాన్ని గ్రహించలేరు. అలాగ రామచంద్రమూర్తి సాక్షాత్తు విష్ణువు. విష్ణువు మళ్ళీ సాక్షాత్ అమ్మవారే. శివుని యొక్క శక్తే మగరూపం ధరిస్తే విష్ణువు, స్త్రీరూపం ధరిస్తే అమ్మవారు.

సత్యసంధా – నారాయణుడే జగత్తుకు నిజమైన రాజు. ఆ రాజైనవాడు రాజరాజేశ్వరుడై వచ్చాడు. రామచంద్రమూర్తి ఏదో ఒక రాజపుత్రునిగా లేడు. అఖండ భూమండలంపై రాజరాజేశ్వరునిగానే తిరిగాడు. మొత్తం వెదికితే ఆయనే కనిపిస్తున్నాడు. 'సాగరమేఖలా' అన్నప్పుడు కూడ సాగరాన్ని – సేతువును బంధించిన రామచంద్రమూర్తి స్ఫురణకు వస్తే ఇంకా సంతోషం.

694. సాగరమేఖలా – శ్రీ సాగరమేఖలాయై నమః

సాగరమే మేఖలముగా కలది. మేఖలా అంటే వడ్డాణము. ఇక్కడ మేఖలా శబ్దానికి అర్థం 'హద్దు'. పూర్వం గొప్ప రాజ్యాన్ని, విస్తార రాజ్యాన్ని పాలించేటప్పుడు సముద్రమే హద్దుగా కలిగి పాలించేవారని చెప్పేవారు. అఖండ భూమండలానికి చక్రవర్తులైనవారి గురించి ప్రస్తావన చేసేటప్పుడు 'సాగరమేఖలా' అంటారు.

రాజ్యలక్ష్మి యొక్క ప్రయోజనం విస్తారం. శత్రురాజ్యాల దాడికి అవకాశం లేని విస్తారం.

సాగరము అవధిగా కలిగినదని భూదేవి రూపముగా కూడా అర్థం ఉంది. వసుంధర – భూదేవి. రాజ్యమివ్వడమే కాకుండా రాజ్య సంబంధమైన భూశక్తి కూడా జగదంబయే. భూదేవి రూపంలో ఉన్న తల్లి అనే విషయం ఇక్కడ ప్రస్తావన ఉన్నది.

ఇంకొక భావం: అమ్మ విశ్వరూపాన్ని భావన చేస్తే, అతల, వితల అనే లోకాల వరుసలో భూమి కటి స్థానానికి వచ్చింది. భువనేశ్వరి ఆమె. సమస్త లోకాలకు ఈశ్వరిగా రాజరాజేశ్వరీ. భువనాలన్నీ ఆ తల్లి యందే ఉన్నాయి కనుక సరిగ్గా పృథ్వి కటి దగ్గరకి వచ్చింది. ఆ పృథ్వి చుట్టూ ఉన్న సముద్రం కటి చుట్టూ పెట్టిన వడ్డాణంలా ఉందని చెప్పారు. నడుము భాగం పృథ్వి కనుక సాగరమేఖలా అన్నారు. ఇంతవరకు అమ్మ విరాడ్రూప భావన చెప్పబడింది.

695. దీక్షితా – శ్రీ దీక్షితాయై నమః

దీక్ష కలిగినది. **ధియం జ్ఞానం క్షిణోతి పాపయతి దీక్షా.** జ్ఞానాన్ని ఇచ్చేది దీక్ష. ఆ దీక్ష కలిగిన స్వరూపం దీక్షితా.

వ్రతయజ్ఞాలు చేసినప్పుడు 'ఆ పని అయ్యేవరకు నేను దీనికే కట్టుబడి ఉంటాను' అని చెప్పడం కోసం కంకణం కట్టుకుంటారు. దీనికే దీక్షాకంకణము అని పేరు. కంకణం కట్టుకున్న వారిని దీక్షితులు అంటారు.

అమ్మవారు ఒక కంకణం కట్టుకున్నారు. అది– 'రాజపీఠనివేశితనిజాశ్రితా'. తనను ఆశ్రయించిన వారిని గొప్పస్థితిలో పెడతానని దీక్ష. నా భక్తుడు అయిన వారిని 'ఉగ్రం కృణోమి' "గొప్పవారిని, మేధావిని చేస్తాను, ఉన్నతస్థితిలో కూర్చోబెడతాను. బ్రహ్మని చేస్తాను" అంది. ఇదంతా కంకణం కట్టుకోవడమే. **"తవ ప్రతిజ్ఞా మద్భక్తా న నశ్యంతీత్యపి క్వచిత్"** – అదే దీక్ష. 'సత్యసంధా' కూడా ఇదే. భక్తులను రక్షించడమే దీక్షగా కలిగినది. లోక రక్షణ దీక్షా బద్ధురాలు. ఆ కట్టుబాటు నుండి బయటకి రాదు.

ఇంకొక అర్థం: 'దీక్షితులే అమ్మ రూపం'. భగవంతుని ఆరాధించడానికి రెండు పద్ధతులున్నాయి. మంత్రాన్ని ఆవహింపజేసి విగ్రహాలలో ఆరాధన చేస్తాం. విగ్రహాలలో కళాన్యాసం చేసి అమ్మవారి శక్తిని ఆవహింపజేస్తాం. కళలు న్యాసం చేస్తే జడమైన విగ్రహంలోనే అమ్మవారు ఉంటారు కదా! మరి మంత్రాన్ని న్యాసం చేసుకుంటున్న చైతన్యవంతమైన శరీరంలో అమ్మవారు ఉండరా! అనేది ఆలోచించాలి. ఉపాసకులైన

వారి శరీరంలో దేవతా శక్తి ఉంటుంది. ఏ దేవతను ఎవరు ఉపాసిస్తారో ఆ దేవత వారిలో సూక్ష్మరూపంగా ఉంటుంది.

దీక్షితుడే సాక్షాత్తు అమ్మవారి రూపం. **'అకాయో భక్తకాయస్యాత్'** అని చెప్తోంది శాస్త్రం. శరీరంలేని భగవంతునికి భక్తుని శరీరమే శరీరం. వాడు నిరంతరం ఆ తల్లిని ఉపాసన చేసేటప్పుడు తన్మంత్రాలని శరీరమునందు న్యాసము చేసుకుంటాడు. మామూలుగానే మంత్రానికి అంగన్యాస, కరన్యాసాలు ఉంటాయి. ఇదంతా శ్రీవిద్యాశాస్త్రమని మరచిపోరాదు. ఈ పదాలన్నింటికి ఆ పరిభాషలో అర్థాలు చెప్పుకోవాలి. లోకవ్యవహారంలో భక్తిపరంగా, ధర్మపరంగా లోకరక్షణ చేస్తోంది కనుక దీక్షితురాలని చెప్పుకున్నాం.

ఈ నామానికి శ్రీవిద్యాపరంగా అర్థం చెప్పుకోవాలి. దీక్షితులైనవారు మాతృకా న్యాసం, షోఢా న్యాసం - ఇలా మంత్రాలన్నింటిని తనలో న్యాసం చేసుకుంటారు. ఒకసారి దీక్ష పొందితే మరణపర్యంతం దీక్షని పాటించాల్సిందే. దానికి సన్నద్ధుడైతేనే దీక్షని స్వీకరించాలి. నిరంతరం అదే జపం, తపం చేస్తుంటే వాని శరీరంలో కొన్ని పరిణామాలు వస్తాయి. శరీరమంతా మంత్రమయమైపోతుంది. దీక్షితుని శరీరం మాంసమయం కాదు - మంత్రమయం. అప్పుడు అమ్మవారు వారిలోనే ఉంటారు. దీక్షితుల రూపములో ఉన్నదే అమ్మ.

దీక్ష అనేది చాలా విశిష్టమైన శబ్దము. దీక్ష ఇచ్చేవానికి, పుచ్చుకునే వానికి ఇద్దరికి కూడా కొన్ని పద్ధతులు ఉంటాయి. **'దీయతే జ్ఞాన విజ్ఞానం క్షీయంతే పాపరాశయః'.** దీ-క్ష శబ్దంలో అర్థం. **దీ** అనే శబ్దము జ్ఞానమునివ్వడాన్ని తెలియజేయగా, **క్ష** అనే శబ్దము పాపములను క్షయింపజేస్తున్నది అని చెప్తోంది. దీక్ష పొందగానే దేవతా రూపమైన జ్ఞానం ప్రవేశిస్తోంది. పాపము క్షయిస్తున్నది. అది చేసే పద్ధతిని దీక్ష అంటారు.

దీక్షలో జరుగుతున్న పద్ధతి ముందు పాపనాశనం. దీనినే శోధనము అంటారు. పాపాన్ని పోగొడతారు. దేవతాతత్త్వాన్ని మంత్రరూపంలో, ఉపదేశరూపంలో, బోధనారూపంలో ప్రవేశింపజేస్తారు.

దీయతే జ్ఞానవిజ్ఞానం క్షీయంతే పాపరాశయః

తేన దీక్షా ఇతి ప్రోక్తా ప్రాప్తా చేత్సద్గురోర్ముఖాత్

సద్గురువు ముఖం నుండి ఆ విధంగా దీక్షని పొందుతారు. **"దివ్యభావ ప్రదానస్యాత్ క్షాళనాత్ కల్మషస్య చ"** అని మరొక అర్థం చెప్పారు. దీక్షలో మొదటి దీ దివ్యభావాన్ని ఇస్తుంది. ఇంతవరకు జీవునిలో కేవలం పశుత్వముంది. ఇప్పుడు మంత్రరూపంలో దివ్యత్వం ప్రవేశించి కల్మషములు క్షాళనం చెయ్యబడుతున్నాయి. 'దీక్షేతి కథితా సద్భిః' – దీక్ష యొక్క ప్రయోజనం 'భవబంధవిమోచనాత్' – భవబంధముల నుండి బయట పెట్టడమే.

'దివ్యజ్ఞానం యతో దద్యాత్ కుర్యాత్ పాపస్య సంక్షయం, తస్మాత్ దీక్షేతి సా ప్రోక్తా మునిభిః తంత్రవేదిభిః'.

దీక్ష పొందకుండా మంత్రం చేస్తే ఆ మంత్రం ఫలించదు. ఇది శాస్త్రం చెప్తున్నది. గురువును ఆశ్రయించి దీక్ష పొందవలసినదే. దీక్ష లేకుండా మంత్రాలు చదివేసి, పాటలు పాడేసి, పుస్తకాలు చదివేస్తే మహా ప్రమాదం.

అదీక్షితాయై కుర్వంతి జపపూజాదికాః క్రియాః

న భవంతి ప్రియే! తేషాం శిలాయాం న్యస్త బీజవత్

– ఎవరైతే దీక్ష లేకుండా జపము, పూజ మొదలైనవి చేస్తారో వారికి అవన్నీ నిష్ఫలములే. ఇవి ఎలాంటివి అంటే రాయి మీది వేసిన విత్తనాలు వంటివే. దీక్ష గొప్పతనం –

ఉపపాతకలక్షాణి మహాపాతక కోటయః

క్షణాద్దహతి దేవేశి! దీక్షాహి విధినా కృతా

పద్ధతి ప్రకారంగా దీక్ష తీసుకుంటే శరీరములో త్వగస్థిగతములై వ్యాపించి ఉన్న పాపాలన్నీ తత్ క్షణమే ధ్వంసం అయిపోతాయి. గురువు కూర్చోబెట్టి ఇవ్వగానే జరిగే పద్ధతి అది. దీక్ష పొందగానే పులకించి పోతాడు. ఆ ఆనందం అనుభవించాలి. మంత్రాన్ని ఏదో మోహంతో పుచ్చుకోకుండా భక్తితో పుచ్చుకునే వాడు మాత్రమే అనుభవిస్తాడు. వాడు ఎలుగెత్తి గెంతులు వేస్తాడు.

ఎన్ని జన్మముల చేసిన పాపము ఈ జన్మముతో విడునన్నా

అన్నిటికిని యిది కడసారి జన్మము సత్యంబిక పుట్టుట సున్నా

తారక మంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా

ఆ దీక్ష పొందినప్పుడు అంత ఆనందపరవశుడైపోతాడు.

భగవత్ దీక్ష స్వీకరించి నిత్య అనుష్ఠానం చేస్తున్నప్పుడు తన్మంత్రాధిదేవత వారి ప్రాణశక్తి యందు, శరీరశక్తి యందు వ్యాపించి ఉంటుంది కనుక దీక్షిత అంటే దీక్షితుల రూపములో ఉన్నది.

'అన్నదా, వసుదా, వృద్ధా' నుండి 'సచ్చిదానందరూపిణీ' వరకు 'సావిత్రీవిద్య' అనేదే మొత్తం అన్ని నామాలలో కనబడుతున్నది. ఈ నామాలన్నీ ఆ విద్యకు సంబంధించినవి. దేనికవి విడివిడిగా మనం గ్రహించినప్పటికీ అనుసంధానం మాత్రం సావిత్రీనామంతోనే అనేది గుర్తు పెట్టుకుని ఆ నామాలను పరిశీలించుకోవాలి.

'రాజరాజేశ్వరీ' నుండి 'సాగరమేఖలా' వరకు కూడా ఈ సావిత్రీవిద్యలో అమ్మ యొక్క రాజరాజేశ్వరీ తత్త్వాన్ని, రాజ్యలక్ష్మీ వైభవాన్ని వివరించుకోవడం జరిగింది. దీక్షితా నామాన్ని రాజరాజేశ్వరీ భావంతో అనుసంధానం చేస్తే ఈ జగద్రక్షణనంతటిని కూడా అమ్మవారు దీక్షితురాలై నిర్వహిస్తున్నది.

అమ్మవారు అలా జగత్తుని నడిపించే వ్యవహారంలో 'దైత్యశమనీ', 'సర్వలోక వశంకరీ', 'సర్వార్థదాత్రీ'. ఒక రాజరాజేశ్వరిగా లోకాన్ని అమ్మవారు ఎలా నడుపుతున్నారో అనే దాన్ని ఈ మూడు నామాలలో చెప్పారు.

696. దైత్యశమనీ – శ్రీ దైత్యశమన్యై నమః

దైత్య బాధలను తొలగించి లోకాలను అనుగ్రహించినది. లోకరక్షణ కోసం అమ్మ దీక్ష కట్టుకున్నప్పుడు ఆ రక్షణలో బాధ్యతగా ఆవిడ చేస్తున్న పనులే ఇవన్నీ.

ఇత్థం యదా యదా బాధా దానవోత్థా భవిష్యతి

తథా తథాఽవతీర్యాహం కరిష్యామ్యరిసంక్షయమ్

అని 'దేవీమాహాత్మ్యం'లో అమ్మవారు చెప్పిన మాట. 'ఎప్పుడు అసురబాధ

లోకానికి వస్తుందో అప్పుడు నేను అవతరించి దానిని తొలగిస్తాను'. అసురులు అంటే తమ శక్తులన్నింటిని స్వార్థానికి, లోకవినాశనానికి వాడే వారు.

అమ్మవారు తన మహాశక్తితో వారి శక్తులను శమింపజేసి లోక రక్షకులైన దేవతలకు బలం ఇస్తున్నది. భండాసుర, మహిషాసుర, చండముండ, దుర్గమ, మహిషాసుర, శుంభనిశుంభాదులను సంహరించిన దేవి.

697. సర్వలోకవశంకరీ - శ్రీ సర్వలోకవశంకర్యై నమః

ఇలా శిష్టులను రక్షించి, దైత్యులను శమనం చెయ్యడం ద్వారా అమ్మవారు తనకు లోకంపై ఉన్న పట్టుని చూపిస్తోంది. 'వశంకరీ' అంటే తన వశంలో ఉండేటట్లుగా లోకాలను నడుపుతోంది.

లోకము యొక్క నిగ్రహానుగ్రహశక్తులు అమ్మవారివే. సావిత్రీ విద్యానుష్ఠానం సిద్ధి అయినవారికి లోకం అనుకూలమవుతుందనే ఫలశ్రుతి ఈ నామంలో ఉంది.

698. సర్వార్థదాత్రీ - శ్రీ సర్వార్థదాత్ర్యై నమః

ఈ విధంగా లోకాన్ని నిగ్రహానుగ్రహాలతో నడుపుతూ అన్ని(సర్వ-అర్థ-దాత్రీ) ప్రయోజనములను ఇస్తున్నది. ఎవరికి, ఏది అవసరమో అది అర్థం. ఆకలి వేసినప్పుడు అన్నమే అర్థం. దాహం వేసినప్పుడు నీరే అర్థం. ఇవి ప్రయోజనాలు.

అమ్మవారి ఉపాసనా ఫలము, ఉపాసనా పద్ధతి కూడా ఈ నామాలలో ఉంది. దీక్ష స్వీకరించి, అమ్మని ఎవరైతే ఉపాసన చేస్తున్నారో వారిని ఎలా అనుగ్రహిస్తున్నదో ఈ మూడు నామాలలో తెలియజేస్తున్నారు. దైత్యనాశనం చేస్తోంది కనుక దైత్యనాశినీ. దీక్షితులై ఉపాసన చేస్తున్న భక్తులలో రాజస, తామస భావాలు ఏవైనా పూర్వ వాసనల వల్ల వస్తే వాటిని తొలగిస్తుంది. అదే దైత్యనాశనం.

భక్తుల సర్వ భావాలను తన యొక్క నిగ్రహంలో పెట్టుకుని నడుపుతున్నది. వారికి కావలసిన అన్ని అర్థములు ఇస్తున్నది. అమ్మవారి ఉపాసనా విద్య యొక్క ఫలాన్ని ఈ మూడు నామాల్లో చూపిస్తున్నారు. ఆ తల్లే మనలో ఉన్న దుష్టత్వాన్ని

శిక్షిస్తూ, శిష్టత్వాన్ని రక్షిస్తూ కావలసినవి ప్రసాదిస్తోంది. 'సర్వార్థదాత్రీ' అనే మాట అమ్మవారికి శాస్త్రాల్లో అనేక చోట్ల కనబడుతున్నది. అక్కడ ఉన్నవే ఇక్కడ కూర్చి మనకి అందిస్తున్నారు.

ధర్మాదీన్ చింతితానర్థాన్ సర్వలోకేషు యచ్ఛతి
అతో దేవీ సమాఖ్యాతా సర్వైః సర్వార్థసాధినీ

అని 'దేవీపురాణం'లో కనబడుతున్నది. ధర్మాదులని, కోరినవాటిని ఇచ్చే తల్లి. నాలుగింటిని కలిపే అర్థము అంటారు. ధర్మ, అర్థ, కామ, మోక్షములను కలుపుకునే పురుష అర్థములు. జీవునికి కావలసిన ఆ నాలుగు అర్థములను ప్రసాదిస్తున్నది.

లోకయాత్రకి కావలసిన అర్థకామములను ఇస్తూ, అర్థకామ సంపాదనకు ఉండాల్సిన ధర్మమనే బుద్ధిని ఇస్తూ, చిట్టచివరికి చిత్తశుద్ధిని కలిగించి మోక్షాన్ని కూడా ఇస్తున్నది. అందుకే 'సర్వార్థదాత్రీ'. ఇది శ్రీవిద్య యొక్క ఫలం.

ఇప్పటివరకు అమ్మవారి యొక్క అనుగ్రహ వైఖరి, అనుగ్రహం పొందాల్సిన విధానము చూపిస్తూ, ఇప్పుడు ఆ మంత్రాధిదేవత అయిన సావిత్రీ నామాన్ని ఆవిష్కరిస్తున్నారు.

699. సావిత్రీ – శ్రీ సావిత్ర్యై నమః

ఇది వైదికమైన మహామంత్ర స్వరూపము. సావిత్రీ మంత్రం ఏదని ఆలోచించే కంటె సావిత్రీ నామమే మంత్రంగా భావన చేస్తూ ఉపాసన చేయవచ్చు. ఈ నామానికి, రాజరాజేశ్వరికి ఉన్న సంబంధం కూడా తెలుసుకోవాలి. సావిత్రీవిద్యలో భాగంగానే 'రాజరాజేశ్వరీ' నామం.

సవితా నుండి సావిత్రీ శబ్దం వచ్చింది. సవిత అనే మాట సూర్యునికి వాడతాం. సవనము, ప్రసవము అనే మాట ఉంది. సవనము అంటే సృష్టి. సావిత్రీ అంటే సృష్టికారకశక్తి. సృష్టి, స్థితి, లయలు మూడు అందులో కలిసి ఉన్నాయి. సృష్టిని నిర్వహిస్తున్నది అని అర్థం. **సవితృప్రకాశ కరణాత్ సావిత్రీత్యభిదా భవేత్। జగతః**

ప్రసవిత్రీతి హేతునానేన చాపి చ॥ (భరద్వాజస్మృతి) – సవితకు (సూర్యునకు) ప్రకాశాన్ని కలిగిస్తున్నది కనుక సావిత్రి. జగతిని కన్నతల్లి కనుక సావిత్రి. సృష్టికర్తయైన పరమేశ్వరుని పత్ని – అని కూడా చెప్పవచ్చు.

'బుద్ధిః కర్మాణి వాఽ స్మాకం యః ప్రేరయతి తస్యతు దేవస్య సవితుః ఖ్యాతమ్' – అమ్మవారు జీవుల బుద్ధులను, కర్మలను ప్రేరేపిస్తుంది కనుక సవిత అంటే ప్రేరకురాలు. సర్వజగత్తుని ప్రేరేపించేది కనుక **'ధియో యో నః ప్రచోదయాత్'.** దీనినే **'బుద్ధిం యా నః ప్రచోదయాత్'** అన్నారు.

సర్వచైతన్యరూపాం తాం
ఆద్యాం విద్యాం చ ధీమహి
బుద్ధిం యా నః ప్రచోదయాత్

ఆ ప్రచోదయిత్రీ శక్తి అమ్మవారు. **'చోదయిత్రీ సూనృతానాం చేతంతీ సుమతీనాం'** అని సరస్వతీసూక్తం. మంచి బుద్ధులను ప్రేరేపిస్తుంది. మంచి చిత్తాలకి చేతనత్వాన్ని ఇస్తుందని సావిత్రీ నామానికి వేదం చెప్పిన అర్థం.

'స నో బుద్ధ్యా శుభయా సంయునక్తు' – ఆ పరమాత్మ మనకి శుభకరమైన బుద్ధులతో కలుపుగాక! అని ఉపనిషత్తు చెప్తోంది. బుద్ధిని శుభంతో యోజనం చేసే శక్తి ఆ తల్లి. ప్రతివారికి కర్మఫలప్రదాయినిగా ప్రేరేపిస్తున్నది ఆ తల్లే అయినప్పటికీ శరణు వేడిన భక్తులకు మాత్రం సత్తువైపే ప్రేరేపిస్తున్నది.

సావిత్రీ అనే మాటకే ఒక మంత్రశక్తి ఉంది. అది సకారంతో ప్రారంభమవడం మొదలుకొని ఈకారంతో పూర్తవడం వరకూ ఆ నామంలోనే చాలా విశేషం ఉంది. **'శ్రీసావిత్ర్యై నమః'** అనేది మంత్రంగా చేసుకున్నా చాలు. సావిత్రీ అంటే సూర్యమండలంలో ఉన్న గాయత్రీస్వరూపిణియైన పరబ్రహ్మస్వరూపం.

సూర్యభగవానుని సవితా అని ఎప్పుడనాలో, సూర్యా అని ఎప్పుడనాలో, మిత్రా అని ఎప్పుడనాలో శాస్త్రం చక్కగా నిర్దేశించింది.

'ఆదిత్యః **సవితా** సూర్యః ఖగః పూషా గభస్తిమాన్'. భాష్యాన్ని సాయనాచార్యులు చెప్తూ **'ఉదయాత్ పూర్వభాగీ సవితా'** – ఉదయించడానికి కాస్త ముందుకాలంలో

సూర్యభగవానుని సవితా అంటారు. సవితా అన్నప్పుడు సావిత్రిని ఉపాసించవలసిన కాలం అక్కడే చెప్పబడింది. తరువాత ఆదిత్య అవుతోంది. మొత్తం రోజంతా - అంటే ఉదయం నుండి సాయంకాలం వరకూ ఉన్న స్వామిని 'సూర్యః' అంటారు.

ఉదయ కాలానికి ఉషః కాలం అని పేరు కూడా ఉంది. **'ఉష రుజాయాం ఉష దాహే'** అని అర్థం ప్రకారంగా ఉష అంటే సర్వరోగహరణశక్తి కలిగిన కాలం. ఆ కాలంలో సవితృరూపుడైన పరమాత్మను ఆరాధన చేస్తే అన్ని మంగళాలు కలుగుతాయి. **'సుమంగళీ'** అని ఉషఃకాలానికి ఉన్న పేరు.

ఉషఃకాలంలో ఉన్న సూర్యభగవానునికి ఉన్న శక్తియే సుమంగళీ. వేదాల్లో ఉన్న ఉషఃసూక్తాలలో ఈ సుమంగళీ శబ్దము చెప్పబడింది. ఆ ఉషఃకాలంలో పరమాత్మని ప్రార్థన చేసినట్లైతే అన్నీ సుమంగళాలే కలుగుతాయి. **'అసౌ యస్తామ్రో అరుణ ఉత బభ్రుః సుమంగళః'** అని వేదం కూడా సూర్యపరంగా చెప్తోంది. అది రుద్ర మంత్రం కనుక సూర్యరూపుడైన రుద్రుడు అన్నారు. ఆయన శక్తి అయిన అమ్మవారు సుమంగళీ. సావిత్రీ అన్నప్పుడు ఇన్ని భావాలు గ్రహించాల్సి ఉంది.

సవితా శబ్దానికి మరొక అర్థం చెప్తూ **'సవితా సర్వభూతానాం సర్వభావాన్ ప్రసూయతే, సవనాత్పావనాచ్చైవ సవితా తేన చోచ్యతే'**. సర్వభూతాలను, వాటి యొక్క ఉనికిని కలిగించేవాడు, పవిత్రము చేయువాడు. ఆ సమయంలో ఆ సవితృరూపుడైన సూర్యభగవానుని ఎవరు ఉపాసన చేస్తారో వారు పవిత్రులౌతారు.

సవనము అంటే యజ్ఞము. యజ్ఞస్వరూపురాలు అని సావిత్రీ శబ్దానికి అర్థం చెప్పుకోవచ్చు. సర్వయజ్ఞాలు సూర్యభగవానుని ద్వారా దేవతలకు చేరుతాయి. అగ్నిహోత్రము సూర్యుని యొక్క స్వరూపమే.

'అగ్నౌ ప్రాస్తాహుతిస్సమ్యక్ ఆదిత్యముపతిష్ఠతే, ఆదిత్యాజ్జాయతే వృష్టిః' 'అన్నదా' 'వసుదా' దగ్గర కూడా దీనితోనే ప్రారంభించుకున్నాం. అగ్నిలో వేసిన ఆహుతుల్ని అగ్నిదేవుడు ఆదిత్యమండలానికి తీసుకుని వెళ్తాడు. సూర్యమండలం సర్వదేవతాత్మకమైన తేజోమండలం కనుక అక్కడకి చేరితే సర్వదేవతలకు చేరుతాయి. అక్కడ నుండి తిరిగి వృష్టులన్నీ మనకి లభిస్తున్నాయి. **'వృష్టేరన్నాః తథా ప్రజాః'** -

వృష్టి వల్లనే అన్నము, దాని వల్ల సంతానము.

సవన శబ్దానికి మరో అర్థం చెప్తూ- **'స్రవణం స్యందనార్థే చ ధాతురేష నిపాత్యతే'** – స్రవణము అంటే స్రవించుట. స్యన్దనము అంటే ప్రవహించుట అనే అర్థం లోంచి తీసుకున్నారు. ఈ తేజస్సు స్రవించి (ప్రవహించి) సృష్టి జరుగుతుంది. **'స్రవణే తేజసోత్పత్తిః సావిత్రీ తేన కథ్యతే'**(దేవీభాగవతం).

తేజస్సు స్రవించి, దాని నుండి ఉత్పత్తి జరుగుతున్నదన్నారు. ఆ సూర్యమండలం నుండి ఆయన యొక్క తేజస్సు భూమి మీదకు జారి 'స్యన్దనమై స్రవించి' వస్తోంది. అది వస్తూనే రకరకాల బీజములుగా సృష్టిగా అవుతున్నది.

భగవానుని యందు ఉన్న తేజస్సు ఆ సూర్యమండలము ద్వారా క్రిందకి వచ్చి దానితో సృష్టి జరుగుతున్నది. ఆ తేజస్సు మన దాకా వస్తోంది కనుకనే సూర్యునకు నమస్కారం చేసుకుంటున్నాం. ఆ స్రవించుతున్న తేజస్సు కలవాడు కనుక సవితా అని, ఆయనకి అభిన్నురాలైన శక్తి కనుక సావిత్రీ అనే అర్థాన్ని తీసుకోవాలి. ఇది కూడా అమ్మ కారుణ్యాన్నే తెలియజేస్తున్న నామం.

యజ్ఞమనే ధాతువుకి 'యజ్ సేవాయాం' – పూజ, అర్చన అని అర్థం. సవనము అంటే అర్చించుట. **'త్రిదశైరర్చితా దేవీ వేదయాగేషు పూజితా। భావశుద్ధి స్వరూపాచ సావిత్రీ తేన సా స్మృతా'.** ఇవన్నీ కూడా శాస్త్రమిచ్చిన సావిత్రీ నామ నిర్వచనాలు. ఈ నామ నిర్వచనాలతో మనం సావిత్రీ నామాన్ని సిద్ధి పొందించు కుంటున్నాం.

నామార్థ విచారణయే గొప్ప సాధన. అదే పెద్ద జపం. అదే పారాయణం. మనం అందరం నమస్కరించే దేవతలు కూడా తల్లికి నమస్కరిస్తున్నారు కనుక 'త్రిదశైరర్చితా దేవీ వేదయాగేషు పూజితా' – వేదాది శాస్త్రాల యందు, యాగాల యందు కూడా ఆరాధింపబడుతున్న తల్లి. అలా ఆరాధిస్తే ఏమి వస్తుంది? 'భావశుద్ధి స్వరూపా' – ఇది సావిత్రీ నామానికి మరొక అర్థం. సావిత్రీ ఆరాధన వల్ల భావశుద్ధి ఏర్పడుతుంది. అది ఒక్కటి ఏర్పడితే చాలు అన్నీ లభిస్తాయి.

అమ్మవారి ఆరాధనే మన చిత్తశుద్ధికి హేతువు. చిత్తశుద్ధిని కలిగించే స్వరూపమే

సావిత్రీ. ఈ సావిత్రి అనేక విద్యలను తన నుండి ప్రసరింప చేస్తున్నది. కేవలం కాంతికిరణాలు మాత్రమే కాక శక్తులన్నీ ఇస్తున్నది.

సూర్యకిరణాల నుండి అన్ని శక్తులు ప్రసవింపబడుతున్నాయి. సృష్టిస్తున్నదంటే అర్థం – జీవులను సృష్టిస్తున్నదే కాక సర్వశక్తులను తన నుండి సృష్టింపజేస్తున్నది ఆ తల్లి. ఒకప్పుడు నారదులవారు అమ్మవారిని ఉద్దేశించి నమస్కారం చేస్తుంటే ఆవిడ సావిత్రీరూపంతో దర్శనమిచ్చింది. నారదులవారికి అమ్మవారు అలా దర్శనమిచ్చిన వెంటనే ఆ తల్లి యొక్క వదనం నుంచి సర్వశాస్త్రాలు గోచరించాయి. ఇది సావిత్రీదేవి యొక్క స్వరూపము.

ఈ సావిత్రీ ఉపాసనే రామచంద్రమూర్తి ఆదిత్యహృదయ రూపంతో చేశారని వ్యాఖ్యాతలు తెలియజేశారు. అంతటి రామచంద్రమూర్తికి ఆ సమయంలో ఏం చెయ్యాలనే స్ఫురణ, శక్తి ఇచ్చింది సావిత్రీవిద్య.

సావిత్రీ అంటే సూర్యమండలరూపిణిగా ఉంటూ ఈ జగత్తులకి శక్తులను ఇస్తున్న తల్లి. సృష్టిని చేస్తున్న తల్లి. బుద్ధులను ప్రేరేపించే తల్లి. పవిత్రులను చేసే తల్లి. మొత్తానికి సావిత్రి అనేది సూర్యమండలములో ఉన్న పరబ్రహ్మ స్వరూపము కనుక తరువాత నామం 'సచ్చిదానందరూపిణి'.

700. సచ్చిదానందరూపిణి – శ్రీ సచ్చిదానందరూపిణ్యై నమః

సూర్యమండలాంతర్గత శక్తియే సచ్చిదానందరూపిణి. అది మండలానికి మాత్రమే పరిమితం కాదు. అది సర్వానికి కారణమైన సత్–చిత్–ఆనందరూపిణి.

శాశ్వతమై, చైతన్యమై, ఆనందమై ఉన్న పరబ్రహ్మస్వరూపిణి.

ఇక్కడితో సావిత్రీవిద్య పూర్తయి, సావిత్రిగా చెప్పబడుతున్న పరబ్రహ్మము ఏమిటో తరువాత నామాలలో వివరిస్తున్నారు. ఇదంతా పరబ్రహ్మ సంబంధమైన నామాలే. అమ్మవారిని పరబ్రహ్మముగా ప్రతిపాదిస్తూ చెప్తున్న నామములలో ఇది ఒక వరుస. తరువాతి నామం 'దేశకాలపరిచ్ఛిన్నా'

దేశకాలాపరిచ్ఛిన్నా సర్వగా సర్వమోహినీ
సరస్వతీ శాస్త్రమయీ గుహాంబా గుహ్యరూపిణీ

701. దేశకాలాపరిచ్ఛిన్నా – శ్రీ దేశకాలాపరిచ్ఛిన్నాయై నమః

ఈ నామానికి విస్తారమైన వ్యాఖ్య 'అపరిచ్ఛేద్యా' నామంలో వివరించుకున్నాం కానీ ఇక్కడ ఈ అర్థాన్ని భావన చేసుకోవాలి. దేనినైనా నిర్దేశించాలంటే దేశము, కాలము అనేది పెద్ద కొలత. ఎంత ప్రాంతమున్నది? ఎంత కాలమున్నది? అని సృష్టిలో ప్రతి వస్తువుకి ఉంటుంది.

ప్రతిదానికి అది స్థాపించిన తేదీ లేదా పుట్టిన సమయమైనా ఉంటాయి. పుట్టిన తేది ఉంటే వెంటనే మరో తేది కూడా సిద్ధంగా ఉంటుంది. సృష్టిలో ప్రతిదానికి ఈ రెండు ఉంటాయి. ఈ మధ్యలో కూడా మనం ఎక్కడెక్కడ ఏ ప్రాంతంలో ఉన్నామో, ఏ యే సమయాలలో ఉన్నామో అని చెప్తాం.

సృష్టిలో ఉపాధులన్నింటికి ఉన్న సామాన్య లక్షణం – ఏక కాలంలో అన్ని చోట్ల, అన్ని కాలాలలోనూ ఉండలేవు. కానీ అమ్మవారు అలా కాదు. సర్వకాలములయందు, సర్వదేశములందు వ్యాపించిన 'సత్యంజ్ఞానమనంతంబ్రహ్మ'. సచ్చిదానందరూపిణి అని ప్రతిపాదన చేస్తూ ఆ తత్త్వాన్ని అవగాహన చేసుకోవడం కోసం, విచారణ కోసం తరువాత నామాలలో వివరిస్తున్నారు. ఈ నామాలన్నీ విచారణమార్గమని ముందే చెప్పుకున్నాం.

భాష్యం చెప్పుకోవడం అంటే విచారణ చెయ్యడం. విచారణ చేస్తున్నప్పుడు తత్త్వంతో అనుసంధానం జరుగుతుంది. అదే పెద్ద ఉపాసన. అదే పెద్ద సిద్ధి.

అయితే శ్రీచక్రమో లేదా విగ్రహమో లేదా ఒక సువాసినీ స్త్రీ లేదా ఒక దీక్షితుడు – వీరందరూ అమ్మవారిని ఆరాధించడానికి ఆలంబనలు. అందుకే మనం శ్రీచక్రంలో పూజ చేస్తాం. విగ్రహంలో పూజ చేస్తాం. సువాసినికి పూజ చేస్తాం. ఇన్నింటి యందు అమ్మవారిని ఆరాధన చేస్తాం. ఇన్ని ఆలంబనల కంటె గొప్ప ఆలంబన–'సూర్యమండలం'.

సూర్యమండలమే పెద్ద శ్రీచక్రమనే భావన చెయ్యాలి లేదా – పెద్ద బిందువు అనుకుందాం. ఎలా అనుకున్నా శ్రీచక్రమే ప్రధానం. అదే సూర్యమండలం. అక్కడ ఆరాధింపబడుతున్న తల్లి సచ్చిదానందరూపిణి.

ఎప్పుడైతే దేశకాలపు కొలతలు లేవో ఇంక 'సర్వగా' అని తరువాత నామంలో చెప్తున్నారు.

702. సర్వగా – శ్రీ సర్వగాయై నమః

అంతటా ఉండునది, గమనము చేయునది. గమనమంటే వ్యాపించడమే.

సచ్చిదానందరూపిణి అయిన తత్త్వము దేశకాలపు కొలతలలో ఇమడదు కనుక ఆ తల్లి 'సర్వగా'.

సర్వగా అనే మాట అమ్మవారిపరంగా మనకి శాస్త్రాలలో అనేకచోట్ల కనిపిస్తోంది. దేవీభాగవతంలో అమ్మవారు హిమవంతునితో సహా దేవతలందరికి గీత బోధిస్తుంటారు. అప్పుడు హిమవంతుడు, "అమ్మా! నేను తరించడం కోసం అడుగుతున్నాను. నిన్ను ఏయే స్థానాలలో పూజించాలి? ఏయే సమయాలలో పూజించాలి?" అన్నాడు. అప్పుడు అమ్మవారు ఒక నవ్వు నవ్వి, ఏ స్థానంలో పూజించాలన్న మాటకి, "నన్ను పూజించడానికి స్థానాలు కొన్ని ఉన్నాయా? నేను లేని స్థానాలు ఉన్నాయా?" అని అంటూ– **"సర్వం దృశ్యం మమ స్థానం"** "కనబడే ప్రతి చోటు నా స్థానమే".

సర్వం దృశ్యం మమ స్థానం సర్వేకాలా వ్రతాత్మకాః
ఉత్సవాః సర్వకాలేషు యతోఽహం సర్వరూపిణీ (దేవీగీత)

"సర్వమూ నా స్థానాలే అయినప్పుడు ఏ కాలంలో పూజించాలన్నావే – అన్ని కాలాలు నావే. వ్రతాచరణ చెయ్యడానికి ఫలానా కాలమని లేదు. ఏ కాలమైనా నా వ్రతం చేసుకోవచ్చు. ఏ చోటనైన నా ఉపాసన చేసుకో. కానీ అడిగావు కనుక నా ముఖ్య స్థానాలు చెప్తాను విను" అని అనేక క్షేత్రములు గురించి తల్లి చెప్తూ తన శక్తిపీఠాలను వివరించింది.

తరువాత కాలములను బోధించినది. పాడ్యమి నుండి అమావాస్య వరకు ఏ ఏ రోజున అమ్మవారిని ఎలా ఎలా ఆరాధన చెయ్యాలో శాస్త్రాలలో పేర్కొన్నారు.

అక్కడితో ఆగకుండా విశేష కాలములు మళ్ళీ చెప్పింది. విశేషకాలాలు అష్టమి, నవమి, చతుర్దశి, పూర్ణిమ, సంక్రమణం. ఇవి ప్రధానంగా తన యొక్క ముఖ్య పర్వములు అని చెప్పడం కాకుండా తరువాత విస్తారంగా శరన్నవరాత్రులు, వసంత నవరాత్రులు, ఆషాఢ నవరాత్రులు, మాఘ నవరాత్రులు అని నాలుగు నవరాత్రులు చెప్పారు. ఇలా చెప్తూ వారంలో ప్రతిరోజు పూజ చెయ్యకపోతే కనీసం శుక్రవారం ఆరాధన అయినా విశేషంగా చెయ్యాలని అద్భుతంగా ఒక అధ్యాయమంతా చెప్పింది.

ఇవన్నీ ఎందుకు చెప్పింది? ముందుగా ఫలానా కాలమని గాని, ఫలానా దేశమని లేదు అని చెప్తూ మళ్ళీ ఇలా చెప్తున్నది. సిద్ధాంతరీత్యా పరమార్థ సత్యమదే. కానీ ఆ స్థితి అందాలంటే కాలాలలో ఉత్తమ కాలాన్ని ఎంచుకోవాలని చెప్తోంది.

పంటలు పండించాలంటే సంవత్సరం పొడుగునా పండిస్తామంటే కుదరదు. వర్షాలు పడే సమయం కావాలి. అలాగ ఇవన్నీ కూడా సాధన దశలోనున్న సాధకుల కోసమని చెప్పింది. సిద్ధదశకి చేరితే అప్పుడు **'సర్వం దేవీమయం జగత్'** అని చెప్పారు.

అమ్మ ముందుగా సిద్ధాంతమే ప్రతిపాదన చేసింది. **'సర్వదృశ్యం మమ స్థానం'** – "కనిపించే ప్రతి చోటూ నాదే, నా స్థానమే. ప్రతికాలం అమ్మ స్వరూపమే. ఏ కాలమైనా, ఏ దేశమైనా నా వ్రతాదులు చేసుకో" అని ముందు చెప్పింది.

అంతటా గంగ ఉన్నప్పటికి స్నానఘట్టం ద్వారానే గంగని ఎలా సేవిస్తున్నామో, అంతటా అమ్మవారు ఉన్నా కొన్ని క్షేత్రముల ద్వారా, కొన్ని కాలముల ద్వారా సేవించుకోవాలని వివరిస్తున్నారు. తద్వారా 'సర్వగా' అయిన తత్త్వాన్ని పొందగలం.

సర్వకాలములు, సర్వస్థానములు తానై సర్వత్రా వ్యాపించి ఉంది. అమ్మవారు ఎన్నెన్ని రూపాలతో ఉన్నారో శాస్త్రం చెప్తూ–సర్వ సిద్ధాంతములు, సర్వశాస్త్రములు అమ్మ రూపములు. సర్వ వేదములు, సర్వ యజ్ఞములు, సర్వ లోకములు అమ్మ

రూపము. సర్వజీవులు, సర్వదేవతలు, సర్వ వృక్షములు, పశువులు – అన్ని అమ్మరూపాలే. వీటన్నిటియందు ఆవిడే వ్యాపించి ఉంది.

"వృక్షేషుస్యాం తథా వాయౌ వ్యోమ్న్యన్యగ్నౌ చ సర్వగా" అని దేవీపురాణంలో ఉంది. పంచభూతములయందు, పశుపక్షులయందు, తరులతలయందు అంతటా చైతన్యముగా వ్యాపించి ఉంది కనుక **"ఏవం విధాహ్యసౌ దేవీ సదా పూజ్యా విధానతః"**

'ఈదృశం వేత్తి యస్త్వేనాం స తస్యామేవ లీయతే' – 'సర్వగా' అని తెలుసుకొని ఎవరైతే విధిగా పూజిస్తున్నారో వారు ఆ పరతత్త్వంలోనే లీనమౌతారు.

"సర్వరూపే త్వం సర్వగాసి భవిష్యసి"(వరాహపురాణం) అని బ్రహ్మదేవుడు స్వయంగా అమ్మవారితో అన్న మాట. అమ్మా! నువ్వు సర్వరూపిణివి.

సర్వస్వరూపే సర్వేశే సర్వశక్తి సమన్వితే
భయేభ్యస్త్రాహినో దేవి దుర్గేదేవి నమోస్తుతే – అని 'దేవీమాహాత్మ్యం'లోని మాట.

703. సర్వమోహినీ – శ్రీ సర్వమోహిన్యై నమః

పరమార్థ జ్ఞానం రాకుండా అడ్డుకోవడమే మోహం. పసిపిల్లలకి కొన్ని వెలుగులు పడకుండా మనం కప్పుతూ ఉండాలి. అలాగే శక్తి లేని వారికి అందనివ్వదు ఆవిడ. శక్తి ఉన్నవారికి అందిస్తుంది. ఇంకా యోగ్యత లేని వారిని మోహింపజేస్తూ ఉంటుంది. లోకంలో అధిక శాతం వారే కనుక ప్రపంచంలో సర్వమోహినీశక్తే ఎక్కువ. తరించడానికి ప్రయత్నిద్దామా అనే బుద్ధి నూటికో, కోటికో ఏ ఒక్కరికో కలుగుతుంది. అలా ప్రయత్నించే కోట్లలో ఏ ఒక్కనికో ఎప్పటికో మోక్షం వస్తుంది. మోక్షం రాకపోయినా వింటూ ఉంటే పాపం పోయి వారు హాయిగా ఉంటూ ఏ జన్మకైనా మోక్షం పొందే స్థితికి వెళ్తారు. అందుకే భగవత్కథలు వింటూ ఉండాలి. హఠాత్తుగా ఏదీ రాదు.

'మోహయతి అఖిలం జగత్' – సర్వజగత్తును మోహింపజేస్తున్నది. 'సర్వగా'

అయిన ఆ తల్లి జగత్తుని నిర్వహిస్తున్నప్పుడు సర్వత్రా వ్యాపించి ఉన్న చైతన్యమే కదా! 'ఆ చైతన్యమే నువ్వు.' ఇన్ని విన్నా "నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని అన్న భావన కలిగిందా?" కలుగలేదు. కారణం మన యొక్క నేను అనబడే అస్తిత్వాన్ని మితి చేసేసి దేహమనే కొలతలో చూస్తున్నాము. దీనినే 'పరిచ్ఛినతి ఇతి మాయా' అన్నారు. ఆ కొలతలో పెట్టి చూడడమనే ఏ శక్తి ఉన్నదో అదే మాయ. అలా పరిమితం చేసి చూడడమనే స్థితిని ఆ తల్లే కల్పన చేసింది... అదే మోహింపజేయడం. వారి వారి యోగ్యతను బట్టి, లోక నిర్వహణ కోసం ఈ వ్యవస్థ. యోగ్యుడైన వానికి తప్పకుండా మోహాన్ని తొలగించి ఆ తల్లే ముక్తిని ఇస్తుంది.

ఇక్కడ శ్రీవిద్యలో ప్రథమావరణంలో త్రైలోక్యమోహనచక్రస్వామిని అయిన తల్లిని వివరిస్తున్నారు. మనకి కావలసినవన్నీ భూపురంలోని త్రైలోక్యమోహన చక్రంలో ఉన్న మూడు గడపలలోనే దొరికిపోతాయి.

మనకి కావలసిన నామాలు అన్నీ అక్కడ ఉన్నాయి. అణిమ, మహిమ, లఘిమ మొదలైన సిద్ధి దేవతలున్నారు. అంతే కాకుండా ప్రపంచాన్ని నడిపే ఎనిమిది రకాలైన మాతృకాదేవతలు అక్కడే ఉన్నారు. ఇరవై ఎనిమిది మంది ముద్రా దేవతలు ఉన్నారు. శంకరులు అంటారు– "నీ అంతఃపురానికి వెళ్ళడం ఇంద్రాది దేవతలకు కూడా చేత కాక, వారు నీ గుమ్మం దగ్గర ఇచ్చే ఈ అణిమాదులతో తృప్తిపడి వెనక్కి వచ్చేస్తూ ఉంటారమ్మా! ఎవరో యోగ్యులు మాత్రమే అంతఃపురానికి వెళ్తారు" అన్నారు.

అంతఃపురానికి ఒక్క బిడ్డ మాత్రమే వెళ్ళగలడు. బిచ్చగాడు వెళ్ళలేడు. కోరికలతో ఉన్న వారందరూ త్రైలోక్యమోహన చక్రం దగ్గరే ఆగిపోతారు. ఏం కావాలి అని తల్లి అడుగుతుంది. నాకు ఫలానాది కావాలంటే, "సరే తీసుకో" అంటుంది. అదే మోహిని. వారికి అమ్మ కావాలని బుద్ధి పుట్టలేదు. పదార్థజాలం మీద మోహం పుట్టి పరమార్థం గురించి వారు ఆలోచించడం లేదు.

అమ్మ ఇచ్చే వరాలు కావాలి కాని, అమ్మ కావాలి అని ఏడవడం చేతకాని వారందరూ మోహితులే. అమ్మ కావాలనుకునే పసివారే అంతఃపురంలోకి వెళ్ళగలరు. అంతఃపురమంటే శ్రీచక్రమధ్యంలో ఉన్న బిందువు. బిందువులోకి వెళ్ళగలగడమంటే

ఈ లోకావరణలన్నీ దాటి వెళ్లగలగడం. త్రైలోక్యమోహన చక్రం దగ్గర కూడా అమ్మ నాక్కావల్సినవి ఇచ్చిందని సంతోషించి తరువాత అయినా అమ్మ (పరతత్త్వసిద్ధి) కావాలని తరిస్తే బాగుంటుంది.

ఇయం సా పరమాశక్తిర్మన్మయీ బ్రహ్మరూపిణీ

మాయా మమ ప్రియాఽనంతా యమేదం మోహితం జగత్

అనయైతజ్జగత్సర్వం సదేవాసురమానుషం

మోహయామి ద్విజ శ్రేష్ఠాః సృజామి విసృజామిచ (కూర్మపురాణం)

'నాలోనున్న మహాశక్తి నా రూపమే కనుక బ్రహ్మరూపిణి. దేవాసుర మనుష్యులతో కూడిన జగతిని సృజించి పోషించి ఈ మాయాశక్తి చేతనే మోహింపజేస్తున్నా'నని పరమేశ్వర వచనం. మోహం కలిగించే శక్తి ఆవిడే, మోహాన్ని పోగొట్టే జ్ఞానస్వరూపిణి కూడా ఆవిడే అని చెప్తూ వెంటనే తరువాత –

704. సరస్వతీ – శ్రీ సరస్వత్యై నమః

సావిత్రియే సరస్వతీ. త్రిసంధ్యలలో అమ్మవారికి మూడు పేర్లు ఉన్నాయి. ప్రాతఃకాలంలో గాయత్రీ. మధ్యాహ్నకాలంలో సావిత్రీ. సాయంకాలంలో సరస్వతీ.

ముందు వచ్చిన నామాల వరుసలో గాయత్రి చెప్పి, తరువాత సావిత్రి చెప్పి, ఇప్పుడు సరస్వతిని చెప్పారు.

సరస్వతి అనే శబ్దం వ్యుత్పత్తిని చూస్తే **'సరస్ సరణ శీలత్వాత్'** – సరణమే ప్రసరణము. సారము – ప్రసారము. సరణము అంటే ప్రవహించుట, వ్యాపించుట. 'సర్వగా' తరువాత ఈ నామం రావడం కూడా చక్కగా ఉన్నది.

ప్రసరించడం శక్తి యొక్క లక్షణం. జడంగా పడి ఉండడం శక్తి కాదు. సాధారణ రాగి తీగని తీసుకుని దాని మొదలులో విద్యుచ్ఛక్తిని అనుసంధానం చేస్తే ఆ విద్యుత్తు మొత్తం తీగంతా ప్రసరిస్తుంది. శక్తి లక్షణమే ప్రసరించడం. మనం చూస్తున్న వాటన్నిటిలో కాంతి శక్తిమంతమైనది. అక్కడి కాంతి ఇక్కడి దాకా ప్రసరిస్తోంది. కాంతికి కూడా శక్తినిచ్చిన తల్లి అంతటా ప్రసరిస్తోంది.

సరస్వతీ ఉపాసన అంటే ప్రాణశక్తి ఉపాసన. దీని గురించి 'హంసినీ' నామం దగ్గర విశేషంగా చెప్పుకున్నాం. హంస అంటే శ్వాస. అందులోంచే ప్రాణశక్తి ప్రసరిస్తోంది. హంస మీద కూర్చుని విహరిస్తున్న సరస్వతీ అంటే ప్రాణశక్తిగా సంచరిస్తున్న జగన్మాత. ఇదే భావాన్ని ఆవిష్కరించుకున్నాం.

యా వసేత్రాణి జిహ్వాసు సదా వాగుపవర్తనాత్, సరస్వతీతి నామ్నేయం సమాఖ్యాతా మహర్షిభిః – సర్వజీవుల జిహ్వాయందు వాక్కుల రూపంలో నర్తించునది సరస్వతి – అని మహర్షులు పలికిన నామం.

ప్రతివారిలో అంతర్వాహిని అయిన చైతన్యప్రవాహమే సరస్వతి. అటువంటి ఈ సరస్వతికి అనేక రూపములు ఉన్నాయని చెప్తూ **'అంబితమే నదీతమే దేవితమే సరస్వతి'** అన్నారు. అంబితమే అంటే అమ్మలలో ఆ తల్లిని మించిన తల్లి లేదు. దేవితమే అంటే దేవతలలో ఆమెను మించిన దేవత లేదు. నదీతమే అంటే నదులలో సరస్వతిని మించినది లేదు. సరస్వతీనదిని కూడా మనం స్మరించుకోవచ్చు.

జ్ఞానము కూడా ప్రసరిస్తుంది. గురువు నుండి శిష్యునికి, ఆ శిష్యుని నుండి మరొక శిష్యునికి అలా ప్రసరిస్తూ వచ్చేదే జ్ఞానం. జ్ఞానానికి, విద్యకి కూడా సరస్వతి అని పేరు రావడానికి కారణం దాని లక్షణం కూడా ప్రసరించుటే.

వాజేభిర్వాజినీవతే– అఖిల ఐశ్వర్యములు ఇస్తుంది. ఆవిడ యజ్ఞస్వరూపిణి, ధేనుస్వరూపిణి, జ్ఞానరూపిణి. రెండు సంవత్సరాల కన్యారూపిణి సరస్వతి – అని ధౌమ్యవచనం.

705. శాస్త్రమయీ – శ్రీ శాస్త్రమయ్యై నమః

శాస్త్రం చేత ప్రధానంగా బోధింపబడునది. శాస్త్రస్వరూపిణి. ఉంగరమంతా బంగారమయమైనట్లుగా శాస్త్రమంతా అమ్మతో నిండిపోయి ఉంది. అన్ని శాస్త్రాలు అమ్మ రూపాలే. ఆ తల్లి అనుగ్రహముంటేనే సిద్ధాంతము, వాదము, కావ్యము, సంగీతము – ఇవన్నీ లభిస్తాయి.

'శాస్త్రయోనిత్వాత్' అని బ్రహ్మసూత్రాలలో శాస్త్రాలన్నీ అమ్మవారి (పరమేశ్వరి)

వల్ల కలిగాయని చెప్పారు. అమ్మవారు తెలియబడడానికి కారణం శాస్త్రం. శాస్త్రాలు తెలియబడడానికి కారణం అమ్మవారు.

మనకి శాస్త్రమే ఆధారం. అందుకే 'చతుస్సూత్రీ'లో ఈ విషయాన్ని మొట్టమొదటే చెప్పారు.

భగవంతుని గురించి తెలుసుకోవాలంటే శాస్త్రము తప్ప మరొక ప్రమాణము లేదు. ప్రత్యక్ష వస్తువులకి శాస్త్రాలు అక్కర లేదు. అతీంద్రియమైన విజ్ఞానానికే శాస్త్రాలు కావాలి. సచ్చిదానందరూపిణి, సరస్వతి అయిన శక్తిని తెలుసుకోవాలంటే శాస్త్రాలే కావాలి. కనుక అతీంద్రియశక్తి అయిన ఆ తల్లే శాస్త్రరూపిణిగా వచ్చింది. ఆ వచ్చిన తల్లిని అతీంద్రియదృష్టి కలిగిన ఋషులు దర్శించి మనకి చెప్పారు. ఏ శాస్త్రాన్ని ముట్టుకున్నా సరస్వతిని ప్రార్థించవలసినదే.

ఎప్పుడైనా జ్ఞానం రావాలంటే శాస్త్రము, గురువాక్యము, తరువాత ఆత్మనిశ్చయము అని చెప్పారు. ఆత్మనిశ్చయము అంటే తన బుద్ధికి తోచి ఇది గొప్పది అనిపించడం. కొంతమంది తన బుద్ధికి తోచిందే శాస్త్రం అంటారు. **శాస్త్రదృష్టం** – సత్యం మొదట శాస్త్రం ద్వారా తెలియాలి. అటుపై **'గురోర్వాక్యం'.** ఆ శాస్త్రాన్ని గురువు చెప్పాలి. గురువు చెప్పిందే శాస్త్రం కాదు.

శాస్త్రాన్ని తెలుసుకుని, శాస్త్ర ప్రకారం జీవిస్తున్నారు కనుక మనం గురువుని గౌరవించాలి. ఏ శాస్త్రప్రమాణం లేకుండా తన బుద్ధికి తోచింది చెప్తే వారిని గురువుగా స్వీకరించరాదు. గురువుకి ఒక పరంపర ఉండాలి.

'శాస్త్రదృష్టం గురోర్వాక్యం'. మూడవది మన **ఆత్మనిశ్చయం**. ఒకటి వదలి మరొకటి కాదు. శాస్త్రము, గురువు ఈ రెండిటి యొక్క అనుగ్రహం కలిగినవానికి వచ్చిన ఆలోచనే సరైనది అవుతుంది. ఆ సరస్వతియే నాకు గురువని ఆశ్రయించగలిగితే, సరియైన గురువుని, సరియైన శాస్త్రాన్ని స్ఫురింపజేస్తుంది.

శాస్త్రం అంటే నిర్వచనం చెప్తూ –

ప్రవృత్తిర్వా నివృత్తిర్వా నిత్యేన కృతకేనవా
పుంసాం ఏనోపదిశ్యేత తచ్ఛాస్త్రం అభిధీయతే

అన్నారు. ప్రధానంగా ప్రవృత్తి, నివృత్తులను తెలియజేయునదే శాస్త్రం. సంసారమార్గంలో ఉండే గృహస్థు ఎలా ఉండాలి? సంసారాన్ని వదలి పెట్టిన వైరాగ్యవంతులు ఎలా ఉండాలి? వారికి నియమాలు ఏమిటి? వారేం చేయాలి? ఇవన్నీ చెప్పడానికి అనుశాసనం ఒకటి కావాలి. ఆ శాసించేదే శాస్త్రము. ఆ శాస్త్రాలన్నీ అమ్మ రూపాలే. ఇది ఎవరు శాసిస్తే అవుతుంది? శాసించడానికి ఈశ్వరికి తప్ప ఇంక ఎవరికి అధికారం లేదు.

నిశ్వాసమారుతైర్వేదాన్నృచం సామం యజుస్తథా, అథర్వణ మహామంత్రా నభిమానేన చాసృజత్। – పరమేశ్వరి ఊపిరి నుండి వేదాలు వచ్చాయి. తరువాత అమ్మవారి యొక్క అభిమానములు అంటే అహం రూపం నుండి అథర్వణ వేదములు, మంత్ర శాస్త్రమంతా వెలికి వచ్చాయి.

తరువాత అమ్మ మాటల్లోంచి కావ్య, నాటక అలంకారాలన్నీ వెలికి వచ్చాయి. నాలిక మీద ఆవిడ వాగ్దేవీ రూపం వ్యక్తమయ్యింది.

'చుబుకేన చకోరాక్షీ వేదాంగాని ససర్జ షట్' – అమ్మ యొక్క గడ్డము నుండి వేదము యొక్క ఆరు అంగములు వచ్చాయి.

మీమాంసా న్యాయశాస్త్రంచ పురాణం ధర్మసంహితాం
కంఠోర్ధ్వరేఖా తంత్రేణ ససర్జ సకలాంబికా

కంఠం యొక్క పై రేఖ నుండి మీమాంసా, న్యాయ శాస్త్రము, పురాణము, ధర్మశాస్త్రము సృజించింది. ఇక మధ్యరేఖలోంచి ఆయుర్వేద, ధనుర్వేదాలు సృజించింది. **'చతుష్షష్టించ విద్యానాం కంఠకూపభువాఽ సృజత్'** – క్రింద రేఖ నుండి కంఠకూపం వరకు అరవై నాలుగు విద్యలు సృజించింది.

'తంత్రాణి నిఖిలాంగేభ్యో దోర్మూలే మదనాగమమ్' – బాహు మూలాలు మొదలుకుని మిగిలిన శరీరం నుండి సర్వ తంత్రములు సృజించిందని అంత చక్కగా వర్ణించారు.

సరస్వతీ, శాస్త్రమయీ అంటే జ్ఞానాధిదేవత. ఆ జ్ఞానాధిదేవతే లలితామహా త్రిపురసుందరి. అంత జ్ఞానాధిదేవతకి బిడ్డ ఎంత గొప్పవాడై ఉంటాడు! ఆయన

కూడా బ్రహ్మవిద్యలోకెల్లా గొప్పవాడైనవాడు.

706. గుహాంబా – శ్రీ గుహాంబాయై నమః

గుహుడు అంటే సుబ్రహ్మణ్యుడు. శివశక్తుల ఏకత్వం ఆయన దగ్గర సిద్ధిస్తుంది. శ్రీవిద్యలో ప్రధానమైన పన్నెండు మందిలో ఈయన ఒకడు. అమ్మ విద్యకు, అయ్య విద్యకు కూడా ఈయన దిట్ట. కనుక ఆ స్కందమూర్తిని ఇక్కడ చూపిస్తున్నారు. స్కందుడు సర్వదేవతలకి నాయకుడు. గుహుడు ప్రధానంగా జ్ఞానదేవత.

ఈ స్వామికి గురుగుహ అని పేరు కూడా ఉన్నది. ముత్తుస్వామి దీక్షితులవారు ఈయన దయ వల్లే అమ్మ అనుగ్రహం పొందారు.

ఆయన ఒక్కసారి అనుగ్రహిస్తే అత్యంత రహస్యమైన బ్రహ్మజ్ఞానాన్ని ఇస్తాడు. ఆ గుహ జ్ఞానస్వరూపుడై ఉన్నవాడే గుహుడు. ఆయనకి తల్లి కనుక 'గుహాంబా'.

ఇంకో అర్థంలో గుహ అంటే బ్రహ్మజ్ఞానం. ఆ బ్రహ్మజ్ఞానాన్ని కలిగించే తల్లి అని అర్థం.

గుహ యందు ఉన్నవాడంటే జీవుడు. గూహనము అంటే కప్పబడుట అని అర్థం. సర్వజీవులు గుహులే. సర్వజీవులు మాయ చేత కప్పబడ్డారు. సర్వజీవులకు అంబ కనుక 'గుహాంబా'.

మరొక అర్థం – ఎప్పుడైతే ఈ సుబ్రహ్మణ్యుడు ఆరు ముఖాలతో వ్యక్తమయ్యాడో అప్పుడు అమ్మవారు తొమ్మిది మంది దాదులని పంపించింది. ఈ తొమ్మిది మంది దాదులూ అమ్మవారి నుంచే వచ్చారు. ఈ తొమ్మిది మంది దాదులని గుహాంబలు లేదా స్కందాంబలు అంటారు. వీరి పేర్లు **స్కంద, స్కందాపస్మార, శకున, రేవతి, పూతన, అంధపూతన, శతపూతన, ముఖకుండిక, నైగమేయ.** ఈ దాదులు వెళ్ళి ఆయనకి పోషణాదులను చూశారు.

తరువాత ఆయన చక్కగా బయటకి వచ్చినప్పుడు 'రా! నాయనా!' అని అమ్మవారు ఎత్తుకుంది. ఈ దాదులు అందరూ అమ్మవారి అంశస్వరూపులే. వీరి పేర్లు ఎప్పుడు అనుకున్నా పిల్లలని రక్షిస్తూ ఉంటారు.

'గుహాంబా' అంటే దాదుల రూపంలో ఉన్న తల్లి అని అర్థంలో కూడా చెప్పుకోవచ్చు. తరువాతి నామం 'గుహ్యరూపిణీ'.

707. గుహ్యరూపిణీ – శ్రీ గుహ్యరూపిణ్యై నమః

జ్ఞానప్రదాయిని అయిన గుహాంబ– గుహ్యరూపిణి. గుహ్యముగా ఉన్నది. 'తిలతైలవత్, దారువహ్నివత్' – నువ్వుల గింజలో నూనెలాగ, కట్టెలో అగ్నిలాగ, పాలలో వెన్నవలె సర్వత్రా ఆవిడే వ్యాపించి ఉంది.

'ఏకో దేవః సర్వభూతేషు గూఢః' అని ఉపనిషత్ చెప్పింది. అందరిలో గూఢముగా ఉన్నదే పరమాత్మ. మరి గూఢంగా ఉన్నవానిని నేను చూడలేదంటే అది అజ్ఞానం. గూఢంగా ఉన్నది ఎలా కనబడుతుంది? కనబడిందంటే అది శక్తి కాదు. కనబడే ఉపాధులన్నీ డొల్లలే. లోపల ఉన్నది మాత్రం శక్తే. అది గూఢ. ప్రతివారిలో గుహ్యరూపిణిగా ఉంది.

గుహ అంటే హృదయం. **'పరం పుమాంసం నిహితం గుహాయాం'** – గుహ యందు ప్రకాశించే తల్లి. గుహ్యరూపిణి అంటే హృదయగుహలో ఉన్న ఆత్మరూపిణి.

ఉపనిషద్రూపిణి అని కూడా చెప్పవచ్చు. ఉపనిషత్ విజ్ఞానానికే గుహ్యశాస్త్రమని పేరు. గుహలో ఉన్న పరమాత్మ గురించి చెప్పే శాస్త్రం కనుక గుహ్యశాస్త్రం.

ఇదం గుహ్యతమం శాస్త్రం అని కృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పాడు. వేదాంతవిద్యకి గుహ్యవిద్య అని పేరు. గుహ్యరూపిణి అంటే వేదాంత విజ్ఞానరూపిణి. వేదాంత విజ్ఞానమే 'సరస్వతీ, శాస్త్రమయీ, గుహాంబా, గుహ్యరూపిణీ'. 'శాస్త్రమయీ' అన్నప్పుడు అన్ని రకాల శాస్త్రాలు చెప్పబడ్డాయి. శాస్త్రములలో కెల్ల ఉత్కృష్ట శాస్త్రం వేదాంతమని కృష్ణపరమాత్మ గీతలో చెప్పాడు. **'అధ్యాత్మవిద్యా విద్యానాం'** "విద్యలలో అధ్యాత్మవిద్యను నేను" అన్నాడు. అన్ని విద్యలలో గొప్పది వేదవిద్య. వేదాల్లో గొప్పది వేదాంతశాస్త్రం. వేదాంతమే గుహ్యవిద్య. తల్లిని శాస్త్రమయీ అని మొత్తంగా చెప్పినా అసలు విద్య అయిన వేదాంతవిద్య అమ్మ రూపమే.

గురుమూర్తిధరాం గుహ్యాం గుహ్యావిజ్ఞానరూపిణీం
గుహ్యాభక్తజనప్రీతాం గుహాయాం నిహితాం నుమః

ఇది సూతసంహితలోని వాక్యం. గురుమూర్తి ధరించినది. గుహ్యామైనది. గుహ్యావిజ్ఞాన రూపముతో ఉన్నది. ఇదే గుహ్యారూపిణి. 'గుహ్యాభక్తజనప్రీతాం' – గుహ్యా భక్తులపై ప్రీతి కలది. అంతర్యాగ పద్ధతిలో అమ్మవారిని ఆరాధన చేసేవారందరూ గుహ్యాభక్తులే. బాహ్యారాధన చెయ్యవచ్చు; కాదని కాదుగాని గుహ్యారాధనే ప్రధానం.

అంతర్యాగం, రహోయాగం అత్యంత ప్రధానం. దానికి ఇది అభ్యాసంగా సహకరిస్తుంది. అంతర్యాగంలో అమ్మని ఆరాధించే భక్తులపట్ల ప్రీతి కలిగినది.

ఈ తల్లి ఎక్కడ ఉంది? "గుహాయాం నిహితాం నుమః". ఇది సూతసంహితలోని అత్యద్భుతమైన శ్లోకం.

వ్యవహార దృష్టికి అగోచరమైన దానిని గుహ్యామంటారు. వ్యవహారదృష్టికి ఏది గోచరించదో అది గుహ్యాం.

'గుహ్యారూపిణీ'కి ఉపాసనాపరమైన అర్థం– హృల్లేఖామంత్రాన్ని గుహ అని అంటారు. హృల్లేఖామంత్రమంటే హ్రీంకారమే. హ్రీ అంటే సిగ్గు, బిడియం, ముడుచుకుపోవడం. తెరుచుకోవడం అంటే బహిర్ముఖత్వం. ముడుచుకోవడం అంటే అంతర్ముఖత్వం. హ్రీం అనేది మనల్ని తొందరగా హృదయంలోకి(గుహలోకి) తీసుకు వెళ్ళే బీజం కనుక హృల్లేఖా. హృదయంలో వ్రాసుకో అంటే హృదయంలో జపించు. ఆ హృల్లేఖకే గుహ్యామంత్రమని పేరు.

ఆ హ్రీం అనే హృల్లేఖా మంత్రం లోపల ఎవరున్నారో ఆవిడే గుహ్యారూపిణి. హ్రీంకారరూపిణి. హ్రీంకారం లోపల అంతర్యామిగా ఉన్నది. ఇక్కడ త్రిశతిలో ఉన్న హ్రీంకార నామాలన్నీ గ్రహించవచ్చు.

'గుహాయాం హృల్లేఖాయాం విద్యమానాం'– హృల్లేఖా మంత్రమునందున్న అంబ. ఇది కూడా ప్రధానార్థమే.

'సర్వోపనిషదాం దేవీం గుహ్యోపనిషదుచ్యతే' – ఉపనిషత్తు ఎన్నో విషయాలను

చెప్తోంది. ప్రధానంగా దాని ఉద్దేశం ఆత్మతత్త్వప్రతిపాదనమే.

ఈ గుహ్యమైన విద్య మనకు ఎలా తెలియబడుతుంది? గుహ్యమంటే అతి రహస్యం. ఆ రహస్యం అన్నింటిలో ఉంది. మనకు కనబడుతున్నవి ఉపాధులు. రహస్యమైనది చైతన్యం. ఉపాధులను దాటి మనం చూస్తేనే ఆ చైతన్యం తెలియబడుతుంది. చైతన్యం వల్ల ఉపాధి ఉంది గాని, చైతన్యానికి ఉపాధి లేదు.

కుండలో గాలి నిజమే కావచ్చు గాని, కుండలో బంధింపబడిందా? కుండ వల్ల గాలి కుండలో ఉన్నట్లుగా కనబడుతోంది. అలాగే ఉపాధులన్నింటిలో చైతన్యము ఉన్నా ఆ చైతన్యానికి ఉపాధి బంధము లేదు.

ఆ చైతన్యము అన్ని ఉపాధుల నుండి విడివడే ఉందని చెప్తూ తరువాతి నామం.

708. సర్వోపాధివినిర్ముక్తా – శ్రీ సర్వోపాధివినిర్ముక్తాయై నమః

సరస్వతీ, శాస్త్రమయీ నుండి మోహినీవిద్య ఆవిడే. మోహం నుండి బయట పెట్టే శాస్త్రవిద్య కూడా ఆవిడే. శాస్త్రవిద్యలు ముందుగా ధర్మప్రకారం నడిపిస్తూ శుద్ధులను చేస్తూ తరువాత గుహ్యవిద్యారూపంలో ప్రకాశింపజేస్తాయి. ఆ గుహ్యవిద్య రావాలంటే గుహ్యవిద్యకి అంబ ఆవిడ. శరీరాది ఉపాధులలో చైతన్యంగా, అంతర్యామిగా ఉన్నప్పటికీ ఉపాధిధర్మాలేవీ తనకు లేనిది. నిర్గుణ పరబ్రహ్మ.

ఆ విద్య ఎలా ఉంటుంది? 'సర్వోపాధివినిర్ముక్తా' అని చక్కగా పూర్తి చేశారు. సర్వశాస్త్రములు సాక్షాత్తుగానో, పరంపరగానో అద్వైతమే తాత్పర్యంగా ప్రతిపాదిస్తాయి. శాస్త్రమయీ అయిన తల్లి సర్వోపాధివినిర్ముక్త అయిన ఏకతత్త్వం.

709. సదాశివపతివ్రతా – శ్రీ సదాశివపతివ్రతాయై నమః

సదాశివునికి పతివ్రత. సదాశివుడు అంటే ఎల్లవేళల శుభస్వరూపుడు. ఈ సదాశివుడు తురీయతత్త్వం. మోక్ష ప్రదాయకుడు. ఈశ్వర పంచకృత్యాలలో అనుగ్రహకృత్యం చేసేవాడు సదాశివుడు.

జీవునికి సంబంధించి తిరోధానము మోహము. అనుగ్రహము మోక్షము. దీని గురించి మునుపే వివరంగా చెప్పుకున్నాం. సృష్టి, స్థితి, లయలు అందరికీ ఉంటాయి. బంధమనేది కూడా అందరికి ఉంటుంది. మోక్షమనేది ఏ కొందరికో ఉంటుంది. ఈ బంధము - తిరోధానము. మోక్షము - అనుగ్రహము. శివుడు ఏ రూపంలో ఉన్నా అమ్మవారు పతివ్రతే. రుద్ర పతివ్రత, మహేశ్వర పతివ్రత అని కూడా అనవచ్చు. కానీ సదాశివపతివ్రతా అని చెప్పడంలో విశేషముంది.

అనుగ్రహమంటే మోక్షం. మోక్షకారకుడైన వాని యొక్క పతివ్రత అంటే అర్థం- ఆయన మోక్షం ఇస్తాడు, ఈవిడ పతివ్రతగా ఆయన ప్రక్కన ఉంటుంది. ఈవిడ సహకారంతోనే ఆయన మోక్షం ఇస్తాడు. ఆయన చేత మోక్షం ఇచ్చేలా చెయ్యగలదు. పతివ్రత సాధించినట్లు ఎవరూ సాధించలేరు.

'సర్వోపాధివినిర్ముక్తా' ప్రక్కన సరైన పదం 'సదాశివపతివ్రతా'. సర్వోపాధి వినిర్ముక్తా అనే మాటలో 'ముక్తా' అంటేనే మోక్షం తెలియబడుతున్నది. మోక్షప్రదాయకుడైన శివుని యొక్క పతివ్రత అని ఒక అర్థం. నిత్యుడైన పరమాత్ముని సతి(శక్తి) కూడా నిత్య సత్య స్వరూపిణి - అని ఈ నామభావం.

మరొక అర్థం - అమ్మవారిని శివుని పతివ్రత అనే భావంతో ఉపాసించడం సమయాచారం. అడుగడుగున శివుని గుర్తు చేయడం సమయాచారం. పతివ్రతకి ఇష్టమైనపని వారి పతిని కీర్తించడం.

సదాశివ అని చెప్పినప్పుడు మిగిలిన నాలుగు కృత్యాలు అందులో ఉన్నాయి. పై స్థితి చెప్పారంటే క్రింద నుండి అన్నీ కలుపుకుని చెప్తారు. సదాశివుడు అంటే మొత్తం పంచకృత్యములు చేసే పరమేశ్వరుడు. ఆయనకి పతివ్రత అంటే అర్థం ఆయన ఏ కృత్యం చేస్తే ఆ కృత్యానికి సహకరిస్తూ ఉన్న తల్లి.

పతివ్రత ఆయన ధర్మానికి సహకరించునది. వారిద్దరి మధ్య సమన్వయం, సామరస్యం ఉంది కనుకనే ఈ ప్రపంచం నడుస్తోంది. వారి ఇద్దరి యొక్క అన్యోన్య భావాన్ని 'సదాశివపతివ్రతా' అనే మాటలో చూపిస్తున్నారు. పాతివ్రత్యం అనేది సంప్రదాయం.

'సదాశివపతివ్రత'గా ఉంది కనుకనే అక్కడ నుండి సత్ సంప్రదాయంతో లోకాన్ని నడుపుతోంది.

710. సంప్రదాయేశ్వరీ - శ్రీ సంప్రదాయేశ్వర్యై నమః

సంప్రదాయములకు నియామకురాలు. నియమాలను ఏర్పరచి వాటి ప్రకారం నడిపించునది.

మరొక అర్థంలో 'సదాశివపతివ్రతా' అంటే శివశక్త్యైక్యరూపిణి. శ్రీచక్రాధిదేవత. శ్రీవిద్యాస్వరూపిణి. ఈ శ్రీవిద్య మనకి తెలియాలంటే సంప్రదాయం ద్వారానే తెలుసుకోవాలి తప్ప అన్యమార్గము లేదు. శ్రీవిద్యా ఉపాసన ఒక సంప్రదాయము. పూర్వం పరమేశ్వరుని చేత ఈ సంప్రదాయాన్ని ఏర్పాటు చేసినది పతివ్రత అయిన అమ్మ.

'సదాశివపతివ్రతా' అన్నప్పుడు మోక్షకారకుడైన సదాశివునికి పతివ్రతగా ఉంటూ, మోక్షకరమైన విద్యని ఇవ్వమని ఆయన చేత నిర్మింపజేసింది. అది శ్రీవిద్య. శ్రీవిద్యాసంప్రదాయాన్ని ఇచ్చినవారు శివశక్తులే.

'సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం' అని నమస్కారం చేసుకుంటున్నాం.

దక్షిణామూర్తి రూపంతో శ్రీవిద్యని ఇచ్చాడు. శ్రీవిద్యకి రెండు సంప్రదాయాలున్నాయి. ఒక సంప్రదాయం దక్షిణామూర్తి రూపంతో, ఇంకొక సంప్రదాయం ఆనందభైరవ రూపంతో ఇచ్చారు. ఇద్దరికి నమస్కారం చేసుకుని శ్రీవిద్యారాధన చెయ్యాలి. దక్షిణామూర్తి అనుగ్రహం లేనిదే శ్రీవిద్యలో పండలేరు.

దక్షిణామూర్తి అంటేనే బ్రహ్మవిద్యాస్వరూపుడు. 'సర్వోపాధివినిర్ముక్తా', 'గుహ్యరూపిణీ' – ఇదంతా దక్షిణామూర్తి స్వరూపం. ఆయన ఇచ్చాడంటే బ్రహ్మవిద్యనే ఇస్తాడు కనుక శ్రీవిద్య బ్రహ్మవిద్యయే. సంప్రదాయం ద్వారా మాత్రమే ఇది తెలుసుకోవాలి కానీ పుస్తకాలు చూసి కాదు.

ప్రతి దానికి సంప్రదాయం కావాలి. ఇప్పుడు మనకి ఈ విద్య వచ్చిందంటే

అది మనకి ఇవ్వబడింది. ఇవ్వబడితే 'దాయం' అంటారు. బాగా ఇవ్వబడితే 'ప్రదాయం' అంటారు. సంపూర్ణముగా ఇవ్వబడితే 'సంప్రదాయం' అంటారు. చక్కగా, గొప్పగా ఇవ్వబడినది కనుక సంప్రదాయము. అది ఒక పరంపర ద్వారా ఇవ్వబడింది. వారు కూడా సంపూర్ణంగా తెలుసుకుని, అనుష్ఠించి, ఆ అనుభవాన్ని, ఆ అధ్యయనాన్ని మనకి అందించారు. అలా పరంపరగా వచ్చినదానినే 'సంప్రదాయము' అంటారు. ఆ సంప్రదాయానికి అమ్మ నియామకురాలు.

సంప్రదాయ విరుద్ధంగా ఎవరు ప్రవర్తిస్తారో వారికి ఈశ్వరి లేదు. ఈశ్వరి అంటే నాథ అని అర్థం. సంప్రదాయంలో లేని వారికి ఆవిడ నాథ కాదు. కనుక వారు అనాథలు అవుతారు.

సంప్రదాయులకు ఆవిడే నాయకురాలు. శంకరభగవత్పాదులవారు భగవద్గీతాభాష్యం రాస్తూ మొట్టమొదటే చెప్పారు. **"అసంప్రదాయవిత్ సర్వశాస్త్రవిదపి మూర్ఖవదుపేక్షణీయః"** – "సంప్రదాయం తెలియనివాడు ఎన్నో శాస్త్రాల్లో పండితుడైనా, వాడు చెప్పే మాటలని మూర్ఖుని వచనాల క్రింద ఉపేక్షించాల"ని చెప్పారు.

నారాయణం పద్మభువం వసిష్ఠం శక్తిం చ తత్పుత్ర పరాశరం చ
వ్యాసం శుకం గౌడపదం మహాంతం గోవిందయోగీంద్రమథాస్య శిష్యం
శ్రీశంకరాచార్యమథాస్య పద్మపాదం చ హస్తామలకం చ శిష్యం
తం త్రోటకం వార్తికకారమన్యాన్ అస్మద్గురూన్ సంతతమానతోఽస్మి

అని అక్కడి నుండి పరంపర చెప్పుకుంటున్నామే. ఆ శంకరులు ఏది ఇచ్చారో అది మన దాకా తీసుకొచ్చిన వారు మనకి చాలు. ఆ పరదేవత ఇచ్చిన విద్యనే వీరంతా మన దాకా ప్రసరింపజేశారు. అందుకు అమ్మకి మనపై దయ పుడితే తాను గురువులనే తీగల ద్వారా విద్యుచ్ఛక్తిగా మనకు ప్రాప్తిస్తుంది. ఆ పరంపరకి నమస్కారం చేసుకోవాలి. సంప్రదాయం కలిగిన గురువు దొరకడం గొప్పభాగ్యం.

పెద్దల ద్వారా, గురువు ద్వారా వచ్చిన జ్ఞానానికి ఆవిడ నియామకురాలు. ఆ జ్ఞానంలో ఉన్నవారికి నాయకురాలు, రక్షకురాలు. దీనికి నారాయణదాసుగారు ఇలా చెప్పారు.

"పంతులనుడువుల న్పాటించి తన్ను నమ్మిన డింగరు న్గాపాడు వేల్పు"

పంతులు- పంత్ అంటే జ్ఞాని, శాస్త్రవేత్త అని అర్థం. శాస్త్రవేత్తల, జ్ఞానుల మాటలను పాటించి తన్ను నమ్మిన డింగరులను రక్షించునది. డింగరి అంటే భక్తుడు, శిష్యుడు. ఇది సంప్రదాయేశ్వరికి గొప్ప అర్థం.

"తమ పెద్దలేగిన దారినే నడచు నెవరికైన న్గోర్కెలిడుపాదిసాహి". మన పూర్వీకుల నుండి వచ్చిన మంచి పరంపర దానిని పాటించే వారిని ఎవరినైనా అనుగ్రహించి అభీష్టాలనిచ్చే పరమేశ్వరి. **'మంచి కోరికల కొనసాగించు వేల్పు'.**

సాధ్వీ

711. సాధు - శ్రీ సాధునే నమః

712. ఈ - శ్రీ య్యై నమః

సాధు లక్షణము గల స్త్రీ. అన్ని సాధు మార్గములు కలది అని అర్థము. అందులో పాతివ్రత్యము ఒకటి.

బాగు, బాగు అని మెచ్చుకునే గుణములను సాధు అంటారు. **'సముచితం ఇతి సాధు'** అని నిర్వచనం చెప్పారు కళ్యాణానందభారతీవారు. ఏది బాగు, ఏది మేలు అనే గుణాలను కలిగి ఉందో దానిని సాధు అనాలి. అనంత కళ్యాణగుణములు కలది 'సాధ్వీ'.

'సంప్రదాయేశ్వరీ'కి, 'సాధ్వీ'కి అనుబంధం ఒకటి ఉంది. శ్రీవిద్యా పరంపరలో సాధ్వీమాట దేనికి వాడాలో చెప్పారు. కొందరు వ్యాఖ్యాతలు సాధ్వీ శబ్దాన్ని రెండు చేశారు. సాధు+ఈ అని అర్థం చెప్పారు. అందులో భాస్కరరాయలు ప్రధానం. కళ్యాణానందభారతీవారు కూడా సాధు+ఈ అనే చెప్పారు. మరి కొందరు కూడా ఇలాగే చెప్పారు.

నారాయణభట్టు మొదలైన వారు మాత్రం సాధ్వీ అనే చెప్పారు. ఏది తీసుకున్నా ఫర్వాలేదు. మనకి 1000 నామాలకి సరిపోకపోతే రెండు నామాలు క్రింద తీసుకోవాలి. 1000 నామాలకి సరిపోతే ఒక్క నామం క్రింద చెప్పుకోవచ్చు.

సాధు అన్నప్పుడు మాత్రం ఆ నామాన్ని నపుంసకలింగ శబ్దంగా తీసుకొని 'సాధునే నమః' అని చెప్పాలి.

'సదాశివపతివ్రతా, సంప్రదాయేశ్వరీ, సాధ్వీ'. శ్రీవిద్య యొక్క స్వరూపమే ఈ ఆవిష్కరణ. శ్రీవిద్యయే అమ్మవారు కనుక 'సంప్రదాయేశ్వరీ' – సంప్రదాయ మునకు నియామకురాలు. సంప్రదాయము అంటే, **"అపరిచ్ఛిన్న గురుపారంపర్య క్రమాగతమిదం రహస్యం"** అన్నారు. ఎక్కడా తెగకుండా వచ్చిన గురుపరంపర. అలా పరంపరగా వచ్చిన రహస్యవిద్య. రహస్యవిద్య అంటే వేదాంత విద్య, మంత్రవిద్య. అటువంటి సంప్రదాయాన్ని అనుసరించి ఎవరు అమ్మని ఆరాధిస్తున్నారో వారందరికి నియామకురాలుగా అనుగ్రహించే తల్లి.

ఎన్నడూ తన పతిని వీడని అనితర సాధారణ పాతివ్రత్యం కలది సాధ్వీ. పతియైన శివునితో అవినాభావం కలిగిన పరమ పతివ్రత సాధ్వి జగన్మాత.

సాధ్వీ అంటే సద్గుణముల రాశి. పాతివ్రత్యాది సద్గుణములు కలిగిన తల్లి. ఆ గుణాలన్నీ కూడా లోకానికి మేలు కలిగించే గుణములు.

ఇంకో అర్థంలో స–అధ్వ అంటే అధ్వములు కలిగినది. అధ్వము అంటే మార్గము అని అర్థం. సంప్రదాయ మార్గములు అనేకములు ఉన్నాయి. ఏ సంప్రదాయం గొప్పది? సాధారణంగా విద్య వల్ల ఒక ప్రమాదం ఉంది. విద్యావంతుల కులముల యందు ఎక్కువగా వైమనస్యాలు ఉంటూ ఉంటాయి. ఎవరికి వారే మేధావి. 'బుద్ధికో సిద్ధాంతం. సిద్ధాంతానికో రాద్ధాంతం'. దీని వల్ల సాధకునికి అయోమయం ఏర్పడుతుంది. ఈ విద్యా పాండిత్యపు అహంకారం వల్ల తాను చెప్పిందే గొప్ప అని, తన పరంపరే గొప్ప అనుకుంటూ ఇతర పరంపరలను అవమానించడం జరుగుతూ ఉంటుంది.

ఎవరి సంప్రదాయాన్ని వారు అనుసరిస్తూ, ఇంకొకరి సంప్రదాయాన్ని గౌరవించడమే గొప్ప సంప్రదాయం. ఏ సంప్రదాయపు లోతులు వారికే తెలుస్తాయి. వేదములోనే అనేక మార్గములు ఉన్నాయి. కొన్ని అంతర్యాగాన్ని చెప్తాయి. కొన్ని బహిర్యాగాన్ని చెప్తాయి. బహిర్యాగంలో కూడా రకరకాల ఆరాధనా పద్ధతులు

చెప్పబడుతూ ఉన్నాయి. ఇవన్నీ కూడా అధ్వములు అంటే మార్గములు.

ఇలాంటి మార్గములన్నింటితో కూడిన విద్య సంప్రదాయబద్ధంగా వస్తోంది కనుక స+అధ్వ. అటువంటి అధ్వములు కలిగినది కనుక సాధ్వీ. వివిధములైన సంప్రదాయ మార్గములు కలిగిన తల్లి.

మూడవ అర్థంలో 'సాధు+ఈ' అని రెండు శబ్దాలు తీసుకున్నారు. అలా విభజించిన నామాలు చాలా కనబడుతూ ఉన్నాయి. సాధుః అనే మాటకు 'సాధునే నమః' అనే నామావళిలో చెప్పుకుంటాం. సాధు అంటే **'సతీ సాధ్వీ పతివ్రతా'** అని అమరకోశం చెప్తోంది. ఈ మూడు కూడా పర్యాయపదాలే. సదాశివపతివ్రత కనుక ఆవిడ సాధు స్వభావురాలు అని చెప్పుకోవచ్చు.

శుద్ధసత్త్వస్వరూపాన్ని సాధు అంటారు. అలాంటి శుద్ధసత్త్వ లక్షణమే అమ్మవారు కనుక సాధువు. ఇక 'ఈ' ప్రత్యేకంగా చూపిస్తున్నారు. శ్రీవిద్యలో ప్రధానమైనది 'ఈ'. **'ఈకారాద్విశ్వకర్త్రీయం మాయా తుర్యాత్మికా ప్రియా'** అని శాస్త్రం చెప్తోంది.(వామకేశ్వరీ తంత్రం) 'ఈ' కారము అక్షరపంక్తిలో నాలుగవది. కనుక 'ఈ' కారము తురీయాత్మికా అయినది. తురీయస్థితిని తెలియజేస్తున్నదే 'ఈ'.

నారాయణదాసుగారు దీనికి అనువాదం చేస్తూ, **"నాలవయున్కియై నలువారు వేల్పు"** అన్నారు. నాలవ యున్కియై అంటే తురీయ స్వరూపమై ఉన్నది. 'ఈం' అన్నప్పుడు ఏవేవి చెప్పబడుతున్నాయో అవన్ని ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. ఈ అనేది నామమైతే నామావళి చదివేటప్పుడు **'యై నమః'** అని చెప్పాలి. ఈ విభజన బాగుంది కానీ ఆరాధకులు మాత్రం **'సాధ్వ్యై నమః'** అని జపించడం శ్రేష్ఠం.

713. గురుమండలరూపిణీ – శ్రీ గురుమండలరూపిణ్యై నమః

'సంప్రదాయేశ్వరీ, సాధ్వీ, గురుమండలరూపిణీ'... ఇది క్రమం. ఇది ఒక గుత్తిగా తీసుకోవాలి. ఏ నామానికి ఆ నామం వ్యాఖ్యానిస్తూ ఉంటే పాండిత్యంతో ఎన్నైనా చెప్పవచ్చు కానీ వశిన్యాది వాగ్దేవతలు కొన్ని నామాల పరంపరలో ఒకానొక జ్ఞానాన్ని ఆవిష్కరణ చేస్తున్నారు. ఒక నామంతో మరొక నామం ముడిపడి ఉంటుంది.

ఈ గుత్తిలో నామాల క్రమం చూస్తే ఈ సంప్రదాయముగా వచ్చిన మార్గాలన్నీ గురుమండలముగా మనకి లభిస్తున్నాయి.

గురుమండలం సాక్షాత్ అమ్మవారి యొక్క రూపమే. మన యొక్క స్వగురు, పరమగురు, పరమేష్ఠి గురువులను గురుమండలం అంటాం. ఇంకా వెనక్కి వెళ్తే చాలామంది ఉంటారు. అందుకే పాదుకాంత దీక్షాపరులు మొదలైనవారు ఆరాధన చేస్తున్నప్పుడు దక్షిణామూర్తిని మొదలుకుని స్వగురు వరకు ఉన్న పరంపరను ఆరాధన చేస్తారు. ఇదంతా కలుపుకుంటే గురుమండలము.

గురుమండలం ప్రధానంగా దివ్యౌఘ, సిద్ధౌఘ, మానవౌఘ అని చెప్పబడతారు. దివ్యౌఘ అంటే దేవకోటికి చెందినవారు. సిద్ధౌఘ అంటే సిద్ధపురుషులైన ఋషులు మొదలైనవారు. మానవౌఘ అంటే మానవుల్లో ఉన్న మహాత్ములు, ఆచార్యపరంపర అంతా చెప్పబడుతున్నది. వీటికి రకరకాల సంప్రదాయాలు మనకి ఉన్నాయి.

ఖడ్గమాలగా వ్యవహరిస్తున్న శుద్ధశక్తిమాలలో ఈ గురుపరంపర అంతా వస్తుంది.

'పరమేశ్వర పరమేశ్వర్యైనమః' తో మొదలవుతుంది. 'మిత్రేశమయ్యైనమః' అవన్నీ దివ్యౌఘ. తరువాత సిద్ధౌఘ. తరువాత మానవౌఘ. చిట్టచివరికి 'కంకాలతాపసమయ్యైనమః'. 'కాలతాపనమయ్యై నమః' అంటారు కాని అసలైన పాఠం 'కంకాలతాపసమయ్యై నమః'. 'దీపకళానాథమయై నమః' కాదు. అది 'దీపకనాథమయై నమః'. వారి గురించి చెప్పుకోవాలంటే అది పెద్ద గురుపరంపర చరిత్ర. దీపకనాథుడు అనే ఆయన చాలా గొప్పవాడు. ఈయన త్రిపురసుందరీ దండకము అని ఒక దండకమును కూడా రచించారు.

దీపకనాథుడు రచించిన త్రిపురసుందరీ దండకములో అనేక మర్మాలు ఉంటాయి. మరికొందరి సంప్రదాయంలో గురుపరంపరలో మార్పులు కనిపిస్తూ ఉంటాయి. ప్రసిద్ధి చెందిన ఖడ్గమాలగా మనం వ్యవహరించిన సంప్రదాయాన్ని చెప్పుకోవడం జరుగుతున్నది.

గురుమండలము అమ్మవారి స్వరూపమే. విద్య గురువుల నుండి వస్తోందంటే

అమ్మవారే వారినుండి వస్తోంది కనుక వారందరూ అమ్మవారి రూపమే. గురుమండలమును అమ్మ రూపముగా అనాలి. ఇంతవరకు ఒక అర్థం చెప్పుకున్నాం కానీ శ్రీవిద్యా సంప్రదాయంలో గురుమండలం అంటే చెప్తూ-

శ్రీనాథాది గురుత్రయం గణపతిం పీఠత్రయం భైరవం
సిద్ధౌఘం వటుకత్రయం పదయుగం దూతీక్రమం మణ్డలమ్,
వీరాన్ద్వ్యష్టచతుష్కషష్టి నవకం వీరావలీ పంచకం
శ్రీమన్మాలినిమన్త్రరాజసహితం వన్దే గురోర్మణ్డలమ్.

గురువుతో మొదలు పెట్టుకుని ఒక మండలముంది. మండలము అంటే సమూహం. ఈ సమూహం అంతా శ్రీవిద్యకి చాలా పటిష్టత చేర్చేవారు. ఇందులో దేవతలున్నారు. పరివారదేవతలున్నారు. శ్రీచక్రానికి రక్షకశక్తులుగా ఉన్నవారు ఉన్నారు. వీరందరి గురించి దీనిలో చెప్పారు.

వీరు శ్రీచక్రంలో నవావరణ దేవతలలోకి రారు. కానీ వీరి అనుగ్రహం సాధకుని మీద ఉంటుంది. అందుకు వీరికి నమస్కరించుకోవాలి. వీరందరిని గురువులు అనుకున్నా తప్పులేదు కాని 'గురోర్మండలం' అంటే గురువుతో మొదలు పెట్టుకుని వచ్చిన సమస్త మండలము.

ఉపాసనా సంప్రదాయం తెలిసిన వారికి చెప్పవలసిన విషయాలు కొన్ని ఉంటాయి. అందరికీ చెప్పవలసినవి కొన్ని ఉంటాయి. ఎంత మేరకు సభలో ప్రకటించవచ్చో అంత మేరకు చెప్పుకుంటూ ఈ శ్లోకానికి భావం తెలుసుకుంటేనే గురుమండలరూపిణికి సంపూర్ణంగా వ్యాఖ్యానమౌతుంది.

'శ్రీనాథాది గురుత్రయం' - శ్రీకారంతో ప్రారంభించారు. గురువులను సాధారణంగా నాథ సంప్రదాయంతో చెప్తారు. ఆనందనాథ అని గురువులను చెప్పడం శ్రీవిద్యా సంప్రదాయం. నాథాది అంటే నాథతో మొదలు పెట్టుకుని గురుత్రయం. గురుత్రయమంటే స్వగురు, పరమగురు, పరమేష్ఠిగురు. గురోర్మండలం అక్కడితో ఆగిపోలేదు. మొత్తం ఇందులో పదిహేను ఉన్నాయి. ఆ పదిహేనులో ఒకటి గురుత్రయం. ఇంక తరువాత పధ్నాలుగు ఉన్నాయి.

రెండవది 'గణపతి' గురుస్థానం. తరువాత 'పీఠత్రయం'- కామగిరిపీఠం, పూర్ణగిరిపీఠం, జాలంధరపీఠం. **'కామపూర్ణ జకారాఖ్య శ్రీపీఠాంతర్నినివాసినీం'** అని మాతృకావర్ణస్తుతి చెప్తుంది.

'భైరవం' – భైరవులు ఎనిమిది మంది. మనం అనుకునే అసితాంగ, సితాంగ కాదు. ఇక్కడి భైరవులు వేరు. వీరు ఎనిమిది మంది. మహామంథాన, ఖచక్ర, ఫట్కార, ఏకాత్మానంద, రవిభక్షణ, చండ, నభోనిర్మల, డమర భాస్కర భైరవులు.

'సిద్ధౌఘం'- ఓఘం అనగానే సమూహము. సిద్ధ సమూహము. ఇక్కడ వీరు తొమ్మిది మంది ఉంటారు. వారికి పేర్లు విశేషంగా ఉంటాయి. మహా దుర్మానాంబా, సుందర్యంబా, విశ్వదళనాంబా, కపాలికాంబా, బడబాంబా, భీమాంబా, కరాళ్యంబా, ఖరాననాంబా, శాలినాంబా – వీరు సిద్ధసమూహం.

'వటుకత్రయం' ముగ్గురు వటుకులని పూజించాలని చెప్పారు. శ్రీవిద్యా సంప్రదాయంలో కుమారీ పూజ, సువాసినీ పూజతోబాటు వటుక పూజ ఉంటుంది. ఈ వటుక కూడా శ్రీచక్రంలో, శ్రీవిద్యలో ప్రధానమైన స్వరూపము. వీరు స్కందవటుక, చిత్రవటుక, విరించివటుక అని ముగ్గురు వటుకలు.

తరువాత **'పదయుగం'**- రెండు పదములు. ప్రకాశపాదుక, విమర్శపాదుక. ఇది పదయుగం.

'దూతీక్రమం' – దూతీ దేవతలు పది మంది ఉంటారు.

యోన్యంబాదూతి, యోనిసిద్ధనాథాంబా, మహాయోన్యంబా, మహాయోని సిద్ధనాథాంబా, దివ్యయోన్యంబా, దివ్యయోనిసిద్ధనాథాంబా, శంఖయోన్యంబా, శంఖయోనిసిద్ధనాథాంబా, పద్మయోన్యంబా, పద్మయోనిసిద్ధనాథాంబా.

తరువాత 'మండలము'. ముందు చెప్పిన గురోర్మండలం వేరు, ఇక్కడి మండలం వేరు. ఇక్కడ మండలం అంటే సూర్యమండలం, అగ్నిమండలం, చంద్రమండలం. 'వీరాన్ద్వ్యష్ట' – పదిమంది. రెండు+ఎనిమిది కలిపి పదిమంది. ఈ పదిమంది – సృష్టివీరభైరవ, శ్రుతివీరభైరవ, సంహారవీరభైరవ, రక్తవీరభైరవ, యమవీరభైరవ, మృత్యువీరభైరవ, భద్రవీరభైరవ, పరమార్కవీరభైరవ, మార్తాండవీరభైరవ, కాలాగ్నిరుద్రభైరవ.

తరువాత 'చతుష్షష్టి'. వీరిని సిద్ధాదేవతలు అంటారు. వీరు మొత్తం అరవై నాలుగుమంది. మంగళనాథ, చౌండికానాథ, జ్యేష్ఠానాథ, కంతుకినాథ, పటహోనాథ, కూర్మానాథ, ధనదానాథ, గంధానాథ, గగనానాథ, మతంగానాథ, చంపకానాథ, కైవర్తానాథ, మాతంగగమనానాథ, సూర్యభక్షానాథ, నభోభక్షానాథ, స్రౌతికానాథ, రూపికానాథ, దంష్ట్రానాథ, ధూమ్రాక్షానాథ, జ్వాలానాథ, గాంధారానాథ, గగనేశ్వరానాథ, మాయానాథ, మహామాయానాథ, నిత్యానాథ, శాంతానాథ, విశ్వానాథ, కామానాథ, ఉమానాథ, శ్రియానాథ, సుభగానాథ, విద్యానాథ, మహావిద్యానాథ, అమృతానాథ, చంద్రానాథ, అంతరిక్షానాథ, సిద్ధానాథ, శ్రద్ధానాథ, అనంతానాథ, శంబరానాథ, ఉల్కానాథ, త్రైలోక్యానాథ, భీమానాథ, రాక్షసీనాథ, మలినానాథ, ప్రచండానాథ, అనంగానాథ, త్రివిధానాథ, అనభిహితానాథ, నందినాథ, మహామనానాథ, సుందరనాథ, విశ్వేశ్వరానాథ, కాలానాథ, మహాకాలానాథ, అభయానాథ, వికారానాథ, మహావికారానాథ, సర్వగానాథ, సృగాలనాథ, పూతనానాథ, శర్వరీనాథ, వ్యోమానాథ, పూర్ణానాథ – వీరు అరవైనాలుగు సిద్ధాదేవతలు.

తరువాత 'నవకం' అంటే తొమ్మిది మంది ముద్రా దేవతలు. వీరు – సర్వసంక్షోభిణీ, సర్వవిద్రావిణీ, సర్వాకర్షిణీ, సర్వవశంకరి, సర్వోన్మాదిని, సర్వమహాంకుశా, సర్వఖేచరి, సర్వబీజ, సర్వయోని ముద్రాదేవతలు.

'వీరావళి' – ఐదుగురు వీరులు. బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వర, సదాశివ – వీరావళీ దేవతలు.

తరువాత 'మాలినీ దేవత' – మాలినీ హంసినీ మాత దగ్గర మాలినీ గురించి చెప్పుకున్నాం. 'మాలినీ' అంటే మాతృకావర్ణమాల పెట్టి దానికి ముందు రాజశ్యామల బీజాక్షరాలు కలుపుకుని చేస్తారు. మాలినీ మంత్రం అంటే మాతృకావర్ణరూపంగా ఉన్న అమ్మవారి ఒకానొక మంత్రవిశేషం. మాతృకామంత్రముల ప్రయోగములు చాలా ఉన్నాయి. 'అ' కారం నుండి 'క్ష' కారం వరకు ఉన్నప్పటికి శ్రీవిద్యలో దాని వాడుక అనేక పర్యాయాలు వస్తూ ఉంటుంది. ఇక్కడ మాలినీ మంత్రం ప్రత్యేకంగా ఉంది.

'మంత్రరాజ' – మంత్రరాజమని శ్రీవిద్యలో ఉంది. అది గురుముఖైక వేద్యం. ఇలా మొత్తం పదిహేను భాగములు. ఇదంతా కలుపుకుంటే గురుమండలము. ఈ గురుమండలమంతా అమ్మవారి రూపమే.

గురు అంటే పెద్ద అని ఇంకొక అర్థం ఉంది. వీరందరి అనుగ్రహం ఉంటేనే ఆవరణ దేవతలని ఆరాధించగలం.

లలితోపాఖ్యానం ప్రకారంగా చూస్తే గురుమండలం వచ్చిన విధానం తెలుస్తుంది. అమ్మవారు పరమేశ్వరునితో ఒకసారి, "వీరందరిని అనుగ్రహించాలి కనుక నువ్వేదైనా చెయ్యమ"ని అంటే "నేను నిన్ను నిర్దేశించకూడదు. నువ్వేదైనా చెప్తే నేను చేస్తాన"న్నాడు. "నువ్వు గురుమండలస్వరూపంగా రావాలి" అంటే పరమేశ్వరుని హృదయం నుండి గురుమండలం వచ్చింది. ఇది గొప్ప విశేషం. ఈ గురుమండలస్వరూపమంతా కామేశ్వరుని యొక్క రూపాలే. కామేశ్వరునికి అభిన్నురాలే కామేశ్వరి. కనుక గురుమండలరూపిణీ.

లలితాసహస్రనామ భాష్యాలు కేవలం నిఘంటువు అర్థాలతో చెప్పలేం. దానికి పూర్తిగా శ్రీవిద్యాపరమైన సంకేతాలే ఉండాలి. గురుమండలరూపిణి అన్నమాటకి పై శ్లోకముతోనే అన్వయం లభిస్తోంది. లలితా సహస్రం అర్థం తెలుసుకుంటే ఇన్ని అనుసంధానం చేసిన ఫలితం లభిస్తోంది. ఇది ఒట్టి నామాల వరుస కాదు. శ్రీవిద్యా సంబంధమైన శాస్త్రం. గురుమండలరూపిణి అనగానే ఈ స్ఫురణ కలిగినా చాలు.

714. కులోత్తీర్ణా – శ్రీ కులోత్తీర్ణాయై నమః

'కులోత్తీర్ణా' – శ్రీచక్రంలో ఒకానొక ఆవరణలో ఉన్న యోగినుల పేరు. 'త్రైలోక్యమోహనచక్రం'లో ఉన్నవారు ప్రకట యోగినులు. అటుపై క్రమంగా గుప్త యోగినులు, గుప్తతర యోగినులు, సంప్రదాయ యోగినులు... అలా చిట్టచివరికి 'పరాపర రహస్య యోగినీ' అని అమ్మవారిని అంటారు. ఆవరణలో ఉన్న దేవతలందరికి యోగినులు అనే పేరు.

శ్రీచక్రంలో బహిర్దశార చక్రం ఉంది. దానికే సర్వార్థసాధక చక్రమని కూడా పేరు. ఇది పది త్రికోణాల చక్రం. ఇందులో ఉన్న పది మంది దేవతలకి కులోత్తీర్ణ యోగినులు అని పేరు. ఆ యోగినుల రూపంలో ఉన్న పరమేశ్వరి.

ప్రత్యేకించి ఆ పేరే ఇక్కడ ఎందుకు చెప్పారో తెలుసుకోవాలి. ఎక్కడికక్కడ అవసరాన్ని బట్టి యోగినీ దేవతల పేర్లు కలుపుతున్నారు. లలితాసహస్రం చేస్తుంటే మనకి తెలియకుండానే శ్రీచక్రారాధన, శ్రీవిద్యాసంప్రదాయానికి సంబంధించి అనేక అంశాలు అనుష్ఠింపబడుతూ ఉంటాయి.

మరొక అర్థంలో 'ఉత్తీర్ణ' అంటే చక్కగా దాటుట అని అర్థం. దాటించే తల్లి. కులము నుండి దాటించునది కులోత్తీర్ణా. కులం నుండి దాటడానికి అనేక అర్థాలు ఉన్నాయి. కులము అంటే సమూహము. సమూహాన్ని(అనేక రూపమైన ద్వైతభ్రాంతి) విడిచిపెట్టి ఏకత్వాన్ని పొందడమే మోక్షం. కృష్ణపరమాత్మ భగవద్గీత 18వ అధ్యాయంలో జ్ఞానం అంటే ఏమిటో ఒక మాటలో తేల్చేశారు.

సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే
అవిభక్తం విభక్తేషు తద్ జ్ఞానం విద్ధి సాత్త్వికమ్

ప్రపంచమంతా అనేకంగా కనబడుతోంది. ఉపాధులు అనేకములు. చైతన్యం ఏకం. అనేకంతో మమైకం అయిపోవడంవల్ల బంధింపబడుతున్నాం. అనేకం వదలి ఏకంలోకి వెళ్ళాలి.

అనేక భావంలోంచి ఏక భావనలోకి తీసుకువెళ్ళే మోక్ష ప్రదాయిని అని కూడా 'కులోత్తీర్ణా' నామానికి అర్థం తీసుకోవాలి.

మరొక అర్థం – ఇంద్రియ సముదాయంతో ఉన్న మన శరీరమే పెద్ద కులం. ఇంద్రియాలన్నింటితో ఏకమై ఉన్నాం కనుక ఇంద్రియాతీతమైన చైతన్యాన్ని తెలుసుకోవాలంటే ఇంద్రియకులము నుండి ఇంద్రియాతీతమైన స్థితికి వెళ్ళాలి.

'సరస్వతీ, శాస్త్రమయీ' నామాల నుండి సరస్వతీవిద్య వస్తోంది. సరస్వతీ జ్ఞానస్వరూపిణి. ఎప్పుడూ ఏకత్వమే జ్ఞానం. అనేకత్వం అజ్ఞానం. అనేకరూపమైన అజ్ఞానం నుండి దాటించి ఏకమైన జ్ఞానం ప్రసాదించే తల్లే 'కులోత్తీర్ణా'.

మూడవ అర్థం – కులము గురించి కులాంగనా, కులాంతస్థా నామాలలో వివరంగా చెప్పకున్నాం. షట్చక్రములని కులము అంటారు. సహస్రారాన్ని అకులము అంటారు. షట్చక్రములు దాటినవాడే సహస్రారానికి చేరగలడు. ఈ షట్ చక్రాలను దాటించే శక్తి అమ్మవారే. కుండలినీ రూపిణియై, షట్చక్రాలను దాటించి సహస్రారంలో పరమాత్మతో ఐక్యం చేయించే తల్లి కనుక 'కులోత్తీర్ణా'.

715. భగారాధ్యా – శ్రీ భగారాధ్యాయై నమః

ఇక్కడ మరొక దేవత అయిన భగమాలినీ గురించి చెప్తున్నారు. తిథినిత్యాదేవతలలో రెండవ అమ్మవారి పేరు 'భగమాలినీ'.

భగారాధ్యా మాటలో మరొక విశేషం ఉంది. భగ శబ్దానికి సూర్యభగవానుడని అర్థం. **'భగే ఆరాధ్యా ఇతి భగారాధ్యా'** సూర్యమండలమునందు ఆరాధింపబడుతున్నది.

పాశాంకుశధనుర్బాణధరాం అరుణవిగ్రహాం
సూర్యమండలమధ్యస్థాం ధ్యాయేత్ త్రిపురసుందరీమ్

ముందు చెప్పుకున్న సావిత్రీవిద్య యొక్క కొనసాగింపే ఈ నామం. సూర్యమండలమునందు ఆరాధింపబడుతున్న తల్లి భగారాధ్యా. ద్వాదశాదిత్యులలో ఒకడు భగుడు. సూర్య, ఖగ, భగ, పూష – ఇలా భగుడు మొదలుకుని మిగిలిన సూర్యులందరిని కలుపుకుని భగశబ్దం చెప్పబడుతున్నది.

మరొక అర్థం – భగ శబ్దానికి ఐశ్వర్యము అని అర్థం. ఐశ్వర్యాలన్నింటి చేత ఆరాధింపబడుతున్నది గనుక 'భగారాధ్యా'.

ఇంకొక అర్థం – అష్టభగములు అని శాస్త్రాలలో చెప్పారు. అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్య, ఈశిత్వ, వశిత్వ. ఈ అష్టైశ్వర్యాలనే ఇక్కడ భగములు అని చెప్పారు. ఈ ఐశ్వర్యాలతో ఆరాధింపబడే తల్లి.

మరొక ప్రధానమైన అర్థం. భగము అనగా త్రికోణము. త్రికోణమునందు ఆరాధింపబడునది. శ్రీచక్రంలో బిందువు తరువాత ఆవరణ – త్రికోణమే. త్రికోణమునందు ఆరాధింపబడునది త్రికోణమధ్య అయిన బిందురూపిణి.

అక్షరాలలో త్రికోణ సంఖ్య కలిగిన ఒక అక్షరం ఉంది. ఆ అక్షరం అమ్మవారికి చాలా ముఖ్యమైనది. **'యదేకాదశమాధారం బీజం కోణత్రయాత్మకం'** అని నిర్వచనం. కోణత్రయాత్మకమైన బీజం అని దీనిని దేవనాగరిలిపిలో చూడాలి. దేవ నాగరలిపిలో త్రికోణాకృతి వచ్చే అక్షరం **'ఏ'**. ఇది అమ్మవారి పంచదశీ విద్యలో రెండవ అక్షరం. **ఏ** లో లీనమై **ఈ** కూడా దాగి ఉంది. భాష తెలిసిన వారికి ఈ విషయం మరింత స్పష్టమౌతుంది. అది శివశక్త్యాత్మకమైన తత్త్వాన్ని తెలియజేస్తున్నది.

అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ... అటుపై ఇలా చెప్పుకుంటూ వెళ్తే 'ఏ' 11 వ అక్షరం. మాతృకావర్ణ వివేచన చాలా అందంగా ఉంటుంది. ఆ ఏకారాక్షరం ద్వారా ఆరాధింపబడేది కనుక భగారాధ్య.

716. మాయా – శ్రీ మాయాయై నమః

పరమాత్మ యొక్క అనిర్వచనీయ శక్తి.

వరాహపురాణంలో 'మాయా' గురించి చక్కటి నిర్వచనాన్ని విష్ణువు అమ్మవారితో చెప్పాడు – "నా మాయాశక్తి ఎంత గొప్పదో తెలుసా" అని మొత్తం 37 శ్లోకాలు చెప్పాడు.

పర్జన్యో వర్షతే తత్ర జలపూరశ్చ జాయతే
దిశో నిర్మలతాం యాంతి సైషా మాయా మమ ప్రియే

నా మాయ ఎలాంటిదంటే వర్షం కురుస్తూ ఉంటుంది. నీరు నిండుతూ ఉంటుంది. ఇదంతా నా మాయ వల్లనే జరుగుతోంది. ఒకొక్కప్పుడు నీరనేదే పుట్టదు. అదీ నా మాయే అన్నాడు. కలగడం, కలగకపోవడం ఇదంతా నా మాయే.

దిశోనిర్మలతాం యాంతి – ఒకొక్కప్పుడు మబ్బులు పడతాయి. ఒకొక్కప్పుడు దిక్కులన్ని నిర్మలమై పోతాయి. ఇంతవరకూ కురిసిందా! అన్నట్టు ఉంటుంది. చూస్తూ ఉంటే ప్రపంచంలో అడుగడుగునా కనబడుతోంది మాయ. కురుస్తున్న వర్షాన్నిగాని, ముసురుకున్న మబ్బుల్నిగాని నియంత్రించగలమా!

అప్పటి దాకా హోరుగా కురిసిన వాన ఒక్కసారిగా వెలసిన తరువాత ఇంత

వరకు వర్షం ఉందా! అని అనిపించేటట్టుగా వాతావరణం మారిపోతుంది. ఉందా! లేదా! అన్నట్టే ఎప్పటికప్పుడు మనకి ప్రపంచంలో కనబడుతూనే ఉంది. అదే 'నా మాయ' అన్నాడు.

చంద్రుడు అంటే చక్కగా, నిండుగా ఉంటాడు. ఒకొక్కప్పుడు పెరుగుతూ ఉంటాడు. ఒకొక్కప్పుడు తరుగుతూ ఉంటాడు. ఒకొక్కసారి కనబడడు. అది నా మాయే అన్నాడు.

సోమోஉ పక్షీయతే పక్షే పక్షేచాపి వివర్ధతే

అమాయాం దృశ్యతే నైవ మాయేయం మమ సుందరి

ఇలా మొత్తం 37 శ్లోకాలు. ఇదంతా లక్ష్మీదేవికి చెప్తున్నాడు. ఆవిడ ఒక మాయ.

ప్రపంచమంతా ఎలా నడుస్తోందని ఆలోచిస్తే ప్రతిది కూడా ఇంతే. అది ఉందా, లేదా? అన్నట్టే అడుగడుగునా కనబడుతూ ఉంటుంది.

ఒక్కసారి కళ్లుమూసుకుని నిద్రపోయామంటే ఇంత ప్రపంచం ఏమైపోయింది? అంతవరకు ఆత్మీయులు ఎవరో వెళ్ళిపోయారని చాలా ఏడుస్తారు. నిద్రపోయారు. ఆ సుషుప్తిలో వాడు వెళ్ళిపోయాడనేది గుర్తు లేదే! ఎక్కడికి పోయింది! ఏది సత్యం! ఇది సత్యమా? అది సత్యమా? రెండూ అనుభూతులే! ఏది సత్యమని చెప్పగలం? ఇక్కడో సత్యం, అక్కడో సత్యం అంటే అది సార్వకాలిక సత్యం కాదు. సార్వదేశిక సత్యం కాదు. ఇది ఆలోచిస్తే ఉందా, లేదా! అని నడిపిస్తున్న శక్తంతా అసలెవరిది? అమ్మవారు ఏ శక్తితో ఈ ప్రపంచాన్నంతటిని నడిపిస్తున్నారో ఆ శక్తినే 'మాయ' అంటారు.

మాయ గురించి 'దేవీపురాణం' చెప్తూ-

విచిత్ర కార్యకరణా అచింతితఫలప్రదా

స్వప్నేంద్రజాలవల్లోకే మాయా తేన ప్రకీర్తితే

ఆశ్చర్య కార్యాలను చేసే శక్తి. అచింతితఫలప్రదా - ఊహించని ఫలం ఇస్తుంది. ఇలా జరుగుతుంది అని అనుకోలేని విధంగా అది జరుగుతూ ఉంటుంది. అదే 'మాయా'.

'అఘటన ఘటనా పటీయసీ మాయా'. ఈ మాయకి ఇది సాధ్యం, ఇది అసాధ్యం అని లేదు. ఏదైనా చెయ్యగలదు. ఇలా చెప్తూ ఉంటే మాయ గురించి ఎంతో చర్చ చేయవచ్చు. మాయకి అవ్యక్తం, అవ్యాకృతం, ప్రకృతి, ప్రధానం, బీజం – ఇలా చాలా పేర్లు ఉన్నాయి.

ఇది పరమాత్మని తెలియనివ్వడం లేదు కనుక దీనికి అజ్ఞానమని కూడా పేరు. అదే అవిద్య.

అవిద్య అంటే తాను కాని దానిని తాను అనుకోవడం. తానైన దానిని తాను తెలుసుకోలేకపోవడం. ఎంత తేట తెలుగులో చెప్పినా అర్థం కాదు. అదే మాయ. నువ్వు ఒప్పుకో. నువ్వు అఖండమైన, సచ్చిదానందమైన, శాశ్వతమైన ఆత్మవు అంటే మనకి అర్థం కాదు. నువ్వు పుట్టి, చచ్చిపోయే ఒకానొక మనిషివి అంటే అది బాగానే ఉంది అనిపిస్తుంది. ఇదీ పరిస్థితి. ఎవరు చేస్తున్నారు ఇదంతా! మన చేతిలో ఉందా! అదే మాయ.

అఖండ చైతన్యం మనసులోకి దూరగానే, ఆ చైతన్యాన్నంతటిని శరీరంతో నిబద్ధం చేసి దానితోనే చూడడం మొదలు పెడుతున్నాం. **'మాతి పరిచ్ఛినతి ఇతి మాయా'** – అఖండ ఆత్మ చైతన్యాన్ని ఒకానొక ఉపాధి కొలతలో చూసే లక్షణం పేరు మాయ. ఈ లక్షణం లేనిది ఎవరికి? దాని స్వరూపం గురించి చర్చ చేసుకోగలం కాని, వదిలించుకోవడం మన చేతిలో లేదు.

అందుకే పరమాత్మ, **"మమ మాయా దురత్యయా** – నా మాయను దాటలేరు" అన్నాడు. ఎంత కష్టపడినా దాటలేరా? అసాధ్యమే. మరి ఏం చెయ్యాలి? **"మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే** – నన్ను ఆశ్రయించు. అదొక్కటి తప్ప మరొక దిక్కు లేదు" అన్నాడు. నన్ను ఆశ్రయించు అంటే అర్థం– ఏది అఖండసచ్చిదానందమో దానిని పట్టుకో. అది పట్టుకుంటే మాయ వదిలేస్తుంది. మనకి పట్టుకొమ్మ దొరికితే ఉన్న కొమ్మ నుండి సహజంగా పాదం పైకి లేస్తుంది. కనుక మాయ ఎలా వదులుతుందని మాయ గురించి ఆలోచించకూడదు. మాయాతీతుడైన పరమాత్మనే పట్టుకోవాలి. **"మామేకం శరణం వ్రజ"** అన్నాడు

పరమాత్మ. **"శరణం వ్రజ"** అంటే మనం ఎప్పుడు చింతన చేసినా ఏది సత్, చిత్, ఆనందము, అఖండము, నిత్యము, నిర్మలమో - దానినే చింతన చేస్తూ ఉంటుంటే మనకి ఆ మెట్టు మీద పట్టు దొరుకుతుంది. అప్పుడు అత్యంత సహజంగా క్రింది మెట్టుని వదిలేస్తాం. దాటేస్తాం.

"ఎవరైతే నన్ను తప్ప అన్యము చింతన చెయ్యరో, వారు నన్ను తప్ప అన్యమును వదిలేస్తున్నారు" అన్నాడు కృష్ణ పరమాత్మ. అంత సులభం. లోకాన్ని నడిపే అమ్మవారి శక్తిని మాయ అంటారు.

'భగవతశ్శక్తిరేవ మాయా' ఇది మొత్తానికి నిర్వచనం.

ఇంకా దీని గురించి చెపూ అనేకరకాలైన మాటలు చెప్పారు. ఆత్మ యందు అనాత్మబుద్ధి. అనాత్మ యందు ఆత్మబుద్ధి. మాయని ఉందంటామా! అంటే జ్ఞానం కలిగిన వానికి మాయ లేదు. పోనీ లేదంటామా! అంటే సృష్టి అంతా దీని నుండే తయారైంది కనుక లేదని అనలేం. ఉంది, లేదని నిర్ణయించలేనిదే కాబట్టి ఎలా ఉంటుందో చెప్పలేం కనుక మాయ అన్నారు. మాయ అంటే 'విచిత్ర కార్యకరీ'.

రామకృష్ణ పరమహంసతో ఒక జిజ్ఞాసువు - "మాయ మన వైపు ప్రయోగించి ప్రపంచాన్ని ఇంత చేస్తోంది కదా తల్లి. ఆ తల్లిలోను కూడా మాయ ఉంది కదా. మన మీదకి వచ్చేటప్పటికి మనకి అవిద్య అయి బాధిస్తోంది. తల్లి దగ్గర మాయ ఉన్నప్పుడు ఆ తల్లికేమి బాధలేదా?" అన్నారు. దానికి పరమహంసగారు, "పాము విషం మనకి ఎక్కినపుడు బాధిస్తోంది కానీ, పాములో ఉన్నప్పుడు దానినేమీ చేయదు కదా" అన్నారు. ఆవిడ ఆ మాయని నిగ్రహించి లోకాన్ని అంతటిని మత్తెక్కించి నడిపిస్తోంది. ఎందుకు ఇలా చేస్తున్నావు అని అడిగే హక్కు మనకి లేదు. ఆవిడ 'స్వతంత్రా'.

ఆవిడ ఎందుకు, ఏం చేస్తుందో మనకేం తెలుసు? మనలాగ ఆలోచించే వాని గురించి చెప్తే ఎందుకిలా చేశావని అడగవచ్చు. మేధావులంతా సృష్టి రహస్యం వారి బుర్రకి అందితేనే ఒప్పుకుంటారు. అలా ఉంది మన పరిస్థితి. ఈశ్వరుడు ఏం ఆలోచించాడో మనకేం అర్థం అవుతుంది? "భగవంతుడా! ఎందుకయ్యా దీనినంతా

సృష్టించావు" అంటే "నేను సృష్టించలేదయ్యా? నువ్వు ఉందని భ్రాంతి చెందా"వంటాడు.

మనకి అంతుపట్టని పరమేశ్వరుని శక్తి విలాసమునే మాయా అని అంటారు.

717. మధుమతీ – శ్రీ మధుమత్యై నమః

ఈ నామానికి అనేక వైదిక అర్థాలు ఉన్నాయి. ప్రతి అర్థం శ్రుతి, స్మృతి, పురాణ, మంత్రశాస్త్ర ప్రమాణాలతో చెప్పబడుతున్నదే.

'మధువాతా ఋతాయతే మధుక్షరంతి సింధవః మాధ్వీర్నస్సంత్వోషధీః, మధు నక్తముతోషసి మధుమత్పార్థివగ్ం రజః మధుద్యౌరస్తు నః పితా, మధుమాన్నో వనస్పతిర్మధుమాగ్ం అస్తు సూర్యః మాధ్వీర్గావో భవంతు నః'.

'మాధ్వీపానాలసా' వద్ద ఈ భావం చెప్పుకున్నాం. వేదం మధు శబ్దాన్ని ఎన్నిమార్లో చెప్పింది. ప్రపంచంలో అంతా మధువుగా ఉండాలి. మధురము అంటే ఆనందం అని అర్థము. ఈ వీచే గాలి నాకు ఆనందకరముగా అగుగాక! ఈ ప్రవహించే జలము ఆనందమే అగు గాక!

ఇవన్నీ ఆనందం యొక్క రూపాలు. ఆ ఆనందం పరమాత్మ యొక్క రూపం. వీచేగాలి, ప్రవహించే నీరు – ఇదంతా మధు స్వరూపమే.

ప్రపంచమంతా మధుమయమని తెలుసుకోలేకపోతున్నాం. ఎందుకంటే పనికిరాని మరో మధువు అలవాటు అయింది. పరమాత్మ తప్ప అన్య విషయములపై తీపి. ఈ ప్రమాదమైన మధువుని తీసేస్తే కానీ అసలు మధువు అర్థం కాదు.

మధుస్వరూపంగా ప్రపంచమంతా ఎవరు వ్యాపించి ఉన్నారో ఆవిడ మధుమతీ.

మధువు అంటే తేనె. తేనెకి పుష్పసారం అని మరొక పేరు. జగత్తును మనం పుష్పంగా భావిస్తే అందులో మధువుగా ఉన్నారు. పువ్వులు చక్కగా విచ్చుకున్నాయి. అందులో మధువు ఉందో, లేదో మనకి తెలియదు కానీ ఉందని మాత్రం ఒప్పుకుంటాం. ఎప్పుడూ ఒక్క పువ్వులో మధువుని చూడలేదు. మనకి తేనె కనబడడం లేదు. పువ్వు మాత్రమే కనబడుతుంది. తుమ్మెదకి పువ్వు కనబడుతున్నా, దానికి తేనేమిటో తెలుసు. తేనె మీదే దాని యొక్క దృష్టి. ఆ తేనెని ఎలా తీసుకోవాలో దానికి తెలుసు.

అదే విధంగా యోగులనే తుమ్మెదలకి ఈ ప్రపంచం అనే పువ్వులో పరమాత్మ అనే మధువు మీదే దృష్టి ఉంటుంది. ఈ ప్రపంచం అనే కుసుమంలో పరమాత్మ అనే మధువును ఎలా ఆస్వాదించాలో వారికి తెలుసు. అలా తెలిసివారు ఆస్వాదించి కూడబెడితే పిండుకొని తీసుకోగలం తప్ప, మనం గ్రహించలేము.

కనిపిస్తున్న పువ్వులో తేనే లేదు అనడం ఎంత అజ్ఞానమో, కనిపిస్తున్న ప్రపంచంలో పరమాత్మ లేదు అనడం అంతే అజ్ఞానం. కుసుమానికి సారం తేనె అయినట్లుగా, ప్రపంచానికి సారం పరమాత్మ.

ప్రపంచానికి సారమైన తల్లి. నామరూపాత్మకమై కనిపిస్తున్న జగత్తు యందు సచ్చిదానందమైన సారవస్తువుగా ఆ తల్లి ఉన్నది కనుక 'మధుమతీ'. ఇది ఒక అర్థం.

మధు శబ్దానికి ఆనందం అని మరొక అర్థం. ఆనందమే మధువు అన్నప్పుడు 'స్వాత్మానందలవీభూతబ్రహ్మాద్యానందసంతతిః' నామం మన మనస్సుకి తగలాలి. అలా తగిలితే ఈ కనిపించే లోకానందములన్నీ లవలేశములే. అల్పములే. ఇవన్నీ బిందువులు. అమ్మవారు ఆనందసింధువు.

అఖండసచ్చిదానందస్వరూపిణి. అంత కంటె మధువైన వస్తువు మరొకటి ఉంటుందా! జగదంబ సాంద్రీభూతమైన ఆనందం.

మూడవ అర్థం – వేదంలో మధువిద్య అని చాలా విశేషంగా చెప్పారు. మధువు గురించి చెప్తూ **'ఆదిత్యో వై మధుః'** అని శాస్త్రం చెప్తున్నది.

సూర్య కిరణాల్లోంచి వచ్చే అమృత శక్తే మనలోకి ప్రసరిస్తోంది. ఈ అమృతాన్ని చెట్లు పత్రహరితముగా పొంది ఆహారాన్ని తయారు చేసుకుంటున్నాయి. నేరుగా సూర్యుని నుండి మధువు తాగడం చేత కాక మనం ఈ చెట్ల నుండి ఆహారం పొందుతున్నాం. పరోక్షంగా మనం సూర్యుడు ఇచ్చే అమృతాన్ని పుచ్చుకుంటున్నాం.

సరఘా, మధు మొదలైన శబ్దాలు సూర్యమండలపరంగా శ్రుతిలో మనకి కనబడుతూ ఉంటాయి.

అది సరిగ్గా శ్రీవిద్యకి అన్వయిస్తూ గౌడ భగవత్పాదులవారు 'సుభగోదయ

స్తవం'లో అందమైన వర్ణనలు చాలా చేశారు. 'సరఘా' అంటే తేనేపట్టులో ఉన్న గదులు. ఆ గదులలో ఉన్న మకరందం. అలా సూర్యమండల కిరణాల నుండి సరఘలలో నుండి తేనె తీసుకున్నట్లుగా దేవతలందరూ స్వీకరిస్తూ ఉంటారని చెప్పారు.

ఆదిత్య మండలాంతర్గతమై ఉంటూ ప్రపంచాన్ని పోషించే అమృత స్వరూపము. అది సూర్యుని యందు ఉన్న తల్లి. ఆమెయే సావిత్రీ, సరస్వతీ, శాస్త్రమయీ. ఆ పరంపరలోనే 'మధుమతీ'.

718. మహీ – శ్రీ మహ్యై నమః

అమృతశక్తిని పొందుతూ మనకు తెలిసిన ఆ భూమి కూడా అమ్మరూపమే. ఆ సూర్యుని నుండి వస్తున్న శక్తిని భూమి అనేక రూపాలతో స్వీకరిస్తున్నది. వృక్షాదులు మొదలైనవన్నీ కూడా గ్రహిస్తున్నాయి. అంటే వృక్షాలకి ఆ స్వీకరించే శక్తి భూమే ఇచ్చింది. భూమి యందే మొలిచిన వృక్షాలు ఆ సూర్యుని కిరణాలతో పెరిగి, సూర్యుని మధువు తీసుకుంటూ ఉన్నాయి.

భూమి కూడా సూర్యశక్తిని అనేక రకాలుగా గ్రహిస్తోంది. ఇది తెలియాలంటే వేదంలో సౌరారుణ మంత్రాలని పరిశీలించాలి. వేదవాఙ్మయమంతా మొత్తం ఆదిత్యమయమే. అమ్మవారు కూడా ఆదిత్యస్వరూపమే. ఇంట్లో ఏ పూజలు చేసినా, చెయ్యలేక పోయినా కనిపించే సూర్యభగవానునికి దండం పెట్టడమనే ఒక మంచి అలవాటు ఉన్నా చాలు.

అనంత సూర్యతత్త్వంలోని అద్భుతమైన విషయాలు వేదాల యందు, పురాణముల యందు ఉన్నాయి. ఆ సూర్యభగవానునిలో ఎన్ని మధువులున్నాయో! ఆ మధువులను భూమికూడా స్వీకరిస్తున్నది. సూర్యశక్తితోనే భూమి నడుస్తోందని కాసింత విజ్ఞానశాస్త్రం తెలిసిన ఎవరైనా ఒప్పుకుంటారు.

భూమి ఇక్కడ ఉందంటే సూర్యుడు ఉండబట్టే ఉంది. భూమి యందు ఉన్న శక్తి అంతా సూర్యుని నుండి తిరిగి పొంది మళ్ళీ మనకు వ్యక్తమౌతూ ఉంటే మనం స్వీకరిస్తున్నాము. సూర్యుని నుండి భూమి రకరకాల మధువులు గ్రహిస్తున్నది.

సూర్యమండలం నుండి వస్తున్న అమ్మవారి శక్తి భూమి నుండి మనకు లభించినప్పుడు 'మహీ' అని నమస్కారం చెయ్యాలి. తల ఎత్తినా అమ్మే. తల దించినా అమ్మే. తల చుట్టూ తిప్పినా అమ్మే. అమ్మ తప్ప మరొకటి లేదు.

భూమి వసుంధరగా అమ్మవారి స్వరూపమని దేవీభాగవతంలో పెద్ద అధ్యాయం చెప్పారు. భూమిని పూజించవలసిన పద్ధతులు చెప్పారు.

ప్రొద్దున్న నిద్ర లేస్తూనే భూమికి దండం పెట్టుకోవాలి. అలాగే ఇల్లు కట్టుకోవడానికి భూమి పూజ చేయాలి. "అమ్మా! నువ్వు నాకు ఆవాసమిచ్చావు తల్లీ!" అని కృతజ్ఞతతో ఆరాధన చెయ్యాలి. పంట పండించేటప్పుడు పూజించాలి.

భారతీయ సంస్కృతిది ఎంతో సున్నితమైన మనస్సు. "పాదం మోపుతున్నందుకు క్షమించు తల్లీ!" అంటాం. భూమిని కూడా అమ్మలా భావించిన భారతీయమహర్షి యొక్క సున్నితమైన సంస్కారానికి నమస్కరించుకుంటూ, ఆ సంస్కారాన్ని పోగొట్టుకున్న నేటి భారతీయులను చూసి బాధపడతూ, 'మహీ' అని భూదేవిని అమ్మవారిగా నమస్కరిద్దాం. మనకు అన్నమిస్తూ, ఉనికిని ఇస్తూ, మనల్ని పుట్టించి, పెంచి, తనలో కలుపుకుంటూ, మనకి కావలసిన ఆభరణాలు, ధాతువులు ఇస్తోంది రత్నగర్భ, అగ్నిగర్భ, శమీగర్భ – ఇలా ఈ భూదేవికి ఎన్నో పేర్లు ఉన్నాయి. అన్ని స్వరూపములతో ఉన్న భూమి సాక్షాత్తూ అమ్మరూపమే.

అంతే కాక గొప్పది కనుక 'మహీ' అని చెప్పబడినది. **'మహీ ప్రకృతిర్మాతా'** అని శాస్త్రం. ప్రకృతికే 'మహీ' అని పేరు. ప్రకృతి ఎంతో విస్తారమైనది. మొట్టమొదటిగా అవ్యక్తము, మహత్, తరువాత అహంకారము, పంచభూతములు, పంచతన్మాత్రలు వచ్చాయి. మహద్రూపముతో వచ్చిన ప్రకృతి. **'మహద్వ్యాప్యస్థితా సర్వం మహీతి ప్రకృతిర్మతా'** (దేవీపురాణం). మహత్తత్త్వం అంతటినీ వ్యాపించి ఉన్నది కనుక మహీ.

719. గణాంబా – శ్రీ గణాంబాయై నమః

గణపతి యొక్క తల్లి. గణములకు తల్లి.

వేదమంత్రములు మొత్తం సప్తకోటి మహామంత్రములు. ఆ మంత్రములనే

గణములకు తల్లి కనుక 'గణాంబా'. దేవగణములు, రుద్రగణములు, వృక్ష గణములు, మానవగణములు, పశుగణములు - ఇలా ఈ లోకములో ఉన్న గణాలన్నిటికి అమ్మ కనుక 'గణాంబా' అని ఇంకో అర్థం చెప్పుకోవచ్చు. లోకం సమూహ వాచకము. సమూహముగా ఉన్న ఈ లోకమునంతటికి ఆవిడే అంబ. కేవలం మానవగణమే కాకుండా గ్రహగణం, నక్షత్రగణం, లోకగణం, లోకాలలో మళ్ళీ దేవగణం. దేవగణములలో మళ్ళీ లెక్కలేనన్ని గణాలు ఉన్నాయి.

ఇన్ని గణములకు అంబ మాత్రం ఒక్కరే కనుక 'గణాంబా'. సమస్తమునకు తల్లి.

శాస్త్రములలో అక్షరములకు గణములని పేరు. గణాంబా అంటే మాతృకావర్ణరూపిణి.

1. గణపతికి తల్లి, 2. విశ్వగణములకి తల్లి, 3. మాతృకావర్గములకు తల్లి.

ముందు గుహాంబా చెప్పి, ఇప్పుడు గణాంబా అని చెప్పడంలో 'కుమారగణ నాథాంబా' చెప్తున్నారు. గణపతి, సుబ్రహ్మణ్యుడు - ఇద్దరూ జ్ఞానమూర్తులే. గురుత్రయం చెప్పిన వెంటనే గణపతిని చెప్పుకుంటున్నాం.

గురుమండలరూపిణీ పరంపరలో గణపతిని చెప్పుకోవలసిందే.

720. గుహ్యకారాధ్యా - శ్రీ గుహ్యకారాధ్యాయై నమః

గుహ్యకులచే ఆరాధింపబడునది.

గుహ్యకులు అని ఒక దేవజాతి ఉన్నారు. యక్షులు, గుహ్యకులు నిజానికి దగ్గర వారే. వారిరువురికి కలిపే కుబేరుడు ప్రభువు. కుబేరవిద్య అని భావన చేసుకున్నప్పుడు ఆ పరంపరలో దీనిని తీసుకోవచ్చు. యక్ష, గుహ్యక ఉభయులకి కుబేరుడే ప్రధానమైన ప్రభువు.

కానీ నవనిధులను కాపాడడం కోసం గుహ్యకులని ఒక జాతిని పెట్టాడు. మణిభద్రుడు, నలకూబరుడు - వీరందరినీ గుహ్యకులు అంటారు. ఈ గుహ్యకులు కూడా ఐశ్వర్యశక్తుల కోసం జగదీశ్వరి అయిన అమ్మవారిని ఆరాధన చేసుకుంటారు.

గుహ్యమైన అర్చన చేసేవారు గుహ్యకులు. రహస్య స్థానములందు ఆరాధించాలి. రహస్యస్థానాలు 1. హృదయం. 2. భ్రూమధ్యం. 3. సహస్రారం.

ముఖ్యంగా భ్రూమధ్యం నుండి సహస్రారం వరకు ఉన్న దానిని పరమ గుహ్యస్థానం అంటారు. ఆ స్థానాల యందు అమ్మవారిని భావించడం అంతా కూడా గుహ్యకారాధన. చంద్రమండలమందు అమ్మవారిని భావించడం కూడా ఒకటి. అలా భావించేవారిని అంతర్యాగ పరాయణులని, అంతర్ముఖులై ఆరాధించేవారిని గుహ్యకులు అంటారు. వారి పూజలందుకునే తల్లి. అదే 'గుహ్యకారాధ్యా'.

721. కోమలాంగీ – శ్రీ కోమలాంగ్యై నమః

ఇప్పటివరకు అమ్మవారి తత్త్వాన్ని చూపిస్తూ 'కోమలాంగీ' అన్నారు. సుకుమారమైన సౌందర్యాన్ని కోమలము అంటారు. కోమలమైన అంగము కలది కోమలాంగీ. లలిత అంటే కూడా అర్థం ఇదే. లాలిత్యమే లలిత. అమ్మవారు చాలా సుకుమారమైన తల్లి. తామర తూడులో ఉన్న దారం ఎంత సుకుమారమో అమ్మవారు అంత సుకుమారము. 'బిసతంతుతనీయసీ'.

వేదరూపిణియైన శ్రీమాత వేదాంగములనే మనోహరమైన అంగములు కలిగినది.

కోమలాంగీ దివ్యమంగళ విగ్రహముగా చెప్పబడుతున్నది.

722. గురుప్రియా – శ్రీ గురుప్రియాయై నమః

'గురుమండలరూపిణీ' 'సంప్రదాయేశ్వరీ' 'గుహాంబా'.... ఇలా ఒకొక్క గురుస్వరూపాలు చెప్పబడుతున్నాయి.

గురుప్రియా – గురువంటే ప్రీతి కలిగినది. గురువంటే ఒక్కడే. అతడే శివుడు. మొత్తం శ్రీవిద్య అంతటికి అతనే గురువు. ఆయనే జగద్గురువు. గురుప్రియా అంటే దక్షిణామూర్తికి ప్రియా. శివపత్ని.

గురువులు చాలా మంది ఉన్నారు. వ్యాసుడు ఒక గురువు. బ్రహ్మ ఒక

గురువు. ఈ శివగురువు గారి కరుణతోనే వారు గురువులు అయ్యారు.

మరొక భావం – గురువుల యెడల ప్రసన్నురాలై ప్రీతి చెంది, వారికి తన విద్యని ఇచ్చి పరిపూర్ణుల్ని చేస్తుంది. గురువులు మనకి విద్యలని ఇచ్చారంటే ముందు ఆ తల్లి గురువులను అనుగ్రహించింది. తరువాత అది గురువుల ద్వారా మనకి లభించింది. 'భక్తిప్రియా' నామం వంటిదే ఈ నామం కూడా.

సంప్రదాయం తెలిసిన అమ్మవారి విద్యలో పండిన మహాత్ముల యెడల ప్రసన్నతాభావాన్ని, ప్రీతి భావాన్ని కలిగియున్న తల్లి కనుక గురుప్రియా. ఈ రెండు భావాలు సంప్రదాయబద్ధమైన భావాలు.

'స్వతంత్రా' 'సర్వతంత్రేశీ' 'దక్షిణామూర్తిరూపిణీ' 'సనకాదిసమారాధ్యా' 'శివజ్ఞానప్రదాయినీ'

ఇది ఒక గుత్తి. ఈ కూర్పే చాలా విశేషం. శ్రీవిద్యే శ్రీమాత. "శ్రీవిద్యాం శివవామభాగ నిలయాం". ఈ విద్య ఎలాంటిదో చెప్తూ స్వతంత్రవిద్య అన్నారు.

723. స్వతంత్రా – శ్రీ స్వతంత్రాయై నమః

తంత్రము అంటేనే శాస్త్రము, విద్య అని అర్థం. ఎప్పుడైనా భగవంతుని ఉపాసన చెయ్యాలంటే తంత్రమే మనకు దిక్కు. **యాగస్య ఇతి కర్తవ్యతా – యాగవిధానాన్ని తంత్రము** అంటారు. ఏ మంత్రం చెప్పాలో, ఏ దేవతకి ఏ పద్ధతిగా యాగం, ఎలా చెయ్యాలో సాంకేతిక విజ్ఞానం ఒకటి ఉంటుంది. యజ్ఞానికి సంబంధించిన ఆ విజ్ఞానానికి తంత్రమని పేరు.

యజ్ఞం అనేది అగ్నిహోత్రం కావచ్చు. పూజ కావచ్చు. జపం కావచ్చు. మొత్తానికి భగవంతుని ఆరాధించే పద్ధతికి తంత్రమని పేరు. ఈ తంత్రాలు చాలా ఉన్నాయి. శాక్తేయతంత్రాలు 64 ఉన్నప్పటికి ఈ తంత్రం ప్రత్యేకం. ఇది స్వతంత్రం. దేని మీద ఇది ఆధారపడి లేదు. దానికదే ప్రత్యేకం. మిగిలిన తంత్రాలన్నీ మనకి ఈ లోకంలో, పైలోకంలో సుఖాలను ఇస్తాయి. ఈ ఒక్క తంత్రం మాత్రమే మోక్షాన్ని ఇస్తుంది కనుక ఇది ఇహము, పరమూ ఇవ్వగలిగే తంత్రము. భోగమోక్షకరీ విద్యా.

ఈ లోకంలో, పరలోకంలో దొరికే సుఖాలకి భుక్తి అని పేరు. లోకాతీతమైన స్థితికి మోక్షము/ముక్తి అని పేరు. ఈ రెండూ ఇవ్వగలిగేది ఈ తల్లే. అందుకే ఇది స్వతంత్రము. విశిష్టమైనది. అన్నింటికంటె ప్రత్యేకమైనది.

ఈ నామానికి అమ్మవారిపరంగా అర్థం చెప్పాలంటే అమ్మవారు ఎప్పుడూ స్వతంత్రురాలే. ఆ పరమేశ్వరి ఎవ్వరికీ అధీనురాలు కాదు.

అన్నీ ఆవిడకి అధీనం. **'సర్వతంత్ర స్వతంత్రా'.**

'స్వాన్యాత్మీయాని తంత్రాణి యస్యా వా' (భాస్కరరాయలు). లోకములోని తంత్రములన్నీ తనకు (దేవికి) సంబంధించినవే – కనుక స్వతంత్రా.

'స్వ ఆత్మీయః స్వాధీనః పరశివః తత్తం వా, తదధీనా వా, పరస్పరాధీనే త్యర్థః' (భాస్కరరాయలు). స్వ – తన ఆత్మీయుడైన పరమశివుడు. తన్త్రా – అధీనంలో గలది. తన అధీనంలో పరమేశ్వరుడు, స్వామి అధీనంలో తాను – ఒకరికొకరు అధీనులు అని భావం.

నిత్యం వసతి తత్రా஽పి పార్వత్యా సహ నర్మభిః
మధ్యే దేవీగృహం తత్ర తదధీనస్తు శంకరః
ఈశాన్యాం హాటకే శైలే శంకరస్య సదాశ్రయం
నిత్యం వసతి తత్రేశః తదధీనాతు పార్వతీ (కాళికాపురాణం)

'కామరూప (కామాఖ్యా) క్షేత్రంలో శంకరుడు పార్వతీ గృహమధ్యంలో నర్మభాషణలతో నివసిస్తున్నాడు. అక్కడ పార్వతికి అధీనుడు. ఈశాన్యాన హాటకశైలం (కైలాసం) పై పార్వతి శివునకు స్వాధీనురాలు అని తాత్పర్యం.

తన పతికి తాను అధీనమై, తనకు స్వామి అధీనునిగాను ఉన్నది.

ఆ చైతన్యం ఒక్కటే 'స్వతంత్రా'. **'కర్తుం అకర్తుం అన్యథా కర్తుమపి సమర్థా ఇతి స్వతంత్రా'.** ఆవిడ ఇష్టముంటే చేస్తుంది, లేకపోతే చెయ్యదు. ఇలాగే చెయ్యదు. ఎలాగైనా చేస్తుంది. ఏ సాధనల అపేక్ష లేకుండానే సృష్ట్యాది సర్వకార్యములను చేయునది స్వతంత్రా.

ఈ స్వతంత్రమైన శ్రీవిద్యాతంత్రమే కాకుండా అన్ని తంత్రాలకి ఆవిడే ప్రభువు. నియామకురాలు. అన్ని తంత్రాలు ఆవిడ అధీనంలో ఉన్నాయి.

724. సర్వతంత్రేశీ – శ్రీ సర్వతంత్రేశ్యై నమః

'సర్వతంత్ర+ఈశీ – సర్వతంత్రాలకు ఈశ్వరురాలు'. తంత్రము అంటే శాస్త్రము. సర్వశాస్త్రాలకు నియామకురాలు. ఇదే శ్రీవిద్యా స్వరూపం. ఎందువల్ల అంత గొప్పదయ్యిందంటే 'దక్షిణామూర్తిరూపిణీ'. అన్నింటికంటె గొప్పవిద్య బ్రహ్మవిద్య. మిగిలిన ఏ విద్యలు చెప్పినా అవన్నీ దీని క్రిందవే. శ్రీవిద్య సర్వతంత్రేశీ. సాక్షాత్ బ్రహ్మవిద్యయే.

మనల్ని అనుగ్రహించడానికి అమ్మ ధరించిన గురురూపమే సరస్వతి. ఆ సరస్వతీ స్వరూపమే దక్షిణామూర్తి. సరస్వతీదేవి, దక్షిణామూర్తి ఈ రెండు ఒకే స్వరూపంగా ఉపాసించడమనేది శాస్త్రంలో, ఉపాసనలో కనబడుతున్న అంశము. రెండూ జ్ఞానమూర్తులే.

'స్వతంత్రా', 'సర్వతంత్రేశీ' దగ్గర మరొక ఔచిత్యాన్ని పరామర్శ చేసుకొందాం. సర్వతంత్రములలో ఈశ్వరిగా ఉంటూ ప్రత్యేక తంత్రంగా ఉన్నది శ్రీవిద్యాతంత్రము. అది దక్షిణామూర్తే గురువుగా మనకి అనుగ్రహించింది కనుక నామాల వరుసలోని ఔచిత్యము ఇదే. ఆదిశంకరభగవత్పాదులు ఈ నామాలను తీసుకుని చక్కని శ్లోకాన్ని అనుగ్రహించారు.

చతుష్షష్ట్యా తంత్రైః సకలమతిసంధాయ భువనం
స్థితస్తత్తత్సిద్ధి ప్రసవపరతంత్రైః పశుపతిః
పునస్త్వన్నిర్బంధాదఖిలపురుషార్థైకఘటనా
స్వతన్త్రం తే తన్త్రం క్షితితలమవాతీతరదిదమ్

లలితాసహస్రనామాలలోంచి వచ్చిన ఒక సౌందర్యలహరి శ్లోకం ఇది. **'స్వతంత్రం తే తంత్రం' 'అఖిల పురుషార్థైక ఘటనా'**. శ్రీవిద్యకు ఉన్న లక్షణాన్ని ఇక్కడ చూపించారు. అన్ని పురుషార్థాలను ఒక్క విద్య ద్వారానే అందించాలని పరమాత్మ దక్షిణామూర్తిరూపంగా ఈ స్వతంత్రమైన తంత్రాన్ని ఇచ్చాడు.

శ్రీవిద్యని బ్రహ్మవిద్య అని ఎలా చెప్పగలమంటే బ్రహ్మవిద్యాస్వరూపుడైన దక్షిణామూర్తి ఈ విద్యని ఇచ్చాడు కనుక. శివుడే అన్ని విద్యలకి గురువు. కానీ

ఒకొక్క విద్యకి ఒకొక్క రకమైన మూర్తి ధరించాడు. శ్రీవిద్యని ఇవ్వడానికి ఆయన దక్షిణామూర్తి రూపాన్ని ధరించాడు. బ్రహ్మవిద్య ఇవ్వాలంటే దక్షిణామూర్తే ఇవ్వాలి. ఆయన శ్రీవిద్య ఇచ్చాడంటే అర్థం శ్రీవిద్య బ్రహ్మవిద్యయే.

725. దక్షిణామూర్తిరూపిణీ - శ్రీ దక్షిణామూర్తిరూపిణ్యై నమః

దక్షిణామూర్తిరూపంగా ఉన్నది. దక్షిణామూర్తి మనకు రూపించి ఇచ్చిన విద్య శ్రీవిద్య.

సనకసనందనాదులు పరమేశ్వరుని దగ్గరకి వెళ్ళినప్పుడు ఆయన అమ్మవారితో కనిపించగానే 'సంసారి' అనుకున్నారు. సన్న్యాసులది నివృత్తి మార్గం. సంసారులది ప్రవృత్తి మార్గం. నివృత్తి మార్గంలో ఉన్న సనకసనందనాదులు శివుని దగ్గరకి బ్రహ్మవిద్యకి వెళ్తే ఆయన అమ్మవారితో కలిసి నృత్యం చేస్తూ కనబడ్డాడు. ఆయన నాట్యం చేస్తూ ఉంటే చుట్టూ ప్రమథగణాలు కూర్చున్నారు. గానాబజానాలలో కూర్చున్నవాడు యోగం, వేదాంతం ఎలా నేర్పుతాడనుకుని వెనుదిరిగారు.

అలా కొంతదూరం వచ్చేసరికి డెబ్బది యోజనాల పొడవు, వంద యోజనాల విస్తీర్ణం కలిగిన మర్రిచెట్టు క్రింద ఒక కుర్రవాడు కనబడ్డాడు. ఆయన చుట్టూ తలలు పండిన బ్రహ్మవాదులు ఉన్నారు. ఎంత ఆశ్చర్యం! దూరం నుంచి చూసి ఇది మనకి సరిపోతుందనుకున్నారు. సంసారి, నర్తకుడు మనకేం నేర్పలేదు. పైగా ఆయన ప్రక్కన ఆవిడ ఒకరు.

ఆవిడంటేనే సంసారం. భార్యతో నృత్యం చేసే ఆయన ఎక్కడ వేదాంతం చెప్తాడనుకున్నారు. పైగా చుట్టూ ఎంతో పరివారం. అంత సంగం పెట్టుకున్నవాడు నిస్సంగమైన వేదాంతవిద్యని ఏం నేర్పుతాడు! అనుకొని వస్తుంటే – ఈయన సంగము లేకుండా ఒక్కడే కనబడ్డాడు. ఆయన ఏమైనా తల పండిపోయినవాడా అంటే కుర్రాడు. చుట్టూ ఉన్నవారు తలలు పండిపోయిన వారు. ఎంత చిత్రం?

చిత్రం వటతరోర్మూలే వృద్ధాః శిష్యాః గురుర్యువా
గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్నసంశయాః

ఇంతకన్నా చిత్రం ఉంటుందా! ఈయన వారికేదైనా చెప్తున్నాడా అంటే మౌనంగా కూర్చుని ఉన్నాడు. ఆ నవ్వులోంచి, ఆ చిన్ముద్రలోంచే వారి అజ్ఞానమంతా పోయింది. "ఆహా!" అనుకున్నారు. అక్కడ 'వారిద్దరు' అనుకున్నారు. ఇద్దరూ కలిసి ఒక్కరే అని అప్పుడు తెలుసుకున్నారు. అక్కడ ఇద్దరుగా కనబడితే వారికి అర్థం కాలేదు కనుక ఆ ఇద్దరే ఇక్కడ ఒక్కరయ్యారు. అంతేకాదు ఈ ఒక్కడే అక్కడ ఇద్దరుగా ఉన్నారు. వారెప్పుడూ ఏకమే.

"అతని సంతతానందశక్తి ఆ సరసిజాక్షి విశ్వజనయిత్రి వారికి వేరు లేదు", "అర్ధశశిభూషణుడు స్వయంప్రబుద్ధుడు నిత్యోన్నతజ్యోతి" అంటారు శ్రీనాథుడు. ఆయన జ్ఞానమైతే, ఈవిడ ఆనందం. జ్ఞానం, ఆనందం వేరుగా ఉండవు. జ్ఞానానందస్వరూపులు.

పరమేశ్వరుడు సనకాదులకి చిన్న సూచన ఇచ్చాడు. అక్కడ మేము ఇద్దరనుకున్నారు కదా. ఇప్పుడు కూడా మేము ఇద్దరమే. నా కుడిచెవికి మకరకుండలం, ఎడమచెవికి తాటంకం ఉంది చూసుకోండని చెప్పినట్లుగా రూపం దాల్చాడు. పరిశీలిస్తే కనబడుతుంది.

తాటంకం స్త్రీల కర్ణాభరణం. మకరకుండలం పురుషదేవతల కర్ణాభరణం. ఎడమచెవికి తాటంకం ఉందంటే ఆయనలో అమ్మవారు ఉన్నారు. పరమేశ్వరుడు దక్షిణం మాత్రమే చూపిస్తూ కనబడ్డాడు గాని వామం కూడా అందులోనే లీనమై ఉంది. అమ్మ లేనిదే అయ్య కనబడదు. రెండూ ఒక్కటే అనే జ్ఞానం వారికి కలిగించాడు. దక్షిణామూర్తిని కుడివైపు నుండి చూస్తే శివుడు. ఎడమవైపు నుండి చూస్తే అమ్మవారు. శివునిలో సగం అమ్మవారు అంటే అమ్మవారిలో సగం శివుడు కాదా! అమ్మవారి వారంతా 'దక్షిణామూర్తిరూపిణీ' అని నమస్కారం చేసుకోవచ్చు. అయ్యవారి వారంతా దక్షిణామూర్తి అని నమస్కారం చేసుకోవచ్చు. దక్షిణామూర్తి మంత్రరూపముగా ఉన్నది – అని కూడా చెప్పవచ్చు.

శివుడే దక్షిణామూర్తిగా శ్రీవిద్య ఇచ్చాడంటే ఆ దక్షిణామూర్తి కూడా అమ్మవారే అని వశిన్యాది వాగ్దేవతలు చూపించారు.

మరొక అర్థంలో- దక్షిణ అంటే సగుణము. అమూర్తి - అంటే నిర్గుణం. సగుణ నిర్గుణరూపిణి.

'దక్షిణా శేముషీ ప్రోక్తా' అని యజుర్వేదీయమైన దక్షిణామూర్త్యుపనిషత్తులోని మంత్రం. దక్షిణా అంటే బుద్ధిశక్తి. జ్ఞానమూర్తియే ఈ స్వామి.

దక్షిణుడు అంటే సమర్థుడు. సర్వసమర్థుడు ఈశ్వరుడు తప్ప వేరేవారు లేరు. 'కర్తుం అకర్తుం అన్యథాకర్తుం' అని చెప్పినట్లుగా ఏది చెయ్యాలన్నా ఆయనే. సృష్టిస్థితిలయలు అనబడే విశ్వకార్యమే సర్వసమర్థత. అది చేసేటప్పుడు ఆయన సగుణుడు.

కానీ తత్త్వతః ఆయనే నిర్గుణుడు కాబట్టే దక్షిణ-అమూర్తి. ఏ మూర్తి లేనిది అమూర్తి. సగుణము, నిర్గుణము కూడా తానే అయిన పరమాత్మ. **'ద్వే బ్రహ్మణీ వేదితవ్యే మూర్తం చ అమూర్తంచ'** - మూర్తము, అమూర్తము కూడా బ్రహ్మమే.

726. సనకాదిసమారాధ్యా - శ్రీ సనకాదిసమారాధ్యాయై నమః

సనకాదులందరూ ఆ దక్షిణామూర్తిరూపిణినే చక్కగా ఆరాధించారు. సమ్- ఆరాధ్యా సమారాధ్యా. కొంచెం కూడా బహిర్ముఖం లేకుండా చేసే ఆరాధన - సమారాధన.

'బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి' అనే స్థితిలో ఉన్న బ్రహ్మవేత్తలు సనకాదులు. వారిచేత ఆరాధింపబడే అన్యము లేని బ్రహ్మమే అమ్మవారు. సాక్షాత్ పరబ్రహ్మస్వరూపిణి.

అమ్మ ఆరాధన అన్నీ ఇస్తుందిగాని అసలు కావలసినది బ్రహ్మవిద్య. ఆ బ్రహ్మవిద్యనే శ్రీవిద్య అనే అర్థంలో చెప్తున్నాం. ఈ శ్రీవిద్యే స్వతంత్రం. ఈ శ్రీవిద్యే సర్వతంత్ర ఈశీ. ఈ శ్రీవిద్యే 'దక్షిణామూర్తిరూపిణీ'... అందుకే 'సనకాదిసమారాధ్యా'.

శ్రీవిద్య కూడా సనకసనందనాదుల నుండే మనకి వచ్చింది. దక్షిణామూర్తి నుంచి గ్రహించి వారు ఇచ్చారు. శ్రీవిద్యకు సంబంధించి శుభాగమపంచకమని ఆగమాలు ఉన్నాయి. అవి వశిష్ఠాగమము, సనకసనందనాదులు ఇచ్చిన ఆగమము,

శుకమహర్షి ఇచ్చిన ఆగమము... ఇవన్నీ శ్రీవిద్యలో ఉన్నాయి. సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు – వీరే సనకాదులు.

ఈ ఆగమాలకే సమయాచార, దక్షిణాచార సంప్రదాయాలు అని పేర్లు. ఆ ఆగమాల సారాంశం అందించినవారు గౌడ భగవత్పాదాచార్యులవారు. వారి తరువాత శంకరభగవత్పాదాచార్యులవారు ఈ సమయాగమాలని మనకి ఇచ్చారు. దక్షిణామూర్తిరూపిణీ అంటేనే దక్షిణాచారము అని చెప్పబడుతున్న సమయాచారమే అమ్మ యొక్క బ్రహ్మవిద్యా స్వరూపము.

త్వమేవానాదిరఖిలా కార్యకారణరూపిణీ

త్వామేవ హి విచిన్వంతి యోగినస్సనకాదయః

అని బ్రహ్మాండపురాణంలో వాక్యం. అమ్మా! కార్యకారణరూపిణివైన నిన్నే నిరంతరం అన్వేషిస్తూ, ఆరాధిస్తున్నారు సనకాది యోగులు. అలా ఆరాధన చేస్తే శ్రీవిద్య మనకేమిస్తుందో తెలియజేస్తున్న తరువాత నామం....

727. శివజ్ఞానప్రదాయినీ – శ్రీ శివజ్ఞానప్రదాయిన్యై నమః

శివజ్ఞానాన్ని కలిగించినది. అమ్మ వల్ల అయ్య తెలుస్తాడు. జగదంబవల్లనే జగజ్జనకుడు తెలియబడతాడు.

అమ్మవారివిద్యకు లక్ష్యం శివుడు. శివుని ఇచ్చే విద్య శ్రీవిద్య–శివవిద్య. శివుడు ఎవరో చెప్తూ '**ప్రమహసి పదే నిస్త్రైగుణ్యే శివాయ నమో నమః**' అన్నారు పుష్పదంతులవారు. త్రిగుణాతీతతత్త్వమే శివుడు. మంగళము శివుడు. ఆనందము శివుడు. ఏ జ్ఞానం వల్ల ఆనందం లభిస్తుందో ఆ జ్ఞానమే శ్రీవిద్య. అందుకే 'శివజ్ఞానప్రదాయినీ'.

త్రిగుణాతీతమైన జ్ఞానమే బ్రహ్మజ్ఞానము. శివజ్ఞానం, బ్రహ్మజ్ఞానమని రెండు లేవు. బ్రహ్మజ్ఞానమని ఉపనిషత్తు ఏం చెప్తోందో అదే శివజ్ఞానం.

శ్రీవిద్య ప్రయోజనమే బ్రహ్మజ్ఞానం.

స్పందేన లక్ష్యతే వాయుః వహ్నిరౌష్ణ్యేణ లక్ష్యతే
చిన్మాత్రమమలం శాంతం శివ ఇత్యుదితస్తు యత్
తత్ స్పందమయ శక్త్యైవ లక్ష్యతే వాన్యథా కిల (యోగవాసిష్ఠం)

'స్పందేన లక్ష్యతే వాయుః' – స్పర్శను బట్టి గాలిని తెలుసుకుంటాం. వేడినిబట్టి నిప్పును తెలుసుకుంటాం. చిన్మయుడు, నిర్మలుడు, శాంతుడు అయిన శివుడు స్పందరూపమైన శక్తి చేత తెలియబడుతున్నాడు.

ఆ సిద్ధిని ఇస్తున్నదే శ్రీవిద్య.

728. చిత్కళా – శ్రీ చిత్కళాయై నమః

కళ అంటే అమ్మవారి ప్రకాశం, శోభ. సద్రూపమైన పరమాత్మ యొక్క చిత్ శరీరంలో కళగా కనబడుతున్నది.

ఆ చిత్కళ ఉంటేనే ఈ శరీరానికి కళ. చిత్కళ అనే మాటకి నిర్వచనం చెప్తూ– **'చిత్తేషు చిత్కళా నామ శక్తిః సర్వశరీరిణామ్'** (పద్మపురాణం) – సర్వజీవుల యొక్క చిత్తంలో ఉన్న శక్తి 'చిత్కళా'. చైతన్యమే 'చిత్కళా'. ఈ చైతన్యం ఎక్కడ నుండి వచ్చిందో మర్చిపోరాదు. శరీరానికి చైతన్యం లేదు. చైతన్యం వల్ల శరీరం ఉంది. శరీరం లేకపోయినా చైతన్యం ఉంటుంది.

కళ అంటే భాగము అని ఒక అర్థం చెప్పుకున్నాం. ఈ శరీరం ఒక భాగం. ఇందులో ప్రకాశిస్తున్నది చిత్. ఆ చిత్ పరమాత్మది. అనంతమైన పరమాత్మ యొక్క చిత్ మన చిత్తంలో ప్రకాశించగానే కళ అయింది.

'మమైవాంశో జీవలోకే జీవభూతాస్సనాతనః' – అని గీతావాక్యం. 'నా అంశయే జీవులలో జీవునిగానైనది' – అని పరమాత్మ వచనం.

729. ఆనందకలికా – శ్రీ ఆనందకలికాయై నమః

ఆనంద మొగ్గ. ప్రతివారిలో అమ్మవారు చిత్‌గా, ఆనందంగా ఉంది. చిత్ కళలో 'కళ'నీ, ఆనందకలికలో 'కలిక'ని తీసి చూస్తే చిదానందం అవుతుంది.

ప్రతివారిలో సచ్చిదానందరూపమైన చైతన్యం కలికలా ఉంది. అందరిలో అది చిన్నమొగ్గలా వెలుగుతోంది.

ఇంద్రియాల ద్వారా అనుభవానికి వచ్చేది ప్రతిబింబానందం. భావసామాన్యమైనది వాసనానందం. కేవల బ్రహ్మజ్ఞానం వల్ల కలిగేది నిజానందం. ఆనందం యొక్క పూర్ణరూపమిది. ఇదే జీవుని అనుభవాలలో అంశలుగా ప్రకాశిస్తుంది. **'ఏతాస్యైవ ఆనందస్యాన్యాని భూతాని మాత్రాముపజీవన్తి'** – అని ఉపనిషత్తు. "పరమాత్మ యొక్క అఖండానందంలో ఒక మాత్ర(అంశ)ను పొంది ఇతర ప్రాణులు జీవిస్తున్నాయి." ఆ ఆనందాంశయే కలిక – అని ఒక అర్థం.

ఇంత శరీరపు గదికి చైతన్యమనే వెలుగుని ఇచ్చే దీపపుకలిక మన హృదయంలో వెలుగుతోంది. అమ్మవారిని భావన చేసినపుడు **'దీపశిఖాం విభావయేత్'** అని చెప్తారు. సహస్రారకమలంలో ఒక దీపశిఖలా అమ్మవారు ప్రకాశిస్తున్నట్లుగా భావించాలి.

చిదానందరూపమైన మొగ్గలాగ, దీపజ్యోతి శిఖలాగ ప్రకాశిస్తోంది. దీపశిఖ చిన్నదే ఉంటుంది కాని, దాని వెలుగు గదంతా పరచుకున్నట్లుగా మనలో అమ్మ దీపశిఖలా ప్రకాశిస్తూ ఉంటే ఆ తల్లి చైతన్యమనే వెలుగు మన శరీరమనే గది నిండా ప్రకాశిస్తోంది. ఆ వెలుగే కన్ను, చెవి, పాదాలు మొదలైన ఇంద్రియముల ద్వారా రకరకాల శక్తులుగా వ్యక్తమౌతోంది.

నానాచ్ఛిద్ర ఘటోదరస్థిత మహాదీప ప్రభాభాస్వరం
జ్ఞానం యస్యతు చక్షురాదికరణ ద్వారా బహిఃస్పందతే

ఆ జ్యోతిని చూడాలి. అదే చిత్కళానందకలిక. కలికకి మరో శాస్త్రీయమైన అర్థం కూడా ఉంది. ఒకానొక రహస్యమైన పద్మాసనంలో రెండు పాదాలు కనబడేటట్లు కూర్చున్నప్పుడు సరిగ్గా మూలాధారం ఆసనానికి తగులుతున్న స్థితి కలిగితే, అలా సాధనగాని చెయ్యగలిగితే అప్పుడు అక్కడ కుండలినీ జాగరణ జరుగుతుంది. ఆ కుండలినీ అగ్నిజ్యోతిలా జాగృతమైనప్పుడు అక్కడ మొదలై సహస్రారం వరకు ఆ వేడి తగులుతున్న స్థితిని కలిక అనాలి. 'చిత్కళానందకలికా' అంటే జాగృతి చెందిన కుండలిని. యోగశాస్త్రంలో కలికా అనే శబ్దాన్ని అక్కడ ప్రయోగించారు.

730. ప్రేమరూపా – శ్రీ ప్రేమరూపాయై నమః

ప్రేమ (కరుణ) వలన పరదేవత రూపం వ్యక్తమౌతోంది. మూర్తీభవించిన ప్రేమయే అమ్మవారు. ఎక్కడైనా ప్రేమ కనబడితే అది అమ్మరూపమే. సృష్టిలో ఎవరైనా ప్రేమ చూపిస్తే మనకి ఎందుకు ఆనందం కలుగుతోంది? ఆ ప్రేమ అమ్మ రూపం కనుక.

అమ్మవారి ప్రేమ ఎన్నింటిలోంచి కనబడుతోందో 'రాజత్కృపా' దగ్గర విస్తారంగా చెప్పుకున్నాం. సూర్యుని లోంచి ప్రాణశక్తిగా ప్రసరిస్తోంది. ఇంతవరకు చెప్పుకున్న అర్థం మధుమతీ, మహీ అంతా అమ్మరూపమే. అమ్మప్రేమయే సృష్టంతా వ్యాపిస్తోంది.

ఆనందమే ప్రేమ. రతిరూపా, రతిప్రియా నామాల దగ్గర చాలా విస్తారంగా చెప్పుకున్నాం. రతిరూపా అంటే ఆసక్తియే ఆవిడ రూపం. అదే ప్రేమ. ఆవిడ ఆసక్తి ఎక్కువగా ఎవరి మీద చూపిస్తోంది? 'శివే శృంగారార్ద్రా' – శివుడంటే ఆవిడకి మహా ప్రేమ కనుక ప్రేమరూపా. అంటే శివుని ఎడల అపారమైన ప్రేమ గలది.

మనకి పరమాత్మ మీద ప్రేమ కలగాలంటే 'ప్రేమరూపా' అనుగ్రహించాలి. ప్రేమరూపా అయిన తల్లి మనని అనుగ్రహిస్తే ఆ ప్రేమ భక్తిరూపంగా బయటకి వస్తుంది. అప్పుడు పరమాత్మ నుండి ఆ ప్రేమ కరుణ రూపంలో మన వైపు ప్రసరిస్తుంది. ఈశ్వర(రీ) ప్రేమయే కరుణ.

'అరుణాం కరుణాతరంగితాక్షీం', 'కాచిదరుణా', 'కాచన విహరతి కరుణా కాశ్మీరస్తబక కోమలాంగలతా'... కాంచీపురంలో కరుణ తిరుగుతోందన్నారు మూకకవి. కామాక్షీ తిరుగుతోందని అనలేదు. కామాక్షియే కరుణ. కరుణయే కామాక్షి.

మనలో ప్రేమయే భక్తి. ఈశ్వరునిలో ప్రేమ కారుణ్యం. రెండూ అమ్మరూపమే. ఈశ్వరుని నుండి కురిసేటప్పుడు అది ధార. మన నుండి వ్యక్తమైనపుడు అది 'రాధా'.

'ప్రేమరూపా' అంటే రాధాదేవి. రాధ అంటే రతిప్రియా. రాధాదేవి, లలిత రెండు కాదు. దుర్గ వేరు, లక్ష్మి వేరు, రాధ వేరు అని అనుకుంటే అది అజ్ఞానం. ఉన్నది ఒక్కడే ఈశ్వరుడు. ఆయనకి ఉన్నది ఒక్కటే శక్తి. ఆ శక్తి పేరు అమ్మ. ఆ

ఈశ్వరుని పేరు అయ్య. దానిని కొందరు కృష్ణుడు, రాధ అన్నారు. కొందరు శివుడు, లలిత అన్నారు. పేరు మారిందే తప్ప వస్తువు మారలేదు.

లలితాసహస్రంలో రాధాదేవి ఈ నామాల దగ్గర స్పష్టంగా కనబడుతోంది. ఈవిడ అర్థమవ్వడమే మహాకష్టం. ఎందుకంటే సృష్టిలో అన్నీ దొరకుతాయిగాని భక్తి మాత్రం తేలికగా దొరకదు. భగవంతుని మీద అవ్యాజమైన ప్రేమ కలగడం దుర్లభం.

రాధాదేవి అనుగ్రహం దొరకడం మహాకష్టం. బ్రహ్మదేవుడంతటివాడు ఆరు కోట్ల సంవత్సరాలు తపస్సు చేస్తే రాధాదేవి కాలికొన గోరు మాత్రమే చూడగలిగాడు. ఒక తలకాయ అహంకారం ఉంటేనే ఇన్ని బాధలే. నాలుగు తలకాయల అహంకారానికి మరి దొరకుతుందా! అహంకారం ఏ రూపంలో ఉన్నా భక్తి రాదు.

గొప్ప ఉపాసకుడు కావచ్చు, గొప్ప మంత్రసిద్ధుడు కావచ్చు... కానీ గొప్ప భక్తుడు కావడం మహాకష్టం.

నిర్మలమైన, నిష్కపటమైన ప్రేమ ఉంటే అది భక్తి. ఆ ప్రేమ అమ్మవారి అనుగ్రహ రూపం. మనకి అమ్మ దయ వల్ల అలాంటి భక్తి కలిగితే, అమ్మ దయ పరిపూర్ణంగా దొరికి, మనకి ఏది ప్రియమో అది కలిగిస్తుంది కనుక 'ప్రియంకరీ'. ప్రియము అనే మాట, ప్రేమ అనే మాట ఉపనిషత్ శబ్దాలు. **'ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి'** అన్నారు. ప్రియమైనది (ఆనందస్వరూపం) ఆత్మయే. అదే ప్రేమరూప.

731. ప్రియంకరీ – శ్రీ ప్రియంకర్యై నమః

'ప్రియం' అనే పదం బృహదారణ్యకంలో గార్గి, యాజ్ఞవల్క్యుల సంభాషణలో వస్తోంది. ఎవరికి ఏది ప్రియము? సృష్టిలో ప్రియం అనే మాట ప్రీతికోసమని వాడుతుంటారు. ఒకరి ప్రీతి కోసం ఒకరు ఏ పని చేయడం లేదు. ప్రతివారు తమ ప్రీతి కోసమే చేస్తున్నారు.

సృష్టిలో అందరికంటె ప్రియమైన వస్తువేది? 'నేను'. నేనంటే ఏది? 'నేను' అంటే ఆత్మ. సృష్టిలో అత్యంత ప్రియంకర వస్తువు ఆత్మ. ప్రియంకరీ అంటే మనలో

ఆత్మరూపంగా ఉన్న తల్లి. సృష్టిలో 'నిన్ను' మించి ప్రీతి వస్తువు మరొకటి లేదు. నేను అనబడే ఆత్మవస్తువే 'ప్రేమరూపా', 'ప్రియంకరీ'.

జగమంతా కారుణ్యరూపంతో వ్యాపించి, ఆ కరుణతో అందరికి ప్రీతి కలిగిస్తున్నది కనుక ప్రేమరూపా, ప్రియంకరీ. భక్తులలో భక్తి అనబడే 'ప్రేమరూపం'గా ప్రకటింపబడి ఆ భక్తి వల్ల మోక్షమనబడే 'ప్రియా'న్ని కలిగిస్తోంది. ఆనందాన్ని కలిగించునది అని భావం. ఆత్మరూపిణియై మనలో ఉన్న తల్లి అని గ్రహించి ఉపాసిస్తే ఆత్మప్రాప్తిని కలిగిస్తోంది కనుక ప్రియంకరీ.

'గురుమండలరూపిణీ' నుండి 'దక్షిణామూర్తిరూపిణీ' వరకు మొత్తం అమ్మవారి గురుస్వరూపమే దర్శనమౌతుంది. 'స్వతంత్రా, సర్వతంత్రేశీ, దక్షిణామూర్తిరూపిణీ, సనకాదిసమారాధ్యా, శివజ్ఞానప్రదాయినీ, చిత్కళా, ఆనందకలికా, ప్రేమరూపా, ప్రియంకరీ' – ఇదంతా కలుపుకొని పూర్తిగా సరస్వతీ స్వరూపంగానే భావించాలి. 'సరస్వతీ', 'శాస్త్రమయీ' నుండి మనకి అమ్మవారి యొక్క సరస్వతీ రూపమే దర్శనమిస్తుంది. సరస్వతీ అంటే గురుస్వరూపం.

732. నామపారాయణప్రీతా – శ్రీ నామపారాయణప్రీతాయై నమః

నామపారాయణ చేసినవారి పట్ల ప్రీతి చెందునది.

'నామపారాయణప్రీతా' 'నందివిద్యా' 'నటేశ్వరీ' – ఈ మూడు నామాలు నందివిద్యని తెలియజేస్తున్నాయి. నామపారాయణ విద్యనే నందివిద్యా అంటారు. **'నామస్మరణాదన్యోపాయం నహి పశ్యామో భవతరణే'** అని ప్రసిద్ధిగా ఉంది. ఏ భక్తి సంప్రదాయంలో చూసినా నామానికి అంత విశేషం ఉంది. ఆ కారణం చేతనే **'యస్య నామ మహద్యశః'** అని వేదం చెప్తోంది.

నామం పారాయణ కావాలి. నామ ఉచ్చారణ, నామ స్మరణ, నామ సంకీర్తన, నామ పారాయణ – వీటికి భేదాలు ఏమిటో తెలుసుకోవాలి. పారాయణ అనే దానికి ఒక మహాత్ముడు అద్భుతమైన నిర్వచనం ఇచ్చారు. తత్త్వార్థస్ఫురణతో మనస్సుని, మాటని ఏకాగ్రం చేసి గ్రహిస్తే అది పారాయణ. ఒకటికి పదిసార్లు వల్లె వేయడం

పారాయణ కాదు. తత్త్వార్థగ్రహణంతో అంటే – ఏం చదువుతున్నామో, దాని భావం ఏమిటో గ్రహించుకుంటూ, ఏకాగ్రంగా పఠిస్తే దానికి పారాయణ అని పేరు. అసలు వల్లె వేయడం మానేయమని చెప్పడం దీని అర్థం కాదు. అలా రోజూ వల్లె వేస్తూ ఉంటే ఎప్పటికో అప్పటికి పారాయణ సిద్ధిస్తుంది.

వెయ్యి నామాలు వల్లె వేస్తున్నప్పుడు వెయ్యి నామాలు పారాయణం కాకపోవచ్చు. కొన్ని నామాల పైనైనా మనస్సు లగ్నమై ఒక అనుభూతిని పొందితే అది పారాయణ. అలా పారాయణ చేస్తే అమ్మవారు సంతోషిస్తారు.

పర + అయన = పారాయణ. దీని అర్థం– నామాన్ని 'ఇదే నాకు గొప్ప దిక్కు. ఇదే నాకు గొప్ప ఆశ్రయము' అనే భావనతో పట్టుకోవాలి. ఇది నన్ను తరింపజేస్తుందన్న భావంతో ఆశ్రయిస్తే దానికి పారాయణమని పేరు.

అమ్మ ప్రీతి చెందడం కంటే ఇంకేం కావాలి? ఏ పూజలు చేసినా శ్రీ పరమేశ్వరీ ప్రీత్యర్థం అంటారు. ఉపాసకులకి లక్ష్యం పరమేశ్వరీ ప్రీతి.

సాధకులకి పనికొచ్చే విషయాలలో ఇదొకటి చేర్చుకోవచ్చు. ధ్యానగమ్యా, భావనాగమ్యా, భక్తిగమ్యా ఎలా చెప్పుకున్నామో వాటి సరసన చేర్చుకోగలిగిన నామం 'నామపారాయణప్రీతా'. అమ్మవారి సాధనలో ప్రధానం నామపారాయణ.

ఉత్తరపీఠికలో అమ్మవారే తన నామాల మహిమ తనకెంత ప్రీతి కలిగిస్తుందో తానే స్వయంగా చెప్పింది. "నా అర్చన చేసేటప్పుడు, ఈ నామాలతో అర్చన చేస్తే నేను సంతోషిస్తాను". "జపం చెయ్యడం, అర్చన చెయ్యడం, అర్చనాకాలంలో ఈ నామాలతో పూజించడం నాకు చాలా ప్రీతి" అని చెప్పింది.

'మామర్చయతు వా మా వా విద్యాం జపతు వా న వా' – నా అర్చన చేసినా చెయ్యకపోయినా, శ్రీవిద్యామంత్రం జపించినా జపించకపోయినా **'కీర్తయేన్నామసహస్రం ఇదం మత్ప్రీతయే సదా'** – "ఈ సహస్రనామాలు నా ప్రీతికోసం చదివితే తప్పకుండా నేను సంతోషిస్తా"నని అమ్మవారే స్వయంగా మణిద్వీపంలో చెప్పింది. సహస్రనామ పారాయణ ప్రీతా అని కూడా మనం అనుకోవచ్చు. ఈ వెయ్యి నామాలు పారాయణ చేస్తే సంతోషిస్తుంది.

ఏభై అక్షరాలని అనుసంధానించడమే నామపారాయణ. మాతృకావర్ణానుసంధానమే నామపారాయణ.

ప్రతి అక్షరమూ అమ్మ నామమే. నామపారాయణకు అమ్మవారు సంతోషిస్తారంటూ 'లఘుస్తవం'లో చెప్పారు. ఇది శ్రీవిద్యారహస్యాలని చెప్తుంది. కొందరు ఇది కాళిదాసకృతం అంటారు. మరి కొందరు కాదంటారు. ఎవరి చర్చ ఏదున్నప్పటికి కూడా ఒక అత్యద్భుతమైన స్తుతి. లఘు అంటే శీఘ్రంగా అని అర్థం. తేలికగా అనుగ్రహించుట, ఆ స్తోత్రమహిమ చాలా విశేషం. అందులో ఒక శ్లోకం

ఆ ఈ పల్లవితైః పరస్పరయుతై ర్ద్వి త్రిక్రమాద్యక్షరైః
కాది క్షాంతగతైః స్వరాదిభిరథక్షాంతైశ్చతైస్సస్వరైః
నామాని త్రిపురే భవంతి ఖలు యాన్యత్యంత గోప్యాని తే
తేభ్యో భైరవపత్ని వింశతి సహస్రేభ్యః పరేభ్యో నమః

ఈ శ్లోకంలో 'నామాని త్రిపురే' – అమ్మా! నీ నామాలు ఇవి. ఈ నామాలు ఎన్ని ఉన్నాయంటే వింశతి సహస్రేభ్యః 20,000కి పైన నామాలు అమ్మవారికి ఉన్నాయన్నారు. 20,736 నామాలు తయారుచేసుకున్న పద్ధతి కూడా ఈ శ్లోకంలో చెప్పారు. ఇదంతా గురుముఖైక వేద్యమైన ఒక సూచనగా చెప్పుకోవలసినవి. మొత్తం 50 అక్షరాలను తీసుకుని ఆ ముందు స్వరాలు గ్రహించాలి. ఆ స్వరములన్నిటిలో విడవకుండా ఉండే ప్రధాన స్వరములు – ఆ, ఈ.

ఆ ఈ పల్లవితైః – ఆ, ఈ లను చిగురులుగా ఉంచి అంటే వాటితో అనుసంధానం చేస్తూ, హల్లులని కూడా కలుపుతూ, ఎలా అచ్చుల్ని కలుపుతూ అమ్మనామం చెయ్యాలో, ఎలా హల్లులని కలుపుతూ చేయాలో, అచ్చుకి హల్లుకి ఏ విధమైన అనుసంధానం చెయ్యాలో అంతా దీనిలో చాలా వివరంగా చెప్పారు. ఇది గురువు ద్వారా నేర్చుకోవలసిన ఒక సాంకేతిక పరిజ్ఞానం తప్ప కేవలం ప్రవచనం ద్వారా తెలుసుకునే అంశం కాదు. అవగాహన కోసం మాత్రం విషయాన్ని స్పృశించడం జరిగింది.

అకారం నుంచి క్షకారం వరకు ఉన్న అచ్చులను హల్లులతో కలుపుకుంటూ

ఒక పద్ధతిలో తీసుకుని వాటన్నిటికి నమః సమకూర్చుతూ వెళ్తే అక్షరాలతోనే మొత్తం నామాలు తయారౌతాయి. ఉదాహరణకి అం, కం, ఆం, ఈం నమః అని ఏర్పడతాయి. ఇలా మొత్తం 20,736 నామాలు. ఆ నామపారాయణకి అమ్మ సంతోషం చెందుతుందని 'నామపారాయణప్రీతా' అనే దానికి శ్రీవిద్యాపరమైన అర్థం.

ఈ నామాలను ఒక రోజుకు గానీ, వారానికి గానీ, పక్షానికి గానీ, మాసానికి గానీ, 36 దినాలలోగానీ పారాయణం చేయాలి. ఈ ప్రకారం నామపారాయణ చేయడం వలన పరమేశ్వరి ప్రీతి చెందుతుంది. సారాంశంగా మనం గ్రహించాల్సింది 'అక్షరాలన్నీ అమ్మరూపాలే'.

శాస్త్రీయంగా ఈ అచ్చులని, హల్లులని ఏ క్రమంలో కలపాలని ఈ శ్లోకంలో చెప్పారో ఆ క్రమంలో కలిపితే వచ్చే నామాలు 20,736. కొన్ని లెక్కలు కడితే 25,000 పైన వస్తాయి. మొత్తానికి 'వింశతి సహస్రేభ్యః' అని ఒక్క మాటలో చెప్పారు కాళిదాసు.

దేవీభాగవతంలో కూడా **'అకారాది క్షకారాంతైః స్వరైర్వర్ణైస్తు యోజితైః, అసంఖ్యేయాని నామాని భవంతి రఘునందన'** అని చెప్పబడింది. అ నుంచి అః వరకూ ఉన్నవి స్వరములు. కకారం నుంచి వచ్చేవన్నీ వ్యంజనములు. ఈ రెండిటిని చక్కగా యోజనం చేసుకుని వెళ్తే 'అసంఖ్యేయాని నామాని భవంతి' లెక్కలేనన్ని నామాలు వస్తాయి. అక్షరం ఏ రూపంలో కనబడ్డా అమ్మనామమే అని భావించగలిగితే ఆ భావం ఇంకా అద్భుతంగా ఉంటుంది. అటువంటి నామాలకు సంతోషించే తల్లి కనుక 'నామపారాయణప్రీతా'.

శ్రీమాతుఃప్రీతయే నిత్యం అనిశం కీర్తయేదిదం
భక్తో యః కీర్తయేత్ నిత్యం ఇదం నామ సహస్రకం

అమ్మవారి ప్రీతికోసమని నిత్యం ఎవరు లలితాసహస్రం చదువుతారో వారికి దేవీ అనుగ్రహం పరిపూర్ణంగా లభిస్తుందని బ్రహ్మాండపురాణంలోని వాక్యం.

733. నందివిద్యా – శ్రీ నందివిద్యాయై నమః

'నందివిద్యా' అనే మాటకి స్థూలార్థం తీసుకుంటే ఆనందానుభవ స్వరూపమే నంది. నందివిద్య అంటే ఆనందవిద్య. శ్రీవిద్యోపాసకులలో నందికేశ్వరుడొకడు. అతనిచే ఉపాసింపబడిన విద్య. ఈ నామవిద్యయే నామపారాయణ విద్య, 'నందివిద్య' అని కొందరి అభిప్రాయం.

734. నటేశ్వరీ – శ్రీ నటేశ్వర్యై నమః

శివ–శివా, శంకర–శాంకరీ, శంభు–శాంభవీ, మృడ–మృడానీ, భవ–భవానీ అయినట్లే నటేశ్వర–నటేశ్వరీ అయ్యింది. నటేశ్వరునికి అభిన్నురాలని చెప్పడమే దీనిలో ఉద్దేశం. నటరాజు ఉపదేశించిన శివసూత్ర విద్య నందివిద్య.

నటరాజు శివుడు. నాట్యం అమ్మవారు. నాట్యం అంటే అభినయం. పరమేశ్వరుని యొక్క అభివ్యక్తే అమ్మవారు. అభివ్యక్తి అంటే శక్తే.

నాట్యం అనేది నటరాజు నుండి ప్రకటింపబడినదే. ఆయన చూపించిన నాట్యంలో ఉన్న హొయలు, సొగసులు, కళలు అన్నీ అమ్మవారే.

నటరాజనే పేరులోనే అమ్మవారు ఉన్నారు. దక్షిణామూర్తిరూపిణీ, నటేశ్వరీకి చాలా దగ్గర సంబంధం ఉంది. అందుకే ఈ రెండు నామాలు దగ్గర దగ్గరగా వచ్చాయి. కూర్చుంటే దక్షిణామూర్తి. లేస్తే నటరాజు. నటరాజు చిదంబర దక్షిణామూర్తి.

నటరాజక్షేత్రమే చిదంబరం. సరిగ్గా నటరాజ విగ్రహం పరిశీలిస్తే ఆయనకి కూడా కుడిచెవికి మకరకుండలం, ఎడమచెవికి తాటంకం ఉంటాయి. నటరాజు కూడా దక్షిణామూర్తిరూపిణిలాగే 'నటేశ్వరీ'. నటరాజవిగ్రహంలో ఎడమవైపు అమ్మవారు. కుడివైపు పరమేశ్వరుడు.

నటరాజ విగ్రహం నిర్మాణానికి, శ్రీవిద్యకి ఉన్న సంబంధం స్మరించుకోవాలి. ఆగమశాస్త్రం ప్రకారం నటరాజ విగ్రహం చెయ్యడానికి రెండు యంత్రాలు వాడతారు. ఒకటి షట్కోణయంత్రం, రెండవది శ్రీయంత్రం.

ఊర్ధ్వత్రికోణం శివస్వరూపం. క్రిందకి వచ్చే త్రికోణం శక్తిస్వరూపం. ఈ రెండూ కలుస్తాయి. వాటి బిందువులను కలుపుతూ గీస్తే ఒక వృత్తం ఏర్పడుతుంది. ఈ చక్రం లోపల షట్కోణాన్ని భావించాలి. ఇది ఒకటి.

అలాగే శ్రీయంత్రంలో నాలుగు త్రికోణాలు పైకి వెళ్తూ, ఐదు త్రికోణాలు క్రిందకి వస్తూ ఉంటాయి. అప్పుడు నలభై మూడు త్రికోణాలు ఏర్పడి దాని తరువాత వృత్తములు వస్తాయి. అష్టదళపద్మం, షోడశదళ పద్మం, చతురస్రం. వీటన్నిటికి ఏది కేంద్రమో అది మధ్యలో బిందువుగా చెప్పబడుతున్నది. నలభైమూడు త్రికోణాలు ప్రధానమైన మాతృకావర్ణాలు.

రెండు త్రికోణాలతో శివశక్త్యాత్మకం అయ్యింది. నాలుగు శివ త్రికోణాలు, ఐదు శక్తి త్రికోణాలతో ఏర్పడిన శ్రీచక్రం కూడా శివశక్త్యాత్మకమే.

నటరాజవిగ్రహం చెక్కేటప్పుడు ఈ రెండూ ఆధారంగా తీసుకుంటారు. దేన్ని ఆధారంగా విగ్రహాన్ని చెక్కారో మనం నటరాజవిగ్రహం చూస్తే పోల్చవచ్చు. నటరాజుకి చుట్టూ వలయం ఉండి దానికి చేతులు తగులుతూ ఉంటే అది షట్కోణంతో చెక్కినట్లు. అలా కాకుండా మధ్యలో కాని చేతులు ఉంటే అది శ్రీచక్రాన్ని ఆధారంగా తీసుకొని చెక్కారని అర్థం. చేతుల నుండి వలయం వరకు మధ్యలో మరికొన్ని చక్కటి అలంకారాలు కనబడుతూ ఉంటాయి.

శ్రీచక్రమే నటరాజరూపం ధరించిందని స్పష్టమైంది. 'శ్రీచక్రం శివ యోర్వపుః' – శ్రీచక్రమే శివశక్తులరూపం. నటరాజవిగ్రహమంటే ఇద్దరి రూపం. 'నటేశ్వరీ' అని చెప్పడంలో ఇంత విశేషం ఉంది.

నామపారాయణప్రీతా–నందివిద్యా–నటేశ్వరీ ఈ మూడింటి అనుబంధం పరిశీలించాలి. నామపారాయణ విద్యనే నందివిద్య అంటారు. ఈ అక్షరాలతో కలిపి అమ్మవారిని ఉపాసన చెయ్యడం. 20,736 నామాలు తయారు అవుతాయని చెప్పుకున్నాం. అవి ఉపాసించినవాడు నందీశ్వరుడు. అమ్మవారి విద్య మనువిద్య, చంద్రవిద్య, కుబేరవిద్య చెప్పినట్లుగా ఇది నందివిద్య. నటేశ్వరుని నుండే అన్ని అక్షరాలు వచ్చాయని మనకి చెప్పినవాడు నందీశ్వరుడు.

నందికేశ్వర కారికలలో ఈ విషయాన్ని చెప్పారు. భరతుని నాట్యశాస్త్రానికి కారికలు రచిస్తూ నందీశ్వరుడు చెప్పిన శ్లోకం-

నృత్తావసానే నటరాజరాజః ననాద ఢక్కాం నవపంచవారం

ఉద్ధర్తు కామాన్ సనకాది సిద్ధాన్ ఏతత్ విమర్శం శివసూత్రజాలమ్

మొత్తం నాట్యం పూర్తి చేసిన తరువాత నటరాజు ఒక్కసారి డమరుకం మ్రోగించాడు. మ్రోగించిన డమరుకంలోంచి పధ్నాలుగు సూత్రాలు వచ్చాయి.

అవి 50 అక్షరాలకు ప్రధానంగా మాతృకలుగా కనబడుతున్న సూత్రములు. ఈ ఏభై అక్షరాల నుండే నామవిద్య అంతా వచ్చింది. ఆ నటరాజు యొక్క డమరుకం మ్రోగించగా వచ్చిన అక్షరాలన్నిటిని స్వీకరించి దానితో అమ్మవారి ఉపాసనవిద్యను గ్రహించినవాడు నందీశ్వరుడు కనుక నందివిద్య. ఆ నంది అలా ఆ నామాలతో ఉపాసన చేసినది 'నామపారాయణప్రీతా'. అదే మూడింటికి ఉన్న అనుబంధం. మహేశ్వరసూత్రాలకు కారికలు రచించినవాడు నందికేశ్వరుడే.

తరువాత నామాలలో అమ్మవారి తత్త్వస్వరూపాన్ని ప్రతిపాదన చేస్తున్నారు. ఈ శ్రీవిద్య ద్వారా మనం గ్రహించాల్సిన పరతత్త్వం చెప్పబడుతోంది.

735. మిథ్యాజగదధిష్ఠానా - శ్రీ మిథ్యాజగదధిష్ఠానాయై నమః

ఇది వేదాంతచర్చకి సంబంధించిన నామం. అమ్మవారు జగత్తుకి అధిష్ఠానం. అధిష్ఠానం అంటే ఆధారం. అమ్మవారు జగత్తుకి ఆధారమని చెప్తే ఏ గొడవా లేదు. 'మిథ్యాజగదధిష్ఠానా' అని చెప్పడం ఏమిటి? అలా చెప్పడంలో చమత్కారం ఉంది. లలితా శాస్త్రం పూర్తి అద్వైత వేదాంత శాస్త్రమని మరొక్కసారి గుర్తుతెచ్చుకోవాలి.

'బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః' అని చెప్తూ, "మొత్తం వేదాంతశాస్త్రమంతా ఒక్కమాటలో చెప్తాను వినండి" అన్నారు శంకరభగవత్పాదుల వారు. '1. బ్రహ్మసత్యం 2. జగన్మిథ్య 3. జీవోబ్రహ్మైవ నాపరః' - బ్రహ్మమే సత్యం. మరి జగత్తో? మిథ్య. మరి జీవుడో? 'బ్రహ్మైవ నాపరః' - జీవుడు బ్రహ్మమే. ముందు బ్రహ్మ సత్యం అని చెప్పారు. తరువాత చెప్పింది జగన్మిథ్య.

బ్రహ్మము సత్యము అన్నది అవగాహన అయితే అప్పుడు జగన్మిథ్య అర్థం అవుతుంది. మిథ్య అనగానే చాలా మంది తొందరపడిపోయి జగత్తు లేదని అనుకుంటున్నారు. 'లేనిది' అని అర్థం కాదు. 'కానిది' అని అర్థం చేసుకోవాలి. లేనిది అని చెప్పాలంటే నాస్తి శబ్దం ఉండేది. మిథ్య అని చెప్పేవారు కాదు. వ్యవహార దృష్టిలో సత్యంగా అనిపిస్తున్న జగత్తు, పరమార్థ దృష్టిలో మిథ్య.

జగత్తుకు ఇది స్వరూపమని ఎవరూ నిర్ణయించలేరు కనుక జగత్తుని మిథ్య అని అంటున్నారు. మనం మన ఇంద్రియాలతో చూసినదాన్ని బట్టి జగత్తును అంటున్నాం. ఇంద్రియాలు ఒక ఉపాధికి, మరొక ఉపాధికి తేడా ఉంది. ఒక్క మానవుల్లోనే ఒకడు ప్రపంచాన్ని చూసిన తీరుకి, ఇంకొకడు ప్రపంచాన్ని చూసిన తీరుకి తేడా ఉంది. అప్పుడు దాని స్వరూపాన్ని ఏమని నిర్ణయిస్తాం? అదేవిధంగా మనకి కొన్ని రంగులు బాగా కనబడతాయి. కొన్ని జంతువులకి రంగులు కనబడవు. అంటే వాటి ఇంద్రియాలు వేరు, మన ఇంద్రియాలు వేరు.

దేశం బట్టి, కాలం బట్టి ఇక్కడ ఉన్నది అక్కడ ఉండడం లేదు, అక్కడ ఉన్నది ఇక్కడ ఉండడం లేదు. ఇదమిత్థమని ఏం నిర్ణయించగలం? ప్రతివారు కూడా ఒకరి దారికి ఒకరు వేరుగానే ఉంటారు. ప్రపంచమంతా లేనిది కాదు. కానిది. కానిది అంటే మనం అనుకుంటున్నదే ప్రపంచం కాదు అని చెప్పడం.

ప్రపంచం గురించి ఒకొక్కడు ఒకొక్కటి చెప్పినప్పటికి సామాన్యంగా అందరూ ఒక్క దగ్గర మాత్రం ఏకీభవిస్తున్నారు. 'నేను' అనే దగ్గర అందరికి సామాన్యమే. నేననే చైతన్యం మాత్రం అంతటా ఒక్కటే. జగత్తు శూన్యమనడానికి లేదు. అనుకుంటునట్టు లేదు కనుక ఇదంతా లేదు అందామంటే శూన్యం కాదు. శూన్యవాదమైన బౌద్ధానికి, అస్తిత్వవాదమైన వేదాంతానికి తేడా ఎక్కడొస్తోందో చూడాలి. జగత్తు లేదని ఎలా అంటాం? జగన్మిథ్య అని తెలుసుకుంటున్నవాడు ఒకడు ఉన్నాడు కనుక అప్పుడు అస్తిత్వవాదం వచ్చింది.

దీనిని మరొక కోణంలో పరిశీలిస్తే ఒక ఇంద్రజాలకుడు ఇంద్రజాల ప్రదర్శన చక్కగా చేస్తున్నాడు. ఆ వేదిక మీద ఒక అద్భుతమైన ఆకాశం సృష్టించాడు. చూస్తూ

ఉండగా అతను ఏం కనికట్టు చేశాడో తెలీదుగాని మనందరికి ఆ ఆకాశంలో ఉన్న నక్షత్రాలు, గ్రహాలను దాటివెళిపోతున్న ఒక అనుభూతి కలిగింది. ఆ అనుభూతిలో ఒక గ్రహం మీంచి ఏదో అగాధంలోకి జారుతున్న అనుభూతి కూడా కలిగినపుడు జనాలు అందరూ భయంగా "అయ్యో!" అని అరుస్తున్నారు. పైకి తీసుకు వెళ్తుంటే "ఆహా! బాగుంది" అంటున్నారు.

కానీ నిజానికి వారంతా ఎక్కడున్నారు? ఎవరి కుర్చీలలో వారు కూర్చుని ఉన్నారు. ఎదురుగా ఆయన ఉన్నాడు. నిజానికి గ్రహాలున్నాయా! నక్షత్రాలున్నాయా! అంతరిక్షం ఉందా! ఏం లేదు. ఉన్నవాడు ఒక్కడే. ఇప్పుడు కనిపించిన మొత్తం ఇంద్రజాలం. అంటే లేనిది ఉన్నట్లు అనిపించింది. అది అనుభవిస్తున్నంతసేపు ఉన్నట్లు అనిపించింది కనుక అప్పుడు ఉంది అనుకుంటే తప్పేం లేదు. కానీ నిజంగా ఉందా? లేదు. ఉన్నట్లు అనిపించింది.

ఉన్నట్టనిపించడానికి కారణం ఎవరు? ఇంద్రజాలకుడు. ఇంత ఇంద్రజాలవిద్య ఇంద్రజాలకుని అధిష్ఠానం చేసుకొని ఉంది.

ఇదమిత్థమని నిర్ణయించలేని ఈ ప్రపంచమంతా ఇంద్రజాలము. ఇంద్రజాలికుని అధిష్ఠానము చేసుకున్నట్టుగా మిథ్యాభూతమైన ఈ ప్రపంచము ఆ పరమాత్మను అధిష్ఠానం చేసుకున్నది. ఇప్పుడు ఇంద్రజాలం సత్యమా? ఇంద్రజాలకుడు సత్యమా? ఇంద్రజాలకుడు సత్యం. అదే బ్రహ్మసత్యం. బ్రహ్మము–ఇంద్రజాలకుడు. జగత్తు–ఇంద్రజాలం. **"ఇంద్రజాలమయం విశ్వం తస్థం వా చిత్రకర్మవత్"** అని శాస్త్రమే చెప్తోంది.

'జగదదింద్రజాలరచనా పటీయసీ'. జగత్తు ఒక ఇంద్రజాలం. ఇంద్రజాలకుడు లేకపోతే ఇంద్రజాలం లేనట్లుగా ఈశ్వరి లేకపోతే జగత్తే లేదు.

ఉదాహరణకు ఒక మహాత్ముడు ఇంద్రజాలం చూడడానికి వచ్చాడు. ఆయన ప్రేక్షకునిగానే వచ్చాడు. కానీ ఆయన వీరిలా భయపడిపోవడం లేదు. పొంగిపోవడం లేదు. ఇంద్రజాలాన్ని చూసి ఆస్వాదిస్తున్నాడు. అంత చక్కటి ఇంద్రజాలం చేసిన ఇంద్రజాలకుని శక్తిని మెచ్చుకొని అభినందిస్తున్నాడు. మిగిలినవారు ఆ ఇంద్రజాలం

చూస్తున్నంతసేపు ఇంద్రజాలకుని మర్చిపోయి ఆ ఇంద్రజాలం మైకంలో పడిపోయి ఏడ్చి, భయపడి, బాధపడి, నవ్వుతున్నారు.

వీరిలా కాక, తెలిసినవాడు ఇంద్రజాలాన్ని చూస్తూ ఆనందిస్తూనే, ఇంద్రజాలకుని గుర్తుపెట్టుకొని "భలే ఇంద్రజాలకుడ"ని మెచ్చుకున్నాడు. అలాగే జ్ఞాని ఈ ప్రపంచాన్ని చూస్తున్నా, పరమాత్మని మరువడు.

ఆ పరమాత్మస్వరూపిణి అమ్మ. దీనికి మనవారు రజ్జుసర్పభ్రాంతి, శుక్తిరజతభ్రాంతి ఇత్యాది చెప్పారు. వేదాంతం తీసుకున్న పడికట్లు ఇవి. ఇవి చెప్తేగాని వేదాంతం అర్థం కాదని వేదాంతం అధ్యయనం చేసే మంచి అలవాటు ఉన్నవారికి ఈ రెండూ చెప్తారు.

రజ్జుసర్పభ్రాంతి అంటే తాడుని చూసి పాము అనుకుంటారు. పాము అనేది ప్రపంచము అనుకొంటే పాముకి అధిష్ఠానం తాడు. అలాగే శుక్తిరజతభ్రాంతి – ముత్యపుచిప్పను చూసి వెండి అనుకున్నారు. అలా అనుకునే ఏదో ఒక లక్షణం దానిలో ఉంది. ఆ లక్షణాన్నే మాయాశక్తి అంటారు. అలా పరమాత్మ తన మాయాశక్తి చేత తన యందు ఈ ప్రపంచాన్నంతటిని వివర్తం చేస్తున్నాడు. దీన్ని వివర్తవాదం అంటారు. పరిణామవాదం, ఆరంభవాదం, వివర్తవాదం అని వీటిని వేదాంతాధ్యయనంలో చెప్తారు. వివర్తం అంటే లేనిది ఉన్నట్లుగా కనబడడం.

దీనికి మరో ఉదాహరణ ఎండమావులు. లోకంలోనే మన కంటికి ఇలాంటివన్ని ఎన్నో కనబడుతున్నాయి. అలాగే ఈ జగత్తంతా పరమేశ్వరుడు తప్ప మరొకటి కాదు. కానీ మనకి పరమాత్మ తప్ప అన్నీ కనిపిస్తున్నాయి. అదే భ్రాంతి.

ఎప్పుడైతే తాడు అని తెలిసిపోయిందో ఇంక పాము అనే భయభ్రాంతులు పోయాయి. అంతవరకు పాము అనే భ్రాంతికి అధిష్ఠానం తాడు. ఇప్పుడు సత్యం ఏది? అధిష్ఠానమే తప్ప భ్రాంతి కాదు. భ్రాంతి అయిన జగత్తు మిథ్య. అధిష్ఠానమైన పరమాత్మే సత్యం. ఇదే బ్రహ్మసత్యం జగన్మిథ్య. ఇదే 'మిథ్యాజగదధిష్ఠానా'.

ఇది తెలిస్తే ఇంక ఏం మిగిలింది? 'నేను' అనబడేది కూడా అదే అని గ్రహించగలుగుతాం. స్వాత్మజ్ఞానం లభిస్తుంది. ఆ జ్ఞానం మనకి ఆ పరమాత్మ

అనుగ్రహం వలన కలగాల్సిందే. మనకి అంత భ్రాంతిని కల్పించినవాడే ఒక్కసారి ఇంద్రజాలం చూసి మూర్ఛపోతే, "అరెరే భయపడిపోయావా ఇదంతా నా ఇంద్రజాలమే" అని చెప్తాడు. అదేవిధంగా అమ్మవారు మనల్ని అనుగ్రహించి 'ముక్తిదా' – ముక్తిని ఇస్తుంది. ముక్తి ఏదైనా వస్తువా ఎక్కడనుండైనా తేవడానికి! ఒక వస్తువు కాదు. ముక్తిరూపిణి – ఆవిడే మోక్షస్వరూపిణి. **'ఏకమేవాద్వితీయం బ్రహ్మ'** (ఉపనిషత్తు). **"నేహ నానాస్తి కించన"** (ఉపనిషత్తు). **"సర్వం ఖల్విదమేవాహం నాన్యదస్తి సనాతనం"** (దేవీభాగవతం), **"యత్ర త్రిసర్గో మృషా"** – ఇవన్నీ **'బ్రహ్మ సత్యం జగన్మిథ్య'** వాదాన్ని చెబుతున్నాయి.

736. ముక్తిదా – శ్రీ ముక్తిదాయై నమః

మనకి తాడు పాము కాదని తెలిసింది. అలా తెలిశాక కొత్తగా ఆ తాడు తాడయ్యిందా! పాముదనం కొత్తగా పోయిందా! అది తాడుగానే ఉంది. అది ఎప్పుడూ ముక్తిరూపమే. బంధమే భ్రాంతి. మోక్షమే సత్యం. సత్యాన్ని తెలుసుకోవడమే మోక్షం పొందడం. అమ్మవారు మోక్షదాయినీ అని ఈ నామం చెప్తోంది. ఇంతవరకు ఇంద్రజాల ఉపమానం చెప్పినా, శుక్తిరజత భ్రాంతి చెప్పినా, రజ్జుసర్పభ్రాంతి చెప్పినా చక్కగా అర్థమైనట్లు అనిపిస్తుంది. కానీ అది అనుభవం మహాకష్టం. చాలా శ్రద్ధగా వింటేగాని వేదాంతం అర్థం కాదు. పరమేశ్వరి దయలేనిదే జిజ్ఞాస, జ్ఞానమూ – రెండూ సాధ్యం కావు.

737. ముక్తిరూపిణీ – శ్రీ ముక్తిరూపిణ్యై నమః

ముక్తి మనం లాక్కుందామంటే రాదు. ఆవిడ అనుగ్రహం వల్లనే వస్తుంది. **'ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే'** – ఏ జ్ఞానం లేకపోయినా అమాయకమైన భక్తితో అమ్మని ఆశ్రయిస్తే నెమ్మది నెమ్మదిగా పక్వత కలిగించి చిత్తశుద్ధిని, జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. జ్ఞానానుభవమే మోక్షం. అది తల్లి దయవలనే రావాలి. ఎందుకంటే ఆవిడే దక్షిణామూర్తిరూపిణీ, నటేశ్వరీ.

"మాయామాత్రమిదం ద్వైతం అద్వైతం పరమార్థతః" అని ఆదిశంకరులు గొప్పగా చెప్పారు. పరమార్థ దృష్టిలో ప్రపంచము అసత్యం. వ్యవహారంలో ఇదే సత్యం. ఇదంతా వ్యవహార ప్రకల్పితం.

తస్మాద్విముక్తిమన్విచ్ఛన్ పార్వతీం పరమేశ్వరీం

ఆశ్రయేత్సర్వభూతానాం ఆత్మభూతాం శివాత్మికాం (కూర్మపురాణం)

'ముక్తిని కోరేవారు పార్వతీదేవిని ఆశ్రయించాలి. ఆమె సర్వప్రాణులకు ఆత్మయైనది – పరమేశ్వరి – మంగళరూపిణి'.

యేఽర్చయంతి పరాం శక్తిం విధినా అవిధినాపి వా

న తే సంసారిణో నూనం ముక్తా ఏవ న సంశయః (బ్రహ్మాండపురాణం)

'శాస్త్ర పద్ధతిలోగానీ, లేకున్నా కానీ పరాశక్తిని పూజించినవారు సంసారంలో పడరు. తప్పక ముక్తి పొందుతారు. సంశయం లేదు.

నిరాలంబోపనిషత్ ఒక మాట చెప్తోంది. ఇప్పుడు మనం చూస్తున్న నామములు, రూపములు, నియమములు, ధర్మాలు, కర్మలు – ఇవన్నీ **'వ్యవహార ప్రకల్పితం' –** వ్యవహారం ఉన్నంతవరకూ ఇవి అన్నీ ఉంటాయి. ఎన్ని వేదాంతాలు వల్లించినా ఈశ్వరానుగ్రహం లేనిదే మోక్షం రాదు కనుక అమ్మ ఇవ్వాలి, మనం పుచ్చుకోవాలి కాబట్టి ముక్తిదా. ముక్తిని ఇచ్చునది. ముక్తే తానైనది.

వెంటనే మోక్షం ఇచ్చేస్తుందా అంటే మొట్టమొదట సద్యోముక్తి ఇవ్వకపోయినా, క్రమముక్తి ఇస్తుంది. క్రమంగా వానికి మోక్షం ఎప్పటికైనా వస్తుంది. అదే విచారణలోకి వెళితే తొందరగా లభిస్తుంది. అమ్మ ఎలాగైనా 'ముక్తిప్రదాయినీ' అని దీని సారాంశం. అదే 'ముక్తిరూపిణీ'. ఇదంతా 'సరస్వతీ' 'శాస్త్రమయీ' నామాలకు ముగింపు వాక్యంగా చెప్పుకోవచ్చు.

'నటేశ్వరీ'తో మొదలు పెట్టారు కనుక ఆ నటనకు సంబంధించిన నామాలు వస్తున్నాయి. తరువాత నామం 'లాస్యప్రియా'.

738. లాస్యప్రియా – శ్రీ లాస్యప్రియాయై నమః

లాస్యమంటే ప్రీతికలది. ఆ ప్రీతి చేతనే లాస్యమాచరిస్తున్నది.

కల్పోప సంహరణ కేళిషు పండితాని

చండాని ఖండపరశోరపి తాండవాని

ఆలోకనేన తవ కోమలితాని మాతః

లాస్యాత్మనా పరిణమంతి జగద్విభూత్యై

కల్పాంతకాలంలో పరమేశ్వరుడు చేసే తీవ్రమైన తాండవాలు అమ్మవారి ఆలోకనం చేత కోమలములుగా మారి లాస్యరూపంగా జగతికి మేలుకలిగేలా పరిణమిస్తున్నాయి.

'లాస్యప్రియా, లయకరీ, లజ్జా, రంభాదివందితా' – ఈ నామాలన్నీ అమ్మవారి లాస్యకళకి సంబంధించిన నామాలు. అమ్మవారు మహారాణి. ఆవిడ సభలో కూర్చున్నప్పుడు అమ్మవారిని సంతోషింపజేయడానికి కొందరు కావ్యాలు పలుకుతున్నారు. కొందరు సంగీతం వినిపిస్తున్నారు. కొంతమంది లాస్యం చేస్తున్నారు. ఆ లాస్యం చూస్తుంటే అమ్మవారికి ప్రీతిగా ఉంది. **'లాస్యదర్శనసంతుష్టా'** అని త్రిశతిలో వస్తుంది. **'హల్లీస లాస్య సంతుష్టా'** – హల్లీసకము అని లాస్యకేళిలో ఒకానొక ప్రక్రియ. ఈ లాస్యం అమ్మవారి సభలో ప్రదర్శిస్తున్నారు. అది చూస్తూ ఆవిడ ప్రీతితో ఆనందిస్తోంది. ఇది లాస్యప్రియా.

'రంభాదివందితా' అన్నారు. రంభాది అప్సరసలు మణిద్వీపంలో అమ్మవారి కొలువులో ఆవిడ ప్రీతి కోసం లాస్యం చేస్తున్నారు. వారు ఆ రూపంలో అమ్మవారికి వందనం చేస్తున్నారు. ఒకొక్కరు వారి వారి శక్తులతో అమ్మవారికి నమస్కారం చేస్తూ ఉంటారు. ఒకరు సంగీతంతో కీర్తిస్తారు. ఇంకొకరు సాహిత్యంతో స్తుతిస్తారు. వారికి వచ్చిన కళలతో వారు చేస్తారు. ఏవైనా అమ్మవారికి వందనాలే. నృత్యం దర్శయామి, గీతం శ్రావయామి, ఆందోళికానారోహయామి అంటుంటాం. నృత్యం కూడా అమ్మవారి సేవలలో భాగమే. ఆ సేవ చేస్తున్నది రంభాది అప్సరఃకాంతలు. వారు అందులో ఆరితేరినవారు. వారి లాస్యరూప ఆరాధనకు ఫలదానోన్ముఖమైన కృప కలిగినది –

అని అర్థం. అందులో ఆరితేరిన వారు.

లాస్యమంటే నాట్యం. నాట్యంలో కొన్ని భేదాలు ఉంటాయి. లాస్యం, తాండవం అని రెండు ఉన్నాయి. తాండవం పరమేశ్వరుడే చెయ్యగలడు. అమ్మవారు లాస్యమే చేస్తుంది. శంకరభగవత్పాదులవారు ఈ మాటని చక్కగా చెప్తూ పరమేశ్వరుని **'సమస్త సంహారక తాండవాయ'** అన్నారు. అమ్మవారిని **'సమస్త సృష్ట్యున్ముఖలాస్యకాయై'** అన్నారు.

తాండవం అనేది ఉద్ధతితో కూడుకొని ఆర్భటీ వృత్తితో ఉంటుంది. ఇవి భరతుడు నాట్యశాస్త్రములో వాడిన పదాలు. ఉద్ధతి అంటే దీనిని పురుషుడు మాత్రమే ప్రదర్శించగలడు. ఆర్భటీవృత్తితో కూడి ఉన్న నాట్యానికి తాండవం అన్నారు.

అలా కాకుండా కోమలంగా చేసే నాట్యాన్ని లాస్యం అన్నారు. ఇది నాట్యశాస్త్ర శబ్దం. కైశికీవృత్తితో కోమలంగా చేసేది లాస్యం. ఈ లాస్యతాండవాల మేళనమే ప్రపంచం.

అమ్మవారు లాస్యం చేస్తూ ఉంటే సృష్టి, స్థితులన్నీ సాగుతూ ఉంటాయి. పరమేశ్వరుడు తాండవాన్ని పెంచితే ఇదంతా లయం అవుతుంది. ఈ రెండిటిలోనే పంచకృత్యాలు దాగి ఉన్నాయి.

దక్షిణామూర్తి స్వరూపంలో, నటరాజ స్వరూపంలో ఎడమచెవికి తాటంకం, కుడిచెవికి మకరకుండలం పెట్టుకోవడంలో అర్థం లాస్యం, తాండవం కలిసి సాగుతుంటేనే ప్రపంచమంతా నిర్వహించబడుతోంది అని చెప్పడం. లాస్యతాండవాలు కేవలం నాట్యశాస్త్రంలోనే లేవు. ప్రపంచంలో ఉన్నాయి. మన బ్రతుకులో ఉన్నాయి.

739. లయకరీ – శ్రీ లయకర్యై నమః

అమ్మవారు లాస్యం మాత్రమే కాకుండా లయం కూడా చేస్తుంది కాబట్టి 'లాస్యప్రియా' 'లయకరీ' నామాలు రెండిటిని ప్రక్కప్రక్కనే పెట్టారు. లయమనేది నాట్యానికి చాలా ముఖ్యం.

'తాళైః నృత్యగీతయోః సమకాల పరిచ్ఛేదోవా లయః తస్య కరీ కర్త్రీ లయకరీ' అన్నారు. తాళం వేస్తూ అటు నృత్యాన్ని, ఇటు గీతాన్ని రెండిటిని సరైన సమయంలో

చక్కగా కలుపుతూ, ఏది ఎక్కడ ఏ కాల భేదంలో తెగాలో తాళం వేసి తెలుసుకుంటారు. ఆ సమయ రూపమే లయ.

మన ఊపిరి ఒక లయలో సాగుతుంది. మనం దానిని పరిశీలించకపోయినా దాని పని అది చేస్తూ ఉంటుంది. సృష్టిలో ప్రతిదానిలో ఒక లయ ఉంటుంది. ప్రతిదీ ఒక పద్ధతిలో వెళ్ళే దానికి లయ అంటారు. లయ అంటే నాశనమని కాదు. సూర్యుడు ఉదయించాడు. తిరిగి అస్తమించాడు. ఇందులో ఒక లయ ఉంది. మనం నడుస్తున్నప్పుడు ఒక చెయ్యి ముందుకు వస్తే మరొక చెయ్యి వెనుకకు వెళ్తూ ఉంటుంది. ఒక లయాత్మకమైన కదిలిక ప్రపంచంలో కనబడుతోంది.

ఈ కదలికతోనే ప్రపంచం సాగుతోంది. సృష్టి సాగుతోందంటే లయ ఉంది అని అర్థం. ఋతువులు మారుతూ ఉన్నాయి. వస్తూ ఉన్నాయి. ఇవన్నీ ఒక లయలో ఉన్నాయి.

లయకారకుడంటే మొత్తం ప్రపంచాన్ని లాగేస్తాడని అర్థం కాదు. లయబద్ధంగా ప్రపంచాన్ని నడిపేవాడు.

ఆ క్రమబద్ధమైన కదలికని కలిగించే తల్లి కనుక 'లయకరీ'. ఈ కదలిక ఆమె చూపిస్తున్న లాస్యంలో ఒక భాగం. ఇది తెలుసుకుని ప్రపంచాన్ని చూస్తే ప్రపంచమంతా అమ్మ, అయ్యల నాట్యమేనని మనకి తెలుస్తుంది. 'చిత్త' ధ్యేయవస్తువులో ఐక్యం (లీనం) కావడాన్ని కూడా 'లయ' అంటారు. **'దశధ్యానసమో లయః'** – పది ధ్యానాలతో సమానం లయ. ధ్యానం కంటే శ్రేష్ఠమైన బ్రహ్మైక్యాన్ని సాధకునకు కలిగించునది లయకరీ.

ప్రపంచాన్నంతటిని తన లాస్యంతో లయబద్ధంగా నడిపిస్తూ ఇంక సమయం అయిపోయింది అని తలచుకున్నప్పుడో, కల్పాంతకాలంలోనో, మరో కాలంలోనో లోపలకి లాగేసుకుంటుంది. లోపలికి లాగడాన్నే 'లజ్జా' అని తరువాత నామంలో చెప్తున్నారు.

740. లజ్జా – శ్రీ లజ్జాయై నమః

'లజ్జా' అనే శబ్దానికి బిడియం లేదా ముడుచుకొనుట అని అర్థం. ఇక్కడ

చెప్పబడుతున్న బీజాక్షరం 'హ్రీం'. హ్రీ అంటేనే లజ్జ. లోపలకి ముడుచుకొనుట. లోకంలో కూడా లజ్జ అంటే అంతే.

'యా దేవీ సర్వభూతేషు లజ్జా రూపేణ సంస్థితా'. లజ్జ అంటే ఇది పారమార్థికమైన అర్థం. వ్యవహారంలో లజ్జ అంటే సిగ్గు.

లాస్యప్రియా అయిన ఆ తల్లి పరమేశ్వరునితో కలిసి అంత చక్కగా లాస్యం చేస్తూ అందులో మళ్ళీ బిడియాన్ని ప్రకటిస్తోంది. లజ్జ అనేది ఉత్తమమైన స్త్రీకి ఉండే బిడియమనే గుణము.'దేవీమాహాత్మ్యం'లో అమ్మవారి గురించి చెప్తూ –

'యా శ్రీః స్వయం సుకృతినాం భవనేష్వలక్ష్మీః
పాపాత్మనాం కృతధియాం హృదయేషు బుద్ధిః
శ్రద్ధా సతాం కులజన ప్రభవస్య లజ్జా
తాం త్వాం నతాః స్మ పరిపాలయ దేవి విశ్వమ్' అన్నారు.

"ఉత్తములైన వారిలో నువ్వు లజ్జారూపంలో ఉంటావమ్మా!" అని కీర్తించారు. సిగ్గు, బిడియం ఇవన్నీ ఉత్తమగుణాలు. ఎవరైనా సిగ్గుతో తలవంచుకున్నారంటే వారికి ఉత్తమ సంస్కారాలు ఉన్నాయని అర్థం.

'లజ్జా' అనేదానికి మరొక శాస్త్రీయమైన అర్థం ఉంది. అధర్మం చేయడానికి వెనుకాడడమే లజ్జా. చూసేవారెవరూ లేకపోయినా అది తప్పు అనే బుద్ధితో అధర్మం నుండి వెనకకు తిరిగిపోవడమే లజ్జా. అది ఉత్తమ సంస్కారం ఉన్నవారికి సహజంగానే ఉంటుంది. ఉత్తమ పురుషుల యందు 'అధర్మం చేయడానికి వెనుకాడే గుణం'గా ఉన్న తల్లి అని మరొక అర్థం. తరువాత నామం 'రంభాదివందితా'.

741. రంభాదివందితా – శ్రీ రంభాదివందితాయై నమః

రంభాది అప్సరసలచేత నమస్కరింపబడుతున్నది. సర్వవిధ దేవకాంతలు అమ్మవారి కొలువులో ఉన్నారు. దేవజాతులు ఎన్నెన్ని ఉన్నాయో అన్నీ అమ్మవారి కొలువులోనే ఉన్నాయి.

'దాసీభూత సమస్త దేవవనితాం' – అనేక దేవజాతులలో అప్సరఃకాంతలు

ఒకరు. వారు అమ్మ ముందు లాస్యము చేసి ఆనందింపజేస్తూ ఉంటే ఆవిడ లయకరిగా సంతోషిస్తోంది.

ఆవిడ చూపించిన ఈ జగత్తంతా లాస్యం. ఆ లీల ఆవిడకి ఆనందం కనుక 'లాస్యప్రియా'. అది అమ్మవారు లీల అని ఎవరైతే తెలుసుకుంటారో వారిని అమ్మవారు 'లయకరీ'గా అనుగ్రహిస్తుంది. లయము అంటే మోక్షము. **అత్యంతిక లయాన్ని మోక్షం** అంటారు. లయమంటే లీనమగుట అని అర్థం. లయకరీ అంటే లీనం చేసుకునేది. పరమాత్మలో లీనమవడమే. ఆ లీనమవడం అమ్మవారే అనుగ్రహించాలి. పిల్లవాడు అమ్మ ఎత్తుకోవాలని చెయ్యి చాచగలడే గాని, తల్లే వానిని ఎత్తుకోవాలి.

ముక్తి కావాలనే తహ తహ మనకి ఉండాలి. ముక్తి అమ్మే ఇవ్వాలి. ముక్తి అంటే ఏమిటి? మరణించడం మోక్షం కాదు. మనోలయమే మోక్షం. మనస్సు పరమాత్మలో లయం అయిపోవాలి. మనస్సు ఇంక ఉండకూడదు. మనస్సుని లయింపజేసి మోక్షం ఇచ్చేది కాబట్టి లయకరీ అంటే మోక్షదాయినీ.

'లజ్జా రంభాదివందితా' – 'లజ్జాపదసమారూఢా', 'లంపటా,' 'లకులేశ్వరీ' అని లలితాత్రిశతిలో వస్తాయి. లజ్జాపదసమారూఢా – లజ్జాపదముపై చక్కగా కూర్చున్నది.

లజ్జా పదం అంటే లజ్జను తెలియజేసే శబ్దం హ్రీం. లజ్జాపదసమారూఢా అంటే హ్రీంలో కూర్చున్న తల్లి. 'హ్రీంకారాసన గర్భితానలశిఖాం'

రంభాదివందితా – రం – రకారం అగ్నిబీజం. అగ్నిబీజ ప్రధానంగా ఉన్న హ్రీం మొదలైన బీజాక్షరాలచేత నమస్కరింపబడుతున్నది. ఇది దీనికి ప్రధానమైన అర్థం. మంత్రశాస్త్రంలో హృల్లేఖకి రంభా అని అర్థం ఉంది. రంభ–ఆది–వందిత అంటే హృల్లేఖ అనగా హ్రీంకారం మొదలైన బీజములచేత నమస్కరింపబడుతున్న తల్లి.

హ్రీం అంటే మొత్తం లోపలికి లాగుకొనుట (అంతర్ముఖులను చేయుట) అని హ్రీంకారీ, హ్రీమతీ, హృద్యా నామాల సందర్భంగా విశేషంగా వివరించుకున్నాం. హ్రీం పదశక్తిని ఇక్కడ చూపిస్తున్నారు.

'లయకరీ, లజ్జా, రంభాదివందితా'లకి చెప్పుకున్న అర్థాలు: మొట్టమొదట నాట్యపరమైన అర్థం. రెండవది వ్యవహారంలో ఉన్న అర్థం. ధర్మము మొదలైన వాటి పరంగా తాత్త్వికమైన అర్థం, చివరిగా మంత్రశాస్త్రపరమైన అర్థం చెప్పుకున్నాం.

'లజ్జారంభాదివందితా' అంటే హ్రీంబీజస్వరూపిణి. ఒక్క హ్రీం మాత్రమే కాదు. హ్రీం మొదలైన బీజాక్షరాలచేత నమస్కరింపబడుతున్న తల్లి.

742. భవదావసుధావృష్టిః – శ్రీ భవదావసుధావృష్ట్యై నమః

భవదావసుధావృష్టిః, పాపారణ్యదవానలా,
దౌర్భాగ్యతూలవాతూలా, జరాధ్వాంతరవిప్రభా,
భాగ్యాబ్ధిచంద్రికా, భక్తచిత్తకేకిఘనాఘనా,
రోగపర్వతదంభోళిః, మృత్యుదారుకుఠారికా.

ఇది ఒక గుత్తి. ముఖ్యమైన గొప్ప నామాల వరుస. ఇందులో మొత్తం ఎనిమిది నామాలు ఉన్నాయి. ఈ ఎనిమిది నామాలు ఒకే అంశాన్ని చెప్తున్నాయని వాటిల్లో చూపిస్తున్న భావమే చెప్తోంది.

కవిత్వానికి ఆలోచనామృతమనే లక్షణం ఉంది. పైపైన చెప్పే అర్థం కాకుండా ఆలోచిస్తున్న కొద్దీ ఇంకా ఊరుతూ ఉంటాయి. లలితాసహస్రనామాలు పేర్లతో కూర్చిన కవిత్వం. కవిత్వంలో ఔచిత్యమే రసమని క్షేమేంద్రుడు చెప్పాడు. ఒకొక్క దానికి అర్థం తీస్తూ ఉంటే రసానుభూతి సిద్ధిస్తుంది.

'భవదావసుధావృష్టిః' నుండి 'మృత్యుదారుకుఠారికా' వరకు ఉన్న ఎనిమిది నామాల కూర్పు ఒక అద్భుతం. దీనిని నిత్యపారాయణం చేసుకుంటే తమ జాతకం ఎలా ఉందో మరొకరికి చూపించనక్కర్లేదు. ఈ ఎనిమిది నామాలు జాతకంలో ఉన్న సర్వదోషాలు తీసివేస్తాయి. దీనికి 'శ్రీమాత్రే నమః' అని సంపుటితం చేసుకోవచ్చు.

'శ్రీమాత్రే నమః' ముందు చెప్పి 'భవదావసుధావృష్టిః' ప్రారంభించుకుని 'మృత్యుదారుకుఠారికా' వరకు శ్రద్ధగా చదువుకుని మళ్ళీ 'శ్రీమాత్రే నమః' అని పూర్తి చేసుకుంటే ఒక సంపుటి అవుతుంది. జీవితంలో ఎన్ని రకాల బాధలు గ్రహాల

వల్ల కలగవలసి ఉన్నా ఈ నామాల స్మరణ వాటన్నిటిని తొలగిస్తుంది. అంత విశేషం ఈ నామాలలో ఉంది. దీనికి జ్యోతిషశాస్త్రపరమైన అర్థం కూడా ఉంది.

ముందు ఈ నామానికి పైపైన అర్థం చెప్పుకొని తరువాత జ్యోతిషశాస్త్రపరంగా ఎలా అన్వయించుకోవాలో చూద్దాం. భవ అంటే సంసారం. దావ అంటే దావాగ్ని. సంసారమనే దావాగ్నిని ఆర్పే అమృత వర్షం భవదావసుధావృష్టి.

సంసారం ఒక దావాగ్నిలా రగిలిపోతోంది. దావాగ్నిలో ఎన్ని నీళ్ళు పోసినా ఆరదు. ఆ సమయంలో కురవాల్సింది కుంభవృష్టి. ఒక్క కుంభవృష్టి కురిస్తే మొత్తం దావాగ్ని ఆరిపోతుంది. నిరంతరం తాపత్రయాలతో ఉన్న సంసారమే భవదావాగ్ని. ఆ దావాగ్ని ఆర్పాలంటే సాధారణ వృష్టి చాలదు. అమృతవృష్టి కావాలి. అలాంటి అమృతవృష్టి అమ్మవారు. అమృతవృష్టి అంటే రెండర్థాలు ఉన్నాయి. అమృతవృష్టి అంటే ఇంతే కురవగలను, ఇంక కురవలేను అని ఆగిపోకుండా కావలసినంత కురవడం. ఎంత వాన పడితే అగ్ని ఆరిపోతుందో అంత! జ్వాల ఆరిపోతే లాభం లేదు. తాపం కూడా ఆరిపోవాలి. ఒకోసారి నిప్పు ఆరిపోతుంది. వేడి మిగిలిపోతుంది. నిప్పు, వేడి మొత్తం పోయి శాంతి రావాలి.

కొన్ని అడవులు రోజుల తరబడి మండుతూ ఉంటాయి. అలాగే ఈ సంసారమనే మంట కూడా జన్మల తరబడి మండుతోంది. ఎన్ని జన్మల నుంచి మండుతోందో! శాంతి లేదు. ఈ మొత్తం సంసారమంతా ఒక్కసారి శాంతించాలి. మన తాపత్రయం అంతా పోవాలంటే అమ్మవారు ఒక్కసారి అమృతవర్షిణిగా కురవాలి.

ముత్తుస్వామి దీక్షితులవారు భవ్యమైన కాశీక్షేత్రంలో మంత్రసిద్ధి పొందారు. అటునుండి వస్తూ తిరుత్తణి క్షేత్రంలో స్వామి దగ్గర నుండి తిరిగి తన గ్రామానికి వెళ్తూ అఖండ కాంచీమండలంలో ప్రవేశించారు. ఆ సమయంలో భయంకరమైన కరువుకాటకాలు ఆక్రమించుకుని ఉన్నాయి. అక్కడి పరిస్థితిని గమనించిన ముత్తుస్వామి దీక్షుతులవారు శ్రీవిద్యా సిద్ధుడు కనుక వెంటనే అమృతేశ్వరిని ధ్యానం చేసుకున్నాడు. ధ్యానం చేసుకోగానే రాగం పెల్లుబికింది. అమృతవర్షిణి రాగంలో అమ్మవారిని స్తుతించారు. "ఆనందామృత కర్షిణి అమృతవర్షిణి హరాది పూజితే! శివే! భవాని!"

అని కీర్తిస్తూ "సలిలం వర్షయ వర్షయ" అన్నారు. "అమృతం స్రావయ స్రావయ" అని అమృతేశ్వరిని స్మరించడం అలవాటు కనుక ఆ భావం ఒక్కసారి పెల్లుబికింది. నిత్యానుష్ఠానపరులైన ముత్తుస్వామిదీక్షితులవారి నుండి మంత్రమయమైన వాక్కు రాగానే వెంటనే కుంభవృష్టి కురిసింది.

అమ్మవారు సాధారణ తాపం పోగొట్టడమే కాదు - భవదావాగ్నినే పోగొట్టగలిగిన తల్లి. మరొక అర్థం - అమృతం అంటే మోక్షమే, ఆనందమే. అమ్మ కురిపించే వర్షమే అమృతవర్షం. ఇది సహస్రారకమలం నుండి డెబ్బైరెండువేల నాడులను తడుపుతున్న అమృతవృష్టి. అది కురిసిందా ఇంక ఈ సంసారం మరి లేదు.

"తాపత్రయాభీల దావాగ్నులారునే విష్ణుసేవామృత వృష్టి లేక" అంటాడు మహాభక్తశిఖామణి ప్రహ్లాదుడు (పోతనగారి భాగవతం).

ఈ సంసారతాపం పోవాలంటే అమ్మ కృప అనే వర్షం కురవాలి. నిరంతరం దేవిని ధ్యానిస్తూ ఉంటే ఆ వర్షం తప్పకుండా కురుస్తుంది. అమ్మని ఆశ్రయిస్తే ఈ భవదావాగ్ని చల్లారుతుంది. తాపత్రయ శాంతి లభిస్తుంది.

దావానలాన్ని ఆర్పడమే కాదు. ఆమెయే పెద్ద దావానలం.

743. పాపారణ్యదవానలా - శ్రీ పాపారణ్యదవానలాయై నమః

పరస్పర విరుద్ధనామాలు చెప్తున్నారు. ముందు నామంలో నిప్పు వల్ల బాధ అని చెప్పారు. కానీ నిప్పు వద్దు అని ఎవరైనా అనగలమా! నిప్పు బాధ పెడితే నీరు కావాలి. పనికి మాలిన కలుపు చెట్లు మానులై పెరిగిపోతే వాటిని తగలబెట్టడానికి మంటా కావాలి. రెండూ కావాలి. సంసారం అగ్నియై బాధిస్తే అమ్మవారు అమృతవృష్టిలా కురుస్తారు. పాపాలు దట్టమైన అడవిలా పెరిగిపోతే ఆ కీకారణ్యంలో అమ్మవారు దావాగ్నిగా మొత్తం పాపాలను తగలబెడతారు. అమ్మవారే నీరు. అమ్మవారే నిప్పు. మనకి ఎప్పుడేది అవసరమో ఆవిడే చూసుకుంటుంది.

పరమేశ్వరి తాపాల పాలిట నీరు. పాపాల పాలిట నిప్పు. పాపారణ్య దవానలా-పాపాలను అరణ్యంతో పోల్చడంలో విశేషం ఉంది. కీకారణ్యం అంటేనే

అది ఎవడో వ్యవసాయం చేసిన వనం కాదు. తనంత తాను పెరిగిపోయినది. అరణ్యాల్లో అంతుపట్టదు. ఏది మొదలో, ఏది కొనో తెలీదు. భయంకరంగా అల్లుకుపోతాయి. అలా మనలో పాపాలు అల్లుకుపోయాయి. తుది, మొదలు కానరాక వ్యాపించాయి. వీటిని నరికినా, అక్కడక్కడ కత్తిరించినా లాభం లేదు. వాటిని మొత్తం తగలబెట్టవలసిందే.

ఆ తల్లిని స్మరిస్తే ఈ పాపారణ్యాన్నంతటిని దహనం చేస్తుంది కనుక 'పాపారణ్యదవానలా'.

కాశీక్షేత్రంలో గంగ ప్రవహిస్తోంది. భాస్కరరాయలవారు భాష్యం రాస్తూ 'గంగాస్వరూపిణీ' అన్నారు. కాశీలో ఉన్న గంగ నీరు కాదు - నిప్పు అన్నాడు విశ్వనాథుడు. **'గంగ అస్మత్తేజోగ్నిగర్భ'** - గంగ నా తేజస్సుతో ఉన్న ఒక జ్వాల అన్నాడు. నీటి రూపంతో ఉన్న నిప్పే గంగ. అదే 'పాపారణ్యదవానలా' అని, **'గంగాయాః పరమం నామ పాపారణ్యదవానలః'** అని ఒక మాట కనబడుతోంది. 'పాపారణ్యదవానలః' అన్నారు కనుక గంగతో పోల్చి చెప్పారు. **అమ్మవారి నామస్మరణ మనలో జన్మజన్మల నుండి అల్లుకుపోయిన అంతుపట్టని పాపాలన్నింటిని తగలబెడుతుంది.** పాపనాశకమైన ఉపాసనాది సత్కర్మల రూపంలో ఉన్నది - అని కూడా గ్రహించవచ్చు.

కృతస్యాఖిలపాపస్య జ్ఞానతోఽజ్ఞానతోఽపివా
ప్రాయశ్చిత్తం పరం ప్రోక్తం పరాశక్తేః పదస్మృతిః (బ్రహ్మపురాణం)

తెలిసిగానీ, తెలియకగానీ చేసిన అన్ని పాపములకు పరాశక్తి పదస్మరణమే గొప్ప ప్రాయశ్చిత్తం.

744. దౌర్భాగ్యతూలవాతూలా - శ్రీ దౌర్భాగ్యతూలవాతూలాయై నమః

ఒక్కోసారి పనికిమాలిన దూది, బూజు పేరుకు పోయినప్పుడు పెద్దగాలి కొడితే మొత్తం ఎగిరిపోతుంది. అలా మన దగ్గర దౌర్భాగ్యమనే తూలం ఉంది. తూలం అంటే దూది. ముందు అమ్మవారు నీరు అయ్యారు. తరువాత నిప్పు అయ్యారు.

ఇప్పుడు గాలి అయ్యారు. మొత్తం పంచభూతతత్త్వాలు కనబడుతున్నాయి. దూదిని ఎగరగొట్టినట్టుగా అమ్మవారు గాలిలా వీచి మన యొక్క దౌర్భాగ్యాల్ని ఎగరగొడుతుంది. అమ్మని ఆశ్రయిస్తే దౌర్భాగ్యం పోతుంది. కలసి వస్తే సౌభాగ్యం. కలసిరాకపోతే దౌర్భాగ్యం.

దౌర్భాగ్యాన్నే దురదృష్టం అంటారు. **'దైవం దిష్టం భాగదేయం అదృష్టం'** అంటోంది అమరకోశం. అదృష్టం అంటే భాగ్యం. దురదృష్టం అంటే దౌర్భాగ్యం. ఈ మాట చెప్పడంలో చాలా విశేషం ఉంది. చాలా మంది "ఎన్ని పూజలు చేసినా మన దురదృష్టాన్ని ఎవరు తొలగించగలరండి?" అంటుంటారు. అది చాలా తప్పు మాట. మనం ఎన్ని చేసినా ప్రారబ్ధం అనుభవించక తప్పదు కదా! అంటే శంకరభగవత్పాదా చార్యులవారు దానిని 'దురక్షరం' అన్నారు. దురక్షరం అంటే కూడని మాటలు. అలా అనడం పాపం అని చెప్పారు. దురదృష్టాన్ని మనం తొలగించుకోలేం కానీ అమ్మ తొలగించగలదు. మనం చెయ్యాల్సింది అమ్మవారిని ఆశ్రయించడమే.

లక్ష్మీసహస్రనామాలలో **'సదదృష్టప్రదాయినీ'** అనే నామం ఉంది. సత్ అదృష్టప్రదాయినీ అంటే 'దురదృష్టవిఘాతినీ' కూడా అమ్మవారు. వాతూల అంటే పెనుగాలి. దౌర్భాగ్యాలనే దూదిని చెదరకొట్టే పెనుగాలి.

మనల్ని బాధించడానికి దుఃఖాలు ఏ రూపం ధరిస్తే దానిని పోగొట్టడానికి అమ్మవారు మరో రూపం ధరిస్తున్నారు. బాధించే దుఃఖం నిప్పైతే అమ్మవారు నీరై వస్తున్నారు. పాపం అడవైతే అమ్మవారు అగ్నియై అనుగ్రహిస్తోంది. దౌర్భాగ్యం దూదిలా అటు ఇటూ కమ్ముకుపోతే అమ్మవారు పెనుగాలిగా వీస్తున్నారు. అజ్ఞానం చీకటై ఆక్రమిస్తే లేదా జర చీకటిలా అక్రమించుకుంటూ ఉంటే అమ్మవారు సూర్యునిలా వస్తారని చెప్తున్నారు.

745. జరాధ్వాంతరవిప్రభా - శ్రీ జరాధ్వాంతరవిప్రభాయై నమః

ధ్వాంతము అంటే పెనుచీకటి. జరా అంటే ముసలితనము. ముసలితనమే పెను చీకటి అన్నారు. ఇంద్రియ పటుత్వం క్షీణిస్తే అంతా అయోమయమే. 'ద్రఢిష్ఠః

బలిష్ఠః ఆశిష్ఠః' - బలం కలిగినవారు మాత్రమే వేదాంతమార్గంలోకి రండి అని ఉపనిషత్ చెప్తోంది.

అధ్యాత్మమార్గం అంత తేలిక కాదు. బలహీనులందరూ చేరిపోతే దానిని వేదాంతమనరు. దృఢత్వం కావాలి. నిజమేగాని, జర ఆక్రమించుకొంటూ ఉంటే ఏం చెయ్యాలి? జర అంటే కేవలం ముసలితనంలో మాత్రమే వచ్చేది కాదు. కొందరు ముప్ఫై ఏళ్ళకే తొంభై ఏళ్ళవారిలా ఉంటారు. ఈ యుగంలో ఎక్కువ మంది జర చేతనే బాధపడుతూ ఉంటారు. క్రమశిక్షణతో కూడిన యోగ జీవితం లేదు. సదాచారం లేదు.

జర అంటే జీర్ణించే దశ అని అర్థం. 'వృద్ధా' నామం దగ్గర ఈ విషయం చర్చించుకున్నాం. వృద్ధ అంటే పెద్దరికం. జర అంటే క్షీణించడం. శరీరంలో జర ఆక్రమించడమంటే క్రమక్రమంగా శరీరశక్తులు, బుద్ధిశక్తులు క్షీణిస్తూ ఉంటే చీకటి కమ్ముకున్నట్లైపోతుంది.

జర చీకటిగా ఆక్రమించుకున్నప్పుడు అమ్మవారు రవిప్రభగా తేజస్సుని ఇస్తున్నారు.

746. భాగ్యాబ్ధిచంద్రికా - శ్రీ భాగ్యాబ్ధిచంద్రికాయై నమః

ఒక్కోసారి భాగ్యాలు వచ్చినపుడు కూడా మనం సరిగ్గా లేకపోతే అవి దాటిపోతాయి. దురదృష్టాలు వచ్చినపుడు మనకి తెలియకుండా పోవాలను కుంటున్నప్పుడు అదృష్టాలు కూడా అలాగే వెళ్ళిపోతుంటాయి. అత్యంత పుణ్యాత్మునికి రావలసిన కష్టం కూడా అలా పైపైన పోతుంది. అత్యంత పాపాత్మునికి రావలసిన సుఖం కూడా అలా పైపైన పోతుంది.

అమ్మవారిని ఆశ్రయించడం మొదలుపెట్టాక రావాల్సిన కష్టాల్ని పైపైన తీసేస్తుంది. రావాల్సిన సుఖాల్ని లాగి మరీ ఇతోధికంగా ఇస్తుంది. మనకి రెండూ కావాల్సినవే. కలసి వచ్చే కాలంలో మరిన్ని మంచిపనులు చెయ్యాలి. అన్నీ వరుసగా కలసి వస్తాయి కనుక ఆ సమయాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి.

మనకున్న అదృష్టం కూడా మరింత పొంగి రావాలంటే 'భాగ్యాబ్ధిచంద్రికా'. భాగ్యం ఒక సముద్రంవంటిది. నిండు పూర్ణిమనాడు వెన్నెల రాగానే సముద్రం ఎలా పొంగుతుందో, అమ్మ అనే నిండు వెన్నెల రాగానే భాగ్యం పొంగి వస్తుంది.

747. భక్తచిత్తకేకిఘనాఘనా - శ్రీ భక్తచిత్తకేకిఘనాఘనాయై నమః

కేకి అంటే నెమలి. భక్తుల చిత్తాలు నెమళ్ళు వంటివి. దట్టమైన మబ్బు వచ్చినపుడు నెమళ్ళు ఎలా పురి విప్పుతున్నాయో, అలా అమ్మ అనే మబ్బురాగానే భక్తుల మనస్సు అనే నెమలి పురి విప్పుతోందన్నారు.

అమ్మవారి భావన హృదయంలోకి వస్తే చాలు వారి యొక్క చిత్తం సంతోషభరితమౌతుంది. భక్తుల చిత్తానికి ఈ తల్లి ఆనందం కలిగిస్తుంది. భక్తులైన వారికి దుఃఖం ఉండదు సరి కదా వారింకా పొంగిపోయి ఆనందిస్తారు. అదృష్టాలని పొంగించింది కనుక ఆనందాలు పురి విప్పుతున్నాయి.

748. రోగపర్వతదంభోళిః - శ్రీ రోగపర్వతదంభోళ్యై నమః

దంభోళి అంటే వజ్రము. రోగాలనే పర్వతాల పాలిట అమ్మవారు వజ్రం వంటిది. ఒకప్పుడు ఇంద్రుడు తన వజ్రాయుధంతో పర్వతాల రెక్కలని నరికివేశాడు. అలాగే ఇక్కడ రోగాలన్నిటిని అమ్మవారు నరికి వేస్తోంది అని చెప్పడానికి 'రోగపర్వతదంభోళిః' అన్నారు.

రోగం పర్వతమని ఎందుకు చెప్పారంటే ఒకొక్కసారి రోగాలు "అవి పోతాయా! లేదా!" అన్నంత గట్టిగా కూర్చుంటాయి. ఒక పట్టాన పోవు. కొన్ని రోగాలు రానంత వరకు ఫరవాలేదు గాని, వచ్చాయంటే తొందరగా పోకుండా కొండల్లా కూర్చుంటాయి.

ఈ కొండల్లాంటి దీర్ఘకాలిక మొండి రోగాల్ని కూడా అమ్మవారు 'దంభోళి' వలె కొట్టి పారేస్తుంది. వజ్రం రెక్కలు తెంచడమే కాదు, పిండి చేయగలదు. ఇంద్రుడు పర్వతాల రెక్కలు కొట్టాడేమో గాని అమ్మవారు ఈ పర్వతాల్ని పిండి చేస్తోందని చెప్తున్నారు.

749. మృత్యుదారుకుఠారికా – శ్రీ మృత్యుదారుకుఠారికాయై నమః

మృత్యువనేది ఒక పెద్ద దారు. దారు అంటే ఒక పెద్ద మొద్దు. మొద్దు మానుని కొట్టడానికి పదును పెట్టిన గండ్రగొడ్డలి కావాలి. అమ్మవారు ఈ మృత్యువనే దారువుని పగులకొట్టే 'కుఠారికా' అంటే గండ్రగొడ్డలి వంటిది. మృత్యువుని పోగొడుతుంది.

'భవదావసుధావృష్టిః' నుండి 'మృత్యుదారుకుఠారికా' వరకు వివరించుకున్న భావాలన్నీ గ్రహిస్తే తెలుస్తుంది. అమ్మ అనుగ్రహం ఎన్ని రకాలుగా ఉంటుందో. అమ్మ అనుగ్రహం నీరయింది. నిప్పు అయింది. గాలి అయింది. సూర్యుడు అయింది. చంద్రుడయింది. మబ్బు అయింది. పిడుగు అయింది (పిడుగే వజ్రాయుధం). తరువాత గండ్రగొడ్డలి అయింది. అమ్మ కరుణ ఇన్ని రూపాలు ధరించి మనల్ని అనుగ్రహిస్తున్నది.

ఈ ఎనిమిది నామాలు జ్యోతిషశాస్త్రప్రకారంగా ప్రతివారికి జాతకంలో ఉండే ఎనిమిది భావాలను సవరిస్తాయి. జాతకచక్రం ప్రకారంగా చూస్తే జ్యోతిష శాస్త్రంలో **ఒకటవ** భావాన్ని **'భవకారకత్వము'** అంటారు. మన సంసారం పరిస్థితి దానిని బట్టి చెప్పవచ్చు. దాని మీద పనిచేసే నామం 'భవదావసుధావృష్టిః'.

'పాపారణ్యదవానలా' ఇది **రెండవ** భావానికి చెందినది. దీన్ని స్వార్జన కారకత్వం అంటారు. అర్థ సేకరణ దగ్గరే పాపం వస్తుంది. దానితో ఎప్పుడో చేసిన దోషాలు ఇప్పుడు అనుభవిస్తూ ఉంటారు. అది స్వార్జనకారకత్వం. ఆ దోషాన్ని పోగొడుతుంది కనుక 'పాపారణ్యదవానలా'

అదే విధంగా దురదృష్టం జాతకంలో **మూడవ** భావంగా చెప్తారు. దాన్ని పోగొట్టే శక్తి 'దౌర్భాగ్యతూలవాతూలా'.

లగ్నస్థానం శరీరకారకత్వము అంటారు. ఇది **నాలుగవ** భావం. శరీరం యొక్క పుష్టి ఇత్యాదులు అక్కడ నిర్ణయింపబడతాయి. ఆ దోషం పోవడం కోసం 'జరాధ్వాంతరవిప్రభా'. 'రవిప్రభా' అనడంలో ఆదిత్యోపాసన సూచించబడింది.

భాగ్యం **పంచమ**స్థాన కారకత్వంగా చెప్తారు. దాని మీద పని చేసేది 'భాగ్యాబ్ధిచంద్రికా'.

'భక్తచిత్తకేకిఘనాఘనా' అనేది మానసిక స్థితిని చెప్తారు. జాతకాన్ని బట్టి మనఃస్థితి(మనోవ్యావృత్తి)ని చెప్పవచ్చు. దానిని **సప్తమ**స్థాన కారకత్వం అంటారు. జ్యోతిషశాస్త్రంలో దీనినే చిత్తోత్థము అంటారు. వారి చిత్తం యొక్క పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పబడుతుంది. అవి సరిగ్గా లేకపోతేనే మానసిక రోగాలు వస్తాయి. వీటన్నిటిని ఆ స్థానం బట్టి చెప్పవచ్చు. ఆ మానసికరోగాలు పోగొట్టగలిగే శక్తి 'భక్తచిత్తకేకిఘనాఘనా' నామానికి ఉంది.

జ్యోతిషశాస్త్రంలో **ఆరవ**స్థానం రోగస్థాన కారకత్వంగా చెప్పబడుతుంది. ఆ రోగాలన్నీ పోగొట్టే శక్తి 'రోగపర్వతదంభోళిః'. జాతకంలో **ఎనిమిదవ** స్థానం మృత్యుస్థానం. దీనినే మారకం అంటారు. దానికి సంబంధించి నియంత్రణ చేసే నామశక్తి 'మృత్యుదారుకుఠారికా'.

మొత్తానికి జాతకంలో ప్రధానంగా ఎనిమిది రకాల భావాలు ఎలా ఉన్నప్పటికి అమ్మని ఆశ్రయించి ఈ నామాలతో వాటిని సవరించుకోవచ్చు. దీనిని మనం అనుసంధానం చేసుకోవచ్చు. ఒక అద్భుతమైన ఆయుధం మనకి లభించింది. బృహజ్జాతకం చెప్పిన ఎనిమిది కారకత్వాల సమష్టి అనుభవమైన జీవితాన్ని చక్కదిద్దే లలితాంబ అనుగ్రహం ఈ ఎనిమిది నామాలలో ప్రపంచితం.

'మృత్యుదారుకుఠారికా' అనేది చాలా విశేషమైన నామం. మరి జనన–మరణ పరంపరలలో పడకుండా మోక్షమిచ్చునది. మృత్యువనగా అజ్ఞానము. అజ్ఞానాన్ని చీల్చి చెండాడుతుందని చెప్పడమే దీనిలో పారమార్థికమైన ప్రయోజనం.

తరువాత 'మహేశ్వరీ' నామం నుండి 'పరాపరా' వరకు మంగళచండీవిద్య అనగా మంగళచండీ మంత్రవిశేషమంతా చెప్పబడుతున్నది.

750. మహేశ్వరీ – శ్రీ మహేశ్వర్యై నమః

ఇది వివరంగా 'మాహేశ్వరీ' నామం దగ్గర చెప్పుకున్నాం. ఇక్కడ ఈ నామం చెప్పడంలో ఉద్దేశం జగజ్జనని సృష్టి స్థితి లయలన్నీ సాగిస్తూ, మరల లోపలికి లాగుతున్నది. అలా లోపలికి లీనం జేయునదే మాయ. ఆ మాయ గురించి తెలిసింది

ఆవిడకి మాత్రమే. తన గురించి తనకే తెలుసు. **'మాయాంతు ప్రకృతిం విద్యాత్ మాయినంతు మహేశ్వరం'**. ఆ మాయాస్వరూపిణియై ఆ మాయను ఎప్పుడు ప్రయోగించాలో, ఎప్పుడు ఉపసంహరించాలో తెలిసిన తల్లికి 'మహేశ్వరీ' అని పేరు.

నిగ్రహానుగ్రహశక్తి ఉంది కనుక మహేశ్వరీ. మహేశ్వరుడంటేనే ఆయనకి మించిన ఈశ్వరుడు మరొకడు లేడని అర్థం. సర్వనియామకురాలని 'మహేశ్వరీ' నామానికి అర్థం.

తరువాత నామాలు 'మహాకాళీ', 'మహాగ్రాసా', 'మహాశనా' – ఈ మూడింటికి ఒకే అర్థం.

751. మహాకాళీ – శ్రీ మహాకాళ్యై నమః

మిక్కిలి నల్లనైనది.

అనంతకాలస్వరూపిణి.

ఆకాశం నీలం రంగులో ఉంటుంది. అనంత తత్త్వానికి సంకేతమే నీలం. అదే నల్లని వర్ణం. అదే కాళీ. అనంతాకాశరూపిణి అని అర్థం.

ఆ అనంత ఆకాశతత్త్వం మళ్ళీ ఈ జ్యోతిర్మండలాలన్నింటిని లీనం చేసుకుంటే మిగిలేది ఏది? ఆకాశంలో 'కృష్ణబిలం' దగ్గరకి ఏది వెళ్ళినా అది దానిని లోపలికి లాగేస్తుంది. ఇది గమనిస్తే బహుశా మన ఋషులు తపశ్శక్తితో ఆ మహాకాళీ దర్శనం చేశారా! అనిపిస్తుంది. లయకారిణి అయిన శక్తి దేనినైనా లోపలకి లీనం చేసుకుంటుంది. ఆ అనంతశక్తికి అంత విశేషం ఉంది. లోపలికి లాగివేసే స్వరూపమే 'మహాగ్రాసా', 'మహాశనా'.

రెండు మాటలు. రెండూ తినడం గురించే చెప్తున్నాయి. గ్రాసము అన్నా ఆహారమే. అశనము అన్నా ఆహారమే. రెండిటికి చిన్న తేడా ఉంది. ఒకేసారి మహాకబళంగా మింగేస్తే గ్రాసము. కొంచెం మింగుతున్నట్లు తెలిసినట్లు తింటే అశనము.

752. మహాగ్రాసా - శ్రీ మహాగ్రాసాయై నమః

753. మహాశనా – శ్రీ మహాశనాయై నమః

కొన్ని నశించిపోతున్నాయని తెలుస్తూ నశిస్తాయి. కొన్ని అసలు అంతుపట్ట కుండా పోతాయి. ప్రళయభేదాలు మనకి చెప్పడం కోసం 'మహాగ్రాసా', 'మహాశనా'. ఈ రూపాలతో ఉన్నది మహాకాళీ. అవాంతర ప్రళయాలు, మహాప్రళయాలు, చివరకు అత్యంతిక ప్రళయం కూడా ఈ తల్లి లీలలే.

'కాలో జగద్భక్షకః' అని ప్రసిద్ధి చెందిన శాస్త్రవాక్యము ఉంది. కాలం అన్నింటిని మ్రింగేస్తోంది. "అన్నింటిని మింగేసే కాలం నేనే" అని కృష్ణపరమాత్మ గీతలో చెప్పాడు. **'కాలోఽస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధః'** 'మొత్తం లోకాన్ని మింగేస్తున్నా' అన్నాడు. లేకపోతే నిన్న ఏమైంది? మొన్న ఏమైంది? ఎవరు మింగేశారు? మొత్తం వెళ్ళిపోయింది. చూస్తూ చూస్తూ ఉంటే అలా ఆడుకుంటూ తిరిగిన బాల్యం, తరువాత యౌవనం, ముసలితనం.

మనకి తెలియకుండానే రోజులు వెళ్ళిపోయాయి. ఇదంతా ఎవరు మింగేశారు? ఎన్ని మింగేసింది కాలం? 'కారే రాజులు రాజ్యముల్ కల్గవే గర్వోన్నతిన్ చెందరే' అని భాగవతంలో బలిచక్రవర్తి అంటాడు. ఒక్కసారి కాళిని తలచుకుంటే ఉన్న గర్వాలన్నీ పోతాయి.

ఈ తల్లి కాలాన్ని ఎలా మింగుతోందో చెప్తూ– **'యస్య బ్రహ్మ చ క్షత్రం చోభే భవత ఓదనః, మృత్యుర్యస్యోపసేచనం'** అని కఠోపనిషత్ చెప్తోంది. శక్తి ప్రళయకాలంలో మొత్తం ప్రపంచాన్ని ఎలా మింగుతోందంటే బ్రహ్మక్షత్రములతో సహా అన్నారు. బ్రహ్మక్షత్రములతో సహా అంటే... బ్రహ్మ అంటే బుద్ధిబలం. క్షత్రం అంటే శరీరబలం. శరీర బలాలు, బుద్ధి బలాలతో సహా అన్ని బలాలు మింగేస్తోంది ఆ తల్లి. మృత్యువును నంజుడు పదార్థంగా చేసుకుని ప్రపంచాన్ని మింగేస్తున్న పరమాత్మ అని వేదం చెప్పింది. సృష్టిలో అందర్ని మృత్యువు మింగుతుంది. ఆ మృత్యువుని అమ్మవారు నంజుడు పదార్థం చేసుకుని దాన్ని కూడా మింగేస్తోంది. ప్రళయకాలంలో మృత్యువు కూడా లేదు.

ఏతదంబ సదిదం తు నేతి నః

శంకయా హృది వికల్పలక్షణః

యో యమస్య ఖలు కాల్యతే త్వయా

భూత సంయమన కేళి కోవిదః (కాళిదాసచరితం)

"ఓ తల్లీ! ఈ జగత్తు సత్యమా? అసత్యమా? – అని మా మదిలో సందేహం చెలరేగుతోంది. ఆ వికల్ప బంధాన్ని నువ్వు పోగొడుతున్నావు. సకల ప్రాణులను నశింపజేసే ఆటలో నేర్పరి అయిన యముని సైతం నశింపజేస్తున్నావు కదా!"

విరించిః పంచత్వం వ్రజతి హరిరాప్నోతి విరతిం

వినాశం కీనాశో భజతి ధనదో యాతి నిధనమ్

వితంద్రీ మాహేంద్రీ వితతిరపి సమ్మీలితదృశా

మహాసంహారేఽస్మిన్ విహరతి సతి త్వత్పతిరసౌ

అని శంకరులు సౌందర్యలహరిలో చెప్పారు. 'వినాశం కీనాశో భజతి' – అందరిని మింగేసే యముని కూడా ప్రళయం మింగేస్తోంది. దిక్కులే లేవు. ఇంక దిక్పాలకులు ఎక్కడుంటారు? ఆ ప్రళయకాలంలో దిక్పాలకులకి కూడా దిక్కులేని స్థితి ఏర్పడింది. యముని కూడా మింగేసిందంటే ఆ ఊహ కేవలం భారతీయ ఋషి మాత్రమే చెయ్యగలడు. మృత్యువు కూడా లేదు. మొత్తం అందర్నీ పట్టుకుని లాగేసిన మహాప్రళయ స్థితిని ఈ నామాలలో చూపిస్తున్నారు.

'మహాకాళీ మహాలక్ష్మీ మహాసరస్వతీ' అంటాం. ఒక దృష్టిలో అయితే సరస్వతీ, లక్ష్మీ, కాళీ రావాలి. కాని కాళీ, లక్ష్మీ, సరస్వతీ అని ఎందుకు చెప్పారు! సృష్టి ఆరంభావస్థ అంటే సర్వమూ లీనమైన అవస్థ. కనుకనే అక్కడ ప్రారంభించారు.

ఈ సృష్టి చక్కగా కొనసాగాలంటే అన్నీ సమకూడుతూ హాయిగా ఉండాలి. అది లక్ష్మి. ఇదంతా అమ్మవారనే జ్ఞానం ఉంటే అప్పుడు మోక్షం వస్తుంది కనుక చిట్టచివరకి మహాసరస్వతి. మహాకాళీ అంటే అన్నింటిని తన కడుపులో పెట్టుకునే తల్లి. మొత్తం లాగేసుకోవడం అంటే మళ్ళీ తెచ్చేది ఆవిడే.

రామకృష్ణపరమహంస కాళీతత్త్వం గురించి చెప్తూ గొప్ప మాట చెప్పేవారు.

కలకత్తాలో ఒక ఆవిడ బుట్టలో బొమ్మలు తెచ్చి, ఆ బుట్ట అక్కడ పెట్టి, ఆ బుట్టలోంచి బొమ్మలన్నీ తీసి బయట పెట్టేది. కొందరు వచ్చి కొనుక్కొని వెళ్ళిపోయేవారు. సాయంకాలానికి మిగిలిన బొమ్మలు తీసి బుట్టలో పెట్టుకొని వెళ్ళిపోయేది. మర్నాడు పొద్దున్నవచ్చి బుట్ట తీసి, నిన్న అందరూ కొనగా మిగిలిన బొమ్మలన్నీ తీసి బయట పెట్టేది. ఇది చెప్పి ఒక్కసారి దండం పెడుతూ 'అమ్మా!' అన్నారు. ఏమిటిలా దండం పెడుతున్నారంటే 'మహాకాళీ!' అన్నారు.

ఈ వేళ సృష్టికి కావలసిన బొమ్మలన్నీ బయటకి తీసింది. ఎవరి కర్మలు అయిపోయాయో వారు మళ్ళీ బుట్టలోకి వెళ్ళలేదు. వారి పని అయిపోయింది. ఇంక మిగిలినవారు ఎవరున్నారో వారిని బుట్టలో వేసుకొంది. మళ్ళీ తరువాతి సృష్టి యందు బయటకి తీసుకొచ్చిందన్నారు. అలా గమనించారు ఆయన.

ఆవిడ 'లలజ్జిహ్వా'. ఎప్పుడూ నాలిక బయట పెట్టుకొని ఉంటుందంటే "నా నోరు ఎప్పుడూ మూత పడదు. మింగడమే నా పని" అని చెప్పడం.

మహదాదితత్త్వాలను, వాటితో కూడిన చరాచరజగద్రూప బ్రహ్మాండాలను కూడా లయం చేసేకునే పరమేశ్వరి.

754. అపర్ణా – శ్రీ అపర్ణాయై నమః

'ఆహారే త్యక్తపర్ణాऽభూద్యస్మాద్ధిమవతస్సుతా
తేన దేవైరపర్ణేతి కథితా పృథివీతలే' – అని పురాణవాక్యం

అమ్మవారు శివుని కోసం తపస్సు చేస్తున్నప్పుడు ఆహారంగా ఆకులు కూడా విడిచి పెట్టి తపస్సు చేసింది కనుక 'అపర్ణా' అన్నారు.

అపర్ణేతి నిరాహారా తాం మాతా ప్రత్యభాషత (బ్రహ్మపురాణం)

దేవతలు వచ్చి నమస్కారం చేశారు. అంతకు ముందు ఆవిడ ఫలాలు కూడా విడిచి పెట్టి తపస్సు చేసింది. తరువాత పర్ణాలు విడిచి పెట్టింది. ఫలాలను విడిచి పెట్టినపుడు అఫలా అనలేదు. పర్ణములు విడిస్తే 'అపర్ణా' అని ఎందుకన్నారు? ఈ నామాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. అమ్మవారికి 'అపర్ణా' అనే పేరు అంతకు ముందు

నుండి ఉంది. 'ఉమా' అనే పేరు మేనాదేవి అమ్మవారిని తపస్సుకి వెళ్ళవద్దని చెప్పినమాటే కాదు. ఉమా అంటే ఓంకారరూపిణి అని మునుపే ఉంది. అలాగే అపర్ణా అంటే ఒక అర్థం ఇచ్చారు గాని, అమ్మవారు ఎప్పుడూ అపర్ణే.

'అపగతం ఋణా యస్యాస్సా అపర్ణా' - ఋణములు లేని తల్లి. 'ఋణానుబంధరూపేణ పశుపత్నిసుతాదయః' - మనకి ప్రపంచం అంతా ఋణాల వల్లే కలిసి ఉంది. పరమేశ్వరికి ఎవరితోనూ ఋణం లేదు. దీనినే భాస్కరరాయలవారు అమ్మని స్తుతిస్తూ -

ఋణమిష్టమదత్త్వైవ త్వన్నామ జపతో మమ
శివే కథమపర్ణేతి రూఢిర్ఖ్యాయతే న తే - అన్నారు.

"అమ్మా! నీకు అపర్ణా అన్న పేరు ఉన్నదా, లేదా?" అన్నారు. "నేను నిన్ను ఇంత నమస్కరిస్తున్నాను కదా! నీ పేర్లు ఇన్ని కీర్తిస్తున్నాను కదా! ఒక్కసారి నాకు కనబడి నన్ను అనుగ్రహించి నిన్ను కీర్తించిన ఋణం తీర్చేసుకోకూడదా తల్లీ! 'ఒకవేళ తీర్చుకోలేదనుకో - నీకు అపర్ణా అన్న పేరే కుదరదమ్మా!" అన్నారు.

'అపర్ణా' నామాన్ని జపిస్తే మనకి ఉన్న ఋణాలు తీరుతాయి. అపర్ణా అంటే ఋణమోచనీ అని అర్థం. ఈ నామానికి, జ్యోతిష శాస్త్రానికి సంబంధం ఉంది.

అమ్మవారు సహజంగా 'అపర్ణా'. అపర్ణా అంటే ఆకులు లేని తీగ. మూలాధారం నుండి సహస్రారం వరకు పాకుతున్న కుండలినీ రూపమైన తీగయే 'అపర్ణా'. పరమేశ్వరుడు స్థాణువు. స్థాణువు అంటే మోడు. చిగురులు లేని చెట్టు. వారి అబ్బాయి పేరు విశాఖుడు. కొమ్మలు లేనివాడు. చాలా గొప్ప కుటుంబం. ఆయనేమో మోడు. ఈవిడేమో ఆకులు లేని తీగ. కొడుకు కొమ్మలు లేని వాడు. ఇందులో రమ్యమైన భావం చెప్పారు.

'ఆకులు ఉన్నాయంటే అది పెరిగిపోతుందని అర్థం. చిగుళ్ళు ఉన్నాయంటే ఇంకా విస్తరిస్తుందని అర్థం. కొమ్మలున్నాయన్నా అదే అర్థం. ఈ మూడు లేనివారు జన్మపరంపరలనే వికారాలుగా పెరగరు. అది స్థిరమైన చైతన్యమని అర్థం'.

'అపర్ణా లతికా' అంటే కుండలినీ. ఇది ప్రధానమైన అర్థం.

ఇప్పటివరకు పరమార్థం, యోగార్థం చెప్పుకున్నాం. ఇక మంత్రార్థం చూస్తే 'అపర్ణా' అనే నామ జపం చాలా విశేషమైనది. అపర్ణా అన్నప్పుడు శివుని కోసం తపస్సు చేస్తున్న అమ్మవారి రూపం. **'చీరవల్కల సంవీతా జటాసంఘాతధారిణీ'** అని ఆ రూపం ఎలా ఉంటుదో శివపురాణం వర్ణించింది. **'ఏకపాదస్థితా దేవీ'** - ఒక పాదం మీద నిలబడింది. ఎడమ పాదాన్ని కుడిమోకాలి దాకా తీసుకువచ్చి నిలబడినది. ఒక చేతిని చిన్ముద్రగా పెట్టి హృదయస్థానంలో ఉంచింది. పంచాగ్నిమధ్యంలో తపస్సు చేస్తూ ఉంది. **'పంచాక్షరీం జపంతీవ'** - నిరంతరం శివజపం చేస్తూ, శివునే ధ్యానిస్తున్న తపస్స్వరూపిణి.

'అపర్ణా' నామాన్ని జపిస్తే మన తపస్సు పండుతుంది. ఈమెకు 'తపఃకామాక్షీ' అని పేరుంది. తమిళనాడులో మాంగాడు దగ్గర ఈ క్షేత్రం ఉంది. అంతేకాక కామాక్షీ దేవాలయంలో ప్రధానంగా కూర్చున్న అమ్మవారి ప్రక్కన ఒక విగ్రహమూర్తి ఉంటుంది. ఆవిడకి 'సర్వశైవాలయేశ్వరి' అని మరొక పేరుంది. ఆవిడే 'తపఃకామాక్షీ'. తపోభంగిమలోనే ఉంటుంది. అపర్ణా. 'హృదయస్థా రవిప్రఖ్యా, శిరఃస్థితా చంద్రనిభా, ఫాలస్థేంద్రధనుఃప్రభా' - నామాలు భావిస్తే ఆ స్వరూపం అక్కడ కనబడుతుంది. క్రింద అగ్ని రగులుతోంది. కుండలినీ, చిదగ్నికుండం అంతా అదే మొత్తం సంకేతం. **పార్వతీకళ్యాణమంతా కుండలినీ యోగమే.**

'అపగత ఋణా అపర్ణా' - అప్పులు లేని తల్లి. అపర్ణానామంలో ఆ శక్తి ఉంది. అపర్ణా నామ జపం కుజదోషాల్ని పోగొడుతుందని జ్యోతిషరీత్యా వేత్తలు చెప్తారు.

'శ్రీ అపర్ణాయై నమః' - ఇదే మంత్రం. ఇది వివాహాలు కానివారికి వివాహం చేయిస్తుంది. తపస్సాధనలని పండిస్తుంది. సంతానాన్ని కలిగిస్తుంది. అంత శక్తి అపర్ణా శబ్దానికి ఉంది. కుజగ్రహ దోషం వల్లనే అప్పుల బాధలు ఉంటాయి. ఈ నామ జపం అప్పుల బాధలని పోగొడుతుంది. కటపయాది సంఖ్యాసూత్రం ప్రకారంగా అపర్ణా తొమ్మిది సంఖ్యను తెలియజేస్తుంది. తొమ్మిది కుజసంఖ్య.

మంగళచండీ విద్యకు సంబంధించిన నామాలని ప్రారంభించుకున్నాం.

'మహేశ్వరీ' నామం నుండి 'పరాపరా' నామం వరకూ మంగళ చండీ ఉపాసనా మర్మాలు ఉన్నాయని ఆ మంత్రశాస్త్ర ఉపాసకులు చెప్పిన విషయం. 'మహేశ్వరీ మహాకాళీ మహాగ్రాసా మహాశనా అపర్ణా'. మహాకాళీ దేవి ఉజ్జయినీ పీఠాధీశ్వరి అయిన తల్లి.

పర్ణములు కూడా విసర్జించి తపస్సు చేసిన తల్లి యొక్క తపస్స్వరూపాన్ని ఇందులో చూపించారు. అదేవిధంగా – ఋణములు లేనిది. ఋణములు లేకుండా చేయునది. జ్ఞానస్వరూపిణి అయిన ఆ తల్లి ఋణవిమోచనీ శక్తిగా చెప్పబడుతున్నది.

755. చండికా – శ్రీ చండికాయై నమః

దేవీమాహాత్మ్యంలో చెప్పబడే తల్లిని చండీదేవి అనే ప్రస్తావన చేస్తున్నాం. చండీ అన్నా, దుర్గా అన్నా, దేవీ అన్నా ఒకే అమ్మవారి స్వరూపం. అమ్మవారిని చండి అని ఎప్పుడనాలి? దీనికి లీలాపరమైన అర్థము, తత్త్వపరమైన అర్థము రెండూ ఉన్నాయి. **'చడి కోపే'** అనే ధాతువు నుండి 'చండీ' అనే శబ్దం వచ్చింది. కోపస్వరూపిణి అని చెప్పినప్పుడు చండీ. లోకంలో కోపం కూడా ఉంది. లేకపోతే ప్రచండమైన సూర్యకాంతిని గ్రీష్మకాలంలో చూడగలమా?

ప్రకృతిలో చండత్వము, సౌమ్యము రెండూ కనిపిస్తున్నాయి. ఏ ప్రకృతి మనల్ని సౌమ్యంగా అనుగ్రహిస్తుందో, అదే ప్రకృతి ఒక సమయంలో చండమౌతుంది. ఆయా జీవుల కర్మఫలంగా ఆ చండరూపం, సౌమ్యరూపం ఉంటూ ఉంటాయి. అలా ఆ తల్లి యొక్క చండరూపం జగత్తులో చూస్తున్నదే. ఇదే "నమస్తే రుద్రమన్యవ" అని కీర్తిస్తున్నాం. పరమేశ్వరుని యొక్క ఆ కోపాని(మన్యువు)కి నమస్కారం అని రుద్రం చెప్తున్నది. మన్యుసూక్తం ఎలాగూ ఉంది. దైవీయమైన ఈశ్వరాగ్రహాన్నే మన్యువు అనాలి. లోకనిర్వహణలో అది ఒక భాగం.

పాలకుడైన రాజు తాను ధర్మపాలన చేసేటప్పుడు అధర్మపరులను శిక్షించేటప్పుడు ఆగ్రహం చూపిస్తాడు. ధర్మపాలనలో భాగమది. ధర్మరక్షణ కోసం ప్రకటించిన ఒకానొక ఈశ్వరవ్యవస్థ. అలా ప్రకటించిన స్వరూపమే 'చండీ'.

దేవీమాహాత్మ్యాన్నే చండీసప్తశతి, దుర్గాసప్తశతి అని వ్యవహరిస్తాం. చండీహోమంలో దేవీమాహాత్మ్యంలోని శ్లోకాలే మంత్రాలుగా ప్రయోగిస్తాం. దేవీమాహాత్మ్యం వ్రాసిన వ్యాసుడు మాత్రం దీనికి చండీసప్తశతి అని పేరు పెట్టలేదు. తరువాత కొందరు దాన్ని మంత్రంగా ప్రయోగించినపుడు చండీసప్తశతి అన్నారు. కాదు నవశతి అని మరికొందరన్నారు. మొత్తానికి చండీని మాత్రం అందరూ అంగీకరించారు.

హవన ప్రక్రియ పేరు కూడా 'చండీ'. మొత్తం దేవీమాహాత్మ్యానికి చండీ అని పేరు రావడానికి కారణం అసురసంహారం చేసిన అమ్మవారిస్వరూపమే అందులో వర్ణించారు. అసురసంహారం కూడా కారుణ్యం యొక్క స్వరూపమే. లోకరక్షణ కోసం శిక్షించి రాక్షసులను, రక్షించి దేవతలను అనుగ్రహిస్తోంది. శిక్షిస్తేగాని అసురులు బాగుపడరు కనుక వారిని శిక్షిస్తోంది. ఆ శిక్షారూపమైన చండీ లోకాన్ని అనుగ్రహించే స్వరూపమే.

'చిత్తే కృపా సమరనిష్ఠురతా చ దృష్టా' అని దేవీమాహాత్మ్యంలో చెప్పారు. "తల్లీ! నీ హృదయం నిండా కారుణ్యమే. సమరంలో మాత్రం నిష్ఠురతని చూపిస్తున్నావు." కారుణ్య ప్రకటనమే చండి అన్నారు. ఈ స్వరూపాన్ని తలచుకోగానే మనకి రక్షణ లభిస్తుంది.

లోకంలో చండ అని వ్యవహారం ఉంది. చండ భాస్కరుడు, ప్రచండ సూర్యుడు. ఏ మాత్రం శక్తిని లోపల దాచుకోకుండా మొత్తం ప్రకటిస్తే దానిని చండము అని చెప్పవచ్చు. సూర్యభగవానుడు తన శక్తిని సంపూర్ణంగా ప్రకటిస్తే అది ప్రచండము. పరబ్రహ్మ యొక్క జ్ఞానప్రకాశం సంపూర్ణంగా రావాలి. ఎంత గొప్పగా రావాలంటే ఆ ప్రకాశం రాగానే ఇంక అప్రకాశ శక్తులేవీ మిగలకూడదు. అప్రకాశ శక్తులంటే అజ్ఞానపు శక్తులు. వాటిని ఇసుమంత కూడా మిగులనీయని సంపూర్ణమైన అఖండజ్ఞానమే చండి. ఇది పరమార్థంతో తెలుసుకోవలసిన అర్థం. అఖండ జ్ఞానోదయం కలిగితే ఇంక అజ్ఞానమనే అసురత్వం ఇసుమంత కూడా మిగులదు.

మరొక అర్థంలో చండీ శక్తి అంటే విశ్వశాసన శక్తి. ఆ శాసన భయం చేతనే

జగత్తంతా నడుస్తోంది. ఆ భయాన్ని కలిగించి విశ్వాన్ని నడుపుతూన్న అభయశక్తియే చండి.

కుమారీ ఉపాసనలో ఏడు సంవత్సరాల వయసున్న బాలికని 'చండికా' అని పిలుస్తారు. **'చండికా సప్తవర్షాస్యాత్'.**

756. చండముండాసురనిషూదినీ

– శ్రీ చండముండాసురనిషూదిన్యై నమః

చండ, ముండ అనే అసురులను నశింపజేసిన తల్లి. చండీసప్తశతిలోని ఒకానొక ఇతివృత్తం ఈ నామంలో ఉంది. ఇదంతా మంగళచండీవిద్య అని చెప్పుకున్నాం. ఈ మంగళచండీ గురించి చెప్తూ దేవీభాగవతం **'సృష్టికాలే మంగళా, సంహారకాలే చండీ'** అంది. సృష్టికాలంలో మంగళరూపిణిగా ఉంటూ సృష్టి స్థితులను చేస్తూ ఉంటుంది. సంహారకాలంలో మొత్తం లయం చేసినపుడు ఆవిడే చండీ అవుతుంది. ఇది మంగళచండీ నిర్వచనం. మంగళచండీవిద్యలో చండికా నామాన్ని ప్రత్యేకంగా చెప్తూ 'చండముండాసురనిషూదినీ' అని ఎందుకు చెప్పారో పరిశీలించాలి.

అసలైన రాక్షసులు శుంభనిశుంభులు. వారికి సహాయకులు చండముండులు. అసలు రాక్షసులైన శుంభనిశుంభులని చంపితే 'శుంభనిశుంభనిషూదినీ' అనవచ్చుగా! లేదా 'మహిషాసుర నిషూదినీ' అనవచ్చుగా! లేదా 'మధుకైటభమర్దినీ' అనవచ్చుగా! సప్తశతిలో ఉన్న మూడు చరితములు ఇక్కడ చెప్పవచ్చు. వీరెవరినీ కాదని 'చండముండాసురనిషూదినీ' అని ఎందుకు చెప్పారు? ఇది తెలిస్తే చండీనవార్ణ మంత్ర ఉద్ధారం ఇందులో కనబడుతుంది.

చండీ నవార్ణవమంత్రంలో ప్రధానం – అమ్మవారికి ఎన్ని పేర్లు ఉన్నా **'చాముండా'** అని చెప్పబడుతున్నది. పూర్తి మంత్రం ఉపాసకులకి తెలుస్తుంది. మొత్తం సప్తశతికంతటికీ మూలమంత్రం చాముండాయే. మరి అంత అసురసంహారం చేస్తే చాముండా అని ఎందుకన్నారు? వారు ఒక్కరు పోతే మిగిలినవన్నీ అవే పోతాయి. ఈ చండముండులే చాలా భయంకరమైన పద్ధతిలో యుద్ధం చేశారు. ఈ చండముండ

సంహారం చేసిన తల్లినే 'చాముండా' అని అంటారు. ఈ మాట చండీసప్తశతిలో ఉత్తమ చరితములో చెప్పబడ్డ అంశం.

యస్మాచ్చండం చ ముండం చ గృహీత్వా త్వముపాగతా
చాముండేతి తతో లోకే ఖ్యాతా దేవి భవిష్యసి

శుంభనిశుంభ సంహారం కోసం కౌశికీదేవి కనుబొమల ముడిలోంచి అమ్మవారు వచ్చింది. ఆవిడే కాళీ అనే తల్లి. చండముండ అసురులు అనేక అక్షౌహిణీల సేనలతో వస్తున్నప్పుడు ఆ కాళీయే నోరు తెరచి ఆ సేనలన్నింటిని మింగేసింది. 'మహాకాళీ మహాగ్రాసా మహాశనా చండముండాసురనిషూదినీ' అన్నప్పుడు ఆ కాళీస్వరూపమే ప్రధానంగా చూపిస్తున్నారు.

ఆ కనబడుతున్న గజబలం, అశ్వబలం, రథబలం, పదాతిబలం – అన్నీ కూడా నోట్లో బఠాణీలు వేసుకున్నట్లు వెళ్ళిపోయాయి. ఆ యుద్ధరంగంలో కనబడ్డ వారందరిని చేత్తో పట్టుకొని నోట్లో వేసుకుంటూ సంచరించింది. 'కాలో జగద్భక్షకః' ఆ కాళీయే తిన్నగా వెళ్ళి మిగిలిన చండముండుల ఇద్దరి తలలు నరికి తీసుకుని వచ్చింది. "నువ్వు చేసిన ఈ యుద్ధమనే యజ్ఞంలో ఈ పశువుల తలలు నరికానమ్మా!" అని తెచ్చి చూపించింది. దానికి అమ్మవారు సంతోషించి, "చాలా సంతోషం. చండముండుల సంహారం చేశావు కనుక నీ పేరు చాముండా" అన్నది.

మహాకాళీ తరువాత ఈ మాట చెప్పడంలో ఆ **'చాముండా'** అనే మంత్రాన్ని ప్రస్తావన చేస్తున్నారు. చండీవిద్య అయిన నవార్ణమంత్రస్వరూపం ఇక్కడ చెప్పబడుతోంది. చాముండా మంత్రం చేసినపుడు కూడా 'చండీపరదేవతా' అనే భావన చేస్తాం.

'చండికా' 'చండముండాసురనిషూదినీ' 'చాముండా'కి, 'చండముండాసుర నిషూదినీ'కి రెండిటికి కలిపే అర్థం చెప్పుకోవాలి. కథ ప్రకారంగా చండముండసంహారం చేసింది కనుక చాముండా అని అర్థం. కానీ చండ, ముండ అనే పేర్లని గురించి ఆలోచిస్తే ఈ రెండు రజోగుణ, తమోగుణాల ప్రకోపం. ఇది ద్వంద్వనాశనమే. సృష్టిలో ద్వంద్వములవల్లే ప్రమాదాలన్నీ వస్తాయి. అమ్మవారు ద్వంద్వనాశినీ. 'సర్వద్వంద్వక్షయంకరీ' అనే నామం శుద్ధశక్తిమాలలో వస్తుంది.

సర్వద్వంద్వక్షయంకరీ - ఎంతవరకు ద్వంద్వాలు ఉంటాయో అంతవరకు బంధం ఉంటుంది. ద్వంద్వములు నశించి ఏకత్వం మిగలాలి. చండ, ముండ అనే ద్వంద్వ భావాన్ని సంహరింపజేసేది - 'చాముండా'.

ఇందులో చండముండులని చెప్తూ దేవీమాహాత్మ్యం వ్యాఖ్యాతలు వీరిని **'రాగద్వేషాలకు'** ప్రతీకలుగానే తీసుకోవడం జరిగింది. అహంకారమమకారాలు, సుఖదుఃఖాలు, లాభనష్టాలు - మనం ఎన్ని చెప్పినా ఇవన్నీ ద్వంద్వాలు. ఆ రెండు ద్వంద్వాలని కొట్టింది. చండ, ముండ- ఒకడు తెగ మిడిసిపడతాడు. మరొకడు చతికిల బడతాడు. రెండూ ప్రమాదమే. మిడిసిపాటుతనం రజోగుణం యొక్క వికారం. చతికిలపాటుతనం తమోగుణం యొక్క వికారం. ఈ రెండు తొలగించాలి. ఆ తొలగించే శక్తే 'చండముండాసురనిషూదినీ'.

'చముం దాతి లాతి ఇతి చాముండా'. చము అంటే సేన, సైన్యము, సమూహము. సైన్యమంటేనే కొంతమంది యొక్క సమూహము. 'చముం దాతి' అంటే సమూహాన్ని నశింపజేయునది. సమూహమంటే అనేకత్వము. ఉపాధులు, అజ్ఞానము... ఇవన్నీ అనేకత్వ లక్షణాలు. వాటిని పోగొట్టి ఏకజ్ఞానమైన స్థితి ఏదైతే ఉందో అదే చాముండా. దానినే ప్రధానమంత్రంగా ఎందుకు చెప్పారంటే ఆ ఏకత్వమే- **'ఏకం అద్వితీయం బ్రహ్మ'.**

యోగపరంగా మూలాధారస్థిత అగ్ని - 'చండ'. శిరఃస్థితమైన రుద్రగ్రంథి - 'ముండ'. ఆ రెండిటినీ భేదించి సహస్రారాన్ని చేరే కుండలిని 'చాముండా'.

ఇప్పటివరకు వచ్చిన 'చండీ', 'చండముండాసురనిషూదినీ' అనేవి 'మహాకాళీ' నామం నుండి అనుబంధంగా వచ్చినవి. ఇది బ్రహ్మవిద్యగా ఆ సంబంధమైన నామాలు మొదలౌతున్నాయి.

757. క్షరాక్షరాత్మికా - శ్రీ క్షరాక్షరాత్మికాయై నమః

సంఖ్యలేనన్ని (అనియత) అక్షరాలే స్వరూపంగా కలది - అని భాస్కరరాయల వ్యాఖ్య. **'ఏకానేకాక్షరాకృతిః'** "ఒక అక్షరం మొదలుకొని అనేక అక్షరాల స్వరూపము

కలది." అని త్రిశతి నామాలలోని నామం.

ఏకాక్షరేతి విఖ్యాతా సర్వాక్షరమయీశుభా

సైవ విశ్వేశ్వరీ దేవీ సైవ క్వాప్యమితాక్షరా (వరాహపురాణం)

'ఆ విశ్వేశ్వరీదేవియే ఏకాక్షర అనీ, అనేకాక్షర అనీ, అమితాక్షర అనీ ప్రసిద్ధి చెందినది

ప్రపంచంలో మనకు కనబడుతున్నది అనేకం. మనం తెలుసుకోవలసినది ఏకం. ఏకత్వజ్ఞానమే కావలసినది. అనేకంలో వ్యాపించింది అమ్మవారు. అనేకముగా కనబడుతున్నది క్షరము. ఏకముగా ఉన్నది అక్షరము. ఈ రెండిటిని కలిపి చూడాలి. అదే- క్షరాక్షరాత్మికా. క్షరము, అక్షరము కూడా అమ్మవారి రూపంగా దర్శించడం మొదలుపెడితే ఏకత్వదర్శనం అవుతుంది. రెండిటిగా కనబడుతున్నది, వాటికి అతీతమైన ఏకమే.

'అవిభక్తం చ విభక్తేషు తత్ జ్ఞానం విద్ధి సాత్త్వికం' – అనేకత్వంలో ఏకత్వాన్ని చూడడమే సాత్త్విక జ్ఞానము, గొప్ప జ్ఞానము. ఉపాధులు అనేకం, చైతన్యం ఏకం. ఉపాధి దృష్టితోనే అనేకత్వ భ్రాంతి కలుగుతోంది. మనకి కావలసినది చైతన్యదృష్టి. ఆ చైతన్యమే లలిత. **సర్వచైతన్యరూపాం తాం.**

ఉపాధులు క్షరములు. క్షరము అంటే నశించే లక్షణం కలిగినవి. అందులో ఉండే చైతన్యం అక్షరం. అనగా నాశనము లేనిది. ఉపాధులు, చైతన్యము రెండు చెప్పారు. ఉపాధుల్లో చైతన్యం ఉంటేనే వాటికి ఒక ఉనికి. ఉపాధులు, ఉపాధుల యందు చైతన్యము రెండూ అమ్మవారే అని ఎరుక కలగాలి. ఇది ఒక భావం. రెండవ భావం క్షరం – జగత్. అక్షరం – బ్రహ్మ. ఈ జగత్తంతా క్షరము అంటే నాశనలక్షణము కలిగినది. ఈ జగత్తు అంతా ఎవరి వల్ల నడుపబడుతోందో అది అక్షరము. జగత్తు–బ్రహ్మము.... రెండూ కలిపి చూడాలి.

గీతలో విశ్వరూపసందర్శనయోగం ఉంది. అదొక జ్ఞానదర్శనము. అదొక యోగం. "నువ్వు చూస్తున్న ఈ విశ్వమంతా నా రూపమే నాయనా!" అన్నారు.

అలా ఉపాధులన్నిటిని విడిగా చూడడం కంటే ఉపాధులన్నీ కలిపి ఒకే

ఈశ్వరుని ఎరుక కలిగించడం కోసం విశ్వరూపసందర్శనం. దానికంటూ అర్జునునికి దివ్యదృష్టి ఇచ్చాడు. దివ్యదృష్టి అంటే జ్ఞానదృష్టి. **"దృష్టిం జ్ఞానమయీం కృత్వా ఏకత్వమనుపశ్యతి"** – జ్ఞానమయమైన దృష్టితో ఏకత్వం లభిస్తుంది. అప్పుడు క్షరము, అక్షరము – రెండూ వేరు కాదు. ఆ అక్షరస్వరూపమే క్షరముల యందు ప్రసరిస్తూ ఉన్నదని ముందు గ్రహించి పరమాత్మని వేరుగా, ప్రపంచాన్ని వేరుగా చూడడం మానేసి పరమాత్మని, ప్రపంచాన్ని కలిపి ఒక్కటిగా పట్టుకోవడం మొదలౌతుంది. 'క్షరక్షరాత్మికా' అంటే జగద్రూపమై బ్రహ్మరూపమై కూడా ఉన్నది.

జగద్రూపమంటే నామరూపాత్మకం. బ్రహ్మస్వరూపమంటే అస్తి, భాతి, ప్రియం. అస్తి, భాతి, ప్రియం, నామ, రూపాలని కలిపి పరమేశ్వరస్వరూపంగా దర్శించడం చేతనవ్వాలి. ఇది మొత్తం భగవద్గీతలో చెప్పిన వాక్యమే. భగవద్గీతకి, సప్తశతికి కూడా అనుబంధం ఉంది. రెండూ సప్తశతే (700). దేవీమాహాత్మ్యంలో 500 పైగా ఉన్న శ్లోకాలని 700 మంత్రాలు చేశారు. సరిగ్గా భగవద్గీతలో కూడా 700 శ్లోకాలే. భగవద్గీత ఏదో యుద్ధంలో చెప్పినది అనిపిస్తుంది. అదీ బ్రహ్మవిద్యే. ఇదీ బ్రహ్మవిద్యే. భగవద్గీతలోని శ్లోకంలో క్షరాక్షరాల గురించి వివరణ ఉంది కనుక ఆ ప్రమాణంతో చెప్పుకోవాలి.

ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ
క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే
ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః
యో లోకత్రయమావిశ్య బిభర్తి అవ్యయ ఈశ్వరః

అని భగవద్గీతలో కృష్ణపరమాత్మ చెప్పిన మాట. క్షర, అక్షర అని రెండు స్వరూపాలు లోకంలో ఉన్నాయి. 'క్షరః సర్వాణి భూతాని' – క్షరః అంటే కనిపిస్తున్న సర్వభూతములు క్షరములే. 'కూటస్థః అక్షర ఏవచ' – అక్షరుడంటే జీవుడు. కనిపిస్తున్న శరీరాలన్నీ క్షరములు. అందులో ఉన్న జీవుడు అక్షరుడు. బాల్యంలో ఒకలా ఉన్నాడు. యౌవనంలో మరొకలా ఉన్నాడు. వృద్ధాప్యంలో ఇంకోలా ఉంటాడు. ఇవన్నీ క్షరములు. కానీ అప్పటి నుండి ఇప్పటి వరకు నా చిన్నప్పుడు, నేను పెద్దయ్యాక అని అంటున్నాం.

అందులో నేను మాత్రం అలాగే కొనసాగుతోంది. వాడు అక్షరుడు. జీవుడు.

'ఉత్తమః పురుషస్త్వన్యః'- ఈ క్షరాక్షరములకు అతీతంగా మరొకడున్నాడు. ఆయన ఉత్తముడు. వీటి కంటే ఉత్కృష్టమైనవాడు. 'అన్యః పరమాత్మేత్యుదాహృతః' – అతనిని పరమాత్మ అంటారు. క్షరములు అంటే ఉపాధులు. అక్షరుడు అంటే జీవుడు. ఈ రెండిటికి అతీతమైనవాడే పరమాత్మ. అందుకే ఆయనకి పురుషోత్తముడని పేరు. ఇదే భగవద్గీతలో పురుషోత్తమప్రాప్తి యోగం అని 15వ అధ్యాయంలో చాలా విస్తారంగా ఉంది.

క్షర అనబడే ఉపాధులు కనబడుతున్నాయా! లేక అక్షర అనబడే జీవుడు చెప్పబడుతున్నాడా! లేక ఈ రెండు కలిపి మరొకటి చూపిస్తున్నాడే ఆ ఉత్తముని చూపిస్తున్నారా! నిజానికి ఉత్తమునినే చూపిస్తున్నారు. ఉత్తముడంటే పరమాత్మ. అమ్మవారు ఆ పరమాత్మ స్వరూపం.

ఈ పరమాత్మయే క్షరమైన జగత్తు యందు, అక్షరమైన జీవుని యందు కూడా వ్యాపించి ఉన్నాడు. క్షరాక్షరాత్మకమైన జగత్తంతా ఆ పరమాత్మ స్వరూపంగా చూస్తూ వెళ్తుంటే క్రమక్రమంగా క్షరాక్షరములకు అతీతమైన పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకోగలం.

'ఉక్తమక్షరమవ్యక్తం వ్యక్తంచరముదాహృతమ్' – అవ్యక్తాన్ని అక్షరమని, వ్యక్తాన్ని క్షరమని కూడా అనవచ్చు. ఈ క్షరాక్షరాత్మికాస్వరూపమే విష్ణుసహస్రంలో 'సదసత్క్షరమక్షరమ్' అని చెప్పారు. తత్త్వం ఒక్కటే. లలితే విష్ణువు. విష్ణువే లలిత అని గ్రహించగలగాలి.

విష్ణుసహస్రంలో 'క్షరమక్షరమ్' అంటే లలితాసహస్రంలో 'క్షరాక్షరాత్మికా' అన్నారు. పరమాత్మ క్షరాక్షరాత్మకములందు వ్యాపించి ప్రకాశిస్తూ ఉన్నాడు.

జీవునికి అక్షరుడనే పేరు పెట్టారెందుకంటే వాడు ఏ దేహంలో దూరినా ఆ దేహంతో తాదాత్మ్యం చెందుతున్నాడు గాని వాడు ఎప్పుడూ పోలేదు. జీవుడు ఈ క్షరము, అక్షరము కూడా ఈశ్వరుడే అని తెలుసుకోగలిగితే క్రమంగా ఈ జీవభావాన్ని వదలి ఈశ్వరభావాన్ని పొందుతాడు. అప్పుడు వాడు క్షరములోను పడడు, జీవునిగాను మిగలడు. ఈశ్వరునిలోనే ఐక్యమౌతాడు. ఈ వాక్యంలో అంత చక్కటి విచారణని చూపిస్తున్నారు.

758. సర్వలోకేశీ - శ్రీ సర్వలోకేశ్యై నమః

క్షరాక్షరాత్మికమైన జగత్తే లోకం. ఈ లోకానికంతటికి అమ్మవారే నియామకురాలు. ఏ జీవుని సంస్కారమేమిటో, ఏ జీవుని కర్మలేమిటో తెలుసుకుని దానికి అనుగుణమైన ఉపాధులు కల్పన చేస్తూ, ఉపాధులలో వానిని తిప్పి నడుపుతోంది.

759. విశ్వధారిణీ – శ్రీ విశ్వధారిణ్యై నమః

ఈశ్వరిగా ఉంటూ ఈ సమస్తాన్ని పోషిస్తోంది. భరిస్తున్నది. ధరిస్తున్నది. ధారణము అంటే పోషణము. విశ్వము అంటే సమస్తము. విడివిడిగా ఉన్న లోకాలన్నిటికి ఆవిడ తల్లి. ఇదంతా కలుపుకుని ఆవిడ ధరిస్తోంది కనుక 'విశ్వధారిణీ'. సమస్తమును ధరించునది అంటే పోషణకర్త్రీ. కేవలం నియామకురాలుగా కూర్చోవడమే కాకుండా పోషించి, రక్షిస్తూ ఉన్న తల్లి కనుక విశ్వధారిణీ.

ఆ తల్లే క్షరమనే ఉపాధులను కూడా కనిపెట్టుకుని ఉంటుంది. ఈ అక్షరుడు ఏ కర్మలు చేశాడో వాటికి తగ్గ ఉపాధులు కల్పన చేస్తూ వానిని నడిపిస్తున్నది అమ్మవారే. ఆ తల్లి ఈ రెండిటిలో ప్రవేశించి వీరిని నడిపిస్తోంది అని చెప్పడమే 'క్షరాక్షరాత్మికా' 'సర్వలోకేశీ' 'విశ్వధారిణీ'.

విశ్వధారిణీ అనే మాటకి భూదేవి అని కూడా అర్థం ఉంది. **'భూమిర్ధేనుర్ధరణీ లోకధారిణీ'** అనే వేదమంత్రాన్నే భాస్కరరాయలవారు ఉట్టంకించారు. భూమికి ధేనువని పేరు. ఆవు నుండి మనం పాడి ఎలా పొందుతున్నామో అలా భూమి నుండి పంటలు, సంపదలు పొందుతున్నాం కనుక భూమిని ధేనువు అన్నారు.

కంచి మహాస్వామివారు, **"జననీ పృథివీ కామదుఘాస్తే"** – ఈ భూమియే కామధేనువని కీర్తించారు. ధరణీ, ధారిణీ – రెండూ ఒకటే. మనలను ధరిస్తున్నది. ఆధారశక్తిగా ఉన్న తల్లే లోకధారిణీ. ఆ లోకధారిణే ఇక్కడ 'విశ్వధారిణీ'.

760. త్రివర్గదాత్రీ – శ్రీ తివర్గదాత్ర్యై నమః

లోకాన్ని నడిపేటప్పుడు అమ్మవారు అందరికి మూడింటిని సమకూర్చుతూ ఉన్నారు. త్రివర్గములు అంటే ధర్మ, అర్థ, కామములు. 'త్రివర్గదాత్రీ', 'సుభగా' – ఈ రెండు నామాలు చండీవిద్య యొక్క ఫలాలు.

సకాములకు ధర్మార్థకామాలను ఇస్తున్న తల్లి. త్రివర్గములు అంటే ధర్మార్థకామాలు అనేకాకుండా సామ్య, వృద్ధి, క్షయము అని కూడా అర్థం. సామ్యము అంటే సమముగా ఉండుట. వృద్ధి, క్షయము అంటే పెరుగుట, తరుగుట.

ఒక్కోసారి వృద్ధి కనిపిస్తూ ఉంటుంది. ఒకొక్కప్పుడు క్షయం కూడా కనబడుతుంది. ఒక్కోసారి సమత్వం కనిపిస్తుంది. ఈ మూడే లోకంలో ఉంటాయి. విశ్వంలో అన్నిటిని త్రివర్గాలుగా అనగా సామ్య, వృద్ధి, క్షయములుగా చేసి నడిపిస్తూ ఉంటుందని తెలుస్తుంది.

వర్గము అంటే భాగము. ప్రపంచమంతా ధర్మ, అర్థ, కామాలుగానే ఉంది. ఎంత ప్రపంచాన్ని గమనించినా మూడే కాలాలు. అది కూడా త్రివర్గమే. సర్వజీవులకి ఉండేవి మూడే శరీరాలు. వీటన్నిటిని ఇచ్చేది ఆ తల్లే. నడిపేదీ ఆ తల్లే. 'విశ్వధారిణీ'లో భాగమిది కనుక 'త్రివర్గదాత్రీ'.

త్రివర్గం అనగానే చాలా మంది ధర్మార్థకామాలు మాత్రమేనని అనుకుంటారు. ఈ మధ్య కొంతమంది పరిశోధకులు "మోక్షమనేది తరువాత చేర్చి చతుర్వర్గము కలిపేశారు గాని నిజానికి మొట్టమొదట త్రివర్గం మాత్రమే ఉండేద"ని అన్నారు. ఇక్కడ తెలుసుకోవలసినది మోక్షం వర్గం కాదు. వర్గము అంటే విభాగము. లోకంలో ధర్మ, అర్థ, కామము దేనికదె విడివిడిగా చూడవచ్చు. వర్గాలను తీసేస్తే ఉండేది మోక్షం. అందుకే దానికి పేరు అపవర్గము. వర్గాలని అపగతము అనగా తొలగిస్తే మిగిలేది మోక్షమే.

మోక్షానికి వర్గము లేదు. భాగము లేదు. అది అఖండము. ఖండమైతేనే భాగం వస్తుంది. త్రివర్గాలే చెప్తారుగాని చతుర్వర్గాలు చెప్పరు. మరి మోక్షం కూడా

చెప్పారంటే అవి పురుషార్థములలో చెప్పారు. చతుర్వర్గం అనలేదు. ధర్మ, అర్థ, కామ, మోక్షాలును పురుషార్థాలు.

ధర్మము, మోక్షము ప్రక్కన పెడితే మధ్యలో ఉన్న అర్థ, కామాలు రెండూ మధురంగా ఉంటాయి. అర్థము, కామము నిజానికి రెండూ కలిపి ఒకటే. మనం అర్థాన్ని కూడా కామిస్తూనే ఉన్నాం. అర్థం కూడా కామం క్రిందకి వచ్చేస్తుంది. త్రివర్గదాత్రీ అంటే ధర్మ, కామ, మోక్షములను ఇచ్చునది. కామములోనే అర్థం కూడా భాగం కనుక కామము అనగానే అర్థకామాలు కలిపేసుకోవచ్చు. ఇది కూడా శాస్త్రీయమైన వ్యాఖ్యానమే. తరువాత నామం 'సుభగా'.

761. సుభగా – శ్రీ సుభగాయై నమః

ఈ నామంలో అమ్మవారి విద్యా లక్షణాన్ని చెప్తున్నారు. అమ్మవారి విద్య పేరు సౌభాగ్యవిద్య. పంచదశికి ఒకానొక పేరు సౌభాగ్యవిద్య అని ఉంది. ఒక సంప్రదాయంలో బాలా మంత్ర బీజాక్షరాలని కలిపి పంచదశితో అనుసంధానం చేస్తే సౌభాగ్యవిద్య అవుతుంది. ఇది సౌభాగ్యవిద్య. సౌభాగ్యహృదయమని శ్రీవిద్యకి ప్రత్యేకించి ఒక శాస్త్రం ఉంది. అమ్మవారు సౌభాగ్యదేవత. 'సుభగస్య భావం సౌభాగ్యం'. భగము అనగా ఐశ్వర్యము, సు అంటే మంచి, మేలు. సుభగా అంటే మేలైన, మంచిదైన ఐశ్వర్యం. ఏ ఐశ్వర్యము పొందడం వల్ల ఇహంలో బాగుంటూ, పరమార్థానికి కూడా అవరోధాలు ఉండవో ఆ ఐశ్వర్యము కోరుకోవాలి.

ఐశ్వర్యము, మాహాత్మ్యం, జ్ఞానం, వైరాగ్యం, యశస్సు, వీరత్వము, ప్రయత్నము, సంకల్పము, శోభ, ధర్మము, సూర్యభగవానుడు, ముక్తి – ఇవి భగశబ్దానికి అర్థాలు. సుభగా అంటే మేలైన మోక్షస్వరూపిణి. అమ్మవారిది సౌభాగ్యవిద్య అని అనడానికి కారణం ఆ ఉపాసనా ఫలంగా ఐశ్వర్య, మాహాత్మ్య, జ్ఞాన, వైరాగ్య, యశస్సు, ప్రయత్నం, సంకల్పము, ధర్మము, మోక్షము సిద్ధిస్తాయి.

మంగళకరమైన సౌందర్యాన్ని కూడా సౌభాగ్యమనే అంటారు. సౌభాగ్యాలన్నీ అమ్మరూపాలే అని సుభగా శబ్దానికి మరొక అర్థం. **'సర్వైః భజతే'** అందరి చేత

భజింపబడుతున్నది కనుక **'సుభగా'**. భజింపబడునది భగ. భజించుట అంటే ఆశ్రయించుట, ఉపాసించుట. అమ్మవారిని అందరూ ఉపాసిస్తారు, ఆశ్రయిస్తారు.

పూజ్యతే యా సురైః సర్వైస్తాం చైవ భజతే యతః

సేవాయాం భజతేర్ధతోర్భగవత్యేవ సా స్మృతా (దేవీపురాణం)

అంటూ భగవతీ, సుభగా శబ్దాలకు శాస్త్రం చెప్పిన అర్థం. దీనికి నారాయణదాసుగారు తెలుగులో అనువాదం చేస్తూ **"అందమయిన దెల్ల నమ్మల పిల్ల"** అన్నారు. మలపిల్ల అంటే కొండకూతురు. అందమైన ప్రతి వస్తువు అమ్మరూపమే. ఈ ఒక్కమాట గుర్తుపెట్టుకుంటే సృష్టిలో అందం కనబడినపుడు అమ్మా! అని దండం పెట్టే సంస్కారం వస్తుంది. భక్తి గలుగుతుంది.

"అందమయిన దెల్ల నమ్మల పిల్ల అయిదేండ్ల యీడున నలరారు బిడ్డ" అన్నారు. కుమారీపూజలో ఐదేళ్ళ బాలికగా ఆరాధింపబడుతున్న అమ్మాయిని సుభగా అంటారు. **"వేఁడివేల్పు న్గూడ వెలిఁగించు జగ్గు"**. వేఁడి వేల్పు అంటే సూర్యుడు. భగ అంటే సూర్యుడు అని అర్థం. సుభగా అంటే సూర్యుని కూడా ప్రకాశింపజేసే వెలుగు అది. **"జ్యోతిషామపి యజ్జ్యోతిః"**. ఇలా వివరిస్తూ **"అడియకెంతో కల్మి నలరించు జేజె"**. అడియ అంటే భక్తుడు. భక్తునికి అన్ని కల్ములు అంటే ఐశ్వర్యాలు ఇచ్చే తల్లి కనుక 'సుభగా'. ముల్లోకాలలో ఉండే సౌభాగ్యం అమ్మవారే.

త్రిలోకసౌభాగ్యమయీం భుక్తిముక్తిప్రదాముమాం

ఆరాధ్య సుభగాం భక్త్యా నారీ వా కి న్న విందతి (పద్మపురాణం)

ముల్లోకాల సౌభాగ్యం మూర్తి కట్టిన అమ్మవారు భుక్తిముక్తిప్రదాయిని. అలాంటి సుభగా అయిన తల్లిని ఎవరు ఆరాధిస్తున్నారో వారికి లభించనిది ఏముందయ్యా! అంటూ కొన్ని మంగళకరమైన వస్తువులని చెప్పారు. మంగళకరమైన వస్తువులన్నీ అమ్మరూపాలే. అదే –

సర్వమంగళమాంగళ్యే శివే సర్వార్థసాధకే

శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోస్తుతే

ఇక్షవస్తరురాజశ్చ నిష్పావా జీరధాన్యకే

వికారవచ్చ గోక్షీరం కుసుంభం కుంకుమం తథా

లవణం చేతి సౌభాగ్యాష్టకం స్థావరముచ్యతే

అంటూ పద్మపురాణంలోని వాక్యాన్ని భాస్కరరాయలవారు ఉట్టంకించారు. ఇక్షు–చెరకు, తరురాజం–తాటిబెల్లం, అనుములు, జీలకర్ర, ఆవుపాలు, ఆవుపాలతో తయారయ్యే పెరుగు, నెయ్యి కూడా చెప్పబడుతున్నాయి.

ఎర్రని పువ్వులు, కుంకుమ, లవణము – ఇవన్నీ భాగ్యపదార్థాలు. ఇలాంటి మంగళకరమైన వస్తువులయందు మంగళస్వరూపంగా ఉన్నది కనుక 'సర్వమంగళ మాంగళ్యే'. మంగళాలకు కూడా మంగళమైన ఐశ్వర్యరూపిణి. మోక్షరూపిణే 'సుభగా'.

762. త్ర్యంబకా – శ్రీ త్ర్యంబకాయై నమః

సర్వమంగళమాంగళ్యే శివే సర్వార్థసాధకే

శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోస్తుతే

'శరణ్యే త్ర్యంబకే గౌరి' – ఇదే పెద్ద మంత్రం. మంత్రం ఏదైనా చెప్తారా అని చాలా మంది అడుగుతూ ఉంటారు. ఈ శ్లోకమే పెద్ద మంత్రం. పెద్దవారు మనం తరించడానికి చక్కటి శ్లోకం ఇచ్చారు. దీన్ని హాయిగా పఠించుకుంటే అంతకన్నా కావలసింది ఏముంది. 'త్ర్యంబకా' అనేది చాలా విశేషమైన శబ్దం.

త్ర్యంబక శివుడు. ఆయన యొక్క శక్తి 'త్ర్యంబకా'. శివునకు అభిన్నురాలని దీని ప్రథమార్థం.

సోమసూర్యానలాస్త్రీణి యన్నేత్రాణ్యంబకాని సా

తేన దేవీ త్ర్యంబకేతి మునిభిః పరికీర్తితా (దేవీపురాణం)

ఈ శ్లోకాన్ని శివునిపరంగా కూడా చెప్పవచ్చు. 'త్రీణి అంబకాని నేత్రాణి యస్య సః' – అంబకము అంటే నేత్రము. త్ర్యంబకా అంటే మూడు కన్నులు కలవాడు. ముక్కంటి అయిన పరమేశ్వరుడు. అమ్మవారికి కూడా మూడు కన్నులు ఉన్నాయి.

ఏతత్తే వదనం సౌమ్యం లోచనత్రయభూషితం
పాతు నః సర్వభూతేభ్యః కాత్యాయని! నమోఽస్తుతే

అని దేవీమాహాత్మ్యం చెప్తోంది. చండీవిద్య అనగానే అందులో శ్లోకాలే వస్తున్నాయి. వశిన్యాదివాగ్దేవతల కూర్పులో ఉన్న ఔచిత్యమిది. "అమ్మా! నీ మూడు కన్నుల వదనం మమ్మల్ని అనుగ్రహించుగాక!" త్ర్యంబకా అంటే మూడు కన్నులు కల తల్లి. ఆ మూడు నేత్రాలు సూర్య, చంద్ర, అగ్నినేత్రాలు. అవి మాత్రమే కాకుండా మూడు కాలాలని దర్శించే తల్లి కనుక 'త్ర్యంబకా'. అమ్మవారి పేరు త్రిపురసుందరీ.

మూడు అంబల రూపంలో ఉన్నది. ముగురమ్మల మూలపుటమ్మ. దుర్గా, లక్ష్మీ, సరస్వతుల రూపిణిగా ఉన్నది. ఇచ్ఛా-జ్ఞాన-క్రియా స్వరూపిణిగా ఉన్నది కనుక 'త్ర్యంబకా'.

శివునికి కూడా ఇలాంటి వైదికార్థమే చెప్తూ త్ర్యంబక అంటే మూడు మూర్తులు ఒక్కడైనవాడు. బ్రహ్మవిష్ణురుద్రాత్మకుడైన ఈశ్వరుడు. అన్నీ సంప్రదాయార్థాలే గనుక అన్నిటిని గ్రహించవచ్చు. జగద్రచన కోసం ఒక తల్లే ముగ్గురయింది. మూడుగా అయిన తల్లి మూడు గుణాలను నియమిస్తోంది కనుక తరువాత నామం...

763. త్రిగుణాత్మికా - శ్రీ త్రిగుణాత్మికాయై నమః

మూడు గుణాల రూపమైనది. జగత్తుకు అతీతమైన పరమాత్మ అమ్మయే. త్రిగుణాలకు ఆవిడ అతీతురాలైనా త్రిగుణాలతో ప్రపంచాన్ని నడుపుతున్నప్పుడు త్రిగుణాలనూ ఆవిడే చైతన్యవంతం చేస్తోంది. అప్పుడు ఆ త్రిగుణాలలో ఉన్న చైతన్యం అమ్మవారే. జగద్రూపంలో చూసినపుడు 'త్రిగుణాత్మికా'.

'సత్త్వరజస్తమోగుణాత్మికా జగద్రూపిణీ మాయా'. మాయాశక్తిగా ఉన్న తల్లి 'త్రిగుణాత్మికా'. మూడు గుణాల సౌమ్య స్వరూపురాలు. ఈ త్రిగుణాత్మికా అయిన శక్తినే కారణబ్రహ్మము అంటారు. ప్రపంచరచన చేయాలనుకున్న అమ్మవారు సత్త్వరజస్తమోగుణాత్మిక అయిన మాయగా ముందు ప్రకటింపబడింది. అది కారణబ్రహ్మము. అక్కడ నుండి కార్యబ్రహ్మం ఏర్పడింది. కార్యబ్రహ్మము అంటే

ప్రపంచము. మాయ కారణబ్రహ్మము. ఈ రెండిటికి అతీతమైనది నిర్గుణబ్రహ్మము – పరమాత్మ. మొత్తం మూడు బ్రహ్మములే. ఇది గ్రహించగలిగితే 'సర్వం బ్రహ్మమయం జగత్' అనే మాట అర్థం అవుతుంది. 'త్రిగుణాత్మికా' అనే మాటకి కారణబ్రహ్మస్వరూపిణి అని అర్థం.

764. స్వర్గాపవర్గదా – శ్రీ స్వర్గాపవర్గదాయై నమః

స్వర్గము, అపవర్గము రెండిటినీ ఇచ్చునది. పుణ్యాత్ములు స్వర్గానికి వెళ్తారు. జ్ఞానులైనవారు మోక్షాన్ని పొందుతారు. ఏదో కాస్త పుణ్యం, పాపం కలసి ఉన్నప్పుడు భూమి మీదకి దిగుతారు. అసలు పుణ్యవాసనే లేకపోతే అధోలోకాల్లో పడతారు. ఎవరైనా ఏది కోరుకుంటారు! నరకాలతో పోల్చుకుంటే భూలోకమే ఫరవాలేదు! స్వర్గము అంటే పుణ్యం వల్ల లభించే ఉత్తమలోక సుఖము.

అపవర్గమంటే లోకాలతో సంబంధం లేదు. ఏ లోకానికి వెళ్ళినా మళ్ళీ పుణ్యం అయిపోతే క్రిందకి వస్తారు. **'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి'** అని కృష్ణపరమాత్మే చెప్పాడు.

ఇక్కడ సంపాదించుకున్నదే అక్కడ అనుభవిస్తాం. జ్ఞానం, భక్తి, వివేకం – ఇవేమీ లేకుండా కేవలం అమ్మవారిని పూజిస్తూ తప్పుచెయ్యకుండా ఉంటే వారికి అమ్మవారు స్వర్గం ఇస్తారు. భక్తిగా ఆరాధన చేస్తూ, "అమ్మా! నువ్వు తప్ప నాకింకెవ్వరూ లేరు" అంటూ అమ్మతత్త్వాన్ని విచారణ చేస్తూ, భావన చేస్తూ, ఎవరైతే ఆరాధిస్తారో వారికి అమ్మవారు అపవర్గాన్ని ఇస్తారు.

ధర్మబద్ధంగా ఉంటూ భగవదారాధన వంటి పుణ్యకర్మలు చేసే వారికి స్వర్గం వస్తుంది. ధర్మాన్ని ప్రక్కన పెట్టి ఈ కర్మలు చేస్తే కొంతకాలం సుఖాన్ని అనుభవించినా మళ్ళీ నరకంలో పడక తప్పదు. ఇప్పుడు ఆరాధన చేశారు కనుక తరువాత మంచి జన్మలు వచ్చే అవకాశం ఉంది. అలాకాకుండా పాపమనేది చెయ్యకుండా భక్తి, జ్ఞానాలు పెంపొందించుకోకుండా అమ్మవారిని ఆరాధన చేస్తూ ఉంటే వారికి రాబోయేది స్వర్గం. మన గతులు మనకే తెలిసిపోతాయి. ఆ స్వర్గలోకంలో పుణ్యం

క్షయమైతే మళ్ళీ క్రిందకి దిగుతాడు. కానీ తరువాత మాత్రం ఇదివరకటి జన్మల కంటె ఉత్తమ జన్మలు వచ్చి అప్పుడు సద్గురు యోగం లభించి ఆ జన్మలోనైనా భక్తి జ్ఞానాలు వచ్చే అవకాశము ఉంది. భక్తి, జ్ఞానాలు వస్తే అపవర్గము తప్పకుండా అమ్మవారు ప్రసాదిస్తుంది.

త్రివర్గాలను ప్రక్కకు తీసేస్తే వచ్చేదే అపవర్గము. ధర్మార్థకామాలని వర్గమంటారు. మోక్షాన్ని అపవర్గము అంటారు. ఆ మోక్షము మరణించాక దొరికేది కాదు... ఇక్కడే దొరుకుతుంది. స్వర్గం మాత్రం మరణించాకే దొరుకుతుంది. భక్తిని, జ్ఞానాన్ని గట్టిగా పట్టుకుంటే ఆ తల్లి ఇక్కడే అనుగ్రహిస్తుంది.

ప్రారబ్ధవశాత్తు అది రాకుండానే చనిపోతే, అప్పుడు అమ్మవారు తన మణిద్వీపంలో ఉంచి ఆ తరువాత క్రమక్రమంగా ఐక్యం చేసుకుని మోక్షాన్ని ఇస్తుంది. ఇది క్రమ ముక్తి – అపవర్గమే. మణిద్వీపవాసము కూడా అపవర్గమే. అమ్మవారి విషయం కనుక మణిద్వీపము అన్నాం. అదే విష్ణువైతే వైకుంఠము, శివుడైతే కైలాసము అనవచ్చు. వారి యొక్క దివ్యలోకా(సుగుణ బ్రహ్మలోకా)లకి వెళ్ళడం కూడా అపవర్గం క్రిందే వస్తుంది.

'ప' వర్గము లేనిది అపవర్గము అన్నారు. ప, ఫ, బ, భ, మ – దీనిని 'ప' వర్గము అంటారు. ప అంటే పాపపుణ్యాలు, ఫ–ఫలము, బ–బంధము, భ–భయము, మ–మరణము. ఈ ఐదు లేనిది అపవర్గము. ఈ ఐదు లేనిదే మోక్షస్థితి. స్వర్గమంటే అర్థం చెప్తూ –

యన్న దుఃఖేన సంభిన్నం న చ గ్రస్తమనంతరం
అభిలాషోపనీతం యత్ తత్సుఖం స్వఃపదాస్పదం

– ఎప్పుడును దుఃఖంతో కలియనిది, ఎడతెరిపిలేనిది – అభిలాషకు తగినది అయిన సుఖము 'స్వః' పదం చేత చెప్పబడుతుంది.

స్వఃలోకం, స్వర్లోకం, స్వర్గం. 'స్వః' అనే మాటకి అర్థం ఒక వాంఛ తీరేటప్పుడు కలిగే ఆనందము. ఆ ఆనందము తరువాత మళ్ళీ దెబ్బ తినకూడదు. అనుభవిస్తున్నంత సేపు దానికి మరొక దుఃఖం ప్రక్కన ఉండకూడదు. దుఃఖ స్పర్శలేని సుఖాన్ని స్వర్గము

అంటారు. అమ్మవారిని ఆశ్రయిస్తే అసలు దుఃఖస్పర్శలేని సుఖాన్ని ఇస్తుంది.

యత్రాఽస్తి భోగో నహి తత్ర మోక్షః

యత్రాఽస్తి మోక్షో న చ తత్ర భోగః

శ్రీసున్దరీ సేవన తత్పరాణాం

భోగశ్చ మోక్షశ్చ కరస్థ ఏవ

– మోక్షమిచ్చేచోట భోగం లేదు. భోగమిచ్చే చోట మోక్షంలేదు. శ్రీత్రిపురసున్దరీ ఆరాధనలో తత్పరులైనవారికి భోగము (స్వర్గం) మోక్షము (అపవర్గము) చేతిలో ఉంటాయి.

765. శుద్ధా – శ్రీ శుద్ధాయై నమః

'శుద్ధం అపాపవిద్ధం' అని ఉపనిషత్ గొప్ప మాట చెప్పింది. అపాపవిద్ధం అంటే పాపపు దెబ్బ తగలనిది. సృష్టిలో మనం అనుభవించే సుఖాలన్నింటికి దుఃఖరూపంలో పాపపుదెబ్బ ప్రక్కన ఉంది. అపాపవిద్ధం శుద్ధం అంటే ఏ దోషము లేనిదని అర్థం. దీని గురించి ఉపనిషత్తు చెప్తూ– **'నిత్యముక్తం బ్రహ్మాస్థానం పరం పదం శుద్ధః పూతశ్శాంతః'** అని చెప్పింది. (నిత్యముక్తా, నిర్వికారా, నిష్ప్రపంచా, నిరాశ్రయా). నిత్యముక్తమైనది పరబ్రహ్మస్వరూపము. సర్వానికి అతీతమైనది. జ్ఞానమైనది. అదే శుద్ధం. శాంతము.

శుద్ధః అంటే అవిద్యా మాలిన్యము లేనిది, త్రిగుణాల వికారాలు లేనిది.

766. జపాపుష్పనిభాకృతిః – శ్రీ జపాపుష్పనిభాకృత్యై నమః

ఇంతవరకు శుద్ధమైన తత్త్వం చెప్పారు. మూడు గుణాలతో ముల్లోకాలను నడుపుతున్న తల్లి మనల్ని అనుగ్రహించడం కోసం అద్భుతమైన ఆకారాన్ని ధరించింది. ఆ ఆకారం కూడా శుద్ధమే. శుద్ధభాగం అమ్మవారిది. శుద్ధం కాని భాగం శరీరానిది. ఇది గ్రహించుకోవాలి. ప్రకృతిది శుద్ధంకాని భాగం. అనాత్మ భాగం. ఆత్మభాగము చైతన్యం.

క్షీణించుట, పెరుగుట, మారుట, రకరకాల గతులు పొందుట అనేవి అనాత్మభాగం. అమ్మవారు శరీరంలో ఉన్నా అనాత్మభాగాలు ఎలా పరిత్యజించాలి, ఆత్మని ఎలా తెలుసుకోవాలి అనేది తెలిస్తే ఆత్మానాత్మవివేకమనేది ఏర్పడుతుంది.

అమ్మవారు ధరించిన ఆకృతి జీవుల ఉపాధి వంటిది కాదు. ఆనందకరమైన సచ్చిదానందపు ఉపాధి. అమ్మవారి విగ్రహమే అటువంటిది. మనం పంచదార పొట్లాలలాంటి వారమైతే అమ్మవారు పంచదారచిలక అని అనేకమార్లు ప్రస్తావించుకున్నాం.

అమ్మవారు ధరించిన రూపం 'జపాపుష్పనిభాకృతిః'. అమ్మవారిది జపాపుష్పం వలె ప్రకాశించే ఆకృతి. జపాపుష్పము అంటే ఎర్రని పువ్వు. దీనిని చక్కని తెలుగు అనువాదం చేస్తూ నారాయణదాసుగారు **"మంకెన విరివిడి మైనొప్పు పడుచు"** అన్నారు. విరి అంటే పువ్వు. జపాపుష్పం అంటే మంకెనపువ్వు. మంకెనపువ్వులాంటి వెలుగు కలిగిన రూపము. ఎర్రగా ఉందని చెప్పడం. 'అరుణకిరణజాలైరంచితాశావకాశా', 'అరుణాం కరుణా తరంగితాక్షీం', 'సర్వారుణా అనవద్యాంగీ'– అరుణవర్ణంతో ప్రకాశిస్తున్న లలితాంబ.

పుష్ప అనే శబ్దానికి అర్థం: '**పుష్పం వికాస ఆర్తవే ధనదస్యవిమానే చ కుసుమే నేత్రరుజ్యపి**'. పుష్పం అనగానే వికసించుట అని అర్థము. పుష్పశబ్దానికి మరొక అర్థం– ధనదస్యవాహనం – కుబేరుని విమానం పుష్పకవిమానం. దానికి కూడా పుష్పకమనే పేరు ఉంది. కుసుమే–పువ్వులకి కూడా పుష్పమని పేరుంది.

శుద్ధమైన తత్త్వాన్ని పొందాలంటే మొట్టమొదట మనకి కావలసినది జపం. జపతో నాస్తి పాతకమ్ – జ్ఞానం అర్థం కావాలన్నా, భక్తి కలగాలన్నా ముందు శుద్ధత కావాలి. దానికి ముందు కావలసినది జపమే. అన్ని యజ్ఞాల కంటే గొప్పది జపమే అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ. **'యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి'**

కుదురుగా కూర్చుని శ్రద్ధగా జపం చేస్తూ ఉంటే క్రమక్రమంగా ఆ జపం వికసిస్తూ ఉంటుంది. అలా వికసించగానే, ఆ జపిస్తున్న మంత్రానికి, దేవతకి అభిన్నత ద్యోతకమవుతుంది. మంత్ర చైతన్యమే దేవత. దేవత అంటేనే మంత్రం.

అమ్మ మంత్రం అమ్మరూపమే. జపం చెయ్యడం మన పని గాని అది ఎప్పుడు వికసిస్తుందో మనం చెప్పలేం. జపం వికసించడానికి ఇది వరకటి సాధనాఫలం – గతజన్మల పుణ్యవిశేషం ఒకటుంటుంది. ఈ జన్మలో సాధన యొక్క తీవ్రతావిశేషం, అనుకూలత, చేస్తున్న పద్ధతులు, గురుకృప – ఇవన్నీ కలియాలి.

చేస్తున్న జపం ఎప్పుడో వికసిస్తుంది. ఆ జపం వికసించినపుడు ఆ జపమంత్రం ఏదైతే చేయబడుతున్నతో ఆ మంత్రానుగుణమైన ఒక ప్రకాశము మనకి గోచరించి దర్శనమిస్తుంది. జపయంత్రం యొక్క వెలుగే అమ్మ ఆకృతిగా కనిపిస్తుంది కనుక 'జపాపుష్పనిభాకృతిః'. **జపం వికసించగా తన్మంత్ర చైతన్య ప్రకాశముగా గోచరించేది – ఇది 'జపాపుష్పనిభాకృతిః'** అన్నదానిలో అసలైన అర్థం.

నా జీవాధారా నా చూపు ప్రకాశమా
నా నాసికా పరిమళమా నాదు జపవర్ణరూపమా
నా పూజాఫలమా నా జీవాధారా

అని త్యాగయ్య బిలహరిరాగంలో కీర్తించారు. 'నాదు జపవర్ణరూపమా!' నేను జపిస్తున్న వర్ణము యొక్క ప్రకాశము నువ్వే ఓ రామచంద్రా! ఆ నువ్వే నా చూపులకి ప్రకాశము. ఆ నువ్వే నా జీవానికి ఆధారము. నా ఎన్నో జన్మల నోముల ఫలము – ఆయన చేసిన మంత్రజపఫలం వల్ల ఆయన నోట వచ్చిన కీర్తనలో ఆ జపవర్ణరూపం, జపాపుష్పం వికసించి దాని ప్రభావము కనబడింది.

మంత్రం విచ్చుకుంటే ఆ శక్తి వ్యక్తమౌతుంది. మొగ్గ విచ్చుకుంటే పువ్వులో ఉన్న శక్తులన్నీ బయటకి తెలుస్తున్నాయి. మంత్రాలన్నీ మొగ్గలే. అవి సాధనతో విచ్చుకోవాలి. సూర్యకాంతి వెచ్చదనం తగిలితే మొగ్గలు విచ్చుకున్నట్లు మన సాధనారూపమైన వెచ్చదనానికి మన జప కుసుమాలు విచ్చుకుంటాయి. అవి విచ్చుకుంటే ఆ మంత్రాక్షర చైతన్యం మనం ఎలా జపం చేశామో ఆ అక్షరాలకు తగ్గట్లుగా ఆకృతి ధరిస్తుంది. అదే 'జపాపుష్పనిభాకృతిః'. దేవతానామాలకు లౌకికార్థాలు చెప్పలేం. ఆ శక్తి సామాన్యం కాదు.

767. ఓజోవతీ – శ్రీ ఓజోవత్యై నమః

మంత్రానికి ఓజస్సు అనే గొప్ప గుణం ఉంది.

ఓజస్సు ఎనిమిదవ ధాతువు. ముందు సప్తధాతువులు గురించి చెప్పుకున్నాం. త్వక్స్థా, మాంసనిష్ఠా ఇత్యాదులు. ఇవి స్థూలంగా కనబడుతూ ఉంటాయి.

వ్యక్తి యందు సర్వేంద్రియాలని కలిపి పట్టుకునే శక్తికి ఓజస్సు అని పేరు. ఏ ఇంద్రియ బలము దానిదే. వాటిని కలుపుకొని శరీరాన్ని పట్టగలిగే పటుత్వాన్ని ఓజస్సు అంటారు. ఆ ఓజస్సు ఉంటేనే శరీరానికి సహస్సు. సహస్సు అంటే భరించుట, నడుపుట. అలా మొత్తం కలిపి పట్టగలిగే శక్తి చేతనే నిర్వహింపబడుతున్నది ఈ శరీరం. ఓజస్సు, సహస్సు అనే రెండు శక్తులు ఉన్నాయి. అవి మనలో ఈశ్వరుడు ప్రవేశింపజేసిన చిచ్ఛక్తి యొక్క రూపాలు.

ఎలాగైతే మన శరీరాన్ని ఓజస్సు, సహస్సులతో పరమాత్మ నడుపుతున్నాడో, అదేవిధంగా ప్రపంచాన్ని కూడా ఓజస్సు, సహస్సు శక్తులతో పరమాత్మ నడుపుతున్నాడు. సంధ్యాకాలంలో గాయత్రీ ఆవాహనలో **"ఓజోసి సహోసి బలమసి భ్రాజోసి దేవానాం ధామనామాసి"** అని అంటారు.

అమ్మా! నువ్వే ఓజస్సువు. నువ్వే సహస్సువు. ఆ రెండిటితో నా శరీరంలో తయారయ్యే బలము నువ్వు. ఆ బలం వల్ల నా శరీరంలో వచ్చే వెలుగు నువ్వు. నాకే కాదు సర్వదేవతలకి కూడా ఆ ప్రకాశాన్ని ఇచ్చేదానవు నువ్వే తల్లీ! ఓజోవతీ అంటే ఓజస్సనే శక్తి కలిగిన తల్లి.

సర్వేంద్రియాల సారశక్తే ఓజస్సు. **"ఓజస్తేజోంశ ధాతునా మవష్టంభ ప్రకాశయోః ఓజో బలే చ దీప్తౌ చ"** (విశ్వనిఘంటువు)– ఓజస్సంటే బలము, ప్రకాశము మొదలైన అర్థాలను చెప్పారు. ఓజస్సు గురించి శంకరభగవత్పాదాచార్యుల వారు చక్కని నిర్వచనం ఇచ్చారు.

'యద్బలం కామరాగ వివర్జితం ఐశ్వర్యమ్ జగద్విధారణ సామర్థ్యం". పరమాత్మ యొక్క బలాన్నే ఓజస్సు అనాలన్నారు. ఈ మాటని భగవద్గీతలో పరమాత్మ చెప్పాడు. **'గామావిశ్యచ భూతాని ధారయామ్యహం ఓజసా'** "ఈ సమస్తమైన ప్రాణికోట్లను,

ఈ భూమిని - వీటన్నిటినీ నేనే ఓజస్సుతో భరిస్తున్నాన"ని అంటారు.

కామరాగదోషాలు లేని, సర్వజగత్తుని పట్టి నడిపించగలిగే ఈశ్వరశక్తి ఓజస్సు. ఈ శక్తి రూపమే ఓజోవతీ.

768. ద్యుతిధరా - శ్రీ ద్యుతిధరాయై నమః

ద్యుతి అంటే ప్రకాశం. ఓజస్సు సప్తధాతువులను చక్కగా నిర్వహింపజేస్తూ శరీరానికి ద్యుతినిస్తుంది. సప్తధాతువులకు మూలధాతువు ఓజోవతి. దాని వల్ల సప్తధాతువులు నిర్వహింపబడితే వచ్చేది ద్యుతి. **ద్యుతి అంటే 'ద్యుతిమ్ అంగగతాం కాంతిమ్'** అన్నారు. ద్యుతి శరీరానికి సంబంధించిన వెలుగు. ఓజస్సు దేవీ స్వరూపం. ద్యుతిని ఆమె ధరిస్తున్నది. ఆ ఓజస్సు శక్తి చేతనే మనలో ద్యుతిని ఇస్తున్నది.

769. యజ్ఞరూపా - శ్రీ యజ్ఞరూపాయై నమః

యజ్ఞమే తన రూపంగా కలది. 'యజ్ఞో వై విష్ణుః' అని శాస్త్రం. సృష్టి అంతా యజ్ఞమే. యజ్ఞమంటే త్యాగపూర్వక కర్మ. త్యాగము అంటే విడుచుట. న మమ - నాది కాదు అని ఏ పని చేస్తామో దానికి యజ్ఞమని పేరు.

ఒకటి పుచ్చుకోవాలంటే ఒకటి ఇవ్వాలి. త్యాగం చెయ్యనివానికి పుచ్చుకునే అర్హత లేదు. సృష్టిలో మనకి ఏది కావాలన్నా దేవతలు ఇవ్వాలి. దేవతలివ్వాలంటే వారికి మనమేదో ఒకటి త్యాగం చెయ్యాలి. ఆ త్యాగమే యజ్ఞం. ఆ త్యాగమనేది అగ్నిహోత్రంలో చెయ్యవచ్చు. పూజలో చెయ్యవచ్చు. ఎలాగైనా చెయ్యవచ్చు. మనం వస్తుత్యాగం చేస్తున్నాం కానీ నిజంగా మమ - అహం - త్యాగం చేస్తున్నామా! చెయ్యగలిగితే అది ఇంకా గొప్ప యజ్ఞం. నా కోసం అనే భావం లేకుండా చెయ్యడమే యజ్ఞం. అది చేస్తున్నవాడు ఒక్క పరమాత్మ తప్ప ఇంకెవ్వరూ కాదు. పరమాత్మ ఇంత ప్రపంచాన్ని ఎవరి కోసం చేశాడు? ఆయన బలం 'కామరాగ వివర్జితం'. ఈశ్వరకృత్యానికే యజ్ఞమని పేరు.

ఆ పరమేశ్వరుడు మనకి లభించాలంటే మనం కూడా యజ్ఞం చెయ్యాలి.

ముందు ద్రవ్యత్యాగం, తరువాత అహం, మమ త్యాగం. అది జరిగేటప్పటికి యజ్ఞం జ్ఞానమైపోయింది. అప్పుడు ఈశ్వరి(రుని)తో ఐక్యం కాగలం.

మనం అన్నాన్ని తింటున్నప్పుడు జఠరాగ్ని రూపంలో ఈశ్వరశక్తి ఏ ఇంద్రియానికి కావలసిన శక్తి ఆ ఇంద్రియానికి అందజేస్తున్నది. అదే విధంగా మనం వేసిన అగ్నిహోత్రంలోని ద్రవ్యాన్ని అగ్నిహోత్రుడు ఏ దేవతకి ఎలా ఇవ్వాలో అలా ఇస్తున్నాడు. అలా ఇవ్వడం వల్ల ఆ దేవతలందరూ సంతోషించి మనకి వృష్టిని ఇస్తున్నారు. ఇక్కడ ఒకటి ఇవ్వగానే అది మరొకవిధంగా మారి మళ్ళీ రావడం ఆదాన – ప్రదాన వ్యవస్థ. ప్రపంచమంతా ఈ యజ్ఞమే జరుగుతోంది.

ఈ ప్రపంచంలో ఆదానం – ప్రదానం చూస్తే సూర్యుడనే అగ్నిలోకి భూమిలోని నీరంతా ఆహుతైపోతోంది. సూర్యుడు ఉప్పునీటిని కూడా తీసుకుని మనకి మంచి నీటిని ఇస్తున్నాడు. 'ఫలమపి చ వాంఛా సమధికం' అని శంకరులు సౌందర్యలహరిలో చెప్పినట్లుగా తీసుకున్నది గోరంతైతే, ఇచ్చేది కొండంత.

సూర్యుడు నీటిని లాక్కుంటూ ముందు భూమికి వేడిని ఇస్తున్నాడు. ఆ వేడిని తీసుకొని భూమి అగ్నిగర్భగా మారిపోతోంది. మళ్ళీ ఆయన వర్షం కురిపించగానే భూమిలో పడిన బీజాలకి ఆ నీరు తోడై ఆ భూగర్భంలో దాగి ఉన్న వేడికి మళ్ళీ అవన్నీ ఆహారంగా మారుతున్నాయి. ఈ మారిన ఆహారాన్నే ప్రతి జీవి తింటుంది. మళ్ళీ తిరిగి ఇదంతా జఠరాగ్నిలోకి వెళ్తోంది. ఇలా ఈ సృష్టి అంతా ఎప్పుడూ ఒక యజ్ఞంగా కనబడుతోంది. ప్రపంచాన్నంతటిని యజ్ఞంగా దర్శించిన మన భారతీయ ఋషులు యజ్ఞం ద్వారానే పరమాత్మని చూడగలమని బోధించారు.

ఆ యజ్ఞమే అమ్మవారి రూపం. వైదిక సంప్రదాయానుగుణంగా యజ్ఞం ఎక్కడ జరుగుతున్నా వెళ్ళి నమస్కరించుకోవాలి. ఆ యజ్ఞంలో సర్వదేవతలు ఉంటారు. అవన్నీ అమ్మరూపాలే. భగవద్గీతలో కూడా –

అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మ సముద్భవః

కర్మబ్రహ్మోద్భవం విద్ధిం బ్రహ్మాఽక్షర సముద్భవం
తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితం

అని కృష్ణపరమాత్మ చెప్పారు. సర్వగతమైన బ్రహ్మము యజ్ఞమును ఆధారం చేసుకునే ప్రపంచాన్ని నడుపుతున్నాడు. అన్నం వల్ల ప్రాణికోటి కలుగుతోంది. వర్షం వల్ల అన్నం కలుగుతోంది. ఆ వర్షం యజ్ఞం వల్లనే కలుగుతోంది. యజ్ఞం కర్మవల్ల కలుగుతోంది. కర్మ వేదం వల్ల కలుగుతోంది. వేదం ఆ బ్రహ్మము నుండి కలుగుతోంది కనుక బ్రహ్మము యజ్ఞమునందే ప్రతిష్ఠితుడై ఉన్నాడని కృష్ణపరమాత్మ చెప్పిన మాట.

సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః
అనేన ప్రసవిష్యధ్వమ్ ఏష వోఽస్త్విష్టకామధుక్

అని గీతలోనే కృష్ణపరమాత్మ చెప్తూ యజ్ఞం చేతనే దేవతలు అనుగ్రహించడం, ప్రపంచం నడవడం జరుగుతోందన్నాడు. ఇది 'యజ్ఞరూపా' నామంలో ఉన్న అర్థం.

అమ్మవారు మహాయాగంలోని చిదగ్నికుండంలోంచి వచ్చింది కనుక అమ్మవారు 'యజ్ఞరూపా'. మహామఖము అంటే ఏమిటో చెప్తూ **"ఇంద్రియద్వార సంగ్రహ్యైః గంధాద్యైరాత్మదేవతాం స్వయం భక్త్యా సమారాధ్యః జ్ఞాతుం సోయం మహామఖః'** అన్నారు. మన ఆత్మయే అమ్మవారు అనుకుని ఇంద్రియాలను నిగ్రహించుకుని మన యొక్క పంచతన్మాత్రల తత్త్వాన్ని పంచోపచారపూజగా అమ్మవారికి సమర్పణ చేసుకోగలిగితే అదే గొప్ప యజ్ఞమని చెప్పారు. ఆ యజ్ఞము అమ్మవారి రూపం.

770. ప్రియవ్రతా – శ్రీ ప్రియవ్రతాయై నమః

వేదము రెండు రకాల కర్మలను చెప్తోంది. యజ్ఞములు, వ్రతములు. ఈ రెండూ ఒకదానికొకటి అనుబంధంగా ఉన్నాయి. వ్రతము అంటే నియమ పాలన. ఏదో ఒకటి కోరుకొని ఆ వ్రతాన్ని నియమపాలనతో అనుసరిస్తూ ఉంటారు. ఇలాంటి వ్రతములు వేదం ఎన్నో చెప్పింది. పురాణాలు కూడా ఎన్నో చెప్పాయి. ఇప్పటికీ మనకి వ్రతాలు, వ్రతకల్పాలు చాలా కనబడతాయి. ఇవన్నీ వేదజనితము.

'ప్రియవ్రతా' అంటే ప్రియమైన వ్రతములు కలది. ఏ వ్రతం చేస్తే అమ్మవారికి

ప్రియం? అమ్మవారివే అన్ని వ్రతములు. దీనికి భవిష్యోత్తర పురాణం చెప్పిన శ్లోకాన్ని భాస్కరరాయలువారు ఉట్టంకించారు.

దేవం దేవీం చ వోద్దిశ్య యత్కరోతి వ్రతం నరః

తత్సర్వం శివయోస్తుష్ట్యై జగజ్జనన శీలయో

న భేదస్తత్ర మంతవ్యో శివశక్తిమయం జగత్

సృష్టిలో ఏ దేవీ దేవతలను ఉద్దేశించి వ్రతాలు చేసినా అవి శివశక్తులను తృప్తి పరుస్తాయి. ఏ వ్రతం చేసినా 'పార్వతీదేవికి పరమేశ్వరుదు ఇట్లని ఆనతినిచ్చె' అని ఉంటుంది. దీని అర్థం 'శివశక్త్యాత్మకం జగత్'. ఏ దేవతని, ఏ దేవిని కొలిచినా శివశక్తులకే ప్రీతి. ప్రతి దేవతావ్రతం అమ్మకే ప్రీతి కలిగిస్తోంది కనుక సర్వవ్రతాలు తనకు ప్రీతిగా కలిగిన తల్లి 'ప్రియవ్రతా'.

ఏ వ్రతం చేసినా వ్రతం చివరకి **"తత్సత్ బ్రహ్మార్పణమస్తు"** అని అంటాం. ఎవరు ఆ పరబ్రహ్మ? అమ్మవారే! అందుకే 'ప్రియవ్రతా'. సర్వవ్రతాల ఫలస్వరూపము, ఫలప్రదాయిని కూడా అమ్మవారే. యజ్ఞం, వ్రతం - ఈ రెండే మనల్ని తరింపజేయడానికి సాధనాలు.

ఆ రెండు తన స్వరూపాలే. పిల్లాడు క్రిందపడి ఉంటే పైకి లేపడం కోసం అమ్మ చేతిని అందిస్తుంది. అలా లేపడానికి అమ్మ ఇచ్చిన చెయ్యి అమ్మదే. అలాగే యజ్ఞం, వ్రతం అమ్మవారు మనల్ని తరింపజేయడం కోసం చాచిన చేతులు. వీటి ద్వారానే మనం తరించగలం.

యజ్ఞములు, వ్రతములు చేస్తున్నవారే సార్థక జీవనులు. అయజ్ఞం చాలా పాపమని చెప్పారు. వారి గురించి కృష్ణపరమాత్మ గీతలో చెప్తూ-

ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః

అఘాయురింద్రియారామో మోఘః పార్థ సజీవతి

అన్నారు. ఎవరైతే యజ్ఞము అనే చక్రాన్ని అనుసరించకుండా బ్రతుకుతారో వారు పాపజీవనులు. మోఘః పార్థ సజీవతి - వాడు బ్రతికున్నా వ్యర్థుడే.

వ్రతమంటే అదే శ్రేష్ఠమని ఆశ్రయించునది. అమ్మవారికి ఒకటే వ్రతం.

అమ్మవారి ప్రియుడు శివుడు. శివుడే అమ్మవారికి వ్రతము. 'ప్రియవ్రతా' అంటే ప్రియమైన శివుడే వ్రతముగా కలది.

'సదాశివపతివ్రతా' భావమే ఇక్కడ చెప్పబడుతున్నది.

771. దురారాధ్యా - శ్రీ దురారాధ్యాయై నమః

అమ్మవారిని ఆరాధించడం మహాకష్టం. ఆవిడతో యుద్ధం చేయడం మరీ కష్టం. పురాణాలలో అమ్మవారిని పూజ చేసేవారు, యుద్ధం చేసేవారు - ఇలా ఇద్దరు కనబడతారు. ఆ ఇద్దరూ మహాకష్టాలు పడ్డారు. మనస్సుని ఏకాగ్రం చేసుకొని, ఇంద్రియాల్ని నిగ్రహించి తాదాత్మ్యం చెంది చేసే పూజ ఎంత కష్టమో ప్రయత్నించి చూస్తే తెలుస్తుంది.

'దురారాధ్యా' అంటే మిక్కిలి కష్టము చేత ఆరాధింపబడునది. ముందు 'సుఖారాధ్యా' వచ్చింది. అమ్మవారిని సుఖంగా ఆరాధించవచ్చు అని చెప్పారు. ఇప్పుడు అమ్మవారిని ఆరాధించడం మహాకష్టం అన్నారు. ఏది నిజం! ఇలాంటి నామాలే విష్ణుసహస్రం కూడా చెప్పింది. 'దుర్లభో దుర్గమో దుర్గో' అంటుంది. మరల 'సులభః సువ్రతః సూక్ష్మః' అని కూడా చెప్తోంది. ఇంద్రియాలను నిగ్రహించి, మనస్సుని ఏకాగ్రపరచడం మహాకష్టం. వాటిని ఏకాగ్రపరచ గలిగితే అమ్మవారి పూజ సులభం. అది ఇందులో చెప్తున్నారు.

భక్తి కలిగిన వారికి భగవంతుడు సులభుడు. కానీ భక్తి కలగడం అంత సులభం కాదు. అది అర్థమైతే అక్కడ 'సుఖారాధ్యా' ఎందుకు చెప్పారో, ఇక్కడ 'దురారాధ్యా' ఎందుకు చెప్పారో అర్థమౌతుంది. కష్టమని చెప్పారు తప్ప, దొరకదు అని చెప్పలేదు. అనేక జన్మల పుణ్యాల విశేషం చేతనే అంబను ఆరాధించే భాగ్యం లభిస్తుంది.

772. దురాధర్షా - శ్రీ దురాధర్షాయై నమః

ధర్షయితుం న శక్యతే – అమ్మవారిని ఎదుర్కొనడం కష్టం. రాక్షసులు అమ్మవారిని ఎదుర్కొనలేక దెబ్బతిన్నారు. అమ్మవారితో యుద్ధం చేయడానికి కూడా ఏదో పుణ్యం ఉండాలి. ఎన్ని పుణ్యాలు లేకపోతే అమ్మవారి ముందుండి యుద్ధం చేయగలరు? అమ్మవారు తన ఖడ్గంతో రాక్షసుల పాపాల్ని కడిగేసి వారికి ఉత్తమగతులని ఇచ్చింది. ఇది చండీవిద్య – సప్తశతికి సంబంధించిన నామాలు.

భాస్కరరాయలవారు భాష్యం చెప్తూ "ధర్షణం (అంటే) స్వాయత్తీకరణం" అన్నారు. స్వాయత్తీకరణమంటే స్వాధీనపరచుకొనుట. అమ్మవారిని లొంగదీసుకోవడం మహాకష్టం. ఆవిడ భక్తికి లొంగుతారు. అలా లొంగదీసుకొనే భక్తి దొరకడం మహాకష్టం.

అమ్మవారి తత్త్వాన్ని తెలుసుకొనడం కష్టం. దీనికి శంకరభగవత్పాదులవారు **"తరళ కరణానామ్ అసులభా"** అన్నారు. కరణములు అంటే ఇంద్రియాలు. తరళము అంటే చపలత్వము. ఇంద్రియాలు నిగ్రహించుకొని, మనస్సుని ఏకాగ్రత పరచుకోనివారికి అమ్మ ఆరాధన కష్టం. చపలచిత్తులకి దురారాధ్యా, దురాధర్షా నిగ్రహసిద్ధులకి సుఖారాధ్యా.

773. పాటలీకుసుమప్రియా – శ్రీ పాటలీకుసుమప్రియాయై నమః

'బంధూకకుసుమప్రియా', 'కదంబకుసుమప్రియా' అని ముందు నామాల్లో వచ్చాయి. ఇప్పుడు 'పాటలీకుసుమప్రియా'. పాటలీకుసుమాలు అమ్మవారికి చాలా ఇష్టము. పాటలీ అంటే ఎరుపు వర్ణము. అమ్మవారికి ఎర్రని పూలు ఇష్టము.

'శ్రీవృక్షో శంకరో దేవః పాటలాయాంతు పార్వతీ' – మారేడు చెట్టు శివుని రూపము. పాటలవృక్షము అమ్మవారి రూపము. పాటలీ కుసుమాలు అంటే గులాబీపువ్వులు అని కొందరు చెప్పారు. తెలుపు, ఎరుపు కలసిన రంగు పాటలీ. అదే గులాబీరంగు. వాటితో అమ్మవారికి పూజ చేయవచ్చు.

పటల – పాటలీ. పటలము అంటే సమూహము. మన భావాలన్నీ విడివిడిగా ఉన్నాయి. వీటన్నిటిని సమూహము చెయ్యాలి. పటలములను కుసుమములుగా

అమ్మవారికి అర్పించాలి. అనేకమే ప్రపంచము. అనేక భావాలను ఏకం చేసి అమ్మవారికి అర్పించాలి.

పటలము అంటే భగవదారాధన చేసేటప్పుడు ఏ ఏ పూజాంగములు ఉన్నాయో అవన్నీ సంపూర్ణముగా చేయాలి. పూజ చేసేటప్పుడు మొదటి నుండి చివర వరకు జపం ఉంటుంది. న్యాసము ఉంటుంది. ఉపచారములుంటాయి. ఇవన్నీ పద్ధతిగా చేయాలి.

జపము ఒక పటలము. న్యాసము ఒక పటలము. అంతా కలిపి ఒక పటలము. ఈ మొత్తం సమూహంగా చేయాల్సిన పద్ధతులన్నీ కూడా వికసింపజేసి, ఈ పటలమంతా సంపూర్ణముగా అమ్మవారికి అర్పణ చేస్తే ప్రీతిగా స్వీకరిస్తుంది కనుక 'పాటలీకుసుమప్రియా'.

774. మహతీ – శ్రీ మహత్యై నమః

అసంగో, అశబ్దో, అశరీరో, అస్పర్శో మహాన్ – అసంగము, అశబ్దము, అశరీరము, అస్పర్శము, మహాన్ – పరబ్రహ్మకు శరీరము లేదు. దేనితోనూ సంపర్కము లేదు. ఈ శబ్ద స్పర్శ రసాదులకు అతీతమైనవాడు ఎవడో ఆ పరమాత్మను మహాన్ అంటారు. పుంలింగంలో మహాన్. స్త్రీలింగంలో మహతీ. మహతీ అంటే పరబ్రహ్మస్వరూపిణి. ఉపనిషద్వచనమిది. అన్నిటి కంటే శ్రేష్ఠమైనది. **'మహ ఇతి తద్బ్రహ్మ సాత్మా'** – అని శ్రుతి. ఆత్మస్వరూపిణి అయిన దేవి. మహచ్ఛబ్దం ఎక్కడ వచ్చినా అది పరబ్రహ్మమును తెలియజేస్తుంది. గొప్ప పరిమాణం కలది అని కూడా భావం.

నారదుని వీణ పేరు కూడా మహతీ. ఆ వీణ అమ్మవారి స్వరూపము. వీణలో కనిపించే నాదమంతా అమ్మరూపము. దేవర్షి యొక్క వీణాస్వరూపముగా ఉన్నది.

775. మేరునిలయా – శ్రీ మేరునిలయాయై నమః

మేరువు అంటే విశ్వచక్రానికి ఆధారమైనది. సర్వజ్యోతిర్మండలాలు ఏ శక్తిని ఆధారం చేసుకొని తిరుగుతున్నాయో అది మేరువు. ఆ మేరువుపై ఆవిడ ఆసీనురాలై ఉంది.

అంటే – అమ్మవారిని ఆధారం చేసుకుని ప్రపంచమంతా చలిస్తోంది. మేరుపర్వత శిఖరం చుట్టూ దేవతలు ప్రదక్షిణ చేస్తారని శాస్త్రం చెప్తోంది. దేవతలు అంటే విశ్వనిర్వహణ శక్తులు. వీరంతా దేన్ని కేంద్రంగా చేసుకొని తిరుగుతారో ఆ శక్తే మేరువు. ఆ కేంద్రశక్తి దేని వల్ల పనిచేస్తోందో ఆ తల్లి 'మేరునిలయా'. మేరువు అంటే అమ్మవారి స్వరూపాన్ని చూపిస్తూ – **'మధ్యస్థ మేరౌ లలితా సదైవాస్తే మహాద్యుతిః'** అన్నారు. మేరువు మధ్య శిఖరంలో అమ్మవారు ఉన్నారు కనుక 'మేరునిలయా'. అమ్మవారి నిలయమైన శ్రీమన్నగరం కూడా మేరుపర్వతం మధ్యలో ఉంది. మేరువు అన్నది మేరుదండము. దాని యొక్క శిఖరము సహస్రారము. ఆ సహస్రారము నందు ఉన్నది 'మేరునిలయా'.

సర్వయంత్రాలు మేరువు నుంచే వచ్చాయి. ఈ మేరువుకి బంగారు కొండ అని పేరు. దీనినే కల్యాణశైలమని అంటారు. మంగళకరమైన శైలము. వెలుగులకి మూలమైనది మేరువు. జ్యోతిస్వరూపాన్ని ఇక్కడ భావన చేస్తున్నారు. అన్ని జ్యోతిస్వరూపాలకి మూలమైన తత్త్వము. అన్ని మంత్రాలు దేని నుండి వచ్చాయో అది మేరువు – అని శాస్త్రీయమైన భావన.

అమ్మవారి మంత్రమే మేరువు. సర్వమంత్రాలు ఆ మంత్రము నుండే వచ్చాయి. మూలమంత్రంలో ఆవిడే ఉంది. కనుక మేరునిలయా. మంత్రశాస్త్రంలో **'నవార్ణో మేరు రుచ్యతే'** అన్నారు. నవార్ణ మంత్రాన్ని మేరువు అంటారు. దాని నుండే సర్వమంత్రాలు వచ్చాయి.

జాగ్రత్తగా పరిశీలిస్తే పంచదశీమంత్రం ఇందులో కనబడుతుంది. అది ఒక రహస్యమంత్రం. దాని ఉద్ధారణ శక్తి ఒకొక్క బీజం. భూమి, శివా, చంద్ర, మాయ. ఈ బీజం దేనిని తెలియజేస్తుందో చెప్పారు. **'మహాత్రిపురసుందర్యాః మంత్రా**

మేరు సముద్భవాః' అని 'జ్ఞానార్ణవం' చెప్తోంది.

తత్ర వశిన్యాద్యష్టకేన సహ భేదభావనా భూప్రస్తారః

మాతృకాక్షరైశ్చేత్ కైలాసప్రస్తారః

షోడశాభిర్నిత్యాభిశ్చేత్ మేరుప్రస్తారః

'వశిన్యాద్యష్టకంతో శ్రీచక్రానికి ఐక్యభావన చేస్తే భూప్రస్తారం; మాతృకా వర్ణాలకు శ్రీచక్రానికి ఐక్యభావన చేస్తే కైలాస ప్రస్తారం; షోడశ నిత్యలకు శ్రీచక్రానికి ఐక్యభావన చేస్తే మేరుప్రస్తారమౌతుంది. అలాంటి మేరువే నివాసంగా కలది మేరునిలయా – అని తంత్రశాస్త్రాల ప్రకారం మరో భావన.

కుడిచేతి మధ్యమవ్రేలుని మేరువు అంటారు. ఇది గ్రహించగలిగితే 'పంచకోశాంతరస్థితా' కూడా అర్థం అవుతుంది. లోపలి భాగంలో ఉన్న మేరునిలయా. వేదం వల్లెవేసేటప్పుడు, సరిగ్గా లెక్కపెట్టేటప్పుడు ప్రధానంగా ఈ వేలిలో ఉన్న కణుపులకి ప్రాధ్యానముంది. అక్కడ కణుపు దగ్గర ఉన్న శక్తికి మేరునిలయా అంటారనే వ్యాఖ్యానాన్ని కూడా అందించారు భాష్యకారులు. ఇది గాయత్ర్యాది అనుష్ఠానంలో కనబడుతుంది.

శ్రీచక్రమే మేరువు. 'సుమేరుమధ్యశృంగస్థా' నామం కూడా ఇక్కడ స్వీకరించవచ్చు. అమ్మవారు 'చక్రరాజరథారూఢా' 'సర్వాయుధపరిష్కృతా' – ఈ చక్రాన్నే రథంగా వర్ణించారు. ఆ రథంలో ఉన్న అమ్మవారు మనలో ఉన్న భండాసురుని సంహరించడానికి అనుగ్రహిస్తున్నారనే భావనతో పరిశీలిస్తే మేరుప్రస్తారాన్ని అమ్మవారి రథంగా ధ్యానించవచ్చు.

చతుర్వేదమహాచక్రం పురుషార్థమహాహయం

ఆనందధ్వజ సంయుక్తం తప్తకార్తస్వరోజ్జ్వలం

సర్వాగ్రే బిందుపీఠేన సహితం బ్రహ్మచారిణీ

మేరుప్రస్తార రూపాఢ్యం చక్రరాజరథోత్తమం (బ్రహ్మాండపురాణం)

ఇది 'మేరునిలయా' అన్నప్పుడు భావించాల్సిన పద్ధతి. అదొక రథం వంటిది. రథానికి నాలుగు చక్రాలు ఉంటాయి. 'చతుర్వేదమహాచక్రం' అంటే నాలుగువేదాలే

చక్రాలుగా ఉన్నాయి. శ్రీచక్రం యొక్క గమనం వేదగమనమే.

'పురుషార్థమహాహయం' అంటే పురుషార్థములే గుర్రాలుగా ఉన్నాయి. 'ఆనందధ్వజ సంయుక్తం'– ధ్వజము అంటే ప్రకటించుట. ఆనందాన్ని ప్రకటిస్తున్నది శ్రీచక్రం. 'తప్తకార్తస్వరోజ్జ్వలం' అంటే కరగబెడుతున్న బంగారురంగుతో ఉంది. పరబ్రహ్మ అయిన శివునితో ఉన్న తల్లి 'బ్రహ్మచారిణీ' అని చెప్పబడుతున్నది. ఆ బిందుపీఠంలో కూర్చుని ఉంది ఆ తల్లి. మేరునిలయా అనగానే ధ్యానించాల్సిన విధానం ఇది.

776. మందారకుసుమప్రియా – శ్రీ మందారకుసుమప్రియాయై నమః

మందారకుసుమములపై ప్రీతి కలిగినది. మందారమంటే కల్పవృక్ష కుసుమాలు. అవి అమ్మవారికి ఇష్టం. సంకల్పాలే కుసుమాలుగా అర్చించడం భావార్చన.

'దేవతరుః శ్వేతార్కో వా'. దేవతరువు అంటే కల్పవృక్షము. భూమి మీద తెల్లజిల్లేడుని మందారం అనాలి. తెల్లజిల్లేడు మందారమంత గొప్పది. శ్వేతార్క కుసుమాలతో పూజ అమ్మవారికి ప్రీతి అని దీనిలో భావం.

777. వీరారాధ్యా – శ్రీ వీరారాధ్యాయై నమః

వీరుల చేత ఆరాధింపడునది. దీక్షితులనే వీరులు అంటారు. దీక్షితులచేత ఆరాధింపబడుతున్నది కనుక 'వీరారాధ్యా'. నియమపాలనే దీక్ష. వారే వీరులు. శాస్త్రీయపరిభాషలో పూర్ణదీక్షాపరులకు వీరులని పేరు.

అనేక నియమాలకి సిద్ధమై దీక్షని స్వీకరిస్తున్నారు. ఇంద్రియాలను నిగ్రహించి, మనస్సును పరమాత్మ తత్త్వంలో లీనం చెయ్యగలవారు వీరులు. సృష్టిలో శారీరక బలం పొందవచ్చు. ఎంతమంది శత్రువులనైనా జయించవచ్చు. కానీ ఇంద్రియాలను జయించడం అంత తేలిక కాదు. దానికి చాలా పటుత్వం కావాలి.

దీనినే సాధనా పటుత్వం అంటారు. దానికి కావలసినది చిత్తశుద్ధి యొక్క

బలం. అలాంటి యోగులు, జ్ఞానులే వీరులు. వారిచే ఆరాధింపబడుతోంది కనుక 'వీరారాధ్యా'.

'అహం, మమ ఇత్యభిమాన రహితః వీరః' అన్నారు. నేను, నాది అనే అభిమానం లేనివారే వీరులు. అహంకార, మమకారాలను విడిచి పెట్టి పరమేశ్వరితో తాదాత్మ్యస్థితి పొందగల మహాత్ములు వీరులు. వారి చేత ఆరాధింపబడుతోంది కనుక 'వీరారాధ్యా'.

778. విరాడ్రూపా – శ్రీ విరాడ్రూపాయై నమః

'లలితా విశ్వవిగ్రహా' అని చెప్పినట్టుగా విరాట్ అంటే అత్యంత ఉత్కృష్టమైన అని అర్థం. ఈ విశ్వమే అమ్మవారి స్వరూపం. ఈ విరాడ్రూప వర్ణన 'సహస్రశీర్షవదనా, సహస్రాక్షీ, సహస్రపాత్' దగ్గర వివరించుకున్నాం. విరాట్ తత్త్వంగా అమ్మవారిని దర్శించుట.

779. విరజా – శ్రీ విరజాయై నమః

విగత రజా విరజా. రజస్సు లేనిది. దుమ్ము లేనిది. నిర్మలమైనది – అని అర్థం. **'హృత్పుండరీకం విరజం విశోకం'** – హృదయంలో దుమ్ము లేకుండా ఉంటే అప్పుడు అమ్మవారి కొలువు కనిపిస్తుంది. మాలిన్యము లేని స్థితినే విరజ అంటారు. అమ్మవారు అత్యంత శుద్ధతత్త్వం.

వైదిక నిరుక్తం ప్రకారంగా విరజా అంటే 'విశిష్ట రజము కలద'ని అర్థం. **జ్యోతిః రజః** – జ్యోతిస్సు ఒక రజము. నక్షత్ర గ్రహశక్తులన్నీ రజములు. రజములు అంటే బీజశక్తులు అనగా కారణమైనవి. అణువులు మొదలైనవి రజములు. **"నమః పాంసవ్యాయ చ రజస్యాయ చ"** అని రుద్రనమకం.

రజస్సుల యందు ఉన్న పరమాత్మ. విశిష్టముగా మూలకారణశక్తులను నిర్వహిస్తోంది కనుక విరజా. ఈ రెండు భావాలు స్వీకార్యములే.

విరజా అనే శక్తిపీఠం ఉందని శాస్త్రాలలో ఉంది. **'విరజే విరజామాతా బ్రహ్మణా సంప్రతిష్ఠితా, యస్యాస్సందర్శనాన్మర్త్యః పునాత్యాసప్తమం కులం'** – విరజా క్షేత్రంలో అమ్మవారు 'విరజా' అని చెప్పబడుతున్నది. బ్రహ్మదేవుడు ప్రతిష్ఠించి

ఆరాధించిన క్షేత్రం. అక్కడ అమ్మవారిని దర్శించినట్లైతే ఏడు తరాలు తరిస్తాయి.

విరజాక్షేత్రం ఉత్కళ రాష్ట్రంలో ఉంది. ఓడ్యాణాం గిరిజాదేవీ. ఓడ్యాణపీఠం అంటే ఉత్కళరాష్ట్రంలో ఉన్న గిరిజాదేవి అని చదువుతున్నాం గానీ విరజాదేవీ అనేది సరియైనది. అత్యంత శక్తిమంతమైన క్షేత్రం. లలితాసహస్రంలో సర్వపీఠశక్తులు ఉన్నాయి. ఇది సమగ్ర శాక్తేయశాస్త్రం.

780. విశ్వతోముఖీ – శ్రీ విశ్వతోముఖ్యై నమః

విశ్వమంతా ముఖము కలది. విశ్వశబ్దానికి సమస్తము అని అర్థం. అన్ని వైపులా ముఖము కలది. సర్వజ్ఞురాలు. అమ్మ యొక్క జ్ఞానం సంపూర్ణం. అన్ని వైపుల నుండి గ్రహించగలగడం సర్వతోముఖం. **'విశ్వతశ్చక్షురుత విశ్వతోముఖమ్'** అని వేదం చెప్తున్న మాట.

'నమఃపురస్తాత్ నమః పృష్ఠతస్తే' అని అర్జునుడు కృష్ణపరమాత్మ యొక్క విశ్వరూపాన్ని చూస్తూ ప్రార్థిస్తాడు. గీతలో విశ్వరూపసందర్శన యోగంలో ఈ శ్లోకం వస్తుంది. నీకు ముందు నమస్కారము. వెనుక నమస్కారము. ప్రక్కలకి నమస్కారము. ఎటు నమస్కారం పెట్టినా నువ్వు చూస్తావు. విశ్వరూపవర్ణన దగ్గరే విశ్వతోముఖ తత్త్వం చెప్పబడుతుంది. 'విరాడ్రూపా' నామం దగ్గర 'విశ్వతోముఖీ' చెప్పడంలో ఔచిత్యం – అమ్మ ఎటువైపునుండైనా చూడగలదు, వినగలదు, గ్రహించగలదు, పలుకగలదు. అది ముఖలక్షణం. అంత సంపూర్ణమైన జ్ఞానస్వరూపిణి.

'విరాడ్రూపా', 'విశ్వతోముఖీ' మధ్యలో 'విరజా' అని పెట్టడంలో ఉన్న అందం పరిశీలించాలి. త్రిగుణాత్మకమైన విశ్వమంతా అమ్మవారి రూపమైనపుడు ఆవిడకీ గుణాలు ఉంటాయా? కానీ ఆ తల్లికి ఈ త్రిగుణాలు అంటవు. ప్రపంచపు వికారాలేవీ చైతన్యానికి తాకవు. అదే 'విరజా'.

ప్రపంచమంతా అమ్మవారంటూనే శుద్ధస్వరూపాన్ని చూపించడంలో, ప్రపంచంగా అమ్మవారిని చూస్తూ ప్రపంచాతీతంగా ఎలా దర్శించాలో బోధిస్తున్నారు వశిన్యాది వాగ్దేవతలు.

781. ప్రత్యగ్రూపా – శ్రీ ప్రత్యగ్రూపాయై నమః

ప్రత్యక్ రూప – ఈ రెండు మాటలు కలసి ఈ నామం ఏర్పడింది. 'ప్రత్యగ్రూపా' తత్త్వాన్ని అమ్మవారి ఆరాధనలో దర్శించి కాళిదాస మహాకవి **'ప్రత్యగుల్లసత్'** – అమ్మవారు ప్రత్యక్‌గా ఉల్లసిస్తుంది అన్నారు. ఉల్లాసమంటే ఉత్కృష్టంగా ప్రకాశించునది. **'ప్రత్యగ్ ఉల్లసత్ తత్పదం గతః'** అని వివరించారు.

పరాఙ్ముఖం, ప్రత్యఙ్ముఖం అని రెండు పదాలు ఉన్నాయి. పరాఙ్ముఖ అంటే బహిర్ముఖత్వం. ప్రత్యఙ్ముఖ అంటే అంతర్ముఖత్వం. ప్రత్యక్ అంటే వెనుతిరగడం. పరాక్ అంటే వెలికి వచ్చుట. ఇంద్రియాలు ఎప్పుడూ పరాకులే. బయట విషయాలవైపే తిరుగుతూ ఉంటాయి. వాటిననుసరించి మనస్సుకి ఎప్పుడూ బయటకి పరిగెత్తడమే అలవాటు. ఆ విషయ సంపర్కం లేని జ్ఞానాన్ని నిర్విషయజ్ఞానం అంటుంది వేదాంతం. నిర్విషయజ్ఞానం అందాలంటే పరాకు వదిలేయాలి. బహిర్ముఖత్వము విడిచిపెట్టాలి. వెనుతిరిగి చూడగలిగితే సాక్షాత్కరించే స్వరూపం కనుక ప్రత్యగ్రూపా. అంతర్ముఖదృష్టికి లభించే పరతత్త్వం. ఇది సాక్షాత్ ఉపనిషత్తులు చెప్తున్న మాట. ప్రత్యక్ అనే మాట కఠోపనిషత్తులో కూడా కనిపిస్తుంది.

'పరాంచి ఖాని వ్యతృణత్స్వయంభూః తస్మాత్ పరాఙ్ పశ్యతి నాంతరాత్మన్'. ప్రతివారి ఇంద్రియాలని పరాకుతో తయారుచేశాడు బ్రహ్మదేవుడు. ఇంద్రియాలతో కలసి మనస్సు కూడా బైటకి తిరుగుతోంది. 'కశ్చిత్ ధీరః' ఒక్క ధీరుడే ఉంటాడు. వాడు మాత్రమే ప్రత్యగ్దృష్టి పొందగలడు. అప్పుడే 'వీరారాధ్యా' అర్థం అవుతుంది. దానిని వెనుతిప్పగలిగేవారే ప్రత్యగ్దృష్టి కలవారు. ప్రత్యక్ అయితేనే తెలిసే తత్త్వం ప్రత్యగాత్మ.

పరమాత్మకి మరోపేరు ప్రత్యగాత్మ. దేహాలతో పరిశీలించి చూసుకుంటే దేహాత్మ. దేహాత్మ భ్రాంతేగాని దేహాత్మ జ్ఞానం అనరు. దేహాన్ని ఆత్మ అనుకోవడం భ్రాంతి మాత్రమే. అది వ్యవహారంలో ఉంటుంది. కానీ భ్రాంతే అది. దేహాదులకి అతీతమైన ఆత్మ, దేహాల నుండి అతీతమైన దృష్టిగలవారికే ఉంది. అందుకే దానికి ప్రత్యగాత్మ అని పేరు. ఈ నామానికి నారాయణదాసుగారు చక్కటి తెలుగు అనువాదం చేశారు.

"నిండారు లోచూపు నిలువైన తెల్వి" - నిండైన లోచూపు అంటే పరిపూర్ణమైన అంతర్ముఖదృష్టి. నిలువైన తెల్వి... పరిపూర్ణజ్ఞానమే అమ్మవారి స్వరూపం

782. పరాకాశా – శ్రీ పరాకాశాయై నమః

ఉత్కృష్టమైన ఆకాశ స్వరూపురాలు. పరాకాశమే అమ్మవారు. **'ఆకాశమాదిజననీం శరణం ప్రపద్యే'** అని అప్పయ్యదీక్షితులవారు అమ్మవారిని కీర్తించారు. ఆకాశస్వరూపిణియైన అమ్మవారికి నమస్కారమన్నారు.

ఆకాశోపాసన అని కూడా ఉంది. సృష్టిలో ఆకాశాన్ని చూడాలి. వస్తువుని చూస్తూ ఉన్నా, వస్తువుకి ఆధారంగా ఉన్న ఆకాశాన్ని చూడడం ఒక సాధన. ఇలా ఆకాశోపాసన చేస్తూ ఉంటే క్రమక్రమంగా ఉపాధులను విడిచి పెడతాం. ఆకాశంలో ఉపాధులు ఉన్నాయి. ఉపాధుల్లో ఆకాశముంది. ఇది మనం పరిశీలిస్తే చాలు.

పంచభూతాల్లో ఒకటైన ఆకాశం గురించి మాట్లాడుతున్నాం. ఈ ఆకాశాన్ని భూతాకాశమంటారు. ఆకాశంలో సమస్తమైన భూతకోటి ఉంది. అన్నీ ఆకాశంలో ఉన్నాయని చెప్తూనే అన్నిట్లోనూ ఆకాశం ఉందని ఒక మాట చెప్తున్నాం. సర్వవ్యాపకం ఆకాశం. ఈ ఆకాశంతో సహా సర్వప్రాణికోట్లు ఆ పరాకాశాన్ని ఆధారం చేసుకున్నాయి. ఇది వైదికవాఙ్మయంలో మాటి మాటికి కనిపిస్తుంది.

'ఆకాశ ఇతి హోవాచాకాశో హ్యే వైభ్యో జ్యాయా నాకాశః పరాయణం' (ఛాన్దోగ్యం) – 'ఆకాశం అన్నిటి కంటె గొప్పది – అన్నిటికీ ఆధారం'.

'పరమే వ్యోమన్ ప్రతిష్ఠితాతి' అనే మాట కనబడుతుంది. **'ఆకాశ శరీరం బ్రహ్మ'** అనేది ఉపనిషద్వాక్యం. **'ఖం బ్రహ్మ'** అన్నారు. ఖం అంటే ఆకాశం. భూతాకాశానికి కూడా ఆవల ఉన్నది ఈ ఆకాశం. **'ఆకాశస్తల్లింగాత్'** అనే బ్రహ్మసూత్రంలో భూతాకాశం కాకుండా, పరబ్రహ్మనే 'ఆకాశ' శబ్దం ద్వారా గ్రహించాలని చెప్తున్నది.

ఆకాశం అంతటా ఉంది. అన్నిట్లోను ఉందని చెప్పుకున్నట్లే, ఆకాశానికి కూడా ఆధారమైన పరాకాశం కూడా అన్నిటిలోనూ ఉంది. మనలో కూడా ఉన్నది అదే. ఆ

పరాకాశం కేవల చైతన్యం మాత్రమే. అదే చిచ్ఛక్తి. అదే చిదాకాశం. ఎవరు ప్రత్యగ్దృష్టితో చూస్తారో వారికి పరాకాశం అనుభవానికి వస్తుంది.

ఎక్కడో ఉన్న గ్రహనక్షత్రాలని చూడడం మహాకష్టంగాని వాటితో సహా అన్నిటికి ఆధారమైన పరాకాశాన్ని చూడడం మాత్రం చాలా సులభం. అన్నింటికి ఆధారమైన ఆ ఆకాశం మన హృదయంలోనే ఉంది. అదే దహరాకాశం. 'దహరాకాశరూపిణీ' నామం దగ్గర చెప్పిన భావం ఇక్కడ గుర్తు తెచ్చుకుంటే చాలు.

పరాకాశమే దహరాకాశంగా ఉంది. బ్రహ్మాండమంతా వ్యాపించి విరాడ్రూపంగా బ్రహ్మాండాలకు కూడా అతీతమైన పరమేశ్వరి మన హృదయంలో పరాకాశస్వరూపమై ఉన్నది.

'యస్య సా పరమాదేవీ శక్తిరాకాశసంస్థితా' - ఏ పరమాదేవి ఉన్నదో ఆ శక్తినే పరమాకాశం అంటారు.

ఆ అంటే ఆసమంతాత్ అనగా సంపూర్ణముగా. ఆకాశమంటే సంపూర్ణమైన ప్రకాశం. అనగా శక్తి, చైతన్యము కనుక పరా ఆకాశ - 'పరాకాశా' - అంటే అత్యంత ఉత్కృష్టమైన సంపూర్ణ చిచ్ఛక్తిస్వరూపిణి.

పరాకాశ శబ్దానికి వివరణ: **"ఇత్థం హి సా జగతో యోనిరేకా, సర్వాత్మికా సర్వనియామికాచ। మాహేశ్వరీ శక్తిరనాదిసిద్ధా వ్యోమాభిధానా దివి రాజతీవ"** (కూర్మపురాణం) - జగత్కారణము, సర్వాత్మికం, సర్వనియామకం అయిన మాహేశ్వరీ శక్తి అనాది, అదే వ్యోమము అని చెప్పబడుతున్నది.

మరొక అర్థంలో- **'ద్వాదశాంతం లలాటోర్ధ్వం కపాలోర్ధ్వావసానకం ద్వ్యంగుళోర్ధ్వం శిరోదేశాత్ పరం వ్యోమప్రకీర్తితా'** - మన శిరోదేశము వద్ద ఉన్న ద్వాదశాంతస్థానమని చెప్పబడుతున్న స్థితియే పరాకాశము. ఆజ్ఞాచక్రం నుండి సహస్రారం వరకు ఉన్న స్వరూపాన్నే పరాకాశము అంటారు. ఇదే అసలైన స్వరూపం. అక్కడికి చేరుకుంటే బిందుస్థానానికి చేరుకున్నట్లే.

783. ప్రాణదా – శ్రీ ప్రాణదాయై నమః

ప్రాణాలు ఇచ్చే తల్లి. ఆ పరాకాశం లోంచి వస్తున్న చిచ్ఛక్తిస్వరూపమే ప్రధాననాడి అయిన సుషుమ్న ద్వారా సర్వనాడులకు ప్రసరించి, శరీరాన్ని చైతన్యవంతం చేస్తోంది. ఆకాశం నుండి ఉద్భవించిన సూర్యశక్తి నుండి ప్రాణశక్తి ప్రసరించి ప్రపంచాన్ని ఏ విధంగా బ్రతికిస్తున్నదో, అదేవిధంగా పరాకాశంలో ఉన్న అమ్మవారి చిచ్ఛక్తి నుండి ప్రసరిస్తున్న చైతన్యమే ప్రాణాలుగా శరీరమంతా వ్యాపించి ఉంది.

'ప్రత్యగ్రూపా' 'పరాకాశా' అని చెప్పినపుడు ఈ శరీరానికంతటి శక్తినిస్తున్న మూలస్థానము ప్రత్యగ్దృష్టితో తెలుసుకోవాలి అని భావం. ఆ మూలస్థానము పరాకాశరూపముగా ఉంది. ఆ పరాకాశము నుంచి ప్రసరిస్తున్న చిచ్ఛక్తే ప్రాణాలను ప్రసరింపజేస్తున్నది. ప్రాణానికి ప్రాణమనే మాట వింటుంటాం. ఎవరూ ప్రాణానికి మరొక ప్రాణాన్ని అడ్డువేయలేరు.

ప్రాణం అనే శబ్దానికి– 'ప్రాణితి చేష్టాం కరోతి ఇతి ప్రాణః' అన్నారు. చేష్టను కలిగించునది ప్రాణము. చేష్ట అంటే కదలిక. కదలికకి ఆధారం ప్రాణం. ఈ ప్రాణం వల్ల శరీరం కదులుతోంది. ప్రాణం దేని వల్ల కదులుతోంది?

గాఢనిద్రపోయినప్పుడు మన మనస్సు కూడా పని చేయదు. ఒక్కడే ఇరవైనాలుగు గంటలు మన శరీరంలో పనిచేసేవాడు. ఆయన ప్రాణమే మన ప్రాణానికి కూడా ప్రాణం. **'ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః'** అని విష్ణుసహస్రం చెప్తోంది. అదే విధంగా ఇక్కడ పరిశీలిస్తే అమ్మవారిని ప్రాణము అందామా అంటే, ప్రాణమే కాదు ప్రాణానికి ప్రాణమైనది. ఈ మాట మనకి ఉపనిషత్తులో స్పష్టంగా కనిపిస్తోంది. **'ప్రాణస్య ప్రాణః'** అనే మంత్రంలో ఈ విషయం చెప్పారు. మనకి చేష్ట కలిగించేది ప్రాణమైతే, ప్రాణానికి కూడా చేష్ట కలిగించేది అమ్మవారు.

ఉపనిషత్తులలో చెప్పిన మాట– **"న ప్రాణేన న అపానేన మర్త్యో జీవతి కశ్చన"** – మానవులు ప్రాణం వల్ల బ్రతకడం లేదు, అపానం వల్ల బ్రతకడం లేదు, పంచప్రాణాల వల్ల కూడా బ్రతకడం లేదు. నిర్వచనం చెప్పలేని ఈశ్వరచైతన్యం చేత జీవిస్తున్నారు కనుక 'ప్రాణదా'.

'ప్రాణోస్మి ప్రజ్ఞాత్మా తం మాం ఆయురమృతముపాస్వ' (కౌషీతకీ బ్రాహ్మణ) – నేనే ప్రాణముల ప్రజ్ఞారూపిణిని. నన్ను ఆయురమృతములుగా ఉపాసించుము'.

ప్రాణదా అయిన తల్లే మన లోపల ప్రాణరూపిణిగా సంచరిస్తూ ఉంది. ప్రాణాలకు ఆవల ఉంటూ ప్రాణాలను ఇస్తున్నది. తానే ప్రాణాలయందు ప్రవేశించి ఉన్నది కనుక దేవిని ప్రాణరూపిణిగా ఉపాసన చెయ్యాలి.

784. ప్రాణరూపిణీ – శ్రీ ప్రాణరూపిణ్యై నమః

ఉపనిషత్తు ప్రాణములకు కూడా ఆవలనున్న బ్రహ్మమునే అసలు 'ప్రాణం'గా పేర్కొన్నది. ఆ పరబ్రహ్మస్వరూపిణి. మరొక అర్థంలో ముఖ్యప్రాణస్వరూపిణి. ముఖ్యప్రాణము అంటే సుషుమ్నానాడి యందు సంచరించునది. ఆత్మ యొక్క ఉనికిని మనం ఈ ప్రాణం ద్వారా తెలుసుకోగలం.

'ప్రాణో బ్రహ్మ కం బ్రహ్మ ఖం బ్రహ్మ' అని శ్రుతి. 'ప్రా పూరణే' అనే ధాతువు ననుసరించి – 'అంతట నిండినది బ్రహ్మమే' అందుకే పరబ్రహ్మస్వరూపిణి అయిన లలితాంబ 'ప్రాణరూపిణి'.

"ప్రాణితి క్షేత్రజ్ఞరూపేణ ప్రాణాత్మనా చేష్టయతివా ప్రాణః చేష్టాం కరోతి శ్వసనరూపేణ" అని వివరించారు. మన లోపల ఉన్న పరమాత్మస్వరూపమైన అమ్మవారి వల్లనే శ్వాస కలుగుతోంది. మనకి తెలియకుండా ఆ క్రియ జరిగిపోతోంది. ప్రాణాలకు కూడా చేష్టను కలిగించే తల్లి. హంసస్వరూపిణి.

అమ్మవారిని లోపల ఉపాసించాలంటే ప్రాణాలని ఆధారంగా తీసుకుని వెళ్ళాలి. ప్రత్యగ్రూపా, పరాకాశా, ప్రాణదా, ప్రాణరూపిణీ. ప్రత్యగ్రూపా అని మన దృష్టి లోపలికి త్రిప్పి, పరాకాశరూపంతో ఉన్న శక్తిని చూపించారు. అక్కడ నుండే ప్రాణాలు ఉత్పన్నమౌతున్నాయని వివరించారు. ప్రాణాలుగా సంచరిస్తున్నది ఆ తల్లే అని చెప్పారు.

ఏనమేకే వదంత్యగ్నిం మనుమన్యే ప్రజాపతిం
ఇంద్రమన్యే పరం ప్రాణం అపరే చ మహేశ్వరీమ్

'ఈ పరమాత్మనే కొందరు అగ్నియని, ఇంకొందరు ప్రజాపతి అని, మరికొందరు ఇంద్రుడని, ఇతరులు ప్రాణమని, అన్యులు మహేశ్వరి అని అంటారు' (మనుస్మృతి).

నిత్యాతంత్రంలో – **'అథ షోడశ నిత్యానాం కాలేన ప్రాణతోచ్యతే'** – షోడశనిత్యలకు కాలాన్ని బట్టి ప్రాణత్వమున్నది. రాశులు, చంద్ర, సూర్య గతులు... మొత్తంగా కాలగమనం శ్వాసకాలాన్ని బట్టి చెప్పబడుతున్నందున, కాలరూపిణియైన జగన్మాత ప్రాణరూపిణియే.

785. మార్తాండభైరవారాధ్యా – శ్రీ మార్తాండభైరవారాధ్యాయై నమః

మార్తాండభైరవుని చేత ఆరాధింపబడుతున్న తల్లి.

'సూర్యోపాసితా త్రిపురా' – మార్తాండభైరవుడంటే సూర్యభగవానుడు. సూర్యభగవానునిచే ఆరాధింపబడుతున్న తల్లి. ఎలాగైతే మనువిద్య, చంద్రవిద్య, కామవిద్య ఉన్నాయో అలాగే సూర్యుడు ఉపాసించిన విద్య కూడా ఉంది. సూర్యోపాసితవిద్యనే ఇక్కడ ప్రస్తావిస్తున్నారు. 'ప్రాణదా', 'ప్రాణరూపిణీ' తరువాత 'మార్తాండభైరవారాధ్యా' చెప్పడంలో ఉన్న విశేషం గమనించాలి.

మన శరీరంలో ఉన్న ప్రాణాల గురించి మాట్లాడుతున్నాం కానీ ప్రపంచంలో అందరికీ ప్రాణాలు సూర్యభగవానుడు ఇస్తున్నాడు. సూర్యభగవానుడు ప్రాణశక్తికి కేంద్రం. ఆయన గురించి ఉపనిషత్ అనేక చోట్ల వర్ణిస్తూ, **'ప్రజానాం ప్రాణః'** అంది.

ప్రశ్నోపనిషత్ సూర్యభగవానుని గురించి చెప్తోంది. **'రశ్మిషు ప్రాణాన్ సన్నిధత్తే'** – తన రశ్ములయందు ప్రాణాలను నింపి ఉన్నాడు. సూర్యుని ఉనికి లేకపోతే ప్రాణశక్తి లేదు. మనందరం సూర్యుని ద్వారానే ప్రాణశక్తిని పొందుతున్నాం. అన్నం, ప్రాణం అన్నీ సూర్యస్వరూపములే. సూర్యభగవానుడు అమ్మవారిని ఆరాధన చేసి ఆ శక్తిని తెచ్చుకున్నాడు. ఆ సూర్యభగవానుడు ఆ ప్రాణశక్తికి తాను కేంద్రమై దానిని మనవైపు ప్రసరింపజేస్తున్నాడు. ఆయనలో ఉన్న ప్రాణశక్తి అంతా అమ్మవారే.

సృష్టిలో ఎవరైనా వారి పని వారు సమర్థవంతంగా చేయాలంటే దానికి శక్తి కావాలి. ఆ శక్తి కావాలంటే అమ్మవారే ఇవ్వాలి. ఒకొక్క దేవతకి ఒకొక్క లక్షణము, ఒకొక్క పని ఉంటాయి. ఆ పని వారు చక్కగా చేయడం కోసం, ఆ లక్షణరూపమైన శక్తి పొందడం కోసం అమ్మవారిని ఉపాసించి, ఆ శక్తిని పొంది తరువాత వారి పనులు ప్రారంభిస్తారు.

సృష్టికి ఆరంభంలో బ్రహ్మ పరమాత్మను ఉపాసించే సృష్టిని చెయ్యగలిగాడు. ప్రజాపతులు, సూర్యచంద్రాదులు... వీరంతా అమ్మవారిని ఆరాధించి ఆయా శక్తులను పొందారు. అదే మనల్ని కూడా నేర్చుకోమని శాస్త్రాలు బోధిస్తున్నాయి. శక్తులు రావాలన్నా, వచ్చిన శక్తులు చక్కగా పనిచేయాలన్నా నిరంతరం ఆ పరాశక్తిని ఉపాసించాలి.

అమ్మవారి ఉపాసనకి రెండు పరమార్థాలు. ఆవిడ శక్తితోనే పనిచేస్తున్నామన్న కృతజ్ఞతా భావంతో తెలివి ఉండాలి. ఆ శక్తిలో ఏమైనా లోపాలు ఉంటే, "అమ్మా! నువ్వే వాటిని సవరించవమ్మా" అని ప్రార్థించాలి. అమ్మవారి ఉపాసన చెయ్యకుండా బ్రతికేవాడు అజ్ఞాని. ఉపాసన అంటే మనకి మూలమైన శక్తిని గుర్తించడం. సూర్యభగవానునికి కూడా శక్తి అక్కడ నుండే వచ్చింది.

ఈ నామంలో కొంత మార్కండేయపురాణం, కొంత లలితోపాఖ్యానంతో అనుసంధానం చేసుకొని ఒక అద్భుతమైన విషయాన్ని చెప్పారు. అమ్మవారు ఈ జగతిలో కాలచక్రాన్ని పెట్టాలనుకున్నారు. ఎవరికి, ఎప్పుడు ఎలా వెళ్ళాలన్నా నియమం ఉంది. ఆ నియమం పేరే కాలం. **కలయతి నియతి ఇతి కాలః** – కాలం ఏర్పాటు చెయ్యాలని అమ్మవారు సంకల్పించుకుంది. అలా సంకల్పించుకోగానే హృదయాకాశంలోంచి మార్తాండభైరవుడు ఉత్పన్నమయ్యాడు. 'విరాడ్రూపా' అంటే విశ్వానికి అంతటికి హృదయం ఆమె హృదయమే. అదే పరాకాశం.

మార్తండభైరవుని అమ్మవారు శాసిస్తే ఆయన మండలంలోంచి క్రమంగా పదిహేనుమంది తిథి నిత్యాదేవతలు ఉదయించారు. ఆ పదిహేను మంది నిత్యాదేవతలు సూర్యచంద్రాది కళలతో అహోరాత్రుల రూపంతో ప్రకాశిస్తున్నారు.

కాలకారకుడు సూర్యుడు అంటాం. మనకి తిథులన్నీ సూర్యభగవానుని వల్లనే వచ్చాయి. ఆ సూర్యభగవానుని అమ్మవారు తన హృదయాకాశం నుండి సృజించింది. అలా సృజింపబడిన ఆయన తనకు సైతం మూలమైన ఆ శక్తినే ఉపాసన చేశాడు.

భైరవుడు అంటే పరమేశ్వరుడు. సూర్యమండలంలో ఉన్న శివతేజాన్ని మార్తాండభైరవుడంటారు. ఆ శివతేజస్సు శక్తిని ఉపాసన చేస్తూ ఉంది కనుక మార్తాండభైరవుడు. సూర్యునికి మార్తాండ అనే పేరు ఎలా వచ్చిందో అనేక పురాణాలు వివరించాయి. మృతమైన అండం నుంచి పుట్టాడు కనుక మార్తాండ. అదితి దేవి గర్భంలో సూర్యుడు ఉన్న సమయంలో ఆవిడ ఉపవాసవ్రతం చేస్తూ ఉండగా ఆవిడ భర్త కశ్యపుడు వచ్చి, "కడుపులో బిడ్డ ఎదుగుతూ ఉంటే ఉపవాసవ్రతం చేస్తున్నావు పిల్లవానిని చంపేస్తావా?" అని అన్నాడు. అప్పుడు ఆయనకి అదితిదేవి సమాధానం చెప్తూ, "చనిపోయేవాడు పుట్టడం లేదు, అసురశక్తులను చంపేవాడు పుడుతున్నాడు" అన్నది.

ఆకాశమే అదితి అని చెప్పారు. ఆకాశాన్ని ఖండించలేం. కశ్యపుడన్న 'చంపేస్తావా' అన్నమాట వినగానే లోపలవాడు ఇంకా ఒక రూపు దిద్దుకోకుండానే బయటకి వచ్చాడు. మృతమైన అండము నుంచి వచ్చాడు కనుక మార్తాండుడు.

ఈ నామానికి వైదిక నిరుక్తం మరో అర్థాన్ని చెప్పింది. **'మృతం అండయతీతి జీవయతీతి మార్తాండః'** – "చచ్చినట్లు ఉన్న ప్రపంచాన్ని చైతన్యవంతం చేసేవాడే మార్తాండుడు" అని మార్తాండ శబ్దానికి అర్థం చెప్పారు. జడానికి జీవాన్ని ఇచ్చేవాడే మార్తాండుడు.

మృతమైన అండం నుంచి వచ్చినవాడు అన్న అర్థం కూడా శాస్త్రోక్తమైనదే. సూర్యమండలంలో ప్రతిక్షణంలో అనేకమైన అణువులు విస్ఫోటనం జరిగి అంత వేడిమి, వెలుగు పుడుతున్నాయని విజ్ఞానశాస్త్రానికి ఇప్పటికి తెలిసింది. విస్ఫోటనమంటే ఎన్నెన్నో క్షయం జరిగి మరెన్నెన్నో పుడుతున్నాయి. అనేక అణువులు అక్కడ మృతమౌతూ ఉండగా, అక్కడ నుండి శక్తి ఉత్పన్నమై ఆ శక్తి వెలికి వస్తోంది. ఇది మార్తాండ శబ్దానికి వైదిక విజ్ఞానపరమైన అర్థం.

'భరత్వ రమణత్వ వమనత్వాత్ భైరవః' అని భైరవనామానికి అర్థం చెప్పుకున్నాం. సృష్టిస్థితిలయలు చేసేవాడు భైరవుడు. భీషణరవమే భైరవం. భీషణరవమంటే పెద్దధ్వని. మార్తాండమండలంలో ఉన్న నాదస్వరూపం. ఆయన నుంచే శబ్దశక్తి, కాంతిశక్తి వస్తున్నాయి. ఈ రెండూ కలిసి ఉన్నవాడే సూర్యభగవానుడు.

సూర్యభగవానుడు అమ్మవారిని ఆరాధన చేసినట్లు పురాణంలో కనబడుతోంది.

'దేవ్యా రత్నమయీం మూర్తిం భక్త్యా నిత్యం దివాకరః

పూజయిత్వాప్తవాన్ దివ్యం సూర్యత్వం శుభముత్తమమ్'

– సూర్యుడు రత్నమయమైన అమ్మవారి మూర్తిని తయారుచేసి నిరంతరం దానిని పూజిస్తూ ఉంటాడు. అలా సూర్యత్వాన్ని పొందాడని పురాణాలు చెప్తున్నాయి. అదే 'మార్తాండభైరవారాధ్యా'.

అమ్మవారి ఆరాధన వల్లనే సూర్యునికి సూర్యత్వముంది. చంద్రునికి చంద్రత్వం, సృష్టిలో ప్రతిదానికి దానిదైన లక్షణశక్తి పరాశక్తి నుండే వస్తూ ఉంటుంది. మనకి సూర్యభగవానుని చూస్తే అమ్మవారే గుర్తుకు రావాలి.

శ్రీమన్నగరంలో మార్తాండభైరవ మండలం ఇరవై రెండు, ఇరవై మూడు ప్రాకారాల మధ్యలో ఉంటుంది. శ్యామల, వారాహీకి సంబంధించిన ప్రాకారాలు ఎలా ఉన్నాయో అలాగే 22, 23 ప్రాకారాల నడిమి ప్రాంతం అంతా మార్తాండభైరవ స్వరూపం. దీనినే ఆర్యాద్విశతిలో దూర్వాసమహర్షి చెప్తూ– **'చక్షుష్మతీ ప్రకాశన శక్తిచ్ఛాయాసమారచితకేళిం మాణిక్యమకుటరమ్యం మన్యే మార్తాండభైరవం హృదయే"** అన్నారు.

ఎవరైతే మార్తాండభైరవ స్థానాన్ని హృదయంలో ధ్యానం చేస్తారో వారికి ఆయన ఆరోగ్యాదులన్నిటిని ఇస్తున్నాడు. అక్కడ 'చక్షుష్మతీ' 'ప్రకాశినీ' మొదలైన శక్తులతో కూర్చుని కిరీటవిరాజమానుడై మార్తాండభైరవుడు ఉంటాడు. ఆ ఆవరణలో ఉండి ఆయన నిత్యం అమ్మవారి ఉపాసన చేస్తూ ఉంటాడు.

తంత్రచింతామణి అనే గ్రంథంలో మార్తాండభైరవుడు భూమి మీద అవతరించి చేసిన ఒక లీలని చెప్పారు. ఇప్పటికీ అది మహారాష్ట్రలో కనిపిస్తుంది. మణిమల్లుడు

అనే దైత్యుడు అందరిని పీడిస్తూ ఉండేవాడు. అప్పుడు అందరూ శివుని ప్రార్థిస్తే, ఆయన సూర్యమండలం నుండి దిగి వచ్చి ఆ అసురుని సంహరిస్తే ఆయనకి **'మల్లారి'** అని పేరు వచ్చింది. శంకరభగవత్పాదాచార్యులవారు శివపాదాదికేశాంత స్తోత్రంలో గుర్రం మీద వెళ్తున్న శివుని వర్ణించారు. తంత్రచింతామణి గుర్రం మీద వచ్చి రాక్షసుని సంహరించిన వాడే మార్తాండభైరవుడని చెప్పింది. 'మార్తాండభైరవారాధ్యా' అంటే 'శివారాధ్యా' నామమే ఇక్కడ కనబడుతోంది. సూర్యరూపుడైన శివునిచే ఆరాధింపబడుతున్న తల్లి

786. మంత్రిణీన్యస్తరాజ్యధూః – శ్రీ మంత్రిణీన్యస్తరాజ్యధురే నమః

'ధూః' అంటే భారము. రాజ్యభారాన్ని 'న్యస్త' అంటే ఉంచబడిన. రాజ్యభారాన్ని మంత్రిణీదేవికి అప్పగించింది. ఇది కూడా లలితోపాఖ్యానంలో చెప్పిన కథే. అమ్మవారి నామాల్లో కొన్ని రూపవైభవాన్ని, కొన్ని లీలావైభవాన్ని తెలియజేస్తాయి.

అమ్మవారు యుద్ధానికి వెళుతున్నప్పుడు ఆవిడ నుండి శ్యామల, వారాహీ శక్తులు ఉత్పన్నమయ్యాయి. సైన్యాన్ని అంతటిని క్రమబద్ధీకరిస్తూ అమ్మవారు ప్రణాళిక వేస్తున్నారు. ఎవరికి ఏ భారమివ్వాలో చూసి వారాహీదేవిని సైన్యాధ్యక్షురాలుగా చేసి, కనుబొమల ముడిలోంచి ముసలము, రోకలి తీసి ఇచ్చి ఆమెను దండనాథగా నియమించింది.

తరువాత శ్యామలాదేవి చేయి తీసుకుని తన చేతికి ఉన్న ఉంగరాన్ని ఆమె చేతికి తొడిగింది లలితాదేవి. అమ్మవారు ముద్రికను ఈ తల్లికి ఇచ్చారు కనుక ఈమెకు 'ముద్రికాదేవి' అని మరొక పేరు కూడా ఉంది. రాజరాజేశ్వరీదేవి ముద్రిక శ్యామలాదేవికి తొడిగి రాజ్యభారాన్ని అంతటిని ఆవిడకి అప్పగించింది. మంత్రిణీ అంటే ఆలోచనాశక్తి. ఆ జ్ఞానశక్తి మొత్తం రాజ్యాన్ని పాలించాలని చెప్పడంలో జ్ఞానమే రాజ్యాన్ని ఏలాలి. శ్యామలాదేవికే రాజ్యభారాన్ని ఇచ్చింది. మంత్రాన్ని గమనించుకుంటూ ఆ మంత్రం చేసినవారికి ఆ పరాశక్తి అనుగ్రహం కలిగేలా ఈ తల్లి చూస్తూ ఉంటుంది. ఆమెయే శ్యామలాదేవి. శబ్దప్రపంచానికి నాయకురాలు.

మంత్రమంటే శబ్దప్రపంచమే.

"సర్వయంత్రాత్మికే! సర్వతంత్రాత్మికే! సర్వమంత్రాత్మికే! సర్వరూపే! హే జగన్మాతృకే! పాహిమాం పాహి" అని కాళిదాసమహాకవి ఈ శ్యామలాదేవినే కీర్తించారు.

మనం ఏ మంత్రం చేసినా అది శబ్దమే. ఉపాసకుని సాధనలో ఇంకా అభివృద్ధి కలిగేలా ప్రేరేపిస్తూ వారి భారాన్ని మొత్తం అమ్మవారికి అర్పిస్తూ, మంత్రాన్ని సాధన చేసేవారు ఎదిగేలా చూసేదే మంత్రిణీ.

అమ్మవారు భక్తుల యొక్క భారాన్ని మంత్రిణీదేవికి అప్పజెప్పింది అని చెప్పడమే ఈ నామంలో దాగిన భావం.

787. త్రిపురేశీ – శ్రీ త్రిపురేశ్యై నమః

ఒకొక్క చక్రంలో ఒకొక్క పేరుతో ఈశ్వరిగా ఉంటుంది. శ్రీచక్రంలో ఉన్న షోడశావరణ చక్రం – సర్వాశాపరిపూరక చక్రం. అక్కడ ఉన్న తల్లి పేరు త్రిపురేశీ. అక్కడున్న ఆవరణ దేవతలందరికీ ఆవిడ అభిన్నురాలు.

మరో భావంలో త్రిపురచక్రమంటే శ్రీచక్రం. సూర్య, చంద్ర, అగ్ని మండలాలు అందులో ఉన్నాయి. అవి త్రిపురాలు. వాటికి ఈశ్వరి త్రిపురేశి.

బిందుమండలవాసిని అయిన అమ్మవారి తరువాత ఆవరణ త్రికోణం. ఈ త్రికోణమే త్రిపురము. మూడు బిందువులే త్రిపురం. మధ్యలో కూర్చుని ఉన్న అమ్మవారు 'త్రిపురేశీ'.

స్థూల–సూక్ష్మ–కారణ దేహాలు అనబడే త్రిపురాలకు ఈశ్వరి. అయిదవ అర్థం – శివుని పత్ని.

శివునికి త్రిపురుడని పేరు ఉంది. అమ్మవారు త్రిపురా. శివునికి కూడా దశావతారాలు ఉన్నాయి. దశమహావిద్యలైన అమ్మవారి స్వరూపాలకి పతిగా ఉన్న పది శివస్వరూపాలు ఉన్నాయి. ఇలా పరమేశ్వరీ – పరమేశ్వరులకి సామ్యం ఉంది.

పరమేశ్వరుడు ఒక్కడు ఉంటే ఆయన నుండి మూడు రూపాలు వచ్చాయి.

అవి– బ్రహ్మ, విష్ణు, రుద్రమూర్తులు. బ్రహ్మవిష్ణురుద్రాత్మకుడు – త్రిపురుడు. ఆయన శక్తి 'త్రిపురేశీ'.

788. జయత్సేనా – శ్రీ జయత్సేనాయై నమః

జయించే లక్షణమున్న సేనలు కలిగిన తల్లి. 'మార్తాండభైరవారాధ్యా, మంత్రిణీన్యస్తరాజ్యధూః, త్రిపురేశీ, జయత్సేనా' వరకు లలితోపాఖ్యానంలోని కథ. అక్కడ భండాసుర సంహారానికి బయలుదేరిన అమ్మ సేనలన్నిటికినీ కలిపి, అలాంటి సేనలతో ఉన్న లలితాంబను 'జయత్సేనా' అన్నారు.

అమ్మవారి లీలాచరిత్ర అంతా అమ్మవారి పరివారదేవతల వైభవమే. మొదట భాగంలో అమ్మవారి లీల చదివేటప్పుడు ఆ పరివారదేవతల మంత్రాలన్నీ అనుసంధానం చేసిన శక్తి పాఠకునికి లభిస్తుంది. ఉపాసకులు కేవలం పరివార మంత్రం జపం చేస్తారు. భండాసురుని సంహారం చేయడానికి బయలుదేరినప్పుడు అమ్మవారికి అటు సంపత్కరీ, ఇటు అశ్వారూఢా దేవతలు ఉన్నారని ఒకొక్కరి పేర్లు చెప్పారు. అవన్నీ కూడా పరివారదేవతల ఉపాసన. శ్రీవిద్యలో మొత్తం అమ్మవారి పరివారదేవతలందరికీ మంత్రాలు ఉన్నాయి. ఆ మంత్రాలన్నీ సేనలు.

దేవతల యొక్క మంత్రాన్ని ఉపాసన చేస్తున్న ఉపాసకుల అంతఃశత్రువులని ఈ సేనలు సంహరిస్తాయి. మనలో ఉన్న భండాసురాది అసురులను కొట్టడమే అమ్మవారి సేనలు శత్రువుల్ని కొట్టడం అంటే. అమ్మ నుండి వచ్చిన శక్తులే మనలో ఉన్న అజ్ఞానాన్ని, ప్రతికూల శక్తులనీ నాశనం చేస్తున్నాయి. ఆ శక్తులన్నీ మంత్రాలు. అమ్మ మంత్రాన్ని జపం చేస్తున్నకొద్దీ ఆ మంత్రచైతన్యమే సేనలుగా ఉత్పన్నమౌతుంది. ఈ సేనలు ఎప్పుడూ విఫలం కావు. ఇవి మన ప్రతికూలతను జయించి తీరుతాయి. భక్తులని అనుగ్రహిస్తూ ఆ భక్తుల్ని బాధపెట్టే రకరకాల దుష్టశక్తులన్నిటిని చెండాడే శక్తి అమ్మవారి మంత్రాలకి ఉంది. జయించే లక్షణము కలిగిన మంత్రాల యొక్క స్వరూపిణి.

ఇక్కడి నుండి ఇంకొక గుత్తి చెప్తున్నారు. 'నిస్త్రైగుణ్యా, పరాపరా,

సత్యజ్ఞానానందరూపా, సామరస్యపరాయణా' – ఈ నాలుగు నామాలు అమ్మవారి పరతత్త్వాన్ని చూపిస్తున్నాయి.

789. నిస్త్రైగుణ్యా – శ్రీ నిస్త్రైగుణ్యాయై నమః

సత్త్వ రజస్తమో గుణాలనే త్రిగుణాలు లేనిది. నీలపుగాజు వెనకాల దీపం పెడితే దీపకాంతి అంతా నీలంగా కనబడుతుంది. ఆ కాంతిని నీలకాంతి అని అంటాం. కాంతి దీపానిదైతే, నీలం అద్దానిది. కాని మనం నీలకాంతి అని కలిపేసి చెప్తాం. దేనికది విడి విడివే అని గ్రహించగలగాలి.

త్రిగుణాలు రంగుగాజులవంటివైతే, అమ్మవారు జ్యోతి వంటిది. త్రిగుణాత్మక మైన ప్రపంచాన్ని ప్రకాశింపజేస్తున్న అమ్మవారు జ్యోతివలె దానికి అతీతంగా ఉన్నారు. అదే పరతత్త్వము యొక్క స్వరూపం.

790. పరాపరా – శ్రీ పరాపరాయై నమః

ఇది చాలా విశిష్టమైన నామం. ఇటు ఉపాసనకి, ఉపనిషత్తత్త్వానికి ముఖ్యమైన నామం. పర అంటే పరమాత్మస్వరూపం. అపర అంటే ప్రపంచము. సృష్టికి అతీతంగా ఉంది గనుక పరబ్రహ్మస్వరూపిణి. సృష్టి 'అపర'. సృష్టి యందు కూడా అమ్మవారే వ్యాపించి ఉంది.

పరాప్రకృతి, అపరాప్రకృతి అని గీతలో చెప్పబడ్డాయి.

అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్
జీవభూతాం మహబాహో యయేదం ధార్యతే జగత్

శరీరంలో ఉన్న పంచభూతాలు అపరాప్రకృతి. ఇందులో ఉన్నవాడు 'పర'జీవుడు. ఈ రెండిటిలో వ్యాపించిన చైతన్యము కాబట్టే పరాపరా. 1. పరమాత్మ, ప్రకృతి – పరాపర. 2. జీవుడు, ఉపాధి – పరాపర. ఈ రెండు స్వరూపాలు అమ్మవారే. ఓంకారతత్త్వాన్ని వ్యాఖ్యానిస్తూ ఉపనిషత్ **'పరాపర విభాగేన ద్వివిధో ప్రణవో మతః'** – ప్రణవములో కూడా పర, అపర అని రెండు ఉన్నాయి. ఓంకారాన్ని

అపరాప్రణవము అంటారు. పరా ప్రణవము అంటే ఓంకారం ద్వారా వ్యక్తమైన పరమాత్మ. ఆయన గురించి చెప్పే ఓంకారం అపరా. అది కూడా పరబ్రహ్మస్వరూపమే.

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ – ఓం అనేది వినిపిస్తోంది. వినబడేది భగవంతుడెలా అవుతాడు? వినబడుతున్నప్పటికి అది కూడా బ్రహ్మమే. వినబడే బ్రహ్మము అపరాబ్రహ్మము. ప్రకృతికి అతీతమైనవాడు పరా బ్రహ్మము. ప్రకృతితో కలిసి ఉండే బ్రహ్మము అపరా బ్రహ్మము.

అపరా బ్రహ్మమైన ఓంకారం ద్వారా పరబ్రహ్మని ఉపాసించాలని శాస్త్రం చెప్తోంది. శబ్దరూపంగా వెలువడే ఓంకారం అపరా బ్రహ్మము. ఓంకారం ద్వారా తెలియబడే పరమాత్మ పరా బ్రహ్మము. పరా ప్రణవము, అపరా ప్రణవమని రెండు రకాల ప్రణవాలు ఉన్నాయి. ఓంకారరూపిణీ ఓంకారం ద్వారా తెలియబడుతున్నది. మజ్జిగని చిలికి వెన్న పొందినట్లు, విచారణ చేసి ఈ ప్రపంచం అనే మజ్జిగతో కలసిపోయిన పరమాత్మని బయటకి లాగి ఆ నవనీతాన్ని ఆస్వాదించాలి. అదంతా మథనమే.

పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరీ. పరా ఇక్కడ పరావాక్కు. అపరా అంటే పశ్యంతి, మధ్యమా, వైఖరీ.

పశ్యంతీ నుండి ప్రపంచం వస్తుంది. పలుకు పలకడానికి మూలమైన చైతన్యం పరా. ఏం పలకాలనే భావం పశ్యంతి. దానికి తగ్గ భాష కూర్చుకోవడం మధ్యమా. బైటకి చెప్పడం వైఖరీ. ఈ మూడు ప్రపంచానికి సంబంధించినవే. మూలశక్తి 'పరా'.

యోగశాస్త్రంలో పరాపరాశక్తి గురించి చెప్తూ 'విలక్షణశక్తి' అన్నారు. ప్రపంచ సంబంధమైన భగవచ్ఛక్తిని అపరమంటారు. ప్రపంచాతీతమైన భగవచ్ఛక్తిని పరం అంటారు.

భక్తిలో సగుణభావ, విగ్రహభావములు అపరబ్రహ్మోపాసనము. జ్ఞాన రూపంగా పరతత్త్వాన్ని పట్టుకుంటే అది పరబ్రహ్మోపాసన. సగుణోపాసనని అపరోపాసన అంటారు. నిర్గుణతత్త్వాన్ని పరబ్రహ్మ అంటారు. సగుణము ధ్యానము. సగుణము ఉపాసన. నిర్గుణము కేవలం జ్ఞానము మాత్రమే. నిర్గుణమైనది పరబ్రహ్మ.

సగుణమైనది అపరబ్రహ్మ. సగుణుడు, నిర్గుణుడు రెండూ పరమాత్మే – అదే 'పరాపరా'

వరాహపురాణం ప్రకారం –

తత్ర సృష్టిః పరా ప్రోక్తా శ్వేతవర్ణస్వరూపిణీ

యా వైష్ణవీ విశాలాక్షీ రక్తవర్ణస్వరూపిణీ

అపరా సా సమాఖ్యాతా రౌద్రీ చైవ పరాపరా

ఏతాస్తిస్రోఽపి సిద్ధ్యంతి యో రుద్రం వేత్తి తత్త్వతః

సృష్టి శక్తి తెల్లని వన్నె కలది. దానిని 'పరా' అంటారు. రెండవది 'అపరా'. దీనిని వైష్ణవీ శక్తి అంటారు. పరాపరా శక్తి మూడవది. రౌద్రీ శక్తి. రుద్రస్వరూపాన్ని (పరాపరాశక్తిని) యథార్థంగా (తత్త్వముగా) తెలుసుకున్న వారికి ఈ మూడు శక్తులు సిద్ధి స్తాయి.

శ్రీవిద్యకు సంబంధించిన మరొక మహాద్భుతమైన అర్థం ఉంది. అమ్మవారి ఉపాసన చేసేటప్పుడు పరా, అపరా, పరాపర అని మూడు రకాల ఉపాసనలు ఉన్నాయి. 'పరయా అపరయా పరాపరయా సపర్యయా' అని చెప్తారు.

మొట్టమొదట సర్వప్రచరగోచరం 'పరా'. 'అపరా' అంటే చక్రము. 'పరాపర' అంటే స్వప్రథామయి. చక్రార్చన చేసేటప్పుడు మూడు రకాల ఉపాసనలు చేయాలి. పర అనే దానికి లోకంలో ఉన్న స్వరూపం అని భావం. పరా అంటే బైటది. మొట్టమొదట అమ్మవారు అంటే మహాశక్తి. నేను ఆవిడ ఉపాసకుడిని అనే భావనతో చేస్తాం. **సర్వప్రచర గోచరా పరా,** అంటే అందరికి అదే అనిపిస్తుంది. ఆ శక్తిని ఒక చక్రము నందు భావన చేస్తూ ఉపాసన చేస్తే అది అపరా పూజ అని చెప్పబడుతుంది. ఈ రెండు గమనించుకుంటూ పరా, అపరా మేళనం చేసుకుంటూ పరాశక్తిని చక్రము నందు ఆరాధన చేస్తూ ఆవిడే మన యందు **స్వప్రథగా** (అహంరూపిణిగా) ఉన్నదని గ్రహించాలి **(నిత్యాహృదయం).**

'తవ నిత్యోదితా పూజా త్రిర్భేదైః వ్యవస్థితా

పరాచాప్యపరాగౌరీ తృతీయా చ పరాపరా

ప్రథమాద్వైతభావస్థా సర్వప్రచరగోచరా

ద్వితీయా చక్రపూజాచ సదా నిష్పాద్యతే మయా

ఏవం జ్ఞానమయీా దేవీ తృతీయా స్వప్రథామయీా

'స్వాత్మానందలవీభూత బ్రహ్మాద్యానందసంతతిః' - ఎక్కడో పైన కూర్చున్న ఒక తల్లి ముందు నేను అల్పుడనని కాకుండా మన లోపల స్వయంప్రకాశ స్వరూపంగా ఉంది ఆ తల్లియే అని తెలిసి చేసిన ఉపాసనకి పరాపరోపాసన అని పేరు. దీని ద్వారా పూజింపబడే స్వప్రథాస్వరూపిణి (జ్ఞానరూపిణి) పరాపర. ఇది శ్రీవిద్యాపరంగా చెప్పుకున్న గొప్ప భావం.

ద్వైతభావం పరాపూజా. చక్రపూజ - అపరా. అద్వైతస్థితి జ్ఞానమయం 'పరాపరా'.

పరాపరవిభాగేన వేదార్థో ద్వివిధః స్మృతః

వేదార్థస్తు పరస్సాక్షాత్ పరాత్పర తరం పరం

అపరో ధర్మసంజ్ఞః స్యాత్ తత్పర ప్రాప్తి సాధనం.

'పరం, అపరం' - అని వేదార్థం రెండే విధాలుగా ఉంది. సాక్షాత్తుగా పరమాత్మను తెలిపే అర్థం 'పర'. ఆ పరమాత్మను పొందుటకు సాధనమైన ధర్మాలను బోధించేది అపర.' - ఈ రెండు అర్థముల రూపమైనది 'పరాపరా'.

791. సత్యజ్ఞానానందరూపా - శ్రీ సత్యజ్ఞానానందరూపాయై నమః

సత్యం - జ్ఞానం - ఆనందం... తన స్వరూపంగా కలది.

పరాపరతత్త్వము సర్వప్రకాశము, స్వయంప్రకాశమైన తత్త్వము. ఇదే సత్-చిత్-ఆనందము. **'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ'. 'విజ్ఞానం బ్రహ్మ'**... అని ఉపనిషద్వాక్యాలు. త్రికాలాలలోనూ ఒకేలా ఉండునదీ, సజాతీయ, విజాతీయ, స్వగత భేదాలు లేనిదీ, అన్నిటినీ ప్రకాశింపజేయునదీ, వికారరహిత జ్ఞానమే ఆనంద - ఆ స్వరూపమే 'సత్యజ్ఞానానందరూపా'.

792. సామరస్యపరాయణా – శ్రీ సామరస్యపరాయణాయై నమః

ఇవన్నీ శ్రీవిద్యకు సంబంధించిన పదాలు. సామరస్యపరాయణా నామానికి కూడా తాత్త్వికార్థం ఉంది, ఉపాసనాపరమైన అర్థం కూడా ఉంది.

సమరసభావం సామరస్యం. 'సమత్వం యోగముచ్యతే'. సమమే యోగము.

సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్
వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి

సర్వభూతాల యందు ఎవడు వ్యాపించి ఉన్నారో వారిని తెలుసుకున్నవాడే నిజమైన తెలివైనవాడు. అది తెలుసుకోలేనంత వరకు నిజమైన తెలివి కాదు. పరమాత్మే సమముగా వ్యాపించి ఉన్నారు. ఎవరెవరిలో? దోమయందు మొదలుకొని, అందరియందు సమముగా వ్యాపించినవాడే పరమాత్మ.

విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శునిచైవ శ్వపాకే చ పండితాః సమదర్శనః

సమ శబ్దం భగవద్గీత నుండి తీసుకోవాలి. ఉపాధులను చూసి మంచి చెడులు, ఎక్కువ తక్కువలు నిర్ణయిస్తుంటారు. ఇవన్నీ ఉపాధి గుణాలు. పరమాత్మ వీటన్నిటిలో సమంగా వ్యాపించి ఉన్నాడు. ఆ పరమాత్మయే రసస్వరూపుడు.

పరమాత్మ మనలో అసలు సారం అనేది తెలుసుకోవాలి. పరబ్రహ్మతో తాదాత్మ్యం పొందిన స్థితిలో తెలియబడే తత్త్వమే సామరస్యపరాయణా. పరబ్రహ్మతో తాదాత్మ్యం పరబ్రహ్మనే తెలియజేస్తుంది. ఇది అంత తేలిక కాదు. సమబుద్ధి కలిగి ఉండుటే యోగం. గీతాచార్యుని మాట – **'సమత్వం యోగముచ్యతే'.** సమత్వమే యజ్ఞం. 'వీరునేమని మతిభ్రమణంబున భిన్నులై ప్రవర్తిల్లక సర్వమున్నతని దివ్యకళామయమంచు విష్ణునందుల్లము చేర్చి' – సర్వత్రా సమముగా వ్యాపించిన పరమాత్మ యందు దృష్టి పెడితే అదే సమత్వం. అదే గొప్ప యజ్ఞం. ఆ యజ్ఞఫలమైన మోక్షమే 'సామరస్యపరాయణా'. సామరస్యం గురించి చెప్తూ, **'భోక్తృభోగ్యకరణోర్మి సంక్షయే సామరస్య రసదోహినీ శివా'** – అన్నారు కాళిదాసమహాకవి.

సాధారణంగా మనందరికి రెండు భావాలు ఉన్నాయి. ప్రపంచంలో

వస్తువులను నేను అనుభవిస్తున్నాను అని అనుకొంటూ ఉంటాం. సుఖంగా అనుభవిస్తే సుఖపడుతున్నాం. దుఃఖంతో అనుభవిస్తే దుఃఖపడుతున్నాం– అనుభవిస్తున్న జీవుడు, అనుభవింపబడే పదార్థము రెండు ఉన్నాయి. అంటే భోగ్యము, భోక్త– ఇవి రెండు కెరటాల వంటివి. కెరటాలు సమసిపోతే ఏది మిగిలిందో అదే సమత్వం. 1. ప్రపంచం, 2. దీనిని నేను అనుభవిస్తున్నాను– అని ఈ రెండు వదిలివేసి ఈ రెండింటిలో వ్యాపించిన చైతన్యం ఏదో తెలుసుకోవాలి. ఆ చైతన్యమే అమ్మవారు. ఆ సమత్వస్థితి కలిగితే జీవభావం, ప్రపంచభావం రెండూ పోతాయి. కేవలం పరమాత్మానుభవం మాత్రం మిగులుతుంది.

సర్వజీవకోటియందు సమముగా వ్యాపించిన తల్లి 'సామరస్యపరాయణా'. అమ్మవారు ఆనందస్వరూపిణి. అదే సామరస్యము. దానితో తాదాత్మ్యం చెందిన అవస్థే పరాయణ. అనగా బ్రహ్మజ్ఞానస్వరూపిణి.

శ్రీవిద్యార్థం – 'ప్రకాశ విమర్శయోః సామరస్యం'. ప్రకాశ, విమర్శల సామరస్యమే తెలియాలి. అమ్మవారు ఎప్పుడూ సామరస్యమునందే ప్రీతి కలది. పరాయణం అనే మాటకి ప్రీతి కలది అని మరొక అర్థం ఉంది. రసము అంటే అనుభూతి. ఇద్దరి భావాలు, అనుభవాలు ఒకటైనపుడు, రెండూ కలిసి సమస్థాయిలో ఉన్నప్పుడు కలిగే ఆనందం పేరు సమరసం. ఇద్దరి ఏకత్వం వలన లభించే ఆనందాన్ని సమరసము అంటారు. ఆ ఆనందం ఎప్పుడూ అమ్మవారి స్వరూపమే.

"పరస్పరతపస్సంపత్ ఫలాయిత పరస్పరౌ, ప్రపంచమాతాపితరౌ ప్రాంచౌ జాయాపతీ స్తుమః" అన్నారు.

అమ్మవారికి అయ్యవారితో సామరస్యం. ఆయన మహాకాలుడైతే అమ్మవారు మహాకాళి. రూపంలో సామ్యం. ఆయన భువనేశ్వరుడైతే అమ్మవారు కూడా భువనేశ్వరి. కిరాతవేషం వేసుకొని పరమేశ్వరుడు శబరుడైతే ఆవిడ శబరి అయ్యింది. పరమేశ్వరుడు ఎలా ఉంటే దానికి అనుగుణంగా అమ్మవారు ఉంటారు.

సమప్రధానౌ సమసత్త్వౌ సమౌ తయోః అని శ్రుతి. 'సమప్రధానములు, సమానబలములు, సమానమైనవి' – అని శివశక్తులను వర్ణించినది. శివశక్తి

సామరస్యం. ఇక్కడ మళ్ళీ సమయాచారం వచ్చింది. పరాపరా, సామరస్యపరాయణా – ఈ రెండూ శ్రీవిద్యకి కీలకమైన నామాలు.

సామరస్యపరాయణా అనేది శ్రీచక్రంలో కనబడుతుంది. పరమేశ్వరుడు, అమ్మవారు చక్కగా శ్రీచక్రాన్ని పంచుకున్నారు. పరమేశ్వరునివి నాలుగు చక్రాలు. అమ్మవారివి ఐదు చక్రాలు. బిందువు దగ్గర ఇద్దరూ పూర్తిగా కలిసిపోతున్నారు. మిగిలిన చోట్ల పంచుకొంటున్నారు. శ్రీచక్రంలో సామరస్యం ఉంది. విశ్వచక్రంలో సామరస్యం ఉంది. శివశక్తుల సామరస్యమే ఈ ప్రపంచం. ఇద్దరూ ఒకేలా ఉంటేనే ఈ ప్రపంచం నడుస్తోంది. ప్రపంచంలో ప్రత్యణువులోను సామరస్యం ఉంది. అణువుల కదిలికలో కూడా సామరస్యం ఉంది. పార్వతీ పరమేశ్వరులని ఉపాసన చేసినవారికి అందరితోనూ సామరస్యం సాధ్యమౌతుంది.

సామరస్యమే ఆవిడ స్వరూపంగా ఉంది కనుక 'సామరస్యపరాయణా'. వారి స్వరూపం అర్ధనారీశ్వరం. ప్రకాశవిమర్శ సామరస్యం, శివశక్తి సామరస్యం.

793. కపర్దినీ – శ్రీ కపర్దిన్యై నమః

కపర్ది అంటే శివుడు. ఆయన పత్ని కనుక 'కపర్దినీ'.

కపర్దమంటే జటాజూటం. పరమేశ్వరునికి జటాజూటం ఉంది. పరమేశ్వరునికి అభిన్నురాలు కనుక అమ్మవారికి కూడా జటాజూటం ఉందని చెప్పవచ్చు. కాళిదాస మహాకవి చెప్తూ **'అర్ఘట్యా శశిఖండ మండిత జటాజూటా'** – చంద్రలేఖ ధరించిన జటాజూటంతో ప్రకాశిస్తున్నది అన్నారు. **'జయ జయహే మహిషాసురమర్దిని రమ్యకపర్దిని శైలసుతే!'** అని చెప్పడంలో ఇదే భావం.

'కం పర్దయతీతి కపర్దం' – కం అంటే జలం. పర్దయతీతి అంటే పాలించునది. జలమును నియంత్రించునది. పరమేశ్వరుని జటాజూటానికి ప్రాముఖ్యమిదే. గంగ ఉరుకులు, పరుగులతో వస్తూ ఉంటే చక్కగా నియంత్రించి పెట్టి పరమేశ్వరుడు ప్రశాంతంగా ఉన్నాడు. జలాన్ని నియంత్రించిన జటాజూటం.

జలతత్త్వమైన చంద్రుడు కూడా అక్కడే ఉన్నాడు. జలాన్ని నియంత్రించిన

జటాజూటాన్ని పరిశీలిస్తే– జటాజూటమంతా అగ్నిశిఖల్లా ప్రకాశిస్తూ ఉంటే, దాని యందు గంగ, చంద్రుడు సోమతత్త్వంగా ప్రకాశిస్తున్నారు. అగ్నీషోమాత్మకమైన తత్త్వమిది.

కపర్ది అనే మాటకి పర్యాయపదాలు కూడా ఉన్నాయి. **'అనేక విధాలైన ప్రశంసలు కలది'** అని ఒక అర్థం. పొగడడానికి యోగ్యమైన గుణాలన్ని కలవాడు కనుక కపర్ది. పొగడడానికి యోగ్యమైన గుణాలు కలది కనుక కపర్దినీ.

కపర్దమనే మాటకి గవ్వల దండ అనే అర్థం కూడా ఉంది. శబరీరూపం ధరించినపుడు ఈ గవ్వలతో దండ వేసుకొని గోచరిస్తున్నది.

794. కళామాలా – శ్రీ కళామాలాయై నమః

కళలు మాలలుగా కలిగినది. మాల అంటే వరుస. ఒకొక్క రోజు ఒకొక్క చంద్రకళ ఉంది. ఈ చంద్రకళలన్నీ ఒకదాని తరువాత ఒకటి వస్తూ ఉంటాయి. ఒక పూస తరువాత మరొక పూస పెట్టినట్లుగా ఈ కళలన్నీ మాలగా కలిగిన కాలస్వరూపిణి.

విద్యలన్ని కలసి ఒక దానితో ఒకటి అనుబంధంగా కలిపి ఉన్న తల్లి కనుక చతుష్షష్టి విద్య సమాహార స్వరూపిణి.

'ప్రతిపన్ముఖ్యరాకాంతతిథిమండలపూజితా' అన్నట్లుగా మొత్తం పదిహేనుకళల సమష్టిరూపం కళామాల. కలిపితేనే మాల. విడివిడిగా చూస్తే పూసలే. కళలన్నిటి సమష్టిరూపంగా భావించడం కళామాల.

'కపర్దినీ, కళామాలా, కామధుక్, కామరూపిణీ' – ఈ నాలుగు కలిపి ఒక మంత్రం. కపర్దినీ నామంలో దుర్గామంత్రం కనబడుతుంది. కోరిన కోర్కెలు తీర్చుతుంది. కళలు ప్రసాదిస్తుంది. పరమేశ్వరుని జటాజూటంలో ఒకొక్క జట ఒకొక్క విద్య. జటాజూటమంటే విద్యల పుట్ట.

'కపర్దినీ' 'కళామాలా' అని చెప్పినప్పుడు జటాజూటం ధరించి అన్ని విద్యల సమష్టిరూపంగా ఉంది కనుక 'కళామాలా' అని భావం చూపించారు.

795. కామధుక్ – శ్రీ కామదుఘే నమః

కామధుక్ అంటే కామధేనువు. కామదుఘాదేవి అని అమ్మవారి స్వరూపం.

కోరిన కోర్కెలను పిండి ఇచ్చేదాన్ని కామధేనువు అంటారు. అమ్మవారిని ధేనుస్వరూపంగా వేదమే వర్ణించింది. ఏది కావాలంటే అది ఇవ్వగలిగే శక్తి వేదానికి ఉంది. అలాగే వేదాన్ని యజ్ఞరూపంలో వినియోగిస్తారు. యజ్ఞాలన్నీ మన కోరికలు నెరవేరుస్తాయి.

'కర్మఫలేషు జుష్టాం' – కర్మఫలాలను ఇచ్చే తల్లిగా మనం ఉపాసన చేస్తాం. యజ్ఞముల ద్వారా, వేదాల ద్వారా కోరికలన్నీ తీర్చే తల్లి. కళామాల అంటే విద్యల వరుస. విద్య అంటే వేదాది విద్యలు. కాబట్టి అమ్మవారు 'కామధుక్'. అమృతస్వరూపిణి అయిన కామదుఘా మంత్రదేవత.

'దేవీం వాచమజనయంత దేవాః తాం విశ్వరూపా పశవో వదంతి సానోమంద్రే షమూర్జం దుహానా ధేనుర్వాగస్మానుపసుష్టుతైతు' అని శ్రుతి చెప్తోంది. ఆ మంత్రంలో **ధేనుర్వాక్** అన్నారు. విద్యామయమైన ధేనువు మా కోరికలను తీర్చుగాక! 'ధేను సరస్వతీ' మంత్రభావన కూడా ఉంది.

796. కామరూపిణీ – శ్రీ కామరూపిణ్యై నమః

అమ్మవారికి ఇదే రూపమని చెప్పలేం. తన స్వతంత్రతతో, స్వేచ్ఛతో ఏ స్వరూపాన్నైనా స్వీకరించగలదు. స్వ ఇచ్ఛ – స్వేచ్ఛ. ఇచ్ఛయే కామ. స్వేచ్ఛగా రూపం ధరిస్తుంది కనుక 'కామరూపిణీ'.

కమనీయమైన రూపం గలది కనుక 'కామరూపిణీ'.

కామ, కామేశ్వరాత్మకమైన రూపం కనుక 'కామరూపిణీ'. **'సోఽ కామమత బహుస్యాం ప్రజాయేయం'** (శ్రుతి), జగత్తును సృష్టించాలనే కోరిక కలవాడు కామేశ్వరుడు. ఆతని స్త్రీ కామరూపిణీ.

797. కళానిధిః – శ్రీ కళానిధయే నమః

కళలకి అమ్మవారు నిధి. ముందు నామాల్లో కళామాలా చెప్పారు. ఇప్పుడు కళానిధిః అన్నారు.

ప్రపంచంలో ఉన్న అన్ని కళలకు ఆవిడే నిధి. అగ్నికళలు, సూర్యకళలు, చంద్రకళలు, అరవై నాలుగు కళలు, పంచబ్రహ్మల కళలు, కాల కళలు – వీటన్నిటికి అమ్మవారు నిధి వంటిది. అన్నీ అందులోనే దాగి ఉన్నాయి.

అన్ని కళలు అమ్మ నుండే వస్తున్నాయి. తిరిగి అందులోనే లీనమౌతున్నాయి. అన్ని కళలకి తరగని గని కనుక 'కళానిధి'.

ఏదైనా కళ కళకళలాడాలంటే అక్కడ అమ్మ ఉండాలి.

షోడశీ మంత్రరూపిణి అనేది ముఖ్యమైన అర్థం. పదిహేను కళలు కలిగిన పంచదశీ మహామంత్రం ఏ అమ్మవారిని ఆధారం చేసుకుని ఉందో ఆవిడ 'కళా నిధిః'. 'కళా' శబ్దానికి 'శివసూత్రా'ల్లో 'కర్మ' అని అర్థం. కర్మలన్నీ ఏ పరతత్త్వంలో లయమౌతాయో అది కళానిధి. 'సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానేన పరిసమాప్యతే' అని గీతావచనం. 'అర్జునా! కర్మ సమాప్తము జ్ఞానమందు పరిసమాప్తిని పొందుతున్నది'. అటువంటి జ్ఞానస్వరూపిణి కళానిధి.

కళానిధిః అంటే మరొక అర్థం చంద్రుడు. పదహారు కళలు కలిగినవాడు. చంద్రరూపిణి కనుక కళానిధిః. సహస్రారకమలంలో ఉన్న చంద్రరూపిణి.

798. కావ్యకళా – శ్రీ కావ్యకళాయై నమః

కావ్యమనే కళ ఆవిడ రూపం అనిపిస్తుంది. కావ్యాలన్నిటికి పుష్టి, లక్షణం అమ్మవారి వల్ల వచ్చాయి. అమ్మ అనుగ్రహం లేకపోతే కవిత్వం రాదు. ఇక్కడ విద్యాధిదేవతనే చెప్తున్నారు.

కావ్యాలాపాంశ్చ యే కేచాత్ గీతాకావ్యాఖిలానిచ
శబ్దమూర్తీధరస్యైతత్వపుర్విష్ణోర్మహాత్మనః

– కావ్యాలాపాలు, గీతాదులన్నీ శబ్దమూర్తిధరుడైన విష్ణురూపాలు

(విష్ణుపురాణం)

కపర్దినీ, కళామాలా, కామధుక్, కామరూపిణీ, కళానిధిః, కావ్యకళా, రసజ్ఞా, రసశేవధిః – శారదాదేవిని ధ్యానం చేస్తూ జటాజూటం ధరించిన తల్లిగా వర్ణించింది శాస్త్రం. జటాజూటంపై చంద్రలేఖను దాల్చి ఉంటుంది. ఆవిడ అన్ని కళలకు నిధి కనుక 'కళానిధిః'.

ఆవిడే 'కావ్యకళా'. ఆవిడ అనుగ్రహం ఉంటేనే కవిత్వం వస్తుంది. కావ్యాన్ని సృజించగలిగే ప్రతిభ కావ్యకళ. "అమ్మా! నీ దయ లేకపోతే నేను కూడా కవిత్వం చెప్పలేనమ్మా!" అని, "మేల్ పట్టున్ నాకగు నమ్మ నమ్మితి జుమీ బ్రాహ్మీ దయాంబోనిధీ" అని నమస్కరించారు శ్రీమద్భాగవతాన్ని ప్రారంభించే ముందు పోతనగారు. మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్ అమ్మలగన్న అమ్మయే ఇవ్వాలి. 'కావ్య'మనగా 'వేదం' అని వైదికార్థం. ఆ వేదస్వరూపిణియే కావ్యకళ.

'రమణీయార్థప్రతిపాదక శబ్దం కావ్యం, వాక్యం రసాత్మకం కావ్యం' అన్నారు. ఏ వాక్యం వింటే మన మనసు రసానుభూతికి లోనౌతుందో ఆ వాక్యానికి కావ్యం అని పేరు. రసమయమైన శక్తిగా ఉన్నది. కావ్యకళని చెప్తే ఆస్వాదించే గుణం ఉండాలి. రసజ్ఞత గుణం కూడా అమ్మవారే.

799. రసజ్ఞా – శ్రీ రసజ్ఞాయై నమః

సంగీతము, సాహిత్యము అన్ని కళల్లో ఏ మాధుర్యం ఉందో, ఏ గొప్పదనం ఉందో దానిని ఆనందించే స్వభావాన్ని రసజ్ఞత అంటారు. ఆ రసజ్ఞత కూడా అమ్మవారి అనుగ్రహమే. రసం అమ్మవారే.

రసజ్ఞత గురించి ఆనందవర్ధనుడు ఆనందమీమాంసలో ధన్యాలోకంలో చెప్పాడు. బ్రహ్మానందం యోగులకి తప్ప ఇంకెవరికీ లభించదు. దానికి దగ్గరగా ఉన్న ఆనందం కావ్యానందం. అద్భుతమైన కావ్యం చదువుతున్నప్పుడు ఉన్న ఆనందం మానుషానందాలన్నిటిని మించిపోయిన ఆనందం. దానిని 'బ్రహ్మానందసబ్రహ్మచారి' అన్నారు.

కావ్యశాస్త్రవినోదేన కాలోగచ్ఛతి ధీమతాం

వ్యసనేన చ మూర్ఖానాం నిద్రయా కలహేన వా

బుద్ధి కలిగినవారు కావ్య, శాస్త్ర పఠనాదులతో కాలాన్ని గడుపుతారు. మూర్ఖులు వ్యసనం, నిద్ర, తగవులతో కాలాన్ని గడుపుతారు.

బ్రహ్మానందమే (పరబ్రహ్మానుభావమే) రసం. దానిని అనుభవించే ప్రజ్ఞానస్వరూపిణి. బ్రహ్మమునకు అభిన్నము.

ఆవిడ అనుగ్రహం ఉంటే రసజ్ఞత వస్తుంది. తరువాత నామం 'రసశేవధిః'.

800. రసశేవధిః – శ్రీ రసశేవధయే నమః

రసానికి ఆవిడ నిధి. కళానిధి, రసశేవధిః – కళలకి ఆవిడే తరగని గని. రసానికి కూడా ఆవిడే నిధి.

అమ్మవారు రసస్వరూపిణి. 'రంజనీ, రమణీ, రస్యా' నామాల దగ్గర విషయం వివరంగా చెప్పడం జరిగింది. రసము ఆవిడ యొక్క రూపము. రసము – సారము ఒక్కటే.

ప్రపంచంలో రసం ఉంది. ఆ రసం – సారం అమ్మవారు.

ఇక్కడ కూడా భండాసురసంహారలీలను దర్శించవచ్చు. భండాసురుడు విశుక్రుడు, విషంగునితో కలిసి మూడులోకాలలో ఉన్న రసమంతా పీల్చి పిప్పి చేసేశాడు. మొత్తమందరూ నీరసులైపోయారు. దానివల్ల స్వర్గాది లోకాలలో ఉన్న అప్సరసలకి నాట్యం చేయాలనిపించడం లేదు. చివరికి దేవతలతో సహా ఇంద్రుడు కూడా నీరసుడైపోయాడు. ముఖాల్లో నవ్వులు లేవు. లోపల ఆనందమనే లక్షణం లేకపోతే అలా మారతారు. ఆ రసలక్షణం లోపల ఉంటేనే ప్రేమ, ఆనందం, ఉత్సాహం, ఉల్లాసం. అలా ముల్లోకాల్లో నీరసం ఆవహించింది.

రసమంటే ఏంటో బ్రహ్మాండపురాణంలో చెప్తూ–

రస ఏవ పరబ్రహ్మ రస ఏవ పరాగతిః

రసోహి కాంతిదః పుంసాం... వేదప్రామాణ్య సంసిద్ధా

రస[ప్రాణః తయా స్థితః

[ప్రాణాత్మకో రసః [ప్రోక్తః [ప్రాణదః కుంభసంభవః

అని హయగ్రీవస్వామివారు అగస్త్యమహర్షితో చెప్పారు. రసమే పర[బహ్మము. "రసో వై సః" పర[బహ్మ రసస్వరూపుడు. పరమాత్మ ఆనందానుభవస్వరూపుడు. అదే కావ్యాదికళలలో కించిత్ మెరుస్తోంది. అసలు ఆనందస్వరూపం [బహ్మమే. రసమనగా ఆనందస్వరూపం.

పరమాత్మ అనుభవంలోకి రావడమే సాక్షాత్కారం.

కలాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం నిజతపః

ఫలాభ్యాం భక్తేషు [ప్రకటితఫలాభ్యాం భవతు మే

శివాభ్యామస్తోక [త్రిభువన శివాభ్యాం హృది పున

ర్భవాభ్యామానందస్ఫురదనుభవాభ్యాం నతిరియమ్

నా హృదయంలో మాటిమాటికి ఆనంద అనుభవంగా పెల్లుబుకుతున్న పార్వతీపరమేశ్వరులకు నమస్కారం అన్నారు. ఆనందానుభవస్వరూపమే పరమేశ్వరుడు. అదే రసం. ఆ రసస్వరూపం [ప్రపంచమంతా ఉంది. అదే మనల్ని జీవింపజేస్తున్నది.

[ప్రాణాదులన్నిటికి అదే రసం. అది లేకపోతే అన్నీ నీరసమే. అదే చిత్కళా. అదే రసశేవధిః. అఖండానంద నిధి. అక్కడ రసం తరగదు. [ప్రపంచానికంతటికి శక్తిని ఇచ్చేది అమ్మవారే.

కమలనయన నీవు కలచోటు సరసంబు

నీవులేని చోటు నీరసంబు

కంబుకంఠి! నీవు కలవాడు కలవాడు

నీవు లేనివాడు లేనివాడు

అన్నారు [శీనాథమహాకవి. రసం ఎక్కడ ఉంటే అక్కడ సరసం. లేకపోతే నీరసం. అమ్మవారు ఎక్కడ ఉంటే అక్కడ రసం, ఉత్సాహం, ఆనందం, ఉల్లాసం ఇవన్నీ ఉంటాయి. అవన్నీ అమ్మవారి రూపాలు. శృంగారాది శాంతం రసం వరకు

నవావరణల యందు నవరసాలున్నాయని శ్రీచక్ర విజ్ఞానం. కనుక 'శ్రీచక్రమే రస శేవధిః'.

'కావ్యకళా'కి వేదం చెప్పిన మరొక అర్థం– పరమేశ్వరుడు ఒక గొప్ప కవి. అద్భుతమైన సృష్టి చేసేవానిని కవి అంటారు. ఈశ్వరుని కంటే గొప్ప కవి ఎవరూ లేరు.

పరమాత్మ విశ్వరూపాన్ని దర్శించిన వెంటనే 'కవిం పురాణమనుశాసితారం' అని అర్జునుడు కృష్ణపరమాత్మని స్తుతించాడు. కవి అన్న శబ్దం పరమాత్మకే వాడాలి. ఈ ప్రపంచమంతా ఆయన కావ్యం. ప్రపంచాన్ని అద్భుతంగా కూర్చి ఎన్నో సంఘటనలు, నవరసాలు ఇత్యాదులు అన్ని ఇందులో పెట్టాడు. ప్రపంచమనే కావ్యంలో కళగా ఉన్నది అమ్మవారే.

ఈ ప్రపంచంలో కళగా ఉన్న అమ్మవారిని తెలుసుకోవాలంటే మనలో రసజ్ఞతగా అమ్మ ప్రకాశించాలి. అలా చేసినపుడు ఈ ప్రపంచమనే కావ్యంలో ఉన్న రసస్వరూపిణి అయిన అమ్మవారిని దర్శించి ఆనందించగలం.

సత్యజ్ఞానానంద రూపమైన అఖండ పరబ్రహ్మయే రసస్వరూపం. అదియే లలితాంబ.

801. పుష్టా – శ్రీ పుష్టాయై నమః

సర్వజగతికి పుష్టినిచ్చునది. ముప్పదియారు తత్త్వాల విశ్వమే శరీరంగా గల తల్లి. బ్రహ్మానందరసముచే పుష్టి పొందినది. **"బ్రహ్మ యుష్మత్త ద్బ్రాహ్మణైరాయుష్మత్"** – అని శ్రుతి వాక్యం. 'వేదవేత్తలచే బ్రహ్మ ఆయుష్మంతుడౌతున్నాడు. వేదము శివుని నుండి పరంపరగా విస్తారమౌతున్న కారణంగా నిండుగా ఉన్నది. అటువంటి వేదము **"బ్రాహ్మణైః పోషితం బ్రహ్మ"** – బ్రాహ్మణులచే పోషింపబడుతున్నది – అని శ్రుతిలోనే చెప్పబడుతోంది. వేదవేత్తలు శిష్యపరంపరగా బ్రహ్మజ్ఞానాన్ని బోధిస్తూ, అధ్యయనాల ద్వారా లోకంలో నిలబెట్టారు. అలా పోషింపబడుతున్న బ్రహ్మవిద్యా స్వరూపిణి.

లోకానుగ్రహార్థం బహు దివ్యగుణాలతో కూడినది సమృద్ధిరూపిణి.

802. పురాతనా - శ్రీ పురాతనాయై నమః

సృష్టికి మునుపే ఉన్నది. అమ్మవారు ఎప్పటినుండి ఉన్నారో చెప్పలేం. ఆవిడ పురాతనా. "అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ **చాల పెద్దమ్మ**" అన్నారు పోతనగారు. పురాతనా - అన్నింటికి ముందు ఉంది. అనాది. కాలంతో గణించి అమ్మవారు 'ఇప్పుడున్నారు, అప్పుడు లేరు' అని చెప్పలేం కనుక **'అజో నిత్యం శాశ్వతోయం పురాణః'** అని ఉపనిషత్ వాక్యం. **'కవిం పురాణమనుశాసితారం'** అని గీతలో ఎలాంటి కూర్పో ఇక్కడ అలాంటి కూర్పే. 'కావ్యకళా' తరువాత 'పురాతనా' రావడం **కవిం పురాణం** అన్న వాక్యానికి తగ్గట్టుగానే ఉన్నది. ఇది ఉపనిషత్ భాష.

803. పూజ్యా - శ్రీ పూజ్యాయై నమః

అందరి చేత పూజింపబడుతున్నది. అందరూ ఎవరిని పూజిస్తారు! అందరూ పుష్టినే పూజిస్తారు. పుష్టిస్వరూపిణి. సర్వదేవతలచే పూజింపబడేది. అందరిచే **ప్రతీక్ష్యా** - ఎదురు చూడబడేది. సాధనల లక్ష్యంగా, ఫలంగా ఉన్నది అని భావం.

804. పుష్కరా - శ్రీ పుష్కరాయై నమః

అమ్మవారు పుష్కరస్వరూపిణి. పుష్కరము అనే మాటకి చాలా అర్థాలు ఉన్నాయి. పుష్కరము అనే మాటకి కమలము, ఆకాశము, సూర్యుడు, ఓషధీ, తీర్థం... ఇన్ని అర్థాలు ఉన్నాయి. ప్రధానంగా పుష్కర వ్యుత్పత్తి ప్రకారంగా చూస్తే **"పుష్ణాతీతి పుష్కరా"** - పోషించునది అని అర్థం. పుష్టి ఆవిడ. ఆ పుష్టిని ఇచ్చి సర్వజగత్తుని పోషించే రసస్వరూపిణి ఆ పరమేశ్వరియే. ఆవిడ లేకపోతే అంతా నీరసమే. 'పోషణకర్త్రీ' అనగా పోషించేది. అనంత ఆకాశరూపిణి అనే అర్థం కూడా సరిపోతుంది.

నారాయణభట్టువారి పాఠం 'పుష్కలా' అని ఉంటుంది. 'లరయోః అభేదః' అన్నారు కనుక తప్పేం లేదు. పుష్కర అన్నా, పుష్కల అన్నా ఒక్కటే. అమ్మవారు అందరినీ పుష్టిగా పోషిస్తున్నారు. సర్వసమృద్ధి కలది. వ్యాపించినది.

పుష్కరం ఒక యోగం. విశాఖ నక్షత్రంలో సూర్యుడు, కృత్తికా నక్షత్రంలో

చంద్రుడు ఉంటే దానిని పుష్కరయోగం అంటారు. **"స యోగం పుష్కరో నామ పుష్కరేష్వతి దుర్లభః"** అంటారు (పద్మపురాణం). ఆ యోగముగా ఉన్న తల్లి.

పుష్కరమంటే తీర్థమని కూడా అర్థం. మనలను పవిత్రులను చేసే తల్లి. పుష్కరమను తీర్థముగా ఉన్నది.

805. పుష్కరేక్షణా – శ్రీ పుష్కరేక్షణాయై నమః

పుష్కర ఈక్షణ. 'ఈక్షణం' అంటే నేత్రములు. లలితాసహస్రంలో అమ్మవారి కనుల మీద ఎన్ని పేర్లు ఉన్నాయో వెతికితే చాలా కనబడతాయి. లోలాక్షీ, దరాందోళితదీర్ఘాక్షీ, చలన్మీనాభలోచనా, పుష్కరేక్షణా.

పుష్కరం అనే మాటకి పద్మం, సూర్యుడు అని అర్థం చెప్పుకున్నాం. పద్మం వంటి నేత్రాలు కలది. సూర్యుడే నేత్రముగా కలది. తన కనులతోనే మనల్ని పుష్కలంగా పోషించే తల్లి 'పుష్కరేక్షణా'.

శ్రీమన్నగర నిర్మాణం చేశాక అమ్మవారు అక్కడ సింహాసనం మీద కూర్చున్నారు. వెంటనే దేవతలందరూ వెళ్ళారు. వారు భండాసురుని గొడవంతా మర్చిపోయి హాయిగా ఉన్నారు. ఎందుకంటే వారికేమి పట్టట్లేదు – దానికి కారణం అమ్మవారు వారిని చూస్తోంది. ఆవిడ చూపు పడితే చాలు అన్నీ మర్చిపోయి హాయిగా ఉన్నారు. కోరిక పుడితే దరిద్రం ఉందని అర్థం. ఆ తల్లి చూపు పడితే ఇంక కోరిక కూడా పుట్టదు. పరిపూర్ణులు అయిపోతారు.

ఏ తల్లి చూపు సోకితే పరిపూర్ణత వస్తున్నదో ఆ చూపే 'పుష్కరేక్షణా'. సమృద్ధిభావం. పరిపూర్ణభావం. ఆ పరిపూర్ణ భావాన్ని కలిగించేది.

చూపంటే జ్ఞానం. జ్ఞానం లభిస్తే పరిపూర్ణుడౌతాడు. ఇంక కొరత లేదు. ఆ జ్ఞానాన్ని తన చూపుతోనే ప్రసరించే తల్లి కనుక 'పుష్కరేక్షణా'.

దృగ్దీక్ష అని ఒకటి ఉంది. కొంతమంది గురువులు చూస్తే చాలు అజ్ఞానం పోతుంది. ఆ గురుమండలరూపిణి అయిన తల్లి ఒక్కసారి తన అక్షులతో అనుగ్రహిస్తే పూర్ణత్వం కూడా లభిస్తోంది కనుక 'పుష్కరేక్షణా', 'పుష్కలేక్షణా'.

పుష్కరా – పుష్కరేక్షణా – సృష్టిలో ఎవరిని ఎలా పోషించుకోవాలో ఆ తల్లి గమనించుకోవద్దూ! అందరిని పోషించడం 'పుష్కరా'. పోషించాక గమనించుకోవడం 'పుష్కరేక్షణా'. విశాలాక్షి అయితేనే అన్నపూర్ణ కాగలదు. విశ్వాన్ని గమనించు కుంటున్నప్పుడు విశాలాక్షీ. ఎవరికి ఏంకావాలో ఇచ్చేటప్పుడు అన్నపూర్ణ. విశాలాక్షే అన్నపూర్ణ. పుష్కరేక్షణ అయితేనే పుష్కర కాగలదు.

సమృద్ధి కలిగిన నేత్రములు కలది. అనంత దర్శనశక్తి సంపన్నురాలనే అర్థంలో కూడా తీసుకోవచ్చు.

806. పరంజ్యోతిః – శ్రీ పరస్మైజ్యోతిషే నమః

'పరంజ్యోతిః పరంధామ పరమాణుః పరాత్పరా' – ఈ నాలుగు నామాలు పర సంబంధమైన నామాలను చెప్తున్నాయి. పర అనే శబ్దానికి ఒకొక్క చోట ఒకొక్క అర్థం చెప్పుకోవాలి. ఇక్కడ పరబ్రహ్మ అనే అర్థం ప్రత్యక్షంగా తెలుస్తూనే ఉంది.

పర అనే నామానికి సర్వోత్కృష్టమైనది, ప్రపంచాతీతమైనది అని అర్థం.

పరంజ్యోతిః – జ్యోతి అనగా చైతన్యము, ప్రకాశము అని అర్థం. ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్న ప్రకాశమే కాక విశ్వానికి అతీతమైనది కూడా అని చెప్పడం కోసం పరంజ్యోతిః అన్నారు. **'పరస్మై జ్యోతిషే నమః'** అనే మంత్రంతో నమస్కారం చేస్తాం. **'పరంజ్యోతిరుపసంపద్య...'** అని కూడా శ్రుతి.

ఈ జ్యోతినే దేవతలు కూడా ఉపాసన చేస్తారు. ప్రకాశస్వరూపులైన దేవతలకి కూడా ప్రకాశమిచ్చే తల్లి అమ్మవారు. దేవతలు కూడా **'తద్దేవాః జ్యోతిషాం జ్యోతిః ఆయుర్హోపాసతేఽమృతం'** అన్నారు. దేవతలు కూడా తమ ఉనికి కోసం అమృతమైన ఈ జ్యోతినే ఉపాసిస్తున్నారని ఈ మంత్రం యొక్క భావం. అమృతమైన జ్యోతి అంటే శాశ్వతమైన జ్యోతి అని అర్థం. **జ్యోతిషామపి యజ్జ్యోతిః** – జ్యోతులకు కూడా జ్యోతి అయిన తల్లి– అని ఉపనిషత్ చెప్తున్నమాట. **'యేన సూర్యస్తపతి తేజసేద్ధః'** (శ్రుతి) ఏ తేజస్సుచే సూర్యుడు ప్రకాశిస్తున్నాడో అది జ్యోతి. సూర్య చంద్రాగ్నులన్ని ప్రపంచంలో మనకి కనబడే జ్యోతులు. వాటిని వెలిగించే తల్లి. కల్పాంతకాలాల్లో

ఈ సూర్యుడు, చంద్రుడు మొదలైనవారెవ్వరికీ కూడా ఉనికి ఉండదు. కానీ ఈ పరంజ్యోతి మాత్రం ఎప్పుడూ ఉంటుంది.

807. పరంధామః – శ్రీపరస్మైధామ్నే నమః

ధామము అంటే స్థానము, తేజస్సు అని అర్థాలు. అమ్మవారి ధామము సర్వోత్కృష్టమైన ధామము.

మనం చూసే చతుర్దశభువనాలు అన్నీ ధామాలు. వీటన్నిటికి ఆధారమై ఉనికి కలిగిస్తున్న ధామం పరంధామం. ఈ చతుర్దశ భువనాలు నశించిపోయే లక్షణాలు కలిగినవి. కానీ పరంధామం ఏ నాటికి నశించదు. **"యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ"** అని శ్రీకృష్ణపరమాత్మ చెప్పారు. దేనిని చేరితే తిరిగి వెనక్కి రారో అది నా పరంధామం.

"తద్ధామ పరమం మమ" ముందు "న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః" "ఆ పరంధామాన్ని సూర్యుడు కాని, చంద్రుడు కాని ప్రకాశింపజేయవలసిన అవసరం లేదు" అన్నారు. సరిగ్గా ఆ శ్లోకం ఎలా కూర్చబడిందో ఈ నామం అలా కూర్చబడింది.

మరొక అర్థం – మనకి స్థానాలు మూడు. ఈ మూడింటికి అతీతమైన ధామం ఏదో అది పరంధామము. మన మూడు ధామాలు అంటే జాగ్రత్, స్వప్న, సుషుప్తి. ఈ మూడింటికి అతీతమైన ధామం తురీయం అని చెప్పబడుతుంది. ఆ తురీయభూమికి చెందిన పరతత్త్వం కనుక ఈ తల్లి పరంధామ. ఈ భావాన్ని తీసుకుని కాళిదాసమహాకవి అమ్మవారిని కీర్తిస్తూ–

న త్వమంబ పురుషో న చాంగనా చిత్స్వరూపిణి నషండతాపి తే
నాపి భర్తృరపితే త్రిరూపతా త్వాం వినా తదపి న స్ఫురేత్ త్రయం

ఒక చక్కని శ్లోకంలో అమ్మవారి పరంధామాన్ని వర్ణించారు. "అమ్మా! నువ్వు పురుషుడవు కాదు, స్త్రీవి కావు. స్త్రీ, పురుషులు కానపుడు నపుంసక లింగం చెప్తారు. అది కూడా నువ్వు కావు. ఆ మూడు నీ వల్లే ఉంటున్నాయి. నువ్వు లేకపోతే ఈ

మూడు లేవు. నీకు ఈ మూడు లేవు". తురీయత్వాన్ని అంత చక్కగా కీర్తించారు.

మూడింటికి అతీతమైన ధామమే పరంధామం అని చెప్తూ-

సైషా మాహేశ్వరీ గౌరీ మమ శక్తిర్నిరంజనా

శాంతా సత్యా సదానందం తద్ధామ పరమం పదం

- అని కూర్మపురాణంలో శివ వాక్యంగా చెప్పబడుతున్నది. భాస్కరరాయలవారు దీనిని కూడా చూపించారు. **"సైషా మాహేశ్వరీ గౌరీ"** - ఆ మహేశ్వరి అయిన గౌరీ - "మమ శక్తిః" అంటున్నాడు శివుడు. అది నా శక్తి. అది శాంతమైనది, సత్యమైనది, సదానందమైనది. శాంతం, సత్యం, సదానందం అనగానే పరబ్రహ్మలక్షణాలే. "తద్ధామ పరమం మమ"- అది పరంధామ స్వరూపం.

808. పరమాణుః - శ్రీ పరమాణవే నమః

పరమమైన అణువు పరమాణువు. అణువు శబ్దానికి అత్యంత సూక్ష్మమైనది అని అర్థం. సృష్టిలో మనం విచారణ చేసి అన్నింటి కంటే ఒక సూక్ష్మం దొరికిందని అంటుంటాం. మనం ఎక్కడిదాకా వెళ్ళి సూక్ష్మమన్నామో దాని కంటే సూక్ష్మంగా పరమేశ్వరి ఉంటుంది.

యంత్రాలకి పరతత్త్వం దొరకదు. అణువుని విచ్ఛేదం చేసి పరమాణువుని తెలుసుకున్నారు. ఇంకా పరమాణువు గురించి తెలుసుకుంటూ వెళ్తూ ఉంటే మనం ఎంత సూక్ష్మమని నిర్ధారణ చేస్తూ ఉంటే అంతకంటె సూక్ష్మానికి వెళ్లిపోతూ ఉంటుంది. అది నిర్ధారణకి దొరకదు. పదార్థ విజ్ఞానానికి దొరకనిదే పరమార్థం.

"పరమాణువులో కూడా వ్యాపించి ఆ మహాశక్తి ఉంది. స్థూలంలో ఉన్న శక్తి కంటే అణువులో ఉన్న శక్తి ఇంకా విశేషం.

ఇంద్రియాలకు గోచరమయ్యేది స్థూలం. ఇంద్రియాలకి గోచరం కానిది సూక్ష్మం. మనసు కూడా ఇంద్రియమే. ఇంద్రియాల అవసరం లేకుండానే మనస్సు కూడా ఊహలు, ఆలోచనలు చేస్తూ ఉంటుంది. కానీ అది కూడా ఇంద్రియాలతో పరిచయమున్న వాటినే ఊహిస్తుంది. అంతకు మించి వెళ్ళలేదు.

ఇంద్రియాతీత సత్యం గురించి మనసు ఆలోచించాలంటే ఇంద్రియాతీతమైన ప్రజ్ఞ కావాలి. మనసుకి, మాటకి కూడా తెలియరానంత సూక్ష్మస్వరూపం. 'అణు' అనే మాటకి 'మంత్ర'మనే అర్థాన్ని గ్రహించి 'ఉత్కృష్టమంత్రస్వరూపిణి' అని చెప్పవచ్చు.

809. పరాత్పరా – శ్రీ పరాత్పరాయై నమః

పరమైన దాని కంటె పరమమైనది. ఇదే గొప్పది అని తేల్చి అనుకుంటే, "కాదు... దానికి పైన నేను ఉన్నాన"ని అంటుంది అమ్మ.

అమ్మను మించిన మరొక గొప్పవస్తువు లేదు. గొప్పవాటి కంటే గొప్పది. సర్వోపనిషత్సారభూతమైన భగవద్గీతలో –

ఇంద్రియాణి పరాణ్యాహురింద్రియేభ్యః పరం మనః,
మనసస్తు పరా బుద్ధి ర్యో బుద్ధేః పరతస్తు సః.

అన్నారు. సృష్టిలో అన్నింటి కంటే గొప్పవి ఏమిటని మనల్ని ప్రశ్నిస్తే సుఖపెట్టే పదార్థాలను ముందు చూసుకుంటాం. కానీ అవి అనుభవించగలగే ఇంద్రియాలు ఉండడం ఇంకా గొప్ప. ఇంద్రియాల కంటె గొప్పది మనస్సు. మనస్సు కంటె బుద్ధి గొప్పది. ఆ బుద్ధి నిశ్చయాత్మకంగా ఉంటుంది. "బుద్ధి కంటె గొప్పది ఏది?" అంటే **"ధియో యో నః ప్రచోదయాత్".** బుద్ధికి కూడా శక్తినిచ్చే సూక్ష్మవస్తువు. అది **"బుద్ధేః పరతస్తు సః"** – ఆ పరతత్త్వం బుద్ధి కంటె పరమమైనది.

'పరాత్ పరా' – ఒకదాని కంటే పరం చెప్పి, ఈ పరము కంటే అది పరం అన్నారు. దాని కంటే మరి చెప్పలేదు. కనుకనే 'పరాత్పరా'. బ్రహ్మ ఆయువుని పరం అంటారు. 'పరాత్పరా' అంటే బ్రహ్మ ఆయువుని మించిపోయి ఉన్నది అమ్మవారు. కాలపరిమితి లేనిది.

మరొక అర్థం **'గగనాదేరపి వ్యాపికా పరాత్పరా'** – మనకు తెలిసిన వాటన్నిటిలో వ్యాపకశక్తి కలిగినది ఆకాశం మాత్రమే. దానిని మించి మరేం చెప్పలేం. ఆ ఆకాశం కంటె వ్యాపక శక్తి కలిగినది కనుక 'పరాత్పరా' అని చెప్పబడుతున్నదని నారాయణభట్టు వ్యాఖ్యానంలో చెప్పారు.

'పరాత్పరా' 'పరాపరా' ఈ రెండు నామాలకి అనుబంధం ఉంది. మనం పరాపరా అని చదివే నామానికి నారాయణభట్టువారు 'పరాత్పరా' అని చెప్పారు. పరాత్పరా నామం చదివే చోట 'పరాపరా' అని తీసుకున్నారు. ఆయనకి దొరికిన పాఠం అలా ఉంది. భాస్కరరాయలవారికి దొరికిన పాఠం ఇటు, అటు ఉంది.

శ్రీవిద్యకి 'పరాపరా'తో ఉన్న అనుబంధం చెప్పుకున్నాం. పరాపరా అంటే స్వయంప్రకాశమైన వస్తువు. పరము నందు, అపరము నందు వ్యాపించి ఉన్న వస్తువే. అదే పరాత్పరమైనది. బిందుపీఠం వద్ద ఉన్న అమ్మవారికి 'పరాపరా' అని పేరు.

త్రైలోక్యమోహనచక్రంలో ప్రకటయోగిని ఉంది. అక్కడ నుండి గుప్తయోగిని, గుప్తతరయోగిని, సంప్రదాయయోగినీ, కులోత్తీర్ణయోగినీ, నిగర్భయోగిని, రహస్యయోగిని, అతిరహస్యయోగిని, పరాపరరహస్యయోగిని వస్తాయి. ఆవిడే 'లలితామహాత్రిపురసుందరి.' దానిని మించిన పరతత్త్వం మరొకటి లేదు. బిందువులో ఉన్న తల్లే 'పరాపరరహస్యయోగిని.' ఆ తల్లికే పరాభట్టారికా అని మరొక పేరు. పరాపరా, పరాత్పరా, పరాభట్టారికా, పరాపరరహస్యయోగినీ అయిన లలితామహా త్రిపురసుందరి ఈ నామం ద్వారా వ్యాఖ్యానించబడుతున్నది. ఇంత అందమైన సమన్వయం ఈ రెండు నామాలలో కనబడుతున్నది.

ఈ నామాల వరుసలో చెప్పుకుంటున్న పరబ్రహ్మకి సంబంధించిన నామాలలో చివరనామం 'పరాత్పరా'. ఇది 'పరాభట్టారికా' అయిన తల్లిని చెప్తున్నది. ముందు చెప్పుకున్న 'కపర్దినీ' 'కళామాలా' నామాలలో 'కపర్దినీ దుర్గా మంత్రం' చెప్పబడింది. కొందరు ఇప్పుడు చెప్తున్నదంతా 'కపర్దినీదుర్గా విద్య' అనే చెప్పారు.

తరువాత నామాలకి ఒక విశేషం ఉంది. 'పాశహస్తా, పాశహంత్రీ, పరమంత్రవిభేదినీ'

810. పాశహస్తా - శ్రీ పాశహస్తాయై నమః

'పాశహస్తా, పాశహంత్రీ, పరమంత్రవిబేధినీ' ఈ మూడు నామాలు కలిపిన

శ్లోకపాదం ఒక అద్భుతమైన మంత్రం. దీనిని అనుసంధానం చేసుకుంటే దీనికో ప్రయోజనం ఉంది. ఎవరైనా దుష్టులు ప్రయోగాలు ఏమైనా చేసినా ఆ బాధ మనకు రాకుండా చేయగలిగే శక్తి ఈ మూడు నామాలకి ఉంది.

'పాశహస్తా' – అమ్మవారు తన చేతులతో పాశం పట్టుకున్నారు. తానే ఎవరి పాశమైనా తీసేస్తోంది. పరస్పరమైన విరుద్ధభావాలు రెండు నామాలలో చెప్పారు 'పాశహస్తా', 'పాశహంత్రీ'. 'రాగస్వరూపపాశాఢ్యా' 'క్రోధాకారాంకుశోజ్జ్వలా' – ఒక చేతిలో పాశం, ఒక చేతిలో అంకుశం పట్టుకుంది.

అమ్మ ఎప్పుడూ పాశం ధరించి ఉంటుంది కానీ ఆవిడకు ఏ పాశాలు లేవు. తనని ఆశ్రయించిన భక్తులకి ఏమైనా పాశాలు ఉంటే తీసివేస్తుందని తరువాత నామంలో చెప్తున్నారు.

811. పాశహంత్రీ – శ్రీ పాశహంత్ర్యై నమః

పాశాలు తీసివేసే తల్లి 'పాశహంత్రీ'.

పాశాలు తీసేటప్పుడు చేత్తో పాశం ఎందుకు పట్టుకోవడమంటే అవసరమైన వానికి తగిలించడానికి. పాశం తగిలించేదీ ఆవిడే, పాశం తొలగించేదీ ఆవిడే. పశువుల కాపరి తాను పోషించే పశువులకి పాశం తగిలిస్తాడు. తగిలించడమే కాదు... తొలగిస్తాడు కూడా. ఎప్పుడు తగిలించాలో, ఎప్పుడు తొలగించాలో వానికి తెలుసు.

అలాగే ఎవరిని ఎప్పుడు పాశంతో బంధించాలో, ఎప్పుడు పాశం తొలగించాలో అమ్మవారికి తెలుసు. మనం తొందరపడి, "అమ్మా! పాశం తీసెయ్యమ"ని అమ్మవారిని అడగకూడదు.

అంతా పరమేశ్వరి అధీనంలో ఉందని అర్థం. అంతా ఆవిడ చేతిలోనే ఉంది.

'పాశహస్తా', 'పాశహంత్రీ'లోనే లోకనిర్వహణ అంతా దాగి ఉంది.

'పాశహంత్రీ' అనే నామానికి అనేక భావాలు తెలుసుకోవచ్చు. పాశములు అంటే బంధమే. బాధించే, బంధించే ఏ పాశాన్నైనా తొలగిస్తుంది. అనిరుద్ధుని కథ

చెప్పుకున్నాం. అతనిని నాగపాశాలతో బంధిస్తే ఆ నాగపాశాన్ని కూడా తొలగించింది.

ఘృణా లజ్జా భయం శంకా జుగుప్సా చేతి పంచమీ

కులం శీలం తథా జాతి రష్టౌ పాశాః ప్రకీర్తితాః

ఈ ఎనిమిది పాశాలే జీవుని సంసారంలో బంధిస్తాయి. ఈ పాశాలతో ఉన్నవాడే జీవుడు. పాశాలను వదిలినవాడే ముక్తుడు. శివోహం స్థితిని పొందినవారు. ఆ ముక్త స్థితిని ఇచ్చునది పాశహంత్రీ.

812. పరమంత్రవిభేదినీ – శ్రీ పరమంత్రవిభేదిన్యై నమః

ఇతరులు చేసిన మంత్రాలుగాని, ప్రయోగాలుగాని ఏవైనా ఉంటే వాటిని వెంటనే త్రిప్పికొట్టగలిగే శక్తి అమ్మవారి ఉపాసనలో ఉంది.

'జయత్సేనా' అని చెప్పుకున్నాం. అమ్మవారి సేనలన్నీ జయించే లక్షణాలు కలవే. అమ్మ మంత్రరాశి చాలా ఉంది. ఆమ్నాయ మంత్రాలలో ఎన్నో మంత్రాలు ఉన్నాయి. అవన్నీ అస్త్రములే. అదే 'చక్రరాజరథారూఢా' 'సర్వాయుధపరిష్కృతా'. ఆ శ్రీచక్రంలోనే అన్ని ఆయుధాలు ఉన్నాయి. ఒకొక్క దేవతా మంత్రం ఒకొక్క ఆయుధం. అమ్మవారిని ఆరాధన చేస్తే ఆ మంత్రశక్తులన్నీ తోడుగా కాపాడుతూ ఉంటాయి.

చిట్టచివరికి అన్నింటికి పరమార్థమైన మోక్షాన్ని కూడా ఇస్తుంది. మననం చేసేవారి పాపాలను నశింపజేయునది అని అర్థం కూడా ఉంది.

సృష్టిలో సుఖంగా ఉండాలనుకునేవారు నిజానికి నాలుగు కోరుకుంటే చాలు. ధార్మికమైన కోరిక ప్రవృత్తి మార్గంలో ఉన్నవారికి తప్పు లేదు. అది సంపద, ఆరోగ్యం, సత్కీర్తి – 'మన గురించి ఎవరూ చెడుగా అనుకోకుండా ఉండడం', నాలుగవది శత్రుబాధ లేకుండా ఉండడం. దరిద్రం, అపకీర్తి, అనారోగ్యం, శత్రుబాధ – ఈ నాలుగు శివపూజ మొదలుపెట్టే వరకే ఉంటాయని శివపురాణం చెప్పింది. శివార్చన చేయడం మొదలుపెడితే ఈ నాలుగు పోతాయి. శివపూజ అంటే శివశక్తుల పూజే. అమ్మని ఆశ్రయిస్తే ఆ తల్లే ఈ 'పరమంత్రవిభేదిని'గా పని చేస్తుంది. దీనికి ప్రమాణం

లలితాసహస్రం ఫలశ్రుతిలో చెప్పారు.

యస్త్విదం నామ సాహస్రం సకృత్పఠతి భక్తిమాన్

తస్య యే శత్రవస్తేషాం నిహంతి శరభేశ్వరః

ఒక్కసారి భక్తిగా పఠించేవారికి ఎవరైనా శత్రువులు ఉంటే శరభేశ్వరుడు ఆ శత్రువుల్ని పరిమార్చుతాడని చెప్పారు.

యో వాభిచారం కురుతే నామసాహస్రపాఠకే

నిర్వర్త్య తత్క్రియాం హన్యా త్తం వై ప్రత్యంగిరా స్వయం

ఎవరైతే లలితాసహస్రాన్ని భక్తిగా చదువుతూ ఉంటారో వారిపై ఎవరైనా అభిచార ప్రయోగం చేసినట్లైతే ప్రత్యంగిరాదేవి ఆ అభిచారాన్ని త్రిప్పి కొడుతుంది.

ప్రత్యంగిరా – ప్రత్యక్ దృష్టితో వెళ్తే మన లోపల వినబడే పరావాక్ రూపం. ఇది పరబ్రహ్మార్థం. అక్కడికి వెళ్తే మౌనం వస్తుంది గాని ఇంక ప్రయోగాలు ఉంటాయా!

లలితాసహస్రం కేవలం మహిమల పుస్తకమే కాదు... జ్ఞానగ్రంథమని తెలుసుకోవాలి.

మనం బ్రతుకులో చక్కగా సాధన చేసుకుంటూ ఉంటే ప్రతికూల శక్తులు మనల్ని బాధించకుండా ఉండడంలో అమ్మ వేస్తున్న ఒక నిఘాయే ప్రత్యంగిరాదేవిలా వచ్చింది. అదొక రక్షణశక్తి.

'పరమంత్రవిభేదినీ'లో వచ్చిన 'పర'కి 'పరబ్రహ్మస్వరూపిణీ'లో 'పర'కి ఇప్పుడు తేడా అర్థమవుతుంది. ఇక్కడ పర అంటే ఇతరులు అని అర్థం. పర–మంత్రవిభేదినీ... ఇతరుల మంత్రములను భేదించునది.

రామాయణంలో నికుంభయాగాన్ని చేస్తున్న ఇంద్రజిత్తుని లక్ష్మణుడు వెళ్ళి కొట్టాడు. ఆ యాగంకాని పూర్తయ్యిందా ఇంద్రజిత్తు అజేయుడౌతాడు. అక్కడ ఇంద్రజిత్తుని కొట్టింది లక్ష్మణశక్తి కాదు – రామశక్తి.

ధర్మాత్మా సత్యసంధశ్చ రామోదాశరథిర్యది

పౌరుషే చాప్రతిద్వంద్వశ్శరైణం జహి రావణిం

అని చెప్పి రామమూర్తిని ఒక్కసారి తలచుకుని, ఆయన యొక్క సత్యాన్ని

స్మరించుకుని, తచ్ఛక్తిని బాణంపై ఆవాహన చేసి, ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు లక్ష్మణస్వామి. అప్పుడు అక్కడ పరమంత్రవిభేదం జరిగింది. ఎవరైతే ధర్మానికి, దేశానికి శత్రువులో అలాంటి వారి ప్రయోగాలని దెబ్బతీయాలి.

మంత్రశక్తి చాలా గొప్పది. దానిని దేశ క్షేమం గురించి వినియోగించాలి. పర-మంత్ర అంటే ధర్మానికి శత్రువులైనవారి యొక్క దుష్టతపస్సులను దెబ్బతీసే తల్లీ! అని నమస్కారం చేసుకోవాలి. ఇదంతా భౌతికార్థంలో చెప్పుకున్నాం.

ఈ నామానికి తాత్త్వికార్థం చూస్తే మంత్రము అంటే ఆలోచన అని అర్థం. మంత్రి అంటే ఆలోచనాపరుడు. ఆలోచన మనసులోనే జరుగుతుంది. రహస్యం కనుక అది మంత్రం.

స్వ-పర. స్వ అంటే ఆత్మస్వరూపురాలైన అమ్మవారు. పర అంటే ఆత్మేతరములైన ప్రాపంచిక విషయాలు. ప్రాపంచిక విషయాల వైపు వెళిపోతున్న ఆలోచనలే పరమంత్రములు. అమ్మవారిని ఆశ్రయించి, "అమ్మా! నీ సాధన చేసేటట్లు నువ్వే అనుగ్రహించు తల్లీ!" అంటే ఈ ప్రాపంచిక ఆలోచనలని విభేదించి, ఏకాగ్రంగా తన వైపుకి తిప్పుకుంటుంది ఆ తల్లి. ఇది దీనిలో గ్రహించవలసిన అసలైన పరమార్థం. **ఇంద్రియాలని నిగ్రహించడమే 'పాశహస్తా'. విషయబంధాన్ని తెంచడమే 'పాశహంత్రీ'. ఆత్మేతరాల నుండి బుద్ధిని మరల్చడమే 'పరమంత్రవిభేదినీ'**

ఈ అర్థాన్ని మనం అనుసంధానం చేసుకోవాలి గాని శత్రువుల్ని గుర్తు తెచ్చుకోవడం కాదు. అమ్మా! నీ నుంచి దూరం చేసే ఆలోచనలే అసలైన శత్రువులు. వాటిని తొలగించు తల్లీ! అని ఆశ్రయిస్తే అమ్మ తప్పకుండా అనుగ్రహిస్తుంది.

813. మూర్తా - శ్రీ మూర్తాయై నమః,

814. అమూర్తా - శ్రీ అమూర్తాయై నమః

'పరాపరా', 'క్షరాక్షరాత్మికా'. ఇలాగే 'మూర్తామూర్తా' కూడా వచ్చింది. మూర్తము అంటే ఎదురుగా ప్రకటింపబడుట. అది రూపమే కానక్కర్లేదు. శబ్దం కూడా మూర్తమే. శబ్దరూపం అంటే ఇంద్రియాలతో దొరికేది. మూర్తము అంటే

మనస్సుతో భావనకి అందేది.

అమూర్తము అంటే అందనిది. అందేది, అందనిది కూడా అమ్మయే. రెండూ ఆ తల్లే. ఆ జగన్మాత మనకి అందకపోతే ఎలా! మనకి అందడం కోసం అందుబాటులోకి వచ్చింది అప్పుడు మూర్తా. అసలు తత్త్వం అమూర్తం.

ఉపాసించేటప్పుడు మనం ధ్యానించే అమ్మ విగ్రహము, లీలలు, దివ్యమైన చరిత్ర – ఇవన్నీ మూర్తములు. 'అరుణాం కరుణా తరంగితాక్షీం' అన్నప్పుడు మూర్తిని మనం ధ్యానం చేశాం. అలా కాసేపు ఆ మూర్తిని తలచుకున్నా ధన్యులమైపోతున్నాం. కనుక అది మూర్తి. ఆ మూర్తి ఇప్పుడు మన కోసం ధరించింది కాదు. ఇది వరకు ఆ తల్లి ఎందరో ఉపాసకులను, ఋషులను అనుగ్రహించడం కోసం, అసురసంహారం కోసం ఆ రూపం ధరించింది. ఆ మూర్తి ధరించి భండాసురసంహారం, మహిషాసుర సంహారం, భక్తులను అనుగ్రహించడం – ఇలా అనేక లీలలను చేసింది. ఆ లీలలన్నీ వింటూ ఉంటే మనసులో ఆ మూర్తులు కదులుతుంటాయి. అమ్మలీలలు, రూపాలు – ఇవన్ని మూర్తములు.

అమూర్తము అమ్మ మంత్రం. మంత్రం ఒక మూర్తిలా కనబడదు. అది సూక్ష్మం. అంతకంటే సూక్ష్మం కుండలినీ. అదీ అమూర్తమే. అంతకంటే సూక్ష్మం పరతత్త్వం. అమ్మ యొక్క పరబ్రహ్మస్వరూపం అమూర్తం.

సగుణ సాకార దివ్యమంగళరూపధారిణి – మూర్తా. నిర్గుణమైన పరబ్రహ్మ స్వరూపం అమూర్తా. రెండు కూడా ఆ తల్లే. రెండూ ఒకటే అని ఉపాసించాలి. సగుణ, నిర్గుణ తత్త్వాలు రెండూ అవగాహన చేసుకోవాలి. **"ద్వే బ్రహ్మణీ వేదితవ్యే మూర్తంచ అమూర్తం చ"** – బ్రహ్మమునకు రెండు స్వరూపాలు ఉన్నాయి. మూర్తామూర్తములు రెండూ అమ్మరూపాలే.

815. నిత్యతృప్తా – శ్రీ నిత్యతృప్తాయై నమః

కొంతమంది నిత్యతృప్తా అనే నామాన్ని మార్చి అనిత్యతృప్తా అని వ్రాశారు. ఎందుకలా వ్రాశారంటే ముందు 'నిత్యతృప్తా భక్తనిధిర్నియంత్రీ నిఖిలేశ్వరీ' దగ్గర

నిత్యతృప్తా వచ్చింది. మళ్ళీ ఇక్కడ నిత్యతృప్తా వస్తే పునరుక్తి అవుతోందని అనిత్యతృప్తా అని చెప్పి దానికేదో అర్థం చెప్పారు. కానీ 'నిత్యతృప్తా' అని చెప్తే తప్పేంలేదు.

స్తోత్రసాహిత్యంలో పునరుక్తి దోషం రాదు. ఒక వేళ పునరుక్తి ఉండి అదే అర్థం వచ్చినప్పటికి సందర్భానుగుణంగా తలచుకోవాలి. నిత్యతృప్తా అంటే అమ్మవారు ఎప్పుడూ తృప్తిగా ఉంటుందని అర్థం. మనం అనుకుంటాం మన పూజ వల్ల అమ్మవారు తృప్తి చెందాలని... కాని ఆవిడ ఎప్పుడూ నిత్యతృప్తా. అమ్మవారి సంపూర్ణతత్త్వమే తృప్తి తత్త్వం. 'నిత్యతృప్తా' అంటే అఖండానందస్వరూపిణి.

816. మునిమానసహంసికా – శ్రీ మునిమానసహంసికాయై నమః

ఇలాంటి నామమే మునుపు కూడా వచ్చింది. అది 'భక్తమానసహంసికా'. ఇక్కడ 'భక్త' పోయి 'ముని' వచ్చింది కాని అర్థం మాత్రం ఏం మారలేదు. అదే అర్థం. నిత్యతృప్తా అయిన తల్లే మునుల మనస్సులలో ఉంది. హంసకి ఒక లక్షణం ఉంది. అది ఓలలాడుతూ ఉంటుంది. అలా భక్తుల మనస్సులలో విహరిస్తూ ఉంటుంది.

ఎప్పుడైనా సరోవరంలో హంస ఉంటే ఆ అందమే అందం. మానస సరోవరంలో అమ్మ అనే హంస ఉంటేనే ఈ సరోవరానికి అందము వస్తుంది. ఒక చక్కని పరిశోధన చేసి హంసలు ఎక్కడ ఉంటాయో చెప్పారు. ఎక్కడ మాలిన్యం ఉండదో అక్కడ హంసలు ఉంటాయి.

మునుల మనస్సుల్లో ఏ కాలుష్యం ఉండదు. అందుకే వారు మునులయ్యారు.

అమ్మ గురించి చేసిన ధ్యానం, సాత్త్విక సాధన, ధార్మికజీవనం, తాత్త్విక చింతన వల్ల చిత్తం శుద్ధమౌతుంది. అలాంటి చిత్తము లోపల అమ్మ విహరిస్తుంది.

మంత్రోపాసకులే మునులు. మంత్రం అంటేనే మననం చేయబడేది. మననం చేసే వారు మునులు. భావాత్మకంగా చింతన చేయడం కూడా మననమే. మంత్రాన్ని మనసుతో మననం చేసుకుంటూ ఉంటే చిత్తం శుద్ధమై, ఆ శుద్ధచిత్తంలో అమ్మవారు ఒక హంసలా గోచరిస్తూ ఉంటారు.

'హంసో నామ సదాశివః'. హంస అంటే 'సదాశివః' అన్నారు. పరతత్త్వమే హంస. హంస శబ్దానికి అత్యంత శుద్ధమైనదని అర్థం. హంస, హంసికా అంటే ముఖ్యప్రాణరూపిణి అని కూడా అర్థం. అందరిలోను తిరుగుతోంది కాని ఎవరికీ పట్టుకోవడం చేతకాదు. మునుల మనసు మాత్రమే తమలో ఆ సుషుమ్న యందు సంచరిస్తున్న హంసరూపిణి, ముఖ్యప్రాణరూపిణి అయిన తల్లిని దర్శించగలదు.

817. సత్యవ్రతా – శ్రీ సత్యవ్రతాయై నమః

'సత్యవ్రతా, సత్యరూపా, సర్వాంతర్యామినీ, సతీ' అని ఈ శ్లోకపాదంలో మొత్తం నాలుగు నామాలు వచ్చాయి. ఇవి అమ్మ యొక్క మరో తత్త్వాన్ని చెప్తున్నాయి. ఇందులో అందమైన కూర్పు ఉంది. ముందు చెప్పిన 'పరంజ్యోతిః పరంధామ పరమాణుః పరాత్పరా'లో పర అనే శబ్దం ఎలా తీసుకొన్నామో, ఇక్కడ ఈ నాలుగు నామాలలో 'సత్' అనే శబ్దాన్ని అలా తీసుకోవాలి. ఇందులో చెప్పబడుతున్నది **'సత్'** స్వరూపిణి అయిన అమ్మవారు. అక్కడ పరబ్రహ్మము చెప్పబడింది. ఇక్కడ సద్వస్తువు చెప్పబడుతోంది.

సత్ అనగా బ్రహ్మమే. శాశ్వతమైన ఉనికి కలిగినది సత్. **'అవితథం పరం బ్రహ్మ సత్'** అన్నారు. పరబ్రహ్మమే సత్. కృష్ణపరమాత్మ పరమాత్మని నిర్దేశించే శబ్దాలు మూడు అని చెప్తూ **'ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణః త్రివిధః స్మృతః'** అన్నారు. బ్రహ్మమునకు చెప్పబడుతున్నవి మూడు శబ్దాలే ఓం – తత్ – సత్. ఏ కర్మచేసినా మనకి తెలిసో తెలియకో దానిలో ఏవో లోపాలు ఉంటాయి. ఆ లోపాల్ని తీసేయడానికి ఓం తత్సత్ బ్రహ్మార్పణమస్తు అని చెప్పమని కృష్ణపరమాత్మయే చెప్పాడు. అక్కడితో అది పరిపూర్ణం అవుతుంది. అంతా పరబ్రహ్మతత్త్వంతో చేస్తే అది పరిపూర్ణమై మంగళము అవుతుంది. పరబ్రహ్మ అనే సముద్రంలోకి చేరితే, చేసే చిన్న కర్మ కూడా అనంతమైన ఫలాన్ని ప్రసాదిస్తుంది. ఓంకారం, తత్, సత్ – ఈ మూడు బ్రహ్మమును తెలియజేస్తాయని అర్థం. తత్ – అనిర్వాచ్యం. అదే సత్ – ఎప్పుడూ ఉండేది.

'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ' అనే మాట ఉంది. సత్ అన్నా, సత్యం అన్నా ఒక్కటే. **సతీ** అంటే **సత్** శబ్దానికి స్త్రీలింగం. ఇప్పుడు ఆ సద్వస్తువును అమ్మా! అనే భావంతో పిలుస్తున్నాం కనుక స్త్రీలింగంలో చెప్పాం. అసలు ఏ లింగమూ కాదు.

'సత్' శబ్దానికి పుంలింగంలో చెప్తే 'సదాశివః' అయ్యింది. స్త్రీలింగంలో చెప్తే 'సతీ' అయ్యింది. ఎప్పుడూ ఉండే తల్లి అని అర్థం. సతీ శబ్దానికి మరొక అర్థం 'పతివ్రతా'. సతీ అనే శబ్దమే ఈ నాలుగు నామాల్లో ప్రధానం కనుక సతీ అర్థాన్ని తెలుసుకోవాలి. దానితో అనుసంధానం మిగిలిన మూడు నామాలు.

పరబ్రహ్మమునకు, పతివ్రతకు సతీ శబ్దం చెప్పబడుతున్నది. సల్లక్షణమే పాతివ్రత్యం. అమ్మవారు సతీ అని వేరేగా చెప్పాలా! దక్షప్రజాపతి పుత్రికగా వచ్చినపుడు అమ్మవారికి సతీ అని పేరు. మరి తరువాత లేదా ఆ పేరు? అంటే ఆవిడ ఎప్పుడూ సతే. ఎప్పుడూ సదాశివపతివ్రతా.

బ్రహ్మపురాణంలో **'సా తు దేవీ సతీ పూర్వం ఆసీద్ పశ్చాత్ ఉమా భవత్' –** ముందు సతీ అన్న పేరుతో ఉన్న తల్లే దక్షయజ్ఞ ధ్వంసం అయ్యాక దాక్షాయణిగా తన ఉనికిని వదలి పెట్టి ఉమా రూపంతో వచ్చింది. అప్పుడు కూడా **'సహవ్రతా భవస్యైవ నైతయా ముచ్యతే భవః' –** ఆవిడ ఎప్పుడూ శివునకు సహవ్రతా. ఆయనతోనే ఉంటూ ఉంటుంది. ఆయన కూడా ఎప్పుడూ ఆవిడని విడిచిపెట్టడు.

సతీ అనే మాట సామరస్య తత్త్వాన్ని బోధిస్తోంది. 'సతీ' అనగానే శివశక్తుల ఏకత్వమే స్ఫురింపబడుతూ ఉంది. **పరమాత్మతో కలిసి ఉన్న శక్తి** అని చెప్పడం. ఆ సతి అయిన సద్వస్తువు దొరకాలంటే మనం సత్కర్మ చేయాలి. సత్ కోసం చేసేదే సత్కర్మ. సత్కర్మ అంటే మంచి పని చేశామనే కాదు. మంచికోసం చేసే పని కూడా మంచి పనే.

ఇక్కడ సత్ వస్తువు అమ్మవారు. సత్కర్మని నియమబద్ధంగా చేస్తే దానికి వ్రతమని పేరు. ఆ సద్వస్తువుని పొందడానికి మనం చేసే దీక్ష, నియమము, సాధన, యజ్ఞం, యాగం, పూజ, ఉపాసన – ఇవన్నీ వ్రతాలు. ఆ వ్రతాలు కూడా అమ్మరూపాలే.

'సత్యములైన వ్రతములు కలది' అని మరొక అర్థం. సత్యములు అంటే వ్యర్థములు కానివి. అమ్మకి సంబంధించిన ఏ వ్రతం ఆచరించినా అది వ్యర్థము కాదు. నోములు, వ్రతాలు అన్నీ అమ్మవారివే. 'ప్రియవ్రతా' దగ్గర వివరంగా చెప్పుకున్నాం. జీవితాంతం అమ్మవారిని ఆరాధించడం ఒక వ్రతమే.

"శరీరధారణమపి వ్రతమేవ". శరీరాన్ని జాగ్రత్తగా ధరించడమే పెద్ద వ్రతం అని చెప్పారు. నియమబద్ధంగా జీవితం గడిపితే వారి ఆయువు బాగుంటుంది. ఇవన్నీ అమ్మవారిని ఉద్దేశించి చేసినపుడు అవి వ్యర్థం కాకుండా ఫలిస్తాయి కనుక 'సత్యవ్రతా'.

భగవద్గీతలో కృష్ణభగవానుడే సత్కర్మ, అసత్కర్మ అని రెండు చెప్పాడు. శ్రద్ధ కలిగి చేస్తే అది సత్యమౌతుంది. శ్రద్ధ లేకుండా చేస్తే అది అసత్ అవుతుంది.

భగవంతుడు, మంత్రము గొప్పవి అని మనకి శాస్త్రం చెప్పింది. శాస్త్రం చెప్పింది కనుక అది సత్యమని భావనతో ఎవరు అనుష్ఠానం చేస్తారో వారికి అది సత్కర్మ. శాస్త్రంపై విశ్వాసం లేకుండా అదే కర్మ చేస్తే అది అసత్కర్మ. సత్యవ్రతం అంటే శ్రద్ధగా చెయ్యబడిన వ్రతము అమ్మ యొక్క రూపం.

1. అమ్మ వ్రతములన్నీ సత్యములే. 2. శ్రద్ధగా చెయ్యబడిన వ్రతములన్నీ అమ్మరూపాలే. **'అశ్రద్ధయా హుతం దత్తం అసత్'** అని గీతలో పరమాత్మ చెప్పిన మాటని గుర్తు పెట్టుకోవాలి. శివసూత్రాలలో **'శరీరవృత్తిర్వ్రతం'** అని చెప్పారు. శరీరపోషణకు మనం ఎంచుకునే విధానం కూడా వ్రతమని అన్నారు. శరీరపోషణకి శాస్త్రీయమైన విధానాన్ని మనం ఎంచుకుంటే అది సద్వ్రతము.

'శివభక్తి సుధాపూర్ణే శరీరే వృత్తిరస్య యా వ్రతమేతదనుష్ఠేయం న తుచ్ఛం తచ్ఛధారణం.' అని సూత్రవార్తికం. 'శివభక్తి అనే అమృతంలో నిండి ఉన్న ఈ శరీరంలో ఉండడమే ఒక వ్రతం. ఈ వ్రతం ఆచరించదగినది. శరీరధారణ తుచ్ఛము కాదు' – అంటే తుచ్ఛక్రియల కోసం కాదు – శివభక్తి కోసమే... అని భావం. **'భవత్పూజోపభోగాయ శరీరమిదమస్తుమే'** అని ఉత్పలభట్టు చెప్పిన మాట. 'నీ పూజకోసమే ఈ శరీరము ఉండుగాక! – వినియోగింపబడుగాక!'

సత్యవ్రతమే అమ్మరూపం. సత్యవ్రతమంటే హరిశ్చంద్రుడు మొదలైనవారు పాటించినది. 'సత్యాన్ని తప్పను' అన్న ఒక్క వ్రతం చాలు. రామకృష్ణపరమహంస - కలియుగంలో సత్యమే గొప్ప వ్రతం అన్నారు. కలియుగంలో ఉపవాసాది వ్రతాలు చెయ్యలేరు. యజ్ఞయాగాదులు చెయ్యలేరు. వాటి విధానాలే పోతున్నాయి. యోగాలన్నీ మనకి కృత్రిమరూపాలతో దొరుకుతున్నాయి.

సత్యంగా బ్రతకడం ఒక్కటి నేర్చుకుంటే అదే పెద్ద వ్రతం. కలియుగంలో సత్యనారాయణ వ్రతం ఒక్కటి చాలంటే అర్థం ఇదే. సత్యమైన జీవితమే సత్యనారాయణవ్రతం. ఆ సత్యమే వ్రతముగా కలిగినవారందరూ అమ్మరూపాలే. అమ్మ ఎప్పుడూ నియమం తప్పదు. నియమం తప్పకుండా ఉండడమే వ్రతం. ప్రకృతి గతిని మార్చుదామని ప్రయత్నించడమంతా అసత్యమే. ప్రకృతినియమాలు సత్యాలు.

అమ్మవారు ఆ విశ్వనియమాలని జాగ్రత్తగా పాటింపజేస్తున్నది. విశ్వనియమాలనే సత్యములు అంటారు. **'సూర్యాచంద్రమసౌ ధాతా యథా పూర్వమకల్పయత్'** (శ్రుతి). సూర్యుడు, చంద్రుడు, గాలి - ఇవన్నీ ఎప్పుడూ ఒక్కలాగే ఉన్నాయి.

కృతయుగంలో ఎలా ఉన్నాయో ఇప్పుడూ అలాగే ఉన్నాయి. అలా ఉంటేనే మన బ్రతుకులు సాగుతున్నాయి. 'విశ్వనియమాలను నియమబద్ధంగా నడుపు తల్లి' అని మరొక అర్థం. అటువంటి నియమాలన్నీ అమ్మరూపాలే.

దీనికి భాష్యం రచిస్తూ 'రామచంద్రుడు సత్యవ్రతుడు' అన్నారు. **'శ్రీరామో లలితాంబికా'** రామచంద్రమూర్తిగా ఉన్న తల్లి. రామచంద్రుడు సత్యాన్ని ఎక్కడా తప్పలేదు. వనవాసం చేస్తున్న రాముని తిరిగి వచ్చేయమని వశిష్ఠునితో సహా అందరూ అడిగారు. వశిష్ఠులవారు తెలివిగా, "రాజ్యం ఎప్పుడూ పెద్దకొడుక్కే ఇవ్వాలి కనుక రామా! నువ్వు వచ్చి పాలిస్తే తప్పేం లేదు" అన్నారు. అందరూ అన్ని అంటున్నా ఆయన ఒక్కటే సత్యానికి కట్టుబడ్డాడు. ఎవరి సత్యం? వారి నాన్నగారి సత్యం. వారి నాన్నగారికి అసత్యదోషం రాకూడదని సత్యానికే కట్టుబడ్డాడు. **'సత్యే ప్రతిష్ఠితం లోకం'** అంటాడు. సత్యమునందే లోకము ప్రతిష్ఠింపబడినది. సత్యం తప్పితే ప్రపంచం గతులు తప్పి తల్లక్రిందులవుతుంది.

818. సత్యరూపా – శ్రీ సత్యరూపాయై నమః

సత్యమే రూపముగా కలది. శ్రద్ధతో కూడిన కర్మ అమ్మరూపం. విశ్వ నియమాలు రూపంగా కలది. పరబ్రహ్మమే సత్. సత్యం జ్ఞానమనంతం బ్రహ్మమే అమ్మరూపం.

సత్+తి+యమ్ – సత్యం. సత్ – అన్నం. తి – ప్రాణము. య– ఆదిత్యుడు. సత్యం అనగా అన్న ప్రాణ ఆదిత్యరూపాలతో ఉన్నదని అర్థం.

సూర్యభగవానుని రూపంతో – అన్నప్రాణ ఆదిత్య రూపాలతో – ఉన్న తల్లి. ఈ సద్వస్తువైన పరమాత్మ ఎక్కడ ఉన్నదో చెప్తూ తరువాత నామం

819. సర్వాంతర్యామినీ – శ్రీ సర్వాంతర్యామిన్యై నమః

అన్నిటి యందు లోపల వ్యాపించి ఉంది. అందరి అంతఃకరణాలనీ నియమించే ఈశ్వరి.

> **"ఏష తే ఆత్మా అంతర్యామ్యమృతః"**(అంతర్యామి బ్రాహ్మణం)
>
> **"ఏషోంతర్యామ్యేష యోనిః సర్వస్వ"** అని ఉపనిషద్వాక్యాలు.

820. సతీ – శ్రీ సత్యై నమః

ఈ నామానికి మొదటిగా వైదికార్థ వివరణ చెప్పుకున్నాం, ఇప్పుడు మరో భావం.

అమ్మవారిది సప్తశతీ అని ఉంది. శతీ అంటే 100, సప్తశతి అంటే 700. ప్రథమ చరిత్రలో ఏడుగురు సతులు. మధ్యమ చరిత్రలో ఏడుగురు సతులు, ఉత్తమ చరిత్రలో ఏడుగురు సతులు ఉన్నారు. ప్రథమచరిత్రలో కాళీ, తార, ఛిన్నమస్తా, సుముఖీ, భువనేశ్వరీ, బాలా, కుబ్జా. మధ్యమ చరిత్రలో లక్ష్మీ, లలితా, కాళీ, దుర్గా, గాయత్రీ, అరుంధతీ, సరస్వతీ అనే శక్తులు. ఉత్తమచరిత్రలో బ్రాహ్మీ, మాహేశ్వరీ, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, మాహేంద్రీ, చాముండా. ఇక సమష్టిరూపసతులు నందా, శతాక్షీ, శాకంభరీ, భీమా, రక్తదంతికా, దుర్గా, భ్రామరీ.

మొత్తం 28 మంది సతులు. వీరందరి రూపమే 'సతీ'.

తరువాతి నామాలు బ్రహ్మణీ, బ్రహ్మజననీ, బహురూపా, బుధార్చితా. ఈ నాలుగు నామాలకి మళ్ళీ అనుబంధం ఉంది.

821. బ్రహ్మణీ – శ్రీ బ్రహ్మణ్యై నమః

బ్రహ్మ యొక్క శక్తి 'బ్రహ్మణీ'. బ్రహ్మణీ అంటే సరస్వతీ దేవి. సరస్వతీరూపముతో ఉన్నది. బ్రహ్మరూపమైన 'అణీ' – పుచ్ఛము. **'బ్రహ్మణ అణీష్ఠః'** – అని శ్రుతి. ఆనందకోశమునకు పుచ్ఛముగా ఉన్న బ్రహ్మము. **'బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా'** అని ఉపనిషద్వాక్యం. దీనిని రెండు నామాలుగా కొందరు చెప్తారు. కొందరు కలిపి ఒక్కటిగా చెప్పారు.

బ్రహ్మజననీ – శ్రీ బ్రహ్మజనన్యై నమః

822. శ్రీ బ్రహ్మణే నమః

823. శ్రీ జనన్యై నమః

బ్రహ్మజననీ అనే నామాన్ని కొందరు వ్యాఖ్యాతలు బ్రహ్మణే నమః, జనన్యై నమః అని రెండు నామాలుగా చెప్పారు. బ్రహ్మజననీ అని ఒక నామంగా కొందరు పేర్కొన్నారు. రెండిటిని స్వీకరించవచ్చు. బ్రహ్మము అంటే వేదము అని ఒక అర్థం. వేదజననీ అంటే గాయత్రి. బ్రహ్మము యొక్క శక్తి బ్రహ్మణి. వేదజననీ, బ్రహ్మజననీ. బ్రహ్మణీ, బ్రహ్మజననీ అనే మాట అదే క్రమములో అనేక శాస్త్రాలలో ఉంది. దానినే ఇక్కడ వశిన్యాదివాగ్దేవతలు అందించారు. ఇది శాస్త్రీయమైన కూర్పు.

దేవీపురాణంలో **'బ్రహ్మణీ బ్రహ్మజననాత్ బ్రహ్మణో జీవనేన వా'** అని నిర్వచనం. బ్రహ్మణీ అని ఎందుకన్నారంటే 'బ్రహ్మజననాత్' – బ్రహ్మను సైతం పుట్టించిన తల్లి. చతుర్ముఖ బ్రహ్మ కంటే ముందు ఉంది అమ్మవారు. ఆవిడ శక్తి చేతనే చతుర్ముఖ బ్రహ్మ కలిగారు. అతనికి వేదాలన్నీ ఆ తల్లే ఇచ్చింది. అమ్మ శక్తి చేతనే త్రిమూర్తులు కలిగారు కనుక 'బ్రహ్మజననీ' అన్నప్పుడు బ్రహ్మకు సైతం కారణమైన తల్లి.

'బ్రహ్మణో జీవనేన వా' – బ్రహ్మని బ్రతికిస్తోంది కనుక 'బ్రహ్మణీ'. బ్రహ్మాదుల ఆయువులు కూడా అమ్మ సంకల్పం మీద ఆధారపడి ఉన్నాయి. వారిని బ్రతికిస్తున్న తల్లి. ఏ బ్రహ్మ ఎంతకాలం ఉండాలనేది ఆవిడ ఏర్పాటు చేసిన వ్యవస్థ. బ్రహ్మని నియమించుట, నడిపించుట... పరాశక్తి పని కనుక బ్రహ్మణీ, బ్రహ్మజననీ.

బ్రహ్మ అంటే వేదము అని కూడా అర్థం. బ్రహ్మజననీ అంటే తన నుండి వేదాలన్నీ వ్యక్తం చేసిన తల్లి. 1. బ్రహ్మణీ అంటే పరబ్రహ్మశక్తి సరస్వతి. 2. బ్రహ్మదేవునికి కూడా కారణమైనది. 3. బ్రహ్మణీ – వేదస్వరూపిణి.

పంచకోశ విచారణ చేసినప్పుడు ఈ విషయాన్ని చెప్పుకున్నాం. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయాలకి పుచ్ఛమేదో అది బ్రహ్మమే. పుచ్ఛమనగా ఆధారం. వీటన్నిటికి చివర. ఇవన్ని నేతి, నేతి అని విడిచాక కనబడుతున్న స్వరూపం. 'బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా' అని చెప్పినట్లుగా ఆనందకోశానికి కూడా ఆవల ఉంటూ పంచకోశాలని ప్రకాశింపజేస్తున్న పరబ్రహ్మస్వరూపమే బ్రహ్మ–అణి. ఆ తల్లే బ్రహ్మదేవునికి జననీ.

824. బహురూపా – శ్రీ బహురూపాయై నమః

అనేకరూపాలతో ఉన్న తల్లి. అనంత రూపాలు ధరించింది. అమ్మవారి సర్వరూపాలని నమస్కారం చేసుకోవలసిందే.

బహూని యస్యా రూపాణి స్థిరాణి చ చరాణి చ
దేవమానుషతిర్యంచ బహురూపా తతశ్శివా (దేవీపురాణం)

విశ్వమే అమ్మరూపం. విశ్వంలో బహురూపాలు ఉన్నాయి. ప్రతిరూపం ఆవిడ కల్పన చేసినదే. ఏ ఒక్కరు తన రూపాన్ని తాను మలచుకోలేరు. వారి కర్మానుగుణంగా రూపాలను ఇచ్చినది. ప్రతి రూపంలో భాసిస్తోంది. "అఖిలరూపులు తన రూపమైనవాడు" అంటాడు గజేంద్రుడు.

విశ్వం బహువిధం జ్ఞేయం సా చ సర్వత్ర వర్తతే
తస్మాత్సా బహురూపత్వాత్ బహురూపా శివా మతా

విశ్వం అనేక విధాలుగా ఉన్నది. ఈ విశ్వమందంతటా ఆమె ఉన్నది కనుక అన్ని రూపములు కలది. కనుక పార్వతి బహురూప. అని వామన పురాణవాక్యం. అమ్మవారి 'బహురూపా' నామం గురించి పురాణాలు చాలా చెప్పాయి. **'అరూపా పరభావత్వాత్ బహురూపా క్రియాత్మికా'** (దేవీపురాణం) అన్నారు. ఆవిడ పరబ్రహ్మస్వరూపిణిగా అరూప. కానీ సృష్టి నిర్వహణ క్రియ వచ్చేటప్పటికి 'బహురూపా'.

అనేక రూపాలతో ఈ పనులన్నీ నిర్వహిస్తున్నది. స్థావర జంగమాత్మకమైన సమస్త రూపాలలో వ్యాపించి ఉన్నది బ్రహ్మాణి. సృష్టికర్తకు కూడా మూలమైన పరబ్రహ్మస్వరూపము పంచకోశాలకి చైతన్యమిస్తోందంటే పంచకోశాలు లేనిది ఎవరికి! అందరిలోను ఉన్నాయి. మరి అందరిలో అమ్మ ఉన్నప్పుడు, అన్ని అమ్మరూపాలే కాబట్టి 'బహురూపా'.

దీనిని తెలుసుకున్నవారే పండితులు. వారే అమ్మవారిని సరిగ్గా ఆరాధించగలరు కనుక –

825. బుధార్చితా – శ్రీ బుధార్చితాయై నమః

జ్ఞానులచే ఆరాధింపబడుతున్నది. అంతా అమ్మవారే అయినా మూర్ఖులకి తెలియడం లేదు. తెలుసుకున్నవాడు జ్ఞాని. ఆ జ్ఞానులు(బుధులు) ఆరాధిస్తారు.

'బ్రహ్మాణీ బ్రహ్మజననీ బహురూపా బుధార్చితా'కి విశేషంగా మరొక అర్థం చూద్దాం. ఇది అగ్నిభట్టారక రూపంలో ఉన్న అమ్మవారిని చెప్తున్నారు.

బ్రహ్మ+అణి. అణి అంటే శిఖ (కొన) యందు ఉన్నది. కొన, పుచ్ఛము, అగ్రము, కీలము – ఇవన్నీ 'అణి' శబ్దంతో చెప్పబడేవి. కొనలో ప్రకాశిస్తూ ఉంది. బ్రహ్మ అనగా వేదము. వేదము ద్వారా చెప్పబడిన కర్మలు బ్రహ్మములు. ఆవిడ వేదజననీ కనుక బ్రహ్మజననీ. వేదముల కొన – వేదాంతంలో ఉన్న బ్రహ్మవిద్య ఆమెయే.

'బహురూపా' అగ్నిభట్టారకుని పేరు. అగ్నికి ఎన్నో శిఖలు ఉంటాయి.

సప్తజిహ్వుడు. ఏడు నాల్కలవాడు. ఒకొక్క నాలుకకి ఒకొక్క పేరు. ఒకొక్క దిక్కుకి ఒకటని చెప్పారు. 'హిరణ్య' తూర్పు దిక్కుకి. అలాగే కనక, రక్త, కృష్ణ, సుప్రభ, అతిరిక్త – ఇవన్నీ మిగతా దిక్కులలో ఉన్న అగ్నికి పేర్లు. **'త్రిశిఖా మధ్యమా జిహ్వా బహురూపా సమాహ్వయం'.** మధ్యలో ఉన్న శిఖ పేరు 'బహురూపా'. దీనికి మూడు నాల్కలు. 'త్రిశిఖా' – ప్రధానమైన జ్వాల. ప్రధాన ఆహుతులు పొందేది 'బహురూపా'. దాని శిఖ యందు అనగా అగ్నిజ్వాల యొక్క కొన యందు ప్రకాశిస్తున్న పరమేశ్వరచైతన్యం యజ్ఞరూపచైతన్యం. అది బ్రహ్మీణీ. అక్కడ ప్రయోగించే మంత్రాలు అన్నీ వేదము నుండే వచ్చాయి. వేదాల నుండి స్వీకరించిన మంత్రాలతోనే ఆహుతులు అగ్నిహోత్రంలో వేస్తున్నారు.

'బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం'. అక్కడ వాడబడుతున్న మంత్రం, కర్మ కూడా బ్రహ్మమే. యజ్ఞము నందు చేస్తున్న వేదకర్మ, వేదమంత్రం బ్రహ్మము కనుక అక్కడ అగ్ని యందు ఉపాసింపబడుతున్న అమ్మవారు మనం చేస్తున్న కర్మలకు, వేదాలకు తల్లి. అందుకే 'బ్రహ్మజననీ'. వాటిని స్వీకరిస్తోంది కనుక 'బహురూపా'.

వేదాలలో పరిజ్ఞానం ఉన్నవారు మాత్రమే యజ్ఞరూపిణి అయిన అమ్మవారిని ఉపాసించగలరు కనుక 'బుధార్చితా'. యజ్ఞాగ్ని శిఖ యందు జ్ఞానులచే ఆరాధింపబడేది. మునుపు చెప్పుకున్నది విచారణపూర్వకమైన జ్ఞానార్థం. ఇది యజ్ఞపరమైన అర్థం.

'బహురూపా' దగ్గర అనేక భావాలు తెలుసుకోవచ్చు. **'ఉమైవ బహురూపేణ పత్నీత్వేన వ్యవస్థితా'** – పరమేశ్వరుని పత్ని అయిన ఉమయే బహురూపాలతో ఉన్నదంటూ ఇక్కడ భాస్కరరాయలవారు శ్రీవిద్యనే బహురూపావిద్యగా చూపిస్తున్నారు. శ్రీవిద్యే బ్రహ్మీణీ విద్య. పంచకోశాంతరస్థితా విద్య కనుక 'బ్రహ్మీణీ'. వేదాలకు కూడా మూలమైన బ్రహ్మజననీ. గాయత్రీవిద్యయే శ్రీవిద్య.

ఆ శ్రీవిద్యలో అమ్మవారు బహురూపాలతో ఉన్నారు. కామోపాసితవిద్య, సూర్యోపాసిత విద్య, లోపాముద్రా విద్య, షోడశీవిద్య, మహావిద్య – ఇవన్నీ అమ్మ

బహురూపాలే. ఇంకా అమ్మవారిని లోపల ఆరాధించే మంత్ర విశేషాలు చూస్తే తారావిద్య, శ్యామలావిద్య, వారాహీవిద్య, బగళావిద్య, తురీయవిద్య, భువనేశీవిద్య, పరాశాంభవీ విద్య, మిశ్రాంబావిద్య, అన్నపూర్ణావిద్య, వాగ్వాదినీవిద్య, బాలావిద్య – ఇవన్నీ చూపిస్తున్నారు. 'రసజ్ఞా, రసశేవధిః, పుష్టా, పురాతనా, పూజ్యా' – ఇదంతా అన్నపూర్ణావిద్య.

'కపర్దినీ, కళామాలా, కామధుక్, కామరూపిణీ'. కామదుఘా అనేది అమృతేశ్వరి అయిన అన్నపూర్ణాదేవి పేరు. ఇవన్నీ శ్రీవిద్యా విశేషాలు.

లలితోపాఖ్యానంలో ఉన్న సమస్త పరివారదేవతలు అమ్మవారి రూపాలే. షడామ్నాయాలలో చెప్పబడ్డ మంత్రాలు అన్నీ బహురూపాలు. ఈ బహురూపాలతో ఉన్న ఒకే ఒక్క తల్లి లలితాపరమేశ్వరి. ఆ తల్లినే గురువుల ద్వారా జాగ్రత్తగా అవగాహన చేసుకుని అర్చన చేస్తారు కనుక అమ్మవారు 'బుధార్చితా'. శ్రీవిద్యాపరంగా, యజ్ఞపరంగా, వేదాంతపరంగా అర్థాలను చెప్పుకున్నాం.

తరువాత నామాలు 'ప్రసవిత్రీ, ప్రచండాజ్ఞా, ప్రతిష్ఠా, ప్రకటాకృతిః' – ఇవన్ని 'ప్ర' నామాలు. అమ్మ ఈ ప్రపంచాన్ని ఎలా నడుపుతోందో ఈ ఒక్క వాక్యంలో చెప్పారు.

826. ప్రసవిత్రీ – శ్రీ ప్రసవిత్ర్యై నమః

'ప్రసవిత్రీ' అంటే కన్నతల్లి. సవిత్రీ, ప్రసవిత్రీ, సావిత్రీ– సృష్టి, స్థితులకు హేతువైన తల్లి అని అర్థం. ప్రసవించుట అంటే కనుట. బ్రహ్మదేవుని మొదలుకొని సర్వులకు ఆ తల్లే ప్రసవిత్రీ. బ్రహ్మజననీ అనడంలోనే సృష్టి అంతటికి ఆయనే పెద్దాయన. తాతగారు – పితామహుడు. ఆయన్నే కన్నతల్లి అంటే ఆయనతోపాటు మనందరిని కన్నతల్లి 'ప్రసవిత్రీ'.

బ్రహ్మాద్యాః స్థావరాంతాశ్చ యస్యా ఏవ సముద్గతాః
మహదాది విశేషాంతం జగద్యస్యా సముద్గతం
తామేవ సకలార్థానాం ప్రసవిత్రీం పరాం నుమః (దేవీపురాణం)

'బ్రహ్మ మొదలు స్థావరం వరకు సమస్తం ఏ దేవి నుండి ఉద్భవించినదో, మహత్తత్త్వం మొదలుకొని విశేషతత్త్వములు కల జగమంతా ఏ దేవి నుండి సంభవించిందో – సకలముకు సృష్టికారిణి అయిన ఆ పరదేవతకు నమస్కారం.'

సృష్టిని కని మాత్రం ఊరుకుందా! లోకంలో తల్లులు పిల్లల్ని కంటారు కానీ వారి కర్మలను మాత్రం కనలేరు. పైగా తల్లులు చెప్పిన ఒక్క మాట కూడా పిల్లలు వినరు. ఈ తల్లి అలా కాదు. సృష్టించి అందరిని శాసిస్తోంది. నియమాలు పెట్టింది. ఆ నియమాలు ఎవరూ దాటలేరు. ఆ ఆజ్ఞలు చాలా అనుల్లంఘనీయములు.

827. ప్రచండా – శ్రీ ప్రచండాయై నమః

828. ఆజ్ఞా – శ్రీ ఆజ్ఞాయై నమః

'ప్రచండాజ్ఞా' అంటే భీకరమైన ఆజ్ఞ. ప్రచండ అంటే శాసనమే. **'ప్రచండో దుర్వహే శ్వేతకరవీరే ప్రతాపినీ'** అంటూ ప్రచండ శబ్దానికి నానార్థాలు చెప్పారు. ప్రచండ అంటే దుస్సాధ్యమైనది. ఎవరూ ఎదుర్కొనలేని దాన్ని ప్రచండ అంటారు. వాటిని పాటించి తీరవలసిందే. విశ్వనియమాలే ప్రచండ ఆజ్ఞలు. వాటిని నిర్వర్తించే తల్లి 'ప్రచండాజ్ఞా'. 'ప్రతాపినీ' అని మరొక అర్థం ఉంది. ప్రతాపంతో కూడిన ఆజ్ఞ 'ప్రచండాజ్ఞా'.

రాజుగారి ప్రతాపానికి భయపడితేనే శాసనం జాగ్రత్తగా వెళ్తుంది. శాస్త్రంలో ఒక మాట ఉంది "కోపం లేని రాజు ఏం పాలిస్తాడు? ఎలా నీతిని రక్షిస్తాడు?" అని. కోపం దుర్గుణం అని చెప్తూ, కోపం లేని రాజు ఎలా పాలిస్తాడని చెప్తున్నారు. రామచంద్రమూర్తిని 'జితక్రోధః' అని చెప్తూనే చివరికి 'కస్య భిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే' అని ఒక మాట చెప్పారు. ఎవరికి కోపం వస్తే దేవతలు కూడా గడగడలాడతారో అటువంటి రాముడు అన్నారు. ధర్మప్రతిష్ఠాపన కోసం చూపించే మన్యువు ఈశ్వరస్వరూపమే అని తెలుసుకోవాలి.

అధర్మంపై ఆగ్రహం ఉండితీరాలి. అది లేకపోతే అమ్మవారిని ప్రార్థిస్తే ఇస్తుంది. 'ప్రచండాజ్ఞా'. చండీ పరదేవతనే ఇక్కడ భావన చేసుకోవచ్చు.

దీనిని రెండు నామాలుగా చెప్తారు. ప్రతాపరూపిణి, శాసనశక్తి – 'ప్రచండా'. శాస్త్రరూపంగా 'ఆజ్ఞా'పించునది కనుక వేదాది శాస్త్రరూపిణి – ఆజ్ఞా అని అర్థాలు.

829. ప్రతిష్ఠా – శ్రీ ప్రతిష్ఠాయై నమః

తాను సృష్టించిన జగతికి తానే ఆధారమై ఉన్నది. ప్రతిష్ఠా అంటే ఆధారవస్తువు. ఈ ఆధారమే ఎప్పుడైనా నిలబడుతుంది. ఆధారంపై ఉన్నవి వస్తూ, పోతూ ఉంటాయి. కెరటాలకి సముద్రం ఆధారం. కెరటాలు వస్తూ పోతూ ఉంటాయి. సముద్రం 'ప్రతిష్ఠా'. సర్వజగతికి అధిష్ఠానముగా ఉన్నది.

పరిణామశీలమై, ప్రపంచమంతా కెరటాల వంటిది. కెరటాలు సముద్రమందు ఉన్నట్లే అమ్మవారి యందే ఉన్నది. అదే ప్రతిష్ఠా. కెరటాలను సముద్రమే ప్రకటిస్తున్నది – అదేవిధంగా ఈ సృష్టి అంతా అమ్మ యొక్క ప్రకటనమే.

'స్వే మహిమ్ని స్థితః ప్రతిష్ఠితః' – తన మహిమ యందే తాను ప్రతిష్ఠితమైన బ్రహ్మము.

830. ప్రకటాకృతిః – శ్రీ ప్రకటాకృత్యై నమః

ప్రకటింపబడిన సృష్టియే తన రూపముగా కలది. విశ్వరూపిణి అని చెప్పుకోవచ్చు. శరీరం చైతన్యమునందే ప్రతిష్ఠితమై ఉంది. అదే శరీరానికి ఆధారము.

'ప్రతిష్ఠా సర్వవస్తూనాం ప్రజ్ఞైషా పరమేశ్వరీ' – సర్వవస్తువులలో ప్రజ్ఞారూపంగా, ప్రతిష్ఠగా ఉన్న తల్లి. **'శివరాగానురక్తాత్మా స్థాప్యతే పౌరుషే యయా సా ప్రతిష్ఠా కలా జ్ఞేయా'** – శివుడు ఒకొక్క రూపాన్ని ధరించినపుడు ఆ రూపంతో ఆయన అనుగ్రహించడానికి కావలసిన ప్రతిష్ఠనంతా అమ్మవారు ఇస్తుంది. ఆయనగారి పరువు, ప్రతిష్ఠ అంతా అమ్మవారే. శివుని అనురాగంలో అనురాగం పొందిన తన స్వరూపాన్ని పురుషతత్త్వమందు (స్వామి క్రియ యందు) స్థాపించునది ప్రతిష్ఠా, కళ.

శివుని రూపాలన్నింటి యందు అమ్మవారు ప్రతిష్ఠగా ఉంటారు. వ్యక్తమైన శివుని యందు వ్యక్తస్వరూపంగా ఉన్నది. వ్యక్తం అంటేనే ప్రకటన. ఆ ప్రకటింపబడిన రూపాలన్నీ అమ్మవే కనుక 'ప్రకటాకృతిః'.

కనబడే ప్రతి వస్తువు శివశక్త్యాత్మకం. శక్తి శివుని యందు ప్రతిష్ఠితమైయున్నది కనుక లోకంలో ప్రకటమైన ఆకృతులన్నీ శివశక్త్యాత్మకములే.

'ప్రకటాకృతిః' అంటే శ్రీచక్రమని అర్థం. శ్రీచక్రంలో మొట్టమొదట వచ్చే త్రైలోక్యమోహనచక్రంలో ఉన్న యోగినులకు పేరు ప్రకటయోగినులు. ఆ ప్రకటయోగినుల ఆకృతులు అమ్మవారివే. త్రైలోక్యమోహన చక్రము నుండి బిందువు వరకు ఉన్న ప్రకటయోగినుల నుండి పరాపర రహస్యయోగినుల వరకు సర్వ ఆకృతులుగా ఉన్న తల్లి 'ప్రకటాకృతిః'. ఇన్ని ఆకృతులుగా ప్రకటింపబడడానికి కారణం శివశక్త్యాత్మకంగా అందులో ఉంది కనుక.

ఇంకొక అర్థంలో తన రూపాన్ని తానే ప్రకటిస్తుంది కానీ ఎవరూ ప్రకటించలేరు. జీవుల రూపాలు కర్మకొద్దీ అమ్మవారిచే ప్రకటింపబడతాయి. కానీ ఆమె రూపం తన ఇచ్ఛ కొద్దీ స్వీకరిస్తుంది. ప్రకటమైన ఆకృతి కలది అంటే స్పష్టంగా తన రూపాన్ని దయతో ప్రకటిస్తుంది. స్వేచ్ఛగా తన ఆకృతిని ప్రకటించునది అని దీని భావం.

సూతసంహితలో – **'తమహం ప్రత్యయవ్యాజాత్ సర్వేజానంతి జంతవః, తథాపి శివరూపేణ న విజానంతి మాయయా'** – అందరూ 'నేను' అనే భావనతో తెలుసుకుంటున్నారు కానీ, ఆ 'నేను' యొక్క అసలు స్వరూపం (శివుని) పరమేశ్వరియే అని మాయ వలన తెలుసుకోలేరు. అటువంటి యథార్థమైన 'అహం' స్వరూపం పరమేశ్వరి యొక్క ప్రకటనయే.

తరువాతి నామాలు. 'ప్రాణేశ్వరీ, ప్రాణదాత్రీ, పంచాశత్పీఠరూపిణీ'. ఈ మూడు నామాలకి ఒక అనుబంధం ఉంది.

831. ప్రాణేశ్వరీ – శ్రీ ప్రాణేశ్వర్యై నమః

ఇంద్రియములకు అధిష్ఠానమైనది.

'ప్రాణస్య ప్రాణః' - ప్రాణాలకు కూడా ప్రాణమైనది పరమేశ్వరి. పంచప్రాణముల వృత్తులకు అధీశ్వరి. మరొక అర్థంలో - అణః అంటే శబ్దం. ప్రకృష్ట శబ్దము - ప్రాణం - అది వేదము. ఆ వేదములకు మూలమైన ఈశ్వరి ప్రాణేశ్వరి. **'సర్వే వేదా యత్పదమామనంతి'** - అని శ్రుతి.

832. ప్రాణదాత్రీ - శ్రీ ప్రాణదాత్ర్యై నమః

లోకంలో అందరికి ప్రాణాలని ఇస్తున్నది. సర్వజగతిని జీవింపజేయునది.

ప్రకటింపబడిన ఆకృతులన్నీ అమ్మరూపాలే. విశ్వమంతా అమ్మరూపాలే. ఆ రూపాల యందు ఆవిడే 'ప్రాణేశ్వరి'గా ఉంది. ప్రాణాలను నియమించడమే కాకుండా ప్రాణాలను ఇస్తూ ఉన్నది. బ్రతికించే తల్లి. ఈ తల్లినే బతుకమ్మ అంటాం. బ్రతికే అందరిది బతుకమ్మ. బతుకమ్మే 'ప్రాణేశ్వరీ', 'ప్రాణదాత్రీ'.

వేదాలలో చెప్పిన మంత్రాన్ని భారతీయ సామాన్యులు 'బతుకమ్మ' అని పాడుకుంటున్నారంటే వేదవేదాంతాలలో ఉన్న మతం సామాన్యభాషలో సామాన్యులకు చేరిపోయింది. సామాన్యులు చేసే బతుకమ్మ జాతర మొదలుకుని, వేదంలో చేసే మహాయాగాల వరకు వ్యాపించి ఉన్న అమ్మకి నమస్కారం. కర్మానుసారంగా జీవులు ఆయుర్దాయాన్ని ప్రసాదించునదే ప్రాణదాత్రి.

833. పంచాశత్పీఠరూపిణీ - శ్రీ పంచాశత్పీఠరూపిణ్యై నమః

ఏభై పీఠాల రూపముగా ఉన్నది

కామరూపం వారణాసీ నేపాలం పౌండ్రవర్ధనం
పురస్థిరం కాన్యకుబ్జం పూర్ణశైలం తథాఽర్బుదం
ఆమ్రాతకేశ్వరైకామ్రం త్రిస్రోతః కామకోటకం
కైలాసం భృగునగరం కేదారం చంద్రపుష్కరం
శ్రీపీఠమోంకారపీఠం జాలంధ్రం మాలవం తదా
కులాంతకం దేవికోటం గోకర్ణం మారుతేశ్వరం

అట్టహాసం చ విరజం రాజగేహం మహాపథం
కోలాపుర మేలాపురం కాలేశశ్చ జయంతికా
ఉజ్జయిన్యపి చిత్రాచ క్షీరకం హస్తినాపురం
ఉడ్డీశశ్చ ప్రయాగాఖ్యం షష్ఠీ మాయాపురీ తథా
జలేశో మలయః శైలో మేరుర్గిరివరస్తథా
మహేంద్రో వామనశ్చైవ హిరణ్యపురమేవచ
మహాలక్ష్మీ పురోద్యాణం ఛాయాఛత్రమతఃపరం

ఏతే పీఠా సముద్దిష్టాః మాతృకారూపకాః స్థితాః (తంత్రసార సంగ్రహం - యోగినీహృదయం గ్రంథాల ఆధారంగా)

కామరూప క్షేత్రం, వారణాసి, నేపాల్, ప్రౌండవర్ధనం, పురస్థిరం, కన్యాకుబ్జం, పూర్ణశైలము, అర్బుదక్షేత్రం, ఆమ్రతక, ఈశ్వరం, ఏకామ్రక్షేత్రం, త్రిస్రోతక్షేత్రం, కామకోటక క్షేత్రం, కైలాసక్షేత్రం, భృగునగర క్షేత్రం, కేదారం, చంద్రపుష్కరం, శ్రీపీఠము, ఓంకార పీఠము, జాలంధరము, మాలవము, కులాంతకము, దేవికోటము, గోకర్ణము, మారుతీశ్వరము, అట్టహాసము, విరజము, రాజగేహము, మహాపథము, కోలాపురము, ఏలాపురము, కాళేశ్వరము, జయంతిక, ఉజ్జయినీ, చిత్ర, క్షీరకము, హస్తినాపురము, ఉడ్డీశ క్షేత్రం, ప్రయాగ, షష్ఠీశ క్షేత్రం, మాయాపురి, జలేశ, మలయ శైల, మేరు, గిరివర, మహేంద్ర, వామన, హిరణ్యపుర, మహాలక్ష్మీపుర, ఛాయాచ్ఛత్రం - ఇలా 50 క్షేత్రాలు. ఈ 50 పీఠాల్లో ఉన్న తల్లి. **'ఏతే పీఠాః సముద్దిష్టాః మాతృకా రూపకాః స్థితా'** - ఇవన్నీ మాతృకాపీఠాలని చెప్పబడ్డాయి. వీటికి కొన్ని ఇప్పుడు ఆధునిక నామాలు కూడా దొరుకుతున్నాయి.

అమ్మవారికి 64 కోట్ల పీఠాలు ఉన్నాయి. అందులో ప్రసిద్ధంగా మనం చెప్పుకుంటున్నవి 108 ఉన్నాయి. వీటిలో మళ్ళీ 64. ఈ 64లో మళ్ళీ 18 క్షేత్రాలు చెప్తారు.

50 శక్తిపీఠాలంటే 50 అక్షరాలే. మాతృకావర్ణాలే శక్తిపీఠాలు. అ కారం నుంచి హ కారం వరకు ళ - క్ష అని రెండు కలిశాయి. ఈ ళ క్ష కలిస్తే హల్లులు

35 అయ్యాయి. అ నుంచి అః వరకు ఉన్న స్వరాలు 16 అయ్యాయి. మరి పంచాశత్ అని 51 ఎలా అయ్యాయంటే 'రూపా' అనేది **క్ష అనే అక్షరం** కలిసినపుడు ఏర్పడుతున్నది. ఆ రూప శబ్దం 'ఒకటి'ని తెలియజేస్తోంది కనుక 'పంచాశత్పీఠరూపిణీ' అంటే 51 రూపాలతో ఉన్న తల్లి.

51 అక్షరాలే అమ్మరూపములు. 51 పీఠాల్లో అమ్మవారు ఉన్నారని తెలుసుకోవడానికి శృంగగిరిలో ఆ శారదాంబకి నిత్యపూజ చేసేటప్పుడు **'పంచాశల్లిపిభిర్విభక్తముఖదోర్యన్మధ్యవక్షస్థలం"** అని ధ్యానం చేస్తారు. ఇదే భావన తీసుకొని **'పంచాశద్వర్ణభేదైర్విహిత వదన దోః పాదయుక్ కుక్షివక్షః'** అని మాతృకావర్ణన చేసుకుంటూ భావించడం ఉంది. ఇదంతా 50 అక్షరముల గురించి చెప్తున్నది.

'ప్రాణేశ్వరీ, ప్రాణదాత్రీ, పంచాశత్పీఠరూపిణీ'కి సంబంధం చూస్తే, మనలో కుండలినీరూపంలో సంచరిస్తున్న ఆ 'ప్రాణేశ్వరీ' మనకు ప్రాణాలను ఇస్తోంది. మూలధారం నుంచి ఆజ్ఞాచక్రం వరకు వెళ్ళేటప్పుడు మూలాధారంలో 4 అక్షరాలు, స్వాధిష్ఠానంలో 6 అక్షరాలు, మణిపూరంలో 10 అక్షరాలు, అనాహతంలో 12 అక్షరాలు, విశుద్ధంలో 16 అక్షరాలు, ఆజ్ఞాచక్రం దగ్గర 2 అక్షరాలుగా సంచరిస్తున్నది. 'అమృతాదిమహాశక్తి సంవృతా' నామం దగ్గర ఇదంతా వివరించుకున్నాం. మనలో ప్రాణశక్తి వికసనం బట్టి అక్షరాలు పలుకుతుంటాయి. ప్రాణాలకు, అక్షరాలకు ఉన్న అనుబంధం ఇది. 'ప్రాణేశ్వరీ', 'ప్రాణదాత్రీ' అయిన తల్లే మన శరీరంలో ఈ అక్షరరూపంతో ఉంది.

ఒకొక్క అక్షరం ఒకొక్క మంత్రం - శక్తి పీఠం.

మూలాధారం దగ్గర 4 శక్తిపీఠాలు, స్వాధిష్ఠానం దగ్గర 6 శక్తిపీఠాలు, మణిపూరం దగ్గర 10 శక్తిపీఠాలు, అనాహతం దగ్గర 12 శక్తిపీఠాలు, విశుద్ధం దగ్గర 16 శక్తిపీఠాలు, ఆజ్ఞాచక్రం దగ్గర 2 శక్తిపీఠాలు - అన్నీ కలిపి సహస్రారం దగ్గర పంచాశత్ శక్తిపీఠాలు. అన్ని శక్తిపీఠాలు మనలోనే ఉన్నాయి. మనలోపల తిరుగుతున్న 'ప్రాణేశ్వరీ', 'ప్రాణదాత్రీ' ఈ శక్తి పీఠాలుగా లేకపోతే ఈ శరీరపీఠమే లేదు.

ప్రతిష్ఠ చేసుకుని కూర్చున్నచోటుకే పీఠమని పేరు. ఆవిడ 'ప్రతిష్ఠా', 'ప్రకటాకృతిః'. పీఠం వేసుకొని మొత్తం శరీరాన్ని నడిపిస్తోంది. మన శరీరమే పంచాశత్పీఠ రూపం. ఈ పీఠాలన్నీ అమ్మవి. ఈ శరీరంలో నేను అనేది ఇంకేం లేదు. అన్ని అమ్మవారే. ఆమె ప్రకటించిన ఆకృతులే. ఆ పరమేశ్వరి తప్ప మరేదీ లేదు. అదే బ్రహ్మజ్ఞానం.

834. విశృంఖలా – శ్రీ విశృంఖలాయై నమః

సంకెళ్ళు లేనిది. ఇదంతా యోగస్థితిని చెప్తున్నది. విధి నిషేధాలు, ప్రతిబంధకాలు, అడ్డంకులు పరిమితులు లేనిది.

ఒక్క సంతానానికి సంతానం కలిగితేనే శృంఖలాలు ఉంటాయే మరి 'ప్రసవిత్రీ' అయినపుడు అమ్మవారికి ఎన్ని శృంఖలాలు ఉండాలి! ఇంత జగత్తుని ప్రసవించింది కానీ, ఏ శృంఖలాలు లేవు. ఇంత ప్రపంచం నడుపుతున్నా ఏ వికారాలకి అంటకుండా ఉంది కనుక 'విశృంఖలా'. కర్మ అనే శృంఖలాలు లేని పరమేశ్వరి 'విశృంఖలా'.

యోగీశ్వరులు, యతులు విశృంఖలులు. వారు శరీరంతో ఉంటారే కానీ ప్రాపంచిక బంధాలనే శృంఖలాలు తెంచుకున్నారు. యతీశ్వరులందరూ అమ్మరూపాలే.

835. వివిక్తస్థా – శ్రీ వివిక్తస్థాయై నమః

ఏకాంతముగా ఉండునది 'విశృంఖలా', 'వివిక్తస్థా' నామాలు యోగస్థితిని, జ్ఞానస్థితిని తెలియజేస్తున్నాయి. అమ్మవారు ఇంత ప్రపంచాన్ని నడుపుతూ ప్రపంచమంతా వ్యాపించి ఉన్నారు కాని, ఒంటరిగా దేనికి అంటకుండా ఉంటారు. చాలామంది ఒకొక్కప్పుడు ఒంటరిగా ఉండాలని అనిపిస్తోందని అనుకుంటారు. ఒంటరిగా కూర్చున్నా వారి తల నిండా సంసారమే ఉంటుంది.

ఆత్మతత్త్వం తప్ప ఇంకేం లేకుండా ఉండడమే వివిక్త. **'వివిక్త సేవీ లఘ్వాశీ'** అని గీతలో కృష్ణపరమాత్మ వచనం. సాధకుడైనవాడు వివిక్తానికే వెళ్ళాలి అన్నాడు. రామకృష్ణపరమహంస ఈ విషయాన్నే చెప్తూ, "సాధకుడైనవాడు తన జీవితకాలంలో

ప్రణాళిక వేసుకుని, తనకి తాను ఏకాంతంగా సాధన చేసుకోవడానికి కొంతకాలం వినియోగించుకోవాలి" అంటారు.

అమ్మవారు ఎప్పుడూ వివిక్తంగా ఉంటారు. ప్రపంచ లంపటం పెట్టుకుంది... ఎప్పుడూ పతితో ఉంటుంది... మరి 'వివిక్తస్థా'గా ఎలా ఉంటుంది? ప్రపంచంలో దేవి తప్ప అన్యవస్తువు లేదని తెలుసుకోవాలి. ఆవిడ 'ఏకా'. ఉన్నది ఒక్కరే అయినప్పుడు ఇంక రెండవది ఎక్కడుంది! అమ్మవారు ఎప్పుడూ 'ఏకాకినీ, భూమరూపా, నిర్ద్వైతా, ద్వైతవర్జితా' కనుక 'వివిక్తస్థా'. వివిక్త శబ్దానికి అమరకోశం చెప్తున్న అర్థం **'వివిక్తౌ పూజ విజనౌ'** – వివిక్త అంటే పవిత్రమైన చోటు. లోకవ్యవహారాలు లేని చోటు.

యోగశాస్త్రానికి సంబంధించిన హారీతస్మృతి అనే ధర్మశాస్త్రంలో చెప్తూ– **'సర్వత్ర మేధ్యా వసుధా యత్ర లోకో న దృశ్యతే'** – 'ఎక్కడ లోకం ఉండదో ఆ చోటే పవిత్రము. మిగిలినదంతా అపవిత్రమే' అన్నారు. ఎక్కువ సంగము ఎక్కడ ఉంటుందో అదే అపవిత్రం. సంగము లేనిచోటే పవిత్రము. అటువంటి చోట ఉన్న పవిత్ర తత్త్వమే వివిక్తస్థా.

ప్రపంచ సంగము లేని యోగుల హృదయాలలో ప్రకాశించునది. ప్రపంచమంతా వ్యాపించి ఉన్నా ఏ సంగమూ లేని శుద్ధతత్త్వస్వరూపిణి.

836. వీరమాతా – శ్రీ వీరమాత్రే నమః

వీరుల చేత ఆరాధింపబడే తల్లి. వీరులకు తల్లి. అమ్మ ఎలాగైతే పిల్లలని గమనించుకుంటుందో అలా తన భక్తులైన వీరులను అమ్మగా గమనించుకుంటుంది.

అమ్మ ఉందని ఎవరు నిబ్బరంగా ఉన్నారో వారు వీరులు. ఉందన్నవారికి ఉంటుంది. అమ్మ ఉందని వారు ధైర్యంగా ఉన్నారు గనుక వారికి అమ్మ ఉంది. వీరులు అనగా ఉపాసకశ్రేష్ఠులు. **'వీరాః ఉపాసక దురంధరాః'**. అంతర్యాగక్రమంలో సిద్ధి పొందినవారు వీరులు.

వీరులంటే ఎవరో చెప్తూ పురాణంలో ఒక మాట చెప్పారు. అమ్మవారికి రెల్లుపొదలో ఆరు ముఖములవాడు పుట్టాడని వార్త వచ్చింది. వెంటనే అమ్మవారిని

తీసుకుని శివుడు అక్కడికి వెళ్ళాడు. అమ్మవారు, "ఎవరో ఈ వీరుడు ఎంత బాగున్నాడో! వీడు నాకు పుత్రుడైతే బాగుండేది" అని అనుకుంటుండగానే, "నీ పుత్రుడే ఈ వీరుడు" అన్నాడు శివుడు. **"స ఏష వీరకో దేవి సదా మే హృదయప్రియః"** . "ఆ వీరుడు వీడే. వీడు నా హృదయం వంటివాడు. నాకు ప్రియమైనవాడు. వీడు నానాశ్చర్యపరాయణుడు" అని చెప్తూ– **"త్వయా పుత్రః కృతార్థస్స్యాత్** – నీకు పుత్రుడవడం వల్ల ఇంకా కృతకృత్యుడయ్యాడు" అని శివుడు అన్నాడు.

నిజానికి శరవణభవుడు కదా ఆయన. పరమేశ్వరుని తేజస్సు అక్కడికి వెళ్ళినపుడు పంచభూతాలు భరించలేకపోయాయి. ఈశ్వరతేజస్సుని ప్రకృతి పట్టుకోగలదా! అప్పుడు ఆ ప్రకృతికి కూడా మూలమైన శక్తి అమ్మవారే శరవణంగా మారింది. అక్కడే అతడు రూపు దిద్దుకున్నాడు. "నువ్వే అక్కడ శరవణంగా మారావు. ఇప్పుడు మరోరూపంతో ఉంటే వీడు ఎవరూ అంటున్నావా! నీ పుత్రుడే ఈ వీరుడు" అన్నాడు శివుడు. "కుమారా!" అని పిలవగానే రెండు చేతులు చాచుకొని వచ్చాడు. వీరమాతా అంటే స్కందమాత.

"స ఏష వీరకో దేవి సదా మే హృదయప్రియః నానాశ్చర్యగురుద్వారి గణేశ్వర గణార్చితః" అన్నారు. కైలాసద్వారం వద్ద ఉన్న గణేశ్వర గణాలచే అర్చింపబడువాడు. గణపతి, సుబ్రహ్మణ్యుడే కాకుండా వీరభద్రుడు కూడా వీరుడే. ఈయన కూడా శివపుత్రుడే. శివుడు తండ్రి అయినపుడు అమ్మవారు తల్లే. 'వీరమాతా' అంటే వీరభద్ర, గణేశ, స్కందాదులకు జనని.

837. వియత్ప్రసూః – శ్రీ వియత్ప్రసువే నమః

ఈ తల్లి ప్రసవిత్రి. ఈ జగత్తుని ఎలా సృష్టించినదంటే మొట్టమొదట ఆకాశాన్ని సృజించింది. ఆకాశం నుండి మిగిలినవన్నీ సృజించింది. 'వియదాదిజగత్ప్రసూః' నామాన్నే 'వియత్ప్రసూః' అని చెప్పడంలో **'ఆత్మనః ఆకాశః సంభూతః'** అని ఆ మంత్రాన్నే చెప్తున్నారు. పరమాత్మ నుండి ఆకాశం ఉద్భవించింది. అందులోంచి మిగిలినవన్ని వచ్చాయి కనుక ఈవిడ 'వియత్ప్రసూః'.

వియత్ చక్రం అంటే హృదయచక్రం. హృదయంలో వ్యక్తమయ్యే తల్లి అని అర్థం. వియచ్చక్రం అనగా శ్రీచక్రం. శ్రీచక్రం నుండి కలిగే తల్లి, శ్రీచక్రాన్ని సైతం కలిగించిన తల్లి.

838. ముకుందా – శ్రీ ముకుందాయై నమః

ముకుందా అంటే కృష్ణుడు. విష్ణువునకు కూడా ఈ పేరు సరిపోతుంది. **'ముక్తిం దదాతి ఇతి ముకుందః'.** కానీ ముకుందా అంటే మనకి కృష్ణుడే గుర్తుకు వస్తాడు. అందరికీ ముక్తిని ఇచ్చిన అవతారం ముకుందా.

'కదాచిదాద్యా లలితా పుంరూపా కృష్ణవిగ్రహా' అని గోపాలమంత్రాలను చెప్తూ 'తంత్రరాజ'మనే గ్రంథం వివరించింది. ఈ లలితాదేవికే అందరిని సమ్మోహింపజేయగలిగే శక్తి ఉన్నది. లలితాదేవి కృష్ణరూపం ధరించి వేణునాదంతో సమ్మోహింపజేసింది. లలిత యొక్క శక్తులందరూ వచ్చి ఆ తల్లి చుట్టూ చేరిపోయారు. ఈవిడ పుంరూపం ధరించిన తల్లి. అందుకే "కృష్ణమ్మా!" అని కొందరు పిలుస్తారు. లలితాదేవి కృష్ణరూపం ధరించింది. గోపకాంతలు అందరూ ఆవిడ యొక్క శక్తులే. భాగవతంలో గోపికామధ్యమంలో ఉన్న కృష్ణపరమాత్మ అష్టావరణల మధ్యంలో బిందువుయందున్న అమ్మవారినే గుర్తు చేస్తాడు.

'ముకుందా' అంటే కృష్ణస్వరూపిణి అని ఒక అర్థం. ముక్తినిచ్చే తల్లి అని మరొక అర్థం. ముక్తిని ఇస్తుందంటే ముక్తి వేరు, అమ్మవారు వేరా!

839. ముక్తినిలయా – శ్రీ ముక్తినిలయాయై నమః

ముక్తిస్వరూపంగా ఉన్నది. మోక్షం పొందేవారు ఎక్కడికి వెళ్తున్నారో అదే అమ్మరూపం. మోక్షం అంటేనే అమ్మపదం. ముక్తికి స్థానమైన తల్లి. సాలోక్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం – అనబడే ముక్తులకు నిలయమైనది.

840. మూలవిగ్రహరూపిణీ - శ్రీ మూలవిగ్రహరూపిణ్యై నమః

ముక్తిని ప్రసాదించడం కోసమే అమ్మవారు మూలవిగ్రహరూపాన్ని ధరించింది. ఆలయాల్లో మూలవిరాట్టులు ఉంటారు. మిగిలినవన్నీ పరివారదేవతలు, ఉత్సవమూర్తులు. ప్రధానమైనది మాత్రం మూలవిరాట్. ఆ మూలవిరాట్టు శక్తులనే పరివారదేవతలలోను, ఉత్సవమూర్తులలోను ఆవాహన చేసి ఆరాధన చేస్తారు.

'ప్రకటాకృతిః' దగ్గర నుండి 'వివిక్తస్థా' వరకు శ్రీవిద్యాస్వరూపిణిగా పరమేశ్వరి ఉందని చెప్పుకున్నాం. బిందురూపంలో 'వివక్తస్థా' గా ఉంది. ఆవిడ నుంచి మహావీరులైన పరివారదేవతలందరూ వచ్చారు. కనుక 'వీరమాతా'. శ్రీచక్రం వియత్ చక్రం కనుక 'వియత్ప్రసూః'. అక్కడ ఉన్న శ్రీచక్రోపాసన మోక్షాన్ని ఇస్తుంది కనుక 'ముకుందా' 'ముక్తినిలయా' అని చెప్తున్నారు. అక్కడ ఉన్న స్వరూపాలన్నీ అమ్మరూపాలే. ఇన్ని రూపాలకు మూలమై బిందువు నందు ఉంది కనుక 'మూలవిగ్రహరూపిణీ'. శ్రీవిద్యలో ఉపాసింపబడే లలితాదేవియే మూలవిగ్రహరూపిణీ. బాలా, శ్యామలాదేవి, వారాహీదేవి మొదలైన వారందరూ ఆమె అంగదేవతలు.

మరొక అర్థం- మోక్షమివ్వడానికి అమ్మవారు మనకి రెండు రూపాలతో దొరికారు. ఒకటి మూలం. రెండు విగ్రహం. మూలం అంటే మూలమంత్రం. విగ్రహం అంటే అమ్మరూపం, శ్రీచక్రం.

విగ్రహం శబ్దానికి విశేషించి గ్రహించునది అని అర్థం. శక్తిని విగ్రహంలో, తరువాత యంత్రంలో గ్రహిస్తాం. మనం ఆలయాల్లో విగ్రహాల్ని చూస్తున్నాం. దేవత యొక్క మంత్రశక్తిని, దేవతాశక్తిని ఆ స్వరూపం గ్రహించి ఉంది కనుక విగ్రహం. లడ్డూ తీపిని గ్రహించినట్లుగా, జ్యోతి కాంతిని గ్రహించినట్లుగా విగ్రహం భగవచ్ఛక్తిని గ్రహించింది. అమ్మవారి విగ్రహం ఏదంటే-

అరుణాం కరుణాతరంగితాక్షీం

ధృత పాశాంకుశపుష్పబాణ చాపాం

అనేది విగ్రహం. ఆ విగ్రహాన్ని ఉపాసించడానికి మనకి పనికి వచ్చేది మంత్రం. అది మూలం. మూలవిగ్రహరూపిణీ అంటే మంత్రరూపిణి, విగ్రహరూపిణి. ఈ

రెండు కలిపి చెప్పడానికి కారణం మంత్రమే విగ్రహం కనుక.

'శ్రీమద్వాగ్భవకూటైకస్వరూపముఖపంకజా' 'కంఠాధఃకటిపర్యంతమధ్యకూట స్వరూపిణీ' 'శక్తికూటైకతాపన్న కట్యధోభాగధారిణీ' నామాలలో చెప్పిన మూడు కూటములే అమ్మ విగ్రహం. అదే మూలవిగ్రహరూపిణీ.

అంతే కాక మూలమంత్రమే తన విగ్రహంగా కలిగినది కనుక మూలవిగ్రహరూపిణీ. ఆ మూలమంత్రాన్ని జపించాలి. ఆ విగ్రహాన్ని ధ్యానించాలి, అర్చించాలి. ఆ రెండు మనం చెయ్యగలిగితే 'ముకుందా'. మోక్షాన్ని ఇస్తుంది. ఆ మోక్షస్వరూపంగా ఉన్న తల్లి ఆవిడే. 'ముక్తినిలయా'

841. భావజ్ఞా – శ్రీ భావజ్ఞాయై నమః

భావాలు తెలిసిన తల్లి. భావమనగా ఉనికి, స్వభావం, చేష్ట, పుట్టుక, సంసారవికారములు... అని అర్థాలు ఉన్నాయి. ఇవన్నీ తెలిసినది. భవునకు – అనగా శివునకు చెందినవి – భావములు... శివజ్ఞానరూపిణి. భావానికి భక్తి – అనే అర్థాన్ని కూడా చెప్పవచ్చు. భక్తికి తెలియునది – అని అర్థం. **'భాం కాంతిః తాం వాంతి గచ్ఛంతి సూర్యాదయేఽపి భావాః** – కాంతినిచ్చే సూర్యాదులను గ్రహించునది.

సంసారచక్రం త్రిప్పుతూ ఉంటుంది. ఈ సంసారచక్రం రోగమని తెలుసుకుని ఎవరు సాధన చేస్తారో వారిని బయటకు తీస్తుంది. భవము అంటే సంసారము. సంసారం యొక్క స్వరూపానికి భావము అని పేరు. ఈ సంసారంలో జరిగే దశలకు భావములు అని పేరు. ఈ సంసారపు దశలన్నీ తెలిసిన పరమేశ్వరి భావజ్ఞ.

సృష్టిలో ప్రతి వస్తువుకి ఆరు భావాలు ఉంటాయి. 'జాయతే, అస్తి, వర్ధతే, విపరిణమతే, పరిక్షీయతే, నశ్యతే' – వీటిని షడ్భావ వికారాలు అంటారు. మొత్తం ఈ ఆరు భావాలు జగదంబకు తెలుసు. కానీ అమ్మవారికి మాత్రం ఈ ఆరు భావాలు లేవు.

842. భవరోగఘ్నీ - శ్రీ భవరోగఘ్న్యై నమః

భవరోగాలను నశింపజేయునది

చావడం-పుట్టడం, పుట్టడం-చావడం. ఇదే భవరోగం. దీనిని కూడా పోగొడుతుంది. సంసారంలో వచ్చే రోగాలనే కాకుండా సంసారమనే రోగాన్ని సైతం తొలగిస్తుంది. పక్వతకలిగిన జీవులకి జనన మరణ రూప సంసారాన్ని నివర్తింపజేయునది మోక్షదాత్రి.

వ్యాధీనాం భేషజం యద్వత్ ప్రతిపక్ష స్వభావతః

తద్వత్ సంసారరోగాణాం ప్రతిపక్షశ్శివౌషధః (శైవాగమం)

- వ్యాధులకు మందువలె సంసారరోగాలకు విరుగుడు పరమేశ్వరియే.

843. భవచక్రప్రవర్తినీ - శ్రీ భవచక్రప్రవర్తిన్యై నమః

జననమరణాదుల రూపమైన సంసార చక్రాన్ని ప్రవర్తింపజేయునది.

ఏషా సర్వాణి భూతాని పంచభిర్వ్యాప్య మూర్తిభిః

జన్మవృద్ధిక్షయైర్నిత్యం సంసారయతి చక్రవత్ (మనుస్మృతి)

"పంచభూతములతో వ్యాపించి సర్వప్రాణులలో నుండి వారి జనన, వృద్ధి క్షయములను, సంసారాన్ని కలిగించి, దానిని చక్రం త్రిప్పినట్లు త్రిప్పుచున్నది" - కనుక భవచక్రప్రవర్తినీ.

జీవులకు కర్మలకు తగిన భవములను ఇచ్చునది. ఆ భవములలోని భావాలన్నీ తెలిసిన సర్వజ్ఞురాలు (భావజ్ఞ), యోగ్యులైన భక్తులకు, జ్ఞానులకు ఆ భవరూప అవిద్యారోగాన్ని పోగొట్టునది (భవరోగఘ్నీ).

'చక్రం హి మన ఏవ' (విష్ణుపురాణం) చక్రమనగా మనస్సు, భవుని (శివుని) మనస్సును లోకము ఎడల ప్రవర్తింపజేయునది. ఒక అర్థంలో - భవచక్రమనగా శివస్థానమైన అనాహత చక్రమున ప్రవర్తించునది.

మరొక భావం - శ్రీ చక్రంలో భూపుర, షోడశదళ, అష్టదళ, బిందువులు - అనే నాలుగు చక్రాలు భవ(శివ) చక్రములు - వాటితో మన్వస్ర, దశారయుగ్మ,

అష్టకోణ, త్రికోణ - అనే అయిదు శక్తిచక్రములుగా కలిసి ప్రవర్తింపజేసే శ్రీచక్రస్వరూపిణి.

844. ఛందస్సారా - శ్రీ ఛందస్సారాయై నమః

వేదాల సారమే శ్రీవిద్య. శ్రీవిద్య స్వరూపాన్ని మూడు నామాల్లో చూపిస్తున్నారు. అవి- ఛందస్సారా, శాస్త్రసారా, మంత్రసారా. ఛందస్సులు అనగా వేదములు.

సారము అంటే ప్రధానమైనది. వేదముల యొక్క తాత్పర్యము. **'సర్వే వేదాః యత్పదమామనంతి'** అని ఉపనిషత్ చెప్తున్నది. వేదాలన్నీ ఏ పరమపదాన్ని చెప్తున్నాయో ఆ పరమపదమే అమ్మవారు.

వేదాలకి సారం గాయత్రీ అని పెద్దలు చెప్తారు. ఆ గాయత్రి యొక్క మరో రూపమే శ్రీవిద్య. పంచదశాక్షరీ అని చెప్పబడుతున్న విద్య సాక్షాత్తు గాయత్రీ విద్యయే. అందుకు అది సారవిద్య. అదే విధంగా పరతత్త్వమైన అమ్మవారు వేదాల హృదయం.

వేదాల యందు ఇతర శాస్త్రాలు కనిపించవచ్చుగాక. కానీ వేదాల తాత్పర్యం మాత్రం పరతత్త్వ ప్రతిపాదనమే.

వేదాలకి ఛందస్సు అని మరొక పేరు. ప్రతి మంత్రం ఛందోబద్ధంగా ఉంటుంది కనుక ఛందోవిద్య. కనుకనే 'గాయత్రీ ఛందసాం మాతా' - ఛందస్సులకు తల్లి అయిన గాయత్రీ సారస్వరూపిణి. 'సారం' అంటే శ్రేష్ఠమని అర్థం కూడా... ఛందస్సులలో శ్రేష్ఠమైన గాయత్రీ స్వరూపమే లలితావిద్య.

845. శాస్త్రసారా - శ్రీ శాస్త్రసారాయై నమః

శాస్త్రమనగా ఒకటే శాస్త్రం. అది వేదం. కృష్ణపరమాత్మ గీతలో అనేకమార్లు శాస్త్రం గురించి ప్రతిపాదన చేశారు. **'తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ'.** ఆయన దృష్టిలో వేదమే శాస్త్రం. మిగిలిన శాస్త్రాలు కూడా ఉన్నాయి. వేదాల్లో ఏం చెప్పారో వాటిని మనకి అర్థమయ్యేటట్లు చెప్పడానికి వచ్చాయి కనుక వాటికి కూడా శాస్త్రములు అని పేర్లు. శ్రుతి, స్మృతి, పురాణము, ధర్మశాస్త్రము, ఆగమశాస్త్రం

అని చెప్పబడుతున్నాయి. ఇవన్నీ వేదాన్ని ఆధారంగా చేసుకుని వచ్చాయి గనుక అవి శాస్త్రములు. 'శాస్త్రసారా' అంటే ధర్మశాస్త్రముల, పురాణముల, సర్వాగమముల యొక్క సారం కూడా అమ్మవారే. 'శాస్త్రయోనిత్వాత్' అని బ్రహ్మసూత్రం. వేదాది శాస్త్రములకు కారణమైన పరమాత్మ. ఆ తత్త్వమే లలిత.

ప్రవృత్తిర్వా నివృత్తిర్వా నిత్యేన కృతకేన వా
పుంసాం యేనోపదిశ్యేత తచ్ఛాస్త్రమభిధీయతే

ప్రవృత్తి విషయములు గానీ, నివృత్తి విషయములు గానీ, నిత్యకృత్య వ్యవహారములు గానీ మానవులకు బోధించేది శాస్త్రం. అటువంటి శాస్త్రములకు లక్ష్యమైనది (తాత్పర్యమైనది) ఆ శాస్త్రములకు కూడా సారమైన శ్రీవిద్యయే శాస్త్రసారా.

846. మంత్రసారా – శ్రీ మంత్రసారాయై నమః

మంత్రముల యొక్క సారము అమ్మవారు. జపించదగినవన్నీ మంత్రములే. జపం మానసిక క్రియా? వాచిక క్రియా? ఇది పెద్ద ప్రశ్న. అక్షరములు ఉన్నాయి కనుక వాచిక క్రియ అనాలా, అంటే బైటకి ఉచ్చరించరాదని మంత్రానికి ఒక నియమం పెట్టారు. అంటే అది మానసిక క్రియ అని చెప్పడం. మొత్తానికి అది వాచిక, మానసిక క్రియల రెండిటి యొక్క స్వరూపము.

వాక్కు నుండి మనస్సులోకి, మనస్సు నుండి పరమార్థంలోకి తీసుకువెళ్ళడానికి పనికి వచ్చేది మంత్రం. **'మననాత్ త్రాయతే ఇతి మంత్రః'**– మననం చేసేవారిని రక్షిస్తోంది. మననం అనే క్రియ మనస్సుతోనే చేయాలి. అందుకే జపం చేసేటప్పుడు అక్షరాలని ఉపాంశువుగా ఉచ్చరించినప్పుడు కూడా మనసు పని చేస్తుంది.

ఏ మంత్రం పలికినా అక్షరాలతోనే పలుకుతాం. అక్షరములన్నీ అమ్మరూపములే అని ముందునుండి చెప్పుకుంటున్నాం. అక్షర సారం అమ్మవారు. అక్షరస్వరూపాలైన వేదశాస్త్ర, మంత్రశాస్త్ర రూపాలన్నీ అమ్మవారి రూపాలే. వేదం చెప్పినా, శాస్త్రం చెప్పినా, మంత్రం చెప్పినా ఇంద్రియాతీత పరమ సత్యాన్ని చెప్పడానికే వచ్చాయి. ఆ పరమ సత్యమే తల్లి అని చెప్పడం కోసం ఈ మూడు నామములు చూపించారు.

వేదముల యొక్క సారము, సమస్త శాస్త్రముల యొక్క సారము, 64 శాక్తేయ తంత్రముల సారమే శ్రీవిద్య. అన్ని మంత్రాలు జపించిన ఫలం అమ్మవారి మంత్రం జపిస్తే లభిస్తుంది. అన్ని శాస్త్రాల మంత్రాల సారమే లలితా పరమేశ్వరి అని తెలిసిన భక్తి గొప్పది.

సారమనే శబ్దానికి ఇంతవరకు తాత్పర్యము, ఉద్దేశమని ఒక అర్థం చెప్పుకున్నాం. సారమునకు మరొక అర్థం చూద్దాం. ఇవన్నీ నిఘంటువులలో చెప్పబడ్డ శాస్త్రీయ అర్థాలు. సారం అంటే బలం. ఆ అర్థంతో పరిశీలిస్తే ఛందస్సారా, శాస్త్రసారా, మంత్రసారా అంటే వేదాలకు, శాస్త్రాలకు, మంత్రాలకు కూడా బలం అమ్మవారే. బలాన్నే శక్తి అంటారు. శక్తిస్వరూపిణి అయిన అమ్మవారు లేకపోతే ఇవన్నీ ఎక్కడ ఉంటాయి!

వేదమయీం నాదమయీం బిందుమయీం పరపదోద్యదిందుమయీం

మంత్రమయీం తంత్రమయీం ప్రకృతి నౌమి విశ్వవికృతిమయీం అంటారు మూకకవి.

847. తలోదరీ – శ్రీ తలోదర్యై నమః

ఇది అమ్మ రూపవర్ణనకు సంబంధించిన నామం. ఉదరము అంటే లౌకికార్థం నడుమభాగం. తలము అంటే ఉబ్బెత్తుగా లేకుండా లోతుకు గాని ఉన్నట్లైతే 'తలోదరీ' అంటారు. సమముగా ఉండుట అని అర్థం.

ఎక్కడికక్కడ వర్ణన చేసేటప్పుడు చక్కని సాముద్రిక లక్షణాలను కలిగిన దివ్యమంగళవిగ్రహాన్ని స్ఫురింపజేస్తున్నారు. ఇప్పటివరకు చెప్పిన వేదసారమై, శాస్త్రసారమై, మంత్రసారమై ఉన్న దివ్యమంగళవిగ్రహమే అమ్మవారు.

కేవలం రూపవర్ణన చేయడం మాత్రమే ఇందులో ఉద్దేశం కాదు. ఇందులో చెప్పదలచుకున్నది అమ్మవారు శాస్త్రముల సారం. శాస్త్రప్రకారంగా 'ఉదరం' అనే దానికి లోపల భాగము అని అర్థం.

తలోదరీ అంటే తలములు ఉదరము నందు కలది. తలము అనగా స్థానము,

లోకము అని అర్థాలు. లోకాలన్నీ స్థానాలేగా. అతల, వితల, సుతల, రసాతల, పాతాళ, భూతల అని వ్యవహారాలు ఉన్నాయి. భూతలం ఉంది కాని ఆకాశానికి తలము అని పేరు లేదు. ఆకాశాన్ని తలం అనగలిగేవారు ఎవరంటే దానికి కూడా పైన ఉండేవారు. కనుక అమ్మవారికి లోకములన్నీ తలములే. మనకి భూతలం క్రింద పాతాళం – ఇలా కొన్ని మనకి క్రింద ఉన్నాయి కనుక తలం అని చెప్పాం. అమ్మవారికి స్వర్గమర్త్యాది లోకములు సర్వమూ కూడా తలములే.

తలములు అనగా సర్వలోకాలు. అయితే అమ్మ వీటికి అతీతంగా ఉంది. అంటే వీటన్నిటిని క్రిందపడేసి వాటి మీద కూర్చుందని అర్థం కాదు. వికారాలకి అంటకుండా ఉంది కనుక అతీతం. కానీ వీటన్నిటియందు ఆవిడ వ్యాపించి ఉంది. ఈ లోకములన్ని ఆమె యందే ప్రకాశిస్తూ ఉన్నాయి. విశ్వరూపం అంటే అదే. సర్వలోకాలు తనలో కలిగిన తల్లి అని 'తలోదరీ' నామానికి అర్థం.

ఛందస్సారా, శాస్త్రసారా అన్నప్పుడు శ్రీవిద్యాపరమైన అర్థం చెప్పుకున్నాం కనుక తలోదరీ అన్న శబ్దానికి దాని పరంగా కూడా అర్థం చూద్దాం. తల అనే దానికి ఎన్ని రకాలుగా చూడాలో చెప్తూ ఇది కటపయాది సంఖ్యా శాస్త్రం ప్రకారంగా చూస్తే త ల – 'త' అనేది 6 సంఖ్యని, 'ల' అనేది 3 సంఖ్యని తెలియజేస్తుంది. త, ల కలిపితే 6+3=9. తల–ఉదరి అంటే తొమ్మిది తనలోనే కలిగినది. తొమ్మిది అంటే నవ ఆవరణలు తనలో కలిగిన శ్రీచక్రస్వరూపిణి.

తలోదరీ అన్నప్పుడు మూడు రకాల అర్థాలు వచ్చాయి. 1. సాముద్రిక లక్షణంగా దివ్యమంగళ విగ్రహంగా ఉన్న తల్లి. 2. సర్వలోకాలు తనలోనే కలిగిన తల్లి. 3. నవావరణలు తనలోనే కలిగిన శ్రీచక్రరూపిణి.

848. ఉదారకీర్తిః – శ్రీ ఉదారకీర్తయే నమః

ఈ నామంలో అమ్మ యొక్క ప్రభావ వర్ణన చూపిస్తున్నారు. ఇది కూడా ఒక విధంగా శ్రీవిద్య యొక్క స్వరూపంగానే భావించవచ్చు. అమ్మవారికి ఉదారకీర్తి ఉంది. ఉదారం అంటే దాపరికం లేకుండా ఉండేది అని అర్థం.

అపరిమితమైన మహత్తరమైన కీర్తి కలిగినది.

ఉత్ అనే శబ్దానికి ఉత్కృష్టం, గొప్పది అని అర్థం. అర శబ్దానికి విస్తారము అని అర్థం. గొప్పదిగా విస్తరించిన కీర్తి కలది. వేదంలో **'యస్య నామ మహ ద్యశః'** అని చెప్పబడుతోంది. పరమాత్మ కీర్తే అంతా వ్యాపించింది. ఎక్కడ గొప్పదనం ఉంటే అక్కడే కీర్తి ఉంటుంది.

అసలు గొప్పతనమే అమ్మ రూపమైనప్పుడు ఏ గొప్పతనాన్ని కీర్తించినా అమ్మవారిని కీర్తించినట్లే. **'యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా'** అని పరమాత్మ గీతలో చెప్పినట్లు– 'ఎక్కడెక్కడ విభూతులు ఉన్నాయో అవన్నీ నా స్వరూపాలే' అన్నాడు. విభూతులు అంటే గొప్పతనాలు. సృష్టిలో ప్రతివారు కీర్తించే గొప్పతనాలన్నీ అమ్మరూపాలే.

అమ్మవారిని కీర్తించని వారెవరు? వేదాలు, వేదప్రతిపాద్యమైన దేవతలు – వీరందరూ అమ్మవారిని కీర్తిస్తున్నారు. ఎవరిని కీర్తిస్తే సర్వదోషములు తొలగి, మంగళములు ప్రాప్తిస్తాయో వారిది ఉదార కీర్తి.

849. ఉద్దామవైభవా – శ్రీ ఉద్దామవైభవాయై నమః

ఉత్ దామ వైభవా. ఉత్కృష్టంగా ప్రకాశిస్తున్న, హద్దులేని వైభవం కలది. 'విభు భావం వైభవం' – విభు అనే మాటకి అర్థం నాయకత్వం, శాసకత్వం.

అన్నిటికి ఉన్నతంగా, అనంతంగా ఉంటూ ప్రకాశింపజేస్తూ ఉన్న అధికారిణి. వైభవము అనగా అధికారం కలది. విభు శబ్దానికి మరొక అర్థం **'విశేషేన భవతీతి విభుః', 'విధా భవతీతి విభుః'** అన్నారు. అనేకరూపాలతో అనేకవిధాలుగా అవుతోంది. ఎన్ని రూపాలుగా ప్రకాశిస్తున్నా ఆ రూపాలన్నీ 'ఉద్దామములే'.... గొప్పవే. (1) ఉద్దామమై వివిధరూపాలు ధరించునది. (2) ఉద్దామముగా లోకమును ఏలునది. (3) ఉద్దామమైన సంపద మొదలైనవి కలిగినది. ఈ మూడు అర్థాలు చెప్పుకోవాలి.

'ఉదారకీర్తిః' 'ఉద్దామవైభవా' అని చెప్పడంలో మరొక విశేషం ఉంది. ఇవి మంత్రాలు కనుక వైదిక అర్థాలే ఎక్కువగా గ్రహించాలి.

ఉత్ అంటే గొప్పది అనేది కూడా శాస్త్రార్థమే. **'ఉదితి నామ'** అని ఒక మాట ఉపనిషత్తుల్లో కనబడుతోంది. **"య యేషోంతరాదిత్యేః హిరణ్మయ పురుషః. తస్యోదితి నామ".**

ఆదిత్యమండలాంతర్వర్తియైన ఏ పరమాత్మ ఉన్నాడో ఆయనకి 'ఉత్' అని నామం ఉంది. ఉత్ అంటే అన్నిటికి పైన ఉన్నాడు. స్పష్టంగా కనిపిస్తూనే మనందరికి పైనే ఉన్నాడు ఆదిత్యుడు. సూర్యభగవానునిలో ఉన్న హిరణ్మయ పురుషుడు ఎవరైతే ఉన్నారో ఆ స్వరూపం 'భానుమండలమధ్యస్థా'. అదే ఉత్ – అని చెప్పబడుతున్నది. ఆ స్వరూపమే వ్యాపించిన కీర్తిగా, ప్రకాశమైన వైభవంగా ఉన్నది.

ఉత్ రూపంతో తన ప్రకాశాన్ని వ్యాపింపజేస్తున్న సూర్యమండలాంతర్వర్తిని. ఆ సూర్యకాంతి నుండి అనేక వర్ణాలు మనకి లభిస్తున్నాయి.

850. వర్ణరూపిణీ – శ్రీ వర్ణరూపిణ్యై నమః

వర్ణములనగా 'వన్నెలు'(రంగులు) అని సామాన్యార్థం. అనేక వన్నెలు కలిగినది. అమ్మ విద్య ప్రధానంగా మాతృకావిద్య. వర్ణరూపిణీ అంటే అక్షరరూపిణి. ఒకొక్క అక్షరానికి ఒకొక్క తేజస్సు ఉంటుంది కనుక 'వర్ణరూపిణీ' అని ఒక అర్థం.

వర్ణములు అనగా లోకంలో జాతుల విభాగం ఉంది. 'వర్ణాశ్రమవిధాయినీ' దగ్గర చెప్పుకున్నది ఇక్కడ గుర్తు పెట్టుకుంటే సరిపోతుంది. వర్ణాశ్రమవిభాగం ఒక శాస్త్రీయమైన విభాగం. 'ఛందస్సారా' 'శాస్త్రసారా' చెప్పినప్పుడు ఆ ఛందస్సులోనే వర్ణము గురించి ఉంది.

బ్రాహ్మణోస్యముఖమాసీత్ బాహూరాజన్యకృతః
ఊరూతదస్య యద్వైశ్యః పద్భ్యామ్ శూద్రో అజాయత

ఒకే పరమపురుషుని అవయవస్థానాలుగా చెప్పడమనే ఉద్దేశాన్ని వర్ణాశ్రమవిధాయినీ దగ్గర చెప్పుకున్నాం. వర్ణాశ్రమాలు ఆ తల్లి ఏర్పరచినది. పూర్వకర్మ వాసనల ననుసరించి వారి గుణకర్మల ప్రకారం వర్ణములు ఏర్పాటు చేసింది. ఎవరు ఏ వర్ణంలో ఉంటే తరిస్తారో వారిని ఆ వర్ణంలో పుట్టించింది అమ్మవారు.

వారు తద్వర్ణానుగుణమైన సంస్కారంతో ఉపాసిస్తే మోక్షం పొందుతారు. ఫలానా

వర్ణం వారే మోక్షం పొందుతారని ఏ శాస్త్రంలోనూ లేదు. మానవునిగా పుట్టిన ప్రతివాడు మోక్షానికి అర్హుడే. వాడు తానున్న పరంపరను అనుసరించి ధర్మం పాటిస్తూ, శాస్త్రాలను గ్రహిస్తూ, సాధన చేస్తూ తరించవచ్చు. అన్ని వర్ణముల రూపంలో ప్రకాశిస్తున్నది ఆ తల్లియే అని తెలిస్తే ఈ వైషమ్యాలు ఉండవు. సర్వవర్ణరూపిణి ఆ తల్లియే.

వర్ణరూపిణికి చెప్పుకున్న మూడు అర్థాలు. 1. సూర్యమండలంలో ప్రకాశిస్తూ, రకరకాల వర్ణాలు ఏర్పరచి నడిపిస్తున్నది 2. అక్షరరూపిణి. 3. చతుర్వర్ణరూపిణి.

'ఉద్దామవైభవా' అన్నప్పుడు ఒక అర్థంగా – విభు అంటే వివిధములుగా అగునది విభు అని చెప్పుకున్నాం. అమ్మవారు లోకరక్షణ కోసం వివిధ రూపాలు ధరించింది. అవి లక్ష్మి, సరస్వతి, దుర్గ. వీటిలో మళ్ళీ చాలా భేదాలు ఉన్నాయి. సరస్వతిలో ఎన్నో రకాల సరస్వతులు ఉన్నారు. నీలసరస్వతి, శుక్లసరస్వతి, కింకిణీ సరస్వతి, అరుణసరస్వతి – ఇలా రకరకాల రూపాలు ఉన్నాయి.

అదే విధంగా లక్ష్మీరూపాలు లెక్కలేనన్ని ఉన్నాయి. శాకంబరీ దుర్గా, కపర్దినీ దుర్గా అని దుర్గా మంత్రాలే చాలా ఉన్నాయి. ఒకొక్క దుర్గామంత్రాల ధ్యానశ్లోకంలో ఒకొక్క రకమైన వర్ణం కనబడుతుంది. వాటిలో మళ్ళీ శూలినీదుర్గా, వనదుర్గా – ఇలా వాటి రూపాలు వేరు. వారి వర్ణాలు వేరు.

ఒకటి అగ్నివర్ణంతో ప్రకాశిస్తూ ఉంటుంది. మరొకటి నీలవర్ణంతో ప్రకాశిస్తుంది. ఒకొక్కదానికి ఒకొక్క రంగు. అమ్మవారు అంటే అరుణా అంటున్నాం. ఆ తల్లే శుద్ధబ్రహ్మవిద్యాస్వరూపిణిగా, శారదాంబగా కనబడినపుడు కేవలం **'శరజ్జ్యోత్స్నా శుద్ధాం శశియుతజటాజూటమకుటాం'** అని ధవళకాంతుల తల్లిగా వర్ణిస్తున్నారు.

ఏ దేవతను ధ్యానించినా వర్ణం ప్రధానంగా ఉంటుంది. దేవతాధ్యానంలో రంగు, చేతులు, పాదాలు, ఆ చేతుల్లో ధరించిన ఆయుధాలు, వస్తువులు – వీటన్నింటికి ఒకొక్కదానికి ఒకొక్క ప్రయోజనం ఉంది. అవి ఎవరు ధ్యానిస్తారో వారికి ఆ ప్రయోజనాలు లభిస్తున్నాయి..

రూపధ్యానమనేది చాలా అద్భుతమైన ప్రక్రియ. అది గొప్ప యోగం. ఇలా అమ్మవారికి ఎన్ని మంత్రాలు ఉన్నాయో అన్ని రూపాలు ఉన్నాయి.

విద్యాప్రదాన సమయే శరదిందుశుభ్రాం
లక్ష్మీప్రదాన సమయే నవవిద్రుమాభాం
విద్వేషవర్గదళనేచ తమాలనీలాం
దేవీం త్రిలోకజననీం శరణం ప్రపద్యే

అని కీర్తిస్తారు. విద్యని ఇచ్చేటప్పుడు అమ్మవారు తెల్లగా, వెన్నెలలా మెరిసిపోతోంది. ఇది శారదారూపం. ఐశ్వర్యాలు ఇచ్చేటప్పుడు పగడపు కాంతులతో, బంగారురంగులతో లక్ష్మీస్వరూపంగా కనబడుతూ ఉంటుంది. శత్రుసంహారం చేసేటప్పుడు నల్లని కాంతులతో ప్రకాశిస్తుందని కాళీరూపాన్ని చూపిస్తున్నారు. ఇలా మూడు రంగులుగా కనబడినది ఒక్కరే అని చెప్తూ 'దేవీం త్రిలోకజననీం శరణం ప్రపద్యే' అన్నారు. ఇది వర్ణాల రూపిణి.

సర్వతో భద్రమండలం అనే యంత్రం వేసేటప్పుడు ఎక్కడ ఏ వర్ణం వెయ్యాలో శాస్త్రంలో ఉంది. ఒక అక్షరానికి, ఒక రంగుకి, ఒక దేవతకి సంబంధం ఉంటుంది. తత్తద్దేవతా మంత్ర రూప వర్ణాలు (అక్షరాలు), వాటి రంగులు అనబడే వర్ణాలు కూడ అమ్మరూపాలే కనుక 'వర్ణరూపా'.

851. జన్మమృత్యుజరాతప్తజనవిశ్రాంతిదాయినీ
– శ్రీ జన్మమృత్యుజరాతప్తజనవిశ్రాంతిదాయిన్యై నమః

ఇది ఒకటే నామం. ఛందస్సారమైన అమ్మవారి ఉపాసన చేస్తే కలిగే ప్రయోజనం చెప్తున్నారు. ప్రతిదానికి స్వరూపము, స్వభావము, ప్రభావము ఈ మూడు చెప్పాలి. అమ్మవారి ఉపాసన చేస్తే లభించే ఫలితం ఇదే.

ఇక్కడ చెప్పబడుతున్న ప్రధానమైన తాపాలు జన్మ, మృత్యు, జరా. జన్మించడం ఒక తాపం. జన్మించిన తరువాత అన్నీ తాపాలే, ప్రధాన తాపం – జరా. చిట్టచివర తాపం – మృత్యువు. జన్మ, మృత్యు – ఈ మధ్యలో జరా అనేది వస్తుంది. జరా

అంటే జీర్ణించుట, క్షీణించుట. పెరుగుతున్నామని అనుకుంటూ ఉంటాం కానీ తరుగుతున్నామని దాని అర్థం.

'జన్మ–మృత్యు–జరా'... వీటితో తపించిపోతున్న జీవునికి విశ్రాంతిని ఇవ్వగలిగే శక్తి అమ్మవారికి మాత్రమే ఉంది. ఈ విశ్రాంతి అనేక రకాలు. ఈ నామం చాలా గొప్ప భావన చేయవలసినది.

సంసారంలో అశాంతి తప్పదు. దీంట్లో మళ్ళీ శాంతి వెతుక్కోవడమంటే గొంగటిలో వెంట్రుకలు ఏరుకోవడం లాంటిదే. శరీరానికి శాంతి లేదు. దీని లక్షణమే తపించడం. జన్మ మృత్యు జరలు లేనిది ఎవరికి? అవి లేని స్థితిని ఊహిస్తే ఎంత బాగుంటుంది? అవి లేనిదే ఆత్మతత్త్వం.

శరీరానికి ఈ మూడూ ఉన్నాయి కానీ ఆత్మకి ఈ మూడు లేవు కనుక ఆత్మస్వరూపాన్ని అవగాహన చేసుకొని 'ఆత్మయే జగదంబ' అని గ్రహించి, జగదంబతో తాదాత్మ్యం చెందితే అదే విశ్రాంతి. ఆ విశ్రాంతిని మనం సాధన చెయ్యగలం కానీ పొందలేం. అమ్మవారు ఇవ్వాల్సిందే. అందుకే 'దాయినీ' అని చెప్పారు.

జన్మమృత్యుజరలు లేని స్థితికి మోక్షమని పేరు. మరణించాక జన్మ, మృత్యు, జర లేదు కదా అంటే... అవి లేవని ఎలా చెప్పగలం? అదే మోక్షం ఎలా అవుతుంది? స్థూలశరీరం పోయింది కానీ మళ్ళీ జన్మలు, మృత్యువులు, జరలు ఉంటూ ఉంటాయి. అవి ఎప్పుడూ లేని స్థితి కావాలంటే మోక్షమే. శ్రీవిద్య మోక్షవిద్య అని చెప్పడం కోసం ఈ వాక్యం పనికొస్తుంది. అమ్మవారి ఉపాసన చేసేవారికి మోక్షం లభిస్తున్నది. వేదాంతశాస్త్రంలో దీనికి ప్రమాణం చూపిస్తూ **'జన్మమృత్యుజరాదుఃఖవిముక్తో అమృతమశ్నుతే'** అని చెప్పారు.

అమృతం అంటే మోక్షం. ఆ అమృతాన్ని ఎవరు పొందుతున్నారంటే జన్మ మృత్యు జరా దుఃఖాలు దాటినవాడు పొందుతున్నారు. ఆ దాటించి మోక్షమిచ్చే తల్లే అమ్మవారు. 'ఛందస్సారా' నామం నుండి ఇప్పటివరకూ విద్య యొక్క స్వరూపం మొత్తం ఆవిష్కరించి ఈ నామంలో ఫలితాన్ని చెప్పారు.

852. సర్వోపనిషదుద్ఘుష్టా - శ్రీ సర్వోపనిషదుద్ఘుష్టాయై నమః

'ఘుష్టా' అంటే ఘోషింపబడినది. ఘోష అంటేనే భాష కంటె అధిక శక్తి కలది. ఘోష అంటే చాటుట. **ఉత్ ఘోషః.**

ఇదే సత్యము, ఇది తప్ప మరొకటి లేదు అని నొక్కి వక్కాణించడాన్ని చాటడం అంటారు. అన్ని ఉపనిషత్తుల గొంతు ఒక్కటే. అవి చెప్పిన సత్యం ఒక్కటే. సర్వ ఉపనిషత్తులది ఏకహృదయమే.

10 ఉపనిషత్తులని ఒకరు, 108 ఉపనిషత్తులని మరొకరు, 1008 ఉపనిషత్తులని మరొకరు చెప్తారు. ఎన్ని ఉపనిషత్తులు చెప్పినా అవన్నీ ఎలుగెత్తి చెప్పే సత్యం మాత్రం ఒక్కటే. ఆ సత్యం అమ్మవారే. 'సర్వోపనిషదుద్ఘుష్టా'.

అన్ని ఉపనిషత్తులు ఏకరువు పెట్టిన పరమసత్యమే శ్రీవిద్య. ఉపనిషత్ప్రతిపాద్యమైన తత్త్వం. ఉపనిషత్తు తరగతులకి వెళ్ళినంత మాత్రాన అవి వచ్చేస్తాయా! ఉపనిషత్తుల్లోకి ప్రవేశించడానికి కావాల్సిన అర్హత చిత్తపక్వత.

'ఛందస్సారా. శాస్త్రసారా. మంత్రసారా' నామాల దగ్గర చెప్పబడింది. వేదము, వేదాంతమని రెండు భాగాలు ఉన్నాయి. అవి-కర్మకాండ, జ్ఞానకాండ. కర్మకాండల సారము అమ్మవారే. జ్ఞానకాండ అయిన ఉపనిషత్తుల సారమైన బ్రహ్మతత్త్వము కూడా లలితాంబయే.

ఉపనిషత్ శబ్దానికి అర్థం చెప్తూ, **"ఉపనీయేమమాత్మానం బ్రహ్మోపాస్తిద్వయం సతః। నిహంత్య విద్యాం తత్ జ్ఞాత్వా తస్మాదుపనిషన్మతా"** అన్నారు. ఉప అంటే దగ్గరికి చేర్చుట అని అర్థం. ఎన్నో అర్థాలు ఉన్నప్పటికి ఒక అర్థాన్ని ఇక్కడ వివరిస్తున్నారు. మనల్ని బ్రహ్మతత్త్వానికి దగ్గరకి చేర్చుతున్నది.

ఒక వైపున మన బుద్ధిని బ్రహ్మము వైపు తీసుకువెళుతూ, మరొక ప్రక్క వెంట పడుతున్న పూర్వజన్మకర్మవాసనలనే అజ్ఞానసంస్కారాల్ని తొలగిస్తుంది.

మరొక అర్థం - ఉపనిషత్తు ఉపన్యాసపు విషయం కాదు. గురువు దగ్గరకి వెళ్ళి నేర్చుకోవలసిందే. కనుకనే ఉపనిషత్తులు నేర్చుకునేటప్పుడు, 'సహనావవతు సహనౌభునక్తు' అని చెప్పుకోవడం. "మన ఇద్దరం ఉపనిషత్తులు నేర్చుకోవడానికి

కూర్చున్నాం. వ్యక్తి, అహంకారం మధ్యలో వచ్చి ఒకరి మీద ఒకరికి ద్వేషాలు పుట్టకుండా జ్ఞానాన్ని పొందుదుము గాక!" అని మంత్రం స్మరించుకుని ఉపనిషత్ విద్య ప్రారంభిస్తారు. భేదభావం తొలగించడమే ఉపనిషత్ లక్ష్యం. జీవ – ఈశ్వరుల మధ్య భేదం అజ్ఞానం. ఆ భేదం తొలగించే జ్ఞానం పేరు ఉపనిషత్. ఉపనిషత్తులన్నీ కలిపి అమ్మవారిని చాటుతున్నాయంటే "జీవబ్రహ్మైక్యతత్త్వమే జగదంబ" అని చెప్పడం దీని ప్రధాన ఉద్దేశం. **"సర్వవేదాంత ప్రత్యయం చోదనాత్ అవిశేషాత్"** అంటూ బ్రహ్మసూత్రాధికరణం తెలియజేస్తోంది

అమ్మవారు వేదముల చేత, వేదాంతములచేత ప్రతిపాదింపబడేది. ఉదాహరణలు చెప్పుకోవాలంటే వేదంలో అమ్మవారి గురించి ఎక్కడెక్కడ చెప్పారో చూడాలి. **'దుర్గాం దేవీగ్ం శరణమహం ప్రపద్యే'** ఇది వేదంలోదే. తల్లికి సంబంధించిన దివ్యమంత్రరాశి **'తాం పద్మినీమీం శరణమహం ప్రపద్యే'** ఇది శ్రీసూక్తం చెప్పింది. **'ప్రణోదేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ'** అని సరస్వతీ సూక్తం. **'మేధా దేవీ జుషమానా ఆగాత్'** అని మేధాసూక్తం చెప్తోంది. ఇలా సర్వవేదాలు ఉన్న వేదసారం అమ్మవారే. అదే– 'ఛందస్సారా' 'శాస్త్రసారా'.

ఉపనిషత్తులు పరిశీలిస్తే– కేనోపనిషత్తులో అమ్మవారు కనబడిన కథని చూపించారు. తానే స్వయంగా వచ్చి **'ఉమా హైమవతీ బహుశోభమానా'** అని చెప్తుంది. ఛాందగ్యోపనిషత్తులో **"రసో వై సః యల్లబ్ధ్వా ఆనందీ భవతి"** అని రసస్వరూపిణి అయిన అమ్మవారిని అక్కడ ప్రతిపాదన చేస్తున్నారు. 'రసజ్ఞా రస శేవధిః'. మొట్టమొదట 'శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ' నామాలకు తైత్తిరీయం చెప్పిన **'యతోవా ఇమాని భూతాని జాయంతే యేన జాతాని జీవంతి'.** ఇలా వెళ్తుంటే 'త్రిపురోపనిషత్, భావనోపనిషత్, బహ్వృచోపనిషత్, అరుణోపనిషత్' – ఇలా అమ్మవారికి సంబంధించిన చాలా ఉపనిషత్తులు ఉన్నాయి.

ఈ ఉపనిషత్తులన్నీ కలిపి చాటుతున్న విషయం పరమేశ్వరియే. అమ్మవారి విద్య పట్టుకుంటే ఉపనిషత్తులు చదువుకోలేదని అసంతృప్తి పడనవసరం లేదు. ఆ విద్యని సరిగ్గా అవగాహన చేసుకుంటూ ఆరాధన చేసుకుంటే అదే సరిపోతూ

ఉంటుంది. ఆ లభించే తత్త్వం ఎలాంటిదో చెప్తూ తరువాత నామం 'శాంత్యతీత కళాత్మికా'.

853. శాంత్యతీతకళాత్మికా – శ్రీ శాంత్యతీతకళాత్మికాయై నమః

ఉపనిషత్తులు అమ్మవారిని ప్రతిపాదన చేస్తున్నాయని ఉపనిషత్తే చెప్పింది.

సర్వే వేదా యత్పదమామనన్తి తపాంసి సర్వాణి చ యద్వదంతి

యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరన్తి తత్తే పదం సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్

ఇప్పుడు 'వర్ణరూపిణీ' నామం నుండి పరిశీలించాలి. వర్ణరూపిణి అంటే అక్షరరూపిణి. ఏది అక్షరం? **ఓమిత్యేకాక్షరం బ్రహ్మ.** ఆమె ఓంకారరూపిణి. ఇప్పుడు చెప్పిన మంత్రం కఠోపనిషత్తులోనిది. కఠోపనిషత్తు చెప్పిన ప్రకారంగా ఓంకారమే పరబ్రహ్మమని ఉపనిషత్తులు ఘోషించాయి. ఓంకారం యొక్క పరమార్థం అమ్మవారు. ఆ ఉపనిషత్తులు ఇచ్చిన బ్రహ్మతత్త్వం ఎలా ఉంటుందో వివరిస్తూ ఆ తత్త్వం 'శాంత్యతీతకళాత్మికా' అన్నారు.

విశ్వవిజ్ఞానప్రకారంగా శాంతం అంటే ఆకాశం. ఆకాశంలో ఉరుములు, మెరుపులు అన్నీ ఉన్నాయి. కానీ ఆకాశానికి అవి ఏవీ లేవు. ఆకాశమే శాంతం. అలాగని అమ్మవారు ఆకాశమా? ఆకాశానికి అతీతురాలు అమ్మ. 'శాంత్యతీతకళాత్మికా' అంటే ఆకాశానికి కూడా ఆవల ఉన్న పరతత్త్వము.

శైవాగమ శాస్త్రాలలో శాంత్యతీతకళకి అర్థం **'శాంత్యతీతకళా అద్వైతానంద బోధదా'–** జీవబ్రహ్మైక్యమైన నిర్వాణ ఆనందము యొక్క జ్ఞానమే అంటే అద్వైతజ్ఞానమే శాంత్యతీతకళ అన్నారు. శంకరులు దీనినే **'బ్రహ్మసత్యం జగన్మిథ్య జీవోబ్రహ్మైవ నాపరః'** అని చెప్పారు. యోగపరంగా పిండాండంలోని సహస్రార స్థానంలో ఉండునది.

మరొక అర్థంలో – కళ అంటే విద్య. ఏ విద్య అద్వైత జ్ఞానాన్ని బోధిస్తుందో దానిని శాంత్యతీతకళ అనాలి. 'ఆత్మికా' అంటే రూపము అని అర్థం. 'శాంత్యతీత కళాత్మికా' అంటే 'అద్వైతజ్ఞానరూపిణి'. ఆ అద్వైతజ్ఞానం మనకి ఎక్కడ నుండి లభిస్తోందో చెప్తూ 'సర్వోపనిషదుద్ఘుష్టా' అన్నారు. అన్ని ఉపనిషత్తుల ఉద్ఘోషయే

శాంత్యతీతకళ. అది అమ్మవారి రూపం. ముందుగా ఉపనిషత్తులు ఏం ఘోషించాయో చెప్పారు. ఆ స్వరూపం అమ్మవారే అని తీర్మానం చేశారు. తరువాత నామంలో ఆ స్వరూపలక్షణం వివరిస్తున్నారు.

854. గంభీరా – శ్రీ గంభీరాయై నమః

'గంభీరా' 'గగనాంతస్థా' 'గర్వితా' 'గానలోలుపా'. ఈ నామాలలో 'గం' బీజాక్షరశక్తి ఉన్నది. 'గంభీరా' అంటేనే అనుకోకుండానే 'గం'బీజం పలికింది. గం బీజం గణపతిది. గణపతి పార్వతీపరమేశ్వరుల తనయుడు మాత్రమే కాదు – పరబ్రహ్మమే. గం అనేది పరబ్రహ్మ వాచకం. గం అంటే సర్వోత్కృష్టము అని అర్థం.

అమ్మవారు 'గంభీరా'. గభీరా, గంభీరా రెండు లోతుని తెలియజేస్తాయి. చాలా లోతైన తల్లి. ఎంత లోతంటే ఈ ప్రపంచం అంతా ఆవిడలోనే ఉంది.

సాధారణంగా ఎంతో నీరున్న సముద్రాన్ని గంభీరంగా ఉందంటున్నాం. ఈ సమస్త బ్రహ్మాండాలు 'తలోదరీ' అయిన ఆ తల్లిలో ఉన్నప్పుడు ఆవిడ ఎంత గంభీరం! స్థూలతత్త్వం నుండి సూక్ష్మంలోకి వెళ్ళాలి అంటే సముద్రపు అగాధపు అంచులలోనికి వెళ్ళినట్లే.

లోతుకు వెళ్ళడం చాలా కష్టం కనుక అమ్మ అంతు పట్టడం మహాకష్టం. అన్నిటినీ తనలో కలిగింది కనుక' గంభీరా'.

'అనంతత్వాత్ గంభీరా' – అనంతత్వము చేత ఆవిడకి గంభీరమని పేరు వచ్చింది.

ఆగమశాస్త్రంలో 'గంభీరా' మాటకి అర్థం చెప్తూ, **'తదీయోఽనుభవస్తస్య స్ఫురణం స్వాత్మనః స్ఫుటం'** అన్నారు. తదీయ అనుభవః – బ్రహ్మానుభవం మనకి కావాలంటే ఎక్కడ దొరుకుతుంది? అంతఃస్ఫురణం స్ఫుటం– అంతః అంటే లోతులకి అని అర్థం. మన హృదయం ఎంత లోతైనదంటే దానికి ఏ అగాధం సరిపోదు. ఆ లోతైన హృదయంలో మనం విచారణ చెయ్యగా పరతత్త్వం దొరుకుతుంది. 'గంభీరా' అంటే – 'అంతర విచారణ వల్ల లోపల దొరుకునది' – అని దీని భావం.

సాధారణంగా లోకంలో లోతుగా ఉన్న మడుగులను హ్రదము అని అంటారు. అమ్మవారి గురించి శివసూత్రాలలో హ్రదము అని చెప్తూ–

మహాహ్రద ఇతి ప్రోక్తా శక్తిర్భగవతీ పరా
ప్రవర్తకత్వ స్వచ్ఛత్వ గంభీరత్వాది ధర్మతః
మహాహ్రదో జగద్వ్యాపీ దేశకాలాద్యగోచరా

అన్నారు. అమ్మవారికి 'మహాహ్రదా' అని పేరు ఉంది. మహాహ్రదము అంటే పెద్దమడుగు. భాగవతంలో గోవర్ధనగిరిని ఉద్ధరించిన తరువాత కృష్ణపరమాత్మ వద్దకు నందుడు మొదలైన గోపకులందరు వచ్చి, "నువ్వు పరమాత్మవని మాకు తెలిసింది. నువ్వు ఎదురుగా తిరుగుతున్నంత సేపు నీ మీద ప్రేమ చూపించాం. నువ్వు గొప్పవాడవనే భక్తిని చూపించాం. కానీ నువ్వు పరతత్త్వమని తెలిసింది. ఆ పరతత్త్వం ఎలా ఉంటుందో మాకు అనుభవానికి కావాల"ని అడుగుతారు. వారి యందు జాలి తలచి పరమాత్మ ఆ జీవులందరిని తన బ్రహ్మానుభవంలోకి ప్రవేశింపజేశాడు.

అలా వారందరిని లాగినపుడు **'తేపి బ్రహ్మహ్రదే నీతాః'** అంటారు వ్యాసులవారు. వారు బ్రహ్మహ్రదములోకి వెళ్ళిపోయారు. పరబ్రహ్మము అనే మడుగులోకి వారంతా దిగిపోయారు. మడుగులో మునిగిపోతే బయట ఏముందో తెలియదు. ఇలా అమ్మవారిని ఒక మడుగుతో పోల్చి చెప్పింది శివసూత్రం.

ఆ పరబ్రహ్మస్వరూపిణి అయిన తల్లి యొక్క 'శాంత్యతీతకళాత్మికా' తత్త్వంలో లీనమైతే మరి ఈ ప్రాపంచిక తాపమేమీ ఉండదు. అక్కడ స్థితిని వర్ణిస్తూ– **"ప్రవర్తకత్వ స్వచ్ఛత్వ గంభీరత్వాత్"** అన్నారు. మూడు లక్షణాలు చెప్పారు. పెద్దమడుగులో నీరు ఉన్నట్లు అమ్మలోనే లోకమంతా ఉంది. అమ్మవారే లోకాన్నంతటిని నిర్వహిస్తోంది. స్వచ్ఛత్వ అంటే నిర్మలంగా ఉంది. లోతుగా ఉంది. అంతేకాకుండా జగద్వ్యాపీ. ఈ సర్వజగతినంతా వ్యాపించిపోయి ఉంది.

మరొక అర్థంలో– మంత్రానుభూతిని గంభీరం అని అంటారు. మంత్రజపం చెయ్యడం వేరు. మంత్రానుభూతిని పొందడం వేరు. ఈ మంత్రానుభూతి ఎలా

ఉంటుందో చెప్తూ- **'మహాహ్రదానుసంధానాత్ మంత్రవీర్యానుభవః'**(శివపురాణం) అన్నారు. ఇది సాధకులకు పనికొచ్చే చాలా ముఖ్యమైన అంశం. ఆ బ్రహ్మహ్రదం మనకి అనుభూతికి వస్తే అదే మంత్రానుభూతి. మంత్రం యొక్క వీర్యం అనగా మంత్రము యొక్క తేజస్సు. జ్ఞానానంద హ్రదముగా లలితాంబను భావించి ధ్యానించితే మంత్రవీర్యాన్ని అనుభూతిగా పొందగలం.

మంత్రజపం చెయ్యగా చెయ్యగా శ్రద్ధగలవారికి అమ్మ అనుగ్రహించి ఆ సిద్ధిని ఇస్తుంది. ఇది పురశ్చరణకు కూడా దొరకదు. కానీ మంత్రవీర్యానుభూతి అంత తేలిక కాదు. అది దొరికితే వాడు 'శాంత్యతీతకళాత్మికా' తత్త్వానికి చేరుకుంటారు.

855. గగనాంతస్థా - శ్రీ గగనాంతస్థాయై నమః

అంతస్థా అంటే లోపల ఉన్నది అని అర్థం. ఈ అనంత ఆకాశం మనం చూస్తున్నాం. ఆ అనంత ఆకాశమునందంతా ఆవిడే వ్యాపించి ఉంది కనుక 'గగనాంతస్థా'.

అంతము అంటే చివర అని అర్థం. గగన-అంత-స్థ అంటే ఆకాశము చివరనున్నదని అర్థం. ఆశాంతము, ఆసాంతము అని రెండు మాటలు ఉన్నాయి. గగనాంతస్థాని పరిశీలిస్తే గగనము యొక్క అంతము నందు ఉన్నది.

జీవభావం ఈశ్వరభావంతో లయం కావాలంటే స్థూలం నుంచి సూక్ష్మంలోకి వెళ్ళాలి. స్థూలం నుంచి సూక్ష్మంలోకి వెళ్ళేటప్పుడు భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం. ఆకాశంతో అంతమైపోతోంది. ఎక్కడైతే ఆకాశం అంతమైందో దానికి పైన అమ్మవారు ఉన్నారు కనుక 'గగనాంతస్థా'. గగనాంతమునందున్నది.

గగనానికి పైన ఏముందో ఉపనిషత్ చెప్పింది. 'ఆత్మనః ఆకాశస్సంభూతః ఆకాశాద్వాయుః వాయోరగ్నిః అగ్నేరాపః' అని తైత్తిరీయం చెప్తోంది. ఆకాశం పరమాత్మ వల్ల కలిగింది. ఆకాశానికి అంతంలో పరమాత్మ ఉన్నాడు. పరమాత్మే అమ్మవారు.

ఆకాశమంటేనే పెద్ద లోతు. ఆకాశమంతా కలిపి ఖం. ఆ లోతును మనం తెలుసుకోలేము. ఆకాశపు లోతే మనకు తెలియదంటే దానికి పైన ఉన్న అమ్మవారు

ఎంత 'గంభీరా'! అందుకే 'గగనాంతస్థా'. ఇందులో మనం అర్థాలు చెప్పుకోవడం లేదు. విచారణ చేస్తున్నాం. అర్థాలు వెతకడం కంటె కూడా విచారణ చాలా ముఖ్యం. విచారణకు ఫలితం బ్రహ్మజ్ఞానం.

'వృక్ష ఇవ స్తబ్ధో దివి తిష్ఠత్యేకః' అని ఉపనిషత్ చెప్తోంది. పరమాత్మ ఎలా ఉన్నాడో చెప్తూ 'దివి తిష్ఠతి' అంటే ఆకాశము నందు వృక్షము వలె స్తబ్ధునిగా ఉన్నాడని చెప్పింది. స్తబ్ధము అంటే జడత్వము కాదు, 'నిర్వికారా' అని చెప్పడం దీని భావం.

గగనమనగా దహరాకాశమే దానియందు ఉన్నది.

మరొక భావంలో – 'గగన' అనగా ఆకాశం, దాని బీజం 'హ'కారం. అంతస్థలు – అంటే 'య,ర,ల,వ' ఈ అయిదు ఆకాశము, వాయువు, అగ్ని, భూ, జల – బీజాలు అనగా పంచభూతబీజాలు. ఈ బీజస్వరూపిణిగా ఉన్నది 'గగనాంతస్థా'

856. గర్వితా – శ్రీ గర్వితాయై నమః

మహానందం, జ్ఞానం – వీటి అతిశయించిన భావవిలాసమే గర్వం. అది కలది గర్వితా.

గర్వం అంటే తన దగ్గర ఉన్నది ప్రకటింపబడడం. పువ్వు పూసినపుడు సహజంగా వాసన వస్తుంది. కర్పూరం ఉంటే పరిమళం వస్తుంది. దీపం కాంతిని సగర్వంగా చూపిస్తుంది. అలాగే సమస్తమైన విభూతులు ఆ తల్లివే. అవి దాచకుండా విశ్వమంతా వ్యాపించి ఉన్నాయి కనుక 'గర్వితా'.

'గగనాంతస్థా' అయిన తల్లి యొక్క శోభయే గగనము మొదలుకొని సర్వము నందు వ్యాపించి ఉంది... అదే 'గర్వితా'.

తాను ఒక్కడు తప్ప అలాంటి వారు మరొకరు లేరు అంటే గర్వం వస్తుంది. సాధారణంగా ఉన్నవి కాకుండా ఏదైనా ప్రత్యేకత ఉంటేనే వారికి సన్మానాలు, సత్కారాలు, గుర్తింపులు చేస్తారు. అసామాన్యం, అసాధారణం అనే మాటకి అర్థం ఇది. అందరి దగ్గర ఉన్న వికారాలేవీ అమ్మ దగ్గర లేవు. అమ్మ దగ్గర ఉన్న

వైభవాలు ఎవరి దగ్గరా లేవు. ఆవిడ తప్ప ప్రపంచంలో ఇంకెవరూ లేరు. మరి ఆవిడ ఇంకెంత గర్వంగా ఉండాలి!

ఆవిడ ఏకా అని చెప్పడమే 'గర్వితా' మాటలోని మరొక అర్థం. ఆమె ఒక్కరే. ఆవిడ్ని మించి మరొకరు లేరు.

'ఏకైవాహం జగద్వంద్యా ద్వితీయా కా మమాపరా' అని దేవీమాహాత్మ్యంలోని వాక్యం. దుర్మార్గులైన శుంభ, నిశుంభులు యుద్ధం చేసినప్పుడు నిశుంభునితో సహా అందరు రాక్షసులు మరణించారు. శుంభునికి ఉక్రోషం వచ్చింది. శుంభుడు అమ్మవారితో, "నువ్వు ఒక్కదానివే వస్తానన్నావు. నిన్ను యుద్ధంలో ఓడిస్తే నన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పికదా వచ్చావు. కానీ నువ్వు ఒక్కదానివే కాకుండా బ్రాహ్మీ, వైష్ణవీ, వారాహీ వీరందరూ వచ్చి యుద్ధం చేస్తే నువ్వు ఒక్క దానివే ఎలా అవుతావం"టే, అమ్మవారు చెప్తూ, "ఓ మూర్ఖుడా! నేను ఒక్కదాన్నే. వీరందరూ కూడా నా స్వరూపాలే, నా విభూతులే. నీ అజ్ఞానం అనేకరూపాలు ధరిస్తే వాటిని కొట్టడం కోసం నేను అనేకరూపాలు ధరించాను. కానీ నేను ఏకా" అని చెప్తూ "ఏకైవాహం జగత్యత్ర" – ఈ జగత్తంతా ఉన్నది నేనే. "ద్వితీయా కా మమాపరా" – "నేను తప్ప రెండవ వస్తువు ఏముంది!" అంది. ఆవిడ అలా అంటేనే అందం.

అమ్మవారు మహారాణీ. కూర్చున్నప్పుడు ఆ ఠీవి, ఆ దర్పం అలానే కనబడాలి. అమ్మవారికి ఆ దర్పమే శోభ. **'న త్వత్సమోస్త్య భ్యధికః కుతోన్యః '** ఉపనిషత్తుల్లోనూ, అదేవిధంగా భగవద్గీతలోను కనబడుతుంది. "అమ్మా! నీతో సమానమే లేదు. ఇంక నీ కంటె అధికం ఉండదని వేరే చెప్పాలా!" సమానము, అధికము లేనప్పుడు 'సమానాధికవర్జితా'. అంటే 'గర్వితా'.

గర్వము అనగా అహంకారము. నాకు అహంకారం లేదు అనేది కూడా అహమే. ఈ అహంకారానికి పేరు– 'ఇదం అహంతా'. ఇదంతో కూడిన అహం. అమ్మవారిది **'పర అహంతా'.** 'గర్వితా' అంటే **పరాహంతాస్వరూపిణీ.** 'పర అహంతా' అంటే పరబ్రహ్మము యొక్క అహం. అహం అనే చైతన్యం పరమమైన బ్రహ్మముది. ఆవిడే పరబ్రహ్మము యొక్క అహంతా. ఇదే **'పురమథితురాహో పురుషికా'.**

'పర–అహంతా' – సర్వోత్కృష్టమైన అహంతా. ఆ అహంతా నుండే లోకమంతా తయారయింది. విశ్వనిర్మాణవిషయమైన 'పరాహంతా' స్వరూపిణి. పరమాత్మ నేను ఈ ప్రపంచం చేస్తానని అనుకున్నాడు. అనుకుంటేనే చేశాడు. నేను అనుకోగానే అనేకం ఏర్పడింది. 'ఏకోహం బహుస్యాం – ఒక్క నేను ఎన్నో అవుతాను'. ఎన్నో అవడానికి కారణం 'అహం'. అంతకు ముందు ఆ ఏకంగా కూర్చున్నప్పుడు ఇంత లేదు. అహం అనగానే బహు అయ్యింది. బహు అయిన సృష్టి రావడానికి కారణం – ఏకమైన పరమాత్మ యొక్క 'నేను' అనే స్ఫురణ. ఎక్కడ చైతన్యం ఉంటుందో అక్కడ 'నేను' అనే స్ఫురణ ఉంటుంది. ఆ అహమే 'గర్వితా'.

857. గానలోలుపా – శ్రీ గానలోలుపాయై నమః

గానమందు ఆసక్తి కలది. అమ్మవారికి సంగీతమంటే చాలా ఇష్టం. ఒక్కసారి రెండు నామాలు కలిపి చూస్తే అమ్మవారు మణిద్వీపంలో సింహాసనంపై కూర్చున్నారు. రాజు కూడా భటునిలా కూర్చుంటే ఏమైనా అందం ఉంటుందా! రాజు రాజులాగే కూర్చోవాలి. సర్వబ్రహ్మాండాలకు రాణి అయిన ఆ తల్లి 'గర్వితా'. అన్ని రాజలాంఛనాలు ధరించి మహారాణిగా కూర్చుంది. అలా కూర్చున్న అమ్మవారి ముందు ఒకొక్కరు చేతులు మోడ్చుకొని నమస్కారం చేస్తున్నారు. ప్రతివారి గొంతులోంచి నాదం పలుకుతోంది.

ఎప్పుడైనా పరతత్త్వానుభూతి కలుగగానే ఒక్కసారి ఆనందం పెల్లుబుకుతుంది. అలా పెల్లుబికి గానం వస్తుంది. వేదం ప్రకారంగా గానం అంటే ఆనందానుభూతితో చేసే వ్యక్తీకరణ. అఖండానందానుభవం నుండి వచ్చిన ఒక వ్యక్తీకరణని గానము అనాలి. అప్పుడు 'గాతారం త్రాయతే' అంటే ఏమిటో తెలుస్తుంది. **'సామగాయన్నాస్తే హా హూ హా సామగాయన్నాస్తే'** – బ్రహ్మానుభూతితో ఎలుగెత్తి గానం చేస్తారు. ఆ గానాన్ని ఇక్కడ వివరించారు. బ్రహ్మానందానుభవంతో చేసిన ఒకానొక స్పందన.

అంతటా వ్యాపించిన ఆ బ్రహ్మానుభవంతో లీనమైపోయిన ఆనందం కలిగి ఇది తప్ప మరేదీ లేదనే భావం కలుగుతుంది. ఆ భావం పేరే 'గర్విత భావం'.

ఆ భావం కలగగానే ఒక్కసారి ఆనందం పెల్లుబికి బయటకి వచ్చినపుడు, ఆ తల్లి "ధన్యుడివయ్యావురా!" అంటుంది. అది 'గానలోలుపా'. బ్రహ్మానుభూతికి సంతోషించే తల్లి.

అమ్మవారికి ఎప్పుడూ సంగీతం ఇష్టం కనుకనే మణిద్వీపంలో ఎప్పుడూ గానవైభవమే. లలితా సహస్రనామ స్తోత్రరూపంగా వశిన్యాదివాగ్దేవతలు చేస్తున్నది కూడా గొప్ప గానమే. ఇందులో ఉన్న సంగీతం ఎక్కడా లేదు. రాగాలు కట్టకపోయినా అందులో సంగీతం ఉంది.

వేదమాత, నారదాదులు అందరూ గానం చేస్తున్నారు ఆ తల్లి కోసం. వీరందరి గానాన్ని వింటూ సంతోషిస్తోంది.

"సామగానలోల మనసిజ లావణ్య ధన్యమూర్ధన్యులు ఎందరో మహానుభావులు" అంటారు త్యాగయ్య. భగవంతునికి గానం అంటే ఇష్టం. యజ్ఞమంతా చేశాక చివరికి వారు సామగానం చేస్తే దేవత కరిగిపోతుంది. సంగీతపు దేవత కూడా ఆ తల్లే. మనకి పాడడం నేర్పి, పాడితే సంతోషిస్తుంది అమ్మవారు. పాటలు ఇచ్చేదీ ఆ తల్లే. పాడితే సంతోషించేది ఆ తల్లే. ఆ తల్లి 'సంగీతప్రియా'. సంగీతస్వరూపిణి.

సరిగమపదనిరతాం తాం వీణాసంక్రాత కాంత హస్తాం తామ్

శాన్తాం మృదులస్వాంతాం కుచభరతాం తాం నమామి శివకాన్తామ్

అంటూ కాళిదాసమహాకవి ఎంతో చక్కగా ఆ తల్లిని కీర్తించారు. అంటే సరిగమపదని స్వరముల యందు ఆసక్తి కలిగినది.

తత – ఆనద్ధ – సుషిర – ఘన – చతుష్టయ సముచ్చయమాత్మకమైన గానం. వీణాదుల వాద్యం, మద్దెల మొదలైన వాద్యాలు, వేణువు, కంచుతాళం వంటివి – వీటి సముచ్చయమైన నాదం – గానం. దానియందు మక్కువ కలది 'గానలోలుపా.'

858. కల్పనారహితా - శ్రీ కల్పనారహితాయై నమః

కల్పన లేనిది. కల్పన అంటే నిర్మించుట. సృష్టి అంతా అమ్మవారి కల్పన. ఈ సృష్టిలో జననం, మరణం, వికారం, ప్రకృతి, త్రిగుణాలు - అన్నీ ఉన్నాయి. ఇవన్నీ సృష్టికి ఉన్నాయి. ఈ జగత్ సృష్టి కల్పన చేసినది తల్లి.

సుఖము, దుఃఖము, వికారాలు... వంటి వాసనామయ విషయ తరంగాలు ఏవీ లేని తల్లి కనుక 'కల్పనారహితా'.

మనం గోడని చూశాం. గోడకి అన్నీ కన్నాలు, రంగులు కూడా ఉన్నాయి. కంటితో చూశాం కనుక గోడకున్న వికారాలు తెలిశాయి. ఆ వికారం కంటికి ఉందా? దృగ్రూపచైతన్యం అమ్మవారు. దృశ్యరూపమైనది ప్రపంచం. దృశ్యవికారాలేవి దృక్కుకి లేవు. దృశ్యమైన శరీరాది వికారాలు దృగ్రూపిణి అయిన పరమాత్మకు లేవు.

'వాసనామయ్యో దృశ్యవీచయః' అన్నారు. కల్పన అంటే వాసనామయమైన వీచికలు. వీచికలు అంటే తరంగాలు. మన మనస్సు ఎప్పుడూ ఏదో కల్పించుకుంటూ ఉంటుంది. ఏమీ తోచకపోతే ఏదేదో ఊహించుకుని ఉన్నట్టుండి ఉలిక్కిపడతాం. ఈ ఊహలన్నీ వాసనల వల్ల వస్తూ ఉంటాయి. వాసనలంటే ఇప్పటివి కావచ్చు, గతంలోవైనా కావచ్చు లేదా గతజన్మలవైనా కావచ్చు.

మనస్సులో వాసనలు తరంగాల్లా వస్తూ ఉంటాయి. ఇవాళ దుఃఖం. రేపు సుఖం. ఇవాళ శాంతం. రేపు కోపం. ఇది తరంగాల స్వరూపమే కానీ అసలు స్వరూపం ఏమిటి? ఈ తరంగాలు కల్పనలు. ఈ తరంగాలు లేని స్థితి ఒక్కసారి చూస్తే అదే గంభీరం. అది నిర్వికారం.

తరంగాలు లేని కొలను చూసి గంభీరంగా ఉంది అంటాం. శివుడు ఎలా కూర్చున్నాడంటే **"నిస్తరంగకమైన మున్నీరువోలె గర్జితము లేని ఘనాఘనము వోలె"** కూర్చున్నాడని శ్రీనాథమహాకవి వర్ణిస్తారు. శివుడు తపోముద్రలో కూర్చున్నప్పుడు తరంగాలు లేని సముద్రము వలె ఉన్నాడట. తరంగాలు లేని సముద్రం అంటే గంభీరం. ఏ వికారం లేదు. నిర్వికారమైన స్థితే 'కల్పనారహితా'. ఎటువంటి

అలజడులు, అల్లకల్లోలాలు లేని నిశ్చల శాంత స్థితి. అదే 'శాంత్యతీతకళాత్మికా' 'గంభీరా' 'గగనాంతస్థా'. అప్పుడే మన లోపల ఉన్న ఆ అంతర నాదాన్ని ఆస్వాదించగలం. అదే 'గానలోలుపా'. ఆ స్థితిలో మనకి రెండవ వస్తువు లేదు కనుక 'గర్వితా'. ఆ నిండైన ఆనందానుభూతి స్థితే 'కాష్ఠా' అని తరువాత నామంలో చెప్తున్నారు.

859. కాష్ఠా – శ్రీ కాష్ఠాయై నమః

'కాష్ఠా' అనేది వైదిక శబ్దం. ఏకస్థితిలో ఉండిపోవుట. మరొక వికారం అక్కడ లేదు. నిర్వికారస్థితికి 'కాష్ఠము' అని పేరు.

కఠోపనిషత్ 'కాష్ఠా' అనే దాని గురించి చెప్తూ– **'మహతీ పరమోఽవ్యక్తం అవ్యక్తాత్ పురుషః పరః, పురుషాన్నపరా కించిత్ సా కాష్ఠా సా పరా గతిః'** అన్నది. ముందు నామాల్లో మనం చెప్పుకున్నట్లుగా స్థూలం నుండి సూక్ష్మంలోకి వెళ్ళేటప్పుడు బుద్ధి వరకు వచ్చి దానిపై పరమాత్మ అని చెప్పుకున్నాం. కానీ ప్రకృతి వివేచనలో సూక్ష్మదశలు చాలా ఉన్నాయి.

బుద్ధికి పైన ఉన్నది మహత్. మహత్తుకి పైన ఉన్నది అవ్యక్తం. పరమాత్మ నుంచి అవ్యక్తం, అవ్యక్తం నుంచి మహత్తు, మహత్తు నుంచి అహంకారం, తరువాత బుద్ధి – ఇది క్రమము. అవ్యక్తమహదహంకారాలు దాటి మహత్తు దాకా వెళ్ళినపుడు మహత్తుకి పైన అవ్యక్తం ఉంది. అవ్యక్తం పైన 'పురుషః' 'పూర్ణత్వాత్ పురుషః' ఇక్కడ పూర్ణుడైన పురుషుడు పరమాత్మే. పూర్ణుడైన పరమాత్మ ఉన్నాడు. ఆయన పైన ఎవరున్నారు? 'పురుషాన్నపరం కించిత్' – ఆ పరిపూర్ణమైన ఈశ్వరతత్త్వానికి పైన మరొకటి లేదు. అదే చేరవలసిన స్థితి. అక్కడికి చేరుకుంటే అది 'పరాగతిః', పరమగతి. దానికి పేరే 'సా కాష్ఠా'.

'పురుషాన్నపరం కించిత్ సా కాష్ఠా సా పరా గతిః' మనం చూస్తున్న ఇంద్రియాలు, బుద్ధి, మనస్సు అన్నీ దాటి మహత్తును, అవ్యక్తాన్ని కూడా దాటిపోయిన తరువాత ఉండే పరతత్త్వం ఏదుందో, దేని తరువాత మరేదీ లేదో ఆ పరతత్త్వమే 'సా

కాష్ఠా సా పరా గతిః'.

'గగనాంతస్థా'కి 'కాష్ఠా' ఎలా సరిపోయిందో పరిశీలించాలి. ఒకదాని కొకదానికి అనుబంధం చూపిస్తున్నారు వశిన్యాదివాగ్దేవతలు.

కాష్ఠా అనే దానికి మరో అర్థం– శివునికి గల అష్టమూర్తులలో ఒకొక్క స్వరూపానికి ఒకొక్క పేరు చెప్పుకున్నాం. అమ్మవారికి కూడా ఆయన పేరుకి తగ్గట్టు పేర్లు ఉన్నాయి. ఆకాశమూర్తి అయిన శివునికి భీమా అని పేరు. పృథ్వీమూర్తికి శర్వ అని పేరుంది. 'శర్వాయ క్షితిమూర్తయే నమః', 'భవాయ జలమూర్తయే నమః', 'రుద్రాయ అగ్నిమూర్తయే నమః', 'ఉగ్రాయ వాయుమూర్తయే నమః', 'భీమాయ ఆకాశమూర్తయే నమః'. ఆకాశము నందు ఉన్నవాడంటే ఆకాశము కంటే గొప్పవాడు గనుక 'గగనాంతస్థా'. ఆ ఆకాశము నందున్న ఈశ్వరుడు భీముడైతే, ఆయన భార్యపేరు 'కాష్ఠా'. కాష్ఠా అర్థం– **'దశదిక్స్వరూపిణీ'**. పది దిక్కుల రూపంలో వ్యాపించి ఉన్న తల్లి. ఆమె లేకపోతే దిక్కు తోచదు. దిక్కు లేదు. జగతికే దిక్కై ఉన్న దిక్స్వరూపిణి 'కాష్ఠా'. ఆ దిక్స్వరూపిణి భీముని పత్ని. భీముడు ఆకాశరూపుడైన పరమేశ్వరుడు. ఇది 'కాష్ఠా' అనే దానికి రెండవ అర్థం.

కాష్ఠా అనే దానికి మూడవ అర్థం– **'వేదాంత వాక్యానాం నిష్ఠా కాష్ఠేతి కథ్యతే'** – వేదాంత వాక్యాలపై నిష్ఠ ఉంటే దానిని 'కాష్ఠా' అంటారు. నిష్ఠ అంటే చెదరకుండా ఉండుట. వేదాంత వాక్యాలయందు బుద్ధిని చెక్కుచెదరకుండా నిలిపితే, అది క్రమముగా పరతత్త్వములో నిలుస్తుంది. కర్రని తీసుకొచ్చి నిప్పులో నిలిపితే, అది నిప్పైపోతుంది. అలాగే మన బుద్ధిని పరతత్త్వంలో నిలిపితే అదే పరతత్త్వం అయిపోతుంది. ఆ స్థితే 'కాష్ఠా'.

'కాష్ఠా' అనే దాని గురించి 'దేవీమాహాత్మ్యం'లో చెప్తూ,

"కళా కాష్ఠాదిరూపేణ పరిణామప్రదాయినీ

విశ్వస్యోపరతే శక్తేః నారాయణి నమోఽస్తు తే"

అన్నారు. "ఈ జగతిని నువ్వు కాలరూపంలో మార్పు చేస్తున్నావమ్మా! ఆ కాలంలో సూక్ష్మమైన కాలం మొదలుకుని మహాకాలం వరకు నీ స్వరూపమే"

అంటూ 'కాష్ఠా' అనే శబ్దం అక్కడ ప్రయోగించారు. అక్కడ కాలం యొక్క పర్యాయపదమే కాష్ఠా. పద్దెనిమిది రెప్పపాట్ల కాలాన్ని 'కాష్ఠా' అంటారు. రెప్పపాటు కాలం సూక్ష్మకాలం. పద్దెనిమిదికి ఒక పూర్ణత్వం ఉంది. 'కాష్ఠా' అంటే సూక్ష్మకాలరూపిణి.

860. కాంతా - శ్రీ కాంతాయై నమః

మునుపు కూడా కాంతా నామం వచ్చింది. కాబట్టి ఇక్కడ మళ్ళీ కాంతా నామం వస్తే ఇది పునరుక్తి అవుతుందని కొంతమంది ఆ నామాన్ని 'అకాంతా' అని విభజన చేశారు. కాదని అనలేం కానీ, అవునని ఒప్పుకోలేము. అకాంతా తీసుకోనక్కర్లేదు. పునరుక్తి దోషం కాదు అని "పునః" స్మరించుకుందాం.

'అకాంతా' అనే దాని గురించి ముందు అర్థం చెప్పుకుందాము. సంధిలో కాష్ఠాకాంతా అన్నప్పుడు అకాంతా తీసుకున్నా తప్పేమీ లేదు. భాస్కరరాయలవారే 'అకాంతా' అని విభజన చేశారు. అంతకు పూర్వం ఉన్న నారాయణభట్టు మొదలైన వారందరూ 'కాంతా' అనే విభజన చేశారు. రెండూ తీసుకోవచ్చు. ఇద్దరూ సిద్ధిపొందిన మహాత్ములే కనుక ఇద్దరు మహానుభావుల వల్ల మనకి రెండు కొత్త విషయాలు తెలుస్తాయి.

'కాంతా' అంటే కమనీయత్వాత్ 'కాంతా'. కమనీయమైనది కాంతా. కమనీయమంటే కోరుకోదగినది అని చెప్పుకున్నాం. కోరుకోదగినది ఆనందము. అమ్మవారు ఆనందస్వరూపిణి.

క + అంతా కలిపితే 'కాంతా'... అనగా బ్రహ్మకి కూడా అంతమును ఇచ్చునది అని అర్థం. 'గగనాంతా' అయినపుడు 'క-అంతా' అయ్యింది. బ్రహ్మదేవునికి కూడా పైన ఉన్న తల్లి.

'అకాంతా' అని మరో అర్థం చూస్తే కం అంటే సుఖం. అకం అంటే దుఃఖం. 'అకాంతా' అంటే దుఃఖాన్ని అంతము జేయు తల్లి అని అర్థం.

861. కాంతార్ధవిగ్రహా - శ్రీ కాంతార్ధవిగ్రహాయై నమః

కాంతుని దేహంలో సగమై ఉంది. కాంత అంటే అమ్మవారు. కాంతుడు అంటే అయ్యవారు. అమ్మవారిని వెతుక్కోవాలంటే ఆయనలో వెతుక్కోవాలి.

బృహదారణ్యకోపనిషత్తులో దీనిని చెప్తూ- **'ఆత్మానం వేదాపాతయతే తతః పతిశ్చ పత్నీశ్చాభవతాం'** అన్నారు. ఆత్మస్వరూపం తనని తాను రెండు చేసుకుంది. అదే పతి, పత్నీ భావాలుగా కనబడింది. అదే ఇక్కడ కాంతార్ధవిగ్రహా. ఆ పరతత్త్వమే ఆ రెండు రూపాలుగా గోచరిస్తూ ఉంది. అర్ధనారీశ్వర స్వరూపం. ఇంకా చెప్పాలంటే శ్రీచక్రం. ఇది 'కాంతార్ధవిగ్రహా'.

శ్రీచక్రంలో సగం శివునిది, సగం అమ్మవారిది. ఈ కాంత 'కాంతార్ధవిగ్రహా'గా ఉన్నది. ఇక్కడ 'కాంతా' ఉంది, 'కాంతార్ధం' ఉంది. **శ్రీచక్రం శివయోర్వపుః -** శివశక్తుల రూపమే శ్రీచక్రము.

862. కార్యకారణనిర్ముక్తా - శ్రీ కార్యకారణనిర్ముక్తాయై నమః

ఈమెకి కార్యం లేదు. కారణము లేదు. కార్యము అంటే ప్రపంచము. కారణము అంటే ప్రకృతి. ఈ జన్మ కార్యమైతే, దీనికి కారణమైనవి కర్మలు. జన్మలో మరికొన్ని కర్మలు తరువాత జన్మకు కారణాలు. ఇలా సాగుతూ ఉంటాయి.

తల్లిని ఈ కార్య కారణాలు ప్రభావితం చెయ్యలేవు. కార్య కారణము లేనిది అన్నప్పుడు ఈ ప్రపంచముగాని, ప్రపంచానికి మూలకారణమైన గుణకర్మ వికారములు కానీ లేని తల్లి అని అర్థం.

'న తస్య కార్యం కరణం చ విద్యతే' అని శ్రుతి చెప్తోంది. పరతత్త్వానికి కార్యకారణాలు లేవు. ఆ తల్లి నిర్మాణము కాని తత్త్వం. ఎప్పుడూ ఉన్నది. తానే అన్నీ నిర్మిస్తున్నది. ప్రాపంచిక వస్తు వికారాలు లేనిది. పరమార్థతః కేవల చైతన్యస్వరూపిణి.

863. కామకేళీతరంగితా - శ్రీ కామకేళీతరంగితాయై నమః

ఆగకుండా వస్తూ ఉన్నదానిని పౌనఃపున్యమంటారు. తరంగమంటే అదే.

తరంగితం అంటే నిరంతరాయం... అనంతం. ఆ ఆనందమే కామకేళి.

కామ అంటే ఆనందం. కేళీ అంటే లీల. ఆ ఆనందపు వ్యక్తీకరణ అనంతం.

మరొక అర్థం– కామకేళీ అనే దానిలో విశేషం కేళి... అంటే ఆట. కామ అంటే పరమాత్మ. సృష్టిని చెయ్యాలనుకున్న ఈశ్వరుడు కామేశ్వరుడు. ఆయన సృష్టి చేయాలని కామించాడు. కనుక పరమేశ్వరుడే కామ. కామేశ్వరీ – కామేశ్వరులు కలిపి కామ శబ్దం. సృష్టి, స్థితి, సంహార, అనుగ్రహ, తిరోధానాలనే పంచకృత్యాల ఈ ప్రపంచమంతా వారి కేళి. ఆనందస్వరూపులైన శివశక్తుల కేళి ఈ ప్రపంచం. ఇది ఎప్పుడూ ఆగదు. జననం తరువాత మరణం. మరణం తరువాత జననం. ఉదయం తరువాత రాత్రి. రాత్రి తరువాత ఉదయం. ఇలా తరంగితమై వస్తోంది. ఈ తరంగితమైన జగత్తు అంతా ఆ శివశక్తుల ఆట. వారి సృష్టి స్థితి లయలు అనబడే కృత్యాల యొక్క తరంగమే ఈ ప్రపంచమంతా. ఇది ఎవరు చేస్తున్నారో వారు కామ. **'పంచాననం ప్రబలపంచ వినోదశీలం...'** (శివపురాణం) ఈ వినోదమే కేళి. కామ కామేశ్వరుల పంచకృత్యకేళి.

మరొక భావం శ్రీచక్రంలో బిందువు మధ్య ఉన్న తల్లి పేరు మహాకామేశ్వరీ. శ్రీశ్రీ లలితామహాత్రిపురసుందరీ పరాభట్టారికా శ్రీమద్రాజరాజేశ్వరి. ఆ పరమేశ్వరి బిందువు. ఒక్కసారి స్పందన కలిగింది. అదే కేళీ. ఆ స్పందన రాగానే త్రికోణచక్రం, అష్టత్రికోణచక్రం, రెండు పది త్రికోణాల చక్రాలు, పధ్నాలుగు త్రికోణాల చక్రం, అష్టదళపద్మం, షోడశదళపద్మం, చతురస్రం – ఇన్ని తరంగాలు ఏర్పడ్డాయి. ఈ తరంగాలన్నీ ఆ బిందువులో ఉన్న కామేశ్వరీ కేళి వల్ల ఏర్పడ్డాయి. శ్రీచక్రరూపమే ఇందులో ఉంది. ఇది మరొక అర్థంగా భావన చేయవచ్చు.

864. కనత్కనకతాటంకా – శ్రీ కనత్కనకతాటంకాయై నమః

మళ్ళీ తాటంకాల వర్ణన. తాటంకాలు అంటే చెవికమ్మలు. ప్రకాశిస్తున్న బంగారపు తాటంకాలు కలది. ప్రకాశించుచున్న ధాతువు అంటే బంగారమే. సృష్టి స్థితి లయలు అనే కేళిని నిర్వహిస్తున్నప్పుడు ప్రధానంగా కాలాన్ని ఆధారం చేసుకొని

చెయ్యాలి. కాలానికి సూర్యచంద్రులు ఇద్దరే కొలబద్దలు. కనుకనే ఇద్దరినీ రెండువైపులా పెట్టుకొంది. 'తాటంకయుగళీభూతతపనోడుపమండలా' అదే 'కనత్కనకతాటంకా'.

మంత్రము యొక్క లక్షణమే ప్రకాశము, తేజస్సు. అమ్మవారి ఒకొక్క మంత్రం సువర్ణకాంతులు వెదజల్లుతూ ఉంటుంది. దేవియే హిరణ్మయీ, హిరణ్యవర్ణా. ఆ హిరణ్మయమే కనత్కనకం.

అక్షరశాస్త్రం ప్రకారంగా తాటంకం అంటే గుర్వక్షరం. దీర్ఘాక్షరమని అర్థం. సాగదీసి చెప్పేది. ఆ దీర్ఘాక్షరంలో ఉన్న తేజస్సే కనత్. 'కనత్కనకతాటంకా' అంటే ప్రకాశమానమైన దీర్ఘాక్షరము అమ్మ యొక్క రూపము. ఆ దీర్ఘాక్షరం ఓం. ప్రపంచానికి మూలమైన తేజస్సు ఓంకారంలో ఉంది.

ఈం, హ్రీం, శ్రీం - ఇవన్నీ దీర్ఘాక్షరాలే. గుప్తప్రణవం మొదలుకొని మహాప్రణవం వరకు బీజాక్షరరూపిణి. ముందు చెప్పుకున్న తాటంకాలకి అర్థం కాకుండా ఇప్పుడు ఈ అర్థంలో తీసుకుంటే పునరుక్తి కాదు.

మెరిసిపోతున్న తాటంకాలతో కూర్చున్న తల్లిది అందమైన రూపం. 'కామకేళీతరంగితా', 'గగనాంతస్థా'లో రూపం చెప్పలేదు. ఇప్పుడు ఈ రూపం ఎలా వచ్చింది? ఆ తల్లి లీలగా రూపాన్ని ధరించింది...

865. లీలావిగ్రహధారిణీ –శ్రీ లీలావిగ్రహధారిణ్యై నమః

లీలతో విగ్రహము ధరించునది. లీల అనే పదానికి రెండర్థాలు ఉన్నాయి. 1. తాను మాత్రమే స్వతంత్రముగా చేస్తున్నది కనుక లీలా. 2. అనాయాసేన కృతం – అనాయాసంగా చేసే పని లీల. అలా ఆ తల్లి స్వతంత్రంగా, అనాయాసంగా రూపాన్ని స్వీకరించింది.

తన ఇచ్ఛతో తాను భక్తుల ఉపాసన కోసం, వారిని అనుగ్రహించడం కోసం దివ్యమంగళ విగ్రహము ధరించి వచ్చింది. లీల అంటే ఆనందము, అనాయాసము, ప్రేమ, కరుణ – ఇవన్నీ చెప్పుకోవాలి. లీలావిగ్రహధారిణీ అంటే కరుణతో విగ్రహము ధరించిన తల్లి. 'కామకేళితరంగితా'లో ప్రస్తావించిన పంచకృత్యాలకు అనుగుణంగా

సృష్టిలీలకు బ్రహ్మవిగ్రహం, స్థితిలీలకు విష్ణుమూర్తి, సంహారలీలకు రుద్రరూపం, తిరోధానాలయందు ఈశ్వరాకృతి, అనుగ్రహమందు సదాశివ స్వరూపం కలది కనుక 'లీలావిగ్రహధారిణి'.

లోకంలో పరాకాష్ఠ అని పేరుంది. ఏదైనా సంపూర్ణస్థితికి చేరినపుడు, దానిని మించి మరొకటి లేనపుడు 'పరాకాష్ఠ' అని అంటారు. ఆ పరాకాష్ఠే 'కాష్ఠ'తత్త్వములో ముందు విస్తారంగా చెప్పుకున్నాం. ఆ 'కాష్ఠ'తత్త్వమైన సంపూర్ణ ఆనందస్వరూపమే కామము అని చెప్పబడుతున్నది. ఆ శివశక్త్యాత్మకమైన ఆనందశక్తి నుంచే సృష్టి కృత్యములుగా కేళి జరిగి విశ్వమంతా కూడా తరంగితమైందని 'కామకేళీతరంగితా' చెప్పుకున్నాం. ఆ కాష్ఠతత్త్వమే లీలతో దివ్యమంగళ విగ్రహాన్ని ఉపాసకులను అనుగ్రహించడం కోసం స్వీకరించింది.

'ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా' – ఉపాసకులకై బ్రహ్మము సగుణమై, సాకారమై సాక్షాత్కరిస్తున్నది. అయితే ఒక విగ్రహము, ఒక రూపము ధరించగానే ఎప్పుడు ధరించిందనే ప్రశ్న వస్తుంది. కానీ ఆమెకు ఆది చెప్పడానికి లేదు కనుక తరువాత నామం...

866. అజా – శ్రీ అజాయై నమః

జన్మలేనిది. లీలావిగ్రహరూపం ధరించినంతమాత్రాన ఒక కాలంలో పుట్టింది అని చెప్పడానికి లేదు. అనాది అయిన తల్లి. అజా నామం గతంలో 'అష్టమూర్తిరజాజైత్రీ' వద్ద వచ్చింది. రెండుమార్లు వచ్చిందంటే అర్థ భేదంతో ఇక్కడ స్వీకరించవచ్చు.

'అజా' శబ్దానికి ఉపనిషత్ చెప్పిన ప్రకారంగా **'అజో నిత్యః శాశ్వతోయం పురాణః'** – ఏది శాశ్వతము, నిత్యము, సనాతనము అయి ఉన్నదో అది 'అజా'.

అజా శబ్దానికి "మాయా" అని కూడా అర్థం ఉంది. అమ్మవారి లీలావిగ్రహరూపధారణ కూడా **'సంభవామి ఆత్మ మాయయా'** అన్నట్లు తన యొక్క మాయాశక్తి చేతనే ధరిస్తుంది. ఆ మాయాశక్తిని ఇక్కడ 'అజా' అని చెప్పుకోవచ్చు. **'అజాం ఏకాం లోహిత శుక్లకృష్ణాం'.**

అజా శబ్దానికి మరొక అర్థం – **'అజతి గచ్ఛతి క్షిపతి ఇతి వా అజః'.** అజ అంటే నడచునది, వ్యాపించునది, ప్రేరేపించునది, వెదజల్లునది అని ఇన్ని అర్థాలు ఇక్కడ తీసుకోవచ్చు.

అమ్మ సర్వత్రా వ్యాపించునది కనుక 'అజా'.

ప్రతివారి బుద్ధులను ప్రేరేపిస్తున్నది కనుక 'అజా'.

ఈ సృష్టిలో ఎవరికి ఏది కావాలో వెదజల్లుతుంది. పంట పండించేటప్పుడు రైతు పొలంలో ముందుగా విత్తనాలు వెదజల్లుతాడు. ఆ వెదజల్లిన విత్తనాలకు అనుగుణంగా అంకురాది సస్యాలు తయారు అవుతాయి. అదే విధంగా జీవులకి కర్మ బీజములు వెదజల్లి సృష్టిని ఉత్పన్నం చేస్తున్నది కనుక 'అజా'.

ఈ నామాన్ని ఇన్ని రకాలుగా భావిస్తూ, తరువాతి నామం 'క్షయవినిర్ముక్తా'లో నిత్యతత్త్వాన్ని నొక్కి చెప్తున్నారు.

867. క్షయవినిర్ముక్తా – శ్రీ క్షయవినిర్ముక్తాయై నమః

క్షీణించుట, నశించుట లేని తల్లి. పుట్టుక లేని తల్లి అజా. సాధారణంగా పుట్టిన తరువాత దశలు ఉంటాయి. క్రమక్రమంగా పెరుగుట, తరుగుట, తరువాత నశించుట. ఆ దశలు కూడా లేవు కనుక క్షయవినిర్ముక్తా.

868. ముగ్ధా – శ్రీ ముగ్ధాయై నమః

ముగ్ధా అనే శబ్దానికి అనేక అర్థాలు ఉన్నాయి. ముఖ్యంగా ముగ్ధా అంటే **'అంకురిత యౌవనా'** అని శాస్త్రీయమైన అర్థం. యౌవనము అంకురిస్తున్న దశలో ఉన్న స్వరూపాన్ని ముగ్ధా అనాలి. లేత యౌవనపు దశ.

ముగ్ధ శబ్దానికి– 'సుందర మూఢయోః' అన్నప్పటికీ కూడా సందర్భము ప్రకారము సౌందర్యమే తీసుకోవాలి. పైగా అమాయకంగా ఉన్నవారిని, ప్రసన్నంగా ఉన్నవారిని కూడా ముగ్ధ సౌందర్యము అనడం వ్యవహారంలో ఉంది. అలా అమ్మవారు ఎటువంటి డాంబికము, రాగద్వేషాలు లేకుండా ప్రసన్నంగా ఉంటారు కనుక ఆ

తల్లిని ముగ్ధా అని అనడం ఈవిధంగా కూడా సరిపోతుంది.

'ముగ్ధా' అంటే షోడశవర్ష ప్రాయ. షోడశీ స్వరూపంగా నిత్యం పదహారు యేళ్ళ వయస్సులో ఉంటుంది. 'అజా' 'క్షయవినిర్ముక్తా' చెప్పి 'ముగ్ధా' చెప్పడంలో ఉద్దేశం – పుట్టుక, నశించుట లేకుండా ఎల్లవేళలా నిండైన పరిపూర్ణదశలో ఉన్నదని భావం..

అమ్మవారి లీలా విగ్రహము యొక్క లక్షణము ఇది. దివ్య మంగళ విగ్రహం ఎప్పుడు ధరించిందో ఎవరూ నిర్ణయించలేరు కనుక 'అజా'. ఆ లీలా విగ్రహానికి కూడా నాశనము మొదలైనవి లేవు. భగవద్రూప లక్షణాలను చెప్తూ శివపురాణం చెప్తున్న మాట.

సర్వే నిత్యాః శాశ్వతాశ్చ దేహాస్తస్య పరాత్మనః
హానోపాదానరహితాః నైవ ప్రకృతిజాః క్వచిత్

భగవద్రూపాలు జ్ఞాన ఆనందవిగ్రహాలు కనుక వాటికి తరుగుదల, పెరుగదల, నశించుట ఉండవు (క్షయవినిర్ముక్తా). అవి నిత్యములు. పరమ జ్ఞానమాత్రములు. ఆనందసందోహాలు. అదే ముగ్ధమైన స్వరూపం. అలాంటి ఆ రూపాన్ని ధ్యానిస్తే వచ్చే అనుగ్రహం.

869. క్షిప్రప్రసాదినీ – శ్రీ క్షిప్రప్రసాదిన్యై నమః

శీఘ్రముగా అనుగ్రహించే తల్లి. 'అజా' నుంచి 'క్షిప్రప్రసాదినీ' వరకు ఉన్న నాలుగు నామాలను కలిపి **'క్షిప్రప్రసాద జగదంబా మంత్రం'** అని మంత్రద్రష్టలు చూపించారు.

శ్రీవిద్య లభిస్తే చరమజన్మ అని ఎందుకన్నారంటే మోక్షం అంత తేలిక కాదు. అది ఎన్ని జన్మల దూరం ఉందో మనకి తెలియదు. అమ్మవారిని ఆశ్రయించామంటే అన్ని జన్మల దూరము లేదు. **'ఆరాధనాదుమేశస్య తస్మిన్జన్మని ముచ్యతే'** అని సౌరపురాణం. ఉమేశ్వరుని అంటే ఉమాసహితుడైన పరమేశ్వరుని అంటే శివశక్తులను ఎవరైతే ఆరాధిస్తారో వారికి ఆ జన్మలోనే మోక్షం వస్తుంది. జ్ఞానం లేనిదే మోక్షం

రాదు కదా అంటే ఆ జ్ఞానం కూడా వారే ఇస్తారు. జ్ఞానం కోసం మనం కష్టపడక్కర్లేదు. దీనికి అనేక విధాలైన ఉదాహరణలు చెప్పారు.

'అన్యథా సంప్రదాయేన జప హోమార్చనాదికం
కృతం జన్మాంతరే సమ్యక్ సంప్రదాయాయ కల్ప్యతే'

అన్నారు. గత జన్మలలో ఎన్నో పుణ్యమైన కార్యాలు, యజ్ఞాలు చెయ్యగా ఈ జన్మలో అమ్మని ఆరాధించే భాగ్యం లభిస్తుంది. ఇది లభించిందా ఇంక ముక్తి తప్పకుండా ప్రాప్తిస్తుంది. (తంత్రరాజం)

అభీష్టాన్ని కోరి అమ్మని ఆరాధించినా వెంటనే అనుగ్రహిస్తుంది. అంతేకాక – అనడంలో మోక్షాన్ని శీఘ్రంగా అందించునది అని మరియొక అర్థం. ఇది క్షిప్రప్రసాద లక్షణం. ఇలా దేవతాలక్షణాలలో క్షిప్ర అనే భావన కలిపి ఉపాసన చేసినట్లైతే అనుగ్రహం తొందరగా లభిస్తుంది.

క్షిప్రప్రసాదనం కావాలంటే ఉపాసనాపద్ధతిలో కొన్ని విశేషాలు అనుసరించాలి. ఆ అనుసరించే విధానాలని తరువాత నామంలో చెప్తున్నారు.

870. అంతర్ముఖసమారాధ్యా – శ్రీ అంతర్ముఖసమారాధ్యాయై నమః

అమ్మవారి సహస్రం సాధనా శాస్త్రం. ఏముంటే అమ్మ అనుగ్రహిస్తుందో చెప్తున్నారు. 'ఆరాధ్యా' నామాల్లో మరొకటి వచ్చింది. వీరారాధ్యా, దురారాధ్యా నామాల వ్యాఖ్యానంలో విశేషంగా ఎన్నో చెప్పుకున్నాం. వాటిల్లో ఈ నామాన్ని చేర్చుకోవాలి.

'అంతర్ముఖసమారాధ్యా' 'బహిర్ముఖసుదుర్లభా' – ఇవి జంట నామాలు. ఈ రెండిటికి అద్భుతమైన అనుబంధం ఉంది. అంతర్ముఖుల చేత సమగ్రముగా ఆరాధింపబడుతున్నది. ఆరాధన–సమారాధన. ఆరాధన అంటేనే గొప్పమాట. రాధనము, ఆరాధనము. 'ఆ' అంటే ఆసమంతాత్ అని. మళ్ళీ సం అని చెప్పడంలో ఉద్దేశం – శాస్త్రపద్ధతిని అతిక్రమించకుండా సంపూర్ణముగా, పరిపుష్టిగా ఆరాధన చేస్తే అది సమారాధన అవుతుంది. అంతర్ముఖులది సమారాధాన.

ముఖ్యంగా అమ్మవారి ఉపాసనలో అంతర్ముఖసమారాధన స్పష్టంగా కనబడుతుంది. ఆదిశంకరులు ఎప్పుడూ దీనికి ప్రాధాన్యం ఇచ్చేవారు. అంతేగాని బాహ్యారాధన వద్దని చెప్పడం కాదు. అంతర్ముఖస్పృహతో చెయ్యాలి. లోకంలో కూడా మనమేదైనా పని చేసేటప్పుడు 'మనసు పెట్టి చెయ్యరా' అని ఒక మాట అంటుంటారు. ఏదో చేశామంటే దాని ఫలితం కూడా ఏదేదోలానే ఉంటుంది. ఏది చేసినా మనసారా చెయ్యాలి.

ఏది చేస్తున్నామో దాని యందు అఖండమైన విశ్వాసం ఉండాలి. ఎదురుగా విగ్రహమనే పదార్థం ఉంది. లేదా శ్రీచక్రమనే వస్తువు ఉంది. దానికి పువ్వులనే మరొక పదార్థం వేస్తున్నామని అనుకోరాదు.

'సర్వం విద్యామయం భావయేత్' అన్నారు. అమ్మవారి ఆరాధన చేసేటప్పుడు మొత్తం అన్ని సమకూర్చుకుని, తనని తాను శుద్ధి చేసుకుని, తరువాత 'సర్వం విద్యామయం భావయేత్' అనే మంత్రాన్ని చదువుతారు.

అది భావంలోకి తెచ్చుకోవాలి. అక్కడ ఉన్నదంతా విద్యామయం. అలాంటి స్థితిలో అమ్మవారి ఆరాధన చెయ్యమన్నారు కానీ ఆరాధన మానేయమనలేదు. భావంతో చెయ్యమన్నారు. అప్పుడది సమారాధన అవుతుంది.

భావంతో చెయ్యడమంటే బాహ్యం విడిచిపెట్టడం కాదు. ఇది కేవలం పూజాకాలంలోనే కాక సర్వకాలాలలోను చెయ్యాలి. దీనినే భావనాయోగం అంటారు. త్రిపురారహస్యంలో దత్తాత్రేయస్వామివారు భావనాయోగం గురించి చాలా అద్భుతమైన అంశాలను వివరించారు.

అంతర్ముఖసమారాధన గురించి తెలుసుకోవడానికి కొన్ని అంశాలని భావనోపనిషత్తులోనివి తీసుకోవాలి. జ్ఞానం అర్ఘ్యం అన్నారు. మనం సాధారణంగా పూజలో అర్ఘ్యం అంటే నీరు వెయ్యడమనుకుంటాం. అంతర్ముఖసమారాధనలో జ్ఞానం అర్ఘ్యం అన్నారు. జ్ఞానమంటే మనం ఎవరిని ఆరాధన చేస్తున్నామో వారి తత్త్వం ఏమిటో తెలుసుకోవడం.

'జ్ఞేయం హవిః' – ఈ జ్ఞానం ద్వారా దేనిని తెలుసుకుంటున్నామో ఆ తెలుసుకునే

వస్తువే హవిస్సు. 'జ్ఞాతా' 'హోతా' – ఆ జ్ఞానాన్ని, జ్ఞేయాన్ని అనుసంధానం చేస్తున్న ఉపాసకుడే హోత. హోత అంటే అగ్నిహోత్రములో ఆహుతులు వేసేవాడు.

జ్ఞాతృ–జ్ఞాన–జ్ఞేయ అభేదభావనం శ్రీచక్రార్చనం. జ్ఞానం అర్ఘ్యం, జ్ఞేయం హవిః, జ్ఞాతా హోతా – ఈ మూడింటి మధ్య అభేదభావాన్ని మననం చేసుకుంటూ ఉంటే అదే శ్రీచక్రార్చనం. ఆ స్థితి కావలసినది.

కామేశ్వరీ, కామేశ్వరులు అన్నాం. కామేశ్వరుడు ఎవరు? **'నిరుపాధిక సంవిదేవ కామేశ్వరః'** – ఉపాధిగతమైన చైతన్యం మనం చూస్తున్నాం. ఉపాధికి అతీతమైన చైతన్యమే కామేశ్వరుడు. ఆ కామేశ్వరుని ఆనందశక్తి అమ్మ. ఆ ఆనందశక్తి ఎక్కడ ఉంది? **'సదానందా పూర్ణా స్వాత్మైవ పరదేవతా లలితా'** – మనలో స్వాత్మగా ఉన్నదే లలితా. ఆమెను ఉపాధులకి అతీతంగా భావన చెయ్యాలి. అలా చేసినపుడు అదే శివ శక్తి అవుతుంది. **'అనన్య చిత్తత్వేన సిద్ధిః'**– మనలో ఉన్న ఆత్మస్వరూపమే లలితాదేవి అని భావన చేస్తూ ఇతర చింతనలు విడిచిపెడితే, ఆత్మకి అన్యమైనిది లేదని అనుభవానికి వస్తే అదే సిద్ధి.

'భావనయా క్రియాః ఉపచారాః' – భావనా క్రియలే ఉపచారాలు. మొత్తం లలితాసహస్రం ఆధారం చేసుకుని ఒకచోట మౌనంగా కూర్చుని అమ్మవారి ధ్యానము, ఆవాహనము అన్నీ చెయ్యవచ్చు. శంకరులు ఎక్కువగా మానసిక పూజాస్తోత్రాలు రచించారు. చతుష్షష్ట్యుపచార పూజ రచించారు. దానికి 'దేవీ మానసికపూజా స్తోత్రమ'ని పేరు పెట్టారు.

మంత్రాహంకారం, ఉపాసనాహంకారం దగ్గరకి రానీయరాదు. ఇంకా అంతర్ముఖత్వానికి ఎంత దూరంగా ఉన్నామో తెలుసుకుంటూ సిగ్గుపడుతూ పూజ చేయాలి. ఆ సిగ్గుపడుతూ ఉపచారం చేయడమే– 'శ్రద్ధయా దేయం, భియా దేయం, హ్రియా దేయం'. నమ్మకం / శ్రద్ధతో చేస్తున్నావు కాబట్టి మంచిదే. "అయ్యో! అలాంటి తల్లికి నేను ఎక్కడ చేయగలను?" అని హ్రియా(సిగ్గుతో), భియా(భయంతో) – ఈ రెండు ఉంటే తప్పకుండా అమ్మ మనల్ని తన వైపు త్రిప్పుకుంటుంది. సందేహం లేదు.

'క్షిప్రప్రసాదినీ'కి, 'అంతర్ముఖసమారాధ్యా'కి సంబంధం ఎందుకు చెప్పారో చూడాలి. భావనోపనిషత్తులో– **'ఏవం ముహూర్త త్రితయం ముహూర్త మాత్రంవా'** అంటారు. "ఇప్పుడు చెప్పిన భావనని ఒక మూడు ముహూర్తాలుగాని, ఒక్క ముహూర్తం గాని ధ్యానిస్తే చాలు వెంటనే అతను శివునితోనే సమానమైపోతున్నాడు" అంటే అభేదస్థితిని పొందుతున్నాడు. అదే క్షిప్రప్రసాదం. **సోహం భావేన పూజయేత్** – అదియే 'అంతర్యుఖ సమారాధ్యా'.

దేహ ధ్యాస వదలి ఆత్మాభిముఖమగుటయే – ఆత్మరూపిణియైన దేవితో తాదాత్మ్యం చెందడమే అంతర్ముఖ సమారాధన. దానిచే ఆరాధింపబడే పరతత్త్వం – సమారాధ్యా.

871. బహిర్ముఖసుదుర్లభా – శ్రీ బహిర్ముఖసుదుర్లభాయై నమః

బహిర్ముఖత్వం కలిగిన వారికి దుర్లభమైనది. దుర్లభా అంటే మహాకష్టం. 'సు' అంటే మిక్కిలి అని అర్థం. బహిర్ముఖులకి చాలా చాలా దూరం. **'తద్దూరే తద్వంతికే'** అనే ఈశావాస్యోపనిషత్ మంత్రం. ఎంతో దూరం ఆ ఈశ్వరుడు. ఎంతో దగ్గర ఈశ్వరుడు. ఎవరికి దగ్గర? అంటే అంతర్ముఖులకి. ఎవరికి దూరం? అంటే బహిర్ముఖులకి దూరం. **'తరలకరణానాం అసులభా'** – ఇంద్రియనిగ్రహం లేని బహిర్ముఖులకు సులభము కానిది (ఆదిశంకరులు)

ఈ నామాన్ని 'దుర్లభా, దుర్గమా, దుర్గా నామాల వద్ద అనుసంధానం చేసుకోవచ్చు. బహిర్ముఖులకి దుర్లభం అని చెప్పారు. మనం బయట దొరికితే గ్రహించవచ్చు అని భావిస్తాం కానీ, లోపలే ఆవిడ ఉంది.

మన శరీరం కంటే మనకి దగ్గరై, ఇంకా ఆలోచిస్తే అది మనమే అయి ఉన్న తత్త్వం ఏదైతే ఉందో ఆ తత్త్వమే అమ్మ. భావన ద్వారానే మనకి సిద్ధిస్తుంది. అది లేని వారు, కేవలం బాహ్యమైన జగద్విషయములపై దృష్టి కలవారికి అంతస్తత్త్వం దుర్లభం.

ఈ భావన బలపడడం కోసం అప్పయ్యదీక్షితులవారు భావనోపనిషత్తుకి

అద్భుతమైన భాష్యం రచించారు. విన్నది, చదివినది నిరంతరం విచారణ చెయ్యడమే ఉపాసన. ఆ భావంతో గ్రహించాలి. విచారణ చేస్తే శ్రీచక్రోపాసన చేసినట్లే. బ్రతుకంతా మంత్రం చేస్తూ ఉన్నా మంత్రంలో సారం తెలియాలంటే శ్రవణము, మననము చెయ్యాలి.

మహాసాధన అంటే శ్రవణము, మననము, నిధిధ్యాసనము. భావనోపనిషత్తుకి అద్భుతమైన భాష్యం రచిస్తూ అప్పయ్యదీక్షితులవారు చివరకి చెప్తారు.

ఆత్మా త్వం గిరిజామతిః సహచరాః ప్రాణాశ్శరీరం గృహం
పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధి స్థితిః
సంచారః పదయోః ప్రదక్షిణ విధిః స్తోత్రాణి సర్వాగిరో
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో! తవారాధనం

భక్తునికి ఆ స్థితి ఉంటుంది. దీనినే శంకరులు సౌందర్యలహరిలో **'జపో జల్పః శిల్పం'** అని చెప్పి చివరికి **'ఆత్మార్పణ దృశా'** అన్నారు.

ఈ ఆత్మార్పణ దృష్టి లేక లౌకిక మార్గంలో ప్రవర్తించేవారికి పరమేశ్వరీ పదప్రాప్తి దుర్లభం.

872. త్రయీ - శ్రీ త్రయ్యై నమః

త్రయీ అంటే వేదము. అమ్మవారు త్రయీ స్వరూపిణి. వేదవేద్యమైనది మాత్రమే కాదు... వేదమే అమ్మవారు అని చెప్తున్నారు.

వేదములు నాలుగు. ఆ నాలుగు వేదాలు కూడా మూడు రకాల మంత్రాలు - ఋక్, యజు, సామ రూపములతో ఉంటాయి. ఋక్కులు శ్లోకరూపముగాను, యజుస్సులు గద్య రూపముగాను, సామములు గాన రూపముగాను ఉంటాయి. ఈ మూడు రకాల మంత్రములే ఉంటాయి కనుక నాలుగు వేదాలకి కలిపి 'త్రయీ' అని పేరు.

త్రయీ శబ్దానికి మరో అర్థం- ప్రతి మంత్రానికి కూడా ఆధిభౌతిక, ఆధ్యాత్మిక, ఆధిదైవిక అర్థములని మూడు రకాలు ఉంటాయి. సాధారణ సంస్కృతం చదివి

వాటికి అర్థాలు చెప్పలేరు. అలా మూడు రకాల అర్థాలతో కూడిన శాస్త్రం కనుక 'త్రయీ'.

అమ్మవారు అటువంటి వేదస్వరూపిణి. **'ప్రత్యక్షేణానుమానేన యస్తూపాయో న విద్యతే'.** ప్రత్యక్ష ప్రమాణాలతోనూ, ఊహాప్రమాణాలతోనూ సాధించలేని దాన్ని చెప్పడానికి పనికి వచ్చే శాస్త్రము పేరే వేదము. **'దృష్టాదృష్ట ప్రసాదినీ త్రయీ'** అంటే ఇహలోక, పరలోక, పరమార్థ అని మూడు రకాల సుఖాలు ఉంటాయి. ఇహలోక సుఖం, పరలోక సుఖం రెండూ కలుపుకుంటే లౌకిక సుఖాలు అనాలి. పరలోకం కూడా లోకమేగా? వెళ్ళలేదు కనుక ప్రస్తుతానికి అది పరం. అక్కడికి వెళ్తే అదే 'ఇహం'. ఇహలోక పరలోక సుఖాలు ఇవ్వడానికి వేదమే శరణ్యం. పరమార్థమైన మోక్షసుఖం ఇవ్వడానికి కూడా వేదమే శరణ్యం. అందుకే 'దృష్టాదృష్ట ప్రసాదినీ' అని వేదము యొక్క స్వరూపము చెప్పారు. మనకి దృష్టాదృష్ట ప్రసాదం ఇవ్వడానికి జగన్మాత 'త్రయీ'గా వ్యక్తమయింది.

ఋగ్యజుస్సామ భావేన సాంగవేదగతా యతః
త్రయీతి కథ్యతే లోకే దృష్టాఽదృష్టప్రసాదినీ

ఋగ్యజుస్సామవేదరూపాన ఉన్న దేవి 'త్రయీ' అని శాస్త్రాలయందు చెప్పబడినది. అది జ్ఞాతాజ్ఞాత విషయాలను బోధించునది (దేవీపురాణం).

అకారాదిస్సామవేదో ఋగ్వేదశ్చ తదాదికః
యజుర్వేద ఇకారాది స్తేషాం సంయోగతశ్శుచిః (నిత్యాతంత్రం)

సామవేద, ఋగ్వేదాలు 'అ'కారంతోను, యజుర్వేదం 'ఇ'కారంతోనూ ఆరంభమౌతుంది. మూడింటి కలయిక వాగ్భవబీజం (ఐ) – అదే 'త్రయీ' రూపిణియైన దేవీ స్వరూపం.

873. త్రివర్గనిలయా – శ్రీ త్రివర్గనిలయాయై నమః

త్రివర్గములలోనూ పరమేశ్వరియే ఉన్నది.

త్రివర్గాలలో అమ్మయే ఉందని తెలిశాక అనుభవించే ప్రతి సుఖంలో అమ్మ

వెలుగే కనబడుతుంది. అప్పుడు కృతజ్ఞతతో అమ్మనే స్మరిస్తాం. 'త్రివర్గనిలయా' అంటే ధర్మ, అర్థ, కామములని ప్రధానార్థం చెప్పుకున్నాం.

ఇంకొక విభజన – ధర్మ ఒకటి. అర్థకామములు కలిపి రెండవది. మోక్షం మూడవది. నాలుగింటిని కలిపి త్రివర్గనిలయా. మొత్తం మూడింటిలోను ఉన్నది.

వేదానికి మూడు భాగాలు ఋక్, యజు, సామములు. ఆ మూడు భాగాలులో ఉన్నది అమ్మవారే.

అదేవిధంగా వేదానికి మూలమైనది ఓంకారం. ఆ ఓంకారంలో అకార, ఉకార, మకారములని మూడు భాగాలు ఉన్నాయి. ఆ మూడు భాగములు అమ్మరూపములే. అకార, ఉకార, మకారములు బ్రహ్మవిష్ణురుద్ర రూపములు. మూడు కాలములు. ఈ త్రివర్గములకు తానే నివాసమై ఉన్నదని మరియొక భావం.

874. త్రిస్థా – శ్రీ త్రిస్థాయై నమః

మూడింటిలో ఉన్న తల్లి. మార్కండేయపురాణంలో 'త్రిస్థా' అనేది అమ్మవారి పేరుగా చెప్పారు.

త్రయో లోకాస్త్రయో దేవా స్త్రైవిధ్యం పావకత్రయం
త్రీణి జ్యోతీంషి వర్గాశ్చ త్రయోధర్మాదయస్తథా
త్రయో గుణాః త్రయశ్శబ్దాః త్రయో దోషాస్తథాశ్రమాః
త్రయఃకాలాః తథావస్థాః పితరోఽహర్నిశాదయః
మాత్రాత్రయం చ తే రూపం త్రిస్థే దేవి సరస్వతీ

ఈ ప్రపంచం అంతా త్రి. వీటన్నిటియందు ఉంది కనుక 'త్రిస్థా'.

మూడు లోకములు, మూడు వేదములు, మూడు విద్యలు. మూడు విద్యలంటే సాంఖ్య – యోగ – వేదాంతము.

'పావకత్రయం' అంటే మూడు అగ్నులు. గార్హపత్యాగ్ని, దక్షిణాగ్ని, ఆహవనీయాగ్ని. 'త్రీణి జ్యోతీంషి' అంటే సూర్య, చంద్ర, అగ్నులు. 'వర్గాశ్చ త్రయం' అంటే ధర్మ అర్థ కామాలు. అది అర్థం చేసుకోవడం కోసం ధర్మాదయః అని

చూపించారు. 'త్రయో గుణాః' సత్వరజస్తమోగుణాలు. 'త్రయః శబ్దాః' అంటే అకార, ఉకార, మకారములు.

'త్రయో దోషాః' మూడు దోషాలు. అవి వాత, పిత్త, కఫ. 'తతః ఆశ్రమాః' – బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థములు చెప్పబడుతున్నాయి. సన్యాసం తురీయం. అది నాలుగవది.

'త్రయః కాలాః'– మూడు కాలాలు. 'తథావస్థాః' మూడు అవస్థలు. పితరులు– బర్హిషదులు, అగ్నిష్వాత్తులు, సోమపులు అని మూడు రకాలైన పితరులు. అలాగే అహర్నిశాదయః పగలు, రాత్రి, సంధ్య. మాత్రాత్రయంచ – మూడు మాత్రలంటే అకార, ఉకార, మకారాలని చెప్పుకోవచ్చు. మొదటే త్రయో శబ్దాః అని వచ్చింది కనుక ఆ భావాన్ని స్వీకరిస్తే ఇక్కడ ఉదాత్త, అనుదాత్త, స్వరిత అనే స్వరశక్తులుగా ఉన్న తల్లి అనవచ్చు.

తురీయమందున్న తల్లే ఈ మూడింటి యందు ఉందని తెలుసుకోవాలి. మూడింటిలో ఉండడం ప్రపంచం నడపడం కోసం, మనలను తరింపజేయడం కోసం.

875. త్రిపురమాలినీ – శ్రీ త్రిపురమాలిన్యై నమః

చక్రేశ్వరీదేవతా నామాలలో ఒకటి 'త్రిపురమాలినీ'. తొమ్మిది ఆవరణలు కలిపి శ్రీచక్రమన్నా, ఏ ఆవరణకి ఆ ఆవరణ ఒక చక్రం క్రింద భావన చెయ్యాలి. లలితామహాత్రిపురసుందరియే ఒకొక్క ఆవరణలో ఒకొక్క పేరుతో ఉంటుంది. ఆ పేర్లన్నీ లలితాసహస్రంలో అక్కడక్కడ పొదిగారు. ముందు 'త్రిపురా' వచ్చింది.

'త్రిపురాచక్రేశ్వరీ' దేవత మొట్టమొదట త్రైలోక్యమోహనచక్రంలో ఉంటుంది. త్రిపురేశీ, జయత్సేనా నామాల దగ్గర త్రిపురేశీ చెప్పారు. అది షోడశావరణ చక్రం.

ఇప్పుడు 'త్రిపురమాలినీ' అనేది అంతర్దశారచక్రంలో ఉన్న చక్రేశ్వరీ నామం. దీనికే 'సర్వరక్షాకరచక్రం' అని కూడా పేరు.

ఈ నామానికి లలితాపరమేశ్వరీ పరంగా మరో అర్థం కూడా చెప్పుకోవాలి.

'మాలినీ' అంటే వరుస అని అర్థంలో చెప్పుకున్నాం. పద్మమాలినీం, హేమమాలినీం అని శ్రీసూక్తంలో చెప్పబడ్డ శబ్దాల ప్రకారంగా వరుసక్రమంలో ఉన్నది మాలినీ. అమ్మవారు త్రిపురమాలినీ అంటే త్రిపురముల యందు ఒక వరుసగా వ్యాపించి ఉంది. మూడు పూసలలో ఉన్న దారంలా ఈ త్రిపురాల యందు వ్యాపించి ఉన్న తల్లి. అనగా మూడు లోకాల యందు వ్యాపించినది. మూడు విడి విడిగా కనబడుతున్నాయి కానీ మూడింటిలో ఏకంగా వ్యాపించినది అమ్మవారే అని తెలుసుకోవాలి.

'మనో బుద్ధి స్తథా చిత్తం పురత్రయముదాహృతం' మనస్సు, బుద్ధి, చిత్తము – వీటినే పురత్రయం అనాలి. వాటి యందు వ్యాపించిన చైతన్యమే త్రిపుర. ఈ మూడింటి ఏకరూపంగా వ్యాపించి ఉంది కనుక 'త్రిపురమాలినీ'.

మరొక అద్భుతమైన మాట ఉపనిషత్తులో చెప్తూ –

త్రిషు ధామసు యద్భోగ్యం భోక్తా భోగశ్చ యద్భవేత్
తేభ్యో విలక్షణస్సాక్షీ చిన్మాత్రోహం సదాశివః

అన్నారు. ఇది 'అంతర్ముఖసమారాధ్యా' వరుసలో వస్తోంది కనుక ఈ భావం చాలా గొప్పది. మనకి మూడు ధామాలు ఉన్నాయి. అవి జాగ్రత్స్వప్నసుషుప్తులనే ధామాలు. ఈ మూడు ధామాల్లోనే భోక్త, భోగ్యం అనేవి ఉంటాయి. ఈ మూడు ధామాల్ని పని చేయిస్తూ సాక్షిగా ఎవరున్నారో ఆవిడే 'త్రిపురమాలినీ'. తురీయా తత్త్వమే త్రిపురమాలినీతత్త్వం అని దీనిలో ప్రస్తావన చెయ్యబడుతోంది.

876. నిరామయా – శ్రీ నిరామయాయై నమః

నిరామయా, నిరాలంబా... రెండూ ప్రక్కప్రక్కన పెట్టడంలో ఒక ఉపనిషత్ క్రమం కనిపిస్తోంది. ఆమయము అంటే వ్యాధులు, ఆధులు. ఇవి ఒకదానితో ఒకటి ప్రభావం అవుతూనే ఉంటాయి. ఎప్పుడూ ఆధివ్యాధులు లేనిది 'నిరామయా'. అవి కర్మశరీరాలు ఉన్న జీవులకి మాత్రమే ఉంటాయి.

ఎప్పుడైనా ఆత్మతత్త్వమే నిరామయం. ఎవరైతే ఆత్మతత్త్వాన్నే భావన చేస్తారో వారు నిరామయస్థితిని పొందుతారు.

877. నిరాలంబా – శ్రీ నిరాలంబాయై నమః

ఆలంబము లేని తల్లి. ఆలంబము అంటే ఆధారము. జగతికి ఆవిడ ఆలంబనము. ఆవిడకి ఏదీ ఆలంబనం లేదు.

సృష్టిలో మనం ఆలంబనమనుకునే ప్రతిదానికి ఒక ఆలంబనం కనబడుతోంది కానీ, అన్నింటికి ఆలంబనమై తనకేదీ ఆలంబనం కాని తల్లి 'నిరాలంబా'.

నిరాలంబోపనిషత్ అని ఒక ఉపనిషత్ ఉంది. శరీరం ఉండడం వల్లే నేను ఉన్నాను కనుక శరీరం మనకి ఆలంబన అనుకుంటాం. ఇది మొదటిదశలో ప్రతీవాడు అనుకుంటాడు. ఇంకా పరిశీలిస్తూ ఉంటే, నేను అనే భావాలకి ఆలంబనం చైతన్యమే, ఆత్మయే అని తెలుస్తుంది. అప్పుడు నేను దానిలో లయమౌతుంది.

నిరాలంబ స్థితి లభించగానే వారికి బాహ్యమనేది లేదు. వారు బహిర్ముఖత్వం దాటిపోయారు.

878. స్వాత్మారామా – శ్రీ స్వాత్మారామాయై నమః

తన యందు తానే క్రీడించుట. క్రీడించుట అంటే ఆనందానుభవము. స్వ ఆత్మ తనలో ఆత్మగా ఉన్న అమ్మవారు కేవల ఆనందరూపిణి. ఆ తాదాత్మ్యం ఎవరు చెందుతారో వారికి బాహ్యవస్తువుల యొక్క అవసరం లేదు.

స్వాత్మారామా అంటే ఆత్మస్వరూపమైన ఆనందానుభవం. మరో అర్థం చెప్తూ– **'స్వమాత్మీయం జగచ్చ ఆత్మా బ్రహ్మ చ అనయోరారామః క్రీడనం విహరణం వృత్తిత్వం యస్యాః సా'** అని చెప్పారు. అమ్మవారు ఆత్మతోనే క్రీడిస్తుంది. ప్రపంచంతో క్రీడించదు. మరి ప్రపంచం ఏమిటి? ప్రపంచం అమ్మవారికి భిన్నమా? ప్రపంచం ఆవిడకి ఆత్మీయం. అమ్మకి భిన్నంగా ప్రపంచం మరొకటి లేదు. జ్యోతికి భిన్నంగా కాంతి లేనట్టే ప్రపంచం అంతా అమ్మ అయినపుడు ఈ ప్రపంచంలో 'ఉనికి'గా (సత్తా–రూపంగా) విహరిస్తున్నది, రమిస్తున్నది, ఆడుకుంటున్నది, ఆనందిస్తున్నది ఆ పరదేవతయే.

ప్రతివారిలో ఆత్మయే ఆనందరూపగా క్రీడిస్తున్నది. తనకి భిన్నంకాని

ప్రపంచమునందు లీలగా విహరించి, ఆనందించి క్రీడించే తల్లి కనుక 'స్వాత్మారామా'. తానే బ్రహ్మమై ఆనందస్థితిలో ఎప్పుడూ ఉంది కనుక 'స్వాత్మారామా'. ఈ రెండు అర్థాలు స్వీకరించాలి.

'స్వమాత్మీయం జగచ్చ ఆత్మా బ్రహ్మ'. చ అంటే మరియు అని అర్థం. తన ఆత్మీయమైన జగత్తునందు, తన స్వరూపమైన బ్రహ్మము నందు 'అనయోరారామః క్రీడనం వృత్తిత్వం' – ఈ రెండిటి యందు ఆనందస్వరూపంగా ఉన్న తల్లి కనుక 'స్వాత్మారామా'.

ఇంద్రియారామా, ఆత్మారామా – రెండు పరస్పర విరుద్ధ శబ్దాలు.

'ఇంద్రియారామా' బాగా పరిచయమైన శబ్దం. పరిచయమే కాదు అనుభవం కూడా. ఇంద్రియారామ శబ్దాన్ని చెప్పినవాడు కృష్ణపరమాత్మ. 'అఘాయురింద్రి యారామో మోఘః పార్థ స జీవతి' అంటాడు గీతలో. ఎవరైతే లౌకికసుఖాలే పరమార్థమని బ్రతుకుతారో వారిని ఇంద్రియారాములు అంటారు. అలా బ్రతుకుతున్నంతకాలం అమ్మ వారికి దూరమే. 'బహిర్ముఖ సుదుర్లభా'.

అంతర్ముఖత్వం గాని లభిస్తే క్రమంగా నిరామయా, నిరాలంబా స్థితికి వెళ్తాం. అప్పుడు 'స్వాత్మారామా' స్థితిలో ఉంటాం. అఖండానందం అనుభవిస్తాం. బహిర్విషయానుభవాలు ఆనంద ఆభాసలే!

ఆత్మతత్త్వం యొక్క మాధుర్యం ముందు బహిర్విషయానందాలు అల్పములే. ఆ ఆనందం అమృతప్రవాహం.

879. సుధాస్రుతిః – శ్రీ సుధాస్రుత్యై నమః

'స్వాత్మారామా' 'సుధాస్రుతిః' అనే దానికి మరో అర్థం చెప్పుకోవచ్చు. 'నిరామయా' 'నిరాలంబా' నుంచి ఒక అనుబంధం ఎలా ఉందో ఉపనిషత్తుల ద్వారా తెలుసుకోవచ్చు. నిరామయస్థితి అని దేన్ని అంటారో, నిరాలంబస్థితి అని దేన్ని అంటారో చెప్పారు.

ప్రభాశూన్యం మనఃశూన్యం బుద్ధిశూన్యం నిరామయః
సర్వశూన్యం నిరాభాసం సమాధిరభిధీయతే

నిరామయా, నిరాలంబా స్థితి అంటే సమాధి స్థితి. సమాధి స్థితిలోనే తురీయం అనుభవానికి వస్తుంది. ఆత్మతత్త్వం అనుభూతికి వచ్చే దశ పేరు తురీయం. ప్రపంచం అనుభవానికి వచ్చే దశ పేరు జాగ్రత్, స్వప్నం... సుషుప్తి ఎందుకు చెప్పలేదంటే సుషుప్తిలో ప్రపంచం లేదు. ఆత్మతత్త్వం అనుభూతికి వచ్చిందా అంటే అదీ లేదు. సుషుప్తిని ప్రాపంచిక దశ అనడానికి లేదు. సమాధి దశ అనడానికి లేదు.

కానీ తురీయదశ సాధన వల్ల యోగికి అది సాధ్యం అవుతుంది. అంతర్ముఖ సమారాధన చేశాడు కనుక యోగికి అది సులభం. ఆ స్థితి ఎలా ఉంటుందో వర్ణిస్తూ **'ప్రభా శూన్యం మనశ్శూన్యం బుద్ధిశూన్యం నిరామయః'** అన్నారు. ప్రభ, మనస్సు, బుద్ధి – మూడు శూన్యం అయిపోతాయి. ఇక్కడ ప్రభ అంటే ప్రాపంచిక విషయ స్పృహ అని అర్థం.

ఆ స్థితిలో సర్వశూన్యం నిరాభాసం అన్నారు. అక్కడ ఆభాస లేదు. అది కేవలం స్వయంప్రకాశస్వరూపమే. ఆ స్థితినే 'సమాధిరభిధీయతే' అంటారు. ఆ స్థితికి ఇంకో ఆలంబన లేదు. అది నిరాలంబా. అక్కడ అనుభవించే అఖండమైన ఆనందమే స్వాత్మారామం. అదియే సుధాసృతిః – అమృతప్రవాహము.

ఈ సుధాస్రుతిః అన్నమాటని శంకరభగవత్పాదులవారు ఎంతో అందంగా ప్రయోగిస్తూ "అవిద్యానాం అంతస్తిమిరమిహిరద్వీపనగరీం జడానాం చైతన్యస్తబక మకరంద సృతిఝురీ" అన్నారు. మకరందస్రుతి. తియ్యని ప్రవాహం అన్నారు. ఆ తియ్యదనం ఏమిటి? చైతన్యం. అమ్మవారి విగ్రహం ధ్యానం చేసేటప్పుడు ఇది ఒక ధ్యానప్రక్రియ. 'నిరామయా, నిరాలంబా, స్వాత్మారామా, సుధాస్రుతిః'కి ఇంతవరకు వేదాంతికమైన అర్థం చెప్పుకున్నాం. అసలు పరమార్థం ఇదే.

'స్రవత్ పీయూష ధారాభిర్వర్షంతీం విషహారిణీం' – అంటూ అమృత ప్రవాహముగా స్రవిస్తూ వర్షిస్తున్న దేవిని విషహారిణిని ధ్యానించే పద్ధతి, శక్తిబీజ ధ్యానముగా 'జ్ఞానార్ణవం' పేర్కొన్నది.

ఈ నామం జపిస్తూ ఒక మూర్తిని ధ్యానించాలి. ఈ నామంలో ఆ తల్లి ఉంది. ఆవిడ పేరు అమృతేశ్వరీదేవి.

అమృతరూపిణిని రెండు విధాలుగా భావించవచ్చు. ఒకటి అమ్మవారి శరీరం చంద్రకాంత శిలవలె నునుపుగా, నిగనిగలాడుతూ ప్రకాశిస్తూ ఉంటుంది. చంద్రకాంత శిలకి ఒకానొక లక్షణం ఉంది. వెన్నెల పడితే ఆ శిల కొంచెం చెమ్మగిల్లి కరుగుతూ ఉంటుంది.

అలా అమ్మవారి శరీరంలో ఒక కాంతి ఉందన్నారు. ఆ కాంతి జ్ఞానకాంతి. ఆ కాంతికి తోడు తేమ ఉంది. **'ఆర్ద్రాం పుష్కరిణీం పుష్టిం'** అని చెప్పినట్లుగా ఆ తేమ అమృతం. సాధారణంగా వెలుగుకి వేడి ఉంటుంది కానీ తడి ఉండదు. అమ్మకి వెలుగు, తడి ఉన్నాయి. అదే ఆశ్చర్యం! దయ అనే తడి ఉంది. జ్ఞానమనే వెలుగు ఉంది. ఈ రెండు కలిసి అమ్మరూపం కనుక చిత్ ఏకరసరూపిణి.

చిత్ అంటే జ్ఞానమనే వెలుగు. రసమంటే కరుణ. కరుణకే మరొక పేరు ఆనందం. ఆనందము, కరుణ అనేదాన్ని రస అనే శబ్దంతో చూపిస్తున్నారు. జ్ఞానము అనే దాన్ని 'చిత్' – వెలుగు అనే దానితో చూపిస్తున్నారు. అమ్మని భావించేటప్పుడు 'అమృతచిన్మయవిగ్రహామ్' అని భావించాలి.

శ్రీచక్రంలో ధ్యానం చేసేటప్పుడు కూడా అమ్మవారు 'అమృతచైతన్యరూపాం భావయేత్' అంటారు. అమృతమంటేనే అఖండానందం. అలాంటి అమ్మని శంకరులు 'సౌందర్యలహరి'లో వర్ణిస్తూ –

కిరంతీమంగేభ్యః కిరణ నికురంబామృతరసం
హృది త్వామాధత్తే హిమకర శిలామూర్తిమివ యః
స సర్పాణాం దర్పం శమయతి శకుంతాధిప ఇవ
జ్వరప్లుష్టాన్ దృష్ట్యా సుఖయతి సుధాసారసిరయా

అని కీర్తించారు. అమ్మా! నువ్వు ఆ చంద్రకాంతి శిలలా ప్రకాశిస్తుంటే నీ శరీరంలోంచి అమృతకిరణాలు 'కిరంతీ' వెదజల్లబడుతున్నాయి. (అటువంటి రూపాన్ని ధ్యానించినవారు విషాలను తొలగించగలరని భావం).

అమ్మవారి సుధామయ విగ్రహం ఇందులో ధ్యానించబడుతోంది. సుధా అంటే **'సుష్టు ధీయతే, సుఖేన ధీయతే ఇతి సుధా' –** చక్కగా, సుఖముగా ధరించునది సుధా.

ప్రపంచాన్ని అమ్మ ధరించింది. గోవర్ధనగిరిని ఎత్తిన కృష్ణపరమాత్మ ఎంత అలవోకగా ఎత్తాడో అలాగే అమ్మవారు ఈ ప్రపంచాన్ని సుఖముగా పట్టుకుంది. అంతే కాక 'సుష్టు ధీయతే' అంటే పరిపూర్ణముగా పట్టి నడిపిస్తోంది. ప్రపంచాన్ని చక్కగా పట్టుకుని ఆనందముగా నడిపించే ప్రవాహశక్తి కనుక 'సుధాసృతిః'. ఇది మరొక అర్థం.

కుండలినీశక్తి ఊర్ధ్వముగా సాగి, సహస్రారాకమలకర్ణిక యందున్న చంద్రబింబాన్ని భేదించగానే ఆ బింబము నుండి అమృత స్రావం కలుగుతుందని శాస్త్రం. ఆ విధంగా అమృత ప్రవాహాన్ని కలుగజేసిన కుండలినీ శక్తి, లేదా – ఆ అమృత ప్రవాహరూపిణి. ఆ అమృతప్రవాహమే డాకిన్యాది శక్తి కుండలాలకు తృప్తి కలిగిస్తున్నది.

వేదవిజ్ఞానం ప్రకారం చంద్రమండలం నుండి అమృత కిరణాలను దేవతలు పానం చేస్తుంటారు. ఆవిధంగా దేవతలను పోషించే చంద్రగత అమృత స్రవంతి దేవీ స్వరూపమే.

దశభిః పంచభిశ్చైవ సుధామృత పరిస్రవైః
కృష్ణపక్షే సదా పీత్వా జాయంతే పీవరాస్సురాః
తత్సర్వం శాంభవీమాయా... (వాయుపురాణం)

880. సంసారపంకనిర్మగ్నసముద్ధరణపండితా

– శ్రీ సంసారపంకనిర్మగ్నసముద్ధరణపండితాయై నమః

సంసారమనే బురదలో బాగా మునిగిపోయిన వారిని చక్కగా ఉద్ధరించే పండితురాలు – నిపుణురాలు.

సంసారాన్ని సముద్రంతో పోల్చుతారు. ఏదైనా నీటి సముద్రం ఐతే కొంతనయం.

అప్పుడప్పుడు తేలవచ్చు. నీరు కొద్దిగా తేటగా ఉంటుంది కనుక ప్రక్కన ఏముందో, పైన ఏముందో కనిపిస్తుంది. సంసారం నీటి సముద్రం కాదు. పంక – అంటే బురద. అక్కడ స్పష్టత అసలు ఉండదు. అంత అగమ్యగోచరం. అది చెప్పడానికి అద్భుతమైన పదం వేశారు. దీనిని పరిశీలిస్తే వశిన్యాదివాగ్దేవతలకి మించిన కవులు ఉన్నారా అనిపిస్తుంది.

బురద బాగా ఉన్నదాన్ని ఊబి అంటారు. పంకము అనే దానికి 'ఊబి' అనే అర్థం సముచితం. ఊబికి ఒక లక్షణం ఉంది. కూరుకుపోతున్న వానిని పైకి లేపుదామని వెళ్ళినవాడు కూడా దిగిపోతాడు. అంత ప్రమాదకరమైనది ఈ సంసారపంకం. అమ్మవారు ఒక్కరే దాని నుండి ఉద్ధరించడానికి సమర్థురాలు. ఇదే కరావలంబం అంటే అర్థం. పైకి లాగమ్మా! అని చెప్పడం. మన అంతట మనం సాధించలేమని స్పష్టంగా చెప్పారు. అమ్మ కృప లేనిదే ఇసుమంత కూడా తరించలేము.

సముద్ధరణ అనే మాట చాలా గొప్పది. పూర్తిగా పైకి లాగేస్తుంది. ఎంత పైకి లాగాలంటే పైకి వచ్చిన తరువాత బురద జాడ కూడా మిగలకూడదు. అజ్ఞానపు ఆనవాలు కూడా మిగలకుండా ఉద్ధరించగలిగే తల్లి. ఈ మాట కూడా శంకర భగవత్పాదాచార్యులవారు తీసుకుని **'జన్మజలధౌ నిమగ్నానాం దంష్ట్రా మురరిపు వరాహస్య భవతీ'** అన్నారు.

భూమిని సముద్రం నుంచి వరాహస్వామి ఎలా ఉద్ధరించాడో, సంసార సముద్రము నుండి జీవులని అలా ఉద్ధరిస్తున్న వరాహస్వామి యొక్క కోర వంటిది అమ్మవారు అని సౌందర్యలహరి ధ్యానస్థితిలో శంకరులు చెప్పారు.

ఆయన ధ్యానస్థితికి వెళ్ళినపుడు సహస్రారకమలంలో ఒక చంద్రలేఖ కనబడుతోంది – అదే సదాకళ. ఆ కళ వరాహస్వామి కోరలా కనబడుతోంది. ఇందులో గ్రహించవలసినది శంకరులు సాదాఖ్యకళ అయిన చంద్రకళాస్వరూపాన్ని దర్శించారు.

యే మనాగపి శర్వాణీం స్మరంతి శరణార్థినః
దుస్తరాపార సంసార సాగరే న పతంతి తే

"శర్వాణిని శరణువేడి, కొంచెమైనా ఆమెను స్మరించినవారు, దాటలేని అపార సంసారసముద్రంలో పడరు" – అని 'కూర్మపురాణ' వచనం.

ఇది 'అంతర్ముఖసమారాధ్యా'కి అనుబంధం. 'అంతర్ముఖసమారాధ్యా' అయిన తల్లి ఎలా అనుగ్రహిస్తుందనేది వరుసగా చూపిస్తున్నారు. "క్షిప్రప్రసాదినియై సంసారపంకము నుంచి ఉద్ధరిస్తాను" అన్నాడు కృష్ణపరమాత్మ. ఇద్దరూ ఒకే తత్త్వం కదా.

అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే
తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్

"అనన్యమైన యోగముతో అంటే నేను తప్ప అన్య చింతనలేని యోగముతో నన్నే ధ్యానిస్తూ ఎవరు ఉపాసన చేస్తున్నారో వారిని నేను మృత్యురూపమైన సంసారసాగరము నుండి సముద్ధరిస్తాను" అని అభయం ఇచ్చాడు కృష్ణపరమాత్మ. అది ఆయన ప్రతిజ్ఞ. ఆ ప్రతిజ్ఞ అమ్మవారి మాటే. అసలు మాటే అమ్మవారు. ఆ తల్లి తత్త్వమదే.

అయితే ఉద్ధరించాలంటే నియమం **'అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే'** అని చెప్పారు. ఇదే అంతర్ముఖసమారాధన. ఆ యజ్ఞానికి అమ్మవారు సంతోషిస్తుంది.

'యజ్ఞప్రియా' నామం నుండి మరొక భావంలోకి ప్రవేశిస్తున్నాము. 'యజ్ఞప్రియా', 'యజ్ఞకర్త్రీ' నుండి క్రమంగా 'విష్ణురూపిణీ' వరకు ఒకే భావం చెప్పబడుతోంది. అమ్మవారు యజ్ఞేశ్వరీదేవి.

881. యజ్ఞప్రియా – శ్రీ యజ్ఞప్రియాయై నమః

యజ్ఞములు ప్రియముగా గలది. సర్వదేవాత్మికగా యజ్ఞముల పట్ల ప్రీతికలది జగన్మాత. అంతర్యాగ, బహిర్యాగ... శ్రీవిద్యాపరంగా రెండూ స్వీకరించాలి. వేదం చెప్పే యజ్ఞాలు చాలా ఉన్నాయి. ఏ యజ్ఞమైనా అమ్మవారికి ప్రీతికరమే. యజ్ఞమంటేనే పవిత్రం చేసే కర్మ.

'యజ్ఞో వై విష్ణుః' – తరువాత విష్ణురూపిణీ అనే నామం వస్తుంది. విష్ణువు, అమ్మవారు ఇద్దరూ ఒకటే. ఇద్దరిలో ఒకటే లక్షణము. యజ్ఞో వై విష్ణుః అనే మాట కృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్తూ–

అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్,

మంత్రోఽ హమహమేవాజ్యమ్ అహమగ్నిరహం హుతమ్.

"నేనే క్రతువుని. నేనే యజ్ఞాన్ని. నేనే స్వాహా. నేనే స్వధా. యజ్ఞంలో వాడబడే మంత్రము నేను. యజ్ఞంలో వేసే ఆజ్యము నేను. యజ్ఞములో రగిలే అగ్నిని నేను. హుతాన్ని కూడా నేనే" అన్నారు కృష్ణపరమాత్మ. ఈ భావన తెలిస్తే యజ్ఞమంతా విష్ణుమయంగా చూడాలని అర్థమౌతుంది.

యజ్ఞంలో ద్రవ్యదృష్టి విడిచి పెట్టి పరమాత్మ దృష్టి తెచ్చుకోవాలి.

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం

బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా

ఆ స్థితిని కలిగించడం కోసం ఇవన్నీ చూపిస్తున్నారు. తరువాత నామం 'యజ్ఞకర్త్రీ'.

882. యజ్ఞకర్త్రీ – శ్రీ యజ్ఞకర్త్ర్యై నమః

అమ్మవారే యజ్ఞం చేస్తూ ఉంటుంది. **"అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ, భోక్తారం యజ్ఞ తపసాం సర్వలోక మహేశ్వరం"** – యజ్ఞము యొక్క కర్త, భోక్త ఆయనయే. ఆ జ్ఞానం ఎప్పుడైతే వచ్చిందో నేను కర్తని, నేను భోక్తని అనే అహంకారం పోతుంది. ఇదంతా కూడా అంతర్ముఖ సమారాధనకి ఎలా పనికి వస్తుందో భావనాత్మకంగా తెలుసుకోగలగాలి.

యజ్ఞాలను చేసేవారిని 'యాజి' అంటారు. సోమయాగం చేస్తే సోమయాజి. పౌండరీకం చేస్తే పౌండరీకయాజి. ఆ యాజిని చూస్తే చాలు పుణ్యాలు వస్తాయి. భార్య లేకపోతే యజ్ఞం చెయ్యడానికి అర్హత లేదని శాస్త్రం చెప్పింది. పరమాత్మ కూడా ఈ ప్రపంచమనే యజ్ఞం చేస్తున్నప్పుడు ఆయన ప్రక్కన అమ్మవారు ఉన్నారు.

ఆవిడే 'యజ్ఞకర్త్రీ'. పరమేశ్వరుడు పెద్ద సోమయాజి అయితే అమ్మవారు పెద్ద సోమిదేవమ్మ. ఏ సోమిదేవమ్మని చూసినా అమ్మరూపమే అని ఆరాధించగలగాలి. అలా ప్రపంచానికి పరమాత్మ యాజి. అమ్మవారు సోమిదేవమ్మ కనుక 'యజ్ఞకర్త్రీ'. ఈశ్వరకృత్యం యజ్ఞమే.

883. యజమానస్వరూపిణీ – శ్రీ యజమానస్వరూపిణ్యై నమః

యజమాని అంటే యజ్ఞదీక్షితుడు అని అర్థం. యజ్ఞమంతటికి ఎవరు ప్రధాన బాధ్యత వహించారో, దీక్ష ఎవరు స్వీకరించారో వారిని యజమాని అంటారు. యజ్ఞం చేయడానికి విప్రులకి ద్రవ్యాలన్నింటిని సమకూర్చి తాను దీక్షితుడు అయ్యాడు. తాను దీక్షితుడై వారందరి సహకారంతో యజ్ఞం చేస్తున్నప్పుడు ఆ సహకరిస్తున్నది ఈశ్వరశక్తే. తన యందు దీక్షారూపంలో అమ్మవారు ఉన్నది.

పంచభూతాని చంద్రార్కావాత్మేతి మునిపుంగవాః
మూర్తిరష్టౌ శివస్యాహుః దేవదేవస్య ధీమతః
ఆత్మ తస్యాష్టమీ మూర్తిః యజమానాహ్వయా పరే (లింగపురాణం)

పంచభూతాలు, సూర్యచంద్రులు, ఆత్మ – ఈ ఎనిమిది దేవదేవుడైన శివుని మూర్తులు. వీటిలో ఆత్మ ఎనిమిదవ మూర్తి. యజమాన మూర్తి – ఆ ఆత్మరూపిణిగా ఉన్నది.

యజమానాత్మకో దేవో మహాదేవో బుధైః ప్రభుః
ఉగ్ర ఇత్యుచ్యతే సద్భిరీశానశ్చేతి చాపరైః
ఉగ్రాహ్వయస్య దేవస్య యజమానాత్మనః ప్రభోః
దీక్షా పత్నీ బుధైరుక్తా సంతానాఖ్యస్తదాత్మజః (లింగపురాణం)

యజమానస్వరూపుడైన మహాదేవుడు ఉగ్రుడని కొందరు, ఈశానుడని కొందరు అంటారు. ఆ యజమాన రూపుడైన ఉగ్రుని పత్ని 'దీక్షా'. వారి పుత్రుడు 'సంతానుడు'. ఈ విషయం వాయుపురాణం కూడా ప్రస్తావించింది. **ఉగ్రాతనుస్సప్తమీ యా దీక్షితైర్బ్రాహ్మణైస్సహ। దీక్షా పత్నీ స్మృతా తస్య సంతానః పుత్ర ఉచ్యతే॥**

884. ధర్మాధారా – శ్రీ ధర్మాధారాయై నమః

'ధర్మాధారా, ధనాధ్యక్షా, ధనధాన్యవివర్ధినీ'. ఈ మూడు నామాలకి చక్కని అనుబంధం ఉంది. ముందు ఈ నామాలకి విడివిడిగా అర్థాలు చెప్పుకుని, అప్పుడు ఈ నామాలకి ఉన్న అనుబంధాన్ని పరిశీలిద్దాం. 'ధర్మాధారా' అంటే ధర్మమునకు ఆధారమైనది. ధర్మమునే ఆధారముగా చేసినది.

మనల్ని ధర్మం ధరిస్తుంది. ధర్మాన్ని అమ్మ ధరిస్తోంది. **'ధారణాత్ ధర్మమిత్యాహుః'** – ధర్మమనగా పట్టు. కదిలే రైలు బండికి క్రింద పట్టాలు ఎలా ఆధారమో, జరిగే బ్రతుకు బండికి ధర్మం అలా ఆధారం. పట్టాలు లేని బండికి ఎంత ప్రమాదమో, ధర్మం లేని జీవితానికి అంత ప్రమాదము.

విశ్వమంతా ధర్మము మీద నడుస్తోంది. విశ్వనిర్వహణ అనే యజ్ఞం ధర్మమే ఆధారంగా చేసి నిర్వహిస్తున్నది. కనుక "ధర్మాధారా". ఆ ఆధారమైన ధర్మం అమ్మవారి రూపమే.

ధర్మము అమ్మ ఆకారం. ధర్మమే ప్రపంచాన్ని నడుపుతోంది. **'అతో ధర్మాణి ధారయన్'** అని వేదం చెప్తోంది. అమ్మవారి వల్ల ఈ ధర్మాలు ధరించబడుతున్నాయి. విశ్వనియమాలు పాటించబడుతున్నాయి. విశ్వమంతా తన ధర్మం తాను పాటిస్తున్నప్పుడు, మన ధర్మం మనం పాటించాలి. విశ్వంలో అమ్మవారు ప్రపంచాన్ని ఏ ధర్మంతో నడుపుతున్నారో, వాటిని దేవతలు ఎలా పాటిస్తున్నారో ఆ దేవతలకు తెలుసు. యజ్ఞానికి ఆధారం ధర్మం. వేదాది శాస్త్రాల ద్వారా తెలియబడే ధర్మమే యజ్ఞానికి ఆధారం. యజ్ఞనామాలలో 'ధర్మాధారా' నామం ఉండడంలో ఉద్దేశం యజ్ఞం చేయడానికి ముఖ్యమైన ధర్మం అమ్మరూపమే. ధర్మము అంటే "శాస్త్రవిహిత కర్మాచరణ".

ధర్మమంటే నిర్వచనం చెప్తూ– **"దేశే దేశే యః ఆచారః పారంపర్యక్రమాగతః ఆమ్నాయైరవిరుద్ధశ్చ స ధర్మః పరికీర్తితః"**(సంవర్తస్మృతి). ఈ శ్లోకాన్ని ప్రతి భారతీయుడు గుర్తుపెట్టుకోవాలి.

(చాలా మంది ఒక వైపు దేశం గురించి, ధర్మం గురించి మాట్లాడతారు.

నిజంగా వారికి ధర్మం పట్ల ఆ గౌరవం ఉందో, లేదో భగవంతునికే తెలియాలి. ఈ మధ్య ఒకాయనకి ఒక సందేహం వచ్చింది. మనకి పితృకర్మలన్నీ ఉన్నాయి. ఇతర దేశాలవారికి అవన్నీ లేవు కనుక వారంతా నరకానికి పోతారా! లేదు – వారికి కూడా సద్గతులు లభిస్తాయంటే మరి అలాంటప్పుడు మనం కూడా పితృకర్మలు చెయ్యక్కర్లేదు అంటారు. ఇలాంటి ఆలోచనలన్నీ మన బుద్ధులు పెడదారిన పడితే వచ్చేవి. ఇతరదేశాల వారికి వారి పద్ధతులు వారికి ఉన్నాయి. మనం చెప్పడానికి లేదు.

ఒకడు గోధుమ పండే చోట గోధుమ తింటాడు. వరి పండే చోట వరి తింటాడు. ఇక్కడ మనం వరి తింటూ అక్కడ వారికి దొరకదు కదా వాళ్ళేం తింటారంటే అది అజ్ఞానం అనిపించుకోదూ!. అక్కడ వారికి వరి దొరకకపోతే వేరేది తింటారు. ఎస్కిమోలు ఉండే ప్రాంతాలలో వరి దొరకదు, శాకాహారం తిందామన్నా దొరకదు. అక్కడ మాంసాహారమే గతి. ఇది అర్థం చేసుకోకుండా వారు తరించడం లేదా? వీరు తరించడం లేదా అని పిచ్చి సందేహాల వల్ల లాభం లేదు.

బాగా తరించడానికి అనువైన భారతదేశంలో అందమైన ధర్మంలో పుట్టి, మోక్షం తప్పకుండా దొరుకుతుంది అన్న ధర్మమున్న దేశంలో బ్రతుకుతూ కూడా ఈ ధర్మాన్ని ప్రక్కకి వదిలి పరాయి ధర్మం వైపు వెళ్ళే వారంతా కూడా చక్కని పంటలు పండే నేలని వదలి బంజరుభూమికి పోయినట్లే. ధర్మం గురించి ఇంత గొప్ప నిర్వచనాన్ని ధర్మశాస్త్రం చెప్పింది.)

'దేశే దేశే యః ఆచారః' – మనం ఉన్న దేశంలో ఏ ఆచారం ఉందో... అంటే, స్వదేశధర్మాన్ని వదలరాదని భావం. **'పారంపర్యక్రమాగతః'.** ఏ ప్రాంతంలో ఉన్నా మనకి పరంపరగా వస్తున్న ఆచారం పాటించాలి. ఇంకో ప్రాంతానికి వెళ్ళినా తమ ఆచారాలను మాత్రం వదులుకోకూడదు. మన తాత, తండ్రులు ఏ మార్గంలో వెళ్ళారో మనం దానిని నియమబద్ధంగా పాటించాలి. అది పరంపర.

'ఆమ్నాయైరవిరుద్ధశ్చ దేశాచారః', మన తల్లిదండ్రులు చేసిన ఆచారం శాస్త్రవిరుద్ధం కానిదైతే తప్పకుండా దానిని అనుసరించాలి.

మన దేశములో, మన పరంపరలో వేదాది శాస్త్రవిరుద్ధం కాని ఆచారమే ధర్మం. ఆ ధర్మమందే లోకం ఉంది. **'ధర్మే సర్వం ప్రతిష్ఠితం'** – ధర్మమునందే అన్నీ ప్రతిష్ఠింపబడి ఉన్నాయి అని శ్రుతి. ప్రతిష్ఠ (ఆధారం) అయినది ధర్మమే. అదే దేవీస్వరూపం.

ధర్మము తెలుసుకొని చేసే సత్కర్మలకు యజ్ఞాలని పేరు. అలాంటి యజ్ఞాలు అమ్మవారికి ఇష్టం కనుక 'యజ్ఞప్రియా'. మనకి యజ్ఞం చెయ్యాలని బుద్ధిపుడితే అమ్మయే కర్త్రిగా అనుగ్రహిస్తుంది. మనలో చేయించే శక్తిగా ఉంటోంది కనుక 'యజమానస్వరూపిణీ'. అన్నీ బాగున్నా ధర్మం చేయడానికి కావలసిన ధనం కావాలిగా!

ధనం ఉన్నప్పుడు యజ్ఞానికి వినియోగించాలి. ధనం అమ్మవారు ఇచ్చిందంటే యజ్ఞం చేయడానికి అవకాశం ఇచ్చిందని అర్థం.

885. ధనాధ్యక్షా– శ్రీ ధనాధ్యక్షాయై నమః

ధనానికి అధ్యక్షురాలు. స్వామిని. సృష్టిలో ఏ ధనమైనా పరమేశ్వరిదే. ధన్యతను ఇచ్చేదే ధనం.

ఆకలి వేసినప్పుడు మనకి ధన్యతని ఇచ్చేది అన్నం. ఎదురుగా బంగారపు కాసులు పెడితే ఆకలితో ఉన్నవారికి ఆకలి తీరదు. అప్పుడు ధనం అన్నం. ఆకలి తీరడం అప్పటి ధన్యత. దాహం వేసినపుడు నీరు ధనం. మనకి ఏది, ఎప్పుడు అవసరమో అప్పుడు అది సమకూరడమే ధన్యత.

జీవుడు మానవశరీరాన్ని ఎందుకు ధరించాడు? మోక్షాన్ని పొందడమే జన్మకి ధన్యత. ఆ ధనాన్ని ఇచ్చే జ్ఞానమే ధనం. ఆ జ్ఞానానికి ఆవిడ అధ్యక్షురాలు కనుక 'ధనాధ్యక్షా'. వేదం మనకు అన్ని రకాల ధనాలను ఇచ్చింది. ఇష్టప్రాప్తి, అనిష్ట పరిహారమనే ధనాన్ని ఇస్తోంది. యజ్ఞానికి కావలసిన ద్రవ్యాలు, సమకూర్చుకోవడానికి కావలసిన ధనం అమ్మ కృపయే ప్రసాదిస్తుంది.

రఘుమహారాజు సర్వదక్షిణాక(విశ్వజిత్) యాగం చేసి మొత్తం రాజ్యంతో సహా దక్షిణ ఇచ్చేశాడు.

వనవాసానికి వెళ్తున్న రామచంద్రమూర్తి కూడా సర్వం దానం చేశాడు. అంతేకాని పెట్టెలో పెట్టి, వచ్చాక చూద్దాంలే అని అనలేదు రాముడు. వారికి ఎంత ధీమా! రేపటి గురించి ఆలోచించారా! వారు అన్నిటిని పరిత్యజించారు. ధర్మాన్ని ఆచరించడానికి ధనం ఆ తల్లే ఇచ్చింది అందుకే ధనాన్ని దానం చేసేశారు. మరి మరుసటి రోజుకో అంటే ఆవిడే ఇస్తుంది. దీని గురించి ఒక చక్కని ఇతివృత్తం చెప్తారు.

ఒక శిష్యుడు తనకి విద్యనేర్పిన గురువుగారిని దక్షిణ ఏం కావాలో చెప్పమని తెగ పీడించసాగాడు. ఆఖరికి గురువుగారు విసుగు చెంది ఒక బలిష్టుడు ఏనుగు మీద ఎక్కి నాణెం ఎగురవేస్తే ఎంత ధనం వస్తుందో అంత ధనం కావాలన్నాడు. అంత ధనాన్ని రాజే ఇవ్వగలడు. ఆ సమయంలో రాజ్యానికి రాజైన రఘుమహారాజు అప్పటికే సర్వదక్షిణాకయాగం చేసి అంతా దానం చేసేశాడు. ఈ శిష్యుడు తిన్నగా వెళ్ళి రఘుమహారాజుని ధనాన్ని అడిగాడు. అడిగినవారికి లేదనకుండా ఇవ్వడం అదొక యజ్ఞం.

రఘుమహారాజు వచ్చిన అతనితో, "రేపు ప్రొద్దున రా ఇస్తా"నని ధైర్యంగా చెప్పాడు. మర్నాడు పొద్దున్నే కుబేరుని దగ్గరికి వెళ్ళడానికి అన్ని సిద్ధం చేసుకున్నాడు. ప్రొద్దున్న చూస్తే ఖజానా నిండా కుబేరుడు ధనం కురిపించాడు. ఎందువల్ల? అతని యజ్ఞానికి అమ్మవారు సంతోషించి, ఆవిడే ధనాధ్యక్షురాలు కనుక ధనానికి అధిపతిగా ఉన్న కుబేరుని పంపించి రఘుమహారాజు ఖజానాలో ధనాన్ని కురిపించింది.

'ధనాధ్యక్షా' అంటే కుబేరరూపంతో అనుగ్రహించే తల్లి. కుబేరుని మీద కూడా పరదేవతదే ఆధిపత్యం. అందుకే 'ధనాధ్యక్షా'. యజ్ఞద్రవ్యాలకు ఆవిడ అధ్యక్షురాలు.

యజ్ఞానికి ధనం ఒక్కటే సరిపోదు. దానికి అవసరమైన హవిస్సులు, ద్రవ్యాలు కావాలి. వాటిని సమృద్ధిగా పెంచి మనకి ఇస్తుంది కనుక తరువాత నామం.

886. ధనధాన్యవివర్ధినీ – శ్రీ ధనధాన్యవివర్ధిన్యై నమః

యజ్ఞద్రవ్యాలను పెంపొందించి అనుగ్రహిస్తున్నది. అగ్నిహోత్రంలో చరువు వెయ్యాలి. యజ్ఞద్రవ్యాలు పుట్టే దేశంలో పుట్టడం ఒక భాగ్యం కనుక దీనిని యజ్ఞభూమి అన్నారు. లక్ష్మీ రూపంగా ధనాన్ని, భూదేవీ రూపంగా ధాన్యాన్ని పెంపొందించునది.

యజ్ఞానికి కావలసిన ద్రవ్యము, దక్షిణ. ధనము అంటే దక్షిణ. ద్రవ్యము అంటే ధాన్యము కనుక 'ధనధాన్యవివర్ధినీ'. దక్షిణ చేతనే యజ్ఞం ధన్యమౌతుంది.

యజ్ఞము, యజ్ఞానికి ప్రధానమైన ధర్మము, ద్రవ్యాలు చెప్పారు. నాలుగవది మంత్రం చెప్పేవాడు కావాలి.

వేదమంత్రం చెప్పాలంటే వేదజీవనం ఉండాలి. మంత్రాలు కంఠస్థం చేసి అక్కడికి వెళ్ళి చెప్పడం కాదు. వేదం పలికేవారు పవిత్రంగా జీవించాలి. సంధ్యావందనాది కృత్యాలు చేయాలి. బ్రాహ్మీముహూర్తంలో లేచి సకాలంలో సంధ్యావందనం చేసుకుని వారు కనీసం చెయ్యవలసిన దేవతార్చన వంటి నిత్యకృత్యాలు చేసుకుంటూ ఉంటేనే వారు చెప్పే వేదమంత్రాలు శక్తిమంతమవుతాయి. లేకపోతే అది శబ్దం మాత్రమే.

'ఆచారహీనం న పునంతి వేదాః'. ఆచారహీనుని వేదమంత్రం కూడా పవిత్రం చేయలేదు. వేదాచార ప్రకారం జీవించే వారిలో ఆచారరూపంలో, విద్యారూపంలో ఉన్నది అమ్మవారే. అలాంటి ఆచారవంతులు, వైదికజీవనం గడిపేవారు వచ్చి యజ్ఞంలో కూర్చుంటే అమ్మ చాలా సంతోషిస్తుంది. తరువాత నామం 'విప్రప్రియా'.

887. విప్రప్రియా – శ్రీ విప్రప్రియాయై నమః

విప్రులంటే ప్రీతి కలది. ఎందుకంటే వారు సదాచారంతో జీవిస్తారు. వేదశాస్త్ర విద్యావంతులు, ఆ విద్య చెప్పిన విధానాన్ని జీవితంగా కలవారు విప్రులు.

ఇది ధర్మం. ఇది అధర్మమని శాస్త్రం చెప్తోంది. ఆ శాస్త్రం వారి ద్వారా ప్రపంచానికి ప్రసరిస్తుంది. విప్రునిది గురుస్థానమని కంచి మహాస్వామివారు చెప్పారు. అది వారు కాపాడుకోవాలి. గురువు అంటే తాను ఆచరించి, ఆచరింపజేయాలి.

అప్పుడు సమాజం తప్పకుండా గౌరవిస్తుంది. విప్రుడు సమాజక్షేమం కోసం బ్రతకాలి కానీ తన క్షేమం కోసం కాదు. **జన్మనా బ్రాహ్మణో జ్ఞేయః సంస్కారైః ద్విజ ఉచ్యతే। విద్యయా యాతి విప్రత్వం త్రిభిః శ్రోత్రియ ఉచ్యతే॥** (బ్రహ్మవైవర్తం)

బ్రాహ్మణ, విప్ర, ద్విజ అంటే బ్రాహ్మణునికి కూడా జన్మతో కొంత సిద్ధిస్తుంది. సంస్కారంతో ద్విజుడు అవుతాడు. విద్య వల్ల విప్రుడు అవుతాడు. ఈ మూడు ఉంటే శ్రోత్రియుడు అవుతాడన్నారు.

888. విప్రరూపా - శ్రీ విప్రరూపాయై నమః

విప్రుల రూపంలో ఉన్నది. మన సంస్కృతిలో జ్ఞానం పుస్తకాల్లో, ఆధునిక పరికరాలలో ఉండాలని అనుకోలేదు. మాక్స్‌ముల్లర్ వేదం గురించి చెప్పేటప్పుడు ఆశ్చర్యపోయాడు. అతడు దురుద్దేశంతో వచ్చినా, "అబ్బా! ఎంత జ్ఞానం" అని చేతులెత్తి దండం పెట్టక తప్పలేదు. శత్రువు చేత కూడా దండం పెట్టించుకున్న ధర్మం పేరు వేదధర్మం.

ఆయన చెప్పాడు- "మనం పుస్తకాలు ఎలా భద్రపరచుకోవాలని నానా యాతన పడుతున్నామో - స్వరసహితంగా యుగాల నుంచి ఒక్క అక్షరం అటూ ఇటూ తప్పకుండా వేదాన్ని భారతదేశంలో భద్రపరిచారు. వీరి యొక్క అద్భుతమైన పరిరక్షణ వ్యవస్థ ప్రపంచంలో ఎవరికీ లేదు" అన్నాడు. చైతన్యంతో విద్య నిలబడుతుంది కానీ జడంతో విద్య నిలబడదు. పరికరాలు జడాలు. చైతన్యవంతమైన మానవునిలో విద్య ఉంటుంది.

విశేషప్రజ్ఞ గలవాడు కనుక విప్రుడు. లౌకికవిద్య కాకుండా పారమార్థిక విద్యయే విశేషప్రజ్ఞ. అది గ్రహించినవాడు కనుక విప్రుడు. ఆ విప్రుడు అమ్మవారి రూపమే. 'శుద్ధవిద్యాంకురాకారద్విజపంక్తిద్వయోజ్జ్వలా'లో ఇదే భావాన్ని చెప్పుకున్నాం. **'యావతీర్వై దేవతాః తాస్సర్వాః వేదవిది బ్రాహ్మణే సంవసంతి'** అని మంత్రం చెప్తోంది. సర్వదేవతలు ఆయనలోనే ఉన్నారు. మంత్రమే దేవత అని చెప్పినప్పుడు మంత్రాన్నే ఎప్పుడూ క్రమబద్ధంగా వల్లిస్తూ కూర్చున్న వాని యందు దేవతలు వసించినట్లే కదా!

889. విశ్వభ్రమణకారిణీ – శ్రీ విశ్వభ్రమణకారిణ్యై నమః

సృష్టిస్థితిలయల ప్రవర్తనయే 'భ్రమణం'. విశ్వము యొక్క ఈ భ్రమణమునకు కారణమైన పరాశక్తి.

స్వభావమేకే కవయో వదంతి

కాలం తథాన్యే పరిముహ్యమానాః

దేవస్యైష మహిమాతు లోకే

యేనేదం భ్రామ్యతే బ్రహ్మచక్రమ్ – అని శ్రుతి.

"ఈ బ్రహ్మాండమంతా స్వభావంచేత తిరుగుతున్నది – కొందరు అంటారు. మరికొందరు కాలంచే తిరుగుతున్నదని అంటారు. మోహముచే ఈ వాదాలు కలుగుతున్నాయి. కానీ నిజానికి ఈ బ్రహ్మాండమంతా పరమేశ్వర మహిమచేతనే తిరుగుచున్నది, ప్రవర్తిస్తున్నది. ఆ మహిమాస్వరూపిణియే విశ్వభ్రమణకారిణి.

ఈశ్వరః సర్వభూతేషు హృద్దేశేఽర్జున తిష్ఠతి

భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా (గీతావచనం)

సర్వభూతముల హృదయాలలోనున్న ఈశ్వరుడే, యంత్రరూపములను తిప్పుచున్నట్లుగా మాయాశక్తితో సర్వభూతాలను భ్రమింప (తిరుగునట్లు) జేస్తున్నాడు. ఆ ఈశ్వరరూపిణి.

గ్రహనక్షత్రాది సమస్త లోకాలు ఏ శక్తిచేత సంచరిస్తున్నాయో ఆ శక్తియే పరమేశ్వరి.

విశ్వమంతా ప్రవర్తిల్లడానికి పనికొచ్చేది యజ్ఞం కనుక యజ్ఞరూపిణియే 'విశ్వభ్రమణకారిణీ'.

890. విశ్వగ్రాసా – శ్రీ విశ్వగ్రాసాయై నమః

చరాచరాలను ప్రళయకాలంలో గ్రసించే (మింగే) పరమాత్మ. కఠోపనిషత్తులో – **'యస్య బ్రహ్మచ క్షత్రంచ ఉభే భవత ఓదనః, మృత్యుర్యస్యోపసేచనం క ఇత్థా వేద యత్ర సః'** అని మంత్రం. బ్రహ్మక్షత్ర సహితంగా చరాచరాలు మృత్యువు

నంజు(మృత్యువుతోసహా)డుగా ఎవనికి ఆహారమో, అట్టి వానిని ఎవడెరుగును? వ్యవహార జ్ఞానానికి క్రియారూపమైన జగతిని – బ్రహ్మక్షత్ర సహితమని సంకేతించారు.

'అత్తా చరాచరణ గ్రహణాత్' అనే బ్రహ్మసూత్రం ఈ విషయాన్ని చెబుతోంది. మృత్యువును సైతం కబళించే సర్వాతీత బ్రహ్మము.

యజ్ఞంలో వేసిన యజ్ఞద్రవ్యాలన్నిటినీ అగ్నిహోత్రరూపంలో స్వీకరిస్తోంది కనుక 'విశ్వగ్రాసా'. అమ్మవారు అగ్నిహోత్రరూపంలో ఎలా మెరిసిపోతోందో చెప్తూ తరువాత నామం 'విద్రుమాభా'.

891. విద్రుమాభా – శ్రీ విద్రుమాభాయై నమః

పగడపు వెలుగులతో అరుణగా భాసిస్తున్నది. అగ్నిహోత్రరూపంలో యజ్ఞమునందు ప్రకాశిస్తున్న అమ్మవారిని దర్శిస్తున్నారు. యజ్ఞమంతా అమ్మవారు కనుక ఆవిడే విష్ణురూపిణీ. **'యజ్ఞో వై విష్ణుః'** పుంలింగంలో అన్నప్పుడు విష్ణువు, స్త్రీలింగంలో చెప్తే వైష్ణవీ.

892. వైష్ణవీ – శ్రీ వైష్ణవ్యై నమః,
893. విష్ణురూపిణీ – శ్రీ విష్ణురూపిణ్యై నమః

విష్ణువునకు అభిన్నురాలు. విష్ణువు యొక్క శక్తే వైష్ణవీ. వైష్ణవీ అంటే సర్వవ్యాపిని అని అర్థం. కొందరు ఉపాసకులు 'విశ్వభ్రమణకారిణీ' తరువాత 'విశ్వగ్రాసా', 'విద్రుమాభా', 'వైష్ణవీ', 'విష్ణురూపిణీ' – ఈ నాలుగింటిలో వైష్ణవీ మంత్రం దాగి ఉంది అన్నారు. 'వైష్ణవీ' అంటే 'యజ్ఞరూపిణీ'.

ఈ 'విశ్వగ్రాసా', 'విద్రుమాభా', 'వైష్ణవీ' భావం తెలుసుకున్నాకనే, కృష్ణపరమాత్మ 'విశ్వగ్రాసా'గా అర్జునునికి కనబడ్డాడు. "విశ్వమంతా నేనే యజ్ఞరూపుడనై నడుపుతున్నాన"న్నాడు. అదే 'విశ్వభ్రమణకారిణీ'. "అంతేకాదు... విశ్వాన్ని మింగేస్తున్నా"నన్నాడు. "ఏదీ చూపించు" అని అనగానే విశ్వరూపాన్ని చూపించాడు. అర్జునుడు వణికిపోయాడు.

"స్వామీ! నీ నోట్లోకి అన్నీ వెళిపోతున్నాయి. నేను ఎవరెవరిని చంపుదామను కుంటున్నానో వారందరూ నీ నోట్లోకి వెళ్ళిపోతున్నారు" అంటే, "నువ్వు చంపేది ఏముంది?" అంటూ **"ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ కర్ణం తథాన్యానపి యోధవీరాన్, మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా'** అంటూ అగ్నిలోకి వెళ్ళిన మిడతల్లా అందరినీ నోట్లోకి తీసుకుపోతున్నాడు. **'లేలిహ్యసే గ్రసమానః సమంతాత్ లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భిః, తేజోభిరాపూర్య జగత్ సమగ్రం భాసస్తవోగ్రాః ప్రతపంతి విష్ణో'** అని వర్ణించారు.

"నీ అగ్ని ముఖంలోకి మొత్తం విశ్వమంతా ప్రవేశిస్తోంది విష్ణో!" అన్నారు. అగ్నిముఖం అంటే జ్వాలలతో ఎలా కనబడుతోందో అదే 'విద్రుమాభా'. అగ్ని యొక్క వెలుగులైన పగడపుజ్వాలలతో ప్రకాశిస్తున్నది. విష్ణువు యొక్క విశ్వరూపం కనుక 'వైష్ణవీ'. ఆవిడే 'విష్ణురూపిణీ'.

విశ్వమంతా ఒక మహాయజ్ఞం. యజ్ఞక్రియ చేస్తున్నవాడు నారాయణుడు. అది దర్శించడానికి చూపించేదే విరాడ్రూపా అయిన విష్ణురూపా. పరమేశ్వరీ యజ్ఞతత్త్వం ఇందులో చెప్పబడినది. యజ్ఞవిద్యయే వైష్ణవీ విద్య. **'యజ్ఞో వై విష్ణుః' 'యజ్ఞో యజ్ఞపతి ర్యజ్వా యజ్ఞాంగో యజ్ఞవాహనః' 'యజ్ఞభృత్ యజ్ఞకృత్ యజ్ఞీ యజ్ఞభుక్ యజ్ఞసాధనః' 'యజ్ఞాంతకృత్ యజ్ఞ గుహ్యం అన్నమన్నాద ఏవ చ'** అని విష్ణుతత్త్వమంతా ఇక్కడ ప్రతిపాదింపబడుతోంది.

'యజ్ఞప్రియా' 'యజ్ఞకర్త్రీ' 'యజమానస్వరూపిణీ' నామాలలో యజ్ఞం చెప్పబడింది. దానికి అవసరమైన విద్య 'ధర్మాధారా'. ద్రవ్యాలుగా 'ధనాధ్యక్షా', 'ధనధాన్యవివర్ధినీ'. హవిస్సు వేయడానికి కూర్చున్నవారిగా, మంత్రం వినియోగించేవారి రూపంగా 'విప్రప్రియా', 'విప్రరూపా'. యజ్ఞంతో విశ్వం నడుస్తోంది అని చెప్పడానికి 'విశ్వభ్రమణకారిణీ'. ఇది పెద్ద సూత్రం. ప్రపంచాన్ని నడుపుతున్న తల్లి ఊరుకుంటోందా! మళ్ళీ సమయం చూసి లోపలకి లాగేస్తోంది. అదే 'విశ్వగ్రాసా'. ప్రపంచాన్ని నడిపేది ఆవిడే. ప్రపంచాన్ని లయం చేసేది కూడా ఆవిడే. రెండూ జరగాలి.

ప్రొద్దున్నలేచి నడిచేవారం రాత్రి నిద్రపోతాం. నడవాలి, పడుకోవాలి... రెండూ ఉండాలి. అలాగే సృష్టి, లయం-రెండూ ఉండాలి. రెండూ సక్రమంగా నడవాలంటే యజ్ఞం ఉండాలి. యజ్ఞరూపిణిగా విశ్వాన్ని నడుపుతోంది.

'విద్రుమాభా' అంటే యజ్ఞాగ్నిరూపిణి. ద్రుమ అంటే వృక్షం. విద్ అంటే జ్ఞానము. విద్ నుంచే వేదము అనే శబ్దం వచ్చింది. విద్-ద్రుమ అంటే వేదరూపమనబడే వృక్షరూపంగా ఉన్న తల్లి. జ్ఞానవృక్షరూపంతో ప్రకాశించునది. విద్రుమాభా అంటే సాక్షాత్ 'జ్ఞానరూపిణి'. నారాయణుని గురించి ఒక అద్భుతమైన శ్లోకం ఈ సందర్భంగా చెప్పుకోవాలి.

ధర్మదృఢబద్ధమూలో నిగమస్కంధః పురాణశాఖాఢ్యః
క్రతుకుసుమో మోక్షఫలో మధుసూదనపాదపో జయతి (గరుడపురాణం)

ధర్మవృక్షం అంటే విష్ణువృక్షం. విష్ణువనే చెట్టుకి ధర్మం మూలము. కాండము వేదము. శాఖలు పురాణాలు. యజ్ఞాలు అనగా సత్కర్మలు, సదాలోచనలు ఇవి కుసుమాలు. ఈ రెండూ లేకపోతే క్రతువులే లేవు.

వేదము, పురాణముల ద్వారా క్రతువులు వర్ధిల్లుతున్నాయి.

'మోక్షఫలో' – మోక్షమే పండు. ఈ చెట్టు విద్రుమ. జ్ఞానమనే చెట్టురూపంగా ఉన్న విష్ణువు.

'త్వం వైష్ణవీశక్తిరనంతవీర్యా విశ్వస్య బీజం పరమాసి మాయా' అని చెప్పి వైష్ణవీశక్తిని 'దేవీమాహాత్మ్యం'లో చూపించారు. "విశ్వానికి బీజం నువ్వు. మహామాయా శక్తిగా ప్రపంచాన్ని నడుపుతున్నావు" అన్నారు. ఆవిడ విష్ణువుకి భిన్నురాలు కాదు.

బ్రహ్మాండపురాణంలోగల లలితోపాఖ్యానంలో చెప్పినట్లు ఒకే పరమేశ్వరుని శక్తి నాలుగు రూపాలుగా ఉంటుంది.

ఆద్యాశక్తిః మహేశస్య చతుర్ధా భిన్నవిగ్రహా
భోగే భవానీరూపా సా దుర్గారూపా చ సంగరే
కోపే చ కాళికారూపా పుంరూపా చ మదాత్మికా

పరమేశ్వరుని యొక్క ఆద్యాశక్తి మనకి భోగములిచ్చేటప్పుడు భవానీగా ఉంది.

ధర్మప్రతిష్ఠాపన కొరకు యుద్ధం చేసేటపుడు దుర్గగా ఉంది. ఆవిడే కోపంలో కాళికగా ఉంది. ఆవిడే పురుషరూపం ధరిస్తే విష్ణువు అయ్యింది. 'పుంరూపా విష్ణువిగ్రహా' అన్నారు.

లలితా చరిత్రలో అమ్మవారు తన గురించి చెప్తూ **'మమైవ పౌరుషం రూపం గోపికా జన మోహనం'** – గోపీ జనులను మోహింపజేసిన కృష్ణుడు నా రూపమే అన్నది.

కూర్మపురాణంలో– **"సహస్రమూర్థానమనంతశక్తిం సహస్రబాహుం పురుషం పురాణం శయానమబ్ధౌ లలితే తవైవ నారాయణాఖ్యం ప్రణతోఽస్మి రూపం"**

"అమ్మా! సహస్రమూర్ధములతో విశ్వరూపునిగా ఉన్న నారాయణుడవు నువ్వే. ఆ నువ్వే ప్రళయకాలంలో కూడా కనిపించే తల్లివి" అన్నారు.

ఒకప్పుడు శివుని చూసినపుడు బ్రహ్మాదిదేవతలు ఆయన్ని, 'నీ ప్రక్కనే ఉన్నావిడ ఎవర'ని అడిగారు. 'ఈవిడే విష్ణువు' అని చెప్పాడు. **'యా తస్య పార్శ్వగా బాలా సా పార్వత్యంశజో హరిః'**. ఆ పార్వతీదేవి యొక్క స్వరూపమే హరి. ఈ రహస్యం తెలిసినవారు శంకరులు... శివానందలహరిలో చెప్తూ–

బాణత్వం వృషభత్వమర్ధవపుషా భార్యాత్వమార్యాపతే
ఘోణిత్వం సఖితా మృదంగవహతా చేత్యాదిరూపం దధౌ
త్వత్పాదే నయనార్పణం చ కృతవాన్ త్వద్దేహభాగో హరిః
పూజ్యాత్పూజ్యతరస్స ఏవ హి న చేత్ కో వా తదన్యోఽధికః

అంటారు. "హే శివా! విష్ణువునకు నువ్వంటే ఎంతో ప్రేమ. నువ్వు యుద్ధానికి బయలుదేరితే బాణమై వస్తాడు. నీ ప్రక్కన భార్యగా నిలబడతాడు..." అన్నారు.

దుర్గాం కాత్యాయనీం చైవ యజ వాగ్దేవతామపి
చేతసా సుప్రసన్నేన విష్ణులోకమవాప్నుయాత్ (బృహత్పరాశరస్మృతి)

– దుర్గ, కాత్యాయని, వాగ్దేవత అయిన జగదంబను సుప్రసన్న చిత్తంతో అర్చించినవాడు విష్ణులోకాన్ని పొందుతాడు.

చండికాం స్నపయేద్యస్తు ఐక్షవేణ రసేనచ

సౌపర్ణేన యానేన విష్ణునా సహ మోదతే (పద్మపురాణం)

– చండీదేవిని చెరకురసంతో అభిషేకించిన వారు విష్ణులోకంలో ఆనందిస్తారు.

పౌర్ణమాస్యాస్తు యో మాఘే పూజయేద్విధివత్ శివాం,

సోఽ శ్వమేధమవాప్నోతి విష్ణులోకే మహీయతే (వామనపురాణం).

– మాఘపూర్ణిమనాడు శివా(పార్వతి)దేవిని విధివిధానంతో అర్చించినవారు అశ్వమేధఫలాన్ని పొంది విష్ణులోకంలో పూజింపబడతారు. ఈ పురాణ వాక్యాలు లలితాంబ విష్ణువునకు అభిన్నురాలని అని తెలియజేస్తున్నాయి.

ఇంతవరకూ యజ్ఞస్వరూపాన్ని చూపించారు. ఆ పరమేశ్వరియే నారాయణస్వరూపిణి అని నమస్కారం చేసుకున్నాము. తరువాతి నామములు అమ్మవారిని సర్వకారణశక్తిగా చూపిస్తున్నాయి.

894. అయోనిః – శ్రీ అయోనయే నమః

895. యోనినిలయా – శ్రీ యోనినిలయాయై నమః

యోని అనే శబ్దానికి కారణము అని అర్థం. అయోనిః– తనకు కారణము ఏమీ లేని తల్లి.

దేవియే అన్నింటికి కారణం.

ప్రపంచానికి కారణము మాయ, ప్రకృతి అంటారు. అమ్మవారు ప్రకృతికి అతీతురాలు కానీ ప్రకృతి యందు కూడా ఆవిడే ఉన్నది. యోనినిలయా అంటే ప్రపంచానికి కారణమైన మాయాశక్తి యందు ఉన్న స్వరూపము.

యోని నిలయా అనే దానిలో రెండు భావాలు. ఆవిడే యోని. ఆవిడే నిలయం. నిలయము అనే మాటకు మరొక అర్థం 'నిలీయంతే ఇతి నిలయం'. నిలీయంతే అంటే లీనము అగునవి. నిలయా అంటే నివాసమని మాత్రమే అర్థం కాదు. ని– నితరామ్ అంటే సంపూర్ణంగా విశ్వం దేనియందు లయమౌతుందో అది నిలయం.

'యోని' అంటే జన్మకారణం. నిలయ అంటే పూర్ణలయం. ఆవిడే జన్మకారిణి.

ఆవిడే లయకారిణి కనుక యోనినిలయా.

'అయోనిర్యోనినిలయా' అని చెప్పడంలో తనకి ఏదీ కారణం లేదు. అన్నిటికి తానే కారణం. అన్నీ లయింపజేసేది కూడా ఆవిడే. పూర్ణలయం అంటే కైవల్యరూపం కూడా.

మరొక భావంలో – శ్రీచక్ర ప్రకారంగా యోని అంటే త్రికోణం. త్రికోణంలో ఉన్నది కనుక యోనినిలయా. కానీ ఆవిడ త్రికోణం కాదు. బిందువుకి త్రికోణముందా? త్రికోణంలో బిందువు ఉంది కానీ, బిందువులో త్రికోణము లేదు. అయోనిః అంటే బిందువు. యోనినిలయా అంటే త్రికోణంలో ఉన్నది అనగానే శ్రీచక్రంలో మొదటి బిందువు, తరువాత త్రికోణం అని చూపిస్తున్నారు. ఇప్పుడు శ్రీచక్రభావన అందింది.

త్రికోణంలో ఉన్న బిందుశక్తి. శ్రీచక్రం మొత్తం 'అయోనిర్యోనినిలయా'. శ్రీచక్రం మొత్తంలో రెండే ఉన్నాయి. ఒకటి త్రికోణం. ఇంకొకటి బిందువు. త్రికోణాల ఆవరణలు ఐదు. బిందు ఆవరణలు నాలుగు. బిందువులు చెప్పినప్పుడు **అయోని** అని, త్రికోణాలు చెప్పినపుడు **యోనినిలయా** అనాలి. రెండూ కలిపి చెప్తే శ్రీచక్రం అనాలి. 'అయోనిర్యోనినిలయా'కి మరొక అర్థం శ్రీచక్రం.

కొన్ని వైదిక శబ్దాలకి లౌకిక అర్థాలు తీసి ఇంకా కుత్సితార్థాలతో మాట్లాడేవారున్నారు. అమ్మని, జగదంబని శరీరదృష్టితో చూడడం ఎంత పాపం! మన జన్మకి కారణమైన స్థితిని భావించేటప్పుడు మాతృభావన ఉండాలి కానీ మరో భావన ఉంటుందా! వేదము, వేదాంతం ఆ దృష్టితో చెప్పాయి. కానీ ఈ నామాలను పట్టుకొని లౌకిక నీచదృష్టితో మాట్లాడేవారున్నారు. అలాంటి వారి సాంగత్యం కూడా భయంకరం. అలాంటి వారికి దూరంగా ఉండాలి.

'కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిం' 'యో యోనిం యోనిం అధితిష్ఠత్యేకః', 'సతశ్చ యోనిమసతశ్చ' – ఇవి వేదవాక్యాలు. సత్ అసత్ అనగా కారణకార్యాలకు కూడా యోని అయినది. అంటే మూలమైనది. వేదంలో పరతత్త్వమనే అర్థంలో వాడారు. **'తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజప్రదః పితా'** – ఇది భగవద్గీతలోని

వాక్యం. ప్రకృతికి యోని అని పేరు. "దాని యందు నా చైతన్యము బీజమై ప్రసరించి విశ్వమనేది ఏర్పడుతుంది" అని చక్కగా వివరించాడు పరమాత్మ.

కైవల్యోపనిషత్తు –

'ఉమా సహాయం పరమేశ్వరం విభుం త్రిలోచనం నీలకంఠం ప్రశాంతం

ధ్యాత్వా మునిర్గచ్ఛతి భూతయోనిం సమస్తసాక్షిం తమసః పరస్తాత్' అని చెప్పింది.

– ఉమాసమేతుడైన పరమేశ్వరుని ఎవరు ధ్యానం చేస్తారో వారు సర్వభూతాలకి కారణమైన ఆ పరతత్త్వంలోకి చేరుతున్నారు.

'యోనిర్మాయైవ నిలయః పరిచ్ఛేదికా యస్యాః' అని వ్యాఖ్యావచనం. యోని అనగా పరిమితము చేయునది – మాయా ... అని అర్థం.

896. కూటస్థా – శ్రీ కూటస్థాయై నమః

కూటము అంటే మాయా. కూటస్థా అంటే మాయని అధిష్ఠించి ఉన్న తల్లి. **'మాయాంతు ప్రకృతిం విద్యాత్ మాయినం తు మహేశ్వరం'** అని చెప్తున్న శాస్త్రవాక్యాన్ని తీసుకోవాలి.

మాయే ప్రకృతి. దాని యందు చైతన్యరూపంగా ఉన్నది కూటస్థా. ప్రపంచమంతా మాయే. ఈ మాయా ప్రపంచానికి చైతన్యం పొందడానికి హేతువైన పరతత్త్వమే 'కూటస్థా'. ఆనందమయ కోశాది ఆవరణలతో అమ్మను (పరతత్త్వాన్ని) కప్పి ఉంచి సంసారంలో ముంచే మాయయే కూటము. దాని అధిష్ఠాన(పరతత్త్వ)మే కూటస్థా.

మరొక అర్థంలో కూటము అంటే సమూహము అని అర్థం. ఇంద్రియాలు ఒక కూటము. లోపల ఆలోచనలు అదొక కూటము. ప్రాణాలు ఒక కూటము. ఇన్ని కూటములు మనలో ఉన్నాయి. ఇన్ని కూటములు పని చేయడానికి మూలమైన చైతన్యమే 'కూటస్థా'. ఆమె సమూహాలను పనిచేయిస్తోంది. ఆ కూటమిలో ఎవరున్నారో ఆమెయే సమూహాల్లోకి ప్రసరించి పని చేయిస్తోంది.

భూమి మీద పాతి పెట్టి కొట్టి వస్తువులను తయారు చేసే ఇనుప దిమ్మలను 'కూటస్థం' అంటారు. దాని ఆధారంగా అనేక వస్తువులను పెట్టి, కొట్టి వస్తువులను చేసినా, ఏ మార్పు లేక తాను స్థిరంగానే ఉంటుంది. అలాగే ప్రపంచ వికారాలకు అతీతంగా, నిర్వికారంగా ఉండే తత్త్వం 'కూటస్థా'.

వాగ్భవ–కామరాజ–శక్తికూటముల యందు ఉన్నది కనుక 'కూటస్థా' మంత్రస్వరూపిణి. అదే విధంగా **'కూటస్థమచలం ధ్రువం'** అని ఉపనిషత్తు చెప్తున్నది.

'కూటస్థా' అన్నప్పుడు శిఖరము నందు ఉన్నదనే భావం తీసుకుంటే మేరుపర్వతము యొక్క శిఖరము నందు ఉన్న తల్లి కనుక 'కూటస్థా'.

897. కులరూపిణీ – శ్రీ కులరూపిణ్యై నమః

కూటమికే కులము, సమూహము అని పేరు. సమూహంలో ఉంటూ వ్యక్తమౌతోంది కనుక 'కూటస్థా' 'కులరూపిణీ'.

కూటస్థమంటే ఆత్మతత్త్వం. ఇంతవరకూ చెప్పినదంతా ఆత్మతత్త్వం. ఈ ఆత్మతత్త్వం మనకి ఎలా అవగతమౌతుంది? దానిని ఒక గురుపరంపర ద్వారా నేర్చుకోవలసిందే. గురుపరంపరయే కులము. విద్య కోసమే గురువంశాన్ని పట్టుకోవాలి. గురువంటే శరీరం కాదు. విద్య. ఒక సమూహంగా, పరంపరగా మనకి వచ్చిన ఆ విద్య కులరూపిణీ.

'కులరూపిణీ' అన్నప్పుడు కూటస్థమైన ఆత్మతత్త్వాన్ని మనకు తెలియజేసిన విద్యాపరంపర అంతా అమ్మరూపమే అని అర్థం. గతంలో చెప్పుకున్న అర్థం ప్రకారంగా షట్చక్రాలే కులము. ఆ రూపంగా ఉన్నదని కూడా భావించవచ్చు.

898. వీరగోష్ఠీప్రియా – శ్రీ వీరగోష్ఠీప్రియాయై నమః

పరతత్త్వ చర్చలో వేదాంతం మాట్లాడేవారంతా కూర్చుంటే ఆ గోష్ఠి ఆమెకు ప్రీతి. వేదాంతం మాట్లాడాలంటే మామూలువారికి సాధ్యమా! దానికి వీరులు కావాలి. పరమ ఏకాగ్రత కావాలి.

'అహం మమ లేనివారు వీరులు – **అభిమాన రహితః వీరః**'. వారు వీరులు. బ్రహ్మమేది? పరతత్త్వమేది? దాని గురించే ఆ వీరుల గోష్ఠి. వారికి అదే ఇష్టం. **'తదేవ ఆలోకయతి తదేవ శ్రుణోతి'.** దీనినే వేదాంత పంచదశిలో విద్యారణ్య స్వామివారు **'బ్రహ్మాభ్యాసవిదుర్బుధః'** అన్నారు. అది బ్రహ్మాభ్యాసం. వారు నిరంతరం బ్రహ్మము గురించే మాట్లాడుతూ, దర్శిస్తూ, వింటూ ఉంటారు.

వేదాంతం, జ్ఞానము, అమ్మవారితత్త్వము – వీటితోనే ఎప్పుడూ అనుసంధానం చేస్తూ సాధనలో పూర్ణదశకి చేరినవారిని వీరులంటారు. వీరులు కూర్చుంటే– అంతర్యాగమంటే ఏమిటి? బహిర్యాగమంటే ఏమిటి? బిందువంటే ఏమిటి? త్రికోణమంటే ఏమిటి? అమ్మవారి లీలలేమిటి? – ఇవే మాట్లాడుతూ ఉంటారు. ఆ మాటల్లో ఎవరున్నారు? **"మద్భక్తాః యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద!"** భగవంతుని గురించి, భగవత్తత్త్వం గురించి చర్చించుకుంటూ ఉన్న భక్తులు ఎవరైతే ఉంటారో, వారి గోష్ఠి చూసి ఆనందిస్తూ ఉంటుంది తల్లి. చర్చ, వివేచన, విచారణ – ఇదే వీరగోష్ఠి. సాధకులైనవారు, జ్ఞానులైనవారు, యోగులైనవారు చేసే భగవత్సంబంధమైన చర్చల పట్ల ప్రీతి కలిగినది. ఆ వీరతత్త్వం ఆవిడ రూపమే.

ఉపాసక దురంధరుల, జ్ఞానుల గోష్ఠి... అంటే ఆ ఉపాసనామర్మములు, భగవత్తత్త్వము, ఆత్మతత్త్వము – ఇవే వారి గోష్ఠి. ఆ గోష్ఠి అమ్మవారికి ప్రియం కనుక 'వీరగోష్ఠీప్రియా'.

మరొకభావంలో అమ్మవారి లీలలన్నీ వీరలీలలే. వీరగాథలే. ఉదాహరణకి భండాసురసంహారం. అదేవిధంగా మహిషాసుర, చండముండ, శుంభనిశుంభ, మధుకైటభ ఇత్యాది రాక్షసుల సంహరించిన గాథలన్నీ ఆమె వీరలీలలు. అవన్నీ చెప్పుకోవడం 'వీరగోష్ఠి'. ఎక్కడైతే అమ్మవారి చరిత్రని చెప్పుకోవడం జరుగుతుంటుందో, అలా చెప్పేవారిని అమ్మవారు చూసి ప్రీతి చెంది అనుగ్రహిస్తోంది. దేవీమాహాత్మ్యం, లలితోపాఖ్యానం పారాయణ చేస్తే ఆ గాథలన్నీ వీరగోష్ఠులు కనుక అమ్మ అనుగ్రహిస్తోంది.

899. వీరా - శ్రీ వీరాయై నమః

ఎదురులేని పరాక్రమంతో శత్రుసంహారం చేసిన తల్లి. వీరా అనే శబ్దానికి స్త్రీపరంగా మరో అర్థం ఉంది. **'పతి పుత్రవతీ వీరా'** - భర్త, పిల్లలు ఉన్నవారిని వీరులు అనాలని చెప్పారు. మరి అమ్మవారు 'వీరా'యేగా. శివపత్నీ, గణేశషణ్ముఖ జనని.

అమ్మవారికి ఎంతో అద్భుతమైన పతి–'మృత్యుంజయుదు'. పుత్రులు ముత్యాలు. 'కుమారగణనాథాంబా'. అంత అందమైన పుత్రులు, 'వీరా' అనగానే ఆ నామంలో ఒక్కసారి కుటుంబం అంతా స్ఫురిస్తుంది. కైలాసంలో శివసమేతంగా ఉంటూ కుమారగణనాథులని ప్రక్కన కూర్చుని పెట్టుకున్న ఆ తల్లే 'వీరా'.

900. నైష్కర్మ్యా - శ్రీ నైష్కర్మ్యాయై నమః

నైష్కర్మ్యా అనేది వేదాంత శబ్దం. ఈ మాటని వాడుతూ సురేశ్వరాచార్యులవారు 'నైష్కర్మ్య సిద్ధి' అనే గొప్ప గ్రంథం రచించారు. 'నైష్కర్మ్యా' అంటే నిర్గతకర్మలు కలది. అనగా ఏ కర్మలు లేని తల్లి అని అర్థం. ఈ నైష్కర్మ్య స్థితిని బ్రాహ్మీస్థితి అంటారు. పరమాత్మతో ఐక్యమయ్యే స్థితిలోనే కర్మ ఉండదు. అంతవరకు ఏదో ఒక కర్మ ఉంటూనే ఉంటుంది.

కర్మని విడిచిన వారంతా జ్ఞానులు కారు. పలాయనవాదం కాదు వేదాంతమనేది. పరిపూర్ణమైన పండిన జ్ఞానం కలిగినవాడు ఉపాధులకి అతీతమైన ఆత్మతత్త్వంతో తాదాత్మ్యం చెందిన వాని స్థితి నైష్కర్మ్యస్థితి. పొరపాటున వేదాంతం మాట్లాడి కర్మ నుండి పారిపోతామనేవారికి చీవాట్లు పెట్టాలి. అలా అర్జునునికి చీవాట్లు పెట్టినవాడు కృష్ణపరమాత్మ. ఆ చీవాట్లే భగవద్గీత అంటే. నైష్కర్మ్యమనేది గొప్పస్థితి.

అమ్మవారి కర్మే ఈ ప్రపంచమంతా. ఆవిడ కర్మ చెయ్యకపోతే ప్రపంచమే లేదు. మరి నైష్కర్మ్యా ఎలా అయ్యింది? నైష్కర్మ్యా అంటే "ఏ కర్మ లేనిద"ని అర్థం. అనగా కర్మ సంబంధాలు లేనిది.

"తస్య కర్తారమపి మాం విద్ధి అకర్తారం" అని గీతలో పరమాత్మ చెప్పాడు.

ఈ జగత్తునంతటిని వారి వారి కర్మలకి అనుగుణంగా నడుపుతోందే కానీ ఆవిడ దేనికీ అంటడం లేదు. కర్మలకి అతీతంగా ఉన్న జ్ఞానరూపిణి అనే అర్థాన్ని చూపిస్తున్నారు.

ఈ నామంలో భావించవలసినవి చాలా ఉన్నాయి. ఈశ్వరుడంటేనే నైష్కర్మ్యస్వరూపుడు. పతంజలి యోగసూత్రాలలో పరమేశ్వరుడంటే ఏమిటో అద్భుతమైన నిర్వచనం ఇస్తూ **'క్లేశకర్మవిపాకాశయైః అపరామృష్టః పురుషవిశేషో ఈశ్వరః'** అన్నారు. క్లేశములు, కర్మలు, సంకల్పాలు – వీటికి అంటని పరిపూర్ణుడే ఈశ్వరుడని చెప్పారు. ఈశ్వరునితో తాదాత్మ్యం చెందిన స్థితి ఉన్నవారికి కూడా ఇవి అంటవు.

గీతలో కృష్ణపరమాత్మ, **'లిప్యతే న సపాపేన పద్మపత్రమివాంభసా'** అని చెప్పినట్లుగా, ఒక్క యోగే ఈ ప్రపంచంలోనే ఉంటూ ప్రపంచాన్ని అంటుకోకుండా ఉంటాడు. దీనికి చక్కటి ఉపమానం చెప్తూ, 'పద్మపత్రం ఇవాంభసా' అన్నారు. తామరాకు మీద నీటి బొట్టువలె **'లిప్యతే న సపాపేన'** – అతడు కర్మదోషాలకి అంటుటలేదు అన్నారు. పాపము అనగా కర్మదోషమని ఇక్కడ అర్థం. అలా ఒక యోగి ఎవరిని ఉపాసించడం వల్ల యోగి కాగలిగాడో ఆ యోగీశ్వరీ అయిన అమ్మవారి స్థితి 'నైష్కర్మ్యా'.

నామాల వరుసని పరిశీలిస్తే 'కూటస్థా', 'కులరూపిణీ', 'వీరగోష్ఠీప్రియా', 'వీరా' – వీరగోష్ఠీ అంటేనే వేదాంతజ్ఞానమని చెప్పుకున్నాం. ఆ వేదాంతజ్ఞానం యొక్క స్థితిని 'నైష్కర్మ్యా' అంటారు.

901. నాదరూపిణీ – శ్రీ నాదరూపిణ్యై నమః

ఈ నామానికి 'నాదరూపా' అనే నామం దగ్గర చాలా విస్తారమైన అర్థం చెప్పుకున్నాం. అమ్మవారు మొత్తంగా మాతృకావర్ణరూపిణి. మాతృకావర్ణాలు అంటే శబ్దాలు. నాదము నుండే శబ్దాలు ఉత్పన్నమయ్యాయి. శబ్దమంతా నాదమయం. అమ్మవారిని మనం నాదం ద్వారానే ఉపాసిస్తున్నాం. మంత్రోపాసన అనేదే నాదోపాసన. మంత్రమంటే శబ్దాన్ని ఉచ్చరిస్తాం. ఆ శబ్దంలో అంతర్లీనమైనది నాదమే. **అవ్యక్తమైన ఈశ్వరతత్త్వం వ్యక్తమైన జగత్తుని సృజించేటప్పుడు ఆ మధ్యలో వచ్చే స్థితికి నాదమని**

పేరు. అవ్యక్తము నాదము ద్వారా వ్యక్తమౌతోంది. అవ్యక్త వ్యక్తాలకి నడిమి స్థితి నాదము.

వ్యక్తములో ఉన్న మనం అవ్యక్తంలోకి వెళ్ళాలంటే నాదాన్ని పట్టుకునే వెళ్ళాలి. ఆ నాదం ప్రపంచంలో శబ్దరూపంలో ఉంది. ఈ శబ్దాన్ని గ్రహించి క్రమంగా ప్రయాణిస్తే శబ్దానికి కూడా మూలమైన నాదంలో ప్రవేశిస్తాము. నాదం ద్వారానే అమ్మవారిని అందుకోగలుగుతాం కనుక అమ్మవారు 'నాదరూపిణీ'. పరమేశ్వరశక్తి నాదరూపంలోనే దొరుకుతుంది.

'నైష్కర్మ్యా' 'కూటస్థా' దగ్గర 'నాదరూపిణీ' చెప్పడంలో ఆంతర్యం చూస్తే వేదాంతంలో నాదరూపిణీ అని ఓంకారాన్ని అంటారు. వేదాంతం ప్రకారంగా పరతత్త్వాన్ని తెలియజేసే శబ్దం ఓంకారం. నాదరూపిణీ అంటే ఓంకారరూపిణి అని ఇక్కడ అర్థం.

'నాదః ప్రణవ శిరః స్థితః తద్రూపా' అన్నారు. నాదము అంటే ప్రణవ శిరః స్థితా. ఓంకారం నాదరూపమని అన్నాం కానీ ఓంకారానికి కూడా సూక్ష్మరూపం ఉంది. ఆ సూక్ష్మరూపానికి నాదమని పేరు. వినబడితే శబ్దం. శబ్దానికి పూర్వస్థితి నాదం.

అది శూన్యంలోంచి రాలేదు. మన లోపల శక్తి ముందు నాదంగా వచ్చి, ఆ నాదం శబ్దరూపం తీసుకొని వెలికి వస్తోంది. ప్రణవము యొక్క శిరస్సుపై నాదం ఉంది. ప్రణవమంటే ఓంకారం. ఓంకారం యొక్క శిరస్సుపై ఉందంటే ఓంకారానికి పైకొన అని చూపిస్తున్నారు. దీనినే తురీయభూమిక అని అంటారు.

ఓంకారంలో అకార–ఉకార–మకారములు మూడు భూమికలు. దాని పైన ఉన్నది తురీయ భూమిక. అది 'నాదరూపా' అని చెప్పబడుతున్నది. ఈ నాదాన్ని యోగి ధ్యానము ద్వారా, మౌనం ద్వారా, మంత్రం తనలో లీనం చేసుకొని క్రమంగా హృదయంలో అనుభూతి చెంది ఈ నాదరూపిణి అయిన అమ్మవారిని సాక్షాత్కరింపజేసుకుంటాడు. అప్పుడు ఆ తల్లి అనాహత స్వరూపంలో హృదయంలో ఉంటుంది.

యోగికి నాదరూపిణి సాక్షాత్కరించిన స్థితిని వర్ణిస్తూ-

ఆనందలక్షణమనాహత నామ్ని దేహే

నాదాత్మనా పరిణతం తవ రూపమీశే

ప్రత్యఙ్ముఖేన మనసా పరిచీయమానం

శంసంతి నేత్రగుళికైః పులకైశ్చ ధన్యాః' అన్నారు. వైఖరీ, మధ్యమా, పశ్యంతీ నామాల దగ్గర వివరించుకున్నవి ఈ నామం దగ్గర గుర్తు తెచ్చుకోవాలి.

పరావాక్కు అత్యంత సూక్ష్మం. అది క్రమంగా మూలాధారంలోకి ప్రవేశించి అక్కడి నుండి బయలుదేరి హృదయస్థానం దగ్గరికి వచ్చేటప్పటికల్లా 'పశ్యంతీ' అవుతుంది. కంఠస్థానం వద్ద మధ్యమ అవుతుంది. బయటకి వినబడేటప్పుడు వైఖరీ అవుతుందని చెప్పుకున్నాం.

ఆ హృదయస్థానమే నాదం స్ఫుటంగా రూపు దిద్దుకునే చోటు. అందుకే అనాహతచక్రం నాదమని చెప్పబడుతుంది. 'ఆనందలక్షణం అనాహతనామ్నిదేహే'. బయటకి వినబడితే ఆహతం. లోపల ఉంటే అనాహతం. అనాహతనాదాన్ని హృదయంలో వినగలం. ఆ అనాహతనాదాన్ని యోగి సాధన వల్ల తెలుసుకుంటాడు. 'ప్రత్యఙ్ముఖేన' అన్నారు. అంటే అంతర్ముఖసమారాధ్యా. ఆ ప్రత్యఙ్ముఖ దృష్టితో హృదయంలో ఒక్కసారి ఆ నాదానుభూతి పొందగానే 'శంసంతి నేత్రగుళికైః పులకైశ్చ ధన్యాః'. వారి ఒళ్ళు ఒక్కసారి పులకించి కనుల నుంచి ఆనందాశ్రువులు రాలుతాయి. నాదానుభూతి అంటే ఇది. దీనికే నాదానుసంధానము అని పేరు. అది సిద్ధావస్థలో లభిస్తుంది.

మనలో ఇంకో నాదస్థానం ఎక్కుడుందో చెప్తూ -

'రోధిన్యాఖ్యం యదుక్తం తేని నాదస్తస్యోర్ధ్వ సంస్థితం....

తస్యోత్సంగతాం ఊర్ధ్వగామినీం పరమాం శివాం ధ్యాయేత్' (స్వచ్ఛంద తంత్రం). నాదరూపిణిని ఎలా ధ్యానం చెయ్యాలో చెప్తున్నారు.

– భ్రూమధ్యస్థానంలోంచి ఒకొక్క అంగుళం పైకి వెళ్తుండగా రోధిని అనే దశ దాటి బ్రహ్మరంధ్రంలోకి వెళ్ళబోతున్న దశలో వస్తుంది ఈ నాద, నాదాంత అనే

స్థితి. అక్కడ పరదేవత నాదమునందు ఉంటుంది కనుక అక్కడున్న పరమశివను ధ్యానిస్తున్నానని చూపించారు.

902. విజ్ఞానకలనా - శ్రీ విజ్ఞానకలనాయై నమః

బ్రహ్మజ్ఞానమే తన స్వరూపమైనది. విజ్ఞానరూపములైన శాస్త్రములను ఏర్పరిచినది.

ఓంకారము వినబడిన నాదం. దానికి మూలం స్థూలంగా వినబడని నాదం. ఆ వినబడని నాదం నుండి వినబడే ఓంకారం వ్యక్తమైతే, ఆ ఓంకారం నుండి వేదములన్నీ వ్యక్తమయ్యాయి.

వేదాల వరకు అన్ని అమ్మరూపములే. ఆ తరువాత వాటిని గ్రహించి లోకములో మిగిలిన శబ్దాలన్నీ ఉత్పన్నమయ్యాయి. వేదముతో మొదలుకుని అన్ని శాస్త్రాలు కలిపి పధ్నాలుగు. ఈ పధ్నాలుగు విద్యల యొక్క తెలివిని విజ్ఞానము అంటారు. నాదరూపిణి అయిన ఆ తల్లే రకరకాల శాస్త్రములు ఏర్పరిచి, ఆ శాస్త్రాల యొక్క తెలివిగా తానే ఉంది గనుక 'విజ్ఞానకలనా'.

'నాదరూపిణీ' తరువాత 'విజ్ఞానకలనా' నామంతో ఉన్న అనుబంధాన్ని గమనించాలి. ఏ విజ్ఞానం తెలుసుకోవాలన్నా దిక్కు శాస్త్రమే. **'చతుర్దశానాం విద్యానాం ధారణం హి యథార్థతః విజ్ఞానమితి తద్విద్యాత్'** అని నిర్వచనం. విజ్ఞానమనగా శాస్త్రముల ద్వారా గ్రహించే తెలివి.

వేదాలు - నాలుగు. ఆ నాదరూపమే వేదముగా విస్తరించింది. ఆ వేదం తరువాత షడంగాలు, పురాణాలు, మీమాంస, ధర్మశాస్త్రం న్యాయశాస్త్రం - ఇలా పరిశీలిస్తే ప్రధానంగా పధ్నాలుగు విద్యలు తేలుతున్నాయి. ఈ పధ్నాలుగు విద్యలు శాస్త్రములని చెప్పబడుతున్నాయి. కనుక నాదమే శాస్త్రములుగా వ్యక్తమైంది. ఈ శాస్త్రాలన్నీ జ్ఞానం కోసమే. ఆ జ్ఞానాన్ని శాస్త్రరూపంతో అమ్మవారు సమకూర్చింది. 'కలనా' అనే మాటకి కూర్చుట, కలిగించుట అని అర్థం. నాదరూపా అయిన ఆ తల్లినే వేదాది శాస్త్రాలు కూర్చిన దేవిగా ఇక్కడ అభివర్ణించారు వశిన్యాది వాగ్దేవతలు.

విజ్ఞానకలనా – విజ్ఞానం అంటే బ్రహ్మానుభవమే. అదే అన్నిటి కంటె గొప్పది. 'విజ్ఞానఘనరూపిణీ', 'ప్రజ్ఞానఘనరూపిణీ' – ఈ రెండు నామాలను చెప్పుకున్నాం. బ్రహ్మజ్ఞానమే విజ్ఞానం. శంకరభగవత్పాదులవారు గీతకి భాష్యం రాస్తూ 'జ్ఞాన–విజ్ఞాన యోగం' గురించి గొప్పగా చెప్పారు. శాస్త్రాలు చదివినప్పుడు స్పష్టంగా అర్థమైతే దాని పేరు 'జ్ఞానం'. అది అనుభవానికి వస్తే 'విజ్ఞానం'. శాస్త్రాల్లో చెప్పిన జ్ఞానాన్ని మనకి అనుభవానికి ఇచ్చే తల్లే 'విజ్ఞానకలనా'. శాస్త్రాలే ఇచ్చిన తల్లి శాస్త్రాల్లో ఉన్న తెలివిని మన బుద్ధికి ఇవ్వలేదూ! హృదయంలో స్ఫురించే ఆ స్వాత్మరూపిణియే విజ్ఞానాన్ని అందిస్తున్నది.

'విజ్ఞానకలనా'కి రెండు అర్థాలు చెప్పుకున్నాం. 1. శాస్త్రాది విద్యలు ఏర్పరచిన తల్లి. 2. ఆ శాస్త్రాల ద్వారా బ్రహ్మజ్ఞానాన్ని తన భక్తులకి అనుగ్రహించే తల్లి.

లలితాసహస్రానికి పూర్వపాఠాలలో అనగా భాస్కరరాయలుకి ముందు ఉన్న పాఠాలలో ఈ నామం **'విజ్ఞానకలికా'** అనే పేరుతో ఉంది. అది కూడా తప్పులేదు. 'చిత్కళానందకలికా' అని చెప్పుకున్నాం. దీపశిఖని కలిక అంటారు. 'విజ్ఞానకలికా' అంటే విజ్ఞానమనే జ్యోతి అమ్మవారు. 'నాదరూపిణీ' వెంటనే 'విజ్ఞానకలికా' ఎందుకు చెప్పారో ఇప్పుడు అర్థమౌతుంది.

ఇదమంధం తమః కృత్స్నం జాయేత భువనత్రయం
యది శబ్దాహ్వయం జ్యోతిః ఆసంసారం న దీప్యతే

అని ఒక మాట అలంకారికులు చెప్తారు. ఈ మాటకి అర్థం– శబ్దజ్యోతే లేకపోతే ఈ ప్రపంచం చీకటైపోతుంది. శబ్దమనగా శాస్త్రం. ఈ శాస్త్రాలు లేకపోతే మనం ఏ విధంగా తరించగలం? భౌతికంగా ఏదైనా పొందాలన్నా, సూక్ష్మమైన విజ్ఞానం కావాలన్నా శాస్త్రాలు అవసరమే. కానీ ఒక్కటి తెలుసుకోవాలి– పరమార్థజ్ఞానం పదార్థజ్ఞానంవలె పొందలేము.

దానికో విధానం ఉంది. ఆ విధానాలే తపస్సు, శ్రద్ధ, సాధన. వీటితో పక్వమైన మనసుకు మాత్రమే పరమార్థ జ్ఞానం వస్తుంది. ఆ పక్వమైన మనసు ఉన్నవాడే వీరుడు. అటువంటి వీరునికి ఆ తల్లి నాదరూపంగా ఉంటూ విజ్ఞానం

కలిగిస్తోంది కనుక 'విజ్ఞానకలనా'. నాదం ద్వారా శాస్త్రాలని ఉత్పన్నం చేసి, ఆ శాస్త్రాల ద్వారా అమ్మవారు మనకి తెలివిని ఇచ్చారు. ఆ తెలివి ఎవరో తరువాత నామంలో చెప్తున్నారు.

903. కల్యా – శ్రీ కల్యాయై నమః

కళల యందు నేర్పరురాలు.

'కలాసు సాధుః కల్యా' అన్నారు. కళలు అంటే విద్యలు. అన్ని విద్యలలోను నేర్పరురాలు. పరాపర విద్యలు రెండూ ఆవిడ స్వరూపములే. దేవియే విద్యల యొక్క నేర్పరితనం. ఏ విషయమైనా మనకి బాగా అర్థం కావాలంటే ఈ కల్యా అనుగ్రహం ఉండాలి.

విద్య అనగానే బ్రహ్మవిద్య అనే అర్థం తీసుకోవాలి. బ్రహ్మవిద్యా స్వరూపురాలు అని మరొక అర్థం.

ధ్యానంలో పండిన దశలో ఎప్పుడు 'నాదరూపా' అనుభవంలోకి వస్తుందో ఆ ధ్యానయోగ స్థితినే 'కల్యా' అంటారు. ధ్యానానికి యోగ్యురాలు 'కల్యా' అనగా ధ్యానించవలసిన తత్త్వము. శుద్ధసత్త్వస్వరూపిణీ, జ్ఞానస్వరూపిణి అయిన పరతత్త్వాన్ని ధ్యానించాలి.

ఇంకొక అర్థంలో కల్యా శబ్దం ఎక్కడెక్కడ వాడాలో శాస్త్రం చెప్తూ – **'కల్యం సర్గే ప్రభాతే చ కల్యో నీరోగదక్షయోః కల్యా కల్యాణవాచిన్యాం'** అన్నారు. కల్యా అంటే– **'కలయితుం సమర్థా కల్యా'** – కలనము అంటే కలిగించుట, ఏర్పాటు చేయుట, సమకూర్చుట. విజ్ఞానకలనా అంటే విజ్ఞానాన్ని కలిగిస్తోంది.

విజ్ఞానాన్నే కాదు – ప్రపంచాన్ని కూడా కలిగిస్తోంది, ఏర్పాటు చేస్తోంది, ఒక పద్ధతిలో పెడుతోంది. ఆ పద్ధతికి ఒక తెలివి ఉండాలి. ప్రపంచం అనే కలనం వెనుక ఉండే విజ్ఞానమే అమ్మవారు. అదే విజ్ఞానకలనా. ప్రపంచ నిర్మాణ విజ్ఞానం పరదేవతయే.

మరొక అర్థంలో కల్యా అంటే 'సర్గే' – సృష్టిని చేయునది.

ఇంకొక అర్థం – **'ప్రభాతకాలరూపిణీ'.** కాలం అంతా అమ్మవారి రూపమే అన్నప్పుడు మరి ప్రత్యేకించి దీనినే ఎందుకన్నారంటే ఆ సమయంలో సాధన చేస్తే దివ్యత్వాన్ని పొందగలం. ప్రభాతకాలం ధ్యానానికి, సాధనకి అనువైనది.

బ్రహ్మదేవుడు కూడా సృష్టికి ప్రభాతకాలంలో భగవంతుని ఆరాధించాడు. కల్పారంభం ఆయనకి ప్రభాతం.

మరొక అర్థం – రోగములేని స్థితిని 'కల్యా' అంటారు. (నీరోగ)

'దక్షయోః' – సమర్థతకి పేరు 'కల్యా'. కల్యాణవాచి. కల్యాణకరమైనది అని మరొక అర్థం. కల్యా-ణ. కల్యా తరువాత 'ణ' వచ్చింది. దీనికి వైదికార్థం – కల్యమును పలుకునది అనగా మంగళమును పలుకునది.

ఇప్పటివరకు చెప్పుకున్న 'కల్యా' నామానికి అర్థాలు: 1. సర్వవిద్యలయందు నేర్పరురాలు. 2. విజ్ఞానమే ఆమె రూపము. 3. ఈ ప్రపంచమును కలనము చేయునది కనుక కల్యా. 4. సృష్టికారిణి. 5. ప్రభాత కాలరూపిణి. 6. రోగరహితస్థితిని ఇచ్చునది. 7. సమర్థత. 8. మంగళకరమైన వాక్కు.

904. విదగ్ధా – శ్రీ విదగ్ధాయై నమః

గొప్ప నేర్పరితనము, చాతుర్యము కలదని అర్థం.

ఒక్కసారి ప్రపంచాన్ని చూస్తే ఎంత గొప్ప చాతుర్యమో తెలుస్తుంది. అమ్మకంటే విదగ్ధా ఎవరున్నారు? చాతుర్యము లేకపోతే సృష్టి స్థితి లయములన్ని ఎలా చెయ్యగలుగుతోంది?

'నాదరూపిణి, విజ్ఞానకలనా, కల్యా, విదగ్ధా' వరకు ఈ సృష్టి రచన చేస్తున్న సమర్థవంతురాలైన తల్లి, ఈ సృష్టి యందు ఉన్న విజ్ఞానము అమ్మరూపమే అని చూపిస్తున్నారు.

పశుపక్ష్యాదులకు కూడా విజ్ఞానం ఉంది. గిజిగానిగూడు, లేదా ఒక సాలీడు గూడు మనం కట్టగలమా! ఆ నేర్పరితనం దాని యందు పెట్టినది ఆ తల్లి. ప్రపంచంలో ప్రతివారిలో ఒక విజ్ఞానాన్ని ఏర్పాటు చేసింది.

విశ్వంలో విజ్ఞానం పెట్టిన అమ్మవారికి నమస్కారం చేసుకోవాలి. పెట్టిన విజ్ఞానాన్ని పరిశోధన చేస్తున్నాం కానీ, ఆ విజ్ఞానం ఎవరు పెట్టారో పరిశోధనకి తెలియదు. అది సాధనకి తెలుస్తుంది.

'విదగ్ధా'- ఆ నేర్పరితనాన్ని పరిశీలించాలి. ఎంత అద్భుతమైన మాట. ప్రొద్దున లేచిన దగ్గర నుండి ప్రపంచాన్ని గమనిస్తూ ఉంటే, "తల్లీ! నీ నేర్పరితనం అడుగడుగునా కనబడుతోంది" అని నమస్కరించుకుంటాము.

విజ్ఞానకలనా, కల్యా, విదగ్ధా. దీనంతటికి మూలం నాదరూపిణి. ముందు నాదంగా వ్యక్తమై ఇంత తయారు చేసింది. ప్రపంచం అంతా నాదమయం అనే భావనలోకి వెళ్ళాలి.

అవ్యక్తము వ్యక్తమై నాదముగా వస్తే, నాదం నుండి ప్రపంచం వచ్చింది. అవ్యక్తం వ్యక్తమౌతున్నప్పుడు నాదంతో పాటు బిందువు వచ్చింది.

905. బైందవాసనా - శ్రీ బైందవాసనాయై నమః

బిందువు నందు ఉన్నది. బిందువు అంటే ప్రథమ స్పందన. పరమాత్మ యొక్క స్పందన శక్తే బిందువు. ఏమిటా స్పందన? ఒక్క నేనే ఎన్నో అవుతానని ఆయన అనుకున్నాడు. అనుకుంటేనే ప్రపంచం ఏర్పడింది. ఆ స్పందన అనే బిందువు లోంచే నాదం వచ్చింది. ఈ నాద బిందువులు కలిసే ఉంటాయి. 'నాదబిందు ఉపనిషత్' అని ఒక ఉపనిషత్ కూడా ఉంది.

ఇది మనం గమనిస్తే, నేను అనే స్పందన ఎక్కడ నుండి వచ్చిందో పరిశీలిస్తే దానికి మూలమైన నాదము, ఆ స్పందనకు మూలమైన చైతన్యము దొరుకుతుంది. అదే నాదబిందు తత్త్వము.

'బైందవాసనా' అనే దానికి సాధారణ అర్థం బిందువునందు ఉన్నది. బైందవ- ఆసన బిందు సంబంధమైన ఆసనము కలది. దానికి బింద్వాసనా అంటే సరిపోతుంది. మరి బైందవాసనా అని ఎందుకు అన్నారు? ఈ నామానికి స్థూలంగా అర్థం చెప్పుకోవాలంటే శ్రీచక్రంలో బిందువునందు ఉన్న తల్లి. అది మహాత్రిపురసుందరి

శివశక్త్యైక్యరూపంగా ఉన్న చోటు. అక్కడ రెండుగా లేదు. రెండూ కలసి ఒక్కటిగా ఉన్న స్వరూపము. పరమాత్మ, పరమాత్మ యొక్క శక్తి ఏకముగా కనిపించే బిందుస్థానము. ఇది 'బైందవాసనా'.

ఈ ఒక్క భావాన్ని చెప్పి వదిలేస్తే వశిన్యాదివాగ్దేవతలు ఒప్పుకోరు. ఎన్నో భావాలు ఉన్నాయి పరిశీలించు అంటారు. బైందవము ఆసనముగా కలది. బైందవము అంటే బిందు సముదాయము. బిందు సంబంధమైనవన్నీ అమ్మవారికి ఆసనములే. ఆసనము అంటే ఉన్న చోటు అని అర్థం. ఎక్కడెక్కడ బిందుస్వరూపం కనబడుతుందో అక్కడ అమ్మ ఉంది. ముందుగా సహస్రారస్థానాన్ని బిందువు అంటారు.

అదేవిధంగా శ్రీచక్రంలో ప్రథమ ఆవరణ. ఇది చతురస్రం నుండి లెక్క వేస్తే తొమ్మిదవ ఆవరణ. ఆ తొమ్మిదవ ఆవరణే బిందువు. అక్కడ ఉన్న తల్లి. అమ్మవారు నిజానికి ఎనిమిది ఆవరణలకు అంటకుండా కేవలం ఒక చోట ఉంటుంది. మిగిలినవన్నీ తరంగాలుగా వచ్చే విషయం. ఇదంతా అమ్మ విజ్ఞానం చేతనే ఏర్పడ్డాయి. కానీ వీటికి మూలమై ఆ త్రికోణం మధ్యంలో దేనికీ అంటకుండా కూర్చుంది. మిగిలినవన్నీ ఒకదానితో ఒకటి అంటుకుంటూ ఏర్పడ్డాయి. వాటికి అంటకుండా ఉన్నావిడే కారణం. ఇప్పుడు 'కూటస్థా, కులరూపిణీ, వీరగోష్ఠీప్రియా, వీరా, నైష్కర్మ్యా, నాదరూపిణీ' అర్థం అవుతుంది.

'కూటస్థా' అంటే నవ ఆవరణలే కూటములు. ఆ కూటముల మధ్యలో కూర్చుంది కనుక 'కూటస్థా'. అక్కడ ఉన్న దేవతలందరూ కులము. కులము అంటే యోగినుల సమూహము. **'కులరూపిణీ'** వారి రూపంలో ఉంది. వారందరూ అమ్మవారి చుట్టూ కూర్చుని సేవించుకుంటూ ఉంటే **'వీరగోష్ఠీప్రియా'.** వారందరికీ శక్తినిచ్చి బిందువులో కూర్చుంది కనుక **'వీరా'.** ఆవిడ అలా సాక్షిగా చూస్తూ కూర్చుంది కనుక **'నైష్కర్మ్యా'** అని చూపిస్తున్నారు. ఆ బిందువులో కూర్చున్న ఆవిడే ఒక్కసారి స్పందించి **'నాదరూపా, విజ్ఞానకలనా, కల్యా, విదగ్ధా, బైందవాసనా'** అయినది.

శ్రీచక్రము యొక్క బిందువునందు ఉన్నదని, సహస్రార స్థానము నందు ఉన్నది అని రెండు అర్థాలు స్పష్టమయ్యాయి.

నిజానికి – శ్రీచక్రములో బిందువు లేని చోటు ఏది? శ్రీచక్రము పేరే బైందవ చక్రం. బిందువునందు ఉన్నది అని చెప్పడమే కాకుండా చక్రమే బైందవ చక్రము. శ్రీచక్రంలో బిందువు తరువాత వచ్చింది ఒక త్రికోణం. తరువాత 8 త్రికోణాలు. దాని తరువాత 10 త్రికోణాలు. దాని తరువాత 10 త్రికోణాలు. దాని తరువాత 14 త్రికోణాలు. మొత్తం 43 త్రికోణాలు అయ్యాయి. ఇవన్నీ త్రికోణచక్రాలు.

బిందువుకి త్రికోణం లేదు కానీ త్రికోణానికి బిందువు ఉంది. అక్కడే 'నైష్కర్మ్య' అర్థమౌతుంది. ప్రతి త్రికోణములోనూ మూడు బిందువులున్నాయి. త్రికోణం మూడు బిందువులకి అనుబంధం ఏర్పరుచుతోంది. ప్రపంచమంతా మూడు బిందువుల మధ్య అనుబంధమే. మూడు బిందువులను కలిపే గీతలే అనుబంధం. అదేమిటో చెప్తూ – 'వామాదీనాం, ఇచ్ఛాదీనాం, జాగ్రదాదీనాం' అన్నారు.

జాగ్రత్ ఒక బిందువు, స్వప్నం ఒక బిందువు, సుషుప్తి ఒక బిందువు. మూడు అవస్థలు. మూడు వేరు వేరు. కానీ మూడింటికి అనుబంధం ఉంది. ఆ అనుబంధమే 'నేను' అనే చైతన్యం. మూడు బిందువుల అనుబంధంగా మధ్యలో ఒక కేంద్రం ఉంటుంది. కనుక త్రికోణం మధ్యలో బిందువు ఉంటుంది.

త్రికోణములో, త్రికోణము చుట్టూ ఉన్నవి బిందువులే. ఇలా చూస్తే మొత్తం శ్రీచక్రమే బైందవ చక్రం. ఇంతవరకు త్రికోణాలు చెప్పారు కానీ అష్టదళము, షోడశదళము, చతురస్రం చెప్పలేదంటే వాటిని కూడా బిందు చక్రములే అంటారని అనేకమార్లు చెప్పుకున్నాం. అవి వృత్తములు.

బిందువుకి వృత్తము సంబంధమేమిటంటే బిందువు విస్తరిస్తే వృత్తం. వృత్తం సంకోచిస్తే బిందువు. పరమాత్మ అనే బిందువు ప్రపంచమనే వృత్తంగా విస్తరించాడు. **ఈ ప్రపంచవృత్తానికి సంక్షిప్త రూపం పరమాత్మ అనే బిందువు.**

బిందువు వ్యాపకత్వమే చతురస్రం. ఇలా శ్రీచక్రమునందు ఉన్నది – బైందవాసనా.

'ఇచ్ఛాదీనాం త్రయం బిందు త్రయైర్యోగాత్ త్రిపురా నాదరూపిణీ' – మూడు బిందువుల యోగము కలది త్రిపురా. ఇచ్ఛ, జ్ఞాన, క్రియ. ఈ మూడు బిందువులుగా

విస్తరించిన శక్తే త్రిపురా. అంటే ఒకే శక్తిని ఈ మూడు రూపములుగా మనం చూశాం. జాగృత్, స్వప్న, సుషుప్తులు త్రికోణశక్తి. వామ, జ్యేష్ఠా, రౌద్రీ అమ్మవారి ప్రధాన శక్తులు. ఈ మూడు సృష్టి, స్థితి లయలు చేసే ఈశ్వర శక్తులు. వామా అంటే వమనము. వెలిగ్రక్కుట. అదే సృష్టి. జ్యేష్ఠా అంటే ఆ సృష్టిని పెద్దది చేస్తోంది. రౌద్రీ అంటే సృష్టి మొత్తం లయం చేయునది. సృష్టి, స్థితి, లయ – ఈ మూడు బిందువుల మూలశక్తి ఒక్కటే.

ప్రతి దేవతకు ఒక యంత్రం ఉంది. కానీ శ్రీయంత్రం మీద ఉన్నంత పరిశోధన ఇంకొకదానిపై జరుగలేదు. కొన్ని దశాబ్దాల క్రిందట ఒక రష్యన్ శాస్త్రవేత్త శ్రీచక్రం మీద అద్భుతమైన విషయాన్ని చెప్పారు. నేటికీ ఎందరో మేధావులు శ్రీచక్రంలో ఎన్నో అద్భుత విజ్ఞానాంశాలను నిరూపిస్తున్నారు. అందులో మొత్తం విశ్వవిజ్ఞాన రహస్యం ఉందని చెప్పారు.

హంస మంత్రానికి బిందు మంత్రం అని పేరు ఉంది. తన్మంత్రరూపంలో ఉంది కనుక 'బైందవాసనా'. **హంసం, హంసః** – రెండు ఉన్నాయి. రెండిటికి తేడా **సం–సః.** అక్షరాలు రాసేటప్పుడు స్వరాలలో చిట్టచివరికి **'అం అః'** రాస్తారు. **అః** అన్నప్పుడు విసర్గ పెడతారు. **అం** అన్నప్పుడు మూసేశాం. **అః** అంటే తెరచాం. **అ** అని తరువాత **హ** తగిలింది. దానిలో స్పందన అహ. ఆహా!

ఈ మధ్య ఒకాయన రాసిన అద్భుతమైన సంస్కృత పుస్తకానికి ఒక అమెరికన్ ముందుమాట రాస్తూ "సంస్కృత భాషను చూస్తే తెలుస్తోంది ఇంత సంస్కారవంతమైన భాష ప్రపంచంలో మరెక్కడా లేదు... భారతదేశంలోనే ఉంది అంటే దానిని బట్టి భారతదేశానికి ఎంత సంస్కారం ఉందో తెలుసుకోవచ్చు" అని అన్నాడు. "ద లాంగ్వేజ్ ఇట్‌సెల్ఫ్ షోస్ ద కల్చర్ ఆఫ్ ఇండియా" అక్షరాల కూర్పులోనే సంస్కారం కనబడుతోంది.

అం అంటే ప్రళయం. **సర్గ** అంటే మొట్టమొదట ప్రారంభమైంది. **విసర్గ** అంటే మళ్ళీ మొదలైంది. **వివిధ సర్గః విసర్గ** అయ్యింది. **అం** లయం అయిపోయింది. **అ** అంటే తెరుచుకుంది కాని, ఏం లాభం లేదు... దానికి స్పందన కలగాలి. అప్పుడు **అః** అయ్యింది. **అః** అన్నప్పుడు **అమ్మ, అయ్య రెండూ కలసిపోయాయి.**

ఈ శబ్దం ఎక్కడ నుండి పలుకుతోందో గమనించాలి. ఏ శబ్దాన్నైనా శ్వాసతోనే పలుకుతారు. శ్వాసకి హంస మంత్రం అంటారు. హంస అన్నప్పుడు 'హ–స' ఉచ్ఛ్వాస, నిశ్వాస రెండిటిని తెలియజేస్తుంది.

'హం–సః'. హం అంటే ఉచ్ఛ్వాసకు సంబంధించింది కనుక లోపలకి లాగుతోంది. సః అంటే బయటికి వదులుతోంది. బయటకి వదలడమంటే సృష్టి. లోపలికి లాగడమంటే లయం.

హం–సం. సం అన్నప్పుడు ఒక నాదం వచ్చి అది లయాన్ని చూపిస్తోంది. సః అన్నప్పుడు సృష్టిని చూపిస్తోంది. రెండిటిలోనూ సాధారణంగా ఉన్నది మాత్రం హంస. హంసం అంటే శివశక్తుల యొక్క లయ స్థితిని తెలియచేస్తున్నది. హంసః అంటే శివశక్తుల యొక్క సృష్టి విస్తారాన్ని చూపిస్తున్నది. ఈ రెండిటి గురించి –

హకారం బిందురూపేణ బ్రహ్మాణం విద్ధి పార్వతి
సకారం బిందు సర్గాభ్యాం హరిశ్చాహం సురేశ్వరి
అవినాభావ సంబంధో లోకే హరిహరౌ ఇతి (జ్ఞానార్ణవతంత్రం)

పార్వతీదేవితో శివుడు చెప్తున్నాడు. శివకేశవులు, హరిహరాత్మకం అంటే ఏమిటో అర్థమౌతుంది. 'హకారం బిందురూపేణ'. హం పరబ్రహ్మను తెలియచేస్తుంది. ఆయన సృష్టి చెయ్యాలి అనుకున్నప్పుడు 'సః'. సృష్టిని లీనం చేసుకోవాలి అంటే సం. శక్తితోనే సృష్టి చెయ్యాలి. శక్తితోనే లయం చెయ్యాలి.

శక్తి స్త్రీవాచకం. అది సకారం. హం అనేది బ్రహ్మమైతే, సం అంటే నేను(శివుడు). సః అంటే విష్ణువు అని చెప్పాడు. శివుడు లయకారకుడు. హంస అనగానే పరబ్రహ్మ యొక్క శక్తే హంస. 'హంస మంత్రార్థరూపిణీ'. 'హంసినీ'. ఆ పరబ్రహ్మ యొక్క శక్తి సృష్టిగా విస్తరిస్తే హంసః. లయంగా లోపలికి లాగేస్తే హంసం. బిందువులు ఎన్ని వచ్చాయో చూడాలి. హం పరబ్రహ్మ. సం అంటే శివుడు. సః అంటే విష్ణువు.

'హంసం, హంసః – అంటే ఏమిటో కాదు మేమిద్దరమే' అన్నాడు శివుడు. హంసంకి, హంసఃకి భేదం లేదు. నాకు, విష్ణువుకి భేదం లేదు అని చెప్పాడు. ఇది

హరిహరాత్మక తత్త్వము. 'హం–సః'. సః అన్నప్పుడు విసర్గలో రెండు సున్నాలు వచ్చాయి. ఒక్క బిందువు రెండు అయిపోయింది. బిందువుగా ఉన్నప్పుడు ఏకం. రెండు అయినప్పుడు సృష్టి మొదలైపోయింది. ఒకే పరమాత్మ తన శక్తితో రెండుగా విడివడి ఈ జగత్తంతటిని నిర్వహిస్తున్నాడు.

హంసంలో ఒక బిందువు తీసుకుని, హంసఃలో రెండు బిందువులు తీసుకుంటే మొత్తం మూడు బిందువులు అయ్యాయి. ఈ మూడు బిందువులు కలిపితే త్రిపురా. ఈ హంసం హంసః మన శ్వాసలో ఉంది. శ్వాస చక్రమే బైందవం. అందులో సంచరించే ఆత్మ చైతన్యరూపిణే 'బైందవాసనా'.

'హాకినీ మండలాదూర్ధ్వం బిందురూపస్తు వర్తులమ్' (స్వచ్ఛంద తంత్రం) హాకినీ మండలానికి పైన వృత్తాకారమైన బిందురూపమున్నది. బిందువునే ధ్యానం చేయడం శ్రేష్ఠం. ఈ బిందువే త్రికోణాలుగా వర్ధిలింది. ఈ బిందువే త్రికోణాలను లయం చేసుకుని ఒక్కటే ఉంటుంది. బిందువు అంటే ఏకమైన పరబ్రహ్మమును తెలియచేస్తున్న తత్త్వమే. ఆ బిందువులు ఎక్కువైతే త్రికోణం. ఒక్కటైపోతే బిందువు.

బిందువును ఎక్కడ ధ్యానించాలో చెప్తూ 'హాకినీమండలాదూర్ధ్వం' – హాకినీ మండలమునకు పైన అన్నారు. హాకినీ మండలం అంటే ఆజ్ఞాచక్రం. ఆజ్ఞాచక్రస్థానం అంటే కనుబొమల నడిమి ప్రాంతం. దానికి పైన 'బిందు రూపస్తు వర్తులమ్'. బిందువు ఎప్పుడూ వర్తులాకారంలో ఉంటుంది.

అక్కడ శివశక్త్యాత్మక తత్త్వం. శ్రీచక్రోపాసకులు బిందుచక్రధ్యానం అక్కడ చేసుకుంటారు. అక్కడ నుండి అదంతా బిందుమండలమే. అదే ఇందుమండలం, చంద్రమండలం. ఇవి తెలుసుకుంటే అక్కడ ఎందుకు గుండ్రటి బొట్టు పెట్టుకుంటారో తెలుస్తుంది. అక్కడ శివశక్త్యాత్మక స్వరూపం ఉంది. దానికే ఆరాధన. 'బైందవాసనా' అన్నప్పుడు ఇప్పుడు చెప్పిన భావనలన్నీ అన్వయించుకోవలసినదే.

1. శ్రీ చక్రములో బిందువునందు ఉన్నది. 2. శ్రీచక్రం మొత్తం బిందుమయమైన శక్తి కనుక **'త్రికోణరూపిణీ శక్తిః బిందురూపః శివస్మృతః అవినాభావ సంబంధం తస్మాత్ బిందు త్రికోణయోః'**. బిందు – త్రికోణములకు అవినాభావ సంబంధములు.

అవే శివశక్తి స్వరూపములు. **'భ్రువోరుపరి భాగే వృత్త సన్నివేశో బైందవమ్'** అన్నారు.

సృష్టి విజ్ఞానంలో శివశక్తులు ఎలా ఉన్నారో చూపించారు. ఈ శివశక్తి రూపాలనే మనం హరిహరులు అంటున్నాం. ఇద్దరికీ భేదము లేదు. శివశక్త్యాత్మకం అంటే ఏమిటో హరిహరాత్మకమన్నా అదే. శివుడు శక్తిగా వ్యాపిస్తే హరి. అదే 'వైష్ణవీ' 'విష్ణురూపిణీ'. జలాలలో ప్రతిబింబించిన చంద్రబింబం బిందువు. బుద్ధియందు జీవరూపంగా ప్రతిబింబించిన పరమాత్మ బిందువు ఉపాధులకు అతీతమైనది.

906. తత్త్వాధికా – శ్రీ తత్త్వాధికాయై నమః

'తత్త్వాధికా', 'తత్త్వమయీ', 'తత్త్వమర్థస్వరూపిణీ'. ఈ నామాలలో తత్త్వాలు వచ్చాయి. తత్త్వము అనే మాటకి అనేక అర్థాలు ఉన్నాయి. సందర్భానికి ఏది అవసరమో అదే తీసుకోవాలి.

తత్త్వములు అంటే ప్రళయం వరకు ఉంటూ జీవులకు అనుభవాన్నిచ్చునవి. ఈ ప్రపంచం తయారు కావడానికి కావలసిన మౌళిక వస్తువులు 24 తత్త్వాలు. తంత్రశాస్త్రం 36 చెప్పింది. 24 తత్త్వాలనే మరికొంచెం విభజించి చెప్పారు. ఈ తత్త్వాలు ప్రపంచానికి ఉన్నాయి. పరమాత్మకు లేవు. ప్రపంచానికి ఉన్నాయంటే ఉపాధులకి ఉన్నవి ఈ తత్త్వములు.

ఉపాధికి తత్త్వాలు కానీ, ఉపాధిలో ఉన్న తల్లి మాత్రం 'సర్వోపాధివినిర్ముక్తా'. తత్త్వములతో కూడి ఉన్న ప్రపంచానికి పైన ఉంది కనుక 'తత్త్వాధికా'. తత్త్వముల కంటె అధికమైనది. గొప్పది. తత్త్వాలకి అతీతురాలు.

తత్త్వములుంటేనే వికారాలు వచ్చాయి. ప్రాపంచిక తత్త్వములు నశించే లక్షణములు కలవి. విశ్వమే లయం అయిపోతున్నప్పుడు విశ్వంలో ఉన్న తత్త్వాలు కూడా లయం అయిపోతాయి. పంచభూతాలు, పంచతన్మాత్రలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు – ఇవన్నీ తత్త్వములే. ఇవన్నీ లయించేవి. లయించే తత్త్వముల కంటే లయించని పరతత్త్వం గొప్పది. అది తత్త్వముల కంటే పరం కనుక పరతత్త్వం అన్నారు.

907. తత్త్వమయీ – శ్రీ తత్త్వమయ్యై నమః

తత్త్వములతో నిండినది. అన్ని తత్త్వాలకు అతీతురాలేకాక, ఆ తత్త్వాలలో వ్యాపించి ఉన్నది ఆ ఈశ్వరియే. ఆత్మ వ్యాపించకపోతే అవేవీ పనిచెయ్యవు. అవి జడమే.

ఆత్మతత్త్వ, విద్యాతత్త్వ, శివతత్త్వములనే మూడు తత్త్వముల స్వరూపంగానూ – వాటి సమష్టి స్వరూపంగానూ ఉన్నది. ఈ సమష్టి స్వరూపం ఆ మూడు తత్త్వములకు అధికం.

మాయాంతమాత్మతత్త్వం, విద్యాతత్త్వం సదాశివాంతంస్యాత్, శక్తిశివౌ శివతత్త్వం, తురీయ తత్త్వం, సమష్టిరేతేషా – అని విద్యావేత్తలైన పెద్దలమాట.

పృథ్వి మొదలు మాయ వరకు ఆత్మతత్త్వం. మాయ మొదలు 'సదాశివ' వరకు విద్యా తత్త్వం. శివశక్తులిద్దరూ శివతత్త్వం. ఈ తత్త్వములన్నిటి సమష్టి స్వరూపం తురీయ తత్త్వం.

36 తత్త్వములు ఈ మూడు భాగాలుగా ఉంటాయి. సచ్చిదానంద రూపమైన పరమేశ్వరియే సర్వతత్త్వములందున్ననూ పైన చెప్పిన 'ఆత్మతత్త్వం'లో చిదానందాలు రెండూ కప్పబడి ఉంటాయి. అనగా మాయాది పృథివ్యాంత తత్త్వములలో 'సత్త' (ఉనికి) మాత్రమే తెలుస్తుంది. అనగా చిదానందములు ప్రకాశింపవు.

రెండవదైన విద్యాతత్త్వంలో సత్తు, చిత్తులు పూర్తిగా ఆవృతమై (కప్పబడి) ఆనందాశ్రయం మాత్రం అల్పంగా కప్పబడి ఉంటుంది.

మూడవదైన శివతత్త్వంలో సచ్చిదానందములు మూడూనూ అనావృతములై (కప్పబడి లేకుండా) ఉంటాయి.

మొత్తంగా ఈ మూడు తత్త్వములు ఆవృతమై, అనావృతమై సచ్చిదానందరూపిణి అయిన పరమేశ్వరి ఉన్న కారణంగా తత్త్వమయి.

'జ్ఞానార్ణవం' అనే గ్రంథం ప్రకారం –

స్వయం ప్రజ్ఞాతసంజ్ఞస్తు శివాధిక్యేన జాయతే
అసంప్రజ్ఞాత నామా తు శివతత్త్వేన వై భవేత్

సమాధి స్థితిలో – శివతత్త్వాధిక్యం వలన సంప్రజ్ఞాత సమాధి, శివతత్త్వం చేత అసంప్రజ్ఞాత సమాధి కలుగుతుంది అని భావం. సంప్రజ్ఞాత సమాధి 'తత్త్వాధికా', అసంప్రజ్ఞాత సమాధి 'తత్త్వమయీ' – అని ఒక భావం.

తత్(అది) అంటారు. ఆ తత్ అనబడేది తత్త్వాధికం. అది తత్త్వములలో 'త్వమ్'గా ఉంది.

ఇప్పుడు మనం పట్టుకోవలసినది అన్నింటికి అతీతమైన ఆ వస్తువే మనలో 'నేను' అనే పదార్థంగా ఉన్నది – అని. ఆ తత్, ఈ త్వమ్ – ఈ రెండూ ఒక్కటిగా గ్రహించగలినప్పుడు అమ్మ అర్థమవుతుంది. అదే 'తత్త్వమర్థస్వరూపిణీ'.

908. తత్త్వమర్థస్వరూపిణీ – శ్రీ తత్త్వమర్థస్వరూపిణ్యై నమః

తత్త్వాధికా, తత్త్వమయీ, తత్త్వమర్థస్వరూపిణీ. ఉదాహరణకి నీటి కడవలో సూర్యుడు. కడవ ఒక తత్త్వము. లోపల నీరు ఒక తత్త్వం. ఈ తత్త్వములను తెలియజేస్తూ, తత్త్వములను ప్రకాశింపజేస్తున్న వస్తువు సూర్యుడు. సూర్యుడు ఎక్కడ ఉన్నాడు? సూర్యుడు కుండ లోపల ఉన్నాడు. బయట ఉన్న సూర్యుని తెలుసుకుని, కుండలో ఉన్న సూర్యుని తెలుసుకుంటే రెండూ – ఒకటే అనే తెలివి వస్తుంది.

కడవలో ఉన్న సూర్యునిలాగ శరీరం లోపల నేను అని ఒక సూర్యుడు ఉన్నాడు. వీడు ప్రతిబింబమే. దీనికి మూలమైనది పరబ్రహ్మ అనే సూర్యుడు. ఈ సూర్యుడు, ఆ సూర్యుడు ఒకడేనని తెలిసిపోయాక సూర్యుడు కుండలో ఉన్నాడని అంటామా? సూర్యుడు అనే దృష్టితో చూస్తే ఆయన కుండలో ఉన్నా, దానికి అంటడం లేదు.

త్వమ్ అనే సూర్యుడు, తత్ అనే సూర్యుడు ఒకటే అని తెలిశాక ఈ శరీర తత్త్వాలతో తాదాత్మ్యము పోతుంది. పరమాత్మగానే మిగులుతాం.

తత్, త్వమ్ అనే రెండిటి యొక్క అర్థమే అమ్మవారు. తత్ వేరు, త్వమ్ వేరు కాదు. తత్త్వమసి అనే మహావాక్యము యొక్క అర్థమే అమ్మవారు. ఇది దీని యొక్క ప్రతిపాదన.

మహావాక్యమే అమ్మవారు. శ్రీవిద్య పూర్ణదీక్షాపరులు సన్న్యాసులే. వారు గృహస్థాశ్రమంలో ఉండవచ్చు కానీ, వారు సన్న్యాసులే. వారు మహావాక్యము తీసుకున్నారు. మహావాక్యం యొక్క ప్రయోజనం ప్రదర్శించేది అంతా "నేను కాదు. నాలో ఉన్న నేను అనేది అమ్మయే" అనే ఐక్యస్థితి రావాలి. అందుకే శ్రీవిద్యలో మహావాక్యాలు ఇస్తారు. సన్న్యాసంలోనూ మహావాక్యములు ఇస్తారు. రెండూ వేదాంతవిద్యలే.

'తత్త్వమర్థస్వరూపిణీ' అంటే తత్త్వమసి మహావాక్యము ద్వారా తెలియబడుతున్న జీవబ్రహ్మైక్య తత్త్వమే. ఇది ఒకే వాక్యంలో చెప్పబడుతున్నది.

909. సామగానప్రియా - శ్రీ సామగానప్రియాయై నమః

నాదరూపా తరువాత సామగానప్రియా నామం చాలా ఔచిత్యం.

ఆ నాదతత్త్వాన్ని పట్టుకోవడానికి గొప్ప ప్రక్రియ సామగానం. సామగానం ద్వారా మాత్రమే ఆ 'నాదరూపా', 'బిందురూపా' అయిన తత్త్వాన్ని మనం పట్టుకోగలం. నీ లోపల త్వమ్(నేను) పదార్థంగా ఉన్న తత్(పరబ్రహ్మస్వరూపిణి)ని గ్రహించాలంటే ఆ సామగానము ద్వారా తెలుసుకోగలమని చెప్పారు.

సామగానం అంటే అమ్మవారికి చాలా ప్రీతి. 'కలౌ కేశవ కీర్తనాత్' అని ఇలాంటివన్నీ చెప్పడంలో ఉద్దేశం సంకీర్తన వల్ల తెలియని తాదాత్మ్యం ఉంటుంది. ఆ తాదాత్మ్యం లోంచి క్రమంగా ఈశ్వర తాదాత్మ్యం పొందుతాం. అందుకే ఒకే భావం, ఒకే శబ్దం. దాన్ని చక్కగా సౌమ్యంగా గానం చేస్తే సామగానం. ముందు ఆ అర్థాన్ని స్వీకరిస్తే, సౌమ్యమైన భావంతో గానం చేస్తే సామగానం. అలాంటి గానానికి ఆమె ప్రీతి చెందుతుంది.

వేదాల్లో కూడా సామగానం చాలా ముఖ్యమైనది. పరమాత్మయే గీతలో, **"వేదానాం సామవేదోఽస్మి"** అని చెప్పారు. అన్ని వేదాలలోకి సామవేదమే నా స్వరూపం అని అన్నారు. మిగిలిన వేదాలు కాదని అర్థం కాదు.

సామగానం వచ్చేసరికి దేవతలకి ఆనందం. ప్రతి యజ్ఞం జరిగేటప్పుడు

బ్రహ్మ, ఉద్గాత, హోత, అధ్వర్యుడు ఉంటారు. ఈ నలుగురుకి బ్రహ్మలే అని పేరు. ఈ ఉద్గాత సామగానం చెయ్యాలి. ఆ సామగానంతో యజ్ఞం పరిపూర్ణమవుతుంది. సామము అంటే లొంగదీసుకొనుట అని అర్థం. సామ, దాన, భేద, దండోపాయాలు ఉన్నాయి. లొంగదీసుకునే ప్రయత్నం చేస్తే సామం.

సాత్త్విక లక్షణం ఉన్న వారే సామానికి లొంగుతారు. రాజస, తామసులు ప్రమాదమైనవారు. వారికి మిగిలిన మూడూ చూపించాల్సిందే. సాత్త్విక గుణంలో గొప్పవారు దేవతలు. వారు సామానికి ప్రసన్నులౌతారు.

ఎలా చదివితే దేవతలు ప్రసన్నులౌతారో అలా చదవడాన్ని సామము అంటారు. 'సామగానప్రియా' నామం 'తత్త్వమర్థస్వరూపిణీ' ప్రక్కనే ఎందుకు పెట్టారు? సామవేదానికి సంబంధించినది ఛాందోగ్యోపనిషత్. ఆ ఉపనిషత్తులోని మహావాక్యం "తత్త్వమసి".

తత్త్వమసి వాక్యంతో తత్త్వమర్థస్వరూపిణీ చెప్పి, దానికి మూలమైన ఛందోగులు (సామగానం చేసే వారిని ఛందోగులు అంటారు) ఆ అనుభూతి కలిగితే "సామగాయాన్నాస్తే" – పరదేవత అయిన ఆ తల్లికి సామగానం అంటే ప్రీతి. వేదమునందు సామగానము చేత ఆనందించే తల్లి. ఆ సామగానమే తత్త్వమసి అనే అనుభవం రాగానే కలిగే ఆనందము యొక్క వ్యక్తీకరణ. ఇది అసలైన సామగానం.

ఇంకా సామగానం గురించి చెప్పాలంటే మన శరీరంలోనే ఋగ్యజుస్సామాలు ఉన్నాయి. మన ఆలోచనలు ఋక్కులు. మన ఆచరణలు యజుస్సులు. మన ప్రాణము సామము. మన శరీరంలో ప్రాణమే సంగీతము. మన శరీరమనే వేణువులో లయబద్ధంగా సాగుతుంది. 'సామగానప్రియా' అంటే ముఖ్యప్రాణరూప ఉపాసన చేస్తే సంతోషించే తల్లి అని దీనికి మరో అర్థం. తరువాతి నామం 'సౌమ్యా'.

910. సౌమ్యా – శ్రీ సౌమ్యాయై నమః

కొందరు ఈ నామాన్ని **'సోమ్యా'** అన్నారు. సౌమ్యా, సోమ్యా – రెండూ సరిపోతాయి. సోమ్యా అంటే సోమ సంబంధమైనది. సోముడు అంటే చంద్రుడు.

చంద్ర సంబంధమైనది. బైందవాసనా వచ్చింది గనుక 'సోమ్యా' అంటే చంద్రమండలరూపిణి.

ఇదంతా యజ్ఞస్వరూపము. యజ్ఞంలో సోమలతా రూపంతో ఉన్నది.

ఆ సోమలత రసాన్ని యజ్ఞమునందు పానం చేస్తారు. సోమలత ఓషధి. అది యజ్ఞద్రవ్యం. సోమము అంటే రసం. రసమున్న లత సోమలత. మూలాధారం నుంచి సహస్రారం వరకు యోగపరంగా చిదేకరూపరసరూపిణి అయిన సోమలత. స-ఉమ అంటే శివశక్తిమయమైన లత సోమలత. అది ప్రతి వారిలోనూ ఉన్న కుండలినీ లత. అది 'సోమ్యా'. ఉమాసహితుడైన పరమేశ్వరస్వరూపంగా ఉన్నది.

సౌమ్యా, సోమ – ఏదనుకున్నా ఉమాసహిత శివతత్త్వమే అమ్మరూపము.

చంద్రమండలము (సోమ) నందు ఉన్నది సౌమ్యా. సహస్రారకమలం చంద్రమండలం... అక్కడ ఉన్నది.

బ్రహ్మానందరసమే సౌమ్యము. దానిని పానం చేస్తున్న ఆనందదశే సౌమ్యదశ.

911. సదాశివకుటుంబినీ – శ్రీ సదాశివకుటుంబిన్యై నమః

స-ఉమ అయినప్పుడు పరమేశ్వరి 'సదాశివకుటుంబినీ'. మధ్యమధ్యలో సమయాచారం తెలియజేస్తూనే ఉన్నారు. సదాశివునికి ఇల్లాలు. కుటుంబానికి పెద్దైనవారిని 'కుటుంబినీ' అంటారు. పంచబ్రహ్మల్లో పైవాడు సదాశివుడు. ఆయన క్రింద ఉన్న కుటుంబం అంతా ఆయన కుటుంబం. సదాశివుని కుటుంబమంటే ఈ అనంత ప్రపంచం. ఈ అనంత కుటుంబానికి పెద్దావిడ అమ్మవారు. ఈ ప్రపంచానికి నాయకురాలు. నాయకుడు పరమేశ్వరుడు. సదాశివకుటుంబినీ అంటే గృహిణీ, గృహస్థులిద్దరినీ చూపించారు

912. సవ్యాపసవ్యమార్గస్థా – శ్రీ సవ్యాపసవ్యమార్గస్థాయై నమః

సవ్యము అంటే ఎడమ. అపసవ్యము అంటే కుడి. కుడి, ఎడమ మార్గములలో ఉన్న తల్లి. సామగానం అంటే ప్రాణరూపం. మనలో ముఖ్యప్రాణమే సామగానమని

చెప్పుకున్నాం. ఆ సామగానం శివశక్త్యాత్మకం. హంసగా సంచరిస్తూ ఉంటుంది. మన శరీరమే సదాశివకుటుంబం. ఆ తిరుగుతున్నప్పుడు సవ్య అపసవ్య మార్గస్థా అనగా ఇడా, పింగళా నాడుల్లోంచి కుడి, ఎడమల్లో సంచరిస్తున్న ప్రాణరూపిణి అమ్మవారు.

మరొక అర్థం. **'ఇడపింగళయోః మార్గయోః బ్రహ్మపురీ శరణ్యోః'** – ఈ రెండు బ్రహ్మపురి దారులు. బ్రహ్మపురమని ఒక పురం ఉంది. దానికి వెళ్ళడానికి రెండు దారులు ఉన్నాయి. ఒకటి సవ్యమార్గం. ఇంకొకటి అపసవ్య మార్గం. బ్రహ్మపురి అంటే సహస్రారం. అక్కడకి వెళ్ళడానికి రెండు మార్గాలు... కుడి(ఇడ), ఎడమ(పింగళ)ల మార్గాలు. సుషుమ్న యందు నిలబడడానికి సవ్యాపసవ్యాలే శరణ్యాలు. ఉచ్ఛ్వాసనిశ్వాసలతో రేచక పూరక చేసుకుంటూ కుంభకంలో నిలపాలి.

మరొక భావం – సవ్య–అపసవ్య–మార్గ అని మూడు వచ్చాయి. సవ్య అపసవ్య అంటే కుడి(ఇడ), ఎడమ(పింగళ). మార్గ అంటే సుషుమ్న. ఈ మూడింటి యందు ఉన్నది అని అర్థం. సుషుమ్న రెండిటికి మధ్యలో ఉన్నది. మార్గము అంటే వెతుకునది అని మరొక అర్థం ఉంది. బ్రహ్మపురికి వెళ్ళడానికి త్రోవ ఇదని చెప్పారు.

మరొక అర్థం – సాధకుడైన వానికి రెండు మార్గములు ఉన్నాయి. ఒకటి మంచి మార్గం. ఇంకొకటి చాలా మంచి మార్గం. ఈ మార్గాలలో ఏదీ త్రొక్కకపోతే వానికి మార్గమే లేదు. మార్గము లేనివానిని భ్రష్టుడు అంటారు. రెండు మార్గాలని చెప్తూ కఠోపనిషత్, **"అన్యచ్ఛ్రేయో అన్యాదుతైవ ప్రేయస్తే ఉభే నానార్థే పురుషౌ నినీతః"** అని చెప్పింది. ప్రేయోమార్గము, శ్రేయోమార్గము అని రెండు మార్గాలు ఉన్నాయి. ఇది సవ్య, అపసవ్య. కుడి ఎప్పుడూ గొప్పది. ఎడమ కొంచెం తక్కువ అని లోకంలో కూడా ఉంది.

ముందు వ్యవహారంగా చూసుకుంటే 'వాడు నా కుడి భుజమండి' అని అంటారు కానీ 'ఎడమ భుజం' అని ఎవరూ అనరు. దక్షిణమార్గము. వామమార్గము. శ్రేయః, ప్రేయః అని రెండు మార్గాలు ఉన్నాయి. ప్రేయోమార్గమే కావాలనుకుంటాం. ఇష్టమైనవి కోరుకుంటూ సుఖపడాలని అనుకోవడం ప్రేయోమార్గం. శాశ్వతసుఖమైన

పరబ్రహ్మ ప్రాప్తిని శ్రేయస్సు అంటారు. చాలా మంది ప్రేయోభిలాషులే కానీ శ్రేయోభిలాషులు అరుదు.

ప్రేయస్సు అంటే తాత్కాలిక సుఖం. శ్రేయస్సు అంటే శాశ్వత సుఖం. పూజలు చేసిన దగ్గర నుండి కలసి వచ్చిందండి అంటుంటారు. అంటే అది ప్రేయో మార్గము. ఎడమమార్గం. అమ్మవారి విద్యను మనం ప్రేయోమార్గానికి వాడేశాం. అది అపసవ్యమార్గం.

ఆ విద్యనే మోక్షం కోసం కొందరు వినియోగిస్తారు. కుడి మార్గం. ఆ శ్రేయోమార్గంలో ఉన్నవారికి శ్రేయస్సులు ఇస్తోంది. వారు ఏ మార్గంలో ఆరాధించారో దానికి తగ్గ ఫలితమిస్తుంది.

వాయుపురాణం ఆధారంగా – నక్షత్రములను వీధులుగా చెప్పిన అద్భుత దర్శనం ఉంది. ఒకొక్క మార్గంలో తొమ్మిది చొప్పున 27 నక్షత్రాలు మూడు వీధులుగా వర్ణించబడ్డాయి.

అశ్విని, భరణి, కృత్తిక – నాగవీధి
రోహిణి, మృగశిర, ఆర్ద్ర – గజవీధి
పునర్వసు, పుష్యమి, ఆశ్రేష – ఐరావతవీధి
– ఈ మూడు ఉత్తర మార్గం (సవ్యమార్గం)
మఘ, పుబ్బ, ఉత్తర – ఆర్షభీవీధి
హస్త, చిత్త, స్వాతి – గోవీధి
విశాఖ, అనురాధ, జ్యేష్ఠ – జారద్గవీవీధి
– ఈ మూడు మధ్యమ మార్గం
మూల, పూర్వాషాడ, ఉత్తరాషాడ – అజవీధి
శ్రవణ, ధనిష్ఠ, శతభిషం – మార్గివీధి
పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతి – వైశ్వానరీవీధి
– ఈ మూడు దక్షిణ (అపసవ్య) మార్గం

సవ్య – అపసవ్య – మార్గ (మధ్యమ) ...ఈ మూడింటిముందు ఉన్న జ్యోతిః

స్వరూపిణి, ఈ నక్షత్ర మార్గములలో ఉండి విశ్వాన్ని నడుపుతున్న జగన్నాయకి.

ఇంకో అర్థం – ఉత్తములైనవారు రెండు మార్గాలలో నిర్గమిస్తారు. ఒకటి దేవయానం. రెండు పితృయానం. దీనికే ఉత్తరాయణం, దక్షిణాయనం అని కూడా వ్యవహరిస్తాం. దేవయానాన్ని అర్చిరాది మార్గాలు అంటారు. ఉపాసనలో తాదాత్మ్యస్థితికి చెందిన మహాత్ములు ఈ అర్చిరాది మార్గం ద్వారా సూర్యమండలాన్ని ఛేదించుకుని సగుణబ్రహ్మలోకానికి చేరుతారు. ఆ దేవయానమార్గంలో వెళ్ళినవారు మరి పుట్టరు.

మిగిలినవారు కోరికల కోసం యాగాలు, మొదలైనవి చేసే మంచివారు. వీరు వెళ్ళే మార్గం పితృయానము, ధూమ్రమార్గము అంటారు.

పితృయానంలో కోరికలతో పూజలు చేసినవారు ఇంద్రలోకం, చంద్రలోకం ఇలాంటివి అనుభవించి తిరిగి భూమి మీదకు వచ్చేస్తారు. వీరు సుఖపడతారు కానీ తిరిగి భూమి మీదకు వస్తారు. ఈ రెండు మార్గాలలో ఉంటూ మనల్ని ఎవరు నడిపిస్తున్నారు? అక్కడ నడవాలంటే అమ్మ అనుగ్రహం కావాలి. 'సవ్యాపసవ్యమార్గస్థా' అంటే వారి కర్మలకు తగిన మార్గంలో, తిరిగి వెనక్కి వచ్చే మార్గాలలో కొందరిని తీసుకువెళుతుంది. తిరిగి వెనక్కి రాని మార్గాల నుండి కొందరిని తీసుకువెళ్తుంది. దానిని క్రమముక్తి అంటారు.

జీవన్ముక్తి అని మూడవది ఉంది. అది కూడా అమ్మవారే ఇవ్వాలి కనుక 'సవ్యాపసవ్యమార్గస్థా'లో 'మార్గ' శబ్దము జీవన్ముక్తిని తెలియజేస్తుంది. సవ్యాపసవ్యమార్గంలో ఇన్ని గతులు ఉన్నాయి.

వామాచార పరాయణులు, దక్షిణాచార పరాయణులు – శ్రీవిద్యలోనే కాకుండా ఏ విద్యలోనైనా ఇద్దరూ ఉంటారు. ఈ రెండు మార్గాలలోను అమ్మని ఉపాసిస్తారు కనుక 'సవ్యాపసవ్యమార్గస్థా'. ఏది గొప్పది అనే వాదన మనం చెయ్యడానికి వీలులేదు. వారు అమ్మవారిని ఏ రూపంలో కొలుచుకున్నారో వారికి ఆ రూపంలో ఏమివ్వాలో అది అమ్మవారు ఇస్తుంది. వామాచార, దక్షిణాచారములు రెండిటిలోను శ్రీవిద్య ఉంది కనుక 'సవ్యాపసవ్యమార్గస్థా' అని చూపించారు.

సవ్యాపసవ్యమార్గస్థాకి మరొక అర్థం చెప్పుకుందాం. ఇది శ్రీచక్ర ఆరాధన చేసే వారికి పనికొస్తుంది. శ్రీచక్ర ఆరాధనలో ఒకొక్క ఆవరణలో ఒకొక్క పూజ చేస్తారు. ఇందులో ఆవరణ దేవతలను పూజించేటప్పుడు క్రమం ఎలా వస్తుందంటే, మొదటి ఆవరణలోనే మూడు రేఖలలోనూ క్రమం ఉన్నది.

దేవతలు ఒక ఆవరణలో ప్రదక్షిణ మార్గంగా వస్తూ ఉంటారు. ఇంకో ఆవరణలో దేవతలు అప్రదక్షిణ మార్గంలో ఉంటారు. మన ఆరాధన కూడా అలాగే వెళ్ళాలి. ఒకటి ప్రదక్షిణ మార్గంలో అర్చన-అది సవ్యమార్గం. మరొకటి అప్రదక్షిణమార్గంలో అర్చన-అది అపసవ్యమార్గం. శ్రీచక్రంలోనే ఈ సవ్యమార్గ, అపసవ్యమార్గాలతో కూడిన ఆవరణల మధ్యలో బిందువు నందు ఉంది కనుక 'సవ్యాపసవ్యమార్గస్థా'.

మొత్తం మీద అమ్మని ఆశ్రయిస్తే మనకి మరి ఆపద ఉండదు. భక్తి, జ్ఞానము కలిపి ఉపాసన చేస్తే మరి వెనక్కురాని లోకాలకు వెళ్తారు. తెలియకుండా ఆరాధన చేస్తే ఇహలోకంలో సుఖము పొందుతారు. పరలోకంలోనూ సుఖం పొంది తిరిగి భూమి మీద మళ్ళీ ఉత్తమ జన్మలు పొంది ఆ జన్మలోనైనా భక్తి, జ్ఞానం పొందుతారు. అమ్మని పట్టుకుంటే ఇప్పుడున్న దానికంటె ఉన్నత స్థితి వస్తుందే కానీ పతనం కారు.

ఇందులో తెలుస్తున్నది ఉన్న స్థితి కంటే ఉన్నత స్థితికి వెళ్లడమే గొప్ప. అలా కాకుండా ఉన్న స్థితి నుంచి క్రింద పడిపోతే ఆపద. ఆ ఆపదలు మరి లేకుండా చేస్తున్నది అమ్మ కనుక తరువాత నామం..

913. సర్వాపద్వినివారిణీ - శ్రీ సర్వాపద్వినివారిణ్యై నమః

అన్ని ఆపదలను తొలగించునది. రెండు మార్గములలోనూ లేనివారిని సైతం - నామస్మరణాదుల మాత్రం చేతనే రక్షిస్తుందనే భావాన్ని పురాణ ప్రమాణాలతో విజ్ఞులు వక్కాణించారు. ఆపదలు వస్తే, ముందు వెనుక ఆలోచించకుండా అమ్మ పాదాలను తలచుకోమన్నారు.

ఆపది కిం కరణీయం? స్మరణీయం చరణయుగళమంబాయాః

తత్స్మరణం కిం కురుతే? బ్రహ్మాదీనామపి కింకరీ కురుతే

ఆపదలో ఏం చేయాలి? అమ్మ పాదాల జంటను స్మరించాలి. ఆ స్మరణ బ్రహ్మాదులను కూడా కింకరులను చేస్తుంది.

శరణం త్వాం ప్రపద్యంతే యే దేవి పరమేశ్వరీం

న తేషామాపదః కాశ్చి జ్ఞాయంతే క్వాపి సంకటః (వరాహపురాణం)

పరమేశ్వరిని ఎవరు శరణు వేడుతున్నారో వారికి మరి సంకటములు లేవు. లౌకికమైన ఆపదలు పోగొడుతుంది. మళ్ళీ వెనక్కి రావలసిన ఆపద లేకుండా కూడా అనుగ్రహిస్తుంది. మనకి పరతత్త్వము అంటే ఏమిటో తెలిసి సాధన చేసి, గ్రహించగలిగితే తప్పకుండా తిరిగి వెనక్కి రాని మోక్షమనే స్థితిని ఇస్తున్నది ఆ తల్లే. మొత్తానికి ఆశ్రయించినవారికి అన్ని ఆపదలను తొలగించునది.

యేతు సంగాన్ పరిత్యజ్య మామేకం శరణం గతాః

ఉపాసతే సదా భక్త్యా యోగమైశ్వర్యమాశ్రితాః

సర్వభూతదయావంతః శాంతా దాంతా విమత్సరాః

అమానినో బుద్ధిమంతః తాపసాస్సంయతవ్రతాః

మచ్చిత్తా మద్గత ప్రాణాః మత్ జ్ఞాన కథనే రతాః

సన్న్యాసినో గృహస్థాశ్చ వనస్థా బ్రహ్మచారిణః

యేచోక్తై ర్లక్షణైః హీనాః అపి మన్నామజాపకాః

తేషాం నిత్యాభియుక్తానాం ఆపదాం పర్వతానపి

నాశయామితరాం జ్ఞానదీపేన న చిరాదిహ

"సంగాన్ని పరిత్యజించి నన్నే శరణువేడి, యోగాన్ని పొంది భక్తితో ఎల్లవేళలా ఉపాసిస్తూ, సర్వభూత దయగలిగిన శాంతులు, దాంతులు, మాత్సర్యం లేనివారు, అభిమానశూన్యులు, బుద్ధిమంతులు, తపశ్శాలురు, వ్రతపరాయణులు, నా యందే చిత్త, ప్రాణాలనుంచువారు, నా జ్ఞానాన్ని గురించి చెప్పుకొనుటలో ఆసక్తి కలవారు – ఈ లక్షణాలు కలవారు – సన్న్యాసులైనా, గృహస్థులైనా, వానప్రస్థులైనా,

బ్రహ్మచారులైనా – వారి పర్వతాలవంటి ఆపదలను కూడా నశింపజేస్తాను. ఆ లక్షణాలు లేకపోయినా – నా నామాన్ని నిరంతరం జపించేవారి ఆపదలను కూడా నశింపజేస్తాను" (కూర్మపురాణం).

"ఆపత్సు నిఖిలాసు త్వం రక్షస్యేవ న సంశయః –(హరివంశం)" సర్వాపదల లోనూ ఓ దేవీ! నీవు రక్షించెదవు. సందేహం లేదు.

914. స్వస్థా – శ్రీ స్వస్థాయై నమః

అంచంచల సుఖమునందున్నది. స్వస్థత – ఏ బాధా లేని స్థితి.

స్వస్థాకి తాత్త్విక అర్థం – స్వ అంటే తన. నేను అన్నప్పుడు హృదయస్థానమైన అనాహతం దగ్గరే చెయ్యి పెడతాం. అక్కడ నేను స్ఫురణ వస్తోంది. ఎలా వస్తుందంటే తుమ్మెద ఝుంకరించినట్టు వస్తుంది. అదే అసలు నాదం. ఇంత నాదం వెలువడడానికి లోపల ఒక జ్యోతి ఉంది. నేను అని ఎక్కడ అనుకుంటున్నామో అక్కడే ఉన్న ఆ తల్లి 'స్వస్థా'.

'అహమితి హృదయే' అంటున్నారు రమణులు. 'అహం' అని ఏ హృదయంలో స్ఫురిస్తోందో, ఆ చోటులో ఎవరు కూర్చున్నారో వారే స్వస్థా.

'స్వే మహిమ్ని ప్రతిష్ఠితః' అని ఉపనిషత్తు. తన మహిమయందు తాను ప్రతిష్ఠితమైన పరతత్త్వం.

915. స్వభావమధురా – శ్రీ స్వభావమధురాయై నమః

సహజమైన మాధుర్యం కలది.

మాధుర్యము అంటే –తీపి. ఆనందం కంటే తియ్యని వస్తువు లేదు. లోకంలో ఆనందాలు – అభావములు లేదా ఆభాసలు. అది నిజానికి లేదు. కానీ ఉందనుకుంటాం. కానీ అమ్మ మాధుర్యము 'స్వభావం'.

మన లోపల ఆత్మానందం యొక్క కాంతి బయట వస్తువు మీద ప్రసరించాక అది ఆనందమని భ్రమిస్తున్నాం. లోపల ఉన్న స్వాత్మయే ఆనందం.

'స్వాత్మానందలవీభూతబ్రహ్మాద్యానందసంతతిః'. అమ్మవారు స్వభావతః మధురమే.

అమ్మనామం, రూపం మాధుర్యం. అది తలచుకున్నా, ధ్యానించినా మధురం... ఆనందం. అమ్మలీలలు కూడా ఎంతో మధురం. అమ్మ కారుణ్యం ఎంత మాధుర్యం! తలచుకుంటే ఆనందంతో ఒళ్ళు పులకించి పోతుంది. ఆ కారుణ్యం ఆమె యొక్క స్వభావం. ఆ తత్త్వం 'స్వభావమాధుర్యం'. ఇదంతా కలిపి **స్వభావమధురా.**

మాధుర్యం అమ్మ స్వభావం.

స్వభా-వమ-ధురా అని మూడు భాగాలుగా చేసి అర్థం చెప్పవచ్చు. 'స్వభా' అంటే ఆత్మ ప్రకాశం. తన వెలుగుతో ఈ ప్రపంచాన్ని బయటకు తీసుకు వచ్చింది. వమనము అంటే వెలిగ్రక్కుట. స్వభా తనదైన ప్రకాశముతో ప్రపంచాన్ని వ్యక్తపరిచింది ఆ తల్లి - ఇది 'వమ'. 'ధురా' అంటే ధరించునది, పోషించునది. 'స్వభా-వమ-ధురా' అంటే తన యొక్క శక్తితో ప్రపంచాన్ని వెలితీసి, ఆ ప్రపంచాన్ని తానే పోషిస్తున్నది కనుక 'స్వభా-వమ-ధురా'. ఇది యొక భావం.

916. ధీరా - శ్రీ ధీరాయై నమః

ధీరురాలు. జ్ఞానం, ఆనందం ఇదే ధీరత్వ లక్షణం. **'నాయమాత్మా బలహీనేన లభ్యః'** - బలహీనునికి ఆత్మ దొరకదు.

ధీరులంటే అర్థమేమిటో కాళిదాసు చెప్తూ - **'వికారహేతౌ సతి విక్రియంతే ఏషాం న చేతాంసి త ఏవ ధీరాః'** అన్నారు - 'ఎదురుగా వికార హేతు సంఘటనలు జరిగినా వికారములకు లోను కాకుండా ఉన్నవాడు ధీరుడు'.

వికారము లేనిది ధీరా. ఆ స్థితి అమ్మవారికి ఉంది. నిర్వికారా, ద్వంద్వాతీత తత్త్వము.

మేరునగధీరులని చెప్పినట్లుగా అమ్మవారు ధీరురాలు. ఇంత ప్రపంచం చేసినా నిశ్చలంగా కూర్చుంది.

ఏ జ్ఞానము చేతనే యోగులు ధీరులౌతున్నారో ఆ జ్ఞానమే అమ్మ కదా!

మనం ధీరురాలిని ఉపాసిస్తే ధీరత్వం వస్తుంది. స్వస్థురాలను ఉపాసిస్తే స్వస్థత

వస్తుంది. మధుర స్వభావాన్ని ఉపాసిస్తే మనం మధురంగా మారిపోతాం. ధీరులే అమ్మవారిని సరిగ్గా ఆరాధన చెయ్యగలరు. తరువాతి నామం 'ధీరసమర్చితా'.

917. ధీరసమర్చితా – శ్రీ ధీరసమర్చితాయై నమః

ధీరులచే చక్కగా అర్చింపబడునది.

'వీరారాధ్యా' వలనే 'ధీరసమర్చితా'. మనస్సులో వికారమున్నప్పుడు ఆరాధనలో మనస్సు నిలవదు. మనస్సు నిలవనప్పుడు అది సరైన ఆరాధన అవుతుందా? ధీరులు మాత్రమే మనస్సు నిలిపి బాగా ఆరాధన చెయ్యగలరు. సమర్చిత – సరిగ్గా ఆరాధించగలరు.

'ధీరాధీరసమర్చితా' కలిపి ఒక నామంగా భావిస్తే – ధీరులచే, అధీరులచే కూడా పూర్తిగా అర్చింపబడునది... అని భావించవచ్చు.

పూజించేవారు రెండు రకాలు. అధీరులు, ధీరులు. ఇంత మంది అమ్మవారి భక్తులున్నారు... అందరూ ధీరులేనా! పోనీ అందరూ అధీరులా! అమ్మవారి ఆరాధనలో ధీరులు ఉన్నారు. అధీరులూ ఉన్నారు.

యోగులు, జ్ఞానులు, మేధావులు, సిద్ధులు కూడా భగవత్ తత్త్వాన్ని ఆరాధన చేస్తున్నారు. అలాగే యోగం లేనివారు, జ్ఞానం లేనివారు, అమాయకులందరూ ఆరాధన చేస్తున్నారు. ఇద్దరి పూజ అమ్మవారు పొందుతోంది. ధీరత లేని వారికి వారి పూజని పొంది ధీరత్వం ఇస్తుంది. ధీరులు అయిన వారికి పొందాల్సింది ఏమీలేదు. ధీరులు అంటే వారికి వికారమే లేదు.

ఆత్మకి ఇతరముగా ఏదో ఉందనిపిస్తేనే వికారం వచ్చింది. ఆత్మజ్ఞానంలో నిలిచిపోయిన ధీరులకి పొందవలసినది ఏమీ లేదు. వారు ఎప్పుడూ ఆనందంగా ఉంటారు. వారినే ధీరులు అంటారు. **'కశ్చిత్ ధీరః ప్రత్యగాత్మానమైక్షత్'** – కఠోపనిషత్తులోని వాక్యం.

తం దుర్దర్శం గూఢమనుప్రవిష్టం
గుహాహితం గహ్వరేష్ఠం పురాణమ్

అధ్యాత్మయోగాది గమనేన దేవం

మత్వా ధీరో హర్షశోకౌ జహాతి

అని కఠోపనిషత్తులో చెప్పారు. పరమాత్మ అంత తేలికగా దొరకడు. దొరకడని ఎక్కడో లేదు. గూఢంగా మనలోనే ఉన్నాడు. అలాంటి వానిని ఒక్క ధీరుడు ఎవ్వడో తెలుసుకుంటాడు. తెలుసుకున్న ధీరునికి శోకం, మోహం నశిస్తున్నాయి.

అమ్మని హృదయంలో తెలుసుకునేవాడు ధీరుడు. వాడు శోకమోహాలు పోగొట్టుకుంటున్నాడు. శోకమోహాలు పోగొట్టుకున్నాక ఇంకా వానికి అర్చనేమిటి?

కానీ 'ధీరసమర్చితా' అంటే ధీరుడే సమంగా అర్చన చేస్తాడు. ధీరుడు అమ్మ తప్ప అన్యము లేదు అనే భావనతో ఉంటాడు. **'సోహం భావేన పూజయేత్'**. అతడు పూర్తి తాదాత్మ్య స్థితిలో ఉంటూ, సర్వం పరమేశ్వరియే అని, ఆఖరికి నేను అనేది కూడా పరతత్త్వమే అని తెలుసుకుని తన్మయుడౌతాడు.

అతడు పొందే ఆనందమే సమర్చన.

ధీరుడు కానివాడు అప్పుడప్పుడు అర్చన చేస్తూ ఉంటాడు. అలా అర్చన చేసే అధీరుల పూజ కూడా స్వీకరిస్తోంది. ఎప్పుడూ అర్చించే ధీరుల పూజ కూడా స్వీకరిస్తుంది. భయంతో అర్చన చేసే సామాన్యుల పూజ కూడా స్వీకరిస్తోంది. జ్ఞానంతో అమ్మనే ఆరాధన చేసే వారి పూజ కూడా స్వీకరిస్తోంది.

'తం ధీరా సః కవయ ఉన్నయంతి' – ఆ పరతత్త్వాన్ని ధీరులైన కవులు స్తుతిస్తున్నారు అని కల్యాణ చరణుల ఒక రచన (భాస్కరరాయలు ఉట్టంకించినది)

పాతయ వా పాతాళే, స్థాపయ వా సకలలోక సామ్రాజ్యే,

మాతస్తవ పదయుగళం నాహం ముంచామి నైవ ముంచామి

'నన్ను పాతాళంలో పాతేసినా, సకలలోక సామ్రాజ్యంలో నిలబెట్టినా – ఓ తల్లీ! నీ పాదాలజంటను విడిచిపెట్టను. ఏ మాత్రము విడువను'. **'నీరన్ ముంచుము పాలముంచుమిక నీదే భార'**మన్నట్లుగా, సుఖదుఃఖాది ద్వంద్వాలకు చలించక, దేవీభక్తిని వీడనివాడే ధీరుడు. అటువంటివాడే తల్లి తత్త్వాన్ని అనుభూతిగా పొందుతూ అర్చించగలడు.

ధీరులు నిరపేక్షులు ఆత్మారాములు నైన మునులు
హరి భజనలు నిష్కారణమ సేయుదురు
నారాయణుడు అట్టివాడు నవ్యచరిత్రా!

అన్నారు పోతనగారు. ధీరులైనవారు, ఏ అపేక్ష లేనివారు, ఆత్మారాములైనవారు కూడా పరమాత్మ యొక్క లీలలను నిరంతరం స్మరిస్తారు. ఆయన స్వభావ మధురం కనుక..

ఆత్మారామాశ్చ మునయః నిర్గ్రంథా అప్యురుక్రమే
కుర్వన్త్యహైతుకీం భక్తిం ఇత్థం భూతగుణో హరిః

అని శుక యోగీంద్రులు భాగవతంలో చెప్పిన మాటే 'ధీరసమర్చితా'లో తెలుస్తున్నది. స్వస్థా, స్వభావ మధురా అయిన తల్లిని ఎవరైతే ఆశ్రయిస్తారో వారు ధైర్యాన్ని పొందగలరు. ధైర్యం పొందినవారు ఇంక అమ్మని విడిచిపెట్టరు. ఆ పట్టులోనే ఉంటారు. ధీరుల ఆరాధన స్వీకరించే తల్లి 'చైతన్యార్ఘ్యసమారాధ్యా'.

918. చైతన్యార్ఘ్యసమారాధ్యా – శ్రీ చైతన్యార్ఘ్యసమారాధ్యాయై నమః

ధీరులు చైతన్యార్ఘ్యం ఇస్తారు. చైతన్య కుసుమాలతో పూజిస్తారు.

చైతన్యమయమైన అర్ఘ్యం ఇవ్వాలి. భావనోపనిషత్తు **'జ్ఞానం అర్ఘ్యం జ్ఞేయం హవిః జ్ఞాతా హోతా'** అన్నది. జ్ఞానమనే అర్ఘ్యం అమ్మవారికి ఇష్టం. అమ్మవారు చైతన్యానికి భిన్నము కాదు. అభిన్నమనే భావంతో కూడిన జ్ఞానం మనకు కలిగితే అప్పుడు అదే జ్ఞానార్ఘ్యం. ఆ జ్ఞానార్ఘ్యం అమ్మవారు అందుకుంటున్నారు.

స్వానుభూత్యా స్వయం సాక్షాత్ స్వాత్మాభూతాం మహేశ్వరీం
పూజయేదాదరేణైవ పూజా సా పురుషార్థదా (స్కాందపురాణం)

ఆత్మస్వరూపురాలిగా మహేశ్వరిని పూజించడమే స్వానుభూతాతో కూడిన పూజ. ఆదరంగా చేసే ఆ పూజ పురుషార్థ(మోక్ష)దాయికం. జ్ఞానముతో స్వానుభూతియే చైతన్యార్ఘ్యం. అదే ఆ పరదేవతకు ప్రీతి.

919. చైతన్యకుసుమప్రియా – శ్రీ చైతన్యకుసుమప్రియాయై నమః

జ్ఞానకుసుమాలు అమ్మవారికి ఇష్టమని చెప్పారు. జడకుసుమాలు కాకుండా జ్ఞాన కుసుమాలు సమర్పించాలి. అలాగని రోజు పూజకి ఉపయోగించే పూలతో అర్చించవద్దని చెప్పడం కాదు. అలాంటి పూలతో ఎన్నో పూజలు చేస్తే ఎప్పటికైనా చైతన్య కుసుమాలు వేసే స్థితి వస్తుంది. చైతన్య కుసుమాలు ఇచ్చే యోగం నాకిమ్మని అమ్మవారిని ప్రార్థించాలి. అప్పుడు మనం జడకుసుమాన్ని చైతన్యంగా చూడాలి.

స్పృహతో పూజ చేస్తే అదే చైతన్యం.

భగవంతుడు మన లోపల చైతన్యాన్ని ఇచ్చాడు. దానిని కుసుమం చెయ్యాలి. కుసుమానికి ఉన్న లక్షణం మెత్తదనం. సుగంధం. వికసనం, మకరందం. ఇన్ని ఉంటే అప్పుడు మంచి పువ్వు అంటాం. అలా మన మనస్సు జ్ఞానంతో విచ్చుకుందా? మన మనస్సుకి సౌకుమార్యం ఉందా? సుగుణాలనే సుగంధాలు ఉన్నాయా? ప్రేమ అనే మకరందం ఉందా? ఈ నాలుగు ఉంటే అది కుసుమం. అలాంటి మనస్సు చైతన్యకుసుమం. ఆ చైతన్యకుసుమమే అమ్మవారికి మహా ప్రీతి. అలా మన మనస్సుని చైతన్య కుసుమంగా మార్చి అమ్మవారి పాదాల మీద పెడితే ఆ పూజ నిజమైన పూజ. దానినే శంకరులు చెప్తూ –

గభీరే కాసారే విశతి విజనే ఘోరవిపినే
విశాలే శైలే చ భ్రమతి కుసుమార్థం జడమతిః
సమర్ప్యైకం చేతఃసరసిజముమానాథ భవతే
సుఖేనావస్థాతుం జన ఇహ న జానాతి కిమహో (శివానందలహరి)

'చేతః సరసిజం'. చిత్తమనే పద్మమనడంలో చైతన్యమనే పద్మం అని స్పష్టమౌతుంది. "అయ్యా! ఈ జనాలు ఎంత మూర్ఖులంటే కొండలెక్కి పత్రాలు తెచ్చి లక్ష బిల్వార్చన చేశాం అంటారు. లక్షపద్మార్చన చేశాం అంటారు. ఆ బిల్వాల కోసం, పద్మాల కోసం కొండలెక్కి, కోనలలో దిగి తిరుగుతున్నారయ్యా... ఎంత కష్టం! దానికంటె హాయిగా మనస్సనే కుసుమాన్ని నీ పాదాల చెంత పెడితే సుఖంగా ఉండవచ్చు అనే తెలివి ఎప్పుడు వస్తుందో వీరికి!" అన్నారు.

అమ్మవారికి ఇష్టమైన చైతన్య కుసుమాలు ఎనిమిది ఉన్నాయి. ఈ ఎనిమిది పువ్వులు సేకరించుకుంటే బాగుంటుంది.

అహింసా ప్రథమం పుష్పం పుష్పమింద్రియనిగ్రహః

సర్వభూత దయాపుష్పం క్షమాపుష్పం విశేషతః

శాంతంపుష్పం తపఃపుష్పం ధ్యానపుష్పం తథైవ చ

సత్యం అష్టవిధం పుష్పం...

– అహింస, ఇంద్రియనిగ్రహం, సర్వభూతదయ, క్షమ, శాంతం, తపస్సు, ధ్యానం, సత్యం... ఇవే ఎనిమిది చైతన్య కుసుమాలు.

'జపాపుష్పనిభాకృతిః' దగ్గర పుష్పాల గురించి చాలా చెప్పుకున్నాం. పుష్పం అంటే వికసించుట. మనలో అహింస మొదలైన గుణాలు వికసించాలి. అలా వికసించిన గుణాలు అమ్మ వారికి మహాప్రీతి.

అమ్మవారే మన లోపల ఉన్నారని అమ్మతత్త్వాన్ని అనుసంధానం చెయ్యాలి. ఆ విచారణే చైతన్యార్ఘ్యం. సమర్పణయే (త్యాగము) చైతన్యకుసుమం – ఇవి అమ్మవారికి ప్రీతి.

'సోహం భావేన పూజయేత్' అనే భావమే ఈ రెండునామాల్లో మనకి కనబడుతుంది. ఏ పూజ చేసినప్పటికి ఇది ప్రధానంగా చెప్తారు.

మహన్యాసం చేస్తున్నప్పుడు కూడా 'నా రుద్రో రుద్రమర్చయేత్' – రుద్రుడు కానివాడు రుద్రుని పూజించరాదు. తాను రుద్రునికి అభిన్నుడైపోవాలి. తనలో అహం రూపచైతన్యం ఆ పరమేశ్వరుడే అని తెలుసుకుని ఆరాధించేటప్పుడు అది జడపూజ కాదు. చైతన్యమైన పూజ చేసినపుడు ఆ అర్ఘ్యం చాలా విశేషం. **'సంవిదేవ గరీయసీ'** అని శాస్త్రం చెప్తోంది. సంవిత్ అంటే జ్ఞానం. అన్నిటి కంటె గొప్పది జ్ఞానం. జ్ఞానరూపమైన అర్చనయే గొప్పది.

ఈ నామాలకి మొదట అర్థం తెలిసి చేయాలి. రెండవది తెలిసి చేసిన దానిని విచారణ చేయాలి. విచారణ అనేది మన లోపల జరిగే ఒక చైతన్యవంతమైన ప్రక్రియ. ఇదే నిజమైన చైతన్య ఆరాధన. ఆ ఆరాధన చాలా విశేషం. పూజ

చేసేటపుడు మనలో జడత్వం ఉండరాదు. జడపూజ చేయరాదు. ఏదో ఒక విగ్రహం ముందు ఉన్నాం. వస్తువులు వేస్తున్నామంటూ మన అభీష్టాలను ధ్యానించడం కాదు. అమ్మవారిని ధ్యానించాలి. ఆ ధ్యానము, జ్ఞానము, భావన - ఇవే చైతన్యం. అదే 'చైతన్యార్ఘ్యా', 'చైతన్యకుసుమప్రియా'.

చైతన్య మంత్రమని ఒక మంత్రం ఉంది. ఆ మంత్రాన్నే భావన చేస్తూ ఆరాధన చేస్తే అది చైత్యన అర్ఘ్యము, చైతన్య కుసుమము అవుతుంది.

జపిత్వా దశసాహస్రం మంత్రం చైతన్యవాచకం

మహాపాతక సంఘైశ్చ ముచ్యతే పాతకాంతరైః - అని సూతసంహితలో కనబడుతుంది. మంత్రం చైతన్యవాచకం. చైతన్యమనబడే మంత్రాన్ని పదివేల సంఖ్య జపిస్తూ అమ్మవారిని ఆరాధించినట్లైతే సమస్త పాతకాల నుండి బయటపడతారు.

చైతన్యమంత్రం అంటే భువనేశ్వరీ మంత్రం. ఆ భువనేశ్వరీ బీజం పంచదశీలో ముమ్మారులు ఆవృతమవడం చేత, ఆ మంత్రం దివ్యమై చైతన్యమవుతుంది. ఆ మంత్రభావనతో చేసే ఆరాధనే 'చైతన్యకుసుమప్రియా', 'చైతన్యార్ఘ్యసమారాధ్యా' అని చెప్పబడుతున్నది.

920. సదోదితా - శ్రీ సదోదితాయై నమః

సదా ఉదితా - 'సదోదితా'. ఎల్లవేళల ఉదయిస్తున్నది. అమ్మవారి యొక్క ప్రకాశానికి ఎప్పుడూ అస్తమయం లేదు. సదా ఉదయిస్తున్న సూర్యుని వంటి కాంతితో ప్రకాశిస్తున్నది.

ఉపనిషత్తుల్లో 'ఉదిత' అనే శబ్దం ఆదిత్యమండాలాంతర్వర్తియైన పరమాత్మకు చెప్పారు. ఆయన పేరే ఉదిత (ఉత్). ఉత్కృష్టస్థితిలో ఉన్నవాడని అర్థం. సూర్య మండలాంతర్వర్తియైన అమ్మవారే ఇక్కడ సదా ఉదిత - అంటే ఎల్లవేళలా ఉదితారూపముగా ఉన్నది.

ఉదయించునది అనేది మరొకభావంలో తెలుసుకోవాలంటే, ఎప్పుడు ధ్యానిస్తే ఆ తల్లి అప్పుడు స్ఫురిస్తుందని చెప్పారు. అర్ధరాత్రి వేళ మనం సూర్యుడు కనిపిస్తే

బాగుండునని అనుకుంటే సూర్యుడు కనిపించడు. ఆయన సమయం ఆయనదే. కానీ ఎప్పుడైనా కూర్చుని ఒక్కసారి అమ్మని తలచుకుంటే వెంటనే హృదయంలోకి వస్తోంది. రావాలంటే ఎక్కడి నుండి రావాలి! అక్కడే ఉంది. స్మరణమాత్రం చేత భక్తుని హృదయంలో ఆవిర్భవించి అనుగ్రహిస్తున్నది.

భక్తి సూత్రాలలో నారదులవారు చెప్తూ, '**స కీర్త్యమానః శీఘ్రమేవావిర్భవతి అనుభావయతి చ భక్తాన్**' అన్నారు. ఒక్కసారి కీర్తన చేసినా, స్మరణ చేసినా భగవంతుడు ఆవిర్భవిస్తాడు.

శంకరులు కూడా శివానందలహరిలో, **'సారూప్యం తవ పూజనే శివమహాదేవేతి సంకీర్తనే సామీప్యం'** – శివా, మహాదేవ అనగానే సామీప్యం లభిస్తుందన్నారు. భగవత్ స్మరణ మాత్రం చేతనే భగవత్సాన్నిధ్యం లభిస్తుంది.

మనం స్పందించినా, స్పందించకపోయినా పరమాత్మ వెంటనే స్పందిస్తాడు. దీనినే **'నో దేవతాసు జడిమా జడిమా మనుష్యే'** అని విద్యారణ్యస్వామివారు చెప్పారు. జడత్వం మనుష్యులకు ఉంటుంది కానీ, దేవతలకి ఉండదన్నారు.

సదా చైతన్యరూపిణిగా ఉండడమే సదోదితా. ఇలా పిలిస్తే అలా పలికి అనుగ్రహించే స్వరూపమని 'సదోదితా' నామంలో కనబడుతోంది. ఇది క్షిప్రప్రసాదినీ భావాన్నే మనకి అందిస్తున్నది. ఈ మాట భక్తునికి ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది.

'సదోదితా' అనేదానికి మరో అందమైన భావం ఉంది. **'సత్సు ఉదితా సదోదితా'**. సత్పురుషుల యందు ఉదయిస్తున్నది.

సదా అనే శబ్దం ఎప్పుడూ సత్స్వరూపమైన పరబ్రహ్మమునే చెప్తున్నది.

'ఓం తత్సదితినిర్దేశః' అని చెప్పిన ఆ భావమే ఇందులో కనిపిస్తున్నది. మైత్రేయ ఉపనిషత్తులో '**హృదాకాశే చిదాదిత్యః సదా భాసతి భాసతి నాస్తమేతి నచోదేతి**' అని ఒక అద్భుతమైన మంత్రం కనబడుతుంది. బయట కనపడే సూర్యుడు ఉదయిస్తున్నాడు, అస్తమిస్తున్నాడు కానీ మన హృదయమనే ఆకాశంలో చిత్ అనబడే ఆదిత్యుడు 'సదా భాసతి' – ఎల్ల వేళల ప్రకాశిస్తున్నాడు, ప్రకాశిస్తున్నాడని రెండు మార్లు చెప్పడం నొక్కి వక్కాణించడం. ద్విరుక్తం నిశ్చయవాచకం. మనం నిద్రపోతున్నా ఆయన

మాత్రం మెలకువగా ఉన్నాడు. 'నాస్తమేతి నచోదేతి' ఆ చిత్ సూర్యునికి ఉదయము లేదు. అస్తమయము లేదు. నిత్యజాగరూకతత్త్వమది. అదే 'సదోదితా'.

921. సదాతుష్టా – శ్రీ సదాతుష్టాయై నమః

ఎల్లవేళలా సంతోషంగా, ఆనందరూపిణిగా ఉన్నది. ఉదితా అంటే ప్రకాశం. తుష్టా అంటే ఆనందం. ప్రకాశం జ్ఞానాన్ని తెలియజేస్తుంది. తుష్టా అంటే ఆనందాన్ని తెలియజేస్తుంది. రెండూ కలిపితే జ్ఞానానందరూపిణి అనే భావం గోచరిస్తోంది. దేవి జ్ఞానం కాని, ఆనందం కాని 'సదా' లక్షణంతో కూడినది అనగా ఎల్లవేళలా ఉండేది.

922. తరుణాదిత్యపాటలా – శ్రీ తరుణాదిత్యపాటలాయై నమః

ఆ తల్లి తరుణ సూర్యుని వలె పాటలవర్ణంతో ఉంది. 'పాటలా శ్వేత రక్తాచ'. తెలుపు, ఎరుపుల కలయికని పాటల వర్ణం అంటారు. మధ్యాహ్న సూర్యుని వలె పాటలవర్ణంతో ఉన్నది.

ఏ ఏ వర్ణాన్ని ధ్యానిస్తే ఏ ఏ ప్రయోజనం వస్తుందో శాస్త్రంలో చాలా చెప్పారు. ఇప్పుడు తరుణాదిత్యవర్ణమే మనం భావన చేసుకుంటున్నాం. ఈ నామంలో అమ్మ రూపభావన కనిపిస్తోంది. **'శృంగారే పాటలాకృతిః'** – సర్వాలంకారశోభితయై, శృంగారనాయికగా ఉన్న రూపం పాటలాకృతి. సదోదితా, సదాతుష్టా తత్త్వస్వరూపాన్ని చెప్తే, రూప సంబంధనామం 'తరుణాదిత్యపాటలా'.

923. 'దక్షిణా' 'దక్షిణారాధ్యా'

దక్షిణా – శ్రీ దక్షిణాయై నమః

'దక్షిణా' 'దక్షిణారాధ్యా' – ఇవి రెండు నామాలు. అమ్మవారికి మరొక పేరు దక్షిణా. దక్షిణామూర్తిరూపిణీ దగ్గర దక్షిణ అర్థాన్ని చాలా విశేషంగా ప్రస్తావించుకున్నాము. ఇక్కడ సందర్భాన్ని బట్టి ఈ నామానికి అర్థం చెప్పుకోవాలి. అమ్మవారి పేరే దక్షిణా. ముందు దక్షిణామూర్తిరూపిణీ అన్నప్పుడు ఆచార్యరూపంగా

దర్శించాము. ఇక్కడ దక్షిణ శబ్దానికి రెండర్థాలు తీసుకోవాలి. దక్షిణా అంటే సర్వసమర్థురాలు.

గురువుకి ఉండవలసిన లక్షణం సమర్థత. అత్యంతిక దుఃఖనాశనమే సమర్థత. దీనినే దక్షిణ, దాక్షిణ్యం అంటారు. సృష్టిలో ఎవరూ దుఃఖాన్ని సమూలంగా నాశనం చెయ్యలేరు. కేవలం జ్ఞానం వల్లనే దుఃఖనాశనం జరుగుతుంది. జ్ఞానమంటే బ్రహ్మజ్ఞానం.

దుఃఖాన్ని సమూలంగా నాశనం చేసే బ్రహ్మజ్ఞానస్వరూపిణి. ఇది 'దక్షిణా' శబ్దానికి అర్థం. అమ్మవారిని ఒక్కసారి ఆశ్రయిస్తే మరి ఏడవనక్కర్లేదు. 'పునర్గర్భరంధ్రం న పశ్యంతి ధీరాః' అని చెప్పినట్లుగా ఆ తల్లిని ఆశ్రయించినవారు మళ్ళీ తల్లి కడుపులో పడరు. మరొక అర్థంలో సర్వసమర్థత అంటే సృష్టి, స్థితి, లయలన్నీ చేయగలదు. ఏది ఏమైనా ఎలాగైనా చేయగలదు. దేవికి సాధ్యం కానిది ఏదీ లేదు.

మరొక అర్థంలో దక్షిణా అంటే **'సరళోదారా'.** సరళ, ఉదార స్వరూపము కలది. సరళ అంటే ఋజుత్వము, ఆర్జవశక్తి అని కూడా అంటారు. మనసు, మాట, క్రియ – ఈ మూడు ఒకేలా ఉంటే దానిని సరళ అంటారు. నిష్కపటము అని అర్థం.

అమ్మవారి దగ్గర కపటము లేదు. మాయ లేదు. అది సరళ. తరువాత ఉదార అంటే దాపరికము లేనిది.

నమస్కారం చేతనే పాపాలన్నిటిని పరిహరించి అనుగ్రహిస్తుంది. లెక్కలు చూడదు ఆ తల్లి. దాపరికములేని, కపటం లేని, సమర్థురాలైన తల్లి. ఈ మూడు భావాలు కలిపితే 'దక్షిణా'.

దక్షిణారాధ్యా – శ్రీ దక్షిణారాధ్యాయై నమః

ఈ నామం కూడా అచ్చంగా 'ధీరా', 'ధీరసమర్చితా' వలనే ఉంది. దక్షిణుల చేత ఆరాధింపబడుతున్నది. ఎప్పుడైనా ఏ భగవత్తత్త్వాన్ని మనం ఆరాధిస్తున్నామో దానికి తగిన పాత్రులం కావాలి. ఇది ఉపాసకులకి ప్రాథమిక నియమం. శుద్ధమైన

వస్తువుని పట్టేటప్పుడు ముందు పాత్రని శుద్ధంగా ఉంచుతున్నాం. శుద్ధ వస్తువునకు పాత్ర ఎలా సిద్ధమౌతుందో, అలా దక్షిణమైన వస్తువు కోసం మన చిత్తం కూడా దక్షిణగా మారాలి. రెండు సమానధర్మాలు ఉంటే కానీ ఉపాసన జరుగదు. ఇదే భావం.

దక్షిణుల ఆరాధననే అమ్మ అందుకుంటుంది. మనం వీరులమవ్వాలి. ధీరులమవ్వాలి. దక్షిణులమవ్వాలి.

మంత్రం మీద ఆశ అందరికి ఉంటుంది. కాని అర్హత కొందరికే ఉంటుంది. ఆ అర్హతను గురువు తెలుసుకుంటాడు. వాడు సమర్థుడు అవునో, కాదో చూసి మంత్రాన్ని ఇస్తాడు. మొట్టమొదట ఉన్న సమర్థతకి తగ్గట్లుగా మంత్రాన్ని ఇస్తాడు. వాడు సాధన చెయ్యగా మరింత సమర్థుడు అయ్యేలా తీర్చిదిద్దుతాడు. సమర్థుడు అవుతున్నకొద్దీ ఆరాధన పండుతుంది.

ఉపాసకుని విషయంలో ఉపాసనకు కావలసిన సమర్థతని దక్షిణ అంటారు. లోకంలో ఎంతమంది లేరు? అందరూ భక్తులు కాగలుగుతున్నారా? కొంతమందే భక్తులుగా ఉండగలిగారు. **'ప్రకాశ్యతే క్వాపి పాత్రే'** అని నారదులవారు భక్తిసూత్రాలలో చెప్పినట్లుగా భక్తిగాని, జ్ఞానంగాని, అమ్మని ఉపాసించాలనే బుద్ధిగాని ఏ కొద్దిమందికో పుడుతుంది. దీనినే శంకరులు సౌందర్యలహరిలో, **"భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానందలహరీం"** అన్నారు. 'కతిచన ధన్యాః' – ఏ కొద్దిమంది ధన్యులో ఉంటారు.

దక్షిణులు అంటే సరళమైన, ఉదారమైన మనస్సు గలవారే దక్షిణులు. కపటం, దాపరికమనే రెండు లక్షణాలు లేకుండా ఉన్నవారే దక్షిణులు. వారి ఆరాధనే నిజమైన ఆరాధన. సరళ, ఉదారత భావనతో కూడిన భక్తి ఎవరికైతే ఉందో అటువంటివారి ఆరాధన అందుకొనే తల్లి కనుక 'దక్షిణారాధ్యా'.

'సమయాచారతత్పరా' అనేది ఎంత విశేషమో ఇక్కడ కూడా 'దక్షిణారాధ్యా' అన్నది అంత విశేషం. దక్షిణాచార సంప్రదాయం ద్వారా ఆరాధింపబడే తల్లి 'దక్షిణారాధ్యా'.

ఇప్పుడు 'దక్షిణా' గురించి మరికొన్ని ఉపాసనా శాస్త్రసంబంధ వాక్యాలను

వివరించుకుందాము. దక్షిణా అంటే 'దక్షిణా యజ్ఞస్యపత్నీ' అన్నారు. ఇవన్నీ వైదికములైన అర్థాలు. యజ్ఞుని యొక్క భార్య పేరు దక్షిణా. ఇది దేవీభాగవతంలో కనబడుతుంది. అమ్మవారు ఎవరెవరికి ఏ ఏ రూపాలలో పత్నిగా వచ్చిందో చెప్తారు.

నిజానికి ఉన్నదంతా ఒక్కడే శివుడు. ఆయన యొక్క శక్తి. శివ-శక్తులే ప్రపంచంలో ఉన్నారు. శివుడు విష్ణువైతే, శక్తి లక్ష్మి అయ్యింది. శివుడు బ్రహ్మ అయితే శక్తి సరస్వతి అయ్యింది. శివుడు యజ్ఞస్వరూపుడైతే అమ్మ 'దక్షిణారూపిణీ' అయింది.

దక్షిణా అని ఒకామె గోలోకంలో ఉండేది. ఆవిడ రాధాదేవికి చెలికత్తె. నిజానికి ఆమె పేరు సుశీల. ఒకానొక కారణం వల్ల రాధాదేవి యొక్క ఆజ్ఞ చేత భూమి పైకి వచ్చి, తపస్సు చేసి లక్ష్మి శరీరంలో ఐక్యం అయింది. ఆ లక్ష్మిలో లీనమైన సుశీల అనే శక్తి 'దక్షిణా' అనే పేరుతో వెలికి వచ్చి యజ్ఞరూపుడైన విష్ణువును చేపట్టింది. **'యజ్ఞో వై విష్ణుః'.** ఈ కథని చెప్పడంలో ఉద్దేశం రాధాదేవి తత్త్వమే లక్ష్మీదేవి తత్త్వం. రెండూ ఒక్కటే. వైకుంఠంలో లక్ష్మి. గోలోకంలో రాధ. ఆ స్వరూపం లోకరక్షణ కోసం యజ్ఞునికి భార్య అయి వచ్చిందని దేవీభాగవతంలో చెప్తున్న కథ. ఆవిడ పేరు దక్షిణాదేవి. పురాణభాష చిత్రంగా ఉంటుంది. శక్తులకు పెట్టిన పేర్లు ఇవి. మనకి అర్థం కావడం కోసం పాత్రలుగా చూపిస్తారు. యజ్ఞమనే శక్తికి బలాన్ని ఇచ్చేది దక్షిణ. **'యజ్ఞస్య శక్తిః దక్షిణా'**. చేసిన యజ్ఞం సమర్థవంతంగా ఫలించాలంటే దక్షిణాదేవి అనుగ్రహం కావాలి.

దక్షిణతో సంపూర్ణంగా ఆరాధింపబడే యజ్ఞస్వరూపిణీ. ఇది వైదికార్థం.

భగవంతుని ఉద్దేశించి చేసే ఆరాధనలన్నీ యజ్ఞాలే. అది అగ్నిహోత్రం, జపం, స్తోత్రం, భజన, కీర్తన - ఏదైనా కావచ్చు.

దక్షిణలు చాలా ఉన్నాయి. అవి యజ్ఞేశ్వరి అయిన అమ్మవారికి సమర్పణ చెయ్యాలి. **'మనో దక్షిణా మనసైవ సర్వం తరతి'** - మనస్సు దక్షిణ. దీని వల్ల అన్నింటినుండి దాటవచ్చు. **'నిశ్చయో దక్షిణా నిశ్చయేన సర్వం ప్రాప్నోతి'** - నిశ్చయం రెండవ దక్షిణ. నిశ్చయాత్మకంగా ఆరాధన చేస్తే దేనినైనా పొందవచ్చు.

'భక్తిర్దక్షిణా' – భక్తి అంటే ప్రేమగా ఆశ్రయించుట. భక్తి వల్ల ఏం జరుగుతుందో చెప్తూ **'భక్త్యా శోకం తరతి'** – భక్తి అనే దక్షిణ చేత శోకాన్ని దాటవచ్చు. **'దీక్షా దక్షిణా'.** దీక్ష పొంది ఉపాసనచేస్తే అదొక దక్షిణ. ఆ దీక్షా దక్షిణ వలన **'కలుషాత్ ముచ్యతే'** కలుషముల నుండి బయటపడతారు. 'దక్షిణారాధ్యా' అంటే ఈ దక్షిణలన్నీ తెలుసుకోవాలి. మనస్సు, నిశ్చయము, భక్తి, దీక్ష – ఈ నాలుగు దక్షిణలతో ఆరాధింపబడే తల్లి 'దక్షిణారాధ్యా'. వాటి రూపముగా ఉన్నది దక్షిణ.

కొందరు దీనిని ఒకే నామంగానే చెప్పారు. 'దక్షిణ–అదక్షిణ–ఆరాధ్యా'. దక్షిణులచేత, అదక్షిణులచేత ఆరాధింపబడుతున్నది. పూజ చేసే వారందరూ దక్షిణులు కారు. అందులో అదక్షిణులు కూడా ఉన్నారు. వారికి మనోబలం లేదు. నిశ్చయం లేదు. భక్తి లేదు. అయినప్పటికి దయతో వారి ఆరాధనా గ్రహిస్తున్నది. దానికి తగ్గ ఫలం ఇస్తుంది. ఎలాగో ఒకలాగ ఆరాధించాడు కనుక ఎప్పటికైనా తరిస్తాడు.

విద్యాయా తదారోహంతి యత్ర కామః పరాగతాః

న తత్ర దక్షిణా యంతి నావిద్వాంసస్తపస్వినః – అని శ్రుతి వ్యాఖ్యానం.

ఏ పదమందు అన్ని కోరికలు తొలగిపోతున్నాయో, ఆ పరమపదాన్ని జ్ఞానం చేతనే పొందుతున్నారు. అజ్ఞానులు, తపశ్శాలురు, దక్షిణులు (కర్మఠులు) ఆ పదాన్ని పొందలేరు.

– ఇక్కడ దక్షిణ శబ్దానికి 'కర్మఠులు' (కర్మమార్గంలో కుశలురు) అనే అర్థాన్ని వ్యాఖ్యాతలు తెలియజేశారు.

కర్మఠుల(దక్షిణుల)చేతను, జ్ఞానుల (అదక్షిణులు)చేతను ఆరాధింపదగిన పరమేశ్వరి

గీతలో భగవానుని వచనం –

చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున

ఆర్తోజిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ

– ఓ అర్జునా! ఆర్తులు, జిజ్ఞాసులు, అర్థార్థులు, జ్ఞానులు(అదక్షిణులు) నన్ను భజిస్తారని పరమాత్మ వచనం.

924. దరస్మేరముఖాంబుజా - శ్రీ దరస్మేరముఖాంబుజాయై నమః

చిరునవ్వు కల ముఖపద్మము గలది.

చక్కగా నవ్వగలగడం ఒక లక్షణము. దానిని సుముఖము అంటారు.

చూపుల నామాలు - 'లోలాక్షీ, దరాందోళితదీర్ఘాక్షీ, త్రిణయనా'. అలాగే నవ్వును వర్ణించే నామాలు కూడా 'మందస్మితప్రభాపూరమజ్జత్కామేశమానసా' 'దరస్మేరముఖాంబుజా', 'దరహాసోజ్జ్వలన్ముఖీ'.

మూకకవి మందస్మిత శతకమని చెప్పారు. ఆయనకి అమ్మవారు కనబడ్డారు కనుక తల్లి నవ్వు మీద నూరు శ్లోకాలు చెప్పారు. చూపులని వర్ణిస్తూ వంద శ్లోకాలు కటాక్షశతకమని చెప్పారు.

శ్రీ కావ్యకంఠ గణపతిమునిగారు కూడా ఉమాసహస్రం రచిస్తూ, వందకుపైగా నవ్వు గురించే చెప్పారు. అమ్మవారి నవ్వుని భావన చేస్తే మనకి 'ప్రసన్నత', 'ఆనందం' కలుగుతాయి. పరదేవత యొక్క ప్రసన్న, ఆనంద, జ్ఞానభావాలు నవ్వులో తెలుస్తాయి. జ్ఞానము, ఆనందము - రెండిటిని వ్యక్తం చేసేదే నవ్వు.

దరస్మేరముఖాంబుజా - దర అంటే అరవిరిసిన అని అర్థం. స్మేర అంటే సన్నని చిరునవ్వు. చిరునవ్వులో మిగుల ప్రసన్నతని చెప్పడం కోసమని 'దరస్మేరముఖాంబుజా' అని చెప్పారు.

'దర' - భక్తులను ఆదరించే, ప్రసన్నమైన ముఖం అని కూడా భావం.

'దర' - అంటే 'భయకాలం' అని అర్థం. ప్రళయాది భయకాలాలో కూడా చెదరని చిరునవ్వు కల ముఖపద్మము కలది.

925. కౌలినీ - శ్రీ కౌలిన్యై నమః / శ్రీ కౌలినీకేవలాయై నమః

వెనుకటి నామాలలో కులాంగనా, కులాంతస్థా, కౌలినీ, కులయోగినీ దగ్గర కౌలినీ వచ్చింది. అక్కడ కుల, అకుల సంబంధమే కౌలము అని చెప్పుకున్నాము. కులము అంటే మూలాధారం నుండి ఆజ్ఞాచక్రం వరకు కులము. సహస్రారస్థానము అకులము. ఇటు నుంచి అటు అనుసంధానమే కౌలము. ఆ మార్గాన్ని తెలిసి చేసే

ఆరాధన కౌలమార్గము. అలాంటి కౌలమార్గములో ఉపాసింపబడుతున్నది కనుక 'కౌలినీ'.

కులసంబధమైనది 'కౌలినీ'. అమ్మవారు కులస్వరూపిణీ అని తెలుసుకుని చేసే ఆరాధనకి 'కౌలినీ' అని అర్థం. కులము అనగా అనేకం చెప్పుకున్నాము. షట్చక్రములు కులం. ఇంచుమించు అదే భావంతో కాళిదాస మహాకవి 'కులము' అనే దానికి అర్థం చెప్తూ **'తేజస్త్రితయం కులం'** అన్నారు. మూడు తేజస్సులకి కులము అని పేరు అన్నారు. మూడు తేజస్సులు ఒకదానితో ఒకటి అనుబంధం కలిగి ఉంటాయి కనుక కులము అని పేరు. **'ఇందు వహ్నిః రవి లక్షణం కులం'**. సూర్యచంద్రాగ్నులు మూడింటికి కలిపి కులము అంటారు. మూలాధారం నుండి ఉన్న అగ్నిమండల, సూర్యమండల, చంద్రమండలాలు మూడు కలుపుకుని కులము. ఈ మూడింటిలో ఉన్నవి షట్చక్రాలే. శ్రీచక్రంలో కూడా మూడు మండలాలు ఉన్నాయి కనుక అదీ కులమే.

అటువంటి శ్రీచక్రం ద్వారా ఆరాధింపబడుతున్నది కౌలినీ. సూర్యచంద్రాగ్ని మండలరూపంగా ఆరాధింపబడుతున్నది.

926. కేవలానర్ఘ (ర్ఘ్య) కైవల్యపదదాయినీ

ఈ నామాలు పాఠాంతరాలలో అభిప్రాయభేదాలు కనబడుతూ ఉంటాయి. 'కౌలినీకేవలా' ఒక నామం. 'అనర్ఘకైవల్యపదదాయినీ' ఒక నామం... భాస్కరరాయలవారు ఇలాగే విభజన చేశారు. చాలామంది దీనినే స్వీకరించారు. కానీ వారికి పూర్వీకులైన నారాయణభట్టు మొదలైనవారు మూడు నామాలు చేశారు. 'కేవలా, 'అనర్ఘా', 'కైవల్యపదదాయినీ'. మూడు నామాలుగా కూడా చెప్పుకోవచ్చు లేదా రెండు నామాలు కలిపి ఒకటిగా చెప్పుకోవచ్చు.

కేవలా – శ్రీ కేవలాయై నమః,

'కేవలా' అంటే ఒక్కరే. ఆవిడ తప్ప రెండవ వస్తువు లేదు. **'ఏకమేవాద్వితీయం బ్రహ్మ', 'ద్వితీయా కా మమాపరా'**– రెండవ వస్తువు ఏముంది అని మాట. ఉన్నది

ఒకటే బ్రహ్మవస్తువు. మరి బ్రహ్మము కాక ఇంత ప్రపంచం ఉందంటే, అలా ఉందనుకోవడం భ్రాంతి. సర్వం బ్రహ్మమే. అమ్మవారు ఆ పరబ్రహ్మస్వరూపిణి కనుక 'కేవలా'.

అనర్ఘా – శ్రీ అనర్ఘాయై నమః,

అర్ఘము అంటే మూల్యము, వెల అని అర్థం. అనర్ఘ అంటే మూల్యము లేనిది అని అర్థం. ఒక వస్తువు కొనాలంటే దానికో మూల్యము ఉంటుంది. అంటే ఆ వస్తువుకు సమానము అయినది అని అర్థం. వెలలేనిది... అనగా సమానము లేనిది 'అనర్ఘా'.

అమ్మని కొనగలిగే ధనం ప్రపంచంలో లేదు. సరితూచగలిగే వస్తువు లేదు. ఆవిడే మహాసంపద.

అంతేకాకుండా వెల కట్టుట, సమానము అంటే మనం కొలత పెట్టినట్టు అయ్యింది. కొలత పెట్టలేని తల్లి అని దీనికి మరొక అర్థం. 'పరిచ్ఛిన్నరహితా' – పరిచ్ఛేదము చెయ్యలేనిది. పరిమితి లేనిది.

కైవల్యపదదాయినీ – శ్రీ కైవల్యపదదాయిన్యై నమః

తాను 'కేవలా' అయినా ఆశ్రయించిన భక్తుని కూడా కేవలుని చేస్తుంది. ఒక కోటీశ్వరుని ఆశ్రయించి ఎంత కొలుచుకున్నా, వాని కంటె క్రింద ఉంచుతాడు కానీ ఆశ్రయించిన వానిని కోటీశ్వరుని చెయ్యడు. సృష్టిలో ఎవ్వడూ తనతో సమానం చెయ్యడు. ఆ పరమేశ్వరి తనతో ఐక్యం చేయగలదు. అమ్మవారిది అంత విశేషమైన అనుగ్రహం. మొదట 'కేవలా' చెప్పి, తరువాత 'కైవల్యా' చెప్పడంలో విశేషమది.

'శివానందరూపః శివః కేవలోహం' – నేను చిదానందరూపుడైన శివుడను అనే స్థితి.

ఆ చిదానందస్థితి మన మనస్సుతో, శరీరంతో ఐక్యమైపోవడంవల్ల పోతోంది. దానిని వదిలి పెట్టి ఏ పరతత్త్వం ఉందో దానితో ఐక్యం కావాలి. ఆ పరతత్త్వం సహజం. శరీరం, మనస్సు అసహజం. అసహజమైనది పట్టుకుని ఏడుస్తున్నాం. సహజస్థితే కైవల్యం.

మన సహజస్వరూపం అమృతమే. ఆ కైవల్యపదము అమ్మవారి అనుగ్రహం వల్లనే లభిస్తుంది కనుక 'కైవల్యపదదాయినీ'.

'కేవలా' భావానికి ఇక్కడ అర్థం మరొకటి చెప్తూ **'విషయ సంపర్కరహితం చైతన్యం కేవలమ్'** అన్నారు. విషయాలతో సంపర్కం లేని చైతన్యమే కేవలా. బుద్ధితో, విషయాలతో, ఇంద్రియాలతో సంబంధం పెట్టుకుంటున్నాం కానీ, లోపల చైతన్యానికి మాత్రం వేటితోనూ సంబంధం లేదు. అది కేవలగా ఉన్నదే. ఆ స్థితి రావడమే 'కైవల్యపదదాయినీ'.

'కేవలా' 'అనర్ఘా' 'కైవల్యపదదాయినీ' మూడు నామాలు చెయ్యవచ్చు. **'అనర్ఘ(ర్ఘ్య)కైవల్యపదదాయినీ'** అని కలిపేస్తే 'సాటిలేని కైవల్యాన్ని ఇచ్చే తల్లి' అని అర్థంలో చెప్పుకోవచ్చు.–

927. స్తోత్రప్రియా – శ్రీ స్తోత్రప్రియాయై నమః

'స్తోత్రప్రియా', 'స్తుతిమతీ', 'శ్రుతిసంస్తుతవైభవా'– ఈ మూడు నామాలలో ఒక అందమైన కూర్పు ఉంది. 'స్తవ్యః స్తవప్రియః స్తోత్రం స్తుతిస్తోతారణప్రియః' అని విష్ణుసహస్రంలో చెప్పిన భావాన్నే ఇక్కడ చూపిస్తున్నారు. అమ్మవారు స్తోత్రప్రియా. స్తోత్రములు అంటే ప్రీతి కలది. సృష్టిలో పొగడ్తకి స్పందించడం గొప్ప గుణం.

మన అవసరాల కొలది చేసేది పొగడ్త కాదు. ఉన్నదానిని తెలుసుకోవడమే పొగడ్త. ఉన్నది నేను తెలుసుకున్నానంటే అలా తెలుసుకున్నందుకు దేవతలు సంతోషిస్తారు. స్తోత్రము అంటే పొగడుట అని మనం చెప్తాం గాని స్తోత్రము అంటే దేవత యొక్క గుణము, లీల, మహిమ, స్వభావము, తత్త్వము చెప్పడమే. అప్పుడు నా గురించి ఇతనికి బాగా తెలిసిందని అమ్మవారు అనుగ్రహిస్తారు. అంటే మన జ్ఞానానికే అనుగ్రహించింది.

ఎవరిని స్తోత్రం చేస్తున్నామో వారికి సంబంధించిన జ్ఞానాన్ని స్తోత్రమంటారు. స్తోత్రానికి ఫలశ్రుతి వెదకడం కాదు. స్తోత్రానికి అర్థం వెతకాలి. అప్పుడు ఆ స్తోత్రమే భగవంతుడు ఏమిటో మనకి చెప్తుంది. ప్రతి స్తోత్రం భగవత్ స్వరూప, స్వభావ,

లీల, రూప, నామ, తత్త్వ ఆవిష్కారము. అలాంటి స్తోత్రానికి అమ్మవారు సంతోషిస్తారు.

స్తోత్రమే భగవతీరూపం. మొత్తం శబ్దరూపంలో పరమేశ్వరి అక్కడ కూర్చున్నది.

స్తుతి శబ్దానికి నిర్వచనం **'ప్రగీతమంత్ర సాధ్యా స్తుతిః'** అన్నారు. చక్కటి గానంతోను, మంత్రముతోను సాధించడాన్ని స్తోత్రం అంటారు.

స్తోత్రం చేయడానికి రెండు లక్షణాలు ఉండాలి. ఒకటి– గేయ లక్షణం. రెండవది మంత్రలక్షణం. ఈ రెండూ ఉంటేనే స్తోత్రం అవుతుంది. మన స్తోత్రాలన్నీ ఛందస్సుల్లో ఉంటాయి. ఛందస్సులో ఒక లయ ఉంటుంది. అదే ప్రగీతం.

సంగీతం రాని వారికి కూడా అది చదివేటప్పుడు లయ వస్తుంది. అందులో మంత్రశక్తి ఉంటుంది. ఈ గీతము చేత, మంత్రం చేత దేవత సంతోషిస్తుంది.

ఈ లలితాసహస్రనామ స్తోత్రానికి రెండూ ఉన్నాయి. దీనిలో ప్రగీతము ఉంది. మంత్రము ఉంది. అమ్మవారు సులభంగా దీని ద్వారా ప్రీతి చెందుతారు.

ఏ స్తోత్రానికైనా ఆరు లక్షణాలు ఉండాలి. మొదటిది నమస్కారం. రెండవది ఆశీస్సు. మూడవది సిద్ధాంతోక్తి. నాలుగవది పరాక్రమము. ఐదవది విభూతి. ఆరవది ప్రార్థన. ఈ ఆరు లక్షణాలు ఉంటే దానిని స్తోత్రమంటారు.

నమస్కారస్తథాశీశ్చ సిద్ధాంతోక్తిః పరాక్రమః

విభూతిః ప్రార్థనాచేతి షడ్విధం స్తోత్రలక్షణం – అనే ప్రసిద్ధ శ్లోకాన్ని ప్రస్తావించారు భాస్కరరాయలవారు.

స్తోత్రంలో 'నమః' అని తన యొక్క నమస్కారాన్ని చెప్పారు. ఆశీస్సు అంటే ఆశించుట అని అర్థం.

'సిద్ధాంతోక్తిః' – స్తోత్రంలో సిద్ధాంతం చెప్పబడాలి. సిద్ధాంతం అంటే శాస్త్రం. ఆ స్తోత్రంలో శాస్త్రం ప్రతిపాదింపబడాలి. 'పరాక్రమః' – ఆ దేవత యొక్క పరాక్రమం చెప్పబడాలి.

'విభూతి' అంటే దేవత యొక్క గొప్పదనాలు, ఐశ్వర్యస్వరూపాలు చెప్పబడాలి. 'ఇచ్ఛాశక్తిజ్ఞానశక్తిక్రియాశక్తిస్వరూపిణి, స్వాహా, స్వధా, మతిః, తుష్టిః, పుష్టిః – ఇవన్నీ అమ్మవారి విభూతులు. నమస్కారం ఎక్కడ చెప్పారంటే 'త్రిజగద్వంద్యా'

'నమజ్జనతమోగుణా' వంటి నామాలలో నమస్కారం చెప్పారు. అదేవిధంగా 'స్వస్తిమతి' 'ధనధాన్యవివర్ధినీ', 'సుఖప్రదా', 'కైవల్యపదదాయినీ' -ఇవన్నీ ఆశీస్సులు. 'సిద్ధాంతోక్తి' అంటే స్తోత్రంలో శాస్త్రం చెప్పబడాలి. దానికి లలితాసహస్రంలో కొదవలేదు. 'మిథ్యాజగదధిష్ఠానా' 'మైత్ర్యాదివాసనాలభ్యా' 'తత్త్వమర్థస్వరూపిణీ, 'కేవలా, కేవలానర్ఘా, సదోదితా, సదాతుష్టా' – ఇవన్నీ సిద్ధాంతవాక్యాలే. ఉపనిషద్వాక్యాలే. 'పరాక్రమ' అంటే భండాసుర సంహారలీలా నామాలన్నీ పరాక్రమ నామాలే. 'ప్రార్థన' అంటే అమ్మవారిని ప్రార్థించుట. మనలను ప్రకృష్టంగా అనుగ్రహించమని వేడుకోవడమే ప్రార్థన. 'భక్తిప్రియా, భక్తిగమ్యా, భక్తివశ్యా, భయాపహా' – ఇత్యాదులన్నీ ప్రార్థన క్రిందకే వస్తాయి. ఉదాహరణకి కొద్దికొద్దిగా చెప్పుకున్నాం.

స్తోత్రమంటే పై లక్షణాలన్నీ ఉండాలి. అలాంటి స్తోత్రములు అమ్మవారికి చాలా ప్రీతి.

928. స్తుతిమతీ – శ్రీ స్తుతిమత్యై నమః

రెండు భావాలు ఈ నామంలో ఉన్నాయి. 'స్తుతిమతీ' అంటే స్తోత్రములు కలది అని అర్థం. అమ్మవారికి లెక్కలేనన్ని స్తోత్రాలు ఉన్నాయి. వేదాలలో, పురాణాలలో పరిశీలిస్తే వేలాది స్తుతులు గోచరిస్తాయి.

'స్తుతిమతీ' అంటే మరొక అర్థం – స్తుతి యందు బుద్ధి ఉన్నది. ఎవరైతే స్తోత్రం చేస్తున్నారో వారి వైపు ఒక్కసారి అనుగ్రహంగా చూస్తుంది. అది మతి. అనుగ్రహించాలనే బుద్ధిని స్తోత్రం చేసే వారిపై ప్రసరిస్తుంది.

మరొక విశేషార్థాన్ని మంత్రరహస్యవేత్తలు ఇందులో ఆవిష్కరించారు. 'స్తుతిమతీ' దీర్ఘం ఉంది. స్తోత్రింపబడుతున్న పరమ మంత్రం 'స్తుతిమతీ'. 'ఈ' అని చివరికి వచ్చింది. సర్వమంత్రాలచేత, సర్వస్తోత్రాలచేత చెప్పబడ్డ 'ఈ' రూపిణీ. 'ఈ' అంటే తురీయతత్త్వం. అమ్మవారి కామకళా బీజం 'ఈ'. ఈమె స్తుతిచే జ్ఞానైశ్వర్యాలు కలుగును కనుక స్తుతిమతీ 'స్తుత్యాస్తుతిశ్చ ఈశ్చ'.

హయగ్రీవ వచనం -

తైశ్చ నానావిధైః స్తోత్రైః వేదార్థైః భావగర్భితైః

స్తుతా సా లలితాదేవీ నందితా చ ముహుర్ముహుః (బ్రహ్మాండపురాణం)

వేదార్థాలతో భావగర్భితములైన అనేక స్తోత్రాలతో స్తుతింపబడి, మాటిమాటికి ఆనందించునది.

929. శ్రుతిసంస్తుతవైభవా - శ్రీ శ్రుతిసంస్తుతవైభవాయై నమః

దేవీవైభవాన్ని వేదాలు స్తోత్రించాయి. సమగ్రముగా, సంపూర్ణముగా వేదాలన్నీ అమ్మవారి వైభవాన్నే పొగడుతూ ఉన్నాయి.

'స్తోత్రప్రియా' అంటే స్తోత్రమంటే ఇష్టం. 'స్తుతిమతీ' అంటే స్తోత్రాలు ఎన్నో కలది. స్తోత్రం చేసేవారిని అనుగ్రహిస్తుంది. స్తోత్రాలు వేదాల నుండే వచ్చాయి కనుక 'శ్రుతిసంస్తుతవైభవా'.

దేవీవైభవం వేదప్రతిపాద్యమైనది. అదృష్టవశాత్తు మన పురాణాలు, శంకరభగవత్పాదులవారు – వీరందరూ వేదప్రతిపాద్యమైన స్తుతులే చెప్పారు కనుక అవి వేదసమానమే. అవి చదువుకున్నా చాలు... మనకి వేదాలు చదువుకోలేదనే బాధ ఉండదు.

శ్రుతిలో రెండు భాగాలు ఉన్నాయి. కర్మకాండ, జ్ఞానకాండ. ఈ రెండిటిలో అమ్మవారే ప్రతిపాదింపబడుతున్నారని తెలుసుకోవాలి. **'సర్వే వేదాః యత్పదమామనంతి'** అని చెప్పినట్లుగా కర్మకాండ యందు అమ్మని యజ్ఞరూపిణిగా స్తుతించారు. జ్ఞానకాండ యందు బ్రహ్మరూపిణిగా, ఆత్మరూపిణిగా స్తుతించారు.

930. మనస్వినీ - శ్రీ మనస్విన్యై నమః

ప్రశస్తం మనో యస్యాః సా' – ప్రశస్తమైన(గొప్ప) మనస్సు కలది మనస్వినీ. అమ్మవారి మనస్సునకు వికారాలేమీ లేవు.

సంకల్ప స్థానమే మనస్సు. పరమాత్మ సృష్టి చెయ్యాలని సంకల్పించాడు. ఆ

సంకల్పశక్తి అమ్మవారు. పరమాత్మ యొక్క మనశ్శక్తి యే 'మనస్వినీ'. 'సత్యకామః సత్యసంకల్పః' అన్నట్లుగా వ్యర్థం కాని సంకల్పం ఎవరిదో అతడు పరమేశ్వరుడు.

ఆ శివసంకల్పశక్తే 'మనస్వినీ'.

వికారాలు లేని ప్రశస్తమైన ఉదాత్తమైన, మనస్సు కలది 'మనస్వినీ'.

లోకంలో ఎవరికి పరాధీనం లేదో, స్వతంత్రత ఉందో వారిని మనస్వినులు అనాలి.

'మనో అస్యాః స్వతంత్రతయా తిష్ఠతి న తు పరాధీనా' అని నిర్వచనం. అమ్మవారు ఎప్పుడూ స్వతంత్రంగా ఉంటారు. పరాధీనురాలు కారు.

ఆ తల్లి ఉత్తమగుణాలు కలది కనుక 'మనస్వినీ'. భర్త మనస్సే ఆవిడగా ఉన్నది. అమ్మవారు పతిమనోనుకూల – అని చెప్పినట్టుగా పరమాత్మ మనస్సుకి అనుకూలంగా నడుచుకునే తల్లి. అలా నడుచుకుంటున్నప్పుడు ఇద్దరి మనస్సు ఒకటే కనుక అది పరాధీనమనడానికి లేదు. అక్కడ స్వతంత్రతకి ఏమీ లోపం లేదు.

931. మానవతీ – శ్రీ మానవత్యై నమః

'మనస్వినీ', 'మానవతీ' – రెండూ ఉత్తమగుణాలు. ఎప్పుడూ ఉదాత్తమైన మనస్సు కలిగి ఉండడం.

మానము అంటే మర్యాద, ధర్మము, హద్దు. మానవతీ అంటే హద్దులు కలది. అమ్మవారు కులాంగన కనుక కులాంగనకి అనగా పతివ్రతా స్త్రీకి అనేక మానములు ఉంటాయి. మర్యాదలు, నియమాలు కలది. మానం అనగా గౌరవము అని కూడా. మానవతీ అంటే గౌరవము కలది.

దేవతలందరి ఆదరాభిమానాలు, గౌరవాలు కలది కనుక మానవతీ. మాన శబ్దానికి మరొక నిఘంటువు అర్థం ఉంది. **'మానః చిత్త సమున్నతిః'**. చిత్తము యొక్క ఉన్నతత్త్వమే మానము.

గొప్ప మనస్సు కలది. మానము, ప్రమాణము. ప్రమాణమంటే గొప్ప మానం అని అర్థం.

ఏదైనా ఒక విషయం చెప్తే పండితులైనవారు, "దానికి ఏదైనా ప్రమాణం ఉందా?" అని అడుగుతారు. భగవంతుని గురించి చెప్పాలంటే ఒకటే ప్రమాణము– అది శాస్త్రప్రమాణము. శాస్త్రాలు అనగా వేదాలు. వేదాలు, పురాణాలు, ధర్మశాస్త్రాలు – ఇవన్నీ మానములు. ఇవన్నీ అమ్మవారి రూపాలే. కనుక 'మానవతీ'.

శ్రుతిసంస్తుతవైభవా... వేదాలన్నీ అమ్మవారిని పొగుడుతున్నాయంటే పొగడదగ్గ అన్ని గుణాలు ఉన్న తల్లి కనుక పొగుడుతున్నాయి. అమ్మవారి గుణాలు మనస్వినీ, మానవతీ, మహేశీ, మంగళాకృతిః. ఆవిడకి ఉన్నతమైన మనస్సు ఉంది. గొప్ప మర్యాదలు ఉన్నాయి. పొగడడానికి పనికొచ్చే శాస్త్రాలన్నీ ఆవిడ రూపాలే.

932. మహేశీ – శ్రీ మహేశ్యై నమః

ఈశ్వరులకే ఈశ్వరురాలు. ఆమెకు పైన మరొక ఈశ్వరులు లేరు. మరొక అర్థం – ప్రణవాకారా. ప్రణవానికి మహేశ్వర శబ్దం శాస్త్రంలో చెప్పారు.

యో వేదాదౌ స్వరః ప్రోక్తో వేదాంతే చ ప్రతిష్ఠితః
తస్య ప్రకృతి లీనస్య యః పరస్స మహేశ్వరః

అన్నిటికి పరుడు అంటే ఉత్కృష్టమైనదేదో, దేనిపైన మరేదీ లేదో దానిని మహేశ్వర అనాలి. పుంలింగంలో మహేశ్వర. స్త్రీలింగంలో మహేశీ, లేదా మహేశ్వరీ. దీని గురించి ముందు వచ్చిన మహేశ్వరీ నామం దగ్గర విశేషంగా చెప్పుకున్నాము.

మహాదేవాత్సముత్పన్నా మహద్భిర్యత ఆదృతా
మహేశస్య వధూర్యస్మాత్ మహేశీ తేన సా స్మృతా (దేవీపురాణం)

ఆవిడ శివుని నుండే కలుగుతోంది. శివుని మనస్సే అమ్మ. శివునికి మనపై దయ చూపించాలనే మనస్సు పుట్టింది. ఆ మనస్సే అమ్మవారు. దయయే అమ్మవారు. మహేశ్వరుని నుండి వచ్చింది కనుక ఆవిడ మహేశీ. 'మహద్భిర్యత ఆదృతా' అంటే మహాత్ముల చేత చెప్పబడేది, సేవింపబడేది 'మహేశీ'. మహాత్ములు, ఋషులు, దేవతలు – అందరూ ఆరాధన చేస్తారు కనుక 'మహేశీ'.

'మహేశస్య వధూ' అంటే మహేశ్వరుని పత్ని కనుక 'మహేశీ'. శివ–శివా, శంకర–శాంకరీ వలనే శివునికి అభిన్నురాలని చెప్పే నామమే 'మహేశీ'.

933. మంగళాకృతిః – శ్రీ మంగళాకృత్యై నమః

అమ్మవారి ఆకృతి మొత్తం మంగళమే. పంచదారచిలకలో అణువణువు పంచదార ఉన్నట్టుగా అమ్మ రూపమంతా మంగళమే తప్ప మరొకటి లేదు. మంగళకరమైన అమ్మరూపాన్ని ధ్యానిస్తే అన్నీ మంగళాలే. **'సర్వమంగళమాంగళ్యే శివే సర్వార్థసాధికే। శరణ్యే త్ర్యంబకే దేవి (గౌరి) నారాయణి నమోస్తుతే'** అని దేవీమాహాత్మ్యం చెప్తోంది.

'బ్రహ్మ తన్మంగళం పరమ్'. పరబ్రహ్మను ఒక్కసారి స్మరిస్తే మంగళమై పోతున్నాము. ఆ మంగళస్వరూపమే జగన్మాత.

934. విశ్వమాతా – శ్రీ విశ్వమాత్రే నమః

విశ్వానికి అంతటికి తల్లి. 'శ్రీమాతా', 'మాతా', 'మలయాచలవాసినీ', 'అంబికా', 'అనాదినిధనా', 'త్రిపురాంబికా' – ఇలా అంబికా నామాలు వస్తూనే ఉన్నాయి. సమస్తానికి కారణమై, పోషకమైన దయాస్వరూపిణి.

935. జగద్ధాత్రీ – శ్రీ జగద్ధాత్ర్యై నమః

జపం చేసుకోవలసిన అమ్మవారి దివ్యనామాల్లో ఇది ఒకటి.

యస్మాత్ ధారయతే లోకాన్ వృత్తిమేషాం దదాతి చ

డు ధాఞ్ ధారణే ధాతుః జగద్ధాత్రీ మతా బుధైః (దేవీపురాణం)

సమస్త లోకాలను ధారణ చేస్తున్నది. లోకంలో ప్రతివారికి వృత్తిని ఇస్తోంది. వృత్తి అంటే 'వృత్తిర్వర్తని జీవనే' అని అర్థం. వృత్తి అనగా జీవనోపాయము. తెలుగులో చెప్పాలంటే బ్రతుకుతెరువు. అది అమ్మవారే ఇస్తారు. తెలితేటలు, తెలివి రాణించాల్సిన తెరువు కూడా అమ్మవారే ఇవ్వాలి. 'జగద్ధాత్రీ' అంటే జీవితంలో ప్రతివారికి పోషణని ఇచ్చునది. ఈ నామం చెప్పుకుంటే పోషణకు లోటు ఉండదు. 'విశ్వమాతా', 'జగద్ధాత్రీ'. తల్లికే పోషించే శక్తి, అర్హత, బాధ్యత కూడా ఉంటాయి. **"ఏష భూతపాలః ఏష సేతుర్విధరణః ఏషాం లోకానాం అసంభేదాయ"** – పరమాత్మ భూతాలనన్నిటినీ

పాలిస్తున్నాడు. లోకాలు అన్యోన్యం కలియకుండా అడ్డుకట్టువలె లోకాలను ధరిస్తున్నాడు. ఆ పరమాత్మయే లలితాంబ.

జగత్తును కన్న తల్లి. పోషించే తల్లి. ఒకొక్కనామంలో అమ్మ ప్రేమ తొణికిసలాడుతోంది. ప్రతి నామం అమ్మ కారుణ్యాన్ని మనకి అందించే రసగుళిక. ఒకరినో, ఇద్దరినో కాదు. జగత్తు, విశ్వ రెండు శబ్దాలు. సమస్తమైన ప్రపంచాన్ని అమ్మవారే పట్టి నడిపిస్తోంది, పోషిస్తోంది. అలా పోషించాలంటే అందరిని గమనించుకోవాలి. కనుక తరువాత నామం – విశాలాక్షీ.

936. విశాలాక్షీ – శ్రీ విశాలాక్ష్యై నమః

విశాలమైన కన్నులు కలది. విశ్వంలో ప్రతివారినీ గమనించుకునేది విశాలాక్షీ. విశాలాక్షీ నామానికి కామాక్షీ, మీనాక్షీ దగ్గర అర్థం వివరించుకున్నాము. ఎక్కడ అక్షి శబ్దం వస్తే అదొక మంత్రం. పరమేశ్వరుని 'ఈక్షత్యాత్మికా శక్తిః'– అదే శ్రీవిద్య, అదే శ్రీమాత. ఆయన యొక్క చూపు అమ్మవారు. ఆయన చూశాడంటే ఇంక దయ వచ్చినట్టే. 'స ఐక్షత బహుస్యాం ప్రజాయేయ'. ఒక్కసారి ఆయన కళ్ళు తెరిచి చూశాడు. ఆ కళ్ళు తెరవడంలోనే చైతన్యం వ్యక్తమౌతోంది. కళ్ళు మూస్తే మొత్తం మూసుకుపోతుంది. కళ్ళు తెరిచి, కళ్ళుమూసే ఆ స్పందన శక్తియే అమ్మవారు. ఆ స్పందన శక్తే అక్షి. విశాలమైన అక్షులు(చూపులు) కలది విశాలాక్షీ. ఎంత విస్తారమైన ప్రపంచాన్నైనా గమనించుకుంటోంది. ప్రతి అణువుని, బ్రహ్మాండాన్ని గమనించే శక్తి.

937. విరాగిణీ – శ్రీ విరాగిణ్యై నమః

వైరాగ్యం కల తల్లి. అమ్మవారు ఇంత ప్రపంచాన్ని నడుపుతోంది కానీ ఎవరితో రాగం లేదు. దేనికీ అంటకుండా ఉన్నది.

'విశాలాక్షీ' 'విరాగిణీ' – ఈ రెండు నామాలు కలిపి ఒక అద్భుతమైన తత్త్వాన్ని ఆవిష్కరింపజేస్తున్నాయి. కాశీవిశాలాక్షీ తత్త్వావిష్కరణ ఇక్కడ జరుగుతోంది.

విశ్వమాతా, జగద్ధాత్రీ, విశాలాక్షీ, విరాగిణీ. కాశీలో ఉన్న అమ్మవారే విశాలాక్షీ విరాగిణీ. కాశీ భోగక్షేత్రం కాదు. యోగక్షేత్రం. తత్త్వక్షేత్రం. భోగం ఇవ్వదని కాదు. కానీ లక్ష్యం యోగం. తత్త్వం పండినవాడు కాశీని వదలలేదు.

అక్కడున్న తల్లి విశాలాక్షి. ఎవరికి అక్షి విశాలమౌతుందో వారికే వైరాగ్యం ఉంటుంది. జ్ఞానం పెరుగుతున్న కొద్ది వైరాగ్యం పెరుగుతుంది. జ్ఞానమే విశాలమైన నేత్రం. అజ్ఞానం సంకుచితం. మన శరీరం, మన ప్రపంచము, మన సంపాదన, దానికోసం వెంపర్లాడడం... వీటితోనే ఉంటే దానిని విరాగం అనరు. అది రాగం – సంకుచితం.

జ్ఞానమనేది ఉంటే ఈ విశాల ప్రపంచాన్ని చూడగలం. ప్రపంచాన్ని చూస్తున్న కొద్దీ క్రమక్రమంగా... ఇవన్నీ అనిత్యములు. ఏది నిత్యం? అనే ఎరుక కలుగుతుంది. **'పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాత్'.** వివేకవంతుడు, జ్ఞాని అనే అర్థంలో చెప్తున్నారు. **'పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ తాప పాపచ్యమానాన్'** – కర్మతో పండిపోతూ, కర్మతో వండబడుతూ ఉన్న లోకాన్ని బాగా పరిశీలించిన వివేకికి నిర్వేదం కలుగుతోంది.

ఈ కనబడే సుఖాలన్నీ నిలబడతాయా? వీటి కోసమా ఈ వెంపర్లాటంతా! అని నిత్య–అనిత్య వస్తు వివేకం రాగానే 'ఇహాముత్రార్థ భోగవిరాగం' కలుగుతుంది. ఈ ఇహలోక, పరలోక సుఖాలన్నీ క్షణికం. ఇవి గొప్పవి కావు. వీటి కోసం వెంపర్లాడడం వ్యర్థమనే వైరాగ్యదశ వస్తుంది. అవి రావాలంటే ముందు ప్రపంచాన్ని పరిశీలన చెయ్యాలి.

వివేకం వల్ల వైరాగ్యం కలగాలి. వివేక వైరాగ్యాలవల్ల జ్ఞానం, భక్తి కలుగుతాయి. ఈ వైరాగ్యం వల్లనే భోగలాలస ఇత్యాదులు జయింపబడతాయి. ఎప్పుడైతే భోగలాలస జయింపబడిందో స్వార్థం పోతుంది. స్వార్థం పోతే దోపిడీలు తగ్గుతాయి. వైరాగ్యం లేనిదే మనం తరించలేమని శాస్త్రం చెప్తోంది. **"జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతి!"** అని అన్నపూర్ణమ్మకి దండం పెట్టుకోవాలి. అన్నపూర్ణ, విశాలాక్షి – ఇద్దరూ ఒకటే స్వరూపం. విశాలాక్షి అంటే జ్ఞానరూపిణి.

'పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాత్' అనే మంత్రమే ఇక్కడ రెండు నామాలు అయ్యింది. ఆ 'పరీక్ష్య' అనేదే 'విశాలాక్షీ'. 'నిర్వేదమాయాత్' – 'విరాగిణీ'. లోకాన్ని పరిశీలిస్తే వైరాగ్యం అదే లభిస్తుంది.

లోకాన్ని ఎలా పరిశీలించగలగాలో ఆ తెలివి అమ్మవారు మనకి ప్రసాదించాలి. అప్పుడు వైరాగ్యం కలుగుతుంది. ఆ రెండూ కలిగితే అప్పుడు ఆనందం వస్తుంది. విరాగే ఆనందంగా ఉంటాడు. సరాగి ఎప్పుడూ ఆందోళనలతో, బాధతో ఉంటాడు. వైరాగ్యంలో ఉన్న ఆనందం ఎంతో గొప్పది.

భోగే రోగభయం కులే చ్యుతి భయం విత్తే నృపాలాత్ భయం...
సర్వం వస్తుభయాన్వితం భువి నృణాం వైరాగ్యమేవాఽభయం

మంచి భోగం అనుభవిస్తూ ఉంటే ప్రక్కనే రోగం ఉంటూ ఉంటుంది. మంచి కులంలో పుడితే ఎక్కడ దాని నుండి భ్రష్టుడవుతాడోనని భయం ఉంటుంది. బాగా కూడబెడితే ఎవరు పట్టుకుపోతారోనని భయం. ఇలా సృష్టిలో ప్రతి వస్తువు భయమే... ఒక్క వైరాగ్యం తప్ప... అని భర్తృహరి చెప్పాడు.

వివేకం కలిగిన వైరాగ్యమే కావాలి. వివేకం 'విశాలాక్షి'. వైరాగ్యం 'విరాగిణి'

938. ప్రగల్భా – శ్రీ ప్రగల్భాయై నమః

బాగా ప్రకటించడాన్ని ప్రగల్భము అంటారు. ప్రగల్భానికి, వైరాగ్యానికి ఏమైనా సంబంధం ఉందా? అమ్మవారు ఎంత వైరాగ్యంతో ఉందో అంత 'ప్రగల్భా'.

'ప్రౌఢత్వాత్ ప్రగల్భా' – గొప్ప నేర్పరితనం కలిగినది.. అమ్మ ఏది దాచిపెడుతుంది? అమ్మ యొక్క తత్త్వం దాచి పెడితే దాగుతుందా! ఈ సమస్త ప్రపంచాన్ని ఎంతో వైభవంగా అమ్మవారు ప్రకటించింది.

జ్యోతిర్మండలాలు, ఋతువులు – ఇవన్నీ చూస్తూ ఉంటే తన నుండి వీటిని ఎంత అద్భుతంగా ప్రకటించింది! అమ్మవారికి ప్రకటించగలిగే ప్రతిభ ఉంది. ఇంత ప్రపంచాన్ని ఒక్కసారి అలా చూపించి, మళ్ళీ అలా ఒక్కసారి అంతా వెనక్కి లాగేస్తుంది. ఎంత ప్రతిభ ఉంది! ఆ ప్రతిభా ప్రదర్శననే ప్రగల్భము అంటారు.

సృష్ట్యాది కర్మలలో పరాశక్తి ప్రాధత్వమే గోచరిస్తున్నది.

అసుర సంహారం జరిగేటప్పుడు, సింహాసనంపై కూర్చుని ఠీవిగా అందరిని అనుగ్రహించేటప్పుడు తన వైభవాన్నంతటిని అమ్మ ప్రకటిస్తోంది. వైభవ ప్రకటనము, ప్రతిభా ప్రకటనము మొత్తానికి ఉన్న గొప్పతనాలన్నీ ప్రకటించిన స్వరూపం కనుక 'ప్రగల్భా'.

'విశాలాక్షీ, విరాగిణీ, ప్రగల్భా' అని చెప్పినప్పుడు ఆ జగదంబ యొక్క స్వరూపమంతా భావిస్తూ కాశీని మానసికంగా దర్శించాలి. ఆ తల్లి ఎలా అన్నం పెడుతుందంటే ఉదారంగా పెడుతుంది. లేదనకుండా పెడుతుంది. ఎంత ఉదారమో తరువాత నామంలో చెప్తున్నారు.

939. పరమోదారా – శ్రీ పరమోదారాయై నమః

అమ్మవారు దాపరికం లేకుండా అనుగ్రహిస్తున్నది. ఆమె కారుణ్యం గొప్పది. సమృద్ధిగా ఆ కారుణ్యాన్ని ప్రసరిస్తోంది. అమ్మవారికేం కొదవ? 'అరుణాం కరుణాతరంగితాక్షీం'. తరంగితమైన కారుణ్యాన్ని వర్షిస్తోంది.

సమృద్ధిగా ఇవ్వడమే ఉదారం. పరమ+ఉదార. ఇంక అంతకన్నా గొప్పది మరొకటి లేదన్నారు. పరమ ఉదార అంటే పరమపదాన్నే ఉదారంగా ఇచ్చే తల్లి. మోక్షదాయినీ అని అర్థం కూడా చెప్పుకోవచ్చు.

పరమోదారా దగ్గర అన్నపూర్ణ గురించి చెప్పారు. **'ఉదారో దాతృమహతోః'** అని అమరం చెప్తోంది. 'ఉదారా' అనే మాట గొప్పతనము, దాతృత్వము ఈ రెండిటి దగ్గర వాడాలి. పరమ ఉదార అంటే గొప్ప దాతృత్వము కల తల్లి. గొప్ప దాతృత్వం అన్నపూర్ణమ్మ తల్లికే ఉంది. కడుపునిండా పెడుతోంది. అన్నములు అంటే ఐశ్వర్యములు. 'విశాలాక్షి'గా ఉన్న ఆ తల్లి 'పరమ ఉదారం'గా అన్నపూర్ణగా అందరికి వడ్డించి పెడుతోంది.

940. పరామోదా - శ్రీ పరామోదాయై నమః

పర ఆమోదా. 'ఆ' అంటే 'ఆసమంతాత్' అనగా సంపూర్ణమైన ఆనందమే అమ్మరూపం. 'పరానందా', 'ప్రజ్ఞానఘనరూపిణీ' చెప్పుకున్నాం. 'పర-ఆమోదా', 'పరానందా' - రెండూ ఒకటే భావం. ఉత్కృష్టమైన, సంపూర్ణమైన ఆనందరూపిణియే 'పరామోదా'.

941. మనోమయీ - శ్రీ మనోమయ్యై నమః

మనోన్మనీ మనం చెప్పుకున్నాం. ఇది మనోమయీ. ఈ భూమిక గురించి ఆలోచించవలసిన గొప్ప విషయం ఉంది.

'మనోమయీ' మాటకి శాస్త్రసిద్ధంగా నిర్వచనం ఉంది. **'స భైరవః చిదాకాశః శివ ఇత్యభిధీయతే, అనన్యాం తస్య తాం విద్ధి స్పంద శక్తిర్మనోమయీ'**- మనోమయీ నామం అక్కడ వచ్చింది.(వసిష్ఠరామాయణం)

'స భైరవః చిదాకాశః శివః'- శివుడు చిదాకాశరూపుడు. చిదాకాశమంటే చిదంబరం. ఆకాశంలో స్పందన శక్తి బయటకి వచ్చింది. ఆకాశంలో స్పందన రాగానే ఒక్కసారి నక్షత్రాలు, గ్రహాలు, జ్యోతిర్గణాలు అన్నీ వచ్చాయి. ఎలాగైతే నీటికొలనులో చిన్నరాయి పడగానే తరంగాలు వచ్చాయో అలా చిదాకాశమైన చిదంబరమునందు పరమాత్మ స్పందనశక్తియే 'మనోమయీ'. **'న ఖలు కుశలః స్పందితుమపి'** - స్పంద శాస్త్రమని కాశ్మీర శైవసిద్ధాంతంలో చాలా అద్భుతమైన విజ్ఞానం ఉంది. దానిని ఇక్కడ మనం భావన చేసుకోవచ్చు.

పరమేశ్వరుని స్పందనశక్తే అమ్మవారు. స్పందనశక్తినే 'మనోమయీ' అంటారు. **'మనసైవానుద్రష్టవ్యః'** - మనస్సు చేతనే నిరంతరం చూడదగినది పరమాత్మ తత్త్వం. అదే పరదేవత.

మనస్సు అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ అనే పంచకోశాల మధ్యలో ఉంది. ఇటు రెండు, అటు రెండు ఉన్నాయి. అన్నమయ, ప్రాణమయాలదంతా బయట ప్రపంచపు గొడవ. విజ్ఞానమయ, ఆనందమయాలది

లోపల విషయం. ఈ రెండిటికి అనుబంధంగా మనస్సు ఉంది. మనస్సు ద్వారం లాంటిది. దీనిని బాగుచేసుకొంటే అటు, ఇటు కూడ బాగుంటుంది.

'మనోమయీ' అయిన శక్తి మన మనోమయకోశంలో పనిచేస్తూ, తద్వారా మిగిలిన రెండు కోశాలని నడుపుతున్న తల్లి.

942. వ్యోమకేశీ – శ్రీ వ్యోమకేశ్యై నమః

వ్యోమకేశుడు అంటే శివుడని అర్థం. శివునిది వ్యోమకేశం. వ్యోమము అనగా ఆకాశము. పరమాత్మను మనం ఉన్న చోటు నుంచి పై వరకూ గమనించినట్లైతే భూమి ఆయన యొక్క పాదముగా, ఆ పైన ఎక్కడో గగనము ఆయన యొక్క కేశములుగాను కనబడుతున్నాయి.

అలా పరమేశ్వరుడు కేశాలు విప్పార్చి ఉంచాడు. వ్యోమమంతా ఆయన కేశమే. ఆయన యొక్క పత్ని కనుక 'వ్యోమకేశీ'.

మరొక అర్థం వ్యోమక+ఈశీ = వ్యోమకేశీ. వ్యోమకము అనగా ఆకాశము. హృదయాకాశము లేదా చిదాకాశము. మనోమయీ తరువాత వచ్చింది కనుక ఇక్కడ చిదాకాశములో వచ్చే స్పందనశక్తియే అమ్మవారు. చిదాకాశము కూడా శివాభిన్నయైన అమ్మయే.

స్పందన శక్తి వస్తే ప్రపంచం. స్పందన శక్తి వ్యక్తం కానప్పుడు కేవలం చిదాకాశం. 'వ్యోమక ఈశీ' అంటే ఆకాశరూపంలో ఉన్న ఈశ్వరి. చిదాకాశరూపిణి. దహరాకాశరూపిణి. వ్యోమస్వరూపుడు శివుని అష్టమూర్తులలో ఒకడు. అతని పత్ని దిగ్రూప.

943. విమానస్థా – శ్రీ విమానస్థాయై నమః

విమానమందు ఉన్నది. విమానం అంటే ఉన్నతస్థానం. అమ్మవారి ఆలయం శ్రీచక్రం. శ్రీ చక్రం యొక్క కొన బిందువు. అది 'విమానస్థా'. మన శరీరంలో కూడా విమానం ఉంది... అదే శిరఃస్థానం.

"తనువే గుడియట తలయే శిఖరమట పెను హృదయమే హరి పీఠమట" అన్నారు అన్నమాచార్యులవారు.

మన తలయే శిఖరము. ఈ శిఖరం సహస్రారం. దానిపై కూర్చుంది కనుక 'విమానస్థా'. రెండు భావాలను తీసుకోవచ్చు.

విమానమంటే మరొక అర్థం **విగతమానము విమానం**. మానము అంటే కొలత. విమానం అంటే కొలత లేనిది అని అర్థం. కొలతకి అందని స్థితి అంటే పరబ్రహ్మస్థితి. పరబ్రహ్మమే విమానం. పరబ్రహ్మమునందు ఉన్న శక్తి కనుక 'విమానస్థా'.

మరొక అర్థం – విశిష్ట మానము విమానం. ఇవన్నీ శాస్త్రీయార్థాలు. అమ్మవారిని తెలియజేసే శాస్త్రములు మానములు. అవి ఒకొక్కటి విశిష్టమానములు. వేదపురాణాదులు మొత్తం కూడా మానములే. అలాంటి విశిష్టమానములైన వేదాది శాస్త్రములందు ఉన్న తల్లి కనుక 'విమానస్థా' అని ఇక్కడ అర్థం. విశేషంగా భక్తులను ఆదరించే స్థితిలో ఉన్నది.

విమానస్థా అంటే 1. శ్రీచక్రబిందువునందు ఉన్నది. 2. సహస్రారస్థానమునందు ఉన్నది. 3. పరబ్రహ్మ యందు ఉన్నది. 4. విశిష్టమైన వేదాది శాస్త్రముల యందు ఉన్నది 5. భక్తులను విశేషంగా ఆదరించునది అని అర్థం.

944. వజ్రిణీ – శ్రీ వజ్రిణ్యై నమః

వజ్రిణీ అనగా ఇంద్రాణి. శాస్త్రములలో ఇంద్రాణీ మంత్రం విశేషంగా చెప్పబడుతున్నది. ఆ ఇంద్రాణి యొక్క అద్భుత మంత్రరహస్యం వజ్రిణీ. 'వ్యోమకేశీ' 'విమానస్థా', 'వజ్రిణీ', 'వామకేశ్వరీ' కలుపుకుంటే వకార బాహుళ్యంతో వచ్చిన ఇంద్రాణీ శక్తి కనిపిస్తుంది. బలాన్ని ఇచ్చే శక్తి ఇంద్రాణి. అమ్మవారికి ఇంద్రాణి, ఐంద్రి అని పేర్లు ఉన్నాయి.

వజ్రిణీ అంటే వజ్రమును పట్టుకున్న దేవి. ఐంద్రీరూపంతో ఉన్న తల్లి. ఇంద్రాణి అంటే శచీదేవి అని దేవీ విభూతిగా చెప్పవచ్చు.

ఇంద్రుడు అనే మాటని వేదం ఈశ్వరపరంగా వాడింది. వేదం ఒక్క ఈశ్వరుని గురించే చెప్తోంది. ఆ ఈశ్వరుడే ఇంద్రుడు. 'అగ్నిశ్చమ ఇంద్రశ్చమే' అని రుద్రచమకంలో శివునే ఇంద్రునిగా చూపించారు. 'సహస్రాక్షాయ మీఢుషే' – సహస్రాక్షుడు అంటే ఇంద్రుడు. అనేక చోట్ల ఇంద్రశబ్దం పరమేశ్వరుడు అనే అర్థాన్నే చెప్పింది. 'ఇది ఐశ్వర్యే' అనే ధాతువు నుంచి ఇంద్రశబ్దం వచ్చింది. పరమేశ్వరుడే ఇంద్రుడు. ఆయన శక్తి ఇంద్రాణి. పరమేశ్వరుడు ఏ శాసనంతో ప్రపంచాన్ని నడుపుతున్నాడో ఆ శాసన శక్తికి వజ్రమని పేరు. ఇది గొప్ప వైదికభావం. భగవచ్ఛాసనాన్ని వజ్రం అంటారు.

'మహద్భయం వజ్రముద్యతం' – అని శ్రుతి. విశ్వాన్ని శాసించే భయస్వరూపం వజ్రం. శాసన భయమే జగతిని నిర్వహిస్తున్నది.

పరమేశ్వరుడన్నా, పరమేశ్వరీ అన్నా ఒకటే అర్థం. ప్రపంచాన్ని నడిపే శాసనరూపమైన శక్తిని దాల్చినది 'వజ్రిణీ'.

'వాగ్వై వజ్రః' – అని శాస్త్రం. వాక్కే వజ్రం... ఆ వాగీశ్వరియే వజ్రిణి.

శక్తిమంతమైన మంత్రం వజ్రమే. తద్రూపిణి...

945. వామకేశ్వరీ – శ్రీ వామకేశ్వర్యై నమః

వామకులు అనబడే ఒక దేవగణం ఉంది. వారికి నాయకురాలు. వామకులు అంటే 'వమంతి జగత్ ప్రసృజంతీతివా దక్షాద్యాః' అని అర్థం. వమించుట అంటే సృష్టించుట. వెలిగ్రక్కుట అని అర్థం. సృజించే వారిని వామకులు అంటారు. ఎవరు వారు? దక్షాద్యాః అన్నారు. బ్రహ్మదేవునికి ఈ లోకవ్యవస్థ యందు సహకరించే ప్రజాపతులను వామకులు అంటారు.

'వజ్రిణీ' 'వామకేశ్వరీ' నామాలకు ఉన్న అనుబంధం చూస్తే సృష్టిని శాసించే శక్తి ఆవిడ. అమ్మవారు తన శాసన ప్రకారంగా పని చేయడానికి కొందరిని నియమించింది. తరువాత వారందరినీ శాసిస్తోంది. సృష్టి చేసే బ్రహ్మాది దేవతలందరూ వామకులై అమ్మ శాసనాన్ని వర్తింపజేస్తూ ఉంటారు. వామకులకు ఈశ్వరిగా ఉంది

కనుక 'వజ్రిణీ' 'వామకేశ్వరీ'. ఈ నామంలో ఇంద్రాణీ శక్తి చెప్పబడుతున్నది.

'వామకేశ్వరతంత్రం' అనే శాస్త్రంలో ప్రతిపాదింపబడిన పరమేశ్వరి.

946. పంచయజ్ఞప్రియా - శ్రీ పంచయజ్ఞప్రియాయై నమః

పంచయజ్ఞములు ఇష్టమైన తల్లి.

దేవయజ్ఞము, పితృయజ్ఞము, ఋషియజ్ఞము, మనుష్యయజ్ఞము, భూతయజ్ఞము - ఈ ఐదు పంచ యజ్ఞాలు. ఈ ఐదు చేస్తే అమ్మవారికి సంతోషము. ఇది ప్రతివారు చెయ్యవలసిందే. అగ్నిహోత్రీకులకైతే అగ్నిహోత్ర, దర్శపూర్ణమాస, చాతుర్మాస్య, పశుబంధ, సోమయాగ - అనే పంచయజ్ఞాలు.

ఈ పంచయజ్ఞాలు ప్రియమైన తల్లి.

ఈ పంచయజ్ఞాలు అమ్మవారి ప్రీతికై చేస్తున్నామని చెయ్యాలి.

947. పంచప్రేతమంచాధిశాయినీ - శ్రీ పంచప్రేతమంచాధిశాయిన్యై నమః

పంచకోశాలు చెప్పేటప్పుడు 'పంచబ్రహ్మస్వరూపిణీ' దగ్గర దీనిని వివరంగా చెప్పుకున్నాం. అక్కడ 'పంచప్రేతసనాసీనా' అంటే, ఇక్కడ 'పంచప్రేతమంచాధిశాయినీ' అన్నారు. ప్రపంచాన్ని నడిపేటప్పుడు ఈ ప్రపంచంలో మనం చూసేవి ఐదు. ఈ ఐదు అమ్మవారి వల్లనే చైతన్యాన్ని పొందాయి. లేకపోతే వాటికి చైతన్యం లేదు. అవి జడమే.

మన ఇంట్లో విద్యుత్ పరికరాలు ఎన్నాళ్ళున్నా విద్యుచ్ఛక్తి లేకపోతే అవన్నీ ప్రేతలు. విద్యుచ్ఛక్తి ప్రవేశిస్తేనే చైతన్యాలు. అమ్మ ప్రవేశించడం చేతనే ఇవన్నీ కదలికలు పొందాయి తప్ప లేకపోతే అవి నిష్క్రియాలే.

జగత్తంతా పంచతత్త్వాలతో కూడినదే. పంచ భూతాలు, పంచ తన్మాత్రలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, పంచ ప్రాణాలు. ఈ ఐదైదులు ఆసనాలుగా అమ్మవారు వచ్చి కూర్చుంటేనే పని చేస్తున్నాయి. లేకపోతే ఇవన్నీ చేతనారహితాలే.

ఇక్కడ స్వరూప భావన చేస్తున్నప్పుడు సదాశివుడు పర్యంకముగా ఉన్నాడు. బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వరులు కోడులుగా ఉన్నారు. దానిపై అమ్మవారు కూర్చున్నది. ఈ స్వరూపమే 'పంచప్రేతమంచాధిశాయినీ'.

పరమేశ్వరుడు నిజానికి నిష్క్రియుడు. ఆయనేం చేయడు. ఆ నిష్క్రియుడైన పరమేశ్వరుని యొక్క మాయాశక్తి ఆయన అన్నీ చేసినట్లు చూపిస్తున్నది. ఐదు రూపాలతో ఉన్న ఈశ్వరుడు నిష్క్రియుడైనా, ఆమె కలయిక చేత అన్నీ చేయగలుగుతున్నాడు. నిష్క్రియుడైన ఈశ్వరునిచేత సృష్టి స్థితి లయాదులనబడే పంచకృత్యాలు చేయిస్తున్న తల్లి అనే అర్థం కూడా తీసుకోవాలి.

'ప్రకర్షణేతః శక్తి తత్త్వస్య సమీపవర్తీ సదాశివ ఏవ మంచం' – గొప్పగా సమీపమున ఉన్న సదాశివుడే మంచం, ఈ కారణంగా వ్యుత్పత్తిలో ప్రేత (ప్రకర్షణేతః) – అని భట్టనారాయణుల 'జయమంగళ వ్యాఖ్య'.

'ప్రేతశబ్దో నిశ్చలత్వం లక్షయతి' – నిశ్చలత్వాన్ని తెలియజేయునదే ప్రేతశబ్దం.

బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ ఈశ్వరశ్చ సదాశివః
ఏతే పంచ మహాప్రేతాః పాదమూలే వ్యవస్థితాః అని ఆగమ వివరణ.

948. పంచమీ – శ్రీ పంచమ్యై నమః

ఇందులో అనేక భావాలు ఉన్నాయి. 'పంచమీ' ఆరాధన అని ప్రత్యేకమైన స్తోత్ర వాఙ్మయం ఉంది. అందులో –

యా నిత్యా పరమాశక్తిః భగచైతన్యరూపిణీ
తాం నమామి మహాదేవీం పంచమీమాత్మరూపిణీమ్

"ఎవరు పరమా శక్తో, మహాదేవియో... ఆ ఆత్మరూపిణి అయిన పంచమికి నమస్కారము" అన్నారు. **'తుర్యాతీత్వాత్ పంచమీ'** అని భట్టనారాయణ వ్యాఖ్య. పంచప్రేత– పంచబ్రహ్మలు ఐదుగురు. బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివ. పంచమతత్త్వముగా ఉన్న సదాశివుని యొక్క శక్తి కనుక 'పంచమీ'. పంచమీ అంటే శివపత్ని.

'వందే దేవీం సకల వరదాం పంచమీం మాతృమధ్యే' అని భావన చేస్తున్నారు. మాతృకాదేవతలో వారాహీదేవిని 'పంచమీ' అంటారు. వారాహీ నామాల్లో మొట్టమొదట నామం 'పంచమీ'. తరువాత 'దండనాథా'. సరిగ్గా మాతృకల పేర్లు బ్రాహ్మీ, వైష్ణవీ, మాహేశ్వరీ, కౌమారీ అని చెప్పి ఐదవ నామంగా వారాహీ అని చెప్పారు. మాతృకలలో ఐదవది కనుక వారాహీకి 'పంచమీ' అని పేరు. వారాహీరూపాన్ని ఇక్కడ భావన చేసుకోవాలి. ఆ తల్లి అన్నప్రదాయిని. జగత్తంతటికి అన్నములు ఇచ్చేది ఆ తల్లే.

వరాహమూర్తి అంటే భూమిని త్రవ్వే శక్తి. ఆవిడ చేతులలో ముసలము, హలము(రోకలి, నాగలి) – ఈ రెండూ ఉంటాయి. నాగలి దున్నడం అంటే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఆహారాన్ని పరిణామం చేయడం అనే శక్తి రోకలి ద్వారా చూపిస్తోంది. రెండూ కూడా అన్నప్రదాయినీ అయిన శక్తిని చూపుతున్నాయి. సర్వజగత్తుకి అన్నప్రదాయకమైన భూమి యందు అన్నశక్తులను ఉత్పన్నం చేసి జీవులకు అందించే శక్తి వారాహీదేవియే 'పంచమీ' అని చెప్పబడుతున్నది.

శ్రీవిద్యామంత్రశాస్త్రాలలో విశేషంగా 'పంచమీవిద్య' అని ఒకటి ఉన్నది. దీనిని **'పంచకూటాత్మికా విద్య'** అని అంటారు. ఐదేసి అక్షరాల చొప్పున ఉన్న ఐదుమంత్రములు స్వరూపమది. అది గురుముఖైక విద్య. 'త్రిపురా స్తవరాజం' మొదలైన చోట్ల దీని ప్రస్తావన ఉంది.

సర్వమేకత్ర సంయోజ్య పంచపంచాక్షరీ భవేత్
పంచకూటాత్మికావిద్యా సర్వతంత్రేషు గోపితా
విద్యా చూడామణిర్దేవీ ప్రోక్తా సర్వోత్తమోత్తమా

– దీనిని 'విద్యా చూడామణి' అంటారు. ఇది అత్యంత గోప్యం. అటువంటి ఉత్కృష్ట విద్యాస్వరూపిణి 'పంచమీ'

మరొక అర్థంలో– బాల్య, యౌవన, కౌమార, వార్ధక్యము – ఇవన్నీ జన్మదశలు. ఈ నాలుగు జన్మదశలు లేకుండా చేసి మోక్షం ఇచ్చే తత్త్వమే 'పంచమీ'.

సామీప్య, సాలోక్య, సారూప్య, సాయుజ్య, కైవల్య అనబడే ఐదు మూర్తులలో ఐదవదైన కైవల్యముక్తిస్వరూపిణి.

949. పంచభూతేశీ – శ్రీ పంచభూతేశ్యై నమః

పంచమీ తత్త్వమే పంచభూతాలకు ప్రభ్వి. ఈ పంచభూతమయమైన శరీరానికి ఆవిడే 'ఈశ్వరీ'. పంచభూతాలు తన అధీనంలో ఉంచుకుని, వాటిచే జగతిని నిర్మించి, ఆ పంచభూతమయ జగతిలో 'సత్తా'రూపంగా ఉండి నియమించినది. పంచభూతాలలో ఐదవదైన ఆకాశరూపిణి – పంచమి. ఆకాశరూపిణిగా భూతాలకు కారణమైనది పంచభూతేశి.

950. పంచసంఖ్యోపచారిణీ – శ్రీ పంచసంఖ్యోపచారిణ్యై నమః

ఈ శ్లోకమంతా పంచతత్త్వాలతో కనబడుతోంది. అమ్మవారు పంచతత్త్వంతో ఉంది కనుక పంచసంఖ్యలతో ఉపచారం చేయాలి. పంచతత్త్వాత్మకం... భూతత్త్వం – 'గంధం', ఆకాశతత్త్వం – 'పుష్పం', వాయుతత్త్వం – 'ధూపం', అగ్నితత్త్వం – 'దీపం', జల(అమృత)తత్త్వం – 'నైవేద్యం'... సమష్టిగా సర్వోపచారం.

పంచసంఖ్యోపచారాలు మళ్ళీ రెండు విధాలు. ఒకటి మానసికం (భావనాత్మకం). రెండు యోగాత్మకం. సాధారణంగా చేసే పంచోపచారపూజ మాత్రమే కాదు. పంచోపచారం పరిపూర్ణం. పంచభూతాలకి అమ్మవారు నాయకురాలు. నాయకురాలికి క్రింద ఉన్నవారంతా దాస్యం చెయ్యాల్సిందే. పంచభూతాలను తల్లికి అర్పించాలి. ప్రపంచంలో మనం ఎంత లెక్కపెట్టుకున్నా ఐదే ఉన్నాయి అని చెప్పింది శాస్త్రం. అందుకే చేతికి పరమేశ్వరుడు ఐదు వేళ్ళనే ఇచ్చాడేమో.

భూతత్త్వానికి గంధం గుణం. ఆకాశానికి శబ్దం గుణం, వికసన గుణం. ఆకాశంలోంచే సూర్యుడు వికసిస్తున్నాడు. ఆకాశాన్ని పుష్పం చేశారు. వాయువు తత్త్వం ధూపంగా చెప్పారు. అగ్నితత్త్వం దీపం చేశారు. రసతత్త్వం అన్నం చేశారు. 'సర్వతత్త్వాత్మనే సర్వోపచారాన్' అని చెప్తారు. ఇదంతా ఎంతో గొప్ప భావం.

యోగులు ఏం చెప్తారంటే, "అమ్మా! నేను ఎలాగూ నీలో ఐక్యం అయ్యాను అనుకో. నా సర్వతత్త్వాలు నీలోకి వెళ్ళిపోవాలి. నా శరీరంలోని పృథ్వీతత్త్వం నీ మేనికి గంధమై అలదాలి. నా శరీరంలో ఆకాశతత్త్వం నీ పాదాలకు పుష్పమై

వికసించి ఉండాలి. నా శరీరంలో తేజస్సు తత్త్వం నీకు దీపమవ్వాలి. నా శరీరంలో జలతత్త్వం నీకు అమృత నైవేద్యమవ్వాలి. నాలో పంచతత్త్వాలు నీకే సమర్పించబడ్డాక ఇంక నేను ఏమౌతాను? నేను నువ్వే అయి ఐక్యమౌతాను తల్లీ!" అంటాడు. ఇది పంచసంఖ్యోపచారంలో ఉన్న విశేషం.

యోగార్థంలోకి వెళ్ళాలి. స్థూలం నుంచి సూక్ష్మంలోకి వెళ్ళడం క్రమం. పృథ్వీతత్త్వం జలతత్త్వంలో లీనం చేయాలి. జలతత్త్వాన్ని అగ్నితత్త్వంలో లీనం చేయడం, అగ్నితత్త్వాన్ని వాయుతత్త్వంలో లయం చేయడం, వాయుతత్త్వాన్ని ఆకాశతత్త్వంలో లీనం చేయడం. ఇదంతా మనస్సుతో చేస్తున్నాం కనుక అది ఆరవది. ఈ ఆరవది మొత్తం ఐదింటితో పనిచేస్తోంది. ఐదు కలిపి ఆరవదాన్ని అమ్మ పాదాల మీద అర్పించడం. ఇది చెయ్యగలిగితే ఇంకేం కావాలి? సరిగ్గా పృథ్వీతత్త్వం నుంచి మనస్తత్త్వం వరకూ తీసుకువస్తే మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధి పంచ చక్రములు పంచభూతాలు. మనశ్చక్రం, ఆజ్ఞాచక్రం భ్రూమధ్యం. ఈ ఐదు పట్టుకుని ఆరవవాడు సహస్రారంలో ఉన్న అమ్మవారికి అర్పితమవడమే... పంచసంఖ్యోపచారం. షట్చక్రవిద్య అంటే ఇదే. ఇదంతా బహిర్యాగ, అంతర్యాగ రూపంలో చూపిస్తున్నారు.

'పంచయజ్ఞప్రియా' నుండి ఇప్పటివరకు చెప్పుకున్న నామాలను పరిశీలిస్తే, ప్రపంచతత్త్వం అర్థం చేసుకుంటూ ప్రపంచ నాయిక అయిన ఆ తల్లియందు ఈ ప్రపంచతత్త్వం ఎలా లీనం చేయాలో చెప్పే పంచీకరణవిద్య యోగంలో చెప్పేదంతా ప్రస్తావన చేయబడుతున్నది.

సారాంశంగా 'పంచమీ' 'పంచభూతేశీ' 'పంచసంఖ్యోపచారిణీ'- ఈ మూడు నామాల్లో ప్రస్తావించబడ్డ దేవతపేరు 'పంచమీ' దేవత. సదాశివుని యొక్క శక్తి పంచమీ. అదేవిధంగా వారాహీ దేవత పంచమీ. మంత్రశాస్త్రపరంగా 'పంచమీ మంత్రం' అని ఒక రహస్య మంత్రం ఉంది. అది గురుముఖైక వేద్యం. ఆ పంచమీ రహస్యవిద్య ఇందులో దాగి ఉంది. పంచమీ అంటే పంచభూతాత్మకమైన ప్రపంచాన్ని శాసించే ఈశ్వరశక్తే పంచమీ దేవత. పంచమీ పరదేవత అని చెప్పబడుతున్నది.

ఈ నామం ద్వారా ఉపాసన చేసినట్లైతే అదొక విశిష్టమైన ఉపాసన అవుతుంది. 'పంచభూతేశీ' అయిన తల్లి 'పంచమీ' అయితే ఆ తల్లిని ఉపాసించవలసిన విధానం ఏమిటి? పంచభూతాల తత్త్వాన్ని తెలుసుకుని, వాటి యందు వ్యాపించి ఉన్నది ఆ తల్లే అనే ఎరుక కలగాలి. ఒకొక్క తత్త్వం అమ్మ స్వరూపమే అని తెలుసుకుంటూ 'పృథ్వీతత్త్వాత్మికాయై గంధం కల్పయామి నమః' – భూతత్త్వం అమ్మరూపమే.

భూమి యందున్న యదార్థరూపం అమ్మవారు. బృహదారణ్యకోపనిషత్ ఈ విషయాన్ని చెప్తూ పృథ్వి యందు ఉన్నది ఈశ్వరతత్త్వం. కానీ పృథ్వి దానిని తెలుసుకోలేదు. కాని పృథ్విని ఆ తత్త్వం తెలుసుకుంటోంది.

పరమాత్మ అన్నింటిలోనూ ఉంటాడు కానీ ఏదీ ఆయనను తెలుసుకోలేదు. కానీ అన్నింటిని ఆయన తెలుసుకోగలడు. ఇలాంటి చక్కని క్రమం ఇందులో కనబడుతుంది.

పంచభూతాత్మకమైన మన దేహము నిండా ఈశ్వర చైతన్యం ఉన్నప్పటికి ఇంద్రియాలు ఆ తల్లిని తెలుసుకోలేకపోతున్నాయి. కానీ ఆమె వీటిని తెలుసుకుంటున్నది. ఆ పరదేవత లేకపోతే మనం వేటినీ తెలుసుకోలేము. ఆ పరతత్త్వమే 'పంచసంఖ్యోపచారిణీ'.

పంచమీ దేవతను ఎలా ఆరాధించాలో వివరించారు.

951. శాశ్వతీ – శ్రీ శాశ్వత్యై నమః

నిత్యమైనది, ధ్రువమైనది. అన్ని కాలాలలో ఏ మార్పు లేకుండా ఉండే పరతత్త్వ స్వరూపిణి. **'శాశ్వతస్తు ధ్రువో నిత్యం'** అని అమరకోశం. **'తేషాం సిద్ధిః శాశ్వతీ నేతరేషాం'** అని శ్రుతి. ముక్త పురుషులకు లభించే మోక్షసిద్ధి. శాశ్వతమైనది. ఆ కైవల్యరూపిణిగా ఉన్నది శాశ్వతీ.

952. శాశ్వతైశ్వర్యా – శ్రీ శాశ్వతైశ్వర్యాయై నమః

నిత్యమైన ఐశ్వర్యం కలది. మార్పులేని, తరుగుదల లేని పరిపూర్ణ ఈశ్వరత్వం

కల జగన్మాత. మూడు కాలాలలోనూ తొలగని స్వతంత్ర శక్తి.

సర్వజ్ఞత, స్వతంత్రత, నిత్యతా, పూర్ణతా, అనాదిబోధ మొదలైన స్వాభావిక శాశ్వత లక్షణాలు కల పరమేశ్వరి.

శాశ్వతైశ్వర్యమనగా మోక్షమే. పరబ్రహ్మము శాశ్వతం. దాని సచ్చిదానంద లక్షణములే శాశ్వతైశ్వర్యములు. తదనుభవరూపమైన కైవల్యమే పరమ సంపద.

953. శర్మదా – శ్రీ శర్మదాయై నమః

'శర్మ దా'– శర్మమును ఇచ్చునది. శర్మ అంటే ఆనందము అని అర్థం. పై చెప్పిన నిజమైన శాశ్వతైశ్వర్యమే శర్మ.. దానిని ఇచ్చునది శర్మదా.

ఉపాసకులకు నిత్యసుఖరూపమైన జ్ఞానానందమును ఇచ్చునది.

954. శంభుమోహినీ – శ్రీ శంభుమోహిన్యై నమః

ఈ నామానికి రెండు రకాల అర్థాలు చెప్పుకోవాలి. శంభుని మోహింపజేసిన తల్లి. పరమాత్మని ఎవరూ మోహింపజేయలేరు. ఆయన మోహాతీతుడు. పరమాత్మని మోహింపజేయగల శక్తి అమ్మవారికి తప్ప మరెవ్వరికీ లేదు. లోకాన్ని మోహింపజేసేవాడు ఒకడున్నాడు. వాని పేరు మన్మథుడు. ఒక్క భూలోకమనే కాదు – స్వర్గంలో ఉన్న ఇంద్రుని, బ్రహ్మని – సమస్త దేవతలని కూడా మోహింపజేయగలిగిన వాని పేరే కాముడు.

మన్మథుడు, "ఎందరో గొప్ప ఘనులనే మోహింపజేశాను కనుక పరమేశ్వరుని కూడా మోహింపజేయగల"నని గర్వంతో వెళ్ళాడు. భస్మం అయ్యాడు. ప్రపంచాన్ని మోహింపజేయగలిగే ఐదు బాణాలు ఆయన ముందు వ్యర్థమైపోయాయి. పరమేశ్వరుడు మన్మథుని దహనం చేశాడు కానీ, అమ్మవారిని చేపట్టడం మానేశాడా? అమ్మవారిపై పరమేశ్వరునికి మనసు రావాలి, వివాహం జరగాలని మన్మథుని ప్రయత్నం. దాని కోసం చాలా కష్టపడ్డాడు. చివరికి తగలబడ్డాడు.

కానీ మన్మథుని కష్టం వ్యర్థం కాలేదు. మన్మథుడు అనుకున్నది మాత్రం

జరిగింది. కానీ అది మన్మథుని వలన జరగలేదు. అమ్మవారి వలనే జరిగింది. అమ్మవారు మన్మథునితో, "నువ్వు లోకాన్ని మోహింపజేయడానికి వచ్చావు. మా ఇద్దరి మధ్య మోహం సృష్టించడానికి నువ్వు పనికిరావు. నేను విశ్వాన్ని మోహింపజేయగల ఆయన యొక్క శక్తిని. ఆయన పేరు కామేశ్వరుడు. నా పేరు కామేశ్వరి. మధ్యలో నీ అవసరం లేదు" అన్నది. మూకకవిగారు చాలా చక్కగా ఈ విషయాన్ని చెప్తూ.

పంచశర శాస్త్రబోధన పరమాచార్యేణ దృష్టిపాతేన
కాంచీసీమ్ని కుమారీ కాచన మోహయతి కామజేతారమ్

పరమేశ్వరుని సైతం స్పందింపజేయగల శక్తి ఆ తల్లి. అతని చేత ఈ విశ్వరచన అంతా చేయించగలిగే శక్తి అమ్మవారు. కాంచీసీమలో ఒకానొక కుమారి చూపులు, మన్మథుని గెలిచిన పరమేశ్వరుని మోహింపజేస్తున్నాయి అన్నారు. పరమేశ్వరుని స్పందింపజేసే శక్తి పేరు కామకళా. 'కామకళా' నామం గుర్తు తెచ్చుకొంటే చాలు. ఆమెయే శంభుమోహినీ. పరమేశ్వరుని మోహింపజేస్తున్నది. ఇదే మాట శంకరులు చెప్తూ –

హరిస్త్వాం ఆరాధ్య ప్రణతజన సౌభాగ్యజననీం
పురా నారీ భూత్వా పురరిపుమపిక్షోభమనయత్

అన్నారు. విష్ణువు అమ్మవారిని ఉపాసన చేశాడు. చేయగానే జగన్మోహినిగా అయ్యాడు. అమృతం పంచడం వరకు ఆ రూపాన్ని స్వీకరించి, మళ్ళీ విష్ణువై వైకుంఠానికి చేరాడు. ఈ లోపల నారదుడు శివుని దగ్గరకు వెళ్ళి, "విష్ణువు మోహినీ రూపం ధరించాడు... చాలా బాగుంది కానీ, ఆ అందం నువ్వు చూడలేదు" అన్నాడు. "నువ్వు విషం మ్రింగి వెళ్ళిపోయావు. ఆ తరువాత ఆయన మోహినీ వేషంలో వచ్చి అమృతాన్ని పంచాడు" అని చెప్తే, "నాకు అమృతం వద్దు కానీ, విష్ణువు ధరించిన ఆ రూపాన్ని ఒక్కసారి చూస్తే బాగుండు"నని తిన్నగా వైకుంఠానికి పరమేశ్వరుడు వేంచేశాడు.

వైకుంఠానికి వచ్చిన శివునికి విష్ణువు చక్కగా స్వాగతం పలికాడు. విష్ణువుతో,

"నువ్వేదో మోహినీరూపం ధరించావుట. నాకు ఒకసారి చూపిస్తావా" అని అడిగాడు. "అదేదో రాక్షసులను మోహింపజేయడానికి సరిపోయింది కానీ నిన్ను మోహింప జేయడానికి ఆ రూపం సరిపోద"న్నాడు. "నాకు చూడాలని ఉంది. చూపించు" అని పరమేశ్వరుడు అడిగితే ఇప్పుడే వస్తానని మరి కనబడలేదు విష్ణువు.

శివుడు వైకుంఠంలో విష్ణువుని వెదకుతూ ఉంటే విరజానది ఒడ్డున ఉద్యానవనంలోంచి ఒక పాట వినబడుతోంది. ఆ పాట ఎవరు పాడుతున్నారా అని లోపలికి వెళ్ళి చూసేసరికి అక్కడ పాడుతూ కనిపించాడు మోహినీ అవతారంలో శ్రీమహావిష్ణువు. ఆ రూపం ఎలా ఉన్నదంటే 'సర్వారుణా అనవద్యాంగీ సర్వాభరణ భూషితా' అని ఈ శబ్దాలే బ్రహ్మాండపురాణంలో వర్ణించారు.

విష్ణువుని చూడగానే మోహితుడైన పరమేశ్వరుడు, "ఈ రూపం ధరించావా" అంటే "ఇది నీ కోసం ప్రత్యేకంగా ధరించాన"న్నాడు విష్ణువు. ఇది 'శంభుమోహినీ' రూపం. మోహినీరూపాలు మూడున్నాయి. అవి భస్మాసురమోహినీ, జగన్మోహినీ, శివమోహినీ.

జగన్మోహినీరూపం, భస్మాసుర మోహినీరూపం రాక్షసులను వంచన చేయడానికి సరిపోయాయి. శివుని లొంగదీసుకొనే ఈ రూపం ధరించడానికి విష్ణువు ప్రత్యేక తపస్సు చేశాడు. ఆ తపస్సు చేసి అమ్మవారినే ఆరాధించాడు. 'యా ఉమా సా స్వయం విష్ణుః' అని శాస్త్రం చెప్పినట్లుగా 'వైష్ణవీ' 'విష్ణురూపిణీ' 'ముకుందా' 'ముక్తినిలయా', 'గోప్త్రీ' 'గోవిందరూపిణీ'. ఇద్దరిదీ ఒకే లక్షణం కనుక సులభంగా ఆ పని చేయగలిగాడు.

సాక్షాత్ శ్రీవిద్యే విష్ణువిద్య కనుక – అంటే విష్ణువు ఉపాసించిన విద్య కనుక – ఒక్కసారిగా తనలో దాగిన ఆ శ్రీతత్త్వాన్ని వెలికి తీసి శ్రీమాతగా మారాడు. పరమేశ్వరుని మోహింపజేశాడు. ఆ గాథని ఇక్కడ వివరిస్తున్నారు. శంభుమోహినీ అనే గాథలో కనబడుతున్నది 'అశేషజనమోహినీం అరుణమాల్యభూషాంబరామ్'.

అమ్మవారే మోహినీస్వరూపిణి. బ్రహ్మాండపురాణంలో అమ్మవారి మూడు రూపాలు చెప్పారు. మొదటిది ప్రకృతి. రెండవది మోహిని. మూడవది భండాసుర

సంహారం కోసం చిదగ్నికుండం నుంచి వచ్చిన లలిత. ఈ మూడు శ్రీవిద్య యొక్క రూపాలే. ఇప్పటివరకు శివుని మోహింపజేసినదనే అర్థంలో చెప్పుకున్నాము.

మరొక అర్థం– శివుని యొక్క మోహినీ శక్తి. ఈ ప్రపంచమంతా ఆ మోహంలో పడి తిరుగుతోంది. పద్మపురాణంలో 'మమ శాంభవీమాయా' అని మాట చెప్పారు. వైష్ణవీ మాయ అన్నా, శాంభవీమాయ అన్నా ఒక్కటే. ఉన్నది ఒకడే ఈశ్వరుడు. ఆయనకి ఉన్నది ఒకటే మాయాశక్తి.

ఆ ఈశ్వరుని విష్ణువంటే, ఆ మాయాశక్తి పేరు వైష్ణవీ. ఆ ఈశ్వరుని శంభు అంటే ఆ శక్తి పేరు శాంభవీ. ఆ మాయాశక్తి ప్రపంచమంతా వ్యాపించి ఉంది కనుక వైష్ణవీ మాయ. అది శంభునిది కనుక శాంభవీ మాయ. ఇన్ని మాయలు లేవు. ఒకటే మాయ ఉంది. ఎన్నో మాయలు అనుకుంటే అదొక మాయ. ప్రపంచాన్ని మోహింపజేసే ఈశ్వరుని మాయాశక్తి అని అర్థం. ఈ రెండర్థాలు మనకు గ్రాహ్యాలే.

తత్త్వతః శివుడే అయిన జీవుడు మాయ కారణంగా జీవభావాన్ని పొందుతున్నాడు. అవిద్యారూపంలో జీవితాన్ని కల్పించిన ఈ మాయయే విద్యారూపిణిగా శివత్వాన్ని ప్రసాదించగలదు. అవిద్యతో కూడినప్పుడు శివునకు భిన్నునివలె ఉన్న జీవుడు విద్య కారణంగా అభిన్నుడవుతాడు. ఇలా మలచే శక్తి శంభుమోహిని. ఈ నామానికి వ్యాఖ్య రచిస్తూ ఒక శ్లోకంలో చెప్పారు జయమంగళ వ్యాఖ్యకర్త భట్టనారాయణులు.

శివం కర్తుం జీవం పునరపి కృపాయాం శివయితుం
జగద్వ్యక్తీకర్తుం శ్రమనిరసనార్థం తరయితుం
స్వతంత్రే శ్రీమాతః తవ పదయుగం నౌమి శివతో
న భిన్నం నాభిన్నం సమరససుఖైకాస్పదమహం

పంచకృత్యాలతో జగన్నిర్వహణ చేస్తున్న శంభుశక్తియే బ్రహ్మవిద్యారూపిణి కూడా.

955. ధరా – శ్రీ ధరాయై నమః

956. ధరసుతా – శ్రీ ధరసుతాయై నమః

ధరా, ధరసుతా, ధన్యా, ధర్మిణీ, ధర్మవర్ధినీ. ధకారం అనే మంత్రం వీటిలో కనిపిస్తోంది.

ఈ నామాన్ని చాలా వ్యాఖ్యానాలలో ధరా, ధరసుతా అని చెప్పారు. సర్వజగతిని ధరించునది ధర. 'ధరా' అంటే భూదేవి. పంచాశత్పీఠాలలో, సర్వతీర్థాలలో ఉన్న పృథ్వియే దేవీరూపం. అమ్మవారి స్వరూపమే భూదేవి (వసుంధరా) అని దేవీభాగవతం కూడా చెప్తోంది.

'ధరసుతా' – ధర యొక్క పుత్రిక. అంటే భూమి యొక్క పుత్రిక అని అర్థం. సీతాదేవి రూపంతో ఉన్నదని అర్థాన్ని చెప్పవచ్చు. సీతాదేవి సాక్షాత్ త్రిపురసుందరియే. లలిత వేరు. సీతమ్మ వేరు కాదు. సీతని త్రిపురసుందరిగా చెప్పి సుందరకాండ పారాయణ చేసే సంప్రదాయం ఒకటి ఉంది. అందుకే సుందరకాండ శ్రీవిద్యాస్వరూపమయింది. శ్రీవిద్యారహస్యాలే అందులో చాలా కనబడతాయి.

ఏడు కాండలుగా రామాయణం ఉండడం. 'రామా'-యణం, 'రామా' 'రమణలంపటా' – ఇందులో అంతరార్థాలు చాలా ఉన్నాయి. రామా అంటే సీత. రామః అంటే రాముడు. కామః అంటే కామేశ్వరుడు. మొత్తం అదే తత్త్వం. సీతా త్రిపురసుందరీ అని మంత్రశాస్త్రంలో సీతామంత్రాన్ని చెప్తూ –

ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తి త్రితయం యద్భావ సాధనం
తత్ బ్రహ్మసత్తా సామాన్యం సీతాతత్త్వముపాస్మహే

సుందరకాండని న్యాసం చేసేటప్పుడు 'అస్యశ్రీ సుందరకాండ మహామంత్రస్య వాల్మీకి ఋషిః' అని ఒక చోట, 'శ్రీరామచంద్రో దేవతా' అని కూడా మరొక చోట ఉంది. 'అనుష్టుప్ ఛందః శ్రీసీతామహాత్రిపురసుందరీ దేవతా' అని న్యాసం చేసుకొని సుందరకాండ పారాయణ చేసే విధానం ఉంది.

'హనుమాన్ దేవతా' అని, 'శ్రీరామచంద్రోదేవతా' అని న్యాసం చేసే విధానాలు కూడా ఉన్నాయి.

సీతాదేవి ముగురమ్మలు ఒక్కరైన మహాలక్ష్మి. ఇది విశిష్టమైన తత్త్వం. మొత్తం రామాయణంలో సీతమ్మ శక్తి – 'సీతాయాః చరితం మహత్' అనే పేరుతో చెప్పుకోవలసినదే. చాలామంది 'ధరసుతా' అనే దానికి ఆ విధంగా వ్యాఖ్యానించారు.

శ్రీధరాయై నమః / శ్రీధరసుతాయై నమః.

కానీ పూర్వపాఠాల్లో మనకి కనిపిస్తున్న నామం మాత్రం 'ధరాధరసుతా'. అంతేకాని ధర ఒక నామం – ధరసుతా, ధరాసుతా అనే నామ విభాగం పొసగదు. మనకి పారాయణలో గ్రాహ్యంగా తీసుకోవచ్చు. ఇంతమాత్రం చేత సీతమ్మ భావం తీసివేశామని అనుకోకూడదు.

'ధరాధరసుతా' అనేదే గ్రాహ్యము.

భూమిని ధరించునది– భూధరము. 'ధరాధరము' అంటే పర్వతము అని అర్థం. 'ధరాధరసుతా' అంటే పర్వతపుత్రిక పార్వతీదేవి. 'శైలేంద్రతనయా' ఎలాగు అన్నారు కనుక మళ్ళీ 'ధరాధరసుతా' పునరుక్తి అవుతుందేమోనని తరువాత వారు మార్చివేసి ఉండవచ్చు. మనకి పూర్వపాఠమే (ధరాధరసుతా) గ్రాహ్యం. 'పర్వతరాజపుత్రి' అని అర్థం.

957. ధన్యా – శ్రీ ధన్యాయై నమః

'ధరాధరసుతా' నామం నుండి 'ధర్మవర్ధినీ' వరకు ఉన్న నామాలలో ప్రధానమైన నామం 'ధన్యా'. 'ధన్యా' అనబడే దేవతామంత్రరహస్యం ఇందులో దాగి ఉంది. 'ధనం కలిగినవాడే ధన్యుడు'. ధనం అంటే ఏమిటి? ధన్యత నిచ్చేది ధనం. అంటే ఏది పొందాలో దానిని పొందితే ధన్యత. ధన్యుడను అయ్యానండి అంటే పొందాల్సిన దానిని పొందానని అర్థం. ఆ పొందడానికి పనికి వచ్చేదేదో అదే ధనం.

అమ్మవారు ధన్యురాలు. పొందాల్సిన దానిని పొందినది. అసలు ఆవిడకి పొందవలసినది ఉందా? 'ధన్యా' శబ్దం అమ్మవారికే సరిపోతోంది. ఆవిడ ఎప్పుడూ 'ధన్యా'. అమ్మవారు కొత్తగా పొందవలసింది ఏమీ లేదు. పొందనిది కూడా ఏమీ లేదు.

ఇవన్నీ చాలా చిత్రమైన మాటలు. 'శాశ్వతీ' 'శాశ్వతైశ్వర్యా' కనుక 'ధన్యా' నామం ఇక్కడ విశేషంగా చెప్తున్నారు.

ఆ 'ధన్యా' అయిన తల్లిని ఎవరు ఉపాసన చేస్తున్నారో వారు ధన్యులౌతారు.

పొందవలసినది ఆత్మవస్తువే. దానిని పొందితే ధన్యతే. పొందించే తల్లి ఆవిడ. ఆమెయే ఆత్మస్వరూపం కనుక పరిపూర్ణురాలు అని దీనికి మరొక అర్థం.

చింతన అనేది నాలుగు రకాలుగా ఉంటుంది. మరణకాలంలో ఏది చింతన చేస్తామో అది ముఖ్యం. అప్పుడు ఏది దొరికితే అదే ధన్యత.

కానీ అప్పుడేం స్ఫురిస్తుందో అది మన చేతుల్లో లేదు. ఇప్పుడే ఏదైనా చింతన చేయగలిగితే చేయాలి.

వారి వారి కర్మలని బట్టి నాలుగు రకాల చింతనలు వస్తాయని శాస్త్రం చెప్తోంది. కొందరికి వచ్చే చింత పేరు ఆర్తచింత. ఆర్తచింత రెండు రకాలు. రజోగుణ, తమోగుణ పూరితులకి రెండు రకాల చింతనలు వస్తూ ఉంటాయి. ఆర్తచింత అంటే మరణసమయంలో ఆస్తులు, ధనాలు, సంపదలు, అభిమానాలు, ప్రేమలు, వ్యక్తులు, విషయాలు – ఇవి గుర్తుకి వస్తే అది ఆర్తచింత. ఈ ఆర్తచింత ఎవరికి గుర్తొస్తే వారి తరువాత జన్మలు తిర్యక్ జన్మలు. అంటే పశుపక్ష్యాది జన్మలు.

రెండవది రౌద్రచింత. రౌద్రము అంటే బాధాకరమైన అంశాలు చింతన చేయడం. విషయవస్తు చింతన ఆర్తచింత. భయ, దుఃఖ వస్తు చింతన రౌద్రచింత. ఇతరుల్ని హింసించే భావాలు, పరవస్తు నాశనభావాలు, దయాహీన భావాలే రౌద్రచింతన.

మూడవ చింత– **'ధన్యే దేవగతిశ్శుభం'.**

సూత్రార్థ మార్గణ మహావ్రత భావనాభిః
బంధప్రమోక్ష గమనాగతహేతు చింతా
పంచేంద్రియాద్యుపశమశ్చ దయా చ భూతే
ధ్యానం తు ధన్యమితి.... (భవిష్యోత్తరపురాణం)

బ్రహ్మసూత్రార్థాలను ఆలోచించుట, మహావ్రతాలను చేయాలని భావించుట,

మోక్షానికి కారణాలేవి? మళ్ళీ జన్మలకి కారణాలేమిటి? అని విచారించుట. ఇంద్రియోద్రేకాలు లేకుండా శాంతింపజేసుకొనుట ప్రాణులయందు దయ – ఈ ధ్యానము(బుద్ధి నిలుకడ) – ధన్యచింత – అని భావం.

ఇటువంటి ఉన్నతమైన 'చింత' దేవీభూతియే కనుక 'ధన్యా'. ఇది దేవగతిని ప్రసాదిస్తుంది.

నాలుగవ చింత పేరు 'శుక్లచింత'. ఇది అంత తేలిక కాదు. సర్వవ్యాపకమైన అఖండమైన బ్రహ్మభావనతో తాదాత్మ్యం చెందిన ఆత్మనిష్ఠ గల జీవన్ముక్త స్థితి ఇది. వారిది శ్లుకచింత అంటారు. ఇది అమ్మవారి నిష్కళారూపంతో/పరబ్రహ్మజ్ఞానంతో తాదాత్మ్యం చెందడం.

వేదాంతం, ఉపనిషత్తులు చెప్పిన బ్రహ్మనిష్ఠలో ఉంటూ శరీరత్యాగం చేసినట్లైతే దానిని శుక్లచింత అంటారు. వారి గతి నిస్సందేహంగా మోక్షమే. ధన్యచింతలో సాలోక్యం ఉంటుంది. శుక్లచింతలో కైవల్యం ఉంటుంది. రెండూ గొప్పవే.

అమ్మవారిని ఆశ్రయిస్తే ఇప్పుడు ధన్యచింతన ఇచ్చి ఆ దివ్యగతులకు చేర్చినా, క్రమంగా కైవల్యస్థితిని కూడా ఇస్తుంది. ఈ నామంలో ఇంత విశేషమైన భావన ఉంది. తన భక్తులకు ధన్యచింతనని ఇచ్చే తల్లి. అమ్మని ఆశ్రయించాము కనుక ఆర్తచింత, రౌద్రచింత మన దగ్గరకి రావు.

పరమాత్మ 'నానవాప్తమవాప్తవ్యం' అని భగవద్గీతలో చెప్పాడు. "నేను పొందనిది లేదు. పొందాల్సింది లేదు" అన్నాడు. ఆ స్వరూపమే 'ధన్యా'.

958. ధర్మిణీ – శ్రీ ధర్మిణ్యై నమః

ధర్మమే స్వభావంగా కలది. ధన్యత రావాలంటే ఇప్పుడు ధర్మం ఉండాలి. బ్రతుకులో ధర్మసంస్కారంలేని వారికి ధన్యత రాదు. ధర్మబద్ధంగా జీవించినట్లైతే వారి మరణసమయంలో అమ్మవారు ఆ చింతనను తానే ఇస్తారు. ధర్మజీవనానికి కూడా అమ్మవారి అనుగ్రహం కావాల్సిందే.

'ధర్మిణీ' అంటే ధర్మాలన్నిటి రూపం కనుక ఆ తల్లి తప్పకుండా మన సాధన

దశలోనే ధర్మబద్ధంగా ఉండేటట్లు చేస్తుంది. నమ్ముకున్నవారికి ధర్మం ఆచరించడానికి కావలసిన పరిస్థితులు కూడా అమ్మ కల్పన చేస్తుంది. ఒకొక్కప్పుడు ధర్మం చేయాలన్నా పరిస్థితులు ప్రతికూలిస్తాయి. ఆవిడ ధర్మిణీ కనుక ఆ తల్లే భక్తులకి ధర్మానికి కావలసిన అనుకూలతలను ప్రసాదిస్తుంది.

'ధారణాత్ ధర్మమిత్యాహుః'. ఏది మనల్ని పట్టి నిలుపుతుందో అదే ధర్మం. మనల్ని పతనం కాకుండా కాపాడేదే ధర్మము. ఈ ధర్మం శాస్త్రముఖంతో తెలుస్తుంది. శాస్త్రాలన్నీ అమ్మవారి రూపాలే. మనం తరించడం కోసం ఆ తల్లి శాస్త్రాల ద్వారా ధర్మాన్ని అందించింది.

ప్రపంచంలో ప్రతిదానికి దాని ధర్మం దానికి ఉంది. అగ్నికి మండడం ధర్మం. వాయువుకి వీచడం ధర్మం. సూర్యునికి ప్రకాశించడం ధర్మం. మన కంటికి చూడడం ధర్మం. చెవికి వినడం ధర్మం. ఈ ధర్మాలు మనం పెట్టినవి కావు. ఉన్నవి వాడుకుంటున్నాం. ఈ ధర్మాలన్నిటితో లోకాలను నడిపే తల్లి కనుక 'ధర్మిణీ'. ఎవరు ఈ ధర్మములతో లోకాలను నడుపుతున్నారో ఆ తల్లి 'ధర్మిణీ'.

959. ధర్మవర్ధినీ - శ్రీ ధర్మవర్ధిన్యై నమః

ధర్మాన్ని వర్ధిల్లజేయునది. కల్పాంతం వరకూ సూర్యుడు వెలుగుతూ ఉండాలి. అతనిలో వెలగడమనే ధర్మం ఎప్పటికప్పుడు వృద్ధి చెందించాలి. అలాగే భూమికి పంటలివ్వడం ఒక ధర్మం. వీటి ఆధారంగా ప్రపంచాన్ని పరిశీలిస్తే చాలు అమ్మ ధర్మాలన్నీ మనకి కనబడుతున్నాయి. భూమి నుండి పంటలను ఇచ్చి మన బ్రతుకులు పండిస్తోంది. ఇలా ధర్మాలను ఎప్పటికప్పుడు వర్ధిల్లజేస్తోంది కనుక 'ధర్మిణీ', 'ధర్మవర్ధినీ'.

మరొక అర్థం- ధర్మస్వరూపిణి అయిన ఆ తల్లే లోకంలో ఎక్కడైనా ధర్మం దెబ్బ తింటే తాను అవతరించి తిరిగి ధర్మాన్ని వృద్ధి చేస్తోంది కనుక ధర్మవర్ధినీ. గీతలో స్వామి చెప్తూ

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం

ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే – అన్నారు.

ధర్మస్థాపనకోసం అమ్మవారు వస్తూ ఉంటుంది. మహిషాసుర, భండా సురాదులను సంహరించి ధర్మాన్ని రక్షించింది ఈ తల్లే. వస్తే విష్ణువు, లేకపోతే వైష్ణవీ. శివుడే ఈ రెండు రూపాలతో వస్తూ ఉంటాడు. లోకం యొక్క స్థితిని కాపాడడం వీరి పని కనుక వీరే అలా వస్తూ ఉంటారు.

'ధర్మిణీ', 'ధర్మవర్ధినీ'– ఈ రెండు నామాలు చాలా అవసరం. శ్రుతిస్మృతి విహిత ధర్మాలను, జ్ఞానవైరాగ్యాది ముముక్షు ధర్మాలను సాధకునిలో వృద్ధిచేసే తల్లి.

ధర్మిణీ, ధర్మవర్ధినీ అయిన ఆ తల్లి అనుగ్రహిస్తేనే మనం ధన్యులమౌతాం. ధర్మం చేత ధన్యత వస్తుంది కనుక 'ధన్యా' తరువాత నామాలు ఇంత చక్కగా కూర్చిపెట్టారు.

ఈ ధర్మమనేది ఎప్పుడూ ఉన్నతమైన భూమికలలోంచే మనకి రావాలి. ఆ ఉన్నత స్థితే 'పర్వతం'. ఆ పర్వతం నుండి ధర్మరక్షణ కోసం వచ్చిన ధరాధరసుత అయిన 'ధన్యా' ఆ పార్వతీదేవి.

960. లోకాతీతా – శ్రీ లోకాతీతాయై నమః

'లోకాతీతా, గుణాతీతా, సర్వాతీతా, శమాత్మికా' – ఈ నాలుగు నామాల అర్థాన్ని భావన చేస్తే చాలు అనిపిస్తాయి. ఇవి అంత సంపూర్ణమైన నామాలు. లలిత అని పేరు చెప్పకుండానే లలితను చూపిస్తున్నారు.

లలితా అనే మాటకి ఎన్నో అర్థాలు దొరికాయి. 'లావణ్య శేవధిః' – లలితకి ఒక అర్థం. ఇప్పుడు మరో అర్థం చెప్తూ 'లోకాతీతా లలితా' అన్నారు. ఇది మత్స్యపురాణంలోని నిర్వచనం. **'లోకానతీత్య లలతే లలితా తేన సోచ్యతే' –** లోకంలో ఎక్కడా లేని లావణ్యం, లోకాలన్నింటిని దాటిపోయిన తరువాత ఏ లావణ్యమున్నదో ఆ లావణ్యమే అమ్మవారు. లావణ్యాలన్నీ నిజానికి అమ్మవారే అయినా

ప్రకృతివికారాలతో కలిపి చూస్తున్నాము. వికారాలని తీసేసి లావణ్యాన్ని చూడాలి. లోకాలకు అతీతంగా ప్రకాశించునది లలితా.

వికారాలు లోకానివి. వికారాలలో చైతన్యం ఉంది కానీ, చైతన్యానికి వికారాలు లేవు. ఇక్కడే ఉంటూ అంటకుండా ఉండడం గొప్ప విషయం.

ఆ 'చైతన్యరూపిణి' 'లోకాతీతా' అంటే లోకాలన్నిటిలో వ్యాపించి ఆ లోకాలకి అతీతంగా ఉన్నది.

సృష్టి–స్థితి–లయ వికారాలు లోకానికి, లోకులకు ఉన్నాయి. లోకపాలకులకి కూడా వికారాలు ఉన్నాయి.

లోకాలు, లోకపాలకులు, లోకులు – ఈ మూడు విషయాలే ఎప్పుడూ ఉంటాయి. వీరి ముగ్గురి గతి ఎంతకాలం? వీరు పోయినా, పోకుండా ఉన్నది ఒకటి ఉంది. "లోకంబులు లోకేశులు లోకస్థులు తెగిన తుది నలోకంబగు పెంజీకటి కవ్వల ఎవ్వండేకాకృతి వెలుగు నట్టి వాని సేవింతున్" అన్నాడు గజేంద్రుడు. లోకాలు, లోకస్థులు, లోకపాలకులందరికి అతీతమైన చైతన్యం 'లోకాతీతా'.

961. గుణాతీతా – శ్రీ గుణాతీతాయై నమః

లోకము అంటే గుణమే. సత్త్వ, రజో, తమో గుణాలు. ఈ మూడు గుణాలతో లోకం నడుస్తున్నది. అమ్మవారు 'నిర్గుణా' కనుక ఈ మూడు గుణాలకి అతీతురాలు. ఆమె వల్లనే మూడు గుణాలు పనిచేస్తున్నాయి కానీ ఆవిడకి ఈ మూడు గుణాలు లేవు అనేది ఈ నామంలో ఉన్న భావం.

'లోకాతీతా' అంటే ఏమిటో 'గుణాతీతా' అన్నా అదే. ఇలా ఎన్ని చెప్తాం? లోకాలకి, గుణాలకి, రూపాలకి, నామాలకి, ఇంద్రియాలకి, ఉపాధికి అతీతురాలని చెప్తూ ఉంటే మాటలు పెరిగిపోతూ ఉంటాయి. అంతా కలిపి ఒక్క మాటలో చెప్పాలంటే 'సర్వాతీతా' అన్నారు.

962. సర్వాతీతా - శ్రీ సర్వాతీతాయై నమః

అన్నింటికి అతీతురాలు. ఏది మనం లోకంలో చూపించినా అది ఉపాధే. 'ఇదం' ప్రత్యయంతో దొరికిన వాటికి అమ్మ అతీతురాలు. **'శబ్దాతీతం పరంబ్రహ్మ గణనారహితం సదా ఆత్మస్వరూపం జానీహి'** (జ్ఞానార్ణవం) - శబ్దాలకు అతీతమై, లెక్కకు అందనిదై ఉన్న ఆత్మ స్వరూపమే పరబ్రహ్మమని తెలుసుకోవాలి. అతీతమైన ఆ స్థితికి జీవుడు చేరుకోగానే అప్పుడు ఆ స్థితి పేరు శాంతము. అది ముక్త స్థితి. అన్నీ శమించిపోయిన స్థితి.

963. శమాత్మికా - శ్రీ శమాత్మికాయై నమః

శాంత స్థితే 'శమాత్మికా'. లోకాతీతా, గుణాతీతా, సర్వాతీతా, శమాత్మికా... విశేష నామపరంపర. ఇదంతా కలిపి ఒక్క మాటలో చెప్పాలంటే తురీయం. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలకి పైన ఉన్న సమాధిస్థితిలో ఉన్న పరమతత్త్వమే తురీయం. అమ్మవారు ఆ తురీయస్వరూపిణి. **'తురీయా కాపి త్వం దురధిగమ నిస్సీమ మహిమా'** - అని శంకరులు చెప్పినట్లు మూడింటికి అతీతమైన తురీయా తత్త్వము - అని అర్థం.

మరికొన్ని అర్థాలు తెలుసుకోవాలి. అమ్మవారి మణిద్వీపం మహాకైలాసం, చతుర్దశ భువనాలకి ఆవల ఉన్నాయి. చతుర్దశ భువనాలకి సృష్టి, స్థితి, లయలు ఉన్నాయి కానీ, వాటికి పైన ఉన్న పరంధామానికి ఈ వికారాలు లేవు. 'లోకాతీతా' అంటే మణిద్వీపవాసిని అని దీని యొక్క భావం.

మరొక అర్థం- 'శ్రీచక్రం'లో పరిశీలిస్తే అమ్మవారి యొక్క ఆ తురీయభూమిక బిందువునందు ఉన్నది. దాని తరువాత త్రికోణం. దాని తరువాత అష్టత్రికోణం. ఇలా అన్నీ వస్తున్నాయి. బిందువు తరువాత వచ్చేవన్నీ అనేకాలే. బిందువు దగ్గర ఉన్న తత్త్వం ఒక్కటే. త్రికోణం వచ్చేసరికి మూడు వచ్చేశాయి. అష్టత్రికోణంలో ఎనిమిది. ఎనిమిదిలో మళ్ళీ మూడేసి చొప్పున అనేకం అయిపోయింది. ఈ అనేకమంతా లోకం.

ఎనిమిది ఆవరణలు కూడా లోకాలే. మొత్తం విశ్వచక్రమే శ్రీచక్రం. ప్రపంచంలో కూడా కనబడేవి ఎనిమిది. ఈ ఎనిమిదింటికి మూలతత్త్వం బిందువులో కూర్చుంది. ఎనిమిది ఆవరణలకు లోకములు అని పేరు. ఆ ఆవరణలు దాటిన తరువాత బిందురూపంలో ఉన్న తత్త్వమే తొమ్మిదవ ఆవరణయందు బిందువునందున్న శ్రీమహాత్రిపురసుందరీ పరదేవతయే 'లోకాతీతా'.

అదేవిధంగా గుణములు మూడు. ప్రతి త్రికోణం గుణమే. త్రికోణ చక్రాలన్నీ దాటిపోయిన తరువాత ఉన్నది కనుక 'గుణాతీతా'. మరి అష్టదశ, షోడశదశ కోణాలు చెప్పారంటే వాటికి కూడా ఆవల ఉన్నది కనుక 'సర్వాతీతా'. ఒకొక్క ఆవరణ దాటుకుంటూ వెళ్ళిపోయిన తరువాత బిందువు నందు ఉన్న తల్లే అక్కడికి చేరేటప్పటికి 'శమాత్మికా'.

లలిత అంటే ఏది లోకాతీతమో, ఏది గుణాతీతమో, ఏది సర్వాతీతమో అది. అతీతము అంటే వికారాలు లేని స్థితి. లోకంలో ప్రతిదానికి వికారాలు ఉన్నాయి. పుట్టుట, పెరుగుట, లయించుట, నశించుట, రోగము, అజ్ఞానం - ఇవన్నీ లోకవికారాలు. ఈ వికారాలు ఏవీ లేని తల్లి. ఈ చివరి నాలుగు వాక్యాలు చాలా విశేషం. కేవల నిర్గుణమై, నిరంజనమై ఏవైతే మనం 'నిర్మలా', 'నిరాకారా' నామాలుగా చెప్పుకున్నామో ఆ స్వరూపమంతా ఇక్కడ చెప్పారు.

శమము అంటే శాంతము. ఏది బాధ కలిగిస్తుందో అది పోతే శాంతి అనుకుంటాం. కానీ జనన - మరణ రూపమైన సంసారం శమించిపోతే అదే అసలు శాంతి.

ఈ సంసారమే ప్రపంచము. శాంతమంటే **'ప్రపంచోపశమం శాంతం చతుర్థం శివం అద్వైతం మన్యంతే'** అని మాండుక్యోపనిషత్తులోని వాక్యం. సర్వవికారాలు దుఃఖాలు, జనన - మరణరూప ప్రవాహం. ఇదంతా శమించి పోయిన కేవల మోక్షస్థితే శాంతం. అక్కడ రెండవ వస్తువు లేదు. దానికే అద్వైతం అని పేరు. అద్వైతమనేది మాండుక్యం లోంచి వచ్చింది. దానికే మరొకపేరు 'శివమ్'. శివమ్ అంటే **'ప్రమహసి పదే నిస్త్రైగుణ్యే శివాయ నమో నమః'**. త్రిగుణాతీతమై, లోకాతీతమై,

సర్వాతీతమై శాంతమైన తత్త్వం. యోగి జాగ్రత్, స్వప్న, సుషుప్తి దాటిపోయిన సమాధి స్థితిలో పొందే అనుభూతి.

అక్కడ ఆ పరతత్త్వం తప్ప రెండవ వస్తువు లేదు. నేను అనేది కూడా లయం అయిపోతుంది. అది మోక్షస్థితి. యోగులు మోక్షములో పొందే సచ్చిదానంద బ్రహ్మతత్త్వమే అమ్మవారు. ఆ స్థితి లౌకికమైన ఆనందం కంటే అతీతం కనుక లోకాతీతమైన ఆనందం. అంత అందమైన వస్తువు మరొకటి లేదు. అదే శివం. 'శివజ్ఞానప్రదాయినీ'. 'శివా' నామార్థం అంతా ఇక్కడ భావించుకోవచ్చు. లోకాతీతా, గుణాతీతా, సర్వాతీతా, శమాత్మికా అయిన తత్త్వమే శివం. అదే లలితా.

శమము అంటే నిర్వచనం చెప్తూ **'సర్వోపాధి ధ్వంసః శమః'** అన్నారు. శమము అంటే అన్ని ఉపాధుల ధ్వంసమే. ఉపాధి పోవడమంటే శరీరం పోవడం కాదు. సూక్ష్మ, కారణ శరీరాలు కూడా లయించిపోవాలి. లయించుట అంటే నాశనం కాదు. సముద్రం ముందు నిలబడి "ఎన్ని కెరటాలో" అన్నాడు ఒకాయన. "ఎంత సముద్రమో" అన్నాడు మరొకాయన. ఏది నిజం? రెండూ నిజమే. కెరటాలు అన్నప్పుడు బహువచనం. సముద్రం అన్నప్పుడు ఏకవచనం. ఎదురుగా ఉన్నది ఏకమా? అనేకమా? ఏకమనుకుంటే మరి అనేకమైన కెరటాలు ఏమైపోయాయి? అనేకమైన కెరటాలు అనే భావం ఒకే సముద్రమనే భావంలో లయమైపోయింది. కెరటం లయించ లేదు. భావం లయించింది. అప్పుడు మనం అంతటిని కలిపి ఒకే సముద్రంగా చూడగలుగుతున్నాము. అదే విధంగా ఈ ఇంద్రియాలు, ఆలోచనలు, శరీరాలు – అన్నీ అనేకమనే భావం పోయి ఉన్నది ఒక్కటే పరబ్రహ్మమనే భావంలో లయమైపోవాలి. అదే లయమంటే.

అన్ని ఉపాధుల్లో ఒకే చైతన్యం ఉందనే జ్ఞానం మనకి కలిగితే చాలు. ఆ జ్ఞానమే లయం. ఆ లయమే శమం. ఉపాధిదృష్టి పోయి, ఏకచైతన్య దృష్టి కలగాలి.

నారాయణ భట్టు భాష్యం చాలా గొప్పగా ఉంటుంది. శుద్ధ అద్వైతభావం దట్టించి ఇచ్చారు. క్లుప్తంగా, సూటిగా చెప్పారు. ఇంతవరకూ నిర్గుణమైన అమ్మతత్త్వాన్ని చెప్పారు. ఆ నిర్గుణతత్త్వమే ఉపాసిస్తే సగుణమౌతోంది. **"ఉత ఉపాసనమేవ**

ముక్తిసాధనమితి కర్తవ్యమితి".

తరువాత రాబోతున్న నామాలలో అమ్మవారి రూపాన్ని వర్ణిస్తున్నారు. ఒక సగుణ సాకారాన్ని వర్ణిస్తున్నారు. అమ్మవారి నిరాకార-నిర్గుణతత్త్వాన్ని జ్ఞేయబ్రహ్మము అంటారు. అమ్మవారి సగుణసాకార రూపము, మంత్రము, శ్రీచక్రము - వీటన్నిటిని ఉపాస్య బ్రహ్మము అంటారు. ఉపాసనదశలో, సాధనదశలో తెలుసుకునేదంతా కూడా ఉపాస్యము. ఇది సగుణం, సాకారం.

జ్ఞేయబ్రహ్మం నిర్గుణం, నిరాకారం. రెండూ వేరు వేరా! అంటే రెండు బ్రహ్మమే. నిర్గుణా, నిరాకారా కూడా అమ్మవారే. సగుణ సాకార కూడా ఆమెయే. ఇంతవరకు 'లోకాతీతా, గుణాతీతా, సర్వాతీతా, శమాత్మికా' అని చెప్పబడిన జ్ఞేయబ్రహ్మమే ఉపాసకుల కోసం 'ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా' అని చెప్పినట్లుగా ఒక అద్భుతమైన దివ్యమంగళ విగ్రహంగా వచ్చింది.

ఆ స్వరూపాన్ని వర్ణిస్తూ- **'తదిదం మనసి నిధాయ'.** అలాంటి అమ్మ యొక్క సగుణ సాకార స్వరూపాన్ని మనస్సులో పెట్టుకొని, **'వశిన్యాది భారతీ గణోపి సగుణాయామేవ శ్రీలలితాభట్టారికాయాః స్తోత్రం పర్యవసాయేతి'** అని నారాయణభట్టు చెప్పారు.

అమ్మ యొక్క ఆ నిర్గుణ నిరాకారతత్త్వాన్ని తెలుసుకుని ఆవిడే ఈ సగుణసాకారంగా ఉన్నదని చెప్తూ ఉపాసకుడైనవాడు ఈ సగుణ సాకార రూపాన్ని నిరంతరం ధ్యానించాలి అని మనకి చెప్పడం కోసం వశిన్యాది వాగ్దేవతలు ఆనందంగా అమ్మవారి సగుణ సాకార నామాలను ఇక్కడ నుండి చెప్పబోతున్నారు. దీనిని బట్టి మనకి సగుణ-నిర్గుణ సమన్వయం జరుగుతోంది. ఆ స్వరూపాన్ని చూపిస్తున్నారు.

964. బంధూకకుసుమప్రఖ్యా - శ్రీ బంధూకకుసుమప్రఖ్యాయై నమః

బంధూక కుసుమం అంటే మంకెనపువ్వు. మంకెనపువ్వులాంటి ఎరుపు రంగుతో ఉన్న తల్లి.

వేదాంత భావన ఉండి సాకార చింతన చేస్తే నామరూపాల భేదాలు ఉండవు.

ఆ ఒక్క పరతత్త్వమే ఈ నామంతో, ఈ రూపంతో ఉపాసింపబడుతోంది.

'బంధూకకుసుమప్రఖ్యా', 'దాడిమీకుసుమప్రభా' అని చెప్పడం కేవలం ఎఱ్ఱగా ఉందని చెప్పడమే కాకుండా అక్కడ మరొక రహస్యం ఉంది. శ్రీచక్రధ్యానంలో ఏ ఆవరణ ఏ రంగులో ఉందో వర్ణిస్తారు. బంధూకకుసుమం రంగులో ఏ ఆవరణ ఉందో చెప్పారు.

శ్రీచక్రపరంగా శ్రీచక్రంలో ఉన్న బిందువునే లోకాతీతా, గుణాతీతా, సర్వాతీతా, శమాత్మికా అని చెప్పుకుంటున్నాం. వేదాంతపరంగా సర్వవ్యాపకమైన బ్రహ్మమే శ్రీచక్రంలో బిందువునందు ఉంది. బిందువు త్రికోణం లోపల ఉంది. త్రికోణ ఆవరణకే 'సర్వసిద్ధిప్రదచక్ర'మని పేరు. ఆ త్రికోణచక్రం మంకెనపువ్వు ఎరుపు ఎలా ఉంటుందో అలాంటి ఎరుపుతో ఉంటుంది. ఆ బిందువు త్రికోణానికి మధ్యలో మెరిసిపోతూ ఉంటుంది కనుక 'బంధూకకుసుమప్రఖ్యా'. 'ప్రఖ్య' అంటే గొప్పగా తెలుపబడుతున్నదని, ప్రకాశిస్తున్నదని అర్థం. త్రికోణ ఆవరణలో ఉన్న తల్లి.

965. బాలా – శ్రీ బాలాయై నమః

కొందరు 'బాలాలీలావినోదినీ' కలిపి ఒకే నామం అన్నారు. రెండు నామాలుగా కొందరు చెప్పారు. ఇంకొంత మంది మూడు నామాలు చేశారు. వెయ్యినామాలను సవరించడం కోసం ఒకొక్కరు ఒకొక్కలా చెప్పారు. ఎలా విడదీసినా తప్పులేదు. బాలా – లీలావినోదినీ అని రెండు నామాలుగా చెప్పుకుందాము. ప్రతి నామం కూర్పు వెనకాల ఒక శాస్త్రం ఉంది. నామానికి ఉన్న శాస్త్రార్థం ఆధారంగా మనం చెప్పుకుంటున్నాం.

లలితామహాత్రిపురసుందరీ నామాల్లో బాలా నామం, లలితా నామం ఒక్కమారు మాత్రమే వచ్చాయి. ప్రధానశక్తి కనుక ఈ నామాన్ని ఒక్కసారి చెప్పి ఊరుకున్నారు. బాలా పరిపూర్ణమైన ఉపాసన.

'త్వం కుమార ఉతవా కుమారీ' – నీవు కుమారుడవా? కుమారివా? – అని శ్రుతివాక్యం. రెండు మొదలు పది ఏళ్ళ వయస్సు గల బాలికలు 'కుమారీ' అని

పూజింపబడతారు. తద్రూపిణి – బాలా.

అరుణకిరణజాలైరంచితాశావకాశా

విధృతజపపటీకా పుస్తకాభీతిహస్తా

ఇతరకరవరాఢ్యా ఫుల్లకల్హారసంస్థా

నివసతు హృది బాలా నిత్య కల్యాణశీలా

బాలా నామమే మంత్రం. సాధారణంగా బాల అంటే చిన్నపిల్ల అనుకుంటారు. ఆవిడెప్పుడూ చిన్నపిల్లే. వెంటనే 'బాలా' శబ్దానికి అర్థం చెప్తూ 'లీలావినోదినీ' అన్నారు.

966. లీలావినోదినీ – శ్రీ లీలావినోదిన్యై నమః

అమ్మవారు ఈ లోకమనే ఆట ఆడుతోంది. ఈ ప్రపంచమనే పని చెయ్యడం వల్ల అమ్మవారికి ఏం ప్రయోజనం లేదు. లీల మాత్రమే. **'లోకవత్తు లీలా కైవల్యం'** అని బ్రహ్మసూత్రం చెప్తోంది. ఒక ఆటలా ప్రపంచాన్ని నడిపిస్తోంది. లోకం అమ్మకి ఒక లీల. ఇది లీలావినోదినీ.

మరొక అర్థం– బాలా అంటే జ్ఞాని అని అర్థం. బాలురు అంటే మన దృష్టిలో అజ్ఞానులు. **"తత్త్వవిదః బాలవత్ ఫలాంతరమనపేక్ష్య ఉపాసనాదికమపి లీలవదా చరతి"** అన్నారు భట్ట నారాయణులు. అమ్మవారి ఆరాధన చేశాక చిట్టచివరికి –

బాలభావానుసారేన మమేదంహి విచేష్టితం

మాతృవాత్సల్య సదృశం త్వయా దేవి విధీయతామ్ – అని పూజాంతంలో ఉపాసకుడు అంటారు.

'బాలురవలె నేను చేసే ఈ ఉపాసనాదులను మాతృవాత్సల్యంతో నువ్వు స్వీకరించాలమ్మా' అని భక్తుని నివేదన.

తత్త్వవేత్తలు ఇతర కాలాలను కోరకుండా బాలుర వలె ఉపాసనాదికాలను లీలగా ఆచరిస్తారు. దానితో పరదేవత ప్రీతి చెందడమే పరమార్థం.

కర్మణ్యకర్మయః పశ్యేదకర్మణి చ కర్మ యః
స బుద్ధిమాన్ మనుష్యేషు స ముక్తః కృత్స్న కర్మకృత్

కర్మలో అకర్మను, అకర్మలలో కర్మను చూసే బుద్ధిమంతుడు అన్ని కర్మలలోను అంటక ఉండే యోగి – అని గీతలో భగవానుడు చెప్పిన భావమే ఇది.

సర్వమూ బ్రహ్మమైనప్పటికీ కూడా మహాత్ములైన జ్ఞానులు లోకవ్యవహారంలో ఉంటారు. కానీ లోకవ్యవహారం వల్ల వారికేం ప్రయోజనం ఉండదు.

"లీలవత్ ఆచరతి" – జీవన్ముక్తులైనవారు లీలగానే సంచరిస్తూ ఉంటారు. జీవన్ముక్తుల యొక్క స్థితిలో ఏ నిరుపాధిక చైతన్యం ప్రకాశిస్తుందో ఆ చైతన్యమే 'బాలా'. బాలా అంటే జీవన్ముక్తావస్థ. 'బాలా' మంత్రంలో ఆరు అక్షరాలు ఉంటాయి. సభల్లో చెప్పరాదు. అది ఉపదేశంగా పొందవలసిన మంత్రం. ఆరు అక్షరాల మంత్రం భావం చెప్తారు వ్యాఖ్యాతలు – 'అహం బ్రహ్మాస్మి' 'బ్రహ్మైవాహమస్మి'.

బాలాదేవిని ఉపాసన చేస్తే ఆ తల్లి ఇచ్చే స్థితి – జీవన్ముక్తావస్థ. అప్పుడు చిన్నపిల్లలా ఆవిడ ఎలా లోకంతో ఆడుకుంటుందో, వారు కూడా ఈ లోకంలో తిరుగుతున్నప్పుడు సుఖం కలిగినా, దుఃఖం కలిగినా ఒక ఆటలా చూస్తారే తప్ప బాధ పడరు.

లోకేశ్వరి అయి ఇంత ప్రపంచమనే ఆటని ఎలా ఆడుతోంది! లీలగా ఆడుతోంది. 'బాలా' అంటే చిన్నపిల్ల అని అర్థం కాదు. ప్రపంచంతో ఆడుకుంటున్న 'లలితాంబ'.

గ్రహముల రంగులరాట్నము త్రిప్పుచు ఆటలాడు హేలా లీలాకరి! బాలాత్రిపురసుందరీ (శివపదం). చిన్నపిల్లలు బొంగరాలు పట్టుకుని గిర్రుని త్రిప్పుతూ ఆనందిస్తూ ఉంటారు. అమ్మవారు బ్రహ్మాండాలనే బొంగరాలను త్రిప్పుతోంది. అమ్మని బాలగా చూస్తే ప్రపంచం బొమ్మరిల్లుగా కనబడుతుంది. అందుకేనేమో నవరాత్రులు వచ్చినప్పుడు బొమ్మలకొలువు పెడతారు. ప్రపంచాన్ని బొమ్మలకొలువులా చూడగలిగిన జ్ఞాని భారతీయ ఋషి.

ఆ బొమ్మల కొలువులో బొమ్మలని అరల మీద అరలుగా జాగ్రత్తగా పెడతారు.

ఏ అరలో ఏం ఉండాలో ఒక పద్ధతి ఉంది. చతుర్దశభువనాలనే అరలలో ఏ అరలో ఎవరు ఎక్కడ ఉండాలో పెట్టి ఆడుకుంటున్న అమ్మవారు బాలా లీలావినోదినీ.

"బాల లీలా విశిష్టత్వాత్ బాలేతి కథితా ప్రియే' అని త్రిపురాసిద్ధాంతంలో చెప్పారు. బాలా అంటే లీలగా ప్రపంచాన్ని నడిపే తల్లి.

'బల పాలనే' ధాతువు నుంచి బాల అనేది వచ్చింది. బల అంటే పోషించునది.

మరొక అర్థం 'బాలా' అంటే రూపమును ఇచ్చునది. **"బలతి రూపయతి బల్యతే ప్రాణ్యత ఇతి బాలః"** అన్నారు. బలము అనగా ఒక రూపము. ఒక ప్రాణము. ప్రపంచానికి ఒక రూపాన్ని ఇచ్చి, ప్రాణాన్ని ఇచ్చిన శక్తిని బాలా అన్నారు.

'రూపయతి బల్యతే ప్రాణ్యత ఇతి బాలః'. రూపములిచ్చి, ప్రాణములిచ్చిన తల్లి బాలా.

967. సుమంగలీ – శ్రీ సుమంగల్యై నమః

'సుమంగలీ, సుఖకరీ, సువేషాఢ్యా, సువాసినీ' – ఈ నామాలన్నీ అమ్మవారి దివ్యమంగళ విగ్రహ లక్షణాన్ని తెలియజేస్తున్నాయి. ఈ నామాలలో 'సువాసినీ' మంత్రం చెప్పబడుతున్నది. దీనికే సౌమంగళ్యమంత్రమని పేరు.

సుమంగలీ శబ్దం వేదంలోంచి వచ్చింది. సుమంగలీ అంటే సర్వమంగళ స్వరూపిణి. గతంలో 'మంగళాకృతిః' నామానికి చెప్పిన అర్థాన్ని ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. లోకానికి మేలు కలిగించే మంగళస్వరూపిణి.

అన్ని మంగళాలు అమ్మలో ఉన్నాయి. ఏ తల్లిని తలచుకుంటే అమంగళాలు దూరమైపోతాయో ఆ తల్లే సుమంగళి. చీకటిని పోగొట్టుకోవడానికి దీపం తెచ్చుకున్నట్టు అమంగళాలని పోగొట్టుకోవడానికి 'సుమంగలీ'ని ధ్యానించుకోవాలి. అమంగళమంటే అజ్ఞానం.

ప్రశస్తాచరణం నిత్యం అప్రశస్త వివర్జనం
ఏతద్ధి మంగళం ప్రోక్తం ఋషిభిః బ్రహ్మావాదిభిః (అత్రి స్మృతి)

ప్రశస్తమైన కార్యాలను ఆచరించడం. అప్రశస్తమైన వాటిని విడిచి పెట్టడమే

మంగళము. అటువంటి మంగళముల స్వరూపిణి – సుమంగళి.

అశుభాని నిరాచష్టే తనోతి శుభ సంతతిం

స్మృతిమాత్రేణ యత్పుంసాం బ్రహ్మ తన్మంగళం పరమ్ (విష్ణుపురాణం)

స్మరణ మాత్రం చేతనే అశుభాలను తొలగించి, శుభాలను విస్తరింప జేయు బ్రహ్మమే పరమమైన మంగళం. ఆ బ్రహ్మమే జగన్మాత సుమంగళి.

968. సుఖకరీ – శ్రీ సుఖకర్యై నమః

సుఖమును ఇచ్చే తల్లి. జ్యోతి అంటే వెలుగును ఇచ్చునది అని చెప్పినట్లు మంగళస్వరూపిణి అయిన ఆ తల్లి తన భక్తులకు సుఖాలను ఇస్తున్నది. ఏది ఆనందమో అది సుఖం. దానిని ఇచ్చే తల్లి 'సుఖకరీ'.

'యో వై భూమా తత్సుఖం'. బ్రహ్మస్వరూపిణి అయిన అనంతరూపిణి సుఖమే తానైనది. భక్తులను అనుగ్రహించునది.

అధికార యోగ్యతననుసరించి సుఖమును ప్రసాదించునది.

969. సువేషాఢ్యా – శ్రీ సువేషాఢ్యాయై నమః

అమ్మవారు సుమంగళికి అనుకూలమైన వేషము ధరించినది.

ముత్తైదువ అని అంటారు. గాజులు, మట్టెలు, మంగళసూత్రం, పసుపు, కుంకుమలు– ఈ ఐదు కలిస్తే ముత్తైదువ అనాలి. ఇవన్నీ ధరించే వేషమే 'సువేషాఢ్యా'. శుభంకరమైన ఆ భూషాణాదులు దాల్చినది.

970. సువాసినీ – శ్రీ సువాసిన్యై నమః

సువాసినీ అంటే 'జీవత్పతికా' అని అర్థం. భర్త జీవించి ఉన్న స్త్రీని సువాసినీ అంటారు.

'సు–వాసినీ' చక్కని వాసము. చక్కని ఉనికి. అమ్మవారు ఎప్పుడూ ఉండే పతి పరమేశ్వరుడు. ఆయన పేరే మృత్యుంజయుడు, అమృతేశ్వరుడు. ఈ తల్లి పేరు

అమృతేశ్వరీ. అమ్మవారు 'మంగళగౌరీ'. **'సుష్టు వస్తు శీలా యస్యాః సా ఇతి సువాసినీ'.** సుష్టు అయిన వస్తువులు, శీలము ఉన్నది 'సువాసిని'. గొప్పదైన ఉనికి, స్వభావము కలది. సమస్త బ్రహ్మాండమంతా వ్యాపించిన ఉనికి, మహాకైలాసంలో భాసిస్తున్న ఉనికి, గొప్ప శీలము కలిగిన ఉనికి.

971. సువాసిన్యర్చనప్రీతా – శ్రీ సువాసిన్యర్చనప్రీతాయై నమః

గౌరీదేవి నిరంతరం సువాసినియే. ఆవిడ పేరే పెద్ద ముత్తైదువ. ఎక్కడైనా వృద్ధురాలైన ముత్తైదువ కనబడితే గౌరీదేవిలా ఉందంటారు.

'సుమంగళీ, సుఖకరీ, సువేషాఢ్యా, సువాసినీ' – నామాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసుకుని సువాసినీ స్వరూపం ఎలా ఉంటుందనే దానిని తీర్చిదిద్దారు. అమ్మవారు నిత్య సువాసిని.

లలితాదేవి అయిన ఆ తల్లిని 'సువాసినీ' నామంతో అర్చించినవారు గొప్ప ధన్యులు అవుతున్నారు. అమ్మవారిని సువాసినీ రూపంగా అర్చించాలి. సువాసినీలు అమ్మవారిని పసుపు, కుంకుమలతో, సువాసినీ ద్రవ్యాలతో అర్చించాలి.

సువాసినులు సువాసినీరూపిణి అయిన అమ్మవారిని అర్చించడమే ప్రీతి కనుక 'సువాసిన్యర్చనప్రీతా'.

సువాసినులను అమ్మవారి రూపంగా అర్చించాలి. ఆ అర్చనకు ప్రీతి చెందునది.

సర్వవ్యాపకమైన భగవంతుని ఎక్కడ ఆరాధన చేస్తాము? ఎలాగైతే ప్రవహిస్తున్న గంగని పాత్రలోకి తెచ్చుకుంటున్నామో, సర్వవ్యాపకమైన భగవంతుని ఆరాధన చేయడానికి ఒక ఆలంబన కావాలి. ఆ ఆలంబన ఎన్ని రకాలో చెప్పారు. సూర్యమండలం, అగ్నిహోత్రం, ప్రతిమ, యంత్రం ఆలంబనాలు. స్త్రీదేవతాపూజలో స్త్రీ ఒక ఆలంబనం. పురుషపూజలో శ్రోత్రియుడైన విప్రుడు ఒక ఆలంబన. ఆ ఆలంబన ద్వారా పరమాత్మని ఆరాధన చేస్తున్నాము.

శ్రోత్రియుడైన విప్రులు ఎందుకు ఆలంబనమంటే వారు నిరంతరం అనుష్ఠానపరులై మంత్రశక్తులను సాధన చేస్తూ, తదనుగుణమైన నియమాలతో,

పరంపరతో ఉంటారు కనుక నిరంతర సాధన వల్ల వారి దేహం కూడా భగవదారాధనకి ప్రధాన ఆలంబన అవుతుంది.

'సువేషాఢ్యా' అన్నట్లుగా మంగళకరమైన అలంకారాలు ధరిస్తూ, జీవత్పతికా అయిన స్త్రీ అమ్మవారి భావనగా ఆరాధించడానికి యోగ్యురాలు అవుతుంది.

దేవీ ఆరాధన చేసేటప్పుడు కలశము నందు ఆరాధన చేస్తారు. శ్రీచక్రమునందు ఆరాధన చేస్తారు. అగ్నిహోత్రమునందు, దీపజ్యోతిలో ఆరాధన చేస్తారు. ఇలా చేస్తూనే బాలగా కుమారికల యందు, సువాసినిగా సువాసిని యందు అమ్మవారిని భావన చేసి ఆరాధన చేస్తే అమ్మవారికి సంతోషం. అది విధానం

ప్రతి అమ్మవారి పూజలోను సువాసినీ పూజ చెయ్యడం, సువాసినికి భోజనం పెట్టడం అనేది ఉంటుంది. చక్రార్చన ఎంత ముఖ్యమో ఇది అంత ముఖ్యం. ఒక జడమైన యంత్రంలోనే, రాయిలోనే అమ్మవారిని మంత్రంతో ఆవహింపజేసి ఆరాధన చెయ్యగలుగుతున్నామే, చైతన్యం కలిగిన సువాసిని యందు అమ్మవారి ఆరాధన ఇంకా సులభం అవుతుంది.

972. శోభనా - శ్రీ శోభనాయై నమః

అమ్మవారు 'శోభనా'. శోభనా నామం మళ్ళీ వచ్చిందని కొంతమంది **'అశోభనా'** అన్నారు. అలా మార్చుకోవలసిన అవసరం లేదు. శోభనా అని రాయవచ్చు. నారాయణభట్టు తీసుకున్న పాఠం కూడా 'శోభనా'. ఆ-శోభనా అంటే సంపూర్ణ శోభన స్వరూపురాలు అని అర్థం. సర్వాభరణ భూషితయైన రూపమే శోభనము. ఆనంద - శుభస్వరూపమైన బ్రహ్మతత్త్వము కనుక శోభనా.

973. శుద్ధమానసా - శ్రీ శుద్ధమానసాయై నమః

శుద్ధమైన మనస్సు కలది.

'రాగాది దోషరహితం శుద్ధం' అన్నారు. ఏ మనస్సుకి రాగద్వేష దోషాలు ఉండవో అదే శుద్ధమైన మనస్సు. అటువంటి మనస్సు కలది. తురీయస్థితి యందున్నదే శుద్ధమానసా.

974. బిందుతర్పణసంతుష్టా - శ్రీ బిందుతర్పణసంతుష్టాయై నమః

బిందువు నందు తర్పణము చేస్తే సంతోషించేది. బిందువులతో తర్పణకు సంతోషించునది. శ్రీచక్ర పూజ చేసేటప్పుడు రెండు రకాలుగా ఉంటుంది. సాధారణంగా కుసుమాలతో పూజ చేయడం. తర్పణ చేయడం కోసం అమ్మవారికి విశేష అర్ఘ్యం అని ఒకటి చేస్తారు. దాని నుండి బిందువులతో తర్పణ చేస్తారు. ఈ అర్ఘ్యం విభిన్న సంప్రదాయాలలో విభిన్నంగా ఉంటుంది.

శ్రీచక్రంలో ఏ ఆవరణలో, ఏ దేవతాస్థానాన తర్పణ చేసినా లలితాంబకే చెందుతుంది. కానీ శివశక్త్యైక్య తత్త్వానికి నిలయమైన బిందుస్థానం ముఖ్యం కనుక అక్కడి తర్పణం విశేష ప్రీతి.

1. బిందువునందు తర్పణకి సంతోషించునది. 2. విశేషార్ఘ్యం యొక్క బిందువుల తర్పణతో సంతోషించునది - అని రెండర్థాలు చెప్పుకున్నాము.

బిందువు అంటే అత్యంత సూక్ష్మమైనది. అత్యంత సూక్ష్మమంటే జ్ఞానమే. జీవన్ముక్తులకు, జ్ఞానులకు పేరు బిందువు. **'జ్ఞాతౄణాం తర్పణైవ తృప్త్యా సంతుష్టా'.** 'సువాసిన్యర్చనప్రీతా'కి, 'బిందుతర్పణసంతుష్టా'కి సంబంధం ఉంది. సువాసినిని పూజిస్తే అమ్మవారు ఎలా సంతోషిస్తారో, జ్ఞానులను పూజిస్తే అలాగే సంతోషిస్తుంది.

తస్యోపనిషదహమితి - (బృహదారణ్యక ఉపనిషత్తు). ఆ పరబ్రహ్మమును 'అహం' అని ఉపనిషద్వచనం. అ - హ - ం. ఇక్కడి 'మ్' - బిందురూపం. విసర్గలు, బిందువులు - **'ః,ం'** - ఇదే ఉపనిషద్రహస్యం. ఈ జ్ఞానముతో తృప్తి (ఆనందం) పొందు యోగుల పట్ల సంతోషించునది.

సూక్ష్మమైన జ్ఞానాన్ని అమ్మవారి పదాలకి మనం అర్పించగలిగితే అప్పుడు సంతోషిస్తుంది. జ్ఞానంతో సంతోషించే తల్లి అని భావం.

975. పూర్వజా - శ్రీ పూర్వజాయై నమః

పూర్వజా అంటే ముందు పుట్టినది. సృష్టికి ముందే ఉన్నది. **"అహమస్మి ప్రథమజా ఋతస్య** - ఈ సృష్టికి పూర్వమే ఉన్నదానను" అని అమ్మవారే చెప్పారు.

దేవతలకంటే పూర్వమే ఉన్నది. దేవతల తరువాత ప్రపంచమంతా ఏర్పడింది. **'పూర్వం దేవేభ్యో అమృతస్య నాభాయి'** అని తైత్తిరీయోపనిషత్తులో మంత్రం. అమృతమునకు కేంద్రమై ఉన్నది. ఆ మంత్రమే ఇక్కడ 'పూర్వజా'. 'అమృతస్య నాభాయి'కి, 'బిందుతర్పణ సంతుష్టా'కి అర్థం కలుపుకోవాలి. ఆ అమృతమే అత్యంత సూక్ష్మము. ఆ బిందుజ్ఞానం మనకి కలిగి ఆ బిందుజ్ఞానమునందు ఆనందిస్తూ ఉంటే అదే బిందుతర్పణం. ఆ తర్పణానికి అమ్మ సంతోషించి ముక్తి నిస్తుంది కనుక 'బిందుతర్పణసంతుష్టా' అని అసలైన అర్థం.

అమృతస్వరూపిణి 'పూర్వజా'. పూర్వజా అంటే నవావరణ పూజ చేసేటప్పుడు ఒకొక్క చక్రం దాటి బిందువుకు వెళ్తారు. అన్నిటికంటే ముందే బిందువు ఉంది" దాని నుండే ఎనిమిది ఆవరణలు ఆవిర్భవించాయి కనుక ఆ బిందుస్వరూపిణియే 'పూర్వజా'.

976. త్రిపురాంబికా – శ్రీ త్రిపురాంబికాయై నమః

త్రికోణంలో ముగ్గురు అమ్మలు ఉన్నారు. వారు మహాకామేశ్వరీ, మహావజ్రేశ్వరీ, మహాభగమాలినీ. ఆ ముగ్గురికి మూలంగా బిందువునందు మధ్యలో అమ్మవారు ఉన్నది కనుక 'త్రిపురాంబికా' అని దీని యొక్క ప్రధాన అర్థం.

త్రికోణచక్రేశ్వరికి పేరు త్రిపురాంబా. 'త్రిపురమాలినీ' నామంలో దీని వ్యాఖ్యానం ఉంది. త్రైలోక్యమోహనచక్రంలో 'త్రిపురా' అనే పేరుతో ఉన్నది. 'షోడశీ' ఆవరణలో 'త్రిపురేశీ' పేరుతో ఉంటుంది. త్రిపురవాసిని ఆ పై చక్రం. బిందువు తరువాత త్రికోణం దగ్గర ఉన్న అమ్మ పేరు 'త్రిపురాంబికా'. బిందువు దగ్గర ఉన్న తల్లి పేరు 'మహాత్రిపురసుందరీ'.

'పూర్వజా' అయిన బిందువు త్రికోణచక్రంలో ఉన్నది. త్రికోణచక్రంలో ఉన్న చక్రేశ్వరి పేరు 'త్రిపురాంబికా'. ప్రకాశాంశ స్వరూపులైన ఇచ్ఛ జ్ఞాన క్రియ శాంతా శక్తులు. విమర్శ అంశ స్వరూపులైన వామా, జ్యేష్ఠా, రౌద్రీ, అంబికా, పశ్యంతీ... వీరు మొత్తం తొమ్మిది మంది ఉంటారు. ఈ తొమ్మిది మందికి 'త్రిపురాలు' సంజ్ఞ

కలవారు. ఈ త్రిపురారూపంతో ఉన్న అంబిక కనుక 'త్రిపురాంబికా'.

దీనికి మరొక జ్ఞానపరమైన అర్థం ఉంది. త్రిపురులు అంటే జీవులు. **'పురత్రయే జీవతి యస్స జీవః'** అని శాస్త్రవాక్యం. పురత్రయములందు జీవించేవాడు జీవుడు. పురత్రయము అంటే స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు. ఈ మూడు పట్టణాలలో తిరిగేవాడు జీవుడు. ప్రతివారికి ఈ మూడూ ఉంటాయి. ఈ జీవులందరికి అంబిక కనుక 'త్రిపురాంబిక'. సర్వజీవులకి అమ్మ అని అర్థం.

977. దశముద్రాసమారాధ్యా – శ్రీ దశముద్రాసమారాధ్యాయై నమః

చక్రార్చన చేసేటప్పుడు ముద్రలు ప్రదర్శిస్తారు.

దశముద్రలతో చక్కగా ఆరాధింపబడుతున్న తల్లి. మంత్రశాస్త్రంలో ఒకొక్క దేవతకి కొన్ని ముద్రలు ఉంటాయి. ఆ దేవతా లక్షణాలు తెలియజేసేవి ముద్రలు.

ముద్రలు చెప్పడానికి రెండు చేతుల సహకారం తీసుకుంటారు. గురుముఖతః ముద్రలు నేర్చుకున్నవారు మాత్రమే ఆ దశ ముద్రలు ప్రకటిస్తారు. ఆ ఉపదేశాలు లేనివారు ఈ నామం అనుకొని అమ్మవారికి ఒక్క ముద్రతో నమస్కారం చేసుకోవచ్చు. అదే నమస్కారముద్ర.

భారతీయ సంస్కృతిలో ముద్రలు ప్రతివారికి తెలుసు. నమస్కారం ఒక ముద్ర. అంజలి ముద్ర, ముకుళ ముద్ర ఇవి నమస్కార ముద్రలు. భయపడకండి అని చెప్పడానికి అభయముద్ర. జ్ఞానాన్ని ప్రసాదించే దక్షిణామూర్తి చేతిలో ఉన్నది చిన్ముద్ర. నాట్యశాస్త్రంలో చాలా ముద్రలు ఉన్నాయి.

నోటితో చెప్పక్కర్లేకుండానే భంగిమతో చెప్పగానే అర్థమై ఒక ఆనందాన్ని ఇస్తుంది. **'ముదం రాతి దదాతి ఇతి ముద్రా'.** దేవతకు ఆనందమును ఇచ్చునది కాబట్టి ముద్ర అని పేరు వచ్చింది.

శ్రీచక్రార్చనలో పదిరకాల ముద్రలు అమ్మవారి దగ్గర ప్రదర్శిస్తారు. వాటి పేర్లు చెప్పుకుంటే ధన్యులమౌతాము. ఒకొక్క ముద్రకి ఒకొక్క దేవత ఉంది. ఆ దేవతల పేర్లు– 'సర్వసంక్షోభిణి, సర్వవిద్రావిణి, సర్వాకర్షిణి, సర్వవశంకరి, సర్వోన్మాదిని,

సర్వమహాంకుశ, సర్వఖేచరి, సర్వబీజ, సర్వయోని, సర్వత్రిఖండా' అని మొత్తం పది ముద్రలు. వీరిని ముద్రాదేవతలు అని కూడా అంటారు. వాటికి ప్రత్యేక బీజాక్షరాలుంటాయి.

భూపురంలో మూడు రేఖలు ఉంటాయి. మూడవ రేఖలో వీరు ఉంటారు. ఒకొక్క ఆవరణకి ఒకొక్క ముద్రాదేవత ఉంది. ఒకొక్క ఆవరణ పూజ పూర్తి చేసినపుడు ఒకొక్క ముద్ర చెప్తారు. మొత్తం పూజ చేశాక పది ముద్రలు కలిపి చూపిస్తారు. ఇలా దశముద్రలతో చక్కగా ఆరాధింపబడుతున్నది. దశముద్రలతో ఆరాధిస్తే సంపూర్ణమౌతుంది.

శ్రీచక్రంలో వేసే ప్రతి ముద్ర రెండు చేతులు కలిపి వేసే ముద్రలే. కొందరు దేవతలకి ఒంటి చేతి ముద్రలు ఉన్నాయి. అంకుశం ఒంటి చేత్తో చూపించే ముద్ర ఒకటి ఉంది. కాని దశముద్రలు వేసేటప్పుడు మహాంకుశముద్ర వచ్చినపుడు రెండు చేతులు కలుస్తాయి. రెండు చేతులు ఎందుకు కలపాలంటే కుడి శివస్థానం, ఎడమ శక్తి స్థానం. ఆరాధిస్తున్నది శివశక్త్యాత్మకమైన శక్తిని కనుక శివశక్త్యాత్మకమైన శక్తులని రెండిటిని మేళనం చేసి చూపిస్తున్నారు. ఇది 'దశముద్రాసమారాధ్యా'.

ముద్రలు, మంత్రాలు ఉంటేనే అమ్మ అనుగ్రహం లభిస్తుందని భ్రాంతి వద్దు. భక్తి ఉంటే అమ్మ అనుగ్రహం ప్రాప్తిస్తుంది. అది తెచ్చుకోగలిగితే చాలా మంచిది. ముద్రలు, మంత్రాలు ఉన్నా, భక్తి లేకపోతే సిద్ధి లేదు. వాటికి భక్తిని కలపాలి. అది లేకపోయినా భక్తి ఉండాలి.

భక్తితో అమ్మవారికి రెండు చేతులు కలిపి నమస్కరిస్తే అప్పుడు అదే దశముద్ర అవుతుంది. ఐదు + ఐదు కలిస్తే ఏర్పడిన ముద్రే దశముద్ర. ఒక్క నమస్కారానికే సంతోషించే తల్లి. అది దీని అర్థం. భక్తితో చెయ్యాల్సినవన్నీ చేస్తూనే అమ్మవారికి నమస్కరించాలి తప్ప ఒక్క నమస్కారంతోనే సరిపెట్టేస్తానంటే అది కూడదు. ఏదీ చేతకాకపోతే **'నమస్తే రుద్రమన్యవ ఉతోత ఇషవే నమః'.** నమస్కారం ఎలా చెయ్యాలో శాస్త్రం చెప్పింది. **'దశప్రాచీర్దశదక్షిణా దశప్రతీచీ దశోదీచీ దశోర్ధ్వా తేభ్యోకరం నమః'** – రుద్రంలో దశముద్రలు ఇవి. దిక్కు దిక్కుకి ఒక పది అని చెప్తారు. నేను

పూజిస్తున్న రుద్రుడు ఇన్ని చోట్ల ఉన్నాడు. అందుకు అన్ని చోట్ల – దశదిక్కులా – నమస్కారం. రెండు చేతులు కలపగానే పది వేళ్ళు కలిశాయి. పది వేళ్ళు కలసిన నమస్కార ముద్ర, అంజలి ముద్రలే 'దశముద్రాసమారాధ్యా'. ఈ భావం సర్వజన సామాన్యంగా ఉంటుంది. తెలిసి నమస్కారం చేస్తే చాలా గొప్పది. అటువంటి భావం ఇందులో కనబడుతోంది. దీనికి తెలుగులో కూడా 'ఐదుపదిసేతలు' అంటారు. జోత అని కూడా అంటారు. జోడించుటే జోత.

978. త్రిపురాశ్రీః వశంకరీ – శ్రీ త్రిపురాశ్రియై నమః

ఈ 'త్రిపురాశ్రీః' 'వశంకరీ' అని రెండు నామాలుగా విభజన చేసుకోవాలి. ఆరాధనలో 'త్రిపురాశ్రియై నమః' అని, 'వశంకర్యై నమః' అని చదువుకోవాలి.

త్రిపురాశ్రీః అనే తల్లి శ్రీచక్రంలో సర్వార్థసాధక చక్రం వద్ద ఉంటుంది. ఆ చక్రానికి ఈశ్వరియైన దేవి. ఐదవ ఆవరణ సర్వార్థసాధక చక్రమంటే బహిర్దశారచక్రం.

'త్రిపురాశ్రీః'కి మరొక అర్థం– త్రిపుర అంటే స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు అని చెప్పుకున్నాం. ఈ మూడింటి యందు ఉన్న శ్రీ అంటే స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలలో ఉన్న చైతన్యం. అలాగే పైలోకం, క్రింది లోకం, మధ్యలోకం. మూడు లోకాలలో, మూడు కాలాలలో, మూడు శరీరాలలో ఉన్న శ్రీః, చైతన్యం 'త్రిపురాశ్రీః'.

త్రిపురములు ఈ లోకమంతా ఉన్నాయి. లోకమంతా వ్యాపించిన చైతన్యం, లోకానికి అతీతమైన చైతన్యం కూడా పరమాత్మయే. **'మాతృమాన ప్రమేయానాం పురాణాం పరిపోషణీ'** అని శాస్త్రం. ఈ జగత్తంతా మాతృ, మాన, మేయ అనబడే మూడు లక్షణాలతో కూడి ఉంది. త్రిపుటితో కూడినదే ప్రపంచం. మాతృ, మాన, మేయ అంటే కొలిచేది కొలత, కొలవబడేది అనే విషయం. సృష్టిలో ప్రతిదీ అటువంటివే. వాటి నిండా తన ఐశ్వర్యాన్ని నింపి ప్రపంచాన్ని పోషిస్తున్నది. ఈ త్రిపురాలకీ అతీతమైనదీ... 'త్రిభిః పురా త్రిపురా' అని చెప్పినట్లుగా వీటికి అతీతముగా భాసిస్తున్న తురీయ చైతన్యము కూడా ఆ తల్లియే అనే భావాన్ని 'త్రిపురాశ్రీః' నామంలో చెప్పారు.

వశంకరీ – శ్రీ వశంకర్యై నమః

సృష్టినంతటినీ తన అధీనంలో పెట్టుకున్న తల్లి. త్రిపురాల యందు శ్రీగా ఏ తల్లి ఉందో ఆ తల్లే శ్రీమాతా, శ్రీమహారాజ్ఞీ. ఆ తల్లిని గ్రహించాలంటే మన ఇంద్రియాలు మన వశమై లోపలకి వెళ్ళగలగాలి. అప్పుడే లోపలి తత్త్వం తెలియబడుతుంది. సాధారణంగా వశంకరీ అంటే లోకాన్ని వశం చేసుకోవడం అనుకుంటారు. లోకమంటే ఇంద్రియాలే. ఇంద్రియాలను వశం చేసుకునే శక్తే వశీకరణశక్తి. ఇంద్రియాలను నిగ్రహించుకుంటేనే మనం అంతర్ముఖులం కాగలము. నిగ్రహం ఉంటేనే అమ్మవారు లభిస్తారు. నిగ్రహశక్తిని ఇచ్చే దేవత.

ఇంద్రియనిగ్రహాదులైన వశమును అనగా అటువంటి శక్తిని 'కరీ' అనగా కలిగిస్తోంది కనుక 'వశంకరీ'.

979. జ్ఞానముద్రా – శ్రీ జ్ఞానముద్రాయై నమః

'దశముద్రాసమారాధ్యా' నుండి వరుసగా ముద్రానామాలు మూడు శ్లోకాలలో కనబడుతున్నాయి. అమ్మవారు జ్ఞానముద్రారూపిణి. జ్ఞానముద్రకే చిన్ముద్ర అని పేరు. దీనికి బోధముద్ర, వ్యాఖ్యాముద్ర, విద్యాముద్ర అని అనేక పేర్లు ఉన్నాయి. వాటిలో ఒకొక్క దానిని అర్థం చేసుకుంటే చాలు మొత్తం తత్త్వం తెలుస్తుంది.

మౌన వ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మ తత్త్వం యువానం
వర్షిష్ఠాంతే వసదృషిగణైరావృతం బ్రహ్మనిష్ఠైః
ఆచార్యేన్ద్రం కర కలిత చిన్ముద్రమానందరూపం
స్వాత్మారామం ముదితవదనం దక్షిణామూర్తి మీడే

అని చెప్పినట్లుగా అది ఆచార్యేంద్రుడైన దక్షిణామూర్తి చూపించిన ముద్ర. ఈ ముద్ర ఆ పరబ్రహ్మతత్త్వ ప్రతిపాదకమైనది.

'జ్ఞానాఖ్యయా అంగుష్ఠ తర్జనీ యోగతో మతా' అని శాస్త్రం. జ్ఞానముద్ర అంటే అంగుష్ఠతర్జనీయోగం. **'అంగుష్ఠ తర్జనీయోగ ముద్రా వ్యాజేన దేహినాం। శ్రుత్యర్థం బ్రహ్మజీవైక్యం దర్శయన్నోవతాత్ శివః'** అని శివగురువందనం. అంగుష్ఠ

తర్జనీ యోగం జీవబ్రహ్మైక్యాన్ని చెప్తోంది. గతంలో దీనిని వివరంగా చెప్పుకున్నాము కనుక ఇప్పుడు ఒక్కసారి స్మరించుకుందాము.

బ్రహ్మము గురించి చెప్పేటప్పుడు అస్తి, భాతి, ప్రియం, నామం, రూపం అని ఐదు అంశాలు ప్రధానంగా ఉంటాయి. నామం, రూపం జగత్తుకి సంబంధించినవి. ఈ జగత్తంతా అస్తి, భాతి, ప్రియంగా ఆ చైతన్యమే వ్యాపించి ఉంది. నామ, రూపాలతో కూడిన ప్రపంచ తాదాత్మ్యంతో దాని యందు వ్యాపించిన అస్తి, భాతి, ప్రియాలను తెలుసుకోలేకపోతున్నాము. కెరటాల దృష్టి ఉపసంహరించి, సముద్రదృష్టి తెచ్చుకుంటే 'శమాత్మికా' తెలుస్తుందని వివరించుకున్నట్లుగా, ఈ నామ రూప ఉపాధి దృష్టిని ఎప్పుడైతే మనం తొలగించుకుంటామో అప్పుడు మిగిలేది 'సత్ చిత్ ఆనందం'. అది కేవలం బ్రహ్మలక్షణం. ఆ సచ్చిదానందానికి అస్తి, భాతి, ప్రియమని పేర్లు. నామరూపాలు రెండు ఉపసంహరిస్తే అస్తి, భాతి, ప్రియమే చెప్పబడుతుంది. ఇది చిన్ముద్రలో దాగిన పరమార్థం. ఉపసంహరించిన నామరూపాలు ముడిచిన బొటనవ్రేలు, చూపుడువ్రేలు. మిగిలిన మూడు అస్తి, భాతి, ప్రియాన్ని సూచిస్తాయి.

మరొక కోణంలో –

చిన్ముద్రలో చూపుడువేలు జీవుడిని, బ్రొటనవేలు బ్రహ్మమును తెలియజేస్తుంది. మధ్యవేలు, ఉంగరపువేలు, చిటికెన వేలు ప్రపంచాన్ని తెలియజేస్తాయి. జీవుడు ఈ మూడింటితో కూడిన ప్రపంచాన్నే అంటి పెట్టుకున్నాడు కానీ ఈ నాలుగింటికి ఆధారమైన బ్రహ్మము వైపు వాడు చూడడం లేదు. ఒకవేళ చూడడం మొదలు పెడితే ఆ మూడింటి తత్త్వం నుండి ఆధారతత్త్వమైన బ్రహ్మము వైపు జీవుడు చేరుకోవడం మొదలు పెట్టి, క్రమంగా జీవబ్రహ్మైక్యం చెందుతాడు. అప్పుడు మిగిలింది పూర్ణత్వం. ఈ మూడింటితో కూడిన ప్రపంచం నుండి విడివడి అతీతమైన ఆ పరమాత్మచైతన్యంతో ఐక్యమైతే అది జీవబ్రహ్మైక్యం. చిన్ముద్ర దీనిని తెలియజేస్తుంది. శివగురువు పట్టిన ఈ ముద్రను చూడగానే బ్రహ్మావాదులందరికి పరతత్త్వం అనుభూతమయ్యింది.

శృంగగిరిలో భాసిస్తున్న శారదాంబ దక్షిణామూర్తిరూపిణి. దక్షిణామూర్తికి

స్త్రీ రూప కల్పన చేస్తే అది అచ్చంగా శారదాదేవి. అమ్మయే 'దక్షిణామూర్తిరూపిణీ' అని చెప్పుకున్నాము.

స్ఫటిక రజత వర్ణం మౌక్తికీం అక్షమాలాం
అమృతకలశవిద్యా జ్ఞానముద్రాః కరాబ్జైః
దధతమురగకక్షం చంద్రచూడం త్రినేత్రం
విధృత వివిధరూపం దక్షిణామూర్తి మీడే

ఆ శ్లోకం ఎలా వర్ణిస్తారో అలాగే ఉంటుంది శారదాంబ. అమృతకలశం, అక్షమాల, చిన్ముద్ర, పుస్తకము పట్టుకున్న మూర్తి. దక్షిణామూర్తిరూపిణి అంటే శృంగగిరి శారదయే. జ్ఞానముద్ర అన్నప్పుడు ఆ స్వరూపాన్ని తెలుసుకోవాలి. జ్ఞానముద్రయే అమ్మ నామం అయిపోయింది.

జ్ఞానముద్రకి మరొక అర్థం – ముద్ర అంటే 'ముదం రాతి ఇతి ముద్రా' అని చెప్పుకున్నాము. జ్ఞానస్వరూపిణియై అందరికి ఆనందాన్ని ప్రసాదించే తల్లి కనుక 'జ్ఞానముద్రా'. ఆనందప్రదాయిని. జ్ఞానము, ఆనందము కలిగించే తల్లి 'జ్ఞానానందరూపిణి'.

980. జ్ఞానగమ్యా – శ్రీ జ్ఞానగమ్యాయై నమః

జ్ఞానము చేత మాత్రమే పొందబడేది. 'జ్ఞానాదేవహి కైవల్యం' అని శాస్త్రమే చెప్పింది. **'జ్ఞానేనైకేన తల్లభ్యం క్లేశేన పరమం పదం'.** పరమాత్మ అంత తేలికగా దొరుకుతాడా! జ్ఞానం చేత మాత్రమే దొరుకుతాడు. ఆ జ్ఞానసాధనకు 'క్లేశేన' – కష్టపడాలి. ఉపాధి తాదాత్మ్యం అలవాటైపోయిన జీవుడు దాని నుండి వెలువడి పరమాత్మ తాదాత్మ్యం పొందడానికి కావలసిన తాపత్రయమే క్లేశము.

'జ్ఞానమేవ ప్రపశ్యంతో మామేవ ప్రవిశంతి తే' – ఎవరైతే జ్ఞాని అవుతారో వారు నాలో చేరతారనేది పరమాత్మ వచనం. **'సర్వోపాధివినిర్ముక్తం అనంతం అమృతం పరం, యత్తు మే నిష్కళం రూపం పరం చిన్మాత్రం కేవలం శివమ్'** అని కూర్మపురాణం చెప్తోంది. నా యొక్క చిన్మాత్రమైన స్వరూపం జ్ఞానము చేత మాత్రమే పొందబడుతుంది

అని చెప్పిన ఈశ్వరవాక్యాన్ని ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. జ్ఞానముచే పొందబడే తల్లి కనుక 'జ్ఞానగమ్యా'. శాస్త్రముల ద్వారా అనగా వాటి అధ్యయన విచారణల ద్వారా పొందబడే పరతత్త్వం.

981. జ్ఞానజ్ఞేయస్వరూపిణీ - శ్రీ జ్ఞానజ్ఞేయస్వరూపిణ్యై నమః

జ్ఞాన, జ్ఞేయాలు అమ్మవారి రూపం. ధ్యాతృ, ధ్యాన, ధ్యేయ - ఈ మూడు అమ్మవారే అని చెప్పినపుడు జ్ఞానజ్ఞేయములే అమ్మవారని ఎందుకు చెప్పారో గ్రహించాలి. జ్ఞాత ఏమైపోయాడు? పరమాత్మని ధ్యానిస్తున్నాడు అన్నప్పుడు త్రిపుటి ఉంది. త్రిపుటి ఐక్యం అయిపోవాలి.

జ్ఞేయము, జ్ఞాత - రెండూ పోయి జ్ఞానం మాత్రమే మిగిలితే అదే త్రిపుటీ ఏకత్వమని ముందు నామాలలో చెప్పుకున్నాము. ఆ త్రిపుటీ ఏకత్వం కలిగినపుడు ఏ అఖండ ఆనందం లభిస్తుందో అదే త్రిపురసుందరీతత్త్వం. ఇక్కడ జ్ఞాన జ్ఞేయస్వరూపిణి అని ఎందుకు చెప్పారు?

లలితాసహస్రం ఉపాసనా శాస్త్రం. ఉపాసన చేస్తున్నప్పుడు నిర్గుణము నందు ఏదైతే జ్ఞేయబ్రహ్మమని చెప్పబడుతుందో, ఆ తత్త్వాన్నే మనం సగుణంగా ఉపాసన చేస్తున్నాము. ఉపాసనలో ఉపాసకుడు అమ్మవారిని ధ్యానం చేస్తూ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ జ్ఞానం ఎక్కడినుండి వచ్చింది? లోపల ఉన్న ఆ జ్ఞానము చైతన్యము యొక్క స్వరూపము.

బ్రహ్మమునే జ్ఞేయముగా పెట్టుకుని ఉపాసకుడు జ్ఞానమార్గంలో ప్రవేశించాడు. అక్కడ ఏ తెలివితో అమ్మవారిని తెలుసుకుంటున్నాడో ఆ తెలివే అమ్మవారు. అది సాధనదశలో జ్ఞేయమని చెప్పబడుతున్నది. సిద్ధదశలో ఆ జ్ఞానము జ్ఞేయమై కనిపిస్తుంది కనుక 'జ్ఞానజ్ఞేయస్వరూపిణీ'.

అమ్మవారిని తెలుసుకోవాలంటే అమ్మవారి ద్వారానే తెలుసుకోవాలి. సూర్యుడు వెలుగుతున్నాడన్న విషయం అక్కడ సూర్యుని వెలుగువల్లే తెలుసుకోగలుగుతున్నాము. అమ్మవారి ప్రకాశమే జ్ఞానం. అమ్మయే జ్ఞానరూపిణి. తెలుసుకునే జ్ఞానం, తెలియబడే

బ్రహ్మము కూడా ఆవిడే.

శ్రీవిద్యోపాసకులు ముఖ్యంగా తొమ్మిది ముద్రలు పడతారు. దీక్షలో ఒక స్థాయికి చేరినవారికి దశముద్రలు ఉంటాయి. త్రిఖండ ముద్రతో కలిపి దశముద్రలు ఉంటాయి. తొమ్మిదవ ముద్ర 'యోని ముద్ర' అని చెప్పబడుతుంది. ఇది పరమమైన ముద్ర. ఇవి గురుముఖైక వేద్యాలు.

982. యోనిముద్రా - శ్రీ యోనిముద్రాయై నమః

ఒకొక్క ఆవరణకి ఒకొక్క ముద్రాదేవతని చెప్పేటప్పుడు ప్రధానంగా బిందువు దగ్గర ఉన్న లలితాపరమేశ్వరికి నవావరణార్చన క్రమంలో యోనిముద్రతో నమస్కారం చేస్తారు. దీనికి 'మహాయోని ముద్ర' అని కూడా పేరు. యోనిముద్రకి బ్రహ్మముద్ర అని, నమస్కారముద్ర అని మరో రెండు నామాంతరాలు ఉన్నాయి. శ్రీవిద్యలో నమస్కార ముద్ర ఇదే.

ఇక్కడ యోని శబ్దం వచ్చినపుడు 'అయోనిర్యోనినిలయా', 'కూటస్థా', 'కులరూపిణీ' దగ్గర విశేషంగా చెప్పుకున్నాము కనుక ఇక్కడ స్మరిస్తే చాలు.

'తస్య ధీరాః పరిజానంతి యోనిం మరీచీనాం పదమిచ్ఛంతి వేధసః' - ధీరులైనవారు ఆ యోనిని తెలుసుకుంటున్నారు. ఈ మంత్రంలో మరీచులు అని చెప్పబడుతున్నవారే 'అణిమాదిభిరావృతాం మయూఖైః' - కిరణాలన్నీ మరీచులు. కిరణాలన్నిటికి మూలమైన బిందుస్వరూపిణియే అక్కడ భాసిస్తున్నది.

యోని అనగా కారణమైనది. మాయాశబలబ్రహ్మము, మాయాశక్తితో కూడిన ఈశ్వరుడు, స్పందనశక్తితో కూడిన పరమేశ్వరుడు (స్పందనశక్తి అన్నా, మాయాశక్తి అన్నా ఇదే) సర్వజగత్తుకి కారణము (యోని). శక్తిసహితమైన ఈశ్వరతత్త్వాన్నే ఉపాసనలో స్వీకరిస్తాము కనుక ఆ ఈశ్వరతత్త్వాన్ని సంకేతించే ముద్ర యోనిముద్ర.

ఇదివరకు నామాలలో కైవల్యోపనిషత్తులో మంత్రం కూడా స్మరించుకున్నాము

ఉమా సహాయం పరమేశ్వరం విభుం
త్రిలోచనం నీలకంఠం ప్రశాంతం

ధ్యాత్వా మునిర్గచ్ఛతి భూత యోనిం

సమస్త సాక్షిం తమసః పరస్తాత్ – అన్నారు. ఇక్కడ ఈ నామానికి శాస్త్రీయమైన, ఉపాసనాపరమైన, ఉపనిషత్పరమైన అర్థాన్నే స్వీకరించాలి. ఆ శక్తిని సంకేతించే ముద్రే 'యోనిముద్ర'. ఈ ముద్రలో ఉపాసకులు దేవిని నమస్కరిస్తే మంత్రదోషాలు తొలగిపోతాయని శాస్త్రం.

యోనిముద్ర అంటే త్రికోణముద్ర. అందులో చివరికి త్రికోణమే కనిపిస్తుంది. ఆ త్రికోణంలోంచి దర్శనం చేస్తారు. బిందువు త్రికోణమధ్యంలో ఉంది. పరబ్రహ్మశక్తి మూడింటిగా ప్రపంచము నందు వ్యాపించిందని చెప్పుకున్నాము. ఇచ్ఛాజ్ఞానక్రియా శక్తులు అనే మూడు బిందువులు కలిపితే త్రికోణం అవుతుంది. ఆ త్రిశక్త్యాత్మక త్రికోణ భావాన్ని ఉపాసనలో చూపించడం కోసం యోనిముద్ర ప్రదర్శిస్తారు. జగత్కారణమైన శక్తి ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తి. దానినే యోనిముద్రగా చెప్పారు.

983. త్రిఖండేశీ – శ్రీ త్రిఖండేశ్యై నమః

త్రిఖండాలకు ఈశ్వరి. త్రిఖండములు అనగా మూడు భాగాలు. మూడు భాగాలు అన్నప్పటికి ఇవన్నీ ఒకదానితో ఒకటి అనుబంధం ఉన్న భాగాలే. మంత్రము నందు వాగ్భవకూటము, కామరాజకూటము, శక్తికూటము. ఇది త్రిఖండం.

అలాగే శ్రీచక్రంలో త్రిఖండములు ఉన్నాయి. తొమ్మిది ఆవరణలు చెప్పినా మూడు ఆవరణలకు ఒక మండలం చొప్పున తీసుకుంటే అగ్నిమండల, సూర్యమండల, చంద్రమండలాలు. అలాగే ప్రపంచం మొత్తం కూడా 'యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలం యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజోవిద్ధిమామకం' అని చెప్పినట్లుగా, సూర్య, చంద్ర, అగ్ని మయమే. త్రిఖండములుగా ఉన్న సూర్య చంద్ర అగ్నులకు, అదేవిధంగా వాగ్భవ, కామరాజ, శక్తి కూటములకు నాయకురాలై, తత్స్వరూపిణియై ఉన్న తల్లి కనుక 'త్రిఖండేశీ'.

ఇక్కడ మరో ముద్ర చెప్పారు. త్రిఖండేశీ అని చెప్పడంలో దీనిని నామంగా ఎంత స్వీకరించవచ్చో, అంతగా పదవముద్ర అయిన త్రిఖండాముద్రని స్వీకరించవచ్చు.

గతంలో చెప్పిన నామాలకి ముద్రా శబ్దాలను చెప్పారు కానీ ఈ నామానికి చెప్పలేదు. దీక్షలో ఒక స్థాయికి చేరాక మాత్రమే త్రిఖండముద్ర చెప్తారు. 'దశముద్రాసమారాధ్యా', 'జ్ఞానముద్రా', 'యోనిముద్రా'. ముద్రాశబ్దంతో మూడు నామాలు వచ్చాయి. 'త్రిఖండేశీ' అన్నప్పుడు 'త్రిఖండముద్ర' కూడా చమత్కారంగా ఇందులో లీనం చేశారు.

984. త్రిగుణా – శ్రీ త్రిగుణాయై నమః

985. అంబా – శ్రీ అంబాయై నమః

జగత్తంతా త్రిగుణాత్మకమే. **'సత్త్వాద్యైః త్రిగుణోచ్యతే'** – అమ్మవారు త్రిగుణాత్మకమైన జగత్తులో వ్యాపించి ఉన్నప్పుడు మనం దానితో కలిపి చూస్తున్నాము. వాటికి చైతన్యం కలిగిస్తూ తద్రూపిణిగా కనిపిస్తున్నా, త్రిగుణాత్మికమైన జగత్తు ఆవిర్భవించడానికి పూర్వమే ఉన్న ఆదిశక్తి ఆ తల్లి.

మూలప్రకృతిగా – సత్త్వరజస్తమోగుణములకు మూలకారిణి.

యోగీశ్వరీ శరీరాణి కరోతి వికరోతి చ
నానాకృతి క్రియారూపనామవృత్తిస్స్వలీలయా
త్రిధా యద్వర్తతే లోకే తస్మాత్ సా త్రిగుణోచ్యతే (వాయుపురాణం)

యోగీశ్వరి అయిన జగదంబ తన లీలచే సకల శరీరాలను సృష్టిస్తున్నది – లయం చేస్తున్నది. నామ, రూప, క్రియాత్మకములైన నానాకృతులను ఏర్పరచుతూ – ఆ మూడింటిగా నర్తిస్తున్నది కనుక త్రిగుణా.

పదైస్త్రిభిర్బలిర్బద్ధః స్వర్గాదిత్రిపథానతా
ఉత్పత్తిస్థితినాశైశ్చ సత్త్వాద్యైస్త్రిగుణోచ్యతే (దేవీపురాణం)

"మూడడుగులతో బలిచక్రవర్తి బద్ధుడయ్యాడు(వామనావతారాన). గంగానది స్వర్గాదులలో మూడు మార్గాలను పొందినది. ఉత్పత్తి స్థితి నాశాలనే మూడు క్రియలు కలది. సత్త్వాది త్రిగుణాలు కలది. ఈ కారణాల చేత త్రిగుణా".

త్రిగుణాత్మకమైన జగత్తుకి తల్లి (అంబా). **'త్రిభిర్గుణమయైర్భావైః ఏభి సర్వమిదం**

జగత్' అని శాస్త్రం చెప్తున్నమాట. ఈ జగత్తంతా కూడా మూడు గుణాలతో కూడి ఉంది. ప్రపంచం ఎంత వెతికినా మూడు గుణాలే. ఈ మూడు గుణాలకు తల్లి. సర్వజగత్తుకు తల్లి. 'త్రిగుణాంబా' అంటే జగజ్జనని. త్రికోణంలో ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తి అని ఎలా తీసుకున్నామో అదే విధంగా త్రిగుణాలు కూడా తీసుకోవచ్చు.

తేజోమూర్తులకు, శక్తిమూర్తులకు, సర్వప్రపంచానికి కారణం గుణత్రయమే. మూడింటికి కారణమైనదే (అంబ) స్వరూపానుసంధానసిద్ధి, సమ్యగ్ దృష్టి, మంత్ర వాక్యం, మంత్ర జీవం – అని చెప్పబడుతుంది తంత్రరాజం. '**అంతర్బహిశ్చ** తత్ సర్వం వ్యాప్య నారాయణ స్థితమ్' – శ్రుతివాక్యం. '**అంతః**'లోని 'అం', '**బహిః**'లోని 'బ' – రెండిటిని కలిపి అంతర్బహిర్వ్యాపిని అయిన పరదేవతను 'అంబ' అని సంభావించవచ్చు. (శ్రీ పాతూరి సీతారామాంజనేయుల వివరణ).

986. త్రికోణగా – శ్రీ త్రికోణగాయై నమః

త్రికోణమునందు ఉన్నది. బిందువు త్రికోణమధ్యంలో ఉంది. శ్రీచక్రార్చన చివరికి వచ్చేటప్పుడు బిందువు దగ్గరే పూర్తి అవుతుంది. లలితాసహస్రం చివరికి వచ్చేటప్పటికి కూడా యోనిముద్రతో, త్రిఖండముద్రతో బిందుస్థానంలో అమ్మవారి పూజతోనే పూర్తి చేస్తున్నారు. ఇది వశిన్యాదివాగ్దేవతలు చూపించిన ఔచితీ క్రమం.

చిట్టచివరకి వస్తున్న బిందుపీఠం 'త్రికోణగా'. త్రికోణగా అన్నప్పుడు మొత్తం ఎన్ని త్రికోణాలు ఉన్నాయో, అన్ని త్రికోణాలలోను బిందువు ఉన్నది. బిందువు లేనిదే త్రికోణం రాదు. అన్ని త్రికోణాలు అమ్మవారి రూపాలే. త్రికోణాలకు మూలతత్త్వం మాత్రం స్పందనశక్తితో కూడిన పరమేశ్వరచైతన్యం. అదే మధ్యలో బిందువులో కనబడుతోంది. బిందు వికసనమే త్రికోణం. దాని కేంద్రమై మూలమైన బిందువే త్రికోణగా.

987. అనఘా – శ్రీ అనఘాయై నమః

'అనఘా' అంటే దోషరహితము. అఘము అంటే పాపము, దోషము. అనఘా అంటే ఏ పాపము వాటి పరిణామములైన దోషాలు, దుఃఖాలు లేనిది. **'శుద్ధం అపాపవిద్ధం', 'అపహత పాప్మా'...** ఇలా ఉపనిషత్తుల్లో ఉన్నాయి.

'సర్వోపనిషదుద్ఘుష్టా' – ఉపనిషత్తుల చేత ఉద్ఘోషింపబడిన పరతత్త్వం 'అనఘా'. శుద్ధమైన తత్త్వం అని చెప్పడం దీని యొక్క భావన. అనఘా అయిన ఆ తత్త్వమే ఈ లోకాన్ని అనుగ్రహించడం కోసం తనదైన మాయాశక్తితో అనేకరూపాలు ధరించి అనేక లీలలు చేసింది.

988. అద్భుతచారిత్రా – శ్రీ అద్భుతచారిత్రాయై నమః

అమ్మరూపాలు, లీలలు, చరించిన విధానం. చరించుట అంటే నడచుట. దీనినే తెలుగులో నడత అంటారు. సంస్కృతంలో చరిత్ర అంటారు. అనఘా అయిన ఆ తల్లే మనకు అఘనాశనం కల్పించడం కోసం... స్మరించి తరించడం కోసమే... శ్రవణ మాత్రం చేతనే పాపాలు పోగొట్టుకుని చిత్తం శుద్ధం చేసుకొని జ్ఞానం గ్రహించడం కోసమే... ఆ దివ్య చరిత్రలను వ్యక్తం చేసినది.

నామ, రూప, లీలలనే చరిత్ర అంటారు. అమ్మ వ్యక్తం అయితే చరిత్ర. అనఘా అయిన తత్త్వమే చరిత్రను వ్యక్తం చేసింది. అది మనలాంటి చరిత్ర కాదు. 'జన్మ కర్మ చ మే దివ్యం' అన్నాడు కృష్ణపరమాత్మ. అమ్మవారు ఒక లీల చేశారన్నా, ఒక రూపాన్ని స్వీకరించారన్నా అది మన వలె ప్రాకృతికవికారాలతో కూడినది కాదని గ్రహించాలి. అది 'సంభవామ్యాత్మ మాయయా' అన్నట్లుగా తనదైన మాయాశక్తిని స్వీకరించి చరిత్రను చూపించారు. ఆ చరిత్రలు అద్భుతములు. అవి అవాఙ్మానస గోచరాలు. మన మనస్సుతో, మాటలతో అది ఇలా ఉంటుందని వర్ణించలేము. అంత మహిమ దానిలో ఉంది. దాని తత్త్వం అద్భుతమే. స్మరిస్తున్న కొద్ది అమ్మవారి చరిత్ర ఎంతో మధురంగా, ఆశ్చర్యంగా ఉంటుంది. 'ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్' అని చెప్పినట్లుగా అత్యంత ఆశ్చర్యకరమైన చరిత్ర కనుక 'అద్భుతచారిత్రా'.

ఈ చరిత్రలన్నీ ముందే చెప్పుకున్నాము. చిదగ్నికుండ సంభవం, శ్రీమన్నగర పట్టాభిషేకం, భండాసురసంహారాది లీలలన్నీ చరిత్రలు. అమ్మ ఈ ప్రపంచాన్ని నడపడమే చరిత్ర. ఈ లోకవ్యవహారమే అమ్మ చరిత్ర.

అద్భుతమైన ఈ విశ్వచరిత్రని నిర్వహిస్తున్న తల్లి కనుక 'అద్భుతచారిత్రా'.

989. వాంఛితార్థప్రదాయినీ – శ్రీ వాంఛితార్థప్రదాయిన్యై నమః

అమ్మవారి అద్భుతమైన ఆ చరిత్రని ఎవరైతే మననం చేసుకుంటూ, స్మరణం చేస్తూ, ధ్యానం చేస్తున్నారో వారు ఏది కోరుకుంటే అది ప్రసాదిస్తున్నది. 'వాంఛిత అర్థప్రదాయినీ'. మోక్షం ఇస్తుందా? మరొకటి ఇస్తుందా? అంటే మనకేం కావాలంటే దానినే ఇస్తుంది. మోక్షం కావాలంటే ముందు మనకి చిత్తశుద్ధిని ఇచ్చి, దానికి అనుగుణమైన జ్ఞానాన్ని ఇచ్చి, జ్ఞానం ద్వారా కైవల్యాన్ని ఇస్తున్న తల్లి.

'చతుర్వర్గాయ చండికాం' అని మాట ఉంది. నాలుగు పురుషార్థాలు కావాలంటే అమ్మవారినే ఆశ్రయించాలి. మోక్షం కోసం కొందరిని, అర్థం కోసం కొందరిని, కోరిక కోసం కొందరిని, ధర్మం కోసం కొందరిని... కానీ నాలుగు కావాలంటే అమ్మవారిని ఆరాధించమని శాస్త్రం చెప్తున్న వాక్యం. చతుర్వర్గప్రదా– ధర్మార్థకామ మోక్షాలను కూడా ఇస్తున్నది.

ధర్మ, అర్థ, కామ, మోక్షాలను కలుపుకొని పురుషార్థం అంటారు. పురుషార్థాలేవైనా అనుగ్రహించే తల్లి కనుక 'వాంఛితార్థప్రదాయినీ'.

శంకరులు దీనిని మరింతగా భావించారు. **'ఫలమపిచ వాంఛాసమధికం'** "అమ్మా! నువ్వు కేవలం వాంఛించిన అర్థం మాత్రమే ఇవ్వకుండా, కోరిన దానికి మించినది ఇస్తున్నావు" అని ఆయన చమత్కారం చేశారు.

కోరినదాని కంటె మించినది ఇవ్వడమంటే కోరికని మించినది. ధర్మ, అర్థ, కామ..(కోరిక) వాటికి మించినది అంటే వాంఛని దాటిపోయిన మోక్షాన్నే ఇచ్చేది. యోగులకి అదే వాంఛితార్థం కనుక 'వాంఛితార్థప్రదాయినీ'.

ఇది ఇవ్వడానికి ఆ తల్లి ఏమైనా కష్టపడాలా! ఆ తల్లి కరుణ లభిస్తే చాలు. ఆ కడగంటి చూపుల గురించి చెప్తున్నారు.

'కరుణాపాంగైః సకృదపి యది మాం పరదేవతే విలోకయసి

కామదుఘా కిం చింతామణినాకృతం అమరతరుణాలం' అన్నారు.

అమ్మా! నువ్వు నీ కరుణాపాంగములను కాసింత ఒక్కసారి ప్రసరిస్తే చాలమ్మా – ఆ భక్తునికి కామధేనువు, చింతామణులు, కల్పవృక్షములు అక్కర్లేదు. అవేవీ ఇవ్వలేనివి ఆ తల్లి యొక్క కరుణాపాంగములు ఇస్తాయి(భట్టనారాయణులు).

990. అభ్యాసాతిశయజ్ఞాతా – శ్రీ అభ్యాసాతిశయజ్ఞాతాయై నమః

సాధనాపరమైన నామాలలో అన్నిటికంటె ముఖ్యమైన నామం ఇది. అభ్యాస–అతిశయజ్ఞాతా. అతిశయించిన అభ్యాసము చేత మాత్రమే తెలియబడేది. ఎప్పుడైనా కావలసింది అభ్యాసం.

"బలవాన్ ఇంద్రియగ్రామో విద్వాంసమపికర్షతి". "ఇంద్రియాలను నిగ్రహించడం అంటే మహాకష్టం కదా!" అని అర్జునుడు అంటే, కృష్ణపరమాత్మ, "నువ్వు చెప్పింది నిజమే. నువ్వు చెప్పిన దాని కంటే మహాకష్టం".

'అసంశయం మహాబాహో మనోదుర్నిగ్రహం చలం,

అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేన చ గృహ్యతే' అన్నారు. కానీ కష్టమని వదిలెయ్యకూడదు. సాధనకి కావలసినవి రెండే రెండు. ఒకటి అభ్యాసము. రెండు వైరాగ్యము.

వైరాగ్యమంటే లౌకిక విషయ వాంఛలు నిస్సారమని తెలుసుకునే ప్రయత్నం ఎంత చేయాలో అంత చేయాలి. అది పెరుగుతూ ఉంటే అభ్యాస వేగం పెరుగుతూ ఉంటుంది. వైరాగ్యం లేకపోతే అభ్యాసం బలహీనమైపోతుంది.

'విశాలాక్షీ', 'విరాగిణీ' నామాల దగ్గర వైరాగ్యభావాన్ని గురించి విస్తారంగా వివరించుకున్నాము. వైరాగ్యంతో కూడినదే అభ్యాసం అవుతుంది. జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగం, ధ్యానయోగం అని చాలా పేర్లు చెప్తూ ఉంటారు. మనకి

ఏ యోగం అబ్బిందో భగవంతునికే తెలుసు.

కృష్ణపరమాత్మ తన నోటితో ఒక యోగం చెప్పాడు. "ఆ యోగం చేస్తే పరతత్త్వాన్ని పొందుతారు" అని చెప్పాడు.

అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్

మన సాధనకి దీనిని అన్వయించుకునే ప్రయత్నం చేయాలి. 'అభ్యాస యోగ యుక్తేన చేతసా'- అభ్యాసయోగముతో కూడిన చిత్తము 'న అన్యగామినా' అంటే ఇతరముల వైపు వెళ్ళకుండా ఉండాలి. అది అభ్యాసం.

అటువంటివాడు 'పరమం పురుషం దివ్యం యాతి పార్థ అనుచింతయన్' – అనుచింత అంటే ఎడతెగని చింతన. "అన్యచింతన లేని/ఎడతెగని చింతనతో కూడిన అభ్యాసయోగం ఎవరికి ఉంటుందో వారు పరమమైన పురుషుడనైన నన్నే పొందుతున్నారు" అన్నారు. ఆ పొందడమే ఇక్కడ 'జ్ఞాతా' అని మాటలో చెప్తున్నారు. మనకి కావలసినది అభ్యాసయోగం.

పరమాత్మ తత్త్వం దొరకడం అంత తేలిక కాదు. **'స తు దీర్ఘకాల నైరంతర్య సత్కారాసేవితో దృఢభూమిః'** అని పతంజలి చెప్పారు. **'అసకృత్ ఉపదేశాత్'** అని బ్రహ్మసూత్రం చెప్పింది. 'అసకృత్' అంటే ఒక్కసారి సరిపోదు. మాటిమాటికి విచారణ చేసుకోవాలి.

సాధన ఎంతవరకంటే, అది పొందేవరకూ చెయ్యాలి. మనం కడుపు నిండేవరకు భోజనం చేస్తాం. మొదటి ముద్దతో ఆపేయమంటే ఎవ్వరైనా ఒప్పుకుంటారా! అలాగే అభ్యాసం ఎంతవరకు అంటే మోక్షం దొరికేవరకు. అంతే!. దానికి కాలం, పరిమితి ఎక్కడ ఉన్నాయి?

బ్రహ్మాండపురాణంలో అమ్మవారి గురించి హయగ్రీవస్వామివారు దీనినే చెప్పారు. మొత్తం లలితాదేవి చరిత్ర అంతా ఆ రెండు వాక్యాల్లో ఉంది.

ధ్యానైకదృశ్యా జ్ఞానాంగీ విద్యాంగీ హృదయాస్పదా
ఆత్మైక్యాద్వ్యక్తమాయాతి చిరానుష్ఠానగౌరవాత్

అమ్మవారిని ఎలా చూడాలో మార్గం చెప్పారు. మనం త్రీడి సినిమాకి వెళ్ళినప్పుడు వారిచ్చిన కళ్ళద్దాలు పెట్టుకోకపోతే మనకి సినిమా అంతా అలికేసినట్టు కనబడుతుంది. కళ్ళజోడు పెట్టుకోకుండా వెళ్ళి "బాగా లేదు" అంటే ఆ తప్పు మనది. దాని కోసం వాడు మరొక కన్ను ఇచ్చాడు. అది పెట్టుకొని వెళ్ళాలి. అలాగే అమ్మవారిని ఈ కంటితో చూస్తే లాభం లేదన్నారు. 'ధ్యానైకదృశ్యా' – ధ్యానమునకు మాత్రమే కనబడుతుంది.

ఏక శబ్దం 'మాత్రమే' అని చెప్తోంది. అదే మనకి **'తే ధ్యానయోగాను గతానుపశ్యన్'** అని శ్వేతాశ్వతరోపనిషత్తులో చెప్పారు. ధ్యానైకదృశ్యా. ఆవిడ స్వరూపం జ్ఞానాంగీ. **జ్ఞానాంగీ** అన్నప్పుడు జ్ఞేయబ్రహ్మము. నిర్గుణముగా ఉన్నప్పుడు జ్ఞానం ఆవిడ స్వరూపం. ఉపాసనలో **'విద్యాంగీ'**. తత్త్వతః ఆవిడ నిర్గుణా. ఉపాసనలో 'విద్యాంగీ'. విద్య అనగా మంత్రం, ఉపాసన అని అర్థం. శ్రీవిద్యారూపిణి.

తత్త్వతః జ్ఞానరూపిణి... ఉపాసనలో విద్యాంగి.

అమ్మవారిని ఎక్కడ ధ్యానించాలో చెప్తూ **'హృదయాస్పదా'** అన్నారు. హృదయమే ఆవిడకి ఆస్పదము. 'ఆత్మైక్యాత్ వ్యక్తమాయాతి'

హృదయాస్పదమైన ఆ పరతత్త్వాన్ని ధ్యానము ద్వారా, విచారణ ద్వారా, దానికి సహకరించే ఉపాసన ద్వారా సాధన చేసినట్లైతే ఆ తాదాత్మ్యం లభిస్తుంది. ఆ తాదాత్మ్యం వల్ల అది వ్యక్తమౌతుంది. అనగా అనుభవమునకు వస్తుంది. ఇంతా చెప్పి తరువాత చెప్పిన చివరి మాట **'చిరానుష్ఠాన గౌరవాత్'** అన్నారు.

అనుష్ఠానం అంటే ఎడతెగని సాధన. మూకకవి అమ్మవారి ముందు నిలబడి–

చింతిత ఫల పరిపోషణ చింతామణిరేవ కాంచీనిలయా మే

చిరతర సుచరిత సులభా చిత్తం శిశిరయతు చిత్సుధాధారా

అంటారు. **చిరతరసుచరితసులభా** – బహుకాలపు సుచరిత. చక్కగా మేలుగా ఆచరించడమే సుచరిత. ఎంతో కాలం చేసిన మంచి ఆలోచన, ప్రవర్తన, సాధన – వీటివల్ల ఆవిడ 'సులభా'. 'చిరతర సుచరిత సులభా'. అభ్యాసం ద్వారా అతిశయంగా (మిక్కిలిగా, పూర్ణముగా) తెలియబడునది.

991. షడధ్వాతీతరూపిణీ - శ్రీ షడధ్వాతీతరూపిణ్యై నమః

అధ్వము అనగా మార్గము. షడధ్వములు అనగా ఆరు మార్గాలు. షడధ్వాతీతరూపిణీ అంటే ఆరుమార్గాలకు అతీతమైన రూపం. అనేక ఆగమాలలో షడధ్వం గురించి చెప్పారు.

షడధ్వరూపమధునా శ్రుణు యోగీశ సాంప్రతమ్
ఏవం షడధ్వ భరితం శ్రీచక్రం పరిచింతయ (దక్షిణామూర్తిసంహిత)

"శ్రీచక్రము షడధ్వములతో కూడినదని తెలుసుకోమ"ని పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పాడు.

అస్మిన్ చక్రే షడధ్వానో వర్తంతే వీరవందిత
ఏవం షడధ్వ విమలం శ్రీచక్రం పరికీర్తితమ్

శ్రీచక్రానికే షడధ్వమని పేరు. ఇది పూర్తిగా సాంకేతిక సంబంధమైన విషయం. **'షడధ్వ శుద్ధిర్విధినా'** అని శివపురాణంలో కూడ కనబడుతుంది.

వాగర్థావివ సంపృక్తౌ వాగర్థఃప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ

చాలామంది దీనికి సాహిత్యపరమైన అర్థమే చెప్పారు. వాక్కు, అర్థము ఎలా కలిసి ఉంటాయో పార్వతీపరమేశ్వరులు అలాగే కలసి ఉంటారని చెప్పారు. కానీ ఇది చెప్పినవాడు శ్రీవిద్యా మర్మాలు తెలిసిన కాళిదాసమహాకవి.

ఆరుమార్గాలు గురించి చెప్పేటప్పుడు, ముందు రెండిటిని తెలుసుకోవాలి. ప్రపంచంలో నామం, రూపం రెండే ఉన్నాయి. మన అనుభవానికి తెచ్చుకునేదంతా రూప ప్రపంచము. దానిని తెలుసుకోవడానికి వాడుకునేది శబ్ద ప్రపంచము. దృశ్యప్రపంచము, నామప్రపంచము- ఈ రెండు కలిసి విశ్వమంతా వ్యాపించి ఉన్నాయి. ఇవి వాగర్థములు. అయితే పరతత్త్వం వాగర్థాలకు అతీతం అనగా నామరూపాలకు అతీతం.

వాగర్థాత్మకమైన ప్రపంచంలో ఆ పరతత్త్వమే వ్యాపించి ఉంది. పరమాత్మ తప్ప అన్యము లేదు. వాగర్థాత్మకమైన ప్రపంచంలో ఉన్న మనం ఆ పరమాత్మను

వాగర్థాల ద్వారానే తెలుసుకోవాలి.

ఏ నామరూపాలు పట్టుకుంటే మరి నామరూపాలు లేని స్థితికి చేరగలమో పరిశీలించుకోవాలి. దానికి మళ్ళీ వాగర్థాలే దిక్కు. గురువుగారి దగ్గరకి వెళ్తే మంత్రం ఇస్తారు. ఆ మంత్రం వాక్కే. దేనిని ధ్యానించాలో వస్తువుని చెప్తారు. వాక్కు, అర్థం రెండూ ఇచ్చేశారు. ఎలా ధ్యానించాలో చెప్తూ శ్రీచక్రం పెట్టుకో. పూజ చేసుకో అని చెప్తారు.

ఉపాసనా సంబంధమైన విషయం కనుక దానిగానే తీసుకోవాలి. ఆ పూజ చేసినపుడు ఎక్కడ, ఏ మంత్రం వాడాలో, ఎలా వాడాలో చెప్తారు – అవన్నీ వాక్కులు. వాక్కు, అర్థములతోనే ఉపాసన అంతా సాగుతుంది కనుక భావన చేసినప్పుడు, “వాక్కు అర్థాలతో ఏ తత్త్వాన్ని నేను ఉపాసన చేస్తున్నానో, ఆ తత్త్వమే వాగర్థముల యందు కూడా ఉన్నది” అని తెలుసుకుంటూ ప్రయాణం చేయాలి.

అమ్మవారిని షడధ్వరూపిణీ అన్నారా? షడధ్వాతీతరూపిణీ అన్నారా? అధ్వ – అతీత రెండూ చెప్పారు.

మనం ఒక ఊరికి వెళ్ళడానికి బయలుదేరి వెళ్తున్నప్పుడు ఒక మార్గంలోంచే వెళ్తాము. మార్గం ఊరికి వెళ్ళేవరకే పని చేస్తుంది. ఊరికి వెళ్ళాక మార్గాన్ని చుట్టపెట్టి తీసుకువెళ్తామా! మనకి లక్ష్యం గమ్యం. గమ్యానికి వెళ్ళాక ఇంక మార్గం లేదు... నడకా లేదు. నడిచేవానికే గమనం. గమ్యానికి కాదు. మార్గం లేకపోయినా గమ్యం ఉంది.

నామరూపాత్మకమైన ప్రపంచం లేకపోయినా పరతత్త్వం ఉంటుంది. కానీ దానిని చేరాలంటే మనం నామరూపాల(వాగర్థముల)తోనే సాధన చెయ్యాలి. అలా వాగర్థములతో సాధన చెయ్యగా క్రమంగా ఆ తత్త్వంలో లీనమౌతాము.

షడధ్వముల ద్వారానే షడధ్వములకు అతీతమైన గమ్యాన్ని చేరుకోవాలని సారాంశం.

వాక్ ప్రపంచంలో మూడు అధ్వలు ఉంటాయి. అర్థప్రపంచంలో మూడు అధ్వలు ఉంటాయి.

వాక్కు అర్థము అన్నప్పుడు లోకవ్యవహారంలో వాడే అర్థములు తీసుకోకూడదు. **'వాగ్రూపా పార్వతీదేవీ అర్థరూపో మహేశ్వరః'** అని శాస్త్రవాక్యం.

షడధ్వచక్రమే శ్రీచక్రం. ఈ రెండిటితో కలిపితేనే శివశక్త్యాత్మకం కనుక 'వాగర్థావివసంపృక్తౌ' అని చెప్పారు. ఇది ఉపాసనా సంబంధమైన అర్థం. వాక్ ప్రపంచంలో **వర్ణ, పద, మంత్ర** అని మూడు భాగాలు ఉంటాయి. ఇవి అమ్మవారిని ఉపాసించడానికి పనికొచ్చే షడధ్వములు.

పరశురాముడు దత్తాత్రేయస్వామివారితో, "స్వామీ! మీరు లలితామంత్రం చెప్పారు. చేశాను. శ్రీచక్రార్చనని ఇచ్చారు. చేశాను". "ఎలా ఉంద"ని అడిగితే, "చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది స్వామీ! కాని ఎంతకాలం! ఇలా అర్చన చేసుకుంటానం"టే, "ఇప్పుడు నువ్వు అర్హుడవయ్యావు" అని దత్తాత్రేయస్వామివారు జ్ఞానకాండని చెప్పడం ప్రారంభిస్తారు.

ముందు శ్రీచక్రార్చన మొదలైనవి చెప్పకుండా నేరుగా జ్ఞానకాండనే చెప్పవచ్చుగా అంటే సాధన చేస్తే కానీ సిద్ధికి కావలసిన సంస్కారం దొరకదు. చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత రెండిటి కోసమే సత్కర్మ, ఉపాసన. 'షడధ్వములు' బాగా ఉపాసించావు కనుక 'అతీతరూపిణి' అయిన త్రిపురా యొక్క రహస్యం చెప్తున్నానని త్రిపురారహస్యాన్ని చెప్పారు.

షడధ్వములలో మొట్టమొదట వచ్చినవి వర్ణ, పద, మంత్ర అని మూడు రకాలు. శాస్త్రములో మంత్రానికి 'వాక్య' అని చెప్తారు. వర్ణ, పద, వాక్య. సృష్టిలో ఏ మాటలైనా మూడు రకాలుగా ఉంటాయి. వర్ణము అంటే అక్షరము. కొన్ని అక్షరాలను కలిపి దానికి అర్థవంతమైన భావన వస్తే అది పదము. ఈ పదాల కూర్పుతో తయారైనది వాక్యము. వాక్యాల సమూహాలనే మనం శాస్త్రాలు, కావ్యాలు అని చెప్తాం. ఇది వాగ్రూపం. చిట్టచివరకి వాక్యం మంత్రం అయ్యింది. షోడశీ, పంచదశీ మంత్రం. దానిలో వర్ణాలు, పదాలు భాగాలుగా ఉన్నాయి. దానితో మనం ఉపాసిస్తున్న అర్థప్రపంచం మళ్ళీ మూడు: అవి – **కళ, తత్త్వ, భువన.**

కళాధ్వ – అమ్మవారి ప్రకాశము ప్రపంచంలో ఎక్కడెక్కడ భాసిస్తోందో

తెలుసుకుంటూ ఉంటే అదే కళల యొక్క జ్ఞానం. అదే కళాధ్వ.

'కలాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం' అని శంకరులు చెప్పారు. సృష్టి యందు ముందు అన్నింటికి మూలం పరమాత్మ యొక్క చిత్కళ. 'చిత్కళానందకలికా' దగ్గర చెప్పుకున్నాము. ఆ చైతన్యమే ప్రపంచంలో ప్రసరించింది.

ఆ ఆత్మ యొక్క అఖండ చైతన్యమే శక్తి. శక్తికి, ఈశ్వరునికి భిన్నం ఎక్కడా లేదు. శాక్తేయవాదం **'శక్త్యాధీనం ఈశ్వరః'** – శక్తి అధీనం ఈశ్వరుడు అని చెప్తోంది. కాని అద్వైతవాదం శివశక్తులకు అభేదాన్ని చెప్తున్నది. ఓతప్రోతముగా ఆ రెండూ కలిసే ఉంటాయి. విడివిడివి కావు.

పరమాత్మ యొక్క చిచ్ఛక్తి చేత ఈ పంచభూతాలు, దాని తరువాత మిగిలినవి ఏర్పడ్డాయి. పంచభూతాలలో మొట్టమొదట మనం చెప్పుకొనేది ఆకాశం. తరువాత వాయువు. అది దహరాకాశం, చిదాకాశం.

ఆకాశంలో ఉన్న చిత్కళకి **'శాంత్యతీతకళ'** అని పేరు. వాయువునందు ఉన్న చిత్కళకి **'శాంతకళ'** అనిపేరు. అగ్ని యందు ఉన్న చిత్కళకి **'విద్యాకళ'** అని పేరు. జలమునందు ఉన్న చిత్కళకి **'ప్రతిష్ఠాకళ'** అని పేరు. భూమి యందు ఉన్న చిత్కళకి **'నివృత్తికళ'** అని పేరు. చిత్కళతో కలుపుకుంటే ఆరు కళలు. కానీ ప్రపంచం గురించి మాట్లాడుతున్నాం కనుక చిత్కళతో కాకుండా చెప్పిన ఐదింటినే తీసుకోవాలి. ఇది కళాధ్వ. కళ అనగానే ఒక్కటి కాదు. దానిలో ఐదింటిని చెప్పారు.

అలాగే **తత్త్వం** సాంఖ్యం ప్రకారంగా– 24 తత్త్వాలు. కొంతమంది 25 తత్త్వాలు అని చెప్తారు. ఉపాసనాపరంగా 36 తత్త్వాలు. అమ్మవారు కూర్చున్న సింహాసనానికి క్రింద పెద్ద మండపం ఉంటుంది. ఆ మండపానికి 36 మెట్లు ఉన్నాయి. ఆ మెట్లు అమ్మపాదం దగ్గరికి వెళ్ళడానికి పనికొస్తాయి. ఆ 36 తత్త్వాలే మెట్లుగా చెప్పారు. **ఉపాసనని సరిగ్గా చేస్తే అదే ఉపనిషత్ జ్ఞానం.** ఉపాసనని ఉపనిషత్ జ్ఞానంతో చేయగలిగితే తరిస్తారు. ఆ 36 తత్త్వాలు గురించి గతంలో వచ్చిన నామాలలో వివరించుకున్నాం. ఆ ముప్పది ఆరు తత్త్వాలు తత్త్వార్థమని చెప్పబడుతున్నాయి.

కళాధ్వములు–5. తత్త్వాధ్వములు–24 కావచ్చు లేదా 36 కావచ్చు. భువనాధ్వములు–14(చతుర్దశ భువనాలు). మనం చూసే వాక్ ప్రపంచమంతా వర్ణ, పద, వాక్యములతో ఉంటుంది. మనం చూసే దృశ్యప్రంపంచం పంచభూతాల లోని కళలతోనూ, 24/36 తత్త్వములతోను, భువనములతోనూ వ్యాపించి ఉంది. ఇంత అద్భుతంగా ప్రపంచాన్ని దృశ్యప్రపంచమని,శబ్దప్రపంచమని రెండే భాగాలగా చేసి చూపించారు.

ప్రపంచాన్ని, పరతత్త్వాన్ని అర్థం చేసుకోవడానికి భారతీయ ఋషులు ఎంత పరిశీలించారో గ్రహించాలి. అలాంటి వివేచన చేసిన జ్ఞానులు పుట్టిన దేశంలో పుట్టినందుకు మనం సంతోషించాలి.

'వర్ణ, పద, మంత్ర, కళా, తత్త్వ భువన అధ్వముల'ని షడధ్వములు వ్యవహారపరంగా చెప్పుకున్న అర్థం. ఉపాసనలో – 'చిత్కళా, శాంత్యతీతకళ, శాంతకళ, విద్యాకళ, ప్రతిష్ఠాకళ, నివృత్తికళ – ఇవన్నీ శ్రీచక్రార్చనలో కనిపిస్తాయి. బాగా ఆలోచిస్తే ఇదంతా అంతర్యాగమే.

అక్కడ వర్ణ అంటే మాతృకావర్ణరూపిణి. ఇలాంటివి అన్నీ శ్రీవిద్యాపరంగా అర్థాలు ఉన్నాయి. వర్ణ, పద, మంత్ర, కళా, తత్త్వ, భువన అనే అధ్వముల రూపములు శ్రీచక్రమందు ఉంటూ, ఆ శ్రీచక్రారాధన చక్కగా చేసేవారికి వాటి ద్వారా తరింపజేస్తోంది కనుక 'షడధ్వాతీతరూపిణీ'.

షడధ్వాంశములలో మొదటి మూడింటిని విమర్శాంశ అంటారు. తరువాత మూడింటిని ప్రకాశాంశ అంటారు. ఇవే ప్రకాశవిమర్శలు. మొత్తం ప్రపంచమంతా ప్రకాశ విమర్శలే. ప్రకాశము శివస్వరూపము. విమర్శ అమ్మరూపము. ఈ ప్రకాశ విమర్శ రూపాలే "వాగర్థావివసంపృక్తౌ". అదే 'షడధ్వాతీతరూపిణీ'.

'యచ్చక్షుషా న పశ్యతి' 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ (శ్రుతి) – పంచజ్ఞానేంద్రియాలు, అంతఃకరణం కలిపి – షడధ్వములు. వాటికి అతీతమైన పరతత్త్వమే లలితాంబ.

992. అవ్యాజకరుణామూర్తిః - శ్రీ అవ్యాజకరుణామూర్తయే నమః

కరుణ అంతా ఒక రూపం ధరిస్తే అది అమ్మవారు. ఆవిడ పేరే కరుణ. కరుణ గురించి అనేకమార్లు చెప్పుకున్నాము. అవ్యాజ్యకరుణామూర్తి అంటే నెపము లేని కరుణ కలది అని అర్థం.

కొందరు అసలు ఏ ఫలం లభిస్తుందో తెలుసుకోకుండా కర్మని చేస్తారు. నిష్కామంగా ఫలాభిసంధి లేకుండా కర్మ చేస్తే చిత్తశుద్ధి వస్తుంది. మనకి ఫలితం అక్కర్లేదనుకున్నా రావలసినది వస్తోంది.

కానీ అమ్మవారు కరుణ చూపించేటప్పుడు ఆ తల్లికి ఏమీ అక్కర్లేదు. దాని వల్ల ఆమెకి కొత్తగా వచ్చేదేమీ లేదు. రావలసినది, పొందవలసినది ఏదీ లేదు. గతంలో చెప్పుకున్న 'ధన్యా' నామం ఒక్కసారి గుర్తు తెచ్చుకుంటే **'నానవాప్తమవాప్తవ్యం'.**

ఆవిడ కరుణ మనపై ఎందువల్ల చూపించిందో చెప్పలేము. నెపములేని కరుణ. ఉదయం లేచిన వెంటనే సూర్యుడు కనబడ్డాడు. అది అవ్యాజకరుణ. అమ్మని అడిగామనా ప్రపంచమంతా నీరు, వెలుగు, గాలి, తిండి - ఇవన్నీ ఇచ్చింది. 'అడగందే అమ్మైనా పెట్టదు' అంటారు కానీ, అడగకుండా అన్నీ పెట్టేది జగదంబ మాత్రమే. ముందు సాధనాదృష్టితో ఇలాగే చూడాలి. ప్రపంచమంతా వ్యాపించిన శక్తి కరుణయే. కరుణ, శక్తి అని రెండు కావు. పరమేశ్వరశక్తియే పరమేశ్వర కారుణ్యం. **'జగత్త్రాతుం శంభోర్జయతి కరుణా కాచిదరుణా'** - జగతిని రక్షించే శంభుని కరుణ ఒకానొక అరుణ. సర్వోత్కృష్ట. (ఆదిశంకర సౌందర్యలహరి)

993. అజ్ఞానధ్వాంతదీపికా - శ్రీ అజ్ఞానధ్వాంతదీపికాయై నమః

అమ్మ వెలుగు దీపశిఖలా ఉంది. అజ్ఞాన అంధకారాన్ని పోగొట్టే జ్ఞానరూపిణి అమ్మవారు. ఆమె కరుణ లేనిదే జ్ఞానం రాదు. **'ఈశ్వరానుగ్రహాదేవ' 'ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే'** అని ఉపనిషత్తు చెప్తోంది. జ్ఞానం రావాలంటే ఈశ్వరానుగ్రహం కావలసిందే. ఆ ఈశ్వరానుగ్రహానికి భక్తే శరణ్యం. ఆ భక్తితో ఉంటే కరుణని గుర్తిస్తాం.

సాధారణంగా పాత్రలలో గంగ తెచ్చుకునేవాడు పాత్రలలోనే దానిని వాడుకుంటున్నాడు. ఆ గంగలో మునకలు వేసేవానికి గంగ ఎంతో దొరుకుతోంది. ఇక్కడికి వచ్చి ఆమె ముంచలేదు. వీడే అక్కడికి వెళ్ళి మునిగాడు. వీడి సాధన అది. కొత్తగా గంగ వాని కోసం ప్రవహిస్తోందా! కనుక అక్కడికి వెళ్ళి గంగలో మునిగేవాడు ఎలాంటివాడో అమ్మ కరుణలో మునిగే భక్తుడు అటువంటివాడే. వాడు భక్తితో ఆ కరుణలో మునుగుతున్నాడు. కొత్తగా వాని కోసం ఆమె ఏమీ చూపించడం లేదు.

"తేషామేవానుకంపార్థం అహమజ్ఞానజం తమః

నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా" అని గీతావాక్యం. నన్నే నిరంతరం ఉపాసించేవాడు ఎవడైతే ఉన్నాడో వానిపై అనుకంప అంటే దయ కలుగుతుంది. ఆ అనుకంపే ఇక్కడ అవ్యాజ కరుణ అవుతుంది. **'జ్ఞానదీపేన భాస్వతా'** అనేదే **'అజ్ఞానధ్వాంతదీపికా'** అయింది.

ఎవరు నన్ను ప్రేమగా ఆశ్రయిస్తారో వారిపై నాకు అనుకంప (కరుణ) కలిగి, అతని హృదయంలో ఉన్న నేను అతనికి జ్ఞానాన్ని ఇస్తున్నాను. జ్ఞానం ఇవ్వడానికి మరో లోకం నుండి దిగక్కర్లేదు. 'ఆత్మభావస్థః'... హృదయాన ఉంటూనే నేను ఇస్తున్నానని చూపిస్తున్న మాటే తరువాత నామంలో 'ఆబాలగోపవిదితా'లో స్ఫురిస్తోంది.

994. ఆబాలగోపవిదితా - శ్రీ ఆబాలగోపవిదితాయై నమః

ఈ నామం చాలా విశిష్టమైనది. తెలుగువారికి 'ఆబాలగోపాలం' అని ఒక పలుకుబడి ఉంది. ఇక్కడ అనేక భావాలు ఉన్నాయి. ఆబాలగోపాలం అనేది వ్రేపల్లెకి సంబంధించిన ఒకానొక మాట. కృష్ణపరమాత్మని ఆబాలగోపాలం ప్రేమించారు.అది చెప్పడం కోసం పూర్వకాలంలో వాడారు. ఆ మాటని 'ప్రతివారు' అని చెప్పడం కోసం వాడతాము. ఆబాలగోపాలమనే మాట బృందావనంలో మాత్రమే చెల్లు. మిగిలిన ప్రాంతాలలో శ్రీకృష్ణపరమాత్మ సంచరిస్తున్నప్పుడు కొందరు ఆయన్ని గుర్తించారు. కొందరు ఆయన్ని గుర్తించలేదు.

బృందావనంలో ఆబాలగోపాలం - బాలురు మొదలుకొని గోపాలకుల

వరకూ అందరికి కృష్ణుడు సర్వస్వం. ఆ భావన తీసుకుని ఆబాలగోపాలం అన్నారు. అక్కడ ఈ పదం వాడినప్పుడు చిన్నపిల్లలు మొదలుకొని పెద్దవారి వరకు తెలియబడే తత్త్వం అని అర్థం.

ఒక్కసారి భాగవతం పరిశీలించాలి. బృందావనవాసుల్ని "మీకేం తెలుసు?" అంటే వారు తడుముకోకుండా "కృష్ణుడు తెలుసు" అని చెప్తారు. వారికి మరొక మాట లేదు. **"తదర్పిత అఖిలాచారస్సన్"** అని నారదులవారు చెప్పినట్లుగా వారికి కృష్ణుడు తప్ప మరొక ప్రపంచము లేదు. బృందావనంలో అందరూ మోక్షం పొందిపోయారు. **'తన్మనస్కాః తదాలాపాః తద్విచేష్టాః తదాత్మికాః'** అని భాగవతం చెప్తోంది.

గోపాలకుల స్థితి సామాన్యం కాదు. వారు బాలురైనప్పటికి మహాత్ములు. వారికి వేదాంతం తెలియకపోవచ్చు కానీ వేదాంతవేద్యుడైన పరమాత్మునిపై అపారమైన ప్రేమ ఉంది. వారికి విషయవస్తు త్యాగం ప్రేమతో జరిగిపోయింది. అవతారమూర్తిగా ఉన్న విష్ణువస్తువుని పట్టుకున్నారు. ఆ పిల్లలు పట్టుకున్న విషయం చూసి బ్రహ్మకే అసూయ పుట్టింది. ఆశ్చర్యపోయారు.

బాలురు మొదలుకొని గోపాలకుల వరకు అందరిచేత తెలియబడే వస్తువు కృష్ణుడు. ఆ కృష్ణతత్త్వమే లలితాతత్త్వం.

వేదంలో గోప శబ్దం రెండు అర్థాలలో వాడబడుతోంది. దేవతలు అని ఒక అర్థంతో వాడబడింది. '**ఉతైనం గోపా అదృశసన్నదృశసన్నుదహార్యః**' – ఆ భావమే ఇక్కడ చెప్పబడుతోంది. వేదాంతంలో భగవంతుడు అందరికి తెలియబడుతున్నాడని చెప్పారు. "నీళ్ళు మోసుకు తిరిగేవారు, పాలు మోసుకు తిరిగేవారికి కూడా భగవంతుడు తెలుసు" అన్నారు. అతడు అక్కడ సూర్యభగవానుని రూపంలో చెప్పబడ్డాడు..

మరొక అర్థం– 'ఆబాలగోపవిదితా' అంటే చిన్నపిల్లలు మొదలుకొని దేవతల వరకు అని చెప్పుకోవచ్చు. గోప అంటే రక్షక శక్తి. గోపనం చేసేవాడు గోప. అసలు గోపకుడు పరమాత్మ. సర్వజగత్తుని పాలించేవాడే గోపకుడు. లోకపాలకులు కనుక దేవతలు గోపకులే.

బాలురు మొదలుకొని ఆ దేవతల వరకు అందరి చేత తెలియబడే తత్త్వమేది? అందరికి అన్ని తెలియబడవంటారు. కానీ అందరికి సాధారణంగా ఒక్కటి మాత్రం తెలుసు. అది **'తమహమ్ ప్రత్యయ వ్యాజాత్ సర్వే జానంతి జంతవః'** అని శాస్త్రం ఒక్కటే చెప్పింది (స్కాన్దం). ప్రతివారికి ఒక్కటి తెలుసు. అది నేను. నేను తెలుసుకున్నాను, నేను తెలుసుకోలేదు. ఇందులో తెలుసుకున్నాను, తెలుసుకోలేదు అనేది మారింది గాని 'నేను' మారలేదు. తెలుసుకోలేకపోయానన్నది తెలుసుకున్నాడు. ఆ జ్ఞానం 'నేను' రూపంగా ప్రతివారిలో ఉంది.

'ప్రకటాకృతిః' అనే నామానికి భాష్యం రచిస్తూ భాస్కరరాయలువారు అదే చెప్పారు. అమ్మరూపం ఎక్కడో దాచిపెట్టబడలేదు. అందరికి తెలుస్తోంది. హరిహరాదులు మొదలుకొని పామరుల వరకు ప్రతివారిలో 'నేను' రూపంగా తెలియబడుతున్న చైతన్యమే 'ఆబాలగోపవిదితా'.

అల్పజ్ఞులు మొదలుకొని మహామేధావుల వరకు అందరికి తెలియబడుతున్న **అహంరూపిణి.** 1.కృష్ణస్వరూపిణి, 2. అహంరూపంతో తెలియబడుతున్నది.

'ఆబాలగోపవిదితా' – ఒక అద్భుతమైన శక్తి. ఆ తల్లి ఎవరంటే, 'రతిరూపా, రతిప్రియా, రస్యా, ప్రేమరూపా, ప్రియంకరీ'– ఇలాంటి నామాల్లో ధ్వనిస్తోంది. ద్వారకాపీఠాధీశ్వరులు(శ్రీ స్వరూపానన్ద సరస్వతీస్వామివారు) ఒకసారి కాశీ క్షేత్రంలో ఈ స్ఫురణ కలిగించారు. కృష్ణపరమాత్మ తెలియాలంటే వారికి అంతకంటే ముందు రాధాదేవి తెలియాలన్నారు. ఆబాలగోపకులకు తెలిసింది రాధాదేవి. 'ఆబాలగోపవిదితా' అంటే రాధాదేవి. రాధాదేవి అనుగ్రహం లేకపోతే పరమాత్మపై ప్రేమ కలుగదు.

అనారాధ్య రాధాం పదాంభోజయుగ్మం
అనాశ్రిత్య బృందావనం తత్పదాంకం
అసంభాష్య తద్భావ గంభీరచిత్తం
కథం శ్యామసింధౌ రసస్యావగాహః (రూపగోస్వామి)

రాధాదేవి అంటే ప్రేమరూపిణి. ఆ ప్రేమరూపమైన భక్తి మనలో కలగకపోతే

పరమాత్మ దొరకడు. 'ఆబాలగోప' – అందులో ఉన్న భక్తిగా తెలియబడుతున్నవాడు ఆ పరమాత్మయే. 'ఆబాలగోపవిదితా' అంటే రాధాదేవి. ఈ తత్త్వం మనకి తెలియాలంటే గోలోకవాసియైన పరమాత్మ కృష్ణపరమాత్మగా బృందావనంలో అవతరించినపుడు ఆయన్ని విడదీయలేని, అవిభాజ్యశక్తి అయిన, ప్రేమానందరూపిణి అయిన అమ్మ రాధాదేవి వృషభానుడు అనే గోపరాజుకి కుమార్తెగా అవతరించింది. వృషభాను నందిని.

బర్సానా అని బృందావన ప్రాంతంలో ఉంది. 'పరసానుపురం' దాని అసలు పేరు. అది క్రమంగా బర్సానా అయింది. వృషభాను నందినిగా ఆ బృందావనంలో రాధాదేవి సంచరిస్తూ బాలురను, గోపకులను అనుగ్రహించింది. 'ఆబాలగోపవిదితా' అంటే రాధాదేవిరూపిణి అని అర్థం. కృష్ణా, రాధా – రెండూ ఒకటే అని కృష్ణుడే చెప్పాడు. 'చంద్రచంద్రికయోరివ (చంద్రుడు – వెన్నెలల వలె)' అన్నాడు. ఆబాలగోపవిదితా అంటే కృష్ణరూపిణి అని మరొక అర్థం. దేవీభాగవతం, బ్రహ్మవైవర్తం, మొదలైన పురాణాలు **పరాశక్తియే రాధాదేవి** అని స్పష్టం చేశాయి.

సర్వజీవులచేత తెలియబడే అహంరూపిణి అయిన తల్లియే, ఆ పరతత్త్వమే, ఆత్మస్వరూపిణే అమ్మవారు. దీనికి ప్రమాణం **'స్వాత్మైవ దేవతా ప్రోక్తా లలితా విశ్వవిగ్రహా'**. ఇదే ధ్యానశ్లోకంలో చెప్పబడే **'అహమిత్యేవ విభావయే భవానీం'** – అందరిచేత తెలియబడే తల్లి. ఆ తల్లి ప్రపంచాన్ని ఎలా నడుపుతోందో తరువాత నామంలో చెప్తున్నారు.

995. సర్వానుల్లంఘ్యశాసనా – శ్రీ సర్వానుల్లంఘ్యశాసనాయై నమః

ఏ ఒక్కరూ దాటుటకు వీలుకాని శాసనం కలది. శాసనం అంటే 'ఇది ఇలా ఉండాలి' అనే నిర్ణయం. 'పరమేశ్వరీ ఆజ్ఞ. ఏ ఒక్కడు అతిక్రమించలేడు.

భీషాస్మాద్వాతః పవతి భీషోదేతి సూర్యః' అని అనేకమార్లు చెప్పుకున్నాము. ప్రపంచమంతా అమ్మ శాసనం వలన నడుస్తోంది.

జగత్సూతే ధాతా హరిరవతి రుద్రః క్షపయతే
తిరస్కుర్వన్నేతత్ స్వమపి వపురీశః తిరయతి
సదాపూర్ణస్సర్వం తదిదమనుగృహ్ణాతి చ శివః
తవాజ్ఞాం ఆలంబ్య క్షణచలితయోర్భ్రూలతికయోః (సౌందర్యలహరి)

"నీ కనుబొమల ఆజ్ఞను ఆధారం చేసుకొనే బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివులు సృష్టి, స్థితి, సంహార, తిరోధాన, అనుగ్రహాలనే పంచకృత్యాలను చేస్తున్నారు." 'సంవిద్భట్టారిక' అయిన లలితాపరమేశ్వరి 'సర్వతంత్ర' అని భావం... విశ్వశాసనకర్త్రి.

996. శ్రీచక్రరాజనిలయా - శ్రీచక్రరాజనిలయాయై నమః

ఇప్పటివరకు చెప్పబడుతున్న ఆ తల్లి శ్రీచక్రంలో ఉన్నది. శ్రీచక్రానికి చక్రరాజమని పేరు. అన్ని యంత్రాలు ఒక ఎత్తు. శ్రీచక్రం ఒక్కటి ఒక ఎత్తు. బిందుసహితమైన శ్రీచక్రం విశ్వచక్రమే. విశ్వాన్ని అర్థం చేసుకోవడం కోసం మనం రకరకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటాము. అందులో ప్రధానమైన ఆలంబన శ్రీచక్రం. శ్రీచక్రాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకుంటే అది పరతత్త్వాన్నే తెలియజేస్తుంది.

'పరీక్ష్య లోకాన్ కర్మచితాన్' - ఆ భావమంతా శ్రీచక్ర పరిశీలనలో మనం తెలుసుకోవాలి. శ్రీచక్రము నందు ఉన్న తల్లి. **'చకతి భ్రమయతి భ్రమణం కరోతి'** - చక్రం అనగా తిరుగుతున్నదని అర్థం. ప్రపంచం పేరే జగత్తు. అది నిరంతరం తిరుగుతోంది. సృష్టి-స్థితి-లయ, పునః పునరావృత్తి - పగలు, మధ్యాహ్నం, రాత్రి. తిరిగి వాటి ఆవృత్తి.

మనం కూడా అంతే - పుట్టడం, పెరగడం, చావడం... మళ్ళీ అదే జనన మరణ పరంపర. మన శరీరంలో, ప్రపంచంలో ఇదంతా జరుగుతున్నది. ప్రపంచము, శరీరము - ఈ రెండిటి యందు ఎవరు తిరుగుతున్నారు? చైతన్యం. విశ్వమునందు, మన యందు ఏ మహాచైతన్యం తిరుగుతోందో/ తిప్పుతున్నదో ఆ చైతన్యమే 'చక్రరాజనిలయా'. ఈ చక్రముల యందు తిరుగుతున్న శ్రీ - అమ్మవారు.

పిండాండ, బ్రహ్మాండ సమన్వయమే శ్రీచక్రారాధన అని చెప్పడంలో విశేషమిది.

కనుకనే మన యొక్క శరీరమే శ్రీచక్రం. ఈ ప్రపంచం కూడా శ్రీచక్రం. ఈ శరీరచక్రమునందు, ప్రపంచచక్రమునందు వ్యాపించిన శ్రీ ఎవరు ఉన్నారో ఆ శక్తి శ్రీమాత. ఆవిడ ఉంది కనుకనే ఈ చక్రమునకు శ్రీచక్రమని పేరు. చక్రమునందున్న 'శ్రీ'ని తెలుసుకోవాలి. చక్రము 'త్రిపురా'. అదే 'త్రిపురాశ్రీ'. ఆవిడే 'శ్రీమాతా'. 'శ్రీమహారాజ్ఞీ'. శివశక్తుల స్వరూపమే శ్రీచక్రం కనుక – ఆ తల్లి ఆ రూపముగా ఉన్నది.

త్రిపురమైన శరీరం, త్రిపురమైన విశ్వము. వీటి యందు వ్యాపించి సంచరిస్తున్న ఆ మహాశక్తియే జగదంబ. శ్రీచక్రంలో బిందువునందు వికసించి ప్రకాశిస్తున్నది. శ్రీచక్రమంతా అమ్మ రూపమే. ఆవరణలు అన్నీ అమ్మ శక్తులే. మూలముగా బిందువు నుండి వ్యాపిస్తున్నది.

997. శ్రీమత్త్రిపురసుందరీ – శ్రీ శ్రీమత్త్రిపురసుందర్యై నమః

శ్రీచక్రంపై రెండు నామాలు వచ్చాయి. శ్రీచక్రరాజనిలయా, శ్రీమత్త్రిపుర సుందరీ. శ్రీమత్ అన్నదానిలో బీజాక్షరం నిక్షిప్తం చేశారు. శ్రీం బీజం ఎలా కలిపారో తెలుసుకుంటున్నాము. ఆవిడ 'త్రిపురసుందరీ'. త్రిపురముగా ప్రపంచమునందు, త్రిపురమైన శరీరమునందు చైతన్యమే సౌందర్యం. ఆ సౌందర్యం లేకపోతే, జగత్తుకి సౌందర్యం లేదు. ఏది ఉండడం వల్ల ఈ ప్రపంచం సుందరంగా ఉందో, ఆ సుందరమే అస్తి, భాతి, ప్రియమైన పరతత్త్వము. అదే నిజమైన సుందరము. అదే సచ్చిదానందము. ఆ ఆనందమే సుందరము.

త్రిపురాల యందు వ్యాపించిన 'శ్రీ' అనగా చైతన్యము. సుందరం అనగా 'ఆనందం'. చైతన్యరూపిణి అయిన ఆనందం శ్రీమత్త్రిపురసుందరి.

998. శివా – శ్రీ శివాయై నమః

ఇది అమ్మవారి రహస్యనామం. 'శివా, భవానీ, ఉమా' – ఈ మూడు అమ్మవారి రహస్యనామాలు. **'ప్రమహసి పదే నిస్త్రైగుణ్యే శివాయ నమో నమః'** – త్రిగుణాతీత

తత్త్వమే శివం. బిందుస్థానం త్రిగుణాలకి, త్రిపురాలకి అతీతమైనది కనుక శివం. అది మంగళకరం. బ్రహ్మతన్మంగళం పరమ్ అన్నారు. మంగళకరమైన, ఆనందకరమైన, శాంతమైన తత్త్వమదే. అందుకే 'శివా' అని చెప్పబడుతూ, ఆ తల్లి విశ్వముతో ఎలా ఉందంటే –

999. శివశక్త్యైక్యరూపిణీ – శ్రీ శివశక్త్యైక్యరూపిణ్యై నమః

అమ్మవారు వేరు, అయ్యవారు వేరు కారు. శ్రీచక్రంలో శివశక్త్యైక్యం ఉంది. బిందు చక్రములు, త్రికోణచక్రములు కలిపి శ్రీచక్రం. ఇందులో త్రికోణచక్రాలు అమ్మవారు, బిందు చక్రములు అయ్యవారు. ఒక బిందుచక్రానికి, ఒక త్రికోణచక్రానికి సమన్వయం ఉంది. ఇది కేవలం గురుముఖతః తెలుసుకోవాలి.

బిందువుకి త్రికోణంతో సమన్వయం ఉంది. తరువాత వచ్చేది అష్టత్రికోణం. అష్టత్రికోణానికి అష్టదళ పద్మంతో సంబంధం ఉంది. ఎవరైతే బిందుత్రికోణాల యొక్క సమన్వయాలని తెలుసుకొని ఉపాసన చేస్తారో వారికి లలితాదేవి అనుగ్రహం లభిస్తుందని స్పష్టంగా హయగ్రీవస్వామివారు త్రిశతి చెప్పిన తరువాత చెప్పిన మాట.

చతుర్భిః శివచక్రైశ్చ శక్తిచక్రైశ్చ పంచభిః
నవచక్రైశ్చ సంసిద్ధం శ్రీచక్రం శివయోర్వపుః (లలితా త్రిశతి)

నాలుగు శివచక్రాలు, ఐదు శక్తిచక్రాలు – ఈ తొమ్మిది చక్రాలతో రూపొందిన శ్రీచక్రం శ్రీకామేశ్వరీ కామేశ్వరుల శరీరం – అనగా శివశక్త్యైక్య రూపం.

త్రికోణ మష్టకోణం చ దశకోణ ద్వయం తథా
చతుర్దశారం చైతాని శక్తిచక్రాణి పంచ చ
బిన్దుశ్చాష్టదలం పద్మం పద్మం షోడశపత్రకమ్
చతురశ్రంచ చత్వారి శివచక్రాణ్యనుక్రమాత్ (లలితాత్రిశతి)

త్రికోణం, అష్టకోణం, రెండు దశకోణాలు, చతుర్దశారం – ఈ అయిదు శక్తి చక్రాలని తెలియాలి. బిందువు, అష్టదళపద్మం, షోడశ దళపద్మం, చతురశ్రం – ఈ నాలుగు శివచక్రాలని భావించాలి.

త్రికోణం బైన్దవం శ్లిష్టం అష్టారేఽ ష్ట దలాంబుజం

దశారయోః షోడశారం భూగృహం భువనాశ్రకే

శైవానామపి శాక్తానాం చక్రాణాంచ పరస్పరమ్

అవినాభావ సంబంధం యోజానాతి స చక్రవిత్

త్రికోణంలో బిందువు; అష్టకోణంలో అష్టదళపద్మం; దశకోణద్వయమందు షోడశారం, చతుర్దశారచక్రమందు భూపుర చక్రం – సంశ్లిష్టాలై(కలయిక కలిగి) ఉన్నవి. శైవచక్రాలకు, శాక్తచక్రాలకు పరస్పరంగల అవినాభావ సంబంధం తెలిసినవాడు శ్రీచక్రవిదుడౌతున్నాడు. ఈ విధంగా నవావరణలు పరస్పర సంశ్లిష్టభావంతో శివశక్త్యైక్యరూప శ్రీచక్రంగా ఏర్పడ్డాయి.

ఏ త్రికోణచక్రానికి, ఏ బిందుచక్రంతో సమన్వయం చేసుకోవాలనేది ఒక అద్భుతమైన విషయం. నాలుగు త్రికోణ చక్రాలు నాలుగు బిందుచక్రాలే. బిందువు దగ్గర ఇద్దరూ కలిసిపోతారు. ఇంక త్రికోణం ఉండదు. ఈ నాలుగు త్రికోణాలకి ఏఏ బిందు చక్రాలతో సమన్వయమో గ్రహించడమే శ్రీచక్రజ్ఞానం.

చతుర్భిశ్శివచక్రైశ్చ శక్తి చక్రైశ్చపంచభిః

శివశక్త్యాత్మకం జ్ఞేయం శ్రీచక్రం శివయోర్వపుః (హయగ్రీవవచనం)

శివచక్రాలు నాలుగు, శక్తి చక్రాలు ఐదు ఐక్యమై శ్రీచక్రమైనది. అందుకే శ్రీచక్రం శివశక్త్యాత్మకమై శివశక్తుల శరీరమని తెలియబడుతున్నది.

శివేచ్ఛయా పరాశక్తిః శివతత్త్వైకతాం గతా

తతః పరిస్ఫురత్యాదౌ సర్గే తైలం తిలాదివ

'నువ్వుల నుండి నూనె వ్యక్తమైనట్లు శివతత్త్వంలో ఏకత్వాన్ని పొందిన పరాశక్తి శివేచ్ఛ చేతనే సృష్ట్యాదియందు అభివ్యక్తమౌతోంది' – అని శివపురాణం (వాయవీయ సంహిత) వివరణ.

హకారం శివుని, సకారం శక్తిని సూచించుచున్నవి. వీటి సమైక్యమైన 'హంస' మంత్రస్వరూపమే శివశక్త్యైక్యరూపిణి (హంసమంత్రార్థరూపిణి) – లలితా త్రిశతి.

సదాకారా పరానందా సంసారోచ్ఛేదకారిణీ

సా శివా పరమాదేవీ శివాऽభిన్నా శివంకరీ (సూతసంహిత)

– సత్ రూపము, పరానందస్వరూపిణి, సంసారాన్ని (మాయను) తొలగించునదది, శివునకు అభిన్నురాలై శివమును కలిగించే పరమోత్కృష్టమైన దేవి శివా.

బ్రహ్మణోऽభిన్నశక్తిస్తు బ్రహ్మైవ ఖలు నాపరా

తథాసతి పృథా ప్రోక్తం శక్తిరిత్యవివేకిభిః

శక్తి శక్తిమతోర్విద్వన్ భేదాభేదస్తు దుర్ఘటః

– బ్రహ్మమునకు వేరు కాని శక్తి బ్రహ్మమే గానీ, ఆ శక్తి వేరు కారు. సత్యమిలా ఉండగా, అవివేకులు శక్తి అని వేరుగా చెబుతున్నారు. శక్తి – శక్తిమంతుల భేదాభేదములు చెప్పుట అసాధ్యం. అంటే – అది ఐక్యరూపమేనని తాత్పర్యం.

'శివశక్త్యైక్యరూపిణీ' అన్నప్పుడు శ్రీచక్రంలో వారు ఉభయులు కలిసి ఉంటారు కనుక 'శ్రీచక్రరాజనిలయా' 'శ్రీమత్త్రిపురసుందరీ' 'శివా శివశక్త్యైక్యరూపిణీ' అని శ్రీచక్రపరంగా అర్థం.

'శివశక్త్యైక్యరూపిణీ' అంటే విశ్వమునందు అంతటా వ్యాపించిన పరమాత్మ యొక్క శక్తికి, పరమాత్మకి భేదం లేదు. శివశక్తులకు ఏమీ భేదం లేదు. ఇదే అర్ధనారీశ్వరతత్త్వంలో చెప్పబడుతుంది. శీచక్రానికి విగ్రహరూపం కల్పన చేస్తే అదే అర్ధనారీశ్వర తత్త్వం.

విగ్రహంగా ఆరాధించినా, శ్రీచక్రంగా ఆరాధించినా అది శివశక్త్యైక్యరూపమే. లలితాంబా రూపంలోనే శివుడు ఉన్నాడు.

1000. లలితాంబికా – శ్రీ లలితాంబికాయై నమః

కొన్ని ప్రాచీన పాఠాలు మాత్రం 'శివా శివశక్త్యైక్యరూపిణీ శ్రీలలితాంబికా' అని చెప్పాయి. 999 నామాలు ఎవరివో ఆమె పేరే చిట్టచివరి నామం... శ్రీలలితాంబికా.

బిందువులో ఉన్నది శ్రీలలితాంబికా. 'శ్రీచక్రరాజనిలయా'. ఆ పరమమైన తల్లే 'శ్రీలలితాంబికా'. ఆ తత్త్వం చెప్పాక మరి చెప్పడానికి ఏం లేదు కనుక ఇదే ఆఖరి మాట. ఆఖరివరకూ ఆగి చివరన ఈ నామం చెప్పారు.

'లోకానతీత్య లలతే లలితా తేన సోచ్యతే' – ఈ సర్వలోకములకు అతీతముగా ప్రకాశిస్తున్నదేదో ఆ దేవి లలిత. ఏ లలిత వల్ల సర్వలోకాలు ప్రకాశిస్తున్నాయో ఆ పరమేశ్వరి లలితా.

లోకములు అంటే కిరణాలు. అదే 'అణిమాదిభిరావృతాం మయూఖైః'. మొత్తం ఎనిమిది ఆవరణలలో ఉన్న ఆవరణ దేవతలందరూ లోకములైతే, వాటికి అతీతముగా బిందువునందు ప్రకాశిస్తున్న తల్లి 'లలితాంబికా'

లలితాంబికా నామానికి అర్థాలు ఇప్పటికే ఎన్నో చెప్పుకున్నాము. వాటిని గుర్తు తెచ్చుకోవాలి. మహాలావణ్యశేవధిః. 'లోకాతీత లావణ్యాత్ లలితా' అని మత్స్యపురాణం చెప్పిన ప్రకారంగా లోకాతీత లావణ్యమే లలితా. దీనినే గతంలో 'లోకాతీతా', 'గుణాతీతా', 'సర్వాతీతా', 'శమాత్మికా' దగ్గర చెప్పుకున్నాము. లోకాతీత లావణ్యమని ఒకటి లోకావరణలన్నీ దాటి ప్రకాశిస్తున్నది.

'శోభా విలాస మాధుర్య గాంభీర్యస్థైర్యతేజసి, లాలిత్యం తత ఔదార్యం ఇత్యష్టౌ సత్త్వజాః పౌరుషా గుణాః'. ఉత్తమగుణాలైన శోభ, విలాసము, మాధుర్యము, గాంభీర్యము, స్థైర్యము, తేజస్సు, లాలిత్యము, ఔదార్యము – ఈ గుణాలన్నిటి కలయికే 'లలితా'. అటువంటి లాలిత్యస్వరూపిణియే తల్లి కనుక 'లలితాంబికా'.

అన్నిటినీ అతిశయించిన ప్రకాశస్వరూపం, షోడశకళాస్వరూపిణి. మంగళములను తెలియజేసే శబ్దమే లలిత. జగజ్జనని కనుక అంబిక.

'లాలనాత్ లలితాభిదా' – లాలించడం చేత లలితా. లాలించుట అంటే ఆనందమును కలిగించుట. ప్రపంచాన్నంతటిని పెంచి, పోషించి, లాలించే తల్లే లలిత.

'సదాశివస్య మనసో లాలనాత్ లలితాభిదా' – బ్రహ్మాండపురాణంలో చెప్పిన నిర్వచనం. 'సదాశివస్య మనసో' – పరమేశ్వరుని మనస్సును ఆనందింపజేస్తోంది

కనుక లలితా. పరమేశ్వరుని యొక్క ఆనందశక్తి. ఆయన జ్ఞానమైతే, ఈవిడ ఆనందం. జ్ఞానానికి, ఆనందానికి భేదం లేదు. 'ఆనందమే అందం' అని చెప్పుకున్నాము. అందం పేరే లలిత.

'ధనురైక్షమస్త్రాణ్యపి కుసుమాని తథాఽఖిలం లలితమిత్యంబికా' – ధనుస్సు – ఇక్షుశరం, అస్త్రములు – కుసుమాలు, సర్వము సుకుమారమే. సౌకుమార్య సౌమ్య తత్త్వమే లలిత.

ప్రయాగపీఠాధిదేవతా నామం లలిత.

'శ్రీమాతా' అని ప్రస్తావించి ప్రస్తుతించి **'శ్రీలలితాంబికా'** నామంతో పూర్తి చేయడం జగన్మాతృతత్త్వాన్ని మాలికగా సంతరించిన వశిన్యాది వాగ్దేవతల గొప్ప కవిత్వమది. తొమ్మిది వందల తొంబది తొమ్మిది నామాల సారమంతా ఈ నామము.

శ్రీచక్రరాజాన బిందుపీఠంలో ఉన్న లలితాదేవి దివ్యచరణాలకు నమస్కరిస్తూ....

సర్వం శ్రీశ్రీశ్రీ లలితామహాత్రిపురసున్దరీపరాభట్టారికా
శ్రీమద్రాజరాజేశ్వరీ చరణారవిన్దార్పణమస్తు

శ్రీ లలితా సహస్రనామ స్తోత్రమ్

పూర్వపీఠికా-

అగస్త్య ఉవాచ-

అశ్వానన మహాబుద్ధే సర్వశాస్త్రవిశారద,
కథితం లలితాదేవ్యాః చరితం పరమాద్భుతం. 1
పూర్వం ప్రాదుర్భవో మాతుః తతః పట్టాభిషేచనమ్,
భండాసురవధశ్చైవ విస్తరేణ త్వయోదితః. 2
వర్ణితం శ్రీపురం చాపి మహావిభవవిస్తరమ్,
శ్రీమత్పంచదశాక్షర్యాః మహిమా వర్ణితస్తథా. 3
షోఢాన్యాసాదయో దేవ్యాః న్యాసఖండే సమీరితాః,
అంతర్యాగక్రమశ్చైవ బహిర్యాగక్రమస్తథా. 4
మహాయాగక్రమశ్చైవ పూజాఖండే ప్రకీర్తితాః,
పురశ్చరణఖణ్డే తు జపలక్షణమీరితమ్. 5
హోమఖణ్డే త్వయా ప్రోక్తో హోమద్రవ్యవిధిక్రమః,
చక్రరాజస్య విద్యాయాః శ్రీదేవ్యా దేశికాత్మనోః. 6
రహస్యఖణ్డే తాదాత్మ్యం పరస్పరముదీరితం,
స్తోత్రఖణ్డే బహువిధాః స్తుతయః పరికీర్తితాః. 7
మన్త్రిణీ దణ్డినీదేవ్యోః ప్రోక్తే నామసహస్రకే,
న తు శ్రీలలితాదేవ్యాః ప్రోక్తం నామసహస్రకమ్. 8
తత్ర మే సంశయో జాతో హయగ్రీవ దయానిధే,
కిం వా త్వయా విస్మృతం తత్ జ్ఞాత్వా వా సముపేక్షితమ్. 9
మమ వా యోగ్యతా నాస్తి శ్రోతుం నామసహస్రకమ్,
కిమర్థం భవతా నోక్తం తత్ర మే కారణం వద. 10

సూత ఉవాచ-

ఇతి పృష్టో హయగ్రీవో మునినా కుంభజన్మనా,
ప్రహృష్టో వచనం ప్రాహ తాపసం కుంభసంభవమ్. 11

శ్రీహయగ్రీవ ఉవాచ-

లోపాముద్రాపతేఽగస్త్య సావధానమనాః శృణు,
నామ్నాం సహస్రం యన్నోక్తం కారణం తద్వదామి తే. 12
రహస్యమితి మత్వాఽహం నోక్తవాంస్తే న చాన్యథా,
పునశ్చ పృచ్ఛసే భక్త్యా తస్మాత్తత్తే వదామ్యహమ్. 13
బ్రూయాచ్ఛిష్యాయ భక్తాయ రహస్యమపి దేశికః,
భవతా న ప్రదేయం స్యాదభక్తాయ కదాచన. 14
న శఠాయ న దుష్టాయ నావిశ్వాసాయ కర్హిచిత్,
శ్రీమాతృభక్తియుక్తాయ శ్రీవిద్యారాజవేదినే. 15
ఉపాసకాయ శుద్ధాయ దేయం నామసహస్రకమ్,
యాని నామసహస్రాణి సద్యః సిద్ధిప్రదాని వై. 16
తన్త్రేషు లలితాదేవ్యాస్తేషు ముఖ్యమిదం మునే,
శ్రీవిద్యైవ తు మన్త్రాణాం తత్ర కాదిర్యథా పరా. 17
పురాణాం శ్రీపురమివ శక్తీనాం లలితా యథా,
శ్రీవిద్యోపాసకానాం చ యథా దేవో పరః శివః. 18
తథా నామసహస్రేషు పరమేతత్ ప్రకీర్తితమ్,
యథాస్య పఠనాద్దేవీ ప్రీయతే లలితామ్బికా. 19
అన్యనామసహస్రస్య పాఠాన్న ప్రీయతే తథా,
శ్రీమాతుః ప్రీతయే తస్మాదనిశం కీర్తయేదిదమ్. 20
బిల్వపత్రైశ్చక్రరాజే యోఽర్చయేల్లలితామ్బికామ్,
పద్మైర్వా తులసీపత్రైరేభిర్నామసహస్రకైః. 21

సద్యః ప్రసాదం కురుతే తస్య సింహాసనేశ్వరీ,
చక్రాధిరాజమభ్యర్చ్య జప్త్వా పంచదశాక్షరీమ్. 22
జపాన్తే కీర్తయేన్నిత్యమిదం నామసహస్రకమ్,
జపపూజాద్యశక్తో౽పి పఠేన్నామసహస్రకమ్. 23
సాఙ్గార్చనే సాఙ్గజపే యత్ఫలం తదవాప్నుయాత్,
ఉపాసనే స్తుతీరన్యాః పఠేదభ్యుదయో హి సః. 24
ఇదం నామసహస్రం తు కీర్తయేన్నిత్యకర్మవత్,
చక్రరాజార్చనం దేవ్యా జపో నామ్నాం చ కీర్తనం. 25
భక్తస్య కృత్యమేతావదన్యదభ్యుదయం విదుః,
భక్తస్యావశ్యకమిదం నామసాహస్రకీర్తనం. 26
తత్ర హేతుం ప్రవక్ష్యామి శ్రుణు త్వం కుంభసంభవ,
పురా శ్రీలలితాదేవీ భక్తానాం హితకామ్యయా. 27
వాగ్దేవీర్వశినీముఖ్యాః సమాహూయేదమబ్రవీత్,

దేవ్యువాచ

వాగ్దేవతా వశిన్యాద్యాః శృణుధ్వం వచనం మమ. 28
భవత్యో మత్ప్రసాదేన ప్రోల్లసద్వాగ్విభూతయః,
మద్భక్తానాం వాగ్విభూతిప్రదానే వినియోజితాః. 29
మచ్చక్రస్య రహస్యజ్ఞా మమ నామపరాయణాః,
మమ స్తోత్రవిధానాయ తస్మాదాజ్ఞాపయామి వః. 30
కురుధ్వమంకితం స్తోత్రం మమ నామసహస్రకైః,
యేన భక్తైః స్తుతాయా మే సద్యః ప్రీతిః పరా భవేత్. 31

హయగ్రీవ ఉవాచ

ఇత్యాజ్ఞప్తా వచో దేవ్యః శ్రీదేవ్యా లలితాంబయా,
రహస్యైర్నామభిర్దివ్యైశ్చక్రుః స్తోత్రమనుత్తమం. 32

రహస్యనామసాహస్రమితి తద్విశ్రుతం పరమ్,
తతః కదాచిత్సదసి స్థిత్వా సింహాసనేఽమ్బికా. 33
స్వసేవావసరం ప్రాదాత్ సర్వేషాం కుమ్భసంభవ,
సేవార్థమాగతాస్తత్ర బ్రహ్మాణీ బ్రహ్మకోటయః. 34
లక్ష్మీనారాయణానాం చ కోటయః సముపాగతాః,
గౌరీకోటిసమేతానాం రుద్రాణామపి కోటయః. 35
మన్త్రిణీదణ్డినీముఖ్యాః సేవార్థం యాస్సమాగతాః,
శక్తయో వివిధాకారాస్తాసాం సంఖ్యా న విద్యతే. 36
దివ్యౌఘా మానవౌఘాశ్చ సిద్ధౌఘాశ్చ సమాగతాః,
తత్ర శ్రీలలితాదేవీ సర్వేషాం దర్శనం దదౌ. 37
తేషు దృష్ట్వోపవిష్టేషు స్వే స్వే స్థానే యథాక్రమమ్,
తతః శ్రీలలితాదేవీకటాక్షాక్షేపచోదితాః. 38
ఉత్థాయ వశినీముఖ్యా బద్ధాంజలిపుటాస్తదా,
అస్తువన్నామసాహస్రై స్వకృతైర్లలితాంబికామ్. 39
శ్రుత్వా స్తవం ప్రసన్నాఽభూల్లలితా పరమేశ్వరీ,
సర్వే తే విస్మయం జగ్ముర్యే తత్ర సదసి స్థితాః. 40
తతః ప్రోవాచ లలితా సదస్యాన్ దేవతాగణాన్,
మమాజ్ఞయైవ వాగ్దేవ్యశ్చక్రుః స్తోత్రమనుత్తమమ్. 41
అంకితం నామభిర్దివ్యైర్మమ ప్రీతివిధాయకైః,
తత్పఠధ్వం సదా యూయం స్తోత్రం మత్ప్రీతివృద్ధయే. 42
ప్రవర్తయధ్వం భక్తేషు మమ నామసహస్రకమ్,
ఇదం నామసహస్రం మే యో భక్తః పఠతేఽసకృత్. 43
మమ ప్రియతమో జ్ఞేయస్తస్మై కామాన్ దదామ్యహమ్,
శ్రీచక్రే మాం సదాభ్యర్చ్య జప్త్వా పంచదశాక్షరీమ్. 44
పశ్చాన్నామసహస్రం మే కీర్తయేన్మమ తుష్టయే,

మామర్చయతు వా మా వా విద్యాం జపతు వా న వా. 45
కీర్తయేన్నామసాహస్రమిదం మత్ప్రీతయే సదా,
మత్ప్రీత్యా సకలాన్ కామాన్‌లభతే నాత్ర సంశయః. 46
తస్మాన్నామసహస్రం మే కీర్తయధ్వం సదాదరాత్,

శ్రీహయగ్రీవ ఉవాచ

ఇతి శ్రీలలితేశానీ శాస్తి దేవాన్ సహానుగాన్. 47
తదాజ్ఞయా తదారభ్య బ్రహ్మావిష్ణుమహేశ్వరాః,
శక్తయో మన్త్రిణీముఖ్యా ఇదం నామసహస్రకమ్. 48
పఠన్తి భక్త్యా సతతం లలితాపరితుష్టయే,
తస్మాదవశ్యం భక్తేన కీర్తనీయమిదం మునే. 49
ఆవశ్యకత్వే హేతుస్తే మయా ప్రోక్తో మునీశ్వర,
ఇదానీం నామసాహస్రం వక్ష్యామి శ్రద్ధయా శ్రుణు. 50

ఇతి పూర్వపీఠికా సమాప్తః

శ్రీ లలితా సహస్రనామ స్తోత్రమ్

అస్యశ్రీ లలితా సహస్రనామ స్తోత్ర మాలా మహామన్త్రస్య, వశిన్యాది వాగ్దేవతా ఋషయః, అనుష్టుప్ఛన్దః, శ్రీ లలితామహాత్రిపురసుందరీ దేవతా, శ్రీ లలితామహా త్రిపురసుందరీ ప్రసాదసిద్ధ్యర్థే జపే వినియోగః...

ధ్యానమ్

సిన్దూరారుణవిగ్రహాం త్రినయనాం మాణిక్య మౌలిస్ఫురత్,
తారానాయకశేఖరాం స్మితముఖీమాపీనవక్షోరుహామ్,
పాణిభ్యామలిపూర్ణ రత్నచషకం రక్తోత్పలం బిభ్రతీం,
సౌమ్యాం రత్నఘటస్థ రక్తచరణాం ధ్యాయేత్పరామంబికామ్.

అరుణాం కరుణాతరంగితాక్షీం
ధృతపాశాంకుశ పుష్పబాణచాపామ్
అణిమాదిభిరావృతాం మయూఖైః
అహమిత్యేవ విభావయే భవానీమ్.

ధ్యాయేత్ పద్మాసనస్థాం వికసితవదనాం పద్మపత్రాయతాక్షీం
హేమాభాం పీతవస్త్రాం కరకలిత లసద్ధేమ పద్మాం వరాంగీమ్
సర్వాలంకారయుక్తాం సతతమభయదాం భక్తనమ్రాం భవానీం
శ్రీవిద్యాం శాన్తమూర్తిం సకలసురనుతాం సర్వసంపత్ప్రదాత్రీమ్.

సకుంకుమవిలేపనామళికచుమ్బి కస్తూరికాం
సమన్దహసితేక్షణాం సశరచాపపాశాంకుశామ్,
అశేషజనమోహినీమ్ అరుణమాల్యభూషోజ్జ్వలాం
జపాకుసుమభాసురాం జపవిధౌ స్మరేదమ్బికామ్.

లం- పృథ్వీ తత్త్వాత్మికాయై శ్రీ లలితాదేవ్యై గంధం పరికల్పయామి ం.
హం- ఆకాశ తత్త్వాత్మికాయై శ్రీ లలితాదేవ్యై పుష్పం పరికల్పయామి.
యం- వాయు తత్త్వాత్మికాయై శ్రీ లలితాదేవ్యై ధూపం పరికల్పయామి.
రం- వహ్ని తత్త్వాత్మికాయై శ్రీలలితాదేవ్యై దీపం పరికల్పయామి.
వం- అమృత తత్త్వాత్మికాయై శ్రీ లలితాదేవ్యై అమృత నైవేద్యం పరికల్పయామి.
సం- సర్వ తత్త్వాత్మికాయై శ్రీ లలితాదేవ్యై తాంబూలాది సర్వోపచారాన్ పరికల్పయామి.

శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ,
చిదగ్నికుండసమ్భూతా దేవకార్యసముద్యతా. –1
ఉద్యద్భానుసహస్రాభా చతుర్బాహుసమన్వితా,
రాగస్వరూపపాశాఢ్యా క్రోధాకారాంకుశోజ్జ్వలా. –2
మనోరూపేక్షుకోదండా పంచతన్మాత్రసాయకా,
నిజారుణప్రభాపూరమజ్జద్బ్రహ్మాండమండలా. –3
చమ్పకాశోకపున్నాగసౌగన్ధికలసత్కచా,
కురువిందమణిశ్రేణీకనత్కోటీరమండితా. –4
అష్టమీచంద్రవిభ్రాజదళికస్థలశోభితా,
ముఖచన్ద్రకళంకాభమృగనాభివిశేషకా. –5
వదనస్మరమాంగల్యగృహతోరణచిల్లికా,
వక్త్రలక్ష్మీపరీవాహచలన్మీనాభలోచనా. –6
నవచంపకపుష్పాభనాసాదండవిరాజితా,
తారాకాంతితిరస్కారినాసాభరణభాసురా. –7
కదంబమంజరీకప్తకర్ణపూరమనోహరా,
తాటంకయుగళీభూతతపనోడుపమండలా. –8
పద్మరాగశిలాదర్శపరిభావికపోలభూః,
నవవిద్రుమబింబశ్రీన్యక్కారిరదనచ్ఛదా. –9
శుద్ధవిద్యాంకురాకారద్విజపంక్తిద్వయోజ్జ్వలా,
కర్పూరవీటికామోదసమాకర్షద్దిగంతరా. –10
నిజసల్లాపమాధుర్యవినిర్భర్త్సితకచ్ఛపీ,
మందస్మితప్రభాపూరమజ్జత్కామేశమానసా. –11
అనాకలితసాదృశ్యచిబుకశ్రీవిరాజితా,
కామేశబద్ధమాంగల్యసూత్రశోభితకంధరా. –12
కనకాంగదకేయూరకమనీయభుజాన్వితా,
రత్నగ్రైవేయచింతాకలోలముక్తాఫలాన్వితా. –13
కామేశ్వరప్రేమరత్నమణిప్రతిపణస్తనీ,
నాభ్యాలవాలరోమాలిలతాఫలకుచద్వయీ. –14
లక్ష్యరోమలతాధారతాసమున్నేయమధ్యమా,

స్తనభారదళన్మధ్యపట్టబంధవళిత్రయా. –15
అరుణారుణకౌసుంభవస్త్రభాస్వత్కటీతటీ,
రత్నకింకిణికారమ్యరశనాదామభూషితా. –16
కామేశజ్ఞాతసౌభాగ్యమార్దవోరుద్వయాన్వితా,
మాణిక్యమకుటాకారజానుద్వయవిరాజితా. –17
ఇంద్రగోపపరిక్షిప్తస్మరతూణాభజంఘికా,
గూఢగుల్ఫా కూర్మపృష్ఠజయిష్ణుప్రపదాన్వితా. –18
నఖదీధితిసంఛన్ననమజ్జనతమోగుణా,
పదద్వయప్రభాజాలపరాకృతసరోరుహా. –19
శింజానమణిమంజీరమండితశ్రీపదాంబుజా,
మరాళీమందగమనా మహాలావణ్యశేవధిః. –20
సర్వారుణాఽనవద్యాంగీ సర్వాభరణభూషితా,
శివా కామేశ్వరాంకస్థా శివస్వాధీనవల్లభా. –21
సుమేరుమధ్యశృంగస్థా శ్రీమన్నగరనాయికా,
చింతామణిగృహాంతస్థా పంచబ్రహ్మాసనస్థితా. –22
మహాపద్మాటవీసంస్థా కదంబవనవాసినీ,
సుధాసాగరమధ్యస్థా కామాక్షీ కామదాయినీ. –23
దేవర్షిగణసంఘాతస్తూయమానాత్మవైభవా,
భండాసురవధోద్యుక్తశక్తిసేనాసమన్వితా. –24
సంపత్కరీసమారూఢసింధురవ్రజసేవితా,
అశ్వారూఢాధిష్ఠితాశ్వకోటికోటిభిరావృతా. –25
చక్రరాజరథారూఢసర్వాయుధపరిష్కృతా,
గేయచక్రరథారూఢమంత్రిణీపరిసేవితా. –26
కిరిచక్రరథారూఢదండనాథాపురస్కృతా,
జ్వాలామాలినికాక్షిప్తవహ్నిప్రాకారమధ్యగా. –27
భండసైన్యవధోద్యుక్తశక్తివిక్రమహర్షితా,
నిత్యాపరాక్రమాటోపనిరీక్షణసముత్సుకా. –28
భండపుత్రవధోద్యుక్తబాలావిక్రమనందితా,

మంత్రిణ్యంబావిరచితవిశుక్రవధతోషితా. -29
విషంగప్రాణహరణవారాహీవీర్యనందితా,
కామేశ్వరముఖాలోకకల్పితశ్రీగణేశ్వరా. -30
మహాగణేశనిర్భిన్నవిఘ్నయంత్రప్రహర్షితా,
భండాసురేంద్రనిర్ముక్తశస్త్రప్రత్యస్త్రవర్షిణీ. -31
కరాంగులినఖోత్పన్ననారాయణదశాకృతిః,
మహాపాశుపతాస్త్రాగ్నినిర్దగ్ధాసురసైనికా. -32
కామేశ్వరాస్త్రనిర్దగ్ధసభండాసురశూన్యకా,
బ్రహ్మోపేంద్రమహేంద్రాదిదేవసంస్తుతవైభవా. -33
హరనేత్రాగ్నిసందగ్ధకామసంజీవనౌషధిః,
శ్రీమద్వాగ్భవకూటైకస్వరూపముఖపంకజా. -34
కంఠాధఃకటిపర్యంతమధ్యకూటస్వరూపిణీ,
శక్తికూటైకతాపన్నకట్యధోభాగధారిణీ. -35
మూలమంత్రాత్మికా మూలకూటత్రయకలేబరా,
కులామృతైకరసికా కులసంకేతపాలినీ. -36
కులాంగనా కులాంతస్థా కౌలినీ కులయోగినీ,
అకులా సమయాంతస్థా సమయాచారతత్పరా. -37
మూలాధారైకనిలయా బ్రహ్మగ్రంథివిభేదినీ,
మణిపూరాంతరుదితా విష్ణుగ్రంథివిభేదినీ. -38
ఆజ్ఞాచక్రాంతరాలస్థా రుద్రగ్రంథివిభేదినీ,
సహస్రారాంబుజారూఢా సుధాసారాభివర్షిణీ. -39
తటిల్లతాసమరుచిష్షట్చక్రోపరిసంస్థితా,
మహాసక్తిః కుండలినీ బిసతంతుతనీయసీ. -40
భవానీ భావనాగమ్యా భవారణ్యకుఠారికా,
భద్రప్రియా భద్రమూర్తిర్భక్తసౌభాగ్యదాయినీ. -41
భక్తిప్రియా భక్తిగమ్యా భక్తివశ్యా భయాపహా,
శాంభవీ శారదారాధ్యా శర్వాణీ శర్మదాయినీ. -42
శాంకరీ శ్రీకరీ సాధ్వీ శరచ్చంద్రనిభాననా,
శాతోదరీ శాంతిమతీ నిరాధారా నిరంజనా. -43

నిర్లేపా నిర్మలా నిత్యా నిరాకారా నిరాకులా,
నిర్గుణా నిష్కలా శాంతా నిష్కామా నిరుపప్లవా. -44
నిత్యముక్తా నిర్వికారా నిష్ప్రపంచా నిరాశ్రయా,
నిత్యశుద్ధా నిత్యబుద్ధా నిరవద్యా నిరంతరా. -45
నిష్కారణా నిష్కలంకా నిరుపాధిర్నిరీశ్వరా,
నీరాగా రాగమథనీ నిర్మదా మదనాశినీ. -46
నిశ్చింతా నిరహంకారా నిర్మోహా మోహనాశినీ,
నిర్మమా మమతాహంత్రీ నిష్పాపా పాపనాశినీ. -47
నిష్క్రోధా క్రోధశమనీ నిర్లోభా లోభనాశినీ,
నిస్సంశయా సంశయఘ్నీ నిర్భవా భవనాశినీ. -48
నిర్వికల్పా నిరాబాధా నిర్భేదా భేదనాశినీ,
నిర్నాశా మృత్యుమథనీ నిష్క్రియా నిష్పరిగ్రహా. -49
నిస్తులా నీలచికురా నిరపాయా నిరత్యయా,
దుర్లభా దుర్గమా దుర్గా దుఃఖహన్త్రీ సుఖప్రదా. -50
దుష్టదూరా దురాచారశమనీ దోషవర్జితా,
సర్వజ్ఞా సాన్ద్రకరుణా సమానాధికవర్జితా. -51
సర్వశక్తిమయీ సర్వమంగళా సద్గతిప్రదా,
సర్వేశ్వరీ సర్వమయీ సర్వమన్త్రస్వరూపిణీ. -52
సర్వయంత్రాత్మికా సర్వతంత్రరూపా మనోన్మనీ,
మాహేశ్వరీ మహాదేవీ మహాలక్ష్మీర్మృడప్రియా, -53
మహారూపా మహాపూజ్యా మహాపాతకనాశినీ,
మహామాయా మహాసత్త్వా మహాశక్తిర్మహారతిః. -54
మహాభోగా మహైశ్వర్యా మహావీర్యా మహాబలా,
మహాబుద్ధిర్మహాసిద్ధిర్మహాయోగేశ్వరేశ్వరీ. -55
మహాతంత్రా మహామంత్రా మహాయంత్రా మహాసనా,
మహాయాగక్రమారాధ్యా మహాభైరవపూజితా. - 56
మహేశ్వరమహాకల్పమహాతాణ్డవసాక్షిణీ,
మహాకామేశమహిషీ మహాత్రిపురసుందరీ. -57
చతుష్షష్ట్యుపచారాఢ్యా చతుష్షష్టికలామయీ,

మహాచతుష్షష్టికోటియోగినీగణసేవితా. -58

మనువిద్యా చన్ద్రవిద్యా చన్ద్రమండలమధ్యగా,
చారురూపా చారుహాసా చారుచన్ద్రకలాధరా. -59

చరాచరజగన్నాథా చక్రరాజనికేతనా,
పార్వతీ పద్మనయనా పద్మరాగసమప్రభా. -60

పంచప్రేతాసనాసీనా పంచబ్రహ్మస్వరూపిణీ,
చిన్మయీ పరమానన్దా విజ్ఞానఘనరూపిణీ. -61

ధ్యానధ్యాతృధ్యేయరూపా ధర్మాధర్మవివర్జితా,
విశ్వరూపా జాగరిణీ స్వపన్తీ తైజసాత్మికా. -62

సుప్తా ప్రాజ్ఞాత్మికా తుర్యా సర్వావస్థావివర్జితా,
సృష్టికర్త్రీ బ్రహ్మరూపా గోప్త్రీ గోవిందరూపిణీ. -63

సంహారిణీ రుద్రరూపా తిరోధానకరీశ్వరీ,
సదాశివానుగ్రహదా పంచకృత్యపరాయణా. -64

భానుమండలమధ్యస్థా భైరవీ భగమాలినీ,
పద్మాసనా భగవతీ పద్మనాభసహోదరీ. -65

ఉన్మేషనిమిషోత్పన్నవిపన్నభువనావళిః,
సహస్రశీర్షవదనా సహస్రాక్షీ సహస్రపాత్. -66

ఆబ్రహ్మకీటజననీ వర్ణాశ్రమవిధాయినీ,
నిజాజ్ఞారూపనిగమా పుణ్యాపుణ్యఫలప్రదా. -67

శ్రుతిసీమన్తసిందూరీకృతపాదాబ్జధూళికా,
సకలాగమసన్దోహశుక్తిసంపుటమౌక్తికా. -68

పురుషార్థప్రదా పూర్ణా భోగినీ భువనేశ్వరీ,
అంబికా–నాదినిధనా హరిబ్రహ్మేంద్రసేవితా. -69

నారాయణీ నాదరూపా నామరూపవివర్జితా,
హ్రీంకారీ హ్రీమతీ హృద్యా హేయోపాదేయవర్జితా. -70

రాజరాజార్చితా రాజ్ఞీ రమ్యా రాజీవలోచనా,
రంజనీ రమణీ రస్యా రణత్కింకిణిమేఖలా. -71

రమా రాకేందువదనా రతిరూపా రతిప్రియా,
రక్షాకరీ రాక్షసఘ్నీ రామా రమణలంపటా. -72

కామ్యా కామకలారూపా కదంబకుసుమప్రియా,
కల్యాణీ జగతీకందా కరుణారససాగరా. -73
కలావతీ కలాలాపా కాన్తా కాదంబరీప్రియా,
వరదా వామనయనా వారుణీమదవిహ్వలా. -74
విశ్వాధికా వేదవేద్యా విన్ధ్యాచలనివాసినీ,
విధాత్రీ వేదజననీ విష్ణుమాయావిలాసినీ. -75
క్షేత్రస్వరూపా క్షేత్రేశీ క్షేత్రక్షేత్రజ్ఞపాలినీ,
క్షయవృద్ధివినిర్ముక్తా క్షేత్రపాలసమర్చితా. - 76
విజయా విమలా వన్ద్యా వన్దారుజనవత్సలా,
వాగ్వాదినీ వామకేశీ వహ్నిమణ్డలవాసినీ. -77
భక్తిమత్కల్పలతికా పశుపాశవిమోచనీ,
సంహృతాశేషపాషండా సదాచారప్రవర్తికా. -78
తాపత్రయాగ్నిసంతప్తసమాహ్లాదనచన్ద్రికా,
తరుణీ తాపసారాధ్యా తనుమధ్యా తమోపహా. -79
చితిస్తత్పదలక్ష్యార్థా చిదేకరసరూపిణీ,
స్వాత్మానన్దలవీభూతబ్రహ్మాద్యానన్దసంతతిః -80
పరా ప్రత్యక్చితీరూపా పశ్యన్తీ పరదేవతా,
మధ్యమా వైఖరీరూపా భక్తమానసహంసికా. -81
కామేశ్వరప్రాణనాడీ కృతజ్ఞా కామపూజితా,
శృంగారరససంపూర్ణా జయా జాలంధరస్థితా. -82
ఓడ్యాణపీఠనిలయా బిన్దుమండలవాసినీ,
రహోయాగక్రమారాధ్యా రహస్తర్పణతర్పితా. -83
సద్యఃప్రసాదినీ విశ్వసాక్షిణీ సాక్షివర్జితా,
షడంగదేవతాయుక్తా షాడ్గుణ్యపరిపూరితా. -84
నిత్యక్లిన్నా నిరుపమా నిర్వాణసుఖదాయినీ,
నిత్యా షోడశికారూపా శ్రీకంఠార్ధశరీరిణీ. -85
ప్రభావతీ ప్రభారూపా ప్రసిద్ధా పరమేశ్వరీ,
మూలప్రకృతిరవ్యక్తా వ్యక్తావ్యక్తస్వరూపిణీ. -86
వ్యాపినీ వివిధాకారా విద్యాఽవిద్యా స్వరూపిణీ,

మహాకామేశనయనకుముదాహ్లాదకౌముదీ. -87

భక్తహార్దతమోభేదభానుమద్భానుసన్తతిః,

శివదూతీ శివారాధ్యా శివమూర్తిశ్శివంకరీ. -88

శివప్రియా శివపరా శిష్టేష్టా శిష్టపూజితా,

అప్రమేయా స్వప్రకాశా మనోవాచామగోచరా. -89

చిచ్ఛక్తిశ్చేతనారూపా జడశక్తిర్జడాత్మికా,

గాయత్రీ వ్యాహృతిస్సంధ్యా ద్విజబృన్దనిషేవితా. -90

తత్త్వాసనా తత్త్వమయీ పంచకోశాంతరస్థితా,

నిస్సీమమహిమా నిత్యయౌవనా మదశాలినీ. -91

మదఘూర్ణితరక్తాక్షీ మదపాటలగణ్డభూః,

చందనద్రవదిగ్ధాంగీ చాంపేయకుసుమప్రియా. -92

కుశలా కోమలాకారా కురుకుల్లా కులేశ్వరీ,

కులకుణ్డాలయా కౌలమార్గతత్పరసేవితా. -93

కుమారగణనాథాంబా తుష్టిః పుష్టిర్మతిర్ధృతిః,

శాన్తిస్స్వస్తిమతీ కాంతిర్నన్దినీ విఘ్ననాశినీ. -94

తేజోవతీ త్రినయనా లోలాక్షీ కామరూపిణీ,

మాలినీ హంసినీ మాతా మలయాచలవాసినీ. -95

సుముఖీ నళినీ సుభ్రూః శోభనా సురనాయికా.

క(కా)లకంఠీ కాంతిమతీ క్షోభిణీ సూక్ష్మరూపిణీ. -96

వజ్రేశ్వరీ వామదేవీ వయోవస్థావివర్జితా,

సిద్ధేశ్వరీ సిద్ధవిద్యా సిద్ధమాతా యశస్వినీ. -97

విశుద్ధిచక్రనిలయాఽఽరక్తవర్ణా త్రిలోచనా,

ఖట్వాంగాదిప్రహరణా వదనైకసమన్వితా. -98

పాయసాన్నప్రియా త్వక్స్థా పశులోకభయంకరీ,

అమృతాదిమహాశక్తిసంవృతా డాకినీశ్వరీ. -99

అనాహతాబ్జనిలయా శ్యామాభా వదనద్వయా,

దంష్ట్రోజ్జ్వలాఽక్షమాలాదిధరా రుధిరసంస్థితా. -100

కాళరాత్ర్యాదిశక్త్యౌఘవృతా స్నిగ్ధౌదనప్రియా,

మహావీరేంద్రవరదా రాకిణ్యంబాస్వరూపిణీ. –101

మణిపూరాబ్జనిలయా వదనత్రయసంయుతా,

వజ్రాదికాయుధోపేతా డామర్యాదిభిరావృతా. –102

రక్తవర్ణా మాంసనిష్ఠా గుడాన్నప్రీతమానసా,

సమస్తభక్తసుఖదా లాకిన్యంబాస్వరూపిణీ. –103

స్వాధిష్ఠానాంబుజగతా చతుర్వక్త్రమనోహరా,

శూలాద్యాయుధసంపన్నా పీతవర్ణాఽతిగర్వితా. –104

మేదోనిష్ఠా మధుప్రీతా బన్దిన్యాదిసమన్వితా,

దధ్యన్నాసక్తహృదయా కాకినీరూపధారిణీ. –105

మూలాధారాంబుజారూఢా పంచవక్త్రాఽస్థిసంస్థితా,

అంకుశాదిప్రహరణా వరదాదినిషేవితా. –106

ముద్గౌదనాసక్తచిత్తా సాకిన్యంబాస్వరూపిణీ,

ఆజ్ఞాచక్రాబ్జనిలయా శుక్లవర్ణా షడాననా. –107

మజ్జాసంస్థా హంసవతీముఖ్యశక్తిసమన్వితా,

హరిద్రాన్నైకరసికా హాకినీరూపధారిణీ. –108

సహస్రదళపద్మస్థా సర్వవర్ణోపశోభితా,

సర్వాయుధధరా శుక్లసంస్థితా సర్వతోముఖీ. –109

సర్వౌదనప్రీతచిత్తా యాకిన్యంబాస్వరూపిణీ,

స్వాహా స్వధా మతిర్మేధా శ్రుతిః స్మృతిరనుత్తమా. –110

పుణ్యకీర్తిః పుణ్యలభ్యా పుణ్యశ్రవణకీర్తనా,

పులోమజార్చితా బంధమోచనీ బర్బరాలకా. –111

విమర్శరూపిణీ విద్యా వియదాదిజగత్ప్రసూః,

సర్వవ్యాధిప్రశమనీ సర్వమృత్యునివారిణీ. –112

అగ్రగణ్యాఽచింత్యరూపా కలికల్మషనాశినీ,

కాత్యాయనీ కాలహంత్రీ కమలాక్షనిషేవితా. –113

తాంబూలపూరితముఖీ దాడిమీకుసుమప్రభా,

మృగాక్షీ మోహినీ ముఖ్యా మృడానీ మిత్రరూపిణీ. –114

నిత్యతృప్తా భక్తనిధిర్నియన్త్రీ నిఖిలేశ్వరీ,
మైత్ర్యాదివాసనాలభ్యా మహాప్రళయసాక్షిణీ. –115
పరాశక్తిః పరానిష్ఠా ప్రజ్ఞానఘనరూపిణీ,
మాధ్వీపానాలసా మత్తా మాతృకావర్ణరూపిణీ. –116
మహాకైలాసనిలయా మృణాలమృదుదోర్లతా,
మహనీయా దయామూర్తిర్మహాసామ్రాజ్యశాలినీ. –117
ఆత్మవిద్యా మహావిద్యా శ్రీవిద్యా కామసేవితా,
శ్రీషోడశాక్షరీవిద్యా త్రికూటా కామకోటికా. –118
కటాక్షకింకరీభూతకమలాకోటిసేవితా,
శిరఃస్థితా చంద్రనిభా భాలస్థేంద్రధనుఃప్రభా. –119
హృదయస్థా రవిప్రఖ్యా త్రికోణాంతరదీపికా,
దాక్షాయణీ దైత్యహన్త్రీ దక్షయజ్ఞవినాశినీ. –120
దరాన్దోళితదీర్ఘాక్షీ దరహాసోజ్జ్వలన్ముఖీ,
గురుమూర్తిర్గుణనిధిర్గోమాతా గుహజన్మభూః. –121
దేవేశీ దండనీతిస్థా దహరాకాశరూపిణీ,
ప్రతిపన్ముఖ్యరాకాంతతిథిమండలపూజితా. –122
కలాత్మికా కలానాథా కావ్యాలాపవినోదినీ,
సచామరరమావాణీసవ్యదక్షిణసేవితా. –123
ఆదిశక్తిరమేయాఽఽత్మా పరమా పావనాకృతిః,
అనేకకోటిబ్రహ్మాండజననీ దివ్యవిగ్రహా. –124
క్లీంకారీ కేవలా గుహ్యా కైవల్యపదదాయినీ,
త్రిపురా త్రిజగద్వంద్యా త్రిమూర్తిస్త్రిదశేశ్వరీ. –125
త్ర్యక్షరీ దివ్యగంధాఢ్యా సిన్దూరతిలకాంచితా,
ఉమా శైలేన్ద్రతనయా గౌరీ గంధర్వసేవితా. –126
విశ్వగర్భా స్వర్ణగర్భా వరదా వాగధీశ్వరీ,
ధ్యానగమ్యాఽపరిచ్ఛేద్యా జ్ఞానదా జ్ఞానవిగ్రహా. –127
సర్వవేదాంతసంవేద్యా సత్యానందస్వరూపిణీ,
లోపాముద్రార్చితా లీలాక్లృప్తబ్రహ్మాండమండలా. –128

అదృశ్యా దృశ్యరహితా విజ్ఞాత్రీ వేద్యవర్జితా,
యోగినీ యోగదా యోగ్యా యోగానందా యుగంధరా. –129

ఇచ్ఛాశక్తిజ్ఞానశక్తిక్రియాశక్తిస్వరూపిణీ,
సర్వాధారా సుప్రతిష్ఠా సదసద్రూపధారిణీ. –130

అష్టమూర్తిరజా జైత్రీ లోకయాత్రావిధాయినీ,
ఏకాకినీ భూమరూపా నిర్ద్వైతా ద్వైతవర్జితా. –131

అన్నదా వసుదా వృద్ధా బ్రహ్మాత్మైక్యస్వరూపిణీ,
బృహతీ బ్రాహ్మణీ బ్రాహ్మీ బ్రహ్మానందా బలిప్రియా. –132

భాషారూపా బృహత్సేనా భావాభావవివర్జితా,
సుఖారాధ్యా శుభకరీ శోభనా సులభా గతిః. –133

రాజరాజేశ్వరీ రాజ్యదాయినీ రాజ్యవల్లభా,
రాజత్కృపా రాజపీఠనివేశితనిజాశ్రితా. –134

రాజ్యలక్ష్మీః కోశనాథా చతురంగబలేశ్వరీ,
సామ్రాజ్యదాయినీ సత్యసంధా సాగరమేఖలా. –135

దీక్షితా దైత్యశమనీ సర్వలోకవశంకరీ,
సర్వార్థదాత్రీ సావిత్రీ సచ్చిదానందరూపిణీ. –136

దేశకాలాపరిచ్ఛిన్నా సర్వగా సర్వమోహినీ,
సరస్వతీ శాస్త్రమయీ గుహాంబా గుహ్యరూపిణీ –137

సర్వోపాధివినిర్ముక్తా సదాశివపతివ్రతా,
సంప్రదాయేశ్వరీ సాధ్వీ గురుమండలరూపిణీ. –138

కులోత్తీర్ణా భగారాధ్యా మాయా మధుమతీ మహీ,
గణాంబా గుహ్యకారాధ్యా కోమలాంగీ గురుప్రియా. –139

స్వతంత్రా సర్వతంత్రేశీ దక్షిణామూర్తిరూపిణీ,
సనకాదిసమారాధ్యా శివజ్ఞానప్రదాయినీ. –140

చిత్కలాఽఽనందకలికా ప్రేమరూపా ప్రియంకరీ,
నామపారాయణప్రీతా నందివిద్యా నటేశ్వరీ. –141

మిథ్యాజగదధిష్ఠానా ముక్తిదా ముక్తిరూపిణీ,
లాస్యప్రియా లయకరీ లజ్జా రంభాదివందితా. –142

భవదావసుధావృష్టిః పాపారణ్యదవానలా,
దౌర్భాగ్యతూలవాతూలా జరాధ్వాంతరవిప్రభా. -143
భాగ్యాబ్ధిచంద్రికా భక్తచిత్తకేకిఘనాఘనా,
రోగపర్వతదంభోలిర్మృత్యుదారుకుఠారికా. -144
మహేశ్వరీ మహాకాలీ మహాగ్రాసా మహాశనా,
అపర్ణా చండికా చండముండాసురనిషూదినీ. -145
క్షరాక్షరాత్మికా సర్వలోకేశీ విశ్వధారిణీ,
త్రివర్గదాత్రీ సుభగా త్ర్యంబకా త్రిగుణాత్మికా. -146
స్వర్గాపవర్గదా శుద్ధా జపాపుష్పనిభాకృతిః,
ఓజోవతీ ద్యుతిధరా యజ్ఞరూపా ప్రియవ్రతా. -147
దురారాధ్యా దురాధర్షా పాటలీకుసుమప్రియా,
మహతీ మేరునిలయా మందారకుసుమప్రియా. -148
వీరారాధ్యా విరాడ్రూపా విరజా విశ్వతోముఖీ,
ప్రత్యగ్రూపా పరాకాశా ప్రాణదా ప్రాణరూపిణీ. -149
మార్తాండభైరవారాధ్యా మంత్రిణీన్యస్తరాజ్యధూః,
త్రిపురేశీ జయత్సేనా నిస్త్రైగుణ్యా పరాపరా. -150
సత్యజ్ఞానానందరూపా సామరస్యపరాయణా,
కపర్దినీ కలామాలా కామధుక్కామరూపిణీ. -151
కలానిధిః కావ్యకలా రసజ్ఞా రససేవధిః,
పుష్టా పురాతనా పూజ్యా పుష్కరా పుష్కరేక్షణా. -152
పరంజ్యోతిః పరంధామ పరమాణుః పరాత్పరా,
పాశహస్తా పాశహంత్రీ పరమంత్రవిభేదినీ. -153
మూర్తాఽమూర్తా నిత్యతృప్తా మునిమానసహంసికా,
సత్యవ్రతా సత్యరూపా సర్వాంతర్యామినీ సతీ. -154
బ్రహ్మాణీ బ్రహ్మజననీ బహురూపా బుధార్చితా,
ప్రసవిత్రీ ప్రచండాఽఽజ్ఞా ప్రతిష్ఠా ప్రకటాకృతిః -155
ప్రాణేశ్వరీ ప్రాణదాత్రీ పంచాశత్పీఠరూపిణీ,
విశృంఖలా వివిక్తస్థా వీరమాతా వియత్ప్రసూః. -156

ముకుందా ముక్తినిలయా మూలవిగ్రహరూపిణీ,
భావజ్ఞా భవరోగఘ్నీ భవచక్రప్రవర్తినీ. -157

ఛందస్సారా శాస్త్రసారా మంత్రసారా తలోదరీ,
ఉదారకీర్తిరుద్దామవైభవా వర్ణరూపిణీ. -158

జన్మమృత్యుజరాతప్తజనవిశ్రాంతిదాయినీ,
సర్వోపనిషదుద్ఘుష్టా శాంత్యతీతకలాత్మికా. -159

గంభీరా గగనాంతస్థా గర్వితా గానలోలుపా,
కల్పనారహితా కాష్ఠా కాన్తా కాన్తార్ధవిగ్రహా. -160

కార్యకారణనిర్ముక్తా కామకేళితరంగితా,
కనత్కనకతాటంకా లీలావిగ్రహధారిణీ. -161

అజా క్షయవినిర్ముక్తా ముగ్ధా క్షిప్రప్రసాదినీ,
అంతర్ముఖసమారాధ్యా బహిర్ముఖసుదుర్లభా. -162

త్రయీ త్రివర్గనిలయా త్రిస్థా త్రిపురమాలినీ,
నిరామయా నిరాలంబా స్వాత్మారామా సుధా సృతిః -163

సంసారపంకనిర్మగ్నసముద్ధరణపండితా,
యజ్ఞప్రియా యజ్ఞకర్త్రీ యజమానస్వరూపిణీ. -164

ధర్మాధారా ధనాధ్యక్షా ధనధాన్యవివర్ధినీ,
విప్రప్రియా విప్రరూపా విశ్వభ్రమణకారిణీ. -165

విశ్వగ్రాసా విద్రుమాభా వైష్ణవీ విష్ణురూపిణీ,
అయోనిర్యోనినిలయా కూటస్థా కులరూపిణీ. -166

వీరగోష్ఠీప్రియా వీరా నైష్కర్మ్యా నాదరూపిణీ,
విజ్ఞానకలనా కల్యా విదగ్ధా బైందవాసనా. -167

తత్త్వాధికా తత్త్వమయీ తత్త్వమర్థస్వరూపిణీ,
సామగానప్రియా సౌమ్యా సదాశివకుటుంబినీ. -168

సవ్యాపసవ్యమార్గస్థా సర్వాపద్వినివారిణీ,
స్వస్థా స్వభావమధురా ధీరా ధీరసమర్చితా. -169

చైతన్యార్ఘ్యసమారాధ్యా చైతన్యకుసుమప్రియా,
సదోదితా సదాతుష్టా తరుణాదిత్యపాటలా. -170

దక్షిణా దక్షిణారాధ్యా దరస్మేరముఖాంబుజా,

కౌలినీ కేవలాఽనర్ఘా కైవల్యపదదాయినీ. –171

స్తోత్రప్రియా స్తుతిమతీ శ్రుతిసంస్తుతవైభవా,
మనస్వినీ మానవతీ మహేశీ మంగళాకృతిః. –172

విశ్వమాతా జగద్ధాత్రీ విశాలాక్షీ విరాగిణీ,
ప్రగల్భా పరమోదారా పరామోదా మనోమయీ. –173

వ్యోమకేశీ విమానస్థా వజ్రిణీ వామకేశ్వరీ,
పంచయజ్ఞప్రియా పంచప్రేతమంచాధిశాయినీ. –174

పంచమీ పంచభూతేశీ పంచసంఖ్యోపచారిణీ,
శాశ్వతీ శాశ్వతైశ్వర్యా శర్మదా శంభుమోహినీ. –175

ధరాధరసుతా ధన్యా ధర్మిణీ ధర్మవర్ధినీ,
లోకాతీతా గుణాతీతా సర్వాతీతా శమాత్మికా. –176

బంధూకకుసుమప్రఖ్యా బాలా లీలావినోదినీ,
సుమంగలీ సుఖకరీ సువేషాఢ్యా సువాసినీ. –177

సువాసిన్యర్చనప్రీతా శోభనా శుద్ధమానసా,
బిందుతర్పణసంతుష్టా పూర్వజా త్రిపురాంబికా. –178

దశముద్రాసమారాధ్యా త్రిపురాశ్రీః వశంకరీ,
జ్ఞానముద్రా జ్ఞానగమ్యా జ్ఞానజ్ఞేయస్వరూపిణీ. –179

యోనిముద్రా త్రిఖండేశీ త్రిగుణాంబా త్రికోణగా,
అనఘాఽద్భుతచారిత్రా వాంఛితార్థప్రదాయినీ. –180

అభ్యాసాతిశయజ్ఞాతా షడధ్వాతీతరూపిణీ,
అవ్యాజకరుణామూర్తిరజ్ఞానధ్వాంతదీపికా. –181

ఆబాలగోపవిదితా సర్వానుల్లంఘ్యశాసనా,
శ్రీచక్రరాజనిలయా శ్రీమత్త్రిపురసుందరీ. –182

శివా శివశక్త్యైక్యరూపిణీ శ్రీలలితాంబికా,
ఏవం శ్రీ లలితాదేవ్యా నామ్నాం సాహస్రకం జగుః. –183

ఇతి శ్రీ బ్రహ్మాండపురాణే, ఉత్తరఖండే, శ్రీ హయగ్రీవవాగస్త్య సంవాదే
శ్రీలలితా సహస్రనామ స్తోత్రకథనం నామ ద్వితీయోఽధ్యాయః

ఉత్తరపీఠికా - ఫలశ్రుతిః

ఇత్యేదం నామసాహస్రం కథితం తే ఘటోద్భవ,
రహస్యానాం రహస్యం చ లలితాప్రీతిదాయకమ్. 1
అనేన సదృశం స్తోత్రం న భూతం న భవిష్యతి,
సర్వరోగప్రశమనం సర్వసంపత్ప్రవర్ధనం. 2
సర్వాపమృత్యుశమనం కాలమృత్యునివారణమ్,
సర్వజ్వరార్తిశమనం దీర్ఘాయుష్యప్రదాయకమ్. 3
పుత్రప్రదమపుత్రాణాం పురుషార్థప్రదాయకమ్,
ఇదం విశేషాచ్ఛ్రీదేవ్యాః స్తోత్రం ప్రీతివిధాయకమ్. 4
జపేన్నిత్యం ప్రయత్నేన లలితోపాస్తితత్పరః,
ప్రాతః స్నాత్వా విధానేన సంధ్యాకర్మ సమాప్య చ. 5
పూజాగృహం తతో గత్వా చక్రరాజం సమర్చయేత్,
విద్యాం జపేత్ సహస్రం వా త్రిశతం శతమేవ వా. 6
రహస్యనామసాహస్రమిదం పశ్చాత్పఠేన్నరః,
జన్మమధ్యే సకృచ్చాపి య ఏవం పఠతే సుధీః. 7
తస్య పుణ్యఫలం వక్ష్యే శ్రుణు త్వం కుమ్భసంభవ,
గంగాది సర్వతీర్థేషు యః స్నాయాత్కోటిజన్మసు. 8
కోటిలింగప్రతిష్ఠాం యః కుర్యాదవిముక్తకే,
కురుక్షేత్రే తు యో దద్యాత్ కోటివారం రవిగ్రహే. 9
కోటిం సౌవర్ణభారాణాం శ్రోత్రియేషు ద్విజన్మసు,
యః కోటిం హయమేధానాం ఆహరేద్ గాంగరోధసి. 10
ఆచరేత్కూపకోటీర్యో నిర్జలే మరుభూతలే,
దుర్భిక్షే యః ప్రతిదినం కోటిబ్రాహ్మణభోజనమ్. 11
శ్రద్ధయా పరయా కుర్యాత్ సహస్రపరివత్సరాన్,
తత్పుణ్యం కోటిగుణితం లభేత్పుణ్యమనుత్తమమ్. 12

రహస్యనామసాహస్రే నామ్నాఽ ప్యేకస్య కీర్తనాత్,
రహస్యనామసాహస్రే నామైకమపి యః పఠేత్. 13
తస్య పాపాని నశ్యన్తి మహాన్త్యపి న సంశయః,
నిత్యకర్మాననుష్ఠానాన్నిషిద్ధకరణాదపి. 14
యత్పాపం జాయతే పుంసాం తత్సర్వం నశ్యతి ద్రుతమ్,
బహునాత్ర కిముక్తేన శ్రుణు త్వం కలశీసుత. 15
తత్రైవనామ్నో యా శక్తిః పాతకానాం నివర్తనే,
తన్నివర్త్యమఘం కర్తుం నాలం లోకాశ్చతుర్దశ. 16
యస్త్యక్త్వా నామసాహస్రం పాపహానిమభీప్సతి,
స హి శీతనివృత్త్యర్థం హిమశైలం నిషేవతే. 17
భక్తో యః కీర్తయేన్నిత్యమిదం నామసహస్రకమ్,
తస్మై శ్రీలితాదేవీ ప్రీతాఽభీష్టం ప్రయచ్ఛతి. 18
అకీర్తయన్నిదం స్తోత్రం కథం భక్తో భవిష్యతి,
నిత్యం సంకీర్తనాశక్తః కీర్తయేత్పుణ్యవాసరే. 19
సంక్రాన్తౌ విషువే చైవ స్వజన్మత్రితయేఽయనే,
నవమ్యాం వా చతుర్దశ్యాం సితాయాం శుక్రవాసరే. 20
కీర్తయేన్నామసాహస్రం పౌర్ణమాస్యాం విశేషతః,
పౌర్ణమాస్యాం చంద్రబింబే ధ్యాత్వా శ్రీలలితాంబికామ్. 21
పంచోపచారైః సంపూజ్య పఠేన్నామసహస్రకమ్,
సర్వే రోగాః ప్రణశ్యంతి దీర్ఘమాయుశ్చ విన్దతి. 22
అయమాయుష్కరో నామ ప్రయోగః కల్పనోదితః,
జ్వరార్తం శిరసి స్పృష్ట్వా పఠేన్నామసహస్రకమ్. 23
తత్క్షణాత్ప్రశమం యాతి శిరస్తోదో జ్వరోఽపి చ,
సర్వవ్యాధినివృత్త్యర్థం స్పృష్ట్వా భస్మ జపేదిదమ్. 24
తద్భస్మధారణాదేవ నశ్యంతి వ్యాధయః క్షణాత్,

జలం సమ్మన్త్ర్య కుంభస్థం నామసాహస్రతో మునే. 25
అభిషించేద్గ్రహగ్రస్తాన్గ్రహాః నశ్యన్తి తత్ క్షణాత్,
సుధాసాగరమధ్యస్థాం ధ్యాత్వా శ్రీలలితామ్బికామ్. 26
యః పఠేన్నామసాహస్రం విషం తస్య వినశ్యతి,
వంధ్యానాం పుత్రలాభాయ నామసాహస్రమన్త్రితమ్. 27
నవనీతం ప్రదద్యాత్తు పుత్రలాభో భవేద్ధ్రువమ్,
దేవ్యాః పాశేన సంబద్ధా మాకృష్టామంకుశేన చ. 28
ధ్యాత్వాఽభీష్టస్త్రియం రాత్రౌ పఠేన్నామసహస్రకమ్,
ఆయాతి స్వసమీపం సా యద్యప్యన్తఃపురం గతా. 29
రాజాకర్షణకామశ్చేత్ రాజావసథ దిఙ్ముఖః,
త్రిరాత్రం యః పఠేతచ్ఛ్రీదేవీధ్యానతత్పరః. 30
స రాజా పారవశ్యేన తురంగం వా మతంగజం,
ఆరుహ్యాయాతి నికటం దాసవత్ప్రణిపత్య చ. 31
తస్మై రాజ్యం చ కోశం చ దదాత్యేవ వశం గతః,
రహస్యనామసాహస్రం యః కీర్తయతి నిత్యశః. 32
తన్ముఖాలోకమాత్రేణ ముహ్యేల్లోకత్రయం మునే,
యస్త్విదం నామసాహస్రం సకృత్పఠతి భక్తిమాన్. 33
తస్య యే శత్రవస్తేషాం నిహంతా శరభేశ్వరః,
యో వాభిచారం కురుతే నామసాహస్రపాఠకే. 34
నివర్త్య తత్క్రియాం హన్యాత్ తం వై ప్రత్యంగిరా స్వయమ్,
యే క్రూరదృష్ట్యా వీక్షంతే నామసాహస్రపాఠకం. 35
తానంధాన్ కురుతే క్షిప్రం స్వయం మార్తాణ్డభైరవః,
ధనం యో హరతే చోరైర్నామసాహస్రజాపినః. 36
యత్ర కుత్ర స్థితం వాఽపి క్షేత్రపాలో నిహంతి తమ్,
విద్యాసు కురుతే వాదం యో విద్వాన్నామజాపినః. 37

తస్య వాక్ స్తంభనం సద్యః కరోతి నకులీశ్వరీ,
యో రాజా కురుతే వైరం నామసాహస్రజాపినః. 38
చతురంగబలం తస్య దండినీ సంహరేత్స్వయం,
యః పఠేన్నామసాహస్రం షణ్మాసం భక్తిసంయుతః. 39
లక్ష్మీశ్చాంచల్యరహితా సదా తిష్ఠతి తద్గృహే,
మాసమేకం ప్రతిదినం త్రివారం యః పఠేన్నరః. 40
భారతీ తస్య జిహ్వాగ్రరంగే నృత్యతి నిత్యశః,
యస్త్వేకవారం పఠతి పక్షమేకమతంద్రితః. 41
ముహ్యంతి కామవశగా మృగాక్ష్యస్తస్య వీక్షణాత్,
యః పఠేన్నామసాహస్రం జన్మమధ్యే సకృన్నరః. 42
తద్దృష్టిగోచరాస్సర్వే ముచ్యంతే సర్వకిల్బిషైః,
యో వేత్తి నామసాహస్రం తస్మై దేయం ద్విజన్మనే. 43
అన్నం వస్త్రం ధనం ధాన్యం నాన్యేభ్యస్తు కదాచన,
శ్రీమంత్రరాజం యో వేత్తి శ్రీచక్రం యః సమర్చతి. 44
యః కీర్తయతి నామాని తం సత్పాత్రం విదుర్బుధాః,
తస్మై దేయం ప్రయత్నేన శ్రీదేవీప్రీతిమిచ్ఛతా. 45
న కీర్తయతి నామాని మంత్రరాజం న వేత్తి యః,
పశుతుల్యః స విజ్ఞేయస్తస్మై దత్తం నిరర్థకం. 46
పరీక్ష్య విద్యావిదుషస్తేభ్యో దద్యాద్విచక్షణః,
శ్రీమంత్రరాజసదృశో యథా మంత్రో న విద్యతే. 47
దేవతా లలితాతుల్యా యథా నాస్తి ఘటోద్భవ,
రహస్యనామసాహస్రతుల్యా నాస్తి తథా స్తుతిః. 48
లిఖిత్వా పుస్తకే యస్తు నామసాహస్రముత్తమం,
సమర్చయేత్సదా భక్త్యా తస్య తుష్యతి సుందరీ. 49
బహునాత్ర కిముక్తేన శృణు త్వం కుమ్భసంభవ,

నానేన సదృశం స్తోత్రం సర్వతన్త్రేషు విద్యతే. 50
తస్మాదుపాసకో నిత్యం కీర్తయేదిదమాదరాత్,
ఏభిర్నామసహస్రైస్తు శ్రీచక్రం యోఽర్చయేత్సకృత్. 51
పద్మైర్వా తులసీపుష్పైః కల్హారైర్వా కదమ్బకైః,
చంపకైర్జాతికుసుమైః మల్లికాకరవీరకైః. 52
ఉత్పలైర్బిల్వపత్రైర్వా కుందకేసరపాటలైః,
అన్యైః సుగంధికుసుమైః కేతకీమాధవీముఖైః. 53
తస్య పుణ్యఫలం వక్తుం న శక్నోతి మహేశ్వరః,
సా వేత్తి లలితాదేవీ స్వచక్రార్చనజం ఫలం. 54
అన్యే కథం విజానీయుః బ్రహ్మాద్యాః స్వల్పమేధసః,
ప్రతిమాసం పౌర్ణమాస్యాం ఏభిర్నామసహస్రకైః. 55
రాత్రౌ యశ్చక్రరాజస్థాం అర్చయేత్పరదేవతామ్,
స ఏవ లలితారూపః తద్రూపా లలితా స్వయమ్. 56
న తయోర్విద్యతే భేదో భేదకృత్పాపకృద్భవేత్,
మహానవమ్యాం యో భక్తః శ్రీదేవీం చక్రమధ్యగామ్. 57
అర్చయేన్నామసాహస్రైః తస్య ముక్తిః కరే స్థితా,
యస్తు నామసహస్రేణ శుక్రవారే సమర్చయేత్. 58
చక్రరాజే మహాదేవీం తస్య పుణ్యఫలం శ్రుణు,
సర్వాన్కామానవాప్యేహ సర్వసౌభాగ్యసంయుతః. 59
పుత్రపౌత్రాదిసంయుక్తో భుక్త్వా భోగాన్యథేప్సితాన్,
అన్తే శ్రీలలితాదేవ్యాః సాయుజ్యమతిదుర్లభమ్. 60
ప్రార్థనీయం శివాద్యైశ్చ ప్రాప్నోత్యేవ న సంశయః,
యః సహస్రం బ్రాహ్మణానాం ఏభిర్నామసహస్రకైః. 61
సమర్చ్య భోజయేద్భక్త్యా పాయసాపూపషడ్రసైః,
తస్మై ప్రీణాతి లలితా స్వసామ్రాజ్యం ప్రయచ్ఛతి. 62

న తస్య దుర్లభం వస్తు త్రిషు లోకేషు విద్యతే,
నిష్కామః కీర్తయేద్యస్తు నామసాహస్రముత్తమం. 63
బ్రహ్మజ్ఞానమవాప్నోతి యేన ముచ్యేత బంధనాత్,
ధనార్థీ ధనమాప్నోతి యశోఽర్థీ చాప్నుయాద్యశః. 64
విద్యార్థీ చాప్నుయాద్విద్యాం నామసాహస్రకీర్తనాత్,
నానేన సదృశం స్తోత్రం భోగమోక్షప్రదం మునే. 65
కీర్తనీయమిదం తస్మాత్ భోగమోక్షార్థిభిర్నరైః,
చతురాశ్రమనిష్ఠైశ్చ కీర్తనీయమిదం సదా. 66
స్వధర్మసమనుష్ఠానవైకల్యపరిపూర్తయే,
కలౌ పాపైకబహులే ధర్మానుష్ఠానవర్జితే. 67
నామానుకీర్తనం ముక్త్వా నృణాం నాన్యత్పరాయణం,
లౌకికాద్వచనాన్ముఖ్యం విష్ణునామానుకీర్తనమ్. 68
విష్ణునామసహస్రాచ్చ శివనామైకముత్తమమ్,
శివనామసహస్రాచ్చ దేవ్యా నామైకముత్తమమ్. 69
దేవీనామసహస్రాణి కోటిశః సన్తి కుంభజ,
తేషు ముఖ్యం దశవిధం నామసాహస్రముచ్యతే. 70
(గంగా భవానీ గాయత్రీ కాళీ లక్ష్మీ సరస్వతీ,
రాజరాజేశ్వరీ బాలా శ్యామలా లలితాదశ).
రహస్యనామసాహస్రమిదం శస్తం దశస్వపి,
తస్మాత్సంకీర్తయేన్నిత్యం కలిదోషనివృత్తయే. 71
ముఖ్యం శ్రీమాతృనామేతి న జానన్తి విమోహితాః,
విష్ణునామశిరాః కేచిత్ శివనామపరాః పరే. 72
న కశ్చిదపి లోకేషు లలితానామతత్పరః,
యే నాన్యదేవతానామ కీర్తితం జన్మకోటిషు. 73
తస్యైవ భవతి శ్రద్ధా శ్రీదేవీనామకీర్తనే,

చరమే జన్మని యథా శ్రీవిద్యోపాసకో భవేత్. 74
నామసాహస్రపాఠశ్చ తథా చరమజన్మని,
యథా విరలా లోకే శ్రీవిద్యాచారవేదినః. 75
తథైవ విరలా లోకే నామసాహస్రపాఠకః,
మంత్రరాజజపశ్చైవ చక్రరాజార్చనం తథా. 76
రహస్యనామపాఠశ్చ నాల్పస్య తపసః ఫలం,
అపఠన్నామసాహస్రం ప్రీణయేద్యో మహేశ్వరీం. 77
స చక్షుషా వినా రూపం పశ్యేదేవ విమూఢధీః,
రహస్యనామసాహస్రం త్యక్త్వా యః సిద్ధికాముకః. 78
స భోజనం వినా నూనం క్షున్నివృత్తిమభీప్సతి,
యో భక్తో లలితాదేవ్యాః స నిత్యం కీర్తయేదిదం. 79
నాన్యథా ప్రీయతే దేవీ కల్పకోటిశతైరపి,
తస్మాద్రహస్యనామాని శ్రీమాతుః ప్రయతః పఠేత్. 80
ఇతి తే కథితం స్తోత్రం రహస్యం కుంభసంభవ,
నావిద్యావేదినే బ్రూయాన్నాభక్తాయ కదాచన. 81
యథైవ గోప్యా శ్రీవిద్యా తథా గోప్యమిదం మునే,
పశుతుల్యేషు న బ్రూయాజ్జనేషు స్తోత్రముత్తమమ్. 82
యో దదాతి విమూఢాత్మా శ్రీవిద్యారహితాయ చ,
తస్మై కుప్యంతి యోగిన్యః సోఽనర్థః సుమహాన్స్మృతః. 83
రహస్యనామసాహస్రం తస్మాత్సంగోపయేదిదమ్,
స్వతంత్రేణ మయా నోక్తం తవాపి కలశోద్భవ. 84
లలితాప్రేరణాదేవ మయోక్తం స్తోత్రముత్తమమ్,
కీర్తనీయమిదం భక్త్యా కుంభయోనే నిరంతరమ్,
తేన తుష్టా మహాదేవీ తవాభీష్టం ప్రదాస్యతి. 85

ఇతి శ్రీ బ్రహ్మాండపురాణే ఉత్తరఖండే శ్రీ హయగ్రీవాగస్త్య సంవాదే
శ్రీలలితారహస్యనామసాహస్ర ఫలనిరూపణమ్.

అకారాది నామక్రమం

